


చైతన్య భగవద్గీత

(ప్రథమ సంపుటము)



స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత

(ప్రథమ సంపుటము)

స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత
స్వామి సుందర చైతన్యానంద
ప్రథమ ముద్రణము : డిసెంబరు 2009....... 15000 కాపీలు.

ప్రతులకు :
1. సుందర చైతన్యాశ్రమం
దుండిగల్ రోడ్,
హైదరాబాద్ - 500 043.
☎ : 08418 - 255777
ఫాక్స్ : 08418 - 255355
2. చైతన్య వానప్రస్థాశ్రమం,
సుందర చైతన్యాశ్రమం
ధవళేశ్వరం - 533 125.
☎ : 0883 - 2417378
3. సుందర చైతన్యాశ్రమం
శాంతిపురం,
విశాఖపట్టణం - 530 016.
☎ : 0891 - 2791079
టైప్ సెట్టింగ్ : ప్రసాద్
ఫోటో డిజైనింగ్ : ప్రవీణ్
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్
ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్, కొవ్వూరు.
☎ : 08813 - 232354, 231575



చైతన్య భగవద్గీత

స్వామి సుందర చైతన్యానంద

విషయ సూచిక

చైతన్య భగవద్గీత





స్వామి సుందర చైతన్యానంద








అంకితం
అనుగ్రహించిన ఆదిదేవునకు
అర్థం చెప్పిన ఆచార్యదేవునకు
అంజలి ఘటిస్తూ
ఓం స్వామి సుందర చైతన్యానంద





శ్లో॥ గీతా సుగీతా కర్తవ్యా
కి మన్యైః శాస్త్ర సంగ్రహైః।
యా స్వయం పద్మ నాభస్య
ముఖ పద్మా ద్వినిస్సృతాః॥


గీత స్వయంగా పద్మనాభుడైన భగవంతుని ముఖ కమలము నుండి వెలువడింది. గీతను చక్కగా అధ్యయనం చేస్తే చాలు. ఇతర శాస్త్రముల అవసర మేముంది?






శ్లో॥ గీతార్థం ధ్యాయతే నిత్యం
కృత్వా కర్మాణి భూరిశః।
జీవన్ముక్త స్స విజ్ఞేయో
దేహా న్తే పరమం పదమ్॥


గీతార్థమును నిత్యము ధ్యానించు వాడు కర్మ లెన్ని ఆచరించినా జీవన్ముక్తుడే. దేహము పతనమైన తరువాత అతడు పరమాత్మనే పొందుతాడు.





చైతన్య భగవద్గీత

(ప్రథమ సంపుటము)



స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత

(ప్రథమ సంపుటము)

స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత

చైతన్య భగవద్గీత

స్వామి సుందర చైతన్యానంద

ప్రథమ ముద్రణము : డిసెంబరు 2009........ 15000 కాపీలు.

ప్రతులకు :

1. సుందర చైతన్యాశ్రమం
దుండిగల్ రోడ్,
హైదరాబాద్ - 500 043.
☎ : 08418 - 255777
ఫాక్స్ : 08418 - 255355

2. చైతన్య వానప్రస్థాశ్రమం,
సుందర చైతన్యాశ్రమం
ధవళేశ్వరం - 533 125.
☎ : 0883 - 2417378

3. సుందర చైతన్యాశ్రమం
శాంతిపురం,
విశాఖపట్టణం - 530 016.
☎ : 0891 - 2791079

టైప్ సెట్టింగ్ : ప్రసాద్
ఫోటో డిజైనింగ్ : ప్రవీణ్
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్

ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్, కొవ్వూరు.
☎ : 08813 - 232354, 231575

స్వామి సుందర చైతన్యానంద




విషయ సూచిక

చైతన్య భగవద్గీత




స్వామి సుందర చైతన్యానంద









అంకితం

అనుగ్రహించిన ఆదిదేవునకు
అర్థం చెప్పిన ఆచార్యదేవునకు
అంజలి ఘటిస్తూ

ఓం స్వామి సుందర చైతన్యానంద

అంబ! భగవద్గీతే! త్వాం అనుసందధామి



ప్రాణాలు వెంట బెట్టుకొని
ప్రపంచం లోకి ప్రవేశించిన వారు
తిరిగి ప్రాణాలను ప్రపంచం లోనే
విడిచిపెట్టి వెళ్తున్నారు.

తల్లి గర్భం నుండి వచ్చే నాడు
అందరూ ప్రాణాల తోనే వస్తున్నారు.
పుట్టిన తరువాత ప్రాణాల్ని
చేదుకోవడం లేదు. తోడుకోవడం లేదు.

వెలిగే దీపం ఆరి పోకుండా
నూనె పోస్తూ ఉంటాము.
తెచ్చుకున్న ప్రాణం కారి పోకుండా
ప్రాణవాయువును పీల్చుకుంటూ ఉంటాము.

ప్రాణవాయువును ప్రసాదించి
ప్రాణాలు కాపాడిన ప్రపంచానికి
ఋణగ్రస్తులం కాలేక ప్రాణాలను
ప్రపంచం లోనే విడిచి వెళ్తున్నాం.



మరణ యోగ్యత ప్రతి ప్రాణికీ ఉంది
యోగ్యమైన మరణం ఎందరి కుంది?

జీవిత మిదం త్రుటి ద్వయస్య క్రీడా

ఈ జీవితం రెండు నిమిషాల ఆట.

ఒక నిమిషంలో జననం. మరో నిమిషంలో మరణం
ఒక క్షణంలో కళ్ళు తెరవడం. మరో క్షణంలో కళ్ళు మూయడం.

ఇదే ద్వయం. ద్వైతం. భయం.
కాదెన్నడూ ఇది అభయం.

రెండిటిని రమణీయంగా చూపిస్తూ
రెండిటి మధ్య అదే పనిగ పరుగు లెట్టిస్తూ
రెండు నిమిషాల్లో బ్రతుకును బుగ్గి చేసే
ద్వైత క్రీడ. త్రుటి ద్వయస్య క్రీడ.

జాతస్య మరణం ధృవమ్

పుట్టేది ఎవరైనా గిట్టేందుకే - ఈ మధ్యలో,
తిరిగేది తిరగడమే. తరిగేది తరగడమే.
తిరగడం కర్మ. తిరిగి తిరిగి అరిగి పోవడం ఫలం.

తిరిగేవే అరుగుతాయి. కదిలేవే కరుగుతాయి.
మరిగే జలాలు ఆవిరౌతూ తరిగి పోతాయి.


దేహాలు తిరిగి తిరిగి
అవయవాలు అరిగి అరిగి
క్షణక్షణానికి ప్రాణాలు కరిగి కరిగి
మాయలో పడిన మనస్సు మరిగి మరిగి - ఒకనాడు
మనిషి మరణించి మట్టిలో మట్టిగా కలిసి పోతాడు
కట్టెలలో కట్టెగా కాలి మసై పోతాడు.

ఇక్కడ ఎవ్వరికీ మినహాయింపులు లేవు
మీనమేషాలు మనం లెక్కించ వచ్చు
మృత్యువు వాటిని లెక్క పెట్టదు.

పచ్చని చెట్టు ఎండేందుకే ఉంది
వెచ్చని దేహం మండేందుకే ఉంది.

కాయ ఏ చెట్టు దైనా రాలి పోయేదే
కాయం ఎవరి దైనా కాలి పోయేదే.

పడేందుకే లేస్తుంది కడలి కెరటం
కాటిలో కాలేందుకే పుడుతుంది కాయం.





కాలః జగద్భక్షకః

జల్లెడ బట్టి అందరినీ జగత్తు వడబోస్తూ ఉంటే
కాలం కదం త్రొక్కుతూ జగత్తునే కబళిస్తోంది
విశ్వాన్నంతా వ్యంజనంలా చప్పరిం చేస్తోంది.

జన్మ నిచ్చిన తల్లుల్ని మాటేసి కాటేసింది
పోషించిన తండ్రుల్ని వాటేసుకొని కూల్చేసింది.

భార్యల్ని మ్రింగింది. భర్తల్ని మ్రింగింది
మిత్రుల్ని మ్రింగింది. బంధువుల్ని మ్రింగింది
తాతలను మ్రింగింది. తనయులను మ్రింగింది
దారి కాచి మరీ దొంగలా దోచుకుంది - ఆ క్షణాల్లో

ఇక బ్రతకడ మెందుకు?
చావే మంచిది అనిపిస్తుంది.

ఈ వైరాగ్యం ఎంత కాలం ఉంటుంది?
కాలం దానిని కూడా మ్రింగేస్తుంది.

మరిగించిన మనసే మరపిస్తుంది
సమస్తాన్ని మరచి పోయేలా చేస్తుంది.

మళ్ళీ ప్రపంచం వైపే పరుగులు
అవే దరువులు. అవే కరువులు.

తన భుజబల పరాక్రమాలతో అవనికి వణకు పుట్టించిన హిరణ్యాక్షుడు, వరాహమూర్తి చేతిలో హతు డయ్యాడు. ఉదక ప్రదాన అంత్యక్రియాదు లాచరించిన తరువాత, పుత్రశోకంతో కుమిలి పోతున్న తల్లి దితిని ఊరడించ డానికి హిరణ్యకశిపుడు మాతృదేవి మందిరంలో ప్రవేశించాడు.

శా॥ నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు వీడి పోదురు సదా సంగంబు లేదొక్కచో
శూరుల్ వోయెడి త్రోవఁ బోయెను భవత్పూనుండు దల్లీ! మహా
శూరుఁ డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్!

అమ్మా! ఈ ప్రపంచం ఒక చలివేంద్రం లాంటిది. జీవు లందరూ దాహం తీర్చుకోవడానికి వచ్చిన బాటసారులే. దాహం తీరిన తరువాత, చలిపందిరిని విడిచి, ఎవరి దారిన వారు పోతూ ఉంటారు.

జననీ! ప్రారబ్ధ ఫలాలను అనుభవించ డానికి ఈ ప్రపంచ మనే చలివేంద్రం వద్దకు మన మందరమూ చేరాం. మనమూ బాటసారులమే. సంసార సంచారులమే.

చలిపందిరి వద్ద కలవడమే సంసారము. చలివేంద్రం వద్ద ఎవరితో చెలిమి? ఎవరిది కలిమి? ఏమి సంగము? ఎక్కడి సంసారము?

మాతా! ఎగిరి పోయేందుకే పక్షులు చెట్టుపై వాలుతాయి. తిరిగి నడచేందుకే బాటసారులు చలివేంద్రాన్ని చేరుతారు. వచ్చిన వాళ్ళందరూ తిరిగి పోయేవారే. స్థిరంగా ఉండేవా రెవ్వరూ లేరు. ఒక కాలంలో కనిపించిన వాళ్ళు మరొక కాలంలో కనిపించరు. అందరూ వెళ్ళే వారే. మనమూ అంతే. కాకపోతే, కొందరు ముందు. కొందరు వెనుక. అంతే.

నా సోదరుడు, మహిని వణకించిన నీ ముద్దుల తనయుడు హిరణ్యాక్షుడు ముందు వెళ్ళాడు. విదియ తనది, తదియ మనది. అంతే. తల్లీ! ఎవ్వరైనా పోయే వారే! కానీ నా సోదరుడు మహాశూరుడు. కనుకనే, విష్ణువుతో పోరాడి శూరులు పయనించే మార్గంలో వెళ్ళి పోయాడు. విజయం విష్ణువు దైతే, వీరస్వర్గం నా తమ్ముడిది.

సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్ముఁ డవ్యయుం
డమలుండు సత్యుఁ డనంతుఁ డాఢ్యుండు - తల్లీ! భగవంతుడైన శ్రీమహావిష్ణువు సర్వజ్ఞుడు, సర్వాత్ముడు, నశించని వాడు, నిర్మలుడు, సత్యరూపుడు, అనంతుడు, ఆఢ్యుడు. ఆ దివ్యాత్ముని చేతిలో మరణించిన మహావీరుడైన నా సోదరుని మరణం దుఃఖించ దగింది కాదు అని హిరణ్యకశిపుడు తల్లి దితిని ఎంతగానో ఓదార్చాడు. కుమిలి పోతున్న మాతృశ్రీ హృదయాన్ని కుదుట పరచాడు.

ఆ తరువాత జరిగిం దేమిటి?

దానవ శ్రేణికిన్ వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్జింప నీ కేటికిన్ - 'దానవు లందరికీ విష్ణువు ప్రబల శత్రువు. అతడిని వధించాలే గాని వర్జించ కూడదు' అంటూ విజృంభించాడు.

జాతస్య మరణం ధ్రువమ్

పుట్టేది ఎవరైనా గిట్టేందుకే - ఈ మధ్యలో,
తిరిగేది తిరగడమే. తరిగేది తరగడమే.
తిరగడం కర్మ. తిరిగి తిరిగి అరిగి పోవడం ఫలం.

తిరిగేవే అరుగుతాయి. కదిలేవే కరుగుతాయి.
మరిగే జలాలు ఆవిరౌతూ తరిగి పోతాయి.


దేహాలు తిరిగి తిరిగి
అవయవాలు అరిగి అరిగి
క్షణక్షణానికి ప్రాణాలు కరిగి కరిగి
మాయలో పడిన మనస్సు మరిగి మరిగి - ఒకనాడు
మనిషి మరణించి మట్టిలో మట్టిగా కలిసి పోతాడు
కట్టెలలో కట్టెగా కాలి మసై పోతాడు.


ఇక్కడ ఎవ్వరికీ మినహాయింపులు లేవు
మీనమేషాలు మనం లెక్కించ వచ్చు
మృత్యువు వాటిని లెక్క పెట్టదు.

పచ్చని చెట్టు ఎండేందుకే ఉంది
వెచ్చని దేహం మండేందుకే ఉంది.

కాయ ఏ చెట్టు దైనా రాలి పోయేదే
కాయం ఎవరి దైనా కాలి పోయేదే.

పడేందుకే లేస్తుంది కడలి కెరటం
కాటిలో కాలేందుకే పుడుతుంది కాయం.





కాలః జగద్భక్షకః

జల్లెడ బట్టి అందరినీ జగత్తు వడబోస్తూ ఉంటే
కాలం కదం త్రొక్కుతూ జగత్తునే కబళిస్తోంది
విశ్వాన్నంతా వ్యంజనంలా చప్పరిం చేస్తోంది.

జన్మ నిచ్చిన తల్లుల్ని మాటేసి కాటేసింది
పోషించిన తండ్రుల్ని వాటేసుకొని కూల్చేసింది.

భార్యల్ని మ్రింగింది. భర్తల్ని మ్రింగింది
మిత్రుల్ని మ్రింగింది. బంధువుల్ని మ్రింగింది
తాతలను మ్రింగింది. తనయులను మ్రింగింది
దారి కాచి మరీ దొంగలా దోచుకుంది - ఆ క్షణాల్లో

ఇక బ్రతకడ మెందుకు?
చావే మంచిది అనిపిస్తుంది.

ఈ వైరాగ్యం ఎంత కాలం ఉంటుంది?
కాలం దానిని కూడా మ్రింగేస్తుంది.

మరిగించిన మనసే మరపిస్తుంది
సమస్తాన్ని మరచి పోయేలా చేస్తుంది.

మళ్ళీ ప్రపంచం వైపే పరుగులు
అవే దరువులు. అవే కరువులు.

తన భుజబల పరాక్రమాలతో అవనికి వణకు పుట్టించిన హిరణ్యాక్షుడు, వరాహమూర్తి చేతిలో హతుడయ్యాడు. ఉదక ప్రదాన అంత్యక్రియాదు లాచరించిన తరువాత, పుత్రశోకంతో కుమిలి పోతున్న తల్లి దితిని ఊరడించ డానికి హిరణ్యకశిపుడు మాతృదేవి మందిరంలో ప్రవేశించాడు.

శా॥ నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు వీడి పోదురు సదా సంగంబు లేదొక్కచో
శూరుల్ వోయెడి త్రోవఁ బోయెను భవత్పూనుండు దల్లీ! మహా
శూరుఁ డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్!

అమ్మా! ఈ ప్రపంచం ఒక చలివేంద్రం లాంటిది. జీవు లందరూ దాహం తీర్చుకోవడానికి వచ్చిన బాటసారులే. దాహం తీరిన తరువాత, చలిపందిరిని విడిచి, ఎవరి దారిన వారు పోతూ ఉంటారు.

జననీ! ప్రారబ్ధ ఫలాలను అనుభవించ డానికి ఈ ప్రపంచ మనే చలివేంద్రం వద్దకు మన మందరమూ చేరాం. మనమూ బాటసారులమే. సంసార సంచారులమే.

చలిపందిరి వద్ద కలవడమే సంసారము. చలివేంద్రం వద్ద ఎవరితో చెలిమి? ఎవరిది కలిమి? ఏమి సంగము? ఎక్కడి సంసారము?


మాతా! ఎగిరి పోయేందుకే పక్షులు చెట్టుపై వాలుతాయి. తిరిగి నడచేందుకే బాటసారులు చలివేంద్రాన్ని చేరుతారు. వచ్చిన వాళ్ళందరూ తిరిగి పోయేవారే. స్థిరంగా ఉండేవా రెవ్వరూ లేరు. ఒక కాలంలో కనిపించిన వాళ్ళు మరొక కాలంలో కనిపించరు. అందరూ వెళ్ళే వారే. మనమూ అంతే. కాకపోతే, కొందరు ముందు. కొందరు వెనుక. అంతే.

నా సోదరుడు, మహిని వణకించిన నీ ముద్దుల తనయుడు హిరణ్యాక్షుడు ముందు వెళ్ళాడు. విదియ తనది, తదియ మనది. అంతే. తల్లీ! ఎవ్వరైనా పోయే వారే! కానీ నా సోదరుడు మహాశూరుడు. కనుకనే, విష్ణువుతో పోరాడి శూరులు పయనించే మార్గంలో వెళ్ళి పోయాడు. విజయం విష్ణువు దైతే, వీరస్వర్గం నా తమ్ముడిది.

సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్ముఁ డవ్యయుం
దమలుండు సత్యుఁ డనంతుఁ డాఢ్యుండు - తల్లీ! భగవంతుడైన శ్రీమహావిష్ణువు సర్వజ్ఞుడు, సర్వాత్ముడు, నశించని వాడు, నిర్మలుడు, సత్యరూపుడు, అనంతుడు, ఆఢ్యుడు. ఆ దివ్యాత్ముని చేతిలో మరణించిన మహావీరుడైన నా సోదరుని మరణం దుఃఖించ దగింది కాదు అని హిరణ్యకశిపుడు తల్లి దితిని ఎంతగానో ఓదార్చాడు. కుమిలి పోతున్న మాతృశ్రీ హృదయాన్ని కుదుట పరచాడు.

ఆ తరువాత జరిగిం దేమిటి?

దానవ శ్రేణికిన్ వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్ - 'దానవు లందరికీ విష్ణువు ప్రబల శత్రువు. అతడిని వధించాలే గాని వర్ణించ కూడదు' అంటూ విజృంభించాడు.



తల్లికి బోధించిం దేమిటి?
తానిప్పుడు వాదించే దేమిటి?

అనర్థాల వైపు పరుగు దీసే వారికి
పరమార్థం ఒక పట్టున వంట పట్టదు.

దేవుడు ఉన్నాడని తెలియని దెవరికి?
దేవుడు అంటే ఏమిటో తెలిసిం దెవరికి?

తెలియడం వేరు
అర్థం కావడం వేరు.

ఆవు తినిన ఆహారాన్ని నెమరు వేస్తుందని మనకు తెలుసు
కానీ, ఆవు నెమరు వేసేది జీర్ణం కాని దానినే అనేది తెలియాలి.

ఏది యుక్తము? ఏది అయుక్తము? అని ఆలోచించలేక
కసువు మేసే టప్పుడు ఆవు ఏదేదో తినేస్తుంది.

తినింది జీర్ణం కానపుడు, తిరిగి నోటి లోకి తెచ్చుకొని
మళ్ళీ నమిలి మ్రింగుతుంది. అదే నెమరు వేయడం.

తృణ స్వీకరణ కాలే
రోమన్థం కుర్వన్ పశురివ
పశ్చాత్ అనర్థం మా భజ !

అయోగ్యమైన దానిని ఆరగించి, అది అరగని దశలో
నెమరు వేయడానికి పశువు పరితపించినట్లు,
అనర్థదాయక మైన విషయాలను ఆశ్రయించి,
ఆ తరువాత ఆవేదనతో కుమిలి పోవద్దని ఆప్తవాక్యం,
స్వయంప్రకాశ యతీంద్రులు పలికిన హితవాక్యం.



జీవిత మొక విచిత్రమైన ప్రయాణము
ప్రయాణం లోనే ప్రమాదాలు జరుగుతాయి.

పయనించే నావే మునిగేది
జీవించే మనిషే మరణించేది.

మరణం అనివార్యం
ఎప్పు డనేది అనిశ్చితం.

అలహాబాద్ ప్రయాణంలో రాత్రి రైలెక్కిన వాడు
ఆసుపత్రిలో మరునాడు ఉదయం కళ్ళు తెరచి
నే నెక్కడున్నాను? అని పలవరించడం లేదా!

అలహాబాద్ వెళ్ళాలని రైలెక్కాడే గాని
ఆసుపత్రిలో పడక పైకి చేరాలని
పలవరించే వ్యక్తి కలలు గన్నాడా?

వాస్తవాలు ఊహాలలో ఊరేగవు
ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రమాణాలే ప్రకాశిస్తాయి.

ఈ ప్రపంచ ఎడారిలో ఇంతవరకు
ఎవరి దప్పిక తీరలేదు.



కోరికలు అందరి బుద్ధులను కుదిపేశాయే గాని
ఎవరి హృదయాన్ని కూడా కుదుట పరచలేక పోయాయి.

అందరూ ప్రపంచంలో కొంత కాలం ఉండి తిరిగి పోయిన వారే గాని
ఈ ప్రపంచాన్ని తమదిగా, తమ ఆస్తిగా మార్చుకున్న వారు ఎవ్వరూ లేరు.

అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః

దేహాలు స్థిరం కావు. సంపదలు శాశ్వతం కావు.

సరుకులు మోసుకొచ్చే నౌక సముద్రంలో మునిగి పోగానే
ఆ పయనించే నౌక లోని సరుకులు కూడా మునిగి పోయినట్లు
మనిషి జీవితం ఈ ప్రపంచంలో ముగిసి పోగానే
అతని కున్న సమస్తము క్షణంలో అతనిది కాకుండా పోతుంది.

దీనికి ఎంత సమయం పడుతుంది?
అంతా క్షణంలో జరిగి పోతుంది.



ఆపదః క్షణ మాయన్తి
క్షణ మాయన్తి సంపదః
క్షణం జన్మ క్షణం మృత్యుః
మునే కి మిహ న క్షణం?

క్షణంలో ఆపద ఆవరిస్తుంది
క్షణంలో సంపద సమీపిస్తుంది
పుట్టేది క్షణం, చచ్చేది క్షణం
మునీ! క్షణం కానిది ఇక్కడ ఏముందని?
అని యోగవాసిష్ఠంలో వసిష్ఠ మహర్షిని
సూటిగా ప్రశ్నించాడు బాలరాముడు.

గతంలో ఎవరెవరు ఏమేమి చేశారో
వాటిలో ఎవరెవరు ఏమేమి చూశారో
వాటి ఫలాలు ఎలా ఉంటాయో, ఎప్పుడొస్తాయో
ఆలోచనలకు అందవు. ఊహాలు పట్టుకో లేవు
ఇక్కడే బంధ్లు ఓడ లవుతాయి
ఓడలు తిరగబడి కడలిలో కలిసి పోతాయి.

సంపదలు దూరమై ఆపదలు చేరు వవుతాయి
బాంధవ్యాలు శూన్యమై భారాలను గుండెలలో దింపుతాయి.



క్షణాలలో ఆరోగ్యాలు విషమిస్తాయి
ప్రమాదాలు బ్రతుకులనే బుగ్గిపాలు చేస్తాయి.

ఎంతటి వారైనా ఏకాకులు కావచ్చు
ఏకంగా పరలోకానికే పయనించ వచ్చు.

తెలిసి చేసినా, తెలియక చేసినా
చేసినవే కనుక తప్పించుకోవడం సాధ్యం కాదు.

నా భుక్తం క్షీయతే కర్మ
కల్పకోటి శతైరపి

కోట్లాది జన్మ లెత్తినా
అనుభవించనిదే కర్మ నశించదు.

కోరుకునే మనస్సు మనిషి కుంది.
అలాగని కష్టాలను మనిషి కోరుకోడు
నష్టాలు రావాలని ఎన్నడూ ఆశించడు
అయినా, వచ్చే సమయానికి అవి వచ్చి తీరుతాయి.



దుఃఖం ప్రాప్తించాలని ఎవ్వరూ అభిలషించరు
అనారోగ్యానికి ఎవ్వరూ ఆహ్వానం పలకరు.

భగవాన్!
నాకు జ్వర మొస్తే నీకు కొబ్బరికాయ కొడతాను
అని మ్రొక్కిన వాళ్ళను మీ రెక్కడైనా చూశారా?

షుగర్ వస్తే తలనీలా లిస్తాను
రక్తపోటు రావాలే గాని అంగ ప్రదక్షిణం చేస్తాను
మలేరియా వస్తే కాలి నడకన కొండ కొస్తాను
టైఫాయిడ్ వస్తే నిలువు దోపిడి సమర్పించు కుంటాను.

ఇలా ఎవ్వరూ కోరి ఉండరు. ఎవ్వరూ మ్రొక్కి ఉండరు.
కోరినా, కోరక పోయినా వచ్చే కాలానికి అవి వచ్చి తీరుతాయి.

అవన్నీ ప్రారబ్ధ ఫలాలు. పిలవక పోయినా వచ్చే చుట్టాలు
అయినా వాటిని ఆహ్వానించే పని లోనే మనం తలమునకలై ఉంటాము
పిలవక పోయినా వచ్చే వాటిని పని గట్టుకొని మరీ పిలుస్తూ ఉంటాము.

ఆస్తులు అంతస్తులు
అధికారాలు ఆరోగ్యాలు
సంపదలు సంతానాలు
ప్రయాణాలు ప్రమోదాలు - ఇవన్నీ ప్రారబ్ధ ఫలాలే.

ఏవి ఎప్పుడు రావాలో అప్పుడు వస్తాయి
ప్రార్థించక పోయినా తప్పక ప్రాప్తిస్తాయి.

ముక్తి అనేది ప్రారబ్ధఫలం కాదు
ముక్తి అనేది మన ప్రారబ్ధంలో ఉంటే,
మనం పుట్టి ఉండే వాళ్ళమే కాదు
తరించి పోయి ఉండే వాళ్ళము.

మోక్షం ప్రారబ్ధ ఫలం కాదు, పురుషార్థ ఫలం
పురుషుడు ప్రయత్నంతో సాధించ వలసిన ఫలం.



పురుషార్థములు

పురుషేణ అర్థ్యతే ఇతి పురుషార్థమ్ - ప్రతి పురుషుడు ప్రయత్నించి పొందా లనుకునే ప్రయోజనాలే పురుషార్థాలు. అవియే ధర్మార్థ కామమోక్షాలు. వీటిలో అర్థకామాలు ప్రాణు లన్నిటిలో గోచరిస్తాయి. ధర్మమోక్షాలు మాత్రం కేవలం మానవులకే సంబంధించి ఉంటాయి.

అర్థం

'అర్థం' అనే పురుషార్థం భద్రతకు సంబంధించింది. ఈ అర్థం అనే పురుషార్థం సర్వ ప్రాణులలో గోచరిస్తుంది. అభద్రత నుండి బయట పడేందుకు, భద్రతను పొందేందుకు జీవులు ఆశించే ప్రయోజనమే అర్థము.

దేహాన్ని రక్షించుకోవాలని అందరూ భావిస్తారు. శరీరానికి భద్రత కావాలి. అంటే, ప్రాణాన్ని నిలుపుకొనేందుకు, దేహాన్ని నిలబెట్టు కొనేందుకు మనిషికి ఆహార పానీయాలు కావాలి. శీతోష్ణాల నుండి రక్షించు కొనేందుకు బట్టలు కావాలి. వర్షాతపాల నుండి దేహాన్ని కాపాడు కొనేందుకు వసతి కావాలి. ఆహార, పానీయ, వసతి, వస్త్రాదులు అందరికీ అవసరమై ఉన్నాయి. అభద్రతా భావాన్ని తొలగించు కొనేందుకు అవసరమైన వీటన్నిటిని మనిషి ప్రయత్నంతో సాధిస్తాడు. అదే అర్థ మనే పురుషార్థము.

'అర్థ' ప్రయోజనాన్ని ఆశించి చేసే ప్రయత్నాలు మానవుల లోనే గాక సర్వ ప్రాణులలో కనిపిస్తాయి. మనిషి గృహం నిర్మించుకుంటే, గువ్వ గూడు కట్టు కుంటుంది. ఎలుకలు బొరియలు చేసుకుంటే, చీమలు పుట్టలు పెట్టుకుంటాయి. వండిన ఆహారాన్ని మనిషి తింటే, వంటబట్టే ఆహారాన్ని జంతువులు తింటాయి. నిలువ చేసుకొనే స్పృహ మానవుని లాగే జంతువులకూ ఉంది. కాకపోతే, ఎంత నిలువ చేసుకున్నా మనిషికి తృప్తి ఉండదు. ఈ విధమైన అసంతృప్తి జంతువులలో వెదకినా కనిపించదు. అదే తేడా.

అర్థ మనే పురుషార్థ సాధన ద్వారా ఏ భద్రతను మనిషి వాంఛిస్తున్నాడో అది మాత్రము లభ్యం కాదని తెలిసి మనిషి నిరాశలో కూరుకు పోతున్నాడు. అర్థాన్ని సాధించుకో గలడే గాని, అభద్రత నుండి విడివడ లేడు. దేహానికి ఎంత భద్రతను కల్పించినా, ఒకనాడు శ్మశానంలో గుంట తీసి దానిని భద్ర పరచక తప్పదు. ఈ విధంగా 'అర్థం' అనే పురుషార్థం పరమార్థం కాలేక పోతోంది.

కామం

'భద్రత' అనేది ఎలా 'అర్థం' అనే పురుషార్థానికి సంబంధించినదో, 'సుఖం' అనేది అలా 'కామం' అనే పురుషార్థం పరిధిలో చేరుతుంది. ఈ సుఖం దేహేంద్రియ మనోబుద్ధులలో దేని కైనా సంబంధించింది కావచ్చు.

దేహ భద్రతకు ఆహారం కావాలి అనేది 'అర్థం'. ఆహారం ఇలాంటిదే కావాలి, అలాంటిదే ఉండాలి అనేది 'కామం'. ఇది భద్రతకు సంబంధించింది కాదు; సుఖానికి సంబంధించింది.

పడుకోవడానికి పడక అవసరం. అది అర్థం. మెత్తని దూది పరుపే కావాలి అనేది కామం. ఉండటానికి ఇల్లు అవసరం. అది అర్థం. అది రమ్యమైన హర్మ్యమే కావాలి అనేది కామం. సుఖ భోగాలకు సంబంధించిన విషయం.

ఆహారం, నిద్ర, వసతి, వస్త్రాదులే కాకుండా, మనిషికి రుచులు కావాలి. అవి కూడా అభిరుచులకు అనుగుణంగా ఉండాలి. అంతేకాదు, ఉల్లాసాలు, విలాసాలు, వినోదాలు, వికాసాలు - ఇలా ఎన్నో కావాలి.

అందాలు కావాలి, ఆభరణాలు కావాలి, విహారం కావాలి, సంగీతం కావాలి, ప్రేమలు కావాలి, శృంగారాలు కావాలి, నృత్యాలు కావాలి, సఖ్యాలు కావాలి, ఆటలు కావాలి, పాటలు కావాలి, పువ్వులు కావాలి, నవ్వులు కావాలి. ఇవన్నీ భద్రత కొరకు కాదు. సుఖం కొరకు. కనుక ఇవి 'అర్థం' అనే పురుషార్థం క్రిందికి రావు. సుఖానికి సంబంధించిన 'కామం' అనే పురుషార్థం క్రిందికి వస్తాయి.

కామ పురుషార్థంలో కూడా పశుపక్ష్యాదులు మానవుల లాగే వర్తిస్తున్నాయి. వాటికీ సుఖాలు, వినోదాలు ఉన్నాయి. కోతి ఆడుతుంది. కోయిల పాడుతుంది. నెమలి నాట్యం చేస్తుంది. నక్క ఊల వేస్తుంది. పడుకోవడానికి పక్షి మెత్తని గూడు నిర్మించు కుంటుంది. వాటికీ మన లాగే ఆట లున్నాయి. పాట లున్నాయి. అనుకున్నవి జరగ నపుడు, అనుకోనివి జరిగి నపుడు కలత లున్నాయి. కళ్ళల్లో నీళ్ళున్నాయి.

సుఖా న్నిస్తుందని ప్రాణులు, మానవులు 'కామ' పురుషార్థాన్ని ఆశ్రయిస్తారు. కానీ, అక్కడ కూడా మనిషికి నిరాశే ఎదు రవుతోంది. సుఖాన్నిచ్చే వస్తువు ఎప్పుడూ సుఖాన్నిచ్చే స్థితిలో ఉండదు. అలాగే ఒక వస్తువుతో, ఒక విషయంతో ఒక సమయంలో సుఖపడిన వ్యక్తి, అదే వస్తువుతో, అదే విషయంతో అన్ని కాలాలలో సుఖపడలేక పోతున్నాడు. ఈ దృశ్యమాన జగత్తులో సుఖ స్థానాలన్నీ క్షర మయ్యేవే. క్షయ మయ్యేవే. ఏది సుఖ హేతువో ఎంతకూ మనిషికి అంతు పట్టడం లేదు. ఈ విధంగా 'కామం' అనే పురుషార్థం పరమార్థం కాలేక పోతోంది.

ధర్మం

ధర్మ మనే పురుషార్థంలో నైతిక మైన అవగాహన ఉంది. ధార్మిక చింతనము చోటు చేసుకొని ఉంది. ఇది వివేకానికి సంబంధించిన విషయం. విచారించే బుద్ధి కరువై, కేవలం సహజాతాలపై ఆధారపడి జీవించే జంతుజాలము ఈ ధర్మ పురుషార్థం వద్దకు చేర లేవు. ఇది కేవలం వివేకవంతు లైన మానవులకే సంబంధించిన పురుషార్థము. మొదటి రెండు పురుషార్థాలైన అర్థకామాలను సాధించు కోవడంలో మనిషి సన్మార్గం లోనే చరించాలి. ఋజుమార్గం లోనే పయనించాలి. ఇదే ధర్మజీవనము. చతుర్విధ పురుషార్థాలలో మూడవ పురుషార్థము.

నా విషయంలో ఇతరులు ఎలా ఉండాలని భావిస్తానో, నేను ఇతరుల విషయంలో అలాగే ఉండాలి. నా విషయంలో ఇతరులు ఎలా ప్రవర్తించ కూడదని నేను ఆశిస్తానో, నేను ఇతరుల విషయంలో అలా ప్రవర్తించకుండా జీవించాలి. ఇదే ధర్మస్పృహ. ధర్మమార్గము. ధర్మాన్ని ఎట్టి పరిస్థితుల లోను మానవులు అతిక్రమించ కూడదు.

దారి తప్పిన వారిని శిక్షించేందుకు, లేదా సంస్కరించేందుకు చట్టా లున్నాయి. దారి తప్పిన మనిషి చట్టాన్ని కూడా తప్పించుకొనే ప్రయత్నం చేస్తాడు. మనిషి చట్టం కళ్ళు కప్పి తప్పించు కోవచ్చు. కానీ, ధర్మం, దైవం కళ్ళు కప్పలేడు అంటూ మతం రంగ ప్రవేశం చేస్తుంది.

మానవులు ప్రపంచంలో స్థూలంగా కర్మలను ఆచరిస్తారు. కర్మాచరణానికి ముందు కర్మ చేయాలి అనే భావం మనస్సులో ఉంటుంది. భావం అంకురించనిదే కర్మ ఆచరింప బడదు. భావము కూడా కర్మే. మానస కర్మ. స్థూల కర్మకు స్థూల ఫలితం ఎలా ఉంటుందో, భావన అనే సూక్ష్మ కర్మకు సూక్ష్మ ఫలితం ఉంటుంది. ఈ సూక్ష్మ ఫలితాలే పాపపుణ్యాలు.

కర్మలు మానవాధీనాలు. ఫలితాలు దైవాధీనాలు. చట్టాన్ని మనిషి తప్పించు కోవచ్చు. కాని, పాపాన్ని తప్పించుకో లేడు. మానవ నిర్మితమైన చట్టం మనిషికి న్యాయం చేయక పోవచ్చు. కానీ పుణ్యఫలం అతని కొరకు నిరీక్షిస్తూనే ఉంటుంది.

ధర్మం పవిత్రమైంది. ధర్మం దైవానికి ప్రతిరూపము. అర్థకామాలను వాంఛించే వారు ధర్మబద్ధంగా జీవించడం అలవరచు కోవాలి. ధర్మంతో కూడిన కామం, ధర్మబద్ధమైన అర్థం సుఖశాంతుల్ని పెంపొందిస్తాయి.

ధర్మాஉ విరుద్ధో భూతేషు
కామోஉ స్మి భరతర్షభ! - అర్జునా! ధర్మానికి విరుద్ధము కాని కామము నేనే అని గీతాచార్యుడు గీత - విజ్ఞాన యోగంలో చెబుతాడు.

ధర్మము అమృతము వంటిది. అది బ్రతుకుకు జీవం పోసి బ్రతికిస్తుంది. అధర్మం విషం లాంటిది. అది బ్రతుకును విషతుల్యం చేసి అంతం చేస్తుంది.

దుర్యోధనునికి రాజ్యం కావాలి. ఆ మాట కొస్తే, ధర్మరాజుకి రాజ్యం అవసరం లేదా? అదే వాస్తవ మైతే, కురుక్షేత్రం రణరంగ మయ్యే దేనా? రాజ్యం ఇద్దరికీ కావాలి. రాజ్య సుఖాలు కూడా ఇద్దరికీ కావాలి.

'కావాలి' అనే కాంక్ష ఇద్దరిలో ఉంది. కానీ, అదేదో, ధర్మబద్ధం గానే ప్రాప్తించాలి అంటాడు ధర్మరాజు. అధర్మంతో నైనా సరే ప్రాప్తించడమే ముఖ్యం అనుకుంటాడు దుర్యోధనుడు.

అధర్మంతో చరించిన దుర్యోధనుడు తాత్కాలికంగా సుఖించినా, చివరికి దుర్గతిని పొంది శాశ్వతంగా అపకీర్తి పాలయ్యాడు.

ధర్మమార్గాన చరించిన ధర్మరాజు, తాత్కాలికంగా వ్యథ చెందినా, చివరికి సద్గతిని పొంది శాశ్వతంగా కీర్తి మంతుడై శోభించాడు.

అధర్మ పరుడైన దుర్యోధనుణ్ణి అపజయం వాటేసుకుంది
ధర్మమూర్తి యైన ధర్మరాజును విజయం వరించింది.

యతో ధర్మః తతో కృష్ణః
యతో కృష్ణః తతో జయః - ధర్మ మెక్కడ ఉంటుందో దైవం అక్కడే ఉంటుంది. దైవం ఎక్కడ ఉంటుందో, జయం అక్కడే ఉంటుంది అని మహాభారత సూక్తి. వేదవ్యాస మహార్షోక్తి. మహాత్ము లందరికీ దివ్యస్ఫూర్తి.

ఇంత వరకు మనం చెప్పుకున్న మూడు పురుషార్థాలలో అగ్రస్థానము ధర్మానిదే. ద్వితీయ స్థానం అర్థం కాగా, చివరిది కామం. అందుచేత ధర్మార్థకామాలు అంటాము. అవి త్రివర్గములు.

సాధారణంగా ఈ మూడు పురుషార్థాలే ఎక్కువగా మానవుల్ని ఆకర్షిస్తూ ఉంటాయి. మానవులు కూడా ఎక్కువ శాతం ఈ మూడిటినే అనుసరిస్తూ ఉంటారు.

ఇక నాల్గవ పురుషార్థము మోక్షము. దీనిని వాంఛించే వాడు ముముక్షువు.

ఇది చివరి పురుషార్థము. మోక్ష రూపమైంది. దీనిని అందరూ ఆశ్రయించ లేరు. ధర్మార్థ కామాలలో దాగి ఉన్న పరిమితాలను అర్థం చేసుకున్న వారే పరమ పురుషార్థమైన మోక్షాన్ని ఆశిస్తారు.

కేవలం ధర్మార్థ కామాల పరిధిలో మనిషి సంతృప్తి చెంద లేడు. అతని సమస్య లౌకిక మైంది కాదు. పారమార్థికమై ఉంది. అసంతృప్తిని భరించే స్థితిలో ఏ వ్యక్తీ లేడు. పరిమితాలను సహించే స్థితిలో ఏ మనిషీ లేడు. అభావాన్ని అంగీకరించ లేడు. అజ్ఞానాన్ని భరించ లేడు. దుఃఖాన్ని సహించ లేడు. సర్వానర్థాల నుండి విడిపడా లనేదే అతని కోరిక. ఈ కోర్కెను తీర్చే శక్తి ధర్మార్థ కామాలకు లేదు. ఈ సత్యం అర్థమైన వెంటనే వ్యక్తి నాల్గవ పురుషార్థం వైపు తిరుగుతాడు. అదే మోక్షం. సర్వబంధ వినిర్ముక్త స్వరూపం.

మోక్షం

మోక్ష మనేది సహజమైన స్వేచ్ఛ. అందరూ కోరుకునే విముక్తి. అందరూ వాంఛించేది ఇదే అయినా, కొందరికి మాత్రమే ఈ విషయం తెలుసు. అయిష్టమైన దానిని ఎవ్వరూ భరించ లేరు. పంజరంలో ఉంచితే పక్షి కూడా యాతన ననుభవిస్తుంది. బయట పడాలని తపన చెందుతుంది. విడుదల కావాలని గిల గిల తన్ను కుంటుంది. పంజరంలో ఉండటం బంధం. విడుదల కావటం మోక్షం.

కారాగృహంలో బంధింప బడిన ఖైది ఏం కోరుకుంటాడు? అతనికి చాలా అవసరాలు ఉండొచ్చు. కానీ అతడి ముఖ్యావసరం, అతడు వాంఛించే ప్రధాన ప్రయోజనం విడుదల మాత్రమే. అదే విముక్తి. అదే మోక్షము.

ఆత్మానం పాశేభ్యః మోచయతీతి మోక్షః

జీవుని బంధము నుండి విడిపించేది ఏదో, అదే మోక్షము.

బంధము నుండి విడిపడాలి అనే వాంఛ అందరిలో ఉంది. అదే అందరిలో ప్రధాన వాంఛ. జీవు లందరూ ఆశించే ముఖ్య ప్రయోజనం అదే. అందుకే అది పరమ పురుషార్థ మైంది.

ఇంతకీ, మోక్ష మంటే పొందడమా? విడి పడటమా? అనే ప్రశ్న ఈ దశలో ఉదయిస్తుంది. నిజమే. పొందినట్లే అనిపిస్తున్నా, వాస్తవానికి పోగొట్టుకున్నట్లే ఉంది. ఖైది స్వేచ్ఛను పొందినాడు అంటాము. కానీ, యథార్థానికి అతడు బంధము నుండి విడి పడ్డాడు. అదే విముక్తి. మోక్షం కూడా అలాగే కనిపిస్తూ ఉంది.

బంధము ఏదో కాదు. దుఃఖాన్ని కలిగించేది ఏదైనా బంధమే. అందుకనే, బంధాన్ని ఎవ్వరూ భరించ లేరు. దుఃఖాన్ని కలిగించే బంధము నుండి విడి పడాలని కోరుకుంటారు. అదే మోక్షేచ్ఛ. విముక్తిని అభిలషించే ప్రగాఢ వాంఛ. దుఃఖం నుండి, అసంతృప్తి నుండి శాశ్వతంగా విడి పడాలనే ఆశ. ఏకైక ఆకాంక్ష.

దుఃఖాదీనాం మోక్షణం అవసానం మోక్షః

దుఃఖాదుల యొక్క వినాశమే మోక్షము.

దుఃఖాన్ని కలిగించేది బంధమైతే, సుఖాన్ని కలిగించేది మోక్షము. అదే బంధ విముక్తి. అసంతృప్తి బంధమైతే, అసంతృప్తి నుండి శాశ్వతంగా విడిపించి నిత్యతృప్తిని ప్రసాదించేది మోక్షము. అదే అందరూ ఆశించేది.

తృప్తః భవిష్యామి

నేను తృప్తిని పొందాలి. తృప్తుడనై ఉండాలి. ఇదే అందరి అభిలాష. కానీ, నేను తృప్తి చెందాలి అని ఎవరైతే అంటున్నారో, వారు ఎవరైనా సరే, ప్రస్తుతం అసంతృప్తిలో ఉన్నారని అర్థము. అంతేకాదు. అసంతృప్తిని భరించ లేక దాని నుండి విముక్తిని పొందాలని కోరుకుంటున్నారని భావం.

అసంతృప్తి వలన కలిగే దుఃఖాన్ని మనిషి భరించలేక పోతున్నాడు. ఇదే బంధము. దాని నుండి విడుదల పొందాలని యత్నిస్తున్నాడు. అదే మోక్షము.

అసంతృప్తి

మనిషికి ఎన్ని ఉన్నా, ఎంత ఉన్నా, ఎందరున్నా, వాటితో పాటు ఏదో లేదు అనేది కూడా ఉంటుంది. అదే అసంతృప్తి. ఆంతర్యంలో ఏదో అసౌకర్యం. అసంపూర్ణత. దానిని హాయిగా, ఆనందంగా భరించ గలిగితే ఏ సమస్య ఉండదు. అసంతృప్తిని మనిషి క్షణ కాలం కూడా భరించలేక పోతున్నాడు. కారాగృహం నుండి విడుదల పొందాలని ఖైదీ ఎలా తపిస్తున్నాడో, అసంతృప్తి నుండి, దుఃఖం నుండి విడిపడాలని ప్రతి మనిషి అలా పరితపిస్తున్నాడు.

కిం అస్మాభిః దీనైః కరణీయం?

ఈ దీన స్థితి నుండి బయట పడటానికి మేము ఏమి చేయాలి? అని అందరూ ఆవేదన చెందు తున్నారు. ఈ వెలితి తొలగే మార్గ మేదో తెలియక అలమటిస్తున్నారు.

ఇదొక విచిత్రమైన సమస్య. వింత సమస్య. తృప్తి ఎక్కడుందో అర్థం గాని సమస్య. ఎవరూ ఎవరినీ తృప్తి పరచలేని ఈ జగత్తులో తృప్తిని పొందాలని జల్లెడ చేత పట్టుకొని గాలిస్తున్నాం. ప్రయత్నాలు విస్తరిస్తున్నాయే గాని ఫలితాలు వెలుగు చూడటం లేదు. వెలితి . . వెలితి . . వెలితి. ఎప్పుడూ ఇదే పరిస్థితి. ఎవరి కైనా ఇదే గతి.

ఏది ఉన్నా వెలితే. ఏది లేకపోయినా వెలితే.
ఎవరు ఉన్నా వెలితే. ఎవరు లేకపోయినా వెలితే.
ఇక్కడున్నా వెలితే. అక్కడున్నా వెలితే.
ఇప్పుడైనా వెలితే. అప్పుడైనా వెలితే.
అనుకూలంలో వెలితే. ప్రతికూలంలో వెలితే.

ప్రయత్నించి లేని దానిని పొందుతాము. లేని దానిని పొందుతామే గాని 'లేదు' అనే దానిని పోగొట్టుకోలేము. 'లేదు' అనేదే మనస్సులో ఉన్నప్పుడు, ఏది ఉండి మాత్రం ఏమి ప్రయోజనం? అందుకే అందరూ అసంతృప్తితో అలమటిస్తూ ఉన్నారు. భాగ్యా లొస్తే తృప్తిగా జీవించ వచ్చు అనుకుంటారు పేదలు. బాధలు తీరితే సుఖంగా బ్రతకవచ్చు అనుకుంటారు ధనికులు. ఎవరికి ఏదుందో, ఏది లేదో తెలియదు గాని, అసంతృప్తి మాత్రం అందరికీ ఉంది. ఆవేదన అందరికీ ఉంది. అశాంతి అందరికీ ఉంది.

సుఖప్రాప్తి

ఇష్టప్రాప్తి అనిష్ట నివారణ చికీర్షా
స్వాభావికా సర్వ ప్రాణిషు దృష్టత్వాత్

ఇష్టమైన దానిని పొందడము, అయిష్టమైన దానిని విడిచి పెట్టడము అనే కోరిక సర్వ ప్రాణులలో సహజంగా కనిపిస్తూ ఉంటుంది. ఇష్టమైన దేదో అది సుఖ మని, అయిష్ట మైనది అసుఖం అని అందరూ భావిస్తుంటారు.

మనం ఈ ప్రపంచంలో దేనిని ఆశించినా, అది సుఖ మని భావించి దానిని కోరుకోవడం లేదు. అది సుఖ హేతువు అని భావించి దానిని పొందు తున్నాము. ఏది సుఖహేతువు అని భావించి మనం ఆశించి పొందుతామో, అది సుఖ కారణం కాదు అని తెలియగానే ఆ క్షణం లోనే దానిని త్యజిస్తాము.

సుఖం అనేది ఒక వస్తువు కాదు. సుఖ మనేది వస్తువే అయితే, ఆ వస్తువు అందరికీ సుఖా న్నిచ్చేదై ఉండాలి. అలాంటి వస్తు వేదీ ప్రపంచంలో గోచరించడం లేదు.

సుఖ మనేది కాలం కాదు. ప్రపంచంలో సమయాలు తెలుస్తున్నాయే గాని, ఏవి సుఖ సమయాలో తెలియడం లేదు. ఆనంద కాలాలు ఎంత అన్వేషించినా అంతు పట్టడం లేదు. రాహువు ఎక్కడున్నాడో తెలుస్తున్నాడు కనుక రాహుకాలం ఉంది. సుఖ మెక్కడుందో తెలియడం లేదు కనుక సుఖ కాలం తెలిసి రావడం లేదు.

సుఖ మనేది ప్రదేశమూ కాదు. సుఖం ఇక్కడ లేక పోవచ్చు. అలాగని, అక్కడుంది అని చెప్పడానికి ఆధారాలు లేవు. ఎక్కడి కెళ్ళినా, ఏ ప్రదేశాన్ని చేరినా అన్నీ ఎండమావులే. అందుకనే ఆరాధనాస్థలాలు ఆదాయ కేంద్రాలుగా మారిపోతూ ఉంటే, ఆశ్రమ ప్రదేశాలు ఆవేదనా నిలయాలుగా గోచరిస్తున్నాయి.

సుఖ మనేది సన్నివేశమూ కాదు. ప్రపంచంలో సంఘటనలు, సన్నివేశాలు ఉన్నాయి. సుఖ సన్నివేశాలు లేవు. ఒకే సన్నివేశం కొందరికి సుఖాన్ని, కొందరికి దుఃఖాన్ని పంచడానికి కూడా కారణం సుఖం సన్నివేశానికి సంబంధించింది కాక పోవటమే.



ఇంతకీ ఏది సుఖం? ఎక్కడుంది?
ఏది సుఖ కారణం? అదెక్కడుంది?

ప్రయత్నాలు - ఫలితాలు

అన్తవత్తు ఫలం తేషాం
తద్భవ త్యల్ప మేధసామ్

వివేకం అల్పంగా ఉండేవారు
పొందే ఫలం కూడా స్వల్పం గానే ఉంటుంది.

ప్రియమైన వస్తువులో సుఖం ఉంటుంది. కానీ, ఏది మనకు ప్రియవస్తువో మనకే అర్థం కావడం లేదు. ఇక సుఖపడే దేముంటుంది? ఒక కాలంలో ప్రియ మైనది మరొక కాలంలో ప్రియంగా లేదు. ఒక ప్రదేశంలో ప్రియంగా అగుపించింది, మరొక ప్రదేశంలో ప్రియంగా అగుపించదు.

యత్నించి, శ్రమించి మనం ఏవో ఏవో పొందు తున్నాము. ప్రయత్నించి, పరిశ్రమించి ఏవో ఏవో పోగొట్టు కుంటున్నాము. మన యత్నంలో ఏదైనా రావచ్చు; సుఖం మాత్రం రాదు. మన ప్రయత్నం వల్ల ఏదైనా పోవచ్చు; దుఃఖం మాత్రం పోదు.

ఒకవేళ ఎక్కడైనా, ఎప్పుడైనా సుఖం కొద్దో గొప్పో ప్రాప్తించినా, అది దుఃఖమిశ్రితం గానే ఉంటుంది. దుఃఖాలు తెలియని సుఖాలు ప్రపంచంలో లేవు. నష్టాలు తెలియని లాభాలు కాగడా పెట్టి వెతికినా కనిపించవు.

నిజం చెప్పాలంటే, లాభాల ముసుగులో
వచ్చే వన్నీ నష్టాలే.
రాబట్టుకొనే వన్నీ పోగొట్టు కొనేందుకే
వాటేసుకునే వన్నీ కాటేసి పోయేందుకే.

వచ్చేవి ఏవయినా పోయేందుకే వస్తాయి
ఉన్నవి ఏవయినా పోయేందుకే ఉంటాయి.

అన్నీ పోతున్నాయి. అందరూ పోతున్నారు. తల్లిదండ్రులు పోతున్నారు. బిడ్డలు పోతున్నారు. భార్యలు భర్తల్ని పోగొట్టు కుంటున్నారు. భర్తలు భార్యల్ని పోగొట్టు కుంటున్నారు. ఉద్యోగాలు ఊడి పోతున్నాయి.

పదవులు పారి పోతున్నాయి. ధనం ఖర్చై పోతూ ఉంది. ఆరోగ్యం క్షీణించి పోతూ ఉంది. పళ్ళు ఊడి పోతున్నాయి. వెంట్రుకలు రాలి పోతున్నాయి. చూపు మారి పోతోంది. వినికిడి జారి పోతోంది. ఆయుష్షు కారి పోతోంది.

పరిశ్రమించి పొందిన వాటిని
ఎంత శ్రమించినా నిలుపుకోలేక పోతున్నాము.

ప్రయత్నించి పోగొట్టుకున్న వాటిని
తిరిగి రాకుండా ఆపు చేయలే కున్నాము.

పొందినవి సుఖాలే అయితే, అవి ఉన్నప్పుడు మనం సుఖంగా ఉండాలి. పోయినవి దుఃఖాలే అయితే, అవి పోగానే దుఃఖం కూడా దూరం కావాలి. కానీ, రెండూ జరగడం లేదు.

మన ప్రయత్నాలతో ఎలాగూ సుఖపడలేక పోతున్నాం. పోనీ, ఇతరుల కారణంగా నైనా సుఖపడే అవకాశం ఉందా? ఇది మరీ దారుణం! మన సుఖం పరులపై ఆధారపడి ఉండే దయితే, మన సుఖాన్ని నిర్ణయించే వారు పరు లవుతారు. అదే నిజమైతే, మనం సుఖపడట మనేది కుందేటి కొమ్మే.



ప్రియ వస్తువు - సుఖ స్థానం

అస్మాకం అప్రత్యక్ష మపి
చిరంతనానాం ప్రత్యక్షమ్

మనకు స్పష్టం కాని సత్యము
మన పూర్వీకులకు సుస్పష్టము.
ఇది శంకలకు తావు లేని బాట
కారణం, ఇది శ్రీ ఆదిశంకరుల మాట.

ఏది ప్రియమో, ఏది సుఖమో, ఏది ప్రియ వస్తువో, ఏది సుఖ స్థానమో తెలియక తికమక పడుతున్నాం. 'మన' అనే దానిలో సుఖ ముందా? మనలో సుఖముందా? మనమే సుఖమా? లేక సుఖమే మనమా?

'నేను ఇప్పుడు సుఖంగా లేను' అంటే, ఈ పరిస్థితికి ముందు సుఖంగా ఉన్నాను అని భావము.

'నేను ఇప్పుడు సుఖంగా ఉన్నాను' అంటే, ఈ పరిస్థితికి ముందు సుఖంగా లేను, సుఖాన్ని ఆశించే వాడుగా ఉన్నాను అని అర్థం.

దీనిని బట్టి చూస్తే, 'నేను సుఖ పడుతున్నాను', 'నేను సుఖ పడ్డాను' అనే వాక్యాలు సుఖం చుట్టు తిరుగుతూ ఉన్నాయే గాని నిత్యసుఖానికి సంబంధించి మాత్రం లేవు. సుఖస్థానం తెలిసినవి కానే కావు.

ఒక కారణంగా, ఒక సమయంలో కలిగే సుఖం నిత్యసుఖం కాదు. దానిని నైమిత్తిక సుఖం అంటారు. సుఖానికి నిమిత్తం ఉంది కనుక, నిమిత్తం దూరమైతే సుఖం జారి పోతుంది. అలాంటి సుఖం కూడా సుఖమే. కానీ, అది అల్పసుఖం. అనిత్య సుఖం. నిత్యసుఖం మాత్రం కానే కాదు.

నిమిత్తాపాయే నైమిత్తి కాపాయః
ఛత్రోపాయే ఛాయోపాయః

సుఖ కారణం పోతే సుఖం పోతుంది.
గొడుగు దూరమైతే నీడ దూర మవుతుంది.

లేకుండా వచ్చి కలిసేది, ఉండి లేకుండా పోయేది నిత్యసుఖం కాదు. అనిత్య సుఖ మేదైనా, అప్రియంగా మారేదే. అప్రియ మైనది నిత్య సుఖస్థానం కాలేదు. కనుక నిత్య సుఖము, నిత్య ప్రియత్వము అనే మోక్షము ప్రయత్నాల పరిధి లోనిది కాదు. కర్మఫలం కాబోదు.

కర్తవ్యేన సాధ్యశ్చేత్
మోక్షః అభ్యుపగమ్యతే
అనిత్య ఏవస్యాత్ !

కర్మ ద్వారా సాధించే ఫలితమే మోక్ష మయ్యేటట్లైతే, అట్టి మోక్షము కూడా అనిత్యమే అవుతుంది అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరులు.

ఇంతకీ, ఏది ప్రియవస్తువు?
ఎక్కడ సుఖ స్థానము?

కర్మఫలంగా ప్రాప్తించేది ఏదీ ప్రియవస్తువు కాదు. పరిమితంగా ఉండేది ఏదీ సుఖస్థానము కాదు.

ప్రియవస్తువు ఏదో అది ఏ పరిస్థితుల లోను అప్రియం కాకూడదు. అప్పుడే అది ప్రియవస్తువు అవుతుంది.

అప్రియంగా మారకుండా సదా ప్రియంగా ఉండేది ఏదైనా ఉందేమో ఆలోచించండి. దానిని కనిపెట్ట గలిగితే అదే నిత్యసుఖం కనుక, సుఖస్థానాన్ని కూడా కనిపెట్టిన వాళ్ళ మవుతాము.

ఎవరికి ఏది ప్రియమో, ఏది అప్రియమో నాకు తెలియదు. నీకు ఏది ఇష్టమో, ఏది అయిష్టమో నేను చెప్పలేను. నీకు నీవు సదా ఇష్టమే అని మాత్రం చెప్పగలను. నీకు నీవు ఎప్పుడూ అయిష్టుడివి కావు అని భేరీ మ్రోగించి మరీ చెప్పగలను. నీకు నీవు ఎలా ఇష్టమో, నాకు నేను అలా ఇష్టము. నీకు నీవు ఎలా ప్రియమో, నాకు నేను అలా ప్రియము.

కదాచిన్నాహం అప్రియః

నాకు నేను ఎప్పుడూ అప్రియం కాను.

ఇంకే ముంది? దొరికి పోయింది చిరునామా. ప్రియవస్తువు ఏదో తెలిసి పోయింది. సుఖ స్థాన మెక్కడో అర్థమై పోయింది.

ప్రియవస్తువు ఏదో కాదు, నీవే. సుఖస్థానం ఎక్కడో లేదు, నీవే. అది నీవే **(తత్త్వమసి)** ప్రియవస్తువు నీవే అని తెలియక పోవడం చేత, అది ఎక్కడో ఉందని స్తనశల్య పరీక్ష చేస్తూ ప్రపంచ మంతా గాలించి మరీ అన్వేషించావు.

ప్రియత్వము అనేది వస్తువుకు సంబంధించింది కాదు. సుఖస్థాన మనేది దృశ్య ప్రపంచం కానే కాదు అని తేలి పోయింది. దృశ్య విషయ మంతా నిషేధింప బడిన తరువాత, ఇక ప్రియవస్తువుగా ఒక్కటే మిగిలింది. అదే నీవు. **విషయి.** నీవే ప్రియ వస్తువు. నీవు నీకు ప్రియం కనుకనే ఏవైనా నీకు ప్రియంగా గోచరిస్తున్నాయి.

ఆత్మ నస్తు కామాయ
సర్వం ప్రియం భవతి

ఏది నీకు ప్రియంగా గోచరించినా ప్రియత్వానికి హేతువు నీవే. ఇది అర్థమైతే, ఇంకెక్కడి అసంతృప్తి? అర్థం కాకపోతే ఎలా వస్తుంది తృప్తి?

తెలియనంత వరకు లేనట్లే ఉంది. తెలియగానే లేని దెప్పుడు? అని ఆశ్చర్యం కలుగుతోంది.

చరణము : **కట్టినాను నీ కొరకే**
పూలగూడు నా మదిలో
వచ్చెద వని ఎదురు చూచితిని
వచ్చి ఉంటివని ఎరుగ నైతిని
పల్లవి : **నీ చరిత పాడుకోనా!**
మనసార వేడుకోనా!
అనుపల్లవి : **నా శ్రమలు తీరిపోగా**
తొలి భ్రమలు పారిపోగా ॥ నీ చరిత ॥

అని చైతన్య రవళి నినదించింది ఇక్కడే. అక్కడే బ్రహ్మమును లేదా మోక్షమును పొందాలి అన్నది ఉపనిషత్తు **(అత్ర బ్రహ్మ సమశ్నుతే).**

ఉన్నది - తెలియనిది

ఆనందాబ్ధిః యత్పరః
సోఽ హమస్మి

'ఏది ఆనంద సాగరమో
అది నేనే' అన్నది ఉపనిషత్తు.

ఆనంద స్వరూపమైన ఆత్మయే సుఖహేతువు అనేది తెలియని కారణంగా, అనాత్మ విషయాలైన వస్తువులను సుఖహేతువులుగా భావించి వాటిని ప్రియ వస్తువులుగా స్వీకరిస్తున్నాం. ప్రియం గాని వాటిని ప్రియంగా భావించడానికి కారణము ప్రియ వస్తువైన ఆత్మ తెలియక పోవడమే. ఆత్మ తెలియడం లేదు అంటే, ఆత్మ లేదని అర్థమా? లేనిది అయితే, తెలియడం లేదు అని ఎలా చెప్పగలం? కనుక, ఆత్మ ఉన్నదే; తెలియకుండా ఉన్నది.

ఉండి తెలియక పోవడం అజ్ఞానము. అదే బంధము.
ఉన్నది ఉన్నట్లు తెలియడం జ్ఞానము. అదే మోక్షము.
తెలిసీ తెలియని తనము ముముక్షుత్వము. మోక్షేచ్ఛకు కారణము.

నీవే ఆత్మ. నీవే సుఖం. నీవు సుఖించ డానికి ఏదీ అవసరం లేదు. కోరికలు తీర నవసరం లేదు. కోరికలు తీరడం వల్ల కాదు సుఖం కలిగేది; కోరికలు లేని వాడుగా ఉండటం వల్ల.

కోరిక మనస్సులో కదలక ముందు నువ్వు సుఖం గానే ఉన్నావు. కోరిక తీరిన తరువాత మళ్ళీ సుఖంగా కనిపిస్తున్నావు. ఎక్కడ కోరిక లేకుండా నీవు నీవుగా ఉన్నావో, అక్కడే నువ్వు సుఖంగా ఉన్నావు. నీవు సుఖరూప మైన ఆత్మవు అనడానికి ఇదొక ఆధారము.

అలాగే, గాఢనిద్రలో నువ్వు సుఖానుభూతిలో ఉన్నావు. కారణ మేమిటి? అక్కడ కోరిక తీరడం కాదు; కోరిక లేకపోవడం. అమనస్కం కావడం. నీ స్వరూపాన్ని, స్వరూపానందాన్ని భగ్నం చేసే కోరికలు, సంకల్పాలు లేనపుడు నీవు సుఖానుభూతిని పొందుతున్నావు. అదే స్వరూపానుభూతి. అది ఉన్నదే కాని లేనిది కాదు. ఉన్నదే కాని, ఉన్నట్లు తెలియకుండా ఉంది. కనుక ఏదో లేకపోవడం బంధ కారణము కాదు. ఉన్నది తెలియక పోవడమే బంధ హేతువు. తెలియక పోవడం అజ్ఞానము. అజ్ఞానమే బంధము. అజ్ఞానము బంధ మైనందున జ్ఞానమే మోక్షము.

కనుక, సమస్య ప్రపంచానికి సంబంధించింది కాదు. సమస్య వ్యక్తికి సంబంధించింది. వ్యక్తి మీదనే కేంద్రీకృతమై ఉంది. తానేమిటో తనకు తెలియక పోవడము సమస్య. అదే బంధము. తానేమిటో తనకు తెలియడమే పరిష్కారము. అదే మోక్షము.

మనిషికి సమస్య లేదు.
మనిషే నిజానికి సమస్య.

సమస్య ఎక్కడుందో
పరిష్కారం అక్కడే ఉంది

పరిష్కార మేమిటో అర్థం కానంత వరకు సమస్య సమస్య గానే ఉంటుంది. వాస్తవానికి పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదు. సమస్య అనేది ఉంది అంటే, దానికి సంబంధించిన పరిష్కారము కూడా ఉంటుంది. అదేమిటో మనకు తెలియ నపుడు సమస్య ఒక్కటే ఉంటుంది. తెలిసిన మరుక్షణాన సమస్య, పరిష్కారము రెండూ లేకుండా పోతాయి.

సమస్యను బట్టే పరిష్కారం ఉంటుంది. సమస్య యొక్క స్వభావాన్ని బట్టే పరిష్కారము యొక్క స్వరూపము తెలుస్తూ ఉంటుంది.

కొన్ని సమస్యలకు పరిష్కారాలు సమస్యలకు బాహ్యంలో ఉంటాయి. కొన్ని సమస్యలకు పరిష్కారాలు సమస్యల లోనే దాగి ఉంటాయి.

దప్పిక సమస్యగా ఉందనుకోండి. దాహం తీర్చుకోవడమే పరిష్కారము. దప్పిక మనలో ఉంది. కానీ, పరిష్కారం బాహ్యంలో ఉంది. దాహాన్ని తీర్చే నీళ్ళు మనలో లేవు. మనకు బాహ్యంలో ఉన్నాయి. ఇదొక రకమైన సమస్యా పరిష్కారము.

మరొక సమస్య ఉంది. ఆ సమస్యకు పరిష్కారం బాహ్యంలో కాకుండా సమస్య తోనే ముడిపడి ఉంది. ముడి ఉన్నంత వరకు సమస్య ఉంటుంది. ముడి విప్పితే పరిష్కారం ఉంటుంది. సమస్య అదృశ్యం అవుతుంది. సందేహం అంతటితో అంత మౌతుంది.

భిద్యతే హృదయ గ్రంథిః
ఛిద్యన్తే సర్వ సంశయాః

హృదయ ముడి విడి పోతే
సంశయాలు పారి పోతాయి.
ముడి ఉందని చెప్పిన ముండకమే
ముడిని విప్పి లేదని చూపింది.

పొడుపు కథలలో చిక్కుముడులు వేసి, సరదాగా సమస్యలను పరిష్కరించుకొనే ప్రక్రియ మనకు తెలుసు. వాటిలో సమస్య లోనే పరిష్కారం నిగూఢంగా ఉంటుంది. విప్పితేనే గుట్టు బయట పడుతుంది.

కా శీతల వాహినీ గంగా?
గంగ ఎక్కడ ప్రవహిస్తూ ఉంది?
అనేది ప్రశ్న రూపంలో సమస్య.

కాశీ తల వాహినీ గంగా !
గంగ కాశీలో ప్రవహిస్తూ ఉంది
అనేది సమాధాన రూపంలో పరిష్కారము.

ఇంతకీ, మన సమస్యకు పరిష్కారం బాహ్యంలో ఉందా? లేక, అది కేవలం అంతరాలాప మేనా?

మన సమస్య బాహ్యానికి సంబంధించింది కాదు. కనుక, దానికి పరిష్కారము బాహ్యంలో లేదు. బంధము అనేది వ్యక్తిపై కేంద్రీకృతమై ఉంది. కనుక ఎక్కడ సమస్య ఉందో, అక్కడే పరిష్కార ముంది.

మనిషికి సమస్య లేదు. మనిషే సమస్య.
మనిషి సమస్యకు మనిషే పరిష్కారము.

తానే సమస్య - తానే పరిష్కారము

చిదంబరంలో నటరాజ స్వామి క్షేత్రపాలకుడు. ఆర్ద్రా దర్శనం చాలా విశిష్టమైన దని అక్కడ భావిస్తారు. ఆర్ద్ర అనేది నక్షత్రము పేరు అని మనకు తెలుసు. ఆర్ద్ర అంటే తడిసింది అని కూడా అర్థము.

ఆర్ద్రాదర్శనము మార్గశీర్షంలో పూర్ణిమ నాడు వస్తుంది. అది మంచు ఎక్కువగా కురిసే సమయం. కనుక చలి అధికంగా ఉంటుంది. చలి అధికంగా ఉండే ఆ రోజు, శివభక్తులు బ్రహ్మముహూర్త కాలంలో స్నానం చేసి, 'శివశివ' అంటూ వెళ్ళి నటరాజస్వామిని దర్శిస్తారు. విశేషమైన ఆర్ద్రా దర్శనంలో పులకరించి పరవశిస్తారు. ఒకవేళ భక్తులు పులకరించకుండానే పరవశించినా, చలి పని గట్టుకొని మరీ వారిని పులకరింప చేస్తుంది.

ఆర్ద్రా దర్శన సందర్భమును పురస్కరించుకొని ఒక కవి చమత్కరించిన అందమైన అద్భుతమైన శ్లోకం ఒకటుంది. ప్రస్తుతం మనం చర్చిస్తున్న 'సమస్య, పరిష్కారము ఒక్కచోటే' అనే అంశాన్ని ఈ శ్లోకం సోదాహరణంగా వర్ణించి వివరిస్తుంది.

శ్లో॥ మౌళౌ గంగా శశాంకౌ కరచరణ తలే శీతలాంగా భుజంగాః
వామే భాగే దయార్ద్ర హిమగిరి దుహితా చందనం సర్వగాత్రే
ఇత్థం శీతం ప్రభూతం కనక సభా నాథ! సోఢుం క్వ శక్తిః ?
చిత్తే నిర్వేద తప్తే యది భవతి న తే నిత్య వాసో మదీయే ॥

అది పరమేశ్వరుని విభూతి యైన మార్గశీర్షం (మాసానాం మార్గశీర్షోహం - గీత ; 10 వ అ - 35 వ శ్లో). బ్రహ్మ ముహూర్త కాలం. చీకటి తెరలు తొలగ లేదు. మంచు దట్టంగా కురుస్తోంది. చలి పులిలా వణికిస్తోంది. చిదంబరేశ్వరుని దర్శించాలని ఒక భక్తుడు ఆలయం లోకి భక్తితో ప్రవేశించాడు. దుర్భరమైన చలిని భరించలేక పోతున్నాడు. ప్రార్థనా మంత్రాలు ఉచ్చరిస్తూ ఉంటే, పదాలు పైకి వినిపించడం లేదు. పదాల శబ్దాలు కటకట మనే దంత ఘోషల మధ్య మరుగున పడి పోతున్నాయి. ఎలాగో శక్తిని కూడ గట్టుకొని పై శ్లోకాన్ని ఆ భక్తుడు అతి కష్టం మీద పలికాడు. శ్లోకం లోని మొదటి మూడు పాదాలు సమస్యను చక్కగా చూపెడుతూ ఉంటే, నాల్గవ పాదము పరిష్కారాన్ని దర్శింప చేస్తూ ఉంది. అపూర్వము, ఆశ్చర్యకరమైన ఈ శ్లోక భావాన్ని చూద్దాం.

చిదంబర క్షేత్రపాలకుడైన చంద్రమౌళీశ్వర స్వామిని తన హృదయ సింహాసనముపై ఆసీనుణ్ణి చేసి, స్వామిని దర్శిస్తూ కనక సభాపతిని వర్ణించడం ప్రారంభించాడు ఒక భక్తుడు.

పరమేశ్వరా! నీ సిగ జల, పుష్ప శోభతో ప్రకాశిస్తోంది. గంగమ్మ చల్లగా నిన్ను అభిషేకిస్తూ ఉంటే, చంద్రుడు సిగ పువ్వై శోభిస్తున్నాడు **(మౌళౌ గంగా శశాంకౌ).**

నటరాజా! నీ హస్తపాదాలను చల్లని, మెత్తని పాములు ఆభరణాల వలె చుట్టుకొని ఉన్నాయి **(కరచరణ తలే శీతలాంగాః భుజంగాః).**

పార్వతీశా! నీ ఎడమ పార్శ్వ మంతా హిమవంతుని తనయ, దయ గల చల్లని మా తల్లి హైమావతి పెనవేసుకొని ఉంది **(వామే భాగే దయార్ద్ర హిమగిరి దుహితా).**

హే చంద్రచూడా! నీ దేహ మంతా చల్లని చందనపు పూతలే **(చందనం సర్వ గాత్రే).**

హే త్రినేత్రధారీ! సాంబశివా! ప్రభూతమైన ఈ శీతాన్ని ఎలా సహిస్తున్నావు? దుర్భరమైన ఈ చలువను ఓర్చుకొనే శక్తి నీ కెలా వచ్చింది **(ఇత్థం శీతం ప్రభూతం కనక సభానాథ! సోఢుం క్వ శక్తిః) ?**

ప్రభో! మహేశ్వరా! తాపాలతో, పరితాపాలతో నిరంతరము సలసల కాగే నా హృదయమే కదా నీకు నిత్య నివాస స్థానము! **(నిత్య తప్తే నిర్వేద తప్తే మదీయ చిత్తే తే నిత్యవాసః).**

భక్తవత్సలా! భవహరా! కాకపోతే, నా హృదయంలో నువ్వు లేకపోతే **(యది న భవతి)** దుర్భరమైన ఆ శీతాన్ని సహించే శక్తి **(సోఢుం శక్తిః)** నీ కెక్కడిది **(క్వ) ?**

ఇదీ శ్లోక భావం.

మాసం మార్గశీర్షం. హిమంతో మహి కప్పబడి ఉంది. బాహ్యంలో ప్రభూతమైన చలి. దానికి తోడు సిగపై చల్లని గంగమ్మ. మరో వైపు చలువల చంద్రుడు. ఎంత దుర్భరమైన చలి! అదలా ఉంచితే, కరచరణాలకు చుట్టుకొని ఉన్న చల్లని పాములు కాటు వేయక పోయినా, దానికి ఏ మాత్రం తీసిపోకుండా జివ్వు మనిపిస్తూ ఉన్నాయి. ఇక వామ ఎక్కడుందో చూడండి! వామ భాగంలో చేరి పోయింది. తండ్రి హిమవంతుని తడినంతా ఒడి గట్టుకొని, కైలాసంలో కుడిపాదము ముందు పెట్టి ప్రవేశించిందే గాని, ఎడమ పార్శ్వ మంతా నేనే నని పెనిమిటిని పెనవేసుకొని అర్ధాంగి శబ్దానికి అర్థం చెప్పింది. ఈ చల్లని మహాశక్తిని ఎలా భరిస్తున్నాడో!

ఇది చాల దన్నట్లు, మధ్యే మధ్యే, పై నున్న ధారాపాత్ర నుండి అప్రయత్నంగా పైన పడుతున్న చల్లని ఉదకము. ఇక అర్చకులు ఊరకుంటారా! ఒడలంతా చందనం పట్టిస్తూ శీతలోపచారాలతో చలించి పోతుంటారు.

ఇంత చలిని ఎవరు భరిస్తారు?
ఇంత శీతాన్ని ఎలా భరిస్తారు? ఇదీ సమస్య. ఇక్కడికి శ్లోకం మూడు పాదాలు పూర్తి అయ్యాయి.

ఏం చెబుతాడు బాహ్యం నుండి చల్లని శివుడు?
లో నుండే అసలు గుట్టును మెల్లగా విప్పుతున్నాడు.

పలికేది గోపన్నే అయినా,
పలికించిన వాడు రామన్నట.
ఇక్కడా అంతే.

గుట్టపై నున్న వాడు గుండె గుహలో గుసగుస మన్నాడు.
గుట్టు వినిన వాడు గుర్తులు పట్టిస్తున్నాడు.



సర్వేశ్వరా! సర్వాత్మా!
నా హృదయం తాపాలకు నిలయము. పరితాపాలకు ఆలయము. నా గుండె అంతా గుబులే. అంతా దుఃఖాగ్నే. మోహ వ్యామోహాల శోకాగ్నే. వాటి మధ్యలో నన్ను ఉద్ధరించేందుకు చేరిపోయావా? **(ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి** - గీత; 18 వ అ - 61 వ శ్లో). మహాదుఃఖంతో సలసల కాగుతున్న నా హృదయంలో చలి కాచుకుంటున్నావా, చల్లని తండ్రీ! కాచుకో! ఇదే నీ చలికి చక్కని పరిష్కారము. నన్ను కాచేందుకు, బ్రోచేందుకు, చల్లగా చూచేందుకు ఏకైక తరుణోపాయము.

అర్థమైందా! దుఃఖ మనే సమస్య ఎక్కడుందో, దానికి పరిష్కారమైన ముక్తేశ్వరుడు కూడా అక్కడే, మూల స్థానేశ్వరుడుగా ఒదిగి ఉన్నాడు. సమస్య ఉన్న చోటే పరిష్కార ముంది. హృదయం లోనే సమస్య. హృదయం లోనే పరిష్కారము.

ఆత్మ - పరమాత్మ

ఆవయో రంతరం న విద్యతే
త్వమే వాహం అహమేవ త్వం

మనిద్దరికీ భేదం లేనే లేదు
నీవే నేను. నేనే నీవు.

పరమాత్మ హృదయం లోనే కాచుకొంటూ ఉన్నాడు. చలి కాచుకొంటూ ఉన్నాడు. నువ్వెక్కడున్నావు? హృదయం లోనే. పరమేశ్వరుడు ఎక్కడున్నాడు? హృదయం లోనే. ఇద్దరూ హృదయం లోనే ఎలా ఉన్నారు? ఒక్కరు గానే ఉన్నారా, లేక ఇద్దరుగా ఉన్నారా? నువ్వు పరమాత్మ కన్నా వేరుగా ఉన్నావా?

పరమాత్మ నీ కన్నా వేరని నువ్వు భావించ వచ్చు. కానీ, నువ్వు తన కన్నా వేరని పరమాత్మ అంగీకరించడు. మనిద్దరికీ **(ఆవయోః)** భేదం లేనే లేదు **(అంతరం న విద్యతే).** నీవే నేను **(త్వమే వాహం).** నేనే నీవు **(అహమేవ త్వం)** అని ఉపనిషద్వాణిని నీకు వినిపిస్తున్నాడు. అదే మహానారాయణోపనిషత్తు.

నారాయణుడు, నరుడు ఒక్క చోటే ఉన్నారు. కృష్ణార్జునులు ఒకే రథంలో ఉన్నారు. జీవేశ్వరు లిరువురూ శరీర మనే రథం లోనే ఉన్నారు **(శరీరం రథ మేవ** - కఠోపనిషత్తు).

నారాయణమూర్తిని వైకుంఠానికి పరిమితం చేసి నువ్వు అవనిపై అలమటించ డానికి సిద్ధ పడవచ్చు. నారాయణమూర్తి నీకు దూరంగా ఉండ లేడు. నువ్వు వైకుంఠం పోలేవు కనుక, ఆయనే వచ్చి నీ హృదయంలో ఒదిగి పోయాడు. కాచుకుంటూ ఉండి పోయాడు. ఎక్కడ నారాయణు డుంటే అదే వైకుంఠము. నిన్ను విడిచి ఉండ లేని నారాయణుడు మనిద్దరికీ అంతరం లేదంటూ నీ ఆంతర్యం లోనే అలరారు తున్నాడు. నీ హృదయమే పాలకడలి అయింది. అనంతశక్తి స్వరూపుడు నీలో నారాయణుడు అనంతశయనుడు. నీ హృదయమే పాలకడలి అయింది. నారాయణుడు నీలో ఉన్నాడు. పవ్వళించి ఉన్నాడు. ఇప్పుడు చెప్పు. నువ్వు శక్తిహీనుడవా? బలహీనుడవా? నారాయణుడు నీలో ఉన్నాడు. సర్వశక్తి నీ లోనే ఉంది. అనంతమైన నీలో అనంతశక్తి ఉంది.

అనంత చైతన్యము

నిన్ను నేను ఎత్తుకోలేను. నన్ను ఎత్తుకొని నువ్వు నడవ లేవు. కానీ, ఎంత ఎత్తైన మనిషైనా, ఎన్ని కిలోల బరువున్నా, తనను తాను తేలికగా మోసుకొని పోతూ ఉంటాడు. ఈ శక్తి ఎక్కడిది? అంత పెద్ద దేహాన్ని జీవితాంతం మోసే దెవరు? ఎంత పెద్ద దేహమైనా అనంతశక్తి ముందు అవగింజే.

ఈ అనంతశక్తి చైతన్యము బరువు లెత్తే ఏనుగులో ఉంది. బాధించే దోమ లోనూ ఉంది. ఈదే తిమింగలంలో ఉంది. ఎగిరే ఈగ లోనూ ఉంది. అది చాలా తేలికైంది. అందుకే ఎగర గలుగుతోంది. చాలా బరువైంది కూడా. అందుకే పర్వతంలా కదలకుండా ఉంటుంది. అణువు అదే. మహత్తూ అదే. దీని వైభవాన్నే వేదం వర్ణించింది. దీని ప్రాభవాన్నే ఋషులు కీర్తించారు.

అణోరణీయాన్ మహతో మహీయాన్
ఆత్మస్య జన్తోః నిహితో గుహాయామ్ ।

అణువు కంటే సూక్ష్మమైంది. మహత్తు కంటే మహత్తర మైంది
సమస్త ప్రాణుల హృదయాలలో అదే దాగి ఉంది.

అణువులు జడరూపాలని, దుర్భేద్యములని పూర్వం విశ్వసించే వాళ్ళం. అణువులు ఛేదింప బడతాయని మనకు ఈ రోజు తెలుసు. అంతేకాదు, జడంగా కనిపించే అణువులో అనంతశక్తి నిండి ఉందని కూడా తెలుసుకున్నాం. అణువు లోని మాయను తొలగించి మహిమను వ్యక్తం చేశారు ఆధునిక శాస్త్రవేత్తలు. మనిషి లోని మాయను తొలగించి మహిమను దర్శింప చేశారు సనాతన మహర్షులు. ప్రతి ఒక్కరిలో అనంతశక్తి చైతన్యము ఉందని సశాస్త్రీయంగా, సహేతుకంగా ప్రబోధించారు. నీలో అది ఉండటం కాదు; నీవే అది అని తేల్చి చెప్పారు.

అనంతాలు రెండు ఉంటాయా? రెండు అనంతాలు ఉంటే, రెండూ అంతమై పోతాయి కదా! అంత మయ్యేది ఎలా అనంత మవుతుంది?

అనంతము ఏకమే గాని, రెండు కాలేదు. అది అద్వయము. అదే పరమాత్మ. మరి ప్రపంచము? ప్రపంచమే కాదు; ప్రపంచము, నువ్వు, నేను, సమస్తమూ అనంత నారాయణుడే. ఇదే శాస్త్ర తాత్పర్యము. అఖండార్థ బోధ.

స య ఏషోఽణి మైత దాత్మ్య మిదం సర్వమ్
తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ! ఇతి

నాయనా! శ్వేతకేతూ! ఈ విధంగా ఏది చైతన్య స్వరూపమో **(ఏషః యః).** ఆ సత్య స్వరూపము **(సః)** సమస్త ప్రపంచ బీజరూపమై సూక్ష్మంగా భాసిస్తోంది **(అణిమా).**

ఈ దృశ్యమాన జగత్తంతా **(ఇదం సర్వం)** ఆత్మ స్వరూపం వల్లనే అలరారుతోంది **(ఏతదాత్మ్యం).** అదియే ఆత్మ **(సః ఆత్మా).**

ఆ పరమాత్మ స్వరూపము **(తత్)** నీవు **(త్వం)** అయి ఉన్నావు **(అసి)** అని బోధించాడు ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలక మహర్షి.

ప్రపంచ మంతా పరమాత్మ చేత పూర్ణమై ఉంది. పరమాత్మే సత్యము. ఆ సత్యమే ఆత్మ. అదే నీవు. ఇదే అఖండార్థ బోధ. అద్వైత జ్ఞానబోధ. ప్రపంచము, జీవుడు, ఈశ్వరుడు అభిన్నులే అనే అమృతబోధ.

యత్పరం బ్రహ్మ సర్వాత్మా
విశ్వ స్యాయతనం మహత్

సర్వులకు ఆత్మ యైన పరమాత్మ
విశ్వానికి సర్వాధారమై ఉన్నాడు.

ఈ సత్యం మనకు తెలుసా? తెలియదు. అయితే తెలియాలి. తెలుసుకోవాలి. అదే తెలియ దగింది **(వేదితవ్యం).** దానిని తెలుసుకున్న తరువాత పొంద వలసింది మరొకటి ఉంటుందా?

మరి, అలాంటి అనంత చైతన్యాన్ని క్రొత్తగా పొందే అవకాశం ఉందా? అది క్రొత్తగా పుడుతుందా? అలా పుట్టేది అనంత మవుతుందా? అనంత మైనది ఉంటే, అది లేని కాల మంటూ ఉంటుందా? లేని ప్రదేశం ఉంటుందా? అలాంటి సద్వస్తువు సాధ్యవస్తు వెలా అవుతుంది? నిత్యవస్తువు సిద్ధవస్తువే గాని సాధ్యవస్తువు కాలేదు. నేడు లేకుండా రేపు కలిగేది సాధ్యవస్తువు. నేడు లేకుండా రేపు కలిగేది మరునాడు మళ్ళీ లేకుండా పోయేదే కదా! అలాంటిది అనంత మెలా అవుతుంది? కనుక, మోక్షము క్రొత్తగా వచ్చేది కాదు. ఉన్నదే. సిద్ధ వస్తువుగా ఉన్నదే.

అయితే, ముక్తి మన కున్నదే. మనం ముక్తుల మయ్యే ఉన్నాము. ఇది అర్థం గాక ముక్తి కొరకు యత్నిస్తున్నాము. మనం ముక్తులమే అయినప్పుడు బంధ మెలా వచ్చింది? ముక్త వస్తువుకు బంధం ఉండే అవకాశమే లేదు. బంధం లేని దానికి బంధం ఉన్నట్లు తెలుస్తూ ఉంది. అదే మన సమస్య.

నువ్వు ఉన్నావా, లేదా? ఉన్నావు. ఆత్మ ఎవరు? నువ్వే. ఇక తెలియని దేముంది? ఇక ఆత్మను పొందడ మేమిటి? ఎలా పొందుతావు? లేని దానిని పొందవచ్చు. ఉన్న దానిని పొందే దేమిటి? ఒకవేళ ఉన్నది తెలియక పోతే తెలుసుకోవాలి. ఏమని? ఆత్మను పొందేది లేదని. ఆత్మను పోగొట్టుకొన్నదీ లేదని. అది సదా ఉన్నదే నని, సిద్ధమే నని, ప్రసిద్ధమే నని. ఆత్మ ఎప్పుడూ అప్రసిద్ధం కాదు అన్నారు శ్రీశంకరులు **(న హ్యాత్మా నామ కస్యచిత్ అప్రసిద్ధః** - గీతాభాష్యము).

ఆత్మ విచారము

మనకు ఏం కావాలి? మోక్షము కావాలి. మోక్షము అంటే ఏమిటి? బంధము నుండి విడి పడటమే మోక్షము. బాగుంది. ఇంతకీ బంధ మెవరికి? మనకు బంధ మున్నట్లేనా? బంధము ఉంది అనుకుందాం. మరి ఆ బంధం సత్యంగా ఉన్నదా, లేకనే ఉన్నట్లున్నదా? ముందు ఈ విషయం నిర్ణయం కావాలి.

బంధము సత్యమే అయితే, సత్యము అంటేనే అన్ని కాలాలలో ఉండేది కనుక, బంధము మన కెన్నడూ దూరం కాదు. అది నిత్యబంధమై ఉంటుంది. దానిని తొలగించడం సాధ్యం కాదు. కనుక, మనం ఆశించే మోక్షం ప్రాప్తించే అవకాశమే లేదు.

ఒకవేళ బంధము అసత్యమే అయితే, అసత్యము అంటే లేనిదే కనుక, లేనిది పోనవసరం లేదు. మోక్షము ఉన్నట్లే. ఇక ప్రయత్న మెందుకు?

అలా గాక, బంధము లేనిదే అయినా, ఉన్నట్లు గోచరించే టప్పుడు **(రజ్జు సర్పవత్** - త్రాడులో పాము లాగా), అట్టి బంధము అర్థం చేసుకో దగిందే గాని, ప్రయత్నంతో దూరం చేసుకో వలసింది కాదు. అలా అర్థం చేసుకోవడమే విచారము. ఆత్మ విషయంలో, లేదా మోక్షం విషయంలో విచారమే ప్రధాన కర్తవ్యము **(అతః విచారః కర్తవ్యః).**

అతో విచారః కర్తవ్యో
జిజ్ఞాసో రాత్మ వస్తునః

ఆత్మవిచార మొక్కటే
ముముక్షువు కర్తవ్యము.

బంధంలో ఉన్నట్లు భావించ డానికి బంధము ఉండ నవసరం లేదు. బంధ మున్నదనే భావన చాలు. ఒక విధంగా చెప్పాలంటే ఈ భావనే బంధము. భావ బంధము. అదే భవబంధము.

నేను బంధంలో ఉన్నానా?
నాకు బంధ మనేది ఉందా? - అని ప్రశ్నించుకొని విచారిస్తే, ఆత్మ వైన నీకు బంధము లేనే లేదని తెలిసి పోతుంది. బంధము భావన అయినపుడు, అట్టి బంధాన్ని నిర్మూలించే మోక్షము కూడా భావనే అవుతుంది. భావ బంధానికి భావ మోక్షమే పరిష్కార మవుతుంది.

బంధ మోక్ష విహీనోస్మి
శుద్ధం బ్రహ్మాస్మి సోస్మ్యహం!

బంధమోక్షాలు లేని వాణ్ణి
శుద్ధ బ్రహ్మ స్వరూపుణ్ణి అన్నది ఉపనిషత్తు.

అర్థమైందా? బంధము కల్పించు కున్నదే. కరిపించు కున్నదే. తగిలించు కున్నదే. తొలగించుకుంటే పోతుంది. అజ్ఞానమే బంధము కనుక, జ్ఞానమే మోక్షము. తానేమిటో, తన స్వరూప మేమిటో తెలియక పోవడము అజ్ఞాన మైతే, తానేమిటో, తన స్వరూప మేమిటో తెలియడమే జ్ఞానము. ఆత్మజ్ఞానము. విచారము ద్వారా లభ్యమయ్యే స్వరూప జ్ఞానము.

మోక్షం జ్ఞానరూపంలో ఉంది
జ్ఞానం కలిగితే మోక్షం సిద్ధిస్తుంది.

ఆత్మజ్ఞానము

జ్ఞానా దేవ తు కైవల్యమ్

జ్ఞానము ద్వారానే మోక్షము సిద్ధిస్తుంది. మోక్షము అనేది ఉన్నదే గాని లేనిది కాదు. ఏదైనా ఒకటి ఉంది అంటే, దానికి సంబంధించిన జ్ఞానము కూడా ఉంటుంది. అదే ఇక్కడ జ్ఞానము అనబడుతూ ఉంది. ఆ జ్ఞానమే ఆత్మజ్ఞానము.

జ్ఞానం ఎలా కలుగుతుంది? ప్రమాణం ద్వారానే కలుగుతుంది. 'ప్రమ' అంటే జ్ఞానము. జ్ఞానమును కలిగించేది ప్రమాణం **(ప్రమాకరణం ప్రమాణం).** ప్రమాణం ఉంటేనే జ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానము విషయంలో శాస్త్రము ప్రమాణము. శాస్త్రము అంటే వేదము.

ఆత్మ ఏదో కాదు; మన స్వరూపమే. కనుక ఆత్మను పొందడ మనేది లేదు. ఆత్మ ఉన్నదే. కానీ, ఉన్నట్లు తెలియనిది. చీకట్లో ఉన్న వస్తువు లేనిది కాదు. ఉన్నట్లు తెలియనిది. వెలుగు రాగానే ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే జ్ఞానం కలిగితే ఆత్మ ఉన్నట్లు తెలుస్తుంది.

మరి, ఆత్మను తెలుసుకొనే వాడెవరు? తెలియని వాడే కదూ? తాను ఆత్మ అని తెలియని వాడే. మరి తాను ఆత్మ కాదని నిర్ణయించుకున్న వాడు తనకు తానుగా తానే ఆత్మ అని ఎలా తెలుసుకుంటాడు? తనకు తానుగా తెలుసు కోలేని దానిని శాస్త్రం ద్వారానే గ్రహించాలి. ఇక్కడే శాస్త్రం ప్రమాణ మైంది.

యత్తు స్వతః అప్రాప్తం
తత్ శాస్త్రేణ బోధితవ్యం.

తనకు తానుగా పొందలేని జ్ఞానమును
శాస్త్ర ప్రమాణం ద్వారానే పొందాలి.

మనము అన్వేషించే సదాత్మ మనమే అయి నందున, అది ఇంద్రియ మనోబుద్ధులకు గాని, ప్రత్యక్ష అనుమానాది ప్రమాణాలకు గాని అందదు. అట్టి దానిని శబ్ద ప్రమాణము ద్వారానే గ్రహించాలి. ఇక్కడే వేదశాస్త్రము ప్రమాణ మైంది.

శ్రుతి శ్చ నః ప్రమాణం అతీంద్రియ విషయ విజ్ఞానోత్పత్తౌ

మన ఇంద్రియ మనోబుద్ధులకు అందని సత్య విషయాన్ని గ్రహించడానికి వేదాలే ప్రమాణము అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి.

ఆత్మ ఉంది. కాని, తెలియకుండా ఉంది. ఇదియే ఆత్మ అజ్ఞానము. ఆత్మజ్ఞానము కలిగితే ఆత్మ అజ్ఞానము నశిస్తుంది **(ఆత్మజ్ఞానేన ఆత్మ అజ్ఞానం నశ్యతి).** ఆత్మజ్ఞానమును పొందిన వాడు తానే ఆత్మ అని తెలుసుకుంటాడు **(ఆత్మవిత్ పరం ఆప్నోతి).** ఈ విధంగా ప్రమాణం జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

ఆచార్యవాన్ పురుషో వేద

శాస్త్రము ఎప్పుడైతే ప్రమాణ మైందో, అధ్యయనం తక్షణ కర్తవ్య మైంది. మరి శాస్త్రాన్ని మనమే అధ్యయనం చేస్తే సరిపోతుందా? సరిపోదు.

జ్ఞానము ఏదైనా, దానిని పొందే పద్ధతి ఒకటి ఉంటుంది. అలా పొంది నపుడే జ్ఞానం ప్రాప్తిస్తుంది. దీనినే శాస్త్ర పరిభాషలో 'బోధనా విధి' అంటారు.

మనకు మనంగా కారు నడపడం నేర్చుకో లేము. మనకు మనంగా కంప్యూటర్‌ను తెలుసుకో లేము. మరొకరి సహాయం లేకుండా సైకిల్ కూడా త్రొక్క లేము. ఈత కొట్టడం అభ్యసించ లేము. సామాన్య విషయాలే ఇలా ఉన్నాయి. ఇక ఆత్మజ్ఞానం ఎవరి సహాయం లేకుండా సిద్ధిస్తుందా?

అయితే, ఇక్కడ మనకు సహకరించే వ్యక్తి మన లాంటి వాడే అయితే ఉపయోగం లేదు. జ్ఞానం కలిగిన వాడై ఉండాలి. కేవలం జ్ఞానం ఉంటే చాలదు. తన కున్న జ్ఞానాన్ని ఇతరులకు అందించ గలిగే విధానం కూడా తెలిసిన వాడై ఉండాలి. తెలిసి బోధించి నపుడే వినే వాడి బుద్ధి నిండుతుంది. తెలిసే లాగా బోధిస్తేనే వినే వాడి బుద్ధి పండుతుంది. అలా బోధించడమే సంప్రదాయము. సాంప్రదాయక బోధ అంది నపుడే జ్ఞానం ప్రాప్తిస్తుంది. సంప్రదాయం తెలిసి బోధించే వ్యక్తిని గురువు అంటారు.

మనది వేద సంస్కృతి. మనది వేద సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని ఋషులు, గురువులు కాపాడుకుంటూ వచ్చారు.

వేదాన్ని ఋషులు సృష్టించ లేదు.
వేదాన్ని బోధించే సంప్రదాయాన్ని సృష్టించారు.

ఋషిభిః న ప్రమాణ కర్తారః
ఋషిభిః సంప్రదాయ కర్తారః

ఋషులు ప్రమాణకర్తలు కారు
ఋషులు సంప్రదాయ కర్తలు.

జ్ఞానం సృష్టింప బడేది కాదు. అందించ బడేది. వెలిగే దీపము మరొక దీపాన్ని వెలిగించినట్లు, జ్ఞానం కలిగిన గురువు మరొకరికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. గురువు లభించిన వారికే జ్ఞానము ప్రాప్తిస్తుంది.

ఆచార్యవాన్ పురుషో వేద

ఆచార్యుడు ఎవరికి లభిస్తాడో
వారికే జ్ఞానం కలుగుతుంది.

ప్రమాణ ప్రమేయ సంబంధము

మనకు మోక్షం కావాలి. మోక్షం జ్ఞానరూపంలో ఉంది అని గ్రహించాము. జ్ఞానము కలిగితే మోక్షం ప్రాప్తిస్తుంది.

జ్ఞానమును శాస్త్రం అందిస్తుంది. ఇదే ప్రమాణ ప్రమేయ సంబంధము. ఆత్మ ప్రమేయము; శాస్త్రము ప్రమాణము. ప్రమాణమైన శాస్త్రం ద్వారా ప్రమేయమైన ఆత్మకు సంబంధించిన జ్ఞానం కలుగుతుంది.

దీనినే ప్రతిపాదక ప్రతిపాద్య సంబంధం అని కూడా అంటారు. ఆత్మ ప్రతిపాదింప బడుతోంది కనుక ఆత్మ ప్రతిపాద్యము. శాస్త్రం ప్రతిపాదించి తెలియ చేస్తోంది కనుక శాస్త్రం ప్రతిపాదకం. నీవే ఆత్మవు. నీవు ఆత్మవని నీకు అర్థమయ్యేలా చేస్తుంది శాస్త్రము. ఇదే ప్రమాణ వైభవము.

రజ్జు జ్ఞానము కలిగిన తరువాత సర్పభ్రాంతి ఎలా లేదో, అలాగే ఆత్మజ్ఞానము కలిగిన తరువాత, అజ్ఞానము, అజ్ఞాన జనిత సంసారము అదృశ్య మవుతున్నాయి. అవిద్యా నివృత్తియే విద్య యొక్క ప్రయోజనం. అజ్ఞాన నివృత్తియే జ్ఞానం యొక్క ఫలం.

బ్రహ్మ విద్యాయాః అవిద్యా నివృత్తిః
తతశ్చ ఆత్యంతిక సంసార అభావః

ఆత్మజ్ఞానము, లేదా బ్రహ్మజ్ఞానము
అవిద్యను అంతం చేస్తుంది.
సమూలంగా సంసారాన్ని నశింప చేస్తుంది.

జ్ఞాన మనేది బుద్ధి నుండి బుద్ధికి అందుతుంది. కనుక శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువు జ్ఞానజ్యోతియై మన హృదయంలో జ్ఞానదీపాన్ని వెలిగిస్తాడు. అదియే ఆత్మజ్ఞాన జ్యోతి. అజ్ఞాన అంధకారాన్ని అదృశ్యం చేసే అఖండాత్మ జ్యోతి. **గు** అంటే చీకటి. **రు** అంటే దానిని పోగొట్టే వెలుగు. అదే గురువు శబ్దార్థము. బంధము, మోక్షము, జ్ఞానము, శాస్త్రము, ఆచార్యుడు - అన్నీ సమగ్రంగా విశ్లేషించుకొని చెప్పుకున్నాం. ఈ దశలో అవగాహన క్రమబద్ధంగా ఉండేలా చూసుకోవాలి. ఇది చాలా ప్రధానమైన విషయం.

మోక్షాయ జ్ఞాన ప్రవృత్తిః
జ్ఞానాయ శాస్త్ర పఠనం
గురూప సదనం శాస్త్ర పఠనం !

మనకు మోక్షం కావాలి. మోక్ష మనేది వస్తువు కాదు; సన్నివేశం కాదు; దేశంలో ఉండదు; కాలంలో తెలియదు. మోక్షం జ్ఞానరూపంలో ఉంది.

జ్ఞానం స్వప్రయత్నంతో సిద్ధించదు. అది ప్రమాణ విషయం. ప్రమాతే ప్రమేయం అనే సత్యం ప్రమాణం లోనే దర్శనీయ మవుతుంది. అదే శాస్త్ర ప్రమాణం. అద్దంలో ముఖదర్శన మైనట్లు శాస్త్రంలో ఆత్మదర్శన మవుతుంది **(ముకురే ముఖ దర్శనవత్ శాస్త్రే ఆత్మదర్శనం).** అద్దానికి అభిముఖంగా వెళ్ళడం అద్దాన్ని దర్శించడానికి కాదు. మన ముఖాన్ని దర్శించడానికి. శాస్త్ర దర్పణాన్ని దర్శించడం కూడా కేవలం శాస్త్ర పఠనానికే కాదు, స్వాత్మ దర్శనానికి.

సంప్రదాయ విదుడైన ఆచార్యుని సన్నిధిలో శ్రవణం చేసి నపుడే ప్రమాణం ఫలిస్తుంది. కనుక, ఆత్మజ్ఞాన ప్రాప్తి కొరకు ఆచార్యుని తప్పక ఆశ్రయించాలి.

ఇదీ క్రమము.

బంధము తొలగాలంటే, మోక్షమును పొందాలి. మోక్షం రావాలంటే జ్ఞానం కలగాలి. జ్ఞానం కలగాలంటే శాస్త్రమును ప్రమాణంగా గ్రహించాలి. శాస్త్రాధ్యయనం గురుసన్నిధి లోనే జరగాలి. ఇదీ సారభూతమైన విషయము.

వేద ప్రమాణము

వేదములు ప్రామాణికాలైన ప్రాచీన జ్ఞాన భాండాగారము. **విద జానే** - దీని చేత తెలుసుకుంటారు కనుక ఇది వేదము **(వేదః).**

వేదాలను శ్రుతులు అని కూడా అంటారు. శ్రుతులు అంటే వినిపించేవి. **శ్రూయతే అనేన ఇతి శ్రుతిః** - దేని చేత జ్ఞానము వినపడు తుందో అది శ్రుతి.

శ్రుతులైన వేదాలను ఆమ్నాయాలు అని కూడా అంటారు. **ఆమ్నాయతే పారంపర్యేణ ఇతి ఆమ్నాయః** - పారంపర్యంగా అభ్యసింప బడేది కనుక వేదము ఆమ్నాయము **(మ్నా అభ్యాసే).**

వేదాలు అపౌరుషేయాలు. పురుషుల చేత రచింప బడేవి పౌరుషేయాలు. అలా కాకుండా స్వతస్సిద్ధ మైనవి, భగవత్స్వరూపంగా విరాజిల్లేవి అపౌరుషేయాలు.

వేదాలన్నీ ప్రాచీన సంస్కృత భాషలో ఉన్నాయి. అందుచేత, ఆధునిక సంస్కృతాధ్యాపకులు, భాషావేత్తలు వేదార్థాన్ని గ్రహించడానికి వేదన చెందుతూ ఉంటారు.

వేద వాఙ్మయాన్ని యథావత్ అర్థం చేసుకోవడానికి అనుకూలంగా యాస్కాచార్యుల వారు **'నిరుక్తము'** అనే సంస్కృత నిఘంటువును రచించారు. నిరుక్తము వేదాంగాలైన ఆరింటిలో ఒకటి. వర్ణాగమ విపర్యయాదుల్ని నిశ్చయించి చెబుతుంది కనుక అది నిరుక్తము **(నిశ్చయేన ఉక్తం నిరుక్తమ్).**

నిరుక్తమును ఆధారం చేసుకొనే భాష్యకారులు వేదాలను వ్యాఖ్యానించారు. వేదాలను వ్యాఖ్యానించిన వారు స్వల్ప సంఖ్యలో ఉన్నారు. వారిలో కూడా పాక్షికంగా వ్యాఖ్యానించిన వారే గాని పూర్ణంగా విశదీకరించిన వారు అరుదు. వేదాన్ని వ్యాఖ్యానించిన సంప్రదాయ విదులలో మాధవాచార్యులు, సాయనాచార్యులు ముఖ్యులు. మాధవాచార్యులే సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన తరువాత విద్యారణ్యస్వామిగా వాసి కెక్కారు. **'వేదాంత పంచదశి'** లాంటి ప్రముఖమైన అద్వైత గ్రంథాలను రచించారు.

ఏ తల్లి కన్నదో - అని తరచుగా మహాత్ములను జనులు శ్లాఘిస్తూ ఉండటం మనం వింటూ ఉంటాము. వేదానికి భాష్యాన్ని అందించిన మాధవ సాయనులు ఒక్క తల్లి బిడ్డలు కావడం, ఇద్దరు సోదరులు అనితర సాధ్యమైన వేదభాష్యాన్ని అందించడం గొప్ప విశేషము. ఆ బిడ్డలను కన్న మహాతల్లి ఎవరో, ఆమె జన్మ ధన్యమైంది. మాధవ సాయనులే కాకుండా ఉద్భటాచార్యులు కూడా రచించారని చెబుతారు. మాధవ సాయనుల భాష్యం లాగా వారిది అంత ప్రాచుర్యాన్ని పొందలేక పోయింది.

సంప్రదాయవిదుల భాష్యం లాగే, మ్యాక్స్‌ముల్లర్ అనే పాశ్చాత్యుడు కూడా సంస్కృత భాషను అభ్యసించి, వేదానికి, ముఖ్యంగా ఋగ్వేదానికి భాష్యాన్ని అందించాడు. ఆయన సంప్రదాయ గాడిలో పడని పాశ్చాత్యుడు. కనుక ఆయన భాష్యం కూడా అలాగే ఉంటుంది. కాకపోతే, ఒక పాశ్చాత్యుడు సంస్కృత భాషను అభ్యసించి,

జ్ఞానాసక్తితో వేదాన్ని పఠించడమే కాకుండా, దానిని వ్యాఖ్యానించడం అనేది అద్భుతమైన విషయము; ప్రశంసనీయము.

ప్రమాణ వైభవము

ప్రపంచము దృశ్యము. కార్యరూపము. ప్రత్యక్ష అనుమానాది ప్రమాణాల చేత అనుభవానికి అందుతుంది. ఈ కార్యరూప ప్రపంచానికి కారణమైన పరమాత్మ ప్రత్యక్షాది ప్రమాణాలకు అందే వాడు కాడు.

కనుక, పరమాత్మ జ్ఞానప్రాప్తికి మరొక ప్రమాణము అవసరమై ఉంది. అదే శబ్ద ప్రమాణం. వేద ప్రమాణం. **ప్రమాకరణం ప్రమాణం -** ప్రమ అంటే జ్ఞానము. ప్రమను కలిగించేది కనుక వేదము ప్రమాణము.

వస్తు ప్రతిపాదనం తత్పరత్వం
సిద్ధం శాస్త్రాణామ్ !

సత్య వస్తువును ప్రతిపాదించడమే గాక, ఆ సత్యవస్తు స్వరూపాన్నే పరమ గమ్యముగా వేదాలు కలిగి ఉన్నాయి అన్నది బృహదారణ్యకోపనిషత్తు *(1 - 3 -1)*. అందుచేతనే వేదం ప్రమాణ వైభవంతో ప్రకాశిస్తూ ఉంది. ప్రమాణ విషయాన్ని సులభంగా తీసుకోవడానికి అవకాశము లేదు. ప్రమాణ విషయము బుద్ధికి చిక్కని దైనపుడు, జ్ఞానం ప్రాప్తించడము దుస్సాధ్య మవుతుంది.

ప్రపంచం లోని శబ్దాది విషయ జ్ఞానాన్ని శ్రోత్రాది ఇంద్రియాల ద్వారా మనం తెలుసుకుంటున్నాం. చెవులు శబ్దాలను వింటాయి; రూపాలను చూడలేవు. కళ్ళు రూపాలను చూస్తాయి; శబ్దాలను వినలేవు. ముక్కు వాసన చూస్తుంది, రూపాన్ని చూడలేదు. ఇంద్రియాలు తమ తమ విషయాలను గ్రహించడములో శక్తివంతంగా ఉండటమే గాక, అలా గ్రహించ డానికి మరొక దానిని ఆశ్రయించ కుండా స్వశక్తి మీదనే ఆధారపడి ఉన్నాయి. ప్రమాణం అనే విషయాన్ని కూడా ఇలాగే అర్థం చేసుకోవాలి.

స్వ విషయ శూరాణాం హి
ప్రమాణాని శ్రోత్రాదివత్

శబ్దాలను ఆలకించడంలో చెవులు ఎలా శక్తివంత మైన ప్రమాణమై ఉన్నవో, అలాగే ఏ ప్రమాణ మైనా తత్సంబంధ విషయము నందు శక్తివంతమైన జ్ఞానసాధన గానే ఉంటుంది అన్నది ఉపనిషత్తు.

శబ్దం విషయంలో చెవి, రూపం విషయంలో కన్ను, రుచి విషయంలో నాలుక ఎలా స్వత: ప్రమాణాలై ఉన్నవో (వాటి వెనుక మనస్సు ఉంది కనుక), అలాగే జ్ఞానం విషయంలో, పరమాత్మజ్ఞానం విషయంలో, ముందు వెనుక, కుడి ఎడమ, పైన క్రింద, లోపల బయట, ఎవరి అవసరం లేకుండా, దేని అవసరము రాకుండా, వేదము స్వప్రమాణమై శోభిస్తోంది.

వేదస్య హి నిరపేక్షం
స్వార్థే ప్రామాణ్యం
రవేరివ రూప విషయే

రూపాలను ప్రకాశింప చేయదానికి సూర్యునికి మరొకరి సహాయము అవసరమా? స్వయంగా తన ప్రకాశము తోనే ప్రపంచాన్ని సూర్యుడు ప్రకాశింప చేయ గలడు. రూపాలను సూర్యుడు ప్రకాశింప చేసి వాటి విషయంలో ప్రమాణ మైనట్లు, పరమాత్మకు సంబంధించిన జ్ఞానం విషయంలో వేదాలు మరో సహాయం వైపు చూడకుండా స్వప్రమాణమై శోభిస్తున్నాయి అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి *(2 - 1 - 1)*.

వేదాలు ఇలా ప్రమాణమై శోభిస్తున్నాయి కనుకనే వాటిని పరమాత్మ శ్వాసలని అభివర్ణించింది శాస్త్రం (**అస్య మహతో భూతస్య నిశ్వసిత మేతత్**). అంతే కాదు. ప్రమాణమై శోభిస్తున్న వేదాన్ని నిరసించిన వారిని, నిరాకరించిన వారిని, వారు ఎంతటి వారైనా నాస్తికులే నని తెగేసి మరీ చెప్పింది (**నాస్తికో వేద నిందకః**).

ఆశ్రయ స్థానము

భారతీయ తాత్త్విక దర్శనా లన్నిటికీ వేదాలే మూలం అని చెప్పవచ్చు. న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, మీమాంసాది షడ్దర్శనా లన్నిటికీ వేదాలే ఆధారము. తత్త్వమును బోధించే వాటిని దర్శనాలు అంటారు (**దృశ్యతే అనేన ఇతి దర్శనమ్ - దర్శ్యతే తత్త్వ మనేన ఇతి దర్శనమ్**). దేని వలన చూడ బడుతుందో అది దర్శనము.

ఇంతకీ చూడ బడేది ఏదై ఉండాలి? ఏది దర్శనీయమై ఉండాలి?

నే నెవరు? నా స్వరూప మేమిటి?
నేను క్షేత్రమా? క్షేత్రజ్ఞ స్వరూపమా?
ఈ జగత్తేమిటి? దీనికి కారణ ముందా?
ఇది సృష్టి యేనా? సృష్టికర్త ఎక్కడున్నాడు?
సృష్టికి సృష్టికర్తకు ఉన్న సంబంధ మేమిటి?

ఈ విధమైన ప్రశ్న లన్నిటికీ సూటిగా, సుస్పష్టంగా సమాధానం చెప్పగలిగే దేదో అది దర్శనము. ఇక్కడే కొన్ని దర్శనాలు, అవి ఎంత గొప్పవి అయినా, వాటి కర్తలు మహాత్ములే అయినా, వారి వాక్యాలు జ్ఞానపూరితాలు గానే కనిపించినా, అవి ప్రమాణం కాలేక పోయాయి.

వేదము ఇక్కడే ప్రమాణ శోభతో కనిపిస్తుంది. ఏ వాక్యాన్నైనా ప్రమాణంగా గ్రహించాలి అంటే, అది పూర్ణమైన, ఫలప్రదమైన జ్ఞానరూపమై ఉండాలి. ఇదే ప్రమాణ విషయంలో ఉపనిషత్తుల ఏకవాక్యత (**నిశ్చిత ఫలవత్ విజ్ఞానో త్పాదకమ్ వాక్యం ప్రమాణమ్ -** బృహదారణ్యక భాష్యం *; 1 - 4 - 7*).

చతుర్విధ పురుషార్థములలో ప్రశస్త మైనది, పరమ పురుషార్థ మని చెప్పబడింది మోక్షమే అని ముందు గానే మనం చెప్పుకున్నాం. మోక్షమే పరమ పురుషార్థ మని దర్శనాచార్యు లందరూ అంగీకరిస్తారు (**దర్శనాంత రేషు మోక్ష స్వరూపమ్**). కాకపోతే ఏది మోక్షము? మోక్ష మంటే ఏమిటి? అనే విషయం లోనే వైరుధ్యాలు గోచరిస్తాయి.

పరమ పురుషార్థ మైన మోక్షం విషయాన్ని నిర్ణయించడంలో వేదాంతర్గత మైన ఉపనిషత్తులు వస్తు నిర్ధారణ చేసి, ప్రమాణమై శోభిస్తున్నాయి. అంతేకాదు. ధర్మార్థ కామ పురుషార్థాలనే త్రివర్గములను సాధించుకొనే ఉపాయాలను తెలియ చేయడంలో కూడా వేదాలు ప్రమాణాలై శోభిస్తున్నాయి.

పురుషా ర్థోపదేశత్వాత్ శ్రుతీనామ్ !

సమస్త పురుషార్థాలను సాధించుకొనే విషయంలో శ్రుతులు ప్రామాణికంగా మార్గాలను తెలియ చేస్తున్నాయి అన్నారు తైత్తిరీ యోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి. సాధ్యరూప మోక్షమే గాక, సాధన రూప విషయాలను కూడా వేదము ప్రామాణికంగా అందించింది. కర్మోపాసనలను వివరించింది. **'ఓం నమశ్శివాయ'** అనే పంచాక్షరీ మహామంత్రము, **'ఓం నమో నారాయణాయ'** అనే అష్టాక్షరీ మహామంత్రం కూడా వేదంలో ప్రమాణ రూపంలో భాసిస్తున్నాయి.

కనుక ప్రమను, అనగా జ్ఞానమును పొందుటకు వేదమే ప్రమాణము అనేది అర్థ మైందని భావిస్తాను. మరి, వేదము ప్రమాణ మైనపుడు వేదాన్నే కదా ఆశ్రయించాలి? భగవద్గీత ఎందుకు? భగవద్గీత ప్రమాణమా? అప్రమాణమా?

గీతా శాస్త్రము - సర్వశాస్త్ర సారము

సర్వధర్మ స్వరూపమై, పంచమ వేదమని ప్రస్తుతింప బడిన మహాభారత మనే విశాలమైన ఆకాశంలో, దివ్యంగా విలసిల్లుతూ, అద్వైత పీయూషాన్ని అవిరళంగా వర్షించిన అమృత మేఘమాలిక శ్రీమద్భగవద్గీత.

'గీత' అంటే గానం చేయబడేది లేదా పాడ బడేది అని అర్థము (గీయత ఇతి గీతమ్. గై శబ్దే). ఇక్కడ బోధింప బడింది; ఉపదేశింప బడింది అని భావించాలి. 'భగవద్గీత' అంటే భగవంతుని చేత ఉపదేశింప బడిన గీత, లేదా జ్ఞానము.

జ్ఞానము అంటే ఆత్మజ్ఞానము, లేదా బ్రహ్మజ్ఞానము అని అర్థము. ఉపనిషత్తు అంటే కూడా జ్ఞాన మనే అర్థం. ఉపనిషత్తు అనేది గ్రంథ నామము కాదు, గ్రంథ విషయము. ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య అని అర్థము (ఉపనిష ద్విషయం ఉపనిష దేవ).

గీతకు ఉపనిషత్తు అనే పేరు కూడా ఉంది. అలా చూచి నపుడు 'గీత' అంటే భగవంతుని చేత చెప్పబడిన ఉపనిషత్తు అని భావించ వచ్చు. కనుక, గీత అంటే ఉపనిషత్తు అనే పేరు కలిగిన బ్రహ్మవిద్య (గీతోపనిష న్నామ్నీం బ్రహ్మవిద్యాం) అని అర్థము.

గీత, ఉపనిషత్తులు రెండూ ఏకవాక్యతను ప్రసాదిస్తున్నాయి. అంటే, ఒకే అర్థాన్ని అందిస్తూ పరమార్థాన్ని ముందుంచు తున్నాయి.

జ్ఞానాత్ మోక్ష ఇతి ఏషోఽ ర్థః
నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ ।

జ్ఞానము వల్లనే మోక్షము ప్రాప్తిస్తుంది
ఇదే గీత, ఉపనిషత్తుల తుది నిర్ణయము
అని శ్రీ శంకరుల గీతాభాష్యము.



యత్ర స్థితం బ్రహ్మజ్ఞానే
వేదశాస్త్ర సునిశ్చితమ్ ।

వేదము నిశ్చయించిన బ్రహ్మజ్ఞానము
గీత యందు సుప్రతిష్ఠము
అని స్కాందపురాణము.

గీత, ఉపనిషత్తులు ఒకే విషయాన్ని ప్రతిపాదిస్తూ ఉన్నందున గీత ఏదో కాదు; ఉపనిషత్తే. గీతలో చెప్పబడిన జ్ఞాన మంతా ఉపనిషత్ జ్ఞానమే. ప్రతి అధ్యాయాన్ని ఒక ఉపనిషత్తు అని చెప్పుకోవచ్చు. ప్రతి శ్లోకము ఒక ఉపనిషత్తే. ఉపనిష న్మంత్రాలు కొన్ని గీతలో యథాతథంగా కూడా ఉన్నాయి. అందుకే నేమో, గీత లోని ప్రతి అధ్యాయం చివర ఉన్న సంకల్ప వాక్యంలో, శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు అని బహువచనాన్ని ప్రయోగించడం జరిగింది. గీతను గీతలు అని, ఉపనిషత్తును ఉపనిషత్తులు అని బహువచన ప్రయోగంతో పలకడం చేత, గీతా శ్లోకాలన్నీ ఉపనిష ద్రూపాలే; ఉపనిషత్సారాలే అని అర్థమవుతూ ఉంది.

అలా కాకుండా, 'ఉపనిషత్సు' అనే పదాన్ని 'ఉపనిషత్తులలో' అని అర్థం చెప్పుకున్నా, గీత ఉపనిషత్తుల లోని జ్ఞానాన్నే ప్రసాదిస్తూ ఉంది అని భావించ వచ్చు. ఉపనిషత్తు, గీత అనే రెండు పదాలు స్త్రీ లింగ పదాలే అనేది కూడా గమనార్హం. ఇంకా చెప్పాలి అంటే, గీత సర్వశాస్త్ర స్వరూపిణి (సర్వ శాస్త్ర మయీ గీతా).

గీత వేద స్వరూపము

వేదము అంటే జ్ఞానము అని తెలుసుకున్నాము. ఏ జ్ఞానము? అనే ప్రశ్నకు ఈశ్వర జ్ఞానము అనేది సమాధానము. ఈశ్వరుడు, ఈశ్వర జ్ఞానము రెండు కావు. ఒక్కటే. వేదము, వేదనారాయణుడు వేరు కాదు. ఒక్కటే. వేదమే తన స్వరూపంగా కల వాడు వేదనారాయణుడు (వేదరూపత్వాత్ వేదః). వేదరూపంలో ఉన్నాడు కనుక ఆయనే వేదము.

వేదము తెలిస్తే, వేద్యుడైన నారాయణమూర్తి కూడా తెలిసినట్లే. వేదనారాయణుని తెలుసుకోవడానికి వేదము తప్ప మరొక మార్గం లేదు.

విష్ణుసహస్రనామం నారాయణమూర్తిని వేదాంగః (వి.స.నా - 130 వ నామం) అని కీర్తించింది. వేదములు అంగాలుగా కలిగిన వాడు కనుక వేదనారాయణుడు వేదాంగు డయ్యాడు (వేదా అంగ భూతాః యస్య సః వేదాంగః).

వేదములు అంగాలు అయితే భగవంతుడు అంగి అవుతాడు. అంగిని ఎలా తెలుసుకుంటాము? అంగాల ద్వారానే తెలుసుకుంటాము. కనుక, వేదము తెలిస్తే వేద నారాయణుడు తెలిసినట్లే. భగవంతుని విషయంలో వేదము అలా ప్రమాణమై శోభిస్తోంది.

భగవంతుని విషయంలో వేదము ఎలా ప్రమాణ మైందో, వేదసారమైన భగవద్గీత కూడా అలాగే ప్రమాణమైంది.

వేదాలలో ప్రథమ వేదమైన ఋగ్వేదము లోని మంత్రాలను ఋక్కులు అంటారు. ఋగ్వేదము పవిత్రమైన అగ్నిదేవుని స్తుతితో ప్రారంభ మవుతుంది.

అగ్ని మీళే పురోహితం ।
యజ్ఞస్య దేవ మృత్విజమ్
హోతారం రత్నధావతమ్ ।

ఇది ప్రథమ వేదమైన ఋగ్వేదంలో ప్రథమ ఋక్కు కావడం చేత బహుశ సృష్టి లోని స్తోత్రా లన్నిటిలో ఇదే ప్రథమం కావచ్చు. ప్రథమ స్తుతి అక్షరాలలో ప్రథమాక్షర మైన 'అ' కారంతో ప్రారంభం కావడం గమనార్హం.

అక్షరాణాం అకారోఽ స్మి - అక్షరాలలో నేను అకారాన్ని అన్నాడు భగవానుడు గీతలో (10 వ అ - 33 వ శ్లో). వేదానికి ఆది అక్షరమైన ఆదినారాయణుడు గీతాచార్యుడే. కనుక, గీత వేదస్వరూపమే. వేదసారమే.

ఇక రెండవది వేదాలలో ఉన్నత మైనది అని భావించే స్వర ప్రధానమైన సామవేదం. సామగాన లోలుడైన శ్రీకృష్ణ పరమాత్మ వేదానాం సామవేదోఽ స్మి - వేదాలలో నేను సామవేదాన్ని అంటూ సామవేదాన్ని తన విభూతిగా అభివర్ణించాడు (గీత ; 10 వ అ - 22 వ శ్లో).

ఋక్సామ యజురేవ చ (గీత ; 9 వ అ - 17 వ శ్లో) ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అన్నీ తానే నంటూ తన వేద స్వరూపాన్ని త్రయీ వేద్యం - మూడు వేదాలు తానే అనే అద్భుత సత్యాన్ని ఆవిష్కరిస్తూ, భగవంతుడు గీతలో దర్శింప చేశాడు. ఏ దివ్యాత్ముని జ్ఞానము అపౌరుషేయ మైన శ్రుతులలో ప్రకాశిస్తూ ఉందో, ఆ ఉత్కృష్ట మైన జ్ఞానమే 'భగవద్గీత' అనే స్మృతి రూపంలో శోభిస్తూ ఉంది. గీతా వైభవాన్ని స్తుతిస్తూ భగవానుడైన శ్రీకృష్ణుడు అర్జునునికి ఏమి బోధించాడో వైష్ణవీయ తంత్రసారము నుండి విందాం.

గీతా మే హృదయం పార్థ
గీతా మే సార ముత్తమమ్
గీతా మే జ్ఞాన మత్యుగ్రం
గీతా మే జ్ఞాన మవ్యయమ్ !



అర్జునా! గీతే నా హృదయము
గీతే నా మహోన్నత స్వరూపము
గీతా జ్ఞానమే నా తేజము
అదే నా అక్షయ వైభవము.

గీతా సరోజము

జన్మజన్మలుగా మనిషి పేర్చుకుంటూ వస్తున్న నొసటి రాతలను తుడిపేందుకు భారతీయ తత్త్వ సాహిత్యంలో అనేక గీతలు ఆవిర్భవించాయి. వాటి వాటి ప్రత్యేకతలను అవి ప్రదర్శించుకుంటూ జ్ఞానాన్ని వితరణ చేశాయి.

గణేశగీత, గురుగీత, హంసగీత
అవధూతగీత, శివగీత, వసిష్ఠగీత
దేవీగీత, ఋభుగీత, అష్టావక్రగీత
బ్రహ్మగీత, భిక్షుగీత, హనుమద్గీత
పరాశరగీత, రామగీత, జీవన్ముక్తగీత

ఓహ్! ఎన్నని? ఇలా చెప్పుకుంటూ పోతే శతాధికం గానే ఉంటాయి. గతంలో రామగీత, అవధూత గీత, జీవన్ముక్త గీత, గురుగీతలకు నేను రచించిన వ్యాఖ్యానాలను ఆశ్రమం విడుదల చేసింది. గీతలను పరిచయం చేస్తూ, ప్రాచుర్యం కల్పించాలని సుమారు పద్దెనిమిది గీతలను ఎన్నుకొని, వాటిలో ముఖ్య శ్లోకాలను ఎంపిక చేసి, వాటిపై సంక్షేపంగా వ్యాఖ్యానించి, **'సర్వగీతార్థ చంద్రిక'** అనే ఒక చిన్ని పుస్తకాన్ని పాతికేళ్ళ క్రితం మేమే విడుదల చేశాము. దానిని పునః ముద్రించ లేదు. కనుక ప్రతులు ప్రస్తుతం లభ్యం కావు.

గీతలు ఎన్ని ఉన్నా, 'గీత' అనగానే స్మృతిలో మెదిలేది భగవద్గీత ఒక్కటే. అదే గీతా మహాత్మ్యము.

సరోవరం నుండి ఏవేవో పుడుతాయి. ఎన్నెన్నో పుడుతాయి. అన్నీ సరస్సు నుండి పుట్టినవే. కానీ, 'సరోజం' అనగానే సరస్సు నుండి ఉద్భవించినవి ఏవీ గోచరించకుండా కమలమే కళ్ళ ముందు కనిపిస్తుంది. మనస్సును మురిపిస్తుంది.

గీత లెన్నున్నా, 'గీత' అనే నామం భగవద్గీతనే బుద్ధిలో నిలుపుతుంది. భగవద్గీత పేరు వినని వారిని, భగవద్గీత తత్త్వాన్ని పూర్ణంగా తెలిసిన వారిని వ్రేళ్ళపై లెక్కేట్ట వచ్చు. అదే భగవద్గీతా వైభవము.

నిష్ఠాద్వయం

వేద ప్రతిపాదితమైన నిష్ఠాద్వయాన్ని ధర్మద్వయము అని కూడా అంటారు. ఇదే వేదోక్త ధర్మం. మొదటిది ప్రవృత్తి రూపమైన కర్మనిష్ఠ ; రెండవది నివృత్తి రూపమైన జ్ఞాననిష్ఠ. ప్రపంచ మనుగడకు ఈ ధర్మద్వయమే కారణము. ఈ నిష్ఠాద్వయం ప్రాణులకు అభ్యుదయాన్ని, నిశ్శ్రేయసాన్ని ప్రసాదిస్తాయి. ప్రవృత్తి లక్షణమైన కర్మనిష్ఠ అభ్యుదయాన్ని అందిస్తే, నివృత్తి లక్షణమైన జ్ఞాననిష్ఠ సాక్షాత్తు నిశ్శ్రేయసమును అనుగ్రహించి ఆశీర్వదిస్తుంది.

మరి, భగవద్గీత వేద స్వరూపమని, ఉపనిషత్సార మని చెప్పుకున్నాం కదా! అలాంటప్పుడు, ఉపనిష త్ప్రతిపాదిత మైన విషయాన్నే భగవద్గీత కూడా బోధించాలి. ప్రసక్తానుప్రసక్తంగా అనేక విషయాలను అనివార్యంగా చర్చించినా, కేంద్ర విషయం నుండి ప్రక్కకు తప్పుకో కూడదు. అప్పుడే వేదం లాగా గీత కూడా ప్రమాణమై శోభిస్తుంది. ఆ విషయంలో గీత సఫలీకృత మైంది. వైదిక మైన నిష్ఠాద్వయ రూపమైన ధర్మద్వయాన్నే భగవంతుడు కేంద్ర విషయంగా తీసుకొని భగవద్గీతలో బోధించాడు.

వైదికం హి ధర్మ ద్వయమ్ అర్జునాయ
శోకమోహా మహోదధౌ నిమగ్నాయ ఉపదిదేశ !

శోక మోహ రూప మహాసముద్రంలో మునిగి పోయిన అర్జునునికి వేదోక్త ధర్మమైన రెండు ధర్మాలను భగవంతుడు గీతలో ఉపదేశించాడు.

ఈ బోధ వల్ల భగవంతునికి ఏమి ప్రయోజనము?
గీతను బోధించి పరమేశ్వరుడు ఏమి సాధించాడు?

ప్రయోజన మనుద్దిశ్య
న మందో పి ప్రవర్తతే !

ప్రయోజనం లేని కార్యాన్ని అప్రయోజకుడు కూడా చేయడు. మరి, భగవంతుని బోధ వెనుక ప్రయోజన మేమిటి?

ప్రయోజనం లేని కార్యాలు విజ్ఞులు ఆచరించరు.
అలాగని తనకూ ప్రయోజనం అవసర మైతే ఆయన భగవంతుడు కాలేడు.

నిజమే. తాను చేసిన ప్రబోధ కార్యము ప్రయోజనంతో కూడుకొని ఉంది కనుక, తన విజ్ఞతకు లోపం రాదు.
కానీ, ఆ ప్రయోజనము తన కొరకు కానందున ఆయన పూర్ణత్వానికి కూడా భంగం లేదు.

తన కంటూ ఏ ప్రయోజనం అవసరం లేకపోయినా **(స్వప్రయోజన అభావేపి)** సర్వ ప్రాణులను అనుగ్రహించాలనే కాంక్షతో **(భూతాను జిఘృక్షయా)** వేదోక్త మైన ధర్మద్వయాన్ని భగవంతుడు గీతలో బోధించాడు.

ప్రవృత్తి - నివృత్తి

వేదాంత శాస్త్రాని కైనా, గీతాశాస్త్రాని కైనా మోక్షమే పరమ ప్రయోజనము. అదే నిశ్శ్రేయసము. సంసారము, దానికి కారణమైన అజ్ఞానము సమూలంగా నశించడమే మోక్షము **(నిశ్శ్రేయసమ్. సహేతుకస్య సంసారస్య అత్యన్త ఉపరమ లక్షణమ్).**

వేదోక్తమైన ధర్మద్వయమే ప్రవృత్తి నివృత్తులు. ఏమి చెయ్యాలో చెప్పేది ప్రవృత్తి. ఎలా ఉండాలో చెప్పేది నివృత్తి. ప్రవృత్తి కర్మమార్గము. నివృత్తి జ్ఞానమార్గము. విధి విధానాలు, కర్మోపాసనల ద్వారా జ్ఞానానికి సిద్ధం చేసే ప్రవృత్తి లక్షణ ధర్మం కర్మమార్గము. జ్ఞానమును ప్రసాదించి స్వరూప స్థితిలో నిలిపే నివృత్తి లక్షణ ధర్మం జ్ఞానమార్గము. ఈ రెండే వేదము ప్రతిపాదించే ధర్మద్వయం.

మోక్షము కర్మఫలం కాదు. కర్మ అనిత్యం. అనిత్యమైన కర్మకు ప్రాప్తించే కర్మఫలం కూడా అనిత్యమే. కనుక అనిత్యమైన కర్మ ద్వారా నిత్యమైన ఆత్మను పొందడం అసంభవం **(న హ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్).** జ్ఞానం వల్లనే మోక్షం సిద్ధిస్తుంది. జ్ఞానం గురువు ద్వారానే ప్రాప్తిస్తుంది. గురువు ప్రసాదించే జ్ఞానాన్ని గ్రహించడానికి బుద్ధి శుద్ధి పడి ఉండాలి. ఈ చిత్తశుద్ధి కర్మయోగం వల్ల సిద్ధిస్తుంది. కర్మయోగము ద్వారా శుద్ధిపడిన తరువాత

ముముక్షువు జ్ఞాననిష్ఠకు అర్హు డవుతాడు **(కర్మజా సిద్ధిః జ్ఞాననిష్ఠా యోగ్యతా లక్షణా).** మోక్షం జ్ఞానరూపంలో ఉంది కనుక ఆత్మజ్ఞానాన్ని పొంది ముక్తు డవుతాడు. శోకాన్ని దాటి పోతాడు **(తరతి శోక మాత్మవిత్ -** ఛాందోగ్యోపనిషత్).

వేద ప్రతిపాదితమై నిష్ఠాద్వయంగా చెప్పబడుతున్న ప్రవృత్తి నివృత్తి మార్గాలనే గీత కూడా బోధిస్తూ ఉంది. ఉపాయమైన కర్మయోగమును సాధనగా, ఉపేయమైన జ్ఞానయోగమును సాధ్యముగా నిర్ణయిస్తూ నిష్ఠా ద్వయాన్ని గీత బోధిస్తూ ఉంది.

గీతా వ్యాఖ్యానాలు - శ్రీ శంకర భాష్యము

భగవద్గీతపై అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇంకా వెలువడు తున్నాయి. ఈ భాష్యాలలో ప్రముఖ మైనది, ప్రాచీన మైనది శ్రీ ఆదిశంకరాచార్యస్వామి రచించిన భాష్యము.

శ్రీ శంకరులకు పూర్వము కూడా భగవద్గీతకు వ్యాఖ్యానము వ్రాసిన వారు ఉన్నారు. అవి గీతా హృదయాన్ని ఆవిష్కరించ గలిగి ఉంటే, శ్రీ శంకరులు గీతకు భాష్యం వ్రాసి ఉండే వారు కారు.

వాస్తవం చెప్పాలంటే, అవి యథావత్ గీతా హృదయాన్ని ఆవిష్కరించక పోగా, వక్ర భాష్యాన్ని కూడా వినిపించాయి. అందుచేత ఆచార్యుల వారు గీతాభాష్యానికి శ్రీకారం చుట్ట వలసి వచ్చింది.

ఆచార్యుల వారికి పూర్వము బోధాయనుడు అనే వ్యక్తి గీతకు వ్యాఖ్యానము రచించాడు. అతనిని వృత్తికారుడు అని కూడా అంటారు. అతడు జ్ఞానకర్మ సముచ్చయ వాదాన్ని ప్రతిపాదించాడు.

ప్రవృత్తి నివృత్తులను గూర్చి ఇప్పుడే మనం సంక్షేపంగా చెప్పుకున్నాం. గ్రంథంలో మున్ముందు సహేతుక మైన తర్కంతో విస్తారంగా చర్చించడం మీరు చూస్తారు.

ప్రస్తుతం మనం చూచి నంత వరకు కర్మయోగ, జ్ఞానయోగాల మధ్య సాధన సాధ్య సంబంధాన్ని చూశాం. ఉపాయ ఉపేయ సంబంధంగా అర్థం చేసుకున్నాం. జ్ఞానం ద్వారానే మోక్షం ప్రాప్తిస్తుంది. మోక్షానికి జ్ఞానమే సాధనం **(జ్ఞాన మేవ సాధనం).** జ్ఞానప్రాప్తికి అంతఃకరణ శుద్ధి అవసరం కనుక, దానికి కర్మయోగము సహకరిస్తుంది. ఉపకరిస్తుంది. ఇదీ ఉన్న విషయం.

వృత్తికారుడు ప్రతిపాదించే జ్ఞానకర్మ సముచ్చయము విచిత్రమైన వాదము. కర్మ, జ్ఞానము కలిసే మోక్షాన్ని ఇస్తాయి అనేది బోధాయనుని అభిప్రాయము. జ్ఞానకర్మలు రెండిటిని ఒకే మనిషి ఒకే కాలంలో ఆచరించడం సాధ్య పడదు. కారణం, అవి గతి - స్థితుల వలె పరస్పర విరుద్ధ మైనవి.

ఒకే కాలంలో ఒకే వ్యక్తి నడవాలి - నడవకుండా నిలబడాలి (గతి - స్థితి) అంటే సాధ్యమేనా? ఇంత అశాస్త్రీయ మైన విషయం వృత్తికారుడికి వంట బట్టింది. పోనీ, అది అతని అభిప్రాయం అని సరిపెట్టు కుందాము అంటే, అదే గీతాహృదయ మని వ్యాఖ్యానిస్తూ, గీతకు జ్ఞానకర్మ సముచ్చయ వాదాన్ని అంట గట్టాడు. వృత్తికారుని మతాన్ని గీతాభాష్యంలో అనేక చోట్ల నామ ప్రసక్తి లేకుండా ఆచార్యుల వారు నిశితంగా ఖండించారు.

తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థ
సార సంగ్రహ భూతమ్ దుర్విజ్ఞేయార్థం

ఈ గీతాశాస్త్రము సమస్త వేదార్థ సార సంగ్రహ భూతమై ఉన్నందున, దాని అర్థాన్ని యథావత్ గ్రహించడం సులభసాధ్యం కాదు. చాలా కష్టమైన కార్యము అంటూ భాష్య పీఠిక లోనే ఆచార్యులు వ్యాఖ్యానించారు.

నేను ముందుగానే తెలియ చేసినట్లు, పూర్వ వ్యాఖ్యానాలు ఉండగా, మళ్ళీ ఆచార్యుల వారు భాష్యాన్ని ఎందుకు రచించారు? అనేది పూర్వపక్షము.

వ్యాఖ్యానాలు ఉండినా, అవి విరుద్ధ భావాలను వ్యక్తం చేయడం వల్ల, వాటిని పఠించే వారు విరుద్ధ భావాలను గ్రహించడమే గాక, ఆ విరుద్ధ భావాలు గీత లోనే ఉన్నాయని కొందరు అంటూ ఉండటం వినిన ఆచార్యులు, ఈ విరుద్ధార్థ గ్రహణాన్ని నివారించి, స్పష్టమైన అర్థాన్ని ఋజుమార్గంలో అందించ డానికి భాష్యాన్ని వ్రాయవలసి వచ్చింది అని స్వయంగా చెప్పడం జరిగింది **(అహం వివేకతః అర్థ నిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి).**

ఆప్త ప్రణీతము

గ్రంథ విషయము విస్పష్టంగా, సులభగ్రాహ్యంగా ఉంటే, దానిని వ్యాఖ్యానించ నవసరం లేదు. మూల గ్రంథము లోని విషయాన్ని గ్రహించడం దుస్సాధ్య మైనపుడే దానికి వ్యాఖ్యానము అవసరమై ఉంటుంది.

మూలానికి వ్యాఖ్యానము తోడై నపుడు విషయం స్పష్టమై సులభగ్రాహ్యం కావాలి. అలా విషయాన్ని సులభ తరం చేసే విధంగా వ్యాఖ్యానించా లంటే వ్యాఖ్యాత ఆప్తుడై ఉండాలి. అతని వ్యాఖ్యానము ఆప్తప్రణీతంగా ఉండాలి.

ఆప్తుడు అంటే యథార్థమును వచించు వాడు అని అర్థము. ప్రామాణికుడు అని భావము. ప్రమాణ విషయాన్ని విడిచి పెట్టకుండా, అప్రమాణ విషయాలను జోడించకుండా విషయాన్ని ఉన్నదున్నట్లు సుస్పష్టంగా అందించ గలిగే వాడు ఆప్తుడు. అట్టివాడు రచించే వ్యాఖ్యానమును ఆప్త ప్రణీతము అంటారు.

వ్యాఖ్యానము ప్రామాణికంగా ఉన్నప్పుడే అది ఆప్త ప్రణీత మవుతుంది. అలా ప్రామాణికంగా ఉండాలి అంటే, అది పంచ లక్షణాయుతంగా ఉండాలి.

పదచ్ఛేదః పదార్థోక్తిః
విగ్రహో వాక్య యోజనా ।
ఆక్షేపస్య సమాధానం
వ్యాఖ్యానం పంచలక్షణమ్ ।

ప్రామాణిక మైన వ్యాఖ్యానమునకు అయిదు లక్షణాలు ఉండాలి. (1) పదచ్ఛేదము, అంటే పదములను విడగొట్టడము (2) పదార్థోక్తి, అంటే పదముల యొక్క అర్థమును చెప్పడము. (3) విగ్రహము, అంటే సమాసగత పదాలను విడదీసి అర్థము చెప్పడము (4) వాక్యయోజనము, అంటే వాక్యానికి సుస్పష్టంగా అర్థం చెప్పడము (5) ఆక్షేపస్య సమాధానం, అంటే ఆక్షేపానికి సమాధానం చెప్పడము. ఈ అయిదు లక్షణాలు ఉన్నప్పుడే వ్యాఖ్యానము ప్రామాణిక మవుతుంది. అట్టి వ్యాఖ్యానమునే ఆప్త ప్రణీతముగా విజ్ఞులు గ్రహిస్తారు.

ఇక భగవద్గీత విషయానికి వస్తే, మూలగ్రంథము సమస్త వేదార్థ సార సంగ్రహభూత మైనందున, అది దుర్విజ్ఞేయమై కష్టసాధ్యంగా ఉన్నందున వ్యాఖ్యాన యోగ్యమై ఉంది.

శ్రీ శంకరులకు పూర్వులైన వ్యాఖ్యానకర్తలు భగవద్గీతను వ్యాఖ్యానించి ఉన్నప్పటికీ, ఆచార్యులు భాష్యాన్ని అందించారు అంటే, పూర్వ వ్యాఖ్యానాలు పంచ లక్షణాయుతంగా లేవా? వ్యాఖ్యాన లక్షణాలను విస్మరించాయా? కాదు. వారు కూడా వ్యాఖ్యాన లక్షణాలను అనుసరించే వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని భాష్యంలో శ్రీ శంకరులే అంగీకరించారు. అయినా, ఆచార్యుల వారు భాష్యం వ్రాయవలసి వచ్చింది. కారణ మేమిటో భాష్య పలుకు ల్లోనే విందాం.

తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థ సార సంగ్రహ భూతం దుర్విజ్ఞేయార్థం। తదర్థా విష్కరణాయ అనేకైః వివృత పద పదార్థ వాక్యార్థ న్యాయ మపి అత్యన్త విరుద్ధ అనేకార్థత్వేన లౌకికైః గృహ్యమానం ఉపలభ్య అహం వివేకతః అర్థ నిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి !

'సమస్త వేదార్థ సార సంగ్రహ భూతమైన గీతాశాస్త్రం యొక్క అర్థాన్ని యథావత్ గ్రహించడం సులభమైన విషయం కాదు; పైగా చాలా కష్టతరం కూడా. అందుచేత, పంచ లక్షణ వ్యాఖ్యాన న్యాయాన్ని అనుసరిస్తూ, పదచ్ఛేదము, పదార్థోక్తి, విగ్రహము, వాక్యార్థము (వాక్య సమన్వయము), ఆక్షేపమునకు సమాధానమును ఇస్తూ కొంత మంది వ్యాఖ్యానించి ఉన్నారు. అయినప్పటికీ, ఆ వ్యాఖ్యానాలు విరుద్ధమైన అనేక అర్థాలతో కూడి ఉన్నందున, అజ్ఞానులు ఆ విరుద్ధమైన అర్థాలను గ్రహించి, గీత లోని భావాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి అని చెప్పుకుంటూ ఉండటం విని, ఏ విధమైన వైరుధ్యానికి అవకాశం ఇవ్వకుండా విషయాన్ని సుస్పష్టం చేయడానికి సంక్షేపంగా వివరిస్తూ వ్యాఖ్యానిస్తాను' అని ఉపోద్ఘాతం లోనే స్పృశించారు.

స్వాభిప్రాయం

మూల విషయానికి సంబంధించిన అర్థాన్ని సుస్పష్టం చేయడం లోనే వ్యాఖ్యాన ప్రాధాన్యత ఉంటుంది. ఎవరైనా **మార్జాలీ** అన్న పదానికి ఆడపిల్లి అనే అర్థాన్ని గ్రహించకుండా, **శునీ** అంటూ ఆడకుక్క అని అర్థం చెప్పారనుకోండి, ఇక ఆ తరువాత, 'మార్జాలీ, అంటే ఆడపిల్లి విశ్వాసం కలది, ఇంటిని కాపలా కాస్తుంది, గొప్ప ఆఘ్రాణ శక్తి కలది' అంటూ అప్రస్తుత అనర్థ వ్యాఖ్యానాన్ని అందించడం జరుగుతుంది.

ఇక్కడే శ్రీ శంకర భాష్యము ఆప్తప్రణీతమై అలరారుతోంది. గీత లోని మూలాన్ని ఎక్కడి కక్కడ పద బంధాలను విడగొట్టి, సంప్రదాయ గాడిలో నిలిచి, అర్థాన్ని సుస్పష్టం చేయడంలో శ్రీ శంకరులు అనితర సాధ్యమైన అసమాన ప్రతిభను ప్రదర్శించారు.

బుధులు విభేదించి మరో విధంగా భావించరనే విశ్వాసంతో నా మనస్సు లోని మాట చెబుతున్నా!

భాష్యకారులుగా ఆచార్యుల వారి వైభవాన్ని
తిలకించి పులకించి పరవశించాలంటే,

కదలి కెరటాల వలె ఎగసి పడే
వాదనల వీణానాద విలసనములతో,
ప్రచండ డిండిమ ధ్వనుల వలె చిందు లేసే
సశాస్త్రీయ సిద్ధాంత భేరీ నినాదాలతో,
అలౌకిక వాగ్విభూతి వినిపించే
నేపథ్య సంగీత ఝరులకు అనుగుణంగా
తర్క వేదికపై గీర్వాణ సుందరాంగి ప్రదర్శించే
ప్రతిభా వైశిష్ట్య నాట్యకళా వైభవాన్ని
అవలోకించా లనుకుంటే,

పున్నమి జాబిల్లి పాలవెల్లిపై వెన్నెల పారబోసినట్లు
ప్రసన్న గంభీరమై శోభించే గీతాభాష్యం కన్నా,



ఆచార్యుల వారి ఉపనిష ద్భాష్యాలను,
ముఖ్యంగా సూత్ర భాష్యాన్ని దర్శించాలి. పఠించాలి.

జ్ఞాన మార్తాండులైన ఆచార్యుల వాగ్వైభవ వేడికి
సంశయ జలనిధులు ఇంకిపోతూ ఉండటాన్ని మనం
కళ్ళారా చూడవచ్చు.



సర్వశాస్త్ర జ్ఞాన వైదుష్యం
అసమాన ప్రతిభా పాండిత్యం - అనే రెండు రెక్కలతో
ఆ పరమహంస వేదాంత గగన వీధులలో
చిత్ర విచిత్రంగా విహరిస్తూ ఉంటే,
దర్శించి తరించే బుద్ధిని చూచి
కళ్ళు కలత చెంది ఈర్ష్య పడతాయి.
హృదయం అమృత జ్ఞాన రస తరంగిత మవుతుంది.

అనుబంధము - అనుగ్రహము

సంప్రదాయ ప్రవర్తక ఆచార్య శ్రేష్ఠులైన శ్రీ శంకర భగవత్పాదులు ధర్మద్వయ రూపంతో శోభించే గీతాశాస్త్రం మోక్షమునే ముఖ్య ప్రయోజనంగా కలిగి, వాసుదేవ పరబ్రహ్మమును ప్రధానంగా ప్రతిపాదిస్తూ ఉన్నందున, గీతా శాస్త్రం యొక్క యథార్థ జ్ఞానం కలిగితే సర్వ పురుషార్థములు మానవాళికి సిద్ధిస్తా యనే సత్య సంకల్పంతో గీతకు వ్యాఖ్యానాన్ని అందిస్తున్నట్లు భాష్య ఉపక్రమణిక అంతిమ వాక్యంలో తమ మనస్సు లోని మాటను స్పష్టం చేశారు.

యతః తదర్థే విజ్ఞాతే సమస్త పురుషార్థ సిద్ధిః
ఇత్యతః తద్వివరణే యత్నః క్రియతే మయా!

గీతాశాస్త్ర జ్ఞానము సమస్త పురుషార్థ సిద్ధిప్రదం
ఆ కారణంగా సాగిన ప్రయత్నమే నా ఈ వివరణం - అన్నారు ఆచార్యులు.

మోక్ష ప్రయోజనము ప్రధానమైంది కనుక, సంప్రదాయమును అనుసరించి గీతాశాస్త్రము అనుబంధ చతుష్టయముతో శోభించాలి. విషయ ప్రయోజన సంబంధాధికారులను కలిగి ఉండాలి. అప్పుడే శాస్త్రము వ్యాఖ్యాన యోగ్య మవుతుంది.

విషయము :- ప్రతిపాద్య విషయము వాసుదేవు డనే పేరు గల పరబ్రహ్మము. పరబ్రహ్మమే అభిధేయము లేదా విషయము **(వాసుదేవాఖ్యం పరంబ్రహ్మ అభిధేయ భూతం).**

సంబంధము :- మోక్ష రూపమైన ఫలానికి, గీతాశాస్త్రానికి ధర్మద్వయం ద్వారా (ప్రవృత్తి నివృత్తి రూప కర్మజ్ఞానాలకు) సాధ్యసాధన సంబంధం ఉక్తం. అదే విషయ విషయి భావ సంబంధము.

అధికారి :- పరమ పురుషార్థమైన మోక్షమును అర్థించు జిజ్ఞాసువు అధికారి. అతడే ముముక్షువు.

ప్రయోజనము :- గీతా శాస్త్రమునకు మోక్షమే సాక్షాత్తు ప్రయోజనము.

ఈ విధంగా విషయ, ప్రయోజన, సంబంధాధికారులను అనుబంధ చతుష్టయముగా కలిగి ఉన్నందున గీతా శాస్త్రము సంప్రదాయ సిద్ధమై వ్యాఖ్యాన యోగ్యతను సంతరించు కున్నది.

గీతా వ్యాఖ్యానాలు

భగవద్గీతా వ్యాఖ్యానాలలో శ్రీ ఆదిశంకరాచార్యస్వామి వారి భాష్యమే ప్రాచీన మైనది, ప్రముఖ మైనది అని ఇప్పటికే చెప్పుకున్నాం. ఆచార్యుల వారి మార్గమును అనుసరిస్తూ, వారి తరువాత అనేక భాష్య వ్యాఖ్యానాలు వెలుగు చూశాయి. అలాగే, ఆచార్యుల వారి మార్గముతో విభేదిస్తూ మరి కొన్ని వ్యాఖ్యానాలు వచ్చాయి.

రెండవ కోవకు చెందినవి నా బుద్ధికి రుచించ నందున నేను వాటిని ప్రస్తావించడం లేదు. ఆచార్యుల వారి బాటలో నడచినవి, ఆచార్యుల వారి భాష్యంతో విభేదించనివి, ముఖ్యంగా నన్ను ప్రభావితం చేసిన కొన్ని వ్యాఖ్యానాలను సంక్షేపంగా వివరిస్తాను. ఇవన్నీ సంస్కృత వ్యాఖ్యానాలే.

(1) గీతా తాత్పర్య బోధిని

ఇది భగవద్గీతకు సుందరమైన, సరళమైన సంస్కృత వ్యాఖ్యానము. వ్యాఖ్యాత శ్రీ శంకరానంద యతీంద్రులు. వీరు వేదాంత పంచదశి, అనుభూతి ప్రకాశిక మొదలైన అద్వైత గ్రంథములను రచించిన శ్రీ విద్యారణ్యస్వామి వారి గురుదేవులు.

శ్రీ శంకరానంద మునీంద్రులు 'గీతా తాత్పర్యబోధిని' వ్యాఖ్యానమును ఆరంభిస్తూ చేసిన గురు దేవతా స్తోత్రములలో స్వగురు స్తుతిని బట్టి చూస్తే వీరు ఆనందాత్మ సరస్వతీ స్వాముల వారి శిష్యులని తెలుస్తూ ఉంది.

భక్త్యా ప్రణమ్య స్వగురుం
ఆనందాత్మ సరస్వతీమ్ !
క్రియతే శ్రీమద్భగవ
ద్గీతా తాత్పర్య బోధినీ ॥

మద్గురువరేణ్యు లైన శ్రీ ఆనందాత్మ సరస్వతికి భక్తితో ప్రణామము లర్పించి, శ్రీమద్భగవద్గీతకు 'గీతా తాత్పర్య బోధిని' అనే వ్యాఖ్యానాన్ని రచిస్తున్నాను అని ప్రార్థనా శ్లోకంలో స్తుతించారు.

'గీతా తాత్పర్యబోధిని' రచయిత లైన శ్రీ శంకరానంద యతివరేణ్యులు అద్వైత సంప్రదాయక ప్రవర్తక గురువు లైన ప్రముఖులలో ఒకరు. 'గీతా తాత్పర్యబోధిని' వ్యాఖ్యానమునే గాక, వేదాంత ప్రపంచానికి సుపరిచిత మైన 'ఆత్మపురాణము'ను రచించిన గ్రంథకర్త కూడా వీరే.

వీరి గీతా వ్యాఖ్యాన మంతా అద్వైతపరం గానే సాగుతుంది. సుప్రసిద్ధమైన ఈ వ్యాఖ్యానము అనితర సాధ్యంగా భాసిస్తుంది. కానీ, వీరికి జ్ఞానము నందే అభిలాష మెండు. భక్తి విషయంలో వైరుధ్యము లేకపోయినా, ఆసక్తిని మాత్రం పెద్దగా ప్రదర్శించరు.

(2) గూఢార్థ దీపిక

సుప్రసిద్ధ మైన గీతా వ్యాఖ్యానములలో 'గూఢార్థ దీపిక' కూడా విశిష్ట మైనదిగా కీర్తింప బడింది. దీని వ్యాఖ్యాత శ్రీమధుసూదన సరస్వతీ స్వాముల వారు.

శ్రీ శంకరాచార్యస్వామి భాష్యమును అనుసరిస్తూ వీరి వ్యాఖ్యానము సాగుతుంది. వేదము ఎలా కాండ త్రయాత్మకంగా ఉందో, భగవద్గీత కూడా కర్మ, భక్తి, జ్ఞాన క్రమంలో కాండత్రయాత్మకంగా శోభిస్తూ,

వేదమునకు ప్రతిరూపమై భాసిస్తూ ఉందని వ్యాఖ్యానించారు. శ్రీ శంకరానందుల వారు భక్తిని స్పృశించకుండా జ్ఞానపరం గానే వ్యాఖ్యను నడుపుతారు. మధుసూదన సరస్వతి భక్తిని స్పృశించకుండా వ్యాఖ్యానాన్ని సాగించ లేరు. ఇదే వీరిరువురి వ్యాఖ్యానములలో మనకు స్పష్టంగా కనిపించే అంతరము.

'అద్వైత సిద్ధి' అనే అద్భుతమైన అద్వైత గ్రంథము శ్రీ మధుసూదన సరస్వతుల వారి కృతియే. వీరు గొప్ప కృష్ణ భక్తులు. వీరిలో భక్తి జ్ఞానాలు అపూర్వ సమ్మేళనంగా కనిపిస్తాయి.

(3) సుబోధినీ వ్యాఖ్య

ఇది శ్రీధరస్వామి రచించిన వ్యాఖ్యానము. భక్తి భావ బంధురమైన శ్రీధరుని 'సుబోధినీ' వ్యాఖ్య ప్రసన్నంగా సాగింది. భాష్యకారుల అభిప్రాయాలతో పాటు, భాష్య వ్యాఖ్యాతల భావాలను కూడా ఔదల దాల్చి గీతా వ్యాఖ్యానమును కొనసాగిస్తున్నట్లు శ్రీధరస్వామి ఉపక్రమణిక లోనే తెలియ చేశారు. లక్ష్మీ సమేతుడైన శ్రీమహావిష్ణువును, పార్వతీనాథు డైన విశ్వేశ్వరుని భక్తితో నమస్కరించి, ఆ విధమైన భక్తి చేత ప్రేరితుడై సుబోధినీ గీతా వ్యాఖ్యానమును రచిస్తున్నట్లు ప్రార్థనా శ్లోకాల లోనే తెలిపి, శివకేశవుల మధ్య అభేదమే దర్శనీయ మని స్పష్టం చేశారు.

భక్తి వలన భగవ దనుగ్రహం ప్రాప్తిస్తుందని, భగవ దనుగ్రహము చేత కలిగిన ఆత్మజ్ఞానము వలన సుఖంగా బంధ విముక్తి, మోక్షప్రాప్తి కలుగుతుం దని, ఇదే గీతార్థ సంగ్రహ మని తన అభిప్రాయాన్ని సుబోధినీ వ్యాఖ్యానంలో ఒక్క శ్లోకం లోనే తేట పరిచారు.

భగవ ద్భక్తి యుక్తస్య
త త్ప్రసాదా దాత్మబోధతః
సుఖం బంధ విముక్తిః స్యాత్
ఇతి గీతార్థ సంగ్రహః

భగవద్భక్తి కల వానికి భగవ దనుగ్రహముచే ప్రాప్తించిన ఆత్మజ్ఞానం వల్ల సుఖంగా బంధ విముక్తి కలుగుతుంది అనేది గీతార్థ సంగ్రహము. ఇది శ్రీధరస్వామి అభిప్రాయము.

(4) భారత భావ దీపము

శివాద్వైతు లైన శ్రీ నీలకంఠాచార్యుల వారు రచించిన గీతా వ్యాఖ్యానమును 'భారత భావదీపము' అంటారు. ప్రామాణికంగా సాగిన వీరి వ్యాఖ్యానము భావగర్భితంగా సాగడమే గాక, అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్హేతుక సిద్ధాంతాలను సున్నితంగా తిరస్కరిస్తూ కూడా సాగుతుంది.

రెండవ అధ్యాయం - పదమూడవ శ్లోకం దేహినోఽస్మిన్ యథా దేహే అనే శ్లోకం పై వ్యాఖ్యానిస్తూ,

వ్యావృత్తేభ్యోఽ ను వృత్తం
భిన్నం కుసుమేభ్యస్సూత్ర మివ,

పరస్పరం భిన్నమైన పుష్పముల యందు అనువృత్త మైన దారము పువ్వుల కన్నా వేరు అయినట్లు, దేహాంతర ప్రాప్తిః - స్థూల శరీరం కన్నా వేరైనట్టి స్థూలానుకారు లగునట్టి సూక్ష్మ దేహములు జీవునికి సంభవిస్తాయి అనే విషయాన్ని విస్తరించి చెబుతూ, అనిత్యములు, అవిభువులు అయిన శరీరాదులకు ఆత్మత్వము సంభవించడం అసంభవం కనుక చార్వాకాది మతాలు నిరస్తములు అని నిర్ధారణ చేస్తారు.

(5) పరమార్థ ప్రపాఖ్య

దైవజ్ఞ పండిత సూరి రచించిన గీతా వ్యాఖ్యానమే 'పరమార్థ ప్రపాఖ్య'. వీరు కృష్ణ భక్తులు. తమ గురువైన చతుర్వేద స్వామి నుండి గ్రహించిన జ్ఞాన ప్రసాదమును ప్రామాణికంగా అందించాలనే కుతూహలంతో గీతా వ్యాఖ్యానమును రచిస్తున్నట్లు, ఈ వ్యాఖ్యానము అల్పజ్ఞులైన వారికి కూడా ఆనందాన్ని ప్రసాదిస్తుంది అని వాగ్దానం చేశారు.

భగవ దనుగ్రహము నందు వీరికి అచంచల మైన విశ్వాసము. సముద్రాన్ని పుడిసిట పట్టే శక్తి అగస్త్య మహర్షికి, భూమాతను పడగలపై నిలిపే శక్తి ఆదిశేషునికి, దహించే శక్తి అగ్నికి, వర్షించే శక్తి మేఘానికి, ప్రకాశించే శక్తి సూర్యునికి, వీచే శక్తి వాయుదేవునికి ఏ లోకాతీత శక్తి స్వరూపుడైన శ్రీకృష్ణుడు అనుగ్రహించాడో, ఆ దివ్యాత్ము డైన యశోదా కిశోరుడే తనలో అంతర్యామిగా అతి సమీపమున సర్వోత్కర్షముగా ప్రకాశిస్తూ, తన చేత గీతా వ్యాఖ్యానాన్ని వ్రాయిస్తున్నాడు అని నివేదించు కున్నారు దైవజ్ఞ పండిత సూరి. గీతా వ్యాఖ్యానాలలో 'పరమార్థ ప్రపాఖ్య' కూడా తన కంటూ ఒక స్థానాన్ని పదిలం చేసుకుంది.

ఇవన్నీ అద్వైత పరంగా సాగిన వ్యాఖ్యానాలే. ఇవే గాక, మరెన్నో, ఎన్నెన్నో చెప్పుకో దగిన గీతా వ్యాఖ్యానాలు అసంఖ్యాకంగా ఉన్నాయి.

ఆచార్యుల వారి భాష్యానికి, ఆచార్యుల వారి శిష్యులలో ఒకరైన ఆనందగిరి ఒక టీకను రచించారు. ఇది శ్రీశంకర భాష్యానికి వివరణములా సాగింది. అదే 'గీతాభాష్య వివేచనము' అనే ఆనందగిరి టీక.

అలాగే శ్రీ మధుసూదన సరస్వతి రచించిన గద్యాత్మక మైన (వచన రూపమైన) 'గూఢార్థ దీపిక' కు శ్రీసదానంద యతీంద్రుల వారు పద్యాత్మకంగా ఒక వ్యాఖ్యను రచించారు. దానిని 'గీతా భావ ప్రకాశము' అంటారు. దీనిని కేవలం శ్రీకృష్ణ పరమాత్మ చరణకమల సేవనముగా రచించి, భగవదర్పణం చేసినట్లు ఆయన చెప్పు కున్నారు.

గీతా భావ ప్రకాశః
శ్రీ సదానందేన నిర్మితః
శ్రీమత్కృష్ణ పదాంభోజ
సేవా ముద్దిశ్య కేవలమ్ - అని శ్రీకృష్ణుని యందు తనకు గల భక్తిని చాటుకున్నారు.

భగవద్గీతపై వెలువడిన సంస్కృత వ్యాఖ్యానాలలో **భాష్యోత్కర్ష దీపిక** కూడా ప్రసిద్ధ మైనదే. దీనిని ధనపతి సూరి రచించారు. సర్వ శాస్త్ర జ్ఞానఫల మైన మోక్షము గీతా భక్తులకు అనాయాసంగా ప్రాప్తిస్తుంది అని ఫలస్తుతిలో శ్లాఘించారు. నిష్కామ కర్మయోగులకు చిత్తశుద్ధి ఫలం కాగా, తత్త్వ జ్ఞానాధికారికి అన్యాపేక్ష లేని కేవల తత్త్వ దర్శనము వలన మోక్షము ప్రాప్తిస్తుందని గీతాశాస్త్రార్థ సారాన్ని ఆవిష్కరించారు.

శ్రీ బెల్లంకొండ రామరాయ కవి రచించినది **భాష్యార్క ప్రకాశము.** ఇదొక అద్భుత మైన అద్వైత వ్యాఖ్యానము. వీరు సుమారు వంద పాతికేళ్ళ క్రితం గుంటూరు జిల్లా లోని పమిడిపాడులో ఉండే వారట. వీరు ఆచార్యుల వారి వలె తక్కువ కాలం జీవించారు. ముప్పై ఎనిమిది సంవత్సరాలే బ్రతికారు. సుమారు వందకు పైగా సంస్కృతంలో గ్రంథాలు రచించారు. అవన్నీ అద్భుత మైనవే. వీరి పాండిత్య ప్రతిభను గుర్తించిన పండిత ప్రపంచం వీరిని 'అభినవ శంకరులు' అని కీర్తించింది. ముఖ్యంగా వీరి గీతా వ్యాఖ్యానము జటిల మైనప్పటికీ బహు రసవత్తరంగా, ఆసక్తికరంగా ఉంటుంది. వీరు 'భాష్యార్క ప్రకాశము'లో గీతా వ్యాఖ్యానానికి ఎంత ప్రాధాన్యత నిచ్చారో, విశిష్టాద్వైత ఆచార్యులైన శ్రీమద్రామానుజ భాష్యాన్ని నిశితంగా విమర్శించడానికి కూడా

అంతే ప్రాధాన్యత నిచ్చారు. అలాగే శ్రీ వేదాంత దేశికులు అద్వైతం పై లేవనెత్తిన ఆక్షేపణలను కూడా తీవ్ర స్వరంతో ఖండించారు. వీరు గొప్ప రామభక్తులు. హయగ్రీవోపాసకులు.



భగవద్గీతకు భాష్యా లెన్నున్నా
వెల్లువలై వ్యాఖ్యలు దొర్లి వచ్చినా
అధ్యయనాని కైనా, అనుభూతి కైనా
శాంకర భాష్యమే అసమాన ప్రదీపము.

అవి మాటలు కావు, మంత్రాలు
పలుకులు కావు, ప్రమాణాలు
వాక్యాలు కావు, వాగ్దేవి రూపాలు
అనుసరించే వారికి శాంతితీరాలు.

గీతా దర్శనము

య ఉపనిషత్సు ధర్మాః
తే మయి సన్తు ! తే మయి సన్తు !

ఉపనిషత్తుల అనంత జ్ఞానము తమ హృదయాలలో సుస్థిరంగా ఆవిష్కరింప బడాలని ఎంతో కాలంగా ఎందరు తపించారో,

వారందరి కలల పంటగా, ప్రార్థనల ఫలంగా మహాభారతము పంచమవేదంగా అవతరించింది (*భారతం పంచమో వేదః*). వేద ధర్మాలను, ఉపనిష ద్రహస్యాలను ఒడి గట్టుకొని మరీ అవతరించింది. ఈ మహత్కార్యాన్ని సామాన్యులు సాధించ గలరా? అందుకే సాక్షాత్తు వేదనారాయణమూర్తి వేదవ్యాసుని రూపంలో అవతరించి ఆ మహత్కార్యాన్ని పూర్తి చేశాడు.

కో హ్యన్యః పుండరీకాక్షాత్
మహాభారత కృద్భవేత్ !

పద్మనయనుడైన పరమేశ్వరుడు తప్ప
కాగలడా మరొకడు మహాభారత కర్త?

విశ్వంలోని రూపా లన్నిటినీ మనం రెండు కళ్ళతో చూస్తున్నాము. అలాగే విశ్వనాథుని స్వరూపాన్ని దర్శించ డానికి మహాభారతము రెండు దివ్య చక్షువులతో శోభిస్తూ ఉంది. అందుచేతనే మహాభారత జ్ఞాన కమలము కలిమల హరణమే గాక ముక్తి ప్రదాయకమై అలరారుతోంది (*భూయాద్భారత పంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే !*). మహాభారత జననికి సర్వదర్శన యోగ్యంగా శోభిస్తున్న ఆ నేత్రద్వయం వల్ల భారతము సర్వ శ్రేష్ఠత్వాన్ని సంతరించుకుంటే, సర్వేంద్రియాలలో నేత్రాలే ప్రధానం కనుక, మహోన్నతమైన మహాభారత గ్రంథంలో ఆ నేత్రద్వయం సర్వోన్నతమై శోభిస్తోంది. ఒకటి, భగవద్గీత; రెండు, విష్ణుసహస్రనామం.

భారతం సర్వ శాస్త్రేషు
భారతే గీతికా వరా!
విష్ణోః సహస్ర నామాపి
జ్ఞేయం పాఠ్యం చ తద్ద్వయమ్ !

సర్వ శాస్త్రములలో మహాభారతము శ్రేష్ఠ మైనది. భారతములో భగవద్గీత శ్రేష్ఠ మైనది. అలాగే విష్ణుసహస్రనామం కూడా. ఈ రెండిటిని సర్వులు తెలుసుకోవాలి. పఠించాలి. గీతను అర్థం చేసుకోవాలి. విష్ణుసహస్రనామాన్ని అవగాహనతో పఠించాలి.

గేయం గీతా నామ సహస్రం
ధ్యేయం శ్రీపతి రూప మజస్రమ్ !

భగవద్గీతను నిత్యము అధ్యయనం చేయాలి. విష్ణుసహస్రనామాన్ని సదా పఠించాలి. ఈ రెండిటి వల్ల ప్రాప్తించే జ్ఞానంతో పరమేశ్వరుని ధ్యానించాలి, దర్శించాలి అని ఆచార్యుల వారి 'భజగోవిందం'.

విశ్వశాంతి ప్రదాయకం

విశ్వశాంతి నినాదంతో నేటి ప్రపంచం ప్రతిధ్వనిస్తూ ఉంది. అరచి అరచి నోళ్ళు అలసి పోతున్నాయి. పలికి పలికి మాటలు మూగ బోతున్నాయి. అంతా అలజడే. అన్నిచోట్ల అశాంతే. అందరిలో ఆవేదనే. మానవ సమాజ మంతా సమస్యలే. సంఘర్షణలే. విశ్వశాంతి అనేది అరుపులకు చిక్కేది కాదు, అవగాహనకు మాత్రమే దక్కేది.

విశ్వశాంతి వ్యక్తిశాంతిపై ఆధారపడి ఉంది. మనిషికి ఆనందం కావాలి. తృప్తి కావాలి. దేశకాలాలకు పరిమితం కాని ఆనందం కావాలి. ఆనంతానందం కావాలి. అది లభించే వరకు వ్యక్తికి సమస్యలు తీరవు; సంఘర్షణలు తప్పవు.

కురుక్షేత్రంలో అర్జునుడు శ్రీకృష్ణుని ముందు ఒకనాడు ఈ సమస్యనే ఉంచాడు. రాజ్యసుఖాలు, స్వర్గభోగాలు సైతం అందించలేని నిరవధిక సుఖాన్ని, అనంతానందాన్ని ఆశిస్తూ ప్రశ్నించాడు. మానవు లందరి సమస్య ఇదే కనుక, సర్వమానవాళి తరపున ప్రతినిధిగా అర్జునుడు ప్రశ్నించాడు.

సర్వలోకాను గ్రహార్థం అర్జునం
నిమిత్తీ కృత్య ఆహ భగవాన్ వాసుదేవః

సర్వ మానవాళిని అనుగ్రహించుటకు అర్జునుని నిమిత్తమాత్రంగా ఉంచుకొని, వాసుదేవ భగవానుడు భగవద్గీతను బోధించాడు.

గీత అర్జునుని సమస్యను పరిష్కరించింది
నీ, నా సమస్యలను కూడా పరిష్కరిస్తుంది
అన్ని కాలాలకు, అందరు వ్యక్తులకు, అన్ని దేశాలకు
ఉపకరించే అమృత సందేశమే శ్రీమద్భగవద్గీత.

భగవద్గీత ఎవరో కొందరికి మాత్రమే ఉపయోగపడే మత గ్రంథము కాదు. సర్వులను అక్కున చేర్చుకొని ఉద్ధరించే అమృత భాండము. అందుకే గీత విశ్వసందేశమై అలరారుతుంటే, గీతాచార్యుడు విశ్వపూజితుడై శోభిస్తున్నాడు.

సారథ్య మర్జున స్యాదౌ
కుర్వన్ గీతామృతం దదౌ,
లోక త్రయోపకారాయ
తస్మై కృష్ణాత్మనే నమః॥

అర్జునుని రథాన్ని నడిపే బాధ్యతను ఒక వైపు నిర్వహిస్తూ, మరో వైపు ముల్లోకాలకు ఉపకారం చేయాలనే సంకల్పంతో గీతామృతాన్ని పంచిన శ్రీ కృష్ణ పరమాత్మకు నమస్కారము.

సమస్యల వలలో చిక్కుకొని సతమత మవుతున్న అర్జునుడు గీతాచార్యుని ఆశ్రయించాడు. గీతను ఆలకించాడు. సర్వ సమస్యల నుండీ, సమస్త సందేహాల నుండి విడి పడ్డాడు. సంతుష్టాంతరంగ చిత్తుడై శోభించాడు.

ఎక్కడా ప్రాప్తించని శాంతిని గీత ప్రసాదిస్తుంది
ఎవరూ అందించలేని ఆనందాన్ని గీత అనుగ్రహిస్తుంది
క్షోభను తొలగిస్తుంది. శోభను కలిగిస్తుంది.

నేటి పరిస్థితి : కాదు, దుస్థితి

గీత అరుదెంచి అయిదు వేల సంవత్సరా లైంది. మన మధ్యకు వచ్చిన గీత మనతో ఉన్నదే గాని మనల్ని విడిచి పెట్టి తిరిగి వెళ్ళ లేదు. గీత మన మధ్యే ఉంది, అయినా ఎందుకనో మన రాతలు మార లేదు.

కల్పతరువు క్రింద ఉన్నవాడు కరువుతో కుమిలి పోవడమా?
అమృత భాండాన్ని ముందు పెట్టుకొని దిక్కులేని చావు చావడమా?
నిజమే మరి! ఏం చేద్దాం!
కళ్ళుండినా గ్రుడ్డితనమే!
చెవు లుండినా చెవిటితనమే!

శబ్దాలంకార సొబగులతో శ్రవణ మనోహరంగా మహిత కవితా విభూతిని వినిపిస్తున్నా, ప్రయత్నంతో గట్టిగా చెవులు మూసుకొనే వాణ్ణి ఎవరు మాత్రం ఎలా తృప్తి పరచ గలరు?

శ్యామసుందరు డైన ఇందిరేశుని సుందర మృదు పదములు కనుల ముందు కదులుతున్నా, కర్కశంగా కళ్ళు మూసుకొనే వాణ్ణి ఎవరు మాత్రం ఎలా కాపాడగలరు?



అన్నీ బాగానే ఉన్నాయి
అల్లుడే మరో విధంగా ఉన్నాడు.

ఆరగించిన వానికి ఆకలి తెలియదు
గీతను అర్థం చేసుకుంటే అశాంతి మిగలదు.

గీత ఎందుకు ఉన్నదో, ఏం చెబుతున్నదో
అర్థం గాక కొందరు పాడై పోయారు.

గీతార్థాన్ని శ్రీ శంకరాది మహాత్ములు
పని గట్టుకొని హృదయాలకు పట్టించినా
అపార్థాలతో, అనుమానాలతో
దారి తప్పి మరి కొందరు పాడై పోయారు.

పాడైన వ్యక్తుల్ని నింపుకున్న సమాజం ఎలా బాగుంటుంది? అదీ పాడై పోతుంది. అలా పాడై పోయిన ప్రపంచమే నేడు అశాంతిని ఆరగిస్తూ, కన్నీళ్ళను పానం చేస్తూ ఉంది. శాంతి కావాలని పరితపిస్తూ ఉంది. స్వస్థత చేకూరా లని ఆరాట పడుతూ ఉంది.



ఎవరు ఎందుకున్నారో ఎవరికీ అర్థం గాని పరిస్థితి
ఎవరు ఎటు పోతున్నారో ఎవరికీ తెలియని దుస్థితి
నిర్హేతుక హింసలే నేటి సమాజంలో నియతి
రాక్షస ప్రవృత్తికే ఎటు చూచినా ప్రపంచంలో పరపతి.

మతి లేని ఆలోచనలు
గతి తెలియని గమనాలు
సుగతి ఎంతకూ కలిసి రాదు
దుర్గతి ఎందుకో దూరం కాదు.

అంతా అపసవ్యమే
అంతటా అస్తవ్యస్తమే.

వ్యాకరణం తెలియని వారు భాషను బోధిస్తారు. వైద్యం తెలియని వారు చికిత్సలు చేస్తారు. రాజ్యాంగము తెలియని వారు పరిపాలిస్తారు. జ్ఞానం లేని వారు బోధలు వినిపిస్తారు.

ఎవరు ఎవరినీ నమ్మరు
ఎవరు ఎవరి నైనా వమ్ము చేస్తారు
సొమ్ము చేసుకోవడమే తెలిసిన పని
ఇదే సర్వులను పాలిస్తున్న శని.

ఈ కారు చీకట్ల మధ్య
ఏదో కాంతిరేఖ మెరుస్తోంది.

మరేదో పనికి శ్రీకారం చుట్ట మంటోంది. అది కేవలం పని కాదు. శనిని తొలగించే పని. మునిని తలపించే పని. ఆ పనితనంలో మునితనం ఉంది. అది మామూలు పని కాదు.

ఆర్తుల, దుఃఖార్తుల
న్యాసుల, జిజ్ఞాసువుల కరకమలాలకు జ్ఞాన కమలాన్ని పట్టించే పని.
వినీతుల, విమల మతుల
ముక్తికాముల, మోక్షప్రియుల నేత్ర ప్రమిదలలో చల్లని జ్ఞానవత్తిని వెలిగించే పని.



అభ్యుదయాన్ని జార విడుచుకున్న సమాజానికి
ప్రశాంతతను పోగొట్టుకున్న మానవాళికి
కనువిప్పును కలిగించే కార్యంలో భాగంగా

కురుక్షేత్రాన్ని ధర్మక్షేత్రంగా దర్శింప చేసేందుకు
మానవ మస్తిష్కాన్ని మహిమాన్వితంగా తీర్చి దిద్దేందుకు

పేదవాడికి పైస లిచ్చినట్లు
అన్నార్తుల ఆకలి తీర్చినట్లు
గ్రహాల గమనాన్ని దారి మళ్ళించి
ఆగ్రహాలను సమర్థతతో నిగ్రహించి



నింగిని నేలకు దించి
వంగిన దయను, క్రుంగిన ధర్మాన్ని
నింగిపై నిండుగా నిలిపి
క్షామాన్ని మరపించి, క్షేమంతో మురిపించి
వైరుధ్యాలను అంతం చేసి, వైభవాలను ఆవిష్కరించేందుకు
అందరి చేతులకు గీతను పట్టించాలి.
గీతా జ్ఞానాన్ని బుద్ధి నిండా నింపాలి.

ఇదే తక్షణ కర్తవ్యం
విశ్వశాంతికి ఏకైక మార్గం.

ఇదే జరిగితే,
సూర్యోదయంతో విశ్వంలో తిమిరాలు తొలగినట్లు, గీతా జ్ఞానోదయంతో సమస్త ఉపద్రవాలు అంతరిస్తాయి. లోకంలో కళ్యాణ శోభ నిండు కుంటుంది.

చైతన్య భగవద్గీత

ఏనాటి పుణ్యఫలమో
ఏ దివ్యాత్ముని కృపా వీక్షణమో
బాల్యం లోనే నా మనస్సు బాలగోపాలుని బడి కెళ్ళి కూర్చుంది. అక్షరాలు నేర్చింది, పాఠాలు విన్నది అక్కడే. మాట లొచ్చింది, పాట లొచ్చింది ఆ బడి లోనే.

'తండ్రీ! నీవు మహోన్నతమైన తండ్రివి. నేను అర్హత లేని బిడ్డను. ఆశ ఒక్కటే నా ఆస్తి. అదే నా అర్హత. పారిజాత సుమాలను పట్టుకున్న చేతులతో నమస్కరిస్తూ ఉంటాను. తులసీ దళములను పట్టుకున్న హస్తాలను జోడించి వందన మంటూ ఉంటాను. నీ మాట వింటూ బ్రతుకుతాను. నీ భాషను పట్టుకొనే శక్తి లేనివాణ్ణి. నీ భావాన్ని ముట్టుకొనే సామర్థ్యం లేనివాణ్ణి.' ఇదంతా నా చిన్ననాటి వేడుకోలు.

ఆ వేడుకోలు వెన్నుని చరణాల చెంతకు చేరుతుందని, తన వేడుకను ఆవిష్కరించే మహాకార్యంలో నన్ను వాడుకోవడం జరుగుతుందని నేను కలలో కూడా ఊహించ లేదు.

గీత తోనే చెలిమి చేశాను
గీతే నా కలిమి అని భావించాను
మనస్సు పట్టుకోలేక పోయినా
చేతులు గీతను విడిచి పెట్టేవి కావు.



అదొక సుదినం. శుభదినం
భగవద్వాణిపై గురి కుదిరింది
భగవద్గీతపై మది నిలిచింది.

యఇమం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిధాస్యతి।
భక్తిం మయి పరాం కృత్వా మామే వైష్య త్యసంశయః॥
న చ తస్మా న్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః।
భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి॥

ఈ గీతాశాస్త్రము అతి రహస్యము. దీనిని నా భక్తులకు ఉపదేశించే వాడు నాకు పరమ భక్తుడు అవుతాడు. నిస్సందేహంగా వాడు నన్నే పొందుతాడు.



అర్జునా! అతని కంటే ప్రియమైన వాడు మానవ ప్రపంచంలో మరొకడు
నేడు లేడు. మున్ముందు ఉండబోడు కూడా.

ఈ రెండు శ్లోకాలు గీతను సమాప్తం చేస్తూ
భగవంతుడు వినిపించిన అమూల్యమైన రత్నాలు
అవే నా పాలిటి రత్నాల గనులు
నన్ను సంపన్నుణ్ణి చేసిన రత్నరాశులు.

గీతా మే పరమా విద్యా
బ్రహ్మరూపా న సంశయః

భగవద్గీత ఒక్కటే నాకు శ్రేష్ఠమైన జ్ఞానము
గీత పరమేశ్వరుని స్వరూపము. సంశయం లేదు.

అంతే. ముక్కుపచ్చ లారని పూప వయస్సులో బుద్ధిలో భగవంతుని నింపుకొని, ఎవరి కొరకూ ఎదురు చూడకుండా గీతా ప్రచార భారాన్ని భుజాని కెత్తుకున్నాను.

శక్తి ఉండి ఆ కార్యానికి పూనుకోలేదు
భక్తి ఉందనే ధైర్యం వల్ల మానుకోలేదు.

కొండ మోసిన వాడే అండగా నిలిచాడు
సేవా పంటను దండిగా పండించాడు.

త్రికరణ శుద్ధిగా నమ్మి నడిచి నందుకు మాటిచ్చిన వాడు మాటను నిలబెట్టు కున్నాడు. నాలుగు దశాబ్దాలు దేశం నలు చెరగులా గీతను వినిపించే భాగ్యాన్ని అనుగ్రహించాడు. **ధన్యోఽస్మి భగవాన్! ధన్యోఽస్మి**

ఎన్నో గ్రంథాలు వ్రాశారు. గీతను వ్రాయ రెందుకని?
ఎంతో కాలంగా ఇదే భక్తులు నాపై సంధిస్తున్న ప్రశ్న.

వినతిని వినిపిస్తూనే ఉన్నా!
అనతి వస్తే తప్పక వ్రాస్తా! - ఇదే భక్తులకు నే నిచ్చిన సమాధానం.

ఆజ్ఞ అయింది. క్షణం ఆగకుండా శుభారంభం చేశా!
రచన ఊపందు కుంది. చిత్ర విచిత్రంగా, నిత్య నూతనంగా రూపు దిద్దుకుంటూ సాగింది.

అర్జునునికి బాహ్యంలో నిలబడి బోధించిన వాడు
నాకు మాత్రం లోపలే స్థిరపడి గుట్టు విప్పాడు.

తెలిసిందంతా వ్రాయలేక పోయాను. వ్రాయ గలిగిందంతా వ్రాశాను. తెలుసుకోవాలి - తరించాలి అని భావించే పుణ్యాత్ములకు మరొకటి తెలియ నవసరం లేకుండా వ్రాశాను.

శ్రమనే ఆహారంగా
పరిశ్రమనే పానీయంగా
నిరీక్షణే నిద్రగా భావించి

అనంత సహనంతో
నిరంతర మననంతో

విచిత్రంగా కదులుతూ
వినూత్నంగా కలలు కంటూ

నడకను మరచి
పరుగును వలచి

సూర్యుణ్ణి విడిచి
చంద్రుణ్ణి మరచి
దీప జ్వాలకే అంకితమై

కాలం తెలియకుండా
కాళ్ళు మడచి కూర్చుని

మాటలకు ప్రాణం పోస్తూ
వాక్యాలకు వన్నె లద్దుతూ

మది నంతా మాధవుని నింపుకొని
హృది నంతా గీతామాతను నిలుపుకొని

శంకరునికి కింకరుణ్ణై
వంకరలు లేకుండా
శంకలు కదలకుండా

రెండు వేల పుటలను కుప్పపోసి
నాలుగు సంపుటాల లోకి ఎత్తి నింపి
భక్తుల భుజాలకు తగిలిస్తున్నా!
అలా ఋషి ఋణాన్ని తీర్చుకుంటున్నా!



నివేదన

తత్త్వవస్తు స్వభావజ్ఞః
తత్ఫలం వేత్తి నాపరః।

ఎవరికి ఏ వస్తు పరిజ్ఞాన ముందో
వారికే దాని ఫలం పూర్ణంగా తెలుస్తుంది.

భగవద్గీత ఏమిటో, ఏం చెబుతూ ఉందో, ఏ ఫలితాన్ని ప్రసాదిస్తూ ఉందో బ్రతుకునే సమర్పించుకొని అర్థం చేసుకున్నాను.

గీతాసుగీతా కర్తవ్యా
కిమన్యైః శాస్త్ర సంగ్రహైః

ఇతర శాస్త్రాల ప్రసక్తి ఎందుకు?
గీతను చక్కగా పఠిస్తే చాలు.

అనే హితవాక్యం యొక్క ప్రభావ మేమిటో జీవితంలో చూశాను
అందుకే, ఆరు పదులు నిండిన దశలో అనుభవాన్ని రంగరించి వ్రాశాను.

గీతకు ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. వస్తున్నాయి. వస్తూనే ఉంటాయి.
ఎవరు ఎందుకు వ్రాశారో, వ్రాస్తున్నారో నాకు తెలియదు.

గీతను ప్రవచించడం వేరు. గీతను రచించడం వేరు
గీతను బోధించే వాళ్ళందరూ గీతను వ్రాయలేరు.

వినే వారికి అర్థమయ్యే లాగా బోధించడం బోధకు లందరికీ సాధ్యం కాదు
చదివే వారికి అర్థమయ్యే లాగా రచించడం కూడా రచయిత లందరికీ సాధ్యం కాదు.

మరొక అడుగు ముందు కేస్తే
గీత అర్థం కాని వాళ్ళు ఎలాగూ గీతను వ్రాయలేరు
గీతను అర్థం చేసుకున్న వాళ్ళందరూ కూడా గీతను వ్రాయ గలరని చెప్పలేము.

అందుచేతనే,
భగవద్గీతకు ఎన్ని వ్యాఖ్యానాలు వచ్చినా
వ్యాఖ్యానం అనగానే, శ్రీ శంకర భాష్యమే మనస్సులో మెదుల్తుంది
అదే ప్రసన్నము. అదే గంభీరము. ప్రసన్న గంభీరము.

కొందరికి కొన్ని వ్యాఖ్యానాలు బాగుంటాయి
కొందరికి కొన్ని వ్యాఖ్యానాలు బాగుండవు
కొందరికి ఏవైనా బాగుంటాయి
కొందరికి బాగున్నవే బాగుంటాయి.

ఏది బాగు? ఏది ఓగు?
తెలిపి చెప్ప గలిగే దెవరు?

బాగు పడాలనే దృఢదీక్ష కలవారు
బాగేమిటో తెలుసు కుంటారు.

బాగును గ్రహించిన వారే
ఇతరులకు బాగును అనుగ్రహించ గలరు.

తాదృశానాం దశాం తాం తాం
తాదృశా ఏవ జానతే!
అలాంటి వారి స్థితిని
అలాంటి వారే తెలుసుకుంటారు.

ఇది చైతన్య భగవద్గీత

నాకు తపః ఫలం
మీకు పుణ్య ఫలం



ఏదో సాదాగా చదివి ప్రక్కన పెట్టే గ్రంథం కాదు
అప్పుడప్పుడు, అక్కడక్కడ కొన్ని కొన్ని పుటలు ఎన్నుకొని చదివేది అసలే కాదు.

సాంతము సాదరంగా అధ్యయనం చేయవలసిన గ్రంథము
బుద్ధితో పాటు భక్తిని తోడు చేసుకొని చదువ వలసిన గ్రంథము.



భక్తి రేవ ఏనం గమయతి
భక్తి రేవ ఏనం దర్శయతి
భక్తి వశః పురుషః

భక్తి చేయి పట్టుకొని భగవంతుని వద్దకు నడిపిస్తుంది
భక్తి కళ్ళు తెరిపించి భగవంతుని చూపిస్తుంది
ఎందుకనో తెలుసా? భగవంతుడు భక్తికి వశుడు.

ఎవరి ఇంట్లో ఏదుందో, ఏది లేదో
నాకు మాత్రం ఏం తెలుసు?

అన్ని ఇళ్ళల్లో గీత ఉండాలి

భగవంతుని దర్శించ డానికి ఆలయానికి వెళ్ళాలి. దేవాలయానికి వెళ్ళాలి
గీత మీ గృహంలో ఉంటే, మీ గృహమే గీతా మందిర మవుతుంది
గోవిందుడు గీత లోనే ఉన్నందున గోవింద మందిర మవుతుంది.

గీతాశ్రయోఽహం తిష్ఠామి
గీతా మే చోత్తమం గృహమ్!

నేను గీతను ఆశ్రయించుకొని ఉంటాను. గీతే నా నివాస స్థానము
ఇది ఎవరో ఎవరికో చెప్పింది కాదు. భర్త భార్యకు చెప్పింది
అడిగింది ధరణి. తన చిరునామా ఎక్కడో చెప్పింది ధరణీపతి.
ఇది వరాహపురాణం లోని వార్త.

భూదేవి ప్రశ్నించింది అంటే భూలోక వాసు లందరి పక్షాన ప్రశ్నించిందని అర్థము
భూదేవికి చిరునామా నందించాడు అంటే భూలోక వాసు లందరికీ అందించాడని అర్థము.

గీత మన ఇంట్లో ఉంటే చాలు
మన ఇంటికి రమ్మని అచ్యుతుని ఆహ్వానించ నవసరం లేదు
మనందరము అచ్యుతుని ఇంటి లోనే ఆనందంగా ఉంటాము.



గృహమే గుడి

గోవిందుని దర్శించాలని భావించే భక్తులకు
ఎన్ని గుళ్ళని నిర్మించ గలను?
గుళ్ళనే గుడులుగా మారిస్తే
ఎలా ఉంటుందని ఆలోచించాను.

ఇలా ఉంటుంది అనిపించింది
అదే చైతన్య భగవద్గీత.



సర్వం సఫలం - సర్వం సంపూర్ణం

నా ఆశయం నెరవేరింది. నా ఏకైక వాంఛ తీరి పోయింది
నా బ్రతుకు సఫల మైంది. పురుషార్థం సిద్ధించింది.

చాలు. చాలు. చాలు.
భగవ దారాధన సమాప్త మైంది
భక్తులకు ప్రసాదం ప్రాప్తించింది.

మహాకృతి మహోజ్జ్వలంగా సమాప్త మైంది
కృతి కర్త ఎవరు? కృతి భర్త ఎవరు?

కృతి భర్త నేను కాదని మీకే తెలుసు
కృతి కర్తను నేను అనేది మీ భావన
కాదని చెప్పేందుకే చివరగా ఈ పాడి మాటలు.

కర్తను కాను అంటే పనిముట్టును అనుకుంటా రేమో!
పనిముట్టును కానే కాను; పనిని ముట్టుకున్నాను. అంతే.

కర్తా బహిః అకర్తా౽ న్తః

బాహ్యానికి కర్తగా కనిపిస్తున్నా
ఆంతర్యంలో అకర్త గానే ఉన్నా!

కృతి భర్తే కృతి కర్త
కృతజ్ఞత చెప్పే ధైర్యం లేదు
ఐదు పది చేసి తల వంచుతున్నా!
అలాగే ఉంటానని విన్నవించు కుంటున్నా!
కృతార్థుణ్ణయ్యా నని వినమ్రుణ్ణై పలుకుతున్నా!

మనసైన మాట

శతాధిక గ్రంథాలను ప్రచురించే అదృష్టానికి నోచుకుంది సుందర చైతన్యాశ్రమం. ఎంతో కాలంగా సర్వులూ ఎదురు చూచిన గ్రంథం చైతన్య భగవద్గీత కూడా ఎదలను అలరించేందుకు ఆవిర్భవించింది. ఎందరో ఎన్నో విధాలుగా ఈ కార్యక్రమాలలో వారి వారి సేవలను అందించి తృప్తి చెందారు. అందరికీ ఆశ్రమం ఋణపడి ఉంటుంది.

ఇక ప్రస్తుత విషయం
చైతన్య భగవద్గీత.

రెండు వేల పుటల గ్రంథాన్ని అచ్చు తప్పులు దిద్దుతూ, సవరించి సరి చేయడం సాధారణమైన కార్యం కాదు. బహు భారమైన ఈ కార్యాన్ని భుజాని కెత్తుకొని, రాత్రనక పగలనక ఓర్పుతో, నేర్పుతో నిర్వహించిన ఆశ్రమ

కమిటి సభ్యురాలు శ్రీమతి సి.పద్మా మోహనరావు సేవలను మరచి చైతన్య భగవద్గీతా గ్రంథాన్ని నేను ఊహించ లేను. ఆమె కుటుంబ సభ్యు లందరినీ వాసుదేవ భగవానుడు సర్వదా బ్రోచు గాక! వారందరికీ నా హృత్పూర్వక ఆశీస్సులు.

ఈ గ్రంథమును దివారాత్రములు కంప్యూటర్‌కు అతుక్కుపోయి డి.టి.పి. చేసిన చి॥ కృష్ణప్రసాద్‌కు, గ్రంథాన్ని సర్వాంగ సుందరంగా ముద్రించిన చి॥ నాగబాబుకు నా ప్రేమ పూర్వక ఆశీస్సులు.

బాల్యం లోనే కదిలిన ప్రస్థానము. నాపై ఎందరి ప్రభావ ముందో నాకే తెలియదు. బాల్యం లోనే విశేషంగా గ్రంథ పఠనం చేశాను. అవి ఎంత గానో నన్ను ఉత్తేజ పరచాయి. ఎందరో మహాత్ముల జీవితాలు, బోధలు నన్ను ప్రభావితం చేశాయి. తనదైన శైలిలో సమాజం కూడా తన వంతు పాత్రను తాను నిర్వహించింది. విశేష గ్రంథ పరిచయం, అశేష జన సంసర్గం కలవాణ్ణి. పేరు పేరున ఎందరికి కృతజ్ఞతలు చెప్పేది? ఎన్ని గ్రంథాలను ఉటంకించేది? ఎలాగూ ఉండనే ఉంది మూలమంత్రం, 'అందరికీ వందనాలు'. దాని తోనే ప్రస్తుతానికి సరిపెట్టు కుంటున్నా.

చివరగా మీ అందరికీ
నా మనసైన మాట.

ఇలాంటి గ్రంథాలు అరుదుగా ఉంటాయి. దొరికి నపుడే దోచుకోవాలి. హృదయంలో దాచుకోవాలి. జీవించి నంత కాలం తోడుగా ఉండ వలసిన గ్రంథము. పుస్తకాన్ని పుస్తకంగా ఉంచకుండా, శ్రమించి మస్తకానికి పట్టించండి.

మన వద్ద ఉన్నది మనది కాదు
మన మనస్సు కెక్కిందే మనది.

సద్భావన సత్కార్యాన్ని రూపొందిస్తుంది
సత్కార్యం సత్ఫలితాన్ని ప్రసాదిస్తుంది.

పుణ్య ఫల విశేషంగా తీర్థపు గిన్నె పూజారి చేతికి వచ్చినట్లు, చైతన్య భగవద్గీత గ్రంథాన్ని అందించే అదృష్టం మమ్మల్ని వరించింది.

ఈ గ్రంథం మీది. మీతో ఉండ వలసింది
మీరు కొనండి. మరి కొందరి చేత కొనిపించండి.

మీరు శ్రద్ధతో చదవండి. ఇతరుల చేత చదివించండి
కానుకగా ఎవరి కైనా సమర్పిస్తారా? ఇంతకు మించిన అమూల్యమైన రత్నం ఎక్కడ దొరుకుతుంది?

సర్వే జనాః సుఖినో భవన్తు!

ప్రణవ ప్రేమలతో
గీతామాత సేవలో

ఆశ్రమం
16-12-2009

ఓం స్వామి సుందర చైతన్యానంద

గీతా మాహాత్మ్యము

శ్లో॥ యత్ర గీతా విచారశ్చ
పఠనం పాఠనం శ్రుతమ్ ।
తత్రాహం నిశ్చితం పృథ్వి
నివసామి సదైవ హి ॥ 1

భూలక్ష్మీ! గీతా విచారము, గీతాధ్యయనము, గీతా ప్రవచనము, గీతా శ్రవణము - ఇవి ఎక్కడ జరుగుతూ ఉంటాయో అక్కడ నేను సదా నిశ్చయంగా ఉంటాను.

శ్లో॥ గీతాశ్రయోఽహం తిష్ఠామి
గీతా మే చోత్తమం గృహమ్ ।
గీతా జ్ఞాన ముపాశ్రిత్య
త్రీన్లోకా న్పాలయా మ్యహమ్ ॥ 2

గీత నాకు ఆశ్రయము. గీత నా దివ్యమైన మందిరము. భూదేవీ! గీతా జ్ఞానమును అనుసరించే నేను ముల్లోకాలను పాలిస్తూ ఉంటాను.

శ్లో॥ గీతా మే పరమా విద్యా
బ్రహ్మరూపా న సంశయః ।
అర్ధమాత్రాక్షరా నిత్యా
స్వనిర్వాచ్య పదాత్మికా ॥ 3

గీత నా ఉత్కృష్టమైన జ్ఞానము. అది బ్రహ్మస్వరూప జ్ఞానము. ఈ విషయంలో సందేహం వద్దు. అది అమాత్రా ప్రణవ స్వరూపము. అక్షరము; నిత్యము; అనిర్వాచ్యము.

శ్లో॥ చిదానన్దేన కృష్ణేన
ప్రోక్తా స్వముఖ తోఽర్జునమ్ ।
వేదత్రయీ పరానన్దా
తత్త్వార్థ జ్ఞాన మంజసా ॥ 4

చిదానందమూర్తి శ్రీకృష్ణ పరమాత్మ గీతను స్వయంగా అర్జునునికి బోధించాడు. గీత వేద స్వరూపము. పరమానంద రూపము. ఆశ్రయించిన వారికి తత్త్వసారాన్ని అనుగ్రహిస్తుంది.

శ్లో॥ గీతా శాస్త్ర మిదం పుణ్యం
యః పఠేత్ ప్రయతః పుమాన్ ।
విష్ణోః పద మవాప్నోతి
భయశోకాది వర్జితః ॥ 5

గీతాశాస్త్రము పుణ్యప్రదము. గీతాశాస్త్రమును శ్రద్ధతో అధ్యయనం చేయు వాడు భయశోకాలు తెలియని విష్ణుపదమును పొందుతాడు.

శ్లో॥ మల నిర్మోచనం పుంసాం
జల స్నానం దినే దినే ।
సకృ ద్గీతామ్భసి స్నానం
సంసార మల నాశనమ్ ॥ 6

నిత్యము జల స్నానం చేసే వారికి దేహ మాలిన్యము తొలగుతుంది. గీతా జ్ఞానజలంలో ఒక్కసారి మునిగితే చాలు. సంసార మాలిన్య మంతా తొలగి పోతుంది.

శ్లో॥ యః శృణోతి చ గీతార్థం
కీర్తయ త్యేవ యః పరమ్ ।
శ్రావయేచ్చ పరార్థం వై
స ప్రయాతి పరంపదమ్ ॥ 7

గీతార్థమును శ్రవణము చేయువాడు, దానిని ఇతరులకు వర్ణించి చెప్పేవాడు, గీత లోని మహోన్నతమైన భావాలను పరులకు వినిపించు వాడు పరమాత్మను పొందుతాడు.

శ్లో॥ సోపా నాష్టాదశై రేవ
భక్తి ముక్తి సముచ్ఛ్రితైః ।
క్రమశః చిత్తశుద్ధిః స్యాత్
ప్రేమ భక్త్యాది కర్మసు ॥ 8

గీతాశాస్త్రము భక్తి దాయకము, ముక్తి ప్రదాయకము. పద్దెనిమిది అధ్యాయములనే సోపానముల ద్వారా ప్రేమ, భక్తి మార్గాలలో పయనించే వారికి చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది.

శ్లో॥ యే శృణ్వన్తి పఠన్త్యేవ
గీతాశాస్త్ర మహర్నిశమ్ ।
న తే వై మానుషా జ్ఞేయా
దేవ రూపా న సంశయః ॥ 9

గీతాశాస్త్రాన్ని అహర్నిశము శ్రవణం చేసే వారిని, అధ్యయనం చేసే వారిని మానవులని భావించ కూడదు. వారు మానవ రూపంలో ఉన్న దేవతలే. ఈ విషయంలో సందేహము లేదు.

శ్లో॥ భారతామృత సర్వస్వం
విష్ణో ర్వక్త్రా ద్వినిస్సృతమ్ ।
గీతా గంగోదకం పీత్వా
పునర్జన్మ న విద్యతే ॥ 10

విష్ణుదేవుని ముఖము నుండి వెలువడిన గీతాశాస్త్రము భారతామృత సర్వస్వము. గీతా గంగోదకాన్ని పానం చేసే వారికి పునర్జన్మ ప్రాప్తించదు *(మోక్షం సిద్ధిస్తుంది).*

శ్లో॥ శత పుస్తక దానం చ
గీతాయాః ప్రకరోతి యః ।
స యాతి బ్రహ్మసదనం
పునరావృత్తి దుర్లభమ్ ॥ 11

వంద గీతా పుస్తకాలను వితరణ చేయువాడు పునర్జన్మ లేని బ్రహ్మపదమును పొందుతాడు *(జ్ఞానదాన ప్రాశస్త్యమును తెలియ చెప్పడమే ప్రధాన విషయం).*

శ్లో॥ ఏత న్మాహాత్మ్య సంయుక్తం
గీతాపాఠం కరోతి యః ।
శ్రద్ధయా యః శృణో త్యేవ
పరమాం గతి మాప్నుయాత్ ॥ 12

ఈ మహాత్మ్యమును తెలుసుకొని గీతను అధ్యయనము చేయువాడు ఉత్కృష్టమైన గతిని పొందుతాడు.



చైతన్య భగవద్గీత

ధ్యాన శ్లోకములు



గీతా ధ్యానము

శ్లో॥ ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।
అద్వై తామృత వర్షిణీం భగవతీ మష్టాద శాధ్యాయినీ
మంబ త్వా మనుసంధధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥ 1

ఓం	= ఓం	అద్వైతామృత వర్షిణీం	= అద్వైత సుధను వర్షించునది
భగవతా	= భగవంతుడైన	అష్టాదశాధ్యాయినీం	= పదునెనిమిది అధ్యాయాలు కలది
నారాయణేన	= నారాయణునిచే	భవద్వేషిణీం	= సంసార జీవనమును రూపు మాపునది
స్వయం	= స్వయముగా		
పార్థాయ	= అర్జునుని కొరకు	భగవతీం	= భగవ త్స్వరూపిణి
ప్రతిబోధితాం	= బోధింప బడినది	అంబ	= అమ్మా
పురాణమునినా	= సనాతన మహర్షి యైన	భగవద్గీతే	= ఓ భగవద్గీతా!
వ్యాసేన	= వ్యాసునిచే	త్వాం	= నిన్ను
మధ్యే మహాభారతం	= మహాభారతము యొక్క నడుమ	అను సందధామి	= పదేపదే ధ్యానిస్తున్నాను.
గ్రథితాం	= కూర్చబడింది		

ఓం! తల్లీ! భగవతీ! సంసార నాశినీ! అష్టాదశాధ్యాయినీ! అద్వైతామృత వర్షిణీ! సాక్షాత్తు భగవంతుడైన నారాయణమూర్తిచే అర్జునుని కొరకు బోధింప బడిన జననీ! సనాతన మహర్షి శ్రీ వేదవ్యాసమునిచే రచింప బడి, మహాభారతము మధ్య శోభించే భారతీ! భగవద్గీతా మాతా! అమ్మా! నిన్ను పదే పదే ధ్యానిస్తున్నాను.

వ్యాఖ్య

భవము - భవ్యము

అమ్మా! నేను - నీ బిడ్డను. ముద్దుబిడ్డను కాలేక పోయిన మొద్దును. దద్దమ్మను. గతంలో నీ మాట వినని నేరానికి పాపపు మూటల్ని మోస్తున్నాను. సంసార కారాగృహంలో మగ్గుతున్నాను. స్థిరత్వం లేని ప్రపంచంలో ప్రియత్వానికి అర్థం లేదని గ్రహించలేక పోయాను. బంతి లాగా దొర్లి పోయేది బాల్యం. పక్షిలా ఎగిరి పోతుంది యవ్వనం. వాగులా ముందుకు సాగి జనన మరణ సంసార సాగరంలో పడిపోతుంది వృద్ధాప్యం. తారాడుతూ, జీరాడుతూ జీవు లందరు మృత్యుకూపం లోకి జారి పోయేవారే. వర్షాకాల మేఘం లాగా కలిమి కారి పోయేదే ***(అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః).***

ఆపదల మధ్య అల్లాడు తున్నాను. నిరాశతో క్షణక్షణం నీరసించి పోతున్నాను. ఏది చేసినా గండమే ఎదు రవుతోంది. ఏది ఆలోచించినా సుడిగుండమై ముంచేస్తోంది. ఒక వైపు ప్రారబ్దం గుండెలపై పిడుగులు

పడేస్తోంది. మరో వైపు ప్రాయము పశ్చిమంగా వాలి పోతోంది. అమ్మా! భవద్వేషిణీ! నన్ను భవము నుండి బయట పడేయి తల్లీ! *(భగవద్గీతే భవద్వేషిణీమ్).*

అమ్మ పిలుపు - అయ్య పలుకు

అమ్మా! నువ్వు తల్లివి. తల్లియే గదా తొల్లి. అందుకే తొలి దండము మళ్ళీ మళ్ళీ నీకే పెడుతున్నాను. తొలుత మళ్ళీ మళ్ళీ నిన్నే స్మరిస్తున్నాను *(త్వాం అనుసంధధామి).* నీ కన్నబిడ్డను. నిన్ను కనే భాగ్యాన్ని ప్రసాదించ మని వేడుకొంటున్నాను. నిన్ను దర్శించుకొనే అదృష్టాన్ని అనుగ్రహించ మని పదే పదే అర్థిస్తున్నాను. ప్రార్థిస్తున్నాను.

చెప్పేవాడు భగవంతుడు. చెప్పబడేది భగవతి. వినిపించే వాడు సమగ్రమైన జ్ఞానస్వరూపుడు. వినపడేది సమగ్ర మైన జ్ఞానము. భగవానుడు భగవతిని భవ్యంగా వినిపిస్తే, భగవతి భగవానుని వైభవాన్ని దివ్యంగా దర్శింప చేస్తూ ఉంది.

తల్లి వైభవాన్ని సంపూర్ణంగా తండ్రి నుండే విన గలం *(భగవతా నారాయణేన).* తండ్రి ప్రాభవాన్ని సమగ్రంగా తల్లి చెబితేనే అర్థం చేసుకోగలం *(భగవతీం అష్టాదశాధ్యాయినీం అంబ).*

సర్వమూ వేద నారాయణుడే. వేదము తల్లి. నారాయణుడు తండ్రి. వేదము, నారాయణుడు వేరు కారు. ఈశ్వరుడు, ఈశ్వర జ్ఞానము వేరు కాదు. ఈశ్వరుడు జ్ఞానస్వరూపుడు. జ్ఞానము ఈశ్వరమయము. కనుక వేదము, వేదనారాయణుడు వేరు కారు. ఒక్కరే. రెండు కాని ఒక్క సత్యమై భాసిస్తున్నారు. అది ద్వైతం కాదు. అద్వైతం. ద్వైతం మృతం. అద్వైతం అమృతం. అమృతం మరణాన్ని దూరం చేస్తుంది. వేదమాత కురిపించే అద్వైతామృతం జనన మరణాలను మాయం చేస్తుంది *(అద్వైతామృత వర్షిణీం).*

అమ్మా! అందుకే నిన్ను మళ్ళీ మళ్ళీ స్మరిస్తున్నాను. అమ్మ పిలుపుకై నిరీక్షిస్తున్నాను. అయ్య పలుకుకై ఎదురు చూస్తున్నాను. ఎద నిండా తల్లిదండ్రుల్ని నిలుపుకొని ప్రార్థిస్తున్నాను. ఒక్క ఒరలో ఇద్దరు ఇమడరు అంటావా! 'తల్లిదండ్రులు' అని రెండుగా వినిపిస్తున్నా, సమాసం ఒక్కటే కదా తల్లీ! తల్లి లేకుండా తండ్రి ఎలా ఉంటాడు? తండ్రి లేకుండా తల్లి ఎలా ఉంటుంది? జ్ఞానం లేకుండా ఈశ్వరుడెలా ఉంటాడు? ఈశ్వరునికి దూరంగా ఈశ్వరజ్ఞానం ఎలా ఉంటుంది? వేదమే నారాయణుడు. నారాయణుడే వేదము. అదే వేదనారాయణ శబ్దము.

అమ్మా! భగవతీ! నా అదృష్టం చూశావా! అమ్మ పిలుపును అందుకుంటున్నా! అదీ అయ్య పలుకులో వినబోతున్నా! ఇరువురు ఒకటే అనే అద్వైత జ్ఞానసుధను పానం చేయబోతున్నా! ఒకరిలో మరొకరిని దర్శించుకొని తృప్తి చెందబోతున్నా! ఒకరి అడుగులో మరొకరు అడుగు వేసుకుంటూ నడిచే మీ అద్భుత చరణాలకు వంగి వంగి వందనాలు అర్పించుకోబోతున్నా! మీ పాదాలలో అద్వైత ముద్రలను చూడబోతున్నా!

అదెలా సాధ్యం అంటావా? మీరు నా తల్లిదండ్రులు కనుక. 'తల్లిదండ్రులు' అనే మాట ద్వంద్వ సమాసము అని కూడా తెలియని మందమతిని కాను లేమ్మా!

ఒక వైపు ద్వంద్వం అంటావు. మరో వైపు ఏక మంటావు. ఏమిటి దంతా? అని ప్రశ్నిస్తున్నావా? మీ ఇద్దరి స్వరూపం అదే నని నాకు తెలిసి పోయింది గామ్మా! ఎలా తెలిసిం దంటావా తల్లీ? తండ్రి చెబితేనే తెలిసింది.

ద్వంద్వ సమాసము నేనే అన్నాడు గోవిందుడు *(ద్వంద్వః సామాసికస్య అహమేవ).* అమ్మా! ద్వంద్వ సమాసము ఉభయ పద ప్రధానం కదా! రెండు పదాలకు సమానార్థమే కదా! ఈ ద్వంద్వ సమాస రహస్యంతో

మీ ఇద్దరి రహస్యం నాకు తెలిసి పోయింది. అయినా, ద్వంద్వం అనే పదానికి 'రహస్యం' అనే అర్థం కూడా ఉంది కదమ్మా! అంతేకాదు, ఈ రహస్యాన్ని వినిపించిన మువ్వల వాని చరణం కదిలిన శ్లోకం కూడా పదవ అధ్యాయం 33 వ శ్లోకమే. మూడు మూడు కనిపిస్తున్నాయి చూడు. అక్కడ కూడా రెండు గానే కనిపిస్తున్నాయి. రెండైనా, మూడైనా ఒక్కటే అనే సత్యాన్ని వినిపించడమే కదా ఇందులోని రహస్యం!

వేద నారాయణునిలో వేదము, నారాయణుడు కలిసే ఉన్నారు. భగవద్గీతలో భగవంతుడు, భగవతి కలిసే ఉన్నారు. ఒకరు ఉంటే రెండవ వారు ఉన్నట్లే. తెలియని వారికి ఇద్దరూ ఉన్నా లేనట్లే. లేదా ఇద్దరూ వేరుగా ఉన్నట్లే. వేదమాత వేద పురుషునికి దూరంగా ఉంటుందని ఎలా ఊహిస్తారో నా కైతే అర్థం కాదు. గీతను గోవిందునికి ఎలా దూరం చేస్తారో నా బుద్ధి కైతే చిక్కదు. రెండిటిని పట్టుకొని వ్రేలాడే ప్రబుద్ధులకు కనువిప్పు కలిగించాలని అభిప్రాయపడ్డా డేమో కాళిదాస మహాకవి, తన 'రఘువంశం' కావ్యంలో దిలీపుని ధర్మపత్ని సుదక్షిణాదేవి నందినీ ధేనువును అనుసరించి నడుస్తున్న సందర్భంలో ***శ్రుతే రివార్థం స్మృతి రన్వగచ్ఛేత్*** - 'శ్రుతిని అనుసరించే స్మృతి వలె ధేనువును అనుగమిస్తూ ఉంది' అన్నాడు. ఈ సత్యం అర్థమైతే గీతామాత ఎవరో కాదు శ్రుతిమాతే. వాసుదేవుడు ఎవరో కాదు, నారాయణుడే. వేదనారాయణుడే.

శ్రేష్ఠుడైన శ్రోత

వినడం ఎవరి కైనా సాధ్యమే. శ్రవణం కొందరికే సొంతం. వినడానికి చెవులుంటే చాలు. శ్రవణానికి మనస్సు తోడు కావాలి. అది కూడా మామూలు మనసు కాదు. సంస్కరింప బడిన మనసై ఉండాలి. శుద్ధి పడిన బుద్ధి మాత్రమే శ్రవణం చేసి సిద్ధిని పొందుతుంది. అలాంటి పవిత్రమైన బుద్ధి గల మహాత్ముడు అర్జునుడు. సాక్షాత్తు నారాయణుడైన వాసుదేవునికి, మహాత్ముడైన అర్జునునికి మధ్య సంవాద రూపంలో సాగిన గీతాబోధను తాను ఆలకించినట్లు సంజయుడు గీతను సమాప్తం చేస్తూ చెబుతాడు. అర్జునుణ్ణి మహాత్ముడని సంజయుడు కీర్తించడమే శ్రోతగా అర్జునుని శ్రేష్ఠత్వానికి అద్దం పడుతూ ఉంది.

అర్జునుడు పుణ్య పురుషుడు. ధర్మాత్ముడు. భగవద్భక్తుడు. అసూయ లేని వాడు. అధర్మాన్ని అంగీకరించని ధీమంతుడు. అట్టి అర్జునుని నిమిత్తంగా చేసుకొని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతను లోకానికి అందించాడు. బోధించింది పార్థుని కొరకే అయినా యావత్ ప్రపంచం లబ్ధిని పొందింది. పొందుతూ ఉంది.

వ్యాసుని వ్యాసంగము

నరుడైన అర్జునునికి నారాయణమూర్తి స్వయంగా బోధించిన జ్ఞానబోధను గ్రంథస్థం చెయ్యడం సామాన్యులకు సాధ్యమా? అందుకే నారాయణ స్వరూపుడు, వేద సంస్కర్త అయిన వ్యాస భగవానుడే రచయిత అయ్యాడు. అచ్యుతుని అమర సందేశాన్ని భావి తరాలకు అందించే పవిత్ర కార్యాన్ని భుజాని కెత్తుకున్నాడు. దేహానికి గుండె లాగా మహాభారతం మధ్య భీష్మపర్వంలో గీతా ప్రదీపాన్ని ఉంచాడు ***(వ్యాసేన గ్రథితాం పురాణ మునినా మధ్యే మహాభారతమ్).***

వేదాలు అనంతములు *(అనంతా వై వేదాః).* వేదాలను సులభతరం చెయ్యాలని సంకల్పించి, అనంత మైన వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, తమ శిష్యులైన పైల, జైమిని, సుమంత, వైశంపాయనుల సహాయంతో విస్తృత పరచాడు శ్రీ వేదవ్యాస మహర్షి. గహన మైన వేద విషయాలను సామాన్య జనులకు అర్థమయ్యే రీతిలో పద్దెనిమిది పురాణాలను రచించి పురాణముని అయ్యాడు. వాటిని ప్రచారం చెయ్యమని సూత మహర్షిని ఆశీర్వదించాడు.

వేద విజ్ఞాన వ్యాప్తికి పాటు పడిన మహానుభావుడు శ్రీ వేదవ్యాస మహర్షి గీతకు వ్యవహర్త కావడం మన

అదృష్టం. కురుక్షేత్ర పుణ్యభూమిలో వాసుదేవుడు కురిపించిన అద్వైత అమృత ధారలను భగవద్గీత అనే సువర్ణ భాండంలో నింపి, ప్రపంచానికి కడుపారా త్రాగించి, తరింప చేసిన వ్యాసమూర్తికి జగతి జోహారు లర్పిస్తోంది.

జయతి పరాశర సూనుః సత్యవతీ
హృదయ నందనో వ్యాసః
యస్యాఽస్య కమల గళితం
వాఙ్మయ మమృతం జగత్ పిబతి ॥

ఏ మహాత్ముని ముఖపద్మము నుండి జాలువారిన వాఙ్మయ పీయూషాన్ని (గీతామృతాన్ని) సమస్త ప్రపంచము పానం చేస్తూ ఉందో, పరాశర పుత్రుడు, సత్యవతీ నందనుడు అయిన అట్టి వ్యాసమహర్షికి జయము! జయము!

పిలిస్తే పలికేది తల్లి. బిడ్డ అవసరాల్ని తీర్చేది తల్లి. గీతామాత కూడా అమ్మ లాగా *(అంబ)* మన ఆర్తనాదాల్ని వింటుంది. అపాయాలను తొలగిస్తుంది. అవసరాలను తీర్చి అక్కున చేర్చుకుంటుంది. భవ సాగరంలో మునిగి పోకుండా రక్షిస్తుంది *(భవద్వేషిణీమ్).* అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది *(అద్వైతామృత వర్షిణీం).* అందుకే, జన్మ నిచ్చే తల్లులు ఎందరున్నా, జన్మను కడతేర్చే తల్లి గీతామాత ఒక్కతే అనే ప్రగాఢ విశ్వాసంతో, అకుంఠిత భక్తి శ్రద్ధలతో గీతామాతకు పదే పదే నమస్కరిస్తున్నా. ఆమె చరణ కమలాలను అచంచల భక్తితో హృదయంలో ధ్యానిస్తున్నా.

త్వమేవ సంధ్యా గాయత్రీ
సావిత్రీ చ సరస్వతీ
గీర్వాణ జ్ఞాన సార రూపిణీ
చైతన్య భగవతీ వాగ్దేవి భారతి
శారదాం! విశారదాం!
నమామి శుభదాం
బుద్ధి ప్రదాం శారదాం ॥ శారదాం ॥

అని గీతామాతను చైతన్యగీతంతో స్తుతిస్తూ, తల్లి పద సరోజాలను హృదయంలో స్థిరంగా నిలుపుకొని ధన్యుల మయ్యెదము గాక!

వ్యాస స్తుతి

నమోస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిన్దాయత పత్రనేత్ర ।
యేన త్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥ 2

వ్యాస	= ఓ వ్యాసమహర్షీ!
విశాలబుద్ధే	= విశాలమైన బుద్ధి కలవాడా!
ఫుల్లారవిందాయత పత్ర నేత్ర	= వికసించిన పద్మపురేకుల వంటి కన్నులు కలవాడా!
యేన	= యే
త్వయా	= నీ చేత
భారత తైలపూర్ణః	= మహాభారత మనే తైలముచే నిండిన
జ్ఞానమయః	= జ్ఞానరూపమైన
ప్రదీపః	= దివ్యదీపము
ప్రజ్వాలితః	= చక్కగా వెలిగించ బడింది
తే	= నీకు
నమః అస్తు	= నమస్కారములు

ఓ వ్యాసమహర్షీ! విశాల హృదయా! వికసిత సరసిజ దళ నయనా! మహాభారత మనే తైలమును నింపి దివ్యమైన జ్ఞాన దీపమును వెలిగించావు. నీకు ప్రణామములు.

వ్యాఖ్య

ఆర్షధర్మ సంస్కృతిలో వ్యాసునిది సమున్నత స్థానం. మహర్షులలో అగ్రతాంబూలం ఆయనిదే. అద్భుత ప్రజ్ఞానిధి. అనంత జ్ఞానజ్యోతి. ఆయన విశాలబుద్ధి ప్రపంచా న్నంతా స్పృశించింది. విశ్వమంతా ఆయన బుద్ధిలో ఇమిడి పోయింది. విశ్వ మెంత విశాలమో, ఆ మహాత్ముని హృదయం కూడా అంత విశాలము ***(వ్యాస విశాల బుద్ధే).***

ఆయన కలానికి హద్దులు లేవు. కవు లందరికీ ఆయన స్ఫూర్తి. కళ లన్నిటికీ ఆయనే దీప్తి. పర్వతాలను పలకరించే టప్పుడు పర్వత మంత ఎత్తు నిలబడతాడు. జంతువుల్ని నిలదీసి భాషిస్తాడు. గువ్వలతో విహరిస్తూ వాటితో గుసగుస లాడుతాడు. నదులతో కలిసి నడుస్తాడు. కాలంతో కరచాలనం చేస్తాడు.

బుద్ధి గల వారు, వారి బుద్ధిని స్వార్థానికి వినియోగించు కుంటారు. బుద్ధి నైపుణ్యంతో వ్యాపారాలు చేసి సంపదలు ఆర్జిస్తారు. ఆస్తుల్ని ప్రోగు చేసుకుంటారు. భాగ్యాలను సంపాదించుకొని భోగాలలో తుల తూగుతారు.

విశాలబుద్ధి గల వ్యాసమహర్షి తన జ్ఞానాన్ని స్వార్థానికి ఉపయోగించుకో లేదు. పరానుగ్రహార్థం వినియోగించాడు. లోక సంగ్రహానికి ఉపయోగించాడు. ఆర్తుల కన్నీళ్ళు తుడిచాడు. పగిలిన హృదయాలను అతికించాడు. అజ్ఞానులను ఉద్ధరించాడు. సమాజాన్ని విజ్ఞాన తోరణాలతో అలంకరించాడు.

వేద కమలాన్ని వికసింప చేసి వేదాబ్జ భాస్కరు డయ్యాడు. సూర్యుని కిరణాలు సోకగానే కమలము వికసించి, మధుర పరిమళాలను వెద జల్లినట్లు, వ్యాస భగవానుని దృష్టి పడగానే వేద కమలము విరబూసి, విజ్ఞాన సుగంధాలను వెదజల్లింది. అందుకే ఆయన విప్పారిన సరసిజ నయనుడు ***(ఫుల్లార విందాయత పత్ర నేత్ర!).***

విస్తృత శాస్త్ర విషయ పరిజ్ఞానము కలవాడు కనుక విశాలబుద్ధి కలవాడు ***(వ్యాస విశాలబుద్ధే).*** పద్మనేత్రుడు అంటే జ్ఞాన నేత్రము కలవాడు అని అర్థము. అదే బ్రహ్మ నిష్ఠత్వము ***(ఫుల్లార విందాయత పత్ర నేత్ర).*** కనుక వ్యాస భగవానుడు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు. ఆచార్యులకు ఆచార్యుడు. ఆర్ష విజ్ఞాన దీపమును వెలిగించి, ఎందరో ముముక్షువులకు ముక్తి మార్గాన్ని సుస్పష్టం చేశాడు. ఆయన ముట్టని తాత్త్విక విషయం లేదు. అందుచేతనే ***వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం*** - వ్యాసుడు చవి చూడని విషయమే లేదని జ్ఞానులు కీర్తించారు.

గీతా జ్ఞాన ధనం - భారతమే ఇంధనం

భారతీయ సంస్కృతిలో మహాభారతానికి ఒక విశిష్ట స్థానం ఉంది. అందుకే, భారతం పంచమ వేదంగా సమున్నత స్థాయిలో నిలిచింది. వేదము ఎలా సంపూర్ణమో, వేదవ్యాస విరచితమైన మహాభారతం కూడా అలా సమగ్ర స్థాయిలో సాక్షాత్కరించింది.

యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్

మహాభారతంలో ఏదయితే ఉందో, అది వేరొక చోట ఉండ వచ్చు. కాని, మహాభారతంలో ఏదయితే లేదో అది మరొక చోట ఉండదు అని వ్యాసుడే రచించాడు. అదే మహాభారత వైభవం.

భారతంలో నీతి ఉంది. ధర్మం ఉంది. అభ్యుదయం ఉంది. నిశ్శ్రేయస ఉంది. అందుకే అది మహాభారతం. వ్యాసుని అద్భుత అపూర్వ సృష్టి అది ఆయనకే సరి పోయింది. వ్యాసుడు నిర్వహించిన

కార్యాలు అన్యులు సాధించ లేనివి. మహత్తర మైన ఆ కార్యాలకు సంపూర్ణ జ్ఞానం ఉండాలి. అద్భుత మైన త్యాగనిరతి కావాలి. అమోఘ సేవాసక్తి ఉండాలి. అవన్నీ పుష్కలంగా ఉండటం చేత వ్యాసమహర్షి అద్భుత కార్యాలను ఆవిష్కరించి చూపాడు. మహాభారత తైలాన్ని నింపి, సర్వ లోకాలకు, సమస్త దేశాలకు, సర్వ కాలాలకు, సమస్త మానవాళికి హితం చేసే గీతా జ్ఞాన ప్రదీపాన్ని వెలిగించి ఇచ్చాడు ***(యేన త్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః)***

భవరోగమును పోగొట్టే దివ్యౌషధము భగవద్గీత. సంసారము రోగ మైతే, సంసారానికి కారణ మైన అజ్ఞానమే రోగ కారణము. కారణము ఉన్నంత వరకు కార్యము ఉంటుంది. కార్యరూప సంసారము తొలగాలి అంటే సంసార కారణమైన అజ్ఞానము అంతం కావాలి.

అజ్ఞానము అంటే చీకటి. చీకటిలో ఏది ఏమిటో అర్థం కానట్లు, అజ్ఞాన తిమిరాలు అలుముకున్నపుడు వివేకము కూడా ప్రకాశించదు. చీకటి తొలగాలి అంటే వెలుగు రావాలి. అజ్ఞాన తిమిరాలు అదృశ్యం కావాలి అంటే జ్ఞాన వెలుగులు ప్రసరించాలి. అదే గీతాజ్ఞాన ప్రకాశము. అట్టి గీతా ప్రదీపాన్ని వెలిగించి శోకార్తుల తలరాతలు మార్చిన వ్యాస భగవానునికి నమస్కారము ***(నమోఽ స్తు).***

ప్రపన్న పారిజాతాయ తోత్రవే త్రైకపాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృత దుహే నమః ॥ 3

ప్రపన్న పారిజాతాయ	= శరణాగతులకు కల్పవృక్షమైన వానికి	గీతామృత దుహే	= గీతామృతమును పితికిన వానికి
తోత్రవేత్ర ఏకపాణయే	= కొరడాను ఒక చేతి యందు కలిగిన వానికి	కృష్ణాయ	= శ్రీకృష్ణునికి
జ్ఞానముద్రాయ	= చిన్ముద్రను ధరించిన వానికి	నమః	= నమస్సులు

శరణాగతులకు కల్పతరువు వంటి వాడు, ఒక చేతి యందు మునికోలను పట్టుకొని, మరియొక చేతితో జ్ఞానముద్రను ప్రదర్శించు వాడు, గీతామృతమును పితికిన వాడు, శ్రీకృష్ణ దేవునకు ప్రణామములు.

వ్యాఖ్య

తరువులు కరువులు తీర్చ వచ్చు. బ్రతుకు తెరువును మార్చలేవు. ఛాయను ప్రసాదించ వచ్చు. మాయను తొలగించ లేవు. ఏ తరువు ఆ ఫలాలనే ఇస్తుంది. కాని కల్పతరువు కోరిన వన్నీ ఇస్తుంది. కల్పతరువు నీడలో కరువులు తీరుతాయి. బరువులు దిగుతాయి. కాని, అజ్ఞానాన్ని తొలగించి మోక్షాన్ని ప్రసాదించడం కల్పతరువుకు కూడా సాధ్యం కాదు. అది ఒక్క పరమేశ్వరునికే సాధ్యం.

స్వర్గం లోని కల్పతరువు కోరికల్ని తీర్చుతుంది. గోవింద కల్పతరువు కోరికలే లేకుండా చేస్తుంది. ఆశ్రితులను ఆప్తకాముల్ని చేస్తుంది. అంటే, సమస్త కోరికలు తీరి పోతాయి కనుక ఇక ఏ కోరికలు ఉండవు అని అర్థము. అదే మోక్షము. **మోక్ష మిచ్ఛేత్ జనార్దనాత్** - మోక్షాన్ని ప్రసాదించే వాడు జనార్దనుడు. భక్తుల పాలిటి కల్పవృక్షము. భక్త పారిజాతము.

ఆ మహాత్ముని సమీపించిన వారందరూ సద్గతిని పొంది తరించారు. పరమాత్మ స్మరణం మరణాన్ని నివారిస్తుంది. అశుభాన్ని అంతం చేస్తుంది. అజ్ఞానాన్ని నిర్మూలిస్తుంది. అజ్ఞానం లేని చోట శోకమోహాదు లుండవు. దుఃఖం దరి చేరదు. ఆనందం దూరం కాదు.

భేదం చూడకుండా నది అందరినీ చల్లబరుస్తుంది. తేడాలు లేకుండా గాలి అందరికీ హాయి నిస్తుంది.

ఈ ప్రేమల్ని, త్యాగాల్ని ప్రకృతిలో ఆవిష్కరించిన పరమాత్మ, ఆశ్రయించిన వారిని తారతమ్యాలు చూడకుండా తరింప చేస్తాడు.

నిరుపేద అయిన కుచేలుని ఆదుకున్నాడు. త్రివక్ర అయిన కుబ్జను కనికరించాడు. దారుణ మైన పరిస్థితి నుండి ద్రౌపదిని రక్షించాడు. అమాయకులైన గోపికలను ఉద్ధరించాడు. సుదాముణ్ణి అనుగ్రహించాడు. అక్రూరునికి యమునా జలాలలో దర్శన మిచ్చాడు. ఆవులకు ఆనందాన్ని పంచాడు. కోతుల్ని కరుణతో చూశాడు. గుఱ్ఱాలకు కరస్పర్శతో హాయిని ప్రసాదించాడు. అన్నం పెట్టిన విప్ర స్త్రీలకు అమృతాన్ని అనుగ్రహించాడు. పాలిచ్చిన తల్లికీ మోక్షమే. విష మిచ్చిన రాక్షసికీ మోక్షమే. పిడికెడు అటుకు లిచ్చినా మోక్షమే. అరటితొక్కలు అర్పించినా మోక్షమే. పారము తెలియని ఆ ప్రేమ సాగరంలో మునక వేసిన వారందరూ తరించి పోయారు. చేరని వారు చెడిపోయా రేమో గాని, ఆశ్రయించిన వారందరూ ఆనంద స్వరూపు లయ్యారు. అమృత స్వరూపు లయ్యారు.

ధర్మాచరణమును నేర్పి వానరులను కూడా నరులను చేసేందుకు రామావతారం వస్తే, జ్ఞానప్రేమలను పంచి నరుల్ని నారాయణులుగా మార్చేందుకు కృష్ణావతారం వచ్చింది. అందుకే మునికోలతో, చిన్ముద్రతో శ్రీకృష్ణుడు చిద్విలాసంగా దర్శన మిస్తాడు.

జగన్మోహనం

శ్రీకృష్ణ పరమాత్మ ఒక చేతిలో వేత్రమును ధరించి ఉన్నాడు. 'వేత్రము' అంటే పశువులను తోలే ముల్లుకఱ్ఱ అని అర్థము. వెదురు కఱ్ఱ అని కూడా అర్థము. గుఱ్ఱాలను తోలే కొరడా, లేదా మునికోల అని కూడా చెబుతారు.

గోవులను మేపు నపుడు బాలకృష్ణుని చేతిలో ఒక కఱ్ఱ ఉండేది. దారి తప్పే గోవుల్ని దారి మళ్ళించడానికి అది ఉపయోగ పడేది. ఆనాడు పశువుల్ని దారి మళ్ళించినట్లే, మానవుల హృదయాలలో నిక్షిప్తమై ఉన్న పశు ప్రవృత్తుల్ని కూడా సదా దారి మళ్ళించి సంస్కరిస్తాడు కనుక చేతిలో వేత్రమును ధరిస్తాడు.

రథంలో ఆసీనమై నపుడు పార్థసారథి చేతిలో మునికోల ఉంటుంది. మునికోలను ఊపుతూ అశ్వాలను అదుపులో పెడుతూ ఉంటాడు. అలాగే ఆశ్రితులైన వారి మనస్సులలో చెలరేగే అరిషడ్వర్గాలను అదుపులో ఉంచి ఆశీర్వదిస్తూ ఉంటాడు.

ఇక రెండవ చేతి ద్వారా జ్ఞానముద్రను ప్రదర్శిస్తాడు. చేతి వ్రేళ్ళ ద్వారా ప్రకటించే తాత్త్విక సంజ్ఞా ప్రదర్శనమే జ్ఞానముద్ర, లేక చిన్ముద్ర. అరచేతిని ముందుకు చాపి, చిటికెన వ్రేలు, ఉంగరపు వ్రేలు, మధ్య వ్రేలు - ఈ మూడింటిని కలిపి ముందుకు చాచి, చూపుడు వ్రేలును మడచి బొటనవ్రేలుతో కలిపి వలయాకారంలో ఉంచడాన్ని చిన్ముద్ర అంటారు.

బొటనవ్రేలు లేనిదే ఏ కార్యమును చెయ్యలేము. అన్నిటికీ అదే ఆధారము. ఆ ఒక్కటి లేకపోతే, నాలుగు వ్రేళ్ళు ఉన్నా ఉపయోగము ఉండదు. కనుక, ఆధార మైన బొటనవ్రేలు బ్రహ్మస్వరూపము.

చూపుడు వ్రేలు ఎప్పుడూ దోష దర్శనం చేస్తూ ఉంటుంది. దోషాలను, పాపాలను చూడటమే గాక, చూపెట్టడం ప్రత్యేకంగా దాని పని. కనుక అది జీవునికి సంకేతము. 'జీవ' సంకేత మైన చూపుడు వ్రేలును 'బ్రహ్మ' సంకేత మైన బొటనవ్రేలుకు తగిలించ గానే వలయాకారం ఏర్పడుతుంది. గుండ్రముగా కనిపిస్తుంది. అదే పూర్ణ స్వరూపము. అది ఎక్కడో, అంత మెక్కడో అర్థం గాని పరిపూర్ణ సత్తా స్వరూపానికి సంకేతము.

ఇలా రెండు వ్రేళ్ళను కలిపే టప్పుడు మిగిలిన మూడు వ్రేళ్ళను ముందుకు చాచి దూరంగా ఉంచాలి.

పూర్ణానంద స్వరూపము అనుభూతిగా నిలవాలి అంటే, ఆ మూడు వ్రేళ్ళు దూరంగా ఉండాలి. అవే త్రిగుణములు. గుణత్రయమును దూరంగా ఉంచాలి. శరీరత్రయమును దూరంగా ఉంచాలి. అవస్థాత్రయమును దూరంగా ఉంచాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, అనాత్మను దూరంగా ఉంచాలి. అలా ఉంచి నపుడే జీవ బ్రహ్మైక్యము అఖండంగా శోభిస్తుంది. ఇదే చిన్ముద్ర లోని చిద్విలాసం.

శ్రీకృష్ణుడు బోధించిన యోగాలు రెండే. ఒకటి జ్ఞానయోగము. రెండవది కర్మయోగము. చిన్ముద్ర ద్వారా జ్ఞానయోగ వైభవమును, మునికోల ద్వారా కర్మయోగ వైశిష్ట్యమును ప్రదర్శించి చూపాడు. రెండిటిని ఆచరించి చూపాడు. కర్మలలో ఉన్నా జ్ఞానాన్ని జారవిడుచుకో కూడదు అనే సందేశాన్ని అందించాడు. జ్ఞానం లేకపోయినా ధనుర్బాణాలను పడేసి అర్జునుడు నిశ్చేష్టుడై కూర్చున్నాడు. పరిపూర్ణ జ్ఞానంతో శోభిస్తున్నా పురుషోత్తముడు మునికోలను చేత పట్టుకొనే ఉన్నాడు. జ్ఞానంతో శోభించే వారికి కర్మ ఎన్నడూ బంధం కాదని ప్రదర్శన ద్వారా చెప్పకనే భగవానుడు చెబుతున్నాడు.

జ్ఞానం కలవాడే జ్ఞానాన్ని ప్రసాదించ గలడు. చిన్ముద్రాకారుడే గీతామృతాన్ని పితికి ఆశ్రితులకు వితరణ చేశాడు. చిన్ముద్ర ఎలా ఉంటుందో పాలు పితికే వారి వ్రేళ్ళు కూడా పితికే టప్పుడు అలాగే ఉంటాయి. శ్రీకృష్ణుడు జ్ఞానక్షీరాన్ని ఎలా పితికాడో తరువాత శ్లోకంలో చూద్దాం.

అమృతోద్భవం

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః ।
పార్థో వత్సః సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥ 4

సర్వోపనిషదః	= సకల ఉపనిషత్తులు	వత్సః	= లేగదూడ
గావః	= ఆవులు	భోక్తా	= అనుభవించు వాడు
గోపాలనందనః	= గోప కుమారుడు	సుధీః	= బుద్ధిమంతుడు
దోగ్ధా	= పాలు పితుకువాడు	దుగ్ధం	= క్షీరము
పార్థః	= అర్జునుడు	మహత్ గీతామృతం	= గొప్పదైన గీతామృతము

ఉపనిషత్తులు గోవులు. పాలు పితుకు వాడు గోపాల నందనుడు. లేగదూడ అర్జునుడు. పానము చేయు వాడు సద్బుద్ధి కలవాడు. గొప్పదైన గీతామృతమే క్షీరము.

వ్యాఖ్య

జ్ఞాన క్షీరం

ఉపనిషత్తులు గోవులు. జ్ఞానము పవిత్రము కనుక జ్ఞాన పూర్ణమైన ఉపనిషత్తులు పవిత్రములు. అలాగే గోమాత కూడా పవిత్రము. గోక్షీరము ఆరోగ్యప్రదము. ఉపనిషత్సార మైన గీతా పీయూషము అమృతానంద ప్రదము. గోక్షీరము ప్రాణులకు శక్తి నిచ్చి జీవనాన్ని వృద్ధి చేస్తుంది. ఉపనిషత్తులు బోధించే జ్ఞానము మనిషికి ఆధ్యాత్మిక శక్తి నిచ్చి అద్వైత జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. జగత్తు యొక్క ధారణ పోషణలు ఏడు విషయాల మీద ఆధారపడి ఉన్నా యన్నారు మన పూర్వీకులు. ఆ ఏడింటిలో గోమాత ఒకటి.

గోభి ర్విప్రైశ్చ వేదైశ్చ సతీభిః సత్యవాదిభిః
అలుబ్ధైః దానశూరైశ్చ సప్తభి ర్ధాయతే మహీః ॥

గోమాత, వేదవిదుడు, వేదము, పతివ్రత, సత్యవాది, లోభి కాని వాడు, దానవీరుడు - ఈ ఏడుగురి తోనే ధరణి యొక్క ధారణ పోషణలు జరుగు తున్నాయి.

గోవు మనకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది. గోమాత సంతాన మైన ఎద్దులు పొలాన్ని దున్న డానికి, బరువులు మోయడానికి, బండ్లు లాగడానికి ఉపయోగ పడతాయి. ఆవుపేడ శక్తివంతమైన ఎరువుగా ఉపయోగ పడుతుంది. పంచితము, అనగా గోమూత్రము కూడా పవిత్రమే. ఔషధాల తయారీలో గోమూత్రాన్ని ఉపయోగిస్తారు. పంచితాన్ని శుద్ధి క్రియకు కూడా వినియోగిస్తారు. గోమాతల నుండి ఇన్ని విధాలైన ప్రయోజనాలు చేకూరుతున్నా, ప్రధాన ప్రయోజనము మాత్రము క్షీరమే.

ఉపనిషత్తులు అనేకమైన విషయాలను చర్చిస్తాయి. కర్మకాండ, యోగవిధి, ఉపాసనాది విషయాలను కూడా ఉపనిషత్తులు చర్చిస్తాయి. కాని, ఉపనిషత్తుల యొక్క ప్రధాన ప్రయోజనం మాత్రం ఆత్మజ్ఞానమే. జ్ఞానక్షీరమే.

భోజనం లేనిదే మనిషికి శక్తి రాదు. కాని, గోక్షీరము లేకుండా భోజనం రుచిస్తుందా? పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, - ఇవన్నీ క్షీరము ప్రసాదించినవే కదా? అందుచేతనే ***వినా గోరసం కో రసం భోజనేషు?*** గోక్షీరం లేని ఆహారంలో రుచి ఏముంటుంది? అన్నారు పెద్దలు.

జ్ఞానం లేకపోతే జీవితంలో వెలుగు ఉండదు. కాని, ఉపనిషత్తులకు దూరమైన జ్ఞానం వాస్తవానికి అజ్ఞానమే. విశ్వ విజ్ఞాన మంతా ఉపనిషత్తుల నుండే లభిస్తుంది. అందుకనే, వేదాంత జ్ఞానం లేని వారి జీవితాలలో వెలుగు ఉండదు అన్నారు పెద్దలు.

బాల్యంలో తల్లిపాలు త్రాగి పెరుగుతాము. శైశవం దాటిన తరువాత, బ్రతికినంత కాలం గోక్షీరం తోనే జీవిస్తాము. అందుకనే గోమాతను పాలిచ్చి పెంచిన తల్లి స్థానంలో నిలిపి పూజించారు మన పూర్వీకులు.

గోక్షీరం ఎలా అందుతుందో, ఉపనిషత్ జ్ఞానం కూడా అలాగే అందుతుంది. అందుచేత గోవుల్ని ఉపనిషత్తుల తోను, క్షీరాన్ని గీతామృతం తోను పోల్చారు. ఆరోగ్యాన్నిచ్చే గోక్షీరం మధురం. ప్రకాశాన్ని ప్రసాదించే ఉపనిషత్ జ్ఞానం మధురాతి మధురం.

ఆవులు గడ్డి తింటాయి. తినిన ఆహారాన్ని తిరిగి నోటి లోకి తెచ్చుకొని నెమరు వేస్తాయి. అలా నెమరు వేయడంలో పాలు ఉత్పన్న మవుతాయి. జటిల మైన, గహన మైన ఉపనిషత్ విషయాలు ఒక రాగాన మ్రింగుడు పడవు. ఆవు నెమరు వేసినట్లు, ఆ తాత్త్విక విషయాలను మనం మననం చేయాలి. నెమరు వేసే టప్పుడు గోమాత తదేకంగా అవధానంతో ఉంటుంది. అప్పుడే పాలు తయా రవుతాయి. అలాగే, ఉపనిష ద్విషయాలను శ్రవణ మననాదుల ద్వారా బుద్ధికి పట్టించుకొని, ఆ తరువాత తదేక నిష్ఠతో నిదిధ్యాసను సాగిస్తే, జ్ఞానక్షీరం లభిస్తుంది. ఆ జ్ఞానక్షీరమే గీతామృతము. ఉపనిషత్తులు అనే గోవుల నుండి గీతాజ్ఞాన క్షీరమును పితికే వాడు గోపాల నందనుడు.

పాల గోపాలుడు

గోవుల నుండి పాలు పితికే వాడు గోపాలుడు. పాలు పితకడం ఒక కళ. తెలిసిన వాడు పితికితేనే పాలొస్తాయి. తెలియని వాడు పితికితే తన్నులు మిగుల్తాయి. శ్రీకృష్ణుడు గొల్ల పిల్లవాడే కనుక చక్కగా పాలు పితక గలడు. అందుకే అతడు గోపాలుడు. గోవులను పాలించే వాడు అయినందున గోపాలుడు ***(గవాం పాలనాత్).*** అలాగే గోవుల్ని మేపే టప్పుడు గోప వేషధారిగా గోచరించడం వల్ల కూడా శ్రీకృష్ణుడు గోపాలుడు ***(గోప వేషధరః గోపాలః).***

పాలు పితకడం అందరూ చేయలేరు. ఉపనిషత్తుల లోని జ్ఞానాన్ని అందరూ అందుకోలేరు. పాలు పితకడం తెలిసిన వానికే గోక్షీరం లభ్య మైనట్లు, సంప్రదాయం తెలిసిన వారికే ఉపనిషత్ జ్ఞానము వంట పడుతుంది. శ్రీకృష్ణుడు గోపాల నందనుడు. గోక్షీరమును ఎలా పితకాలో తెలిసిన వాడు. అలాగే **గో** అంటే 'మహి' లేదా 'భూమి' అని కూడా అర్థము. భూమికి పతి కనుక గోపాలుడు భూపతి. అతడే గోపతి. అతడే గోహితుడు కూడా. ***గోభ్యో హితో గోహితః*** - భూమండలానికి మేలు చేసే వాడు. ***గో*** అంటే వాక్కు అని మరొక అర్థం. ఉపనిషత్తుల యొక్క జ్ఞాన వైభవాన్ని వర్ణించి చెప్పి, అటు ఉపనిషత్తుల ప్రాభవాన్ని నిలుపు తున్నాడు. ఇటు ఉపనిషత్ జ్ఞానము ద్వారా మహిలో మహిమను ఆవిష్కరిస్తున్నాడు. ఉపనిషత్తు లనే గోవుల నుండి గోపాలు డనే శ్రీకృష్ణుడు భగవద్గీత అనే క్షీరాన్ని ఎలా పితుకు తున్నాడో అర్థం చేసుకున్నాం. ఇంతవరకు జ్ఞానం యొక్క వైశిష్ట్యంతో పాటు ***(గీతా)***, జ్ఞాని యొక్క వైభవాన్ని కూడా అర్థం చేసుకున్నాం ***(గోవిందః)***. ముక్తికి గకార చతుష్టయం రాజమార్గ మని శాస్త్రం చెబుతూ ఉంటే, ఇప్పటికే మనకు గకార ద్వయం లభ్యమైంది. (1)గీత (2) గోవిందుడు.

గీతా గంగా చ గాయత్రీ గోవిందేతి హృది స్థితే
చతు ర్గకార సంయుక్తే పునర్జన్మ న విద్యతే ॥

గీత, గంగ, గాయత్రి, గోవిందుడు అని గకారముతో ప్రారంభమయ్యే నాల్గింటిని హృదయములో నిలుపుకున్న వారికి పునర్జన్మ ఉండదు.

వాత్సల్యం తోనే వర్షన

ఆవు పాలు ఇస్తుంది. కాకపోతే, ముందుగా లేగదూడ తల్లి పొదుగును స్పృశించాలి. అప్పుడే ప్రేమతో పొదుగు నుండి పాలు కారుతాయి. గీతా క్షీరాన్ని శ్రీకృష్ణుడు ప్రసాదించ డానికి అర్జునుడు లేగదూడగా నిలిచాడు. గీతాబోధ ప్రపంచానికి అంద డానికి పార్థుడు నిమిత్త మయ్యాడు. అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని పరానుగ్రహార్థం ఉపదేశించాలని భగవానుడైన వాసుదేవుడు సంకల్పించాడు ***(సర్వ లోకానుగ్రహార్థం అర్జునం నిమిత్తీకృత్య ఆహ భగవాన్ వాసుదేవః).***

పేరు ఒకరిది - ఊరు అందరిది

ఆవు పాలిచ్చేది దూడ కొరకే అయినా, పాలన్నీ దూడ ఒక్కటే త్రాగదు; త్రాగలేదు. దూడ ముందుగా కొన్ని పాలు త్రాగుతుంది. ఆ తరువాత మిగిలిన పాలు మన పాలు.

గీతామృతం కూడా అంతే. గీతాజ్ఞానాన్ని శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి ఉద్దేశించి బోధించినా, అది కేవలం అర్జునుని కొరకే కాదు. అందరి కొరకు. అందరి ఆనందం కొరకు. గీతామృతాన్ని పానం చేసే వారు బుద్ధిమంతులు ***(సుధీః భోక్తా)***. అంటే వివేకబుద్ధి కలవారు అని అర్థం. అట్టి వారే గీతామృతాన్ని పానం చేసి అమృత స్వరూపు లవుతారు. ఈ విధంగా వేదార్థ సార సంగ్రహమైన గీతాశాస్త్రాన్ని ప్రసాదించిన శ్రీకృష్ణ దేవునకు కృతజ్ఞతతో మళ్ళీ మళ్ళీ తలవంచి నమస్కరిస్తున్నాము.

జగద్గురు వందనం

వసుదేవసుతం దేవం కంస చాణూర మర్దనమ్ ।
దేవకీ పరమానన్దం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 5

వసుదేవ సుతం	= వసుదేవుని కుమారుడు
కంస చాణూర మర్దనం	= కంస చాణూరులను చంపిన వాడు
దేవకీ పరమానందం	= దేవకీమాతను పరమానంద పరచిన వాడు

జగద్గురుం	= జగద్గురువు
దేవం	= భగవంతుడు
కృష్ణం	= శ్రీకృష్ణుని
వందే	= నమస్కరింతును

వసుదేవుని కుమారుడు, కంసచాణూరులను చంపిన వాడు, దేవకీదేవికి దివ్యానందాన్ని ప్రసాదించిన వాడు, జగద్గురువు, శ్రీకృష్ణదేవునికి నమస్కారము.

వ్యాఖ్య

వసుదేవ సుతం దేవం

వసుదేవుని కుమారుడుగా అవతరించుట చేత శ్రీకృష్ణుడు వాసుదేవు డని కీర్తింప బడ్డాడు ***(వసుదేవ సుతం - వసుదేవస్య అపత్యం వాసుదేవః).*** అంతేకాదు, సర్వ భూతముల యందు వసించు వాడు కూడా తానే. అందుచేత కూడా ఆయన వాసుదేవుడు ***(వసన్తి భూతాని తత్ర)***. సర్వత్ర ఉండు వాడు, సర్వమును ఆచ్ఛాదించు వాడు కనుక ఆయన 'వాసుః' అయ్యాడు. వాసువైన తాను సాక్షాత్తు దేవుడే కనుక వాసుదేవు డయ్యాడు ***(వాసుశ్చాసౌ దేవశ్చేతి వాసుదేవః)***. అలా చూచి నపుడు అవతారమూర్తిగా ఆయన వసుదేవుని కుమారుడు. దేవుడుగా వసుదేవునికి కూడా తండ్రి. జగత్పిత.

సర్వాణి తత్ర భూతాని వసన్తి పరమాత్మని
భూతేషు చ స సర్వాత్మా వాసుదేవ స్తతః స్మృతః ॥

పరమాత్మ యందు సర్వ భూతములు, సర్వ భూతముల యందు పరమాత్మ ఉండుట చేత ఆయన వాసుదేవుడు అని విష్ణుపురాణము. కనుక వసుదేవుని కుమారుడుగా స్తుతింప బడిన వాసుదేవుడు, వాస్తవానికి దేవదేవు డైన వాసుదేవుడే ***(వసుదేవ సుతం దేవం).***

కంస చాణూర మర్దనం

శ్రీకృష్ణుడు మేనమామ అయిన కంసుని వధించి కంసారి అయ్యాడు. కంసుడు ఎవరో కాదు, అజ్ఞానమే కంసుడు. ఆదిత్య దర్శనంతో అంధకారం అదృశ్య మైనట్లు, అచ్యుతుని దర్శనంతో అజ్ఞానం అంత మవుతుంది.

అజ్ఞాన కొలువులో అహంకారమే గొప్ప యోధుడు. వాడే చాణూరుడనే మల్లయోధుడు. అహంకారానికి ప్రతిరూపం. శ్రీకృష్ణుడు చాణూరుణ్ణి కూడా వధించాడు. పరమాత్మ ప్రవేశంతో హృదయ మనే మధురా నగరాన్ని కలుషితం చేస్తున్న కంసచాణూరులు మరణిస్తారు. జీవునికి అనంతానందం ప్రాప్తిస్తుంది.

దేవకీ పరమానందం

తల్లి యైన దేవకీదేవికి శ్రీకృష్ణుడు దివ్యానందాన్ని ప్రసాదించాడు. దేవకీ నందనుడై దేవకీదేవిని ఆనందంలో ఓల లాడించాడు. ఆయన దేవకీసుతుడు ***(దేవక్యాః పుత్రః)***. అంతేకాదు. సర్వములో, సర్వ దేవతలలో శోభించే దివ్య చైతన్యం కూడా దేవకీ పుత్రుడే అన్నది పంచమ వేదమైన మహాభారతము ***(సర్వ దేవాః దేవకీ పుత్ర ఏవ - ఇతి మహాభారతే).***

దేవకీదేవికి శ్రీకృష్ణుడు రెండుసార్లు పరమానందాన్ని కలిగించాడు. కారాగృహంలో బిడ్డగా ఆవిర్భవించి నపుడు, శంఖచక్ర గదా పద్మములతో శోభిస్తూ చతుర్భుజుడుగా దివ్య దర్శన మిచ్చి, 'అమ్మా! బాధపడకు, నేను వచ్చాను. సదా మీ తోనే ఉంటాను. మీ లోనే ఉంటాను. మీ బంధాలను తొలగిస్తాను' అని అభయ ప్రదానం చేసి మహదానందాన్ని కలిగించాడు. అది మొదటిసారి.

ఆ అలౌకిక రూపాన్నే ధ్యానిస్తూ, ఆయన దివ్యనామాన్నే స్మరిస్తూ, చెరసాలలో భక్తి సాధనను కొనసాగించింది దేవకీమాత. తనను స్మరించే భక్తుల్ని శ్రీకృష్ణుడు విస్మరించడు. కంసుణ్ణి వధించి, దేవకీ వసుదేవుల్ని చెరసాల నుండి విడిపించి వారికి దివ్యానందాన్ని అనుగ్రహించాడు. ఇది రెండవ సారి.

దేవకీమాతకే కాదు. భక్తు లెవరి కైనా భగవ దనుగ్రహం ఇలా రెండు సార్లు ప్రాప్తిస్తుంది. మొదట హృదయంలో భక్తిరూపంలో ఆవిష్కరింప బడుతుంది. ఆ తరువాత జ్ఞానరూపంలో ఆశీర్వదించి పరమానందాన్ని ప్రసాదిస్తుంది **(దేవకీ పరమానందం)**.

కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీకృష్ణ భగవానుడు ప్రసాదించిన గీతా జ్ఞానం ఒక కాలానికో, ఒక దేశానికో, లేదా కొందరు వ్యక్తులకో సంబంధించింది కాదు. యావద్విశ్వానికి విశ్వ మున్నంత వరకు ఉపకరించే జ్ఞానం కావడం చేత ఆయన జగద్గురువు. కృష్ణుడు బోధించిన గీతాజ్ఞానం పట్ల కొందరికి ఆసక్తి లేకపోవచ్చు. అనురక్తి లేకపోవచ్చు. అయినా, అది వారికి సంబంధించే ఉంది. అవసరం తెలియనంత మాత్రాన అవసరం లేదని కాదు. తెలిసొచ్చిన నాడు అది ఒక్కటే తెరువు అని అర్థ మవుతుంది. ఆనాడు వారికి కూడా ఆయనే గురువు. ఆ విధంగా శ్రీకృష్ణుడు జగద్గురువు. అట్టి జగద్గురువైన శ్రీకృష్ణునికి నమస్కారము.

కృష్ణ యను పలుకులో ఎంత కమ్మదనము
బాధలలో ఓదార్చు అమ్మతనము
నిన్ను మించిన దైవమును కనలేము మేము
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకము భక్తితో నివేదించు కుంటున్న ఒక వెన్నముద్ద.

తరించే మార్గము

భీష్మద్రోణ తటా జయద్రథజలా గాన్ధార నీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా ।
అశ్వత్థామ వికర్ణ ఘోర మకరా దుర్యోధ నావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాణ్డవై రణనదీ కైవర్తకః కేశవః ॥ 6

భీష్మద్రోణతటా	= భీష్మద్రోణులు తీరములు	దుర్యోధన ఆవర్తినీ	= దుర్యోధనుడు సుడిగుండము
జయద్రథజలా	= సైంధవుడు నీరు		
గాంధార నీలోత్పలా	= శకుని నల్లకలువ	సః	= ఆ
శల్యగ్రాహవతీ	= శల్యుడు సొరచేప	రణనదీ	= యుద్ధమనే నది
కృపేణ వహనీ	= కృపుడు జలప్రవాహ వేగము	ఖలు	= వాస్తవముగా
కర్ణేన	= కర్ణుడనే	పాండవైః	= పాండవులచే
వేలాకులా	= అలలతో నిండి	ఉత్తీర్ణా	= దాట బడినది
అశ్వత్థామ వికర్ణ ఘోరమకరా	= అశ్వత్థామ, వికర్ణులు భయంకర మొసళ్ళు	కైవర్తకః	= నావికుడు
		కేశవః	= కేశవుడు

భీష్మద్రోణులను తీరములుగా కలది, జయద్రథుని జలముగా కలది, శకునిని నల్లకలువగా కలది, శల్యుని సొరచేపగా కలది, కృపాచార్యుడనే జలప్రవాహ వేగము కలది, కర్ణు డనే అలలతో కూడినది, అశ్వత్థామ వికర్ణులనే భయంకరమైన మొసళ్ళతో నిండినది, దుర్యోధనుడనే సుడిగుండము గల సమరనదిని నిజానికి పాండవులు చక్కగా దాట గలిగారు. శ్రీకృష్ణుడు నావికు డయ్యాడు.

వ్యాఖ్య

దుర్యోధనుని అధర్మ జీవనానికి, అక్రమ ప్రవర్తనకు ప్రతిఫలమే కురుక్షేత్ర సంగ్రామము. మాతృమూర్తి కుంతీదేవి అభీష్టానికి అనుగుణంగా, అచ్యుతుని సారథ్యంలో పాండవులు యుద్ధానికి సిద్ధ పడ్డారు. ఏడు అక్షౌహిణుల సైన్యం పాండవుల వైపు నిలిచింది. కౌరవుల పక్షంలో పదకొండు అక్షౌహిణుల సైన్యం నిలిచి భయంకరంగా గోచరిస్తూ ఉంది. మహా ప్రళయ ప్రభంజనంలా కనిపిస్తున్న కౌరవసేనను భయంకరమైన నదీ ప్రవాహంతో పోల్చి అద్భుతంగా వర్ణిస్తూ, చివరగా జీవితానికి అతి ముఖ్యమైన సందేశాన్ని కూడా జోడించి జోహారు లర్పిస్తూ ఉంది ఈ శ్లోకం.

సమరనది

పాండవులు ఎవరిని ఎదిరించి పోరాడాలో, ఆ కౌరవసైన్యం భయంకరమైన నదీ ప్రవాహంలా ఉంది. అది మామూలు నది కాదు. సమరనది. సంసార రణనది.

ఏటి గట్ల మధ్యే నది ప్రవహిస్తుంది. గట్లు లేకపోతే ఏరు ఉండదు. నీరు అన్ని వైపుల పారి కళ్ళేపి చల్లినట్లు రూపం లేకుండా పోతుంది. కురుక్షేత్రంలో కౌరవసేనా నదికి భీష్మద్రోణులు గట్ల లాగా నిలిచి ఉన్నారు. నదిని పటిష్ఠ మైన గట్లు కాపాడినట్లు, కౌరవసేనా నదిని పరాక్రమవంతులు, అజేయు లైన భీష్మ ద్రోణులు కాపాడు తున్నారు. ఏటి గట్టు బలంగా లేనపుడు ఏటికి గండ్లు పడతాయి. అసమాన పరాక్రమవంతు లైన భీష్మద్రోణుల పరాక్రమం ముందు ప్రమాదానికి అవకాశం లేని రీతిలో సమరనది ప్రవహిస్తోంది **(భీష్మద్రోణ తటా)**.

గట్లు పటిష్ఠంగా ఉండినా, నదిలో నీళ్ళు లేకపోతే ఏమి ప్రయోజనం? గొప్ప సైన్యం అనే జలంతో జయద్రథుడు జలరూపంలో ఉన్నాడు **(జయద్రథజలా)**. ఆ జలం కూడా ప్రవాహ రూపంలో పరవళ్ళు త్రొక్కుతూ ఉంది. ఆ ప్రవాహ వేగమే కృపాచార్యుడు **(కృపేణ వహనీ)**.

నది ప్రవహించే టప్పుడు మార్గంలో అక్కడక్కడ ఏటి గట్లు కొద్దిగా రాపిడికి గురై, గుంటలు ఏర్పడుతూ ఉంటాయి. అలాంటి చోట ప్రవాహ జలము కొంత నిలువ ఉండి పోతుంది. అక్కడ బీజవ్యాప్తి వల్ల మొక్కలు పెరుగుతాయి. తీగలు మొలుస్తాయి. కలువలు మొదలైన పువ్వులు పూస్తాయి. కొంత కాలానికి తీగ లన్నీ విస్తరించి నదీ ప్రవాహాన్ని అడ్డగిస్తూ ఉంటాయి. ప్రస్తుతం కౌరవుల సమరనదిలో శకుని కలువ పొద లాగా ఉన్నాడు **(గాంధార నీలోత్పలా)**.

నదిలో భయంకరమైన సొరచేపలు, తిమింగలాల లాగా, కర్ణుడి సారథి శల్యుడు కనిపిస్తున్నాడు **(శల్య గ్రాహవతీ)**. ఈదడానికి వీలు లేని విధంగా ఆ సమరనది కర్ణుడనే భయంకర కెరటాలతో ఎగిసి పడులోంది **(కర్ణేన వేలాకులా)**. శ్రమించి ఈదడానికి ప్రయత్నిస్తే, గొప్ప ప్రమాదం యువకిశోరాలైన అశ్వత్థామ, వికర్ణు లనే భయంకర మొసళ్ళ రూపంలో పొంచి ఉంది **(అశ్వత్థామ వికర్ణ ఘోర మకరా)**.

ఇన్నిటినీ తట్టుకొని గట్టు పైకి చేరే లోగా మధ్యలో పెద్ద సుడిగుండం ఉంది. అదే దుర్యోధనుడు

(దుర్యోధన ఆవర్తినీ). ఆ వైపు లాగబడిన వాళ్ళు తిరిగి బయట పడలేరు. భీష్మ, ద్రోణ, కృప, వికర్ణాదులు ఆ సుడిగుండంలో చిక్కుకొని బయట పడ లేక గింజుకుంటున్న వాళ్ళే. యుద్ధం వారిలో ఎవ్వరికీ ఇష్టం లేదు. అయినా సుడిగుండంలో చిక్కుకొని బయట పడలేక పోతున్నారు. ఇలాంటి భయంకర సమరనదిని ఎవరైనా దాటగలరా? కాని, పాండవులు దాటేశారు. దానికి కారణం వారు నావలో ఎక్కడమే. అది కూడా విజ్ఞాన నౌక కావడమే. అంతకన్నా ముఖ్యమైన విషయం ఆ నౌకను నడిపే వాడు శ్రీకృష్ణుడు కావడమే *(కైవర్తకః కేశవః).*

తరుణోపాయం

జీవితము ఎవరి దైనా చదరంగమే. రణరంగమే. ఇక్కడ ఏదైనా జరగవచ్చు. ఎలాగైనా జరగవచ్చు. ఎప్పుడైనా జరగవచ్చు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. వివేకంతో చరించాలి. జీవన సమరనదీ ప్రవాహంలో పరిస్థితి విషమించకుండా చూసుకోవాలి.

నదీ ప్రవాహంలో ప్రతి క్షణమూ మార్పులే. జీవితంలో కూడా అంతే. నదిలో కాలు పెట్టబోయే ముందు ఏ నీటి నైతే మనం చూస్తామో, కాలు పెట్టే సరికి మన పాదాలకు తాకే నీరు మనం చూసింది కాదు. కాలు పెట్టే లోగా మనం చూసిన నీరు ముందుకు పోతుంది. కొత్త నీరు కాళ్ళను తాకుతుంది. ఇదే మార్పు. జీవితమూ ఇంతే. క్షణక్షణానికి మార్పే జీవిత మిచ్చే గొప్ప తీర్పు. నేడున్న వారు రేపుండరు. నేడున్న పరిస్థితులు మరునాడు ఉండవు. ఈ నిముషంలో లేని ప్రమాదం మరో పది నిముషాల్లో ముంచుకు రావచ్చు. ఉన్నవి ఊడిపోతూ ఉంటాయి. కొన్ని కళ్ళ ముందే కాలిపోతూ ఉంటాయి. కదిలే కాళ్ళకు కదలలేని స్థితి ఒకటుంది. చూచే కళ్ళకు చూడలేని పరిస్థితీ ఉంటుంది. జాగ్రత్తగా ఉన్నా కొన్ని జారి పోతూనే ఉంటాయి. గోరంత లాభాలను చూసుకొని పది అడుగులు పైకి పోతాం. కొండంత నష్టాలను మోయలేక వంద అడుగులు క్రిందికి జారిపోతాం.

ప్రారబ్దం దర్శకత్వం వహించే ఈ జీవిత నాటకంలో ప్రతిక్షణం ఉత్కంఠే. ప్రతి నిముషం ఉద్వేగమే. అంతా అనిశ్చితమే. అయోమయమే. ఈ మాయా మనుగడలో మనిషి ఎవరిని ఆశ్రయించాలి? ఎవరిని ఆశ్రయించినా, మునిగిపోయే వాణ్ణి వాటేసుకొని తేలేందుకు ప్రయత్నం చేయటమే అవుతుంది. ఎవరిని ఆశ్రయిస్తే అశ్రువులు, అగచాట్లు శాశ్వతంగా అదృశ్య మవుతాయో, ఎవరి అండ దొరికితే దండగ అనుకున్న బ్రతుకు దండిగా పండుతుందో - అట్టి ఏకైక శరణ్యమూర్తి కేశవుణ్ణి భక్తితో ఆశ్రయించాలి.

సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః. భయంకరమైన యుద్ధ మనే నదీ ప్రవాహాన్ని పాండవులు అవలీలగా దాటేశారు. ఎలా దాట గలిగారో తెలుసా? ***కైవర్తకః కేశవః.*** నావ నడిపే వాడు శ్రీకృష్ణుడు కావడం చేత.

పాండవులు శ్రీకృష్ణుని ఆశ్రయించి తరించారు. అందరమూ అదే చెయ్యాలి. బ్రతుకులో చెలరేగే బాధల్ని మన శక్తియుక్తులతో పోగొట్టుకో లేము. ఉప్పెనలా వచ్చిపడే కష్టాల్ని మనకు మనంగా తొలగించుకో లేము. ఎక్కడ అవరోధాలు అడ్డు నిలుస్తాయో, ఎప్పుడు ప్రతిబంధకాలు ఎదురౌతాయో మన మనస్సుకు తెలియదు. ఒకవేళ తెలిసినా చేయ గలిగింది కూడా చాలా విషయాల్లో ఏమీ ఉండదు. రోదిస్తే చీకటి పోదు. ఏడిస్తే పోయింది రాదు. అనివార్యాలు జీవితంలో తప్పవు. అసంభవా లెన్నడూ జరగవు.

చంద్రుడు ఉదయిస్తేనే వెన్నెల. వసంతం విరబూస్తేనే వనం కళకళ. పరమాత్మ కృప ప్రాప్తిస్తేనే జీవితంలో పరిపూర్ణకళ. ఆనందకళ. అనంతానందకళ. భగవంతుడు ఇలా అందరికీ శరణమై ఉన్నాడు. ఆనంద ప్రదాతయై ఉన్నాడు.

మహాభారత కమలం

పారాశర్య వచః సరోజ మమలం గీతార్థ గన్ధోత్కటం
నానాఽఖ్యానక కేసరం హరికథా సంబోధనా బోధితమ్ ।
లోకే సజ్జన షట్పదై రహరహః పేపీయమానం ముదా
భూయా ద్భారత పఙ్కజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే ॥ 7

అమలం	= నిర్మలమైన	సజ్జన షట్పదైః	= మహాత్ము లనెడి తుమ్మెదలచే
పారాశర్య వచః సరోజం	= వ్యాసుని వచనములనే సరస్సున పుట్టినది	అహరహః	= దినదినము
గీతార్థ గంధ ఉత్కటం	= గీతార్థ మనే మధురమైన సుగంధము కలది	ముదా	= ఆనందముతో
		పేపీయమానం	= ఆస్వాదించ బడేది
నానా ఆఖ్యానక కేసరం	= వివిధములైన కథలే కేసరములుగా గలది	భారత పంకజం	= మహాభారత కమలము
		కలిమల ప్రధ్వంసి	= కలికల్మషమును నాశనం చేసి
హరికథా సంబోధనా బోధితం	= హరికథల సందేశాలతో వికసించినది	నః	= మాకు
		శ్రేయసే	= శ్రేయస్సు కొరకు
లోకే	= లోకంలో	భూయాత్	= అగు గాక!

వ్యాసప్రబోధ మనే సరోవరమున పుట్టినది, గీతార్థ మనే మధురమైన సుగంధము కలది, వివిధము లైన కథలను కేసరములుగా కలది, హరికథా సందేశములతో ప్రఫుల్ల మైనది, ఈ ప్రపంచమున బుధజను లనెడి తుమ్మెదలచే ప్రతిదినము ఆనందముగా ఆస్వాదించ బడునది, కలిదోషములను పోగొట్టునది, నిర్దోష మైనది అయిన మహాభారత కమలము మాకు శ్రేయస్సును ప్రసాదించు గాక!

వ్యాఖ్య

మహాభారత కమలం వ్యాస భగవానుని వాక్సరోవరం నుండి ఆవిర్భవించింది. మహాభారతము అద్భుత మైన గ్రంథము. పంచమ వేదంగా శ్లాఘింప బడింది. ధర్మసూక్ష్మములు, తత్త్వసారములతో నిండిన పవిత్రమైన గ్రంథము. జన కళ్యాణాన్ని ఆవిష్కరించిన గ్రంథము.

భారతము ఇతిహాసమే అయినా, ఒక కాలానికి సంబంధించిన గ్రంథం కాదు. ఏ కాలములో నైనా కమలము తన పరిమళాన్ని ఒకే విధంగా వెద జల్లినట్లు, మహాభారత కమలం దేశకాలాదులకు పరిమితం కాకుండా జ్ఞాన సుగంధాన్ని వెద జల్లుతుంది.

మానవ సమాజం లోని వ్యక్తుల జీవన స్థితిగతులకు, ఆలోచనా విధానానికి, ప్రవర్తనకు అద్దం పడుతుంది. అర్థం చెబుతుంది. కవితా శిల్పంతో, నాటకీకరణంతో, ధర్మ సూక్ష్మ వివరణంతో, తాత్త్విక విశ్లేషణలతో అద్భుతంగా, అసమానంగా అలరారుతూ వినడానికి ఇంపుగా, సొంపుగా ఉంటుంది. అందుచేతనే, 'వింటే భారతమే వినాలి' అనే నానుడి విపుల వ్యాప్తి చెందింది.

అద్దంలో ఎవరి ముఖమైనా కనిపిస్తుంది. మహాభారతంలో ఎవరి జీవిత మైనా ప్రతిబింబిస్తుంది. మన పాత్రలు, ప్రవర్తనలు, మనస్తత్త్వాలు భారతంలో ప్రతిఫలిస్తూ ఉంటాయి. అందుకే భారతం రమణీయంగా

గోచరిస్తుంది. భారతాన్ని అధ్యయనం చేయడం అంటే, మన ఆంతరంగిక లోతు ల్లోకి తొంగి చూడటమే.

భారతం త్రికాల జ్ఞాని యైన వ్యాసభగవానుని అపూర్వ సృష్టి కావడమే ఇందుకు ప్రబలమైన కారణము *(పారాశర్య వచః సరోజం)*. వ్యాసుని పారాశర్యుడని ఈ శ్లోకంలో పేర్కొనడంలో కూడా అంతరార్థం అదే. భవిష్యత్తును వర్తమానము నందు దర్శించే స్మృతికర్త పరాశరుని కుమారుడు వ్యాసుడు. అట్టి వ్యాసమహర్షి రచించింది కావడం చేత మహాభారత కమలం కాలంలో వాడి పోకుండా కళకళ లాడుతూ ఉంది. నిర్మలంగా ఉంది *(అమలం)*.

వాసన లేని పూలు పూజకు పనికిరావు. అవి దర్శనీయమే గాని అర్చనీయము కావు. తత్త్వ సౌరభాన్ని గుండెలో దాచుకోలేని గ్రంథాలు అవి ఇతిహాసా లైనా, కావ్యాలైనా పది కాలాల పాటు ఊరేగ లేవు. మహాభారత గ్రంథము అమోఘమైన గీతా సుగంధంతో అజేయంగా అలరారుతూ ఉంది. తత్త్వార్థ సౌరభంతో గుబాళిస్తూ ఉంది *(గీతార్థ గంధోత్కటం)*.

పువ్వు యొక్క సౌందర్యము పూలరేకుల మీదే ఆధారపడి ఉంటుంది. నైతిక జీవనాన్ని వృద్ధి చేసే ధార్మిక కథలనే పూలరేకులతో మహాభారత కమలం మనోజ్ఞంగా శోభిస్తూ ఉంది *(నానాఽఖ్యానక కేసరం)*.

కోమలమైన రేకులతో సుగంధాన్ని విరజిమ్ముతూ పువ్వులు విరబూయాలి అంటే చల్లని చిరుగాలి తోడు కావాలి. శ్రీహరి భగవానుని దివ్య గాథల లోని భక్తి మారుతము తోడై మహాభారత కమలము విరబూసింది *(హరికథా సంబోధనా బోధితం)*. పవిత్రాత్ములు, పావనచరితులు అయిన సాధుజనులు, సత్పురుషులు అనే తుమ్మెదలు అనుదినము ఆ మహాభారత కమలమును ఆఘ్రాణిస్తూ ఉంటారు. జ్ఞాన మకరందాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు.

షట్పది అంటే తుమ్మెద. తుమ్మెదకు ఆరు కాళ్ళు. అందుకే అది షట్పది. తుమ్మెద ఎటు ఎగిరినా, ఎక్కడ తిరిగినా పువ్వుపై వాలి నపుడే నవ్వుతుంది. తనకు ఆకలి తీరేది, ఆనందం కలిగేది పువ్వు ఒడి లోనే. ఆ గుడి లోనే.

అరవిందము ఎవరి కైనా అందం గానే అగుపిస్తుంది. కాని తుమ్మెదకు అందులో అందమే కాదు, ఆనందం కూడా లభిస్తుంది. అరవిందంలో దాగిన మకరందాన్ని జుర్రుకొనే భాగ్యం తనకు ఉండటమే తన ఆనందానికి కారణము.

తుమ్మెద పద్మము లోని మకరందాన్ని ఆస్వాదించినట్లు, సత్పురుషులు, సుకృతాత్ములు అయిన షట్పదులు మహాభారత కమలం లోని అమృతానంద రసాన్ని పానం చేస్తారు.

మహాభారతాన్ని ఎవరు విన్నా ఆనందాన్ని పొందుతారు. కాని సత్పురుషు లనే షట్పదులు అందులోని తత్త్వసారాన్ని ఆస్వాదించి తృప్తి చెందుతారు. తుమ్మెద ఆరు కాళ్ళతో సంచరిస్తుంది కనుక దానిని షట్పది అంటారు. సత్పురుషులు ఐదు జ్ఞానేంద్రియాలు, ఒక మనస్సు వెరసి ఆరు ఇంద్రియ పాదాలతో చరిస్తూ జ్ఞానమధువును గ్రోలుతారు కనుక వారు కూడా షట్పదులే *(సజ్జన షట్పదైః)*.

సుకృతాత్ములైన ఈ సజ్జన భ్రమరాలు మహాభారత కమలం లోని మధువును ప్రతి రోజు ఆనందంతో ఆస్వాదిస్తూ ఉంటారు *(అహరహః పేపీయమానం ముదా)*. మహాభారతం యొక్క అవసరం మానవులకు ప్రతిరోజు ఉంది. ప్రతిరోజు అద్దం చూసుకొని ముఖాన్ని ఎలా సరి చేసుకుంటామో, అలాగే ప్రతిరోజు మహాభారతాన్ని పఠిస్తూ మన జీవన సరళిని సవరించుకుంటూ ఉండాలి. అప్పుడే బ్రతుకులో అందం నిండుతుంది. ఆనందం పండుతుంది.

వ్యాస భగవానుని వాక్సరోవరం నుండి ఆవిర్భవించిన మహాభారత కమలం మన హృదయ సరోవరంలో విరబూయాలి. కమలాలతో కళకళ లాడే సరోవరం స్వచ్ఛంగా, నిర్మలంగా, రమణీయంగా, పవిత్రంగా ఉంటుంది. మహాభారత మనే ధార్మిక, తాత్త్విక సరోజం హృదయ మడుగులో వికసిస్తే, నిర్మలత్వాన్ని, పావనత్వాన్ని సంతరించుకొని బ్రతుకు దివ్యంగా శోభిస్తుంది. కలికల్మషాలు అంతరించి పోతాయి **(కలిమల ప్రధ్వంసి)**. శ్రేయస్సు ప్రాప్తిస్తుంది. యావత్ప్రపంచం ఈ మహాభారత కమలాన్ని ఆఘ్రాణించు గాక! సర్వజనులు షట్పదులై మహాభారత కమలం లోని ఆనంద మకరందాన్ని ఆస్వాదించెదరు గాక! **జయోఽస్తు విజయోఽస్తు** - 'జయ'మునకు జయమగు గాక! జయ గ్రంథానికి విజయ మగు గాక!

కృపా విశేషము

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।
యత్కృపా తమహం వన్దే పరమానన్ద మాధవమ్ ॥ 8

యత్ కృపా	= ఎవరి కృప	లంఘయతే	= ఎక్కించునో
మూకం	= మూగవానిని	తం	= అట్టి
వాచాలం	= భాషణశీలునిగా	పరమానంద మాధవం	= పరమానంద స్వరూపుడైన మాధవుని
కరోతి	= చేయునో	అహం	= నేను
పంగుం	= కుంటి వానిని	వందే	= నమస్కరిస్తున్నాను
గిరిం	= కొండను		

ఎవరి కృప మూగవానిని భాషణశీలునిగా చేయునో, కుంటివానిని కొండ లెక్కించునో అట్టి పరమానంద స్వరూపుడైన మాధవునికి నమస్కరిస్తున్నాను.

వ్యాఖ్య

భగవత్కృప అనిర్వచనీయం. అనుభవైక వేద్యం. భగవంతుని అనుగ్రహం అమృతానందాన్ని ప్రసాదిస్తుంది. భక్తి మానవునికి బ్రహ్మ సంబంధమును కలిగిస్తుంది. మనస్సు మాధవుని యందు లగ్నమైతే మాయ అంతరిస్తుంది. మహిమ అందల మెక్కుతుంది.

బుద్ధిలో సదా భక్తి భావాలు ఉండేటట్లు జీవించ గలిగితే భక్తులం అవుతాము. భక్తులము కాగలిగితే భగవత్కృపను పొందడానికి అర్హులం అవుతాము. భగవంతుడు సదా భక్తులను దయతో రక్షిస్తూ ఉంటాడు.

భక్తిలో అపారమైన శక్తి ఉంది. అద్భుతమైన లివ ఉంది. భక్తి మూగవానిని కూడా మాట్లాడిస్తుంది **(మూకం కరోతి వాచాలం)**. అదంతా భగవంతుని కృపా విశేషం. కృపా సాగరుడైన పరమేశ్వరుని పాదాల చెంత కృపారసం సముద్రం లాగా పొంగి పొరలుతూ ఉంటుంది. నమస్కరించే సంస్కారం తోడైతే భగవత్కృప విశేషంగా వర్షిస్తుంది. కరచరణ విహీను డైన కూర్మదాసు పండరీపురానికి నడిచి వెళ్ళి పాండురంగణ్ణి దర్శించాడు. సంత్ జ్ఞానదేవ్ మహిషము చేత వేదాన్ని పలికించాడు. భగవత్కృపకు అడ్డు లేదు అనడానికి ఇవన్నీ తార్కాణాలు.

తల్లికి వినపడే లాగా బిడ్డ విలపిస్తే చాలు. మరుక్షణం లోనే తల్లి ప్రత్యక్ష మవుతుంది. ఆకలి తీర్చుతుంది. లాలిస్తుంది. పాలిస్తుంది. బాధను తొలగిస్తుంది. కష్టాల్ని కరిగిస్తుంది. మహా భక్తుడైన అంబరీషునిపై

దుర్వాస మహర్షి దురాగ్రహాన్ని ప్రకటించాడు. క్రోధావేశాన్ని ప్రదర్శించాడు. ఏ విధమైన క్షోభకు గురి కాకుండా, అలజడి లేకుండా అంబరీషుడు ప్రసన్నంగా అగుపించాడు. అంబరీషుని అనుగ్రహించేందుకు, దుర్వాసుని సంహరించేందుకు భగవత్కృప సుదర్శనం రూపంలో బయలు దేరింది. మహా తపస్వి అయిన దుర్వాస మహర్షి చివరగా భక్తుడైన అంబరీషుణ్ణే ఆశ్రయించ వలసి వచ్చింది. ఆ సందర్భంలో దుర్వాసుడు పలికిన వాక్యాలు భక్తుల వైభవానికి ప్రతిరూపాలుగా భాసిస్తాయి.

ఒకమా రెవ్వరి పేరు కర్ణములలో నొయ్యారమై సోకినన్
సకలా ఘంబులు పల్లటిల్లి తొలగున్ సంభ్రాంతితో నట్టి స
త్సుకరున్ మంగళతీర్థ పాదు హరి విష్ణున్ దేవ దేవేశునిన్
అకలంక స్థితి గొల్చు భక్తులకు లేదద్దంబు రాజాగ్రణీ ॥

పరమేశ్వరుని కృపతో సర్వ పాపాలు హరించుకు పోతాయి. సదా భగవంతుని మౌనంగా స్మరించే వారికి, నిర్మలంగా ధ్యానించే వారికి, కర్మయోగులై అర్చన కీర్తనాదుల ద్వారా సేవించే వారికి భగవత్కృప తప్పక సిద్ధిస్తుంది. అలాంటి సిద్ధిని ప్రసాదించే వాడు కనుకనే పరమానంద రూపుడైన పరమేశ్వరుని ఈ శ్లోకంలో **మాధవమ్** అని కీర్తించడం జరిగింది.

'మా' అంటే లక్ష్మీదేవి. 'ధవుడు' అంటే భర్త. అందుచేత లక్ష్మీపతి మాధవుడని కీర్తింప బడ్డాడు. మౌన, ధ్యాన, యోగాల ద్వారా తెలియబడే వాడు మాధవుడు *(మౌనాత్ ధ్యానాత్ యోగాత్ విద్ధి భారత మాధవమ్)* అని మహాభారతంలో వ్యాసోక్తి.

భగవంతుని కొరకు నిర్వహించే ఉపాసనలు, ఆరాధనలు, భక్తి కార్యాలన్నీ అలౌకిక కర్మలు. అలౌకిక కర్మలకు ఫలం అలౌకికం గానే ఉంటుంది. అదే దయ. భక్తి సాధనల ఫలంగా పరమేశ్వరుడు అనుగ్రహించే కృపా విశేషం భక్తుణ్ణి కృతార్థుణ్ణి చేస్తుంది. కృతకృత్యుణ్ణి చేస్తుంది.

చరణము : *నను కరుణించిన భక్తివి నీవే*
నేను వరించిన ముక్తివి నీవే
నీ వెంట పడితే మిగలదు మోహము
నీవు వెంట రాగా వెలుగును మోక్షము

పల్లవి : *రాధా రమణ రాదేల కరుణ*
దేవకీనందన మాకేల వేదన?

అనుపల్లవి : *జీవుల గమ్యము నీవే కావా!*
బ్రతుకు సంద్రమున నీవే నావ! ॥ రాధా ॥

అని భక్తి వైభవాన్ని, భగవత్కృపా విశేషాన్ని వర్ణించింది చైతన్య గీతిక.

యం బ్రహ్మ వరుణేన్ద్ర రుద్ర మరుత: స్తున్వన్తి దివ్యై: స్తవై
ర్వేదై: సాంగ పదక్ర మోపనిషదై ర్గాయన్తి యం సామగా: ।
ధ్యానావస్థిత త ద్గతేన మనసా పశ్యన్తి యం యోగినో
యస్యాన్తం న విదు: సురాసురగణా: దేవాయ తస్మై నమ: ॥ 9

బ్రహ్మ వరుణేంద్ర రుద్ర మరుతః	= బ్రహ్మదేవుడు, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు, వాయుదేవుడు
దివ్యైః స్తవైః	= అద్భుతమైన స్తోత్రములచే
యం	= ఎవనిని
స్తున్వంతి	= స్తుతిస్తున్నారో
సామగాః	= సామవేద గాయకులు
వేదైః	= శ్రుతుల ద్వారా
స అంగ పదక్రమ ఉపనిషదైః	= అంగము, పదము, క్రమము, ఉపనిషత్తులతో కూడి
యం	= ఎవరిని గూర్చి
గాయంతి	= గానం చేస్తున్నారో
ధ్యానావస్థిత	= ధ్యాన స్థితిలో

తద్గతేన	= పరమాత్మ యందు లగ్నమైన
మనసా	= మనస్సుతో
పశ్యన్తి	= అవలోకిస్తున్నారో
యం	= ఎవరిని
యోగినః	= పరమ యోగులు
యస్య అంతం	= ఎవరి పూర్ణత్వమును
సురాసురగణాః	= దేవతలు, అసురులు కూడా
న విదుః	= తెలియలేరో
తస్మై	= అట్టి
దేవాయ	= భగవంతునకు
నమః	= ప్రణామము

బ్రహ్మదేవుడు, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు, వాయుదేవుడు ఎవరిని దివ్యమైన స్తోత్రములచే స్తుతిస్తున్నారో, సామవేద గాయకులు అంగ, పద, క్రమ, ఉపనిషత్తులతో కూడి ఎవరిని కీర్తిస్తున్నారో, పరమయోగులు ధ్యానములో పరమాత్మ యందు లగ్నమైన మనస్సుతో ఎవరి వైపు చూస్తున్నారో, దేవాసురులు సైతము ఎవరి స్వరూపమును తెలుసుకోలేక పోతున్నారో అట్టి దేవదేవునకు ప్రణామములు.

వ్యాఖ్య

పరమేశ్వర సాక్షాత్కారానికి అనేక మంది అనేక మార్గాలలో ప్రయాణం సాగిస్తూ ఉంటారు. పవిత్రమైన లక్ష్యంతో ఆరంభ మైనవి కనుక మార్గాలన్నీ మంగళకరం గానే ఉంటాయి. అద్భుతం గానే గోచరిస్తాయి. అలా గోచరించాలి కూడా. కానీ ఇవన్నీ మహా తేజోవంతమైన ఆ ఏకైక గమ్యానికి సోపానాలే గాని స్వయంగా తేజోమయాలు కావు.

మీరు చరించే మార్గం మీరు చేరాలి అనుకునే గమ్యానికి ఎలా సంబంధించి ఉంది? మార్గం, గమ్యం కన్నా వేరుగా లేదు అని తెలియడమే సరియైన మార్గం. అదే జ్ఞానం.

మనం ఎన్నిటినో ఆశిస్తాము. అభిలషిస్తాము. చాలా వాటిని ప్రేమిస్తాము. ఆశించినవి కొన్ని లభిస్తాయి. ప్రేమించినవి కొన్ని ప్రాప్తిస్తాయి. ప్రేమించిన వన్నీ లభించాలని లేదు. చిరుగాలిని నువ్వు ప్రేమించ వచ్చు. అలాగని దానిని పెట్టెలో పెట్టి దాచుకో లేవు. జాబిలిని నేను ప్రేమించ వచ్చు. అలాగని దానిని ఆకాశం నుండి త్రెంపుకొని జేబులో పెట్టుకో లేను. అవసరం లేదు కూడా.

సామాన్యమైన విషయాలే ఇలా ఉండే టప్పుడు, బ్రహ్మవిదుడు ప్రత్యేకంగా మార్గంలో నిలిచి, గమ్యమైన అనంత బ్రహ్మ స్వరూపాన్ని గ్రహించ గలడా? గ్రహించ లేడు. ఎందుకో తెలుసా? తానే బ్రహ్మము. మార్గం గమ్యానికి వేరుగా లేదు. గమ్యం లోనే మార్గం ఒదిగి ఉంది. అన్నీ ఇలాగే ఉన్నాయి. అందుకే బ్రహ్మము అనంతము.

బ్రహ్మము సద్వస్తువు. ఉన్నదే గాని కానున్నది కాదు. లేని దానిని ప్రయత్నించి పొందాలి. ఉన్న దానిని అర్థం చేసుకోవాలి. బ్రహ్మము ఉన్నదే గనుక, అలా ఉన్నట్లు ఏ జ్ఞానం చేత తెలియ బడుతూ ఉందో, అదే బ్రహ్మజ్ఞానము.

బ్రహ్మజ్ఞానం విషయంలో పొంద బడేది ఏదో అది పొందాలి అనుకొనే వాడు బ్రహ్మమే. మార్గంలో ఉన్న వ్యక్తిని గమ్యం నుండి వేరు చేసేది దేశమూ కాదు. కాలమూ కాదు. కేవలం అజ్ఞానమే. అజ్ఞానము తొలగితే సాధకుడే సాధ్యం. ఆ సాధ్యం కూడా సిద్ధం. ఎప్పుడో ఎక్కడో సాధ్య మయ్యేది కాదు. ఇప్పుడే, ఇక్కడే సిద్ధమై ఉండేది. కనుక అది జ్ఞాతవ్యమే గాని కర్తవ్యం కాదు. అందుకనే, ***తత్ విజిజ్ఞాసస్వ*** - దానిని తెలుసుకొనే ప్రయత్నం చెయ్య మన్నది ఉపనిషత్తు.

దేవతలు మరణం లేనివారే గాని బ్రహ్మజ్ఞానులు కారు. కనుక దేవతలకు కూడా బ్రహ్మమే ప్రభువు ***(అమరాణాం మరణ రహితానాం ప్రభుః).*** ఆయనే గమ్యము. దేవతలు అత్యున్నత మైన ప్రకాశ స్వరూపులు. ఉన్నత స్థాయిలో ఉన్నంత మాత్రాన ఉన్న సత్య స్వరూపానికి సంబంధించిన జ్ఞానం కలగాలని లేదు. ప్రమాణం ఉంటేనే ప్రమ, లేదా జ్ఞానం కలుగుతుంది.

కనుకనే, దేవత లందరూ దివ్య స్తోత్రాలతో స్తుతించినా, బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకోలేక పోయారు. వేదనాదంతో కీర్తించే వేద పండితులు కూడా బ్రహ్మ స్వరూపాన్ని గ్రహించలేక పోతున్నారు. అంతర్ముఖులై ధ్యానమగ్ను లైన యోగులు కూడా బ్రహ్మ స్వరూపము అర్థం గాక నిశ్చేష్టులై ఉన్నారు. అట్టి పరబ్రహ్మమును ఎలా కీర్తించాలి? కీర్తించను ఎలాగూ వీలు పడదు కనుక, ఎలా కీర్తించినా దోషం లేదు. అనంత మైన పరమాత్మ స్వరూపాన్ని పరిమితమైన మన ప్రార్థనలలో మడత పెట్టలేము అనేదే అన్ని ప్రార్థనల యొక్క అంతరంగము. కనుక, ఎవరి స్వరూపాన్ని సురాసురులు సైతం తెలుసుకోలేరో, అట్టి భగవంతునికి నమస్కారము ***(యస్యాంతం న విదుః సురా సురగణాః దేవాయ తస్మై నమః).***

భగవాన్! నీవు ఉన్నట్లు తెలుసు. ఎలా ఉన్నావో తెలియదు. నీ స్వరూప స్వభావాలు నా బుద్ధికి దొరకడం లేదు. నీవు ఎలా ఉన్నా, నేను పిలిచే పలుకు మాత్రం నీకే వినిపించాలి. నా ప్రార్థనలు నిన్నే చేరాలి.

తవ తత్త్వం న జానామి కీదృశోఽసి మహేశ్వర
యాదృశోఽసి మహాదేవ తాదృశాయ నమోనమః ॥

నీ స్వరూప మేమిటో నాకు తెలియదు. అది ఏదైనా కానీ, నేను చేసే వందనము ఆ స్వరూపానికే. నీ స్వరూపానికే.

ఈ విధమైన మెత్తని భావాలతో నిండిన ధ్యాన శ్లోకాలను పఠించి, తృప్తి చెందిన గీతా భక్తుని హృదయం ఆనందంతో ఊగుతూ గీత వైపు సాగుతూ ఉంది.

చైతన్య భగవద్గీత

అథ ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయము

అర్జున విషాదయోగః - అర్జున విషాద యోగము

ధృతరాష్ట్ర ఉవాచ :

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాండవా శ్చైవ కి మకుర్వత సంజయ ॥ 1

ధర్మక్షేత్రే-కురుక్షేత్రే-సమవేతాః-యుయుత్సవః
మామకాః-పాండవాః-చ-ఏవ-కిం-అకుర్వత-సంజయ

సంజయ	=	ఓ సంజయా!	సమవేతాః	=	చేరిన
ధర్మక్షేత్రే	=	ధర్మభూమి యైన	మామకాః	=	నా వాళ్ళు
కురుక్షేత్రే	=	కురుక్షేత్రమున	పాండవాః చ ఏవ	=	పాండవులు
యుయుత్సవః	=	సమరేచ్ఛతో	కిం అకుర్వత	=	ఏమి చేశారు?

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు :

సంజయా! యుద్ధం చెయ్యాలని మా వాళ్ళు, పాండవులు ధర్మక్షేత్ర మైన కురుక్షేత్రానికి చేరారు కదా! అక్కడ వాళ్ళు ఏం చేశారు?

వ్యాఖ్య

మంగళము

గీతాశాస్త్రము ధృతరాష్ట్రుని శ్లోకంతో ఆరంభమైంది. మంగళాచరణము చేసి శాస్త్రాన్ని ప్రారంభించాలి అనేది సంప్రదాయము. శిష్టాచార నియమము. భగవద్గీత మంగళముతో ఆరంభం కాకుండా, ఒకేసారి ధృతరాష్ట్రుని శ్లోకంతో ప్రారంభం కావడం చేత, గీతాశాస్త్రము సంప్రదాయ విరుద్ధ మని కొందరి అభిప్రాయము.

ఈ విషయాన్ని కాస్త వివరంగా, విస్పష్టంగా విచారించు కోవాలి. భగవద్గీతకు మంగళాచరణం అవసరమా? అనేది ముందుగా నిర్ణయం కావాలి.

భగవద్గీతకు మంగళాచరణం ప్రత్యేకంగా ఉండ నవసరం లేదు. గీత మహాభారతము మధ్యలో ఉంది **(మధ్యే మహాభారతమ్).** మంగళాచరణముతో మహాభారతము మొదలైంది కనుక భార తాంతర్గత మైన భగవద్గీతకు ప్రత్యేకించి మంగళము చెప్ప నవసరం లేదు.

అలా కాకుండా, భగవద్గీత తత్త్వ ప్రధానమైన శాస్త్రం కనుక, భార తాంతర్గతమే అయినా ప్రత్యేకించి మంగళార్థము ఒక శ్లోకము ఉండి తీరాలి అని భావించడంలో తప్పు లేదు. అలాగని మంగళాన్ని ఆచరించకుండా, సంప్రదాయానికి భిన్నంగా గీత ఆరంభమైంది అనే విమర్శ అర్థరహితం. ఎందుకని? గీతారంభము మంగళాచరణము తోనే జరిగింది.

ధర్మము - దైవము

భగవద్గీతలో ధృతరాష్ట్రుడు పలికిన ఈ ప్రథమ శ్లోకం **ధర్మక్షేత్రే** అంటూ మొదలైంది. **ధర్మక్షేత్రే** అనే సమాసంలో మొదటి పదమే ధర్మం. ధర్మము అనగా దైవమే. ధర్మరూపంలో ఉన్నది దైవమే. ధర్మమును ఆచరించడం సాధన మైతే, ధర్మరూపంలో ఉన్న దైవాన్ని పొందడము సాధ్యము. కనుక, ధర్మము అనేది సాధన వాచకమే కాదు, సాధ్య వాచకం కూడా. ధర్మ శబ్దము సాధన సాధ్య వాచకము, లేదా ఉపాయ ఉపేయ వాచకము.

సాధ్య రూపుడైన పరమేశ్వరుడు మంగళకరుడు. మంగళ రూపుడైన భగవంతుని పొందుటకు ఆచరించే సాధన కూడా మంగళకరమే. అందుచేత, ధర్మశబ్దంతో ప్రారంభించ బడిన గీతాశాస్త్రము మంగళార్థంతో దివ్యంగా శోభిస్తూ ఉంది అనే విషయంలో సందేహానికి తావు లేదు.

ధరతీతి ధర్మః ధరించునది ధర్మము. ***ధృఞ్ ధారణే*** అనే ధాతువు నుండి ధర్మ శబ్దము పుట్టింది. ధారణం అంటే భరించడం, లేదా మోయడం అని అర్థము. ***డుధాఞ్ ధారణ పోషణయోః*** ధారణము, పాలనము అనే రెండు లక్షణాలు కలిగింది ధర్మము. సర్వ ప్రపంచాన్ని భరించేది, ధరించేది, పాలించేది ఏదో అదే ధర్మము. ఈ కారణం చేత సమస్త విశ్వానికి మూలాధారము ధర్మము.

ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా

యావ ద్విశ్వానికి ధర్మమే ఆధారంగా ఉంది అన్నది తైత్తిరీయ శ్రుతి. ధర్మ రూపంలో దైవం ఉన్నప్పుడే అది సాధ్య మవుతుంది. కనుక, ధర్మ మనేది ఏదో కాదు భగవ ద్విభూతియే. భగవ ద్రూపమే. ధర్మరూపంలో ఉన్నది దైవమే. ధర్మం ఉన్నచోట దైవం ఉన్నట్లే. ధర్మస్పృహ దైవస్మరణమే.

యతో ధర్మః తతో కృష్ణః

యతో కృష్ణః తతో జయః

ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ శ్రీకృష్ణ భగవానుడు ఉంటాడు. ఎక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడో అక్కడ జయం వర్ధిల్లుతుంది అని వ్యాసప్రోక్తం.

ధృతరాష్ట్రుని శ్లోకం 'ధర్మ' అనే రెండు అక్షరాలతో దివ్యంగా ప్రారంభమై, 'జయ' అనే రెండు అక్షరాలతో సమాప్త మైంది. ***ధర్మమేవ జయతే*** - ధర్మమే జయించి తీరుతుంది అనే ఆర్షవాణిని ప్రథమ శ్లోకమే అద్భుతంగా ఆవిష్కరించింది.

నరేశుడు - నారాయణుడు

ధర్మ మనే పదంతో ఆరంభం కావడం చేత ప్రథమ శ్లోకం మంగళమనే అనుకుందాం. కాని, పలికిన వాడు ధృతరాష్ట్రుడు కదా! 'ధృతరాష్ట్ర ఉవాచ' అంటూ గీత మొదలైంది. ధృతరాష్ట్రుడు పలికింది మంగళం ఎలా అవుతుంది? అనేది మరి కొందరి వాదము.

వాదించడంలో తప్పు లేదు. కాని, అలా వాదించే వారికి ధృతరాష్ట్ర శబ్దము కూడా మంగళమే అనే సత్యం తెలిస్తే బాగుంటుంది. ***ధృతం రాష్ట్రం యేన సః ధృతరాష్ట్రః*** - ధృతరాష్ట్రుడు అంటే రాష్ట్రమును ధరించిన వాడు అని అర్థము. రాష్ట్రమును ధరించే వాడు రాజు. రాష్ట్రమును పాలించే వాడు రాజు. దేశము యొక్క ధారణ పాలనలు ప్రభువు మీద ఆధారపడి ఉంటాయి. ప్రభువు లోని ఆ శక్తి పరమేశ్వరునిదే. అందుచేతనే ***నరాణాం చ నరాధిపమ్*** - నరులలో నరాధిపుడు అనగా రాజు నేనే అన్నాడు గీతలో భగవానుడు.

దేశాన్ని పాలించే శక్తి సామర్థ్యాలు ప్రభువులో ఉంటాయి. అదే ఐశ్వర్యం. **ఈశ్వరస్య భావః ఐశ్వర్యం.** ప్రభువు యొక్క ఐశ్వర్యము వాస్తవానికి జగత్ప్రభువుదే. పరమేశ్వరునిదే. ఈశ్వరునిలో ఐశ్వర్యం సమగ్రంగా ఉంటుంది. రాజులో అవసరమై నంతే ఉంటుంది. అందుచేతనే ధర్మంగా పాలించే రాజును ధర్మప్రభువు అంటుంటారు. ప్రభువు లోని ధర్మవైభవము పరమేశ్వరునిదే. ధర్మరూపంలో దైవం శోభిస్తూ ఉండటమే దానికి కారణము.

ధర్మస్పృహ లేనివాడు ప్రభువు కాలేడు. దైవస్పర్శ లేనిదే ధర్మస్పృహ రాదు. ***నా విష్ణుః పృథివీ పతిః*** - విష్ణు అంశ లేనివాడు రాజు కాలేడు అన్నది శాస్త్రము. అందుకనే ప్రభువును భగవ ద్విభూతిగా గీత అభివర్ణించింది.

ధర్మ క్షేత్రము

క్షేత్రము అంటే భూమి, లేక స్థలము అని ఒక అర్థం. ధర్మమును పండించు కొనుటకు అనువైన ప్రదేశము కావడం చేత, ధర్మ నిలయమైన భారతదేశం ధర్మక్షేత్ర మైంది. ధర్మక్షేత్రము అంటే ధర్మమే ప్రధానంగా శోభించు క్షేత్రము అని అర్థము. పుణ్య ప్రధానమైన క్షేత్రము అని భావము.

భారతదేశము ధర్మ ప్రధానమైన క్షేత్రము. పుణ్యప్రద మైన భారతావనిలో కురు మహారాజు ధర్మ పరిపాలన సాగించిన ప్రదేశము కురుక్షేత్రము. అది ఎందరో మహాత్ములు, మహర్షులు కఠోర తపస్సు నాచరించిన తపోభూమి. మరెందరో సుకృతాత్ములు యజ్ఞ యాగాది కర్మములు నిర్వహించిన కర్మభూమి. 'కురు' అంటే కర్మ. పుణ్య కర్మలను ఆచరించ డానికి అనువైన, నెలవైన క్షేత్రము కురుక్షేత్రము.

కురు మహారాజుకు ఇంద్రుడు ప్రత్యక్ష మైంది ఇక్కడే. కురుమహారాజా! కురుక్షేత్ర పుణ్యభూమిలో తప మాచరిస్తూ అంతిమ శ్వాసను విడిచిన వారికి సద్గతి లభిస్తుంది. పుణ్య ప్రధానమైన ఈ కురుక్షేత్రంలో ఆయుధ హస్తులై యుద్ధమున మరణించిన వీరులు ఉత్తమ లోకాలు చేరుతారు అని ఇంద్రుడు వర ప్రదానం చేశాడు. అంతే కాదు. మదాంధులైన క్షత్రియులతో అవతారమూర్తి యైన పరశురాముడు ఘోర పోరాటం చేసి, తన పవిత్ర పాద స్పర్శతో పావనం చేసిన పుణ్యస్థలి కూడా ఈ కురుక్షేత్రమే. దీనిని బ్రహ్మావర్త మని కూడా పిలిచేవారట.

కురుక్షేత్రం చ మత్స్యాశ్చ పాంచాలా శ్శూరసేనకాః

ఏష బ్రహ్మర్షి దేశో వై బ్రహ్మావర్తా దనంతరః

కురుక్షేత్రం, మత్స్యదేశం, పాంచాలము, శూరసేనకము అనే ప్రదేశాలు కలసిన దేశాన్ని బ్రహ్మర్షి దేశము అని పిలిచేవారు.

క్షేత్రము అంటే పవిత్రమైన స్థలము అని కూడా అర్థము. పావన నదీమ తల్లులు ప్రవహించే ప్రదేశాలు కూడా క్షేత్రాలే. అలాగే పరమేశ్వరుడు వెలసిన దివ్య స్థానములను కూడా క్షేత్రములు అంటారు.

గంగ, యమున, నర్మద, కృష్ణ, కావేరి మొదలైన పుణ్యనదులు ప్రవహించే ప్రదేశాలను నదీ క్షేత్రాలు, లేదా తీర్థక్షేత్రాలు అంటారు. ఆయా పుణ్య నదీతీరాలలో దానాది పుణ్యకర్మలను ఆచరిస్తాము. కనుక అవి కూడా కర్మ క్షేత్రాలే. ధర్మ ప్రధానమైన పుణ్యక్షేత్రాలే. కురుక్షేత్రాలే.

కాశీక్షేత్రము, శ్రీకాళహస్తి క్షేత్రము, శ్రీశైలక్షేత్రము, బదరీక్షేత్రము, తిరుపతిక్షేత్రము, పండరీ క్షేత్రము మొదలైన పవిత్ర ప్రదేశాలన్నీ భగవ న్మూర్తులతో మంగళకరంగా శోభిస్తూ దివ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి గాంచాయి.

అలాగే, జీవులు వసించే శరీరాలు కూడా క్షేత్రాలే. మానవ దేహాలన్నీ క్షేత్రాలే.

ఇదం శరీరం కౌన్తేయ క్షేత్ర మిత్యభిధీయతే

అర్జునా! ఈ మానవ దేహాన్ని క్షేత్రము అంటారు అని గీతాచార్యుడే స్వయంగా క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో తెలిపాడు. జీవునికి దేహము ఉపాధి. దేహములో వసించే జీవుణ్ణి దేహం కవచం లాగా కాపాడుతుంది **(క్షతత్రాణాత్)**. అందుచేత కూడా దేహము క్షేత్రము అని పిలువ బడింది.

శరీరము క్షేత్రము. క్షేత్రము అనే పొలానికి రైతు స్వామి. దేహమనే క్షేత్రానికి జీవుడు స్వామి. పొలంలో ఏ బీజాలు నాటుతామో ఆ విధమైన పంటే మనకు ఫలంగా వస్తుంది. అలాగే దేహ మనే క్షేత్రాన్ని కూడా వినియోగించు కోవాలి.

ధర్మబీజాలు నాటుకుంటే, బాహ్యంలో ధర్మకార్యాలు సాగి మనకు పుణ్య మనే పంట వస్తుంది. అధర్మ బీజాలను నాటుకుంటే, తద్వారా అధర్మ కార్యాలు సాగి మనకు పాపం అనే పంట ప్రాప్తిస్తుంది. జ్ఞానాభిలాషులు జ్ఞాన బీజాలను నాటుకుంటే, జ్ఞానమును సముపార్జించుకొని మోక్షఫలాన్ని పొంది తరిస్తారు.

అందరికీ బ్రతుకు పంట పండాలి. అంటే, అందరూ ధర్మాన్ని అనుసరించాలి. ఆచరించాలి. చేసుకున్న వారికి చేసుకున్నంత; ఆ పైన మరి కొంత. ఈ సత్యం పంట విషయానికి వర్తిస్తుందే గాని వంట విషయానికి వర్తించదు.

కిలో బియ్యం వంట చేస్తే మూడు కిలోలు అన్నం తయా రవుతుంది. అలాగని పంచదార, పాలు కలిపి వంట చేస్తే మూడు రెట్లు కోవా తయారు కావాలంటే కాదు. ముద్దగా ఘనీభవించి నాలుగో వంతు కోవా తయా రవుతుంది. ఈ వ్యత్యాసాలు వంటలో ఉంటాయి. పంటలో తరుగుదల ఉండదు.

ధర్మము వంట లాంటిది కాదు. పంట లాంటిది. పెట్టుబడి తక్కువ. రాబడి ఎక్కువ. ఒక బస్తా ధాన్యపు గింజల్ని రైతు భూమిలో చల్లుతాడు. తిరిగి కొన్ని బస్తాల ధాన్యాన్ని ఫలంగా పొందుతాడు. ధర్మం కూడా అలాంటిదే. స్వల్పంగా ఆచరించినా అధికంగా ఫలాన్ని అందిస్తుంది.

స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్

ధర్మాన్ని ఏ కొంచెము ఆచరించినా అది గొప్ప భయాన్ని పోగొట్టి కాపాడుతుంది అని అభయ ప్రదానం చేసింది గీతామాత. దీపం చిన్నదే అయినా దట్టమైన చీకటిని దూరం చేస్తూ ఉంది కదా! ధర్మాచరణం కూడా అంతే.

కురుక్షేత్రము

కురుక్షేత్రము పుణ్యభూమి. యజ్ఞభూమి. తపోభూమి. ఇంతవరకు ఇలాగే అర్థం చేసుకున్నాం. ఇక ఇప్పుడు, కురుక్షేత్రాన్ని యుద్ధభూమిగా చూడబోతున్నాం. కురుక్షేత్రంలో పోరాడటానికి ఇరువర్గాలు సిద్ధపడ్డాయి. (**కురుక్షేత్రే యుయుత్సవః ఏవ సమవేతాః**). పుణ్యభూమి పోరాట భూమిగా మారింది. సాధన క్షేత్రం సమరక్షేత్ర మైంది. వేదనాదాలతో మారు మ్రోగిన యజ్ఞభూమి రణభేరీ నినాదాలతో హోరెత్తే యుద్ధభూమిగా తయారైంది.

యుద్ధము ఏదో కాదు. వైరుధ్యమే యుద్ధము. వైరుధ్యంలో జనించే సంఘర్షణే సమరము. ప్రపంచంలో ఎక్కడ చూచినా కనిపించేది సమరమే. సమరాన్ని విశ్వం సహించ లేదు. అందుకే విశ్వశాంతి నినాదం.

విశ్వం లోనే కాదు. ఏ వ్యక్తిలో చూచినా సమరమే దాగి ఉంది. వ్యక్తి మనస్సు భరించలేని సంఘర్షణే

సమరము. సంఘర్షణల మధ్య మనిషి స్వాస్థ్యమును పొందలేడు. సమన్వయంతో జీవించ లేడు. సంఘర్షణల ఒత్తిడిలో మనిషి ప్రశాంతంగా బ్రతక లేడు. అందుకే వ్యక్తి శాంతి - వ్యక్తి ఔన్నత్యం అనే నినాదాలు విశ్వంలో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి.

వైరుధ్యాలు విచిత్రంగా విలయ తాండవం చేస్తున్న విశ్వంలో మనం జీవిస్తున్నాం. ఈ కల్లోల వాతావరణంలో యజ్ఞభూమి యైన కురుక్షేత్రము యుద్ధభూమిగా మారినట్లు, శాంతి మందిరంగా విలసిల్ల వలసిన ప్రపంచం అశాంతి నిలయంగా నిలిచి ఉంది.

రంగస్థలమా? రణస్థలమా?

ఆడేందుకు ఉన్నది నాటకరంగం. పోరాడేందుకు ఉన్నది రణరంగం. ఆట ఏదైనా ఆట కొరకే. ఆట వరకే. కాని, పోరాటము అలాంటిది కాదు. పోరాటము పోరాటము కొరకే కాదు. పోరాటము పోరాటము వరకే కాదు. పోరాటము వికృతం కొరకు. పోరాటము వినాశం కొరకు.

ఆటలో ఆనందం ఉంటుంది. పోరాటంలో ఆందోళన ఉంటుంది. ఆటలో పోరాట పటిమ ఉండటం తప్పు కాదు. ఉండాలి కూడా. కాని, ఆట పోరాటంగా మారితే మాత్రం, ఆ తరువాత అంతా ఆరాటమే. బ్రతుకంతా కాటకమే.

ఇంతకీ ప్రపంచం రంగస్థలమా? రణస్థలమా? జీవితం నాటకరంగమా? రణరంగమా? విలువలతో విలసితంగా జీవించే విశ్రాంతి మందిరమా? లేక, విరోధాలతో విషాదాలను విరజిమ్మే వికృత సదనమా? ఆలోచనలకు పదును పెట్ట వలసింది ఇక్కడే.

నాటకంలో ఎందరో నటులు ఉంటారు. ఎన్నో సన్నివేశాలు ఉంటాయి. మరెన్నో అలంకరణలు ఉంటాయి. అలా ఉన్న వన్నీ ఒకే నాటకానికి సంబంధించి ఉన్నాయి. ప్రత్యేకతలతో గోచరిస్తున్నా, ప్రత్యేకంగా మాత్రం లేవు.

ఈ ప్రపంచంలో ఉన్న వన్నీ అలాగే ఉన్నాయి. ప్రత్యేకతలు ఉన్నాయేమో గాని, అవి ప్రత్యేకంగా లేవు. వివిధ రకాల పాత్రలు ఒకే నాటకంలో ఒదిగినట్లు, వివిధ రంగుల పువ్వులు ఒకే మాలలో చేరినట్లు, ఒక్క మాటలో చెప్పాలంటే - వివిధములైన అలలు ఒకే సముద్రంలో అలరారినట్లు, విశ్వంలో ఉన్న వన్నీ ఏకంలో ఏకమై ఉన్నవే గాని, అనేకంలో భిన్నమైనవి మాత్రం కావు.

ఈ సత్యం అర్థమైతే ప్రపంచం ఒక రంగస్థలం. జీవు లందరూ ఉత్సాహంతో నటనలో నర్తిస్తూ జీవించే కళాకారులు. అర్థం కాకపోతే, విశ్వమే ఒక వికృతమైన రణస్థలం. జీవు లందరూ విద్వేషాలతో యుద్ధంలో పోరాడుతూ గతించే పోరుగాళ్ళు.

నటించుట - వికటించుట

నాటకంలో నటులు ఎవరి పాత్రను వారు పోషించాలి. పోషిస్తారు. ఎవరైనా, ఎంతటి నటుడైనా తన పాత్రనే తాను పోషిస్తాడు. అంతమాత్రాన ఇతరుల పాత్రలతో సంబంధం లేకుండా నటించ లేడు. ఇతర పాత్రలతో సంబంధాన్ని సంరక్షించుకొంటూ తన పాత్రను తాను పోషించాలి. అప్పుడే నటనలో వైభవము. అక్కడే నటునిలో వైదుష్యము.

ఇది అర్థమైతే, నటనలో ఘర్షణ ఉన్నా, నటునిలో ఘర్షణ ఉండదు. ఒకవేళ వ్యత్యాసాలు గోచరించినా, వ్యావహారికంగా నటనలో ఉంటాయే గాని, స్వాభావికంగా వ్యక్తిలో ఇమడవు.

అలా కాకుండా, ఇతర పాత్రలతో విభేదిస్తూ, వ్యక్తిత్వంలో విభిన్నంగా వ్యవహరిస్తే, నటుడు ఘర్షణలో పడతాడు. నాటకాన్ని సంఘర్షణకు గురి చేస్తాడు. పుణ్య క్షేత్రమైన కురుక్షేత్రాన్ని రణక్షేత్రంగా మార్చేస్తాడు.

నాటకంలో నటించే నటుడికి నాటకం మొత్తం తెలుసు. అంతేకాదు. వ్యక్తిగా తానేమిటో కూడా తనకు తెలుసు. కనుక సంఘర్షణతో కూడిన సన్నివేశాలలో కూడా నటుడు తనలో తాను ప్రసన్నంగా ఉంటాడు. ప్రతిచర్యలు లేకుండా ప్రశాంతంగా ఉంటాడు. ప్రమోదంగా నటిస్తాడు.

దర్శకుని మార్గదర్శకత్వంలో నాటకం ప్రదర్శింప బడుతుంది. పరమేశ్వరుని అధ్యక్షతన ఈ ప్రపంచ రంగస్థలిపై జీవులు ప్రవేశిస్తూ నిష్క్రమిస్తూ ఉంటారు (***మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే స చరాచరమ్****; గీత - 9 వ అ - 9 వ శ్లో*). నాటకంలో ఏమి జరగబోతుందో నటుడికి తెలుసు కనుక, నటుడు సంఘర్షణతో నటిస్తున్నా, వాస్తవానికి నటునిలో ఏ సంఘర్షణా ఉండదు.

కానీ, జీవితంలో ఎప్పుడు ఏమి జరుగుతుందో జీవికి తెలియదు. ఎవరు ఏమౌతారో అర్థం కాదు. అందుకే ప్రతి వ్యక్తికి అనుక్షణం సంఘర్షణ, సంతాపము. ప్రతిక్షణం ఆవేదన, పరితాపము.

యజ్ఞాలు - యుద్ధాలు

మానవ దేహంలో ఎన్నో జీవ కణాలు ఉన్నాయి. ఏ జీవకణం దేనికి అదే. అయినా ఒక జీవకణం మరొక జీవకణంతో సమన్వయ సంబంధాన్ని కలిగి ఉంది. అన్యోన్య అనుబంధాన్ని కలిగి ఉంది.

అలాగే మనస్సులో బోలెడన్ని ఆలోచనలు ఉన్నాయి. ఏ ఆలోచన దేనికి అదే. నిన్నటి ఆలోచన వేరు. నేటి ఆలోచన వేరు అని మనం అనుకోవచ్చు. కానీ, నేటి ఆలోచనకు పునాదులుగా నిన్నటి ఆలోచనలే ఉన్నాయి. మొన్నటి ఆలోచనలే ఉన్నాయి. గతంలో ఏనాడో చేసిన ఆలోచనలు కూడా ఉన్నాయి.

దేహంలో జీవకణాలు ఎన్నున్నా దేహం ఒక్కటే. మనస్సులో ఆలోచనలు ఎన్నున్నా మనస్సు ఒక్కటే. ఇదీ అవగాహన. ఈ అవగాహన కుదిరితే కురుక్షేత్రంలో యజ్ఞాలు చెయ్యొచ్చు. ఈ అవగాహనే కనుక లోపిస్తే యజ్ఞానికి బదులు యుద్ధం చెయ్యొచ్చు. ప్రస్తుతం మనం అక్కడే ఉన్నాం. యుద్ధభూమి లోనే ఉన్నాం.

బాహాబాహి

బాహ్యం ఉంది. బాహ్య ప్రపంచం ఉంది. నిద్రించి నపుడు బాహ్యాన్ని మరచినా, మేలుకుంటే మాత్రం బాహ్యాన్ని బహిష్కరించడం సాధ్యం కాదు. బాహ్యం బాగుంటే బ్రతుకు బాగుంటుంది. బాహ్యం బాధక మైతే బ్రతుకు బావురు మంటుంది.

నిద్రించిన పుణ్యానికి మేలుకోక తప్పదు. మేలుకోగానే ఎదురుపడే వారిని స్మృతిలో పోల్చుకోక తప్పదు. వారు మనకు నచ్చని వారైతే శాంతిని రాల్చుకోక తప్పదు.

ఎదురయ్యే వాటిని, లేదా ఎదురుపడే వారిని చూచి యెద చెడితే ఘర్షణ మొద లవుతుంది. కురు క్షేత్రంలో యుద్ధం ఆరంభ మైనట్లే.

ఇష్టమున్నా లేకపోయినా నిత్యము కొన్ని ముఖాల్ని చూడక తప్పదు. మనకు కనిపించే ముఖం భార్యది కావచ్చు. భర్తది కావచ్చు. అధికారిది కావచ్చు. ప్రక్కింటి వారిది కావచ్చు. లేదా, రోజూ మనం ప్రయాణం చేసే బస్సులో కండక్టర్‌ది కావచ్చు.

ఇష్టం లేని ముఖాలను చూస్తే మనస్సులో ఆరాటం మొద లవుతుంది. ఘర్షణ చెలరేగు తుంది. అదలా ఉంచితే, కొన్ని పరిస్థితులలో ఇష్టమైన ముఖాల్ని చూడటంలో కూడా ఘర్షణే తలెత్తుతూ ఉంటుంది.

మనకు ఇష్టులైన వారిని ఆరోగ్యంగా మనం చూడగలం. ఆనందంగా ఉంటే చూడగలం. అలా చూడటంలో ఘర్షణ లేకపోవచ్చు. వారినే ప్రమాదానికి గురై నపుడో, లేదా మృత్యుశయ్యపై చివరి క్షణాలు లెక్క పెడుతు న్నపుడో చూడాలంటే మన పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇదంతా ఘర్షణే. సంఘర్షణే. బాహ్యంలో సాగే బాహాబాహి.

కురుక్షేత్రంలో అర్జునుని విషాదం వెనుక నిగూఢంగా ఉండి ప్రేరేపించిన ఘర్షణ ఇదే. అదంతా మున్ముందు చెప్పుకుందాం. ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని మీకు గుర్తు చేస్తూ ప్రస్తావిస్తున్నా.

నాటకంలో నటుడికి ఏ పాత్ర ఎదురైనా అతని మనస్సులో మాత్రం ఏ విధమైన చలనమూ ఉండదు. ఎదురైన వ్యక్తి స్నేహితు డైనా, శత్రువైనా, నటనలో మార్పు ఉంటుందే గాని, మనస్సులో ఏ వికారమూ ఉండదు.

అంతర్యుద్ధం

బాహ్యంలో నచ్చనివి బాహాబాహికి కారణ మైతే, ఆంతర్యంలో నచ్చనివి అంతర్యుద్ధానికి కారణము. రేపు మన మనస్సులో ఏ ఆలోచనలు కదుల్తాయో వాటిని నేడు ఊహించలేక పోతున్నాము. నిన్న ఏ ఆలోచనల్ని సంతోషంతో హుషారుగా కదలించామో, అవి నేడు బేజారెత్తి స్తున్నాయి. గత మాసంలో చేసినవి ఈ మాసంలో రుచించడం లేదు. ఇది మరొక ఘర్షణ. ఆంతరంగిక ఘర్షణ.

నీకు ఒక వ్యక్తి పూర్తిగా నచ్చితే, ఆ తరువాత మనస్సులో ఏ ఘర్షణ ఉండదు. అసలే నచ్చకపోతే కూడా ఘర్షణ ఉండే ప్రసక్తి లేదు. అలా కాకుండా, ఒక వ్యక్తిలో కొంత నచ్చి, కొంత నచ్చనపుడు, మనస్సులో ఘర్షణ తప్ప మరొకటి ఉండదు.

వ్యక్తి మనకు నచ్చితే అక్కున చేర్చుకోవచ్చు. నచ్చకపోతే ప్రక్కన పెట్టవచ్చు. ఒకే వ్యక్తి కొంత నచ్చి, కొంత నచ్చనపుడు ఉంచుకోవాలో తెలియదు, త్రెంచుకోవాలో అర్థం కాదు. ఇదే సంఘర్షణ. ఇదే సమరము. అయితే, ఈ యుద్ధము బాహాబాహి కాదు. అంతర్యుద్ధం. ఇదే ప్రతి జీవిని పట్టి పీడిస్తున్న సమస్య. కురుక్షేత్రం అద్దం పడుతున్న అందరి సమస్య. జనులందరి సమస్య. ఇదొక చీకటి. దట్టమైన చీకటి. దారి ఎటో అర్థం గాని చీకటి. అంధకారం. గాఢాంధకారం. అజ్ఞానాంధకారం. ఈ చీకటి నుండి బయట పడాలి. వెలుగు వైపుకు ఎగ్రబ్రాకాలి.

తమసోమా జ్యోతిర్గమయ

గీతాభవనం లోకి ప్రవేశించాలి అంటే ముందుగా ద్వారం వద్ద ధృతరాష్ట్రుల వారిని అవశ్యం దర్శించాలి. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. పుట్టుక తోనే గ్రుడ్డివాడు. జాత్యంధుడు. అంధత్వ మనేది ఆ మహారాజుతో కలిసే పుట్టింది (***జన్మనా సహ జాయతే***). అంటే, అలా జన్మించడానికి బీజాలు పూర్వజన్మ లోనే నాటుకున్నా డని అర్థము.

ప్రారబ్ధ వశాత్తు ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడైతే, ప్రయత్నించి లేని గ్రుడ్డితనాన్ని అర్ధాంగి గాంధారి అరువు తెచ్చుకుంది. ఇక సంతానం విషయం చెప్ప నవసరం లేదు. అంతా దుస్సంతానమే. దుర్యోధన, దుశ్శాసన, దుస్సల అంటూ అంతా దుకార ప్రయోగమే. దుష్ట సంజాతమే.

దేహ మనే రాష్ట్రాన్ని ధరించిన వాడు ధృతరాష్ట్రుడు. దేహాన్నైతే ధరించాడు కాని, ఆ దేహము ఎందు కొచ్చిందో, దేని కొరకు ఉందో గ్రహించలేని వాడు. కళ్ళకు ఎలాగూ చూపు లేదు. మనస్సును కూడా మూసేసుకున్న వాడు. సత్యాన్ని దర్శించ లేని అంధుడు. జ్ఞానాంధుడు.

ఈ గ్రుడ్డి మహారాజు గారి వాక్యం మమకారంతో ఆరంభ మైంది. **మామకాః** - నా వాళ్ళు అంటూ కౌరవుల్ని, **పాండవాః** - పాండవులు అంటూ పాండుపుత్రుల్ని సాహసించి మరీ పలికాడు.

అయిన వారు - కాని వారు

అయ్యో! అంబికేయా! నా వాళ్ళు (**మామకాః**) అని ముద్దుగా పిలుచుకున్నావు. బావుంది. నీ వాళ్ళు నీ వాళ్ళే. ఎవరూ కాదనడం లేదు. కాని, నీ తమ్ముడు పాండురాజు కుమారులు నీ వాళ్ళు కాకుండా ఎలా పోయారు?

ఇరువురిలో ప్రవహించే రక్తం ఒకటే కదా! ఇరువురిదీ ఒకే వంశం. ఒకే కుటుంబం. ఒకే గోత్రం. అలాంటప్పుడు అయిన వాళ్ళు, కాని వాళ్ళు అనే విచక్షణ ఎక్కడిది? గ్రుడ్డి విచక్షణ. అదే అంధకారం. మనస్సులో చీకటి. మమకారం పొరలు కప్పిన మానవునికి వాస్తవాలు అగుపించవు. విడ్డూరాలే కనిపిస్తాయి. వికారాలే వినిపిస్తాయి.

పాండవులు ఎక్కడి నుండో క్రొత్తగా పుట్టుకొచ్చిన వాళ్ళు కారు. తెలియని వారూ కారు. స్వయాన తన తమ్ముని బిడ్డలే. వాళ్ళనే తన వాళ్ళుగా చూడలేని ధృతరాష్ట్రయ్య ఇక ఎవరిని తన వారిగా చూస్తాడు?

ఇంతకీ, అయిన వాళ్ళెవరు? కాని వాళ్ళెవరు? మానవ జీవన ప్రస్థానంలో ఎవరికి ఎవరు సొంతము? ఎవరికి ఎవరు తోడు? ఎవరితో ఎవరు కలసి వచ్చారు? ఎవరితో ఎవరు కలసి పోతారు? ఉన్నా ఎంత కాలం కలసి ఉంటారు? ఎవరిదైనా ఒంటరి జీవితమే. అందరమూ ఒంటరిగా వచ్చిన వాళ్ళమే. ఒంటరిగా పోయే వాళ్ళమే. అలాంటప్పుడు నా వాళ్ళు (**మామకాః**) అనే మమకార ప్రదర్శనం అర్థ రహితం కాదా? విచారణ చేయ గలిగే వారికి ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఎవ్వరికీ ఏమీ కారని తేలుతుంది (***విచార్యమాణే న కస్యాపి కశ్చిత్ బంధుః***).

అదేదో తాత్త్విక అవగాహన లెండి. వ్యావహారికంగా మనకు సంబంధించిన వాళ్ళు మన వాళ్ళు కాకుండా పోతారా? అని మీరు అనవచ్చు. తప్పు లేదు. అలాంటప్పుడు, మళ్ళీ మన వాళ్ళ లోనే వీరు మన వాళ్ళు - వారు కాని వాళ్ళు అనే వ్యత్యాసాలు, విభేదాలు ఎక్కడి నుండి పుట్టుకొచ్చాయి? ఏమో! తెలియదు అంటారా! అదే పుట్టుగ్రుడ్డి అంటే.

అయినవాళ్ళు అంటే, ఉభయులూ అయిన వాళ్ళే. కాని వారు అంటే, ఎవరైనా కాని వాళ్ళే. ఇలా చూచి నపుడు ఇరువురూ తన వాళ్ళే కావాలి. లేదా, ఇరువురూ తన వాళ్ళు కాకుండా పోవాలి.

వీరు నా వాళ్ళు (**మామకాః**), వారు నా వాళ్ళు కారు అనుకుంటే, అక్కడే ఘర్షణ ఆరంభ మవుతుంది. ఈ ఘర్షణే ప్రస్తుతం కురుక్షేత్రం. ఇది హస్తినాపురానికి సమీపాన ఉండే బాహ్య కురుక్షేత్రం కాదు. అంతః కరణను అంటి పెట్టుకొని ఉన్న ఆంతరంగిక కురుక్షేత్రం.

పెద్ద మనస్సు - చిన్న బుద్ధి

ముందు పుట్టిన వాడు తండ్రితో సమాన మనుకొంటూ అన్నగారైన ధృతరాష్ట్రుని తండ్రి కంటే ఎక్కువగా పాండురాజు భావించాడు. పూజించాడు. పాండురాజు మరణానంతరం ధృతరాష్ట్రుడే తండ్రి అని త్రికరణ శుద్ధిగా నమ్మిన వ్యక్తి ధర్మరాజు.

భారత యుద్ధం ముగిసింది. ధర్మరాజు సింహాసనాన్ని అధిష్ఠించే శుభ ఘడియ సమీపించింది. మంగళ శంఖాన్ని చేత పట్టుకొని పవిత్ర నదీజలాలతో శ్రీకృష్ణుడు ధర్మరాజును అభిషేకించాడు.   సింహాసనాన్ని అధిష్ఠింప చేశాడు. ఆ సందర్భంలో ధర్మరాజు తన మనస్సు లోని మాటను, మనసైన మాటను మంజులంగా వినిపిస్తాడు.

కృష్ణా! ధృతరాష్ట్ర మహారాజు నా తండ్రి. నా దైవం. ఆయన ప్రతినిధిగా ఈ సింహాసనాన్ని నేను అధిష్ఠించాను. ఆయన క్షేమాన్నే కాంక్షిస్తూ జీవిస్తాను (**ఏతదర్థం హి జీవామి**). ఆయన సేవ లోనే నా బ్రతుకును చరితార్థం చేసుకుంటాను. నాకు ఆయనే ప్రభువు అంటాడు.

ధృతరాష్ట్రుడు వృద్ధుడు. పెద్దవాడు. ధృతరాష్ట్రుని ముందు ధర్మరాజు వయస్సులో చాలా చిన్న వాడు. పసికూన. ధర్మరాజు చిన్నవాడే అయినా ఎంతో పెద్ద మనస్సుతో పలికాడు. ధృతరాష్ట్రుడు పెద్దవాడే అయినా, **మామకాః - పాండవాః** అంటూ చిన్న బుద్ధిని బయట పెట్టుకున్నాడు. ఎవరు పెద్దలు? ఎవరు పిన్నలు? పెద్ద మనస్సు కలిగిన పిన్నలు పెద్దలు కాకపోతారా? చిన్న బుద్ధులున్న పెద్దలు పిన్నలు కాకుండా ఉంటారా?

ఆఖ్యాయిక

యంత్రాలు తయారు చేసే ఒక కంపెనీ వారు ఆ నగరం లోనే ఉన్న ఒక సంస్థకు ఒక యంత్రాన్ని అమ్మడం జరిగింది. పక్షం రోజులు గడచిన తరువాత, యంత్రము సరిగ పని చేయడం లేదు. దానిని సరి చేసే వారిని ఎవరి నైనా పంపించండి అని కంపెనీకి ఫోన్ చేశారు ఆ సంస్థవారు.

వెంటనే ఒక వ్యక్తిని పంపించారు కంపెనీ వారు. ఆ వచ్చిన వ్యక్తి యంత్రాన్ని పరిశీలించే లోగా, సంస్థ వారు కంపెనీకి మళ్ళీ ఫోన్ చేశారు. అయ్యో! మీరు పంపిన వ్యక్తి వచ్చాడు. కాని, అతడు చాలా కుర్రవాడు. ఎవరి నైనా పెద్ద వ్యక్తిని పంపించండి అని సంస్థ యజమాని అడిగాడు.

ఫరవాలేదు. మీరేమీ ఆదుర్దా చెందకండి. అతడు సరిపోతాడు. ఆ యంత్రాన్ని కనిపెట్టింది ఆ కుర్రవాడే అని కంపెనీ వారు సమాధానం ఇచ్చారు.

ధర్మం విషయంలో గాని, జ్ఞానం విషయంలో గాని పరిగణించ వలసింది వయస్సును కాదు. జీవన విధానాన్ని, బుద్ధి వికసనాన్ని. అవి లోపించడం వల్లే తన వాళ్ళు, పాండవులు కురుక్షేత్రంలో ఏమి చేశారు? (***కిం అకుర్వత?***) అని ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించాడు.

ఎవరు చేయాలి? ఏమి చేయాలి?

సంజయా! సమరాభిలాషతో కురుక్షేత్రానికి చేరిన నా వాళ్ళు - పాండవులు ఏమి చేశారు? అని వింతగా ప్రశ్నించాడు ధృతరాష్ట్రుడు. యుద్ధభూమిలో ఎవరైనా ఏం చేస్తారు? ఉభయులు కరచాలనం చేసుకొని కలసి భోంచేస్తారా? పరస్పరం మందహాసాన్ని చిందిస్తూ, కుశల ప్రశ్నలు వేసుకొంటూ, పాచికలు ఆడుకుంటారా? ఏమీ చేయరు, యుద్ధం తప్ప! అలాంటప్పుడు ఏం చేశారు అని ప్రశ్నించడ మేమిటి? ఏదో చేయాలి అనేది ఆయన దుగ్ధ. బుద్ధిలో దురద.

ఆలయంలో ప్రవేశిస్తే చాలు. హంతకుడి కైనా ఆ సమయంలో మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. భక్తి కలుగుతుంది. కురుక్షేత్రము పుణ్యక్షేత్రం. ధర్మస్థలం. తపో వనం. శాంతి నిలయం. ధర్మక్షేత్ర మైన కురు క్షేత్రంలో కాలు మోపిన వీరులకు ధర్మ స్పృహ కలగ లేదా? వారి మనస్సులు మార లేదా? వారిలో పరివర్తన రాలేదా? అనేదే ధృతరాష్ట్రుని ఆశ.

అనుకూలమా? ప్రతికూలమా?

పుణ్యక్షేత్రంలో ప్రవేశించ గానే మనస్సులు మారుతాయా? మనుష్యులు పరివర్తన చెందుతారా? పుణ్య సంకల్పాలు గల పుణ్యాత్ములకు పుణ్యక్షేత్రాలు ఓడలకు తెరచాప ల్లాగా సహకరిస్తాయి. ఉపకరిస్తాయి. అంతేగాని, పుణ్యస్పృహ లేని పాపాత్ములను మార్చే శక్తి పుణ్యక్షేత్రాలకు లేదు.

విద్యుద్దీపంలో విద్యుద్వాహక తీగ (ఫిలమెంటు) ఉంటేనే అందులో విద్యుచ్ఛక్తి ప్రసరిస్తుంది. తీగ వీడిపోతే లేదా ఊడిపోతే, విద్యుచ్ఛక్తి ప్రసరించి మాత్రం ఏం చేస్తుంది? దీపాన్ని వెలిగిస్తుందా? కాంతిని ప్రసరింప చేస్తుందా? పాపాత్ములు ఫిలమెంట్లు రాలిపోయిన బల్బుల వంటివారు. అట్టి వారిలో పుణ్యకాంతిని ప్రసరింప చేయడం పుణ్యక్షేత్రాలకు కూడా సాధ్యం కాదు.

అంతమాత్రాన విద్యుచ్ఛక్తి నిరుపయోగమా? నిరుపయోగ మైతే, మరొక బల్బును ఎలా వెలిగిస్తూ ఉంది? పుణ్యాత్ములే పుణ్య ఫలాలను అందుకుంటారు. చిల్లికుండ నీటిని నిలబెట్టుకో లేని విధంగా పాపాత్ములు పుణ్యాన్ని కార్చేసు కుంటారు. పుణ్య ఫలాలను రాల్చేసు కుంటారు. అంతమాత్రాన పుణ్యక్షేత్రాల వైభవం తరగదు. కరగదు.

ఎవరు మారాలి? ఎందుకు మారాలి?

మనస్సులు మారితే మారణహోమం ఆగుతుందని అంబికేయుని అభిప్రాయమా? అదే నిజమైతే, ఎవరి మనస్సులు మారాలి? ఎవరిలో మార్పు వస్తే సమరం ఆగుతుంది? ఈ విషయంలో ప్రధానంగా ముగ్గురే కనిపిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఎవరు సంకల్పించినా రణం ఆగుతుంది. వారెవరంటే, ఒకడు ధృతరాష్ట్రుడు. రెండవ వాడు దుర్యోధనుడు. మూడవ వాడు ధర్మరాజు.

యుద్ధం నివారింప బడాలి అనేదే కనుక ధృతరాష్ట్రుని అభిప్రాయ మైతే, ఈ యుద్ధం జరగటానికి వీల్లేదు అని తాను ఒక్క ఆజ్ఞ జారీ చేస్తే సరిపోయేది. ఆ ఆదేశాన్ని ఆధారం చేసికొని భీష్మద్రోణాదు లతో పాటు మరెందరో వీరులు ధృతరాష్ట్రునికి మద్దత్తుగా నిలిచి యుద్ధాన్ని తీవ్రంగా ప్రతిఘటించి ఉండేవారు. భీష్మద్రోణులు లేకుండా దుర్యోధనుడు రణరంగంలో కాలు పెట్ట గలడా? ఇదంతా ధృతరాష్ట్రునికి తెలియదా? తెలుసు. మమకార ఊబిలో చిక్కుకు పోయిన మహానుభావుడికి ఏమి తెలిసి మాత్రం ఏం లాభం? తన మనస్సు మారదు. మారలేదు. తానే మార నప్పుడు, తన రక్తాన్నే పంచుకొని పుట్టి, దానికి తోడు దుష్ట ప్రారబ్ధ సహజత్వంతో చెలరేగి పోతున్న దుర్యోధనుడు మారుతాడా? దుర్యోధనుడు మారనే మారడు అని క్షుణ్ణంగా తెలిసిన వాడు కూడా ధృతరాష్ట్రుడే.

తాను మారలేదు. తన కుమారుడు మారడు. ఇక ఎవరు మారాలి అని ఆయన అభిమతం? ఇంకెవరు? మిగిలింది ధర్మరాజే కదా! ధర్మరాజే మారాలి. ధర్మరాజు ధర్మాత్ముడు కనుక ధర్మక్షేత్ర మైన కురుక్షేత్రంలో ప్రవేశించ గానే ధర్మస్పృహ ఆవేశించి, సమరంపై ఉత్సాహం తరిగి, రాజ్యంపై విరక్తి పెరిగి, యుద్ధాన్ని నిరసించి మళ్ళీ కట్టుబట్టలతో కానల కేగే ప్రయత్నం చేయలేదా? అనేదే ఆయన గారి ప్రశ్నాంతరం.

ఇన్ని ఆలోచనలతో సతమత మౌతూ, అంతర్యాన్నే రణక్షేత్రంగా మార్చుకున్న ధృతరాష్ట్రుడు ***కిం అకుర్వత?*** యుద్ధభూమిలో ఏమి చేశారు? అంటూ పగలే కలవరిస్తున్నాడు.

అధర్మం అచ్చి రాదు - ధర్మమే రక్షించాలి

ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. యుద్ధం ఎలా జరిగింది? అని ధృతరాష్ట్రుడు సంజయుని సూటిగా ప్రశ్నించి ఉంటే విషయం స్పష్టంగా ఉండేది. అలా కాకుండా, యుద్ధంలో ఏమి చేశారు? ***(కిం అకుర్వత?)*** అని ప్రశ్నించడం వల్లే విషయం మీమాంసకు దారి తీసింది.

ఏమి చేశారు? అని ప్రశ్నించడం లోనే, మనం ముందు గానే విశ్లేషించు కున్నట్లు, ఎవరో ఏదో చేయాలని, దాని వల్ల మరేదో జరగాలని ధృతరాష్ట్రుడు ఆశిస్తున్నాడు అనేది నిర్వివాదాంశం. సరే. ఇంతకీ ఏమి చేయాలి? ఎవరు చేయాలి? ఏమి జరగాలి?

తన కుమారులు గెలవాలి. పాండవులు ఓడిపోవాలి. ధృతరాష్ట్రుడు అంతకు మించి ఆలోచించడం లేదు. ఆయనకి కావలసింది అదే. అంతే.

దుర్యోధనుడు గెలవాలి. కాని, అధర్మపరుడు కనుక గెలవ డేమో అనే భయం. ధర్మరాజు ధర్మప్రభువు కనుక రాజ్యాన్ని త్యజిస్తాడు అనే ధైర్యం. ధర్మరాజు తనంతట తాను యుద్ధము నుండి విరమిస్తే, తన బిడ్డకు రాజ్యం దక్కుతుంది అనే ఆశ. ఇలా ఎందుకు జరగలేదు? అనేదే ధృతరాష్ట్రునిలో సంఘర్షణ.

అసందర్భ ప్రలాపం

భగవద్గీత మహాభారతం భీష్మపర్వంలో ఇరవై ఐదవ అధ్యాయంలో ప్రారంభ మైంది. యుద్ధం ప్రారంభ మైన పదవ రోజు భీష్మాచార్యుడు రథం నుండి పతన మయ్యాడు. ఆ విషయాన్ని చెప్పటానికి పరుగెత్తుకొంటూ సంజయుడు ధృతరాష్ట్రుని మందిరానికి వచ్చాడు.

సంజయోఽ హం మహారాజ నమస్తే భరతర్షభ ।
హతో భీష్మ శ్శాంతనవో భారతానాం పితామహః ॥
యస్య వీర్యం సమాశ్రిత్య ద్యూతం పుత్ర స్తవా కరోత్ ।
స శేతే నిహతో రాజన్ సంఖ్యే భీష్మః శిఖండినా ॥

మహారాజా! నేను సంజయుణ్ణి. నమస్కారము. భరతవంశ పితామహుడు, శంతన మహారాజ నందనుడు భీష్ముడు శరతల్పంపై ఉన్నాడు. ఎవరి శౌర్య పరాక్రమాలపై ఆశలు పెట్టుకొని, నీ కుమారుడు కపట జూదమును నిర్వహించి యుద్ధానికి సిద్ధపడ్డాడో, ఆ భీష్ముడు శిఖండి విడిచిన బాణాలకు గురై పతన మయ్యాడు. నీ కొడుకు ఆశలన్నీ అడియాస లయ్యాయి అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

ఈ వాస్తవాన్ని ధృతరాష్ట్రుడు జీర్ణించుకోలేక పోయాడు. సంజయుని మళ్ళీ మళ్ళీ ప్రశ్నించాడు. మహేంద్ర తేజోసముడు, నరశార్దూల మైన భీష్ముడు హతుడయ్యాడా! అని విస్మెర పోయాడు.

కథం భీష్మేణ సంగ్రామ మకుర్వన్ పాండునందనాః ।
కథం చ నా జయ ద్భీష్మో ద్రోణే జీవతి సంజయ ॥

సంజయా! యుద్ధంలో భీష్ముని ఎదుర్కొని పాండుసేనలు ఎలా నిలిచాయి? యుద్ధం ఎలా జరిగింది? *(కథం?)* ద్రోణుడు జీవించి యుండగా భీష్ముడు ఎలా పతన మయ్యాడు? కృపాచార్యుడు సమీపంలో లేడా? ***(కృపే సన్నిహితే తత్ర భరద్వాజాత్మకే తథా)*** అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఇదంతా పదమూడు, పద్నాలుగు అధ్యాయాలలో జరిగిన ధృతరాష్ట్ర సంజయ సంభాషణము. ఆ తరువాత యుద్ధభూమిలో జరిగిన విషయాలన్నీ పూస గ్రుచ్చినట్లు సంజయుడు ధృతరాష్ట్రునికి వివరించి చెప్పాడు. వారి సంవాదమును పది అధ్యాయాలలో వాయు వేగంతో ముగించుకొని మహాభారతం ఇరవై ఐదవ అధ్యాయం దగ్గరకు వచ్చి ఆగింది. ఇక్కడ భగవద్గీత ప్రారంభ మైంది.

ఇదీ సందర్భము. ఈ సన్నివేశంలో యుద్ధంలో నా వారు, పాండవులు ఏమి చేశారు? ***(కిం అకుర్వత)*** అని ప్రశ్నించడం అసందర్భ ప్రలాపం కాదా!

ముందు గానే నేను వివరించినట్లు యుద్ధం ఎలా జరిగింది? అని ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించి ఉండాలి. కాని, అది కూడా అప్రస్తుతమే నని ఇప్పటికే విజ్ఞులకు అర్థమై ఉంటుందని భావిస్తున్నాను.

భీష్ముడు హతు డయ్యాడు అని సంజయుడు చెప్పగానే, యుద్ధం ఎలా జరిగింది? అని ధృతరాష్ట్రుడు

వెంటనే ప్రశ్నించాడు. మళ్ళీ ఇక్కడ అడగ నవసరం లేదు. *కథం* అనే మాటకే అవకాశం లేనపుడు *కిం అకుర్వత* అనే మాట ఎలా అంకురిస్తుంది?

భాషాపరంగా వ్యాకరణశాస్త్రంలో తలదూర్చి అర్థం చేసుకుంటే, *కిం అకుర్వత* అనే మాట విచిత్రాల మూటను విప్పుతుంది.

కిం అకుర్వత అనే మాటను సమస్త పదంగా తీసుకుంటే, *కిం అకుర్వత* - ఎంత తప్పు చేశారు! అనే అర్థం వస్తుంది. అంటే, అలా చేయకుండా ఉంటే బాగుండేది అనే భావం ధ్వనిస్తుంది. సంజయా! యుద్ధాభిలాషతో ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో సమావేశమై నా వాళ్ళు, పాండవులు ఎంత తప్పు చేశారు! అనే అర్థం స్ఫురిస్తుంది.

అలా సమస్త పదం కాకుండా, వ్యస్తమైతే, *కిం అకుర్వత* అంటే ఏదో చేశారు అనే అర్థం వస్తుంది. అంటే, వాళ్ళకు తోచిందేదో వాళ్ళు చేసుకు పోయారు. ఏదో చేశారు. ఏదేదో చేసేశారు. ఏమేమో చేసేశారు. అలా చేసి సాధించిం దేముంది? ఏమి ఉపయోగం? అనే అర్థం వస్తుంది. సమర వాంఛతో ధర్మక్షేత్ర మైన కురుక్షేత్రంలో సమావేశ మైన నా వాళ్ళు, పాండవులు , సంజయా! ఏదో చేసేశారయ్యా! అనే అర్థం ధ్వనిస్తుంది. ఏమిటో, అంధ మహారాజు! ఒక్క మాట పలికి అందరినీ గందరగోళంలో ముంచేస్తూ, ఎవరికీ అందకుండా పోతున్నాడు.

అంబికేయుని అంతర్మథనం

యుద్ధం భయంకరంగా సాగుతోంది. ఇప్పటికే ఎందరో మరణించారు. భీష్ముడు హతుడయ్యాడు. గుండె గుబేలు మంటోంది. ఏ క్షణాన ఏమి వినవలసి వస్తుందో అనే భయం మనసును పీడిస్తోంది. ఇలా ఎందుకు జరిగింది? అని ఆంతర్యం ప్రశ్నిస్తోంది. మరో విధంగా ఎందుకు జరగలేదు? అని చిత్తం చింతిస్తోంది. దారుణమైన ఈ అంతర్మథనంలో ఏమి అడగాలని ఆ మహారాజు భావిస్తున్నాడో, ఏమి అడుగుతున్నాడో ముమ్మందు మందహాసంతో మాటలు కదిలించే మువ్వల వానికే తెలియాలి. చిరునవ్వుల వానికే తెలియాలి.

ఏది ఏమైనా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలి కదా అనుకొంటూ, సంజయుడు స్మృతి పుటలలో తల దూర్చి, పది రోజులు వెనక్కి వెళ్ళి, యుద్ధంలో మొదటి రోజు ఏం జరిగిందో చెప్పడం ఆరంభించాడు. యుద్ధం ఎలా జరిగింది? అని అడిగినా, యుద్ధభూమిలో ఏమి చేశారు? అని ప్రశ్నించినా సమాధానం సరిపోయే లాగా త్రికాలవేది, సర్వాన్ని ప్రత్యక్షంగా దర్శించే శక్తి గల సంజయుడు *(ప్రత్యక్షదర్శీ సర్వస్య భూత భవ్య భవిష్య విత్)* చెప్పడం ఆరంభించాడు.

సంజయ ఉవాచ :

దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా ।
ఆచార్య ముపసంగమ్య రాజా వచన మబ్రవీత్ ॥ 2

దృష్ట్వా-తు-పాండవానీకం-వ్యూఢం-దుర్యోధనః-తదా
ఆచార్యం-ఉపసంగమ్య-రాజా-వచనం-అబ్రవీత్

తదా	=	అప్పుడు	దృష్ట్వా	=	వీక్షించి
రాజా	=	రాజైన	తు	=	ఆ తరువాత
దుర్యోధనః	=	దుర్యోధనుడు	ఆచార్యమ్	=	ద్రోణాచార్యుని
వ్యూఢం	=	వ్యూహంగా ఏర్పాటైన	ఉపసంగమ్య	=	సమీపించి
పాండవానీకం	=	పాండవ సైన్యమును	వచనం	=	మాటను
			అబ్రవీత్	=	పలికాడు

సంజయుడు చెబుతున్నాడు :

మహారాజా! వ్యూహంగా ఏర్పడిన పాండవ సైన్యాన్ని దుర్యోధన మహారాజు చూశాడు. వెంటనే ద్రోణాచార్యుల వద్దకు వెళ్ళాడు. తన పలుకును వినిపించాడు.

వ్యాఖ్య

అజ్ఞానము - అహంకారము

అజ్ఞానాంధకారంలో అలమటిస్తున్న అంబికేయుని అప్రస్తుత ప్రసంగాన్ని అర్థం చేసుకున్నాం. అజ్ఞానానికి బిడ్డ అహంకారము. ధృతరాష్ట్రుని బిడ్డ దుర్యోధనుడు. మొదటి శ్లోకంలో ధృతరాష్ట్రుని దర్శనం. రెండవ శ్లోకంలో దుర్యోధనుని భాషణం.

పాండవ సేనను చూచిన దుర్యోధనుడు ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి భాషించాడు అంటున్నాడు సంజయుడు. ఈ శ్లోకము వద్ద దుర్యోధనుడు ప్రవేశించి భాషించడం జరిగింది. కాని, 'దుర్యోధన ఉవాచ' అని వ్యాసుడు ప్రస్తావించ లేదు. దుర్యోధనుని మాటల్ని సంజయుని చేతనే చెప్పించాడు. 'ధృతరాష్ట్ర ఉవాచ' ఉంది కదా మళ్ళీ ఈయన గారు ఎందుకు లెమ్మని భావించాడేమో! మొదటి శ్లోకం మంగళార్థ మైనా ఉపయోగ పడింది. చిన్నదొర గారిది అంతా అహంకార ప్రదర్శనమే కదా అని భావించి, పవిత్రాత్ముడైన సంజయుణ్ణే ఉపయోగించు కున్నాడేమో వ్యాసుడు!

సంధిలో సంజయుడు

మొదటి శ్లోకంలో 'సంజయా' అనే సంబోధన విన పడింది. రెండవ శ్లోకం నుండి 'సంజయ ఉవాచ' అంటే, సంజయుడే వినిపించడం జరుగుతూ ఉంది. సంజయా! అంటూ ధృతరాష్ట్రుడు పలికాడు. దుర్యోధనుడు పలికింది సంజయుడు వినిపించాడు. ఇరువురి మధ్య సంజయుణ్ణే ప్రధానం చేశాడు వ్యాసమహర్షి. ధృతరాష్ట్ర దుర్యోధనుల వంటి వ్యక్తుల మధ్య సంజయుడి లాగా జీవించమని చెప్పకనే చెబుతున్నాడు.

ధృతరాష్ట్రునిలో కోరుకో వలసింది కనిపించదు. దుర్యోధనునిలో ఏరుకో వలసింది వినిపించదు. మొదటిది అంతా అజ్ఞానమే. రెండవది అంతా అహంకారమే. ఈ మధ్యలో నిలిచిన మధ్యవర్తి సంజయుడే ఆదర్శమూర్తి. అందుకే నేమో గీత మొదటి శ్లోకమును విన్నవాడు సంజయుడు. గీత చివరి శ్లోకమును వినిపించిన వాడు కూడా సంజయుడే. జయమును ఆశించే వారు, విజయమును కాంక్షించే వారు సంజయుణ్ణే ఆదర్శంగా తీసుకోవాలి.

సర్వోత్కర్షేణ జయ సంజయ - అన్ని విధాల విజయమును సాధించ మని ఆశీర్వదిస్తుంది సంజయ నామం.

సమ్యక్ జయః యస్య సః సంజయః

ఇంద్రియ మనస్సులను చక్కగా జయించిన వాడు సంజయుడు. కురుక్షేత్రంలో వీరులు ఏమి చేశారు? అని ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు, రాజైన దుర్యోధనుడు వ్యూహముగా ఉన్న పాండవ సేనను చూచి, ఆచార్యుడైన ద్రోణాచార్యుని సమీపించి ఇలా చెబుతున్నాడు అనే సమాధానాన్ని వినిపించాడు సంజయుడు.

బాహ్య దృశ్యము

అనూహ్యమైన రీతిలో వ్యూహాకారంగా కనిపిస్తున్న పాండవ సైన్యాన్ని దుర్యోధనుడు చూశాడు. ఇది

బాహ్యం లోని యుద్ధ దృశ్యము. రణరంగంలో సైన్యాన్ని ఒక ప్రత్యేకమైన రూపంలో నిర్మించడాన్ని వ్యూహం అంటారు.

పద్మం యొక్క ఆకారంలో సైన్యాన్ని నిలబెడితే అది పద్మవ్యూహము. ముందు ఎక్కువ సైన్యము ఉండి వెనుక తక్కువ సైన్యాన్ని ఉంచితే అది మకర వ్యూహము. ముందు తక్కువ సైన్యము ఉండి వెనుక ఎక్కువ సైన్యము ఉంటే అది శకట వ్యూహము. చీమల బారు లాగా సైన్యమంతా ఒకే వరుసలో ఉంటే, అది సూచికా వ్యూహము. ఈ విధంగా గారుడ వ్యూహము, దండ వ్యూహము, వరాహ వ్యూహము అని అనేక వ్యూహా లున్నాయి. అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆయా సేనాధిపతులు వ్యూహాలను నిర్మిస్తూ ఉంటారు.

పాండవులు నిర్మించిన వ్యూహాన్ని చూచి భయపడిన దుర్యోధనుడు ఆచార్యుడైన ద్రోణుని సమీపించాడు. సైన్యాన్ని చూడగానే ***(దృష్ట్వా తు)*** భయ పడ్డాడు. భయ పడగానే ***(తదాతు)*** ద్రోణాచార్యుని సమీపించాడు. యుద్ధభూమి దుర్యోధనునికి తెలియనిదా? ఎందుకని భయ పడ్డాడు? దుర్యోధనుని భయానికి మూడు కారణాలు కనిపిస్తున్నాయి.

అంతర్యుద్ధము

కురుక్షేత్రంలో కౌరవ సైన్యంతో పోల్చితే పాండవుల సైన్యము తక్కువే. పదకొండు అక్షౌహిణుల సైన్యం కౌరవుల వైపు ఉంటే, ఏడు అక్షౌహిణుల సైన్యం మాత్రమే పాండవుల వైపు ఉంది.

ఎందరో రాజులు తనకు బాసటగా నిలిచారు. అసమాన పరాక్రమవంతులతో తన సేన అపర్యాప్తంగా ఉంది. ఇలాంటి సేనను ఎదుర్కొనే రీతిలో పాండవులు సేనను సమకూర్చుకో లేరు అని దుర్యోధనుడు ఇంతకాలం ఊహించాడు. కాని నేడు రణరంగంలో అనూహ్యంగా ఏడు అక్షౌహిణుల సైన్యాన్ని చూడగానే ***(దృష్ట్వా తు)*** దిగ్భ్రాంతి చెందాడు. 'తు' శబ్దం ఈ వాస్తవానికి అద్దం పడుతోంది. దుర్యోధనుని భయానికి ఇది మొదటి కారణము.

అంతర్యుద్ధంలో అల్లకల్లోలం

పాండవుల సేన పెద్దదే కావచ్చు. తన సేన అంత కంటే పెద్దది కదా! పాండవ సైన్యంలో గొప్ప వీరులు ఉంటే ఉండొచ్చు. అలాగని, తన సేనలో ఉన్న వీరులు మాత్రం తక్కువ వారా? మరి దుర్యోధనునికి భయ మెందుకు?

నిజమే. తన సైన్యంలో వీరు లున్నారు. శూరు లున్నారు. కాని, పాండవ సైన్యంలో ఉండే వీరులకు, తన సైన్యంలో ఉండే వీరులకు మధ్య ఏదో అంతరం ఉంది అని ఆంతర్యం ఘోషిస్తోంది.

తన వైపు భీష్ముడు ఉన్నాడు. కాని, యుద్ధం చేయడం అతనికి ఇష్టం లేదు. ఆచార్యుడైన ద్రోణుడు ఉన్నాడు. కాని, భీష్ముడు లాగా స్థిరమైన వాడు కాడు. ఇక కర్ణుడు ఉన్నాడు అంటే, అతడు విశ్వాసపాత్రుడే. తన కొరకు ప్రాణం ఇస్తాడు. కాని, అత్యవసర సమయంలో ఆమడ దూరాన ఉంటాడు. ఇక వికర్ణుడు, విదురుడు, సంజయుడు - వీళ్ళందరూ పాండవ పక్షపాతంతో వ్యవహరించే వారే. ఎందరో తనతో కలసి ఉన్నారు. కాని, పాలలో పంచదార లాగా తన మనస్సులో మనస్సుగా కలసిన వారెందరు?

ఇక పాండవుల వైపు చూస్తే, అందరూ హితులే. సన్నిహితులే. అవసరమైతే ప్రాణాలు అర్పించడానికి సంసిద్ధంగా ఉన్నవారే. పైగా, కొండంత అండగా శ్రీకృష్ణుడు వాళ్ళ మధ్యే ఉన్నాడు. ఎందరో దేవతల ఆశీర్వాదాలు పాండవులకు ఉన్నాయి. తన విజయాన్ని కాంక్షించే వారి కన్నా, పాండవుల విజయాన్ని కాంక్షించే వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. దుర్యోధనుని భయానికి ఇది రెండవ కారణము.

అపరాధాలే అవరోధాలు

తప్పు చేసిన వారు ఎంతటి వారైనా తప్పించుకో లేరు. చట్టము నుండి తప్పించు కుంటే తప్పించుకో వచ్చు. చిత్తము నుండి తప్పించుకో లేరు. నిలదీసే చిత్తాన్ని పడుకోబెట్ట లేరు.

పాపిని పాపమే శిక్షిస్తుంది. పాపం చేశావు - పాపం చేశావు అంటూ, తన మనస్సే తనను శపిస్తూ ఉంటుంది. అందుకే దోషి ధైర్యంగా ఉండ లేడు. పైకి ధైర్యంగా ఉన్నా, లోపల దీనుడై ఉంటాడు. హీనుడై ఉంటాడు. దోష రహితులైన వారి ముందు మరీ కుంచుకు పోతాడు. తాను ముందుకు సాగా లనుకున్నా, మనస్సు వెనక్కి లాగుతూనే ఉంటుంది.

పాండవుల సైన్యములో అందరూ సత్పురుషులే. సజ్జనులే. మహాత్ములే. పుణ్యాత్ములే. వారిని చూడగానే దుర్యోధనుని మనస్సు సహజం గానే సంకోచించి ఉంటుంది. ఇది దుర్యోధన మహారాజు భయానికి మూడవ కారణము.

ఆచార్యుని ఆశ్రయము

భయంతో చలించి పోయిన దుర్యోధనుడు, భయపడిన పిల్లవాడు పెద్దల వద్దకు పరుగు లెత్తినట్లు, ద్రోణాచార్యుల వారి వద్దకు వెళ్ళాడు. బాహ్య ఓటమి కన్నా ముందే, దుర్యోధనుని మనస్సులో ఓటమి చేరి పోయింది. అపజయ శంక బుద్ధిలో ప్రవేశించింది. ఆంతర్యం అల్లకల్లోల మైంది. అందుకే ఆచార్యుని ఆశ్రయించాడు.

ఆచారా లేమయ్యాయి?

ఆచార్యుని సరే ఆశ్రయించాడు. సంప్రదాయాన్ని పాటించ నవసరం లేదా? సంప్రదాయాన్ని విస్మరిస్తే సదాచారాలు మిగుల్తాయా? సదాచారం లేకుండా సత్ప్రవర్తన ఎలా సాధ్యం?

ఆచార్యుని సమీపించి నపుడు అభివాదం చెయ్యాలా లేదా? మరి దుర్యోధనుడు చేశాడా? లేదు. ఇది దుర్యోధనుని దురాచార ప్రవృత్తి కాదా?

కాదులెండి. యుద్ధభూమిలో ద్రోణ దుర్యోధనులు గురుశిష్యులుగా లేరు. దుర్యోధనుడు రాజు స్థానంలో ఉన్నాడు. శాసించే స్థితిలో ఉన్నాడు. ద్రోణుడు సేనాధిపతి స్థానంలో ఉన్నాడు. కాబట్టి అభివాదం చేయక పోవడం అనాచార మేమీ కాదు అని మీరు అనవచ్చు.

అదే నిజమైతే, సేనాధిపతి రాజు వద్దకు రావాలి గాని, రాజు సేనాధిపతి దగ్గరకు వెళ్ళడ మేమిటి? అనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది. అదే గాక, తరువాత శ్లోకంలో ద్రోణుణ్ణి 'ఆచార్యా!' అంటూ దుర్యోధనుడే సంబోధిస్తాడు. దానిని బట్టి వారి మధ్య గురుశిష్య సంబంధమే ఉంది అని ధ్రువ పడుతూ ఉంది. అభివాదము చేయక పోవడం వెనుక రాజు గారి అహంకారమే ప్రధానం గాని మరొక కారణం కాగడా పెట్టి వెతికినా కనిపించదు.

సంజయుని సంకేతము

దుర్యోధనుడు సరే. సంజయుడు చేసింది బాగుందా? ధృతరాష్ట్ర మహారాజు వద్ద, రాజైన దుర్యోధనుడు అని సంజయుడు పలకడం సమంజసమా? కానే కాదు. అది సంజయునికి తెలియనిదీ కాదు. ధృతరాష్ట్ర మహారాజా! తానే రాజైనట్లు తొలి నుండి దుర్యోధనుడు ప్రవర్తించడం వల్లనే ఈ దౌర్భాగ్యము దాపురించింది.

అనర్థము ప్రాప్తించింది అని వ్యంగ్యంగా పలకడమే సంజయుని మనోభావము. ఈ విధమైన సంభాషణము వాళ్ళిద్దరి మధ్య మహాభారతంలో అనేక చోట్ల కనిపిస్తుంది కూడా.

పశ్యైతాం పాండుపుత్రాణాం ఆచార్య మహతీం చమూమ్ ।
వ్యూఢాం ద్రుపద పుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥ 3

పశ్య-ఏతాం-పాండుపుత్రాణాం-ఆచార్య-మహతీం-చమూం
వ్యూఢాం-ద్రుపద పుత్రేణ-తవ-శిష్యేణ-ధీమతా

ఆచార్య	=	ఓ ఆచార్యా!	పాండుపుత్రాణాం	=	పాండుతనయుల
తవ	=	నీ యొక్క	ఏతాం	=	ఈ
ధీమతా	=	బుద్ధిమంతుడు	మహతీం	=	గొప్పదైన
శిష్యేణ	=	శిష్యుడు	చమూం	=	సైన్యమును
ద్రుపద పుత్రేణ	=	ద్రుపదుని కుమారునిచే	పశ్య	=	చూడు!
వ్యూఢాం	=	వ్యూహంగా ఏర్పడిన			

ఆచార్యా! పాండవుల సైన్యము ఎంత గొప్ప వ్యూహంతో నిలబడి ఉందో చూడండి. దానిని నిర్మించింది ద్రుపదుని కొడుకైన ధృష్టద్యుమ్నుడు. మీ శిష్యుడు. బుద్ధిమంతుడు.

వ్యాఖ్య

భయ భ్రాంతులతో విహ్వలుడైన గాంధారీ నందనుడు తన పక్షాన్ని తాను చక్క బరచుకొనే ప్రయత్నంలో పడ్డాడు. కర్ణుడేమో యుద్ధానికి దూరంగా ఉన్నాడు. ద్రోణుడు ఉన్నా, అతనిపై దుర్యోధనునికి భీష్మునిపై ఉన్నంత విశ్వాసం లేదు. అందుచేత, తన సైన్యానికి అధిపతిగా ఉన్న భీష్మాచార్యుల వారిని సంప్రదించడానికి బదులుగా ద్రోణాచార్యుని సమీపించాడు.

ఆచార్యా! అటు చూడు! పాండవుల సైన్యము చాలా గొప్పగా ఉంది. ఆ వ్యూహాన్ని రూపొందించిన వాడు ద్రుపదుని కుమారుడు. నీ శిష్యుడైన ధృష్టద్యుమ్నుడు బుద్ధిమంతుడు అని వ్యంగ్యంగా, మర్మంగా పలికాడు. శత్రుపక్షంపై విరుచుకు పడేలా ప్రేరేపించే ప్రయత్నంలో, త్రాచుపాము తోక త్రొక్కినట్లు ద్రోణాచార్యుని ఉసి గొల్పుతూ భాషించాడు.

మిత్ర భేదం - స్వలాభం

గొప్పదైన పాండవ సైన్యాన్ని చూడండి అంటున్నాడు దుర్యోధనుడు. పదకొండు అక్షౌహిణులతో తన సైన్యము ఉండగా, ఏడు అక్షౌహిణుల పాండవ సైన్యాన్ని గొప్పదిగా వర్ణించడంలో ***(మహతీం చమూం)*** దుర్యోధనుని హృదయం ఎంత భయ కంపితంగా ఉందో అర్థ మవుతూనే ఉంది. దుష్ట పన్నాగాలతో, రహస్య కుతంత్రాలతో కలుషిత మైన దుష్టులు విశ్వాస పాత్రులైన వారిని కూడా దారుణంగా శంకించడం, దోషాన్ని అంటగట్టి దుర్భాష లాడటం మనం చూస్తూనే ఉంటాం. ప్రస్తుతం దుర్యోధన చక్రవర్తి ఆ పని లోనే నిమగ్నమై ఉన్నాడు.

పాండవ వ్యూహకర్త ధృష్టద్యుమ్నుడు అనకుండా ద్రుపదుని కొడుకు అంటున్నాడు. మిత్రులైన ద్రుపద ద్రోణులు విభేదంతో విడి పడటం ఎప్పుడో జరిగింది. తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా ద్రోణుడు అర్జునుని ద్వారా ద్రుపదుని అవమానించాడు. ద్రోణునిపై పగ తీర్చుకోవ డానికి ద్రుపదుడు యజ్ఞం చేసి

ధృష్టద్యుమ్నుని బిడ్డగా పొందాడు. ఇదంతా గతం. ఈ గతం ద్రోణాచార్యుని స్వగతమే కదా! అది ఆయనకు తెలియదా? మరి, దుర్యోధనుడు ఎందుకు చెప్తున్నాడు?

నీపై ప్రతీకారం తీర్చుకోవ డానికి ద్రుపదుడు తన కుమారునితో సిద్ధ మయ్యాడు. ఏం చెయ్యాలో ఆలోచించుకో అనే భావాన్ని స్ఫురింప జేస్తూ ద్రోణాచార్యుని రెచ్చగొడు తున్నాడు. అంతే.

పాముకే పాలు పోసింది

ద్రోణుడు ధృష్టద్యుమ్నునికి విలువిద్య నేర్పాడు. తన ప్రాణం తీయాలనే ఏకైక లక్ష్యంతో ఆవిర్భవించిన వాడికి ఎవరైనా విలువిద్య నేర్పుతారా? కాటేయడానికి సిద్ధంగా ఉన్న సర్పానికి ఎవరైనా పాలు పోస్తారా?

ఇప్పుడు చూడు. నీ శిష్యుడే కదా? ***(తవ శిష్యః)*** ఇక చూపిస్తాడు తడాఖా! ***నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష*** - నీ పైనే శర ప్రయోగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఏం చేస్తాం? నీ శిష్యుడు కదా! బుద్ధిమంతుడు ***(ధీమతా)***. గురువునే గుర్తులు మిగలకుండా చేయాలనే శిష్యుడు. భళా! గొప్ప బుద్ధిమంతుడేలే! అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నాడు దుర్యోధనుడు.

ధీమతా అనే పదాన్ని చాలా లోతైన అర్థంతో ప్రయోగించాడు దుర్యోధనుడు. రణరంగంలో బుద్ధిమంతుడు అంటే విలువిద్యా నిపుణుడు అని అర్థం. ధృష్టద్యుమ్నుడు నీ శిష్యుడు కనుక నీ విద్యా సంపత్తి నంతా గ్రహించే ఉంటాడు. తనకు సహజంగా ఉన్న ప్రావీణ్యంతో పాటు అన్యుల నుండి గ్రహించిన కౌశలం కూడా ఉంటుంది కాబట్టి, నా వైపు నిలబడి యుద్ధం చేసే నీ కన్నా, పాండవుల వైపు నిలబడి పోరాడుతున్న నీ శిష్యుడు ధృష్టద్యుమ్నుడే గొప్పవాడుగా తెలుస్తున్నాడు అనే ధ్వని కూడా అతని మాటల్లో ఉంది. ఇది వాస్తవం కాకపోతే, రణరంగంలో శిష్యుని కన్నా గురువే గొప్పవాడు అని నిరూపించుకో! అనే ఎత్తి పొడుపు కూడా ఉంది.

పిలుపులో విరుపు

ద్రోణాచార్యుని సమీపించిన దుర్యోధనుడు ఆచార్యా! అని సంబోధించాడు. కానీ శ్లోకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అక్కడ కూడా రెండో అర్థం స్ఫురిస్తోంది. **పాండు పుత్రాణా మాచార్య** (పాండు పుత్రాణాం ఆచార్య) అనడం చేత, పాండవుల ఆచార్యుడా! అనే వ్యంగ్య సంబోధన కూడా వినపడుతూ ఉంది.

పాండవులు నీ శిష్యులే. వాళ్ళ నాయకుడు కూడా తమరి శిష్యుడే. ప్రత్యర్థు లందరికీ తమరే గురువు. తమరికి కూడా వాళ్ళంటే వల్లమాలిన ప్రేమ. బాగానే ఉంది. కాని అదేమిటో! మా వైపు చేరి యుద్ధం చేస్తావు. అదే విచిత్రం. సరే. తమరికి ఇష్టమైన పాండవుల సేన లోని నాయకుల్ని గురించే చెబుతాను. వినండి. మీ మనస్సుకు కాస్త హాయిగా ఉంటుంది అంటూ దిక్కు తోచక శత్రుస్మరణం చేస్తున్నాడు.

దుర్యోధనుడు అటు చూడ మన్నాడు. ద్రోణుడు చూశాడు. ఇప్పుడు ఏమి చేయాలి? పాండవ సైన్యము చాలా పెద్దదిగా ఉంది. దానిని తక్కువగా అంచనా వేయ కూడదు అనేది దుర్యోధనుని భావన.

సైన్యము గొప్పదిగా ఉన్నంత మాత్రాన విజయము సాధిస్తారని ఎలా చెప్పగలం? విజయం అనేది సైన్యాన్ని నడిపే నాయకుల మీద ఆధారపడి ఉంటుంది. భీష్మాది మహావీరులు, శూరులు తన వైపు కూడా ఉన్నారు కదా! అయినా భయ మెందుకు?

పాండవ సైన్యములో కూడా మహా శూరు లున్నారు. కనుక, ఉపేక్షిస్తే లాభం లేదు అనుకొంటూ శత్రుపక్షంలో ఉండే శూరు లెవరో చెబుతున్నాడు.

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥ 4

అత్ర-శూరాః-మహేష్వాసాః-భీమార్జునసమాః-యుధి
యుయుధానః-విరాటః-చ-ద్రుపదః-చ-మహారథః

అత్ర	=	ఈ సైన్యములో	విరాటః	=	విరాటుడు
యుధి	=	సమరము నందు	చ	=	మరియు
భీమార్జునసమాః	=	భీమార్జునుల వంటి వాళ్ళు	మహారథః	=	మహారథుడైన
మహేష్వాసాః	=	గొప్ప ధనుర్ధారులు	ద్రుపదః	=	ద్రుపదుడును
శూరాః	=	శూరులు	చ	=	మరియు
యుయుధానః	=	సాత్యకి			

పాండవ సైన్యంలో భీమార్జునులతో సమానులైన శూరు లున్నారు. గొప్ప ధనుస్సులు ధరించి ఉన్నారు. సాత్యకి, విరాటరాజు, మహారథుడైన ద్రుపదుడు, ఇంకా -

వ్యాఖ్య

పాండవ సైన్యంలో గొప్ప గొప్ప వీరు లున్నారు. శూరు లున్నారు. అతిరథ మహారథు లున్నారు (**సర్వ ఏవ మహారథాః**) అంటున్నాడు దుర్యోధనుడు. పైగా వీరందరూ భీమార్జునులతో సమానులు అంటున్నాడు.

గొప్ప ధనుర్విద్యా నిపుణుడై, తనను, సారథిని, గుఱ్ఱాలను ఏక కాలంలో రక్షించుకొంటూ పదివేల మందితో పోరాడే శక్తి గల వీరుణ్ణి మహారథుడు అంటారు. భీమార్జునులతో పాటు పాండవ సైన్యంలో ఉండే గొప్ప శూరుల్ని గూర్చి చెబుతున్నాడు దుర్యోధనుడు.

(1) **యుయుధానుడు.** కృష్ణార్జునులకు చాలా సన్నిహితుడు. గొప్ప పరాక్రమవంతుడు. శ్రీకృష్ణునికి తమ్ముడు. అర్జునుడికి శిష్యుడు కూడా. యుద్ధంలో అసమాన పరాక్రమాన్ని ప్రదర్శించే వాడు కావడం చేత సాత్యకికి యుయుధానుడు అనే పేరు వచ్చింది. కురుక్షేత్రంలో కృతవర్మను, సుదర్శనుని వధించడమే గాక, భూరిశ్రవునితో భయంకర పోరాటాన్ని సాగిస్తాడు సాత్యకి.

(2) **విరాటరాజు.** అజ్ఞాతవాసంలో పాండవులకు ఆశ్రయం కల్పించాడు. పాండవుల ఏడు అక్షౌహిణుల సేనలలో ఒక దానికి సారథ్యం వహిస్తాడు. తన కుమారులు శంఖుడు, ఉత్తరునితో కలసి కురుక్షేత్రంలో పోరాడి, ద్రోణుని చేతిలో మరణిస్తాడు. అభిమన్యునికి మామ. శత్రువులను విశేషంగా పీడించే వాడు కనుక విరటుడు అని ప్రసిద్ధి.

(3) **ద్రుపదుడు.** ధృష్టద్యుమ్నుని తండ్రి. పాంచాల దేశానికి రాజు. ద్రౌపది ఆయన కూతురే. ద్రుపదుడు ద్రోణునికి శత్రువు కనుక ద్రోణాచార్యుని రెచ్చగొట్టే ప్రయత్నంలో 'మహారథు' డంటూ ద్రుపదునికి ప్రత్యేకంగా విశేషణాన్ని జోడించాడు దుర్యోధనుడు.

ధృష్టకేతు శ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్ ।
పురుజి త్కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥ 5

ధృష్టకేతుః-చేకితానః-కాశిరాజః-చ-వీర్యవాన్
పురుజిత్-కుంతిభోజః-చ-శైబ్యః-చ-నరపుంగవః

ధృష్టకేతుః	=	ధృష్టకేతుడు	కుంతిభోజః	=	కుంతిభోజుడు
చేకితానః	=	చేకితానుడు	చ	=	ఇంకను
వీర్యవాన్	=	బలవంతుడైన	నరపుంగవః	=	పురుషశ్రేష్ఠుడు
కాశిరాజః	=	కాశిరాజు	శైబ్యః	=	శైబ్యుడు
చ	=	మరియు	చ	=	మరియు
పురుజిత్	=	పురుజిత్తు			

ధృష్టకేతువు, చేకితానుడు, బలవంతుడైన కాశిరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, పురుష శ్రేష్ఠుడైన శైబ్యుడు - వాళ్ళతో పాటు -

వ్యాఖ్య

(4) **ధృష్టకేతువు :-** చేది దేశపు రాజు. శిశుపాలుని కుమారుడు. నకులుని భార్య శ్రుణుమతి ఇతని చెల్లెలే. గొప్ప పోరాట పటిమ కలవాడు.

(5) **చేకితానుడు :-** యాదవ కులానికి సంబంధించిన వీరుడు. చికితానుని కుమారుడు. యుద్ధంలో ఇతనిని దుర్యోధనుడు సంహరిస్తాడు.

(6) **కాశిరాజు :-** కాశీ నగరాన్ని పాలించిన చక్రవర్తి. యుద్ధంలో అసమాన పరాక్రమంతో పోరాడుతాడు. అందుచేత 'వీర్యవాన్' అని ప్రత్యేకంగా శ్లాఘించడం జరిగింది.

(7) **పురుజిత్తు :-** కుంతీదేవికి సోదరుడు. కుంతిభోజుని కుమారుడు. ధర్మజ భీమార్జునులకు మేనమామ. పురు వంశీయులను జయించి పురుజిత్తు అయ్యాడు.

(8) **కుంతిభోజుడు :-** ఇతడు పురుజిత్తు సోదరుడు. తండ్రి యైన కుంతిభోజుని పేరే ఇతనికి కూడా పెట్టబడింది. కుంతీదేవి సోదరుడు.

(9) **శైబ్యుడు :-** శిబి వంశములో పుట్టి నందున ఇతడు శైబ్యుడు. ధర్మరాజుకు పిల్ల నిచ్చిన మామ. శైబ్యుని కుమార్తె దేవిక. శౌర్యవంతుడైన శైబ్యుని 'నరపుంగవః' - పురుష శ్రేష్ఠుడు అంటున్నాడు దుర్యోధనుడు.

యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥ 6

యుధామన్యుః-చ-విక్రాంతః-ఉత్తమౌజాః-చ-వీర్యవాన్
సౌభద్రః-ద్రౌపదేయాః-చ-సర్వే-ఏవ-మహారథాః

విక్రాంతః	=	పరాక్రమవంతు డైన	సౌభద్రః	=	సుభద్ర కుమారుడు
యుధామన్యుః	=	యుధామన్యుడు	చ	=	మరియు
చ	=	మరియు	ద్రౌపదేయాః	=	ద్రౌపది కుమారులు
వీర్యవాన్	=	బలవంతుడైన	సర్వే	=	అందరు
ఉత్తమౌజాః	=	ఉత్తమౌజుడు	మహారథాః ఏవ	=	మహారథులే
చ	=	మరియు			

పరాక్రమవంతుడైన యుధామన్యుడు, బలవంతుడైన ఉత్తమౌజుడు, సుభద్ర కుమారుడు, ద్రౌపది కొడుకులు - వీళ్ళందరూ మహారథులే.

వ్యాఖ్య

(10) **యుధామన్యుడు** :- ఇతడు అర్జునుని రథానికి వామపార్శ్వంలో చక్ర రక్షకుడుగా ఉంటాడు. గొప్ప శక్తిమంతుడు. అందుకే విక్రాంతుడు.

(11) **ఉత్తమౌజుడు** :- ఇతడు పాంచాల దేశపు రాజకుమారుడు. అర్జునుని రథానికి కుడిభాగాన చక్ర రక్షకుడుగా ఉంటాడు. గొప్ప వీర్యవంతుడు.

(12) **సౌభద్రుడు** :- సుభద్రార్జునుల పుత్రుడు. ఉత్తర భర్త. అభిమన్యుడు.

(13) **ద్రౌపదీ కుమారులు** :- ధర్మజుని వలన కలిగిన **ప్రతివింధ్యుడు**, భీముని వలన కలిగిన **శ్రుతసోముడు**, అర్జునుని వలన కలిగిన **శ్రుతకర్ముడు**, సహదేవుని వలన కలిగిన **శ్రుతసేనుడు**, నకులుని వలన కలిగిన **శతానీకుడు**. వీరు అయిదు మంది ద్రౌపదీ పుత్రులు. వీరినే ఉపపాండవులు అంటారు. వీరందరూ మహారథులే.*

మరి, అలాంటి మహారథులైన శత్రువులతో పోరాడి అనర్థం సృష్టించు కోవడం కంటే, వారితో సంధి చేసుకుంటే సరిపోతుంది కదా! అని ద్రోణాచార్యుడు ఎక్కడ చెబుతాడో అని ముందే ఊహించుకొని, తన సైన్యంలో కూడా వీరశూరులు, అతిరథ మహారథులు ఉన్నారంటూ వారిని గూర్చి కూడా చెబుతున్నాడు.

అస్మాకం తు విశిష్టా యే తా న్నిబోధ ద్విజోత్తమ ।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తా న్బ్రవీమి తే ॥ 7

అస్మాకం-తు-విశిష్టాః-యే-తాన్-నిబోధ-ద్విజోత్తమ
నాయకాః-మమ-సైన్యస్య-సంజ్ఞార్థం-తాన్-బ్రవీమి-తే

ద్విజోత్తమ	=	ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా!	తాన్	=	వారిని
అస్మాకం	=	మన పక్షంలో	తే	=	నీకు
యే తు	=	ఎవరైతే	సంజ్ఞార్థం	=	తెలియాలని
విశిష్టాః	=	గొప్పవారో	బ్రవీమి	=	చెబుతున్నాను
మమ	=	నా యొక్క	తాన్	=	వారిని
సైన్యస్య	=	సైన్యమునకు	నిబోధ	=	గమనించు
నాయకాః	=	నాయకులో			

బ్రాహ్మణోత్తమా! ఇక మన పక్షంలో గొప్పవాళ్ళు, సేనా నాయకు లెవ్వరో నీకు తెలియాలని చెబుతున్నా. వారిని కూడా గమనించు.

వ్యాఖ్య

పాండవ సైన్యము లోని అతిరథులను పేర్కొన్నంత మాత్రాన తాను వాళ్ళను చూచి భీతి చెందుతున్నట్లు ద్రోణుడు అర్థం చేసుకుంటా డేమో నని, తన వైపు కూడా అతిరథులైన మహావీరులు ఎందరో ఉన్నారంటూ తన సైన్యము లోని నాయకులను కూడా దుర్యోధనుడు వరుసగా చెప్పబో తున్నాడు.

అంతే కాదు. ఒకవేళ, పాండవసేన లోని తన శిష్యులపై వ్యామోహంతో ద్రోణుడు పూర్ణ హృదయంతో కౌరవుల వైపు శ్రమించక పోయినా, తనకు వచ్చే నష్ట మేమీ లేదనేది ధ్వనించేలా ఈ శ్లోకంలో ద్రోణాచార్యుని

* స్వామీజీ రచించిన చైతన్య మహాభారతంలో ఈ మహారథులను గూర్చి విశేషంగా చర్చించడం జరిగింది.

ద్విజోత్తమా! అని సంబోధించాడు. అంటే, బ్రాహ్మణశ్రేష్ఠుడా! అని అర్థము. ఈ సందర్భములో ఇదొక విచిత్ర మైన, వికటమైన సంబోధనము.

హోమ ధూమం - రణ రుధిరం

ద్విజుడు అంటే రెండవ సారి పుట్టినవాడు అని అర్థము. తల్లి గర్భము నుండి పుట్టడం మొదటి జన్మ అయితే, ఉపనయన సంస్కారం జరిగిన తరువాత ఆ వ్యక్తే రెండవ జన్మ ఎత్తిన వాడు అవుతాడు. అప్పుడు ద్విజుడు అని పిలువ బడతాడు.

జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః

పుట్టుకతో అందరూ శూద్రులే. ఉపనయన సంస్కారం తరువాత ద్విజులుగా మారుతారు. ఈ విధంగా రెండు జన్మలు ఎత్తిన వాడు ద్విజుడు లేక ద్విజన్ముడు అన్నది శాస్త్రం (***ద్వేజాతీ జన్మనీ యస్య సః ద్విజన్మా***).

జన్మ నిచ్చిన జననీ జనకులు మొదటి జన్మకు కారణ మవుతున్నారు. ద్విజుడుగా తన రెండవ జన్మకు గాయత్రీ మంత్రము జనని కాగా, జనకుడు దానిని ఉపదేశించే ఆచార్యుడు అవుతున్నాడు (***తద్వితీయం జన్మ మాతా సావిత్రీ పితా తు ఆచార్యాః***). గాయత్రిని వేదంలో సావిత్రి అని కూడా పిలుస్తారు. మంత్రద్రష్ట విశ్వామిత్ర మహర్షి.

అయితే, ఈ సందర్భంలో ద్రోణాచార్యుని ద్విజోత్తమా! అని సంబోధించడంలో దుర్యోధనుని అంతర్య మేమిటి? ఏముంది, కాస్త మనస్సు పెట్టి చూస్తే శుభ్రంగా తెలుస్తూనే ఉంది కదా!

ద్విజోత్తమా! బ్రాహ్మణశ్రేష్ఠుడా! నీ శరీరం మా వైపు నిలబడి ఉంది. మనస్సేమో ఆ వైపు పచార్లు చేస్తోంది. నీ శిష్యు లందరూ ఆ వైపే ఉన్నారు. నీ మనస్సు కూడా అక్కడే ఉంది. ఇక నీ వల్ల నాకు ఒరిగే దేముంది? అలాగని, నీవు లేకపోతే తరిగే దేముంది? నీవు ద్విజశ్రేష్ఠుడవు. గాయత్రీమాత పుత్రుడవు. సంధ్యా వందనాది పవిత్ర కర్మలు, యజ్ఞ యాగాది పుణ్య కర్మలకు అలవాటు పడ్డ వాడివి. పైగా సత్త్వగుణం గల బ్రాహ్మణుడివి.

హోమధూమం మధ్యలో కూర్చుని వేదమంత్రాలు వల్లించడం వేరు. రణరంగంలో నిలబడి రుధిర ప్రవాహాన్ని వీక్షిస్తూ పోరాడటం వేరు. పారాయణ జపధ్యానాలకు అలవాటు పడిన నీ ద్విజ స్వభావం రణరంగంలో ఏవో అద్భుతాలు సృష్టిస్తుందని నేను ఆశించడం లేదు. నీవు మా అందరికీ శిక్షణ ఇచ్చి ఉండొచ్చు. ఆట నేర్పడం వేరు. క్లిష్టమైన పరిస్థితుల్లో ఆడటం వేరు. పైగా చిత్తము లేకుండా చిందులు వేయడం చిత్రం గానే ఉంటుంది అంటూ, ఆచార్యునిపై తన కున్న అవిశ్వాసాన్ని చెప్పకనే బైట పెట్టేశాడు. అందుకే తన సైన్యంలో ఉండే మహారథులను వివరించి చెబుతున్నాడు. కౌరవ సైన్యములో ఉండే నాయకు లెవరో ద్రోణుడి స్థాయి యోధునికి తెలియదా? మరి దుర్యోధనుడు ఎందుకు చెబుతున్నట్లు?

సంజ్ఞార్థం - గుర్తు చేయాలి అని చెబుతున్నాను అంటున్నాడు. భీష్ముని పతనానంతరం సర్వ సేనాధిపతిగా పగ్గాలు చేపట్టబోయే ద్రోణుడికి తన సైన్యమును, అది కూడా నాయకులను గూర్చి గుర్తు చేయడ మేమిటి? నీవు మనస్సు పెట్టి యుద్ధం చేయక పోయినా, నాకు వచ్చే నష్ట మేమీ లేదు అని గుర్తు చేయడమే. నా వైపు నిన్ను మించిన అతిరథ మహారథు లెందరో ఉన్నారు అని తేల్చి చెప్పడమే. చాలా విడ్డూరంగా ఉంది కదూ! నిజమే. అలా ప్రవర్తించే వాడే దుర్యోధనుడు.

ఇక కౌరవ వీరుల్ని గూర్చి ప్రారంభిస్తూ ముందుగా ద్రోణాచార్యుని ప్రస్తావించాడు దుర్యోధనుడు. తన మనస్సులో ద్రోణునిపై ఉండే అవిశ్వాసాన్ని అణచుకో లేక సూటిపోటి మాటలతో వ్యంగ్యాస్త్రాలను విపరీతంగా

సంధించేశాడు. ఆ మాటలకు ద్రోణుడు ఎక్కడ మనస్తాపం చెందాడో, క్రోధంతో కదులు తున్నాడో అని శంకించి, ఆచార్యుని శాంతింప చేసే ప్రయత్నంలో ప్రథమంగా ద్రోణాచార్యునే ప్రస్తావించాడు. దారి తప్పిన వారికి ఎన్నో దారులు!

భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ ॥ * 8

భవాన్-భీష్మః-చ-కర్ణః-చ-కృపః-చ-సమితింజయః
అశ్వత్థామా-వికర్ణః-చ-సౌమదత్తిః-తథా-ఏవ-చ

భవాన్	=	మీరు	అశ్వత్థామా	=	అశ్వత్థామ
భీష్మశ్చ	=	భీష్ముడు	వికర్ణశ్చ	=	వికర్ణుడు
కర్ణశ్చ	=	కర్ణుడు	తథా ఏవ చ	=	అలాగే
సమితింజయః	=	సమర విజయుడు	సౌమదత్తిశ్చ	=	సోమదత్తుని పుత్రుడు
కృపశ్చ	=	కృపాచార్యుడు			

మీరు, భీష్ముడు,కర్ణుడు, సమర విజయుడు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కొడుకు - వీళ్ళే కాదు,

వ్యాఖ్య

తన పక్షంలో ఉండే ముఖ్యమైన వీరుల్ని గూర్చి చెబుతూ ప్రథమంగా *భవాన్* - తమరు అంటూ ప్రారంభించాడు. వాస్తవంగా మాట్లాడితే ముందు భీష్ముణ్ణి చెప్పి తరువాత ద్రోణుణ్ణి చెప్పాలి. ఇంతవరకు తాను చేసిన అప్రస్తుత అధిక ప్రసంగం వల్ల కలిగిన గాయాలను నయం చేసేందుకు సున్నితంగా మందు రాసే ప్రయత్నంలో పడ్డాడు దుర్యోధనుడు. అందుకనే భీష్ముని కన్నా ముందు ద్రోణుణ్ణి, వికర్ణుడి కన్నా ముందు అశ్వత్థామను ప్రస్తావించి, భోజనం లేకుండానే బ్రాహ్మణుణ్ణి ఉబ్బిస్తున్నాడు.

గొప్ప తేజోసంపన్ను లైన తమరు, భీష్ముడు, కర్ణుడు, సమర విజయుడు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కుమారుడు భూరిశ్రవుడు అంటూ ఏడు మందిని ప్రస్తావించాడు. పాండవ సైన్యములో పదిహేడు మంది వీరుల్ని ప్రస్తావించి, తన వైపు ఏడు మంది వీరుల్నే ప్రస్తావించాడు (**సౌమదత్తి ర్జయద్రథః** అనే పాఠాంతరాన్ని గ్రహిస్తే ఎనిమిది మంది అవుతారు. ఆ ఎనిమిదవ వాడు జయద్రథుడు. అంటే, సింధు నరేశుడు సైంధవుడు).

వాపు - బలుపు

పదకొండు అక్షౌహిణుల సైన్యము గల కౌరవ సైన్యము లోని నాయకులను ఏడు మందిని పేర్కొని, ఏడు అక్షౌహిణుల సైన్యము గల పాండవ సైన్యము లోని నాయకులను పదిహేడు మందిని చెప్పడంలో ఆంతర్య మేమిటో! పైగా పాండవ వీరుల్ని మూడు శ్లోకాలలో ప్రస్తావించి, తన సైన్యము లోని వీరులను ఒక్క శ్లోకం లోనే చెప్పేశాడు. * *

మన వాళ్ళను గూర్చి మనకు ఎలాగూ తెలుసు కదా, ఎదుటి వారి శక్తిని అంచనా వేయడమే కర్తవ్యం కావాలి అనే సంగ్రామ చాతుర్యమా? లేక సైన్యము ఎక్కువగా ఉందే గాని, వీరులు కౌరవ సైన్యంలో తక్కువగా

* సౌమదత్తిః జయద్రథః అని పాఠాంతరము.

* * గీత 16 వ అధ్యాయమును ప్రారంభిస్తూ, దైవీ సంపదలో జన్మించిన వారిని మూడు శ్లోకాలలో వర్ణించి, ఆసురీ సంపదలో జన్మించిన వారిని ఒక్క శ్లోకంలో చెప్పాడు గీతాచార్యుడు. వ్రాసిన వాడు వ్యాసుడు కావడం చేత, ఇది కూడా ఆలోచించ దగిన విషయమే.

ఉన్నారు. సైన్యము అక్షౌహిణుల సంఖ్యలో తక్కువగా ఉన్నా, పాండవసేన లోనే వీరులు ఎక్కువగా ఉన్నారు అనే నైరాశ్యమా? ఏమో, రెండవదే అయినా దుర్యోధనుని విషయంలో ఆశ్చర్యపో నవసరం లేదు.

ఎందుకంటే, తరువాత శ్లోకంలో మరెందరో తన వైపు ప్రావీణ్యత గల మహావీరులు ఉన్నారు అని పేరు లేని వాళ్ళను ప్రస్తావిస్తాడు. పైగా, వాళ్ళు తమ కొరకు ప్రాణాలు తెగించి వచ్చారు అంటాడు. ఇవన్నీ విస్మరించ దగిన విషయాలు మాత్రం కావు. అదేమిటో కూడా చెప్పుకుందాం.

అన్యే చ బహవ శ్శూరాః మదర్థే త్యక్తజీవితాః ।
నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥ 9

అన్యే-చ-బహవః-శూరాః-మదర్థే-త్యక్తజీవితాః
నానాశస్త్ర ప్రహరణాః-సర్వే-యుద్ధ విశారదాః

అన్యే	=	ఇంకా వేరే	త్యక్త జీవితాః	=	బ్రతుకును ధారబోసి
బహవః	=	చాలా మంది	సర్వే	=	అందరు
శూరాః	=	శూరులు	నానాశస్త్ర ప్రహరణాః	=	అనేక శస్త్రాస్త్రములు గలవారు
మదర్థే	=	నా కొరకు	యుద్ధవిశారదాః	=	సమర చాతుర్యము గలవారు

ఇంకా, వేరే వాళ్ళు చాలా మంది, నా కోసం బ్రతుకును ఫణంగా పెట్టి వచ్చి ఉన్నారు. శస్త్రాస్త్రములను ధరించిన వాళ్ళందరూ యుద్ధంలో ఎంతో ప్రావీణ్య మున్న వాళ్ళు

వ్యాఖ్య

తన సైన్యంలో ముఖ్యులైన ఏడు మంది వీరుల్ని ప్రస్తావించిన దుర్యోధనుడు, ఆ తరువాత మరెందరో ఉన్నారు అంటున్నాడు. పైగా వాళ్ళందరూ గొప్ప ప్రావీణ్యమున్న వాళ్ళు, శస్త్రాస్త్రములను ధరించి ఉన్నవాళ్ళు అంటున్నాడు. అంతటితో ఆగలేదు. తన కోసం ప్రాణాలు సైతం తెగించి వచ్చారు అంటున్నాడు.

మళ్ళీ ఇదేమిటి? పేరు లేని వాళ్ళను ప్రస్తావిస్తూ, వాళ్ళందరూ గొప్ప ప్రావీణ్యము ఉన్నవాళ్ళట. అంటే, గడచిన శ్లోకంలో పేరు పేరున చెప్పినాడే, వాళ్ళందరూ ప్రావీణ్యము లేని వారా?

అలా ప్రావీణ్యత గల అనామధేయులు శస్త్రాస్త్రములను ధరించి ఉన్నారు అంటున్నాడు. మరి, ఎనిమిదవ శ్లోకంలో పేరు పేరున పలికిన ఏడు మంది విషయ మేమిటి? వాళ్ళు శస్త్రాస్త్రములు ధరించి లేరా? మరి ఎలా ఉన్నారు? గంగాళముల ప్రక్కన గరిటెలు పట్టుకొని నిలుచున్నారా? విస్తళ్ళ ముందు పద్మాసనాలలో విసన కఱ్ఱలు ధరించి విస్తరించి కూర్చున్నారా? ఎంత అర్థరహిత ప్రసంగం! అంతా స్వార్థపూరిత ప్రవచనం.

ఇంకా చూడండి, రాజు గారి వాక్చాతుర్యం! ఆ అనామధేయు లందరూ తన కోసం ప్రాణాలు ధారబోసి వచ్చారు అంటున్నాడు. ఇదొక భావ దారిద్ర్యం.

నిజమే. వాళ్ళందరూ ఈ మహారాజు గారి కోసం ప్రాణాలు త్యజించే వచ్చారు అనుకుందాం. కలం లేకుండా వచ్చిన వాడు కలం లేని వాడే కదా! కళ్ళజోడు లేకుండా వచ్చిన వాడు కళ్ళజోడు లేనివాడే కదా! ప్రాణాలు త్యజించి వచ్చిన వాళ్ళెవరు? ప్రాణాలు లేని వాళ్ళే కదా! ప్రాణాలు త్యజించి వచ్చిన అనామధేయ వీరులు శత్రుపక్షంలో ఎవరి ప్రాణాలు తీస్తారు? భయపడిన వాళ్ళవి తప్ప!

త్యక్త జీవితాః అనే మాటే అశుభ సూచకం. ప్రాణాలు త్యజించి వచ్చారు అనేది మాటలో వినపడుతున్నా,

ప్రాణాలు త్యజించ బోతారు అనేది మనస్సులో కనపడుతూనే ఉంది. అదే కాకుండా, ఆ ప్రాణాలు కూడా తన కోసం (మదర్థం) త్యజించి వచ్చారు అని అన్యాయంగా, అధర్మంగా పలుకు తున్నాడు. ప్రజల కొరకు రాజు బ్రతకాలి గాని, తన కొరకు వారు ప్రాణాలు త్యజించి వచ్చారని రాజు పలకడం శోచనీయం.

మహావీరులైన ఏడు మంది కౌరవ మహారథులను ప్రస్తావించిన తరువాత, అసందర్భంగా అనామధేయుల్ని ఆకాశాని కెత్తుతూ స్తుతించడం వెనుక హేతు వేమిటి? ఏముంది! ఆ ఏడు మంది తన బ్రతుకులో వేడుకను ఆవిష్కరించ లేరు అనే అనుమానమే. కారణ మేమిటి? దుర్యోధనుని ఆంతర్యమే.

(1) **ద్రోణుడు** :- బ్రాహ్మణుడు. వేదాధ్యయన తత్పరుడు. కౌరవులకు, పాండవులకు ఇరువురికీ గురువే. ఉభయులకు అస్త్రవిద్యను నేర్పిన వాడు. అర్జునునితో సమానమైన వాడు ఉండడు అని ఆశీర్వదించడమే గాక, నాకు సహకరించే ఏకలవ్యుని బొటనవ్రేలును దూరం చేసిన వాడు. ఇక ఇప్పుడు, యుద్ధంలో నాకు సహాయం చేయబోతాడు!

(2) **భీష్ముడు** :- రాజయ్యే లక్షణాలన్నీ ఉండి కూడా తండ్రి కోసం సమస్తాన్నీ త్యజించిన వాడు. వివాహము కూడా చేసుకోనని భీష్మించు కున్నాడు. అలాగే బ్రతుకును నీరసింప చేసుకున్నాడు. పైగా తలచుకోగానే తల వాలిపోయే వరాన్ని తండ్రి నుండి పొంది ఉన్నాడు. పాసగితే ఉంటాడు. విసిగిపోతే చెప్పకుండానే తన దారిన తాను పోతాడు. యుద్ధంలో పాండవులను చంప కూడదు అని నిర్ణయించుకున్న వాడు. నాకు యుద్ధంలో ఏదో చేసి పెడతాడు!

(3) **కర్ణుడు** :- ప్రాణానికి ప్రాణ మిచ్చే స్నేహితుడు. మతి గలవాడే. అతి ఎక్కువ. కవచ కుండలాలు ఉంటే, అతణ్ణి ఎవ్వరైనా మట్టు పెట్ట గలరా? ఇంద్రుడు వచ్చి అడుగుతాడు, ఇవ్వద్దు మొర్రో అని పుత్ర వాత్సల్యంతో ఏడు గుఱ్ఱాలను తోలుకుంటూ సూర్యుడు వచ్చి చెబితే, తండ్రి మాటను కూడా లెక్క చేయకుండా, 'నన్ను యాచించిన వాడు లేదనుకొంటూ తిరిగి పోవుటయా! అదే జరిగినచో, వెంబడించదా అతనిని నా ప్రాణం కూడా' అని నాటక వాచకం పలుకుతాడా? ఇంద్రుడు రానే వచ్చాడు. కవచ కుండలాలు పోనే పోయాయి. అసమాన శక్తివంతుడే. తన శక్తి అవసర సమయంలో ఉపయోగ పడదు అనే శాపం కూడా ఉన్నవాడు. నా మిత్రుడే. ప్రాణమిత్రుడే. యుద్ధంలో నా కేదో చేయబోతాడు!

(4) **కృపాచార్యుడు** :- అయోని సంభవుడు. ద్రోణుడికి బావమరిది. ద్రోణుడి లాగే మా అందరికీ గురువు. వాళ్ళకూ నేర్పాడు. మాకూ నేర్పాడు. మా సైన్యములో బండెక్కి ఉన్నాడు.

(5) **అశ్వత్థామ** :- ద్రోణుని కొడుకు. కృపునికి అల్లుడు. మహాకోపి. ఏదైనా చేయ గలడు. బ్రహ్మాస్త్ర ప్రయోగం కూడా చేసే శక్తి కలవాడు. కాని, దానిని ఉపసంహారము చేసే దెలాగో తెలియని వాడు. అర్జునుణ్ణి మించిపోతాడేమో నని తన తండ్రే ఆ రహస్యాన్ని చెప్పలేదు. అతడే అశ్వత్థామ. ప్రస్తుతం నా సైన్యం లోనే ఉన్నాడు.

(6) **వికర్ణుడు** :- మా తమ్ముడే. వందలో ఒకడు. మందలో చేరడు. ఉన్నట్లుండి నీతుల మూట విప్పుతాడు. ధర్మము - దయ అంటూ తెగ మాట్లాడుతాడు. ప్రస్తుతానికి మా వైపే ఉన్నాడు.

(7) **సౌమదత్తి** :- సోమదత్తుని కొడుకు. భూరిశ్రవుడు. కౌరవ పాండవు లిరువురికి పిత్ర సమానుడు. పాండవుల్ని జయించాలని శివుని ప్రార్థిస్తూ తపస్సు చేశాడు. శివుడు తృప్తి చెంది వరం ఇవ్వడానికి వచ్చాడు. శివుణ్ణి చూచి కూడా గర్వంతో ఊగిపోతూ లేచి నిలబడ లేదు. శివుడు క్రుద్ధుడై, యుద్ధంలో క్రూర మరణాన్ని పొందుతావు అని శాపం పెట్టి వెళ్ళాడు. ఆయనే ఇప్పుడు మా నాయకులలో ఒకడు.

(8) **జయద్రథుడు** :- పాఠాంతరంలో ఎనిమిదవ వాడు చేరితే, ఆయనే జయద్రథుడు. సైంధవుడు. మా చెల్లెలు దుస్సల మొగుడు. అతనికి అన్నీ బాగానే చూశాము. ఏ లోటు రానివ్వ లేదు.

సామాన్యుడు కాడు. అటు, ఇటుగా నా లక్షణాలు కలవాడే. పాండవుల ధర్మపత్ని ద్రౌపదిని అపహరించుకొని పోయాడు. భీముడు, అర్జునుడు వెంబడించి పట్టుకున్నారు. బావమరిది అని చంప లేదు గాని చంపినంత పని చేశారు.

ఆ తరువాత, పాండవులు ఏమి చేస్తారో అని భయం పట్టుకొంది. శివుణ్ణి గూర్చి చాలా కాలం తపస్సు కూడా చేశాడు. పాండవుల్ని కూడా జయించే వరాన్ని తపస్సు ద్వారా పొందాడు. కాని, అర్జునుణ్ణి చంపడం సాధ్యం కాదు అనే మెలిక కూడా ఆ వరంలో చోటు చేసుకొని ఉంది. ఆయన కూడా ప్రస్తుతం ధనుస్సు పట్టుకొని మా మధ్య లోనే ఉన్నాడు. నన్ను రక్షిస్తా నంటున్నాడు.

అందరి విషయంలో ఇలాంటి అందమైన భావాలే దుర్యోధన మహారాజు మనస్సులో ఉన్నాయి. అందరి పైనా అవిశ్వాసమే కనుక అనామధేయులపై అకుంఠిత విశ్వాసము. అంతా అయోమయం. ఆంబికేయం.

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।
పర్యాప్తం త్విద మేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥ 10

అపర్యాప్తం-తత్-అస్మాకం-బలం-భీష్మాభిరక్షితం
పర్యాప్తం-తు-ఇదం-ఏతేషాం-బలం-భీమాభిరక్షితం

భీష్మాభిరక్షితం	=	భీష్మునిచే రక్షితమైన	భీమాభిరక్షితం	=	భీమునిచే రక్షితమైన
తత్	=	అలాంటి	ఏతేషాం	=	వారి యొక్క
అస్మాకం	=	మన	ఇదం	=	ఈ
బలం	=	బలము	బలం తు	=	శక్తి అయితే
అపర్యాప్తం	=	అపారము	పర్యాప్తం	=	పరిమితము
తు	=	అయితే			

మన సైన్యము అపారము. దానిని భీష్ముడు రక్షిస్తున్నాడు. ఇక పాండవుల సైన్య మంటారా? అది చాలా పరిమితం. దానిని భీముడు కాపలా కాస్తున్నాడు.

వ్యాఖ్య

తన సైన్యము పదకొండు అక్షౌహిణులతో ఉంది. పాండవ సైన్యము ఏడు అక్షౌహిణులతో ఉంది. కనుక తన బలం అపర్యాప్తం. పాండవులది పర్యాప్తం. ఇకపోతే అపరిమిత మైన తన సైన్యానికి భీష్ముడు రక్షకుడు. పరిమితమైన పాండవుల సైన్యానికి భీముడు రక్షకుడు అనేది శ్లోకార్థం. సుస్పష్టం.

భీష్ముడు - భీముడు

తన సైన్యాన్ని రక్షించే వాడు సర్వసేనాధిపతి భీష్ముడు అనేది అర్థ మవుతూ ఉంది. పాండవ సైన్యాన్ని భీముడు రక్షిస్తున్నాడు అంటూ భీష్మునికి ప్రత్యర్థిగా భీముణ్ణి ఎందుకు ఎన్నుకున్నాడో అర్థం కావాలి.

భీముడు రాజు కనుక అతణ్ణి పేర్కొన్నాడు అనుకొందామా? లేదా, జ్యేష్ఠుడు కనుక భీముణ్ణి ఉదహరించినాడు అనుకుందామా? ప్రభువు, జ్యేష్ఠుడు - ఈ రెండూ ధర్మరాజే కాని భీముడు కాడు. అలా చూచి నపుడు ధర్మరాజు పేరు చెప్పాలి గాని భీముడి పేరు కాదు.

జ్యేష్ఠుడు కాకపోయినా, శ్రేష్ఠత్వము లేకపోయినా, భీష్ముని లాగా సర్వసేనాధిపతి కనుక భీముడి పేరును ఉదహరించాడు అని అనుకుందా మంటే, పాండవసేనకు సర్వసేనాధిపతి ధృష్టద్యుమ్నుడే గాని భీముడు కాదు.

పోనీ జ్యేష్ఠత్వము, శ్రేష్ఠత్వము, సర్వసేనాధిపత్యము లేకపోయినా, నానాస్త్ర కోవిదుడు, అద్భుత శస్త్రాస్త్ర నిపుణుడు భీముడు అని భావించాడా అంటే, అది కూడా సరి కాదు అనిపిస్తోంది. అలాంటి లక్షణాలు కలవాడు అర్జునుడే గాని భీముడు కాదు.

చివరగా, ప్రత్యేకతలు ప్రదర్శించక పోయినా, పరిపూర్ణతలో దేదీప్యమానంగా ప్రకాశించే పరమాత్మ స్వరూప మని భీముణ్ణి తలచినాడా? అలా చూచి నపుడు, అర్జునుని రథంలో మందహాసంతో శోభిస్తున్న శ్యామసుందరమూర్తిని చెప్పాలి.

అందరినీ ప్రక్కన బెట్టి, తనకు అసలే గిట్టని నిత్య శత్రువు హిడింబి మొగుణ్ణి మొగసాలలో నిలపడ మేమిటి? గాంధారీ నందనుడు ఏది పలికినా గందరగోళాన్నే సృష్టిస్తూ ఉంది.

ప్రతిజ్ఞలే ప్రతిభలు

కౌరవ సైన్యాన్ని రక్షించ వలసిన సర్వసేనాధిపతి భీష్మాచార్యుడు. కాని, యుద్ధంలో ఎందరి నైనా వధిస్తాను గాని పాండవులను మాత్రం సంహరించను అని భీష్ముడు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు.

ఇక భీముడు అంటారా! ధృతరాష్ట్రుని కొడుకు లందరినీ నేనే వధించి తీరుతాను అని ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు.

ఈ రెండూ దుర్యోధనుని మనస్సులో సాగర కెరటా ల్లాగా ఎగసి ఎగసి పడు తున్నాయి. అందుచేత భీష్మభీముల్ని ఉదహరించాడు. అలా భీతి చెందుతున్న సమయం లోనే తమ బలం అపరిమిత మని, పాండవుల బలం పరిమిత మని తాత్కాలిక ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. సైన్యం లాగే భీష్ముని కన్నా భీముడు పరిమితుడు అని కూడా తృప్తి చెందు తున్నాడు. ఎందుకంటే, భీష్మ శబ్దంలో భీముడు చిక్కిపోయే ఉన్నాడు. 'భీష్మ' - భీ్ష్-మ. . . 'భీమ' అనే రెండు అక్షరాలను తొలగించినా, భీష్మునిలో 'ష' కారము మిగిలే ఉంది కదా! ఆ 'ష' కారాన్ని పట్టుకొని సంతోషంతో ఆంతర్యంలో షికారు చేస్తున్నాడు దుర్యోధనుడు.

మరో దారి మంచిది కాదు

ఈ శ్లోకం యొక్క భావార్థము స్పష్టం గానే తెలుస్తున్నా, దీనికి భిన్నంగా అర్థాన్ని సృష్టించారు చాలా కాలంగా చాలా మంది వ్యాఖ్యాతలు.

భీష్మాభి రక్షితం అస్మాకం తద్బలం అపర్యాప్తం

భీమాభి రక్షితం ఏతేషాం ఇదం బలం పర్యాప్తం - అని సూటిగా తెలుస్తూ ఉన్నా,

భీష్మాభి రక్షితం పర్యాప్తం

భీమాభి రక్షితం అపర్యాప్తం - అంటే, భీష్ముని చేత రక్షింప బడుతున్న కౌరవ బలము పరిమితము. భీముని చేత రక్షింప బడుతున్న పాండవ బలము అపరిమితము అనే అర్థాన్ని నేశారు. ఇదంతా సంస్కృత భాషా వైభవము.

అపర్యాప్తం అంటే, అపరిమితము అని ఒక అర్థము. దానినే **న + పర్యాప్తం** గా గ్రహిస్తే, సమర్థవంతము కాదని అర్థము. అంటే కౌరవ సైన్యం పాండవ సైన్యంతో సరితూగ లేదని భావము. అలాగే భీముని సైన్యము

పర్యాప్తం అన్నప్పుడు పరిమిత మైనది అనే గాక, గెలవడానికి **పర్యాప్తం**, అంటే సరిపోతుంది అని భావం. సమర్థవంతంగా ఉంది అని అర్థం. ఇలాంటివి నాలుకలపై నర్తించేందుకు బాగుంటాయి. మనస్సులలో నిలిచేందుకు సరిపోవు.

భారతాన్ని సమగ్రంగా అధ్యయనం చేసిన వారికి ఇవన్నీ చాలా చిన్న విషయాలుగా మూల పడి ఉంటాయి. యుద్ధానికి ముందే ఈ విషయాన్ని సుస్పష్టం చేస్తూ సంజయుణ్ణి దుర్యోధనుడు హెచ్చరిస్తాడు కూడా.

మాకు నక్షౌహిణులు పదనొకండు, వారికి నేడు. మా సైన్యంబు సారవంతంబు వారి బలంబు నిస్సారంబు - అని వ్యాసభారతాన్ని తెనిగిస్తూ తేటతెల్లం చేశాడు తిక్కన సోమయాజి. సారవంతము అంటే అపర్యాప్తం, నిస్సారము అంటే పర్యాప్తం. ఇక సందేహము ఏముంది? ఎక్కడుంది?

ఎంతో చెప్పావు. ఏదేదో చెప్పావు. ఇంతకీ నేను ఏమి చెయ్యాలి? అన్న ప్రశ్న ద్రోణుని కళ్ళల్లో చదివి ఉంటాడు దుర్యోధనుడు. అందుకని చెప్పబో తున్నాడు. మీరు ఏమీ చేయ నవసరం లేదు (ఎలాగూ చేయరని నాకు తెలుసు కనుక). అందరూ చేరి అసమాన పరాక్రమశాలి అయిన భీష్ముణ్ణి రక్షిస్తూ ఉండండి అంటాడు దుర్యోధనుడు.

భీష్ముడు సర్వసేనాధిపతి. గొప్ప యోధుడు. ఆయనను మేము రక్షించడ మేమిటి? తనను తాను రక్షించుకోలేని అసమర్థుడా? అని అనుకుంటారేమో కదా!

కాదు. కాదు. భీష్ముడు అసమర్థుడు కాడు. అతణ్ణి ఎవ్వరూ రక్షింప పనిలేదు. కాకపోతే, పాండవుల్ని వధించను అని శపథం చేశాడు కనుక, పాండవులే చెలరేగి భీష్ముణ్ణి చంపుతా రేమో అనే భయం. అందుకే అతణ్ణి రక్షించు కోవాలి. అతడు జీవించి ఉంటే విజయం తనదే అనేదే దుర్యోధనుని అభిమతం.

అయనేషు చ సర్వేషు యథాభాగ మవస్థితాః ।
భీష్మ మేవాభిరక్షన్తు భవన్తః సర్వ ఏవహి ॥ 11

అయనేషు-చ-సర్వేషు-యథాభాగం-అవస్థితాః
భీష్మం-ఏవ-అభిరక్షంతు-భవంతః-సర్వే-ఏవ-హి

భవంతః	=	మీరు	యథాభాగం	=	మీ మీ నియమిత స్థానముల యందు
సర్వే ఏవ	=	అందరు			
చ	=	అందువల్ల	అవస్థితాః	=	ఉండినవారై
సర్వేషు	=	అన్ని	భీష్మమేవ	=	భీష్మాచార్యుల వారిని
అయనేషు చ	=	స్థానాలలో	అభిరక్షంతు హి	=	చక్కగా రక్షింతురు గాక!

అన్ని చోట్ల మీరు ఉండ వలసిన స్థానాలను విడిచి పెట్టకుండా ఉండండి. అందరూ ఏకంగా భీష్ముణ్ణి రక్షించుకుంటూ ఉండాలి.

వ్యాఖ్య

దుర్యోధనుని గుండెల్లో ఒక వైపు నిరాశా గాలులు వీస్తున్నాయి. మరొక వైపు తన పక్షంలో నిలబడి పోరాడుతున్న నాయకుల మీద అనుమానపు నీడలు ప్రాకుతున్నాయి. ఈ దశలో ఒక్క భీష్ముని మీదే తన ఆశలన్నీ మూగి ఉన్నాయి. కనుకనే అందరూ కలసి భీష్ముణ్ణి రక్షించండి అని రాజుగా ఆజ్ఞాపిస్తున్నాడు దుర్యోధనుడు. భీష్ముని సమీపించే అవకాశం లేకుండా వ్యూహాన్ని నిర్మించి, ఆయా స్థానాలలో వీరుల్ని

నియమించారు. అలా నియమిత స్థానాలను వీడకుండా ఉండి, భీష్మణ్ణి కాపాడు కోవాలి అంటున్నాడు.

ద్రోణాచార్యునికి సమీపం లోనే భీష్ముడు ఉన్నాడు. దుర్యోధనుని వ్యర్థ ప్రలాప మంతా పితామహునికి వినపడే ఉంటుంది. సమరారంభంలో ఇదొక అనారోగ్యకర మైన వాతావరణ మని భీష్ముడికి తెలుసు. వీరోత్సాహాన్ని ఇలాంటి సన్నివేశాలు నిస్సారంగా మారుస్తాయని కూడా తెలుసు.

దుర్యోధనుడు ఇంతగా ప్రేలుతున్నా, తిరిగి ఒక్క మాటైనా పలకని ద్రోణుని మౌనాన్ని భీష్ముడు అర్థం చేసుకోలేని వాడు కాడు. ఈ దారుణ సన్నివేశాన్ని ఇక కొనసాగించడం శ్రేయస్కరం కాదని భావించాడో ఏమో, పెద్దగా సింహనాదం చేసి శంఖారావం వినిపించాడు.

తస్య సంజనయ న్హర్షం కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చైః శఙ్ఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥ 12

తస్య-సంజనయన్-హర్షం-కురువృద్ధః-పితామహః
సింహనాదం-వినద్య-ఉచ్చైః-శంఖం-దధ్మౌ-ప్రతాపవాన్

తస్య	=	అతనికి	ఉచ్చైః	=	గట్టిగా
హర్షం	=	సంతోషము	సింహనాదం	=	సింహగర్జనము
సంజనయన్	=	కలిగిస్తూ	వినద్య	=	చేసి
ప్రతాపవాన్	=	ప్రతాపవంతుడు	శంఖం	=	శంఖమును
కురువృద్ధః	=	కురువృద్ధుడు	దధ్మౌ	=	పూరించాడు
పితామహః	=	పితామహుడు			

భీష్మ పితామహుడు కురువృద్ధుడు. పరాక్రమవంతుడు. దుర్యోధనునికి సంతోషాన్ని కలిగించాలని భావించాడు. అంతే. పెద్దగా సింహనాదం చేసి, శంఖాన్ని పూరించాడు.

వ్యాఖ్య

మాట పడింది - భావం లేచింది

అందరూ కలసి భీష్మణ్ణి రక్షించండి అని దుర్యోధనుడు పలికిన మాట భీష్ముల వారి చెవిన పడింది. పరశురాముని నిరసించి పోరాడిన తనను ఇతరులు రక్షించాలా? ఇక ఈ ఉన్మత్త ప్రలాపాన్ని ఆపాలని భావించాడో ఏమో, మాట పలక కుండా సింహగర్జన వంటి కేక వేసి శంఖాన్ని పూరించాడు భీష్ముడు.

తరగతి గదిలో విద్యార్థులు గోల చేస్తూ ఉంటే, ఉపాధ్యాయుడు బల్లను చరుస్తాడు. ఆ శబ్దానికి పిల్లలు నోళ్ళు కట్టేసు కుంటారు. దుర్యోధనా! ఇక పిల్లచేష్టలు, వ్యర్థ ప్రసంగాలు ఆపు! అని చెప్పకుండానే శంఖాన్ని పూరించి దుర్యోధనుని నోరు మూయించాడు భీష్ముడు.

దుర్యోధనుడు అసలు ఇలా ఎందుకు వాగుతున్నాడు? పాండవ సేనను చూచి భీతి చెందుతున్నాడు. భయ విహ్వలుడై, దిక్కు తోచక పూజార్హులను కూడా పరోక్షంగా తూలనాడు తున్నాడు. ఇతనికి ధైర్యం కావాలి. ఉత్సాహం కావాలి. నీరసించిన నాడీమండలం చైతన్యవంతం కావాలి అని భావించి శంఖాన్ని పూరించాడు భీష్ముడు.

ధృతరాష్ట్రకుమారా! దిగులు పడకు. అతులిత శౌర్య పరాక్రమాలు కలిగిన మేము నీ వైపు ఉన్నాం.

పాండవుల్ని మేము ఎదుర్కొంటాం. నువ్వు భీతి చెందకు, అని సంకేతాన్నిస్తూ, తమ శంఖనాదం ద్వారా దుర్యోధనునిలో ధైర్యోత్సాహాలను నింపే ప్రయత్నం చేశాడు భీష్ముడు.

సర్వ సేనాధిపతి భీష్మాచార్యుడు కౌరవ పక్షంలో నిలబడి, సింహనాదం చేసి శంఖాన్ని పూరించాడు. అంటే యుద్ధానికి శ్రీకారం చుట్టాడు అని అర్థం. పితామహుని పిలుపును అందుకొని, సేనలన్నీ వారి వారి నాదాలను వినిపిస్తూ సమ్మతిని తెలిపాయి. సిద్ధం అంటూ శబ్దంతో మారు పలికాయి.

తతః శఙ్ఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః ।
సహసై వాభ్యహన్యన్త స శబ్ద స్తుములోఽభవత్ ॥ 13

తతః-శంఖాః-చ-భేర్యః-చ-పణవానక గోముఖాః
సహసా-ఏవ-అభ్యహన్యంత-సః-శబ్దః-తుములః-అభవత్

తతః	=	తరువాత	అభ్యహన్యంత	=	మ్రోగింప బడ్డాయి
శంఖాశ్చ	=	శంఖములు	స శబ్దః	=	ఆ శబ్దము
భేర్యశ్చ	=	దుందుభులు	తుములః	=	భయంకరంగా
పణవానక గోముఖాః	=	తప్పెటలు, రణభేరులు, బూరలు	అభవత్	=	వ్యాపించింది
సహసా+ఏవ	=	ఒకేసారి			

ఆ తరువాత శంఖాలు, దుందుభులు, తప్పెట్లు, రణభేరులు, బూరలు ఒకేసారి మ్రోగాయి. ఆ శబ్దము చాలా భయంకరంగా ఉండింది.

వ్యాఖ్య

జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అయిన భీష్ముడు శంఖాన్ని పూరించ గానే కౌరవసేన లోని వారందరూ ఇక యుద్ధం ఆరంభ మైనట్లే నని భావించి, ఎవరికి వారుగా శబ్ద సంకేతాలను అందించారు.

భం భం అంటూ శంఖాలు ధ్వనించాయి. వారి పక్షం లోనే మరో వైపు నుండి ప్రతిధ్వనించాయి. దుందుభులు పెద్దగా మ్రోగాయి. తప్పెట్ల శబ్దాలు ఉరుముల మ్రోతల్లా ఉన్నాయి. మేఘ గర్జనంలా రణభేరులు దిక్కులు పిక్కటిల్లేలా వినిపించాయి. కర్ణభేరులను బ్రద్దలు చేస్తున్నట్లు బూరల శబ్దాలు చొచ్చుకు పోతున్నాయి.

భూమ్యాకాశాలు శబ్దమయంగా మారి పోయాయి. ఎటు చూచినా శబ్దాలే. ఏ వాయిద్యాలు లేని పదాతి దళాలు నోళ్ళ తోనే విచిత్రంగా అరుస్తూ వికృత ధ్వనులు వినిపించాయి.

కౌరవసేనలు ఇంతగా సంకుల సమరనాదాలు చేస్తూ ఉంటే, పాండవ సేనలు ఏమి చేశాయో! ఏమి చేస్తాయి? చర్యలు ఉన్నప్పుడు ప్రతిచర్యలు తప్పుతాయా? ధ్వనులు ఉన్నప్పుడు ప్రతిధ్వనులు లేకుండా ఉంటాయా? ఈ వైపు ఒకటి అంటే ఆ వైపు ఆరు అంటున్నారు. అదే కదా యుద్ధ మంటే. పాండవులు కూడా శంఖాలను పూరిస్తున్నారు. తరువాత శ్లోకం నుండి ఆరు శ్లోకాల వరకు ఆ నాదాలే. సునాదాలే.

తతః శ్వేతై ర్హయై ర్యుక్తే మహతి స్యన్దనే స్థితౌ ।
మాధవః పాణ్డవ శ్చైవ దివ్యౌ శఙ్ఖౌ ప్రదధ్మతుః ॥ 14

తతః-శ్వేతైః-హయైః-యుక్తే-మహతి-స్యందనే-స్థితౌ
మాధవః-పాండవః-చ-ఏవ-దివ్యౌ-శంఖౌ-ప్రదధ్మతుః

తతః	=	తరువాత	స్థితౌ	=	ఉన్న
శ్వేతైః	=	తెల్లని	మాధవః	=	శ్రీకృష్ణుడు
హయైః	=	గుఱ్ఱములతో	పాండవశ్చైవ	=	అర్జునుడూ
యుక్తే	=	కూడిన	దివ్యౌ	=	శ్రేష్ఠములైన
మహతి	=	ఉత్తమమైన	శంఖౌ	=	శంఖాలను
స్యందనే	=	రథము నందు	ప్రదధ్మతుః	=	పెద్దగా పూరించారు

ఇక, ఆ తరువాత, తెల్లని గుఱ్ఱాలు కట్టిన రథంలో శ్రీకృష్ణుడు, అర్జునుడు ఉన్నారు. వారిద్దరు ఎంతో శ్రేష్ఠమైన శంఖాలను పూరించారు.

వ్యాఖ్య

కౌరవసేన నుండి భయంకరంగా సమర నాదాలు మ్రోగాయి. మేమూ సిద్ధమే నంటూ, తెల్లని గుఱ్ఱాలు కట్టిన గొప్ప రథము మీద ఆసీనులైన శ్రీకృష్ణార్జునులు దివ్యము లైన శంఖాలను పూరించారు.

శుభమస్తు

శ్రీకృష్ణార్జునుల దర్శనమే శుభదర్శనం. వారి శకటమే శుభ శకటం. గొప్పదైన రథంలో ఉన్నారు అంటున్నాడు సంజయుడు ***(మహతి స్యందనే).*** యుద్ధభూమిలో ఎన్నో రథా లున్నాయి. ఇది అలాంటి సాధారణమైన రథం కాదు. ఖాండవ వనాన్ని దహించి నపుడు తృప్తి చెందిన అగ్నిదేవుడు ఆనందంతో ప్రసాదించిన సురలోక శకట మది.

ఆ రథానికి పూన్చిన గుఱ్ఱాలు కూడా సామాన్య మైనవి కావు. దేవ లోకమునకు సంబంధించినవి. అట్టి రథంలో ఉన్న శ్రీకృష్ణార్జునులు మ్రోగించిన శంఖములు కూడా మామూలు శంఖాలు కావు. ఓంకారంతో ధ్వనించే దేవతా శంఖములు. కనుకనే వాటి ధ్వని ప్రత్యేకంగా వినిపించింది. ఈ కారణం చేతనే **'దధ్మతుః'** అనకుండా 'ప్ర' అనే ఉపసర్గను చేర్చి **'ప్రదధ్మతుః'** అంటూ ధ్వని విశేషాన్ని శ్లాఘించాడు సంజయుడు.

అంతా ప్రత్యేకతే. అన్నీ ప్రత్యేకతలే. ఈ ప్రత్యేకతలలో ఉన్న దంతా దివ్యమైన ప్రభావమే. తెల్లని గుఱ్ఱాలు కట్టిన దేవతా రథము కనుక అన్నిటి కన్నా ప్రత్యేకంగా, దివ్యంగా శోభిస్తూ ఉంది. తెల్లదనము శాంతికి చిహ్నము. అపజయాలు, అవరోధాలు ఉన్న చోట శాంతి ఉండదు. కనుక తెల్లదనము విజయ చిహ్నము.

విజయోస్తు

శ్రీకృష్ణార్జునులు ఉన్న రథము, ఆ రథానికి కట్టిన గుఱ్ఱాలు, వారు మ్రోగించిన శంఖాలు అన్నిటిని విశేషణాలతో సంజయుడు వైభవోపేతంగా వర్ణించాడు. ఈ వర్ణన లోనే వివరణ లన్నీ ఉన్నాయి. అన్నీ విజయ చిహ్నాలే. ఇవన్నీ వినిన తరువాత ధృతరాష్ట్రుడు మనస్సు మార్చుకుంటా డని, సంధి చేసుకోమని దుర్యోధనునికి ఆజ్ఞ లిస్తాడని సంజయుడు ఊహిస్తున్నాడు. ఆశిస్తున్నాడు. అలా జరిగితే, ఇరుపక్షాలకు విజయమే. లేదా, విజయము ఏకపక్షం గానే ఉంటుంది. ఆ పక్షము ఎవరిది? అనే సంశయానికి ఇక తావు లేదు. ఆ వివరణమే ఈ వర్ణనము. తనకు విజయమో! వినాశమో! ధృతరాష్ట్రుడే నిర్ణయించుకోవాలి.

ఇలా పలికి పాండవ సైన్యంలో ఎవరెవరు ఏయే నాదాలు వినిపించారో, ఏయే శంఖాలు పూరించారో విపులంగా వివరిస్తున్నాడు సంజయుడు.

పాఞ్చజన్యం హృషీకేశో దేవదత్తం ధనఞ్జయః ।
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 15

పాంచజన్యం-హృషీకేశః-దేవదత్తం-ధనంజయః
పౌండ్రం-దధ్మౌ-మహాశంఖం-భీమకర్మా-వృకోదరః

హృషీకేశః	=	శ్రీకృష్ణుడు	వృకోదరః	=	భీముడు
పాంచజన్యం	=	పాంచజన్యమును	పౌండ్రం	=	పౌండ్రమనే
ధనంజయః	=	అర్జునుడు	మహాశంఖం	=	గొప్ప శంఖమును
దేవదత్తం	=	దేవదత్తమును	దధ్మౌ	=	పూరించారు
భీమకర్మా	=	భయంకరమైన పనులు చేసే			

శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. అర్జునుడు దేవదత్తాన్ని ఊదాడు. ఇక భీకర కృత్యాలు చేసే భీముడు మాత్రం, పౌండ్రం అనే గొప్ప శంఖాన్ని మ్రోగించాడు.

వ్యాఖ్య

దైవ సన్నిధి

కౌరవ పక్షంలో ప్రథమంగా భీష్ముడు శంఖాన్ని పూరించాడు. కాని, పాండవుల పక్షంలో ప్రథమంగా శ్రీకృష్ణ భగవానుడు పూరించాడు. సర్వ సేనాధిపతిగా ఆ వైపు భీష్ముడు మ్రోగించి నపుడు ఈ వైపు ధృష్టద్యుమ్నుడు మ్రోగించాలి. కాని, యుద్ధము చేయను అని ద్వారక లోనే దుర్యోధ నార్జునులకు ప్రతిజ్ఞ చేసిన శ్రీకృష్ణుడు యుద్ధంలో శంఖాన్ని పూరించాడు.

కౌరవుల సైన్యము వీరుల పరిరక్షణలో ఉంది. పాండవ సైన్యము దైవానుగ్రహంతో నడుస్తుంది అని దీని అర్థము. పాండవ పక్షానికి అధ్యక్ష స్థానంలో అచ్యుతుడు ఉన్నాడు. ఇక వారికి నశింపు లేదు అని భావము.

పరమేశ్వరుడు పూరించిన శంఖము పేరు పాంచజన్యము. శ్రీకృష్ణుడు తన గురుపుత్రుని అపహరించిన పంచజనుడు అనే రాక్షసుని సంహరించి, అతని ఎముకతో శంఖమును తయారు చేసుకోవడం చేత ఆ శంఖానికి పాంచజన్యము అనే పేరు వచ్చింది.

శంఖము శల్యమే

శంఖము అనేది ఒక ప్రాణి. అది జలచరము. చేప లాగా నీటిలో ఉంటుంది. మనకు మాంసము, ఎముకలు దేహం లోపల ఉంటాయి. పైన చర్మము ఉంటుంది. శంఖమునకు అలా కాదు. బయట ఎముక ఉండి లోపల మాంసము ఉంటుంది. కనుకనే శంఖంలో ప్రాణి ఉన్నప్పుడు నీళ్ళల్లో శంఖము కదులుతూ ఉండటాన్ని కూడా మనం చూడగలం.

సముద్రంలో పంచజనుడు అనే రాక్షసుని ఎముక నుండి గ్రహించుట చేత శ్రీకృష్ణుని శంఖమునకు పాంచజన్యము అనే పేరు వచ్చింది.

శంఖాస్థి పావనం అపావన మస్థిమాణాం

శంఖము యొక్క ఎముక చాలా పవిత్రము. ఇతర ప్రాణుల ఎముకలను మనం అపవిత్రంగా భావిస్తాము. శంఖము యొక్క ఎముక పవిత్రము కాబట్టే మనం లింగాభిషేకాన్ని శంఖము తోనే నిర్వహిస్తాము. ఒక పురుగు లేదా ప్రాణి యొక్క శల్యము పూజోపకరణంగా మారిపోయింది. ఎంత అద్భుతం!

శ్రీకృష్ణ పరమాత్మ పాంచజన్యాన్ని పూరించాడు. అది మామూలు శబ్దము కాదు. గీతాఘోషము. హృషీకములు అంటే ఇంద్రియాలు. వాటికి ప్రభువు కనుక శ్రీకృష్ణుడు హృషీకేశుడు. అట్టి శ్రీకృష్ణుడు పాండవుల వైపు ఉన్నాడు. కనుక కౌరవుల శక్తి సామర్థ్యాలు పాండవుల ముందు పని చేయవు అనేది సంజయుని అభిప్రాయం. యుద్ధం మానుకోమని ధృతరాష్ట్రునికి సంకేతం.

శ్రీకృష్ణదేవుని ఈ శ్లోకంలో హృషీకేశుడని పలికిన సంజయుడు ముందు శ్లోకంలో మాధవుడని అన్నాడు. మాధవుడు అంటే లక్ష్మీపతి అని అర్థము. 'మా' అంటే లక్ష్మీదేవి. ఆమెకు 'ధవుడు' అనగా భర్త కనుక మాధవుడు ***(మాయాః శ్రియః ధనః పతిః మాధవః).*** ఇక్కడ లక్ష్మీదేవి అంటే ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి అని అర్థం కాదు. జయలక్ష్మి, విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి అని అర్థము. విజయలక్ష్మి భర్త పాండవుల వైపు ఉన్నాడు కనుక విజయము వారిదే, ఇక నీ ఇష్టం, అని ధృతరాష్ట్రుని సూక్ష్మంగా హెచ్చరిస్తున్నాడు సంజయుడు.

దైవ ప్రసాదం

శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరిస్తే, అర్జునుడు దేవదత్తాన్ని మ్రోగించాడు. దేవాసుర సంగ్రామంలో రాక్షసులతో పోరాడి విశేషంగా వారిని అర్జునుడు సంహరించి నపుడు అచ్చెరు వొందిన దేవతలు ఆనందంతో అనుగ్రహించిన శంఖమే దేవదత్తము. కనుక అర్జునుని శంఖారావము సాధారణ శంఖధ్వని కాకుండా అలౌకిక నాదాన్ని వినిపిస్తూ ఉంటుంది.

అర్జునాచ్యుతులు నరనారాయణులే అని మనకు తెలుసు. అర్జునుడు నరుడు. నరుడికి దేవతలు ప్రసాదించింది కనుక పార్థుని శంఖము దేవదత్తము. వాస్తవానికి ఒక్క నరుడికే కాదు, అర్జునుడికే కాదు, నరులందరికీ, సమస్త మానవాళికి దేవదత్త మనే శంఖము ప్రసాదించ బడింది. దానిని వినియోగించుకొనే సామర్థ్యం ఉంటే ప్రతి ఒక్కరు అలౌకిక నాదాలను ఆలకించ వచ్చు. ఆనంద స్వరాలను ఆస్వాదించ వచ్చు. సృష్టిలో ఏ ప్రాణికి దక్కని ఈ భాగ్యాన్ని భగవంతుడు నరులకే ప్రసాదించాడు. అందుకే అది దేవదత్తం.

మానవుని కంఠమే దేవదత్తం. పశుపక్ష్యాదులకు కంఠాలు ఉన్నాయి. అవి అరుపులకు పనికొస్తాయి. అక్షరాన్ని పలికేందుకు ఉపకరించవు. అనంతుని నామమే అక్షరం. దివ్యాక్షరం. వేద నాదమే అక్షరం. వేదవాణి అక్షరం. ఇవన్నీ పలికేందుకు, పాడేందుకు సహకరించే కంఠ మనే శంఖము దైవ ప్రసాదం. దేవదత్తం. పలికే వారికి భగవంతుడు పలుకుతాడు. పిలిచే వారికి భగవంతుడు పలుకుతాడు. నారదుడికి పలికాడు. ప్రహ్లాదునికి పలికాడు. మీరాబాయికి పలికాడు. త్యాగరాజుకు పలికాడు. దేవదత్తాన్ని మ్రోగించే వాళ్ళు ఎవరైనా కృష్ణ ప్రియులే. కృష్ణ సఖులే. అర్జునులే.

జగతి కొలనులో వెలుగు చున్నది
కమల లోచనుని చరణ కమలము *
ఆడవే పాడవే అందాల తుమ్మెద
సుధలు గ్రోలి నిండును నీ యెద
పాడవే తుమ్మెద కృష్ణుని మీద
ఆడవే పాడవే హాయిగా తీయగా *॥ పాడవే ॥*

అని దేవదత్తాన్ని పూరించే ప్రయత్నం చేసింది చైతన్య గీతిక.

దేవదత్తాన్ని పూరించిన అర్జునుని ధనంజయుడు అంటున్నాడు సంజయుడు. రాజసూయ యాగ సమయంలో రాజ్యాలను, రాజ్యాధిపతులను జయించి ధనరాశుల్ని తెచ్చి నందున అర్జునుడు ధనంజయుడని మహాభారతంలో వ్యాసుని మాట. అంటే ధనం అర్జునుని ముందు ఓడి పోయిందని భావము. దైవానికే

* పాదోఽస్య విశ్వాభూతాని - పురుషసూక్తము.

గాని ధనానికి పీట వేయని పార్థుడు ధనంజయుడు. అందుకే దైవాన్ని తన బండి లోనే కూర్చోబెట్టు కున్నాడు విజయుడు.

ఇక్కడ ధనంజయుడు అనే సంబోధనముతో మరొక సంకేతాన్ని కూడా ధృతరాష్ట్రునికి ఇచ్చాడు సంజయుడు. అర్జునుడు ధనం కోసం యుద్ధం చెయ్యడం లేదు. ధర్మం కోసం యుద్ధం చేస్తున్నాడు. ధర్మ రూపంలో ఉన్న దైవం ప్రక్కనే ఉన్నాడు. విజయము వాళ్ళనే వరించి తీరుతుంది. కనుక, సంధికి ఇంకా సమయం దాటి పోలేదు. ఇక నైనా మేలుకో అని పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

అంతేకాదు. ఈ శ్లోకంలో అర్జునుని ధనంజయు డని పేర్కొనిన సంజయుడు ముందు శ్లోకంలో పాండవః అన్నాడు. అంటే, పాండురాజు కుమారుడు అని అర్థము. రాజ్యము పాండురాజుదే కనుక, ఏ విధంగా చూచినా రాజ్యము పాండవులదే అని మర్మంగా భాషించాడు కూడా.

భీమం - భీకరం

భయంకరమైన కార్యాలు చేసే భీముడు పౌండ్రము అనే గొప్ప శంఖాన్ని పూరించాడు. వృకము అనే అగ్నిని కుక్షిలో కలిగి ఉన్నాడు కనుక భీమునికి వృకోదరుడు అనే పేరు వచ్చింది. ఎంత ఆహారా న్నైనా జీర్ణించుకొనే శక్తి భీమునికి ఉంది. అలాగే యుద్ధంలో ఎందరి నైనా మట్టుపెట్టే సామర్థ్యం కూడా ఉంది. భయంకరమైన కర్మలు చేసే భీమసేనుడు పౌండ్ర మనే శంఖాన్ని భీకరంగా ఊదాడు. పాండవులలో మిగిలిన ముగ్గురు సోదరులు ఏయే శంఖాలను పూరించారో తరువాత శ్లోకంలో చెబుతున్నాడు సంజయుడు.

అనంత విజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।
నకులః సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ ॥ 16

అనంతవిజయం-రాజా-కుంతీ పుత్రః-యుధిష్ఠిరః
నకులః-సహదేవః-చ-సుఘోష మణిపుష్పకౌ

కుంతీపుత్రః	=	కుంతీపుత్రుడు	నకులః	=	నకులుడు
రాజా	=	రాజైన	సహదేవశ్చ	=	సహదేవుడు
యుధిష్ఠిరః	=	ధర్మరాజు	సుఘోష మణిపుష్పకౌ	=	సుఘోష మణిపుష్పకము లనే శంఖాలను
అనంత విజయం	=	అనంత విజయమును			

కుంతీపుత్రుడు, మహారాజైన యుధిష్ఠిరుడు, అనంత విజయ మనే శంఖాన్ని పూరిస్తే, నకులుడు సుఘోషాన్ని, సహదేవుడు మణిపుష్పకాన్ని పూరించారు.

వ్యాఖ్య

అనంతం

ధర్మరాజు అనంత విజయము అనే శంఖాన్ని పూరించాడు. అనంత విజయం అంటే సదా విజయమును దర్శించు వాడు అని అర్థము. ధర్మరాజును ప్రత్యేకంగా రాజు అని సంజయుడు సంబోధించడం గమనార్హం.

ప్రస్తుతం రాజ్యానికి రాజు దుర్యోధనుడే గాని ధర్మరాజు కాదు. దుర్యోధనుడు రాజ్యాన్ని మోసంతో చేజిక్కించుకున్నా, వాస్తవానికి ధర్మరాజే రాజు అని సంజయుడు ధర్మవచనాన్ని వినిపిస్తున్నాడు. అంతే కాదు. అనంత విజయము అనే శంఖాన్ని పూరించిన యుధిష్ఠిరుడు కురుక్షేత్రంలో విజయాన్ని సాధించి, రాజుగా సింహాసనాన్ని అధిష్ఠించేది తథ్యం అనేది కూడా సంజయుని మాటల్లో దోబూచు లాడుతోంది.

సుఘోషం

నకులుడు సుఘోషము అనే శంఖాన్ని పూరించాడు. సుఘోషము అంటే ఇంపైన శబ్దము. శ్రావ్యమైన శబ్దము. మంగళకరమైన ధ్వని. ధర్మరాజు అనంత విజయాన్ని ఊది విజయ కేతనాన్ని ఎగుర వేయడం ఖాయం అని సూచిస్తే, ఆ తరువాత మంగళ నాదాలతో ధర్మరాజు సింహాసనాన్ని అధిష్ఠించడం అక్షర సత్యం అని సుఘోషం ద్వారా నకులుడు చెప్పకనే చెబుతున్నాడు.

మణిపుష్పకం

సహదేవుడు మణిపుష్పకం అనే శంఖాన్ని పూరించాడు. ధర్మరాజు అనంత విజయాన్ని పూరించేశాడు. విజయ సూచకంగా నకులుడు సుఘోషాన్ని వినిపించాడు. మణిమయ నవరత్న ఖచిత సింహాసనం పై ధర్మరాజు ఆసీనుడు కావడం ఒక్కటే మిగిలి ఉంది. అది కూడా జరిగి తీరుతుంది అనే సంకేతా న్నిస్తూ సహదేవుడు మణిపుష్పకాన్ని పూరించాడు.

విజయ సూచకం

ఐదుగురు పాండవ సోదరులు దివ్యములైన ఐదు శంఖాలను పూరించారు. అన్నీ విజయ సూచకంగా, మంగళకరంగా వినిపించాయి. శంఖాలు ఐదు వినిపించినా విజయం ఒక్కటే అన్నట్లుగా ఉంది ఆ ఘోష. పైగా ఆ రోజు ఏకాదశి.

దివ్య నామాలతో శోభించే పాండవుల శంఖాలు శ్వేతవర్ణంతో పవిత్రంగా ప్రకాశిస్తున్నాయి. **పాండవాః** అంటే హంస రెక్కల వలె తెల్లగా ఉండే వారు, స్వచ్ఛమైన వారు అని అర్థము. ఇదంతా విజయ సూచకమే.

పాండవులకు ముందుగానే కౌరవులు శంఖములను పూరించారు. కాని, ఒక్క శంఖమున కైనా పేరు ఉన్నట్లు వినలేదు. అవి ప్రఖ్యాతికి నోచుకోని శంఖాలు. పాండవుల శంఖాలకు పేరు ప్రఖ్యాతు లున్నాయి. అంటే, ప్రసిద్ధమైన వని భావం. పంచ పాండవులతో పాటు పాండవ పక్షాన ఇంకా ఎవరెవరు శంఖాలను పూరించారో చెబుతున్నాడు సంజయుడు.

కాశ్యశ్చ పరమేష్వాసః శిఖణ్డీ చ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః ॥ 17

కాశ్యః-చ-పరమేష్వాసః-శిఖండీ-చ-మహారథః
ధృష్టద్యుమ్నః-విరాటః-చ-సాత్యకిః-చ-అపరాజితః

పరమేష్వాసః	=	శ్రేష్ఠమైన విల్లు గల	ధృష్టద్యుమ్నః	=	ధృష్టద్యుమ్నుడును
కాశ్యశ్చ	=	కాశీరాజు	విరాటః చ	=	విరాటుడును
మహారథః	=	మహారథుడైన	అపరాజితః	=	పరాజయ మెరుగని
శిఖండీ చ	=	శిఖండియు	సాత్యకిః చ	=	సాత్యకియును

గొప్ప ధనుస్సును పట్టుకొని కాశీరాజు, మహారథుడు శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, పరాజయం తెలియని సాత్యకి - ఇంకా,

వ్యాఖ్య

మహా ధనుర్ధారి కాశీరాజు, మహారథు డైన శిఖండి, సర్వసేనాధిపతి ధృష్టద్యుమ్నుడు, విరాటరాజు, పరాజయ మెరుగని కృష్ణుని సోదరుడు సాత్యకి వారి వారి శంఖాలను మ్రోగించారు.

ఈ శ్లోకంలో కూడా చివరగా అపజయము లేదు అనే మాటను వినిపిస్తున్నాడు సంజయుడు. యుద్ధమును మొదట నుండి వ్యతిరేకిస్తున్న సంజయుడు అనుక్షణము ఆ ప్రయత్నం లోనే ఉన్నట్లు కనిపిస్తోంది.

కౌరవుల విజయం భీష్మద్రోణుల మీదే ఆధారపడి ఉంది. కాని, కేవలం వారిద్దరిని సంహరించ డానికే జన్మించిన వీరులు ఇద్దరు ఈ శ్లోకం లోనే ఒదిగి పోయారు. భీష్ముని పాలిట మృత్యువుగా శిఖండి, ద్రోణుని పాలిట కాలుడుగా ధృష్టద్యుమ్నుడు కనిపిస్తూనే ఉన్నారు. అందుచేత కూడా పాండవులు అపరాజితులు. పాండవ సేనలో శంఖనాదం చేసిన వీరులను తరువాత శ్లోకంలో కూడా చెప్పి, అక్కడికి ఆపుతున్నాడు.

ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।
సౌభద్రశ్చ మహాబాహుః శఙ్ఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ॥ 18

ద్రుపదః-ద్రౌపదేయాః-చ-సర్వశః-పృథివీపతే
సౌభద్రః-చ-మహాబాహుః-శంఖాన్-దధ్ముః-పృథక్-పృథక్

పృథివీపతే	=	హే భూపతీ!	సర్వశః	=	అంతట
ద్రుపదః	=	ద్రుపదుడు	పృథక్ పృథక్	=	వేరు వేరుగా
ద్రౌపదేయాః చ	=	ద్రౌపది కుమారులు	శంఖాన్	=	శంఖములను
మహాబాహుః	=	గొప్ప భుజములు గల	దధ్ముః	=	పూరించారు
సౌభద్రః చ	=	సుభద్ర కొడుకు అభిమన్యుడు			

హే ధృతరాష్ట్ర మహారాజా! ద్రుపదరాజు, ద్రౌపది కొడుకులు, గొప్ప బాహువులతో శోభిస్తూ సుభద్ర కొడుకు అభిమన్యుడు - అందరూ అంతట ఎవరికి వారుగా శంఖాలను పూరించారు.

వ్యాఖ్య

క్రమం - సక్రమం

ద్రుపదరాజు, ద్రౌపది కుమారులు (ఉప పాండవులు ఐదు మంది), గొప్ప బాహువులు కలిగిన సుభద్ర కుమారుడు అభిమన్యుడు, వీరందరూ శంఖాలను పూరించారు. కాని పాండవ పక్షం లోని వీరులు పూరించిన శంఖాలన్నీ వేరు వేరుగా ధ్వనించాయి (**పృథక్ పృథక్**) అంటున్నాడు సంజయుడు.

కౌరవులు పూరించి నపుడు నేటి చట్టసభల్లో ప్రజా ప్రతినిధు లందరూ మూకుమ్మడిగా లేచి, ఒకేసారి అర్థం కాకుండా అరచినట్లు ఉంటే, పాండవులు పూరించిన శంఖాలు ఒక దాని తరువాత ఒకటిగా సునాద భరితంగా, పూర్వపు రోజుల్లో క్రమశిక్షణ కలిగిన నాయకులు చట్టసభల్లో ఒకరి తరువాత ఒకరు భావగర్భితంగా ప్రసంగించినట్లు ఉన్నాయని అర్థము.

కౌరవుల క్రమశిక్షణా రాహిత్యానికి, పాండవుల క్రమశిక్షణకు ఈ శంఖారావాల లోని వ్యత్యాసాలే అద్దం పడుతున్నాయి.

ఈ శ్లోకంలో ధృతరాష్ట్రుని పృథివీపతీ! అని సంజయుడు సంబోధించడం వాస్తవానికి విశేషమే. ప్రస్తుతం నీవు భూపతివి. పాండవుల భూమిని వారికి పంచి ఇచ్చి నట్లైతే, ఈ భీకర పోరాటము ఉండేది కాదు. కాని, నీవే పృథివీపతిగా శోభించా లనుకున్నావు. ఇక ఆ స్థానము ఉండబోదు. నీకు రాజ్యం మిగలదు. నీవు రాజుగా ఉండలేవు. అందుకే చివరి సారి పృథివీపతీ! అని పిలుస్తున్నా. కళ్ళు ఎలాగూ తెరువలేవు. మనస్సు నైనా తెరచి చూడు. వాళ్ళ రాజ్యాన్ని వాళ్ళకు అప్పగించడం క్రమం. సక్రమం. లేదా, అంతా అక్రమమే. అధర్మమే. ఇది, సంజయుని పిలుపు లోని అంతర్భావం.

ఇంతవరకు పాండవుల శంఖనాదాలను వినిపించిన సంజయుడు, వాటి ప్రభావము ఎలా ఉందో చెబుతున్నాడు.

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥ 19

సః-ఘోషః-ధార్తరాష్ట్రాణాం-హృదయాని-వ్యదారయత్
నభః-చ-పృథివీం-చ-ఏవ-తుములః-వ్యనునాదయన్

తుములః = భయంకరమైన
సః ఘోషః = ఆ శబ్దము
నభః చ = ఆకాశమును
పృథివీం చ ఏవ= భూమిని కూడా
వ్యనునాదయన్ = మారు పలికిస్తూ
ధార్తరాష్ట్రాణాం = ధృతరాష్ట్రుని బిడ్డల
హృదయాని = గుండెలను
వ్యదారయత్ = చీల్చి వేసింది

పాండవులు భయంకరంగా శంఖాల్ని పూరించారు. ఆ శబ్దాలు భూమ్యాకాశాలను ప్రతిధ్వనింప చేశాయి. ధృతరాష్ట్రుని బిడ్డల గుండెల్లో దడ పుట్టించాయి.

వ్యాఖ్య

పాండవ సైన్యము చేసిన శంఖనాదాలు భూమ్యాకాశాలను ప్రతిధ్వనింప చేశాయి. దారుణమైన ఆ సంకుల శంఖ ధ్వనికి దుర్యోధనాదుల గుండెలు జారి పోయాయి.

అంతకన్నా ముందే కౌరవులు శంఖనాదాలు వినిపించడం మనం చూశాం. ఆ శబ్దాలకు పాండవులు చలించ లేదు. కాని, పాండవుల భయంకర మైన శంఖ నాదాలకు కౌరవుల హృదయాలు బ్రద్ద లైనట్లు వింటున్నాం.

హృదయ విదారకమైన ఈ పరిస్థితికి పాండవుల వీర్య శౌర్యాలు, దివ్యములైన శంఖములు వినిపించిన భీకర ధ్వనులు ఒక కారణ మైతే, కౌరవులలో దోష స్పృహతో కూడిన ఆంతరంగిక సంఘర్షణ మరొక కారణము.

పాండవుల శంఖనాదాలకు కౌరవులలో అధైర్యం చోటు చేసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తూ ఉంది. కాని, కౌరవుల శంఖనాదాలకు పాండవులు భీతి చెందక పోగా, రెట్టించిన ధైర్యోత్సాహాలతో ప్రతిస్పందనను వినిపించారు.

కౌరవుల భయానికి వారి అధర్మ వర్తనమే కారణము. పాండవుల ధైర్యానికి వారి ధర్మవర్తనము, గతంలో ఆర్జించిన పుణ్యమే కారణము.

అథ వ్యవస్థితా న్దృష్ట్వా ధార్తరాష్ట్రా న్కపిధ్వజః ।
ప్రవృత్తే శస్త్రసమ్పాతే ధను రుద్యమ్య పాణ్డవః ॥ 20
హృషీకేశం తదా వాక్య మిదమాహ మహీపతే ।

అథ-వ్యవస్థితాన్-దృష్ట్వా-ధార్తరాష్ట్రాన్-కపిధ్వజః
ప్రవృత్తే-శస్త్రసంపాతే-ధనుః-ఉద్యమ్య-పాండవః
హృషీకేశం-తదా-వాక్యం-ఇదం-ఆహ-మహీపతే

అథ = తరువాత
మహీపతే = ఓ భూపతీ!
శస్త్రసంపాతే = ఆయుధ ప్రయోగము
ప్రవృత్తే = జరుగ బోతుండగా
కపిధ్వజః = పతాకము నందు కపిరాజు గల
పాండవః = పాండు కుమారుడు
వ్యవస్థితాన్ = సిద్ధంగా ఉన్న
ధార్తరాష్ట్రాన్ = ధృతరాష్ట్రుని బిడ్డల్ని
దృష్ట్వా = చూచి
ధనుః = వింటిని
ఉద్యమ్య = ఎత్తి పట్టుకొని
తదా = అప్పుడు
హృషీకేశం = శ్రీకృష్ణునితో
ఇదం = ఈ
వాక్యం = మాటను
ఆహ = పలికాడు

ధృతరాష్ట్ర మహారాజా! ఆయుధ ప్రయోగానికి సమయం ఆసన్నమైంది. జండా పై కపిరాజును పెట్టుకున్న అర్జునుడు నీ కొడుకుల్ని చూశాడు. ధనుస్సును పైకెత్తి కృష్ణుడితో చెబుతున్నాడు.

వ్యాఖ్య

శస్త్రాస్త్ర ప్రయోగానికి సమయం ఆసన్న మైంది. జండాపై కపిరాజును కలిగిన అర్జునుడు దుర్యోధనాదుల్ని చూశాడు. గాండీవాన్ని ఎత్తి పట్టుకున్నాడు. ఏదో చెప్పాలని శ్రీకృష్ణుని వైపు చూశాడు.

రణరంగంలో అందరి రథాలకు పతాకాలు ఉంటాయి. కొందరివి ప్రత్యేక చిహ్నాలతో ఉంటాయి. అర్జునుని రథానికి అమర్చిన పతాకంపై కపీశుడు హనుమంతుడు ఉన్నాడు.

మహాభారతము - అరణ్యపర్వములో గంధమాదన పర్వత ప్రదేశము గుండా సౌగంధికా వనం వైపు సాగి పోతున్న భీమసేనుడికి హనుమంతుడు దర్శన మిచ్చి, కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుని రథముపై రెపరెప లాడే ధ్వజముపై తాను ఉంటాడని మాట ఇచ్చాడు. అలాగే ఇప్పుడు అర్జునుని స్యందన ధ్వజంపై ఆంజనేయుడు శోభిస్తున్నాడు.

అర్జున ఉవాచ :

సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥ 21
యావ దేతా న్నిరీక్షేఽహం యోద్ధుకామా నవస్థితాన్ ।
కైర్మయా సహ యోద్ధవ్య మస్మి న్రణ సముద్యమే ॥ 22

సేనయోః-ఉభయోః-మధ్యే-రథం-స్థాపయ-మే-అచ్యుత
యావత్-ఏతాన్-నిరీక్షే-అహం-యోద్ధుకామాన్-అవస్థితాన్
కైః-మయా-సహ-యోద్ధవ్యం-అస్మిన్-రణసముద్యమే

అచ్యుత = శ్రీకృష్ణా!
ఉభయోః = రెండు
సేనయోః = సేనల
మధ్యే = నడుమ
మే = నా యొక్క
రథం = రథమును
స్థాపయ = ఉంచు
అస్మిన్ = ఈ
రణసముద్యమే = యుద్ధ సమయాన
మయా = నా చేత
కైః+సహ = ఎవరితో
యోద్ధవ్యం = యుద్ధము చేయాలో
యోద్ధుకామాన్ = సమరవాంఛ గల
అవస్థితాన్ = ఉన్న

ఏతాన్	= వీళ్ళను	యావత్ నిరీక్షే	= ఎక్కడ నుండి చూడగలనో
అహం	= నేను		

అర్జునుడు అంటున్నాడు :

కృష్ణా! నా రథాన్ని నడిపించు. రెండు సేనల మధ్యన ఉంచు. నే నెవరితో యుద్ధం చేయాలి? యుద్ధానికి ఎవరెవరు సిద్ధంగా ఉన్నారు? వాళ్ళను నేను చూచేటట్లు నా రథాన్ని ఉంచు.

వ్యాఖ్య

మహాభారత యుద్ధము ప్రారంభమయ్యే సమయం సమీపించింది. మహాభారతానికి ముందు ఎన్నో యుద్ధాలు జరిగాయి. కాని మహాభారతము లాంటి యుద్ధము మును పెన్నడూ జరగ లేదు. అందుకే అది మహా సంగ్రామము.

ఉభయ సైన్యాలు సమరానికి సిద్ధంగా ఉన్నాయి. ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. అశ్వములు సకిలిస్తున్నాయి. అంతా కోలాహలం. రథాశ్వముల డెక్కల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. యావద్భారతం లోని రాజు లందరూ యుద్ధభూమిలో ఏదో ఒక పక్షాన నిలబడి ఉన్నారు.

ఏ క్షణం కొరకు అర్జునుడు నిరీక్షించాడో ఆ క్షణం రానే వచ్చింది. ఒక దారుణ బీభత్స సన్నివేశానికి తెర లేవబోతోంది. దుర్యోధనుని దుర్మార్గ కృత్యాలతో విసిగి పోయిన పాండవులు ధర్మానికి పట్టాభిషేకం చేసేందుకు కురుక్షేత్రంలో ఆయుధాలతో నిలబడ్డారు.

కృష్ణా! నా రథాన్ని ఉభయ సేనల మధ్య ఉంచు అన్నాడు అర్జునుడు. తాను ఎవరితో యుద్ధం చేయాలో వారిని చూడాలి అంటున్నాడు. ఎక్కడ రథాన్ని ఉంచితే, శత్రుపక్షం లోని వీరుల్ని చూచే అవకాశం ఉంటుందో అక్కడ ఉంచ మంటున్నాడు. శ్రీకృష్ణుణ్ణి ఆజ్ఞాపిస్తున్నా నేమో? అనే సందేహం కూడా అర్జునునిలో ఉదయించ లేదు. యుద్ధ సమయంలో ఉభయ సేనల మధ్య రథాన్ని ఉంచడము ప్రమాదం కాదా? అనే ఆలోచన కూడా పార్థునికి తట్టలేదు. అవన్నీ కృష్ణుడే చూసుకుంటా డనే విశ్వాస మేమో! అచ్యుతా! అని సంబోధించడం లోని ఆంతర్యం అదే నేమో!

కౌరవుల లోన నిప్పు డెవ్వారి తోడ న
నికి గడగుదు నో చూచి కొనగ వలయు
నరద మల్లన యుభయ సైన్యముల నడిమి
నేల కటు వోవగా నిచ్చి నిలుపు మచట ।

అని తిక్కన సోమయాజి ఆంధ్రానువాదము.

యోత్స్యమానా నవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధే ర్యుద్ధే ప్రియచికీర్షవః ॥ 23

యోత్స్యమానాన్-అవేక్షే-అహం-యే-ఏతే-అత్ర-సమాగతాః
ధార్తరాష్ట్రస్య-దుర్బుద్ధేః-యుద్ధే-ప్రియచికీర్షవః

దుర్బుద్ధేః	= దుష్టబుద్ధి యైన	ప్రియ చికీర్షవః	= మేలు చేయదలచిన వారై
ధార్తరాష్ట్రస్య	= దుర్యోధనునకు	య ఏతే	= ఏ వీరులు
యుద్ధే	= యుద్ధము నందు	అత్ర	= ఇక్కడ

సమాగతాః	= సమావేశ మయ్యారో	అహం	= నేను
యోత్స్యమానాన్	= అలా యుద్ధము చేసే వాళ్ళని	అవేక్షే	= చూస్తాను

దుర్యోధనుడిది పాడు బుద్ధి. అతడికి మేలు చేయాలని యుద్ధానికి వచ్చిన వాళ్ళెవరో వాళ్ళను చూస్తాను.

వ్యాఖ్య

దుర్యోధనుడు దుర్బుద్ధి కలవాడు. అతనికి మేలు చేయాలని, ప్రియమును చేకూర్చాలని ఎవరెవరు వచ్చి యున్నారో వాళ్ళను చూస్తాను అంటున్నాడు అర్జునుడు. ఇక్కడ అర్జునుని ఆంతర్యాన్ని కొద్దిగా ఆలోచించాలి. దుష్టుడైన దుర్యోధనుని వైపు ఉన్న వీరులు ఏదో కారణం చేత అతనికి మేలు చేయాలని వచ్చిన వారు ఉంటారే గాని, మాకు కీడు చేయాలి అనే ఆలోచనతో వచ్చి ఉంటారని నేను అనుకోను. యుద్ధాన్ని నివారించే ప్రయత్నం వాళ్ళు కూడా చేసే ఉంటారు. దుర్యోధనుడిది దుష్టబుద్ధి కనుక వాళ్ళు చెప్పినా విని ఉండడు. అందుచేత, వాళ్ళ కున్న ప్రత్యేక కారణాల వల్ల యుద్ధానికి అనివార్యంగా వచ్చి ఉంటారే గాని, మాకు కీడు చేయాలని ఎవ్వరూ భావించరు. మేము ఎవరికి కీడు చేశామని మాకు కీడు తల పెడతారు? భీష్మద్రోణాదులు కూడా దుర్యోధనుని తృప్తి పరచేందుకే వచ్చారు కదా! మేము గాయ పడటాన్ని వాళ్ళు తట్టుకో గలరా? కృష్ణా! అందుకని ఎక్కడ నువ్వు రథాన్ని ఉంచితే నేను అందరినీ చూడ గలనో అక్కడ ఉంచు అన్నాడు అర్జునుడు.

సంజయ ఉవాచ :

ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।
సేనయో రుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥ 24

ఏవమ్-ఉక్తః-హృషీకేశః-గుడాకేశేన-భారత
సేనయోః-ఉభయోః-మధ్యే-స్థాపయిత్వా-రథోత్తమమ్

భారత	= ఓ ధృతరాష్ట్రుడా!	ఉభయోః	= రెండు
ఏవం	= ఈ విధముగా	సేనయోః	= సైన్యముల
గుడాకేశేన	= అర్జునుని చేత	మధ్యే	= నడుమ
ఉక్తః	= చెప్పబడిన	రథోత్తమం	= గొప్పది యగు రథమును
హృషీకేశః	= శ్రీకృష్ణుడు	స్థాపయిత్వా	= నిలిపి

సంజయుడు చెప్పాడు :

ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు అలా చెప్పాడు. అంతే. శ్రీకృష్ణుడు రథాన్ని తీసికెళ్ళి రెండు సేనల నడుమ ఉంచాడు.

భీష్మద్రోణ ప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।
ఉవాచ పార్థ పశ్యైతా న్సమవేతాన్ కురూ నితి ॥ 25

భీష్మద్రోణ ప్రముఖతః-సర్వేషాం-చ-మహీక్షితాం
ఉవాచ-పార్థ-పశ్య-ఏతాన్-సమవేతాన్-కురూన్-ఇతి

భీష్మద్రోణ ప్రముఖతః = భీష్మద్రోణుల ఎదుట
చ = మరియు
సర్వేషాం = సర్వులైన
మహీక్షితాం = రాజుల ఎదుట
పార్థ = ఓ అర్జునా
సమవేతాన్ = సన్నద్ధులైన

ఏతాన్ = ఈ
కురూన్ = కౌరవులను
పశ్య = చూడు
ఇతి = అని
ఉవాచ = పలికెను

రాజు లందరి ముందు, భీష్ముడికి ద్రోణుడికి ఎదురుగా శ్రీకృష్ణుడు రథాన్ని నిలిపాడు. అర్జునా! యుద్ధానికి నడుం కట్టిన కౌరవుల్ని చూడు! అన్నాడు.

వ్యాఖ్య

గుడాకేశు డైన అర్జునుడు చెప్పినట్లే చేశాడు హృషీకేశుడైన శ్రీకృష్ణుడు. నిద్రను జయించిన వాడు గుడాకేశుడు. ఇంద్రియాలను ప్రేరేపించే వాడు హృషీకేశుడు. అర్జునుడు అవధానంతో ఉన్నాడు. శ్రీకృష్ణుడు ఉద్యమించే స్థాయిలో, పురికొల్పే స్థితిలో ఉన్నాడు.

ప్రస్తుతానికి రథాన్ని తీసుకెళ్ళి అర్జునుడు చెప్పినట్లు ఉభయ సేనల మధ్య ఉంచాడు. రథం లోనే ఉన్నాడు కనుక పాండవ మధ్యముడు కూడా మధ్యకే చేరాడు. అందరి దృష్టి ఆ రథం మీదనే ఉంది. అది ఉత్తమ మైన రథం కదా! *(రథోత్తమమ్).*

అగ్నిదేవుడు ప్రసాదించిన రథం. మంగళకరంగా తెల్లని దేవతాశ్వములు కట్టిన రథం. జండాపై హనుమంతుడు. రథం నడుమ నరుడు. నడిపే చోట నారాయణుడు. ఇక, ఆ రథం యొక్క గొప్పతనాన్ని ప్రత్యేకించి చెప్పే దేముంది? కనిపిస్తూనే ఉంది కదా!

ప్రతి మానవ శరీరము రథమే. ఎవరి మనస్సులో మాధవుడు కొలువై ఉంటాడో అది ఉత్తమ మైన రథము *(రథోత్తమమ్).* మాధవుడు అందరి లోను ఉన్నాడు. కాని మాధవ స్పృహ అందరిలో లేదు. మాధవ స్మరణము అందరి మనస్సులు చేయ లేవు. అలా చేసే మనస్సులను కలిగిన శరీరాలే ఉత్తమ రథాలు.

పెట్ట మన్నాడు - చిచ్చు పెట్టమన లేదు

రెండు సేనల నడుమ రథాన్ని పెట్టమన్నాడు అర్జునుడు. అంతే. ఎవరి ముందు పెడితే అర్జునుని బుద్ధి కలత పడుతుందో అక్కడ రథాన్ని పెట్టాడు శ్రీకృష్ణుడు. ఎవరిని చూస్తే కయ్యానికి కాళ్ళు తడబడతాయో, గుండెలు అదురుతాయో వాళ్ళ ఎదురుగా బండిని ఆపాడు. రాజు లందరి ముందు, భీష్మద్రోణులకు ఎదురుగా రథాన్ని నిలిపాడు. అంతటితో ఆగాడా? 'అర్జునా! యుద్ధం చేయడానికి సిద్దంగా ఉన్న కౌరవులను చూడు!' అన్నాడు *(ఉవాచ పార్థ! పశ్యైతాన్ సమవేతాన్ కురూన్ ఇతి).* మొదటి అధ్యాయంలో శ్రీకృష్ణుడు పలికిన ఒకే ఒక వాక్యం ఇది. అది కూడా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడని సంజయుడు చెప్పిన వాక్యం.

పార్థ! పశ్య

అర్జునా! సమరాభిలాషు లైన కురుసేనను చూడు అన్నాడు శ్రీకృష్ణుడు. చూడాలనే ఉద్దేశం తోనే అర్జునుడు రెండు సేనల నడుమ రథాన్ని ఉంచ మన్నాడు. అలాగే ఉంచాడు శ్రీకృష్ణుడు. కళ్ళెదుట *(ప్రముఖతః)* కనిపిస్తున్న వారిని, చూడు *(పశ్య)* అని ప్రత్యేకంగా చెప్ప వలసిన అవసరం లేదు. అయినా, శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆ సన్నివేశంలో, ఆ పరిస్థితిలో 'చూడు' అనే ఆ చిన్న మాట అనూహ్యమైన రీతుల్లో అర్జునుని అంతఃకరణమును కుదిపేసింది. ఆంతర్యంలో కల్లోలాన్ని రేపింది. వివేకాన్ని కలత పెట్టింది.

విషాదానికి పీట వేసింది. కొండంత గుండెను పిండి చేసింది. ద్వేషాగ్నితో రగిలి పోతున్న మనస్సును మమకారంతో నిర్వీర్యం చేసింది.

ఎదురు పడగానే ఎద పగిలింది

భీష్మద్రోణుల ఎదుట రథం ఆగింది. చూడు! అన్నాడు కృష్ణుడు. ఏమి చూడాలి? ఏదో చూశాడు అర్జునుడు. ఏదేదో చూశాడు. ఎదలో దాగిన మమకారా న్నంతా చూశాడు. ఏదో అయ్యాడు. ఎదురాడే శక్తిని కోల్పోయాడు. ఎదురుకొనే పటిమను పడేసు కున్నాడు. ఎదబాధతో ఎదురీద లేక నిశ్చేష్టుడై నిలబడి పోయాడు.

చూడు! అనే ఒక్క మాటే పలికాడు మాధవుడు. ఆ ఒక్క మాటను పట్టుకొని ఏకంగా ఏకేస్తోంది అర్జునుని మనస్సు.

అర్జునా! చూడు! ఎదురుగా ఎవరున్నారో చూడు! భీష్మ తాతయ్య! మీ కురు వంశాభివృద్ధికి ఆయన ఎన్ని త్యాగాలు చేశాడు? ఎన్ని సుఖాలు త్యజించాడు? జీవితంలో ఆయన సుఖపడిం దెప్పుడు? మీ సుఖానికి ఆయన ఆరాట పడని క్షణ మేదో కాస్త ఆలోచించు. పుణ్యాత్ముడు. ధర్మాత్ముడు. వేదవిదుడు. సత్యవ్రతుడు. అసమాన పరాక్రమవంతుడు. ఆయన ఒడి లోనే కదా నువ్వు పెరిగింది! బాల్యంలో నీకు కథలు చెప్పిన తాతయ్య! యౌవ్వనంలో మీ ప్రగతికి బాటలు వేసిన తాతయ్య! ఆ వృద్ధ పితామహుణ్ణి పూజించ వలసిన నీవు, గౌరవించ వలసిన నీవు, ఆయనపై శరవర్షం కురిపించి, ఆ ముసలి ప్రాణం నేల కొరిగితే చూడాలని ఉన్నావా? పార్థ! పశ్య! చూడు! చూడు! బాగా చూడు! ఆయన త్యాగానికి ఇదా ఫలితం? ఆయన ప్రేమకు ఇదేనా నీవు పట్టే నీరాజనం? పార్థ! పశ్య! అర్జునా! చూడు! ఇలాగే చూచి ఉంటుంది అర్జునుని మనస్సు. ఇలాగే చూపి ఉంటుంది పార్థుని హృదయం.

అర్జునా! అటు చూడు! ఆ ప్రక్కనే ఎవ రున్నారో చూడు! ఆచార్యా! అని నీవు ప్రణామం చేసే నీ గురువు ద్రోణాచార్యుడు. తన బిడ్డ అశ్వత్థామ కన్నా నిన్నే ఎక్కువగా ప్రేమించిన వాడు. తన కుమారునికి చెప్పని ధనుర్విద్యా రహస్యాల్ని నీకు చెప్పాడు. నిన్ను సవ్యసాచిగా తీర్చి దిద్దాడు. అర్జునునికి మించిన విలుకాడు మరొకడు ఉండటానికి వీలు లేదని బహిరంగంగా ప్రతిజ్ఞ బూనిన బ్రాహ్మణుడు. నిన్ను మించి పోతాడేమో నని ఏకలవ్యుని బొటనవ్రేలును గురుదక్షిణగా గ్రహించి మాయని మచ్చ తెచ్చు కున్నాడు. అలాంటి ఆచార్యునిపై సుమవర్షాన్ని కురిపించ వలసిన నువ్వు, శరవర్షాన్ని కురిపించి, ఆ మహాత్ముని పవిత్ర దేహం రక్తపు మడుగులో పడి ఉంటే చూడాలని ఉబలాట పడుతున్నావా? పార్థా! పశ్య! అర్జునా! చూడు. చూడు. బాగా చూడు. గురువులకు శిష్యు లిచ్చే గురుదక్షిణ ఇదేనా? గురువు ఋణం తీర్చుకొనే మార్గం ఇదేనా? భావితరాలలో శిష్యు లందరూ నిన్నే ఆదర్శంగా తీసుకుంటే, ఇక ఆ తరువాత గురువుల గతేమిటో ఆలోచించు! పార్థ! పశ్య! అర్జునా! చూడు. ఇలాగే అవలోకించి ఉంటాడు అర్జునుడు. ఇలాగే కలతపడి ఉంటుంది అర్జునుని ఆంతర్యం.

అంతే. తాను దగా పడింది అంతా మరచి పోయాడు మహాత్ముడైన అర్జునుడు. దయతో చలించి పోయాడు. కరుణతో కదలి పోయాడు. తాను చేస్తున్న దేమిటి? అని పునరాలోచన చేశాడు. ఏదో తప్పు చేస్తున్నట్లు తడబడి పోయాడు.

ఊహల ఊయల

మరొక కోణం నుండి చూద్దాం! ఒకవేళ రథాన్ని భీష్మద్రోణుల ముందు ఉంచకుండా దుశ్శాసనుని ముందు గాని, దుర్యోధనుని ముందు గాని, శకుని ముందు గాని, (కర్ణుడు యుద్ధభూమిలో లేడు కనుక) నిలిపి ఉంటే ఎలా ఉండేది? ఏమో! ద్రౌపది వస్త్రాపహరణం స్మృతిలో మెదిలి, వెంటనే గాండీవాన్ని చేబూని గడగడ లాడించేవా డేమో గాండీవి.

అంటే, రణరంగంలో భీష్మద్రోణులు ఉన్నపళంగా ఊడి పడ్డారా? వారుభయులు రణభూమిలో ఎదురుగా దర్శన మిస్తారని ధనంజయునికి ముందు తెలియదా? తెలిసే కదా వచ్చాడు? పైగా సవ్యసాచి సామాన్యుడా! పశుపతితో పోరాడిన దిట్ట! అలాంటి వాడు ఇలా ఎందు కయ్యాడు?

అందుకే అంటున్నాను మాధవుని వశ్య గుళిక బాగా పని చేసిందని! కొన్ని సందర్భాలలో మామూలు మాటలే మారణహోమాల్ని సృష్టిస్తాయి. లేదా, మంగళ తోరణాలు కట్టిస్తాయి. కోటలు కట్టేవీ మాటలే. కోటలు కూల్చేవి కూడా మాటలే.

భీష్మద్రోణుల రూపాలు కౌంతేయుని కలత పెట్టాయా? లేక పరంధాముడు పలికిన వశ్య సూత్రం ఫలించిందా? లేక ఈ రెండు దోహదం చేశాయా? కాకపోతే, అర్జును డంతటి మహావీరుడు అలా నీరసించడ మేమిటి? అని ఆలోచించి నపుడు, ఏది ఏమైనా, కనిపించిన రూపాలో, వినిపించిన శబ్దాలో, ఏవైనా గాని, భీష్మద్రోణుల ప్రభావం ఆ క్షణంలో పార్థుని బుద్ధిపై పడింది అని మాత్రం అనిపిస్తోంది. కారణం కూడా కనిపిస్తోంది. భగవద్గీత, రెండవ అధ్యాయం సాంఖ్యయోగం లోని నాల్గవ శ్లోకంలో అర్జునుడు చెప్పిన దానిని విశ్లేషిస్తే, ఆధారానికి సంబంధించిన ద్వారం తెరచు కుంటుంది.

కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన॥

కృష్ణా! భీష్మద్రోణులు పూజింప దగిన వారు. వారిని యుద్ధంలో బాణాలతో ఎదుర్కొని ఎలా పోరాడేది? అన్నాడు అర్జునుడు. ఇది ఊహల ఊయలో, లేక వాస్తవాల పల్లకీయో పట్టింపు లేదు కాని, ఇది మనం పట్టించుకో వలసిన విషయమా, కాదా! అనేదే మీమాంస.

జగన్నాటకం - జగన్నాథ రథం

అయితే, ఇదంతా కృష్ణుడు ఆడిన నాటకమా? అర్జునుణ్ణి బలహీన పరచింది కృష్ణుడేనా? కృష్ణుడు ఇదంతా ఎందుకు చేసినట్లు? ఎవరు అడగాలి? ఎవర్ని అడగాలి? పరమేశ్వర లీలల్ని ప్రశ్నించే శక్తి ఎవరి కుంది? సమాధానం చెప్పే సామర్థ్యం మాత్రం ఎవరి కుంది? ఈశ్వర సంకల్పాలు ఈశ్వరునికే ఎరుక.

కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు ఉన్నాడని మనకు తెలుసు. కృష్ణుని హృదయంలో ఏముందో ఎవరికి తెలుసు? కృష్ణుని ముందు అర్జును డున్నాడు. కాని, అనాదిగా అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న జీవు లెందరో శ్రీకృష్ణుని మనస్సులో కదిలి ఉంటారు. మహారణ్యంగా గోచరిస్తున్న ఉపనిష ద్వనంలో విహరించలేని సామాన్య జనులకు సైతం ఉపనిషత్సారాన్ని అందించాలని అచ్యుతుడు భావించి ఉంటే, అది మానవాళికి మహాభాగ్యం కాదా! ఆశీర్వాదం కాదా! అనుగ్రహం కాదా! భగవద్గీత మానవాళికి ఎనలేని, కొనలేని ఐశ్వర్యం కాదా!

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందనః

ఉపనిషత్తు లనే ఆవుల నుండి గీతామృతాన్ని పితికిన గోపాలుడు కురుక్షేత్రాన్ని అక్షయ గోశాలగా ఎన్నుకొని ఉంటే, లోక కళ్యాణానికి ఇంకేమి కావాలి? అదే జరిగిందేమో! అర్జునుణ్ణి నిమిత్తంగా చేసికొని ఉపనిషత్సారాన్ని గీతా పీయూషంగా మానవాళికి అందించాడేమో *('అర్జున నిమిత్తీ కృత్య' అని శ్రీ శంకర భాష్యము).*

ఇదే వాస్తవ మైతే, కురుక్షేత్రంలో అర్జునుడికి ఎదురైన సమస్య కల్పిత మేనా? అర్జునుని విషాదము కేవలం మానవాళి కొరకు మాధవుడు సృష్టించిందేనా? అర్జునుని సమస్యకు పరిష్కారంగా గీత ఆవిర్భవించింది అంటున్నారు కదా! సమస్యే కల్పిత మైనపుడు, పరిష్కారం సత్యం ఎలా అవుతుంది? భగవద్గీతను అందించాలనే ఉద్దేశాన్ని సఫలం చేసుకోవడానికి అర్జునుని ప్రయత్న పూర్వకంగా కృష్ణుడు కలత పెట్టడం సమంజసమా?

సర్వజ్ఞుడైన పరమేశ్వరునికి గీతను అందించటానికి మరొక మార్గమే లేకపోయిందా? ఇలా ప్రశ్నల వర్షం కురిస్తే ఆశ్చర్యపో నవసరం లేదు.

అర్జునుడిలో ఉత్పన్నమయ్యే మమకార జనిత శోక మోహాలను ముందే గుర్తించి శ్రీకృష్ణుడు రథాన్ని అక్కడ ఉంచాడేమో! అందరి భావాలను గ్రహించి, ప్రేరేపించే శక్తి పరమేశ్వరునికి ఉంది అనే కదా ఆ దివ్యాత్ముని 'హృషీకేశుడు' అని ఈ శ్లోకం లోనే తెలుసుకున్నాం! అంతా ఈశ్వరలీల.

త త్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄ నథ పితామహాన్।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీం స్తథా॥ 26
శ్వశురా న్సుహృద శ్చైవ సేనయో రుభయో రపి।

తత్ర-అపశ్యత్-స్థితాన్-పార్థః-పితౄన్-అథ-పితామహాన్
ఆచార్యాన్-మాతులాన్-భ్రాతౄన్-పుత్రాన్-పౌత్రాన్-సఖీన్-తథా
శ్వశురాన్-సుహృదః-చ-ఏవ-సేనయోః-ఉభయోః-అపి

అథ	= తరువాత		భ్రాతౄన్	=	అన్నదమ్ములను
పార్థః	=	అర్జునుడు	పుత్రాన్	=	కొడుకులను
తత్ర	=	అక్కడ	పౌత్రాన్	=	మనుమలను
ఉభయోః సేనయోః	=	రెండు సేనలలో	సఖీన్	=	మిత్రులను
అపి	=	కూడా	తథా	=	అలాగే
స్థితాన్	=	ఉన్నట్టి	శ్వశురాన్	=	మామలను
పితౄన్	=	తండ్రులను	సుహృదః చ	=	స్నేహితులను
పితామహాన్	=	తాతలను	ఏవ	=	కూడా
ఆచార్యాన్	=	గురువులను	అపశ్యత్	=	చూశాడు
మాతులాన్	=	మేనమామలను			

అర్జునుడు సైన్యంలో ఇరువర్గాలను చూశాడు. తండ్రులు, తాతలు, గురువులు, మేనమామలు, అన్నదమ్ములు, కొడుకులు, మనుమళ్ళు, స్నేహితులు, మామలు, మిత్రులు - అందరూ వీళ్ళే కనిపించారు.

వ్యాఖ్య

ఉభయ సేనల మధ్య నిలిచిన రథము నుండి వీక్షించిన అర్జునునికి ఇరుపక్షాల లోని వీరు లందరూ కనిపించారు. కౌరవ సైన్యములో దుర్యోధనాదులకు బంధువు లెవరో వారు తమకు కూడా బంధువులే. తమ సైన్యములో తమకు ఎవరు బంధువులో వారందరూ కౌరవులకు కూడా బంధువులే. ఇక ఎవరికి ఎవరితో యుద్ధము? కుడి చేత్తో ఎడమ చేతిని, ఎడమ చేత్తో కుడి చేతిని మెలిపెడితే ఒరిగే దేముంటుంది?

శత్రువులతో యుద్ధం చేయడం కష్టం కాక పోవచ్చు. ఇక్కడ శత్రువు లెవరు? పరిశీలించి చూస్తే అందరూ తన వాళ్ళే. ఒక్కచోట కలసి భోం చేయవలసిన వాళ్ళు. ఒకరి కష్టాన్ని మరొకరు పంచుకో వలసిన వాళ్ళు. కలసి తినడానికి బదులు కలసి తన్నుకో వలసిన పరిస్థితి వస్తే, వినడానికే రుచించదు. ఇక పాల్గొనే వారికి ఎలా ఉంటుంది?

యుద్ధం చేయాలి అంటే శత్రుభావం ఉండాలి. ద్వేష వృత్తి ప్రకోపించాలి. కాని, ఇక్కడ ఎవరితో శత్రుత్వము? ఎవరిపై ద్వేషము? అందరినీ వీక్షించాడు విజయుడు. రెండు సేనలు రెండు కళ్ళుగా కనిపిస్తున్నాయి. ఏ కన్ను పోయినా తనకే నష్టం. కళ్ళు రెండైనా చూపు ఒకటే అయినట్లు, సేనలు రెండైనా, అర్జునుడికి ఒక్కటి గానే గోచరిస్తున్నాయి.

ఇరుపక్షాల వారిని కలయ చూశాడు. తండ్రులు, తాతలు, గురువులు, మేనమామలు, అన్నదమ్ములు, బిడ్డలు, మనుమళ్ళు, స్నేహితులు, మామలు, మిత్రులు అందరూ వీళ్ళే. వీళ్ళతో పాటు ఏ పాపము ఎరుగని సామాన్య జనులు. అందరినీ చూశాడు.

తా న్సమీక్ష్య స కౌన్తేయః సర్వా న్బన్ధూ నవస్థితాన్ ॥ 27
కృపయా పర యావిష్టో విషీద న్నిద మబ్రవీత్ ।

తాన్-సమీక్ష్య-సః-కౌంతేయః-సర్వాన్-బంధూన్-అవస్థితాన్
కృపయా-పరయా-ఆవిష్టః-విషీదన్-ఇదం-అబ్రవీత్

సః	= ఆ	పరయా	= అత్యంత
కౌంతేయః	= అర్జునుడు	కృపయా	= కరుణతో
అవస్థితాన్	= సన్నద్ధులై యున్న	ఆవిష్టః	= కూడుకొని
తాన్	= ఆ	విషీదన్	= బాధ పడుతూ
సర్వాన్	= సమస్తమైన	ఇదం	= ఈ విధముగా
బంధూన్	= బంధువులను	అబ్రవీత్	= అన్నాడు
సమీక్ష్య	= బాగా చూచి		

యుద్ధానికి సిద్ధంగా ఉన్న బంధువు లందరినీ చూశాడు అర్జునుడు. అపార మైన కరుణతో చలించి పోయాడు. బాధ పడుతూ చెబుతున్నాడు.

వ్యాఖ్య

మనస్సు చాలా విచిత్ర మైంది. విడ్డూర మైంది. కౌరవులను మట్టుపెట్టే సమయం ఎప్పుడు వస్తుందా అని ఇంతకాలం అర్జునుడు నిరీక్షించాడు. అలాంటి అవకాశం దానంతటదే నడచి వచ్చి ముందు నిలబడిన క్షణాన, అర్జునుడు అపార కృపతో నీరసించి పోతున్నాడు. ఒకప్పుడు తాను ఆశించిందే. కాని, దానిని అందుకొనే స్థితిలో ఇప్పుడు లేడు.

బంధువు లందరినీ చూశాడు. మమకార పాశంతో బందీ అయ్యాడు. కృపా పరవశు డయ్యాడు. వీళ్ళను ఎలా వధించాలి? అని తనను తాను ప్రశ్నించు కున్నాడు. ఎంత ప్రశ్నించుకున్నా సమాధానం చిక్కలేదు. దొరక లేదు.

సంధి ప్రయత్నా లన్నీ విఫల మయ్యాయి. దుర్యోధనుని దురాగతాలు శ్రుతి మించాయి. క్రూరాత్ము లైన కౌరవులను ఇక విస్మరించ కూడదు. వీళ్ళను చంప వలసిందే అనే దృఢ నిశ్చయంతో యుద్ధానికి వచ్చిన అర్జునుడు, వీళ్ళనా నేను చంప వలసింది? అని ఇప్పుడు, ఇక్కడ తనలో తాను కుమిలి పోతున్నాడు. మమకారం వల్ల ఏర్పడిన కృపా పారవశ్యంతో చలించి పోతున్నాడు. ఇది మామూలు విషయం కాదు. సాధారణ సమస్య కాదు.

అర్జునుడు సాదాసీదా వ్యక్తి కాడు. తొందరపడి ఏ పనీ చేసే వాడు కాడు. వివేకంతో, విచక్షణతో జీవించేవాడు. విశ్లేషించుకుంటూ కార్యాచరణలో నిమగ్న మయ్యేవాడు. అందుకనే, యుద్ధానికి ముందే ఉభయ సేనల మధ్య రథాన్ని ఉంచ మన్నాడు. తాను చంప వలసిన వాళ్ళందరూ తన వారే. తన వాళ్ళతో కలసి శత్రువులను చంపడం వేరు. తన వాళ్ళనే శత్రువులుగా భావించి చంపడం వేరు.

కౌరవుల వల్ల అష్టకష్టాలు అనుభవించి ధర్మబద్ధంగా యుద్ధరంగంలో కాలు పెట్టిన అర్జునుడు, యుద్ధం ప్రారంభమయ్యే సంక్లిష్ట సమయంలో ఇలా నీరసించడ మేమిటి? అనేది సామాన్యమైన ప్రశ్న. దారుణమైన బాధల్ని అనుభవించి, కౌరవుల క్రూర కృత్యాలకు బలై కూడా, యుద్ధానికి విముఖంగా ఉన్నాడంటే, హేతువు ఏమై ఉంటుంది? ఆ హేతువు ఎంత బలీయ మైనది కాకపోతే గీత ఆవిర్భవిస్తుంది? అనేవి సామాన్యమైన ప్రశ్నలు కావు. విశేషమైన విశ్లేషణలు.

అర్జున ఉవాచ :

దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥ 28
సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ 29

దృష్ట్వా-ఇమం-స్వజనం-కృష్ణ-యుయుత్సుం-సముపస్థితం
సీదంతి-మమ-గాత్రాణి-ముఖం-చ-పరిశుష్యతి
వేపథుః-చ-శరీరే-మే-రోమహర్షః-చ-జాయతే

కృష్ణ	= ఓ కృష్ణా!	సీదంతి	= శిథిల మౌతున్నాయి
యుయుత్సుం	= యుద్ధము చేయగోరి	ముఖం చ	= నోరు కూడా
సముపస్థితం	= చేరి యున్న	పరిశుష్యతి	= ఎండిపోతూ ఉంది
ఇమం	= ఈ	మే	= నా యొక్క
స్వజనం	= బంధుజనమును	శరీరే	= దేహము నందు
దృష్ట్వా	= చూచి	వేపథుః చ	= వణుకు కూడా
మమ	= నా యొక్క	రోమహర్షః చ	= గగుర్పాటు కూడా
గాత్రాణి	= అవయవములు	జాయతే	= కలుగుతూ ఉంది.

అర్జునుడు అంటున్నాడు :

కృష్ణా! యుద్ధం చేయాలని వచ్చిన నా బంధువుల్ని చూశాను. నా అవయవాలు పట్టు తప్పుతున్నాయి. నోరు ఎండిపోతోంది. దేహంలో దడ పుడుతోంది. గగుర్పాటు కలుగుతోంది.

వ్యాఖ్య

ఉభయ సేనల మధ్య రథాన్ని నిలిపి, కళ్ళెమును లాగి పట్టుకొని, 'పార్థా! చూడు' అని ఇరవై ఐదవ శ్లోకంలో పలికిన పార్థసారథి, తాను కూడా కౌరవసైన్యాన్ని చూస్తూనే ఉన్నాడు. అర్జునుడు కృష్ణా! అని పిలిచి, తన దీన స్థితిని ఈ శ్లోకంలో వివరించ డానికి ప్రారంభించాడు. ఆ సంబోధనతో శ్రీకృష్ణుడు తన ఎడమ భుజముపై నుండి తలను తిప్పి అర్జునుని తదేకంగా చూశాడు. ఒక చేతితో కళ్ళెమును అందముగా లాగి

పట్టుకొని, రెండవ చేతిలో మునికోలను ధరించి, అర్జునుడు చెప్పే విషయాన్ని వెనుదిరిగి అవధానంతో ఆలకించే పార్థసారథి అద్భుత దృశ్యం ఈ సందర్భము లోనిదే. తేరులో ఈ తీరు లోనే ఉండి ఆలకిస్తున్న శ్రీకృష్ణుడు, తాను గీతను బోధించే సమయంలో దేహ స్థితిని మార్చి, అర్జునుని సూటిగా చూస్తూ పలుకుతాడు. అంతవరకు అలాగే వెను దిరిగి పార్థుని పలుకుల్ని ఓర్పుతో వింటూ ఉంటాడు.

కృష్ణా! అంతా చూశాను. అందరినీ చూశాను. వీళ్ళల్లో సుజను లున్నారు. కుజను లున్నారు. కాని, అందరూ స్వజనులే. నా వాళ్ళే. అటు వైపు నుండి నా వాళ్ళు వేసే బాణాలు ఇటు నా వాళ్ళకే తగుల్తాయి. ఇటు వైపు నుండి మేము ప్రయోగించే అస్త్రశస్త్రాలు అటు నా వాళ్ళకే తగుల్తాయి. నా వాళ్ళను నా వాళ్ళే చంపాలి. చచ్చే నా వాళ్ళు చంపే నా వాళ్ళ చేతి లోనే చావాలి. ఈ పరిస్థితిని నేను తట్టుకోలేక పోతున్నాను. దుర్భర దుఃఖంతో నలిగి పోతున్నాను.

ఈ దారుణ పరిస్థితిని చూచి నా అవయవాలు ముక్క లౌతున్నాయి. నోటిలో తడి ఆరి పోతోంది. శరీరం వణకుతోంది. రోమాంచ మవుతోంది.

మమకారం కొట్టిన దెబ్బకు అర్జునుని మనస్సు విలవిల లాడింది. మనస్సు పట్టు తప్పగానే, దేహం పట్టును కోల్పోయింది.

శత్రువుల దేహాంగాలను విడగొట్ట వలసిన వాడు నా అవయవాలు ముక్క లౌతున్నాయి అంటున్నాడు. ఎందుకు అలా అయ్యాయి? ఎవరు వాటిని అలా శిథిలం చేసింది? మమకారం వల్లే అంగాలు ముక్క లయ్యాయి. అహంకారమే అలా మమకారాన్ని వాటేసుకొని అంగాలను శిథిలం చేసింది.

ముక్కలైన అవయవాలు ఏ పని చేస్తాయి? ఏ పనీ చేయలేని అంగాలు సంగ్రామానికి పనికొస్తాయా? కాళ్ళు కదలడం లేదట. చేతులు చలనాన్ని కోల్పోయాయట.

నోటిలో తడి ఆరి పోయిందట (***ముఖం చ పరిశుష్యతి***). శుష్యతి అంటే ఆరిపోవడం. కాని, ఇక్కడ పరిశుష్యతి (***పరితః శుష్యతి***) అంటున్నాడు పార్థుడు. అంటే తడి ఏ మాత్రం లేకుండా నోరు ఎండి పోయింది అంటున్నాడు. దీనిని బట్టి అర్జునుని విషాదము ఏ స్థాయికి చేరుకుందో మనం ఊహించు కోవచ్చు.

ఎక్కువ దూరం నడిస్తే, దాహం వేసి నోరు ఎండి పోవచ్చు. అధికంగా వ్యాయామం చేస్తే నోటిలో తడి ఆరి పోవచ్చు. ఏ శ్రమ లేకపోయినా, కేవలం రథంలో ఆసీనమై ఉన్నా, నోటిలో తడి ఆరి పోయింది అంటే, అర్జునునిలో దుఃఖాగ్ని ఎలా రగులుతోందో ఆలోచిస్తే ఎవరి కైనా అర్థ మవుతుంది.

ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కోలేక శరీరం వణకుతోంది. గగుర్పాటు చెందుతోంది అంటూ, ఇంకా తన శారీరక లక్షణాలు, చిహ్నాలు ఎలా ఉన్నాయో వివరిస్తున్నాడు విజయుడు.

గాణ్డీవం స్రంసతే హస్తా త్త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ 30

గాండీవం-స్రంసతే-హస్తాత్-త్వక్-చ-ఏవ-పరిదహ్యతే
న-చ-శక్నోమి-అవస్థాతుం-భ్రమతి-ఇవ-చ-మే-మనః

హస్తాత్	=	చేతి నుండి	త్వక్ చ ఏవ	=	చర్మము కూడా
గాండీవం	=	గాండీవము	పరిదహ్యతే	=	మండిపోతూ ఉంది
స్రంసతే	=	జారిపోతూ ఉంది	అవస్థాతుం చ	=	నిలుచుటకు కూడా
న శక్నోమి	=	శక్తి లేకుండా ఉన్నాను	మనః	=	మనస్సు
మే	=	నా యొక్క	భ్రమతీవ	=	భ్రమించి నట్లుంది

గాండీవము చేతి నుండి జారి పోతోంది. చర్మం కాలి పోతోంది. నిలబడలేక పోతున్నాను. నా తల తిరుగుతోంది.

వ్యాఖ్య

గాండీవము అర్జునుని ధనుస్సు. తనకు ఎంతో ప్రియమైనది. కాని, అది కూడా చేతి నుండి జారిపోతూ ఉంది అంటున్నాడు అర్జునుడు. అంటే, తాను ప్రయత్నంతో పడేయడం లేదు. దానంతట అదే జారిపోతూ ఉంది అంటున్నాడు. అంటే సమరవాంఛ దానంతట అదే ఆవిరై పోతూ ఉంది అని అర్థం.

చర్మం కాలి పోతోందట. అంటే, దేహంలో మంట లెత్తుతున్నాయి. అందుకే చర్మము కాలి పోతోంది. మనసు మరిగి పోతోంది కనుకనే దేహములో మంటలు పుట్టు కొస్తున్నాయి. మమకారం దేహ మనస్సులను ఒకేసారి భయంకరంగా కాల్చేస్తూ ఉంటే ఆరాటపడి పోతున్నాడు అర్జునుడు.

ఈ దశలో అర్జునుడు రథంలో కూర్చొని ఉన్నాడు. యుద్ధం చేయాలి అంటే లేచి నిలబడాలి. లేచే పరిస్థితిలో లేడు. ఆ మాత్రం శక్తి కూడా లేదంటున్నాడు. నిజమేనా? అయితే ఎందుకిలా అయింది? ఉభయ సేనల మధ్య రథాన్ని ఉంచమని చెప్పి కొన్ని నిముషాలు మాత్రమే అయింది. ఈ లోగా లేవలేని విధంగా శక్తిహీను డెలా అయ్యాడు?

ప్రాణతుల్య మైన తమ వారు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతూ ఉన్న సమయంలో, వైద్యుడు రోగి గది నుండి బయటికి రాగానే, డాక్టరు గారు! ఎలా ఉంది? అని పరుగెత్తుకుంటూ వెళ్ళి అడుగుతారు. చెప్పలేము. ఏదైనా, ఏ క్షణమైనా జరగవచ్చు అని వైద్యుడు చెప్పగానే, ఆ అడిగిన వ్యక్తి అక్కడే కుప్పకూలి పోవడం మనం చూస్తేనే ఉంటాం. క్షణం క్రితం పరుగెత్తుతూ వచ్చి, వార్త వినగానే అశక్తుడై పడిపోవడం జరుగుతూ ఉంది. మనస్సు అశక్త మైనపుడు దేహం కూడా శక్తిహీన మవుతుంది. అందుకనే, తల తిరుగుతోంది (***భ్రమతీవ చ మే మనః***) అంటున్నాడు అర్జునుడు.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయోఽను పశ్యామి హత్వా స్వజన మాహవే ॥ 31

నిమిత్తాని-చ-పశ్యామి-విపరీతాని-కేశవ
న-చ-శ్రేయః-అనుపశ్యామి-హత్వా-స్వజనం-ఆహవే

కేశవ	=	ఓ కేశవా!	స్వజనం	=	బంధువులను
చ	=	ఇంకను	హత్వా	=	వధించి
విపరీతాని	=	విపరీతము లైన	అను	=	ఆ తర్వాత
నిమిత్తాని	=	శకునములను	శ్రేయః చ	=	శ్రేయమును
పశ్యామి	=	చూస్తున్నాను	న పశ్యామి	=	చూడలేక పోతున్నాను
ఆహవే	=	యుద్ధము నందు			

కేశవా! అపశకునాలు కనిపిస్తున్నాయి. యుద్ధంలో బంధువు లందరినీ చంపుకొని, నేను బావుకొనే దేమిటో ఊహించలేక పోతున్నాను.

వ్యాఖ్య

శకునాలు - నిమిత్తాలు

అపశకునాలు అగుపిస్తున్నాయి అంటున్నాడు అర్జునుడు. అపశకునాలు అనర్థ సూచకాలు. పక్షుల ద్వారా తెలిసేవి శకునాలు. అవి శుభములే. ఒకవేళ అశుభ మైతే దుశ్శకునాలు అనాలి. పక్షి కూస్తే శకునం. కాకి అరిస్తే శకునం. అసలు శకునం అంటేనే పక్షి అని అర్థము. ఆంధ్రంలో శకునము. సంస్కృతంలో **శకునః**

శకున్తిః శకునిః శకున్తః శకునః ద్విజః (పక్షీ)

అని అమరకోశము. నక్క అరిస్తే, కుక్క ఏడిస్తే అది శకునం కాదు. ఎందుకంటే, కుక్కలు, నక్కలు పక్షులు కావు కనుక. మరి, అప్పుడు దాని నేమనాలి? నిమిత్తం అనాలి. ఏదో ఆపద సూచితమే నిమిత్తం. విపరీతము లైన నిమిత్తాలను నేను చూస్తున్నాను అంటున్నాడు అర్జునుడు. విపరీతా లంటే అనర్థ సూచకాలు.

స్వపక్షమా? ప్రతిపక్షమా?

అర్జునుడి లాంటి వీరుడు చివరికి శకున శాస్త్రము నీడలో రక్షణ పొందాలని యత్నిస్తున్నాడు. విపరీత మైన నిమిత్తాలు, దుశ్శకునాలు కనిపిస్తున్నాయి అంటున్నాడు. అవి బాహ్యంలో కనిపించే రూపాలు, శబ్దాలు కావచ్చు. లేదా, తన శరీరము లోనే కంపించే అవయవాలు కావచ్చు.

బాగానే ఉంది. మరి, ఈ శకునాలు, నిమిత్తాలు ఎవరికి వర్తిస్తాయి? స్వపక్షం వారికా? లేక, ప్రతిపక్షం వారికా? ఎందుకంటే, ఈ శకునాలు, నిమిత్తాలు ఉభయులకూ కనిపిస్తున్నాయి కనుక.

ఎటైనా పోటే

ఎవరి కైతే ఏముంది? ఏ చెంపను వాయించినా కన్నీళ్ళే కదా వస్తాయి! ఎవరికి చెడు జరిగినా ఇరువురికీ అశుభమే. ఇరువురూ స్వజనులే. యుద్ధములో స్వజనులను చంపుట వలన *(హత్వా స్వజన మాహవే)* నాకు జరిగే మేలేమిటో గోచరించడం లేదు *(న చ శ్రేయోఽ ను పశ్యామి)*. ఎటు చూచినా ఈ యుద్ధము అనర్థ దాయకం గానే కనిపిస్తూ ఉంది. అంతా శూన్య ప్రయోజనం. బ్రతుకుకు అర్థ మేమిటో బోధ పడటం లేదు అని ఆవేదన చెందుతున్నాడు అర్జునుడు.

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవిన్ద కిం భోగై ర్జీవితేన వా ॥ 32

న-కాంక్షే-విజయం-కృష్ణ-న-చ-రాజ్యం-సుఖాని-చ
కిం-నః-రాజ్యేన-గోవింద-కిం-భోగైః-జీవితేన-వా

కృష్ణ	= హే కృష్ణా!	గోవింద	= హే గోవిందా!
విజయం	= విజయమును	నః	= మాకు
కాంక్షే	= కోరుట	రాజ్యేన	= రాజ్యముతో
న	= లేదు	కిం	= ఏమి లాభము?
రాజ్యం చ	= రాజ్యమును	భోగైః	= భోగముల చేత గాని
సుఖాని చ	= సుఖములను	జీవితేన వా	= బ్రతుకుట చేత గాని
న	= లేదు	కిం	= ఏమి లాభము?

కృష్ణా! నేను విజయాన్ని కోరుకోవడం లేదు. రాజ్యాన్ని ఆశించడం లేదు. సుఖాలకు ఆరట పడటం లేదు. హే గోవిందా! రాజ్యము వల్ల గాని, భోగాల వల్ల గాని మాకు ఒరిగే దేముంది? బ్రతుకే నిరర్థక మనిపిస్తోంది.

వ్యాఖ్య

యుద్ధం చేయడం వలన తనకు శ్రేయస్సు కలగదు అంటున్నాడు అర్జునుడు. అంటే, తనకు శ్రేయస్సు కావాలి. అది యుద్ధం చేయడం వల్ల లభించే అవకాశము లేదు అనే అభిప్రాయం అర్జునునికి ఉంది.

విజయ మెందుకు?

యుద్ధం చేస్తే మాకు ఒరిగే దేమిటి? అనేది ప్రశ్న. అంటే, విజయాన్ని సాధించడం ప్రయోజనం కాదా? అలాగైతే, ఇప్పటి వరకు యుద్ధాలు చేసి విజయాల్ని సాధించిన వారు ఎందుకు చేసినట్లు? యుద్ధాలలో విజయాలు సాధించక పోతే రాజ్యా లెలా ప్రాప్తించినట్లు?

పైగా, నీ పేరు విజయుడు కదా! విజయాన్ని సాధించే వాడివి కాబట్టే కదా, నీకు విజయుడు అనే పేరు వచ్చింది? మరి ఇలా యుద్ధానికి విముఖుడవై, విజయాన్ని చేజార్చుకుంటే, విజయుడు అనే పేరు పోదా?

కృష్ణా! పోతే పోనీ. పేరు ప్రఖ్యాతులే శ్రేయస్సు అని నాకు అనిపించడం లేదు. నేను విజయాన్ని కోరుకోవడం లేదు *(న కాంక్షే విజయం)*. విజయం సాధిస్తేనే రాజ్యం వస్తుంది అనేదే ప్రధాన విషయ మైతే, నాకు రాజ్యం కూడా అవసరం లేదు *(న కాంక్షే రాజ్యం)*.

రాజ్య మెందుకు?

కృష్ణా! రాజ్యాన్ని పొంది సాధించే ప్రయోజన మేమిటో కూడా నాకు తెలియడం లేదు. ***కారే రాజులు రాజ్యముల్ గలుగవే... వారేరి?*** రాజ్యము దుర్యోధనుడికి ఉంది కదా! మరి అతడు సుఖంగా ఉన్నాడా? కనుక, నేను రాజ్యాన్ని కోరుకోవడం లేదు అంటున్నాడు అర్జునుడు. మరి, అదే నిజమైతే, యుద్ధభూమికి ఎందుకు వచ్చినట్లు? రథం నడుప మని కృష్ణుని ఎందుకు అడిగినట్లు? నిజమే! యుద్ధం చేయాలనే కిరీటి కదన రంగంలో కాలు మోపాడు. కాని, యుద్ధభూమిలో బంధు జనాన్ని చూసిన తరువాత, సమరవాంఛ సన్నగిల్లింది. యుద్ధ విముఖత బుద్ధిలో జనించింది. మరి, రాజ్యం లేకపోతే, రాజ్యసుఖాలు ఎలా ప్రాప్తిస్తాయి? రాజ్యసుఖాలు కూడా అవసరం లేదు అంటున్నాడు *(సుఖాని న కాంక్షే)*.

సుఖా లెందుకు?

సుఖాల వల్ల ఏమి ప్రయోజనం? సుఖాలు మానవులకు తెలియనివి కావు. సాగర మంత దుఃఖాన్ని అనుభవించింది వాస్తవమే అయినా, కొద్దో గొప్పో కూప తటాకాది స్థాయిలో సుఖాలు కూడా మానవుల అనుభవంలో ఉన్నాయి. ఇంత వరకు అనుభవించిన సుఖాల వల్ల సాధించింది ఏముంది? అలాంటప్పుడు ఇక మున్ముందు కలిగే సుఖాల వల్ల మాత్రం ఒరిగేది ఏముంటుంది? మతాబుల కాంతి లాంటి సుఖాలు మనుగడకు వన్నె తెస్తాయా? మనిషికి తృప్తి నిస్తాయా?

రాజ్యాలు పొందినా, భోగాలలో రమించినా, వాటి వల్ల కలిగే ప్రయోజనము శ్రేయోదాయకమా? కానప్పుడు, ఈ రాజ్యా లెందుకు? విజయా లెందుకు? యుద్ధా లెందుకు? సరే, అదంతా బాగానే ఉంది అర్జునా! కాని, యుద్ధము చేయనంత మాత్రాన శ్రేయస్సు కలుగుతుందా? శ్రేయస్సు మాట దేవు డెరుగు. అసలు జీవనము సాగుతుందా?

జీవించడానికి ఇల్లు కావాలి. ధనం కావాలి. ఇవన్నీ ఎలా వస్తాయి? అర్జునుడు యుద్ధాన్ని విరమించాడు

కనుక, అతని కష్టసుఖాలు మేమే చూసుకుంటా మని దుర్యోధనుడు ముందుకు వస్తాడా? ఇంతెందుకు? అసలు రాజ్యంలో ఉండ నిస్తాడా? ఈ వేధింపుల మధ్య బ్రతికే దెలా? అదంతా ఏమో. అసలు బ్రతకడ మెందుకు? బ్రతికి ఏమి సాధించాలి? *(జీవితేన వా కిం?)* అంటున్నాడు అర్జునుడు.

బ్రతికి ఏమి సాధించాలి?

ఎందుకు జీవించాలి? జన్మించాము కనుక జీవించాలా? లేక, మరణం రాలేదు కనుక బ్రతకాలా? బ్రతికి సాధించే దేమిటి? ఎన్ని సాధించినా, ఒకనాడు మృత్యువు బాధించక తప్పదు *(మరణాంతం జీవితం)*. ఇలాంటి బ్రతుకు కోసం ఎంత మంది బ్రతుకుల్ని బలి తీసుకోవాలి? బ్రతుకు ఏమిటో, దేని కొరకో స్పష్టంగా అర్థం కాకపోవడం చేత బ్రతుకు మీదే విజయునికి విరక్తి పుట్టింది.

భావము నీదే - భారమూ నీదే

ఈ శ్లోకంలో పరమేశ్వరుని కృష్ణా! గోవిందా! అనే రెండు పవిత్ర నామాలతో సంబోధించాడు అర్జునుడు. తనకు ఏమి కావాలో నిర్ణయించుకో లేని స్థితిలో అర్జునుడు ఉన్నాడు. గోల పెట్టే మనసును గోప్యంగా ఉంచుకో లేక గోవిందా! అంటూ మొర పెట్టు కుంటున్నాడు.

గారేషా తు యతో వాణీ తాం చ విన్దయతే గోవిందః

'గో' అంటే వాక్కు. 'విందయతే' అంటే ఇవ్వడ మని అర్థము. వాక్కును అనుగ్రహించే వాడు, లేదా ప్రసాదించే వాడు కనుక శ్రీకృష్ణుడు 'గోవింద' శబ్దవాచ్యు డయ్యాడు.

కృష్ణా! మాట లైతే నా నుండి దొర్లుతున్నాయి. వాటి లోని మర్మ మేమిటో నాకు బోధ పడటం లేదు. మాటల్ని కదిలించే వాడివి నీవు. అవి ఎందుకు కదుల్తున్నాయో నీకే తెలుసు. గోవిందా! భావము నీదే. భావము తెలిసిన వాడివి కనుక, నా బాధను తొలగించే భారము కూడా నీదే.

మానవుని ఆలోచనలు సహజంగా బాహ్య ప్రపంచానికి సంబంధించే ఉంటాయి. మానవుడు ఆచరించే కర్మ లన్నీ బాహ్యం లోనే సాగుతుంటాయి. కాని, వాటికి కారణమైన భావాలు ఆంతర్యంలో మెదులుతూ ఉంటాయి. అంతర్యామిని ఆశ్రయించుకొని బాహ్యానికి కదులుతూ ఉంటాయి. ఇలా ఆంతర్యాన్ని ప్రేరేపించే గోవిందుని వైభవము బాహ్యంలో కూడా విరాజిల్లితే బ్రతుకు భగవన్మయ మవుతుంది. అందుకే నేమో, తాళ్ళపాక అన్నమయ్య ఆ దిశలో మనస్సుకు మార్గ నిర్దేశం చేశాడు.

భావము లోనా బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా ॥ ॥ భావము ॥

తన సమస్యను గోవిందుని ముందు పెడుతూ, తన మనసును గోవిందుని చేతికి అందిస్తూ, తాను వాంఛించే శ్రేయస్సును ప్రసాదించ మని గోవిందుని ప్రార్థిస్తున్నాడు పార్థుడు. ఆ భారము నీదే నంటూ గోవిందుని 'కృష్ణా' అని సంబోధించాడు.

సచ్చిదానందాత్మకః కృష్ణ వర్ణాత్మక త్వా ద్వా కృష్ణః

సచ్చిదానంద స్వరూపుడు కనుక భగవంతుడు 'కృష్ణ' శబ్ద వాచ్యు డయ్యాడు. కనుక, భావము నెరిగిన గోవిందా! నాకు నిత్యానందాన్ని (శ్రేయస్సు) ప్రసాదించే భారము కూడా నీదే నంటూ 'కృష్ణా' అని సంబోధించాడు అర్జునుడు.

అర్జునా! నీకు రాజ్యము అవసరం లేక పోవచ్చు. కాని, యుద్ధంలో నీవు ఒక్కడి వేనా ఉండేది? నీ వాళ్ళు లేరా? మనకు ఇష్టం లేకపోయినా, మన వాళ్ళ కోసం కొన్ని పనులు చేయాలి కదా! అలాగే, నీకు రాజ్యము

అవసరం లేకపోయినా, యుద్ధము ఇష్టం లేకపోయినా, నీ వాళ్ళ కోసమైనా చేయవచ్చు కదా! ఈ ప్రశ్నకు సమాధానమే తరువాత శ్లోకంలో అర్జునుని ఆవేదన.

యేషా మర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనాని చ ॥ 33

యేషాం-అర్థే-కాంక్షితం-నః-రాజ్యం-భోగాః-సుఖాని-చ
తే-ఇమే-అవస్థితాః-యుద్ధే-ప్రాణాన్-త్యక్త్వా-ధనాని-చ

యేషాం అర్థే	= ఎవరి కొరకు	త ఇమే	= అట్టి వీరందరు
నః	= మనకు	యుద్ధే	= యుద్ధము నందు
రాజ్యం	= రాజ్యము	ప్రాణాన్	= ప్రాణములను
భోగాః	= భోగములు	ధనాని చ	= ధనమును
సుఖాని చ	= సౌఖ్యములు	త్యక్త్వా	= విడిచి
కాంక్షితం	= కోరబడినవో	అవస్థితాః	= నిలబడి యున్నారు

కృష్ణా! రాజ్యాన్ని, రాజ్య భోగాల్ని, రాజ్య సుఖాల్ని మనం ఎవరి కొరకు ఆశించామో, వాళ్ళే యుద్ధంలో నిలబడి ఉన్నారు. సంపదల్ని వదిలేసు కున్నారు. ప్రాణాల్ని కూడా లెక్క చేయకుండా నిలిచి ఉన్నారు.

వ్యాఖ్య

లోకంలో ఎవరు ఏది సంపాదించినా - సుఖాలైనా, భోగాలైనా తన వారితో కలసి అనుభవించడం కొరకే. ప్రస్తుతం యుద్ధం చేసి రాజ్యాన్ని సాధించడం కూడా తన వాళ్ళ కొరకే అనేది అర్జునుని ఆలోచన. అదే వాస్తవ మైతే, తాను, తన వాళ్ళు మాత్రమే కలసి యుద్ధంలో పోరాడాలి. అలా కాకుండా, ఏడు అక్షౌహిణుల సైన్యం తన పక్షాన ఎందుకు వచ్చి నిలిచిందో అర్జునుడు ఆలోచించలేక పోతున్నాడు.

రాజ్యం తన వారి కొరకే అయితే, రాజ్యం కొరకు యుద్ధం చేయడం అనివార్య మైతే, ఈ యుద్ధం అనర్థ మని అర్జునుని అభిప్రాయం. నా వాళ్ళ కొరకు యుద్ధం చేయాలి. ఎవరితో చేయాలి? నా వాళ్ళ తోనే చెయ్యాలి. ఎవరి కొరకు *(ఏషా మర్థే కాంక్షితం)* యుద్ధం చెయ్యాలో, వారే వచ్చి యుద్ధంలో నిలబడి ఉన్నారు.

పైగా ప్రాణాలపై ఆశను వదలుకొని *(ప్రాణాన్ త్యక్త్వా)* యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. యుద్ధం జరిగితే, వారి ప్రాణాలు మిగలవు. రాజ్యం మిగుల్తుంది. ఏమి చేసుకోవాలి ఆ రాజ్యాన్ని? ఎవరితో కలసి రాజ్య సుఖాలు అనుభవించాలి?

యుద్ధభూమిలో ఉన్న నా వాళ్ళు వీరులు. అంతేకాదు. రాజ్యాలున్న వాళ్ళు. భాగ్యాలున్న వాళ్ళు. ధనమున్న వాళ్ళు. అయినా ధనంపై వారి కున్న ఆశను త్యజించారు. ధనాన్ని విడిచిపెట్టి *(ధనాని త్యక్త్వా)* తగాదాకు వచ్చారు. ఇప్పుడు తాను యుద్ధం చేసి ధనాన్ని సంపాదించి బావుకొనే దేముంటుంది? రాజ్యభోగాలు వీరి తోనే కదా కలసి అనుభవించాలి? వాటిని త్యజించే కదా వాళ్ళందరూ రణభూమిలో ఉన్నారు? ఇక రాజ్య మెందుకు? భోగా లెందుకు? రాజ్య భోగాల కొరకు రణ మెందుకు? సరే. ఇంతకీ ఆ తన వాళ్ళు ఎవరో చెబుతున్నాడు, చూద్దాం.

ఆచార్యాః పితరః పుత్రా స్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సమ్బన్ధిన స్తథా ॥ 34

ఆచార్యాః-పితరః-పుత్రాః-తథా-ఏవ-చ-పితామహాః

మాతులాః-శ్వశురాః-పౌత్రాః-శ్యాలాః-సంబంధినః-తథా

ఆచార్యాః	=	గురువులు	శ్వశురాః	=	మామలు
పితరః	=	తండ్రులు	పౌత్రాః	=	మనుమలు
పుత్రాః	=	కుమారులు	శ్యాలాః	=	బావలు
తథా ఏవ చ	=	అలాగు ననే	తథా	=	అట్లే
పితామహాః	=	తాతలు	సంబంధినః	=	చుట్టాలు
మాతులాః	=	మేనమామలు			

వాళ్ళెవరంటే - గురువులు, తండ్రులు, కొడుకులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమళ్ళు, బావలు - ఒక్క మాటలో చెప్పాలంటే చుట్టా లందరూ.

వ్యాఖ్య

తాను యుద్ధం చేసేది ఎవరి కొరకని అర్జునుడు భావిస్తున్నాడో, ఎవరు చనిపోతే, రాజ్యం లభించినా సుఖం ఉండదని చింతిస్తున్నాడో వాళ్ళను గూర్చి చెబుతున్నాడు.

ద్రోణుడు, కృపుడు మొదలైన గురువులు, సొమదత్తి మొదలైన తండ్రులు, లక్ష్మణ అభిమన్యాది కుమారులు, భీష్ముడు, సోమదత్తుడు మొదలైన తాతలు, శైబ్యుడు, ద్రుపదుడు మొదలైన మామలు, కుంతిభోజుడు, శకుని మొదలైన మేనమామలు, జయద్రథుడు మొదలైన బావలు, భీమ దుర్యోధన దుశ్శాసనాది సోదరులు - అందరూ వీళ్ళే. అర్జునుడికి వీళ్ళే కనిపిస్తున్నారు. మనస్సులో ఉన్న వాళ్ళే బయట కనిపిస్తున్నారు. వాస్తవానికి యుద్ధభూమిలో వీళ్ళే కాదు. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం నిలబడి ఉంది. వాళ్ళెవ్వరినీ ప్రస్తావించడం లేదు. వీరుడైన అర్జునుడు కాదు ప్రస్తుతం మాట్లాడేది. మమకారం బరి తెగించి మాట్లాడుతోంది. కట్లు త్రెంచుకొని పరుగిడుతోంది.

ఏతా న్న హన్తు మిచ్ఛామి ఘ్నతో౽పి మధుసూదన ।
అపి త్రైలోక్య రాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥ 35

ఏతాన్-న-హన్తుం-ఇచ్ఛామి-ఘ్నతః-అపి-మధుసూదన

అపి-త్రైలోక్య రాజ్యస్య-హేతోః-కిం-ను-మహీకృతే

ఏతాన్	=	వీరిని	ఇచ్ఛామి	=	కోరుట
ఘ్నతః అపి	=	చంపుతున్న వారైనా	న	=	లేదు
హంతుం	=	హింసించుటకు	మధుసూదన	=	హే మధుసూదనా!
త్రైలోక్య రాజ్యస్య	=	త్రిలోకాధిపత్యము	మహీకృతే	=	భూమి కొరకు
హేతోః అపి	=	కొరకు గాని	ను కిమ్	=	ఎలా కోరను?

ముల్లోకాల రాజ్యాధిపత్యము వచ్చి పడినా నేను వీళ్ళ నెవ్వరినీ చంపలేను. ఇక భూమి కోసం చంపుతానా? మధుసూదనా! ఒకవేళ వీళ్ళల్లో ఎవరైనా నన్ను చంపాలని ప్రయత్నించినా, నేను మాత్రం వాళ్ళను చంపను.

వ్యాఖ్య

సరే. అర్జునుడు కరుణా హృదయుడు. బంధువులను వధించలే నని బాధ పడుతున్నాడు. అలాగని,

దుర్యోధనాదులు వదిలి పెడతారా? అర్జునుడు చంపడం మానేసినా, వాళ్ళు విజృంభించి అర్జునుని వధించరా? ఆ మాత్రం సాహసం చేయలేని వాళ్ళా?

బాల్యం నుండి వాళ్ళు చేసిందంతా అదే కదా! భీముణ్ణి గంగలో ముంచలేదా? లక్క ఇంటికి నిప్పు పెట్టలేదా? విష ప్రయోగం చేయలేదా? ఈ కార్యాల వెనుక ప్రేమ లున్నాయా? మమకారా లున్నాయా? ఇన్ని చేసిన వాళ్ళు ఈ రోజు వారిని విడిచి పెడతారా? కారుణ్యంతో అర్జునుడు వారిని కనికరించినా, కాఠిన్యంతో అర్జునాదుల్ని మట్టు బెట్టే ప్రయత్నం చేయరా?

అది నిజమే. అయినా ఫరవాలేదు అంటున్నాడు అర్జునుడు. వాళ్ళు నన్ను చంపితే చంపనీ. నేను మాత్రం వాళ్ళను వధించను అంటున్నాడు (*ఏతాన్ న హన్తుం ఇచ్ఛామి ఘ్నతో౽పి*). తన వాళ్ళు, మన వాళ్ళు అనే మమకారం లేకుండా వాళ్ళు ప్రవర్తిస్తే అది వాళ్ళ వ్యవహారం. వాళ్ళు అలా వ్యవహరిస్తున్నా రని నేనెందుకు అలా వర్తించాలి? అనేది అర్జునుని ఆంతర్యం.

స్వర్గలోకము, మానవ లోకము, పాతాళము - ఇవే త్రిలోకములు. ఈ మూడు లోకాల రాజ్యాధిపత్యాన్ని ఇచ్చినా, తన వాళ్ళను వధించడం సాధ్యం కాదు. అలాంటప్పుడు భూలోకంలో ఏదో కొద్దిపాటి రాజ్యం కొరకు వధించడం సాధ్యమా? అనేది అర్జునుని వాదము.

ఇంతవరకు ఇహలోక సంబంధమైన సుఖాల కొరకు తన వారిని వధించడం సాధ్యం కాదని వాదించిన విజయుడు, ఈ శ్లోకం నుండి పరలోక సుఖాల కొరకు కూడా యుద్ధం చేయ లేనని చెబుతున్నాడు.

నిహత్య ధార్తరాష్ట్రా న్నః కా ప్రీతిః స్యా జ్జనార్దన ।
పాప మేవా శ్రయే దస్మా న్హత్వైతా నాతతాయినః ॥ 36

నిహత్య-ధార్తరాష్ట్రాన్-నః-కా-ప్రీతిః-స్యాత్-జనార్దన

పాపం-ఏవ-ఆశ్రయేత్-అస్మాన్-హత్వా-ఏతాన్-ఆతతాయినః

జనార్దన	=	హే జనార్దనా!	ఆతతాయినః	=	దురాత్ములైన
ధార్తరాష్ట్రాన్	=	ధృతరాష్ట్రుని కొడుకుల్ని	ఏతాన్	=	వీరిని
నిహత్య	=	చంపితే	హత్వా	=	చంపి
నః	=	మాకు	అస్మాన్	=	మమ్ములను
కా	=	ఏమి	పాపమేవ	=	పాపమే
ప్రీతిః	=	సంతోషము	ఆశ్రయేత్	=	ఆశ్రయిస్తుంది
స్యాత్	=	కలుగును?			

జనార్దనా! ధృతరాష్ట్రుని బిడ్డల్ని చంపితే మా కేమి సుఖం? వాళ్ళు పాపాత్ములు. పాపుల్ని చంపితే, మమ్మల్ని కూడా పాపమే చుట్టుకుంటుంది.

వ్యాఖ్య

దుర్యోధనాదులను వధించి సుఖించే దేముంటుంది? అనేది అర్జునుని ప్రశ్న. యుద్ధంలో దుష్టుడైన దుర్యోధనుడు ఒక్కడే లేడు. అతనికి సహకరించే వీరులు అనేక మంది వచ్చి ఉన్నారు. వారిలో ధర్మాత్ములు కూడా ఉన్నారు. ఈ సంగ్రామంలో వాళ్ళు నశించే ప్రమాదం కూడా ఉంది.

ఇకపోతే, కౌరవ సైన్యము కూడా పాండవ సైన్యములో కొందరిని సంహరించ వచ్చు. ఈ విధంగా

ఉభయ పక్షాలలో ఉత్తములైన వారు ఎందరో హతులయ్యే ప్రమాదం ఉంది. అదే జరిగితే, ఇహ లోకంలో మనం పరితపించక తప్పదు. పరలోకంలో పాప ఫలితాన్ని అనుభవించక తప్పదు. దుర్యోధనాదులు ఆతతాయులే. ఆ విషయంలో సందేహము లేదు. కాని, మనం అందరినీ వదలి ఆతతాయుల్ని మాత్రమే చంపలేము కదా! కనుక ఆతతాయుల్ని వధించడంలో దుష్టులే గాక పుణ్యాత్ములు, అమాయకులు కూడా వధింపబడే ప్రమాదం ఉన్నందున, ఆతతాయుల్ని వధించడంలో తమకు పాపమే చుట్టుకుంటుంది అనేది అర్జునుని వాదము. పాపము అనేది నేడు చేసినా, పాప ఫలాన్ని ఏదో ఒకనాడు, ఎక్కడో ఒక చోట అనుభవించక తప్పదు అనే జన్మాంతర పాపపుణ్యాలను కూడా స్పృశిస్తూ, పరలోక అనుభవాలను కూడా తెర పైకి తెచ్చాడు పార్థుడు. ఇంతకీ ఆతతాయులు అంటే ఎవరు?

అగ్నిదో గరద శ్చైవ శస్త్రపాణి ర్ధనాపహృత్
క్షేత్ర దార హరశ్చైవ షడేతే హ్యాతతాయినః ॥

ఇంటికి నిప్పు పెట్టేవాడు (*అగ్నిద*), విషం పెట్టేవాడు (*గరద*), మారణాయుధాలు ధరించే వాడు (*శస్త్రపాణి*), పరుల ధనాన్ని అపహరించే వాడు (*ధనాపహృత్*), ఇతరుల భూములను ఆక్రమించే వాడు (*క్షేత్ర హరః*), అన్యుల భార్యలను అవమానించే వాడు, లేదా అపహరించే వాడు (*దారహరః*). ఈ ఆరు మందిని ఆతతాయులు అంటారు. వీరు వధార్హులే అని శాస్త్రము నిర్ధారణ చేసింది.

పైన తెలిపిన ఆరు దోషాలలో ఏ ఒక్కటి ఉన్నా అట్టి ఆతతాయి వధార్హుడు. కాని, దుర్యోధనాదులు ఈ ఆరు దోషాలనూ పూర్ణంగా కలిగి ఉన్నారు. (1) లక్క ఇంటికి నిప్పు పెట్టారు. (2) భీముడిపై విష ప్రయోగం చేశారు. (3) శస్త్రాలు ధరించి అరణ్యవాసంలో ఉన్న పాండవుల్ని మట్టు పెట్టాలని చూశారు. (4) పాండవుల ఐశ్వర్యాన్ని అపహరించారు. (5) ధర్మబద్ధంగా పాండవులకు రావలసిన భూమిని కాజేశారు. (6) పాండవుల పట్టమహిషి అయిన ద్రౌపదిని అవమాన పరచారు. ఈ ఆరు దోషాలు కలిగిన దుర్యోధనాదులను కేవలం ఆతతాయులని కాదు; నికృష్ట ఆతతాయులు అని పిలవాలి.

ఒక వైపు కౌరవులను ఆతతాయులు అంటూనే, మరో వైపు వధార్హు లైన ఆతతాయులను చంపితే పాపము అంటుతుందని అర్జునుడు విచిత్రంగా వాదిస్తున్నాడు. పాపాత్ముల్ని చంపితే పాపము వచ్చే టట్లైతే, పుణ్యాత్ముల్ని చంపితే పుణ్యం వస్తుందా? అర్జునుని భావం అది కాదు. పాపి ఎలాగూ పాపం చేస్తాడు. పాపి విషయంలో కూడా ధర్మాత్ములు పాపం చేయ కూడదు (*న పాపే ప్రతిపాపః స్యాత్*) అనేదే పుణ్యాత్ముడైన అర్జునుని అభిప్రాయం.

తస్మా న్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రా న్స్వబాంధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ 37

తస్మాత్-న-ఆర్హాః-వయం-హంతుం-ధార్తరాష్ట్రాన్-స్వబాంధవాన్
స్వజనం-హి-కథం-హత్వా-సుఖినః-స్యామ-మాధవ

మాధవ	=	కృష్ణా!	అర్హాః న	=	అర్హులము కాము
తస్మాత్	=	అందువలన	స్వజనం	=	తన వారిని
వయం	=	మేము	హత్వా	=	చంపుకొని
స్వబాంధవాన్	=	బంధువులైన	కథం	=	ఏ విధముగా
ధార్తరాష్ట్రాన్	=	ధృతరాష్ట్రుని సంతానాన్ని	సుఖినః	=	సుఖవంతులము
హంతుం	=	చంపుటకు	స్యామ హి	=	కాగలము

కృష్ణా! బంధువు లైన ధృతరాష్ట్రుని బిడ్డల్ని చంపడం మా వల్ల కాదు. మాధవా! తన వాళ్ళను చంపుకొని ఎవరైనా ఎలా సుఖపడ గలరు?

వ్యాఖ్య

ధర్మము - మమకారము

ధర్మస్పృహతో అర్జునుడు రణరంగంలో ప్రవేశించాడు. యుద్ధభూమిలో స్వజనుల్ని చూచిన తరువాత అతని మనస్సును మమకారం చుట్టుకొంది. మరీ గట్టిగా పట్టుకుంది. మమకారాన్ని తట్టుకోలేక ధర్మం మరుగున పడి పోయింది. ధర్మానికి, మమకారానికి మధ్య ఘర్షణ ప్రారంభ మైంది. ప్రస్తుతం మమకారానిదే పై చేయిగా నిలిచింది. స్వజనుల్ని చంపడం పాపం కనుక, ఇహలోక సుఖాలే కాదు, పరలోక సుఖాలు కూడా తమకు మిగలవు అనేది అర్జునుని ఉద్దేశ్యం.

ప్రతి కర్మకు ఫలితం ఉంటుంది. స్థూల కర్మకు స్థూల ఫలితం ఉన్నప్పుడు, సూక్ష్మ కర్మకు సూక్ష్మ ఫలితం ఉండాలి కదా! స్వజనుల్ని వధించడం స్థూలకర్మ. దానికి ఫలితం రాజ్యం కావచ్చు. రాజ్యం సరే వస్తుంది. దానిని ఎవరితో కలసి అనుభవించాలి? ఎవరితో కలసి విజయోత్సవాలు జరుపు కోవాలి? స్వజనుల్ని వధించి సాధించిన రాజ్యంలో జరుపుకొనే ఉత్సవాలలో ఉత్సాహాలు కూడా ఉంటాయా?

అయ్యో! ఆతతాయులనే గాక అమాయకుల్ని, సుజనులైన స్వజనుల్ని కూడా చంపుకున్నామే! అనే బాధను మరచి పోగలమా? ఇలా దుఃఖించడం దృష్టఫల మైతే, వారిని చంపాలి అనే భావన ఏదైతే యుద్ధానికి ముందే మనస్సులో ఉందో, అది సూక్ష్మకర్మ. స్థూలకర్మకు స్థూల ఫలిత మున్నట్లే, సూక్ష్మకర్మకు సూక్ష్మ ఫలితం ఉంటుంది. ఆతతాయుల్ని చంపడం పుణ్య మైతే, దానికి ఫలితంగా పుణ్య లోకాలకు ద్వారాలు తెరుచుకో వచ్చు. కాని, కేవలం ఆతతాయుల్నే కాదు కదా యుద్ధంలో వధించేది? సజ్జనులు కూడా చనిపోతారు. ఆతతాయుల్ని చంపడం వల్ల పుణ్యం ప్రాప్తిస్తే, అమాయకుల్ని, సుజనుల్ని వధించడం వల్ల పాపం సంభవించి నరకం ప్రాప్తిస్తుంది. కనుక బంధువుల్ని చంపడానికి మేము సిద్ధంగా లేము అంటున్నాడు. స్వజనుల్ని చంపుకొని, ఆ తరువాత సుఖించే దేముంటుంది అని ప్రశ్నిస్తున్నాడు.

కౌరవులు పాండవులకు స్వజను లైతే, పాండవులు మాత్రం కౌరవులకు స్వజనులు కారా? మరి, వాళ్ళు యుద్ధాన్ని ఎందుకు విరమించు కోవడం లేదు? ఈ ఆలోచన వారికి ఎందుకు రాలేదు? అనే ప్రశ్నకు కూడా సమాధానం చెబుతున్నాడు సవ్యసాచి.

యద్య ప్యేతే న పశ్యన్తి లోభోపహత చేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38

యద్యపి-ఏతే-న-పశ్యంతి-లోభోపహత చేతసః
కులక్షయకృతం-దోషం-మిత్రద్రోహే-చ-పాతకం

లోభోపహత చేతసః	=	లోభము చేత చెదరగొట్ట బడిన మనస్సు గల	మిత్రద్రోహే	=	మిత్ర ద్రోహము వలన కలుగు
ఏతే	=	వీరు	పాతకం చ	=	పాపమును
కులక్షయ కృతం	=	కులనాశము వలన కలుగు	పశ్యంతి	=	చూచుట
దోషం	=	చెడును	యద్యపి న	=	లేక పోయినా

కులం నశిస్తే కలిగే చెడు ఏమిటో, మిత్ర ద్రోహము వల్ల ఏర్పడే పాతక మెలాంటిదో వాళ్ళకు కనిపించక పోవచ్చు. వారికి రాజ్యమే కావాలి. అంతా లోభమే.

వ్యాఖ్య

తెలివి - వెలితి

యుద్ధంలో స్వజనులు మరణిస్తారు. దాని వలన కుల నాశము జరుగుతుంది. స్వజనులే కాదు, సుహృత్తులు కూడా చనిపోతారు. అది మిత్రద్రోహ మవుతుంది. ఈ ఆలోచన అర్జునునికే ఎందుకు వచ్చింది? అర్జునుని పరిస్థితిలో దుర్యోధనాదులు కూడా ఉన్నారు కదా! వాళ్ళెందుకని అలా ఆలోచించడం లేదు. వాళ్ళకు ధర్మాలు తెలియవా? వివేకము లేదా? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. వారికి ధర్మాలు తెలిసినా ప్రయోజనం లేదు. వాళ్ళ తెలివిలో ఒక వెలితి ఉంది. అదే లోభము. వాళ్ళ తెలివిని లోభం తినేసింది. అమాంతం మింగేసింది. అందుకే వాళ్ళను లోభోపహత చేతసులు అంటున్నాడు అర్జునుడు.

లోభం మనిషి చేత ఏ పాపా న్నైనా చేయిస్తుంది. లోభికి లాభమే ప్రధానం, ధర్మం కాదు. లోభం గురువుల్ని గుర్తించదు. బంధువుల్ని ప్రేమించదు ***(అర్థాతురాణాం న గురుః న బంధుః).*** దుర్యోధనాదులు రాజ్య లోభంతో పాడై పోయారు. అందువల్ల కులక్షయం వల్ల కలిగే దోషాన్ని వాళ్ళు పట్టించుకో లేదు. అందుకే కదా పాండవుల్ని లక్క యింటిలో కరిగించేయా లని చూశారు! కులక్షయం వల్ల కలిగే దోషం తెలిస్తే అలా చేస్తారా? తెలియక కాదు. లోభము వారి బుద్ధిని నాశనం చేసింది.

సంధికి వెళ్ళిన అచ్యుతుని బంధించే ప్రయత్నం ఎవరైనా చేస్తారా? అది మిత్రద్రోహం కాదా? ఈ విషయం వాళ్ళకు తెలియదా? తెలుసు. కాని లోభం ముందు ధర్మాలు ఆవిరై పోయాయి. పుణ్యపాపాలు, ధర్మాధర్మాలు, ఇవేవీ పట్టించుకోరు లోభులు.

కావచ్చు. దుర్యోధనాదులు లోభులే కావచ్చు. మరి, ఆ వైపు భీష్మద్రోణులు కూడా ఉన్నారు కదా! వారు కూడా లోభులేనా? ధనాశ, రాజ్యకాంక్ష వారికి కూడా ఉన్నాయా? కులక్షయ దోషము, మిత్రద్రోహ పాతకము వారికి కూడా తెలియదా?

భీష్మద్రోణులు దుర్యోధనాదుల లాగా లోభోపహత చేతసులు కారు. దుర్యోధనాదుల బుద్ధుల్నే లోభం పాడు చేసింది. కాని, లోభంతో పాడై పోయిన దుర్యోధనుని అధీనంలో ఉండటం చేత, ధర్మస్పృహ కలవారే అయినా, ప్రస్తుతము ధర్మం విషయంలో భీష్మద్రోణులు అశక్తులై ఉన్నారు. కాని, అన్నీ తెలిసి లోభం తెలియని మనం పోరుకు దిగడ మేమిటి? అనేదే అర్జునుని వాదము.

యుద్ధం చేయడం తన వల్ల కావడం లేదు అంటూ ఇంత వరకు స్వజన ప్రియ వాదాన్ని వినిపించిన పార్థుడు, ఇక్కడి నుండి యుద్ధాన్నే ఆపి వేయాలి అనే ప్రయత్నంలో పడ్డాడు.

కథం న జ్ఞేయ మస్మాభిః పాపా దస్మా న్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భి ర్జనార్దన ॥ 39

కథం-న-జ్ఞేయం-అస్మాభిః-పాపాత్-అస్మాత్-నివర్తితుం
కులక్షయకృతం-దోషం-ప్రపశ్యద్భిః-జనార్దన

జనార్దన	=	హే జనార్దనా!
కులక్షయకృతం	=	కులనాశము వలన కలుగు
దోషం	=	దోషమును
ప్రపశ్యద్భిః	=	చక్కగా గ్రహించిన

అస్మాభిః	=	మా చేత
అస్మాత్	=	ఈ
పాపాత్	=	పాపము నుండి
నివర్తితుం	=	తొలగుటకు
కథం	=	ఎలా
జ్ఞేయం	=	తెలియ దగింది
న	=	కాదు

జనార్దనా! కులక్షయము వల్ల కలిగే దోష మేమిటో మనకు తెలుసు కదా! అలాంటప్పుడు ఈ పాపం నుండి మన మెందుకు తప్పించుకో కూడదు?

వ్యాఖ్య

స్వార్థమా? ధర్మమా?

యుద్ధాన్ని దుర్యోధనాదులు వాంఛించారు. వారిది లోభమే కావచ్చు. మరి అరణ్యవాస, అజ్ఞాతవాస కాలంలో మీరు మాత్రం యుద్ధాన్ని వాంఛించ లేదా? అది లోభం క్రిందికి రాదా? ఇకపోతే, దుర్యోధనుని అధీనంలో ఉన్న భీష్మద్రోణాదులు ధర్మస్పృహను త్యజిస్తే, యుద్ధాభిలాషులై వచ్చిన మీ పక్షం లోని ధర్మాత్ములు కూడా భీష్మద్రోణాదుల లాగే అశక్తులు కారా?

కానే కారు. దుర్యోధనునిది లోభం. అధర్మం. మాది అలోభం. ధర్మం. కనుక, లోభ జనిత పాపం మమ్మల్ని గాని, మా అధీనంలో ఉండే రాజుల్ని గాని అంటదు అనేదే అర్జునుని అభిమత మైతే; మరి అలాంటప్పుడు ధర్మం కోసం చేసే పోరాటములో దోషాలు, పాతకాలు ఎక్కడున్నాయి? ధర్మ నిర్వహణలో మమకారానికి చోటెక్కడుంది? అనేది మరో ప్రశ్న.

ధర్మబద్ధంగా రాజ్యం కావాలని మేము ఆశించాము. అధర్మంగా నైనా రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని దుర్యోధనుడు ఆరాట పడ్డాడు. ఉభయులమూ రణరంగానికి చేరాము. ఇక్కడ స్వజనుల్ని చూచిన తరువాత, మిత్రులను వీక్షించిన తరువాత మా మనస్సు మెత్త పడింది. లోభముతో పాడై పోయిన దుర్యోధనుని మనస్సు మారలేదు. మారలేదు కనుక అతడు మారణహోమం నుండి మరలి పోలేడు. కాని, ధర్మ మెరిగి, దయాగుణం కల మేమైనా రణాన్ని ఎందుకని విరమించు కోకూడదు? కులక్షయం వల్ల సంభవించే ప్రమాదాలు చాలా ఉన్నాయి అంటున్నాడు పాండునందనుడు.

కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽభిభవ త్యుత ॥ 40

కులక్షయే-ప్రణశ్యంతి-కులధర్మాః-సనాతనాః
ధర్మే-నష్టే-కులం-కృత్స్నం-అధర్మః-అభిభవతి-ఉత

కులక్షయే	=	కులనాశము జరిగితే
సనాతనాః	=	అనాదిగా వస్తున్న
కులధర్మాః	=	కుల ధర్మములు
ప్రణశ్యంతి	=	నశిస్తాయి
ధర్మే నష్టే	=	ధర్మము నశిస్తే
కృత్స్నం	=	సమస్తమైన
కులం	=	కులమును
అధర్మః	=	అధర్మము
అభిభవతి ఉత	=	వ్యాపించును కదా!

కులక్షయం జరిగితే, అనాదిగా, ఆచారంగా వస్తున్న కులధర్మాలు నశిస్తాయి. ధర్మం నశిస్తే, కులమును అధర్మం ఆక్రమిస్తుంది.

వ్యాఖ్య

కులక్షయం వల్ల అనాదిగా వస్తున్న ఆచారాలు నశిస్తాయి. అనాచారాలు, దురాచారాలు ప్రబలుతాయి. శాస్త్రాలు బోధించే ధర్మాలు పాండిత్యము ఉన్న వారికే తెలుస్తాయి. ఇవన్నీ శాస్త్ర ప్రబోధితాలు. అలా కాకుండా, సదాచారవంతులైన పెద్దలు బోధించే ధర్మాలు కులధర్మాలు. అట్టి సాంప్రదాయక ధర్మాల వలన కులంలో ధర్మ జీవనం కొన సాగుతుంది.

అయితే, యుద్ధంలో కులధర్మాలు తెలిసిన పెద్దలు నశించి పోతే, ఆ తరువాత కులధర్మాలు, సంప్రదాయాలు కనుమరు గవుతాయి. ధర్మజీవనం అడుగంటి పోతుంది. అధర్మం ప్రబలుతుంది. కులంలో అధర్మం పెచ్చు పెరిగితే ఆ తరువాత అంతా దోషయుత మవుతుంది. ఎలాగో చెబుతున్నాడు.

అధర్మాభి భవాత్ కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥ 41

అధర్మాభిభవాత్-కృష్ణ-ప్రదుష్యంతి-కులస్త్రియః
స్త్రీషు-దుష్టాసు వార్ష్ణేయ-జాయతే-వర్ణసంకరః

కృష్ణ	=	ఓ కృష్ణా!	వార్ష్ణేయ	=	కృష్ణా!
అధర్మాభిభవాత్	=	అధర్మము వ్యాప్తి చెందితే	స్త్రీషు దుష్టాసు	=	స్త్రీలు చెడిపోవుట వలన
కులస్త్రియః	=	కులాంగనలు	వర్ణసంకరః	=	వర్ణసంకరము
ప్రదుష్యంతి	=	చెడి పోతారు	జాయతే	=	కలుగుతుంది

కృష్ణా! అధర్మం వ్యాప్తి చెందితే స్త్రీలు పాడై పోతారు. స్త్రీలు చెడిపోతే వర్ణ సంకరం జరుగుతుంది.

వ్యాఖ్య

ఇంటి దీపం ఆరిపోతుంది

ధర్మం నశిస్తే కులమును అధర్మం ఆక్రమిస్తుంది (*అధర్మః అభిభవతి*) అని ముందు శ్లోకంలో చెప్పిన అర్జునుడు, అలా అధర్మము కులమును ఆక్రమిస్తూ వ్యాప్తి చెందడం వల్ల (*అధర్మ అభిభవాత్*) కులస్త్రీలు చెడి పోతారు (*ప్రదుష్యన్తి*) అంటున్నాడు.

గృహంలో ధర్మనిష్ఠను కొనసాగించే బాధ్యత, పరిరక్షించే సమర్థత రెండిటిని స్త్రీకే కట్టబెట్టింది సనాతన ధర్మం. కనుక గృహంలో ధర్మదీపాన్ని వెలిగించేది, ఆరిపోకుండా కాపాడేది స్త్రీ మూర్తియే.

ధర్మ ప్రజా సంపత్యర్థం స్త్రియ ముద్వహే

ధర్మ, సంతానముల సంపదను వాంఛించి నేను స్త్రీని వివాహము చేసుకుంటున్నాను అని వివాహానికి ముందే వరుడు ఈ పుణ్య సంస్కృతిలో వాగ్దానం చేస్తాడు. అంతేకాదు.

ఆవాభ్యాం కర్మాణి, ఆశ్రమ ధర్మ కర్మాణి కర్తవ్యాని, ప్రజా శ్చోత్పాదయితవ్యాః

ఇక మీదట మన మిద్దరము గృహస్థాశ్రమ ధర్మాలను చక్కగా ఆచరిస్తూ, అట్టి ధర్మాచరణ ఫలంగా చక్కని సంతానాన్ని పొందుదాము అని వరుడు వధువుతో చెబుతాడు.

వాస్తవానికి భార్య వల్లనే భర్త అన్ని విధాల అద్భుత ప్రయోజనాలను సాధిస్తాడు. అర్ధాంగి వల్లే భర్తకు

సర్వమూ సమకూరుతాయి అని ధర్మశాస్త్ర ప్రబోధము. (1) ఉత్తమ సంతానం (**అపత్యం**), (2) ధర్మ కార్యాచరణము (**ధర్మకార్యాణి**) (3) పతిసేవ (**శుశ్రూషా**), (4) ఉత్తమమైన రతి సుఖము (**రతి రుత్తమా**), (5)తనకు, తన పితృ దేవతలకు స్వర్గప్రాప్తి (**స్వర్గః పితౄణా మాత్మన శ్చహ**), ఇవన్నీ భార్యల వల్లనే భర్తలకు ప్రాప్తిస్తాయి. అందుచేత, సత్సంతానాన్ని ప్రసాదించి ఇటు భర్తకు, అటు భర్త పూర్వీకులకు మహోపకారం చేస్తున్న మహిళలు ఇంటికి మణిదీపాలు అన్నది మనుధర్మ శాస్త్రం.

ప్రజానార్థం మహాభాగా పూజార్హా గృహదీప్తయః
స్త్రియ శ్శ్రియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన ॥

సత్సంతానాన్ని అందించి, భర్తలకు మహోపకారం చేస్తున్న మహిళామూర్తులు భర్తల గృహాలకు మణిదీపాల వంటి వారు (అందుకే అర్ధాంగిని భార్యామణి అంటూ ఉంటారు). స్త్రీలు శ్రీమహాలక్ష్మి వంటి వారు కనుక పూజార్హులు అని ధర్మ శాస్త్రము స్త్రీని శ్లాఘించింది. ఇదంతా పూర్వపు రోజుల్లో హిందూ సమాజం నుండి స్త్రీ మూర్తులు అందుకున్న నీరాజనాలు.

ఇన్ని విధాల గృహాలను రక్షిస్తూ పురుషులను ఆదుకుంటున్న స్త్రీ మూర్తులను పురుషులు రక్షించాలి. ఆదుకోవాలి. పురుషుడు ధనాన్ని సంపాదించ వచ్చు. కాని, దానిని భద్రపరచే బాధ్యత, ఖర్చు చేసే యోగ్యత స్త్రీకే అప్పగించింది హిందూధర్మం.

అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్

పురుషుడు సంపాదించి తీసికొని వచ్చిన ధనమును ఇల్లాలే భద్ర పరచాలి. అవసరాన్ని బట్టి ఇల్లాలే ఖర్చు చేయాలి. భర్తకు అవసరం వచ్చినా భార్యనే అడిగి తీసుకోవాలి. ఈ విధంగా గృహస్థాశ్రమంలో విశిష్ట మైన విలువలు పరిరక్షింప బడ్డాయి.

ఈ విధంగా గృహాలను పరిరక్షిస్తున్న స్త్రీలను రక్షింప వలసిన బాధ్యత పురుషుల పైనే ఉంది. కాని, యవ్వనంలో ఉన్న పురుషులు లక్షలాది మంది కురుక్షేత్రంలో ఉన్నారు. యుద్ధంలో వారు మరణిస్తే, యువతులకు వైధవ్యం ప్రాప్తిస్తుంది. స్త్రీలను రక్షించే వారు లేకుండా పోతారు. అలాంటి అయోమయ పరిస్థితిలో స్త్రీలు అభద్రతలో పడిపోయి బలహీనతలకు తల వంచుతా రేమో! అదే జరిగితే, సాంఘిక సంక్షేమం కుంటు పడుతుంది. సమాజ అభ్యుదయం అడుగంటి పోతుంది. ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు పెద్దలు. ఇల్లాలికే భద్రత లోపిస్తే, ఇంటిదీపమే ఆరిపోతే, ఇక ఇల్లు ఎలా భద్రంగా ఉంటుంది? అంతా అభద్రతే. ఇదంతా యుద్ధ ఫలితమే నని అర్జునుని అభిమతం. కులస్త్రీలు అభద్రతలో పడి, గృహదీపాలు ఆరిపోతే వర్ణసంకరం ఏర్పడు తుందని భీతి చెందుతున్నాడు పార్థుడు. వంశనాశం ఇదే నేమో అని ఆందోళన చెందు తున్నాడు.

ఈ సందర్భంలో, శ్రీకృష్ణుని వార్ష్ణేయా! అని సంబోధించాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు వృష్ణి వంశమునకు చెందిన వాడు కనుక ఆయన వార్ష్ణేయుడు. ఈ సంబోధన ద్వారా అర్జునుడు శ్రీకృష్ణునికి రెండు సంకేతాలు పంపుతున్నాడు.

అయ్యా! శ్రీకృష్ణ మహాశయా! మాది కురువంశము. నీది వృష్ణివంశము. నీ కేమి? ఎన్నైనా చెబుతావు. రాలేది, కూలేది నా వంశమే కదా! అందుకే నేను ఆందోళన పడుతున్నా అనేది ఒక సంకేతము. అదేమిటయ్యా! అర్జునా! యుద్ధంలో మా వంశం వారు కూడా ఉన్నారు కదా! మాకూ నష్టమే కదా? అని శ్రీకృష్ణుడు అంటాడేమో నని, అందుకే చెబుతున్నానయ్యా అచ్యుతా! ఇద్దరికీ తంటాయే కనుక, వెంటనే బండి వెనక్కి తిప్పు. ఇద్దరం ఎవరింటికి వాళ్ళం పోదాము అనేది రెండవ సంకేతము.

అధర్మ వ్యాప్తి వల్ల కులస్త్రీలు చెడి పోతారు. వర్ణ సంకరం ఏర్పడుతుంది అని చెప్పిన అర్జునుడు ఆ వర్ణ సంకరము యొక్క ఫలితం ఎలా ఉంటుందో చెబుతున్నాడు.

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిణ్డోదకక్రియాః ॥ 42

సంకరః-నరకాయ-ఏవ-కులఘ్నానాం-కులస్య-చ
పతంతి-పితరః-హి-ఏషాం-లుప్త పిండోదకక్రియాః

సంకరః	= వర్ణసంకరము	ఏషాం	= వీరి యొక్క
కులఘ్నానాం	= కులమును చెడిపిన వారికి	పితరః	= పితరులు
కులస్య చ	= కులమునకు	లుప్తపిండోదక క్రియాః	= శ్రాద్ధతర్పణ క్రియలు లేనివారై
నరకాయ ఏవ	= నరకము కొరకే	పతంతి హి	= పతన మవుతారు

వర్ణసంకరము వల్ల కులానికి, కుల భ్రష్టులకు మిగిలేది నరకమే. అలాంటి వారి పితృ దేవతలు శ్రాద్ధ తర్పణాలకు కూడా నోచుకోరు. అధోగతి పాలవుతారు.

వ్యాఖ్య

అంతా పాపమయం

అధర్మం వ్యాప్తి చెందడం వల్ల ఏర్పడిన వర్ణ సంకరము నరకాన్ని అందిస్తుంది. కులాన్ని నాశనం చేసిన వారికి, ఆ వినాశంలో నశించకుండా మిగిలిన వారికి ఇరువురికీ నరకమే నంటున్నాడు నర నామధేయుడు.

అధర్మ వ్యాప్తికి, కుల నాశానికి, వర్ణ సంకరానికి కారకులైన వారికి ఎలాగూ నరకం ప్రాప్తిస్తుంది. అలా కాకుండా, వినాశములో నశించకుండా మిగిలిన వారు ఉంటారు కదా! వారికి కూడా నరకమే ప్రాప్తిస్తుంది అనేది అర్జుని అభిప్రాయం.

ధర్మం తెలిసిన వారు, కుల ధర్మాలను క్షుణ్ణంగా ఎరిగిన వారు యుద్ధంలో దివంగతు లౌతారు కనుక, మిగిలియున్న వారికి మార్గ నిర్దేశం చేసేవారు లేకుండా పోతారు. వీరు ఏది విహితమో, ఏది అవిహితమో ఎరుగరు కనుక కులధర్మాలను విస్మరించి పాపాన్ని సంపాదించు కుంటారు. ఇలా యుద్ధ కారణంగా అంతా పాపమయమై పోతుందని పార్థుని ఆవేదన.

పెద్దలు చిన్నబోతారు

కులమును నశింప చేసిన వారికి, కులధర్మాలు పాటించలేని అసమర్థులకు మాత్రమే కాదు నరకం ప్రాప్తించేది. పూర్వీకులు కూడా పిండోదకాలు అందక అధోగతి పాలవుతారు అంటున్నాడు అర్జునుడు.

కులములో పూర్వీకులు చేసిన పాపాలకు నిష్కృతిగా ఆ కులంలో జీవించి యున్న వారి సంతతి పిండోదకాలు సమర్పిస్తారు. ఈ విధంగా పితరుల ఋణాన్ని తీర్చుకుంటారు. గృహస్థాశ్రమ ధర్మంలో వివాహానికి ఇదొక ముఖ్య ప్రయోజనం.

వివాహస్య ఫలం దేవ పితృర్ణాఖ్య ప్రకరణం

దేవ ఋణాన్ని, పితృ ఋణాన్ని పూర్తిగా తీర్చడమే వివాహానికి ఫలం. గడచిన మూడు తరాల లోని పితృ దేవతలు వారు జీవించి ఉన్నప్పుడు తెలిసో, తెలియకో, ఎన్నో పాపాలు చేసి ఉంటారు. ఆ పాపాలను తటస్థ

పరచి, గతించిన పితరులు యాతన లేకుండా సుఖించడానికి, వారి సంతతి వారు ప్రతి మాసము తర్పణాదులు నిర్వహిస్తారు. పిండోదకాలు సమర్పిస్తారు.

యుద్ధంలో పెద్ద లందరూ నశిస్తే, పిండోదకాలు పితరులకు అర్పించేవా రెవరుంటారు? చనిపోకుండా మిగిలి యున్న వాళ్ళు అర్పిస్తారు అనుకుందాము. వాళ్ళకైనా విధి విధానాలు తెలిపే వాళ్ళెవ రుంటారు? ఈ విధంగా పితరులు పిండోదకాలు లేనివారై తీవ్ర యాతనను, దుఃఖాన్ని అనుభవిస్తారు. ఇదంతా యుద్ధ ఫలితమే కదా? అనేది పార్థుని ప్రశ్న.

చిరునామాలు చిక్కవు

కులస్త్రీలు రక్షణ లేక పాడైతే, వర్ణ సంకరము ఏర్పడుతుంది. అలాంటప్పుడు పిండోదకాలు సమర్పించే వారు ఎవరు? ఎవరు సమర్పించేవి ఎవరికి చెందుతాయి? అనేది చాలా సంక్లిష్ట మైన విషయం. బీజ ప్రదాతలు ఒకరు, పిండోదకాలు స్వీకరించే వారు వేరొకరు అయ్యేందుకు వీలు లేదు. ఎవరికి ఎవరు బీజప్రదాతలో, వారికే చెందుతాయి తత్సంబంధమైన పిండోదకాలు. ఇదంతా వర్ణ సంకరంలో అర్జునుడు చూస్తున్న గందరగోళం.

ఈ గందరగోళ మంతా గాండీవికే గాని గోవిందునికి లేనే లేదు. ఈ ప్రశ్న లన్నిటికీ సమాధానాలు గోవిందుని వద్ద ఉన్నాయి. ఈ చిక్కుముడు లన్నీ సాంఖ్యంలో వాటంతటవే విడి పోతాయి.

దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకర కారకైః ।
ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥ 43

దోషైః-ఏతైః-కులఘ్నానాం-వర్ణసంకర కారకైః
ఉత్సాద్యంతే-జాతిధర్మాః-కులధర్మాః-చ-శాశ్వతాః

ఏతైః	= ఈ	జాతిధర్మాః	= జాతిధర్మములు
వర్ణసంకర కారకైః	= వర్ణ సంకరమునకు కారణమైన	చ	= మరియు
దోషైః	= దోషముల చేత	కులధర్మాః	= కులధర్మములు
కులఘ్నానాం	= వర్ణసంకర మొనర్చిన వారి యొక్క	ఉత్సాద్యంతే	= నశించి పోతాయి
శాశ్వతాః	= శాశ్వతములైన		

ఈ విధంగా వర్ణ సంకరానికి కారకులైన వ్యక్తుల దోషం వల్ల, శాశ్వత మైన జాతిధర్మాలు, కులధర్మాలు నశించి పోతాయి.

వ్యాఖ్య

వర్ణసాంకర్యము సృష్టించిన పాపము వల్ల కులము కుప్ప కూలుతుంది. కుల నాశము వల్ల కులధర్మాలు దెబ్బ తింటాయి. జాతిధర్మాలు నశిస్తాయి. ధర్మాలు తెలిసిన తలలు యుద్ధంలో రాలి పోవడం చేత, తరతరాల నుండి అందుతూ వస్తున్న ఈ ధర్మాలు తరువాత తరాల వారికి అందకుండా పోతాయి. ఆచరించ వలసిన ధర్మాలను ఆచరించక పోవడం వల్ల పాపము సంక్రమిస్తుంది. అలాగే ఆచరించ కూడని అకృత్యాలను ఆచరించడం వల్ల కూడా నరకము ప్రాప్తిస్తుంది.

ఏది సామాన్య ధర్మము, ఏది విశేష ధర్మము, ఏది స్త్రీ ధర్మము, ఏది పురుష ధర్మము, అనేది ధర్మం తెలిసిన వాళ్ళ నుండే కదా మనం గ్రహించాలి! అలాంటి విశిష్ట వ్యక్తులను సంగ్రామంలో శాశ్వతంగా సాగ నంపితే, ఆ తరువాత ధర్మం విషయంలో కుటుంబాలకు, సమాజానికి మార్గనిర్దేశం చేసే వారు ఎవ రుంటారు?

ధర్మాన్ని రక్షించే దెలా? ధర్మాన్ని రక్షించలేక పోతే, ధర్మం చేత రక్షింపబడే దెలా? ఇన్ని అనర్థాలకు మూలమైన యుద్ధంలో పాల్గొని సాధించే దేముంటుంది? ఏదైనా ఉంటే, అది నరకమే నని తన అభిప్రాయం. తాను విన్నది కూడా ఇదే అంటున్నాడు అర్జునుడు.

ఉత్సన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।
నరకే నియతం వాసో భవతీ త్యనుశుశ్రుమ ॥ 44

ఉత్సన్నకులధర్మాణాం-మనుష్యాణాం-జనార్దన
నరకే-నియతం-వాసః-భవతి-ఇతి-అనుశుశ్రుమ

జనార్దన	=జనార్దనా!	వాసః	= నివాసము
ఉత్సన్న కులధర్మాణాం	=చెడిన కులాచారములు గల	భవతి	= కలుగుతుంది
మనుష్యాణాం	=మనుష్యులకు	ఇతి	= అని
నరకే	=నరకము నందు	అనుశుశ్రుమ	= వింటున్నాము
నియతం	=అనివార్యంగా		

జనార్దనా! కులధర్మాలు పాడు చేసిన మనుష్యులకు నరకము తప్పనిసరి అని వింటున్నాము.

వ్యాఖ్య

బంధుజన నాశము, కులక్షయ దోషము, మిత్రద్రోహ పాతకము, జాతిధర్మ నాశము, అధర్మ వ్యాప్తి పితరుల అధోగతి - ఇలా ఇప్పటికే అర్జునుడు శ్రుతి మించిన రాగాన్ని వినిపించాడు. తన కున్న పాండిత్యాన్నంతా ప్రబలంగా, ప్రముఖంగా ప్రదర్శించాడు.

అర్జునుడు సదాచార గాడిలో పెరిగిన వాడు. శిష్టాచార సంప్రదాయంలో, క్రమశిక్షణతో, పెద్దల మార్గంలో నడచిన వాడు. ఇప్పుడు యుద్ధభూమిలో తనను ముంచిన మమకార మాయలో పడి, అధికుల ముందు అధిక ప్రసంగం చేశానని తనలో తాను శంకించు కున్నాడో ఏమో తెలియదు గాని, కులధర్మాలను పాడు చేసిన వారికి నరకవాసము తప్పదని పెద్దల ద్వారా విని ఉన్నాను (**అనుశుశ్రుమ**) అని అంటున్నాడు.

ఇహము లేదు - పరము మిగలదు

యుద్ధములో విజయాన్ని సాధిస్తే రాజ్యము వస్తుంది. కాని, బంధు జనము నశించడం వల్ల రాజ్యం వచ్చినా సుఖం ఉండదు. తన వాళ్ళు లేరు అనే బాధ, తన వాళ్ళను చంపుకొని రాజ్యభోగాలను అనుభవిస్తున్నా ననే వ్యథ మనిషిని క్రుంగదీస్తూ ఉంటాయి కనుక, ఇక బ్రతికినంత కాలము సుఖశాంతులు ఉండవు.

పోనీ, మరణించిన తరువాత స్వర్గాది ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయా అంటే, అదీ లేదు. కులక్షయానికి కారణం కావడం చేత నరకమే ప్రాప్తిస్తుంది గాని స్వర్గము లభించదు. ఇలా పెద్దల ద్వారా (**ఇతి శుశ్రుమ పూర్వేషాం**) తాను విని ఉన్నాడు. కనుక, యుద్ధం నుండి బయట పడలేక పోతే తనకు నరకమే గతి అని వాపోతున్నాడు విజయుడు.

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్య సుఖలోభేన హన్తుం స్వజన ముద్యతాః ॥ 45

అహో-బత-మహత్పాపం-కర్తుం-వ్యవసితాః-వయం
యత్-రాజ్యసుఖలోభేన-హంతుం-స్వజనం-ఉద్యతాః

యత్	= ఏ కారణము వలన	పాపం	= పాపమును
రాజ్యసుఖలోభేన	= రాజ్యసుఖము పై ఆశ చేత	కర్తుం	= చేయుటకు
స్వజనం	= బంధువులను	వయం	= మేము
హంతుం	= చంపుటకు	వ్యవసితాః	= ప్రయత్నించిన వాళ్ళ మయ్యాము
ఉద్యతాః	= ఉద్యమించామో	అహో బత	= అయ్యో!
మహత్	= గొప్పదైన		

బంధువుల్ని హతమార్చి, పాపాన్ని మూట గట్టుకోవడానికి నడుం బిగించాము. ఇదంతా రాజ్యసుఖాలపై ఆశ తోనే కదా! అయ్యో!

వ్యాఖ్య

రాజ్యభోగాలపై ఆశతో భీష్మద్రోణాది మహాత్ములను వధించ డానికి సాహసించామా? అని తనలో తాను క్రుంగి పోతున్నాడు ధనంజయుడు. ఒక వైపు తన మనసే తనను నిలదీస్తుంటే, మరో వైపు ఇదే విషయం రేపు ప్రజల నుండీ అభియోగంగా వినవలసి వస్తుందేమో నని కూడా సంశయిస్తున్నాడు.

రాజ్య సుఖము ఎంత? పాపమే అంతా!

దారుణంగా పోరాడి, స్వజనుల్ని వధించి రాజ్యాన్ని పొంద వచ్చు. రాజ్య సుఖాలను అనుభవించ వచ్చు. ఎంతకాలం ఉంటుంది భోగానుభవము? దేహాలే శాశ్వతం కానపుడు రాజ్యాలు శాశ్వతమా? రాజ్య భోగాలు నిత్యమా? ఏదో కొంత కాలం అల్ప సుఖాలు అనుభవిస్తే అనుభవించ వచ్చు. ఆ తరువాత శాశ్వతంగా నరక కూపంలో పడి, దుర్భర దుఃఖాన్ని అనుభవించాలి కదా! రాజ్య లోభంతో ఇంత పాపాన్ని మూటకట్టు కుంటున్నామా? అని అర్జునుడు బాధతో నలిగి పోతున్నాడు. అంతేకాదు, ఈ విషయా లన్నీ యుద్ధభూమికి రాక ముందే ఎందుకని ఆలోచించలేక పోయాను? అని పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నాడు.

స్వల్ప కాలం రాజ్య సుఖాలు అనుభవించ డానికి స్వజనుల్నే చంపుకోవాలా? స్వజనులకు దూరమై, భారమైన హృదయాలతో అనుభవించే సుఖాలు ఎంతవరకు తృప్తి నిస్తాయి? ఇలాంటి ప్రశ్నలు అర్జునుని అంతర్యాన్ని కుదిపేస్తున్నాయి.

విచిత్ర మేమిటంటే, రాజ్య సుఖాభిలాష అనేది దుర్యోధనునికి సంబంధించిందే గాని అర్జునునికి సంబంధించింది కాదు. ధర్మస్పృహతో అర్జునుడు యుద్ధభూమికి వచ్చాడే గాని, రాజ్యలాభము కోసం కాదు. రాజ్య లోభము ఉండీ కాదు. మమకారం పీడిస్తూ ఉంటే, తాను యుద్ధానికి ఎందుకు వచ్చాడో కూడా మరచి పోతున్నాడు పార్థుడు.

యది మా మప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్ ॥ 46

యది-మాం-అప్రతీకారం-అశస్త్రం-శస్త్రపాణయః
ధార్తరాష్ట్రాః-రణే-హన్యుః-తత్-మే-క్షేమతరం-భవేత్

అప్రతీకారం	= ప్రతీకారము చేయని	శస్త్రపాణయః	= శస్త్రధారులైన
అశస్త్రం	= శస్త్రమును పట్టని	ధార్తరాష్ట్రాః	= దుర్యోధనాదులు
మాం	= నన్ను	రణే	= యుద్ధము నందు

హన్యుః యది	= చంపుదురేని	క్షేమతరం	= శ్రేయస్కరము
తత్	= అది	భవేత్	= అగును
మే	= నాకు		

నేను వాళ్ళను ఎదిరించను. ఆయుధాన్ని పట్టను. అయినా ధృతరాష్ట్రుని కొడుకులు ఆయుధాల్ని పట్టుకొని వస్తారా? యుద్ధంలో నన్ను చంపుతారా? అలాగే చంపనీ! అదే నాకు మంచిది.

వ్యాఖ్య

అర్జునుడు సరే వాళ్ళను వధించడు. అలాగని వాళ్ళు కూడా అర్జునుణ్ణి వధించకుండా ఉంటారా? ఇందుకు సమాధానంగా, ఆయుధాలు ధరించి కౌరవులను చంపడం కన్నా, నిరాయుధుడిగా ఉండి, వాళ్ళ చేతిలో చావడమే మంచిది అంటున్నాడు అర్జునుడు.

చంపడమా? చావడమా?

స్వజనుల్ని, పెద్దల్ని వధించి నరకానికి పోవడమా? లేక నిరాయుధులుగా నిలబడి శత్రువుల చేతిలో మరణించడమా? చంపి నరకానికి పోవడం కన్నా, చచ్చి నరక ప్రవేశాన్ని నివారించు కోవడమే మంచిది అని భావించాడు అర్జునుడు.

కదనరంగంలో కాలు మోపిన తరువాత ఆయుధాల్ని ధరించి పోరాడాలి. అది వద్దని భావించి నపుడు, ఆ తరువాత ప్రత్యామ్నాయంగా రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి, యుద్ధం నుండి పారి పోవడం. రెండు, నిరాయుధులుగా నిలబడి శత్రువుల చేతిలో హతులు కావడం. యుద్ధం నుండి పారిపోవడం పిరికితనం అనిపించు కుంటుంది కనుక, బ్రతికి పాప ఫలాన్ని అనుభవించడం కన్నా, పాప నివారణోపాయంగా మరణించడమే మేలు అనే నిర్ణయానికి వచ్చేశాడు అర్జునుడు. హింసతో విజయాన్ని సాధించడం కన్నా, అహింసా మార్గంలో మరణించడమే ఉత్తమ ధర్మంగా భావిస్తున్నాడు. యుద్ధంలో కొందరిని చంపి, ఆ తరువాత యుద్ధభూమి లోనో, లేదా రాజ్యాధికారము అనుభవించిన తరువాతనో చావడం కన్నా, ఎవరినీ చంపకుండా చావడమే శ్రేయోదాయకము అని అనుకుంటున్నాడు.

ఇక దుర్యోధనాదుల విషయ మంటారా? వారు ఇప్పటికే ఎన్నో పాపకార్యాలు చేసి ఉన్నారు. మా విషయంలో వారు చేసిన దురాగతాలు, దురితాలు దుస్తరాలు.

ఇపుడు నిరాయుధులుగా ఉన్న మమ్మల్ని చంపి, ఈ పాపం కూడా మూట కట్టుకో నివ్వండి. ధర్మస్పృహ కలిగిన అహింసావ్రతులం మేము. అధర్మయుతులు, హింసా ప్రవృత్తి కలవారు కౌరవులు.

సంజయ ఉవాచ :

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥ 47

ఏవం-ఉక్త్వా-అర్జునః-సంఖ్యే-రథోపస్థే-ఉపావిశత్
విసృజ్య-సశరం-చాపం-శోకసంవిగ్నమానసః

అర్జునః	= అర్జునుడు	శోకసంవిగ్న మానసః	= దుఃఖము చేత చలించిన మనస్సు కలవాడై
ఏవం	= ఈ విధముగా	సశరం	= బాణంతో కూడా
ఉక్త్వా	= పలికి	చాపం	= ధనుస్సును

విసృజ్య	= విడిచి	రథోపస్థే	= రథము మధ్యలో
సంఖ్యే	= యుద్ధభూమిలో	ఉపావిశత్	= కూర్చున్నాడు

సంజయుడు చెబుతున్నాడు :

అర్జునుడు యుద్ధభూమిలో అలా మాట్లాడాడు. ధనుర్బాణాలను పడేశాడు. దుఃఖంతో కుమిలి పోయాడు. రథం మధ్యలో జారబడ్డాడు.

వ్యాఖ్య

పాపాచరణం కన్నా ప్రాణ త్యాగమే మంచిదని భావించింది అర్జునుని సున్నిత హృదయం. యుద్ధాన్ని త్యజించాలనే నిర్ణయానికి అర్జునుడు వచ్చేశాడు. ధనుర్బాణాలు ధరించి ఉన్నంత వరకు తనను యుద్ధం చేయ వలసిందిగా అందరూ వేధిస్తూనే ఉంటారు అని అభిప్రాయపడి, అంతకు ముందే చేజారి పోతున్న గాండీవాన్ని (*గాండీవం స్రంసతే హస్తాత్ - 30 వ శ్లో*) ఇప్పుడు ప్రయత్న పూర్వకంగా క్రింద పడేశాడు పార్థుడు.

ఉభయ సైన్యాలను వీక్షించాలని ఇంతవరకు రథంలో నిలబడి యున్న అర్జునుడు, దారుణ మైన దుఃఖంతో కదిలిపోతూ (*శోకసంవిగ్న మానసః*), ఇక నిలబడుటకు కూడా అశక్తుడై, రథోపస్థ ప్రదేశంలో జారబడ్డాడు.

అస్పష్ట అవగాహన

యుద్ధం చేసే ఆలోచన లేనపుడు అర్జునుడు యుద్ధరంగం నుండి వెళ్ళి పోకుండా అక్కడే ఎందుకు కూర్చుండి పోయాడు? యుద్ధం చేసే ఆలోచన లేదు కనుక నిలబడ్డవాడు కూర్చున్నాడు, బాగుంది. మరి విరమించి వెళ్ళేవాడు కూర్చో నవసరం లేదు కదా!

తన వాదనలో ఏదో స్పష్టత లోపించిందని అర్జునునికే అనిపిస్తోంది. తన భావాలతో తానే పూర్తిగా ఏకీభవించలేక పోతున్నాడు. అందుకే కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు ఏదైనా చెబుతాడేమో! తన అవగాహనలో లోపం ఉంటే సరి దిద్దుతా డేమో అని నిరీక్షిస్తున్నాడు.

స్థాన భ్రంశము

రథానికి ముందు భాగాన పల్లంగా ఉండే చోట సారథి కూర్చుంటాడు. సారథికి వెనుక భాగాన కొంత ఎత్తైన ప్రదేశంలో యోధుడు ఉంటాడు. యోధునికి వెనుక భాగాన పల్లంగా ఉండే చోట శస్త్రాస్త్రములను అందించే సేవకుడు ఉంటాడు. ఇవి పూర్వము యుద్ధరంగంలో రథములో వ్యక్తులు ఉండే ప్రదేశాలు.

ప్రస్తుతము అర్జునుడు తాను ఉండవలసిన చోట లేడు. యుద్ధము చేసే స్థితిలో లేనందున యోధుడు ఉండే ప్రదేశాన్ని త్యజించాడు. యోధుని వెనుక సేవకుడు కూర్చొనే ప్రదేశము రథోపస్థ ప్రదేశము. ధనుర్బాణాలను పడేసిన పార్థుడు రథోపస్థ ప్రదేశంలో కూర్చున్నాడు.

అర్జునుని ఈ విషాద స్థితిని సంజయుడు ధృతరాష్ట్రునికి విపులంగా వివరించి చెప్పాడు.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే అర్జున విషాదయోగో నామ ప్రథమోఽధ్యాయః

ఇతి	=	ఈ విధంగా
శ్రీమత్భగవద్గీతాసు	=	శ్రీమద్భగవద్గీత యందు
ఉపనిషత్సు	=	ఉపనిషత్తుల యందు
బ్రహ్మవిద్యాయాం	=	బ్రహ్మవిద్య యందు
యోగశాస్త్రే	=	యోగశాస్త్రము నందు
శ్రీకృష్ణార్జున సంవాదే	=	శ్రీకృష్ణార్జునుల సంవాదము నందు
అర్జునవిషాదయోగః నామ	=	అర్జున విషాదయోగము అనే పేరు గల
ప్రథమః అధ్యాయః	=	మొదటి అధ్యాయము

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు అర్జున విషాదయోగము అనే మొదటి అధ్యాయము.

వ్యాఖ్య

గీతా శాస్త్రము - వేదాంతము

వేదాంతము అంటే ఉపనిషత్తుల లోని విషయము. బ్రహ్మమును పొందునట్లు చేయునది ఉపనిషత్తు. కనుక, ఉపనిషత్తు అనునది గ్రంథ విషయమే గాక గ్రంథనామము కూడా.

ఉపనిషదితి బ్రహ్మవిద్యా

ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య. ఆత్మయే బ్రహ్మము అనే జ్ఞానాన్ని బోధించి, శోకాన్ని దాటించి, బ్రాహ్మీస్థితిని ప్రసాదించు చున్నది (*బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి*) కనుక అది ఉపనిషత్తు. అదే వేదాంతము.

ఉపనిషత్తుల సారమే భగవద్గీత. భగవద్గీతలో ఏడు వందల శ్లోకాలు ఉన్నాయి. (గీతలో ఇంకా అధికంగా శ్లోకాలు - **ఖిల శ్లోకాః** ఉన్నాయని కొందరు, ఉన్నవాటిలో కూడా కొన్ని ప్రక్షిప్తాలని మరి కొందరు చెప్పే మాటలు మాకు అసంగతాలు. అనామోదములు).

తం ధర్మం భగవతా యథోపదిష్టం వేదవ్యాసః సర్వజ్ఞః
భగవాన్ గీతాఖ్యైః సప్తభిః శ్లోకశతైః ఉపనిబబన్ధ ।

భగవంతుడు ఉపదేశించిన ధర్మాన్ని యథాతథంగా ఏడు వందల శ్లోకాలలో సర్వజ్ఞుడైన భగవాన్ వేదవ్యాస మహర్షి 'గీత' అనే నామంతో శ్లోకబద్ధం చేశాడు అన్నారు భగవాన్ శ్రీమచ్ఛంకర భగవత్పాదులు. శంకరుల మాటే మాకు శిరోధార్యం.

భగవద్గీత లోని అధ్యాయాలు, అలాగే శ్లోకాలు కూడా ఉపనిషత్తులే. ఎలాగైతే ఉపనిషత్తులు బ్రహ్మ విద్యను అనుగ్రహించి, శోకాన్ని దాటిస్తాయో, గీత కూడా అదే పని చేస్తుంది. బ్రహ్మవిద్యే కేంద్ర విషయం కావడం చేత గీత ఉపనిషత్తులతో సమానము.

అంతేకాదు. గీత లోని శ్లోకాలన్నీ ఉపనిషత్తులే అని చెప్పడం జరిగింది. *భగవద్గీతాసు ఉపనిషత్సు* అన్నారు. భగవంతుడు ప్రబోధించిన 'ఉపనిషత్తుల'లో అనే బహువచనం ఉన్నందున, ప్రతి శ్లోకము ఒక ఉపనిషత్తు, లేదా ఉపనిష త్ప్రతిపాదిత విషయం అని ప్రవచింప బడింది.

బ్రహ్మవిద్య - యోగశాస్త్రము

బ్రహ్మజ్ఞానమును ఉపదేశించునది బ్రహ్మవిద్య. యోగశాస్త్రము అంటే కర్మయోగ శాస్త్రము. ఒకటి నివృత్తి. మరొకటి ప్రవృత్తి. విడిపడ టానికి చేసే ప్రయత్నం నివృత్తి. లేని దానిని పొందటానికి చేసే ప్రయత్నం ప్రవృత్తి.

అంతఃకరణ శుద్ధికి ఉపకరించే కర్మయోగము ప్రవృత్తి. బంధ నివారణకు ఉపకరించే జ్ఞానయోగము నివృత్తి. సాంఖ్యులకు జ్ఞానయోగము, యోగులకు కర్మయోగము ఉపయుక్తములు. గీతాశాస్త్రము ఇటు బ్రహ్మవిద్య, అటు యోగశాస్త్రము, రెండిటిని ఉపదేశిస్తూ, పూర్ణశాస్త్రమై శోభిస్తోంది.

సంప్రదాయ రక్షణ

బ్రహ్మవిద్య ఊహలకు, తర్కాలకు అందేది కాదు (***నైషా తర్కేణ మతిరాపనేయా***). ఆచార్యుని ఆశ్రయించి ఆయన అనుగ్రహము చేతనే జ్ఞానమును పొందాలి. అప్పుడే పొందిన జ్ఞానము ఫలవంత మవుతుంది (***ఆచార్యవాన్ పురుషో వేద ఆచార్యాద్ధైవ విద్యా విదితా సాధిష్ఠం ప్రాపత్ ఇతి***). కనుక విధి క్రమము ననుసరించి గురుదేవుని ఆశ్రయించాలి. ప్రశ్నించి తెలుసుకోవాలి. (***కశ్చిత్ గురుం బ్రహ్మనిష్ఠం విధివ దుపేత్య... ఇచ్ఛన్ పప్రచ్ఛ***). ఇది సంప్రదాయము. ఉపనిషత్తుల ద్వారా అందిన శిష్టాచార సంప్రదాయము.

సంప్రదాయమును విస్మరిస్తే జ్ఞానం అందదు. ఉపనిషత్తుల విషయాన్నే గీత ప్రతిపాదిస్తూ ఉంది కనుక గీత సంప్రదాయానికి భిన్నం కాకుండా ఉంది. ఉపనిషత్తులు గురుశిష్యుల సంవాద రూపంలో వినిపిస్తాయి. గీతా శాస్త్రము కూడా శ్రీకృష్ణార్జునుల (***గురుశిష్యుల***) సంభాషణ రూపంలో సాగింది.

యోగ శబ్దార్థము

భగవద్గీతలో పద్దెనిమిది అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కొక్క అధ్యాయానికి ఒక్కొక్క పేరు ఇవ్వబడింది.

ఈ నామధేయాలు మూలానికి సంబంధించినవా? లేక అధ్యాయాల లోని విషయాన్ని బట్టి ఆ తరువాత వచ్చిన వ్యాఖ్యాతలు ప్రత్యేకించి పెట్టినవా? అనే మీమాంస కూడా ఉంది. ఇదంతా యోగ శబ్దార్థం వల్లే వచ్చింది.

యోగః సన్నహనోపాయ ధ్యాన సఙ్గతి యుక్తిషు

యోగము - కవచాదులు (***సన్నహన***), ఉపాయములు (***ఉపాయ***), ధ్యానము (***ధ్యాన***), కలయిక (***సఙ్గతి***), కూర్చుట (***యుక్తిషు***), - ఇవన్నీ యోగమునకు అర్థములే. మరెన్నో అర్థాలు ఉన్నాయి. యోగము అంటే సంబంధము, యోగ్యత, ప్రయత్నము, ప్రాప్తి, చికిత్స అనే అర్థాలు కూడా ఉన్నాయి. యోగము చిత్తవృత్తి నిరోధ మని పతంజలి మహర్షి పారిభాషిక పద ప్రయోగంతో నిర్వచించాడు.

గీతా శాస్త్రము మహాభారతము - భీష్మ పర్వములో ఇరవై ఐదవ అధ్యాయము నుండి నలభై రెండవ అధ్యాయము వరకు వరుసగా పద్దెనిమిది అధ్యాయాలలో ఉంది. కనుక అధ్యాయాల చివర, వరుసగా ప్రథమోఽధ్యాయః, ద్వితీయోఽధ్యాయః, తృతీయోఽధ్యాయః . . . . అష్టాదశోఽధ్యాయః అని ఉండి ఉంటుంది. ఆ తరువాత, గీతా విద్వాంసులు యోగాల పేర్లను చేర్చి ఉంటారు.

నామ భేదం

యోగాలకు నామకరణం చేసిన వారు అనేకులు ఉన్నందు వల్లనే భారత ప్రతులలో ఉండే నామాలు, గీత అధ్యాయాల చివర ఉండే నామాలు వేరు వేరుగా ఉంటాయి.

ఆరవ అధ్యాయాన్ని ధ్యానయోగము అని కొందరు వ్రాస్తే, ఆత్మసంయమ యోగము అని కొందరు, ఆత్మయోగ మని కొందరు, స్వరూపయోగ మని కొందరు, అధ్యాత్మయోగ మని కొందరు వ్రాస్తారు. శంకర భాష్యానుసారం వచ్చే గ్రంథాలలో అభ్యాసయోగః అని ఉంటుంది.

అలాగే నాల్గవ అధ్యాయానికి జ్ఞానయోగ మని, అవతార యోగమని, కర్మబ్రహ్మార్పణ యోగమని - ఇలా ఎన్నో యోగ నామాలు ఇవ్వబడ్డాయి. వీటిని చూచి నపుడు వీటికి నామకరణం అనేక మంది చేసి ఉంటారు అనిపిస్తుంది. కాదు, చేశారనే వాస్తవం తెలుస్తుంది.

అసలు సంగతి

'సఙ్గతి' అనే అర్థమే ఇక్కడ యోగ శబ్దార్థము. ఏ అధ్యాయాన్ని ఏ పేరుతో పిలిచినా నష్టం లేదు కాని యోగ శబ్దార్థమును సంగతిగా నిర్ణయించాలి. ఇదే అసలు సంగతి. సంగతి అంటే ఇక్కడ సంబంధము. సంబంధము అంటే విషయ సంబంధము; లేక విషయంతో సంబంధము.

ఆరవ అధ్యాయాన్ని ధ్యానయోగము అన్నా రనుకోండి. దాని అర్థ మేమిటి? ఆరవ అధ్యాయంలో ధ్యానమే విషయము అని అర్థము. అదే సంగతి. అంతే గాని ధ్యానాభ్యాసమునకు సంబంధించినది అని కాదు. అలా చూచి నపుడు, కర్మయోగము అంటే కర్మకు సంబంధించిన విషయం, భక్తి యోగము అంటే భక్తికి సంబంధించిన విషయం. అంతేగాని, భక్తి ఒక యోగమని, ధ్యానం ఒక యోగమని, విభూతి ఒక యోగమని, అనేక యోగాలను సృష్టించి, అవన్నీ అభ్యాస యుక్తము లని అర్థం చెప్పకూడదు. అలా చెబితే, ఏమవుతుంది? ఏమవుతుందా! గీత పద్దెనిమిది యోగాలను బోధించినట్లు అవుతుంది ***(వాస్తవానికి గీత బోధించింది రెండు యోగాలే).*** ఆ పద్దెనిమిది యోగాలను మనం అభ్యసించాలి అనే భాష్యాలు కూడా వినిపిస్తాయి. వినడానికి బాగానే ఉంటాయి. ఆచరణ వద్దకు వచ్చినపుడే గొంతులో వెలగపండు పడేది.

ఉదాహరణకి అర్జున విషాద యోగం అనే ఈ మొదటి అధ్యాయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? యోగ శబ్దాన్ని యోగ విశేషంగా గ్రహిస్తే, ధ్యానయోగ మంటే ధ్యానాభ్యాస మని, విషాదయోగ మంటే, విషాదాభ్యాసము అని అర్థం వస్తుంది. విషాదాన్ని అభ్యసించేది ఎలా? అంటే, విషాదానికి మనం ప్రయత్నించాలా? లేని విషాదాన్ని కొని తెచ్చుకోవాలా? అలాగే చెబుతున్నారు చాలా మంది. ఏడుపు లేనిదే వేడుక లేదని ప్రాసలు వేసి మరీ యతు లవుతున్నారు.

అర్జున విషాద యోగము అంటే అర్జున విషాదము అనే విషయమును వర్ణించుట అని భావము. అంతే. అంతకు మించి తీగ లాగ నవసరం లేదు. అన్ని అధ్యాయాలను కూడా ఇలాగే అర్థం చేసుకోవాలి.

అధ్యాయము

అధ్యాయః అంటే, అధ్యయనము, పాఠము, వేదాధ్యయనము, గ్రంథ భాగము అనే అర్థాలు ఉన్నాయి. ప్రథమోఽధ్యాయః అంటే ప్రథమ పాఠము అని గ్రహించ వచ్చు. గ్రంథములో ప్రథమ భాగము అని అర్థం చేసుకోవచ్చు.

అధ్యాయము అంటే, చదవడం అని, చదవ బడేది అని కూడా స్థూలంగా చెబుతారు. అంటే, ఒక అధ్యాయం తరువాత మరొక అధ్యాయాన్ని వరుసక్రమం లోనే చదవాలి అని కూడా తెలుస్తోంది. భగవద్గీతను అక్కడక్కడ, అలా అలా చదివే వారికి అంతంతే తెలుస్తూ ఉంటుంది. కొంత కొంతే అర్థ మవుతూ ఉంటుంది. గీతా శాస్త్రము పూర్ణ శాస్త్రము. కనుక గీతను పూర్ణం గానే అధ్యయనం చేయాలి. పద్దెనిమిది అధ్యాయాలను పూర్ణంగా అధ్యయనం చేసి నపుడే గీతాహృదయం సుస్పష్ట మౌతుంది. అధ్యయన ఫలం సిద్ధిస్తుంది.

ఓం

చైతన్య భగవద్గీత

అథ ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయము

సాంఖ్యయోగః - సాంఖ్యయోగము

ఇదేమిటి?

మనకు ఎన్నో అర్థమవుతూ ఉంటాయి. ఎన్నిటినో మనం అర్థం చేసుకొంటూ ఉంటాము. అయితే, వాటన్నిటి వెనుక ఉండేది జ్ఞానమే అని చెప్పలేము. అంత తెలిసిన వాడు ఇలా అయ్యా డేమిటి? అని కొన్ని సందర్భాలలో కొందరి విషయంలో మనమే వ్యాఖ్యానిస్తూ ఉంటాము. అదేదో అనూహ్యమైన పరిణామం అని భావించి అలా వ్యాఖ్యానిస్తామే గాని, అది వాస్తవాన్ని అర్థం చేసుకోలేని మన బుద్ధి లోపమే అని గ్రహించము.

ఇది నాకు ఇష్టము, అది అయిష్టము. ఇత నంటే నాకు ఇష్టము, అత నంటే అయిష్టము. ఇష్టాలైతే మనకు ఉన్నాయి. అవి ఎందుకు ఇష్టమో మనకు స్పష్టంగా తెలియదు. అలాగే, మనకు అయిష్టాలు కూడా చాలా ఉన్నాయి. అవి ఎందుకు అలా అయిష్టంగా మారాయో సహేతుకంగా మనం వివరించ లేము. అంతే కాదు. నేడు అయిష్టంగా ఉన్నవి నిన్న ఎందుకు ఇష్ట మయ్యాయో తెలియదు. నేడు ఇష్ట మైనవి రేపు ఎందుకు అయిష్టంగా మారుతాయో కూడా అర్థం కాదు.

ఇవన్నీ మన మనస్సులలో ఏర్పడిన తాత్కాలికమైన నిర్ణయాలు. ఈ నిర్ణయాల వెనుక ఎవరో లేరు. మన భావాలే ఉన్నాయి. మన అభిప్రాయాలే ఉన్నాయి. రాగాలే ఉన్నాయి. ద్వేషాలే ఉన్నాయి. కాని, విశాలమైన ఈ ప్రపంచం మన అభిప్రాయాలకు, మన భావాలకు అనుగుణంగా నడవదు. ధర్మచోదిత మైన ఈ విశ్వము మన రాగద్వేష సంగీతానికి అనువుగా గజ్జె కట్టి నాట్యం చెయ్యదు.

ఆంతర్యాలు - అలజడులు

మనకు తెలియకుండా మనలో ఏవేవో సమస్యలు ఉంటాయి. మనకు అర్థం కాకుండా మనలో ఎన్నో సంఘర్షణలు అవ్యక్తంగా ఉంటాయి. అదొక పూడిక తెలియని అగాధం. ఆ పూడికను మనం తీయలేము. అక్కడికి మనం ప్రయత్నించినా వెళ్ళలేము. అంత లోతుగా మనలో మనమే ఎలా త్రవ్వుకున్నామో, ఎంత బయట పడేసినా అర్థం కాదు. అవన్నీ అగాధాలు. అగోచరాలు. ఉన్నట్లు తెలియకుండా ఉంటాయి. లేనట్లే ఉంటాయి.

ఆంతర్యం ఎవరి దైనా ఇలాగే ఉంటుంది. విశ్లేషించినా అంతు చిక్కదు. విస్మరించినా దూరం కాదు. ఆంతర్యంలో సమస్య లన్నీ అవ్యక్తం గానే ఉంటాయి. అలా ఉండి మనలో భయాలను కదలిస్తూ ఉంటాయి. బాధల్ని సృష్టిస్తూ ఉంటాయి. మన ఆంతర్యం మనదే. మన తోనే ఉంటుంది. మన తోనే కలసి పుట్టింది. మనల్ని నేడున్న పరిస్థితికి తెచ్చింది అదే.

ఎంత తెలిసినా మనిషి సంతోషంగా ఉండలేక పోతున్నాడు అంటే, ఆ తెలిసింది ఏదో, అది అతడు సుఖపడటానికి సరిపోవడం లేదు అని అర్థము. అదంతా కూడా జ్ఞానమే. కాని, సమ్యక్ జ్ఞానం కాదు. పూర్ణజ్ఞానం కాదు. పూర్ణ జ్ఞానమే అయితే, మనిషికి ఆనందం దూరం కాకూడదు.

జీవితం లోని వాస్తవాలకు, మనం వాటిని అర్థం చేసుకొనే విధానానికి మధ్య ఏదో అంతరం ఉంది.

అలాగే నాల్గవ అధ్యాయానికి జ్ఞానయోగ మని, అవతార యోగమని, కర్మబ్రహ్మార్పణ యోగమని - ఇలా ఎన్నో యోగ నామాలు ఇవ్వబడ్డాయి. వీటిని చూచి నపుడు వీటికి నామకరణం అనేక మంది చేసి ఉంటారు అనిపిస్తుంది. కాదు, చేశారనే వాస్తవం తెలుస్తుంది.

అసలు సంగతి

'సఙ్గతి' అనే అర్థమే ఇక్కడ యోగ శబ్దార్థము. ఏ అధ్యాయాన్ని ఏ పేరుతో పిలిచినా నష్టం లేదు కాని యోగ శబ్దార్థమును సంగతిగా నిర్ణయించాలి. ఇదే అసలు సంగతి. సంగతి అంటే ఇక్కడ సంబంధము. సంబంధము అంటే విషయ సంబంధము; లేక విషయంతో సంబంధము.

ఆరవ అధ్యాయాన్ని ధ్యానయోగము అన్నా రనుకోండి. దాని అర్థ మేమిటి? ఆరవ అధ్యాయంలో ధ్యానమే విషయము అని అర్థము. అదే సంగతి. అంతే గాని ధ్యానాభ్యాసమునకు సంబంధించినది అని కాదు. అలా చూచి నపుడు, కర్మయోగము అంటే కర్మకు సంబంధించిన విషయం, భక్తి యోగము అంటే భక్తికి సంబంధించిన విషయం. అంతేగాని, భక్తి ఒక యోగమని, ధ్యానం ఒక యోగమని, విభూతి ఒక యోగమని, అనేక యోగాలను సృష్టించి, అవన్నీ అభ్యాస యుక్తము లని అర్థం చెప్పకూడదు. అలా చెబితే, ఏమవుతుంది? ఏమవుతుందా! గీత పద్దెనిమిది యోగాలను బోధించినట్లు అవుతుంది ***(వాస్తవానికి గీత బోధించింది రెండు యోగాలే).*** ఆ పద్దెనిమిది యోగాలను మనం అభ్యసించాలి అనే భాష్యాలు కూడా వినిపిస్తాయి. వినడానికి బాగానే ఉంటాయి. ఆచరణ వద్దకు వచ్చినపుడే గొంతులో వెలగపండు పడేది.

ఉదాహరణకి అర్జున విషాద యోగం అనే ఈ మొదటి అధ్యాయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? యోగ శబ్దాన్ని యోగ విశేషంగా గ్రహిస్తే, ధ్యానయోగ మంటే ధ్యానాభ్యాస మని, విషాదయోగ మంటే, విషాదాభ్యాసము అని అర్థం వస్తుంది. విషాదాన్ని అభ్యసించేది ఎలా? అంటే, విషాదానికి మనం ప్రయత్నించాలా? లేని విషాదాన్ని కొని తెచ్చుకోవాలా? అలాగే చెబుతున్నారు చాలా మంది. ఏడుపు లేనిదే వేడుక లేదని ప్రాసలు వేసి మరీ యతు లవుతున్నారు.

అర్జున విషాద యోగము అంటే అర్జున విషాదము అనే విషయమును వర్ణించుట అని భావము. అంతే. అంతకు మించి తీగ లాగ నవసరం లేదు. అన్ని అధ్యాయాలను కూడా ఇలాగే అర్థం చేసుకోవాలి.

అధ్యాయము

అధ్యాయః అంటే, అధ్యయనము, పాఠము, వేదాధ్యయనము, గ్రంథ భాగము అనే అర్థాలు ఉన్నాయి. ప్రథమోఽధ్యాయః అంటే ప్రథమ పాఠము అని గ్రహించ వచ్చు. గ్రంథములో ప్రథమ భాగము అని అర్థం చేసుకోవచ్చు.

అధ్యాయము అంటే, చదవడం అని, చదవ బడేది అని కూడా స్థూలంగా చెబుతారు. అంటే, ఒక అధ్యాయం తరువాత మరొక అధ్యాయాన్ని వరుసక్రమం లోనే చదవాలి అని కూడా తెలుస్తోంది. భగవద్గీతను అక్కడక్కడ, అలా అలా చదివే వారికి అంతంతే తెలుస్తూ ఉంటుంది. కొంత కొంతే అర్థ మవుతూ ఉంటుంది. గీతా శాస్త్రము పూర్ణ శాస్త్రము. కనుక గీతను పూర్ణం గానే అధ్యయనం చేయాలి. పద్దెనిమిది అధ్యాయాలను పూర్ణంగా అధ్యయనం చేసి నపుడే గీతాహృదయం సుస్పష్ట మౌతుంది. అధ్యయన ఫలం సిద్ధిస్తుంది.

ఓం

చైతన్య భగవద్గీత

అథ ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయము

సాంఖ్యయోగః - సాంఖ్యయోగము

ఇదేమిటి?

మనకు ఎన్నో అర్థమవుతూ ఉంటాయి. ఎన్నిటినో మనం అర్థం చేసుకొంటూ ఉంటాము. అయితే, వాటన్నిటి వెనుక ఉండేది జ్ఞానమే అని చెప్పలేము. అంత తెలిసిన వాడు ఇలా అయ్యా డేమిటి? అని కొన్ని సందర్భాలలో కొందరి విషయంలో మనమే వ్యాఖ్యానిస్తూ ఉంటాము. అదేదో అనూహ్యమైన పరిణామం అని భావించి అలా వ్యాఖ్యానిస్తామే గాని, అది వాస్తవాన్ని అర్థం చేసుకోలేని మన బుద్ధి లోపమే అని గ్రహించము.

ఇది నాకు ఇష్టము, అది అయిష్టము. ఇత నంటే నాకు ఇష్టము, అత నంటే అయిష్టము. ఇష్టాలైతే మనకు ఉన్నాయి. అవి ఎందుకు ఇష్టమో మనకు స్పష్టంగా తెలియదు. అలాగే, మనకు అయిష్టాలు కూడా చాలా ఉన్నాయి. అవి ఎందుకు అలా అయిష్టంగా మారాయో సహేతుకంగా మనం వివరించ లేము. అంతే కాదు. నేడు అయిష్టంగా ఉన్నవి నిన్న ఎందుకు ఇష్ట మయ్యాయో తెలియదు. నేడు ఇష్ట మైనవి రేపు ఎందుకు అయిష్టంగా మారుతాయో కూడా అర్థం కాదు.

ఇవన్నీ మన మనస్సులలో ఏర్పడిన తాత్కాలికమైన నిర్ణయాలు. ఈ నిర్ణయాల వెనుక ఎవరో లేరు. మన భావాలే ఉన్నాయి. మన అభిప్రాయాలే ఉన్నాయి. రాగాలే ఉన్నాయి. ద్వేషాలే ఉన్నాయి. కాని, విశాలమైన ఈ ప్రపంచం మన అభిప్రాయాలకు, మన భావాలకు అనుగుణంగా నడవదు. ధర్మచోదిత మైన ఈ విశ్వము మన రాగద్వేష సంగీతానికి అనువుగా గజ్జె కట్టి నాట్యం చెయ్యదు.

ఆంతర్యాలు - అలజడులు

మనకు తెలియకుండా మనలో ఏవేవో సమస్యలు ఉంటాయి. మనకు అర్థం కాకుండా మనలో ఎన్నో సంఘర్షణలు అవ్యక్తంగా ఉంటాయి. అదొక పూడిక తెలియని అగాధం. ఆ పూడికను మనం తీయలేము. అక్కడికి మనం ప్రయత్నించినా వెళ్ళలేము. అంత లోతుగా మనలో మనమే ఎలా త్రవ్వుకున్నామో, ఎంత బయట పడేసినా అర్థం కాదు. అవన్నీ అగాధాలు. అగోచరాలు. ఉన్నట్లు తెలియకుండా ఉంటాయి. లేనట్లే ఉంటాయి.

ఆంతర్యం ఎవరి దైనా ఇలాగే ఉంటుంది. విశ్లేషించినా అంతు చిక్కదు. విస్మరించినా దూరం కాదు. ఆంతర్యంలో సమస్య లన్నీ అవ్యక్తం గానే ఉంటాయి. అలా ఉండి మనలో భయాలను కదలిస్తూ ఉంటాయి. బాధల్ని సృష్టిస్తూ ఉంటాయి. మన ఆంతర్యం మనదే. మన తోనే ఉంటుంది. మన తోనే కలసి పుట్టింది. మనల్ని నేడున్న పరిస్థితికి తెచ్చింది అదే.

ఎంత తెలిసినా మనిషి సంతోషంగా ఉండలేక పోతున్నాడు అంటే, ఆ తెలిసింది ఏదో, అది అతడు సుఖపడటానికి సరిపోవడం లేదు అని అర్థము. అదంతా కూడా జ్ఞానమే. కాని, సమ్యక్ జ్ఞానం కాదు. పూర్ణజ్ఞానం కాదు. పూర్ణ జ్ఞానమే అయితే, మనిషికి ఆనందం దూరం కాకూడదు.

జీవితం లోని వాస్తవాలకు, మనం వాటిని అర్థం చేసుకొనే విధానానికి మధ్య ఏదో అంతరం ఉంది.

అంతు చిక్కని అగాధం ఉంది. ఇలాంటి చోటే మనస్సులో ఘర్షణ ఏర్పడుతుంది. అవగాహన స్పష్టంగా లేనపుడే మనిషిలో సంఘర్షణ ప్రారంభ మవుతుంది.

మనిషి - మనసు

మంచో, చెడో, ఏ పనైనా మనిషే చేయాలి. ఏ పని చేయాలి, ఏది చేయకూడదు అనేది కూడా మనిషే నిర్ణయించు కోవాలి. ఈ నిర్ణయాలు మనసు లోనే జరగాలి. అలా నిర్ణయాలు జరగడానికి ఆలవాలమైన మనస్సు, ఆలోచనలకు నిలయమైన మనస్సు ప్రశాంతంగా ఉండాలి. అలజడి లేకుండా ఉండాలి. ఘర్షణలు తలెత్తకుండా ఉండాలి.

ఘర్షణ పడే చిత్తము వివేకంతో చిగురించదు. వివేకం లోపించడం వల్లే ఘర్షణ మొదలవుతుంది. ఆంతర్యంలో ఘర్షణలు విజృంభించి నపుడు అవ్యక్తంగా ఉన్న వన్నీ బుసలు కొడుతూ పైకి లేస్తాయి. అగాధంలో కూరుకు పోయిన సమస్య లన్నీ ఉపరితలం చేరుతాయి. అవ్యక్తంగా నిద్రపోతున్న భయాలు, సమస్యలు మేలుకుంటాయి. బ్రతుకులో బాధలకు, దుఃఖాలకు తెర తీస్తాయి. క్షణాల్లో పరిస్థితుల్ని తారుమారు చేస్తాయి. నిముషాల్లో తుఫానును సృష్టిస్తాయి.

సమరంలో సవ్యసాచి

అర్జునుడు యుద్ధభూమిలో ఉన్నాడు. కురుక్షేత్రంలో ఉన్నాడు. నేడు అతడు కదన రంగంలో ఉండటానికి వెనుక ఎంతో కథ నడచింది. అన్నీ వింతలే. విచిత్రాలే. వికృతాలే. విడ్డూరాలే. వినాశానికి దారి తీసే విషయాలే.

యుద్ధం ఉన్నపళంగా వచ్చింది కాదు. క్షణంలో ఊడి పడింది కాదు. పిడుగుపాటే అయినా పిడుగులా పడింది మాత్రం కాదు. నేడు ఆశనిపాతము అనిపించినా, ఏనాడూ శకుని పాత్ర లేకుండా సాగింది కాదు.

బాల్యం నుండి మాత్సర్యాలే. ఈర్ష్యలే. అసూయా పాచికలే. విషాన్ని జీర్ణించుకోవలసి వచ్చింది. మంటల నుండి బయటపడవలసి వచ్చింది. నీళ్ళల్లో తల దాచుకో వలసి వచ్చింది. నిండు సభలో మహిళ మానమే ప్రశ్నార్థకంగా మారి నపుడు తలలు దించుకో వలసి వచ్చింది.

కందమూలాలు తిని కాలాన్ని నెట్టుకొంటూ వచ్చారు. వనంలో వాసము - రణం తోనే నివాసము. మృగాలతో పోరాటము - మృగాల వంటి మనుష్యుల మధ్య ఆరాటము, విరాటుని కొలువులో అజ్ఞాతము - అజ్ఞాతంలో అలివకు అవమానము, ఎన్ని బాధలు? అన్నీ బాధలే. అన్నీ వ్రణాలే. అన్నీ రణాలే. చివరికి ఏదీ కుదరక, ఎద బాధతో మహారణం. కురుక్షేత్ర కదన రంగంలో ధర్మసంగ్రామం.

సన్నాహాలు - సాయుధాలు

అర్జునుడు దశాబ్దాలు నిరీక్షించింది ఈ సంగ్రామం కొరకే. కఠోర తపస్సులతో సురుల హృదయాలను దోచుకొని, అద్భుత శస్త్రాస్త్రాలను సమకూర్చు కున్నది ఈ సమరం కొరకే. పశుపతితో పోరాడి పాశుపతాస్త్రాన్ని పార్థుడు సాధించింది ఈ పోరాటం కొరకే.

మనిషి ధనాన్ని సంపాదించు కొనేది అవసరాలు తీర్చుకోవ డానికి, అనుభవించడానికి. వీరుడు ఆయుధాలను సమకూర్చు కొనేది సమర రంగంలో ప్రయోగించడానికి. అవసరాలకు ఉపయోగపడని ధనం ఉండి ఏమి ప్రయోజనం? అవసర సమయంలో సమరంలో సంధించుటకు ఉపకరించని ఆయుధాలు ఉండి ఏమి ఉపయోగం?

క్షత్రియుడు ధర్మం కోసం యుద్ధం చెయ్యాలి. తనది ధర్మం. అధర్మపరుడైన దుర్యోధనుని సంహరించి,

ప్రజా క్షేమాన్ని రక్షించ వలసిన ధర్మం ధనంజయునికి ఉంది. అది పాండవుల కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని నెరవేర్చే సమయం కొరకే ఇంత వరకు పాండవులు నిరీక్షించారు. సమయం ఆసన్న మైంది. సమరం ఆరంభం కాబోతోంది. రథాన్ని ఉభయసేనల మధ్య ఉంచమన్నాడు పార్థుడు. అలాగే ఉంచాడు పార్థసారథి.

అవ్యక్తాలు వ్యక్త మయ్యాయి

యుద్ధరంగంలో ఇరుపక్షాల లోని యోధుల్ని పరిశీలించి చూశాడు పార్థుడు. పరీక్షించి మరీ చూశాడు. పరితాపంతో చలించి పోయాడు. విషణ్ణు డయ్యాడు. దేహం విశీర్ణ మైంది. మనసు విచలిత మైంది.

అంతా అయిపోయింది. ఏం మిగిలింది? దుఃఖమే మిగిలింది. తనపై తనకు పట్టు లేకుండా పోయింది. మనస్సును నియంత్రించే స్థితిలో లేడు. దేహం కూడా నీరసించి పోయింది. ధనుర్బాణాలు పడేశాడు. ఉత్సాహాన్ని పడేశాడు. ఆసక్తిని దూరం చేసుకున్నాడు. అర్థం గాక ధర్మాన్నే పడేశాడు.

ఇదంతా విజయాన్ని సాధించలే మేమో అనే భయంతో కాదు. శత్రు సైన్యాన్ని చూచి భీతి చెంది అసలే కాదు. అంటే, ఏ భయమూ లేదని కాదు. యుద్ధ భయము లేదు అంటున్నాను. అంతే.

అంటే, మరేదో భయం ఉందనే కదా? అవును. ఉంది. అది మరేదో భయం కాదు. మహాభయం. అర్జునుని ఆంతర్యంలో అర్థం కాకుండా, అవ్యక్తంగా ఉండి, సమర రంగంలో ఒక్కసారిగా బహిర్గతమై, అర్జును డంతటి వీరుణ్ణి భీరుడుగా మార్చేసిన మహాభయం. మమకారం సృష్టించిన మారణహోమం.

చరణము : **సమర నదిలో మమకార జలము**
ఎవరి నైనా ముంచుట తథ్యము
ఎంత ఈదినా తెలియదు తీరము
ముందు వెనుక గాఢాంధకారము

పల్లవి : **సంసారమె సంగ్రామము**
తెగిన ప్రేగు అనుబంధము
జీవుల ఆరాటము
జీవన పోరాటము ॥ సంసారమె ॥

ఇది చైతన్య గీతం. గీతలో ప్రతిబింబిస్తున్న అర్జునుని మమకారానికి ఊతం.

మమకారం సృష్టించిన మహాభయంతో అర్జునుడు చలించి పోయాడు. ఎవరు లేకపోతే తాను సుఖంగా జీవించలేడో, ఎవరిని విడిచి తాను బ్రతకలేడో, వాళ్ళనే లేకుండా, శాశ్వతంగా లేకుండా చేయవలసి వస్తోంది అనే భయం. విజయ పతాకాన్ని రెపరెప లాడించాలంటే, తన వాళ్ళను పిట్టల్ని రాల్చినట్లు రాల్చేయాలి. ధనుర్బాణాలను చేత బట్టి దారుణంగా కూల్చేయాలి. అదంతా తలచుకొంటూ ఉంటే అర్జునుడి గుండె ముక్కలై పోతోంది. అందుకే ధనుర్బాణాలు పడేశాడు. రథంలో క్రింది వైపున కూర్చుండి పోయాడు (**రథోపస్థే ఉపావిశత్**).

అర్జునుడు - అందరికీ ప్రతినిధి

సవ్యసాచికి సమరం సమస్యగా మారింది. మహా పరాక్రమవంతు డైన పాండవ మధ్యముని మూర్తిమత్వాన్నే మార్చేసింది. ఇతడు అర్జునుడేనా? అనే సంశయం అందరికీ కలుగుతోంది. పూర్వం ఉన్న పార్థుడేనా? అనే సందేహం కలుగుతూ ఉంది. మార్పు అలాగే ఉంటుంది. క్షణాల్లో అన్నీ తారుమా రవుతాయి.

సమస్య అర్జునునిది అని మనకు అనిపిస్తోంది. వాస్తవానికి ఇది అందరి సమస్య. అన్ని దేశాలకు సంబంధించిన సమస్య. అన్ని కాలాలకు సంబంధించిన సమస్య. అందరు వ్యక్తులకు సంబంధించిన సమస్య.

అర్జునునిలో అవ్యక్తంగా, అగాధంగా ఉన్న భయాలే మమకార రూపంలో బహిర్గతమై, సమర రంగంలో సమస్యని సృష్టించాయి. అవి మన లోనూ ఉన్నాయి. కాకపోతే, అర్జునుని ఆంతర్యం లోని అవ్యక్తాలు బాహ్యం లోకి తొంగి చూశాయి. మనలో అవ్యక్తాలు ఇంకా నిద్ర పోతున్నాయి. అంతే తేడా.

ఎవరు ఎప్పుడు నిద్ర లేస్తారో ఎవరికి తెలుసు? అవ్యక్తాలు కూడా అంతే. అర్జునునికి మమకార రూపంలో నిద్ర లేచాయి. మరొకరికి మరో విధంగా బహిర్గతం కావచ్చు. ఇంటిలో చేరిన పాము ఎప్పుడైనా ప్రమాదమే. ఏ ఇంటిలో అయినా ప్రమాదమే. ఒంటిలో చేరిన మహాభయం, ఉల్లమును గుల్ల చేసే మహాభయం ఎప్పుడైనా ప్రమాదమే. ఎవరి కైనా ప్రమాదమే.

కనుక అర్జునుడు అందరికీ ప్రతినిధి. సర్వ మానవాళికి ప్రతినిధి. అర్జునుని బాధలో అందరి బాధలూ ఉన్నాయి. అర్జునుని శోకంలో అందరి శోకాలూ ఉన్నాయి. అర్జునుని సమస్య అందరి సమస్యగా ఉంది. అందుకనే, అర్జునుని ఆధారం చేసుకొని, నరుని నిమిత్తం చేసుకొని (***అర్జున నిమిత్తీ కృత్య***), నరజాతి కంతా జీవిత పరిష్కారాన్ని అందిస్తున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

సంజయ ఉవాచ :

తం తథా కృప యాఽఽవిష్ట మశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదన్త మిదం వాక్య మువాచ మధుసూదనః ॥ 1

తం-తథా-కృపయా-ఆవిష్టం-అశ్రుపూర్ణాకులేక్షణం
విషీదంతం-ఇదం-వాక్యం-ఉవాచ-మధుసూదనః

తథా	=	ఆ విధముగా
కృపయా	=	కరుణచే
ఆవిష్టం	=	నిండియున్న వాడు
అశ్రుపూర్ణాకులేక్షణం	=	కన్నీరు నిండిన వ్యాకులమైన నేత్రములు గలవాడు
విషీదంతం	=	శోకిస్తున్న వాడు
తం	=	ఆ అర్జునుని
మధుసూదనః	=	శ్రీకృష్ణుడు
ఇదం	=	ఈ
వాక్యం	=	వచనమును
ఉవాచ	=	పలికాడు

సంజయుడు చెబుతున్నాడు :

మహారాజా! ఆ విధంగా అర్జునుడు కరుణార్ద్ర హృదయు డయ్యాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చూపులు కలత చెందాయి. దుఃఖిస్తున్న అర్జునుని చూచి మధుసూదనుడు నోరు విప్పాడు.

వ్యాఖ్య

అధ్యాయ విభాగము

అర్జునుని విషాదం తోనే మొదటి అధ్యాయము పూర్తి అయింది. వాస్తవానికి రెండవ అధ్యాయం మొదటి పది శ్లోకాల వరకు అర్జునుని విషాదమే కొనసాగు తుంది. ఉభయసేనల మధ్య దుఃఖిస్తున్న (***ఉభయోః సేనయోః మధ్యే విషీదంతం***) అర్జునునితో శ్రీకృష్ణుడు మాట్లాడు తున్నాడు అని సంజయుడు చెబుతాడు. పదకొండవ శ్లోకం నుండి పరమేశ్వరుడు పరమ పవిత్రమైన గీతాశాస్త్రాన్ని వినిపిస్తాడు.

మొదటి అధ్యాయము సంజయుని శ్లోకంతో సమాప్త మవుతుంది. రెండవ అధ్యాయము మళ్ళీ సంజయుని శ్లోకం తోనే ప్రారంభ మవుతుంది. ఈ రెండు శ్లోకాల లోనూ అర్జునుని విషాదాన్నే వర్ణించాడు సంజయుడు.

వక్తలో మార్పు లేదు. విషయంలో మార్పు లేదు. అలాంటప్పుడు సంజయుడు పలికిన రెండు శ్లోకాలను వేరు చేసి అధ్యాయాలను విభజించడానికి కారణ మేమిటి? సాంఖ్య యోగాన్ని 'సంజయ ఉవాచ' అని కాకుండా 'శ్రీ భగవానువాచ' తో ప్రారంభించి ఉంటే సరిపోయేది కదా! అర్జున విషాద యోగాన్ని నలభై ఏడు కాకుండా నలభై ఎనిమిది శ్లోకాలతో నింపి, 'సంజయ ఉవాచ' తో ముగించి ఉంటే బాగుండేది కదా అని కొందరికి అనిపిస్తూ ఉంటుంది.

అలా కాకుండా, అర్జునుని విషాద మంతా ప్రథమ అధ్యాయం లోనే ఉండాలి అని అభిప్రాయపడి, సాంఖ్య యోగము లోని మొదటి పది శ్లోకాలను కూడా అర్జున విషాద యోగం లోనే చేర్చి, ***అశోచ్యా నన్వశోచస్త్వం*** అనే భగవానుని శ్లోకంతో రెండవ అధ్యాయాన్ని ప్రారంభించి ఉంటే బాగుండేది అని మరి కొందరు భావిస్తూ ఉంటారు.

ఏది ఎక్కడ మొదలెట్టాలి, ఎక్కడ ముగించాలి అనే విషయంలో వేదము యొక్క ఆద్యంతాలు తెలిసిన వేదవ్యాసునికి మనం సలహాలివ్వ నవసరం లేదు. అద్భుతమైన వ్యాస భగవానుని అమోఘ సంకల్పాలను అర్థం చేసుకో గలిగితే చాలు.

గుణత్రయ ప్రభావము

సత్త్వరజ స్తమోగుణాలు అనే త్రిగుణాలు ప్రకృతి సంభవాలు. ప్రకృతిలో ఈ మూడు గుణాలు సమంగా ఉంటాయి. కాని, వ్యక్తిలో అవే విషమంగా ఉంటాయి. గుణ ప్రభావంతో వ్యక్తులు విభిన్నంగా ప్రవర్తిస్తూ ఉంటారు.

తమోగుణములో అజ్ఞానమే ప్రధానంగా ఉంటుంది. ఉద్యమ స్థితి పూర్ణంగా ఆగి పోతుంది. ఉద్యోగ సద్యోగాలను విరమించి మనస్సు నిరుద్యోగంలో పడుతుంది. నిర్వేదంలో ఉంటుంది. నిరాశతో ఉంటుంది.

రజోగుణము రాగాత్మకంగా ఉంటుంది. రంజన స్వభావంతో ఉంటుంది. తమోగుణం లాగా పడి ఉండటానికి అంగీకరించదు. మూల పడినా బయటికి ఈడ్చి, దృశ్య విషయాలతో మనస్సును సంగమింప చేస్తుంది. క్రియాశీలంగా ఉంటుంది. రాగద్వేషాలే రజోగుణంలో ప్రధాన పాత్రను పోషిస్తూ ఉంటాయి.

సత్త్వగుణము ప్రసన్నంగా ఉంటుంది. విశుద్ధంగా ఉంటుంది. వినిర్మలంగా ఉంటుంది కనుక దర్పణము వస్తువును ప్రతిబింబించి నట్లు సత్త్వగుణము చైతన్యాన్ని ప్రతిఫలింప చేస్తుంది. సత్త్వగుణ ప్రధానులైన వారే ఆత్మజ్ఞానాన్ని శ్రవణం చేయడానికి అర్హులు.

ధనుర్బాణాలను పడేసి, క్రియాశూన్యుడై, ఎప్పుడైతే రథోపస్థ ప్రదేశంలో అర్జునుడు కూర్చుండి పోయాడో, అప్పటికి అతని తమోగుణం చరమ స్థాయికి చేరింది. ఈ విషయాన్ని నిర్ధారణ చేయడానికే సంజయుని రెండు శ్లోకాలను వేరు చేసి, అధ్యాయ విభజనకు సంకల్పించాడు వేదవ్యాసుడు.

రెండవ అధ్యాయం రెండు, మూడు శ్లోకాలలో అర్జునుని మందలిస్తాడు మధుసూదనుడు. నిర్దాక్షిణ్యంగా ఛీకొట్టి తమోగుణ చీకటి నుండి లాగి బయట పడేస్తాడు. అక్కడి నుండి అర్జునుని రాగాత్మక ప్రవృత్తిని చూస్తాము. మమకార వృత్తిని చూస్తాం. రజోగుణ విన్యాసాన్ని చూస్తాం.

రజోగుణ రాగాలాపన చేస్తూ, చేస్తూ అర్జునుని అంతఃకరణము సత్త్వగుణాన్ని అభివ్యంజనం చేస్తుంది.

ఈ స్థితి లోనే అర్జునుడు ధర్మ సమ్మూఢ చేతస్కుడ నయ్యాను అని అంగీకరిస్తాడు. ఏది శ్రేయస్సో నిర్ణయించి చెప్పమంటాడు. అంతటితో ఆగ లేదు. శిష్యరికం ప్రదర్శించాడు. శాసించ మని ప్రార్థించాడు. సత్త్వగుణ ప్రధాను డయ్యాడు. ఆత్మబోధను ఆలకించ డానికి అర్హుడయ్యాడు. అధికారి అయ్యాడు. అది జరిగిన తరువాతే గీతా శాస్త్రాన్ని ప్రారంభించాడు అచ్యుతుడు.

తమోగుణం చరమ స్థాయికి చేరగానే, చేష్ట లుడిగిన అర్జునుని చూపుతూ మొదటి అధ్యాయం సమాప్త మవుతుంది. రెండవ అధ్యాయం ప్రారంభం లోనే తమోగుణం నుండి రజోగుణానికి చేరుతుంది పార్థుని చిత్తము. రజస్తమస్సులు ప్రధానంగా ఉన్నప్పుడు మనస్సుకు జ్ఞానం పట్టదు. అందుచేత సత్త్వగుణము వచ్చే వరకు నిరీక్షించి, ఆ తరువాత సాంఖ్యాన్ని ప్రారంభించాడు భగవానుడు.

అర్జునుని ఆకృతి

అర్జునుని దైన్యాన్ని వర్ణిస్తున్నాడు సంజయుడు. జాలి కలవా డయ్యాడట (***కృపయావిష్టం***). కన్నీళ్ళ పర్యంత మయ్యాడట (***అశ్రుపూర్ణాకులేక్షణమ్***). పైగా ఏడుస్తున్నాడట (***విషీదన్తం***). అది చూచి, మాట పడేశాడట మధుసూదనుడు. ఇది సంజయుని సంక్షిప్త సంకలిత సంభాషణము.

కృపావిష్టుడు

అర్జునుడు దయార్ద్ర హృదయు డయ్యాడు. జాలిగుండె కలవా డయ్యాడు. ఆయన బుద్ధిని కృప ఆవరించింది. యుద్ధ విముఖతకు కారణమైంది. మరి, ఆ రథం లోనే శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఉన్నాడు కదా! ఆయన ఎందుకని కృపావిష్టుడు కాలేదు? శ్రీకృష్ణుడు కరుణ లేని వాడా? కృప చూపలేని వాడా? కృపానిధి అని ముల్లోకాలు కీర్తించింది ఆయననే కదా! ఇది కూడా ఆలోచించాలి.

కౌంతేయుడు కరుణామయుడే. యుద్ధానికి రాక ముందు కూడా కృప గలవాడే. అయినా యుద్ధం చేయాలనే వచ్చాడు. యుద్ధానికి వెళ్ళకు అని అడ్డు చెప్పని కృప, యుద్ధం చేయకు అని సమరభూమిలో అడ్డు పడుతూ ఉంది. అంటే ఇక్కడ కృప ఒక్కటే కాదు. ఇంకా ఏదో ఉంది.

ఈ ఘర్షణ అంతా ఇతరుల వల్ల ఏర్పడింది కాదు. తన మనస్సు లోనే తయారైంది. ఆలోచనా విధానంలో ఏవో ఏవో తయారయ్యాయి. యుద్ధం చేయక పోతే ధర్మం తప్పిన వాడ నౌతానేమో అనే భయం కూడా అర్జునునిలో ఉంది. పోనీ చేద్దామా అంటే, స్వజనుల్ని, గురువుల్ని చంపాలి. అందుకు మనస్సు సిద్ధంగా లేదు.

ధర్మాన్ని విస్మరించి సుఖపడ లేడు. స్వజనుల్ని చంపి బ్రతక లేడు. ధర్మానికి, వ్యక్తిగత మమకారాలకు మధ్య ఘర్షణ ఏర్పడింది. ఎటైనా దెబ్బ తగిలేది తనకే. ఇక కృప ఎవరి మీద? నిజం చెప్పాలంటే తన మీదే. తన వాళ్ళను పోగొట్టుకొని సుఖంగా బ్రతకలేని తనపై తనకు కృప ఉంది కనుకనే తన వాళ్ళపై కృప కలిగింది. ఇదంతా మమకారము. అహంకారము సృష్టించిన మాయాజాలము. అందుకే అచ్యుతుడు దీనిని అంగీకరించ లేదు. బలహీనతగా కొట్టి పారేశాడు. కృప అనే ముసుగులో అహంకారం దూరి అర్జునుని బుద్ధిని కబళించి వేసిందని శ్రీకృష్ణుడు గుర్తించాడు.

అశ్రుపూర్ణాకులేక్షణుడు

కళ్ళల్లో నీళ్ళు తిరుగు తున్నాయి కనుక చూపులు కూడా కలత చెందాయి. దేహ స్థాయిలో కూడా అర్జునుడు బలహీన పడ్డాడని స్పష్టంగా తెలిసి పోతోంది. కృప ముసుగులో బుద్ధిని కబళించిన మమకారం శరీరాన్ని కృంగ తీయడమే గాక మనస్సును కూడా తీవ్రంగా కలత పెట్టేసింది.

విషణ్ణుడు

మనస్సు విషాదంతో నిండి పోయింది. బాధతో బరు వెక్కింది. ఇదంతా అహంకారము సృష్టించిన మమకారము ఆడే నాటకమే నని గుర్తించిన శ్రీకృష్ణుడు ఈ మమకార పిశాచాన్ని, మోహ జాడ్యాన్ని తుద ముట్టించుటకు సిద్ధ పడ్డాడు. కనుకనే శ్రీకృష్ణుని ఈ సందర్భములో మధుసూదనునిగా వర్ణించాడు సంజయుడు.

సర్వేషాం దేహే మధువత్ ఇష్టత్వాత్ మధుః అహంకారః

తం ఆత్మ ప్రకాశనేన సూదయతి నాశయతీతి మధుసూదనః

సర్వ మానవుల దేహాలలో తేనె లాగా ఇష్ట మైనది, తియ్య నైనది అహంకారము. అట్టి అహంకారమును ఆత్మజ్ఞాన ప్రకాశము చేత నశింప చేయువాడు కనుక శ్రీకృష్ణుడు మధుసూదను డయ్యాడు.

అర్జున విషాద యోగంలో ముప్పై అయిదవ శ్లోకంలో శ్రీకృష్ణుని మధుసూదనా! అని అర్జునుడు సంబోధించాడు. మధువనే రాక్షసుని సంహరించడం వల్ల శ్రీకృష్ణుడు మధుసూదను డయ్యాడు. ప్రస్తుత శ్లోకంలో మధువు అంటే అహంకారము అని అర్థం చెప్పుకున్నాం. అహంకారాన్ని నశింప చేసేవాడు కనుక శ్రీకృష్ణుడు మధుసూదన శబ్దవాచ్య డయ్యాడు.

దీనిని బట్టి చూచి నపుడు అహంకారము కూడా రాక్షసి లాంటి దని అర్థమవుతూ ఉంది. అదొక భూత మని, పిశాచ మని తెలుస్తూ ఉంది. భూతం మనిషిని ఆవేశించినట్లు, అహంకార భూతం కృపా ముసుగులో అర్జునుని మనస్సును ఆవేశించింది. ఏ భూతం పడితే మాత్రం ఏమవుతుంది? సర్వభూతనాథుడు రథం లోనే ఉన్నాడు కదా! మోహ పిశాచాన్ని, అహంకార భూతాన్ని అర్జునుని మనస్సు నుండి తరిమే ప్రయత్నంలో కొరడా ఝళిపించినట్లు మధుసూదనుడు తీక్షణ మైన పదజాలంతో పార్థుని యుద్ధానికి ప్రేరేపిస్తున్నాడు.

శ్రీ భగవానువాచ :

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥ 2

కుతః-త్వా-కశ్మలం-ఇదం-విషమే-సముపస్థితం
అనార్యజుష్టం-అస్వర్గ్యం-అకీర్తికరం-అర్జున

అర్జున =	హే అర్జునా!	కశ్మలం =	మాలిన్యము
అనార్యజుష్టం =	అనార్యులు పొందేది	విషమే =	విషమ సమయములో
అస్వర్గ్యం =	స్వర్గానికి పనికి రానిది	త్వా =	నిన్ను
అకీర్తికరం =	అపకీర్తిని కలిగించేది	కుతః =	ఎక్కడి నుండి
ఇదం =	ఈ	సముపస్థితం =	ఆవరించింది?

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! సంక్లిష్టమైన సమయంలో ఈ మనోవ్యథ నీకు ఎలా దాపురించింది? ఇది ఆర్యులకు తగనిది. స్వర్గానికి పనికి రానిది. పైగా, అపకీర్తిని కలిగించేది.

వ్యాఖ్య

విషమ సమయంలో వింత ప్రవర్తన

శత్రువులతో పోరాడాలని పోరుభూమిలో పాదం పెట్టిన పార్థుడు, విరోధులను వధించడం కన్నా వారి

చేతిలో మరణించడమే మంచిది అనే వింత వాదాన్ని వినిపించాడు. యుద్ధం వల్ల కలిగే ఉపద్రవాలు తెలుస్తూ ఉండే టప్పుడు యుద్ధాన్ని ఎందుకు విరమించ కూడదు? అని ప్రశ్నిస్తూ, ధనుర్బాణాలను క్రింద పడేశాడు ధనంజయుడు.

అర్జునునిలో గోచరించిన ఈ అనూహ్య పరిణామానికి అచ్యుతుడు ఆశ్చర్య పోయాడు. యుద్ధభూమికి వచ్చి యుద్ధాన్ని విరమించాలని గోల పెట్టడం కన్నా అసలు యుద్ధానికి రాకుండా ఉంటే సరిపోయేది కదా! రణరంగానికి ఎందు కొచ్చినట్లు? ఇదొక ఆకస్మిక పరిణామం. వింత ప్రవర్తన.

ఏది వస్తుందో తెలియదు

జీవితం చాలా విచిత్ర మైంది. జీవుల ప్రవర్తన అంతకన్నా విచిత్ర మైంది. ఎవరు ఎప్పుడు ఎలా ఉంటారో తెలియదు. ఎవరు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో అర్థం కాదు. అన్నీ వింతలే. అన్నీ విడ్డూరాలే.

అర్జునుడు అచ్యుతునికి క్రొత్తవాడు కాడు. బాగా తెలిసిన వాడే. బంధువు. సఖుడు. అన్నీను. అలాంటి వ్యక్తిలో మనో వ్యాకులత, మనోవ్యథ, మనో మాలిన్యం ***(కశ్మలమ్)*** ఈ స్థాయిలో గతంలో ఎప్పుడూ చూడలేదు శ్రీకృష్ణుడు. అందుకే ఆశ్చర్య పోతున్నాడు. ఈ అవివేకం నీకు ఎక్కడి నుండి వచ్చింది? ***(కుతః)*** అని సూటిగా ప్రశ్నిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

ఉన్నదే వస్తుంది

ఈ కశ్మలము ఎక్కడి నుండి వచ్చింది? అని ప్రశ్నించాడు గోవిందుడు. ఎక్కడి నుండి వచ్చింది? అంటే, మునుపు తన వద్ద ఉన్నది కాదు అని అర్థము. అర్ధ శతాబ్దము పైగా పరిచయం ఉన్నా, ఈ విధమైన వింత ప్రవర్తన తానెప్పుడూ అర్జునునిలో చూడ లేదు. ఇది సహజ స్వభావమే అయితే, ఎప్పుడో ఒకప్పుడు కంట బడేదే. అలా ఎప్పుడూ కనలేదు. వినలేదు. ఇప్పుడే, ఇక్కడే, కురుక్షేత్రం లోనే ప్రత్యక్షమైంది.

ఇంతవరకు అర్జునుని విషయంలో తన కంట పడిన వన్నీ సాహసాలే. విజయాలే. వీరత్వాలే. అర్జునుడు అంటేనే ధైర్యవంతుడు, వివేకవంతుడని పేరు. పిరికితనము, అవివేకము, మనోమాలిన్యము లాంటివి అర్జునునిలో అనూహ్య మైనవి. అయితే, ఇప్పుడు ఎలా వచ్చాయి? ఎక్కడి నుండి వచ్చాయి? ఉన్నవే అయితే, ఇంతకాలం కంట బడకుండా ఎలా ఉన్నాయి? ఎక్కడ దాచాడు? ఎలా దాచాడు?

ఉన్న వన్నీ తెలియవు

ఏవి తెలిసినా ఉన్నవే తెలుస్తాయి. అలాగని ఉన్న వన్నీ తెలుస్తాయని చెప్పలేము. ఇంట్లో ఉన్నవి ఇంటి లోని వారి కందరికీ తెలుస్తాయి. బ్యాంకులో దాచినవి ఆ దాచిన వ్యక్తికి మాత్రమే తెలుస్తాయి. కాని, మనస్సులో ఉన్న వన్నీ మనిషికి తెలియాలి అనే నియమం లేదు. మనిషి కొన్ని విషయాలను ప్రయత్నంతో, మరి కొన్ని విషయాలను అప్రయత్నంగా మనస్సులో దాచు కుంటాడు. కొన్ని విషయాలైతే మనిషికి సంబంధం లేకుండానే మనస్సులో చేరి పోతాయి. అశేష అనుభవ పరంపరలలో కొన్ని జారి మనస్సు లోతుల్లో పడి ఉంటాయి. అవన్నీ అలా ఉంటాయే కాని, ఉన్నట్లు తెలియవు.

జలాశయాల్లో పూడికలో ఏర్పడిన చలనం వల్ల ఉపరితలాన జలాలు కదులుతూ ఉండటం, బుడగలు వస్తూ ఉండటం మనం చూస్తూ ఉంటాము. అలాగే మనస్సు లోతులలో జరిగే కంపనం వల్ల అవ్యక్తంగా అంతర్యంలో దాగి ఉన్నవి బాహ్యంలో వ్యక్త మవుతూ ఉంటాయి.

అంతర్యంలో ఏ కంపనం ఎలాంటిదో, తత్సంబంధ మైన పోకడలే బాహ్యంలో గోచరిస్తూ ఉంటాయి.

కానీ, అంతర్యంలో ఎప్పుడు ఎలాంటి చలనం జరుగుతుందో తెలియదు. ఏది జరిగినా, దాని ప్రతిరూపమే, ప్రతిబింబమే బాహ్యంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది కనుక, బాహ్యం లోని ప్రవర్తన కూడా అర్థం కాదు. వింత గానే ఉంటుంది. విచిత్రం గానే ఉంటుంది.

ఎప్పుడు ఏది వస్తుందో తెలియదు. ఏది వచ్చినా ఉన్నది వస్తుందే గాని లేనిది రాదు. అయితే ఆ వచ్చిన దేదో అది అలా ఉన్నట్లు ముందు తెలియదు కనుక ఇప్పుడు వింతగానే కనిపిస్తుంది. నిగూఢ మైనవి, నిమగ్న మైనవి వెలుగు చూచే టప్పుడు అనుభవం విచిత్రం గానే ఉంటుంది.

ఒక అద్భుతమైన రచన చేసి నప్పుడు, లేదా విస్మయాన్ని కలిగించే విషయాన్ని ప్రసంగించి నపుడు వ్యక్తి తనలో తానే ఒక వింతను, విచిత్రాన్ని దర్శిస్తూ ఉంటాడు. ఈ భావం నాలో ఎలా కదిలింది? ఈ ఆలోచన నాకు ఎక్కడి నుండి వచ్చింది? అని విస్తుపోతూ ఉంటాడు. ఎక్కడి నుండి వస్తాయి? తన నుండే వస్తాయి. తనకు తెలియకుండా తనలో ఉన్నవే తన ద్వారా వెలుగు చూసి నపుడు తనకే వింతగా ఉంటుంది. ఇక ఇతరులకు వింతగా ఉంటుందని ప్రత్యేకంగా చెప్పే దేముంది? అందుకే ఆశ్చర్యపోతూ, ఈ మనోవ్యథ నీకు ఎలా దాపురించింది? ***(కుతస్త్వా కశ్మలమిదం)*** అని ప్రశ్నించాడు శ్రీకృష్ణుడు.

సమయాలు - సందర్భాలు

ఒక వ్యక్తి ఎప్పుడు తింటాడో చెప్పగలం. ఎప్పుడు త్రేపుతాడో ఎలా చెప్పగలం? తినడానికి సమయా లున్నాయి. సందర్భాలూ ఉంటాయి. త్రేపడానికి ఏది సమయమో, ఏది సందర్భమో ఎలా చెప్పగలం? తినిన ప్రతి వ్యక్తి త్రేపుతాడని చెప్పలేము. అలాంటప్పుడు ఎవరు త్రేపుతారో, ఎప్పుడు త్రేపుతారో, ఎక్కడ త్రేపుతారో చెప్పగలమా?

ఒక వ్యక్తి త్రేపి నపుడు, ఈ త్రేపు ఎలా వచ్చింది? ఎందు కొచ్చింది? ఈ సమయం లోనే ఎందు కొచ్చింది? అంటే సమాధానం ఏమి చెప్పాలి? త్రేపు వచ్చేది త్రేపే వాడికే తెలియదు. అందుకే కదా కొందరు ధ్యానంలో, మరి కొందరు శ్రవణంలో, ఇంక కొందరు నిద్రలో కూడా త్రేపుతూ ఉంటారు!

తినిన వాడే త్రేపుతాడు. త్రేపడానికి కూడా సమయం ఉంది. త్రేపే సమయం లోనే మనిషి త్రేపుతాడు. ఆ త్రేపే సమయం ఏదో తెలియదు కనుక, ఇలాంటి సమయంలో త్రేపుతా వేమిటి అని ప్రక్క వ్యక్తి ప్రశ్నిస్తే, నిజమే కదా! ఇప్పుడు ఎందుకు త్రేపాను అని త్రేపిన వ్యక్తి తికమక పడుతూ ఉంటాడు. త్రేపిన సమయము సరి యైనదే. ఆ సమయం తెలియక పోవడం చేత, ఆ కాలం అకాలంగా, ఆ కార్యం అకార్యంగా తెలుస్తూ ఉంటాయి. అచ్యుతుడికి అన్నీ తెలిసినా, అర్జునునికి తెలియ జేయాలని ఈ విషమ సమయంలో ***(విషమే సముపస్థితం)*** నీకు ఈ అవివేకం ఎక్కడి నుండి వచ్చింది? అని ప్రశ్నించాడు.

అర్జునునిలో అంతర్యుద్ధము

సంక్లిష్ట మైన సమయంలో ధర్మాధర్మాల మధ్య సదవగాహన లోపించి నపుడు సత్పురుషుడు సంఘర్షణకు లోనవుతాడు. దేహాన్ని వ్యాధులు పట్టి పీడించినట్లు, మనస్సును వ్యథలు ఆక్రమించి భయాలతో బీభత్సం చేస్తాయి. పాపభీతితో కుదిపేస్తాయి. పార్థుని విషయంలో అదే జరిగింది. అర్జునుని బుద్ధి భయనిలయ మైంది. ధర్మాత్ము డైన ధనంజయుని మూడు భయాలు విపరీతంగా బాధిస్తున్నాయి.

(1) ఇప్పుడు నేను చేయబోయే సంగ్రామము సరియైన దేనా? నేను చేయ దగిన దేనా? ఆర్యసంతతిలో ఆవిర్భవించిన వాణ్ణి. ఆర్షసంస్కృతిలో పెరిగిన వాణ్ణి.

ఆరాత్ పాపకర్మభ్యో యాతి ఇతి ఆర్యః

పాప కార్యాలకు దూరంగా పోవు వాడు ఆర్యుడు. మరి, తాను చేసే యుద్ధము పాపకర్మ అయితే తనకు తీరని కళంకాన్ని తెచ్చి పెడుతుందేమో అని భీతి చెందుతున్నాడు అర్జునుడు.

(2) ఈ రణరంగంలో పోరాడటం నైతికమా? అనైతికమా? ధర్మమా? అధర్మమా? అనే మీమాంస మరొక వైపు అర్జునుని మనస్సును కుదిపేస్తోంది. ధర్మాచరణమునకు ఫలంగా స్వర్గం ప్రాప్తిస్తే, అధర్మాచరణము నకు ప్రతిఫలం నరకమే కదా! ఈ కురుక్షేత్ర పోరాటము తనకు నరక ద్వారాలను తెరుస్తుందేమో అనే నరక భయం కూడా నరుని హృదయాన్ని పిండుతూ ఉంది.

పైగా, ధార్తరాష్ట్రులు దురాత్ములు. పాపుల్ని చంపితే, మమ్మల్ని కూడా పాపమే చుట్టు కుంటుంది ***(పాపమే వాశ్రయే దస్మాన్ హత్వైతా నాత తాయినః)*** అని మొదటి అధ్యాయం ముప్పై ఆరవ శ్లోకంలో అర్జునుడు అనేశాడు కూడా. కనుక, ఈ యుద్ధం నరక హేతువు అవుతుందేమో అనే పాపభీతి, పరలోక భయం కూడా పార్థుని పట్టుకుని ఉన్నట్లు తెలుస్తోంది.

(3) పరలోకం మాట పరమేశ్వరు డెరుగు. ఇహలోకంలో తల దించుకోవలసి వస్తుందేమో! పవిత్రంగా, ప్రసిద్ధంగా జీవించి పది పేర్లు సాధించు కున్నాడు. ఆశించకుండానే దశవిధ నామాలు అందుకున్నాడు. ఈ పోరాటంలో బీభత్సాన్ని సృష్టించి, పది కాదు కదా, ఒక్కటి కూడా నిలబెట్టుకోలేక పోతాడేమో! పేరు పోగొట్టుకొని ఎలా బ్రతకాలి? ఇన్నాళ్ళు సన్మానాల మధ్య బ్రతికాడు. ఇప్పుడు అవమానాలను భరిస్తూ బ్రతకడం సాధ్య పడుతుందా? ఇలా అర్జునునిలో అంతర్యుద్ధం నడుస్తూ ఉంది. ఆంతర్యం కల్లోలంగా మారింది. మనసు నీరసించి పోయింది. శరీరం నిర్వీర్య మైంది. గాండీవం చేజారి పోయింది. విజయుడు విషణ్ణ డయ్యాడు.

వజ్రం వజ్రేన భిద్యతే

వజ్రాన్ని వజ్రం తోనే కోయాలి. భయాన్ని భయం తోనే పోగొట్టాలి. ఇదొక అద్భుతమైన శిక్షణ ప్రక్రియ. అసమానమైన రక్షణ ప్రక్రియ. శ్రీకృష్ణుని అమోఘ బోధనా పటిమ ఆరంభ శ్లోకం లోనే అందల మెక్కింది.

భయాలలో, బాధలలో పడి అర్జునుని మనస్సు మునిగి పోతూఉంది. కర్మాచరణం నుండి విడిపడి మగత లోకి జారి పోతూఉంది. దానిని ఎలాగైనా పైకి లేపాలి. నూతనోత్తేజాన్ని కలిగించాలి. ఉత్సాహాన్ని నింపాలి.

పట్టు తప్పి ఒక వ్యక్తి శరీరం కూలబడుతూ ఉంటే, మరొక వ్యక్తి తన దేహశక్తితో సాయం చేసి నిలబెడతాడు. అలాగే, భయంతో, అధైర్యంతో ఒక వ్యక్తి మనసు బలహీనమై, నీరసించి నపుడు, బుద్ధి బలం గల మరొక వ్యక్తి తన ధీశక్తితో అభయ ప్రదానం చేసి, అవగాహనను కల్పించి, పతన మౌతున్న మనస్సును ప్రగతి బాటలో నడిపిస్తాడు. శ్రీకృష్ణుడు తన ప్రారంభ శ్లోకంలో అదే చేస్తున్నాడు. అదే చెబుతున్నాడు.

భయాలు రెండు విధాలుగా ఉంటాయి. (1) విధాయక భయాలు (2) విధ్వంసక భయాలు. విధాయక భయాలు ఆలోచనల్ని పెంచి, అవగాహనను దించి, అంతరాయాలను అదృశ్యం చేసి, అంతరంగాన్ని ఉద్యుక్తం చేస్తాయి. ఉద్యమ స్ఫూర్తిని కలిగిస్తాయి. విధ్వంసక భయాలు ఆలోచనల్ని కుదించి, అవగాహనను దారి మళ్ళించి, అంతరాలను ఆవిష్కరించి, ఆంతర్యాన్ని కల్లోల పరుస్తాయి. కలవర పెడతాయి.

అర్జునునిలో విధ్వంసక భయం చోటు చేసుకుంది. దాని వలన వ్యక్తిత్వమే అస్తవ్యస్త మైంది. విధ్వంసక భయం ఎప్పుడైనా, ఎవరి కైనా ఆత్మహత్యా సదృశమే. శ్రీకృష్ణుడు కూడా పరోక్షంగా అర్జునుని భయ పెడుతూనే మందలించాడు. కాకపోతే అది విధాయక భయం. భయాన్ని పోగొట్టే భయం. నూతన తేజాన్ని నింపే దైవబలం.

వజ్రాన్ని వజ్రం తోనే ముక్కలు చేయాలి. అలాగే భయాన్ని భయం తోనే పోగొట్టాలి అనే బౌద్ధిక పరివర్తనకు, సాంస్కృతిక పునర్జీవనానికి శ్రీకారం చుట్టాడు శ్రీకృష్ణుడు. అర్జునునిలో మూడు భయాలు ఎలా చోటు చేసుకున్నాయో ఇప్పటికే మనం చూశాం. శ్రీకృష్ణుడు మరో మూడు భయాల్ని ప్రవేశ పెట్టి ముచ్చటిస్తున్నాడు. కాకపోతే, మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లు కాకుండా, ఆకలితో గతించే వానికి అమృతాన్ని అందించినట్లు భాషించాడు. తమోగుణ ప్రభావంతో కూలబడిన అర్జునునిలో రాజసిక ప్రవృత్తిని కలిగించి తన కాళ్ళ మీద తాను నిలబడేటట్లు చేశాడు.

భయాలే అభయాలు

యుద్ధం ప్రస్తుత పరిస్థితుల్లో తాను చేయదగిన దేనా? అనేది అర్జునుని మొదటి భయం. కురుక్షేత్ర సంగ్రామంలో పోరాడటం పుణ్యమా? పాపమా? అనేది అర్జునుని రెండవ భయం. ఈ విధమైన యుద్ధము చేయడం వల్ల తనకు అపకీర్తి సంభవిస్తుందేమో! అనేది అర్జునుని మూడవ భయం. తాను ఏది ఆచరించడం వల్ల ఉపద్రవాలు సంభవిస్తాయని ఊహించుకొని అర్జునుడు భీతి చెందు తున్నాడో, దానిని ఆచరించక పోవడం వల్లనే తన ఊహాల లోని ఉపద్రవాలు సంక్రమిస్తాయని శ్రీకృష్ణుడు అర్జునుని ఆంతర్యంలో నిగూఢంగా ఉన్న మూడు భయాలనే ప్రస్తావిస్తూ ప్రవచిస్తున్నాడు.

(1) అనార్య జుష్టం

ఆర్యులు ఆచరించ దగినదా, కాదా? అనేది అర్జునుని సంశయం. ఆచరిస్తేనే ఆర్యుడు. ఆచరించకుండా ఉండటం ఆర్యునికి తగినది కాదు; అనార్యులకు తగినది ***(అనార్య జుష్టం)*** అని మొదటి భయాన్ని నివారించే ప్రయత్నంలో అద్భుతంగా ప్రవచించాడు అచ్యుతుడు. **జుష్టం** అంటే ఆచరించ దగినది అని అర్థం. **అనార్య జుష్టం** అంటే ఆర్యులు కాని వారు ఆచరించేది అంటూ మరీ దారుణ మైన భయాన్ని అర్జునుని బుద్ధికి పట్టించాడు భగవానుడు.

అర్తుం యోగ్యః ఆర్యః. ఆర్యుడు అంటే సేవింప దగిన వాడు, లేదా పూజింప దగిన వాడు అని అర్థము. ఆర్యుడు ఎందుకని పూజింప దగిన వాడు? ధర్మాన్ని ఆచరించాలని కోరుకొనే వాడు, అధర్మాన్ని ఆచరించ కూడదని అభిప్రాయపడే వాడు కనుక ఆర్యుడు పూజార్హుడు ***(కర్తవ్యం ఆచరన్ కామం అకర్తవ్యం అనాచరన్)***. ఆర్యుడు ఆచరణీయుడు. అనుష్ఠానపరుడు.

సకాలంలో సత్కర్మలు చేసే సత్పురుషులు ఆర్యులు. ఆతతాయు లైన దుర్యోధనాదుల వల్ల ధర్మ హాని ఏర్పడింది. క్షత్రియునికి ధర్మం ప్రాణవాయువు వంటిది. కురుక్షేత్రంలో జరిగేది ధర్మయుద్ధము. వ్యక్తిగత బాంధవ్యాలకు సంబంధించింది కాదు. క్షత్రియ జాతిలో జన్మించిన ఆర్య పురుషుడు ధర్మరక్షణ కొరకు యుద్ధం చేయాలి. అలా చేయక పోతే, అధర్మం వ్యాప్తి చెందుతుంది. క్షత్రియుడు ధర్మాన్ని విస్మరించి యుద్ధం చేయక పోవడం చేతనే ధర్మానికి హాని ఏర్పడుతుంది కనుక, అట్టి ధర్మ గ్లానికి కారణమైన క్షత్రియుడు అనార్యుడని పిలువ బడతాడు. అధర్మ వ్యాప్తికి కారణ మైనందున నరకంలో ప్రవేశిస్తాడు.

(౨) అస్వర్గ్యం

యుద్ధం చేస్తే పాపం వస్తుందేమో, పాప ఫలంగా నరకం సంభవిస్తుం దేమో అనేది మూడవ వాని రెండవ భయం. ఇది గుఱ్ఱం ముందు బండిని ఉంచడమే అవుతుందని శ్రీకృష్ణుడు కనువిప్పు కలిగించాడు.

యుద్ధం చేయక పోతేనే నరకం ప్రాప్తిస్తుంది, స్వర్గం చేజారి పోతుంది అని భగవానుడు సహేతుకంగా

వివరించాడు. ధర్మహాని కలిగే టప్పుడు ధర్మాన్ని రక్షించడానికి క్షత్రియుడు యుద్ధం చేయాలి. అది క్షత్రియ ధర్మం. ధర్మ రక్షణ చేయకుండా, కర్తవ్యం నుండి జారిపోయిన క్షత్రియుడు నరకాన్ని పొందుతాడు.

ధర్మ రక్షణకై యుద్ధం చేసి యుద్ధభూమిలో మరణించిన వీరుడు స్వర్గాన్ని పొందుతాడు అని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. వాటిని అనుసరిస్తూ ఆచరించే వారు ఆర్యులు. స్వర్గప్రాప్తికి అర్హులు. ధర్మయుద్ధం నుండి పారి పోయేవారు అనార్యు లవుతారు. స్వర్గ ద్వారాలు వారికి మూత పడతాయి.

(3) అకీర్తికరం

యుద్ధం చేస్తే అపఖ్యాతి పాలవుతా నేమో అనేది అర్జునుని మూడవ భయం. ఆ అపఖ్యాతి ఏదో యుద్ధం చేయక పోవడం వల్ల వస్తుందే గాని చేయడం వల్ల కాదు అనేది అచ్యుతుని ఆక్షేపము.

యుద్ధాన్ని విరమించి, అర్జునుడు వెను దిరిగితే, కిరీటి కీర్తి కిరీటంలో మరో మణిపూస చేరుతుందా? ధనంజయుడు దయామయుడు అని ప్రజలు కీర్తిస్తారా? పోరాడి గెలిస్తే కీర్తి వస్తుంది గాని పారిపోయి ఓడిపోతే యశస్సు పెరుగుతుందా?

యుద్ధం చేస్తే అపకీర్తి వస్తుంది అనేది అర్జునుని భయం. యుద్ధాన్ని విరమిస్తేనే అపఖ్యాతి అనేది శ్రీకృష్ణుని వాదన.

అర్జునా! కీర్తి, అపకీర్తి అనేవి ఎక్కడ నుండి వస్తాయి? ఎవరి నుండి వస్తాయి? ప్రజల నుండి రావాలి. ప్రజలు ఎవరిని కీర్తిస్తారు? ఎవరిని నిందిస్తారు? ప్రజలు ధర్మాభిలాషులు. ధర్మ రక్షణ చేసే వారిని కీర్తిస్తారు. ధర్మహాని కలిగించే వారిని నిందిస్తారు. దూషిస్తారు.

దుర్యోధనుడు అధర్మపరుడు. నీవు రణరంగం నుండి పారిపోతే, ఆ తరువాత దుర్యోధనునిదే ప్రభుత్వము. అతని దుష్ట పరిపాలనలో ప్రజలు దుర్గతి పాలవుతారు. ఇదంతా నీ నిర్వాకమే నని నిన్ను ఎత్తి పొడుస్తూ ఉంటారు. అర్జునుని పిరికితనం వల్లే మనకు ఈ దుర్గతి ప్రాప్తించింది అని నిన్ను నిందిస్తారు. ఇదంతా కీర్తి క్రిందికే వస్తుందా అర్జునా?

ప్రజలు ఎప్పుడైనా గెలిచిన వారికే పూలదండలు వేస్తారు. పార్థా! పారిపోయిన వారికి పసుపు కుంకాలను పంపడం చూశాము గాని నీరాజనాలు పట్టడం చూడ లేదు. అది కూడా కీర్తే నని నీవు భావిస్తే, నా కేమీ అభ్యంతరం లేదు.

రాజుగా దుర్యోధనుడు ఏ చెడు కార్యం చేసినా, ప్రజలు ముందుగా నిందించేది నిన్నే. ధర్మయుద్ధంలో పాల్గొని, అధర్మపరులను హతమార్చి, వీర క్షత్రియుడిగా ప్రజల మన్నన లందుకొని, ధర్మయుత మైన పాలనను అందిస్తే కీర్తి వస్తుంది గాని, పారిపోతే పేరు వస్తుందా? ఏమో వస్తే రావచ్చు. పేడివాడు అనే పేరు రావచ్చు. పనికి రానివాడు అనే ఖ్యాతి మిగలొచ్చు. అర్జునా! ఆలోచించుకో. పేరు తెచ్చుకోమని, ఖ్యాతి పెంచుకోమని తల్లిదండ్రులు పేరు పెడతారు గాని, పేరును పోగొట్టుకోమని పేరు పెట్టరు. అయినా, నీ పేరు అర్జునుడు కదా! ఈ కశ్మలం ఈ విషమ సమయంలో నీ కెక్కడి నుండి దాపురించింది? అని లేని భయాలను, రాని భయాలను గుండెలో నింపుతూ భాషించాడు భగవంతుడు.

అర్థం కాలేదా అర్జునయ్యా!

చూడు మిత్రమా! నీవు కీర్తిని సంపాదిస్తా వనే మా అత్తమామలు నీకు అర్జునుడు అని పేరు పెట్టి ఉంటారు. పేరుకు ప్రాకులాడ వలసింది పోయి నీలో కశ్మలం పేరుకుపోయిం దేమిటి?

అర్జ్యత ఇతి అర్జునః అర్జ అర్జనే - నీ వల్ల పేరు ప్రఖ్యాతులు ఆర్జింప బడుతాయి అనే కదా నీకు అర్జును డని పేరు పెట్టింది?

శుక్ల శుభ్ర శుచి శ్వేత విశద శ్వేత పాణ్డరాః
అవదాత స్సితో గౌరో వలక్షో ధవలో౽ ర్జునః ॥

ఈ అర్థాలన్నీ నీవే కదా! శ్వేతవర్ణంతో శోభిస్తూ ఉంటావు. పవిత్రమైన వాడివి. శుద్ధమైన వాడివి. అందుకే కీర్తిమంతుడివి.

ధవళః ధావతి శుద్ధ్యతి ఇతి ధవళః అర్జునః. అర్జున అంటేనే ధవళ వర్ణము. శుద్ధిరూపము. మరి, ఈ అశుద్ధము నిన్ను ఎలా ఆవరించింది? ఈ కశ్మలము ఎక్కడి నుండి వచ్చి నిన్ను పట్టుకొంది? ***(కుతస్త్వా కశ్మల మిదం).***

అర్జునా! తెలుపు వస్త్రానికి మురికి అంటుకోవచ్చు. కాని, ఆ మాలిన్యము తెలుపు వస్త్రానిది కాదు. ఎక్కడి నుండో వచ్చి వస్త్రానికి అంటుకొని ఉంటుంది. శుద్ధి చేస్తే మురికి పోతుంది. వస్త్రం తెల్లగా శోభిస్తుంది ***(శ్వేతతే శ్వేతమ్).***

పార్థా! నీవు కూడా శుద్ధమైన వాడివి. అర్జునుడివి. ప్రస్తుతము నిన్ను ఆవరించిన మనోమాలిన్యము నీ స్వభావము కాదు. ఆగంతుకము. రాసుకుంటే ఉంటుంది. రాల్చేస్తే పోతుంది. తగిలించుకుంటే ఉంటుంది. తొలగించుకుంటే పోతుంది.

మధ్యలో వచ్చినవి మధ్య లోనే పోతాయి. అర్జునా! ఇంతెందుకు? మీరు అజ్ఞాతవాసం చేసి నపుడు విరాట నగరంలో నువ్వు అదోలా ఉన్నావు కదా! ఇప్పుడలా ఉన్నావా? లేవు కదా! అంతే. ఒకవేళ, అలాగే ఉన్నట్లు అనిపిస్తోందా? అలాంటి దేమీ లేదు. భ్రమపడకు. అలాంటి ఆలోచనల్ని రానివ్వకు. వచ్చినా ఉండ నివ్వకు. విడిచేయ్! అది నీకు తగదు.

క్లైబ్యం మాస్మగమః పార్థ నైత త్త్వ య్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్య క్త్వోత్తిష్ఠ పరంతప ॥ 3

క్లైబ్యం-మా స్మ గమః-పార్థ-న-ఏతత్-త్వయి-ఉపపద్యతే
క్షుద్రం-హృదయ దౌర్బల్యం-త్యక్త్వా-ఉత్తిష్ఠ-పరంతప

పార్థ	=	హే అర్జునా!	పరంతప	=	హే పరంతపా!
క్లైబ్యం	=	అధైర్యమును	క్షుద్రం	=	నీచమైన
మాస్మగమః	=	పొందకు	హృదయదౌర్బల్యం	=	హృదయ దుర్బలత్వమును
ఏతత్	=	ఇది	త్యక్త్వా	=	విడిచి
త్వయి	=	నీ విషయమున	ఉత్తిష్ఠ	=	లెమ్ము!
న ఉపపద్యతే	=	తగదు			

పార్థా! అధైర్య పడకు. అది నీకు తగింది కాదు. నువ్వు శత్రువులను పీడించే వాడివి కదా! లే! నీచమైన హృదయ దౌర్బల్యాన్ని విడిచేయి.

వ్యాఖ్య

అధైర్యమే అవరోధము

అధైర్యము అవాంఛనీయము. అసంగతము. సద్యోగ స్ఫూర్తికి ప్రతిబంధక మైన అధైర్యము

అసమంజసము అని శ్రీకృష్ణుని అభిప్రాయం. అందుకే అధైర్యాన్ని పొందకు. అశక్తతను దగ్గరకు రానివ్వకు అని సవ్యసాచికి సలహా ఇస్తున్నాడు (**క్లైబ్యం మాస్మగమః**).

'క్లైబ్యం' అంటే అధైర్యము అని ఒక అర్థము. నపుంసకత్వము అని మరొక అర్థము. ఈ రెండింటిలో ఏదీ యుద్ధభూమికి అర్హ మైనది కాదు. అధైర్యపరుడు యుద్ధం చేసే దేముంటుంది? ఇక నపుంసకుని విషయం ప్రత్యేకంగా చెప్పే దేముంది?

పురుషుడైన వాడు రణరంగంలో ఎదజూపి, ఎదురొడ్డి పోరాడుతాడు. స్త్రీ ఇంటి లోనే ఉంటుంది. సమర రంగానికి రాదు కనుక ఆమె పోరాడే ప్రసక్తే లేదు. నపుంసకుని విషయమే విచిత్రంగా ఉంటుంది. నపుంసక జీవి స్త్రీ కాదు కనుక ఇంటిలో ఉండటం జరగదు. పురుషుడు కానందున యుద్ధంలో ప్రవేశించడం జరగదు.

స్త్రీ కానందున యుద్ధం చేయకుండా ఇంట్లో ఉండేది లేదు. పురుషుడు కానందున రణరంగంలో ఉండటమే గాని పోరాడేది ఉండదు. మరి, యుద్ధభూమిలో చేసే దేమిటి? ఏముంది? పోరాడే వాళ్ళ మధ్య తారసిల్లి, తారాడుతూ, తచ్చాడుతూ తటస్థంగా ఉండటమే.

అర్జునుడు స్వభావత: అధైర్యవంతుడు కాడు. నపుంసకుడు అసలే కాడు. గతంలో ఎందరితో యుద్ధం చెయ్యలేదు? ఇంతెందుకు? ఉత్తర గోగ్రహణంలో కౌరవసేన నంతా గడగడ లాడించిన గడుసరి గాండీవి కాడా? సాక్షాత్తు పరమేశ్వరునితో పోరాడి పాశుపతాస్త్రమును పొందిన వాడు ధైర్యము లేనివాడా? అర్జునుడు కురువీరుడు. రణధీరుడు. అందుకే, ఈ సందర్భంలో అర్జునుని పార్థా! అని సంబోధించాడు భగవంతుడు.

పృథాదేవి ఉత్తమ క్షత్రియ స్త్రీ. ఆమె కుమారుడివి. ఉత్తమ క్షత్రియ ధర్మాలతో శోభించ వలసిన వాడివే గాని అధైర్యంతో వెన్ను చూపే వాడివి కావు. కాకూడదు. అది పురుష లక్షణం కాదు. నపుంసక లక్షణం (**క్లీబత్వం - క్లైబ్యం**). నీ విషయంలో అది తగదు. అర్జునా! ఏదో శాపవశాత్తు గతంలో బృహన్నలగా కులికింది వాస్తవమే అయినా, అదేదో పోయింది కదా! ఇప్పుడు లేదు కదా! కనుక ఎటు చూచినా, ఏ అర్థాన్ని ఆశ్రయించినా, క్లైబ్యం నీకు తగింది కాదు.

నీవు తగవు - నీకు తగవే

అర్జునా! ఇది నీకు తగదు (***త్వయి ఏతత్ న ఉపపద్యతే***). అధైర్యము నీకు సంబంధించింది కాదు. తగవు లాడే స్వభావం గల క్షత్రియుడవే గాని పిరికితనాన్ని, పేడితనాన్ని ప్రదర్శించుటకు నీవు తగవు. ఈ విధమైన ప్రవర్తన నీకు తగదు.

బుద్ధి బలహీనపడి నపుడు, హృదయం విషాదభరిత మైనపుడు, మనస్సును నియంత్రించే శక్తిని మనిషి కోల్పోయి నపుడు, ఈ విపత్కర పరిస్థితి నుండి బయట పడటానికి తన శక్తి సరిపో నపుడు మరొక చోట నుండి సహాయం అవసరమై ఉంటుంది. ఆ సహాయంతో తన అశక్తత నుండి బయటపడి మనిషి శక్తివంతు డవుతాడు.

మరొక చోట నుండి సహాయం అందటం అంటే, అది వ్యక్తి నుండి కావచ్చు. గ్రంథం నుండి రావచ్చు. లేదా దృఢమైన లక్ష్యం నుండి కావచ్చు. ఒక సన్నివేశం కూడా సరిపోవచ్చు. ఏదైనా సరే, అలాంటి పరిస్థితిలో ఆ సహాయం ఏదో అది శక్తి ఉత్పాదక యంత్రంగా పని చేయాలి.

ప్రతి మనిషిలో నిగూఢ మైన శక్తి ఉంది. అలాగే కొంత అశక్తత కూడా ఉంటుంది. బలాబలాలు ఉన్నవాడే మనిషి. వ్యక్తిలో రెండూ ఉండొచ్చు. కాని, ఒకే సమయంలో రెండిటిని ప్రదర్శించడం సాధ్యం కాదు.

ఏదో ఒకటే బయట పడుతూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో ధైర్యం ఉండొచ్చు. కొన్ని పరిస్థితులలో అధైర్యమే అందలం ఎక్కవచ్చు. ఎప్పుడు ఏది వస్తుందో, ఏ స్థాయిలో ఉంటుందో చెప్పలేము.

బలం బలమే కనుక బాధ లేదు. బలహీనత ఆక్రమిస్తేనే దానిని నివారించుకొనే ప్రయత్నం చేయాలి. అది కూడా, మనకు సాధ్యం కాకపోతే, మరొకరి సహాయం సలహా రూపంలో సహకరించ వచ్చు. ఉపకరించ వచ్చు. కాని, ఆ సలహాలు సౌజన్యాలుగా ఉండాలే గాని దౌర్జన్యాలుగా ఉండ కూడదు. సముచితాలుగా ఉండాలే గాని, అనుచితాలు కాకూడదు. విధాయకాలై ఉండాలే కాని, విధ్వంసకాలు కాకూడదు.

సలహాలు ఎవ్వరైనా ఇవ్వగలరు. అదొక పెట్టుబడి లేని వ్యాపారం. కొందరికి అనవసర మైన వ్యాపకం కూడా. కాని ఆ సలహాలు సముచితాలు కాకపోతే మాత్రం ఆ తరువాత అంతా అనుచితమే. అనాదరమే. అహితమే. అందుచేతనే, సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడు ఈ సందర్భంలో అనితర సాధ్యంగా, అసమాన వైభవంతో అభిభాషించాడు. పార్థా! అధైర్యము నీకు తగదు. క్షత్రియ వీరా! అధైర్యానికి నీవు తగవు (**నైతత్త్వయ్యుప పద్యతే**). తగవు లాడటమే నీకు తగును అంటున్నాడు అర్జున సఖుడు.

ఆకాశం లోనే ఎండ-వాన

ప్రభాకరుడు పలికినా, జాబిల్లి నవ్వినా ఆకాశంలో ప్రకాశం తాండవిస్తుంది. ఆ ఇరువురూ తెరమరు గైతే గగనాన్ని చీకటి కప్పేస్తుంది. ఆకాశం లోనే చీకటి వెలుగులు. ఆకాశం నుండే తిమిర తేజాలు. ఎండైనా, వానైనా ఆకాశం నుండే. ఏది ఎలా వస్తే ఆకాశం అలా అగుపిస్తుంది.

వ్యోమంలో వెలుగునీడలు తారాడినట్లు, శీతోష్ణాలు పచార్లు చేసినట్లు, బలాబలాలు బుద్ధిలో ఉంటాయి. బుద్ధి నుండే బహిర్గత మవుతాయి. బుద్ధి లోనే బలం ఉంటుంది. బుద్ధి లోనే బలహీనత ఉంటుంది. ఏది బుద్ధిలో ఉంటే అదే బ్రతుకులో తచ్చాడుతుంది. అందుకే, మనసే మనిషి అంటుంటారు మనస్తత్త్వ శాస్త్రవేత్తలు.

ఇటుకలు, సున్నము బలంగా ఉంటే గోడ బలంగా ఉంటుంది. ఆలోచనలు, భావాలు తేజోవంతంగా ఉంటే, బ్రతుకు తేజరిల్లుతుంది. ఆ పని ఎవరికి వారు చేసుకోవాలి. అలా చేసుకోవడం సాధ్యపడ నపుడు మరొకరి చేయూత అవసరం అవుతుంది. అలా చేయూత నిచ్చే వ్యక్తి ఆచార్యుడే అయితే చిత్తము చిగురిస్తుంది. బ్రతుకు పరిమళిస్తుంది. అర్జునునికి కురుక్షేత్రంలో అలాంటి సహాయమే అవసర మైంది. అదృష్టం తోడై అచ్యుతుని అండ లభించింది.

నీరసించిన అర్జునుని మనస్సును శక్తివంతం చేసే ప్రయత్నంలో శ్రీకృష్ణుడు బలమైన రసాయనాన్ని ఈ శ్లోకంలో నూరి పోశాడు. వండి వడ్డించాడు. పనిగట్టుకొని త్రాగించాడు. పనితన మేమిటో ప్రదర్శించి చూపాడు. నిద్రించిన ఆకాశాన్ని సూర్యుడు వెలుగులతో తట్టి లేపినట్లు, నిర్వీర్యమై కూల బడిన అర్జునుని అంతఃకరణములో వివేక దీపాన్ని వెలిగించాడు అనంతుడు.

బలవంతుడివి - బలహీన పడకు

అర్జునా! దారుణమైన ఈ విషమ సమయంలో ఈ అవివేకము నిన్నెలా ఆవేశించింది? ఈ మనో వ్యాకులత నీకు ఎలా దాపరించింది? ఇది నీకు తగింది కాదు. నీవు వీరుడివి. శూరుడివి. బలవంతుడివి. నీ చరిత్రలో ఇప్పటి వరకు పుటలన్నీ ఇలాగే ఉన్నాయి. ఇప్పుడే ప్రథమంగా నీలో ఈ కశ్మలాన్ని చూస్తున్నాను. ఇది నీకు తగింది కాదు (***నైతత్త్వయ్యుపపద్యతే***) అంటూ అమోఘంగా భాషించాడు అనంతుడు.

ఈ సందర్భములో పైపైన చూచే వారికి శ్రీకృష్ణుడు అర్జునుని అశక్తతపై స్వారి చేసినట్లు కనిపిస్తుంది. కాని, వివేకంతో విశ్లేషించుకొని, ఆంతరంగిక ఔన్నత్యాన్ని అర్థం చేసుకోగలిగే వారికి, శ్రీకృష్ణుడు అర్జునుని ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, పతన మౌతున్న మనస్సును పదిలంగా నిలిపి, పవిత్రంగా నడిపించినట్లు అర్థ మవుతుంది.

'ఇది నీలో ఉంది' అని దోషాన్ని ఎత్తి చూపడం వేరు. అదే విషయాన్ని 'ఇది నీలో ఉండ తగింది కాదు' అని చెప్పడం వేరు. మొదటి వాక్యం పతనానికి శ్రీకారం చుడుతుంది. రెండవ వాక్యం ప్రగతికి ద్వారం తెరుస్తుంది. మొదటిది నిరాశా నిస్పృహలను, లేదా కోపతాపాలను కలిగించ వచ్చు. కాని, రెండవది మాత్రం ఆశాకిరణాల్ని విరజిమ్ముతూ క్రియాశీలత్వాన్ని ప్రసాదిస్తుంది. దౌర్జన్యాలు ఫలించవు. సౌజన్యాలు నిష్ఫలం కావు.

ఆత్మగౌరవం దెబ్బ తింటే మాత్రం, ఆ వ్యక్తిలో అభివృద్ధి అగుపించదు. మనిషికి పశువుకు తేడా ఇక్కడే. గొడ్డును దుడ్డుకర్రతో బాదినా, మరుక్షణమే గడ్డి పడేస్తే చాలు. గుట్టుగా తిని త్రేపుతుంది. కాని, మనిషిని కొట్ట నవసరం లేదు. తిట్టినా చాలు. మనసు గాయ పడుతుంది, మనిషి తిండి మానేస్తాడు. పశువుకు ఆకలి తీరితే చాలు. కాని, ఆకలి కన్నా, ఆత్మగౌరవానికే మనిషి ప్రాధాన్యత నిస్తాడు.

మనిషి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తూ సలహా లివ్వ కూడదు. అలా ఇవ్వడం ఆత్మ వినాశానికి దారి తీస్తుంది. పడిపోయిన వ్యక్తిని లేపి కూర్చోబెట్టాలి. ఆ తరువాత, కూర్చున్న వ్యక్తిని ప్రయత్నంతో నిలబెట్టాలి. నిలబడ్డాడా, ఆ తరువాత మెల్లగా నడిపించాలి. ఇది విధాయక పద్ధతి. ఇక్కడే సౌజన్యంలో సౌరభం.

అర్జునా! ఇది నీకు తగింది కాదు అని అర్జునుని వ్యక్తిత్వాన్ని ఆకాశానికి ఎత్తేశాడు శ్రీకృష్ణుడు. తనలో తాను ఆలోచించుకొనే శక్తిని అర్జునునికి ప్రసాదించాడు. వలచిన పేడితనాన్ని చెదర గొడుతూ, మరచిన పురుష వైభవాన్ని తిరిగి ఆవిష్కరిస్తూ అభిభాషించాడు.

ఇది మామూలు విషయం కాదు. మనిషిని మనీషిగా, మనీషిని మహర్షిగా, మహర్షిని మాధవునిగా మలచే మహోత్కృష్టమైన బోధనా విధానం. మనస్సుల్ని మలచి, మనుషులను తీర్చిదిద్దే కార్యంలో మహాశిల్పి మధుసూదనుడు ప్రదర్శించిన అసమాన బోధనా కౌశలాన్ని బిడ్డల విషయంలో తల్లిదండ్రులు, విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు, భార్యల విషయంలో భర్తలు, ఉద్యోగుల విషయంలో అధికారులు అనుసరించి ఆచరించ గలిగితే, ఆ తరువాత సమాజంలో కనిపించేది ఏదో కాదు, అభ్యుదయమే. ఆదర్శమే. ఆనందమే.

క్లైబ్యం మాస్మగమః అన్నప్పుడు, శ్రీకృష్ణుడు అర్జుమని మనస్సును పేల్చేశాడు అనిపిస్తుంది. **నైతత్త్వ య్యుపపద్యతే** అన్నప్పుడు అవగాహనను వింపి, ఆశాజ్యోతిని వెలిగించాడని తెలుస్తుంది.

జ్యోతి ప్రజ్వలనం

సూర్యుడు ఉదయిస్తాడు. విశ్వం వెలుగులతో నిండుతుంది. ఆ వెలుగులో జనులు పయనిస్తారు. పనులు చేసుకుంటారు. ఎవరు ఏ దారిలో పోవాలో, ఎవరు ఏయే పనులు చేయాలో సూర్యుడు నిర్ణయించడు. ఎవరికి వారే నిర్ణయించు కుంటారు. అదంతా వారి వారి స్వభావం మీద, అవసరం మీద ఆధారపడి ఉంటుంది.

అంతే కాదు. సూర్యుడు వెలుగులను విరజిమ్ముతూ ప్రకాశిస్తున్నా, మనం క్రియాశూన్యంగా పడి ఉంటే, మవ్వు ఎందుకవి అలా ఉన్నావు? కర్మలు చేయ వెందుకని? అని సూర్యుడు ప్రశ్నించడు. తాను ప్రకాశించే వాడే గాని, నీకు పని కల్పించే వాడు కాడు. నిన్ను పనికి పురికొలిపే వాడు కాడు. ఆ పని అంతా మనదే. మనమే చూసుకోవాలి. మనమే చేసుకోవాలి. మన కొరకే చేసుకోవాలి.

భగవద్గీత జ్ఞానస్వరూపం. గీతాచార్యుడు జ్ఞానరూపుడు. మన హృదయాలలో జ్ఞానప్రదీపాన్ని గీత వెలిగిస్తుంది. ఆ వెలుగులో ఎవరి కార్యాలు వారు పూర్తి చేసుకోవాలి. ఎవరి సమస్యల్ని వారు పరిష్కరించు కోవాలి. సత్యాన్ని అన్వేషించి పట్టుకోవాలి. అసత్యాన్ని విస్మరించి ఆనందంగా జీవించాలి.

శ్రీకృష్ణుడు ఈ రెండు ప్రారంభ శ్లోకాలలో అందించిన సందేశము దీప ప్రజ్వలనమే. సూర్యుడు ఏ ఒక్క వ్యక్తి కోసమో ఉదయించడం లేదు. ఆయన ప్రకాశం అందరి కొరకై ఉంగి. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అందించిన సందేశము ఒక్క అర్జునుని కొరకే కాదు. వినింది అర్జునుడే అయినా, వినిపించింది మాత్రం యావ ద్విశ్వానికే గాని ఏ ఒక్క వ్యక్తి కోసమో కాదు. విశ్వం లోని వ్యక్తులలో ఒక కాలంలో, ఒక దేశంలో ఉన్న వ్యక్తి అర్జునుడు.

గీత అర్జునుని కొరకే అయితే, అతనికే ఉపయోగ పడాలి. లేదా, ఆ కాలము వారికే ఉపయోగ పడాలి. అర్జునునికి శ్రీకృష్ణుడు బోధించిన విషయములో విశ్వసందేశ ముంది. అందుకే విశ్వ మంతటికీ గీత శిరోధార్య మైంది. అన్ని కాలాలకు, అన్ని దేశాలకు, అందరు వ్యక్తులకు సూర్యప్రకాశం లాగా ప్రమాణ ప్రకాశ మైంది. ప్రమను ఆరబోస్తూ భ్రమను అదృశ్యం చేస్తోంది. ఐదు వేల సంవత్సరాలు గడచినా నేటికీ నిత్య నూతనంగా మానవాళిపై తన ప్రభావాన్ని చూపుతోంది. జ్ఞాన ప్రభంజనమై అంతటా వీస్తూ ఉంది.

పిరికితనం పనికిరాదు

చీకటిలో ఏది ఎక్కడుందో, ఎవరు ఎక్కడున్నారో తెలియదు. అందుచేత, ధీరుడు కూడా చీకటిలో భీరు డవుతాడు. కాని, ఒక వైపు వెలుగులు విరజిమ్ముతున్నా విలవిల లాడే వ్యక్తి పిరికివాడు. అతని మనసులో పిరికితనం ఉంది. గుండెలో గుబులు ఉంది. అదే దుర్బలత్వము. మనోదౌర్బల్యము. హృదయ దౌర్బల్యము. అదే మనిషికి అభద్రం. క్షుద్రం. నీచం. దీపమున్నా దిగులు తప్పని దౌర్బల్యం.

కృష్ణుడు కొరడా ఝళిపించాడు. అర్జునునిలో చలనం మొదలైంది. మగతను విడిచాడు (**క్షుద్రం హృదయ దౌర్బల్యం**). తమోగుణం నుండి తమాయించు కున్నాడు. రజోగుణం రాజిత మైంది. తమోగుణ ప్రేరితుడై యుద్ధం చేయలేను అనే సంకేతా న్నిస్తూ ధనుర్బాణాలు పడేసిన సవ్యసాచి, భగవంతుని సందేశముతో కనువిప్పు కలిగి, రజోగుణము చేత ప్రభావితుడై, యుద్ధం ఎలా చేసేది? అంటూ భాషిస్తున్నాడు.

వేలాది సంవత్సరాలుగా అంతటా గీతాప్రదీపం వెలుగుతూనే ఉంది. కానీ, దేదీప్యమానంగా గీతాజ్యోతి వెలుగుతున్నా భయం చీకటిలో బిక్కుబిక్కు మంటూ బ్రతికే వారే ఎక్కువగా కనిపిస్తూ ఉంటారు. ఈ భయాలే మహాజాడ్యాలు. మరణాలు. మారణహోమాలు.

కళ్ళు మూసుకుంటే వెలుగు ఉండి ఏమి లాభం? వినియోగము తెలియాలి. వినియోగము అంటే వినింది ఆచరణలో పెట్టడ మని అర్థము. అది చేయలేని దోషం వల్ల గీత మన వద్దే ఉన్నా, రాత మారడం లేదు.

శ్రీకృష్ణుని పలుకులు పార్థునికి ప్రాణవాయువును అందించాయి. ఆశల్ని చిగురింప చేశాయి. కదలిక ప్రారంభ మైంది. ఏ దౌర్బల్యమో ఏమో, అదేదో తన మనసు లోనే ఉండి కలత పెడుతూ ఉంది అనేది అర్జునునికి అర్థమై పోయింది. అది గమనించిన గోవిందుడు, 'లే, వదిలేయ్!' (**త్యక్త్వా + ఉత్తిష్ఠ**) అని ఆజ్ఞాపించాడు.

మనల్ని ఎవ్వరూ కట్టి పడేయ లేదు. మనమే అనవసరంగా భయాన్ని పట్టుకున్నాం. ధైర్యాన్ని పోగొట్టు కున్నాం. పట్టుకున్న దానిని విడిచి పెడితే చాలు. ఆ తరువాత, పట్టు లేని భయాలు వాటంతటవే పారిపోతాయి.

అందుకే, బలహీనతల్ని విడిచేయ్! బలంగా లేచి నిలబడు అని హుంకరించాడు హృషీకేశుడు.

దౌర్బల్యముతో స్నేహం మంచిది కాదు. పిరికితనము శత్రువే గాని నేస్తం కాదు. శత్రువును ఉపేక్షించ కూడదు. శత్రు శేషాన్ని ఉంచకూడదు అంటారు పెద్దలు. అర్జునా! శత్రుతాపనా! లే! నిలబడు అన్నాడు పరమేశ్వరుడు.

పరంతపా! పని సాగనీ

పార్థునికి పరంతపుడు అని పేరు. అంటే శత్రువును పీడించే వాడు అని అర్థము. ఆ పని జరగాలి. అప్పుడే పార్థుడు పరంతపుడు. శత్రువు బయట ఉన్నాడు. పోరాడటానికి ఎదురుగా నిలబడి ఉన్నాడు. అతణ్ణి పీడించాలి. ఎందుకో, అది జరగడం లేదు. బాహ్యం లోని శత్రువును పీడించ వద్దంటూ, లోపల ఎవరో మరొక శత్రువు పార్థుణ్ణి పీడిస్తున్నాడు. ఆ శత్రువే అవివేకము. అదే హృదయ దౌర్బల్యం. ముందుగా అంత శ్శత్రువును మట్టు పెట్టాలి. ఆ తరువాత బాహ్య శత్రువును వధించ డానికి అవరోధా లుండవు. అందుకనే, 'అర్జునా! లే. నిలబడు' అన్నాడు శ్రీకృష్ణుడు.

అర్జున ఉవాచ :

కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన ॥ 4

కథం-భీష్మం-అహం-సంఖ్యే-ద్రోణం-చ-మధుసూదన
ఇషుభిః-ప్రతియోత్స్యామి-పూజార్హౌ-అరిసూదన

మధుసూదన	= హే కృష్ణా!	సంఖ్యే	= యుద్ధము నందు
అహం	= నేను	అరిసూదన	= శ్రీకృష్ణా!
పూజార్హౌ	= పూజింప దగిన	ఇషుభిః	= బాణాలతో
భీష్మం	= భీష్ముని	కథం	= ఏ విధముగా
ద్రోణంచ	= ద్రోణుని	ప్రతియోత్స్యామి	= ఎదిరించి పోరాడ గలను?

అర్జునుడు అడుగుతున్నాడు :

మధుసూదనా! భీష్మద్రోణులు పూజార్హులు. వాళ్ళను నేను ఎలా ఎదిరించేది? అరిసూదనా! యుద్ధంలో వాళ్ళపై బాణాలు ఎలా వేసేది?

వ్యాఖ్య

శ్రీకృష్ణుని మాటలు అర్జునునిలో ఏదో కొంత మార్పును కలిగించినట్లు కనిపిస్తోంది. కలత చెందిన మనస్సు కొద్దిగా కుదుట పడినట్లు అగుపిస్తోంది. ఆవేశము అదుపులో ఉంది. కన్నీళ్ళు లేకుండా చూస్తున్నాడు. ఆవేశం లేని ఆలోచనతో పలుకు తున్నాడు. సరళమైన భాషలో, మృదువైన పలుకులతో, సున్నితంగా భాషిస్తూ తన సంశయాలను శ్రీకృష్ణునికి వినిపిస్తున్నాడు.

అవగుణము కాదు - అప్రియము

ఈ అవివేకము నీకు ఎక్కడి నుండి వచ్చింది? భయాన్ని విడిచి పెట్టు. ఇది నీకు తగింది కాదు. మనో దౌర్బల్యము నీచ మైనది. శ్రీకృష్ణుడు పలికిన ఈ మాటల్ని అర్జునుడు జీర్ణించుకోలేక పోతున్నాడు.

కృష్ణా! నేను యుద్ధం చేసే స్థితిలో లేను అనేది వాస్తవమే. దానికి కారణం ఏమిటి? నేను భయపడి యుద్ధం చేయడం లేదని నీవు అభిప్రాయ పడినట్లు నీ మాటల్లో తెలుస్తూ ఉంది. నేను భయపడి యుద్ధం విరమించడం లేదు. పిరికితనంతో పారిపోవడం లేదు. నా యుద్ధ విముఖతకు, నాకు సరిపడని ఈ విధమైన కారణాలను ఆపాదించడం నన్ను బాధిస్తోంది. పుండుపై కారం చల్లినట్లు ఉంది. కాకిని కూర్చో బెట్టినట్లు ఉంది.

అయిష్టులను వధించడం సాధ్యమే. ఇష్టమైన వారిని ఎలా చంపాలి? శత్రువులను చంపగలం. మిత్రుల్ని చంపే దెలా? బంధువుల్ని చంపే దెలా? అని మథన పడుతున్నాను. కృష్ణా! నువ్వు నన్ను అడుగుతా వేమో, దుష్టులైన దుర్యోధనాదులు కూడా బంధువు లేనా? అని. అచ్యుతా! దుర్యోధన, దుశ్శాసనాదుల్ని చంపడానికి నేను వెనుకాడటం లేదు. ఎటొచ్చి, భీష్మ ద్రోణాదుల విషయం లోనే కలత పడుతున్నాను. వారిపై బాణాలను ఎక్కుపెట్టడాన్ని ఊహించు కోలేక పోతున్నాను.

భీష్మ డెవరు? ద్రోణు డెవరు? భీష్ముడు కులవృద్ధుడు. పైగా గుణవృద్ధుడు. పెంచి పోషించిన వాడు. వందనీయుడు. ద్రోణుడు ఆచార్యుడు. విద్య నేర్పిన వాడు. విజయానికి బాట వేసిన వాడు. కన్నబిడ్డ కన్నా నన్నే మిన్నగా భావించాడు. ప్రాణ సమానంగా ప్రేమించాడు. ఇలాంటి వారిని ఎలా చంపేది? నాకు చేతు లున్నది వాళ్ళను పూజించుటకే గాని వధించుటకు కాదు. వాళ్ళకు నమస్కరించ వలసిన చేతులు వాళ్ళను ఎలా నాశనం చేస్తాయి?

అచ్యుతా! ఇలా ఆలోచించడం దుర్బలత్వమా? ఇది నాకు తగనిదా? వీరుడు ఇలా ఆలోచించ కూడదా? ధనుర్బాణాలు పట్టగానే దయ దూరం కావాలా? కవచం ధరించ గానే కరుణను వదిలేయాలా? వీరుడు అంటే కఠినుడా? వీరుడికి ప్రేమలు పనికి రావా? మమతలు మంచివి కావా? అస్త్రశస్త్రాలే కాని అనుబంధాలు, అనురాగాలు ఉండ కూడదా?

పూజార్హు లైన పెద్దలను, గురువులను వధించుటకు వెనుకాడటం అవగుణమా? కృష్ణా! అధైర్య మనే అవగుణంతో నేను యుద్ధాన్ని విరమించడం లేదు. అప్రియమైన కార్యాన్ని ఆచరించలేక పోతున్నాను. అధర్మ కార్యాన్ని చూచి భీతి చెందుతున్నా. అంతే.

చెప్పేవాళ్ళు - చేసేవాళ్ళు

మాధవా! కడుపులో చల్ల కదలకుండా కబుర్లు చెప్పేవాళ్ళు చాలా మంది ఉంటారు. చెప్పేవాళ్ళు ఎన్నైనా చెబుతారు. చేసే వాళ్ళదే గదా కష్ట మంతా? చెప్పడం తేలికే. కాని, చంపడం అంత తేలిక కాదు. ఎవరైనా, ఎన్నైనా చెప్పగలరు. అలాగని, అందరూ అందరినీ చంపలేరు. అంతమాత్రాన కశ్మల మంటూ కషాయాన్ని త్రాగించే ప్రయత్నం చేయడం సముచిత మేనా?

ఏమిటి, నువ్వేనా చంపేది? మేము చంపలేదా? అంటావేమో! అందుకే నిన్ను మధుసూదనా! అని పిలుస్తున్నా! నువ్వు చంప లేదని నేను అనడం లేదు. నువ్వు చంపింది ఎవరిని? రాక్షసుల్ని చంపావు. మధువనే రాక్షసుని వధించావు. అందుకని మధుసూదనుడ వయ్యావు.

అయ్యా! నేను చంప వలసింది ఎవరిని? రాక్షసుల్ని కాదు. మహాత్ముల్ని. రాక్షసుని వధించావు కనుక అది నీకు బిరుదుగా మారింది. మధుసూదన నామం మారుమ్రోగింది. నేను భీష్ముణ్ణి వధిస్తే నన్ను జనం కీర్తిస్తారా? భీష్మారీ! అని శ్లాఘిస్తారా? ఈ కార్యము నాకు తగినదా? ఇది స్వర్గహేతువా? ఇది కీర్తికరమా? కృష్ణా! అందుకే అంటున్నాను. ఇది నాకు తగినది కాదు ***(ఏతత్ మయి న ఉపపద్యతే)***. ఆచార్యులను చంపడం ఆర్యుల లక్షణం

కాదు (*అనార్య జుష్టం*). ఈ అమంగళం నన్ను స్వర్గానికి అనుమతించదు (*అస్వర్గ్యం*). ప్రపంచంలో శిష్ట గర్హిత మైన కార్యాన్ని ఆచరించిన వ్యక్తిగా నన్ను చూస్తారు. ఇది అవమానం (*అకీర్తికరం*).

ఏ మూడు భయాలు తన ఆంతర్యంలో బీభత్సాన్ని సృష్టించి యుద్ధ వైముఖ్యానికి కారణ మయ్యాయో, వాటిని ఈ దశలో కూడా పార్థుడు పట్టుకునే పలుకు తున్నాడు.

మధుసూదనా! నా చేతల్ని చూచి చీదరించుకోకు. నా మనసును కూడా చూడు. నా మాటలు నా మనస్సును ఆవిష్కరించలేక పోతున్నా యేమో! సున్నితమైన నా మనసును చూడు. సుహృద్భావంతో కొట్టుకుంటున్న నా హృదయాన్ని చూడు.

ప్రాణం తీయడం ఎవరైనా చేయ గలరు. అలా తీసిన వాళ్ళెవరైనా తిరిగి ప్రాణం పోయ గలరా? నువ్వు ఎందరినో చంపావు. నేను కూడా చంపాను. ప్రస్తుతం చంపలేక పోతున్నా నంటే చంపడం తెలియకనా? చంపడానికి ధైర్యం లేకనా? ఇలాంటి మాటలు మరొకరు అంటే బాధ ఉండదు. అన్నీ తెలిసిన నువ్వు అంటున్నావే, అక్కడే నేను ఏదో అవుతున్నాను.

అర్జునా! మన శరీరం లోని అవయవమే అయినా, పాడై పోయిన దుష్టాంగాన్ని శస్త్ర చికిత్స చేసి దూరం చేసుకోవడం లేదా? బంధువులే కావచ్చు. అలాగని, దురాత్ములు, అధర్మపరులు, దుష్టులైన బంధువులను వధించక పోతే ఎలా? నన్ను చూసి నేర్చుకో. కంసు డెవరు? స్వయాన నాకు మేనమామ. అలాగని మమకారంతో చెట్టెక్కి కూర్చున్నానా? మెడ వంచి, తలను త్రుంచేశాను. నువ్వు అలా ఎందుకు చేయవు? అని నన్ను ప్రశ్నిస్తా వేమో కృష్ణా!

చూడు. బంధువైన కంస భూపతిని నీవు వధించింది నిజమే. ఆ పని చేయడానికి నేనూ సిద్ధమే. బంధువు, సోదరుడైన దుర్యోధన భూపతిని చంపడానికి నా కేమీ అభ్యంతరం లేదు. బంధువులుగా పుట్టినా వీళ్ళందరూ శత్రువులుగా పెరిగిన వాళ్ళే. వాళ్ళు మనకు శత్రువులే. వాళ్ళను చంపడం దోషం కాదు. అందుకే కదా, నిన్ను అరిసూదనా! అని పిలిచాను.

కృష్ణా! నువ్వు చంపిన వాళ్ళందరూ రాక్షసులు. శత్రువులు. అందుకే నువ్వు మధుసూదనుడివి. అరిసూదనుడివి. ఇక నా విషయం అంటావా? నేను కూడా అలా ఎందరినో చంపాను. కాని, గురువును చంపడం అనేది ఇప్పటి వరకు నువ్వు చెయ్యలేదు. నేనూ చెయ్యలేదు. కాకపోతే, అలాంటి సంక్లిష్టమైన సమస్య ఎదురైన సమయంలో నువ్వు చెప్పేవాడి వయ్యావు. నేను చేసేవాడి నయ్యాను. అసలు తంతు ఇక్కడే ఉంది.

శత్రువుల్ని వధించి 'అరిసూదనా!' అని పిలిపించు కున్నావు. ఇప్పుడు గురువును వధించి, 'ఆచార్య సూదనా' అని నన్ను తిట్టించుకో మంటావా? కృష్ణా! ఇదీ నా బాధ. నా మనసు లోని వ్యథ. అందుకే చంపలేక పోతున్నాను. చంప వలసి వస్తుందని యుద్ధం చేయలేక పోతున్నాను. బలహీనుణ్ణి కాను. బలమైన కారణాలతో సతమత మవుతున్న వాణ్ణి అని తన విషాదం వెనుక దాగి యున్న కారణాలను బైట పెట్టాడు అర్జునుడు.

బావుంది. మరి, యుద్ధాన్ని విరమించి ఏమి చేయాలి? యుద్ధాన్ని విరమిస్తాడు కనుక రాజ్యం రాదు. రాజ్య సుఖాలూ ఉండవు. అవి లేకపోయినా ఫరవాలేదు అనుకుందాం. కనీసం బ్రతకడానికి మార్గమంటూ ఉండాలి కదా! అయిదు గ్రామాలు ఇవ్వడానికి కూడా అంగీకరించని దుర్యోధనుడు రేపు తన రాజ్యంలో కనీసం అద్దె ఇంట్లో బ్రతకడాని కైనా పాండవులకు అవకాశం ఇస్తాడా? దుర్యోధనుని రాజ్యంలో పాండవులకు అద్దెకు ఇల్లు ఇచ్చేవారు ఉంటారా? మరి ఎలా బ్రతకాలి? అది కూడా చెప్పేస్తున్నాడు అర్జునుడు.

గురూ నహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహలోకే ।
హ త్వార్థకామాంస్తు గురూ నిహైవ భుఞ్జీయ భోగా న్రుధిరప్రదిగ్ధాన్ ॥ 5

గురూన్-అహత్వా-హి-మహానుభావాన్-శ్రేయః-భోక్తుం-భైక్ష్యం-అపి-ఇహలోకే
హత్వా-అర్థకామాన్-తు-గురూన్-ఇహ-ఏవ-భుంజీయ-భోగాన్-రుధిర ప్రదిగ్ధాన్

మహానుభావాన్	=	మహానుభావులైన
గురూన్	=	గురువులను
అహత్వా	=	చంపక
ఇహలోకే	=	ఈ లోకమున
భైక్ష్యమపి	=	భిక్షాన్న మైనను
భోక్తుం	=	భుజించుట
శ్రేయః హి	=	శ్రేయస్కరము కదా!

గురూన్	=	గురువులను
హత్వా తు	=	చంపి
ఇహ ఏవ	=	ఈ లోకము నందే
రుధిర ప్రదిగ్ధాన్	=	రక్తసిక్త మైన
అర్థకామాన్	=	అర్థకామాలైన
భోగాన్	=	భోగాలను
భుంజీయ	=	అనుభవిస్తాను

కృష్ణా! గురువులు మహానుభావులు. వాళ్ళను బలి చేసి, నెత్తురు కూడు తిని బ్రతకడం కన్నా, వాళ్ళను చంపడం మానేసి ఈ లోకంలో భిక్ష మెత్తుకొని జీవించడం శ్రేయస్కరము కదా!

వ్యాఖ్య

శాంతి జీవనం

రణరంగంలో శత్రు పక్షాన ముందు వరుసలో ఉన్న సేనాధిపతులు భీష్మద్రోణులు. ఇంతవరకు ఆచార్య స్థానాన్ని అలంకరించిన వాళ్ళు. సమున్నతులు. పూజార్హులు. వాళ్ళనే ముందుగా వధించాలి. లేదా వాళ్ళ చేత వధింప బడాలి. ఇది అర్జునుని సమస్య. ఎటు ఆలోచించినా మిగిలేది అశాంతే.

అలా ఎందుకు అనుకోవాలి? విజయాన్ని సాధించి, రాజ్యభోగాలను అనుభవిస్తూ, ఆనందంగా శాంతి జీవనాన్ని సాగించ వచ్చు కదా! అలా జీవించే అవకాశం ఉంటే అర్జునుడు యుద్ధానికి వెనుకాడే వాడు కాదు. అలా జీవించడం సాధ్యం కాదు అని అర్జునుని ఆంతర్యం ఘోషిస్తూ ఉంది.

విజయాన్ని సాధిస్తే, రాజ్యం లభిస్తుంది. రాజ్యభోగాలు ప్రాప్తిస్తాయి. అవన్నీ అర్థకామాలే. వాటి వల్ల సుఖాలు ప్రాప్తించవు. ఒకవేళ ప్రాప్తించినా అవి నైమిత్తిక సుఖాలే గాని నిత్యసుఖం కాలేవు.

అర్థ మనే పురుషార్థం భద్రతకు సంబంధించింది కాగా, కామ మనే పురుషార్థం సుఖానికి సంబంధించింది. రాజ్యం లభిస్తే తద్వారా వాంఛింప దగినవి ప్రధానంగా ఈ రెండే.

భద్రత అనేది కేవలం ధనం వల్ల రాదు. నిజం చెప్పాలంటే అర్థం వల్లే అభద్రత పెరుగుతుంది. రాజ్యాలు, భోగాలు లభించిన వారు తృప్తి చెందిన దాఖలాలు ఈ ప్రపంచంలో ఎంత అన్వేషించినా అగుపించవు (*న హి లోకే విత్తలాభః కస్యచిత్ తృప్తి కరోద్రష్టః*).

ఇక సుఖాలు అంటావా? వాటిలో కూడా తృప్తి లేదు. ఏది ఎవరికి ఎప్పుడు ఇష్టమో, ఎప్పుడు అయిష్టమో చెప్పలేము. ఇష్టాయిష్టాలు మారుతూ ఉంటాయి. వాటితో పాటు సుఖాలు పారిపోతూ ఉంటాయి. ఇక కామం అనే పురుషార్థం వల్ల ప్రాప్తించే దేముంటుంది?

నిస్సారమైన ఈ అర్థకామాల కొరకు మహానుభావులైన గురువుల్ని వధించాలా? అలా వధించి సాధించే దేముంటుంది? అంతా అశాంతే. అభద్రతే. ఇక శాంతి ఎక్కడ? ఎప్పుడు?

గెలిచినా శాంతి రాదు
ఓడితే శాంతి లేదు

అనిత్యము లైన అర్థకామాలను కొంత కాలం అనుభవించ డానికి మహానుభావు లైన గురువులను వధించడమా? దారుణమైన ఈ పాప కార్యానికి ఫలం రాజ్యసుఖమా? ఎక్కడుంది సుఖం? అంతా దుఃఖమే. నరకమే. పశ్చాత్తాప జీవనమే.

ప్రతి సుఖానుభవంలో దుఃఖమే తొంగి చూస్తూ ఉంటుంది. రమణీయ భోగాలన్నీ గురువుల్ని, పెద్దల్ని రాల్చేసుకొని సాధించినవే గదా? అని అంతర్యం నిలదీస్తూనే ఉంటుంది. కమనీయమైన సుఖాలు, కమ్మని రుచికరమైన పదార్థాలు ఒక వైపు నోరూరిస్తున్నా, మరో వైపు అవి రక్తసిక్తంగా కళ్ళకు కనిపిస్తూనే ఉంటాయి. ఇక భోగా లేవి? సుఖా లెక్కడ? అంతా దుఃఖమే. అంతా నరకమే.

బ్రతికినంత కాలము భోగానుభవంలో కూడా నరకమే దర్శనీయంగా ఉంటుంది. మరణించిన తరువాత ఈ ఘోర పాప ఫలితంగా నరకము లోనే జీవించ వలసి వస్తుంది. గెలిచినా ఇహపర లోకాలలో నరకానుభవమే కనుక శాంతి అనేది కుందేటి కొమ్మే అవుతుంది. ఒకవేళ ఓటమిని చవి చూస్తే, ప్రత్యేకించి చెప్పే దేముంటుంది? ఆ ఆలోచన వస్తే చాలు, నరకంలో ఉన్నట్లే ఉంటుంది. కనుక, ఎలా చూచినా యుద్ధము అవాంఛనీయమే. ఇలాగే చూస్తూ ఉంది అర్జునుని మనస్సు.

బ్రతుకు తెరువు

యుద్ధాన్ని విరమించి, రాజ్యాన్ని పోగొట్టుకొని ఆ తరువాత ఎలా బ్రతకాలి? ఎలాగైనా బ్రతకవచ్చు. బ్రతికే వాళ్ళందరూ యుద్ధాలు చేసే బ్రతుకు తున్నారా? జీవించే వాళ్ళందరూ రాజ్యాలు ఏలుతూనే జీవిస్తున్నారా? ఇంతకాలం పాండవులు ఏ రాజ్యాలు ఉండి జీవించారు? బ్రతక డానికి రాజ్యాలు అవసరమా? రాజ్యాలు ఉన్నంత మాత్రాన సుఖంగా బ్రతక గలరా? రాజ్యం దుర్యోధనుడికి కూడా ఉంది. సుఖ మెక్కడుంది? శాంతి ఎక్కడుంది? అనుక్షణం ఘర్షణే. బ్రతుకంతా సంఘర్షణే. రాజ్యమూ ఘర్షణే. రాజ్యము కొరకు సాగించే సమరమూ సంఘర్షణే.

అది సరే. మరి, ప్రాణాన్ని నిలుపు కోవాలి అంటే, దేహాన్ని రక్షించు కోవాలి కదా! రిక్త హస్తాలతో పూట గడిచే దెలా? ఆకలి కడుపుతో కంటిపై రెప్ప వాలే దెలా? ఏముంది? కోరుకొనే స్వభావం గల వారికి ఎన్నున్నా తృప్తి ఉండదు. కోరికలను ప్రక్కన పెట్ట గలిగితే, ఉన్నది ఏదైనా తృప్తినే ఇస్తుంది.

కృష్ణా! మహాత్ముల్ని, గురువుల్ని చంపి, రక్తంతో తడిసిన భోగాలను అనుభవించడం కన్నా, ఈ లోకంలో బిచ్చ మెత్తుకొని తృప్తిగా జీవించడమే యుక్త మని భావిస్తున్నా. మాకు రాజ్యం లేక పోవచ్చు. మేము రాజ్యం లోనే ఉంటాము. రాజులు మమ్మల్ని పట్టించుకోక పోవచ్చు. ప్రజలు పట్టెడన్నము పెట్టక పోరు. నాలుగిళ్ళ ముందు నిలబడి, ఒక చెట్టు క్రింద కూర్చుంటే చాలు. కాలం గడుస్తుంది. బ్రతుకు నడుస్తుంది. జీవన యాత్రలో బ్రతుకు బండి నడవ టానికి ఇంధనాన్ని పుణ్యాత్ములు సమకూర్చుతూనే ఉంటారు. చాలు. కావలసింది ఇంధనమే గాని ధనం కాదు కదా?

యుద్ధం చేసి రాజ్యాన్ని చేజిక్కించు కోవచ్చు. దాని వల్ల ఒరిగే దేమిటి? రక్తసిక్త మైన ఆహారాన్ని భుజిస్తూ, బాధాతప్త మైన స్మృతులతో బ్రతికినంత కాలం నరకాన్ని అనుభవిస్తూ బ్రతకాలి. దారుణ మైన రణం వల్ల సంక్రమించిన మహా పాపఋణాన్ని తీర్చడానికి మరణించిన తరువాత నరకం లోనే మకాం పెట్టాలి.

అలా కాకుండా, యుద్ధాన్ని విరమించి, బిచ్చ మెత్తుకొని జీవిస్తే బ్రతికినంత కాలం తృప్తిగా జీవించ వచ్చు. మరణించిన తరువాత, పాప ఋణం లేదు కనుక పాప ఫలితాన్ని అనుభవించ డానికి నరకానికి వెళ్ళ నవసరం లేదు. దోష రహితమైన బ్రతుకు తెరువు ఫలితంగా స్వర్గాన్ని పొందవచ్చు. కనుక, మరణ సదృశ మైన రణం కన్నా, అమృత తుల్యమైన రణ విరమణమే శ్రేష్ఠంగా కనిపిస్తోంది.

అర్హత ఉందా?

భిక్షాన్నము భుజించి బ్రతుకు తెరువు చూసుకోవాలి అనుకోవడం బాగానే ఉంది. అర్జునా! నువ్వు భిక్షార్హుడి వేనా? భిక్ష మెత్తే అర్హత నీకు ఉందా? అదేమిటి? రాజ్యాధికారం చెలాయించడానికి అర్హత ఉండాలి. అడుక్కు తినడానికి కూడా అర్హత కావాలా? నాలుగిళ్ళ ముందుకు నడిచి పోవడానికి రెండు కాళ్ళు ఉంటే చాలు. రెండు మాటలతో అర్థించడానికి ఒక్క నోరుంటే చాలు. పెట్టింది పట్టడానికి రెండు చేతులు చాలు. ఇంకేమి అర్హత కావాలి?

అర్జునా! నీ లాగే అందరూ జోలె పట్టుకుంటే, ఆ తరువాత పెట్టే వాళ్ళు ఎవరుంటారు? అర్జును డంతటి వాడే జోలె ఆనంద మని భావించాడు కదా అని అందరూ జోలె కుట్టించుకొని భుజానికి తగిలించుకుంటే ఏమవుతుంది? దేశం బిచ్చగాళ్ళ రాజ్యంగా మారి పోదా? రాజ్యంలో అందరూ బిచ్చగాళ్ళైతే, రాజు పెద్ద బిచ్చగాడు కాకుండా పోతాడా? దుర్యోధన మహారాజుని యుద్ధం చేయకుండానే బిచ్చగాణ్ణి చేయడానికి ఈ ప్రణాళికను రూపొందించావా అర్జునా?

అర్హు లెవరు? అర్జునుడు అర్హుడేనా?

భిక్ష మెత్తుకొని జీవించడానికి అర్హత అవసరమా? అవును. అవసరమే. లేకపోతే, సోమరితనమే అర్హతగా మారి, దేశం దిక్కుమాలిన దవుతుంది. మరో విధంగా జీవించ డానికి అవకాశం లేనివాళ్ళే భిక్ష మెత్తుకొని బ్రతకాలి. అదే అర్హత.

ఎవరూ లేని, ఏ దిక్కూ లేని వారు భిక్షార్హులు. అర్జునుడికి అన్నదమ్ము లున్నారు. ఆత్మీయు లున్నారు. అత్తమామ లున్నారు. కొడుకులు, కోడళ్ళు ఉన్నారు. దేహాంగాలన్నీ సౌష్ఠవంతో శోభిస్తున్నాయి. అలాంటి వాడు భిక్షార్హు డెలా అవుతాడు?

ఇకపోతే రెండవ తెగకు సంబంధించిన వాళ్ళు బ్రహ్మచారులు. గురువు వద్ద శుశ్రూష చేస్తూ విద్య నార్జించే బ్రహ్మచారులు భిక్ష మడగ టానికి అర్హులు. సంపాదన లేకుండా జ్ఞాన సముపార్జనే సంపాదనగా జీవిస్తూ ఉంటారు కనుక, అలాంటి వటువులు భిక్షాటన చేసి, గురువును పోషిస్తూ, తమను పోషించుకుంటూ విద్యార్థి దశను పూర్తి చేసుకుంటారు. కనుక బ్రహ్మచారులు భిక్షార్హులు. అలా చూసినా అర్జునుడు అర్హుడేనా? అర్జునుడు బ్రహ్మచారి ఎలా అవుతాడు? అభిమన్యుడు అంగీకరిస్తాడా? సుభద్ర సుముఖ మేనా?

భిక్షాటన చేయడానికి అర్హులు అనాథులు, బ్రహ్మచారులే గాక, మరో తెగ వారు కూడా ఉన్నారు. వారే సన్యాసులు. సర్వసంగ పరిత్యాగులు. సమస్తాన్ని త్యజించి, జ్ఞానాభ్యాసమే ప్రధానంగా కలిగి ఉన్నారు కనుక, శాస్త్రజ్ఞుల్ని ప్రభుత్వం పోషించినట్లు, సన్యాసుల్ని సమాజం ఆదుకుంటుంది. శాస్త్రజ్ఞుల ప్రయోగ జనిత ఫలితాలు ప్రజలకు అందుతాయి కనుక ప్రభుత్వం వారిని పోషిస్తుంది. సాధు పురుషుల జ్ఞానం సమాజ కళ్యాణానికి దోహద పడుతుంది కనుక సమాజం సాధువుల్ని పోషిస్తుంది.

అలా చూచినా కూడా అర్జునుడు భిక్షాటనకు అర్హుడు కాదు. అర్జునుడు గృహస్థుడు. సన్యాసులను

పోషించ వలసిన వాడే గాని, సన్యాసి లాగా పోషింప దగిన వాడు కాడు. కనుక భిక్షార్హత అర్జునునికి లేదు. ఆ మాట కొస్తే, నేను సన్యాసినే కదా! అంటాడేమో అర్జునుడు.

సుభద్రా పరిణయం ఎలా జరిగింది? సన్యాసి వేషం లోనే కదా సాంగోపాంగంగా సర్వమూ సాగి పోయింది. కనుక, ఎప్పుడో విద్యాభ్యాసం చేసి పట్టభద్రుడైన వాడు నేడు ఉద్యోగాన్ని సంపాదించు కున్నట్లు, పూర్వం వేసిన సన్యాసి వేషం నేడు భిక్షాటనకు అర్హతను కల్పించదా?

అయ్యో! సుభద్రాపతీ! వేషాలు మోసాలు చేయడానికి పనికొస్తాయి. బ్రతుకును మోయడానికి పనికి రావు. సన్యాసులు భిక్షార్హులని శాస్త్రం చెప్పిందే గాని, 'ఆహా నా పెళ్ళంట' అని లోలోన మురిసిపోతూ, పై పైన మంత్రాలు పలికి మాయలు చేసే కుహనా సన్యాసులు భిక్షార్హులని శాస్త్రం ఎక్కడా చెప్పలేదు.

అర్జునుని అంతర్యం

భిక్ష మెత్తుకొని జీవించడానికే సవ్యసాచి అంతర్యం సిద్ధపడి పోయింది. వికలాంగుడిగా తనకు అర్హత లేదు. బ్రహ్మచారి కాలేడు. ఇక మిగిలింది సన్యాస మొక్కటే. ప్రస్తుతం అర్జునుడు సన్యాసి కాడు. గృహస్థుడు. గృహస్థుడు బ్రహ్మచారి కాలేడు. కాని, సన్యాసి కాగలడు. అదే జరిగితే, భిక్షాటనకు అర్హత లభించినట్లే. అదే అర్జునుని అంతర్యం.

గురువులు *(గురూన్)*, మహానుభావులు *(మహానుభావాన్)*, పూజార్హులు *(పూజార్హౌ)*, శ్రేయస్సు *(శ్రేయః)* అంటూ అర్జునుని శ్లోకాలలో, మొక్కల్లో పువ్వు ల్లాగా పరిమళిస్తూ ప్రకాశిస్తున్న పదాలన్నీ అర్జునుని అంతర్యానికి అద్దం పడుతున్నాయి. సన్యాసానికి ఉద్యుక్త మయ్యే హృదయాన్ని ప్రదర్శిస్తున్నాయి. కర్మల కన్నా, కర్మసన్యాసము వైపే మొగ్గు చూపుతున్న పార్థుని బుద్ధికి సాక్షిగా నిలుస్తున్నాయి.

మమకారం ఒక వైపు మనస్సును మెలి పెడుతోంది. మమకారాన్ని త్యజించడం సాధ్యం కాక, మమకారానికి కారణమైన అహంకారాన్నే త్యజించాలని అస్పష్టంగా ఆలోచిస్తున్నాడు అర్జునుడు. అది దుస్సాధ్య మని, అసాధ్య మని కర్మయోగ విశ్లేషణలో అర్జునునితో పాటు ముమ్ముందు మనమూ అర్థం చేసుకుంటాము. కాని, అవగాహన కొరవడిన ఈ దశలో అసాధ్యాలు సుసాధ్యాలుగా అగుపించడం దుస్సాహసమే అయినా దుస్సాధ్యం మాత్రం కాదు. ఆ కోణం లోనే మమకారాన్ని భుజాని కెత్తుకుంటూ ప్రసంగాన్ని తరువాత శ్లోకంలో కూడా కొనసాగిస్తున్నాడు కౌంతేయుడు.

న చైత ద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।
యానేవ హత్వా న జిజీవిషామ స్తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥ 6

న-చ-ఏతత్-విద్మః-కతరత్-నః-గరీయః-యత్-వా-జయేమ-యది-వా-నః-జయేయుః
యాన్-ఏవ-హత్వా-న-జిజీవిషామః-తే-అవస్థితాః-ప్రముఖే-ధార్తరాష్ట్రాః

యాన్	= ఎవరిని	నః	= మమ్మల్ని
హత్వా	= చంపి	జయేయుఃయది వా	= వాళ్ళే జయిస్తారో
న జిజీవిషామః	= జీవించుటకు ఇష్టపడమో	నః	= మాకు
తే	= అట్టి	కతరత్	= ఏది
ధార్తరాష్ట్రాః	= ధృతరాష్ట్ర సంబంధులు	గరీయః	= శ్రేష్ఠమో
ప్రముఖే	= ఎదురుగా	ఏతత్ చ	= ఈ విషయమును కూడా
అవస్థితాః ఏవ	= నిలబడ్డారు కదా!	న విద్మః	= ఎరుగము
జయేమ యద్వా	= మనము జయిస్తామో		

కృష్ణా! యుద్ధ రంగంలో మనం ఉన్నాం. మనం జయిస్తామో, వాళ్ళు గెలుస్తారో తెలియదు. మనతో పోరాడటానికి ధృతరాష్ట్రునికి సంబంధించిన వాళ్ళు ఎదురుగా నిలబడ్డారు. వాళ్ళను చంపి మనం బ్రతక గలమా?

వ్యాఖ్య

జయాపజయాలు

యుద్ధం చేయడానికి రెండు పక్షాలు ఉండాలి. కాని, గెలిచేది మాత్రం ఒక పక్షమే. విజయము ఒక్కరిదే. ఆ ఒక్కరు ఎవరు? ఏ పక్షము వారు? ఎవరు గెలిస్తే మంచిది? కౌరవులా? పాండవులా? అది కూడా సవ్యసాచికి సందిగ్ధం గానే ఉంది.

యుద్ధ మంటూ జరిగిన తరువాత ఎవరో ఒకరు జయించక తప్పదు. ఎవరి విజయము తనకు శ్రేయస్కరము అనేది అర్జునునికి అర్థం కావడం లేదు. ఇంతకీ గెలిచే దెవరు? ఏమో! జయాపజయాలు దైవాధీనాలు. ఎవరైనా జయించ వచ్చు. గెలిచేది తామే నని ఎవరికి వారు భావిస్తూ ఉంటారు. ఎవరి అంచనాలు వారికి ఉంటాయి. కాని, తారుమా రయ్యేవి అంచనాలే కదా! పోరాటంలో అంచనాలు ముందు ఉంటాయి. విజయానికి వచ్చే సరికి అంచనాలే ముంచుతూ ఉంటాయి.

ఏది తెలుసు? ఏదీ తెలియదు

యుద్ధములో గెలుపు ఎవరిదో తెలియదు. ఎవరు గెలిస్తే మంచిదో అది కూడా అర్థం కాదు. అందుకే భిక్షాటన శ్రేయస్కరముగా కనిపించింది. అది కూడా స్థిరంగా లేదు. యుద్ధమా? భిక్షాటనమా? ఈ రెండిటిలో ఏది మంచిది? అనేది కూడా తేలడం లేదు. రెండూ మంచి గానే కనిపిస్తున్నాయి. రెండూ చెడు గానే అగుపిస్తున్నాయి. రెండిటిలో మంచిచెడు లున్నాయి.

యుద్ధం స్వధర్మము. స్వధర్మాన్ని ఆచరించడము శ్రేయస్కరము. స్వధర్మాన్ని త్యజిస్తే పాపం వస్తుంది. కనుక యుద్ధము యుక్తమే గాని అయుక్తము కాదు. అనుచితమూ కాదు. అలా చూచి నపుడు యుద్ధము మంచిదే.

మరో విధంగా చూస్తే, యుద్ధంలో హింస ఉంది. కులక్షయం జరుగుతుంది. స్వజన నాశము తప్పదు. గురువధ అనివార్యం. ఇలా ఆలోచించి నపుడు యుద్ధం శ్రేయస్కరము కాదు అనిపిస్తూ ఉంది.

ఇకపోతే, మిగిలింది భిక్షాటనము. అందులో హింస లేదు. కులక్షయము, స్వజన నాశము లాంటి దోషాలు లేవు. కాని, అది స్వధర్మము కాదు. పరధర్మము. పరధర్మము ఎప్పుడూ మేలు చేయదు. ఈ విధంగా భిక్షాటనములో కూడా మంచిచెడులు ఉన్నాయి. ఏది శ్రేయస్కరమో *(కతరత్ గరీయః)* అది గ్రహించలేక పోతున్నాను *(న విద్మః)* అంటున్నాడు అర్జునుడు. ఎటూ తేల్చుకోలేక తికమక పడుతున్నాడు. ఎందుకని?

ఏదైనా ఎదబాధే

ఎవరు జయిస్తారు? ఎవరు జయించలేరు? అనేది ప్రధాన విషయంగా లేదు. ఎవరు జయిస్తారు అనేది విజయునికి సమస్య కాదు. ఎవరు జయించినా సమస్యే అనేది అర్జునుని సమస్య.

ఓటమిలో మరణమే సంభవించ వచ్చు. అది చాలా బాధాకరం. ఇక గెలుపు విషయాని కొస్తే అది మరీ బాధాకరంగా ఉంది. దారుణంగా ఉంది. ఓటమిలో మరణమే ఉపద్రవం. కాని, గెలుపు మరణం కన్నా భయంకరంగా ఉంది.

కృష్ణా! ఎవరిని వధించిన తరువాత *(యాన్ హత్వా)* మేము జీవించలేమో *(న జిజీవిషామః)*, అట్టి ధృతరాష్ట్రునికి సంబంధించిన భీష్మాదులు *(తే ధార్తరాష్ట్రాః)* ఎదురుగా యుద్ధం చేయడానికి సిద్ధంగా నిలబడ్డారు ***(ప్రముఖే అవస్థితాః)***.

ఓడితే ఎలాగూ ప్రాణాలు మిగలవు. గెలిచినా, అయిన వాళ్ళను పోగొట్టుకొని బ్రతకలేము కనుక ప్రాణాలు నిలవవు. ఏది జరిగినా ఎదబాధ తప్పేటట్టు లేదు.

కృష్ణా! గెలుపు వారిదే అనుకుందాం. ఒకవేళ ఓటమి మనదే అయితే, ప్రాణాలు పోకుండా మనం జీవించి ఉంటే, అప్పుడు ఏమి చేయాలి? అప్పుడైనా భిక్షాటన చేసి జీవించక తప్పదు కదా! అదేదో ఇప్పుడే ప్రారంభిస్తే ఏమైంది? అంటూ ఎదబాధతో ఎదురీద లేక ఏదేదో మాట్లాడు తున్నాడు అర్జునుడు. అంతా ధర్మమీమాంసే. కాని, ఏది ధర్మమో, ఏది అధర్మమో అర్థం చేసుకోలేక ఆందోళనలో నలిగి పోతున్నాడు. ఆ విషయాన్ని తానే అంగీకరిస్తున్నాడు.

కార్పణ్య దోషోపహత స్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః ।
యచ్ఛ్రేయః స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ 7

కార్పణ్య దోషోపహత స్వభావః-పృచ్ఛామి-త్వాం-ధర్మసమ్మూఢ చేతాః
యత్-శ్రేయః-స్యాత్-నిశ్చితం-బ్రూహి-తత్-మే-శిష్యః-తే-అహం-శాధి-మాం-త్వాం-ప్రపన్నం

కార్పణ్య	= కృపణత్వ మనే	స్యాత్	= అగునో
దోష	= దోషము చేత	తత్	= దానిని
ఉపహత	= కొట్టబడిన	మే	= నాకు
స్వభావః	= ప్రకృతి గలవాడనై	బ్రూహి	= చెప్పు
ధర్మ సమ్మూఢచేతాః	= ధర్మం విషయంలో మోహానికి గురైన మనస్సు కలవాడనై	అహం	= నేను
		తే	= నీకు
త్వాం	= నిన్ను	శిష్యః	= శిష్యుడను
పృచ్ఛామి	= అడుగు తున్నాను	త్వాం	= నిన్ను
యత్	= ఏది	ప్రపన్నం	= శరణు జొచ్చిన
శ్రేయః	= శ్రేయస్సుగా	మాం	= నన్ను
నిశ్చితం	= నిర్ణయింప బడినది	శాధి	= శాసింపుము

నా మనస్సును దైన్యం ఆవరించింది. నా స్వభావమే చెడి పోయింది. ధర్మ నిర్ణయం చేసే శక్తిని నా మనస్సు కోల్పోయింది. అందుకే నిన్ను అడుగుతున్నాను. నాకు కావలసింది శ్రేయస్సు. అది ఎలా సాధ్యమో నీవే ఖచ్చితంగా చెప్పాలి. కృష్ణా! నేను నీ శిష్యుణ్ణి. నీవే నాకు శరణ్యము. నన్ను శాసించు.

వ్యాఖ్య

ప్రయాణాలు - ప్రమాదాలు

జీవితము ఒక సుదీర్ఘ ప్రయాణము. అడుగులు వేస్తూనే పోవాలి. ఎక్కడ మడుగులు ఎదురవుతాయో ఊహించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ప్రయాణం చేస్తేనే ముందుకు సాగుతాము. ప్రమాదాలు వాటిల్లేది ప్రయాణం లోనే.

ప్రయాణం దారి లోనే. ప్రమాదమూ దారి లోనే. ఎప్పుడు ఏ సమస్య తలెత్తుతుందో తెలియదు. సాధారణ సమస్యల్ని సానుకూల దృక్పథంతో పరిష్కరించు కోవచ్చు. విషమ పరిస్థితులు ఎదురై నపుడు, లేదా సామాన్య మనుకున్న సమస్యలు విషమంగా పరిణమించి నపుడు, కర్తవ్యం అర్థం కానపుడు, అర్థమైనవి సందేహాలను సృష్టించి నపుడు ఎవరైనా వివేకాన్ని కోల్పోతారు. కలత పడతారు. కలతపడే మనస్సు విచక్షణతో విశ్లేషించ లేదు. అక్కడ మరొకరి సహాయం అవసర మవుతుంది. అర్జునుని పరిస్థితి ప్రస్తుతం అదే.

తప్పు తెలిసింది

మనస్సుకు సర్వజ్ఞత్వం లేదు. మనస్సుకు అన్నీ తెలియవు. మనస్సు చేసే ఆలోచనలే మనకు తెలుస్తాయి. మనస్సు చేసే నిర్ణయాలే మనకు మంచివిగా తోస్తాయి. మనస్సు సదా ఋజుమార్గం లోనే ఆలోచిస్తుందని చెప్పలేము. అందుచేత, మనస్సు చేసే నిర్ణయాలు సరియైనవి కాకపోయే అవకాశం కూడా ఉంది. నిజం చెప్పాలంటే, మనస్సును ఎక్కువ శాతం అవాస్తవాలే ఆక్రమించుకొని అధికారం చెలాయిస్తూ ఉంటాయి.

అందరికీ మనస్సు లున్నాయి. అందరూ దారి తప్పే అవకాశ ముంది. దారి తప్పేవాళ్ళే అందరూ. కాని, అలా తాము దారి తప్పినట్లు తెలుసుకో గలిగే వారెందరు? తెలిసినా, అంగీకరించే పెద్ద మనస్సు గలవారు ఎందరుంటారు? ఎందరైనా ఉండనీ. వారే నిజమైన మనుషులు. మనీషులయ్యే అవకాశానికి నోచుకున్నవారు.

తన దోషాన్ని తాను తెలుసు కోవడం మానవత్వం. తెలుసుకున్నట్లు అంగీకరించడం దైవగుణం. తప్పును ఒప్పుగా కప్పిపుచ్చుకొనేందుకు చేసే ప్రయత్నం అమానుషం. అసుర స్వభావం.

ఇంతవరకు అర్జునుడు ఎంతగానో మాట్లాడాడు. తనకు తెలిసిన ధర్మాలన్నీ ప్రవాహ రూపంలో ప్రసంగించాడు. ఇప్పుడే, ఇక్కడే తన మాటల్లో ఏదో తప్పు ఉందని ప్రథమంగా గుర్తిస్తున్నాడు. తన ఆలోచనల్లో ఏదో దోషం ఉందని బహిరంగంగా భగవంతునికి విన్నవిస్తున్నాడు. ఇంతకీ ఏమిటి ఆ దోషం?

కార్పణ్యం

కార్పణ్య దోషము చేత తన స్వభావం దెబ్బ తినింది అంటున్నాడు అర్జునుడు. కృపణత్వ దోషము చేత స్వభావమే పాడై పోయిందట. దైన్యం ఆవరించిందట. మనస్సు విచలిత మైందట. వివేకం లోపించిందట. అందుచేత ఏది ధర్మమో, ఏది అధర్మమో నిర్ణయించలేక పోతున్నాను అని చెబుతున్నాడు కౌంతేయుడు.

కార్పణ్య దోషము అనే సమాసంలో 'కార్పణ్యము' అనేది ఏదయితే ఉందో, అదే స్వభావంగా మారిపోయిందని అర్థము. స్వభావం స్థాయికి చేరి పోయింది. స్వభావమై కూర్చుంది అని భావం. ఇంతకీ అర్జునుని అంతగా చెదర గొట్టిన ఆ కార్పణ్యం ఏమిటి?

పిసినారి పీఠమా?

కృపణుని స్వభావము కార్పణ్యము **(కృపణస్య స్వభావః కార్పణ్యం)**. కృపణుడు అంటే లోభి మహాశయుడు. లేనివాడు కాడు. ఉన్నా లేనివాడు. చేతులు నిండినా చిత్తము నిండని వాడు. తనకు, పరులకు ఉపకరించని కలిమికి కాపలాదారుడు. ధనక్షయము ఏ కొద్దిగా జరిగినా, జరుగు తుందని ఊహించినా, హోరుగాలికి ఊగిపోయే చెట్టు లాంటి 'తనదైన' చిత్తము గల అరుదైన వ్యక్తి.

అర్జునుని పీడిస్తున్న కృపణత్వం ఇదేనా? ఎందుకంటే, తన దైనది ఏదో అది దూరమైతే తట్టుకోలేని వాడు లోభి. కృపణుడు. 'నాది' లేనపుడు 'నేను' ఎందుకు అనుకునేవాడు. ఇదంతా మమకారమే. లోభత్వము యొక్క ఫలరూపమే మమకారము కనుక, 'నా వాళ్ళు - నా బంధువులు' అంటూ విలపిస్తున్న అర్జునుడు ఇలాంటి కృపణుడి క్రిందికి వస్తాడేమో! అనేది కొందరి సంశయము.

మహాభారతంలో అర్జునుని పాత్రను అధ్యయనం చేసిన వారు ఎవ్వరూ ఈ సంశయాన్ని సమర్థించరు. ఆయన ధనంజయుడు. త్యాగమయుడు. రాజ్య మెందుకు? రాజ్య సుఖా లెందుకు? ***(కింనో రాజ్యేన గోవింద, కిం భోగై:)*** అని ప్రశ్నిస్తున్న వివేకవంతుడు. ఇహపర సుఖాలను తుచ్ఛంగా భావించిన వైరాగ్యమూర్తి. మరి, ఈ కార్పణ్య మేమిటి?

ఇంద్రియ దాస్యమా?

కృపణుడు అంటే అజితేంద్రియుడు అని కూడా అర్థము. అంటే ఇంద్రియములను జయించలేని వాడు ***(కృపణః అజితేంద్రియః).*** ఇది అర్జునునికి వర్తిస్తుందా? కఠోర నియమ నిష్ఠలతో తపస్సు చేసి, పశుపతిని మెప్పించి, పాశుపతాస్త్రమును పొందిన పార్థుడు ఇంద్రియాలను జయించలేని వాడా?

సుందర సుషమాన్విత మందస్మిత వదనంతో, అలౌకిక సౌందర్యంతో, శృంగారానికి నాంది పలుకుతూ, దేవేంద్రుని అనుమతితో రంగ ప్రవేశం చేసిన అసమాన సౌందర్యవతి ఊర్వశి, మంద గమనంతో శయ్యా మందిరానికి అరుదెంచి నపుడు, అమ్మా! క్షమించు. నీకు బిడ్డగా నమస్కరిస్తున్నాను. నీవు నాకు తల్లివి. కుంతి, మాద్రి, శచీదేవి లాగా నీవూ నాకు పూజనీయురాలివి. నన్ను నీ బిడ్డగా స్వీకరించు అని పలికి, తత్ఫలితంగా శాపగ్రస్తుడై, నపుంసకుడై, నాట్యాచారుడిగా ఒక్క సంవత్సరం కులికిన మహానుభావుడు అర్జునుడు అజితేంద్రియుడా? కానే కాడు. మరి ఈ కార్పణ్యానికి అర్థ మేమిటి?

అజ్ఞానమే అసలైన అర్థం

కృపణత్వము అంటే అజ్ఞానము అని, కృపణుడు అంటే అజ్ఞాని అని ఒక అద్భుతమైన విషయాన్ని వినిపించింది ఉపనిషత్తు.

యో వా ఏతదక్షరం గా ర్గ్యవిదిత్వా స్మాల్లోకా త్ప్రైతి స కృపణః

'గార్గీ! అక్షర స్వరూపమైన పరబ్రహ్మమును తెలుసుకోకుండా, ఈ ప్రపంచం నుండి ఎవ్వడైతే నిష్క్రమిస్తున్నాడో వాడే కృపణుడు' అని యాజ్ఞవల్క్య మహర్షి సాధ్వీమాత గార్గికి బోధించాడు.

ఇదే, ఈ అజ్ఞానమే అర్జునుని లోని కృపణత్వ దోషం. అజ్ఞానం ఆవరించి నపుడు ఏది ధర్మమో, ఏది అధర్మమో అర్థం కాదు. ఏది సత్యమో, ఏది అసత్యమో తెలిసి రాదు. అందుచేతనే తాను ధర్మం విషయంలో సంశయాల మధ్య నలిగి పోతున్నట్లు అర్జునుడు అంగీకరిస్తున్నాడు ***(ధర్మ సమ్మూఢ చేతాః).***

అన్నీ సందేహాలే

యుద్ధం చెయ్యాలా, వద్దా? యుద్ధం విరమిస్తే ఏం చెయ్యాలి? భిక్షాటనమే కదా? అది యుక్తమా? అయుక్తమా? స్వధర్మం కనుక యుద్ధాన్ని ఆచరించక తప్పదు. బాగానే ఉంది. స్వధర్మము హింసతో కూడుకొని ఉంది కదా! అయినా ఆచరించక తప్పదా? ఇంతకీ, సమరమా? భిక్షాటనమా? ఏది ఉచితం? ఏది అనుచితం?

అర్జునా! ఈ ధర్మాలన్నీ గతంలో నువ్వు విన లేదా? విద్యాభ్యాసం చేసి నపుడు ధర్మబోధలో ఈ సత్యాలను గురువు నీకు బోధించ లేదా?

గురుబోధలో ఇవన్నీ నేను ఆలకించాను. నేను శ్రద్ధతో ధర్మశాస్త్రాల్ని పఠించాను. కాని, ప్రస్తుతం ధర్మ నిర్ణయం చేయలేని స్థితిలో ఉన్నాను. ధర్మం విషయంలో నా మనస్సు నిండా సందేహాలే చేరిపోయాయి ***(ధర్మ సమ్మూఢ చేతాః).*** ఇదంతా కార్పణ్యదోషము యొక్క ప్రభావమే. కృపణత్వ దోషం చేత నా స్వభావమే చెడిపోయింది ***(కార్పణ్య దోషోప హత స్వభావః).***

కౌరవుల మనస్సులను లోభం దెబ్బ కొట్టిందని మొదటి అధ్యాయం ముప్పై ఎనిమిదవ శ్లోకంలో చెప్పాడు అర్జునుడు ***(లోభోపహత చేతసః).*** తానేమో కార్పణ్య దోషము చేత దెబ్బ తిన్నానని చెబుతున్నాడు. కౌరవులది లోభము, తనది కార్పణ్య మని అర్జునుడు అంగీకరిస్తున్నాడు. తనలో ఏ కృప ప్రస్తుతం వ్యక్త మౌతూ ఉందో అది కార్పణ్య దోష ప్రభావమే నని అభిప్రాయ పడుతున్నాడు.

అర్జునుని కృపను ఇప్పటికే రెండు చోట్ల సంజయుడు ఉదహరించాడు కూడా. అర్జునుడు కృపతో కూడుకొని ఉన్నాడు ***(కృపయా உ విష్టమ్)*** అని మొదటి అధ్యాయం ఇరవై ఏడవ శ్లోకం లోను, రెండవ అధ్యాయం ప్రథమ శ్లోకం లోను సంజయుడు ప్రత్యేకించి ప్రస్తావించాడు.

విషమ సమయాల్లో ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ తలెత్తి నపుడు, వివేకవంతుడు శ్రేయస్సు వైపే మొగ్గు చూపాలి. తాత్కాలిక సుఖాలకు తల వంచి వినాశాన్ని వరించ కుండా, శాశ్వత మైన శ్రేయస్సు వైపే మరలాలి. అర్జునుడు అదే చేశాడు.

చెడిన మనస్సుకు చెడు అర్థం కాదు. కలత చెందిన చిత్తము మంచిని వరించ లేదు. ఇలాంటి చోట మరొకరి సహాయం మనకు అవసరం. అర్జునునికి కూడా అదే ప్రస్తుతం అవసరమై ఉంది. కాకపోతే, అర్జునుడు పుణ్యాత్ముడు కనుక, ధర్మ జీవనం గడిపిన వాడు కనుక ఆయన అదృష్టం కొద్ది సహకరించ దానికి సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడే లభించాడు.

జ్ఞాన పిపాస

తృప్తి లేకుండా మనిషి జీవించ లేడు. ఈ ప్రపంచంలో తృప్తి తెలియని వారు లేరు. తృప్తి చెందని వారు లేరు. తిరిగి అసంతృప్తిని పొందని వారూ లేరు. ఏ తృప్తి అయినా తాత్కాలికమే. నిత్య తృప్తి అనేది ఈ ప్రపంచంలో కుందేటి కొమ్ము లాగే ఉంది.

దాహం వేస్తే మనిషి నీటిని పానం చేస్తాడు. తృప్తి కలుగుతుంది. అంత మాత్రాన దప్పిక శాశ్వతంగా దూరం కాలేదు. ఆకలికి మనిషి ఆహారాన్ని భుజిస్తాడు. తృప్తిగా భోంచేస్తాడు. అంతమాత్రాన ఆకలికి పూర్తిగా దూరం కాలేడు. తృప్తి విషయంలో అనుభవాలన్నీ ఇలాగే ఉంటాయి. నొప్పి తెలియకుండా ఉండేందుకు స్వీకరించే ఔషధాలు రోగ నివారకాలు కావు. ఆరోగ్య ప్రదాయకాలూ కావు. ఏ తృప్తి అయినా ఈ ప్రపంచంలో తాత్కాలికంగా అసంతృప్తిని దూరం చేసేదే కాని నిత్యతృప్తిగా మాత్రం ఉండ లేదు.

ఏది పొందినా ***(ప్రవృత్తి),*** ఏది పోగొట్టుకున్నా ***(నివృత్తి),*** లాభనష్టాల ఊబిలో దిగడం జరుగుతుందే గాని నిత్యతృప్తిని పొందడం జరగదు. అసంతృప్తి నుండి శాశ్వతంగా విడి పడటమూ జరగదు. అర్జునుడికి తన దుఃఖము దూరమయ్యే లాగా కనిపించడం లేదు. పొంది సాధించేది లేనపుడు, అర్థం చేసుకోవడం ఒక్కటే మార్గం. జ్ఞానమే శరణ్యం. జ్ఞానమే సాధనం ***(జ్ఞాన మేవ సాధనం).***

నిత్యతృప్తి అనేది నిత్యవస్తువు లోనే ఉంటుంది. నిత్యవస్తువు అంటే అబాధితం అని అర్థము. లేనిదిగా ఎప్పుడూ కాలేనిది నిత్యవస్తువు. సదా ఉన్నదే. అట్టి అనంతమైన వస్తువును కర్మల ద్వారా ఎలా పొందగలం? కనుక ఉన్న దానిని ఉన్నట్లుగా తెలుసు కోవాలి. అదే జ్ఞానం. నిత్యజ్ఞానం. నిత్యవస్తువుకు సంబంధించిన జ్ఞానమే నిత్యజ్ఞానం. అది కూడా ఉన్నదే. కాకపోతే అజ్ఞానం వల్ల ఉన్నది ఉన్నట్లు తెలియకుండా ఉంది. అంతేకాదు. లేదేమో! అనే సందేహాన్ని కూడా కలిగిస్తూ ఉంది. ఇదే మోహము ***(అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః).***

అర్జునుడు ఆశించేది నిత్యతృప్తి. అందుకే జ్ఞానదాహంతో తపించి పోతున్నాడు. అట్టి జ్ఞానాన్ని నిశ్చయించి చెప్పమని శ్రీకృష్ణుని అర్థిస్తున్నాడు. దానినే శ్రేయస్సు అంటున్నాడు ***(యచ్ఛ్రేయస్స్యాత్ నిశ్చితం బ్రూహి).*** తనకు శ్రేయస్సే కావాలి. ప్రేయస్సు అవసరం లేదు.

శ్రేయస్సు - ప్రేయస్సు

ప్రియమును తాత్కాలికంగా కలిగించేది ప్రేయస్సు. శుభమును శాశ్వతంగా అందించేది శ్రేయస్సు. తాత్కాలిక సుఖాల వైపే మానవులు పరుగులు పెడుతూ అలసిపోతూ ఉంటారు. ఇదే ప్రేయస్సు. దీని నుండి విడిపడి అసంతృప్తి తెలియని ఆనంద స్వరూపాన్ని పొందటమే శ్రేయస్సు.

శ్రేయస్సు ప్రేయస్సు లనే ఈ రెండూ మనిషిని చుట్టుముట్టి ఉంటాయి ***(శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యం ఏతః).*** వివేకము కలిగిన ధీర పురుషుడు ***(ధీరః),*** ఆ రెండిటిని పరిశీలించి ***(తౌ సంపరీత్య),*** వేరు వేరుగా తెలుసుకొంటున్నాడు ***(వివినక్తి).*** అలా విడమరచి తెలుసు కొనిన ధీర పురుషుడు ***(సః ధీరః),*** ప్రేయస్సు కన్నా వేరైన శ్రేయస్సునే ***(ప్రేయసః శ్రేయః హి)*** వరించి వాంఛిస్తున్నాడు ***(అభివృణీతే).*** అట్టివాడు నిత్యతృప్తిని పొందుతున్నాడు. అదే మోక్షము. అర్జునుడు ప్రస్తుతం వాంఛించేది శ్రేయస్సునే గాని ప్రేయస్సును కాదు.

అర్జునుడు ఇంతవరకు ధర్మప్రసంగమే చేశాడు. కాని, ధర్మము విషయంలో తాను స్పష్టతను కోల్పోయినట్లు ఈ శ్లోకం లోనే ప్రథమంగా చెబుతున్నాడు ***(ధర్మ సమ్మూఢ చేతాః).*** అలాంటప్పుడు ధర్మ వివేచనం చేసి నిర్ణయిస్తే సరిపోతుంది. ధర్మ మీమాంసను లేవనెత్తి, అర్జునునికి ధర్మం విషయంలో ఉన్న సంశయాన్ని శ్రీకృష్ణుడు నివారిస్తే సరిపోతుంది. కాని, అంతటితో అర్జునుడు సరిపెట్టుకొనే లాగా లేడు. వాస్తవం చెప్పాలంటే, ప్రస్తుత తరుణంలో అర్జునుడు ధర్మాధర్మాల నుండి విడిపడి ఆలోచిస్తున్నాడు.

ధర్మము యొక్క ఫలం పుణ్యం. పుణ్య మనేది సుఖానికి సంబంధించింది. పరిమిత మైన ఆనందాన్నిచ్చేది. దానిని అర్జునుడు అర్థించడం లేదు. తనకు శ్రేయస్సు కావాలి అంటున్నాడు. అదేదో నిశ్చయించి చెప్పమని శ్రీకృష్ణుని అభ్యర్థిస్తున్నాడు ***(యచ్ఛ్రేయస్యా న్నిశ్చితం బ్రూహి).*** సుఖదుఃఖాలను అధిగమించిన ఆనందాన్ని అభిలషిస్తున్నాడు. ధర్మాధర్మాలను దాటిన పరంధామాన్ని కోరుకుంటున్నాడు. ప్రియాప్రియముల నుండి విడిపడిన నిత్య సుఖాంబోధిలో ఓలలాడాలని పరితపిస్తున్నాడు. బ్రహ్మవిదుడు కావాలని, బ్రహ్మమునే పొందాలనే ఏకైక వాంఛతో ఉన్నాడు. బ్రహ్మవిదుని ప్రయాణాన్ని ఉపనిషత్తు కూడా ఇలాగే వర్ణించింది.

స ఏష విసుకృతో విదుష్కృతో బ్రహ్మ విద్వాన్ బ్రహ్మైవాభిప్రైతి

ఆ బ్రహ్మవిదుడు ***(స ఏష బ్రహ్మ విద్వాన్)*** పుణ్యము నుండి విడిపడి ***(విసుకృతః),*** పాపమును అంటక ***(విదుష్కృతః).*** బ్రహ్మమునే ***(బ్రహ్మైవ)*** పొందుచున్నాడు ***(అభిప్రైతి)*** అని కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్తు ప్రవచించింది.

ఎందుకు చెప్పాలి?

కృష్ణా! నాకు ఏది శ్రేయస్సో దానిని నువ్వే నిర్ణయించి చెప్పు. నా మనస్సు ధర్మనిర్ణయం చేసే స్థితిలో లేదు అన్నాడు అర్జునుడు.

అర్జునుడు అడిగినంత మాత్రాన శ్రీకృష్ణుడు చెప్పాలని ఎక్కడుంది? ఎందుకు చెప్పాలి? అర్జునుడి రథాన్ని తోలడానికి అచ్యుతుడు అంగీకరించాడు. బోధిస్తా నని చెప్పలేదు.

అర్జునుడు అడుగు తున్నాడు కనుక చెప్పవచ్చు కదా అంటారా! అడిగినంత మాత్రాన చెప్పాలని కూడా లేదు. అడిగిన వాళ్ళందరికీ ఎందుకు చెప్పాలి? అర్జునుడు ఒక్కడే కాదు, శ్రీకృష్ణుడు చెబితే వినడానికి ప్రపంచ మంతా నిరీక్షిస్తూ ఉంది. వెలుగు కోసం విశ్వమంతా సూర్యుని వైపు చూచినట్లు, జ్ఞానం కోసం ప్రపంచ మంతా పరమేశ్వరు డైన శ్రీకృష్ణుని వైపు చూస్తూ ఉంది. దేవగణము, మహర్షి సమూహము సైతం ఆ దివ్యాత్ముని బోధామృతాన్ని గ్రోలాలనే ఉర్రులు చాస్తోంది. ఈ సత్యాన్ని మహాభారతం - అరణ్యపర్వంలో మహాత్ముడైన మార్కండేయ మహర్షి స్వయంగా ధర్మరాజుకు చెప్పాడు కూడా.

ధర్మరాజా! ఈ ప్రపంచము ప్రళయజలాలలో మునిగి నపుడు, నైరాశ్యంతో నేను కలత చెందిన సమయంలో, ఏ దివ్యాత్ముని ఉదరంలో ఈ సమస్త బ్రహ్మాండాన్ని దర్శించానో, ఆ పరంధాముడు ఎవరో కాదు. ఈ పురాణ పురుషుడే. వార్ష్ణేయుడే. శ్రీకృష్ణుడే.

యస్స దేవో మయా దృష్టః పురా పద్మాయ తేక్షణః
స ఏవ పురుష వ్యాఘ్రః సంబంధీ తే జనార్దనః ॥

ధర్మరాజా! పూర్వము ప్రళయ సమయంలో పద్మనేత్రుడైన ఏ భగవంతుని నేను దర్శించానో, అతడే ప్రస్తుతం నీకు బంధువైన శ్రీకృష్ణుడు అన్నాడు మార్కండేయుడు.

అలాంటి జగన్నాథుడైన శ్రీకృష్ణుని అర్జునుడు ఆశ్రయించడంలో, అడగటంలో ఆశ్చర్య మేముంది? అలాగని, అడిగిన వాళ్ళందరికీ చెబుతారా? అడిగిన వాడు అర్హత లేనివాడైతే, బోధించిన దంతా బూడిదలో పోసిన పన్నీరు కాదా? అడిగిన వాడు అర్హత లేనివా డైతే బోధించ కూడదు అనేది శాస్త్రవిధి.

నియమాలు ఉన్నాయి

జ్ఞానము పవిత్ర మైనది. ప్రసాదం వంటిది. అర్హులకే అనుగ్రహించాలి. పాడు చేసుకొనే స్వభావం కల వారికి ఆస్తులనే పంచరు కదా! అమృత స్వరూపమైన ఆత్మజ్ఞానాన్ని ఎవరు పంచుతారు?

న అపుత్రాయ అశిష్యాయ ప్రబ్రూయాత్

పుత్రుడు కాని వానికి, శిష్యుడు కాని వానికి చెప్పకూడదు అన్నది శాస్త్రం. బిడ్డకు తండ్రిపై ప్రేమ ఉంటుంది. అలాగే శిష్యునికి గురువుపై ప్రేమ ఉండాలి. ప్రేమ లేని వానికి బోధిస్తే బోధ ఫలించదు.

బిడ్డకు తండ్రి విషయంలో ప్రేమే కాదు, చనువు కూడా ఉంటుంది. అలాంటి చనువును గురువు విషయంలో శిష్యుడు ప్రదర్శించ కూడదు. హద్దు లెరిగి ప్రవర్తించాలి. బుద్ధి కలిగి ప్రసంగించాలి. అందుచేత శిష్యుడు అని చెప్పడం జరిగింది. పుత్రుని ప్రేమ, శిష్యుని భక్తి రెండూ కలిగిన వాడే శిక్షణ యోగ్యుడు. అట్టి వానికే బోధించాలని శాస్త్రం శాసించింది.

వినయ విధేయతలు కలిగిన శిక్షణ యోగ్యుడే ఉంటాడు. కాని, బోధించ మని అర్థించడు. అలాంటి వానికి బోధించ వచ్చా? బోధించ కూడదు. అర్హు డైనప్పటికీ అర్థిస్తేనే బోధించాలి.

న అపృష్టః కస్యచిత్ బ్రూయాత్

జిజ్ఞాసతో వచ్చి అడగని ముముక్షువునకు బోధించ కూడదు అని కూడా చెప్పింది శాస్త్రం. శిష్యునికి జ్ఞానాభిలాష ఉండొచ్చు. కాని, గురువును అడగాలి. అభ్యర్థించాలి. ప్రార్థించాలి.

శిష్యుడే కదా! అడగక పోయినా బోధిస్తే ఏమవుతుంది? ఏదైనా కావచ్చు. ఏమీ కాకపోవచ్చు కూడా. రెండూ ప్రమాదాలే. శాస్త్రం ప్రమాణము. జ్ఞానమును ప్రసాదించేది కనుక ప్రమాణము ***(ప్రమాకరణం***

ప్రమాణం). ప్రమాణము ఫలిస్తే జ్ఞానము శోభించాలి. అంతేగాని ఏదో కావడము, ఏదీ కాకపోవడము - ఈ రెండూ జరగ కూడదు.

అడగని వానికి ప్రేమతో గురువు బోధించాడనే అనుకుందాం. శిష్యుడు వివేక శూన్యుడైతే, 'నీకై నీవే బోధించావు. నేను అడిగానా?' అని గురువుకు ఎదురు ప్రశ్న వస్తే ఏమవుతుంది? జ్ఞాన స్వరూపుడైన గురువుకు ఏమీ కాదు. పరమ పవిత్రమైన సంప్రదాయానికే ఎద పగుల్తుంది. బోధ ఎంత ముఖ్యమో, సంప్రదాయ రక్షణ అంత ముఖ్యం. సంప్రదాయ రక్షణ లోనే జ్ఞానము పండుతుంది. పరిఢవిల్లు తుంది.

అర్హత పొందిన అర్జునుడు

కృష్ణా! శ్రేయస్సు ఏదో నాకు బోధించు అని అడిగాడు అర్జునుడు. ఈ వాక్యాన్ని ఈ సందర్భం లోనే వింటున్నాం. శ్రీకృష్ణార్జునుల మైత్రి ఈనాటిది కాదు. వాళ్ళ మైత్రిలో దశాబ్దాలే దొర్లిపోయాయి.

కలిసి తిరిగారు. కలబడి భుజించారు. కష్టాలు పంచుకున్నారు. కలతలలో పరస్పరము కాచుకున్నారు. కాని, ఎప్పుడు కూడా నాకు శ్రేయస్సును బోధించు అని అర్జునుడు శ్రీకృష్ణుని అడగ లేదు. ఇప్పుడే, ఇక్కడే, కురుక్షేత్రం లోనే ప్రథమంగా అడుగు తున్నాడు పార్థుడు.

ఏ సన్నివేశంలో విషాదానికి, దైన్యానికి అవకాశం లేదో, అలాంటి యుద్ధ సన్నివేశంలో పార్థుడు విషణ్ణు డయ్యాడు. కలత చెందాడు. దీను డయ్యాడు. ఉపదేశాన్ని గ్రహించ డానికి సిద్ధ మయ్యాడు. అర్హతను ప్రదర్శించాడు. శ్రద్ధను ప్రకటించు కున్నాడు. బోధించ మని అర్థించాడు. నేను నీ శిష్యుణ్ణి ***(శిష్యస్తేఽహం).*** నన్ను శాసించు ***(శాధిమాం)*** అని అభ్యర్థించాడు. ప్రార్థించాడు. శిష్యుడుగా శరణాగతు డయ్యాడు ***(ప్రపన్నమ్).***

జ్ఞానాన్ని శిష్య లందరికీ సమానంగా పంచుతాడు గురువు. కాని, వ్యక్తిగతంగా వారిని తీర్చిదిద్దే ప్రక్రియలో విభిన్నంగా గోచరిస్తూ ఉంటాడు. ఈ తరతమ భావము గురువు స్వభావానికి సంబంధించింది కాదు. శిష్యుల ప్రవర్తనకు సంబంధించింది.

కొందరు శిష్యులు గురువు హృదయాన్ని గ్రహిస్తూ ప్రవర్తిస్తూ ఉంటారు. కొందరు శిష్యులు తమ బుద్ధిని పట్టించుకొంటూ గురుబోధను ప్రతిచర్యలతో గ్రహిస్తూ ఉంటారు. మొదటి వారికి గురువు చెప్పింది ఏదైనా ప్రసాదమే. రెండవ తెగ వారికి తమకు అనుకూలంగా ఉంటే ప్రసాదము. అనుకూలం కాకపోతే ప్రమాదము.

జ్ఞానం వంటబట్టే వరకు అన్నీ ప్రమాదాలే. అదంతా గురువుకు తెలుసు. కనుకనే, ప్రతిచర్యలు లేకుండా ప్రసన్నంగా జీవించే శిష్యులకు అవసర మైతే ఆజ్ఞాపించి కూడా చెబుతాడు గురువు. ముట్టుకుంటే మునిగి పోయే మనస్సులు గల శిష్యులకు ఉపదేశిస్తాడే గాని వారిని ఆజ్ఞాపించడు.

అర్జునుడు ఈ శ్లోకంలో గురుదేవుడైన గోవిందుని ఆశ్రయించడమే గాక నన్ను శాసించు, ఆజ్ఞాపించు ***(శాధిమాం)*** అని విన్నవించు కొంటున్నాడు. తన విషయంలో సంశయించ వద్దని తనను తాను గురువుకు సమర్పించు కొంటున్నాడు. అంతేకాదు, ప్రియతమ మైన వారినే ప్రేమతో ఆజ్ఞాపిస్తారు కనుక, తాను ప్రియతమ శిష్యుడ నని చెప్పకనే చెప్పాడు పార్థుడు.

శిష్యుడుగా అర్జునుడు అర్హతను పొందాడు. బోధను గ్రహించ డానికి అధికారి అయ్యాడు. శిష్య డయ్యాడు. శిక్షణయోగ్యు డని ప్రకటించు కున్నాడు. కాని, ఇక్కడ అర్జునుని వాక్యాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. నేను శిష్యుణ్ణి ***(అహం శిష్యః)*** అనలేదు. నేను నీ శిష్యుణ్ణి ***(అహం తే శిష్యః)*** అన్నాడు. శిష్యుడైన వాడు శిక్షణ యోగ్యుడు కనుక ఏ గురువైనా బోధిస్తాడు. కాని, అర్జునునికి మాత్రం శ్రీకృష్ణుడే బోధించాలి.

ఎందుకని? నేను నీకు శిష్యుణ్ణి అన్నాడు అర్జునుడు. అంటే, తన గురువుగా శ్రీకృష్ణుణ్ణే ఎంచుకున్నాడు పార్థుడు.

గురువు లఘువు కాదు

గురుత్వము గౌరవప్రద మైనది. గణనీయ మైనది. ఘనమైనది. ఘనకీర్తి గలది. లఘుత్వము కానిది. లక్షణ మైనది.

ఎందరైనా బోధించ వచ్చు. బోధించేవా రందరూ గురువులు కాలేరు. జ్ఞానగంధము లేకపోయినా జ్ఞానుల మని విర్రవీగే వారు, అహంకారముతో ఊగిపోయే వారు గురువులు కాలేరు. అలాంటి వారిని అనుసరించే మూఢ శిష్యులు గ్రుడ్డి వానిని అనుసరించే గ్రుడ్డివారి లాగా పతన మౌతారు అన్నది ఉపనిషత్తు.

' అవిద్యాయా మన్తరే వర్తమానాః
స్వయం ధీరాః పండితం మన్యమానాః
దంద్రమ్యమాణాః పరియన్తి మూఢాః
అంధేనైవ నీయమానా యథాంధాః ॥

అజ్ఞానంలో అలమటించే మూఢులు తామే గొప్ప పండితుల మని, వివేకుల మని గర్వంతో ఊగిపోతూ, 'గ్రుడ్డి వానిని అనుసరించే మరొక గ్రుడ్డివాని' లాగా పరిభ్రమిస్తూ ఉంటారు అన్నది కఠోపనిషత్తు.*

అర్జునుడు జ్ఞానసాగరు డైన అచ్యుతుని గురువుగా ఎన్నుకున్నాడు. దాని ఫలితంగా మోహనాశము - స్మృతిలాభము జరిగిందని చివరగా అర్జునుడే చెబుతాడు.

గురు-శిష్య వైభవము

ఆత్మజ్ఞానమును బోధించు ఆచార్యుడు అరుదుగా ఉంటాడు. అందుకే గురువు వైభవోపేతుడు. అట్టి ఆత్మజ్ఞానమును అందుకొనే నిపుణుడైన శిష్యుడు కూడా అరుదు గానే ఉంటాడు. కనుక శిష్యుడు కూడా వైభవంతో ఉన్నవాడే. ఇలాంటి గురుశిష్యులు ఏకమైన చోట ఉన్నదంతా జ్ఞానమే. జ్ఞానామృతమే. జ్ఞాన వైభవమే.

ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా
ఆశ్చర్యో జ్ఞాతా కుశలాఽనుశిష్టః

ఈ జ్ఞానమును గూర్చి చర్చించ గల వక్త చాలా అరుదు. నిపుణుడైన ఆచార్యుడు చర్చించే ఈ తత్త్వమును అందుకొనే శ్రోత కూడా నిపుణుడే. అరుదైన వాడే. ఇలాంటి గురుశిష్యులు ఒక్కటైన చోట రెండు గాని, కాలేని, అద్వితీయ జ్ఞాన మొక్కటే శోభిస్తుంది.

అలాంటి గురుశిష్యులే శ్రీకృష్ణార్జునులు. కనుకనే, వీరి మధ్య పదిహేడు అధ్యాయాలతో జ్ఞానం వరద లాగా పారింది. అద్భుతమైన గురువు, అద్భుతమైన శిష్యుడు కురుక్షేత్రంలో ఒక్కచోట చేరారు. సంవాద రూపంలో తత్త్వాన్ని చర్చింప బోతున్నారు. అమృతమయ మైన ధర్మబోధ అంద బోతోంది. దివ్యమైన జ్ఞానామృతము వితరణకు సిద్ధం కాబోతోంది.

అర్జునుడు ఆత్రుతతో నిరీక్షిస్తున్నాడు. సంజయుడు ఆసక్తితో ఎదురు చూస్తున్నాడు. మీరూ, నేను కూడా శ్రద్ధతో చేతులు జోడిస్తున్నాం. మారలేక పోయినా, విని ఆనందించ డానికి ధృతరాష్ట్రుడు కూడా సిద్ధపడు తున్నాడు.

* కఠోపనిషత్తు పై పూజ్య స్వామీజీ ప్రవచనముల వి.సి.డి.లు ఆశ్రమంలో లభ్యం.

శరణాగతి

యుద్ధభూమిలో ప్రవేశించి నపుడు అర్జునునిలో కేవలం శత్రుభావనే ఉండింది. సమర సంకల్పమే ఉండింది. ద్వేషవృత్తి ఒక్కటే మనస్సును అంటి పెట్టుకొని ఉండింది.

రణరంగంలో భీష్మాదుల్ని చూచిన తరువాత శత్రు భావన మెల్లమెల్లగా పలుచ బడింది. దాని స్థానంలో మమకార భావన మొలకెత్తింది. ఒక దశలో మనసంతా మమకార వృత్తి పెనవేసుకు పోయింది.

మమకారం అర్జునుని కుదిపేసింది. అంతటితో ఆగలేదు. ఒక సాధారణ సమస్యను పారమార్థిక సమస్యగా మార్చేసింది. ప్రేయస్సును పేలవంగా తేల్చేసింది. శ్రేయస్సునే ప్రధానంగా ముందుకు తెచ్చింది.

మమకార వృత్తి స్థానంలో శరణాగత వృత్తి శోభించింది. జ్ఞానాభిలాష బుద్ధిలో పల్లవించింది. వీరుడిగా కురుక్షేత్రంలో అడుగు పెట్టిన అర్జునుని శిష్యునిగా రూపు దిద్దింది.

అర్జునుడు శరణాగతు డయ్యాడు. ఇక్కడ అర్జునుడు శరణాగతు డయింది వ్యక్తికి అని అనిపిస్తున్నా, కనిపిస్తున్నా, వాస్తవానికి అతడు శరణాగతుడైంది జ్ఞానానికి. వాసుదేవుని లోని అమృతమయమైన జ్ఞానానికి. జ్ఞాని వైభవము అంటే జ్ఞాన వైభవమే. జ్ఞానము యొక్క వైభవమే.

జ్ఞాన ద్వారము

భగవద్గీత రెండవ అధ్యాయం - సాంఖ్య యోగము ఏడవ శ్లోకంలో అర్జునుడు ఏడుపు మానేసి ప్రసన్నంగా శరణాగతు డయ్యాడు. గీతాజ్ఞాన సాధానికి ఈ శ్లోకం ముఖద్వారము అనిపిస్తోంది. ఈ శ్లోకం లేనట్లయితే గీతాభవనం లోకి ప్రవేశమే దక్కేది కాదు. ఈ శ్లోకం శ్రీకృష్ణుని చెవిలో పడకుండా ఉంటే, అర్జునునికి గీతామృతాన్ని శ్రీకృష్ణుడు పంచేవాడు కాడు. అందుకనే, శాస్త్రారంభానికి అవసరమైన అనుబంధ చతుష్టయం ఈ శ్లోకం లోనే పులకిస్తూ పుష్పితమై, పుష్కలంగా పురస్కారము నందుకొంది.

విషయము, ప్రయోజనము, అధికారి, సంబంధము - ఈ నాలుగు అనుబంధ చతుష్టయము. శాస్త్రారంభానికి మూలము.

(1) విషయము : జ్ఞానము. ఆత్మజ్ఞానము. శ్రేయస్సును బోధించమని అర్జునుడు ప్రశ్నించాడు. శ్రేయస్సు అంటే మోక్షము. మోక్షము జ్ఞానరూపంలో ఉంది కనుక జ్ఞానమే ఇక్కడ కేంద్ర విషయము.

(2) ప్రయోజనము : పరమ పురుషార్థమైన మోక్షమే ప్రయోజనము.

(3) అధికారి : అర్జునుడు అధికారి. వివేక, వైరాగ్య, శమాది షట్క సంపత్తి, ముముక్షుత్వము అనే సాధన చతుష్టయ సంపద గల అర్జునుడు అధికారి.

(4) సంబంధము : గీతలో జ్ఞానమే ప్రధానమై నందున, భగవంతుడు, భగవంతుని జ్ఞానము (గీత) వేరు కానందున గ్రంథ విషయము, గ్రంథ నామమునకు సంబంధము ఉంది. అంతేకాదు. శిష్టాచార సంప్రదాయంలో బోధ విషయంలో ప్రముఖంగా ఉండ వలసిన గురుశిష్య సంబంధము కూడా ఇక్కడే శోభించింది.

ఇక జ్ఞానబోధ ప్రారంభం కావాలి. అర్జునుడు తన చివరి మాటను పలికి విరమిస్తున్నాడు.

న హి ప్రపశ్యామి మ మాపనుద్యా ద్యచ్ఛోక ముచ్ఛోషణ మిన్ద్రియాణామ్ ।
అవాప్య భూమా వసపత్న మృద్ధం రాజ్యం సురాణా మపి చాధిపత్యమ్ ॥ 8

న-హి-ప్రపశ్యామి-మమ-అపనుద్యాత్-యత్-శోకం-ఉచ్ఛోషణం-ఇన్ద్రియాణాం
అవాప్య-భూమౌ-అసపత్నం-ఋద్ధం-రాజ్యం-సురాణాం-అపి-చ-ఆధిపత్యం

భూమౌ	= భూమండలమున	ఇంద్రియాణాం	= ఇంద్రియాలకు
అసపత్నం	= శత్రువులు లేని	ఉచ్ఛోషణం	= మిక్కిలి తాపమును కలిగించే
ఋద్ధం	= సమృద్ధ మైన	మమ	= నా యొక్క
రాజ్యం	= రాజ్యమును గాని	శోకం	= దుఃఖమును
సురాణాం	= దేవతల	యత్	= ఏది
ఆధిపత్యం చ అపి	= ఆధిపత్యమును కూడా	అపనుద్యాత్	= పోగొట్టునో
అవాప్య	= పొందినా	న ప్రపశ్యామి హి	= చూడలేక పోతున్నాను

కృష్ణా! సర్వేంద్రియ తాపంతో, శోకంతో కుమిలి పోతున్నాను. ఎలా తొలగించుకోవాలో తెలియడం లేదు. ఈ లోకంలో శత్రు శేషం లేని, సకలైశ్వర్య సంపన్నమైన రాజ్యం లభించినా, నా శోక తాపాలు తీరేలా లేవు. స్వర్గాధిపత్యం కూడా అలాంటిదే ననిపిస్తోంది. నాకు మరొక మార్గం కనిపించడం లేదు.

వ్యాఖ్య

యుద్ధం చెయ్యాలని అర్జునుడు కురుక్షేత్రంలో ప్రవేశించాడు. పోట్లాడటం మాని మాట్లాడటం ఆరంభించాడు. మాటలన్నీ ఖర్చయి పోయాయి. బుద్ధిలో బాధలు అలాగే ఉన్నాయి. ఏమి చెయ్యడానికి మనస్సు ఇష్టపడటం లేదు. ఏది చేసినా చేతులు కాలుతాయి - చిత్తము పేలుతుంది అనే భావం బుద్ధిలో స్థిరపడి పోయింది.

ఏమి చేయాలి? - ఏది పొందాలి?

యుద్ధం చెయ్యాలి. గెలిస్తే రాజ్యం. ఓడితే స్వర్గం. యుద్ధం స్వధర్మం కనుక ఆచరించక తప్పదు. చేసి సాధించే దేముంది? శ్రేయస్సు లభిస్తుందా? అని అర్జునుని ఆంతర్యం ప్రశ్నిస్తోంది.

యుద్ధంలో విజయాన్ని సాధిస్తే రాజ్యం లభిస్తుంది. రాజ్యం రావచ్చు. దుఃఖం పోతుందా? పైరుకు తెగులు - ప్రభువుకు వైరులు అనివార్యాలు. దోమలు, నల్లులు నిండిన ప్రదేశంలో పట్టుపాన్పులు ఏమి సుఖాన్నిస్తాయి? ప్రభువుకు శత్రువులు ఉంటారు. ప్రతికూల పరిస్థితులూ ఉంటాయి. కనుక దుఃఖం తప్పదు. కాని, ఇక్కడ అర్జునుడు ప్రస్తావిస్తున్నది సామాన్యమైన రాజ్యం కాదు. అఖండ భూమండలాధిపత్యము. శత్రువులు లేని రాజ్యము (*అసపత్నం - ఋద్ధం - రాజ్యం*).

కృష్ణా! మనం వాళ్ళను జయిస్తామో, లేక వాళ్ళే మనల్ని జయిస్తారో కూడా తెలియదు. ఏది మనకు శ్రేయస్కరమో కూడా తెలియడం లేదు అని ఆరవ శ్లోకంలో అన్నాడు అర్జునుడు. ఎవరు గెలిచినా సాధించేది ఏమీ లేదని ఇప్పుడు అంటున్నాడు.

తామే గెలిస్తే రాజ్యం వస్తుంది. రాజ్యం క్రొత్తది. దేహం మాత్రం పాతదే. రాజ్యం ఉండినా దేహం ఉండదు. దేహం కూడా కర్మఫలమే. గతంలో ఆచరించిన కర్మల ఫలితంగా దేహం ప్రాప్తించింది. కర్మఫలం ఏదైనా నశించేదే. అర్జునుడు సాధారణమైన వ్యక్తి కాడు. శాస్త్ర విషయాలు వినిన వాడే. అనివార్యాలను జీవితంలో చూసిన వాడే. అదంతా వృథా కాలేదు. తన సమస్యను తీవ్రతరం చేస్తూనే ఉంది. అనిత్యాలను ఆరబోస్తూనే ఉంది.

కుండను చేయడం కర్మ. వస్త్రాన్ని నేయడం కర్మ. కర్మ యొక్క ఫలంగా ఒక కాలంలో ప్రాప్తించిన కుండ మరొక కాలంలో పగిలి పోతుంది. కర్మఫలంగా ఒక కాలంలో లభించిన వస్త్రము మరొక కాలంలో చిరిగి పోతుంది. దేహం కూడా కర్మఫలమే. ఏది పొందినా మరొక నాడు దానిని పోగొట్టుకో వలసిందే. దేహమే నిత్యం కాదు. ఇక రాజ్యం నిత్యమా? ప్రభువై సాధించే దేముంది? పరితపిస్తూనే బ్రతకాలి. అసంతృప్తి తోనే జీవించాలి.

ఒకవేళ యుద్ధంలో అపజయమే ఎదురైతే, మరణమే ప్రాప్తిస్తే, అప్పుడేం జరుగుతుంది? స్వర్గం ప్రాప్తిస్తుంది. ఇక్కడ కేవలం స్వర్గమే కాదు, స్వర్గలోకాధిపత్యం లభించినా తన దుఃఖం ఉపశమించే లాగా లేదు అని స్పష్టంగా చెబుతున్నాడు అర్జునుడు.

రోగి ఒక గ్రామాన్ని విడిచి మరొక గ్రామానికి పోయినంత మాత్రాన రోగం పోతుందా? ఇంటి లోని కష్టాలను మనస్సులో పెట్టుకొని కార్యాలయానికి వెళ్ళిన ఉద్యోగి, కాగితాలలో తల దూర్చినంత మాత్రాన అతని తల నుండి కష్టాలు తప్పు కుంటాయా? అసంతృప్తితో బ్రతికే వ్యక్తి స్వర్గాన్ని చేరి మాత్రం ఏం పొందుతాడు? భోగాలు అనుభవిస్తున్నా, అవి అనిత్య మనే సత్యాన్ని అవలోకిస్తూనే ఉంటాడు. భూమండలాధిపత్యాన్ని అనుభవించినా దానిని త్యజించక తప్పదు. స్వర్గలోకాధిపత్యము కూడా అంతే కదా! అదీ కర్మఫలమే. ఈ లోకంలో కర్మఫలంగా లభించింది ఎలా అంతమవుతూ ఉందో, అలాగే పుణ్యకర్మ ఫలంగా స్వర్గలోకంలో లభించేది కూడా అంతమయ్యేదే నని విస్పష్టం చేసింది ఛాందోగ్య శ్రుతి ***(తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే, ఏవ మేవ అముత్ర పుణ్యచితో లోకః క్షీయతే).*** తృప్తి అనేది ప్రదేశంపై, కాలంపై ఆధారపడి ఉన్నది కాదు. వ్యక్తిపై కేంద్రీకరింపబడి ఉన్నది. ఈ లోకంలో తృప్తి లేనివాడు మరో లోకంలో కూడా తృప్తిగా ఉండ లేడు.

పరిధి దాటిన పరితాపము

రాజ్యం రావచ్చు. స్వర్గం రావచ్చు. దుఃఖం పోయే లాగా లేదు. దేహం లోపల ఏర్పడిన వ్రణాన్ని నిర్మూలించకుండా, దేహంపై మందు రాస్తే బాధ తగ్గుతుందా? తొలగుతుందా? అంతర్యం లోని అసంతృప్తిని అదృశ్యం చేసుకోకుండా బాహ్యంలో పొందే భోగాలన్నీ రోగాలే నని పార్థునికి తెలిసి పోయింది. భూమండలాది స్వర్గ పర్యంతం భోగ్య వస్తువుల యందు జిహాసా బుద్ధి ఏర్పడింది.

అర్జునుడు నిలకడగా నిలబడలేక పోయాడు. గాండీవాన్ని పట్టుకొనే శక్తి కూడా చేతులకు లేకుండా పోయింది. అర్జునుని లోని శక్తి నంతా దుఃఖం పీల్చేసింది. శోకాగ్నిలో కుమిలి పార్థుని పటుత్వము ఆవిరై పోయింది. ఇంతటి దుఃఖాన్ని పోగొట్టే శక్తి రాజ్యం వల్ల గాని, స్వర్గం వల్ల గాని వచ్చే ప్రసక్తే లేదని అర్జునునికి అర్థమై పోయింది.

వైరాగ్యం పరమం ధనం

జ్ఞానసాధానికి వైరాగ్యం పటిష్ఠ మైన పునాది వంటిది. వైరాగ్యం లేని జ్ఞానం స్థిరంగా నిలబడదు. అర్జునునిలో వైరాగ్యం తీవ్రస్థాయికి చేరింది. ఇదంతా వివేకం వల్ల ఏర్పడిందే గాని మతాబుల కాంతి వంటిది కాదు. వివేకంతో సాగించిన విశ్లేషణ విజయునిలో వైరాగ్యాన్ని పుష్కలంగా దించింది.

పరిస్థితులు విషమించి నపుడు, అన్ని వైపుల నుండి నిరాశా గాలులు వీచి వ్యక్తి మూర్తిమత్వము నీరసించి నపుడు ఎవరైనా వైరాగ్యాన్ని పొందే అవకాశం ఉంటుంది. కాని, అది తాత్కాలికంగా ఉంటుందే గాని శాశ్వతంగా నిలవదు. అర్జునుడు దారుణమైన పరిస్థితిని వివేకంతో విశ్లేషించుకొని, తన సమస్య ఏమిటో కనుగొన్నాడు.

తనలో అలుముకున్న నిరాశా చీకట్లను తొలగించుకొనే ప్రయత్నంలో అచ్యుతుడనే ఆశాదీపాన్ని, అక్షయ దీపాన్ని ఆశ్రయించాడు. వైరాగ్యంతో వాసుదేవుణ్ణి శరణు బొందాడు. వైరాగ్యము లేని శ్రవణము ఫలప్రదం కాదు.

కొందరికి తత్త్వజ్ఞానము కూడా కాలక్షేపంగా ఉంటుంది. దానినొక వినోదంగా భావిస్తూ, విచిత్రంగా భాషిస్తూ ఉంటారు. అలాంటి వారిలో తత్త్వం పట్ల నిబద్ధత ఉండదు. తీవ్రత ఉండదు. అలాంటి వారు గీతా జ్ఞానగంగలో మునక వేయలేరు.

వివేక వైరాగ్యాలు ఎంత ఉన్నతంగా ఉంటే, అంత మహోన్నతంగా తత్త్వం పంట పడుతుంది. అర్జునుని విషయంలో వైరాగ్యం తీవ్రస్థాయికి చేరింది. ఇహపర లోక భోగాలన్నీ తుచ్ఛంగా కనిపించాయి ఆ పుణ్యాత్మునికి. తత్ఫలితంగా శ్రీకృష్ణ భగవానుడు గీతను బోధించుటకు సిద్ధ పడ్డాడు. ఈ విషయాన్నే సంజయుడు ధృతరాష్ట్రునికి చెబుతున్నాడు.

సంజయ ఉవాచ :

ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।
న యోత్స్య ఇతి గోవిన్ద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9

ఏవం-ఉక్త్వా-హృషీకేశం-గుడాకేశః-పరంతపః
న-యోత్స్యే-ఇతి-గోవిందం-ఉక్త్వా-తూష్ణీం-బభూవ-హ

పరంతపః	=	శత్రువులను తపింపజేసే	ఉక్త్వా	=	పలికి
గుడాకేశః	=	అర్జునుడు	న యోత్స్యే	=	యుద్ధము చేయను
హృషీకేశం	=	హృషీకేశుడైన	ఇతి	=	అని
గోవిందం	=	గోవిందునితో	ఉక్త్వా	=	పలికి
ఏవం	=	ఈ విధముగా	తూష్ణీం బభూవ హ	=	మౌనంగా ఉండి పోయాడు

సంజయుడు చెబుతున్నాడు :

ధృతరాష్ట్ర మహారాజా! శత్రువులను తపింప చేసే అర్జునుడు హృషీకేశుడైన గోవిందునితో ఈ విధంగా పలికి, నేను యుద్ధం చెయ్యలేను అని చెప్పేశాడు.

వ్యాఖ్య

సంజయుడు ఈ శ్లోకంలో అర్జునుని 'గుడాకేశుడు', 'పరంతపుడు' అంటూ, శ్రీకృష్ణుని 'హృషీకేశుడు' అని పేర్కొంటున్నాడు.

అర్జునుడు పరంతపుడు. అంటే, శత్రువులను తపింప చేయువాడు అని అర్థము. శత్రు సంతాపకరు డైన అర్జునుడు ఎదురుగా శత్రువులను పెట్టుకొని కూడా యుద్ధం చెయ్యనని చెప్పి మౌనం వహించాడు.

పరంతపుడైన అర్జునుని గుడాకేశుడని కూడా చెబుతున్నాడు. ఈ పద ప్రయోగం మొదటి అధ్యాయం ఇరవై నాల్గవ శ్లోకంలో కూడా జరిగింది. 'గుడాక' మంటే నిద్ర. నిద్రను జయించిన వాడు కనుక అర్జునుడు గుడాకేశుడు.

నిద్ర తమోగుణాన్ని సూచిస్తుంది. తమోగుణాన్ని జయించిన వాడు కనుక అర్జునుడు గుడాకేశుడు.

తమోగుణం నుండి బయట పడ్డట్లే అజ్ఞాన నిద్ర నుండి కూడా మేల్కొనే సమర్థుడు అనేది అంతర్భావము.

పరంతప: అంటే అర్జునుడు అని తెలుసుకున్నాం. 'పరంతప:' అనే పదానికి 'పరంతప' అనే పాఠాంతరము కూడా ఉంది. 'పరంతప:' అని విసర్గ యుక్తంగా ఉంటే, 'పరంతప' శబ్దం అర్జునునికి సంబంధించి ఉంటుంది. అలా కాకుండా, విసర్గం లోపించి కేవలం 'పరంతప' అని ఉంటే, సంజయుడు ధృతరాష్ట్రుని పరంతపా! అని సంబోధించినట్లు అవుతుంది. ధృతరాష్ట్రుడు అంధుడు. కనుక శత్రువులను తపింప చేయువాడు అనే అర్థాన్నిచ్చే పదం ధృతరాష్ట్రుని కన్నా అర్జునునికే చక్కగా సరిపోతుంది.

శ్రీకృష్ణుని హృషీకేశుడు అంటున్నాడు. ఈ పదం ఇప్పటికే రెండుసార్లు వచ్చింది. మొదటి అధ్యాయం పదైదవ శ్లోకం లోను, అలాగే ఇరవై నాల్గవ శ్లోకంలో కూడా శ్రీకృష్ణుని హృషీకేశుడు అనడం జరిగింది.

'హృషీకములు' అంటే ఇంద్రియాలు. వాటిని ప్రేరేపించే చైతన్యరూపుడు కనుక శ్రీకృష్ణుడు హృషీకేశుడు. నేను యుద్ధము చెయ్యను అని పలికి అర్జునుడు మౌనం వహించినా, హృషీకేశుడు ప్రక్కనే ఉన్నాడు కనుక, ఎలాగైనా ప్రేరేపించి యుద్ధాన్ని జరిపిస్తాడనే భావము తోనే హృషీకేశుడు అనడం జరిగింది.

హృషీకేశుడైన శ్రీకృష్ణుని 'గోవిందం' అని పేర్కొనడంలో కూడా విశేషమైన భావం ఉంది. అర్జునునికి శ్రేయస్సును అనుగ్రహించే వేదాంత జ్ఞానాన్ని శ్రీకృష్ణుడు బోధించ డానికి ఉపక్రమిస్తున్నాడు. కనుక గోవింద నామము చక్కగా సరిపోయింది.

గోభిర్వేదాంత వాక్యైరేవ వింద్యతే లభ్యత ఇతి గోవిందః

వేదాంత వాక్యాల ద్వారా వ్యక్తమయ్యే వాడు కనుక శ్రీకృష్ణుడు 'గోవింద' శబ్దవాచ్యుడు. అర్జునుని సమస్యను జ్ఞానము ద్వారా పరిష్కరించు వాడు గోవిందుడు.

'గోవింద' శబ్దార్థము గురుదేవుని యొక్క సర్వజ్ఞత్వమును సూచిస్తూ ఉంది అని అభిప్రాయ పడ్డారు గీతాభాష్యంలో శ్రీ మధుసూదన సరస్వతి ***(గో వేద లక్షాణాం వాణేం విన్దతీతి వ్యుత్పత్త్యా సర్వ వేద ఉపాదానత్వేన సర్వజ్ఞమ్).*** వేదరూపమైన వాక్కును ***(గో)*** పొందువాడు ***(విన్దమ్)*** అను వ్యుత్పత్తి చేత సమస్త వేదములకు ***(సర్వవేద)*** కారణమైన వాడు అగుట చేత ***(ఉపాదానత్వేన)*** శ్రీకృష్ణుడు 'గోవింద' శబ్దవాచ్యుడుగా సర్వజ్ఞుడు ***(సర్వజ్ఞమ్).***

అర్జునుడు శ్రీకృష్ణునితో చెప్పవలసిం దంతా చెప్పి, నేను యుద్ధము చెయ్యను ***(న యోత్స్య)*** అని పలికి, మరో మాట లేకుండా, ఊరక ***(తూష్ణీం)*** ఉండి పోయాడు ***(బభూవ).*** మౌనంగా ఉండి పోయాడు.

సర్వజ్ఞుడైన జగద్గురువు శ్రీకృష్ణ భగవానుడు మాట్లాడబో తున్నాడు. గురుబోధను ఆలకించాలంటే శిష్యుడు నిశ్శబ్దం గానే ఉండాలి. గురు వచనముల యందే మనస్సును నిలిపి, మరో ఆలోచన లేకుండా, ఆలాపన లేకుండా ఊరుకోవాలి. శ్రవణం చేసే వాడు సమస్తాన్ని త్యజించి, సర్వాన్ని మరచి వినాలి అనేది కూడా శాస్త్రోక్తం ***(సంన్యస్య శ్రవణం కుర్యాత్).***

> **తమువాచ హృషీకేశ: ప్రహసన్నివ భారత ।**
> **సేనయో రుభయోర్మధ్యే విషీదన్త మిదం వచ: ॥** **10**

తం-ఉవాచ-హృషీకేశ:-ప్రహసన్-ఇవ-భారత
సేనయో:-ఉభయో:-మధ్యే-విషీదంతం-ఇదం-వచ:

భారత	=	ఓ ధృతరాష్ట్రా!	తం	=	ఆ అర్జునుని
ఉభయో:	=	రెండైన	హృషీకేశ:	=	శ్రీకృష్ణుడు
సేనయో:	=	సేనల యొక్క	ప్రహసన్ ఇవ	=	నవ్వుచున్న వాని వలె
మధ్యే	=	నడుమ	ఇదం వచ:	=	ఈ వాక్యమును
విషీదంతం	=	దు:ఖిస్తున్న	ఉవాచ	=	పలికెను

మహారాజా! ఉభయ సేనల నడుమ దిగులుతో దుఃఖమగ్నుడై ఉన్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు మందహాసాన్ని చిందిస్తూ మాట కదిపాడు.

వ్యాఖ్య

ఉభయసేనల మధ్య
పాండవ మధ్యముడు

మిశ్రమ భావాల మధ్య ఎటూ తేల్చుకోలేక నలిగి పోతున్నాడు పాండవ మధ్యముడైన పార్థుడు. ఏదేదో చేసేయాలని యుద్ధభూమిలో అడుగు పెట్టిన అర్జునుడు ఏదీ చేయలేని స్థితికి చేరి, చివరగా యుద్ధ విరమణకు సిద్ధపడ్డాడు. సంక్లిష్టమైన సమయంలో, వీరోచిత పోరాటానికి నడుము బిగించిన తరుణంలో, ఎక్కడో గుండె లోతుల్లో అవ్యక్తంగా దాగియున్న సంశయాలు, భయాలు, ఆందోళనలు ఒక్కసారి పెల్లుబికి చుట్టు ముట్టాయి. విజయుడు విషాదంతో విలపిస్తున్నాడు.

ఉద్యోగ నిమిత్తము ఎంపిక చేసే సమావేశానికి హాజరై నపుడు, దరఖాస్తు పెట్టిన వ్యక్తే దయనీయంగా దిగాలు పడి ఉండటం చూస్తుంటాము. పెళ్ళిచూపులకు ప్రథమంగా వెళ్ళిన వరుడు వధువు గృహంలో అదోలా మెలికలు తిరగడం ఎవరికి తెలియదు? క్రొత్తగా పాఠశాలలో ప్రవేశించి నపుడు, బాల్యం వల్ల భయమో, బిడియమో ఉండింది అంటే అర్థం చేసుకోవచ్చు. నూతనంగా ఉద్యోగ నిర్వహణకు కార్యాలయంలో కాలు పెట్టేటప్పుడు కూడా అలాంటిదే ఏదో ఉంది అంటే దానిని ఎలా అర్థం చేసుకోవాలి?

మనకు ప్రాణతుల్యమైన వారి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని తెలియగానే మనస్సు ఎందుకు పట్టు తప్పుతుంది? కాళ్ళు ఎందుకు వణకుతాయి? చెమటలు ఎందుకు పోస్తాయి? మాట లెందుకు తడబడతాయి? వరదలు పొంగి వచ్చినపుడు, సునామీ ముంచుకొచ్చి నపుడు, ప్రాణాలు కోల్పోయిన విగత జీవుల దీన గాథల్ని పత్రికలలో చదివి నపుడు, మన గుండెలు ఎందుకు గోల చేస్తున్నాయి? కళ్ళు ఎందుకు చెమ్మగిల్లు తున్నాయి? అలా జరగడం అసమంజసమా? ఆ మాత్రం చలనాలు మనుషుల్లో లేకపోతే, రాళ్ళల్లో ఉంటాయా? రప్పల్లో కనిపిస్తాయా?

అర్జునుడు దు:ఖిస్తున్నాడు అనేది అందరికీ తెలుసు. ఆ సన్నివేశంలో దు:ఖం రావడం ఆశ్చర్యమా? కళ్ళ ముందే, క్షణాల్లో, అయిన వాళ్ళు ఎవరుంటారో, ఎవరు ఉండరో అనే ఆలోచన ఆవేదనా పూరిత మైనది కాదా? చిన్న చిన్న కారణాలకే మనుషులు పెద్దపెద్దగా రోదిస్తూ ఉంటారు. అర్జునుడు కూడా నరుడే కదా! మానవుడే కదా! మనస్సున్న వాడే కదా! మమతలు తెలిసిన వాడే కదా! అలాంటి వాడు కలత చెందడం అసహజమా?

అందరి లాగే అర్జునుడు కూడా ఆవేదనకు గురి అయ్యాడు. విషాదానికి లోనయ్యాడు. అలాగని, అర్జునుణ్ణి అందరితో పోల్చడం సబబు కాదు. భయంకర పరిస్థితులు తలెత్తి నపుడు అందరి లాగే అర్జునుని

కళ్ళు కూడా వర్షించి ఉండొచ్చు. అంతమాత్రాన అందరి లాగా అర్జునుడు కాళ్ళకు బుద్ధి చెప్పలేదు. పలాయనం చిత్తగించ లేదు. సమస్యను విస్మరించ లేదు. దానికి మూల మేమిటో తెలుసుకొనే ప్రయత్నం చేశాడు. కార్యంతో కలత పడినా, కారణాన్ని సమూలంగా నిర్మూలించే కార్యక్రమానికి నడుం బిగించాడు. ఆ ప్రయత్నము యొక్క ఫలితమే గీతాశాస్త్రము. ఉపనిషత్సార సందేశము.

జనన మరణాల మధ్య

జీవుల బ్రతుకులు

వచ్చేవారు లేనివారే. ఉన్నవారు లేకుండా పోయేవారే. ఆయువును పోసుకొని జన్మకు వస్తారు. ఆయువును క్రుమ్మరించి మృత్యువులో వాలి పోతారు. ఈ జనన మరణా లనే రెండు గట్ల మధ్య సాగేదే జీవన ప్రవాహము. జీవి ప్రయాణము. మునిగినా తేలినా ప్రవాహం లోనే. గట్ల మధ్యనే. తరించినా అంతరించినా ఉభయ తీరాల మధ్యనే.

ఏది జరుగుతుందో, ఎలా జరుగుతుందో ఎవరికి తెలుసు? అందుకే మధ్యలో ఉన్న వాళ్ళందరూ ఏడ్చేవాళ్ళే. దుఃఖించే వాళ్ళే. విషాదంతో విలవిల లాడే వాళ్ళే.

నరు లందరి పరిస్థితి ఇదే. అందుకనే నరు లందరి పక్షాన ప్రతినిధిగా ఒక్క నరుడు దుఃఖించాడు. ఆ నరుడే అర్జునుడు. సర్వ జీవుల ప్రతిరూపంగా కురుక్షేత్రంలో నిలిచాడు. మధ్యలోనే ఉన్నాడు. ఉభయసేనల మధ్యలోనే ఉన్నాడు.

నరుడు మధ్యముడే. ఇద్దరు అన్నలకు, ఇద్దరు తమ్ముళ్ళకు మధ్యలో అర్జునుడు. పాండవ మధ్యముడు. నరు డెవడైనా మధ్యముడే. ఉత్తములైన దేవతలకు, అధమమైన జంతుజాలానికి మధ్యలో నరజన్మ. మానవ జన్మ. మాధవు డయ్యేందుకు అనువైన జన్మ. అందుకే నరుడు మధ్యముడు.

జీవన పోరాటంలో కూడా నరుడు మధ్యముడే. ఉభయసేనల మధ్య అర్జునుడు. జనన మరణాల మధ్య మానవుడు. ఎదబాధతో ప్రవాహంలో ఎదురీదిన వాడు. మాధవుని ఆశ్రయించిన వాడు. దయ చూపి ఎదబాధను తొలగించమని యదునందనుని యాచించిన వాడు. ప్రార్థించిన వాడు. శాసించి రక్షించమని వేడుకొన్న వాడు. నీ కృప లేనిదే కడతేరలే నని కన్నీటితో శరణుజొచ్చిన వాడు.

పల్లవి : **వసంతం విరబూసిన గాని**
చిగురించవు మోడు తరువులు
అనుపల్లవి : **నీ దయ మా యెద తాకిన గాని**
విరబూయవు మా బ్రతుకులు *॥ వసంతం ॥*
చరణము : **ఉన్నది చెప్పకనే పోతూ ఉంది**
రానున్నది తానే రాబోతుంది
పోయింది ఆయువు వచ్చేది మృత్యువు
నిలవని కాయము చావుకు తాయము *॥ వసంతం ॥*

ఇదే జీవ చైతన్యం. చైతన్య జీవన ఆలాపం. జీవుల విలాపం.

అర్జునుని విషాదాన్ని శ్రీకృష్ణుడు చూశాడు. అతని విలాపాన్ని, విషాదానికి కారణాన్ని అతని మాటల లోనే విన్నాడు. మందహాసంతో తన మాటను వినిపించ డానికి ఉద్యుక్తు డయ్యాడు.

విషాదంతో అర్జునుడు క్రుంగిపోతున్న సమయంలో శ్రీకృష్ణుడు నవ్వడ మేమిటి? ఎలా నవ్వ గలిగాడు?

ఎందుకు నవ్వాడు? మసక చీకటిలో స్థాణువును (కొమ్మలు లేని చెట్టును) చూచి అది చోరుడని భావించి కేక వేసిన వ్యక్తిని చూచి, అది మోడు అని తెలిసిన వాడు నవ్వడా? ఇదీ అంతే.

అర్జునుని దుఃఖానికి కారణమే లేదు అని అచ్యుతునికి తెలుసు. విషాద సన్నివేశంలో ఎవ్వరూ నవ్వలేరు. నిజమే. కాని, అక్కడ విషాదానికి హేతువే లేదని భగవంతునికి తెలుసు. కేవలం అజ్ఞానం వల్ల ఏర్పడిన శోక మోహాలతో అర్జునుడు కలత చెంది కన్నీళ్ళు పెడుతున్నాడని మధుసూదనునికి తెలుసు. అందుకే నవ్వుతూ కనిపిస్తున్నాడు. అది పరిహసించడం కాదు. సానుభూతితో, ప్రేమతో పరామర్శించడం. అది వికృతపు నవ్వు కాదు. సమ్యక్ జ్ఞానం వల్ల ఏర్పడిన చిద్విలాసంలో చిందిన చిరునవ్వు. సర్వ భయాలు, సమస్త శోకాలు జ్ఞానోదయంతో అదృశ్యమయ్యే సమయం ఆసన్న మైందని సూచించే పువ్వు వంటి నవ్వు. పుష్పహాసుని పూర్ణజ్ఞానం విరజిమ్మిన వెలుగుల కిరణం. పూర్ణజ్ఞానం వల్ల కలిగిన మంజుల మనోజ్ఞ ప్రశాంత మందహాసం.

సంసార బీజ భూతౌ శోకమోహౌ , తయోశ్చ సర్వకర్మ సంన్యాస పూర్వకాత్ ఆత్మజ్ఞానాత్ న అన్యతః నివృత్తిః ఇతి తత్ ఉపదిదిక్షుః సర్వలోకానుగ్రహార్థమ్ అర్జునం నిమిత్తీకృత్య ఆహ భగవాన్ వాసుదేవః అశోచ్యా నిత్యాది ।

శోకమోహాలు సంసారానికి బీజాలు. సర్వ కర్మ సన్యాస పూర్వకమైన ఆత్మజ్ఞానం వల్లనే అవి తొలగాలి గాని, అన్య సాధనల వల్ల నివర్తింప బడవు. ఈ విషయాన్ని ఉపదేశించాలని భావించిన శ్రీకృష్ణ భగవానుడు అర్జునుని నిమిత్తంగా చేసికొని, సర్వ లోకాన్ని అనుగ్రహించడం కోసం గీతోపదేశాన్ని ప్రారంభించాడు (***అశోచ్యాన్ అన్వశోచః*** - దుఃఖింప దగని వాళ్ళను గూర్చి దుఃఖిస్తున్నావు).

మువ్వల వాని నవ్వు

అర్జునాచ్యుతులు కురుక్షేత్రంలో ఒకే చోట ఉన్నారు. ఒకే సన్నివేశాన్ని వీక్షిస్తున్నారు. ఒకే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అర్జునుని ముఖంలో విషాదం అలుముకొని ఉంది. అచ్యుతుని ముఖంలో ఆనందం తాండవిస్తూ ఉంది. ఏడుపులో నరుడు. వేడుకలో నారాయణుడు.

ఏడ్చేవాడు జీవుడు, నవ్వేవాడు దేవుడు. ఏడ్చేవాడు అజ్ఞాని, నవ్వేవాడు జ్ఞాని. ఏడ్చేవాడు మానవుడు, నవ్వేవాడు మాధవుడు. ఏడ్చేవాడు రోగి, నవ్వేవాడు వైద్యుడు. వైద్యుడు నారాయణుడే అనేది లోకోక్తి. అర్జునుని పుణ్యఫలంగా, నారాయణుడే వైద్యుడిగా వచ్చి పార్థుని భవరోగాన్ని రూపుమాపిన అపూర్వ అద్భుత సన్నివేశ మది. భేషజము, భిషక్ రెండూ తానే అయిన జగద్గురువు భవరోగ చికిత్సను నవ్వుతూ ఆరంభించాడు.

నాణ్యమైన నవ్వు నాల్గు విధాలు

(1) అర్జునుడు శ్రీకృష్ణునికి శరణాగతు డయ్యాడు. శ్రేయస్సును నిశ్చయించి చెప్పమన్నాడు. చెయ్యడానికి శిష్యుడుగా తాను సిద్ధమన్నాడు. శాసించి మరీ చెప్పమన్నాడు (***శాధి మాం***). కానీ, శ్రీకృష్ణుడు గురువుగా ఏమి చెబుతాడో వినకుండానే నేను యుద్ధం చెయ్యను (***న యోత్స్యే***) అనేశాడు. ఒక వైపు చెప్పమంటాడు, మరో వైపు చెయ్యనంటాడు. ఈ విరుద్ధ భాషణం వాసుదేవునికి నవ్వు తెప్పించిందేమో!

(2) ఉభయసేనల మధ్య చేరి విలపిస్తున్నాడు విజయుడు (***సేనయో రుభయో ర్మధ్యే విషీదన్తం***). ఏడవడం తప్పు కాదు. ఎవరి స్వేచ్ఛ వారిది. ఎవరు ఎలాగైనా ఏడ్చుకోవచ్చు ఈ ప్రపంచంలో. కాకపోతే, ఆ ఏడ్చే దేదో యుద్ధానికి రాక ముందే ఇంట్లో ఏడిస్తే బాగుండేది కదా! ఉభయసేనల మధ్య ఏడవడ మెందుకు? అదేమన్నా పది మంది చూచి ఆనందించ దగిన అద్భుతమైన వినోద ప్రదర్శనమా? అని నవ్వుకుంటున్నా డేమో!

(3) ఈ మాత్రం ఏడ్చే కార్యక్రమానికి నీవు ఒక్కడివే వచ్చి ఉంటే సరిపోయేది కదా! బండి తోలమని నన్నెందుకు పిలిచావు? నువ్వేదో విరగ దీస్తావని, అరగ దీస్తావని నేనొస్తే, నువ్వేమో రథం వెనుక అరుగు మీద కూర్చొని తీరిగ్గా ఏడుస్తావా? ఇక నేనెందుకు వచ్చినట్లు? ఏడిస్తే అర్జునుడు ఎలా ఉంటాడో చూడటానికి వచ్చానా? లేక నేను పని లేనివాణ్ణి అని భావించి పని కల్పించావా? అని నవ్వాడేమో!

(4) అర్జునా! నీ ఏడుపు ఏదైనా గానీ. అందరి ఏడుపులను రూపుమాపే వేడుకను ఆవిష్కరించే మంగళ గడియలు అరుదెంచాయి అనే ఆనందంలో మాధవుడు మందహాసం చిందించాడేమో!

మువ్వలవాడు నవ్వాడు. ముజ్జగాలను నవ్వించే ప్రయత్నంలో చిదానంద స్వరూపుడు చిద్విలాసంతో చిరునవ్వులు చిందించాడు. ఏడుపుకు వీడుకోలు పలక మన్నాడు. ఆ మార్గం లోనే వేడుకోలు వినిపిస్తూ గీతా భవనం లోకి ప్రవేశిద్దాం!

పల్లవి : **మువ్వల గోపాల**
చిరునవ్వుల గోపాల
అనుపల్లవి : **ఏటికి మాటను - గాలికి పాటను**
ఓర్పుతో నేర్పిన భక్త మందార! ॥ మువ్వల గోపాల ॥
చరణము : **విజయుని రథమును కదిపి నడిపి**
రాతను తుడిపే గీతను తెలిపిన
నంద గోపాలా!
ఆనంద గోపాలా! ॥ మువ్వల గోపాల ॥

అని ఊహాలలో ఊరేగింది చైతన్య గీతిక.

ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీ భగవానువాచ :

అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః ॥ 11

అశోచ్యాన్-అన్వశోచః-త్వం-ప్రజ్ఞావాదాన్-చ-భాషసే
గతాసూన్-అగతాసూన్-చ-న-అనుశోచంతి-పండితాః

త్వం	= నీవు	పండితాః	= పండితులు
అశోచ్యాన్	= శోకింప దగని వారిని గూర్చి	గతాసూన్	= మరణించిన వారిని గూర్చి గాని
అన్వశోచః	= దుఃఖిస్తున్నావు	అగతాసూన్ చ	= బ్రతికియున్న వారిని గూర్చి గాని
ప్రజ్ఞా వాదాన్ చ	= పండిత వచనములను కూడా	న అనుశోచంతి	= దుఃఖించరు.
భాషసే	= పలుకు తున్నావు		

శ్రీ భగవానుడు బోధిస్తున్నాడు :

అర్జునా! ఏడవ కూడని వాళ్ళ కోసం ఏడుస్తున్నావు. పండితుల వాక్యాలు పలుకు తున్నావు. పండితులు పోయిన వాళ్ళ కోసం విలపించరు. ఉన్నవాళ్ళ కోసం దుఃఖించరు.

వ్యాఖ్య

శోక మోహాలు

ధర్మం విషయంలో తన మనస్సు మోహంలో చిక్కుకున్న దని అర్జునుడే చెప్పాడు (**ధర్మ సమ్మూఢ చేతాః**). మోహం అంటే ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా చూడటం. ఇది అజ్ఞానం వల్ల సంభవిస్తుంది. అజ్ఞానం ఏదో కాదు. జ్ఞానం లేకపోవడమే అజ్ఞానం.

ఉన్నది ఉన్నట్లు తెలియడం జ్ఞానం. ఉన్నది ఉన్నట్లు తెలియక పోవడం అజ్ఞానం. అజ్ఞాన దశలో లేనిది ఉన్నట్లు తెలిసే ప్రమాదం ఉంది. ఆ ప్రమాదమే మోహము. జను లందరూ మోహవలయం లోనే పరిభ్రమిస్తూ ఉంటారు. వారిలో అర్జునుడు ఒకడు.

అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః

అజ్ఞానము జ్ఞానమును కప్పేసింది. అందుచేత జనులు మోహానికి గురి అవుతున్నారు. తాను ఏమిటో తనకు తెలియదు. ఇది అజ్ఞానము. అజ్ఞాని తాను కాని దానిని తాననుకొని మోహానికి లోనవుతూ ఉంటాడు. ఇది అందరికీ సంబంధించింది కనుక దీనిని సాధారణమోహం అంటారు. ఈ మోహంలో పడ్డవాడు తాను దేహమని భావిస్తూ ఉంటాడు. తన దేహము ఎవరితో సంబంధం కలిగి ఉందో, తాను వారికి సంబంధించిన వాడుగా ఉంటాడు. అలాగే వాళ్ళు తనకు సంబంధించిన వారుగా భావిస్తూ ఉంటాడు. దీనినే భ్రాంతి, లేదా మోహము అంటారు.

నేను వీళ్ళకు సంబంధించిన వాణ్ణి (**అహమ్ ఏషామ్**). అలాగే వీళ్ళు నాకు సంబంధించిన వాళ్ళు (**మమ ఏతే**). ఈ విధమైన మోహం వల్ల, తన వాళ్ళు చనిపోతారేమో, ఈ సంబంధాలు తెగిపోతాయేమో అనే భయం చేత మనిషికి దుఃఖం పొరలి వస్తుంది. అర్జునుడికి అదే జరిగింది. ఆ విషయం దాచుకోకుండా తానే చెప్పేశాడు కూడా. స్వజనులైన బంధువులను మేము చంపలేము. స్వజనుల్ని చంపుకొని సుఖ పడగలమా? (*1 వ అ - 37 వ శ్లో*) అని ప్రశ్నించాడు కూడా. అందుకే, భీష్మద్రోణాదుల్ని ఎలా చంపాలి? (**కథం భీష్మ మహం సంఖ్యే**) అని కృష్ణుణ్ణి నిలదీసి అడిగాడు.

దేహమే తాను అనే మోహం వల్ల కలిగినదే ఈ శోకము. ఇది అందరికీ ఉంది. కనుకనే దీనిని సాధారణ మోహం అన్నారు. ఇది కాకుండా, అర్జునునికి ప్రత్యేకంగా మరొక మోహం తాత్కాలికంగా వచ్చి తగులుకొంది. స్వధర్మమైన యుద్ధము అధర్మంగా కనిపించింది. ఇది అసాధారణ మోహం. ఈ రెండు మోహాలు కుదిపి వేయడం చేతనే కౌంతేయుడు కలత చెంది కన్నీళ్ళు పెట్టుకున్నాడు. అదే శోకం. మోహం వల్ల సంభవించింది. ఇవే శోకమోహాలు. సంసారానికి బీజాలు (**సంసార బీజ భూతౌ శోకమోహౌ**). తానెవరో, ఏమిటో తెలిస్తే గాని ఈ శోకమోహాల నుండి విడి పడటం జరగదు. సంసార సాగరము నుండి బయట పడటం సాధ్యం కాదు. దీనికి ఆత్మజ్ఞానమే ఏకైక మార్గము. మరొక ఉపాయమే లేదు కనుక ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించ డానికి భగవానుడు పూనుకున్నాడు. **అశోచ్యాన్** అంటూ అర్జునుణ్ణి ఆత్మజ్ఞాన మార్గం లోకి దించు తున్నాడు. (**తత్ర ఏవం ధర్మ సమ్మూఢ చేతసః మహతి శోక సాగరే నిమగ్నస్య అర్జునస్య అన్యత్ర ఆత్మజ్ఞానాత్ ఉద్ధరణమ్ అపశ్యన్ భగవాన్ వాసుదేవః తతః అర్జునమ్ ఉద్ధి ధారయిషుః ఆత్మజ్ఞానాయ అవతారయన్ ఆహ!**).

యుద్ధం విషయంలో కలిగిన అసాధారణ మోహాన్ని తొలగించడం శ్రీకృష్ణునికి పెద్ద సమస్యేమీ కాదు. ఒకవేళ దానిని తొలగించినా, అలాంటిదే మరొక అసాధారణ మోహం పునః ఏర్పడదు అని చెప్పలేము.

సాధారణ మోహం నిర్మూలించ బడితేనే అసాధారణ మోహాలు అదృశ్య మవుతాయి. కనుక, ఆత్మజ్ఞానోప దేశము అనివార్యమైంది.

శోకం ఎవరి కోసం?

ఉభయసేనల మధ్య దుఃఖిస్తున్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు చూశాడు. ఏడవకు అర్జునా! అని చెప్పలేదు. ఎందుకు ఏడుస్తున్నావు? అని అడగలేదు. ఏడుపు నీకు తగిన దేనా? అని అడుగుతున్నాడు. దుఃఖింప దగిన వాళ్ళ కోసమే దుఃఖిస్తున్నావా? అని ప్రశ్నిస్తున్నాడు. దుఃఖానికి కారణం ఉందా? అని సూటిగా నిలదీస్తున్నాడు.

శోచ్యాః అంటే శోచ్యులు. శోచ్యులు అంటే దుఃఖింప దగిన వారు. అలాగే దుఃఖింప దగని వారు కూడా ఉంటారు. వాళ్ళు ***అశోచ్యాః*** అంటే, అశోచ్యులు ***(న శోచ్యాః అశోచ్యాః)***. ఈ ప్రపంచంలో ఏవేవో నష్టాలు వాటిల్లుతూ ఉంటాయి. వాటన్నిటికీ మనం దుఃఖించము. అవి మనకు సంబంధించినవి అయితే మాత్రం తప్పక బాధ పడతాము. ఈ విధంగా బాధపడ దగినవి, బాధపడ దగనివి అని రెండు విధాల బాధలు ఈ ప్రపంచంలో తెలుస్తున్నాయి.

'చనిపోయాడండీ' అని ఎవరైనా కేక వేస్తే, అది విన్న వెంటనే మనం ఏడుస్తామా? 'ఎవరండి చని పోయింది?' అని ప్రశ్నిస్తాము. ఆ చనిపోయిన వ్యక్తి ఎవరో అయితే, 'కారణ మేమిటట?' అని అడుగుతాము. అదే ఆ చనిపోయిన వ్యక్తి మనకు సంబంధించిన వాడు అయితే కారణం తెలియకుండానే ఏడుస్తాము. ఇది తగిన దేనా? అని భగవానుడు ప్రశ్నిస్తున్నాడు.

దుఃఖించకు అని శ్రీకృష్ణుడు చెప్పడం లేదు. దుఃఖించడానికి కారణం ఉందా? అని అడుగు తున్నాడు. ఏడవకు అని చెప్పినంత మాత్రాన మనుషులు ఏడవకుండా ఉంటారా? ఎప్పటి నుండో ఏడుస్తున్నారు. ఇప్పుడు వద్దంటే ఆపుతారా? ఎవరి ఏడుపు వాళ్ళు ఏడ్చుకోవచ్చు. కాకపోతే, ఏడవ టానికి కారణం కనిపించడం లేదు అంటున్నాడు గీతాచార్యుడు.

తగని వారి కొరకు తాపమా?

అర్జునా! దుఃఖింప దగని వాళ్ళ కొరకు ***(అశోచ్యాన్)*** దుఃఖిస్తున్నావు అంటూ శ్రీకృష్ణుడు గీతాబోధను ఆరంభించాడు. భీష్మాదుల కొరకు అర్జునుడు విలపిస్తున్నాడు. భీష్మద్రోణులు కూడా దుఃఖింప దగినవారు కారు. శోచ్యులు కారు. అశోచ్యులు అనేది అచ్యుతుని అభిమతం.

ఒక వ్యక్తిని గూర్చి దుఃఖించాలి అంటే ప్రముఖంగా రెండే కారణాలు ఉండాలి. ఒకటి, అతడు దురాచార వంతుడై ఉండాలి. లేదా, నశిస్తూ అయినా ఉండాలి. భీష్మద్రోణాదులలో ఈ రెండు కారణాలూ కనిపించవు.

భీష్మద్రోణులు సదాచారవంతులు. సత్ప్రవర్తన కలవారు. సజ్జనులు ***(భీష్మద్రోణాదయః సద్వృత్తత్వాత్)***. వారు మహానుభావులని అర్జునుడే అన్నాడు కదా! అలాంటి వారి ప్రవర్తనలో దుఃఖానికి అవకాశం లేదు.

ఇకపోతే, రెండవది. వాళ్ళు నశిస్తారు అని దుఃఖించాలి. ఇది వాస్తవమా? నశించే దెవరు? దేహాలు నశిస్తాయి. మానవదేహం సామాన్య మైనది కాదు. అది ధర్మసాధనము. అందుకే అది దుర్లభము. దుర్లభమే అయినా దూరం కాకుండా ఉండ లేదు.

దుర్లభో మానుషో దేహో దేహినాం క్షణభంగురః

మానవదేహము దుర్లభమే అయినా అది క్షణభంగురము. క్షణంలో పతనమై పారి పోతుంది. ఎవరి

దేహమైనా నిలవదు. అలాగే భీష్మద్రోణుల దేహాలు కూడా నిలవవు. అలాంటప్పుడు వారి దేహం విషయంలో దుఃఖము తగిన దేనా?

అదలా ఉంచితే, దేహాలు ఉండటానికి ఆధార మైనది ఆత్మ. ఆత్మకు చావు లేదు. అది నిత్య మైనది. ఇంతకీ భీష్ముడు దేహమా? ఆత్మా? మనము దుఃఖించేది దేహం కోసమా? ఆత్మ కోసమా? దేహము ఎలాగూ నశించేదే కనుక దానిని గూర్చి దుఃఖించ నవసరం లేదు. ఆత్మ నశించేది కాదు కనుక ఆత్మను గూర్చి శోకించ పనిలేదు. ఇక ఎవరి కోసం ఈ దుఃఖం?

భీష్మద్రోణాదులు సత్ప్రవర్తన కలవారు కనుక దుఃఖింప దగినవారు కారు ***(అశోచ్యాః)***. వాస్తవానికి వారు ఆత్మ స్వరూపులే కనుక శోకింప దగిన వారు కారు ***(అశోచ్యాః నిత్యత్వాత్)***. ఇక వాళ్ళు ఎలాగూ దేహాలు కారు కనుక అవి నశిస్తా యని దుఃఖింప నవసరం లేదు. ఇక దుఃఖ మేమిటి? ఎవరి కోసం? దుఃఖింప దగని వాళ్ళ కోసం దుఃఖిస్తున్నాడు అర్జునుడు. అర్జునుడే కాదు. అందరూ అలాగే దుఃఖిస్తున్నారు. దేహాలే ఆత్మ యని భావించి ఆవేదన చెందుతున్నారు. ఈ వాస్తవం అర్థమైతే ఎవరూ, ఎవరి కొరకు దుఃఖింప నవసరం లేదు.

బాధపడి బావుకొనే దేమిటి?

ఈ ప్రపంచంలో మనం బ్రతక డానికి ఉన్నామా? బాధ పడటానికి ఉన్నామా? ఉన్న మనం ఎంత కాలం ఉంటాము? ఎవరైనా అంతేకదా? చూచేందుకు కళ్ళున్నాయి. వాలేందుకు రెప్ప లున్నాయి. రెప్పలు వాలితే కళ్ళు మూస్తాము. రెప్పలు లేస్తే కళ్ళు తెరిచి చూస్తాము. ఇంతవరకు ఎన్నిసార్లు కళ్ళు తెరిచాము? ఎన్నిసార్లు కళ్ళు మూశాము? రెప్పపాటు ఆగకుండా జరుగుతూనే ఉంది. ఒకనాడు ఏదో ఒక్క రెప్పపాటుతో ఆ ఆట కాస్తా ఆగి పోతుంది. అదే చివరి రెప్పపాటు. అదే చావు.

ఇంతకీ, చివరి రెప్పపాటు ఏదో ఎవరికి తెలుసు? తెలియనంత మాత్రాన చావు నుండి ఎవరు తప్పించు కుంటారు? ఏ రెప్పపాటు చివరిదో తెలియదు. అందుకే జీవితం రెప్పపాటు అంటారు. వాలేది రెప్ప. మునిగేది తెప్ప. అర్థమైతే, ముప్పుతిప్ప లెక్కడుంటాయి? ఎవరు ఏడవాలి? ఎవరి కొరకు ఏడవాలి? పోయిన వాళ్ళ కొరకు ఏడవాలి. ఎవరు ఏడవాలి? ఉన్నవాళ్ళే ఏడవాలి. మరి, ఉన్నవాళ్ళు పోకుండా ఉంటారా? అందరూ పోయేవాళ్ళే అయి నపుడు ఏడ్చి సాధించే దేముంటుంది? మనం కూడా పోయే వాళ్ళమే కనుక ఇతరుల కోసం ఏడవడం కన్నా, మన కోసమే మనం ఏడ్చుకుంటే మంచిది కదా! అలాంటప్పుడు ఎంతకాలం ఏడవాలి? పోయే వరకు ఏడుస్తూనే ఉండాలి. ఇక బ్రతుకంతా ఇలా ఏడుపు తోనే సరిపెట్టుకొంటే, బ్రతుకులో వేడుక ఎప్పుడు? పోయిన తరువాతేనా? పోయిన తరువాత వేడుక ఉంటే ఉండొచ్చు. ఊరేగింపు సాగవచ్చు. దానిని చూడటానికి మన మెక్కడ ఉంటాం? మనం లేకుండా జరిగే మన చివరి ఉత్సవమే కదా చావు. మనం వినకుండా మన ప్రక్కన నడిచేదే కదా చావు మేళం. ఎందుకొచ్చిన బాధ? చావు బాధ.

చావు తెలిసే దెవరికి? తెలియని దెప్పుడు?

ఎవరు ఎప్పుడు చస్తారో ఎవరికి తెలుసు? తెలిస్తే, ఆ ఏడ్చేది ఏదో ముందే ఏడవ వచ్చు. చచ్చిన వాడు ఏడవ లేడు. ఏడ్చేవాడు చావకుండా ఉండలేడు. అయినా, ఎప్పుడొస్తుంది చావు? ఏమో, ఎవరికి తెలుసు! ఎందుకు తెలియదు? చావు రాని దెప్పుడు? లేని దెప్పుడు? దానిని తెలుసు కోవాలి. అంతే. తెలియనంత మాత్రాన ఉన్నది లేకుండా పోతుందా?

చావు అంటే ఏమిటి? చచ్చే దెవరు? ఉన్నది పోవడమే మృత్యువా? నశించడమే మృత్యువా? నశింపు

ఏమిటి? మార్పే కదా! అలా చూచి నపుడు మనం ఎప్పుడు మరణిస్తున్నాము? ఎప్పుడూ మరణిస్తూనే ఉన్నాము.

దేహం రాలి పోవడమే మరణమా? అదే నిజమైతే, దేహము ఒకేసారి రాలిపోతుందా? వెంట్రుకలు రాలుతూ ఉంటాయి. పళ్ళు రాలుతూ ఉంటాయి. చూపు తగ్గి కళ్ళు వాలుతూ ఉంటాయి. మన్నును మూజూడాలని వెన్నుపాము వంగుతూ ఉంటుంది. ఇవన్నీ జరిగి నపుడు దుఃఖించని మనం చావుకే ఎందుకు భయపడుతున్నాం? మరణం విషయం లోనే ఎందుకు దుఃఖిస్తున్నాం? గడియారంలో క్షణాల ముల్లు తిరిగి నపుడు పట్టించుకోని మనం గంటల ముల్లు తిరిగి నపుడే ఎందుకు పట్టించు కుంటున్నాం? ఇది జరగ కుండానే అది జరుగుతుందా?

దేహంలో ఉన్నవి, దేహంగా ఉన్నవి ఒకొక్కటి పోతున్నా పెద్దగా రోదించని మనం, మరణానికే ఎందుకు దారుణంగా విలపిస్తున్నాము? ఎందుకో తెలుసా? మరణం తరువాత మనిషి రూపం ఉండదు కనుక. కళ్ళు దేహానివే అయినా, కళ్ళు పోయినా దేహం ఉంటుంది. పళ్ళు దేహానివే అయినా, పళ్ళు రాలినా దేహం ఉంటుంది. కాని దేహం రాలితే, ఆ తరువాత ఏదీ ఉండదు. అందుకే మరణబాధ దారుణంగా ఉంటుంది.

విలాపానికి ఫలం నిష్ఫలం

కర్మ అంటూ జరిగితే ఫలితం ఉండాలి. ఫలితం లేని కార్యం ఉండదు. అలాగే కారణం లేని కార్యమూ ఉండదు. కాని, మరణ బాధకు ఏ ఫలమూ ఉండదు. కారణమూ ఉండదు.

ఏడుపు కార్యమే కదా! మరి దానికి కారణ మేమిటి? చావే. అయితే చావ కూడనిది చచ్చిందా? చావ దగిందే చచ్చిందా? చావకూడనిది ఎలా చస్తుంది? చావ దగిందే చచ్చింది. మరి, చావ దగిందే సహజంగా చచ్చే టప్పుడు అసహజంగా ఏడవటానికి కారణం ఎక్కడుంది? హేతు వేమిటి?

ఇంత తొందరగా పోతాడని అనుకోలేదు. ఇంకా కొంత కాలం ఉంటాడని అనుకున్నాను. అందుకే ఏడుస్తున్నాను. అదే నా ఏడుపుకు కారణం అంటావా?

నిన్ను అలా అనుకోమన్నది ఎవరు? నీవే అనుకున్నావు. నీవు అనుకున్నట్లు జరగ లేదు. అలాంటప్పుడు అలా ఊహించి నందుకు ఏడవాలి గాని చచ్చి నందుకు ఏడవడం దేనికి?

సరే ఏడవ టానికి సరియైన కారణం దొరకటం లేదు. అదలా ఉంచుదాము. పోనీ ఏడ్చినందుకు ఫలం ఉంటుందా? ఉండదు. అందుకే కదా, కొందరే ఏడుస్తున్నారు. అయిన వాళ్ళే ఏడుస్తున్నారు. ఏడుపుకు ఫలితం ఉండేట ట్లయితే, అయిన వాళ్ళే కాదు, కాని వారు కూడా అయిన వారి కన్నా ఎక్కువగా ఏడ్చి ఉండేవారు. వాళ్ళు వీళ్ళు ఏమిటి? అందరూ అదే పనిగా ఏడుస్తూనే ఉండేవారు.

ఇంటి ముందు నిలబడి మనం పిలిస్తే, ఇంటిలో ఉన్న మనిషి 'వస్తున్నానండీ' అని మారు పలుకుతాడు. అతడు అలా మారు పలకక పోయినా, వస్తాడనే ఆశతో మనం ఎదురు చూస్తాం.

మరణించిన వాని కోసం మనం పెద్దగా రోదిస్తే, అతడు మారు పలుకుతాడా? తిరిగి వస్తాడా? దుఃఖం మరణించిన వానిని బ్రతికిస్తుందా? అదేమన్నా అమృతమా? అలాంటప్పుడు ఏడ్చి ప్రయోజన మేమిటి?

మన ఏడుపు ఏగిన వానికి వినిపిస్తుందా? అంత పెద్దగా ఏడ్వగలమా? చనిపోయిన తరువాత రోజు రోజుకు ధ్వని ఎంతగా తగ్గిపోతూ ఉంటుందో మనకు తెలియదా? మనం రోదించినా ఫలితం లేనపుడు దుఃఖించడ మెందుకు?

మరణించిన వానికి మన ఏడుపు వినిపించదు. బ్రతికి ఉన్న వాళ్ళేమో ఏడుపును వేడుకగా వినలేరు. చావు వస్తే ఎవ్వరూ నిలవరు. చావు రానపుడు పొమ్మన్నా ఎవ్వరూ పోలేరు. పోయిన వాళ్ళు పోయారని, ఉన్నవాళ్ళు పోతారని ఏడవ టానికి ఏడ్చేవాడు మాత్రం పోకుండా ఉంటాడా?

ఆఖ్యాయిక

పూర్వము ఒక దోషికి మరణదండన విధించారు రాజుగారు. మరణశిక్షను అమలు చేయ వలసిన రోజు రానే వచ్చింది. దోషిని ఉరికంబం వద్దకు తీసికొని వచ్చారు. కొంతసేపట్లో ఉరి తీయబోతారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రాజుగారు, 'నీ చివరి కోరిక ఏమిటో చెప్పు' అని అడిగారు.

ఏదైనా తినాలని ఉంటే తినిపిస్తారు. మరెవరి నైనా చూడాలని ఉంటే చూపిస్తారు. మరణశిక్ష అమలులో అదొక సంప్రదాయము. మరణశిక్షను అనుభవించ బోయే దోషి రాజు వైపు చూచి, నవ్వుతూ ఒక శ్లోకం చెప్పాడు.

భట్టి ర్నష్టో భారవిశ్చాపి నష్టః
భిక్షుర్నష్టో భీమసేనోఽపి నష్టః
భుక్కుండోఽహం భూపతి స్త్వంబతాసి
భ భీ భు భూ ష్వంతక స్సన్నివిష్టః ॥

మహాప్రభో! విక్రమార్కుని కాలంలో భట్టి ఉన్నాడు. మీకు తెలుసనే అనుకుంటాను. అతడు ఇప్పుడు లేడు. చచ్చిపోయాడు (*భ - నష్టః*). భారవి అనే కవి ఉండేవాడు కదా! అతడూ మరణించాడు (*భా*). భిక్షువు ఉండేవాడు. అతడూ పోయాడు (*భి*). అర్జునుని అన్నగారు భీమసేనుడు వెయ్యి ఏనుగుల బలం కలవాడని ప్రతీతి. ఆయన కూడా పోయాడు (*భీ*). నన్ను భుక్కుడు అంటారు (*భు*). ఇక కొన్ని నిముషాల్లో బయలుదేరు తున్నాను. మంత్రులు, కవులు, బిచ్చగాళ్ళు, మల్లయోధులు అందరూ పోయారు. దోషిని నేనూ పోతున్నాను.

ఇంత వరకు చూసిన దానిని బట్టి యమధర్మరాజు (*అంతకః*) అక్షర పంక్తిలో భ, భా, భి, భీ అంటూ 'భ' గుణింతములో ప్రవేశించినట్లు తెలుస్తూ ఉంది. ఇప్పుడు 'భు' (భుక్కుడు) అంటూ నా వద్దకు వచ్చాడు. 'భు' తరువాత అక్షరము 'భూ' అని తమకు తెలియనిది కాదు. నా పని పూర్తి కాగానే నేరుగా సమవర్తి తమ వద్దకే (**భూపతిః**) వచ్చేట ట్లున్నాడు. కాస్త అవధానంతో ఉంటారని చెబుతున్నా. అంతే. ఇక, నన్ను ఉరి తీసేయండి అన్నాడు దోషి.

రాజు గారు లేచి, 'ఆపండి! అతణ్ణి ఉరి తీయకండి. తరువాత చెబుతాను' అంటూ అంతఃపురానికి వెళ్ళాడు. ఏం చెబుతాడు? చెప్పేందు కేముంది? అంతర్యంలో అలజడి మొదలై ఉంటుంది. ఎవరు ఉంటారు? పోకుండా ఎవరు ఉంటారు? కలకాలం ఉంటామని భావిస్తారు. ఎంతకాలం ఉంటారు? అల్ప కాలమే. స్వల్ప కాలమే. అదే కల-కాలం. కలగన్నంత సేపు ఉండే కాలం. నేనే ఉండ నప్పుడు వాణ్ణి పంపించడ మెందుకు? అని ప్రభువు ఆలోచనలో పడి ఉంటాడు.

శోచ్యులు - అశోచ్యులు - పండితులు

ఎవరి కోసం దుఃఖించాలి? దుఃఖింప దగిన వాళ్ళు ఎవరు? శోచ్యు లెవరు? ఎవ్వరూ లేరు. అందరూ అశోచ్యులే. దుఃఖింప దగని వారే. ఈ విషయం చక్కగా తెలిసిన వాళ్ళు పండితులు. వారి దృష్టిలో అందరూ అశోచ్యులే. చావు సహజం.

అర్జునుని పరిస్థితే కాస్త తికమకగా ఉంది. యుద్ధం వల్ల సంభవించే ఉపద్రవా లన్నిటినీ ఏకరువు పెడుతూ అర్జునుడు అనర్గళంగా ధర్మోపన్యాసం చేసేశాడు. ఒక అధ్యాయ మంతా మాట్లాడినా సరిపోలేదు. రెండవ అధ్యాయంలో కూడా ఐదు శ్లోకాలను ఆక్రమించాడు.

అర్జునుని మాటలేమో పండిత వచనా ల్లాగా ఉన్నాయి. ప్రవర్తన చూస్తే దుఃఖింప దగని వారి కోసం పామరుని వలె ఏడుస్తున్నాడు. పలుకుల్ని బట్టి పండితుడని భావించాలో, రోదన విని పామరుడని నిర్ణయించాలో అర్థం కావడం లేదు. ఇంతకీ, పండితు డంటే ఎవరో చెబితే సరిపో తుందని భావించాడేమో 'పండిత' పదానికి నిర్వచనం వినిపించాడు వాసుదేవుడు.

గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః

అర్జునా! చచ్చిన వాళ్ళను గూర్చి ***(గతాసూన్)***, బ్రతికిన వాళ్ళను గూర్చి ***(అగతాసూన్)***, పండితులు ***(పండితాః)*** దుఃఖించరు ***(న అనుశోచన్తి)*** అన్నాడు శ్రీకృష్ణుడు.

'పండా' అంటే ఆత్మకు సంబంధించిన జ్ఞానం. 'పండా' ఎవరికి ఉంటుందో వారే పండితులు ***(పండా ఆత్మవిషయా బుద్ధిః యేషాం తే హి పండితాః ఆత్మజ్ఞాః)***. ఆత్మజ్ఞులు. ఆత్మను తెలిసిన వారు.

దుఃఖం తెలియనిది పాండిత్యం

పార్థుని పలుకుల్లో పాండిత్య ప్రకర్ష ముంది. ప్రవర్తనలో పామరత్వం గోచరిస్తూ ఉంది. ఆత్మజ్ఞానము కలవారు పండితులు. ***పాండిత్యం నిర్విద్య*** అనే బృహదారణ్యక శ్రుతి ఆత్మజ్ఞానము కలవారే పండితులని నిర్ణయించింది. పారమార్థిక దృష్టితో చూచి నపుడు అందరూ ఆత్మస్వరూపులే. ఆత్మ నిత్యము కనుక అశోచ్యులే. దుఃఖింప దగని వారే. అలాంటి వారి విషయములో దుఃఖిస్తూ ఉన్నాడు కనుక అర్జునుడు పండితుడు కాడు. ఆత్మవిదుడు కాడు. అజ్ఞానము లోనే ఉన్నాడు అని నిర్ణయించాలి ***(పరమార్థతః నిత్యాన్ అశోచ్యాన్ అనుశోచసి, అతః మూఢః అసి ఇత్యభిప్రాయః)***.

అర్జునా! దుఃఖించకు అని శ్రీకృష్ణుడు ఎందుకు చెప్పలేదో ఇక్కడ అర్థమైంది అనుకుంటాను. దుఃఖించ వద్దని కృష్ణుడు చెప్పినంత మాత్రాన అర్జునుడు దుఃఖించకుండా ఉండ లేడు. అర్జునుడు దుఃఖాన్ని మానాలి అంటే అతడు పండితుడు కావాలి. ఆత్మజ్ఞుడు కావాలి. ఆత్మ ఏమిటో, అనాత్మ ఏమిటో తెలియాలి. చావు ఏమిటో, చచ్చే దెవరో అర్థం కావాలి. అందుకే, ***అశోచ్యాన్*** అంటూ ఆత్మజ్ఞానాన్ని బోధిస్తూ గీతోపదేశాన్ని ప్రారంభించాడు గోవిందుడు.

ఆత్మ పుట్టింది కాదు. కనుక చావదు. చావు లేని దాని విషయంలో దుఃఖం ఉండదు. ఆత్మ కానిది అనాత్మ. దానికి నిత్యత్వము లేదు. ఆత్మ నిత్యము కనుక ఆత్మ కొరకు దుఃఖింప నవసరం లేదు. అనాత్మ నిత్యము కాదు కనుక దాని కొరకు కూడా దుఃఖింప నవసరం లేదు. ఈ విధమైన ఆత్మానాత్మ వివేకం గల పండితులు దేని కొరకూ దుఃఖించరు. వివేకం లోపించిన కారణంగా పార్థుడు విషణ్ణు డయ్యాడు.

ఉన్నా పోయినా ఒక్కటే

మరణించిన వారిని గూర్చి పండితులు దుఃఖించరు. గతించిన వారు అంటే ప్రాణాలు పోయిన వారు ***(గతాసూన్, గత ప్రాణాన్, మృతాన్)***. జీవించి యున్న వారిని గూర్చి కూడా పండితులు విలపించరు. జీవించి యున్నవారు అంటే, ప్రాణాలు పోని వారు అని అర్థము ***(అగతాసూన్, అగత ప్రాణాన్ జీవతః)***. ప్రాణాలు వస్తాయి కనుక అవి పోతాయి. ఇది అనివార్యమైన విషయం. దుఃఖానికి ఆస్కారం లేని విషయం. ఆత్మ రాలేదు

కనుక పోదు. పోని, పోలేని ఆత్మ విషయంలో దుఃఖానికి అవకాశమే లేదు కనుక, ఈ జ్ఞానము గల పండితులు దుఃఖించరు. అంటే, చావు విషయంలో దుఃఖించే వారు పండితులు కారు అనేది సుస్పష్టం.

ఉన్నది పోయేందుకే కనుక చస్తే ఏడవ వద్దు. ఏడ్చినంత మాత్రాన పోయింది తిరిగి రాదు కనుక ఏడ్చి చచ్చేదీ వద్దు. బ్రతికున్న వాళ్ళు చావాలి అనుకోరు. బ్రతకాలనే అనుకుంటారు. వారి ఆశాదీపం కూడా కొడి గట్టే లాగా వారి ముందు పని గట్టుకొని ఏడ్చి చంపొద్దు. అందర్ని వదలి మనం పోతామేమో అని చచ్చే వరకు ఏడుస్తూ కూర్చోవద్దు. చావు ఎవరి కైనా సహజం. చచ్చేది ఆగదు. చావనిది సాగదు.

దేహాలు అనిత్యాలు. నేడు ఉండినా రేపు లేకుండా పోయేవే. ఉన్నప్పుడు కూడా, 'ఒక్కనాటికి - వల్లకాటికి' అనే జపం చేస్తూనే ఉంటాయి. ఆత్మ నిత్యము. అనంతము. అది ఉన్నదే. పోనిదే. ఈ విధమైన జ్ఞానంతో పండితులు శోకాన్ని దాటుతారు ***(తరతి శోకం ఆత్మవిత్ - ఛాందోగ్యశ్రుతి)***.

పల్లవి: **జ్ఞానమె నీ నావ - ధన్యము నీ త్రోవ**
సంసార జలధిలో మేలైన నావ ॥ జ్ఞానమె ॥

చరణములు

1. **ఎక్కడి కేగినా - ఎంతగా తిరిగినా**
నావ తీరానికి - కాయము కాటికి ఖాయము ॥ జ్ఞానమె ॥
2. **లేనిది కాదులే - క్రొత్తగా రాదులే**
ఉన్నదే తెలియాలి - జ్ఞానమే దీపమై వెలగాలి ॥ జ్ఞానమె ॥

ఊడే వాటికి, వాడే వాటికి వగచ కుండా, వీడని, విడిపోని విశుద్ధాత్మగా విహరిస్తూ సాగిపొమ్మంది చైతన్యగీతిక.

ఓం ప్రథమం - అద్భుత బీజం

అశోచ్యా నన్వ శోచస్త్వం అనే ఈ శ్లోకంతో గీతోపదేశాన్ని ప్రారంభించాడు గోవిందుడు. జగద్గురువులు శ్రీ శంకర భగవత్పాదులు తమ భాష్యాన్ని ఈ శ్లోకం నుండే ప్రారంభించారు.

గీతోపదేశ మనే మహావృక్షానికి ***అశోచ్యా నన్వ శోచస్త్వం*** అనే ఈ శ్లోకాన్ని బీజశ్లోకంగా చెప్పుకుంటాము. వృక్షము యొక్క వైభవ మంతా బీజం లోనే నిక్షిప్తమై ఉన్నట్లు, గీతోపదేశ మంతా ఈ శ్లోకంలో బీజ రూపంలో ఉంది. ***అశోచ్యాన్*** అంటూ రెండవ అధ్యాయంలో బోధను ప్రారంభించిన గోవిందుడు **మా శుచః** అంటూ పద్దెనిమిదవ అధ్యాయంలో గీతను సమాప్తం చేస్తాడు. దుఃఖానికి కారణం లేదు అంటూ ప్రారంభించాడు. అది ఋజువు కావాలి. గీతోపదేశంలో ఆత్మజ్ఞానాన్ని అందించి ఈ పరమ సత్యాన్ని ఋజువు చేశాడు శ్రీకృష్ణుడు. దుఃఖానికి హేతువే లేదనే వాస్తవం తెలిసి పోయింది కనుక, ఇక దుఃఖించకు **(మా శుచః)** అంటూ గీతోపదేశాన్ని ముగించాడు.

దుఃఖమగ్ను డైన అర్జునుని దుఃఖ నివృత్తికి, ఆనందప్రాప్తికి గీత బోధించ బడింది. దుఃఖం అసంగత మంటూ ఆరంభించి, దుఃఖించకు అంటూ శక్తివంతంగా సమాప్తి చేసి, బోధ యొక్క ఫలితాన్ని గీతాచార్యుడు సుస్పష్టం చేశాడు. కనుకనే గీతాపారాయణ విధానంలో అంగన్యాస కరన్యాసాలు చెబుతూ ఈ శ్లోకము యొక్క ప్రథమ పాదాన్ని బీజంగా చెప్పుకుంటాం.

'అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే' ఇతి బీజం
'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' ఇతి శక్తిః

'అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః' ఇతి కీలకమ్

దుఃఖింప దగింది లేదు అనేది గీతోపదేశానికి బీజం. సర్వమును పరిత్యజించి ఉన్న ఒకే పరమాత్మను ఆశ్రయించడం శక్తి. సర్వ పాపాల నుండి విడిపడి మోక్షాన్ని పొంది దుఃఖానికి దూరం కావడం కీలకం. అందు చేతనే ***అశోచ్యాన్*** అంటూ ప్రారంభించి, **మా శుచః** అంటూ సమాప్తి చేశాడు. ఆద్యంతాల లోనే దుఃఖ ప్రసక్తి వచ్చింది. మధ్యలో దుఃఖ నివారణోపాయానికి బోధ జరగ లేదు అనే అభియోగానికి అవకాశ మివ్వకుండా **నత్వం శోచితు మర్హసి** - దుఃఖింప పని లేదు అని మధ్యలో కూడా తెలుపుతూనే బోధించాడు శ్రీకృష్ణుడు.

అకర్మ అమంగళమా?

గీత మోక్ష ప్రదాయక మైన గ్రంథము. ఆత్మజ్ఞానమే కేంద్ర విషయంగా శోభిస్తున్న గ్రంథము. జ్ఞానార్హతకు ప్రవృత్తి ప్రధానం కనుక ప్రవృత్తిని గూర్చి గీత ప్రముఖంగా ప్రవచించిందే గాని, వాస్తవానికి నివృత్తి లోనే గీత నిలిచి ఉంటుంది. గీత నివృత్త్యాత్మక గ్రంథము. ఈ ప్రత్యేకత ప్రారంభ శ్లోకం లోనే ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

ఏ శాస్త్రమైనా చెయ్య వలసింది ఉంది అని చెబుతూ ప్రారంభ మవుతుంది. గీత అలా కాకుండా చెయ్య కూడనిది చేస్తున్నావు ***(అశోచ్యా నన్వ శోచస్త్వం)*** అంటూ ప్రారంభ మైంది. నివృత్తికి ఇక్కడే అద్దం పడుతోంది భగవద్గీత.

చెయ్య కూడనిది చేస్తున్నావు అంటూ నిషేధ రూపంలో గీతోపదేశం ప్రారంభం కావడం మంగళకరంగా లేదని కొందరి అభిప్రాయం. మంగళం విషయానికి వస్తే, ఇప్పటికే మహాభారతంలో మంగళ ప్రస్తావన ఎంతగానో జరిగింది. మంగళాచరణం చేసి వ్యాసభగవానుడు భారతాన్ని ప్రారంభించాడు. గీతకు *ధర్మక్షేత్రే కురుక్షేత్రే* అనే ప్రథమ శ్లోకంలో మంగళాచరణం ఎలా జరిగిందో ఈ గ్రంథంలో మనమే చూశాం. ప్రస్తుతం గీత - రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకంలో మనం ఉన్నాం. ఇక్కడ మళ్ళీ మంగళం అవసరమా?

గీతోపదేశాన్ని గోవిందుడు ఈ శ్లోకం నుండి ప్రారంభించాడు అని అంటున్నారు కనుక మంగళం ఉంటే బాగుంటుంది కదా! మంగళం లేకపోయినా సరిపెట్టు కోవచ్చు. కాని, కర్మ రాహిత్యంతో గీతాచార్యుడు ఉపదేశాన్ని ప్రారంభించడం మంగళకరంగా ఉందా? అనే సంశయాన్ని కొందరు దాచుకో వచ్చు. దానిని కూడా దూరం చేసుకుందాం.

మనిషికి తృప్తి కావాలా? అసంతృప్తి కావాలా? అసంతృప్తిని ప్రస్తావించడం శుభమా? సంతృప్తిని వ్యక్త పరచడం శుభమా? ఆకలితో ఉన్న వ్యక్తిని భోం చేయండి అని చెబుతాం. తృప్తిగా భోంచేసిన వ్యక్తిని ఇంక కాస్త గ్రహించండి అంటే, అయ్యో! వద్దండి, చెయ్యలేను అంటాడు. ఎందుకు అలా అంటాడు? తృప్తి చెందాడు కనుక. చెయ్యను, చెయ్యలేను అనడం అమంగళమా? అసంతృప్తితో కర్మారంభం జరుగుతుంది. తృప్తిలో, జ్ఞానంలో కర్మలు విలీన మౌతాయి.

సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే

కర్మలన్నీ జ్ఞానం లోనే పరిసమాప్త మవుతాయి అని గీతాచార్యుడే ముమ్ముందు నాల్గవ అధ్యాయంలో చెప్పబోతాడు. ఆ సందర్భంలో విపులంగా చర్చించు కుందాం. కనుక, మంగళకరంగా మనం కర్మలు చెయ్యొచ్చు. అంతేగాని, కర్మ మంగళం కాదు. కర్మలలో అకర్మను దర్శించడమే శుభం. మంగళం.

ఇదంతా అద్వైతాన్ని అభిలషించే వారికి, అనుసరించే వారికి సరిపోవచ్చు. మేము మాత్రం దానిని మంగళాచరణంగా అంగీకరించము అని మరొక పక్షము వాదించ వచ్చు. అయితే, వారికి కూడా సమాధానం చెబుతున్నాము.

అద్వైతము అందరూ అంగీకరించ గలిగే సామాన్య విషయం కాదు. అందరూ అంగీకరించాలని మేము కూడా కోరుకోము. అలాంటి వారికి మేము చెప్పేది ఒక్కటే. మీరు కోరుతున్నారు కనుక, అవసరం లేకపోయినా మంగళ ప్రస్తావన ఈ సందర్భంలో ముందుకు తెచ్చాం. అలా చూచినా, పదకొండవ శ్లోకం మంగళకరంగా ఉంది. ***అశోచ్యాన్*** అంటూ శ్లోకము మొదలైంది. 'అ' అనే అక్షరంతో ప్రారంభం కావడమే మంగళాచరణం.

అక్షరాణాం అకారోఽస్మి

అక్షరాలలో తాను 'అ' కారము అని గీత - విభూతి యోగంలో అచ్యుతుడే చెప్పాడు కనుక, భగవంతుడైన శ్రీకృష్ణుడు తన స్వరూపమైన అక్షరంతో ప్రారంభించడం చేత, ఈ శ్లోకం మంగళకరము.

వాక్య తాత్పర్యం

అజ్ఞాన జనితమైన శోకమోహాల నుండి విడిపడాలి అంటే, ఆత్మజ్ఞానమే ఏకైక మార్గమని తలచి శ్రీకృష్ణుడు ***అశోచ్యాన్*** అంటూ ఆత్మ యొక్క నిత్యత్వాన్ని ప్రబోధించ డానికి ఉపక్రమించాడని అర్థం చేసుకున్నాం. ఆత్మజ్ఞానము అంటే బ్రహ్మాత్మైక్య జ్ఞానము. ఆత్మయే బ్రహ్మము అనే మహావాక్య జ్ఞానము. **తత్త్వమసి** వాక్య తాత్పర్యం.

తత్ - త్వం - అసి అనే మూడు పదాలకు విపుల వ్యాఖ్యానమే భగవద్గీత అని మనం అర్థం చేసుకొని ఉన్నాం. ఈ మూడు పదాలకు వివరణంగా పరమేశ్వరుడు మూడు షట్కాలను బోధించాడు. మొదటి ఆరు అధ్యాయాలు 'త్వం' పదమును నిర్దేశించే ప్రథమ షట్కము. ఆ తరువాత ఆరు అధ్యాయాలు 'తత్' పదమును నిర్దేశించే ద్వితీయ షట్కము. చివరి ఆరు అధ్యాయాలు 'అసి' పద నిర్దేశమును గావించే తృతీయ షట్కము. ***అశోచ్యాన్*** అనే ఈ శ్లోకంతో ప్రారంభ మైన ప్రథమ షట్కము 'త్వం' పద నిర్దేశము గాన, ***అశోచ్యాన్ అన్వశోచః త్వం*** అంటూ తనలో 'త్వం' పదమును నింపుకొని, మొదటి ఆరు అధ్యాయాలలో నా పని అంతా ఇదే అని చెప్పకనే చెబుతూ ఉంది.

ద్వితీయం అద్వితీయం

అనాత్మ లక్షణాలను ఆత్మ యందు ఆరోపించుకొని దుఃఖించడం అందరి లాగే అర్జునునికి కూడా సాధారణ మోహం కాగా, స్వధర్మాన్ని అధర్మంగా భావించడం అర్జునునికి మాత్రమే ఉన్న అసాధారణ మోహం. సాధారణ మోహం లాగే అసాధారణ మోహం కూడా అందరికీ ఉంటుంది. కాకపోతే, అర్జునుడికి అది యుద్ధం విషయంలో తలెత్తింది. మరొకరికి మరొక విషయంలో తొంగి చూడవచ్చు.

సాధారణ మోహాన్ని నివృత్తి చేసే ప్రయత్నంలో రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకం నుండి ముప్పైయవ శ్లోకం వరకు ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించి **న త్వం శోచితు మర్హసి** - దుఃఖింప నవసరం లేదు అంటూ అక్కడ ముగించాడు!

స్వధర్మమైన యుద్ధాన్ని అధర్మంగా భావించి, యుద్ధం నుండి విరమించి పరధర్మాన్ని ఆశ్రయించాలని భావించిన పార్థుని అసాధారణ మోహాన్ని తొలగిస్తూ, అక్కడి నుండి ఎనిమిది శ్లోకాలలో ధర్మాన్ని గూర్చి అద్భుతంగా ప్రవచించాడు భగవానుడు. ఈ ధర్మ ప్రసంగాన్ని ధర్మాష్టకం అని అంటారు.

ధర్మ జీవనంలో కర్మే ప్రధానం కనుక, బంధహేతువైన కర్మను కర్మయోగంగా మార్చుకొని, కర్మసంగము, ఫలసంగము లేకుండా సమబుద్ధితో ఆనందయాత్రను సాగించేది ఎలాగో ఆ తరువాత పదిహేను శ్లోకాలలో చర్చించి యాభై మూడవ శ్లోకం వద్ద సమాప్తి చేశాడు. చివరగా సాంఖ్య, యోగాల ప్రతిరూపంగా, సాకార

రూపంలో నడయాడే జ్ఞానస్వరూపు డైన స్థితప్రజ్ఞుని వైభవాన్ని వర్ణించాడు. ఈ విధంగా ద్వితీయ మనే సాంఖ్యము అద్వితీయంగా శోభిస్తూ ఉంది. ఇక వినండి.

దుఃఖింప దగిన వారు భీష్మద్రోణులతో సహా ఎవ్వరూ లేరు. వారు అశోచ్యులు. ఎందుకని వాళ్ళు అశోచ్యులు? **(కుతః తే అశోచ్యాః?)** *వారు నిత్యులు కనుక* **(యతః నిత్యాః)**. *అదెలా?* **(కథమ్?)** *అదెలాగో చెబుతూ ఆత్మ యొక్క నిత్యత్వాన్ని బోధిస్తున్నాడు.*

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్ ॥ 12

న-తు-ఏవ-అహం-జాతు-న-ఆసం-న-త్వం-న-ఇమే-జనాధిపాః
న-చ-ఏవ-న-భవిష్యామః-సర్వే-వయం-అతః-పరం

అహం	=	నేను	జనాధిపాః	=	రాజులు కూడా
జాతు	=	ఒకప్పుడు	న	=	లేరు అనేది
న ఆసం	=	లేను అనేది	న తు ఏవ	=	లేనే లేదు
నతు ఏవ	=	లేనే లేదు	అతఃపరం	=	ఇక మీదట
త్వం	=	నీవు కూడా	వయం సర్వే	=	మన మందరము
న	=	లేవనేది లేదు	న భవిష్యామః	=	లేకపోవుదు మనునది
ఇమే	=	ఈ	న ఏవ	=	లేనే లేదు

పార్థా! నేను ఒకప్పుడు లేనివాణ్ణి కాను. నువ్వు కూడా లేని వాడివి కావు. ఈ రాజు లందరూ కూడా ఒకప్పుడు ఉన్నవారే. మన మందరం భవిష్యత్తులో లేకుండా పోయే వాళ్ళము అసలే కాము.

వ్యాఖ్య

వచ్చేది ఏదైనా మనకు ఇష్టమైన దైతే అది వస్తే మనకు సంతోషం కలుగుతుంది. ఉన్నది ఏదైనా అది మనకు ఇష్టమైన దైతే, అది పోతే దుఃఖం కలుగుతుంది. మా కోడలు ఎప్పుడు ప్రసవిస్తుందో చెబుతారా? అని జ్యోతిష్కుణ్ణి అడుగుతారు. అంతే గాని, ఆ పుట్టే బిడ్డ చనిపోయే దెప్పుడో చెప్పండి అని ఎవ్వరూ అడగరు.

ప్రసవిస్తే అంత వరకు లేని వాడే కదా పుడతాడు! పుట్టిన వాడు గిట్టకుండా ఎలా ఉంటాడు? అందరూ ఈ ప్రపంచంలో పుట్టేవాళ్ళే. గిట్టేవాళ్ళే. పుట్టడం అనేది ఒక కాలంలో జరుగుతుంది. గిట్టడం కూడా కాలం లోనే జరుగుతుంది. ఈ జనన మరణాలకు మధ్య ఉన్న కాలంలో మనిషి దేహంతో జీవిస్తాడు.

ఒక వ్యక్తి ఉన్నాడు అంటే దేహంతో ఉన్నాడనే అర్థం. దేహం ఎల్లకాలం ఉండదు కనుక, దేహం పోతే ఆ వ్యక్తి లేకుండా పోతాడు. అందుచేత అతడు శోచ్యుడు, దుఃఖింప దగిన వాడు అనేది మన భావం. అనుభవం కూడా. ఇది వాస్తవం కాదని, నేడున్నవాడు ఎప్పుడూ ఉండే వాడే నని, లేకుండా వచ్చిన వాడు కాడని, లేకుండా పోయేవాడూ కాడని, అందుచేత దుఃఖింప దగిన వాడు కాడని ఈ శ్లోకంలో ఆత్మ యొక్క నిత్యత్వాన్ని ఆవిష్కరిస్తున్నాడు భగవానుడు.

ఉన్న నే నెవరు? నేనుగా ఉన్న దెవరు?

తాను ఉన్నట్లు ఎవరికి తెలియదు? అలాగని, తాను ఎలా ఉన్నాడో తెలిసింది ఎవరికి? నేను ఉన్నాను ***(అహమస్మి)*** అని మనిషి అంటాడు. ఇక్కడ 'నేను' అని దేనిని గుర్చి మాట్లాడు తున్నాడో అది దేహ మని అతని

అభిప్రాయం. దేహం నేడుంది. పుట్టక ముందు లేదు. లేకుండా ఉన్నదే పుట్టింది. ఇప్పుడు ఉంటూ ఉంది. కొంత కాలం ఉండి ఆ తరువాత లేకుండా పోతుంది. లేకుండా పోవడం ఎవ్వరికీ ఇష్టం లేదు. అలా పోయే పరిస్థితి వచ్చినపుడు, ఇష్ట మైనది పోతూ ఉంది కనుక దుఃఖం అనివార్యంగా ఉంటుంది. తన విషయంలో ఇష్ట మున్నట్లే, తనకు సంబంధించిన వారి విషయంలో కూడా ఇష్ట ముంటుంది కనుక, వారి దేహాలు పోతాయని తెలిసినా దుఃఖం ముంచు కొస్తుంది.

వాస్తవానికి నే నెవరు? నాలో నేనుగా ఉన్న దెవరు? అని విచారిస్తే 'నేను దేహము కాను - నాకు దేహం ఉంది' అనే అద్భుతమైన సత్యం తెలిసి వస్తుంది. గతంలో లేని దేహం భవిష్యత్తులో లేకుండా పోయేందుకే వచ్చి ఉండొచ్చు. కాని, నేను అలా లేకుండా పోయేందుకు లేకుండా వచ్చినవాణ్ణి కాను. గతంలో కూడా ఉన్నవాణ్ణే. అలాగే భవిష్యత్తులో కూడా ఉండబోయే వాణ్ణే. ఎప్పుడూ ఉన్నవాణ్ణే ఇప్పుడూ ఉన్నాను. ముమ్ముందు కూడా ఉంటాను. నేను లేని కాలమే లేదు. ఒకప్పుడు లేకుండా పోయేవి ఉన్నప్పుడు ఉండటానికి కూడా నేనే కారణము.

ఉండి పోయేది పోతే నష్టం లేదు

పోకుండా ఉండేది తెలియక పోతే లాభం లేదు

నేడు ఉన్నాను అనడంలో తప్పు లేదు. ఒకనాడు లేను అంటేనే దోషం. నేను పుట్టాను అనడం తప్పు కాదు. పుట్టిన రోజు పండుగ జరుపు కోవడం అనుచితమూ కాదు. పుట్టక ముందు లేను అంటేనే సమస్య ఉత్పన్నం అవుతుంది.

శ్రీరామచంద్రుడు ధర్మ రక్షణార్థం జన్మించాడని ఆయన పుట్టిన రోజును శ్రీరామనవమిగా మనం జరుపుకుంటున్నాం. అవతార మెత్తిన వాడు శ్రీమహావిష్ణువు. శ్రీరాముడుగా ఉద్భవించింది వైకుంఠవాసుడే. అంటే, శ్రీరాముడుగా పుట్టినవాడు శ్రీరాముడుగా పుట్టక ముందు ఉన్నవాడా, లేనివాడా? ఉన్నవాడే. మరి, అలా ఒకప్పుడు ఉండిన శ్రీరాముని దేహం నేడు ఉందా? లేదు. అంటే, రాముడు లేనట్లేనా? అదే వాస్తవమైతే, మనం రామధ్యానం ఎందుకు చేస్తున్నాము? మన ధ్యానాన్ని అనుగ్రహించే దెవరు? శ్రీరాముడు కాదా? శ్రీరాముని దేహం ఒక కాలంలో ఉండి, ఆ తరువాత లేకుండా పోవచ్చు. అలాగని, రాముడు లేకుండా పోలేదు. దేహం లేకపోయినా తాను ఉన్నాడు. ఉన్నాడు కనుకనే మన మొర వింటున్నాడు. ఉన్నాడు కనుకనే పిలిస్తే వస్తున్నాడు. తులసీదాసు మొర విన్నాడు. రామదాసు పిలిస్తే వచ్చాడు.

అర్జునా! నేడు నీ ముందు నేనున్నాను. నేను పుట్టినట్లు మా అమ్మ దేవకీదేవి చెబుతుంది. కాని, పుట్టక ముందే నేను ఉన్నానని మా మామయ్య కంసుడికి తెలుసు. అందుకే, నేను పుట్టగానే కబురు అందించమని కాపలా వాళ్ళను పెట్టాడు. అర్థమైందా అర్జునా! పుట్టక ముందు నేను లేను అనేది లేనే లేదు ***(న త్వేవాహం జాతు నాసం)***. ***తత్*** గా తెలిసే పరమేశ్వరుడు నిత్యమే. ఆ విషయంలో సంశయం లేదు. 'నేను'గా, 'నీవు'గా తెలిసే **త్వం** కూడా నిత్యమేనా? ఇక్కడే సంశయం.

అయ్యా! కృష్ణయ్యా! అది నీ విషయం. నీవు అవతారమూర్తివి. పుట్టుక లేని వాడివి. మరణం తెలియని వాడివి. నీ జనన మరణాలు చాలా విచిత్ర మైనవి. కాని, పుట్టి చచ్చే మా విషయ మేమిటి? అనేది అర్జునుని ప్రశ్న. ఇది నిజమేనా?

శ్రీకృష్ణుడు అవతారమూర్తి అని అర్జునుడికి ఈ సందర్భంలో తెలుసా? శ్రీకృష్ణుడు భగవంతుడు అని గీతోపదేశానికి ముందు అర్జునుడు గ్రహించాడా? లేదు. అది తెలిసి ఉంటే, రథంలో క్రింది భాగాన శ్రీకృష్ణుణ్ణే

కూర్చోబెట్టి, ఎత్తైన స్థానంలో తాను కూర్చుంటాడా? ఇంతెందుకు? శ్రీకృష్ణుణ్ణి రథం నడపడానికి, గుర్రాలను కడగటానికి అంగీకరిస్తాడా? తన సర్వస్వమూ అయిన అచ్యుతుడు భగవంతుడే అని పార్థునికి తెలియదు. మనకు తెలియకుండా మనతో ఉంటూ, మనల్ని ఆదుకొనే వాడే భగవంతుడు. కనుక భగవంతుని స్థాయిని ఉదహరిస్తూ శ్రీకృష్ణుడు బోధించడం లేదు. ఆత్మస్థాయి నుండే బోధను అనుగ్రహిస్తున్నాడు. ఆత్మ ఒక్కటే కనుక అందరమూ అన్ని కాలాలలో ఉన్నవాళ్ళమే అనే అద్భుత సత్యాన్ని వంట బట్టిస్తున్నాడు.

అర్జునా! నాది, నీది అని ఇక్కడ రెండు లేవు. విషయమంతా ఒక్కటే. జనన మరణాలు ఎవరివి అయినా విచిత్రాలే. విగత చిత్రాలే. చూడు పార్థా! నా దేహం రాక ముందు నేను ఎలా ఉన్నానో, నీ దేహం రాక ముందు నీవూ అలా ఉన్న వాడివే. నీవే కాదు. మన ముందు కనిపిస్తున్న ఈ రాజులు, భీష్మద్రోణాదులు సైతం వాళ్ళ దేహాలు పుట్టక ముందు కూడా ఉన్నవారే. నా దేహం లేకపోయినా, భవిష్యత్తులో నేను ఎలా ఉండబోతానో, అలాగే నీ దేహం పోయిన తరువాత నీవు, వాళ్ళ దేహాలు పతనమైన తరువాత వాళ్ళు అలాగే ఉండబోతారు. పార్థా! ఉండి పోయేది ఏదో అదే నీకు తెలుస్తూ ఉంది. పోకుండా ఉండేది ఏదో నీకు అర్థం కావడం లేదు. అదే నీ దుఃఖానికి కారణం.

అర్జునా! నీవు, ఈ రాజులందరు కూడా పుట్టక ముందు లేరు అనేది లేదు. ఉన్నవారే. (***న త్వం... ఇమే జనాధిపాః న ఆసన్ ఇతి***). నేను, నీవు, ఈ రాజులు దేహాలు లేక ముందు ఉన్న వాళ్ళమే. భవిష్యత్తులో దేహాలు లేకపోయినా ఉండే వాళ్ళమే. అంతేగాని, భవిష్యత్తులో లేకుండా పోయే వాళ్ళము కాము (***అతః పరమ్ వయం సర్వే న భవిష్యామః న ఏవ***). ఇది అర్థం కాకపోవడం వల్లనే శోకమోహాలు కలుగు తున్నాయి.

నేడయితే ఉన్నాము కానీ పుట్టక ముందు లేము కదా! ఈ భావమే మోహాము. లేకుండా వచ్చాము కనుక భవిష్యత్తులో లేకుండా పోతాము. ఈ ఆలోచనే భయానికి, దుఃఖానికి కారణము. వాస్తవానికి దుఃఖ కారణం లేనే లేదు. ఆలోచనా విధానమే దుఃఖానికి కారణంగా తెలుస్తూ ఉంది.

అర్జునా! గతంలో మన మందరమూ ఉన్నాము. నేడూ ఉన్నాము. మనతో పాటు ఇప్పుడు దేహాలు ఉన్నాయి. భవిష్యత్తులో దేహాలు పతన మవుతాయి. మన ప్రయాణం మాత్రం సాగుతూనే ఉంటుంది.

ఇప్పుడు చెప్పు. భవిష్యత్తులో నీవు, వాళ్ళూ ఉంటూనే ఉంటారు. కనుక నీవు నీ కోసం దుఃఖింప నవసరం లేదు. అలాగే వాళ్ళ కోసం కూడా దుఃఖింప పని లేదు. ఇదే విషయం వాళ్ళకు కూడా వర్తిస్తుంది. వాళ్ళూ, నీవు భవిష్యత్తులో లేకుండా పోయేవారు కారు కనుక వాళ్ళు వాళ్ళ కోసం ఏడవ వలసిన పనిలేదు. అలాగే నీ కోసం ఏడవ వలసిన అగత్యం వాళ్ళకు లేదు. గతంలో అందరమూ ఉన్నాము. నేడు కూడా ఉన్నాము. భవిష్యత్తులో అందరము ఉండబోతాము. ఇక ఎవరు ఎవరి కోసం ఏడవాలి? (***అశోచ్యా నన్వ శోచస్త్వం***).

నువ్వు ఉంటేనే అది ఉంటుంది

అది లేకపోయినా నువ్వు ఉంటావు

అర్జునా! నువ్వు దేహం లేక ముందు కూడా ఉన్నవాడివే. అప్పుడు దేహం లేదు. లేనిది వచ్చింది. దేహానికి ఆది ఉంది. కనుక అది అనాది కాదు. ఆది ఉన్న దేహానికి అంతం ఉంది. అందుకని అది అనంతం కాలేదు.

కుండ పుట్టింది కనుక దానికి ఆది ఉంది. ఆది ఉంది కనుక అంతమూ ఉంటుంది. తయారు కాక ముందు కుండ లేదు. పగిలిన తరువాత కుండ ఉండబోదు. దేహం యొక్క పరిస్థితి కూడా అదే (***జనేః పూర్వం అపి మృతేః అథాపి దేహః నాస్తి***).

కుండ అన్ని కాలాలలో ఉండదు. కాని, మట్టి లేని కాలమే లేదు. దేహాలు ఎప్పుడూ ఉండవు. కాని, ఆత్మ లేని కాలమే లేదు. కాలము లేకపోయినా ఆత్మ ఉంటుంది. అదే ఆత్మ యొక్క కాలాతీత స్థితి. నిత్య మంటే అదే. కనుక, ఆత్మ నిత్యము. నిత్యమైన ఆత్మ నశిస్తుందా? నశించదు. మరి, దుఃఖం దేని కోసం (***అశోచ్యా నన్వ శోచస్త్వం***)?

అర్జునా! కుండ పుట్టక ముందే మట్టి ఉంది. కుండ భగ్నమైనా మట్టి ఉంటుంది. దేహం పుట్టక ముందే నువ్వు ఉన్నావు. నేనూ ఉన్నాను. ఈ రాజులూ ఉన్నారు. దేహం పోయినా నువ్వు ఉంటావు. నేను ఉంటాను. ఈ రాజులూ ఉంటారు. దేహాలుగా ఉండ లేరు. ఆత్మగా ఉంటారు. కనుక, ఉండరేమో అనే సంశయం లేనే లేదు (***న భవిష్యామః న ఏవ***).

కుండలు ఎన్నో ఉంటాయి. కాని, అన్ని కుండలలో ఆకాశం ఒక్కటే. దేహాలు అనేకంగా ఉంటాయి. కాని, అన్ని దేహాల లోని ఆత్మ ఒక్కటే. బల్బులు ఎన్నో రూపాల్లో ఉంటాయి. అనేక రంగుల్లో ఉంటాయి. కాని, వాటన్నిటిలో ఉండే శక్తి ఒక్కటే. అన్ని బల్బులలో ఒకే విద్యుత్ ఉన్నట్లుగా అన్ని దేహాలలో ఒకే చైతన్యం ఉంది.

ఏకో దేవః సర్వ భూతేషు గూఢః..... ...... సర్వ భూతాంతరాత్మా

ఒకే పరమేశ్వరుడు సర్వ భూతాలలో దాగి ఉన్నాడు. సర్వ జీవులలో ఆత్మస్వరూపంగా శోభిస్తున్నాడు అన్నది ఉపనిషత్తు.

మట్టి ఉంటేనే కుండ ఉంటుంది. కుండ లేకపోయినా, మట్టి ఉంటుంది. బల్బు వెలుగుతూ ఉంది అంటే విద్యుత్ ఉంది అని అర్థం. బల్బు పగిలి పోతుంది. అలాగని, విద్యుత్ నలిగిపోదు. నశించిపోదు.

ఆత్మ ఉంటేనే దేహాలు ఉంటాయి. దేహాలు లేకపోయినా ఆత్మ ఉంటుంది. ఇప్పుడు దేహం ఉంది. దేహంలో చైతన్యాత్మ ఉంది. దేహం పుట్టక ముందు ఈ దేహం లేదు. దేహం లేకపోయినా ఆత్మ చైతన్య స్వరూపంగా భాసిస్తూనే ఉంది. అర్జునా! నువ్వు ఆత్మవి. కనుక ఎప్పుడూ ఉంటావు. ఈ రాజులు కూడా అంతే.

నడిచే రథాలు మారుతాయి

నడిపే రథికుడు మారడు

అర్జునా! అర్థమైంది కదూ! ఎప్పుడూ ఉండేది ఏదో అది నిత్యము. ఎప్పుడూ ఉండ లేనిది ఏదో అది అనిత్యము. నిత్యము ఎప్పుడూ పోనిది కనుక దాని కోసం దుఃఖింప నవసరం లేదు. అనిత్యము ఎప్పుడైనా పోయేదే కనుక దాని కోసం కూడా దుఃఖింప పని లేదు. ఆత్మ నిత్యము. కనుక మన మందరమూ నిత్యులమే. ఎప్పుడూ ఉండే వాళ్ళమే. దేహాలు పోయినా పోయే వాళ్ళము కాము. దేహాలు రాక ముందు కూడా ఉన్న వాళ్ళమే.

దేహం రథం లాంటిది (***శరీరం రథ మేవ***). తనకు తానుగా నడవ లేదు. నువ్వుంటేనే నడుస్తుంది. ఎవరి రథము వారిదే. కాని, ఒక రథం ఉన్నట్లు మరొక రథం లేదు. ఏ రెండు శరీరాలూ ఒకే విధంగా లేవు. ఒకే రంగులో లేవు. ఒకే రూపంలో లేవు. మాటలో భేద ముంది. చూపులో తేడా ఉంది. నడకలో వ్యత్యాస ముంది. అర్జునా! ఈ తారతమ్యం ఎక్కడిది? అందరి శరీరాలు ఒకే విధంగా ఎందుకు లేవు?

కృష్ణా! శరీరాలు కూడా కర్మఫలాలే. అందరూ గతంలో ఒకే విధమైన కర్మాచరణం చేయలేదు. అందుచేత, అందరి శరీరాలు ఒకే విధంగా లేవు. మరి, ఈ దేహం ఎప్పుడు చేసిన కర్మకు ఫలం? ఈ జన్మలో చేసిన కర్మల యొక్క ఫలితమే అని చెప్ప గలరా? దేహం రావడమే కదా జన్మ? జన్మ వచ్చిన తరువాతే కదా

కర్మ? మరి, ఈ దేహంతో, ఈ జన్మలో ఆచరించే కర్మ వల్ల ఈ జన్మలోనే ఈ దేహాన్ని ఎలా పొందగలం? నేడున్న దేహం గత జన్మల కర్మఫలం.

అదీ విషయం. గత జన్మలో కర్మలు చేశాము కదా! ఆ కర్మలు ఏ దేహంతో చేశాము? ఏ దేహమో తెలియదు గాని ఈ దేహమైతే కాదు. ఈ దేహంతో గత జన్మలో కర్మలు ఎలా చేస్తాం? సరే. మరి వేరే దేహం ద్వారా ఇప్పుడు కర్మఫలాలను అనుభవించేది ఎవరు? నేనే. ఎవరి కర్మఫలం అది? నాదే. ఎప్పుడు చేసింది? గత జన్మలో. అంటే ఇప్పుడున్న నువ్వు అప్పుడు కూడా ఉన్నావా? ఉండబట్టే కదా చేశాను? అప్పుడు చేసిన నువ్వు ఇప్పుడు కూడా ఉన్నావా? ఉండబట్టే కదా అనుభవిస్తున్నాను? బావుంది. మరి ఇప్పుడున్న దేహం అప్పుడు లేదు కదా! లేదు. అప్పుడున్న దేహము ఇప్పుడు లేదు కదా! లేదు. అప్పుడున్న నీవు, ఇప్పుడున్న నీవు ఒక్కరేనా? అవును. అందుకే అంటున్నాను. నువ్వు ఎప్పుడూ ఉండే వాడివే నని. నేడున్న నువ్వు గతంలో ఉన్నా వని, భవిష్యత్తులో కూడా ఉండబోతా వని. నీ లాగే ఈ రాజు లందరూను. అర్జునా! ఇప్పుడు చెప్పు. దుఃఖానికి కారణ ముందా?

ప్రయాణంలో ఎన్నో బండ్లు ఎక్కుతాము. ఎన్ని ఎక్కుతామో అన్ని దిగుతాము. బండ్లు మారుతాయి. మారుతూనే ఉంటాయి. ప్రయాణం చేసే వాడు మాత్రం మారడు. మారే వాటిలో మారనిది, నశించే దేహాలలో నశించనిది ఏదో అదే నీ స్వరూపం. అందరి స్వరూపం అదే. రూపాలలో భేదాలే గాని స్వరూపంలో భేదం లేదు.

చరణం : ***రూపాలకు రూపము నీవే - రూపము లేని స్వరూపము నీవే***
ఊరు పేరు ఉనికి ఏల? ఊపిరి నీవై నిలిచిన వేళ

పల్లవి : ***ఎన్నో ఎన్నో రూపాలు - అన్నీ ఆరే దీపాలు***
మారని రూపం ఆరని దీపం భువిలో దివిలో నీవే సకలం *॥ ఎన్నో ॥*

ఇది ఆత్మ చైతన్యం. చైతన్య గానం లోని అమృతానంద రాగం.

అర్జునా! మారే దానిని మారకుండా ఆప లేము. మారని దానిని ప్రయత్నించినా మార్చ లేము. అనిత్యాలు మారుతూనే ఉంటాయి. మారే అనిత్యాలకు ఆధారమైన నిత్యాత్మ మారదు. సదాత్మగా సదా శోభిస్తూ ఉంటుంది.

అర్జునా! ఆకాశం ఉంది. వాతావరణ మార్పుల్ని ఆకాశంలో మనం చూస్తూ ఉన్నాం. వాతావరణం మారుతూ ఉంది. ఆకాశం మారుతుందా? నిత్యమైన ఆకాశం మారదు. అది సర్వగతం. అలాగే నిత్యమైన నీవు కూడా మార్పు లేని వాడవు. సర్వగతుడవు (***ఆకాశవత్ సర్వగతశ్చ నిత్యః***). నీవూ నిత్యుడవే. ఈ రాజు లందరూ నిత్యరూపులే. ఆత్మస్వరూపులే. కనుక ఎవరూ ఎవరి కోసము దుఃఖింప నవసరం లేదు.

భేదం అజ్ఞానం - అభేదమే జ్ఞానం

అర్జునా! మన మందరము భవిష్యత్తులో కూడా లేకుండా పోయేవాళ్ళం కాము అని శ్రీకృష్ణుడు బోధించడములో అర్థం స్పష్టంగా తెలుస్తూ ఉంది. ఈ దేహాలు నశించిన తరువాత కూడా ఆత్మ స్వరూపంగా మనం సదా ఉంటాం అనేది నిర్వివాదంగా గోచరిస్తోంది.

నేను, నీవు, ఈ రాజులు అంటూ వేరు వేరుగా చెప్పింది ఉపాధి స్థాయి నుండే గాని ఆత్మస్థాయి నుండి కాదు. శ్లోకంలో **వయం** అనే బహువచనం ఉండటం వల్ల, దానిని పట్టేసుకొని భేదాన్ని అల్లుకొంటూ పోయారు అద్వైతము నచ్చనివారు. ఇలాంటి అస్పష్ట వ్యాఖ్యానాలు తలెత్త కూడదనే శ్రీ శంకర భగవత్పాదులు భాష్యంలో వివరణమును విస్పష్టం చేశారు.

దేహ భేదాను వృత్త్యా బహువచనం న ఆత్మాభిప్రాయేణ

అక్కడ ఉన్న రాజుల్ని ఎలా చంపాలి? అనే మీమాంసలో అర్జునుడు ఉన్నాడు. ఆ రాజు లందరికీ దేహాలు ఉన్నాయి. అవి కూడా అనేక రూపాలలో గోచరిస్తూ ఉన్నాయి. కనుక, దేహముల భేదమును బట్టి దేహస్థాయి నుండి బహువచన ప్రయోగం చేయడం జరిగిందే గాని, ఆత్మస్థాయి నుండి కాదు.

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాన్తరప్రాప్తి ర్ధీర స్తత్ర న ముహ్యతి ॥ 13

దేహినః-అస్మిన్-యథా-దేహే-కౌమారం-యౌవనం-జరా
తథా-దేహాంతరప్రాప్తిః-ధీరః-తత్ర-న-ముహ్యతి

దేహినః	= జీవునకు	యథా	= ఎలాగో
అస్మిన్	= ఈ	తథా	= అట్లే
దేహే	= దేహము నందు	దేహాంతరప్రాప్తిః	= మరొక దేహము ప్రాప్తించుటను
కౌమారం	= బాల్యము	తత్ర	= ఆ విషయమున
యౌవనం	= యౌవనము	ధీరః	= జ్ఞాని
జరా	= ముసలితనము	న ముహ్యతి	= మోహమును పొందదు.

జీవుడికి ఈ దేహంలో బాల్యము, తరువాత యౌవనము, ఆ తరువాత ముసలితనము కలుగుతున్నాయి కదా! అలాగే చనిపోయిన తరువాత మరొక దేహం ప్రాప్తిస్తుంది. ఈ విషయంలో జ్ఞానులు మోహానికి గురి కారు. అందుకనే, వారిని ధీరులు అని పిలుస్తారు.

వ్యాఖ్య

మరణించేది ఆత్మ కాదు. మార్పు చెందేది ఆత్మ కాదు. నీవు ఆత్మవే. నీవు మరణించవు. నీవు మార్పు లేని వాడివి. మార్పు లేని, మరణం తెలియని ఆత్మకు దేహం ఉపాధి. ఉపాధికి అవస్థలు ఉన్నాయి. మార్పు లున్నాయి. మరణం ఉంది. పరిణామము చెందుతూ పతనమయ్యే దేహాన్ని ఉపాధిగా కలిగిన ఆత్మ దేహి ***(దేహః అస్య అస్తీతి దేహీ)***. ఎవడికి దేహం ఉంటుందో అతడే దేహి, లేక జీవాత్మ. అంటే, దేహముతో కలసిన ఆత్మయే జీవుడు అని అర్థం.

దేహం రాక ముందు జీవుడు ఉన్నాడు. కనుక, దేహం నశించినా జీవుడు ఉంటాడు అని జీవి యొక్క నిత్యత్వాన్ని గడచిన శ్లోకంలో చూశాము. ఈ సత్యాన్ని గ్రహించిన జ్ఞానులు మృత్యువు విషయంలో శోకమోహాలకు గురి కారు. జీవాత్మ నశించేది కాదు. వికారము చెందేది కాదు. కనుక, ఎటువంటి వికారానికి, వినాశానికి కూడా దుఃఖింప వలసిన అవసరం లేదు. ఈ విషయం ప్రస్తుత శ్లోకంలో సోదాహరణంగా వివరింప బడుతూ ఉంది.

దేహము - దేహి

దేహములో ఉన్నవాడు దేహి. దేహమును ఉపాధిగా కలవాడు దేహి. దేహం మారుతూ ఉంటుంది. అది గ్రహిస్తున్న దేహిలో ఏ విధమైన మార్పు ఉండదు. మార్పులన్నీ దేహధర్మాలే గాని ఆత్మధర్మాలు కావు. అందుచేతనే, మరణించిన వ్యక్తిని గూర్చి మాట్లాడే టప్పుడు జీవుడు దేహాన్ని వదిలేశాడు అంటాము. అంతేగాని, దేహము జీవుణ్ణి వదిలేసింది అని చెప్పము. చావడము అనేది దేహధర్మము కనుక, చనిపోయిన వ్యక్తిని దేహధర్మ మొందినాడు అని పెద్దలు వ్రాస్తూ ఉంటారు. పలుకుతూ ఉంటారు. ఇవన్నీ ఆత్మ యొక్క నిత్యత్వాన్ని

నిరూపించిన పవిత్ర ఆర్ష సంస్కృతిలో, జ్ఞానం కలిగిన వ్యక్తుల నాలుకలపై తొణికిస లాడే జ్ఞానామృత జల బిందువులు.

దేహం ఎప్పుడూ ఒక విధంగా ఉండదు. మారుతూ ఉంటుంది. మన దేహాన్నే తీసుకోండి. గతంలో ఉన్నట్లు ఇప్పుడు లేదు. గతానికి, ఇప్పటికి శరీరంలో చాలా మార్పు లున్నాయి. అయినా, దేహాన్ని తెలుసు కుంటున్న మనలో ఏ మార్పూ లేదు. అదే జీవాత్మ. దేహం లోని మార్పులను గ్రహిస్తూ తనలో ఏ విధమైన మార్పు లేనిది.

మారేది దేహం. మరణించేది దేహము. దేహము ఎప్పుడో ఒకనాడు మరణిస్తుంది అనేది అందరికీ తెలుసు. కాని, దేహము ఎప్పుడూ మరణిస్తూనే ఉంది అనేదే అర్థం కావాలి. ఎప్పుడూ మరణిస్తూనే ఉంది అనే సత్యం అర్థమైతే, ఇప్పుడూ మరణిస్తూనే ఉంది అనే జ్ఞానం కలుగుతుంది. మరణం దుఃఖ కారణమైతే, మరణము ఎప్పుడూ సాగుతూనే ఉంది కనుక దుఃఖము కూడా సదా కొనసాగుతూనే ఉండాలి. కాని, అలా జరగడం లేదు. ప్రాణం పోయి నప్పుడే మనుషులు దుఃఖిస్తున్నారు. అదే మరణం అని భావిస్తున్నారు. ఇదేదో కాస్త గజిబిజి గానే ఉంటుంది. కాస్త వివరంగా చెప్పుకొని అర్థం చేసుకుందాం.

వికారం - నిర్వికారం

ఆత్మ నశించదు. నశించని ఆత్మను అంటి పెట్టుకున్న అవస్థలు నశిస్తున్నాయి. దేహంలో వచ్చే మార్పులే అవస్థలు. అందరి అనుభవంలో అగుపించేవే. చిన్న బిడ్డను వృద్ధుడు అని అనలేము. బాలుడు అంటాము. కనుక, దేహమును ధరించిన జీవుడు, లేదా దేహి యొక్క మొదటి దశ బాల్యదశ. అదే బాల్యావస్థ.

బాలుడు బాలుడు గానే ఉండడు. పెరిగి పెద్దవాడు అవుతాడు. అంటే యౌవనములో అడుగు పెడతాడు. అతడు యువకుడు. బాల్యావస్థ నుండి యౌవనావస్థలో ప్రవేశించిన వాడు.

ఈ రెండు అవస్థల లోను దేహంలో చాలా మార్పు గోచరిస్తూ ఉంటుంది. బాల్యంలో దేహం శక్తిహీనంగా ఉంటుంది. చిన్నదిగా ఉంటుంది. యౌవనం వచ్చే సరికి దేహం శక్తివంత మౌతుంది. పెరిగి పెద్దది అవుతుంది. దృఢ పడుతుంది. ఈ రెండు అవస్థలను తెలుసు కుంటున్న దేహిలో మాత్రం ఏ మార్పూ ఉండదు.

యౌవనము నుండి అదే వ్యక్తి వార్ధక్యానికి ప్రయాణాన్ని సాగిస్తాడు. అదే వృద్ధాప్యం. ముసలితనం. ఇది వృద్ధావస్థ. ఈ అవస్థ మిగిలిన రెండు అవస్థల కన్నా భిన్నంగా ఉంటుంది. దేహంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయి.

శరీరంలో పటుత్వం తగ్గుతుంది. నడకలో వేగం ఉండదు. పరుగు ఊహకు అందదు. వెంట్రుకలు తెల్ల బడతాయి. దంతాలు ఊడి పోతాయి. ఊతకర్ర చేతికి వస్తుంది. చూపు మందగిస్తుంది. చెవులు సరిగా వినపడవు. విన్నది అర్థం కాదు. తిన్నది జీర్ణం కాదు. దేహం లేవ నంటుంది. లేపితే కూర్చోలే నంటుంది. నడుము వంగి పోతుంది. మెడ తిరగ నంటుంది. దడ మొద లవుతుంది. బాల్య యౌవనాలలో ఉన్నది ఒక శరీరమే అయినా, అప్పటికి ఇప్పటికీ, ఆ అవస్థకు ఈ అవస్థకు ఎంతో తేడా ఉంది. ఇవన్నీ వికారాలే. మార్పులే. తిరుగు లేని తీర్పులే. దేహంలో ఇన్ని వికారాలు గోచరిస్తున్నా, దేహి యైన జీవాత్మ నిర్వికారం గానే ఉంది. ఆత్మకు ముసలితనం లేదు. వృద్ధ మానవుడు అంటున్నారే గాని, వృద్ధాత్మ అని ఎవరూ అనడం లేదు.

ఎందుకో తెలుసా! మార్పులన్నీ శరీరానివే. ముసలితనం శరీరానికే. దేహి శరీరం కాదు. ముసలివాడు కాలేడు. శరీరాలలో ఉన్న వాడే గాని తాను శరీరం కాదు. శరీర రహితుడు. అందుకే, ***అశరీరం శరీరేషు*** అన్నది ఉపనిషత్తు. అంటే, శరీరాలలో శరీరం లేకుండా ఉండే వాడు అని అర్థం. ఇది అర్థమైతే దేహం లోని మార్పులు

దుఃఖ కారణాలు కావు. మరణం కూడా దేహానికే కనుక మరణంలో కూడా మోహము ఉండదు. శోకము ఉండదు. ఈ జ్ఞానము ఎవరికి ఉంటుందో అతణ్ణి ధీరపురుషుడు అంటున్నాడు భగవానుడు.

మార్పు - మరణం

మార్పు లన్నీ దేహానివే అని తెలిసిన వారు అవస్థలు మారుతూ ఉన్నా ఆవేదన చెందరు. ఆందోళనకు గురి కారు. కాని, మార్పు లెన్ని జరుగుతున్నా దిగులు చెందని జనులు మరణం వచ్చే సరికి దిగాలు పడతారు. కలత చెందుతారు. కన్నీళ్ళు పెట్టుకుంటారు. ఎందుకో తెలుసా! మరణం కూడా మార్పే నని తెలియదు కనుక.

మరణం అనేది ఒకచోట జరిగేది కాదు. ఒకప్పుడు కలిగేది కాదు. ఎప్పుడూ జరిగేదే. జరుగుతూ ఉండేదే. మనిషి ఒక్క క్షణంలో మరణించడం లేదు. ప్రతిక్షణం మరణిస్తూనే ఉన్నాడు. మన దేహం నిత్యము మారుతూ ఉంది. మన శరీరంలో ప్రతి జీవకణము క్షణం క్షణం మార్పుకు లోనవుతూనే ఉంది.

బాల్యావస్థను చూశాం. అది పోయింది. అదొక చావు. ఆ తరువాత యౌవనం పుట్టింది. కొంత కాలానికి అది కూడా పోయింది. అది మరొక చావు. ఆ తరువాత వృద్ధాప్యం పుట్టింది. అది మృత్యువుతో చస్తుంది. అదే చివరి చావు. ఇవన్నీ మరణాలే. చావులే. మరణం అంటే ఏదో కాదు, మార్పే.

మరి, బాల్యా ద్యవస్థలతో పాటు మరణం కూడా మార్పే అయి నప్పుడు, అవస్థల మార్పులలో దుః ఖించని వాడు మరణం విషయంలో ఎందుకు దుఃఖిస్తున్నాడు? కారణ మేమిటి?

బాల్యా ద్యవస్థలు దేహానికి వస్తున్నా, తాను మాత్రం దేహం లోనే ఉండి చూస్తున్నాడు. తనకు ఏ విధమైన హాని లేదు కనుక దుఃఖించడం లేదు. బాల్య యౌవన వార్ధక్యాల వలె మరణం కూడా ఒక అవస్థే నని తెలియక పోవడం చేత మరణంలో దుఃఖం కలుగుతోంది. మూడు అవస్థలలో తాను ఎలా నిర్వికారంగా ఉన్నాడో, నాల్గవ అవస్థ అయిన మరణంలో కూడా తాను నశించ కుండా ఉంటాడు అనే జ్ఞానం లేకపోవడం చేత మానవుడు శోకిస్తున్నాడు.

ఒక అవస్థ ముగిసి నపుడు మరొక క్రొత్త అవస్థ పుడుతుందే గాని క్రొత్త వ్యక్తి పుట్టడు. అవస్థ మారుతుందే గాని జీవితం మారడం లేదు. అవస్థ పోయినంత మాత్రాన వ్యక్తి పోవడం లేదు. అవస్థలు దేహానికి సంబంధించినవి. అవస్థలు పోయినా తాను ఉంటాడు. మరణం కూడా దేహానికి సంబంధించినదే. కనుక, దేహము పోయినా జీవుడు ఉంటాడు. అలాంటప్పుడు దుఃఖ మెందుకు? అవస్థలు నశించి నపుడు ఎలా దుః ఖం లేదో, మరణావస్థలో కూడా దుఃఖం ఉండటానికి వీల్లేదు. అయినా దుఃఖం కలుగుతూనే ఉంది.

ఇక్కడ మరొక సూక్ష్మమైన విషయాన్ని కూడా అర్థం చేసుకోవాలి. బాల్యా ద్యవస్థలు దేహానికి కలుగుతున్నా, దేశకాలాదులు మారడం లేదు అని కూడా మనిషి భావిస్తున్నాడు.

దేహంలో బాల్యా ద్యవస్థలు నడుస్తూ ఉంటే, ఈ దేహం లోని మార్పులన్నీ ఇప్పుడే, ఇక్కడే, ఈ ప్రదేశం లోనే ఉండి దర్శించడం జరుగుతోంది. ఈ దేహంతో పాటు ఈ కాలము కూడా కొన సాగుతూనే ఉంది. మరణం దగ్గరకు వచ్చే సరికి, మరణం అవస్థే అయినా, దేహాంతర ప్రాప్తి అనేది మరొక దేశంలో, మరొక కాలంలో జరుగుతూ ఉంది. అది కూడా భయానికి ముఖ్య కారణ మౌతూ ఉంది. కాని, దేశకాలాదులు కూడా మార్పులే అని తెలుసుకుంటే ఆ దిగులు కూడా దూర మవుతుంది.

మనకు ప్రాణతుల్యమైన వ్యక్తే కావచ్చు. అలాగని, అతడు విదేశాలకు వెళ్తే మనం దుఃఖిస్తామా? మరి దేహాంతర ప్రాప్తి ఏమిటి? అలాంటిదే కదా! ప్రయోజనం ఉంది కనుకనే మన ఆత్మీయుడు విదేశాలకు

వెళ్ళాడు. ప్రయోజనం ఉంది కనుకనే జీవుడు ఈ దేహాన్ని విడిచి మరొక దేహం లోకి వెళ్తున్నాడు. కనుక, చావు హర్షించ దగిందే గాని గర్హించ దగింది కాదు.

అవస్థలు మారినంత మాత్రాన జీవికి ఎలా నశింపు లేదో, దేహాంతర ప్రాప్తి కూడా అలాంటిదే. దేహము నశించి నంత మాత్రాన దేహి నశించడం లేదు. బ్రతుకులో ఎన్నో మార్పులను చూచి చలించని జీవుడే చావును కూడా ఒక మార్పుగా చూస్తున్నాడు.

వనంలో పువ్వులు వికసిస్తూ ఉంటాయి. అలాగే వాడిపోతూ ఉంటాయి. మళ్ళీ తాజా సుమాలు విరబూస్తూ ఉంటాయి. జీవన వనవాటికలో పాత అవస్థలు మరుగున పడుతూ ఉంటాయి. నూతన అవస్థలు తెర మీదికి వస్తూ ఉంటాయి. ఇలాంటి వాటికి ధీరుడు దుఃఖించడు. మోహాన్ని పొందడు **(ధీరః ధీమాన్ తత్ర ఏవం సతి న ముహ్యతి న మోహమ్ ఆపద్యతే).** మారేవి మారుతున్నా, ఆరేవి ఆరుతున్నా, మారని, మారలేని, ఆరని, ఆరిపోని అఖండ జ్యోతిర్మయానందము తన స్వరూపమే నని ధీరువికి తెలుసు.

నాడు ఉండినది నేడు ఉన్నది
రేపు ఉండునది ఉండ దగినది
అది ఇది కానిది అద్భుతమైనది
అన్నిటికీ ఆధార మైనది
ఆరని దీపము అఖండము
జీవుల గమ్యము చైతన్యము
రామ రామ జయ రాజారాం
రామ రామ జయ సీతారాం

అని దేహివి చేరే గుర్తును తెలుపుతూ, చైతన్య గుళికను గుటక వేయించింది రామజోగి చిట్కాలులో ఆనంద నిధానం.

పాత భవనాన్ని కూల్చేసి, అక్కడే మరొక అందమైన నూతన భవనాన్ని నిర్మించుకుంటాం. దివ్యమైన ఆ భవనం లోకి ప్రవేశించడానికి ఉత్సాహ పడతామే గావి నిరుత్సాహంతో నీరసిస్తామా? పాతది పోయిందని దుఃఖిస్తామా? దేహాంతర ప్రాప్తి కూడా ఇంతే.

ఆత్మ యొక్క నిత్యత్వం అర్థమైతే, దశలు మారుతున్నా, మరణం సమీపిస్తున్నా, దేహి ధీరుడై ఉంటాడు. ఆనంద స్వరూపుడై ఉంటాడు. మరణం అనేది అతనికి శోక సన్నివేశం కాదు. మంగళస్నానం లాంటిది.

ఒక యజ్ఞాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తాం. పూర్ణాహుతిని ఆనందంగా జరుపుకుంటాం. ఆ తరువాత అందరమూ శుభకరంగా నదిలో దిగి మంగళస్నానం చేస్తాం. దానినే **అవభృథ స్నానం** అంటారు.

జీవితం ఒక మహాయజ్ఞము లాంటిది. ఈ దేహం సమాప్తమై, దేహాంతర ప్రాప్తి కలిగే ముందు జీవన యజ్ఞానికి పూర్ణాహుతి పవిత్ర సమయంలో లభించే మంగళస్నానమే, అవభృథ స్నానమే మరణం. శోకానికి కారణమే లేని పావన తరుణం.

మరణం - మరపు

చివరగా ఈ సందర్భంలో ఒక్క సందేహం మనస్సును పట్టుకొని వ్రేలాడుతూ ఉంటుంది. బాల్యాద్యవస్థల లాంటిదే దేహాంతర ప్రాప్తి కూడా అనేది అర్థమైంది. అలాంటపుడు, బాల్యంలో, యౌవనంలో జరిగిన విషయాలు మనకు జ్ఞాపక మున్నాయి కదా! మరి గత జన్మ స్మృతులు ఎందుకని లేవు?

అది అర్థం చేసుకొనే ముందు మరొక్క విషయాన్ని కూడా మనస్సులో పెట్టుకుందాం. ఈ జన్మలో జరిగిన విషయాలు అన్నీ మనకు జ్ఞాపక మున్నాయా? ముఖ్యంగా శైశవదశ లోని అనుభవాలు స్మృతికి వస్తున్నాయా? రావు. రాలేవు. ఎందుకో తెలుసా?

శైశవదశలో బుద్ధి వికసనం జరగదు. అందువల్ల మనస్సు పేలవంగా ఉండి ఏ అనుభవాన్ని నిలుపుకో లేక పోతుంది. అంతమాత్రాన శైశవంలో అనుభవాలు, అనుభూతులు లేవని కాదు కదా!

మరణంలో మనసు విచ్ఛేద మవుతుంది. బుద్ధి వికల మౌతుంది. అలలు తీవ్రంగా కదలి నపుడు బావిలో పూడిక కనిపించనట్లు, మనసు కల్లోల మైనందున జ్ఞాపకాలు తెలియవు. అందుకే జన్మాంతర విషయాలు మరుగున పడిపోతూ ఉంటాయి. ఇది కూడా సృష్టిలో నియతికి సంబంధించిన విషయమే. ముమ్ముందు గీతా వ్యాఖ్యానంలో ఇవన్నీ చూస్తాము. కాకపోతే, జన్మాంతర జ్ఞాపకాల విషయంలో మరపు ఒక వరం లాంటిది. భగవత్ప్రసాదం వంటిది.

గత జన్మల జ్ఞాపకాలు వర్తమాన జీవితాన్ని నిస్సారంగా మారుస్తాయి. రాగద్వేషాలకు పాదులుగా మారుతాయి. అనిశ్చితమైన జీవన విధానానికి శ్రీకారం చుడతాయి. అవసరం లేని వాటిని అవసరాలుగా చూపుతాయి. ప్రశాంత జీవనంలో అశాంతి మంటలు రేపినా ఆశ్చర్యపడ నవసరం లేదు. అందుకే నేమో, సర్వజ్ఞుడు, సర్వ నియంత అయిన పరమేశ్వరుడు పూర్వజన్మ స్మృతి లేకుండా మనిషి మనస్సులో మరపును మడతపెట్టి ఉంచాడు.

*అనిత్యమైన దేహం గతిస్తుంది. దేహం కన్నా అన్యమైన ఆత్మ నశించదు అనే జ్ఞానం కలగడం వల్ల మరణం విషయంలో మోహం కలగదు. కాని, జీవితకాలంలో సుఖదుఃఖాల కారణంగా శోకమోహాలు ఏర్పడుతాయి కదా! అని అర్జునుడు సంశయిస్తాడని ఊహించి (**ఉత్తరవాక్య వచనం ఆశఙ్క్య**) స్థూల దేహం కన్నా ఆత్మ విలక్షణంగా ఉన్నట్లే, సూక్ష్మ దేహం కన్నా కూడా ఆత్మ విలక్షణ మైనది అని చెప్పడం ప్రారంభిస్తున్నాడు గీతాచార్యుడు*

మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ 14

మాత్రాస్పర్శాః-తు-కౌంతేయ-శీతోష్ణ సుఖదుఃఖదాః
ఆగమాపాయినః-అనిత్యాః-తాన్-తితిక్షస్వ-భారత

కౌంతేయ	= కుంతీకుమారా!	ఆగమాపాయినః	= రాకపోకలు గలవి
మాత్రా స్పర్శాః తు	= ఇంద్రియాలకు ఇంద్రియ విషయాలతో కలిగే సంబంధాలైతే	అనిత్యాః	= అస్థిర మైనవి
శీతోష్ణసుఖదుఃఖదాః	= శీతోష్ణ సుఖదుఃఖములను కలిగిస్తాయి	భారత	= హే అర్జునా!
		తాన్	= వాటిని
		తితిక్షస్వ	= ఓర్చుకో

అర్జునా! ఇంద్రియాలకు ఇంద్రియ విషయాలతో సంబంధం కలిగి నపుడు శీతోష్ణాలు కలుగుతాయి. అలాగే సుఖదుఃఖాలు ఏర్పడుతాయి. పార్థా! అవి వస్తూ ఉంటాయి: పోతూ ఉంటాయి. స్థిరంగా ఉండవు. వాటిని నీవు ఓర్చుకోవాలి.

వ్యాఖ్య

నిత్యమైన ఆత్మ నశించేది కాదు కనుక శోకానికి అవకాశం లేదు. ఆత్మ కన్నా అన్యమైన దేహం నశించేదే

కనుక దాని విషయంలో కూడా దుఃఖానికి కారణము లేదు. ఈ సత్యము మరణ భయాన్ని తొలగిస్తుంది. కాని నిత్య జీవితంలో దుఃఖాన్ని కలిగించేవి చాలా ఉన్నాయి. మరణానికి సంబంధించిన దుఃఖము తొలగినంత మాత్రాన అన్ని దుఃఖాలు అదృశ్యమై పోతాయి అని అనుకో గలమా? మరణం దేహానికి సంబంధించింది. స్థూల శరీరానికి సంబంధించింది. జీవుడు స్థూలం తోనే కాదు, సూక్ష్మ శరీరంతో కూడా తాదాత్మ్యం చెంది ఉన్నాడు. అనేక కారణాల వల్ల జీవితంలో దుఃఖం ఏర్పడుతూ ఉంటుంది. ఆ విషయాన్ని కూడా ప్రస్తుత శ్లోకంలో చర్చించి, దుఃఖ కారణాలను తొలగిస్తున్నాడు భగవంతుడు.

దేహం చస్తేనే కాదు దుఃఖం కలిగేది. చస్తుంది అనే వార్త కూడా దుఃఖాన్ని కలిగిస్తుంది. చావును ప్రక్కన పెడితే, బ్రతికి ఉన్నప్పుడు కూడా దేహం వల్ల బాధలు కలుగుతూనే ఉంటాయి.

బ్రతుకు నడవాలి అంటే మనిషి కూడా నడవక తప్పదు. కూర్చుంటే బ్రతుకు నడవదు. మరి నడిచే టప్పుడు పడే అవకాశం లేక పోలేదు. జారితే ఆశ్చర్యం లేదు. పడి దెబ్బ తగిలితే దేహానికి గాయ మవుతుంది. గాయము బాధిస్తుంది. దుఃఖాన్ని కలిగిస్తుంది.

తల ఉన్నందుకు తలనొప్పి వస్తుంది. కడుపు ఉన్నందుకు కడుపు నొప్పి వస్తుంది. అవయవాలు దేహంలో పని చేస్తున్నాయి. పని చేస్తున్నాయి కనుక కొన్ని అరిగి పోతాయి. మరి కొన్ని పాడై పోతాయి. ప్రయత్నిస్తే పాడైనవి కొన్ని బాగవుతాయి. కొన్ని శాశ్వతంగా పాడై పోతాయి. ఇవన్నీ బాధలే.

వేడిని, చలిని తట్టుకో నేందుకు దేహంపై చర్మం ఉంది. అధిక వేడికి చర్మము కాలి పోతుంది. అధిక చలికి చర్మము ముడుచుకు పోయి పగిలి పోతుంది. చర్మము ఉన్నందుకు ఈ చలనాలు తప్పవు. చర్మములో చలనాలు కలుగుతూ ఉంటే చిత్తంలో సంచలనాలు పుడుతూ ఉంటాయి. సంఘర్షణలు కుదుపుతూ ఉంటాయి. ఇవన్నీ దుఃఖాలు. వీటి స్వభావ స్వరూపాలను, నివారణోపాయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

మాత్రలు - స్పర్శలు

మాత్రలు అంటే ఇంద్రియాలు. స్పర్శలు అంటే విషయాలు. చెవి, కన్ను, నాలుక, ముక్కు, చర్మము అనేవి ఇంద్రియాలు. శబ్దము, రూపము, రుచి, వాసన, స్పర్శ అనేవి విషయాలు. ఐదు ఇంద్రియాలు ఐదు ఇంద్రియ విషయాలను గ్రహిస్తూ ఉంటాయి. ఇంద్రియాలు దేహంలో ఉంటాయి. విషయాలు దేశంలో ఉంటాయి.

ఆభిః మీయన్తే శబ్దాదయః ఇతి శ్రోత్రాదీని ఇంద్రియాణి మాత్రాః

శబ్దము మొదలైన విషయాలను గ్రహించే ఇంద్రియాలను మాత్రలు అంటారు. ఇవి శబ్దాది విషయాలను కొలుస్తాయి. మదింపు వేస్తాయి. సకిలింపు వినిపిస్తే గుఱ్ఱ మని, గాండ్రింపు వినిపిస్తే వ్యాఘ్ర మని గ్రహించ డానికి చెవి అనే ఇంద్రియము కారణము. ఇది మేక, అది మేఘము అని గ్రహించడానికి కన్ను అనే ఇంద్రియము కారణము. ఈ విధంగా విషయ ప్రపంచంలో ఏది ఏమిటో గ్రహించడానికి, మదింపు వేయడానికి ఇంద్రియాలు ఉపకరిస్తాయి. వీటిని మాత్రలు అంటారు. ఇక స్పర్శలు చూద్దాం.

స్పృశ్యన్తే ఇతి స్పర్శాః విషయాః శబ్దాదయః

స్పర్శలు అంటే స్పృశింప బడేవి అని అర్థం. అంటే ఇంద్రియాలు అనే మాత్రల ద్వారా స్పృశింపబడే విషయాలు. ఇవే స్పర్శలు. ఇంద్రియ విషయాలు.

దేహం ఉన్నంత వరకు దేహంలో ఇంద్రియాలు ఉంటాయి. ఇవి ఐదు ఇంద్రియాలు. వీటి వల్లనే విషయ జ్ఞానము కలుగుతూ ఉంది కనుక వీటిని పంచ జ్ఞానేంద్రియాలు అంటారు. ఇవి దేహంలో ఉంటాయి.

అలాగే దేశం ఉన్నంత వరకు ప్రదేశంలో విషయాలు ఉంటాయి. ఇవి ఐదు విషయాలు. వీటి విషయమే ఇంద్రియాలకు అందే జ్ఞానము. వీటిని విషయ పంచకం అంటారు. ఇంద్రియాలు ఐదు. విషయాలు ఐదు. పంచ జ్ఞానేంద్రియాల ద్వారా పంచ విషయాలు ప్రముఖంగా అందుతూ ఉన్నాయి కనుక ఇది ప్రపంచము.

ఇంద్రియాలు ఉన్నా, విషయాలు లేకపోతే ప్రపంచం ఉన్నట్లు తెలియదు. విషయాలు ఉన్నా, ఇంద్రియాలు లేకపోతే ప్రపంచం ఏమిటో అర్థం కాదు. మాత్రలు ఉండాలి. స్పర్శలు ఉండాలి. అంతే కాదు. అవి పరస్పరము సంబంధం కలిగి ఉండాలి. అప్పుడే విషయ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానము ఉత్పన్న మవుతుంది.

మాత్రాణాం స్పర్శాః శబ్దాదిభిః సంయోగాః తే శీతోష్ణ సుఖదుఃఖదాః శీతమ్ ఉష్ణమ్ సుఖం దుఃఖం చ ప్రయచ్ఛన్తి

మాత్రలు అనబడే ఇంద్రియాలకు స్పర్శలు అనబడే విషయాలతో ఏర్పడే సంయోగాలు శీతాన్ని, ఉష్ణాన్ని, సుఖాన్ని, దుఃఖాన్ని పంచుతూ ఉంటాయి. శీతోష్ణాల వల్ల సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి. అంటే, శీతము వల్ల సుఖము, ఉష్ణము వల్ల దుఃఖము అని కాదు. శీతము వల్ల ఒకప్పుడు సుఖము, ఒకప్పుడు దుఃఖము కలుగుతూ ఉంటుంది. అలాగే ఉష్ణము వల్ల ఒకప్పుడు సుఖము, మరొకప్పుడు దుఃఖము కలుగుతూ ఉంటుంది. దీనిని బట్టి చూస్తే శీతంలో సుఖమూ లేదు, దుఃఖమూ లేదు. అలాగే ఉష్ణంలో కూడాను. కాకపోతే దేశ కాల పరిస్థితులను బట్టి శీతోష్ణాల వల్ల సుఖదుఃఖాలు ఏర్పడుతూ ఉంటాయి. ఇది కొంత విశ్లేషించాల్సిన విషయం. కనుక, కొంత వివరంగా చెప్పుకుందాం.

శీతోష్ణాలు - సుఖదుఃఖాలు

శీతోష్ణాలు విషయాల నుండి కలుగుతాయి. సుఖదుఃఖాలు మనస్సు నుండి పుడతాయి. కాలాలు మారుతూ ఉంటాయి. వేసవిలో మండుటెండలు కాస్తాయి. వర్షాకాలంలో వానలు కురుస్తాయి. శీతాకాలంలో చలి చుట్టేస్తుంది.

వేసవిలో మండుటెండల్ని మనిషి భరించ లేడు. బాబోయ్! ఎండలు మండిపోతున్నాయి. వర్షాకాలం వచ్చే దెప్పుడో! అని తొందర పడతాడు. వేసవి పోయింది. వర్ష ఋతువు ప్రారంభ మవుతుంది. అయ్యో! వర్షాల వల్ల ఏ పనీ జరగడం లేదు. ఈ వర్షాకాలం పోయే దెప్పుడో! అని వాపోతూ ఉంటాడు. వర్షాకాలము పోయి శీతాకాలం వస్తుంది. అబ్బ! ఈ చలిని భరించలేక పోతున్నాను బాబు! చర్మము పగిలి పోతోంది. ఎముకలు విరిగి పోతున్నాయి. ఈ చలికాలం ఇంకెప్పుడు పోయేది? అంటూ శివరాత్రి కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఏదో రాలేదు అంటాడు. అది రాగానే పోయే దెప్పుడు? అంటాడు. ఇక ఏ కాలంలో మనిషి సుఖంగా ఉంటాడు? పోయే కాలంలో తప్ప.

కాఫీ వేడిగా ఉంటుంది. చలిలో, వర్షంలో త్రాగితే చాలా సుఖంగా ఉంటుంది. అదే కాఫీని వేసవి మండుటెండల్లో త్రాగాలంటే సుఖం ఉండదు సరికదా, చాలా అసౌకర్యంగా కూడా ఉంటుంది.

శీతల పానీయాలు కూడా అంతే. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు శీతల పానీయాలు సుఖాన్నిస్తాయి. అదే చలితో కూడిన వాతావరణంలో త్రాగాలంటే చాలా కష్టంగా ఉంటుంది. దీనిని బట్టి మనకు ఏమి అర్థ మవుతుంది? శీతమైనా, ఉష్ణమైనా వాటిలో కేవలం సుఖమే ఉందని చెప్పలేము. అలాగని దుఃఖమే ఉందని కూడా చెప్పలేము. శీతోష్ణాలు సుఖదుఃఖాల్ని పంచడము అనేది అనేక విషయాల మీద ఆధారపడి ఉంటుంది. శీతోష్ణాలు ఉన్నాయి. ఉంటాయి. వాటిని లేకుండా చెయ్యలేము. రాకుండా ఆపలేము. ఆ అవసరం మనకు లేదు కూడా. ఎందుకంటే, విశ్వ మనుగడకు అవి అవసరమై ఉన్నాయి. శీతోష్ణాలు ఉండేది వాటిని మనం తొలగించ డానికి కాదు. అర్థం చేసుకోవ డానికి. అవగాహన వల్ల వాటిని బాధించే శక్తి క్రమంగా తగ్గుతుంది.

దుఃఖ మనేది ఉష్ణము కాదు, శీతమూ కాదు. ఒక వస్తువు కాదు. ఒక ప్రదేశం కాదు. ఒక కాలం కాదు. ఒక పరిస్థితీ కాదు. అది ఆలోచనా విధానం. సుఖం కూడా అంతే. దుఃఖం కావాలని ఎవ్వరూ ఆలోచించరు. కానీ, ఆలోచిస్తూ, ఆలోచిస్తూ దుఃఖంలో పడిపోతారు. అలాగే సుఖం కూడా. సుఖం కావాలనే అందరూ ఆశిస్తారు. కాని సుఖ మేమిటో, ఎక్కడుందో అర్థం గాక ప్రయత్నించి దుఃఖాన్ని కొనితెచ్చుకుంటారు.

అన్ని వేళల పరిస్థితులు అనుకూలంగా ఉండవు. నేడుండినా రేపు ఉంటాయని చెప్పలేము. ఆశించినవి జరగవు. అవసరం లేని వన్నీ పిలిచినట్లు వస్తూ ఉంటాయి. ఎవ్వరైనా ప్రయాణం చేయాలి అనుకుంటారే గాని ప్రమాదం జరగాలని ఆశించరు. మన ఆలోచనలకి జరిగే వాటికి సంబంధం ఉండదు. జీవితంలో ఏ కష్టమూ రాకూడదని మనిషి ఆలోచిస్తాడు. తప్పు లేదు. అలాగే ఆలోచించాలి కూడా. అందరము అలాగే ఆలోచిస్తున్నాం. అలాగని వచ్చే కష్టాలు రాకుండా ఆగుతాయా? వస్తున్నా మని ముందుగా మనకు కబు రంపుతాయా? మన ఆలోచనలు ఒక వైపు నడుస్తూ ఉంటాయి. జరిగేవి మరొక వైపు జరిగిపోతూ ఉంటాయి. వీచే గాలిని ఎలా ఆపలేమో, కురిసే మబ్బును ఎలా నిలప లేమో, జీవితంలో ఎదురయ్యే వాటిని కూడా ప్రక్కకు నెట్టలేము. కాకపోతే, వాటిని అర్థం చేసుకోవడం అలవరచు కోవాలి. ఏమని? వాటికి రాకపోకలు ఉన్నాయి అని.

వస్తాయి - పోతాయి

శీతోష్ణాలు వస్తూ ఉంటాయి. అలాగే పోతూ ఉంటాయి. స్థిరంగా ఉండవు. అందుకే అవి అనియతాలు. అనిత్యాలు. 'ఆగమం' అంటే రాక. 'అపాయం' అంటే పోక. 'ఆగమాపాయినాలు' అంటే రాకపోకలు గలవి అని అర్థం. స్థిరంగా ఉండవు అని భావం.

ఇద్దరు వ్యక్తులు ఒకచోట మాట్లాడుకుంటూ ఉంటారు. అదేదో సంతోషంగా విన దగిందే నని మనసు ఉబలాట పడుతుంది. వెళ్ళి అదేమిటో చెప్పమని వాళ్ళను అడుగుతాం. అబ్బే, ఏమీ లేదు లెండి! అని వాళ్ళు మొగమాట పడతారు. మనలో కుతూహలం పెరుగుతుంది. ఫరవాలేదు, చెప్పండి అని పట్టు పడతాం. ఏమీ లేదండి! ఫలానా వ్యక్తి మిమ్మల్ని ఇలా విమర్శించాడు అని చెబుతారు. అంతే. ఆ క్షణం నుండి గాలివానకు అరటిచెట్టు లాగా మన మనస్సు ఊగి పోతుంది. దాని ప్రభావం మనస్సు మీద కొంత కాలం అలాగే ఉంటుంది. జీవితం ఇలాగే ఉంటుంది.

ఏవి ఎప్పుడు ఎలా వస్తాయో తెలియదు. వచ్చే వాటిని ఆపలేము. అర్థం చేసుకుంటూ పోవాలి. ఎవరు మనసుతో వాళ్ళు ఆలోచిస్తారు. ఇతరుల ఆలోచనల్ని మన మనసు మోస్తూ పోతే, ఆ తరువాత ఒక దశలో మన మనస్సును మనమే భరించ లేక పోతాం. సదవగాహనను ఏర్పరచు కోవాలి. సహనాన్ని పెంచుకోవాలి. ఎందుకంటే, ఏవేవో వస్తూ ఉంటాయి. అలాగే పోతూ ఉంటాయి.

మోపే వారు నిందలు ఎందరో
మోసే వాడివి కాబోకు
కాకి కూతలు ఎవరికి మధురము?
కోకిల రవమే కమనీయము
సహనమె సంపద పగయే ఆపద
సద్గతి కిదియే సోపానము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అంటూ రామజోగి చిట్కాలలో చైతన్య సందేశం.

వచ్చేవి వస్తాయి. పోయేవి పోతాయి. అవి ఎలాగైనా ఉంటాయి. వచ్చేవి చెప్పి రావు. పోయేవి భుజం తట్టి పోవు. ఏవి ఎలా ఉన్నా మనకు నష్టం లేదు. మనం ఎలా ఉండాలో మనం నిర్ణయించు కోవాలి.

పరిస్థితులు మన అధీనంలో ఉండవు. కాని, ప్రవర్తన మన అధీనమే. అన్నీ వెన్నెల రాత్రులే ఉండవు. చీకటి రాత్రులు కూడా ఉంటాయి. వెన్నెలలో విహరించాలి. చీకటిలో దీపం వెలిగించు కోవాలి. అలా జీవించ గలిగితే ద్వంద్వాలు మనస్సుపై దాడి చేయలేవు. బ్రతుకులో అందాలు దూరము కావు. ఇదంతా అవగాహన లోనే స్థిరపడాలి. ఓర్చుకొనే దెలాగో మెల్లగా నేర్చుకోవాలి. అదే తితిక్ష.

ఏవి వచ్చినా పోయేందుకే వస్తాయి. అందుకనే వాటిని భగవానుడు 'ఆగమాపాయినాలు' అంటున్నాడు. అంతేకాదు, ఎంతో కాలం ఉండవు కనుక 'అనిత్యాలు' అని కూడా అంటున్నాడు. వాటి మీద మనకు నియంత్రణ లేదు. అలాగే వాటికి నిలకడ కూడా లేదు. పట్టించు కుంటేనే పట్టి పీడిస్తాయి. అర్థం చేసుకుంటే ఆనవాళ్ళు కూడా మిగలవు.

మబ్బు లొచ్చాయి పోయాయి వచ్చినట్లే
రాకపోకలు లేక గగనము వెలుగుచుండె
జగతి మబ్బు పోయె గగనమై ఉంటివయ్య
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని విబూది పండ్లు మనస్సును అలరిస్తాయి.

వగచకుండా కాచుకో

రాకపోకలతో విసిగించే అనిత్యాలను అవగాహనతో వీక్షిస్తూ సహించడమే తితిక్ష. ద్వంద్వాలు ఏవైనా అనిత్యాలే కనుక వాటి విషయంలో పొంగిపో నవసరం లేదు. అలాగే కృంగిపో నవసరం లేదు.

తితిక్ష అంటే దుఃఖపడుతూ భరించడం కాదు. ఆవేదనతో సహించడమూ కాదు. అవగాహనతో పరిస్థితిని అవలోకించి, మనస్సులో ఏ విధమైన ప్రతిచర్యలు లేకుండా, వచ్చే వాటికి స్వాగతం పలుకుతూ, పోయే వాటికి వీడ్కోలు చెబుతూ చలించ కుండా ఉండటమే తితిక్ష (***శీతోష్ణ సుఖదుఃఖాది సహిష్ణుత్వం తితిక్షా!***).

ఈ శ్లోకంలో అర్జునుని రెండు పేర్లతో సంబోధించాడు శ్రీకృష్ణుడు. ద్వంద్వాలను సహించాలి అనే సంకేతా న్నివ్వడానికి రెండు పేర్లతో పిలిచాడేమో! లేక, పేరున్న వాడివి, పడేసుకోకు అని చెప్పడానికో!

తల్లి వైపు నుండి పిలుస్తూ, ***కౌన్తేయా!*** అన్నాడు. కుంతీకుమారా! అంటూ తల్లిని జ్ఞాపకం చేశాడు. తండ్రి వైపు నుండి పిలుస్తూ ***భారతా!*** అన్నాడు. జ్ఞానంలో రమించేవాడా! అంటూ తండ్రిని స్మృతికి తెచ్చాడు.

తల్లి యైన కుంతీదేవి ఎన్నో బాధల్ని అవగాహనతో సహించింది. తితిక్షకు ప్రతిరూపంగా శోభించింది. ధర్మాత్ముడు, పుణ్యాత్ముడు అయిన పాండురాజు తపోనిష్ఠా గరిష్ఠుడై అనేక సందర్భాలలో తితిక్షకు మారు పేరుగా భాసించాడు. అర్జునా! అలాంటి పుణ్య దంపతులకు సంతానంగా జన్మించావు. తితిక్షను అలవరచుకొని వారి బిడ్డ వనిపించుకో! మాతాపితల పేరును నిలబెట్టు అని భావించి, అలా పిలిచాడేమో! ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. మాధవుని మనస్సు మానవులకు చిక్కుతుందా! చిక్కితే అది ప్రసాదమే. అనుగ్రహమే. వాస్తవానికి వాసుదేవుని మాట లోని మర్మం వాసుదేవుడికే తెలియాలి. లేదా ఆయన స్వరూపమే అయిన వ్యాసదేవునికే తెలియాలి. అంతే.

తితిక్షాపరునికి లభించే ఫల మేమిటో చెబుతున్నాడు. శీతోష్ణ సుఖదుఃఖాలను సహించే వానికి ఏమవుతుందో వినిపిస్తున్నాడు (*శీతోష్ణాదీన్ సహతః కిం స్యాత్ ఇతి శృణు*).

యం హి న వ్యథయ న్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖసుఖం ధీరం సోఽ మృతత్వాయ కల్పతే ॥ 15

యం-హి-న-వ్యథయంతి-ఏతే-పురుషం-పురుషర్షభ
సమదుఃఖసుఖం-ధీరం-సః-అమృతత్వాయ-కల్పతే

పురుషర్షభ	=ఓ పురుషశ్రేష్ఠా!	న వ్యథయంతి	= కష్ట పెట్టవో
ఏతే	=ఇవి	సః హి	= అతడే
సమదుఃఖసుఖం	=సుఖ దుఃఖములను సమంగా చూచు	అమృతత్వాయ	= మోక్షానికి
ధీరమ్	=ధీరుడైన	కల్పతే	= అర్హుడగును
యం పురుషమ్	= ఏ పురుషుణ్ణి		

పురుషశ్రేష్ఠుడవగు ఓ అర్జునా! సుఖదుఃఖముల యందు సమబుద్ధి కలిగిన ఏ ధీరపురుషుణ్ణి ఈ మాత్రాస్పర్శలు బాధించలేవో అట్టివాడు మోక్షమును పొందుటకు అర్హుడు.

వ్యాఖ్య

ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో సంగమించి నపుడు శీతోష్ణాలు, సుఖదుఃఖాలు కలుగు తున్నాయి. అవే మానవులను సుఖదుఃఖాల ఊబిలోకి దించి కష్టపెడుతూ ఉంటాయి (*వ్యథయన్తి*). కాని, తితిక్ష కలిగి శీతోష్ణ సుఖదుఃఖాలను సమంగా భావిస్తూ, అవగాహనతో సహించే వివేకవంతుణ్ణి అవి బాధించలేవు (*న వ్యథయన్తి*).

రెండూ ఒక్కటే

సాధారణంగా అందరూ సుఖానికి అనుకూలంగా ఉంటారు. అలాగే దుఃఖానికి ప్రతికూలం గానూ ఉంటారు. అనుకూలమైన సుఖంలో ప్రీతిని కనబరుస్తూ ఉంటారు. ప్రతికూలమైన దుఃఖంలో అప్రీతిని ప్రదర్శిస్తూ ఉంటారు. సుఖంలో, సుఖ కారణాలలో రాగం కలిగి ఉంటారు. దుఃఖంలో, దుఃఖ కారణాలలో ద్వేషాన్ని కుమ్మరిస్తూ ఉంటారు.

సుఖదుఃఖాలను సమంగా చూస్తూ సహించే ధీరపురుషులు రాగద్వేషాల నుండి విడిపడి ఉంటారు. మాత్రాస్పర్శల వల్ల ఏర్పడే ద్వంద్వాలు వారిని కదిలించ లేవు (*న చాలయన్తి*). వారికి వ్యథను కలిగించ లేవు (*న వ్యథయన్తి*).

సుఖదుఃఖాలు రెండూ మనో వికారాలే. వాస్తవానికి వీటిలో సుఖం సుఖంగా లేదు. దుఃఖం దుఃఖంగా లేదు. ఒక వ్యక్తికి సుఖంగా ఉండేది మరొక వ్యక్తికి దుఃఖంగా ఉంటుంది. అంతేకాదు. ఒక వ్యక్తికి ఒక దశలో, ఒక కాలంలో ఏవైతే సుఖాలుగా అనిపిస్తాయో అదే వ్యక్తికి మరొక దశలో, మరొక కాలంలో అవి సుఖాలు కాకుండా పోతాయి. దుఃఖాలు కూడా అలాగే ఉంటాయి. అందుకే సుఖదుఃఖాలు మనోవికారాలు. ఎప్పుడూ ఉండవు. ఉన్నా ఒకే లాగా ఉండవు. వచ్చిపోతూ ఉంటాయి. ఒకసారి సుఖం రూపంలో వచ్చింది మరొకసారి దుఃఖం ముసుగు వేసుకొని వస్తుంది. కనుక అవి అనిత్యాలు. అనిత్యాలు కనుక అంతఃకరణ వికారాలే గాని ఆత్మ ధర్మాలు కావు.

ధీమంతుడే శ్రీమంతుడు

శీతోష్ణ సుఖదుఃఖాలు అనే ద్వంద్వాలు ఏ మహాపురుషుని కలత పెట్టలేక పోతాయో, అతడే ధీమంతుడు

(*ధీరం*). ధీరుడు. *ధియం* అంటే బుద్ధి. **రాతి** అంటే నిగ్రహించు వాడు. కనుకనే ధీరుడు. ఆత్మయే నిత్యమని గ్రహించిన వాడు. ఈ అధ్యాయం పదకొండవ శ్లోకంలో (గీతోపదేశ ప్రారంభ శ్లోకం) పండితుడు అని కీర్తింప బడినవాడు ఈ ధీరుడే. ధీమంతుడే. ఆత్మస్థుడే.

శీతోష్ణాలు దేహాన్ని కుదుపుతాయి. ధీమంతుని చలింప చేయలేవు. కారణం, అతడు దేహస్థుడు కాడు ఆత్మస్థుడు. అనిత్యమైన స్థూల శరీరము యొక్క ప్రభావానికి లోను గాని వాడు.

సుఖదుఃఖాలు మనస్సును విచలితం చేస్తాయి. ధీరపురుషుని కదిలించ లేవు. కారణం అతడు చిత్తస్థుడు కాడు. ఆత్మస్థుడు. అనిత్యమైన సూక్ష్మ శరీరం యొక్క ప్రతాపానికి లొంగని వాడు.

ద్వంద్వాలలో అతడు సముడు. రెండూ అతనికి ఒక్కటే. తుల్య భావంతో తన్మయమైన వాడు. ఏది ఉన్నా కదలడు. ఏది లేకపోయినా కలవర పడడు. అవి ఉన్నా లేనివే యని అతని భావం. అదే తుల్య భావం.

స్థూలమైనా, సూక్ష్మమైనా రెండూ అనిత్యాలని అతడికి తెలుసు. అందుచేత వాటి ప్రభావం అతని మీద పడదు. మండుతున్న పొయ్యి మీద నీళ్ళకుండను ఉంచుతాము. కొంత సేపటికి కుండ బాగా కాగుతుంది. పట్టుకుంటే కాలుతుంది. అలాగే కుండ లోని నీళ్ళు సలసల కాగుతాయి. పైన పడితే కాల్చుతాయి.

పొయ్యి లోని మంట కుండను కాల్చింది. నీళ్ళను కాచింది. కాని, కుండ లోని ఆకాశాన్ని కాల్చ గలిగిందా? పేల్చ గలిగిందా? అందుకే ఆకాశాన్ని అసంగం అంటాము.

సుఖదుఃఖాలు కూడా కుండ లాంటి స్థూలదేహాన్ని, నీళ్ళ లాంటి సూక్ష్మదేహాన్ని కలత పెట్టగలవే గాని, ఆకాశం వంటి ఆత్మను అంట లేవు. వెంట రాలేవు. ధీరుడు ఆత్మస్థుడు. అందుకే ఆ మహితాత్ముని నిత్యాత్మదర్శన నిష్ఠుడు అని భాష్యంలో అభివర్ణించారు శ్రీ ఆది శంకరులు (**సః నిత్యాత్మదర్శననిష్ఠః**).

ఉంటే ఏమి? అంటక పోతే
మంటలు మాయలు మనిషికి లేవు
ఎక్కడ లేదు ఆకాశము
అంటుట కివ్వదు అవకాశము
ఆత్మ ఎప్పుడూ అసంగము
ఎందుకు నీకు గుణసంగము?
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కాలులో అద్వయాత్మ అద్భుత వర్ణనము.

ద్వార దర్శనం

సుఖదుఃఖాలలో కలత చెందని వాడు, ద్వంద్వాలలో అందంగా అద్వయాన్ని దర్శించే ధీరపురుషుడు అమృతత్వానికి, అంటే మోక్షానికి అర్హుడు అవుతున్నాడు అని ద్వంద్వాలను సహించడం వల్ల కలిగే ఫలాన్ని చెబుతున్నాడు.

ఏదైతే అమృతమో, అది అభయ స్థానము. ఏదైతే అభయమో అది బ్రహ్మస్థానము అని శ్రుతి ప్రబోధం (***ఏత దమృతం ఏతదభయం ఏతద్బ్రహ్మ ఇతి శ్రుతి వచనం***). అట్టి బ్రహ్మము నిర్దోషం కనుక సమం అని పిలువ బడింది అన్నది భగవద్గీత (***నిర్దోషం హి సమం బ్రహ్మ***).

అలాంటి సమస్థితిని దర్శించువాడు ధీరపురుషుడు. అలాంటి ధీరపురుషుడు మోక్షానికి అర్హుడు అవుతున్నాడు ***(సోఽ మృతత్వాయ కల్పతే - సః అమృతత్వాయ మోక్షాయ, కల్పతే సమర్థః భవతి)*** అన్నాడు గీతాచార్యుడు.

మోక్ష ద్వారం

విషయేంద్రియ సంయోగము ఎవరిని కలత పెట్టలేదో, సుఖదుఃఖాలలో ఎవడు సమదృష్టితో ఉన్నాడో అట్టి ధీరపురుషుడు మోక్షానికి అర్హుడు అంటున్నారు కదా! మరి, అలాంటప్పుడు, మోక్షానికి సాధన చతుష్టయ సంపద కాకుండా ఒక్క తితిక్షుత్వమే అధికారి లక్షణంగా చెప్పినట్లు అయింది కదా! ఇది సరియైన దేనా?

తితిక్ష అనేది శమదమాదులలో ఒకటి. తితిక్ష ఒక్కటే మోక్ష సాధనమైన జ్ఞానమును పొందుటకు సరిపోదు. సుఖదుఃఖాలలో సమంగా ఉండట మనే తితిక్ష శమదమాదులకు ఉపలక్షణము. అలాగే ధీరమ్ **(ధీమంతుడు)** అనే పదము వివేక వైరాగ్యాదులకు ఉపలక్షణంగా చెప్పబడింది. కనుక వివేక, వైరాగ్యాదులతో కూడిన శమ దమాదులు మోక్షార్హతకు సాధనాలుగా చెప్పబడ్డాయి. అర్జునుడు ముముక్షుత్వముతో శ్రేయస్సును వాంఛించాడు కనుకనే గీతాచార్యుడు బోధను అనుగ్రహిస్తున్నాడు. పైగా **పురుషర్షభ** అని అర్జునుని శ్రేష్ఠత్వమును స్పష్టం చేశాడు.

'పురుషర్షభ' అనే సమాసము నందు 'ఋషభః' శబ్దము ఉత్తర పదమై, పూర్వ పదమైన 'పురుష' శబ్దము యొక్క శ్రేష్ఠత్వమును స్పష్టం చేస్తూ ఉంది ***(శ్రేష్ఠార్థ గోచరః)***. ఈ విధంగా సాధన చతుష్టయ సంపన్నుడైన అధికారి మోక్ష సాధనమైన 'త్వం' పదార్థ జ్ఞానమును పొందుటకు అర్హత కలవాడై అమృతత్వానికి సమర్థుడు అవుతున్నాడు ***(మోక్షాయ కల్పతే, సమర్థః భవతి)***.

అర్జునా! దుఃఖింప దగని వారి కోసం దుఃఖిస్తున్నావు అని పదకొండవ శ్లోకంలో ఉపదేశాన్ని ప్రారంభించిన గీతాచార్యుడు ఆత్మానాత్మ వివేకాన్ని ఇంతవరకు ఐదు శ్లోకాలలో చర్చించాడు. అనాత్మ రూపాలన్నీ ఎలా అనిత్యాలో ఇంతవరకు చెప్పడం జరిగింది. అది సరిపోదు. ఈ సత్యాన్నే తాత్త్విక దృష్టితో విశద పరచేందుకు సాంప్రదాయక సదసద్వివేకాన్ని శాస్త్రీయంగా బోధించ వలసిన అవసరం ఉంది. అక్కడే బోధకు పూర్ణత్వము. ఆ కార్యాన్ని ప్రారంభిస్తున్నాడు శ్రీకృష్ణ భగవానుడు.

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయో రపి దృష్టోఽ న్త స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥ 16

న-అసతః-విద్యతే-భావః-న-అభావః-విద్యతే-సతః
ఉభయోః-అపి-దృష్టః-అంతః-తు-అనయోః-తత్త్వదర్శిభిః

అసతః	=	లేని దానికి	అనయోః	=	ఈ
భావః	=	ఉనికి	ఉభయోః అపి	=	రెండిటి యొక్క
న విద్యతే	=	లేదు	అంతః తు	=	నిర్ణయము
సతః	=	ఉన్న దానికి	తత్త్వదర్శిభిః	=	తత్త్వజ్ఞుల చేత
అభావః	=	లేకపోవుట	దృష్టః	=	చూడ బడింది
న విద్యతే	=	ఉండదు			

లేనిది ఉండేది లేదు. ఉన్నది లేకుండా ఉండదు. ఈ రెండిటి యొక్క యదార్థ స్వరూపాన్ని చూచే వారే జ్ఞానులు.

వ్యాఖ్య

ఉండని దానికి ఉనికి లేదు

ఆత్మ నిత్యము అని గ్రహించాము. నిత్యము అంటే ఎప్పుడూ లేకుండా ఉండేది కాదు అని అర్థం. ఇప్పుడు, అప్పుడు, ఎప్పుడూ అనే పదాలన్నీ కాలాన్నే సూచిస్తున్నాయి. కనుక ఆత్మ సదా ఉంటుంది అని చెప్పినా, సదా అనే పదము కాల వాచకము కనుక కాలమంతా ఉండేది అని అర్థం. అంటే, కాలము లేనపుడు లేనిది అని భావం. అలాంటిది నిత్యము కాలేదు. కనుక, కాలంలో ఉంటూ కాలాతీతంగా కూడా ఉండేది ఏదో అది నిత్యము. దానినే ఈ శ్లోకంలో 'సత్' అనడం జరిగింది. సత్ అంటే ఆత్మ. అదే నిత్యము. నిత్యమైన సదాత్మ లేక పోవడం అనేది లేదు ***(సతశ్చ ఆత్మనః అభావః అవిద్యమానతా న విద్యతే)***.

'సత్'కు వ్యతిరిక్త మైనది ఏదో అది 'అసత్'. కాలాతీతంగా ఉండేది సత్ అయితే, కాలాతీతంగా ఉండ లేనిది, కాలంలో మాత్రమే ఉండేది అసత్ అవుతుంది. సత్ అనేది నిత్యం కనుక అసత్ అనేది అనిత్య మవుతుంది. కాలపరిధి లోకి ఏది వచ్చినా అది అసత్తే, అనిత్యమే.

అందుచేతనే విషయేంద్రియ సంయోగము వలన కలిగే శీతోష్ణ సుఖదుఃఖాలు ఆగమాపాయినాలు, అనిత్యాలు అన్నాడు గీతాచార్యుడు ***(ఆగమా పాయినోఽ నిత్యాః తాన్ తితిక్షస్వ భారత)***.

శీతోష్ణాలు కారణాన్ని కలిగి ఉన్నాయి. కనుక అవి అసత్తు. శీతోష్ణాలను ప్రామాణికంగా పరీక్షించి నపుడు వాటికి ఉనికి ఉన్నట్లు గోచరించదు. ఒక పాత్ర వేడిగా ఉంది. అది ఉష్ణము. అది అలా ఉండటానికి అగ్ని కారణము. అంతేకాదు. తాను వేడిగా ఉన్నట్లు పాత్ర వ్యక్తీకరించ లేదు. పాత్రకు స్ఫూర్తి లేదు. పాత్ర వేడిగా ఉంది అని దానిని స్పృశించిన మనం చెబుతాము. మన చర్మానికి వేడి తగిలింది కనుక పాత్ర వేడిగా ఉంది అంటాము. ఒకవేళ చర్మము స్పర్శను కోల్పోతే పాత్ర యొక్క వేడి మనకు స్ఫురించదు. వేడి ఉన్నా లేనిదే అవుతుంది. కనుక, ఉష్ణము అనేది అగ్ని మీద, మన చర్మము మీద, చర్మాన్ని తెలుసుకొనే చిత్తము మీద ఆధారపడి ఉంది. మరొక కారణాన్ని ఎప్పుడైతే కలిగి ఉందో, ఆ కారణం లేనపుడు కార్యము లేనిదే అవుతుంది. కనుక అది అసత్. అంటే, స్వతంత్ర మనుగడను కలిగి ఉన్నది కాదు, స్వప్రతిష్ఠంగా లేదు అని అర్థం.

ఇప్పుడు పాత్ర వేడిగా ఉన్నా, కొంత సేపటికి మళ్ళీ చల్ల బడుతుంది. కనుక కార్యము ఏదైనా వికారమే. వికారము కలిగింది ఏదైనా మార్పు చెందేదే. మార్పు చెందే దానికి స్వతంత్ర సత్తా లేదు. కార్యము వికారము. వికారము కలిగింది మారి పోతుంది ***(వికారో హి సః వికారశ్చ వ్యభిచరతి)***. నియతంగా అంటే, ఒకే రూపంలో ఉండేది అవ్యభిచారి. అదే సత్. అలా ఉండ లేనిది అనియత మైనది కనుక వ్యభిచారి. అదే అసత్.

కార్యాలన్నీ అసత్తులే. కారణం కన్నా భిన్నంగా ఉండ లేనివి. స్వతంత్ర మనుగడకు నోచు కోనివి. పుట్టక ముందు లేనివి. గతించిన తరువాత ఉండ లేనివి. అంటే, ఆ రెండు కాలాలలో గోచరించనివి. కనుక అసత్యాలు. అనిత్యాలు.

మట్టికుండనే తీసుకుందాం. పరీక్షించి చూచి నపుడు కారణమైన మట్టి కన్నా అన్యమైనది అక్కడ ఏదీ కనిపించడం లేదు. కార్యం లోని సత్త్వం కారణం లోనిదే. సత్త్వం అంటే ఉండుట అనే లక్షణము. కార్యమైన కుండలో ఉన్న దేమిటి? మట్టి. కుండకు కారణమైన దానిలో ఉన్న దేమిటి? మట్టే. మట్టిలో ఉన్నదే (సత్త్వం) కుండలో ఉంది. కారణంలో ఉన్నదే కార్యంలో ఉంది.

కుండ తయారైంది అన్నప్పుడు దానిలో 'ఉండుట' అనే ధర్మం ఉంది. 'మట్టికుండ ఉంది'. ఈ వాక్యంలో 'ఉంది' అనేది సత్త్వం. ఆ తరువాత కుండ పగిలి పోయింది. అప్పుడు కుండ లేదు. 'మట్టికుండ ఉంది' అనే

వాక్యంలో కుండ పోయింది కనుక, ఇప్పుడేముంది? కుండను తప్పించి వాక్యాన్ని చూడండి తెలుస్తుంది. 'మట్టి ఉంది'. కనుక కుండ అనే కార్యంలో 'ఉంది' అనేది ఏదయితే ఉండిందో, కుండ పగిలిన తరువాత ఆ 'ఉంది' అనేది ఎక్కడుంది? కారణం లోనే , అంటే మట్టి లోనే ఉంది. అందుకే 'కుండ' పగిలినా 'మట్టి' ఉంది. ఇక కుండ ఏమిటి? కుండకు సత్యం ఏమిటి? అస్తిత్వం ఏమిటి? కుండ అనే పదం కన్నా వేరుగా కుండకు అస్తిత్వం లేదు. రూపం ఉండింది. రూపానికి నామం ఉండింది. రూపం పోయింది. రూపంతో పాటు నామం కూడా పోయింది. నామరూపాలు పోయాయి. నామరూపాలు ఉండి నపుడు ఏదయితే ఉండిందో, అది మాత్రం పోలేదు. ఉంది. ఎలా ఉంది? కారణంగా ఉంది. కారణంలో ఉంది. కనుక నామరూపాలకు ఉనికి లేదు. ఈ విషయాన్నే ఛాందోగ్య శ్రుతి ధ్రువ పరచింది.

వాచారంభణో వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం

కుండ అనేది ఒక రూపానికి నామం. ముంత అనేది మరొక రూపానికి నామం. నామరూపాలు నిత్యం కావు. సత్ కావు. మృత్తిక అంటే మట్టి. మట్టే సత్యం. అదే సత్. సత్ త్రికాల అబాధితం. అంటే మూడు కాలాల్లో నిషేధించను వీలు పడనిది సత్. అసత్ అనేది బాధితం. అంటే కాలంలో నిషేధింప బడేది అని అర్థం. సత్ లేకపోతే నామరూపాలకు అస్తిత్వం లేదు.

చరణము : ***ముంత మూకుడు బానలు కుండలు - నామ రూపాల పోకడలే***
మట్టి పాత్రలకు మన్నే అండ - జగమంతటికి నీవే నిండా

పల్లవి : ***ఎన్నో ఎన్నో రూపాలు - అన్నీ ఆరే దీపాలు***
మారని రూపం - ఆరని దీపం
భువిలో దివిలో నీవే సకలం ॥ ఎన్నో ॥

కుండలు అమ్మే వ్యక్తి వద్దకు వెళ్ళి, ఆ కుండను ఎంత కిస్తావు? అని అడిగాడు ఒక వ్యక్తి. పది రూపాయలండి అన్నాడు అమ్మేవాడు. ఐదు రూపాయల కిస్తావా? అన్నాడు కొనేవాడు.

కుండే కదా మీకు కావలసింది? అని ప్రశ్నించాడు అమ్మేవాడు. అవును అన్నాడు కొనేవాడు. మట్టి కాదు కదా? అని మళ్ళీ అడిగాడు అమ్మేవాడు. కాదు అన్నాడు కొనేవాడు. సరే, మట్టికుండ పది రూపాయలు. మీకు కుండే కావాలి, మట్టి వద్దు అన్నారు కనుక, మట్టిని ఉంచేసి కుండను తీసుకుపోండి. అయిదు రూపాయలే ఇవ్వండి చాలు అన్నాడు అమ్మేవాడు. ఇవ్వడానికి ఇబ్బంది లేదు కాని, కొని పట్టుకుపోయే దేమిటో కొనే వానికి అర్థం కాలేదు.

అసత్ అనేది కార్యం. వికారయుతం. పుట్టక ముందు ఉండదు. గిట్టిన తరువాత ఉండబోదు. స్వతంత్ర సత్తా లేనిది. స్వప్రతిష్ఠం కానిది. తనకు మరొక కారణాన్ని కలిగి ఉంది. మరొక దానిపై ఆధారపడి ఉంది. అది అసత్.

ఆదౌ అంతేచ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా

'ఆద్యంతముల యందు ఏదయితే లేదో అది వర్తమానంలో ఉన్నా లేనిదే' అని మాండూక్యకారికలలో శ్రీ శంకరుల వారి పరమ గురువు గౌడపాదాచార్యుల వారు తెలిపారు.

ఉన్న దానికి లేమి లేదు

స్వతంత్ర సత్తా లేనిది, కారణాన్ని కలిగి ఉన్నది, మరొక దానిపై ఆధారపడి ఉన్నది అసత్తు అని

గ్రహించాము. దీనికి వ్యతిరిక్త మైనది సత్తు. అంటే స్వతంత్ర మనుగడ కలది, తన వంటూ ఒక కారణము లేనిది, మరొక దానిపై ఆధార పడనిది అని అర్థం.

కార్య కారణాలను విశ్లేషించి అర్థం చేసుకుంటే కార్యం ఉంది అంటే, దానికి కారణం ఉండాలి. కార్యం ***ఉంది.*** కారణం ***ఉంది.*** ***ఉంది*** అనేది కార్యకారణాలు రెండిటిలో ఉంది.

కార్యమైన కుండ ***ఉంది.*** కారణమైన మట్టి ***ఉంది.*** ***ఉంది*** అనేది రెండిటిలో ఉంది. కార్యమైన కుండ పగిలి పోతుంది. కుండ పోయినా, 'కుండ ఉంది' అనే వాక్యంలో ఉండిన ***ఉంది*** పోలేదు. ఆ ***ఉంది*** అనేది 'మట్టి ఉంది' అనే వాక్యంలో చేరిపోయి ఉంది.

కార్యమైన కుండ ఉన్నప్పుడు, కుండలో ఉండుట అనే ధర్మం (సత్యం) ఏదయితే ఉండిందో, అది కుండ పగిలి పోయిన తరువాత కుండకు కారణమైన మట్టిలో కనిపిస్తూ ఉంది.

'మట్టి కుండ ఉంది' అనేది వాక్యము. ఈ వాక్యంలో మట్టి - కుండ - ఉంది అనే మూడు పదాలు ఉన్నాయి. కుండ నశించగానే 'కుండ' అనే పదం పోయింది. మట్టి - ఉంది, అనే రెండు పదాలతో 'మట్టి ఉంది' అనే వాక్యమే ఉంది.

కుండ నశించగానే, దాని సత్యం మట్టిలో గోచరిస్తూ ఉంది. కార్యమైన కుండ నశించినట్లే, కారణమైన మట్టి కూడా నశించి నపుడు, మట్టి కార్య మవుతుంది. ఆ మట్టికి కారణమైన జలంలో సత్యం గోచరిస్తుంది. జలం నశించి నపుడు, దానికి కారణమైన వాయువులో సత్యం కనిపిస్తుంది. వాయువు నశిస్తే, దానికి కారణమైన ఆకాశంలో సత్యం చేరి పోతుంది. ఆకాశం లేని ప్రళయ కాలంలో ఆకాశానికి కారణ మైనది ఏదో దానిలో సత్యం ఉంటుంది. కనుక ఉండుట అనేది (సత్యం) లేకుండా పోవడం లేదు. ఉన్నది లేకుండా పోయేది లేదు ***(నాఽభావో విద్యతే సతః, సతః అభావః న విద్యతే).***

ఆకాశం దాని నుండే పుట్టింది ***(తతః ఆకాశః సంభూతః).*** ఆకాశం పుట్టక ముందు ఆకాశానికి కారణంగా ఏదయితే ఉండిందో దాని లోనే ఉండుట అనేది ***(సత్యం)*** ఉండింది. ఆకాశానికి ముందు ఉన్న సద్వస్తువు ఏదో అదే అద్వితీయ పరబ్రహ్మము. అదే సత్తు.

సదేవ సౌమ్య ఇద మగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయం బ్రహ్మ నేహ నానాఽస్తి కించన

నాయనా (సౌమ్య!) ఈ సృష్టికి పూర్వము ***(ఇదం అగ్రే, సృష్టేః ప్రాక్)*** 'సత్తు' ఒక్కటే ఉండింది. అది రెండు కాని ఏకమై ఉండింది. అదియే బ్రహ్మము. అందులో రెండవది అనేది లేనే లేదు అన్నది ఛాందోగ్య శ్రుతి.

అదే సృష్టికి కారణము. ఆ బ్రహ్మము యొక్క సంకల్పము తోనే సృష్టి ఆవిర్భవించింది. సృష్టి కార్య మైంది. కార్యమైన సృష్టి కారణమైన బ్రహ్మము కన్నా వేరుగా లేదు. సృష్టి ఉంది అన్నప్పుడు, సృష్టిలో ***ఉంది*** అనేది ఏదో సృష్టి విలీన మైనపుడు, ఆ ***ఉంది*** అనేది కారణమైన బ్రహ్మము లోనే ఉంది. అదే సత్.

ఆత్మవా ఇద మేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కించన మిషత్, స ఈక్షత లోకాన్ను సృజా ఇతి!

ఈ సృష్టికి పూర్వము ఆత్మ ఒక్కటే ఉండింది. అది తప్ప వేరొకటి లేనే లేదు. ఆ ఆత్మే లోకాలను (సృష్టిని) సృష్టించాలని సంకల్పించింది అన్నది ఐతరేయోపనిషత్తు.

సృష్టికి పూర్వం ఉన్నది ఏదో (సత్) అదే సృష్టి లోనూ ఉంది. కుండకు పూర్వము ఉన్నది ఏదో (మట్టి) అదే కుండ లోనూ ఉంది ***(మృత్తికేత్యేవ సత్యమ్).*** కుండ ఉంది అని మనం చెప్పినప్పుడు కూడా ఆ ఉన్నది (సత్) ఏదో అది మట్టికి సంబంధించినదే. ఈ విధంగా ప్రపంచంలో ఏది ఉంది (సత్యం) అనిపించినా,

విచారించి అర్థం చేసుకుంటే అది, ఆది కారణమైన అద్వితీయ బ్రహ్మమునకు సంబంధించినదిగా ఉంటుంది.

మట్టికుండ కుండగా అసత్. మట్టికుండ మట్టిగా సత్. ప్రపంచము ప్రపంచముగా అసత్. ప్రపంచము పరమాత్మగా సత్. ఇక్కడ అసత్ అంటే అసలే లేనిది అని కాదు. మరొక దానిపై ఆధార పడినది, స్వతంత్ర మనుగడ లేనిది అని ఇప్పటికే మనం అర్థం చేసుకొని ఉన్నాం. అదే అసత్. అదే మిథ్య. అదే మాయ.

మాయామయము జగమంతా
మమకారాలే మనసంతా
ఉన్నది చూడరు ఎవరైనా
లేనిదే చూస్తారు ఎపుడైనా
ఉన్నది బ్రహ్మము లేనిది జగము
తెలిసే దెపుడు ఈ నిజము?
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అంటూ రామజోగి చిట్కాలలో సదసద్వివేకం రాగాలాపన చేసింది.

ఉన్నదే ఉంది (సత్). లేనిది ఉన్నట్లు ఉంది (అసత్). ఈ రెండూ బుద్ధిలో చేరిపోయి ఉన్నాయి. ఇవే రెండు బుద్ధులు. అందువలన సదసద్వివేకం చేసి తీరాలి.

సర్వత్ర బుద్ధి ద్వయోపలబ్దేః సద్బుద్ధిః అసద్బుద్ధిః ఇతి

అంతట 'సత్ బుద్ధి', 'అసత్ బుద్ధి' అని బుద్ధి ద్వయం తెలుస్తూ ఉంది. సద్విషయానికి సంబంధించిన బుద్ధి సద్బుద్ధి. సద్బుద్ధి సర్వత్ర అనుగతమై ఉంటుంది. మార్పు చెందదు. వికారానికి లోను కాదు ***(యద్విషయా బుద్ధిః న వ్యభిచరతి తత్ సత్).*** అలాగే అసద్విషయానికి సంబంధించిన బుద్ధి అసద్బుద్ధి. ఇది వికారయుతము. మార్పు చెందుతూ ఉంటుంది ***(య ద్విషయా బుద్ధిః వ్యభిచరతి తత్ అసత్).***

సన్ ఘటః . అనే చోట రెండు శబ్దాలు వినిపిస్తున్నాయి. 'సన్' ఒకటి. 'ఘటః' మరొకటి. 'సన్' అంటే ఉన్నది అని అర్థం. అదే సత్. 'ఘటః' అంటే కుండ అని అర్థము. పదాలు రెండైనా అవి ఒకే వస్తువును సూచిస్తున్నాయి.

కుండ పగిలిపోతే ***(ఘటే వినష్టే).*** కుండ బుద్ధి నశిస్తుంది ***(ఘట బుద్ధిః వ్యభిచరతి).*** అంతేగాని సద్బుద్ధి నశించదు. కుండ ఉంది అన్నప్పుడు 'ఉంది' అనే దానికి వేరుగా కుండ లేదు. కుండ పోయినా, 'ఉంది' అనేది ఉంది. 'ఉంది' అనేది అన్నిచోట్ల ఉంది. ఇదే అనుగతం. పువ్వు ఉంది. దీపం ఉంది. ఏనుగు ఉంది. కుక్క ఉంది. భార్య ఉంది. 'ఉంది' అనేది అంతటా ఉంది. కనుక 'కుండ ఉంది' అనే వాక్యంలో 'ఉంది' అనేది సద్బుద్ధి. 'కుండ' అనేది అసద్బుద్ధి. సద్బుద్ధి నిత్యము. అసద్బుద్ధి అనిత్యము. వికారయుతము. మిథ్యాభూతము.

నీలోత్పలం అన్నప్పుడు నీలమ్, ఉత్పలమ్ అనే రెండు పదాలలో 'నీలమ్' అనేది విశేషణము. 'ఉత్పలమ్' అనేది విశేష్యం. విశేష్యాలైన ఉత్పలాదులు ఉండటం వల్లనే నీలం అనే విశేషణాన్ని చెప్పడం జరిగింది.

నీలోత్పలం వాడి రేకులు ఊడి నపుడు, ఉత్పలం ఉండదు. కానీ నీలం ఉంటుంది. నింగిలో నీలం ఉంది. సాగరంలో నీలం ఉంది. నీ కళ్ళల్లో నీలం ఉంది. వస్త్రంలో ఉంది. జలంలో ఉంది. ఉత్పలం (అసత్) పోయింది. నీలం (సత్) మరొక చోట కనిపిస్తోంది. ఇది సదసద్వివేకం.

నీలోత్పలం మనే వస్తువు నందు నీలబుద్ధి ఉంది. అలాగే ఉత్పలబుద్ధి కూడా ఉంది. నీలమ్, ఉత్పలం అనే రెండు పదాలు ఒకే వస్తువును తెలుపు తున్నాయి. పైగా, ఈ రెండు ఒక దాని కన్నా మరొకటి వేరుగా లేవు. నీలం కన్నా వేరుగా ఉత్పలం లేదు. నల్లకలువ అన్నప్పుడు కలువ నుండి రంగును ఎలా వేరు చేయగలం? ఉత్పలం నీలం కన్నా వేరు కాకుండా ఉంది అని అర్థం చేసుకోవాలి ***(నీలాభిన్నం ఉత్పలం).*** కాబట్టి నీల బుద్ధి సద్బుద్ధి. ఉత్పల బుద్ధి అసద్బుద్ధి.

సన్ ఘటః అన్నచోట కూడా ఇదే. ***ఘటః అస్తి,*** కుండ ఉంది అంటే, ఆ 'ఉంది' అనేది ఏదో అది కుండ కన్నా వేరుగా లేదు ***(సదభిన్నో ఘటః, సత్ అభిన్నః ఘటః).*** 'ఉంది' అనే సత్తు కన్నా వేరుగా కుండ అనే అసత్ లేదు.

ఘట, ఉత్పలాది విశేష్యము లన్నీ వికారయుతములు. కనుక మిథ్యా భూతములు. ఉన్నట్లుగా వస్తాయి. లేనట్లుగా పోతాయి. అందుకే ఆగమాపాయినాలు. అసత్తులు కనుక అనిత్యాలు. వీటికి స్వతంత్రంగా సత్యం లేదు. వస్తుత్వము, సత్యత్వము లేదు. వీటి అర్థాలు పరమార్థంలో ఉన్నాయి.

తత్త్వ దర్శనం

దేహం 'ఉంది'. దేహం పోతుంది. 'ఉంది' అనేది ఆత్మగా ఉంది. దేహం అసత్. 'ఉంది' అనేది సత్. ఇక అన్నీ అంతే. ఆత్మ ఒక్కటే సత్. ఆత్మ కన్నా అన్యమైన వన్నీ అసత్. ఇదే తత్త్వం. ఈ రెండిటి నిర్ణయమే తత్త్వం ***(ఆత్మా సత్యం తదన్యత్ సర్వం మిథ్య ఇతి తత్త్వ వివేకః).*** ఈ నిర్ణయాన్ని దర్శించిన వారు తత్త్వద్రష్టలు, తత్త్వవేత్తలు ***(ఉభయోః అపి అంతః తు తత్త్వ దర్శిభిః దృష్టః).***

దేహం ఉంది. కన్ను ఉంది. చెవి ఉంది. మనస్సు ఉంది. బుద్ధి ఉంది. బుద్ధి వృత్తి ఉంది. దేశం ఉంది. కాలం ఉంది. వస్తువు ఉంది. ప్రపంచం ఉంది. అజ్ఞానం ఉంది. 'ఉంది' అనేది అంతటా ఉంది. అదే సత్. అది ఎప్పుడూ మారనిది. అసత్తు లన్నీ మారుతూ ఉంటాయి. కనుక లేనిది ఉండేది లేదు ***(న అసతః విద్యతే భావః).*** ఉన్నది లేకుండా పోయేది లేదు ***(న అభావః విద్యతే సతః).***

కుండ పగిలి పోయింది - అసత్

పగిలిన కుండ ఉంది - సత్ - ఇదే సదసద్వివేకం. లోక వ్యవహార దృష్టిలో నిత్యానిత్య వివేకంగా అర్థం చేసుకున్న దానిని ఈ శ్లోకంలో సదసద్వివేకంగా శాస్త్ర ప్రమాణంతో చెప్పుకున్నాం.

అర్జునా! ఉన్నది లేకుండా పోయేది కాదు కనుక దుఃఖించకు ***(అశోచ్యానన్వ శోచస్త్వం).*** లేనిది ఉండేది కాదు కనుక దుఃఖించకు ***(అశోచ్యానన్వ శోచస్త్వం).*** ఈ రెండిటికి సంబంధించిన వివేకము గల వారు పండితులు. వారు దేనికీ దుఃఖించరు ***(గతాసూ నగతా సూంశ్చ నానుశోచన్తి పండితాః).***

ఈ విధంగా సదసద్వివేకాన్ని వివరించిన శ్రీ వాసుదేవ భగవానుడు, ఏది సత్తో అది ఎలా నశించదో ముందుగా విశదం చేస్తున్నాడు.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశ మవ్యయ స్యాస్య న కశ్చి త్కర్తు మర్హతి ॥ 17

అవినాశి-తు-తత్-విద్ధి-యేన-సర్వం-ఇదం-తతం
వినాశం-అవ్యయస్య-అస్య-న-కశ్చిత్-కర్తుం-అర్హతి

యేన	= దేని చేత	అవ్యయస్య	= నశించని
ఇదం సర్వం	= ఈ సర్వము	అస్య	= దీనికి
తతం	= వ్యాపించ బడిందో	వినాశం	= వినాశమును
తత్ తు	= దాని నైతే	కర్తుం	= చేయుటకు
అవినాశి	= నాశము లేనిదిగా	కశ్చిత్	= ఎవదును
విద్ధి	= తెలుసుకో	న అర్హతి	= అర్హుడు కాదు

ఈ జగత్తంతా ఏదయితే వ్యాపించి ఉందో, అది నశించేది కాదని తెలుసుకో. నశించని దానిని నాశనం చేసే వారు ఎవ్వరూ లేరు.

వ్యాఖ్య

అర్జునా! దుఃఖింప దగని వాళ్ళ కొరకు దుఃఖిస్తున్నావు అంటూ పదకొండవ శ్లోకంలో భగవంతుడు పలికిన ఆక్షేపణ వాక్యాన్ని సమర్థిస్తూ నిత్యానిత్య వస్తు వివేకాన్ని ఇంతవరకు బోధించాడు. లౌకిక దృష్టిలో అదొక అర్థవంతమైన విశ్లేషణము. ఆత్మ నిత్యము కనుక దుఃఖింప నవసరం లేదు. అనాత్మ అనిత్యము కనుక దుఃఖానికి అవకాశము లేదు అనే అందమైన వాదనను వినిపించాడు.

ఆత్మానాత్మ వివేకానికి శాస్త్రం అవసరం లేదు. యుక్తి, అనుభవం కూడా సరిపోతాయి. జగత్తులో అన్నీ మార్పు చెందుతూ ఉన్నాయి. అలా మార్పు చెందేవి అనిత్యాలు. అనిత్యాలు ఉన్నాయి అంటే, నిత్యమైన దేదో ఉండబట్టే అనిత్యాలు తెలుస్తూ ఉన్నాయి అనేది యుక్తితో నిర్ణయించ వచ్చు.

గురువు చెంత కూర్చొని శాస్త్రాన్ని అధ్యయనం చేయడానికి శిష్యునికి కావలసిన అర్హతలలో నిత్యానిత్య వస్తు వివేకం ఒకటి. అంటే, శాస్త్రాధ్యయనానికి ముందే అట్టి వివేకము విద్యార్థికి ఉండాలి. అలాంటప్పుడు నిత్యానిత్య వస్తు వివేకం శాస్త్ర సిద్ధాంత మెలా అవుతుంది?

నిత్యము అన్నప్పుడే ఎప్పుడూ ఉండేది అని కాల వాచకంగా గ్రహిస్తాము. వాస్తవానికి నిత్యమైన ఆత్మ కాలాతీత మైనది. కాబట్టి ఎప్పుడూ ఉన్నది అని కాకుండా ఉన్నది (అస్తి) అని చెప్పాలి. అలాగే అనిత్యాన్ని ఎప్పుడూ లేనిది అంటూ కాల పరిధి నుండి చెప్పడం కాకుండా, లేనిది (నాస్తి) అనాలి. ఉన్నది సత్తు. లేనిది అసత్తు. లేని అసత్తుకు ఉనికి లేదు. ఉన్న సత్తుకు లేమి ఉండదు. అయితే ఇంత వరకు వ్యావహారికంగా చర్చించిన నిత్యానిత్య వివేకం స్థానంలో, ప్రామాణికంగా శాస్త్ర దృష్టితో సదసద్వివేకాన్ని పదహారవ శ్లోకంలో చర్చించాడు గీతాచార్యుడు. ఇది శాస్త్రీయమైన తాత్త్విక దృష్టి.

సదసద్వివేకము అనేది గహనమైన విషయము. ముఖ్యంగా రెండవ అధ్యాయమైన సాంఖ్య యోగానికి గుండెకాయ లాంటిది. ఒక విధంగా కేంద్ర విషయ మనే చెప్పాలి. కనుక విషయ సౌలభ్యం కొరకు ఈ అంశాన్ని మరి కొంత విశదీకరించి విస్పష్టం చేయడం అవసరమని భావించాడో ఏమో, ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న పదిహేడవ శ్లోకంలో సద్విషయ చర్చను, పద్దెనిమిదవ శ్లోకంలో అసద్విషయ చర్చను చేపట్టి దివ్యంగా భాషించాడు భగవానుడు.

సర్వం విష్ణుమయం జగత్

ఈ శ్లోకంలో తత్ అనే పదం ఏదయితే ఉందో, అది పూర్వ శ్లోకంలో ప్రతిపాదించిన సత్‌కు ప్రత్యామ్నాయంగా వాడ బడింది. 'ఉన్న దానికి లేమి అనేది ఉండదు' అని ఏ సద్రూపాన్ని వివరించడం జరిగిందో, అదే ఇక్కడ సర్వ వ్యాపకము, అవ్యయము అయిన తత్ పదంగా తెలుస్తూ ఉంది. దాని చేతనే

(యేన) ఈ సమస్త జగత్తు ***(సర్వమిదం)*** వ్యాపింపబడి ఉంది ***(తతమ్)***. అంటే, ఈ ప్రపంచ మంతా సదాత్మ చేత పరివ్యాప్తమై ఉంది అని అర్థం.

విశ్వంలో ఎన్నో ఉన్నాయి. అన్నిటిలో 'సత్' వ్యాపించి ఉంది. అందుచేత అది సర్వవ్యాపి. సర్వ వ్యాపకమై ఉంది కనుక అది అవినాశి.

'ఇదం' అనేది జగత్తును సూచిస్తుంది. ఇదం సర్వం అనడం చేత యావద్విశ్వము అని తెలుస్తూ ఉంది. జగమంతా సద్వస్తువు వ్యాపించి ఉంది అని సిద్ధాంతము.

బావుంది. ఇంతకీ విశ్వము, అనగా జగత్తు సత్తా? అసత్తా? ఇందులో సందేహ మేముంది? ముందు శ్లోకంలో ఈ విషయాన్ని సమగ్రంగా చర్చించాము కదా! ప్రపంచము సత్తు కాదు. అసత్. ఎందుకని? (1)స్వతంత్ర సత్తా లేదు. (2) మరొక దానిపై ఆధారపడి ఉంది. (3) కారణ సహితంగా తెలుస్తూ ఉంది. పైగా దృశ్యంగా ఉంది. అనిత్య మైనది.

కారణం లేకుండా కార్యం ఉండదు కనుక సత్ లేకుండా అసత్ ఉండదు. అంతేకాదు. కారణం కన్నా వేరుగా కార్యం ఉండ లేదు కనుక కార్యంలో ఉన్నది ఏదో అది కారణమే. కార్యమంతా కారణమే వ్యాపించి ఉంటుంది.

వ్యాప్య వ్యాపక సంబంధములో కూడా వ్యాపకంగా ఉండేది ఏదో అదే సత్తు. సర్వంలో వ్యాపకమై ఉండేది సత్తు మాత్రమే. సర్వము వ్యాప్యము. సద్వస్తువు ఒక్కటే వ్యాపకము. అసద్వస్తువు వ్యాప్యము.

మట్టిపాత్రలు ఉన్నాయి. మట్టి ఉంది. మట్టికుండ వ్యాప్యము. మట్టి వ్యాపకము. మట్టికుండలో అంతట వ్యాపించి ఉన్నది మట్టే కదా! అలాగే ఈ నామరూపాత్మక మైన జగత్తంతా సద్రూపమే వ్యాపించి ఉంది.

యేన సర్వ మిదం తతమ్

దేని చేత ***(యేన, సదాఖ్యేన బ్రహ్మణా)*** అంటే, ఏ సద్రూపమైన బ్రహ్మము చేత ఈ సమస్త మైన ప్రపంచము ***(సర్వం ఇదం)*** వ్యాపించబడి ఉందో ***(తతమ్)*** అనేది ఈ పాదము యొక్క అర్థము.

యేన సర్వ మిదం తతమ్ అనే ఈ శ్లోక పాదము ఇక్కడే గాక, ఎనిమిదవ అధ్యాయము ఇరవై రెండవ శ్లోకం లోను, పద్దెనిమిదవ అధ్యాయం నలభై ఆరవ శ్లోకం లోను కనిపిస్తుంది. ఇదే భావం ఈశావాస్యోపనిషత్తు లోని ప్రముఖమైన ప్రథమ మంత్రంలో వినిపించింది. ***ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్*** అన్నది ఈశోపనిషత్తు.

అండాండంబులు పిండాండంబులు
బ్రహ్మాండంబులు బ్రహ్మలు మొదలుగ
అంతా రామమయం
ఈ జగమంతా రామమయం

అని సద్రూప చైతన్యాన్ని దివ్యంగా గానం చేశాడు భద్రాచల రామదాసు.

కుండ వ్యాప్యం. మట్టి వ్యాపకం. కుండ పగిలి పోతుంది. అలాగని మట్టి నశిస్తుందా? కుండ అనేది కేవలం నామరూపాలే అని ఇప్పటికే గ్రహించాము. నామరూపాలు నశిస్తాయే గాని మట్టి నశించదు. వ్యాప్యం నశిస్తుందే గాని వ్యాపకం నశించదు.

సమస్త ప్రపంచము వ్యాప్యము. సద్వస్తువు వ్యాపకము. వ్యాప్యమైన అసద్రూప ప్రపంచము నశిస్తుంది. వ్యాపకమైన సద్రూప చైతన్యము నశించదు. సత్ అనేది ఆత్మే కనుక ఆత్మ నశించదు (***అవినాశి. న వినష్టుం శీలమ్ అస్య ఇతి.*** నశించే స్వభావం లేనిది ఏదో అది అవినాశి).

సర్వ వ్యాపకమైన అవ్యయ సద్రూపాన్ని ఎలా చూడగలం? అందుకే ***విద్ధి.*** తెలుసుకో అంటోంది గీత. ***తద్విద్ధి.*** దానిని తెలుసుకో అంటోంది. ఇది కేవలం జ్ఞానం కనుక, ఏ బోధనావిధి చేత అర్థ మవుతుందో, పొంద బడుతుందో అలా తెలుసుకోమని అర్థము (***విద్ధి విజానీహి యేన విధినా ప్రాప్యతే ఇతి***).

అవినాశికి నాశము లేదు

ప్రపంచము నశించినా సద్వస్తువు నశించదు. ప్రపంచం సద్వస్తువుపై ఆధారపడి ఉంది. సద్వస్తువు ప్రపంచంపై ఆధారపడి లేదు. ప్రపంచం లేకపోయినా సద్వస్తువు ఉంటుంది. దానికి నాశము లేదు. ఆత్మకు ఎందుకని నాశము లేదు?

ఆత్మకు నాశము ఎలా కలుగుతుంది? ఉన్నది ఏదైనా నశించాలి అంటే, ఆ నాశము తన వల్లనైనా తనకు కలగాలి. లేదా, తన కన్నా అన్యమైన దాని వల్లనైనా కలగాలి. ఆత్మకు ఈ రెండు కారణాల వల్ల నాశము ఉండదు.

ఆత్మ రూపము లేనిది. కనుక అవయవములు లేనిది. అవయవాలు ఉంటే, అవి నశించడం చేత స్వనాశము జరిగే అవకాశము ఉంటుంది. నిరవయవ మైన ఆత్మ తనకు తానుగా నశించ లేదు (***నిరవయవత్వాత్ దేహాదివత్***).

అలాగే తనకు అన్యమైన దాని వల్ల కూడా ఆత్మకు నాశము కలగదు. ఆత్మ కన్నా అన్యముగా ఏది ఉన్నా అది అసత్ అవుతుంది. అసద్వస్తువుకు తానే ఆశ్రయము కనుక తానే కర్త, కర్మ కావలసి ఉంటుంది. కనుక అదీ పొసగదు.

ఒకవేళ సద్వస్తువైన ఆత్మకు మరి యొక ఆశ్రయము ఉంటే, ఆశ్రయ నాశము జరగడం చేత తాను నశించే అవకాశం ఉంటుంది. ఆత్మకు ఆశ్రయ మనేది వేరుగా లేదు. దేనికైనా ఆత్మే ఆశ్రయమై ఉంది. కనుక, ఆ విధంగానూ నాశము సాధ్యం కాదు.

ఆత్మకు కారణము కనుక ఉంటే నశించే అవకాశము ఉంటుంది. కారణం నశిస్తే ఆత్మ నశిస్తుంది. కాని, ఆత్మ సర్వకారణమై శోభిస్తూ, తన కంటూ ఒక కారణము లేనిదై ఉన్నందున అలా కూడా ఆత్మకు నశింపు లేదు. ***నా చాస్య కశ్చిత్ జనితా.*** మరొక దాని నుండి ఆత్మ ఆవిర్భవించ లేదు అని వేదము చెబుతూ ఉంది. కనుక, ఆత్మ కారణం లేనిదై ఉంది. ఇలా ఏ విధం గాను ఆత్మకు నాశము లేనందున ఆత్మను ***అవ్యయః*** వ్యయము కానిది, నాశము లేనిది అంటున్నాడు గీతాచార్యుడు.

చంపే శక్తి ఎవరి కుంది?

సద్రూపమైన ఆత్మ నాశ మెరుగదు. ఆత్మను చంప గలిగే సామర్థ్యం ఎవరి కుంది? ఎవరికైనా ఉంటే, దేనికైనా ఉంటే వాళ్ళు, లేక అది ఉన్నట్లే కదా! ఎక్కడున్నట్లు? కాలం లోనే కదా! కాలంలో ఉండేవి కాలాతీత మైన ఆత్మను ఎలా చంపుతాయి? కనుక సద్వస్తువును నశింప చేసే శక్తి ఎవ్వరికీ లేదు (***న కశ్చిత్ కర్తుమర్హసి***). ఈ విషయంపై వ్యాఖ్యానాన్ని అనుగ్రహిస్తూ, సాక్షాత్తు ఈశ్వరుడు కూడా ఆత్మను చంప లేడు అని గీతాభాష్యంలో వ్రాశారు (***న కశ్చిత్ ఆత్మానం వినాశయితుం శక్నోతి ఈశ్వరోఽపి***).

ఆత్మను వధించే శక్తి ఈశ్వరునికి కూడా లేదు అని ఆచార్యులు భాష్యం చెప్పడానికి కారణాలు రెండున్నాయి. ఒకటి, ఆత్మ ఎవరో కాదు. ఆత్మయే ఈశ్వరుడు. ఆత్మయే బ్రహ్మము (***ఆత్మా హి బ్రహ్మ***). రెండు, స్వవిషయంలో క్రియ సాధ్యం కాదు (***స్వాత్మని చ క్రియా విరోధాత్***). మనిషి తన భుజాలపై తాను ఎక్కగలడా? తన కంటిలో ఉండే రేఖలు మొదలైన వాటిని తానే చూడ గలడా? (***యథా చక్షుర్గత రేఖాదీన్ చక్షుః న పశ్యతి*** - శ్రీ బెల్లంకొండ రామరాయకవి విరచితం ***భాష్యార్కదీపః***). ఆత్మయే బ్రహ్మ మైనందున తనను తాను వధించుకొనే క్రియ సాధ్యం కాదు. ఈశ్వరుని చేత కూడా ఆత్మ చావదు అనడంలో ఇదే ఉద్దేశ్యం. అర్జునా! ఈశ్వరుడే చంప లేని ఆత్మను నువ్వు చంప గలవా? ఆత్మకు చావు లేదు. ఇప్పుడు చెప్పు. నీ దుఃఖానికి అర్థముందా? కనుక, విజయా! విలపించకు.

సద్విషయ చర్చను ముగిస్తూ, అసద్విషయ చర్చను తరువాత శ్లోకంలో చేపడుతున్నాడు.

అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత ॥ 18

అంతవంతః-ఇమే-దేహాః-నిత్యస్య-ఉక్తాః-శరీరిణః
అనాశినః-అప్రమేయస్య-తస్మాత్-యుధ్యస్వ-భారత

నిత్యస్య	= నిత్యుడును		అంతవంతః	=	అంతం కలవి
అనాశినః	= నాశము లేనివాడు		ఉక్తాః	=	చెప్పబడినవి
అప్రమేయస్య	= ఊహింపను వీలు కాని వాడు		తస్మాత్	=	అందుచేత
శరీరిణః	= దేహికి		భారత	=	అర్జునా!
ఇమే దేహాః	= ఈ దేహములు		యుధ్యస్వ	=	పోరాడు

శరీరాలను ధరించు జీవుడు నిత్యుడు. నాశము లేనివాడు. ప్రమాణాలకు చిక్కని వాడు. కాని, ఈ శరీరాలు అంతరించి పోతాయి. అందుచేత, అర్జునా! యుద్ధం చెయ్యి.

వ్యాఖ్య

'సత్' అవినాశి. దానికి ఎవ్వరూ నాశాన్ని కలిగించ లేరు. 'అసత్' అనేది లేనిది. లేనిది నశించేది ఉండదు. అలాంటప్పుడు దుఃఖము దేని కొరకు? ఏది నశిస్తూ ఉందని దుఃఖించాలి? నాశము దేనికి? నశింప చేసే వారెవరు? తాత్త్విక దృష్టితో చూచి నపుడు ఇది గొప్ప మోహంగా తెలుస్తూ ఉంది. అందుకనే వేదాంతం దుఃఖాన్ని తొలగించే ప్రయత్నం చేయదు. దుఃఖ మనేది ఎలా అసమంజసమో బుద్ధికి పట్టిస్తుంది. తొలగించే ప్రయత్నం కర్మ. అర్థం చేసుకోవడం జ్ఞానం.

అర్థం చేసుకొనేది బుద్ధి. బుద్ధికే జ్ఞానం పట్టించాలి. కాని, ఇప్పటికే బుద్ధిలో ఉండ కూడని జ్ఞానం చాలా ఉండి పోయింది. నిండి పోయింది. దానిని బుద్ధి నుండి దూరం చేయాలి. ఉండ వలసింది, ఉండ దగింది ఏదో దానిని ఉంచడము, ఉండకూడని దానిని దూరం చేయడం అనే కార్యం అవశ్యం చేయాలి. అప్పుడే దుఃఖం దూరం అవుతుంది. అంటే, దుఃఖం ఎక్కడికో పారి పోతుందని కాదు. త్రాడు అని తెలియగానే అంతవరకు పాము అనే భావన వల్ల ఏర్పడిన భయ శోకాదులు అదృశ్య మైనట్లు, సదసద్వివేకంలో దుఃఖం ఆవిరై పోతుంది. కనుక, దుఃఖం మనిషికి సమస్య కాదు. జ్ఞానం లేకపోవడమే సమస్య. భయంకరమైన సమస్య. ఇదే ఉపనిషత్తుల సారాంశము. ఈ సత్యమే సదసద్వివేకంలో సారభూతమైన విషయంగా పరమేశ్వరుడు గీతలో బోధిస్తున్నాడు.

జీవః అనాత్మానాం దేహాదీనాం ఆత్మత్వేన అభిమన్యతే
స అభిమానః ఆత్మనః బంధః, తన్నివృత్తిః మోక్షః
యా తదభిమానం కారయతి సా అవిద్యా
స అభిమానః యయా నివర్తతే సా విద్యా ॥

అసద్రూపము లైన దేహాదులను సద్రూపమైన ఆత్మగా భావించి జీవుడు అభిమానిస్తున్నాడు.
ఆ దేహాభిమానమే ఆత్మకు బంధము. అది తొలగి పోవడమే మోక్షము.
అట్టి దేహాభిమానాన్ని కలిగించేది అజ్ఞానము.
అట్టి అజ్ఞానాన్ని తొలగించేది ఏదో అదే జ్ఞానము.

సార రూపమైన ఈ సద్బోధను అందించింది సర్వసారోపనిషత్తు. గీత ఉపనిషత్తుల సారం కనుక ఆ సదుపదేశమునే సదసద్వివేకం ద్వారా బుద్ధికి పట్టిస్తూ ఉంది. గడచిన శ్లోకంలో 'సత్'కు సంబంధించిన విషయాన్ని చర్చించి, అవినాశి యైన ఆత్మకు నాశము అనూహ్యము కనుక దుఃఖము అసంగతం అని గ్రహించాము.

ప్రస్తుత శ్లోకంలో 'అసత్'ను గూర్చి మరికొంత విపులంగా చర్చించి, లేని దాని కోసం దుఃఖం ఉండ నవసరం లేదని సుస్పష్టంగా బోధిస్తున్నాడు భగవానుడు. కాకపోతే, ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అజ్ఞానం అనేది ప్రత్యేకంగా బుద్ధిలో ఎక్కడుంది? జ్ఞానం లేకపోవడమే అజ్ఞానం. అజ్ఞానం పోతే దుఃఖం పోతుంది. చీకటి పోవాలి అంటే వెలుగు రావాలి. అజ్ఞానం పోవాలంటే జ్ఞానం రావాలి. అందుచేత గడచిన శ్లోకంలో 'సత్' చర్చ సాగించిన జగద్గురువు, ఈ శ్లోకంలో 'అసత్' విషయాన్ని విశద పరచే దిశలో అసద్విషయాన్నే సూటిగా ప్రవేశ పెట్టకుండా, కూర్చొని పడుకోవాలి అన్నట్లు, సద్విషయ చర్చను కొనసాగిస్తూనే బుద్ధిని మెల్లగా అసద్విషయ చర్చ వైపుకు మళ్ళించి, ఆ కోణంలో ఆలోచించినా దుఃఖము అసంగత మనే శాస్త్రీయ బోధను అందిస్తున్నాడు. నిత్యుడు, అవినాశి, అప్రమేయుడు అయిన దేహి యొక్క దేహములు నశించి పోతాయి కనుక, సంతాపాన్ని మాని సంగ్రామం లోకి ప్రవేశించ మంటున్నాడు భగవానుడు.

నిత్యం - అవ్యయం - అప్రమేయం

'సత్' అని ఇంత వరకు దేని నైతే గ్రహించామో, ఆ సద్రూప చైతన్యమును మూడు పదాలలో ఇంకా వివరిస్తున్నాడు. దేహము అసత్. దేహమును ఉపాధిగా కలిగిన దేహి సత్. అసద్రూపమైన దేహము సద్రూపమైన దేహికి ఉపాధి. దేహి ఎవరో కాదు. జీవాత్మయే దేహి.

దేహి నిత్యుడు. అంటే ఏ వికారములు లేని వాడు. మరి, దేహంలో ఉండే వాడు కదా దేహి! అవును. అంతటా ఉండే ఆకాశము ఘటంలో కూడా ఉన్నట్లు, చైతన్య రూపుడైన జీవుడు దేహంలో కూడా ఉన్నాడు. ఘటంలో ఉన్న ఆకాశాన్ని ఘటాకాశం అన్నట్లు, దేహంలో ఉన్న జీవాత్మను దేహి అంటున్నాము. ఆకాశం ఘటంలో ఉన్నా, ఘటానికి పరిమితం కానట్లు, దేహి దేహంలో ఉన్నా, దేహ వికారాలకు లోను గాకుండా ఉన్నాడు. దేహాలు అనిత్యాలు. కాని, దేహ వికారాలకు విలక్షణంగా ఉండే దేహి నిత్యుడు ***(నిత్యః).***

నిత్యుడు కనుక నశించే వాడు కాడు. వికారములే లేని వాడికి వినాశము ఎలా వస్తుంది? నశించేవి దేహాలు. వికారం చెందుతూ శరీరాలు నశిస్తాయి. వికారాలను చూస్తూ, వికారం చెందని దేహి నాశము లేనివాడు. అవినాశి. అవ్యయుడు ***(అనాశినః).*** నిత్యుడు, అవ్యయుడు అయిన దేహి అప్రమేయుడు. అంటే ప్రత్యక్షాది ప్రమాణాలకు అందని వాడు. తెలుసుకొనే వాడు ప్రమాత. తెలియబడేది ప్రమేయము. తెలుసు కొనుటకు సహకరించేది ప్రమాణము. ప్రమాణము ద్వారా కలిగే జ్ఞానము ప్రమ.

విచిత్ర మేమిటంటే, మనకు లభించే ప్రత్యక్ష, అనుమానాది ప్రమాణాలన్నీ మన కన్నా అన్యమైన వాటిని గ్రహించడానికి సహకరిస్తాయి. ఉపకరిస్తాయి. ప్రమాణ వ్యాపారం సాగడానికి ఆధార మైనదే ఆత్మ. అట్టి ఆత్మను ప్రమాణాలు తెలియ చేయలేవు. ఇక్కడ ప్రమేయము ఏదో కాదు, ప్రమాతే. కనుక దేహి ప్రమాణాలకు అందే వాడు కాడు ***(అప్రమేయః).***

పునరుక్తి దోషం

దేహి నిత్యుడు, అనాశినుడు అని చెప్పి నపుడు ఈ రెండూ ఒకటే కదా! అనే సందేహం రావచ్చు. నశించని వాడు నిత్యుడు. నిత్యుడైన వాడు నశించడు. ఇలా ఒకే అర్థం వచ్చే టప్పుడు రెండు పదాలతో చెప్పడం పునరుక్తి క్రిందికి రాదా? దోషం కాదా? అని కొందరు సంశయించ వచ్చు.

పునరుక్తి దోషం అనేది, వాస్తవం చెప్పాలంటే, కావ్యాలకు, సాహిత్యానికే గాని వేదాంతానికి వర్తించదు. అదలా ఉంచండి. ప్రస్తుతం ఈ సందర్భంలో మాత్రం నిత్యుడు, అవినాశి అనడం పునరుక్తి కాదు ***(నిత్యస్య అవినాశినః ఇతి న పునరుక్తం).***

రెండిటి అర్థాలు ఒక్కటే అయినా, ఇక్కడ పునరుక్తి లేదు. లోకంలో నిత్యత్వము, వినాశము అనేవి రెండు విధాలుగా తెలుస్తున్నాయి ***(నిత్యత్వస్య ద్వివిధత్వాత్ లోకే, నాశస్య చ).*** నిత్యత్వము రెండు విధాలుగా తెలుస్తూ ఉంటుంది. అలాగే వినాశము కూడా రెండు విధాలుగా ఉంటుంది.

వినాశము అంటే నశించడం. నాశము రెండు విధాలు. ఒకటి, పూర్తిగా నశించి పోవడం. రెండు, క్రమేపి నశిస్తూ ఉండటం. దేహము చనిపోయిన తరువాత శ్మశానంలో భస్మీభూతమై, కనిపించకుండా పోతుంది ***(అదర్శనం గతః నష్టః ఉచ్యతే).*** ఇదొక విధమైన నాశము. అలా కాకుండా, దేహము కనిపిస్తూనే ఉంటుంది. కాని, వ్యాధుల వల్ల చిక్కి శల్యమౌతూ, నశిస్తూ ఉంటుంది. ఇది మరొక విధమైన నాశము. ఈ రెండు విధాలైన వినాశాలు దేహికి లేవు అని చెప్పడానికే, నిత్యుడు, అవినాశి అనే రెండు విశేషణాలను ప్రయోగించాడు గీతాచార్యుడు.

ఒకవేళ ఈ రెండు విశేషణాలను కనుక ప్రయోగించకుండా ఉన్నట్లైతే, ప్రపంచము మార్పు చెందుతూ ఉన్నా ప్రళయం వరకు నిత్యం గానే ఉన్నట్లు, దేహి కూడా పరివర్తన చెందుతూ వ్యావహారికంగా తెలిసే ప్రవాహ నిత్యత్వం కలవాడుగా తెలుస్తాడు. ఈ కారణం చేత, నిత్యుడు, అవినాశి అనే రెండు విశేషణాలు చెప్పవలసి వచ్చింది.

అలా, నిత్యుడు, అవినాశి, అప్రమేయుడు అయిన దేహి యొక్క దేహములు అంతమై పోతాయి అంటున్నాడు అచ్యుతుడు.

దేహము - సందేహము

సద్రూపమైన దేహి నిత్యుడు. అసద్రూపమైన దేహాలు అనిత్యాలు. అంతవంతాలు. అంతమయ్యే స్వభావం కలవి అంతవంతాలు. అవే శరీరాలు. శరీరాలలో చరించే వాడు శరీరి. అనేక గృహాలలో మానవుడు నివసించి నట్లు, అనేక దేహాలలో దేహి వసిస్తూ ఉంటాడు. అందుచేత శరీరాలకు దేహములు **(దేహాః)** అని బహువచనము ప్రయోగించి, దేహికి శరీరి ***(శరీరిణః)*** అని ఏకవచన ప్రయోగం చేశాడు. దేహములు అనేకములైనా దేహి ఒక్కడే అని గ్రహించాలి.

దేహం ఉంది. దేహంలో దేహి ఉన్నాడు. దేహి వల్లనే దేహం ఉంది. దేహం లేకపోయినా దేహి ఉంటాడు.

అందుచేత, దేహము అనిత్యము. అసత్తు. దేహి నిత్యము. సత్తు. దేహి అవినాశి. దేహము నాశము కలది. కనుక దేహం నశిస్తుంది. ఆత్మ నశించదు.

దేహం ఒకటి ఉంది అంటాము. ఒకటిగా దేహం ఎక్కడుంది? అని ప్రశ్నిస్తే సమాధానం దొరకదు. దేహంలో ఎన్నో కలసి ఉన్నాయి. దేహంలో రక్తం ఉంది. మాంసం ఉంది. చర్మము ఉంది. మజ్జ ఉంది. ఎముకలు ఉన్నాయి. కేశములు ఉన్నాయి. ఎన్నో ఉన్నాయి. ఎన్నెన్నో ఉన్నాయి. ఇవన్నీ కలిస్తేనే దేహం. దేహం అనేది ప్రత్యేకంగా లేదు (**నైకః న ఏకః**).

కలసినవి ఏవైనా విడి పోతాయి. యంత్రానికి మఱలు ఊడినట్లు, దేహంలో కీళ్ళు సడలి పోతాయి. ఊడి పోతాయి. మాంసం మెత్త బడుతుంది. క్రొవ్వు కరిగి పోతుంది. చర్మం ముడతలతో మడత పడుతుంది. రక్తం ఇంకి పోతుంది. కలసిన వన్నీ విడి పోతాయి. దేహం నశిస్తుంది. అంత మవుతుంది. ఏ దేహమైనా అంత మయ్యేదే. అందుకనే, దేహాలు అంతవంతాలు.

దేహాలు అంత మవుతా యని ఎవరికి తెలియదు? అర్జునుడికి తెలియదా? అందరికీ తెలుసు. అర్జునుడికి తెలియకుండా ఎలా ఉంటుంది? మరి, అంత సామాన్యమైన విషయాన్ని చెప్పడానికి గీతాచార్యుడు అవసరమా? దేహాలు అంతమౌతా యని అర్జునుడికి తెలుసు. అలా అర్జునుడికి తెలుసు అన్న విషయం బాగా తెలిసిన వాడు కూడా శ్రీకృష్ణు డొక్కడే. దేహాలు పోతున్నా యనే కదా అర్జునుడు పని గట్టుకొని ఏడుస్తున్నాడు! పార్థుని ఏలాపానికి ప్రత్యక్ష సాక్షి పార్థసారథి కాదా? అర్జునుడు ఎంత బాగా ఏడవ గలడో, కుంతీదేవి కన్నా, సుభద్ర కన్నా బాగా తెలిసిన వాడు శ్రీకృష్ణు డొక్కడే. అలాంటప్పుడు దేహాలు నశిస్తాయని అర్జునుడికి ఎందుకు చెబుతున్నాడు?

దేహాలు అంతవంతాలని, నేడున్నా ఒకనాడు లేకుండా పోతాయని శ్రీకృష్ణుడికి తెలుసు. అర్జునుడికీ తెలుసు. మనకూ తెలుసు. కాకపోతే, దేహాలు ఉన్నప్పుడు కూడా లేనివే అనే సత్యం శ్రీకృష్ణుడి కొక్కడికే తెలుసు. అర్జునుడికి తెలియదు. మనకూ తెలియదు.

దేహాలు అసత్తులు. రజ్జువులో సర్పం లాగా ఉన్నప్పుడు కూడా లేనివే. దేహాలు ఉన్నట్లు తెలుస్తూ ఉంటాయి. విశ్లేషించి వివేకంతో అర్థం చేసుకుంటే, అవి ఉన్నా లేనట్లే ఉంటాయి. ఎండమావులలో నీళ్ళు ఉన్నట్లే, ప్రపంచంలో దేహాలు ఉన్నాయి. ప్రమాణాలతో పరిశీలించి తెలుసుకోగానే, ఎండమావి కనిపిస్తున్నా నీళ్ళు లేనివే అని గ్రహించినట్లు, సదసద్వివేకంతో చూచి నపుడు దేహాలు ఉన్నా లేనివే అవుతున్నాయి అని శ్రీశంకరభాష్యము.

అంతవంతాలు అంటే కేవలం శ్మశానంలో నశిస్తున్నాయి అని కాదు. మిథ్యాభూతాలైన దేహాలు సత్యావగాహనలో అంతమౌతున్నాయి అని అర్థము.

స్వప్నంలో గోచరించిన రూపాలు స్వప్నం తరువాతే కాదు లేకుండా పోయేది, స్వప్న కాలంలో కూడా అవి లేనివే. స్వప్న దేహాలు ఎలా మేలుకోగానే అంతవంతాలో, జాగ్రత్ప్రపంచంలో చలించే దేహాలు కూడా జ్ఞానం కలిగితే స్వప్నం లోని మాయా దేహాల లాగా అంతవంతాలే (**ఇమే దేహాః స్వప్న మాయా దేహాదివత్ అన్తవన్తః**).

పార్థా! పోరాడు!

ఎలా చంపేది? అంటూ అర్జునుడు దుఃఖించాడు. చచ్చేందుకు ఎవరున్నారు? అన్నంత వరకు బండిని నడిపాడు భగవంతుడు. చావని దానిని ఎవ్వరూ చంపలేరు. చచ్చే దానినే ఎవరైనా చంప గలరు. చచ్చే దెవరు? దేహాలు. దేహాలు సత్తా అసత్తా? అసత్తే నని తేలి పోయింది. ఇక దుఃఖ మెందుకు? యుద్ధం చెయ్యొచ్చు. అర్జునా! లే! పోరాడు! అన్నాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధానికి ప్రోత్సహించాడు, **హింప చేయమన్నాడు, చేయించాడు అంటూ కొందరు అసందర్భ, అప్రయోజక ప్రసంగాలు చేస్తూ ఉంటారు.** *భారత! యుద్ధ్యస్వ* - పార్థా! పోరాడు అంటూ కురుక్షేత్రంలో అర్జునుణ్ణి యుద్ధానికి పురికొల్పాడు అనేది వారి అభియోగము.

ఇక్కడ ఒక్క విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. లేకపోతే, ఇలాంటి పుచ్చిపోయిన అభియోగాల వాక్య బీజాల తోనే జ్ఞానపంటను పాడు చేసుకో వలసి వస్తుంది. పార్థా! యుద్ధం చెయ్యి! అని శ్రీకృష్ణుడు పలికిన వాక్యం విధివాక్యం కాదు. అనువాద వాక్యం. నువ్వు యుద్ధం చెయ్యాలి అని శ్రీకృష్ణుడు యుద్ధకర్మకు శ్రీకారం చుట్టలేదు. అర్జునుడు యుద్ధం చేయాలని నిర్ణయించుకొనే కురుక్షేత్రానికి వచ్చాడు. లేకపోతే, ఆయనకు అక్కడ ఏమి పని? వచ్చిన పనిని మరచి అచ్చి రాని మాటలన్నీ మాట్లాడు తున్నాడు. మరచిన విషయాన్ని శ్రీకృష్ణుడు జ్ఞాపకం చేశాడు. అంతే.

అర్జునుడికి యుద్ధ ఆలోచనే లేనపుడు, శ్రీకృష్ణుడే ప్రేరేపించి యుద్ధం చెయ్యమంటే, అది విధివాక్యం అవుతుంది. మొదట తానే యుద్ధానికి సిద్ధపడి వచ్చాడు. తనకు యుద్ధంలో సహాయం చేయ వలసిందిగా శ్రీకృష్ణుని ప్రార్థించి మరీ వెంట తెచ్చు కున్నాడు. అలాంటప్పుడు శ్రీకృష్ణుడు యుద్ధానికి కారకుడెలా అవుతాడు? శ్రీకృష్ణునికి యుద్ధాసక్తి లేదు. ఆయనకు ఉండేది ధర్మాసక్తి మాత్రమే. యుద్ధానికి వచ్చిన అర్జునుడు మోహానికి లోనై, ధర్మం విషయంలో నా మనస్సు సంశయాలతో ఉంది (**ధర్మ సమ్మూఢ చేతాః**), నాకు ఏది మేలో నిశ్చయముగా చెప్పు, నన్ను శాసించు అని ప్రార్థిస్తే, శ్రీకృష్ణుడు అర్జునుడు క్షత్రియుడు కనుక ధర్మయుద్ధము క్షత్రియధర్మము అని చెప్పాడు. అంతేగాని, యుద్ధానికి అర్జునుణ్ణి ప్రేరేపించ లేదు. హింసకు కారకుడూ కాలేదు.

'యుద్ధం చెయ్యొచ్చు అనేది శ్రీకృష్ణుని ఉపదేశము. అదే జరిగి, భీష్మాదులు మరణిస్తే వాళ్లను తాను చంపిన వాడు అవుతాడు. ఒకవేళ భీష్మాదులు గెలిస్తే తాను గతించిన వాడు అవుతాడు. ఇది ఎలా?' అనే సందేహం అర్జునుని మనస్సులో ఉందని ఊహించిన భగవానుడు, ఈ సమస్య అనాదిగా జీవుల్ని పీడిస్తూ ఉన్నదే గాని, అర్జునునితో పుట్టింది కాదని, అలాగే దీనికి పరిష్కారం కూడా వేదాలు అందించే ఉన్నాయని తెలుపుతూ, కృష్ణ యజుర్వేదము లోని కఠోపనిషత్ నుండి రెండు మంత్రాలను ఎన్నుకొని ఈ సందర్భంలో ఉదహరించాడు. అవే పందొమ్మిది, ఇరవైయవ శ్లోకాలు.

య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే ॥ 19

యః ఏనం-వేత్తి-హంతారం-యః-చ-ఏనం-మన్యతే-హతం
ఉభౌ-తౌ-న-విజానీతః-న-అయం-హంతి-న-హన్యతే

యః	=	ఎవ్వడు	మన్యతే	=	భావిస్తాడో
ఏనం	=	ఈ ఆత్మను	తౌ ఉభౌ	=	ఆ ఇద్దరు కూడా
హంతారం	=	చంపేదిగా	న విజానీతః	=	తెలిసిన వారు కారు
వేత్తి	=	తెలుసుకుంటాడో	అయం	=	ఈ ఆత్మ
యః చ	=	ఎవడు	న హన్తి	=	చంపదు
ఏనం	=	ఈ ఆత్మను	న హన్యతే	=	చంప బడదు
హతం	=	చచ్చేదిగా			

దేహధారి యైన జీవుడు చంపే వాడని భావించే వాడికి సత్యం తెలియదు. అలాగే జీవుడు చంపబడే వాడు అని భావించే వాడికి కూడా యథార్థం తెలియదు. దేహి చంపేవాడూ కాదు; చంపబడే వాడూ కాదు.

వ్యాఖ్య

మనిషికి ఆలోచించే మనసు ఉంది. మనసు ఉంది కనుక ఏవేవో ఆలోచిస్తూ ఉంటాడు. మనిషి మనస్సులో జరిగే ఆలోచన లన్నీ వాస్తవాలు కానవసరం లేదు. పొరపాటున ఒక మనిషి అభిప్రాయం సత్యమని మనం నమ్మితే, రేపు అదే వ్యక్తి మన వద్దకు వచ్చి నా అభిప్రాయం అది కాదు అంటే ఆశ్చర్యపడ నవసరం లేదు. మనస్సులు అలాగే ఉంటాయి. ఆలోచనలు అలాగే సాగుతాయి.

అతడు వధించాడు. ఇతడు వధింపబడ్డాడు అని మాట్లాడుతూ ఉంటాము. ఈ వాక్యాలు సత్య మేనా? అనే ప్రశ్న ఎవ్వరము, ఎప్పుడు వేసుకోము. పైగా ఇలాంటి మాటలు పలకడానికి మనం శాస్త్రాలను అధ్యయనం చెయ్యలేదు. ఈ లోకం లోనే నేర్చుకున్నాం. ఈ మాటలకు ప్రపంచమే ప్రమాణము. అందువల్ల ప్రపంచంలో మనం ఏరుకున్న విషయాలు, వాటిని పట్టుకొని అల్లుకున్న భావాలు సత్యాలు కావచ్చు, కాకపోవచ్చు. అవి సత్యాలా, కాదా! అవి నిర్ణయించడానికి మనం ప్రపంచం వద్దకు వెళ్తే లాభం లేదు. శాస్త్రం వద్దకు రావాలి. జ్ఞానమును శాస్త్రము నుండే పొందాలి. అందుకే శాస్త్రము ప్రమాణమైంది. 'ప్రమ' అంటే జ్ఞానము. జ్ఞానమును అందించేది కనుక శాస్త్రము ప్రమాణము ***(ప్రమాకరణం ప్రమాణం)***. అట్టి శాస్త్రము అపౌరుషేయమైన వేదమే కాని మరొకటి కాదు. మానవుల ఊహలు, ఊహాజనిత మతాలు ఎన్నడూ ప్రమాణం కాలేవు. అందుచేతనే ఈ సందర్భంలో సాక్షాత్తు భగవంతుడైన శ్రీకృష్ణుడు కూడా వేదాన్నే ఉటంకించాడు.

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోకము, ఆ తరువాత శ్లోకము కఠోపనిషత్తులో ఉన్నాయి. వాటిని యథాతథంగా ఈ సందర్భంలో హారములో మణులు పొదిగినట్లు అమర్చాడు అచ్యుతుడు.

ఉపదేశానికి మాటలు అరువు తెచ్చుకో వలసిన అవసరం గీతాచార్యునికి లేదు. జ్ఞాన కరువు తెలియని విజ్ఞాన కల్పతరువు శ్రీకృష్ణుడు. ఉపనిష న్మంత్రాలను ఉటంకించి గీతా భవనానికి నూతన సొగసుల్ని దిద్ద వలసిన అగత్యం సర్వజ్ఞుడైన శ్యామసుందరునికి లేదు. ఒక విధంగా చెప్పాలంటే, ఉపనిషత్తులే ఆ దివ్యాత్ముని వైభవాన్ని వర్ణించలేక మూగబోయాయి ***(యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ - తైత్తిరీయ శ్రుతి)***. మనస్సులు మూగబోయేది, వాక్కులు విహ్వలత చెందేది వాసుదేవ చైతన్యాన్ని వర్ణించే సందర్భం లోనే అనేది మనం విస్మరించ కూడని విషయమే కాదు, స్మరించ దగిన వైభవము కూడా. వేదాలు వర్ణించ లేక మూగబోయాయి కనుకనే తానే ప్రేమతో స్వాత్మానంద సాగరము నుండి ఒక అలను పైకి లేపి, ఆ అద్భుతాన్ని అనమానంగా వర్ణించి, దాని అప్రమేయ వైభవాన్ని అమోఘంగా ఆవిష్కరించాడు.

వేదైశ్చ సర్వైః అహమేవ వేద్యః
వేదాన్త కృత్ వేదవిదేహ చాహమ్ ॥

అర్జునా! సమస్త వేదముల చేత తెలియ దగిన దివ్యత్వము నేనే. నేను పండించిన పంటే వేదాంతము. వేదమును తెలిసిన వాణ్ణి కూడా నేనే, అని గీత - పదిహేనవ అధ్యాయం - పదిహేనవ శ్లోకంలో వివరించాడు.

అలాంటి భగవానుడు ఈ రెండు శ్లోకాలను కఠోపనిషత్తు నుండి ఎందుకు సంగ్రహించాడు? (1)సంప్రదాయాన్ని రక్షించడానికి. (2) ఆదర్శాన్ని చూపడానికి. (3) వైభవాన్ని గుర్తించి, గౌరవించడం ఎలాగో ప్రపంచానికి చాటి చెప్పడానికి.

వేదము ప్రమాణము. వేదాలను శ్రుతులు అంటారు. శ్రుతి ప్రతిపాదిత విషయాన్ని మహాత్ములు తమదైన శైలిలో వివరించి, వ్యాఖ్యానాలు అందించ వచ్చు. వాటిని శ్రుతులు అనరు. స్మృతులు అంటారు.

స్మృతులు ఏవైనా, ఎవరు చెప్పినా, అవి శ్రుతులను అనుసరించే ఉండాలి. శ్రుతులకు భిన్న మైన స్మృతులను ఆర్షసంస్కృతి అంగీకరించదు. ఇది సంప్రదాయం. సంప్రదాయ రక్షణే జాతికి శ్రీరామరక్ష.

పవిత్రమైన ఋషి సంప్రదాయాన్ని రక్షించే ప్రయత్నంలో గీతాచార్యుడు ఉపనిషత్తుల నుండి మంత్రాలను గ్రహించి, గీతలో పొందు పరచాడు. తాను బోధించేది శ్రుతులకు భిన్నం కాదని లోకానికి సందేశా న్నిచ్చాడు. అందరూ అలాగే ప్రవర్తించాలని శ్రేష్ఠుడుగా ఆదర్శాన్ని అందించాడు. జ్ఞాన భాండాగారాలు, ఈశ్వర ప్రసాదాలైన వేదాలను విడిచి, బుద్ధితో బోధలు చేసే అస్తవ్యస్త ధోరణి నేల విడిచి సాము చేయడం లాంటి దని స్పష్టం చేశాడు. తాను ఆదర్శాన్ని ఆచరించి చూపాడు. అదే శ్రీకృష్ణుని వైభవం.

ఋషిభి ర్బహుధా గీతం ఛన్దోభి ర్వివిధైః పృథక్
బ్రహ్మసూత్ర పదైశ్చైవ హేతు మద్భి ర్వినిశ్చితైః ॥

అర్జునా! ఈ విషయం ఋషుల చేత అనేక విధాలుగా చెప్ప బడింది. వేదాలలో సహేతుకంగా వివిధ శాస్త్ర నిర్ణయాలచే గానం చేయబడింది. బ్రహ్మమును తెలిపే సూత్రాల చేత కూడా దివ్యంగా ప్రబోధించ బడింది అని భగవద్గీత - పదమూడవ అధ్యాయంలో దివ్యంగా ప్రవచించాడు. 'ఇది నా అంతరాత్మ చెప్పింది' అంటూ, అర్థరహిత ప్రసంగాలు చేసే అప్రయోజకుల నోళ్ళు మళ్ళీ తెరవకుండా భగవానుడు కట్టేశాడు.

ప్రస్తుతం మనం రెండవ అధ్యాయం - పందొమ్మిదవ శ్లోకాన్ని చర్చించ బోతున్నాం. ఈ శ్లోకం కఠోపనిషత్తులో కూడా ద్వితీయ వల్లిలో - పందొమ్మిదవ మంత్రమే. అది కాకతాళీయ న్యాయమని మీరు అనుకుంటే తప్పు లేదు. నేను మాత్రం అలా అనుకోవడం లేదు. వ్యాసుని వైచిత్ర్యాలు అలాగే ఉంటాయి అని నా అభిప్రాయం.

అర్జునా! ఆత్మ చంపు తుందని కొందరు, చస్తుందని కొందరు భావిస్తూ ఉంటారు. వీరిద్దరూ వాస్తవం తెలియని వారే. ఆత్మ చంపదు, చంప బడదు అంటున్నాడు భగవానుడు.

కర్త కాదు - కర్మ కాదు

నేను చంప బడతాను, నేను చంపుతాను అనే మాటలు మనం వింటూ ఉంటాము. నేను చంపేవాణ్ణి ***(హన్తాఽహం)***. నేను చంపబడే వాణ్ణి ***(హతోఽస్మ్యహం)*** అని అంటూ ఉంటారు. ఇంతకీ చచ్చే దెవరు? చంపే దెవరు?

దేహి సద్రూప చైతన్యము, నిత్యుడు, అవినాశి, అప్రమేయుడు అని ఇప్పటికే గ్రహించాము. అలాంటి దేహి ఎలా చంపుతాడు? చచ్చేది దేహము కనుక చావడము దేహ ధర్మము. చంపినాను అనేది బుద్ధి. కనుక అది అంతఃకరణ ధర్మము. ఈ రెండూ అసత్తులే. అనాత్మలైన దేహ మనోధర్మాలను ఆత్మ యందు ఆరోపించడం చేత ఆత్మ చంపుతుందని, చస్తుందని భ్రమ చెందుతూ అవివేకులు పలవరిస్తూ ఉంటారు.

చంపుట అనే క్రియ ***(హనన క్రియ)*** ఎవరికి సంబంధించింది? ఆత్మ ఎలా చంపుతుంది? ఆత్మకు చేతు లున్నాయా చంపడానికి? కంఠ ముందా పిసికితే చావడానికి? ఆత్మ అవయవాలు లేనిది కనుక, ***(నిరవయవత్వాత్)*** ఎలా చంపుతుంది? ఎలా చస్తుంది?

చంపేది బుద్ధి ధర్మము. చచ్చేది దేహ ధర్మము. చచ్చినా, చంపినా, ఈ రెండూ ఉండాలి. ఈ రెండు లేని చోట చావడమూ ఉండదు. చంపడమూ జరగదు.

చంపడము, చావడము అనే ఈ కర్తృకర్మలు జాగ్రత్స్వప్నాల్లోనే జరుగుతాయి. ఎందుకో తెలుసా? దేహము, బుద్ధి ఈ రెండు అవస్థల లోనే ఉన్నాయి. గాఢనిద్రలో ఇప్పటి వరకు కర్తృకర్మలు జరిగినట్లు దాఖలాలు లేవు. ఎందుకో తెలుసా? అక్కడ దేహమూ లేదు. బుద్ధీ లేదు.

అర్జునా! అర్థమైందా! ఇదంతా ఆరోపమే గాని స్వరూపం కాదు. దేహ ధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించి ఒకడు చచ్చాను అంటాడు. బుద్ధి ధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించి మరొకడు చంపినాను అంటాడు. తాను ఆత్మ అని తెలుసుకుంటే, తాను చచ్చేవాడు కాడని, చంపే వాడూ కాడని గ్రహిస్తాడు. ఆత్మ ఏ కర్మకు కర్త కాలేదు. ప్రపంచంలో ఏ కర్త ఏది ఆచరించినా, ఆత్మ కర్మ కాలేదు.

పార్థా! నువ్వు ఎవరో ఇప్పుడు చెప్పు? నువ్వు ఆత్మవే. కనుక చంపేవాడివి కావు. అదలా ఉంచు. భీష్ముడు ఎవరో చెప్పు? అతడూ ఆత్మే. కనుక అతనూ చచ్చేవాడు కాడు. భీష్మద్రోణాదుల్ని ఎలా చంపేది? అవి ఇంతకు ముందు నువ్వు పలికిన మాటకు అర్థముందా? ఆలోచించు అన్నాడు అచ్యుతుడు.

ఇదొక అద్భుతమైన శ్లోకం. ఎందరినో ప్రభావితం చేసింది. ఎందరో జీవితాలలో దీపం వెలిగించింది. వికారాల నుండి విడి పడి, వివేకంతో విలక్షణంగా జీవించ డానికి ఎందరికో స్ఫూర్తి నిచ్చింది. ముఖ్యంగా పాశ్చాత్యుల్ని కూడా ఎంతగానో ప్రభావితం చేసింది.

అమెరికా తత్త్వవేత్త ఎమర్సన్‌ను ఈ శ్లోకం ఎంతగానో చలింప చేసింది. ఇంగ్లండు దేశానికి చెందిన గొప్ప విశ్లేషకుడు, విమర్శకుడు, రచయిత అయిన కార్లైల్ ఆంగ్లం లోకి అనువదించ బడిన భగవద్గీతను ఎమర్సన్‌కు కానుకగా ఇచ్చాడు. అది చదివిన తరువాత ఎమర్సన్‌లో గొప్ప పరివర్తన చోటు చేసుకుంది. గీతను అధ్యయనం చేసిన తరువాత తన ఆలోచనా విధానం లోనే గొప్ప మార్పు వచ్చినట్లు తానే స్వయంగా వ్రాసు కున్నాడు.

నాయం హన్తి న హన్యతే అనే వాక్యం అతనిపై అష్టాక్షరీ మంత్రం లాగా పని చేసింది. ఎమర్సన్ సాహిత్యం చదివిన వారు ఆయన రచించిన ***బ్రహ్మ*** (Brahma) అనే గ్రంథాన్ని మరచిపోలేరు.

వికారాలు తెలియనిది కనుక ఆత్మ చంపదు. చంప బడదు. ఆత్మకు వికారాలు ఎలా లేవో, తరువాత శ్లోకం వివరిస్తూ ఉంది.

న జాయతే మ్రియతే వా కదాచి న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

న-జాయతే-మ్రియతే-వా-కదాచిత్-అయం-భూత్వా-భవితా-వా-న-భూయః
అజః-నిత్యః-శాశ్వతః-అయం-పురాణః న-హన్యతే-హన్యమానే-శరీరే

అయం	=	ఈ ఆత్మ
కదాచిత్	=	ఎప్పుడును
న జాయతే	=	పుట్టనిది
న మ్రియతే వా	=	చచ్చేది కాదు
న భూత్వా	=	లేకనే
భూయః	=	మరల
భవితా వా న	=	ఏర్పడుట లేదు
అయం	=	ఈ ఆత్మ
అజః	=	పుట్టుక లేనిది
నిత్యః	=	స్థిరమైనది
శాశ్వతః	=	నిత్యమైనది
పురాణః	=	అనాది యైనది
శరీరే	=	శరీరము
హన్యమానే	=	చస్తూ ఉన్నా
న హన్యతే	=	చంపబడదు

ఆత్మ ఎన్నడూ పుట్టదు. కనుక మరణించదు. కొంతకాలం ఉండి ఆ తరువాత లేకుండా పోయేది కాదు. కొంత కాలం లేకుండా ఉండి ఆ తరువాత ఉండేది కూడా కాదు. ఆత్మ పుట్టుక లేనిది. నిత్య మైనది. తరిగేది కాదు. పురాతన మైనది. దేహము క్షీణిస్తున్నా ఆత్మ నశించదు.

వ్యాఖ్య

ఆత్మ చంపేది కాదు. చచ్చేది కాదు. తాను చంపదు, తాను చావదు అని గడచిన శ్లోకంలో గ్రహించాము. మరి, పుడుతుందా? పుట్టి చావకుండా ఉంటుందా? అంటే మార్పు చెందదా? మరి, మనం చూచే మార్పు లన్నీ ఏమిటి? దేనికి సంబంధించినవి? ఇలా అనేక ప్రశ్నలు ఈ సందర్భంలో పుట్టు కొస్తాయి. వాటన్నిటికి సమాధానాలు ఈ శ్లోకంలో లభిస్తాయి.

పుట్టదు - చావదు

పుట్టడం అంటే, అంతవరకు లేనిది రావడం, క్రొత్తగా కనిపించడం అని అర్థము. చావడం అంటే, అంతవరకు ఉన్నది లేకుండా పోవడము అని అర్థము. లేకుండా వచ్చేది జన్మము. ఉండి పోయేది మరణము. ఈ రెండు ఆత్మకు లేవు అని తెలుపుతూ ఈ శ్లోకంలో ***న జాయతే, న మ్రియతే*** అనే రెండు వాక్యాలను ప్రవేశ పెట్టాడు గీతాచార్యుడు.

ఆత్మ పుట్టదు. పుట్టేది కాదు. ఉత్పత్తి లేదు. పుట్టడం అనే లక్షణము ఆత్మకు లేదు. జనన రూప వికారము లేదు ***(జని లక్షణా వస్తు విక్రియా న ఆత్మనః విద్యతే)***. లేనిది కలిగితే జన్మము. ఆత్మ అలా పుట్టాలి అంటే ఆత్మ లేని కాలమంటూ ఒకటి ఉండాలి.

కాలము అనేది సాపేక్షిక సత్యము. కాలము తన మనుగడకు ఆత్మపై ఆధారపడి ఉంది. ఆధారపడి ఉంది కనుక కాలము అసత్. అసద్రూపమైన కాలం ఆత్మపై ఆధారపడి దొర్లుతూ ఉంది. కాలం ఉంది అంటే, ఆత్మ ఉంది అని అర్థం. కాలం లేకపోయినా ఆత్మ ఉంటుంది.

గాఢనిద్రలో కాలం ఎవరికి తెలిసింది? తెలిసి ఉంటే, తెలిసే అవకాశమే ఉంటే, నిద్ర లేవగానే కాల మెంత? అని ఎందుకు అడుగుతాము? ఇంతసేపు నిద్ర పోయానా! అని ఎందుకు ఆశ్చర్య పోతారు? గాఢనిద్రలో కాలం లేదు. ఆత్మ ఉంది. ఉంది కనుకనే, నిద్ర లేస్తున్నాం. ఆత్మ లేని కాలమే లేనందున ఆత్మ కాలంలో ఆవిర్భవించదు.

పుట్టడం ఉంటేనే గిట్టడం. జననం ఉంటేనే మరణం. ఆత్మ జన్మించ లేదు. కనుక ఆత్మ మరణించదు. అంటే వినాశమును పొందదు. లోకంలో మరణించేవి ఎలా లేకుండా పోతున్నాయో, అటువంటి వినాశ రూప మైన మార్పు ఆత్మకు లేదు ***(న మ్రియతే చ ఇతి అన్యా వినాశ లక్షణా విక్రియా ప్రతిషిధ్యతే)***. ఆత్మ లేకుండా వచ్చింది కాదు కనుక లేకుండా పోయేది కాదు.

మరణము అంటే మార్పే కదా! వికారమే కదా! ఆత్మకు ఎలాంటి వికారమూ లేదు. అది అవికార్యం. మార్పు, లేదా వికారం జరగాలి అంటే కర్త, కర్మ అపేక్ష అనివార్యం. కర్త ఉండాలి. కర్మ జరగాలి. అప్పుడే మార్పు జరుగుతుంది. ఆత్మ విషయంలో అలాంటి వాటికి అవకాశం లేదు.

నేను గీతా వ్యాఖ్యానము వ్రాస్తున్నాను. ఇది కర్మ. ఈ కర్మలో మార్పు అనివార్యం కదా! నేను వ్రాస్తున్నాను. దానికి ముందు వ్రాయాలి అనే ఆలోచన ఉంది. ఆ తరువాత ఒక ఆలోచన తరువాత మరొక ఆలోచన తోసుకుంటూ వచ్చాయి. అలాగే పోయాయి. ఇదే మార్పు.

ఏమి వ్రాయాలి? ఎలా వ్రాయాలి? ఎప్పుడు వ్రాయాలి? వ్రాతకు కావలసిన వన్నీ ఉన్నాయా? లేక తెచ్చుకోవాలా? ఎక్కడ నుండి తెచ్చుకోవాలి? ఇదంతా ఆలోచించేది ఎవరు? నేనే. ఇప్పుడు నే నెవరు? కర్త. కర్తలో మార్పులు ఉన్నాయా, లేవా? వ్రాయాలి అనుకు న్నప్పుడు నేను ఆలోచించే వాణ్ణి ***(మన్తా)***. వ్రాతకు కావలసినవి ఆశించి నపుడు నేను కోరుకొనే వాణ్ణి ***(కామీ)***. వ్రాయాలని కూర్చున్నా, వ్రాసే అవకాశం లేనపుడు, ప్రతిబంధకాలు తలెత్తి వ్రాతలో వేగం సన్నగిల్లి నపుడు నేను బాధపడే వాణ్ణి ***(భోక్తా)***. ఇవన్నీ కర్తలో వికారాలే కదూ! ఇలాంటి వికారాలు ఆత్మకు ఉన్నాయా? లేవు. అందుచేత ఆత్మ కర్త కాదు. కర్త కాదు కనుక కర్మ లేదు. కర్తృకర్మ అపేక్ష లేదు కనుక వికారం లేదు. వినాశం ఉండదు.

వికార ద్వయం నాస్తి

లేనిది కలగడం ఒక వికారం. ఉన్నది లేకుండా పోవడం మరొక వికారం. మొదటిది జన్మ. రెండవది మృత్యువు.

లేనిది ఏది వచ్చినా అది ఒకనాడు లేకుండానే పోతుంది. కుండ లేకుండానే వచ్చింది. లేని కుండ వచ్చింది కనుక అది ఒకనాడు పగిలి లేకుండానే పోతుంది. ఇదొక వికారము.

లేనిది వచ్చి లేకుండా పోవడము ఒక వికారమైతే, ఒక రూపంలో ఉన్నది మరొక రూపంగా మారి, ఆ తరువాత లేకుండా పోవడము మరొక వికారము. మొదటి వికారానికి కుండను దృష్టాంతంగా చెప్పుకున్నాం. రెండవ వికారానికి పక్షి గ్రుడ్డును తీసుకుంటే సరిపోతుంది.

పక్షి గ్రుడ్డు పెడుతుంది. ఇది పుట్టడం. కొంత కాలానికి గ్రుడ్డు నుండి పక్షిపిల్ల పుడుతుంది. ఈ విధంగా గ్రుడ్డుగా పుట్టి, గ్రుడ్డుగా ఉండి పిల్లగా మారిన పక్షి భవిష్యత్తులో మరణించి లేకుండా పోతుంది. ఈ విధంగా లేకుండా ఉండినది, మళ్ళీ కలగటం కూడా ఉండదు ***(నాయం భూత్వా భవితా వా న భూయః)***.

న జాయతే మ్రియతే వా కదాచిత్
నాయం భూత్వా భవితా వా న భూయః ॥

శ్లోకంలో ఇంత వరకు చెప్పుకున్న దానిలో ***'కదాచిత్'*** అనే ఒక్క పదాన్ని వివరించాల్సి ఉంది. 'కదాచిత్' అంటే, ఎప్పుడును లేదా ఒకప్పుడును అని అర్థం. కనుక ఈ 'కదాచిత్' అనే పదం వికారము లన్నిటికీ సంబంధించి ఉంటుంది ***(కదాచిచ్ఛబ్దః సర్వ విక్రియా ప్రతిషేధైః సంబధ్యతే)***. ఎలాగంటే, ఒకప్పుడు పుట్టింది కాదు. ఒకప్పుడు చచ్చింది కాదు. ఎప్పుడునూ మారేది కాదు. ఇలా ప్రతి మార్పు లోను ఒకప్పుడును, ఎప్పుడును అంటూ 'కదాచిత్' శబ్దము కలసి పోతుంది. కలసి ఉంటుంది ***(న కదాచిత్ జాయతే, న కదాచిత్ మ్రియతే ఇత్యేవం)***. ఈ పదంలో మరొక అందమైన అవగాహనకు తెర లేస్తుంది.

అది లేనిది - ఇది కానిది

ఏదీ కాలేదు

పుట్టడం అనే వికారము లేనిది, మరణం అనే వికారానికి లోను కానిది, మధ్యలో వచ్చే వికారాలు ఏవీ అంటనిది ఆత్మ. అవికార్య సత్తా స్వరూపము. పుట్టింది ఏదైనా గిట్టి తీరుతుంది. ఈ జనన మరణాలతో పాటు మరి కొన్ని వికారాలను పొందుతూ ఉంటుంది.

దేహమే తీసుకుందాం. దేహం పుట్టింది. పుట్టిన దేహం మరణిస్తుంది. ఈ లోగా అనేక వికారాలకు లోనవుతుంది. ఆ వికారాలు ఆరు విధాలుగా ఉంటాయి. వాటినే షడ్భావ వికారాలు అంటారు.

అవి (1) ***జాయతే***- పుట్టుట (2) ***అస్తి***- ఉండుట (3) ***వర్ధతే***- పెరుగుట (4) ***విపరిణమతే***- మార్పు చెందుట (5) ***అపక్షీయతే***- క్షీణించుట (6) ***వినశ్యతి*** - నశించుట. ఈ ఆరు వికారాలను షడ్వికారములు అంటారు. ఇలా షడ్వికారాలు పొందేది ఏదయినా నశించి పోతుంది. ఆత్మకు ఈ ఆరు వికారాలు లేవు. కనుక ఆత్మ నశించదు. పుట్టిన దానికే వికారాలు ఉంటాయి. ఆత్మ పుట్ట లేదు.

ఆత్మ ఆరు వికారాలు లేకుండా ఎలా నిత్యమై, సత్యమై ఉందో గీతాచార్యుడు దివ్యంగా బోధిస్తున్నాడు. వికార లక్షణాలు లేవని చెప్పే ప్రక్రియలో భాగంగా ఆత్మ యొక్క లక్షణాలను విశేషంగా వివరిస్తున్నాడు.

అజః :- ఆత్మ పుట్టింది కాదు. ఆత్మకు పుట్టుక లేదు ***(న జాయతే, నోత్పద్యతే)***. కుండ పుట్టింది కాని ఆకాశం పుట్టలేదు. కుండ భగ్న మవుతుంది. కుండ లోని ఆకాశం భగ్నం కాదు. షడ్వికారాలలో మొదటిదైన పుట్టుక ***(జాయతే)*** ఆత్మకు లేదు. దేహం పుట్టింది కనుక దేహానికి ఉంది.

నిత్యః :- ఆత్మ నిత్యము. అంటే, కాల పరిధి లోకి రాదు అని అర్థము. ఏదైనా ఉన్నది ***(అస్తి)*** అంటే, కాలంలో ఉన్నది అని అర్థము. కాలంలో ఉన్నది కాలంలో నశిస్తుంది అని భావం. ఆత్మ ఉంది. కాని కాలానికి పరిమితమై ఉన్నది కాదు. కాలంలో ఉంది. కాలాతీతంగా కూడా ఉంది. ఈ ప్రపంచంలో ఏది ఉండినా పోయేందుకే ఉంటుంది. దేహం ఉంది. ఒకనాడు పోయేందుకే ఉంది ***(అస్తి)***. అందుచేత దేహానికి 'అస్తి' అనే వికారము ఉంది. కాని, ఆత్మ లేని కాలము లేనందున, ఆత్మ యొక్క అస్తిత్వము నిత్యమై ఉంది ***(అస్తి - నిత్యః)***. ఇలా ఆత్మ రెండవ వికారము లేకుండా ఉంది.

శాశ్వతః :- ఆత్మ శాశ్వత మైంది. మార్పు లేకుండా ఉంది. అదేమిటి, అంత పొడుగయ్యావు? సంవత్సరం లోనే ఇంత పెరిగావా? అని పిల్లలతో మనం అంటూ ఉంటాము. అది వర్ధమాన దశ కనుక పిల్లలు పెరుగుతూ ఉంటారు. అలా పెరిగేది దేహము ***(వర్ధతే)***. పెరగడమనే మూడవ వికారము దేహానిదే గాని ఆత్మది కాదు. అందుకే ఆత్మ శాశ్వతము. శాశ్వతము అంటే ఎప్పుడూ ఉండేది. వికారం లేకుండా అలాగే ఉండేది ***(శశ్వత్ భవః శాశ్వతః)***. పెరుగు లేనిది కనుక తరుగు తెలియనిది. అదేమిటి! అంత తగ్గిపోయారు? అని వృద్ధులతో అంటూ ఉంటాము. తరిగే ఐదవ లక్షణం ***(అపక్షీయతే)*** కూడా దేహానిదే కాని, ఆత్మది కాదు.

పురాణః :- ఎప్పటి నుండో ఉన్నా, అలాగే ఉండేది కనుక ఆత్మ పురాణ మైనది ***(పురా అపి నవః పురాణః)***. ఎప్పుడూ దివ్యం గానే ఉంటుంది. వికారం చెందదు. దేహం అలా కాదు. పాత పడే కొద్ది రోతగా మారుతూ ఉంటుంది ***(విపరిణమతే)***. ఈ పరిణామ దోషము కూడా వికారమే. పరిణామము అనే నాల్గవ వికారము కూడా దేహానిదే గాని, ఆత్మది కాదు.

న హన్యతే :- ఆత్మ చంప బడేది కాదు. ఆత్మ చావదు. దాని నెవరూ చంప లేరు. ఆత్మ పుట్ట లేదు. పెరగ లేదు. క్షీణించ లేదు. పరిణామం చెంద లేదు. ఇక ఎలా నశిస్తుంది? నశించే వికారము దేహానిది. దేహం వికారంతో పుట్టింది కనుక వికారిగా చస్తుంది. ఆత్మకు పుట్టుక లేదు. కనుక మృత్యువు ఉండదు. దేహాలు చస్తూ ఉన్నా ఆత్మ చావదు ***(న హన్యతే హన్యమానే శరీరే)***. కనుక నశించుట ***(వినశ్యతి)*** అనే ఆరవ వికారము కూడా దేహానిదే కాని ఆత్మది కాదు.

షడ్వికారాలు కలిగిన దేహం చస్తుంది. షడ్వికార రహితమైన ఆత్మ చావ కుండా ఉంటుంది. ఈ విధంగా ఆత్మలో షడ్వికారాలు లేవని ఈ శ్లోకంలో నిరూపించడం జరిగింది ***(అస్మిన్ శ్లోకే షడ్భావ వికారాః లౌకిక వస్తు విక్రియాః ఆత్మని ప్రతిషిధ్యన్తే)***.

ఈ విధమైన ఆత్మ తానే నని తెలిసిన జ్ఞాని జీవించి ఉన్నప్పుడే ముక్తుడు. జీవన్ముక్తుడు. దేహం లోనే ఉంటాడు. దేహ వికారాలు తనవి కావని గ్రహించి ఉంటాడు. నేను దేహము అనే భావం ఆ మహాత్మునిలో కదలదు. 'నేను' అనేది లేకుండా దేహంలో ఉంటాడు. 'నాది' అనేది అర్థం కాకుండా గృహంలో ఉంటాడు. అహంకారం ఆవిరై పోయింది కనుక 'నేను'గా లేని వాడు. మమకారం మరిగి పోయింది కనుక 'నాది' అనేది తెలియని వాడు. నేను మట్టిని అనే జ్ఞానం కలిగిన కుండ, వ్యవహారంలో ఉపకరిస్తున్నా, తన స్వరూపంలో తాను ఉన్నట్లు, నేను ఆత్మను-అని తెలిసిన లోక వ్యవహారాలలో చరిస్తూ ఉండినా, తామరాకు నీటి లోనే నీటిని అంటకుండా ఉన్నట్లు, ఈ ప్రపంచంలో వ్యవహరిస్తూ ఉంటాడు. దేహ విలక్షణుడైన ఆ మహాత్ముడు దేహాన్ని అంటి పెట్టుకొని లేడు. దేహమే ఆ దివ్యాత్ముని నీడ లాగా అనుసరిస్తూ ఉంటుంది (***ఛాయావత్ అనువర్తినీ***).

ఓం... ఓం... ఓం...

అర్జునా! దేహ మేమిటో, దేహి ఎవరో తెలిసిందా? చచ్చే దెవరో, చావని దెవరో అర్థమైందా? ఎవరి కోసం దుఃఖించాలి? శోచ్యు లెవరు? అందరూ అశోచ్యులే. అర్థమైతే దుఃఖ మెక్కడుంది? ఈ సత్యం అర్థమైన వాడే జ్ఞాని. జ్ఞాని ఎవరిని చంపుతాడు? ఎవరిని చంపిస్తాడు? ఇదంతా ఎలా చేస్తాడు? అది కూడా చెప్పకుందాం.

వే దావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హన్తి కమ్ ॥ 21

వేద-అవినాశినం-నిత్యం-యః-ఏనం-అజం-అవ్యయం
కథం-సః-పురుషః-పార్థ-కం-ఘాతయతి-హంతి-కమ్

పార్థ	=	హే అర్జునా!	వేద	=	తెలుసుకున్న
యః	=	ఎవడు	సః పురుషః	=	ఆ పురుషుడు
ఏనం	=	ఈ ఆత్మను	కం	=	ఎవనిని
నిత్యం	=	ఎల్లప్పుడు ఉండుదానినిగా	కథం	=	ఎట్లు
అవినాశినం	=	నాశము లేని దానినిగా	ఘాతయతి	=	చంపించును?
అజం	=	పుట్టుక లేని దానినిగా	కం	=	ఎవనిని
అవ్యయం	=	అక్షయమైన దానినిగా	హంతి	=	చంపును?

పార్థా! ఆత్మ పుట్టేది కాదని, చచ్చేది కాదని, ఎప్పుడూ ఉండేదని తెలుసుకున్న వాడు ఎవరిని ఎలా చంపిస్తాడు? ఎవరిని చంపుతాడు?

వ్యాఖ్య

ఆత్మ స్వరూపం

ఆత్మ నిత్యము. నిరవయవము. సావయవ వస్తువే పుడుతుంది. పుట్టినదే నశిస్తుంది. ఆత్మకు అవయవాలు లేవు. కనుక ఆత్మ పుట్టదు. నశించదు. ఆత్మ అవినాశి. అవినాశి అంటే చివరి దైన భావవికారం లేనిది (***అంత్య భావ వికార రహితం***) అని అర్థం. మరణమే అంత్యభావ వికారము. అది ఆత్మకు ఎందుకని లేదు? అని ప్రశ్నిస్తే, పుట్టుక అనే ఆది భావ వికారం లేదు కనుక మరణము అనే అంత్యభావ వికారం లేదు అనే సమాధానం వస్తుంది. ఆద్యంతముల యందు ఏదయితే లేదో, దేని కైతే ఆద్యంతములు ఉన్నవో అది మధ్యలో ఉండినా లేనిదే అని గ్రహించాము కనుక, ఏ విధమైన భావవికారం లేనిది ఆత్మ. అందుకే ఆత్మ అవినాశి.

ఆత్మను అవినాశిగా తెలుసుకున్న వాడు ఆత్మజ్ఞుడు. ఆత్మజ్ఞానము కలవాడు. జ్ఞానము నందు అధికారం కలవాడు (***సః విద్వాన్ పురుషః అధికృతః***). పండితుడైన ఆ ఆత్మవిదుడు ఆత్మను పుట్టుక లేని దానినిగా తెలుసుకుంటాడు (***అజః***). ఏ విధమైన మార్పులు లేని దానినిగా అర్థం చేసుకుంటాడు (***అవ్యయం***). ఆత్మను అజంగా, అవ్యయంగా, అవినాశిగా తెలుసుకున్న వాడు దేనిని ఎలా చంపుతాడు? ఎలా చంపిస్తాడు?

ఇక్కడ చంపుట (***హన్తి***) అని చెప్పడంలో కేవలం హననక్రియ అని అర్థం కాదు. చంపుట అనేది కర్మ. చచ్చుట అనేది కూడా కర్మే. కాని, ఇక్కడ చంపుట, చచ్చుట అనే ప్రత్యేకమైన అర్థాలు ఏవీ లేవు. 'హన్తి' అనే పదము అన్ని క్రియలకు ఉపలక్షణంగా చెప్ప బడింది. కనుక ఒక హనన క్రియే కాదు, ఆత్మలో ఏ కర్మకు అవకాశము లేదు. కర్తృకర్మ ప్రేరకాలు ఆత్మలో ఊహించుట సాధ్య పడదు అనేదే ఇక్కడ కేంద్ర విషయం.

ఒక కర్మ జరగాలి అంటే, ఆ కర్మకు సంబంధించిన ఆలోచనలు ముందుగా మనస్సులో ఉండి తీరాలి. కర్మకు ముందు కర్మకు సంబంధించిన జ్ఞానము ఉంటుంది. అట్టి జ్ఞానమును ఆధారం చేసుకొనే కర్మ చేయడం జరుగుతుంది. మరి, ఆ జ్ఞానం ఆలోచిస్తేనే కదా కలుగుతుంది? ఆలోచించాలి అంటే, మనస్సులో సంకల్పాలు నడవాలి కదా!

సంకల్పం చేసే దెవరు? కర్మ చేసే దెవరు? కర్మ చేసే వాడే సంకల్పిస్తాడా? లేక సంకల్పం లేకుండా కర్మ చేస్తాడా? ఇప్పుడు కర్త ఎవరు? చేసే వాడు కర్త. మరి, అలా చేసేవాడు ఆలోచన లేకుండా చేస్తాడా? చెయ్యలేడు. మరి ఆలోచించిం దెవరు? కర్తే. ఆ కర్త ఎవరు? ఆత్మ అవుతుందా? కాలేదు. ఎందుకో తెలుసా! ఆత్మ సంకల్పించదు. సంకల్పాలు నడవ డానికి ఆధారమైంది ఆత్మ. కనుక ఆత్మ కర్త కాదు. ఇలా ఆత్మ స్వరూపాన్ని అకర్తగా, అభోక్తగా తెలుసుకున్న వాడు ఆత్మజ్ఞుడు.

ఆత్మవిదుడు

ఆత్మలో కర్తృకర్మ ప్రేరకాలు లేవని తెలిసిన వాడు, ఆత్మ నిష్క్రియత్వ చైతన్య మనే జ్ఞానాన్ని పొందిన వాడు ఆత్మవిదుడు. అతడు కర్తృ భోక్తృ లక్షణాలు లేని ఆత్మలో సర్వకర్మ సన్యాసమును దర్శించిన వాడు. పరమార్థ జ్ఞానదృష్టితో జీవిస్తూ, కర్మల యందు అకర్మను దర్శించేవాడు. అందుచేతనే మన పెద్దలు, **జ్ఞాత్వా కర్మాణి కుర్వీత** అన్నారు. జ్ఞానాన్ని పొంది కర్మలు ఆచరించు అన్నారు. జ్ఞానం కలిగిన వారికి కర్మలలో అకర్మ దర్శనీయ మవుతూ ఉంటుంది. ప్రస్తుత సాంఖ్య ప్రకరణంలో ఆత్మ వికార రహిత మని, జ్ఞానికి ఏ కర్మలు ఉండవు అని ప్రబోధించడమే ప్రధాన ఉద్దేశ్య మని శ్రీ శంకరులు కూడా అభిప్రాయ పడ్డారు.

హేత్వర్థస్య తుల్యత్వాత్ విదుషః సర్వకర్మ ప్రతిషేధ ఏవ ప్రకరణార్థః అభిప్రేతః భగవతః

ఆత్మ వికార రహితము అనే హేతువు యొక్క అర్థం, సర్వకర్మల విషయం లోను ఆత్మ నిర్వికారము అని తెలుస్తూ ఉంది కనుక, అట్టి ఆత్మను తెలుసుకొనిన ఆత్మజ్ఞాని చేత సర్వకర్మలు నిషేధింప బడుతున్నాయి అనేది భగవంతుని అభిప్రాయము. చంపుట అనే హనన క్రియను నిషేధించుట అనేది కేవలం ఉదాహరణకు సూచించినది మాత్రమే (***హన్తేః తు ఆక్షేపః ఉదాహర ణార్థత్వేన కథితః***).

ఆత్మ జ్ఞానోదయంలో అజ్ఞానం నివృత్తి అవుతుంది. దేహ ధర్మాలను ఆత్మ యందు ఆరోపించుకొని నేను చంపినాను - నేను చంపించినాను అనే అజ్ఞాన వచనాలు ఇక ఆ స్థితిలో విన పడవు.

ఆత్మ యందు వికారము దర్శనీయ మైనపుడు తాను కర్త అవుతాడు. లేదా, తాను కర్తగా ఉండి కర్మ యైన మరొకరిని పురి కొల్పుతాడు. కర్తృత్వమే లేనపుడు ప్రేరకత్వము ఎలా ఉంటుంది? ఆత్మను తెలుసుకున్న వాడు ఎలా చంపుతాడు? ఎలా చంపిస్తాడు? అంటే ఆత్మజ్ఞుడు కర్మలు ఎలా చేస్తాడు? ఎలా చేయిస్తాడు?

అని అర్థం. ఆత్మను తెలుసు కోవడము అంటే, అలా తెలుసుకున్న వాడు సర్వకర్మ సన్యాసి అయ్యాడని భావము.

మరి, ఆత్మ అవినాశి అనేది నిర్ధారణ చేయ బడింది కదా! అది ఎలా? ***(తత్ర ఆత్మన: అవినాశిత్వం ప్రతిజ్ఞాతమ్; తత్ కిం ఇవ ఇతి? ఉచ్యతే)*** *అదే చెప్పబోతున్నాడు.*

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరో௨పరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22

వాసాంసి-జీర్ణాని-యథా-విహాయ-నవాని-గృహ్ణాతి-నరః-అపరాణి
తథా-శరీరాణి-విహాయ-జీర్ణాని-అన్యాని-సంయాతి-నవాని-దేహీ

యథా	=	ఏ ప్రకారము	తథా	=	అలాగే
నరః	=	మనుష్యుడు	దేహీ	=	జీవుడు
జీర్ణాని	=	చినిగిన	జీర్ణాని	=	శిథిలములైన
వాసాంసి	=	వస్త్రాలను	శరీరాణి	=	శరీరములను
విహాయ	=	విడిచి	విహాయ	=	విడిచి
అపరాణి	=	ఇతరములైన	నవాని	=	నూతనమైన
నవాని	=	వస్త్రాలను	అన్యాని	=	అన్యములైన దేహములను
గృహ్ణాతి	=	ధరించునో	సంయాతి	=	ధరించు చున్నాడు

మానవుడు చినిగి పోయిన వస్త్రాలను వదిలేసి, వేరే నూతన వస్త్రాలను ధరిస్తాడు కదూ! అర్జునా! జీవుడు కూడా శిథిలమైన శరీరాలను విడిచేసి, వేరే క్రొత్త శరీరాలను పొందుతూ ఉంటాడు.

వ్యాఖ్య

జీవుడు నిత్యుడు. నశించే వాడు కాడు. మార్పు చెందే వాడు కాడు. మరణం పొందేవాడు కాడు అని ఇంత వరకు చూశాం. కాని, ఈ లోకంలో మనిషి పొందే అనుభవ జ్ఞానము మరో విధంగా ఉంది. ఎంద రెందరో కళ్ళ ముందే గతిస్తున్నారు. ఉన్న వాళ్ళు పోయేందుకే ఉన్నారు అని తెలిసి పోయింది. ఉండి పోయే వారిలో తామూ ఒకడు అని మనిషికి అర్థమై పోయింది. ఇదొక తీరని ఆవేదన. ఆరని అశాంతి. ఇదంతా అవివేకంతో మనిషి తనకు తానుగా కల్పించుకున్న బంధము. మరణంలో సమస్తము మునిగి పోతుందని లేని ప్రళయాన్ని ఊహించుకొని మానవులు అల్లాడి పోతున్నారు. మరణం మంగళకర మైనదని, ఆహ్వానించ దగినదే గాని ఆవేదన చెంద దగిన విషయం కాదని చెబుతూ, జనన మరణాల గుట్టు విప్పుతూ, జీవుని నిత్యత్వాన్ని విస్పష్టం చేస్తున్నాడు గీతాచార్యుడు.

గువ్వ - గూడు

సుదీర్ఘ జీవిత ప్రయాణంలో ఈనాటి బ్రతుకు ఒక మజిలీ. ఈ విరామంలో ఎన్నో సంఘటనలు. ఎన్నెన్నో బాంధవ్యాలు. సుఖాలు, నవ్వులు, కష్టాలు, కన్నీళ్ళు, సంయోగాలు, వియోగాలు. ఇదంతా జీవితం. జీవి ఆడే చదరంగం.

నానా దిక్కుల నుండి వచ్చిన పక్షులు ఒక్క చెట్టు మీద విశ్రమిస్తాయి. విశ్రమించినట్లే ఉంటాయి. ఇంతలోనే విశ్రామం విరమించి విహారం సాగిస్తాయి. కొమ్మలు పక్షివి కావు. పక్షికి రెక్కలూ మిగలవు. చెట్టు విడిస్తే ఏ పక్షి పయనం ఏ వైపో!

చెట్టుపై గూడు; గూటిలో పక్షి. హోరుగాలి వీచినా, పై కొమ్మ నుండి పండు రాలి గూటిపై పడినా, గూడు ముక్కలౌతుంది. గువ్వ గంతు లేస్తుంది.

గూటి మీద పండు రాలె - గూడు రెండు ముక్క లాయె
గూటి లోని రామచిలుక - గుట్టల పాలాయె రన్నా
గూటి చిలకేదిరా - చిన్నన్నా
గూడు చినబోయెరా!

గూడు కాదెన్నడూ తోడు - గువ్వకు తప్పదెప్పుడైనా దౌడు. గూటిలో గువ్వ ఉంటుంది. గువ్వలో గుట్టు ఉంటుంది. గుట్టు తెలియని గువ్వ గూడే సర్వమని భ్రమిస్తుంది. లేదా, గగనంలో సవార్లు సాగిస్తుంది. గుట్టు తెలిస్తే గువ్వ మనసే గగన మంత విశాల మవుతుంది (*గగన సదృశం*).

బట్ట కడితే బ్రతుకు - బట్ట విడిస్తే చావు

మనిషి వస్త్రాన్ని ధరిస్తాడు. ఆ వస్త్రమే చిరిగి పోతే దానిని వదిలి మరొక క్రొత్త వస్త్రాన్ని ధరిస్తాడు. అలాగే మనిషి దేహ మనే వస్త్రాన్ని ధరిస్తాడు. అది దుర్బలమైతే, ఆ దేహాన్ని త్యజించి నూతన దేహాన్ని పొందుతూ ఉంటాడు.

వాడుకలో ఏవయినా పాత బడతాయి. పాడై పోతాయి. దండైనా, కుండైనా, వస్త్రమైనా, దేహమైనా - ఏదైనా శిథిలం కావలసిందే.

వస్త్రధారి వస్త్రాన్ని మోయాలి. దేహధారి దేహాన్ని మోయాలి. దేహం యొక్క ప్రయోజనం దేహికి ఉంది. ప్రయోజనం లేకపోతే ఎవ్వరూ భారాన్ని మోయరు. వస్త్రం దేహాన్ని కప్పి దేహాన్ని రక్షిస్తూ ఉంటుంది. అలాగే, దేహం దేహిని కప్పి, దేహిని రక్షిస్తూ ఉంటుంది.

అందరికీ దేహాలు ఉన్నాయి. అందరి దేహాలు ఒకే లాగా లేవు. అందరూ వస్త్రాలు ధరిస్తారు. అందరి వస్త్రాలు ఒకే రంగులో ఉండవు. ఒకే నాణ్యతలో కనిపించవు. అభిరుచుల్ని బట్టి బట్టలు. కర్మలను బట్టే దేహాలు.

ఇంటి లోని వారందరికీ ఎవరెవరికి ఎలాంటి బట్టలు కొని పెట్టాలో ఇంటిపెద్దకు తెలుసు. ఉద్యోగం చేసే వారికి ఒక రకమైన బట్టల్ని, చదువుకొనే వారికి వేరొక రకమైన బట్టల్ని, పనిపాట లేని వానికి మరొక రకమైన బట్టల్ని ఇంటి యజమాని కొని పెడతాడు. ఎవరికి ఏవి అవసరమో ఇంటిపెద్దకు తెలుసు.

ఈ ప్రపంచానికి యజమాని పరమేశ్వరుడు. ఎవరెవరికి ఎలాంటి దేహాలు ఇవ్వాలో సర్వజ్ఞుడైన సర్వేశ్వరునికి తెలుసు. అందరి దేహాలు ఒక విధంగా లేవు. రూపాలలో భేదా లున్నాయి. రంగులలో భేదా లున్నాయి. ఆరోగ్యాలలో భేదా లున్నాయి. అందాలు, వికారాలు, కళలు, కాంతులు, చూపులు, చేతలు ఎన్నో ఉన్నాయి. అన్నీ భిన్నంగా ఉన్నాయి. అవి అలా ఉండటం వెనుక ఎంతో జ్ఞాన ముంది.

దేహాలు రావడం వెనుక నియతి ఉంది. దేహాలు ఉండటంలో ధర్మా లున్నాయి. దేహాలు రాలి పోవడంలో కూడా నియతి ఉంది. దేహం వస్తుంది. అలాగే పోతుంది. అందుకే దేహాలు అనిత్యాలు అని తెలుసుకున్నాం. దేహాలు నశించినా దేహి నశించడు. మరొక దేహాన్ని ధరిస్తాడు.

చిరిగిన వస్త్రాలను విడిచి పెట్టి నూతన వస్త్రాలను మనిషి ధరించినట్లు, శిథిలమైన దేహాన్ని విడిచి పెట్టి దేహి నూతన దేహాన్ని ధరిస్తూ ఉంటాడు. వ్యక్తి ఒక్కడే. కాని ధరించే వస్త్రాలు అనేకములు. అలాగే, దేహి ఒక్కడే. కాని, ధరించే దేహాలు అనేకములు. అందుచేతనే, దేహములను **శరీరాణి** అని బహువచనం తోను, జీవుని **దేహీ** అని ఏకవచనం తోను వివ రించి బోధించాడు.

వస్త్రాలను ధరించే వ్యక్తి వస్త్రాల కన్నా వేరుగా ఉన్నాడు. కనుకనే వస్త్రాలను మార్చుకోవడానికి బాధ పడడు. మరి దేహి విషయ మేమిటి? దేహాలను ధరించే దేహి కూడా దేహాల కన్నా వేరు గానే ఉన్నాడు. కాకపోతే, దేహమే తాను అనే అజ్ఞానంలో ఉన్నాడు. అందుచేత దేహ పతనాన్ని తట్టుకో లేక గగ్గోలు పెడు తున్నాడు.

అర్థం గాకనే ఆవేదన

తల్లి బిడ్డకు పాలిస్తూ ఉంటుంది. కొంతసేపు ఇవ్వగానే ఆ వైపు చనుబాలు అయి పోయాయి అని తల్లి గ్రహిస్తుంది. బిడ్డను ఆ వైపే ఉంచితే లాభం లేదని భావిస్తుంది. వెంటనే బిడ్డను అటు నుండి ఇటు వైపుకు త్రిప్పుకుంటుంది. అలా చెయ్యడం బిడ్డకు పాలు పట్టించాలనే గాని, స్తన్యపానము చేయకుండా నిరోధించాలని కాదు.

అజ్ఞానంలో ఉండటం చేత ఈ సత్యం శిశువుకు తెలిసి రాదు. పాలు త్రాగే శిశువును తన దేహం నుండి దూరం చేయగానే బిడ్డ కెవ్వు మని కేక వేస్తుంది. వెంటనే తల్లి మరో వైపు తన తనువుకు హత్తు కుంటుంది. అంతే, బిడ్డ ఏడుపు ఆపేస్తుంది.

ఈ ప్రపంచంలో మనం ప్రారబ్ధాన్ని అనుభవిస్తూ బ్రతుకుతున్నాం. ఒక వైపు చనుబాలు లేవని తెలియ గానే, అక్కడ నుండి వేరే వైపుకు తల్లి బిడ్డను మార్చినట్లు, ఈ ప్రపంచంలో మనకు నూకలు చెల్లిపోయా యని తెలియగానే, పరమేశ్వరుడు ఈ లోకం నుండి మనల్ని తరలిస్తాడు. అదే మృత్యువు. స్తన్యపానం చేసే బిడ్డ అవివేకంలో గోల చేసినట్లు, మనం కూడా అజ్ఞానం చేత మరణంలో దుఃఖిస్తున్నాం.

తరలి పోయేవే తనువులు

నూతన వస్త్రాలు శోభాయమానంగా ఉంటాయి. క్రొత్త వాటి కన్నా వాడుకలో మరింత శోభిస్తాయి. మళ్ళీ వాడుక లోనే మాసి పోతాయి. మలిన పడతాయి. మగ్గి పోతాయి. మూల పడతాయి.

వస్త్రాలు కళకళ లాడే కాలం ఉంది. చిరిగి పీలిక లయ్యే కాలమూ ఉంది. ఇదే కాల మహిమ. ఆకు రాలే కాలముంది. కాయ రాలే కాలముంది. అలాగే కాయం రాలే కాలమూ ఉంది. ఏ వస్త్రమైనా చిరిగి పోయేదే. ఎవరి తనువైనా కాటికి తరలి పోయేదే. దేహాలు దగ్ధమై పోయినా, దేహి ధగధగ మనే కాంతులతో నూతన దేహంలో ప్రవేశిస్తాడు.

చిరిగి పోయిన వస్త్రాన్ని విసర్జించి, నూతన వస్త్రాన్ని ధరించడానికి ఎవరైనా శోకిస్తారా? దుర్బలమైన దేహాన్ని త్యజించి, అందమైన, ఆరోగ్యవంతమైన దేహాన్ని పొంద డానికి మనం ఎందుకు దుఃఖిస్తున్నాం?

కలత లేనివి కూడా కదలి పోతున్నాయి

ఇక్కడ మరొక సందేహము పుట్టుకొస్తోంది. జీర్ణమైన శరీరాలు, వృద్ధాప్యంలో బలహీనమైన శరీరాలు ***(దుర్బలతాం గతాని)*** గలిస్తే అర్థం చేసుకోవచ్చు. నవ యవ్వనంలో ఉండే దేహాలు, రెండు పదులు కూడా నిండని ముచ్చటైన తనువులు కూడా తరలి పోతున్నాయి కదా! వాటి నెలా అర్థం చేసుకోవాలి?

క్రొత్తపాతలు, అందచందాలు, ఆరోగ్యాలు, ప్రారబ్ధాలు - వీటిని మదింపు వేసే కొలత పాత్రలు ప్రపంచంలో లేవు. ఎవరి పాత్రలు వారివే. ఎవరి కొలతలు వారివే.

ఒక వ్యక్తి యవ్వనంతో చాలా అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తాడు. మాటల మధ్య తన మూగబాధను వినిపిస్తాడు. వివాహ ప్రయత్నాలు ఒక వైపు సాగుతూ ఉంటే, మరో వైపు తన దేహంలో దారుణమైన క్యాన్సర్ మహామారి మకాం పెట్టి ఉధృత రూపాన్ని దాల్చి ఉందని, రాలి పోవడానికి మాసాలే మిగిలి ఉన్నాయి అని

చెబుతాడు. మనకు మాటలు మూగబోతాయి. చూడటానికి అలా ఉన్నాడు. లోపల ఇలా ఉందా? అని నివ్వెర పోతాము. బాహ్యానికి ఆ దేహం పది కాలాల పాటు ఉండ దగినదే అన్నట్లు ఉంది. దుర్బలత్వ మంతా లోపలే దాగి ఉంది.

ఒక వ్యక్తి ఇల్లు అమ్ముతాడు. మరొక వ్యక్తి ఆ ఇంటిని కొంటాడు. అమ్మిన వాడికి అది పాత ఇల్లు. అందుకే అమ్మేశాడు. కొన్నవాడికి అదే క్రొత్త ఇల్లు. మంచి ముహూర్తం చూసుకొని, బంధుమిత్రాదులతో కలసి ఏదో నూతన గృహప్రవేశం చేసినట్లు ప్రవేశిస్తాడు. నిజమే! ఆ గృహం అతని దృష్టిలో నూతనమే. కాని, గతంలో ఎన్నో శవాలను తరలించిన పాత గృహం అదే అనేది వాస్తవము.

మనం ఈ ప్రపంచానికి ఒంటరిగా రాలేదు. ప్రారబ్ధాన్ని వెంట బెట్టుకొనే వచ్చాం. దేహాలు ఎలా ఉన్నా యనేది ప్రధానం కాదు. ఆ దేహంతో ఈ జన్మలో అనుభవించ వలసిన కర్మఫలం మిగిలి ఉందా, అయిపోయిందా! అనేదే ముఖ్య విషయం. ప్రారబ్ధ కర్మానుభవము శేషించి ఉంటే, జీవి ఆ దేహంతో కొనసాగుతాడు. ప్రారబ్ధం అడుగంటితే వల్లకాటి వైపుకు దేహాన్ని నడిపించి, అనువైన మరో దేహంలో దూరి పోతాడు.

చనిపోయిన వ్యక్తిని శ్మశానానికి అప్ప చెప్పే టప్పుడు దేహం మీద ఒక్క వస్త్రాన్ని కూడా ఉంచరు. చివరికి మొలత్రాడును కూడా తెంచేస్తారు. నాయనా! నీవు ధరించిన వస్త్రాన్ని విడిచేశావు. తరువాత, నీవు ధరించ బోయే వస్త్రం నీ కోసం నిరీక్షిస్తోంది. ఇది ఇక పనికిరాదు అనే సత్యాన్ని ఎరుక పరచాలనే అలా చేస్తారు. ఇదంతా పోయిన వాడికి తెలుస్తుందా? లేదు. ఉన్నవాళ్ళు తెలుసుకుంటా రని అలా చేస్తారు.

ఇంధనం లేని వాహనం నడవదు

దేహం ఈ ప్రపంచంలో ఉండటానికి, ఉండకుండా పోవడానికి వయస్సే ప్రధానం కాదు. కర్మఫలమే కీలకాంశం. కర్మఫలం తన దైన మార్గంలో పావులను కదుపుతూ ఉంటుంది.

కొందరు నూరేండ్లు నిండి చిక్కి శల్యమైన దేహంతో మరణిస్తారు. కొందరు వయస్సులో ఉండి కూడా భయంకరమైన వ్యాధుల వాత పడి, లేదా దారుణ ప్రమాదాలకు లోనై మరణిస్తారు.

తుపాకి గుండ్లు దేహంలో దూసుకు పోయినా బ్రతికిన వారు కొంద రున్నారు. తుపాకి గుండ్ల వంటి భయంకరమైన మాటల్ని విని తట్టుకోలేక ప్రాణాలు విడిచేసిన వారూ ఉన్నారు.

ఎవరి గుండె వారిదే. అలాగని ఆగే ముందు చెప్పి ఆగుతుందా? ఎవరి ప్రాణం వారిదే. అలాగని సాగే ముందు చెప్పి సాగుతుందా? ప్రారబ్ధం చేతిలో అన్నీ కీలుబొమ్మలే. అందరూ ఆటబొమ్మలే.

ఇది బ్రతుకు ఆట. ఆడించే వాడి చేతి లోనే ఉంది అంతా. అర్జునా! ఆటలో ఆందోళన ఎందుకు? ఆట ఆగితే ఆవేదన ఎందుకు? ఇది తెలిస్తే ఆటలో ఆనందం ఉంటుంది. గెలుపులో ఆనందమే. ఓటమిలో కూడా ఆనందమే. గెలుపు ఓటములు కూడా ఆటలో భాగమే.

I have loved life so much, why should I not love death even more?

నేను జీవితాన్ని ఎంతగానో ప్రేమించాను. మృత్యువును అంతకన్నా ఎక్కువగా ఎందుకు ప్రేమించలేను? అని తనను తాను ప్రశ్నించు కున్నాడు విశ్వకవి టాగూర్.

అర్జునా! దేహాలు కర్మానుసారంగా రాలిపోయినా, దేహి ఏ విధమైన వికారాలకు లోను గాకుండా క్రొత్త శరీరాలను పొందుతాడు ***(దేహీ, ఆత్మా అవిక్రియః ఏవ ఇత్యర్థః).***

దేహం ఎప్పుడో ఒకప్పుడు చస్తుంది. అది చచ్చేందుకే ఉంది. అనుక్షణం చస్తూ ఉంది. ఇది అనివార్యం. శోకించ దగనిది. దేహి అవినాశి, నిత్యుడు, శాశ్వతుడు. ఈ విషయాన్ని కూడా సహేతుకంగా చర్చించుకున్నాం. సశాస్త్రీయంగా చెప్పుకున్నాం. ఇక దుఃఖించడం మానేయ్! ***(అశోచ్యా నన్వ శోచస్త్వం).***

అర్జునా! నువ్వు దేహివే కాని దేహానివి కావు. దేహి యైన నిన్ను నశింప చేసే శక్తి ఎవ్వరికీ లేదు. భీష్మద్రోణాదులు కూడా అంతే. వారికి కూడా ఎవ్వరూ వినాశమును కలిగించలేరు. నీవూ ఆత్మే. భీష్ముడూ ఆత్మే. ఆత్మకు ఎందుకు నశింపు లేదో చెబుతాను, విను!

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయ న్త్యాపో న శోషయతి మారుతః ॥ 23

న-ఏనం-ఛిందంతి-శస్త్రాణి-న-ఏనం-దహతి-పావకః
న-చ-ఏనం-క్లేదయంతి-ఆపః-న-శోషయతి-మారుతః

ఏనం	= ఈ ఆత్మను	ఏనం	= ఈ ఆత్మను
శస్త్రాణి	= శస్త్రములు	ఆపః చ	= నీళ్ళు
న ఛిందంతి	= ఛేదించవు	న క్లేదయంతి	= తడుపవు
ఏనం	= ఈ ఆత్మను	మారుతః	= గాలి
పావకః	= అగ్ని	న శోషయతి	= ఎండగట్ట లేదు
న దహతి	= కాల్చదు		

ఆత్మను శస్త్రాలు ఖండించ లేవు. అగ్ని కాల్చలేదు. నీళ్ళు తడపలేవు. గాలి ఎండబెట్ట లేదు.

వ్యాఖ్య

శక్తి గలవారు భువిలో ఎందరో ఉన్నారు. శక్తి గలవి ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. శక్తిని ఉపయోగించి కొందరు కొందరిని ఏదైనా చేయ గలరు. వాళ్ళే మరి కొందరిని ఏమీ చేయ లేరు. కొన్ని శక్తులు ఎవరికీ మినహాయింపు లేకుండా ఎవరి నైనా, ఏదైనా చేయ గలవు, ఎప్పుడైనా చేయ గలవు. అవసర మనుకుంటే యావద్విశ్వాన్నే కబళించే శక్తి అణువుల్లో దాగి ఉంది. కాని, ఏదీ ముట్టలేని, ఎవరూ పట్టలేని, ఏ శక్తీ నశింప చేయలేని అద్భుత చైతన్య శక్తి ప్రతి మనిషి హృదయంలో ఒదిగి ఉంది. అదే సత్. అదే ఆత్మ. పుట్టుక లేనిది. మరణం తెలియనిది. ఏ వికారాలకు లోను కానిది. దానిని నశింప చేసే శక్తి దేనికీ లేదు.

మానవదేహం పాంచభౌతికం. అది పంచభూతాల సృష్టి. మానవ దేహాన్ని పంచభూతాలు ఏదైనా చేయ గలవు. అస్త్రాలు, శస్త్రాలు, విషాలు, మారణాయుధాలు దేహాన్ని ముక్కలు చేయ గలవు. మాయం చేయ గలవు. దేహాన్ని బూడిద చేసే శక్తి నిప్పు కుంది. ముంచే శక్తి నీటి కుంది. ఎండగట్టి ఆరేసే శక్తి, ఊడ్చి పారేసే శక్తి గాలి కుంది. కాని ఇవన్నీ కలసి ఒకటైనా, ఆత్మను కదిలించ లేవు. కాల్చలేవు. పీల్చలేవు. ఊడ్చలేవు. మాడ్చలేవు. అదే అద్భుతాత్మ. ఆశ్చర్యాత్మ. చైతన్యాత్మ. సత్యాత్మ.

పంజరం తగలబడి నపుడు పంజరం లోని పక్షి తగల బడకుండా ఉంటుందా? ఇల్లు దగ్ధ మైనపుడు ఇంటి లోని మనిషి చావకుండా ఉంటాడా? మరి, దేహము దగ్ధమయ్యే టప్పుడు దేహి నశించకుండా ఎలా ఉంటాడు? ఉంటాడు. అందుకనే, ***కథం హన్తి?*** ఎలా చంపుతారు? అని ఇరవై ఒకటవ శ్లోకంలో గీతాచార్యుడు ప్రశ్నించాడు.

వధించాలి అంటే సాధనం ఉండాలి. దేని చేత వధించాలి? ఆత్మను వధించ దానికి వధ సాధనాభావ ముంది. అంటే, వధకు సాధనము అలభ్యంగా ఉంది ***(అభావః)*** అని అర్థము. అదేమిటి? బ్రతికించే సాధనము మన వద్ద లేదు అంటే అర్థం చేసుకో గలము. వధించడానికి సాధనా లెందుకు లేవు? పంచభూతాలలో ఒక్క ఆకాశాన్ని ప్రక్కన పెడితే మిగిలిన నాలుగు భూతాలు వధ సాధనాలే కదా! నిజమే. దేహం విషయంలో వధ సాధనాలే గాని ఆత్మ విషయంలో కాదు.

ఆయుధాలు అలభ్యం

ఆయుధాలు పృథివి యొక్క వికారాలు. స్థూల రూపాలు. స్థూల మైనవి స్థూలాన్ని ఖండించ గలవే గాని సూక్ష్మాన్ని ఖండించ లేవు. గొడ్డలి స్థూలాయుధము. చెట్టు కూడా స్థూలం. అందుచేత గొడ్డలితో చెట్టును ఖండించడం సాధ్య పడుతుంది. ఇదే గొడ్డలితో నీళ్ళను ఖండించడం సాధ్య పడుతుందా? జ్వాలను ముక్కలు చేయడం వీలు పడుతుందా? గాలిని నరకడం సాధ్యమేనా? సరే, ఇక ఆకాశం విషయం చెప్పే దేముంటుంది? చెట్టును ఖండించిన గొడ్డలి నిప్పును, నీళ్ళను, గాలిని ఖండించ లేక పోవటానికి కారణ మేమిటి? అవన్నీ సూక్ష్మాలు కావడమే. స్థూలము సూక్ష్మాన్ని ఖండించ లేదు.

ఆయుధాలు ఖండించా లంటే అంగా లుండాలి. అవయవాలు ఉండాలి. దేహానికి అవయవాలు ఉన్నాయి కనుక ఆయుధము ఖండించ గలుగుతుంది. ఆత్మకు అవయవాలు ఎక్కడున్నాయి? అందుకనే శస్త్రాలు ఆత్మను ఖండించ లేవు ***(దేహినం న ఛిన్దన్తి శస్త్రాణి నిరవయవత్వాత్).*** ఆత్మ అమూర్తం. కనుక ఆయుధాలకు అందదు.

అగ్ని అయోగ్యం

కాల్చే శక్తి అగ్నికి ఉన్నా, కాలే అశక్తత ఆత్మకు లేదు. కనుక, అగ్ని ఆత్మను ముట్ట లేదు. లంకలో అశోక వనా న్నంతా అగ్నిదేవుడు కాల్చేశాడు. కాని, సీతమ్మను సమీపించలేక పోయాడు. ఆత్మను తాకే యోగ్యత తనకు లేదని దూరంగా ఉండి పోయాడు.

కట్టెల్ని అగ్ని భస్మం చేస్తుంది. జలాన్ని ఆవిరి చేస్తుంది. గాలిని కాల్చుతుందా? ఆకాశాన్ని తగల బెడుతుందా? ఇలాంటివి చేసేందుకే యోగ్యత లేనపుడు ఆత్మను ఎలా దగ్ధం చేస్తుంది? ***(అగ్నిః అపి న భస్మీ కరోతి).***

నీళ్ళు నిరుపయోగం

పటికబెల్లం నీళ్ళల్లో పడి కరిగి పోతుంది. వస్త్రం కొంతకాలం నీళ్ళల్లో ఉంటే చీకి పోతుంది. కొన్ని నీళ్ళల్లో కరిగి పోతూ ఉంటే, మరి కొన్ని నీళ్ళల్లో తరిగి పోతూ ఉంటాయి. జలం రూపాల్ని అరూపం చేయడమే కాకుండా రూపం లేని వాటికి రూపా న్నిస్తుంది. మట్టిని జలం కరిగిస్తుంది. అంతేకాదు, మట్టికి రూపాన్నిస్తుంది కూడా. నీళ్ళు కలిపే మట్టితో బొమ్మలు తయారు చేస్తారు. ఇళ్ళను నిర్మించు కుంటారు. శరీరానికి జలం వల్లే రూపం వచ్చింది. మరణించిన తరువాత మృత కళేబరాలను నదీ జలాలే కరిగించేస్తూ ఉంటాయి.

ఆత్మ విషయంలో మాత్రం నీళ్ళు ఏమీ చేయలేక నిరుపయోగంగా మిగిలి పోతాయి. దేహాల్ని ముంచి నట్లు ఆత్మను జలాలు ముంచ లేవు. ఆత్మను అరూపం చెయ్యలేవు. కారణం, ఆత్మకు రూపం లేదు. ఆత్మకు కొంగ్రొత్త రూపాన్ని ఇవ్వడం కూడా ఉదకానికి సాధ్యం కాదు. ఆత్మ నిరవయవం.

గాలినే నీళ్ళు ఏమీ చేయలేవు. ఆత్మను ఏం చేయగలవు? నీళ్ళు నీళ్ళుగా ఉండ టానికి కారణ మైనది ఆత్మ. ఆత్మ ఆధారమైనదే గాని ఆధేయము కాదు.

గాలి ఆడదు

ఈల వేస్తూ, గోల చేస్తూ, నిలకడ లేకుండా పరుగులు తీసే గాలి ఆటలు ఆత్మ వద్ద సాగవు. గాలి చాలా విచిత్రమైంది. ఉండి కొందరిని బ్రతికిస్తుంది. పోయి కొందరిని చంపేస్తుంది. గాలి ఆడక కొందరు పోతారు. గాలి ఎక్కువై కొందరు చస్తారు ***(శోషణేన నాశయతి వాయుః)***. కాని, ఇదే గాలి ఆత్మను శుష్కింప చేయలేదు. కదిలించ లేదు.

వస్తువు లోని చమురును పీల్చేసి దానిని గాలి నశింప చేస్తుంది. అందుకే పూలు వాడి పోతాయి. ముఖాలు వాలి పోతాయి. దీపాలు ఆరి పోతాయి. దేహాలు రాలి పోతాయి. అన్నిటికి అన్నీ జరుగుతాయి కాని, ఆత్మకు మాత్రం ఏమీ జరగదు.

ఒకటి వధింప బడింది అంటే దానికి కారణం ఉండాలి. ఏదయితే వధకు కారణమో, దాని చేత వధింప బడింది కార్యమై ఉండాలి. అప్పుడే వధ సాధ్య మవుతుంది. ప్రపంచంలో ఏదైనా కార్యం గానే తెలుస్తూ ఉంది. ఆత్మ ఒక్కటే కార్యంగా తెలియదు. అందుకే అది సర్వకారణం. సర్వకారణమైన ఆత్మను, పరిమితంగా ఉంటూ, కొంత కాలం కారణాలుగా కులికే కార్యాలు ఏమి చేయ గలవు? అందుకే ఆత్మ మరణ ధర్మం లేనిదై అమృత స్వరూపంగా భాసిస్తోంది.

మరణ ధర్మము కలది దేహము. దానిని నశింప చేయడానికి వధ సాధనా లున్నాయి. ఆత్మ అమృత స్వరూపము. నశించే దేహాలలో ఉన్నా నశించేది కాదు. ఆత్మకు మరణం లేదు కనుక ఆత్మను తెలుసుకున్న వాడు మరణానికి భీతి చెందడు. దుఃఖించడు.

అశరీరం శరీరేషు అనవస్థేషు అవస్థితమ్
మహాన్తం విభు మాత్మానం మత్వా ధీరో న శోచతి ॥

అనిత్యములైన దేహాలలో ఉండినా ఆత్మ దేహము లేనిది. శ్రేష్ఠ మైనది. సర్వగత మైనది. అట్టి ఆత్మను తెలుసుకున్న వాడు ధీరుడు. దుఃఖం తెలియని వాడు.

ఆత్మను ఖండించలేరు, మండించలేరు అంటూ ఉంటే, ఎందుకని ఆత్మను నాశనం చెయ్యలేరు? అనే ప్రశ్న పుడుతుంది. దానికి సమాధాన మేమిటి? ఏముంది? సాధ్యం కాదు కనుక, అనేదే సమాధానం.

అచ్ఛేద్యోఽ యమదాహ్యోఽ యమక్లేద్యోఽ శోష్య ఏవ చ ।
నిత్యః సర్వగతః స్థాణు రచలోఽ యం సనాతనః ॥ 24

అచ్ఛేద్యః-అయం-అదాహ్యః-అయం-అక్లేద్యః-అశోష్యః-ఏవ-చ
నిత్యః-సర్వగతః-స్థాణుః-అచలః-అయం-సనాతనః

అయం	=	ఈ ఆత్మ	అయం	=	ఇది
అచ్ఛేద్యః	=	ఛేదింప రానిది	నిత్యః	=	నిత్య మైనది
అయం	=	ఈ ఆత్మ	సర్వగతః	=	అంతటను వ్యాపించినది
అదాహ్యః	=	దహింప రానిది	స్థాణుః	=	స్థిర మైనది
అక్లేద్యః	=	తడుప రానిది	అచలః	=	చలనము లేనిది
అశోష్యః ఏవ చ	=	ఎండింప లేనిది	సనాతనః	=	శాశ్వత మైనది

ఆత్మ ఖండింప బడదు. కాల్చబడదు. తడుప బడదు. ఎండింప బడదు. ఆత్మ నిత్య మైనది. అంతటా వ్యాపించి ఉండునది. సుస్థిర మైనది. చలనము లేనిది. ప్రాచీన మైనది.

వ్యాఖ్య

అయం అంటే ఇది అని అర్థము. మనకు ఆత్మ ఒక్కటే 'ఇది'గా తెలుస్తూ ఉంటుంది. ఆత్మకు అన్యంగా తెలిసేవి అన్నీ 'అది'గా, 'అవి' గానే ఉంటాయి.

మనకు దూరంగా ఉన్న గోడను, ఆ గోడ అంటాము. మన చేతి లోని పువ్వును ఈ పువ్వు అంటాము. అదే పువ్వును చూచిన కంటిని గూర్చి మాట్లాడ వలసి వచ్చి నపుడు ఆ పువ్వు - ఈ కన్ను అంటాము. అలాగే ఆంతర్యం లోకి మరలితే, ఆ కన్ను - ఈ మనస్సు, ఆ మనస్సు - ఈ బుద్ధి, ఆ బుద్ధి - ఈ అజ్ఞానము, ఆ అజ్ఞానము - ఈ జ్ఞానము, ఆ జ్ఞానము - దానిని తెలుసుకొనే ఈ ఆత్మ. . . అదే **అయం ఆత్మా** - ఈ ఆత్మ. అదే మన స్వరూపము.

సర్వం హ్యేతద్బ్రహ్మా అయమాత్మా బ్రహ్మా
సోయమాత్మా చతుష్పాత్

ఈ సర్వమూ బ్రహ్మ స్వరూపమే. ఈ ఆత్మయే బ్రహ్మము ***(అయం - ఆత్మా - బ్రహ్మా)***. ఆ ***(సః)*** ఈ ***(అయం)*** ఆత్మ ***(ఆత్మా)*** నాలుగు పాదాలతో ఉంది ***(చతుష్పాత్)*** అని మాండూక్యోపనిషత్ ప్రబోధము.

అయమాత్మా బ్రహ్మా ఈ ఆత్మయే బ్రహ్మము అనే మహావాక్యంలో 'అయం' అనే ఏ పదము చేత ఆత్మ సూచింప బడిందో, అదే ప్రస్తుత శ్లోకంలో ***అయం*** అంటూ ఆత్మరూపంగా ఉపయోగింప బడింది.

ఈ ఆత్మ ***(అయమాత్మా)*** నరక డానికి వీలు లేనిది. కాల్చడానికి వీలు కానిది. ముంచ డానికి సాధ్యం కానిది. ఎండింప డానికి వీలు పడనిది. ఎందుకని? రెండవ పాదంలో సమాధానం చెబుతున్నాడు. ఆత్మ నిత్య మైనది. సర్వగత మైనది. స్థిరమైనది. చలనము లేనిది. సనాతన మైనది. కనుక పంచభూతాల చేత నశింప బడుటకు అసాధ్య మైనది.

వధించడం కర్మ. వధింప బడటం కర్మ. శస్త్రాదుల చేత చంప బడుటకు ఆత్మ అయోగ్యము, అనర్హము అనేది ఈ శ్లోకంలో నిరూపించ బడుతూ ఉంది. అంటే ఎట్టి క్రియకు కూడా ఆత్మ కర్మ కాలేదు. క్రియాఫలము ఉన్నప్పుడే కర్మత్వము సంభవిస్తుంది. ఆత్మ ఏ క్రియకు ఫలము కాదు.

కర్మల వలన నాలుగు విధాలైన క్రియాఫలాలు కలుగుతాయి. ఈ నాల్గింటిలో ఏదో ఒకటి సంభవించే అవకాశం ఉన్నప్పుడే కర్మత్వము ఉంటుంది (ఏ క్రియాఫలమైనా, హననక్రియా ఫలమైనా కూడా). ఆ నాలుగు ఏమిటి అంటే (1) ఉత్పాద్యం (2) ప్రాప్యం (3) వికార్యం (4) సంస్కార్యం. ఈ నాలుగింటిలో ఏదో ఒక క్రియాఫలం ఉన్నప్పుడే కర్మత్వం ఉంటుంది.

(1) ఉత్పాద్యం :- ఆత్మ ఉత్పాద్యం కాదు. నూతనంగా మనం కుండను తయారు చేసినట్లు, ఆత్మను ఉత్పత్తి చెయ్యడం సాధ్యం కాదు. ఆత్మ స్వతస్సిద్ధం. ఉత్పత్తి చేయాలి అనే ఆలోచనకు ముందే ఆత్మ ఉంది. అలాంటప్పుడు ఆత్మను పుట్టించడం సాధ్యమా? కాదు. కనుక ఆత్మ నిత్యము.

(2) ప్రాప్యం :- వస్తువు ఉంది. దేశకాలాదులలో ప్రయత్నిస్తే పొందుతాము. ఆవు పొదుగులో పాలున్నాయి. ఆవు గోశాలలో ఉంది. మనం ఇక్కడ కూర్చుంటే పాలు లభ్యం కావు. అక్కడి కెళ్ళాలి. పాలు పిండి తెచ్చుకోవాలి. ఇది ప్రాప్యం. ఆత్మ అలా లభ్య మవుతుందా? కాదు. ఎందుకని? ఆత్మ అంతటా ఉంది.

(3) వికార్యం :- ఇక మూడవది వికార్యం. అంటే, పరిణామం చెందడం. ఈ పరిణామ కార్యము యొక్క ఫలంగా కర్మత్వము ఉండట మని అర్థము. పాలు ఉన్నాయి. మనకు నెయ్యి కావాలి. పాలను తోడు పెట్టాలి.

మజ్జిగ చేయాలి. వెన్న తీయాలి. నెయ్యి పొందాలి. అంటే, ఒక పరిణామ క్రమంలో పాల నుండి మనకు నెయ్యి లభిస్తూ ఉంది. ఆత్మ అలా లభిస్తుందా? లభించదు. ఆత్మ స్థిరమైనది కనుక పరిణామం చెందదు. సత్తు అయిన ఆత్మ అవికార్యము.

(4) సంస్కార్యం :- సంస్కరించడం వల్ల కలిగే ఫలము అని అర్థము. దర్పణముపై దుమ్ము ఉంది. మనం ఎంత ప్రయత్నించినా అందులో మన ప్రతిబింబము కనిపించదు. దుమ్ము దులుపుతాము. అద్దం మళ్ళీ స్వచ్ఛంగా మన రూపాన్ని ప్రతిఫలింప చేస్తుంది. ఇది శుద్ధికార్యము. ఆత్మ అచలం కనుక సంస్కార్యం కాలేదు.

అందుచేత పృథివ్యాదులకు ఆత్మ విషయం కాదు. శస్త్రాదులకు విషయం కాలేదు. కాని ఇక్కడ మరొక ముఖ్య విషయ ముంది. ప్రస్తుతం ఈ శ్లోకంలో ఆత్మ ***అచ్ఛేద్య*** మని, ***అదాహ్య*** మని, ***అక్లేద్య*** మని, ***అశోష్య*** మని ఏదయితే చెప్పబడిందో, ముందు శ్లోకంలో, అంటే ఇరవై మూడవ శ్లోకంలో చెప్ప బడింది కూడా అదే కదా! అదే విషయాన్ని పునః ప్రస్తావించడం పునరుక్తి దోషం కాదా!

పునరుక్తి లేదు - అతివ్యాప్తి రాదు

ఈ సందర్భములో ఆత్మను గూర్చి విచారం చేస్తున్న ఈ శ్లోకాలలో పౌనరుక్త్యం ఉంది అని కొందరు శంకిస్తూ ఉంటారు. పౌనరుక్త్యం అంటే పునరుక్తి దోషం. అంటే, చెప్పిందే చెప్పడం, మళ్ళీ మళ్ళీ చెప్పడం పునరుక్తి దోషం అనబడు తుంది.

న జాయతే మ్రియతేవా అనే శ్లోకం లోనే ఆత్మ నిత్యమైనది, ఏ విధమైన వికారములు లేనిది అని స్పష్టంగా చెప్ప బడింది. ఆ తరువాత శ్లోకాలలో ఆత్మను గూర్చి చెప్పిన దంతా ఈ శ్లోకంలో చెప్పిన దాని కన్నా భిన్నం కాదు, అధికంగానూ లేదు. కొంత విషయము శబ్దము చేత, కొంత విషయము అర్థము చేత పునరుక్తం అయింది. ***(కించిత్ శబ్దతః పునరుక్తం, కించిత్ అర్థతః ఇతి)***. కనుక ఇక్కడ పునరుక్తి దోషం ఉంది అని సంశయిస్తారు. కాని, దీనిని పౌనరుక్త్యం అని భావించ కూడదు.

ఆత్మ విషయము దుర్జ్ఞేయము. సులభంగా గ్రహించడం సాధ్యం కాదు. అందుచేత, స్వయంగా తానే ఆత్మ ప్రసంగం కల్పించుకొని వేరు వేరు శబ్దాలతో, అర్థాలతో బోధిస్తూ ఆత్మ విషయాన్ని సులభతరం చేస్తున్నాడు భగవంతుడు. ఇలా ఎందుకు చేస్తున్నాడు? అంటే, క్లిష్టమైన, గహనమైన ఆత్మతత్త్వమును తెలుసు కొనిన సంసారులు సంసారాల నుండి బయటపడ గలుగుతారు అనే ఉద్దేశం తోనే పరమేశ్వరుడైన వాసుదేవుడు అలా పదే పదే చెబుతున్నాడు అని శ్రీ శంకరుల వారు కూడా భాష్యంలో అభిప్రాయ పడ్డారు ***(కథం ను నామ సంసారిణామ్ అవ్యక్తం తత్త్వం బుద్ధి గోచరతామ్ ఆపన్నం సత్ సంసార నివృత్తయే స్యాత్ ఇతి).***

పునరుక్తి దోషం వేదాంత శాస్త్రానికి లేదు. కాని, ఈ శ్లోకంలో ప్రస్తావించిన ***అచ్ఛేద్య, అదాహ్య, అక్లేద్య, అశోష్య*** మనే లక్షణాలు ఆత్మ యందే కాకుండా వేరే చోట కూడా అగుపిస్తాయి. ఇలా, ఒక దాని లక్షణాలు మరొక దాని యందు ప్రవర్తిస్తూ ఉండటం, లేదా వ్యాపించి ఉండటం అతివ్యాప్తి దోషం.

ఆత్మ ఖండింప బడదు. మండింప బడదు. తడుప బడదు. ఎండింప బడదు. ఈ నాలుగు లక్షణాలు ఆకాశానికి కూడా ఉన్నాయి. ఆకాశాన్ని ఖండించ లేము. కాల్చలేము. తడప లేము. ఎండబెట్ట లేము. ఆత్మకు చెప్పిన ఈ నాలుగు లక్షణాలు పంచభూతాలలో ఆకాశతత్త్వంలో కనిపిస్తున్నాయి.

అంతేకాదు. చతుర్విధ భూతాలు ఆకాశాన్నే కాదు, సూక్ష్మ శరీరాన్ని కూడా ఏమీ చేయలేవు. మనోబుద్ధుల్ని కూడా శస్త్రాలు ఖండించ లేవు. అగ్ని దహింప చేయ లేదు. నీళ్ళు ముంచ లేవు. వాయువు ఆరబెట్ట లేదు.

కనుక, ఈ సందర్భములో ఆత్మను గూర్చి చెప్పిన నాలుగు లక్షణాలు ఆకాశానికి, సూక్ష్మ శరీరానికి కూడా సంబంధించి ఉండటం చేత ఇక్కడ అతివ్యాప్తి దోషం వస్తుంది. శ్రీకృష్ణుడు చెప్పింది ఆత్మను గూర్చి కాదేమో, ఆకాశాదులను గూర్చి ముచ్చటించా డేమో అనే శంక కలుగుతుంది. ఈ సందేహాన్ని నివృత్తి చేస్తూ, అతివ్యాప్తి కాదు అని చెప్పడానికి గీతాచార్యుడు **నిత్యము, సర్వగతము, స్థాణువు, అచలము, సనాతనము** అంటూ శ్లోకము యొక్క రెండవ పాదములో ఉటంకించి, ఈ లక్షణాలు ఆత్మకే గాని ఆకాశాదులకు వర్తించవు అని తేటతెల్లం చేశాడు.

ఆత్మ కాలపరిధి లోకి రాదు. ఇప్పుడు ఉండి అప్పుడు లేనిది కాదు. కాలంలో ఉత్పత్తి అయినది కాదు కనుక ఆత్మ ఉత్పాద్యం కాదు. కాలంలో ఆవిర్భవించినవి కాలంలో నశించి తీరుతాయి. ఆత్మ కాలంలో పుట్టింది కాదు కనుక నశించదు. ఈ కారణం చేత ఆత్మ నిత్యము ***(నిత్యః).***

ఆత్మ దేశ పరిధి లోకి కూడా రాదు. ఇక్కడ ఉండి అక్కడ లేనిది కాదు. కనుక అది దేశంలో ప్రాప్యం కాదు. అలా ఒక ప్రదేశానికి పరిమిత మైనవి గతించి పోతాయి. ఆత్మ దేశంలో ఉండేది కాదు. దేశకాలాదులు ఆత్మస్ఫూర్తి తోనే తెలుస్తాయి. అందుచేత ఆత్మ అంతటా ఉంది ***(సర్వగతః).***

ఆత్మ నిత్యం కనుక మార్పు చెందదు. మార్పు లేనిది కనుక అవికార్యంగా తెలుస్తూ ఉంది. ఆత్మ లేని చోటంటూ లేదు కనుక వికార్యానికి అవకాశం లేనిదై స్థిర మైనదిగా ఉంది ***(స్థాణుః).***

ఆత్మను శుద్ధి చేయడం కూడా సాధ్యం కాదు. ఆత్మను శుద్ధి చేయడానికి ఆత్మ కన్నా వేరుగా రెండవ వస్తువు ఉంటే కదా! కనుక ఏ విధమైన సంస్కార్యానికి అవకాశం లేకుండా ఉంది. ఆత్మ చలన రహిత మైనది ***(అచలం).***

కర్మజనిత ఫలాలైన ఉత్పాద్యం, ప్రాప్యం, వికార్యం, సంస్కార్యం అనే చతుర్విధ ఫలాలు ఆత్మ విషయంలో నిషేధింప బడు తున్నాయి కనుక ఆత్మ శాశ్వత మైనది. స్థిరమైనది. నిత్య మైనది. సర్వగత మైనది. సనాతన మైనది ***(సనాతనమ్).*** దీనినే క్రమంగా గుర్తించి అర్థం చేసుకుందాం.

చతుర్విధ భూతాలు ఆత్మను నశింప చేయలేవు కనుక ఆత్మ నిత్యము ***(భూతాని ఏనం ఆత్మానం నాశయితుం న ఉత్సహన్తే, తస్మాత్ నిత్యః).*** ఆత్మ నిత్యము కనుక సర్వగతము ***(నిత్యత్వాత్ సర్వగతః).*** సర్వగతము కనుక ఆత్మ స్థాణువు ***(సర్వగతత్వాత్ స్థాణుః).*** స్థాణువు కనుక స్థిరము, ధ్రువము ***(స్థాణుః ఇవ స్థిరః).*** స్థిరము కనుక ఆత్మ అచలము ***(స్థిరత్వాత్ అచలః).*** ఈ విధంగా ఈ ఆత్మ సనాతనము. చిరంతనము ***(అయం ఆత్మా అతః సనాతనః చిరంతనః).***

ఇవన్నీ అతివ్యాప్తి దోషాన్ని నివారిస్తాయి. అంతేకాదు. ***అచ్ఛేద్యం, అదాహ్యం, అక్లేద్యం, అశోష్యం*** అంటూ ముగిస్తే, ఆత్మ లేని దేమో, శూన్యమేమో అని భావించే ప్రమాదం కూడా లేక పోలేదు. ఎందుకంటే, లేని దానిని ఎవరు ఖండిస్తారు? ఎవరు మండిస్తారు? ఎవరు తడుపుతారు? ఎవరు ఎండ బెడతారు? కనుక ఆత్మ లేనిదే నేమో! శూన్య మేమో! అనే సందేహాన్ని నివారిస్తూ, ఆత్మ **నిత్యము, సర్వగతము, స్థిరము, అచలము, సనాతనము** అని చెప్పడం జరిగింది.

అద్భుతమైన ఈ ఆత్మ విషయ ప్రసంగము తరువాత శ్లోకంలో కూడా కొనసాగుతూ ఉంది.

అవ్యక్తోఽయ మచిన్త్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే ।
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25

అవ్యక్తః-అయం-అచింత్యః-అయం-అవికార్యః-అయం-ఉచ్యతే
తస్మాత్-ఏవం-విదిత్వా-ఏనం-న-అనుశోచితుం-అర్హసి

అయం	=	ఈ ఆత్మ	తస్మాత్	=	అందువలన
అవ్యక్తః	=	వ్యక్తము కానిది	ఏనం	=	ఈ ఆత్మను
అయం	=	ఈ ఆత్మ	ఏవం	=	ఈ రీతిగా
అచింత్యః	=	చింతింప వీలు కానిది	విదిత్వా	=	తెలిసికొని
అయం	=	ఈ ఆత్మ	అనుశోచితుం	=	దుఃఖించుటకు
అవికార్యః	=	వికారము లేనిది	న అర్హసి	=	తగవు
ఉచ్యతే	=	చెప్పబడింది			

ఆత్మ ఇంద్రియాలకు గోచరము కాదు. మనస్సు ఆత్మను ఊహించ లేదు. ఆత్మ మారేది కాదు. ఈ విధంగా ఆత్మను అర్థం చేసుకుంటే, నువ్వు దుఃఖించే అవసరం ఉండదు.

వ్యాఖ్య

దుఃఖింప దగినది శోచ్యం. దుఃఖింప దగనిది అశోచ్యము. విచారించి అర్థం చేసుకుంటే ఇక్కడ దుఃఖింప దగినది ఏదీ లేదు. ఏ సన్నివేశమూ శోచ్యం కాదు. ఏ వ్యక్తీ శోచ్యుడు కాడు. అంతా అశోచ్యమే. అందరూ అశోచ్యులే. ఈ సత్యం అర్థమైన వాళ్ళు పండితులు. దుఃఖం తెలియని వాళ్ళు. ఇది అర్థం కాని వాళ్ళు పండితులు కారు. కనుకనే దుఃఖిస్తూ ఉంటారు.

అర్జునుడు దుఃఖిస్తున్నాడు. ఆగకుండా తెగ ఏడుస్తున్నాడు. అర్జునుణ్ణి పండితుణ్ణి చేయాలని శ్రీకృష్ణుడు భావించాడు. ఆత్మానాత్మ వివేకాన్ని నూరి పోశాడు. పిండి మరీ త్రాగించాడు. దుఃఖహేతువును సమూలంగా నిషేధించి నిర్మూలించాడు.

అర్జునా! నీ దుఃఖానికి కారణం నీవా? నీవు కానిదా? అనే ప్రశ్నను లేవదీశాడు. దుఃఖానికి నీవే కారణమైతే ఏదీ శోచ్యం కాదు. ఎవరూ శోచ్యులు కారు. ఒకవేళ, నీవు కానిది నీ దుఃఖానికి కారణమైతే, అప్పుడు కూడా ఏదీ శోచ్యం కాదు. ఎవరూ శోచ్యులు కారు అనే విషయాన్ని ఇంతవరకు అమోఘంగా ప్రవచించాడు. ఈ ప్రసంగాన్ని ఇంతటితో విరమించే ప్రయత్నంలో, నీవు నిత్యాత్మవే కనుక, దుఃఖింప వలసిన అవసరం లేదంటూ, ***అశోచ్యా నన్వ శోచస్త్వం*** అనే విషయానికి పూర్ణత్వాన్ని కల్పిస్తూ, బోధకు తుది మెరుగులు దిద్దుతున్నాడు.

అర్జునా! ఈ ఆత్మ అవ్యక్తము. అచింత్యము. అవికార్యము. కనుక దుఃఖింప నవసరం లేదు అంటున్నాడు.

అవ్యక్తం - అశోచ్యం

ఇంద్రియాలకు ఏది గోచరమో అది వ్యక్తము. కాని, ఆత్మకు రూపాదులు లేనందున ఏ ఇంద్రియానికి కూడా ఆత్మ గోచరం కాదు. కనుక, ఇంద్రియ అప్రత్యక్ష మగుట చేత ఆత్మ అవ్యక్తము ***(సర్వ కారణ అవిషయత్వాత్).***

స్థూలదేహం వ్యక్త మౌతూ ఉంది. వ్యక్తమయ్యే స్థూల దేహం ఉంది అని అర్థం చేసుకొనే సూక్ష్మదేహం కూడా వ్యక్త మౌతూ ఉంది. మనలో దుఃఖం ఉంది. బాధ ఉంది. సంశయం ఉంది. సంతోషం ఉంది. ఇవన్నీ సూక్ష్మ దేహమైన మనస్సులో వ్యక్త మవుతూ ఉన్నాయి. ఎవరికి వ్యక్త మవుతున్నాయి? దేహేంద్రియాలకు మాత్రం కాదు. అవ్యక్తానికే వ్యక్త మవుతున్నాయి. కనుక ఆత్మ అవ్యక్తం. అనగా ఇంద్రియాలకు వ్యక్తం కానిది.

ఈ అవ్యక్త మనే పదాన్ని రెండు శ్లోకాలు దాటితే ఇరవై ఎనిమిదవ శ్లోకంలో విశేషంగా ఉపయోగించాడు భగవానుడు. ఏదో అర్థం గాని అవ్యక్తం నుండి జీవులు వచ్చారని, అలాగే మరణించి అవ్యక్తం లోకి పోతున్నారని, ఈ మధ్య లోనే వ్యక్త మవుతున్నా రని అవ్యక్తాన్ని అయోమయంగా, మాయావరణంగా విశేషణ రూపంలో వర్ణించడం జరిగింది.

కఠోపనిషత్తులో అవ్యక్తమును కార్యకారణ శక్తి సముదాయంగా పేర్కొంటూ, ***అవ్యక్తాత్ పురుషః*** అవ్యక్తము కంటే పురుషుడు శ్రేష్ఠుడని తెలిపి, ***పురుషాన్న పరం కించిత్ (పురుషాత్ పరం కించిత్ న),*** పురుషుని కంటే శ్రేష్ఠ మైనది మరొకటి లేదు అని యమధర్మరాజు నచికేతునికి బోధించాడు.

కాని, ఈ శ్లోకంలో గీతాచార్యుడు అవ్యక్త మని చెబుతున్నది ఆత్మ విషయమే. దీనిని తెలుసుకుంటే ***(ఏవం విదిత్వా)*** దుఃఖించే కార్యము ఉండదు అని ఫల మేమిటో కూడా చెబుతున్నాడు.

అచింత్యం - అశోచ్యం

ఇంద్రియ ప్రత్యక్షం కానందున ఆత్మను అవ్యక్తం అన్నాడు. అంటే, ప్రత్యక్షాది ప్రమాణాలకు అందనిది అని అర్థం. ప్రత్యక్ష ప్రమాణాలకు అందని అవ్యక్తాత్మ అనుమాన ప్రమాణానికి అందే అవకాశ ముందేమో! అనే సంశయాన్ని నివారిస్తూ, ఆత్మను అచింత్య మని చెబుతున్నాడు.

పొగతో ఉన్న నిప్పును ఒక చోట సమీపంగా కళ్ళతో చూస్తాము. ఇది ప్రత్యక్షం. ఆ తరువాత మరొక చోట దూరంగా ఉన్న పొగను మాత్రమే చూసి, అక్కడ నిప్పు ఉంది అని నిర్ణయిస్తాము. నిప్పు కళ్ళకు కనిపించక పోయినా, ధూమం కనిపించడం వలన అగ్ని అనుమేయ మవుతూ ఉంది. ఇది అనుమాన ప్రమాణము.

ప్రత్యక్షం కాని దాని విషయంలో అనుమాన ప్రమాణము సిద్ధించదు. నిప్పును ప్రత్యక్షంగా చూసినట్లు మనము ఆత్మను చూడ లేదు. అందుచేత అనుమేయానికి అవకాశము లేక ఆత్మ అచింత్యమని చెప్పబడింది.

అనుమాన ప్రమాణం ఫలించాలంటే మనస్సులో వృత్తులు కదలాలి. వృత్తికి ఆత్మ విషయం కావాలి. మనస్సు ఆత్మను గూర్చి ఆలోచించ లేదు. ఆత్మ ఉండటం చేతనే మనస్సుకు ఆలోచించే సామర్థ్యం కలుగుతోంది ***(చైతన్య జ్యోతిషా అవభాసితస్య మనసః మనన సామర్థ్యం*** - కేన భాష్యం). కనుక ఆత్మ చింతించుటకు వీలు కానిది. ఆత్మ అద్వయము. ఆత్మను తెలుసుకోన డానికి ఆత్మ తప్ప మరొకటి లేదు ***(నాఽన్యోఽతోఽస్తి విజ్ఞాతా)*** అని వేదం చెబుతూ ఉంది.

అవికార్యం - అశోచ్యం

వికారం చెందేది కానందున ఆత్మ అవికార్యము. పాలు తోడు పెట్టి నపుడు పెరుగు మొదలైన పదార్థముల రూపంలో వికారం చెందుతాయి. ఆత్మ నిరవయవం కనుక అది వికారం చెందే అవకాశం లేదు. అవయవాలు లేనిది ఏదైనా వికారం చెంద లేదు. ఆత్మకు అవయవాలు లేవు కనుక అది అవికార్యం ***(అవిక్రియత్వాత్ అవికార్యః).***

ఇరవై నాల్గవ శ్లోకంలో కర్మజన్య ఫలాలను గూర్చి తెలుసుకు న్నప్పుడు క్రొత్తగా పుట్టడం అనే 'ఉత్పాద్యం' ఆత్మ విషయంలో పొసగదు అని అర్థం చేసుకున్నాం. అంటే ఆత్మ 'అనుత్పాద్యం' అని అర్థం. అనుత్పాద్యత్వము అనే ఆత్మ ధర్మానికి అవికార్య మనే ఈ విశేషణము ఉపలక్షణంగా కనబడుతోంది. ఈ విషయం వేదంలో కూడా విస్పష్టంగా ఉంది ***పురస్తాత్సిద్ధం బ్రహ్మ (పురస్తాత్ - సిద్ధం - బ్రహ్మ).*** దృశ్యంగా వ్యక్త మయ్యేవి ప్రభవించక ముందే బ్రహ్మము ఉంది అని దాని అర్థం. అంటే అవికార్యంగా ఉంది అని భావము.

ప్రపంచంలో ప్రతిదీ మార్పు చెందుతూ ఉంటుంది. అణుశాస్త్ర పరిశోధనలో క్షణంలో పదార్థం మార్పు

చెందు తుందని, ముఖ్యంగా 'పార్టికల్ ఫిజిక్స్'లో అరక్షణం కాలంలో అణువు విభాగ మవుతుందని, అలా విభాగమైన అణువు ఛేదింప బడి నపుడు అసంఖ్యాకము లైన భాగాలుగా విడి పోతుందని శాస్త్రజ్ఞులు ఆశ్చర్యకర మైన విషయాల్ని చెబుతున్నారు.

సర్వ సాక్షిత్వం

స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు ఆత్మ విలక్షణంగా ఉంది ***(స్థూల సూక్ష్మ కారణ శరీరాత్ వ్యతిరిక్తః).*** స్థూల శరీరం ప్రత్యక్షంగా వ్యక్త మవుతుంది. ఆత్మ స్థూల శరీరం లాగా వ్యక్త మయ్యేది కాదు కనుక అవ్యక్తము ***(అవ్యక్తోఽ యం).*** ఆత్మ చింతించ డానికి వీలు లేనిది. సంకల్పాలకు, ఊహలకు అందేది కాదు. ఆత్మ సూక్ష్మ శరీరం లాగా చింతించుటకు సాధ్యము కానిది కనుక అది అచింత్యము ***(అచింత్యోఽ యం).*** కారణ శరీరం వికారం చెందుతుంది. ప్రియాది వృత్తి సహితంగా ఉంటుంది. ఆ విధంగా ఆత్మ వికారం చెందేది కాదు. కారణ శరీరము లాగా వికారము చెందేది కాదు కనుక ఆత్మ అవికార్యము ***(అవికార్యోఽ యం).***

అర్జునా! ఈ విధంగా ఆత్మను తెలుసుకుంటే ***(విదిత్వా)*** చావు దుఃఖాన్ని కలిగించ లేదు. నేను వీళ్ళను చంపుతున్నాను ***(హన్తా అహమ్ ఏషామ్),*** నా చేత వీళ్ళు చంపబడు తున్నారు ***(మయా ఇమే హన్యన్తే)*** అని దుఃఖించడం జరగదు. అర్జునా! భయంకర మైన శస్త్రాస్త్రాలు, మారణాయుధాలు స్పృశించ లేని ఆత్మ విషయంలో ఇక నువ్వు దుఃఖింప పని లేదు అన్నాడు భగవానుడు ***(న అనుశోచితుం అర్హసి).***

ప్రమాణం లేకుండా ప్రమ కలగదు. ముఖ్యంగా ఆత్మ విషయంలో శ్రుతి ప్రమాణానికి దూరమై జ్ఞానమును పొందడం సాధ్యం కాదు. ఆత్మబోధను గ్రహించ డానికి కావలసిన బోధనావిధి భారతదేశం లోనే ఉంది. అందుచేతనే, పాశ్చాత్యులలో ధర్మబోధను అందించే వారు ఉంటారే గాని, ఆత్మజ్ఞానం కలవారు అరుదుగా ఉంటారు. అలా అరుదైన అపమాన వ్యక్తి, అద్భుత శక్తి సోక్రటీస్ మహాశయుడు.

సోక్రటీస్ ప్రబోధాల వల్ల ఏథెన్స్ ప్రజలు పాడై పోతున్నారని, ముఖ్యంగా యువత చెడిపోతూ ఉందని ఆయనపై అభియోగాన్ని మోపుతూ న్యాయస్థానంలో వ్యాజ్యము నమోదైంది. చివరికి తీర్పు రానే వచ్చింది. సోక్రటీస్‌ను విషం త్రాగి మరణించమని న్యాయస్థానం తీర్పు చెప్పింది.

సోక్రటీస్ ప్రశాంతంగా కనిపించాడు. శిక్షను అమలు పరచారు. సోక్రటీస్ విషాన్ని పానం చేశాడు. ఆ తరువాత కూడా చాలా ప్రశాంతంగా కనిపించాడు. ఆయన ముఖంలో భయాందోళనలు గోచరించ లేదు.

సోక్రటీస్‌ను దర్శించి చాలా మంది దుఃఖించారు. వారందరిని సోక్రటీస్ అనునయించాడు. తన ప్రశాంతతకు భంగం కలిగించ వద్దని ఆజ్ఞాపించాడు.

క్రైటో అనే వృద్ధుడు సోక్రటీస్‌ను సమీపించి, "In what way shall we bury you, Socrates?" 'సోక్రటీస్! నిన్ను ఎలా పూడ్చ మంటావు?' అని అడిగాడు.

"In any way you like, but first, you must catch me, the real me. Be of good cheer, my dear Crito, and say that you are burying my body only, and do with that whatever is usual and what you think best" అని సమాధానం చెప్పాడు సోక్రటీస్.

'నీకు ఎలా తోస్తే అలా చెయ్యి. కాకపోతే, ముందు నువ్వు నన్ను పట్టుకో. నా నిజ స్వరూపాన్ని పట్టుకో. నా ప్రియమైన క్రైటో! సంతోషంగా ఉండు. నువ్వు పూడ్చిపెట్టాలి అనుకొనేది నా శరీరాన్ని మాత్రమే. సాధారణంగా అందరూ ఎలా చేస్తారో అలాగే చెయ్యి! లేదా, నీకు ఏది మేలనిపిస్తే అది చెయ్యి!' అని ప్రశాంతంగా పలికాడు సోక్రటీస్.

అదొక దివ్యానుభూతి. అద్భుత మైన అంతరంగి కానుభూతి. ఆత్మవిదుని జ్ఞానానంద స్వరూప విలాసము. చిరంత నానంద చిద్విలాసము.

మేలుకున్న వాడు స్వప్నగత దేహానికి అలంకరణలు చేయాలని భావిస్తాడా? త్రాడును దర్శించిన వాడు పాము కోసం అన్వేషిస్తాడా? కలలో ఏమి జరిగితే ఏమైంది? పల్లకీలో ఊరేగినా, పాడెపై పవ్వళించినా, యుద్ధంలో నిలిచినా, అర్జునా! ఎవరి మనస్సు వ్యాకులత చెందదో, చంద్రబింబము లాగా పూర్ణమై, ప్రశాంతంగా ఎవడు కనిపిస్తాడో వాడే ఆత్మజ్ఞుడు. ఇదే జ్ఞానం. ఆత్మజ్ఞానం. గీతాజ్ఞానం. ఉపనిష ద్వైభవం.

తుషార కర బింబాచ్ఛం మనో యస్య నిరాకులమ్
మరణోత్సవ యుద్ధేషు స శాన్త ఇతి కథ్యతే ॥

రణం లోను, మరణం లోను, ఉత్సవం లోను ఎవరి మనస్సు కలత పడదో, పూర్ణేందు బింబము వలె స్వచ్ఛమైన ప్రశాంతతతో ఎవడు శోభిస్తూ ఉంటాడో అతడే ఆత్మజ్ఞుడు అన్నది ఉపనిషత్తు.

ఆత్మ నిత్యము. సర్వగతము. అట్టి ఆత్మకు నాశము లేదని, నాశము లేని దాని కొరకు దుఃఖించ నవసరం లేదని ఇంతవరకు గీతాచార్యుడు బోధించాడు. ఒకవేళ ఆత్మ నశించేదే అని సామాన్యుల వలె భావించినా కూడా దుఃఖించ వలసిన అవసరం లేదు అని చెబుతున్నాడు.

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితు మర్హసి ॥ 26

అథ-చ-ఏనం-నిత్యజాతం-నిత్యం-వా-మన్యసే-మృతం
తథాపి-త్వం-మహాబాహో-న-ఏవం-శోచితుం-అర్హసి

మహాబాహో	= అర్జునా!	అథ మన్యసే చ	= భావిస్తున్నావేమో
త్వం	= నీవు	తథాపి	= అట్లైనా కూడా
ఏనం	= ఈ ఆత్మను	ఏవం	= ఈ విధముగ
నిత్యజాతం	= నిత్యము పుట్టుచున్న దానినిగా	శోచితుం	= దుఃఖించుటకు
నిత్యం	= నిత్యమును	న అర్హసి	= తగవు
మృతం వా	= నశించుచున్న దానినిగా		

అర్జునా! ఆత్మ ఎప్పుడూ పుడుతూ ఉంటుందని, ఎప్పుడూ చస్తూ ఉంటుందని భావిస్తున్నావా? అలా చూచినా నువ్వు దుఃఖింప నవసరం లేదే!

వ్యాఖ్య

ప్రామాణికంగా, తాత్త్వికంగా పదకొండవ శ్లోకం నుండి గీతాచార్యుడు అందించిన నిత్యాత్మ బోధ ఇక్కడ తాత్కాలికంగా ఆపాడు. మరో విధమైన వాదమును లౌకికుల స్థాయి నుండి ప్రారంభించి, ఆ కోణం నుండి కూడా పరిష్కారాన్ని అందిస్తున్నాడు.

అథ చ - అని ప్రారంభించి నపుడే విషయం మరొక మలుపు తిరిగింది అని అర్థము. 'ఒకవేళ' అనే భావంతో చెప్పి నప్పుడు, అది సాధారణ జనుల స్థాయి నుండి చెప్పినదే గాని, సిద్ధాంత పరంగా నిర్ణయించినది కాదు అని అర్థము. *అథ చ* అనేది అంగీకార సూచకంగా కూడా వాడతారు. ఒకవేళ, ఆ పక్షాన్ని అంగీకరించినా కూడా అనే ధ్వని ఉంటుంది.

అర్జునా! నిత్యమైన ఆత్మను గూర్చి నీకు సశాస్త్రీయంగా వివరించాను. అనంగీకార మైన విషయం అందులో ఏదీ లేదు. విషయం వాస్తవమే అయినా, అందరూ అంగీకరించాలి అని ఎక్కడుంది? సంస్కారం కూడా ఊరేగుతూ ఉంటుంది కదా! నేను చెప్పేంది అంగీకరించ లేని వాళ్ళు, తాము గ్రుడ్డిగా నమ్మే దానినే పట్టుకొని వ్రేలాడుతూ ఉంటారు. అలా చూచినా కూడా దుఃఖించ నవసరం లేదు అంటూ భౌతికవాదుల దృక్పథం నుండి కూడా ఒక రాగం తీస్తున్నాడు మురళీ మోహనుడు.

ఆత్మ నిత్యుడే. కాని, చస్తూ పుడుతూ ఉంటాడు అని కొందరు (తార్కికులు) వాదిస్తూ ఉంటారు. అలా చూచినా దుఃఖించడ మెందుకు? అనేది శ్రీకృష్ణుని అభిప్రాయము.

మరి కొందరు దేహమే ఆత్మ. దేహం పుడితే ఆత్మ పుడుతుంది. దేహం చస్తే ఆత్మ చస్తుంది. ఈ మధ్యలో క్షణం క్షణం మారుతూ ఉంటుంది అని చెబుతూ ఉంటారు (చార్వాకులు).

ఇలాంటి వాదాలను అనుసరించి చూచినా దుఃఖానికి హేతువు కనిపించదు. దేహంతో కలసి పుట్టడం జన్మ. దేహంతో కలసి మరణించడం మృత్యువు. చచ్చేదే మళ్ళీ మళ్ళీ చస్తూ ఉంది. పుట్టేదే మళ్ళీ మళ్ళీ పుడుతూ ఉంది. ఈ వాదమే సత్యము అని అనుకున్నా అది అర్థం చేసుకో దగిందే గాని, దుఃఖించ దగింది కాదు. ఆత్మ అవికార్యము కనుక నిత్యము అని ఇంత వరకు బోధించడం జరిగింది. దానికి భిన్నంగా లౌకిక దృష్టితో ఆత్మ వికార్యమే అని భావించినా దుఃఖించ నవసరం లేదని బోధించడానికే ఈ శ్లోకం చెప్పబడిందని జరిగిందని శ్రీమధుసూదన సరస్వతి అభిప్రాయము.

ఆత్మ సత్. ఆత్మ లేకుండా పోవడం అంటూ ఉండదు *(న అభావః విద్యతే సతః)*. కనుక, ఆత్మను సద్రూపం గాను, చావు లేనిది గాను సాంఖ్య ప్రకరణంలో వర్ణించడం జరిగింది. కాని, ఆత్మ చస్తుంది అనేది మాట వరుసకు అంగీకరించి ఈ శ్లోకం చెప్పడం జరిగింది అని శ్రీ హనుమంతుల వారి పైశాచ భాష్యము.

ఆత్మ నిత్యజాతం - నిత్యమృతం. ఎప్పుడూ పుడుతూ ఉంటుంది. ఎప్పుడూ చస్తూ ఉంటుంది అని భావించినా, దుఃఖించ నవసరం లేదు అంటున్నాడు. ఎందుకని? దుఃఖించి సాధించే దేముంది? పుట్టేది పుడుతూనే ఉంటుంది. చచ్చేది చస్తూనే ఉంటుంది *(జన్మవతః జన్మ నాశవతః నాశః)*. ఇందులో దుఃఖానికి అవకాశ మెక్కడుంది?

కాని, ఇక్కడ ఒక విచిత్రం ఉంది. ఇలా సిద్ధాంతాల రగడ చేసే వాళ్ళు కూడా చావు దగ్గరయ్యే సరికి ఏడుస్తూనే ఉంటారు. తమ వాళ్ళు పోతున్నారంటే చార్వాకులు కూడా ఏడుస్తారు. మాటలతో ఏడుపులు దూరం కావు. మర్మం తెలిస్తేనే మాయ మవుతాయి. ఆట లాడటం మంచిదే. బ్రతుకుతో ఆడుకోవడం ఎవరికీ శ్రేయస్కరము కాదు.

చీకటి ముసిరిన చింతల నడుమ
ఆడిన ఆటలు చాలవా!
మృత్యుపాశము వెంట నున్నది
సత్యమార్గమును కనలేవా?
తెర పడిందా తనువే లేదు
మర్మము నెరిగి సాగిపో
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

ఈ సందర్భంలో అర్జునుని **మహాబాహో!** అని సంబోధించాడు భగవంతుడు. గొప్ప బాహువులు కలవాడా! అని పిలిచాడు. బాహుబలం కల వాడివి. మంచిదే. దానితో పాటు బుద్ధి బలం కూడా కల వాడివి కా! బలప్రయోగాలు అన్ని వేళల కాపాడవు. బుద్ధి లోని బాధల్ని తొలగించ డానికి జ్ఞానం, అంటే బుద్ధి బలం ఉండాలే గాని, బాహుబలం కాదు.

అర్జునా! ఈ శ్లోకంలో నేను వినిపించిన వాదము నా సిద్ధాంతము కాదు. నీ అభిప్రాయ మని కూడా నేను భావించడం లేదు. బుద్ధి పెరగక, ఎగబ్రాక లేని వాళ్ళ కోసం నేనే కొన్ని మెట్లు క్రిందికి దిగి మాట్లాడుతున్నాను. అంతే.

నీవు మాత్రం నిత్యాత్మనే అర్థం చేసుకుంటా వని భావిస్తున్నా. ఒకవేళ, నువ్వూ ఈ చాదస్తుల కోవ లోనే చేరి పోతాను అంటావా! చేరిపో! కానీ, నీ చాదస్తపు మూక చావు విషయంలో ఏడవ కుండా ఉండాలి. అదే నేను చెప్పేది. త్వరపడి ఏడ్చేశారంటే, మీరు చెప్పే సిద్ధాంతాన్ని మీరే నమ్మలేక పోతున్నారని అర్థం. పార్థా! చాతుర్యంతో జీవించడం బుద్ధిమంతుల లక్షణం గాని, చాదస్తంతో బ్రతకడం కాదు.

పుట్టిన దానికి చావు తప్పదు. అలాగే చచ్చిన దానికి పుట్టుక తప్పదు అనే అనివార్య విషయాన్ని కొందరు ప్రస్తావించి ప్రసంగిస్తూ ఉంటారు. అలా చూచినా దుఃఖానికి అవకాశం లేదు. ఎలాగో విను!

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥ 27

జాతస్య-హి-ధ్రువః-మృత్యుః-ధ్రువం-జన్మ-మృతస్య-చ
తస్మాత్-అపరిహార్యే-అర్థే-న-త్వం-శోచితుం-అర్హసి

జాతస్య	=	పుట్టిన వానికి
మృత్యుః	=	చావు
ధ్రువః హి	=	తప్పదు కదా!
మృతస్య	=	చచ్చిన వానికి
జన్మ చ	=	పుట్టుకయు
ధ్రువం	=	తప్పదు కదా!
తస్మాత్	=	కాబట్టి
అపరిహార్యే	=	అనివార్య మైన
అర్థే	=	విషయము నందు
త్వం	=	నీవు
శోచితుం	=	దుఃఖించుటకు
న అర్హసి	=	తగవు

పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చిన వానికి జన్మ తప్పదు. అనివార్యమైన ఈ విషయానికి నువ్వు దుఃఖించడ మెందుకు?

వ్యాఖ్య

ఈ ప్రపంచంలో ఉన్న వాళ్ళందరూ పుట్టిన వాళ్ళే. పై నుండి ఊడిపడ్డ వాళ్ళు కారు. అలాగే చెట్లు నుండి కాచిన వాళ్ళూ కారు. పుట్టిన వాళ్ళను చావ కుండా ఆపే శక్తిమంతులు ఇంత వరకు పుట్ట లేదు. పుట్టడం అనే లక్షణం ఉన్నప్పుడు చావు అనేది అవలక్షణం కాదు. పుట్టిన ప్రతి వ్యక్తి మరణిస్తాడు. మరణించిన వాడు తిరిగి పుడతాడు. అలా పుడుతూ, చస్తూ ఉండేది ఆత్మే అని భావించినా దుఃఖించ డానికి హేతువు కనిపించడం లేదని, గడచిన శ్లోకంలో లాగే ఈ శ్లోకంలో కూడా సామాన్యుల దృష్టి కోణం నుండి సాధారణ బోధను వినిపిస్తున్నాడు.

బండి బయలు దేరేది గమ్యాన్ని చేరడానికే. బ్రతుకు బయలు దేరేది మరణాన్ని చేరుకోవ డానికే. పుట్టి చావడం, చచ్చి పుట్టడం - ఇవే జనన మరణాలు. అపరిహార్యాలు. తప్పించుకో లేని అనివార్యాలు. చక్రభ్రమణం లాంటి ఈ జనన మరణ వలయంలో చిక్కి చచ్చిన వాడు పుట్టకుండా ఉండ గలడా? పునర్జన్మ విషయంలో పూర్వం సిద్ధాంతము మాత్రమే ఉండింది. ఇప్పుడు ఋజువులు కూడా ఉన్నాయి. అంగీకరించని వాళ్ళు కూడా అంగీకరించేలా సాక్ష్యాలు అన్ని దేశాలలో ఉన్నాయి. పుట్టి చావని వాళ్ళు ఎవరు? చచ్చి పుట్టని వాళ్ళు ఎవరు?

పరివర్తిని సంసారే (చక్రవత్) మృతః కో వా న జాయతే

పరిభ్రమించే ఈ చావుపుట్టుకల సంసారములో చచ్చి పుట్టని వాడు ఎవడున్నాడు? అని ప్రశ్నించింది శాస్త్రం.

ప్రపంచంలో మార్చ గలిగేవి కొన్ని ఉంటాయి. అలాగే మార్చ లేనివి కొన్ని ఉంటాయి. మార్చ గలిగే వాటిని అవసరమైతే ప్రయత్నంతో మార్చు కోవాలి. మార్చలేని వాటిని మనస్సుతో అంగీకరించాలి. అప్పుడే మనుగడకు అర్థం ఉంటుంది.

జనన మరణాలు మార్చ లేనివి. అవి మన చేతిలో లేవు. ఎందుకు పుట్టామో తెలియదు. ఎంతవరకు ఉంటామో తెలియదు. ఎప్పుడు పోతామో అర్థం కాదు. ఎవరు పుట్టించారో తెలియదు. అందుకనే, ***పుట్టించ మని అడిగినానా? పుట్టించితే అలిగినానా?*** అని ఒక కవి హృదయం మెలికలు తిరిగింది.

అర్జునా! శాస్త్రాన్ని ప్రామాణికంగా అంగీకరించ లేని వాళ్ళు అస్తవ్యస్త పోకడలతో ఏవేవో ఊహించు కుంటారు. ఎన్ని ఊహించినా, ఎంతగా ఊహించినా, వల్లకాటికి ఊరేగే ప్రయాణాన్ని ఆపలేరు. అది అపరిహార్యం. అలాంటి దాని విషయంలో దుఃఖం అర్థ రహితం.

అల పుడుతుంది. అల పడిపోతుంది. నేడు అస్తమిస్తుంది. రేపు ఉదయిస్తుంది. మనిషి పుడతాడు. మనిషి మరణిస్తాడు. ఇది అనివార్యం. అపరిహార్యం. అర్జునా! అలా చూచినా దుఃఖం అసంగతం. అర్థ రహితం.

మరణాన్ని విడిచి పెట్టి జననం ఉండదు. మనిషి జననం లోనే మరణం కూడా పుడుతుంది. క్షణంలో మనిషి పుడతాడు. ఆ క్షణం నుండే మరణం ప్రారంభ మవుతుంది. ప్రతిక్షణం మరణమే. ప్రతి నిముషం మరణమే. గంటగంటకూ మరణమే. రోజు రోజుకూ మరణమే. అందుకే నేమో! పుట్టిన క్షణం నుండే లబ్ - డబ్ అంటూ గుండె మరణ మృదంగాన్ని వినిపిస్తూ ఉంటుంది.

వ్యాపారం చేయడానికే వ్యాపారి కొట్టు తెరుస్తాడు. వ్యాపారం పూర్తి కాగానే కొట్టు కట్టేస్తాడు. జీవితంలో కూడా అంతే. జీవన వ్యాపారము పూర్తి కాగానే ప్రతి మనిషి జీవిత మనే దుకాణాన్ని కట్టేస్తాడు. అందరూ కొట్టు కట్టేసి పోయే వాళ్ళే. వ్యాపారం ఎప్పుడు పూర్తయితే కొట్టు అప్పుడే కట్టేస్తారు. ఎవరి వ్యాపారం వారిదే. ఎవరి సమయాలు వారివే.

అర్జునా! భీష్మాదులు మరణిస్తారని దుఃఖిస్తున్నావు. నీ దుఃఖానికి అర్థముందా? కారణ ముందా? సరే, నువ్వు వాళ్ళను చంపవు. అలాగని వాళ్ళు చావకుండా ఉంటారా? నువ్వు చంపనంత మాత్రాన, వాళ్ళు చావకుండా ఎప్పటికి అలాగే ఉండేట ట్లైతే యుద్ధం మానేయ్!

నువ్వు చంపక పోయినా వాళ్ళు మరణించి తీరుతారు. అయినా, నువ్వు యుద్ధం చేయడానికి వచ్చావు. హత్యలు చేస్తున్నట్లు బాధపడతా వెందుకు? యుద్ధం అన్న తరువాత ఇరువైపుల పోయేవాళ్ళు పోతారు. ఉండేవాళ్ళు ఉంటారు. పోయినవాళ్ళు చేదు కారు. ఉన్నవాళ్ళు తీపి కాలేరు. అర్థం గాని ఆలాపనలు. వ్యర్థమైన ఆవేదనలు.

జననం తరువాత మరణం, మరణం తరువాత జననం - ఈ జనన మరణాలే జగతిలో నిరంతరం. రాత్రింబవళ్ళు తిరుగుతూ ఉంటాయి. ఉదయ సాయంత్రాలు మారుతూ ఉంటాయి. వెలుగునీడలు వీడకుండా ఉంటాయి. కాలచక్రం గిర్రున తిరుగుతూ ఉంటుంది. ప్రతి భ్రమణానికి ఆయువు కుంచుకు పోతూ ఉంటుంది. కాలం జీవితంతో ఆడుకొంటూ ఉంటుంది. కాలం కరుణపై ఆధారపడి బ్రతుకు నడుస్తూ ఉంటుంది. పువ్వు కాయగా మారేది, కాయ పండుగా తయారయ్యేది చెట్టును అంటి పెట్టుకొని ఉండటానికి కాదు. చెట్టును వీడి రాలి పోవడానికి. అర్జునా! అర్థం చేసుకో! చావుపుట్టుకలు అనివార్యాలే, అపరిహార్యాలే అని భావించినా దుః ఖించడానికి ఏముంది?

మార్పు చేసే అవకాశం ఉన్నప్పుడు మార్పు చేసే ప్రయత్నం చేయక పోయినా, ఫలితానికి దూరమైనా దుఃఖిస్తే అర్థం ఉంది. మార్పు చేయలేనిది ఉన్నప్పుడు దానిని అర్థం చేసుకొని అంగీకరించాలే గాని, ఆందోళన చెందుతూ దుఃఖించ కూడదు. దుఃఖించినా సాధించే దేమీ ఉండదు. ఇరవై ఆరు, ఇరవై ఏడవ శ్లోకాలలో శాస్త్రానికి భిన్నంగా సాధారణ మానవుల ప్రకృతిని దృష్టిలో ఉంచుకొని దుఃఖ నివారణ ప్రసంగాన్ని సాగించిన పరమేశ్వరుడు తరువాత శ్లోకంలో ముక్తాయింపు వినిపిస్తున్నాడు.

అవ్యక్తాదీని భూతాని వ్యక్త మధ్యాని భారత ।
అవ్యక్త నిధనా న్యేవ తత్ర కా పరిదేవనా ॥ 28

అవ్యక్తాదీని-భూతాని-వ్యక్తమధ్యాని-భారత
అవ్యక్త నిధనాని-ఏవ-తత్ర-కా-పరిదేవనా

భారతా	=	అర్జునా!	అవ్యక్త నిధనాని ఏవ	=	మరణించిన తరువాత కూడా కనిపించవు
భూతాని	=	ప్రాణులు	తత్ర	=	అట్టి విషయమున
అవ్యక్తాదీని	=	పుట్టుటకు ముందు కనిపించవు	పరిదేవనా	=	దుఃఖపడ వలసింది
వ్యక్తమధ్యాని	=	మధ్యలో కనిపిస్తాయి	కా	=	ఏముంది?

సర్వప్రాణుల శరీరాలు మొదట్లో లేవు. మధ్యలో అగుపిస్తున్నాయి. గతించిన తరువాత మళ్ళీ లేకుండా పోతాయి. అలాంటి విషయంలో దుఃఖపడ వలసింది ఏముంది?

వ్యాఖ్య

ఎచటి నుండి ఎచటికో?

ఈ ప్రపంచం అణువణువులో ప్రసూతి శాల ఉంది. అణువణువులో శ్మశానవాటిక ఉంది. అన్ని ప్రదేశాలలో ప్రాణులు పుడుతూనే ఉన్నాయి. అన్ని ప్రదేశాలలో మరణిస్తూనే ఉన్నాయి. పుట్టక ముందు ఎక్కడున్నాయో తెలియదు. చచ్చి ఎక్కడికి పోతాయో అర్థం కాదు.

పుట్టిన తరువాతే ఎవరైనా ఉన్నట్లు తెలుస్తారు. పుట్టక ముందు తెలియరు. దీనినే భగవానుడు అవ్యక్తావస్థ అంటున్నాడు. అవ్యక్తావస్థ అంటే, సుషుప్త్యవస్థ లాగా అదొక అవస్థ ఏమో అనుకోవద్దు. 'అవ్యక్తమ్' అంటే, ఇక్కడ అదర్శన మని అర్థము. అంటే, కనిపించని స్థితి. పుట్టక ముందు ఎవ్వరూ కనిపించరు. అలాగే మరణించిన తరువాత కనిపించకుండా పోతారు. అది కూడా అవ్యక్తావస్థే. అదర్శనమే. లేకుండా వస్తారు. లేకుండా పోతారు. ఉండినా కనిపించరు. కనిపించ నపుడు ఉన్నారని ఎలా నమ్మేది? అందుకే అవ్యక్తం అంటున్నాడు.

పుట్టక ముందు కనిపించరు. చచ్చిన తరువాత కనిపించరు. మధ్యలో కొంతకాలమే కనిపిస్తారు. ఇక ఆవేదన ఎందుకు? అని ప్రశ్నిస్తున్నాడు శ్రీకృష్ణుడు. తెల్లవారక ముందు చీకటి ఉంటుంది. ఆ తరువాత తెల్లవారుతుంది. సాయంత్రం పొద్దు వాలుతుంది. మళ్ళీ ప్రపంచం చీకటిలో కూరుకు పోతుంది. చీకటి నుండి వచ్చి చీకట్లోకి సాగి పోతుంది.

బండిలో ప్రయాణం చేస్తూ ఉంటాము. మధ్యలో ఎవరో వచ్చి కలుస్తారు. వాళ్ళు ఎక్కడి నుండి వచ్చారో తెలియదు. ప్రయాణం తరువాత ఎటు పోతారో అర్థం కాదు. ఈ మాత్రానికి మధ్యలో ఏముంది విలాపము? ఏముంటుంది విలాసము?

అర్జునా! భీష్మాదులు ఎక్కడ నుండి వచ్చారో నీకు తెలుసా? ఎక్కడికి పోతారో నీకు తెలుసా? పోయే వాళ్ళు చెప్పి పోతారా? చెప్పి పోవడానికి వెళ్ళే దెప్పుడో వాళ్ళకు తెలుసా? ఎక్కడికి పోతారో తెలుసా? తెలిస్తే, మనతో చెప్పి పోయేవాళ్ళు కదా! చెన్నైకి పోతున్నానని మిత్రుడు చెప్పి పోతున్నాడు కదా! పోయిన తరువాత అక్కడ నుండి ఫోన్ చేసి క్షేమంగా చేరానని చెబుతున్నాడు కదా! ఈ ప్రపంచంలో మరణించిన వాళ్ళు అలా చెప్పి పోతున్నారా? వాళ్ళు ఎక్కడ ఉండేది మనకు తెలుసా? తెలిస్తే, ఎందుకు ఏడుస్తాము? వెళ్ళి తెచ్చుకొనే వాళ్ళం కదా! అర్జునా! ఎందుకొచ్చిన ఆవేదన ఇదంతా! *(కా పరిదేవనా?)*.

వ్యర్థ ప్రలాపాలు - వృథా విలాపాలు

అర్జునా! కనిపించకుండా వచ్చి కనిపించకుండా పోయేవాళ్ళ కోసం కంట తడి పెట్టడం సముచితంగా ఉందా? ఇకనైనా ఏడవడం మానేయ్! ఏడుపు ఒక వేడుక కాదు. అనవసరంగా ఏడవకు. అలసి పోతావు.

ఇంతకీ చావు అనేది ఒక ముగింపు అని ఎవరు చెప్పారు? చనిపోయిన వాళ్ళు లేకుండా పోయేవాళ్ళు కారు. కనిపించకుండా పోయేవాళ్ళు. అంతే. అందుకే అవ్యక్తం, అదర్శనం అని అర్థం చేసుకున్నాం.

అదర్శనాత్ ఆపతితః పునశ్చా దర్శనం గతః
నాసౌ తవ న తస్య త్వం వృథా కా పరిదేవనా ॥

కనిపించని స్థితి నుండి వచ్చాడు. కనిపించని స్థితి లోకి పోతున్నాడు. అతడు నీకు ఏమీ కాడు. నువ్వు అతనికి ఏమీ కాలేవు. ఎందుకొచ్చిన వ్యర్థ విలాపం? *(కా పరిదేవనా?)* అని మహాభారతము.

ఇక్కడ విలాప మెందుకు? అంటే, విలాసము కూడా ఎందుకు? అని అర్థం చేసుకోవాలి. విడిచి పోయేవి అని తెలిసి నపుడు పొంగిపోయి సాధించేదీ ఉండదు. క్రుంగిపోయి బావుకొనేదీ ఉండదు. అతి లేకుండా మిత జీవనాన్ని సాగించడమే ఎవరికైనా హితము.

జరిగేవే జరుగు తున్నాయి. జరగ కూడనివి జరిగితే విలపించాలి. అందరికి జరిగేవే మనకూ జరుగు తున్నాయి. గాలి వీచడం నేరమా? భూమి తిరగడం దోషమా? ఎండ కాయడం తప్పా? వానలు కురవడం పాపమా? నిప్పు కాలడం లేదా? నీళ్ళు పారడం లేదా? చెట్టుకొమ్మలు ఊగడం లేదా? కోతి చంచలంగా ఉందని కోప మెందుకు? గేదె అడ్డు తొలగ లేదని శాప మెందుకు? పోనీ, ఏడిస్తే, ఇవేమన్నా మారుతాయా? అలాంటప్పుడు మరణం విషయంలో ఏడు పెందుకు? మరణం మన ఇంట్లోనే జరిగిందా? అయిన వాళ్ళను పోగొట్టుకున్న వాళ్ళం మన మేనా? అందరికి జరిగిందే మనకూ జరుగుతూ ఉంది. కాకపోతే ఎవరికీ జరగనట్లు, మనకే జరిగినట్లు, ఏదో ఏదో ఊహించుకొని ఎదను ముక్కలు చేసుకుంటున్నాం.

ఆఖ్యాయిక

అవి గౌతమ బుద్ధుడు ఉన్న రోజులు. ఒక తల్లి, తన ఒక్కగా నొక్క సంతానం, బాలుడు అయిన బిడ్డను

పోగొట్టుకొని గుండె చెరువయ్యేలా దుఃఖిస్తూ ఉంది. గౌతమ బుద్ధుడు చూశాడు. ఆమెను ఓదార్చాడు. అయినా, ఉపయోగం లేకుండా పోయింది. నీకు నీ బిడ్డ కావాలి. అంతే కదూ? సరే, నేను చెప్పినట్లు చెయ్యి! నువ్వు వెళ్ళి ఎవరి ఇంటిలో ఇంత వరకు ఎవరూ చావ లేదో, వారి ఇంటి నుండి పిడికెడు ఆవాల గింజలు తీసుకొనిరా! అన్నాడు బుద్ధుడు. ఆమె ఉత్సాహంతో లేచి పరుగులు తీసింది. ఆశతో గ్రామంలో ప్రతి ఇల్లూ తిరిగింది. ఎవరూ చనిపోని ఇల్లు ఒక్కటి కూడా కనిపించ లేదు. అందరూ అయిన వాళ్ళను పోగొట్టుకున్న వాళ్ళే.

ఈ మధ్యలో ఆమె ఒక సత్యాన్ని గ్రహించింది. అందరికి జరిగిందే నాకూ జరిగింది. ధర్మానికి తన, మన భేదం తెలియదు. అందుకే అందరి విషయంలో సమదృష్టితో వర్తించే యమధర్మరాజును 'సమవర్తి' అన్నది శాస్త్రం.

ఆది ఎక్కడో తెలిసిరాదు
అంత మెప్పుడో తెలియదు
నడుమ అన్నీ మరపులే
క్షణక్షణానికి మార్పులే
ఏది ఉండునో ఏది ఊడునో
తెలియని జగతి శోకమయం
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ఆశ్చర్య వత్పశ్యతి కశ్చి దేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్యః శృణోతి శ్రు త్వా ప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥ 29

ఆశ్చర్యవత్-పశ్యతి-కశ్చిత్-ఏనం-ఆశ్చర్యవత్-వదతి-తథా-ఏవ-చ-అన్యః
ఆశ్చర్యవత్-చ-ఏనం-అన్యః-శృణోతి-శ్రుత్వా-అపి-ఏనం-వేద-న-చ-ఏవ-కశ్చిత్

కశ్చిత్	=	ఒకడు	అన్యః చ	=	మరొకడు
ఏనం	=	ఈ ఆత్మను	ఏనం	=	ఈ ఆత్మను
ఆశ్చర్యవత్	=	ఆశ్చర్యముగా	ఆశ్చర్యవత్	=	ఆశ్చర్యము వలె
పశ్యతి	=	చూస్తాడు	శృణోతి	=	వింటాడు
తథా ఏవ	=	అట్లే	శృత్వా అపి	=	విని కూడా
అన్యః చ	=	మరి ఒకడు	కశ్చిత్	=	ఎవ్వడును
ఆశ్చర్యవత్	=	ఆశ్చర్యముగా	ఏనం	=	ఈ ఆత్మను
వదతి	=	చెబుతాడు	న వేద ఏవ	=	ఎరుగనే ఎరుగడు

ఆత్మను ఒకడు ఆశ్చర్యంగా చూస్తాడు. మరొకడు చిత్రంగా చెబుతాడు. ఇంకొకడు విచిత్రంగా వింటాడు. ఇంకొకడు ఎంత విన్నా అసలే తెలుసుకోలేడు.

వ్యాఖ్య

సత్యమైనది ఆత్మ. అది నశించేది కాదని ఇప్పటికే తెలుసుకున్నాం. దాని కోసం దుఃఖించ వలసిన

పనిలేదు. ఇక వస్తూ పోతూ ఉండే అపరిహార్యాలు శోకింప దగినవా? మరి దుఃఖం దేని కొరకు? అదే ఎవ్వరికీ అర్థం కాని విషయం. అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించే విషయం.

ఆశ్చర్య మనేది ఒక పదం. ఆశ్చర్యమనే పదానికి మించిన ఆశ్చర్యం ఈ ప్రపంచంలో మరొకటి ఉండదు. ఉంటూ అర్థం కాకుండా ఉండేది ఏదైనా ఆశ్చర్యమే. ఎవరైనా చని పోయారు అని చెప్పగానే వినిన వ్యక్తిలో మనకు మొదట కనిపించేది ఆశ్చర్యం. ఊహించని ప్రగతిని ఎవరైనా సాధిస్తే ఆశ్చర్యం. ఎవరూ చేయలేని కార్యాన్ని ఎవరైనా పూర్తి చేస్తే ఆశ్చర్యం. ఆశ్చర్యాన్నైతే అందరూ వ్యక్తం చేస్తారు. ఆశ్చర్య మేమిటి? అని ప్రశ్నిస్తే, ఎవ్వరూ చెప్పలేక ఆశ్చర్యంగా చూస్తారు, ఆశ్చర్యంగా మిగిలి పోతారు. అదే ఆశ్చర్యం!

ఆశ్చర్యవత్ ఆశ్చర్యమ్, అదృష్టపూర్వం అద్భుతం అకస్మాత్ దృశ్యమానం తేన తుల్యమ్ ఆశ్చర్యవత్ ఆశ్చర్యం!

ఇంతవరకు చూడనిది అకస్మాత్తుగా చూడటం జరిగితే, అదేదో ఆశ్చర్యంతో సమానము. అలాంటి దేదైనా ఆశ్చర్యమే. అయిదు తలలతో ఆవు పుట్టింది అని చెప్పగానే, అందరూ ఆశ్చర్యంతో చూడటానికి వెళ్తారు. ఎందుకంటే, అలాంటిది గతంలో ఎన్నడూ చూడలేదు, వినలేదు కనుక. అదే ఆశ్చర్యము.

ఆంగ్లేయులు ప్రథమంగా ద్విచక్ర వాహనాన్ని మన దేశంలో ప్రవేశ పెట్టి నపుడు, ఆ సైకిల్ మీద వెళ్ళే వ్యక్తిని చూడటానికి గోదావరి గట్టు పొడవునా జనం గుమిగూడి, అదేదో చక్రం మీద మనిషి పోతున్నాడు. ఆశ్చర్యంగా ఉంది. చూద్దాం, రండి! అంటూ పరుగులు తీశారట. వస్తువు ఏమిటి? విషయ మేమిటి? అనేది కాదు ప్రధానము. అంత వరకు చూడనిది, ఒక ప్రత్యేక మైనది ఏదైనా ఉంటే అదే ఆశ్చర్యం.

ఈ ప్రపంచాన్ని ఒక ఆశ్చర్యంగా మనుషులు చెప్పుకుంటూ ఉంటారు. ఇక్కడ ఏవి ఎందుకు, ఎలా జరుగు తున్నాయో తెలియదు కనుక చిత్రమైన జగత్తు అని ఆశ్చర్య పడుతూ ఉంటారు. విచిత్రమైన ప్రపంచం అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ ఉంటారు.

ఆత్మ విషయంలో కూడా అలాగే ఆశ్చర్యాన్ని కనబరుస్తూ ఉంటారు అంటున్నాడు గీతాచార్యుడు.

ఆశ్చర్యాత్మ

ఆత్మను కొందరు ఆశ్చర్యం లాగా చూస్తూ ఉంటారు. కొందరు ఆశ్చర్యం లాగా పలుకుతూ ఉంటారు. కొందరు ఆశ్చర్యం లాగా వింటూ ఉంటారు. కొందరేమో, చూచినా, మాట్లాడినా, వినినా అర్థం చేసుకోలేరు అన్నాడు శ్రీకృష్ణుడు.

ఆత్మ విషయంలో అన్నీ ఆశ్చర్యాలే. ఆత్మ అంత సులభంగా వంట బట్టేది కాదు. అందుకే ఆశ్చర్యంగా మిగిలి పోతూ ఉంటుంది. ఆత్మను అర్థం చేసుకోవడం కష్టం (***దుర్విజ్ఞేయః***). అర్జును డంతటి వాడే అటు ఇటు చూస్తున్నాడు ఆశ్చర్యంగా. అర్థమైందా, కాలేదా అనేది వేరే విషయం. అర్థమైనా ఆశ్చర్యమే. అర్థం కాకపోయినా ఆశ్చర్యమే. అందుకే నేమో, ఈ శ్లోకాన్ని పరిచయం చేస్తూ, శ్రీ శంకరాచార్యస్వామి భాష్యంలో శ్రీకృష్ణుడు అర్జునునిపై సానుభూతితో అనునయ వచనాలు పలికినట్లు ఆశ్చర్యంగా వినిపించారు.

అయం ప్రకృతః ఆత్మా కిం త్వా మేవ ఏకం ఉపాలభే సాధారణే భ్రాన్తి
నిమిత్తే? కథం దుర్విజ్ఞేయః అయం ఆత్మా ఇతి? అతః ఆహ -

ప్రకృతమైన ఈ ఆత్మను గ్రహించడం చాలా కష్టము. ఆత్మ విషయంలో అందరూ సహజం గానే భ్రాంతి చెందుతూ ఉండే టప్పుడు, అర్జునా! నిన్ను ఒక్కడినే ఎందుకు నిందించాలి? అనుకుంటూ ఆత్మను తెలుసుకోవడం ఎంత కష్టమో భగవంతుడు చెబుతున్నాడు అన్నారు శ్రీ శంకరులు.

చూడటమే ఒక ఆశ్చర్యం

ఒకడు ఆత్మను ఆశ్చర్యం లాగా చూస్తాడు (***ఆశ్చర్య మివ ఏనం ఆత్మానం పశ్యతి కశ్చిత్***). ఇక్కడ చూడటం అంటే తెలుసుకోవడ మని అర్థం. ఆత్మ దృశ్యం కాదు కనుక చూడటము అంటే, తెలుసుకోవడం, లేదా బుద్ధితో చూడట మని అర్థము. అలా తెలుసు కోవడంలో కలిగేది ఆశ్చర్యమే నంటున్నాడు. ఎందుకని? ఒక గ్రంథాన్ని చదివి అర్థం చేసుకుంటాం. శ్రీమద్రామాయణం ఉంది. దానిని చదివి అర్థం చేసుకుంటాం. అలాగే ఆత్మ విషయం ఉపనిషత్తులలో ఉంది. కాని, చదివితే అర్థం కాదు. అదే ఆశ్చర్యం.

అనన్య ప్రోక్తే గతి రత్ర నాస్తి - ఆత్మ విషయం ఎవరి నుండైనా శ్రవణం చేయ వలసిందే గాని, మనకు మనంగా చదివితే అర్థం కాదు. అదే ఆశ్చర్యం. ***ఆచార్యవాన్ పురుషో వేద.*** ఆచార్యుణ్ణి అనగా గురువును పొందిన వాడే అర్థం చేసుకో గలడు అని కూడా వేదమే తెలిపింది.

గురువు వద్ద శ్రవణం చేయాలి. అది కూడా ఆశ్చర్యమే. ఇంతవరకు ఎందరి నుండి మనం ఎన్ని విషయాలు శ్రవణం చేయలేదు? కాని, ఆచార్యుని వద్ద ఆత్మ విషయం శ్రవణం చేయడం ఒక ప్రత్యేకతగా ఉంది. అదే ఆశ్చర్యము.

ఆత్మ అంటే ఏదో అని చెబుతాడని శ్రోత ఊహిస్తే, ఆత్మవు నీవే అని బోధిస్తాడు. పోనీలే, అదేమిటో తెలుసుకుందా మనుకుంటే, నువ్వు కాళ్ళు లేకనే నడుస్తావు, చెవులు లేకనే వింటావు, కళ్ళు లేకనే చూస్తావు అంటూ, మన భాష లోనే మాట్లాడుతున్నా, మనస్సుకు పట్టని విషయాల్ని అదే పనిగా చెబుతాడు.

చెవులు ఉంటేనే అంతంత మాత్రం వినపడుతూ ఉంది. చెవులు లేకనే వింటావు అనేసరికి, ఆ తరువాత ఆ కొద్దిపాటి వినికిడి కూడా పోతూ ఉంది. నువ్వు లేని చోటే లేదు అని గురువు బోధిస్తూ ఉంటే, అసలు ఉన్న దెక్కడో కూడా అర్థం కావడం లేదు. అంతా ఆశ్చర్యమే. నేను పుట్టలే దంటాడు. మరి, పుట్టిన తేది ఏం కావాలి? నీకు చావు లేదు అంటాడు. అది అర్థం చేసుకోవడానికి చచ్చినంత పని అవుతోంది. ఆశ్చర్యం!

చెప్పడం కూడా ఆశ్చర్యమే

ఆత్మను గూర్చి చెప్పడం కూడా చాలా కష్టమే. అసలు చెప్పడం ఎందుకు? వినే వాడికి అర్థం కావడానికి. మరి అర్థమవుతూ ఉందా? ఆశ్చర్యం! వినేవారే గాని అర్థమైంది అనే వారు ఉండరు. అలాంటి విషయాన్ని చెప్పడం సులభ సాధ్యమా?

గుండెల్ని పిండి, గొంతును అరగదీసి, మనసును మరగించి, అనేక దృక్కోణాలలో గురువు బోధిస్తాడు. తీరా ఉపనిషత్తును పూర్తి చేసిన తరువాత, రామాయణం అంతా విని రాముడికి లక్ష్మణుడు ఏమౌతాడు? అని అడిగినట్లు, ఆత్మను పొంద డానికి నేను ఏమి చేయాలి? అని అడుగుతాడు శ్రోత. పాపం, వక్త! ఆశ్చర్యం! నువ్వేమీ చేయ నవసరం లేదు నాయనా! అదేదో నేనే చేస్తాను. మళ్ళీ బోధిస్తాను అని గురువు మళ్ళీ సిద్ధ పడతాడు. ఆశ్చర్యం!

ఆత్మ మాటలకు అందనిది. మనస్సుకు చిక్కనిది. అయినా మాటల లోనే చెప్పాలి. మనస్సుకే పట్టించాలి. ***యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ -*** ఎక్కడికి నా మాటలు చేరలేవో, నీ మనస్సు చేరుకో లేదో అదే ఆత్మ అని చెప్పాలి. అది కూడా మాటల లోనే చెప్పాలి. ఆశ్చర్యము!

చెప్పింది శ్రోతకు అర్థమైతే, వక్తకు ఆశ్చర్యం! ఎంత చక్కగా గ్రహించ గలిగాడు అని ఆశ్చర్యం. ఒకవేళ చెప్పింది శ్రోత గ్రహించలేక పోతే, ఇంత చెబుతున్నా గ్రహించలేక పోతున్నా డేమిటి? అని ఆశ్చర్యం.

వినడం కూడా ఆశ్చర్యమే

ఇంతవరకు ఏది విన్నా మన కన్నా అన్యమైన దానిని గూర్చే విన్నాం. కాని, ఇప్పుడు మనం వినేది మనల్ని గురించే కనుక ఆశ్చర్యంగా ఉంటుంది. ఏవో ఏవో ఈ ప్రపంచంలో లభ్యమైతే మనం సుఖ పడతాము అనేది మన అవగాహన. మరి, బోధలో మనమే సుఖం, మనమే సుఖహేతువు అని ఆశ్చర్యంగా వింటాము.

ఏమిటి! నాలో ఇంత వైభవ ముందా? ఇదంతా నిజమేనా? అని శ్రోత ఆశ్చర్యంగా వింటూ ఉంటాడు. ఈలోగా, ***సర్వమిద మహం చ బ్రహ్మైవ*** - ఈ జగత్తు, బ్రహ్మము, నేను, నీవు అంతా ఒక్కటే. నీవే బ్రహ్మము అని గురువు బోధిస్తాడు. ఆశ్చర్యం! ఆశ్చర్యం! పరమాశ్చర్యం!

విన్నంత సేపు బాగానే ఉంటుంది. ఎంత విన్నా మళ్ళీ మొదటి కొస్తుంది. ఇంత వింటున్నా, అంత బాగా చెబుతున్నా అర్థం కాదేమిటో! ఆశ్చర్యం!

వినినా వంటబట్టక పోవడం

పరమాశ్చర్యం!

వినడం వరకు బాగానే ఉంటుంది. వినిన తరువాత ఏమీ విననట్టే ఉంటుంది. ఆశ్చర్యం! ఎంత విన్నా అర్థం కావడం లేదు. గురువు గారికి ఎలా అర్థమైందబ్బా! అని ఆచార్యుని ఆశ్చర్యంగా చూస్తాడు శిష్యుడు. అంతవరకు ఫరవాలేదు. మరొక ఆశ్చర్యం ఉంది.

వక్తు రేవ హి తజ్జాడ్యం శ్రోతా యత్ర న బుధ్యతే

వినే వాడికి అర్థం కాకపోతే ఆ దోషము చెప్పే వాడిదే అనే న్యాయ మొకటుంది. నాకు అర్థం కాక పోవడానికి కారణం నేను కాదు అని ఈ న్యాయాన్ని గనుక శిష్యుడు వినిపిస్తే గురువుకు పరమాశ్చర్యం! ఇంతకీ సారాంశ మేమిటంటే, ఎంతో పరిశ్రమిస్తేనే గాని ఆత్మజ్ఞానం కలగదు ***(అతః దుర్బోధః ఆత్మా ఇత్య భిప్రాయః).*** మన కన్నా అన్యమైన దానిని తెలుసు కోవడం ఆశ్చర్యం కాక పోవచ్చు. ఆత్మబోధలో మనం తెలుసు కుంటున్నది మనల్నే. అందుచేత అర్థమైనా ఆశ్చర్యం గానే ఉంటుంది. అర్థం కాకపోయినా ఆశ్చర్యం గానే ఉంటుంది. అంతా ఆశ్చర్యమయం.

*ఇంతవరకు బోధించిన సాంఖ్య ప్రకరణాన్ని ఇప్పుడు సమాప్తి చేస్తున్నాడు **(అథ ఇదానీం ప్రకరణార్థమ్ ఉపసంహరన్ ఆహ).***

దేహీ నిత్య మవధ్యోఽ యం దేహే సర్వస్య భారత ।
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥ 30

దేహే-నిత్యం-అవధ్యః-అయం-దేహే-సర్వస్య-భారత
తస్మాత్-సర్వాణి-భూతాని-న-త్వం-శోచితుం-అర్హసి

భారత	=	అర్జునా!
సర్వస్య	=	అందరి
దేహే	=	దేహాలలో
అయం	=	ఈ
దేహీ	=	ఆత్మ
నిత్యం	=	ఎల్లప్పుడు
అవధ్యః	=	వధింప బడేది కాదు
తస్మాత్	=	అందుచేత
సర్వాణి	=	సమస్తమైన
భూతాని	=	ప్రాణుల గూర్చి
త్వం	=	నీవు
శోచితుం	=	దుఃఖించుటకు
న అర్హసి	=	తగవు

అందరి శరీరాలలో ఉన్న ఈ ఆత్మ ఎప్పుడూ చంప బడదు. కనుక, ఏ ప్రాణిని గూర్చి కూడా నువ్వు దుఃఖించ పని లేదు.

వ్యాఖ్య

ఎక్కడికి పోదు

ఏదో జరిగి పోతుందని, మరేదో అవుతుందని అర్జునుడు ఏదో ఏదో ఆలోచించుకొని, ఎదలో భారం నింపుకొని కురుక్షేత్రంలో ఏడుస్తూ కూర్చున్నాడు. ***అశోచ్యా నన్వ శోచస్త్వం.*** దుఃఖింప దగని విషయంలో దుఃఖిస్తున్నావు అంటూ రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకంలో శ్రీకృష్ణుడు సాంఖ్యాన్ని బోధించడం ప్రారంభించాడు. ఈ శ్లోకంతో సాంఖ్య ప్రకరణం ముగుస్తుంది. ***నత్వం శోచితు మర్హసి*** అంటూ సమాప్తి చేస్తున్నాడు. 'దుఃఖం తగదు' అంటూ ప్రారంభమై 'దుఃఖింప పని లేదు' అంటూ సమాప్తి చేస్తున్నాడు.

శుద్ధ ఆత్మతత్త్వ విజ్ఞానం సాంఖ్యం ఇతి అభిధీయతే

నిర్మలమైన ఆత్మ తత్త్వమునకు సంబంధించిన జ్ఞానమే సాంఖ్యము అని వ్యాసుని ప్రబోధము. రెండవ అధ్యాయం లోని సాంఖ్య ప్రకరణ మంతా ఈ విషయం చుట్టే తిరిగింది. తాను ఆత్మ అని తెలుసుకున్న వాడు నిత్యతృప్తుడు. నిరాశ్రయుడు. తన తృప్తికి మరొకరిపై ఆధారపడి ఉండే వాడు కాడు. తన ఆనందానికి మరొక సన్నివేశాన్ని అన్వేషించే వాడు కాడు.

తానేమిటో తనకు తెలియడం చేత, తన దేహంతో పాటు ఈ ప్రపంచ మేమిటో కూడా అతనికి తెలుసు. తాను ఉన్నట్లు తనకు తెలుసు. ఉన్న వన్నీ ఈ ప్రపంచంలో ఎలా ఉన్నాయో కూడా తెలుసు. తెలియబడే వన్నీ ఎప్పుడూ మారుతూ ఉండినా, అలా మారే వాటి నన్నిటినీ తెలుసుకొనే తాను మారేవాడు కాడని కూడా అతనికి తెలుసు. అతడే దేహి. మారే దేహాలలో ఉంటూ మారని వాడు.

కుండ ఉంది. కుండలో ఆకాశం ఉంది. కుండను కొని తీసుకొని పోతూ ఉంటాం. మనం కుండను పట్టుకొని పోతామే గాని కుండ లోని ఆకాశాన్ని తీసుకొని పోము. కుండ ఉంటుంది. కుండలో ఆకాశం ఉంటుంది. కుండ పగుల్తుంది. కుండ లోని ఆకాశం ముక్కలు కాదు. నశించదు.

కుండలు అనేకంగా ఉంటాయి. అన్ని కుండలలో ఆకాశం ఉంటుంది. కుండలు ఎన్ని ఉంటే అన్ని ఆకాశాలు ఉండవు. కుండలు ఎన్నయినా ఉండొచ్చు. ఆకాశం మాత్రం ఒక్కటే. కుండలు ప్రయాణం చేస్తాయి. ఆకాశం పయన మెరుగదు. కుండలు పగిలి పోతాయి. ఆకాశం నశించదు. అది సర్వగతం. కుండ లన్నీ ఆకాశానికి ఉపాధులు. ఒకే ఆకాశానికి అనేకమైన ఉపాధులు.

ఆత్మకు దేహాలన్నీ ఉపాధులే. ఒకే ఆత్మకు అనేకమైన ఉపాధులు. దేహాలు ఎన్నో ఉంటాయి. దేహి ఒక్కడే. దేహాలు మార్పు చెందుతాయి. దేహి మారడు. దేహాలు నశిస్తాయి. దేహి నశించడు. అలా నశించని జీవుడు ***(దేహీ)*** దేహం లోనే ఉన్నాడు. నశించని వాడుగా ఉన్నాడు ***(అవధ్యః).*** ఏ వికారాలూ లేకుండా ఉన్నాడు ***(నిత్యః).***

అర్జునా! నీవూ అదే. ఆత్మవే. అందరూ ఆత్మస్వరూపులే. అందరి దేహాలలో ఉన్న అఖండాత్మ స్వరూపము ఒక్కటే ***(సర్వస్య దేహే అయందేహీ నిత్యః, అవధ్యః).*** అర్జునా! పోయేది ఏదన్నా ఉంటే పోనీ. 'నేను పోతాను' అనేది మరచిపో! బాగలేనిది ఏదన్నా ఉంటే ఉండనీ. అంతమాత్రాన 'నేను బాగలేను' అనకు. నువ్వు పోయే వాడివి కావు, నీకు నశింపు లేదు, అంటూ పరమేశ్వరుడు ఈ శ్లోకంలో కూడా ఆత్మ యొక్క నిత్యత్వాన్ని వివరించి, అర్జునుని ఆవేదనకు చరమగీతం పాడుతున్నాడు.

ఏడుపు మానేయ్!

ఉండేది ఏమిటో, పోయేది ఏమిటో అర్థం కాక విషణ్ణుడ వయ్యావు. పోయేది అంటూ ఏదైనా ఉంటే, దానిని పోనీ. కాని, నువ్వు పోయేవాడివి కావు. వచ్చిన వాడివీ కావు. ఎన్నడూ ఉన్నవాడివే. నువ్వు ఎలా నిత్యంగా ఉన్నావో, అలాగే నీకు సంబంధించిన జ్ఞానం కూడా నిత్యమే. నువ్వు నిత్యుడుగా ఉండబట్టే నిత్యమైన ఏ జ్ఞానము కల్పిత బంధాలను కరిగిస్తోంది.

దుఃఖ మనేది ఆత్మ లేక కాదు. నువ్వే ఆత్మ అని తెలియక. ఆత్మస్వరూపం కాని దెవరు? అలాగని ఆత్మ తానే అన్న జ్ఞానం ఎంత మంది కుంది? ఆత్మ యొక్క అజ్ఞానం అందరికీ అనాదిగా ఉంది. అది అలాగే కొనసాగుతూ ఉంది. ఎందుకో తెలుసా! ఆత్మ ఏమిటో అర్థం కాకపోవడం చేత.

పార్థా! ఆత్మ ఏమిటో నీకు తెలిపాను. అనాత్మ ఏమిటో కూడా తెలిపాను. ఆత్మను అనాత్మగా భావించే ప్రమాదం ఉండకూడ దనే అలా చేశాను. నువ్వేమిటో నీకు తెలిసింది. నువ్వు కాని దేమిటో కూడా నీకు అర్థమైంది. నువ్వు ఎక్కడికీ పోవు. ఏ వికారానికి, వినాశానికి లోను కావు *(నిత్యః అవధ్యః)*. ఇక నువ్వు కాని దంటావా? అది అసత్. లేనిదే. ఉన్నది పోదు కనుక అశోచ్యం. లేనిది ఉండేది లేదు కనుక అశోచ్యం. ఇక దుఃఖ మెక్కడుంది? కౌన్తేయా! కళ్ళు తుడుచుకో! విజయా! విలపించకు. అర్జునా! ఆవేదన చెందకు. పార్థా! లే! పోరాడు.

అర్జునునికి పట్టిన మోహం రెండు విధాలుగా ఉందని ప్రారంభం లోనే చెప్పుకున్నాం. అనాత్మ ధర్మాలను ఆత్మ యందు ఆరోపించుకొని, నేను చంపేవాణ్ణి - నేను చచ్చేవాణ్ణి అని దుఃఖించే సాధారణ మోహం మొదటిది. దానికి చికిత్స జరిగిపోయింది. అదే సాంఖ్య ప్రకరణం.

ఇక రెండవది అసాధారణ మోహం. స్వధర్మమైన యుద్ధాన్ని అధర్మంగా భావించి, పాపభీతితో శోకానికి గురి కావడం రెండవది అయిన అసాధారణ మోహం. ప్రస్తుతం రెండవ దానికి చికిత్స ప్రారంభ మవుతూ ఉంది. ధర్మం అనే కోణం నుండి చూచినా, యుద్ధం చేయ దగిందే నంటూ తరువాత శ్లోకం నుండి ప్రారంభిస్తున్నాడు భగవానుడు.

పరమార్థ తత్త్వ దృష్టితో చూచి నపుడు శోకమోహాలకు అవకాశమే లేదని ఇంతవరకు చెప్ప బడింది. కేవలం ఆత్మజ్ఞాన దృష్టి తోనే కాదు, స్వధర్మం అనే దృష్టితో కూడా చెప్పడం జరుగుతూ ఉందని శ్రీ శంకరాచార్య స్వామి ధర్మచర్చకు భాష్యంలో శ్రీకారం చుట్టి అవతారికను అందించారు **(ఇహ పరమార్థ తత్త్వా పేక్షాయాం శోకో మోహో వా న సంభవతి ఇత్యుక్తమ్. న కేవలం పరమార్థ తత్త్వాపేక్షా యా మేవ, కిం తు -).**

స్వధర్మ మపి చావేక్ష్య న వికమ్పితు మర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥ 31

స్వధర్మం-అపి-చ-అవేక్ష్య-న-వికంపితుం-అర్హసి
ధర్మ్యాత్-హి-యుద్ధాత్-శ్రేయః-అన్యత్-క్షత్రియస్య-న-విద్యతే

స్వధర్మం అపి	=	స్వధర్మమును కూడా	ధర్మ్యాత్	=	ధర్మయుతమైన
అవేక్ష్య చ	=	గాంచి	యుద్ధాత్	=	యుద్ధము కంటె
వికంపితుం	=	చలించుటకు	అన్యత్	=	అన్యమైన
న అర్హసి	=	తగవు	శ్రేయః	=	శ్రేయస్సు
క్షత్రియస్య	=	క్షత్రియునకు	న విద్యతే హి	=	లేదు గదా!

అర్జునా! నువ్వు క్షత్రియుడివి. ధర్మ యుద్ధం చేయడం నీ స్వధర్మము. అలా చూచినా కూడా యుద్ధము కన్నా నీకు శ్రేయస్కర మైనది మరొకటి లేదు. నువ్వు శోకింప పని లేదు.

వ్యాఖ్య

చేయ వలసింది చేయ నపుడు చేయకూడని దానిని చేయవలసి వస్తుంది. ఏదీ చేయకుండా మనిషి జీవించలేడు. ప్రతి మనిషి ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. ఏదో ఏదో చేస్తూ పోతే, మరేదో ఏదో అనుభవించ వలసి వస్తుంది. కనుక, చేసేది ఏదైనా ధర్మబద్ధంగా ఉండాలి. అప్పుడే వ్యక్తి సుఖశాంతులతో జీవిస్తాడు. సమాజము అభ్యుదయ మార్గంలో పయనిస్తుంది. మానవ సమాజం అభ్యుదయ మార్గంలో ఆదర్శంగా జీవించాలంటే, సమాజంలో ఉండే వ్యక్తు లందరు, వారి వారి ధర్మాలను త్రికరణ శుద్ధిగా ఆచరించ గలగాలి. ఎక్కడ ఏ చిన్న మర ఊడినా పెద్ద యంత్రము కుంటు పడునట్లు, ఏ వ్యక్తి ధర్మచ్యుతుడైనా సమాజాభ్యుదయానికి విఘాతం ఏర్పడుతుంది. ప్రభువు ధర్మం తప్పితే మరీను.

ధర్మ జీవనం

భార్యాబిడ్డల్ని పోషించడం యజమాని ధర్మము. ప్రజలను పాలించడం రాజు ధర్మము. పశుపక్ష్యాదులు తమ సంతానాన్ని తాము రక్షించు కుంటాయి. మీరు అలా రక్షించుకోవాలి అని వాటికి ఎవ్వరూ చెప్పలేదు. అవి కేవలం సహజాతాల ప్రేరణతో తమ ధర్మాన్ని నెరవేర్చు కుంటాయి.

మనిషికి మనస్సుంది. బుద్ధి ఉంది. ఉన్నంత మాత్రాన లాభం లేదు. అవి పని చేస్తేనే ఉపయోగం. ఎవరి బుద్ధైతే పని చేస్తుందో, అతణ్ణి బుద్ధిమంతుడు అంటారు. పని చేయక పోతే బుద్ధిహీనుడు అంటారు. బుద్ధిమంతుడు తనను తాను రక్షించుకుంటూ సమాజ అభ్యుదయానికి సహకరిస్తూ ఉంటాడు. బుద్ధిహీనుడు తనను తాను పాడు చేసుకుంటూ, సమాజ అస్థిరతకు తన వంతుగా కారకు డవుతాడు.

మనిషి జ్ఞానవంతుడు కావాలి. సాంఖ్య ప్రకరణంలో మనం చూచినట్లు ఆత్మజ్ఞానియై శోభించాలి. ధర్మపరుడు కాని వాడు జ్ఞానవంతుడు కాలేడు. ఉట్టికి ఎక్కలేని వాడు స్వర్గానికి ఎక్కుతాడా? అనేది సామెతే కాదు, సత్యం. చేయ దగిందే *(ధర్మం)* చెయ్య లేనివాడు చేయ వలసింది *(జ్ఞానాభ్యాసం)* ఏమి చేస్తాడు?

ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః

ధర్మమును నశింప చేసేవాడు ధర్మం చేత నశింప బడుతాడు. ధర్మమును రక్షించేవాడు ధర్మం చేత రక్షింప బడుతాడు అన్నది మహాభారతము. అందుచేత ధర్మాన్ని ఎవ్వరూ విడిచి పెట్ట కూడదు అని విధిగా శాసించింది *(తస్మాత్ ధర్మం న త్యాజ్యం).*

ధర్మం అమృతం వంటిది. అది మనిషికి ప్రాణం పోస్తుంది. అధర్మం విషం లాంటిది. అది మనిషి ప్రాణం తీస్తుంది. అధర్మంగా జీవిస్తూ, ఆనందంగా బ్రతక గలము అనుకోవడం ఎండమావులలో దప్పిక తీర్చుకొనే ప్రయత్నమే అవుతుంది.

క్షత్రియ ధర్మం

క్షతాద్ యో వై త్రాయతి ఇతి స తస్మాత్ క్షత్రియః స్మృతః

వినాశము జరగకుండా సమాజాన్ని కాపాడే వాడు క్షత్రియుడు. అవసరమైతే యుద్ధమైనా చేసి ప్రజల్ని రక్షించ వలసిన వాడు క్షత్రియుడు. అంతేగాని, తన వ్యక్తిగత ఆరాటంతో సన్యసించే వాడు మాత్రం కాదు.

యుద్ధం స్వధర్మో నృపతేః ప్రజానాం పరిపాలనమ్

ప్రజల్ని ధర్మబద్ధంగా పాలిస్తూ వారికి సుఖశాంతులు దూరం కాకుండా చూడటం, ఒకవేళ అలాంటి దురదృష్టకరమైన పరిస్థితి ఆసన్న మైతే, యుద్ధం చేసి అయినా సరే శాంతి భద్రతలను కాపాడటం క్షత్రియ ధర్మం. రాజధర్మం.

కనుక యుద్ధం అనేది క్షత్రియుని కర్తవ్యము. యుద్ధఫలం ఇలాగే ఉండాల్సి అనే నియమ మేమీ లేదు. అది ఎలాగైనా ఉండొచ్చు. కర్మఫలాలు దైవాధీనాలు. కర్తవ్యాన్ని నిర్వహించడం మానవుల వంతు. ఫలాలను అనుగ్రహించడం భగవంతుని వంతు. కర్తవ్యాన్ని విస్మరించే వానికి ఫలాలను గూర్చి ప్రసంగించే అర్హత ఉండదు.

క్షత్రియుడు ధర్మ పరిపాలన చేయాలి. అది ధర్మము. ఏ కారణం చేత నైనా ధర్మచ్యుతి జరిగితే, తత్ఫలితంగా శాంతిభద్రతలు కుంటు పడితే, దానిని సుస్థిర పరచ డానికి యుద్ధమే శరణ్య మైతే, యుద్ధంలో పోరాడైనా సరే, దేశాన్ని, ప్రజల్ని రక్షించాలి. అందుచేత యుద్ధం క్షత్రియుని ధర్మం అని చెప్ప బడింది. ఈ విధంగా యుద్ధం క్షత్రియునికి స్వధర్మము ***(స్వధర్మః క్షత్రియస్య యుద్ధమ్).***

ధర్మయుద్ధంలో ధనంజయుడు

కురు సామ్రాజ్యాన్ని పాలించ డానికి అంధుడైన ధృతరాష్ట్రుడు అనర్హుడు. అందుచేత ధృతరాష్ట్రుని సోదరుడైన పాండురాజు ధర్మజ్ఞుల, శ్రేష్ఠ పురుషుల ఆదేశాన్ని బౌదల దాల్చి సింహాసనాన్ని అధిష్ఠించాడు.

అదృష్టాలు అందల మెక్కిస్తాయి. దురదృష్టాలు పని గట్టుకొని క్రిందికి దించుతాయి. పాండురాజు విధి వక్రించింది. తపస్సు నాచరించ డానికి పాండురాజు అరణ్యాలకు వెళ్ళాడు. ఆ తరువాత, పాండురాజు కుమారుడు, జ్యేష్ఠుడు అయిన ధర్మరాజు సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఆయన పరిపాలనలో ధర్మం చతుష్పాదాలతో నడిచింది. ప్రజలు సుఖశాంతులలో జీవించారు.

ఇంతలోనే దాయాదుల పోరు ఆరంభమైంది. ధర్మప్రభువు ధర్మరాజును దుర్యోధనుడు దగా చేశాడు. మాయ చేసి మోసం చేసి రాజ్యాన్ని అపహరించాడు. ధర్మం అడవుల పాలైంది. అధర్మం అందల మెక్కింది. అధర్మ పాలనలో ప్రజలు అశాంతికి లోనయ్యారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది, ప్రజల జీవనంలో సుఖశాంతులు నింపడము పాండవుల ధర్మమైంది. అందుకే శ్రీకృష్ణుడు పాండవుల పక్షం చేరాడు. కనుక స్వధర్మము అనే కోణము నుండి చూచినా, అర్జునుడు చలింప వలసిన అవసరము లేదు అనేది శ్రీకృష్ణుని అభిప్రాయము.

యుద్ధభూమిలో అర్జునుడు విషణ్ణుడైన సందర్భంలో ఎలా చలించి పోయాడో మనం చూశాం. శరీరం వణుకుతోంది అని అర్జునుడే అన్నాడు. ***(వేపథుశ్చ శరీరేమే రోమహర్షశ్చ జాయతే).*** దానిని దృష్టిలో ఉంచుకొని, అర్జునా! క్షత్రియ ధర్మాన్ని ఆచరించడానికి అనువైన ఈ యుద్ధంలో నువ్వు అంతగా చలించిపో నవసరం లేదు అంటున్నాడు శ్రీకృష్ణుడు.

దిగులు - దిగ్భ్రాంతి

మహాభారత యుద్ధ ఫలితాలను అతిగా ఊహించుకొని కలత చెందిన అర్జునుడు దారి తప్పి ఆలోచించాడు. అతనికి ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా గోచరించ సాగింది. అందుచేత స్వజనుల్ని చంపుకోవడం శ్రేయస్కరంగా కనిపించడం లేదని ప్రథమ అధ్యాయంలో వాదించాడు ***(న చ శ్రేయోఽ ను పశ్యామి హత్వా స్వజన మాహవే).***

తరువాత, రెండవ అధ్యాయంలో తాను ధర్మం విషయంలో సందేహంతో ఉన్నట్లు అంగీకరించాడు. ఏది శ్రేయస్సో కూడా అర్థం కావడం లేదని ఒప్పుకున్నాడు. తనకు శ్రేయస్సును నిశ్చయించి చెప్పమని

ప్రార్థించాడు. అదంతా దృష్టిలో ఉంచుకొని శ్రీకృష్ణుడు, క్షత్రియుడైన వానికి ధర్మయుతమైన యుద్ధము కంటె శ్రేయస్కర మైనది వేరొకటి లేదు అని ధర్మ ప్రసంగం చేస్తున్న ఈ సందర్భంలో నొక్కి వక్కాణిస్తున్నాడు ***(ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽ న్యత్ క్షత్రియస్య న విద్యతే).***

క్షత్రియుడు అనివార్యమైన మరణం నుండి వెను తిరగ కూడదు. ఒకవేళ యుద్ధంలో ప్రాణం పోయినా ప్రశస్తమే. పవిత్రమే. అదే చెబుతున్నాడు.

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ లభన్తే యుద్ధ మీదృశమ్ ॥ 32

యదృచ్ఛయా-చ-ఉపపన్నం-స్వర్గద్వారం-అపావృతం
సుఖినః-క్షత్రియాః-పార్థ-లభంతే-యుద్ధం-ఈదృశం

పార్థ	=	అర్జునా!	ఈదృశం చ	=	ఇట్టి
యదృచ్ఛయా	=	కోరకుండా	యుద్ధం	=	యుద్ధమును
ఉపపన్నం	=	లభించిన	సుఖినః	=	సుఖవంతులు
అపావృతం	=	తెరవ బడిన	క్షత్రియాః	=	క్షత్రియులు
స్వర్గద్వారం	=	స్వర్గద్వారము అయిన	లభంతే	=	పొందుతున్నారు

పార్థా! యుద్ధము నువ్వు కోరుకున్నది కాదు. దీని వల్ల స్వర్గ ద్వారాలు తెరుచు కుంటాయి. ఇట్టి యుద్ధమును క్షత్రియులు మాత్రమే పొందుతారు. అలా పొందిన వాళ్ళు ధన్యులు కదా!

వ్యాఖ్య

ఊహించని కార్యం

యుద్ధమును ఎవ్వరూ అభిలషించరు. యుద్ధాలైనా, వర్షాలైనా కోరితే వచ్చేవి కావు. పుణ్యాన్ని పంచ డానికి యుద్ధం వస్తే, పంటను పండించ డానికి వర్షాలు పడతాయి. యుద్ధం వచ్చినా, వర్షం పడినా కారణాలు ఉన్నాయి. కారణాలు లేకపోతే కోరినా అవి రావు. ఆశించకుండా వచ్చే అవకాశాలను విజ్ఞులు వినియోగించు కుంటారే గాని, పాడు చేసుకోరు.

అర్జునా! క్షత్రియుడివి కావడం చేత ఈ అవకాశం నిన్ను వరించింది. నువ్వు యుద్ధం చెయ్యాలని భావించలేదు. నన్ను కౌరవుల వద్దకు సంధికి పంపే టప్పుడు కూడా యుద్ధాన్ని నివారించమనే నువ్వు కూడా చెప్పావు. నేను కూడా అలాగే ప్రయత్నించాను. కాని, మన ప్రయత్నాలు ఫలించ లేదు. దుర్యోధనుడు యుద్ధాన్నే కోరుకున్నాడు. సంగ్రామం అనివార్యమైంది. ఇది నువ్వు ఆశించకుండానే నీకు ప్రాప్తించింది ***(యదృచ్ఛయా ఉపపన్నమ్).***

యుద్ధం చెయ్యడం భీష్మాదులకు మాత్రం ఇష్టమా? మన లాగే యుద్ధ నివారణకు వాళ్ళు కూడా ప్రయత్నించారని నీకు తెలియదా? వారి ప్రయత్నాలు కూడా ఫలించ లేదు. యుద్ధం తప్పనిసరి అయింది. మరి, వాళ్ళు యుద్ధానికి రాలేదా? ఇష్టం లేదని పారిపోయారా? పారిపోతే క్షత్రియు లెలా అవుతారు? క్షత్రియ ధర్మాలలో యుద్ధం నుండి పారిపోకుండా ఉండటము కూడా ఒకటి అని వారికి తెలుసు ***(యుద్ధే చాప్య పలాయనమ్ .... క్షాత్రం కర్మ స్వభావజమ్).***

పుణ్యప్రదం

అర్జునా! అనేక యజ్ఞ యాగాదులు చేసిన వాళ్ళు వాటి ఫలంగా స్వర్గాన్ని పొందుతారు. కాని వీరులైన క్షత్రియులు అదే స్వర్గ ఫలాన్ని యుద్ధం వల్ల పొందుతారు. అందుచేత ఆశించని యుద్ధాన్ని పుణ్యం గల క్షత్రియులే పొంద గలరు.

కృష్ణా! హింసాయుతమైన యుద్ధము పుణ్యకార్యమా? అని అడుగుతా వేమో. యుద్ధం పుణ్యకార్య మని నేను చెప్పడం లేదు. యుద్ధం ధర్మ కార్యము అంటున్నాను. ధర్మ కార్యము యొక్క ఫలం పుణ్యం. ఆ పుణ్యఫలం స్వర్గం.

కనుక క్షత్రియ ధర్మాన్ని అనుసరించి యుద్ధంలో పాల్గొనే వీరులు మరణిస్తే, వారి కొరకు స్వర్గ ద్వారాలు తెరుచు కుంటాయి. ధర్మయుద్ధంలో పాల్గొనడ మనే కార్యము వల్ల లభించే పుణ్యమే, మూతబడిన స్వర్గ ద్వారాలను తెరిపిస్తుంది. ఈ శ్లోకంలో అర్జునుణ్ణి *పార్థా!* అని పిలిచాడు శ్రీకృష్ణుడు. పార్థా! అంటే, పృథ కుమారా! అని అర్థము. పృథ అంటే కుంతీదేవి. ఈ సంబోధనలో ఎంతో భావం నిగూఢంగా ఉంది. అట్టి భావవ్యూహ తోనే అర్జునునికి స్ఫూర్తి నివ్వాలని భావించి శ్రీకృష్ణుడు పార్థా! అని పిలిచాడు.

శ్రీకృష్ణుడు రాయబారానికి హస్తినకు వెళ్ళి నపుడు, సంధి విఫలమై యుద్ధము అనివార్యము కాగా, తిరిగి పాండవుల వద్దకు వస్తూ, అత్తమ్మ కుంతీదేవిని దర్శించు కున్నాడు. ఆ సమయంలో కుంతీదేవి శ్రీకృష్ణునితో ఇలా అంది.

ఏతద్ధనంజయో వాచ్యో నిత్యోద్యుక్తో వృకోదరః
యదర్థం క్షత్రియా సుతే తస్య కాలోఽ_ య మాగతః ॥

కృష్ణా! క్షత్రియ జనని దేని కొరకు కుమారుని కంటుందో, అట్టి సమయము ఆసన్న మైనదని, అర్జునునికి, నిరంతరము పోరాట పటిమను ప్రదర్శించే భీమునికి నా మాటగా చెప్పు అన్నది.

తల్లి మాటను గుర్తుకు తెస్తూ, పార్థా! అని సంబోధించి, కోరకుండా లభించింది, స్వర్గద్వారాలను తెరిచేది అయిన యుద్ధ కార్యాన్ని ఆచరించు అని స్ఫూర్తిని కలిగిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

యుద్ధం చేయకపోతే ఏమౌతుంది? దాని ఫలిత మేమిటో కూడా చెబుతున్నాడు.

అథ చే త్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33

అథ-చేత్-త్వం-ఇమం-ధర్మ్యం-సంగ్రామం-న-కరిష్యసి
తతః-స్వధర్మం-కీర్తిం-చ-హిత్వా-పాపం-అవాప్స్యసి

అథ	= ఇక		తతః	=	అపుడు
త్వం	= నీవు		స్వధర్మం	=	స్వధర్మమును
ధర్మ్యం	= ధర్మయుక్తమైన		కీర్తిం చ	=	కీర్తిని
ఇమం	= ఈ		హిత్వా	=	విడిచి
సంగ్రామం	= యుద్ధమును		పాపం	=	పాపమును
న కరిష్యసి చేత్	= చేయక పోతే		అవాప్స్యసి	=	పొందుతావు

అర్జునా! ధర్మ సమ్మతమైన ఈ యుద్ధాన్ని నువ్వు చెయ్యక పోతే, దాని ఫలిత మేమిటో తెలుసా? నువ్వు పోగొట్టు కొనేది స్వధర్మాన్ని, కీర్తిని. పొందేది పాపాన్ని.

వ్యాఖ్య

ధర్మ వర్తనం లేక పోవడమే అధర్మం

ఇష్టాయిష్టాలను నిర్ణయించుకునే అధికారం మనిషికి ఉంది. వాటిని మార్పు చేసుకునే అధికారం కూడా మనిషికి ఉంది. పాపపుణ్యాల విషయంలో మాత్రం నిర్ణయాధికారం శాస్త్రానిదే కాని మనిషిది కాదు.

వ్యక్తి సమాజానికి దూరంగా లేడు. సమాజ సహకారం లేకుండా జీవించ లేడు. సమాజం పట్ల తన ధర్మాన్ని నిర్వర్తించని వాడు అధర్మపరుడు అవుతాడు. అధర్మఫలం పాపం కనుక అతడు పాపము చేసిన వాడు అవుతాడు. పాపఫలమును అనుభవించ వలసిన వాడు కూడా అవుతాడు.

యుద్ధం చెయ్యక పోతే ఏమవుతుంది? ఏ యుద్ధం? ధర్మయుద్ధం. అందుచేతనే, ధర్మయుతమైన ఈ యుద్ధము *(ఇమం ధర్మ్యం సంగ్రామం)* అని నొక్కి మరీ స్పష్టం చేశాడు భగవంతుడు. ఇలాంటి ధర్మ యుద్ధాన్ని విరమిస్తే దుష్ఫలితం అనివార్యం అంటున్నాడు. ఈ శ్లోకంలో *అథ* అనే పద ప్రయోగము వల్ల, యుద్ధం విరమిస్తే కలిగే దోషానికి సంబంధించిన విషయాన్ని హెచ్చరికతో పరిసమాప్తం చేయడం జరిగింది.

యుద్ధ మనేది క్షత్రియునికి స్వధర్మం అని ఇప్పటికే తెలుసుకున్నాం. అధర్మపరులైన శత్రువులు ఎదురు నిలిచి పోరాడే టప్పుడు, వారిని జయించి, ధర్మాన్ని రక్షించ వలసిన బాధ్యత, భూ భారాన్ని తగ్గించ వలసిన కర్తవ్యం కూడా భూపతికే ఉంది. అందుకే ఇది సాధారణ ప్రసంగం కాదు; ధర్మశాస్త్ర ప్రబోధము.

నిర్జిత్య పరసైన్యాని క్షితిం ధర్మేణ పాలయేత్

ధర్మదూరులైన శత్రు మూకలను జయించి భూమిని, ధర్మాన్ని క్షత్రియుడు రక్షించాలి అని ధర్మశాస్త్రం చెబుతూ ఉంది. దీనికి భిన్నంగా వర్తించడం అధర్మం అవుతుంది. చేయ వలసింది చేయక పోవడం కూడా పాపమే అని ముఖ్యంగా గుర్తించాలి.

ఇక్కడ మరొక సంశయం కలుగుతుంది. కర్మ చేస్తే ఫలితం తప్పదు అనేది అందరికీ తెలుసు. ఫలం ఏదయినా కర్మ చేస్తేనే అందుతుంది. మరి, ఇక్కడ అర్జునుడు కర్మను మానేస్తున్నాడు. అంటే, కర్మ చేయడం లేదు. చేయని దానికి ఫలం ఉందని చెప్పడం విడ్డూరంగా లేదా? అనే సంశయం కొందరికి కలుగుతూ ఉంటుంది.

నిజమే. యుద్ధం అయితే చేయడం లేదు. యుద్ధభూమికి వచ్చి తిరిగి పోతున్నాడా, లేదా? అది కర్మ కాదా? అలా తిరిగి పోవడం అనే కర్మ చేయకూడనిది కాదా? చేయకూడని దానిని చేస్తున్నాడు కనుక అది పాపం. దాని ఫలితమే పాప ఫలం. ధర్మయుద్ధం నుండి పారి పోవడం పాపం. కాని, ధర్మశాస్త్రం ఈ విషయాన్ని ఎంత క్షుణ్ణంగా చెబుతూ ఉందంటే, అలా పలాయనం చిత్తగిస్తున్న సమయంలో యోధుడు కనుక మరణిస్తే అతని పుణ్యం జయించిన రాజుకు చెందుతుంది అని కూడా చెప్పింది.

రాజా సుకృత మాదత్తే హతానాం విపలాయినామ్

యుద్ధభూమి నుండి పారిపోతూ మరణించిన వాడి సుకృతాన్ని రాజే పొందుతా డని యాజ్ఞవల్క్య స్మృతి చెబుతూ ఉంది. కనుకనే సంగ్రామం నుండి పరుగులు తీసి పాపం మూట కట్టుకో వద్దు అని శాస్త్రం ఆదేశించింది ***(న నివర్తేత సంగ్రామాత్)***.

అందుచేత, ధర్మయుతమైన ఈ యుద్ధాన్ని చేయకుండా విడిచి పెడితే, స్వధర్మాన్ని పోగొట్టు కోవడమే గాక, కీర్తిని కూడా పోగొట్టుకొని పాపాన్ని మూట కట్టుకో వలసి వస్తుందని పరమేశ్వరుడు హెచ్చరిస్తున్నాడు.

పేరు నిలవదు - ఖ్యాతి మిగలదు

స్వధర్మం అనేది చాలా గొప్ప విషయం. విశాలంగా అర్థం చేసుకో వలసిన విషయం. స్వధర్మం కళ్ళ లాంటిది. కళ్ళజోడు వంటిది కాదు. స్వధర్మం తల్లి లాంటిది. సవతి తల్లి వంటిది కాదు. స్వధర్మం మనతో కలిసి పుడుతుంది. స్వధర్మాన్ని మార్చుకో లేము. సవతి తల్లులు ఎందరైనా ఉండొచ్చు. కన్నతల్లి మాత్రం ఒక్కతే. ఆమె విషయంలో మార్పు జరగదు. జరగలేదు. తల్లి విషయంలో నిర్ణయాధికారం మనకు లేదు. తల వంచి అంగీకరించడమే. స్వధర్మం కూడా తల్లి లాంటిదే. అందుకని స్వధర్మాన్ని విడిచి పెట్ట కూడదు. క్షత్రియునికి యుద్ధం స్వధర్మం కనుక యుద్ధాన్ని విడిస్తే ధర్మాన్ని విడిచి పెట్టినట్లే అవుతుంది అని భగవంతుడు హెచ్చరిస్తున్నాడు. స్వధర్మాన్ని పోగొట్టు కుంటే పాపం వస్తుంది అంటున్నాడు ***(స్వధర్మం హిత్వా పాప మవాప్స్యసి)***.

యుద్ధాన్ని విరమిస్తే స్వధర్మ నాశమే గాక, కీర్తి నాశమని కూడా ఎరుక పరుస్తున్నాడు. అదేమిటి? అర్జును డంటటి వీరుడు యుద్ధాన్ని విరమిస్తే జనులు శ్లాఘించరా? ఆహా! చంపే శక్తి ఉన్నా, చంపకుండా విడిచి పెట్టాడు. దయామయుడు, ప్రేమమూర్తి అని స్తుతించరా?

అలా జరగనే జరగదు. యుద్ధ రంగానికి రాకుండా విరమించి ఉంటే, అది వేరే విషయం. యుద్ధం చేయడానికి వచ్చి, రణభూమి నుండి తిరిగి పోతే, యుద్ధం చేయ లేకనే తిరిగి పోయాడు అని చెప్పుకుంటారు.

అర్జునునికి ఎంత పేరుంది! ఎంత ఖ్యాతి ఉంది! చేసిన వందలాది దానకర్మలు ఒక్క దొంగతనంతో పోయినట్లు, ఉన్న ఖ్యాతి సమస్తమూ, యుద్ధం మానేయడ మనే ఒక్క అపఖ్యాతితో తుడిచి పెట్టుకు పోతుంది. పైగా, పాపం మూట కట్టుకో వలసి వస్తుంది.

అయ్యో! ఎంత పాపాన్ని చేయడానికి పూనుకున్నాము? ***(అహోబత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్)*** అని మొదటి అధ్యాయం నలభై ఐదవ శ్లోకం లోను, ఆతతాయులైన దుర్యోధనాదుల్ని వధించుట వలన మాకు పాపమే వస్తుంది ***(పాప మేవ ఆశ్రయేత్ అస్మాన్)*** అని అదే అధ్యాయం ముప్పై ఆరవ శ్లోకం లోను అర్జునుడు వాపోయాడు. పాప మనేది యుద్ధం చేయక పోవడం వల్ల వస్తుందే గాని ***(పాపం అవాప్స్యసి)*** యుద్ధం చేయడం వల్ల కాదు అని ఈ సందర్భంలో భగవానుడు సహేతుకంగా, సశాస్త్రీయంగా వివరించాడు.

యుద్ధం చేయక పోవడం వల్ల కలిగే దుష్ఫలితాలను తరువాత శ్లోకంలో కూడా వినిపిస్తున్నాడు.

అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తేఽవ్యయామ్ ।
సమ్భావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ **34**

అకీర్తిం-చ-అపి-భూతాని-కథయిష్యంతి-తే-అవ్యయాం
సంభావితస్య-చ-అకీర్తిః-మరణాత్-అతిరిచ్యతే

అపి చ	=	మరియు	కథయిష్యంతి	=	ముచ్చటించుకుంటారు
భూతాని	=	లోకులు	సంభావితస్య	=	మాననీయునకు
తే	=	నీ యొక్క	అకీర్తిః	=	అపకీర్తి
అవ్యయాం	=	అంతము లేని	మరణాత్ చ	=	మరణము కంటె కూడా
అకీర్తిం	=	అపకీర్తిని	అతిరిచ్యతే	=	అధిక మైనది.

ప్రజలు నీ అపకీర్తిని చాలా కాలం పాటు అదే పనిగా చెప్పుకుంటారు. సన్మానాలు అందుకొన్న వానికి అవమానము మరణం కంటే ఎక్కువే కదా?

వ్యాఖ్య

జరిగిన వన్నీ సన్మానాలే

అర్జునా! ఒక పెద్ద బండను కొండ మీదకి మోసుకొని పోవడానికి చాలా శ్రమించాలి. సమయం కూడా చాలా పడుతుంది. అదే బండను పై నుండి క్రిందికి త్రోయడానికి పెద్దగా శ్రమించ నవసరం లేదు. పైగా ఎక్కువ కాలం పట్టదు కూడా.

అర్జునా! నీవు ఎంత కీర్తిమంతుడివి! అదంతా క్షణాల్లో వచ్చిందా? సులభంగా ప్రాప్తించిందా? ఎంత కాలం ఎంతగా శ్రమిస్తే లభించింది! ఎన్ని అద్భుతమైన ఆయుధాలు నీ వద్ద ఉన్నాయి! అవి దారిన పోయే వాళ్ళు దానం చేసినవి కావే! దేవతల్ని మెప్పించి, ఒప్పించి తెచ్చినవి కావా? పరమశివునితో నువ్వు చేసిన పోరాటం సామాన్యమా? దాని వల్ల నీకు లభించిన కీర్తి మరొకరికి సాధ్యమా? ***(మహా దేవాది సమాగమాది నిమిత్తాం, కీర్తిః).*** జనులు నిన్ను ఎంతగా కీర్తించారు! ధర్మాత్ముడు అనలేదా? శూరుడని పిలవలేదా? ***(ధర్మాత్మా, శూరః ఇత్యేవం ఆదిభిః).*** నువ్వు యుద్ధం నుండి వెను దిరిగితే ఈ కీర్తి మిగుల్తుందా? నీ ఖ్యాతి నిలుస్తుందా?

జరగబోయే వన్నీ అవమానాలే

ఎంతో కాలం శ్రమించి సాధించిన కీర్తి క్షణాల్లో మటుమాయ మవుతుంది. అర్జునా! సంవత్సరాలు శ్రమించి సాధించిన పేరేమో క్షణాల్లో పోతుంది. క్షణాల్లో సంక్రమించిన అపకీర్తి మాత్రం జీవితాంతం ఉంటుంది. పేరు లేకపోతే నష్టం లేదు. పేరున్న వాడు చెడ్డపేరుతో బ్రతకడం దుర్భరంగా ఉంటుంది. మరణ సదృశంగా ఉంటుంది. కాదు, కాదు. మరణం కన్నా దారుణంగా ఉంటుంది.

నువ్వు కనిపించగానే అదిగో! అతడే! అంటూ చెప్పుకుంటారు. పూర్వం కూడా అలాగే చెప్పుకొనే వారు. కాకపోతే, దేవతల్ని సైతం ఎదిరించి పోరాడిన విజయ శిఖామణి ఇతడే! అని చెప్పుకొనే వారు. ఇప్పుడు? అదిగో, అతడే! కురుక్షేత్రం నుండి దౌడు తీసిన వీరయోధుడు అతడే! అని అపహాస్యం చేస్తారు. అది భరించడం నీ లాంటి వీరుడికి సాధ్యమేనా అర్జునా? ఆలోచించు!

కృష్ణా! వీరుడు అంటే, పరాక్రమాన్ని ప్రకటిస్తే నేనా? బాహుబలాన్ని ప్రదర్శించి శత్రువును వధిస్తేనే శూరుడా? వీరుడైన వానికి మనస్సు ఉండదా? క్షత్రియుడు అయినంత మాత్రాన ప్రేమ ఉండదా? ధీరుడికి సున్నిత మైన హృదయం ఉండ కూడదా? ఇప్పటి వరకు నా వైభవా లెన్నో చూశారు. ఈ యుద్ధాన్ని ఎందుకు చేయలేక పోతున్నానో ప్రజలు గ్రహించ లేరా? పండితులు వివరించ లేరా? జాలిగుండె అని నిర్ణయించ లేరా?

అర్జునా! అదంతా నీ భ్రమ! ఈ సమాజం ఒక మాయలమారి. అన్నీ బాగుంటే పగలు అరబోస్తుంది. ఏ మాత్రం తేడా వచ్చినా, నిజానిజాలను పరిశీలించ కుండానే పగలు కుమ్మరిస్తుంది. అసమానంగా ఊరేగిన వాణ్ణే అదుపు లేకుండా కుదిపేసే సమయం ఆసన్న మైందని పొంగి పోతుంది. నామరూపాలు లేకుండా ఊడ్చి పారేసే కాలం చేరువైందని ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతుంది. సముద్ర మంత నోరు తెరుచుకొని విమర్శిస్తుంది. గాలిలా తిరుగుతూ ప్రచారం చేస్తుంది. సామాన్యులే కాదు, మహారథులు కూడా నిన్ను నిశితంగా, నిర్దయగా విమర్శిస్తారు. యుద్ధం చెయ్యలేక కేవలం పిరికితనం తోనే నువ్వు పరుగులు తీశావని చెప్పుకుంటారు. నా మాట విను!

భయాద్రణాదుపరతం మంస్యన్తే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 35

భయాత్-రణాత్-ఉపరతం-మంస్యంతే-త్వాం-మహారథాః
యేషాం-చ-త్వం-బహుమతః-భూత్వా-యాస్యసి-లాఘవం

మహారథాః	=	మహారథులు	యేషాం	=	ఎవరికి
త్వాం	=	నిన్ను	త్వం	=	నీవు
భయాత్	=	భయము వలన	బహుమతః	=	మాననీయుడవు
రణాత్	=	రణరంగము నుండి	భూత్వా	=	అయి
ఉపరతం	=	మరలిన వానిగా	లాఘవం	=	చులకన
మంస్యంతే	=	అనుకుంటారు	యాస్యసి చ	=	పొంద గలవు

మహారథు లందరూ పూర్వం ఎంతగానో నిన్ను గౌరవించారు. ఇప్పుడు వాళ్ళ దృష్టిలో నువ్వు చులకనై పోతావు. కేవలం భయం వల్లనే నువ్వు యుద్ధం మానేశావని వాళ్ళందరూ భావిస్తారు.

వ్యాఖ్య

ఉన్న కృపను చూడరు
లేని భయాన్ని అంటకడతారు

అర్జునా! సామాన్యులు చేసే విమర్శల్ని తట్టుకో వచ్చు. కాని, మహారథులు కూడా అలాగే భావిస్తారు. నువ్వు ఏదో కృపతో యుద్ధం నుండి వెను దిరిగావని ఋజు మార్గంలో అర్థం చేసుకోరు. కర్ణుడు మొదలైన వారికి భయపడే నీవు యుద్ధాన్ని విరమించావని చెప్పుకుంటారు (*భయాదిభిః కర్ణాదిభ్యః యుద్ధాత్ నివృత్తం చిన్తయిష్యన్తి - న కృపయా ఇతి*) అంటున్నాడు గీతాచార్యుడు.

అర్జునుడిలో ఉన్నది వాస్తవానికి కృపే. ఈ విషయం శ్రీకృష్ణునికి పూర్తిగా తెలుసు. కాని, ఎవరు అర్థం చేసుకుంటారు? ఒక వైపు నిజం తెలుస్తూ ఉన్నా, అర్జునుణ్ణి చులకన చేయాలని పలు విధాలుగా విమర్శిస్తారు. జడిసి పోయాడు. ఇక జగడ మెక్కడిది? అని అవహేళన చేస్తారు.

పూర్వము అర్జునుడు అంటే గౌరవం ఉన్నవాళ్ళే ఇప్పుడు చులకనగా చూస్తారు. అందుకే **లాఘవమ్** అంటున్నాడు శ్రీకృష్ణుడు. 'లాఘవమ్' అంటే లఘుభావము, తేలిక భావము, చులకన భావము అని అర్థము.

లఘుభావం ఏర్పడి నపుడు కేవలం వెనుక మాత్రమే నిందిస్తారని చెప్పలేము. ముందే విమర్శిస్తారు. ముఖం మీదే అపహాస్యం చేస్తారు. ఇలాంటి సమయాల లోనే మహామహులు కూడా నీరు గారి పోతారు. ఇలా చులకన భావంతో చూచే దెవరు? పూర్వం తనను గౌరవించిన వాళ్ళే, భయపడిన వాళ్ళే, దుర్యోధనుడు మొదలైన వాళ్ళే. వాళ్ళే ఇప్పుడు నిందించే మహారథులు (*మహారథాః దుర్యోధన ప్రభృతయః*). దుర్యోధనాది ప్రభృతులు పూర్వం భయపడి గౌరవించారు. నేడు చులకన భావంతో లేని దౌర్బల్యాన్ని అంట గడతారు. కొందరు మనుషులు మారరు. వారి మనసులూ మారవు. మంచికి నోచుకోరు. వంచనకు వెనుకాడరు. అర్జునా! అలాంటి వారికి అవకాశం ఇచ్చిన వాడివి అవుతావు. బాగా ఆలోచించుకో!

చరణము : పాలకడలిలో కాలకూట విషము
ఎదురౌ తుందని ఎరిగిన దెవరు?

ఏ పాప మెరుగని కైలాసపతికి
గళమున గరళము నింపిందెవరు?
పల్లవి : మారిన దెవరు - మార్చే దెవరు?
మార్పు మనిషికి సాధ్యమా మనసా? ॥ మారిన ॥
అనుపల్లవి : కురిసే మబ్బును నిలిపే దెవరు?
మారే మనసును ఆపే దెవరు? ॥ మారిన ॥

మంచివారు చెడు నెరుగరు. చెడ్డవారు మంచి నెరుగరు. వివేకం లోపిస్తే మహిలో అన్నీ విడ్డూరాలే.

యుద్ధం మానేస్తే, అందరి దృష్టిలో అర్జునుడు ఎలా చులకన అవుతాడో వివరించిన వాసుదేవుడు, అలా తేలిక భావంతో రెచ్చిపోయిన శత్రువులు ఏ విధంగా మాట్లాడతారో వినిపిస్తున్నాడు.

అవాచ్యవాదాంశ్చ బహూన్వదిష్యన్తి తవాహితాః ।
నిన్దన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36

అవాచ్యవాదాన్-చ-బహూన్-వదిష్యంతి-తవ-అహితాః
నిందంతః-తవ-సామర్థ్యం-తతః-దుఃఖతరం-ను-కిం

తవ	=	నీకు	అవాచ్యవాదాన్ చ	=	అనరాని మాటల్ని కూడా
అహితాః	=	శత్రువులు	వదిష్యంతి	=	అన గలరు
తవ	=	నీ యొక్క	తతః	=	అంత కంటె
సామర్థ్యం	=	సామర్థ్యమును	దుఃఖతరం	=	దుఃఖము
నిందంతః	=	నిందిస్తూ	కిం ను	=	ఏముంటుంది?
బహూన్	=	అనేకంగా			

అర్జునా! ఇక నువ్వంటే గిట్టని వాళ్ళున్నారు చూడు. నీ సామర్థ్యాన్ని నిందిస్తూ అనరాని మాటలు అంటారు. అంతకు మించిన బాధ మరొకటి ఉంటుందా?

వ్యాఖ్య

అర్జునా! ఎవరైనా తేలికైన బంతి తోనే ఆడుకుంటారు. బరువైన బండతో ఎవ్వరూ ఆడుకోరు. చులకన కానంత వరకే శూరత్వము. ఒక్కసారి నీవు చులకన అయ్యావా, ఆ తరువాత అందరూ శూలాలు దించాలనే చూస్తారు. మాటల ఈటెలు విసిరేందుకే సిద్ధ పడతారు. పరుషమైన పదాలను ప్రయోగిస్తారు. వాడియైన వాక్యాలను వినిపిస్తారు. అంతకు మించిన దుఃఖం మరొకటి ఉంటుందా?

కృష్ణా! అదేమిటి? నా శక్తేమిటో ఎవరికి తెలియదు? నా వీర వైభవ మంతా ప్రచార రూపంలో జనావళి లో ఊరేగింది కదా? సమాజానికి నేనేమైనా క్రొత్త వ్యక్తినా? ఇంత తెలిసి వచ్చెందుకు నిందిస్తారు? నా సామర్థ్యము వారికి తెలియనిదా?

అర్జునా! తెలుసు. నీ శక్తేమిటో విమర్శించే వారికి బాగా తెలుసు. తెలుసు కనుకనే నిందిస్తారు. తెలియని వాళ్ళు ఎలా నిందిస్తారు? అసలు వాళ్ళు నిందించేది నీ సామర్థ్యాన్నే (**నిందంతః తవ సామర్థ్యమ్**). సామర్థ్యాన్ని శ్లాఘించాలి గాని నిందించడ మేమిటి, అంటావా? సామర్థ్యానికి క్రొత్త అర్థాలు పుట్టిస్తారు. నూతన వ్యాఖ్యానాలు వెలుగు లోకి తెస్తారు. పైగా, ప్రభుత్వం వహించే వాళ్ళు అందరూ ఆ వైపే మొగ్గు చూపుతారు. వాళ్ళు చేసే

నిందలు దుర్భరంగా ఉంటాయి. అనరాని మాటలు అంటారు (***అవాచ్య వాదాన్ వదిష్యన్తి***). అవి కూడా అనేక విధాలుగా ఉంటాయి (***బహూన్***). అలా ఎందుకు చేస్తారు అంటావా? వాళ్ళందరూ నీకు అహితులే కనుక. (***అహితాః శత్రవః***). శత్రువులు ఏమి చేయరు? ఏది మాట్లాడరు?

నీ సామర్థ్యము (***తవ సామర్థ్యమ్***) నీకు తెలుసు. నాకు తెలుసు. వాళ్ళకు కూడా తెలుసు. తెలిసే నిందిస్తారు. ఏముంది ఇతడి సామర్థ్యం? అంటూ విమర్శలు మొదలు పెడతారు. అబ్బ! శివుడితో యుద్ధం చేశాడట! మన ముందే నిలువ లేక పోయాడు. చూడగానే పారిపోయాడు. ఇతనేమిటి? శివుడితో యుద్ధం చేయడ మేమిటి? ఏదో వేడుక కోసం శివుడు కొంతసేపు వినోదంగా ఆడుకుంటే, ఇతడే శివుణ్ణి జయించి నట్లు చెప్పుకున్నాడు. అంతా ప్రచార ఆర్భాటము! ఈ రోజు తేలిపోయింది కదా, కురుక్షేత్రంలో ఆయన సామర్థ్య మేమిటో!

ఇక ఉత్తర గోగ్రహణం విషయం మనకే తెలుసు కదా! ఉత్తర కుమారునికి సారథిగా వచ్చినవాడి సామర్థ్యం ఏమిటో మనమే చూశాం కదా! ఏదో దయ తలచి ఒక్కడితో పోరాడట మెందుకని వదిలేస్తే, తానే మమ్మ ల్నందరినీ జయించినట్లు చాటింపు వేయించు కున్నాడు. మరి, ఆ సామర్థ్య మేదో ఇప్పుడు ప్రదర్శించ వచ్చు కదా!

ఆయన గొప్ప నాట్యాచార్యుడే కావచ్చు. ఆడుకుంటే ఎవరు కాదన్నారు? పోరాడటం అనే మాటలో ఆట ఉందని, పోరు ఒక ఆటని అర్జునుడు భావించి నట్లుంది. కర్ణ దుర్యోధనాది వీరుల ముందు నిలబడి పోరాడట మంటే, ఉత్తర కుమారునికి సారథ్యము వహించడమూ కాదు, ఉత్తరకు నాట్యం నేర్పించడమూ కాదని అర్జునుడికి ఇప్పటికి తెలిసి ఉంటుంది అని చెప్పుకుంటారు. ఒకనాటి నీ సామర్థ్యం ఈ రోజు అసమర్థతగా అందరి నోళ్ళల్లో నాని పోతుంది.

ఏదో మహాయుద్ధం చేసేటట్లు రెండు సేనల మధ్య రథాన్ని నిలపమని చెప్పాడు. ఇది ఎక్కడన్నా ఉందా? ఈ పుడమికి పోరాటాలు క్రొత్తవా? ఇది వరకు ఎందరు యుద్ధాలు చేయలేదు? ఏదో ఒక వైపు నిలబడి యుద్ధం చేయడం చూశాము. మధ్యలో నిలబడి యుద్ధం చేస్తారా? ఈ మధ్యావతారము ఏమిటో! పాండవ మధ్యముడు కనుక మధ్యలోకి వచ్చాడేమో అనుకున్నాము. తరువాత అర్థమైంది, ఈ మధ్యావతారము విరాట నగరంలో ఎత్తిందే నని. అందుకే కదా, వీర పురుషుల్ని చూడగానే కాలికి బుద్ధి చెప్పాడు.

అర్జునా! అహితులు అదుపులో ఉంటారా? అవకాశం వచ్చి నపుడు జారవిడుచు కుంటారా? మహారథులే అలా అంటారని అనుకోకు. మశకాలు కూడా తెగించి తమ మహిమను తామే చాటు కుంటాయి. మామూలు సైనికులు కూడా నన్ను చూచే భయపడి అర్జునుడు పారిపోయాడు అని భార్యలతో చెప్పుకుంటారు. నన్ను చూచిన తరువాత, ఆ నరుడు నడవనే లేదు. పార్థా! పార్థా! అంటూ సారథి వెంటబడి పిలుస్తున్నా, ఇంకెక్కడి పార్థుడు? పరుగే పరుగు. ఒకటే పరుగు. అయినా, అందరూ అలా పరుగులు తీయలేరు. పోరాటంలో లేక పోయినా, పరుగులో మాత్రం గొప్ప పటిమే ఉంది అని చెప్పుకుంటారు. అర్జునా! నీతో పాటు నాకూ తప్పదు పోటు. ఆలోచించుకో! ఇక పత్రికలలో వార్తలన్నీ మన చుట్టే తిరుగుతాయి. పతాక శీర్షికన నీ పేరు ఊరేగుతుంది. ఏదో ఓ మూల వలయం చుట్టి నాకూ కొన్ని వడ్డిస్తారు. అర్జునా! ఇంతకు మించిన దుఃఖం మరొకటి ఉంటుందా? ఇలా దుఃఖంతో జీవించడం కన్నా యుద్ధంలో మరణించడమే మేలు కదా! (***మృతం శ్రేయో న జీవితమ్***).

యుద్ధం చేయడమా? చేయక పోవడమా? ఇక ఈ మీమాంసకు తెర దించుతూ, యుద్ధమే సమంజస మని నిర్ణయం చేస్తున్నాడు భగవంతుడు.

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మా దుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37

హతః-వా-ప్రాప్స్యసి-స్వర్గం-జిత్వా-వా-భోక్ష్యసే-మహీం
తస్మాత్-ఉత్తిష్ఠ-కౌంతేయ-యుద్ధాయ-కృతనిశ్చయః

కౌంతేయ	=	అర్జునా!	భోక్ష్యసే	=	అనుభవించ గలవు
హతో వా	=	చంప బడితివా	తస్మాత్	=	అందువలన
స్వర్గం	=	స్వర్గమును	కృతనిశ్చయః	=	దృఢనిశ్చయము కలవాడవై
ప్రాప్స్యసి	=	పొంద గలవు	యుద్ధాయ	=	యుద్ధమునకు
జిత్వా వా	=	జయించితివా	ఉత్తిష్ఠ	=	లెమ్ము!
మహీం	=	రాజ్యమును			

కౌన్తేయా! యుద్ధంలో మరణిస్తే స్వర్గాన్ని పొందుతావు. జయించావా, భూ మండలాన్ని పాలిస్తావు. ఏదైనా రానీ! నిశ్చయమైన భావంతో లేచి నిలబడు. యుద్ధానికి సిద్ధం కా!

వ్యాఖ్య

కర్తవ్యాన్ని నిర్వహించే వారికి ఏదైనా మంచే జరుగుతుంది. ధర్మాన్ని ఆచరించే వారు ఎన్నడూ దగా పడరు. స్వధర్మాన్ని ఆచరించే వారు సత్ఫలితాన్నే అందుకుంటారు. కనుక ధర్మాచరణంలో సంశయాలు మంచివి కావు. యుద్ధకర్మకు సంబంధించిన సర్వ సంశయాలను అర్జునుని హృదయం నుండి దూరం చేసిన భగవానుడు, ఇక స్వధర్మమైన యుద్ధమును ఆచరించి సత్ఫలమును అందుకో మని ఆజ్ఞాపిస్తున్నాడు.

విజయమో! వీర స్వర్గమో!

యుద్ధం అనివార్యమని తేలిపోయింది. మరి ఫలితం మాట ఏమిటి? అది మన చేతిలో లేని విషయం. ఆట ఆడటమే మన పని. జయాపజయాలు దైవాధీనాలు. కర్మలు ఏవైనా అంతే. కర్మలు మనం చేస్తాం. రావలసిన ఫలం దైవానుగ్రహంగా వచ్చి తీరుతుంది. కాకపోతే, స్వధర్మానుష్ఠానంలో ఫలితం ఎలా ఉన్నా, అది శుభదాయకం గానే ఉంటుంది.

యుద్ధం విషయంలో కృత నిశ్చయంతో ఉండమని ఆజ్ఞాపించాడు అచ్యుతుడు. ఫలితం విషయ మంటారా? ఏముంది? ఇక్కడ రెండే ఫలితాలు ఉన్నాయి. కాకపోతే, ఏది వచ్చినా శుభమే. లాభమే. పోరాటము అనివార్యం. మరణిస్తే స్వర్గం ప్రాప్తిస్తుంది (***హతః సన్ స్వర్గం ప్రాప్స్యసి***). గెలిస్తే రాజ్యం లభిస్తుంది (***జిత్వా వా భోక్ష్యసే మహీమ్***). రెండిటిలో ఏదైనా లాభమే. వాంఛనీయమే (***ఉభయథాపి లాభః ఏవ***).

ధర్మయుద్ధంలో మరణించిన వారికి స్వర్గం ప్రాప్తిస్తుంది. ఇది శాస్త్రం నిర్ణయించిన ఫలం. ఒకవేళ గెలిస్తే రాజ్యం లభిస్తుంది. ప్రజలకు ధర్మ పరిపాలనం అందించే అవకాశం వస్తుంది. ఎన్నో పుణ్య కార్యాలు చేయ వచ్చు. రాజ్యభోగాలు అనుభవించ వచ్చు. బ్రతికితే పుణ్యకార్యాలు చేయవచ్చు. మరణిస్తే పుణ్య ఫలాన్ని అనుభవించ వచ్చు. ఎటు చూచినా లాభమే. ఏది జరిగినా నష్టం లేదు. అందుచేతనే, ఇలాంటి యుద్ధాన్ని సుఖవంతులైన క్షత్రియులే పొందుతారు అని భగవంతుడు ముప్పై రెండవ శ్లోకం లోనే చెప్పేశాడు (***సుఖినః క్షత్రియాః పార్థ లభన్తే యుద్ధ మీదృశమ్***).

కీడెంచి మేలెంచాలి అంటారు పెద్దలు. యుద్ధంలో జయాపజయాలు రెండూ లాభాలే నని తెలిసినా,

పరమేశ్వరుడు ముందుగా మరణాన్ని ప్రస్తావించి *(హతోవా)* ఆ తరువాత విజయాన్ని పేర్కొన్నాడు. ముందు మరణానికే సిద్ధం చేస్తున్నాడు. కష్టతరమైన కార్యానికి మనస్సును సిద్ధం చేసుకుంటే, ఆ తరువాత జీవితంలో కష్టాలే ఉండవు. వైఫల్యాలకు జంక కుండా సిద్ధపడి పోరాడితే, ఆ తరువాత ఏది వచ్చినా వైభవం గానే ఉంటుంది. అందుచేత, ఇక లేచి, యుద్ధానికి సిద్ధపడ మని చెబుతున్నాడు శ్రీకృష్ణుడు.

కౌన్తేయా! లే, నిలబడు అన్నాడు శ్రీకృష్ణుడు. నేను యుద్ధం చేయలేను అని చెప్పి, ధనుర్బాణాలను క్రింద పడేసి, రథము వెనుక భాగాన అర్జునుడు కూర్చుండి పోయాడు అనేది మనం చూశాం *(రథోపస్థ ఉపావిశత్)*. యుద్ధం నిశ్చయం అని చెప్పేశాడు కనుక, ఇక లేవ మంటున్నాడు శ్రీకృష్ణుడు. లేవ మన్నాడు కదా అని లేచి ఇంటి వైపు అర్జునుడు అడుగులు వేస్తాడేమో నని, లేచేది యుద్ధము కొరకే *(యుద్ధాయ)* అని స్పష్టం చేస్తున్నాడు.

ఈ సందర్భంలో అర్జునుణ్ణి *కౌంతేయా!* అని పిలిచాడు శ్రీకృష్ణుడు. ఈ సన్నివేశంలో ఇలా పిలవడంలో ఏదో అనుబంధం పెన వేసుకొని ఉంది. ఇది కేవలం మనస్సును చలింప చేసే మాట కాదు. హృదయాన్ని ద్రవింప చేసే ప్రేమ పిలుపు.

సోదరుడు మాటల మధ్య, తమ్ముడూ! అన్నాడు అంటే, ఆ క్షణంలో ఏదో జరుగుతూ ఉందని అర్థం. పేరు పెట్టి పిలిచే తండ్రి, నాయనా! అని కుమారుణ్ణి పిలిచాడు అంటే, నా తండ్రీ! అని బిడ్డను పలకరించాడు అంటే, వాళ్ళిద్దరి మధ్య ఆ క్షణంలో మాటలకు అందనిది ఏదో జరిగిపోతూ ఉందని గ్రహించ వచ్చు. అలాగే, శ్రీకృష్ణుడు ఈ సందర్భంలో అర్జునుణ్ణి కౌంతేయా! అనడంలో కూడా అలాంటిదే ఏదో దోబూచు లాడుతోంది.

అర్జునా! చెప్ప వలసింది అంతా చెప్పాను. వివిధ కోణాలలో వివరించాను. మా మేనత్త కుమారుడివి. అందుకే, సంకోచం లేకుండా మాట్లాడేశాను. ఇక కార్యరంగం లోకి కాలు పెట్టాలి. నువ్వు సూక్ష్మగ్రాహివి. కుంతీపుత్రుడివి. కుంతము అంటే బల్లెము. బల్లె మంత కుశాగ్ర బుద్ధి గల వాడివి అని అర్థము. నడుము బిగించు. మీ అమ్మ నీకు ఎందుకు జన్మ నిచ్చిందో ఆ కార్యాన్ని నెరవేర్చ మని నా ద్వారా ఆమె నీకు ఆదేశా న్నిచ్చింది. తల్లి ఆజ్ఞను పాలించు. తల్లి పక్షము వాణ్ణి. నా మాట కూడా హృదయంలో పెట్టుకో. ఉత్తిష్ఠ! లేచి నిలబడు అనేదే కౌంతేయా! అనే సంబోధనలో శ్రీకృష్ణుని ఆంతర్యము.

భవ్యమైన మలుపు

భగవద్గీత ఇక్కడ ఒక అందమైన మలుపు తిరుగుతోంది. కర్మయోగానికి బాట సుగమం చేయ బడుతోంది. ఉపనిషత్తులు బ్రహ్మవిద్యనే ప్రధానంగా చేసుకొని శోభిస్తూ ఉంటాయి. భగవద్గీత బ్రహ్మవిద్యతో పాటు యోగశాస్త్రంగా కూడా దేదీప్యమాన మవుతూ ఉంది. అదే గీత యొక్క ప్రత్యేకత *(శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే)*.

కర్మ లేకుండా జీవితం క్షణం కూడా ముందుకు సాగదు. ప్రతి కర్మను అవగాహనతో ఆచరించ గలిగితే కర్మ అనేది యోగంగా మారి అమృతమయ జీవనాన్ని ప్రసాదిస్తుంది. కానిచో, బంధాన్ని సృష్టించి బ్రతుకులో అందాలను, ఆనందాలను దూరం చేస్తుంది.

నిరాశల నుండి మనిషి బయట పడాలి. నిరుత్సాహాన్ని బుద్ధి నుండి తరిమి వేయాలి. ఎన్ని పరిస్థితులు చుట్టు ముట్టినా, ఎన్ని సమస్యలు అడ్డు నిలిచినా, ఏ మాత్రం కళను కోల్పోకుండా, చుక్కల మధ్య పూర్ణ చంద్రుని లాగా శోభించే జీవన మార్గాన్ని ఇక తరువాత శ్లోకం నుండి పదిహేడు శ్లోకాలలో ఒక ప్రవాహంలా బోధించ బోతున్నాడు భగవంతుడు. ***ఉత్తిష్ఠ!*** లేచి, నిలబడు అని భగవంతుడు చెప్పింది ఒక్క అర్జునునికే

కాదు, మనందరికే. యావ త్ప్రపంచానికి, అన్ని కాలాల లోని అందరు వ్యక్తులకి. శారీరక దుగ్మతల్ని విడిచి, మానసిక దౌర్బల్యానికి చరమగీతం పాడి, ఉత్సాహంతో, ఉద్యమ స్ఫూర్తితో, జీవిత రంగస్థలిపై తమ పాత్రను మహోన్నతంగా పోషించుటకు సిద్ధం కమ్మని సర్వ మానవాళికి పాంచజన్యాన్ని పూరిస్తూ పవిత్ర సందేశాన్ని అందివ్వ బోతాడు.

యుద్ధంలో మరణిస్తే స్వర్గము ప్రాప్తిస్తుంది. యుద్ధంలో గెలిస్తే రాజ్యము లభిస్తుంది. నిజమే. అయితే ఈ యుద్ధం వల్ల ఇహపరాలలో ఏదో ఒకటి సిద్ధిస్తుంది. కాని, అర్జునుడు కాంక్షించిన శ్రేయస్సు ఎలా వస్తుంది? మోక్షహేతువు కానపుడు ఈ యుద్ధాన్ని చేయడ మెందుకు? సమబుద్ధితో సంగ్రామాన్ని నిర్వహిస్తే, దాని వల్ల చిత్తశుద్ధి ఏర్పడి, మోక్షమునకు దారి సుగమ మవుతుంది. ఆ విధమైన కర్మయోగమును ఆచరించడానికి తగిన ఉపదేశాన్ని అనుగ్రహిస్తున్నాడు.

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి ॥ 38

సుఖదుఃఖే-సమే-కృత్వా-లాభాలాభౌ-జయాజయౌ
తతః-యుద్ధాయ-యుజ్యస్వ-న-ఏవం-పాపం-అవాప్స్యసి

సుఖదుఃఖే	=	సుఖదుఃఖాలను	యుద్ధాయ	=	యుద్ధానికి
లాభాలాభౌ	=	లాభనష్టాలను	యుజ్యస్వ	=	సిద్ధపడు
జయాజయౌ	=	జయాపజయాలను	ఏవం	=	ఇలా చేస్తే
సమే	=	సమానముగ	పాపం	=	పాపమును
కృత్వా	=	భావించి	న అవాప్స్యసి	=	పొందవు
తతః	=	ఆ తరువాత			

సుఖ మొచ్చినా, దుఃఖ మొచ్చినా ఒకేలా ఉండు. లాభ మొచ్చినా, నష్ట మొచ్చినా ఒకే భావంతో చూడు. జయ మొచ్చినా, అపజయ మొచ్చినా సమబుద్ధితో స్వీకరించు. ఇలా చేస్తే నీకు ఏ పాపమూ అంటదు.

వ్యాఖ్య

అర్జునుడు అంత దుఃఖం లోనూ, తన దుఃఖ మేమిటో స్పష్టంగా దర్శించ గలిగాడు. శత్రువులు లేని సమృద్ధమైన రాజ్యము భూలోకంలో లభించినా, సురలోక ఆధిపత్యము ప్రాప్తించినా, ప్రస్తుతం తనను కాల్చేస్తున్న దుఃఖాన్ని అవి పోగొడుతాయి అని తాను భావించటం లేదని తేల్చి చెప్పేశాడు. తనకు కావలసిన శ్రేయస్సును నిశ్చయించి చెప్పమని కూడా శ్రీకృష్ణుని అడిగాడు.

అర్జునా! యుద్ధంలో మరణిస్తే స్వర్గము, జయిస్తే రాజ్యము లభిస్తాయి కనుక యుద్ధం చెయ్యమని శ్రీకృష్ణుడు ఆదేశించాడు. ఈ రెండిటిని (ఇహపర సుఖాలు) నిరుపయోగంగా అర్జునుడు చూస్తున్నాడు. పైగా అతను వాంఛించేది శ్రేయస్సు. అంటే, మోక్షము. యుద్ధం వల్ల స్వర్గమో, రాజ్యమో వస్తాయే గాని మోక్షము వచ్చే ప్రసక్తే లేదు. ముఖ్యంగా క్షత్రియునికి యుద్ధం కంటే శ్రేయస్సును ఇచ్చేది మరొకటి ఉండబో దని శ్రీకృష్ణుడు ఈ ధర్మప్రసంగాన్ని ప్రారంభిస్తూ ముప్పై ఒకటవ శ్లోకం లోనే చెప్పడం జరిగింది *(ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే)*.

కర్మ ఏదైతే జరుగుతూ ఉందో, దానికి సంబంధించిన జ్ఞానం ముందే ఉంటుంది. మనం ఏ కర్మ

చేయాలి? ఎలా చేయాలి? చేసే పద్ధతి ఏమిటి? మన అవగాహన ఎలా ఉండాలి? ఇవన్నీ కర్మాచరణం జరగక ముందే మన బుద్ధిలో ఉండాలి. ఈ విధంగా, కర్మజ్ఞానములు అనుష్ఠానంలో అభిన్నంగా ఉన్నాయి. కనుక, జ్ఞానశుద్ధి లేకుండా కర్మశుద్ధి రాదు. జ్ఞానశుద్ధితో కర్మాచరణం జరిగితే, అది యుద్ధమైనా, యజ్ఞమైనా, తద్వారా అంతఃకరణము శుద్ధిపడి, ఆత్మజ్ఞానమును పొందుటకు అర్హమై, మోక్షాన్ని పొందుతుంది. ఈ విధమైన కర్మయోగ ప్రక్రియను ఆవిష్కరిస్తూ, కర్మయోగ పునాదిని ఈ శ్లోకంలో అందంగా భగవానుడు నిర్మిస్తున్నాడు. సమబుద్ధి కలిగి కర్మలను ఆచరిస్తే, పాపము పొందక పోవటమే గాక, చిత్తశుద్ధిని పొంది మోక్షమును పొందే అర్హతను సంపాదించ గలుగుతారు అని బోధిస్తున్నాడు.

ఇంతవరకు యుద్ధం చేయడానికి అనుగుణంగా హేతువు లన్నీ వినిపించాడు. ఇప్పుడు తాత్త్విక దృష్టితో, అనుష్ఠాన ప్రధానమైన కర్మయోగాన్ని ప్రవేశ పెడుతున్నాడు. ఆ తరువాత కర్మయోగాన్ని చర్చిస్తాడు. అంతటితో ఆగకుండా ముమ్ముందు రాబోయే అధ్యాయాలలో కూడా ఈ విషయాన్ని గీతాచార్యుడు ప్రస్తావిస్తూనే ఉంటాడు. ఇది విషయాన్ని అందంగా మలుపు తిప్పే శ్లోకము.

యుద్ధము స్వధర్మ మని భావించి పోరాటానికి దిగుతున్న అర్జునునికి సముచితమైన ఉపదేశాన్ని ఈ శ్లోకంలో శ్రీకృష్ణుడు అందిస్తున్నాడు అని భాష్యంలో శ్రీ శంకరులు కూడా అభిప్రాయ పడ్డారు (**యుద్ధ మానస్య ఉపదేశమ్**). అయితే, ఈ ఉపదేశము ప్రసంగ వశాత్తు చేయబడినా (**ఏష ఉపదేశః ప్రాసంగికః**) వాస్తవానికి పరమార్థ దర్శనమును బోధించడమే ఇందులోని ప్రధాన విషయము.

సమతా సాధానికి ముఖద్వారము

సమతా సౌధంలో ప్రవేశించాలి అంటే రాగద్వేషాలు సమరసమై ఉండాలి. తటస్థపడి ఉండాలి. రాగద్వేషాలు తటస్థపడిన బుద్ధిలో సుఖదుఃఖాలు నిలవ లేవు. ఇది కాస్త విచారించి, విశ్లేషణతో అర్థం చేసుకో వలసిన విషయము.

కర్మాచరణం వెనుక రాగద్వేషాలే ప్రధానంగా ఉంటాయి. ఏది చేరువైతే మనకు సుఖమో, దానిపై మనకు రాగం ఉందని అర్థము. ఏది దూరమైతే మనకు సుఖమో, దానిపై మనకు ద్వేషము ఉంది అని అర్థము. వ్యక్తుల విషయంలో కూడా అంతే. ఇవే రాగద్వేషాలు.

యుద్ధం విషయమే తీసుకుందాం. యుద్ధం సుఖమా? కానపుడు, దుర్యోధనుడికి యుద్ధంపై రాగం ఎలా ఉదయించింది? యుద్ధం ఇష్టం కాదు, దేని కారణంగా యుద్ధమనే కార్యం జరుగుతూ ఉందో, దాని మీద ఇష్టం. అదేమిటి? లాభం. రాజ్యలాభం. అదెలా వస్తుంది? యుద్ధంలో జయిస్తే వస్తుంది. కనుక లాభం అనే కార్యం జయము అనే కారణం మీద ఆధారపడి ఉంది. అందుచేత దుర్యోధనునికి యుద్ధం ప్రియంగా ఉంది. ఒకవేళ యుద్ధం అపజయాన్ని కలిగిస్తుంది అని ముందే తెలిస్తే, దాని మీద రాగం ఉదయించదు. ద్వేషం పుడుతుంది. యుద్ధాన్ని ద్వేషిస్తాడు. ఎందుకని? యుద్ధం వెనుక నష్టం కార్యంగా ఉంది కనుక. అదే రాజ్యనష్టం. దానికి కారణ మేమిటి? అపజయము. అపజయం కారణంగా రాజ్యనష్టం వాటిల్లుతోంది. కనుక యుద్ధం అప్రియంగా ఉంటుంది.

ఈ విధంగా ఏ కర్మ చేసినా, రాగద్వేషాల ప్రేరణతో కనుక చేస్తే, అవి సుఖదుఃఖాలకు కారణ మవుతాయి. రాగద్వేషాలను తృప్తి పరచేందుకు కర్మ చేయ కూడదు. ధర్మాధర్మాలను దృష్టిలో ఉంచుకొని కర్మలను ఆచరించాలి. ఇలా ధర్మాధర్మాల పరిధిలో నుండి యుద్ధం చేస్తే పాపము అంటదు (**న ఏవ పాపం అవాప్స్యసి**).

సుఖం కార్య రూపంలో తెలుస్తూ ఉంది అంటే, అందుకు లాభమో, జయమో, సన్మానమో కారణమై ఉంటుంది. అలాగే దుఃఖం కార్యరూపంలో తెలుస్తూ ఉంది అంటే అందుకు నష్టమో, అపజయమో, అవమానమో కారణమై ఉంటుంది. రాగద్వేషాలు లేని కర్మలలో సుఖదుఃఖాలు ఉండవు. రాగద్వేషాలు లేని కర్మలు బంధహేతువులు కాలేవు. అందుకనే సుఖదుఃఖాలను, లాభాలాభాలను, జయాపజయాలను సమంగా భావిస్తూ యుద్ధానికి సిద్ధపడ మని భగవానుడు ఆదేశిస్తున్నాడు. సుఖదుఃఖాలను సమం చేయుట మంటే, రాగద్వేషాలను కదలించ వద్దు అని అర్థము (**సుఖ దుఃఖే సమే కృత్వా - రాగద్వేషౌ అకృత్వా ఇతి ఏతత్**).

రాగద్వేషాలు

సమత్వంలో శాంతి ఉంటుంది. విషమత్వంలో అశాంతి ఉంటుంది. సమత్వము యోగము. విషమత్వము రోగము. రాగద్వేషాలను సమం చేసి, ధర్మాధర్మాలను అవలోకిస్తూ, ఏది చేయాలి? ఏది చేయకూడదు? అనే వివేకంతో కర్మలను ఆచరించేవాడు యోగి అవుతాడు.

కర్మ రంగంలో ప్రవేశించే ముందు కర్మ ఎలా చెయ్యాలో క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. రాగద్వేషాలు లేకుండా ఉండాలి. ధర్మాధర్మాల అవలోకనం జరుగుతూ ఉండాలి. ఈ విధంగా, రాగద్వేషాలను సమం చేసి, వాటి కార్యాలైన సుఖదుఃఖాలను, లాభాలాభాలను, జయాపజయాలను సమంగా చూసే సమబుద్ధిని ఏర్పరచుకొని, ఆ తరువాత యుద్ధానికి సిద్ధపడు అర్జునా! అంటున్నాడు శ్రీకృష్ణుడు (**తతః యుద్ధాయ యుజ్యస్వ**). ఈ విధంగా యుద్ధం చేస్తే పాపాన్ని పొందవు అంటున్నాడు (**ఏవం యుద్ధం కుర్వన్ పాపమ్ న అవాప్స్యసి**).

దుర్యోధనుడు యుద్ధంలో ఉన్నాడు. అతనిని యుద్ధానికి పురికొల్పిం దెవరు? ధర్మాధర్మాలా? కానే కాదు. అవి అతనికి పట్టనే పట్టవు. గిట్టనే గిట్టవు. అతని వెనుక ఉండి నడిపించేవి రాగద్వేషాలే. అవి ఎలా ఆడిస్తే అలా ఆడాడు. పాపాన్ని మూటగట్టు కున్నాడు.

దుర్యోధనుడికి రాజ్యంపై రాగ ముంది. అంతే కాదు, పాండవులపై ద్వేష ముంది. ఈ రాగద్వేషాలే అతణ్ణి యుద్ధరంగంలో నిల బెట్టాయి. అశాంతిలో పడుకో బెట్టాయి.

యుద్ధానికి రాగద్వేషాలే కారణం కనుక, యుద్ధానికి ముందు కూడా దుర్యోధనుడు అశాంతి జీవనాన్నే గడిపాడు. కాని, శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధం చేయ వలసిందిగా ఆజ్ఞాపించడం వెనుక ఈ రాగద్వేషాలు లేవు. వాస్తవానికి అర్జునుడు కూడా రాగద్వేషాలతో కురుక్షేత్రంలో అడుగు పెట్టలేదు. ధర్మ ప్రధానం గానే యుద్ధంలో పాల్గొన డానికి వచ్చాడు. అంటే, పాండవులు దుర్యోధనుని లాగా రాగద్వేషాలతో యుద్ధానికి రాలేదా? లేదు.

మరి, యుద్ధంలో విజయాన్ని సాధిస్తే, రాజ్యాన్ని చేజిక్కించుకోరా? అది రాగం కాదా? కాదు. ఎందుకని? రాజ్యం పాండవులదే కదా! వాళ్ళ రాజ్యాన్నే వాళ్ళు పొందా లనుకుంటున్నారు. పైగా, రాజ్యం ఒక అధర్మపరుడి చేతిలో ఉంది. అలాంటి వ్యక్తి నుండి రాజ్యాన్ని, ప్రజలను రక్షించ వలసిన బాధ్యత క్షత్రియులుగా పాండవులపై ఉంది. కనుక వారు యుద్ధం చేయడంలో ధర్మమే ప్రధానంగా గోచరిస్తూ ఉంది. ఇక ద్వేష మనేది పాండవులలో కాగడా పెట్టి వెతికినా కనిపించదు. దుర్యోధనుని దుష్ట కార్యాలను వాళ్ళు నిరసించారే గాని, ఏనాడూ దుర్యోధనుని నిందించి ఎరుగరు.

కర్మలు చేయక తప్పదు. కనుక, కర్మల వెనుక రాగద్వేషాలు లేకుండా చూసుకోవాలి. కర్మల వెనుక రాగ ద్వేషాలు లేకపోతే, కర్మఫలాల విషయంలో ప్రతిచర్యలు చోటు చేసుకోవు. ప్రతిచర్యలు లేని మనస్సే ప్రశాంతంగా ఉంటుంది.

చేయక తప్పవు కర్మములు
చేసి చూడాలి ఫలములు
అనుకూలములు సుఖములు
ప్రతికూలములు శోకములు
రాగద్వేషాలే సందడులు
రాలిననాడే పండుగలు
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ ఇది రామజోగి చిట్కా.

కర్మలలో చంచలత్వం ఉంటుంది. కర్మలలో అన్నీ చలనాలే ***(చలనాత్మకం కర్మ)***. అలలు అలలుగా కర్మ ప్రేరిత సంకల్పాలు మనసులో కదులుతూ ఉంటాయి. వాటిని అదుపులో ఉంచుకోవాలి. అప్పుడే బుద్ధిలో ప్రశాంతత నిలుస్తుంది.

ఊయలలో బిడ్డ పడుకుని ఉంటుంది. ఆ బిడ్డ చూపులో ఏదో ప్రశాంతత తొంగి చూస్తూ ఉంటుంది. రాగద్వేషాలు లేక పోవడమే బిడ్డ ప్రశాంతతకు కారణము.

మనస్సు ప్రశాంతంగా ఉంటేనే ఏదైనా సాధించ గలం. ఆవేశాలు అంతఃకరణను కుదుపుతూ ఉంటే, బుద్ధిలో ఉద్రేకాలు ఊరేగుతూ ఉంటే, బ్రతుకు పూర్ణత్వం వైపు సాగదు.

రాగద్వేషాల్ని సమం చేస్తే, మనం నివసిస్తున్న ప్రపంచం మనకు రెండింతలుగా కనిపిస్తుంది. మనం నేలపై నడుస్తున్నా, ఆకాశంలో విహరించినట్లే ఉంటుంది. సుఖదుఃఖాలు రెండూ ఒక్కటే అనేది కర్మయోగానికి పునాది. సమభావంతో స్వధర్మాన్ని ఆచరిస్తే, ఏ పాపము అంటదు అని చెబుతూ, ఈ శ్లోకంలో కర్మయోగానికి చక్కని పునాదిని నిర్మించడం జరిగింది. కర్మను కర్మయోగంగా మార్చుకొనే దెలాగో, కర్మఫలాలను ప్రశాంతంగా, ప్రసన్నంగా ప్రసాద రూపంలో ఎలా గ్రహించాలో బోధించే అసమాన గీతా ప్రబోధానికి ఈ శ్లోకంతో శ్రీకారం చుట్టాడు శ్రీకృష్ణుడు.

ఆత్మ విషయానికి సంబంధించిన జ్ఞానమును ఇంతవరకు చెప్పడం జరిగింది. అట్టి జ్ఞానానికి అనుకూలంగా ఏ కర్మయోగం ఆచరించడం చేత కర్మబంధం నుండి విడిపడటం జరుగుతుందో, అట్టి యోగ జ్ఞానమును చెప్పడానికి ప్రారంభిస్తూ సాంఖ్య, యోగాలకు సంబంధించిన స్పష్టమైన అవగాహనను ఇప్పుడు అందించడమే సముచిత మని భావించి, ఆ విషయాన్ని ఈ సంధి శ్లోకంలో వివరిస్తున్నాడు.

ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధి ర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి ॥ 39

ఏషా-తే-అభిహితా-సాంఖ్యే-బుద్ధిః-యోగే-తు-ఇమాం-శృణు
బుద్ధ్యా-యుక్తః-యయా-పార్థ-కర్మబంధం-ప్రహాస్యసి

పార్థ = అర్జునా!
సాంఖ్యే = జ్ఞానయోగ విషయమున
ఏషా = ఇంతవరకు చెప్పిన
బుద్ధిః = వివేకము
తే = నీ కొరకు
అభిహితా = చెప్ప బడినది
యయా = ఏ
బుద్ధ్యా = బుద్ధిచే
యుక్తః = కూడిన వాడవై
కర్మబంధం = కర్మబంధమును

ప్రహాస్యసి = విడువ గలవు
ఇమాం = దీనినే
యోగే తు = యోగ విషయమున
శృణు = వినుము

అర్జునా! పరమార్థ తత్త్వ జ్ఞానాన్ని సాంఖ్యం అంటారు. ఆ విషయాన్నే ఇంతవరకు నీకు చెప్పాను. ఇక కర్మయోగ విషయాన్ని చెబుతాను. విను. ఈ యోగశాస్త్ర జ్ఞానము చేత నువ్వు కర్మ బంధం నుండి విడి పడతావు.

వ్యాఖ్య

శోకమోహాది రూప సంసార నివృత్తికి సాక్షాత్తు కారణమైన జ్ఞానము సాంఖ్యము. ఇది పరిశుద్ధమైన ఆత్మతత్త్వ విజ్ఞానము ***(శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభి ధీయతే)***. దేని చేత ఆత్మతత్త్వము చక్కగా ప్రకాశింప బడుతూ ఉందో అదే సాంఖ్యము అని శ్రీధర వ్యాఖ్య ***(సమ్యక్ ఖ్యాయతే ఇతి సాంఖ్యం)***. అంటే, సమస్త ఉపనిషత్తుల చేత ***(సర్వైః వేదాంతైః)*** ప్రకాశింపబడు ఆత్మజ్ఞానము సాంఖ్యము.

ఈ సాంఖ్య విషయమును ***అశోచ్యా నన్వశోచస్త్వం*** అనే పదకొండవ శ్లోకము నుండి ప్రారంభించి, ముప్పైయవ శ్లోకము వరకు వివరంగా చెప్పడం జరిగింది. ఆ తరువాత ముప్పై ఒకటవ శ్లోకము నుండి ముప్పై ఎనిమిదవ శ్లోకము వరకు చెప్పిన విషయం సాంఖ్యం కాదు. అది ప్రాసంగిక ఉపదేశము. అంటే, ప్రసంగ వశాత్తు సందర్భానుసారంగా బోధించిన అన్య విషయమే గాని సాంఖ్యము కాదు.

ఇక ఇప్పుడు, అనగా నలభైయవ శ్లోకం నుండి కర్మయోగము బోధింప బడుతూ ఉంది. ఇంతవరకు చెప్పిన (1) ఆత్మ విషయ జ్ఞానమునకు సంబంధించిన సాంఖ్యము, (2) అట్టి జ్ఞానానికి అనుకూలంగా సమబుద్ధితో ఆచరింపబడే కర్మలకు సంబంధించిన కర్మయోగము, మరియు (3) బంధమును కలిగించు కర్మలు - ఈ మూడింటికి సంబంధించిన అవగాహన ఈ సందర్భములో ఏర్పడక పోతే, ఆ తరువాత గీతా జ్ఞానమును హృదయంలో భద్రపరచు కోవడం చాలా కష్ట సాధ్య మవుతుంది. అందుకే ఈ ముప్పై తొమ్మిదవ శ్లోకాన్ని సంధి శ్లోకంగా అందించాడు పరమేశ్వరుడు.

సాంఖ్యము లేదా సన్యాసము

లేనిది ఉండట మంటూ ఉండదు. ఉన్నది లేకుండా పోయేదంటూ ఉండదు. ఈ రెండిటిని గూర్చిన నిర్ణయము ఏదో అదే తత్త్వవివేకము అంటూ, సదసద్వివేకం ద్వారా ఉన్నది ఆత్మే నని, దానికి అన్యమైనది ఏదైనా అనాత్మే నని సాంఖ్య ప్రకరణంలో గ్రహించాము. ఆత్మజ్ఞానము ద్వారా మోక్షమును పొందవచ్చు నని కూడా తెలుసుకున్నాం. సర్వ బంధముల నుండి విడిపడి పోవడమే మోక్షము.

ఇంతకీ బంధము అనేది సత్యమా, అసత్యమా? బంధమే కనుక సత్యమైతే, సత్యమైనది పోయేది కాదు కనుక బంధము కూడా పోదు. ఒకవేళ బంధమే కనుక అసత్యమైతే, అది లేనిదే కనుక పోవలసిన అవసరం లేదు. ఈ రెండూ కాకుండా బంధం అనేది అటు సత్యము గాక, ఇటు అసత్యము గాక మిథ్యగా గోచరించు చున్నదైతే అది కేవలం అజ్ఞానమే అవుతుంది. అజ్ఞాన జనితమైన అధ్యాసే అవుతుంది. అజ్ఞానమే సమస్యగా తెలిసే టప్పుడు, దానిని పరిష్కరించడానికి జ్ఞానము కన్నా అన్యమైన సాధనము ఉండదు. జ్ఞానము అజ్ఞానమును పోగొడుతుంది. ఉన్నది ఉన్నట్లుగా తెలుస్తుంది. అదే మోక్షము.

మోక్షము అనేది లేనిది కాదు. ఉన్నదే. కాని, అజ్ఞానం వల్ల ఉన్నట్లు తెలియనిది. ఆత్మ లేనిది కాదు. ఉన్నదే. కాని, ఉన్నట్లు తెలియనిది. చీకటిలో ఉన్న వస్తువు లేనిది కాదు. ఉన్నట్లు తెలియనిది. వెలుగు వస్తే ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే, జ్ఞాన వెలుగులో అజ్ఞాన చీకట్లు విచ్ఛిన్న మవుతాయి. ఆత్మ తనంతట తానే దివ్యంగా ప్రకాశిస్తుంది. అదే మోక్షము.

ఈ ఆత్మజ్ఞానమే సాంఖ్యము. అర్జునా! ఈ సాంఖ్యానికి సంబంధించిన జ్ఞానమును నీకు బోధించాను *(ఏషా, సాంఖ్యే, బుద్ధిః జ్ఞానం, తే తుభ్యం, అభిహితా ఉక్తా)*. పరమార్థ వస్తు వివేక విషయానికి సంబంధించిన జ్ఞానాన్ని గీతాచార్యుడు బోధించాడు. ఈ జ్ఞానాన్ని పొంది అందరూ తరించాలి.

సాంఖ్యము బోధించే ఆత్మజ్ఞానమును పొందడానికి ప్రతిబంధకాలను తొలగించుకొని కేవలం జ్ఞాన సముపార్జనమే ప్రధానంగా చేసుకొని జీవించే త్యాగి సన్యాసి. ఇతనికి కర్మాపేక్ష ఉండదు. జ్ఞానాసక్తే ప్రధానంగా ఉంటుంది. ఈ విధమైన జీవనానికి అలవాటు పడిన వారు సాంఖ్యులు, లేదా సన్యాసులు. జ్ఞాననిష్ఠ యందే కాలమును వెళ్ళబుచ్చు వారు. ***నిష్ఠా*** అంటే స్థితి. ***అనుష్ఠేయ తాత్పర్యం*** - అంటే అనుష్ఠించ వలసిన దాని యందు తత్పరత్వం. ఇది సన్యాసము. సాంఖ్యజీవన విధానం. సన్యాసి శ్రవణ మనన నిదిధ్యాసల ద్వారా జ్ఞానమును పొంది, తానే బ్రహ్మము అని తెలిసికొని మోక్షరూపు డవుతాడు. సర్వబంధముల నుండి విడి పడతాడు. శోకమోహాలను దాటుతాడు. ఆనంద స్వరూపుడై శోభిస్తాడు. అతడే ఆత్మవిదుడు. ఆప్తకాముడు. బ్రహ్మజ్ఞాని. ఈ స్థితికి ఉపకరించేదే సాంఖ్యము. జ్ఞాననిష్ఠ , లేదా జ్ఞానయోగము.

కర్మబంధము

ప్రతి మనిషి అసంతృప్తితో బ్రతుకుతూ ఉంటాడు. తృప్తి చెందాలని అభిలషిస్తూ ఉంటాడు. అది నిత్య తృప్తిగా ఉండాలని భావిస్తూ ఉంటాడు. అలాంటి దాని కొరకు అన్వేషిస్తూ కర్మలు చేస్తూ ఉంటాడు. తద్వారా లభించే ఫలాలు శాశ్వతంగా ఉండాలని ఆశిస్తాడు. కాని కర్మఫలాలు ఎప్పుడూ శాశ్వతం కావు. కర్మలు పరిమితంగా ఉంటాయి. కాలం చేత, దేశం చేత, వ్యక్తి సామర్థ్యం చేత పరిమితంగా ఉండే కర్మలు అనిత్య మైన కర్మలు. వాటి ఫలాలు నిత్యానందాన్ని అందించ లేవు.

కర్మలు చేయకుండా మనిషి క్షణకాలం ఉండ లేడు. కర్మ చేసి నిత్యసుఖాన్ని పొంద లేడు. కర్మలు చేస్తూ ఉంటాడు. తత్సంబంధమైన ఫలాలు అందుతూ ఉంటాయి. ఫలానుభవం తరువాత ఫలం అంతరించి పోతుంది. ఫలం నశించగానే ఫలానుభవం వల్ల ఏర్పడిన ఆనందం కూడా నశిస్తుంది. కాని, ఆ ఆనందానికి సంబంధించిన ఆసక్తి మనస్సులో నిలిచి పోతుంది. అదే వాసనగా పరిణమిస్తుంది. ఇలా మనిషి ఎన్నో కర్మలు చేస్తాడు. ఎన్నో ఫలాలను అనుభవిస్తాడు. ఎన్నో వాసనలను మనస్సులో ముద్రించు కుంటాడు. ఆ వాసనల ప్రేరణతో పునః ఆయా కర్మలలో చరిస్తూ ఉంటాడు.

కర్మ - కర్మఫలం - అనుభవం - వాసన ఇది క్రమము. వాసన - కర్మ - కర్మఫలం - అనుభవం - మళ్ళీ వాసన ఇది ఒక ఆవృతం. ఇదొక భ్రమణం. చక్రభ్రమణం. సంసార చక్రభ్రమణం. కర్మబంధం. ఈ విధంగా కర్మ సముద్రంలో పడి, అనిత్యమైన ఫలాలను అనుభవిస్తూ శోకమోహాది రూప సంసారంలో జీవుడు పరిభ్రమిస్తూ ఉంటాడే గాని మోక్షాన్ని పొంద లేడు.

కృతి మహోదధౌ పతన కారణం
ఫల మశాశ్వతం గతి నిరోధకం

అశాశ్వతమైన కర్మఫలాలే కర్మ సముద్రంలో పడటానికి కారణ మవుతున్నాయి. గమ్యానికి అడ్డుగోడలై ఉన్నాయి అన్నారు ఉపదేశసారంలో శ్రీ రమణమహర్షి.

పతనానికి కారణమైన కర్మలు ప్రగతికి రాజమార్గం కాలేవు. బంధాన్ని కలిగించే కర్మలు మోక్షానికి కారణం కాలేవు. ***న మోక్షార్థాని కర్మాణి ఇతి సిద్ధమ్*** - కర్మ మోక్షానికి పనికి రాదు అని ఋజువైంది అన్నారు బృహదారణ్యకోపనిషద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి. కనుక మోక్షమును అభిలషించే వ్యక్తి కర్మల వైపు

వెళ్ళ కూడదు. జ్ఞానం వైపే తిరగాలి. జ్ఞాననిష్ఠాపరుడు కావాలి. అంటే సన్యాసి కావాలి. ఉపనిషత్తుల నిర్ణయం ఇదే. వాస్తవం చెప్పాలంటే భగవద్గీతకు కూడా ఈ విషయము నందే ఆసక్తి, అనురక్తి.

గీతాశాస్త్రే ఆత్మ జ్ఞానవతః సన్యాసే ఏవ అధికారః న కర్మణి

శాస్త్రము నుండి, లేదా గురువు నుండి ఆత్మకు సంబంధించిన విషయ జ్ఞానమును పొందిన వ్యక్తి సన్యాసము వైపు మరలాలే గాని, కర్మల వైపు కాదు అనేది గీతాశాస్త్రము యొక్క ఉపదేశము అని గీతాభాష్యంలో శ్రీ శంకరులు అభిప్రాయ పడ్డారు.

కర్మలు చేయకుండా ఉండలేము. అలాగని కర్మలు చేసి సాధించే దేమీ లేదు, కర్మ సముద్రంలో పడి మునిగి పోవడం తప్ప. ఇప్పుడేమి చేయాలి? *కిం కర్తవ్యం?*

కర్మయోగము

కర్మయోగమే తక్షణ కర్తవ్యం. అదే నిష్కామ కర్మయోగము. ఈ కర్మయోగము కర్మబంధాలను తొలగిస్తుంది. మోక్షహేతువు అవుతుంది.

కర్మ బంధము కాదు. కర్మఫలము బంధమును సృష్టించదు. కర్మఫలాలను స్వీకరించే టప్పుడు మన మనస్సులో ఏర్పడే ప్రతిచర్యలే బంధాన్ని సృష్టిస్తాయి. ఈ ప్రతిచర్యలకు రాగద్వేషాలే కారణమై ఉంటాయి. కొంప ముంచేవి రాగద్వేషాలే.

కర్మలను త్యజించ వలసిన అవసరం లేదు. రాగద్వేషాలను తటస్థం చేస్తే చాలు. కర్మాచరణంలో 'అహం' భావన లేకుండా నిమిత్తమాత్రంగా వ్యవహరిస్తూ, ఫలాలు అందినపుడు 'మమ' భావన లేకుండా ప్రసాదంగా స్వీకరించ గలిగితే కర్మలు బంధహేతువులు కావు. పైగా అంతఃకరణ శుద్ధికి ఉపకరిస్తాయి. అంతః కరణ శుద్ధి లేని బుద్ధిలో జ్ఞానం నిలవదు. కనుక కర్మయోగి కాని వాడు సన్యాసి కాలేడు. ఈ విషయాలన్నీ మున్ముందు కర్మయోగంలో విపులంగా చర్చించుకుందాం.

సమన్వయం

జ్ఞానమును అనుగ్రహించేది సాంఖ్యము. జ్ఞానమును గ్రహించడానికి చిత్తశుద్ధిని, చిత్త నైర్మల్యాన్ని ప్రసాదించేది కర్మయోగము. కర్మయోగి కానివాడు జ్ఞాని కాలేడు. జ్ఞానము ఎంత ప్రధానమో, జ్ఞాన సముపార్జనకు సహకరించే కర్మయోగము కూడా అంతే ప్రధానము.

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥

జ్ఞాననిష్ఠుల చేత ఏ స్థానము పొందబడుతూ ఉందో, కర్మయోగుల చేత కూడా అదే పొందబడుతూ ఉంది. సాంఖ్యమును, యోగమును ఎవ్వడు ఒక్కటిగా చూస్తాడో, వాడే సత్యదర్శనము చేసిన వాడు అని ఐదవ అధ్యాయంలో గీతాచార్యుడే చెప్పబోతాడు. ఇక్కడ సాంఖ్యము అంటే కపిలుని సాంఖ్యము కాదని, యోగము అంటే పతంజలి యోగము కాదని, నేను ప్రత్యేకించి చెప్ప నవసరం లేదనుకుంటాను.

ఎవడు కర్మయోగి అవుతాడో, వాడు తప్పక కర్మసన్యాసి అవుతాడు. కర్మయోగము సన్యాసానికి దూరంగా లేదు. సన్యాస మంటే ఏమిటి? వదలడమే సన్యాసము *(సమ్యక్ న్యాసః ఇతి సన్యాసః)*. కర్మయోగంలో అది జరుగుతూనే ఉంది కదా!

కర్మయోగి రాగద్వేషాలను వదులు కుంటున్నాడా, లేదా? అది సన్యాస లక్షణం కాదా? కర్మఫలాలను త్యాగం చేయడం లేదా? కర్తృత్వ భావనను విడిచి పెట్టడం లేదా? భోక్తృత్వ భావనను త్యజించడం లేదా? ఇవన్నీ న్యాసాలు కావా? భవిష్యత్తులో ప్రాప్తించే సన్యాసానికి సోపానాలు కావా? ఈ విధంగా సాంఖ్య, యోగాలు రెండూ ముక్తి మార్గాలై ఉన్నాయి. వీటి సమన్వయం లోనే సిద్ధత్వం ప్రాప్తిస్తుంది. ఈ విషయాన్ని ఉపనిషత్తు కూడా ధ్రువపరచింది.

తత్కారణం సాంఖ్య యోగాది గమ్యం
జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః ॥

సర్వ కారణమైన పరబ్రహ్మమును సాంఖ్యము ద్వారా, కర్మయోగము ద్వారా పొందాలి. అట్టి భగవంతుని తెలుసుకున్న వాడు సర్వ బంధముల నుండి విడిపడు తున్నాడు అన్నది శ్వేతాశ్వతరోపనిషత్తు.

*బంధించే కర్మల కన్నా, బంధవిముక్తికి తోడ్పడే కర్మయోగము ఎంత ఉత్కృష్ట మైనదో తరువాత శ్లోకంలో చెబుతున్నాడు. ఈశ్వరారాధనతో కూడిన కర్మయోగమును అభ్యసించి, భగవదనుగ్రహానికి పాత్రులమై, పరమేశ్వర ప్రసాదం అనే నిమిత్తం వల్ల (**ఈశ్వర ప్రసాద నిమిత్త జ్ఞానప్రాప్తేః**) ప్రాప్తించే జ్ఞానముతో కర్మబంధం నుండి విడిపడి తరించుటకు నిష్కామ కర్మయోగమును స్తుతిస్తున్నాడు. కర్మయోగము నందు ఆసక్తిని పెంపొందించడమే ఈ స్తుతి యొక్క ఉద్దేశ్యము (**స్తౌతి ప్రరోచనార్థమ్**).*

నేహాభిక్రమనా శోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40

న-ఇహ-అభిక్రమనాశః-అస్తి-ప్రత్యవాయః-న-విద్యతే
స్వల్పం-అపి-అస్య-ధర్మస్య-త్రాయతే-మహతః-భయాత్

ఇహ	= ఇందు	ధర్మస్య	= ధర్మము యొక్క
అభిక్రమనాశః	= ప్రారంభ నాశము	స్వల్పమపి	= కొంచెమైనను
న అస్తి	= లేదు	మహతః	= గొప్పదైన
ప్రత్యవాయః	= ప్రత్యవాయ దోషము	భయాత్	= భయము నుండి
న విద్యతే	= ఉండదు	త్రాయతే	= రక్షించును
అస్య	= ఈ		

అర్జునా! కర్మలలో రెండు దోషా లున్నాయి. ప్రారంభించిన పని పాడై పోవచ్చు. దీనిని అభిక్రమ నాశ దోషం అంటారు. అలాగే ఫలితాలు విరుద్ధంగా కూడా రావచ్చు. దీనిని ప్రత్యవాయ దోషం అంటారు. కర్మయోగంలో ఈ రెండూ ఉండవు. ధర్మరూపమైన ఈ యోగాన్ని స్వల్పంగా ఆచరించినా, గొప్ప భయం నుండి మనల్ని రక్షిస్తుంది.

వ్యాఖ్య

కర్మ బంధహేతువు. కర్మయోగము మోక్షహేతువు. కర్మ బంధిస్తుంది. కర్మయోగము బంధము నుండి విడిపిస్తుంది. కర్మ దోషయుత మైనది. కర్మయోగము నిర్దోష మైనది. కర్మలలో నష్టం ఉంటుంది. కర్మయోగములో అంతా లాభమే. నష్టము తెలియని లాభమే. వేసే ప్రతి అడుగు అభివృద్ధి వైపే. ప్రగతికి సోపానమే. ఈ విధంగా సకామ కర్మలకు, నిష్కామ కర్మలకు ఉండే భేదాన్ని వివరిస్తున్నాడు.

అభిక్రమ నాశం

కర్మ దోషయుతంగా ఉంటుంది. కర్మల లోని దోషాలలో అభిక్రమనాశ దోషం ఒకటి. 'అభిక్రమము' అంటే ప్రారంభము. 'నాశం' అంటే లేదు అని అర్థం. అంటే, ఒక కర్మను ప్రారంభించి నపుడు దానికి ఫలం నిశ్చయంగా ఉంటుంది అనేది లేదు. మనం ఆరంభించిన కర్మ ఫలితాన్ని ఇవ్వకుండానే మధ్యలో నశించే అవకాశం ఉంది. ఎలాగంటే, వ్యవసాయము, వాణిజ్యము మొదలైన విషయాల లాగా (**యథా కృష్యాదేః**).

రైతు పంట పెడతాడు. అది అభిక్రమం. అంటే ప్రారంభం. పొలంలో పంట పెట్టడము అనే ఈ కర్మకు ధాన్యము ఇంటికి చేరడం ఫలం. అలా ఫలము చేతికి అందకుండా, ప్రారంభించిన కార్యము మధ్యలో పాడైతే అది అభిక్రమనాశం. కర్మలలో ఇలాంటి దోషం ఉంటుంది.

ఆదాయం రావాలని వర్తకుడు వాణిజ్యాన్ని ఆరంభిస్తాడు. కాని, మధ్యలోనే నష్టం వచ్చి వాణిజ్యము అనే కర్మ ఆగిపోవచ్చు. ఇదే అభిక్రమనాశం. వంట చేయడం కర్మ. వంట మధ్యలో పాడైతే అది అభిక్రమ నాశ దోషం.

ఆరంభించ బడిన కర్మ నశించ డానికి అనేక కారణాలు ఉండొచ్చు. ఉదాహరణకు పొలంలో పెట్టిన పంటనే తీసుకుందాం. వర్షాలు పడక పంట పాడు కావచ్చు. తెగుళ్ళు కారణం కావచ్చు. ఏది కారణం అనేది అలా ఉంచితే, పాడయ్యే అవకాశం ఉంది అనే విషయాన్ని నిరాకరించే అవకాశం లేదు.

కాని, కర్మయోగంలో ఈ విధమైన దోషం లేదు. వేసే ప్రతి అడుగు ముందడుగే. ఆరంభించిన కర్మ మధ్యలో ఆగినా వినాశము మాత్రం ఉండదు. అభిక్రమనాశం ఉండదు. కర్మయోగము మోక్ష మార్గము. ఈశ్వరారాధనతో కూడింది (**న ఇహ మోక్షమార్గే కర్మయోగే అభిక్రమనాశః**). ఎంత చేస్తే అంతే ఫలము. చేసుకున్న వారికి చేసుకున్నంత.

ఒక వ్యక్తి భయంకరమైన ఆకలితో ఉంటాడు. అతనికి కొంచెము ఆహారమే లభించ వచ్చు. దాని వల్ల అతనికి పూర్తిగా ఆకలి తీరక పోవచ్చు. కాని, కొంతైనా తీరిందా, లేదా? పూర్తిగా తిన నివ్వకుండా మధ్యలో ఎవరైనా ఆపినా, తినినంత వరకు ఆకలి తీరుతుందే గాని, అభిక్రమ నాశము ఉండదు. పూర్తిగా భోంచేయ లేదు కనుక తినింది ఆకలి తీర్చదు అనే దోషం లేదు. కర్మయోగము ఇలాంటిది. అభిక్రమ నాశ దోషము లేనిది. కర్మకు, కర్మఫలానికి మధ్య అవరోధం ఏర్పడి ఫలం అందక పోవడం అనే దోషం కర్మలలో ఉంటుందే గాని, కర్మయోగంలో ఉండదు.

ఈ రోజు పది మాలలు జపం చేయాలి అని కూర్చుంటాము. నాలుగు మాలలు చేస్తాం. ఈలోగా అవరోధం ఏదో వస్తుంది. జపం అక్కడికి ఆపి, వేరే అవసర కార్యంలో మనం నిమగ్న మవుతాం. అలా చేయడం వల్ల ఆరంభించిన జపము నాలుగు మాలలకే పరిమిత మైంది. అయినా, ఆ నాలుగు మాలలు చేయడం వలన కలిగే ఫలము తప్పక వచ్చి తీరుతుంది.

గంట సేపు చేసే పూజలో అర్ధగంట కార్యక్రమం పూర్తి అయింది. ఈ లోగా ముఖ్యమైన ఫోను వస్తుంది. లేచి వెళ్ళి, ఫోనులో మాట్లాడి, ఆ తరువాత తిరిగి వచ్చి మళ్ళీ పూజను ప్రారంభిస్తాం. ఈ విధమైన అవరోధము మధ్యలో ఏర్పడటం వల్ల పూజాఫలము అందకుండా పోవడ మనేది లేదు. భోజనం చేస్తూ చేస్తూ వెళ్ళి, ఫోను మాట్లాడిన తరువాత తిరిగి వచ్చి మళ్ళీ భోజనం చేయడం లాంటిదే.

మరి, అలా ఫోను మ్రోగి పూజకు అంతరాయం కలిగి నపుడు, భక్తుడు కలత చెందడం జరుగుతూ ఉంది కదా! అంటే, అది సాధకుని మనోస్థాయికి సంబంధించిన విషయం. కర్మఫలానికి సంబంధించింది

కాదు. కాని, ఇక్కడ మరొక సత్యాన్ని కూడా సాధకులు గ్రహించాలి. సాధనలో వచ్చే అవాంతరాలను ప్రతిబంధకాలుగా ప్రారంభ సాధకులు భావిస్తారే గాని, పరిపక్వత చెందిన వారు కలత చెందరు. పూజా సమయంలో ఫోను మ్రోగితే, ఆ ఫోను చేసిన వాడు నా కృష్ణుడే అని భక్తుడు ప్రశాంతంగా లేచి వెళ్తాడు. అంతేగాని, అదేదో అవరోధ మని భావించి ఆవేదన చెందడు. ఇలాంటి పరిపక్వత కర్మయోగంలో మెల్ల మెల్లగా అల్లుకుపోతూ ఉంటుంది.

ప్రత్యవాయం

అభిక్రమ నాశ దోషం లాగే కర్మలలో మరొక దోషం ఉంది. అదే ప్రత్యవాయ దోషం. రోగంతో బాధపడే వ్యక్తి మందు తీసుకుంటాడు. మందు తీసుకొనే మోతాదులో భేదం వచ్చినా, పథ్యంలో లోపం జరిగినా, సత్ఫలితం రాకపోవడ మనేది ప్రక్కన పెడితే, దుష్ఫలితం వచ్చే అవకాశం కూడా ఉంది.

అలాగే ఒక రోగానికి మందు తీసుకుంటే ఆ రోగం పోవచ్చు. తీసుకున్న ఔషధం యొక్క గుణాన్ని బట్టి మరొక క్రొత్త వ్యాధి ఉత్పన్నం కావచ్చు. ఇదే ప్రత్యవాయ దోషం అంటే. ఇలాంటి దోషం కర్మయోగంలో లేదు. ఏ కొద్దిగా కూడా లేదు *(కించ న అపి చికిత్సావత్ ప్రత్యవాయః విద్యతే)*.

వేదోక్త కర్మకాండలో కొన్ని సందర్భాలలో ఉచ్చారణ దోషం వల్ల విరుద్ధ ఫలాలు వచ్చే అవకాశం ఉంది. త్వష్ట ప్రజాపతి నిర్వహించిన యజ్ఞంలో ఇంద్రుని వధించే కుమారుడు కావాలి అని సంకల్పం చేస్తే, స్వరదోషం వల్ల ఇంద్రుని చేత వధింపబడే బిడ్డడు పుట్టాలి అనే భావం ఏర్పడింది. అలాగే జరిగింది*. నహుషుడు కొండచిలువగా మారడం కూడా మనకు తెలుసు. ఇవన్నీ ప్రత్యవాయ దోషాలు. **

కర్మయోగంలో ప్రత్యవాయ దోషం లేదు. నువ్వు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని సంకీర్తన చేస్తూ ఉన్నావనుకో, ఓం నమో భగవతే వాసుదేవా. . అనే సరికి హఠాత్తుగా తుమ్ము వచ్చి ఆపేశా వనుకో. దాని వల్ల నష్టం వాటిల్లదు. నువ్వు విడిచి పెట్టినా 'య' కారాన్ని కృష్ణుడు అందుకొని, తరువాత మంత్రానికి ఫలం సిద్ధం చేస్తుంటాడు. ఇదంతా కర్మయోగ వైభవం.

లాభనష్టాలలో, సుఖదుఃఖాలలో సమబుద్ధి కలిగి, ఫలితాన్ని ఈశ్వర ప్రసాదంగా స్వీకరించే కర్మయోగంలో అభిక్రమ నాశ దోషం ఉండదు. విధి ఉల్లంఘన వల్ల ఏర్పడే ప్రత్యవాయ దోషం కూడా ఉండదు. దోష రహితమైన కర్మయోగంలో ఎంత చేసుకుంటే అంత ఫలం. కర్మయోగి ఆచరించే కర్మలలో ఈశ్వరుడు ఉన్నందున, కర్మయోగి చేసే కర్మలన్నీ అలౌకిక కర్మలే. అలౌకిక కర్మలకు ఫలం కూడా అలౌకికం గానే ఉంటుంది. అదే ఈశ్వరానుగ్రహం. భగవంతుని దయ. ఈశ్వర భావనతో ఎంతగా కర్మ చేస్తూ ఉంటే అంతగా చిత్త ప్రసాదం ఏర్పడుతూ ఉంటుంది.

నేడు స్వల్పము - రేపు సర్వము

అర్జునా! ఈ కర్మయోగ రూప ధర్మాన్ని స్వల్పంగా ఆచరించినా, అది దారుణమైన జనన మరణ రూప సంసార భయం నుండి మనలను రక్షిస్తుంది. ఇది భగవ ద్వచనం. బాధాతప్త జగత్తులో మ్రగ్గుతున్న జనావళికి భగవంతుడు వినిపిస్తున్న అభయవాక్యం.

ఈ కర్మయోగములో సాధన స్వల్పమే అయినా, ఫలం అధికంగా ఉంటుంది. ఇక్కడ భగవంతుడు స్వల్పం అన్నాడే గాని అల్పం అనలేదు. ఈ రెండిటి మధ్య తారతమ్యాన్ని కూడా మనం గుర్తించాలి.

అల్ప వస్తువు మోతాదులో తక్కువగా ఉంటుంది. విలువ కూడా తక్కువ గానే ఉంటుంది. స్వల్ప వస్తువు

*పూజ్య స్వామీజీ రచించిన చైతన్య భాగవతము. ** చైతన్య మహాభారతంలో చూడవచ్చు.

అలా కాదు. మోతాదులో తక్కువగా ఉన్నా విలువను బట్టి చూస్తే అమూల్యంగా ఉంటుంది. దీనిని యోగ్యతా లక్షణము అంటారు.

రాయి, రత్నము రెండూ రాళ్ళే. మొదటి దానికి పరిమాణమే గాని, యోగ్యత లేదు. రెండవది పరిమాణంలో చిన్నదే అయినా ధర విషయాని కొస్తే ప్రముఖంగా పలుకుతుంది. అందుకే దానిని విలువైన రాయి అంటాము.

దేవాలయం బయట ఒక రాతి ముక్క పడి ఉంటుంది. అందులో మరొక ముక్క మూర్తిగా మలచబడి ఆలయంలో పూజ లందుకొంటూ ఉంటుంది. రెండూ రాళ్ళే. రెండూ ఒకే మోతాదు లోనే ఉన్నాయి. యోగ్యత విషయాని కొచ్చే సరికి పోలికే లేకుండా పోయింది. కర్మలు ఎంత గొప్పవి అయినా బంధ హేతువులే. ఆ కర్మలే యోగభావనతో ఆచరించి నపుడు మోక్ష హేతువులు అవుతున్నాయి. ఇదంతా కర్మయోగ వైభవము.

పవిత్రమైన ఈ కర్మయోగాన్ని ఆచరించే భక్తుడు జనన మరణరూప సంసారం నుండి బయట పడతాడు. స్వల్పము అనే సంశయం అవసరం లేదు. నేడు స్వల్పం, రేపు స్వల్పం, మరునాడు స్వల్పం, ఆ మరునాడు స్వల్పం - ఆ తరువాత సర్వం.

చిన్న నిప్పురవ్వ అరణ్యాన్ని దహించి వేస్తుంది. సాగర మధ్యంలో చిక్కుకున్న వ్యక్తి చిన్న నావను ఆశ్రయించుకొని తీరం చేరుతాడు. చిన్న మాత్రను మ్రింగి రోగి దారుణమైన రోగాన్ని పోగొట్టు కుంటాడు. స్వల్పమైనా, కర్మయోగము భవబంధాలను తొలగిస్తుంది.

కర్మయోగము అనేది భావన. అది కేవలం కర్మ అనుకో కూడదు. కర్మయోగి భావనలో భగవంతుడు ఉంటాడు. భావన బుద్ధిలో ఉంటుంది. భావనలో ఈశ్వరుడు ఉన్నాడు అంటే, బుద్ధిలో ఈశ్వరుడు ఉన్నాడని అర్థము. భావన కూడా కర్మే, మానసకర్మ. భావన రూపంలో భగవంతుడు ఉన్నాడు కనుక అదే భావన భగవద్భావన. భగవద్భావనకు ఫలం భగవదనుగ్రహం. అదే భావశుద్ధి. అదే చిత్తశుద్ధి. అదే అంతఃకరణ శుద్ధి. ఆ చిత్త ప్రసాదమే జ్ఞానానికి కర్మయోగిని అర్హుణ్ణి చేస్తుంది. అధికారిని చేస్తుంది.

అల్ప ప్రయోజనం - అనల్ప ఫలం

సాంఖ్యము బోధించే సన్యాసము ఉత్కృష్టమైనది. అందులో రెండవ ఆలోచన లేదు. కానిపోతే, పట్టుకున్న ప్రతి దానిని విడిచిపెట్ట మంటూ ఉంటుంది సన్యాసము. ఆశను విడిచిపెట్టు! వ్యాపారాన్ని విడిచిపెట్టు! భార్యా బిడ్డల్ని వదిలేయ్! దేహాన్ని మరచిపో! మనస్సును నిగ్రహించు! ఆలోచనల్ని అరికట్టు! నిజమే, ఇవన్నీ మోయడం ఎందుకు? వీటిని మోయడం కన్నా క్రిందికి త్రోయడమే నయం. బుద్ధి మాత్రం ఎన్నిటి నని మోస్తుంది? మోసి మోసి అదే ఒక మోయలేని బరువై కూర్చుంటుంది.

అలాగని, అన్నిటినీ విడిచి పెట్టడం సాధ్యమా? బుద్ధి శుద్ధి పడినపుడే అవన్నీ సాధ్య పడతాయి. వినాదాలలో వివాదాలు పరిష్కారం కావు. అవగాహన తోనే అంతర్యం లోని అలజడులు అణగుతాయి.

కర్మయోగం తీరుతెన్నులు సన్యాసం లాగా ఉండవు. అది వదులు - ఇది వదులు అని సన్యాసము చెప్పినట్లు కర్మయోగం చెప్పదు. అది చేయదగింది - చెయ్యి, ఇది చేయదగింది - చెయ్యి, అని బుజ్జగించి చెబుతుంది. ఏదో ఒకటి చెయ్యాలనే దురద మనకు ఉండనే ఉంది. కనుక చేయ వలసిన కర్మలను, చేయదగిన కార్యాలను రాగద్వేష రహితంగా చేస్తూ, పనిని పూజగా ఎలా మార్చుకోవాలో కర్మయోగము నేర్పుతుంది. కర్మయోగి చేసే ప్రతి కర్మ ఒక పూజగా మారుతుంది. ఈ విధమైన కర్మయోగంలో రాగద్వేషాలు పలుచబడి పోతూ ఉంటాయి. మనస్సులో ప్రశాంతత చేరిపోతూ ఉంటుంది. చిత్తశుద్ధి ఏర్పడుతూ ఉంటుంది. ఆ తరువాత చిత్త నైశ్చల్యం రానే వస్తుంది. బుద్ధి ధ్యానానికి సిద్ధ పడుతుంది. ఇదంతా కర్మయోగమే చేసి పెడుతుంది.

[illegible]

[illegible]

న హి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి

[illegible]

[illegible]

వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41

వ్యవసాయాత్మికా-బుద్ధిః-ఏకా-ఇహ-కురునందన
బహుశాఖాః-హి-అనంతాః-చ-బుద్ధయః-అవ్యవసాయినాం

కురునందన	= అర్జునా	అవ్యవసాయినాం	= నిశ్చయబుద్ధి లేని వారి
ఇహ	= ఈ యోగమున	బుద్ధయః	= బుద్ధులు
వ్యవసాయాత్మికా	= నిశ్చయ రూపమైన	బహుశాఖాః	= అనేక భేదములు గలవి
బుద్ధిః	= బుద్ధి	అనంతాః చ హి	= అనంతములు గదా
ఏకా	= ఒక్కటే		

[illegible]

వ్యాఖ్య

[illegible]

సాంఖ్యము - యోగము

[illegible]

[illegible]

[illegible]

నిశ్చయ స్వభావము

[illegible] (వ్యవసాయాత్మికా బుద్ధిః)

[illegible]

[illegible]

మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చా శుద్ధ మేవచ
అశుద్ధం కామ సంకల్పం శుద్ధం కామ వివర్జితమ్ ॥

[illegible]

[illegible]

[illegible]

[illegible]

కురు నందన

ఈ శ్లోకంలో అర్జునుణ్ణి కురునందనా! అని సంబోధించాడు శ్రీకృష్ణుడు. కురునందనా! అంటే కురు వంశాన్ని సంతోష పెట్టువాడా! అని అర్థము. అంతేకాదు, 'కురు' అంటే చెయ్యి అని అర్థము. 'నందన' అంటే ఆనందించే వాడు. కురునందనా! అని ప్రత్యేకంగా సంబోధిస్తూ, కర్మయోగంలో చరించి తృప్తి చెందు అని బోధించాడు శ్రీకృష్ణుడు.

నిశ్చయమైన జ్ఞానం లేనివారు ఎలా ఉంటారో వినిపిస్తున్నాడు.

కర్మ బంధమా? ఈ వాక్యం పలకడం కర్మ కాదా! ఈ వాక్యాన్ని పలకాలి అని అనుకోవడం కర్మ కాదా? పలకడం వాచక కర్మ అయితే, పలకాలి అనుకోవడం మానసకర్మ. కర్మ బంధము అని చెప్పే వ్యక్తి బంధములో ఉండే చెబుతున్నాడా? లేక బంధము లేకుండా చెబుతున్నాడా? బంధములో ఉండే వ్యక్తికి బంధము ఎలా తెలుస్తుంది? బంధము అర్థమైతే ఇక బంధ మెక్కడుంది? కల కనే వ్యక్తికి ఇది కల అని తెలుస్తుందా? తెలిస్తే ఇక కల ఎక్కడుంది?

బంధము లేని వ్యక్తి కర్మ బంధము అని ఎలా చెబుతాడు? అలా చెప్పడం కర్మ అని అతనికి తెలియదా? కనుక కర్మ బంధము కాదు. కానే కాదు. గాలి వీచడం కర్మ. మొక్క పెరగడం కర్మ. పువ్వు పూయడం కర్మ. కాయ కాయడం కర్మ. అలలు కదలడం కర్మ. చిలుక పలకడం కర్మ. కళ్ళు తెరవడం కర్మ. రెప్ప పడటం కర్మ. సృష్టి కర్మ. స్థితి కర్మ. లయ కర్మ. కర్మ కాని దేముంది? కర్మలలో బంధ మెక్కడుంది?

మరి, బంధ మేమిటి? కర్మ బంధము కాదు. కోరిక బంధము. కోరికతో కూడిన ఏ కర్మ అయినా బంధమే. కోరిక లేని కర్మ బంధం కాదు. శ్వాస కర్మ కాదా! అది బంధమా? అలాగని శ్వాసను బంధిస్తే, ప్రాణం నిలుస్తుందా? చూపు బంధమా? అదీ కర్మే కదా! చూపు బంధమైతే సర్వ శక్తిమంతుడైన పరమేశ్వరుని సృష్టి లోని అందాలన్నీ దేని కొరకు? ఎవరి కొరకు? వినికిడి బంధమా? అదే వాస్తవ మైతే, సృష్టి లోని రమణీయ పలుకులు, ఆపాత మధురమైన గానామృతాలను ఎవరు ఆస్వాదించాలి? కనుక కర్మ బంధం కాదు. కోరికే బంధము.

అలా అయితే, కోరిక లేకుండా కర్మ సాధ్యమా? ఏ కర్మను ఎవరు చేసినా, వెనుక కోరిక ఉండి తీరాలి కదా! కోరిక ఉంటేనే కదా ఎవరైనా కర్మ చేస్తారు? భగవంతుడు కూడా సృష్టి చేయాలని కాంక్షించే చేశాడని ఉపనిషత్తు కూడా చెబుతూ ఉంది.

అయినా, కోరిక లేకుండా ఎవరైనా ఉండగలరా? మనిషికి అది సాధ్యమేనా? ప్రతిచోట చలన ముంది. ప్రతి చలనంలో కోరిక దాగి ఉంది. ఈ విశ్వంలో పరిమితాలన్నీ ప్రత్యక్షం గానో, పరోక్షం గానో చలిస్తూనే ఉన్నాయి. అనంతాన్ని అందుకోవాలనే ఆశే ఆ చలనాలలో దోబూచు లాడుతోంది.

భూమండలం కూడా అందుకే చలిస్తోంది. సౌరమండల మంతా మెల్లగా చలిస్తూ, ఒక మహోజ్జ్వలమైన తార వైపుకు తరలిపోతూ ఉందని విజ్ఞాన శాస్త్రవేత్తలు వింత వింత విషయాల్ని వినిపిస్తున్నారు.

మనుషు లందరూ ఆ బాట లోనే ఉన్నారు. ఆ మార్గం లోనే తెలిసో తెలియకో ప్రయాణం సాగిస్తున్నారు. అనిత్యాల నుండి విడిపడి నిత్యవస్తువును వాటేసు కోవాలని, అంతం కలిగిన వాటి నుండి విడిపడి అనంతం వైపు పరుగులు తీయాలని ఆశ పడుతున్నారు. మన అందరి కోరిక అదే.

ఎండలో తిరిగి అలసి పోయి ఇల్లు చేరిన వ్యక్తి, చల్లని పానీయం కావాలని కోరుకుంటాడు. ఎందుకని? ఎండలో వచ్చాడు. బాగా డస్సి పోయాడు. అలసటగా ఉంది. ఆవేదనగా ఉంది. ఇదంతా అనుభవిస్తూ, భరిస్తూ

కూర్చోలేడు. ఈ అస్వస్థత నుండి బయట పడాలి. శీతల పానీయం కావాలి అంటాడు. శీతల పానీయం కావాలి అని అడిగింది శీతల పానీయం కొరకు కాదు. తాను అసౌకర్యం నుండి విడివడ టానికి.

ఇదొక్కటే కాదు. మనం ఈ ప్రపంచంలో ఏది కోరినా, దాని వెనుక దాగి ఉన్న సత్యం ఇదే. సినిమా చూసినా, టి.వి. చూసినా, కాశ్మీరు వెళ్ళినా, ఊటీలో ఊరేగినా, పకోడి నమిలినా, పాయసం జుర్రినా, ఎత్తులో ఎగిరినా, మత్తులో తూలినా, అన్నిటి వెనుక, అందరి వెనుక, ప్రతి కోరిక వెనుక అసంతృప్తి నుండి విడిపడాలనే ఆతృతే ఉంది. కాకపోతే, ఈ విధమైన అనుభవాలలో ఏదో కొంత తృప్తిని మనిషి అనుభవిస్తున్నాడు. వాస్తవానికి అది తృప్తి కాదు. తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

మన అసంతృప్తి ఎక్కడుందో మనం చూడలేక పోతున్నాం. మనం ఆశించే తృప్తి ఎక్కడ దాగి ఉందో మనం అర్థం చేసుకోలేక పోతున్నాం. దేహము, ఇంద్రియాలు, మనస్సు కల్పించే పైపై ప్రేరణలకు స్పందిస్తున్నామే గాని, మన ఆంతర్యపు లోతుల్లో వీటికి ఏది హేతువుగా ఉందో విశ్లేషించుకోలేక పోతున్నాం.

అవి కావాలి - ఇవి కావాలి అనేది మన ఉద్దేశ్యం కాదు. అనంతంగా భాసించాలి అనేదే మన ఆశ. ఇది అనంతానికి సంబంధించిన కోరిక. అనంతమైన కోరిక. కాని, ఇంద్రియ మనస్సులు మనల్ని పరిమితాల వైపుకు ఈడుస్తున్నాయి. అసలు బంధానికి హేతువు ఇక్కడే ఉంది. అంతేగాని బంధహేతువు కర్మ కాదు.

మరి, కర్మ బంధం కానపుడు, కోరికే బంధమై నపుడు కోరికల్ని వదిలేస్తే సరిపోతుంది కదా? మరి కోరికలు ఎందుకు కదుల్తున్నాయి? నువ్వు తృప్తిగా లేవు కనుక. తృప్తి చెందాలి అని ఆశిస్తున్నావు కనుక కోరికలు కదుల్తున్నాయి. కోరికల్ని వదిలేయాలి అంటే, అవి లేకపోయినా నువ్వు తృప్తిగా ఉండ గలగాలి. ఉండ గలవా?

తృప్తిగా ఉండటానికి కోరికల్ని వదిలేస్తావా?

తృప్తిగా ఉన్నావు కనుక కోరికల్ని వదిలేస్తావా?

నువ్వు తృప్తిగా ఉండాలి అంటే కోరికల్ని వదిలేయాలి. నువ్వు తృప్తిగా లేనపుడు కోరికల్ని ఎలా వదుల్తావు? కర్త ఉన్నంత వరకు కోరికలు బంధహేతువులే. నిన్ను నువ్వు కర్తగా భావించినంత వరకు కోరికలు నిన్ను బంధిస్తూనే ఉంటాయి. బాధిస్తూనే ఉంటాయి. నీవు అకర్తవు, అభోక్తవు అని నీ స్వరూపాన్ని నీవు తెలుసుకుంటే, కోరికలు ఉన్నా నష్టం లేదు, పోయినా నష్టం లేదు. కర్మలు సాగినా నష్టం లేదు, కర్మలు ఆగినా నష్టం రాదు.

నమాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా
ఇతి మాం యోఽ భిజానాతి కర్మభిర్న సబధ్యతే ॥

అర్జునా! కర్మలు నన్ను అంటవు. కర్మఫలము నందు నాకు కోరిక లేదు. ఇలా నన్ను ఎవడు తెలుసుకుంటాడో, అతడు కర్మల చేత బద్ధుడు కాడు అన్నాడు జ్ఞానయోగంలో గీతాచార్యుడు.

కృష్ణుడు భోక్తగా లేడు. కనుక కర్త కూడా కాడు. ఆయన అకర్త. అభోక్త. ఇది జ్ఞానం. ఆత్మజ్ఞానం. ఆత్మయే పరమాత్మ. జీవుడే దేవుడు. నరుడే నారాయణుడు. మానవుడే మాధవుడు. మాధవుడు ఏమిటో అర్థ మైతే, మానవుడు మాధవుడి కన్నా అన్యం కాదని తేలిపోతుంది.

ఇది జ్ఞానం. ఇదే సాంఖ్యం (**శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభిధీయతే**). సన్యాసము దీని కొరకే. సన్యాసానికి అర్హత లేని వాళ్ళు చిత్తశుద్ధికి కర్మల నాచరించాలి. ఇది యోగము. కర్మయోగము. మోక్షానికి ఈ రెండూ మార్గాలే.

మరి, బంధము? ఈ రెండూ కాకుండా, కోరికల చేత, ఆశల చేత ప్రేరేపింప బడి, కర్మ సుడిగుండంలో పరిభ్రమించే మార్గము ఏదైనా బంధమే. ఇలా బంధాలు తగిలించుకొని, బ్రతుకులో అందాలు చెడగొట్టు కుంటున్న వారస్థుల్ని గురించి, ఛాందసుల్ని గురించి మూడు శ్లోకాలలో చెబుతున్నారు, విందాం!

యామిమాం పుష్పితాం వాచం ప్రవద న్త్యవిపశ్చితః ।
వేదవాదరతాః పార్థ నాన్య దస్తీతి వాదినః ॥ 42

యాం-ఇమాం-పుష్పితాం-వాచం-ప్రవదంతి-అవిపశ్చితః
వేదవాదరతాః-పార్థ-న-అన్యత్-అస్తి-ఇతి-వాదినః

పార్థ	= అర్జునా!	వాదినః	= వాదించువారు
వేదవాదరతాః	= వేదవాదముల యందు రమించు వారు	అవిపశ్చితః	= అవివేకులు
అన్యత్	= మరి యొకటి	పుష్పితాం	= వికసిత పుష్పం లాగా పైకి అందంగా కనపడే
అస్తి	= ఉండుట	ఇమాం	= ఇట్టి
న	= లేదు	యాం వాచం	= ఏ మాటలను
ఇతి	= అని	ప్రవదంతి	= చెబుతున్నారో

అర్జునా! అవిపశ్చితులు అంటే అవివేకులు. వీరికి వేదం ప్రతిపాదించిన సకామ కర్మల యందే ప్రీతి. ఫల భోగము నందే ఆసక్తి. స్వర్గాన్ని మించింది మరొకటి లేదని పువ్వులు పరచినట్లు రమణీయంగా వాదిస్తూ ఉంటారు.

వ్యాఖ్య

సాంఖ్యమును అనుసరించే సన్యాసులు, యోగమును ఆశ్రయించిన కర్మయోగులు ఒకే విధమైన నిశ్చయాత్మక బుద్ధిని ఎలా కలిగి ఉన్నారో గడచిన శ్లోకంలో చూశాం. నిశ్చయాత్మక బుద్ధి లేని అవిపశ్చితుల స్వభావమును గూర్చి వరుసగా మూడు శ్లోకాలలో వినబోతున్నాం.

అవిపశ్చితులు అంటే అల్పబుద్ధులు, అవివేకులు అని అర్థం (*అవిపశ్చితః అల్పమేధసః అవివేకినః ఇత్యర్థః*). అలాగని వాళ్ళు నిరక్షరకుక్షులు కారు. వేదాధ్యయనము చేసిన వారే. వేదంలో అద్భుతమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. అల్పమైన ఫలాలను అందించే సాధనలు ఉన్నాయి. అనల్పము, అనంతమైన ఫలాన్ని ఇచ్చే సాధనలూ ఉన్నాయి. వివేకులు అనంతఫలము వైపు మొగ్గు చూపుతారు. అవివేకులు అల్ప ఫలాలను ఆశ్రయించుకొని ఉంటారు. అల్ప ఫలాలను ఆశించేవారు కనుక వారు అల్పమేధ కలవారు. అవిపశ్చితులు. అల్పబుద్ధి కలవారు కనుక అల్పాన్నే అనంతంగా ఊహించుకొని, విన్న చెవులు దొరకగానే అలస్యం చేయకుండా ఊదరగొడుతూ ఉంటారు.

పువ్వుల పలుకులు

వీరిది సుమ సంభాషణం (*పుష్పితాం వాచమ్*). వినడానికి ఇంపుగా, సొంపుగా సంభాషిస్తారు. పువ్వులు ఎంత సున్నితంగా ఉంటాయో, వాళ్ళ పలుకులు కూడా అంత సుకుమారంగా ఉంటాయి. పట్టుకుంటే పూల రేకులు ఊడినట్లు, ప్రశ్నిస్తే వీళ్ళ మాటలు కూడా ప్రాబల్యాన్ని కోల్పోతాయి. మనోహరంగా కనిపించే పువ్వులు గంటల్లో వాడిపోయినట్లు, సుందరమైన వీరి వాదాలు క్షణాల్లో వాడోడు లేకుండా పోతాయి. కాకపోతే, వింటున్నంత సేపు రమణీయం గానే ఉన్నట్లు అనిపిస్తాయి అన్నారు శ్రీ శంకరులు కూడా (*శ్రూయమాణ రమణీయాం*). వారి పుష్పిత వాణిని **వదన్తి**, పలుకుతున్నారు అంటే సరిపోతుంది. కాని, గీతాచార్యుడు **ప్రవదన్తి** అని ఉపసర్గను

చేర్చి చెప్పారు. వారు మాట్లాడే అర్థరహితమైన, వ్యర్థమైన విషయాలను చాలా ఘనంగా భావించి, గంభీర స్వరంతో వినిపిస్తూ ఉంటారు. అందుకని ప్రవదన్తి అన్నారు. మాటల్లో పస లేకపోయినా, పలికే ప్రతి మాట వేద వాక్కే. అదే విచిత్రము.

వేద వాదాలు

వీరికి భోగమే యోగము. ఏ సాధన చేస్తే ఏ ఫలం వస్తుంది? ఏ భోగం అనుభవించాలంటే ఏ యాగం చేయాలి? ఈ విధంగా ఫలాపేక్షతో కూడిన యజ్ఞయాగాదుల యందు ఆసక్తి గాని, మోక్షము, భగవంతుడు, మొదలైన విషయాలలో అనురక్తి ఉండదు. వీరు తెలిసినది అంటే కర్మలు - ఫలభోగాలే గాని మరొక ప్రస్తావన ఉండదు.

ఈ యాగం చేస్తే పుత్రులు కలుగుతారు (*పశ్యతి పుత్రం*). ఆ క్రతువు చేస్తే మనవడు పుడుతాడు (*పశ్యతి పౌత్రం*). ఎవరికి ఘనంగా దక్షిణలు ముట్టుతాయో వారు అమృతత్వాన్ని పొందుతారు (*దక్షిణావంతో అమృతత్వం భజన్తే*). మేము యజ్ఞ యాగాదులు నిర్వహించి సోమపానం చేశాం (*అపామ సోమమ్*). ఇలాంటి నిష్ఫలమైన పుష్పిత వాక్కులను పునశ్చరణ లేకుండా పుంఖాను పుంఖాలుగా వల్లిస్తూ ఉంటారు. అన్నీ పూల పలుకులే. మోదుగ పూలు లాంటివి. పువ్వుల్లో సువాసన ఉండదు. కాయల్లో చేదు భయంకరంగా ఉంటుంది.

తన మాటే వేదం - తన పాటే నాదం

భోగ సాధనాలైన కర్మలు తప్ప మరొక విషయాన్ని ముచ్చటించ డానికి అంగీకరించరు. వేదమంతా తమకే తెలుసు అంటారు. కర్మకాండనే పట్టుకొని వ్రేలాడుతూ ఉంటారు. జ్ఞానకాండ వైపు కన్ను ఎత్తైనా చూడరు. ఎందుకని? కర్మలు - భోగాలు, వీటి కన్నా అన్యమైనది, అద్భుత మైనది మరొకటి లేనే లేదని వాదిస్తూ ఉంటారు (*న అన్యత్ అస్తి ఇతి వాదినః*). వేదాన్ని విశ్వసిస్తారు. వేదాన్ని భాసిస్తారు. వేదసారాన్ని అందుకొనే ప్రయత్నం మాత్రం చెయ్యరు. కర్మకాండకే ప్రాధాన్యత నిచ్చి, పైపై మాటలకే పరిమిత మవుతారు గాని లోతులకు వెళ్ళి ముఖ్య విషయాన్ని గ్రహించరు.

ఛాందోగ్యోపనిషత్తులో ఒక చిన్న ఆఖ్యాయిక ఉంది. ఒక జీవాత్మను మృత్యువు వెంబడించి తరుము తుంది. పరుగు లెత్తి అలసి పోయిన ఆ జీవాత్మ ఎక్కడ రక్షణ పొందాలో తెలియక వేదాలలో ప్రవేశిస్తుంది. అలాగని మృత్యువు విడిచి పెట్టకుండా, తాను కూడా వేదాల లోకి ప్రవేశిస్తుంది. ఆ జీవాత్మ మృత్యువు నుండి తప్పించుకోవడానికి వేద లోతుల్లోకి, లోతుల్లోకి, లోతుల్లోకి వెళ్తుంది. ఆ అగాధ లోతుల్లోకి వెళ్ళడం మృత్యువుకు సాధ్యం కాదు. మృత్యువు వెను దిరిగి వచ్చేస్తుంది. ఆ జీవాత్మ మరణం నుండి తప్పించుకొని తరించి పోతుంది. ఇదీ కథ.

వేదము యొక్క లోతులను చూచిన వారే మృత్యువు నుండి తప్పించు కుంటారు. వేదము యొక్క లోతు అంటే, వేదము యొక్క అంతము, లేదా చివరి భాగము. అదే వేదాంతము. ఉపనిషత్తుల జ్ఞానము. వేదాంత లోతుల లోకి దూసుకొని పోయింది కనుకనే ఆ జీవాత్మ మృత్యువు నుండి తప్పించుకో గలిగింది. **అపామ సోమమ్** అంటూ పైపైన కర్మకాండ లోనే పచార్లు చేసి ఉంటే, ఇంతే సంగతులు అని సంతకం పెట్టవలసి వచ్చేది.

ఈ వేద లంపటుల విచిత్ర స్వభావాన్ని తరువాత శ్లోకంలో కూడా వివరిస్తున్నాడు భగవంతుడు.

కామాత్మానః స్వర్గపరా జన్మకర్మ ఫలప్రదామ్ ।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43

కామాత్మానః-స్వర్గపరాః-జన్మకర్మఫలప్రదాం
క్రియావిశేషబహులాం-భోగైశ్వర్యగతిం-ప్రతి

కామాత్మానః	=	కోరికలతో నిండిన మనస్సు గల
స్వర్గపరాః	=	స్వర్గమే పరమ మైనది అని తలచేవారు
జన్మకర్మఫలప్రదాం	=	జన్మమును, కర్మఫలమును ఇచ్చే
క్రియా విశేష బహులాం	=	బహుళమైన కార్యకలాపములతో నిండినది
భోగైశ్వర్య గతిం ప్రతి	=	భోగముల యొక్క ఐశ్వర్యముల యొక్క ప్రాప్తిని గురించి

ఈ అవిపశ్చితుల మనస్సుల నిండా కోరికలే ఉంటాయి. స్వర్గము నందే వారికి మక్కువ. భోగాలను, సంపదలను పొందే మార్గాన్ని చెబుతూ ఉంటారు. అవి అనేక క్రియా కలాపాలతో కూడి ఉంటాయి. పైగా, జన్మ అనే కర్మ ఫలాన్ని అందిస్తాయి.

వ్యాఖ్య

కోరికల కోలాటం

కోరికలే స్వభావంగా గల వారికి (**కామాత్మానః**), అవి కావాలి - ఇవి కావాలి, అది చేస్తే ఇవి వస్తాయి, ఇది చేస్తే అవి వస్తాయి, అంటూ పోయే వరకు వచ్చే వాటికి స్వాగతం పలకడం తోనే సరిపోతుంది. ఏది చేయాలన్నా, దానికి ముందుగా ఏమొస్తుంది? అనే ప్రశ్న పుడుతుంది. మనస్సు నిండా కోరికలే. బ్రతుకంతా కోరికల కోలాటం తోనే సాగుతుంది. ఇదంతా అజ్ఞాన క్రీడ. అవిద్యా విలాసము. అవిద్యా జనితమైన కర్మ సుడిగుండంలో చిక్కుకొనే భోగవాదులు అంధకారంలో కూరుకు పోతున్నారు అని ఉపనిషత్తు హెచ్చరించింది కూడా.

అన్ధం తమః ప్రవిశన్తి యే అవిద్యా ముపాసతే

అవిద్యను ఆశ్రయించే వారు అజ్ఞాన చీకట్లలో ప్రవేశిస్తారు అన్నది ఈశావాస్యోపనిషత్తు.

దివిలో కాపురం

స్వర్గమే వారికి పరమ పురుషార్థం. స్వర్గమే గమ్యము (**స్వర్గపరాః**). స్వర్గ ప్రస్తావన వేదంలో ఉంది. స్వర్గం భోగభూమి. వీరు భోగాసక్తులు కనుక స్వర్గమే వీరికి సర్వస్వము. అంతే కాని స్వర్గము కూడా ఒక లోకమే నని, స్వర్గానికి కూడా ఆద్యంతా లున్నాయని, పుణ్యఫలంగా ప్రాప్తించిన స్వర్గము పుణ్యం క్షీణించ గానే నశిస్తుందని, తిరిగి జన్మ ప్రాప్తిస్తుందని వాళ్ళు ఆలోచించరు. భోగవాదులు కనుక, నందన వన విహారాలు, అమృత పానాలు, అప్సరసల విలాసాలు - ఈ వాంఛలే మళ్ళీ మళ్ళీ వాళ్ళ మనస్సులలో తిరుగుతూ ఉంటాయి. జ్ఞానకాండ వైపు దృష్టి మరల్చరు కనుక వైరాగ్య శూన్యులై ఉంటారు. ఈ స్వర్గ చర్చ ప్రతి మతం లోను ఉంది. మోక్షం తెలియని వారికి స్వర్గమే మోక్షము. బ్రతికినంత కాలం కడుపే కైలాసం. ఇల్లే వైకుంఠం. చచ్చిన తరువాత స్వర్గమే సర్వము.

ఈ స్వర్గపరుల సల్లాపాలు ఆలకించిన కొందరు అమాయకులు కొన్ని విచిత్రమైన పదాలను, వింత వింత వాక్యాలను వినిపిస్తూ ఉంటారు. మీరు ఊటీకి వెళ్ళొచ్చారు కదా! అక్కడ ఎలా ఉంది? అని అడిగితే, అబ్బ! ఏం చెప్పను? స్వర్గం లాగా ఉంది అంటాడు. స్వర్గం ఎలా ఉంటుందో చూసిన వాడు చెప్పాడా? చెప్పేవాడు చూశాడా? పోని, అతడు చెప్పిన దానిని మన మెలా అర్థం చేసుకోవాలి? మనం ఎప్పుడైనా స్వర్గం చూశామా? చూడని దానిని అర్థం చేసుకొనే దెలా? ఎవరి మనస్సులో స్వర్గానికి సంబంధించి ఎలాంటి

ఊహాచిత్రం ఉంటుందో, దానిని అలా అలా ఊహించు కోవడమే. అందుకే, ఎవడి లోకం వాడిది అనే నానుడి నోళ్ళల్లో బాగా నానింది.

ఒక కప్పు కాఫీ ఇచ్చి, ఎలా ఉంది? అని అడిగితే, ఒకడు అమృతంలా ఉందంటాడు. ఏదో పూర్వం త్రాగి త్రేపినట్లే! మా అబ్బాయికి ఒక మంచి అమ్మాయిని చూసి పెట్టండి పేరయ్య గారూ! అంటే, మీ కెందుకండీ! రంభ లాంటి అమ్మాయిని చూసి పెడతాను అంటాడే గాని, పిల్లవాడి వయస్సెంతో, రంభ వయస్సెంతో కూడా ఆలోచించడు.

భోగ భాగ్యాలు

ఇక వారి పుష్పితవాణి భోగం తోనే బోణి. భోగాలను, ఐశ్వర్యాలను, సిరిసంపదలను, స్వర్గాన్ని - ఇలాంటి వాటిని అనుగ్రహించే కర్మలను గూర్చే వారి చర్చ నడుస్తూ ఉంటుంది. కర్మకు ఫలం జన్మ. ఉత్తమ జన్మ రావాలి అంటే ఏ కర్మను ఆచరించాలి? అనేదే వారి సంభాషణ సారాంశమై ఉంటుంది (***కర్మణః ఫలం జన్మైవ కర్మఫలం తత్ ప్రదాతాతీతి జన్మ కర్మ ఫలప్రదా***).

అంతే కాకుండా క్రియా విశేషాలను అధికంగా చర్చిస్తూ ఉంటారు. క్రియా విశేషాలు అంటే క్రియల యొక్క గొప్పతనాలు (***స్వర్గ పశు పుత్రాది అర్థాః***). స్వర్గము, సిరిసంపదలు, ఇవే ప్రధానంగా గల విషయాలకు సంబంధించిన కర్మలు అని అర్థము. ఈ విధమైన అనుచిత ఆలోచనలు చేస్తూ జనన మరణ సంసార చక్రంలో పడి తిరుగుతూ ఉంటారు.

చివరికి ఏమౌతుంది? వినండి.

భోగైశ్వర్య ప్రసక్తానాం త యాపహృత చేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥ 44

భోగైశ్వర్యప్రసక్తానాం-తయా-అపహృత చేతసాం
వ్యవసాయాత్మికా-బుద్ధిః-సమాధౌ-న-విధీయతే

భోగైశ్వర్య ప్రసక్తానాం	= భోగైశ్వర్యముల యందు ఆసక్తి కల వారికి	వ్యవసాయాత్మికా	= నిశ్చయాత్మక మైన
		బుద్ధిః	= బుద్ధి
తయా	= అట్టి పుష్పిత వాక్కులచే	సమాధౌ	= అంతఃకరణము నందు
అపహృత చేతసాం	= అపహరించబడిన మనస్సు గల	న విధీయతే	= ఉండదు.

భోగము నందు, ఐశ్వర్యము నందు ఆసక్తు లైన ఈ అవిపశ్చితుల తియ్యని పుష్పిత వాక్కులకు ఆకర్షితులై కొందరు బుద్ధిని జార విడుచు కుంటారు. అలాంటి వారి అంతఃకరణములో నిశ్చయ బుద్ధి నిలవదు.

వ్యాఖ్య

నిశ్చయం నిలవదు

భోగమే నా కర్తవ్యం. ఐశ్వర్యమును సాధించడమే నా పని (***భోగః కర్తవ్యం ఐశ్వర్యం చ ఇతి భోగైశ్వర్యయోః ఏవ ప్రణయవతాం***). ఈ విషయాల యందే ఆసక్తి, ఆ విధమైన సంకల్ప సల్లాపాల చేత వివేకమును పోగొట్టుకున్న అవిపశ్చితుల బుద్ధి యందు అలాంటి విషయాలే ఉంటాయి గాని, సాంఖ్యులకు, యోగులకు ప్రాప్తించే వ్యవసాయాత్మికా బుద్ధి, నిశ్చయ రూపమైన జ్ఞానము నిలిచేందుకు అవకాశము లేదు. ఇక్కడ సమాధి అంటే అంతఃకరణము, లేదా బుద్ధి అని అర్థము.

మోక్షం నాస్తి

ఇలాంటి భోగవాదులకు మోక్షము లభించదు. ఎందుకని? కారణం లేకుండా కార్యము సంభవించదు కనుక. ***కారణా భావే కార్యాభావః*** అనే న్యాయము ననుసరించి, కారణము లేకుండా కార్యము ప్రాప్తించదు కనుక, యోగబుద్ధి అనే కారణమే లేని ఈ భోగాసక్తులు తత్కార్యమైన మోక్షమును పొందలేరు.

భోగవాసన అంతఃకరణములో చేరి పోయింది. మనస్సంతా తేనెటీగలు ముసురుకున్నట్లు, కోరికలు నిండిపోయాయి. యోగబుద్ధి ప్రవేశించే అవకాశమే లేదు. కాపాడే వేదము ఉండి కూడా బ్రతుకు అన్యాయమై పోయింది. ప్రమాణ ఫలం అందకుండా పోయింది. అందుకనే బృహదారణ్యకోపనిషత్తు ఇలాంటి వాళ్ళను దృష్టిలో ఉంచుకొని, వేదము వేదము కాకుండా పోయింది అన్నది ***(వేదో అవేదో భవతి).***

కాకపోతే, ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు వేదనింద చేశాడని కొందరు విమర్శిస్తూ ఉంటారు. శ్రీకృష్ణుడు వేదనింద చేయలేదు. వేదసారాన్ని గ్రహించలేని వేదజడుల్ని నిరసించాడు. అంతే.

అందుకనే, హే అర్జునా! వేదం లోని ఈ కర్మకాండలో చిక్కుకొని సంసారములో పడకుండా, సాంఖ్య, యోగాది గమ్యమైన మోక్షాన్ని పొందుటకు గుణాతీతుడివి కా! అని తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ 45

త్రైగుణ్యవిషయాః-వేదాః-నిస్త్రైగుణ్యః-భవ-అర్జున
నిర్ద్వంద్వః-నిత్యసత్త్వస్థః-నిర్యోగక్షేమః-ఆత్మవాన్

అర్జున	= అర్జునా!	నిర్ద్వంద్వః	= ద్వంద్వములు లేని
వేదాః	= వేదములు	నిత్యసత్త్వస్థః	=సదా సత్త్వము నందే ఉన్న వాడవు
త్రైగుణ్యవిషయాః	=త్రిగుణములకు సంబంధించిన ఫలాలను విషయాలుగా బోధిస్తాయి	నిర్యోగక్షేమః	=యోగక్షేమములు లేని వాడవు
		ఆత్మవాన్	=అప్రమత్తుడవు
నిస్త్రైగుణ్యః	=త్రిగుణాలను విడిచిన వాడవుగా	భవ	=కా!

కర్మ కాండను ప్రతిపాదించే వేదాలు త్రైగుణ్య విషయాలు. అంటే, సంసార రూపాలు. అర్జునా! నువ్వు మూడు గుణాల నుండి ముక్తుడివి కా! ద్వంద్వాలను దాటిపో. నిత్య సత్త్వంలో నిమగ్నుడవు కా! యోగక్షేమాల నుండి విడిపడిపో! ఆత్మజ్ఞానివి కా!

వ్యాఖ్య

వేదము - వేద్యము

వేదంలో ప్రధానంగా రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి కర్మకు సంబంధించింది. అదే ప్రవృత్తి. రెండవది జ్ఞానానికి సంబంధించింది. అదే నివృత్తి. ఈ రెండిటిలో ఏదో ఒక దానిని మనుషులు అనుసరిస్తూ ఉంటారు. అందుచేత అందరికీ వేదం యొక్క అవసరం ఉంది. కాకపోతే, వేదంలో ఎవరికి ఏది అవసరమో, ఎవరికి దేనిపై ఆసక్తి ఉందో, దానినే వాళ్ళు అందుకుంటారు. ఆచరిస్తారు.

గ్రంథాలయంలో ఎన్నో గ్రంథాలు ఉంటాయి. గ్రంథాలయానికి అందరూ వెళ్తారు. ఎవరికి ఏ గ్రంథం కావాలో అదే వాళ్ళు తీసికొని చదువుతారు. ఒకరు పింగళి సూరన 'కళాపూర్ణోదయము' చదువుతారు. మరొకరు షేక్స్పియర్ 'కామెడి ఆఫ్ ఎర్రర్స్' చదువుతారు*. ఎవరు ఏది చదువుతారు, ఏది చదవరు? అనేది వాళ్ళ ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంటుంది.

* 'కళా పూర్ణోదయము' రచించిన పింగళి సూరన పదిహేనవ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాయల వారి ఆస్థానము లోని అష్టదిగ్గజ కవులలో ఒకడు. 'కామెడి ఆఫ్ ఎర్రర్స్' రచించిన షేక్స్పియర్ ఇంగ్లాండు దేశీయుడు. పదిహేనవ శతాబ్దము లోని వాడే. ఇంగ్లండు, ఇండియాల మధ్య రాకపోకలు లేని కాలమది. కాని, వీరిరువురు వ్రాసిన ఈ గ్రంథాలకు సామ్యం ఉందనేది స్వామీజీ అభిప్రాయం.

నిఘంటువులో వేలాది, లక్షలాది పదాలు ఉంటాయి. వాటిలో ఎవరికి ఏ పదం అవసరమో, దాని మీదే చూపుడు వ్రేలు పడుతుంది. వేదంలో అనేక విషయాలు చర్చింప బడ్డాయి. వాటిలో ఎవరికి ఏది కావాలో దానినే వాళ్ళు ఎంచుకుంటారు.

మనిషి ఒక్కడే. కాని, ఆ మనిషిలో కోరికలు అనేకము. ఆశలు అనేకము. ఒకరు ఆశించింది మరొకరు ఆశించాలి అనే నియమం లేదు. ఒకరి కోరిక మరొకరి కోరిక కానవసరం లేదు. ఎవరి కోరికలు వారివే. ఎవరి కష్టాలు వారివే.

ఆశించడం ఇచ్ఛాశక్తి. అలా ఆశించ డానికి కావలసిన విషయ జ్ఞానము కూడా మనిషికి ఉంది. ఉండబట్టే ఆశించాడు. అదే జ్ఞానశక్తి. జ్ఞానశక్తి ద్వారా ప్రేరేపించబడి, ఇచ్ఛాశక్తి ద్వారా దేనిని కోరుకుంటాడో, దానిని పొందడానికి కావలసిన శక్తి కూడా మనిషికి ఉంది. అదే క్రియాశక్తి. క్రియాశక్తి ఉండటం వల్లనే ఈ ప్రపంచంలో తాను సాధించాలి అనుకున్నవి కొన్నైనా మనిషి సాధించ గలుగుతున్నాడు.

అంటే, అన్నీ సాధించలేక పోతున్నాడు అని అర్థం. ఇది మన అనుభవంలో, అందరి అనుభవంలో తొంగి చూస్తున్న విషయమే. అలా సాధించలేక పోవడానికి ఏవో ప్రతిబంధకాలు ఉంటాయి. ఆ ప్రతిబంధకాలను అధిగమించే శక్తి మనకు ఉండదు. అందువల్లనే ఫలాలు అందకుండా పోతాయి.

ప్రగాఢంగా మనం ఆశించింది, ప్రతిబంధకాల కారణంగా విఫల మైనపుడు, ప్రతిబంధకాలను తొలగించుకొని ఫలితాలను పొంది తృప్తి చెందడానికి మన శక్తి సరిపో నపుడు, ఎక్కడ నుండి సహాయం అందుతుందో ఆ వైపుకు తిరుగుతాము. లోకంలో అందే సహాయాలు కూడా విఫల మైనపుడు, అలౌకికమైన సహాయం కొరకు ప్రయత్నం చేస్తాము. అది దైవ సహాయం కావచ్చు. లేదా, దేవతా సహాయం కావచ్చు. అలాంటి సహాయాన్ని పొందడానికి మనం చేసే కర్మలే ప్రార్థనలు. పూజలు. యాగాలు. యజ్ఞాలు.

ఏ కర్మకు ఏది ఫలం? ఏ యాగానికి ఏది ఫలం? ఇవన్నీ వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయి. ఇదంతా కర్మకాండ. ఉపాసనా కాండ. ఇది వేదంలో ఒక భాగం. కర్మకాండకు సంబంధించిన విషయం.

రెండవది జ్ఞానకాండ. ఇది వేదాలలో చివరి భాగము. కనుకనే, దీనిని వేదాంతము అంటారు. ఇక్కడ బోధింప బడేది జ్ఞానము. లౌకిక జ్ఞానము కాదు. బ్రహ్మజ్ఞానము. ఈ జ్ఞానమును బోధించే కాండ జ్ఞానకాండ. అవే ఉపనిషత్తులు. ***ఉపనిషదితి బ్రహ్మ విద్యా***. ఉపనిషత్తు అంటేనే బ్రహ్మవిద్య అని అర్థము.

వేదములో ఉత్తరార్థంగా గోచరించే వేదాంతము అనే ఈ జ్ఞానకాండ కోరికల్ని తీర్చే ప్రయత్నంలో ఉండదు. కోరేవాణ్ణి గూర్చి చర్చించే విషయంలో ప్రమాణమై ఉంటుంది. కర్మలు, క్రియలు, ఫలాలను ప్రక్కనబెట్టి సూటిగా కర్తను గూర్చి చర్చిస్తుంది.

జ్ఞానకాండ కోరికలను ఎందుకు తీర్చదు? ఆ ప్రయత్నం ఎందుకు చేయదు? తనకు ఆ శక్తి లేదా? వేదం లోని కర్మకాండ కన్నా శక్తివంత మైనది వేదాంతము. కోరికలను తీర్చే శక్తి ఉందా, లేదా? అనేది అప్రధాన మైన విషయం. కోరికలు తీరినా, తీరక పోయినా, ఒరిగేది ఏమీ ఉండదు అనేదే వేదాంతానికి ప్రధానమైన విషయం. అందుకనే,

స్వప్నస్థ రాజ్యభిక్షాభ్యాం ప్రబుద్ధః స్పృశతే ఖలు!

కలలో రాజు అయిన వానికి మేలుకుంటే సింహాసనం ఉంటుందా? స్వప్నంలో భిక్షాటనం చేసిన యాచకునికి

మేలుకుంటే అక్షయపాత్ర ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించి కోరికల వల్ల కలిగే సుఖదుఃఖాలు స్వప్నతుల్యాలు అని స్పష్టం చేసింది ఉపనిషత్తు. అందుచేత కోరికల జోలికి ఉపనిషత్తు పోదు.

ఈ సందర్భంలో కర్మకు, జ్ఞానానికి ఉన్న తేడా అస్పష్టంగా ఉండ కూడదు. అస్పష్ట అవగాహనలు గీతను అర్థం చేసుకోవడానికి సరిపోవు. కోరికలు తీర్చే పనిలో కర్మకాండ ఉంటుంది. కోరేవాణ్ణి పట్టించుకొని వేదాంతం చర్చిస్తుంది.

ఇప్పటి వరకు ఎన్నో కోరుకున్నాం. కోరినవి కొన్ని సాధించుకున్నాం. అయినా, సాధించుకో లేనివి చాలా మిగిలి ఉన్నాయి. ఎన్ని తీరినా, తృప్తి తీరని వ్యక్తి గానే మనిషి మిగిలి పోతున్నాడు. వ్యక్తి ఎంత తెలివి గల వాడైనా ఈ వెలితి నుండి తప్పించుకోలేక పోతున్నాడు. వెలితిని తొలగించి, వెలుగును ప్రసాదించే జ్ఞానం ఒక్క ఉపనిషత్తుల్లోనే ఉంది.

వేదాలు కర్మకాండకు పరిమితమై ఉంటాయి. వాటిలోని జ్ఞానము సంసారానికి సంబంధించిన జ్ఞానము *(త్రైగుణ్య విషయాః)*. ఈ సంసార హేతువులైన త్రైగుణ్య విషయాల నుండి విడిపడి కోరికలను దాటిన వాడవు కా! *(నిస్త్రైగుణ్యో భవ!)* అని బోధిస్తున్నాడు గీతాచార్యుడు.

ముల్లోకాలు ఈ మూడే

కర్మకాండను బోధించే వేదాలు త్రైగుణ్య విషయాలు. వివేక జ్ఞానము లోపించి, భోగైశ్వర్యాలే ప్రధాన మనుకొని జీవించే వారికి వేదము అంటే త్రైగుణ్య విషయమే అని అభిప్రాయం. త్రిగుణాలకు సంబంధించిన విషయాలు త్రైగుణ్యాలు.

సత్త్వగుణము, రజోగుణము, తమోగుణము - ఈ మూడు గుణాలను త్రిగుణములు అంటారు. సత్త్వగుణము సుగుణము. రజోగుణము అవగుణము. తమోగుణము దుర్గుణము. సత్త్వగుణము సహకరిస్తుంది. రజోగుణము వికటిస్తుంది. తమోగుణము పాడు చేస్తుంది. సత్త్వగుణములో జ్ఞానము, ప్రశాంతత ఉంటాయి. రజోగుణములో రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, ఆవేశాలు, ఆందోళనలు ఉంటాయి. తమోగుణములో సోమరితనము, నిద్ర, దుఃఖాదులు ఉంటాయి.

ఈ ప్రపంచ మంతా మాయామయము. మాయలో ఈ త్రిగుణాలే ఉంటాయి. మాయకు స్వతంత్ర మనుగడ లేదు. మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంటుంది *(బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమో గుణాత్మికా మాయా అస్తి)*. ప్రపంచమే మాయా నిర్మితము కనుక మాయలో ఉన్న త్రిగుణాలే ప్రపంచంలో కనిపిస్తాయి.

సర్వలోకాలు సృష్టి లోనివే. మాయా స్వరూపాలే. ప్రపంచమే త్రిగుణ మిళితం. భోగైశ్వర్యాలు, వాటిని పొందడానికి ఆచరించే సాధనలు ఈ త్రిగుణాల యొక్క కార్యాలే. కారణమైన మాయలో ఉన్న త్రిగుణాలే కార్యమైన జగత్తులో ఉన్నాయి. పరలోకం కూడా సృష్టి లోనిదే. కనుక, స్వర్గలోక భోగాలు, వాటిని పొందడానికి ఆచరించే సాధనలు కూడా త్రిగుణముల లోనివే.

త్రైగుణ్యమే సంసారము. సంసారానికి సంబంధించిన విషయాలను బోధించేవి త్రైగుణ్య విషయాలు *(త్రైగుణ్యం సంసారః విషయః ప్రకాశయితవ్యః యేషాం తే వేదాః త్రైగుణ్య విషయాః)*.

సాధ్య సాధనములు

త్రిగుణముల కారణంగా రాగద్వేషాలు అనే కార్యాలు ఏర్పడ్డాయి. ఈ రాగద్వేషాలకు సంబంధించిన విషయాలనే వేదాలు బోధిస్తాయి. ఎవరు ఏ ఫలమును ఆశిస్తారో, వారికి తత్సంబంధ మైన సాధనల్ని తెలుపుతాయి. కొన్ని విషయాలలో ఫలితాలు కనిపిస్తాయి. కొన్ని విషయాలలో అగోచరంగా ఉంటాయి. కొన్నిటిని

పరిశీలించుకొనే అవకాశం ఉంటుంది. కొన్నిటిని విశ్వసించాలే గాని పరీక్షించి చూసుకొనే అవకాశం ఉండదు.

సంతానం లేని వారు సంతానం కలగ డానికి యాగం చేస్తారు. వర్ష పాతానికి యజ్ఞాలు నిర్వహిస్తారు. వీటికి ఫలితాలు ఉన్నాయా, లేదా అనేది పరీక్షించి చూసుకోవచ్చు. కాని, స్వర్గప్రాప్తి కోసం యజ్ఞం చేస్తే, దానిని ఎలా నిర్ధారణ చేసుకోవాలి? విశ్వసించాలి. అంతే.

ఏది ఏమైనప్పటికి వేద ప్రతిపాదితమైన కర్మల వలన కలిగే ఫలితాలు ఏవైనా అనిత్యాలే. నశించేవే. సంతానం కలిగినా నశించి పోవలసిందే. స్వర్గం ప్రాప్తించినా పుణ్యం క్షీణించ గానే పోగొట్టుకో వలసిందే.

త్రైగుణ్య విషయాలు సంసారము అని ఎప్పుడైతే చెప్పబడిందో, ఇక వేదము లోని కర్మకాండను ఆశ్రయించి మనం సాధించ బోయేది సంసారాన్నే కాని మరొక దానిని కాదు. సంసారానికే యజ్ఞ యాగాదులైతే, ఇక శ్రమించి వాటిని ఆచరించడ మెందుకు? సంసారాన్ని పొంది మనం ఏమి సాధించాలి? ఇప్పుడు మనం ఎక్కడున్నాం? సంసారంలో కాదా? మనం ముడిపడి ఉన్నది మూడు గుణాల్లో కాదా! చిక్కుముళ్ళు అన్నీ మూడు ముళ్ళే కదా! పీటముళ్ళు ఆ మూడే కదా!

పల్లవి : **వృథా చేయబోకు - ఈ జన్మము సదా రాదు నీకు** ॥ వృథా ॥

చరణములు : **ఉత్తమ జన్మమురా దీనిని వ్యర్థము చేయకురా**
ఉత్త సంసారమురా రేపది మృత్యురూప మౌరా ॥ వృథా ॥

మూడు గుణంబులలో నీవు ముక్తుడ గారాదా!
పాడు ఘటము కాదా, రేపది భస్మమై పోదా! ॥ వృథా ॥

అంటూ మూడుగుణాల సంసారం నుండి విడిపడి పొమ్మని సందేశాన్నిస్తూ చైతన్య గానం తత్త్వ గానాలాపన చేసింది. అందుకనే పరమేశ్వరుడు అర్జునా! గుణాల నుండి తప్పుకో! *(నిస్త్రైగుణ్యో భవ!)* అని ఆదేశిస్తున్నాడు.

ముడులు విడిపోనీ

గుణాలే సంసారం కనుక, సంసార దుఃఖం నుండి విడిపడాలి అంటే, సంసారాన్ని ప్రభావితం చేసే గుణాల నుండి బయట పడాలి. అందుకే, నిస్త్రైగుణ్యుడవు కా! అంటున్నాడు *(నిస్త్రైగుణ్యో భవ!)*.

గుణాల నుండి విడిపడ గలమా? విడిపడి ఉండ గలమా? అసలు మానవ శరీరమే గుణ సముదాయం కదా! త్రిగుణాలు పోతే, త్రిగుణాల కార్యమైన శరీరం మిగుల్తుందా? కనుక, నిస్త్రైగుణ్యుడు అంటే, కోరికలు లేనివాడు అని అర్థం *(నిష్కామః భవ ఇత్యర్థః)*. నిష్కాముడు అంటే అనిత్యమైన భోగైశ్వర్యముల మీద ఆసక్తి లేనివాడు. మమకారాన్ని పూర్తిగా త్యజించిన వాడు.

రెండు తరువాతే మూడు

కోరికల్ని జయించి కామనా రహితుడైన వాడే నిస్త్రైగుణ్యు డవుతాడు అని తెలుసుకున్నాం. కోరికల్ని జయించాలంటే ముందు ద్వంద్వాల నుండి విడిపడాలి. రెండిటి నుండి విడి పడితేనే మూడిటి నుండి విడి పడతాడు. రెండు తరువాతే కదా మూడు. కనుక ముందు ద్వంద్వముల నుండి విడిపడాలి *(నిర్ద్వంద్వో భవ!)*.

సుఖదుఃఖాలకు కారణమైన పరస్పర వైరుధ్యము గల శీతోష్ణాదులు ద్వంద్వములు అని చెప్పబడ్డాయి. ద్వంద్వాలు ఉన్నంత వరకు కోరికలు తప్పవు. ద్వంద్వాలు అనే కారణాలకు కామనలు కార్యాలు. కామనలు ఉంటే త్రిగుణాలు ఉన్నట్లే. త్రిగుణాలు ఉన్నంత వరకు సంసారం తప్పదు. సంసారం ఉన్నంత వరకు దుఃఖం అనివార్యంగా ఉంటుంది. కనుక ద్వంద్వాలను దాటి పోవాలి.

ద్వంద్వాలను దాటి పోయేది ఎలా? వాటి ప్రభావం బుద్ధిపై పడకుండా ఉంటే వాటిని దాటి పోయినట్లే. శీతోష్ణాలు, మానావమానాలు, జయాపజయాలు - ఇవన్నీ ద్వంద్వాలే. ఈ ద్వంద్వాల మధ్యే అందాలు పాడై పోతున్నాయి. ఆనందాలు అదృశ్య మవుతున్నాయి.

కర్మకాండను అంటిపెట్టుకొని, భోగైశ్వర్యాలకై అర్రులు చాస్తూ, సంసార వలయంలో చిక్కుకు పోయిన భోగవాదుల్ని గూర్చి గడచిన మూడు శ్లోకాలలో చెప్పుకున్నాం. వారిని కామాత్ములని తెలుసుకున్నాం *(కామాత్మానః)*.

ప్రస్తుతం భగవానుడు చెబుతున్నది వారికి విరుద్ధమైన జీవన విధానము. కర్మకాండను ఆశ్రయించుకొని కామాత్ములైన వారిది భోగజీవితం. జ్ఞానకాండను ఆశ్రయించుకొని నిష్కాములైన వారిది త్యాగ జీవితం.

కామాత్ముల మనస్సులలో కామం ఉంటుంది. నిష్కాముల హృదయాలలో కామం ఉండదు. ఆత్మస్పృహ ఉంటుంది.

ఆశ నిరాశల ఊయలలో
ఊగింది మనసు ఉసూరు మంటూ
ఆశే లేని జీవికి
ఉండదు నిరాశ ఎన్నటికి
ఆశ ఉంటే ఉండనీ
శివుడే ఆశలో నిండనీ
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ద్వంద్వాల నుండి విడిపడిన వారికే ఆశ అడుగంటుతుంది. నిష్కామ్యం వరిస్తుంది. ద్వంద్వాలను ఎలా దూరం చేసుకోవాలి? చెబుతున్నాడు. అర్జునా! నిత్యసత్త్వస్థుడవు కా! అప్పుడే ద్వంద్వాలను దాటి పోగలవు *(నిత్య సత్త్వస్థో భవ!)*.

పార్థా! ప్రశాంతంగా ఉండు!

నిత్య సత్త్వస్థుడు అంటే, నిత్యము సత్త్వ గుణాన్ని ఆశ్రయించిన వాడు అని అర్థము. అంటే, రజోగుణ, తమోగుణాలకు లొంగని అంతఃకరణము కలవాడు. సత్త్వగుణ ప్రధానంగా ఉండేవాడు ప్రశాంతంగా ఉంటాడు. ప్రసన్నంగా ఉంటాడు. ప్రియంగా ఉంటాడు. వివేకంతో ఉంటాడు. అతనిలో రజోగుణ ప్రేరితాలైన రాగము, రోషము, ఆవేశములు అణగారి ఉంటాయి. అలాగే, తమోగుణ ప్రేరితాలైన నిద్ర, అలసత, నైరాశ్యము, శోకములు అదృశ్యమై ఉంటాయి.

నృతియు సంప్రీతియును బ్రసన్నతయు నీ దృశ్యములగు సత్త్వగుణోదితములు
రాగలోభ రోషాదులు రాజసములు దర్పశోక ప్రముఖములు తామసములు

అని గుణ విశేషాలను వివరించింది ఆంధ్ర మహాభారతము (తిక్కన సోమయాజి).

శ్రీమద్రామాయణంలో విభీషణుడు సత్త్వగుణానికి ప్రతీక మైతే, రావణుడు రజోగుణానికి, కుంభకర్ణుడు తమోగుణానికి ప్రతీకంగా ఉంటారు. ముగ్గురూ సోదరులే. అలాగే త్రిగుణములు కూడా మాయాదేవి బిడ్డలే.

సత్త్వము అంటే బ్రహ్మ స్వరూపము అని కూడా అర్థము. నిత్య సత్త్వస్థుడు అంటే, సదా బ్రహ్మము నందే నిలకడగా ఉండువాడు అని అర్థము. ప్రశాంత జీవనమును గడిపేవాడు, బ్రహ్మభావన యందే స్థిరంగా నిలిచిన ధన్యాత్ముడు తన జీవనయాత్రను కూడా బ్రహ్మదృష్టి లోనే కొనసాగిస్తాడు. లేనిది కావాలి అనుకోడు. ఉన్నది పోయినా కలత చెందడు.

యోగక్షేమాలు

యోగక్షేమాలను మరచి మనుగడను సాగించ మంటున్నాడు. నిర్యోగక్షేముడుగా జీవించ మంటున్నాడు *(నిర్యోగ క్షేమః)*. లేని దానిని పొందడం యోగము *(అనుపాత్తస్య ఉపాదానం యోగః)*. పొందిన దానిని రక్షించుకోవడం క్షేమం *(ఉపాత్తస్య రక్షణం క్షేమః)*.

ఈ రెండే ప్రతి మనిషిని కుదిపేస్తూ ఉంటాయి. మనం ఆశించినవి కొన్ని లభించకుండా ఉంటాయి. ఒకవేళ లభించినా, నిలవకుండా పోతాయి. అలా పోతూనే ఉంటాయి. ఆశించింది రాకపోయినా దుఃఖమే. శ్రమించి సాధించుకున్న దానిని పోగొట్టుకున్నా శోకమే.

మొక్కను నాటడం యోగం, రక్షించుకోవడం క్షేమం. ఇల్లు కట్టుకోవడం యోగం. అది పాడు కాకుండా కాపాడుకోవడం క్షేమం. స్కూటర్ కొనడం యోగం. అది మూల పడకుండా చూసుకోవడం క్షేమం.

ఇక్కడ మరొక ముఖ్య విషయాన్ని గ్రహించాలి. యోగం విషయంలో ప్రాప్తం రెండు విధాలుగా ఉంటుంది. (1) మనము ఆశించకుండా ప్రాప్తించేవి. (2) మనం ప్రయత్నించి సాధించేవి. ఈ రెండూ యోగం క్రిందికే వస్తాయి.

మనం ఆశించకుండా ప్రాప్తించే యోగము అంటే, నా ఉద్దేశ్యం మనం అడగకుండానే పరమేశ్వరుడు ప్రసాదించినవి అని. మనకు దేహం ఉంది. మనం కోరితే వచ్చింది కాదు. ఆయన అనుగ్రహిస్తేనే వచ్చింది. అది మనకు నచ్చిందా నచ్చలేదా అనేది వేరే విషయం.

తల్లిదండ్రుల్ని మనం ఎన్నుకోలేదు. పుట్టిన తేదీని నిర్ణయించింది మనం కాదు. జన్మకాలం మనం సూచించింది కాదు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, పుట్టిన ప్రదేశము - ఇవన్నీ ఈశ్వరుడు నిర్ణయించిన విధంగానే మనకు ప్రాప్తించాయి. ఇదంతా యోగమే. అందుకనే, ఆశించని, ఊహించని ఆశ్చర్యాలు జరిగి నపుడు, 'ఆయన యోగం అలా ఉందండి' అంటూ ఉంటారు.

ఇక రెండవ యోగము మన ప్రయత్నంతో, కృషితో సాధించేది. అది మనం కట్టిన ఇల్లే కావచ్చు, తాళి కట్టిన ఇల్లాలే కావచ్చు, కన్నబిడ్డలే కావచ్చు, కొన్న కాంచనమే కావచ్చు. తినే కంచమే కావచ్చు. ఇవన్నీ కూడా పూర్వం లేకుండా ఉండి, ఆ తరువాత మన ప్రయత్నంతో పొందినవి కనుక యోగము క్రిందికే వస్తాయి.

యోగమైతే ఇలా రెండు విధాలుగా ప్రాప్తిస్తూ ఉంది కాని, క్షేమం మాత్రం రెండిటికి ఒక్కటే. పరమేశ్వరుడు ప్రసాదించిన యోగాలైనా, మనం కృషితో సాధించిన యోగాలైనా - రెండిటిని రక్షించుకోవడం మాత్రం చేస్తూనే ఉంటాం. కాని, విచిత్ర మేమిటంటే, రెండు యోగాలూ నిలవవు. రెండిటినీ కాపాడుకో లేము. రెండిటినీ పోగొట్టుకోవలసిందే. కాకపోతే, ఏది ముందో, ఏది వెనకో తెలియదు. పోతాయని మాత్రం ఖచ్చితంగా తెలుసు. పరమేశ్వరుడు ఇచ్చిన ఒళ్ళు నిలవదు. మనం కట్టుకున్న ఇల్లూ నిలవదు. ఒళ్ళు కాలి బూడిదై పోతుంది. ఇల్లు కూలి నేల పాలవుతుంది. ఇంకెక్కడి సంబంధాలు? ఎవరి కున్నాయి అనుబంధాలు?

న మే దేహా న సంబంధో మేఘేనేవ విహాయసః

మేఘంలో ఆకాశానికి సంబంధం ఉందా? నాకు మాత్రం దేహంతో ఎక్కడుంది సంబంధం? అని సూటిగా ప్రశ్నించాడు ఋషి కుండికోపనిషత్తులో.

ఉన్నవి నిలవవు కనుక వాటి క్షేమాలు చూడ నవసరం లేదంటారా? అలా ఎందుకంటాము? కాపాడుకొనే ప్రయత్నం చక్కగా చేయాలి. చెయ్యి జారిపోతే మాత్రం, విలక్షణంగా ఉండటం మన స్వభావం కావాలి అంటున్నాడు భగవానుడు. అంతే.

అన్నీ పోయేవే. ప్రతి దానికి వచ్చే కాలం ఉంది. అలాగే పోయే కాలం ఉంది. పోయే క్షణాన ఎవ్వరూ దేనినీ ఆపలేరు. ఇలా ఆలోచించి నపుడు యోగక్షేమాలు లాభాలా, నష్టాలా? రెండూ కావు. ఎందుకని? వచ్చేవి పోతాయి అని తెలిసి నపుడు వచ్చేవి లాభాలూ కావు, పోయేవి నష్టాలూ కావు.

ఈ లోకంలో దైవానుగ్రహంగా మనకు ప్రాప్తించినవి, మన ప్రయత్నంతో మనం సాధించినవి రెండూ మిగలవు. అంతేకాదు, ఒకవేళ స్వర్గం ప్రాప్తించినా, అది కూడా పోయేదే. అందుచేతనే, పుణ్యాన్ని, ధర్మాన్ని, స్వర్గాన్ని గూర్చి చర్చించిన ధర్మశాస్త్రాలు కూడా వాటిని లాభాలుగా పరిగణించ లేదు. ఆత్మజ్ఞానాన్నే అక్షయ లాభంగా కీర్తించాయి.

ఆత్మలాభా న్న పరం విద్యతే

ఆత్మలాభానికి మించి పొంద దగిన లాభ మంటూ లేదు అని ఆపస్తంభ ధర్మ సూత్రము సుస్పష్టం చేసింది.

అర్జునా! అప్రమత్తంగా ఉండు!

ఇక్కడ **ఆత్మవాన్** అంటే సదా ఆత్మ చింతనమే కలవాడు అని అర్థం. బ్రహ్మాకార వృత్తిని అఖండంగా సాగించేవాడు అని అర్థం. ఏ విధంగా నైనా బుద్ధిలో ఆత్మజ్ఞానమే ఉండాలి గాని, అనాత్మకు సంబంధించిన జ్ఞానము ఉండ కూడదు.

శ్రీ శంకరాచార్యస్వామి ***ఆత్మవాన్*** అంటే అప్రమత్తుడు అనే అర్థం చెప్పారు (***అప్రమత్తశ్చ భవ***). ఏమరుపాటు లేకుండా ఉండమని ఆదేశించారు. అంటే, దేహేంద్రియ మనోబుద్ధులను స్వాధీనంలో ఉంచుకో మని సూచించారు.

ఎంత విన్నా, ఎంత చదివినా, ఆచరణలో లేని విద్య సత్ఫలితా న్నివ్వదు. ***సాధనా భావే సాధ్యాభావః.*** సాధనము లేకుండా సాధ్యము లభించదు. అంటే, దేహేంద్రియ మనోప్రాణాలు అనాత్మ. వాటి యందు ఆత్మబుద్ధిని ఉంచకుండా అప్రమత్తుడవై ఉండు అని భావము. ఏవి ఉన్నా నష్టం లేదు. అవి 'మనము' అనుకుంటే మాత్రం లాభం లేదు.

ఆత్మవాన్ భవ! అర్జునా! ఆత్మవంతుడవు కా! అని ఈ శ్లోకంలో భగవంతుని చివరి మాట. అర్జునా! ధనవంతుడవు కా! బలవంతుడవు కా! గుణవంతుడవు కా! అని చెప్పకుండా ఆత్మవంతుడవు కా! అని ఉపదేశించాడు వాసుదేవ పరబ్రహ్మ.

ధనం దగా చేసేదే. బలం బలహీన మయ్యేదే. గుణాలు చంచలములే. ఆత్మజ్ఞానమే స్థిరం. ధృవం. ఆనందప్రదం. అనంతానంద స్వరూపం.

మరి, గీతాచార్యుడు చెప్పినట్లు ఇహపర సాధన సాధ్యాలను విస్మరిస్తే, తద్వారా లభించే సుఖాలు బ్రహ్మవిదునికి దూరమైనట్లే కదా! అని కొందరు సందేహిస్తూ ఉంటారు. అలాంటి దేమీ లేదు. బ్రహ్మవిదునికి

దూరంగా ఏ సుఖమూ లేదు. **సర్వం పదం హస్తి పదే నిమగ్నమ్.** *కుంజర పాదంలో సర్వ జంతువుల పాదములు ఇమిడి ఉన్నట్లు, బ్రహ్మానందములో సమస్త సుఖాలు ఇమిడి ఉన్నాయి అని తరువాత శ్లోకంలో బోధిస్తున్నాడు.*

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।
తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46

యావాన్-అర్థః-ఉదపానే-సర్వతః-సంప్లుతోదకే
తావాన్-సర్వేషు-వేదేషు-బ్రాహ్మణస్య-విజానతః

సర్వతః	= అంతటను	విజానతః	= పరమార్థ జ్ఞానము గల
సంప్లుతోదకే	= నిండిన జలప్రవాహము ఉండగా	బ్రాహ్మణస్య	= బ్రాహ్మణునకు
ఉదపానే	= నీరు లభించే బావి మొదలైన వానిలో	సర్వేషు	= సమస్తమైన
యావాన్	= ఎంతగా	వేదేషు	= వేదములలో
అర్థః	= ప్రయోజనం ఉండునో	తావాన్	= అంత ప్రయోజనము

బావులు, చెరువుల యందు మనకు ఎంత ప్రయోజనం సిద్ధిస్తుందో, అంతటా పొంగి పొరలుతున్న జలాశయంలో అంతే ప్రయోజనం సిద్ధిస్తుంది. అలాగే, వేదోక్త కర్మల వల్ల ఏ ఫలం సిద్ధిస్తుందో, పరమార్థం తెలిసిన సన్యాసికి అదే ఫలం సంపన్న మవుతుంది.

వ్యాఖ్య

అంతే ప్రయోజనం

వేదాల లోని కర్మకాండ ప్రతిపాదించే సకామ కర్మలను విడిచి పెట్టిన బ్రహ్మవిదునికి, ఆయా కర్మల వల్ల ఏర్పడే ఫలితాలు దూరం కావడం లేదా? ఆ ఫలితాలను బ్రహ్మజ్ఞాని పోగొట్టుకోవడం లేదా? అనే సంశయాన్ని నివారిస్తూ, సర్వత్ర వరద నీరు పొంగి ప్రవహించే టప్పుడు, బావులు, చెరువులు, నదులు మొదలగు వాటి వల్ల ఎంత ప్రయోజనం ఉంటుందో, సర్వము తానైన బ్రహ్మజ్ఞానికి త్రైగుణ్య విషయాలైన యజ్ఞ యాగ వ్రత తపో దానాదుల వల్ల అంతే ప్రయోజనం ఉంటుంది అని చెబుతున్నాడు.

ఉదపానే - 'ఉద' అంటే ఉదకము. ఉదకమును అనగా జలమును పానం చేస్తారు (***పిబన్తి***) కనుక, జలము ఉండే స్థానానికి ఉదపానము అని పేరు. నీరు ఉండే ప్రదేశాలు ఈ భూమిపై చాలా ఉన్నాయి. వాపీ, కూప, తటాక, నదీనదాలలో నీరు ఉంటుంది. ఆ నీరు మానవాళికి ఉపయోగ పడుతూ ఉంటుంది.

దిగుడు బావుల లోని నీరు (***వాపి***) పొలాలలో సేద్యానికి ఉపయోగ పడుతుంది. చేద బావుల లోని నీరు (***కూప***) పానం చేయడానికి పనికొస్తుంది. చెరువు నీరు (***తటాక***) స్నానం చేసేందుకు ఉపకరిస్తుంది. పారే జలము (నదీనదాలు) బట్టలు ఉతక డానికి ఉపయోగ పడుతుంది. వీటిలో ఒక్కొక్క దాని వల్ల ఒక్కొక్క ప్రయోజనం ఉంటుంది. కాని, సర్వత్ర వరద జలము ప్రవహించే టప్పుడు వీటి అవసరం ఉంటుందా? వాపీ కూప తటాక నదీ నదాల వల్ల కలిగే ప్రత్యేక ప్రయోజనా లన్నీ ఆ మహాజలాశయంలో కలుగుతూ ఉన్నాయి కదా! అలా, ఆ మహా జలాశయము సర్వత్ర వ్యాపించి నపుడు ఈ బావులు, చెరువులు, నదులు, మొదలైన వన్నీ ఆ జలాశయంలో అంతర్భూతాలై పోయాయి కదా! (***తత్ర అంతర్భవతి***).

అలాగే, త్రైగుణ్య విషయాలను బోధించే వేదాల వల్ల బ్రహ్మజ్ఞానికి అలాంటి ఫలమే ఉంటుంది. యాగాలు,

యోగాలు, యజ్ఞాలు, వ్రతాలు, తపస్సులు, దానాలు మొదలైన వన్నీ వేదాల లోని కర్మకాండలో ఉన్నాయి. ఆయా సాధనలు ఆచరిస్తే లభ్యమయ్యే ఫలితాలు కూడా అక్కడే చెప్పబడ్డాయి. బ్రహ్మవిదుడు ఈ వేదోక్త కర్మముల నన్నిటినీ త్యజిస్తున్నాడు. అలాగని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను పోగొట్టుకున్న వాడు కావడం లేదు.

ఎలాగైతే, వాపీ కూప తటాకాదుల వల్ల కలిగే ప్రయోజనా లన్నీ మహా జలాశయం వల్ల కలుగుతూ ఉన్నాయో, అలాగే బ్రహ్మవిదుని యందు వేదోక్త కర్మల వల్ల ఏర్పడే ప్రయోజనా లన్నీ సిద్ధించే ఉన్నాయి. ***శతే పంచాశత్.*** 'నూటిలో యాభై ఉండనే ఉంది' అనే న్యాయము చందమున బ్రహ్మజ్ఞానములో సర్వ వేదోక్త కర్మల ఫలము ఇమిడి ఉంది అని అర్థము.

వేదోక్త కర్మఫలాలు అందించే సుఖాలు నైమిత్తిక సుఖాలు. అంటే, ఒక కారణం వల్ల లభించేవి. నిమిత్తము ఉండటం వల్లనే ప్రాప్తించేవి. నిమిత్తం ఉండటం వల్ల ప్రాప్తించిన నైమిత్తిక సుఖాలు, నిమిత్తం పోగానే లేకుండా పోతాయి. స్వర్గమే తీసుకుందాం. పుణ్యం నిమిత్తంగా స్వర్గం అనే సుఖం లభిస్తుంది. పుణ్యం క్షీణించ గానే స్వర్గం దూర మవుతుంది. వేద ప్రతిపాదిత కర్మల వల్ల కలిగే సుఖాలన్నీ ఈ విధమైన నైమిత్తిక సుఖాలై ఉంటాయి.

బ్రహ్మజ్ఞాని లోని ఆనందము సహజ మైనది. మరొక కారణం వల్ల ప్రాప్తించింది కాదు. అది నిత్యసుఖమే కాని నైమిత్తిక సుఖం కాదు. ఈ నైమిత్తిక సుఖాల వల్ల ప్రాప్తించే ఆనందము కూడా వాస్తవానికి బ్రహ్మానందములో ఒక లేశమే నని ఉపనిషత్తు ఉద్ఘోషించింది ***(ఏతస్య ఏవ ఆనందస్య అన్యాని భూతాని మాత్రా ముపజీవన్తి).***

అంతా ప్రయోజనమే

బావి నీటి వల్ల కొంత ప్రయోజనము. చెరువు నీటి వల్ల కొంత ప్రయోజనము. నదీ జలము వల్ల కొంత ప్రయోజనము. మహా జలాశయము వల్ల అంతా ప్రయోజనమే.

వేదాల లోని సకామ కర్మల వల్ల కలిగే ప్రయోజనాలు సాధన సాధ్యాలను బట్టి భిన్నంగా ఉంటాయి. ఏ కర్మకు ఆ ఫలమే ప్రాప్తం. ఏది చేసుకుంటే అదే ఫలం. ఎంత చేసుకుంటే అంతే ఫలం. కాని, బ్రహ్మజ్ఞానము వల్ల కలిగే ఫలం అనంతఫలం. అంతా ఫలమే.

అంతం కలిగిన కర్మల ఫలితాలను ఆశించే మానవుల ప్రవృత్తిని బట్టి చూచినా, పెద్ద ప్రయోజనం లభించే టప్పుడు, చిన్న ప్రయోజనాన్ని త్యజించడం మనం చూస్తూ ఉంటాం.

పెద్ద ఉద్యోగం లభిస్తే వ్యక్తి చిన్న ఉద్యోగాన్ని త్యజిస్తాడు. మధ్యమ ఫలాల కోసం అధమ ఫలాలను, ఉత్తమ ఫలాల కోసం మధ్యమ ఫలాలను మానవులు విడిచి పెడుతూ ఉండటం సర్వ సామాన్యమైన విషయం.

న తే (జ్ఞానినః) కర్మ ప్రశంసన్తి కూపం నద్యాం పిబన్నివ

నదిలో పుష్కలంగా నీరు లభించే టప్పుడు మనిషి బావికి ప్రాధాన్యత నివ్వనట్లు, బ్రహ్మజ్ఞాని సకామ కర్మలకు ప్రాధాన్యత నివ్వడు అని మహాభారతంలో వ్యాసోక్తి.

బావులలో, నదులలో, చెరువులలో నీరు పెరుగుతూ ఉంటుంది. తరుగుతూ ఉంటుంది. సముద్రజలం పెరగదు. అలాగే తరగదు. సకామ కర్మల వల్ల ఏర్పడే సుఖాలలో వృద్ధిక్షయాలు ఉంటాయి. బ్రహ్మజ్ఞానం పూర్ణరూపమైంది. బ్రహ్మజ్ఞాని పూర్ణపురుషుడు. అతడి ఆనందాన్ని పెంచేవారు లేరు, తగ్గించేవారూ లేరు.

మరి, అలాంటప్పుడు, బ్రహ్మజ్ఞానం కొరకే ప్రయత్నం చేస్తే సరిపోతుంది కదా! కర్మలు చేయడ మెందుకు? అని అర్జునుడు ప్రశ్నించకుండా, కర్మయోగ ప్రాశస్త్యాన్ని ప్రముఖంగా తరువాత శ్లోకంలో వివరిస్తున్నాడు.

అర్జునుడికి వేదం తెలుసు. వేదం లోని కర్మకాండ అంతా తెలుసు. కాని, కర్మను కర్మయోగంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకో వలసిన సమయం ఆసన్నమైంది. అర్జునుడి అదృష్టం కొద్దీ అందించేవాడు అచ్యుతు డయ్యాడు.

కర్మ ణ్యే వాధికార స్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతు ర్భూ ర్మా తే సఙ్గోఽ స్త్వకర్మణి ॥ 47

కర్మణి-ఏవ-అధికారః-తే-మా-ఫలేషు-కదాచన
మా-కర్మఫలహేతుః-భూః-మా-తే-సంగః-అస్తు-అకర్మణి

తే	= నీకు	తే	= నీకు
కర్మణి ఏవ	= కర్మము నందే	కర్మఫలహేతుః	= కర్మఫలమునకు కారణమైన వాడవు
అధికారః	= అధికారము	మా భూః	= కావద్దు
ఫలేషు	= ఫలము నందు	అకర్మణి	= కర్మ చేయక పోవుట యందు
కదాచన	= ఒకప్పుడును	సంగః	= ఆసక్తి
మా	= లేదు	మా అస్తు	= ఉండ కూడదు

అర్జునా! కర్మల యందే నీకు అధికారం. ఫలాల విషయంలో ఎప్పుడూ అధికారం లేకుండా ఉండు. కర్మ ఫలాలకు నువ్వు కారణం కావద్దు. అలాగని కర్మలను మానేయాలని చూడకు.

వ్యాఖ్య

సుందరంగా, సుశోభితంగా, సముజ్జ్వలంగా భాసించే పరమేశ్వరుని సృష్టిలో ఒక కాలంలో, ఒక ప్రదేశంలో మనం జన్మించాము. జన్మించడం మన అధీనంలో లేదు. కాని, జీవించడం మన చేతి లోనే ఉంది.

పరిస్థితుల్ని మనం శాసించ లేము. ప్రవర్తనను మనం సరిదిద్దుకో గలం. బాహ్యాన్ని మార్చడం మనకు సాధ్యం కాదు. బాహ్యంలో ఏది ఎందుకు జరుగుతూ ఉందో, వాటికి సంబంధించిన పూర్ణజ్ఞానం మనకు లేదు. జ్ఞానం లేనపుడు ఏం మార్చగలం? కాకపోతే, మనకు దృఢ నిశ్చయ మంటూ ఉంటే, అంతర్యాన్ని మార్చుకొని ఆనందంగా జీవించగలం. బుద్ధిని సరి చేసుకొని బ్రతుకును భవ్యంగా తీర్చుకోగలం.

జీవితంలో అన్నీ అనుకూలంగా ఉండవు. నేడు ఉండినా రేపు ఉంటాయని చెప్పలేము. అన్నీ మారుతూ ఉంటాయి. వాటితో పాటు మనస్సు కూడా మారుతూ ఉంటే, మథన పడుతూ ఉంటే, ఇక జీవితంలో సుఖపడట మనేది కుందేటి కొమ్మే అవుతుంది.

కొన్ని కావాలి అనుకుంటాం. కావాలి అనుకున్నవి రావాలి అని కోరుకుంటాం. వాటిని పొందాలని కర్మలు చేస్తాము. కొన్ని వస్తాయి. అన్నీ రావు. అలాగే, ఉన్నవి ఇష్టం లేకపోతే, అవి పోవాలి అని కర్మలు చేస్తాం. కొన్ని పోతాయి. అన్నీ పోవు.

ఇష్టమైనవి దగ్గరగా ఉండాలి అనుకుంటాం. కానీ, ఉండవు. ఇష్టం లేనివి దూరంగా పోవాలి అనుకుంటాం. కాని, పోవు. ఉండటానికి వచ్చినవి పొమ్మన్నా పోవు. పోవడానికి వచ్చినవి ఉండమన్నా ఉండవు. ఈ రెండిటి మధ్య ఆనందంగా బ్రతకడం ఎలాగో మనిషికి అర్థం కావాలి.

బ్రతకడం మనిషికి తెలుసు. ప్రాణం ఉన్నందుకు ఏదో ఒక విధంగా బ్రతికేస్తాడు. బ్రతుకు బండిని లాగేస్తాడు. కాని, ఆనందంగా బ్రతకడం మనిషికి తెలియదు. సుఖంగా జీవనయాత్రను సాగించడం ఎలాగో

అర్థం కాదు. ఆ రహస్యాన్ని భగవద్గీత బయట పెడుతుంది. అలా జీవించే పద్ధతిని కర్మయోగం బోధిస్తుంది. ప్రస్తుతం మనం గీతాసౌధంలో ఈ అద్భుతాన్ని వీక్షిస్తున్నాం. నాలుగు చక్రాల మీద ఆధారపడి కారు పరుగులు తీస్తూ ప్రయాణం చేసినట్లు, ప్రధానంగా నాలుగు విషయాల మీద ఆధారపడి కర్మయోగ శకటము పవిత్రమైన మార్గంలో జ్ఞానం వైపు పరుగులు పెడుతూ ఉంది.

అర్జునా! (1) కర్మ చేయడంలో నీకు అధికారం ఉంది. (2) ఫలితం విషయంలో ఎప్పుడూ లేదు. (3)కర్మ ఫలాలకు నువ్వు కారణం కావద్దు. (4) కర్మను చెయ్యకుండా ఉండటానికి ఆసక్తి చూపవద్దు. అందమైన, అద్భుతమైన ఈ శ్లోకంలో ఈ నాలుగు ప్రధానమైన విషయాలు. మొదటిది విధివాక్యం. అంటే చేయదగింది. మిగిలిన మూడు నిషేధ వాక్యాలు. అంటే, చేయ కూడనివి.

నిర్ణయాధికారం నీదే

ప్రాణులన్నీ కర్మ చేస్తాయి. చలించడం ఏదైనా కర్మే *(చలనాత్మకం కర్మ)*. మనిషి ఒక్కడే కాదు, ప్రతి ప్రాణి కర్మలో నిమగ్నమయ్యే ఉంది. కాకపోతే, కర్మ స్వేచ్ఛ మనిషికి మాత్రమే ఉంది. పశుపక్ష్యాదులకు లేదు. అవి సహజాతాలతో పని చేస్తాయి. అందుచేత, సృష్ట్యాది నుండి అవి ఒకే విధంగా ఉన్నాయి. ఇంత కాలం గడచినా, పాపం మోసం చేసేది ఎలాగో ఇప్పటికీ నేర్చుకోలేక పోయాయి. మానవుని లాగా ప్రగతిని సాధించలేక పోయాయి.

మనిషికి బుద్ధి ఉంది. ఆలోచించే పరిజ్ఞానం ఉంది. విచారించే వివేక ముంది. కనుకనే, కర్మ స్వేచ్ఛ ఉంది. ఈ స్వేచ్ఛనే అధికారం అంటున్నాడు గీతాచార్యుడు. ఒక పనిని చెయ్యాలి అనుకుంటే మనిషి చెయ్యగలడు *(కర్తుం శక్యం)*. ఒక పనిని చెయ్యకూడదు అనుకుంటే, చెయ్యకుండా ఉండగలడు *(అకర్తుం శక్యం)*. ఒక విధంగా చెయ్యాలి అనుకున్న దానిని మరొక విధంగా కూడా చెయ్యగలడు *(అన్యథావా కర్తుం శక్యం)*. ఈ స్వేచ్ఛ మనిషికి ఉంది. ఇదే కర్మలలో అధికారము.

గోడ కట్టినా, గుంట త్రవ్వినా, పద్యం వ్రాసినా, పాట పాడినా, అవలోకించినా, ఆలోచించినా, వ్యవసాయం చేసినా, వ్యాపారం సాగించినా, కట్టె కొట్టినా, కట్టు కట్టినా, ఉద్యోగం సాగించినా, ఉద్యమం కొనసాగించినా - ఇవన్నీ కర్మలే. నీ ఇష్టంతో జరిగేవే. నిర్ణయాధికారం నీదే. అర్జునా! కర్మ చేయడంలో నీకు అధికార ముంది *(కర్మణి ఏవ అధికారః తే)*.

యుద్ధానికి రావాలి అనుకున్నావు, వచ్చావు *(కర్తుం శక్యం)*. యుద్ధం చెయ్యను అని కూర్చున్నావు *(అకర్తుం శక్యం)*. యుద్ధం మానేసి సన్యాసి నవుతాను అంటున్నావు *(అన్యథావా కర్తుం శక్యం)*. అర్జునా! నీకు కర్మస్వేచ్ఛ, కర్మ విషయంలో అధికారం ఉండ బట్టే ఇన్ని రంగులు మారుస్తున్నావు. క్రొత్త క్రొత్త హంగులు చూపిస్తున్నావు.

మొదటి చక్రం బాగానే తిరుగుతోంది. రెండవ చక్రం దగ్గరే సమస్య తలెత్తుతూ ఉంది. చక్రంతో పాటు తల కూడా తిరుగుతోంది. కర్మ చేయడంలో అధికారం ఉంది అనే మొదటి విషయం అర్థమైంది. ఫలితం విషయంలో అధికారం లేదు అనే రెండవ విషయమే కాస్త మ్రింగుడు పడకుండా ఉంది.

ఎవరు ఏ కర్మ చేసినా ఫలితాన్ని ఊహించే చేస్తారు. గోళ్ళు కొరుకుతూ కూర్చున్నా, మనస్సులో ఏదో మ్రింగుడు పడని విషయం ఉందనే అర్థం. కొరికితే ఏమన్నా మ్రింగుడు పడుతుందేమో అనే ఆశ. అంతే. ఏ కర్మ చేసినా, దాని వెనుక ఏదో సాధించాలి అనే కోరిక ఉండి తీరుతుంది. అదే ఫలాశ. ఫలాసక్తి. కర్మ చేసే అధికారం నీకు ఉంది. కాని, ఫలం విషయంలో అధికారం లేదు అనేదే కష్టపడి మ్రింగినా జీర్ణం కాని విషయం.

కర్మ చేసే అధికారం ఉన్నప్పుడు, ఫలాన్ని పొందే అధికారం లేకుండా ఎలా ఉంటుంది? నా కర్మకు నేను బాధ్యుణ్ణే అయి నపుడు, నా కర్మఫలానికి మరొకరు బాధ్యులు ఎలా అవుతారు? నా కర్మ యొక్క ఫలాన్ని ముందుగా ఊహించే కదా నేను కర్మ చేశాను? ఎవరైనా అలాగే చేస్తారు. ఫలితాన్ని ఊహించకుండా ఎవరైనా ఎందుకు చేస్తారు?

ప్రయోజనం అనుద్దిశ్య మందోఽపి న ప్రవర్తతే

ఫలితాన్ని ఊహించకుండా బుద్ధిహీనుడు కూడా కర్మ చేయడు. మరి, ఫలితాన్ని ఊహించి కర్మను ఆచరించే టప్పుడు, కర్మ విషయంలో ఉన్న అధికారం, ఫలం విషయంలో ఎందుకు లేదు? ఇవన్నీ చక్కని ప్రశ్నలు. వీటన్నిటికీ ఈ శ్లోకంలో జవాబులు చిక్కుతాయి.

ఈ చిక్కుముడులు విప్పే ముందు నేను ఒక్క ప్రశ్న మీ ముందు ఉంచుతాను; నాకూ కర్మాధికారం ఉంది కనుక! ఎన్నికల్లో నిలబడిన నలుగురు అభ్యర్థులు విజయం అనే ఫలాన్ని ఊహించే కదా పోటీ చేయడం అనే కర్మను సాగిస్తారు! ఎన్నికల్లో నిలబడే అధికారం నలుగురికీ ఉంది. లేకపోతే ఎలా నిలబడతారు? విజయాన్ని నలుగురూ ఊహించే కదా పోటీ చేశారు! మరి గెలిచే అధికారం నలుగురికీ ఉందా? ఉంటే, ముగ్గురెందుకు ఓడుతారు? అలాగని, గెలిచిన వ్యక్తికి అధికారం ఉందంటారా? అదే వాస్తవమైతే, ఓడిన ముగ్గురికి కూడా గెలిచే అధికారం ఉండాలి కదా? నలుగురికి అర్హతలు ఉండబట్టే కదా నిలబడ్డారు? ధరావత్తు సొమ్ము నలుగురు చెల్లించారూ కదా! కాస్త ఆలోచించండి.

ఈ ప్రపంచంలో శ్రమించే సేవకులుగా మనం ఉన్నామే గాని, జీతాలిచ్చే యజమానులుగా లేము. ఇక్కడే ఫలితాలను సాధించడంలో అధికారులం కాలేక పోతున్నాం. ఎందుకని? కాస్త విశ్లేషించి అర్థం చేసుకుందాం.

ఫలం దైవాధీనం

కర్మయోగం అంటే ఫలితాలను ఊహించకుండా కర్మలు చేస్తూ పోవడం అని చాలా మంది వ్యాఖ్యానిస్తూ ఉంటారు. ఇలాంటి అశాస్త్రీయ, అహేతుక విషయాలను గీత బోధించదు. ఫలితం మీద దృష్టి లేకుండా, ఫలితాన్ని ఊహించకుండా, ఎవరైనా కర్మ చేయగలరా? ఫలితం మీద దృష్టి లేనపుడు కర్మ చేయడం ఎందుకు?

అర్జునా! కర్మ చేయడంలో నీకు అధికారం ఉంది. ఫలితంలో లేదు **(మా ఫలేషు)** అన్నాడు భగవానుడు. అంతేగాని, ఫలితం ఊహించ వద్దు అని చెప్పలేదు. ఫలితాన్ని ఊహించే అందరూ కర్మల్ని ఆచరిస్తారు.

జీతాన్ని ఊహించే ఉద్యోగం చేస్తాం. అదే ఫలమంటే. ఆటలో గెలవాలనే ఆడతాం. పరీక్షల్లో ఉత్తీర్ణులం కావాలనే వ్రాస్తాం. ఉద్యోగాన్ని సంపాదించాలనే ఇంటర్వ్యూకి వెళ్తాం. ఈ కర్మ లన్నీ ఊహించే ఆచరిస్తాం. అలాగే చేయాలి. కాకపోతే, మనం ఊహించిన ఫలితాలు రావచ్చు. రాకపోవచ్చు. ఫలం విషయంలో మనకు అధికారం ఉండేట ట్లయితే, అలా రాకపోవడం అనేది ఉండనే ఉండదు. ఇక్కడే మనం కాస్త లోతుగా విశ్లేషించు కోవాలి.

క్రీడాకారుడు శ్రమించి ఆడాలి. గెలవాలనే ఆడాలి. కాని, ఆడేవా ళ్ళందరూ గెలవ లేరు. గెలుపుపై మనకు అధికారం ఉంటే ఎప్పుడూ విజయం మనదే కావాలి. ఆడే అధికారం మనకు ఉంది. విజయం విషయంలో మనకు అధికారం లేదు. పని చేయకుండానే జీతాల్ని ఆశించే నేటి సమాజం, కర్మ చేసిన వారికి కూడా

ఫలితంపై అధికారం లేదు అనే సత్యాన్ని అంగీకరించ లేదు. అంగీకరించలేని సత్యాన్ని అర్థమయ్యేలా బోధించడానికే శాస్త్రం ఉంది.

ఫలితాన్ని ఊహించి మనం కర్మ చేస్తాం. మనం కర్మ చేసినంత మాత్రాన ఫలితం రావాలనే నియమం లేదు. కర్మ చేయడమే కాకుండా, ఫలితం రావడానికి అనుకూలమైన పరిస్థితుల నన్నిటినీ మనం సఫలం చేయగలగాలి. అప్పుడే కర్మ సత్ఫలితా న్నిస్తుంది. కాని, అలా సఫలం చేయడం మన చేతిలో లేదు. మన చేత కాదు.

పంటను పండించడానికి రైతు తన వంతు కృషి తాను చేస్తాడు. కేవలం రైతు చేసే కృషి తోనే పంట రాదు. పంట పండాలి అంటే వర్షం సకాలంలో పడాలి. రైతు పంట పెట్టగలడే కాని, మేఘాల్ని పిండలేడు. అతివృష్టిని ఆపలేడు. అనావృష్టిని నివారించ లేడు. ఎన్నో కారణాల వల్ల పంట చేతికి అందకుండా పోతుంది. ఫలం వస్తే మనం అనుభవించగలం కాని, ఫలితాన్ని సృష్టించ లేము. కర్మఫలాన్ని సృష్టించుకొనే అధికారం మనకే ఉంటే, అసలు కర్మ చేయకుండానే ఫలితాన్ని సృష్టించుకో వచ్చు. అది సాధ్యపడే పని కాదు. ఫలితం విషయంలో మనకు అధికారం లేదు కనుకనే భగవంతుడు, అర్జునా! కర్మ చేయడంలో నీకు అధికార ముంది, ఫలితంలో లేదు అంటున్నాడు (**కర్మణే వాధికారస్తే మా ఫలేషు కదాచన**). అంటే, ఎప్పుడూ లేదా? ఎప్పుడూ లేదు అనే దాని అర్థం. ఒకప్పుడు ఉంటే, మరొకప్పుడు కూడా ఉండే అవకాశం ఉంటుంది. **కదాచన** (ఎప్పుడూను) అనే పదం వాడటం లోని అర్థం అదే.

ఇంటి నుండి బయలుదేరి బండి నడుపుకుంటూ పోతుంటారు. ప్రమాదం జరగాలని ఎవరైనా అనుకుంటారా? కాని జరుగుతున్నాయా, లేదా? ఒకవేళ జరగ కూడదు అని సంకల్పించినా జరిగేవి జరగకుండా ఉంటాయా? జరిగేవి జరిగే తీరుతాయి.

ఈ ప్రపంచం పరమేశ్వరుని సృష్టి. అందమైనది. అర్థవంత మైనది. ప్రయోజనాత్మక మైనది. దీనికి సంబంధించిన సర్వజ్ఞానము ఎవ్వరికీ లేదు, పరమాత్మకు తప్ప. ఈ ప్రపంచంలో ఎవ్వరము సర్వజ్ఞులం కాము. కనుకనే ఏది ఎందుకు ఎప్పుడు ఎలా జరుగుతుందో అర్థం చేసుకోలేక సతమత మవుతుంటాము.

మనకు అర్థం కాక పోవచ్చు. కానీ, ఉన్న వన్నీ అర్థవంతం గానే ఉన్నాయి. ఉదజని, ప్రాణవాయువు కలసి నీరు తయారైంది. రాయిని పైకి విసిరితే, భూమి ఆకర్షించడం వల్ల క్రింద పడుతోంది. ఈ సృష్టిలో అన్నీ ధర్మబద్ధంగా నడుస్తున్నాయి. ప్రతిదాని వెనుక ఒక నియతి ఉంది. ఉంది కనుకనే ఆ ప్రత్యేకమైన విషయాన్ని అధ్యయనం చేయడానికి, పరిశోధించడానికి అవకాశం కలుగుతూ ఉంది.

ఈ సృష్టి లోని ధర్మాలను ఎవరు సృష్టించారు? ఎవరికి తెలుసు? విశ్వాన్ని గూర్చి వ్యక్తి ఏమి చెప్పగలడు? విశ్వానికి కర్త ఎవరో అతనికే విశ్వాన్ని గూర్చి తెలుసు. ఈ సృష్టి లోని చట్టా లన్నీ ఆయన అధీనం లోనే ఉన్నాయి. వాస్తవం చెప్పాలంటే ఈ చట్టాల రూపంలో ఉన్నది తానే. ధర్మరూపంలో ఉండేది దైవమే. ధర్మ రూపంలో ఉన్నాడు కనుక ఆయన సర్వజ్ఞుడు. సర్వజ్ఞుడు కనుకనే సర్వాన్ని సృష్టించ గలిగాడు (**సర్వజ్ఞః సర్వం సృజతి**). సర్వజ్ఞుడైన వాడే సర్వులు ఆచరించే సమస్త కర్మలకు ఫలితాన్ని ఇవ్వగలడు. కనుక కర్మ మన చేతి లోనే ఉంది. కాని, ఫలితం దైవాధీనం.

కోరుకునే శక్తి భగవంతుడు మనిషికి ప్రసాదించాడు. దానినే ఇచ్ఛాశక్తి అంటారు. కోరే శక్తి ఉన్నవాడు కోరుకుంటే తప్పేముంది? ఏది కోరుకున్నా తప్పు లేదు. మనం కోరింది రాకపోవడమూ తప్పు కాదు. అలా రాలేదని దుఃఖ పడటమే తప్పు. లాభం కొరకు వ్యాపారం చేయడం దోషం కాదు. కాని, నష్టం వస్తే, అది రావలసింది కాదు అని దుఃఖించడం మాత్రం సమంజసం కాదు.

ఏదైనా వచ్చింది అంటే, అది రావలసింది కనుకనే వచ్చింది. రాకూడని దైతే ఎందుకొస్తుంది? ఈ ప్రపంచంలో అనివార్యాలు ఉన్నవేమో గాని అసంభవాలు లేవు. మనం ఆశించింది రాకపోవచ్చు. అలాగని, మనకు రావలసిన దానిని ఆపే శక్తి ఎవ్వరికీ లేదు. మన ఊహలకు, ఆశలకు ఫలితాలు రాకపోవచ్చు. మన కర్మలకు ఫలితాలు వచ్చి తీరుతాయి.

ఏ కర్మకు ఏది ఫలమో, ఏ కర్మ ఫలము ఎప్పుడు రావాలో, ఎక్కడ రావాలో, సర్వజ్ఞుడికే తెలుసు. మనం సర్వజ్ఞులం కాము. కనుక సత్యాన్ని గ్రహించలేము. నేడు ఆచరించిన కర్మల యొక్క ఫలితాలను గూర్చే మనం ఆలోచిస్తాం. కాని, గత జన్మల లోని కర్మల యొక్క ఫలితాలు ఈ జన్మ లోని కర్మఫలితాలతో ఏకమై అందే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితులలో ఏదీ అర్థం గాని అయోమయ స్థితిలో మనం పడిపోతాము. అందుకనే ఫలాలలో నీకు అధికారం వద్దు అంటున్నాడు గీతాచార్యుడు.

పల్లవి : **ఏ కర్మమునకు ఏది ఫలమో ఎరిగినవా రెవరు?**
చేసిన కర్మము ఫలమును పొందక దాటే వారెవరు? ॥ ఏ కర్మమునకు ॥

చరణము : **నీది కానిది, నీకు లేనిది రమ్మన్నా రాదు**
నీది అయినది, నీకొర కున్నది పొమ్మన్నా పోదు
ఉండే వాటిని పొమ్మనకు, మరి లేనిది రమ్మనకు
రాకపోకల వాడుక తెలియక, వేడుక లేదనకు ॥ ఏ కర్మమునకు ॥

అని కర్మఫలాలను ఆరబోసింది చైతన్య గీతిక.

ఫల హేతువు పరమేశ్వరుడే

కర్మ చేయాలి. కర్మఫలము వస్తుంది. కర్మఫలము నందు మనకు అధికారము లేదు (**కర్మ కుర్వతః మా ఫలేషు అధికారః అస్తు, కర్మఫల తృష్ణా మా భూత్ కదాచన**).

కర్మ చేస్తాం. ఫలితం వస్తుంది. కాని అది మనం ఆశించిన విధంగా ఉండక పోవచ్చు. మనం ఒకటి ఊహిస్తాం. ఫలం మరొకటి వస్తుంది. మనం ఆశించింది రాలేదని ఆవేదన చెందుతాం. మనం ఊహించింది రాని మాట నిజమే. కాని, మనకు రావలసిందే వచ్చింది అనేది అంతకు మించిన నిజం. లోపం ఏదన్నా ఉంటే మన ఊహలో ఉంటుందే గాని సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు అందించే కర్మఫలంలో ఉండదు.

పరమేశ్వరుని అమృత హస్తాల నుండి అందుతూ ఉంది కనుక కర్మఫలము ప్రసాదము. ప్రసాదము అనేది వస్తువు కాదు, భావన. **ప్రసాదేతి ప్రసన్నతా.** ప్రశాంతతను కలిగించేది ఏదో అదే ప్రసాదము. ఫలహేతువు పరమేశ్వరుడు అనేది నిర్ధారణ కాగానే, ఫలం ప్రసాదంగా దర్శన మిస్తుంది.

ఏది అందినా, ఇచ్చేవాడు ఈశ్వరుడు కావడం వల్ల, అందినది ప్రసాదం అవుతుంది. ఏది అందుకుంటున్నా అందులో అందించే వాని రూపమే గోచరిస్తుంది. కనుక ప్రతి కర్మఫలమూ ప్రసాదమే.

ప్రసాదంలో ఇష్టాయిష్టాలు ఎవరి కుంటాయి? ప్రసాదాన్ని ఎవ్వరైనా కళ్ళ కద్దుకుని తీసుకుంటారు. తిరుపతి నుండి లడ్డు తెస్తే అది ప్రసాదము. శ్రీకాళహస్తి నుండి బిల్వపత్రం తెస్తే అది ప్రసాదము. శ్రీశైలం నుండి విబూది తెస్తే అది ప్రసాదము. కాశి నుండి గంగోదకం తెస్తే అదీ ప్రసాదమే. బృందావన ధూళి కూడా మహాప్రసాదమే. పదార్థాలు అనేకములు. కానీ, అన్నీ ప్రసాదాలే. కనుక ప్రసాదము అనేది వస్తువు కాదు, భావన అని తేలిపోయింది. ఒక వస్తువు పరమేశ్వరుని వద్ద నుండి వచ్చింది అని గుర్తించ గలిగే భక్తి మనకు ఉంటే, మరుక్షణమే ఆ వస్తువు ప్రసాద మవుతుంది.

ఈ విధమైన ప్రసాద భావనలో అంతా ప్రసన్నతే. ఆశించింది అందినా ప్రసాదమే. అందక పోయినా ప్రసాదమే. అధికంగా అందినా ప్రసాదమే. అల్పంగా అందినా ప్రసాదమే.

ప్రసాద భావనలో అనుకూలాలు అదృశ్య మవుతాయి. ప్రతికూలాలు పారి పోతాయి. ఏది అధికమో తెలియదు. ఏది అల్పమో అర్థం కాదు. కర్మయోగికి కర్మఫలాల యందు ఆసక్తి ఉండదు. అంతఃకరణ శుద్ధి కోసమే కర్మలు ఆచరిస్తాడు కనుక ఈ ప్రసాద భావన వల్ల బుద్ధి శుద్ధి పడుతుంది.

చరణము : **అనుకూలములు ప్రతికూలములు ఫలములలో లేవు**
అధికమైనా అల్పమైనా ఫలము నిష్ఫలము
రాగము కాని ద్వేషము లేని ఫలములు బాధించవు
ఏది వచ్చినా ఎలా వచ్చినా నీ కది ప్రసాదము

పల్లవి : **ఏ కర్మమునకు ఏది ఫలమో ఎరిగినవా రెవరు?**
చేసిన కర్మము ఫలమును పొందక దాటే వారెవరు?

మనకు ఏవి ఉన్నా, మనతో ఎందరు ఉన్నా, పరమేశ్వరుడు ప్రసాదిస్తేనే అవి మనకు కలిగాయి. అందుకే ఉన్న వన్నీ ప్రసాదాలు. ఉన్నవా రందరూ అనుగ్రహ రూపాలు.

సామాన్యునికి కర్మ సాధనం - ఫలం సాధ్యం. కర్మయోగికి కర్మ సాధనం - ఫలం చిత్తశుద్ధి. అందరూ ఫలం కోసం పని చేస్తారు. భక్తునికి ఫలాసక్తి ఉండదు. ఈ ప్రపంచంలో కర్మల వల్ల పొందే ఫలాలన్నీ ఏదో ఒకనాడు పోగొట్టు కొనేవే అని కర్మయోగికి తెలుసు ***(అస్మిన్ లోకే కర్మభిః సంపాదిత అనుభవః నష్టో భవతి!).***

కర్మశూన్యత దోషయుతం

ఫలాసక్తి లేనపుడు కర్మ చేయడం ఎందుకు? అని భావించకూడదు. ఒకవేళ కర్మలో దోషముంటే దానిని త్యజించ వచ్చు. దోషం కర్మలో లేదు. కర్మఫలం లోనూ లేదు. కర్మఫలాల విషయంలో మనం ప్రతిచర్యలతో స్పందించడంలో ఉంది. సమస్య అక్కడ ఉత్పన్న మవుతుంది.

కర్మను త్యజించడం ఎందుకు? ఆశించిన ఫలం రాదు అనే భయం ఉంటేనే కర్మను త్యజించాలి. కర్మకు ఫలం రాదని కర్మను ఆరంభించక ముందే నీకు తెలుసా? కర్మ చేస్తేనే కదా ఫలం వచ్చేది? కనుక కర్మ చేయాలి. వచ్చిన ఫలితాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. అప్పుడు ఏ దోషమూ అంటదు. కర్మయోగికి కర్మశూన్యత సమస్యల్ని సృష్టిస్తుందేమో గాని కర్మాచరణము సమస్య కాదు. ఫలాసక్తితో కర్మలు చేయడం రజోగుణ మైతే, కర్మశూన్యత తమోగుణ మవుతుంది. ఫలాపేక్ష లేకుండా కర్మలు ఆచరించడం సత్త్వగుణము. కర్మయోగి నిత్య సత్త్వస్థుడు.

కర్మయోగి కర్మఫలం కొరకు కర్మ చేయడు అని తెలిసింది. మరి కర్మలు ఎలా చేయాలి? ***(కథం తర్హి కర్తవ్యమ్ ఇతి ఉచ్యతే).*** *తరువాత శ్లోకం ఆ విషయాన్నే స్పష్టం చేస్తూ ఉంది.*

యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనఞ్జయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48

యోగస్థః-కురు-కర్మాణి-సంగం-త్యక్త్వా-ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోః-సమః-భూత్వా-సమత్వం-యోగః-ఉచ్యతే

ధనంజయ	= అర్జునా!	కర్మాణి	= కర్మలను
సంగం	= ఫలసంగమును	కురు	= చేయుము
త్యక్త్వా	= విడిచి	సమత్వం	= సమబుద్ధి
సిద్ధ్యసిద్ధ్యోః	= సిద్ధి యందు అసిద్ధి యందు కూడా	యోగః	= యోగమని
సమః భూత్వా	= సమభావంతో ఉన్నవాడవై	ఉచ్యతే	= చెప్పబడింది
యోగస్థః	= యోగములో ఉండి		

అర్జునా! యోగనిష్ఠలో ఉండి కర్మలను ఆచరించు. ఫలాసక్తిని విడిచి పెట్టు. ఫలము సిద్ధించినా, సిద్ధించక పోయినా సమబుద్ధితో ఉండు. సమత్వమే యోగము.

వ్యాఖ్య

నదిని దాటాలి అనేదే నీ అభిమత మైతే, నదిలో దిగకుండా నీవు ఆ పని చేయలేవు. కేవలం నదిలో దిగినా లాభం లేదు. ఈత తెలిసి ఉండాలి. లేకపోతే మునిగిపోయే ప్రమాద ముంది. మోక్ష తీరాన్ని చేరాలి అని అభిలషించే సాధకుడు కర్మ జలాలలో దిగక తప్పదు. అయితే, ఈ కర్మలను కర్మయోగంగా మార్చుకొనేది ఎలాగో తెలియక పోతే, మళ్ళీ సంసారంలో మునిగిపోయే ప్రమాదమే ఉంటుంది. కనుక యోగస్థుడవై కర్మలను ఆచరించు అని ఈ శ్లోకంలో గీత బోధిస్తూ ఉంది ***(యోగస్థః కురు కర్మాణి).***

యోగస్థుడు అంటే యోగము నందు ఉన్నవాడు. మరి, యోగం అంటే ఏమిటి? సమత్వమే యోగము ***(సమత్వం యోగ ఉచ్యతే)*** అని యోగానికి ఒక క్రొత్త నిర్వచనాన్ని ఈ సందర్భంలో గీత వినిపిస్తూ ఉంది. సిద్ధించినది, సిద్ధించనిది, ఈ రెండిటి విషయంలో సముడుగా ఉంటూ కర్మలు చేయమని చెబుతూ ఉంది ***(సిద్ధ్య సిద్ధ్యోః సమో భూత్వా. . . ., సిద్ధ్య సిద్ధ్యోః అపి సమః తుల్యః భూత్వా కురు కర్మాణి ఇతి).*** అదెలా సాధ్యం? సంగమును, అనగా ఆసక్తిని త్యజించి కర్మలు చేయడము వల్లనే. *(సంగం త్యక్త్వా).*

సంగత్వమే సంగతి

కర్మ చేస్తూపో. ఫలితాన్ని విడిచి పెట్టు. కర్మఫలానికి నీవు కారణం కావద్దు అని నలభై ఏడవ శ్లోకంలో కర్మయోగాన్ని బుద్ధికి పట్టించాడు భగవంతుడు.

కర్మ బంధము కాదు. ఫలాసక్తియే బంధము అని అర్థం చేసుకున్నాం. ఫలసంగం లేకుండా కర్మలను ఆచరించడం కర్మయోగంలో కీలకమైన విషయము. కర్మలు చేస్తూ, ఫలాసక్తిని విడిచి, ప్రసాద భావనతో కర్మఫలాలను అనుభవించడం వల్ల గతంలో చేసిన కర్మల వల్ల ఏర్పడిన వాసనలు తరిగిపోతూ ఉంటాయి. ఫలాసక్తిని విడిచి, రాగద్వేషాలు లేకుండా, ఈశ్వరభావనతో ప్రస్తుతం కర్మలు చేస్తూ ఉన్నాము కనుక, క్రొత్త వాసనలు అంతఃకరణములో తయారు కావు. ఈ విధంగా కర్మయోగంలో ఒక వైపు వాసనలు ప్రక్షాళన మవుతున్నాయి. మరో వైపు జ్ఞానప్రాప్తికి అంతఃకరణము శుద్ధిపడి సిద్ధపడుతూ ఉంది. హృదయం పవిత్ర మవుతూ ఉంది. ఇలాంటి హృదయమే ధ్యానానికి ఉపకరిస్తుంది. ఈ విషయాన్ని ఆరవ అధ్యాయంలో విపులంగా చెప్పుకుందాం.

జ్ఞానయోగంలో చరించే తత్త్వవిదునికి, కర్మయోగంలో సంచరించే కర్మయోగికి మోక్షమే పరమావధి కనుక సమబుద్ధి ఉండి తీరాలి. సంగత్వం ఉన్నంత వరకు సమత్వం ఉండదు. కనుక, కర్మయోగి సంగత్వాన్ని త్యజించి కర్మలు చేయాలి ***(సంగం త్యక్త్వా. . . కురు కర్మాణి).***

ఏ కర్మ తాను చేయవలసి ఉందో, ఆ కర్మను సంగత్వం లేకుండా, విధిగా కర్మయోగి నిర్వహించాలి. అంటే, కర్మ చేయాలి; కర్మసంగం ఉండ కూడదు. ఈ కర్మ నాది అనే భావన ఉండకూడదు. ఈ కర్మ నేను చేయవలసింది. నేను చేసేందుకు ఉంది అని భావించాలి. అంతేకాని, 'ఈ కర్మ నాది' అనే కర్మసంగం కర్మయోగికి పనికి రాదు. ఈ కర్మ నాది అని భావిస్తే, ఫలం ఎవరి దవుతుంది? కర్మ నాది అయినపుడు ఫలం కూడా నాదే అవుతుంది. ఇది ఫలసంగం. ఫలాసక్తి లేకుండా కర్మలను ఆచరించే వ్యక్తికి ఫలసంగం ఉండదు. కనుక, కర్మసంగం ఉండ కూడదు. ఫలసంగం ఉండ కూడదు.

కర్మ నాది కాదు అని స్పష్ట మైనపుడు, నేను కర్తను ఎలా అవుతాను? కర్తను కానపుడు కర్తృత్వ మెక్కడిది? కనుక, యోగికి కర్తృత్వ సంగం కూడా లేదు. కర్త అయినవాడే భోక్త అవుతాడు. కర్తృత్వం ఉంటేనే భోక్తృత్వం ఉంటుంది. కర్మ నాది కాదు అనే భావనతో కర్మయోగి కర్తృత్వం నుండి ఎప్పుడైతే విడిపడి పోతాడో, తత్కర్మఫలం కూడా నాది కాదు అనే భావనతో భోక్తృత్వ సంగం నుండి కూడా విడిపడి పోతాడు.

కర్మసంగం లేదు కనుక కర్తృత్వ సంగం లేదు. కర్తృత్వ సంగం లేదు కనుక ఫలసంగం లేదు. ఫలసంగం లేదు కనుక ఫల భోక్తృత్వ సంగం లేదు. ఇలా సర్వ సంగముల నుండి విడిపడి సమభావంతో ఉన్నవాడు కర్మయోగి. ఈ సమత్వమే యోగము అంటోంది భగవద్గీత. ఈ యోగంలో ఉన్నవాడు యోగస్థుడు. కర్మయోగి. కనుకనే, సంగత్వాన్ని త్యజించి, యోగస్థుడవై కర్మల నాచరించు అర్జునా! అంటున్నాడు యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు **(యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ!).**

యోగస్థుడైన వాడు ఏ కర్మలైనా చేయనీ. ఎన్ని కర్మలైనా చేయనీ. సంగం లేదు కనుక అతడిని కర్మ బంధించదు. పైగా అతడు చేసే కర్మ లన్నీ ఒకే మార్గంలో పోతూ ఉంటాయి. సద్గతి వైపే సాగుతూ ఉంటాయి. మోక్షం వైపే నడుస్తూ ఉంటాయి.

సమత్వమే సద్గతి

కర్మ బంధించదు. సంగత్వం బంధిస్తుంది. ఫలాశే బంధకారణ మవుతూ ఉంది. కర్మయోగి యోగస్థుడు. కామ్యకర్మలు చేయడు. ఫలాసక్తి లేకపోవడమే తన సమ వైఖరికి కారణము.

ఫలాసక్తి లేని వానికి ఏ ఫలమైనా సమమే. ఇదే సమత్వము. ఇది ప్రియము, అది అప్రియము అని భావిస్తేనే కర్మలు బంధిస్తాయి. ఇది సుఖము - అది దుఃఖము అని తలచి నపుడే రాగద్వేషాలు పుట్టుకొస్తాయి. ఫలాల వెనుక ధర్మాలు ఉన్నాయి అనేది అర్థమైతే, రాగద్వేషాలు అంకురించవు. ఈ విషయంలో కర్మయోగి చిత్తము చలించదు. కనుక కర్మ చేసేటప్పుడే తాను యోగస్థుడు **(యోగస్థః కురు కర్మాణి).**

కర్మ సుఖాన్ని ఇవ్వదు. దుఃఖాన్నీ ఇవ్వదు. కర్మ కేవలం కర్మఫలాన్ని ఇస్తుంది. అంతే. కర్మఫలాల విషయంలో మనకు ఉండే రాగద్వేషాలను బట్టి, ఆసక్తిని బట్టి సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి.

యోగస్థుడైన వాడు చేసే కర్మలు గంగాజలం వలె పావనమై ఉంటాయి. తులసిదళాల వలె పవిత్రమై ఉంటాయి. యోగస్థుడు కర్మలు ఆచరిస్తున్నాడు అంటే, అవి కేవలం ఈశ్వరార్థమై ఉంటాయి **(యోగస్థః సన్ కురు కర్మాణి, కేవలం ఈశ్వరార్థమ్).** అతడు కేవలం ఈశ్వరుని కొరకే కర్మలు ఆచరిస్తాడు.

మన కర్మలు ఈశ్వరుని కెందుకు? సంసారం కోసం ఉద్యోగం చేసినట్లు, ఈశ్వరుని కొరకు కర్మలు చేయాలా? మన కర్మలు సర్వజ్ఞుడైన ఈశ్వరునికి అవసరమా? కానే కాదు. మరి ఈశ్వరార్థం కర్మలు ఎందుకు చేయాలి?

మనం చేయదగిన కర్మ ఏదో దానిని చేయడం మన ధర్మము. యోగస్థుడు ధర్మార్థం కర్మను చేస్తున్నాడే

గాని ఫలం కొరకు కాదు. ధర్మరూపంలో ఉన్నది ఎవరో కాదు, దైవమే. కనుక దైవానికి చెల వంచి యోగస్థుడు కర్మను ఆచరిస్తున్నాడు. అంతేగాని, తన కర్మ ఈశ్వరునికి అవసరమై కాదు. తన కర్మల వల్ల ఈశ్వరుడు సంతృప్తి చెందేదీ లేదు. తన కర్తవ్యాన్ని నిర్వహించే టప్పుడు, ఆ కర్తవ్య రూపంలో గోచరిస్తున్న శ్రీకృష్ణుణ్ణే దర్శిస్తూ, ఫలసంగం లేకుండా, కర్మాచరణంలో తృప్తి చెందేవాడే యోగస్థుడు. మనం చేసే కర్మల వల్ల పరమేశ్వరుడు తృప్తి చెందడానికి అంతకు పూర్వం భగవంతుడు అసంతృప్తిలో ఉన్నాడా? అందువల్ల, నేను చేసే కర్మల వల్ల ఈశ్వరుడు సంతోషించాలి అనే సంగత్వాన్ని కూడా విడిచి పెట్టేయాలి అని వ్యాఖ్యానించారు భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి.

విధిగా నీవు చేయ వలసిన కర్మ స్వకర్మ. స్వకర్మ రూపంలో ఉన్నది సర్వేశ్వరుడే అని తెలిసి పోయింది. ఇక ఇప్పుడు మనం చేసే ప్రతి కర్మ ఈశ్వరార్పణమే. ఆచరించే ప్రతి కర్మలో ఈశ్వర దర్శనమే. ఇక్కడ పని లేదు. పూజే ఉంది. యోగస్థుడు ఆచరించే ఆరాధనే ఉంది. ఈ విధంగా కర్మ లాచరించే వానికి బంధ మెక్కడుంటుంది? ఆనందం దూరంగా ఎక్కడికి పోతుంది? స్వధర్మాచరణములో ఎంతెంత అవగాహన పెరుగుతూ ఉంటే, అంతంత సమత్వం నిండుతూ ఉంటుంది. ఆరాధనా పూరిత కర్మ ద్వారా మనస్సును ఆత్మజ్ఞానానికి సిద్ధం చేయడమే ఇక్కడ యోగము. ఇదే సిద్ధి. దీనికి భిన్న మైనది **అసిద్ధి.** ఈ రెండిటిలో కూడా సమంగా ఉండటమే యోగము **(సమత్వం యోగ ఉచ్యతే).**

ఫలాపేక్ష లేకుండా కర్మలు చేస్తూ ఉంటే చిత్తశుద్ధి కలుగుతుంది. తద్వారా కలిగే జ్ఞానప్రాప్తి లక్షణము **సిద్ధి (ఫల తృష్ణా శూన్యేన క్రియమాణే కర్మణి సత్త్వ శుద్ధిజా, జ్ఞానప్రాప్తి లక్షణా సిద్ధిః).** దీనికి విరుద్ధ మైనది **అసిద్ధి (తద్విపర్యయజా అసిద్ధిః).** ఈ రెండిటి విషయంలో కూడా సమంగా ఉంటూ కర్మలు చేయడమే యోగం **(తయోః అపి సమః తుల్యః భూత్వా కురు కర్మాణి).** అంటే, ఈ కర్మను ఆచరిస్తే, ఇది చిత్తశుద్ధికి దోహదపడి జ్ఞానప్రాప్తిని కలిగిస్తుందని, ఈ కర్మపై ఆశ గాని, లేదా రాగం గాని; ఆ కర్మ వల్ల అంతఃకరణము మలినమై జ్ఞానప్రాప్తికి ప్రతిబంధక మౌతుందని ఆ కర్మపై నిరాశ గాని, లేదా ద్వేషం గాని లేకుండా, రెండిటి విషయం లోను సమబుద్ధి కలిగి యుండటమే యోగము. అంతఃకరణ అశుద్ధికి సంగత్వమే కారణం కాని కర్మ కాదు అని యోగస్థునికి తెలుసు. అందుకని అతడు చలించడు. ఇది యోగస్థుని అద్భుతమైన యోగస్థితి.

సమత్వ బుద్ధితో కూడిన ఈ నిష్కామకర్మ సకామ కర్మల కంటే ఎంత శ్రేష్ఠమైనదో వివరిస్తున్నాడు.

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనఞ్జయ ।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49

దూరేణ-హి-అవరం-కర్మ-బుద్ధియోగాత్-ధనంజయ
బుద్ధౌ-శరణం-అన్విచ్ఛ-కృపణాః-ఫలహేతవః

ధనంజయ	= అర్జునా!	బుద్ధౌ	= బుద్ధి యందు
బుద్ధియోగాత్	= బుద్ధియోగము కంటె	శరణం	= ఆశ్రయమును
కర్మ	= కామ్యకర్మ	అన్విచ్ఛ	= కోరుకో
దూరేణ	= చాలా దూరం చేత	ఫలహేతవః	= ఫలము నాశించు వారు
అవరం హి	= తక్కువైనది కదా!	కృపణాః	= కృపణులు

ధనంజయా! ఫలాపేక్షతో చేసే కర్మ, బుద్ధి యోగము కంటే చాలా తక్కువది. కనుక బుద్ధి యోగాన్నే ఆశ్రయించు. ఫలాసక్తి కలవారు దీనులు.

వ్యాఖ్య

ఉండని దానికి ఉనికి లేదు

సమత్వబుద్ధితో కూడిన కర్మయోగం పవిత్ర మైనది. రాగద్వేషాలకు చాలా దూరంలో ఉంటుంది. ఫలితాల విషయంలో ఆందోళన లేకుండా సమబుద్ధితో ఉంటుంది. అంత:కరణ శుద్ధిని కలిగిస్తుంది. సాంఖ్యము బోధించే జ్ఞానాన్ని అందుకోవ డానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. సూటిగా చెప్పాలంటే మోక్షహేతువు అవుతూ ఉంది. ఫలసంగం లేకుండా ఉండటమే కర్మయోగ వైశిష్ట్యము.

ఫలితాన్ని కోరుతూ, ఫలాసక్తితో కర్మలు చేసేవారు దీనులు అంటున్నాడు గీతాచార్యుడు *(కృపణా:).* వారు ఎందుకని కృపణులు అంటే, ఫలాసక్తి చేత ప్రేరేపింపబడి విశేషంగా కర్మ లాచరిస్తూ ఉన్నారు కనుక *(ఫల హేతవ: ఫలతృష్ణా ప్రయుక్తా:).*

సమత్వబుద్ధితో కూడిన కర్మయోగముతో పోల్చి చూచి నపుడు ఫలాసక్తితో చేసే సకామ కర్మ చాలా నికృష్టమైంది *(అవరం నికృష్టం).* సకామ కర్మలు ఫలసంగంతో కూడుకొని ఉంటాయి. రాగద్వేషాల మధ్య ఊగిస లాడుతూ ఉంటాయి. భోగైశ్వర్య ప్రసక్తి తోనే నిండి ఉంటాయి. జననమరణాలకు కారణమై, బంధహేతువులుగా ఉంటాయి. సకామ కర్మలలో మోక్షాపేక్ష అనూహ్యం. చిత్తశుద్ధి శూన్యం. నికృష్టమైన ఈ సకామ కర్మలు శ్రేయోదాయకం కావు కనుక, దీనుల వలె వాటిని ఆశ్రయించ వద్దని పరమేశ్వరుడు ఈ శ్లోకంలో హెచ్చరిక చేస్తూ ఉన్నాడు. చిత్తశుద్ధిని, చిత్త నైర్మల్యాన్ని కలిగించే నిష్కామ కర్మయోగమునే ఆశ్రయించమని బోధిస్తున్నాడు *(బుద్ధౌ శరణ మన్విచ్ఛ).*

సమత్వబుద్ధి యోగమును *(బుద్ధౌ)* ఆశ్రయించ మంటున్నాడు *(శరణమ్ ఆశ్రయమ్ అభయప్రాప్తి కారణమ్, అన్విచ్ఛ ప్రార్థయస్వ).* సమత్వబుద్ధి భయాన్ని నిర్మూలిస్తుంది. అభయాన్ని అనుగ్రహిస్తుంది. అందుకే దానిని అభయప్రాప్తి కారణము అన్నారు భాష్యంలో శ్రీ శంకరులు.

కర్మ ఆరంభించక ముందే, ఈ కర్మ వల్ల ప్రయోజనం ఏమిటి? అనే ఊహలను, ఆశలను ముందుంచుకొని, విచారించుకొని ఆ తరువాత కర్మాచరణములో ప్రవేశించడం సకామ కర్మలలో సాధారణ మైన విషయము. తమ అంచనాలు నెరవేరుతాయో లేదో అనే భయం కర్మారంభము నుండే ప్రారంభ మవుతుంది. ఒకవేళ నెరవేరక పోతే ఎలా? అనే సందిగ్ధం మనస్సులో ఆందోళనకు నాంది పలుకుతుంది. ఈ భయాలు నిరాశల్ని పెంచుతాయి. నిరుత్సాహాన్ని మనసులో దించుతాయి. అందుకే ఫలాసక్తి కలవారు కృపణులు. దీనత్వంతో బ్రతికేవారు *(కృపణా:).* దీనత్వంతో బ్రతికే వ్యక్తి జీవితం నికృష్టంగా ఉంటుంది *(అవరం).*

ఫలాసక్తే ఈ నికృష్టమైన దీనత్వానికి కారణము. ఫలసంగం వల్లే భయాలు పుట్టుకొస్తున్నాయి. సమత్వ బుద్ధితో వ్యవహరించే వారిలో ఫలసంగం ఉండదు. భయాలూ ఉండవు. అందుకనే బుద్ధి యోగాన్ని ఆశ్రయించ మంటున్నాడు భగవానుడు *(బుద్ధౌ శరణం).* పైగా, అది అభయప్రదం అంటున్నాడు *(అభయప్రాప్తి కారణమ్)*. దానినే ఆశ్రయించ మంటోంది గీత. ప్రార్థించ మంటోంది *(అన్విచ్ఛ ప్రార్థయస్వ).*

ఫలాసక్తితో సకామ కర్మలను ఆచరించే దీనులు ఆశానిరాశల మధ్య ఊగిస లాడుతూ ఉంటారు. అశాంతితో అలమటిస్తూ ఉంటారు. మనిషికి ఏది ఉంది, ఏది లేదు అనేది ప్రధానం కాదు. ఆశ ఒక్కటి ఉంటే చాలు. ఎన్ని ఉన్నా లేనట్లే. అది తీరని దాహం. వయస్సు గడిస్తున్నా ఆశ నశించదు. పైగా నిరాశా నిస్పృహలను పెంచుతూ పోతుంది.

చరణము : **లేనినాడు ధన మొకటే లేదు**
ఉన్ననాడు మరి లేనివి ఎన్నో!
ఎన్నున్నా - ఆశ కదిలితే
పండని కాయే ఆ బ్రతుకెపుడు
పల్లవి : **ఉన్నది గాంచవె ఓ మనసా!**
వేరొండులే దనే సత్యము తెలుసా!

అంటూ ఆశాపాశాన్ని త్రుంచే ప్రయత్నంలో, ఉన్న సత్యాన్ని కళ్ళ ముందు ఆరబోసింది చైతన్యగీతిక.

నలభై ఎనిమిది, నలభై తొమ్మిదవ శ్లోకాలలో వరుసగా అర్జునుణ్ణి **ధనంజయ - ధనంజయ** అంటూ సంబోధించాడు దామోదరుడు. అర్జునా! లౌకిక ధనాన్ని జయించావు. ఇక అక్షయ ధనాన్ని కూడా జయించు. మోక్షసిరిని చేజిక్కించుకో అని చెప్పడమే 'ధనంజయ!' అని రెండు శ్లోకాల్లోనూ వరుసగా సంబోధించడం లోని ఆంతర్యం. అందుకని **బుద్ధౌ శరణ మన్విచ్ఛ** - బుద్ధియోగాన్ని ఆశ్రయించు. అభయస్థితిని పొంది తరించు అని బోధించాడు.

సమత్వబుద్ధి వల్ల పాపపుణ్యాలు అంటవు. కర్మలు చేస్తున్నా కర్మలకు అంటకుండా ఉండే స్థితిని కర్మయోగము అనుగ్రహిస్తుంది. ఎలాగో చూడండి!

బుద్ధియుక్తో జహా తీహ ఉభే సుకృతదుష్కృతే ।
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50

బుద్ధియుక్తః-జహాతి-ఇహ-ఉభే-సుకృతదుష్కృతే
తస్మాత్-యోగాయ-యుజ్యస్వ-యోగః-కర్మసు-కౌశలం

బుద్ధియుక్తః	= సమత్వబుద్ధితో కూడిన వాడు	యోగాయ	= యోగము కొరకు
ఉభే సుకృతదుష్కృతే	= పుణ్యపాపముల రెండింటిని	యుజ్యస్వ	= ప్రయత్నించు
ఇహ	= ఇక్కడే	కర్మసు	= కర్మల యందు
జహాతి	= విడుస్తున్నాడు	కౌశలం	= నేర్పు
తస్మాత్	= ఆ కారణము చేత	యోగః	= యోగము

సమత్వ బుద్ధి కలవాడు పుణ్యపాపాలను రెండిటినీ ఈ లోకం లోనే విడిచి పెట్టేస్తున్నాడు. అందుచేత బుద్ధి యోగానికి సిద్ధం కా! కర్మలలో కుశలత్వమే యోగము.

వ్యాఖ్య

కర్మయోగాన్ని సంక్షిప్తంగా, సారభూతంగా నలభై ఏడవ శ్లోకంలో వివరిస్తూ భగవానుడు ఉపదేశించిన నాల్గవ అంశం 'కర్మలను విడిచిపెట్ట కూడదు' **(మాతే సఙ్గోస్త్వ కర్మణి).** ఆ విషయాన్ని ప్రస్తుత శ్లోకం విస్పష్టం చేస్తూ ఉంది.

యోగాన్ని నిర్వచిస్తూ, సమత్వమే యోగము అని నలభై ఎనిమిదవ శ్లోకంలో ఉపదేశించాడు. సమత్వ మనేది కర్మలకు సంబంధించింది కాదు. కర్మఫలాలకు సంబంధించింది. కర్మలను ఆచరించడములో, లేదా ఆరంభించడంలో సమత్వం కుదరదు. కారణం? కర్మలు స్థూలమైనవి. పైగా, దేని కదే. ఒక కర్మ మరొక కర్మ కాదు. పంట పెట్టడం ఒక కర్మ అయితే, వంట చేయడం మరొక కర్మ. ఈ రెండిటిని సమంగా చూడటం

సాధ్య పడదు. ఫలితాలు మనస్సుపై ప్రభావాన్ని చూపుతాయి కనుక, వాటి విషయంలో ప్రసాద భావన కలిగి ఉంటే, రాగద్వేషాలు తటస్థ మవుతాయి. ప్రసాదంలో భేదాలు చూడనట్లే, కర్మ ఫలితాల విషయంలో కూడా సమత్వం కుదురుతుంది. కాని, కర్మలను ఆరంభించే విషయంలో అది వర్తించదు. ఆ విషయాన్ని ఈ శ్లోకం విశద పరుస్తూ **యోగః కర్మసు కౌశలమ్** అంటూ యోగానికి మరొక అద్భుతమైన నిర్వచనాన్ని అందిస్తోంది.

ముందు కర్మ జరిగితే తరువాత ఫలితం వస్తుంది. ఫలాలలో ప్రసాద బుద్ధి కలిగి సమభావంతో ఉండటం వల్ల ఫలభోగ సంగము ఉండదు. నూతన వాసనలు తయారు కావు. ఉన్నవి కూడా ప్రక్షాళనం అవుతూ ఉంటాయి. చిత్తశుద్ధి ఏర్పడుతూ ఉంటుంది.

కాని, ఫలితానికి ముందే కర్మాచరణములో దోషాలు సంక్రమించే ప్రమాదం ఉంది కదా? ఇది కర్మ సంగాన్ని కలిగించదా? పాపపుణ్యాలను అంటగట్టదా? అనేది సంశయం. ఆ విషయాన్నే ఈ శ్లోకంలో చర్చిస్తున్నాడు భగవానుడు. మనం సోదాహరణంగా అర్థం చేసుకుందాం.

ఒక వ్యక్తి అధర్మంగా ఒక కర్మను ఆచరించి, ఫలితాల విషయంలో సమత్వంతో మెలిగితే, అతడు కర్మయోగి అవుతాడా? పాప కర్మాచరణం చేసినవాడు కాకుండా పోతాడా? అక్రమ వ్యాపారం చేస్తాడు. ఫలితం అధికమైనా, అల్పమైనా, అనుకూలమైనా, ప్రతికూలమైనా ప్రసాదంగా సమబుద్ధితో స్వీకరిస్తాడు. అంతమాత్రాన, అతడు కర్మయోగి అవుతాడా? పాపపుణ్యాల నుండి విడిపడినవా డవుతాడా? కాడు. ఫలితాల విషయంలో ఒకవేళ సమత్వాన్ని అలవరచుకుంటే, ఫలసంగం లేనివాడు అవుతాడు కాని కర్మసంగం నుండి, కర్తృత్వ సంగము నుండి విడిపడిన వాడు కాలేడు. అందుచేత, ***సమత్వం యోగ ఉచ్యతే*** అనే యోగ నిర్వచనము ఒక్కటే చిత్తశుద్ధికి సరిపోదు కనుక, ***యోగః కర్మసు కౌశలమ్*** అనే రెండవ నిర్వచనాన్ని ఈ శ్లోకంలో అందిస్తున్నాడు.

కర్మలలో కుశలత్వము

విహిత కర్మలను, అంటే చేయదగిన కర్మలను ధర్మబద్ధంగా చేసిన వ్యక్తి సమత్వబుద్ధితో ఫలాలను ప్రసాదంగా స్వీకరించడం వల్ల ఫలసంగం లేనివాడు అవుతున్నాడు. ఇక్కడ మరొక ముఖ్యమైన విషయాన్ని మనం విశ్లేషించుకోవాలి.

నేను కర్తను అనే భావంతో కర్మ చేసినపుడు కర్తృత్వం ఏర్పడుతూ ఉంది. కర్త అయినవాడు భోక్త కాకుండా ఎలా ఉంటాడు? ఫలితాలను ఎలా తప్పించుకుంటాడు? సమత్వంతో జీవిస్తే, ఫలితం యొక్క ప్రభావం మనసు మీద పడకుండా జాగ్రత్త పడగలడు. నూతన వాసనలు తయారు కాకుండా చూసుకో గలడు. కాని, కర్మాచరణములో జరిగిన పాపపుణ్యాల నుండి ఎలా విడి పడతాడు? కేవలం ఈ జన్మలో చేసినవే గాక, గత జన్మలలో చేసిన పాపపుణ్యాల మూటను కూడా మోస్తూ ఉన్నాడు కదా! వాటి నుండి ఎలా విడి పడతాడు?

నేను కర్తను అనే కర్తృత్వ భావనతో చేసినపుడు, పాపపుణ్యాలు కర్తను అంటిపెట్టుకొనే ఉంటాయి. కేవలం ఫలసంగం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను తొలగించుకున్నంత మాత్రాన కర్మసంగం వల్ల ఏర్పడే పాపపుణ్యాల నుండి ఎలా విడిపడతాడు?

మరొక విషయాన్ని కూడా ఇక్కడ అర్థం చేసుకోవాలి. కర్మఫలాల విషయంలో ప్రసాద భావన వల్ల సమత్వం ప్రాప్తించింది. బావుంది. మరి ప్రసాదం ఏమిటి? ఈశ్వర ప్రసాదం. పరమేశ్వరుడు ప్రవేశించకుండా ప్రసాదం లభిస్తుందా? భక్తుడు ఉండి, భగవంతుని అర్చించి నపుడే కదా ప్రసాదం లభిస్తుంది? ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం.

భగవంతుని విశ్వసించని నాస్తికుడు ప్రసాదాన్ని స్వీకరించ గలడా? ఫలితాన్ని స్వీకరించగలడే గాని, ఫలితాన్ని ప్రసాదంగా స్వీకరించ లేడు. సామాన్య జ్ఞానంతో అతడు ఆచరించిన కర్మ శాస్త్ర దృష్ట్యా ధర్మమే అయినప్పటికీ, ఫలితాన్ని మాత్రం అతడు ప్రసాదంగా స్వీకరించలేడు. పరమేశ్వర భావన లేకుండా ప్రసాద భావన ఉండే అవకాశమే లేదు.

భక్తుడైన కర్మయోగి పరమేశ్వర భావనతో ఉన్నాడు కనుక, ఫలితాన్ని ప్రసాదంగా గ్రహించ గలడు. బావుంది! మరి నైవేద్యం పెట్టకుండానే ప్రసాదం లభిస్తుందా? లభించదు. కనుక కర్మను ఆచరించే టప్పుడు, ఆ కర్మలో పరమేశ్వరుడు ఉన్నప్పుడే అట్టి కర్మ పూజగా మారి, ఫలితం ప్రసాదంగా అందుతుంది.

కర్మ ఫలితాన్ని ప్రసాదంగా స్వీకరించాలి అంటే, ముందు కర్మను అర్చనగా ఆచరించాలి. చేసే పని పూజ కావాలి అంటే, కర్మ చేసే ముందే భావనలో ఈశ్వరుడు ఉండాలి. ఈశ్వర భావనతో కర్మ జరగాలి. మరి అదెలా సాధ్యం?

పరమేశ్వరుడు సర్వవ్యాపి. విశ్వవ్యాపి. విశ్వంలో విశ్వనాథుడు ధర్మరూపంలో ఉన్నాడు. నేను చేసే కర్మ గనుక ధర్మబద్ధంగా ఉంటే, ధర్మరూపంలో దైవమే ఉన్నాడు కనుక, పనిలో పరమేశ్వరుని పూజించడమే అవుతుంది.

పని అనే పూజలో కర్త అయిన నేను పూజారిగా ఉన్నాను. విశ్వమంతా ధర్మరూపంలో వ్యాపించి ఉన్న పరమేశ్వరుడు విశ్వం లోనే ఉన్న వ్యక్తిలో కూడా వ్యాపించి ఉన్నాడు. నా దేహం కూర్చుంటే, అందులో ఆయన ప్రమేయం ఉంది. నా దేహం తిరిగితే, అందులో ఆయన ప్రమేయం ఉంది. నా చేతులు పని చేయడం వెనుక ఆయన శక్తే ఉంది. ఆయన దృష్టి పడటం వల్లనే నా చూపుకు వెలుగు ఉంది. కనుక నా ద్వారా ఎన్నో జరగవచ్చు. అలాగని నేను కర్తను కాను. హరియే కర్త. ఈ భావనతో పని చేస్తే, ఆ పని పూజ అవుతుంది ***(నాహం కర్తా హరిః కర్తా తత్పూజా కర్మచాఖిలమ్)***.

ఈ విధమైన వైఖరితో సాగే పని పూజ అవుతుంది కనుక ఫలితం ప్రసాదం అవుతుంది. ఒక నాస్తికుడు మంచి పనే చెయ్యవచ్చు. కాని, ఈ విధమైన ఈశ్వర భావనతో చెయ్యగలడా? అందుచేత నాస్తికుడు ఆచరించిన సత్కర్మకు సత్ఫలితం రావచ్చు నేమో గాని, ఆ ఫలితం ప్రసాదంగా మాత్రం మారదు. రాగద్వేషాలు సమరస మైతేనే ఫలితం ప్రసాదం. ప్రసాద భావన ఉంటేనే చిత్తశుద్ధి కలుగుతుంది.

కర్మ పూజ కావాలి. ఈశ్వరారాధన కావాలి. ఫలితం ప్రసాదం కావాలి. కర్మ పూజ కావాలి అంటే కర్మలో పరమేశ్వరుడు ఉండాలి. కర్మలో పరమేశ్వరుడు ఎలా ఉంటాడు? ధర్మరూపంలో ఉంటాడు. అంటే, కర్మ ధర్మబద్ధంగా ఉంటేనే కర్మలో ఈశ్వరుడు ఉన్నట్లు. ధర్మబద్ధ మైన కర్మను ఈశ్వర భావనతో, అహంకారం లేకుండా ఆచరించి నపుడే అది పూజ అవుతుంది. ఫలితాన్ని ఈశ్వర భావనతో, మమకారం లేకుండా స్వీకరించి నపుడే అది ప్రసాదం అవుతుంది.

కర్మ పూజ కానపుడు ఫలితం ప్రసాదం కాలేదు. ఫలితాలు అందినపుడు ప్రతిచర్యలు లేకుండా, ప్రసాదంగా సమత్వంతో స్వీకరించాలి అంటే, కర్మను ఆచరించే టప్పుడు ఈశ్వర భావనతో ధర్మబద్ధంగా ఆచరించ గలగాలి. **సమత్వం యోగ ఉచ్యతే** అనే యోగ నిర్వచనము ఫలితాల విషయంలో మనకు ఉండవలసిన వైఖరిని స్పష్టం చేసింది. కాని, కర్మాచరణములో మన వైఖరి ఎలా ఉండాలో **యోగః కర్మసు కౌశలమ్** అనే నిర్వచనము విశదపరుస్తూ ఉంది.

తాను ధర్మబద్ధంగా చేయవలసింది ఏదో అది స్వధర్మము. దానిని ఆచరించడమే స్వకర్మ. ఈ స్వకర్మ

ద్వారా పరమేశ్వరుని అర్చించిన వారికి చిత్తశుద్ధి సిద్ధిస్తుంది ***(స్వకర్మణా తం అభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః).*** సిద్ధించకపోయినా, సిద్ధించినా, ఫలితం సిద్ధించినా, సిద్ధించక పోయినా సమత్వబుద్ధితో స్వధర్మాన్ని ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తాడు కనుక ఫలితం సిద్ధించినా, సిద్ధించక పోయినా సమత్వబుద్ధితో ఉంటాడు. ఇదే కర్మలలో కుశలత్వము ***(స్వధర్మాఖ్యేషు కర్మసు వర్తమానస్య యా సిద్ధ్య సిద్ధ్యోః సమత్వ బుద్ధిః ఈశ్వరార్పిత చేతస్తయా తత్ కౌశలం కుశలభావః తద్ధి కౌశలం).*** ఇదే కౌశలం. కర్మలలో నేర్పు. ఈ విధమైన అవగాహనతో కర్మయోగి కర్మల యందు కుశలత్వంతో ఉంటాడు. కర్మలలో కర్మయోగి నేర్పరి. అంతేగాని, కర్మలలో నేర్పరితనం కల ప్రతి వ్యక్తీ కర్మయోగి కాలేడు. అలా అయ్యేట ట్లయితే, నేర్పుతో చోరత్వానికి పాల్పడే జేబుదొంగలు కూడా కర్మయోగులు కావాలి.

యోగః కర్మసు కౌశలం అనే యోగ నిర్వచనము కర్మ విషయంలో బంధం లేకుండా చేస్తూ ఉంది. ***సమత్వం యోగ ఉచ్యతే*** అనే యోగ నిర్వచనము ఫలం విషయంలో బంధ విముక్తిని కలిగిస్తూ ఉంది. ఈ విధంగా కర్మయోగానికి పూర్ణత్వం సిద్ధిస్తూ ఉంది. కర్మయోగి కర్మల లోను, ఫలితాల లోను సమబుద్ధితో చరిస్తున్నాడు. కనుక పుణ్యపాపాల నుండి విడిపడు తున్నాడు.

పాపపుణ్యాలు పారిపోతాయి

కర్మసంగం నుండి, ఫలసంగం నుండి విడిపడిన కర్మయోగి పాపపుణ్యాల నుండి కూడా విడిపడు తున్నాడు.

కర్మలో ధర్మాధర్మా లుంటాయని తెలుసుకున్నాం. ధర్మబద్ధంగా చేస్తే అది సత్కర్మ. అధర్మంగా ఆచరిస్తే అది దుష్కర్మ. సత్కర్మ సుకృతం. దుష్కర్మ దుష్కృతం. సుకృత ఫలం పుణ్యం. దుష్కృత ఫలం పాపం. ఈ పాపపుణ్యాలు రెండూ మనిషిని బంధిస్తాయి. ఈ రెండూ కర్మల లోనే ఉన్నాయి కనుక బంధము కర్మల లోనే ఉంది. అదే కర్మబంధం.

కర్మయోగి పాపపుణ్యాలను ఇక్కడే విడిచేస్తున్నాడు ***(జహాతీహ)*** అంటున్నాడు ఈ శ్లోకంలో గీతాచార్యుడు. ఇక్కడే వదిలేస్తున్నాడు అంటే, ఈ లోకం లోనే విడిచిపెడు తున్నాడు అని అర్థం ***(జహాతి త్యజతి, ఇహ అస్మిన్ లోకే).***

పుణ్యపాపాలను అనుభవించ డానికి ప్రత్యేకంగా లోకాలు ఉన్నాయి. పుణ్యం చేసుకున్న వాడు స్వర్గానికి పోతాడు. పాపం చేసిన వాడు నరకానికి పోతాడు. కర్మయోగి ఎక్కడికీ పోవడం లేదు. అందుచేత, పుణ్య పాపాలను ఇక్కడే విడిచేస్తున్నాడు.

పాపము యొక్క అనుభవము దుర్భరము కనుక దానిని విడిచి పెట్టడం బాగానే ఉంది. పుణ్యఫలాన్ని కూడా ఎందుకు విడిచి పెట్టాలి? అని కొందరు సంశయిస్తూ ఉంటారు.

పుణ్యం చేసిన వాళ్ళు స్వర్గానికి పోతారు. పాపం చేసిన వాళ్ళు నరకానికి పోతారు. పాప ఫలాన్ని అనుభవించిన తరువాత మళ్ళీ ఆ జీవుడు మానవ లోకంలో పుడుతాడు. అలాగే పుణ్యఫలంగా ప్రాప్తించిన స్వర్గ సుఖాన్ని అనుభవించిన తరువాత, ఆ జీవుడు కూడా మానవలోకం లోనే మళ్ళీ జన్మిస్తాడు. ఇరువురికీ జన్మ అనివార్యం.

కర్మయోగి తరించి పోతాడు కనుక పరలోకానికి వెళ్ళే ప్రసక్తి లేదు. పుణ్యపాపాలను అనుభవించడానికి పరలోకం వెళ్ళడు కనుక ఆ పుణ్యపాపాలను ఈ లోకం లోనే విడిచిపెట్టి వెళ్తున్నాడు.

కర్మయోగి పుణ్యపాపాలను ఎలా త్యజిస్తాడు? వచ్చే వాటిని *(ఆగామి)* రాకుండా ఆపుకో గలడేమో గాని, గత జన్మలలో ఆచరించిన కర్మల ఫలితంగా సంక్రమించిన పుణ్యపాపాలను ఎలా పోగొట్టుకుంటాడు? జ్ఞానం

వల్లనే పాపపుణ్యాలు నశిస్తాయి. కర్మయోగం వల్ల అంతఃకరణ శుద్ధి జరుగుతుందే గాని, పాపపుణ్యాలు ఎలా నశిస్తాయి? పరమార్థ దర్శనం కలిగి నపుడే కదా పుణ్యపాపాలు నశిస్తాయి!

నిజమే. జ్ఞానం వల్లనే కర్మ లన్నీ దగ్ధ మవుతాయి. పుణ్యపాపాలు జ్ఞానం చేతనే అదృశ్య మవుతాయి. కాకపోతే, కర్మయోగి జ్ఞానానికి ఎంతో దూరం లేడు. ఇదే అర్థం కావలసిన విషయం. కర్మయోగంలో నిష్ణాతు డైన వాడు ఆలస్యం లేకుండా జ్ఞానాన్ని పొందుతాడు. జ్ఞాని అవుతాడు కనుక పుణ్యపాపాలను ఇక్కడే విడి చేస్తాడు అని అర్థం ***(సత్త్వశుద్ధి జ్ఞానప్రాప్తి ద్వారేణ ఉభే సుకృత దుష్కృతే ఇహ జహాతి).*** ఈ విషయాన్ని ఉపనిషత్తు కూడా ధ్రువపరుస్తూ ఉంది. చిత్తశుద్ధిని పొందిన సాధకుడు పుణ్యపాపాలను విడిచి నిరంజన స్వరూపు డవుతున్నాడు అని ప్రమాణాన్ని అందించింది.

విద్వాన్ పుణ్య పాపే విధూయ నిరంజనః సామ్య ముపైతి

సాధకుడు ***(విద్వాన్ సాధకః ఇత్యర్థః)*** బంధహేతువులైన పుణ్యపాప కర్మలను సమూలంగా విడిచిపెట్టి ***(విధూయ నిరస్య దగ్ధ్వా)*** నిరంజనుడై, పరమేశ్వరునితో సామ్యమును పొందుతున్నాడు అని అథర్వణ వేదం.

ధర్మాత్ముడైన వాడు శాశ్వత శాంతిని పొందుతున్నాడు. అర్జునా! నా భక్తుడు (కర్మయోగి) నశించడు అని తెలుసుకో అని తొమ్మిదవ అధ్యాయంలో భగవంతుడే చెబుతాడు. ఇదంతా కర్మయోగ వైభవము. చూస్తూ ఉండగానే కర్మయోగంలో కర్మ పడిపోయి యోగం నిలుస్తుంది. కళ్ళ ముందే కర్మయోగి కర్మను జార్చుకొని యోగియై శోభిస్తున్నాడు. ఆ తరువాత జ్ఞానియై తరించిపోతాడు.

కనుక కర్మలను విడిచిపెట్టే ప్రయత్నం అవసరం లేదు. కర్మయోగి కాగలిగితే, కర్మలు వాటంతట అవే లేకుండా పోతాయి. కనుక కర్మను విడిచిపెట్ట నవసరం లేదు ***(మాతే సంగోఽస్త్వ కర్మణి).*** అర్జునా! యోగమును ఆచరించు. కర్మయోగివి కా! సమత్వబుద్ధిని సాధించు ***(తస్మాత్ సమత్వ బుద్ధి యుక్తో భవ!).***

కర్మయోగి కర్మబంధము నుండి ఎలా విడిపడుతున్నాడో తరువాత శ్లోకంలో వివరిస్తున్నాడు

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబన్ధ వినిర్ముక్తాః పదం గచ్ఛ న్త్యనామయమ్ ॥ 51

కర్మజం-బుద్ధియుక్తాః-హి-ఫలం-త్యక్త్వా-మనీషిణః
జన్మబంధ-వినిర్ముక్తాః-పదం-గచ్ఛంతి-అనామయం

బుద్ధియుక్తాః	= సమత్వబుద్ధి గల	జన్మబంధ వినిర్ముక్తాః	= జన్మబంధము నుండి విడిపడిన వారై
మనీషిణః	= వివేకులు		
కర్మజం	= కర్మ వలన పుట్టిన	అనామయం	= దుఃఖరహితమైన
ఫలం	= ఫలితమును	పదం	= స్థానమును
త్యక్త్వా	= విడిచి	గచ్ఛంతి హి	= పొందుచున్నారు కదా!

సమబుద్ధి కలిగిన వివేకవంతులు కర్మలు పంచే ఫలాలను త్యజిస్తారు. జన్మ బంధాల నుండి విడిపడతారు. ఏ ఉపద్రవాలు లేని చోటికి చేరి పోతారు.

వ్యాఖ్య

బంధానికి కారణమైన కర్మల లోనే చరిస్తూ ఉండినా బంధానికి లొంగని శక్తిని, యుక్తిని ప్రసాదిస్తుంది

కర్మయోగము. ఇదే సమత్వము. ఇదే కర్మలలో కుశలత్వము. కర్మయోగంలో కొనసాగే సుకృతాత్ములు బంధానికి కారణమైన 'కర్మ'ను దూరం చేసుకొని ముక్తి హేతువైన 'యోగం'లో శోభిస్తారు.

మానవు లందరూ పాపపుణ్యా లనే పడవ లోనే ప్రయాణం చేస్తూ ఉంటారు. కర్మయోగంలో ప్రవేశించ గానే పాపం కారిపోతుంది. పుణ్యం మాత్రమే మిగిలి ఉంటుంది. చిత్తశుద్ధి ఏర్పడగానే పుణ్యపాపాలు రెండూ కారిపోతాయి. కాయ పెరుగుతూ ఉంటే పూలరేకులు రాలి పోతాయి. ఆ తరువాత కాయ పండుగా మారుతుంది. రాగద్వేషాల కారణంగా ఏర్పడే పుణ్యపాపాలను దాటిన కర్మయోగి జ్ఞానమును పొంది తరిస్తాడు.

సమత్వబుద్ధి గల వాడు పుణ్యపాపములు రెండిటిని ఈ లోకము నందే విడిచి పెడుతున్నాడు అని యాభైయవ శ్లోకం మొదటి పాదంలో తెలిపాడు ***(బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే)***. సమత్వబుద్ధి గలవాడు కర్మ ఫలములను విడిచి పెడుతున్నాడు అని యాభై ఒకటవ శ్లోకం మొదటి పాదములో తెలిపాడు. రెండూ ఒకే విషయం. కాని యాభైయవ శ్లోకం రెండవ పాదమును పరిశీలిస్తే యోగాన్ని అనుష్ఠించు, కర్మల యందలి కుశలత్వమే యోగము అని సాధనను ఎరుక పరచి, యాభై ఒకటవ శ్లోకం రెండవ పాదంలో బంధ విముక్తి జరిగి, మోక్షప్రాప్తి కలుగుతూ ఉంది అని ఫలం వినిపిస్తున్నాడు.

ఫలత్యాగం

సమత్వబుద్ధి గల కర్మయోగి ఫల సంగాన్ని త్యజిస్తున్నాడు ***(సమత్వం యోగ ఉచ్యతే)***. కర్మ సంగాన్ని కూడా త్యజిస్తున్నాడు ***(యోగః కర్మసు కౌశలమ్)***. పుణ్యపాపాలే కర్మఫలం కనుక పుణ్యపాపాల నుండి విడిపడిన కర్మయోగి పుణ్యపాపాల ఫలమైన జన్మబంధము నుండి కూడా విడిపడు తున్నాడు ***(జన్మ బంధ వినిర్ముక్తాః)***.

బంధాన్ని ఎవరూ భరించ లేరు. బంధములో అందము ఉండదు. ఆనందమూ ఉండదు. బంధము నుండి విడిపడాలని అందరూ భావిస్తూ ఉంటారు. ఇంతకీ ఏది బంధం? జన్మ బంధమే బంధము అంటున్నాడు గీతాచార్యుడు ***(జన్మ ఏవ బంధః జన్మబంధః)***.

జన్మించడం లోనే బంధము తెలుస్తూ ఉంది. వాస్తవానికి జన్మించడములో ఒక బంధము నుండి బయట పడటమే జరిగింది. కాకపోతే, జన్మించగానే మరెన్నో బంధాలు తగుల్కోవడం చేత జన్మ బంధ మైంది.

పుట్టక ముందే తొమ్మిది నెలలు తల్లి గర్భంలో జీవి బందీయై ఉన్నాడు. జన్మించడంతో చెరసాల నుండి బయట పడ్డట్లే అయింది. కాని, అక్కడ నుండి క్రొత్త క్రొత్త బంధాలు మొదలవు తున్నాయి. ఊయలలో కొంత కాలము, ఇంట్లో కొంత కాలము, పాఠశాలలో కొంత కాలము, కార్యాలయాల్లో కొంత కాలము, సంసారంలో కొంత కాలము, వైద్యశాలలో కొంత కాలము - ఇలా జీవులు ఎప్పుడూ బంధాల లోనే కొనసాగుతూ ఉంటారు. ఎలా విడిపడతామా అని ఆందోళన చెందుతూ ఉంటారు. అట్టి వారికి తరుణోపాయాన్ని గీత అందిస్తోంది.

కర్మసంగాన్ని, ఫలభోగ సంగాన్ని త్యజించిన కర్మయోగులు, జననమరణాలు శరీరానికే గాని అకర్త లైన ఆత్మకు కాదని, తామే ఆత్మ యని తత్త్వజ్ఞానాన్ని పొందుతారు. దుఃఖ రహితమైన ముక్తి పథాన్ని సాధించి తరిస్తారు. అది కూడా, ఎప్పుడో మరణించిన తరువాత కాకుండా, జీవించి ఉండగానే సాక్షాత్కరించు కుంటారు ***(జీవన్తః ఏవ జన్మబంధ వినిర్ముక్తాః సన్తః పదం పరమం విష్ణోః మోక్షాఖ్యం గచ్ఛన్తి, అనామయం సర్వోపద్రవ రహితం ఇత్యర్థః)***. కర్మఫలాన్ని త్యజించి, జ్ఞానవంతులైన వారు జీవించి ఉండగానే జన్మబంధాల నుండి విడిపడి, ఏ ఉపద్రవాలు లేని విష్ణుదేవుని యొక్క పరమపదము అనే మోక్షాన్ని పొందుతారు.

పదం ప్రాప్తం

పరమపదము ఏదో అదే పరంధామము. అదే విష్ణుపదము. అదే మోక్షము. మనిషి మరణిస్తే మన సంప్రదాయంలో పరమపదించాడు అని అంటారు. పరమపదము అంటే ఏమిటి?

తద్విష్ణోః పరమం పదం అన్నది వేదము. 'పదం', 'ధామం' అనేవి వేద పదాలు. పరమం పదం, పరంధామం అనేవి జీవుల గమ్యాన్ని నిర్దేశించే ప్రమాణ పదాలు.

పదం అన్నా, ధామం అన్నా స్థలము, లేదా ప్రదేశము అని అర్థం. చనిపోయిన తరువాత జీవులు చేరే ప్రదేశమే పరమపదం. ఆ చోటు ఎక్కడ? ఆ ప్రదేశము ఏది? ఈ విషయంలో మతాలు చిత్ర విచిత్రంగా చెబుతాయి. కాని, వేదము ఈ మతాలకు భిన్నంగా, విలక్షణంగా శోభిస్తూ ప్రవచిస్తుంది.

చనిపోయిన తరువాత ఇక్కడ లేము కనుక మరొక చోటికి చేరి ఉంటాము అనేది మతాల విశ్వాసం. భువిని విడిచిన జీవులు దివిని చేరుతారు అనేది వారి నమ్మకం. దివి అంటే మరొక లోకం లేదా స్వర్గం అని వారి భావము.

స్వర్గానికి వెళ్ళడం అంటే మళ్ళీ తిరిగి వస్తారా, లేదా? ఒక చోటికి వెళ్ళడ మంటూ జరిగితే తిరిగి రావడము కూడా జరుగుతుంది. ఈ విషయాన్ని గీత - తొమ్మిదవ అధ్యాయం కూడా ధ్రువపరుస్తుంది.

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి

పుణ్యఫలంగా స్వర్గానికి వెళ్ళిన వారు పుణ్యఫల భోగాన్ని అనుభవించి, పుణ్యము క్షీణించ గానే మళ్ళీ భూలోకం చేరుతారని గీతాబోధ.

చావడం తిరిగి పుట్టడానికే అయితే, పుట్టుక మాట అలా ఉంచితే, చావుకు కూడా అర్థం లేకుండా పోతుంది. ఇలాంటి వ్యర్థ ప్రయాణాలు, అనర్థ ప్రమాణాలు చేరలేని దివ్యధామమే వేదం చెప్పిన పరంధామం. అదే పరమపదం. అదే ఈ శ్లోకంలో అనామయ పదం. అంటే, సర్వోపద్రవ రహిత స్థితి. ఏ బాధలు, ఉపద్రవాలు లేని స్థితి.

యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ

అర్జునా! ఎక్కడికి చేరితే తిరిగి రావడ మంటూ ఉండదో అదియే నా పరంధామం అని గీత - పదిహేనవ అధ్యాయంలో భగవంతుడు చెబుతాడు.

ఏది పరంధామం? పరమేశ్వరుని ధామమే పరంధామం. అది ఎక్కడ? పరమేశ్వరుడు ఏమిటో తెలిస్తే, ఆయన పరంధామం ఎక్కడో అర్థ మవుతుంది.

సృష్టికి పరమేశ్వరుడు అభిన్న నిమిత్త ఉపాదాన కారణం కావడం చేత పరమేశ్వరుని కన్నా వేరుగా సృష్టి లేదు. ఉండలేదు. సృష్టి రూపంలో ఉన్నది పరమేశ్వరుడే. విశ్వమున్న చోటే విశ్వేశ్వరు డున్నాడు. విశ్వం లేక పోయినా, విశ్వేశ్వరుడు దివ్యంగా ప్రకాశిస్తూ ఉంటాడు. అదే అతని అనంత వైభవం. అనంతం అనేది ఒక ప్రదేశంలో ఉంటుందా? అనంతం జ్ఞానరూపంలో ఉంటుంది. జ్ఞానం కలిగిన వ్యక్తి అనంతు డవుతాడు. అనంతుడు ఎక్కడికి పయనిస్తాడు? ఎక్కడ నుండి ప్రయాణం ఆరంభిస్తాడు? ఎక్కడికి చేరుతాడు? అనంతుడు చేరడానికి తన కన్నా అన్యంగా ఏముందని? ఏ ప్రదేశ ముందని? కనుకనే,

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి - బ్రహ్మమును తెలుసుకొనే వాడు బ్రహ్మమే అగుచున్నాడు.

బ్రహ్మవిదాప్నోతి పరమ్ - బ్రహ్మవిదుడు పరంధామమును పొందుతున్నాడు.

తానే పరంధామంగా విలసిల్లు తున్నాడు. పరమపదంగా శోభిస్తున్నాడు. అనామయ పదంగా భాసిస్తున్నాడు. అదే విష్ణుపదం. విష్ణువు అంటే, అంతటా ఉండేవాడు *(వ్యాపన శీలం)*. అంతేగాని, ఏదో ఒక లోకంలో ఊరేగే వాడు కాదు. ఊరించేవాడూ కాదు. కనుక పరంధామం, లేదా పరమపదం, లేదా అనామయపదం అనేది లౌకిక స్థానం కాదు. అలౌకిక ధామం. స్వరూప ధామం. అదే మోక్షం. అది ఉన్నదే గాని కానున్నది కాదు. అందుకనే, జన్మబంధ వినిర్ముక్తుడు అనామయ పదమును చేరుతాడని గీతాచార్యుడు బోధిస్తే, అది మరణించిన తరువాత కలిగేది కాదు, జీవించి ఉండగానే, ఇక్కడే ఇప్పుడే స్వరూపంగా పొందబడేది అని శ్రీ శంకరాచార్య స్వామి భాష్యంలో ఉద్ఘోధించారు *(జీవన్తః ఏవ జన్మబంధ వినిర్ముక్తాః సన్తః పదం పరమం విష్ణోః మోక్షాఖ్యం గచ్ఛన్తి)*.

ఇది కేవలం జ్ఞానం వల్ల ప్రాప్తించేది. నువ్వు ముక్తుడవు అయ్యే ఉన్నావు. కనుకనే, జ్ఞానం మోక్షాన్ని ప్రసాదిస్తూ ఉంది. ఒకవేళ ఇప్పుడు ముక్తుడవు కాకపోతే, మోక్షం క్రొత్తగా వచ్చేది అయితే, ఒక కాలంలో వస్తుంది కనుక మరొక కాలంలో తప్పకుండా పోతుంది.

కనుక నీవు నిత్యముక్తుడవే. ఇదే శాస్త్ర తాత్పర్యం. నిత్య ముక్తుడవు కనుక బంధ మనేది లేనే లేదు. ఇప్పుడు లేదు. ఇంతకు పూర్వం లేదు. ఇక ముందు ఉండబోదు. బంధం లేనిదే. బంధం లేదు అని గుర్తించ నంత కాలం బంధం ఉంటుంది. లేకనే ఉన్నట్లు ఉంటుంది. కనుక లేని దానిని లేనట్లు, ఉన్న దానిని ఉన్నట్లు గుర్తించడమే జ్ఞానం.

జ్ఞానం వల్లనే మోక్షం ప్రాప్తిస్తుంది *(జ్ఞానాదేవతుకైవల్యం)*. నిష్కామ కర్మయోగము యొక్క గమ్యస్థానము జ్ఞానమే. సమత్వబుద్ధి గల యోగి చిత్తశుద్ధిని పొంది, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతాడు. కనుక కర్మయోగము కూడా మోక్షహేతువే.

పల్లవి : **గోవిందా! గోవిందా! జన్మలన్నీ గోవింద!**
జన్మలన్నీ గోవిందా! కర్మములన్నీ గోవింద!

అనుపల్లవి : **శరణన్న వారికి గోవిందా! గోవిందా!**
మరణము గోవింద! జననము గోవిందా! *॥ గోవిందా ॥*

చరణములు : **(1) జన్మల బంధాలు గోవిందా గోవిందా**
జీవుల సంబంధాలు గోవిందా గోవిందా
బాధలు గోవింద! బరువులు గోవింద!
కష్టాలు నష్టాలు గోవిందా! గోవిందా! *॥ గోవిందా ॥*

(2) లోకము గోవింద శోకము గోవింద
పాపము గోవింద పుణ్యము గోవింద
చేతి గీత గోవింద నొసటి రాత గోవింద
ఆశలు గోవింద పేరాశలు గోవిందా! *॥ గోవిందా ॥*

అని గోవిందా - గోవిందా అంటూ సరిపెట్టుకుంది చైతన్యగీతం.

ఆత్మ తత్త్వాన్ని అచ్యుతుని నుండి ఆలకించాడు అదృష్టవంతుడైన అర్జునుడు. ఆత్మతత్త్వాన్ని పొందడానికి అనువైన అంతఃకరణ శుద్ధిని ప్రసాదించే కర్మయోగాన్ని కూడా దివ్యంగా ఆలకించాడు. ఈ కర్మయోగం ద్వారా కలిగే చిత్తశుద్ధి వలన ఏర్పడే సమత్వబుద్ధి తనకు ఎప్పుడు ప్రాప్తిస్తుందో, అనామయపదం ఎప్పుడు

సిద్ధిస్తుందో అనే జిజ్ఞాస అర్జునుని మనస్సులో కదులుతూ ఉందని పరమేశ్వరుడు గ్రహించాడేమో! ఆ విషయాన్ని కూడా తరువాత రెండు శ్లోకాలలో చెబుతున్నాడు.

యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి ।
తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52

యదా-తే-మోహకలిలం-బుద్ధిః-వ్యతితరిష్యతి
తదా-గంతాసి-నిర్వేదం-శ్రోతవ్యస్య-శ్రుతస్య-చ

యదా	=	ఎప్పుడు	తదా	=	అప్పుడు
తే	=	నీ యొక్క	శ్రోతవ్యస్య	=	వినవలసిన దాని విషయంలో
బుద్ధిః	=	బుద్ధి	శ్రుతస్య చ	=	వినిన దాని విషయంలో
మోహకలిలం	=	మోహ కాలుష్యమును	నిర్వేదం	=	వైరాగ్యమును
వ్యతి తరిష్యతి	=	దాటేస్తుందో	గంతాసి	=	పొంద గలవు

అర్జునా! నీ బుద్ధి మోహ కాలుష్యాన్ని దాటాలి. అప్పుడు వినదగిన విషయాల లోను, విన్న విషయాల లోను నీకు విరక్తి కలుగుతుంది.

వ్యాఖ్య

వివేకము లేకపోవడమే 'మోహం' *(అవివేక రూపం)*. 'కలిలం' అంటే కాలుష్యము. మాలిన్యము. 'మోహ కలిలం' అంటే, అవివేక రూపమైన మాలిన్యము అని అర్థం *(అవివేక రూపం కాలుష్యం)*. వివేకం లేని బుద్ధికి ఎటు పోవాలో, ఎందుకు పోవాలో అర్థం కాదు. అవివేకం వల్ల ఉన్న దానిని లేనట్లు, లేని దానిని ఉన్నట్లు అర్థం చేసుకొనే ప్రమాదం కూడా ఉంటుంది. ఏది అర్థమైతే, దాని పైనే మనస్సులో ఆసక్తి కలుగుతుంది. దేనిపై ఆసక్తి ఉంటే, దాని వైపే బుద్ధి పరుగులు తీస్తుంది. మోహాత్మక మైన మనస్సుకు అనిత్య మైనదే నిత్యంగా కనిపిస్తుంది కనుక, అట్టి మనస్సు అనిత్యాల వైపే ప్రయాణం చేస్తూ ఉంటుంది. అంతేకాదు, నిత్యమైన దాని వైపు పోకుండా నిరోధిస్తూ ఉంటుంది కూడా. ఈ మోహం ఆత్మానాత్మ వివేక జ్ఞానాన్ని కలుషితం చేస్తుంది **(యేన ఆత్మానాత్మ వివేకబోధం కలుషీకృత్య)**. మనస్సును విషయాల వైపు ప్రవర్తింప చేస్తుంది **(విషయం ప్రతి అంతఃకరణం ప్రవర్త్యతే)**. ఈ మోహ కాలుష్యాన్ని బుద్ధి దాటి పోవాలి. అలా దాటి పోవడం అంటే, మోహ మాలిన్యాన్ని అతిక్రమించాలి. నిర్మలం కావాలి. శుద్ధి పడాలి **(తత్ తవ బుద్ధిః వ్యతితరిష్యతి, శుద్ధి భావమ్ ఆపత్స్యతే ఇత్యర్థః)**. అప్పుడే యోగబుద్ధి సిద్ధిస్తుంది.

అవసరం లేనివి అవసరాలుగా తెలుస్తూ ఉంటే, జీవితంలో ఏది అవసరమో కూడా అర్థం కాకుండా పోతుంది. అనవసరమైన విషయాల పట్ల ఆసక్తి లేకపోవడం కూడా ప్రగతి సూచకమే. మనకు అవసరం లేనివి ఇతరులకు అవసరం కావచ్చు. వాళ్ళకు ఆసక్తి ఉన్న విషయాలపై మనకు ఆసక్తి ఉండ నవసరం లేదు. మనకు ఏది కావాలో అది క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. దాని పైనే మనకు అనురక్తి ఉండాలి. ఇది వివేకం. అనవసరాలను ఆలింగనం చేసుకోవడం అవివేకం. అదే మోహం. దాని వల్ల ఏర్పడే అశుద్ధమే కాలుష్యం. ఇదే మోహ కాలుష్యం. ఇది తొలగితే, ఇంత వరకు వినిన విషయాల పట్ల **(శ్రుతం)**, వినబోయే విషయాల పట్ల **(శ్రోతవ్యం)** నిర్వేదమును పొందుతావు అంటున్నాడు గీతాచార్యుడు.

వినింది వికలం

ఈ శ్లోకం సాధకులకు చాలా ఉపయుక్త మైంది. దారి తెలియక దగా పడే వారికి ఇదొక దారిదీపం

వంటిది. అక్షరాభ్యాసం నాడే అక్షర స్వరూపం తెలిసి రానట్లు ప్రారంభం లోనే అందరూ వివేకంతో ఎలా చరిస్తారు? ఆ మార్గంలో చరిస్తూ ఉంటే, క్రమేపి వివేకం ఉదయిస్తుంది. వివేకం ఉదయించే లోగా వ్యక్తిలో ఏదో జరిగి పోతుంది.

వ్యక్తిలో వివేకం ఉదయించ లేదని, అవివేకం చూస్తూ కూర్చుంటుందా? తన వ్యాపక మేదో తనకు ఉండనే ఉంటుంది. తన వ్యాపారము తాను సాగిస్తూనే ఉంటుంది. ఇది ఎంత వరకు ప్రాకి పోతుంది అంటే, వివేకం వచ్చినా ప్రవేశించడానికి వీలు లేనంతగా మనస్సులో నిండి పోతుంది. ప్రతి సాధకునికి ఇదొక కాళరాత్రి వంటిది.

వివేకం లేనివాడు కనుక ఎక్కడెక్కడో ఏదేదో వింటాడు. జ్ఞానం లేదు కనుక విన్నది అంతా వాస్తవమే నని భ్రమిస్తాడు. అదే సత్యమని అతుక్కు పోతాడు. గమ్యం నిర్దిష్టంగా ఉండదు కనుక మార్గం కూడా నిర్ణీతంగా ఉండదు. ఎటు పోవాలో, ఏమి చేయాలో అర్థం కాదు. ఈ లోగా మరొకటి వింటాడు.

అన్ని మార్గాలు ఒకే గమ్యం వైపు నడుస్తాయి. ఏ మార్గమైనా గమ్యం చేర్చేదే అని ఎవరో బాకా ఊదుతూ ఉంటే అది వింటాడు. ఈ అస్తవ్యస్త వాక్యానికి రోమ్ నగరం ఒక ఉదాహరణ. అంతే, ఇక ఆ తరువాత ఎటు పడితే అటు పోవడమే. ఏది కనిపిస్తే అదే దారి. అదేమి టంటే, రోమ్ నగరం అంటాడు. ఇక ఆ నాలుకపై 'రోమ్' ఉంటుందే గాని, 'రామ్' ఉండదు.

విన్న వన్నీ విడ్డూరాలే. వివేకం లేనపుడు వినే వన్నీ విచిత్రాలే. ఈ విచిత్రాలు బుద్ధిని ఎంతగా వికలం చేస్తాయో ఇపుడు తెలియదు. బుద్ధిని శుద్ధి చేసుకోవడానికి శ్రీకారం చుట్టిన నాడు ఎంత చెత్త చేరి పోయిందో అర్థ మౌతుంది.

- ఇలా చేస్తే మూడు నెలల్లో ముక్తి ముంగిట నిలుస్తుంది.

- ఈ మార్గంలో నడిస్తే బొందితో కైలాసం పోవచ్చు.

- ధ్యానం చేయకపోతే మోక్షం రాదు.

- టిక్కెట్టు లేకుండా సినిమా హాల్లోకి పోలేవు. శరీరంపై ఈ చిహ్నాలు లేకపోతే దైవసన్నిధి లోకి ప్రవేశించ లేవు.

- మానవసేవ లోనే మోక్షం లభిస్తుంది.

- భగవంతుడు ఆ లోకంలో ఉంటాడు. అలా ఉంటాడు. ఇలా ఉంటాడు.

ఇలాంటి మహావాక్యాలు వందల్లో కాదు, వేలల్లో ఉన్నాయి. వెతికితే లక్షల్లో కూడా దొరుకుతాయి. ఎన్నని? ఎందరని? ఇంకెక్కడి వివేకం? బుద్ధే వికలమై పోయింది.

వినబోయేది వైకల్యం

ఇది విన్నాను - అది వినాలి.

ఇది చదివాను - అది చదవాలి.

వీళ్ళు చెప్పింది ఆచరించాను - వాళ్ళు చెప్పింది ఆచరించాలి.

ఇక్కడికి పోయాను - అక్కడికి పోవాలి.

ఈ ధ్యానం చేశాను. ఆ ధ్యానం చేయాలి.

ఇందులో ఏదో దొరికింది - అందులో ఏం దొరుకుతుందో చూడాలి.

ఇలా పలవరిస్తూ ఉంటారు. అంతా తిరుగుతూ ఉంటారు. అన్నీ కావాలి. ఎన్నెన్నో కావాలి. ఏదీ వదలరు. దేనినీ పట్టుకోరు. వారానికి ఒక ఆశ్రమం. రోజుకో గురువు. క్షణం చిత్తం. క్షణం మాయ. అంతా మాయే. మాయే మహిమ. ఇదంతా మోహ కాలుష్యం. వివేకం లోపించడం వల్ల ఏర్పడిన బుద్ధి దోషం.

మనిషే కాదు చీకటిలో
ఛాయ కూడా కనబడదు
　　మహిమే కాదు మోహములో
　　మాయ కూడా కనిపించదు
వెలుగుల లోనే విచారము
తానే వెలుగును వివేకము
　　రామ రామ జయ రాజారామ్
　　రామ రామ జయ సీతారామ్ - ఇదొక రామకోటి చిట్కా.

అంతా మంచే - అన్నీ మంచివే

జ్ఞానం ఎవరి నుండైనా రావచ్చు. దిక్కు లేని వారికి ఏ దిక్కు నుండైనా వినిపించ వచ్చు. ఎవరు చెప్పినా వినాలి. వినపడింది వినాలి (*శ్రోతం శ్రోతవ్యం*). కనపబడింది చూడాలి (*దృష్టం దృష్టవ్యమ్*). ఏ పుట్టలో ఏ పాముందో! ఏ పెట్టెలో ఏ తేలుందో! దూరపు కొండలు నునుపు - దగ్గర తొండలు మెరుపు . . . అదేమి టంటే, తొండ పరుగు కంచె వరకు అని మరొక విరుపు.

ఇలా విని విని ఎందరో పాడయ్యారు. వినాలి అనుకొని ముమ్ముందు ఇంకెందరో పాడు కావటానికి సిద్ధంగా ఉన్నారు. ఇలా విన్న విషయాల పట్ల, వినబోయే విషయాల పట్ల ఎవరికి ఆసక్తి ఉండదో, పైగా వైరాగ్యం ఉంటుందో, అట్టి వారికి యోగబుద్ధి సిద్ధించింది అని అర్థం.

నిరాశ కాదు - నిర్వేదం

అవసరం లేని దాని విషయంలో ఆశ కదలకుండా ఉండటం నిరాశ కాదు. నిర్వేదం. వైరాగ్యం. రాగం లేని స్థితి. నిస్సారమైన విషయాల పట్ల అరుచి. వాస్తవానికి ఇదొక గొప్ప సంపద. వైరాగ్య సంపద. సాంఖ్య, యోగాలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న వారికి అనిత్యమైన విషయాల పట్ల కలిగే అనాసక్తి. నిర్వేదం. ఇంతవరకు విన్నవి (*శ్రుతం*), ఇక మీదట వినబోయేవి (*శ్రోతవ్యం*) ఏవైనా నిష్ఫలమే అనే వివేకం. జ్ఞానం (*శ్రోతవ్యం శ్రుతం చ నిష్ఫలం ప్రతిపద్యతే ఇత్యభిప్రాయః*). అలం బుద్ధి లక్షణం. ఇది చాలు. చాలు. చాలు అనే తృప్తితో యోగబుద్ధి సారించిన విలక్షణ దృక్పథం. వైరాగ్య దర్శనం.

ఇది వారికి ఎలా సాధ్యమైంది? అంతకు మించి పొంద దగింది లేదు కనుక. వేదాంత జ్ఞానమునకు మించిన సత్యం ఏముంది? యోగనిష్ఠలో ఉన్న వ్యక్తికి ఇహపర విషయాల యందు ఉన్న వైరాగ్యాన్ని కదిలించే శక్తి ఏ సిద్ధాంతానికి ఉంది?

ఈ ప్రపంచము దేని చేత ప్రకాశిస్తూ ఉందో (*యేన ప్రకాశతే విశ్వం*), దేని యందు లయించిపోతూ ఉందో (*యత్రైవ ప్రవిలీయతే*), అట్టి పరమశాంత స్వరూపమైన, శ్రేష్ఠపదమైన బ్రహ్మమును నేనే (*తద్బ్రహ్మ పరమం శాన్తం తద్బ్రహ్మాస్మి పరం పదమ్*). ఇది ఉపనిషత్తు ప్రసాదిస్తున్న ఆత్మజ్ఞానము. దీనికి మించి పొంద దగింది ఏముంది? ఇంతకు మించిన ఆకర్షణ ఎక్కడుంది? అందుచేత వేదాంత వన విహారం చేసే యోగయుక్తునికి, జ్ఞాననిష్ఠునికి ఈ ప్రపంచంలో విన్న విషయాల పట్ల, వినబోయే విషయాల పట్ల ఆసక్తి ఉండదు. అనురక్తి ఉండదు. అంతా నిర్వేదమే. వైరాగ్య విభూతి ప్రదర్శనమే. అంతా చిన్మయమే (*సర్వం సచ్చిన్మయం తతమ్*). ఇక నేను కోరుకో దగింది ఏముంది? (*కిం అన్యత్ అభివాంఛామి?*) అని నిత్యతృప్తితో పరవశించి ప్రశ్నించాడు ఉపనిషత్తులో మహర్షి.

ప్రపంచంలో వివిధ సాధన సాధ్య విషయాలే గాక, వేదం లోని సాధ్య సాధనల విషయంలో కూడా యోగ బుద్ధి విలక్షణం గానే ఉంటుంది. వైరాగ్యం తోనే ఉంటుంది అంటున్నాడు.

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధావచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53

శ్రుతివిప్రతిపన్నా-తే-యదా-స్థాస్యతి-నిశ్చలా
సమాధౌ-అచలా-బుద్ధిః-తదా-యోగం-అవాప్స్యసి

శ్రుతివిప్రతిపన్నా	= వేదవాదాలతో కలత చెందిన	యదా	= ఎప్పుడు
తే	= నీ యొక్క	స్థాస్యతి	= నిలబడుతుందో
బుద్ధిః	= బుద్ధి	తదా	= అప్పుడు
నిశ్చలా	= చలింపనిదై	యోగం	= యోగమును
అచలా	= స్థిరముగా	అవాప్స్యసి	= పొంద గలవు
సమాధౌ	= సమాధి యందు		

అనేక విషయాలను, వేద వాదాలను ఆలకించి విచలితమైన నీ బుద్ధి ఆత్మ యందు నిశ్చలంగా నిలవాలి. అప్పుడే యోగాన్ని పొంద గలవు.

వ్యాఖ్య

ప్రతిచర్యలు లేని యోగము, ప్రతిబంధకాలు లేని జ్ఞానము - ఈ రెండూ చాలా ప్రధాన మైనవి. ఆత్మ ఉన్నదే. ఆత్మజ్ఞానమే ఇప్పుడు తన వద్ద లేనిది. కనుక ఆత్మజ్ఞానానికి సాధకుడు యత్నించాలి. ఉన్న దానికి సంబంధించిన జ్ఞానమే కనుక విచారము కొనసాగించాలి. ఇక్కడ భగవత్కృప ఆచార్యుని రూపంలో, ప్రమాణ రూపంలో ఉంటుంది. ప్రమాణ విచారం చక్కగా జరిగితే ప్రమ కలుగుతుంది. ప్రమ అంటే జ్ఞానము.

ఇలాంటి జ్ఞానము కలగాలి అంటే, మనస్సు శుద్ధిపడి ఉండాలి. అంటే, రాగద్వేషాల చేత అశుద్ధమైన మనస్సు, వాటి నుండి విడివడి విశుద్ధం, ప్రసన్నం కావాలి. అందుకు సహకరించేదే కర్మయోగము. కనుక యోగము జ్ఞాన సాధనము.

సాధారణంగా మనస్సు చలన స్వభావం కలిగి ఉంటుంది. అనేక విషయ సంపర్కం చేత బుద్ధి వికలమై ఉంటుంది. విషయ ప్రపంచం యొక్క అస్థిరత్వం అర్థమైతే వికలమైన బుద్ధి వైరాగ్యంతో శోభిస్తుంది. కలత చెందకుండా ఉంటుంది.

విషయ ప్రపంచంలో అనేక విషయాలను, సాధన సాధ్యాలను గూర్చి విని, చూచి, ఆలోచించి, విక్షిప్త మైన మనస్సు, ఈ మోహ కాలుష్యాన్ని దాటి నపుడు దేనికీ కలత చెందకుండా నిర్వేదంతో విలక్షణంగా ఉంటుంది అని యాభై రెండవ శ్లోకంలో చూశాం. ప్రపంచంతో మనస్సు ఎలాగైతే విక్షిప్త మైందో, అలాగే వేదం లోని కర్మకాండ వల్ల కూడా విక్షిప్త మయ్యే అవకాశం ఉంది.

శ్రుతులలో వేరు వేరు సాధనలు, వేరు వేరు ఉపాసనలు చెప్పబడ్డాయి. వేరు వేరు సాధనలకు వేరు వేరుగా సాధ్యాలు నిర్ణయింపబడి ఉన్నాయి. వీటిలో ఏది ఆచరణీయమో ఏది కాదో, ఏది అవసరమో, ఏది అనవసరమో అర్థం కానపుడు, మనస్సు విచలిత మవుతుంది. విక్షిప్త మవుతుంది.

మనకు ఏది కావాలో అది నిశ్చయంగా తెలిస్తే, ఆ తరువాత సాధ్యసాధనాలు ఎన్నున్నా అవి మనలను కలత పెట్టలేవు. వాటి ప్రభావం మన మీద ఉండదు. అవన్నీ ఉంటాయి. అయినా బుద్ధి వైరాగ్యంతో విలక్షణంగా

ఉంటుంది. సాధనసాధ్యాల విషయంలో నిశ్చయం లేక సందేహంతో నిండి ఉన్న మనస్సునే శ్రవణాదులు కలత పెడతాయి. సంశయాలు లేని బుద్ధికి అవి విక్షేపాన్ని కలిగించ లేవు.

కళ్ళు లేని వ్యక్తిని ఏ రూపం కలత పెడుతుంది? వినికిడిని కోల్పోయిన వ్యక్తిని ఏ శబ్దం బాధిస్తుంది? అలాగే, నిశ్చయ జ్ఞానంతో సంశయ నివృత్తి జరిగి, పురుషార్థ నిశ్చయం స్థిరంగా ఉండి, సాంఖ్య, యోగాలకు సంబంధించిన అవగాహన స్థిరంగా ఉన్న వ్యక్తి మనస్సును వేదం లోని కర్మకాండ కూడా అస్థిర పరచ లేదు.

సర్వే వేదాః యత్పద మామనన్తి - సర్వ వేదాలు ఏ బ్రహ్మమును గూర్చి చెబుతున్నాయో, ఆ బ్రహ్మమే ఏకైక గమ్యముగా గల సాధకుని బుద్ధిని కర్మలు కలత పెట్టలేవు.

అర్జునా! శ్రుతుల లోని సాధ్యసాధన సంబంధము లైన విషయాలను శ్రవణం చేయడం చేత విప్రతిపన్న మైన, అంటే విక్షిప్త మైన (నిలకడను కోల్పోయిన) బుద్ధి, ఏ సమయంలో నిశ్చల మవుతుందో, స్థిర పడుతుందో, ***(యదా స్థాస్యతి నిశ్చలా, యదా యస్మిన్ కాలే, స్థాస్యతి స్థిరీభూతా భవిష్యతి, నిశ్చలా చలన వర్జితా సతి)*** సంశయాలు లేకుండా అచలమై ఉంటుందో ***(అచలా)*** అప్పుడు యోగాన్ని పొందుతావు ***(తదా యోగమ్ అవాప్స్యసి)*** అంటూ ఈ కర్మయోగ ప్రకరణాన్ని సమాప్తం చేస్తున్నాడు గీతాచార్యుడు.

ఈ శ్లోకంలో ఒక్క పదాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే సరిపోతుంది. 'చిత్తం ఎక్కడ నిలకడగా ఉంటుందో' అంటున్నాడే, అది ఎక్కడ? అదే సమాధి అనే పదం. అంటే దేని మీద బుద్ధి నిశ్చలంగా ఉంటుందో అది సమాధి ***(సమాధా వచలా బుద్ధిః సమాధౌ - సమాధీయతే చిత్తం అస్మిన్ ఇతి సమాధిః ఆత్మా)***. ఇక్కడ సమాధి అంటే ఆత్మ అని అర్థము. ఏ విక్షేపాలు లేకుండా, వికల్పాలు లేకుండా ఆత్మ యందు బుద్ధి స్థిరంగా ఉండటమే సమాధి. ఆ సమయం లోనే యోగబుద్ధి స్థిరంగా ఉంది అని అర్థం ***(తస్మిన్ కాలే యోగం అవాప్స్యసి)***. చిత్తైకాగ్రత సిద్ధించింది అని భావం. బుద్ధి ఆత్మలో స్థిరపడి నపుడు యోగబుద్ధిని పొందినట్లు నిశ్చయం. దీనినే బుద్ధి అనకుండా ప్రజ్ఞ అని ప్రవచించారు భాష్యంలో ఆచార్యులు. వివేక ప్రజ్ఞను సమాధిగా అభివర్ణించారు (***యోగమ్ అవాప్స్యసి, వివేక ప్రజ్ఞాం సమాధిం ప్రాప్స్యసి***). సమాధిలో వివేక ప్రజ్ఞ యొక్క స్థిరత్వము గోచరిస్తుంది.

ఇది వినగానే, స్ఫూర్తితో స్పందించిన అర్జునుడు, పార్థసారథిని ప్రశ్నించే అవకాశం లభించి నందుకు పొంగిపోతూ ***(ప్రశ్న బీజం ప్రతిలభ్య)***, *వివేక ప్రజ్ఞను పొందిన, సమాధి స్థితుడైన, ఆత్మ యందు ప్రజ్ఞ స్థిరపడిన స్థితప్రజ్ఞుని లక్షణాలను వాసుదేవుని నుండి వినాలనే కుతూహలంతో ఇలా ప్రశ్నిస్తున్నాడు*

అర్జున ఉవాచ :

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥ 54

స్థితప్రజ్ఞస్య-కా-భాషా-సమాధిస్థస్య-కేశవ
స్థితధీః-కిం-ప్రభాషేత-కిం-ఆసీత-వ్రజేత-కిం

కేశవ	= కృష్ణా!	కిం	= ఏమి
సమాధిస్థస్య	= సమాధి యందున్న	ప్రభాషేత	= భాషించును?
స్థితప్రజ్ఞస్య	= స్థిరబుద్ధి గల వాని యొక్క	కిం	= ఎట్లు
భాషా	= భాషణము	ఆసీత	= కూర్చొనును
కా	= ఏది?	కిం	= ఏ విధంగా
స్థితధీః	= స్థితప్రజ్ఞుడు	వ్రజేత	= చరించును?

అర్జునుడు అడుగుతున్నాడు :

కేశవా! ఆత్మ స్థితుడైన స్థిత ప్రజ్ఞుని లక్షణ మేమి? స్థితప్రజ్ఞుడు ఏమి మాట్లాడుతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా సంచరిస్తాడు?

వ్యాఖ్య

అసమాన అద్భుత దీప్తి
అరుదైన అపూర్వ కీర్తి

ధర్మం అనేది లక్షణం. దానికి రూపం లేదు. బుద్ధిలో భాసిస్తుంది. రూపం లేని ధర్మం రూపాన్ని ధరిస్తే ఎలా ఉంటుంది అంటే ఏమి చెప్పగలం? 'శ్రీరాముడిలా ఉంటుంది' అని అనగలం. అంతే.

ప్రేమ అనేది కూడా లక్షణమే. ప్రేమకు కూడా రూపం లేదు. రూపం లేని ప్రేమ భావంలో చలిస్తుంది. హృదయంలో ఊరేగుతుంది. రూపం లేని ప్రేమ ఎలా ఉంటుంది అంటే సమాధానం ఏం చెప్పగలం? 'శ్రీకృష్ణ పరమాత్మలా ఉంటుంది' అని చెప్పగలం. అంతే.

మరి, జ్ఞానం? ఆత్మ లక్షణమైన అద్భుత జ్ఞానం ఎలా ఉంటుంది? అంటే, తిరిగి ఏం జవాబు చెప్పాలి? చెప్పడానికి మాటలు ఎక్కడ నుండి తెచ్చుకోవాలి? మరుగున పడిపోతున్న మనస్సుతో ఏమని ఊహించాలి? మేలుకొని మాట్లాడాలా? నిద్రించి కల కనాలా? మైమరచి నిద్ర పోవాలా? ఎక్కడ నుండి పలకాలి? ఏమని చెప్పాలి? ఏమీ చెప్పలేక రెండు చేతులు జోడించి, ఆచార్యదేవులు శ్రీ ఆదిశంకరుల వారి వైపు చూడాలి. చూడమని చెప్పాలి. అంతే.

గీతలో మనం అధ్యయనం చేస్తున్నది రెండవ అధ్యాయం. ఇది ద్వితీయం. అద్వితీయం. అధ్యాయం ఆరంభం లోనే శరణాగతిని చెప్పుకున్నాం. ఆ తరువాత ఆత్మజ్ఞానమైన సాంఖ్యాన్ని అధ్యయనం చేశాం. ఆ తరువాత ప్రాసంగిక విషయంగా ధర్మాన్ని గూర్చి విన్నాం. మళ్ళీ సాంఖ్యము నుండి లంకెను అంది పుచ్చుకొని పవిత్రమైన ప్రసాదం లాంటి కర్మయోగాన్ని విన్నాం. ఇక ఇప్పుడు స్థితప్రజ్ఞుని లక్షణాలను వినబోతున్నాం.

స్థితా ప్రతిష్ఠితా అహమస్మి పరంబ్రహ్మ ఇతి ప్రజ్ఞా యస్య సః స్థితప్రజ్ఞః

నేనే పరబ్రహ్మమును అని ఎవని ప్రజ్ఞ, లేదా జ్ఞానము స్థితమై, అంటే స్థిరమై నిలిచి ఉందో, అతడే స్థితప్రజ్ఞుడు. బ్రహ్మజ్ఞాని. జీవన్ముక్తుడు.

దేవుడు ఎలా ఉంటాడో అని ఆలోచించే వారు ఎవరిని దర్శించి ఇలా ఉంటాడా! అని తృప్తి చెందుతారో, అతడే స్థితప్రజ్ఞుడు.

తనపై ఎటువంటి ప్రభావం చూపలేని ప్రపంచాన్ని, సంకల్పం కూడా లేకుండా, కేవలం సన్నిధి అనుగ్రహం చేతనే విశేషంగా ప్రభావితం చేస్తాడు. యావద్విశ్వానికి నీడ నిచ్చే ఆ జ్ఞాన తరువు యొక్క వ్రేళ్ళు వేదంలో పాతుకొని ఉంటాయి. అతనిని మలిన పరచే వస్తువు లేదు. పాడు చేసే శక్తి లేదు.

ఏది వచ్చినా అతనికి ఆనందమే. అతడు ఆహ్వానం పలకడం తెలియని వాడు. ఏది దూరమైనా అతనికి ఆనందమే. అతడు వీడుకోలు చెప్పడం అర్థం కానివాడు. సర్వమూ ఆ వ్యక్తికి సంతతానంద సంధాయకమే. కారణం, అతడు వ్యక్తి కాడు, అద్భుత శక్తి.

సుఖాలు అతణ్ణి వరించి సమీపిస్తాయి. అయ్యో! సంతోష పరచలేక పోయామే అని దిగులుతో వెను దిరిగి పోతాయి.

మేము ఆవరిస్తే ఉక్కిరిబిక్కిరై ఊపిరి ఆడకుండా విలపించే వాళ్ళనే చూశాము. చింత చెందని వాణ్ణి, కన్నీళ్ళు ఒలికించని వాణ్ణి, దరహాసము చెదరని పూర్ణచంద్ర శోభతో ప్రకాశించే పవిత్రాత్ముణ్ణి ఇంత కాలానికి చూడగలిగా మని కష్టాలు పరవశిస్తాయి.

నదులొచ్చి పడుతున్నా పెరుగుదల లేని సముద్రం లాగా, ఏది వచ్చినా, ఎంత వచ్చినా పొంగని వాడు. జలాలు ఆవిరై పోతున్నా తరుగుదల అర్థం కాని సాగరం లాగా ఏది పోతున్నా, ఎవరు పోతున్నా క్రుంగని వాడు. నిర్వికార స్వరూపుడు.

ప్రాపంచిక పెనుగాలులు దారుణంగా వీస్తున్నా, ఏ మాత్రం కదలిక లేకుండా ప్రకాశించే జ్ఞాన ప్రదీపుడు. సర్వశక్తి స్వరూపుడు.

దేవాలయం కదలదు. దేవాలయంలో దేవుడు పలకడు. కదిలే దేవాలయంలో పలికే దేవుడే స్థితప్రజ్ఞుడు. ముముక్షువులు ప్రయత్నించి సంపాదించుకో వలసిన పవిత్ర సాధనలను సహజ లక్షణాలుగా పొందిన పావనాత్ముడు. కృతకృత్యుడు. ఆప్తకాముడు. అతడే స్థితప్రజ్ఞుడు. అరుదైన ఆరాధ్యమూర్తి. మానవాళికి అసమాన అద్భుత స్ఫూర్తి. లోక కళ్యాణ కీర్తి.

పార్థుని ప్రశ్న

కేశవా! ఆత్మస్థితుడైన స్థితప్రజ్ఞుని లక్షణ మేమిటి? అతడు ఏమి మాట్లాడుతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా చరిస్తాడు? ఇది అర్జునుని ప్రశ్న.

యోగబుద్ధినే ప్రజ్ఞ అనే పదంతో భాషించడం జరిగిందని మనం ముందే చెప్పుకున్నాం. ఆత్మవివేకం కలిగిన బుద్ధినే ప్రజ్ఞగా అర్థం చేసుకోవాలి. 'స్థిత' అంటే ప్రతిష్ఠితం కావడం. ఈ శ్లోకంలో **స్థితప్రజ్ఞః - స్థితధీః** అనే రెండు పదాలలో 'స్థిత' అనేది సామాన్యంగా ఉంది. ప్రజ్ఞః - ధీః అనే రెండు పదాలు ఒకే అర్థంతో వాడబడ్డాయి. ఎవరి ప్రజ్ఞ, లేదా బుద్ధి ఆత్మ యందు సుప్రతిష్ఠమై ఉందో అతడే స్థితప్రజ్ఞుడు.

స్థితప్రజ్ఞుడు ఆత్మజ్ఞాని. ఆత్మజ్ఞానికి ఉపనిషత్తులలో అనేక పేర్లు ఉన్నాయి. బ్రహ్మనిష్ఠుడు, బ్రహ్మజ్ఞాని, ఆప్తకాముడు, జీవన్ముక్తుడు - ఇలా అనేక పేర్లతో ఉపనిషత్తులు పిలిచాయి. కాని, ఈ సందర్భం లోనే, గీత లోని ఆత్మజ్ఞానికి స్థితప్రజ్ఞుడు అనే పేరును వింటున్నాము. ఇది పార్థుడు సృష్టించిన పదం.

యాభై మూడవ శ్లోకంలో ***యదా స్థాస్యతి నిశ్చలా, సమాధా వచలా బుద్ధిః*** అనే పదాలను పరమేశ్వరుడు పలికి నపుడు, అర్జునుడికి అందమైన ఆలోచన కదలి, సుందరమైన ఈ మాటను (**స్థితప్రజ్ఞ**) రూపొందించాడు. ఆ తరువాత, ఈ విశిష్ట నామం విశేష ప్రాచుర్యాన్ని పొందింది. ఆత్మ యందు (**సమాధిః**) నిశ్చలమైన (**స్థిత**) బుద్ధి (**ప్రజ్ఞ**) ఎవరికి ఉందో అతడే స్థితప్రజ్ఞుడు. పార్థుని ప్రశ్నకు సమాధానంగా స్థితప్రజ్ఞుని లక్షణాలను పద్దెనిమిది శ్లోకాలలో వర్ణించిన పార్థసారథి చివరగా, **ఏషా బ్రాహ్మీస్థితిః** అని సమాప్తం చేశాడు. ఆత్మ యందు బుద్ధి స్థిరపడటమే స్థితప్రజ్ఞత్వం కావడం వల్ల, ఇదే బ్రాహ్మీస్థితి అని సమాప్తి చేయడం జరిగింది.

పతంజలి మహర్షి బోధించిన యోగ ప్రక్రియలో ఎనిమిదవ అంగము సమాధి. ఆ సమాధికి రాకపోక లుంటాయి. అక్కడ యోగి అంతర్ముఖుడై నప్పుడే సమాధినిష్ఠుడు. బహిర్ముఖ మైనపుడు సమాధిలో లేడు అని అర్థం. కాని ఇక్కడ, ***సమాధి*** అనే పదాన్ని ఆత్మ గానే గ్రహించాలి. అష్టాంగ యోగ మార్గంలో వినిపించే సమాధిగా అర్థం చేసుకో కూడదు. ఇక్కడ నడిచేది జ్ఞాన ప్రకరణం.

స్థితప్రజ్ఞస్య కా భాషా - సమాధిస్తస్య అని అర్జునుడు అన్నప్పుడు అది సమాధి స్థితుడైన వానికి సంబంధించిన విషయ మని, అలా సమాధి స్థితుడైన యోగి బహిర్ముఖమై ప్రపంచంలో చరించే టప్పుడు అతడు ఎలా ఉంటాడు? అనేది ***స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్*** అనే రెండవ పాదము యొక్క అర్థమని చాలా మంది వ్యాఖ్యానిస్తూ ఉంటారు. చాలా మంది ఇలా ప్రవచించడం బాల్యంలో నేను కూడా విన్నాను. ఈ విధమైన వ్యాఖ్యానము గీతకు అన్వయించదు. గీత జ్ఞాన ప్రధానమైన మోక్షశాస్త్రము.

అర్జునుని అంతరంగం

అర్జునుని ప్రశ్న లోని ఆంతర్యం ఏమై ఉంటుంది? స్థితప్రజ్ఞుని లక్షణ మేమిటి? అతడు ఎలా మాట్లాడుతాడు? ***(కిం ప్రభాషేత?)*** ఎలా కూర్చుంటాడు? ***(కిమాసీత?)*** ఎలా చరిస్తాడు? ***(వ్రజేత కిమ్?)*** అని ప్రశ్నిస్తున్నాడు. ఇది విడ్డూరంగా లేదూ? ఒక వైపు ప్రశ్నిస్తూనే, మరొక వైపు వింటూనే, స్థితప్రజ్ఞుడు ఎలా మాట్లాడుతాడు? అని అడగట మేమిటి? అర్జునుడితో మాట్లాడుతున్న దెవరో అర్జునుడికి తెలియదా? ఠీవిగా కళ్ళెం చేత పట్టుకుని రథంలో ముందు కూర్చుని దివ్యంగా శోభిస్తున్న ముకుందుని తన ఏడుపుతో లేపి నిలబెట్టి, ఎలా కూర్చుంటాడు? అని ఇప్పుడు అడుగుతా డేమిటి? ఎలా సంచరిస్తాడో ఇన్ని సంవత్సరాలుగా చూడలేదా? అతడి సంచారాన్ని గురించి ప్రత్యేకించి ఇప్పుడు ప్రశ్నిస్తా డేమిటి? శ్రీకృష్ణుని కన్నా వేరుగా ఆత్మజ్ఞానిని, బ్రహ్మజ్ఞానిని చూడాలని కౌంతేయుడు ఉబలాట పడుతున్నాడా? కానే కాదు.

అర్జునుడు సర్వ మానవాళి ప్రతినిధి. ఆయన వేసే ప్రశ్న లన్నీ మన ప్రశ్నలే. ఆయన పొందే సమాధానా లన్నీ మన కోసమే. శ్రీకృష్ణు డెవరో, ఏమిటో తెలియకపోతే, ఈ శ్లోకంలో ***కేశవా!*** అని సంబోధిస్తాడా?

కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాః
తే యద్వశేన వర్తన్తే స కేశవః

క+అ+ఈశ - ఈ మూడు కలసి 'కేశ' శబ్దం వస్తుంది. 'క' అంటే బ్రహ్మ, 'అ' అంటే విష్ణువు, 'ఈశ' అంటే ఈశ్వరుడు. 'కేశ' శబ్దంలో త్రిమూర్తులు ఒదిగి పోయారు. ఈ ముగ్గురు మూర్తులు ఎవరికి వశపడి ఉంటారో (వ), అతడే కేశవుడు. త్రిమూర్తులను శాసించేవాడు.

స్థితప్రజ్ఞః అనడంలో కేశవుని కన్నా అన్యమైన విచిత్ర రూపాన్ని చూడాలని అర్జునుడు భావించడం లేదు. అలాగే ***ప్రభాషేత, ఆసీత, వ్రజేత*** అనే పదాలను ప్రయోగించి ప్రశ్నించడంలో స్థితప్రజ్ఞుని ఆసన సిద్ధిని దర్శించాలని అభిలషించడమూ లేదు. ఆత్మజ్ఞుడైన జ్ఞాని హర్ష శోకాలలో ఎలా ఉంటాడు? ఇంద్రియ మనస్సులను నియమిస్తాడా? ఎలా నియంత్రిస్తాడు? శబ్దాది విషయాలు అందరిని పురి కొల్పినట్లే స్థితప్రజ్ఞుని కూడా ప్రేరేపిస్తాయి కదా! వాటి విషయంలో ఎలా వ్యవహరిస్తాడు? ఇదంతా అర్జునుని అంతరంగం. అచ్యుతునికి హస్తామలకం. లేకపోతే, అంత అద్భుతంగా, గుటక మ్రింగకుండా పద్దెనిమిది శ్లోకాలను అనర్గళంగా పలికి ఆత్మజ్ఞాన వైభవాన్ని ఆవిష్కరిస్తాడా?

అస్పష్ట అవగాహన

మనం ముందుగానే చర్చించు కున్నట్లు, స్థితప్రజ్ఞత్వం అనే అద్భుత విషయాన్ని యోగ దృక్పథం నుండో, లేక మరొక కోణం నుండో దర్శించి, కేవలం పదాల యొక్క అర్థాన్నే యథాతథంగా గ్రహించి, కొందరు తదనుగుణంగా అభినయించడం మీరు కూడా చూసే ఉంటారు. వారి మాటల్లో, చేతల్లో, నడకలో ఒక విధమైన వింత ధోరణి అసహజంగా కనిపిస్తూ ఉంటుంది. వారి దృష్టిలో అదంతా స్థితప్రజ్ఞ వైభవం. అలాంటి విచిత్ర పోకడలు శ్రీకృష్ణునిలో, శ్రీ ఆదిశంకరాచార్యులలో కాగడా పెట్టి వెతికినా కనిపించవు. జ్ఞానం అనేది

బుద్ధికి సంబంధించిందే గాని, భౌతిక దృష్టిలో ప్రదర్శించే వేషభాషలు కాదు. వింత నడకలు కాదు. ఒయ్యారపు చూపులూ కాదు.

మాట్లాడుతూ, మాట్లాడుతూ మెల్లగా కళ్ళు మూస్తారు. అర్ధ నిమీలిత నేత్రాలతో అలా ఉండి పోతారు. మెల్లమెల్లగా కొద్ది కొద్దిగా మాట్లాడుతారు. మాటకి మాటకి మధ్య నిశ్శబ్దాన్ని పెంచుతుంటారు. అలా మాట్లాడాలి. అలాగే మాట్లాడాలి. లేకపోతే, స్థితప్రజ్ఞులం కాకుండా పోతామేమో అని వాళ్ళ భయం. వారి వెంట ఉండి మనం చూడాలే గాని, ఆకలి వేసినపుడు కాలు కాలిన పిల్లుల్లాగా తిరుగుతూ గగ్గోలు పెట్టేస్తారు. ఎందుకొచ్చిన బాధ ఇదంతా? బోధ అర్థం గాక స్వయంకృతంగా తగిలించుకొనే వ్యథ కాకపోతే!

ఇలా మాట్లాడితేనే స్థితప్రజ్ఞులం అవుతామేమో అనుకుంటే, మూగవాడు జ్ఞాని అయ్యే అవకాశం లేదా? ఇలా నడిస్తేనే స్థితప్రజ్ఞులం అవుతాము అనుకుంటే, కుంటివాడు ఆత్మజ్ఞానానికి అనర్హుడా? దండధారుడైన ప్రతి సన్యాసి స్థితప్రజ్ఞుడైతే, కర్ర చేతి కొచ్చిన వృద్ధు లందరూ ***(వృద్ధోయాతి గృహీత్వా దండం)*** స్థితప్రజ్ఞ లేగా? బరువుల్ని పెంచుకుంటూ పోతే బంధాలు తొలగవు. జ్ఞానం కలిగి నపుడే బ్రతుకులో అందాలు అరబోసు కుంటాయి. ఆనందాలు వెల్లివిరుస్తాయి.

భావ సుమాలు

ఒక పొదలో మల్లెలు విరబూస్తే, అవి మనకు కనిపించక పోయినా, వాటి సౌరభాన్ని మనం ఆఘ్రాణిస్తాము. బిడ్డల వచ్చీరాని పలుకులు స్పష్టంగా లేకపోయినా, వారి ఆలోచన లేమిటో మనం పసి కట్టేస్తాము. జ్ఞానం కలిగిన వారు స్థాలీపులాక న్యాయంగా సర్వాన్ని గ్రహించేస్తారు. మనోగతాన్ని చదివేస్తారు.

ఉదీరితోఽర్థః పశునాఽపి గృహ్యతే
హయాశ్చ నాగాశ్చ వహన్తి నోదితాః
అనుక్తమ ప్యూహతి పండితో జనః
పరేంగిత జ్ఞాన ఫలాహి బుద్ధయః

మనం ఏదన్నా పలికితే, లేదా చెబితే పశువుకు అర్థ మవుతుంది. గుర్రాలు, ఏనుగులు అర్థం చేసుకొని బరువుల్ని మోస్తాయి. కాని, చెప్పని విషయాన్ని కూడా ఎవడైతే ఊహిస్తాడో వాడే పండితుడు. ఎందుకంటే, పరుల అంతరంగాన్ని అర్థం చేసుకోవడానికి మనుషులకు బుద్ధుల్ని ప్రసాదించాడు భగవంతుడు.

ఎంత అందమైన శ్లోకం! శ్లోకాలన్నీ అందం గానే ఉంటాయి. భావాలు బుద్ధికి పడితేనే బ్రతుకులు అందంగా మారుతాయి. సామాన్య విషయాలు కూడా కొందరికి అర్థం కావు. చెప్పినా తలకు ఎక్కవు. మనసుకు పట్టవు. మీరు చెప్పింది నాకు ఇలా అర్థమైంది అంటూ ఉంటారు. పశువులకు చెప్పింది చెప్పినట్లు అర్థ మవుతుంది. చాలా మంది మనుషులకు విన్నది మరొక విధంగా అర్థమవుతూ ఉంటుంది.

బుద్ధిలో గంభీరత ఉండాలి. అనుపేక్ష్యత ఉండాలి (విస్మరించని సంస్కారము). సౌమనస్యము ఉండాలి. ఏవైనా, ఎవరికైనా పుట్టుకతో రావు (ప్రత్యేకతలు చర్మాంశములు కావు). ప్రయత్నిస్తే, ప్రయత్నంలో దోషం లేకపోతే, ఈ ప్రపంచంలో, ముఖ్యంగా ఆధ్యాత్మిక జీవితంలో అసాధ్యాలు అంటూ ఉండవు.

అర్జునుడు ఎంత భావస్ఫూర్తితో అర్థించాడో! లేకపోతే, పరమేశ్వరుడు సారథి స్థానాన్ని అలంకరిస్తాడా? అర్జునుని అంతరంగాన్ని అర్థం చేసుకున్న అచ్యుతుడు ఎంత అద్భుతంగా ప్రవచిస్తాడో ఈ స్థితప్రజ్ఞ వైభవంలో మనం చూస్తాం.

సాధకుడు ప్రయత్న పూర్వకంగా ఏ సాధనలను ఆచరించాలో, అవే స్థితప్రజ్ఞునిలో సహజ లక్షణాలుగా

శోభిస్తూ ఉంటాయి. ఆధ్యాత్మిక గ్రంథాలలో ఇది చాలా సహజమైన విషయం అంటారు భాష్యంలో శ్రీశంకరులు
(సర్వత్రైవ హి అధ్యాత్మ శాస్త్రే కృతార్థ లక్షణాని యాని తాన్యేవ సాధనాని ఉపదిశ్యన్తే యత్న సాధ్యత్వాత్).

శ్రీ భగవానువాచ :

ప్రజహాతి యదా కామా న్సర్వా న్పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ 55

ప్రజహాతి-యదా-కామాన్-సర్వాన్-పార్థ-మనోగతాన్
ఆత్మని-ఏవ-ఆత్మనా-తుష్టః-స్థితప్రజ్ఞః-తదా-ఉచ్యతే

పార్థ	= అర్జునా!	ఆత్మనా	= ఆత్మ చేత
యదా	= ఎప్పుడు	ఆత్మని ఏవ	= ఆత్మ యందే
మనోగతాన్	= మనస్సులో ఉన్న	తుష్టః	= సంతోషించిన వాడై ఉండునో
సర్వాన్	= సమస్తమైన	తదా	= అప్పుడు
కామాన్	= కోరికలను	స్థితప్రజ్ఞః	= నిశ్చలబుద్ధి కలవాడని
ప్రజహాతి	= విడిచి పెడతాడో	ఉచ్యతే	= చెప్పబడుచున్నాడు

భగవంతుడు చెబుతున్నాడు :

పార్థా! మనస్సు లోని సమస్తములైన కోరికలను విడిచిపెట్టి ఉంటాడు. తన లోనే తనతో సంతోషిస్తూ ఉంటాడు. అతడే స్థితప్రజ్ఞుడు.

వ్యాఖ్య

ముముక్షువుకు ఏవి మోక్ష సాధనలో అవి జీవన్ముక్తునికి లక్షణాలు. స్థితప్రజ్ఞుని లక్షణ మేమి? అని అర్జునుడు అడిగిన మొదటి ప్రశ్నకు గీతాచార్యుడు ఇలా సమాధానం చెబుతున్నాడు. మనస్సు లోని సమస్త కోరికలను సంపూర్ణముగా విడిచిపెట్టిన వాడు, తన ఆనందానికి తన మీదే ఆధారపడి ఉండేవాడు స్థితప్రజ్ఞుడు.

దేనిని ఈ ప్రపంచంలో మనం ఆశించినా, అది సుఖము అని కాదు మనం దానిని వెంబడించేది, సుఖ కారణమని. మనం సుఖకారణ మని భావించింది సుఖం కాదు అని తెలిసి నపుడు, ఆ క్షణం నుండే దానిని ఆశించడం మానేస్తాము.

సుఖం ఎక్కడ ఉంటుందో, అక్కడ సంతోషం ఉంటుంది. తృప్తి ఉంటుంది. సుఖాలు మనకు తెలియనివి కావు. మనం సంతోషంగా ఉన్న సమయాలు జీవితంలో లేక పోలేదు. తృప్తి చెందిన సందర్భాలూ లేక పోలేదు. కాని, అవే గనుక సుఖ సంతోషాలు అయితే, మనల్ని అవి సదా సుఖపెట్టి ఉండాలి. కాని, అలా జరగలేదు. అందుకనే, నిరంతరం మనం సుఖాన్వేషణలో ఉన్నాం. సంతోషానికై వెంపర్లాడుతున్నాం. తృప్తి చెందాలని శ్రమిస్తున్నాం.

ఆనందం అనేది ఒక వస్తువు కాదు. ఒక ప్రదేశం కాదు. కాలము కాదు. సన్నివేశమూ కాదు. వీటిలో ఏది మనకు నిత్యతృప్తిని ప్రసాదించినా, మనం నేడు అసంతృప్తితో ఉండేవాళ్ళం కాదు.

కాఫీ చేదుగా ఉంటుంది. పంచదారను కలిపితేనే అది తియ్యగా మారుతుంది. తీపి అనేది చక్కెర ధర్మము. తీపి లేని చక్కెర ఉండదు. కాని సుఖము అనేది వస్తువు యొక్క ధర్మము కాదు. సుఖం అనేది వస్తువే

అయితే, పంచదార కాఫీని మధురంగా మార్చినట్లు, వస్తువులు మనల్ని సుఖపెట్ట గలిగి ఉండాలి. ప్రపంచంలో వస్తువు లున్నాయి. కాని, సుఖవస్తువు లేదు. వ్యక్తులు ఉండొచ్చు. వారు మనల్ని సమీపించ వచ్చు. అంతమాత్రాన సుఖం సమీపిస్తుందని, తృప్తి లభిస్తుందని అనుకోలేము. వ్యక్తులు మనకు దూరం కావచ్చు. ఆ కారణంగా సుఖం దూర మవుతుందని, తృప్తి మాయ మవుతుందని కూడా చెప్పలేము.

ఉన్నవి సుఖానికి, తృప్తికి కారణమని కొందరు అభిప్రాయ పడుతున్నారు. అలా ఉన్నవి ఒక దశలో తృప్తిని పంచలే నపుడు, పైగా అసంతృప్తికి కారణ మైనపుడు, ఇవి తృప్తికి హేతువులు కావు అని తెలిసి వాటిని త్యజిస్తున్నారు. లేనివి ఆనంద హేతువు లని అభిప్రాయపడి వాటిని పొందటానికి మరికొందరు శ్రమిస్తున్నారు. శ్రమించి వాటిని సాధించుకున్నా, అవి ఉండి తృప్తిపరచలేక పోగా జీవితంలో అసౌకర్యంగా మారినపుడు అవి అభిలషణీయాలు కావని గ్రహించి, వాటిని ఇష్టం గానో, అయిష్టం గానో విడిచి పెట్టేస్తున్నారు.

తన ఆనందానికి తానే కారణమైన మహాత్ముడు స్థితప్రజ్ఞుడు. కనుక తాను ఉన్నాడు అంటే ఆనందంగా ఉన్నాడు అని అర్థము. తాను నిత్యానందుడు కనుక, ఏదైనా తనను సమీపించ వచ్చు. అంతమాత్రాన తన ఆనందం పెరిగే దంటూ ఉండదు. తన నుండి ఏదైనా దూరం కావచ్చు. అలాగని, తన తృప్తి దూరమయ్యేది ఉండదు. అతడే స్థితప్రజ్ఞుడు.

కామము - కామి

కోరికలు ఉండాలి. అలా ఉన్న కోరికలు తీరాలి. అప్పుడే మనకు సుఖం. ఇది సాధారణంగా అందరి అభిప్రాయం. ప్రస్తుతం మనం సుఖంగా లేము కనుక కోరికలను తీర్చుకొని తృప్తి చెందాలి అనుకుంటాం. అలాగే కోరికలను తీర్చుకుంటున్నాం. కోరిక లైతే తీరుతున్నాయి కాని, తృప్తి కలగడం లేదు.

స్థితప్రజ్ఞుడు సమస్తమైన కోరికలను విడిచి పెట్టేశాడు. కాని, తృప్తిగా ఉన్నాడు. ఆనందంగా ఉన్నాడు. దేనినీ ఆశించకుండా, దేనిపై ఆధార పడకుండా తనలో తాను తృప్తి చెంది ఉన్నాడు. ఇది స్థితప్రజ్ఞుని వైభవము.

కోరికలు మనస్సు నుండే కదుల్తాయి. మనస్సు ఉంటేనే కోరికలు ఉంటాయి. గాఢనిద్రలో మనస్సు లేదు. అందుకనే, కోరికలు కూడా లేవు. మరి, స్థితప్రజ్ఞుడు మనస్సు లోని సమస్తమైన కోరికలను చక్కగా విడిచి పెట్టేశాడు కదా! **(సర్వాన్ కామాన్ మనోగతాన్ ప్రజహాతి)**. మరి అతనికి మనస్సు ఉందా, లేదా?

స్థితప్రజ్ఞుడు కూడా జీవించి ఉన్నంత వరకు కర్మలను ఆచరిస్తూనే ఉంటాడు. స్నానం చేస్తాడు. భోజనం చేస్తాడు. నిద్ర పోతాడు. వెనుక శబ్దమైతే తిరిగి చూస్తాడు. ఇవన్నీ కర్మలే. మనస్సు లేకపోతే ఇవన్నీ ఎలా చేస్తాడు? మనస్సు ఉంది. కాకపోతే, కోరికలు లేని మనస్సు ఉంది.

అంటే, ఇక స్థితప్రజ్ఞుని మనస్సులో కోరికలు కదిలే అవకాశమే లేదా? ఎందుకు లేదు? స్థితప్రజ్ఞులైన వారిని బాగా పరిశీలించి అర్థం చేసుకుంటే, స్థితప్రజ్ఞత్వం సిద్ధించిన తరువాత కూడా వారిలో కోరికలు ఉన్నట్లు తెలుస్తూ ఉంది.

స్థితప్రజ్ఞత్వం సిద్ధించిన తరువాతే రమణమహర్షి 'ఉపదేశసారం' రచించారు. వ్రాయాలి అనే కోరిక లేకపోతే ఎలా వ్రాయగలిగారు? మొదట ఆ గ్రంథాన్ని తమిళంలో రచించారు. ఆ తరువాత, ఆయనే ఆ పుస్తకాన్ని తెలుగు లోకి, సంస్కృతం లోకి అనువాదం చేశారు. అభిలాషే లేకపోతే ఇవన్నీ ఎలా జరుగుతాయి?

చెప్పాలి అనే కోరిక లేకపోతే, శ్రీకృష్ణుడు గీతను బోధించే వాడా? వ్రాయాలి అనే వాంఛ లేకపోతే, శ్రీశంకరులు గీతాభాష్యం రచించే వారా? ఇవన్నీ చూస్తూ ఉంటే, స్థితప్రజ్ఞులైన వారు కోరికలను సమూలంగా విడిచి పెట్టినట్లు గోచరించడం లేదు.

సిద్ధిని పొందగానే కోరికలు పోవు. పోవలసిన అవసరం కూడా లేదు. ప్రజ్ఞ స్థిరంగా ఉన్నవాడు జ్ఞాని (స్థితప్రజ్ఞు). జ్ఞాని దేహంతో జీవించే ఉన్నాడు. ప్రారబ్ధాన్ని మోస్తూ దేహం కొనసాగుతూనే ఉంది. దేహ అవసరాలు తీరుతున్నాయి. మనస్సు లేకుండా అవసరాలు ఎలా తీరుతాయి? ఆలోచనలను కదిలించకుండా అవసరాలను తీర్చుకొనేది ఎలా? ఆలోచనలు కదిలే టప్పుడు కోరికలు తలెత్తవా? తప్పక తలెత్తుతాయి.

సాధకులకు కోరికలు మనస్సులో కదిలినట్లే, సిద్ధ పురుషులకు కూడా కోరికలు కదుల్తాయి. కదుల్తాయి కనుకనే, మనస్సులో పుట్టిన సమస్త కోరికలను విడిచి పెడుతున్నాడు అని చెప్పడం జరిగింది. కోరికలే లేకపోతే, విడిచిపెట్టే దేముంటుంది?

బంధమా? అందమా?

జ్ఞాని మనస్సులో కోరికలు పుడుతాయి. అది మనోధర్మము. మనస్సులో కలిగిన కోరికలను జ్ఞాని విడిచి పెడుతున్నాడు. ఈ కోరికలు మనోగతాలు. అంటే మనస్సులో ప్రవేశించినవి అని అర్థం. ఈ విషయాన్ని అవధానంతో అర్థం చేసుకోవాలి.

ఒక అందమైన వస్తువును జ్ఞానం లేనివాడు చూస్తాడు. అలాగే కళ్ళున్నాయి కనుక స్థితప్రజ్ఞుడు కూడా చూస్తాడు. అందమైనది కనుక, పొందాలనే అభిలాష కలగడం మనస్సుకు సహజం. ఇద్దరికీ మనస్సు ఉంది. అందమైనది కనుక ఇద్దరి మనస్సులలో అభిలాష పుడుతుంది. కోరిక కలుగుతుంది. అవివేకి దానిని పొందాలని, పొంది సుఖించాలని దాని వెంట పడతాడు. స్థితప్రజ్ఞుడు దానిని చూస్తాడు. మనస్సులో కోరిక కదుల్తుంది. ఆ అందము ఎలా అవాంఛనీయమో, ఎలా సుఖ హేతువు కాదో తనకు తెలుసు కనుక, చేయి జారిపోయి వస్తువు క్రింద పడిపోయినట్లు, స్థితప్రజ్ఞుని మనస్సు నుండి కోరిక జారి పోతుంది. ఇదే తేడా. చాలా పెద్ద తేడా.

స్థితప్రజ్ఞునికి కోరికలు కలగక పోవడం అనేది లేదు. మనస్సు లోకి విషయాలు ప్రవేశించినట్లే, కోరికలు కూడా ప్రవేశిస్తాయి. కనుకనే ఆచార్యుల వారు ***మనోగతాన్*** అనే మాటకు ***మనసి ప్రవిష్టాన్, హృది ప్రవిష్టాన్*** అని అర్థం చెప్పారు. అంటే, మనస్సులో ప్రవేశించిన కోరికలు, హృదయంలో ప్రవేశించిన కోరికలు అని అర్థం. కోరికలైతే ప్రవేశించడం జరుగుతూ ఉంది. ప్రవేశించిన కోరికలను గుర్తించి, వాటిని వెంటనే త్యజించడం కూడా జరుగుతూ ఉంది. అయితే ఆ విడిచిపెట్టడం కూడా మామూలుగా విడిచి పెట్టడం కాదు. పూర్తిగా విడిచి పెట్టడం అని అర్థము. అందుకనే గీతాచార్యుడు ***జహాతి*** అని సరిపెట్టకుండా, ఉపసర్గను చేర్చి, ***ప్రజహాతి*** అన్నాడు. ***ప్రకర్షేణ జహాతి, పరిత్యజతి***, అంటే పూర్తిగా విడిచి పెట్టడం అని అర్థం.

జహాతి అంటే త్యజించడం. మనం అవసరం లేదని ఈ క్షణంలో త్యజించిన వాటిని రేపు మళ్ళీ అవసరాలుగా భావించి అభిలషిస్తూ ఉంటాం. అంటే విడిచి పెట్టినవి మళ్ళీ తిరిగి వస్తుంటాయి అని అర్థము. ***ప్రజహాతి*** అంటే, ఇక మళ్ళీ అగుపించవు అని అర్థం.

బంధ హేతువులైన కోరికలు మనస్సులో స్ఫురించ గానే స్థితప్రజ్ఞుడు వెంటనే వాటిని రాల్చేస్తాడు. బంధమును కలిగించనివి, లోక కళ్యాణానికి ఉపకరించేవి అయినపుడు వాటిని ఆదర్శంగా ఆచరిస్తాడు. కృతార్థుడైన వ్యక్తిని కర్మలు ఏం చేయగలవు? సంగత్వం లేని కర్మలలో బంధ మెక్కడుంది? అంతా అందమే. ఇది అర్థం కాకపోవడం చేత, జ్ఞానులను కూడా సమాజం గుర్తించలేక పోతోంది.

దేనిని బట్టి జ్ఞానిని గుర్తించాలి? జ్ఞానాన్ని బట్టే గుర్తించాలి. అంతేగాని, మరొక దానిని బట్టి కాదు. జ్ఞాని కర్మలు చెయ్యొచ్చు. చేయకుండా ఉండొచ్చు. సమాజానికి ఏదీ చేయడం లేదు కనుక అతడు జ్ఞాని కాడు అనడం అజ్ఞానానికి నిదర్శనం. జ్ఞాని సమాజాన్ని ఎలా ఆశీర్వదిస్తాడో అజ్ఞానికి అర్థం కాదు.

అలాగే, జ్ఞాని విశేషంగా కర్మలు చెయ్యొచ్చు. అంతమాత్రాన, అతని జ్ఞానాన్ని సంశయించ కూడదు. జ్ఞాని కర్మలు చేస్తే సమాజానికి అదృష్టం. జ్ఞాని ఏ కర్మలు చేయకుండా ఒకచోట కూర్చున్నా, అది సమాజానికి ఆశీర్వాదం.

ఆలయంలో భగవంతుడు మూలవిరాట్టుగా ప్రతిష్ఠింపబడి ఉంటాడు. ఆలయం లోని మూర్తి అచలం. ధ్రువం. ఆ భగవంతుడే ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తిగా ఊరేగుతూ వస్తాడు. ఆ రెండు మూర్తులలో భగవంతుడు కాని దెవరు? రెండు రూపాలు ఒక స్వరూపానివే. రెండు మూర్తులూ ఆరాధ్యములే. ఆలయం లోని మూర్తిని మనం వెళ్ళి దర్శించి అర్చిస్తాం. తానే మన వద్దకు ప్రేమతో కదిలి వచ్చిన ఉత్సవమూర్తిని ఆరాధించి ఆనందిస్తాం.

కదలకుండా ఉన్నా, కదిలి ఊరేగినా, రెండు మూర్తులలో దర్శన మిచ్చేది భగవంతుడే. కర్మలు ఆచరించినా, ఆచరించక పోయినా, స్థితప్రజ్ఞుడు జ్ఞానియే. చేసినా, చేయక పోయినా అతడు అకర్తే. కర్త ఉంటేనే కోరికలు బంధిస్తాయి. కర్త లేకుండా కదిలే కమనీయ కోరికలే స్థితప్రజ్ఞునిలో ఉంటాయి. బంధహేతువు లైన కోరికలు ఆ పవిత్రాత్ముని అంతఃకరణలో కదలవు. ఎందుకని? అతడు ఆనంద స్వరూపుడు. నిత్య తృప్తిలో ఓలలాడే వాడు. తన స్వరూపమైన ఆనందంలో తానుగా ఆనందించే వాడు. కోరిక లన్నీ తీరిపోయిన ఆప్తకాముడు. ఆత్మవిదుడు.

యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽ శ్నుతే సర్వాన్కామా న్సహ। బ్రహ్మణా విపశ్చితేతి।

ఎవడు బుద్ధిగుహ లోని శ్రేష్ఠమైన హృదయాకాశంలో నిగూఢంగా ఉన్న ఆత్మను తెలుసుకొను చున్నాడో, అట్టివాడు బ్రహ్మాత్మ స్వరూపముతో పాటు సమస్త మైన కోర్కెలను ఒకేసారి అనుభవించిన వాడు అగుచున్నాడు అని బ్రహ్మవిదుని పూర్ణత్వ శోభను దివ్యంగా వర్ణించింది తైత్తిరీయ శ్రుతి.

ఆఖ్యాయిక

యమునాతీరంలో ఆచార్యుడైన గురుగోవిందుడు ఆసీనుడై ఉన్నాడు. ప్రవహించే యమునా నది పరవళ్ళను తిలకిస్తూ, ఎగసిపడే అలల సౌందర్యాన్ని వీక్షిస్తూ కూర్చొని ఉన్నాడు. కోటీశ్వరుడైన రఘునాథు డనే శిష్యుడొకడు అక్కడికి వచ్చి గురువుకు నమస్కరించాడు.

గురుదేవా! నేడు నా పుట్టిన రోజు. మీ ఆశీస్సులను అర్థిస్తున్నాను. నా సమర్పణను స్వీకరించి అనుగ్రహించండి అని రెండు బంగారు కడియాలను గురుగోవిందునికి సమర్పించాడు.

గురుగోవిందుడు వాటిని స్వీకరించి, అందులో ఒక దానిని కుడిచేతి బొటన వ్రేలుకు తగిలించుకొని, సుదర్శన చక్రం లాగా త్రిప్పుతూ ఉన్నాడు. అది కాస్త పట్టు తప్పి, ప్రవహించే యమునా జలాలలో పడి పోయింది.

అయ్యో! పడిపోయిందా! ఫరవా లేదు, గురుదేవా! నాకు ఈతలో కూడా గొప్ప ప్రావీణ్యా ముంది. కాకపోతే, మీ చేతి నుండి జారిపోయిన ఆ స్వర్ణ కంకణము నదిలో ఏ వైపు పడిందో నేను చూడలేదు. మీరు చూసి ఉంటారు. తమరు చెబితే, నేను నది లోకి దూకి, తిరిగి ఆ కంకణాన్ని తెచ్చిపెట్టగలను అన్నాడు.

ఆ మాటలు విని, శిష్యుడు రఘునాథుని ప్రియంగా వీక్షించి, తన చేతిలో ఉన్న రెండవ కడియాన్ని పట్టుకొని, 'అదిగో - అక్కడ' అని దానిని కూడా నీళ్ళ ల్లోకి విసిరేశాడు గురుగోవిందుడు. అంతే!

సమీచీనత్వ బుద్ధి

మనస్సులో కదిలే సమస్త మైన కోరికలను త్యజించిన వాడు, తన ఆనందానికి తానే కారణమైన మహాత్ముడు స్థితప్రజ్ఞుడు. నిత్యతృప్తుడు. నిరాశ్రయుడు. పరమార్థ దర్శనం అనే అమృత రసం ప్రాప్తించడం చేత, ఇది చాలు - అన్యములైనవి ఏవీ అవసరం లేదు అనే స్థిరమైన సంకల్పం కలవాడు స్థితప్రజ్ఞుడు. ***(పరమార్థ దర్శనామృత రసలాభేన అన్యస్మాత్ అలం ప్రత్యయవాన్ స్థితప్రజ్ఞః).***

స్థితప్రజ్ఞుడు కోరికలను విడిచి పెట్టేశాడు. అలాగని కోరికలను విడిచి పెట్టేసిన ప్రతి వ్యక్తీ స్థితప్రజ్ఞుడు అవుతాడా? పూర్ణత్వం లేనివాడు కోరికలను కూడా పడేసుకుంటే, దుఃఖభాగుల కోవలో చేరుతాడేమో గాని స్థితప్రజ్ఞుడు కాలేడు. నిరాశ వేరు, నిర్వేదం వేరు అని ఇప్పటికే మనం తెలుసుకొని ఉన్నాం.

స్థితప్రజ్ఞుడు తృప్తి చెంది ఉన్నాడు కనుక దేనినీ వాంఛించడు ***(న కించిత్ వాంఛతి)***. అసంతృప్తితో అల్లాడే వ్యక్తి కోరికలను కూడా విడిచి పెడితే, ఇక తృప్తి చెందే ప్రయత్నం కూడా చేయకుండా, నిరాశావాదిగా, నిర్భాగ్యుడిగా నిలిచి పోతాడు.

తృప్తిగా భోంచేసిన వాడు, 'నేను తినలేనండి - నాకు వద్దండి' అని చెప్పడం వేరు. ఎవరి మీదనో అలిగి, లేదా మరెవరి మీదనో ద్వేషంతో 'నేను తినలేనండి - నాకు వద్దండి' అని అంటే, అలా అనిన వ్యక్తి తృప్తిగా ఉన్నాడని అర్థమా?

ముముక్షువులు కోరికలకు దూరం కాలేరు. అలాగని, కోరికల్ని ఆవిష్కరిస్తూ ఊరేగితే, చివరికి ఆవేదనే మిగుల్తుంది. కోరికలు సాధకులకు సహజం. బంధ హేతువులైన కోరికలు స్థితప్రజ్ఞుని మనస్సు నుండి పాదరసం లాగా జారిపోతే, సాధకులైన వారు ప్రయత్న పూర్వకంగా వాటిని దూరం చేసుకోవాలి. ప్రగతి హేతువులైన కోరికల్ని కదిలించుకుంటూ పోవాలి. పతన హేతువులైన వాటిని పరిత్యజించాలి. వాటి లోని దోషాలను దర్శించ గలిగితే అవి క్రమేపి దూరమై పోతాయి. కనుక, నిత్యానిత్య వస్తు వివేక జ్ఞానంతో సమీచీనత్వ బుద్ధిని సాధకులు తయారు చేసుకోవాలి.

'సమీచీనము' అంటే అర్హ మైనది, తగినది అని అర్థం. అట్టి దానిని గుర్తించే బుద్ధిని 'సమీచీనత్వ బుద్ధి' అంటారు. కోరిక కదలి నపుడు ఇది తగినదా, కాదా అనేది వివేకంతో విశదీకరించుకొని, ఆ తరువాత ***యోగః కర్మసు కౌశలమ్*** అని మనం చర్చించిన విషయాన్ని హృదయంలో ఉంచుకొని, అహంకారం లేకుండా ఈశ్వరార్పణ బుద్ధితో కర్మను ఆచరించాలి. అలా నైవేద్యంగా సమర్పించిన కర్మకు ఫలం వచ్చినపుడు, ***సమత్వం యోగ ఉచ్యతే*** అని మనం అర్థం చేసుకున్న విషయాన్ని స్మృతికి తెచ్చుకొని, ప్రసాద బుద్ధితో ఫలమును అందుకోవాలి.

ఈ విధమైన నిష్కామ కర్మయోగం వల్ల, బంధహేతువు లైన కర్మలు దూర మవుతాయి. బంధమును సృష్టించని సత్కర్మలు చిత్తశుద్ధికి తోడ్పడుతాయి. ఒక దశలో కోరికలు వాటంతటవే సమూలంగా దూరమై పోతాయి. ఆత్మానందము అనుభూతిగా భాసిస్తుంది. అంతవరకు ముముక్షువు కోరికలను సాంతం విడువ లేడు. విడువ కూడదు కూడా.

ఏ కోరికలు స్థితప్రజ్ఞునికి ఆభరణాలుగా, అలంకరణలుగా శోభిస్తున్నాయో, అట్టి సద్భావ జనిత కోరికలను ముముక్షువులు ప్రయత్న పూర్వకంగా కదిలించి సాధనలు ఆచరించాలి. సాధకుని స్థాయిలో కోరిక ఆశీర్వాదమే గాని, అవరోధం కాదు. కాకపోతే, అవి సకామమా, నిష్కామమా అనేది సాధకుడే బేరీజు వేసుకోవాలి. అంతేగాని, తొందరపడి కోరికలే ఉండ కూడదు అనే నిర్ణయానికి రాకూడదు.

ఆఖ్యాయిక

మహాభారతంలో ఒక చిన్న కథ. భీష్ముని వద్ద ధర్మరాజు ధర్మ ప్రసంగాన్ని ఆలకించాడు. ఆ తరువాత, ఒకనాడు తన చుట్టూ ఉన్న బంధువులను చూచి ఒక ప్రశ్నను సంధించాడు.

ప్రతి మనిషి ప్రయత్నంతో సాధించ వలసిన పురుషార్థములు నాలుగు ఉన్నాయి అని మనకు తెలుసు. అవే ధర్మార్థ కామ మోక్షాలు. అయితే, ఈ నాల్గింటిలో ఏది శ్రేష్ఠతమము? అని ప్రశ్నించాడు ధర్మరాజు.

దేనికైనా ధర్మమే ప్రధాన మైంది. విశ్వమంతా ధర్మము నందే ప్రతిష్ఠితమై ఉంది. ధర్మానికి దూరమై ఏ పురుషార్థము ఫలించదు. కనుక, ధర్మమే శ్రేష్ఠతమము అని సమాధానం చెప్పాడు విమల నీతిజ్ఞుడైన విదురుడు.

ధర్మమును ఆచరించాలన్నా, ధర్మ కార్యాలను నిర్వహించాలన్నా, ధనము ప్రధానమై ఉంది. ఈ జగత్తు ధనం మూలం గానే ప్రకాశిస్తూ ఉంది. జగద్వైభవానికి ధనమే ప్రధానము. కనుక, భద్రతను కలిగించే అర్థమే శ్రేష్ఠతమము అని ధనంజయుడు చెప్పాడు.

తన అభిప్రాయాన్ని కూడా సర్వులూ ఆశిస్తున్నారు కనుక ధర్మరాజు తన నిర్ణయం కూడా చెప్పాడు. సర్వ మానవాళికి అంతిమ గమ్యము మోక్షమే కనుక, జనన మరణ చక్రం నుండి విడిపించి, శాశ్వతానందాన్ని ప్రసాదించే మోక్షమే శ్రేష్ఠతమ మని తన అభిప్రాయాన్ని తెలియ జేశాడు.

కాని, అందరికీ విస్మయాన్ని కలిగిస్తూ, చతుర్విధ పురుషార్థాలలో కామమే పరమ శ్రేష్ఠమని భీముడు బల్ల గుద్ది మరీ చెప్పాడు. ఏ కర్మను ఆచరించాలన్నా, ముందుగా దానిని ఆచరించాలి అనే కోరిక ఉండాలి. ధర్మ మైనా, అర్థమైనా, మోక్షమైనా, కామించకుండా సాధించే అవకాశ ముందా? **కామి కాలేని వాడు మోక్షకామి *అవుతాడా?*** కనుక, ఏది సాధించాలన్నా, కామం ఉన్నప్పుడే సాధ్యం కాబట్టి, చతుర్విధ పురుషార్థాలలో కామమే సర్వ శ్రేష్ఠ మని పలికి, భీమసేనుడు గదను పైకెత్తి భుజంపై పెట్టుకున్నాడు. అందరూ భీముణ్ణే సమర్థించారు.

కనుక ముముక్షువులు కోరికలను విడిచి పెట్టడం కాకుండా, వడగట్టి వ్యవహరించడం అలవరచు కోవాలి. అలా సోపానక్రమంగా వృద్ధి చెంది, ఆ తరువాత సమస్త కోరికలను సంపూర్ణంగా త్యజించి, ఆత్మానంద స్వరూపులై స్థితప్రజ్ఞులై శోభించాలి.

*అర్జునుడు అడిగిన **కిం ప్రభాషేత?** అనే రెండవ ప్రశ్నకు సమాధానం చెబుతున్నాడు.*

దుఃఖే ష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే ॥ 56

దుఃఖేషు-అనుద్విగ్నమనాః-సుఖేషు-విగతస్పృహః
వీతరాగభయక్రోధః-స్థితధీః-మునిః-ఉచ్యతే

దుఃఖేషు	=	దుఃఖాలలో	వీతరాగ భయక్రోధః	=	అనురాగము, భయము, క్రోధము లేనివాడు
అనుద్విగ్నమనాః	=	కలత చెందని మనస్సు కలవాడు	మునిః	=	మనన శీలుడు
సుఖేషు	=	సుఖాలలో	స్థితధీః	=	స్థితప్రజ్ఞు డని
విగత స్పృహః	=	ఆసక్తి లేనివాడు	ఉచ్యతే	=	చెప్పబడతాడు

అతని మనస్సు కష్టాలలో కలత పడదు. సుఖాలలో తృప్తి చెందదు. అనురాగము, భయము, క్రోధము లేనివాడు. అట్టి మననశీలుడే స్థితప్రజ్ఞుడు.

వ్యాఖ్య

స్థితప్రజ్ఞుడు ఎలా భాషిస్తాడు (*కిం ప్రభాషేత ?*) అనే రెండవ ప్రశ్నకు యాభై అరు, యాభై ఏడవ శ్లోకాలలో సమాధానం చెబుతున్నాడు. స్థితప్రజ్ఞుడు ప్రపంచంలో ప్రాప్తించే సుఖదుఃఖాల విషయంలో ఎలా వ్యవహరిస్తాడు అనేది ఈ ప్రశ్న లోని అంతరార్థం.

దుఃఖాలలో దిగులు చెందని వాడు, సుఖాల యందు ఆసక్తి లేనివాడు, రాగము, భయము, క్రోధము లేనివాడు, స్థిరమైన బుద్ధి గల మననశీలుడు స్థితప్రజ్ఞుడు అని అభిభాషించాడు అచ్యుతుడు.

సుఖము - దుఃఖము

ప్రపంచం ఒక్కటే. కాని, ఆ ప్రపంచం అందరినీ ఒకే విధంగా ప్రభావితం చేయడం లేదు. నిన్న ఇష్టమైన వస్తువు నేడు అయిష్టంగా ఉంది. అంటే, నిన్న సుఖాన్ని పంచిన వస్తువు నేడు సుఖాన్ని పంచే స్థితిలో లేదు అని అర్థం. అలాగే, మొన్న అయిష్టంగా ఉన్నది నేడు ఇష్టంగా కనిపిస్తోంది. మళ్ళీ రేపు ఎలా ఉంటుందో తెలియదు. ఇష్టమైన వస్తువులో సుఖం కనిపిస్తుంది. అయిష్టమైన వస్తువు దుఃఖ కారణంగా తెలుస్తూ ఉంది.

ఇంతకీ వస్తువులో సుఖ ముందా? దుఃఖ ముందా? సుఖమే ఉంది అనుకుందాం. అదే వాస్తవ మైతే, మరొక కాలంలో ఆ వస్తువు నుండే దుఃఖం ఎందుకు కలుగుతుంది? పోనీ, దుఃఖమే ఉన్నట్లు అంగీకరిద్దా మంటే, అదే వస్తువు మరొక కాలంలో సుఖాన్ని ఎలా ఇవ్వ గలుగుతుంది? ఇంతకీ వస్తువులో ఏముంది? సుఖమైతే లేదు. ఎందుకని? దుఃఖాన్ని కూడా పంచుతూ ఉంది కనుక. అంటే, దుఃఖం ఉందా? దుఃఖం కూడా లేదు. ఎందుకని? సుఖాన్ని పంచుతూ ఉంది కనుక.

ఇలా విచారిస్తూ పోతే, సుఖం ఎక్కడుంది? అనే ప్రశ్న తలెత్తుతుంది. ప్రపంచంలో లేదు అనే సమాధానం వస్తుంది. అలాగే దుఃఖం ఎక్కడుంది అని ప్రశ్నిస్తే, ప్రపంచంలో లేదు అనే సమాధానమే వస్తుంది. సుఖదుఃఖాలు ప్రపంచంలో లేనపుడు, అవి ఎక్కడున్నాయి? సుఖదుఃఖాలు ఎప్పుడైతే ప్రపంచంలో లేవో, ఈ ప్రపంచం ఉంది అని ఎవరైతే తెలుసుకుంటున్నారో, వారి లోనే ఉన్నాయి అని నిర్ధారణ అవుతూ ఉంది. ప్రపంచం ఉంది అని తెలుసుకుంటున్నది నీవే.

ప్రపంచం ఉన్నట్లు నీకు తెలుస్తూ ఉంది. నువ్వు చూస్తేనే ప్రపంచం ఉంది. నువ్వు తెలుసుకొంటూ ఉన్నావు కనుకనే ప్రపంచం ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ప్రపంచానికి స్వతంత్ర మనుగడ లేదు. ప్రపంచం నీ మీద ఆధారపడి ఉంది. నువ్వు మాత్రం ఎవరి మీద ఆధార పడకుండా ఉన్నావు. స్వతఃసిద్ధంగా ఉన్నావు. నీ మీద ఆధారపడి మనుగడను సాగించే ప్రపంచం సర్వ స్వతంత్రుడ వైన నీకు సుఖాన్ని గాని దుఃఖాన్ని గాని ఎలా కలిగిస్తుంది?

సుఖదుఃఖాలు అనేవి ప్రపంచానికి సంబంధించి లేవు. కనుక, సుఖదుఃఖాలకు సంబంధించిన మన సమస్య ప్రపంచంతో ముడిపడి లేదు. మనం సుఖపడట మనేది, లేదా దుఃఖపడట మనేది ప్రపంచం మీద ఆధారపడి ఉంటే మాత్రం, మన సుఖదుఃఖాలను నిర్ణయించేది ప్రపంచమే అవుతుంది.

ప్రపంచం పరిణామశీలం. నిరంతరం మార్పు చెందుతూ ఉంటుంది. కనుక, ప్రపంచం మనిషికి సమస్య కాదు. సమస్య అనేది ఏదైనా ఉంటే, అది మనిషి మీదనే కేంద్రీకృతమై ఉంది. అలా చూచి నపుడు, సుఖదుఃఖాల సమస్య మనిషికి లేనే లేదు. **మనిషికి మనిషే సమస్య.**

ఇంతకీ, మనిషిలో ఏముంది? సుఖముందా? దుఃఖముందా? సుఖముంది. అయితే దుఃఖం ఎలా వచ్చింది? లేదు, లేదు. దుఃఖమే ఉంది. మరైతే సుఖ మెక్కడుంది? ప్రపంచాన్ని గూర్చి విచారించి నపుడు,

సుఖదుఃఖాలు ప్రపంచంలో లేవు అనేది ఎలాగైతే అర్థమైందో, అలాగే మనల్ని గూర్చి ఆలోచించి నపుడు, సుఖదుఃఖాలు మన స్వరూపం కూడా కావు అనేది అర్థ మవుతుంది. ఏది ఏమిటో అర్థం కాకపోవడం వల్లనే సుఖదుఃఖాల బరువుతో బ్రతుకు భారంగా మారుతూ ఉంది. స్థితప్రజ్ఞుడికి తానే ఆత్మ అనే ప్రజ్ఞ స్థిరంగా ఉంది. ఆత్మ ఆనంద స్వరూపము. సుఖదుఃఖాలు మనోగతాలు. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న వాడు కనుకనే దుఃఖం వస్తే ఉద్విగ్న మనస్కుడు కాడు. సుఖం వస్తే దాని యొక్క స్పృహ లేకుండా ఉంటాడు (***దుఃఖేషు అనుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః***). జీవన్ముక్తులు సుఖదుఃఖాలలో మునిగిపోరు అన్నది ఉపనిషత్తు (***జీవన్ముక్తా నమజ్జన్తి సుఖదుఃఖ రసస్థితే***).

రాగ భయ క్రోధాదులు

సుఖాలు ఎవరిని ఉత్సాహ పరచలేవో దుఃఖాలు వారిని కలత పెట్ట లేవు. సుఖదుఃఖాలు రెండూ మనో వికారాలే. జ్ఞాని ఆత్మస్థితమైన ప్రజ్ఞ కలవాడు కనుక సుఖదుఃఖాలలో చలనం లేకుండా ఉంటాడు.

మనకు ఎన్నైనా ఉండొచ్చు. అవన్నీ మన మనస్సులో ఉండ నవసరం లేదు. మన చుట్టూ ఎందరైనా ఉండొచ్చు. వాళ్ళందరూ మన బుద్ధిలో ఉండ నవసరం లేదు. ఏ వస్తువులు, లేదా వ్యక్తులు మనకు దగ్గరగా ఉంటే మనకు సుఖంగా ఉంటుందో, వారిపై మనకు రాగం ఉందని అర్థం. ఏ వస్తువులు లేదా వ్యక్తులు దూరంగా పోతే మనం కలత పడతామో అవన్నీ రాగ సంబంధాలు. అనురాగ బంధాలు. ఇలాంటి రాగం స్థితప్రజ్ఞునికి ఉండదు.

రాగం ఉంటే ఏమి? దాని వల్ల ఏమిటి నష్టం? ఉంచుకోవచ్చు. రాగం మనస్సులో ఉంచుకోవడం తప్పు కాదు. రాగం ఉన్న వాటిని మనస్సులో నింపుకుంటే, రేపు అవి దూరమై నపుడు కష్టం. దూరమైన వాటిని మనస్సు నుండి దూరం చేసుకో గలమా? భౌతికంగా దూరమై, భావంలో దూరం కానివి బుద్ధికి భార మవుతాయి. బ్రతుకులో బరువును పెంచుతాయి.

ఉన్నవి బాధించవు. మనస్సులో ఉన్నవే బాధిస్తాయి. బాధించే వాటిని మనస్సులో పెట్టుకొని సుఖంగా బ్రతకలేము. బాధించకుండా ఉండేదే మనస్సులో ఉండాలి. అప్పుడే సుఖశాంతులతో జీవించ గలం.

ఉండి బాధించేవి అనిత్యాలు. పోయి బాధించేవి కూడా అనిత్యాలే. ఈ విషయంలో స్థితప్రజ్ఞునికి స్థిర మైన బుద్ధి ఉంది. కనుక తాను సదా రాగము నుండి విడిపడి ఉంటాడు.

రాగవృత్తి మనస్సులో ఉంటే, ఆ తరువాత ఏదో ఒక సమయంలో మనస్సులో క్రోధవృత్తి తప్పక వచ్చి చేరుతుంది. రాగవృత్తి విఫలమైతే, ఆ తరువాత ఉద్భవించేది క్రోధవృత్తే. రాగవృత్తి లేని మనస్సులో క్రోధవృత్తి చేరదు. కనుక మననశీలుడైన స్థితప్రజ్ఞుడు రాగక్రోధాల నుండి విడిపడి ఉన్నాడు.

దేహాత్మ భావమును త్యజించిన వాడు జ్ఞాని. దేహము తాను కానందున, దేహము యొక్క క్షయ నాశాదులు అతనికి భయ కారణాలు కాలేవు. దేహం తాను కానపుడు, ఇతర దేహాలతో సంబంధాలు మిథ్యే కనుక వాటి క్షయ నాశాదులు కూడా అతనికి భయాన్ని కలిగించ లేవు.

ఆత్మజ్ఞానంలో ద్వైతం లేదు. ద్వైతము లేనపుడు భయం ఎలా కలుగుతుంది? ఉన్నది ఒక్కటే అయినపుడు, నాశ మెవరికి? ఎవరి వలన నాశము? కనుక స్థితప్రజ్ఞుడు భయము నుండి విడిపడి అభయ రూపుడై శోభిస్తున్నాడు. అద్వయుడు కనుకనే అభయరూపుడు. జ్ఞాని యొక్క అద్వయానుభూతిని ఉపనిషత్తు అందంగా వర్ణించింది. **సర్వ మాత్మేద మాత్రాహం కిం వాంఛామి త్యజామి కిమ్?** ఈ సమస్తమూ ఆత్మయే. ఇక నేను దేనిని ఆశిస్తాను? దేనిని త్యజిస్తాను? - ఇది జ్ఞాని యొక్క అద్వైతానుభూతి.

దుఃఖము వచ్చి నపుడు కలత చెందని, సుఖము వచ్చినపుడు ఆసక్తి కలగని సమస్థితికి గతంలో సాధకుడుగా ప్రయత్నించిన వాడు నేడు స్థితప్రజ్ఞుడై ఆ సమస్థితిని లక్షణంగా పొంది శోభిస్తున్నాడు. రాగము, క్రోధము, భయము నుండి విడి పడాలని పూర్వం ప్రయత్నం చేసేవాడు. ఇప్పుడు వాటన్నిటి నుండి విడిపడి ఆనందరూపుడై అలరారు తున్నాడు. ముముక్షువులు అయిన వారు స్థితప్రజ్ఞుని లక్షణాలను సాధనలుగా స్వీకరించి, వాటిని సాధించడానికి తీవ్రంగా యత్నించాలి.

దుఃఖాలలో కలత చెందని వాడు స్థితప్రజ్ఞుడు. సాధకుడు ఈ లక్షణానికి ప్రయత్నించాలి. దుఃఖము ఒక్కటే. కాని, ఇక్కడ **దుఃఖేషు** అని బహువచనం వాడటం జరిగింది. దుఃఖము ఒక్కటే అయినా, దుఃఖ కారణాలు మూడు విధాలుగా ఉన్నందున, దుఃఖములు అనే బహువచనాన్ని ప్రయోగించాడు. అలాగే, **సుఖేషు** అనడం కూడా.

సుఖదుఃఖాలు మూడు విధాలుగా ఉంటాయి. (1) ఆధ్యాత్మికము (2) ఆధిభౌతికము (3) ఆధి దైవికము.

జ్వరము, తలనొప్పి మొదలైన దేహ సంబంధంగా కలిగే దుఃఖాలు ఆధ్యాత్మిక దుఃఖాలు. వ్యాఘ్ర వృశ్చిక సర్పాదుల వల్ల ఏర్పడే దుఃఖాలు ఆధిభౌతికాలు. పెనుగాలి, వర్షము, ఎండ, అగ్ని, పిడుగుపాటు మొదలైన వాటి వలన కలిగే దుఃఖాలు ఆధిదైవికాలు.

పాపపుణ్యాల కారణం గానే ఈ విధమైన సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి. దుఃఖానుభవంలో పాపం క్షీణిస్తూ ఉంటుంది. దుఃఖాన్ని ప్రసాదంగా స్వీకరిస్తూ, దుఃఖ హేతువైన పాపాన్ని ఆచరించకుండా సాధకుడు జాగ్రత్త వహించాలి.

అలాగే ఆనంద మనేది ఆత్మ యందే లభిస్తుంది కాని, విషయాల నుండి, వ్యక్తుల నుండి రాదు అని గ్రహించి, సాధకుడు వాటి యందు రాగము లేకుండా ఉండాలి. తాను దేహము కాదని, ఆత్మయే నని సదా సంభావిస్తూ భయము నుండి విడిపడాలి. క్రోధం అనేది మనోగతం. రాగం ఫలించ నపుడు క్రోధం పడగ విప్పుతుంది. క్రోధం వల్ల ఎంతో శక్తి వ్యర్థమై పోతుందని తెలిసి, ఆ శక్తిని సాధకుడు జప ధ్యానాదులకు వినియోగించు కోవాలి.

అర్జునుడు అడిగిన రెండవ ప్రశ్నకు ***(కిం ప్రభాషేత ?)*** *సమాధానమును యాభై ఏడవ శ్లోకంలో కూడా కొనసాగిస్తున్నాడు.*

యః సర్వ త్రానభిస్నేహ స్తత్త త్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

యః-సర్వత్ర-అనభిస్నేహః-తత్-తత్-ప్రాప్య-శుభాశుభం
న-అభినందతి-న-ద్వేష్టి-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

యః	= ఎవడు	న అభినందతి	= సంతోషింపడో
సర్వత్ర	= అన్నిటి యందు	న ద్వేష్టి	= ద్వేషింపడో
అనభిస్నేహః	= అభిస్నేహము లేనివాడై	తస్య	= అట్టివాని యొక్క
తత్ తత్	= ఆయా	ప్రజ్ఞా	= జ్ఞానము
శుభాశుభం	= శుభాశుభాలను	ప్రతిష్ఠితా	= స్థిరమైనది.
ప్రాప్య	= పొంది		

అతడికి దేని తోనూ అనుబంధం లేదు. శుభాన్ని పొంది సంతోషించడు. అశుభాన్ని పొంది ద్వేషించడు. అతని జ్ఞానము స్థిరమైనది.

వ్యాఖ్య

కిం ప్రభాషేత? హర్ష విషాదాలలో స్థితప్రజ్ఞుడు ఎలా వ్యవహరిస్తాడు? అనే రెండవ ప్రశ్నకు యాభై ఆరవ శ్లోకంలో సమాధానం చెప్పడం ప్రారంభించిన పార్థసారథి, ఆ విషయాన్ని ఈ శ్లోకంలో కూడా కొనసాగిస్తున్నాడు. 'రాగ భయక్రోధాదుల నుండి విడిపడిన వాడు' అని పూర్వ శ్లోకంలో చెప్పిన విషయాన్ని కొనసాగిస్తూ అభిస్నేహం అవరోధ మంటూ ఈ శ్లోకాన్ని ప్రారంభిస్తున్నాడు.

రాగ భయ క్రోధాదులు ఎలా ప్రతిబంధకాలో చూశాం. రాగం అంటూ ఉండాలే గాని, ఎవరు ఎంత రాగం తీస్తారో చెప్పలేము. దేనిపై మనకు రాగం ఉంటుందో, అది ఎప్పుడూ దూరం కాకూడదని ఆలోచిస్తూ ఉంటాం. అలా ఆలోచించడం తప్పు కాదు. కాని, అది దూర మయ్యేది మాత్రం వాస్తవం. కనుక, దేని వైపు మన రాగం సాగుతూ ఉంటుందో, అది ఎప్పుడు దూర మవుతుందో అనే భయం మనస్సును పట్టి పీడిస్తూనే ఉంటుంది. ఎవరు ఎప్పుడు దూరమౌతారో అనే దిగులు అంటిపెట్టుకొనే ఉంటుంది. అలాంటి పరిస్థితులకు కారణమయ్యే వ్యక్తులపై క్రోధం పుడుతుంది. ఇవన్నీ జరగకుండా ఉండాలి అంటే అభిస్నేహం లేకుండా ఉండాలి. అలా సహజం గానే ఉండగలిగే వాడు ముని. ఆ స్థితిని ప్రయత్నంతో సాధించే వాడు ముముక్షువు.

అభిస్నేహాలు అవరోధాలు

స్నేహము అంటే చెలిమి. అభిస్నేహము అంటే గట్టి స్నేహము. స్నేహము ఎప్పుడూ లేతగా ఉండాలి. ముదర కూడదు. స్నేహము అంటే చమురు అని కూడా అర్థము. చమురు అంటుకుంటే చాలు, దానిని వదిలించుకోవడం కష్టం. అభిస్నేహం కూడా అలాంటిదే. ఇది జ్ఞానానికి ప్రతిబంధకము. అందుకనే ముని (మననశీలుడు) అభిస్నేహం లేకుండా ఉంటాడు ***(అభిస్నేహ వర్జితః).*** స్థితప్రజ్ఞుడు ***(యః)*** అన్ని విషయాల లోను ***(సర్వత్ర)*** అభిస్నేహము లేకుండా ఉంటాడు అంటున్నాడు అచ్యుతుడు. దేహము, జీవితము మొదలైన విషయాలలో కూడా అభిస్నేహం లేకుండా ఉండే వాడు ముని అని శ్రీ శంకరులు భాష్యంలో అభిప్రాయ పడ్డారు ***(దేహ జీవితాదిషు అపి అనభిస్నేహః).***

పూలు విరబూస్తాయి. విరబూసిన పూలు వాడి పోతాయి. దేహాలు జన్మిస్తాయి. జన్మించిన దేహాలు నశిస్తాయి. ఈ ప్రపంచంలో ఎవరు మన వారు? మన దేహమే మనది కాదు. ఈ దేహం ఎంత కాలం ఉంటుందో మనకే తెలియదు. క్షణక్షణానికి చిల్లికుండలో నీరు కారి పోయినట్లు ***(భిన్న కుంభోదకవత్)*** ప్రతి క్షణం దేహం నశించిపోతూ ఉంది ***(ప్రతి క్షణం వినాశీ).***

మన దేహమే మనది కాకుండా పోతుంది. అలాంటప్పుడు ఈ దేహంతో సంబంధాలు కలిగిన వారిపై అభిస్నేహాన్ని పెంచుకోవడం ఎంతవరకు సమంజసం? పోయే దేహాన్ని అతిగా ప్రేమించి సాధించేది ఏమీ ఉండదు. కనుకనే, జీవిత, దేహాదుల యందు అభిస్నేహము లేకుండా ఉంటాడు స్థితప్రజ్ఞుడు.

జీవితమే ఒక స్వప్నం లాంటిది అని మునికి తెలుసు. తాత్త్వికంగా విచారించి నపుడు, నిద్ర నుండి మేల్కొన్న వానికి కల లోని వ్యక్తులు లేనివారే అయినట్లు, మననశీలునికి దారాపుత్రాదులు, బంధుమిత్రాదులు ఉన్నప్పుడు కూడా వారు లేనివారే అని తెలుసు ***(విచార్యమాణే తత్త్వ దృష్ట్యా దారా పుత్రాదయో న సన్తి).*** అందుకే వారిపై అభిస్నేహం లేకుండా ఉంటాడు.

ఆకాశంలో మేఘాలు ఉంటాయి. అలాగని మేఘాలతో ఆకాశానికి సంబంధం లేదు. కొండపై మేఘాలు ఊరేగు తుంటాయి. అయినా, కొండకు, మేఘాలకు సంబంధం లేదు. కలిసినట్లే కనిపిస్తాయి. అలా కనిపించి నపుడు కూడా విడివడే ఉంటాయి. స్థితప్రజ్ఞుడు అన్నిటితో ఉంటాడు. అన్నిటి నుండి విడివడి ఉంటాడు. స్నేహంతో ఉంటాడు. అభిస్నేహం లేకుండా ఉంటాడు. స్నేహం బంధించదు. అభిస్నేహం బంధానికి కారణ మవుతుంది.

దేహం ఉంటే నష్టం లేదు. దేహాసక్తి ఉంటే లాభం లేదు. మితిమీరిన సంబంధాలు, అతి స్నేహాలు సంతాపాన్నే కలిగిస్తాయి. ఎండమావుల్ని చూస్తే తప్పు లేదు. వాటి వెంట పరుగు లెత్తితే సుఖం మిగలదు. ఇదంతా అభిస్నేహమే అనేది గీతాచార్యుని సందేశం.

స్నేహాలు సమీపించి నపుడే స్మృతికి వస్తాయి. అభిస్నేహాలు దూరంగా ఉన్నా కలత పెడతాయి. ఎవరిపై మనకు అభిస్నేహం ఉంటుందో, వారు దూర దేశాలలో ఉన్నా, వాస్తవానికి మన మనస్సు లోనే తిష్ఠ వేసి ఉంటారు. వారి సమస్య లన్నీ మన సమస్యలుగా మిగిలి ఉంటాయి. అభిస్నేహాలు లేకపోతే, వాటి వల్ల ప్రాప్తించే శుభాశుభాలు మనపై ప్రభావాన్ని చూపలేవు. స్థితప్రజ్ఞుడు అభిస్నేహము లేనివాడు కనుక, వాటి వల్ల కలిగే ఫలితాలకు కలత చెందడు. శుభం కలిగిందని సంతసించడు. అశుభం వాటిల్లిందని దుఃఖించడు. రాగద్వేషా లకు అతీతంగా ఉంటాడు.

శుభాశుభాలు

విశ్వానికి చీకటి వెలుగులు తప్పవు. వ్యక్తికి శుభాశుభాలు తప్పవు. శుభం కలిగి నపుడు వ్యక్తులు పొంగిపోతూ ఉంటారు. అశుభాన్ని ద్వేషిస్తూ ఉంటారు. శుభాశుభాలు తమ ప్రభావాన్ని మనస్సుపై ఇలా చూపుతూ ఉంటాయి.

శుభాశుభాలు కలిగి నపుడు స్థితప్రజ్ఞుడు సమబుద్ధితో వ్యవహరిస్తూ ఉంటాడు. వివేకం వలన ఏర్పడిన జ్ఞానం అతనిని హర్ష విషాదాలలో స్థిరంగా, సమంగా ఉండేటట్లు చేస్తుంది.

శుభములను సుఖ కారణాలుగా, అశుభములను దుఃఖ కారణాలుగా మానవులు భావిస్తూ ఉంటారు. వాస్తవానికి ప్రపంచంలో, లేదా జీవితంలో సన్నివేశాలు జరుగుతూ ఉంటాయి. అవి అలా జరగడం వెనుక నియతి ఉంది. ధర్మా లున్నాయి. జరగ కూడనివి ఎన్నడూ జరగవు. జరిగే వాటిని ఆపాలి అనుకున్నా అవి జరిగి తీరుతాయి. ఏవి ఎలా ఉంటాయో ముందే వివేకంతో గ్రహించ గలిగితే, శుభాశుభాలు, హర్ష విషాదాల మధ్య ఊగిసలాడే పరిస్థితి తల ఎత్తదు.

శుభమైనా, అశుభమైనా, ఏది ఎందుకు జరుగుతూ ఉందో మనకు తెలియక పోవచ్చు. మన ప్రమేయం లేకుండా మన జీవితంలోకి ఏవీ ప్రవేశించవు. తెలిసో, తెలియకో తెచ్చుకున్న వాటిని తరిమితే పోవు. పోయే క్షణం వచ్చినపుడు తురిమినా నిలవవు. అవి అలా జరగడం వెనుక ధర్మముంది. దైవ హస్త ముంది.

గృహ ప్రవేశము అనేది శుభ కార్యము. బంధుమిత్రాదుల మధ్య ఒక వ్యక్తి ఆ కార్యాన్ని ఎంతో ఆనందంగా జరుపుకుంటూ ఉంటాడు. పొంగిపోతూ ఉంటాడు. ఈ లోగా ఆ ఇంట్లో అగ్ని ప్రమాదము సంభవించి తీరని నష్టం వాటిల్లుతుంది.

గృహ ప్రవేశము, అగ్ని ప్రమాదము రెండూ సంఘటనలే. నిష్కారణంగా, నిర్హేతుకంగా ఏదీ జరగ లేదు. గృహప్రవేశ కార్యంలో సంతసించిన వ్యక్తి అగ్ని ప్రమాదం జరిగి నపుడు దుఃఖిస్తాడు. కారణాలను అన్వేషిస్తూ

ద్వేషాన్ని ప్రకటిస్తాడు. దుఃఖాన్ని కలిగించే సన్నివేశం వెనుక దాగి ఉన్న వాస్తవాన్ని చూడలేక పోవడమే, అర్థం చేసుకోలేక పోవడమే అతని ద్వేషానికి కారణ మవుతూ ఉంది.

సూర్యోదయంలో వెలుగులు విరజిమ్ముతాయి. దానిని శుభోదయంగా మనిషి స్వీకరిస్తాడు. సూర్యాస్తమయంలో చీకట్లు ముసురు కుంటాయి. అది అశుభమా? సూర్యాస్తమయం లేకపోతే, సూర్యోదయం ఎలా జరుగుతుంది? అవగాహన లోపించిన వారికి చీకటి అశుభము. చీకటి అనేది గాయపడే గాని, రావాలసినది కాదు. ఈ వాస్తవాన్ని అంగీకరిస్తూ, దీపాన్ని వెలిగించి, సంధ్యలో వందనం సమర్పించ మన్నారు మన పెద్దలు.

కొన్ని సంఘటనలు ప్రియంగా ఉంటాయి. కొన్ని అప్రియంగా ఉంటాయి. శుభమైనా, అశుభమైనా వాటిని సమంగా స్వీకరించాలి. ఆందోళన లేకుండా కర్మఫలాలను అందుకో గలగాలి (**సమత్వం యోగ ఉచ్యతే**). బాధ ఉండ కూడదు. ప్రతిచర్యలు లేకుండా ప్రవర్తించాలి. అప్పుడే సమత్వం ఉన్నట్లు. వివేక ప్రజ్ఞ గల మనిషిలో ఈ సమస్థితి సహజంగా శోభిస్తూ ఉంటుంది. ముముక్షువులు అవగాహనను పెంచుకొని, ఆందోళన లేకుండా జీవించడానికి ప్రయత్నించాలి. ప్రారంభంలో ఏదైనా కష్టం గానే ఉంటుంది. కాలంలో అన్నీ సాధ్యాలే ఉంటాయి.

పసిబిడ్డ తడబడే అడుగులతో నడిచేందుకు చేసే ప్రయత్నం చూస్తే మనకే ఆందోళనగా ఉంటుంది. అడుగడుగుకీ బిడ్డ ఎంతగానో కష్ట పడుతూ ఉంటుంది. వయస్సు పెరిగే కొద్దీ, నిలబడటం, నడవటం, పరుగులు తీయటం అన్నీ సహజంగా జరిగి పోతూ ఉంటాయి. ఈ సహజత్వము ఎక్కడ నుండో ఊడి పడలేదు. బిడ్డ అభ్యాసం లోనే సమకూరింది. ముముక్షువు లైనవారు జ్ఞాన లక్షణాలను ప్రయత్నించి సాధించుకోవాలి. సిద్ధావస్థలో అవే సహజంగా కనిపిస్తాయి.

*అర్జునుడు అడిగిన మూడవ ప్రశ్న **కిం ఆసీత?** అంటే, ఎలా కూర్చుంటాడు? శ్రోత్రాది జ్ఞానేంద్రియాలను ఎలా నియమిస్తాడు? అని అర్థం. దానికి సమాధానమే యాభై ఎనిమిదవ శ్లోకం*

యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58

యదా-సంహరతే-చ-అయం-కూర్మః-అంగాని-ఇవ-సర్వశః
ఇంద్రియాణి-ఇంద్రియార్థేభ్యః-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

యదా = ఎప్పుడు
అయం = ఇతడు
కూర్మః = తాబేలు
అంగానీవ = అంగముల వలెనే
ఇంద్రియార్థేభ్యః = శబ్దాది విషయముల నుండి
ఇంద్రియాణి = ఇంద్రియములను

సర్వశః = అన్ని వైపుల నుండి
సంహరతే = వెనుకకు మరల్చునో
తస్య = అతని
ప్రజ్ఞా = జ్ఞానము
ప్రతిష్ఠితా = స్థిరమైనది

తాబేలు తన అంగాలను లోనికి ముడుచుకుంటుంది కదా! అలాగే స్థితప్రజ్ఞుడు తన ఇంద్రియాలను విషయాల నుండి వెనక్కి లాగేసుకుంటాడు. అతని జ్ఞానము చలించనిది.

వ్యాఖ్య

మనం నివసిస్తున్న ప్రపంచం ఎవరి సొత్తూ కాదు. ఏ ఒక్కరికీ సొంతం కాదు. ఇక్కడ ఎవరైనా, దేని

కోసమైనా ప్రయత్నించ వద్దు. ప్రయత్నించిన ప్రతి ఒక్కరికీ ప్రతిదీ దొరుకుతుందని చెప్పలేము. దొరికినా స్థిరంగా ఉంటుందని చెప్పలేము. ఇప్పటి వరకు మన జీవితంలో ఎన్నెన్నో దొరక బుచ్చుకున్నాం. అలాగే వాటిని పోగొట్టుకున్నాం. ఎందుకని అలా జరుగుతుంది? ముందే చెప్పాము కదా, ఏదీ మన సొత్తు కాదు.

ఇంద్రియాలు మన దేహంలో ఉన్నాయి. ఇంద్రియ విషయాలు దేశంలో, అంటే బయట ఉన్నాయి. బాహ్యం లోని విషయాలను ఇంద్రియాలు గ్రహించి మనస్సు ముందు ఉంచుతాయి. తత్ఫలితంగా ఇంద్రియాల ద్వారా మనస్సు వెళ్ళి విషయ ప్రపంచంతో సంబంధాన్ని ఏర్పరచు కుంటుంది. ద్వంద్వాలను అనుభవిస్తూ ఉంటుంది.

మనస్సు అలా ఎందుకు విషయాల వైపు పరుగులు తీస్తుంది? ఏదో లాభం ఉంది కనుకనే పోతుంది. లాభం వచ్చేటట్లైతేనే ఏపనైనా, ఏ వ్యాపారం లోకి అయినా ప్రవేశిస్తారు. ఏదీ రాదని తెలిస్తే ఎవ్వరూ ఎక్కడికీ పోరు.

ఇంతకీ ఇంద్రియ విషయాల వల్ల మనస్సు పొందే లాభ మేమిటి? ఇక్కడ ఇంకా కాస్త లోతుగా ఆలోచించ వలసి ఉంటుంది. లాభము అనేది మళ్ళీ రెండు విధాలు. వాస్తవంగా లాభం ఉండి, లాభాన్ని పొందడము ఒకటి. లాభము లేకపోయినా, లాభము ఉన్నట్లు, లాభాన్ని పొందుతున్నట్లు ఊహించుకొని తృప్తి చెందడము మరొకటి. అంటే, ఈ రెండవ విషయంలో వాస్తవంగా జరిగేది ఒకటి. మనం భావించేది మరొకటి.

ఇంద్రియ విషయాలు సుఖ హేతువులు అని అందరి అభిప్రాయం. అందుకే అందరూ ఆ వైపు పరుగులు తీస్తూ ఉంటారు. వస్తువులలో సుఖాలు ఉన్నట్లయితే, సుఖ మనేది విషయాల స్వభావమైతే, ఒకర్ని ఆకర్షించిన విషయం, లేదా వస్తువు అందరినీ ఆకర్షించగలిగి ఉండాలి.

సీతమ్మ చూసింది బంగారు జింకే అయితే అది రామలక్ష్మణుల్ని కూడా ఆకర్షించి ఉండాలి. కాని, అలా జరగలేదు. సీతమ్మ కష్టాలకు బంగారు జింక కారణమా? అది బంగారు జింక కాదు అని గ్రహించలేని సీతమ్మ బుద్ధి కారణమా? అమ్మగారి బుద్ధే కారణం. అదలా ఉంచండి. అసలు బంగారు జింక అక్కడికి రాకుండా ఉన్నట్లైతే, సీతమ్మ అమాయక మనస్సు దానిని కోరేది కాదు కదా? బంగారు జింక ఉంటే ఉండ నివ్వండి. కళ్ళతో చూడబట్టే కదా ప్రమాదం వాటిల్లింది! కళ్ళు చూస్తే ఏమైంది? మనస్సు కోరుకోకుండా రామలక్ష్మణుల మనస్సుల లాగా కదలకుండా ఉండి ఉంటే ఈ ఇక్కట్లు వచ్చేవి కావు కదా? ఇలా ఎన్నో ప్రశ్నలు.

ఇంద్రియాలు ప్రదర్శించక పోతే, మనస్సు ప్రకోపించదు కదా? అని కొందరు. మనస్సు స్థిరంగా ఉండ గలిగితే కిటికీల వంటి ఇంద్రియాలు కలత పెట్టవు కదా? అని మరి కొందరు. నిజం చెప్పాలంటే, ఈ రెండూ కారణం కావు. మరో విధంగా చెబితే రెండూ కారణాలే. వివేకం లోపిస్తే, ఏదైనా దుఃఖానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. వివేకం ఉంటే, ఏదీ బాధించదు. ఇంద్రియాల విషయంలో ఉండ వలసిన అవగాహనను యాభై ఎనిమిదవ శ్లోకం లోను, మనస్సు విషయంలో ఉండ దగిన అవగాహనను యాభై తొమ్మిదవ శ్లోకం లోను అందిస్తున్నాడు భగవంతుడు.

పార్థా! తాబేలు తన అంగాలను లోపలికి ముడుచు కొనునట్లు, స్థితప్రజ్ఞుడు ఇంద్రియాలను ఇంద్రియ విషయాల నుండి మరలించి అంతర్ముఖం చేస్తున్నాడు అంటున్నాడు పార్థసారథి.

ఇంగితము లేని ఇంద్రియాలు

ఇంద్రియాలను జయించిన వాడే ఆత్మ సామ్రాజ్యానికి అధినేత అవుతాడని, ఇంద్రియాలను జయించ

లేని అసమర్థులే ఇక్కట్లకు లోనౌ మని సాధారణంగా మనలు అభిప్రాయ పడుతూ ఉంటారు. కనుక ఇంద్రియ విషయాల నుండి ఇంద్రియాలను ఉపసంహరించే ప్రయత్నం చేస్తూ ఉంటారు.

కొందరు హఠ యోగాది ప్రక్రియలను అనుసరిస్తూ ఇంద్రియాలను బలవంతంగా లొంగదీస్తూ ఉంటారు. ఇలాంటి మార్గ ప్రయాణాలు ఫలితాల నివ్వవు. తాత్కాలికంగా నిగ్రహించబడి, మళ్ళీ బహిర్ముఖ మవ్వడానికి కొరకు ఇంద్రియాలు ఎదిరిస్తూ ఉంటాయి. అలా కాకుండా, ఇంద్రియ విషయాల లోని దోషాన్ని మనస్సుకు పట్టిస్తే, తెలిసి ఎవరూ గోతిలో పడరు కనుక, ఇంద్రియాలు సహజం గానే నిగ్రహించ బడతాయి. దీనినే యోగశాస్త్రంలో 'ప్రత్యాహారము' అంటారు.

ప్రపంచంలో ఎన్నో విషయాలు ఉన్నాయి. మరెన్నో వస్తువులు ఉన్నాయి. వాటన్నిటినీ గూర్చి మనం ఆలోచిస్తున్నామా? ఉన్న వన్నీ మనకు తెలియవు. తెలిసిన విషయాలలో కూడా అన్నీ మనం పట్టించుకోము. ఏవి మనకు అవసరమో, వేటిపై మనకు ఆసక్తి ఉంటుందో, వాటినే పట్టించు కుంటాము.

ఇంద్రియాలు ఉన్న వాటిని తెలియ జేస్తాయి. అంతే. నేత్రేంద్రియము ఉంది కనుక రూపాలు, రంగులు కనిపిస్తున్నాయి. శ్రోత్రేంద్రియము ఉంది కనుక శబ్దాలు వినిపిస్తున్నాయి. కళ్ళు లేని వ్యక్తికి రూపాలు లేవు, రంగులూ లేవు. అలాగే పంచ జ్ఞానేంద్రియాలు లేకపోతే ప్రపంచమే లేదు.

ప్రపంచం ఒకటే ఉంది అని మనకు తెలియడానికి ఇంద్రియాలు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. నడచిపోతూ దారిలో ఒకచోట గుడిగంటలు వింటాం. అంటే, దగ్గరలో గుడి ఉంది అని గ్రహించి అక్కడికి వెళ్ళి భగవంతునికి నమస్కరిస్తాం. నాటకశాలలో ఉన్నా, [illegible] కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటాం. ఇదంతా వినికిడి వల్ల కలిగే ప్రయోజనం.

టెలివిజన్ కార్యక్రమాల్ని చూస్తూ, అదే పనిగా రిమోట్‌తో ఛానళ్ళను మార్చుతూ ఉంటాం. ఇలా మనం ఛానళ్ళ మార్పుకు కళ్ళు కారణమా? టెలివిజన్ లోని కార్యక్రమాల్ని కళ్ళు చూపిస్తాయి. అంతే. ఏ కార్యక్రమాన్ని చూడాలి అనే విషయాన్ని నిర్ణయించేది మనస్సే గాని కళ్ళు కాదు. అవసరమైన కార్యక్రమాల్ని చూడటం మానేసి, అనవసరమైన, ఆసక్తికరమైన కార్యక్రమాల్నే మనం [illegible] చూస్తూ ఉంటాము.

ఈ ప్రపంచంలో కోరుకోకుండా ఎప్పటికైనా చూడవచ్చు. ఆసక్తి కలిగి ఆశించి నప్పుడే బంధాలు మొదలవుతాయి. ఆశించేది మనస్సే కాని ఇంద్రియాలు కాదు. మనస్సు నిగ్రహంతో ఉంటే, ఇంద్రియాలు చేయగలిగేది కూడా ఏమీ ఉండదు. గాఢంగా నిద్రించే వ్యక్తికి అత్తరు రాసినట్లే ఉంటుంది.

మనస్సును నిగ్రహించడాన్ని శాస్త్రంలో 'శమము' అంటారు (**మనో నిగ్రహః**). శమము మనస్ వశ్యత. ఇంద్రియాలను వస్తువుల నుండి దూరం చేయడము ఒక్కటే మార్గము. అదే బాహ్యేంద్రియ నిగ్రహము. దీనిని శాస్త్రంలో 'దమము' అంటారు. గీతలో మనం ముందుకు పోయే కొద్ది వీటి ప్రస్తావన అనేక చోట్ల వస్తుంది. అప్పుడు విపులంగా చర్చించుకుందాం. ఇంద్రియాలను చక్కగా ఉపసంహరించ గలిగితే (**సంహరతే, సమ్యక్ ఉపసంహరతే**) తాత్కాలికంగా మనస్సు నియమించ బడుతుంది. ఇలా ఉపసంహరించడం స్థితప్రజ్ఞునికి సహజంగా ఉంటుంది. తాబేలు తన అవయవాలను లోపలికి ముడుచు కున్నంత సులువుగా ఉంటుంది. అదే పనిని సాధకుడు ప్రయత్నంతో పరిశ్రమించి సాధించాలి.

తాబేలు తార్కాణము

ఇంద్రియాలను బయటకు విడిచి పెట్టడం, మరల లోపల పెట్టుకోవడం అనేది జ్ఞానికి తాబేలు లాగా సహజంగా ఉంటుందని సోదాహరణంగా వివరిస్తున్నాడు.

భారతీయ సాహిత్యం, ముఖ్యంగా తత్త్వశాస్త్రం పశుపక్ష్యాదుల్ని, మృగకీటకాదుల్ని నిశితంగా పరిశీలించి, మానవ జీవన విధానానికి సరిపడే అంశాలను వాటి నుండి గ్రహించి, వాటి ద్వారా నైతిక, ఆధ్యాత్మిక సత్యాలను విరివిగా మానవాళికి వితరణ చేసింది.

విశ్వాసము, క్రూరత్వము, మోసం, స్నేహం, ఇంద్రియ నిగ్రహం, త్యాగం - మొదలైన గుణాలను, స్వభావాలను విపులంగా వివరించ డానికి, ఆసక్తికరంగా బోధను శ్రోత గ్రహించ డానికి, నోరు లేని ప్రాణుల్ని ఎన్నుకొని నోరార ప్రవచించింది.

ప్రస్తుతం జ్ఞాని తన ఇంద్రియాలను నియమించే పద్ధతిని వివరించ డానికి తార్కాణంగా కూర్మానికి కుర్చీ వేశాడు శ్రీకృష్ణుడు.

తాబేలు వేగంగా చరించ లేదు. మెల్లగా చరిస్తూ ఉంటుంది. ఏదైనా శబ్దం విన్నా, లేదా ఏదైనా అపాయాన్ని శంకించినా, వెంటనే తన అంగాలను వాలముతో సహా లోనికి లాగేసు కుంటుంది. దృఢమైన, దుర్భేద్యమైన కవచం లాంటి చిప్పలో ఇమిడి పోతుంది. అపాయం నుండి తప్పించు కుంటుంది.

అంగాలను సులువుగా బయటకు వదలి పెడుతుంది. అలాగే, సులువుగా లోనికి ముడుచు కుంటుంది. అంటే, ఎప్పుడు బహిర్ముఖం కావాలో, ఎప్పుడు అంతర్ముఖం కావాలో తాబేలుకు తెలుసు. కూర్మానికి భగవత్ప్రసాదంగా ఆ జ్ఞానం లభించింది. అదే స్థితప్రజ్ఞునిలో వివేక ప్రజ్ఞ వల్ల ప్రాప్తించిన మన: ప్రసాదంగా శోభిస్తోంది.

కూర్మ మఖిలావయవముల గుదియ ముడుచు
మాడ్కి నే యోగి యింద్రియ మానసములఁ
దనర మరలించు నింద్రియార్థముల వలన
నాతఁ డాత్మ స్థిత ప్రజ్ఞుఁడగు మహాత్మ।

ఇది 'సీతారామాంజనేయ సంవాదము' అనే బృహద్గ్రంథము లోని పద్యము.

తాబేలు అవయవాలను సులువుగా బయటకు వదలి పెట్టి, తిరిగి సులభంగా వెనక్కి తీసేసుకుంటుంది. మానవులు కూడా శ్రోత్రాది ఇంద్రియాలను సులువుగా బహిర్ముఖం చేస్తారు. కాని ఎందుకనో, అంత సులువుగా వెనక్కి తీసుకోలేరు.

అభిమన్యుడు వీరావేశంతో పద్మవ్యూహంలో ప్రవేశించాడు. ప్రవేశించ గలిగాడే గాని తిరిగి నిష్క్రమించలేక పోయాడు. మృత్యువాత పడ్డాడు. విచ్చలవిడిగా ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో పెనుగు లాడితే, ఆ తరువాత జీవితంలో పెనుతుఫానే ముంచు కొస్తుంది. అందుచేత ఇంద్రియ నిగ్రహము చాలా అవశ్యంగా తెలుస్తోంది.

స్వామీ! మీకు ఏ ఆహారమంటే ఇష్టం అని ఒక సాధువును ప్రశ్నిస్తే, నాయనా! నాకు ప్రత్యాహారం అంటే చాలా ఇష్టం అని చెప్పాడట. ఇంద్రియాలను ఇంద్రియ విషయాల నుండి వెనుకకు త్రిప్పడమే ప్రత్యాహారం. ఆహారం లేకపోతే మనిషి జీవించ లేడు. ప్రత్యాహారం లేకుండా సాధకునికి ఆధ్యాత్మిక జీవితం ఉండదు.

ఇంద్రియాలను నియమించి తీరాలి. అన్ని వైపుల నుండి నియమించాలి. ఏ ఒక్క ఇంద్రియాన్నో నియమిస్తే సరిపోదు. ఒక ఇంద్రియం యొక్క ప్రభావం మరొక ఇంద్రియంపై పడే ప్రమాద ముంది. అందుచేత అన్ని వైపుల నుండి *(సర్వశః)* అని చెప్పడం జరిగింది.

ఇవి చూడ కూడనివి, అవి విన కూడనివి, ఇవి తిన కూడనివి అని మునికి తెలుసు. అవి ఎలా నిరుపయోగమో వివేక బుద్ధి ఫలితంగా స్థితప్రజ్ఞునికి తెలుసు కనుక అతని ఇంద్రియాలు సహజం గానే విషయాల నుండి వెనుదిరుగుతాయి. ముముక్షువులు ఈ విషయంలో తీవ్రంగా ప్రయత్నించాలి. అప్పుడే ఇంద్రియ నిగ్రహాన్ని సాధించ గలుగుతారు. అవగాహన చాలినంతగా లేనపుడు విషయాల నుండి విరమించడం అలవరచు కోవాలి. ఇంద్రియాలను విషయాలకు దూరంగా ఉంచాలి.

ఇంద్రియాలను ఇంద్రియ విషయాలకు దూరం చేస్తే సరిపోతుందా? అంతటితో ఇంద్రియ నిగ్రహం సాధించి నట్లేనా? కానే కాదు. అది కేవలం తాత్కాలిక ఉపశమనమే. ఉపసంహారమే. పట్టు సడలిస్తే మళ్లీ పరుగులే. మరి శాశ్వతంగా ఇంద్రియాలు ఎప్పుడు నిగ్రహింప బడుతాయి? అది కూడా విందాం.

విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59

విషయాః-వినివర్తంతే-నిరాహారస్య-దేహినః
రసవర్జం-రసః-అపి-అస్య-పరం-దృష్ట్వా-నివర్తతే

నిరాహారస్య	= ఆహారం లేని,	పరం	= పరమాత్మను
దేహినః	= జీవుడికి	దృష్ట్వా	= చూచి
రసవర్జం	= రాగాన్ని విడిచి	అస్య	= అతని యొక్క
విషయాః	= విషయములు	రసః అపి	= రాగము కూడా
వినివర్తంతే	= నివర్తిస్తాయి	నివర్తతే	= తొలగి పోతుంది

విషయాలను గ్రహించని జీవునికి విషయాలు దూర మవుతున్నాయే గాని, వాటి యందు రాగము నశించడం లేదు. పరమాత్మను దర్శించ గలిగితే విషయాలతో పాటు రాగము కూడా తొలగి పోతుంది.

వ్యాఖ్య

దేహానికి ఆకలిదప్పులు ఉన్నట్లే, మనస్సుకు కూడా ఆకలిదప్పులు ఉన్నాయి. అదే రాగాసక్తి. ఇంద్రియాలను నిగ్రహిస్తే, విషయాలు దూర మవుతాయి. అంతేగాని మనస్సులో ఉండే విషయాసక్తి దూరం కాదు. కేవలం ఇంద్రియాలను నియమించినంత మాత్రాన, ఆ వ్యక్తి యొక్క బుద్ధి స్థిరంగా ఉంది (స్థితధీః) అని చెప్పలేము.

ఉపవాసం

ఇంద్రియాలను జయించాలని, ఉద్రేకాలను నియంత్రించాలని అభిప్రాయపడి కొందరు సాధకులు ఉపవాస వ్రతం పాటిస్తూ ఉంటారు. నిరాహారంగా ఉంటే ఇంద్రియాలను అరికట్ట వచ్చు అనుకుంటారు. ఇది ఉపయుక్తం కాదని ఆ తరువాత అనుభవంలో గ్రహిస్తారు. ఆహారాన్ని దూరం చేసుకో గలమే గాని ఆహారం పట్ల ఆసక్తిని దూరం చేసుకోలేము అని తెలుసు కుంటారు.

ఆహారం తీసుకోకుండా ఉంటే ఆహారానికి భౌతికంగా దూర మవుతాము. మానసికంగా చాలా దగ్గరై ఉంటాము. ఏకాదశి నాడు కొందరు ఉపవాసం ఉంటారు. వారి దృష్టి, ధ్యానము అంతా ద్వాదశి మీదే ఉంటుంది. అంటే, ద్వాదశి పారాయణం మీద కాదు. పారాయణానంతరం స్వీకరించ బోయే ప్రసాదం మీద, భోజనం మీద ఉంటుంది. ఆ భోజనం ఎలా ఉండాలి? అనే విషయచర్చ లోనే కొందరు ఏకాదశిని గడిపేస్తారు.

ఉపవాసంలో దేహం బలహీన పడుతుంది. ఇంద్రియాలన్నీ శక్తిహీనంగా ఉంటాయి. అంటే, అన్ని

ఇంద్రియాలలో బలం లేకుండా ఉంటుంది. అయితే ఇంతవరకు ఇంద్రియాలలో ఉన్న బలం ఏమైనట్లు? అన్ని ఇంద్రియాలలో ఉన్న బలం వెళ్ళి నాలుకకు అంటుకుపోయింది అని అర్థం.

ఇంద్రియాణి జయన్త్యాశు నిరాహారా మనీషిణః
వర్జయిత్వాతు రసన మసౌ రస్యేహి వర్ధతే॥

ఆహారాన్ని విడిచి పెట్టిన విద్వాంసులు అన్ని ఇంద్రియాలను జయించ గలుగుతారు, ఒక్క రసనేంద్రియమును తప్ప. ఎందుచేత నంటే, నాలుక స్వవిషయంలో ఆసక్తిని పెంచుకుంటూనే ఉంటుంది అన్నది భాగవతము.

జ్వరం వస్తే ఆహారం రుచించదు. రోగి ఆహారం తీసుకోవడం మానేస్తాడు. నీరసంతో ఉంటాడు. ఇంద్రియాలన్నీ బలహీనపడి ఉంటాయి. అంతమాత్రాన అతనిలో ఆసక్తి, అభిరుచి నశించవు. జ్వరం తగ్గగానే ఏవేవి తినాలి? అని ఊహించుకుంటూనే ఉంటాడు. జ్వరం వల్ల రసనేంద్రియము పదార్థాల జోలికి పోదు. కనుక ఆ వ్యక్తికి ఆహార పదార్థాలు దూర మవుతాయి. అంతే కాని ఆహారం మీద అభిరుచి దూరం కాదు. ఇదే విషయాసక్తి. ఇదే రాగాసక్తి. రసానుభవం.

నీరసం రసహీనం కాదు

దేహేంద్రియాలు నీరసానికి లోనవుతాయి. కాని, మనస్సు మాత్రం నిరాహారంగా ఉంటే మనిషి నీరసిస్తాడు. విషయాలు దూరమైనంత మాత్రాన విషయరసం దూరం రసపూర్ణం గానే ఉంటుంది. మనస్సు నీరసించదు. కాదు. మనస్సు నుండి కారిపోదు. పారిపోదు.

ఆహారము అంటే కేవలం నాలుక ద్వారా లోనికి వెళ్ళే పదార్థాలు మాత్రమే అని భావించ కూడదు. ***ఆహ్రియతే ఇతి ఆహారః***. ఇంద్రియాల ద్వారా మనం గ్రహించే విషయాలన్నీ ఆహారమే. నోటికి పదార్థాలు ఆహారమైతే, కంటికి రూపాలు, రంగులు ఆహారము. చెవికి శబ్దము ఆహారము. ముక్కుకు వాసన ఆహారము. చర్మానికి స్పర్శ ఆహారము. ఇంద్రియాల ద్వారా లోనికి గ్రహింపబడే బాహ్య విషయాలన్నీ ఆహారమే.

విషయాల మీద మనకు ఉండే ఆసక్తే రాగం. ఆ రాగాన్నే రసం అంటారు. 'రస' శబ్దానికి ఆసక్తి, అభిరుచి, రాగం అనే అర్థాలు ప్రముఖంగా ఉన్నాయి ***(రస శబ్దో రాగే ప్రసిద్ధః)***. విషయ సంబంధమైన రాగమే రసము. విషయాలను నిరాకరిస్తే ***(ఆహారం)*** విషయాలు దూర మౌతాయే గాని, విషయ సంబంధమైన ఆసక్తి, రసం మనస్సులో ఊరుతూనే ఉంటుంది. నిరాహారం వల్ల దేహేంద్రియాలు నీరసించ వచ్చు నేమో గాని మనస్సు మాత్రం రసహీనం కాదు.

విషయాలను నివారించినా విషయాసక్తి మనస్సులో గాఢంగా ఉంటుంది కనుక, మళ్ళీ విషయానుభవం లోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ఆహారాన్ని పునః విశేషంగా స్వీకరించే పరిస్థితిని ఎవ్వరూ కాదన లేరు.

దేహ బరువు తగ్గాలని నేడు చాలా మంది అనేక చికిత్సలను చేయించు కుంటున్నారు. పురాతన చికిత్సలతో పాటు అధునాతన సాంకేతిక చికిత్సలు కూడా వ్యవహారం లోకి వచ్చి ఉన్నాయి. చికిత్స సమయంలో ఆరు కిలోల బరువు తగ్గితే, చికిత్సానంతరం కొంత కాలానికి మళ్ళీ తొమ్మిది కిలోలు పెరిగి ఉంటారు. అభిరుచులు బరువును అధికం చేస్తాయి.

వృక్ష శాఖల్ని ఖండించి నంత మాత్రాన వృక్షం నశించదు. మూలం గాఢంగా లోతుకు చొచ్చుకు పోయి ఉంటుంది కనుక మళ్ళీ చెట్టు చిగురిస్తూనే ఉంటుంది. నూతనమైన శాఖలు పుట్టుకొస్తూనే ఉంటాయి. మూలాన్ని వ్రేళ్ళతో సహా పెకలించి వేస్తే, చెట్టు మళ్ళీ చిగురించదు. ఇంద్రియ నిగ్రహం కూడా అంతే.

విషయాలను దూరం చేస్తే ఉపయోగం ఉండదు. విషయాసక్తి మనస్సులో దూరం కావాలి. దేహేంద్రియ మనస్సులు అన్నీ నిగ్రహింప బడాలి.

నిరాహారంగా ఉండి, ఇంద్రియాలను విషయాలకు దూరంగా ఉంచడాన్ని 'నిగ్రహం' అంటారు. మనస్సులో రాగ రసం ఇంకిపోయి, మనస్సు స్వాధీన మైతే, దానిని 'సంయమనం' అంటారు. నిగ్రహము ఒక్కటే సరిపోదు. సంయమనం కూడా కావాలి. అప్పుడే బుద్ధి స్థిరంగా ఉంటుంది. అదెప్పుడు సాధ్యం? పరమాత్మ దర్శనం జరిగి నపుడే.

పరధ్యానము - పరమాత్మ దర్శనం

పరమాత్మ ఆనంద స్వరూపుడు ***(రసోవైసః)***. రస స్వరూపుడైన పరమాత్మ దర్శనం లభించే వరకు మనసులో రసం నివర్తించదు. రాగాసక్తి దూరం కాదు. విషయాభిలాష అదృశ్యం కాదు. పరతత్వాన్ని ఎప్పుడైతే దర్శించడం జరుగుతుందో, అప్పుడే విషయాలతో పాటు విషయ రసం కూడా లేకుండా పోతుంది.

ఒకడు పరధ్యానంలో ఉంటే, అతని ముందు ఏది ఉన్నా ఉన్నట్లు అతనికి తెలియదు. పిలిచినా అతనికి వినిపించదు. శబ్దం అతని చెవిలో పడుతుందే గాని మనస్సులో దూరదు. ఇంద్రియాలకు విషయాలు అందుతున్నా, పరధ్యానంలో ఉన్నవాడు ఆ విషయాల పట్ల స్పృహ లేకుండా ఉంటాడు. కారణం ఏమిటి? ఎదురుగానే ఉన్న వస్తువు కనిపించక పోవడానికి కారణము, అతని మనస్సులో మరేదో వస్తువు ఉండటమే. మనస్సులో గోచరించే వస్తువును చూడటంలో నిమగ్నమై ఉన్నాడు కనుక కళ్ళ ఎదుట ఉన్న వస్తువును గుర్తించ లేక పోతాడు.

ఆంతర్యంలో పరమాత్మను దర్శించే వాడు బాహ్య విషయాల యందు స్పృహ లేనివాడై ఉంటాడు. ఆసక్తి లేనివాడై ఉంటాడు. రస పిపాస లేనివాడై ఉంటాడు. బయట ఎన్నయినా ఉండనీ. ఉన్న వన్నీ లోనున్న దాని కన్నా వేరు కానపుడు, ప్రత్యేకించి దేని మీద ఆసక్తి ఉంటుంది? పరమాత్మ దర్శనం కలగనంత వరకే ప్రపంచంపై ఆసక్తి ఉంటుంది. పరమాత్మ దర్శనంతో విషయ పిపాసలు పండుటాకుల్లా రాలిపోతాయి. ఇదంతా పరమాత్మ దర్శన వైభవము.

అత్యవసరమైన పని మీద వెళ్తున్న తల్లి, బిడ్డను ఇంటిలో విడిచి పెట్టి జాగ్రత్తగా చూస్తూ ఉండమని కుటుంబీకులకు చెప్పి వెళ్తుంది. ఉదయం వెళ్ళిన తల్లి మధ్యాహ్నమైనా ఇంకా ఇంటికి రాలేదు. తల్లి కోసం బిడ్డ ఏడవడం మొదలు పెడుతుంది. పండ్లు, మిఠాయిలు బిడ్డ చేతిలో పెట్టి, అమ్మ వచ్చేస్తుందని ఓదార్చుతూనే ఉన్నారు కుటుంబము లోని వారు.

సాయంత్రం అయింది. అమ్మ ఇంకా రాలేదు. బిడ్డ ఏడుపు తారాస్థాయికి చేరుకుంది. బొమ్మలు కూడా కొనిపెడతారు. అవన్నీ బిడ్డ చేతిలో పట్టుకొని ఉంటుందే గాని, ఏడుపు మాత్రం మానదు. బొమ్మలు చేతి లోనే ఉంటాయి. కళ్ళల్లో నీళ్ళు కారుతూనే ఉంటాయి.

ఈ లోగా అమ్మ వచ్చేస్తుంది. తల్లిని చూడగానే బిడ్డ చేతి లోని బొమ్మల్ని పడేస్తుంది. చుట్టూ ఉన్న మిఠాయిలను, పండ్లను ప్రక్కకు నెట్టేస్తుంది. ఏడుపు ఆపేస్తుంది. ఒక్క ఉదుటన లేచి, అమ్మా! అంటూ ముందుకు ఉరికి అమ్మను పట్టేసుకుంటుంది. చుట్టేసుకుంటుంది. అంతే. ఆ క్షణంలో, బిడ్డకు తల్లి తప్ప మరేదీ కనిపించదు. వినిపించదు. తినాలని అనిపించదు. సమస్త విషయాలు మనస్సు నుండి అప్రయత్నంగా జారిపోతాయి ***(పరం దృష్ట్వా, అస్య రసః అపి నివర్తతే)***. పరమాత్మ జ్ఞానం కలిగి, పరమేశ్వరుని దర్శించిన మనస్సులో విషయాసక్తి ఇలాగే అదృశ్య మవుతుంది. రాగం ఆగుతుంది. రసం నీరసిస్తుంది.

పల్లవి : సత్యమైన నీ కథ విని
వినిపించింది మనసు మనవిని " సత్యమైన "
అనుపల్లవి : పోయిన పున్నమి వచ్చిందని
చేసిన పున్నెము తెచ్చిందని " సత్యమైన "
చరణము : చెప్పుటకేమి లేదని
చెప్పక మన సుండలేదని
మనసారా నీ కిచ్చిన మనసు
ఏనాటికి తిరిగి రాదని
నిన్నొదలి ఎన్నడు రాలేదని " సత్యమైన "

అని రాగాన్ని త్రుంచి పడేసింది చైతన్య గీతిక.

ఈ విధమైన పరమాత్మ దర్శనం, సమ్యగ్దర్శనం స్థితప్రజ్ఞునికి జరిగిపోయింది కనుక, ఆ మహాత్ముని స్థిరమైన వివేక బుద్ధిని ***(స్థితధీః)*** విషయాలు చేరలేవు. విషయాసక్తి చలింప చేయలేదు. ముముక్షువులైన సాధకులు మాత్రం అట్టి పరమార్థ దర్శన ప్రజ్ఞను సిద్ధం చేసుకోవాలి అని అభిభాషించారు భాష్యంలో ఆచార్యులు ***(తస్మాత్ సమ్యగ్దర్శనాత్మికాయాః ప్రజ్ఞాయాః స్థైర్యం కర్తవ్యమ్ ఇతి అభిప్రాయః).***

పరమాత్మ దర్శన రూపమైన ప్రజ్ఞను స్థిరంగా నిలబెట్టుకోవాలి. అలా భావించే వారు ముందుగా తమ ఇంద్రియాలను వశపరచుకోవాలి. శుద్ధి చేసుకోవాలి. ఇంద్రియాలు వశపడక పోతే మాత్రం, ఆ తరువాత పెనుతుఫాను చెలరేగే ప్రమాదం ఉంటుంది. ఎలాగంటే . . . . .

యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః ।
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః ॥ 60

యతతః-హి-అపి-కౌంతేయ-పురుషస్య-విపశ్చితః
ఇంద్రియాణి-ప్రమాథీని-హరంతి-ప్రసభం-మనః

కౌంతేయ	= అర్జునా!	ప్రమాథీని	= ప్రమాదమును కలిగించు
యతతః అపి	= ప్రయత్నము చేయుచున్న	ఇంద్రియాణి	= ఇంద్రియములు
విపశ్చితః	= విద్వాంసుడైన	ప్రసభం	= బలాత్కారముగా
పురుషస్య	= పురుషుని యొక్క	హరంతి హి	= హరించు చున్నవి గదా!
మనః	= మనస్సును		

కౌన్తేయా! విద్వాంసుడైన పురుషుడు తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉంటాడు. అయినా, క్షోభను కలిగించే ఇంద్రియాలు మనస్సును బలవంతంగా లాక్కొని పోతుంటాయి.

వ్యాఖ్య

స్థితప్రజ్ఞునికి ఇంద్రియ మనస్సులు లోబడి ఉంటాయి. ఆత్మయే తాను అనే జ్ఞానం ఉండటం చేత, తన ఆనందానికి మరొక దానిపై ఆధారపడి ఉండే ప్రసక్తి లేనందున, మననశీలుని బుద్ధి స్థిరంగా ఉంటుంది. గాలి లేని చోట దీపం లాగా నిశ్చలంగా, పవిత్రంగా ఉంటుంది. అతనికి ప్రపంచము విస్మృతప్రాయం.

వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉండే దివ్యాత్ముడు స్థితప్రజ్ఞుడు. వివేకము లేని వాడు అవిపశ్చితుడు. అవివేకి. అట్టి

వానిని ఇంద్రియాలు కుదిపేస్తాయి. మనస్సు ముంచేస్తుంది. పెనుగాలికి ఊగే అరటిచెట్టు లాగా అతడు సుఖదుఃఖాల మధ్య ఊగిపోతూ ఉంటాడు.

అటు స్థితప్రజ్ఞుడు కాలేక, ఇటు అవివేకిగా ఉండలేక, స్థిరమైన వివేక బుద్ధి కొరకు ప్రయత్నించే సాధకుడు విపశ్చితుడు **(మేధావినః)**. వివేకము కలిగిన విద్వాంసుడు ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును నియమించి, స్థిరమైన వివేక ప్రజ్ఞ కొరకు ప్రయత్నిస్తూ ఉంటాడు. అట్టి విపశ్చితుడైన సాధకుని విషయం ఈ శ్లోకంలో చర్చింప బడుతూ ఉంది.

పండితుడైన సాధకుడు ఇంద్రియాలను నియమించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ ఉంటాడు ***(యతతః ప్రయత్నం కుర్వతః)***. అయినా బాధించే స్వభావం కలిగిన ఇంద్రియాలు ***(ప్రమాథీని, ప్రమథన శీలాని)*** వివేకం కలిగి ప్రయత్నం చేయుచున్న సాధకుని మనస్సును క్షోభకు గురి చేస్తాయి ***(విక్షోభయన్తి, ఆకులీ కుర్వన్తి)***. తీవ్రంగా బాధించి క్షోభింప చేస్తాయి. వ్యాకులచిత్తున్ని చేస్తాయి. అలా కలత చెందిన విద్వాంసుని మనస్సును క్షణాల్లో బలాత్కారంగా ***(ప్రసభం)*** హరించి వేస్తాయి ***(హరన్తి)***.

ఇంద్రియాలు చాలా బలం కలిగి ఉంటాయి. దేహాన్ని చలింప చేస్తాయి. మనస్సును చంచలంగా మారుస్తాయి. కొన్ని విషయాలలో మనస్సు మగతలో పడి ఉన్నా, ఇంద్రియాలు మనస్సును తట్టి లేపుతాయి. పట్టి ఊపుతాయి. అందుకనే, విద్వాంసుడు అయినప్పటికి ***(విపశ్చితః అపి)***, తీవ్రంగా ప్రయత్నం చేయుచున్నప్పటికి ***(యతతః అపి)***, ఇంద్రియాలు మనస్సును బలవంతంగా ఇంద్రియ విషయాల వైపు ఈడుస్తున్నాయి అంటున్నాడు.

చిత్తం దుర్బలం - యత్నం విఫలం

దీపం లేని ఇంటి లోనే దొంగలు పడతారు. దీపం ఒక్కటే సరిపోదు. ధీరత్వం కూడా ఉండాలి. బాహ్యంలో ఏమి జరుగుతూ ఉందో తెలుసుకోవడానికి దీపం ఉండాలి. దేని నైనా ఎదుర్కొని సాధించే ధీశక్తి వ్యక్తి ఆంతర్యంలో ఉండాలి. అప్పుడే దొంగల్ని నివారించినట్లు ఇంద్రియాలను నిగ్రహించే అవకాశం ఉంటుంది.

ఇంద్రియ విషయాల లోని దోషాన్ని చూడటము వివేకము. అట్టి వివేకము కలవాడే విపశ్చితుడు. విద్వాంసుడు. కేవలం వివేకముతో ఆదమరచి ఉండటం లేదు. నిగ్రహించే ప్రయత్నము తీవ్రం గానే చేస్తున్నాడు. అయినప్పటికి ఇంద్రియాలు అతని బుద్ధిని హరించి వేస్తున్నాయి.

ప్రయత్నమే చేయకుండా కూర్చునే అవివేకి బుద్ధిని ఇంద్రియాలు సులభంగా ఈడ్చి పడేస్తాయి. ఇక్కడ విపశ్చితుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు కనుక ఇంద్రియాలు బలప్రయోగంతో అతడిని లొంగదీసు కుంటున్నాయి ***(హరన్తి ప్రసభం)***.

బలవాన్ ఇంద్రియ గ్రామో విద్వాంసం అపికర్షతి

బలవంతుడైన విద్వాంసుని కూడా ఇంద్రియాల గుంపు లొంగదీసు కుంటుంది అన్నాడు వ్యాసమహర్షి.

ప్రయత్నశీలుడైన వివేకి యొక్క మనస్సును కూడా ఇంద్రియాలు బలవంతంగా హరించ డానికి కారణమేమిటి? అనే ప్రశ్న ఎవరిలో నైనా ఉదయిస్తుంది. దానికి కారణం ఒక్కటే. అతడు విద్వాంసుడే కావచ్చు. ప్రయత్నశీలుడే కావచ్చు. అతడి మనస్సులో ఇంకా రాగాసక్తి మిగిలి ఉంది (రసం). ఈ రసమే బుద్ధిని నీరసం చేస్తుంది. లేని శక్తిని ఇంద్రియాలకు చేకూర్చుతుంది.

చిన్న నిప్పురవ్వ అరణ్యాల్ని దహించే శక్తిని కలిగి ఉన్నట్లు, మనస్సు లోని విషయాసక్తి ఇంద్రియాలకు

మిలిమిరిన బలాన్ని సమకూర్చుతుంది. ఇక్కడే చాలా మంది పండితులు పరాభవానికి లోనయ్యారు. మహాశక్తిమంతులు, మాననీయులైన వారు కూడా దారి తప్పి దగా పడ్డారు.

మహర్షి విశ్వామిత్రుడు ఎప్పుడు ఎక్కడ విఫలమైనా, ఆ దురదృష్టం వెనుక విషమించిన రసమే ఉండింది. మహాభారతంలో అయితే, మహాత్ములు, మహావీరులు అయిన భీష్మద్రోణాదులలో కూడా ఈ రాగం శ్రుతి తప్పినప్పుడే వారు ఆపదల పాలైనట్లు, ఆవేదనలకు లోనైనట్లు తెలుస్తుంది.

మనస్సులో విషయాసక్తి మిగిలి ఉంటే చాలు. ఇంద్రియాలు విజృంభించి మనస్సును లొంగదీసుకుంటాయి. బుద్ధి దుర్బల మైనపుడే సాధకుడి యత్నాలు విఫల మౌతాయి.

మనస్సు ఇంద్రియాల వశం కాకుండా సాధకులు జాగ్రత్త పడాలి. మనస్సును నిగ్రహించి, వివేక ప్రజ్ఞను స్థిరపరచుకోవాలి అని భావించే ముముక్షువులు, ముందుగా ఇంద్రియాల విషయంలో జాగ్రత్త పడాలి. దానికి ఏమి చేయాలి?

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

తాని-సర్వాణి-సంయమ్య-యుక్తః-ఆసీత-మత్పరః
వశే-హి-యస్య-ఇంద్రియాణి-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

తాని సర్వాణి	= ఆ ఇంద్రియాల నన్నిటిని	ఇంద్రియాణి	= ఇంద్రియములు
సంయమ్య	= చక్కగా వశ పరచుకొని	వశే	= స్వాధీనము నందున్నవో
యుక్తః	= యోగయుక్తుడు	తస్య	= అతని యొక్క
మత్పరః	= నా యందు ప్రియము గలవాడై	ప్రజ్ఞా	= బుద్ధి
ఆసీత	= కూర్చోవాలి	ప్రతిష్ఠితా హి	= స్థిరమైనది కదా
యస్య	= ఎవని యొక్క		

ఇంద్రియాల నన్నిటినీ నిగ్రహించాలి. ఏకాగ్ర బుద్ధి కలిగి ఉండాలి. నా యందే ఆసక్తి గలవాడై ఉండాలి. ఇంద్రియాలు ఎవరికి వశ పడతాయో వారి జ్ఞానమే సుస్థిర మైనది.

వ్యాఖ్య

ఇంద్రియాలను వశపరచుకో వలసిన అవసరం జీవితంలో ప్రధాన మైనది అని తెలియని వాడు పామరుడు. అవసరాన్ని గుర్తించడమే గాక, ఆ మార్గంలో నిరంతరం శ్రమించే వాడు పండితుడు. ఇంద్రియాలను సంపూర్ణంగా నియమించడమే గాక, ఇంద్రియ విషయ స్పృహ కూడా లేని పవిత్రాత్ముడు జ్ఞాని. అతడే స్థితప్రజ్ఞుడు. అతని వివేక బుద్ధి సదా స్థిరంగా ఉంటుంది.

సాధ్యం తెలియాలి. సాధన నడవాలి. అప్పుడే సిద్ధి. ఇంద్రియ విషయాలు దోషపూరితాలు. ఇంద్రియాలు మోసపూరితాలు. ఇవి బ్రతుకును పాడు చేసేందుకే ఉన్నాయి. చెడిపే వాటిని నమ్ముకోవడం, చెడిపోగానే దుఃఖించడం మనిషికి పరిపాటి అయింది.

ఇంద్రియ విషయాలు సుఖ హేతువులు కావు. ఇంద్రియ విషయాలలో ప్రతి సుఖం వెనుక దుఃఖమే దాగి ఉంటుంది. ఇది పూర్ణంగా అర్థమైతే, ఇక ఆ తరువాత, ఆ వైపుకు పొమ్మన్నా మనస్సు పోదు. రాగద్వేషాలు స్థిరమైనవి కావు. కనుక, వాటి కార్యాలైన సుఖదుఃఖాలు కూడా స్థిరమైనవి కావు. స్థిరం కానివి ఎప్పుడో ఒకప్పుడు

మనల్ని వదలి పోయేవే. వాటంతటవి మనల్ని విడిచిపెట్టి పోతే మనకు దుఃఖం కలుగుతుంది. వాటి లోని దోషాలను గుర్తించి మనమే వాటిని వదిలేస్తే, సుఖం దూరం కాకుండా ఉంటుంది.

మనస్సును నియమించాలి అంటే ఇంద్రియాలను నిగ్రహించి తీరాలి అని పూర్వ శ్లోకాల లోనే గ్రహించాము. కనుక, వివేక ప్రజ్ఞలో కూడుకున్న స్థితప్రజ్ఞుడు ఇంద్రియాల నన్నిటినీ వశపరచుకొని (**సంయమ్య వశీకరణం కృత్వా**) ఉంటాడు. 'మత్పరుడై కూర్చుని ఉంటాడు' (**ఆసీత మత్పరః**) అంటున్నాడు భగవంతుడు.

'మత్పరుడు' అంటే వాసుదేవుడే సర్వభూతాంతరాత్మ అని తెలిసి, తాను వాసుదేవుని కన్నా అన్యుడు కాదని భావించుట (**మత్పరః అహం వాసుదేవః సర్వ ప్రత్యగాత్మా పరః యస్య సః మత్పరః**) అని అర్థం. కూర్చుని ఉంటాడు అంటే నిర్వ్యాపారుడై ఉంటాడు అని అర్థం. అదే **ఆసీత** - 'కూర్చునుట' అనే పదానికి అర్థం (**న అన్యః తస్మాత్ ఇతి ఆసీత ఇత్యర్థః**). వాసుదేవుని కంటె తాను అన్యుడు కానట్లు భావించడం చేత, మననశీలుని ఇంద్రియాలు వశ పడతాయి. అప్పుడు అతని ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది (**అభ్యాస బలాత్ తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా**).

కృషి ఉండాలి - కృప కావాలి

ఇంద్రియాలను నిగ్రహించడంలో మన కృషి పూర్ణంగా ఉండాలి. విషయాల యందు ఆసక్తి, పరమాత్మ యందు ఉదాసీనత ఉన్నంత కాలం మనం ఈ ప్రపంచంలో అశక్తులము గానే ఉంటాము. అశక్తతలో ఏమి సాధిస్తాము? కనుక, అలాంటి సమయాలలో దృష్టిని పరమాత్మ వైపు మళ్ళించాలి.

ఈ శ్లోకంలో ప్రధానంగా రెండే విషయాలు ప్రస్తావించ బడ్డాయి. ఒకటి సాధన దశ. రెండవది సాధ్య స్థితి. ఇంద్రియాల నన్నిటినీ సంయమనం చేయాలి అనేది సాధన. మత్పరుడై ఉండాలి అనేది సాధ్య సంబంధం. సాధన విషయంలో నిషేధాన్ని నిర్దేశించాడు. సాధ్య విషయంలో విధిని నిర్ణయించాడు.

దృశ్య నివారితము సాధన కాగా, మనస్సు ఆత్మ పరమై ఉండటం సాధ్య సంబంధ మవుతూ ఉంది. విషయాలన్నీ దృశ్యాలే. దృశ్యాల నుండి ఇంద్రియ మనస్సులను నిగ్రహించి, ప్రత్యగాత్మ రూపుడైన వాసుదేవుని యందు చిత్తమును స్థిరంగా ఉంచితే, అట్టి వాని వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది (**తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా**).

దృశ్య వారితం చిత్త మాత్మనః
చిత్త్వ దర్శనం తత్త్వ దర్శనం ॥

దృశ్య పదార్థముల నుండి వారింప బడిన చిత్తము ఆత్మ దర్శనము చేయడమే సత్య దర్శన మని శ్రీరమణ మహర్షి 'ఉపదేశసారం'లో రచించారు. దృశ్యము నుండి ప్రయత్న పూర్వకంగా విడిపడాలి. ఆ తరువాత పరమాత్మ యందు మనస్సును లగ్నం చేయాలి (**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః**).

పతంజలి మహర్షి తన యోగ దర్శనములో మొదట **యోగః చిత్తవృత్తి నిరోధః** అని యోగాన్ని నిర్వచించారు. మనస్సు లోని ఆలోచనలను అరికట్ట మని ఆదేశించారు. మనస్సులో ఏ ఆలోచనలు ఉంటాయి? విషయాలకు సంబంధించిన ఆలోచనలే ఉంటాయి. కనుక దృశ్యము నుండి విడిపడ మని ప్రబోధించారు.

విషయాల నుండి విరమించిన ఇంద్రియ మనస్సులు, అలాగే ఖాళీగా ఉంటే, తిరిగి విషయాలలో దూరిపోయే ప్రమాదం ఉంటుంది కనుక, అలా నియమించిన ఇంద్రియ మనస్సులను స్వరూపంలో సంధానం చేయమన్నారు (**తదా ద్రష్టుః స్వరూపేஉ వస్థానమ్**).

ఈ రెండూ సులభం కావు. విషయాల నుండి ఇంద్రియాలను నియమిస్తే గాని, మనస్సును ఆత్మ యందు లగ్నం చెయ్యలేము. మనస్సు ఆత్మ యందు లగ్నమైతే గాని రాగాసక్తి (రసం) ఉపశమించదు. ఏం చెయ్యాలి?

ఒక రాజు గారికి ఒక్కడే కుమారుడు. అతడికి వివాహం కావాలి. ఆ పిల్లవాడు ఉన్మాది. పిల్ల నివ్వమని ఎవరిని అడిగినా, 'పిచ్చి కుదిరితే పిల్లను ఇస్తాము' అంటారు. వైద్యుల్ని సంప్రదిస్తే, 'పెళ్ళి చేస్తేనే పిచ్చి కుదురుతుంది. ఇది ఒక విచిత్రమైన పిచ్చి' అంటారు. ఏం చేయాలి?

ప్రస్తుతం ఈ శ్లోకంలో మన పరిస్థితి కూడా అదే. ఇంద్రియాలను నిగ్రహించే ప్రయత్నా లన్నీ మనం చేయాలి. మన ప్రయత్నం విఫలమై నపుడు పరమేశ్వరుని వైపు మరలాలి. అనుగ్రహాన్ని అర్థించాలి. ప్రార్థించాలి.

ఇదేమిటి? సాంఖ్య ప్రకరణంలో స్థితప్రజ్ఞుడైన జ్ఞాని లక్షణాలను వర్ణిస్తూ, తటాలున భక్తికి తెర లేపడ మేమిటి? వ్యాఖ్యానాన్ని భక్తి పరంగా త్రిప్పడ మేమిటి? అని మీకు ఆశ్చర్యం కలగవచ్చు. ఇక్కడ, నేను పని కట్టుకొని వ్యాఖ్యను త్రిప్పడం లేదు. పరమేశ్వరుని వాక్యాల లోని మర్మాన్ని విప్పి చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. అంతే.

ఇంద్రియాలను నియమించడంలో మన కృషి ఫలించ నపుడు పరమేశ్వరుని కృపను అర్థించడం తప్ప మరో గత్యంతరము లేదు. అందుకే గీతాచార్యుడు **మత్పరః** అన్నాడు. లేకపోతే **తత్పరః** అని ఉండేవా డేమో! జ్ఞానమార్గంలో స్థితుడైన స్థితప్రజ్ఞుడు ఎలాగూ ఆత్మపరుడై ఉంటాడు. అదే మార్గంలో చరించే సన్యాసులు కూడా ఆత్మపరం గానే ఆలోచిస్తారు. కాని, సాధకుడైన కర్మయోగికి సగుణబ్రహ్మను ఆశ్రయించడం కన్నా మరొక మార్గమే లేదు. పైగా, అదే సరియైన మార్గము కూడా. ఆచార్యుల భాష్యంలో కూడా ఈ సత్యం తొంగి చూస్తుంది.

అర్జునా! మత్పరుడవు కావాలి. అంటే, ఆత్మ పరాయణుడవు కావాలి. లేదా, భగవత్పరాయణుడ వైనా కావాలి. ఈశ్వరుడు పరబ్రహ్మము కన్నా వేరుగా లేడు కదా! **మత్పరః** అనే అంశాన్ని వ్యాఖ్యానించే టప్పుడు 'అందరిలో ప్రత్యగాత్మ రూపంగా ఉన్న వాసుదేవుడు' అని ఆచార్యులు ప్రసాదించిన వ్యాఖ్యానాన్ని మీకు అందించాను. ప్రత్యేకించి 'వాసుదేవ' శబ్దాన్ని ప్రయోగించడంలో ఆచార్యుల వారి అభిప్రాయం సుస్పష్టంగా ఉంది. భక్తి లేకుండా కర్మయోగం లేదు. ఈ భక్తియే పరిపక్వత చెంది నపుడు స్వస్వరూపాను సంధానం అవుతుంది.

సాధకుడు విద్వాంసుడు, ప్రయత్నశీలుడు అయినప్పటికి, ప్రలోభ పెట్టే ఇంద్రియాలు అతని మనస్సును బలాత్కారంగా హరించుకొని పోతాయి అని పూర్వ శ్లోకం లోనే చూశాము కదా! హరించుకొని పోయేవారు, అపహరించుకొని పోయేవారు ఎవరు? చోరులు కాదా? మరి, అలాంటి దొంగల నుండి ఎలా తప్పించుకోవాలి? ప్రభువును ఆశ్రయించాలి. మరో మార్గం లేనే లేదు.

ప్రభువు మన వాడైతే చాలు. చోరుల్ని ఎదిరించడంలో మనం అశక్తులం అయినా, శక్తిమంతుడైన ప్రభువు మనకు అండగా ఉంటాడు కనుక తన అధికారాన్ని వినియోగించి చోరుల్ని శిక్షించగలడు. మనల్ని రక్షించగలడు.

మనం ప్రభువుకు సంబంధించిన వాళ్ళం అని తెలిస్తే, అసలు చోరులే మన చెంతకు రాక పోవచ్చు. ఏది ఎలా ఉన్నా, చోరుల బారి నుండి మనం బయట పడేది మాత్రం తథ్యం. అలాగే, పరమేశ్వరునికి మనం భక్తులం కాగలిగితే, ఏ మాలిన్యము మనల్ని అంటదు. ఏ అశుభమూ మనకు జరగదు.

న వాసుదేవ భక్తానాం అశుభం విద్యతే క్వచిత్

భగవంతుడైన వాసుదేవునికి భక్తులైన వారికి ఏ అశుభమూ జరగదు.

[illegible]

ధ్యాయతో విషయా న్పుంసః సఙ్గస్తేషూపజాయతే ।
సఙ్గా త్సఞ్జాయతే కామః కామాత్క్రోధో௨భిజాయతే ॥ 62

ధ్యాయతః-విషయాన్-పుంసః-సంగః-తేషు-ఉపజాయతే
సంగాత్-సంజాయతే-కామః-కామాత్-క్రోధః-అభిజాయతే

విషయాన్	=	విషయములను	సంగాత్	=	ఆసక్తి వలన
ధ్యాయతః	=	ధ్యానిస్తున్న	కామః	=	కోరిక
పుంసః	=	పురుషునకు	సంజాయతే	=	పుడుతుంది
తేషు	=	వాని యందు	కామాత్	=	కోరిక వలన
సంగః	=	ఆసక్తి	క్రోధః	=	క్రోధము
ఉపజాయతే	=	పుడుతుంది	అభిజాయతే	=	పుడుతుంది

విషయాలను అదే పనిగ చింతిస్తూ ఉంటే వాటి యందు మనిషికి ఆసక్తి ఏర్పడుతుంది. ఆసక్తి వల్ల కామం పుడుతుంది. కామం వల్ల క్రోధం జనిస్తుంది.

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥ 63

క్రోధాత్-భవతి-సమ్మోహః-సమ్మోహాత్-స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశాత్-బుద్ధినాశః-బుద్ధినాశాత్-ప్రణశ్యతి

క్రోధాత్	=	క్రోధము వలన	స్మృతిభ్రంశాత్	=	విస్మృతి వలన
సమ్మోహః	=	మోహము	బుద్ధి నాశః	=	బుద్ధినాశనము
భవతి	=	కలుగుతుంది	బుద్ధినాశాత్	=	బుద్ధినాశము వలన
సమ్మోహాత్	=	మోహము వలన	ప్రణశ్యతి	=	సర్వనాశన మగును
స్మృతివిభ్రమః	=	విస్మృతియు			

క్రోధం వల్ల మోహము కలుగుతుంది. మోహము వల్ల స్మృతి నశిస్తుంది. స్మృతి నశించడం వల్ల బుద్ధి నశిస్తుంది. బుద్ధి నాశం వల్ల మనిషే నశించి పోతాడు.

వ్యాఖ్య

ఎవరు ఎలా జీవించినా, జీవించాలి అనుకున్నా, ఈ ప్రపంచంలో అడ్డుచెప్పే వారు ఎవ్వరూ లేరు. ఎవరి స్వేచ్ఛ వారిది. ఎవరి జీవితం వారిది. కాని, ఎవరి బ్రతుకును వారే పాడు చేసుకొనుటకు సిద్ధపడితే మాత్రం బాగు చేసే శక్తి కూడా ఎవ్వరికీ లేదు.

జీవితంలో కొన్నిటిని మనం ఆశిస్తాం. అవి కావాలి అని గాఢంగా అభిలషిస్తాం. అలాగే కొందరిని ప్రేమిస్తాం. వాళ్ళు సదా మనతో కలిసి ఉండాలి అనుకుంటాం. ఇవన్నీ మన ఆశలు. కోరికలు.

మనం ఆశించే విషయాలన్నీ మనకు అర్థ మయ్యాయి అని కాదు. మనం ప్రేమించే వ్యక్తుల యొక్క స్వరూప స్వభావాలు మనకు అవగత మయ్యాయని కాదు. వాళ్ళ అంతర్యాలు మనకు అంతు పట్టాయనీ కాదు.

వాస్తవం చెప్పాలంటే, మనకు ఇతరులతో ఉండే సంబంధాలన్నీ వాళ్ళ స్వభావాలను మనం ఆపోశనం పట్టడం వల్ల ఏర్పడ్డవి కావు. వాళ్ళ విషయంలో మనకు ఉండే అభిప్రాయాలను బట్టి వారితో మన సంబంధాలు ముడిపడి ఉన్నాయి. విషయాలు కూడా అంతే.

అందుకనే, మనతో సంబంధం కలిగిన విషయాలు ఊహించని విధంగా వికృత రూపాన్ని దాల్చి నపుడు, 'ఇవి ఇలా అవుతాయని నేను అనుకోలేదు' అని వాపోతాం. అలాగే, మనం ప్రేమించే వ్యక్తులు, మనతో సంబంధాలు కలిగి ఉన్న మనుషులు మన అభిప్రాయాలకు భిన్నంగా ప్రవర్తించి నపుడు మనం బాధపడతాం. వ్యధ చెందుతాం. 'వీళ్ళు ఇలాంటి వాళ్ళని నేను ఊహించ లేదు' అంటూ క్రోధాన్ని వెళ్ళ గక్కుతాం. వాళ్ళు ఎలాంటి వాళ్ళో మనం అర్థం చేసుకోవాలి గాని, మనం ఊహించినట్లు వాళ్ళు ప్రవర్తించడం సాధ్యపడే విషయం కాదు. సత్యం ఏదో మనస్సుకు పట్టాలి గాని, మనస్సు లోని చెత్తంతా సత్యం అయ్యే అవకాశం లేదు.

ప్రపంచం లోని విషయాలలో సుఖాలను అన్వేషించడం ఎండమావులలో దప్పిక తీర్చుకొనే ప్రయత్నం వంటిదని ఇప్పటికే మనకు అర్థమైపోయింది. వ్యక్తుల సంబంధాల వల్ల బ్రతుకులో అందాలు, ఆనందాలు వెలసిల్లుతాయని గాలిమేడలు కట్టుకోవడం, ఇసుక నుండి చమురును పిండే ప్రయత్నమే నని కూడా తేలిపోయింది. అయినా, కొందరు రాగాసక్తిని పెంచుకొంటూ, విషయ సంగత్వాన్ని సృష్టించుకుంటూ ఎలా పతన మౌతున్నారో అవరోహణ క్రమంలో ఈ రెండు శ్లోకాలలో వివరిస్తున్నారు.

అష్టాంగ అయోగము

సాధకుడు ప్రగతిని సాధించి, పరిపూర్ణతను పొందడానికి యోగమార్గంలో యమ నియమాది అష్టాంగ యోగాన్ని ఆరోహణ క్రమంలో పతంజలి మహర్షి బోధించాడు. విషయ ప్రపంచంలో రాగాసక్తితో జీవించి పతన మయ్యే వ్యక్తి యొక్క దుర్గతిని అవరోహణ క్రమంలో గీతాచార్యుడు వివరిస్తూ, అలా వినాశాన్ని పొంద వద్దని హెచ్చరిస్తున్నాడు. ఇది యోగమార్గం కాదు. అయోగ మార్గం. అందుకే దీనిని 'అష్టాంగ అయోగం'గా పిలుస్తోంది చైతన్య భగవద్గీత. అవి (1) విషయ ధ్యానము (2) సంగత్వము (3) కామం (4) క్రోధం (5) సమ్మోహము (6) స్మృతిభ్రంశము (7) బుద్ధినాశము (8) సర్వనాశము. ఇది అష్టాంగ అయోగంలో అవరోహణ క్రమం.

వీటిని గూర్చి తెలుసుకునే ముందు ఒక ప్రశ్నకు సమాధానం చెప్పుకొని ముందుకు పోదాం. హఠయోగాది సాధనల్ని ఆచరించే కొందరు ప్రశ్నిస్తూ ఉంటారు. 'ఏమండీ! ఇంద్రియాలను నిగ్రహిస్తే సరిపోతుంది కదా! మనస్సులో ఏముంటే ఏమైంది? ఇంద్రియాలను ఇంద్రియ విషయాల వైపు వెళ్ళకుండా హఠంతో నిరోధిస్తే సరిపోతుంది కదా!' అని.

ఆ ప్రయత్నమే గనుక ఫలరూప మైతే, కారాగారంలో మగ్గుతున్న ఖైదీ లందరూ యోగులే అవుతారు. ఇంద్రియాలు గుడ్డివి. కళ్ళజోడు లాంటివి. చూడటానికి కళ్ళజోడు ఉపయోగ పడుతుందే గాని చూసేవి మాత్రం కళ్ళే. అలాగే, ఇంద్రియాలు విషయాలను మనస్సు ముందు ప్రదర్శిస్తాయి. అంత వరకే. ఇంద్రియాలు విజృంభించి విషయాల వైపు పరుగులు పెడుతున్నాయి అంటే, దానికి మనస్సు లోని విషయాసక్తే కారణం. విషయ చింతనమే ప్రబల కారణము. విషయ చింతనముతో ప్రారంభమై, వ్యక్తి వినాశానికి దారి తీసేది కేవలం రాగాసక్తే. అదెలాగో చూద్దాం.

విషయ ధ్యానము

బాహ్యం లోని విషయాలు ఇంద్రియాల ద్వారా అంతర్యం లోకి, అనగా మనస్సు లోకి ప్రవేశిస్తూ ఉంటాయి. సంతలో ఎన్నో వస్తువుల్ని మనం చూస్తాం. అన్నీ మన ఇంటి లోకి రావాలి అనుకోము. అలాగే, ఈ ప్రపంచం లోని విషయాలు ఎన్నో మన మనస్సు లోకి ప్రవేశిస్తూ ఉంటాయి. అన్నీ కావాలని మన బుద్ధి కోరుకోదు.

ఎందుకనో కొన్ని మనకు నచ్చుతాయి. నచ్చిన వాటిని ఇష్టపడతాం. అయితే, ఒకరు ఇష్టపడింది మరొకరు ఇష్టపడాలి అనే నియమ మేమీ లేదు. రుచులు లోకంలో భిన్నంగా ఉంటాయి. అభిరుచులూ భిన్నం గానే ఉంటాయి.

ఏదైనా ఒకటి మనకు నచ్చింది అంటే, అందులో ఉన్నదంతా నచ్చిందని చెప్పలేము. మనం నచ్చింది అక్కడ ఉంది. అంతే. అరటిపండును మనం కోరుకున్నాము అంటే, అందులో మనకు కావలసింది పండే గాని తొక్క కాదు. అలాగే గులాబీ పువ్వు మనకు కావాలి. ముల్లు అవసరం లేదు. కాకపోతే, తొక్క లేకుండా అరటిపండు దొరకదు. ముల్లు లేకుండా గులాబి ఉండదు.

పెళ్ళిచూపులు లేకుండా ఎవరూ పెళ్ళి చేసుకోరు. చూపులు ఎన్నో జరుగుతాయి. నచ్చేది మాత్రం ఒక్కరినే. అలా నచ్చి పెళ్ళి చేసుకున్న వారికి నచ్చిం దేమిటి? అని ప్రశ్నిస్తే ఎవరి నుండి సరైన సమాధానం రాదు. ఎందుకని? నచ్చింది ఏమిటో నచ్చిన వారికే తెలియదు. ఇక ఇతరులకు తెలిసే దేముంటుంది? కష్టం తప్ప!

ఇంతకీ నచ్చిం దేమిటి? దేహము యొక్క వర్ణమా? దేహము యొక్క పొడవా? దేహము లోని కోమలత్వమా? కట్టుకున్న దుస్తులా? పెట్టుకున్న నగలా? పెట్టబోయే కానుకలా? చదివిన చదువా? కంఠస్వరమా? మందహాసమా? మనస్సా? మాటతీరా? ఈ రోజుల్లో అయితే, నాకు నచ్చింది సింప్లిసిటీ అని విచిత్రంగా పలుకుతూ ఉంటారు. మంచిదే. నచ్చి ఉండొచ్చు. ఆ మాత్రం దానికి పెళ్ళి అవసరమా? అందుకే విదియ నాడు నచ్చుకోవడం, చవితి నాడు అదే పనిగ నొచ్చుకోవడం. విశ్లేషిస్తే మన ఇష్టాలన్నీ ఇలాగే ఉంటాయి.

ఏది మనకు నచ్చుతుందో, దానిని మనస్సు ధ్యానిస్తూ ఉంటుంది. అదే విషయధ్యానం అంటే. సద్గతికి ఈశ్వర ధ్యానం. దుర్గతికి విషయ ధ్యానం. ఏ ధ్యానమైనా మానస వ్యాపారమే. బాహ్యంలో ఉండే విషయాలతో, లేదా వ్యక్తులతో మానసికంగా ఏర్పడే సంబంధమే ఇక్కడ ధ్యానం. విషయ ధ్యానం. 'అది ప్రాప్తిస్తే బాగుండును' అనే ఆలోచన. మనల్ని ఆకర్షించిన 'శోభన విషయం' గురించి తదేక చింతన.

సంగబుద్ధి

విషయ చింతనము ప్రారంభమై నపుడే కాస్త జాగ్రత్తపడి ఆత్మానాత్మ వివేకంతో సంగబుద్ధి ఏర్పడకుండా చూసుకోవాలి. లేదా, చింతనము సంగత్వాన్ని సృష్టిస్తుంది (*సంగః ఆసక్తిః ప్రీతి*). ఇక్కడే విషయాసక్తి మొద లవుతుంది. సంగత్వము ఏర్పడిన తరువాత సంకల్పా లన్నీ ఆ వైపే నడుస్తూ ఉంటాయి. ఇదే విషయ సంగత్వము. అలా కొంత కాలము సాగితే, సంగత్వ ప్రభావం చేత కోరిక పుడుతుంది. ఇదే కామము (*సంగాత్ ప్రీతేః సంజాయతే సముత్పద్యతే కామః తృష్ణా*). విషయాసక్తి కోరికను కదిలిస్తుంది. ఇక అది తీరని దాహాన్ని సృష్టిస్తుంది.

కోరిక దగ్గర విషయం గట్టి పడుతుంది. విషయ ధ్యానము, సంగత్వము అనే రెండు స్థాయిలలో విషయం కాస్త పలుచగానే ఉంటుంది. కామం దగ్గరకు వచ్చేసరికి విషయం గట్టి పడుతుంది.

కామ వికారము

'నేను ఆశిస్తున్నది ఆశించ దగిందే' అనే భావంతో ప్రారంభమై, 'ఎలాగైనా అది నాకు దక్కాలి' అనే

ధృఢమైన కోరికగా మారుతుంది. ఆ కోరిక ఏదైనా కావచ్చు. ధనం కావచ్చు. గృహం కావచ్చు. పదవి కావచ్చు. కీర్తి కావచ్చు. కుక్క కావచ్చు. కోతి కావచ్చు, లేదా కోతి లాంటి మనిషి కావచ్చు.

విషయ ధ్యానము, సంగత్వము - ఈ రెండు స్థాయిలలో వివేకం బలహీనంగా ఉంటుంది. కామం స్థాయిలో మాత్రం వివేకానికి గ్రహణమే పడుతుంది. ఎవరు చెప్పినా, ఏమి చెప్పినా కామికి రుచించదు. ఈ స్థాయికి రాకుండా సాధకులు జాగ్రత్త పడాలి. ఈ స్థాయికి, అనగా కామం యొక్క స్థాయికి చేరిన తరువాత నిరోధించ గలిగే వాళ్ళు చాలా అరుదుగా ఉంటారు.

కొందరు కుక్క మీద ప్రేమను పెంచుకొని కుక్కను ప్రాణతుల్యంగా పెంచుకుంటూ ఉంటారు. దాని చూపుల్లో వాళ్ళకు చంద్ర దర్శనం అవుతుంది. అది తోక ఆడిస్తే వాళ్ళ మనస్సులు ఆనందంతో ఊగి పోతాయి. అది లేనిదే బ్రతకలేము అన్నవాళ్ళు ఉన్నారు. అది మరణిస్తే సమాధులు నిర్మించిన వాళ్ళు ఉన్నారు. మరీ ప్రేమ ముదిరి దానితో పాటు మరణించిన వాళ్ళూ ఉన్నారు.

ఈ శ్లోకంపై వ్యాఖ్యానాన్ని ప్రారంభించే టప్పుడే నేనొక విషయాన్ని ప్రస్తావించాను. ఎవరు ఎలా ఉండా లనుకుంటే అలా ఉండొచ్చు. అడ్డుచెప్పే వాళ్ళు ఎవ్వరూ ఉండరు. కాకపోతే, ఎవరి జీవితాలను వాళ్ళు మదింపు వేసుకోవాలి. జీవితాన్ని చేజేతులా ఎవరైనా పాడు చేసుకోవచ్చు. కాని, తిరిగి బాగు చేసుకోవాలి అనుకుంటే మాత్రం, అది పాడు చేసుకున్నంత సులభం కాదు.

కుక్కను పెంచుకోవచ్చు. తప్పు లేదు. అది మరణిస్తే దానితో పాటు మరణించాలి అనుకోవడం మాత్రం వివేకవంతుల లక్షణం కాదు. చనిపోయిన కుక్క మళ్ళీ పుడుతుంది. దానితో పాటుగా చనిపోయిన వాళ్ళు తిరిగి ఎలా పుట్టాలని? ఎక్కడ పుట్టాలని? మన విధికి మనమే కర్తలము అనే సత్యాన్ని ఎవ్వరూ మరచి పోకూడదు.

ఆఖ్యాయిక

ఋషభుని కుమారుడు భరతుడు. అజనాభము అనే దేశాన్ని పాలించిన రాజు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. ప్రజలను పరమ వాత్సల్యంతో ప్రేమించాడు. పాలించాడు. మహాభక్తుడు. ఆయన వల్లనే మన దేశము భారత దేశము అనే పేరును పొందింది.

జింక చర్మాన్నే వస్త్రంగా ధరించేవాడు. ముక్తి మార్గంలో రాజ్యం కూడా ప్రతిబంధకమే నని, సమస్తాన్ని త్యజించి, కఠోర సాధనను కొనసాగించాలని పులహాశ్రమం చేరాడు. భోగాలు అనుభవించ వలసిన వయస్సులో సర్వమును త్యజించి, రాజ్యాన్ని బిడ్డలకు అప్పగించి సన్యసించాడు.

ఒకనాడు నదీ తీరమున ధ్యానమగ్నుడై ఉన్నాడు భరతుడు. అక్కడకు ఒక గర్భిణి అయిన లేడి వచ్చింది. ఈ లోగా ఆ వనం లోని సింహ మొకటి గర్జించింది. భీతి చెందిన హరిణి నదిని దాటేందుకు ఎగిరి దుమికింది. జింకపిల్లను ప్రసవించి తల్లి జింక మరణించింది.

భరతుడు చలించి పోయాడు. తల్లిని పోగొట్టుకున్న బిడ్డను ఆశ్రమానికి తెచ్చుకున్నాడు. ఆ హరిణ పోతమును పెంచుతూ దాని మీద ఎనలేని ప్రేమను పెంచు కున్నాడు. జపధ్యానాదులు దూర మయ్యాయి. హృదయంలో జింకపిల్లే నిండి పోయింది. దాని ధ్యాస లోనే బ్రతుకు గడిచి పోయింది. మరణ సమయంలో కూడా భరతుని మనస్సులో జింకపిల్లే ఉండి పోయింది. దాని ఫలితంగా మరణించిన భరతుడు మరుజన్మలో జింకగా పుట్టవలసి వచ్చింది. ఆ తరువాత తరించడానికి రెండు జన్మలు ఎత్తవలసి వచ్చింది.* ఇదే కామ వైపరీత్యము.

*స్వామీజీ రచించిన చైతన్య భాగవతము - పంచమ స్కంధములో వివరంగా పఠించవచ్చు.

కోరికల్ని కదలించే శక్తి మనిషి మనసుకు ఉంది. కోరిన ప్రతి దానిని సాధించుకొనే శక్తి మాత్రం మనిషికి లేదు. మనిషి సర్వాన్ని కోరుకోవచ్చు. కాని, దానిని పొందడానికి తనకు సర్వ శక్తిమత్వం లేదు అనేది మరచి పోకూడదు. సాధారణంగా కోరిన వస్తు లభించదు. ప్రతి మనిషి జీవితంలో ఆశించేది ఎక్కువ. అందుకొనేది తక్కువ. ఆశించడానికి స్తోమత అవసరం లేదు. అందుకోవడానికే సామర్థ్యం కావాలి. కోరిన దానిని పొందే సామర్థ్యం లేక, పొందిన దానిని నిలబెట్టుకొనే శక్తి లేక బాల్యం నుండి వృద్ధాప్యం వరకు ప్రతి మనిషి అంతులేని నిరాశలో కూరుకుపోతూ ఉంటాడు.

చరణము : కోరిన దేదీ దొరకని బాల్యము
ఆశల ఊబిలో మునిగిన పరువము
సాగింది కాలము సడలింది దేహము
ఎపుడూ నిరాశే తోడు - మనసా

పల్లవి : చూడు ఇదే నీ లోకం - మనసా
మనసా - ఓ మనసా - నా మనసా

అనుపల్లవి : తిరిగి రాదు పోయిన సమయం
ఎటు పోతుందో పయనం - మనసా ॥ చూడు ఇదే నీ లోకం ॥

అని చైతన్య గీతిక మనస్సును జాగృతం చేసింది.

కోరింది లభ్యం కానపుడు మనిషి క్షోభకు గురి అవుతాడు. చింత చెందుతాడు. తన కోరిక ఫలించక పోవటానికి కారణ మేదో దానిపై క్రోధం పెంచు కుంటాడు. ప్రతిబంధకంపై ప్రకోపంతో రెచ్చి పోతాడు. ఇదే క్రోధం. కామం విఫలం కావడం వల్ల ఏర్పడిన పరిణామం. ప్రతిఫలం (***కామాత్ కుతశ్చిత్ ప్రతిహతాత్ క్రోధః అభిజాయతే***).

క్రోధ ప్రకటనము

కామం విఫలం కాగానే క్రోధం బుసలు కొడుతుంది. క్రోధానికి కామమే కారణము. కామం నుండే క్రోధం ఉద్భవిస్తుంది. కామానికి, కామ ఫలితానికి మధ్య అవాంతరాన్ని సృష్టించిన ప్రతిబంధకముపై క్రోధం జనిస్తుంది. ఈ దశలో నిగ్రహము అనేది కుందేటి కొమ్ము అవుతుంది.

క్రోధము మనస్సును క్రుంగ దీస్తుంది. బుద్ధిని వికలం చేస్తుంది. వివేకాన్ని హరించి వేస్తుంది. క్రోధంలో మనస్సు ఆలోచనా శక్తిని కోల్పోతుంది. బుద్ధి నిర్ణయించే శక్తిని జారవిడుచు కుంటుంది. వివేకం ఉండదు కనుక క్రోధి ఏదైనా చేస్తాడు. కోపిష్ఠి ఎలాగైనా మాట్లాడుతాడు.

పశువుకు వివేకం ఉండదు. మృగానికి వివేకం ఉండదు. వివేకం లోపించిన మనిషి అంతకన్నా విశిష్టంగా వ్యవహరించ లేడు. ఆ విషయాన్ని కోపిష్ఠి స్వయం గానే అంగీకరిస్తాడు. 'నాకు కోపం వస్తే నేను మనిషిని కాను - ఏం చేస్తానో నాకే తెలియదు' అంటూ ఉంటాడు. తాను మనిషి కానని తానే అంగీకరిస్తున్నాడు. ఇక కోపిష్ఠిని గురించి వేరే ఏమి చెప్పాలి?

కోపం వచ్చిన వాడు ఎవ్వరినీ లెక్క చేయడు. జన్మ నిచ్చిన తల్లిదండ్రుల్ని కూడా దారుణంగా అవమానిస్తాడు. మన సంస్కృతిలో ఆచార్యుని ఆదిదేవునితో సమానంగా భావించి పూజిస్తాము. కాని, అట్టి గురుదేవుని కూడా కోపిష్ఠి నిందిస్తాడు అన్నారు భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి (**క్రుద్ధః హి సంమూఢః సన్ గురుమ్ అపి ఆక్రోశతి**).

క్రోధం వచ్చి నపుడు వివేకం నశిస్తుంది కనుక కోపము వచ్చిన వాడు కోపాన్ని ఎలాగైనా ప్రకటించ వచ్చు. విధి నిషేధాలు ఆ వదరుబోతుకు వర్తించవు. నీళ్ళు చల్లగా లేవని గ్లాసును ముక్కలు చేయాలా? కోపం వరే వచ్చింది. అలాగని గరిటెలు ఏం చేశాయి? ఫైళ్ళు ఏం చేశాయి? కుర్చీలు ఏం చేశాయి? మరీ ఇంత బీభత్సమా? ఏళ్ళ తరబడి క్రికెట్ ఆడుతున్నా, నైపుణ్యాన్ని పెంచుకోలేని అసమర్థతకు చింతించ వలసింది పోయి, అవుటు కాగానే బ్యాట్‌ని నేలకేసి కొట్టే ప్రబుద్ధుల్ని క్రీడాకారులని స్తుతించాలా? లేక అప్రయోజకు లని గర్హించాలా? ఎందరో వీక్షిస్తున్నారు అనే ఇంగితము కూడా లేదు. అదే కోపమంటే! ప్రతిబంధకము ఏదో కూడా కోపంలో అర్థం కాదు. ప్రతిబంధకం అర్థం కానపుడు ఎదురుగా ఏది కనిపిస్తే దాని మీదే ప్రతాపం. ఎవరు కనిపిస్తే వారి మీదే ప్రకోపం. క్రోధం వల్ల మనస్సు స్థిమితాన్ని కోల్పోతుంది.

ఇక్కడ మరొక్క విషయాన్ని కూడా మనం సమన్వయించు కోవాలి. క్రోధంతో పాటు లోభాన్ని కూడా కలిపి అర్థం చేసుకోవాలి. కామం సఫలం కానపుడు క్రోధం కలుగుతుంది. ఒకవేళ కామం ఫలిస్తే ఏమవుతుంది? లోభం తయారవుతుంది. లోభం కూడా మనస్సుపై తీవ్ర ప్రభావాన్నే చూపుతుంది. అది రాలేదు - ఇది రాలేదు అని కామం గోల పెడుతూ ఉంటే, ఇది పోతుందేమో - అది పోతుందేమో అని లోభం గగ్గోలు పెడుతూ ఉంటుంది. రెండూ మనస్సును కలత పెట్టేవే. క్షోభను కలిగించేవే. ఈ రెండిటి మధ్య క్రోధం ఉంటుంది. కామక్రోధ లోభాలలో క్రోధం మధ్యలో ఉంటుంది. అటు కామం ఫలించక పోయినా, ఇటు లోభం విఫలమైనా, రెండిటి మధ్య ఉన్న క్రోధం మధ్యాహ్న మార్తాండుని వలె ప్రచండంగా చెలరేగి పోతుంది.

మోహ జాలము

క్రోధం వల్ల మనస్సులో సమ్మోహము ఏర్పడుతుంది. ఏది చేయాలి? ఏది చేయకూడదు? అనే వివేకం పూర్తిగా నశించడమే మోహము. సమ్మోహము. అవివేకానికి ఆకారము. ఆహార్యము ***(సంమోహః అవివేకః కార్యాకార్య విషయః).*** ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు అర్థం చేసుకొనే అయోమయ స్థితి మోహంలో ఉంటుంది. అందులో చిక్కినవాడు బయట పడలేడు. అందుకే దానిని మోహజాలము అన్నారు. ఈ మోహ ప్రభావం చేత వ్యక్తి జ్ఞాపకశక్తిని కోల్పోతాడు.

స్మృతి విభ్రమము

మోహం వల్ల కార్యాకార్య వివేకము పూర్తిగా క్షీణిస్తుంది కనుక స్మృతి జ్ఞానము నశిస్తుంది. స్మరణ శక్తి ఉండదు. సాధారణంగా జ్ఞాపకం పెట్టుకోవలసిన వాటిని జ్ఞాపకం పెట్టుకోవడము, మరచి పోవలసిన వాటిని మరచి పోవడము చిత్తము యొక్క సహజ లక్షణము.

స్మృతి విభ్రమము జరిగిన వాళ్ళు జ్ఞాపకం పెట్టుకో వలసిన వాటిని మరచి పోతూ ఉంటారు. మరేం చేస్తుంటారు? చేసేందుకు ఏమీ లేదు కనుక, మరచి పోవలసిన విషయాల్ని నెమరు వేసుకుంటూ ఉంటారు. అంటే, స్మృతి చెడిన వారికి అనవసరమైన వన్నీ అవసరాలుగా తెలుస్తూ ఉంటాయి అని అర్థం.

ఈ స్మృతి విభ్రమము విషయంలో శ్రీ శంకరాచార్య స్వామి అందమైన వ్యాఖ్యను అందించారు. 'స్మృతి కలగడానికి తగిన విధంగా కారణాలు ఉన్నా, స్మృతి కలగక పోవడం స్మృతి విభ్రమము' అని వ్యాఖ్యానించారు ***(స్మృత్యుత్పత్తి నిమిత్త ప్రాప్తౌ అనుత్పత్తిః).*** స్మృతి కలగటానికి అనుకూలంగా నిమిత్తాలు ఉన్నా, స్మృతి కలగకుండా ఉంటుందా? ఆశ్చర్యంగా ఉంది కదూ! అదే స్మృతి విభ్రమము అంటే. ఉదాహరణకు ఒక వ్యక్తిని గూర్చి చెప్పుకుందాం.

ఆఖ్యాయిక

ఇద్దరు స్నేహితులు ఉండేవారు. ప్రతి రోజు వారు ఉభయులూ కలిసి మాట్లాడుకోకుండా నిద్రపోరు. ఒకనాడు ఒకడు మరొకనితో, మిత్రమా! నువ్వు నా నుండి యోగవాసిష్ఠము అనే గ్రంథమును తీసికొనిపోయి ఆరు నెలలైంది. ఇంకా చదవలేదా? నువ్వు పూర్తి చేసి ఉంటే, అది నేను మళ్ళీ చదవాలి అనుకుంటున్నాను అన్నాడు.

అరెరె! ఈ రోజు కూడా అనుకున్నా, తెచ్చి ఇచ్చేద్దా మని. చదవడం పూర్తి అయి నెలరోజు లైంది. రోజూ తెద్దామని అనుకుంటూనే మరచిపోతున్నా. రేపు తప్పక తెచ్చి ఇస్తాను అన్నాడు. రోజూ అలాగే, అలాగే అంటూ వెళ్ళడం. మరునాడు అలాగే మరచిపోయి రావడం.

ఒకనాడు, మిత్రమా! నీకు మరపు కాస్త ఎక్కువలా ఉంది. రోజూ ఇలాగే మరచి పోతున్నావు. రేపు నువ్వు మరచి పోకుండా నే నొక పని చేస్తాను అని చెప్పి, మిత్రుడి ఉత్తరీయం కొంగు చివర ఒక చిన్న రాయిని ఉంచి ముడి వేశాడు పుస్తకం ఇచ్చిన మనిషి. 'చాలా బాగుంది. ఇక నేను మరచిపోయే ప్రసక్తే లేదు' అని చెప్పి వెళ్ళాడు ఆ మతిమరపు మనిషి.

మరునాడు ఇంటి నుండి బయలుదేరుతూ ఉత్తరీయాన్ని భుజాన వేసుకున్నాడు. కొంగు చివర నున్న రాయి భుజానికి తగిలింది. వెంటనే భార్యను పిలిచి, నా ఉత్తరీయంలో రాయి కట్టింది నువ్వేనా? దేని కోసం? అని అడిగాడు. నేను కాదండీ! నిన్న మీరు మీ స్నేహితుడి ఇంటికి వెళ్ళారు కదా! బహుశ అతడే మైనా కట్టాడేమో! అన్నది అర్ధాంగి.

అయితే, కావచ్చు అనుకుంటూ తొందర తొందరగా మిత్రుడి ఇంటికి వచ్చి, మిత్రమా! నా ఉత్తరీయంలో రాయి కట్టింది నువ్వేనా? అని అడిగాడు. ఆ మిత్రుడికి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

ఇదే ఆచార్యుల వారు చెప్పింది. జ్ఞాపకానికి కారణాలు సుస్పష్టంగా ఉన్నా, ఏ మాత్రం జ్ఞాపకానికి నోచుకోక పోవడము స్మృతివిభ్రమ విలాసము. స్మృతి లేనపుడు ఇక బుద్ధి ఎక్కడ ఉంటుంది? అదే బుద్ధి నాశము అంటే.

బుద్ధి లేదు

స్మృతి ఎప్పుడైతే పోయిందో, ఏదీ జ్ఞాపకం ఉండదు. అంతా విస్మృతే. దాని వల్ల బుద్ధి నశించి పోతుంది. ఏది కార్యము? ఏది అకార్యము? అనే వివేకానికి బుద్ధి అయోగ్యమై పోతుంది. అదే బుద్ధినాశము ***(కార్యాకార్య విషయ వివేకా యోగ్యతా అంతఃకరణస్య బుద్ధేః నాశః ఉచ్యతే)*** అంటే.

బుద్ధినాశము అంటే బుద్ధి లేకుండా పోయిందని కాదు. 'బుద్ధి లేని మనిషి' అన్నప్పుడు ఆ మనిషికి బుద్ధి అసలే లేదు అని అర్థం కాదు. బుద్ధిని ప్రదర్శించడం వల్లే కదా బుద్ధి లేనివాడు అని అర్థమైంది? బుద్ధి లేదు అంటే, యోగ్యమైన బుద్ధి లేదు అని అర్థం. సద్బుద్ధి లేదు అని భావం. బుద్ధి మాత్రం ఉంటుంది. ఏం ప్రయోజనం? సద్బుద్ధిగా లేనిది ఏదో అది ఓనాడు దుర్బుద్ధిగా, దుష్టబుద్ధిగా మారుతుంది. ఇలా బుద్ధి నశించడం వల్ల, మనిషికి, పశువుకు మధ్య తేడా లేకుండా పోతుంది. కనుక మనిషే నశించి పోతాడు అంటే, పురుషార్థ ప్రాప్తికి యోగ్యతను కోల్పోతాడు అని అర్థం. దాని కన్నా మరణమే నయం ***(పురుషార్థ అయోగ్యః భవతి ఇత్యర్థః).***

సర్వ నాశం

ఇంకే ముంది? అంతా అయిపోయింది. సమస్త అనర్థాలకు విషయ ధ్యానమే మూలం అని తేలిపోయింది ***(సర్వ అనర్థస్య మూల ముక్తం విషయాభి ధ్యానమ్).***

విషయ ధ్యానము ఎలా అనర్థ దాయకమో ఇంతవరకు వివరించాడు. ఇక ఇప్పుడు మోక్షమును పొందే ఉపాయమును బోధిస్తున్నాడు. అర్జునుడు అడిగిన *ప్రజేత కిమ్?* అనే నాల్గవ ప్రశ్నకు సమాధానమే ఈ అరవై నాల్గవ శ్లోకము.

రాగద్వేష వియుక్తై స్తు విషయా నిన్ద్రియై శ్చరన్ । 64
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥

రాగద్వేషవియుక్తైః-తు-విషయాన్-ఇంద్రియైః-చరన్
ఆత్మవశ్యైః-విధేయాత్మా-ప్రసాదం-అధిగచ్ఛతి

రాగ	= రాగము చేత	విషయాన్	= విషయములను
ద్వేష	= ద్వేషము చేత	చరన్ తు	= అనుభవించుచున్నవా డైతే
వియుక్తైః	= విడువబడి	విధేయాత్మా	= స్వాధీనమైన మనస్సు కలవాడై
ఆత్మవశ్యైః	= తనకు వశమైన	ప్రసాదం	= చిత్త నైర్మల్యాన్ని
ఇంద్రియైః	= ఇంద్రియముల చేత	అధిగచ్ఛతి	= పొందుతాడు

రాగద్వేషాలు లేకుండా చూసుకోవాలి. ఇంద్రియాలను వశ పరచుకోవాలి. మనస్సును స్వాధీన పరచుకోవాలి. అలాంటి వాడు విషయాల మధ్య చరిస్తున్నా ప్రశాంతం గానే ఉంటాడు.

వ్యాఖ్య

మనస్సులో దుఃఖ కారణం లేకుండా జీవించ గలిగితే, అంతకు మించిన భాగ్యం మనిషికి మరొకటి ఉండదు. మనలో మనం హాయిగా తృప్తి చెంది జీవించడం కంటే ఉత్తమమైన సుఖాలు, సంపదలు ఈ ప్రపంచంలో లేవు.

ప్రజేత కిమ్? 'శబ్దాది విషయాలలో స్థితప్రజ్ఞుడు ఎలా చరిస్తాడు?' అని అర్జునుడు అడిగిన నాల్గవ ప్రశ్నకు సమాధానమే ఈ శ్లోకము. పూర్వ శ్లోకంలో విషయాసక్తితో, విషయ ధ్యానంలో బ్రతుకును పాడు చేసుకుంటున్న అముముక్షువు విషయం వివరించిన వాసుదేవుడు, ఈ శ్లోకంలో మనస్సును నియమించిన ముముక్షువు యొక్క ప్రశాంత జీవనాన్ని వివరిస్తున్నాడు.

సాధకుడు వివేకి అయినప్పటికీ, చక్కని ప్రయత్నము చేస్తున్న వాడై నప్పటికీ, క్షోభను కలిగించే ఇంద్రియాలు అతని మనస్సును ఎలా పాడు చేస్తున్నాయో అరవైయవ శ్లోకంలో స్పష్టం చేశాడు. ఇంద్రియాలను నియమిస్తేనే వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉంటుందని అరవై ఒకటవ శ్లోకంలో చెప్పాడు. ఇంద్రియాలను నిగ్రహించినా, మనస్సును నియమించకుండా విషయ ధ్యానం చేస్తూ పోతే వచ్చే ప్రమాదము ఏమిటో అరవై రెండు, అరవై మూడవ శ్లోకాలలో వివరించాడు. కాని, ఈ శ్లోకంలో విషయాన్ని మరొక మలుపు త్రిప్పుతూ, మనస్సును కనుక నిగ్రహించ గలిగితే, ఇంద్రియాలను విడిచి పెట్టినా వచ్చే ప్రమాదము ఏమీ ఉండదని నూతన చర్చకు తెర తీస్తూ ఉన్నాడు. ఇక్కడ ప్రసంగ విషయమే పూర్తిగా మారి పోయింది. విషయం అలా వేరు పడిందని చెప్పేందుకు శాస్త్రంలో **తు** అనే అవ్యయ పదమును వాడుతూ ఉంటారు.

విషయ చింతనము అనర్థదాయక మని గడచిన రెండు శ్లోకాలలో విన్నాం. అంటే విషయాలను స్మరించకుండా ఉండాలి అని అర్థం. మరి విషయాలను గూర్చి ఆలోచించకుండా, విషయ సంబంధమైన క్రియలు ఎలా నడుస్తాయి? ఒకవేళ నడిస్తే, అవి అనర్థ మనే కారణము యొక్క కార్యాలే కదా! కారణము

అనర్థ మైనపుడు కార్యాలు కూడా అనర్థాలే! మరి, అన్నపానాది కార్యాలు కూడా విషయ చింతనము అనే అనర్థ కారణము వల్ల ఏర్పడినవే కదా! అన్నపానాదులు లేకుండా జీవించే దెలా? అన్నపానాదులకు సంబంధించిన ఆలోచనలు కదలకుండా అన్నపానాదుల్ని స్వీకరించడం ఎలా జరుగుతుంది? శరీరయాత్ర ఎలా సాగుతుంది? ఈ విధమైన సందేహాలను నివారిస్తూ, ముముక్షువు రాగద్వేషాల నుండి విడిపడిన వాడై, వశ పడిన ఇంద్రియాలతో విహిత కర్మలను ఆచరిస్తూ, ప్రశాంతతను పొందుతున్నాడు అని బోధిస్తున్నాడు.

రాగద్వేషాలు

విషయాల యందు మనిషికి గల ఆసక్తియే రాగద్వేషాలకు కారణ మవుతూ ఉంది. ఇంద్రియ విషయాల లోని దోషాలను దర్శించడం చేత విషయాసక్తి అడుగంటి పోతుంది. విషయాసక్తి క్షీణించ గానే రాగద్వేషాలు అదృశ్య మవుతాయి. రాగద్వేషాలు నిర్వీర్యం కాగానే విషయాలు నిస్సార మవుతాయి, కర్మలు బంధ రహితంగా ఉంటాయి.

పాము వల్ల ఎవ్వరికీ హాని జరగదు. హాని జరిగింది అంటే, అది పాము కోరల లోని విషం వల్లనే. కోరల్ని తీసి వేస్తే పాము వల్ల ఏ అపాయము ఉండదు. రాగద్వేషాలు అనే కోరల్ని దూరం చేస్తే కర్మలు నిరపాయంగా ఉంటాయి.

రాగద్వేషాల నుండి విడిపడిన ముముక్షువు మనస్సును, ఇంద్రియాలను నియమించి ఉంటాడు కనుక, విషయాలలో చరించినా నిర్దోషం గానే ఉంటాడు. రాగద్వేషాల కోరల నుండి విడిపడిన మనస్సు నియమింప బడి ఉంటుంది కనుక **(విధేయాత్మా)** ఇంద్రియాలు మరొక మార్గం లేక మనస్సుకు వశపడి ఉంటాయి **(ఆత్మ వశ్యైః)**. ఇక్కడ ఆత్మ అంటే అంతఃకరణము అని అర్థము. కనుక ఇంద్రియాలు మనస్సుకు వశపడి ఉంటాయి అని అర్థం.

విషయ ధ్యానంలో ఉన్న లౌకికుడు ఏ ప్రపంచముతో సంబంధము పెట్టుకొని చరిస్తున్నాడో, ముముక్షువు కూడా అదే ప్రపంచంతో వ్యవహరిస్తున్నాడు. విషయ చింతనములో పడ్డవాడు రాగద్వేషముల చేత కలుషిత మైన మనస్సుతో విషయ ప్రపంచంలో చరించి పాడై పోతున్నాడు. రాగద్వేషముల నుండి విడిపడి, మనస్సును నియమించి, తనకు స్వాధీనములైన ఇంద్రియాల చేత అదే ప్రపంచంలో చరిస్తూ ముముక్షువు ప్రశాంతతను అనుభవిస్తున్నాడు. అతని శాంతి భగ్నం కావటం లేదు. దేహేంద్రియ మనస్సులు ప్రపంచంలో చరిస్తున్నా యోగయుక్తుడు స్థిరంగా ఉన్నాడు. అతని బుద్ధి పరినిష్ఠితమై ఉంది.

ధర్మాధర్మాలు

రాగద్వేషాలు ఎప్పుడైతే దూరమై పోయాయో **(రాగద్వేష వియుక్తైః)**. ఇక వివేక ప్రజ్ఞ కలవాడు ప్రపంచంలో చరించ డానికి ఆధార మేమిటి? అతనిలో కర్మకు కారణ మేమిటి? రాగద్వేషాలు తటస్థ పడ్డాయి కనుక, ఇక అతడిలో మిగిలి ఉన్నవి ధర్మాధర్మాలే. చేయదగింది ఏది, చేయ కూడనిది ఏది అనే విచక్షణతో, చేయవలసిన కార్యాలను ఫలాసక్తి లేకుండా, రాగద్వేషాల వలలో చిక్కకుండా తటస్థంగా ఆచరిస్తూ ఉంటాడు. అలాంటి వ్యక్తిని ఏ కర్మలూ బాధించ లేవు.

ధర్మాచరణములో సంగబుద్ధి లేకుండా ఎప్పుడైతే విషయాల మధ్య చరిస్తున్నాడో, అతడు ఎక్కడ చరించినా, ఎలా చరించినా ధర్మానికి దూరంగా పోడు. ధర్మము దైవానికి దూరంగా లేదు. ధర్మ రూపంలో ఉన్నది దైవమే. కనుక ప్రజ్ఞావంతుడు ఎక్కడ చరించినా, వాస్తవానికి పరమాత్మ స్పృహ తోనే ఉంటాడు.

సర్వథా వర్తమానోఽ పి స యోగీ మయి వర్తతే

అర్జునా! నా యందే మనస్సు నుంచిన యోగి ఏ విధంగా వ్యవహరిస్తూ ఉండినా, అతడు నా లోనే ఉంటాడు అని ముున్ముందు గీతలో భగవానుడే చెబుతాడు.

అంతటా, అన్ని విధాల పరమేశ్వర స్పృహతో జీవించే వాడు ప్రత్యేకంగా దేనిపై రాగాన్ని ఉంచుతాడు? దేనిని పని కట్టుకొని ద్వేషిస్తాడు?

విషయాలలో చరిస్తూ ఉండినా తామరాకు మీద నీటిబొట్టు లాగా అంటకుండా ఉంటాడు. అదే పనిగా తిరుగుతూ ఉండినా, ఏ మాలిన్యము అంటని గాలి లాగా పవిత్రుడై ఉంటాడు. ప్రసన్నంగా ఉంటాడు. ప్రశాంతంగా ఉంటాడు. ప్రసాద బుద్ధితో నిర్మలంగా ఉంటాడు ***(ప్రసాదం అధి గచ్ఛతి)***. ప్రసాదము అనేది పదార్థం కాదు. భక్తితో స్వీకరించే పదార్థమే ప్రసాదం. కాని, ఇక్కడ ప్రసాదం అంటే ప్రసన్నత. స్వస్థతతో జీవించడం ***(ప్రసాదః ప్రసన్నతా స్వాస్థ్యమ్)***.

మరి, ఈ ప్రసాదం యొక్క ఫల మేమిటి? ప్రసాదం ప్రాప్తిస్తే ఏం జరుగుతుంది? చెబుతున్నాడు.

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే।
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ 65

ప్రసాదే-సర్వదుఃఖానాం-హానిః-అస్య-ఉపజాయతే
ప్రసన్నచేతసః-హి-ఆశు-బుద్ధిః-పర్యవతిష్ఠతి

అస్య	= అట్టి వానికి	ప్రసన్న చేతసః	= నిర్మలమైన మనస్సు గల వానికి
ప్రసాదే	= చిత్త నైర్మల్యము వలన	ఆశు	= శీఘ్రముగ
సర్వదుఃఖానాం	= సమస్త దుఃఖముల యొక్క	బుద్ధిః	= బుద్ధి
హానిః	= వినాశము	పర్యవతిష్ఠతి హి	= స్థిరపడు చున్నది
ఉపజాయతే	= కలుగు చున్నది		

చిత్త ప్రసాదము లభించిన వానికి సమస్త దుఃఖాలు అంతరిస్తున్నాయి. నిర్మలమైన మనస్సు గల వాని బుద్ధి వెంటనే ప్రశాంతతను పొందుతుంది కదా!

వ్యాఖ్య

ఆలోచించ గలిగే మనస్సును అడగకుండానే భగవంతుడు మనకు ప్రసాదించాడు. భగవంతుడు అనుగ్రహించిన మనస్సుతో మనం ఆనందంగా జీవించడ మనేది మన ఆలోచనా విధానం మీద ఆధారపడి ఉంటుంది.

విశిష్టమైన అతిథిని మన ఇంటికి ఆహ్వానిస్తాం. అతడు అంగీకరిస్తే ఎంతగానో పొంగిపోతాం. ఇంటిని శుభ్రం చేసుకొని అలంకరించే కార్యంలో పూర్తిగా నిమగ్న మవుతాం. మరి ఆత్మారాముడు ప్రవేశించే ముందు మన బుద్ధిని ఎలా శుద్ధి చేసుకోవాలి? ఎంత పవిత్రంగా ఉంచుకోవాలి? అదే తపస్సు. అదే జ్ఞాన సాధన.

ధూళి ధూసరితమైన ఆసనంలో అతిథిని కూర్చోబెడతామా? కనుక ఆత్మారాముడు స్థితుడై ఉండాలంటే, మన అంతఃకరణ పరిశుద్ధమైన ఆలయంగా మారాలి. అందుకనే, **దేవో భూత్వా దేవం యజేత.** దేవుణ్ణి పూజించే ముందు నీవు దేవుడివి కావాలి అన్నది శాస్త్రం. అందుకే పూజకు ముందు స్నానం, తిలక ధారణం, శుద్ధ వస్త్ర ధారణం చేస్తాము. ముందు శుద్ధి, తరువాత సిద్ధి. సాధన సాధ్యాలు రెండూ బుద్ధి లోనే.

రాగద్వేషాల నుండి విడిపడి, ఇంద్రియ మనస్సులను వశ పరచుకొని, విషయాలలో చరిస్తూ ఉండినా, బుద్ధి ప్రసన్నం గానే ఉంటుంది అని గ్రహించాము. అలాంటి ప్రసాద బుద్ధియే వైకుంఠ ద్వారము. ఆ తరువాత వైకుంఠ ప్రవేశమే. విష్ణుదేవుని దర్శనమే.

దుఃఖము - శాంతి

ఆరోగ్యం ఉంది అంటే, అనారోగ్యం లేదు అని అర్థము. స్వస్థత ఉన్న చోట అస్వస్థత ఉండదు. అస్వస్థతకు కారణాలు అనేకం ఉండొచ్చు. స్వస్థతకు కారణం అవసరం లేదు. అది స్వభావం. అస్వస్థతకు గల కారణాలు తొలగిపోతే, అస్వస్థత ఉండదు. స్వస్థతే మిగుల్తుంది.

దుఃఖం ఉంది అంటే దుఃఖ కారణాలు ఉన్నాయి అని అర్థం. దుఃఖం మనందరి అనుభవంలో ఉంది. కాని, అందరి దుఃఖాలకు కారణాలు ఒకే విధంగా లేవు. కారణాలు భిన్నంగా ఉన్నా, దుఃఖం మాత్రం ఏకమే. దుఃఖము అందరిదీ ఒక్కటే. రాజు గారి దుఃఖము, సేవకుని దుఃఖము అని దుఃఖంలో విభజన లేదు. దుఃఖము ఎవరికి వచ్చినా, బుద్ధి బరు వెక్కుతుంది. గుండె భార మవుతుంది. మనసు మెలికలు తిరుగుతుంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. ఇదంతా దుఃఖానుభవం.

దుఃఖం అందరికీ ఒక్కటే. దుఃఖ కారణాలు మాత్రం వ్యక్తికి వ్యక్తికి భిన్నంగా ఉంటాయి. ప్రియ మైనది దూరమైతే ఎవరికైనా దుఃఖం కలుగుతుంది. ప్రియమైనది ఏది? అనే ప్రశ్న పడితే మళ్ళీ సమాధానం ఒకే విధంగా ఉండదు. ఎవరికి దేని మీద, లేదా ఎవరి మీద ఆసక్తి ఉంటే, అది వారికి ప్రియం అవుతుంది.

నాయకుడు దుఃఖిస్తాడు. యాచకుడు దుఃఖిస్తాడు. పసి బాలుడూ దుఃఖిస్తాడు. అందరి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. కారణాల లోకి వెళ్ళి, దుఃఖ హేతువు ఏమిటి? అని ఆ ముగ్గురిని ప్రశ్నిస్తే, పదవి చేజారి పోయింది అంటాడు నాయకుడు. అక్షయపాత్ర పోయింది అంటాడు యాచకుడు. ఆటబొమ్మ విరిగి పోయింది అంటాడు పిల్లవాడు.

ఎవరికి ఏది పోగొట్టు కోవడం వల్ల దుఃఖం కలిగిందో, వారికి అది తిరిగి లభిస్తేనే దుఃఖం పోతుంది. అంతేగాని, ఒకరి దుఃఖ కారణం తొలగడం వల్ల మరొకరి దుఃఖం దూరం కాదు. పదవి పోవడం వల్ల నాయకుడు దుఃఖిస్తున్నాడని, దుఃఖిస్తున్న బాలుడికి అదే పదవిని ఇస్తామని చెబితే, దుఃఖం పోదు సరిగదా, కాస్త పెరిగే అవకాశం కూడా ఉంది. అలాగే అక్షయపాత్రను కొనిపెడితే, యాచకుడికి దుఃఖం పోతుంది కాని, అదే అక్షయపాత్రను నాయకుడికి ఇస్తే దుఃఖం వెయ్యింత లవుతుంది.

ఎవరి దుఃఖ కారణాలు దూరమైతే, వారి దుఃఖం దూర మవుతుంది. దుఃఖం దూరం కాగానే ప్రశాంతత బుద్ధిలో చోటు చేసుకుంటుంది. ప్రశాంతత అందరికీ ఒక్కటే. దుఃఖం ఒక్కటే అయినా, దుఃఖ కారణాలు వేరుగా ఉన్నట్లు, ప్రశాంతత ఒక్కటే అయినా ప్రశాంతతకు కారణాలు వేరుగా ఉంటాయా? ఉండవు. ఎందుకని? ప్రశాంతత అనేది వ్యక్తి స్వభావం. అది అతని స్వరూపం. అశాంతికి కారణా లుంటాయి గాని, శాంతికి కారణాలు అవసరం లేదు. అశాంతికి గల కారణాలు అదృశ్య మైతే శాంతి పూర్ణమై భాసిస్తుంది. ఇది పూర్ణశాంతి. పరమాత్మ జ్ఞానం వల్ల ప్రాప్తించే పరమశాంతి.

దూరమైన దుఃఖం

స్థిరమైన ప్రజ్ఞ గలవాడు రాగద్వేషాలను తటస్థ పరచి ఉంటాడు కనుక అతనికి ఇష్టాయిష్టాలు ఉండవు. ఏదో పోవడం వల్ల దుఃఖం రాదు. ఏదో ఉండటం వల్ల సుఖం పోదు. విషయాసక్తి నశించడం వల్ల ఈ విధమైన రాగద్వేషాలు స్థితప్రజ్ఞుని బుద్ధిలో అదృశ్య మయ్యాయి. అతడు గతానికి వగచేది ఉండదు. అగతాన్ని వలచేది

ఉండదు. రాగద్వేషాలు ఈ విధంగా ఎవరిని చలింప చేయలేవో వారి బుద్ధి ప్రసన్నంగా ఉంటుంది. ఈ బుద్ధి ప్రసాదం కారణంగా సమస్త దుఃఖాలు నశించి పోతున్నాయి.

ఇది సాధ్యమేనా? ధన నష్టం జరిగితే దుఃఖం ఉండదా? ఉంటుంది. ఎవరికి? ధనం సుఖ కారణమని భ్రమించే వారికి, ధన నష్టం కారణంగా దుఃఖం కలుగుతుంది. ధనంపై ఆసక్తి లేని వారికి ధననష్టం దుఃఖాన్ని ఎలా కలిగిస్తుంది? ధనం మనకే కాదు, ఎందరికో ఉంది. మన కన్నా అధికంగా సంపదలున్న వారి ఐశ్వర్యాలే నిలవకుండా పోతున్నాయి. మనవి మాత్రం పోకుండా ఉంటాయా? ఎవరైనా, ఈ ప్రపంచం లోకి ధనంతో ప్రవేశించ లేదు. ఒంటరి గానే వచ్చారు. వచ్చిన తరువాతే ఈ ప్రపంచంలో వారి వద్దకు ధనం వచ్చి చేరింది. వచ్చింది ఏదైనా పోయేదే. పోవడం, ఉండటం అనేది అలా ప్రక్కన పెడితే, ఉన్న దాని మీద ఆసక్తి ఉన్నప్పుడే, ఆ ఉన్నది పోయి నపుడు బాధ కలుగుతూ ఉంటుంది. ఉన్నదాని మీద రాగం లేనపుడు, అది ఉండినా, పోయినా ఒరిగేది ఉండదు, తరిగేదీ ఉండదు. ధనాసక్తి లేని స్థితప్రజ్ఞుని బుద్ధిని, ధనం ఉండి సుఖపెట్టనూ లేదు. ధనం పోయి దుఃఖపెట్టనూ లేదు.

ధన నష్టమే కాదు, జన నష్టము కూడా అంతే. జనం సుఖ కారణం కాలేరు. అలాంటప్పుడు దుఃఖ కారణ మెలా అవుతారు? జీవులకు రాకపోకలు ఉంటాయి. వాటి ప్రభావం మాత్రం మననశీలునిపై ఉండదు.

పోయేవాళ్ళ కోసం ఏడ్చే ఉద్యోగం మన కెవరిచ్చారు? ఒకనాడు పోయేవాళ్ళే నేడు ప్రపంచంలో ఉన్నారు అనేది జ్ఞానం. చావు అనేది దుఃఖానికి కారణమా? అదే వాస్తవ మైతే, చచ్చిపోతున్న వాళ్ళందరి కోసం మనం ఏడవాలి. అలా ఎవ్వరూ ఏడవడం లేదు. కొందరు పోతేనే ఏడుస్తున్నారు. ఎందుకని? వాళ్ళు తమ వాళ్ళు కనుక. తమ కుటుంబీకులు కనుక. మరి, కుటుంబంలో చనిపోతున్న అందరి కొరకు ఒకే విధంగా ఏడుస్తున్నారా? పసివాళ్ళకు, ముసలివాళ్ళకు ఒకే స్వరమా? లేదు. మరి, ఈ భేదం ఎందుకు? మళ్ళీ సమాధానం మొదటికే వస్తుంది. రాగాసక్తియే ఇక్కడ ప్రధానం. పరమాత్మ దర్శనం చేత, ఈ రాగాసక్తి పూర్తిగా నశించింది కనుక *(శ్లోకం -59)* జన నష్టం కూడా ప్రజ్ఞావంతుని బుద్ధిని చలింప చేయలేదు. అంతే.

దుఃఖాలు ప్రపంచంలో ఉంటాయి. అలాగే దుఃఖ కారణాలు కూడా ఉంటాయి. కాని, అవేవీ స్థితప్రజ్ఞుని బుద్ధిని కదిలించ లేవు. అతనిలో దుఃఖాన్ని కలిగించ లేవు.

ప్రసాద బుద్ధి ప్రాప్తించడం చేత వివేక ప్రజ్ఞ గల మననశీలుని దుఃఖాలన్నీ నశించి పోతాయి ***(ప్రసాదేసర్వ దుఃఖానాం హానిః వినాశః అస్య యతేః ఉపజాయతే)***. ప్రసన్నత వల్ల దుఃఖాలు పోతాయా? ఈ విషయం ప్రామాణిక మేనా? దుఃఖ నివృత్తి ఇలా జరుగు తుందని శాస్త్రం అంగీకరిస్తుందా? దీనిని కాస్త సంక్షిప్తంగా విశ్లేషించుకుందాం.

సమస్త దుఃఖాలకు అధ్యాసే కారణం. కనుక అధ్యాస ***(అతస్మిన్ తద్బుద్ధిః - అది కాని దాని యందు అది అనే బుద్ధి)*** తొలగితేనే సమస్త దుఃఖాలు నశిస్తాయి. అధ్యాస తొలగాలి అంటే, దానికి కారణమైన అజ్ఞానం నివృత్తి కావాలి. మరి అజ్ఞానం ఎలా నివృత్తి అవుతుంది? జ్ఞానం వల్లనే అజ్ఞానం నశించాలి. ఇదీ క్రమం. జ్ఞాన మార్గంలో ఉండే కార్యక్రమం. మరి, జ్ఞానం వల్లనే సర్వ దుఃఖాలు నశిస్తాయి అని శాస్త్రం సాంప్రదాయకంగా, సహేతుకంగా బోధిస్తూ ఉంటే, దానికి భిన్నంగా, కేవలం బుద్ధి లోని ప్రశాంతత వల్లనే సర్వ దుఃఖాలు నశిస్తాయి అని గీతాచార్యుడు బోధించడం సశాస్త్రీయ మేనా? అదే వాస్తవ మైతే, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువును ఆశ్రయించి ఆత్మజ్ఞానాన్ని పొంద వలసిన అవసర మేమిటి? ఇలాంటి మీమాంస అనివార్యం.

నిజమే. కేవలం ప్రసన్నత ప్రాప్తించడం వల్లనే దుఃఖాలన్నీ దూరమై పోవు. దుఃఖాలు లేకుండా పోవడం

వేరు, దుఃఖాలు నశించడం వేరు. ప్రసాదబుద్ధి గల పవిత్రాత్మునిలో దుఃఖాలు లేవు అనేది వాస్తవమే. కాని, దుఃఖాలు సమూలంగా నశించడం అనేది ఆత్మజ్ఞానం వల్లనే జరుగుతుంది. కాకపోతే, ప్రసాద బుద్ధి కలిగిన ప్రజ్ఞావంతునికి జ్ఞానం ఎంతో దూరంలో లేదు అనేది వాస్తవం. ముందే నేను వివరించి నట్లుగా, ప్రసాద బుద్ధి వైకుంఠ ద్వార దర్శనం లాంటిది. ద్వార దర్శనమే దైవదర్శనం కాదు. కాని, ద్వార దర్శనం చేసుకున్న వ్యక్తికి దైవ దర్శనం ఎంతో దూరం లేదు. అందుకు ఎంతో సమయమూ పట్టదు. అందుచేతనే ప్రసన్న చిత్తము కలవారికి స్థిర జ్ఞానం ప్రాప్తించడం శీఘ్రం గానే **(ఆశు)** జరిగి పోతుంది అన్నాడు ఈ శ్లోకంలో గీతాచార్యుడు.

ప్రసన్న చేతస్కుడైన వాని బుద్ధి స్థిరంగా ఉంటుంది. ఆకాశం లాగా నిశ్చలంగా ఉంటుంది. ఆత్మ స్వరూపం లాగా అచలంగా ఉంటుంది అని అర్థం **(ఆకాశ మివ పరి సమన్తాత్, అవతిష్ఠతే ఆత్మస్వరూపేణైవ నిశ్చలీ భవతి ఇత్యర్థః)**.

వివేక ప్రజ్ఞ గల వాని ప్రసాద బుద్ధి ఆకాశం లాగా నిశ్చలంగా ఉంటుంది అని ఆచార్యుల వారి భాష్యం. ఈ సందర్భంలో ఇదొక అందమైన, అద్భుతమైన ఉపమానం.

పంచభూతాలలో చలనము లేనిది ఆకాశ మొక్కటే. వాయువు చలిస్తుంది. అగ్ని చలిస్తుంది. జలము చలిస్తుంది. భూమి అదే పనిగా తిరుగుతూ ఉంది. ఆకాశం మాత్రం అచలంగా ఉంది. అందుచేతనే ఆత్మను మరొక దానితో పోల్చవలసి వచ్చినప్పుడు, మరొక మార్గం లేక ఆకాశం తోనే పోలుస్తూ ఉంటాము. **ఆకాశవత్, వ్యోమవత్** అని చెబుతూ ఉంటాము. విష్ణుమూర్తిని *గగన సదృశం* అని కీర్తిస్తాము. పైగా, ఆకాశము ఆత్మస్వరూపానికి అతి సన్నిహితంగా ఉంది. పంచభూతాలలో ముందుగా ఆకాశమే వచ్చింది ***(తతః ఆకాశః సంభూతః)***. ఈ విధంగా స్థిరమైన ప్రజ్ఞ కలవాడు కృతకృత్యుడు అవుతాడు అన్నారు భాష్యంలో ఆచార్యులు కూడా **(ఏవం ప్రసన్న చేతసః అవస్థిత బుద్ధేః కృతకృత్యతా)**. అంటే, అంతటా బ్రహ్మమునే దర్శించే ప్రజ్ఞ ***(బుద్ధిః)*** ప్రతిష్ఠిత మవుతూ ఉంది ***(పర్యవతిష్ఠతి)*** అని అర్థం.

అంటే, ప్రసాదబుద్ధి వలన ఏర్పడిన నిర్మలత్వము, ఆత్మజ్ఞానము వలన ఏర్పడే నిర్మలత్వము వంటిదని అర్థము ('గగన సదృశం' లాగా). ఇంతవరకు దుఃఖాలు ఆశ్రయించిన అంతఃకరణమును ఇప్పుడు నిర్మల మైన ప్రసాదము ఆక్రమిస్తుంది. ఇక, శీఘ్రంగా ఆ బుద్ధిలో పవిత్రమైన జ్ఞానం ప్రవేశిస్తుంది. పతంజలి మహర్షి కూడా తమ యోగదర్శనంలో ఈ విషయాన్ని విస్పష్టం చేశాడు.

సూత్రము : సత్త్వ పురుషయోః శుద్ధి సామ్యే కైవల్య మితి ॥

'సత్త్వము' అంటే బుద్ధి. శుద్ధమైన బుద్ధి. ప్రశాంత మైన బుద్ధి. 'పురుషుడు' అంటే ఆత్మ. చైతన్య రూపుడు. వీరిద్దరికి శుద్ధిలో, అనగా నిర్మలత్వములో పోలిక ఉంది. సామ్యము ఉంది. ఈ సామ్యము స్థిరపడితే కైవల్యము సిద్ధించినట్లే అని 'యోగ దర్శనము' - విభూతి పాదము, యాభై ఐదవ సూత్రంలో యోగసూత్రకారుడు మహర్షి పతంజలి ప్రస్ఫుటం చేశాడు (సత్త్వ పురుషయోః =బుద్ధి పురుషుల యొక్క, శుద్ధి సామ్యే =శుద్ధి యందు సామ్యము కలుగ గానే, కైవల్యమ్ ఇతి = కైవల్యము సిద్ధిస్తుంది).

కనుక ఇట్టి స్థిరమైన ప్రశాంత ప్రజ్ఞను అభిలషించు వాడు రాగద్వేషాలను తటస్థ పరచాలి. మనస్సును సంయమనం చేసి, శాస్త్ర విహిత కర్మలను, ధర్మబద్ధంగా ఇంద్రియాలతో ఆచరిస్తూ, పారవశ్యం చెందకుండా ప్రవర్తిస్తూ ఉండాలి. అప్పుడే పవిత్రమైన ప్రసాద బుద్ధి ఏర్పడుతుంది. ఈ స్థితి స్థితప్రజ్ఞునిలో సహజంగా భూషణం లాగా ప్రకాశిస్తూ ఉంటుంది.

వివేక ప్రజ్ఞ గల యోగయుక్తుని వైభవాన్ని ఇంతవరకు వర్ణించిన గీతాచార్యుడు, ఇప్పుడు, అయుక్తుడు

వివేక ప్రజ్ఞ లేకుండా ఉంటాడు కనుక, అతనికి ప్రసాదబుద్ధి ఉండదు, శాంతి ఉండదు అని అంటున్నాడు ఈ విషయాన్నే రాబోయే అరవై ఆరు, అరవై ఏడు శ్లోకాలలో చెబుతున్నాడు. కాకపోతే, ఈ సందర్భంలో పూర్వోత్తర శ్లోకాలను కలిపే అవతారికలో శ్రీ శంకరాచార్య స్వామి, **సేయం ప్రసన్నతా స్తూయతే** - అంటే, ఈ ప్రసాద బుద్ధి స్తుతింపబడుతూ ఉంది అన్నారు. అప్రసన్నతను గర్హించడములో ప్రసన్నతను స్తుతించడం అంతర్వాహినిగా ఉండనే ఉంటుంది. ఎలాగో చూద్దాం!

నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చాభావయతః శాన్తి రశాన్తస్య కుతః సుఖమ్ ॥ 66

న-అస్తి-బుద్ధిః-అయుక్తస్య-న-చ-అయుక్తస్య-భావనా
న-చ-అభావయతః-శాంతిః-అశాంతస్య-కుతః-సుఖం

అయుక్తస్య	= యోగయుక్తుడు కాని వానికి	అభావయతః	= భావ శూన్యునకు
బుద్ధిః	= బుద్ధి	శాంతిః	= శాంతి
న అస్తి	= ఉండదు	న చ	= ఉండదు
అయుక్తస్య	= యోగయుక్తుడు కాని వానికి	అశాంతస్య	= శాంతి లేని వానికి
భావనా చ	= భావనయు	సుఖం	= సుఖము
న	= కలుగదు	కుతః	= ఎలా కలుగును?

నిగ్రహ యుక్తి లేని వానికి బుద్ధి ఉండదు. సంయమ శక్తి లేని వానికి ఆత్మనిష్ఠ ఉండదు. ఆత్మ భావన లేని వానికి శాంతి మిగలదు. శాంతి లేని వానికి సుఖము ఎలా కలుగుతుంది?

వ్యాఖ్య

వేడి నుండి విడిపడాలి అని నిప్పు ఎప్పుడూ భావించదు. కారణం, వేడి వల్ల నిప్పుకు ఎప్పుడూ బాధ లేదు. వేడిగా ఉండటం నిప్పు యొక్క స్వభావం. స్వభావము ఎప్పుడూ బాధించదు. శాంతికి దూరంగా పోవాలని ఏ వ్యక్తీ భావించడు. శాంతి వల్ల జీవికి ఎన్నడూ అస్వస్థత ఉండదు. శాంతి అనేది ప్రతి జీవి లక్షణం. స్వభావం. స్వరూపం. స్వభావ స్వరూపాలు ఎప్పుడూ బాధించవు.

నిప్పు వల్ల నీటికి బాధ ఉంది. అందుకే వేడి చేస్తే నీరు సలసల కాగుతుంది. వేడి నుండి విడిపడాలి అని నీరు భావిస్తుంది. అందుకే నీటిని కాచి ప్రక్కన పెట్టినా, కొంత సేపటికి వేడిని తొలగించుకొని నీరు చల్లబడుతుంది. అశాంతి నుండి విడి పడాలని ప్రతి వ్యక్తీ కోరుకుంటాడు. అశాంతి వల్ల జీవి అస్వస్థతను అనుభవిస్తాడు. అందుకే అశాంతి కలిగి నపుడు దానికి కారణాలను అన్వేషించి, వాటిని తొలగించుకొని తిరిగి శాంతిని పొందాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. శాంతి లేనివాడు సుఖం లేనివాడే.

సుఖపడాలి అంటే శాంతి ఉండాలి. శాంతి ఉండాలి అంటే, ఆత్మభావన ఉండాలి. ఆత్మభావన ఉండాలి అంటే, ప్రసన్న చిత్తము ఉండాలి. ప్రసన్న చిత్తము ఉండాలి అంటే ఇంద్రియ నిగ్రహము ఉండాలి.

ఈ శ్లోకంలో ప్రధానంగా నాలుగు కార్యాలు ఉన్నాయి. ఈ నాలుగు కార్యాలకు నాలుగు కారణాలు ఉన్నాయి. **కారణా భావే కార్యాభావః** 'కారణాన్ని తొలగిస్తే కార్యం మిగలదు' అనే న్యాయాన్ని అనుసరించి, ఒక్కొక్క అయుక్త కార్యానికి గల అయుక్త కారణాన్ని తొలగిస్తూ, చివరగా నిత్య సుఖానికి, నిత్య శాంతికి మార్గాన్ని సుగమం చేస్తున్నాడు.

ప్రసాద బుద్ధి

'అయుక్తుడు' అంటే ప్రసాద బుద్ధి లేనివాడు. సమాహిత చిత్తము లేనివాడు. అట్టి వానికి ఆత్మ విషయానికి సంబంధించిన బుద్ధి ఉండదు (**నాస్తి బుద్ధిః అయుక్తస్య**). ఆత్మను తెలుసుకొనుటకు అనువైన అంతఃకరణమే 'ఆత్మబుద్ధి'.

ఆత్మబుద్ధి లేదు అంటే ఇంద్రియ నిగ్రహము, చిత్త సంయమనము లేవు అని అర్థము. అలాంటి అంతఃకరణము ఆత్మ చింతనకు పనికి రాదు. స్వచ్ఛమైన, నిస్తరంగంగా ఉండే జలము లోనే ప్రతిబింబము గోచరిస్తుంది. జలచరాల వల్ల గాని, క్రొత్తగా వచ్చి పడే జలాల వల్ల గాని, నీరు కదలిక చలిస్తూ ఉంటే, ప్రతిబింబము గోచరించదు. ఒకవేళ కనిపించినా, గుర్తు పట్టలేని విధంగా ఛిన్నాభిన్నమై ఉంటుంది. ఇక బురద నీరు, బుడగల నీరు అయితే చెప్ప నవసరం లేదు. ప్రతిబింబము కనిపించే అవకాశమే ఉండదు.

విషయాసక్తి గల మనస్సు బురద నీరు వంటిది. సంయమనం లేని చిత్తము అలంతో చలించే జలము వంటిది. సమాహిత చిత్తము నిర్మల జలము వంటిది. నిస్తరంగ జలము వంటిది. అలాంటి సమాహిత చిత్తమే ఆత్మ చైతన్యమును ప్రస్ఫుటంగా ప్రతిఫలింప చేస్తుంది. ఆ సమాహిత చిత్తమే ప్రసాద బుద్ధి. అయుక్తునకు ఇది లభించదు (**నాస్తి న విద్యతే. బుద్ధిః ఆత్మ స్వరూప విషయా, అయుక్తస్య అసమాహిత అంతఃకరణస్య**).

ఆత్మ భావన

ఆత్మభావన అంటే, ఆత్మజ్ఞానము యొక్క విషయంలో అభినివేశం. అంటే, పట్టుదల. ప్రసాద బుద్ధి లేని అయోగ్యునికి, లేదా అయుక్తునికి ఆత్మజ్ఞానం విషయంలో పట్టుదల ఉండదు. అంటే, విషయ ధ్యానం ఉంది అని అర్థం. విషయ ధ్యానం సాగుతూ ఉంది అంటే రాగద్వేషాలు పుష్కలంగా ఉన్నాయి అని అర్థం. అలాంటి వాని బుద్ధి దృశ్యముల వైపు పరుగులు తీస్తుందే గాని, ద్రష్ట వైపు తిరగదు.

ఆత్మభావన లేని వ్యక్తిలో విషయ వాంఛానివృత్తి జరగదు. రాగద్వేషాలతో నిండి పోయిన మనస్సుతో ఏకమై పోయిన వ్యక్తికి ఆత్మభావన ఎలా ఉంటుంది? వాంఛా నివృత్తి చేసుకోవాలి అని ఎందుకు అనిపిస్తుంది? తనకు ఆత్మ భావన ఏర్పడక పోవడమే గాక, మరెవరైనా హితోపదేశం చేసినా క్రోధం కలుగుతుందే గాని, వాంఛా నివృత్తికై ప్రయత్నం సాగదు.

ఒకే కుర్చీలో ఇద్దరు వ్యక్తులు కూర్చోలేరు. ఒకరు లేచిన తరువాతే మరొకరు కూర్చోగలరు. విషయాసక్తిని ఆశ్రయించిన బుద్ధిలో ఆత్మభావన ఉండదు. ఆత్మభావన ఉండాలి అంటే ప్రసాద బుద్ధి ఏర్పడి ఉండాలి. ప్రసాద బుద్ధి ఉండాలి అంటే విషయాసక్తి లేకుండా ఉండాలి. కనుక, అయుక్తు డైన వానికి ఆత్మభావన ఉండదు (**న చ అస్తి అయుక్తస్య భావనా ఆత్మజ్ఞానాభినివేశః**).

శాంతి జీవనం

ఆత్మానందమును పొందాలి అని భావిస్తున్న వ్యక్తి చిత్తము నిర్మలంగా ఉండాలి. ప్రశాంతంగా ఉండాలి. అలాంటి మనస్సే ఆత్మభావన చేయ గలుగుతుంది. ఆత్మభావన లేని వానికి శాంతి ఉండదు (**న చ అస్తి అభావయతః శాన్తిః**).

అయుక్తుడైన వాడు ఆత్మభావన చేయ లేడు. అశుద్ధమైన బుద్ధికి ఆత్మచింతన అలవడదు. ఇక అభినివేశం, అంటే పట్టుదల ఎలా వస్తుంది? శ్రవణ మననాదులు అట్టి వాని బుద్ధిలో జరగవు. అది బుద్ధి కాదు. సంశయాల పుట్ట. అందుచేత ఆత్మభావన సాగదు. ఉపశమము ఉండదు (**న చ అస్తి అభావయతః ఆత్మజ్ఞాన అభినివేశమ్ అకుర్వతః శాన్తిః ఉపశమః**).

సుఖప్రాప్తి

ఇక్కడ సుఖము అంటే నిత్యసుఖము అని అర్థం. నిరతిశయ సుఖము అని భావం. అదే ఆత్మసుఖం. ఉపశమం లేని వానికి, అంటే శాంతి లేని వానికి నిరతిశయ సుఖం ఎలా కలుగుతుంది? (*అశాంతస్య కుతః సుఖమ్*).

చిత్త సంయమనం ద్వారా విషయాల నుండి ఇంద్రియాలను మరల్చడం వల్ల ఏర్పడే ఆంతరంగిక సుఖమే ఇక్కడ కేంద్ర విషయము. అంతేగాని విషయ తృష్ణ వల్ల ఏర్పడే సుఖం కానే కాదు (*న విషయ విషయా తృష్ణా*). అలాంటి సుఖం వాస్తవానికి దుఃఖమే (*దుఃఖ మేవ హి సా*) అని శ్రీ శంకర భాష్యము.

అలాంటి విషయ తృష్ణ ఎంత వరకు ఉంటుందో, అంతవరకు జీవికి సుఖం లభించదు. చిత్తము ఉపశమిస్తేనే సుఖం ప్రాప్తిస్తుంది. అందుకనే, శాంతి లేని వానికి సుఖ మెలా కలుగుతుంది? అని ప్రశ్నించాడు గీతాచార్యుడు.

అయుక్తుడైన వానికి ఎందుకని ఆత్మబుద్ధి ఉండదు? అంటే, దానికి సమాధానమే తరువాత శ్లోకం.

ఇన్ద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివామ్భసి ॥ 67

ఇంద్రియాణాం-హి-చరతాం-యత్-మనః-అను-విధీయతే
తత్-అస్య-హరతి-ప్రజ్ఞాం-వాయుః-నావం-ఇవ-అంభసి

చరతాం	= చరించుచున్న	ప్రజ్ఞాం	= బుద్ధిని
ఇంద్రియాణాం	= ఇంద్రియములకు	అంభసి	= నీటి యందు
యత్ మనః	= ఏ మనస్సు	నావం	= ఓడను
అనువిధీయతే	= అనుసరించి ప్రవర్తిస్తున్నదో	వాయుః ఇవ	= గాలి వలె
తత్	= అట్టి మనస్సు	హరతి హి	= హరిస్తున్నది గదా!
అస్య	= ఈ మనుజుని యొక్క		

ఇంద్రియాలు ఇంద్రియ విషయాల వైపు పరుగు లెత్తుతూ ఉంటే, వాటి వెంటబడి తిరిగే మనస్సు మానవుని వివేకాన్ని హరించి వేస్తుంది. ఎలాగో తెలుసా? నీటిలో పయనించే నావను గాలి పెడదారి పట్టించినట్లు.

వ్యాఖ్య

ఈ జీవితం లోని అనుభవాలు, ఈ జన్మ లోనివే కాకుండా గత జన్మల లోనివి కూడా, ఎన్నో, ఎన్నెన్నో కలసి మనల్ని ఈనాటి జీవన స్థితికి నెట్టాయి. ఏ బాధకు ఏది ప్రధాన కారణమో తెలియక పోయినా, కారణం లేకుండా మాత్రం ఏ కార్యము జరగదని మనకు తెలుసు.

బాధలతో బ్రతుకును ఈడ్చుకుంటూ పోవడము ఎవ్వరికీ ఇష్టం ఉండదు. కాని, బాధల నుండి విడి పడటం కూడా ఎవ్వరికీ సాధ్యం కావడం లేదు. అందుకే ప్రతి ఒక్కరికీ బ్రతుకు బాధలమయం అనిపిస్తూ ఉంటుంది.

అవసరం లేని వాటిని మనస్సు నుండి తొలగిస్తేనే ఈశ్వర జ్ఞానం మనస్సులో నిలుస్తుంది. మనస్సు నిండా ప్రపంచాన్ని నింపుకొని, ఆత్మజ్ఞానం కావాలి, ఈశ్వర ధ్యానం సాగాలి అంటే అది సాధ్యపడే విషయం కాదు.

ఏ విషయంలో ఎవరికి ఆసక్తి ఉందో, ఏ విషయంలో ఎవరికి అనురక్తి ఉందో తెలియదు గాని, వారి విషయంలో వారికి ఆసక్తి ఉండి తీరాలి. మనల్ని మనమే పట్టించుకోక పోతే, మనల్ని పట్టించుకో వలసిన అవసరం ఎవరికి ఉంటుంది? మన విషయంలో మనమే జాగ్రత్త పడాలి. మనకు హాని చేయడంలో మనను మించిన వారు ఎవరో ఉంటా రనేది అవాస్తవం. ఇంతవరకు జన్మాదిగా మనల్ని మనమే హాని చేసుకుంటూ వచ్చాము. కాబట్టి మనల్ని మనమే బాగు చేసుకోవాలి. మనల్ని మనం హాని చేసుకో కూడదు. మనల్ని హాని చేసే అవకాశాన్ని మరొకరికి ఇవ్వ కూడదు. ఆ విషయంలో ఇంద్రియ మనస్సులు కూడా మినహాయింపు కావు.

బాహ్య దృష్టితో విధించి విశ్వరచన చేశాడు. అందువల్ల సృష్టిలో అన్నీ బాహ్య వ్యాపారాలే కనిపిస్తాయి. చెట్లు ప్రాణవాయువును విడుస్తూ ఉంటాయి. సాగరజలాలు ఆవిరిగా పైకి పైకి మేఘాల్ని తయారు చేస్తూ ఉంటాయి. భూమి లోపల విత్తనాన్ని నాటినా, అది భూమిని చీల్చుకొని బాహ్యానికి దూసుకొస్తుంది. అన్నీ బాహ్యం లోకి పరుగులు పెట్టేవే. ఈ విషయంలో ఇంద్రియాలు ప్రత్యేకం కావు. మనస్సు విశేషం కాదు.

చలించే లక్షణం గల ఇంద్రియాలు నిచ్చలం విడిగా బాహ్య ప్రపంచంలో చరిస్తూ ఉంటాయి. అది వాటి స్వభావం. ఇంద్రియాలు తమ తమ విషయాలలో చరిస్తూ ఉంటాయి. ప్రవర్తిస్తూ ఉంటాయి (*ఇంద్రియాణాం చరతాం స్వస్వ విషయేషు ప్రవర్తమానానాం*). అవి అలా చరిస్తూ ఉంటే, మనస్సు వాటిని అనుసరించి ప్రవర్తిస్తూ ఉంటుంది (*మనః అను విధీయతే, అను ప్రవర్తతే*).

ఇంద్రియాలు ఇంద్రియ విషయాల వైపు పరుగులు తీస్తే వచ్చే నష్టమేమీ లేదు. ఇంద్రియాలు విషయాలతో సంయోగం చెందకుండా ఉండ లేవు. కన్ను ఇంద్రియము. రూపము, లేదా రంగు ఇంద్రియ విషయము. కన్ను పని చేస్తూ ఉంది అంటే, రూపాలు కనిపించకుండా ఎలా ఉంటాయి? చెవి ఉంది కనుక శబ్దం వినిపిస్తుంది. దానిని ఎవరు ఆపగలరు? విషయాలు ఉంటే నష్టం లేదు. ఇంద్రియాలు వాటితో ఏకమైనా వచ్చే నష్ట మేమీ ఉండదు. మనస్సు వెళ్ళి ఇంద్రియాలతో ఏకమై నప్పుడే సమస్యలు తలెత్తు తున్నాయి.

కనిపించే ప్రతి వస్తువును కళ్ళు చూస్తాయి. కళ్ళు చూచే వస్తువు లన్నీ మనస్సుకు అవసరం లేదు. మనస్సుకు ఏది అవసరమో దానినే మనస్సు కోరుకుంటుంది. శబ్దాలైనా, వాసనలైనా, రుచులైనా, స్పర్శ లైనా ఏవైనా అంతే. ఇలా ఇంద్రియాలు విషయాలలో వ్యవహరిస్తూ ఉంటే, ఏ మనస్సైతే వాటిని అనుసరించి తిరుగుతూ ఉంటుందో, ఆ మనస్సు యోగయుక్తుని బుద్ధిని హరిస్తుంది (*తత్ అస్య ప్రజ్ఞాం హరతి*).

ఇక్కడ ప్రజ్ఞ అంటే 'ఆత్మానాత్మ వివేకము వలన కలిగిన జ్ఞానము' అని అర్థం (*ఆత్మానాత్మ వివేక జాం*). అట్టి జ్ఞానాన్ని మనస్సు హరిస్తుంది. నశింప చేస్తుంది (*నాశయతి*). ఆత్మానాత్మ వివేకము నశించడం వల్ల ఇంద్రియ మనస్సులు విషయ సుఖాల వెంట బడి పరుగులు తీస్తాయి. జీవిని వెతలలో పడదోస్తాయి.

తే॥ జ్ఞాన విజ్ఞాన యుతుఁడయ్యు సంతతంబు
నాత్మ భావన లేకున్న యతని యిన్ద్రి
యంబులు మనంబు తమకు వశంబుఁ జేసి
విషయ సుఖముల చవిఁజూపి వెతలఁ బెట్టు

అని సీతారామాంజనేయ సంవాదము.

ఇంద్రియాల వెంట బడి విషయాల వైపు పరుగులు పెట్టే మనస్సు యోగయుక్తుని ఆత్మానాత్మ వివేక జ్ఞానాన్ని హరిస్తుంది అన్నాడు గీతాచార్యుడు. అది ఎలా? (*కథం?*). నీటి లోని పడవను గాలి ఎలాగో అలాగ అంటున్నాడు (*వాయుః నావమ్ ఇవ, అంభసి ఉదకే*).

నీటిలో ప్రయాణం చేసే వాళ్ళు ఓడలలో పయనిస్తూ ఉంటారు. ఓడలు వారు చేరాలనుకున్న గమ్యము వైపు ఒక నిర్దిష్టమైన మార్గంలో నడుస్తూ ఉంటాయి. ఈ లోగా పెనుగాలి వీస్తుంది. అలా వీచిన గాలి ఓడను పెడత్రోవ పట్టిస్తుంది. మరొక దిశకు లాక్కొని పోతుంది. సుడిలో పడదోసినా ఆశ్చర్యం లేదు.

అలాగే, యోగయుక్తుని ప్రజ్ఞ ఆత్మ వైపు సాగిపోతూ ఉంటే, మనస్సు పెనుగాలి లాగా అతని ప్రజ్ఞను దారి మళ్ళించి, విషయాల వైపు త్రిప్పుతుంది. విషయ సుడిగుండంలో పడ దోస్తుంది.

కనుక మనస్సు బుద్ధితో చేరి ఆత్మప్రాప్తి కొరకు యత్నించాలే గాని, ఇంద్రియాలతో చేరి విషయ సుఖాల వైపు పరుగు పెట్ట కూడదు.

రాగద్వేషాలను తటస్థ పరచి, ఇంద్రియాలను నిగ్రహించడమే స్థిరమైన ప్రజ్ఞకు హేతువు అని బోధిస్తూ, ఇంద్రియ నిగ్రహ ప్రకరణాన్ని తరువాత శ్లోకంలో సమాప్తి చేస్తున్నాడు.

తస్మా ద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇన్ద్రియా ణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

తస్మాత్-యస్య-మహాబాహో-నిగృహీతాని-సర్వశః
ఇంద్రియాణి-ఇంద్రియార్థేభ్యః-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

మహాబాహో	= అర్జునా!	ఇంద్రియాణి	= ఇంద్రియములు
తస్మాత్	= అందువలన	నిగృహీతాని	= నిగ్రహింప బడినవో
ఇంద్రియార్థేభ్యః	= ఇంద్రియ విషయముల నుండి	తస్య	= వాని యొక్క
సర్వశః	= అన్ని విధముల	ప్రజ్ఞా	= బుద్ధి
యస్య	= ఎవని యొక్క	ప్రతిష్ఠితా	= స్థిరమై ఉంది

అర్జునా! కాబట్టి, ఇంద్రియాలు ఇంద్రియ విషయాల నుండి అన్ని విధాలా నిగ్రహింప బడాలి. అలాంటి వాని జ్ఞానమే సుస్థిరంగా ఉంటుంది.

వ్యాఖ్య

నిగ్రహమే నిర్ణయం

మనస్సు నిరంతరం చలిస్తూ ఉంటుంది. మనస్సు చలించ డానికి, చరించ డానికి దారులు రెండే ఉన్నాయి. మనస్సు ఇంద్రియాల ద్వారా అధోముఖంగా పయనించి, ఇంద్రియ విషయాలలో రమిస్తూ, అనిత్యమైన సంసారాన్ని తయారు చేసుకోవచ్చు. లేదా, బుద్ధి ద్వారా ఊర్ధ్వంగా పయనించి ఆత్మానందాన్ని పొందవచ్చు. మనస్సు అధోముఖంగా నడక సాగిస్తే కలిగే దుర్గతిని, ఊర్ధ్వంగా పయనిస్తే ప్రాప్తించే సద్గతిని తెలియ చేసిన తరువాత, ***తస్మాత్*** - అందుచేత, బుద్ధి ద్వారా ఆత్మప్రాప్తి కొరకే యత్నించ మని, దానికి ఇంద్రియాలను నిగ్రహించడమే ప్రధానమైన సాధన మని తెలియ చేస్తూ, ఈ శ్లోకంతో ఇంద్రియనిగ్రహ ప్రకరణాన్ని సమాప్తి చేస్తున్నాడు భగవంతుడు.

వివేకవంతుడు శుద్ధ మనస్సును తయారు చేసుకోవాలి. ఇంద్రియాలు మనస్సుకు లోబడి చరించాలి. శుద్ధ బుద్ధి సూచించినట్లు విహిత కర్మల యందే ఇంద్రియాలు చరిస్తూ ఉండాలి. విషయాల లోకి వెళ్ళమని మనస్సు ఆజ్ఞాపించి నపుడే ఇంద్రియాలు ముందుకు సాగాలి. తిరిగి రమ్మని చెప్పగానే తల వంచి తిరిగి వచ్చే లాగా ఉండాలి.

బండిని గుఱ్ఱాలు లాగుతూ ఉంటాయి. కళ్ళెము మాత్రం సారథి చేతి లోనే ఉంటుంది. కళ్ళెముల యొక్క పట్టు విడుపులను బట్టి గుఱ్ఱాలు పరుగెత్తుతూ ఉండాలి. కళ్ళెమును గట్టిగా పట్టి లాగ గానే గుఱ్ఱాలు ఆగి పోవాలి. ఆగిపోతాయి కూడా.

బ్రతుకు బండిని ఐదు గుఱ్ఱాలు లాగుతూ ఉంటాయి. మనస్సు కళ్ళెము, బుద్ధి సారథి. బుద్ధి అనే సారథి ఆజ్ఞలను పాటిస్తూ మనస్సు అనే కళ్ళెము, ఇంద్రియములు అనే గుఱ్ఱములు ప్రవర్తిస్తూ ఉండాలి. అప్పుడే గమ్యము సుగమ మవుతుంది.

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహ ఏవ చ
ఇంద్రియాణి హయా నాహుః విషయాం స్తేషు గోచరాన్

ఆత్మ రథము యొక్క యజమాని. శరీరమే రథము. బుద్ధియే సారథి. మనస్సు కళ్ళెము. ఇంద్రియాలే గుఱ్ఱములు. ఇంద్రియ విషయాలే మార్గములు అని అద్భుతంగా ప్రవచించింది కఠోపనిషత్తు.

ఇంద్రియాలు ఇంద్రియ విషయాల నుండి అన్ని విధాల నిగ్రహింప బడాలి (***ఇంద్రియాణి సర్వశః ఇంద్రియార్థేభ్యః నిగృహీతాని***). ఏదో ఒక్క ఇంద్రియాన్ని మాత్రం నిగ్రహిస్తే సరిపోదు. సర్వేంద్రియములు నిగ్రహింప బడాలి. అది కూడా సంపూర్ణంగా నిగ్రహింప బడాలి. త్రికరణ శుద్ధిగా నియమింప బడాలి (***సర్వశః సర్వ ప్రకారైః మానసాది భేదైః***). ఒక వైపు విషయాలు ప్రేరేపిస్తున్నా, ఇంద్రియాలు నిగ్రహంలో ఉండాలి. మనస్సు సంయమనంతో ఉండాలి.

మనస్సును నిగ్రహించే ప్రయత్నం చేయడమే కాదు, అది చక్కగా నిగ్రహింప బడిందో లేదో వీక్షిస్తూ ఉండాలి. సాధారణంగా అందరూ గమ్యాన్ని చేరాలి అనే కోరుకుంటారు గాని, మార్గాన్ని విస్మరిస్తూ ఉంటారు. మార్గాన్ని బట్టే గమ్యం ఉంటుంది. మార్గం విషయంలో శ్రద్ధ వహించే వారు గమ్యాన్ని తప్పక చేరుతారు.

స్థిత ప్రజ్ఞత్వం కావాలి అని అందరూ ఆశిస్తారు. మనస్సు ఏ వైపు పోతుందో పట్టించుకోరు. ప్రేయో మార్గంలో చరించే బుద్ధికి వివేక ప్రజ్ఞ కుదరదు. శ్రేయో మార్గంలో చరించే బుద్ధికే స్థిరత్వం ఉంటుంది. మన మనస్సు ఎటు నడుస్తూ ఉందో అనుక్షణం గమనిస్తూ ఉండాలి. అట్టివారే స్థితప్రజ్ఞులై శోభిస్తారు.

కోరుకొమ్మంటివి రెండు వరాలు నన్ను
కోరుకొంటిని చేతులు రెండు కలిపి
ఒకటి జగతి మరపు వేరొకటి శివుని వలపు
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

నీలకంఠ శతకంలో ఇదొక విబూది పండు.

ఈ శ్లోకంలో అర్జునుణ్ణి **మహాబాహో!** అని సంబోధించాడు పరమేశ్వరుడు. అంటే గొప్ప బాహువులు కలవాడా! అని అర్థం. గొప్ప శక్తిసామర్థ్యాలు కలవాడు అని భావం. తన బాహుబలం చేత సమర రంగంలో శత్రువులను తుద ముట్టించగల సామర్థ్యం కలవాడు సవ్యసాచి. శత్రువులను నిలువరించి గొప్ప బాహువులు కలవాడు అనే ఖ్యాతిని సాధించినట్లే, ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును నియమించి, మహా బుద్ధిమంతుడు, స్థితప్రజ్ఞుడు అనే యశస్సును కూడా సాధించ మని ప్రోత్సహించడమే **మహాబాహో!** అనే సంబోధన లోని అంతర్భావం.

స్థితప్రజ్ఞ వైభవాన్ని యాభై ఐదవ శ్లోకం నుండి ప్రవచించడం ప్రారంభించిన పార్థసారథి, యాభై ఎనిమిదవ

శ్లోకంలో ఈ ఇంద్రియ నిగ్రహ ప్రకరణాన్ని ప్రారంభించి, అరవై ఎనిమిదవ శ్లోకంలో సమాప్తి చేశాడు. యాభై ఎనిమిదవ శ్లోకం లోని రెండవ పాదము, అలాగే అరవై ఎనిమిదవ శ్లోకం లోని రెండవ పాదము అక్షరం కూడా మార్పు లేకుండా ఒకే విధంగా ఉన్నాయి. **ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా** అంటూ నిగ్రహ ప్రకరణాన్ని ఆద్యంతాలలో ఒకే విధంగా పలికి, ఇంద్రియ నిగ్రహము యొక్క ఆవశ్యకతను నొక్కి వక్కాణించాడు భగవంతుడు.

తరువాత శ్లోకం నుండి విషయం మరొక మలుపు తిరుగుతూ ఉంది. స్థితప్రజ్ఞుని వైభవాన్ని తరువాత మూడు శ్లోకాలలో వివరిస్తున్నాడు గీతాచార్యుడు

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69

యా-నిశా-సర్వభూతానాం-తస్యాం-జాగర్తి-సంయమీ
యస్యాం-జాగ్రతి-భూతాని-సా-నిశా-పశ్యతః-మునేః

సర్వభూతానాం	= సమస్త ప్రాణులకు	భూతాని	= భూతములు
యా	= ఏది	జాగ్రతి	= మేల్కొని ఉంటాయో
నిశా	= రాత్రియో	సా	= అది
తస్యాం	= దాని యందు	పశ్యతః	= పరమార్థ తత్త్వాన్ని చూస్తున్న
సంయమీ	= యోగి	మునేః	= మునికి
జాగర్తి	= మేల్కొని ఉంటాడు	నిశా	= రాత్రి
యస్యాం	= దేని యందు		

ఏది సర్వ ప్రాణులకు రాత్రియో, దాని యందు జితేంద్రియుడైన యోగి మేల్కొని ఉంటాడు. దేని యందు సర్వ ప్రాణులు మేల్కొని ఉంటాయో అది పరమార్థమును వీక్షిస్తున్న మునికి రాత్రి.

వ్యాఖ్య

జ్ఞానం వల్ల మోక్షం వస్తుందా? అదే వాస్తవ మైతే, మోక్షానికి నిమిత్తం ఉంది అని చెప్పవలసి వస్తుంది. అప్పుడు మోక్షంలో ప్రాప్తించేది నిరతి శయానందము కాకుండా పోతుంది. మోక్షం కూడా నైమిత్తిక సుఖంగా మిగిలి పోతుంది. జ్ఞానం వల్ల మోక్షము వచ్చేట ట్లయితే, జ్ఞానం లేక ముందు మోక్షం లేనిదే అవుతుంది. అలాంటిది ఎలాంటి మోక్షమో తెలియదు గాని, నిత్యమోక్షం మాత్రం కాలేదు. ఒకప్పుడు లేకుండా మరొకప్పుడు కలిగేది ఏదయినా కాల పరిధి లోకే వస్తుంది. కాలపరిధిలో ఉన్నది ఏదీ నిత్యం కాదు.

మోక్షం సదా ఉన్నదే. జ్ఞానం వల్ల మోక్షం కలుగుతుంది అనేది వాస్తవం కాదు. మోక్షమే జ్ఞానరూపంలో ఉంది అనేది సత్యం. జ్ఞానం వల్ల అజ్ఞానం తొలగుతుంది. అంతే. మోక్షము అనేది దేని యొక్క ఫలమూ కాదు. అది కేవలం స్వరూప వైభవము. సత్య జ్ఞానానంద స్థితి. ఈ స్థితిలో దివ్యంగా ప్రకాశించే వాడే స్థితప్రజ్ఞుడు. ఆత్మవిదుడైన స్థితప్రజ్ఞుని వైభవాన్ని అద్భుతంగా వర్ణిస్తూ ఉంది ప్రస్తుత శ్లోకం.

ఇది ఆలంకారిక భాషలో చెప్పబడిన గ్రంథి శ్లోకం. 'గ్రంథి' అంటే సంస్కృతములో ముడి అని ఒక అర్థం. దారం ముడి పడుతుంది. ఒకొక్కసారి చిక్కుముడి పడుతుంది. దానిని జాగ్రత్తగా విప్పాలి. లేదా, మొదటికే మోసం వచ్చి, మరీ బిగుసుకు పోతుంది. శాస్త్రంలో అక్కడక్కడ ఇలాంటి గ్రంథి శ్లోకాలు అగుపిస్తూ

ఉంటాయి. వాటిని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే దివ్యమైన మణులు లభ్య మవుతాయి. తొందరపడి అస్తవ్యస్తంగా అర్థం చేసుకుంటే, విషయం మరీ జటిల మవుతుంది.

సమస్త ప్రాణులకు ఏది రాత్రి సమయమో అది స్థితప్రజ్ఞునికి పగలు. సర్వ ప్రాణులకు ఏది పగలో అది జ్ఞానికి రాత్రి. ఇది శ్లోకం యొక్క భావం.

ఇలాంటి శ్లోకాల విషయంలో కేవలం అక్షరార్థం, వాక్యార్థం గ్రహిస్తే సరిపోదు. లక్ష్యార్థాన్ని గ్రహించాలి. ఏ అంతర్భావం ఇందులో ఇమిడి ఉందో, దాగి ఉందో దానిని సశాస్త్రీయంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి.

కేవలం వాక్యార్థాన్ని గ్రహిస్తే మాత్రం అంతా అయోమయంగా ఉంటుంది. అందరూ నిద్రపోయే రాత్రి సమయాన జ్ఞాని మేల్కొని ఉంటాడు అని చెబితే, ఆ తరువాత రాత్రి పూట కాపలా కాచే వాళ్ళు, రాత్రి ఉద్యోగాలు చేసే వాళ్ళు, దొంగలు అందరూ అదృష్టవశాత్తు జ్ఞానులై కూర్చుంటారు.

దివారాత్రములు

రాత్రి పూట చీకటి దట్టంగా అలుముకొని ఉంటుంది. తదేకంగా చూసినా చీకటిలో ఏదీ కనిపించదు. ఏది ఏమిటో అర్థం కాదు. పగటి పూట వెలుగు ఉంటుంది కనుక చూస్తే కనిపిస్తుంది. ఈ సందర్భంలో, అందరికీ ఏది రాత్రి సమయమో, అది సంయమ శీలుడైన స్థితప్రజ్ఞునికి పగలు అంటున్నాడు. అంటే, అందరూ ఎక్కడైతే చూడలేని స్థితిలో ఉన్నారో, అక్కడ స్థితప్రజ్ఞుడు చూస్తున్నాడు అని అర్థము. అలాగే ఏది సర్వులకు పగలో, అది జ్ఞానికి రాత్రి అంటున్నాడు. అంటే, అందరూ చూసే దానిని జ్ఞాని చూడలేక పోతున్నాడు అని అర్థం.

లౌకికులకు ప్రపంచం సత్యము. జ్ఞానికి పరమాత్మ సత్యము. ప్రపంచము ప్రపంచముగా సామాన్యులకు గోచరిస్తుంది. ప్రపంచము పరమాత్మగా యతివరేణ్యునికి అగుపిస్తుంది. అందరూ చూసేది ఆత్మవిదునికి అగుపించదు. ఆత్మజ్ఞాని చూచే దానిని సర్వులూ వీక్షించ లేరు. ఏది అతనికి వెలుగో, అది అన్యులకు చీకటి. ఏది సర్వులకు ప్రకాశమో, అది జ్ఞానికి తిమిరము.

ఇంద్రియ విషయానుభవములో సామాన్యులు సదా మేల్కొని ఉంటారు. అక్కడ జ్ఞాని నిద్రించిన వాడే. ఆత్మానందములో జ్ఞాని రమిస్తూ ఉంటాడు. అక్కడ లౌకికులు నిద్రించిన వారే.

వ్యావహారిక ప్రపంచములో లౌకికులు మేల్కొని ఉంటారు. అక్కడ ముని నిద్రిస్తూ ఉంటాడు. అంటే, ఎరుక లేకుండా ఉంటాడు. పారమార్థిక స్ఫురణలో స్థితప్రజ్ఞుడు శోభిస్తూ ఉంటాడు (**పరమార్థ తత్త్వం స్థితప్రజ్ఞస్య విషయః**). అక్కడ సామాన్యులు నిద్రిస్తూ ఉంటారు.

ఆనందానుభూతి

స్థితప్రజ్ఞుని వైభవాన్ని వర్ణించడం ప్రారంభిస్తూ, స్థితప్రజ్ఞుని లక్షణాన్ని (**కా భాషా ?**) వివరించే యాభై ఐదవ శ్లోకంలో, మనస్సు లోని కోరికలను సంపూర్ణంగా విడిచిపెట్టి, తన ఆత్మ యందే ఆత్మానందమును పొందువాడు స్థితప్రజ్ఞుడు అని నిర్వచించడం జరిగింది.

కోరికల్ని పట్టుకొని వ్రేలాడే వారు సాధారణ మానవులు. అది వారికి పగలు. సమస్త కోరికల్ని త్యజించిన యతికి కోరికల స్పృహ లేనందున అది అతనికి రాత్రి.

ఆత్మ యందు ఆత్మానందమును అనుభవించే వాడు జ్ఞాని. కనుక, అది అతనికి పగలు. ఆత్మానందము అనేది ఒకటి ఉందని కూడా తెలియని సామాన్యులకు ఆ స్థితి చీకటి కాలమే. రాత్రి సమయమే.

సామాన్యుల సుఖం అనిత్యం. స్థితప్రజ్ఞుని ఆనందం నిత్యం. సామాన్యుల సుఖానికి కారణాలు ఉన్నాయి. అందుచేత వారు అనుభవించేది నైమిత్తిక సుఖం. స్థితప్రజ్ఞుని ఆనందం మరొక నిమిత్తం ద్వారా ప్రాప్తించింది కాదు. అందుచేత అతడు అనుభవించేది నిర్నిమిత్త సుఖం.

ఈ విధంగా విద్యావిద్యల తారతమ్యం తెలుస్తూ ఉంది. జ్ఞానాజ్ఞానాల వ్యత్యాసం అర్థమవుతూ ఉంది. జ్ఞానికీ అజ్ఞానికీ భేదం అనేది వ్యవహారంలో కనిపించేది కాదు. భావంలో ప్రస్ఫుట మయ్యేది. ఇదొక ఆశ్చర్యకర మైన విషయం. కాకి గూబల అనుభవం లాగా విచిత్ర మైనది.

కాకోలూక నిశేవాఽయం సంసారోఽజ్ఞాత్మ వేదినోః

వివేకము గల జ్ఞానుల, అవివేకము గల అజ్ఞానుల యొక్క ఈ సంసారము కాకి గూబల రాత్రి వంటిది అన్నది శాస్త్రము.

రాత్రి చీకటి గల కాకికి ఏది పగలో, పగలు చీకటి గల గూబకు అది రాత్రి. రాత్రి యందు చూపు గల గూబకు ఏది పగలో, పగలు చూపు గల కాకికి అది రాత్రి. వ్యాఖ్యను కూడా గ్రంథి వాక్యాలలో చెప్పుకొని ఆనందించాలని ఇలా వ్రాశాను. అంతే.

భానుని వెలుగు గువ్వకు పిలుపు
తెలియని గూబకు దివి నలుపు
బ్రహ్మమయము విశ్వము సర్వము
తెలియని వానికి భ్రమమయము
గలగల పారును నదిలో జలము
గతుకుట మానదు శునకము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని ఒక రామయోగి చిట్కా.

అజ్ఞానులైన వారికి పరమార్థ తత్త్వం రాత్రి లాంటి రాత్రి (*అజ్ఞానినాం సర్వ భూతానాం నిశా ఇవ నిశా పరమార్థ తత్త్వమ్*). అవిద్యా నిద్ర నుండి మేల్కొన్న సంయమి, జితేంద్రియుడు అయిన యోగి, పరమార్థ తత్త్వ రూపమైన దాని యందు మేల్కొని యున్నాడు (*తస్యాం పరమార్థ తత్త్వ లక్షణాయాం అజ్ఞాన నిద్రాయాః ప్రబుద్ధః సంయమీ జితేంద్రియః యోగీ ఇత్యర్థః*) అని ఆచార్యుల వారి భాష్యము.

జ్ఞానోదయం

జ్ఞాని అద్వైతానుభూతిలో శోభిస్తున్నాడు. ద్వైతము అనేది అతనికి రాత్రి. అవిద్యావస్థలో ఉన్న వారికి ద్వైత ప్రపంచము సత్యమే అనిపించ వచ్చు. కారణం, గ్రాహ్య గ్రాహక సంబంధం ఉండటమే. 'గ్రాహ్యము' అంటే గ్రహించ బడునది. 'గ్రాహకము' అంటే గ్రహించునది.

ఈ విధమైన గ్రాహ్య గ్రాహకములు స్వప్నంలో కూడా ఉన్నాయి కదా! స్వప్నము అవిద్యా రూపమే కదా! అలాగే, గ్రాహ్య గ్రాహక సంబంధం ఉన్న జాగ్రదవస్థ కూడా అవిద్యా రూపమే కనుక జ్ఞానికి జాగ్రత్ప్రపంచం కూడా రాత్రి వంటిదే.

జ్ఞాతృ - జ్ఞాన - జ్ఞేయములు అనే త్రిపుటి స్వప్నంలో తెలుస్తూ ఉండినా, నిద్ర నుండి మేలుకోగానే అ మూడూ లేనివే అవుతున్నాయి. కనుక జ్ఞానికి ద్వైతమే రాత్రి. అద్వైతమే పగలు.

మరి, ప్రమాణమైన శాస్త్రం విషయం ఏమిటి? వేదము ప్రమాణము. సత్యము వేరు, ప్రమాణము వేరు. గ్రాహ్య గ్రాహకములు ఎలా తెలుస్తున్నాయో, అలాగే వేదము యొక్క పూర్వార్థ మంతా కూడా ఈ గ్రాహ్య గ్రాహకముల తోనే నిండి ఉంది. కర్మ ప్రవృత్తే గోచరిస్తూ ఉంది. సాధ్య సాధనాలను గూర్చి ప్రసంగిస్తూ వేదము కూడా కర్మను ప్రబోధ చేస్తూనే ఉంది. ఇదంతా రాత్రి లాంటి అవిద్య అని తెలుసుకున్న జ్ఞాని కర్మల నుండి విడివడు తున్నాడు. ఆత్మజ్ఞానం కలిగే వరకే ప్రమాణము యొక్క ప్రమాణత్వం ఉంటుంది. ఆత్మజ్ఞానం కలిగిన తరువాత, తానే అద్వితీయాత్మగా ప్రకాశిస్తూ ఉన్నందున, ప్రమాణ ప్రమేయాలకు అవకాశం ఎక్కడుంది? తెలిసేది, తెలియబడేది అనే ద్వైతానికి అవకాశ మెక్కడుంది?

తెలియదగినది ప్రమేయము. తెలుసుకొనే వాడు ప్రమాత. ప్రమేయం ఉంటేనే ప్రమాత ఉంటాడు. ప్రమేయం ఉండటం వల్ల ప్రమాతకు ప్రమాతృత్వం ఉంటుంది. ప్రమాతే ప్రమేయము అనే అద్వయ జ్ఞానం కలిగి నప్పుడు, అంతవరకు ఉన్న ప్రమాతృత్వం కూడా తొలగిపోతూ ఉంది. అంత్య ప్రమాణమైన శాస్త్రం ఆత్మ యొక్క ప్రమాతృత్వాన్ని కూడా నివర్తింప చేస్తుంది. ఎప్పుడైతే, ప్రమాతృత్వాన్ని నివర్తింప చేస్తుందో, అప్పుడు స్వప్నం లోని ప్రమాణాలు మేలుకున్న తరువాత అప్రమాణ మైనట్లు, ప్రమాణమైన శాస్త్రం కూడా ఈ అఖండానంద స్థితిలో అప్రమాణ మవుతుంది (*నివర్తయదేవ చ అప్రమాణీ భవతి స్వప్న కాల ప్రమాణ మివ ప్రబోధే*). ఇదే జ్ఞాని వైభవము. ఆత్మజ్ఞాన వైభవము. ఈ వైభవమే గలవాడు స్థితప్రజ్ఞుడు. దీనికి భిన్నంగా ఇంద్రియ విషయాలను వెంబడించి చరించువాడు హతప్రజ్ఞుడు, లేదా గతప్రజ్ఞుడు.

ఉత్పన్న శక్తిబోధస్య త్యక్త నిశ్శేష కర్మణః
యోగినః సహజావస్థా స్వయ మేవ ప్రకాశతే ॥

జ్ఞానశక్తిని పొందిన వాడు, కర్మలను సంపూర్ణంగా త్యజించిన వాడు అయిన యోగికి సమాధి స్థితి స్వయంగా, సహజంగా కలుగుతూ ఉంది అన్నది ఉపనిషత్తు.

విషయాసక్తిని విడిచి, రాగద్వేషాలను తటస్థ పరచి, స్థితప్రజ్ఞుడైన మహాత్మునికి మాత్రమే మోక్షం ప్రాప్తిస్తుంది గాని, విషయాలను కోరే వాడికి కాదు అనే సత్యాన్ని సోదాహరణంగా ప్రతిపాదిస్తున్నాడు.

ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠం సముద్ర మాపః ప్రవిశన్తి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే స శాన్తి మాప్నోతి న కామకామీ ॥ 70

ఆపూర్యమాణం-అచల-ప్రతిష్ఠం-సముద్రం-ఆపః-ప్రవిశంతి-యద్వత్
తద్వత్-కామాః-యం-ప్రవిశంతి-సర్వే-సః-శాంతిం-ఆప్నోతి-న-కామకామీ

ఆపూర్యమాణం	=	నింపబడుతూ ఉన్నా	సర్వే	=	అన్నియును
అచలప్రతిష్ఠం	=	మార్పు లేని స్థితి గల	యం	=	ఎవనిని
సముద్రం	=	సముద్రమును	ప్రవిశంతి	=	చేరుతున్నాయో
యద్వత్	=	ఏ విధముగ	సః	=	అతడు
ఆపః	=	జలములు	శాంతిం	=	శాంతిని
ప్రవిశంతి	=	ప్రవేశిస్తాయో	ఆప్నోతి	=	పొందుతాడు
తద్వత్	=	ఆ విధంగా	కామకామీ	=	కామములు కోరేవాడు
కామాః	=	కామములు	న	=	పొందడు

ఎంతగా నిండుతున్నా, హద్దు మీరకుండా స్థిరంగా ఉండే సముద్రములో నదీ జలాలు ప్రవేశిస్తూనే ఉంటాయి.

అలాగే సమస్తమైన భోగ్య విషయాలు ఏ వికారాన్ని కలిగించకుండా ఎవనిలో ప్రవేశిస్తున్నాయో, అతడే శాంతిని పొందుతాడు. కోరికలు కోరేవాడు పొంద లేడు.

వ్యాఖ్య

అందరూ పూర్ణత్వాన్ని వాంఛిస్తారు. పూర్ణత్వము అనేది లేనిదే అయితే దానిని పొందాలి అనే ఆశ ఎలా ఉదయిస్తుంది? పూర్ణత్వము అనేది ఉన్నదే అయితే, ఉన్న పూర్ణంలో నువ్వు వేరుగా ఎలా ఉండ గలవు? పూర్ణము ఉంది. ఏదైనా ఉన్నది అంటే, దానికి సంబంధించిన జ్ఞానము కూడా ఉంటుంది. పూర్ణము ఉంది కనుక పూర్ణానికి సంబంధించిన జ్ఞానము కూడా ఉండాలి. ఆ జ్ఞానము కలిగితే పూర్ణము ఏమిటో తెలుస్తుంది. ఏమని తెలుస్తుంది? నీ కన్నా వేరుగా పూర్ణము అనేది ఒకటి ఉంది అని కాదు, నీవే పూర్ణమని. శూన్యము తెలియని పూర్ణమని. కోరిక కదలని పూర్ణమని. కొరత తెలియని పూర్ణమని.

వ్యవహారంలో కూడా పూర్ణం అనే పదాన్ని మనం వాడుతూ ఉంటాము. చెరువు పూర్ణంగా నిండింది అంటాము. కడుపు పూర్ణంగా నిండింది అంటాము. కాని, కాల వ్యవధిలో చెరువు పూర్ణంగా లేదని తెలుస్తుంది. కొన్ని గంటల తరువాత మళ్ళీ కడుపు ఖాళీగా ఉంది అని అర్థ మవుతుంది. కనుక ఇవన్నీ పూర్ణాలే అయినా, కారే అవకాశాన్ని, మారే అవసరాన్ని త్రోసి పుచ్చలేవు. ఆ మామిడిపండు రసపూర్ణంగా ఉంది అంటాము. అంటే, అందులో పూర్ణంగా రసమే ఉందా? తొక్క, పిక్క లేవా? ఇలాగే ఉంటాయి వ్యవహారంలో పూర్ణాలు. తొలగించేవి, తగిలించేవి లేకుండా స్వతః పూర్ణంగా ఉండే జ్ఞానమే పూర్ణజ్ఞానము. అదే ఆత్మజ్ఞానము. బ్రహ్మజ్ఞానము. స్థితప్రజ్ఞుని నిశ్చలమైన జ్ఞానము.

స్వతః పూర్ణః పరాత్మా బ్రహ్మ శబ్దేన వర్ణితః

స్వయంగా పూర్ణ రూపమైన పరమాత్మ స్వరూపమే బ్రహ్మ శబ్దము చేత వర్ణింప బడింది అన్నది వేదాంతము. ఈ పూర్ణాత్మలో వెలుగే గాని వెలితి తెలియదు. ఇది పెరిగేది కాదు. తరిగేది కాదు. సాగర సదృశ మైనది.

అచల ప్రతిష్ఠం

నదులు సముద్రం లోకి ప్రవేశిస్తూ ఉంటాయి. ఇలా కొన్ని వేల సంవత్సరాలుగా నదీ జలాలు వాటంతట అవే తోసుకొంటూ వచ్చి సముద్రంలో పడుతున్నాయి. నదులను తనలో ప్రవేశించ మని సముద్రం కోరినట్లు ఎక్కడా దాఖలాలు లేవు.

నదీజలాలు అదే పనిగా వచ్చి పడుతున్నా, మేఘ జలాలు నిలిచి కురుస్తున్నా, అన్ని వైపుల నుండి జలాలు సముద్రాన్ని నింపుతున్నా (*ఆపూర్యమాణమ్ అబ్ధిః*), జలాలన్నీ సాగరంలో లయిస్తున్నాయే గాని సాగరం యొక్క నీటి మట్టము పెరగడం లేదు. అలాగే తరగడమూ లేదు. సముద్రము సదా పూర్ణం గానే ఉంటుంది. తన పూర్ణత్వానికి మరొక దానిపై ఆధార పడటం లేదు. నదుల వలె ఒక చోట నుండి మరొక చోటికి చలించడం లేదు (*అచలమ్*). అంతే కాదు, జలాలు ఎన్ని వచ్చి పడినా తన హద్దును దాటడం లేదు. స్థిరంగా ఉంది (*ప్రతిష్ఠమ్*).

స్థితప్రజ్ఞుడు కూడా సాగర సదృశంగా శోభిస్తున్నాడు. తాను పూర్ణుడై ఉన్నాడు. తన పూర్ణత్వము మరొక దానిపై ఆధారపడి లేదు. జలాలు వచ్చి సాగరంలో పడుతున్నట్లు, సమస్త విషయాలు (*సర్వే కామాః*) అన్ని వైపుల నుండి వచ్చి ఆ పూర్ణ పురుషునిలో ప్రవేశిస్తూ ఉన్నాయి (*ప్రవిశన్తి*). సాగరంలో ప్రవేశించిన జలాలు సాగర రూపాన్ని పొందినట్లు, బ్రహ్మజ్ఞానిలో ప్రవేశిస్తున్న విషయాలు ఆ దివ్య స్వరూపునిలో విలీనమై పోతున్నాయి.

పొంగుట తెలియని, క్రుంగుట అర్థం గాని పూర్ణ సాగర సదృశుడు స్థితప్రజ్ఞుడు.

నీళ్ళు సముద్రం లోనే కాదు, బావుల్లో, నదుల్లో, చెరువుల్లో కూడా ఉన్నాయి. బావినీరు వర్షపు జలం మీద, భూగర్భ జలాల మీద ఆధారపడి ఉంది. వర్షం పడకపోయినా, భూగర్భ జలాల మట్టం తగ్గినా, బావి ఎండిపోతుంది.

వర్షాల వల్ల, వాగులు, కాలువలు వచ్చి కలవడం వల్ల నదులు పొంగి ప్రవహిస్తాయి. వాగులు ప్రవహించడం ఆగిపోయినా, వర్షాలు పడకపోయినా నదులు ఇంకి పోవడం చూస్తూ ఉంటాము.

నదీజలాలు, వాగులు, వంకలు వచ్చి కలవడం చేత, వర్షపు నీరు వచ్చి పడటం చేత చెరువులు నిండుతాయి. గ్రీష్మంలో జలం ఆవిరై నీటి మట్టం తగ్గిపోతూ ఉంటుంది.

ఈ విధమైన పొంగుక్రుంగులు సముద్రంలో చూడలేము. సామాన్య జను లందరూ బావులు, చెరువులు, నదుల లాంటి బుద్ధులు కలిగి ఉంటారు. వారి బుద్ధులు స్థిరంగా ఉండవు. పొంగుతూ క్రుంగుతూ ఉంటాయి. వారి సుఖశాంతులు విషయాలపై ఆధారపడి ఉంటాయి. అలా ఆధారపడి జీవించే వాళ్లే కామ కాము లంటున్నాడు గీతాచార్యుడు.

కామములు అంటే ఇక్కడ కోరబడేవి అని అర్థము. అంటే ఇంద్రియ విషయాలు అని అర్థం. వాటిని కోరేవాడు కామకామి. సాగర సదృశంగా ఎవని వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉంటుందో, అట్టి స్థితప్రజ్ఞుడు శాంతిని పొందుతాడు (*సః శాంతిం ఆప్నోతి*). విషయాలను వాంఛించే వాడు శాంతిని పొందలేడు (*న కామ కామీ*).

తనలో వచ్చిపడే జలరాశు లన్నీ తన కన్నా అన్యమైనవి కావని తెలుసు కనుక సాగరము పూర్ణంగా ఉంటుంది. తనను చేరే విషయాలన్నీ తన కన్నా అన్యమైనవి కావని స్థితప్రజ్ఞునికి తెలుసు కనుక అతడూ పూర్ణ రూపుడై శోభిస్తాడు. తాను కోరేవి తన కన్నా అన్యమైనవి అని భావించడం చేత కామి పూర్ణత్వం అర్థం కానివాడై ఉంటాడు.

అవికార్య స్వరూపం

సాగరాన్ని చేరే నదీ జలాలు నానా వర్ణ రసగంధ భేద విశేషాలతో నిండి ఉంటాయి. గంగాజలము తెల్లగా ఉంటుంది. కృష్ణాజలము నల్లగా ఉంటుంది. ఈ విధంగా సాగరంలో వచ్చి పడే జలరాశులు, శుక్ల నీల రక్త పీతాది వర్ణ విశేషాలతో కనిపిస్తూ ఉంటాయి. ఇవన్నీ వచ్చి సాగరాన్ని కలసి తమ విశేషాలను పోగొట్టుకొని విలీనమై పోతాయి. సముద్రం మాత్రం ఈ విశేషాలు ఏవీ లేకుండా సహజం గానే శోభిస్తూ ఉంటుంది.

నదీ జలాలలో వర్ణ భేదమే కాకుండా రసభేదం కూడా ఉంటుంది. కొన్ని నదీ జలాలు తియ్యగా ఉంటాయి. మరి కొన్ని ఉప్ప గాను, వగరు గాను ఉంటాయి. మధురామ్ల తిక్త కషాయాది రస విశేషాలతో ఉంటాయి. అంతేకాదు, పరిమళ దుర్గంధాది వాసనా విశేషాలు కూడా ఉంటాయి. కొన్ని జలాలు పలుచగా ఉంటే, మరి కొన్ని చిక్కగా ఉంటాయి. ఈ విధమైన లఘుత్వాది గుణ విశేషాలతో కూడా ఉంటాయి. సాగరంలో ప్రవేశించిన తరువాత ఇవన్నీ అదృశ్యమై పోతాయి. సాగరంలో మచ్చుకైనా కనిపించవు. తనలో వచ్చి పడుతున్న జలాల విశేషాలను తనలో ప్రదర్శించ కుండా సాగరం సహజంగా, గంభీరంగా శోభిస్తూ ఉంటుంది.

స్థితప్రజ్ఞుని బుద్ధి కూడా సాగరం లాగా నిశ్చలంగా, అవికార్యంగా భాసిస్తూ ఉంటుంది. అనేక భోగ్య విషయాలు పూర్ణ పురుషునిలో ప్రవేశిస్తూ ఉంటాయి. సూపా పూప రస అన్నాదులు స్వీకరింప బడుతూ ఉంటాయి. సూపా పూప రసాన్నాదులు అంటే, పప్పు, పిండివంటలు, రసము, అన్నము మొదలైనవి అని అర్థము. ఇవన్నీ ప్రారబ్ధ ఫలంగా, అప్రార్థితంగా జ్ఞానికి అందుతూ ఉంటాయి. నామ, రూప, రస, పరిమళ, పాక సంస్కారాది

విశేషాలతో అందుతూ ఉంటాయి. అయినా సాగర సదృశమైన ఆ దివ్యాత్ముని బుద్ధిలో ఏ విధమైన వికారము గోచరించదు. అది చలించ కుండా స్థిరంగా ఉంటుంది *(స్థితధీః అచల ప్రతిష్ఠమ్)*.

కామి (కోరేవాడు) భోగ్య విషయాలలో వికారం చెందుతూ ఉంటాడు. విషయాలలో రాగ రమ్యాది విశేషాలను చూస్తూ, అహంకార మమకారాలను రంగరించుకొని, నేను భోక్తను అనే అభినివేశంతో భేద దృష్టిని కలిగి, బద్ధుడై ఉంటాడు. అందుచేత అశాంతితో అలమటిస్తూ మనుగడను సాగిస్తూ ఉంటాడు.

జలరాశులు వచ్చి పడుతున్నా, తనలో ఏ విధమైన మార్పు లేకుండా, గంభీరంగా, ప్రశాంతంగా, పూర్ణంగా శోభిస్తూ ఉంటుంది సాగరము. అలాగే, భోగ్య విషయాలు ఎన్ని వచ్చి తన బుద్ధిలో ప్రవేశిస్తూ ఉండినా, ఏ మాత్రం చలనం లేకుండా, ఏ విధమైన వికారం చెందకుండా, పూర్ణ శోభతో, శాంతరూపుడై ప్రకాశిస్తూ ఉంటాడు స్థితప్రజ్ఞుడు. ఈ విధమైన పూర్ణశోభ భోగ్య విషయాలను కోరే కామికి లభించదు.

సముద్రం తన పూర్ణత్వానికి వచ్చిపడే జలాలపై ఆధారపడి లేదు. జ్ఞాని తన పూర్ణానందానికి విషయాలపై ఆధారపడి లేడు. తనలో ప్రవేశించే జలరాశిని సముద్రం నిరోధించడం లేదు. తనను చేరే విషయాలను స్థితప్రజ్ఞుడు నిరాకరించడం లేదు. ***అహం అకర్తా - అహం అభోక్తా*** అనే భావన తోనే ప్రపంచంలో చరిస్తూ ఉంటాడు. పుణ్య పాపాలకు అతీతుడు. శుభాశుభాలకు విలక్షణుడు. అసంగ రూపుడు. ఆనంద స్వరూపుడు.

స్థితప్రజ్ఞుని వైభవ మంతా అతని బుద్ధి లోనే ఉంది. అది ఆంతరంగిక సౌందర్యము. జ్ఞాని దేహం ఇలా ఉండాలి అనే నియమ మేమీ లేదు. అష్ట వక్రాలు ఉన్నా మహర్షి ప్రజ్ఞ స్థితమే గాని గతం కాదు. జ్ఞాని వైభవము దేహ సంబంధ మైంది కాదు. జ్ఞానం కలిగింది కదా అని అరవై వయస్సు గల దేహం ఇరవై లోకి జారి పోయేదీ ఉండదు. జ్ఞానము అనేది ఇంద్రియ సంబంధ మైనది కాదు. ఒక అంధుడికి జ్ఞానం కలిగితే, దాని ప్రభావం వల్ల దేహానికి ఉన్న అంధత్వం పోదు. బుద్ధి లోని అజ్ఞానం పోతుంది. అంతే. ప్రజ్ఞ మార్పు చెందదు. మార్పును వాంఛించదు. అందుకే ఆ ప్రజ్ఞ స్థితం. స్థితప్రజ్ఞ. స్థితప్రజ్ఞ కలవాడు స్థితప్రజ్ఞుడు. అతడే జీవన్ముక్తుడు.

యస్య స్థితా భవేత్ప్రజ్ఞా యస్యానందో నిరంతరః
ప్రపంచో విస్మృత ప్రాయః స జీవన్ముక్త ఇష్యతే ॥

ఎవరి ప్రజ్ఞ స్థిరంగా నిలిచి ఉంటుందో *(స్థితప్రజ్ఞః)*, ఎవరి ఆనందము నిరంతరం ప్రవాహ రూపంలో ఉంటుందో, ఎవరికి ప్రపంచం స్మృతిలో ఉండదో అతడే జీవన్ముక్తుడు అన్నారు 'వివేక చూడామణి' గ్రంథంలో శ్రీ శంకరాచార్యస్వామి.

ఈ అద్భుత అద్వైత జ్ఞాన ప్రసాదాన్ని సర్వులకూ వితరణ చేయా లనే గీతామాత ఐదు వేల సంవత్సరాలుగా ఈ ప్రపంచంలో నిలిచి ఉంది. సర్వులూ స్థితప్రజ్ఞులు కావాలి అనేదే భగవద్గీత ఏకైక ఆశయము. అందుకొనే వారు ధన్యులు *(తేధన్యాః)*.

పల్లవి :**కడలి అలల వోలె మనసాయే**
అంబర మంతాయె నా హృదయం ॥ కడలి ॥

చరణములు : **1. కవుల ఊహలు పాపల నవ్వులు**
హరివిల్లు రంగులు నను చేరే
కోకిల రవములు కుసుమ బాలలు
కదిలించే మదిని స్పృశియించే ॥ కడలి ॥

2 తలుపులు లేని నీ గుడిలో
నీ రాకను ఆపే వారెవరు?
తలపులు ఆగిన నా హృదిలో
తడబడతా వేమి రావేమి? ॥ కడలి ॥

అంటూ ఆత్మానంద సాగరంలో లేచిన ఒక చైతన్య తరంగం.

స్థితప్రజ్ఞ ప్రకరణాన్ని సమాప్తి చేస్తూ, సింహావలోకనంగా పునః సారభూతమైన విషయాన్ని తరువాత శ్లోకంలో అందిస్తున్నాడు.

విహాయ కామాన్య స్సర్వా న్పుమాం శ్చరతి నిఃస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాన్తి మధిగచ్ఛతి ॥ 71

విహాయ-కామాన్-యః-సర్వాన్-పుమాన్-చరతి-నిఃస్పృహః
నిర్మమః-నిరహంకారః-సః-శాంతిం-అధిగచ్ఛతి

యః	=	ఏ	నిర్మమః	=	మమకారము లేనివాడై
పుమాన్	=	పురుషుడు	నిరహంకారః	=	అహంకారము లేనివాడై
సర్వాన్	=	సమస్తములైన	చరతి	=	చరిస్తాడో
కామాన్	=	కోరికలను	సః	=	అట్టివాడు
విహాయ	=	విడిచి	శాంతిం	=	శాంతిని
నిఃస్పృహః	=	స్పృహ లేనివాడై	అధిగచ్ఛతి	=	పొందుతాడు

సమస్తమైన కోరికలను విడిచి పెట్టిన వాడు. వాటి యందు స్పృహ లేకుండా ఉన్నవాడు. మమకారము లేనివాడు. అహంకారము తెలియని వాడు. అలా చరించే వాడే శాంతిని పొందుతాడు.

వ్యాఖ్య

బుద్ధిలో వివేక ప్రజ్ఞ ఉండాలే గాని, మనల్ని ఆకర్షించే శక్తి ఈ ప్రపంచంలో దేనికీ ఉండదు. ఎవ్వరికీ ఉండదు. ఏముంది ఈ ప్రపంచంలో ఆకర్షణ? ఎక్కడుంది ఈ జగతిలో ఆనందము? ఆడంబరాల మధ్య ఊరేగినా, అష్టైశ్వర్యాలతో తులతూగినా, అందల మెక్కి సర్వాధికారం సాగించినా, సుందర మందిరాలలో ఆదమరచి నిద్రించినా, ఏదో ఒకనాడు, ఎక్కడో ఒక్కచోట మానవ దేహం కూలి పోయేదే. ఎవరి దేహమైనా నేల రాలి పోయేదే. కాలి బూదిగా మారి పోయేదే.

దేహము ఒక మట్టికుండ. ఏనాడైనా పగిలేదే. ఇక మనసా? అదొక దారపు ఉండ. ఎంత జాగ్రత్త పడినా చిక్కు పడుతూనే ఉంటుంది. చిక్కుల్లో పడుతూనే ఉంటుంది. చచ్చే దేహము - చంపే మనసు, ఈ రెండిటి తోనే బ్రతుకులు కాలి పోతున్నాయి. మనుగడ మసై పోతూ ఉంది. ఎన్ని జన్మలు ఇలా వృథా కావాలి? ఎంత కాలం ఈ బాధలు అనుభవించాలి? ఎలాగూ దగా పడ్డాం. ఇకనైనా నిఘా పెంచుకుందాం. అంతరించే అడ్డదారుల్ని వదలి, తరించే దొడ్డదారిని వెతుక్కుందాం.

దీన శుభము లేదు దివ్య కీర్తియు లేదు
జగతిఁ బుట్టి బుట్టి చచ్చి చచ్చి
పొరల నేల మనకు పుట్టని చావని
త్రోవ వెదకి కొనుట దొడ్డబుద్ధి ॥

అని చిన్న వయస్సు లోనే దొడ్డ విషయాన్ని బోధించాడు ప్రహ్లాదుడు. ఇదే నిజమైన త్రోవ. ఇదే జ్ఞాన మార్గము. ధన్యమైన మార్గము. ఈ త్రోవలో నడచే వారందరూ ధన్యులే.

తే ధన్యాః భువి పరమార్థ నిశ్చితే హాః
శేషాః స్తు భ్రమనిలయే పరిభ్రమన్తః

అట్టి జ్ఞానాన్ని పొందేందుకు యత్నించువారు ధన్యులు. మిగిలిన వారు మాయలో పరిభ్రమిస్తున్నారు. భ్రమలో చరిస్తున్నారు అన్నారు 'ధన్యాష్టకం'లో శ్రీ శంకరాచార్యస్వామి.

స్థితప్రజ్ఞుని లక్షణాన్ని యాభై ఐదవ శ్లోకంలో ***ప్రజహాతి యదా కామాన్ సర్వాన్*** - 'సమస్తమైన కోరికలను విడిచి పెట్టిన వాడు' అంటూ కామనా త్యాగంతో ప్రారంభించాడు శ్రీకృష్ణుడు. ఈ శ్లోకంలో ***విహాయ కామాన్ యః సర్వాన్*** - 'సమస్తములైన కోర్కెలను విడిచి పెట్టిన వాడు' అంటూ అదే వాక్యంతో స్థితప్రజ్ఞుని వైభవాన్ని సమాప్తి చేస్తున్నాడు. కామజయమే రామజయం. శ్రీరామ జయం. కామాన్ని జయించిన వాడే ఆత్మారాముడు అవుతున్నాడు. ఎవడు సమస్త కోరికలను త్యజించి చరిస్తూ ఉంటాడో, అట్టి పురుషుడే స్థితప్రజ్ఞుడు. అతడే శాంతిని పొందుతాడు. బంధాన్ని కలిగించే కోరికలను త్యజించిన వివేకవంతుడు కేవలం ప్రారబ్ధానుభవము కొరకే ప్రపంచంలో చరిస్తూ ఉంటాడు ***(చరతి)***. ఇక్కడ చరించడము అంటే, జీవితంపై ఆసక్తి ఉండి అని అర్థం కాదు. ప్రారబ్ధ వశాత్తు దేహం ఉంది కనుక, జీవనము కొరకే వ్యవహరిస్తూ చరించేవాడు అని అర్థము ***(చరతి, జీవనమాత్ర చేష్టా శేషః పర్యటతి ఇత్యర్థః)***.

కోరిక లన్నీ విడిచి పెట్టేశాడు, సరే. కనీసం, బ్రతకాలి అనే ఆశైనా లేకుండా ఉంటాడా? అది కూడా లేదు అనే సత్యాన్ని వివరిస్తూ ఉంది ***నిస్పృహః*** అనే పదం. శరీరం జీవించి ఉండాలి అనే స్పృహ కూడా లేనివాడు ***(శరీర జీవన మాత్రేఽపి నిర్గతా స్పృహా యస్య సః నిస్పృహః సన్)***.

ప్రారబ్ధాధీనమై చరిస్తున్న దేహానికి ఏది ప్రాప్తించినా, దాని యందు కూడా **మమ** 'నాది' అనేది లేనివాడు. ఎందుకని? ***అహం*** 'నేను' అనేదే లేకుండా పోయింది కనుక. 'నేను' అనేది ఉంటేనే, 'నాది' అనేది ఉంటుంది. 'నేను' అనేది బ్రహ్మమే, పూర్ణబ్రహ్మమే అనే ప్రజ్ఞ గల ఆత్మవిదుడు, తన కన్నా అన్యంగా ఎవ రున్నారని వారి నుండి వేరు పడటానికి 'నేను' అనాలి? అంతా తానే అయి నపుడు అతనిది కానిది ఏముందని 'నాది' అని ప్రత్యేకంగా పలకాలి? ఇలా అహంకార మమకారముల నుండి విడిపడిన వాడు స్థితప్రజ్ఞుడు. అతడే శాంతిని పొందుతున్నాడు. అతడి స్థితియే మోక్షము. అదే నిర్వాణము.

ఈ ప్రపంచంలో ఏది పొందినా, ఎన్ని పొందినా శాంతి మాత్రము రాదు. ఒక్క జ్ఞానమే శాంతిని ప్రసాదిస్తుంది. ఆత్మజ్ఞానమే పూర్ణశాంతిని హృదయంలో నింపుతుంది.

సాగరాన్ని చేరే వరకు నది ప్రవహిస్తూనే ఉండాలి. పండయ్యే వరకు కాయ చెట్టును అంటి పెట్టుకొనే ఉండాలి. శాంతి లభించే వరకు మనం ఈ ప్రపంచంలో కర్మలు ఆచరిస్తూనే ఉండాలి.

కర్మల ఫలితంగా ఏది లభించినా, సుఖం వస్తుందేమో గాని శాంతి రాదు. సుఖాలకు రాకపోక లున్నాయి. సుఖం రావచ్చు. వచ్చిన సుఖం పోవచ్చు. కాని శాంతి మన స్వరూపం. అది లభ్యమైతే మళ్ళీ పోయేదంటూ ఉండదు.

సుఖ మున్న చోట దుఃఖం లేక పోవచ్చు. అలాగని, శాంతి ఉంటుంది అని చెప్పలేము. ఈ కారణం చేతనే, సుఖాలు ఉన్నవారు కూడా ఈ ప్రపంచంలో కర్మలు ఆచరిస్తూనే ఉన్నారు.

దుఃఖము ఉన్నచోట సుఖము ఉండదు, శాంతి ఉండదు. సుఖమున్న చోట దుఃఖం ఉండదు, శాంతి

కూడా ఉండదు. మరి శాంతి లేని వానికి సుఖ మెక్కడుంటుంది? ***అశాంతస్య కుతః సుఖమ్?*** శాంతి లేని వానికి సుఖ మెలా వస్తుంది? అని ప్రశ్నించాడు గీతాచార్యుడు ఈ అధ్యాయం లోనే.

శాంతి ఉంటేనే సుఖం ఉంటుంది. ఏది పొందినా శాంతి రాదు. జ్ఞానం వల్లనే శాంతి వస్తుంది. పరమాత్మ జ్ఞానం వల్లనే శాంతి ప్రాప్తిస్తుంది. అదే మోక్షం. స్థితప్రజ్ఞుడు పొందే అక్షయధనం ఇదే ***(సః ఏవం స్థితప్రజ్ఞః బ్రహ్మవిత్, శాంతిం నిర్వాణాఖ్యామ్ అధిగచ్ఛతి ప్రాప్నోతి బ్రహ్మభూతో భవతి ఇత్యర్థః)***.

అధ్యాయమును పరిసమాప్తి గావిస్తూ ఫలశ్రుతిని అందిస్తున్నాడు గోవిందుడు.

ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాస్యా మన్తకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥ 72

ఏషా-బ్రాహ్మీ-స్థితిః-పార్థ-న-ఏనాం-ప్రాప్య-విముహ్యతి
స్థిత్వా-అస్యాం-అంతకాలే-అపి-బ్రహ్మనిర్వాణం-ఋచ్ఛతి

పార్థ	= అర్జునా!	అంతకాలే అపి	= మరణ కాలంలో అయినా
ఏషా	= ఇది	అస్యాం	= బ్రహ్మస్థితి యందు
బ్రాహ్మీస్థితిః	= బ్రహ్మజ్ఞాని స్థితి	స్థిత్వా	= నిలిచి
ఏనాం	= దీనిని	బ్రహ్మనిర్వాణం	= బ్రహ్మప్రాప్తిని
ప్రాప్య	= పొంది	ఋచ్ఛతి	= పొందుతున్నాడు.
న విముహ్యతి	= మోహము చెందదు		

అర్జునా! ఇదే బ్రహ్మరూప స్థితి. దీనిని పొందినవాడు తిరిగి మోహమును పొందదు. మరణ సమయంలో కూడా ఈ బ్రాహ్మీస్థితిలో నిలిచి బ్రహ్మానందమును పొందుతాడు.

వ్యాఖ్య

అద్వితీయమైన ద్వితీయ అధ్యాయాన్ని సమాప్తం చేస్తూ, ఆత్మజ్ఞాన వైభవమును స్తుతిస్తున్నాడు ***(ఏషా జ్ఞాన నిష్ఠా స్తూయతే)***. అర్జునా! ఇదే బ్రాహ్మీస్థితి. స్థితి అంటే నిష్ఠ. ఇదే బ్రహ్మనిష్ఠ ***(ఏషా బ్రాహ్మీ స్థితిః)***.

ఆత్మతత్త్వ విజ్ఞానమే సాంఖ్యం. ఈ అధ్యాయంలో ఆత్మజ్ఞానమే ప్రధానంగా చర్చింప బడింది. ఆత్మజ్ఞానాన్ని పొందడానికి అర్హతను సాధించడం కోసం కర్మయోగం చెప్ప బడింది. స్థితప్రజ్ఞుని గూర్చి అర్జునుడు ప్రశ్నించడం వల్ల జ్ఞాన మార్గంలో సాధ్య సాధనాలను కూడా బోధించడం జరిగింది. వేదాంత విజ్ఞాన మంతా ఈ సాంఖ్యం లోనే ఆవిష్కరింప బడింది. ఇదే బ్రాహ్మీస్థితి అంటూ ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు అనంతానంద స్వరూపుడైన గీతాచార్యుడు.

ఇదే బ్రాహ్మీస్థితి. దేశకాలాదులు తెలిసి రాని అనంతానుభూతి. అద్వయానుభూతి. వ్యక్తిత్వము అర్థం గాని అవ్యక్తానుభూతి. ఈ స్థితిలో మనం ఒక చోట ఉండే వాళ్ళము కాము. బ్రహ్మము ఎక్కడో లేనిది కాదు. ఎక్కడో ఉండేదీ కాదు. ఎక్కడైనా ఉండేదే. ఎక్కడ, ఎప్పుడు అనే భావాలకు చిక్కేది కాదు. అలాంటి ఆలోచనలకు తాను ఆధారమే అయినా, వాటికి తనలో అవకాశ మివ్వని అఖండస్థితి.

నీవు - నేను, అది - ఇది అనేవి తెలియని, అర్థం గాని అద్వైత స్థితి. ఏది ఎక్కడ ఉంది? అని ఊహించలేని స్థితి. అన్నీ అంతటా ఉన్నాయనే జ్ఞాన మొక్కటే అఖండంగా వెలిగే ఆనంద ప్రదీప స్థితి. ఇదే బ్రాహ్మీస్థితి. ఇది ప్రత్యేక అనుభవం కాదు. సమస్త అనుభవాలు సమరసమైన అఖండైక రసానుభూతి. నది సాగర రూపమై తానే

సాగర మనే అనుభూతిలో స్థిరపడి నట్లు, ఈ ఆత్మయే బ్రహ్మ అనే బ్రహ్మాత్మైక్య జ్ఞానము స్థితమైన, స్థిరమైన అవ్యయానంద స్థితి. *అహమేవ - అహమేవ.* 'నేనే - నేను నేనే' అనే ఆత్మజ్ఞాన తరంగ వలయాలు ఆత్మానంద సాగరంలో చలిస్తున్న అనిర్వచనీయ స్థితి.

తదేవ నిష్కళం బ్రహ్మ నిర్వికల్పం నిరంజనం
చైతన్య మేకం బ్రహ్మతః ప్రజ్ఞానం బ్రహ్మ మయ్యపి ॥

ఆ బ్రహ్మము విభాగములు లేనిది. వికల్పములు లేనిది. మలినము అంటనిది. చిద్రూప మైనది. అద్వయ మైనది. ఈ కారణం చేత *(అతః)*. నా యందున్న ప్రజ్ఞానము కూడా *(మయ్యపి ప్రజ్ఞానం)* బ్రహ్మమే *(బ్రహ్మైవ)* అని అమృతబిందూపనిషత్తు గొంతు విప్పింది. త్రిపుర తాపిన్యుపనిషత్తు వంత పాడింది.

తిరుగు లేని తిరిగి రాని స్థితి

దివ్యమైన ఈ బ్రాహ్మీస్థితిని పొందిన వాడు *(ఏనాం ప్రాప్య)* ఏ విధమైన మోహానికి గురి కాడు *(న విముహ్యతి)*. మేలుకున్న వ్యక్తిని స్వప్నం లోని విషయాలు చలింప చేయలేవు. బ్రహ్మనిష్ఠుడైన వానిని భ్రమలు ముట్టలేవు. పట్టలేవు. సూర్యోదయమైన తరువాత చీకట్లు ఎలా ఉంటాయి? కాయ పండుగా మారిన తరువాత పూలరేకులు ఎక్కడ మిగిలి ఉంటాయి? అన్నిటికీ తెరపడి పోయింది. అజ్ఞానం తెర మరుగైంది. నిత్య మోక్షంలో మోహ మనేది అనూహ్యం. మోహం కదిలితే ఇక మోక్ష మెక్కడిది? మోహం నశిస్తేనే మోక్షం. మోహం తిరిగి వస్తే మోక్షం నశించినట్లే కదా! నశించేది మోక్షం ఎలా అవుతుంది? కనుక మోహము తిరిగి రాదు. మోక్షము ఎక్కడికీ పోదు. ఉన్నది ఉన్నట్లు తెలియడమే జ్ఞానం. ప్రజ్ఞానం.

మోక్షము కూడా క్షరమైతే
దానిని పొంది ఫలమేమి?
అక్షరమై అది స్థిరమైతే
పొందే యత్నం ఎందుకని?
పోయేది లేదు - వచ్చేది కాదు
ఉన్నది ఉన్నట్లు తెలియాలి
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

ఇది రామజోగి చిట్కా.

కాలం కాదు కొలమానం

దివ్యమైన ఈ బ్రాహ్మీస్థితి కాలంలో కలిగేది కాదు, కాలంలో కరిగేదీ కాదు అని తెలుసుకున్నాం. కనుక ఎప్పుడూ ఉన్న బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానము ఎప్పుడైనా కలగవచ్చు. ఎప్పుడు ఎవరికి కలిగినా, ఆ కలిగిన వ్యక్తి వ్యక్తిగా మిగిలి ఉండడు. బ్రహ్మముగా వెలిగి పోతాడు. ఈ స్థితి మరణ సమయంలో నైనా కలగవచ్చు. కలగడము అంటే కడతేరి పోవడమే కనుక అది ఎప్పుడైనా సంభవించ వచ్చు. జ్ఞానము ఆ వయస్సులో అసంభవము, ఈ వయస్సులో అసంగతము అనేది లేనే లేదు.

జ్ఞానానికి కావలసింది మనస్సే గాని వయస్సు కాదు. సానుకూలమైన సమబుద్ధే గాని సమయం కాదు. చచ్చే వ్యక్తి కూడా పొందవచ్చు. కాకపోతే, జిజ్ఞాస చావ కుండా ఉండాలి. వివేక వైరాగ్యాదులు అంతరించ కుండా ఉండాలి. శ్రద్ధ మొద్దు బారి పోకూడదు. అంతే. కనుకనే, మరణ సమయంలో నైనా *(అన్తకాలేఽపి)* ఈ బ్రాహ్మీస్థితిలో *(అస్యాం)* స్థిరంగా నిలిచి *(స్థిత్వా)* బ్రహ్మరూపమైన మోక్షాన్ని పొందవచ్చు *(బ్రహ్మ నిర్వాణమ్*

ఋచ్ఛతి). చివరి సమయంలో కూడా శ్రద్ధ గలవాడు గురువు నుండి జ్ఞానాన్ని పొందుతాడు. మోక్షాన్ని పొందుతాడు.

అత్యాశ కాదు - అనంతాశ

నా వయస్సు మళ్ళింది. మనస్సు మరిగి పోయింది. దేహం సడలి పోయింది. ఏదీ చెయ్యలేని పరిస్థితి దాపురించింది. ఇక నేను ఏమి సాధిస్తాను? అని వృద్ధులు చింతిస్తూ ఉంటారు. మరణ సమయంలో ఉండే వారికి కూడా మోక్షం ప్రాప్తించే అవకాశం ఉందని సాక్షాత్తు భగవంతుడే చెబుతూ ఉంటే, నేను ముసలివాణ్ణి, మునిగి పోతానేమో అని దుఃఖించడం జ్ఞానం అనిపించుకోదు.

వయస్సు మళ్ళిన వారి మనస్సులు పలికే ఈ అప్రస్తుత ప్రసంగాలు యువతకు చెడు సంకేతాన్ని చేర వేస్తాయి. ఇంతకాలం జీవించిన వ్యక్తే తరించడం సాధ్యం కాదని ఇలా తపించి పోతున్నాడు; ఇక మనకిది సాధ్యమేనా? అని నిరాశలో యువత కూరుకు పోయే ప్రమాదం ఉంది.

ఎక్కువ కాలం జీవించిన వారికి అనుభవాలు కూడా ఎక్కువ గానే ఉంటాయి. తమ అనుభవాల ద్వారా అనుభవం లేని వారిలో ఆసక్తిని, ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపే కర్తవ్యం పెద్దలదై ఉండాలి. నిరాశల్ని, నిస్పృహల్ని పెనవేసుకొని, తాము కలత పడటమే గాక, యువతను కలవర పెట్టడం పెరిగిన వయస్సుకే కళంకము.

మనిషి ఆశావహ దృక్పథంతో జీవించాలి. మనిషిలో ఉత్సాహం ఉండాలి. ఉద్యమ స్ఫూర్తి ఉండాలి. అదే యోగ లక్షణం. నిరాశలు, నిస్పృహలు రోగ లక్షణాలు.

వయస్సు మళ్ళినంత మాత్రాన జ్ఞానం మరలి పోయిందని, వెనుదిరిగి పోయిందని ఎవరు చెప్పారు? వయస్సు పోయినా వినికిడి ఉంటే చాలు. ఆరోగ్యం పోయినా, ఆసక్తి ఉంటే జ్ఞానాన్ని రాకుండా ఎవ్వరూ ఆపలేరు.

ఆఖ్యాయిక

ఖట్వాంగుడు చక్రవర్తి. రాజ్యాన్ని పాలిస్తూ ఉన్నాడు. దేవ దానవ సంగ్రామంలో మహా శక్తివంతుడైన ఖట్వాంగుడు దేవతల వైపు నిలబడి రాక్షసులతో పోరాడాడు. విజయాన్ని సాధించిన దేవతలు ఖట్వాంగుని ప్రశంసించారు. ఏదైనా వరాన్ని కోరుకొమ్మని ఆజ్ఞాపించారు.

ఖట్వాంగుడు ఆలోచించి, తన మరణ కాలము ఎప్పుడో తెలియచేయ వలసిందిగా దేవతల్ని ప్రార్థించాడు. దేవతలు దివ్యదృష్టితో చూచి, ఇక కేవలం ముహూర్త కాలమే ఉంది అని నిప్పు లాంటి నిజాన్ని వినిపించారు. అంటే, కేవలం నలభై ఐదు నిముషాలు మాత్రమే ఖట్వాంగునికి జీవించే అవకాశం ఉంది. ఖట్వాంగుడు సమస్తాన్ని త్యజించాడు. మనస్సు బ్రహ్మము నందు నిలిపి, ఆ ముహూర్త కాలంలో తరించి పోయాడు.

ఖట్వాంగో నామ రాజర్షిః ముహూర్తే ముక్తి మేయివాన్
విజ్ఞాయ చరమావస్థాం దేవతాభ్యో నృపోత్తమః ॥

తాను కేవలం ముహూర్త కాలము మాత్రమే జీవించే అవకాశం ఉందని దేవతల ద్వారా, జ్ఞానుల ద్వారా తెలుసు కొనిన రాజర్షి ఖట్వాంగుడు ప్రయత్నించి ముక్తిని సాధించాడు. నలభై ఐదు నిముషాల కాలంలో మృత్యు ముఖంలో ప్రవేశించ బోయే ఖట్వాంగుడు తరించి నపుడు, మేము ముసలివాళ్ళ మయ్యాం, తరిస్తామో లేదో! అని వృద్ధులు చింతించడం హాస్యాస్పదం కాదా?

ఏది కనిపిస్తే దాని వెంట పరుగు లెత్తకుండా, ఏది వినిపిస్తే దాని కొరకు వెంపర్లాడ కుండా, ఆశా పిశాచాన్ని మనస్సు నుండి దూరం చేసుకొని, ధన జన మమకార వ్యామోహాల నుండి బయటపడి, దృఢమైన

మనస్సుతో, ఆచార్యదేవుని అడుగుజాడలలో అకుంఠిత విశ్వాసంతో చరించే వారు జ్ఞానాన్ని పొంది తరించడానికి వయస్సు అవరోధం కాదు. అనారోగ్యం ప్రతిబంధకమూ కాదు. వివేక విచారాలకు నోచుకోని మనస్సు, సందేహాలకు నిలయమైన బుద్ధి, విశ్వాసం లేని చిత్తము, శ్రేష్ఠులను అర్థం చేసుకోలేని అహంకారము - ఇవే జ్ఞానానికి అడ్డుగోడలు. అవరోధాలు.

వేదము ఒక మహారణ్యము. అందులో ఏది ఎక్కడుందో నిరంతరము అందులో నిమగ్నమై ఉన్న వారికే అర్థం కాదు. అలాంటి వేద విజ్ఞానాన్ని కాచి, వడబోసి, సారాన్ని తీసి గీతామృతంగా భగవంతుడు మానవాళికి ప్రసాదించాడు. మరణకాలంలో అయినా జ్ఞానాన్ని పొందే అవకాశం ఉందని, ప్రతి మానవ హృదయంలో కొండంత విశ్వాసాన్ని నింపి సాంఖ్యాన్ని ముగిస్తున్నాడు గీతాచార్యుడు.

మరణానికి ఎవ్వరూ భీతి చెందాల్సిన అవసరం లేదు. గీతామృతం మన వద్ద ఉంది. ఇక మరణ మెక్కడుంది? భగవంతుడు అందరినీ కనికరిస్తాడు. జ్ఞానము అందరినీ ఆశీర్వదిస్తుంది.

వికారి నైనా బికారి నైనా
ఈసడించదు దర్పణము
పేదనైనా పామరునైనా
పారద్రోలదు దైవము
జ్ఞానమె మనిషికి శరణము
తెలియని నాడే మరణము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

ముముక్షువులకు మోక్ష మార్గంలో దారి బత్తెంగా ఇదొక రామజోగి చిట్కా.

జ్ఞానమే ప్రధానం కనుక మరణశయ్యపై ఉన్న వారు కూడా తరిస్తారు. వృద్ధులైనా తరిస్తారు. రోగులైనా తరిస్తారు. జ్ఞానము బుద్ధికి అందేదే కనుక, ఏ జాతి వారైనా తరిస్తారు. ఏ మతం వారైనా తరిస్తారు. లింగభేదం లేదు. వర్ణభేదం లేదు. శ్రద్ధ ఒక్కటి ఉంటే చాలు. అంతా అభేదమే. అద్వైత జ్ఞానమే.

ఈ సందర్భంలో రెండవ అధ్యాయానికి భాష్యాన్ని సమాప్తం చేస్తూ, చివరి వాక్యాన్ని అద్భుతంగా పలికి ఆశీర్వదిస్తారు పూజ్యపాదులు శ్రీ శంకరాచార్యస్వామి.

కిము వక్తవ్యం బ్రహ్మచర్యాదేవ సంన్యస్య యావజ్జీవం యో బ్రహ్మణి ఏవ అవతిష్ఠతే స బ్రహ్మనిర్వాణం ఋచ్ఛతీతి?

మరణ సమయంలో ఉన్నవాడే తరించే టప్పుడు బ్రహ్మచర్యాశ్రమము నుండే సన్యాసమును స్వీకరించి, జీవిత మంతా బ్రహ్మ విచారము నందే ఉన్నవాడు మోక్షాన్ని తప్పక పొందుతాడు అని ప్రత్యేకంగా చెప్పాలా? అని చివరి మాట పలికారు. మహాత్ముల మాటే శ్రీరామరక్ష.

జై జై శ్రీ శంకర గురుదేవ!

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే సాంఖ్యయోగో నామ ద్వితీయోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు సాంఖ్యయోగము అనే రెండవ అధ్యాయము.

చైతన్య భగవద్గీత

అథ తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయము

కర్మయోగః - కర్మయోగము

కొండ అద్దమందు కొంచెమై ఉండదా? అప్పట్లు, వేదాంత సారమంతా, ముఖ్యంగా భగవద్గీత కేంద్ర విషయ మంతా రెండవ అధ్యాయం - సాంఖ్యయోగంలో అద్భుతంగా ప్రవచింప బడింది. గీతాచార్యుడు ప్రబోధించిన ఆత్మ తత్త్వం అర్జునుడికి ఎంతో తృప్తి నిచ్చింది. ఊరట నిచ్చింది. ఆనందాన్ని పంచింది. కాని కర్మ విషయమే కాస్త ఇబ్బంది పెడుతోంది.

ఏది శ్రేయస్సో దానిని నిశ్చయించి చెప్పమని అర్థించాడు అర్జునుడు. తనకు కావలసింది మోక్షమే అనే విషయం కూడా సుస్పష్టం అయింది. మోక్షము అనేది ఉన్నదే కనుక, దానికి సంబంధించిన జ్ఞానం కలగాలి. అంతే. అదే ఆత్మజ్ఞానం. అదే సాంఖ్యం (***శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభిధీయతే***).

ఆత్మ సత్యము. ఆత్మ జ్ఞానము. ఆత్మ అనంతము. అట్టి ఆత్మకు సంబంధించిన జ్ఞానమే ఆత్మ జ్ఞానము. ఆత్మ జ్ఞానము కలిగిన వాడు తానే ఆత్మ అని తెలుసు కుంటాడు. ఆత్మయే బ్రహ్మము అని గ్రహిస్తాడు. ఇదే మోక్షము. కనుక జ్ఞానము వల్లనే మోక్షము సిద్ధిస్తుంది అనేది వేదాంత తాత్పర్యము. భగవద్గీత కూడా ఈ విషయాన్నే ధ్రువ పరచింది (***తస్మాత్ కేవలాదేవ జ్ఞానాత్ మోక్షః ఇతి ఏషః అర్థః నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ***).

ఆత్మతత్త్వాన్ని రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకం నుండి ముప్పైయవ శ్లోకం వరకు అద్భుతంగా ప్రవచించాడు గీతాచార్యుడు. అర్జునుని ప్రశ్నను ఆధారం చేసుకొని ఆత్మవిదుని వైభవాన్ని కూడా స్థితప్రజ్ఞ లక్షణాలలో వివరించాడు. ఇదంతా అర్జునుడికి చాలా ఓదార్పును, సంతృప్తిని కలిగించింది.

తనకు కావలసింది మోక్షం. మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలగాలి అంటే శ్రవణం చేయాలి. ***సన్న్యస్య శ్రవణం కుర్యాత్.*** సన్యసించి శ్రవణం చేయాలి అనే విషయం కూడా ప్రసిద్ధమే. మరి, సన్యాసాన్ని ప్రోత్సహించకుండా, అర్జునా! నువ్వు యుద్ధం చెయ్యి అని, జ్ఞాన బోధానంతరం కూడా శ్రీకృష్ణుడు చెప్పడం అర్జునుడికి మ్రింగుడు పడని విషయంగా తయారైంది.

మా తే సంగోఽస్త్వకర్మణి - అర్జునా! కర్మను మానేయాలి అనుకోకు (2 - 47).

యోగస్థః కురు కర్మాణి - యోగస్థుడవై కర్మలను ఆచరించు (2 - 48).

ఉత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః - అర్జునా! లే! యుద్ధానికి సిద్ధపడు (2 - 37).

యోగాయ యుజ్యస్వ - కర్మయోగానికి ప్రయత్నం చెయ్యి (2 - 50).

సవ్యసాచి సందేహం

ఇంతకీ గీతాచార్యుడు ప్రబోధించేది జ్ఞానమా? లేక కర్మాచరణమా? జ్ఞాన మార్గంలో చరిస్తే మోక్షం సిద్ధిస్తుంది. కర్మ చేస్తే కర్మఫలం వస్తుంది. అంతేగాని మోక్షం రాదు. మోక్ష మనేది కర్మఫలం కాదు. ఇకపోతే, శ్రీకృష్ణుడు బోధించిన కర్మయోగము కూడా అంతఃకరణ శుద్ధిని కలిగిస్తుందే గాని మోక్షాన్ని ప్రసాదించ లేదు. అలాంటప్పుడు, రాజమార్గం లాగా జ్ఞానమార్గం ఉండగా, మోక్షాన్ని ప్రసాదించ లేని కర్మాచరణ వైపు తనను

మనస్సుతో, ఆచార్యదేవుని అడుగుజాడలలో అకుంఠిత విశ్వాసంతో చరించే వారు జ్ఞానాన్ని పొంది తరించడానికి వయస్సు అవరోధం కాదు. అనారోగ్యం ప్రతిబంధకమూ కాదు. వివేక విచారాలకు నోచుకోని మనస్సు, సందేహాలకు నిలయమైన బుద్ధి, విశ్వాసం లేని చిత్తము, శ్రేష్ఠులను అర్థం చేసుకోలేని అహంకారము - ఇవే జ్ఞానానికి అడ్డుగోడలు. అవరోధాలు.

వేదము ఒక మహారణ్యము. అందులో ఏది ఎక్కడుందో నిరంతరము అందులో నిమగ్నమై ఉన్న వారికే అర్థం కాదు. అలాంటి వేద విజ్ఞానాన్ని కాచి, వడబోసి, సారాన్ని తీసి గీతామృతంగా భగవంతుడు మానవాళికి ప్రసాదించాడు. మరణకాలంలో అయినా జ్ఞానాన్ని పొందే అవకాశం ఉందని, ప్రతి మానవ హృదయంలో కొండంత విశ్వాసాన్ని నింపి సాంఖ్యాన్ని ముగిస్తున్నాడు గీతాచార్యుడు.

మరణానికి ఎవ్వరూ భీతి చెందాల్సిన అవసరం లేదు. గీతామృతం మన వద్ద ఉంది. ఇక మరణ మెక్కడుంది? భగవంతుడు అందరినీ కనికరిస్తాడు. జ్ఞానము అందరినీ ఆశీర్వదిస్తుంది.

బికారి నైనా బికారి నైనా
ఈసడించదు దర్పణము
పేదనైనా పామరునైనా
పారద్రోలదు దైవము
జ్ఞానమె మనిషికి శరణము
తెలియని నాదే మరణము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

ముముక్షువులకు మోక్ష మార్గంలో దారి బత్తెంగా ఇదొక రామజోగి చిట్కా.

జ్ఞానమే ప్రధానం కనుక మరణశయ్యపై ఉన్న వారు కూడా తరిస్తారు. వృద్ధులైనా తరిస్తారు. రోగులైనా తరిస్తారు. జ్ఞానము బుద్ధికి అందేదే కనుక, ఏ జాతి వారైనా తరిస్తారు. ఏ మతం వారైనా తరిస్తారు. లింగభేదం లేదు. వర్ణభేదం లేదు. శ్రద్ధ ఒక్కటి ఉంటే చాలు. అంతా అభేదమే. అద్వైత జ్ఞానమే.

ఈ సందర్భంలో రెండవ అధ్యాయానికి భాష్యాన్ని సమాప్తం చేస్తూ, చివరి వాక్యాన్ని అద్భుతంగా పలికి ఆశీర్వదిస్తారు పూజ్యపాదులు శ్రీ శంకరాచార్యస్వామి.

కిము వక్తవ్యం బ్రహ్మచర్యాదేవ సంన్యస్య యావజ్జీవం యో బ్రహ్మణి ఏవ అవతిష్ఠతే స బ్రహ్మనిర్వాణం ఋచ్ఛతీతి?

మరణ సమయంలో ఉన్నవాడే తరించే టప్పుడు బ్రహ్మచర్యాశ్రమము నుండే సన్యాసమును స్వీకరించి, జీవిత మంతా బ్రహ్మ విచారము నందే ఉన్నవాడు మోక్షాన్ని తప్పక పొందుతాడు అని ప్రత్యేకంగా చెప్పాలా? అని చివరి మాట పలికారు. మహాత్ముల మాటే శ్రీరామరక్ష.

జై జై శ్రీ శంకర గురుదేవ!

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే సాంఖ్యయోగో నామ ద్వితీయోஉధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు సాంఖ్యయోగము అనే రెండవ అధ్యాయము.

చైతన్య భగవద్గీత

అథ తృతీయోஉధ్యాయః - మూడవ అధ్యాయము

కర్మయోగః - కర్మయోగము

కొండ అద్దమందు కొంచెమై ఉండదా? అన్నట్లు, వేదాంత సారమంతా, ముఖ్యంగా భగవద్గీత కేంద్ర విషయ మంతా రెండవ అధ్యాయం - సాంఖ్యయోగంలో అద్భుతంగా ప్రవచింప బడింది. గీతాచార్యుడు ప్రబోధించిన ఆత్మ తత్త్వం అర్జునుడికి ఎంతో తృప్తి నిచ్చింది. ఊరట నిచ్చింది. ఆనందాన్ని పంచింది. కాని కర్మ విషయమే కాస్త ఇబ్బంది పెడుతోంది.

ఏది శ్రేయస్సో దానిని నిశ్చయించి చెప్పమని అర్థించాడు అర్జునుడు. తనకు కావలసింది మోక్షమే అనే విషయం కూడా సుస్పష్టం అయింది. మోక్షము అనేది ఉన్నదే కనుక, దానికి సంబంధించిన జ్ఞానం కలగాలి. అంతే. అదే ఆత్మజ్ఞానం. అదే సాంఖ్యం (***శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభిధీయతే***).

ఆత్మ సత్యము. ఆత్మ జ్ఞానము. ఆత్మ అనంతము. అట్టి ఆత్మకు సంబంధించిన జ్ఞానమే ఆత్మ జ్ఞానము. ఆత్మ జ్ఞానము కలిగిన వాడు తానే ఆత్మ అని తెలుసు కుంటాడు. ఆత్మయే బ్రహ్మము అని గ్రహిస్తాడు. ఇదే మోక్షము. కనుక జ్ఞానము వల్లనే మోక్షము సిద్ధిస్తుంది అనేది వేదాంత తాత్పర్యము. భగవద్గీత కూడా ఈ విషయాన్నే ధ్రువ పరచింది (***తస్మాత్ కేవలాదేవ జ్ఞానాత్ మోక్షః ఇతి ఏషః అర్థః నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ***).

ఆత్మతత్త్వాన్ని రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకం నుండి ముప్పైయవ శ్లోకం వరకు అద్భుతంగా ప్రవచించాడు గీతాచార్యుడు. అర్జునుని ప్రశ్నను ఆధారం చేసుకొని ఆత్మవిదుని వైభవాన్ని కూడా స్థితప్రజ్ఞ లక్షణాలలో వివరించాడు. ఇదంతా అర్జునుడికి చాలా ఓదార్పును, సంతృప్తిని కలిగించింది.

తనకు కావలసింది మోక్షం. మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలగాలి అంటే శ్రవణం చేయాలి. ***సన్న్యస్య శ్రవణం కుర్యాత్.*** సన్యసించి శ్రవణం చేయాలి అనే విషయం కూడా ప్రసిద్ధమే. మరి, సన్యాసాన్ని ప్రోత్సహించకుండా, అర్జునా! నువ్వు యుద్ధం చెయ్యి అని, జ్ఞాన బోధానంతరం కూడా శ్రీకృష్ణుడు చెప్పడం అర్జునుడికి మింగుడు పడని విషయంగా తయారైంది.

మాతే సంగోஉస్త్వ కర్మణి - అర్జునా! కర్మను మానేయాలి అనుకోకు (*2 - 47*).

యోగస్థః కురు కర్మాణి - యోగస్థుడవై కర్మలను ఆచరించు (*2 - 48*).

ఉత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః - అర్జునా! లే! యుద్ధానికి సిద్ధపడు (*2 - 37*).

యోగాయ యుజ్యస్వ - కర్మయోగానికి ప్రయత్నం చెయ్యి (*2 - 50*).

సవ్యసాచి సందేహం

ఇంతకీ గీతాచార్యుడు ప్రబోధించేది జ్ఞానమా? లేక కర్మాచరణమా? జ్ఞాన మార్గంలో చరిస్తే మోక్షం సిద్ధిస్తుంది. కర్మ చేస్తే కర్మఫలం వస్తుంది. అంతేగాని మోక్షం రాదు. మోక్ష మనేది కర్మఫలం కాదు. ఇకపోతే, శ్రీకృష్ణుడు బోధించిన కర్మయోగము కూడా అంతఃకరణ శుద్ధిని కలిగిస్తుందే గాని మోక్షాన్ని ప్రసాదించ లేదు. అలాంటప్పుడు, రాజమార్గం లాగా జ్ఞానమార్గం ఉండగా, మోక్షాన్ని ప్రసాదించ లేని కర్మాచరణ వైపు తనను

శ్రీకృష్ణుడు ఎందుకు మళ్ళిస్తున్నాడు? అనేది అర్జునుని సందేహం. ఈ సందేహమే అర్జునుని కలవర పెడుతోంది.

స్థితప్రజ్ఞ వైభవ వర్ణనములో ప్రథమ శ్లోకం లోనే **ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్** - అర్జునా! మనస్సులో కలిగే సమస్తమైన కోరికలను ఎవడైతే త్యజిస్తాడో వాడే స్థితప్రజ్ఞుడు అని చెప్పాడు కదా! మరి కోరికల్ని విడవడ మంటే, కర్మల్ని విడిచి పెట్టడం కాదా?

అసలు కోరికే లేకపోతే కర్మకు అవకాశం ఎక్కడుంది? కోరికలు ఉన్నవాడే వాటిని తీర్చుకోవడానికి కర్మలు చేస్తాడు (**కామాయ మానస్య కరోతి కర్మాణి** - ఉపనిషత్ భాష్యం). ఏదో సాధించాలి అనే కదా మనిషి కర్మ చేస్తాడు? మరి కర్మ ద్వారా ఏది సాధించినా అది మోక్షం మాత్రం కాదు. అలాంటప్పుడు జ్ఞాననిష్ఠకు సంబంధించిన సన్యాసమే శ్రేయోదాయకం. మరి ఈ కర్మల వైపు నన్నెందుకు శ్రీకృష్ణుడు పురికొల్పు తున్నాడు? అని సందేహిస్తున్నాడు అర్జునుడు.

యమిచ్ఛేత్ తమావసేత్ అనే న్యాయాన్ని బట్టి, ఎవరు దేనిని వాంఛిస్తారో, వారు దాని యందే నిమగ్నమై ఉంటారు. ఎవరికి ఏది ఇష్టమో, దాని చుట్టే వారి మనస్సు తిరుగుతూ ఉంటుంది. అర్జునుడికి మమకారం వల్ల యుద్ధం రుచించ లేదు. సన్యాసానికి మనస్సు సిద్ధ పడుతోంది. అందుకు అనుకూలంగా జ్ఞానమార్గం ఉంది. దాని వైపే ఆయన మనస్సు మొగ్గు చూపుతోంది. కర్మలను విడిచి పెట్టడానికి సిద్ధంగా ఉంది.

నిజమే. కాని, కర్మలను విడిచి నంత మాత్రాన జ్ఞానము ప్రాప్తిస్తుందా? ఆత్మజ్ఞానం కలగాలి అంటే, అంతఃకరణశుద్ధి ఉండాలి. కర్మలను పరే త్యజిస్తాడు. మరి జ్ఞానాన్ని పొందడానికి అవసరమైన చిత్తశుద్ధి ఏది? కర్మలను విడిస్తే చిత్తశుద్ధి వస్తుందా? అసలు కర్మల్ని త్యజించడం అంత సులభమైన విషయ మేనా?

కర్మ అనివార్యం

కర్మను వదిలించు కోవడం అంత తేలికైన పని కాదు. శక్తి ఉన్నా లేకపోయినా, వయస్సు ఉండినా, మళ్ళినా, ఆరోగ్యమున్నా క్షీణించినా మనిషి కర్మ చేయక తప్పదు. నాకు శక్తి లేదు. నేను కర్మ చేయలేను అని నువ్వు చెప్పొచ్చు. శక్తి లేదని భోం చేయకుండా ఉండ గలవా? శక్తి రావాలంటే భోంచేసి తీరాలి. అదీ కర్మే.

వయస్సు పైబడింది. నేను పని చేయలేను అంటారు వృద్ధులు. నిజమే. ఏమీ చేయక పోయినా, కర్ర పట్టుకొని లేస్తున్నావా, లేదా? లేవడమే కాదు, కర్ర పట్టుకోవడం కూడా కర్మే. కర్ర పట్టుకోవడమే కాదు, కర్ర పట్టుకోవాలి అని అనుకోవడం కూడా కర్మే.

చిన్నపిల్లలు ఏమీ చేయకుండా ఊయలలో పడుకొని ఉన్నా, వారు కూడా కర్మ చేస్తున్న వారే. కాళ్ళు ఆడించడం కర్మ. చూడటం కర్మ. నవ్వడం కర్మ. ఏడవడం కర్మ. ఏది కర్మ కాదు?

ఆరోగ్య ముంటే విందు లారగిస్తావు. ఆరోగ్యం లేకపోతే, విందుకు దూర మవుతావు. విందు మానినా మందు తినడం మానలేవు కదా! అది కూడా కర్మే.

కర్మ ఎవరినీ వదలదు. అందరూ కర్మలు చేయాలి. చేశారు. చేస్తున్నారు. శ్రీరాముడు చేశాడు. శ్రీశంకరాచార్య స్వామి చేశారు. శ్రీకృష్ణుడూ చేశాడు. గీతను బోధించడం కర్మ కాదా? మురళిని వాయించడం కర్మ కాదా?

అన్నీ కర్మలే. ఆడటం కర్మ. ఆడించడం కర్మ. పాడటం కర్మ. పాడించడం కర్మ. ఆదుకోవడం కర్మ. గుండె బాదుకోవడం కర్మ. కర్మ కాని దేముంది? కర్మ చేయని వారు ఎవరున్నారు?

ఇక్కడ మనం గమనించ వలసిన అతి ప్రధానమైన విషయం ఒకటి ఉంది. పరిమిత మైనది ఏదైనా,

ఎవరైనా, పని చేయక తప్పదు. తప్పక పని చేయ వలసిందే. ఎందుకని? పరిమితంగా ఉండటమే దుర్భరం కనుక. విశ్వమంతా ఆ కోణం లోనే నడుస్తూ ఉంది.

ప్రపంచాన్ని పరిశీలించి చూస్తే, సూర్యోదయం నుండి ప్రాణులే కాకుండా ప్రకృతి కూడా కర్మ వలయంలో పడి పరిభ్రమిస్తూనే ఉంది. సృష్టిలో ఎక్కడా బద్ధక మనేది కన్పించడం లేదు, మనోబుద్ధులున్న మనిషిలో తప్ప.

విశ్వమే కర్మ వలయంలో చిక్కి ప్రవర్తించే టప్పుడు, విశ్వధర్మాలకు వేరుగా, విలక్షణంగా వ్యక్తి ప్రవర్తించ గలడా? కర్మ నుండి విడిపడి అకర్మలో ఉండ గలడా? వ్యక్తి విశ్వానికి వేరుగా లేడు. విశ్వం వ్యక్తికి వేరుగా లేదు.

విశ్వము చాలా విశాల మైనదే కావచ్చు. విశాలమైన విశ్వాన్ని గూర్చి ఆలోచించే బుద్ధి గల మానవుడు విశ్వమంతటి వాడు కాక పోవచ్చు. కాని, విశ్వాన్నంతా తనలో ఇముడ్చుకొనే శక్తి కలిగిన వాడు. ఈ విషయా లన్నీ మున్ముందు గీతలో మనం ఆశ్చర్యంగా చూడబోతాము.

చలించే గుణం గాలికి ఉంది. గాలికి దూరమై వ్యక్తి జీవించ లేడు. చలించే గాలి నీలో ఉన్నా, అది చలిస్తూ ఉంటుందే గాని, దుప్పటి కప్పుకొని పడుకోదు. ఒకవేళ మనిషి దుప్పటి కప్పుకొని పడుకున్నా, లేదా నిద్రించినా, అతనిలో గాలి మేలుకొని కదులుతూ ఉంది కనుకనే అతడు దుప్పటి తొలగించుకొని మళ్ళీ లేవగలుగు తున్నాడు. వాయుదేవుడు సదా కర్మ లోనే ఉన్నాడు.

చలించే గుణం జలానికి ఉంది. చలించడం ద్రవ లక్షణం. ప్రపంచంలో చలించే జలమే మన దేహంలో కూడా చలిస్తూ ఉంది. దేహానికి రూపాన్నిచ్చే జల భూతము, దేహంలో ఉండి రక్తాన్ని ప్రసరింప చేస్తూ ఉంది. లేకపోతే, జీవనమే సాధ్యం కాదు. అదంతా కర్మే. వరుణుడు నిరంతరము కర్మ లోనే ఉన్నాడు. ఇలా ఎంతైనా చెప్పుకుంటూ పోవచ్చు. ఈ ప్రపంచంలో కర్మ లేని దెక్కడ?

భూమి తిరుగుతూ ఉంది. అదీ కర్మే. తిరిగే భూమి మీద ఉన్న వాళ్ళు తిరగకుండా ఎలా ఉంటారు? నేను తిరగడం లేదు అని అనుకున్నా, వాస్తవానికి తిరుగుతున్న వాణ్ణే. ఇక కర్మశూన్యత ఎక్కడుంది? కర్మ ఏమిటో అర్థం కాకపోవడం చేత, మనిషిని కర్మశూన్యత ఆకర్షిస్తూ ఉంది.

ఏదీ చేయనంత మాత్రాన అది కర్మశూన్యత కాదు. మాట్లాడకుండా మనిషి ఉండొచ్చు. ఆలోచించ కుండా ఉండగలడా? శ్వాసించకుండా ఉండగలడా? ఆ రెండు కూడా ఆగిపోతే, ఆ తరువాత కర్మ చేయకుండా ఉండటానికి ఇక ఉన్న దెవరు? అసలు దేహాన్ని ధరించడమే కర్మ. దేహాన్ని ధరించ డానికి కారణం కర్మ. దేహము కొంత కాలం ఈ ప్రపంచంలో మనుగడను సాగించడానికి కారణం కర్మ. దేహం రాలి పోవడానికి కూడా కారణం కర్మే. కర్మ తోనే పుట్టిన దేహం కర్మ తోనే పెరుగుతుంది. కర్మ తోనే పెరిగిన దేహం కర్మ తోనే తరుగుతుంది. కర్మ తోనే తరిగిన దేహం కర్మ కారణం గానే నశించి పోతుంది. నశించిన తరువాత కూడా కర్మ ప్రభావం చేతనే పంచభూతాలలో విలీనమై పోతుంది. అంతా కర్మే.

అనివార్యం - అనర్థం

కర్మ మనిషిని బంధిస్తుంది అని ముందే చెప్పుకున్నాం. విషయాసక్తి ఉండబట్టే కర్మలు చేస్తున్నాం. కర్మ చేయడానికి ఏ ధర్మాలైతే ఈ ప్రపంచంలో మనకు అనుకూలిస్తున్నాయో, అవే ధర్మాలు ఆయా కర్మలకు సంబంధించిన ఫలాలు మనకు అంద డానికి కారణమై ఉన్నాయి.

ఆసక్తితో కర్మను చేస్తాము. ఫలితాన్ని అనుభవిస్తాం. ఫలానుభూతి మనస్సుపై ప్రగాఢమైన ముద్రను వేస్తుంది. అదే వాసన, లేదా సంస్కారము.

కర్మలలో ఎవ్వరికీ ఆసక్తి లేదు. కర్మఫలాల యందే ఆసక్తి ఉంది. అవి తృప్తి నిస్తాయనే ఆశ ఉంది. వాటి వల్ల నిత్యతృప్తి కలుగుతుందనే భ్రాంతి ఉంది (**తృప్తః భవిష్యామి**). ఏ కర్మ అయినా దేశకాలాదుల చేత, వ్యక్తి సామర్థ్యం చేత పరిమితంగా ఉంటుంది. పరిమితమైన కర్మలు పరిమితమైన కర్మఫలాలను సృష్టిస్తాయి. నిత్యతృప్తిని అందించ లేవు.

కృతస్య క్షయిత్వాత్. సృష్టింప బడేది ఏదైనా నశించేదే అంటారు బృహదారణ్య కోపనిష ద్భాష్యంలో శ్రీశంకరాచార్య స్వామి.

కర్మలు చేస్తాం. కర్మఫలాలను అందుకుంటాం. వాటి వల్ల మనకు తాత్కాలికమైన సుఖం కలుగుతుంది. ఆ తరువాత ఫలితం నశించి పోతుంది. ఆ ఫలితం వల్ల కలిగే సుఖం కూడా గతించి పోతుంది. సుఖం గతించినా, ఆ సుఖానుభవం వల్ల మనస్సులో ఏర్పడిన సంస్కారము, లేదా వాసన నశించదు. మనస్సును అంటి పెట్టుకొనే ఉంటుంది. అలాంటి అనుభూతిని తిరిగి పొందాలి అనే వాంఛను రెచ్చ గొడుతూనే ఉంటుంది. ఇదే మనస్సులో ఆవేదన. ఆందోళన.

ఆవేదనతో అంతఃకరణ ఆనందంగా ఉండ లేదు. మనస్సు ఆ వాంఛను తీర్చు కొనేందుకు ప్రయత్నిస్తుంది. కర్మ చేస్తుంది. ఫలాన్ని అనుభవిస్తుంది. మళ్ళీ భోగానుభవ సంస్కారాన్ని తయారు చేసుకుంటుంది. అది మళ్ళీ ప్రేరేపించి కర్మను చేయిస్తుంది. ఈ విధంగా కర్మ సుడిగుండం తయా రవుతుంది.

కర్మ - కర్మఫలం - భోగానుభవం - వాసన, మళ్ళీ వాసనా ప్రేరిత కర్మ - కర్మఫలం - భోగానుభవం - వాసన, లేదా సంస్కారము. ఇలా కర్మచక్రం తిరుగుతూ ఉంటుంది. ఒక దశలో మనం కర్మ సముద్రంలో పడి ఉన్నాము అని అర్థ మవుతుంది. ఈ విధంగా కర్మలు జన్మలకు కారణ మవుతాయే గాని, మోక్ష హేతువులు కాలేవు.

మరి కర్మల వల్ల మోక్షము లభ్యం కానపుడు కర్మలు చేయడం దేనికి? కర్మల నుండి సంపూర్ణంగా విడిపడి పోవచ్చు కదా? అర్జునుని ఆంతర్యం కూడా ఇదే. మంచిదే. కాని, కర్మల నుండి విడిపడటం సాధ్య మేనా?

న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మా ణ్యశేషతః

అర్జునా! శరీరం ఉన్నంత వరకు కర్మలను పూర్ణంగా త్యజించడం ఎవ్వరికీ సాధ్య పడదు అని సాక్షాత్తు గీతాచార్యుడే పద్దెనిమిదవ అధ్యాయంలో చెబుతాడు. ముఖ్యంగా ఈ మూడవ అధ్యాయం లోనే ఆ విషయాన్ని విపులంగా చర్చిస్తాడు కూడా.

దేహము ఉన్నంత వరకు కర్మ చేయకుండా ఉండ లేము. ఏ కర్మ చేసినా అది బంధహేతువే గాని మోక్ష హేతువు కాదు. **కర్మ అనివార్యం - ఆచరిస్తే అనర్థం.** ఇది సర్వ మానవాళి సమస్య.

తరుణోపాయం

కర్మ చేయకుండా ఉండటం సాధ్యం కాదు (**అనివార్యం**). చేసి సాధించేది మాత్రం కర్మఫలమే. బంధమే (**అనర్థం**). దీనికి ఉపాయం ఏమిటో ఆలోచించాలి. మొదటి అధ్యాయాంతంలో 'యోగ' శబ్దార్థాన్ని మనము విపులంగా చెప్పుకున్నాం. అక్కడ 'యోగము' అనే పదానికి మనం చూచిన అర్థాలలో, 'సంగతి' అనే అర్థానికి పీట వేశాం. యోగానికి 'ఉపాయం' అనే మరొక అర్థాన్ని కూడా చెప్పుకున్నాం. ఇక్కడ, ఈ సందర్భంలో అదే సమన్వయం. ఏ ఉపాయాన్ని అనుసరించి ఆచరిస్తే కర్మ బంధహేతువు కాదో, పైగా

మోక్షసాధన మవుతుందో, ఆ ఉపాయమే కర్మయోగము. మూడవ అధ్యాయం లోని సారభూతమైన విషయము. అర్జునుని సందేహంతో ఈ అధ్యాయం ప్రారంభ మవుతూ ఉంది.

అర్జున ఉవాచ :

జ్యాయసీ చే త్కర్మణ స్తే మతా బుద్ధి ర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ 1

జ్యాయసీ-చేత్-కర్మణః-తే-మతా-బుద్ధిః-జనార్దన
తత్-కిం-కర్మణి-ఘోరే-మాం-నియోజయసి-కేశవ

జనార్దన	= కృష్ణా!	కేశవ	= కృష్ణా!
బుద్ధిః	= జ్ఞానము	తత్	= అప్పుడు
కర్మణః	= కర్మ కంటె	ఘోరే	= భయంకరమైన
జ్యాయసీ	= శ్రేష్ఠ మైనది	కర్మణి	= కర్మ యందు
తే	= నీ యొక్క	మాం	= నన్ను
మతా చేత్	= అభిప్రాయమైతే	కిం నియోజయసి	= ఎందుకు నియోగిస్తున్నావు?

అర్జునుడు అడుగుతున్నాడు :

జనార్దనా! కర్మ కంటే జ్ఞానం శ్రేష్ఠ మని నీ అభిప్రాయమా? అదే అయితే, కృష్ణా! భయంకరమైన కర్మల లోకి నన్ను ఎందుకు దించుతున్నావు?

వ్యాఖ్య

ప్రశ్న ఎందుకు?

రెండవ అధ్యాయంలో హేతు, ఫల భూతమైన బుద్ధిద్వయం పరమేశ్వరుని చేత ప్రతిపాదించ బడింది. మొదటిది యోగబుద్ధి, అంటే కర్మయోగ బుద్ధి. రెండవది సాంఖ్యబుద్ధి, అంటే జ్ఞానయోగ బుద్ధి.

కర్మయోగబుద్ధి సాధనము. కనుక హేతుభూతము. జ్ఞానయోగబుద్ధి సాధ్యము. కనుక ఫల రూపము. ఈ రెండిటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించాలి. లేకపోతే, అనేక సంశయాలు తలెత్తుతాయి. ప్రస్తుతం పార్థుని ప్రశ్నకు కూడా ఇదే కారణము.

రెండవ అధ్యాయంలో సాంఖ్యబుద్ధిని అనుసరించి జ్ఞాననిష్ఠను బోధించాడు భగవంతుడు. **ఏషా తే౽భిహితా సాంఖ్యే బుద్ధిః** - ఆత్మజ్ఞాన విషయంలో ప్రతిపాదింప బడిన సాంఖ్యము నీకు చెప్పబడింది. అలాగే **యోగే త్విమాం శృణు** - ఏ ఉపాయంతో కర్మబంధము నుండి విడిపడ గలవో అట్టి కర్మయోగ బుద్ధిని విను అంటూ కర్మయోగాన్ని గూర్చి కూడా ప్రసంగించాడు. ఇంతవరకు ఏ సంశయానికి అవకాశం లేదు.

కాకపోతే, నలభై తొమ్మిదవ శ్లోకంలో ***దూరేణ హి అవరం కర్మ బుద్ధి యోగాత్*** - బుద్ధియోగం కంటే కర్మ నికృష్ట మైనది అని భగవంతుడు తెలిపాడు. ఇక్కడ బుద్ధియోగము అంటే కర్మయోగము. కర్మ అంటే ఫలాపేక్షతో కూడిన సకామకర్మ అని అర్థం. ఈ సందర్భంలో బుద్ధి అనే పదాన్ని సాంఖ్యబుద్ధిగా అర్జునుడు అర్థం చేసుకున్నాడు. పైగా, **బుద్ధౌ శరణ మన్విచ్ఛ** -'నువ్వు బుద్ధినే ఆశ్రయించు' అని అదే శ్లోకంలో చెప్పడం వల్ల, సాంఖ్యము కంటే కర్మ నికృష్టము కనుక సాంఖ్యమునే ఆశ్రయించ మని శ్రీకృష్ణుడు చెప్పినట్లు అర్జునుడు పొరపాటు పడ్డాడు.

అలా పొరపడ్డా నేమో అనే సంశయం కూడా అర్జునునికి లేక పోలేదు. ఈ విషయాన్ని రెండవ శ్లోకానికి వ్యాఖ్యానములో చెబుతాను.

అర్జునుని అవగాహన అలా ఉంది. అదలా ఉంచండి. **మాతే సంగోస్త్వ కర్మణి** - అర్జునా! కర్మలను విడిచి పెట్టకు. **యోగస్థః కురు కర్మాణి** - యోగస్థుడవై కర్మలను ఆచరించు అనే వాక్యాలు భగవంతుడు కర్మను ప్రతిపాదిస్తున్నా డని తెలుస్తూ ఉంది. అలాగే, డెబ్భైయ్యవ శ్లోకంలో జ్ఞానియే పూర్ణశాంతిని పొందుతాడు కాని కోరికలను కోరే కామి పొంద లేడు (**న కామ కామీ**) అని జ్ఞానాన్ని ప్రశంసించడం జరిగింది. సకామ కర్మను నిరసించడం కూడా జరిగింది. అంతకంటే ప్రధానంగా,

బుద్ధి యుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే

సమత్వ బుద్ధి గలవాడు పాపపుణ్యాలు రెండిటిని ఈ లోకము లోనే విడిచి పెట్టేస్తున్నాడు అని యాభై య్యవ శ్లోకంలో భగవంతుడు బోధించాడు. ఇక్కడ సుకృత, దుష్కృతాలను త్యజించే వాడు స్వరూపంతో సహా (అహంకారమే ఇక్కడ స్వరూపం) త్యజిస్తున్నాడు అని అర్జునుడు భావించాడు.

అర్జునుడు క్రొత్తగా విద్యాభ్యాసం చేసిన వాడు కాదు. వేదంలో ప్రవేశ మున్నవాడే. ఒకవేళ అదే క్రొత్త సమస్యల్ని సృష్టిస్తూ ఉందేమో! ఎందుకంటే, వేదంలో సాధ్య సాధనాలను వివరించే కర్మ విషయం విశేషంగా చర్చింప బడి ఉండవచ్చు. కాని కర్మయోగం విషయంలో గీత వలె స్పష్టంగా లేదు. కర్మయోగము వేదంలో ఉన్నదే అయినా, అది కేవలం భగవంతుడైన శ్రీకృష్ణుని అద్భుత అమోఘ సృష్టి అని నిస్సంకోచంగా చెప్ప వచ్చు. ఈ విధమైన స్పష్టత లోపించడం వల్లనే భగవంతుడు పని గట్టుకొని గీతను బోధించాడు. అర్జునుడు కూడా వేదాన్ని ఆలకించిన వాడే కనుక 'సుకృత దుష్కృతాలను త్యజించాడు' అంటే, కర్తతో సహా అని భావించాడు. ఈ విషయాన్ని బృహస్పతి ప్రవచించి ఉన్నాడు కూడా! అర్జునుడికి తెలిసే ఉండొచ్చు.

త్యజ ధర్మ మధర్మంచ ఉభే సత్యానృతే త్యజ
ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తం త్యజ ॥

ధర్మాధర్మములను రెండిటిని విడిచి పెట్టు. సత్యమును, ఋతమును రెండిటిని త్యజించు. దేని చేత విడిచి పెడుతున్నావో దానిని కూడా విడిచి పెట్టు అని బృహస్పతి వచనం. **అహం కర్తా అహంకారః** కనుక, విడిచి పెట్టే అహంకారాన్ని కూడా తుడిచి పెట్టాలని అర్థం చేసుకున్నాడేమో అర్జునుడు!

ఇదీ అర్జునుని సంశయం. ఒక వైపు శ్రీకృష్ణుడు జ్ఞాననిష్ఠను ప్రశంసిస్తున్నాడు. మరొక వైపు కర్మలను ఆచరించ మంటున్నాడు. కర్మ కంటే (**కర్మణః**) జ్ఞానము (**బుద్ధి**) శ్రేష్ఠ మని నీ అభిమత మైతే, కృష్ణా! ఘోర మైన కర్మల లోకి నన్నెందుకు దించు తున్నావు? అని ప్రశ్నిస్తున్నాడు అర్జునుడు. ఈ ప్రశ్నతో మూడవ అధ్యాయం కర్మయోగము ప్రారంభ మవుతూ ఉంది.

ప్రశ్నార్థక మైంది

కర్మ అంటే సకామ కర్మ. బుద్ధియోగము అనేది నిష్కామ కర్మయోగము. బుద్ధియోగము, అంటే నిష్కామ కర్మయోగము కంటే సకామ కర్మ నికృష్ట మని భగవంతుడు బోధించాడు. కాని, జ్ఞానము కంటే నిష్కామ కర్మయోగము నికృష్ట మని అర్జునుడు అర్థం చేసుకున్నాడు. బుద్ధి అంటే కర్మయోగ బుద్ధి అని కనుక అర్జునుడు అర్థం చేసుకొని ఉంటే, ఘోరమైన ఈ కర్మ లోకి నన్నెందుకు పడదోస్తున్నావు? (**తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి**) అని ప్రశ్నించే వాడు కాడు. ఎందుకంటే, నిష్కామ కర్మయోగము ఘోర మెట్లా అవుతుంది?

ఘోరకర్మ అంటే యుద్ధం అని అర్జునుని అభిప్రాయము. యుద్ధ మనేది సాధారణమైన కర్మ కాదు. రక్తపాతంతో కూడిన దారుణమైన కర్మ. పైగా, తాను కోరిందేమో మోక్షము. ఇదేమో ఘోరమైన యుద్ధ కర్మ. పైగా ఏ కర్మకు కూడా మోక్షం ఫలం కాలేదని ఒక వైపు తెలుస్తూ ఉంది. ఇవన్నీ గందరగోళాలే. అన్నీ కలిపి ప్రశ్నార్థక మయ్యాయి. అదే పార్థుని ప్రశ్న.

పైగా తానే మరొక మాట కూడా అంటున్నాడు. పరస్పర విరుద్ధమైన వాక్యాలతో నా బుద్ధిని కలత పెట్టేలా ఉన్నావు అని కూడా అనేశాడు. ఈ రెండిటిలో ఏది శ్రేయోమార్గమో దానిని బోధించ మని అడుగుతున్నాడు.

అదే రెండవ శ్లోకం.

వ్యామిశ్రే ణేవ వాక్యేన బుద్ధిం మోహయ సీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహ మాప్నుయామ్ ॥ 2

వ్యామిశ్రేణ-ఇవ-వాక్యేన-బుద్ధిం-మోహయసి-ఇవ-మే
తత్-ఏకం-వద-నిశ్చిత్య-యేన-శ్రేయః-అహం-ఆప్నుయాం

వ్యామిశ్రేణ ఇవ	= కలిసిపోయి నట్లున్న	శ్రేయః	= శ్రేయస్సును
వాక్యేన	= వాక్యము చేత	ఆప్నుయాం	= పొందగలనో
మే	= నా యొక్క	తత్	= అట్టి
బుద్ధిం	= బుద్ధిని	ఏకం	= ఒక్క దానిని
మోహయసి ఇవ	= మోహింపజేయునట్లు ఉన్నావు	నిశ్చిత్య	= నిశ్చయించి
అహం	= నేను	వద	= చెప్పుము
యేన	= దేని చేత		

కలగా పులగం చేసి నీ మాటలతో నా బుద్ధిని కలవర పెడుతున్నావు. నాకు ఏది శ్రేయస్సు నిస్తుందో ఆ ఒక్క దానినే నిశ్చయంగా చెప్పు.

వ్యాఖ్య

గీతాచార్యుడు పలికిన మాట అర్జునునికి వ్యామిశ్రంగా కనిపిస్తూ ఉంది. వ్యామిశ్రం అంటే సంకీర్ణము, లేదా కలిసి ఉండటము అని అర్థము. పాలు, నీళ్ళు కలిసి ఉండటం వ్యామిశ్రం. ఆ విధంగా శ్రీకృష్ణుని వచనం కలగాపులగం లాగా అగుపిస్తూ ఉంది అంటున్నాడు. వ్యామిశ్రంతో పాటు మోహాన్ని కూడా కలిగించే టట్లు ఉంది అని అంటున్నాడు. ఈ విధమైన రెండు సందేహాలను అర్జునుడు వ్యక్తం చేశాడు. శ్రీకృష్ణుడు పరస్పర విరుద్ధంగా కనిపించే రెండు మార్గాలను సంకీర్ణం చేసి సంభాషించడం వల్లనే ఈ రెండు సంశయాలు ఉత్పన్న మైనట్లు చెబుతున్నాడు. జ్ఞానకర్మ సముచ్చయం వల్లనే ఈ గందరగోళ మంతా తల ఎత్తిందని అర్జునుని అభిప్రాయము (వృత్తికారుని మతమైన సముచ్చయ వాదము గీతకు అంగీకారం కాదు. సమ్మతము కాదు). శ్రీకృష్ణుడు జ్ఞానకర్మలు ఏకమైతేనే శ్రేయస్సు అని చెప్పలేదు. ఈ విషయాన్ని అర్జునుడు కూడా గ్రహించాడని తెలుస్తూ ఉంది. లేకపోతే, రెండిటిలో ఏది నాకు శ్రేయస్సో, ఆ ఒక్క దానినే బోధించు కేశవా అని అడిగి ఉండేవాడు కాదు కదా!

సముచ్చయం కాదు - సందేహం లేదు

ఒక వైపు జ్ఞానాన్ని ప్రబోధిస్తూ, మరొక వైపు కర్మను ఆచరించ వలసిందిగా కర్మయోగాన్ని విశేషంగా

ప్రతిపాదించాడు వాసుదేవుడు. అంటే, జ్ఞానకర్మలను ఒకే కాలంలో ఒకే వ్యక్తి ఆచరించాలా? అదెలా సాధ్యం? లేక రెండూ ఆచరణీయము లని చెప్పడంలో భిన్న కర్తృక మని భావమా? భిన్న కర్తృకము అంటే భిన్నమైన కర్తలు ఆచరించడము అని అర్థం. దీనిని కాస్త స్పష్టంగా అర్థం చేసుకుందాం.

జ్ఞానకర్మలు రెండిటిని ఒకే వ్యక్తి ఆచరించాలా? రెండిటిని ఆచరించడానికి అధికారి ఒక్కడేనా? ఏకాధికారమా? లేక, జ్ఞానకర్మలను వేరు వేరు వ్యక్తులు ఆచరించాలా? భిన్నాధికారమా? అంటే కొందరు కర్మను, కొందరు జ్ఞానమును ఆచరించాలి అని భావమా?

అది ఏకాధికారము, రెండిటిని ఒక్కడే ఆచరించాలి అని అంటే, పరస్పర వైరుధ్యము గల జ్ఞానకర్మలను ఒకే వ్యక్తి ఏక కాలంలో ఆచరించడం సాధ్యం కాదు కదా! అలాంటప్పుడు జ్ఞానకర్మల సముచ్చయం అనుపపన్నం కాదా?

లేదు, భిన్నాధికారమే అని అంటావా? కొందరు కర్మాధికారులు, కొందరు జ్ఞానాధికారులు అని అంటావా? అలాంటప్పుడు నేను దేనికి అధికారినో, అది నాకు చెప్పాలి గాని, రెండూ చెబుతున్నావు ఎందుకని కృష్ణా?

నాకు ఏదైనా ఫరవాలేదు. నాకు కావలసింది మాత్రం మోక్షం. శ్రేయస్సు. దేని వల్ల నేను శ్రేయస్సును పొందుతానో ***(యేన శ్రేయోஉహ మాప్నుయామ్)***. ఆ ఒక్క దానిని నాకు నిశ్చయించి చెప్పు ***(తత్ ఏకం నిశ్చితం వద)*** అంటున్నాడు అర్జునుడు.

జ్ఞానకర్మలలో ఏది శ్రేష్ఠం? అని అడిగితే, జ్ఞానమే శ్రేష్ఠము అంటున్నాడు శ్రీకృష్ణుడు. మరి నేను ఏమి చెయ్యాలి కృష్ణా? అని అడిగితే, అర్జునా! యోగస్థుడవై కర్మల్ని ఆచరించు అని శ్రీకృష్ణుడే ఆదేశిస్తున్నాడు. ఇదీ గందరగోళము. మోక్షానికి జ్ఞానమే సాధనము. నువ్వు మాత్రం కర్మల్ని విడిచి పెట్టకు అని గీతాచార్యుని ప్రబోధం. ఇక్కడే వ్యామిశ్రాన్ని చూస్తున్నాడు అర్జునుడు.

జ్ఞానమే శ్రేష్ఠమైతే, కర్మల లోకి నన్ను దించడ మెందుకు? జ్ఞానమును, కర్మలను రెండిటిని అనుష్ఠించాలి అంటావా? జ్ఞానకర్మలకు కర్తలు భిన్నం కదా? జ్ఞానానికి కర్త వేరు. కర్మకు కర్త వేరు ***(భిన్న కర్తృకయోః జ్ఞాన కర్మణోః)***. కనుక ఒకే వ్యక్తి రెండిటిని ఏక కాలంలో ఆచరించడం అసంభవం ***(ఏక పురుష అనుష్ఠాన అసంభవం)***. కాబట్టి ఈ రెండిటిలో ఏదో ఒక్కటే ఆచరణీయం. ఆ ఒక్కటి ఏదో దానిని నిశ్చయించి చెప్పు అని అర్థిస్తున్నాడు అర్జునుడు.

ఆరోపణము కాదు - అభ్యర్థనము

కృష్ణా! కలగాపులగం చేసినట్లు **(వ్యామిశ్రేణ ఇవ)** ఉన్న నీ మాటలతో నా బుద్ధిని మోహానికి గురి చేసినట్లు **(మోహయసి ఇవ)** ఉన్నావు అన్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుని వచనం కలగాపులగం అనేది అర్జునుని వాస్తవమైన అభిప్రాయమా? కానే కాదు. ఎందుకని? కలగాపులగం అయినదాని 'వలె' ***(ఇవ)*** ఉంది అన్నాడు. అలాగే శ్రీకృష్ణుని భాషణము తనను మోహానికి గురి చేసింది అనేది అర్జునుని అభిమతమా? ముమ్మాటికీ కాదు. అందుకే మోహానికి గురి చేసినదాని 'వలె' ***(ఇవ)*** ఉంది అన్నాడు.

'కృష్ణా! నీ మాటలు వ్యామిశ్రము, మోహయుతము' అని కనుక అర్జునుడు పలికి ఉంటే, భగవద్గీతను శ్రవణం చేయడానికి అర్జునుడు అర్హుడే కాడు. 'కృష్ణా! నేను నీకు శిష్యుణ్ణి. నన్ను శాసించు. బోధించు' అని శరణాగతు డైనవాడు అలా అభియోగాన్ని మోపుతాడా?

కృష్ణుడు అర్జునుడికి అపరిచితు డేమీ కాదు. కాని, ఇప్పుడు శ్రీకృష్ణుడు కేవలం పరిచితుడుగా లేడు. స్నేహితుడిగా లేడు. బంధువుగా లేడు. గురువుగా ఉన్నాడు. జగద్గురువుగా శోభిస్తున్నాడు.

'నేను గురువును' అని శ్రీకృష్ణుడు ప్రకటించుకోలేదు. 'నేను శిష్యుణ్ణి' అని అర్జునుడే తన శ్రద్ధను ప్రకటించు కున్నాడు. బిడ్డ ఉంటేనే తల్లి. శిష్యుడు ఉంటేనే గురువు. బిడ్డకు ఒకే తల్లి. శిష్యుడికి ఒకే గురువు. అర్జునుని అదృష్టం కొద్ది జగద్గురువే అతనికి ఆచార్యు డయ్యాడు.

గురువుతో 'నన్ను నువ్వు కలవర పెడుతున్నావు' అని శిష్యుడు భాషించడమా! అది ఘోరపాపం కాదా? మోహాన్ని మాయం చేసే మహితాత్ముడైన ఆచార్యుని నువ్వు నాకు మోహాన్ని కలిగించేలా బోధిస్తున్నావు అని అనవచ్చా? ఇది మహాదారుణం. శిష్టాచార సంప్రదాయంలో ఊహించ డానికి కూడా వీలు లేని మహాపరాధం. అలాంటి అపచారాన్ని కౌంతేయుడు చేస్తాడా? చెయ్యడు. చెయ్యలేడు.

అందుకే **ఇవ - ఇవ** అంటూ వినమ్రుడై పలికాడు. అలా కనిపిస్తున్నాయి అని అర్థము. గురుదేవా! నీ వాక్యాలు అద్భుతాలు. అమోఘాలు. కాని, మంద బుద్ధి నైన నాకు అర్థంగాక, అవి సంకీర్ణంగా గోచరిన్నాయి. సముచ్చయంగా అర్థమౌతున్నాయి. ఇదే మోహం. నువ్వు కలిగించింది కాదు. నేను కల్పించుకున్నది అంటూ, అర్జునుడు అభిప్రాయ పడుతున్నాడే గాని ఆరోపణ చేయడం లేదు. అదే 'ఇవ' శబ్దార్థము. ఆచార్యుల వారు కూడా తమ భాష్యంలో ఇలాగే అభిప్రాయ పడ్డారు.

భగవాన్! వివిక్తాభిధాయీ! నువ్వు సుస్పష్టం గానే చెబుతావు. నేను మందబుద్ధిని కనుక, నాకు వ్యామిశ్రంలా కనిపిస్తోంది ***(మమ మంద బుద్ధేః వ్యామిశ్రం ఇవ భగవద్వాక్యం ప్రతిభాతి)***. మోహమంతా నా స్వయంకృతమే. నన్ను మోహజాలం నుండి బయట పడేయాలని బోధిస్తున్న నువ్వు నన్ను ఎందుకు మోహానికి గురి చేస్తావు? ***(మమ బుద్ధి వ్యామోహ అపనయాయ హి ప్రవృత్తః త్వం తు కథం మోహయసి?)***. అని గుండెలు కరిగే గురుభక్తి వచనాలతో అర్జునుని హృదయాన్ని ఆవిష్కరించారు పూజ్యపాదులు శ్రీ ఆది శంకరాచార్య స్వామి. శ్రీకృష్ణుణ్ణి అర్జునుడు 'వివిక్తాభిధాయీ' అని పిలిచాడు భాష్యంలో. 'వివిక్తాభిధాయి' అంటే, ఏ విషయానికి ఆ విషయాన్ని విడమరచి చెప్పేవాడు అని అర్థము.

మధుసూదన సరస్వతి వ్యాఖ్యానము కూడా ఆచార్యుల వారి మార్గం లోనే ఉంది. **ఇవ** శబ్దార్థాన్ని చెబుతూ, భగవాన్! నీవు పరమ కరుణామూర్తివి. నీలో మోహకత్వం లేదు. అయినా, నా భ్రాంతి చేత మోహము నాలో భాసిస్తుంది అని అర్జునుని ఆంతర్యాన్ని విప్పి చూపాడు ***(పరమ కారుణికస్య తవ మోహకత్వం నాస్తి ఏవ. తథాపి భ్రాన్త్యా మమైవం భాతీతి ఇవ శబ్దే నోక్తమ్)***.

అర్జునుడు ఆదర్శం

వేదాంత శాస్త్రంలో బోధ చాలా ప్రధానమైంది. బోధ ఎంత ప్రధానమో బోధనా విధి అంత ప్రధానము. అదే సంప్రదాయము. సంప్రదాయాన్ని తెలిసి బోధించే సద్గురువు లభించడం ముముక్షువుల అదృష్టం. జిజ్ఞాసువుల భాగ్యం. అలాంటి గురువరేణ్యులతో ఎలా భాషించాలి, వారి వద్ద ఎలా ప్రవర్తించాలి అనే విషయంలో అర్జునుణ్ణి ముముక్షు జనులు ఆదర్శంగా తీసుకోవాలి. 'ఇవ' శబ్దాన్ని ప్రయోగించి, వ్యామిశ్రం అనకుండా, వ్యామిశ్రం వలె ఉన్నది అనడం శిక్షణ యోగ్యుడైన శిష్యుని యొక్క విశిష్ట గుణాన్ని తెలుపుతూ ఉంది. మనం దోషయుతంగా ప్రవర్తించినా, దోషాలకు అతీతులైన గురువులు పట్టించుకోరు. అలాగని, సామాన్య వ్యక్తులతో మెలగినట్లే గురువులతో కూడా ప్రవర్తించే సంస్కారం గల శిష్యుడు శిక్షణార్హుడేనా?

కర్మయోగం అర్జునుని ప్రశ్నతో ప్రారంభ మైంది. ఒక విధంగా చూస్తే సంశయంతో కూడిన అర్జునుని ప్రశ్న భగవద్గీతలో ఇదే మొదటిది అని చెప్పవచ్చు. మున్ముందు మరెన్నో సంశయాలను ప్రశ్నల రూపంలో భగవంతుని ముందు ఉంచి, వాటికి సమాధానాలను అందుకుంటాడు అర్జునుడు.

రెండవ అధ్యాయంలో యాభై నాల్గవ శ్లోకంలో *స్థితప్రజ్ఞస్య కా భాషా?* అని అర్జునుడు ప్రశ్నించాడు కదా! అనే సంశయం మీకు రావచ్చు. అదీ ప్రశ్నే. కాని, అది సందేహంతో కూడిన ప్రశ్న కాదు. స్థితప్రజ్ఞుని వైభవాన్ని వివరించ మని ఉత్సుకతతో కోరిన వాక్యం. ఇక్కడే, కర్మయోగం ప్రారంభం లోనే, అర్జునునిలో సందేహాయుత మైన మొదటి ప్రశ్న తలెత్తింది.

వాస్తవానికి ఈ సంశయం అర్జునునికి రెండవ అధ్యాయంలో కర్మయోగం గురించి ఆలకించి నపుడే కలిగింది. కాకపోతే, స్థితప్రజ్ఞత్వం అనే విషయమును శ్రీకృష్ణుడు చెప్పగానే, వెంటనే స్పందించిన పార్థుడు, స్థితప్రజ్ఞ వైభవాన్ని వివరించ మని అర్థించాడు. అది పూర్తి కాగానే, తన మనసును కలత పెడుతున్న సంశయాన్ని నివృత్తి చేసుకోవాలని భావించి మూడవ అధ్యాయం ఆరంభం లోనే జగద్గురువును పరిప్రశ్నించాడు.

సంబోధనమే సర్వసిద్ధి మంత్రం

కర్మయోగంలో ఆరంభ శ్లోకాలు రెండూ అర్జునుని ప్రశ్నలే. అయితే, ఈ సందర్భములో గీతాచార్యుని ***జనార్దనా! కేశవా!*** అని యుక్తియుక్తంగా, భావయుతంగా సంబోధించాడు పాండునందనుడు. తనకు కావలసింది ఏమిటో మళ్ళీ మళ్ళీ అడిగి పునరుక్తితో పురుషోత్తముని విసిగించ కుండా, సంబోధన తోనే సంచి నింపుకొనే ప్రయత్నం చేశాడు. అందుకే ***జనార్దనా!*** అని ఆర్తితో పలుకు తున్నాడు. తనకు మోక్షమే కావాలి అని పునరుద్ఘాటిస్తున్నాడు.

జనైః పురుషార్థం అభ్యుదయ నిశ్శ్రేయస లక్షణం యాచ్యతే ఇతి జనార్దనః

అభ్యుదయ నిశ్శ్రేయస లక్షణమైన పరమ పురుషార్థమును గూర్చి జనుల చేత కోరబడే వాడు జనార్దనుడు. మోక్షమును ప్రసాదించ మని జనులందరూ ఎవరిని యాచిస్తారో అతడే జనార్దనుడు.

అర్జునుడు శ్రేయస్సును వాంఛిస్తున్నాడు. మోక్షాన్ని కోరుకుంటున్నాడు. ఈ విషయాన్ని ఇప్పటికి మూడుసార్లు శ్రేయస్సు - శ్రేయస్సు - శ్రేయస్సు అని ప్రస్తావించాడు. మళ్ళీ ఐదవ అధ్యాయం ప్రారంభంలో కూడా అడుగుతాడు. కనుకనే ఈ సందర్భంలో శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రశ్నించి, పునరుక్తిని పలకలేక సంబోధన తోనే అర్థిస్తున్నాడు. ఇదంతా భావసౌందర్యం. ఆధ్యాత్మిక మార్గంలో శిష్యుడైన వానికి ఉండవలసిన సమయోచిత, సందర్భోచిత భావపుష్టి.

జనార్దనా! అని సరిపెట్టుకోలేదు. మళ్ళీ, ***కేశవా!*** అని కూడా ప్రార్థించాడు. జనార్దనుడు కేశవుడు ఎలా అవుతాడో విష్ణుపురాణం వైభవంగా ప్రవచించింది.

కేశి వధాద్వా 'యస్మాత్త్వయైష దుష్టాత్మా హతః కేశీ జనార్దన' తస్మాత్ కేశవ నామ్నా త్వం లోకే ఖ్యాతో భవిష్యసి

జనార్దనా! దురాత్ముడైన 'కేశి' అనే రాక్షసుణ్ణి వధించావు. ఈ కారణంగా నువ్వు లోకంలో 'కేశవ' నామంతో విఖ్యాతుడవు అవుతావు అని శ్రీకృష్ణునితో విన్నవించు కున్నాడు నారదమహర్షి.

'కేశి' ఎవరో కాదు. అజ్ఞానమే కేశి. అజ్ఞానం నశిస్తేనే మోక్షం ప్రాప్తిస్తుంది. ***కేశవా! నా అజ్ఞానాన్ని పోగొట్టు. జనార్దనా! నాకు మోక్షాన్ని ప్రసాదించు*** అంటూ దివ్య భావస్ఫూర్తితో పరమాత్మను సంబోధిస్తూ సంభాషించాడు పార్థుడు.

కనుక, కర్మజ్ఞానాలలో ఏదో ఒకటి నిశ్చయించి చెప్పు కృష్ణా! అని అర్జునుడు ప్రార్థిస్తూ ప్రశ్నించాడు. పార్థుని ప్రశ్నకు పార్థసారథి ప్రతివచనం పలుకుతున్నాడు.

శ్రీభగవానువాచ :

లోకేఽస్మి న్ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3

లోకే-అస్మిన్-ద్వివిధా-నిష్ఠా-పురా-ప్రోక్తా-మయా-అనఘ
జ్ఞానయోగేన-సాంఖ్యానాం-కర్మయోగేన-యోగినాం

అనఘ	=	పాపరహితుడా!	జ్ఞానయోగేన	=	జ్ఞానయోగము చేత
పురా	=	పూర్వము	యోగినాం	=	యోగులకు
అస్మిన్	=	ఈ	కర్మయోగేన	=	కర్మయోగము చేత
లోకే	=	లోకమున	ద్వివిధా	=	రెండు విధాలుగా
మయా	=	నా చేత	నిష్ఠా	=	నిష్ఠ
సాంఖ్యానాం	=	సాంఖ్యులకు	ప్రోక్తా	=	చెప్ప బడింది

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

పాప రహితా! పార్థా! ఈ లోకంలో అనుష్ఠాన పద్ధతులు రెండు విధాలు అని పూర్వం నేనే చెప్పాను. సాంఖ్యులకు జ్ఞానయోగము. యోగులకు కర్మయోగము.

వ్యాఖ్య

ప్రతి వచనం ఫలదాయకం

జనార్దనా! కేశవా! అంటూ తన సంశయాన్ని ప్రశ్న రూపంలో భగవంతుని ముందు ఉంచాడు అర్జునుడు. అర్జునుని ప్రశ్నకు సమాధానం చెబుతూ, సంబోధన తోనే సంతృప్తి పరుస్తూ శుభం పలికాడు సర్వేశ్వరుడు.

అజ్ఞాన నివృత్తికి ***కేశవా!*** అంటూ, మోక్షప్రాప్తికి ***జనార్దనా!*** అంటూ అర్జునుడు సంబోధిస్తే, ***అనఘా!*** అంటూ ప్రతివచనం పలికి, జ్ఞానబోధను గ్రహించి తరిస్తావు అని భగవానుడు అభయ ప్రదానం చేశాడు.

అనఘా! అంటే, పాపరహితుడా! అని అర్థం. భగవద్గీత సమాప్తి సమయంలో అర్జునుణ్ణి 'మహాత్ముడు' అని శ్లాఘించాడు సంజయుడు. మహాత్ముడంటే ఎవరు? పాపాన్ని చూచి భీతి చెందే వాడే మహాత్ముడు. పాపాచరణము సహించ లేని సత్పురుషుడే మహాత్ముడు.

అర్జునుని జీవితంలో కళంక మనేది కాగడా పెట్టి వెతికినా కనిపించదు. ధర్మమే ఊపిరిగా భావించి జీవించిన పవిత్రాత్ముడు. అందుచేతనే, గీతా శ్రవణానికి అర్హు డయ్యాడు. సాక్షాత్తు భగవంతుని కరుణకు పాత్రుడై, ఆదిదేవుణ్ణే ఆచార్యునిగా పొందాడు. అలాంటి వానికి పాప మెక్క డుంటుంది? అందుకే అర్జునుడు అనఘుడు.

అర్జునా! అనఘా! మిశ్రమ వాక్యాలతో నిన్ను నేను కలత పెట్ట లేదు. నిన్ను నీవే కలత పెట్టుకున్నావు. అర్జునా! నిన్ను నేను మోహ కాలుష్యానికి గురి చేస్తానా? బిడ్డ మట్టిలో ఆడి మలిన పడితే, తల్లి స్నానం చేయిస్తుంది కదా! నీ విషయంలో నేనూ అంతే. మోహజాడ్యాన్ని నీవు తయారు చేసుకున్నావు. పవిత్రమైన జ్ఞానజలంలో నీకు ఆగంతుకంగా ప్రాప్తించిన అవివేకాన్ని పోగొట్టి బుద్ధిని శుద్ధి చేస్తాను అనే సంకేతాన్ని 'అనఘా' అనే సంబోధన ద్వారా ఇస్తూ బోధను ప్రారంభిస్తున్నాడు భగవంతుడు.

ఉభయ నిష్ఠలు

ఈ లోకంలో రెండు నిష్ఠ లున్నాయి. సాంఖ్యులకు జ్ఞాననిష్ఠ. యోగులకు కర్మయోగ నిష్ఠ. ఈ రెండిటిని పూర్వం ఈ లోకంలో తానే చెప్పినాడట. ఇది భగవానుని ప్రతివచనంలో ప్రథమ విషయం. ముందుగా నిష్ఠ అంటే ఏమిటో తెలుసుకుందాం.

నిష్ఠా స్థితిః అనుష్ఠేయ తాత్పర్యమ్. 'నిష్ఠ' అంటే స్థితి. ఆచరించ వలసిన విషయంలో తత్పరత్వం. విహిత కర్మల యందు నియమంతో కూడిన అనుష్ఠానము. ధ్యానయోగి ధ్యానం చేస్తూ ఉంటాడు. అంటే, అతడు ధ్యానము నందే తత్పరుడై ఉంటాడు. అది ధ్యానయోగి యొక్క స్థితి. అదే ధ్యాననిష్ఠ. తపస్సు నందు తత్పరుడై ఉండటం తపోనిష్ఠ. వ్రతమును ఆచరించుటలో తదేక దృష్టితో వ్యవహరించడం వ్రతనిష్ఠ. బ్రహ్మము నందే బ్రహ్మభావనతో ఉండటం బ్రహ్మనిష్ఠ. జ్ఞానం విషయంలో తదేక చింతనము కలిగి ఉండే స్థితి జ్ఞాననిష్ఠ. కర్మల యందు లగ్నమై ఉండే స్థితి కర్మనిష్ఠ. ఇది 'నిష్ఠ' శబ్దార్థము. అనుష్ఠానంలో నిశ్చయాత్మక మైన స్థితి. నియమబద్ధ మైన అనుష్ఠాన పద్ధతి.

ఈ లోకంలో ***(అస్మిన్ లోకే)*** రెండు విధాలైన నిష్ఠ ***(ద్వివిధా నిష్ఠా)*** పూర్వము ***(పురా)*** నా చేతనే చెప్ప బడింది ***(మయా ప్రోక్తా)*** అంటున్నాడు అచ్యుతుడు. సాంఖ్యులకు జ్ఞానయోగ నిష్ఠ ***(జ్ఞాన యోగేన సాంఖ్యానాం)***. యోగులకు కర్మయోగ నిష్ఠ ***(కర్మయోగేన యోగినామ్)***. ఇదీ అసలు విషయం.

రెండు విధాలైన అనుష్ఠాన పద్ధతిని పూర్వం తానే చెప్పినట్లు చెబుతున్నాడు. ఇక్కడ 'పూర్వం' అంటే సృష్ట్యారంభంలో అని అర్థం ***(సర్గాదౌ)***. అంటే, సృష్టికి పూర్వమే సృష్టికి సంబంధించిన జ్ఞానం ఉంది. అదే వేదజ్ఞానం. ఆ జ్ఞానం తోనే భగవంతుడు సృష్టి కార్యాన్ని చేశాడు.

సృష్టి, సృష్టి జ్ఞానము ఒక్కటే. సృష్టి జ్ఞానము సృష్టి కర్తదే. కనుక ఆయన నుండే సృష్టికి జ్ఞానం అందాలి. అలాగే అందింది. కాకపోతే, ఎన్నో లోకాలు ఉండగా, పవిత్రమైన వేదజ్ఞానము, వేదజ్ఞానము ప్రతిపాదించే ద్వివిధా నిష్ఠ ఈ లోకంలో మాత్రమే చెప్ప బడింది. మరొక లోకంలో చెప్పబడ లేదు ఎందుకని? అడవిలో వెన్నెల కాచినా ప్రయోజనము ఉండదు కనుక.

జ్ఞానబోధ యొక్క ఆవశ్యకత ఏమిటి? మోక్షప్రాప్తి. అంతే కదూ? మోక్షార్హత మానవ లోకంలో ఉందే గాని, మరొక లోకంలో లేదు. మానవ లోకము ఒక్కటే కర్మభూమి. మిగతా లోకాలన్నీ భోగ భూములు. కర్మభూములు కావు. అందుచేత ఈ లోకానికే వేదజ్ఞానం, వేదాంత జ్ఞానం ప్రసాదించ బడింది.

అర్జునా! అందుచేత ఈ లోకానికే నేను పూర్వం ద్వివిధా నిష్ఠను అందించాను. కృష్ణా! కుబేర లోకంలో ఎందుకని వితరణ చేయలేదు? చేయ కూడదని కాదు గాని, చేసినా ప్రయోజనం ఉండదని! చిక్కుల నుండి బయట పడాలి అనే ఆరాటం వాళ్ళకు లేదు. చెక్కులను పోగు చేసుకోవాలి అనే ఉత్సాహం నాకు లేదు. అందుకే ఇక్కడే బోధించాను. మోక్షాన్ని జన్మహక్కుగా పొంది, పరమేశ్వరా! నీవే దిక్కు అనే ముముక్షువులు ఇక్కడే ఉన్నారు కనుక, ఇక్కడే బోధను అందించాను. అభ్యుదయ నిశ్శ్రేయసలకు సాధనమైన వేద సంప్రదాయాన్ని ఆవిష్కరించి, బోధించిన సర్వేశ్వరుడను నేనే ***(అభ్యుదయ నిశ్శ్రేయస ప్రాప్తి సాధనం వేదార్థ సంప్రదాయమ్ ఆవిష్కుర్వతా, ప్రోక్తా, మయా సర్వజ్ఞేన ఈశ్వరేణ)***.

ఒక్కటే గమ్యము - ఒక్కటే మార్గము

అర్జునుడు శ్రేయస్సును అర్థించాడు. శ్రేయస్సు అంటే మోక్షము. అందరికీ మోక్షం కావాలి. కనుక అందరికీ మోక్షమే ఏకైక గమ్యము.

మరి, మోక్షము ఎక్కడుంది? మోక్షము జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలిగితేనే మోక్షం కలుగుంది. దీనికి మరొక మార్గం లేదు. జ్ఞానము ద్వారానే మోక్షం లభిస్తుంది అనేది సర్వ ఉపనిషత్తుల యొక్క ఏకైక తాత్పర్యం ***(జ్ఞానాత్ మోక్షా ఇతి చ సర్వోపనిషదాం సిద్ధాన్తః)*** అని శ్రీ శంకరుల ఉపనిష ద్భాష్యము.

మోక్షము గమ్యము. అందుకు జ్ఞానమే మార్గము. మరి, ఈ ద్వివిధా నిష్ఠ ఏమిటి? ద్వివిధా నిష్ఠ అంటే రెండు రకాలైన మార్గాలు సమాంతరంగా ఉన్నాయని అర్థం కాదు. ద్వివిధా నిష్ఠ అంటే రెండు రకాలైన వ్యక్తులు ఉన్నారు, వాళ్ళను బట్టి రెండు విధాలైన నిష్ఠను బోధించ వలసి వచ్చింది అని భావం. నిష్ఠ రెండు విధాలుగా గోచరిస్తున్నా, మోక్షమనే ఏక గమ్యాన్ని చేరే సరికి, ఒక్క నిష్ఠే మిగిలి ఉంటుంది. అదే జ్ఞాననిష్ఠ. అదెలాగో అర్థం చేసుకుందాం.

జ్ఞాన నిష్ఠ

సాంఖ్యులకు, అంటే సన్యాసులకు జ్ఞానయోగ నిష్ఠ ప్రతిపాదించ బడింది. బ్రహ్మచర్యాశ్రమము నుండే సన్యసించిన వివేకవంతులకు, వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థులైన యతిపురుషులకు జ్ఞాననిష్ఠ చెప్ప బడింది. బ్రహ్మ విషయము నందే స్థిరంగా ఉన్న పరివ్రాజకులకు ***(బ్రహ్మణ్యేవ అవస్థితానాం)*** జ్ఞాననిష్ఠయే అనుష్ఠాన పద్ధతి.

జ్ఞానయోగము అంటే జ్ఞానమే యోగము అని అర్థం ***(జ్ఞానమ్ ఏవ యోగః జ్ఞానయోగః)***. బ్రహ్మమే సత్యమని, ఆత్మయే బ్రహ్మమని ఎరిగిన వారు సాంఖ్యులు, లేదా సన్యాసులు. శ్రవణ మనన నిదిధ్యాసల ద్వారా పొందబడు 'నేనే బ్రహ్మము' అనే అఖండ బ్రహ్మాకార వృత్తి చేత నిశ్చలమైన స్థితిని లేదా నిష్ఠను కలిగి ఉండటమే జ్ఞానయోగ నిష్ఠ ***(జ్ఞాన యోగేన సాంఖ్యానామ్)***.

జ్ఞాననిష్ఠలో ఉన్న వారికి మరొక వ్యాపకము ఉండదు. ఆత్మవిచార ధ్యానమే ప్రధానమైన సాధన. అదే జ్ఞాననిష్ఠ, లేదా బ్రహ్మనిష్ఠ. వీరిది నివృత్తి మార్గము. నిరాకార పరబ్రహ్మమునే చింతన చేయువారు జ్ఞాననిష్ఠులు. సాంఖ్యులు. సన్యాసులు. సన్యాసులు కాని వారు, గృహస్థాశ్రమంలో కర్మలలో చరించు వారు అనుసరించ వలసింది జ్ఞాననిష్ఠ కాదు. కర్మయోగ నిష్ఠ.

కర్మయోగ నిష్ఠ

కర్మయోగము అంటే కర్మమే యోగముగా గలది అని అర్థం ***(కర్మ ఏవ యోగః కర్మయోగః)***. ఈ విధమైన కర్మయోగము యోగులకు, అనగా కర్మలను ఆచరించే గృహస్థులకు అనుష్ఠాన పద్ధతిగా చెప్ప బడింది. అదియే కర్మయోగ నిష్ఠ.

కర్మ పరిమితమై, పరిమితమైన ఫలాలను ఇస్తుంది కనుక కర్మ బంధహేతువు. సాధకుడైన వాడు ఈశ్వర భావనతో కర్మలను ఆచరిస్తాడు కనుక అవి బంధహేతువులు కావు. కర్మయోగి కర్మలను ఆచరిస్తాడే గాని, కర్మల చేత గాని, కర్మఫలాల చేత గాని బద్ధుడు కాడు.

నేను కర్తను కాను. హరియే కర్త ***(నాహం కర్తా - హరిః కర్తా)***. పరమేశ్వరుని సేవకుడుగా నేను కర్మలను ఆచరిస్తున్నాను అనే భావనలో చరిస్తాడు ***(ఈశ్వర భృత్యవత్ అహం కరోమి)***. కర్మాచరణములో కర్తృత్వమును విడిచి, ఫలానుభవము నందు సంగత్వము లేకుండా ఉంటాడు. కర్మలను పరమేశ్వరునికి నైవేద్యంగా సమర్పించి, లభించిన ఫలాలను ప్రసాదంగా స్వీకరిస్తూ, రాగద్వేషముల నుండి విడిపడి ఉంటాడు. ఈ విధంగా విశుద్ధ మైన, ప్రసన్నమైన చిత్తమును కర్మయోగ నిష్ఠలో పొందుతాడు. ఇతడే కర్మయోగి. ఇతని అనుష్ఠాన పద్ధతి కర్మయోగ నిష్ఠ. ఇతనిది ప్రవృత్తి మార్గము. ఈశ్వర దర్శన ప్రాప్తియే కర్మయోగ ఫలము.

పార్థుని పరిస్థితి

సన్యాసిది జ్ఞాననిష్ఠ. యోగిది కర్మయోగ నిష్ఠ. జ్ఞానమార్గంలో చరించే యతి పురుషులకు జ్ఞానమే మార్గము. కర్మమార్గంలో చరించే గృహస్థులకు జ్ఞానయుతమైన కర్మయే మార్గము. ఇలా, రెండు విధాలుగా నిష్ఠ తెలుస్తూ ఉండినా, గమ్యము మాత్రము ఒక్కటే. అదే మోక్షము.

ఈ రెండిటిలో అనగా, జ్ఞాన కర్మలలో ఏది శ్రేష్ఠము? రెండూ శ్రేష్ఠమే. శ్రేష్ఠము కానిది సకామకర్మ ఒక్కటే. కర్మయోగమూ శ్రేష్ఠమే. జ్ఞానయోగమూ శ్రేష్ఠమే. ఈ రెండు మార్గాలలో దేనినైనా గ్రహించ వచ్చు.

జ్ఞానమార్గానికి అర్హులైన వారికి జ్ఞాననిష్ఠ శ్రేష్ఠము. జ్ఞాననిష్ఠకు అర్హులు కాని వారికి కర్మయోగ నిష్ఠ శ్రేష్ఠము. ఇక్కడ ఒక్క విషయం సుస్పష్టంగా తెలియాలి. మనం ఆశ్రయించ వలసింది జ్ఞానయోగమునో, లేక కర్మయోగమునో గాని, జ్ఞానమునో, లేక కర్మనో కాదు.

మోక్షమును పరమావధిగా భావించి, సన్యాసి జ్ఞానయోగంలో ఉంటాడు. మోక్షమునే పరమ పురుషార్థంగా భావించి గృహస్థుడు కర్మయోగంలో ఉంటాడు. ఇక్కడే సాధారణ కర్మ కర్మయోగంగా మారుతూ ఉంది.

జ్ఞానమే శ్రేష్ఠమని నీ అభిప్రాయ మైతే, ఘోరమైన యుద్ధకర్మలో నన్ను ఎందుకు దించుతున్నావు? అని అర్జునుడు ప్రశ్నించాడు.

అర్జునుడు సన్యాసి కాడు. గృహస్థుడు. కనుక కర్మయోగి కావలసిన వాడే గాని, సర్వకర్మల్ని సన్యసించి జ్ఞాననిష్ఠలో ఉండ వలసిన వాడు కాడు. కర్మలు చేయ వలసిన వాడే గాని, కర్మలను విడిచి పెట్ట వలసిన వాడు కాడు.

కర్మయోగం ద్వారానే జ్ఞానయోగం

కేవలం కర్మలను విడిచినంత మాత్రాన, అలా విడిచిన వాడు సన్యాసి కాలేడు. కర్మయోగంలో శుద్ధి పడిన వాడే జ్ఞానయోగంలో స్థిరంగా ఉంటాడు. చాలా మంది సన్యాసం పుచ్చుకొని, ఆ తరువాత ఎందుకు పుచ్చుకున్నామా? అని చింతిస్తూ ఉంటారు. సన్యాసం పుచ్చుకోవడం వేరు. సన్యాసిగా జీవించడం వేరు. మనస్సులో రాగద్వేషాల గాలులు వీచే వారికి సన్యాసము సుఖా న్నివ్వదు.

కర్మలను విడిచి నంత మాత్రాన సన్యాసము అనిపించుకోదు. అలాగైతే, సోమరిపోతు లందరూ సన్యాసు లవుతారు. అలా కావడం చేతనే ప్రధానంగా నేటి సమాజంలో సన్యాసము ప్రశ్నార్థకంగా మారింది.

సన్యాసులు కాని వారు కర్మయోగము ద్వారా చిత్తశుద్ధిని పొందాలి. అప్పుడే జ్ఞానయోగానికి అర్హు లవుతారు. అందుచేతనే ఫలాపేక్షను కోరే దీను ల్లాగా కాకుండా, బుద్ధి యోగాన్ని ఆశ్రయించు అంటున్నాడు అర్జునునితో శ్రీకృష్ణుడు ***(బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః).*** ఇక్కడ భగవంతుడు ప్రబోధించిన యోగబుద్ధిని సాంఖ్య బుద్ధిగా అర్థం చేసుకున్న అర్జునుడు, కర్మయోగము కంటే జ్ఞానయోగము శ్రేష్ఠమని శ్రీకృష్ణుడు చెప్పినట్లు పొరపాటు పడ్డాడు.

ఇక్కడే శ్రద్ధగా అర్థం చేసుకోవాలి. కర్మలను విడిచి జ్ఞానాన్ని ఆశ్రయించమని గీతాచార్యుడు చెప్పలేదు. అలాగని, జ్ఞానకర్మలను రెండిటిని కలిపి ఆచరించ మని అసలే చెప్పలేదు ***(జ్ఞానకర్మ సముచ్చయము).***

నువ్వు జ్ఞానయోగము నైనా అనుసరించ వచ్చు. లేదా, కర్మయోగము నైనా అనుసరించ వచ్చు. రెండిటికి మోక్షమే గమ్యము.

కాకపోతే, సన్యాసానికి అర్హత లేకుండా సన్యాసం పుచ్చుకుంటే, సన్యాసంలో చేయదగిన కార్యము తప్ప

మిగిలిన వన్నీ చేస్తూ పోవలసి వస్తుంది. కర్మయోగం బుద్ధిని శుద్ధి చేస్తుంది. తద్వారా జ్ఞాననిష్ఠను మార్గాన్ని సుగమం చేస్తుంది. కనుక, ***యోగస్థః కురు కర్మాణి,*** యోగస్థుడవై కర్మలను ఆచరించు అని అర్జునుని కర్మయోగం వైపుకు త్రిప్పాడు గీతాచార్యుడు. ఈ ద్వివిధానిష్ఠను మున్ముందు అనేకచోట్ల ప్రస్తావిస్తూ అద్భుతంగా ప్రవచిస్తాడు పరమేశ్వరుడు.

జ్ఞాననిష్ఠ ప్రాప్తికి హేతువు కర్మనిష్ఠయే అని భగవంతుడు చెబుతున్నా, అర్జునుని మనస్సు సన్యాసము నందే అపేక్ష కలిగి ఉందని గుర్తించిన గీతాచార్యుడు, కర్మలను త్యజించినంత మాత్రాన సిద్ధి లభించదు అని తరువాత శ్లోకంలో బోధిస్తున్నాడు.

న కర్మణా మనారమ్భా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సంన్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 4

న-కర్మణాం-అనారంభాత్-నైష్కర్మ్యం-పురుషః-అశ్నుతే
న-చ-సంన్యసనాత్-ఏవ-సిద్ధిం-సమధిగచ్ఛతి

పురుషః	= మనుజుడు	న అశ్నుతే	= పొందడు
కర్మణాం	= కర్మల యొక్క	సంన్యసనాత్ ఏవ	= కేవలం సన్యసించుట చేతనే
అనారంభాత్	= ఆరంభము చేయక పోవటం వల్ల	సిద్ధిం	= సిద్ధిని
నైష్కర్మ్యం	= నిష్క్రియమైన స్థితిని	న సమధిగచ్ఛతి చ	= పొంద లేడు

కర్మ చేయడం మానేసి నంత మాత్రాన మానవుడు నైష్కర్మ్యమును పొందలేడు. కర్మను విడిచినంత మాత్రం చేత సిద్ధిని పొందలేడు గదా!

వ్యాఖ్య

గమనం లేకుండానే గమ్యమా?

జ్ఞాననిష్ఠ ప్రాప్తికి కర్మనిష్ఠ హేతువు. కర్మనిష్ఠ తనకు తానుగా, స్వతంత్రంగా మోక్ష హేతువు కాదు. కాని, కర్మనిష్ఠను హేతువుగా పొందిన జ్ఞాననిష్ఠ స్వతంత్రంగా మోక్ష హేతువు అవుతూ ఉంది.

కర్మనే చేయ నపుడు 'కర్మ లేకుండా పోవడము' అనే ఫలం కలగదు. ఆకలితో ఉన్నవాడు భోం చేస్తాడు. భోం చేసిన తరువాత తృప్తి చెందుతాడు. అలా తృప్తి చెందిన వాడు వెంటనే తిరిగి భోంచేయ నవసరం లేదు. 'భోజనం చేయ నవసరం లేదు' అనే ఫలం భోజనం చేయడం వల్లనే కలిగింది. అసలు భోజనం చేయడమే ఆరంభించని వ్యక్తి, 'భోజనం చేయ నవసరం లేదు' అనే ఫలితాన్ని ఎలా పొందుతాడు? చలనమే లేదు. చేరే దేముంది? కదలనే లేదు. కడ చేరే దెక్కడ? కడతేరే దెప్పుడు? కర్మలనే ఆరంభించని వాడు నైష్కర్మ్యాన్ని ఎలా పొందుతాడు?

నడచిన వాడే చేరుతాడు. చెట్టెక్కిన వాడే దిగుతాడు. బట్ట కట్టుకున్న వాడే విప్పుతాడు. ఒళ్ళు తడిచిన వాడే తుడుచుకుంటాడు. చేసిన వాడే చేయడం ఆపేస్తాడు. చేయడమే ఆరంభించని వాడు చేత లుడిగిన స్థితికి చేరలేడు ***(న కర్మణాం అనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే).***

కర్మను చేయకుండా ఉన్నంత మాత్రాన 'కర్మ లేకపోవడం' *(నైష్కర్మ్యం)* అనే ఫలాన్ని పొంద లేము. ఉపాయం లేకుండా ఉపేయప్రాప్తి కలగదు అనే న్యాయం ఉండనే ఉంది కదా ***(న హి ఉపాయం అంతరేణ ఉపేయ ప్రాప్తిః అస్తి) !***

కర్మ లేని స్థితియే నైష్కర్మ్యం. అది కర్మ చేత అబాధితం. ఏదైతే కర్మ చేత నిషేధింప బడదో, అదే నైష్కర్మ్యం. అది ఆత్మయే. ఆత్మసిద్ధియే నైష్కర్మ్యసిద్ధి. జ్ఞానయోగము నైష్కర్మ్యరూపము. ఆత్మ స్వరూపమునకు సంబంధించినది. నైష్కర్మ్య రూపమైన జ్ఞానయోగము ఉపేయ మైతే, కర్మయోగము ఉపాయము. ఉపాయమైన కర్మయోగము లేకుండా ఉపేయమైన జ్ఞానయోగ నిష్ఠ ఎలా ఏర్పడుతుంది? నైష్కర్మ్యం ఎలా సిద్ధిస్తుంది?

కర్మలను వదలి పెట్టడం నైష్కర్మ్యం కాదు. కర్మత్యాగమూ కాదు. అది కేవలం కర్మలలో త్యాగం. గమ్యం చేరాలని బండిలో ప్రయాణం చేస్తూ గమ్యం రాక ముందే బండి దిగి పోతే గమ్యం చేరినట్లు అవుతుందా? జ్ఞాననిష్ఠకు అర్హతను పొందక ముందే కర్మయోగాన్ని త్యజించడం చాలా ప్రమాదము.

కర్మలను విడిచి పెడితే నైష్కర్మ్యం రాదు. నైష్కర్మ్య స్థితిలో కర్మలు వాటంతట అవే విడిపోతాయి. నైష్కర్మ్యం రావాలి అంటే జ్ఞానం రావాలి. నేను ఆత్మ. ఆత్మ అకర్త. అభోక్త. కనుక, నేనూ అకర్తే - అభోక్తే అనే జ్ఞానం మనిషికి కలగాలి. దానికి ప్రత్యేకమైన మనస్సు కావాలి. శుద్ధ బుద్ధి ఉండాలి. దానిని కర్మయోగం ప్రసాదిస్తుంది. అట్టి కర్మయోగాన్ని ఆరంభించని వారికి నైష్కర్మ్యం సిద్ధించదు ***(నైష్కర్మ్యం అశ్నుతేన)***.

పడేసుకోవడమే పరమార్థమా?

సన్యాసము స్వీకరించి నంత మాత్రాన సిద్ధి కలుగుతుందా? కలగదు. సన్యాసము తీసుకుంటే, కర్మలు దూర మవుతాయి. అజ్ఞానం దూరం కాదు. శ్రవణాదుల ద్వారా జ్ఞానాన్ని పొంది అజ్ఞానాన్ని పోగొట్టు కొనేందుకే సన్యాసము ఉంది. అదే జ్ఞాననిష్ఠ. అదే నివృత్తి మార్గము.

జ్ఞానసాధన నిమిత్తమే సన్యాసము స్వీకరింప బడుతుంది. మరి సన్యాసు లందరూ జ్ఞానసాధనలో ఉన్నారా? ఉండక పోవచ్చు. అసలు జ్ఞానాసక్తే లేని సన్యాసులు నేడు ఎక్కువగా కనిపిస్తున్నారు. మరి వారందరూ సన్యాసము ఎందుకు గ్రహించినట్లు? జ్ఞానం కోసమే. మరి జ్ఞానాభ్యాసమును ఎందుకని చెయ్యరు? జ్ఞాననిష్ఠలో ఎందుకని ఉండరు? చెయ్యలేరు కనుక చెయ్యరు. ఉండలేరు కనుక ఉండరు. మరి వాళ్ళకు సిద్ధి ఎలా? ఇంకెక్కడి సిద్ధి? బుద్ధి ఉంటే కదా సిద్ధి? సన్యాసము పుచ్చుకొని సంసారాలను చేజార్చుకుంటారే గాని, జ్ఞాననిష్ఠలో ఉండి సిద్ధిని చేజిక్కించుకో లేరు ***(సన్న్యసనా దేవ, కేవలాత్ కర్మ పరిత్యాగ మాత్రాదేవ జ్ఞాన రహితాత్ సిద్ధిం న ప్రాప్నోతి)***. జ్ఞానం లేకుండా కేవలం కర్మలను త్యజించి నంత మాత్రాన సిద్ధిని పొందలేరు.

కర్మసన్యాసం అంటే కేవలం కర్మల్ని విడిచి పెట్టడం కాదు. కర్మలలో సన్యాస భావం కలిగి ఉండటం. కర్మలలో సన్యాస భావన అంటే ఏమిటి? కర్మ చేసే ముందు నేను చేస్తున్నాను అనే భావన ఉంటుంది. అదే కర్తృత్వ భావము. ఫలం ప్రాప్తించి నపుడు నేను అనుభవిస్తున్నాను అనే భావన ఉంటుంది. అదే భోక్తృత్వ భావం. ఈ రెండు లేనపుడే కర్మలలో సన్యాస మనస్తత్వం ఉంటుంది. కర్తృత్వం లేనపుడు కర్త ఎక్కడ ఉంటాడు? కనుక నేను అకర్తను ***(అహం అకర్తా)***. భోక్తృత్వం లేనపుడు భోక్త ఎక్కడుంటాడు? ఇదే నైష్కర్మ్య స్థితి. కనుక నేను అభోక్తను ***(అహం అభోక్తా)***.

ఈ స్థితి కేవలం కర్మల్ని విడిస్తే కలుగుతుందా? లేక జ్ఞానం వల్ల కలుగుతుందా? జ్ఞానం వల్లనే ప్రాప్తిస్తుంది. కనుక జ్ఞానంతో సన్యాసాన్ని స్వీకరిస్తేనే సిద్ధి కలుగుతుంది. జ్ఞానం లేకుండా మరే ఇతర కారణాల వల్ల కర్మల్ని విడిచి పెట్టినా అది సన్యాసము అనిపించు కోదు. ఒకవేళ అనిపించు కోవచ్చు, కాషాయం కనిపిస్తూ ఉంది కనుక. సిద్ధి మాత్రం కుందేటి కొమ్మే అని భగవంతుడు నిశ్చయంగా చెబుతున్నాడు.

వివేకం లేకుండా, రాగద్వేషాలను తటస్థ పరచ కుండా సన్యాసం పుచ్చుకొని ఏమి సాధిస్తారు? రాగద్వేషాల

ప్రపంచాన్నే సాధించు కుంటారు. శ్రవణాదులే ప్రధాన మనుకొని సన్యాసమును స్వీకరించిన వారు వివిదిషా సన్యాసులుగా జీవితాన్ని కొనసాగించాలి. నేటి సమాజంలో సన్యాసులు అలా ఉన్నారా?

కొందరు పాట కచేరీలు చేస్తున్నారు. కొందరు నాట్యం చేస్తున్నారు. కొందరు నాటకాలు వేస్తున్నారు. కొందరు చలనచిత్ర కార్యక్రమాల్లో తల మునకలై ఉన్నారు. కొందరు రాజకీయాలు నడుపుతున్నారు. కొందరు సమాజ అభ్యుదయాన్ని కాంక్షించి ఉద్యమాలు నడుపు తున్నారు. నిరసన వ్రతాలేనా! నిరాహార దీక్షలేనా! అదేమిటంటే, ఆ సంరక్షణ - ఈ సంరక్షణ అంటారు. అంతేగాని సన్యాసానికే రక్షణ కరువైందని గుర్తించరు. వీరికి విషయాల యందు ఉత్సాహమే గాని, ఉపనిషత్తుల మీద మనస్సుంటే కదా! ఇక మరీ వైపరీత్యం ముంచుకొస్తే, విద్వత్తు కలిగి, శ్రమించి గ్రంథరచన చేసిన సాధువుల గ్రంథాల నుండి విషయాలను దొంగిలించి, అదంతా తమ జ్ఞానమే అన్నట్లు ఊగిపోతూ, తల-తోక లేని ప్రసంగాలు చేస్తుంటారు. ఎంగిలి కూడా మంగళమే అనే స్థాయికి సన్యాసం నేడు దిగజారి పోయింది.

దీని కంతటికి కారణ మేమిటి? ఏముంది! రాగద్వేషాలను తటస్థ పరచకుండా, కర్మయోగంలో పరిపక్వత చెందకుండా, సన్యాసం స్వీకరించడమే. రాగద్వేషాలను తటస్థ పరచే అవకాశం కర్మయోగంలో ఉందే గాని, సన్యాసంలో లేదు. రాగద్వేషాలు తటస్థ పడకుండా సన్యాసం స్వీకరించిన వారు ఇటు కర్మయోగులూ కారు. అటు సన్యాసులూ కారు. సిద్ధి ఎలాగూ లేదు. కనీసం శుద్ధి కూడా లేకుండా పోతుంది.

కనుక, కర్మసన్యాస మనేది వట్టి మాటల పంచాంగం కాదు. కర్మయోగి అయిన వాడే కర్మసన్యాసి కాగలడు. జ్ఞానం లేకుండా కేవలం కర్మలను విడిచిన వాడు సన్యాసి కాలేడు. అయినా కర్మ చేయకుండా ఉండటం సులభమైన కార్యం కాదు. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

న హి కశ్చిత్ క్షణ మపి జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః ॥ 5

న-హి-కశ్చిత్-క్షణం-అపి-జాతు-తిష్ఠతి-అకర్మకృత్
కార్యతే-హి-అవశః-కర్మ-సర్వః-ప్రకృతిజైః-గుణైః

కశ్చిత్	= ఎవడును		గుణైః	= గుణముల చేత
జాతు	= ఒకప్పుడును		సర్వః	= ప్రతివాడు
క్షణమపి	= క్షణ మైనను		అవశః	= అస్వతంత్రుడై
అకర్మకృత్	= కర్మ చేయని వాడై		కర్మ	= కర్మను
న తిష్ఠతి హి	= ఉండడు గదా		కార్యతే హి	= చేస్తున్నాడు
ప్రకృతిజైః	= ప్రకృతి సిద్ధమైన			

కర్మ చేయకుండా ఎవ్వడూ క్షణం కూడా ఉండలేడు. స్వభావము వల్ల పుట్టిన గుణాలు మానవుని ప్రేరేపిస్తున్నాయి. వాటికి అనుగుణంగా అస్వతంత్రుడై మానవుడు కర్మల నాచరిస్తున్నాడు.

వ్యాఖ్య

కర్మ ప్రపంచంలో నిర్విరామంగా కూరుకు పోయిన కర్మజీవులు మానవులు. కర్మ చేయకపోతే జీవనం సాగదు. ప్రతి మనిషి దేహంలో కర్మ సాగుతూనే ఉంటుంది. తెలిసి ప్రత్యక్షంగా కొన్ని కర్మలు నడుస్తూ ఉంటే, మన ప్రమేయం లేకుండానే పరోక్షంగా ఎన్నో కర్మలు సాగుతూ ఉంటాయి. కొనసాగుతూనే ఉంటాయి. కొన ఊపిరి వరకు కర్మలు కదుల్తూనే ఉంటాయి. ఊపిరి పోసుకోవడం కర్మ. ఊపిరి పీల్చుకోవడం కర్మ.

చలనాత్మకం కర్మ కర్మ అంటే ఏదో కాదు. ఎక్కడ ఏ చలనం కలిగినా అది కర్మే. మొక్క పెరగడం కర్మ. మొగ్గ తొడగడం కర్మ. పువ్వు పూయడం కర్మ. కాయ కాయడం కర్మ. పండు పండటం కర్మ. పండి రాలడం కర్మ.

బండి ఎక్కడం కర్మ. బండి దిగడం కర్మ. మధ్యలో కూర్చుని ఉండటం కర్మ. తిండి తినడం కర్మ. తిండి మానడం కర్మ. అన్నీ కర్మలే. కర్మ లేకుండా క్షణం గడవదు. క్షణకాలం ముందుకు పోవాలి అంటే కర్మ జరగాలి. గడియారాన్ని చూచి కాలాన్ని నిర్ణయిస్తాం. క్షణాలు, నిముషాలు, గంటలు ఎలా కదలి పోతున్నాయో గడియారం చూపిస్తుంది. కాలం ఎంతైనా కావచ్చు. ఎన్ని గంటలైనా కావచ్చు. అలా గంటలు సాగడ మనేది క్షణాలు సాగడంపై ఆధారపడి ఉంటుంది. క్షణం కదిలి వెనక్కి వెళితేనే నిముషం వస్తుంది. కదులుతున్న క్షణంలో సాగే కాలంలో క్షణక్షణము కర్మే. కర్మ లేని క్షణం లేదు. ఏ ఒక్కడూ కర్మ చెయ్యకుండా క్షణం కూడా ఉండలేడు (***న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మ కృత్***).

కాయము ఉన్న వాడెవ్వడూ కర్మ నుండి తప్పుకో లేడు. కర్మ కారణంగా వచ్చిన దేహము కర్మ తోనే సాగి సాగి, చివరగా అంతరించడం అనే కర్మలో అదృశ్యమై, ఆ తరువాత కూడా కర్మ చేయించు కుంటుంది. కర్మ లేకుండా జీవనం సాగదు. జననం కర్మ. జీవనం కర్మ. మరణం కర్మ.

నేను రెండు గంటలు కర్మ చేయకుండా ఉంటాను అని ఒక వ్యక్తి వ్రతాన్ని చేపట్టవచ్చు. ఒక వైపు మౌన వ్రతము సాగుతూ ఉంటుంది. మరొక వైపు నేను ఏమీ మాట్లాడటం లేదు అనే మననం మనస్సులో కొనసాగు తూనే ఉంటుంది. మననం కూడా కర్మే. మానసకర్మ.

దేహంలో అణువణువున చలన ముంది. అది కర్మ. కణకణములో చలన ముంది. అదీ కర్మే. గుండె కొట్టుకొంటూ సాగడం కర్మ. గుండె కొట్టుకోలేక ఆగడం కర్మ. అంత్యక్రియ జరగ దానికి గుండె ఆగిపోవడము అనే కర్మే కారణము.

దేహంలో నిరంతరము కర్మలు సాగుతూనే ఉన్నాయి. ఊపిరితిత్తులు పని చేస్తున్నాయి. రక్త ప్రసారం జరుగుతూ ఉంది. శ్వాసలు కదులుతూ ఉన్నాయి. మనస్సులో ఆలోచనలు నడుస్తూ ఉన్నాయి. ఇవన్నీ కర్మలే. కళ్ళు మూయడం కర్మ. కళ్ళు తెరవడం కర్మ. నిద్ర పోవడం కర్మ. నిద్ర మేల్కొనడం కర్మ. కర్మ కానిది ఏముంది? కర్మ చేయని వారు ఎవరున్నారు?

కాలు నిలవని పిల్లవాడిని, ఎందుకలా తిరుగుతావు? కొంతసేపు కదలకుండా కూర్చో! అని మనం ఒక్కొక్కసారి శాసిస్తూ ఉంటాము. అలా కూర్చున్న పిల్లవాడు కొంతసేపైన తరువాత, ఇలా ఎంతసేపు కూర్చోవాలి? పనీ పాట లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవడం నా వల్ల కాదు అంటాడు. అలా అంటాడే గాని, గోళ్ళు గిల్లుకోవడం కూడా కర్మే అని అర్థం చేసుకోలేడు. కర్మల నుండి విడి పడటం ఎవ్వరికీ సాధ్యం కాదు.

అబ్బ! చాలా శ్రమపడి పోయాను. కొంతసేపు అలా ఫ్యాను క్రింద కూర్చుని విశ్రాంతి తీసుకుంటాను అనుకుంటూ ఫ్యాను క్రింద కుర్చీలో కూర్చుంటాడు ఓ వ్యక్తి. అతడు ఏమీ చేయకున్నా, ఫ్యాను గాలికి తలపై వెంట్రుకలు కదుల్తూ ఉంటాయి. అదీ కర్మే.

కర్మ చేయడం కష్టం అనుకుంటారు చాలా మంది. కాని, కర్మ చేయకుండా ఉండటం ఎంత కష్టమో కర్మను ఆపితే గాని తెలియదు. అందుకే, సన్యాసము అందరికీ సాధ్య పడదు. నమ్మెలు విఫల మయ్యేది కూడా ఇక్కడే.

సృష్టికి కర్త ఉన్నాడు. ఆయనే సృష్టికర్త. సృష్టికర్త కార్యమే సృష్టి. సృష్టి అనేది కర్మ. సృష్టే కర్మ అయి నపుడు, సృష్టిలో ఉన్న మానవుడు కర్మకు ఎలా దూరం అవుతాడు? విమానం గాలిలో ఎగురుతూ ఉంది. విమానంలో ప్రయాణం చేసే వాడు ఎగరక పోయినా ఎగిరిన వాడే. ఈ సత్యం ఎరిగిన వాడే.

ఆఖ్యాయిక

నలుగురు స్నేహితులు కలిసి ఒక పోటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎవరు పది గంటల సేపు మాట్లాడకుండా కూర్చుంటారో వారు విజేతలు. గెలిచిన వారికి ఒక చేతి గడియారము బహుమానము.

పోటీ కార్యక్రమం ప్రారంభమైంది. గంట గడిచింది. స్నేహితులు ఒకరిని ఒకరు చూసుకొని ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. మరొక గంట గడిచింది. ఒకడు మరొకణ్ణి సైగతో, ఎలా ఉంది నీకు? అని అడిగాడు.

రెండవ వాడు బాగానే ఉంది అని తల ఊపాడు. అది చూచి మూడవ వాడు, అలా సైగలు కూడా చేసుకోకూడదు! అన్నాడు. వెంటనే, మొదటివాడు మూడవ వాడితో, ఏయ్! నువ్వు మాట్లాడేశావ్! పోటీ నుండి నువ్వు విరమించినట్లే! అన్నాడు. అది వినగానే, తల ఊపిన రెండవ వాడు పకపక నవ్వుతూ నువ్వు మాత్రం మాట్లాడ లేదేంటి? నువ్వూ ఓడి పోయినట్లే అన్నాడు.

ఇక, అంతవరకు మౌనంగా ఉన్న నాల్గవ వ్యక్తి, మీ విషయం నాకు తెలియదు గానీ, నేను మాత్రం మాట్లాడలేదు అన్నాడు. పోటీ సమయం ఇంకా ఎనిమిది గంటలు మిగిలి ఉంది. కర్మల్ని ఆపడం సాధ్యపడే పని కాదు. ఎందుకని కర్మలు అలా అనివార్య మవుతున్నాయి? వాటి వెనుక కారణా లున్నాయి.

కార్యకారణాలు

ప్రపంచం మాయా కార్యము. ఈ మాయా ప్రకృతిలో త్రిగుణాలు కదుల్తూ ఉంటాయి. మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంటుంది. బ్రహ్మాశ్రయమైన మాయలో సత్త్వ రజస్తమో గుణాలు అనే త్రిగుణాలు ఉంటాయి. కారణమైన మాయా ప్రకృతిలో త్రిగుణాలు ఉన్నాయి కనుక, మాయా ప్రకృతికి కార్యమైన ఈ దృశ్యమాన ప్రపంచంలో కూడా త్రిగుణాలు ఉండి తీరాలి. కనుక, ఉన్నాయి. ప్రకృతి గుణాల ప్రభావాలను గూర్చి పదునాల్గవ అధ్యాయంలో భగవానుడు విశదంగా చర్చిస్తాడు.

మాయకు బద్ధుడైన మానవుడు మాయా కార్యమైన గుణాల ఒత్తిడి వల్ల కర్మలను ఆచరిస్తూ ఉంటాడు. అస్వతంత్రుడై చరిస్తూ ఉంటాడు. కనుక, కర్మలను నిరోధించడం సాధ్యం కాదు. కర్మలను ఎలాగూ నిగ్రహించడం, నిరోధించడం సాధ్య పడదు కనుక, ఈశ్వర భావనతో కర్మల నాచరించి, బంధహేతువైన కర్మలను జ్ఞాననిష్ఠకు హేతువైన కర్మయోగంగా మార్చుకోమని పవిత్రమైన కర్మయోగ నిష్ఠను భగవంతుడు ఉపదేశిస్తున్నాడు.

ఇక్కడ అతి ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. త్రిగుణాలు అజ్ఞానిని చలింప చేస్తాయే గాని, జ్ఞానిపై తమ ప్రభావాన్ని చూపలేవు. జ్ఞాని గుణాతీతుడు. నిస్త్రైగుణ్యుడు. *ఉదాసీనవత్ ఆసీనః, గుణైః యః న విచాల్యతే* - ఉదాసీనుడుగా ఆసీనుడైన జ్ఞాని గుణాల వల్ల చలించడు అని పద్నాల్గవ అధ్యాయం - గుణత్రయ విభాగ యోగంలో గీతాచార్యుడే చెబుతాడు. అంటే, గుణాలు అజ్ఞానినే చలింప చేస్తాయి అని అర్థం. అందుచేతనే శ్రీశంకర భాష్యంలో, ***అజ్ఞః ఇతి వాక్య శేషః*** అనడం జరిగింది. అంటే, ఈ శ్లోకానికి ***అజ్ఞః*** - 'అజ్ఞాని' అనే పదాన్ని చేర్చి అర్థం చేసుకోవాలి అన్నారు ఆచార్యులు. గుణాలు అజ్ఞానిని చలింప చేస్తాయే గాని, జ్ఞానిని చలింప చేయలేవు అనే సత్యాన్ని గుర్తించ మని దాని భావం.

జ్ఞాని కానివాడు గుణాల చేత చలిస్తూ, ఇంద్రియ వ్యాపారాలను మాత్రమే నిగ్రహించి, యథేచ్ఛగా మనో వ్యాపారాన్ని సాగిస్తూ ఉంటాడు. అట్టి కపటిని కనిపెట్టి చూపుతున్నాడు.

కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇన్ద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే ॥ 6

కర్మేంద్రియాణి-సంయమ్య-యః-ఆస్తే-మనసా-స్మరన్
ఇంద్రియార్థాన్-విమూఢాత్మా-మిథ్యాచారః-సః-ఉచ్యతే

యః	= ఎవడు	ఆస్తే	= ఉంటాడో
కర్మేంద్రియాణి	= కర్మేంద్రియములను	సః	= వాడు
సంయమ్య	= నియమించి	విమూఢాత్మా	= వివేక శూన్యుడు
మనసా	= మనస్సు చేత	మిథ్యాచారః	= కపటి అని
ఇంద్రియార్థాన్	= శబ్దాది ఇంద్రియ విషయాలను	ఉచ్యతే	= చెప్పబడుతున్నాడు
స్మరన్	= స్మరిస్తూ		

కపటమైన ఆచరణ కలవాడు వివేక శూన్యుడు. కేవలం కర్మేంద్రియాలను అణచి పెడతాడు. అతని మనస్సు మాత్రం ఇంద్రియ విషయాలనే చింతిస్తూ ఉంటుంది.

వ్యాఖ్య

మనం ఏమి సాధించాలో మనకు క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. దానితో పాటు మన అర్హత ఏమిటో కూడా మనకు అర్థం కావాలి. అర్హతలే ఎప్పుడైనా, ఎక్కడైనా అందల మెక్కుతాయి. దంభముతో కూడిన ఆచారాలు, దర్పముతో కూడిన వ్యవహారాలు బ్రతుకును చీకటిమయం చేస్తాయి.

దురహంకారము బ్రతుకులో సుఖాన్ని దూరం చేస్తుంది. తెలిసి చేసినా, తెలియక చేసినా పాపాచారము మనిషిలో పవిత్రతను లేకుండా చేస్తుంది. జ్ఞానం లేకుండా కర్మలలో ప్రదర్శించే అనవసరమైన ఆర్భాటాలు, అర్థరహితమైన ఆరాటాలు ఆరోగ్యప్రదము కావు.

హితమైన ఆహారమును తీసుకుంటే ఆరోగ్యం కలుగుతుంది. అహితమైన ఆహారము అనారోగ్యాన్ని తెచ్చి పెడుతుంది. నిరాహారము దేహాన్నే నశింప చేస్తుంది. కర్మలు కూడా అంతే. నిష్కామ కర్మలు ప్రశాంతతను ప్రసాదిస్తాయి. సకామ కర్మలు అశాంతిని కలిగిస్తాయి. నైష్కర్మ్యం పేరుతో ప్రదర్శింప బడే అకర్మ అధోగతికి దారి తీస్తుంది. జ్ఞానం లేకుండా కర్మత్యాగం చేసే వాడు అజ్ఞుడు. అవివేకి. కపటి.

మూఢాచారము

మనోనిగ్రహం లేకుండా కేవలం ఇంద్రియాలను నియమించడం నిగ్రహం క్రిందికి రాదు. ఇంద్రియాలు తమంతట తాము విషయాలలో రమించ లేవు అని ఇప్పటికే మనం తెలుసు కున్నాము. మనస్సు ఇంద్రియాలతో చేరినపుడే విషయానుభవము కలుగుతుంది. అలాంటప్పుడు కేవలం దంభముతో, మూర్ఖంగా, మౌఢ్యంగా ఇంద్రియాలను మాత్రం నిగ్రహించి, మనస్సును నిగ్రహించలేని వ్యక్తులు ఎప్పుడైనా, ఎక్కడైనా నిగ్రహరూపులే గాని, నిగ్రహవంతులు కాలేరు. పైగా, అలాంటి విమూఢులు మిథ్యాచారులు అవుతారు అంటున్నాడు భగవంతుడు (***సః విమూఢాత్మా మిథ్యాచారః ఉచ్యతే***).

'మిథ్య' అంటే సత్యము కానిది. 'ఆచారము' అంటే ప్రవర్తనము. 'మిథ్యాచారము' అంటే అసత్య

ప్రవర్తనము. కపట వర్తనము. అట్టి కపట వర్తనము కలవాడు విమూఢుడు. అట్టి విమూఢుడు మిథ్యాచారుడు. శ్రీ ఆది శంకరాచార్యుల వారు అతని ప్రవర్తనను పాపంగా నిర్ణయించారు. విమూఢుడైన మిథ్యాచారుడు పాపాచారము కలవాడు అన్నారు (***విమూఢాత్మా విమూఢ అన్తఃకరణః మిథ్యాచారః మృషాచారః పాపాచారః సః ఉచ్యతే***).

ఇంద్రియాలు బాహ్యకరణాలు. మనస్సు అంతఃకరణము. అంతఃకరణములో మూఢత్వము కలవాడు కనుక మిథ్యాచారుడు విమూఢుడు అని పిలువ బడ్డాడు. ఇక్కడ మిథ్యాచారుని కపట వర్తనము ఏమిటి?

తాను నైష్కర్మ్య సిద్ధిని పొందిన జ్ఞానిగా అభినయించడమే మిథ్యాచారము. ఇంద్రియాలను విషయాల లోకి వెళ్ళకుండా నిరోధిస్తాడు. బాహ్య విషయాల పట్ల ఆసక్తి లేనట్లు వ్యవహరిస్తాడు. ఏ విషయాలను బాహ్యంలో విస్మరించి విసర్జించాడో, వాటినే మనస్సులో తదేకంగా స్మరిస్తూ ఉంటాడు. ఇంతకు మించి కపట వర్తనము ఏముంటుంది?

ఇంద్రియాలను అరికట్టి, లేదా బిగబట్టి, మనస్సులో కోరికల్ని అదుపు చేయలే నపుడు నిగ్రహము అనే మాటకు అర్థం ఎక్కడుంది? తాను ఏమీ చేయడం లేదు కనుక, ఇంద్రియ విషయాల నుండి ఇంద్రియాలను నిగ్రహించి ఉన్నాడు కనుక, తాను నిజం గానే నిష్క్రియత్వంలో ఉన్నట్లు నటిస్తూ ఉంటాడు. ఇదే కపట వర్తనము.

ఇంద్రియ విషయాలను అనుభవించక పోయినా, మనస్సులో అవే ఆలోచనల్ని సాగించే వ్యక్తికి నిష్క్రియత్వ మెక్కడుంది? నిష్క్రియత్వ మంటే ఏమిటి? ఆత్మతత్త్వమే నిష్క్రియత్వము. ఆత్మ నిష్క్రియము. నిరంజనము. శాంతము. ఇది తనకు తాను అర్థం చేసుకో వలసిన విషయమా? లేక, పరుల కొరకు అభినయించ దగిన విషయమా? జ్ఞానం లేని మూర్ఖుడు కనుక, అజ్ఞాన ప్రదర్శన లిస్తూ కాలం వెళ్ళబుచ్చుతూ ఉంటాడు. వింత ప్రవర్తనతో అమాయకులను మాయ చేస్తూ ఉంటాడు. అతడే మిథ్యాచారుడు.

కదలకుండా కూర్చుంటాడు. అది నిష్క్రియత్వం అని ఆయన అభిప్రాయము. అదే నిజమైతే, గోడలన్నీ జ్ఞానులే. కళ్ళు ఆర్పకుండా చూస్తూ ఉంటాడు. ఆయన ఏదో కర్మలో అకర్మను దర్శిస్తున్నట్లు జనం భావించాలని మనస్సులో తహతహ లాడుతూ ఉంటాడు. అలా చూడటమే సమదర్శన మైతే, కిటికీ లన్నీ జ్ఞానులే.

బూడిద పూసుకొని చెట్ల క్రింద ఆసీనులయ్యే వాళ్ళు, ముందు మంట వేసుకొని చలి కాచుకొనే భంగిమలో కూర్చునే వాళ్ళు, కౌపీనంతో ఎండలో, వానలో తిరిగే వాళ్ళు, ఏదో ఆత్మానందాన్ని అనుభవిస్తున్నట్లు అప్పుడప్పుడు మందహాసం చిందిస్తూ కొంగ ల్లాగా ఆకాశం వైపు చూచేవాళ్ళు, ఓహ్! ఎన్ని వేషాలని? ఎన్ని భంగిమలని? మిథ్యాచారానికి మ్రింగుడు పడని అసత్యమే లేదు.

ముఖ్యంగా, అవధూతలు అని చెప్పుకొంటూ తిరిగే వాళ్ళలో నూటికి తొంభై మంది మిథ్యాచారులే అనేది నా జీవితానుభవము. బ్రతుకుకు అర్థం తెలియక, జడలు పెంచుకొని, బట్టలూడ దీసుకొని, బజారున పడి, ఉలుకు పలుకు లేకుండా, మందమతుల్ని ఊరించే ఈ మిథ్యా జ్ఞానుల్ని చిన్నతనంలో నేను చాలా మందిని చూశాను. వివేకం కన్నా విశ్వాసమే మెండుగా ఉన్న ఆ దశలో ఎంత మందిని విశ్వసించానో, ఆ తరువాత ఎంతగా కుమిలి పోయానో! అందుకే ఇలాంటి దౌర్భాగ్యుల్ని 'మూఢులు' అని సరిపెట్టుకో లేక 'విమూఢులు' అని ఛీ కొట్టాడు గీతాచార్యుడు.

ఏం చేద్దాం! అజ్ఞాన దశలో అన్నీ ఆనందాలే. విడ్డూరాలన్నీ వింతలు గానే కనిపిస్తాయి. పిచ్చివాళ్ళను కూడా పరమహంసలుగా ప్రజలు రూపొందించిన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. పరమహంసల్ని చూడాలని ఉబలాట పడే పిచ్చి భక్తులు, పిచ్చివాళ్ళనే పరమహంసలుగా భావించి అర్చిస్తే, వాళ్ళ అమాయకత్వాన్ని తప్పు

పట్టలేము గాని, ఆ అమాయకత్వాన్నే ఆత్మానుభూతిగా భావిస్తే మాత్రం, ఆ తరువాత వచ్చే ప్రమాదాన్ని వారు భరించ గలరా అనేది సందేహం.

మిథ్యాచారు లేమో జ్ఞానం లేక పోయినా, అర్థరహిత మైన విచిత్ర వేషాలతో, వింత ప్రవర్తనలతో ప్రదర్శన లిచ్చి, కాలంలో కనుమరుగై పోతారు. ఆ తరువాత, అమాయకులు ఒక వైపు, గోముఖ వ్యాఘ్రాలు మరో వైపు సందడులకు శ్రీకారం చుట్టి అంగడులు తెరుస్తారు.

ఆ మహాత్ముడు చావలేదు. ఆయనకు చావు లేదు. చావు రాదు. ఆయన బ్రతికే ఉన్నాడు. రాత్రి మా ఇంటి కొచ్చాడు. ఒరే! నీ ఇంట్లో భోంచేయాలని వచ్చానురా! అన్నాడు. అంతే. నేను పీట వేశాను. మా అమ్మ విస్తర వేసి అన్నం వడ్డించింది. నా భార్య పులుసు పోసింది. మా పెద్దబ్బాయి వంకాయ కూర వడ్డించాడు. మా చిన్నమ్మాయి రసం పోసింది. మా మేనత్త మజ్జిగ పోసింది. ఖాళీ విస్తర నేనే ఎత్తేశాను. చెయ్యి కడుగు కొనేందుకు పెరట్లో వేపచెట్టు వెనక్కి భగవాన్ వెళ్ళాడు. తువాలు తెద్దామని నేను లోనికి వెళ్ళాను. అంతే! తిరిగి వచ్చే సరికి ఆయన లేడు. ఇదీ కథ.

అంతే. ఆ తరువాత అతణ్ణి చుట్టేస్తారు జనం. అతని రెండు చేతుల్ని తమ చేతుల్లోకి తీసికొని కళ్ళ కద్దుకుంటారు. భగవాన్ భోంచేసిన విస్తరను ఎత్తి వేసిన ఈ చేతులు ఎంత పుణ్యం చేసుకున్నాయో! అని సామాన్యులు కూడా ఆ సందర్భంలో కవుల అవతార మెత్తుతారు. ఏవో నాలుగు అక్షరాలు పాట్టలో పడేసుకొని, అవి వినేవాళ్ళు ఎప్పుడు దొరుకుతారా! అని ఎదురు చూసే ఒక కవి, ఈ చేతుల పుణ్యాలు, పుణ్య వాక్యాలు వినగానే, అమాంతం రెచ్చిపోయి **కమలాక్షు నర్చించు కరములు కరములు** అంటూ ఆయన రాగాన్ని ఆయన వినిపించి పని పూర్తయిందని వెళ్ళి పోతాడు.

ఇలా ఒకరిని మించి ఒకరు వింత వింత అనుభవాలను ఊహించుకొని చాటుతూ ఉంటారు. కవులు కలాలు పట్టి కల్లబొల్లి కథలు, చరిత్రలు వ్రాసేస్తారు. ఇక ఆ తరువాత, పారాయణాలేనా! భజన లేనా! గుళ్ళేనా! గోపురా లేనా! సందడే సందడి. అంగడే అంగడి.

హృషీకేశుని హెచ్చరిక

ఇలాంటి వ్యక్తుల విషయంలో జాగ్రత్త వహించక పోతే, ఆ తరువాత ఆధ్యాత్మిక జీవనమే దారి తప్పి మనిషి దగా పడే అవకాశము లేక పోలేదు. అటు మిథ్యాచారుడు కూడా డాంబికత్వంతో జ్ఞానాన్ని పొందే అవకాశాన్ని జారవిడుచు కోవడమే గాక, చిత్తశుద్ధికి కూడా మార్గాన్ని మూసేసు కుంటాడు. ఛిద్రమైన భావాలతో, క్షుద్రమైన సంకల్పాలతో బ్రతుకునే బుగ్గి చేసుకుంటాడు. కాలం వ్యర్థ మవుతూ ఉంటుంది. బ్రతుకు వృథా అయిపోతుంది. ఇలాంటి అప్రయోజకుల మాయలో పడి అమాయకులైన సాధకులు అన్యాయ మవుతూ ఉంటారు.

మోసము తెలియదు మోసముగా
వంచన అగుపించు మంచిదిగా
సాధువుగా లంకేశుడు
పసిడి లేడిగా మారీచుడు
మాటల వెనుక మర్మములు
మహిలో ఎన్నో మోసాలు
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

మూర్ఖత్వంతో ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించి, మనస్సులో పూర్వం అనుభవించిన వాటిని, ఇక ముందు అనుభవించాలని భావించే వాటిని నెమరు వేసుకోవడం కన్నా, డాంబికత్వాన్ని త్యజించి, పవిత్ర మైన కర్మయోగంలో చరించి, రాగద్వేషాలను తటస్థ పరచుకొని, జ్ఞాననిష్ఠకు సిద్ధం కావడమే దివ్యమైన మార్గ మని గీతాచార్యుడు బోధిస్తున్నాడు. అనర్థదాయక మైన మార్గంలో పయనించి, బ్రతుకును అన్యాయం చేసుకో వద్దని హెచ్చరిస్తున్నాడు.

తిరిగే రాతికి పాచి పట్టదు

సాధన అనేది చెప్పుకున్నంత సులువైన విషయం కాదు. శిక్షణ లేని మనస్సులకు అనుకున్నంత అనువైన విషయమూ కాదు. తిరిగే మనస్సును కూర్చోబెట్టడం మహామహులకే దుస్సాధ్యంగా ఉంటుంది. ఇక, సామాన్యుల విషయం ప్రత్యేకంగా చెప్పాలా?

మిథ్యాచారులకే కాదు, సదాచారవంతు లకు కూడా మనస్సు నిలబడదు. కాకపోతే, సదాచారవంతు డైన సాధకునికి ప్రయత్నమైనా ఉంది. మిథ్యాచారునికి ఆ అవకాశం కూడా ఉండదు. అర్హత లేకపోయినా డాంబికంగా ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సుతో ఇంద్రియ వ్యాపారాల్ని సాగిస్తూ, శుద్ధిపడే అవకాశాన్ని కూడా జారవిడుచు కోకుండా, అటువంటి మిథ్యా జీవనానికి స్వస్తి పలికి, కర్మయోగంలో కొనసాగితే, మనస్సు శుద్ధి పడుతుంది. కర్మయోగాన్ని అనుష్ఠించ లేకపోయినా, కనీసం కర్మ ప్రవాహంలో కొనసాగుతూ ఉండినా, కర్మాచరణంలో తల మునకలై ఉండటం చేత కొంతైనా మనస్సు నియమింపబడే అవకాశం ఉంటుంది. మిథ్యాచార జీవనం కన్నా, అజ్ఞానంతో కూడినదే అయినా, కర్మాచరణమే మేలు.

జలాలలో కదల కుండా ఉండే రాతికే పాచి పడుతుంది. మంచి ముత్యాలకు ఎలాగూ పాచి పట్టదు. తిరిగే రాతికి కూడా పాచి పట్టదు. కర్మయోగి మంచి ముత్యం లాంటివాడు. కర్మి తిరిగే రాయి లాంటి వాడు. మిథ్యాచారుడు కదలలేని బండ లాంటి వాడు. జీవన ప్రవాహం లోనే అందరూ ఉన్నారు. జీవించే విధానాన్ని బట్టి వెలుగులు ఉంటాయి. లేదా, వెతలే మిగుల్తాయి.

తనిఖీ కేంద్రాలు

రహదారులలో, అక్కడక్కడ ప్రభుత్వము తనిఖీ కేంద్రాలను (చెక్‌పోస్టులు) ఏర్పాటు చేస్తుంది. ఆ కేంద్రాల వద్ద, ప్రయాణం చేసే వాహనాలను ఆపి, తనిఖీలు నిర్వహిస్తారు. తరలించ కూడని వస్తువుల్ని తరలిస్తున్నా రేమో అని పరీక్షించి చూస్తారు. అలాంటివి ఏవీ లేకపోతే, సజావుగా ముందుకు సాగనిస్తారు. ఒకవేళ అలాంటి నిషిద్ధమైన వస్తువులు ఉంటే వాటిని అక్కడే దించి, ఆ తరువాత వాహనాలను ముందుకు పోనిస్తూ ఉంటారు.

ఆధ్యాత్మిక జీవన రహదారిలో కూడా ఇలాంటి తనిఖీ కేంద్రాలు చాలా అవసరం. గీతలో అనేక చోట్ల తనిఖీ కేంద్రాల వంటి శ్లోకాలు దర్శన మిస్తాయి. సాధన మార్గంలో అవసరం లేనివి, అనర్థాన్ని కలిగించేవి మనతో కలసి ప్రయాణం చేస్తున్నాయా! అని మనల్ని మనం పరీక్షించు కోవడానికి ఈ తనిఖీ కేంద్రాల వంటి శ్లోకాలు ఉపకరిస్తాయి.

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోకం అలాంటిదే. మిథ్యాచారుల్ని గూర్చి తెలుసుకుంటే మనకు ఒరిగే దేముంటుంది? అలాంటి మిథ్యా జీవనము తెలిసో, తెలియకో మనలో కూడా కొద్దో, గొప్పో ప్రవేశించి ఉంటే, దానిని తొలగించుకొని ప్రయాణాన్ని సుగమం చేసుకోవడానికి ఇలాంటి శ్లోకాలు ఉపకరిస్తాయి. ఆత్మ పరిశీలనకు ఎంతగానో దోహద పడతాయి.

మనో నిగ్రహమే సాధకునికి ప్రశస్త మైన సాధన. మనసు ఒక్కటి నిగ్రహింప బడితే, మనుగడలో వెలుగుల

తోరణాలు కనిపిస్తాయి. మనస్సు నిగ్రహాన్ని కోల్పోతే, బ్రతుకులో అన్నీ చీకటి కోణాలే ఎదు రవుతాయి. మనస్సు మనది అయినపుడు ఎక్కడి కెళ్ళినా, ఏది చేసినా బాధ ఉండదు. బరువు తెలియదు. మన మనస్సే మనది కానపుడు ఏది చేసినా, ఏది చూసినా వెతలే ఎదు రవుతాయి, కలతలే కనిపిస్తాయి. ఈ సత్యాన్ని మహాభారతం అద్భుతంగా, భావగర్భితంగా ప్రవచించింది.

నాన్తస్య కిం అరణ్యేన తథా నాన్తస్య భారత
యస్యైవ నివసేద్దాంతః తత్ అరణ్యం స చాశ్రమః ॥

అంతఃకరణమును నిగ్రహించ గలిగే వారు అరణ్యాలకు పోవలసిన అవసర మేముంది? అంతఃకరణ మును నిగ్రహించ లేని వారు అరణ్యాలకు పోయి మాత్రం సాధించే దేముంటుంది? ఎవరు మనస్సును నియమిస్తారో, వారు ఎక్కడ ఉంటే అదే అరణ్యం. అదే ఆశ్రమం (*తదరణ్యం స చాశ్రమః*).

అలాంటి ఉత్తమ జీవన విధానానికి తెరదీస్తూ, తరువాత శ్లోకాన్ని బోధిస్తున్నాడు భగవంతుడు.

య స్త్విన్ద్రియాణి మనసా నియ మ్యారభ తేఽర్జున ।
కర్మేన్ద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే ॥ 7

యః-తు-ఇంద్రియాణి-మనసా-నియమ్య-ఆరభతే-అర్జున
కర్మేంద్రియైః-కర్మయోగం-అసక్తః-సః-విశిష్యతే

అర్జున	=	అర్జునా!	కర్మయోగం	=	కర్మయోగమును
యఃతు	=	ఎవడయితే	అసక్తః	=	ఆసక్తి లేనివాడై
ఇంద్రియాణి	=	ఇంద్రియములను	ఆరభతే	=	ఆరంభించునో
మనసా	=	మనస్సు చేత	సః	=	అతడు
నియమ్య	=	నియమించి	విశిష్యతే	=	శ్రేష్ఠుడు
కర్మేంద్రియైః	=	కర్మేంద్రియముల చేత			

అర్జునా! శ్రేష్ఠుడు ఇంద్రియాలను మనస్సు చేత నియమిస్తాడు. ఆసక్తి లేకుండా, కర్మేంద్రియాల చేత కర్మ యోగమును ఆరంభిస్తాడు.

వ్యాఖ్య

కేవలం కర్మేంద్రియాలను నిగ్రహించి, మనస్సు చేత ఇంద్రియ వ్యాపారాలను సాగించే అవివేకి, ఎలా వ్యర్థ జీవిగా మారుతున్నాడో ఆరవ శ్లోకంలో చూశాం. అతడికి భిన్నంగా, మనస్సును నిగ్రహించి, కర్మేంద్రియాల ద్వారా విషయాలలో చరించే కర్మయోగి ఎలా ప్రగతిని సాధిస్తున్నాడో ప్రస్తుత శ్లోకంలో అర్థం చేసుకుంటున్నాం.

తనపై తనకు పట్టు లేనపుడు, కర్మేంద్రియాలను బిగబట్టి విషయానుభవానికి దూరమై సాధించేది ఏమీ ఉండదు. మనసులో విషయాసక్తిని విడిచి పెట్టిన యోగి, తనకు వశమైన మనస్సు చేత ఇంద్రియాలను విషయాలలో విడిచిపెట్టినా, కర్మయోగ ప్రభావము చేత బద్ధుడు కావడం లేదు. పైగా, పరమ పురుషార్థ ప్రాప్తికి అర్హు డగుచున్నాడు. ఈ శ్లోకంలో 'తు' అనే శబ్దము విషయము మారుతూ ఉంది అని తెలుపుటకు ప్రయోగింప బడింది.

వివేక బుద్ధి

ఇంద్రియాలను కర్మయోగి మనస్సు చేత నియమిస్తున్నాడు. మనస్సు ఇంద్రియాలను ఎలా

నియమిస్తుంది? మనస్సు లోని వివేకం చేత నియమిస్తుంది. అదే వివేక బుద్ధి. ఈ విధమైన అంతరేంద్రియ నిగ్రహముతో కర్మయోగి కర్మలను ఆరంభించి ఆచరిస్తాడు (*ఆరభతే*).

కర్మలను ఆరంభించడము అంటేనే, వాటి వెనుక కోరిక ఉంది అని భావము. అదే కర్మఫలాసక్తి. కర్మఫలానుభవము నందు ఆసక్తి. భోగానుభవ కాంక్ష. కాని, అది కర్మయోగికి లేదు.

కర్మయోగి విహిత కర్మలను ఆచరిస్తాడు. ఫలాసక్తి లేకుండా ఉంటాడు. ఫలం ఏదైనా అది అశాశ్వత మని అతడికి తెలుసు. అంతేకాదు, ఫలానుభవం మనస్సులో సంస్కారాన్ని ముద్రించి జన్మలకు తరలిస్తుంది అని కూడా తెలుసు. కనుక కర్మఫలాసక్తి లేకుండా ఈశ్వరారాధనా భావంతో కర్మల్ని ఆచరించి, చిత్తశుద్ధిని పొందుతాడు. అదే పరమధర్మంగా భావిస్తాడు (*స్వవిహిత వృత్త్యా భక్త్యా భగవదారాధనం పరమోధర్మః* - మధ్వాచార్యులు). మనస్సును నియమించి ఉన్నాడు కనుక రాగద్వేషాల నుండి విడిపడి ఉంటాడు. అతడి కర్మలు రాగద్వేషాల చేత కలుషితం కానందున, అతడు బద్ధుడు కాడు.

విహిత కర్మ ఏదో అదే స్వధర్మము. ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక, విహిత కర్మాచరణమును దైవారాధనగా భావిస్తాడు. తత్ఫలితంగా అంతఃకరణ శుద్ధిని పొందుతాడు.

సాధన భూయస్త్వే ఫల భూయస్త్వమ్ అనే న్యాయాన్ని అనుసరించి, సాధన అధికమయ్యే కొలది, ఫలము కూడా అధిక మవుతూ ఉంటుంది. మనస్సును నియమించి, రాగద్వేషాల నుండి విడిపడి, కర్మ ఫలాపేక్ష లేకుండా, ఈశ్వర భావన చేత కర్మయోగి ఎప్పుడైతే కర్మలు ఆచరిస్తున్నాడో, అతడు కర్మలను ఆచరిస్తూ ఉండినా, ఆ కర్మాచరణము పూర్వ వాసనలను ఒక వైపు క్షాళనం చేస్తూనే మరొక వైపు చిత్తశుద్ధిని అధికం చేస్తూ ఉంటుంది.

ఆరవ శ్లోకం లోని మిథ్యాచారుని జీవనము ఇందుకు భిన్నంగా ఉంటుంది. అతడు కర్మలను విరమించి ఉన్నాడు కనుక, విహిత కర్మల నుండి విముఖుడు. ధర్మాచరణానికి విదూరుడు. విషయవాంఛలకు దూరం కానందున వినష్టుడు. భగవ చ్చింతనానికి దూరుడు. అనుభవించక పోయినా విషయాలకు దగ్గర వాడు. సదా విషయస్మరణమే కర్తవ్యంగా కలవాడు. ఎలాగూ కర్మలను త్యజించి ఉన్నాడు కనుక పరభాగ్యోపజీవి.

అనాసక్తి

వివేకబుద్ధి కలిగిన యోగి కర్మేంద్రియాల ద్వారా కర్మలను ఆచరిస్తూ ఉండినా, విశిష్టుడే. ఎందుకో తెలుసా? అతడికి కర్మల యందు గాని, కర్మఫలాల యందు గాని ఆసక్తి లేదు (*అసక్తః*). అతడు ఫలాభిసంధి లేనివాడు.

విషయాల పట్ల ఆసక్తి లేదు. ఫలాకాంక్షతో కర్మలను ఆరంభించడం లేదు. ఎప్పుడైతే ఈ రెండిటిని త్యజించడం జరిగిందో, అలాంటి పావనాత్ముడు జ్ఞాననిష్ఠా మార్గానికి అర్హుడవుతున్నాడు (*తదుభయ పరిత్యాగే జ్ఞానకారీ భవేత్* - స్వయంప్రకాశ యతి).

భోగానుభవము నందు ఆశ లేనివాడు కనుక కర్మయోగి అసక్తుడు. కర్మయోగికి విషయాసక్తి ఎలా దూర మవుతుంది? వివేకం ఉంది కనుక. నిత్యానిత్య వస్తు వివేకం కలిగి ఉన్నాడు కనుక.

విషయాలు పరిచ్ఛేద రూపాలు. ఇంద్రియాలు పరిమిత పరికరాలు. మనస్సు చంచలము. ఇక ఎక్కడి భోగానుభవం? రూపాలను, రంగులను చూచి చూచి నేత్రాలు మొద్దుబారి పోతున్నాయి. మసక లవుతున్నాయి. వడపోసి వడపోసి మూత్రపిండాలు వాడి పోతున్నాయి. కొట్టుకొని కొట్టుకొని గుండె నీరస పడుతోంది.

అనుభవించిన భోగాలు రోగాలకు ద్వారాలు తెరుస్తున్నాయి. అనుభవంలో అవయవాలు అరిగి పోతున్నాయి. సుఖానుభవం ఎంతో అర్థం కాదు. దుఃఖానుభవమే అంతా. సుఖం అల్పం. క్లేశం అనల్పం. ఇదే విషయానుభవం **(సుఖమల్పం బహుక్లేశః విషయ గ్రాహిణాం నృణామ్)**. అందుకే కర్మయోగి అసక్తుడు.

ఆహారం లేకపోతే మనిషి జీవించ లేడు. అలాగని హానికరమైన ఆహారాన్ని తీసుకుంటే అనారోగ్యానికి గురి అవుతాడు. సాత్త్వికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటాడు.

ఆహారం లాంటిదే కర్మ కూడా. ఆహారానికి కర్మకు చాలా దగ్గర సంబంధ ముంది. ఆహారం లేకపోతే మనిషి కర్మ చేయలేడు. అలాగే కర్మ చేయకుండా ఆహారాన్ని పొంద లేడు. ఆ రెండిటికి అవినాభావ సంబంధం ఉంది. కనుక ఆహారం విషయంలో ఎలాగో కర్మ విషయంలో కూడా అలాగే ఉండాలి.

కర్మ చేయక పోతే మనిషి జీవించ లేడు. అలాగని సకామ కర్మలు చేస్తూ పోతే బంధంలో తగుల్కుంటాడు. నిష్కామ కర్మయోగంలో చరిస్తేనే బంధంలో చిక్కుకోడు. అంతేకాదు, చిత్తశుద్ధిని పొంది జ్ఞాననిష్ఠకు అర్హుడవుతాడు. కనుక, ఎవడైతే విషయాల యందు విరక్తిని, పరమేశ్వరుని యందు అనురక్తిని కలిగి ఉంటాడో అతడే యోగయుక్తుడు **(పరమాత్మని యో రక్తః విరక్తః అపరమాత్మని - ఉపనిషత్తు)**.

కృష్ణా! నాకు ఏదో ఒకటి నిశ్చయించి చెప్పు **(తదేకమ్ నిశ్చిత్య వద)** *అని రెండవ శ్లోకంలో అర్జునుడు అడిగాడు కదా! గీతాచార్యుడు చెబుతున్నాడు.*

నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః ॥ 8

నియతం-కురు-కర్మ-త్వం-కర్మ-జ్యాయః-హి-అకర్మణః
శరీరయాత్రా-అపి-చ-తే-న-ప్రసిద్ధ్యేత్-అకర్మణః

త్వం	=	నీవు	జ్యాయః హి	=	శ్రేష్ఠము కదా
నియతం	=	నియతమైన	అకర్మణః	=	కర్మ చేయని
కర్మ	=	కర్మను	తే	=	నీకు
కురు	=	చేయుము	శరీరయాత్రా అపి చ	=	శరీరయాత్ర కూడా
అకర్మణః	=	కర్మ చేయకుండుట కంటె	న ప్రసిద్ధ్యేత్	=	జరగదు
కర్మ	=	కర్మ			

నువ్వు మాత్రము నియత కర్మను చెయ్యి. కర్మను మానుట కంటే కర్మ చేయడమే శ్రేయస్కరము. కర్మ చేయకపోతే దేహయాత్ర కూడా సాగదు.

వ్యాఖ్య

నదిని దాటాలి అనుకుంటే, నదిలో దిగడం ఒక్కటే మార్గం. కర్మ సుడిగుండం నుండి బయటపడి తరించాలి అనుకుంటే, కర్మ చేయడం కన్నా మరొక మార్గం లేదు. ఈత వచ్చిన వాడు నదిలో దిగినా మునిగి పోడు. కర్మయోగి కర్మ ప్రవాహంలో ఈదుతున్నా, అతడు కర్మ వలయంలో చిక్కుకోడు. కర్మల చేత బద్ధుడు కాడు.

పని చేసి చేసి విసిగి పోయానండీ! ఇక నేను పని నుండి విరమించాలి అనుకుంటున్నాను అని చాలా మంది అంటూ ఉంటారు. కర్మలలో అలసట వారి చేత అలాంటి మాటలు పలికిస్తుంది. ఏదీ చెయ్యకుండా

ఉండటం ఎవ్వరికీ సాధ్యం కాదు. అలాగని, ఏదేదో చేసి ఎదలు పగలగొట్టు కోవడం కూడా మంచిది కాదు. ఏది చెయ్యాలో దానిని అవగాహనతో చేస్తే, కర్మ యోగంగా మారుతుంది.

మన ప్రమేయం లేకుండానే కొన్ని కర్మలు మన ద్వారా జరుగుతూ ఉంటాయి. శ్వాసక్రియ నడుస్తూ ఉంది. ప్రతి క్షణం నడుస్తూ ఉంది. కాని శ్వాసలను గూర్చి మనం ఆలోచించడం లేదు. శ్వాసించే ప్రయత్నము ప్రత్యేకంగా చేయడమూ లేదు. అవన్నీ సహజం గానే జరిగి పోతున్నాయి. అందుచేత వాటిని సహజ కర్మలు అంటారు. కళ్ళపై అదే పనిగ రెప్పలు పడుతూ లేస్తూ ఉంటాయి. దేహ చలనాలు జరుగుతూ ఉంటాయి. మూత్రపిండాలు పని చేస్తూ ఉంటాయి. కాలేయము ఖాళీగా ఉండదు. గుండె కొట్టుకుంటూనే ఉంటుంది. ఇవన్నీ సహజంగా జరిగిపోతూ ఉంటాయి. అందుకే అవి సహజ కర్మలు.

సహజ కర్మలు నడుస్తూ ఉంటేనే, జీవనయాత్ర సాగుతూ ఉంటుంది. వాటి వల్ల మనిషికి బంధము లేదు. అలాగే మోక్షము కూడా ఉండదు. అవి ఒక నియతికి కట్టుబడి నడిచేవే గాని, మనం పని కట్టుకొని ఆచరించే నియత కర్మలు కావు.

కర్మస్వేచ్ఛ

సహజ కర్మలు మానవులలో నడిచినట్లే, జంతువులలో కూడా నడుస్తాయి. మానవుని లాగా జంతువులకు కర్మస్వేచ్ఛ లేనందున, అవి బ్రతికినంత కాలం సహజ కర్మల మధ్యే జీవనాన్ని సాగిస్తాయి. ప్రత్యేకమైన కోర్కెలు వాటిలో కదలవు. సహజాతాలే ప్రధానంగా ఉంటాయి. రాగద్వేషాలకు అవకాశం లేదు కనుక జంతువులకు బంధమూ లేదు. మోక్షమూ ఉండదు.

మనిషికి కర్మ స్వేచ్ఛ ఉంది. ఏది చెయ్యాలి, ఏది చెయ్య కూడదు అనే వివేకం ఉంది. మానవులు ఆచరించే కర్మలు వివిధంగా ఉండటానికి వివేకంలో భేదమే ప్రధాన కారణము.

మన కర్మల వెనుక ఇష్టాయిష్టాలు ఉన్నాయి. అవే రాగద్వేషాలు. అనుకున్నది జరగాలి అని కర్మ చేస్తాము. అలా జరిగి నపుడు అది మన విజయంగా భావిస్తాము. అది హిమాలయాన్ని ఎక్కడం కావచ్చు. వ్యాపారంలోకి దిగడం కావచ్చు. అలాగే, మనం జరగాలి అనుకున్నది జరగ నపుడు అది మన అపజయంగా భావిస్తాము. జయం వచ్చిందని పొంగిపోయిన మనమే అపజయం ఎదురైందని క్రుంగిపోతాము. కర్మలు - కర్మఫలాల విషయంలో సరియైన అవగాహన మనకు లేకపోవడమే ఈ విధమైన ఘర్షణకు కారణము.

కర్మలో జయమూ లేదు. అపజయమూ లేదు. కర్మలు జయాపజయాలను సృష్టించ లేవు. కర్మలు ఇవ్వగలిగేది కర్మ ఫలాలను మాత్రమే. కర్మఫలాల విషయంలో మన కున్న రాగద్వేషాలను బట్టి ఒక కర్మఫలం జయం గాను, మరొక కర్మఫలం అపజయం గాను తెలుస్తూ ఉంటుంది. అంతేకాదు, ఒక కాలంలో జయం అనుకున్నది మరొక కాలంలో అపజయం గాను, ఒక కాలంలో అపజయ మనుకున్నది ఇంకొక కాలంలో జయం గాను తెలుస్తూ ఉంటుంది. తరచుగా పార్టీలు మార్చే వారు ఎన్నికలలో వచ్చే ఫలితాలకు ఒక్కొక్క ఎన్నికలో ఒక్కొక్క విధంగా స్పందించ డానికి కారణం ఫలితాలు కావు. వారి వారి మనస్సులలో మారిపోయే రాగద్వేషాలు.

మరి, రాగద్వేషాల చేత ప్రేరేపించబడి కర్మ చేసిన వ్యక్తి ఫలితం విషయంలో ప్రశాంతంగా ఉండే మార్గముందా? ఉంది. అదే కర్మయోగ వైభవము. కర్మ రాగద్వేషాల చేత ఆరంభించ బడినా, ఫలితం అనేది సృష్టి లోని ధర్మాలకు తల వంచి ప్రాప్తిస్తుందని, ఆ ధర్మాల రూపంలో ఉన్నది దైవమే నన్న వివేకం ఉన్నవాడు ఫలితం ఎలా ఉన్నా దానిని ప్రసాదం గానే స్వీకరిస్తాడు.

ప్రస్తుతం మనస్సులో ఉన్న రాగద్వేషాల వత్తిడికి లోనై కర్మను ఆచరించడం వల్ల, మనస్సులో ఉన్న రాగమో లేదా ద్వేషమో క్షాళనం అవుతుంది. కర్మఫలం విషయంలో ప్రసాద భావన ఉన్నందున, నూతనంగా రాగద్వేషాలు తయారు కావు. కనుక ఫలం వచ్చి నపుడు అది జయమని పొంగడము గాని, అపజయ మని క్రుంగడము గాని జరగదు. ఫలము ఏదైనా ఒక్కటే. ఎందుకని? ఏది వచ్చినా ప్రసాదమే కనుక. ప్రసాదము అనేది భావనే కాబట్టి బుద్ధిని ప్రశాంతంగా ఉంచుతుంది. ఇలా శాంతించిన మనస్సు జ్ఞాననిష్ఠకు అర్హతను సాధిస్తుంది.

కర్మయోగంలో ప్రధానంగా కర్మకు కాదు విలువ; భావానికి విలువ. కర్మఫలం ప్రధానం కాదు; కర్మ ఫలము నందు భావనే ప్రధానం. కర్మయోగికి ఏ కర్మఫల మైనా ఒక్కటే. కారణం, ఏదైనా అశాశ్వతమే. కర్మయోగం ద్వారా ప్రస్తుతం ఉన్న రాగద్వేషాలను తటస్థం చేయడం వల్ల, ఉన్న వాసనలు క్షాళన మవుతాయి. నూతనంగా సంస్కారాలు పుట్టవు. చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది. అది మోక్షహేతువు అవుతుంది.

యోగ్య ప్రయుక్తం సాధనం కార్య సాధకమ్ - అనేది న్యాయం. యోగ్యుడైన వాడు చేసే ఏ పని అయినా ఫలప్రద మవుతుంది. యోగ్యుడు ప్రయోగించిన సాధనము కార్యసాధక మవుతుంది. అయోగ్యుని సాధనే అరణ్య రోదన మవుతుంది. యోగ్యుడైన వాడు ఆచరించ వలసిన యోగవిధి ఏమిటో చెబుతూ, అర్జునా! నియతమైన కర్మను చెయ్యి. అకర్మ కంటే కర్మే విశిష్ట మైనది. కర్మను మానేస్తే దేహయాత్ర కూడా సాగదు అంటున్నాడు ఈ శ్లోకంలో భగవానుడు.

'నియతకర్మ' అంటే, అవశ్యం చేయదగిన కర్మ అని అర్థము. అలాంటి కర్మను చెయ్యాలే గాని మానకూడదు. ***నియతం కురు కర్మత్వం*** - ఈ వాక్యాన్ని రెండు విధాలుగా అన్వయించుకో వచ్చు. ***నియతం కర్మ కురు (త్వం).*** అర్జునా! నియతమైన కర్మను నువ్వు ఆచరించు అని ఒక అర్థము. ***కర్మ నియతం కురు (త్వం).*** అర్జునా! కర్మను నువ్వు నియతంగా చెయ్యి అని మరొక అర్థము. ఏది ఎలా ఉన్నా, ***నియతం*** అనేదే ఈ శ్లోకంలో కేంద్ర విషయం.

నియత కర్మ

'నియతకర్మ' అంటే నువ్వు తప్పక చేయ దగిన కర్మ అని అర్థము. మరి, ఏది నియతకర్మ? ఇది నియతకర్మ అని నిర్ణయించేది ఎవరు? అనే ప్రశ్న కూడా ఉత్పన్న మవుతుంది. నియతం అనే పదము లోనే దాని అర్థము, నిర్ణయాధికారము, రెండూ ఇమిడి ఉన్నాయి.

నియతం నిత్యం, యో యస్మిన్ కర్మణి అధికృతః ఫలాయ చ అశ్రుతం తత్ నియతం కర్మ. 'నియతం' అంటే నిత్యము అని అర్థము. అంటే శాస్త్రము నిశ్చయించిన కర్మ (***శాస్త్ర ఉపదిష్టం***). శాస్త్ర ప్రతిపాదిత కర్మను ఆచరించడానికి అధికారి అయినవాడు, ఫలాభిసంధి లేకుండా ఆచరించే కర్మ 'నియతకర్మ' అవుతుంది. అంటే, కర్మను నిర్ణయించేది శాస్త్రమైనా కావాలి, లేదా స్వభావమైనా కావాలి. శాస్త్ర విహితంగా, లేక స్వభావ జనితంగా ఆచరింప బడేది 'నియతకర్మ'. ఈ రెండిటిని కలిపి ఒక్క మాటలో 'స్వధర్మం' అని చెప్పుకోవచ్చు.

శాస్త్రం నిర్దేశించిన కర్మలు నియత కర్మలు. ఇందులో విధి నిషేధాలు ఉంటాయి. చేయ దగినది చేయ మని చెప్పడం విధి అయితే, చేయకూడని దానిని చెయ్యవద్దు అని చెప్పడం నిషేధం. శ్వాసించడం చేయ దగిన కర్మ. అలాగని 'నువ్వు శ్వాసించు' అనే విధి వాక్యాన్ని వేదము అందించ నవసరం లేదు. అలాగే 'భవనం మీద నుండి క్రిందికి దూకవద్దు' అనే నిషేధ వాక్యాన్ని కూడా వేదం పలక నవసరం లేదు. ఇవన్నీ మానవుని సామాన్య వివేకానికి అందుతాయి. అలా కాకుండా తనకు తానుగా గ్రహించలేని విషయాలను, గ్రహించినా దారి తప్పే

అవకాశం ఉన్న విషయాలను, హితకారిణి అయిన శాస్త్రము కర్మల విషయంలో సుస్పష్టమైన మార్గనిర్దేశం చేస్తుంది.

శాస్త్ర విహిత కర్మలు ఉన్నట్లే, స్వభావ జనిత కర్మలు కూడా ఉంటాయి. మనస్సు లోని సంస్కారమే ఇక్కడ స్వభావము. శాస్త్ర ప్రతిపాదిత కర్మలను గాని, లేదా స్వభావ ప్రేరిత కర్మలను గాని సకామంలో చేస్తే, లేదా ఫలాపేక్షతో చేస్తే అవి బంధహేతువు లవుతాయి. అందుకే నియతకర్మను ఫలాపేక్ష లేకుండా ఆచరించ మని గీతాచార్యుడు ఆదేశిస్తున్నాడు (***నియతం కర్మ, తత్ కురు హే అర్జున! ఫలాయ చ అశ్రుతం తత్ నియతం కర్మ***).

నియతకర్మ అనగానే ప్రస్తుతం చేస్తున్న కర్మను మార్చే ప్రయత్నము చేయ నవసరం లేదు. ఇప్పుడు ఎలాగైతే కర్మలు చేస్తున్నావో అలాగే చెయ్యి. ఏ కర్మ ప్రస్తుతం అశాస్త్రీయంగా జరుగుతూ ఉందో, దానినే సశాస్త్రీయంగా చేస్తావు. అంతే. ఫలాసక్తితో ఇంతవరకు కర్మలను ఆచరించావు. ఫలాపేక్ష లేకుండా ఇక మీదట నియతకర్మను చేస్తావు. అంతే. ప్రయాణము అదే. మార్గము అదే. ఏదీ మారలేదు. మనస్సులో భావన ఒక్కటే మారింది. మనస్సు మారింది. దానితో మనుగడ మహిమాన్విత మయింది. అదే కర్మయోగ వైశిష్ట్యము. అర్జునా! ఇప్పుడు చెప్పు. కర్మను విడిచి పెట్టి జడత్వంతో రాయిలా పడి ఉండటం శ్రేయస్కరమా? నియత కర్మను ఫలాసక్తి లేకుండా ఆచరిస్తూ, చిత్తశుద్ధితో ప్రకాశిస్తూ, ప్రసన్న చిత్తముతో జ్ఞాననిష్ఠకు సిద్ధం కావడం శ్రేయస్కరమా? అందుకే, అకర్మ కంటే కర్మే మంచిది అంటున్నాను (***యతః కర్మ జ్యాయః అకర్మణః***).

అకర్మ అయుక్తం - కర్మ యుక్తం

నేను కర్మ చెయ్యను అని కూర్చున్నంత మాత్రాన అలా అనుకుంటున్న వ్యక్తి కర్మ చేయనివాడు కాలేడు. 'నేను కర్మ చెయ్యను' అని చెబుతున్న వాడు ఎవడో, అతడే ఒకప్పుడు 'నేను కర్మ చేస్తున్నాను' అన్నవాడు. 'కర్మ చేయ్యను' అన్నప్పుడు కర్త ఉన్నాడు. 'కర్మ చేస్తున్నాను' అన్నప్పుడు కూడా కర్త ఉన్నాడు. కర్త ఉన్నంత వరకు కర్మ నుండి విడిపడటం సాధ్యం కాదు.

తాను అకర్త అని తెలుసుకున్న వాడే కర్మ నుండి విడిపడతాడు. 'నేను అకర్త' అనేది జ్ఞానం. జ్ఞానంలో కర్మకు అవకాశం లేదు. తాను అకర్త అనే జ్ఞానం లేకుండా, 'నేను కర్మను చెయ్యను' అన్నంత మాత్రాన అలా అనే వ్యక్తి అకర్త కాలేడు. అందుచేత అకర్మ కంటే కర్మయే ఉత్తమ మైనది. కాకపోతే, యోగ భావనతో కర్మలు బంధం కాకుండా చూసుకోవాలి. అది కర్మయోగం లోనే సాధ్యం. కనుక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలోచించి నపుడు కర్మ చేయకుండా ఉండటం కంటే, కర్మ చేయడమే అధికతర మైనది (***కర్మ జ్యాయః అధికతరం ఫలతః***).

కర్మశూన్యత అనేది సన్యాసము క్రిందికి రాదు. జ్ఞానంతో సన్యాసము తీసుకుంటే, అది విద్వత్సన్యాసము అవుతుంది. జ్ఞానేచ్ఛతో సన్యాసం పుచ్చుకుంటే, అది వివిదిషా సన్యాస మవుతుంది. ఏదీ చేయకుండా కూర్చున్నవాడు, ఈ రెండిటి క్రిందికి రాడు. పైగా, ఆత్మజ్ఞానము లేకుండా కర్మలకు దూరమైనాడు కనుక మోక్షప్రాప్తి యొక్క ప్రసక్తే లేదు.

కర్మయోగి ఫలాసక్తి లేకుండా కర్మలను ఆచరించడం చేత చిత్తశుద్ధిని పొంది మోక్షార్హు డవుతున్నాడు. జ్ఞాననిష్ఠకు యోగ్యతను సాధిస్తున్నాడు. ప్రసాద భావన వల్ల ప్రశాంతత అనే దృష్టఫలాన్ని కూడా అనుభవిస్తున్నాడు.

ఏ కర్మను చేయని వాడు ఏ ప్రగతిని సాధించ లేడు. ఈ జన్మలో ప్రగతికి సోపానాలే లేనివాడు, రాబోయే జన్మలో ఏ వైభవాన్ని చూస్తాడు? అందుచేత, అధమ జన్మను పొందుతాడు.

కర్మయోగి అలా కాదు. ఒకవేళ తాను సిద్ధిని పొందలేక పోయినా, ఆచరించిన కర్మయోగము యొక్క ఫలితంగా శుచి గల ప్రదేశాలలో జ్ఞాననిష్ఠకు అనుకూలమైన శ్రీమంతుడుగా జన్మిస్తాడు. కనుక, ఆత్మజ్ఞానము లేని వానికి అకర్మ అయుక్తం. కర్మయే యుక్తం.

అకర్మ విషయంలో మనం ఆలోచించ వలసిన అతి ముఖ్యమైన విషయం కూడా ఒకటుంది. కర్మ చేయకుండా కూర్చోవడం వల్ల, కర్మల లోని దోషాలు అంటవని, నూతన వాసనలు తయారు కావని భావించి కూడా కొందరు కర్మలను త్యజిస్తారు. ఇది మరీ ప్రమాదకరమైన పరిస్థితి. ఎందుకంటే, నూతన సంస్కారాల విషయం అలా ఉంచండి. పేరుకు పోయిన పాత వాసనలు ప్రక్షాళన మయ్యేది ఎలా? సహేతుకమైన ఆలోచన లోపిస్తే, ఆ తరువాత అంతా ప్రమాదమే. కర్మను చూచి భయపడి, అకర్మ శ్రేయస్కర మని భావించడం అనుచితం. కనుక, కర్మ చేస్తూ, కర్మను యోగంగా మార్చుకోవడం లోనే వాసనలు ప్రక్షాళనమై, బుద్ధి శుద్ధిపడే అవకాశం ఉంది. ఒకవేళ మనిషి భయపడ వలసిన పరిస్థితి వస్తే, కర్మను మానడం అనే ఆలోచనకు భయపడాలి గాని, కర్మను చేయడానికి కాదు.

అకర్మ అన్ని విధాల దోషయుతంగా తెలుస్తూ ఉంది. అంతేకాదు, కర్మ చేయని వానికి దేహయాత్ర కూడా జరగదు. మనుగడే సమస్యగా పరిణమిస్తుంది. అలా చూచి నపుడు కర్మాకర్మల విశేషం ఈ లోకం లోనే స్పష్టంగా తెలుస్తూ ఉంది ***(అతః దృష్టః కర్మాకర్మణోః విశేషః లోకే)***.

దేహయాత్ర

దేహంలో ఉన్నవాడు దేహి. దేహయాత్ర లేకుండా దేహి ఉండలేడు. దేహం ఉంటేనే దేహి. దేహం ఉండాలి అంటే కర్మ జరిగి తీరాలి. చలించే దేహం చలనాత్మకమైన కర్మకు దూరమై మనుగడను సాగించ లేదు.

కారులో ప్రయాణం చేసేవాడు కారు విషయంలో తగు చర్యలు చేపట్టినట్లు, దేహ మనే బండిలో పయనించే వాడు దేహం విషయంలో అవసరమైన కార్యాలు చేపట్టక తప్పదు. కారును శుభ్రం చేసుకోవాలి. ఇంధనాన్ని నింపుకోవాలి. ఇవన్నీ కర్మలే. దేహి కూడా దేహం విషయంలో స్నానాది శుద్ధి కార్యాలను నిత్యం ఆచరించాలి. దేహం నిలవడానికి అన్నపానీయాదుల్ని స్వీకరించాలి. అప్పుడే దేహం మన గలుగుతుంది. ఇంధనం లేకపోతే కారు కదలదు. అన్నాదులు లేకుండా శరీరయాత్ర జరగదు.

కారును నడపకుండా పడేస్తే త్రుప్పు పట్టి పోతుంది. కర్మను చేయడం మానేస్తే, దేహం క్షీణిస్తుంది. మనస్సు ఆలోచనా శక్తిని కూడా కోల్పోతుంది. బండి మనకు ఉపకరిస్తూ ఉంది కనుక, బండి నడవ డానికి కొంత కర్మ చేయక తప్పదు. దేహం జీవనయాత్రకు ఉపకరిస్తూ ఉంది కనుక, దేహం విషయంలో కూడా దేహి కర్మ చేయక తప్పదు.

కర్మ చేయక పోవడం వల్ల దేహం యొక్క మనుగడకే ప్రమాదము అని చెప్పకుండా, దేహయాత్ర కూడా జరగదు అనడంలో భగవంతుడు ఎంతో భావగర్భితమైన సందేశాన్ని ముముక్షు లోకానికి అందించాడు. **యాత్రా** అంటే, ప్రయాణము, మార్గము, ఉత్సవము, తీర్థయాత్ర అని అర్థము.

శ్రేయస్సును పొందడానికి దేహి సాగించే ప్రయాణమే దేహయాత్ర. శ్రేయస్సు గమ్యము. అట్టి గమ్యాన్ని చేరడానికి దేహికి పరమేశ్వరుడు ప్రసాదించిన వాహనమే దేహము. గమ్యము చేరడము అనేది గమనంపై ఆధారపడి ఉంటుంది. గమనమునే ***యాత్రా*** అంటారు. ప్రతి గమనము యాత్ర కాకపోవచ్చు. యాత్ర చేయాలి అంటే మాత్రం గమనం తప్పదు. మోక్షమనే గమ్యాన్ని చేరడానికి అకర్మ అనేది మార్గం కాదు. గమనం కాదు. చలనాత్మకమైన కర్మయే గమనము.

ప్రయాణాలు మనిషికి క్రొత్తవి కావు. ప్రతి ప్రయాణము యాత్ర కాదు. కాని, యాత్ర చేయాలి, తీర్థయాత్ర చేయాలి అంటే మాత్రం ప్రయాణం చేసే తీరాలి. బండిలో మనం ప్రయాణిస్తాము. కాని, ఎటు పయనించాలి? అనేది బండికి తెలియదు. బండిని నడిపే వ్యక్తి బుద్ధికి తెలుస్తుంది. అలా తెలిసిన వాడు బండిని నడిపితేనే గమ్యం వస్తుంది. కదలకుండా బండిలో కూర్చుంటే గమ్యం చేరడం సాధ్య పడదు.

దేహం అనే బండిలో ఉన్న దేహి దేహేంద్రియ మనోబుద్ధులను కదిలించి శ్రేయస్సు వైపు నడిపితేనే, గమ్యాన్ని చేరి తరిస్తాడు. కేవలం దేహంలో కూర్చుని కర్మ చేయకుండా ఉంటే, గమనమే జరగదు కనుక గమ్యాన్ని చేరే అవకాశమే ఉండదు ***(శరీర యాత్రా అపి న ప్రసిద్ధ్యేత్ ప్రసిద్ధిం న గచ్ఛేత్ అకర్మణః అకరణాత్)***.

మానవులు తీర్థయాత్రలు చేస్తూ ఉంటారు. పుణ్యాన్ని ఆర్జించాలని తీర్థాటన చేస్తారు. కాని, మానవుడు సాగించే దేహయాత్ర కేవలం పుణ్యానికే కాదు, మోక్షానికి కూడా. పరమ పురుషార్థాన్ని సాధించడం కోసమే దేహయాత్ర కొనసాగాలి. ఈ కార్యం కోసమే పరమేశ్వరుడు జీవునికి శరీరాన్ని ప్రసాదించాడు. జీవితంలో మహోత్తమమైన ధర్మసాధన కొరకే దేహం ఉంది.

శరీరం ఆద్యం ఖలు ధర్మ సాధనమ్ - ధర్మజీవన యాత్రలో, మోక్షజీవన మార్గంలో శరీరమే ప్రథమ సాధనంగా ఉందని మహాకవి కాళిదాసు 'కుమార సంభవం'లో అద్భుతంగా ప్రవచించాడు.

ఈ దేహయాత్ర ఎప్పుడు బయలు దేరిందో, ఎక్కడ శ్రీకారం చుట్టిందో చెప్పలేము. తల్లి గర్భం నుండి కదలి శ్మశాన గర్భంలో ఆగినట్లు తెలుస్తున్నా, వాస్తవానికి అది సత్యం కాదు. నేటి దేహానికి అది వర్తించవచ్చు. ఏమి సాధించాలని నేటి దేహం వచ్చిందో, అదే సంకల్పంతో గత జన్మలలో దేహాలు కూడా వచ్చాయి. దేహయాత్రలు జరిగాయి. అయినా, గమ్యం చేరడం జరగ లేదు. అందుకే నేడు మళ్ళీ దేహం కనిపిస్తూ ఉంది. ఈ జన్మ కూడా వృథా అయితే, మళ్ళీ జన్మలో వేరొక దేహం కనిపిస్తుంది. శ్మశానము అనేది జీవికి విరామ స్థానమే గాని, గమ్యస్థానము కాదు. మోక్షమే గమ్య స్థానము.

కర్మ చేయడం మానేస్తే, దేహము యొక్క మనుగడే ప్రమాదంలో పడి పోతుంది. బండి పాడై నపుడు ఇక గమనం ఏముంది? గమ్య మెక్కడుంది? కనుకనే, అకర్మ కన్నా కర్మే యుక్త మని, కర్మ చేయక పోతే, దేహయాత్ర కూడా ప్రశ్నార్థక మవుతుందని హెచ్చరిస్తున్నాడు పార్థసారథి.

అర్జునా! కర్మను చూచి భయపడి, అకర్మను వరించి, నీవు చెప్పినట్లు సన్యాసి లాగా భిక్ష మెత్తుకొని జీవించాలని భావించినా, చూడు నాయనా! భిక్ష మెత్తడం కర్మ కాదా? సన్యాసి మాత్రం కర్మకు దూరమైంది ఎప్పుడు? అందుకని, నియతమైన కర్మ అకర్మ కంటే మేలైనది కనుక, ఫలాసక్తి లేకుండా ఆచరిస్తూ పో! స్వధర్మాచరణమే నీకు యుక్తం. పాపాలన్నీ ప్రక్షాళన మవుతాయి. చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది. మోక్షం కళ్ళ ముందే దోబూచు లాడుతుంది.

నిప్పు పెట్టిన వ్యక్తిని అయినా
ముట్టినచో నిప్పు కాల్చును
ధర్మము విడిచి చరించు వారికి
లభించదు దేవుని కనికరము
ధర్మము నందే వైభవము
తప్పిన ధర్మము వైకల్యము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

అర్జునా! కర్మ బంధహేతువు కనుక అది త్యాజ్యమని నీవు భావించడం కూడా సరియైనది కాదు. ఎలాగో, చెబుతాను విను.

యజ్ఞార్థా త్కర్మ ణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబన్ధనః ।
తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసఙ్గ స్సమాచర ॥ 9

యజ్ఞార్థాత్-కర్మణః-అన్యత్ర-లోకః-అయం-కర్మబంధనః
తదర్థం-కర్మ-కౌంతేయ-ముక్తసంగః-సమాచర

కౌంతేయ	= అర్జునా!	కర్మబంధనః	= కర్మమే బంధముగా గలది
యజ్ఞార్థాత్	= యజ్ఞార్థమైన	తదర్థం	= యజ్ఞము కొరకు
కర్మణః	= కర్మ కంటె	ముక్తసంగః	= సంగమును విడిచిన వాడవై
అన్యత్ర	= ఇతర కర్మ యందు	కర్మ	= కర్మమును
అయం	= ఈ	సమాచర	= చక్కగా ఆచరించు
లోకః	= లోకము		

అర్జునా! యజ్ఞము కొరకు కాకుండా ఈ లోకంలో చేసే కర్మ లన్నీ బంధాలకు కారణ మవుతాయి. కాబట్టి సంగత్వము లేకుండా కర్మను ఆచరించు.

వ్యాఖ్య

స్వార్థంతో కూడిన సకామ కర్మలు బంధహేతువులు. ఫలాసక్తి లేకుండా, ఈశ్వర ప్రీత్యర్థం ఆచరించే కర్మలు బంధహేతువులు కావు. కనుక ఈశ్వరార్థం కర్మల్ని ఆచరించాలి అని గీతాచార్యుని ప్రబోధము.

యజ్ఞకర్మ

యజ్ఞో వై విష్ణుః విష్ణువు సర్వ యజ్ఞ స్వరూపుడు అన్నది వేదం. యజ్ఞములను ఆచరించు వారికి సంతుష్టిని కలిగించు వాడు అని కూడా చెప్పింది శ్రుతిమాత ***(సర్వేషాం తుష్టికారకః యజ్ఞా కారేణ ప్రవర్తత ఇతి వా యజ్ఞోవై విష్ణుః ఇతి శ్రుతేః)***. కనుక యజ్ఞ మనగా విష్ణువు. ఈశ్వరుడు. యజ్ఞరూపుడైన పరమేశ్వరుని కొరకు ఆచరించే కర్మ ఏదైనను అది యజ్ఞకర్మే అవుతుంది ***(ఈశ్వరార్థం యత్ క్రియతే తత్ యజ్ఞార్థం కర్మ)***. యజ్ఞార్థం, అంటే ఈశ్వరార్థం కర్మను ఆచరించే వాడు బద్ధుడు కాడు. ఈశ్వర ప్రీత్యర్థం కర్మను ఆచరించే వారికి బంధము లేదు. యజ్ఞకర్మ కాకుండా స్వార్థపూరితమైన కర్మలు చేయువారు కర్మబంధంలో చిక్కు కుంటారు.

రాగద్వేషాల చేత ప్రేరేపించ బడి ఫలాసక్తితో ఆచరించి నపుడే కర్మలు బంధిస్తాయి. యజ్ఞకర్మ వైశిష్ట్యము దానికి భిన్నంగా ఉంటుంది. యజ్ఞకర్మలో స్వార్థ చింతనము ఉండదు. రాగద్వేషాల స్థానంలో ధర్మాధర్మాలు విలుస్తాయి. ధర్మస్పృహ ప్రధానంగా ఉంటుంది. యజ్ఞరూపుడైన పరమేశ్వరుడే ఇక్కడ ధర్మరూపంలో ఉన్నాడు. సకామ కర్మలలో ఏ ఫలాసక్తి బాధిస్తూ ఉండిందో, ఆ ఫలాసక్తి స్థానంలో ప్రసాద బుద్ధి చోటు చేసుకుంటుంది. ఫలసంగం ఎక్కడైతే లేదో, అక్కడ కర్మ బంధహేతువు కాలేదు.

కర్మణా బధ్యతే జన్తుః - కర్మల చేత జీవులు బద్ధు లవుతారు అన్నది శాస్త్రం. అంటే, యజ్ఞకర్మ కానిది ఏదైనా బంధహేతువు అవుతుందనే అర్థం. ఏది బంధము కొరకు కాదో ***(తత్ కర్మ యత్ న బంధాయ - ఉపనిషత్తు)*** ఆ కర్మ యజ్ఞకర్మ.

కర్మ ఒక్కటే. చేసే వ్యక్తి కూడా ఒక్కడే. చేసే విధానమూ ఒక్కటే. కాకపోతే, చేసే వ్యక్తి యొక్క భావాన్ని

బట్టి అది బంధమా? బంధ రహితమా? అని నిర్ణయించ వలసి ఉంటుంది. సకామ కర్మలలో ఫలాభిసంధి ఉంటుంది కనుక అది బంధము. యజ్ఞకర్మ నిష్కామము కనుక అది బంధము కాదు. కర్మలలో దోషము లేదు. కర్మలలో భావనే ప్రధానం. నికృష్టమైన భావంతో ఆచరించే కర్మను ఉత్కృష్టమైన భావంతో చేస్తాం. అంతే.

రాగద్వేషాల కొరకు అచరించే దైతే, అట్టి కర్మ బంధాన్ని సృష్టిస్తుంది. ధర్మాధర్మాల స్పృహ కలిగి, ధర్మ రూపంలో ఉన్న దైవం ప్రీత్యర్థం ఆచరించే కర్మ బంధాన్ని సృష్టించదు. పైగా చిత్తశుద్ధిని కలిగించి మోక్షహేతు వవుతుంది. కనుక, కర్మలు ఈశ్వరార్థం జరగాలి. కర్మలలో ఫలాభిసంధి లేకుండా చూసుకోవాలి. అలా చేయగలిగి నపుడు కర్మకు బంధించే శక్తి ఉండదు.

సమర్పణ భావం

ఇంత వరకు సంగత్వం లేకుండా కర్మ చేయమన్నాడు. ఫలాసక్తి రహితంగా కర్మల్ని ఆచరించ మని చెప్పాడు. ఇప్పుడు విషయాన్ని ఒక అందమైన మలుపు త్రిప్పుతూ, యజ్ఞార్థం చేయ మంటున్నాడు. ఈశ్వరార్థం ఆచరించ మంటున్నాడు. యజ్ఞకర్మలో 'నేను', 'నాది' అనే అహంకార, మమకారాలు నిస్సారమై నిర్వీర్య మవుతూ ఉంటాయి. మనం చేసేది ఏదైనా ఈశ్వర కర్మ అవుతుంది. మనకు అందేది ఏదైనా ప్రసాదము అవుతుంది. కర్మ నైవేద్య మవుతూ ఉంటే, ఫలం ప్రసాదంగా అందుతూ ఉంటుంది. బుద్ధి ప్రసన్నతలో ప్రశాంతంగా ఉంటుంది. జ్ఞాననిష్ఠకు సిద్ధపడుతూ ఉంటుంది.

కర్మ చేయడానికి మనిషికి శక్తి కావాలి. ఆలోచించే యుక్తి కావాలి. పరిస్థితులు, కాలం అనుకూలంగా ఉండాలి. ఇవన్నీ భగవ త్ప్రసాదాలు. కాళ్ళు లేనివాడు నడవ లేడు. కళ్ళు లేనివాడు చూడ లేడు. చేతులు ఉండబట్టే పనులు చేస్తున్నాము. ఇవన్నీ భగవంతుడే ప్రసాదించాడు. అవి అలా పని చేయడానికి నియతిని నిర్మించింది తానే. సమస్తాన్ని నియంత్రించే నియంత తానే. కనుక కర్మాచరణము మనం చేసినా, వైభవ మంతా తనదే. ఆయన యంత్రి. నేను యంత్రము. పని నాదే కావచ్చు. పనితన మంతా అతనిదే. నేను కేవలం పాత్రధారిని. పరమేశ్వరుడు సూత్రధారి. ఈ భావనతో చేసే కర్మ ఏదైనా యజ్ఞకర్మే అవుతుంది. పని పూజగా మారుతుంది. ఫలం ప్రసాద మవుతుంది.

మనం చేసే కర్మలలో స్వార్థం లేదు. ధర్మస్పృహ, ధర్మచింతన ప్రధానంగా ఉంది. ఏ కర్మ చేయాలో, ఏది చేయ కూడదో అనే విషయంలో కూడా అవగాహన ఉంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి జారి పడుతూ ఉంటే, మనం ముందు కురికి అతణ్ణి రక్షించే ప్రయత్నం చేస్తాం. ఎందుకని? భగవంతుడు మనకు చేతు లిచ్చాడు. అందుచేత, మరొక వ్యక్తి పతనమయ్యే పరిస్థితిని రానివ్వము. ఈ విధమైన కర్మలో స్వార్థం లేదు. కాని, ఇదే కర్మలో ఈశ్వర భావన గనుక చోటు చేసుకుంటే, అది యజ్ఞకర్మ అవుతుంది. అదే కర్మయోగము.

అర్జునా! కనుక, యజ్ఞార్థం కర్మలు చెయ్యి. ఈశ్వర ప్రీత్యర్థం కర్మలను ఆచరించు. ముక్తసంగుడవై ఉండు ***(ముక్త సంగః కర్మఫల సంగ వర్జితః సన్)***. ఈ విధంగా కర్మలను ఆచరించు ***(సమాచర నిర్వర్తయ)***. నిస్వార్థంగా, ఈశ్వర ప్రీత్యర్థం, ఫలాసక్తి లేకుండా చేసే ఏ కార్యమైనా యజ్ఞకార్యమే. దైవ కార్యమే. ఈశ్వర ప్రీత్యర్థం చేసే కర్మ బంధించదు. స్వార్థ పూరిత కర్మలే బంధిస్తాయి. అలాంటి కర్మలతో కలవకు. దూరంగా ఉండు. ముడిపడితే బంధము. విడిపడితే మోక్షము.

ఆఖ్యాయిక

ఒక ఇంట్లో భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. పరస్పరం పరుష పదజాలంలో దూషించు

కుంటున్నారు. ఒక దశలో విసిగి పోయిన భర్త భార్యకు హితబోధ చేస్తూ, మన ఇంట్లో ఉన్న రెండు కుక్కలు చూడు, ఎంత అన్యోన్యంగా జీవిస్తున్నాయో? ఏ రోజైనా మన లాగా పోట్లాడు కున్నాయా? వాటి లాగా ప్రశాంతంగా మనం ఎందుకని ఉండలేక పోతున్నాం? అని అనునయంగా పలికాడు. భార్య మండి పడుతూ, మీరు చెప్పేది నేను అంగీకరించను. అవి కూడా ఉండ లేవు. మచ్చికతో ఉండటం వాటికి కూడా సాధ్యం కాదు. నా మాట మీద మీకు నమ్మకం లేకపోతే, ఆ రెండిటిని కలిపి ఒక త్రాటితో కట్టేయండి. ఆ తరువాత ఏమి జరుగుతుందో మీకే అర్థమవుతుంది అంది. అంతే.

అర్జునా! యజ్ఞకర్మ నేడు నేను ప్రారంభిస్తున్నది కాదు. సృష్ట్యాది నుండే ఉంది. అందుకే నువ్వు ఆచరించాలి. అది కూడా చెబుతాను. విను.

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽస్త్విష్టకామధుక్ ॥ 10

సహయజ్ఞాః-ప్రజాః-సృష్ట్వా-పురా-ఉవాచ-ప్రజాపతిః
అనేన-ప్రసవిష్యధ్వం-ఏషః-వః-అస్తు-ఇష్టకామధుక్

ప్రజాపతిః	=	బ్రహ్మ	అనేన	=	దీని చేత
పురా	=	పూర్వము	ప్రసవిష్యధ్వం	=	వృద్ధి చేయండి
సహయజ్ఞాః	=	యజ్ఞములతో గూడిన	ఏషః	=	ఇది
ప్రజాః	=	ప్రజలను	వః	=	మీకు
సృష్ట్వా	=	సృజించి	ఇష్టకామధుక్	=	ఇష్టమైన కోరికలను ఇచ్చునది
ఉవాచ	=	పలికెను	అస్తు	=	అగు గాక

పూర్వము బ్రహ్మదేవుడు యజ్ఞములతో సహ ప్రజలను సృష్టించాడు. ఈ యజ్ఞముల చేత మీరు వృద్ధిని సాధించండి. యజ్ఞములు మీ కోర్కెలను తీర్చుతాయి అన్నాడు.

వ్యాఖ్య

ప్రజలను సృష్టించిన వాడు ప్రజాపతి (***ప్రజానాం స్రష్టా***). అతడే బ్రహ్మదేవుడు. సృష్టి ప్రారంభంలో ప్రజాపతి యజ్ఞ సహితంగా ప్రజల్ని సృష్టించాడు. ప్రజా సహితంగా యజ్ఞాల్ని సృష్టించాడు. అంటే, మనిషి సృష్టింపబడి నపుడే హిత కారకములు, అహిత నివారకములు అయిన సాధనోపాయాలు కూడా పుట్టాయి అని అర్థము.

అలా ప్రజలను సృష్టించిన ప్రజాపతి, ఈ యజ్ఞముల చేత వృద్ధిని సాధించండి అని చెప్పాడు. ఈ యజ్ఞాలు మీ అభీష్టములను నెరవేర్చి ఫల విశేషాలను ప్రసాదిస్తాయి అని కూడా చెప్పాడు. సర్వులకు యజ్ఞములు ఫలదాయకములు. సకాములైన వారికి స్వర్గాది భోగాలను ప్రసాదిస్తాయి. నిష్కాములై శ్రేయస్సును అభిలషించే ముముక్షువులకు ముక్తిని అనుగ్రహిస్తాయి. ***ధర్మజ్ఞ సమయః ప్రమాణమ్*** అనే సూత్ర నిర్దేశానుసారం ధర్మజ్ఞుడు, శ్రేష్ఠుడు అయిన బ్రహ్మదేవుని ఉపదేశమును ప్రామాణికంగా గ్రహించి సర్వులు ఆచరించాలి. పెద్దల మాటను ఆలకించి ఆచరించాలి అనేది సృష్ట్యాది లోనే నిర్దేశింప బడింది.

సంస్కార యజ్ఞాలు

యజ ధాతువు నుండి 'యజ్ఞ' శబ్దం పుట్టింది. 'యజ' అంటే దేవతారాధన అని అర్థం. యజ్ఞాలు భగవత్ప్రీతికరము లైన ఆరాధనలు. ఇవన్నీ వైదిక కర్మలు. జీవితాన్ని అన్ని దశలలో సంస్కరించే సంపదలు.

జీవాత్మను సంస్కరించ డానికి నలభై సంస్కారాలను శాస్త్రం నిర్దేశించింది (***చత్వారింశత్***). అవి గర్భాధానము నుండి ప్రారంభమై అంత్యేష్టి వరకు సాగుతాయి. ఆ తరువాత కూడా నిర్వహించ బడుతాయి. ఇవన్నీ జీవి ఔన్నత్యాన్ని కాంక్షించి నిర్దేశింప బడినవే. వీటిలో పంచ మహాయజ్ఞాలు ఉన్నాయి. సప్త పాక యజ్ఞాలు ఉన్నాయి. సప్త హావిర్యజ్ఞాలు ఉన్నాయి. సప్త సోమ యజ్ఞాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా గర్భాధాన పుంసవన సీమంత జాత కర్మాది నలభై సంస్కారాల లోనివే.

ఈ విధమైన యజ్ఞాలలో కొన్ని ప్రతిరోజు చేయవలసినవి కాగా, మరి కొన్ని ప్రత్యేక సమయాలలో నిర్వహించ వలసినవిగా ఉంటాయి. పంచ మహాయజ్ఞాలు రోజూ చేయాలి. దేవయజ్ఞము, పితృయజ్ఞము, బ్రహ్మయజ్ఞము, మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము లాంటివి నిత్యమూ చేయ వలసినవి. అగ్నిహోత్రము నిత్యకర్మ. ఔపాసన కూడా అంతే. అది పాకయజ్ఞంలో భాగమే. కాని సోమయజ్ఞాలు జీవితంలో ఒక్కసారి మాత్రమే చేయ వలసినవి.

సంస్కార యజ్ఞాలన్నీ జీవుడు తల్లి గర్భంలో ఉన్నప్పుడే ప్రారంభ మవుతాయి. ఇవి దోషాలను దూరం చేస్తాయి. ఉత్తమ శక్తులకు ఊత నిస్తాయి. భావశుద్ధిని పెంపొందిస్తాయి. అందుచేతనే అవి సంస్కారాలు అని పిలువ బడ్డాయి. ***సంస్క్రియన్తే ఏభిరితి సంస్కారాః*** జీవులను సంస్కరిస్తాయి కనుక అవి సంస్కారాలు. శాస్త్రీయ మైన క్రియా విశేషాలు.

వస్తు వినియోగంలో కూడా మనం ఈ విధమైన సంస్కారాలను చూస్తూ ఉంటాం. ఉదాహరణకు మనం తినే అన్నమునే తీసుకోండి. మొదట అది వరి ధాన్యంగా ఉంటుంది. అది మన ఆహారమే. కాని, ధాన్యాన్ని అలాగే ఆరగించ గలమా? సంస్కరించిన తరువాతే వినియోగించుకో గలం. ముందు ధాన్యాన్ని కోసి ఆర బెట్టాలి. ఆ తరువాత దానిపై ఉన్న పొట్టును తొలగించాలి. అది బియ్యంగా తయారైన తరువాత కడిగి, వండటం అనే క్రియను సాగించాలి. ఆ తరువాతే అది అన్నమై మనకు ఆహారంగా ఉపయోగ పడుతుంది. ఇదంతా ధాన్య సంస్కారము.

అలాగే భూమి నుండి రత్నాలు, బంగారు మొదలైన ప్రశస్తమైన, విలువైన వస్తువులు లభిస్తాయి. కాని, వాటిని ఎంతో శుద్ధి చేస్తే గాని వాటి లోని వైభవము బహిర్గతం కాదు. అలా సంస్కరింప బడిన తరువాతే అవి ఆభరణాలై, అలంకార యోగ్యమై శోభిస్తాయి.

అలాగే జన్మాదిగా ఎన్నో దోషాలతో జీవులు జన్మిస్తారు. వారిని సంస్కరించే ప్రక్రియలు చేపట్టక పోతే, వ్యర్థ జీవు లవుతారు. సంస్కరిస్తే పునీతు లవుతారు. ప్రకాశవంతంగా జీవిస్తారు. పవిత్రులై తరిస్తారు.

ఈ విధమైన జీవ సంస్కారాలు గర్భాధానం నుండే ఆరంభ మవుతాయి. తల్లి గర్భంలో ఉన్న దేహ పిండము మంత్రపూతం కావడమే గర్భాధాన సంస్కార వైశిష్ట్యం. గర్భాధాన, పుంసవన, సీమంతాది సంస్కారాలు గర్భవతి యైన మహిళను ఉద్దేశించి చేసేవిగా మనం భావిస్తాము. వాస్తవానికి అవి తల్లి గర్భంలో వృద్ధి చెందే బిడ్డ కొరకు నిర్దేశించినవి. అందుచేత, వీటి విషయంలో ఉపేక్ష పనికి రాదు. గర్భము దాల్చిన మూడవ మాసంలో పుంసవనము, గర్భము దాల్చిన ఆరవ మాసంలో గాని, లేదా ఎనిమిదవ మాసంలో గాని సీమంతం చేస్తారు. ఇవన్నీ పరమేశ్వరుని అనుగ్రహాన్ని అర్థిస్తూ, ఈశ్వర ప్రీత్యర్థం యజ్ఞ భావనతో చేసే కార్యక్రమాలు.

స్త్రీ పురుషుల నియమ రహిత ప్రవర్తనము వల్ల, దోషయుత సంకల్ప ప్రభావ జనిత అరిష్టాలను హరించేందుకే గర్భాధాన, జాతకర్మ, చౌల, ఉపనయనాది సంస్కారాలను నిర్వహిస్తారు. ప్రతి సంస్కారము జీవిని శుద్ధి చేస్తూ పోతుంది. అందుకే ఇవన్నీ పవిత్రమైన యజ్ఞా లయ్యాయి. ప్రతి సంస్కారము, సంస్కారాచారము నందు గోచరించే క్రియలు ఎంతో ఆధ్యాత్మిక భావగర్భితాలు.

వైదిక సంప్రదాయానుసారం పిల్లవాడు పుట్టగానే తండ్రి ఆ బాలుని ముఖాన్ని ముందుగా చూడాలి. అలా చూచిన క్షణం లోనే, తండ్రి పితృ ఋణం నుండి విముక్తు డవుతున్నాడు అన్నది శాస్త్రం (**ఋణాత్ పితా విముచ్యేత పుత్రస్య ముఖ దర్శనాత్**). పుత్రుని ముఖాన్ని చూడగానే తాను పితృఋణం నుండి విముక్తిని పొందినట్లు తండ్రి భావించ వచ్చు నని వాగ్దానం చేసింది శాస్త్రం. అందుచేతనే, ముఖాన్ని చూచిన తరువాత, తండ్రి సచేల స్నానం చెయ్యాలి అన్నది. సచేల స్నానం అంటే, బిడ్డ ముఖాన్ని చూచే సమయంలో తండ్రి ఏ బట్టను ధరించి ఉన్నాడో, ఆ బట్టతో సహ స్నానం చేయడమే సచేల స్నానం (**పుత్రే జాతే పితుః స్నానం సచేలం తు విధీయతే**).

అంతేకాదు, ఈ స్నానం చేసే పద్ధతిని కూడా మహాద్భుతంగా వివరించింది. పాత్రలో నింపిన జలముతో సచేల స్నానం చేయ కూడదట. సచేల స్నానం నదిలో గాని, చెరువులో గాని, దిగుడు బావిలో గాని చేయాలట. అది కూడా మెల్లగా దిగి కాదు. ఎగిరి నీళ్ళల్లో దుమికి స్నానం చెయ్యాలట. ఇవన్నీ ఎందుకు?

పుత్రుని ముఖం చూడగానే, పితృఋణం నుండి విముక్తిని పొందినట్లు తండ్రి భావిస్తాడు. కారణ మేమిటంటే, తనకు కలిగిన కుమారుడు తన తరువాత పితృ దేవతలకు సమర్పించ వలసిన తర్పణాది క్రియలు సమర్పించి, పితృఋణం తీరుస్తాడు అని అర్థం. తండ్రి చేసిన అప్పును తనయుడు తీర్చినట్లు, తండ్రి పితృఋణాన్ని కూడా శ్రాద్ధాది కర్మల ద్వారా తీరుస్తాడని అర్థం.

మరి జలాశయాల్లో ఎగిరి దుమికి ఎందుకు స్నానం చెయ్యాలి? ఎగిరి దుమికితే, జల బిందువులు పైకి చిమ్ముతాయి. అలా పైకి ఎగసే జలబిందువుల ద్వారా పైనున్న పితృ దేవతలకు, మీ ఋణాన్ని తీర్చుకుంటాము అనే సంకేతాన్ని పంపుతాడు. మెల్లగా జలాశయాల్లో దిగితే నీళ్ళు పైకి చిమ్మవు కదా! అందుకే అలా దుమికి స్నానం చేయాలి.

శిశువు జన్మించిన వేళా విశేషాన్ని బట్టి దోషాలు ప్రాప్తించే అవకాశం ఉంటుంది. వీటిని జాతారిష్టాలు అంటారు. అలా జాతారిష్టంతో పుట్టిన శిశువు పెరిగే వేళ సంప్రాప్తించే దోషాలను బాలారిష్టాలు అంటారు. ఇలాంటి అరిష్ట నివారణార్థం 'జాతకర్మ' సంస్కారాన్ని నిర్వహిస్తారు. తద్వారా అరిష్ట జనిత దోషాలు హరింప బడతాయి. ఆయుర్దాయం అభివృద్ధి చెందుతుంది. ఈ విషయాలన్నీ 'బృహస్పతి సంహిత' విపులంగా విశదీకరించింది (**జన్మని అశుభ యోగానాం వినాశాయ విశేషతః**).

తండ్రి బిడ్డకు జాతకర్మ సంస్కారాన్ని నిర్వహించిన తరువాత, తల్లి బంగారు పాత్ర లోని జలముతో గాని, లేదా బంగారు ఉంచిన జలముతో గాని తన దక్షిణ కుచమును, అంటే కుడి స్తనమును శుద్ధి చేస్తుంది. స్తనశుద్ధి చేస్తున్న సమయం లోనే మంత్రోచ్చారణ చేస్తుంది.

యస్మై త్వగ్ స్తన ప్రప్యాయ ఆయుః వచః యశో బలం - ఓ పయోధరమా! పాలు నిండిన స్తనమా! నువ్వు నా బిడ్డకు దీర్ఘాయువును ప్రసాదించు. దేహకాంతిని అనుగ్రహించు. కీర్తిని, బలాన్ని పుష్కలంగా ఇవ్వు అని అభిమంత్రించి, ఆ తరువాత తన కుడి స్తనమును బిడ్డ నోటికి అందిస్తుంది. ఇదంతా జాతకర్మ సంస్కారంలో గోచరించే 'ఫలీకరణ హోమ' సంప్రదాయ వైభవం. ఇవన్నీ తెలిసి ఆచరిస్తే, అద్భుతమైన ఫలితాలను ప్రసాదిస్తాయి.

యదేవ విద్యయా కరోతి శ్రద్ధ యోపనిషదా, తదేవ వీర్యవత్తరం భవతి

దేని నైనా అర్థం చేసుకొని, శ్రద్ధతో ఆచరించి నపుడే అది ఫలవత్తరం అవుతుంది అన్నది ఛాందోగ్యోపనిషత్తు. 'వీర్యవత్తరం' అంటూ, 'తరప్' ప్రత్యయాన్ని ప్రయోగించడం చేత, తెలియక చేసినా,

మంత్రోచ్చారణ మహిమ చేత ఫలం లభిస్తుంది. కాని, తెలిసి చేస్తే ఫలితం అధికతరం అని చెప్పడానికే, అలా ప్రవచించాడు ఋషి.

గర్భాధానం మొదలుకొని, సీమంత, జాతకర్మ, నామకరణాది సంస్కారాలన్నీ తల్లిదండ్రులు బిడ్డల క్షేమాన్ని కాంక్షించి చేసేవే. కాకపోతే, అన్నీ ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి. ఎందుకని? పరమేశ్వర ప్రీతి లోనే పాపాలు ప్రక్షాళన మవుతాయి కనుక.

మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా పరమేశ్వర ప్రీత్యర్థం

అంటున్నాము సంకల్పము చేప్పేటప్పుడు. దురితములు అంటే పాపాలు. అనేక జన్మలలో చేసిన పాపాలు పర్వత రూపాలై ఉంటాయి. అవన్నీ నశించాలి. నా విషయంలో పరమేశ్వరుడు తృప్తి చెందాలి అనేదే ఈ సంస్కారాల లోని ప్రధాన మైన ఉద్దేశము.

ఈ విధమైన సంస్కారాల ప్రభావం చేత వ్యక్తిలో విశిష్టత చోటు చేసుకుంటుంది. పాపం పరిహరింప బడుతుంది. బుద్ధిలో వికసనం కలుగుతుంది. సదాచారం లేకుండా సర్వాత్మభావం కలగదు కనుక మన సాంప్రదాయక ఆచారాలు, సంస్కారాలు ఉత్కృష్ట ధర్మాలై, ఇటు వ్యక్తికే, అటు సమాజానికి కళ్యాణాన్ని కలిగిస్తాయి (***ఆచారః పరమోధర్మః నృణాం కళ్యాణ కారకః***).

ఈ సదాచారాలన్నీ సృష్ట్యాది లోనే ఆవిర్భవించాయి. సత్సంప్రదాయాలు, ఉత్తమ సంస్కారాలు యజ్ఞ రూపాలుగా సర్గాది యందే మానవులతో పాటు ఉద్భవించాయి. అందుకే ప్రజలతో పాటు యజ్ఞాలను కూడా ప్రజాపతి సృష్టించాడని గీతాచార్యుడు చెబుతున్నాడు.

యజ్ఞవ్యాప్తి

ప్రజలతో సహ యజ్ఞాలు పుట్టాయి. ప్రజలు, యజ్ఞాలు ప్రజాపతి నుండి ఉద్భవించిన కవలలు. కనుక యజ్ఞము మనిషికి సహోదరి. కలిసి పుట్టినా మార్గనిర్దేశం చేసే శక్తిని కలిగి ఉంది కనుక, ప్రజల కన్నా యజ్ఞానికే జ్యేష్ఠత్వము, శ్రేష్ఠత్వము ఉన్నాయి. అక్క చెప్పినట్లు తమ్ముడు వినాలి. యజ్ఞం ఆదేశించినట్లు ప్రజలు ఆచరించాలి. అప్పుడే వ్యక్తి ఔన్నత్యం, సమాజ అభ్యుదయం. ఇలా జీవించి యజ్ఞాలను వృద్ధి పరచండి అని విరించి పలికాడు (**అనేన యజ్ఞేన, ప్రసవ ష్యధ్వం ప్రసవః వృద్ధిః తాం కురుధ్వమ్**).

యజ్ఞాలు, ప్రజలు సృష్ట్యారంభంలో పుట్టారు. యజ్ఞాలను ప్రక్కన పెడితే, మిగిలినవి ఏవయితే పుట్టాయో అవన్నీ ప్రజల క్రిందికే వస్తాయి. కనుక పుట్టిన వన్నీ యజ్ఞ భావం తోనే జీవించాలి. యజ్ఞ జీవనాన్ని పెంపొందిస్తూ ఉండాలి. అదే వృద్ధి. అభివృద్ధి. 'ప్రసవ' శబ్దార్థము.

సృష్టిలో అన్నీ యజ్ఞభావం తోనే ఉన్నాయి. యజ్ఞజీవనాన్నే కొనసాగిస్తూ ఉన్నాయి. లేకపోతే, ఈ సృష్టి ఎప్పుడో అంతరించి పోయేది. యజ్ఞము అనేది పవిత్రకర్మ. కాకపోతే, యజ్ఞకర్మను కామ్యకర్మగా కాకుండా, ఫలాసక్తి లేకుండా ఆచరించి, శ్రేయస్సుకు సాధనంగా మలచుకునే అద్భుత కర్మయోగ ప్రక్రియను ప్రవేశ పెడుతూ ప్రవచిస్తున్నాడు గీతలో భగవానుడు.

సృష్టి సందర్భం లోనే యజ్ఞాలు పుట్టాయి. నేటికీ యజ్ఞజీవనం ప్రకృతిలో పరవశిస్తూ దర్శన మిస్తుంది. నిస్వార్థంగా, ఫలాసక్తి లేకుండా యజ్ఞకర్మలు సృష్టిలో సాగిపోతూ ఉన్నాయి.

యావ ద్విశ్వాన్ని సూర్యుడు తన వెలుగులతో నింపు తున్నాడు. ఏదీ ఆశించడు. ఫలాభిసంధి తెలియని పారవశ్య కార్యంలో సదా నిమగ్నమై ఉన్నాడు. అదే అర్కుని ప్రకాశం లోని రహస్యము.

జలాలను మరిగిస్తాడు. ఆవిరిని పీల్చుకుంటాడు. మేఘాలకు రూపు దిద్దుతాడు. మేఘజలాలను ధరణిపై ధారగా కుమ్మరిస్తాడు. ప్రచార ఆర్భాటం లేదు. ప్రశంసలపై ఆసక్తి లేదు. జీవితమే గాని జీతం తెలియదు. అదే ఆయన జీవన శోభ. ఆయన యజ్ఞ జీవనంతో శోభిస్తున్నాడు. ఆయన వల్లే విశ్వము పోషింప బడుతూ ఉంది. ఇలా యజ్ఞాన్ని వృద్ధి చేస్తూ, పూషా! అని కీర్తింప బడ్డాడు. జగత్తును పోషించే వాడు పూషా!

ఆయన ఉదయిస్తేనే, మనం కార్యాలలో ఉద్యమిస్తాము. అన్ని కార్యాలకు ఆది తానై ఆదిత్యు డయ్యాడు. ఆదివారానికి అధిపతి అయ్యాడు. అంతేనా? ఆయన యజ్ఞజీవన వైభవానికి సంతసించిన గీతాచార్యుడు, **జ్యోతిషాం రవి రంశుమాన్.** ప్రకాశము గల వారిలో నేను సూర్యుణ్ణి అని దివ్యంగా గీతలో ప్రవచించాడు. ఇదంతా యజ్ఞజీవన ఫలం.

యజ్ఞభావంతో జీవించి సూర్యుడు నారాయణు డయ్యాడు. సూర్యనారాయణు డయ్యాడు. యజ్ఞ జీవనానికి అలవాటు పడిన వాయువు వాయుదేవు డయ్యాడు. పరోపకారార్థం, ఫలాపేక్ష లేకుండా జీవించే జీవన విధానము ఏదైనా యజ్ఞమే.

నదులు పరుల కొరకే ప్రవహిస్తున్నాయి. చెట్లు ఇతరులకు నీడనిస్తూ, గాలి నిస్తూ, ఫల పుష్పాదులను పంచుతూ బ్రతుకు తున్నాయి. అంతా యజ్ఞజీవనమే. ప్రకృతిలో ఎక్కడ చూచినా యజ్ఞరూపాలే. యజ్ఞ స్వరూపాలే.

ప్రపంచంలో వన మహోత్సవ వైభవాన్ని చూచి నపుడు పక్షుల ప్రాభవం తెలిసి వస్తుంది. ఎవరి ఇంట్లో వాళ్ళు మొక్కలు నాటుకుంటారు. ఎవరి పొలంలో వారు బీజాలను చల్లుకుంటారు. మరి ప్రపంచంలో అడుగడుగునా పచ్చదనం ప్రాకి పోవడానికి కారణ మెవరు? పక్షులు కావా? వాయువు కాదా? ఏమి ఆశించి అవన్నీ ఈ కార్యాలను నిర్వహిస్తున్నాయి? అదే యజ్ఞజీవనం.

వానపాములు భూమిని గుల్ల చేసి సారవంతం చేస్తాయి. పంట చేతికి వచ్చే సమయంలో ఎలుకలు పాడు చేయకుండా పాములు రక్షిస్తాయి. అంతా యజ్ఞజీవనమే. యజ్ఞజీవన వైభవమే.

యజ్ఞము కామధేనువు

గోవు నుండి పాలు పితుక్కుంటాము. ఆవు పాలిస్తుందే గాని పంచదార నివ్వలేదు. కాని, కామధేనువు అలా కాదు, ఏది కోరితే దానిని అనుగ్రహిస్తుంది (***ఇష్ట కామధుక్***). మనకు ఏమి కావాలో వాటిని దాని నుండి పిండుకోవచ్చు. యజ్ఞము కామధేనువు వంటిది.

యజ్ఞ జీవనము వలన పరమ పురుషార్థమైన మోక్షము కూడా కలుగుతుంది. యజ్ఞ జీవనము చిత్తశుద్ధిని అనుగ్రహిస్తుంది. చిత్తశుద్ధి మోక్షహేతువు అవుతుంది. కనుక యజ్ఞము ప్రతి ఒక్కరి జీవితంలో కామధేనువు కావాలి.

కామధేనువు ఉండేది కోర్కెలను తీర్చడానికా? కోరికలు లేకుండా చేయడానికా? అసలు కోరికలే లేవు అనుకుందాం. అప్పుడు తీర్చ వలసిన అవసర మేముంటుంది? అప్తకాముడైన వాడు దేనిని కోరుకుంటాడు? ఏ కోర్కెను తీర్చుకుంటాడు?

సోఽ శ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి

ఎవడైతే తన హృదయము నందు బ్రహ్మమును దర్శిస్తాడో, అతడు బ్రహ్మస్వరూపుడై సమస్త కోర్కెలు తీరినవాడు అగుచున్నాడు అని తైత్తిరీయశ్రుతి. ఈ విధమైన ఫలసిద్ధికి యజ్ఞము కామధేనువు వంటిది.

ఈ విధమైన యజ్ఞ కర్మాచరణము ద్వారా దేవతలతో ఎలా సంబంధాలు ఉంటాయో, ఉండాలో తెలుపుతున్నాడు.

దేవా న్భావయ తానేన తే దేవా భావయంతు వః ।
పరస్పరం భావయన్తః శ్రేయః పర మవాప్స్యథ ॥ 11

దేవాన్-భావయత-అనేన-తే-దేవాః-భావయంతు-వః
పరస్పరం-భావయంతః-శ్రేయః-పరం-అవాప్స్యథ

అనేన	= వీని ద్వారా		పరస్పరం	=	ఒకరి నొకరు
దేవాన్	= దేవతలను		భావయంతః	=	సంతోష పరచు కొంటూ
భావయత	= గౌరవించండి		పరం	=	శ్రేష్ఠమైన
తే దేవాః	= ఆ దేవతలు		శ్రేయః	=	శ్రేయస్సును
వః	= మమ్మల్ని		అవాప్స్యథ	=	పొంద గలరు.
భావయంతు	= గౌరవిస్తారు				

యజ్ఞము చేత మీరు దేవతల్ని తృప్తి పరచండి. ఆ దేవతలు తిరిగి మిమ్మల్ని తృప్తి పరుస్తారు. ఇలా పరస్పరము తృప్తి పరచుకొంటూ, ఉత్కృష్టమైన శ్రేయస్సును పొందుతారు.

వ్యాఖ్య

మనిషి ఒంటరిగా పుడతాడు. ఒంటరిగా మరణిస్తాడు. కాని, ఒంటరిగా జీవించలేడు. పది మందితో కలిసే జీవించాలి. తన జీవనానికి ఎందరో సహకరించాలి. మనిషి బ్రతికినంత కాలం శ్వాసిస్తూనే బ్రతకాలి. అంటే, తాను జీవించి ఉన్నంత కాలం గాలిని పీల్చుకుంటూనే ఉండాలి. శ్వాసించే శక్తి తనలో ఉండవచ్చు. కాని, శ్వాసించ డానికి బయట గాలి ఉండాలి. గాలి లేకుంటే మనిషి జీవితం అంతమై పోతుంది.

సృష్టిలో అన్నీ ఇలాగే ఉన్నాయి. అందరికీ అవసరాలు ఉన్నాయి. ఎందరో సహకరిస్తేనే మన జీవితం నడుస్తుంది. ఒకరి వల్ల మనకు ఎలా సహకారం అందుతూ ఉందో, మన వల్ల కూడా ఇతరులకు అలాగే సహకారం అందుతూ పోవాలి. ఇది పరస్పర సహకార జీవనము. దీనినే యజ్ఞ జీవనము అని అభిభాషించాడు గీతాచార్యుడు. జీవన చక్రాన్ని త్రిప్పేది యజ్ఞ భావనే. యజ్ఞ జీవనమే.

జీవులను సృష్టించి నపుడే బ్రహ్మదేవుడు యజ్ఞాలను కూడా సృష్టించాడు. యజ్ఞముల చేత అభివృద్ధిని సాధించమని, పరమ పురుషార్థాన్ని పొంది ఆనందించ మని పదవ శ్లోకంలో తెలిపిన భగవంతుడు, యజ్ఞము యొక్క స్వభావ స్వరూపాలను, యజ్ఞ జీవన ఫలాలను ఈ శ్లోకంలో తెలుపు తున్నాడు. యజ్ఞ జీవనం లేకుండా మనిషి సంతృప్తి చెంద లేడు.

ఎన్నో వస్తున్నాయి - ఎందరో ఇస్తున్నారు

పాడిపంటలు లేకపోతే మనం జీవించ లేము. భూమాత మనకు పంట నిస్తుంది. పంట పండ టానికి మేఘము నీళ్ళు పోస్తుంది. సూర్యుడు శక్తి నిస్తున్నాడు. పాడు కాకుండా వాయుదేవుడు కాపాడు తున్నాడు. ఇది యజ్ఞ భావన. ఒకరికి మరొకరు సహకరించడం యజ్ఞమైతే, అట్టి సహకార జీవనం వల్ల కలిగే ఫలమే యజ్ఞఫలం.

మొక్కలు పువ్వులను ఇస్తాయి. మన కొరకే అవి పూస్తున్నాయి. పువ్వులను మనం కోసుకుంటాము.

మొక్కలు అడ్డు చెప్పవు. కాకపోతే, మొక్కలు పూలు పూయాలి అంటే, అవి బ్రతికి ఉండాలి. మొక్కలు బ్రతకాలి అంటే వాటికి నీళ్ళు కావాలి. పువ్వులను అందించే చేతులు మొక్కలకు ఉన్నాయి. నడిచి వెళ్ళి నీళ్ళు తెచ్చుకొని త్రాగడానికి మొక్కలకు కాళ్ళు లేవు. కాళ్ళు ఉన్న మనం మొక్కలకు నీళ్ళు తెచ్చి పోస్తే, మనసున్న మొక్కలు మనకు పువ్వులను ప్రసాదిస్తాయి. ఇదే యజ్ఞ జీవనము. మరొకరిని తృప్తి పరచకుండా మనం తృప్తి చెందడం సాధ్యం కాదు. యజ్ఞ భావనే మనిషికి ఎనలేని సుఖసంతోషాలను ప్రసాదిస్తుంది.

యజ్ఞ జీవనం సృష్టిలో దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది. యజ్ఞము వల్లే వానలు కురుస్తున్నాయి. సౌరశక్తి అందుతూ ఉంది. సంతానం కలుగుతూ ఉంది. పంటలు అందుతున్నాయి. పాడి కలుగుతూ ఉంది. పసిడి ప్రాప్తిస్తూ ఉంది. ఆరోగ్యం కలుగుతూ ఉంది. ఆయుష్షు వృద్ధి చెందుతూ ఉంది.

పశువులు పాలు ఇస్తున్నాయి. క్షీరాన్నిచ్చే గోమాతలు తమ క్షీరాన్ని తాము త్రాగవు. మన కొరకే వాటి పొదుగులు బరువెక్కు తున్నాయి. మనం పిండుకుంటున్నా అవి వారించడం లేదు. బాధను భరిస్తూ మనకు క్షీరాన్ని ప్రసాదిస్తున్నాయి. ఈ విధమైన యజ్ఞభావన వాటికి ప్రయత్నం లేకుండానే అలవడింది. ప్రకృతి సహజం గానే ప్రాప్తించింది. కాని, మనిషికి కర్మస్వేచ్ఛ ప్రసాదించ బడింది. అందుచేత, ప్రయత్నిస్తేనే యజ్ఞ భావన అలవడుతుంది.

గోవులిచ్చే పాలు మనకే. మానవులకే. పాలు పిండుకోవడం తప్పు కాదు. పాలిచ్చే పశువులకు గడ్డి పెట్టక పోవడం నేరం. కుడితిని త్రాగించక పోవడం దోషం. పశువులకు గ్రాసాన్ని అందిస్తే, అవి మనకు క్షీరాన్ని ప్రసాదిస్తాయి. నువ్వు పెట్టే ఆహారం వల్ల ఆవులు బ్రతుకుతాయి. అవి ప్రసాదించే క్షీరం వల్ల నీ ఆయుష్షు వృద్ధి చెందుతూ ఉంది. ఇదే పరస్పర సహకార రూపమైన యజ్ఞ జీవనము.

ప్రకృతి దేవతా స్వరూపం

యజ్ఞజీవనంతో సాగుతున్న ప్రకృతిలో పరమేశ్వరుని అడుగులు మనకు దర్శన మిస్తాయి. వాటినే మనం దేవతలు అంటూ ఉంటాము. భౌతికంగా ఏవయితే జడరూపాలుగా కనిపిస్తున్నాయో, భావనను తోడు చేసుకొని వీక్షించి నపుడు అవే దేవతామూర్తులుగా దర్శన మిస్తాయి.

వాయువు జడం. కాని వాయువు లేకుంటే ఆయువు మిగలదు. అందుచేత ఆయుష్షు నిచ్చే వాయువు భగవ త్ప్రసాదంగా వీక్షింప బడుతోంది. దేవతా స్వరూపంగా దర్శింప బడుతోంది. అందుకే వాయువును వాయుదేవుడు అంటున్నాం. ***నమస్తే వాయో!*** ఓ వాయుదేవుడా! నీకు నమస్కారము అంటూ వాయువుకు నమస్కరిస్తున్నాం.

భౌతికంగా చూస్తే సూర్యుడు ఒక అగ్నిగోళం. కేవలం జడరూపము. కాని మన జీవనానికి ఉపకరిస్తున్న సౌరశక్తిని అర్థం చేసుకు న్నప్పుడు, సూర్యుణ్ణి దేవతగా ఆరాధిస్తున్నాం. ప్రార్థనతో పలకరిస్తున్నాం. ***శం నో మిత్రః*** ఓ సూర్యదేవా! మమ్మల్ని సుఖపెట్టు అని మొరపెట్టు కుంటున్నాం.

జలము కూడా జడమే. కాని, నీరము ప్రాణాధార మనే సత్యాన్ని గ్రహించి నపుడు, ప్రాణాన్ని కదిలించే చలనశక్తిని జలాలకు ప్రసాదించిన ప్రాణేశ్వరుడైన పరమేశ్వరుని వైభవాన్ని నీళ్ళల్లో దర్శిస్తూ, ***శం వరుణః*** సుఖ శాంతులను అనుగ్రహించ మని వరుణుణ్ణి వేడుకుంటున్నాము.

నిత్య దర్శనం

పరమేశ్వరుని దర్శనం కావాలని మనం ఎంతగానో పరితపిస్తాం. కాని, ప్రతిరోజు, ప్రతిక్షణం ప్రకృతి రూపంలో పరమేశ్వర దర్శనం ప్రాప్తిస్తూనే ఉంది అనే సత్యాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాం.

అరుణోదయానికి ముందే స్నానాదులు ముగించుకొని, రెండు చేతులు జోడించి, తూర్పుదిక్కును చూస్తూ కూర్చో. సూర్యుడు తూర్పున మెల్లగా పైకి వస్తూ ఉంటే, నీవు కూడా భక్తి భావంతో లేచి దండం పెట్టు. అది భగవద్దర్శనం అవునో, కాదో ఆలోచించుకో.

దృశ్యాలను చూచే శక్తి నేత్రాలకు ఉంది. కాని, దృశ్యాలలో దోబూచు లాడే 'దృక్' స్వరూపాన్ని దర్శించేందుకే నేత్రాల వెనుక మనస్సు నిలిచి ఉంది. నేత్రంతో పాటు మనస్సును ప్రసాదించడంలో పరమేశ్వరుని ఉద్దేశ్యం అదే. కళ్ళతో చూస్తే కేవలం రంగులు, రూపాలు కనిపిస్తాయి. దృశ్యాలు మాత్రమే అగుపిస్తాయి. కాని, ఆ కళ్ళకు బుద్ధిని తోడు చేసుకొని కనిపించే రూపాలలో అవ్యక్తంగా ఉన్న పరమేశ్వరుని దర్శించాలి అనేదే ఈశ్వర ప్రబోధం. అందుచేతనే, అట్టి దర్శన భాగ్యాన్ని ప్రసాదించ మని దేవతా రూపంలో ఉన్న దేవదేవుని, ప్రకృతి రూపంలో ఉన్న పరమేశ్వరుని ఋషులు ప్రార్థించారు.

ఓ దేవతలారా! మా కన్నులతో పరమేశ్వరుని దివ్య రూపాన్ని దర్శించే భాగ్యాన్ని ప్రసాదించండి అని ప్రార్థించారు ***(భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః)***. మన ప్రార్థనలను ఆలకించిన పరమేశ్వరుడు మనకు దర్శన మివ్వడానికి దేవతా రూపంలో సిద్ధ మయ్యాడు. గాలి వీచినంత మాత్రాన సరిపోదు. తెరచాపను ఎత్తి పట్టినపుడే ప్రయాణం సుఖంగా సాగుతుంది. పరమేశ్వరుని అనుగ్రహం గాలి లాగా వీస్తూనే ఉంది. మనమే అది గుర్తించి యజ్ఞభావనతో తెరచాపను ఎత్తి పట్టాలి.

యజ్ఞ జీవనం

యజ్ఞభావనతో జీవిస్తూ, మనం దేవతల్ని తృప్తి పరిస్తే, యజ్ఞరూపు లైన దేవతలు మనల్ని అధికంగా తృప్తి పరుస్తారు. ఈ విధంగా పరస్పరం సహకరించు కుంటూ యజ్ఞజీవనంతో సుఖాన్ని, శ్రేయస్సును కూడా పొంద వలసిందిగా పరమేశ్వరుడు ప్రబోధిస్తున్నాడు.

మన పూర్వీకులు యజ్ఞములను భావస్ఫూర్తితో ఆచరించేవారు. వారు సమర్పించే హవిర్దానాలతో ఇంద్రాది దేవతలు తృప్తి చెందేవారు ***(దేవాన్ ఇంద్రాదీన్ భావయత వర్ధయత)***. అలా తృప్తి చెందిన ఇంద్రాది దేవతలు వర్షాన్ని కురిపించి, తద్వారా అన్నాదులను కలిగించి వాళ్ళను తృప్తి పరచేవారు ***(తే దేవాః భావయన్తు ఆప్యాయన్తు వృష్ట్యాదినా)***. ఈ విధంగా పరస్పరం సహకరించుకుంటూ సుఖాన్ని, శ్రేయస్సును పొందేవారు ***(ఏకం పరస్పరం అన్యోన్యం భావయన్తః శ్రేయః పరమం అవాప్స్యథ)***.

శ్రేయస్సు అంటే మోక్ష మని ఇప్పటికే మనం తెలుసుకొని ఉన్నాం. ఇక్కడ 'శ్రేయః' అనే పదాన్ని మోక్షపరం గాను, స్వర్గపరం గాను కూడా అర్థం చేసుకోవాలి.

యజ్ఞాలు పుణ్యకర్మలు. పుణ్యం వల్ల వచ్చేది స్వర్గమే కాని మోక్షం కాదు. యజ్ఞము ఏదైనా సరే, దాని వెనుక ఒక కోరిక ఉంది. అభీష్ట ఫలసిద్ధికే యజ్ఞం చేస్తాం. కనుక ఈ యజ్ఞ ఫలితాలు బుభుక్షువుకు ***(భోక్తా)*** ఉపకరించేవే గాని ముముక్షువుకు సహకరించేవి కావు అని కొందరు భావిస్తూ ఉంటారు.

దేవతలు, మానవులు పరస్పరం సంతృప్తి పరచుకుంటూ యజ్ఞ కర్మలను ఆచరించడం చేత, అట్టి యజ్ఞ జీవన ఫలంగా ఉత్తమమైన స్వర్గాన్ని పొందుతారు ***(స్వర్గం వా పరం శ్రేయః అవాప్స్యథ)***. ఈ విషయంలో సందేహం లేదు.

కాని, ముముక్షువు అయిన కర్మయోగి యొక్క యజ్ఞ భావనలో పరమేశ్వరుడే ఉన్నాడు కనుక, అతడు ఫలాసక్తి లేకుండా యజ్ఞకర్మలను ఆచరించడం చేత అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞానప్రాప్తి ద్వారా ఉత్తమ శ్రేయస్సును అనగా మోక్షాన్ని పొందుతాడు అని భావము ***(పరమపి జ్ఞానప్రాప్తి క్రమేణ అవాప్స్యథ)***.

చేసే చేతులు రెండు - తినే చేయి ఒక్కటే

ఇక్కడ మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను అర్థం చేసుకో వలసి ఉంది. మానవులు, దేవతలు పరస్పరం యజ్ఞభావనతో సహకరించుకుంటూ సంతృప్తిని పొందు తున్నారు అని గ్రహించాం. యజ్ఞాచరణలో కూడా పరస్పరం ఒకే విధంగా చరిస్తున్నారు. ఇదీ అర్థమవుతూ ఉంది. కాని, యజ్ఞఫలం విషయంలో ఇరువురూ సమానంగా ఫలితాన్ని పొందుతున్నారా? అనేది ప్రత్యేకంగా నా సందేహం. ఈ సందేహాన్ని పట్టుకొని విషయాన్ని తరచి చూస్తే, 'లేదు' అనే వ్యతిరేక సమాధానమే వస్తుంది.

మనం అర్థం చేసుకున్న దానిని బట్టి చూస్తే యజ్ఞఫలము స్వర్గం కావాలి, లేదా మోక్షం కావాలి. బుభుక్షువు స్వర్గాన్ని కాంక్షిస్తాడు. అభీష్టాన్ని నెరవేర్చుకొని స్వర్గాన్ని పొందుతాడు. ముముక్షువు అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతాడు. బాగుంది. ఇంతకీ దేవతలు కూడా యజ్ఞజీవనంలో తృప్తి చెందు తున్నారు కదా! మరి వారు పొందే యజ్ఞఫల మేమిటి? స్వర్గమా? మోక్షమా? రెండూనా? లేక రెండూ కాదా?

యజ్ఞఫలంగా దేవతలు స్వర్గాన్ని పొంద లేరు. ఎందుకని? చెట్టు ఎక్కి ఉన్నవాడు మళ్ళీ చెట్టు ఎక్కడ మేమిటి? దేవతలు స్వర్గం లోనే ఉన్నారు కదా! మళ్ళీ స్వర్గానికి ఎలా పోతారు? అంతగా కోరుకుంటే, నరకానికి పోతే పోవచ్చు. కాని యజ్ఞఫల మనేది స్వర్గాన్ని ప్రసాదించేదే కాని, నరకాన్ని ప్రసాదించేది కాదు. కనుక దేవతలకు యజ్ఞఫలంగా స్వర్గప్రాప్తి ప్రత్యేకంగా లేదు. ఇక మిగిలింది ఏమిటి? మోక్షమే కదూ? కనుక దేవతలకు యజ్ఞఫలంగా మోక్షప్రాప్తి కలగాలి. కాని దానికి కూడా అవకాశం లేదు. ఎందుకని?

మోక్షానికి ప్రయత్నం భూలోకంలో జరగాలే కాని, స్వర్గలోకంలో కాదు. స్వర్గలోకం భోగభూమి. అది కర్మభూమి కాదు కనుక స్వర్గం నుండి మోక్ష ప్రయత్నము సాధ్య పడదు. కనుక దేవతలకు ఇటు స్వర్గఫలం ప్రత్యేకంగా లేదు. అటు మోక్షఫలం అందే అవకాశం లేదు. పోనీ అంతఃకరణ శుద్ధి కలుగుతుందా అంటే, ఆ ఆలోచనకు కూడా సమన్వయం కుదరదు. అంతఃకరణ శుద్ధిని పొందడం కూడా కర్మే. మోక్ష హేతువైన సమకార్యం. ఇలాంటివి భూలోక వాసులకే గాని స్వర్గలోక వాసులకు సాధ్య పడవు. కనుక, యజ్ఞజీవనంలో ఫలాన్ని అందుకొని తృప్తి చెందేవారు మానవులు. యజ్ఞాల వల్ల తృప్తి చెంది ఆనందంతో ఆశీర్వదించే వారు దేవతలు.

మానవులు పరిమితమైన శక్తి గలవారు. స్వార్థానికి సంకెళ్ళు వేయడంలో అశక్తులు. కనుక, వారి నుండి మనకు సర్వత్ర, సదా సహాయం అందుతుందని చెప్పలేము. కాని, దేవతలు అలాంటి నిస్సహాయులు కారు. పైగా, వారిలో యజ్ఞజీవనమే గాని స్వార్థం ఉండదు. కనుక, యజ్ఞభావనతో, దేవతారాధనా భావంతో సాగించే యజ్ఞకర్మలే సత్ఫలితాల నిస్తాయి. యజ్ఞ భావానికి దూరమై జీవించే సమాజం లోనే కరువులు, కాటకాలు, కారిన్యాలు, హింసలు తాండవిస్తూ ఉంటాయి.

ఒక కార్యానికి అనేక కారణాలు ఉంటాయి. అలాంటి కారణాలలో ఏదో ఒక కారణం ప్రధానంగా ఉంటుంది. అలాగే సమాజ అభ్యుదయానికి అనేక కారణాలు ఉంటాయి. కాని, మానవుల సత్ప్రవర్తన, ధర్మ జీవనము ప్రధాన కారణమై ఉంటుంది.

అలాగే సమాజ వినాశానికి కూడా మానవుల దుష్ప్రవర్తన, అధర్మ జీవనము ప్రధాన కారణాలుగా ఉంటాయి. ధర్మ పరాయణులున్న సమాజం దివ్యంగా శోభిస్తుంది. అభ్యుదయంతో అలరారే సమాజంలో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లుతారు. యజ్ఞభావంతో జీవించడం వల్ల ప్రకృతి పల్లవించి పులకిస్తుంది. సమాజం శాంతితో పరవశించి సుఖిస్తుంది.

దాతృత్వం ఉండదా?

పరస్పర సహకార యజ్ఞజీవనంలో దేవతలు మానవులను తృప్తి పరచి ఆనందిస్తున్నారే గాని, ఏ విధమైన ఫలాసక్తిని వాంఛించి కాదు అని అర్థం చేసుకున్నాం. అలాంటప్పుడు, మానవులు యజ్ఞభావంతో జీవించక పోయినా, దేవతలు తమ అసమాన దాతృత్వ వైభవంతో మానవులకు సహాయం చేయవచ్చు కదా! అని కొందరు పిడివాదాలు, పొడివాదాలు వినిపిస్తూ ఉంటారు.

కృతం భవతి సర్వత్ర - ఎక్కడైనా చేస్తేనే ఫలం లభిస్తుంది. ఏదీ చేయక పోవడ మనే కర్మకు ఫలితం కూడా ఏమీ లేక పోవడమే అవుతుంది. కాళ్ళే లేని వ్యక్తికి చెప్పులు తొడగడం సాధ్యమేనా? చేస్తేనే ఫలం. చూస్తేనే రూపం.

చేసినవాడు ఫలితాన్ని ఆశిస్తాడు. ఏది చేస్తాడో తత్సంబంధ మైన ఫలాన్నే ఆశిస్తాడు. ఏదీ చేయని వాడు ఏ ఫలితాన్ని ఆశిస్తాడు? సమస్తాన్నీ ఆశిస్తాడు. సర్వులూ ఏమి చేయకనే సమస్తాన్ని ఆశిస్తూ కూర్చుంటే, ప్రయోజనం ఎలా ఉంటుందో ఊహిస్తే అర్థం కాకపోదు.

పైగా, ఏమీ చేయకుండా ఉండేందుకే భగవంతుడు మానవాళిని సృష్టించి ఉంటే, మనిషికి కాళ్ళు చేతులు ఎందుకు ఇచ్చినట్లు? కళ్ళు - నాలుక దేని కొరకు ఉన్నట్లు? చేయమనే ఇచ్చాడు. చేస్తూ చూడమనే ఇచ్చాడు. చూస్తూ చేయమనే ఇచ్చాడు. చూసి ఆశించాలి. ఆశించిన దానిని చేసి సాధించాలి. అందుచేతనే, మనుషులతో పాటే యజ్ఞాలను కూడా సృష్టించాడు. మానవులు చేయ వలసింది చేస్తే, దేవతలు ఇవ్వవలసింది ఇస్తారు. చెయ్యడానికి నోచుకోని చేతులు పుచ్చుకోవ డానికి పనికి రావు.

ఆఖ్యాయిక

ఒక శిష్యుడు గురువు గారిని దర్శించడానికి ఆశ్రమానికి వచ్చాడు. లోపలికి వెళ్ళి గురువు గారికి నమస్కరించి, 'గురుదేవా! భగవంతుని మీద నాకు అచంచల విశ్వాసం ఏర్పడింది. నా యోగక్షేమా లన్నీ భగవంతుడే చూసుకుంటాడు అనే ప్రగాఢ విశ్వాసంతో ఉన్నాను. ఇదంతా మీ దివ్య బోధ లోనే నాకు ప్రాప్తించింది.

గురుదేవా! పూర్వము నేను ఎక్కడికి వెళ్ళినా, నా సైకిలుకు తాళం వేసి లోనికి వెళ్ళేవాణ్ణి. ఇప్పుడు అలా చెయ్యడం లేదు. రక్షించే దేవుడు ప్రక్కనే ఉండగా, నా సైకిలును ఎవరు అపహరిస్తారు? భారాన్నంతా భగవంతునిపై పడేసి నిశ్చింతగా ఉంటున్నాను. ఇప్పుడు కూడా నా సైకిలు మన ఆశ్రమం ముందే తాళం లేకుండా పడి ఉంది' అని ఊగిపోతూ పలికాడు.

అతడి మాటలను ఆలకించిన గురువు, 'చూడు నాయనా! రక్షించే పరమేశ్వరుడు ప్రక్కనే ఉన్నాడని నువ్వే చెబుతున్నావు కదా! మరి, నువ్వు లోపలికి వచ్చి నపుడు ప్రక్కనే ఉండే పరమేశ్వరుడు కూడా లోనికి వచ్చినట్లే కదా! మరి, బయట సైకిలును ఎవరు రక్షిస్తారు?' అని ప్రశ్నించాడు. శిష్యుడు తెల్లబోయాడు.

'మూర్ఖుడా! నీకు భగవంతుడు బుద్ధి నిచ్చింది నీ సైకిలుకు ఆయన కాపలా కాయడానికా? సైకిలుకు తాళం ఉండేది తీసిపెట్టి తమాషా చూడ టానికా? ఛీ! ముందు వెళ్ళి సైకిలుకు తాళం వేసిరా! నీకు నీవుగా చక్కగా చేసుకో వలసిన కార్యాలను భగవంతుడు ఎప్పుడూ పట్టించుకోడు' అని గురువు చీవాట్లు పెట్టాడు.

యజ్ఞభావంతో జీవించే వారికే దైవ సహాయం అందుతుంది. దేవతల ఆశీర్వాదాలు లభిస్తాయి. చేసే వారే ఫలాలను అందుకుంటారు. ఇచ్చే వారికే పుచ్చుకొనే అర్హత ఉంటుంది. పుచ్చుకొని తిరిగి ఇవ్వని వాడు ఎవడైనా చోరుడే. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

ఇష్టాన్భోగాన్హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః ।
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః ॥ 12

ఇష్టాన్-భోగాన్-హి-వః-దేవాః-దాస్యంతే-యజ్ఞభావితాః
తైః-దత్తాన్-అప్రదాయ-ఏభ్యః-యః-భుంక్తే-స్తేనః-ఏవ-సః

యజ్ఞభావితాః	= యజ్ఞము చేత సంతోషింప బడిన	దత్తాన్	= ఇవ్వబడిన వానిని
దేవాః	= దేవతలు	ఏభ్యః	= వీరి కొరకు
వః	= మీ కొరకు	అప్రదాయ	= సమర్పించ కుండా
ఇష్టాన్	= ఇష్టములైన	యః	= ఎవడు
భోగాన్	= భోగములను	భుంక్తే	= భుజిస్తాడో
దాస్యంతే హి	= తప్పక ఇస్తారు	సః	= వాడు
తైః	= వారి చేత	స్తేన ఏవ	= చోరుడే

యజ్ఞము చేత తృప్తి చెందిన దేవతలు మీకు ఇష్ట భోగాలను ప్రసాదిస్తారు. అలా ప్రసాదింప బడిన వాటిని తిరిగి దేవతలకు సమర్పించ కుండా అనుభవించు వాడు చోరు డవుతాడు.

వ్యాఖ్య

మానవుని మనుగడ మహిమాన్విత మైనది. ధర్మంతో ముడిపడి ఉంది. నియతిలో నియంత్రించబడి ఉంది. తన కొరకే తాను జీవించే విధానానికి భిన్నమైన ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. నా జీవనం నీతో ముడిపడి ఉంది. నీ జీవనం నాతో ముడిపడి ఉంది. మనిద్దరి జీవితాలు మరొకరితో కలిసి నడుస్తూ ఉన్నాయి. తమకు తాముగా ఎవ్వరూ బ్రతకలేని ప్రపంచ మిది. అందరూ అందరి కొరకు ఆదర్శంగా జీవించ వలసిన అందమైన ప్రపంచమిది. మనం అందరి కొరకు ఉన్నాం. అందరూ మన కొరకు ఉన్నారు. ఈ విధమైన సమిష్టి సహకార జీవనాన్ని సమన్వయంతో సాగే దైవ నిర్మితమైన ప్రపంచంలో, ధర్మయుతంగా జీవించుటకు ప్రయాణము సాగిస్తున్న బాటసారులం మనం. ఈశ్వరీయ సామ్యవాద వ్యవస్థలో భాగస్వాములం మనం.

ప్రభుత్వము యొక్క ప్రమేయం లేకుండా ప్రజా జీవనము సాగదు. పరమేశ్వరుని పాత్ర లేకుండా ప్రపంచంలో ఏ కార్యమూ జరగదు. అన్ని కార్యాలలో ఆపద్బాంధవు డైన ఆదిదేవుని అదృశ్యహస్త ముంది. పరమేశ్వరుని ప్రమేయం లేకపోతే మనిషి మాట్లాడ లేడు. చూడలేడు. వినలేడు. తినలేడు. తినినా జీర్ణించుకో లేడు. అన్ని కార్యాల వెనుక అచ్యుతుని అద్భుతమైన అనుగ్రహం దాగి ఉంది. అగ్ని, వాయువు, వరుణుడు, సూర్యుడు మొదలైన దేవతామూర్తుల రూపంలో జీవులను, జగత్తును ఆశీర్వదిస్తున్న మహిమాన్విత శక్తి ఆ పరంధాముడే.

పెట్టుబడులు - ఫలితాలు

నీవు చేసే వ్యాపారములో మరి కొందరు పెట్టుబడి పెట్టడం వల్ల వ్యాపారము సవ్యంగా సాగడమే గాక, గొప్ప ఫలితాన్ని కూడా సాధిస్తుంది. వ్యాపారములో పెట్టుబడిదారులకు కూడా ఫలితం అందుతుంది. అందాలి కూడా. అలా కాకుండా, పెట్టుబడులను మాత్రం గ్రహించి, ఫలితాన్ని పెట్టుబడిదారు లకు పంచని వాడు ఏమవుతాడు? ముందు దొంగ అవుతాడు. ఆ తరువాత ఋణగ్రస్తు డవుతాడు.

అలాగే, దేవతల రూపంలో ఉన్న పరమేశ్వరుని సంపదను అందుకొని ప్రత్యర్పణం లేకుండా జీవించే

వాడు కూడా చోరుడే అవుతాడు. ఋణగ్రస్తుడుగా మిగిలి పోతాడు. పదుగురికి సంబంధించిన భాగ్యాన్ని ఒక్కడే అనుభవిస్తే దొంగ గాక ఏమవుతాడు?

ఆకలిగా ఉందని భోజనానికి కూర్చుంటాం. విస్తరలో ఆహారం వడ్డించ బడింది. ఆరగించ డానికి ఉపక్రమిస్తున్నాం. ఆరగిస్తే ఆకలి తీరి పోతుంది. తృప్తి కలుగుతుంది. మనకు తృప్తి నిచ్చేందుకు విస్తరలో ఆహారం సిద్ధంగా ఉంది.

అది ఆహారమా? లేక ఈశ్వరుని అనుగ్రహ ప్రసాదమా? ఆకలి తీర్చే అన్నాన్ని సృష్టించింది ఎవరు? మనం మాత్రం కానే కాదు. వంటవార్పులే మనవి. అన్నదాత భగవంతుడే.

ధరణి లేకుండా ధాన్యం లేదు. ధరణి లోని సత్తువ ఎవరిది? ధాన్యాన్ని సృష్టించిం దెవరు? ఆదిబీజాన్ని అనుగ్రహించిం దెవరు? వర్ష రూపంలో ఉన్న దెవరు? సౌరశక్తి ఎవరిది? అగ్ని రూపంలో పక్వం చేసిం దెవరు? ఓషధు లెలా వచ్చాయి? పంచభూతాల నుండి సూర్యచంద్రుల వరకు అందరూ చేతులు కలిపితేనే నా చేతి నిండా ఈ క్షణం అన్నపు ముద్ద ఉంది. అందుకే ఆ ముద్ద నోటి లోకి చేరే లోగా ఈ భాగస్వాము లందరూ కళ్ళ ముందు మెదుల్తున్నారు. దానిని వారికి సమర్పించి ఆ తరువాత భోం చేయాలి. మనం చేసే ప్రత్యర్పణంలో ధర్మం ఉంది. మనకు బాధ్యత ఉంది. వారికి హక్కూ ఉంది. కృతజ్ఞతా భావంతో వారి వంతు వారికి అర్పించి ఆ తరువాతే మనం ఆరగించాలి. అది, ధర్మ జీవనం. అలా కాకుండా స్వార్థంతో మనమే ఆరగించడం దొంగ జీవనం. అలాంటి స్వార్థపరుడు దొంగే **(స్తేనః)** అవుతాడు అంటున్నాడు గీతాచార్యుడు.

ఒక నిర్దోషి శిక్షకు గురి అయి నపుడు, 'నేను ఏ దోష మెరుగను. నాపై దురుద్దేశంతో నిందను మోపారు. నేను నిర్దోషిని. సత్య మేమిటో ఆ భగవంతుడికే తెలుసు' అంటూ ఉండటం మనము తరచుగా వింటూ ఉంటాము. లోకం దోషిగా పరిగణించినా, దైవదృష్టిలో తాను నిర్దోషియే నని ఆ వ్యక్తి అభిప్రాయము.

మరొక కోణంలో చూచి నపుడు, ప్రజల దృష్టిలో నిర్దోషిగా, ధర్మజ్ఞుడుగా పేరు పొందిన వ్యక్తి, దైవం దృష్టిలో దోషి అయి నపుడు, అధర్మపరుడు అయి నపుడు, ఆ వ్యక్తి మనస్సు ఎలా ఉంటుంది? నేను పాపిని. ఈ విషయాన్ని లోకం గుర్తించలేక పోవచ్చు. చట్టం పసికట్టలేక పోవచ్చు. అయినా నా పాపం భగవంతుడికి తెలియకుండా పోతుందా? దైవం దృష్టిలో నేను శిక్షార్హుణ్ణే కదా! అని తనలో తాను కుమిలి పోతూ ఉంటాడు.

దొంగల పరిస్థితి ఎప్పుడైనా, ఎక్కడైనా ఇలాగే ఉంటుంది. దేవతలు ప్రసాదించిన భోగాలను ప్రత్యర్పణం చేయకుండా, స్వార్థంతో తానే అనుభవించువాడు రాజైనా దొంగే. దైవ సంపదను అపహరించి మనుషులు దొంగలు కాకూడదు. ధర్మ జీవనాన్ని సాగించి, ఈశ్వరార్పణ బుద్ధితో ప్రత్యర్పణం చేసి, ఋణ విముక్తులు కావాలి. భోగాలను అనుభవించి, ఋణము లేనివాడుగా కానివాడు ***(ఆనృణ్యమ్ అకృత్వా)*** దొంగే. చోరుడే ***(స్తేనః ఏవ తస్కరః ఏవ)***. ఎందుకో తెలుసా? దేవతల సంపదను అపహరించిన వాడు అయ్యాడు కనుక ***(సః దేవాది స్వాపహారీ)***. 'ఆనృణ్యమ్' అనేది భాష్యం లోని పదం. ఆనృణ్యము అంటే 'ఋణము లేని వారు అగుట' అని అర్థము.

దేవతల రూపంలో ఉన్న పరమేశ్వరుని అనుగ్రహంతో లభించిన భోగాలను ముందుగా పరమేశ్వరునికి సమర్పించి, ఆ తరువాత ప్రసాదంగా స్వీకరించు వారు ఏ పాపాన్ని అంటరు. ప్రసాదాన్ని భుజించేవారు ప్రసన్నచిత్తు లవుతారు. అలా కాకుండా, కేవలం స్వార్థ జీవనాన్నే కొనసాగించు వారు భుజించేది ప్రసాదం కాదు. పాపమే అంటోంది గీత. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చూడబోతున్నాం.

యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః ।
భుఞ్జతే తే త్వఘం పాపా యే పచ న్త్యాత్మకారణాత్ ॥ 13

యజ్ఞశిష్టాశినః-సంతః-ముచ్యంతే-సర్వకిల్బిషైః
భుంజతే-తే-తు-అఘం-పాపాః-యే-పచంతి-ఆత్మకారణాత్

యే తు	= ఎవరైతే	భుంజతే	= తింటున్నారు
ఆత్మకారణాత్	= తమ శరీర పోషణార్థము	యజ్ఞశిష్టాశినః	= యజ్ఞశేషమును ఆరగించు
పచంతి	= వండుకొంటున్నారో	సంతః	= సత్పురుషులు
పాపాః	= పాపులైన	సర్వకిల్బిషైః	= సమస్త పాపముల నుండి
తే	= వారు	ముచ్యంతే	= విడిపోతున్నారు
అఘం	= పాపమును		

యజ్ఞ శేషమును ఆరగించే సత్పురుషులు సర్వ పాపాల నుండి విడిపడు తున్నారు. అలా కాక, ఎవరైతే, కేవలం తమ కొరకే వండు కొంటున్నారో, అట్టి పాపాత్ములు పాపాన్నే ఆరగిస్తున్నారు.

వ్యాఖ్య

జీవించడానికి మనిషి భుజించి తీరాలి. భుజించకుండా జీవించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. అందరూ భుజిస్తూనే జీవిస్తారు. అందరూ ఆహారాన్నే భుజిస్తారు. ఈ విషయం అందరికీ తెలుసు. కాని, ఆహారాన్ని ఎవ్వరూ భుజించరు అనేది శాస్త్రము యొక్క అభిప్రాయం.

ఎవరు ఏది భోం చేస్తారు? ఏ పదార్థాన్ని భుజిస్తారు? అనేది అప్రధానమైన విషయం. అమృతాన్ని భుజిస్తున్నారా? పాపాన్ని తింటున్నారా? అనేది ముఖ్యమైన చర్చనీయాంశం. మనిషి తీసుకొనేది ఆహారమే అయినా, ఆ ఆహార రూపంలో అమృతమైనా ఉంటుంది, లేదా పాపమైనా ఉంటుంది. అమృతాహారమైనా ఉంటుంది, లేదా పాపాహారమైనా ఉంటుంది.

యజ్ఞములను ఆచరించి, దేవతాదులకు సమర్పించిన తరువాత మిగిలిన యజ్ఞ శేషమును భుజించే వారు అమృతమును భుజించిన వారై, సమస్త పాపముల నుండి విడిపడి పోతున్నారు. అలా కాకుండా, యజ్ఞ జీవనానికి దూరులై, కేవలం తమ కొరకే ఎవరైతే వండుకొని తింటున్నారో, వారు పాపాన్నే భుజిస్తున్నారు. ఇదే గీతామాత నిర్దేశము. గీతాచార్యుని ఆదేశము.

యజ్ఞము అంటే పంచ మహాయజ్ఞములు అని శాస్త్ర నిర్ణయము. దేవయజ్ఞము, పితృయజ్ఞము, ఋషి యజ్ఞము, మనుష్య యజ్ఞము, భూత యజ్ఞము - ఈ ఐదు యజ్ఞాలను 'పంచమహా యజ్ఞములు' అంటారు. ఈ పంచమహా యజ్ఞాలను నిర్వహించి, యజ్ఞశేషంగా ప్రాప్తించిన ఆహారాన్ని భుజించే వారు అమృతాహారాన్ని ఆరగించిన వారవుతున్నారు. అంతేకాదు. అమృతాహార సేవనము యొక్క ఫలితంగా సమస్తమైన పాపాల నుండి విముక్తు లవుతున్నారు.

పాపాలు - పరిహారాలు

కర్మాచరణంలో తెలిసో తెలియకో హింస జరిగిపోతూ ఉంటుంది. హింస వలన కలిగే పాపాలు ఐదు విధాలుగా ఉంటాయి. వీటినే 'పంచ మహాపాతకాలు' అంటారు. ప్రతి మనిషి ఈ ఐదు పాపాలను ప్రతి రోజు తెలిసో, తెలియకో ఆచరిస్తూ ఉంటాడు.

కణ్డనీ పేషణీ చుల్లీ చోదకుంభీ చ మార్జనీ
పంచ సూనా గృహస్థస్య పంచయజ్ఞా త్ప్రణశ్యతి ॥

రోలు, లేక కత్తిపీట (*కణ్డని*), నూరెడి రాయి, లేదా రుబ్బు రాయి (*పేషణి*), పొయ్యి (*చుల్లి*), నీళ్ళకుండ (*ఉదకుంభః*), చీపురు (*మార్జనీ*) - ఈ ఐదింటిని సూనాస్థానములు అంటారు. అంటే, హింస జరిగే స్థానములు, లేదా హింసకు కారణమైన స్థానములు అని అర్థము. ఈ ఐదింటికి సంబంధించిన కార్యాలలో అనివార్యంగా జరిగే హింస ఐదు విధాలుగా ఉంటుంది. అవే పంచపాపాలు. శాస్త్రంలో వీటిని 'పంచసూనాలు' అంటారు.

రోటిలో దంచే టప్పుడు (గ్రైండర్ త్రిప్పే టప్పుడు), కత్తిపీటతో లేదా కత్తితో ముక్కలు కోసే టప్పుడు, పప్పు లేదా పిండి రుబ్బే టప్పుడు, పొయ్యి లేక స్టవ్ వెలిగించే టప్పుడు, పొయ్యి మండే టప్పుడు, చల్లని జలపాత్రను ఉంచు నపుడు, ముఖ్యంగా ఇంటిని శుద్ధి చేసే టప్పుడు మన కర్మల ఫలితంగా అనేక సూక్ష్మ జీవులు నశిస్తాయి. అది తెలియక చేసినదే అయినా చేయ దగింది మాత్రం కాదు. తెలిసి జరిగినా, తెలియక జరిగినా హింస హింసే.

దోమల మధ్య నిద్ర పోలేము. అందుకని, దోమ నివారక ద్రవ్యాల్ని ఇళ్ళల్లో ఉపయోగిస్తాము. దాని వల్ల దోమలు నశిస్తాయి. ఈగలు, బొద్దింకలు చని పోతాయి. ఇదంతా పాపమే. ప్రతి గృహస్థుడు ఈ విధమైన పంచసూనా దోషాలను అనివార్యంగా చేస్తూ ఉంటాడు. ఆ దోష నివారణార్థం పంచ యజ్ఞాలను నిర్వహించి పాపము నుండి విముక్తిని పొందుతూ ఉంటాడు (*పంచసూనా గృహస్థస్య పంచయజ్ఞా త్ప్రణశ్యతి*).

ప్రసాదమే పరిహారము

పంచసూనాది పాపాలను ప్రక్షాళనం చేసుకొనేందుకు పంచ మహాయజ్ఞాలు నిర్వహిస్తారు. దేవయజ్ఞము, పితృయజ్ఞము, ఋషి యజ్ఞము, మనుష్య యజ్ఞము, భూతయజ్ఞము - ఈ అయిదింటిని పంచ మహాయజ్ఞాలు అంటారు. ఈ పంచ మహాయజ్ఞాలను నిర్వహించి, యజ్ఞ శిష్టమైన అశనమును లేదా ఆహారమును భుజించి వారు యజ్ఞశిష్టాశులై సమస్తమైన పంచసూనాది పాపాల నుండి విముక్తు లవుతారు. అందుకనే యజ్ఞ శిష్టమైన ఆహారమును అమృతము అన్నారు.

ప్రతి నిత్యం అనివార్యంగా జరిగి పోయే పంచసూనాది దోషాలను పరిహరించు కోవాలి. లేకపోతే, మనిషి పాపాల చేత బద్ధు డవుతాడు. పాప విముక్తికై చేసే ప్రతిక్రియలే పంచ మహాయజ్ఞాలు.

(1) దేవ యజ్ఞము :- వేదాధ్యయనము, దేవతార్చన, జపహోమాదులు మొదలైనవి దేవయజ్ఞము క్రిందికి వస్తాయి.

(2) పితృయజ్ఞము :- పితృదేవతలను సంతోషపెట్టే కార్యాలను పితృయజ్ఞము అంటారు. శ్రాద్ధ తర్పణాలు పితృయజ్ఞాలే.

(3) ఋషి యజ్ఞము :- ఋషులు ప్రసాదించిన జ్ఞానము వలన మనం అభ్యుదయ నిశ్శ్రేయసలను సాధిస్తున్నాము. అట్టి ఋషుల యొక్క ఋణాన్ని తీర్చుకొనే ప్రయత్నంలో ఋషి యజ్ఞాన్ని నిర్వహించాలి. స్వాధ్యాయ ప్రవచనాదులను నిరంతరము కొనసాగించుటయే ఋషి యజ్ఞము.

(4) మనుష్య యజ్ఞము :- ఎందరో వ్యక్తుల సహకారం వల్లనే మన జీవితం సాగుతూ ఉంది. అట్టి మానవులను తృప్తి పరచే కార్యక్రమంలో మనుష్య యజ్ఞమును నిర్వహించాలి. అతిథి అభ్యాగతులను సత్కరించడం, మాననీయులను సన్మానించడం మనుష్య యజ్ఞ మవుతుంది.

(5) భూత యజ్ఞము :- పశుపక్ష్యాదులు ఎన్నో విధాలుగా మన జీవనానికి సహకరిస్తాయి. వాటిని తృప్తి పరచేందుకు నిర్వహించే కార్యక్రమాలు భూత యజ్ఞంగా పిలువ బడతాయి.

ఈ విధంగా పంచయజ్ఞ విధులను నిర్వర్తిస్తూ, యజ్ఞ శేషాన్ని ప్రసాదంగా స్వీకరిస్తూ, ప్రమాదకృత హింసాది జన్యములైన పంచసూనాది దోషాల నుండి మానవులు విముక్తులు కావాలి.

సర్వమూ సమర్పణమే

ఇంతవరకు రెండు, మూడు అధ్యాయాలలో ఏ 'కర్మయోగ' తత్త్వాన్ని మనం అర్థం చేసుకున్నామో, దానినే ఇక్కడ 'యజ్ఞము' అనే విషయంగా అభిభాషిస్తున్నాడు. కర్మయోగంలో దేనిని 'ప్రసాదం'గా అర్థం చేసుకున్నామో, దానినే ఇక్కడ 'యజ్ఞశేషం'గా చెప్పుకుంటున్నాము.

ప్రసాదం విషయంలో ఎలాగైతే భావనే ప్రధాన మైందో, యజ్ఞశేషం విషయంలో కూడా భావనే ప్రధానం. ప్రసాదం ఎలా వస్తువు కాదో, యజ్ఞశేషం కూడా అన్నం కాదు. యజ్ఞశిష్టము ప్రసాదమే కనుక, అది పదార్థం కాదు, భావన.

ఆహారాన్ని ముందుగా పరమేశ్వరునికి బ్రహ్మార్పణం అని సమర్పించి, ఆ తరువాత యజ్ఞ శేషాన్ని అమృతంగా స్వీకరిస్తాము. కొందరు భోజనంలో మొదటి ముద్దను బ్రహ్మార్పణం చేసి, పవిత్రంగా నేత్రాలకు అద్దుకొని, దానిని ప్రక్కన ఉంచి, ఆ తరువాత యజ్ఞశేషాన్ని భుజిస్తారు. భోజనానంతరం ఆ అన్నపు ముద్దను పక్షులకు గాని, జంతువులకు గాని సమర్పించి, వాటిలో పరమేశ్వరుని దర్శిస్తూ తృప్తి చెందుతారు.

వంట పూర్తి కాగానే, కొంత పదార్థాన్ని పరమేశ్వరార్పణం గావించి, దానిని ప్రక్కన ఉంచి, ఆ తరువాత యజ్ఞశేషాన్ని అమృతంగా స్వీకరిస్తారు. తదనంతరం వేరుగా ఉంచిన అర్పణ పదార్థాన్ని యాచకులకో, పక్షులకో సమర్పించి తృప్తి చెందుతూ ఉంటారు. ఈ సదాచారం ఇప్పటికీ సంప్రదాయవాదుల గృహాలలో కనిపిస్తూ ఉంటుంది.

ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్య స్విద్ధనమ్ ॥

ఈ సమస్త చరాచర ప్రపంచము ఈశ్వరునిచే పరివ్యాప్తమై ఉంది. త్యాగం చేసి అనుభవించు. ఏ ఒక్కరి ధనాన్ని ఆశించకు అని అద్భుతంగా ప్రవచించింది ఈశావాస్యోపనిషత్తు.

త్యాగము చేసి అనుభవించు ***(తేన త్యక్తేన భుంజీథా, తేనత్యక్తేన త్యాగేన ఇత్యర్థః, భుంజీథాః పాలయేథాః).*** ఇదే యజ్ఞజీవనము. యజ్ఞశేషమైన అమృతమును భుజించే సత్పురుషుల జీవన వైభవము. అలాంటి సంతులు సర్వ పాపముల నుండి విడిపడు తున్నారు.

చేయవలసిన కర్మలను ప్రమాద వశాత్తు చేయక పోవడం వల్ల సంక్రమించిన పాపము, చేయకూడని కర్మలను బుద్ధి పూర్వకంగా చేయడం వల్ల ప్రాప్తించిన పాపము, స్పృహ లేకపోయినా, నడవడంలో గాని, పరుండటంలో గాని, కాళ్ళు చేతులు అప్రయత్నం గానో, ప్రయత్న పూర్వకం గానో కదిలించడంలో గాని అవశంగా ప్రాప్తించిన పాపములు - ఈ విధమైన సమస్త పాపముల నుండి, పాప ఫలితాల నుండి, యజ్ఞ శేషమును ఆరగించు పావనాత్ములు విముక్తు లవుతున్నారు.

ఏకా క్రియా ద్వ్యర్థకరీ బభూవ - ఒక కార్యము రెండు ప్రయోజనాలను కలిగిస్తుంది అనే న్యాయము ననుసరించి యజ్ఞ శిష్టాశులైన సత్పురుషులు యజ్ఞ జీవనమును సాగిస్తూ అటు లోక కళ్యాణానికి దోహదం

చేయడమే గాక, ఇటు సత్త్వశుద్ధి ద్వారా మోక్షానికి సిద్ధపడుతూ ఉన్నారు. అమృతమును ఆరగిస్తున్నారు. అమృతత్వానికి మార్గాన్ని సుగమం చేసుకుంటున్నారు.

అలా కాకుండా, ఎవరైతే యజ్ఞభావ విముఖులై, అనర్థమైన స్వార్థమే పరమార్థ మని భావించి, తమ దేహ పోషణార్థమే వండుకొని తింటున్నారో, వారు పాప భోజనులే అవుతున్నారు.

పాపమే పరమాన్నము

యజ్ఞ శేషమును భుజించే పావనాత్ముడు తయారు చేసుకున్న పాపాల నుండి విడిపడి పోతూ ఉంటే, యజ్ఞదూరులై, కేవలం ఆత్మంభరులై చరించు పాపులు పని కట్టుకొని లేని పాపాలను తయారు చేసుకుంటున్నారు. పాపాన్నే భుజిస్తూ ఉన్నారు ***(భుంజతే, తే అఘం పాపం).***

పంచ మహాయజ్ఞాలకు దూరులైన వారు తమ కుక్షిని నింపుకొనుటకే వండుకుంటారు. అటు దేవతలకు సమర్పించరు. ఇటు భూతాలకు అర్పించరు. కనుక వారు అన్న రూపంలో ఉన్న పాపాన్ని భుజిస్తున్నారే గాని అన్నాన్ని భుజించడం లేదు. కేవలం తన స్వార్థం కొరకే భుజించువాడు పాపాన్నే భుజిస్తున్నాడు అన్నది ఋగ్వేదము.

యజ్ఞ విముఖుడైన స్వార్థపరుడు ఫలశూన్యమైన ఆహారాన్ని పొందు తున్నాడు ***(మోఘమన్నం విన్దతే అప్రచేతాః*** - ఋగ్వేదము). 'అప్రచేతాః' అంటే సద్బుద్ధి లేనివాడు అని అర్థము.

కేవలాఘో భవతి కేవలాదీ - 'కేవలాదీ' అంటే కేవలం తన పొట్ట కోసమే తినేవాడు అని అర్థం. 'కేవలాఘోభవతి' అంటే కేవలం పాపాన్నే భక్షించే వాడు అవుతున్నాడు అని వేదవచనము.

కుక్షింభరులు యజ్ఞ విముఖులు. భగవ న్నివేదనమును చేయరు. అతిథులను ఆదరించరు. శకున శునకాది భూతాలకు కూడా సంతర్పణము చేయరు. కనుకనే వారు పాప విముక్తులు కాలేక పోతారు. ఇలా స్వార్థ జీవనమును సాగించువాడు పాపము నుండి విడిపడడు అని 'శతపథ బ్రాహ్మణము' తెలుపుతూ ఉంది ***(న సః పాప్మనో వ్యావర్తతే).***

తే.గీ ॥ అతిథి పితృదేవతా పూజ లాచరించి
కాని గృహమేధులకు భోజ్యమైన గుడువ
దగదు యజ్ఞశిష్టం బమృతంబుగాగ
నార్య జనములు సెప్పుదు రధిపవర్య?

అని 'ఆంధ్ర మహాభారతము' - శాంతి పర్వములో తిక్కనార్యుని తీపి పద్యము.

సృష్టి చక్రంలో యజ్ఞచక్ర మనేది అతి ప్రధానమైన, ప్రశస్తమైన అంగము. కనుక ఈ యజ్ఞ చక్రాన్ని సర్వులూ అనుసరించాలి. **ముచ్యంతే సర్వకిల్బిషైః** అంటూ అది సర్వ పాపాల నుండి మనలను విరమింప చేస్తూ ఉంది. అలాగే, **నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే** అంటూ మోక్షానికి కూడా దారి చూపిస్తూ ఉంది. అందుకే ఈ కర్మయజ్ఞ చక్ర గమనాన్ని తరువాత వరుసగా మూడు శ్లోకాలలో చెబుతున్నాడు.

అన్నా ద్భవన్తి భూతాని పర్జన్యా దన్నసమ్భవః ।
యజ్ఞా ద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥ 14

అన్నాత్-భవంతి-భూతాని-పర్జన్యాత్-అన్నసంభవః
యజ్ఞాత్-భవతి-పర్జన్యః-యజ్ఞః-కర్మసముద్భవః

చైతన్య భగవద్గీత

అన్నాత్	= అన్నము వల్ల	యజ్ఞాత్	= యజ్ఞము వల్ల
భూతాని	= ప్రాణులు	పర్జన్యః	= మేఘం
భవంతి	= పుడుతున్నాయి	భవతి	= పుడుతూ ఉంది
పర్జన్యాత్	= మేఘము వల్ల	యజ్ఞః	= యజ్ఞము
అన్నసంభవః	= అన్నము కలుగుతూ ఉంది	కర్మసముద్భవః	= కర్మము వలన పుడుతుంది

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్ ।
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ 15

కర్మ-బ్రహ్మోద్భవం-విద్ధి-బ్రహ్మ-అక్షరసముద్భవం
తస్మాత్-సర్వగతం-బ్రహ్మ-నిత్యం-యజ్ఞే-ప్రతిష్ఠితం

కర్మ	=కర్మను	తస్మాత్	= అందువలన
బ్రహ్మోద్భవం	=వేదము వలన ఉత్పన్న మైనదిగ	సర్వగతం	= సర్వవ్యాపకమైన
విద్ధి	=తెలుసుకో	బ్రహ్మ	= బ్రహ్మము
బ్రహ్మ	=వేదము	నిత్యం	= సదా
అక్షర సముద్భవం	=పరబ్రహ్మము నుండి ఉత్పన్న మైనదిగ	యజ్ఞే	= యజ్ఞము నందు
		ప్రతిష్ఠితం	= ప్రతిష్ఠితమై ఉంది

అన్నము వలన ప్రాణులు పుడుతున్నాయి. మేఘము వలన అన్నము కలుగుతూ ఉంది. యజ్ఞము వలన మేఘము ఏర్పడుతూ ఉంది. యజ్ఞము కర్మ వల్లనే సాధ్య మవుతూ ఉంది.

కర్మ వేదము వలన కలుగుతూ ఉంది. వేదము అక్షర రూపుడైన బ్రహ్మము నుండి ఉత్పన్నమైంది. అందుచేత, సర్వగతమైన బ్రహ్మము సదా యజ్ఞము నందే స్థిరపడి ఉంది.

వ్యాఖ్య

ప్రజలతో పాటు యజ్ఞములను కూడా సృష్టించాడు ప్రజాపతి యైన బ్రహ్మదేవుడు. తండ్రి తన బిడ్డలకు వ్యాపార నిమిత్తం కొంత డబ్బు ఇచ్చినట్లు, సుఖ జీవనానికి, పురుషార్థ సాధనకు బ్రహ్మదేవుడు యజ్ఞములను పెట్టుబడిగా మనకు ప్రసాదించాడు. తండ్రి ఇచ్చిన ధనములో బిడ్డలు వ్యాపారమును వృద్ధి చేసుకున్నట్లు, పరమేశ్వరుడు ప్రసాదించిన యజ్ఞములలో యజ్ఞ వ్యాపారమును విరివిగా సాగించి, విశిష్టమైన ఫలాలను ఈ లోకంలో మనం కూడా పొందాలి. అదే యజ్ఞ వైభవము.

యజ్ఞము మనతో కలిసి పుట్టింది. మధ్యలో వచ్చి కలిసింది కాదు. కనుక యజ్ఞము సోదరి వంటిది. భార్య వంటిది కాదు. భార్యను భర్త చూసి, నిర్ణయించుకొని వరిస్తాడు. వరించి వివాహ మాడుతాడు. ఈ సంబంధము మధ్యలో కలిగింది. అందుచేత మధ్య లోనే తెగిపోతుంది. యజ్ఞము సోదరి లాగా మనతో కలిసి పుట్టింది. సోదరి రక్తమే మనలో ఉంటుంది. మన రక్తమే సోదరిలో ఉంటుంది. మనుషుల విషయంలో యజ్ఞం కూడా అంతే. కాని, ఇక్కడ సోదరి ఉపమానం కూడా ఏకదేశీయమే. వాస్తవానికి, మనతో కలిసి పుట్టిన యజ్ఞం, సముద్రంలో కలిసే వరకు నదికి వేగం తోడుగా ఉన్నట్లు, మనతో కలిసే ఉంటుంది. కనుక, యజ్ఞమును త్యజించ కూడదు. యజ్ఞం కూడా కర్మే కనుక కర్మను త్యజించ కూడదు అనేదే ఇక్కడ ప్రధానమైన విషయం. అటు సృష్టి చక్రాన్ని, ఇటు జీవన చక్రాన్ని అందంగా, అద్భుతంగా త్రిప్పేది, నడిపేది యజ్ఞచక్రమే.

దేవతలను, మానవులను అనుసంధానం చేసేది యజ్ఞమే. యజ్ఞకర్మ మనల్ని అటు దేవతల తోను, ఇటు మానవుల తోనూ కలుపుతుంది. యజ్ఞకర్మ ద్వారా మనం దేవతల్ని తృప్తి పరుస్తాము. తృప్తి చెందిన దేవతలు అనుగ్రహించే భోగాలను అందుకొని, వాటిని మానవులలో పరమేశ్వరుని దర్శిస్తూ, యజ్ఞ భావనతో వారికి సమర్పణం గావిస్తూ, మిగిలిన యజ్ఞశేషమును ప్రసాదంగా స్వీకరిస్తాం. ప్రశాంతతను అనుభవిస్తూ సమస్త కల్మషాల నుండి విడి పడతాం. మోక్షమార్గంలో మహోన్నత స్థాయికి చేరుకుంటాం.

ఇచ్చి పుచ్చుకోవడాలే యజ్ఞంలో ప్రధానంగా కనిపిస్తాయి. పుచ్చుకొని తిరిగి ఇవ్వక పోవడం ధర్మం కాదు. ఇవ్వకుండా పుచ్చుకొనే వైఖరి సమంజసం కాదు. ఇస్తూ పుచ్చుకోవాలి. పుచ్చుకుంటూ ఇవ్వాలి. ఈ రెండిటిలో ఈశ్వరభావన తోడుగా ఉండాలి. అప్పుడే ఆ ఇచ్చి పుచ్చుకోవడాలు యజ్ఞకార్యా లవుతాయి.

సాగరం నుండి ఉద్భవించిన నదులు తిరిగి సముద్రాన్ని చేరి శాంతిస్తాయి. అది నిత్య ప్రవాహం. అదే ప్రవాహ నిత్యత్వం. ప్రభాతంలో సూర్యుడి నుండి వెడలిన కిరణాలు ప్రదోషంలో తిరిగి సూర్యుని లోనే లయించి విశ్రమిస్తాయి. ఉదయ కాలంలో చెట్టును వీడి ఎగిరి పోయిన పక్షులు అస్తమయ కాలానికి చెట్టును చేరి విశ్రమిస్తాయి. బ్రహ్మమును వీడి జగత్తులో ప్రవేశించిన మనం తిరిగి బ్రహ్మమును చేరి శాంతించాలి. జనన మరణ చక్రంలో పడి శోకమయ జీవనాన్ని కొనసాగించడం కాకుండా యజ్ఞ చక్రాన్ని ఆలంబనగా పట్టుకొని సుఖమయంగా, శాంతిమయంగా బ్రతుకును కడతేర్చు కోవాలి. బ్రహ్మము యజ్ఞము నందే ప్రతిష్ఠితమై ఉన్నాడు.

అన్నం నుండే ఆవిర్భావం

అన్నం నుండే ప్రాణులు పుడుతున్నాయి. ప్రాణుల ఆవిర్భావము అన్నము వల్లనే జరుగుతూ ఉంది. అంటే, ప్రాణులు కేవలం అన్నం వల్ల పుట్టవు. పాత్రల్లో ఉండే అన్నం వల్ల మనుషులు పుట్టరు. ఆ అన్నాన్ని తల్లిదండ్రులు ఆరగించడం వల్ల పుడతారు. కనుకనే, భాష్యంలో 'అన్నాత్' అనే పదానికి 'భుక్తాత్' అనే అర్థం చెప్పారు. 'భుక్తాత్' అంటే తిన బడినది అని అర్థం. అంటే, తల్లిదండ్రులు తినిన ఆహారము శుక్ల శోణిత రూపంగా (రేతో రూపంగా పురుషుడిలో, శోణిత రూపంగా స్త్రీలో) పరిణమించి ప్రాణుల ఆవిర్భావానికి కారణ మవుతూ ఉంది. కనుక సర్వప్రాణులు అన్నము నుండే పుడుతున్నాయి అని చెప్పడం జరిగింది (*అన్నాత్ భుక్తాత్ లోహిత రక్త పరిణతాత్ ప్రత్యక్షం భవన్తి జాయన్తే భూతాని*).

అన్నాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే జాతాని అన్నేన వర్ధన్తే

భూతము లన్నీ అన్నము వల్లనే పుడుతున్నాయి. పుట్టిన భూతములు అన్నము వల్లనే వృద్ధి చెందు తున్నాయి అని తైత్తిరీయశ్రుతి. మరి, ప్రాణుల ఆవిర్భావానికి కారణమైన అన్నము ఎక్కడ నుండి వస్తూ ఉంది? పర్జన్యం నుండి అన్నం పుడుతూ ఉంది.

పర్జన్యం నుండే ప్రసాదం

ప్రాణుల ఆవిర్భావానికి హేతువైన అన్నము పర్జన్యము నుండి పుడుతూ ఉంది. 'అన్నాత్' అన్నప్పుడు 'భుక్తాత్' అని ఎలా లక్షణం చెప్పుకున్నామో, అలాగే ఇక్కడ 'పర్జన్యము' అంటే 'వర్షము' అని లక్షణం చెప్పుకోవాలి. వర్షము వల్లనే కదా మనకు అన్నాదులు కలుగుతున్నాయి! (*పర్జన్యాత్ వృష్టేః అన్నస్య సంభవః అన్నసంభవః*).

పర్జన్యము అంటే వర్షము అని, వర్షమేఘము అని, వర్షరూపుడైన వరుణదేవుడు అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. అంతేకాదు. పర్జన్యుడు అంటే సూర్యుడు అనే అర్థం కూడా ఉంది.

అగ్నౌ ప్రాస్తాహుతిః సమ్యగాదిత్యం ఉపతిష్ఠతే
ఆదిత్యా జ్జాయతే వృష్టిః వృష్టేః అన్నం తతః ప్రజా ॥

అగ్ని యందు అర్పించిన ఆహుతి సూర్యుని చేరుతుంది. సూర్యుని వల్ల వర్షం కలుగుతుంది. వర్షం వల్ల అన్నము, అన్నము వలన ప్రాణులు పుడుతున్నాయి అని బృహదారణ్య కోపనిషత్తులో జనక యాజ్ఞవల్క్య సంవాదంలో ప్రతిపాదింప బడింది. మనుధర్మ స్మృతిలో కూడా ఈ శ్లోకం ఉంది. కనుక పర్జన్య శబ్దానికి సూర్యుడు అని గ్రహించినా అంగీకారమే. అలాగే సముద్రము అని చెప్పుకున్నా విరోధం లేదు. ఎందుకంటే, సముద్రం వల్లనే మేఘాలు తయా రవుతున్నాయి. కాకపోతే, పర్జన్యానికి ఎన్ని అర్థాలు చెప్పుకున్నా, ఇవన్నీ పరమేశ్వరుని కన్నా వేరుగా లేవు అనే సత్యాన్ని మాత్రం విస్మరించ కూడదు. పర్జన్యుడు అంటే పరమేశ్వరుడు అని అర్థం. విష్ణుసహస్రనామంలో 'పర్జన్యః' అనేది కూడా ఒక పవిత్రనామం (810 వ నామం - **కుముదః కున్దరః కున్దః పర్జన్యః పావనోఽ నిలః**).

కనుక పర్జన్య మెవరో కాదు, పరమేశ్వరుడే. మేఘరూపంలో ఉన్న పరమేశ్వరుడు వర్షించి ధరణిని చల్ల బరచినట్లు, పర్జన్య నామధేయుడైన పరమేశ్వరుడు అనుగ్రహ వర్షాన్ని కురిపించి తాపత్రయమును తొలగిస్తాడు (***పర్జన్యవత్ ఆధ్యాత్మికాది తాపత్రయం శమయతి***). అంతేకాదు. వర్షించే మేఘము అన్నాది ఫలాలను అనుగ్రహించునట్లు, పర్జన్యుడైన పరంధాముడు సమస్త కామములను అభివర్షిస్తాడు. సమస్త కోర్కెలను తీర్చుతాడు అని అర్థము (***సర్వాన్ కామాన్ అభివర్షతీతి వా, పర్జన్యః***). అంతా భగవత్ప్రసాదమే. ప్రాణులు ప్రసాదం. ప్రాణుల పుట్టుకకు కారణమైన అన్నాదులు ప్రసాదం. అన్నాదులను సృష్టించే వర్షాలు కూడా ప్రసాదమే. మరి, ఈ వర్షానికి కారణం? యజ్ఞము నుండి పర్జన్యం పుడుతుంది.

యజ్ఞ మేఘం

యజ్ఞము వల్ల వర్షం కలుగుతుంది (***యజ్ఞాత్ భవతి పర్జన్యః***). యజ్ఞము పవిత్రము కనుక యజ్ఞభావన కూడా పవిత్రమే. స్థూలంగా ఆచరింపబడే యజ్ఞకర్మకు ఫలం ఉన్నట్లే, సూక్ష్మమైన యజ్ఞభావనకు కూడా సూక్ష్మ ఫలితం ఉంటుంది. అదే యజ్ఞము యొక్క సుకృతం. దాని వల్లనే వర్షం పుడుతుంది. పడుతుంది.

యజ్ఞం వల్ల వర్షం కలుగుతుంది అంటే, యజ్ఞము చేయక పోతే వర్షాలు ప్రాప్తించవు అని అర్థము. వర్షాలు పడితే క్షేమం. వర్షాలు పడక పోతే క్షామం. తన స్వకర్మ చేత పరోపకారం జరిగితే అది యజ్ఞకర్మ అవుతుంది. యజ్ఞాలలో పరోపకారవాంఛ ఉంది. యజ్ఞఫలమైన పర్జన్యము కూడా పరోపకారార్థమే వర్షిస్తూ ఉంది.

మేఘాలు గగనంలో కదుల్తూ ఉంటాయి. అవసరానికి పరోపకార దృష్టితో వర్షిస్తాయి. ఆకాశంలో మేఘాలు నిరాధారంగా తిరుగుతూ ఉంటాయి. తమ పైనే తాము ఆధారపడి ఉంటాయి. పరులకు సహకరిస్తూ ఉంటాయి. ఇదే యజ్ఞజీవనము.

వృక్షాలు కదుల్తూ ఉంటాయి. గాలిని చలింప చేస్తూ ఉంటాయి. తమ కాళ్ళ మీదనే తాము నిలబడి ఉంటాయి. ఇతరుల భుజాల పైన ఎక్కి స్వారి చేయవు. కాని తమ శాఖ లనే చేతుల్ని మెల్లగా ఊపుతూ సర్వులకు చల్లని గాలిని, హాయిని ఇస్తాయి. పువ్వులను రాలుస్తాయి. పండ్లను అందిస్తాయి. ప్రాణులకు నీడ నిస్తాయి. మేఘాలు ద్రవించుటకు సహకరిస్తాయి. ఇదంతా తమ హద్దులో తాము ఉంటూనే నిర్వహిస్తాయి. సర్వులను పోషిస్తాయి. తమ పోషణకు ఎవరిపైనా ఆధార పడకుండా ఉంటాయి. ఇదే యజ్ఞజీవనం. విశ్వకళ్యాణానికి ఆచరించ వలసిన విశిష్టకార్యం. ఆడంబరాలకు అవకాశ మివ్వకుండా, అహంకారము అవరోధం కాకుండా, పవిత్రమైన అంతఃకరణతో, ఉదార స్వభావంతో ఆచరించే కార్యమే యజ్ఞకర్మ.

ఉదార చరితులైన మహర్షులలో విశ్వామిత్ర మహర్షి అగ్రగణ్యుల కోవకు చెందుతారు. విశ్వానికి మేలు చేసే మిత్రుడు కనుక ఆయన విశ్వామిత్రుడు. ఆయన ఆచరించిన ప్రతి కార్యము విశ్వ కళ్యాణార్థమే జరిగింది. సీతారాముల కళ్యాణంతో శ్రీకారం చుట్టి, విశ్వకళ్యాణంతో తృప్తి చెందిన మహర్షి శ్రీ విశ్వామిత్రుడు.

సమాజంలో కళ్యాణశోభను ఆవిష్కరించ డానికి ముందే విశ్వామిత్రుడు అరణ్యంలో యజ్ఞాన్ని నిర్వహించాడు. యజ్ఞం చేయనిదే విశ్వకళ్యాణం జరగదని ఆ మహాత్మునికి తెలుసు. అందుకనే, ముందుగా యజ్ఞాన్ని నిర్వహించాడు. యజ్ఞమేఘమే అభ్యుదయ ఫలాన్ని అందిస్తుందని గుర్తించాడు. గ్రహించాడు.

అభ్యుదయమే ప్రధాన మైనపుడు అహంకారం అగుపించదు. అందుకనే అరణ్యంలో యజ్ఞాన్ని నిర్వహించాడు. అక్కడ జన సందోహం లేదు. ఆర్భాటాలు అసలే లేవు. అసంస్కారులైన అడవిజాతి వారి మధ్యే యజ్ఞాన్ని నిర్వహించాడు.

విశ్వామిత్రుడు అరణ్యంలో కాకుండా అయోధ్యలో యజ్ఞమును నిర్వహించి ఉంటే, ఏ ఆపద ఉండేది కాదు. ఏ ఉత్పాతము ఉత్పన్న మయ్యేది కాదు. ఆపదలు వచ్చినా, వస్తాయని తెలిసినా తాను మాత్రం అరణ్యం లోనే యజ్ఞాన్ని నిర్వహించాలని దృఢంగా సంకల్పించాడు.

జనారణ్యం మధ్య ఆడంబరాలను, అహంకారాలను ఆరబోసుకుంటూ, పది మంది మెప్పు కోసం సాగించే వినోద ప్రదర్శనం యజ్ఞం కాబోదని విశ్వామిత్రుడు అభిప్రాయ పడ్డాడు. విశ్వకళ్యాణం జరగాలే గాని అది విశ్వానికి తెలియ వలసిన అవసరం లేదని అభిప్రాయ పడ్డాడు. కాకపోతే, రామలక్ష్మణుల్ని తనకు తోడుగా ఉంచు కున్నాడు.

రాముడు దైవం. లక్ష్మణుడు వివేకం. యజ్ఞ జీవనమును సాగించే వారు వివేకాన్ని పోగొట్టుకో కూడదు. అలాగే దైవారాధనకు దూరం కాకూడదు. చిత్త ప్రసాదము, దైవానుగ్రహము - ఈ రెండిటిని పొందినవారు విశ్వకళ్యాణ కారకు లవుతారు. రామలక్ష్మణు లున్నచోట యజ్ఞాలు ఫలప్రద మౌతాయి. సంపదలు నిండుతాయి. విజయాలు ప్రాప్తిస్తాయి. ధర్మం శోభిస్తుంది. ఈ విషయాన్నే గీతను సమాప్తం చేస్తూ సంజయుడు కూడా వినిపిస్తాడు (***యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః, తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతి ర్మతిర్మమ***).

కనుక, సమాజంలో కళ్యాణ శోభ గోచరించాలన్నా, విశ్వము వెలుగులతో వికసించాలన్నా యజ్ఞ జనిత వర్షమే కారణ మవుతుంది. ఈ సందర్భములో, కొందరిలో అనివార్యంగా కొన్ని సంశయాలు ఉత్పన్నం కావచ్చు.

యజ్ఞాలు లేకపోయినా వర్షాలు పడుతూ ఉన్నాయి కదా! పంటలు కూడా పండుతూనే ఉన్నాయి కదా! శాంతిరూపమైన యజ్ఞాలు లేకపోవడమే గాక, అశాంతి మయమైన హింసలు కూడా విలయతాండవం చేస్తూ ఉన్నాయి. అయినా పాడిపంటలు అందుతూనే ఉన్నాయి కదా! లేకపోతే, ప్రజలు ఎలా జీవిస్తున్నారు? యజ్ఞాలు లేకపోయినా ప్రజా జీవనానికి ఆటంకం లేనపుడు, యజ్ఞాలను నిర్వహించ వలసిన అవసర మేమిటి? అని కొందరు సంశయగ్రస్తులు ప్రశ్నిస్తూ ఉంటారు కూడా.

అరిష్టాలు చెప్పిరావు

పనులే మనకు కనిపిస్తాయి. ఫలితాలు అగుపించవు. వర్తమానం లోనే మనస్సు వర్తిస్తుంది. భవిష్యత్తును స్పష్టంగా వీక్షించ లేదు. సదాచారవంతుడు అనారోగ్యం పాలైతే, దురాచారవంతుడు, త్రాగుడుకు బానిస అయిన అప్రయోజకుడు ఆరోగ్యంగా తిరుగుతూ ఉంటాడు. అంతమాత్రాన వాడు అమృతాన్ని సేవిస్తున్నాడు అని అర్థమా?

సమాజంలో ఎక్కువ మంది ఇలాగే అర్థం చేసుకుంటున్నారు. మోతాదు మించక పోతే, అంతకు మించి

మేలు చేసే మిత్రులు ఉండబో రని వైద్యులు కూడా నొక్కి వక్కాణిస్తున్నారు. కలియుగంలో వైకల్యాలే కైవల్యాలు కాబోలు. కొద్దికొద్దిగా పుచ్చుకుంటే విషం హాని చేయదు అని భావించడంలో ఎంత సత్య ముందో, ఈ మోతాదు మించని మంత్రంలో తంత్రం కూడా అంతే ఉంది.

'నువ్వు త్రాగకు. నేను పాడై పోతున్నాను' అని కాలేయము కబురు చేయదు. 'నేను కొట్టుకోలేక పోతున్నాను' అని గుండె గంట కొట్టి చెప్పదు. 'నేనిప్పుడిప్పుడే కొద్దికొద్దిగా, దేహంలో ప్రాకుతున్నాను' అని క్యాన్సరు కార్డుముక్క వ్రాయదు. వచ్చిన తరువాత నయం చేసుకొనే యత్నం కన్నా, రాక ముందే నివారించుకొనే ప్రయత్నమే ఎప్పుడైనా, ఎవరికైనా శ్రేయోదాయకము.

యజ్ఞాలు లేకపోయినా, హింసలు విరివిగా విస్తరించినా వర్షాలు పడుతున్నాయి. అది ఎవరూ కాదనడం లేదు. వర్షాలు పడుతున్నాయి. కాని, సకాలానికి పడుతున్నాయా? పంటను పండించే వర్షాలు పడుతున్నాయా? పంటను పాడు చేసే వర్షాలే పడుతున్నాయి. పాడిపంటల్ని వృద్ధి చేసే వర్షాలు పడటం లేదు. పైగా అంటురోగాలను వ్యాపింప చేసే వానలు కురుస్తున్నాయి.

వానలు కురుస్తున్నాయి. కాని వాటి వల్ల క్షేమం కలగక పోగా క్షామం ఏర్పడుతూ ఉంది. వానలు పడి మల్లెలు పూస్తున్నాయి. కాని మల్లెలలో సువాసన ఏది? మామిడికాయలు కాస్తున్నాయి. కాని ఫలాలలో మాధుర్య మేది? యజ్ఞఫలాలు కానివి రుచిగా ఉండవు. శుచిగా ఉండవు. కనుక యజ్ఞజనిత పర్జన్యాలే పవిత్రమైన ఫలితాల నిస్తాయి. వర్షం కోసం ఆకాశాన్ని చూచే సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుందే గాని, సముద్రం వైపు చూచే సమాజం సుఖశాంతులకు నోచుకోదు. మరి, వర్షానికి కారణమైన యజ్ఞానికి కారణ మేమిటి? కర్మయే యజ్ఞానికి కారణము.

చేస్తేనే యజ్ఞము

యజ్ఞము కర్మ వల్ల పుడుతుంది (***యజ్ఞః కర్మ సముద్భవః***). యజ్ఞానికి కారణం కర్మే గాని కర్మ చేయక పోవడం కాదు. యజ్ఞం కార్యం కనుక, అకార్యం నుండి కార్యం ఉత్పన్నం అయ్యే అవకాశం లేనందున యజ్ఞమునకు కర్మ కారణ మవుతూ ఉంది.

ఇక్కడ అర్థవంతమైన సంశయం ఒకటి తలెత్తుతుంది. యజ్ఞము కర్మ వల్ల పుడుతుంది అంటున్నాడ గీతాచార్యుడు. మరి, యజ్ఞ మేమిటి? యజ్ఞం కర్మ కాదా? యజ్ఞము కర్మ అయినపుడు, యజ్ఞము కర్మ వ జనిస్తుంది అంటే, కర్మ కర్మ వల్ల పుడుతుంది అని చెప్పినట్లు అవుతుంది కదా! ఇది సమంజసమా? కా కాదు. కర్మ కర్మ వల్ల జనిస్తుంది అని చెప్పడం అయుక్తం. అసంగతం. కనుక 'అన్నము', 'పర్జన్యము' అ పదాలను లక్షణాన్ని ఆశ్రయించి ఎలా అర్థం చేసుకున్నామో, 'యజ్ఞం' విషయంలో కూడా లక్షణాశ్రయ అనివార్యం అవుతూ ఉంది.

'యజ్ఞము' అంటే 'అపూర్వము' అని అర్థము (***యజ్ఞః అపూర్వమ్***). అపూర్వం అనే కర్మ వల్ల యజ్ఞ పుడుతుంది అని అర్థము. అంటే, ఋత్విక్కులు, యజమాని మొదలైన వారు నిర్వహించే మంత్ర, తంత్ర హోమాది వైదిక కర్మ వల్ల యజ్ఞము జరుగుతుంది అని అర్థము.

వేద ప్రమాణము

కర్మ బ్రహ్మము నుండి పుడుతుంది. అంటే, ఏ కర్మకు వేదం కారణమో, అట్టి వేదమే ఇక్కడ బ్రహ శబ్దంలో చెప్ప బడింది (***బ్రహ్మ వేదః***). కనుక యజ్ఞకర్మ బ్రహ్మోద్భవము, అంటే వేదోద్భవము అని అర్థమ ఋత్విక్కులు మరియు యజమానుల యొక్క వ్యాపార రూపంగా గోచరించే యజ్ఞకర్మ వేదమునే ప్రమాణం

కలిగి ఉంది కనుక, ఇక్కడ వేదమే బ్రహ్మ శబ్దంతో చెప్పబడింది (***యజమానాది వ్యాపార రూపం కర్మ బ్రహ్మ వేదః, కర్మ తస్మాత్ ప్రవృత్తమ్*** - శ్రీధరవ్యాఖ్య). కర్మ స్వభావాన్ని తెలుపుతుంది కనుక 'బ్రహ్మము' అంటే 'వేదము' అని అర్థం చేసుకోవాలి. మరి బ్రహ్మము అనే వేదం ఎక్కడ నుండి ఆవిర్భవించింది?

వేదపురుషుని నుండే వేదజ్ఞానము

వేదము బ్రహ్మము నుండి పుడుతుంది. వేదము బ్రహ్మమే. వేద నారాయణుడూ బ్రహ్మమే. అంటే 'బ్రహ్మము' అని చెప్పబడిన వేదము 'అక్షరము' అని చెప్పబడే బ్రహ్మము నుండి పుట్టింది అని భావము (***బ్రహ్మ వేదాఖ్యం అక్షర సముద్భవమ్***). అక్షరమైన బ్రహ్మమే వేదానికి కారణము. సమస్త విషయాలను ప్రకాశింప చేస్తూ సర్వజ్ఞమై శోభిస్తున్న వేదానికి బ్రహ్మమే కారణం (***మహతః ఋగ్వేదాదేః శాస్త్రస్య, సర్వజ్ఞ కల్పస్య యోనిః కారణం బ్రహ్మ***).

అక్షర రూపుడు, జగత్కారణమైన బ్రహ్మము నుండే నిశ్వాస రూపమున వేదము ఆవిర్భవించింది కనుక వేదమునకు బ్రహ్మమే కారణమని వేదమే చెబుతూ ఉంది (***అస్య మహతో భూతస్య నిశ్వసిత మేత దృదృగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వాంగిరసః*** - బృహదారణ్యకోపనిషత్తు).

బ్రహ్మము అని చెప్పబడిన వేదము అక్షర రూపుడైన పరబ్రహ్మము నుండి నిశ్వాస లాగా బహిర్గత మైంది. అంటే అవలీలగా, అనాయాసంగా, అప్రయత్నంగా వెలువడిందని భావము.

శ్వాసక్రియలో గాలిని వదలడం అంటే, లోపల ఉన్న గాలిని విడిచి పెట్టడ మనే గాని, గాలిని సృష్టించి విడిచి పెట్టడం అని అర్థం కాదు. సర్వజ్ఞమైన వేదమును నిశ్వసించడం అంటే, బ్రహ్మము కన్నా వేరు గాని జ్ఞానమును ప్రకాశింప చేయడమనే గాని, జ్ఞానమును సృష్టించి బహిర్గతం చేయడమని భావం కాదు.

వేదము అంటే జ్ఞానము. జ్ఞానాన్ని సృష్టించడం సాధ్యం కాదు కనుక, వేదం కూడా సృష్టింప బడింది కాదు. అది అపౌరుషేయము. అంటే, ఏ పురుషుని యొక్క కార్యము కాదని అర్థము.

వేదము జ్ఞాన స్వరూపమే అయినా, అది సృష్టింప బడిందే గాని అపౌరుషేయము కాదు అని కొందరి అభిప్రాయము. అలాంటి వారే వేదానికి కాలాన్ని నిర్ణయిస్తారు. అంటే, వేదము ఒక కాలంలో ఆవిర్భవించినట్లు చెబుతారు. ఇదంతా సంప్రదాయం అర్థం గాని వ్యక్తులు సాగించే వింత సంభాషణము.

జ్ఞానము ఒక కాలంలో పుట్టింది అంటే, అది పుట్టక ముందు జ్ఞానం లేదనే కదా అర్థం? పుట్టడం అంటేనే లేనిది కలగడం అని అర్థం. అంతవరకు లేని జ్ఞానం క్రొత్తగా పుట్టింది అంటే, జ్ఞానం పుట్టక ముందు ఏముంది? జ్ఞానము యొక్క అభావం ఉంది. అదేమిటి? అజ్ఞానము. అంటే, అజ్ఞానం నుండి జ్ఞానం కలిగింది అని అర్థమా? అలాగే అంగీకరిద్దాం. మరి అజ్ఞానం నుండి జ్ఞానం కలిగింది అంటే, కార్యమైన జ్ఞానానికి అజ్ఞానం కారణం అని చెప్పినట్లు అయింది కదా! అదే వాస్తవ మైతే, జ్ఞానం కలిగిన తరువాత అజ్ఞానం ఉందా, లేదా?

జ్ఞానం కలిగిన తరువాత అజ్ఞానం ఉండదు. ఎలా ఉంటుంది? వెలుగు వచ్చిన తరువాత చీకటి ఎలా ఉంటుంది? అదే వాస్తవ మైతే, మరి కార్యమైన జ్ఞానానికి అజ్ఞానం కారణమై నపుడు, కార్యంలో ఉన్నది కారణమే కనుక, కారణమైన అజ్ఞానం పోతే కార్యమైన జ్ఞానం ఎలా ఉంటుంది? అజ్ఞానమే పోకుండా ఉన్నప్పుడు, ఇక జ్ఞాన మెక్కడుంది? చీకటి ఉంది అంటే, వెలుగు లేదు అనే కదా అర్థం? వెలుగు, చీకటి రెండూ ఉన్నాయి అంటారా? అలాంటప్పుడు చీకటిని అర్థం చేసుకోవడం కష్టం కాదు గాని, వెలుగు విషయమే ప్రశ్నార్థక మవుతుంది. చీకటితో కలిసి కాపురం చేసే వెలుగు కూడా ఒక వెలుగేనా? చీకటిని పోగొట్ట లేనిది వెలుగు ఎలా అవుతుంది?

కనుక జ్ఞానము ఉన్నదే. జ్ఞానం విషయంలో ఉన్న దానిని కనుగొనడమే గాని లేని దానిని కల్పించడం కుదరదు. బ్రహ్మము, బ్రహ్మము యొక్క జ్ఞానము వేరు కావు. కనుక అక్షర పరబ్రహ్మము బ్రహ్మ మని చెప్పబడే వేదానికి కారణమైంది.

బ్రహ్మము, బ్రహ్మజ్ఞానము వేరు కావు కనుక, అక్షర పరబ్రహ్మము, సర్వజ్ఞమైన వేదము వేరు కావు. బ్రహ్మజ్ఞానము కలిగితే బ్రహ్మము తెలిసినట్లే. బ్రహ్మజ్ఞానము వేదము నందే ఉండటం చేత బ్రహ్మము వేదంలో ప్రతిష్ఠితమై ఉన్నాడు. వేదము బ్రహ్మరూపము కనుక, వేదరూపమైన కర్మలో కూడా బ్రహ్మమే ఉన్నాడు. వేద ప్రతిపాదిత కర్మ నుండి యజ్ఞము ఆవిర్భవించింది కనుక యజ్ఞములో కూడా బ్రహ్మమే ఉన్నాడు. యజ్ఞ రూపుడుగా ఉన్నాడు ***(యజ్ఞోవై విష్ణుః)***. యజ్ఞము వల్లనే వర్షం ఉత్పన్న మైంది కనుక వర్షరూపంలో కూడా తానే ఉన్నాడు.

తపామ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ

'అర్జునా! నేను తపింప చేస్తున్నాను. వర్షాన్ని ఆకాశంలో నిలిపేది నేనే. వర్షాన్ని కురిపించేది నేనే' అని రాజవిద్యా రాజగుహ్య యోగంలో భగవానుడే స్వయంగా చెబుతాడు.

వర్షం వల్ల అన్నం ఏర్పడుతూ ఉంది కనుక, అన్నరూపంలో కూడా తానే ఉన్నాడు ***(అన్నం బ్రహ్మేతి వ్యజానాత్*** - తైత్తిరీయ శ్రుతి). అన్నం వల్లనే ప్రాణులు ఉత్పన్న మౌతున్నాయి కనుక, ప్రాణులలో ఉన్నది కూడా తానే. ఈ విధంగా బ్రహ్మము సర్వవ్యాపకమై, సర్వత్ర ప్రతిష్ఠితమై ఉన్నాడు ***(తస్మాత్ సర్వగతం బ్రహ్మ)***. కనుక యజ్ఞము నందు ఉన్నది ఎవరో కాదు. యజ్ఞము నందు బ్రహ్మమే ప్రతిష్ఠితమై ఉన్నాడు ***(నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్)***.

బ్రహ్మము సర్వగత మని నిర్ధారణ చేస్తూ, మళ్ళీ యజ్ఞము నందే ప్రతిష్ఠిత మని చెప్పడం వైరుధ్యం కాదా? కానే కాదు. యజ్ఞము బ్రహ్మము కన్నా వేరై నపుడే అది విరుద్ధ మవుతుంది. సర్వగత మైన బ్రహ్మమునకు అన్యంగా ఏదీ లేదు. కాకపోతే, ప్రస్తుతం యజ్ఞచక్ర వైభవము చర్చింప బడుతూ ఉన్నందున బ్రహ్మము యజ్ఞము నందు సుప్రతిష్ఠితం అని చెప్పడం జరిగింది ***(సర్వగత మపి సత్ నిత్యం, సదా యజ్ఞవిధి ప్రధానత్వాత్ యజ్ఞే ప్రతిష్ఠితమ్)***.

కనుక, ఈ కర్మచక్రమును, యజ్ఞ చక్రమును విస్మరించి జీవనం సాగించడం సాధ్యం కాదు. అలా విస్మరిస్తే, ఫలితాలు కూడా విషమిస్తాయి. ఎలాగో వినండి.

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయ తీహ యః ।
అఘాయు రిన్ద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16

ఏవం-ప్రవర్తితం-చక్రం-న-అనువర్తయతి-ఇహ-యః
అఘాయుః-ఇంద్రియారామః-మోఘం-పార్థ-సః-జీవతి

పార్థ	= అర్జునా!	న అనువర్తయతి	= అనుసరించి జీవించడో
ఏవం	= ఈ విధముగా	సః	= వాడు
ప్రవర్తితం	= త్రిప్ప బడుచున్న	అఘాయుః	= పాపమే ఆయువుగా గలవాడై
చక్రం	= సృష్టి చక్రమును	ఇంద్రియారామః	= ఇంద్రియ లోలుడై
ఇహ	= ఈ లోకము నందు	మోఘం	= వ్యర్థముగా
యః	= ఎవడు	జీవతి	= జీవించు చున్నాడు

అర్జునా! ఆ విధంగా తిరుగుతున్న కర్మ చక్రాన్ని అనుసరించి ప్రవర్తించని వాడు పాప జీవనం గడుపు తున్నాడు. ఇంద్రియ లోలుడై వ్యర్థ జీవిగా బ్రతుకు తున్నాడు.

వ్యాఖ్య

ధర్మచక్రము

విశ్వచక్రం విశిష్టంగా తిరుగుతూ ఉంది. ధర్మమునే ప్రధానంగా చేసుకొని తిరుగుతూ ఉంది కనుక ఇది ధర్మచక్రము. ఈ చక్రము త్యాగ నిరతితో చరిస్తూ ఉంది కనుక ఇది యజ్ఞచక్రము. సమయాలను, నియమాలను పాటిస్తూ పరిభ్రమిస్తూ ఉంది కనుక ఇది కాలచక్రము. ఈశ్వరాజ్ఞ చేత ఈ జగచ్చక్రము తిరుగుతూ ఉంది ***(ఏవం ఈశ్వరేణ జగచ్చక్రం ప్రవర్తితం)***.

ఈ సృష్టి చక్రమును కదిపిన వాడు పరమేశ్వరుడు. నడిపేవాడు కూడా తానే. చక్రం ఆగకుండా తిరుగుతూ ఉంది. చక్రము అంటే కేవలం బండిచక్ర మని కాదు. చక్రము వలె తిరిగేది అని అర్థము ***(చక్రవత్ భ్రామ్యతి ఇతి)***.

ప్రతిక్షణం ఈ చక్రభ్రమణంలో క్రొత్తవి ఎన్నో, ఎన్నెన్నో గోచరిస్తూ ఉంటాయి. ఋతువులు తిరిగి పోతూ ఉంటాయి. కాలాలు కదలిపోతూ ఉంటాయి. మొక్కలు పుష్పిస్తూ ఉంటాయి. చెట్లు చిగురిస్తూ ఉంటాయి. కాయలు కాస్తూ ఉంటాయి. ఆకులు రాలుతూ ఉంటాయి. ఒక వైపు ప్రసూతి గృహాలు విరివిగా పంపుతూ ఉంటే, మరో వైపు శ్మశాన వాటికలు విచ్చలవిడిగా పట్టుకు పోతూ ఉంటాయి.

చక్రంలో ఏ ఆకు ఎక్కడ ఉండాలో అక్కడే ఉంది. ఏ అంగము ఏ కార్యం చెయ్యాలో అదే చేస్తూ ఉంది. ఇది చిన్నది - అది పెద్దది అనే తారతమ్యం లేదు. ఏ చిన్నది దారి తప్పినా చాలా పెద్దది ఆగిపోతుంది. అన్నీ ఒకే చక్రంలో ఇమిడి ఉన్నాయి. కనుక, దేని ప్రాధాన్యత దానికే ఉంది.

పనసతొనలు తియ్యగా ఉంటాయి. కాకరకాయలు చేదుగా ఉంటాయి. అవి అలా ఉండటంలో ఆశ్చర్యం లేదు. అలా ఉండకుండా మరో విధంగా ఉన్నప్పుడు ఆలోచించ వలసి వస్తుంది. ఏది ఎలా ఉండాలో అలా ఉండటం నియతి. నియతికి భిన్నంగా చరించడం దోషం. నియతి రూపంలో ఎవరో లేరు. నియంతయే ఉన్నాడు. ధర్మమే నియతి. ధర్మరూపంలో ఉన్నది దైవమే. ధర్మచక్రాన్ని త్రిప్పేది దైవమే. అందుకే ఆయన చక్రధారి. చక్రపాణి. చక్రమును చేతి యందు కలవాడు చక్రపాణి ***(చక్రం పాణౌ యస్య సః)***. ధర్మచక్ర రూపంలో ఉన్న చక్రపాణి త్రిప్పే విశ్వచక్రంలో, విడ్డూరంగా ప్రవర్తించడం అంటే దైవానికి ప్రతికూలంగా చరించడమే అని అర్థము. అధర్మంగా చరించడమే అని భావం.

నీవు, నేను, మనం అందరమూ ఈ కాలచక్రంలో అంగాలై ఉన్నాము. నియతితో సాగే ఈ యజ్ఞచక్రంలో మన కర్తవ్యాన్ని మనం నిర్వహిస్తూ పోవాలి. విశ్వం ఎంత గొప్పదైనా కావచ్చు. విశ్వమంత గొప్పగా వ్యక్తి కనిపించక పోవచ్చు. కాని, వ్యక్తి విశ్వంలో ఉండ దగిన వాడే. ఉండదగిన వాడు కాకపోతే ఎందుకు ఉంటాడు? ఉన్నాడు అంటే, చేయ వలసింది ఉంది కనుకనే ఉన్నాడు. చేయ వలసింది ఉండి నపుడు చేయకుండా ఉండటం అధర్మం అవుతుంది.

దారి తప్పితే దగా పడినట్లే

చేయవలసింది చేయనివాడు ఏం చేస్తాడు? చేయకూడనిది చేస్తాడు. అదే అధర్మం. అదే పాపం. అది ఎంతవరకు చేస్తాడు? అదే చేయడానికి అలవాటు పడ్డాడు కనుక బ్రతికి ఉన్నంత వరకు పాపమే చేస్తాడు.

అంటే జీవనమే పాపభూయిష్ట మైందని అర్థము. ఆయుర్దాయ మంతా పాపాచరణకే సరిపోతుంది. అందుకనే, అట్టి వానిని **అఘాయుః** అంటున్నాడు గీతాచార్యుడు.

'అఘము' అంటే పాపము. 'ఆయుః' అంటే జీవనము. అఘాయువు అంటే, పాపమే ఆయువుగా గల వాడు, లేదా పాపజీవనుడు అని అర్థము. ధర్మచక్రాన్ని అనుసరించని వాడే పాపజీవనుడు.

'అఘాయువు' పాపజీవనుడు కనుక ధర్మచక్రంలో ఇమడడు. మరి ఎక్కడ చరిస్తాడు? ఇంద్రియ సుడిగుండంలో పడి పరిభ్రమిస్తూ ఉంటాడు. అందుకనే అఘాయువును ఇంద్రియారాముడు అని అంటున్నాడు భగవానుడు.

ఇంద్రియాలతో ఇంద్రియ విషయాల యందు రమించేవాడు, క్రీడించే వాడు ఇంద్రియారాముడు ***(ఇంద్రియైః ఆరామః ఆక్రీడా విషయేషు యస్య సః ఇంద్రియారామః).***

అట్టి వాని జీవితము వృథా అంటున్నాడు వాసుదేవుడు ***(మోఘం వృథా, హే పార్థ సః జీవతి).*** కనుక ఆత్మజ్ఞానం లేనివాడు కర్మాధికారి కనుక కర్మలు యజ్ఞభావనతో చేస్తూనే ఉండాలి అనేది ప్రస్తుత ప్రసంగ సారాంశం ***(తస్మాత్ అధికృతేన కర్తవ్య మేవ కర్మ ఇతి ప్రకరణార్థః).***

మూడవ అధ్యాయమైన ఈ కర్మయోగమును ప్రారంభిస్తూ, సాంఖ్యులకు, అనగా సన్యాసులకు జ్ఞాన యోగమును, యోగులకు, అనగా సన్యాసులు కాని వారికి, లేదా గృహస్థులకు కర్మయోగమును విస్పష్టంగా తెలియ చేయడం జరిగింది.

తదేకం వద నిశ్చిత్య అంటూ ఈ రెండిటిలో ఏదో ఒక దానిని నిశ్చయించి చెప్ప వలసిందిగా అర్జునుడు రెండవ శ్లోకంలో అభ్యర్థించాడు. దానికి సమాధానంగా ***న కర్మణా మనారంభాత్*** అంటూ నాల్గవ శ్లోకంలో కర్మయోగాన్ని ప్రారంభించి, **నియతం కురు కర్మత్వం** అంటూ ఎనిమిదవ శ్లోకంలో శాస్త్ర విహిత కర్మలను ఆచరించ మని ఉపదేశించడం జరిగింది. ఆ తరువాత, ***యజ్ఞార్థాత్ కర్మణోన్యత్ర*** అనే తొమ్మిదవ శ్లోకం నుండి, ఇప్పుడు మనం అధ్యయనం చేస్తున్న ***ఏవం ప్రవర్తితం చక్రం*** అనే పదహారవ శ్లోకం వరకు ఆత్మవేత్తలు కానివారు అవశ్యం కర్మలను ఎందుకు ఆచరించాలో తెలుపుతూ, కర్మలు చేయక పోవడం ఎలా అయుక్తమో, దోషమో కూడా విపులంగా చర్చించడం జరిగింది.

ఆత్మజ్ఞానం లేని కర్మాధికారులు కర్మలను తప్పక అనుష్ఠించాలి అంటున్నాడు కదా! మరి, ఆత్మానందమును అనుభవించు ఆత్మజ్ఞానులు కర్మలను ఆచరించాలా లేదా? అనే సంశయానికి సమాధానం చెబుతున్నాడు.

యస్త్వాత్మరతి రేవ స్యా దాత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సంతుష్ట స్తస్య కార్యం న విద్యతే ॥ **17**

యః-తు-ఆత్మరతిః-ఏవ-స్యాత్-ఆత్మతృప్తః-చ-మానవః
ఆత్మని-ఏవ-చ-సంతుష్టః-తస్య-కార్యం-న-విద్యతే

యః మానవః తు	= ఏ మానవుడైతే			
ఆత్మరతిః ఏవ	= ఆత్మ యందే ప్రీతి గలవాడై	స్యాత్	=	ఉంటాడో
ఆత్మతృప్తః చ	= ఆత్మ చేతనే తృప్తిని పొందువాడై	తస్య	=	అట్టి వానికి
ఆత్మని ఏవ	= ఆత్మ యందే	కార్యం	=	చేయ దగింది
సంతుష్టః చ	= సంతోష పడువాడై	న విద్యతే	=	ఉండదు

ఆత్మ యందే రమించువాడు, ఆత్మ యందే తృప్తి పొందువాడు, ఆత్మ యందే సంతసించు వాడు చేయవలసిన కార్య మేదీ లేదు.

వ్యాఖ్య

ఇంద్రియ విషయాల యందు రమిస్తూ బ్రతుకును వృథా చేసుకొనే ఇంద్రియారాముణ్ణి గూర్చి గడచిన శ్లోకంలో చర్చించిన భగవంతుడు, సదా ఆత్మ యందే రమిస్తూ, ఆత్మ యందే తృప్తి చెందుతూ, ఆత్మ యందే ఆనందిస్తున్న ఆత్మారాముణ్ణి గూర్చి ఇప్పుడు చెబుతున్నాడు. విషయం వేరు పడిందని చెప్పడానికి 'తు' శబ్దాన్ని ప్రయోగించాడు.

సూర్యుడు ఉదయించాడు అంటే వెలుగులను విరజిమ్ముతాడు. సూర్యుని ప్రకాశాన్ని ఎవ్వరూ ఆపలేరు. తాను కూడా ఆపుకోలేడు. ప్రకాశమే తన స్వరూపము. స్వరూపాన్ని దాచుకోవడం సాధ్యం కాదు.

మల్లెలు విరబూసాయి అంటే, పరిమళాలను వెదజల్లుతాయి. వానలు ఎక్కడైనా, ఎప్పుడైనా చల్లగానే కురుస్తాయి. ఆత్మజ్ఞాని సర్వత్ర, సదా ఆత్మానందం లోనే ఉంటాడు. ద్వంద్వాలను అధిగమించిన ఆ మహాత్ముని చిత్తము ఆత్మ యందే రమిస్తూ ఉంటుంది. అతని అనంతానందము యొక్క రహస్యం అదే ***(యస్య బ్రహ్మణి రమతే చిత్తం నందతి నందతి నందత్యేవ*** - భజగోవిందం).

ఆత్మరతుడు

ఆత్మజ్ఞాని సదా ఆత్మ యందే రమిస్తూ ఉంటాడు. అంటే, ఆత్మ కన్నా అన్యమైన విషయాల యందు రమించడు అని నిశ్చితార్థం ***(ఆత్మరతిః ఆత్మని ఏవ రతిః న విషయేషు).***

సుఖపడాలి అనుకొనే వారే అందరూ. సుఖ మెక్కడుందో తెలిసిన వారు ఎందరు? అందుకనే, సుఖ పడటానికి కొందరు వస్తువుల్ని కోరుకుంటారు. కొందరు వ్యక్తుల్ని వాంఛిస్తారు. కొందరు కొన్ని ప్రత్యేక సన్నివేశాలను తయారు చేసుకుంటూ ఉంటారు. వాటి వల్ల కూడా సుఖం కలగవచ్చు. కాని, అట్టి సుఖం తాత్కాలికం. అనిత్యం. నిత్యసుఖ మనేది పరిమిత విషయాలలో లభించదు. అది మానవుని స్వభావం. స్వరూపం. తానే సుఖం. అది తెలిసిన వాడు తన సుఖానికి మరొక దానిని కోరుకోడు. ఏదో అనుకూలంగా ఉంటేనే తనకు సుఖం అనే అవివేకం నుండి ఆత్మజ్ఞాని ఎప్పుడో విడి పోయాడు. తన సుఖానికి తానే కారణం అని తెలిసిన వాడు ఆత్మజ్ఞాన నిష్ఠుడు. తాను తనతో ఉంటే చాలు అనే సత్యాన్ని దృఢంగా ఎరిగిన వాడు. ఆత్మ సదా సుఖ స్వరూపము అనే జ్ఞానం స్థిరంగా కలవాడు ***(యస్య స్థితా భవేత్ ప్రజ్ఞా).*** ఆత్మ నిత్యము కనుక ఆత్మసుఖము కూడా అఖండము. ఆత్మ తానే అనే జ్ఞానము గల ఆత్మవేత్త యొక్క సుఖము కూడా అఖండమే ***(యస్య ఆనందః నిరంతరః).*** ప్రపంచంలో ఏదీ తన సుఖానికి అనుకూలంగా ఉండ నవసరం లేదు. కనుక, ఆత్మసుఖంలో రమించే జ్ఞాననిష్ఠునికి ప్రపంచము విస్మృతప్రాయము ***(ప్రపంచో విస్మృతప్రాయః).*** ఇక, తాను తనకు అనుకూలంగా ఉండటాన్ని కాదనే వాళ్ళు ఎవరున్నారు? అందుకే అతడు సదా ఆత్మరతుడు.

ఆత్మతృప్తుడు

ఆత్మజ్ఞాన నిష్ఠుడు ఆత్మ యందే తృప్తి చెంది ఉంటాడు. అంటే, ఆత్మ కన్నా అన్యములైన విషయాల యందు తృప్తి చెందడు అనేది పరమార్థం ***(ఆత్మతృప్తః ఆత్మని ఏవ తృప్తః న అన్నరసాదినా).***

తృప్తః భవిష్యామి - నేను తృప్తి పడాలి అనుకొనే వారే అందరూ. తృప్తి చెందిన వారు ఈ ప్రపంచంలో ఎందరు? అందరూ తృప్తి చెందే వారే. మళ్ళీ అసంతృప్తితో అలమటించే వారే. ఆకలి తీరని వారెవ రున్నారు?

అలా చూచి నపుడు, ఆకలి తీరినవారు మాత్రం ఎవరున్నారు? అనుభవించి నపుడు తృప్తితో 'చాలు' అనుకుంటారు. ఆ తరువాత ఎంతో సేపు పట్టదు 'చాలదు' అనే అసంతృప్తిని వ్యక్తం చేయడానికి. తృప్తి అనేది మానవునికి కుందేటి కొమ్ము లాంటిది. కాని ఆత్మజ్ఞాని అంతటా 'అలం' బుద్ధిని సాధించినవాడు. 'అలం' అంటే చాలు అని అర్థం. అందుకే అతడు నిత్యతృప్తుడు. తన తృప్తికి మరొక దానిపై ఆధార పడేవాడు కాడు కనుక నిరాశ్రయుడు. ఆత్మకు మించినది మరొకటి లేదని ఎరిగిన వాడు (*న దేవః స్వాత్మనః పరః* - తన ఆత్మకు మించిన దేవుడు లేడు - ఉపనిషత్తు). అందుచేత ఆత్మ తృప్తికి మించిన తృప్తి, లేదా సుఖము మరొకటి ఉండదని క్షుణ్ణంగా తెలిసిన వాడు (*న హి ఆత్మ తృప్తేః పరం సుఖం* - యోగశిఖోపనిషత్తు).

ఆత్మ సంతుష్టుడు

ఆత్మజ్ఞాని ఆత్మ యందే సంతుష్టుడు. అంటే, ఆత్మ కన్నా వేరైన విషయాల యందు సంతోషించాలనే వాంఛ లేనివాడు (***ఆత్మని ఏవ సంతుష్టః సంతోషః హి బాహ్యార్థ లాభే సర్వస్య భవతి, తమ్ అనపేక్ష్య ఆత్మని ఏవ చ సంతుష్టః***).

విషయాలలో ఆనందించాలి అనే అభిలాష లేనివాడు. సంతోష మనేది కేవలం తనకు సంబంధించిన విషయ మని, ఆత్మజ్ఞాన జనిత ఫలమని పూర్ణంగా తెలిసిన వాడు. అందరూ ప్రపంచంలో ఆనందిస్తూ ఉంటే, వారందరికీ విలక్షణంగా ఆత్మవిదుడు తనలో తాను ఆనందిస్తూ ఉంటాడు. ఇతరుల సంతోషానికి నిమిత్తాలు ఉన్నాయి. తనది నిర్నిమిత్తానందము. ఏదో లభిస్తే సంతోషము అనే దురవగాహన నుండి విడిపడి తనకు తాను దూరం కాకుండా ఉంటేనే సంతోషము అనే పరమార్థ జ్ఞానం కలిగినవాడు. నదులన్నీ సాగర రూపాన్ని దాల్చినట్లు, ప్రపంచం లోని సమస్తమైన సంతోషాలు ఏ ఆనందసాగర రూపమై ఉన్నాయో, ఆ సుఖ సాగరము తానే అనే జ్ఞానము కలవాడు (***ఆనందాబ్ధిః యత్పరః సోఽహమస్మి*** - మైత్రేయోపనిషత్తు). అలాంటి మహాత్ముడు ఏమి చెయ్యాలి? దేని కోసం చెయ్యాలి?

కిం కర్తవ్యం?

అసంతృప్తితో ఉండేవారు దానిని పోగొట్టు కొనేందుకు ఏదేదో చేస్తూ ఉంటారు. ఏవేవో పొందాలని, తద్వారా తృప్తి చెందాలని ఉబలాట పడుతూ ఉంటారు. ఏమేమి చేసి ఏవేవి పొందాలో అవన్నీ ఆత్మవిదుడు పొందే ఉన్నాడు కనుక ఆయన చేయ వలసింది ఏమీ లేదు. సర్వఫలమును పొందిన వాడై ఉన్నాడు కనుక చేయవలసిన వన్నీ చేసినవాడే అయ్యాడు (***కృత్స్న కర్మకృత్***).

ఆత్మే తానని తెలిసిన వాడు ఆత్మజ్ఞాన నిష్ఠుడు. ఆత్మ పూర్ణ స్వరూపము కనుక అది అసంగము. ఏకమైన ఆత్మకు దేనితో సంగత్వం ఉంటుంది? సంగత్వం లేనపుడు కర్మ ఎక్కడుంది? ఆత్మలో కర్మ లేనపుడు ఆత్మ ఎలా ఉంది? కర్మ చేయనిదిగా ఉంది. అంటే నిష్క్రియత్వంతో ఉంది. అకర్తగా ఉంది. ఆత్మ అకర్త అని గ్రహించి నపుడు, తానే ఆత్మ అని తెలుసు కొనిన ఆత్మవిదుడు ఎలా ఉంటాడు? అకర్తగా ఉంటాడు. పొంద వలసింది ఉంటేనే చేయ దగింది ఉంటుంది. పొంద వలసింది లేనపుడు చేయ వలసింది మాత్రం ఏముంటుంది? ఇలాంటి జ్ఞానము కల ఆత్మవిదునికి చేయవలసింది ఏదీ లేదు అని అర్థం (***యః ఈదృశః ఆత్మవిత్ తస్య కార్యం కరణీయం న విద్యతే, నాస్తి ఇత్యర్థః***).

ఆత్మజ్ఞాన నిష్ఠుడు కర్మలు చెయ్యవచ్చు. చెయ్యకుండా కూర్చోవచ్చు. ఎలా ఉన్నా తాను అకర్తే. ఆత్మజ్ఞానము కర్తను అదృశ్యం చేసింది. కనుక, ఆత్మవిదుడు కర్మను చేసినా తాను కర్త అనే భావం లేకుండా ఉంటాడు. కర్మల నుండి నేను ఎప్పుడు విడిపడతాను? అని ఆత్మజ్ఞాని పలకడు. సర్వ కర్మల నుండి విడిపడి

ఉన్న ఆత్మనే నేను అనే జ్ఞానంతో ఉంటాడు. ఇక దేహం అంటారా? ఉంటుంది. తాను దేహమనే భావన ఆత్మనిష్ఠునికి ఉండదు కనుక ప్రారబ్ధ ఫలంగా కదులుతున్న దేహం ఆత్మజ్ఞానిని నీడ లాగా వెంబడిస్తూ ఉంటుంది (***ఛాయావత్ అనువర్తినీ*** - వివేక చూడామణి).

కర్మలు చేసి ఆత్మజ్ఞాని పొందేది ఉండదు. కర్మలు చేయకుండా పోగొట్టుకొనేదీ ఉండదు. గుణ దోషాలకు అతీతుడైన జ్ఞాని నిరాశ్రయుడు. ఈ సత్యాన్నే ప్రవచిస్తున్నాడు.

నైవ తస్య కృతే నార్థో నాకృతే నేహ కశ్చన । 18
న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థవ్యపాశ్రయః ॥

న-ఏవ-తస్య-కృతేన-అర్థః-న-అకృతేన-ఇహ-కశ్చన
న-చ-అస్య-సర్వభూతేషు-కశ్చిత్-అర్థవ్యపాశ్రయః

తస్య	= అతనికి	న	=లేదు
ఇహ	= ఈ లోకము నందు	చ	=మరియు
కృతేన	= కర్మ చేయడం చేత	అస్య	=ఇతనికి
అర్థః	= ప్రయోజనము	సర్వభూతేషు	=సర్వభూతముల యందును
న ఏవ	= లేనే లేదు	అర్థవ్యపాశ్రయః	=లాభాన్ని ఆశించి ఆశ్రయించడం
అకృతే న	= కర్మము చేయక పోవుట చేత	కశ్చిత్	=ఏది కూడా
కశ్చన	= ఏమియును	న	=లేదు

అట్టి ఆత్మజ్ఞానికి ఈ లోకము నందు కర్మలు చేయుట వలన ప్రయోజనము ఏమీ ఉండదు. కర్మ చేయక పోయినా ఏమీ ఉండదు. అతనికి సమస్త ప్రాణుల యందు ఫలం కొరకు సంబంధము ఏ మాత్రము ఉండదు.

వ్యాఖ్య

ప్రయోజనాన్ని ఆశించ కుండా కర్మ చేయడం జరగదు. కర్మ జరిగింది అంటే ఫలం ఉండి తీరాలి. ఇంతవరకు మనం అర్థం చేసుకున్న దానిని బట్టి కర్మఫలము నందు ఆసక్తి కలిగి కర్మ చేసేవాడు కర్మి. కర్మ ఫలాసక్తి లేకుండా చిత్తశుద్ధి కొరకు కర్మలు ఆచరించే వాడు కర్మయోగి. అసలు కర్మలకే అంటక, నైష్కర్మ్య స్థితిలో ఉండే మహితాత్ముడు జ్ఞాని. అతని వైభవాన్నే ప్రస్తుతం మనం చూస్తున్నాము.

ఉండి లాభం లేదు

కర్మ యొక్క ఫలం రెండు విధాలుగా మనకు అర్థమైంది. మొదటిది బాహ్య ప్రపంచంలో లభించే కర్మఫలం. రెండవది బాహ్యంలో కాకుండా తన లోనే, అంటే తన మనస్సు లోనే ప్రాప్తించే అంతఃకరణ శుద్ధి. ఈ రెండు ఫలాలను దృష్టిలో ఉంచుకొనే కర్మాచరణం చేయాలి. జ్ఞాని ఈ రెండు ఫలాలకు అతీతుడు. అతడు ఆత్మ యందే ఆనందాన్ని పొందుతూ ఉన్నాడు కనుక అతనికి (***తస్య పరమాత్మ రతేః***) కర్మ చేసి పొంద వలసిన ప్రయోజనము ఏదీ కనిపించడం లేదు (***కృతేన కర్మణా ప్రయోజనం నాస్తి***).

కర్మ జన్యమైన సుఖము అనిత్యమని అతనికి తెలుసు. నిరంతరం బ్రహ్మానంద రసానుభూతిలో అఖండంగా అలరారుతున్న ఆత్మవిదుడు, తాను పొందే ఉన్న ఆత్మజ్ఞానానికి అవసరమైన అంతఃకరణ శుద్ధి కొరకు కర్మలు ఆచరించే పని లేదు.

ఆత్మ అకర్త కనుక కర్మలో కూడా జ్ఞాని అకర్మనే చూస్తాడు. అలాంటి వాడు కర్మ చేసి పొందేది

ఏముంటుంది? కర్మ చేయనంత మాత్రాన పోగొట్టు కొనేది ఏముంటుంది? ఆత్మ అకర్త అనే జ్ఞానం జారి పోయేది కాదు. పారిపోయేది కాదు. జ్ఞాని పొంద వలసింది ఏదీ లేనందున అతడు అకర్తే. కర్మ చేయని వాడే. అలాంటి జ్ఞాని నుండి అనాయాసంగా కర్మలు దొర్లితే అవి సూర్యుని ప్రకాశం లాగా, చంద్రుని వెన్నెల లాగా ప్రపంచానికి ఆశీస్సులు అవుతాయి. అంతేగాని, కర్మలలో ఉన్నందున ఆత్మజ్ఞానికి ఏదో ఒరుగుతుంది అని మాత్రం కాదు.

సరే. జ్ఞాని ప్రత్యేకంగా పొంద వలసింది ఏమీ లేదు కనుక కర్మల యొక్క అవసరం అతనికి లేదు అనే అనుకుందాం. మరి, మనం రెండవ అధ్యాయంలో చూసినట్లు, చేయ వలసిన కార్యాన్ని చేయక పోవడం చేత ప్రాప్తించే ప్రత్యవాయ దోషం జ్ఞానికి అంటదా? జ్ఞానికి ఏదీ అంటదు. అందుకే అతడు నిస్సంగుడు.

పోతే నష్టం లేదు

చెయ్య వలసింది చెయ్యక పోతే మనకు నష్టం వాటిల్లుతుంది. దీనినే కర్మ ప్రస్థానంలో ప్రత్యవాయ దోషంగా తెలుసుకున్నాం. జ్ఞాని కర్మలు చేయక పోయినా అతడికి ప్రత్యవాయ దోషం అంటదు.

ఉన్నది ఆత్మ ఒక్కటే. అది ఏకం, అద్వయము అనే జ్ఞానం ఆత్మవిదునికి స్థిరంగా ఉంది. తత్ఫలితంగా ఈ ప్రపంచమంతా అతనికి మిథ్యా స్వరూపమే. **మాయా మాత్ర మిదం ద్వైతమ్** - ఈ ద్వైత ప్రపంచము అంతా మాయే నని అతనికి తెలుసు కనుక, మాయలో కర్మలను ఆచరింపక పోవడం వల్ల కలిగే నష్టం కూడా ఏదీ ఉండదు అని అతనికి తెలుసు.

అప్పు తీసుకున్న వాడు తిరిగి ఇవ్వక పోతే శిక్షార్హుడు. స్వప్నంలో అప్పు తీసుకున్న వాడు మేలుకున్న తరువాత చెల్లించక పోతే శిక్షార్హు డవుతాడా? స్వప్నము లోని కర్మజనిత దోషం జాగ్రదవస్థలో వర్తిస్తుందా? ఇదీ అంతే.

ఆత్మ జ్ఞానామృతమును పానం చేసి తృప్తి చెందిన ఆత్మవిదునికి, కృతకృత్యుడైన జ్ఞానికి ఏ కొద్దిపాటి కర్తవ్యం కూడా లేదు. ఒకవేళ కర్తవ్యము ఉండి తీరాలి అంటే మాత్రం, అలా ఉన్నవాడు ఆత్మజ్ఞాని కానే కాదు అని శాస్త్రం నిర్ధారించింది (**జ్ఞానామృతేన తృప్తస్య కృతకృత్యస్య యోగినః నైవాస్తి కించి త్కర్తవ్య మస్తి చేత్ న స తత్త్వవిత్).**

మరి, అర్జునుడు ఇప్పుడు ఏమి చేయాలి? కర్మను త్యజించాలా? లేక ఆచరించాలా? అదే తరువాత శ్లోకం.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచర న్కర్మ పర మాప్నోతి పూరుషః ॥ 19

తస్మాత్-అసక్తః-సతతం-కార్యం-కర్మ-సమాచర
అసక్తః-హి-ఆచరన్-కర్మ-పరం-ఆప్నోతి-పూరుషః

తస్మాత్	= అందువలన	అసక్తః	= ఆసక్తి లేనివాడై
అసక్తః	= ఫలాసక్తి లేనివాడవై	కర్మ	= కర్మను
సతతం	= ఎల్లప్పుడు	ఆచరన్	= చేయుచున్న
కార్యం	= చేయ దగిన	పూరుషః	= పురుషుడు
కర్మ	= కర్మమును	పరం	= మోక్షమును
సమాచర	= చక్కగా ఆచరించు	ఆప్నోతి హి	= పొందుతాడు గదా!

అందుచేత, నువ్వు ఫలాపేక్ష లేకుండా, చేయదగిన కర్మను చేస్తూ ఉండు. ఫలాపేక్ష లేకుండా కర్మ నాచరించే వాడు మోక్షమును పొందుతున్నాడు.

వ్యాఖ్య

జ్ఞాని నిత్యతృప్తుడు. నిత్యానంద స్వరూపుడు. తన ఆనందానికి తానే కారణమైన వాడు. అలాంటి వాడు తృప్తి చెంద డానికి చేయ వలసింది ఏముంటుంది? అలాగని ఏదీ చేయకుండా కూర్చుంటే మాత్రం అతనికి వచ్చే నష్ట మేముంటుంది? అందుకే జ్ఞాని నిత్యతృప్తుడు. నిరాశ్రయుడు. తాను పొంద వలసిన ప్రయోజనం ప్రత్యేకంగా ఏదీ లేనందున, అతడు ఆశించి చేయ దగిన పని కూడా ఏమీ ఉండదు. ఈ విషయాన్ని పద్దెనిమి దవ శ్లోకంలో చూశాం.

కృష్ణా! అలాంటప్పుడు నేను కూడా జ్ఞానమార్గాన్ని ఆశ్రయించి కర్మలను విడిచి పెడతాను. కర్మలు చేసి సాధించే దేమీ లేదు కనుక, జ్ఞాన నిష్ఠాపరుడు కర్మలను త్యజించినట్లు నేను కూడా త్యజిస్తాను అని అర్జునుడు అభిప్రాయ పడతా డేమో అని ఆశంకించి, అర్జునా! నువ్వు కర్మలను ఆచరించి తీరాలి అని బోధించేందుకు ఈ శ్లోకాన్ని చెబుతున్నాడు గీతాచార్యుడు. జ్ఞాని అయిన వాడు కర్మలను ఆచరించ వచ్చు. లేదా, విరమించ వచ్చు. అలాగని, జ్ఞానము లేనివా రందరూ కర్మ చేసి సాధించే దేమీ లేదు కనుక కర్మల్ని త్యజిస్తాము అని అభిప్రాయ పడితే, అలాంటివాళ్ళు కర్మలను విడిచిన వాళ్ళు అవుతారే గాని, బంధాలను తొలగించుకొన్న వాళ్ళు కాలేరు.

ఆఖ్యాయిక

సంగీత శిక్షణను ఇచ్చే ఒక గురువు గారి వద్ద సంగీతం నేర్చుకోవాలని ఒక విద్యార్థి చేరాడు. గురువు గారి వద్ద కొన్ని సంవత్సరాలు అభ్యాసం చేశాడు. అయినా అతడికి సంగీతం ఏమాత్రం అబ్బ లేదు.

'గురువుగారూ! మీరు గొప్ప సంగీత విద్వాంసులు. మీ వద్ద శిక్షణ పొందితే నేను కూడా గొప్ప విద్వాంసుణ్ణి కావచ్చు నని ఆశపడి మిమ్మల్ని ఆశ్రయించాను. కాలం గడిచి పోయిందే గాని కళ రాలేదు' అన్నాడు దీనంగా.

బద్ధకస్తుడైన ఆ పిల్లవాణ్ణి చూచి గురువు, 'మూడు పూటలా పుష్టిగా తిని కూర్చుంటే సంగీతం వస్తుందా? మాకు అలా రాలేదులే' అన్నాడు విసుగ్గా. ఆ తరువాత, నాలుగు రోజులు గడిచాయి. శిష్యుడు గురువు గారిని మళ్ళీ వచ్చి కలిశాడు.

'గురువుగారూ! నాలుగు రోజులు గడచి పోయాయి. ఈ నాలుగు రోజులూ మీరు చెప్పినట్లే చేశాను. అయినా, ఫలితం శూన్యం. ఇక, నేను చెయ్య దగింది ఏమిటి?' అని అడిగాడు.

గురువు ఆలోచనలో పడ్డాడు. నాలుగు రోజుల క్రితం ప్రత్యేకించి వీడికి నేను ఏమి చెప్పాను? సంవత్సరాలు తరబడి శిష్యరికం చేసినా సంగీతం అబ్బని వీడికి, నాలుగు రోజుల్లో అది ప్రాప్తించేటట్లు, నేను ఏ మంత్రం చెప్పాను? అని ఆలోచనలో పడ్డాడు. చివరికి శిష్యుణ్ణే అడిగేశాడు, 'నేను నీకు ఏం చెప్పాను?' అని.

'గురువుగారూ! మూడు పూటలా తిని కూర్చుంటే సంగీతం రాదన్నారు కదా! అందుకని ఈ నాలుగు రోజులు మూడు పూటలా తినకుండానే పడుకున్నాను. అయినా సంగీతం రాలేదు' అన్నాడు.

సాధన తోనే సాధ్యం

సంగీత జ్ఞానం పూర్ణంగా కలిగిన విద్వాంసుడు సాధన చేయక పోయినా పాడ గలడు. సంగీత జ్ఞానము లేనివాడు తిని కూర్చున్నా, తినకుండా పడుకున్నా, అతడు తినినవాడు, తినని వాడు అవుతాడే గాని సంగీతం

వచ్చినవాడు మాత్రం కాలేడు. ***అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు*** - సంగీత సాధన చేస్తూ ఉంటే సంగీత విద్య వస్తుంది. విద్వాంసుడైన వాడు అభ్యసించడం లేదని సాధకుడు కూడా అభ్యసించడం మానేస్తే, అతడు ప్రయత్నాన్ని విరమించిన వాడు అవుతాడే గాని, అనుకున్నది సాధించిన వాడు కాలేడు. ***సాధనమున పనులు సమకూరు ధరలోన*** - 'చేసుకున్న వారికి చేసుకున్నంత' అనేది ఒక అద్భుతమైన సత్యవచనం.

జ్ఞాని కర్మలు చేయడం లేదని, జ్ఞాని కానివాడు కూడా కర్మల్ని మానేస్తే, అట్టివాడు కర్మను విడిచిన వాడు అవుతాడే గాని జ్ఞాని కాలేడు. ప్రస్తుతం జ్ఞానిగా శోభిస్తున్న వ్యక్తి కూడా గతంలో కర్మలను ఆచరించి తత్ఫలితంగా అకర్త అయిన వాడే గాని, కర్మ చేయకుండా నైష్కర్మ్యాన్ని పొందిన వాడు కాడు ***(న కర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽ శ్నుతే*** *- 3 వ అ - 4 వ శ్లో).*

అర్జునా! ఆత్మజ్ఞాని పొంద వలసింది లేదు కనుక చేయ వలసింది కూడా ఏమీ లేదు. ఆత్మజ్ఞానము లేని వారందరు కర్మలను అవశ్యం చేయాలి. జ్ఞానోదయం జరగ నపుడు, జ్ఞానదీపాన్ని వెలిగించుకొనే ప్రయత్నాన్ని విరమించు కోవడం అవివేకం. ***తస్మాత్*** - అందువలన. అంటే, నీవు జ్ఞానివి కానందు వలన కర్మను ఆచరించి తీరాలి.

ప్రస్తుత శ్లోకాన్ని 'తస్మాత్' అని ఆరంభించడములో అంతర్భావం ఇదే. జ్ఞానులు కర్మలను విడిచిపెట్టి ఆత్మరతిలో ఆత్మతృప్తులై ఆత్మానందాన్ని అనుభవిస్తుంటారు కనుక, నేను కూడా అలాగే సంతుష్టుడనై ఉంటాను అని జ్ఞానం లేనివాడు భావిస్తే, ప్రగతి లేకపోగా, పతనం తప్పదని తెలుపుతూ, ***తస్మాత్ జాగ్రత జాగ్రత*** అని హెచ్చరిస్తున్నాడు.

చెయ్యదగింది చెయ్యి

ఏవి ఎలా జరగవలసి ఉందో అవి అలా జరుగుతాయి. నేను చేయగలిగింది చేస్తాను అనేది సాధకుని భావన కావాలి. మనం చేయవలసినవి ఎన్నో ఉన్నాయి. అవి చేయడం కోసమే మనం ఈ ప్రపంచంలో ఉన్నాము. చేయ వలసినవే చేయ లేనపుడు, చేయ లేనివి ఎలా చేస్తాము?

కర్మ బంధాన్ని సృష్టిస్తుందా? జడమైన కర్మ బంధాన్ని ఎలా సృష్టిస్తుంది? కనుక కర్మ బంధము కాదు. కర్మల యందు ఆసక్తే బంధము. బంధము కాకుండా కర్మలు చెయ్యవచ్చు. ఆసక్తి లేకుండా కర్మ చేస్తే కర్మ బంధించదు. కనుకనే, అర్జునా! చేయవలసిన కర్మను ***(కార్యం కర్తవ్యం కర్మ)*** ఎల్లప్పుడు ***(సతతం సర్వదా)*** చక్కగా ఆచరించు ***(సమాచర నిర్వర్తయ)***. కాకపోతే, కర్మ ఫలాసక్తి లేకుండా ఆచరించు ***(అసక్తః)***. ఫలాపేక్ష లేకుండా కర్మలు చేయడం అంటే, రాగద్వేషాల నుండి విడిపడి, ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించడం అని అర్థం ***(ఈశ్వరార్థమ్ కర్మ కుర్వన్)***. అలా కర్మలను ఆచరిస్తే, తద్వారా చిత్తశుద్ధిని సాధించి మోక్షాన్ని పొందుతావు ***(మోక్షం ఆప్నోతి ప్రాప్నోతి సత్త్వశుద్ధి ద్వారేణ ఇత్యర్థః)*** అనేది భగవానుని ఆదేశము.

ముక్తిమార్గం

కర్మ చేయకుండా ఉండటం సాధ్యం కాదు. కర్మలను ఆచరిస్తూ పోతే రాగద్వేషాలు నూతనంగా తయారు కాకుండా ఉండవు. మనస్సు రాగద్వేషాలకు చిక్కితే కర్మ బంధహేతువు అవుతుంది. కనుక కర్మలను చేస్తూనే అవి బంధాలు కాకుండా చూసుకోవాలి. అందుకు కర్మయోగమే అనువైన చక్కని మార్గము.

కర్తవ్యతా బుద్ధితో ఫలాకాంక్ష లేకుండా కర్మల్ని ఆచరించాలి. ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే రాగద్వేషాలు తటస్థ పడతాయి. దీనినే మహాత్ములు 'అనాసక్తి యోగము' అని పేర్కొన్నారు. ఈ విధమైన కర్మయోగమును ఆచరించు సుకృతాత్ములు చిత్తశుద్ధి ద్వారా మోక్షాన్ని పొందుతారు.

ధర్మరూపంలో ఉన్నది దైవమే అని ఇప్పటికే గ్రహించాం. ఈ ప్రపంచంలో ధర్మచక్రమే తిరుగుతూ ఉంది. ధర్మాన్ని ఆశ్రయించి, ధర్మమార్గాన చరించే వారికి రాగద్వేషాలు అంటవు కనుక, వారి మనస్సు స్వలక్ష్యము నందే ఉంటుంది. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల్ని ఆచరించడం అంటే, ధర్మరూపంలో ఉన్న దైవాన్ని హృదయం లోకి ఆహ్వానించడం అని అర్థం. అదే భక్తి. భక్తి కలిగిన వాడు భక్తుడు. భక్తుడు ఎవరో కాదు. కర్మయోగే భక్తుడు. భక్తుడైన కర్మయోగి, భక్తి ద్వారా, అంటే కర్మయోగము ద్వారా అంతఃకరణ శుద్ధిని పొందు తున్నాడు. ఈ విధంగా ముక్తిమార్గంలో చరించి మోక్షరూపు డవుతున్నాడు.

కర్మయోగి ధర్మ జీవనాన్ని సాగించడం చేత పాపమంతా ప్రక్షాళన మవుతుంది ***(ధర్మేణ పాప మపను దతి)***. పాపం నశించడం చేత బుద్ధిలో జ్ఞానం ఉదయిస్తుంది ***(జ్ఞాన ముత్పద్యతే పుంసాం క్షయాత్ పాపస్య కర్మణః)***. జ్ఞానం వలన మోక్షం సిద్ధిస్తుంది ***(జ్ఞానా దేవతు కైవల్యం)***. ఇది క్రమం. కర్మయోగి కార్యక్రమం.

ముముక్షువులైన వారు ఎందరో ఈ కర్మయోగ మార్గంలో చరించి తరించి పోయారు. ఇది పవిత్రమైన, సూటియైన మార్గం కనుక, తరించిన మహాత్ములు కూడా ఆదర్శాన్ని నిలిపేందుకు వారికి అవసరం లేకపోయినా, కర్మల్ని ఈ ప్రపంచంలో ఆచరించి చూపారు. వారెవరంటూరా? వినండి.

కర్మ ణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహ మే వాపి సమ్పశ్య న్కర్తు మర్హసి ॥ 20

కర్మణా-ఏవ-హి-సంసిద్ధిం-ఆస్థితాః-జనకాదయః
లోకసంగ్రహం-ఏవ-అపి-సంపశ్యం-కర్తుం అర్హసి

జనకాదయః	= జనకుడు మొదలగు వారు	లోకసంగ్రహం ఏవ	=లోక కళ్యాణమునే
కర్మణా ఏవ	= కర్మ చేతనే	సంపశ్యన్ అపి	=చూస్తున్న వాడవైనా కూడా
సంసిద్ధిం	= సిద్ధిని	కర్తుం	=కర్మ చేయుటకు
ఆస్థితాహి	= పొందిరి గదా	అర్హసి	=తగి యున్నావు

జనకుడు మొదలైన వారు కర్మ చేతనే సిద్ధిని పొందారు కదా! నీవు కూడా లోక హితమును దృష్టిలో ఉంచుకొని కర్మను ఆచరించడమే సముచితం.

వ్యాఖ్య

కర్మ చేసే ప్రతి వ్యక్తి అజ్ఞాని కాడు. అలాగే, కర్మ చేయకుండా ఉన్న ప్రతివాడూ జ్ఞాని కాడు. కర్మ చేసినంత మాత్రాన జ్ఞాని జ్ఞాని కాకుండా పోడు. కర్మ చేయనంత మాత్రాన అజ్ఞాని అజ్ఞానం నుండి విడి పడడు.

కర్మ చేయడం మోక్షానికి విరుద్ధ మని శాస్త్రం చెప్పలేదు. కర్మ మోక్షాన్ని ప్రసాదించ లేదు అని మాత్రమే చెప్పింది. ఫలాసక్తితో, రాగద్వేషాలతో కర్మలను ఆచరిస్తే అవి బంధహేతువు లవుతాయి. ఫలాసక్తి లేకుండా, ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తే కర్మ కర్మయోగంగా మారుతుంది. అంతఃకరణ శుద్ధిని ప్రసాదిస్తుంది. చిత్తశుద్ధి మోక్షానికి హేతువు అవుతుంది. గతంలో తరించిన మహాత్మ లందరూ ఇలాగే తరించారు.

కర్మల విషయంలో అవగాహన చక్కగా ఉండాలి. జ్ఞాననిష్ఠకు అర్హులు కాని వారు కర్మల్ని సన్యసించి సాధించేది ఏమీ ఉండదు. అలాగని, కర్మలలో కూరుకు పోయినా ప్రయోజనం ఉండదు. కనుక కర్మల ద్వారా శుద్ధిపడే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. అదే శ్రేయోమార్గం.

యుద్ధకర్మను అర్జునుడు సన్యసించడాన్ని శ్రీకృష్ణుడు సమర్థించడం లేదు. పైగా వ్యతిరేకిస్తున్నాడు కూడా. అలాగని, రాజు లందరు స్వార్థంతో, ఫలాభిసంధితో యుద్ధాలు చేసినట్లు, అర్జునుడు కూడా చేయాలి అని శ్రీకృష్ణుడు అభిప్రాయ పడటం లేదు. అర్జునుడు క్షత్రియుడు. క్షత్రియుడైన అర్జునుడు చేయవలసిన కర్మ (**కార్యం కర్మ**) ఏదయితే నిరీక్షిస్తూ ఉందో, దానిని చేయక తప్పదు అనేదే శ్రీకృష్ణుని అభిమతం. అలా చేయ దగిన కర్మను ఆసక్తి లేకుండా ఆచరిస్తే బంధము లేక పోవడమే గాక, మోక్షానికి మార్గం సుగమం అవుతుంది అనేదే గీతాచార్యుని నిశ్చితాభిప్రాయము.

ఇది కేవలం ఊహ మాత్రమే కాదు. ఆ విధమైన కర్మయోగ మార్గంలో ఎందరో విద్వత్తు కలిగిన క్షత్రియులు గతంలో తరించారు. మోక్షాన్ని పొందారు అని కూడా చెబుతున్నాడు (***కర్మణి ఏవ, పూర్వే క్షత్రియాః విద్వాంసః సంసిద్ధిం మోక్షం గన్తుమ్***). అలాంటి క్షత్రియులు ఎవరు? అని అడిగితే, జనకుడు మొదలైన వారు అని సమాధానం చెబుతున్నాడు (***జనకాదయః జనక అశ్వపతి ప్రభృతయః***).

కర్మయోగంలో చరించి గతంలో ఎందరో క్షత్రియులు సంసిద్ధిని పొందారు అంటున్నాడు. వారే జనకాదులు అని సోదాహరణంగా చెబుతున్నాడు. 'జనకాదులు' అనడం లోనే జనకుడు ఒక్కడే కాదు, ఇంకా చాలా మంది ఉన్నారు అని అర్థం. ఎవరు వారు? జనకుడు, అశ్వపతి, భగీరథుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, ఇక్ష్వాకుడు మొదలైన వారు పురాణేతిహాసాలలో ఎందరో కనిపిస్తారు. వారందరూ జ్ఞానులయ్యారు. మోక్షాన్ని పొందారు.

అయితే వీరందరూ మోక్షాన్ని పొందడానికి కర్మను ఆచరించారా? లేక త్యజించారా? అనేది ఇక్కడ చర్చనీయాంశము. రెండూ చెయ్య లేదు. బంధ కారకములైన కర్మల్ని చేసినా ప్రయోజనం ఉండదు అని గ్రహించిన వారు కనుక, వారందరూ రాజులే అయినా, గృహస్థులే అయినా కర్మలలో కూరుకొని పోలేదు.

అలాగని, తమ క్షత్రియ ధర్మాన్ని, గృహస్థ ధర్మాన్ని విస్మరించి సన్యాసుల వలె చరించడం యుక్తం కాదని గ్రహించారు కనుక కర్మలను త్యజించనూ లేదు. కర్మలు ఆచరిస్తూనే కర్మలలో శుద్ధిపడే ప్రయత్నం చేశారు. చిత్తశుద్ధి ద్వారా జ్ఞానప్రాప్తిని, తద్వారా మోక్షాన్ని పొంది తరించారు.

చేసి తరించారా? తరించి చేశారా?

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న ఈ శ్లోకం యొక్క మొదటి పాదాన్ని రెండు కోణాల నుండి దర్శించి అర్థం చేసుకోవాలి. జనకుడు మొదలైన రాజులు కర్మాచరణ ద్వారా సిద్ధిని పొందారా? లేక సిద్ధిని పొంది కర్మాచరణం చేశారా? ఈ రెండిటికీ అవకాశా న్నిస్తున్న ఈ శ్లోక పాదాన్ని అలా రెండు విధాలుగా విశ్లేషించి అర్థం చేసుకుంటేనే విషయం స్ఫటికంలా స్పష్టంగా బుద్ధిలో నిలుస్తుంది.

ఏమీ చేయకుండా ఎవరూ ఏదీ పొందలేరు. అలాంటప్పుడు జనకాదులు మాత్రం అకర్మ ద్వారా సిద్ధిని ఎలా పొందుతారు? కనుక కర్మయోగంలో చరిస్తూనే పొందారు.

మరి ఈ శ్లోకంలో, ఆత్మజ్ఞానాన్ని పొందడానికి జనకాదులు కర్మను ఆచరించారా? లేక జ్ఞానాన్ని పొంది కర్మాచరణం సాగించారా? అనే మీమాంస తలెత్తుతూ ఉంది కనుక వారికి సమ్యగ్దర్శన ప్రాప్తి లభించిన తరువాతే కర్మల్ని ఆచరించారు అని గనుక చెప్పుకుంటే, వారు లోక కళ్యాణార్థం కర్మాచరణం చేశారు అని అర్థం చేసుకోవాలి (***యది తే ప్రాప్త సమ్యగ్దర్శనాః తతః లోక సంగ్రహార్థం***).

అలా కాకుండా, వారికి సమ్యగ్దర్శన ప్రాప్తి కలగలేదు కనుకనే కర్మను ఆచరించారు అని చెప్పుకుంటే అంతఃకరణ శుద్ధికి కర్మలను ఆచరించి, కర్మయోగం ద్వారా సంసిద్ధిని పొందారు అని ఈ శ్లోకంలో మొదటి

పాదాన్ని అర్థం చేసుకోవాలి (***అప్రాప్త సమ్యగ్దర్శనాః జనకాదయః కర్మణా, సత్త్వశుద్ధి సాధన భూతేన, క్రమేణ సంసిద్ధిం ఆస్థితాః***).

ఆత్మజ్ఞానం లేని వారే అయినా, చిత్తశుద్ధి కోసం క్షత్రియులైన జనకాదులు కర్మాచరణం చేసి, తద్వారా జ్ఞానాన్ని పొందారు కనుక, క్షత్రియుడైన అర్జునుడు కూడా వారి మార్గం లోనే చరించి, యుద్ధకర్మను ఆచరించి కూడా సిద్ధిని పొందవచ్చు అని అభిప్రాయము.

జనకాదులు ఆత్మజ్ఞానార్థమై, చిత్తశుద్ధి నిమిత్తం కర్మలను ఆచరించి ఉండవచ్చు. కాని, శ్రీకృష్ణుని గీతాబోధ వల్ల తనకు ఆత్మజ్ఞానం కలిగింది కనుక తాను కర్మను ఎందుకు చెయ్యాలి? అని అర్జునుడు భావిస్తాడేమో అని ఆశంకించిన అచ్యుతుడు, అలా అయినప్పటికీ, అర్జునా! నువ్వు లోక సంగ్రహార్థం కర్మలు చెయ్యవచ్చు అంటున్నాడు.

జనకుడు మొదలైన వారు జ్ఞానాన్ని పొందిన తరువాత కూడా లోక సంగ్రహార్థం కర్మల్ని ఆచరించారు. తాము ఆత్మే నని వారికి తెలుసు. ఆత్మ అకర్త అనేది వారి అనుభవంలో ఉన్న విషయమే. అయినా, ప్రారబ్ధవశాత్తు దేహము కొనసాగుతూ ఉంది కనుక, దేహ ప్రారబ్ధానుసారము కర్మల్ని అవశ్యం చెయ్యాలి కనుక చేశారు.

శ్వాసల్ని పీల్చుకోకుండా జ్ఞాని దేహంలో ఉండ గలడా? మరి, శ్వాసక్రియ కర్మ కాదా! అలాగని, శ్రమించి ఎవరైనా శ్వాసలు పీల్చుకుంటున్నారా? శ్రమించి కంటిరెప్పలు వాల్చుతున్నారా? సామాన్యులు శ్వాసక్రియాది కర్మల్ని అనాయాసంగా, అప్రయత్నంగా ఆచరించినట్లు, జ్ఞానులు సర్వ కర్మల్ని స్పృహ లేకుండా చేయగలరు. కారణం, ఆత్మ అకర్త అనే జ్ఞానం వారిలో స్థిరపడి ఉంది కనుక.

జీవన్ముక్తులైన జనకాదులు దేహధారులై ఉన్నారు కనుక, క్షత్రియ ఉపాధితో క్షాత్ర ధర్మాన్ని నిస్సంగులై, ఆత్మరూపులై ఆచరించారు. వారికి రాజ్యం ఉండింది. కనుక చేయ వలసిన కార్యం ఉండింది (**కార్యం కర్మ**). ప్రజల కష్టాలను తీర్చేవారు. ధర్మయుతంగా రాజ్యాన్ని పాలించేవారు. ప్రజల బాధల్ని తీర్చి, లోక సంగ్రహార్థం కర్మాచరణం చేసేవారు. అదంతా లోకం కొరకే కాని, తమ కొరకు కాదు. ఇంతెందుకు? శ్రీకృష్ణ భగవానుని విషయం చూడండి. ఆయన రథాన్ని నడుపుతున్నది తన కొరకా? అర్జునుని కొరకా? తన స్వార్థం కొరకా? లోక కళ్యాణం కొరకా? జ్ఞాని చర్యలు ఎప్పుడైనా, ఎక్కడైనా ఇలాగే ఉంటాయి.

ఆత్మజ్ఞానం కలిగిన తరువాత, కర్మలు చెయ్యకూడదు అనే నియమం లేదు. జ్ఞానం కలిగి ఉండవచ్చు. అయినా ప్రారబ్ధాధీనంగా దేహం కొనసాగుతూ ఉంది కనుక (***ప్రారబ్ధ కర్మాయత్తః***) దేహ ప్రారబ్ధాన్ని అనుసరించి కర్మల్ని చెయ్యవచ్చు. కర్మల్ని విడిచి పెట్టి కూర్చోవచ్చు. రాజ్యాన్ని పాలించ వచ్చు. చెట్టు క్రింద నిష్క్రియుడై పడి ఉండవచ్చు. జ్ఞానికి విధి నిషేధాలు విధించే సాహసం ఇంతవరకు ఎవ్వరూ చెయ్యలేదు. జ్ఞాను లందరిలో జ్ఞానం ఒక్కటే. కాని, జ్ఞానం కలిగిన వారు అందరూ ఒకే విధంగా చరించరు. అది ప్రారబ్ధ భేదమే గాని జ్ఞానంలో భేదం కాదు.

పూర్ణ జ్ఞానరూపులైన శ్రీ ఆది శంకరాచార్య స్వామి ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించి జ్ఞాన ప్రబోధం చేశారు. అరుణాచలంలో శ్రీరమణులు నిశ్చల రూపులై లోకాన్ని ఆశీర్వదించారు. అదంతా ప్రారబ్ధ భేదం వల్ల వచ్చిందే గాని జ్ఞానంలో భేదం వల్ల కాదు.

అర్జునా! జ్ఞానులైన జనకాదులే లోక సంగ్రహార్థం కర్మల్ని ఆచరించారు. నీవు జ్ఞానివి కాకపోయినా, కర్మల్ని త్యజించాలని ఉబలాట పడుతున్నావు. నువ్వు చేయవలసిన కర్మ ఉంది (**కార్యం కర్మ**). అదే నిన్ను ప్రస్తుతం కురుక్షేత్రానికి ఈడ్చుకొని వచ్చింది. చెయ్యవలసింది ఉండగా, చెయ్యను అని భీష్మించుకొని

కూర్చోవడం జ్ఞాని లక్షణం కాదు. యుద్ధం కావాలని నువ్వు అభిలషించావా? నేను ప్రయత్నించానా? అయినా అనివార్యంగా ప్రాప్తించిన యుద్ధంలో నీ పాత్రను పోషించేందుకే నువ్వు ఇక్కడ నిలబడి ఉన్నావు. అలా కాకుండా నువ్వు కూడా జ్ఞానివే అని గనుక నీ అభిమత మైతే, అప్పుడు కూడా యుద్ధ ప్రారబ్ధం కలిగిన దేహంతో లోక సంగ్రహార్థం నువ్వు యుద్ధానికి సిద్ధం కాక తప్పదు. లోకం సక్రమ మార్గంలో చరించ డానికి నువ్వు కర్మను ఆచరించే తీరాలి ***(లోక సంగ్రహమ్ ఏవ అపి ప్రయోజనం సంపశ్యన్ కర్తుమ్ అర్హసి).***

క్షత్రియ ప్రారబ్ధంతో ఉన్న దేహంతో క్షత్రియ ధర్మం ఆచరింప బడాలి. తప్పదు. సర్వ ధర్మాలు రాజును ఆశ్రయించుకొని ఉన్నాయి ***(సర్వేరాజాశ్రితా ధర్మాః).*** కనుక రాజ దేహమును ధరించిన నీవు రాజ ధర్మానికి దూరం కాలేవు. రాజధర్మానికి కారకుడు రాజే కదా! ***(రాజా ధర్మస్య కారకః).*** కనుక క్షత్రియ ప్రారబ్ధ దేహధారి వైన నువ్వు ఆత్మజ్ఞానివి అయినా కర్మల్ని ఆచరించాలి ***(లోక సంగ్రహార్థం).*** ఆత్మజ్ఞానివి కాకపోయినా, కర్మల్ని ఆచరించాలి ***(సత్త్వ సంశుద్ధి సాధనార్థం).*** అర్జునా! కర్మను విరమించి నంత మాత్రాన బంధవిముక్తి జరగదు. కర్మ ద్వారానే జ్ఞానం కలగాలి. ఈ విషయంలో శాస్త్రం భిన్నంగా లేదు.

సర్పి రస్తి పయసీక్షు గో రస స్తైల మస్తి తిలమధ్యే ఏవతత్
లభ్యతే మథన యంత్ర కర్మణా కర్మణా హృదిగతా తథైవ చిత్ ॥

పాలల్లో నెయ్యి ఉంది. చెరకులో రసం ఉంది. నువ్వులలో నూనె ఉంది. కానీ మథించి నపుడే వాటిలో ఉన్నది లభ్య మవుతూ ఉంది. అలాగే, హృదయాంతర్యామి అయిన ఆత్మ కూడా కర్మ చేతనే ప్రాప్తిస్తుంది.

అర్జునా! జ్ఞానులు శ్రేష్ఠులు కదా! మరి జ్ఞానాన్ని పొందాలని యత్నించే సాధకులు కూడా శ్రేష్ఠులే కదా! కనుక శ్రేష్ఠులు ఎవరైనా ఇతరులకు ఆదర్శాన్నే అందిస్తారు. ఎందుకో తెలుసా! శ్రేష్ఠులు ఏది ఆచరిస్తే, అన్యులు దానినే అనుసరిస్తారు కనుక. విను.

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దే వేతరో జనః ।
స య త్ప్రమాణం కురుతే లోక స్త దనువర్తతే ॥ 21

యత్-యత్-ఆచరతి-శ్రేష్ఠః-తత్-తత్-ఏవ-ఇతరః-జనః
సః-యత్-ప్రమాణం-కురుతే-లోకః-తత్-అనువర్తతే

యత్ యత్	= ఏయే కర్మను	యత్	= దేనిని
శ్రేష్ఠ	= శ్రేష్ఠుడు	ప్రమాణం	= ప్రమాణముగ
ఆచరతి	= ఆచరిస్తాడో	కురుతే	= చేస్తాడో
తత్ తత్ ఏవ	= ఆయా కర్మనే	లోకః	= లోకము
ఇతరః	= ఇతరమైన	తత్	= దానినే
జనః	= జనము	అనువర్తతే	= అనుసరిస్తుంది
సః	= అతడు		

శ్రేష్ఠుడు దేనిని ఆచరిస్తే ఇతరులు దానినే ఆచరిస్తారు. శ్రేష్ఠుడు ప్రమాణంగా గ్రహించిన దానినే అన్యులు కూడా ప్రమాణంగా స్వీకరిస్తారు.

వ్యాఖ్య

చెట్టుకు కొమ్మలు ఎన్నయినా ఉండ వచ్చు. కాని, ప్రధాన మైనది కాండము. దానిని ఆధారం చేసుకొనే శాఖలు విస్తరిస్తూ ఉంటాయి. అలాగే గృహంలో యజమాని ప్రధానమైన వాడు. అతని మార్గం లోనే గృహం లోని

సభ్యులు ప్రవర్తిస్తూ ఉంటారు. కార్యాలయంలో అధికారి ప్రధానుడు. దేశంలో రాజు ప్రధానుడు. ప్రధానుడైన వాణ్ణి శ్రేష్ఠుడుగా దర్శిస్తూ అన్యులు అనుసరిస్తూ ఉంటారు.

శ్రేష్ఠః ప్రధానః - శ్రేష్ఠుడు అంటే ప్రధానమైన వాడు అని అర్థము. శ్రేష్ఠుడు మార్గదర్శి. అతని బాటలో నడవాలని అందరూ అభిలషిస్తారు. అతని మాటను శిరోధార్యంగా సర్వులూ భావిస్తారు. అతని మాటే వేదం. అతని పాటే నాదం. అతడు ఆడిందే ఆట. అతడు పాడిందే పాట.

శ్రేష్ఠత్వము అనేది జ్యేష్ఠత్వము వల్ల కూడా వస్తుంది. కాకపోతే పరిమితంగా ఉంటుంది. గృహంలో జ్యేష్ఠుడే శ్రేష్ఠుడు. కాని అది ఆ కుటుంబానికి మాత్రమే వర్తిస్తుంది. సర్వులకు వర్తించదు. జ్యేష్ఠు డైనంత మాత్రాన శ్రేష్ఠుడని చెప్పలేము. కాని, శ్రేష్ఠత్వము ఉన్నవాడు జ్యేష్ఠుడు కాకపోయినా శ్రేష్ఠుడే. జ్యేష్ఠత్వము, శ్రేష్ఠత్వము, రెండూ ఒకే చోట అరుదుగా అగుపిస్తాయి.

అదే అందరికీ దారి

శ్రేష్ఠుడు ఎలా ప్రవర్తిస్తే ఇతరులు అలాగే ప్రవర్తించ డానికి ప్రయత్నిస్తారు. ఎలా ఆలోచిస్తే అందరూ అలాగే ఆలోచిస్తారు. శ్రేష్ఠుడైన వాడు ఏయే కర్మలను ఆచరిస్తాడో ***(యద్యత్ కర్మ ఆచరతి శ్రేష్ఠః)*** ఆయా కర్మలనే సామాన్య జనులు అనుసరిస్తూ ఆచరిస్తారు ***(తత్తత్ ఏవ కర్మ ఆచరతి ఇతరః అన్యః జనాః తదనుగతః - కించ సః శ్రేష్ఠః).*** అందుచేతనే అతడు శ్రేష్ఠుడు.

శ్రేష్ఠుడైన వాడు సమాజానికి మార్గదర్శకుడు కావాలి. అతడి ప్రవర్తన సమాజం మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. శ్రేష్ఠుడైన వాడు దారి తప్పితే, సమాజం దగా పడి పోతుంది. శ్రేష్ఠుడు విబుధు డైతే, అతనిని అనుసరించే వారు బుధజను లవుతారు. శ్రేష్ఠుడు విప్లవకారు డైతే, అతడి అనుయాయులు ప్రతి చిన్న విషయానికి ఆవేశంతో ఊగిపోతూ ఉంటారు.

రాజు అనేవాడు రాజ్యానికి శ్రేష్ఠత్వము వహిస్తాడు. అతని మాటను అందరూ అంగీకరిస్తారు. అతడి నడవడికను అనుసరిస్తారు. అనుకరిస్తారు. రాజు సత్పురుషు డైతే జనులు సత్ప్రవర్తనలో ఉంటారు. జ్యేష్ఠుడు అనైతికంగా జీవిస్తే, అనుయాయులలో ఎక్కువ శాతం అధర్మ మార్గం లోనే ఉంటారు. ఈ సత్యం ప్రజాస్వామ్యంలో మరీ స్పష్టంగా, ముంజేతి కంకణం లాగా దర్శన మిస్తుంది. లంచగొండితనం, హింస మొదలైన పైశాచిక కృత్యాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో విలయ తాండవం చేయడానికి శ్రేష్ఠత్వాన్ని, ప్రాధాన్యాన్ని కలిగి యున్న నాయకులే కారణము. ***యథా రాజా తథా ప్రజా*** అని కదా ఆర్యోక్తి!

కాకపోతే, ఇక్కడ కాస్త లోతుగా ఆలోచించ వలసిన విషయం ఒకటుంది. శ్రేష్ఠుడు దారి తప్పితే, అనుసరించే వారందరూ దారి తప్పుతారు అనేది అందరికీ సువిదితమే. కాని, దాని వల్ల అనుయాయులకే నష్ట మని భావిస్తూ ఉంటారు. అది వాస్తవమే అయినా, గాలివాన కొమ్మలనే కాదు, చెట్లను కూడా కూల్చేస్తుంది అన్నట్లు, అనాదర్శం వల్ల ఏర్పడే దుష్పరిణామం అనుయాయుల్నే కాదు, జ్యేష్ఠుని కూడా విడిచి పెట్టదు. వ్యవస్థే పాడై నపుడు, ఆ వ్యవస్థలో జీవించే వ్యక్తి విలక్షణంగా సుఖపడ గలడా? కనుక శ్రేష్ఠుడైన వాడు మెలకువలో ఉండాలి. మేలైన మార్గం లోనే చరించాలి. భిన్నంగా వ్యవహరిస్తే అది ఎవరికీ మంచిది కాదు.

ఆఖ్యాయిక

కార్తీక మాసంలో శ్రేష్ఠుడైన ఒక విప్రుడు నదీస్నానం చేయడానికి వెళ్ళాడు. తన చేతిలో ఒక రాగి చెంబు ఉంది. నది లోకి దిగబోయే ముందు దానిని తీరం లోనే ఉంచి, నదిలో ప్రవేశించడానికి ఉద్యుక్తు డయ్యాడు. అంతలోనే అతనికి ఒక సందేహం కలిగింది. ఆ రాగి చెంబును ఎవరైనా అపహరిస్తారేమో అనే సంశయం

కలిగింది. ఎవరూ అపహరించకుండా ఉండాలని ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. తన రాగి చెంబును ఎవ్వరూ చూడకుండా ఇసుకలో పూడ్చి పెట్టేశాడు. స్నానానంతరం తీసుకోవచ్చు అని అభిప్రాయ పడ్డాడు.

అతనికి వెంటనే మరొక సందేహం కలిగింది. తీరమంతా ఇసుకే కదా, స్నానానంతరము వచ్చి తీసుకోవడానికి సంకేత మెలా? అని ఆలోచించి, ఎక్కడైతే తన రాగి చెంబును పూడ్చి పెట్టాడో, అక్కడ ఇసుకతో ఒక లింగాకారాన్ని చేశాడు. ఇక ఏ సందేహమూ అవసరం లేదు. రాగి చెంబు క్షేమంగా ఉంటుంది. స్నానం చేసి వచ్చి ఆ లింగాకారాన్ని గుర్తించి, చెంబును చేత పట్టుకొని వెళ్ళొచ్చని నిర్ణయించుకొని స్నానానికి నదిలో దిగాడు.

విప్రుడు వేదాధ్యయనం చేసిన శ్రేష్ఠుడు. నదీ స్నానానికి వచ్చిన చాలా మంది భక్తులు ఆయన చెంబును దాచడం చూడలేదు గాని, సైకత లింగాన్ని చేస్తూ ఉండటం చూశారు. కార్తీక మాసంలో అలా సైకత లింగాన్ని చేసి ఆ తరువాత స్నానం చేయడం శాస్త్ర విధి అయి ఉంటుందని విప్రుని ప్రవర్తనను వింతగా అర్థం చేసుకున్న ఆ భక్తులు తాము కూడా శ్రేష్ఠుని మార్గాన్నే అనుసరించాలని భావించి, ఒకొక్కరు ఒకొక్క సైకత లింగాన్ని తీరంలో చేసుకుంటూ పోయారు.

విప్రుడు స్నానం చేసి వచ్చి, తీరంలో నిలబడి ఆశ్చర్య పోయాడు. ఎక్కడ చూచినా సైకత లింగాలే. తన రాగి చెంబు ఏ లింగం క్రింద ఉందో అతడికి అర్థం కాలేదు. చెంబును దాచే ఉపాయమైతే ఆలోచించాడు గాని, అది తనకే అపాయం తెచ్చి పెడుతుందని, అందరికీ అనాదర్శం అవుతుందని ఊహించలేక పోయాడు.

గతానుగతికో లోకో న లోకః పారమార్థికః
తీరే సైకత లింగేన నష్టం మే తామ్రభాజనమ్ ॥

ఈ లోకం చాలా విచిత్ర మైంది. పోయేవాడి వెంట బడి గొర్రెదాటుగా పోవడమే గాని, వాస్తవాన్ని ఆలోచించి ఆచరించే వారు అరుదు. నదీ తీరంలో సైకత లింగాన్ని చేసిన కారణంగా, నా రాగి చెంబు నాకు దూరమైంది అని విప్రుడు చింతించాడు. శ్రేష్ఠత్వ మనేది ఉత్కృష్టంగా ఉండాలే గాని నికృష్టం కాకూడదు.

అర్జునా! శ్రేష్ఠుడు ఏది చేస్తే ఇతరులు అదే చేస్తారు. శ్రేష్ఠుడు దేనిని ప్రమాణంగా గ్రహిస్తే, ***(శ్రేష్ఠః యత్ ప్రమాణం కురుతే)***, అది లౌకికమైనా, వైదికమైనా ***(లౌకికం వైదికం వా)*** లోకం దానినే అనుసరిస్తుంది ***(లోకః తదనువర్తతే)***. దానినే ప్రమాణంగా స్వీకరిస్తుంది ***(తదేవ ప్రమాణీ కరోతి)***. ఇది చాలా నిగూఢమైన విషయం. సర్వ కాలాలకు ఉపకరించే విషయం. సమాజంలో ధార్మిక, ఆధ్యాత్మిక స్పృహకు సంబంధించిన విషయం. సాంఘిక స్థిరత్వం ధార్మిక చింతనముపై ఆధారపడి ఉంటుంది. సమాజంలో ధార్మిక చింతనము శ్రేష్ఠుని పైనే ఆధారపడి ఉంటుంది.

అదే ప్రమాణం

ప్రమాకరణం ప్రమాణం. 'ప్రమ' అంటే జ్ఞానము. ప్రమను, అంటే జ్ఞానాన్ని కలిగించేది ఏదో అదే ప్రమాణము. ఇది లౌకికం గానూ ఉండ వచ్చు. లేదా వైదికం గానూ ఉండ వచ్చు. లౌకిక వైదిక వ్యవహారా లన్నిటికీ వైదికులకు వేదమే ప్రమాణము. అందరికీ వేదం ప్రమాణం కాక పోవచ్చు. వేదమే ప్రమాణం అని భావించే వారికి కూడా శాస్త్ర లోతులు అర్థం కాకపోవచ్చు. శాస్త్ర మనేది మహాసాగరం. అగాధం. దానిని అందరూ ఈదలేరు. కనుక శ్రేష్ఠులైన వారిని అనుసరిస్తూ పోతారు. పోవాలి కూడా. అందుకు చాలా కారణాలు ఉన్నాయి.

తర్కోఽ ప్రతిష్ఠః శ్రుతయో విభిన్నాః నైకో ఋషిర్యస్య మతం ప్రమాణం
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గత స్స పన్థాః ॥

తర్కానికి స్థిరత్వము లేదు. వేదాలు విభిన్నంగా ఉన్నాయి. ఈ ఋషి పలికిందే వేదము అని చెప్పేందుకు వీలు లేదు. ధర్మతత్త్వము నిగూఢ మైనది. శ్రేష్ఠుడైన మహాత్ముడు ఏ మార్గాన చరిస్తే అదియే ఇతరులకు ఆదర్శ మార్గము అన్నది మహాభారతము.

కనుక శ్రేష్ఠుడైన రాజు దేనిని ప్రమాణంగా గ్రహిస్తే, ప్రజలు దానినే ప్రమాణంగా గ్రహిస్తారు. ఈ సత్యాన్ని ప్రవచించింది ఆర్షధర్మమే అయినా, దానిని ఎలా వినియోగించు కోవాలో బౌద్ధ ధర్మానికి తెలిసి నంతగా హిందూ ధర్మానికి తెలియదు అనేది నిర్వివాదాంశం. అంటే, అదేదో అర్థం గాని అమోఘమైన విషయం కావడం వల్ల హిందూ ధర్మాచార్యులు అర్థం చేసుకోలేక పోయారు అనేది నా అభిమతం కాదు.

హిందూ ధర్మము చాలా విశాలమైంది. కాని ధర్మాచరణంలో తన కంటూ కొన్ని పరిధు లున్నాయి. అవి కూడా ఇనుపగోడ ల్లాగా దుర్భేద్యంగా ఉన్నాయి. సత్యదృష్టే గాని మతవ్యాప్తి యందు హిందూ ధర్మానికి ఆసక్తి లేదు. ప్రచార ఆర్భాటాలు గాలికి, నిప్పుకు, నీళ్ళకు ఎలా లేవో, హిందూ ధర్మానికి కూడా అలాగే లేవు. హిందూధర్మము మతం కాక పోవడమే ఇక్కడ ప్రధానమైన విషయం.

విశిష్టమైన వేద ప్రమాణాన్ని రాజులు ఏయే కాలాలలో అనుసరించారో, ఆయా కాలాలలో ధర్మం చతుష్పాదాలతో నడిచింది. ప్రజలు సుఖశాంతులతో జీవించారు. హింసలు కుందేటి కొమ్ము లయ్యాయి. ప్రతి ఇంటి గుమ్మానికి శాంతి తోరణాలు అలంకరించ బడ్డాయి. ప్రతి మానవ హృదయం ప్రశాంతి సదనమై, దైవ మందిరమై విలసిల్లింది.

అవగాహన లేని ప్రభువులు శ్రేష్ఠులుగా చరించిన కాలా ల్లోనే ధర్మం చావుదెబ్బ తిన్నది. జనజీవనం అస్తవ్యస్త మైంది. క్రూరత్వానికి కాళ్ళొచ్చాయి. అశాంతికి రెక్క లొచ్చాయి. మరీ, ఇటీవల ప్రజాస్వామ్య భారతంలో జ్ఞానం లేని మతాలు, సంస్థలు బుద్ధిహీనులైన నాయకుల్ని బుట్టలో వేసుకొని తమ వ్యాపారాన్ని, వ్యవహారాన్ని ప్రబలంగా విస్తరింప జేస్తున్నాయి. ఇది సమాజానికి ఆరోగ్యకరం కాదు. అనాలోచిత మార్గాలు ఏదో ఒకనాడు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తాయి. అందుకనే, రాజధర్మంలో ఉన్న అర్జునుణ్ణి ఆదర్శంగా జీవించమని, తన శ్రేష్ఠత్వాన్ని ఋజువు చేసుకోమని శ్రీకృష్ణుడు ఆదేశిస్తున్నాడు. జనకాదుల్ని దృష్టిలో ఉంచుకొని, జీవనయాత్రను సాగించ మని సాధువాక్యాన్ని వినిపిస్తున్నాడు. జ్ఞానం గల వారిని సర్వులూ అనుకరిస్తారు కనుక, అర్జునా! జ్ఞానంతో చరించడం అలవరచుకో అంటున్నాడు భగవానుడు.

ఎఱుక గలుగు నాతఁడేది యొనర్చిన
నదియు చేతు రితరులైన వార
లతఁడు సత్యమిట్టి దనెనేని లోకంబు
తత్త్వవర్తనమునఁ దగిలి యుండు ॥

అని భాగవతంలో పోతనామాత్యుని తీపి పద్యము.

చెప్పేందుకు ఎన్నైనా ఉంటాయి. చేసే వారికి కదా తెలుస్తుంది అని అర్జునుడు గుండెలో గుసగుస లాడతా డేమో నని ఊహించిన గోవిందుడు, అర్జునా! నేను చెప్పి చూచేవాణ్ణి కాను. చేసి చూపేవాణ్ణి. ఒకరెందుకు? నేనే నీకు ఆదర్శం. నన్ను చూచి నేర్చుకో! అంటూ పరమేశ్వరుడు తన సమగ్ర యశస్సును ఆవిష్కరిస్తున్నాడు.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22

న-మే-పార్థ-అస్తి-కర్తవ్యం-త్రిషు-లోకేషు-కించన
న-అనవాప్తం-అవాప్తవ్యం-వర్తే-ఏవ-చ-కర్మణి

పార్థ	= అర్జునా!		అనవాప్తం	=	పొంద బడనిది
మే	= నాకు		అవాప్తవ్యం	=	పొంద వలసినది
త్రిషు లోకేషు	= ముల్లోకాలలో		న	=	లేదు
కర్తవ్యం	= చేయ దగినది		కర్మణి	=	కర్మము నందే
కించన	= ఏదియు		వర్తే ఏవ చ	=	ప్రవర్తిస్తూనే ఉన్నాను
న అస్తి	= లేదు				

పార్థా! ముల్లోకాలలో నేను చేయవలసిన కార్య మంటూ నాకు ఏదీ లేదు. నేను పొందనిది లేదు. పొంద దగిందీ లేదు. అయినా, నేను కర్మలను చేస్తూనే ఉన్నాను.

వ్యాఖ్య

అర్జునా! ఆత్మజ్ఞానమును పొందిన ఆప్తకాముడు కూడా లోకసంగ్రహార్థం కర్మల్ని ఆచరిస్తూనే ఉంటాడు. ఈ విషయంలో నీకు సందేహం ఉంటే, ఒకరి విషయం ఎందుకు? నా వైపు ఎందుకు చూడవు? (***మాం కిం న పశ్యసి ?***) అంటూ తననే ఉదాహరణంగా చూపిస్తున్నాడు షడ్గుణైశ్వర్య సంపన్నుడైన భగవానుడు. నన్ను చూడు. నా నడవడిని చూడు. నా చర్యల్ని చూడు. ప్రతిచర్యలు చూడు. క్షణం తీరిక లేదు - పైసా ఆదాయం లేదు. ఇదే ఆత్మవిదుని జీవన వైభవం.

కర్తవ్యం నాస్తి

ఎవరు ఏది చేసినా లేని దానిని పొందడానికి చేస్తారు. లేదా, ఉన్న దానిని వదిలించుకోవడం కోసమైనా చేస్తారు. లేనిది సుఖ కారణమైతే, ఆ లేని దానిని పొందాలని ప్రయత్నిస్తారు. ఉన్నది దుఃఖ కారణమైతే, ఆ ఉన్న దానిని వదిలించు కోవాలని ప్రయత్నిస్తారు. పొంద వలసింది ఉన్నప్పుడే చెయ్య వలసింది ఉంటుంది. పొంద వలసింది లేనపుడు చెయ్య వలసింది కూడా ఉండదు.

పడక కుర్చీలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న వ్యక్తిని, 'ఏమిటి? పని లేకుండా ఖాళీగా కూర్చొని ఉన్నారు?' అని ప్రశ్నిస్తే, 'అన్ని పనులూ అయిపోయా యండి. అందుకే విశ్రాంతి తీసుకుంటున్నా' అంటాడు.

అంటే, ఇక ఆయన చేయ వలసిన పనులు ఏవీ లేవని అర్థమా? కానే కాదు. ఆ సమయానికి లేవు అని అర్థం. ఆ ప్రదేశంలో లేవు అని అర్థం. ఇంట్లో పనులన్నీ పూర్తి అయ్యాయి అంటే, ఇక ఆఫీసులో పూర్తి చేయ వలసినవి ఉన్నాయి అని అర్థం. ఇదే కర్తవ్యం. అంటే చేయ దగిన కర్మ.

ప్రతి ఒక్కరికి ఏదో ఒక కర్తవ్యం ఉంటుంది. నేడు లేకపోయినా, రేపు ఉంటుంది. లేదా మరునాడైనా ఉంటుంది. ఇక్కడ లేకపోయినా వేరొకచోట ఉంటుంది. నేడు ఇక్కడ లేకపోయినా, రేపు ఇక్కడే ఉంటుంది. అందుకనే, చాలా మంది ప్రయాణాలు అర్థాంతరంగా ఆగిపోతూ ఉంటాయి. విధి నిషేధాలు ఉంటూ ఉంటాయి కనుక కర్మలు మారుతూ ఉంటాయి. కర్తవ్యాలు మారుతూ ఉంటాయి.

కాని, భగవంతుని విషయం వేరు. ఆయనకు ఏ కర్తవ్యమూ లేదు. ఎక్కడ లేదు? ఎక్కడా లేదు. ఎప్పుడు లేదు? ఎప్పుడూ లేదు. ముల్లోకాలలో ఆయనకు కర్తవ్యం అంటూ లేదు (***త్రిషు లోకేషు కర్తవ్యం నాస్తి***). అప్పుడు లేదు. ఇప్పుడు లేదు. ఎప్పుడూ లేదు (***త్రిషు లోకేషు***). అక్కడ లేదు. ఇక్కడ లేదు. ఎక్కడా లేదు (***త్రిషు లోకేషు***). ఎందుకని లేదు?

భగవంతుడు ఏమి పొందాలి? ఆయనకు లేని దేమిటి? పొంద వలసినది, ఆయన పొందకుండా ఉన్నది ఏమిటి? ఏది లేదని ఆయన దేనిని కోరుకోవాలి? ఆయనకు లభ్యము కానిది (***అనవాప్తమ్***) లేనే లేదు (***న - నానవాప్తం***). అప్రాప్త మైనది ఉంటే కదా, దానిని పొందాలి అనే కర్తవ్యం ఉంటుంది? చతుర్దశ భువనాలు తన లోనే ఉన్న పరమేశ్వరునికి లేనిదంటూ ఏముంది? కనుక ఆయన చేయదగింది కూడా లేదు (***కర్తవ్యం నాస్తి***). ఆయనకు లేనిది లేదు (***న అప్రాప్తం***). అలాగే ఉండ వలసింది లేకుండా పోయేదీ లేదు (***న అవాప్తవ్యం***). అయినా పరమేశ్వరుడు సదా కర్మల యందే ఉన్నాడు.

కార్యం అస్తి

చేయ వలసింది అంటూ ఏదీ లేకపోయినా, పొంద వలసిన దంటూ ప్రత్యేకంగా ఉండక పోయినా పరమేశ్వరుడు సదా కర్మల యందే ఉన్నాడు. కర్తవ్యమే లేకపోయినా, కర్మల యందే ఉన్నాడు (***వర్త ఏవ చ కర్మణి***).

తనకు ఏ అవసరం లేకపోయినా లోకసంగ్రహార్థం వాసుదేవుడు కర్మల్ని ఆచరించాడు. ఎంత చేస్తున్నా ఆనందానికి దూరం కాలేదు. నిర్విరామంగా శ్రీకృష్ణుడు కర్మలను ఆచరించినా, ఎప్పుడూ ఎవ్వరూ ఆయనను నీరసించినట్లు చూడలేదు. అలసి పోతే కదా నీరసం వచ్చేది? సంవత్సరాలు ఆడుతున్నా శ్వాసలు అలసి పోవడం లేదు. ఇక శ్వాసల్ని నడిపే పరమేశ్వరుడు అలసి పోతాడా?

కర్మల లోనే ఉన్నా, ఎన్నడూ కేశవుడు నిరాశ చెందలేదు. ఆశ ఉంటే కదా నిరాశ? లోక కళ్యాణార్థం సాగే మంగళ కార్యాలలో శోభే గాని క్షోభ ఉండదు. సమస్త కోరికలు తీరిన జ్ఞానులు లోకసంగ్రహార్థం కర్మలు చేస్తారు. అందుకు నిదర్శనం వాసుదేవుడే. జన్మించింది మొదలు శ్రీకృష్ణుడు కర్మకు దూరమైంది ఎప్పుడు? అలాగని కర్మల చేత బద్ధుడైనది ఎప్పుడు?

ఎప్పుడు చూచినా, ఎక్కడ చూచినా ఏదో ఒకటి చేస్తూనే కనిపించాడు. ఒకొక్కప్పుడు గోవుల్ని పూజిస్తూ కనిపిస్తాడు. మరొకప్పుడు కోతులకు వెన్న పెడుతూ అగుపిస్తాడు. రాక్షసుల్ని మట్టు బెడుతూ ఉంటాడు. గోవులను రక్షిస్తూ ఉంటాడు. ఆలమందల మధ్య పాడుతూ ఉంటాడు. అబలల మధ్య ఆడుతూ ఉంటాడు. బండి ఎక్కి హస్తినలో కనిపిస్తాడు. బండి దిగి ద్వారకలో దర్శన మిస్తాడు. ఆపదలో ఉన్నవాళ్ళను ఆదుకొంటూ ఉంటాడు. కవ్విస్తాడు. నవ్విస్తాడు. కనికరించి కడ తేరుస్తాడు.

రాయబారిగా పోయి రమ్మంటే రాజు లాగా పోయాడు. బండి తోలమంటే, బదులు చెప్పకుండా భారాన్ని భుజాన వేసుకున్నాడు. ధనంజయుడు దిగాలు పడి కూర్చుంటే, దివ్యంగా నిలబడి భగవద్గీతను బోధించాడు. అందరి మధ్యే ఉన్నా, అన్నీ చేస్తూ ఉన్నా అందం చెడకుండా శోభించాడు. వేడుకే గాని ఏడుపు తెలియని వాడు. ప్రమతో సదా వెలిగి పోయాడే గాని, భ్రమలో ఎప్పుడూ కుమిలి పోలేదు. అందించిన వాడే గాని అందుకున్న వాడు కాడు. అటుకులతో తృప్తి చెందాడు. అక్షయ సంపదల్ని అనుగ్రహించాడు.

మడుగులో దూకాడు. మేడల్లో కులికాడు. యమునలో ఈదాడు. వేణువును ఊదాడు. మన్ను అయినా వెన్న అయినా ఒకటే నన్నాడు. నిరంతరం చిరంతనమే. చిద్విలాసమే. అంతా లోకసంగ్రహార్థమే. పాలిచ్చిన తల్లికి మోక్షమే. విష మిచ్చిన రాక్షసికీ మోక్షమే. దగ్గర చేరిన వారందరూ దరి చేరి పోయారు. ఆయనకు సాటివాడే లేడు. ఇక మేటివాడు ఎలా వస్తాడు? అందుకే, **కృష్ణస్తు భగవాన్ స్వయమ్** - అంటూ భాగవతం నోరార కీర్తించింది.

అర్జునా! నేను శ్రేష్ఠుణ్ణి. జ్యేష్ఠుణ్ణి కూడా. అందుకే కర్తవ్యం లేక పోయినా ఆదర్శం కొరకు దివ్యంగా

కర్మల్ని ఆచరించాను. నాకు కర్తవ్యం లేదని నేను కర్మల్ని మానేస్తే, నన్ను చూచి కర్తవ్యం ఉన్నవాళ్ళు కూడా కర్మల్ని మానేస్తారు. శ్రేష్ఠుడు ఆ విధంగా అనాదర్శం కాకూడదు. ఎందు కంటావా? చెబుతాను, విను.

యది హ్యహం న వర్తేయం జాతు కర్మ ణ్యతన్ద్రితః ।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23

యది-హి-అహం-న-వర్తేయం-జాతు-కర్మణి-అతంద్రితః
మమ-వర్త్మ-అనువర్తన్తే-మనుష్యాః-పార్థ-సర్వశః

పార్థ	=	అర్జునా!	మనుష్యాః	=	మనుషులు
అహం	=	నేను	సర్వశః	=	అన్ని విధాల కూడా
జాతు	=	ఎప్పుడైనా	మమ	=	నా యొక్క
అతంద్రితః	=	అప్రమత్తుడనై	వర్త్మ	=	మార్గమును
కర్మణి	=	కర్మ యందు	అనువర్తంతే	=	అనుసరిస్తారు
న వర్తేయం యది	=	ప్రవర్తించ నట్లైతే			

పార్థా! నేను అప్రమత్తుణ్ణై కర్మల్ని ఆచరిస్తూ ఉంటాను. అలా కాకపోతే, జను లందరు నా మార్గమునే అనుసరిస్తారు. నా లాగే ప్రవర్తిస్తారు.

వ్యాఖ్య

అశ్రేష్ఠః శ్రేష్ఠానుసారీ - సామాన్యుడు శ్రేష్ఠుడైన వానిని అనుసరిస్తాడు అనే న్యాయాన్ని బట్టి శ్రేష్ఠులైన వారు సామాన్యులకు మార్గదర్శకులుగా ఉండాలి. ఇది చాలా ప్రశస్తమైన విషయం కనుక సర్వులలో జ్యేష్ఠుడు, సర్వులకు శ్రేష్ఠుడు అయిన సర్వేశ్వరుడే ఆచరించి ఆదర్శాన్ని నెలకొల్పాడు.

శ్రేష్ఠుడు అంటే ప్రధానమైన వాడు అని ముందు శ్లోకంలో చెప్పుకున్నాం. ఈ శ్రేష్ఠత్వము తరతమ భేదాలతో ఉంటుంది. ఒకరిని మించిన శ్రేష్ఠత్వము మరొకరిలో గోచరిస్తూ ఉంటుంది. అందరి కన్నా శ్రేష్ఠుడు పరమేశ్వరుడు. ఆయనే శ్రేష్ఠతముడు. శ్రేష్ఠు లందరూ పురుషులు. శ్రేష్ఠతముడైన భగవంతుడు పురుషోత్తముడు. సర్వులను అతిశయించిన ఐశ్వర్యము కలవాడు కనుక శ్రేష్ఠుడు (**సర్వాతిశయత్వాత్ శ్రేష్ఠః**). అలాగే, సర్వాతిశయుడైన పరమేశ్వరుడు సర్వులకు కారణమైన వాడు కనుక జ్యేష్ఠుడు (**సర్వ కారణత్వాత్ జ్యేష్ఠః**). సర్వమును సృష్టించిన భగవానుడు స్వయంగా మధురలో అవతరించి నపుడు సర్వ మానవాళికి ఆదర్శాన్ని అందించి, జ్యేష్ఠత్వానికి, శ్రేష్ఠత్వానికి పరిపూర్ణతను కలిగించాలని సదా కర్మల నాచరిస్తూ కనిపించాడు.

అనుకరణ అనేది ప్రతి వ్యక్తి లోను కొద్దో గొప్పో ఉంటుంది. అనుకరణ అనేది అసలే లేనివారు ఉండరు. అది ప్రతి మనిషికి జన్మ తోనే వస్తుంది. అందుకే అది సహజాతము (**జన్మనా సహ జాయతే**). ఈ సహజాత లక్షణం చేత మనుషులు శ్రేష్ఠుడైన వానిని అనుసరిస్తారు. అందుచేత శ్రేష్ఠుడు కర్మల విషయంలో అప్రమత్తుడై ఉండాలి. సోమరి కాకుండా ఉండాలి. అలసత్వము లేకుండా ఉండాలి. శ్రేష్ఠునిలో అజాగ్రత చోటు చేసుకుంటే, అనుకరించే వారు పరమ అజాగ్రత స్వరూపులై ఉంటారు. కనుకనే, అర్జునా! సోమరితనము లేకుండా, నేను ఈ విధంగా కర్మలలో ఉండక పోయినట్లైతే, జనులందరు నన్నే అనుసరిస్తారు. అందుకే అన్యులకు ఆదర్శంగా ఉండాలని కర్మల్ని ఆచరిస్తున్నాను. అది కూడా అలసత్వము లేకుండా ఆచరిస్తూ ఉన్నాను.

ప్రయాణము - ప్రమాదము

'తంద్రత' అంటే అలసత్వము, కునికిపాటు అని అర్థము. కార్యంలో అవశత్వమే 'తంద్రత'. శ్రీకృష్ణుడు

కార్యాచరణములో ఈ అవగుణానికి అవకాశం ఇవ్వలేదు (*అతన్ద్రితః అనలసః*). అప్రమత్తుడై కర్మల్ని ఆచరించాను అంటున్నాడు. తాను పొంద వలసింది ఏమీ లేకపోయినా, కర్మ చేయ వలసిన అవసరం తనకు లేకపోయినా, లోక సంగ్రహార్థం కర్మలు చేయడమే కాకుండా, ఆ కర్మల్ని అప్రమత్తుడై ఆచరించడం అద్భుతమైన విషయము. శ్రీకృష్ణు డంతటి శ్రేష్ఠతముడే అలా అప్రమత్తుడై ఉంటే, ఇక సామాన్యులైన మానవులు ఎంత జాగ్రతతో వ్యవహరించాలి? ఈ ఆలోచన సామాన్యులలో కలిగించడమే ఆదర్శము. ఆధ్యాత్మిక ప్రయాణంలో అలసత్వానికి మించిన శత్రువు మరొకటి ఉండదు. సర్వ నాశనాన్ని సృష్టించేది సోమరితనమే. సోమరి చిత్తము దయ్యాల కొంప అని ఆంగ్ల సామెత. అలసత్వాన్ని, ఏమరుపాటును పొరపాటుగా కాకుండా పిడుగుపాటుగా భావించారు మన పెద్దలు. అందుకే దానికి 'ప్రమాదము' అని పేరు పెట్టారు. ప్రమాదము, నిద్ర, అలసత్వము అనేవి తమోగుణ లక్షణా లని పద్దెనిమిదవ అధ్యాయంలో భగవంతుడే చెబుతాడు. అక్కడ ఈ మోహ జాడ్యాన్ని వివరంగా చర్చించు కుందాము.

మన సంస్కృతిలో అలసత్వాన్ని, అతినిద్రను చావు కన్నా హీనంగా చూశారు మన పెద్దలు. ఇదొక ప్రమాదావస్థ. అందుకే నేమో, నిద్ర మరణంతో సమాన మన్నారు. సామాన్యులు ఇలా అంటూ ఉండటం మనం విన్నాం. వింటున్నాం. కానీ మహాజ్ఞాని, బ్రహ్మపుత్రుడైన సనత్సుజాతుడు కూడా ధృతరాష్ట్రునితో అదే మాట అన్నాడు. **ప్రమాదో వై మృత్యుః** - ఈ ప్రమాదావస్థ చావుతో సమానము అన్నాడు. ఆధ్యాత్మిక మార్గంలో చరించే సాధకునికి నిద్ర, అలసత్వము, ప్రమాదము - వీటి స్వరూపమైన తంద్రత అశనిపాతము వంటిది అని శ్రీ ఆది శంకరాచార్య స్వామి కూడా నిర్ధారణ చేశారు.

ప్రమాదో బ్రహ్మనిష్ఠాయాం న కర్తవ్యః కదాచన

ఆధ్యాత్మిక మార్గంలో చరించే సాధకునికి అజాగ్రత్త, నిద్ర, మరపు అనే ప్రమాదావస్థ ఉండనే కూడదు అని ప్రకరణ గ్రంథంలో వ్యాఖ్యానించారు శ్రీ శంకరులు. ప్రమాదమే మృత్యువు (**ప్రమాదో మృత్యు రితి**) అని కూడా హెచ్చరించారు.

ప్రమాదావస్థలో మనిషి ఏం చేస్తాడు? అలసత్వ మున్నవాడు ఆచరించే దేముంటుంది? నిద్రించే వాడు చూసే దేముంటుంది? చేసే దేముంటుంది? ఏదీ చేయకుండా ఉండేవాడు ఏమి పొందుతాడు? ఏదీ చేయలేని కారణానికి ఏదీ పొందలేని కార్యమే గదా ఫలితం! అదే చావు అని ఆచార్యుల అభిప్రాయం.

అర్జునా! అందుచేతనే చేయ వలసిం దంటూ నాకు ప్రత్యేకంగా ఏదీ లేకపోయినా, ప్రమాదానికి గురి కాకుండా కర్మల్ని ఆచరిస్తున్నాను. నేను కనుక కర్మల్ని విడిచి పెడితే, శ్రీకృష్ణుడి కన్నా శ్రేష్ఠు లెవరు? మనం కూడా ఆయన మార్గం లోనే పోదామని వాళ్ళ బలహీనతకు వాళ్ళే బలాన్ని చేకూర్చు కుంటారు. అందుకే అలాంటి అలసత్వానికి అవకాశం ఇవ్వకుండా నేను కర్మల నాచరించి నా శ్రేష్ఠత్వాన్ని నిరూపించు కుంటున్నాను.

కృష్ణా! నీవు షడ్గుణైశ్వర్య సంపన్నుడవు కదా! నీలో కళ్యాణ గుణాలు అనేకం ఉన్నాయి. జ్ఞాన సంపద సమగ్రంగా ఉంది. ఆ విషయాలలో కూడా జనులు నిన్ను అనుకరించ వచ్చు కదా! మరి, అలా అనుకరించడం లేదు ఎందుకని?

అర్జునా! మనస్తత్త్వ శాస్త్రం తత్త్వశాస్త్రంలో ఒక అంశం. ఇది మనస్తత్త్వ శాస్త్రానికి సంబంధించిన ప్రశ్న. అనుకరణలో ఒక విధమైన ఉన్మాదం విచిత్రంగా చోటు చేసుకొని ఉంటుంది. అనుకరించ వలసిన విషయాలు ఎదుటి వ్యక్తిలో అనేకం కనిపిస్తూ ఉన్నా, వాటిలో తన మనస్తత్త్వానికి, తన అభిరుచికి అనుగుణమైన దానినే అనుకరించే వాడు ఎన్నుకుంటాడు. ఇదొక మానసిక దౌర్బల్యం.

శ్రేష్ఠుడు భోంచేస్తాడు. పని చేస్తాడు. అనుకరించే వాడు భోజనాన్ని మాత్రమే అనుసరిస్తాడు. పని చేయడాన్ని అనుకరించడు. ఎందుకని? పని చేయడం కన్నా చెయ్యకుండా ఉండటమే అతడికి ఇష్టం. ఈ ప్రపంచంలో ఏది చెయ్యాలన్నా ఒళ్ళు వంచక తప్పదు. అది ఎవ్వరికీ ఇష్టం ఉండదు. ఏమి చెయ్యకుండానే అన్నీ వచ్చి ఒడిలో పడాలి అనేదే అందరికీ ఇష్టం. ఎవరైనా ఇష్ట మైనదే కదా చేస్తారు?

శ్రేష్ఠుడు ఆలయానికి వెళ్తాడు. అలాగే సినిమాకు కూడా వెళ్తా డనుకోండి. అనుసరించే వాడు ఆలయానికి వెళ్ళాలని సంకల్పించడు. సినిమాకు పోవడానికే సిద్ధ పడతాడు. అదేమంటే శ్రేష్ఠుణ్ణి కారణంగా చూపిస్తాడు. కనుక, అనుసరించే వాడి బలహీనతను కూడా దృష్టిలో ఉంచుకొని శ్రేష్ఠుడు అప్రమత్తుడై వ్యవహరించాలి. తాను అదే చేస్తున్నట్లు పరమేశ్వరుడు చెబుతున్నాడు.

ఒకవేళ, శ్రేష్ఠుడైన తాను అలా జీవించక పోతే ఏమి జరుగుతుందో కూడా చెబుతున్నాడు.

ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః ॥ 24

ఉత్సీదేయుః-ఇమే-లోకాః-న-కుర్యాం-కర్మ-చేత్-అహం
సంకరస్య-చ-కర్తా-స్యాం-ఉపహన్యాం-ఇమాః-ప్రజాః

అహం	= నేను	సంకరస్య చ	= సంకరానికి కూడా
కర్మ	= కర్మను	కర్తా	= కారకుణ్ణి
న కుర్యాం చేత్	= చేయనిచో	స్యాం	= అవుతాను
ఇమే	= ఈ	ఇమాః	= ఈ
లోకాః	= లోకములు	ప్రజాః	= ప్రజలను
ఉత్సీదేయుః	= నశిస్తాయి	ఉపహన్యాం	= చెడగొట్టిన వాడ నవుతాను

నేను కర్మ చేయడం మానేస్తే, ప్రజలు కూడా కర్మలు చేయకుండా చెడి పోతారు. కర్మ సంకరానికి నేను కర్త నవుతాను. ప్రజల్ని పాడు చేసిన వాణ్ణి కూడా అవుతాను.

వ్యాఖ్య

ప్రారబ్ధ కర్మను అనుభవించ డానికి పుట్టిన వాళ్ళం మనం. విశ్వ ప్రభుత్వమును నడిపే నియంత పరమేశ్వరుడు. ఏవేవో కావాలని తాపత్రయపడే వాళ్ళం మనం. ముల్లోకాలలో పొంద వలసింది అంటూ ఏదీ లేని పురుషోత్తముడు భగవంతుడు. అయినా, ధర్మ సంస్థాపనార్థం అవతారాన్ని ధరించి నపుడు, సర్వ మానవాళికి ఆదర్శాన్ని నిర్దేశించేందుకు తాను మానవులు ఆచరించే సామాన్య కర్మల్ని ఆచరించాడు. వాటినే మహిమాన్వితంగా ఆచరించి మహికి మహోజ్వలంగా కర్మయోగ దిశా నిర్దేశం చేశాడు.

అకర్మ అనాదర్శం

అర్జునా! అకర్మ కారణంగా లోకాలు నశిస్తాయి. లోకులు కూడా నశించి పోతారు. కనుక, జగత్తు యొక్క స్థితికి కర్మ అవశ్యమై ఉంది. అలాంటి కర్మ విషయాన్ని నేను ఉపేక్షిస్తే లోక నాశనానికి కారణ మవుతాను.

కర్మ లేకపోతే యజ్ఞాలు ఎలా జరుగుతాయి? యజ్ఞాలు జరగక పోతే దేవతలకు హవిర్దానము ఎలా అందుతుంది? హవిస్సులతో దేవతలు సంతృప్తి చెందక పోతే, వర్షా లెలా వస్తాయి? ఒకవేళ వచ్చినా, అతివృష్టి, సునామీలు వస్తాయి. అలాంటప్పుడు పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయా? ఉండవు. ఇక లోకం నశించకుండా

ఎలా ఉంటుంది? అందుకే నాకు అవసరం లేకపోయినా నేను కర్మను ఆచరిస్తున్నాను. నేను కనుక కర్మను ఆచరించడం మానేస్తే **(న కుర్యాం కర్మ చేత్ అహం)** ఈ లోకాలన్నీ **(ఇమే సర్వే లోకాః)** నశించి పోతాయి **(ఉత్సీదేయుః వినశ్యేయుః)**. ఈ విధంగా కర్మ సంకరానికి, లోక వినాశానికి నేను కారణ మవుతాను. నేను చేయడం లేదని అందరూ చేయడం మానేస్తారు.

అర్జునా! చేతులు కనిపిస్తాయి కనుక అందరూ చూడ గలుగుతారు. బుద్ధిని చూడ గలిగే సూక్ష్మదర్శిని ఎవరి వద్ద ఉంది? నేను చేసే కర్మల్ని అందరూ చూడ గలరు. నాలోని జ్ఞానాన్ని చూచే శక్తి ఎవరి కుంది? జ్ఞానం బుద్ధిలో అర్థం చేసుకునేది కనుక అది అందరికీ సాధ్య పడదు. కర్మలు కళ్ళకు కనిపిస్తూ ఉంటాయి కనుక, అర్థం కాక పోయినా అందరూ అనుసరించ గలరు. అలాంటప్పుడు నేను కర్మలు చేయకుండా ఎలా ఉంటాను? జ్ఞానైశ్వర్యంతో శోభించే నేనే కర్మలు ఆచరించే టప్పుడు, జ్ఞానము లేని వాళ్ళు ఆచరించకుండా ఎలా ఉండ గలరు? అయినా, జ్ఞానం లేని వాళ్ళు కర్మల్ని మానేస్తే జ్ఞానం వస్తుందా? కర్మల్ని మానేసి మరే విధంగా జ్ఞానాన్ని పొందుతారు? చూడు అర్జునా! త్రాగేది పాలే అయినా, పట్టడానికి పాత్ర ఉండాలి. పాలు ఇవ్వండి అంటే గ్లాసుతో తెచ్చిస్తారు. నేను అడిగింది పాలు కదా, గ్లాసు ఎందుకు తెచ్చావు, అంటే ఎలా? గ్లాసును ఎవ్వరూ మింగరు. కాని, గ్లాసు లేకుండా ఎవ్వరూ పాలు త్రాగలేరు. జ్ఞానామృతాన్ని పానం చేయడానికే అందరూ ఉన్నారు. కాని, కర్మపాత్ర లేకుండా జ్ఞానక్షీరాన్ని పానం చేయడం సాధ్యం కాదు. జ్ఞానాత్పూర్వం కర్మను త్యజించడం వినాశానికి దారి తీస్తుంది.

దూరమైతే దుర్గతే

జ్ఞానం లేని వారు కర్మకు దూరమైతే దుర్గతి ప్రాప్తిస్తుందే గాని సద్గతి లభించదు. భౌతికం గాను, బౌద్ధికం గాను వినాశమే దాపురిస్తుంది. ప్రగతి అనేది పని చేయడం మీదే ఆధారపడి ఉంటుంది. తరతమ భేదాలు పని చేసి నపుడే గోచరిస్తాయి. ఏ పనీ చేయని వారిలో తరతమ వ్యత్యాసాలు ఎలా ఉంటాయి?

జ్ఞానం లేని మనిషి మనస్సులో ఏముంది? అజ్ఞానము ఉంది. అజ్ఞానము ఎప్పుడైతే ఉందో, దాని నంటి పెట్టుకొని రాగద్వేషా లుంటాయి. స్వార్థం ఉంటుంది. అభిమానం ఉంటుంది. అహంకారం ఉంటుంది. మమకారం ఉంటుంది. వీటి మధ్య జ్ఞానం నిలుస్తుందా? మరి ఇవన్నీ దూరం అయ్యే దెలా? కర్మ చేయక పోతే ఇవన్నీ ఎలా అదృశ్య మవుతాయి?

కర్మ చేయక పోతే పోవలసినవి పోవు. రావలసినవి రావు. మనిషిలో జ్ఞానాభిలాష ఉండవచ్చు. కాని, జ్ఞానాశ చిగురించదు. కాంతి కనిపించదు. అంతా చీకటే ఉంటుంది. నిరాశే అలుము కుంటుంది. నిరాశా జీవి తానేమి సుఖ పడతాడు? సమాజాన్ని ఏమి సుఖ పెడతాడు?

మొక్కలో పువ్వు లాగా సమాజంలో మనిషి శోభించాలి. మొక్కలో ఎండిపోయిన కట్టెపుల్ల లాగా సమాజంలో వ్యక్తి ఉండ కూడదు. అలా ఉండటం వల్ల తనకు వెలుగు ఉండదు. సమాజానికి శోభ ఉండదు.

కర్మకు దూరమైన సమాజం ఈ విధంగా దుఃఖభూయిష్ట మవుతుంది. నిరాశా జీవులకు నిలయమైన సమాజం నిర్వీర్యమై నీరసించి పోతుంది. నవ్వుతూ, నవ్వించే వాడు ప్రక్కనే ఉంటే, నవ్వలేని వాడు కూడా నవ్వుతూ ఉంటాడు. ఏడ్చేవాడు ప్రక్కన చేరితే, నవ్వేవాడు కూడా కొంత కాలానికి నవ్వును మరచి పోతాడు. ఒక దశలో, నవ్వంటే ఏమిటి? అని ప్రశ్నించినా మనం ఆశ్చర్యపో నవసరం లేదు.

ముసిముసి నవ్వుల పసితనాన్ని మొగ్గ లోనే త్రుంచేసి, నవ్వు ముసలిదైన తరువాత, మైదానాలలో నిలబెట్టి, కొనితెచ్చుకొని కేరింతలు కొట్ట మనడం నవ్వు అవుతుందా? లేక నవ్వులాట అవుతుందా? హో - హో అంటూ కేరింతలు కొడితే నవ్వు వస్తుందా? రాని నవ్వుకు ఆహ్వానం ఇలాగేనా?

నవ్వును కర్మగా భావించడం ఈ దురవస్థకు కారణం. నవ్వు పువ్వు లాంటి దని తెలియక పోవడం వల్లే కేరింతలకు కాళ్ళొచ్చాయి. మొగ్గను నలిపితే సువాసన రాదు. పువ్వు వికసిస్తే పరిమళాన్ని ఎవ్వరూ ఆపలేరు. నవ్వు వస్తే ఆపుకో గలరా? నవ్వు రానపుడు తెచ్చుకో గలరా? నవ్వు కనుక కర్మే అయితే, ఆపడం కష్టం కాదు. ప్రయత్నించి పొందడమూ కష్టం కాదు. కానీ, అది సాధ్యమయ్యే పనేనా?

బ్రతుకు పువ్వు కావాలి
పువ్వే నవ్వుగా రావాలి
పలుకులు కావాలి పూలరేకులు
కమ్మని భావాలు పరిమళాలు
సుమ సౌందర్యమె జీవనము
నిత్యానందమే మకరందము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

తృప్తిగా భోం చేసిన వాడే త్రేపుతాడు. భోం చేయడం కర్మ. కాని త్రేపు మాత్రం ప్రయత్నంతో చేసే కర్మ కాదు. తృప్తిగా భోం చేయడం వల్ల కలిగిన ఫలితం. భోజనం అనే కర్మే జరగ నపుడు, త్రేపు ఎలా వస్తుంది? ఆకలితో ఉన్నవాడు తృప్తిగా భోజనం చేసినట్లు అభినయిస్తూ, మైదానాలలో నిలబడి త్రేపినట్లు శబ్దాలు చేస్తే అది నిజంగా త్రేపడం అవుతుందా?

యుద్ధకర్మను ఆచరించడం అనే దోషం వల్ల జాతి సంకరం ఏర్పడు తుందని (**వర్ణసంకర కారకైః**). తద్వారా ఏర్పడే ధర్మచ్యుతి వల్ల నరకం ప్రాప్తిస్తుందని (**నరకే నియతం వాసః భవతి**) తాను పూర్వం విని ఉన్నట్లు (**అనుశుశ్రుమ**) అర్జునుడు తన విషాదంలో ఆలపించాడు.

దానికి వ్యతిరిక్తమైన భావనను భగవంతుడు ఈ సందర్భంలో వినిపిస్తున్నాడు. అర్జునా! ఒకవేళ నువ్వు అలా గతంలో విని ఉంటే విని ఉండ వచ్చు. కాని, అది మాత్రం విన దగింది కాదు. విన దగింది ఏమిటో నేను వినిపిస్తాను. విను. కర్మ చేస్తే కాదు సంకరం ఏర్పడేది, కర్మ చేయక పోవడం వల్ల ఏర్పడుతుంది. సంకరం ప్రాప్తిస్తుందని నువ్వు కర్మ మానేస్తాను అంటున్నావు. కర్మ చేయక పోతే నేను సంకరానికి కారణ మవుతానని నేను కర్మ చేస్తున్నాను.

అర్జునా! కర్మ నాశనానికి దారి తీస్తుందని నువ్వు కర్మను త్యజించాలి అంటున్నావు. కర్మను మానేస్తే వినాశం వస్తుందని నేను కర్మ చేస్తున్నాను అంటూ, అర్జునుడు వినిపించిన మాటల్నే తిరిగి పలుకుతూ, కర్మకు నూతన భాష్యాన్ని వినిపిస్తున్నాడు భగవంతుడు.

అర్జునా! నేను ప్రజల్ని అనుగ్రహించ వలసిన వాణ్ణి. కాని, కర్మ చేయడం మానేస్తే, వాళ్ళ వినాశానికి కారణ మవుతాను (**ప్రజానామ్ అనుగ్రహాయ ప్రవృత్తః ఉపహతిమ్ ఉపహననం, కుర్యామ్ ఇత్యర్థః**). అలా చేయడం భగవంతుణ్ణే అయిన నాకు తగిన దేనా? చెప్పు (**మమ ఈశ్వరస్య అననురూపమ్ ఆపద్యేత**). అందుకే అవసరం లేకపోయినా కర్మాచరణలో ఉన్నాను. నేనే ఆచరించే టప్పుడు, నువ్వు ఆచరించకుండా ఎలా ఉంటావు? పార్థా! అందరూ కర్మలు చేయాల్సిందే.

కాకపోతే, అజ్ఞానులు ఫలాపేక్షతో సకామ కర్మల యందు నిమగ్నమై ఉంటారు. జ్ఞానులు ఫలాపేక్ష లేకుండా లోక సంగ్రహార్థం కర్మలు చేస్తూ ఉంటారు. అదే తేడా. విను.

సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథాఽసక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥ 25

సక్తాః-కర్మణి-అవిద్వాంసః-యథా-కుర్వంతి-భారత
కుర్యాత్-విద్వాన్-తథా-అసక్తః-చికీర్షుః-లోకసంగ్రహం

భారత	= అర్జునా!	తథా	= అట్లే
అవిద్వాంసః	= అవివేకులు	విద్వాన్	= జ్ఞాని
కర్మణి	= కర్మ యందు	లోకసంగ్రహం	= లోక సంగ్రహమును
సక్తాః	= ఫలాపేక్ష కలిగి	చికీర్షుః	= చేయ దలచిన వాడై
యథా	= ఏ విధంగా	అసక్తః	= ఫలాపేక్ష లేకుండా
కుర్వంతి	= చేస్తారో	కుర్యాత్	= చెయ్యాలి

అర్జునా! జ్ఞానము లేని వారు ఫలాపేక్షతో కర్మలను ఆచరిస్తూ ఉంటారు. జ్ఞాని కూడా అలాగే కర్మలు చేస్తూ ఉంటాడు. కాకపోతే, ఫలాపేక్ష లేకుండా ఉంటాడు. లోక హితార్థము చేస్తూ ఉంటాడు.

వ్యాఖ్య

జ్ఞాననిష్ఠలో ఉన్న కొందరు కర్మల విషయంలో విముఖతను చూపుతూ ఉంటారు. జీవితాన్ని ఎంతో చూశాము. చేయ వలసిన కర్మ లన్నీ చేశాము. కర్మల వల్ల సాధించేది ఏముంటుంది? కర్మల నుండి విరమించే సమయం ఆసన్నమైంది. ఇక విరామమే ఆరామం. నైష్కర్మ్యమే కర్తవ్యం అని చాలా మంది భావిస్తూ ఉంటారు. చేసింది చాలు. చూసింది చాలు. ఇక ఏమి చెయ్యాలి? ఏమి చూడాలి? నాలో నన్ను చూసుకోవడమే చేయ వలసింది అనుకొంటూ ఉంటారు. ఈ అభిప్రాయంతో గీతాచార్యుడు ఏకీభవించడం లేదు.

వైఖరి లోనే వ్యత్యాసం
వ్యవహారంలో కాదు

ఆత్మజ్ఞానము కలవారు విద్వాంసులు. ఆత్మజ్ఞానం లేనివారు అవిద్వాంసులు. ఉభయులూ కర్మల లోనే ఉంటారు. వారు చేసే కర్మలు ఒకే విధంగా ఉంటాయి. కాని, ఆ కర్మల విషయంలో వారి వైఖరి యందు అజగజాంతర వ్యత్యాసం ఉంటుంది. అంటే, మేకకు ఏనుగుకు ఉన్నంత తేడా ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే సామ్యమే ఉండదు.

అజ్ఞాని కర్మలు చేస్తాడు. జ్ఞాని కూడా కర్మలు చేస్తాడు. ఇద్దరూ కర్మల లోనే ఉంటారు. కాని, కర్మాచరణంలో వారి దృక్పథాలు భిన్నంగా ఉంటాయి. కర్మ ఫలాపేక్షతో అజ్ఞాని కర్మ చేస్తాడు. ఫలాసక్తి లేకుండా జ్ఞాని కర్మలను ఆచరిస్తాడు. 'నేను చేస్తున్నాను' అనే కర్తృత్వ బుద్ధి అజ్ఞానిలో ఉంటుంది. 'చేయదగింది కనుక చెయ్యాలి' అని, కర్తృత్వ బుద్ధి లేకుండా జ్ఞాని కర్మను ఆచరిస్తాడు.

కర్మ ఫలాపేక్ష ఉంది కనుక అజ్ఞానులు కర్మలకు అంటుకొని పోతారు (*సక్తాః*). ఆప్తకాముడైన జ్ఞానికి ఫలాపేక్ష లేనందున ఆసక్తి లేకుండా కర్మ నాచరిస్తాడు (*అసక్తః*). అజ్ఞాని ఆచరించే కర్మమార్గము బంధాన్ని కలిగించి, జన్మల్ని అందిస్తుంది. జ్ఞాని ఆచరించే కర్మలు బంధాలను తొలగించి, మోక్షాన్ని అనుగ్రహిస్తాయి.

తాము భోగించ డానికే ఈ ప్రపంచం ఉంది అని భావించి అజ్ఞానులు కర్మల్ని ఆచరిస్తారు. కర్తృత్వంతో కర్మలకు అంటుకు పోతారు. అలాగే భోక్తృత్వం వల్ల ఫలాలతో సంగత్వం కలిగి ఉంటారు.

సృష్టి లోని నియతిని అర్థం చేసుకుంటూ, చేయవలసిన కర్మను జ్ఞాని లోక సంగ్రహార్థం ఆచరిస్తాడు. కర్తృత్వాభిమానం లేకుండా నిష్కామంగా చేస్తాడు కనుక జ్ఞాని కర్మలకు అంటడు. పరానుగ్రహార్థం ఆచరిస్తాడు కనుక ఫలాభిసంధి లేకుండా ఉంటాడు.

అజ్ఞానిలో అంతా స్వార్థమే. తన కొరకే తాను కర్మల్ని ఆచరిస్తాడు. జ్ఞానిలో అంతా పరార్థమే. లోక సంగ్రహార్థమే జ్ఞాని కర్మల్ని ఆచరిస్తాడు. అజ్ఞానికి తన దేహమే సర్వం. సర్వాన్ని తన కొరకు వినియోగించు కోవడానికి ఏ మాత్రం వెను కాడని స్వభావమే సొంతం. జ్ఞానికి సర్వం తన దేహమే. సర్వానికి తన సేవల్ని విస్తరించ డానికి నిరంతరం ధర్మ జీవనాన్ని కొనసాగించడమే సొంతం.

కర్మలు చేయడంలో ఉభయులు ఒకే విధంగా కనిపిస్తారు. అజ్ఞాని కర్మల్ని ఎంత ఉత్సాహంతో చేస్తాడో, జ్ఞాని కూడా అంతే ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ కర్మల్ని ఆచరిస్తాడు. వ్యవహారంలో ఇద్దరూ ఒకే విధంగా కనిపించినా, వైఖరిలో చాలా వ్యత్యాసం ఉంటుంది. జ్ఞాని చాలా విలక్షణంగా అగుపిస్తాడు. కర్తృత్వ బుద్ధి లేకుండా ఉండటం, ఫలాసక్తి లేకుండా కర్మల్ని ఆచరించడం, సాకల్య వైకల్యాల యందు, అంటే కర్మ సఫలమైనా, నిష్ఫలమైనా, పూర్ణంగా ఫలించినా పాక్షికంగా ఫలించినా, హర్షవిషాదాలకు లోను గాకుండా ఉండటం జ్ఞాని లోని వైలక్షణ్యము.

కళ్యాణప్రదం

రాగద్వేషాలు మనస్సు నుండి రాలిపోతాయి. ఫలాసక్తి బుద్ధి నుండి జారి పోతుంది. స్వార్థం కళ్ళ ముందే కరిగి పోతుంది. సంయమవంతు డైన జ్ఞాననిష్ఠుడు సదా కర్మలలో కదులుతూనే ఉన్నా బంధం లేకుండా ఉంటాడు. సదా ఆనంద మగ్నుడై ఉంటాడు.

ఫలాసక్తి ఎప్పుడైతే లేదో, కర్మలలో తారతమ్యం అర్థం కాదు. చెయ్య వలసింది చెయ్యడమే గాని, ఇష్టాయిష్టాలు కర్మాచరణంలో కనిపించవు. లేకపోతే, విశ్వసారథి విజయసారథి అవుతాడా? గుఱ్ఱాలను శుభ్రం చేసినా, రథాన్ని సిద్ధం చేసినా, మునికోలను చేత పట్టినా, మునీశ్వరుడై వేదాంత రహస్యాలను విశిష్టంగా బోధించినా - ఆ రూపంలో మార్పు లేదు. ఆ స్వరూపంలో మార్పు లేదు. ఆ నవ్వులో మార్పు లేదు. ఆయన నడకలో మార్పు లేదు. వ్యవహారం మారుతూ ఉండే గాని వైభవం మారడం లేదు.

అందుకే నేమో! ఆ రూపాన్ని ఎంత చూచినా తనివి తీరడం లేదు (***రూపం అత్యద్భుతం హరేః***). గొప్ప ఆశ్చర్యం కలుగుతోంది (***విస్మయః మే మహాన్***). క్షణక్షణం ఆనంద వీక్షణమే (***హృష్యామి చ పునః పునః***) అని పరమాత్మ రూప వైభవాన్ని వర్ణిస్తూ సంజయుడు పరవశించి పోయాడు కురుక్షేత్రంలో.

రూపాన్ని చూచి సంజయుడు పులకరిస్తే అమృత వాక్యాలను విని అర్జునుడు తన్మయు డవుతున్నాడు. మళ్ళీ మళ్ళీ మాట్లాడమని అర్థిస్తున్నాడు. చెవులను దోసిళ్ళుగా చేసికొని గీతా పీయూషాన్ని ఎంత పానం చేసినా తృప్తి కలగడం లేదని కురుక్షేత్రంలో కుంతీ నందనుడు కదిలి పోతున్నాడు (***భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽ మృతమ్***).

ఇదంతా జ్ఞానంతో కర్మలలో చరిస్తున్న జ్ఞాని వైభవం. మాటలకు అందని మాధవ వైభవం. మనస్సుకు చిక్కని మధుసూదనుని ప్రాభవం. లోక కళ్యాణార్థం నిష్కామంగా ఆచరింప బడే అలౌకిక కర్మ వైభవం.

చిట్టి నా పొట్టకు శ్రీరామరక్ష - చిన్ని నా ఇంటికి మరొక లక్ష అనే మంత్రాన్ని సదా జపిస్తూ, స్వార్థపరుడు ఉత్సుకతతో సంసారంలో ఊగుతూ ఉంటే, **ధర్మస్య జయోఽ స్తు - విశ్వస్య కళ్యాణమస్తు** అనే విశిష్ట భావనతో, నిష్కాముడైన జ్ఞాననిష్ఠుడు పరమోత్సాహంతో ప్రపంచంలో ఊరేగు తున్నాడు.

అజ్ఞానులు ఏ విధమైన అభినివేశంతో ఆసక్తులై కర్మలు ఆచరిస్తున్నారో, జ్ఞాని కూడా అదే అభినివేశంతో
అసక్తుడై కర్మల్ని ఆచరిస్తూ ఉంటాడు. వ్యత్యాస మంతా వైఖరి లోనే గాని వ్యవహారంలో కాదు. భేద మంతా
మనస్సు లోనే గాని మనుగడలో కాదు.

రెండు సరోవరాలు ఉన్నాయి. జలపూర్ణంగా గోచరిస్తున్నాయి. గట్టున నిలబడి చూస్తే రెండిటిలో భేదం
లేదు. వాటి లోకి దిగితే భేదం అర్థ మవుతుంది. ఒక సరోవరం లోని జలం బురదతో నిండి ఉంటుంది.
మరొక సరోవరం లోని జలం స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటుంది.

బురద నిండిన సరోవరం లాగా ఫలాసక్తి గల అజ్ఞాని మనస్సు ఉంటే, నిర్మలోదకంతో పవిత్రంగా ఉన్న
సరోవరం లాగా నిష్కాముడైన జ్ఞాని మనస్సు ఉంటుంది. అందుచేతనే జ్ఞాననిష్ఠుని కర్మలు నిర్మలంగా
ఉంటాయి. పవిత్రంగా ఉంటాయి. పరానుగ్రహార్థం శోభిస్తూ ఉంటాయి.

ఇదంతా జ్ఞాని ఎందుకు చేస్తున్నట్లు? (***తద్వత్ కిమర్థం కరోతి***) లోక సంగ్రహార్థమే జ్ఞాని ఇదంతా
చేస్తున్నాడు (***చికీర్షుః లోక సంగ్రహమ్***). పరానుగ్రహార్థమే పరమేశ్వరుడు కూడా ప్రస్తుతం రథాన్ని నడుపు
తున్నాడు.

చేసే చేతలలో, పలికే పలుకులలో, చూచే చూపులలో - జ్ఞాని ఎక్కడున్నా, ఏమి చేసినా అతని
హృదయంలో జ్ఞానజ్యోతి సదా ఆరకుండా వెలుగుతూ ఉంటుంది. అందుకే ఫలాసక్తిని వీడి పరానుగ్రహార్థం
(***లోక సంగ్రహమ్***) సదా చికీర్షుడై ఉంటాడు. ***చికీర్షుః*** అంటే ***కర్తుం ఇచ్ఛుః*** - అంటే, చెయ్యడానికి ఇచ్ఛ కలిగి
ఉంటాడు అని అర్థం.

క్రతువు లోన వసంత ఋతువు లోన
వేదనాదము వినిపించు యెదల లోన
యతుల హృదయాన వెలిగేటి వెలుగు నీవు
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని విశ్వనాథుని విమల చరణ సన్నిధిలో ఒక విభూదిపండు.

అజ్ఞానులు ఆసక్తితో ఉంటారు. అది వారికి సహజం. అలాగని, వాళ్ళను నిరసించ కూడదు. తాను
ఆచరించే కర్మల ద్వారానే జ్ఞాని అజ్ఞానులను సన్మార్గంలో ఉంచాలి. అదే చెబుతున్నాడు.

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసఙ్గినామ్ । 26
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్తః సమాచరన్ ॥

న-బుద్ధిభేదం-జనయేత్-అజ్ఞానాం-కర్మసంగినాం
జోషయేత్-సర్వకర్మాణి-విద్వాన్-యుక్తః-సమాచరన్

కర్మసంగినాం	= కర్మఫలాసక్తు లైన		యుక్తః	= అభియుక్తుడై
అజ్ఞానాం	= అజ్ఞానులకు		సర్వ కర్మాణి	= సమస్త కర్మలను
బుద్ధిభేదం	= బుద్ధి చలనమును		సమాచరన్	= చక్కగా ఆచరిస్తూ
న జనయేత్	= కలిగించ కూడదు		జోషయేత్	= చేయించాలి
విద్వాన్	= జ్ఞాని			

జ్ఞాని యైనవాడు అజ్ఞానుల బుద్ధిని కలతపెట్ట కూడదు. తాను యోగయుక్తుడై సమస్త కర్మలను నేర్పుతో
ఆచరిస్తూ ఉండాలి. ఇతరులు కూడా అలాగే ఆచరించేటట్లు చూడాలి.

వ్యాఖ్య

తాను పొంద వలసింది ఏదీ లేకపోయినా, లోక సంగ్రహార్థం జ్ఞాని కర్మలను ఆచరిస్తూనే ఉన్నాడు. కానీ, జ్ఞానం ప్రతి ఒక్కరు పొంద దగినదే అయినా, అజ్ఞానులను జ్ఞానం వైపు త్రిప్పి వారి బుద్ధిని జ్ఞాని కలత పెట్ట కూడదు. కర్మాసక్తులైన వారి బుద్ధికి పట్టని తాత్త్విక విషయాలను వారికి బోధించి మనస్సును కలవర పరచ కూడదు.

అవసరమే కాదు - అర్హత కూడా ఉండాలి

కర్మల యందు ఆసక్తి గల అజ్ఞానుల బుద్ధిలో భేదాన్ని కలిగించ కూడదు అంటున్నాడు భగవానుడు. బుద్ధిభేదం అంటే బుద్ధిలో అస్థిరత్వం అని భావము. 'భేదనం' అంటే చాలనం. చలింప చేయడం అని అర్థం. మరి, చలింప చేసేది దేనిని? అంతవరకు ఏదైతే చలనం లేకుండా స్థిరంగా ఉండిందో దానిని. మరి అంత వరకు కర్మాసక్తులైన అజ్ఞానులలో చలించ కుండా స్థిరంగా ఉన్న దేమిటి?

'నేను ఈ కర్మ చెయ్యాలి; ఆ ఫలితాన్ని అనుభవించాలి' (**మయా ఇదం కర్తవ్యమ్, భోక్తవ్యం చ అన్య కర్మణః ఫలమ్**) అనే నిశ్చితమైన బుద్ధి అజ్ఞానులలో స్థిరంగా ఉంటుంది. అట్టి బుద్ధిని చలింప చేయడమే 'బుద్ధిభేదం'. దానిని కలిగించ కూడదు (***తం న జనయేత్, న ఉత్పాదయేత్***) అంటున్నాడు. జ్ఞానులైన వారికి, జ్ఞానం కలిగి ఇతరులకు బోధ చేసే వారికి శ్రీకృష్ణుడు అనుగ్రహిస్తున్న సందేశం ఇది.

'దేవుణ్ణి ఏ కోరికలు కోర కూడదు. మోక్షాన్నే కోరుకోవాలి. మోక్షం జ్ఞాన రూపంలో ఉంది. కనుక జ్ఞానాభ్యాసం చెయ్యాలి. కర్మలు అజ్ఞాన జనితం. కర్మల్ని త్యజించాలి. నేను అకర్తను - అభోక్తను అని సదా భావిస్తూ ఉండాలి. . .' ఇలాంటి మాటలతో సకామ కర్మలను ఆచరించే వారి బుద్ధిని జ్ఞాని కలత పెట్ట కూడదు.

పైన పలికిన వాక్యాలు సత్యాలే కావచ్చు. ప్రతి ఒక్కరికి వాటి అవసరం ఒకనాడు కలగవచ్చు. అలాగని కర్మ ఫలాపేక్షతో కర్మల్ని ఆచరించే అజ్ఞానులకు, జ్ఞానార్హత లేని వారికి అవన్నీ బోధించి ఏమి ప్రయోజనం?

దేవుణ్ణి ఏదీ కోరకూడదు అంటే ఎలా? భగవంతుని ముందు కాకపోతే మరెవరి ముందు చెయ్యి చాపాలి? ఆయనను మించిన దాత ఎవరు? అడిగింది ప్రాప్తిస్తుందా, లేదా? అనేది వేరే విషయం. అడగ వలసిన అవసరం వచ్చి నపుడు దృష్ట నష్ట స్వభావం కలిగిన ఈ ప్రపంచం ముందు మోకరిల్లడం కన్నా, భక్తవత్సలు డైన పరమేశ్వరుని ముందు నిలబడి ప్రార్థించడం యుక్తం కాదా? ఆ విధంగా నైనా రెండు చేతులెత్తి భగవంతునికి నమస్కరించే అదృష్టం ఆర్తుడికి లభిస్తుంది.

పిల్లవాడు చందమామను కోరుకోవడం తప్పా? కోరిక కదలి నప్పుడు తల్లిదండ్రుల్ని గాక మరెవరిని అడుగుతాడు? అడిగి నంత మాత్రాన వస్తుందా, అనే పిడివాద మెందుకు? పిల్లవాడు కనుక అర్థం గాక అడిగాడు. అర్థం గాక పిల్లవాడు అడిగితే, అతనికి అర్థం గాని తార్కిక విషయాలను వినిపించి సాధించే దేముంటుంది? అది అడగ దగింది కాదు అనేది అర్థమైతే, ఎందుకు అడుగుతాడు? అజ్ఞాన దశ లోనే చిత్రమైన అభ్యర్థనలు ఉంటాయి. అలాంటి విషయాలను అర్థం చేసుకోవాలే గాని అభ్యంతరం చెప్పకూడదు.

జ్ఞాన రుచి కలిగిన నాడు అర్థించే వాడే తన ఆశలలో అరుచిని చూస్తాడు. జ్ఞానము నందే అనన్య భావాన్ని, దానికి విరుద్ధమైన విషయాలలో చెప్పకుండానే ఉదాసీనతను పెంచు కుంటాడు. అనురాగం స్థానంలో విరాగాన్ని దర్శిస్తాడు. అంత వరకు అతణ్ణి మెల్లగా అనునయిస్తూ దిశా నిర్దేశం చేస్తూ పోవాలి. 'నీవు అకర్తవు - అభోక్తవు' అంటూ మ్రింగుడు పడని విషయాలను అదే పనిగ ఏకరువు పెడితే, అతడు ఏకంగా కర్మలు చేయడమే మానేస్తాడు.

ఈ రోజుల్లో ఈ విధమైన విపరీత ధోరణి బాగా ప్రబలి పోయింది. ఒకటి రెండు సంవత్సరాలు, అక్కడ ఇక్కడ తిరగడం, నాలుగు వేదాంత వాక్యాలు మ్రింగడం, ఆ తరువాత అజీర్ణంతో బాధపడుతూ, 'నామం వల్ల ఏమొస్తుంది? నామిని తెలుసుకో! జపం చేస్తే ఏమొస్తుంది? జపం చేసే వాడెవడో వెతికి పట్టుకో! నువ్వెవరో తెలుసుకో!' అంటూ అజీర్ణ త్రేపుల్ని త్రేపుతూ, విచిత్ర వేషధారణతో ఊరూరూ విద్వారంగా తిరుగుతూ ఉంటారు. ఇలాంటి శుష్క వాదనలను వినిపించే శూన్య హృదయుల్ని ఈ శ్లోకంలో మందలిస్తున్నాడు మధుసూదనుడు.

అజ్ఞానులు ఫలాసక్తులే గాని ధర్మాసక్తులు కారు. జ్ఞానాసక్తులు అసలే కారు. ఆసక్తి లేనిచోట అవధానం ఉండదు. అవగాహన కలుగదు. అవగాహన కలిగే వరకు వారిని కర్మలలో కొనసాగే టట్లు చూడాలి. అంతేగాని, కలవర పెట్టి కర్మల్ని విరమింప చేయ కూడదు.

క్రొత్త బట్టలు దొరికే వరకు చిరిగిన బట్టలే మేలు చేస్తాయి. చిరిగి పోయాయని వాటిని త్యజించమని చెప్పకూడదు. కుట్టుకొని వేసుకోమని చెప్పాలి. ఉతుక్కొని ధరించ మని తెలియ చేయాలి. అంతేకాదు. మనం కూడా ఖరీదైన బట్టల్ని ధరించ కుండా, సాధారణ దుస్తుల్ని ధరిస్తే, మనం అతనికి ఆదర్శంగా ఉంటాము. మాటల కన్నా చేతలే దివ్యంగా బోధిస్తాయి. శోభిస్తాయి.

అనుసరించేటట్లు జీవించాలి

అజ్ఞానుల విషయంలో చేతులకు పని కల్పించాలే గాని చెవులకు చిలుము పట్టించ కూడదు. కర్మాసక్తులైన వారు చేసే కర్మలను ఆపడం కాకుండా, ఆ కర్మలనే జ్ఞాని కూడా యోగయుక్తుడై శ్రద్ధతో ఆచరించాలి. అప్పుడే ఆదర్శం అందల మెక్కుతుంది.

జ్ఞాని కూడా ఆదర్శం కోసం అజ్ఞానుల లాగే కర్మల్ని ఆచరిస్తే, తాను కూడా కర్మ సుడిగుండంలో చిక్కుకొని బద్ధుడు కాడా? కానే కాడు. అందుకే అతడు యుక్తుడు. అతడు చేసే కర్మల వెనుక జ్ఞానం ఉంది. వ్యవహారం ఒకే విధంగా ఉన్నా, వైఖరిలో భేదం ఉన్నందున బద్ధుడు కాడు. కనుక, ఫలాసక్తి గలవారు చేసినట్లే సర్వ కర్మల్ని, ఫలాసక్తి లేకుండా, శ్రద్ధతో ఆచరించి అజ్ఞానులకు జ్ఞాని ఆదర్శం కావాలి (**సర్వ కర్మాణి విద్వాన్ స్వయం తదేవ అవిదుషాం కర్మ, యుక్తః అభియుక్తః సమాచరన్**). అంతేకాదు, తాను చేయడమే గాక, వారి చేత కూడా చేయించాలి (**జోషయేత్ కారయేత్**).

కర్మలు - కైంకర్యాలు

జ్ఞాని తాను ఆచరించి చూపాలి. ఇక్కడ **యుక్తః** అంటే, జ్ఞానంతో కూడిన జ్ఞాననిష్ఠుడు అని అర్థం (**జ్ఞానేన యుక్తః**). కర్మాసక్తి కలిగి ఫలాపేక్షతో చరించే కర్మికి కర్మల నుండి విడిపడి పొమ్మని బోధించడం కంటే, ఆ కర్మల్నే ఫలాసక్తి లేకుండా ఎలా ఆచరించాలో చేసి చూపడం మంచిది అంటున్నాడు భగవానుడు.

కర్మ ప్రవాహంలో కొట్టుకు పోయే వ్యక్తిని దారి మళ్ళించడం చాలా కష్టము. అయుక్త మైన మాటలతో అతణ్ణి మళ్ళించే ప్రయత్నం చేయడానికి బదులు, జ్ఞాననిష్ఠుడు ఆత్మస్థితుడై, ఫలాసక్తి లేకుండా పరానుగ్రహార్థం నిర్మలంగా కర్మల్ని ఆచరిస్తూ ఉంటే, అట్టి ప్రశాంత జీవనాన్ని చూచి సకామ కర్మలను ఆచరించే వారు కూడా నిష్కామ కర్మయోగం వైపు ఆకర్షితు లవుతారు. ఈ విధంగా జ్ఞాననిష్ఠుడు తాను ఆచరిస్తూ కర్మాసక్తులను ఆకర్షించి వారి చేత కూడా చేయించాలి (**జోషయేత్ కారయేత్**).

ఈ శ్లోకంలో **జోషయేత్** అనే పదానికి **యోజయేత్** అనే పాఠాంతరం కూడా ఉంది. అజ్ఞానులైన వారికి ఆత్మజ్ఞానాన్ని బోధించ కుండా వారి చేత కర్మలు చేయించాలి అని అర్థం.

జోషయేత్ - జుషీ ప్రీతి సేవనయోః అని ధాత్వర్థము. అంటే, వారికి ప్రీతి కలిగించాలి (**జోషయేత్**). ఆచరించే టట్లు చూడాలి (**యోజయేత్**).

ప్రీతి ఎలా కలుగుతుంది? ఆచరించి చూపడం లోనే ప్రీతి కలుగుతుంది. జ్ఞాననిష్ఠుడు తిలకధారణ చేసి చరిస్తూ ఉంటే, ఆ తరువాత ఆ శ్రేష్ఠుని మార్గాన్ని అందరూ అనుసరిస్తారు. అన్ని విషయాలలో అతడు అలాగే ఆదర్శం కావాలి.

సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారు అద్వైతానుభూతిని పొందిన మహాజ్ఞాని. అయినా, సామాన్య జనులకు అనుకూలంగా ఎన్నో కీర్తనలు రచించారు. అద్వైతాచార్యులైన శ్రీ శంకర భగవత్పాదులు అనేక ఆలయాలను పునరుద్ధరించారు. వివిధ దేవతామూర్తులపై స్తోత్రాలు రచించారు. పూజాదికాలు నిర్వహించారు. ఇవన్నీ సామాన్యులను సన్మార్గంలో నడిపించ డానికే.

ఇక్కడ మరొక్క ముఖ్య విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. జ్ఞాననిష్ఠుడు తాను ఆచరిస్తూ, కర్మాసక్తులను ఆకర్షించి సన్మార్గంలో ఉంచాలి అంటే, ఈ అనుసరణము కర్మయోగ పరిధి లోనిదే గాని జ్ఞానయోగానికి సంబంధించింది కాదు.

అనుసరించడం అనేది కర్మయోగంలో సాధ్య పడుతుందే గాని, జ్ఞానయోగంలో సాధ్య పడదు. జ్ఞాని కర్మయోగాన్ని ఆచరిస్తూ ఆదర్శాన్ని ఆవిష్కరించాలి. అంతేగాని జ్ఞానాన్ని ప్రదర్శించ కూడదు. దానిని ప్రవచించ వలసిందే గాని దర్శించడం వీలు పడదు. కాకపోతే, కర్మాసక్తుడైన వాడు జ్ఞాననిష్ఠుని ఆదర్శంతో ముందు కర్మయోగిగా మారితే, ఆ తరువాత అతడే జ్ఞానార్థియై మోక్షాన్ని పొందుతాడు.

కర్మయోగాన్ని అనుసరిస్తూ అభ్యసించ వచ్చు. జ్ఞానాన్ని ఆలకించ వలసిందే గాని అనుసరించడం, అనుకరించడం కుదరదు. కనుకనే, మనవాళ్ళు, **రాముడు చేసినట్లు చెయ్యి - కృష్ణుడు చెప్పినట్లు చెయ్యి, కృష్ణుడు చేసినట్లు చెయ్యకు)** అని చెబుతూ ఉంటారు.

రాముడు ధర్మ మార్గాన్ని ఆదర్శంగా నిలిపాడు కనుక, ఆ మార్గంలో మనమూ చరించ వచ్చు. కానీ, కృష్ణుడు బోధించిన గీతను మనం అర్థం చేసుకొని ఆచరించాలి. అంతేగాని ఆయన జీవితంలో చేసిన వన్నీ చేయాలి అనుకుంటే, అది సాధ్య పడదు. రాసలీలలో నాట్యం చేయడం వీలు పడుతుందేమో గాని, ఆయన లాగా కార్చిచ్చును అమాంతం మ్రింగడం, కొండనెత్తి వేలిపై నిలబెట్టడం సాధ్యమయ్యే పనులేనా!

కనుక, జ్ఞాననిష్ఠలో ఉన్నవారు అజ్ఞానులను తాత్త్విక సందేశాలతో కలత పెట్టకూడదు. వారు కర్మలు చేస్తున్నట్లే తాము కూడా కర్మల్ని ఆచరిస్తూ, ఫలాకాంక్ష లేకుండా జీవించి, సామాన్యులకు ఆదర్శాన్ని నెలకొల్పాలి. తాము చేస్తూ, తాము చేసే కర్మలలో వారికీ ప్రీతి కలిగేటట్లు చూడాలి. ఆ తరువాత, వారి చేత కూడా నిష్కామంగా చేయించాలి.

వివేకం పెరుగుతూ ఉంటే, ఫలాసక్తి నశిస్తూ ఉంటుంది. కర్మలలో అవగాహన ఏర్పడితే, సకామ కర్మలు నిష్కామ కర్మ లవుతాయి. సదాచార జీవనము అలవడుతుంది. అది సర్వాత్మ భావానికి దారి తీస్తుంది. అంతేగాని, ప్రారంభం లోనే మ్రింగుడు పడని విషయాల జోలికి పోకూడదు. **సర్వం బ్రహ్మమయం** అనేది అందరి స్థాయికి దిగి రాలేని సత్యము. ముందు ఆలయంలో భగవంతుణ్ణి దర్శించి, అర్చించి, శుద్ధి పడితే, ఆ తరువాత జ్ఞానప్రాప్తి ద్వారా అంతటా సమదర్శనం ప్రాప్తిస్తుంది.

ఆద్యుడు ఎవరో తెలియని నాడు
ఆలయమే మనకు ఆశ్రయము
అనంతుడు తానని తెలిసిన నాడు
ఏది కాదు ఆలయము?
విశ్వమంతా సుందరము
ఏది చూసినా శివమయము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

మనిషి కర్మ చేత ఎలా బద్ధు డవుతున్నాడో తరువాత శ్లోకంలో స్పష్టం చేస్తున్నాడు.

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః । 27
అహంకార విమూఢాత్మా కర్తాఽహ మితి మన్యతే ॥

ప్రకృతేః-క్రియమాణాని-గుణైః-కర్మాణి-సర్వశః
అహంకార విమూఢాత్మా-కర్తా-అహం-ఇతి-మన్యతే

ప్రకృతేః	= ప్రకృతి యొక్క	అహం	= నేను
గుణైః	= గుణముల చేత	కర్తా ఇతి	= చేసేవాణ్ణి అని
సర్వశః	= అన్ని విధాలుగా	అహంకార విమూఢాత్మా	= అహంకారము చేత వివేకమును కోల్పోయిన వాడు
క్రియమాణాని	= చేయబడుతున్న	మన్యతే	= భావిస్తున్నాడు
కర్మాణి	= కర్మలను		

చేయబడే కర్మ లన్నీ ఏ విధంగా చూచినా ప్రకృతి యొక్క గుణముల చేతనే చేయబడుతూ ఉంటాయి. ఆత్మ జ్ఞానము లేని అహంకారి నేనే కర్తను అని భావిస్తూ ఉంటాడు.

వ్యాఖ్య

జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ కర్మలు ఆచరిస్తున్నారు. కర్మలు చేస్తున్నా జ్ఞాని బద్ధుడు కాడు. కాని అజ్ఞాని కర్మల చేత బద్ధుడు అవుతాడు. ఈ బంధము కర్మభేదాన్ని బట్టి వచ్చింది కాదు. భావ వ్యత్యాసాన్ని బట్టి వచ్చింది. భావభేదం వల్ల అజ్ఞాని బద్ధు డవుతున్నాడు, జ్ఞాని బద్ధుడు కావడం లేదు. అజ్ఞాని ఎలా బద్ధు డవుతున్నాడో ఇరవై ఏడవ శ్లోకం లోను, జ్ఞాని ఎలా బద్ధుడు కావడం లేదో ఇరవై ఎనిమిదవ శ్లోకం లోను స్పష్టంగా వివరిస్తున్నాడు.

ప్రకృతి పురుషులు

'ప్రకృతి' అంటే మాయ, లేక అవిద్య. మాయ త్రిగుణ మిళితం. త్రిగుణమయం. మాయ లోని త్రిగుణాలే ఇరవై నాలుగు తత్త్వాలుగా మార్పు చెందాయి. పంచభూతాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, శబ్దాది విషయాలు ఐదు, అంతఃకరణ చతుష్టయం - ఇవే ఇరవై నాలుగు తత్త్వాలు.

బాహ్య ప్రపంచము, దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతము, అన్నీ 'ప్రకృతి' అనబడే మాయ యొక్క కార్యాలే. ప్రకృతి వికారాలే. ఒక్క మాటలో చెప్పాలంటే, దేహేంద్రియ ప్రాణ మనస్సులు, ఈ దృశ్యమాన ప్రపంచము దేని నుండి వచ్చాయో, ఆ కారణమే మాయ, లేదా 'ప్రకృతి'.

మాయ కారణము. మాయ నుండి వచ్చిన వన్నీ కార్యాలు. మాయా కార్యాలు. ప్రకృతి కార్యాలు. ప్రకృతి నుండి వచ్చిన ఏ కార్యంలో అయినా ప్రకృతి గుణాలే ఉంటాయి. అందుచేత అవి ప్రకృతి కార్యాలు (*ప్రకృతేః గుణైః క్రియమాణాని కర్మాణి*).

ప్రకృతి గుణమయం అని చెప్పుకున్నాం. ఈ ప్రపంచ మంతా ప్రకృతి కార్యమే కనుక సత్త్వరజ స్తమో గుణాలు అనే ఇటుకల పైనే ఈ విశ్వసౌధం నిర్మిత మైంది. బాహ్యంలో ఉన్నవీ గుణాలే. మనలో ఉన్నవీ గుణాలే. బాహ్య ప్రపంచం లోను, వ్యక్తి దేహేంద్రియ మనోబుద్ధుల లోను ఉన్న వన్నీ గుణాలే కనుక, బాహ్యం లోని గుణ సముదాయం వ్యక్తి లోని గుణ సముదాయం పరస్పరం ఆకర్షించుకొంటూ ఉంటాయి. ఆ విధంగా సమరస మవుతూ ఉంటాయి.

విషయాల కొరకు ప్రాకు లాడేది ఇంద్రియాలు కాదు. దేహమూ కాదు. మనలో ఉన్న గుణాలే బాహ్యం లోని గుణాల వైపు పరుగులు పెడుతున్నాయి. *గుణాః గుణేషు వర్తన్తే*- గుణాలు గుణాలలో తిరుగు తున్నాయి అనే సత్యం జ్ఞానికే అర్థ మవుతుంది. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చూస్తాం కూడా.

ప్రకృతి యొక్క గుణాలే నానా విధాలైన కార్యాలను ఈ విశ్వంలో సాగిస్తున్నాయి. ఈ సత్యాన్ని తెలుసుకున్న వాడు జ్ఞాని. 'గుణాలు గుణాలలో ప్రవర్తిస్తున్నాయి. నేను ఏమి చేయడం లేదు. నేను కర్తను కాను' అని జ్ఞాని భావిస్తాడు. అందుచేత అతడు ప్రకృతి కార్యాల చేత బద్ధుడు కాడు. ఈ సత్యం అర్థం గాని అజ్ఞాని 'నేనే కర్తను' అని భావిస్తూ ఉంటాడు (*అహం కర్తా ఇతి మన్యతే*). అందుకే అతనిని *అహంకార విమూఢాత్మా* అని పిలుస్తున్నాడు గీతాచార్యుడు.

ఈ ప్రపంచ మంతా ప్రకృతి కార్యమే కనుక, ప్రకృతి నుండి జనించినదే కనుక, ఏదయినా ప్రకృతి వికారమే. ఈ మూల ప్రకృతి పురుషునిపై ఆధారపడి ఉంది. 'పురుషుడు' అంటే చైతన్యము, ఆత్మ, బ్రహ్మము అని అర్థం చేసుకోవాలి. కనుక, త్రిగుణ మిళితమైన ప్రకృతి, లేదా మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది (*బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమో గుణాత్మికా మాయా అస్తి*).

కార్యకరణాభిమాని

మూల కారణంగా తెలుస్తూ ఉన్న మాయ నుండి కార్యరూప జగత్తు ఆవిర్భవించింది. ప్రకృతి వికారమే కనుక ప్రపంచములో కూడా గుణ వికారాలే గోచరిస్తున్నాయి. అలాగే మానవ దేహము కార్యమైతే, ఇంద్రియ ప్రాణ మనోబుద్ధులు కరణాలై ఉన్నాయి. ఈ కార్యకరణ సంఘాతమునకు ప్రకృతి, లేదా మాయ మూల కారణంగా ఉంది.

ప్రకృతి, లేదా మాయ పురుషుని, లేదా బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది. అలాగే మన దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులు అనే కార్యకరణ సంఘాతము ఆత్మను ఆధారం చేసుకొని ఉంది. ఇంతకీ, నీ వెవరు? నీవు ఆత్మవే గాని గుణ వికారమైన కార్యకరణ సంఘాతము కాదని రెండవ అధ్యాయం లోనే అర్థం చేసుకున్నాము. అలాంటప్పుడు ప్రపంచంలో నడిచే గుణ సమన్వయ కార్యాలకు నీవు కర్తవు ఎలా అవుతావు?

కార్యకరణ సంఘాతమైన దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధుల యందు 'అహం' భావన, లేక 'నేను' అనే భావన కలిగి ఉన్నందున, తానే కర్త అని అజ్ఞాని భావిస్తుంటాడు. అలాంటప్పుడు 'నీవు అకర్తవు - అభోక్తవు' అని జ్ఞాని వినిపించే బోధ ఫలితా న్నిస్తుందా? కర్మ చేసి నపుడే కదా కర్త ఉంటాడు? 'నేను కర్తను' అనే భావనతో అజ్ఞాని కర్మలను ఆచరిస్తు న్నప్పుడు, 'నీవు కర్తవు కావు' అని జ్ఞాని చేసే బోధ ఫలిస్తుందా? అందుకనే, జ్ఞాని అజ్ఞానిని కలత పెట్టకూడదు అని ఇరవై ఆరవ శ్లోకంలో భగవంతుడు విస్పష్టంగా వినిపించాడు.

అహం కర్తా అహంకారః - దేహేంద్రియాదిక మైన అనాత్మ యందు 'నేను' అనే బుద్ధి ఏదయితే ఉందో, అదే అహంకారము. అట్టి అహంకారము చేత మూఢమైన బుద్ధి గలవాడు అహంకార విమూఢుడు. గుణ ధర్మాలను తన యందు ఆరోపించుకొని ఆవేదన చెందే అజ్ఞాని. ఈ విధంగా అజ్ఞాని కర్మల చేత బద్ధు డవుతున్నాడు.

ఇదే సంసారము. 'తాను కానిది తాను' అనే భావనే బంధము. సర్వ దుఃఖాలకు, సమస్త దోషాలకు అదే కారణము.

దేహోऽహ మితి సంకల్పం తద్దుఃఖ మితి చోచ్యతే
దేహోऽహ మితి యజ్ఞానం తదేవ నరకం స్మృతమ్ ॥

'నేను దేహము' అనే భావనే దుఃఖమయమైన సంసారము. 'నేను కార్యకరణ సంఘాతము' అనే భావనే నరక బాధలకు కారణ మవుతూ ఉంది అన్నది తేజోబిందూపనిషత్తు.

అవివేకము చేత తాను కర్త అని భావించిన అజ్ఞాని బద్ధుడవుతూ ఉంటే, గుణకర్మల వాస్తవ స్థితిని తెలిసిన జ్ఞాని, తాను కర్త కాదు అని భావిస్తూ, ఆసక్తి లేకుండా కర్మలను ఆచరిస్తున్నాడు. అది కూడా చెప్పుకుందాం.

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః । 28
గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే ॥

తత్త్వవిత్-తు-మహాబాహో-గుణకర్మవిభాగయోః
గుణాః-గుణేషు-వర్తంతే-ఇతి-మత్వా-న-సజ్జతే

మహాబాహో	=అర్జునా!	గుణేషు	= విషయముల యందు
గుణకర్మ విభాగయోః	=గుణ, కర్మల విభాగముల యొక్క	వర్తంతే ఇతి	= ప్రవర్తిస్తున్నాయి అని
తత్త్వవిత్ తు	=తత్త్వమును తెలిసిన వాడైతే	మత్వా	= తలచి
గుణాః	=గుణములు	న సజ్జతే	= ఆసక్తి లేకుండా ఉంటాడు

అర్జునా! గుణకర్మల విభజనము యొక్క వాస్తవమును తెలిసిన వాడు జ్ఞాని. ఇంద్రియాలు అనే గుణాలు విషయాలు అనే గుణాల యందు ప్రవర్తిస్తూ ఉన్నాయని భావిస్తాడు. వాటి యందు ఆసక్తి లేకుండా ఉంటాడు.

వ్యాఖ్య

కారణమైన ప్రకృతి, లేదా మాయలో త్రిగుణాలు ఉన్నాయి. అవి పరిణామం చెంది సూక్ష్మ, స్థూల భూతాలు గాను, శ్రోత్రాది సూక్ష్మ స్థూల ఇంద్రియాలు గాను జనించాయి. ప్రపంచ మంతా పంచభూతాల సమ్మేళనమే కనుక ప్రపంచంలో త్రిగుణాలే ఉన్నాయి. అలాగే మానవ దేహం, ఇంద్రియ మనోబుద్ధులు కూడా గుణ వికారాలే. అందువల్ల, బాహ్యప్రపంచం లోని గుణాలు, వ్యక్తి లోని గుణాలను ఆకర్షిస్తున్నాయి. ఈ విధంగా కర్మలు జరుగుతూ ఉంటే, వీటి యథార్థ స్వరూపమును తెలియక, తానే కర్త అని భావించి 'అహంకార విమూఢాత్ముడు' బద్ధు డవుతున్నాడు. అతనికి భిన్నంగా తత్త్వవిదుడు ప్రవర్తిస్తున్నాడు. కర్మల యందు ఆసక్తి లేకుండా ఉంటూ ముక్తు డవుతున్నాడు.

గుణాల యొక్క, కర్మల యొక్క యథార్థ స్వరూపం తెలిసి, వాటి నుండి తనను వేరు చేసుకొని శోభించే వాడు తత్త్వవిదుడు (*గుణ విభాగస్య కర్మ విభాగస్య చ తత్త్వవిత్ ఇత్యర్థః*). అది తెలిసిన వాడు కనుక

గుణాలు గుణ విషయాల యందు ప్రవర్తిస్తున్నాయి అని గ్రహిస్తాడు. అంటే, ఇంద్రియ మనోబుద్ధులు అనే గుణాలు, లేదా కరణాలు (*గుణాః కరణాత్మకాః*) గుణాల యందు, అంటే విషయాల యందు (*గుణేషు విషయాత్మకేషు*) ప్రవర్తిస్తున్నాయి (*వర్తన్తే*) అని యథార్థంగా తెలుసు కుంటాడు. అలా ఎప్పుడైతే తెలుసు కుంటాడో, ఆత్మ ప్రవర్తించడం లేదు అనే సత్యాన్ని గ్రహించి (*న ఆత్మా ఇతి మత్వా*), కర్తృత్వం లేకుండా ఉంటాడు. కర్మల యందు ఆసక్తి లేకుండా ఉంటాడు (*న సజ్జతే సక్తిం న కరోతి*).

ఇంద్రియాలకు ఇంద్రియ విషయాల తోనే సంబంధం. గుణాలకు గుణవిషయాల తోనే సంబంధం. ఆత్మకు ఇటు ఇంద్రియాలలో గాని, అటు ఇంద్రియ విషయాలతో గాని; ఇటు గుణాలతో గాని, అటు గుణ విషయాలతో గాని సంబంధం లేదు. సంగత్వం లేదు. కనుక ఆత్మ అసంగము. ఈ సత్యం తెలిసిన వాడు కనుక తత్త్వవిదుడు అసంగుడు (*అసంగః సంగ వర్జితః*).

శుద్ధ చైతన్య స్వరూపుడైన పురుషుడు లేదా ఆత్మ, దృక్శక్తి, లేదా దృక్చైతన్యము. వాస్తవానికి చూచే వాడు తానే. చైతన్యాత్మ చూచేందుకు సాధనమైన బుద్ధి, దర్శనశక్తి. దృక్శక్తికి, దర్శనశక్తితో ఏర్పడిన సంయోగము వల్లనే **అహం కర్తా**, 'నేను కర్తను' అనే భ్రాంతి కలుగుతూ ఉంది. దృక్శక్తిని దర్శనశక్తిగా భావించ డానికి అజ్ఞానమే కారణం (*తస్య హేతుః అవిద్యా* - యోగసూత్రం). కనుక అజ్ఞానం వల్ల సంసారం ఉత్పన్న మవుతూ ఉంది. 'నేను కర్తను' అని భావించేవాడు (*కర్తాఽ హ మితి మన్యతే*) బద్ధుడై సంసారి అవుతున్నాడు. ఈ విషయాన్ని పతంజలి మహర్షి యోగదర్శనంలో స్పష్టం చేశాడు.

ద్రష్టృ దృశ్యయోః సంయోగో హేయహేతుః

దృగ్దృశ్యముల సంయోగమే హేయమైన దుఃఖరూప సంసారానికి హేతువు అని పతంజలి యోగసూత్రం.

చంద్రునికి జలముతో సంబంధము లేదు. కాని, చంద్రుడు జలములో ప్రతిబింబించడం చేత చంద్రునికి జలముతో సంబంధం ఉన్నట్లు అగుపిస్తూ ఉంటుంది. అలాగే నిర్వికారుడైన పురుషునికి, గుణ వికారమైన బుద్ధికి ఏ విధమైన సంబంధం లేదు. కాని దృక్చైతన్యం బుద్ధిలో ప్రతిఫలించడం చేత పురుషునికి బుద్ధితో సంబంధం ఉన్నట్లు కనిపిస్తూ ఉంది. అనిపిస్తూ ఉంది.

తత్త్వవిదుడు గుణకర్మల యొక్క విభాగమును వాస్తవముగ తెలిసిన వాడు కనుక, అజ్ఞానము నుండి విడిపడి ఉన్నాడు. అజ్ఞానం లేని కారణం చేత, పురుష, బుద్ధుల యొక్క సంయోగము లేని వాడై ఉన్నాడు. కనుక దుఃఖము తెలియని వాడై ఉన్నాడు. ఇదే తత్త్వవిదుని మోక్షము. ఈ క్రమం పతంజలి యోగసూత్రంలో సుస్పష్టంగా తెలుస్తుంది. అవిద్య యొక్క అభావం వల్ల సంయోగము యొక్క అభావము సంభవము. ఈ సంయోగ అభావమే 'హానమ్'. హానము' అంటే దుఃఖ రాహిత్యము. అదే దృక్చైతన్య మైన పురుషుని కైవల్యము, లేదా మోక్షము (*తదభావాత్ సంయోగ అభావః హానం తద్దృశేః కైవల్యమ్* - యోగసూత్రమ్).

మోక్షరూపుడైన తత్త్వవిదుడు ప్రపంచంలో చరిస్తూ ఉన్నా, తామరాకు మీద నీటిబొట్టు లాగా ఉంటాడు కనుక, అతనికి కర్మసంగం లేదు. ఫలసంగం లేదు. భువిలో చరిస్తున్నా, దివి నుండి దిగి వచ్చిన దివ్యాత్ముడా! అనిపిస్తూ ఉంటాడు.

ఈ విధమైన గుణకర్మల యదార్థ జ్ఞానము లేకపోవడం చేత, గుణకర్మల యందు ఆసక్తి కలిగి, కర్తృత్వాభిమానంతో కర్మలను ఆచరించే మందమతులను విద్వాంసులు కలతపెట్ట కూడదు కనుక, **న బుద్ధిభేదం జనయేత్** అంటూ ఇరవై ఆరవ శ్లోకంలో ఉపక్రమించిన విషయాన్ని ఇక్కడ ఉపసంహరిస్తున్నాడు.

ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జన్తే గుణకర్మసు ।
తా నకృత్స్నవిదో మన్దా న్కృత్స్నవి న్న విచాలయేత్ ॥ 29

ప్రకృతేః-గుణసమ్మూఢాః-సజ్జంతే-గుణకర్మసు
తాన్-అకృత్స్నవిదః-మందాన్-కృత్స్నవిత్-న-విచాలయేత్

ప్రకృతేః	= ప్రకృతి యొక్క	మందాన్	= మందమతులైన
గుణసమ్మూఢాః	= గుణములచే మోహితులై	తాన్	= వారిని
గుణకర్మసు	= గుణకర్మముల యందు	కృత్స్నవిత్	= విద్వాంసుడు
సజ్జన్తే	= ఆసక్తు లౌతున్నారో	న విచాలయేత్	= కలత పెట్ట కూడదు
అకృత్స్నవిదః	= అల్పజ్ఞులైన		

అల్పజ్ఞులైన మందమతులు ప్రకృతి యొక్క గుణముల చేత మోహితులై ఉంటారు. గుణముల యొక్క కార్యాలలో ఆసక్తులై ఉంటారు. అట్టి కర్మజీవులను సర్వజ్ఞుడైన జ్ఞాని కలత పెట్ట కూడదు.

వ్యాఖ్య

గుణముల యొక్క, కర్మల యొక్క యథార్థ స్వరూపమును గ్రహించలేని అవివేకులు ఫలాసక్తితో కర్మల యందు నిమగ్నమై ఉంటారు. వీరు బద్ధులు. అల్పజ్ఞానం కలిగిన వారు. అవిద్వాంసులు. వీరిని **అకృత్స్నవిదః** అంటున్నాడు భగవానుడు. 'అకృత్స్నవిదులు' అంటే పూర్ణజ్ఞానం లేనివారు అని అర్థము. పాక్షికమైన జ్ఞానం కలవారు అని భావం. అంటే కేవలం ఫలితాన్ని మాత్రమే దర్శించేవారు అని అర్థము (*అకృత్స్నవిదః కర్మఫల మాత్ర దర్శినః*). వీరిని మందబుద్ధులు, లేదా మందమతులు అంటున్నాడు. అంటే, అల్పప్రజ్ఞ కలిగిన వారు అని భావము (*మందాన్ మంద ప్రజ్ఞాన్*). సంస్కృతంలో 'మన్దః' అనే పదానికి చాలా అర్థాలున్నాయి. 'మన్దః' అంటే సోమరి, ఉత్సాహం లేనివాడు, బలహీనుడు. 'విలంబము' అంటే ఆలస్యము చేసేవాడు. ఇతడు చేసినా ఆలస్యమే. చూసినా ఆలస్యమే. ఇతడికి ఏదైనా అర్థం చేసుకోవడానికి చాలా సమయం కావాలి అని అర్థం. 'మన్దః' అంటే 'శని' అని అర్థం కూడా ఉంది. శనిని దర్శించాలంటే తూర్పు గోదావరి జిల్లాకు పోవాలి. అక్కడ 'మందపల్లి' అనే గ్రామంలో శనీశ్వరుని ఆలయ ముంది. శని ఉండటం చేత ఆ గ్రామానికి 'మందపల్లి' అనే పేరు వచ్చింది.

మందమతులు, 'అకృత్స్నవిదు' లైతే, విద్వాంసులు, లేదా ఆత్మవిదులు 'కృత్స్నవిదులు' (*కృత్స్నవిత్ ఆత్మవిత్ స్వయం*). అలాంటి తత్త్వవిదులు మందభాగ్యులైన వారిని చలింప చేయకూడదు (*న విచాలయేత్*). ఇక్కడ చలింప చేయడము అంటే మనం ముందే చూచినట్లు బుద్ధి భేదం కలిగించడం అని అర్థము (*బుద్ధి భేద కరణ మేవ చాలనం*). అలా విద్వాంసులు మందమతులను చలింప చేయ కూడదు, లేదా కలతపెట్ట కూడదు అని అర్థం (*తత్ న కుర్యాత్ ఇత్యర్థః*).

ఈ శ్లోకం లోని విషయం ఇరవై ఆరవ శ్లోకంలో చెప్పిందే. అక్కడ అజ్ఞానిగా పేర్కొన్న మూర్ఖుడికి ఇక్కడ మందభాగ్యుడనే బిరుదు ప్రదానం చేయడం కన్నా అన్యమైన విషయం ఈ శ్లోకంలో నాకు కనిపించడం లేదు. అలాగని చాలా అవసరమైన, అతిముఖ్యమైన, ఉపేక్షింప దగని గంభీరమైన విషయం కనుకనే, భగవానుడు పునః ప్రవచించాడు గాని, పునరుక్తికి తెర తీయలేదు.

ప్రబోధాలు చేసే వారికి, ప్రవచనాలు సాగించే వారికి, శిష్యులను ప్రోగు చేసుకొనే గురువులకి ఈ

సత్యం వంట బట్టక పోతే, ఇది చాలా హానికరమైన పరిణామాలకు దారి తీస్తుందని భగవానుడు పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

అజీర్ణపు రోగికి ఆహారం పెట్టే కొద్ది ఆరోగ్యం చెడిపోతూ ఉంటుంది. బాగా కాలిన భూమి మీద చల్లటి నీళ్ళు పోస్తే ఆవిర్లు పైకి లేస్తాయి. పోసిన వాణ్ణే వేడెక్కిస్తాయి. అర్హత లేని వ్యక్తికి ఆత్మను గూర్చి బోధిస్తే, దాని వల్ల మేలు జరగక పోగా, అతనిలో నిరాశ అలుము కుంటుంది. మందబుద్ధులపై అతిప్రేమను కుమ్మరిస్తే ప్రాప్తించేది అనర్థమే గాని పరమార్థం కాదు.

చంచల స్వభావుల్ని కర్మల నుండి విరమింప చేయ కూడదు. నాకేం జరుగుతుంది? నా కేమి వస్తుంది? అంటూ పలవరించే మంద ప్రబుద్ధుల్ని కర్మల లోనే కొనసాగ నివ్వాలి. జ్ఞాననిష్ఠను గూర్చి అసలు చెప్ప కూడదు. కర్మయోగాన్ని కూడా క్రమంగా ప్రవేశ పెట్టాలే గాని, ఒక్కసారిగా బోధించ కూడదు. 'మందం' అంటేనే సంస్కృతంలో గాని, తెలుగులో గాని మెల్లగా అని అర్థం.

మందబుద్ధులు మూఢులు కనుక, 'నీవు అకర్తవు - అభోక్తవు' అంటూ కలవర పెట్టకుండా 'ఏదైనా అస్థిరమే, అశాశ్వతమే' అంటూ వైరాగ్య వచనాలతో ఊదర పెట్టకుండా, మెల్లగా, అంటే మందంగా భగవన్నామ సంకీర్తనం చేయించడం చాలా మంచిది. ఉత్తమమైన సాధన. పరివర్తనను గమనిస్తూ, సోపానక్రమంగా ముందుకు నడిపించాలి. ఈ కారణం చేతనే శ్రీ శంకరాచార్యస్వామి *గోవిందం భజ మూఢమతే!* అని చక్కగా ప్రవచించారు.

ఇటు మందమతి కాక, అటు తత్త్వవిదుడు కాలేక, ప్రస్తుతం ముముక్షువుగా కొనసాగుతున్న వ్యక్తి యొక్క కర్తవ్యం ఏమిటి? చెబుతున్నాడు.

మయి సర్వాణి కర్మాణి సంన్య స్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30

మయి-సర్వాణి-కర్మాణి-సంన్యస్య-అధ్యాత్మ చేతసా
నిరాశీః-నిర్మమః-భూత్వా-యుధ్యస్వ-విగతజ్వరః

సర్వాణి	= సమస్తమైన		నిరాశీః	= ఆశ లేని వాడవు
కర్మాణి	= కర్మలను		నిర్మమః	= మమకారము లేని వాడవు
మయి	= నా యందు		విగత జ్వరః	= సంతాప రహితుడవు
అధ్యాత్మచేతసా	= అధ్యాత్మ చిత్తముతో		భూత్వా	= అయి
సంన్యస్య	= ఉంచి		యుధ్యస్వ	= యుద్ధము చెయ్యి

సమస్త కర్మలను వివేక బుద్ధితో నా యందు సమర్పించు. ఆశను విడిచి పెట్టేయ్! మమతను వదలి పెట్టేయ్! దుఃఖానికి దూరమై యుద్ధంలో పోరాడు.

వ్యాఖ్య

కర్మలను ఆచరించ నంత మాత్రాన మానవులు నైష్కర్మ్యమును పొంద లేరు. అలాగే, కర్మలను విడిచి నంత మాత్రాన మోక్షాన్ని పొంద లేరు అని నాల్గవ శ్లోకంలో ప్రారంభించిన కర్మయోగ ప్రకరణాన్ని ఈ శ్లోకంతో సమాప్తం చేస్తున్నాడు భగవంతుడు. కర్మను అవశ్యం ఆచరించాలి అంటూ ఇరవై కారణాలను పేర్కొన్నాడు. అందుచేతనే ఈ ముగింపు శ్లోకంలో 'యుద్ధం చెయ్యి' (**యుధ్యస్వ**) అని ఆదేశిస్తున్నాడు.

కర్మయోగ ప్రకరణాన్ని ఉపసంహారం చేస్తూ యుద్ధం చెయ్యమని చెప్పడంలో ప్రధానమైన విషయం

కర్మాచరణమే గాని యుద్ధం కాదు. అర్జునుడు యుద్ధభూమిలో ఉన్నాడు కనుక యుద్ధం చెయ్యమంటున్నాడు. అంతే. ఎవరెవరు ఏయే కర్మక్షేత్రాలలో ఉంటే ఆయా కర్మల్ని ఆచరించాలి అని దాని అర్థం. ఎవరెవరికి ఏయే కర్మలు చేయ దగినవో (**కార్యం కర్మ**) వాటిని వారు ఆచరించి తీరాలి అనేది నిర్ణయం.

రైతు వ్యవసాయం చెయ్యాలి. వైద్యుడు వైద్యం చెయ్యాలి. ఉపాధ్యాయుడు బోధించాలి. ప్రభువు పాలించాలి. ఉద్యోగస్థులు ఉద్యోగాలు చెయ్యాలి. వ్యాపారస్థులు వ్యాపారాలు చెయ్యాలి. 'చెయ్యాలి' అనేదే కేంద్ర విషయం. కర్మయోగ ప్రకరణంలో ప్రధానమైన విషయం. మరి, ఎలా చెయ్యాలి? అంటే, అధ్యాత్మ చిత్తంతో సర్వ కర్మలను పరమేశ్వరుని యందు సమర్పించాలి అంటున్నాడు.

సమస్తములైన కర్మల్ని సన్యసించి యుద్ధం చెయ్యడం ఎలా? కర్మ లన్నిటినీ త్యజించడం అంటే, యుద్ధం కూడా కర్మే కనుక యుద్ధాన్ని కూడా త్యజించాలి. పైగా సమస్త కర్మలను త్యజించిన వాడు, ఇంతవరకు మనం అర్థం చేసుకున్న దానిని బట్టి, జ్ఞాననిష్ఠకు అర్హుడు కావాలి. అంతేగాని కర్మనిష్ఠకు కాదు. ఆచార్యుని ఆశ్రయించి శ్రవణం చేయదగిన వాడై ఉండాలే గాని కర్మక్షేత్రంలో పోరాడే వాడు కాలేడు.

కనుక, సమస్తమైన కర్మలను నా యందు సన్యసించి అని భగవంతుడు పలికిన వాక్యంలో 'సన్యసించి' అంటే ఉంచి అని అర్థము (**సంన్యస్య నిక్షిప్య**). ఇక్కడ **మయి** నా యందు ఉంచి అనడంలో ఉద్దేశ్యం సర్వజ్ఞుడు, సర్వాత్మ స్వరూపుడు, పరమేశ్వరుడు అయిన వాసుదేవుని యందు ఉంచి అని అర్థం (**మయి వాసుదేవే పరమేశ్వరే సర్వజ్ఞే సర్వాత్మని, సర్వాణి కర్మాణి సంన్యస్య నిక్షిప్య**). అంటే, సగుణబ్రహ్మము నందు సమర్పించి అని భావం.

మరి, వాసుదేవ పరబ్రహ్మము నందు కర్మల్ని సమర్పించేది ఎలా? కర్మ అనేది వస్తువు కాదు. పదార్థం కాదు. పత్రం కాదు. పుష్పం కాదు. మరి కర్మల్ని ఎలా సమర్పించాలి? అందుకనే, అధ్యాత్మచిత్తముతో సమర్పించాలి అంటున్నాడు. అధ్యాత్మచేతము అంటే 'వివేకబుద్ధి' అని అర్థము (**అధ్యాత్మ చేతసా వివేక బుద్ధ్యా**)

'వివేకబుద్ధి' అంటే కర్తృత్వము లేని బుద్ధి. అలాగని 'అహం అకర్తా' అనే బుద్ధి కాదు. 'కర్తను నేనే. కాని కర్తృత్వ బుద్ధి నాకు లేదు' అని అర్థం. కర్మ చేస్తున్నాను. కాని, సేవకుడు లాగా చేస్తున్నాను. యజమాని ఆదేశించిన కర్మను చేస్తున్నాను. నిర్దేశించిన కర్మను చేస్తున్నాను. చేయదగిన కర్మను చేస్తున్నాను. ఈశ్వరుని భృత్యుణ్ణై చేస్తున్నాను. ఈశ్వరుడు ప్రభువు. నేను భృత్యుడు - ఇదే వివేకబుద్ధి, ఈ విధమైన బుద్ధితో పరమేశ్వరునికి సర్వ కర్మల్ని నైవేద్యంగా సమర్పించాలి. ఇలా సమర్పించే కర్మయోగి వైఖరి ఎలా ఉండాలి అంటే, మూడు విషయాలను అందంగా ప్రతిపాదిస్తున్నాడు. (1) ఆశను విడిచి పెట్టాలి. (2) మమకారం లేకుండా ఉండాలి. (3) సంతాపము, లేక శోకము లేకుండా ఉండాలి. అప్పుడే కర్మలు పవిత్ర నైవేద్యా లవుతాయి.

ఆశను ఆగనీ

అందరి కర్మల వెనుక ఆశలు ఉన్నాయి. ఆశ ఏదో కాదు, కామం. ఒక విధంగా చెప్పాలంటే విషయ దాహం. అది వర్తమానానికి సంబంధించింది అయినా కావచ్చు. లేదా, భవిష్యత్తుకు సంబంధించింది అయినా కావచ్చు. గతానికి సంబంధించింది మాత్రం కాలేదు. గతానికి సంబంధించి అనుభవాలు, నిరాశలు ఉంటాయే గాని, ఆశలు ఉండవు. నెరవేరాలి అనే కోరికే ఆశలో ప్రధానంగా ఉంటుంది. గతం ఎలాగూ తిరిగి రాదు కనుక ఆశలు గతానికి సంబంధించి ఉండవు.

నేడు ఎలా ఆశలు కదుల్తున్నాయో గతంలో కూడా అలాగే కదిలాయి. మనిషి ఆశాజీవి. ఆశలు మనిషికి

క్రొత్తవి కావు. గతం లోని ఆశలే నేడు వీస్తున్న నిరాశా గాలులు. అలాగే నేటి ఆశలే భవిష్యత్తులో నిస్పృహల్ని ప్రసరింప చేస్తాయి. ఇంత వరకు ఆశామార్గంలో చరించి అన్యాయమై పోయాం. ఇక ఆశల్ని విడిచి పెట్టి ప్రయాణం సాగించాలి. కర్మయోగి అదే చేస్తాడు. అందుకే అతడు **నిరాశీ** అయ్యాడు ***(నిరాశీః త్యక్తాశీః).*** 'నిరాశీ' అంటే ఆశను విడిచి పెట్టిన వాడు. లోకాన్ని మరచిన వాడు. లోకేశ్వరుని మరవని వాడు. అతడే కర్మయోగి. అతడే భక్తుడు.

మమతను మాసిపోనీ

'ఇది నాది - అది నాది' అనే మమకారము మరుగున పడాలి ***(నిర్గత మమభావః).*** ఈశ్వరుని కొరకు కర్మల్ని ఆచరించే భృత్యుడికి మమకారం ఎలా ఉంటుంది? 'నాది - నాది' అంటూ ఇంతవరకూ ప్రోగు చేసుకున్న మమకార దోషాన్ని 'నీదే - నీదే' అంటూ ఇకనైనా కడిగేసు కోవాలి. **త్వమేవ శరణం మమ దేవ దేవ** అంటూ మమతను వీడి, సేవా జీవనాన్ని ప్రారంభించాలి. అదే కర్మయోగ వైభవం. కర్మయోగి ప్రాభవం.

సంతాపం సడలిపోనీ

జ్వరః అంటే దుఃఖము, వేడి, జ్వరము అని అర్థాలున్నాయి. వీటి నుండి విడి పడటమే ఇక్కడ విగత జ్వరము *(విగతజ్వరః విగత సంతాపః విగత శోకః విగత జ్వరః).* భౌతికంగా దేహానికి వచ్చే జ్వరము శారీరిక జ్వరము. మనస్సును పీడించే సంతాపము, లేదా దుఃఖము మానసిక జ్వరము. ఇదే సంసార తాపము. కర్మయోగి సంసార తాపము నుండి విడిపడిన వాడు. ఆశ లేనివాడు కనుక ఏదో రాలేదని దుఃఖించడు. మమకారం లేనివాడు కనుక ఏదో పోయిందని బాధ పడడు. 'పరమేశ్వరుని భృత్యుడు' అనే పాత్రను పవిత్రంగా పోషిస్తాడు కనుక ప్రశాంత జీవనాన్ని కొనసాగిస్తాడు. అర్జునా! ఇదే కర్మయోగ వైభవం. ఇప్పుడు ఆలోచించు. కర్మల్ని విడిచిపెట్టి ఏమి సాధిస్తావు? వైభవం అంతా కర్మయోగం లోనే ఉంది. కర్మయోగము నందు శుద్ధిపడిన వాడే జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొంది తరిస్తాడు.

పరమేశ్వరుడు అనుగ్రహించిన ఈ బోధను ఎలా ఆచరించాలో, ఆచరిస్తే కలిగే ఫలితం ఏమిటో చెబుతున్నాడు.

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠన్తి మానవాః ।
శ్రద్ధావన్తో౽నసూయన్తో ముచ్యన్తే తే౽పి కర్మభిః ॥ **31**

యే-మే-మతం-ఇదం-నిత్యం-అనుతిష్ఠంతి-మానవాః
శ్రద్ధావంతః-అనసూయంతః-ముచ్యంతే-తే-అపి-కర్మభిః

శ్రద్ధావంతః	= శ్రద్ధ కలవారై	నిత్యం	= ఎల్లప్పుడు
అనసూయంతః	= అసూయ లేనివారై	అనుతిష్ఠంతి	= అనుసరిస్తారో
యే మానవాః	= ఏ మనుజులు	తే అపి	= వారు గూడ
మే	= నా యొక్క	కర్మభిః	= కర్మల చేత
ఇదం మతం	= ఈ అభిప్రాయమును	ముచ్యంతే	= విడి పడతారు

నా ఈ అభిప్రాయాన్ని సదా అనుసరించే వారు శ్రద్ధావంతు లవుతారు. అసూయ లేని వారు అవుతారు. కర్మల నుండి విడిపడతారు.

వ్యాఖ్య

అర్జునా! నేను బోధించిన ఈ కర్మయోగాన్ని గతంలో ఆచరించిన వారందరూ తరించి పోయారు.

అనాదిగా ఎందరికో జ్ఞానభిక్ష పెట్టిన పవిత్ర మార్గమిది. అందుచేతనే జ్ఞానాన్ని పొందిన జనకాదులు కూడా పరానుగ్రహార్థం కర్మల్ని ఆచరించారు. ఇంతెందుకు? ఇతరుల విషయం అలా ఉంచు. నన్ను చూడు! నేను పొంద దగింది ఏదీ లేకపోయినా, నీ బండిలో కూర్చుని సారథ్యం వహిస్తున్నానా, లేదా? పరానుగ్రహార్థం చేసే కర్మలలో పోగొట్టుకొనేది ఏమీ ఉండదు. పైపెచ్చు అట్టి కర్మలు లోకసంగ్రహార్థం సాగుతుంటాయి కనుక వాటి ద్వారా ప్రపంచం లబ్ధిని పొందుతుంది.

అర్జునా! ఎవరో తరించారని ఇతిహాసాల నుండి ఉదహరిస్తే, ప్రస్తుతం ఉన్న వాళ్ళు తరించరు అని భావం కాదు. నీళ్ళు ఏ కాలంలో అయినా, ఏ వ్యక్తికైనా దాహాన్ని తీరుస్తాయి. నేను బోధించిన జ్ఞానం కూడా అలాంటిదే. అది ఎవరినైనా, ఎప్పుడైనా తరింప చేస్తుంది. కాకపోతే, ఈ మార్గాన్ని నిరంతరం ఆచరించాలి. అంతేకాదు, ప్రస్తుతం మనకున్న వాటిలో కొన్నిటిని తొలగించు కోవాలి, లేని వాటిని కొన్నిటిని తగిలించు కోవాలి. అవేమిటో చెబుతాను. విను.

కర్మయోగంలో చరించే భక్తులు (1) శ్రద్ధావంతులై ఉండాలి. (2) అసూయ లేనివారై ఉండాలి. అంటే, శ్రద్ధను గట్టిగా పట్టుకోవాలి. అసూయను ప్రయత్నించి పోగొట్టు కోవాలి. శ్రద్ధ లేని వారికి ఈ యోగము ఎలా వంట పట్టదో, అసూయాపరులకు కూడా అలాగే వంట పట్టదు.

శ్రద్ధ అంటే శాస్త్ర విషయం లోను, శాస్త్రమును బోధించే సద్గురువు విషయం లోను అకుంఠితమైన విశ్వాసమును కలిగి ఉండటం. ఇక్కడ శాస్త్రము గీతాశాస్త్రము. గీత మోక్షశాస్త్రము. ప్రమాణ రూపంలో ఉన్న ప్రసాదము. ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకొని స్వీకరించినట్లు, గీతాశాస్త్రాన్ని పవిత్రంగా, ప్రమాణంగా విశ్వసించి ఆచరణలో పెట్టు కోవాలి.

శ్రద్ధ కలవారై ఉండాలి. అసూయ లేనివారై ఉండాలి. అసూయ అనేది ఒక విచిత్రమైన దుర్గుణం. అది నిప్పు లేకుండా లేచే పొగ. నేల విడిచి సాము చేసే ప్రక్రియ. మన కన్నా ఆధిక్యాన్ని, అభివృద్ధిని సాధించిన వాళ్ళను చూచి నపుడు మనస్సును ద్వేషంతో నింపే ఒకానొక దుర్గుణం అసూయ అని సాధారణంగా భావిస్తూ ఉంటారు. అది ఉండ కూడని అవలక్షణమే. కాని, అది అసూయ కాదు, మాత్సర్యము. ఇతరులలో ఉన్న దానిని చూచి ఓర్వలేని గుణము. అసూయ అది కాదు. అసూయ అంటే, లేని దానిని ప్రయత్న పూర్వకంగా ఆరోపించడం. గుణాలలో దోషాన్ని దర్శించడం ***(గుణేషు దోష దర్శనం).*** ఉన్న మంచిని చూడలేక పోగా, లేని దోషాన్ని ఆరోపించి చూడటం అసూయ అనే దుర్గుణం.

ఎవరైనా పవిత్రంగా దానం చేస్తూ ఉంటే, అసూయాపరుడు జీర్ణించుకో లేడు. ఆ దానకర్మ వెనుక ఏదో లబ్ధిని పొందాలనే ఉద్దేశం ఉందని ప్రసంగం సాగిస్తాడు. ఇలా అసూయాపరులు విశృంఖలంగా వ్యవహరిస్తూ ఉంటారు. ఇలాంటి దుర్గుణము లేకుండా ఉంటేనే కర్మయోగము ఫలితా న్నిస్తుంది.

అర్జునా! మోక్ష శాస్త్రమైన గీతాశాస్త్రము నందు శ్రద్ధ ఉండాలి. అసూయ ఉండ కూడదు. అలాగే, గీతా శాస్త్రాన్ని బోధిస్తున్న సద్గురువు నైన నా విషయంలో కూడా శ్రద్ధ ఉండాలి. అలాగే, నా విషయంలో అసూయ ఉండ కూడదు ***(అనసూయన్తః అసూయాం మయి గురౌ వాసుదేవే అకుర్వన్తః).***

శాస్త్రం బోధించే విషయంలో సందేహాలు ఉండ వచ్చు. వాటిని ప్రయత్నించి, పరిప్రశ్నించి తొలగించు కోవాలి. శాస్త్ర విషయంలో సందేహాలు ఉండవచ్చు. అలాగని శాస్త్రాన్ని సందేహించ కూడదు. ప్రమాణగత సంశయం ప్రమాదాన్ని సృష్టిస్తుంది. శాస్త్రం విషయంలో శ్రద్ధ కలవాడు శాస్త్రాన్ని సందేహించడు. శాస్త్రం విషయంలో తన అవగాహనను సందేహిస్తాడు. ఇదే సంప్రదాయం.

అర్జునుడికి శ్రద్ధ ఉంది. అయినా, సందేహాలను జగద్గురువైన గీతాచార్యుని ముందు పరుస్తూ నివృత్తి చేసుకున్నాడు. సందేహం కలిగి నపుడు శాస్త్రాన్ని ప్రశ్నించ లేదు. తన అవగాహనను ప్రశ్నించుకున్నాడు. గురుబోధలో దోషాన్ని చూడ లేదు. తన అవగాహనను తాను పునః పరిశీలించు కున్నాడు. ప్రశ్నించు కున్నాడు. తన బుద్ధికి విన్న విషయం అస్పష్టంగా ఉన్నట్లు నిర్ణయించు కున్నాడు ***(వ్యామిశ్రేణ ఇవ)***. ఇదే శ్రద్ధ.

అర్జునా! ఇలాంటి శ్రద్ధ కలిగి, అనసూయాపరు లైన వారు, సదా ఈ యోగాన్ని అనుసరిస్తే ***(నిత్యం అనుతిష్ఠన్తి)*** కర్మ సుడిగుండం నుండి తప్పక బయట పడ గలరు. కాకపోతే, ఇది నిత్యానుష్ఠానం కావాలి. సదా ఆచరించాలి. కర్మలు సదా సాగుతూ ఉంటాయి కనుక, కర్మలలో యోగబుద్ధి సదా ఉండాలి.

కర్మయోగి ఎవరో కాదు, భక్తుడే కర్మయోగి. అందుచేత కర్మయోగి పూజ చెయ్యవచ్చు. అది బహిరంగ సాధన. అలాగే, కర్మయోగి కళ్ళు మూసుకొని సగుణబ్రహ్మ ధ్యానాన్ని కొనసాగించ వచ్చు. అది అంతరంగ సాధన. సాధనలకు సమయాలు ఉంటాయి. కాని, కర్మలు నిరంతరం సాగుతూనే ఉంటాయి. అట్టి కర్మలలో యోగబుద్ధిని కలిగి ఉండటం నిత్యసాధన.

శ్రద్ధ అనేది ఆధ్యాత్మిక మార్గంలో అమృతము వంటిది. శాస్త్ర విషయంలో, సద్గురువు విషయంలో ఎవరికి ఎంత శ్రద్ధ ఉంటే, అంత ఫలం అందుతూ ఉంటుంది. ఇక, అసూయ అంటారా! అది విషం లాంటిది. గురువు ప్రసాదించే జ్ఞానామృతంలో అసూయ అనే విషం కలిస్తే, ఆ తరువాత ప్రమాణఫలం ప్రాప్తించే అవకాశమే ఉండదు. కనుక ఈ శ్లోకంలో పరమేశ్వరుడు సూచించిన రెండు ప్రధాన విషయాలను సాధకులు సదా మనస్సులో నింపుకొని ముక్తి మార్గంలో పయనించాలి.

అలా కాకుండా, పైన చెప్పిన దానికి భిన్నంగా, విపరీతంగా చరించే మూఢులు ఏమవుతారో తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

యే త్వేత దభ్యసూయన్తో నానుతిష్ఠన్తి మే మతమ్ ।
సర్వజ్ఞాన విమూఢాం స్తా న్విద్ధి నష్టా నచేతసః ॥ 32

యే-తు-ఏతత్-అభ్యసూయంతః-న-అనుతిష్ఠంతిః-మే-మతం
సర్వజ్ఞాన విమూఢాన్-తాన్-విద్ధి-నష్టాన్-అచేతసః

యే తు	= ఎవరైతే	తాన్	= వారిని
మే	= నా యొక్క	అచేతసః	= అవివేకులుగా
ఏతత్ మతం	= ఈ అభిప్రాయమును	సర్వజ్ఞాన విమూఢాన్	= ఏ జ్ఞానము లేని వాళ్ళుగా
అభ్య సూయంతః	= అసూయాపరులై	నష్టాన్	= చెడిపోయిన వాళ్ళుగా
న అనుతిష్ఠంతి	= అనుసరించరో	విద్ధి	= తెలుసుకో

అసూయాపరులు నా అభిప్రాయాన్ని అనుసరించరు. వారు మూర్ఖులు. వారిని సర్వ జ్ఞాన శూన్యులుగా, భ్రష్టులుగా తెలుసుకో!

వ్యాఖ్య

శ్రద్ధ కలవారై, అసూయా రహితులై పరమేశ్వరుని అభిమతానికి ***(ఈశ్వరస్య మతం)*** అనుగుణంగా చరించే వారు జ్ఞానవంతులై తరించి పోతారు. దానికి భిన్నంగా, అసూయాపరులై, ఆచార్యుని యందు, ప్రమాణము నందు శ్రద్ధ లేనివారై, భగవంతుడు ఉపదేశించిన మార్గమును విడిచిన వారై, ఇటు కర్మ సంబంధమైన జ్ఞానము లేక, అటు బ్రహ్మ సంబంధమైన జ్ఞానము లేక భ్రష్టులై పోతారు.

అలాంటి వారు అవివేకులు ***(అచేతసః)***. వ్యర్థమైన వాదాలతో, శుష్క వచనాలతో బ్రతుకును బుగ్గి చేసుకుంటారు. తత్ఫలితంగా వారు నశిస్తారు అంటున్నాడు భగవంతుడు ***(నష్టాన్ నాశం గతాన్)***.

ఇక్కడ నష్ట మేమిటో కూడా అర్థం కావాలి. నష్ట మంటే ఉన్న దానిని పోగొట్టుకోవడం అని కాదు. వచ్చే దానిని రాబట్టుకోలేక పోగొట్టుకోవడం అని అర్థం. ఈ ప్రపంచం లోకి మనం లక్ష్యసాధన కోసం వచ్చాం. ఇక్కడ మోక్ష సాధన కొరకే ఉన్నాం. ఈ అవకాశం దేవతలకు కూడా లేదు. ఒక్క మానవుడికే ఉంది. అందుచేతనే గడచిన శ్లోకంలో **మానవాః** అని ప్రత్యేకించి చెప్పి, తరించే అవకాశం ఒక్క మానవుడికే ఉందని తెలిపాడు. అలాంటి అవకాశాన్ని జారవిడుచు కోవడం కన్నా మించిన నష్టం ఏముంటుంది? అందుకే సర్వజ్ఞాన విమూఢులై ***(సర్వజ్ఞాన విమూఢాన్)*** నశించి పోతారు అంటున్నాడు భగవంతుడు.

ఇక్కడ అన్ని రకాలైన జ్ఞానాల విషయంలో వివేకం లేనివాడు కనుక సర్వజ్ఞాన విమూఢుడు అని అర్థం కాదు. అన్ని విషయాలలో జ్ఞానం లేకపోవడ మేమిటి? నిరుపయోగ మైన అనేక విషయాలకు సంబంధించిన జ్ఞానం అవివేకికి బాగా ఉంటుంది. శాస్త్రాన్ని, గురువును విమర్శించే జ్ఞానం ఉంది కదా? అది జ్ఞానమా, అజ్ఞానమా - అనేది వేరే విషయం. అసలే జ్ఞానం లేకుండా మాత్రం లేదు. మూఢుడికి మూఢ జ్ఞానము ఉంది. కాని, సర్వజ్ఞానం లేదు. అందుకే అతడు సర్వజ్ఞాన విమూఢుడు.

భగవంతుడికి 'సర్వం' అని పేరు. అంటే 'సర్వుడు' అని అర్థం ***(సర్వః సర్వస్య సర్వదా జ్ఞానాత్ సర్వమ్)***. సర్వ రూపుడు కనుక పరమేశ్వరుడు సర్వుడు. సర్వుడైన ఈశ్వరునికి సంబంధించిన జ్ఞానము సర్వజ్ఞానము. అట్టి సర్వ జ్ఞానమునకు సంబంధించిన వివేకము లేనివాడు సర్వజ్ఞాన విమూఢుడు. కనుక శ్రద్ధ లేనివారు, అసూయా పరులైన మూర్ఖులే విమూఢులు. సంశయగ్రస్తులు. వీరు ప్రమాణ, ప్రమేయ, ప్రయోజన విషయాలలో మూఢులై ఉంటారని ఆనందగిరి శంకర భాష్యానికి రచించిన టీకలో తెలిపారు.

కృష్ణా! పవిత్రమైన నీ మార్గాన్ని వీళ్ళు ఎందుకు అనుసరించరు? పరధర్మాన్ని ఎందుకు ఆశ్రయిస్తారు? దోషాల నుండి బయటపడి తోషంతో జీవించాలని ఎందుకు అభిలషించరు? అనే సందేహాలకు సమాధానం చెబుతున్నాడు.

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతే ర్జ్ఞానవా నపి ।
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33

సదృశం-చేష్టతే-స్వస్యాః-ప్రకృతేః-జ్ఞానవాన్-అపి
ప్రకృతిం-యాంతి-భూతాని-నిగ్రహః-కిం-కరిష్యతి

జ్ఞానవాన్ అపి	= జ్ఞానవంతుడు కూడా	ప్రకృతిం	= స్వభావాన్నే
స్వస్యాః	= తనదైన	యాంతి	= పొందుతూ ఉంటాయి
ప్రకృతేః	= స్వభావానికి	నిగ్రహః	= నిగ్రహము
సదృశం	= తగినట్లుగా	కిం	= ఏమి
చేష్టతే	= ప్రవర్తిస్తాడు	కరిష్యతి	= చేయగలదు?
భూతాని	= ప్రాణులు		

జ్ఞానవంతు డయినా తన స్వభావానికి అనుగుణం గానే ప్రవర్తిస్తున్నాడు. ప్రాణులన్నీ తమ స్వభావాన్ని అనుసరించే నడుస్తున్నాయి. కాబట్టి, నిగ్రహము ఏమి చేస్తుంది?

వ్యాఖ్య

అతడు ఎందుకలా ప్రవర్తించాడు? ఆమె ఆ విధంగా ఎలా మాట్లాడ గలిగింది? ఎంత చెప్పినా అలాగే చేస్తా డెందుకని? ఆ వ్యక్తి ఇక మారే అవకాశమే లేదా? అనే ప్రశ్నలు ఎదురై నపుడు, ఏం చేద్దామండీ! అది అతని స్వభావం. అతడు అంతే. అది ఆమె స్వభావం. ఆవిడ మారదు అనే మాటలు జవాబులుగా వినపడుతూ ఉంటాయి. ఈ మాటలు సాధారణంగా సామాన్యుల నోటి నుండి వింటూ ఉంటాం. కాని, అవే మాటలు సాక్షాత్తు భగవంతుని ముఖతః ప్రస్తుతం వింటున్నాము.

ప్రకృతిని బట్టే ప్రవృత్తి

సమస్త ప్రాణులు తమ స్వభావాన్ని అనుసరించే ప్రవర్తిస్తూ ఉంటాయి. జ్ఞాని కూడా తన స్వభావానికి అనుగుణం గానే ప్రవర్తిస్తూ ఉంటాడు. తన ప్రకృతిని, లేదా స్వభావాన్ని నిగ్రహించడం ఎవరికీ సాధ్యమయ్యే పని కాదు అంటున్నాడు గీతాచార్యుడు.

పూర్వజన్మ సంస్కారాలు ప్రస్తుత జన్మలో అభివ్యక్త మవుతూ ఉంటాయి. అదే ప్రకృతి, లేదా స్వభావము (***ప్రకృతిః నామ పూర్వకృత ధర్మాది సంస్కారః వర్తమాన జన్మాదౌ అభివ్యక్తః***). పూర్వ జన్మములో ఆచరించిన ధర్మాధర్మాలు, రాగద్వేషాది కర్మల వలన ఏర్పడిన సంస్కారమే నేటి జన్మలో మానవుని స్వభావంగా ఉంటుంది. అదే మానవ ప్రకృతి అంటే. తన ప్రకృతికి అనుగుణం గానే మనిషి ప్రవర్తిస్తూ ఉంటాడు. స్వభావానికి భిన్నంగా ప్రవర్తించడం ఎవరికీ సాధ్యమయ్యే విషయం కాదు. గత జన్మ సంస్కార జనిత వాసనలకు అనుగుణమైన ప్రదేశాల లోనే ప్రాణులు పుడుతూ ఉంటాయి.

వైద్య విద్యను అభ్యసించిన వ్యక్తి వైద్యశాల లోనే ఉంటాడు. పాఠశాలలో ఉండడు. ఉపాధ్యాయ వృత్తిలో శిక్షణ పొందిన వ్యక్తి పాఠశాలలో బోధిస్తూ ఉంటాడే గాని వైద్యశాలలో వైద్యం చేస్తూ కనిపించడు. జన్మ సంస్కార ప్రవృత్తి కూడా ఇలాగే ఉంటుంది.

గత జన్మ సంస్కారాలే ప్రస్తుత జన్మలో స్వభావంగా ఉన్నప్పుడు, తన ప్రకృతికి భిన్నంగా చరించడం ఎవ్వరికీ సాధ్యపడదు. స్వభావమే మనిషి చేత కర్మ చేయిస్తుంది. స్వభావ సిద్ధములైన గుణాల చేత నెట్టబడి ప్రతి వ్యక్తి అస్వతంత్రుడై కర్మల్ని ఆచరిస్తాడు అని కర్మయోగము - ఐదవ శ్లోకం లోనే భగవానుడు చెప్పి ఉన్నాడు (**కార్యతే హి అవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః**). ప్రకృతి అధీనంలో ఉన్నవారు ప్రవృత్తికి ఎలా దూర మవుతారు? ఒక కర్మను ఆపడం అంటే, మరొక కర్మను ఆరంభించడం అని అర్థం. స్వభావమే కర్మల్ని చేయిస్తుంది. ఆహారం తినను అని కూర్చున్న వ్యక్తి చేత కూడా ఆకలి ఎలా తినేలా చేస్తుందో, కర్మ చేయను అని కూర్చున్న వ్యక్తి చేత కూడా స్వభావం కర్మ చేయిస్తుంది.

గత జన్మ కృత పుణ్యపాప కర్మల వలన ఏర్పడిన సంస్కారము మనస్సు లోతుల్లో వాసనల రూపంలో ఉంటుంది. అదే స్వభావము, లేదా ప్రకృతి. అనుకూల పరిస్థితులలో, సమయాలలో బహిర్గత మయ్యేందుకు యత్నిస్తూ ఉంటుంది. బావి లోని నీటిని చేదతో తోడి బయటికి తీసినట్లు, ఇంద్రియాలు నిగూఢంగా ఉన్న వాసనల్ని బాహ్యానికి ఈడుస్తాయి. ఆ ప్రవాహాన్ని ఆపడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ప్రకృతి వేగాన్ని ఎవ్వరూ ఆపలేరు. ఒకవేళ ఆపే ప్రయత్నం చేసినా, నదిని నిరోధించినట్లే ఉంటుంది. గాలిని అరచేతిలో బంధించినట్లే ఉంటుంది. అందుచేతనే, ***నిగ్రహం కిం కరిష్యతి*** - స్వభావాన్ని నిగ్రహించడం ఎలా కుదురుతుంది? అని భగవంతుడే ప్రశ్నిస్తున్నాడు. స్వభావాన్ని నియంత్రించడం అసంభవం అంటున్నాడు. శ్రీ శంకరాచార్యస్వామి తమ భాష్యంలో, స్వభావ ప్రవాహంలో కొట్టుకుపోయే వారిని, అన్యుల మాట అటుంచి, స్వయంగా భగవంతుడు కూడా ఆపలేడు అన్నారు (***నిగ్రహః కిం కరిష్యతి, మమ వా అన్యస్య వా***).

నిజమే కదూ! తమ వాసనలకు (***స్వస్యాః ప్రకృతేః***) అనుగుణం గానే (***సదృశమ్***) మనిషి ప్రవర్తించే టప్పుడు (***చేష్టతే***) అలా ప్రవర్తించడం వెనుక నియతి ఉందా, లేదా? నియతి రూపంలో ఉన్నది నియంతే కదూ! మరి నియతిని నియంత అతిక్రమిస్తాడా? ధర్మాన్ని దైవమే ఉల్లంఘిస్తాడా? స్వభావాన్ని ఆపడం అందుకే అసంభవము. స్వభావాన్ని నిగ్రహించలేక పోవడం చేతనే పరమేశ్వరుని బోధను మానవులు అనుసరించలేక పోతున్నారు. అందుకే మార్పు బాధాకరం. మనిషిని మార్చడం కష్టతరం. స్వభావ ప్రేరణతో ప్రకోపించిన సుయోధనుని వాసుదేవుడే మార్చలేక పోయాడు.

పల్లవి : **మారిన దెవరు? మార్చే దెవరు?**
మార్పు మనిషికి సాధ్యమా మనసా! ॥ మారిన ॥
అనుపల్లవి : **కురిసే మబ్బును నిలిపే దెవరు?**
మారే మనసును ఆపే దెవరు? ॥ మారిన ॥
చరణము : **నీది కానిది నీకు లేనిది**
ఇవ్వలేరు ఇలలో దేవతలైనా
కర్కశమైన కౌరవపతిలో
మార్పును చూశాడా కేశవుడైనా ॥ మారిన ॥

అని నిగ్రహింప బడని ప్రకృతిని పల్లవితో ముడి వేసి, చరణంలో చర్చించింది చైతన్య గీతిక.

జ్ఞాని ప్రత్యేకం కాదు

సామాన్యులే కాదు, జ్ఞాని కూడా తన ప్రకృతికి అనుగుణం గానే ప్రవర్తిస్తాడు అంటూ విస్మయాన్ని గొలిపే విషయాన్ని వినిపిస్తున్నాడు (***జ్ఞానవాన్ అపి స్వస్యాః ప్రకృతేః సదృశం చేష్టతే***). తాను అకర్తగా శోభిస్తున్నా, జ్ఞాని ఆచరించే కర్మలు స్వభావాన్ని అనుసరించే సాగుతున్నాయి అంటున్నాడు.

ప్రారబ్ధానుసారం జ్ఞాని దేహం ద్వారా కర్మలు ఎలా జరుగుతూ ఉన్నాయో, గత జన్మ సంస్కార జనిత వాసనల కనుగుణంగా జ్ఞాని కర్మలలో ప్రవర్తిస్తూ ఉంటాడు. కాకపోతే, జ్ఞాని స్వభావం పవిత్రంగా ఉంటుంది కనుక, ఆయన ద్వారా పవిత్రమైన కర్మలే అప్రయత్నంగా సాగిపోతూ ఉంటాయి. దేహంలో గుండె ఆడినట్లు, రక్తం పారినట్లు, రెప్పపాట్లు పడినట్లు, శ్వాసలు అల్లలాడినట్లు, మనస్సు లోని స్వభావము అప్రయత్నంగా ప్రవర్తిస్తూ ఉంటుంది.

మరి, స్వభావ ఆగ్రహాన్ని నిగ్రహించ లేనపుడు, అందరూ ప్రారబ్ధం చేతిలో కీలుబొమ్మలే కదా? అంతా ప్రారబ్ధ ప్రాభవమే కదా? ఇక పురుషార్థానికి స్థాన మెక్కడుంది? పురుషార్థ సాధనకు అవకాశమే లేనపుడు శాస్త్రము యొక్క ప్రయోజన మేమిటి? ***సత్యం వద - ధర్మం చర*** - సత్యాన్ని పలుకు - ధర్మంగా నడుచుకో అంటోంది శాస్త్రం. మరి, స్వభావం అసత్య భాషణంతో, అధర్మ ఆచరణతో నిండి ఉన్నప్పుడు, శాస్త్రం చెప్పిన దానిని ఆచరించే అవకాశ మెక్కడుంది? స్వభావాన్ని నిగ్రహించడం సాధ్యపడదని భగవంతుడే చెబుతున్నాడు కదా! అలాంటప్పుడు విహిత కర్మాచరణ ఎలా సాధ్యం?

ఈ సంశయాన్ని తరువాత శ్లోకంలో నివారిస్తున్నాడు.

ఇన్ద్రియ స్యేన్ద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయో ర్న వశ మాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపన్థినౌ ॥ 34

ఇంద్రియస్య-ఇంద్రియస్య-అర్థే-రాగద్వేషౌ-వ్యవస్థితౌ
తయోః-న-వశం-ఆగచ్ఛేత్-తౌ-హి-అస్య-పరిపంథినౌ

ఇంద్రియస్య	=	ప్రతి ఇంద్రియమునకు	వశం	=	వశమును
ఇంద్రియస్య అర్థే	=	ఇంద్రియ విషయము నందు	న ఆగచ్ఛేత్	=	పొంద గూడదు
రాగద్వేషౌ	=	రాగద్వేషములు	తౌ	=	ఆ రాగద్వేషములు
వ్యవస్థితౌ	=	ఏర్పడి ఉన్నాయి	అస్య	=	సాధకునికి
తయోః	=	ఆ రాగద్వేషములకు	పరిపంథినౌ హి	=	శత్రువులు గదా

ప్రతి ఇంద్రియానికి దానికి సంబంధించిన ఇంద్రియ విషయము నందు రాగద్వేషాలు ఏర్పడి ఉన్నాయి. రాగద్వేషాలకు ఎవ్వరూ వశపడ కూడదు. రాగద్వేషాలు సాధకునికి ప్రబల శత్రువులు కదా!

వ్యాఖ్య

ఏ వ్యక్తి కూడా తన ప్రకృతికి, లేదా స్వభావానికి భిన్నంగా ప్రవర్తించ లేడని అర్థం చేసుకున్నాం. స్వభావమే జీవితాన్ని నడుపుకుంటూ పోతూ ఉంది. మన కర్మల్ని స్వభావమే నిర్ణయిస్తూ ఉంది అని గ్రహించాం.

స్వభావాన్ని అనుసరించే అందరూ ప్రవర్తిస్తున్నారు అన్నప్పుడు స్వభావం లేనివారు ఎవరుంటారు? ఎవ్వరూ ఉండరు (*న చ ప్రకృతి శూన్యః కశ్చిదస్తి*). ఒకవేళ, అలాంటి వారు ఎవరైనా ఉంటే, వారికి మాత్రమే శాస్త్రం ఉపయోగ పడుతుందని, స్వభావ ప్రేరణలో ప్రవర్తించే వారికి శాస్త్రం ఉపయోగ పడదని అర్థం. అలాంటప్పుడు ఇక శాస్త్రాధ్యయనం ఎందుకు? ఆ సందేహానికి సమాధానమే ఈ శ్లోకం.

స్వభావం కర్మలను నిర్ణయించ వచ్చు. స్వభావ సిద్ధమైన కర్మలు బంధాన్ని కలిగించవు. రాగద్వేషాలతో కలిసి నపుడే కర్మలు బంధిస్తాయి. రాగద్వేషాల విషయంలో మనం జాగ్రత్తగా ఉంటే, స్వభావజనిత కర్మలు బంధహేతువులు కావు. స్వభావాన్ని మనం నిగ్రహించలేక పోవచ్చు. కాని, వివేకంతో చరిస్తే రాగద్వేషాలను కట్టడి చేయగలం.

రాగద్వేషాలు

ప్రతి ఇంద్రియానికి తత్సంబంధమైన ఇంద్రియ విషయము నందు రాగద్వేషాలు ఉంటాయి. **ఇంద్రియస్య ఇంద్రియస్య** అని రెండుసార్లు చెప్పడాన్ని సంస్కృత భాషా ప్రక్రియలో **వీప్సా** అంటారు. అంటే, ద్విరుక్తి అని అర్థము. 'ఇంద్రియస్య ఇంద్రియస్య' అంటే సమస్తమైన ఇంద్రియముల యొక్క **అర్థే** - విషయముల యందు; అనగా రూపము నందు, శబ్దము నందు, రసము నందు, స్పర్శము నందు, గంధము నందు అని అర్థము. ప్రతి ఇంద్రియానికి తత్సంబంధమైన ఇంద్రియ విషయము ఇష్టమైతే రాగము ఏర్పడుతుంది (*ఇష్టే రాగః*). అనిష్ట మైతే ద్వేషము కలుగుతుంది (*అనిష్టే ద్వేషః*).

విషయాలను గుర్తించ డానికి ఇంద్రియాలు ఉపకరిస్తాయే గాని, రాగద్వేషాలను ఇంద్రియాలు కదిలించ లేవు. రాగద్వేషాలు కదల డానికి స్వభావమే కారణము. అందుచేత కళ్ళు చూపించిన వన్నీ మనం కోరుకోము. వాటికి సంబంధించిన వాసనలు మన వద్ద ఉన్నప్పుడే అవి మనల్ని ఆకర్షిస్తాయి. ఆకర్షించిన వాటినే మనం కోరుకుంటాము.

ఎంత విశిష్టమైన వస్తువునైనా అందరూ అభిలషించలేక పోవడానికి స్వభావమే కారణము. మనము దేనిని కోరుకున్నా, ఆ కోరిక వెనుక స్వభావ ప్రేరణ ఉంటుంది. కాని, అది మనకు కనిపించదు. మెదడు యొక్క లోతుల్లో ఉంటుంది కనుక అర్థం కాదు కూడా. 'ఏం చేద్దాం! నేను అలాగే ప్రవర్తిస్తూ ఉంటాను. అది నా

స్వభావం' అని మనుషులు చెప్పుకోవడం కూడా వింటూ ఉంటాము. స్వభావం ముందు మనిషి ఎంత అశక్తుడో ఆ మాటల్ని విశ్లేషిస్తే అర్థ మవుతుంది.

ఒక పువ్వును నచ్చినా, ఒక మనిషిని మెచ్చినా, ఒక పండును కోరినా, ఒక బట్టను ధరించినా, ఒక పదార్థాన్ని ఆశించినా, ఒక ప్రదేశాన్ని నిరసించినా వాటి వెనుక కారణా లున్నాయి. అవన్నీ స్వభావంలో దాగి ఉన్నాయి. వ్యక్తుల స్వభావాలు భిన్నంగా ఉన్నాయి కనుక, రాగద్వేషాలలో వ్యత్యాసాలు గోచరిస్తూ ఉన్నాయి.

పెళ్ళిచూపులలో అనేక మందిని చూడటానికి ఇదే కారణము. వాస్తవానికి అక్కడ చూస్తున్నవి కళ్ళు కాదు. మనస్సూ కాదు. మనస్సులో అంతర్లీనంగా ఉన్న స్వభావం. స్వభావమే సానుకూలమైన వ్యక్తి కొరకు అన్వేషిస్తూ ఉంది. ఎందరో అందమైన అబ్బాయిలను చూసిన తరువాత, సాధారణ రూపాన్ని చూసి అమాంతం పెళ్ళికుమార్తె నచ్చేస్తుంది. అందమైన వాళ్ళను ఎందరినో చూచి కాదన్నావు. చివరికి ఈ చింతపండు నచ్చాడా? అని ఎవరైనా ఎగతాళి చేస్తే, నా కళ్ళతో చూస్తే మీకు అర్థ మవుతుంది అంటుంది పెళ్ళి కుమార్తె. నిజమే. అది అక్షర సత్యం. దృశ్యం అందరి నేత్రాలకు ఒకే విధంగా కనిపిస్తుంది. కాని, నచ్చడం అనేది చూడటం మీద ఆధారపడి లేదు. స్వభావం మీద ఆధారపడి ఉంది. ఆ స్వభావ జనిత ఆకర్షణే నేత్రాల ద్వారా ప్రసరించి నచ్చడం లేదా మెచ్చడం జరుగుతుంది.

ఏది నచ్చినా, ఏది నచ్చక పోయినా వాటి వెనుక రాగద్వేషా లున్నాయి. ఈ రాగద్వేషాలను స్వభావం కదిలిస్తూ ఉంటుంది. తదనుగుణంగా అస్వతంత్రుడైన మనిషి ప్రవర్తిస్తూ ఉంటాడు. మనస్సులో నిక్షిప్తమై ఉన్న సంస్కారం మీద మానవునికి ఆధిపత్యం లేదు. స్వభావం మనిషి అధీనంలో ఉండదు. కాని, చేసే కర్మలలో మనిషికి స్వేచ్ఛ ఉంది. ఒక కర్మను చెయ్యవచ్చు (*కర్తుం శక్యం*). చేయక పోవచ్చు (*అకర్తుం శక్యం*). మరో విధంగా చెయ్యవచ్చు (*అన్యథావా కర్తుం శక్యం*). కనుక స్వభావం ముందుకు తోస్తున్నా, స్వభావాన్ని నిగ్రహించ లేని వ్యక్తి కర్మల విషయంలో తన కున్న స్వేచ్ఛను వినియోగించుకో వచ్చు. రాగద్వేషాలను మార్చలేక పోవచ్చు నేమో గాని, రాగద్వేషాలకు చిక్కకుండా కర్మల్ని ఆచరించ వచ్చు. ఇదే కర్మయోగంలో దాగి ఉన్న వైభవం.

ఉంటే ఉండనీ - కలిసి ఉండకు

స్వభావం కర్మల్ని నిర్ణయించ వచ్చు. ప్రవర్తనను నియంత్రించ వచ్చు. కాని, మన కర్మస్వేచ్ఛను నిషేధించ లేదు. పూర్వజన్మ సంస్కార జనిత వాసనలు ఒక వైపు ప్రవాహ రూపంలో ప్రేరేపిస్తున్నా, ప్రస్తుత జన్మలో పురుష ప్రయత్నంతో సాగుతున్న పరమార్థ సాధనను అవగాహనతో కొనసాగిస్తే, రాగద్వేషాలకు వశం కాకుండా కర్మల్ని ఆచరించ వచ్చు. స్వభావము స్వధర్మంగా రూపు దాల్చినా, రాగద్వేషాలు లేకుండా స్వధర్మాన్ని ఆచరించి కర్మబంధం నుండి విడిపడ వచ్చు. స్వభావం ఎలా వ్యక్త మవుతుంది? రాగద్వేషాల ద్వారానే వ్యక్తం కావాలి. రాగద్వేషాలను ఎప్పుడైతే తటస్థ పరచామో, ఆ తరువాత కోరలు తీసిన పాము లాగా కర్మలు నిర్వీర్య మవుతాయి. బంధాన్ని కలిగించ కుండా ప్రారబ్ధం కరిగి పోతూ ఉంటుంది. అందుచేతనే, 'రాగద్వేషాలకు వశపడకు' అంటున్నాడు భగవంతుడు (***తయోః రాగద్వేషయోః వశం న ఆగచ్ఛేత్***). అంతేగాని, 'రాగద్వేషాలు లేకుండా ఉండు' అని చెప్పలేదు. ఎందుకంటే, అవి స్వభావంలో ఉంటాయి. వాటిని నియంత్రించ లేము. కనుక, వాటికి వశపడకు అన్నాడు. ఇది కర్మస్వేచ్ఛను ఆవిష్కరిస్తోంది.

రాగద్వేషాలను తటస్థ పరచ గలిగితే కర్మలు బంధించవు. కనుక రాగద్వేషాలను అవశ్యం తటస్థ పరచాలి. అది కర్మయోగం ద్వారానే సాధ్యం. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను నైవేద్యంగా సమర్పించి, ఫలితాల్ని ప్రసాదంగా స్వీకరించి నపుడు ఇక రాగ మెక్కడుంది? ద్వేషం ఎలా ఉంటుంది? రాగద్వేషాలు లేనపుడు

ఇక బంధ మెక్కడుంది? రాగద్వేషాలే మనిషికి ప్రబల శత్రువులు. శ్రేయో మార్గంలో అవే విఘ్నాలు. ప్రతిబంధకాలు. కనుక అవే శత్రువులు అంటున్నాడు (*పరిపన్థినః హి*).

స్వభావజనిత రాగద్వేషాల చేత ప్రేరేపింప బడిన వాడు పరధర్మం కూడా అనుసరణీయమే అని భావిస్తాడు. అది యుక్తం కాదు. ఆ విషయాన్ని చెబుతున్నాడు.

శ్రేయా న్స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35

శ్రేయాన్-స్వధర్మః-విగుణః-పరధర్మాత్-స్వనుష్ఠితాత్
స్వధర్మే-నిధనం-శ్రేయః-పరధర్మః-భయావహః

స్వనుష్ఠితాత్	= బాగుగా ఆచరింప బడిన		స్వధర్మే	=	తన ధర్మము నందు
పరధర్మాత్	= పరధర్మము కంటె		నిధనం	=	మరణమైనా
విగుణః	= గుణము లేనిదైనా		శ్రేయః	=	శ్రేయస్కరము
స్వధర్మః	= తన ధర్మము		పరధర్మః	=	పరుల ధర్మము
శ్రేయాన్	= శ్రేష్ఠమైంది		భయావహః	=	భయాన్ని కలిగిస్తుంది

చక్కగా ఆచరింప బడిన అన్యుల ధర్మము కన్నా, గుణము లేని దైనా స్వధర్మమే మేలు. స్వధర్మము నందు మరణ మైనా మంచిదే. పరధర్మము భయంకరము.

వ్యాఖ్య

మన ప్రకృతికి, లేదా స్వభావానికి అనుకూల మైనది ఏదో అదే స్వధర్మము. ప్రకృతిని అనుసరించి ప్రవృత్తి ఉంటుంది. ఇదే స్వధర్మానుష్ఠానము. స్వధర్మాన్ని ఆచరించడంలో మనం శాస్త్ర విహిత కర్మల్ని ఆచరిస్తూ పోవాలి. విపరీతంగా చరిస్తే పరిస్థితులు వికటిస్తాయి. ఫలితాలు విధ్వారంగా ఉంటాయి.

హింస చేయ కూడదు (*హింసాం న కుర్యాత్*). మద్యపానం చేయ కూడదు (*సురాం న పిబేత్*). మాంస భక్షణం చేయ కూడదు (*కలంజం న భక్షయేత్*). ఇవి శాస్త్ర ప్రతిపాదిత నిషేధాలు. కాని, స్వభావంలో వీటి యందు రాగబుద్ధి ఉంటే, అవి నిషేధాలే అయినా వాటిని మనిషి విధిగా గ్రహిస్తాడు.

స్నాన సంధ్యాదులు, నిత్య నైమిత్తిక కర్మలు శాస్త్ర విహితాలే అయినా, వాటి యందు ద్వేషబుద్ధి ఉంటే వాటిని త్యజిస్తాడు. కనుక చేయకూడని నిషిద్ధ కర్మలు చేయడానికి, చేయవలసిన విహిత కర్మలు చేయక పోవడానికి రాగద్వేషాలే కారణాలని తేలి పోయింది. ఈ రాగద్వేషాలు స్వభావ జనితాలు కనుక వీటికి స్వభావమే ప్రబల కారణము.

స్వభావమే స్వధర్మమై ఉంటుంది. స్వభావ ప్రేరణతో స్వధర్మాన్ని ఆచరించే టప్పుడు, మనకు కర్మస్వేచ్ఛ ఉంది కనుక, శ్రద్ధతో శాస్త్రానుసారం కర్మల్ని కర్మయోగంగా మార్చుకుంటే, పూర్వ సంస్కారాలు ఖర్చయి పోతాయి. నూతన వాసనలు తయారు కావు. కనుక శాస్త్రానుసారం స్వధర్మానుష్ఠానం అనివార్యం. అవసరం కూడా.

స్వధర్మం భవ్యం - పరధర్మం భయరూపం

స్వః ధర్మః స్వధర్మః - తనదైన ధర్మమే స్వధర్మము. తన ప్రకృతికి అనుగుణమైన ధర్మమే స్వధర్మము. అలాంటిది గుణహీనంగా ఉండవచ్చు కూడా (*విగుణః అపి*). అయినా అదే శ్రేయస్కరము (*శ్రేయాన్*). అదే ప్రశస్త మైనది. చక్కగా ఆచరింప బడిన పరధర్మము కంటే స్వధర్మమే ప్రశస్తము.

స్వధర్మాన్ని ఆచరించ డానికి అనుకూలమైన స్వభావము మనస్సులో ఉంది. సంస్కార ప్రేరిత కర్మను, లేదా స్వధర్మాన్ని రాగద్వేషాలు లేకుండా, ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తే, ధర్మరూపంలో దైవమే ఉన్నందున, స్వధర్మానుష్ఠానంలో వాసనలు ప్రక్షాళన మవుతాయి. సుగుణాలతో కూడినదే అయినా పరధర్మము అనుష్ఠింప దగింది కాదు. పరధర్మాన్ని అనుసరించ డానికి ప్రేరణ నిచ్చే అనుకూలమైన స్వభావము మన వద్ద లేకపోవడమే అందుకు కారణము.

ఒక వైపు స్వభావ ప్రేరిత స్వధర్మాన్ని విస్మరించడము వల్ల పూర్వ వాసనలు ప్రక్షాళనం కావు. మరొక వైపు పరధర్మం స్వభావంలో లేనందున ప్రేరణ కరువై పరధర్మాన్ని ఆచరించడం సాధ్యం కాదు. అందుచేత, జీవించినంత కాలము చేసే కర్మలలో ఘర్షణను అనుభవిస్తూ బ్రతక వలసి వస్తుంది. ఇలా బ్రతకడం కన్నా చావడమే మేలు అంటున్నాడు భగవంతుడు. పరధర్మంలో బ్రతకడం కన్నా స్వధర్మంలో మరణించడమే శ్రేయస్కరము (***స్వధర్మే స్థితస్య నిధనం మరణ మపి శ్రేయః పరధర్మే స్థితస్య జీవితాత్***).

స్వధర్మం తల్లి లాగా జన్మతః సంక్రమించింది. భౌతికంగా బిడ్డ పుట్టడానికి తల్లి ఎలా కారణమో, అలాగే జీవి ఆవిర్భావానికి స్వభావం కారణము. స్వధర్మాన్ని మార్చడం సాధ్యం కాదు. ఇష్టం లేకపోతే మళ్ళీ పెళ్ళి చేసుకొని భార్యను మార్చుకోవచ్చు. అలా తల్లిని మార్చడం సాధ్యం కాదు. స్వమాతను కాదని, పరమాత గర్భం నుండి మళ్ళీ పుట్టడం సాధ్యం కాదు. అలాగే స్వధర్మాన్ని నిరసించి, పరధర్మాన్ని స్వీకరించడం కూడా సాధ్యం కాదు.

అర్జునుడు క్షత్రియుడు. క్షత్రియ స్వభావం కలవాడు. క్షత్రియ ధర్మం స్వధర్మంగా కలవాడు. అందుకే అరణ్యంలో కూడా అస్త్రశస్త్రాలు సాధించు కోవడానికి తపస్సు చేశాడు. క్షత్రియ ధర్మమైన యుద్ధకర్మను చేయడానికి కురుక్షేత్రంలో ప్రవేశించాడు. తీరా ప్రవేశించాక, ఏ కారణం చేతనో యుద్ధం కన్నా భిక్షాటనమే శ్రేయస్కర మని భావించాడు. దీనిని వాసుదేవుడు వారిస్తున్నాడు.

యుద్ధం అర్జునుడికి స్వధర్మం. తన ప్రకృతికి సంబంధించింది. భిక్షాటన స్వధర్మం కాదు. పరధర్మం. అర్జునుడు కర్మనిష్ఠకు సంబంధించిన వాడే కాని, జ్ఞాననిష్ఠకు సంబంధించిన వాడు కాడు. అలాంటప్పుడు సన్యాసి ధర్మాన్ని ఎలా ఆచరించగలడు? భిక్షాటన సమయంలో ఎవరైనా ఛీ కొడితే, అర్జునుడు సహించ గలడా? కాని సన్యాసి సంతోషంగా ఆ తిరస్కారాన్ని స్వీకరించ గలడు. అర్జునుడు క్షత్రియ ఆవేశం కలవాడు కనుక, అలా నిందించిన వాణ్ణి శిరచ్ఛేదం చేసినా చేస్తాడు. ఆ చేసేదేదో, దారిన పోయేవాణ్ణి చేసే కన్నా, దుష్టుడైన దుర్యోధనుణ్ణి చేయవచ్చు కదా? పరధర్మమైన భిక్షాటన అర్జునుడికి ఎలా శ్రేయస్కరము? పైకి పెట్టుబడి లేని వ్యాపారంగా కనిపించ వచ్చు. కాని, లోపల భిక్షాటనకు అనుకూలమైన స్వభావము ఏది?

ఇంతెందుకు? అర్జునుడి అన్నగారు భీమసేనుల వారు ఏకచక్రపురంలో మారువేషంలో భిక్షాటన చేశారు కదా! అప్పుడేమైంది? రూపము బ్రాహ్మణ రూపమే గాని, స్వరూప ప్రదర్శన మంతా క్షత్రియునిదే.

భిక్షాటనలో అన్యుల ఇళ్ళ ముందు నిలబడి, 'మాతా! భిక్షాందేహి!' అనలేక పోయాడు. అందుకని ఇళ్ళ ముందు నిలబడి హుంకరించే వాడు. ఆ శబ్దానికి భయపడి తల్లులు భిక్షం వేసేవారు. భిక్షం యాచించినట్లు ఉండేది కాదు, పన్ను వసూలు చేసినట్లే ఉండేది అన్నాడు వ్యాసుడు. **భిక్షాటనం చ హుంకారాత్, కరవత్ వైశ్యతో౽గ్రహీత్** - వ్యాపారస్థుల నుండి ప్రభువు సుంకం వసూలు చేసినట్లు భిక్షను సంగ్రహించేవాడట భీమసేనుడు. ఇదెక్కడన్నా ఉందా! ఎందుకు ఉండదు? పరధర్మంలో తప్పక ఉంటుంది.

ఒకవేళ స్వధర్మమైన యుద్ధం దోషపూరితంగా ఉందని, ఏ కష్టము, దోషము లేకుండా భిక్షాటన హాయిగా

ఉంటుందని భావించి, నేడు అర్జునుడు యుద్ధాన్ని మాని, కురుక్షేత్రం నుండి పలాయనమై హరిద్వార్‌లో ఆశ్రమం పెట్టుకున్నా, ప్రక్క ఆశ్రమం సన్యాసితో పోట్లాడుతాడే గాని పద్మాసనంలో కూర్చుని ధ్యానం చేయలేడు. ఒకవేళ చేసినా, ఆ ధ్యానంలో దుర్యోధనుడు దర్శన మిస్తుంటాడే గాని దేవుడు ఉండడు.

ఎవరి వేలిముద్రలు వారివే. ఎవరి చూపు వారిదే. ఎవరి జీర్ణశక్తి వారిదే. ఎవరి స్వధర్మము వారిదే. బాగుగా అనుష్ఠింపబడే పరధర్మం కన్నా గుణహీనంగా కనిపించినా స్వధర్మమే మేలు. భయంకరమైన పరధర్మాన్ని ఆచరించడం కన్నా, స్వధర్మంలో మరణించడమే ఉత్తమము. నేడు మరణించినా, రేపు స్వభావానికి అనుకూల మైన జన్మ వస్తుంది. పరధర్మంలో బ్రతికి పాడు కావడం కన్నా, స్వధర్మంలో మరణించి, తిరిగి జన్మించిన తరువాత స్వధర్మానుష్ఠానాన్ని కొనసాగించడం ఉత్తమం.

పాలు గొప్పవే కావచ్చు. నీళ్ళు పాల లాగా విశిష్ట మైనవి కాక పోవచ్చు. అయినా, చేప నీళ్ళ ల్లోనే బ్రతుకుతుంది. విశిష్ట మైనవి కదా అని చేపను పాలల్లో ఉంచితే చచ్చిపోతుంది. స్వధర్మ పరధర్మాలు ఇలా జీవన్మరణాలకు కారణ మవుతాయి.

ఇక్కడ, ఈ సందర్భంలో అర్జునుని బుద్ధి సంశయంలో పడింది. స్పష్టత కోసం తపిస్తూ ఉంది. ఎందుకని మనిషి అనివార్యంగా పాపం చేస్తున్నాడో తెలుసు కోవాలని భావించి ప్రశ్నిస్తున్నాడు.

అర్జున ఉవాచ :

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥ 36

అథ-కేన-ప్రయుక్తః-అయం-పాపం-చరతి-పూరుషః
అనిచ్ఛన్-అపి-వార్ష్ణేయ-బలాత్-ఇవ-నియోజితః

వార్ష్ణేయ	= కృష్ణా!	నియోజితః ఇవ	= ఆజ్ఞాపింప బడ్డాడా అన్నట్లు
అథ	= అయితే	కేన	= దేని చేత
అయం	= ఈ	ప్రయుక్తః	= ప్రేరేపింప బడిన వాడై
పూరుషః	= పురుషుడు	పాపం	= పాపాన్ని
అనిచ్ఛన్ అపి	= ఇష్టము లేకున్నా కూడా	చరతి	= చేస్తున్నాడు?
బలాత్	= బలవంతంగా		

అర్జునుడు అడుగుతున్నాడు :

కృష్ణా! తనకు ఇష్టం లేకున్నా, ఎవరో బలవంతంగా ఆజ్ఞాపించినట్లు మనిషి పాపం చేస్తున్నాడు. మనిషిని అలా ప్రేరేపించేది ఏది?

వ్యాఖ్య

తప్పులే చెయ్యని వారు ఎవరున్నారు ఈ ప్రపంచంలో? తమలో దోషాలే లేవని ఎవరు చెప్పగలరు? అందరూ చెడిపోయిన వాళ్ళు కారు. కాని, కొద్దో గొప్పో చెడు చేయకుండా ఎవ్వరూ లేరు. మరి, చెడు చేసే వారికి అది చెడు అని తెలిసి చేస్తున్నారా? లేక తెలియక చేస్తున్నారా? తెలిసే చేస్తున్నారు. తెలియకుండా ఎలా చేస్తారు? అలా తెలియకుండా జరిగితే అది పిల్లల్లో జరగాలి. పిల్లలు చేసేది చెడు కాదు. పొరపాట్లు, అంతే.

ఎవరు తప్పు చేసినా తెలిసే చేస్తారు. అధర్మపరులు ధర్మాధర్మాలు తెలియని వారు కారు. దొంగతనము

చేసే వారికి అది తప్పు అని తెలియక కాదు. అది తప్పు కాదని వాళ్ళ అభిప్రాయమైతే, రహస్యంగా ఎందుకు చేస్తారు?

తెలిసే తప్పు చేసే టప్పుడు, అలా చేయడం వారికి ఇష్టమేనా? తప్పు చెయ్యడానికి మనిషి ఎంత ఘర్షణకు గురి కావాలి! మనస్సు ఘర్షణకు గురి కావడం ఎవరికి ఇష్టం? అయినా, మనిషి తప్పు చేస్తూనే ఉన్నాడు. ఇష్టం లేకపోయినా చేస్తున్నాడు. పైగా చెయ్యకూడదు అనుకున్నా ఎవరో బలవంతంగా నెట్టినట్లు చేస్తున్నాడు. లేదా రాజు చేత ఆజ్ఞాపించ బడిన సేవకుని లాగా చేస్తున్నాడు. ఇదంతా ఎందుకు జరుగుతోంది? నే నెందుకు పాపం చేస్తున్నాను? అని మౌనంగా ప్రతి మనిషి తన మనస్సులో వేసుకొనే ప్రశ్ననే అర్జునుడు మనందరి ప్రతినిధిగా శ్రీకృష్ణుని బాహాటంగా అడుగు తున్నాడు.

మనిషి ఇష్టపడి తప్పు చేస్తే ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు. ఇష్టం లేకున్నా ***(స్వయమ్ - అనిచ్ఛన్ అపి)*** ఎందుకు పాపాన్ని చేస్తున్నాడు? ఇష్టం లేనిది చేయడం అంటే, వెనుక దేని ప్రోద్బలమో ఉండాలి. లేదా ఎవరైనా ప్రేరేపిస్తూ ఉండాలి. అలా ప్రేరేపించే దెవరు? భగవంతుడా? ప్రారబ్ధమా? అజ్ఞానమా? కామమా? ఎవరి చేత, లేదా దేని చేత ***(కేన)*** ఆజ్ఞాపించ బడి మానవులు పాపాచరణం చేస్తున్నారు? అనేది అర్జునుని ప్రశ్న.

కేన అని అర్జునుడు ఏ పదంతో ప్రశ్నించాడో, ఆ పదం నామధేయం గానే ఒక ఉపనిషత్తు ఉంది. అదే కేనోపనిషత్తు. ***కేనేషితం పతతి ప్రేషితం మనః*** - మనస్సు విషయాల మీదికి పరుగు లెత్తడానికి కారణ మెవరు? అలా అభిలషించే దెవరు? ప్రేరేపించే దెవరు? అనే ప్రశ్నతో కేనోపనిషత్తు ప్రారంభమైంది.

దుర్యోధనుడు కూడా **కేన** అనే పలికాడు. తాను చేసేది పాప మని, అధర్మ మని దుర్యోధనునికి తెలుసు. ధర్మ మేమిటో తెలియక అలా చేశాడేమో అని అనుకోవ డానికి వీల్లేదు. అతనికి ధర్మం కూడా తెలుసు. కాని ధర్మ మార్గంలో జీవించడం తెలియదు. అతని వింత ప్రవర్తనను విచిత్రమైన అతని మాటల్లోనే చెప్పు కుందాం.

జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః జానా మ్యధర్మం న చ మే నివృత్తిః
కేనాపి మార్గేన హృది స్థితేన యథా నియుక్తోఽస్మి తథా కరోమి ॥

ధర్మం నాకు తెలుసు. కాని అనుసరించాలి అనుకోలేదు. నాకు అధర్మం కూడా తెలుసు. కాని విడిచి పెట్టడం జరగలేదు. ఎవరో నన్ను నియమిస్తూ నడిపిస్తూ ఉంటే నేను అలా నడిచాను. ఆ నడిపిం దెవరో నా మనస్సు లోనే ఉండాలి అన్నాడు.

పాపం అనర్థ మని, వినాశ హేతువు అని అర్జునునికి తెలుసు. దుర్యోధనునికి కూడా తెలుసు. కాకపోతే, అనర్థానికి మూల మేమిటో తెలుసుకొని దానిని పరిహరించు కోవాలి అనే ఆలోచన దుర్యోధనునికి లేదు. కాని, అర్జునుడు మాత్రం పాపానికి హేతువు ఏమిటో తెలుసుకొని, దానిని పరిహరించు కోవాలని శ్రీకృష్ణుని అడుగు తున్నాడు. కారణం అర్థమైతే కదా నివారించు కొనేది? అందుకనే ***అథ*** అంటూ ప్రశ్నను ప్రారంభించాడు. ***అథ*** శబ్దము అర్థాంతర బోధకము.

భగవంతుని బోధలో ఇంత వరకు వినాశానికి అనేక కారణాలు చెప్పబడ్డాయి. ***ధ్యాయతో విషయాన్ పుంసః*** *(2 - 62),* ***భుంజతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మ కారణాత్*** *(3 - 13),* ***ప్రకృతేర్గుణ సమ్మూఢాః*** *(3-29),* ***తౌ హ్యస్య పరిపన్థినౌ*** *(3 - 34)* - ఇవన్నీ అనర్థానికి హేతువులు గానే గోచరిస్తున్నాయి. అనర్థానికి ఇవన్నీ సమాన ప్రాధాన్యం గల కారణాలా? లేక, వీటిలో ఒకటి ప్రధానము, మిగిలినవి అప్రధానములా? లేక సహకారులా? కృష్ణా! నీవు విషయాన్ని ఎంతో విస్తరించి చెప్పావు. నాకు మాత్రం అంతా అనిశ్చితంగా ఉంది.

కనుక నీవే నిశ్చితమైన విషయాన్ని సంక్షిప్తంగా చెప్పు! తద్వారా ఈ అనర్థం నుండి బయట పడి ఆత్మానందాన్ని అనుభూతం చేసుకుంటాను అని అర్జునుడు ప్రశ్నిస్తున్నాడు. ఇదంతా ఆ శ్లోకంలో ఎక్కడుంది బాబూ? తమరి పైత్యాన్ని పార్థునిపై రుద్దడ మేమిటి? అని సంశయిస్తున్నారా? ఏనుగు పాదంలో అన్ని పాదాలు ఇమిడినట్లు, శ్రీకృష్ణుని 'వార్ష్ణేయా!' అని పిలవడం లోనే పార్థుని హృదయం సుస్పష్టంగా ఆవిష్కరింప బడింది.

వార్ష్ణేయా అంటే వృష్ణి వంశంలో పుట్టిన వాసుదేవా! అని అర్థం **(వృష్ణి కుల ప్రసూత)**. కాని, మరొక గంభీరమైన, తాత్త్వికమైన అర్థం కూడా ఉంది. బ్రహ్మజ్ఞానులైన వారిలో బ్రహ్మానంద పీయూషాన్ని వర్షింప చేయునది 'వృష్ణి'. ఈ విధమైన సమ్యక్ బోధ ద్వారా తెలియ దగిన వాడు వార్ష్ణేయుడు **(బ్రహ్మవిదాం బ్రహ్మానందామృతం వర్షతీతి వృష్ణిః ! సమ్యగ్బోధేన తేన అవగమ్యతే ఇతి వార్ష్ణేయః)**.

సర్వానర్థ హేతువైన ఏ శత్రువును గూర్చి చెప్పమని అర్జునుడు ప్రశ్నించాడో, ఆ శత్రువు యొక్క చిరునామాను తెలియ చేస్తున్నాడు చిద్విలాస చిదానంద స్వరూపుడు.

శ్రీ భగవానువాచ :

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్ ॥ 37

కామః-ఏషః-క్రోధః-ఏషః-రజోగుణ సముద్భవః
మహాశనః-మహాపాప్మా-విద్ధి-ఏనం-ఇహ-వైరిణం

ఏషః	=ఇది	మహాపాప్మా	= గొప్ప పాపము గలది
రజోగుణసముద్భవః	=రజోగుణము వలన పుట్టిన	ఏనం	= దీనిని
కామః	=కామము	ఇహ	= ఇక్కడ
ఏషః	=ఇది	వైరిణం	= శత్రువుగా
క్రోధః	=క్రోధము	విద్ధి	= తెలుసుకో
మహాశనః	=తృప్తి పొందనిది		

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

రజోగుణము వలన పుట్టిన కామమే పాప కారణము. క్రోధమే పాప కారణము. దీనికి తృప్తి లేదు. మహా పాపాలకు కూడా ఇదే కారణము. ఈ కామాన్ని, క్రోధాన్ని ఇక్కడ శత్రువని తెలుసుకో.

వ్యాఖ్య

పాపం అనేది కార్యం. చెయ్యబడేది కార్యం. చెయ్యాలి అనే కోరిక లేకుండా చెయ్యడం అనే కార్యం జరగదు. **అకామస్య క్రియా నాస్తి** అనే న్యాయాన్ని అనుసరించి, ఎక్కడ ఏ కార్యం జరిగినా దానికి కారణంగా కోరిక ఉంటుంది. పాపము అనే కార్యం జరగాలి అంటే పాప సంకల్పం మనస్సులో కదలాలి. అదే కోరిక. పాప కార్యానికి హేతువు. ఎవరు ఏ పాపకార్యం చేసినా అది కామము యొక్క కార్యమే అని వేదం కూడా ప్రవచించింది **(యద్యద్ధి కురు తే జన్తుః తద్ధి కామస్య చేష్టితమ్)**.

వివేక ప్రధానమైన సత్త్వగుణం ప్రచ్ఛన్న మైనపుడు క్రియాశీలమైన రజోగుణం ప్రభవిస్తుంది. రజస్సు యొక్క గుణము రాగము. రంజనాత్మకమైన విషయము నందు రజోగుణము వల్ల రాగం ఏర్పడుతుంది. ఆ తరువాత భోగేచ్ఛ కదుల్తుంది. అదే కామము. కనుక, కామము అనేది రజోగుణము నుండి పుడుతుంది **(రజోగుణ సముద్భవః)**.

కామము సర్వప్రాణి ప్రత్యక్షం. కోరిక లేని దెవరు? కోరిక తెలియని దెవరికి? అందుకనే **ఏషః** - 'ఇది' అంటున్నాడు భగవానుడు. 'ఇది' అంటే, అందరికీ తెలిసింది. ఇది కామం **(ఏషః కామః)**. ఇది క్రోధం **(ఏషః క్రోధః)**. రెండిటికి 'ఏషః' - 'ఇది' అని ఏకవచన ప్రయోగం చేయడంలో, కామము, క్రోధము అనే రెండు పేర్లు ఇక్కడ వినపడు తున్నా, ఆ రెండూ ఒక్కటే అని అర్థం. క్రోధము కూడా కామమే. తీరని కామమే క్రోధంగా మారుతుంది. ఈ కామం వల్లనే పాప కార్యాలు సాగుతాయి. కామం పోతే క్రోధం ఉండదు.

తృప్తి లేనిది

కామానికి తృప్తి తెలియదు. 'చాలు' అనే పదం కామానికి అర్థం కాదు. సంస్కృతంలో **అలం** అంటే 'చాలు' అని అర్థం. అదే తృప్తి. అలం బుద్ధి. కామానికి అలం బుద్ధి లేదు. అందుకే అది 'అనలం'. 'అనలం' అంటే నిప్పు. ఎంత వేసినా, ఎన్ని వేసినా అగ్ని దహించి వేస్తుంది. ఇక చాలు అనదు. అందుకే అది అనలమైంది.

కామం కూడా అంతే. కామం భోగం కొరకే అయితే, భోగించిన తరువాత కామం లేకుండా పోవాలి. కానీ మన అనుభవం అందుకు భిన్నంగా ఉంది. భోగ్య వస్తువులను అనుభవిస్తున్నా, భోగేచ్ఛ తీరడం లేదు. అనుభవించే కొద్ది పెరుగుతూ ఉందే గాని తరగడం లేదు.

న జాతు కామః కామానా ముప భోగేన శామ్యతి
హావిషా కృష్ణ వర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే ॥

కామములను ఎంతగా అనుభవించినా కామము శమించదు. నెయ్యి పోస్తూ ఉంటే అగ్ని ఎలా వృద్ధి చెందుతుందో, అనుభవించే కొద్ది కామము పెరుగుతూనే ఉంటుంది అని మహాభారతము లోను, మనుధర్మ శాస్త్రం లోను చెప్ప బడింది.

భోగిమంటలో కట్టెలు వేస్తూ ఉంటాము. ఎన్ని వేసినా కట్టెలు కాలిపోతూ ఉంటాయే గాని, మంట ఆరదు. పైగా విజృంభిస్తూ ఉంటుంది. అలాగే భోగి ఎంతగా కామాన్ని తృప్తిపరచా లనుకున్నా, అనుభవించడం జరుగుతుందే గాని కామము శాంతించదు. తృప్తి చెందదు. అందుచేతనే తృప్తి చెందాలని భావిస్తూ నూతనంగా కోరికల్ని తయారు చేసుకుంటూ ఉంటాడు. అనుభవించిన తరువాత మళ్ళీ అసంతృప్తిలో పడుతూ ఉంటాడు. ఒకవైపు అనర్థాన్ని చూస్తూనే, మరో వైపు కామాన్ని తృప్తి పరచే ప్రయత్నంలో ఉంటాడు అన్నది వేదం **(అనర్థ పరిపాకత్వ మపి జానన్ ప్రవర్తతే)**. అనర్థ మని తెలిసి కూడా కామాన్ని విడిచి పెట్టడు.

తృప్తిని దూరం చేసి, శాంతిని కాల రాచి, పాప కూపంలో పడేసే ఈ కామాన్ని శత్రువుగా అభివర్ణించాడు గీతాచార్యుడు. బ్రతుకును బుగ్గి చేసేవాడు శత్రువు అవుతాడు తప్ప మిత్రుడు అవుతాడా? పాప స్వభావం గల కామం మనిషి చేత ఘోర పాపాలు చేయిస్తుంది. కామం ప్రేరేపించి నపుడే మనిషి పాపం చేస్తాడు అన్నారు శ్రీశంకరాచార్యస్వామి **(కామేన హి ప్రేరితః జన్తుః పాపం కరోతి)**. అందుచేత, అర్జునా! ఈ సంసారంలో **(ఇహ సంసారే)** ఈ కామమే **(ఏనం కామమ్)** శత్రువు అని **(వైరిణమ్)** తెలుసుకో **(విద్ధి)** అన్నాడు భగవంతుడు.

మనం నివసించే గ్రామంలో లేదా పట్టణంలో మనకు గొప్ప శత్రువు ఉన్నాడు అని తెలిస్తే, ప్రమాదాన్ని ఊహించి ఎంతగానో బాధ పడతాము. ఒకవేళ, ఆ శత్రువు మన వీధి లోనే మకాం పెట్టాడని తెలిసిం దనుకోండి, ఎలా ఉంటుంది? వీధిలో కూడా ఎక్కడో కాదు, మనం అద్దెకున్న ఇంట్లోనే మరొక వాటాలో అద్దెకు ఉంటున్నాడు అని తెలిస్తే, అప్పుడెలా ఉంటుంది? అది కూడా కాదు. భయంకరమైన ఆ శత్రువు మన మనస్సు లోకి ప్రవేశించాడని తెలిసిం దనుకోండి, మన పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడానికి మాటలు సరిపోతాయా? ఇప్పుడు మన అందరి పరిస్థితి అదే కదా! మహాపాపి, భయంకరమైన కామ శత్రువు, క్రోధ శత్రువు మన

చిత్తాన్ని ఛిద్రం చేసేస్తున్నాడు. ఇది అర్థం కాకపోవడం చేత మన ప్రమాద మేమిటో కూడా మనకు తెలిసి రావడం లేదు. అందుకే 'విద్ధి' తెలుసుకో అంటున్నాడు భగవంతుడు.

గతంలో చేసిన పాపాలకు నేడు పశ్చాత్తాపంతో కుమిలి పోతూ ఉన్నాం కదా! దురదృష్టాన్ని, దుర్గతిని అనుభవిస్తూ, **తృష్ణయా హి అహంకారితః** - దురాశే నాకీ దుర్దశను కలిగించింది అని దుఃఖిస్తున్నాం కదా! అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రాకుండా ఉండాలి అంటే, పాపాన్ని చేయించే కామాన్ని మనస్సు నుండి గెంటేయాలి.

ఆశ ఉంటే కలదు నిరాశ
కల గంటేనే కలవరము
శ్వాస లాగినా ఆశలు పోవు
అంటి ఉంటాయి మరుజన్మకు
ఆశే మనిషికి పాశము
బ్రతుకును త్రుంచే యమపాశము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

కామము ఎలాంటి శత్రువో, ఏ విధంగా శత్రువో దృష్టాంతముతో వివరిస్తున్నాడు.

ధూమే నావ్రియతే వహ్ని ర్యథాదర్శో మలేన చ ।
యథోల్బే నావృతో గర్భ స్తథా తే నేద మావృతమ్ ॥ 38

ధూమేన-ఆవ్రియతే-వహ్నిః-యథా-ఆదర్శః-మలేన-చ
యథా-ఉల్బేన-ఆవృతః-గర్భః-తథా-తేన-ఇదం-ఆవృతం

యథా	=	ఏ విధంగా	ఉల్బేన	=	మావి చేత
ధూమేన	=	పొగ చేత	గర్భః	=	గర్భస్థ శిశువు
వహ్నిః	=	అగ్ని	ఆవృతః	=	కప్పబడుతుందో
ఆవ్రియతే	=	కప్పబడుతుందో	తథా	=	అలాగే
యథా	=	ఏ విధముగా	తేన	=	దాని చేత
ఆదర్శః	=	అద్దము	ఇదం	=	ఇది
మలేన చ	=	మాలిన్యము చేత	ఆవృతం	=	కప్పు బడింది

పొగ చేత అగ్నె కప్పబడినట్లు, ధూళి చేత అద్దము కప్పబడినట్లు, మావి చేత గర్భము నందు శిశువు ఆవరింపబడినట్లు, కామము చేత జ్ఞానము కప్పబడి ఉంది.

వ్యాఖ్య

సర్వ అనర్థాలకు కారణమైన శత్రువు కామము. ఈ కామము యొక్క పరిణామమే క్రోధము. రజోగుణము వలన పుట్టిన కామము, రజోగుణము తోనే ప్రవర్తిస్తూ ఉంటుంది. సర్వ పాపాలకు కారణం కావడం చేత కామము మహాపాపము. తృప్తి తీరనిది కనుక మహాశనము. అందుకే సంసారంలో కామమే అప్రతిహతమైన శత్రువు. మోక్షమార్గంలో ప్రధాన శత్రువు అయిన కామమును మూడు దృష్టాంతముల చేత వివరిస్తున్నాడు.

సూర్యాస్తమయం జరిగిన తరువాత ప్రపంచాన్ని చీకటి కప్పివేసినట్లు, ఈ కామమనే శత్రువు జ్ఞానాన్ని కప్పేస్తుంది. ఎలా అంటే, అగ్నిని పొగ కమ్మినట్లు, అద్దాన్ని దుమ్ము కప్పినట్లు, గర్భస్థ శిశువును మావి ఆవరించినట్లు అంటున్నాడు.

నిప్పు - పొగ

నిప్పు నుండే పుట్టిన పొగ నిప్పును కప్పేస్తుంది. నిప్పుకు ప్రకాశం ఉంది. ధూమము అప్రకాశం. నివురు కప్పినపుడు నిప్పు కూడా ప్రకాశం లేనట్లే అప్రకాశంగా అగుపిస్తుంది. వాస్తవానికి ప్రకాశాత్మక మైన అగ్నిలో వెలుగు లేకుండా పోలేదు. పొగ కప్పి ఉండటం చేత అగ్ని అప్రకాశాత్మకంగా అగుపిస్తోంది. నివురును తొలగిస్తే నిప్పు కనిపిస్తుంది. ప్రకాశిస్తూ గోచరిస్తుంది. అంతేకాదు. నివురు కప్పి నపుడు కూడా నిప్పులో ఉన్న వెలుగు కనిపించలేదే గాని, అందులోని దాహకశక్తి పోలేదు. నివురు కప్పినా ముట్టుకుంటే నిప్పు కాలి తీరుతుంది.

నిప్పును పొగ కమ్మినట్లు మానవుని వివేకాన్ని కామము కప్పేస్తుంది. మంచిచెడు లేమిటో, ధర్మాధర్మాలేమిటో గ్రహించే వివేకము కామము వల్ల మరుగున పడి పోతుంది. కామాన్ని తొలగిస్తే జ్ఞానము మళ్ళీ బుద్ధిలో యథావిధంగా ప్రకాశిస్తూ గోచరిస్తుంది.

ముకురము - మురికి

నిప్పును పొగ ఎలా కప్పేసిందో, అద్దాన్ని దుమ్ము అలా కప్పేస్తుంది. కాకపోతే, నిప్పును పొగ కమ్మినపుడు నిప్పు కనిపించ లేదు. ఉన్నట్లు కూడా తెలియ లేదు. కాని, దర్పణాన్ని ధూళి ఆవరించినా, దర్పణము దర్శనీయంగానే ఉంటుంది. అద్దం కనిపిస్తూనే ఉంటుంది. కాకపోతే, అద్దంలో మన ప్రతిబింబం కనిపించదు. దుమ్ము చేరడం వల్ల దర్శనానికి అద్దం ఉపకరించడం లేదు. అంతమాత్రాన అద్దం తన దర్శన శక్తిని కోల్పోలేదు. దుమ్ము దులిపితే, అద్దము మళ్ళీ రూపాన్ని ప్రతిబింబిస్తుంది.

నిప్పును పొగ కప్పినట్లు, అద్దాన్ని దుమ్ము మూసినట్లు, జ్ఞానాన్ని కామం కప్పేస్తుంది. అద్దంలో మన ప్రతిబింబాన్ని మనం చూసుకోవ డానికి దుమ్ము ఎలా ప్రతిబంధక మైందో, మన స్వరూపాన్ని మనం దర్శించుకోవడానికి కామం ప్రతిబంధక మైంది. అద్దంపై ఉన్న దుమ్మును దులిపి శుభ్రం చేస్తే అద్దం ఉపయోగ పడినట్లు, కామాన్ని బుద్ధిలో అదృశ్యం చేస్తే జ్ఞానం దివ్యంగా సత్య దర్శనానికి ఉపకరిస్తుంది.

శిశువు - మావి

నిప్పును పొగ, ముకురాన్ని మురికి కప్పినట్లు, గర్భస్థ శిశువును మావి కప్పేసింది. నివురు కప్పిన నిప్పు కనిపించదు. అయినా ముట్టుకుంటే కాలుతుంది. దర్పణము కంటికి కనిపిస్తూ ఉంటుంది. అయినా ప్రతిరూపాన్ని ప్రదర్శించ లేదు. మావి చేత కప్పబడిన గర్భస్థ శిశువు తల్లి గర్భంలో ఉంది. మావి కనిపించదు. తొలగించే అవకాశాన్ని ఇవ్వదు. బిడ్డ జననం వరకు నిరీక్షించ వలసిందే గాని, నిప్పుపై నివురును, ముకురంపై మురికిని తొలగించినట్లు, శిశువును ఆవరించిన మావిని తొలగించను సాధ్యపడదు. అది కాలం లోనే తొలగాలి.

గర్భస్థ శిశువును మావి కప్పినట్లు, కామం వివేకాన్ని దట్టంగా ఆవరించింది అంటున్నాడు. తొలగించను సాధ్యపడని విధంగా కప్పేసింది అంటున్నాడు. అది కాలంలో తొలగ వలసిందే గాని, వెంటనే తొలగించడం సాధ్యపడదు అనే సంకేతాన్ని కూడా ఇస్తున్నాడు.

కామ విన్యాసాలు

నిప్పును కప్పిన నివురును విసనకర్రతో విసిరితే పోతుంది. ఊదితే ఉండదు. కాని దర్పణాన్ని కప్పిన

ధూళి ఊదినా, విసిరినా పూర్తిగా పోదు. తుడిస్తేనే పోతుంది. కడిగితేనే పోతుంది. కాని శిశువును కప్పిన మావిని అటు ఊదనూ లేము. ఇటు కడగనూ లేము. కనిపెట్టుకొని కూర్చోవడం కన్నా ఏమీ చెయ్యలేము.

కొందరిలో కామము నివురు లాగా ఉంటుంది. ఊదగానే నివురు అదృశ్య మైనట్లు, గురూపదేశముతో వారి లోని కామము కనుమరు గవుతుంది.

మరి కొందరిలో కామము దర్పణంపై ధూళి లాగా ఉంటుంది. ఊదడం కాకుండా తుడిస్తేనే, కడిగితేనే దర్పణం శుద్ధి పడినట్లు, కేవలం గురూపదేశమే కాక, వీరిలో పురుష ప్రయత్నం కూడా జరగాలి. సాధనావశ్యకత ఉంటుంది. అభ్యాస వైరాగ్యాలతో అనుష్ఠానంలో స్థిరపడి తేనే అది పోతుంది.

ఇంక కొందరిలో కామము గర్భస్థ శిశువును మావి కప్పినట్లు ఉంటుంది. ప్రయత్నించినా సద్యః ఫలితం రాదు. అలాంటి వారు నిరీక్షణ లోనే నిరాశకు దూర మవుతారు. ఫలితాన్ని అందుకుంటారు. వీరికి కాలం లోనే అన్నీ కలిసి వస్తాయి.

నిప్పు లోని ప్రకాశాన్ని నివురు నిరోధించినట్లు, వివేకాన్ని కప్పిన కామం మనిషి లోని అందాన్ని, ప్రకాశాన్ని దూరం చేస్తుంది. దర్పణాన్ని ధూళి మలినం చేసినట్లు, కామం హృదయాన్ని కలుషితం చేస్తుంది. మావిని తొలగించటానికి ప్రయత్నాలు విఫల మైనట్లు, ఎంత ప్రయత్నించినా నిగ్రహింపబడక కామం సాధకుని నిస్సహాయునిగా మార్చేస్తుంది.

ఎంత చేసినా, ఏమి చేసినా తృప్తి చెందని కామము మనిషిని దీనుణ్ణి చేసి దిగులు పుట్టిస్తుంది. కామము ప్రతిహత మైనపుడు పుట్టుకొచ్చే క్రోధము (***కామాత్క్రోధోభి జాయతే;*** *2 - 62*) ప్రపంచంలో శత్రువుల్ని ప్రోగు చేస్తూ మనిషికి శాంతి లేకుండా చేస్తుంది. అందుచేతనే ఈ కామక్రోధాల్ని నిరోధించడానికి, ఈశ్వరుణ్ణి, ఈశ్వర జ్ఞానాన్ని ఆశ్రయించాలి.

దిగులుతో దినములన్నీ కారిపోయె
పగలతో ప్రపంచమె మారిపోయె
దరి చేర్చాలి నన్ను నీవు దారి చూపి
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా! అని ఈశ్వర పూజనంలో ఒక విబూది పండు.

జ్ఞానాన్ని పొందాలని యత్నించే సాధకునికి కామము ఎలా నిత్య శత్రువుగా నిలిచి ఉందో వివరిస్తున్నాడు.

ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।
కామరూపేణ కౌన్తేయ దుష్పూరే ణానలేన చ ॥ 39

ఆవృతం-జ్ఞానం-ఏతేన-జ్ఞానినః-నిత్యవైరిణా
కామరూపేణ-కౌంతేయ-దుష్పూరేణ-అనలేన-చ

కౌంతేయ	=	అర్జునా!	నిత్యవైరిణా	=	నిత్య శత్రువు
దుష్పూరేణ	=	నింప శక్యము కానిది	ఏతేన	=	దీని చేత
అనలేన చ	=	అగ్ని వంటిది	జ్ఞానం	=	జ్ఞానము
కామరూపేణ	=	ఆశారూప మైనది	ఆవృతం	=	కప్పు బడినది
జ్ఞానినః	=	జ్ఞానికి			

అర్జునా! కామము ఎన్నటికీ నిండనిది. అగ్ని లాగా తృప్తి చెందనిది. ఆశా రూప మైనది. జ్ఞానికి నిత్య శత్రువు. కామం తోనే జ్ఞానం కప్పబడి ఉంది.

వ్యాఖ్య

శ్రేయో మార్గంలో అప్రతిహత మైన విరోధిగా ప్రతిబంధకాలను సృష్టించే కామం మానవులను వివిధము లైన పొరలతో ఎలా కప్పి వేసిందో, అలాగే ప్రతి వ్యక్తిని వివిధంగా ఎలా అడ్డగిస్తూ ఉందో, మూడు దృష్టాంతాల ద్వారా తెలుసుకున్నాం. మానవుని జ్ఞానాన్ని మూసేసిన ఈ కామం జ్ఞానాన్ని పొందాలని ఆశించే ముముక్షువుకు నిత్యవిరోధి అంటున్నాడు.

శత్రువు - నిత్య శత్రువు

అజాత శత్రువులు ఈ ప్రపంచంలో ఉండరు. ప్రతి ఒక్కరికి కొందరు శత్రువులు ఉండనే ఉంటారు. కారణం లేకుండా శత్రుత్వము ఉండదు. ఆ కారణం ఎదుటి వ్యక్తే కానవసరం లేదు. ***తన కోపమే తన శత్రువు*** అని సుమతి శతక కర్త తెలిపినట్లు, తన లోని ఈర్ష్యాసూయలే ఎదుటి వ్యక్తిలో శత్రువును చూపించ వచ్చు.

ఏది ఎలా ఉన్నా, శత్రువు అనే వాడు ఉంటాడు. శత్రువు మన ముందే ఉండ నవసరం లేదు. మనస్సులో కదిలినా చాలు, మనిషి ఏదో అసౌకర్యాన్ని అనుభవిస్తూ ఉంటాడు. నేడు శత్రువై బాధిస్తున్న వ్యక్తి, కాలంలో మిత్రుడుగా మారితే, ఆ తరువాత అతడు శత్రువుగా ఉండడు. బాధను కలిగించడు.

ఒకవేళ శత్రువు మిత్రుడుగా మారక పోయినా, ఏ కారణం చేత నైనా అతడు దేశాంతరం వెళ్ళి దూర మైతే, శత్రుత్వము మరుగున పడి పోతుంది. ఒకవేళ మనిషే మరణిస్తే, ఆ తరువాత ఉండమన్నా ఉండదు. అందుకే మరణంలో శత్రుత్వము లేదు అంటూ ఉంటారు. మరణం ఎవరి దైనా కావచ్చు. అందరికీ మరణం ఉంది. శత్రువు మరణించ వచ్చు. శత్రువును చూచేవాడూ మరణించ వచ్చు. ఇలా చూచి నపుడు ప్రతి మనిషికి శత్రువు లున్నారే గాని నిత్యశత్రువు కనిపించడు.

కాని, కామం మనిషికి శత్రువు. జ్ఞానవంతునికి నిత్యశత్రువు (***జ్ఞానినో నిత్య వైరిణా***) అంటున్నాడు గీతాచార్యుడు.

శత్రువు మరొక కాలంలో మిత్రుడు కావచ్చు. కామం ఏ కాలం లోనూ మిత్రుడు కాలేదు. ఏ ప్రదేశం లోనూ మిత్రుడు కాలేదు. ఎప్పుడూ శత్రువే. శత్రువు దూర ప్రాంతాలకు వెళ్ళినట్లు, కామం మనల్ని విడిచి దూరంగా పోదు. ఇక చావంటారా! కామానికి అది లేనే లేదు. మనల్ని చంపుతుందే గాని అది చావదు. ఒకవేళ మనం మరణిస్తే, అంతటితో ఆగుతుందేమో అని ఆశించడానికి వీలు లేదు. ఈ జన్మను చాలించి, మనం మరో జన్మను ఎత్తినా, అక్కడ కూడా కామం మనకు ఎదురేగి ఆహ్వానం పలుకుతుంది. అందుకే కామాన్ని నిత్యవిరోధిగా భగవంతుడు అభివర్ణిస్తున్నాడు.

నిత్యము తోడుగా ఉంటుంది. కనుకనే కామము నిత్యశత్రువు. జన్మాంతరాలలో కూడా విడిచి పెట్టదు కనుక నిత్యవిరోధి. ప్రపంచంలో మనకు విరోధులు ఉండ వచ్చు. అందరి విషయంలో కాకపోయినా, కొందరి విషయంలో నైనా మనది పై చేయిగా ఉంటుంది. వారిపై మనదే విజయంగా ఉంటుంది.

కామం విషయం అలా కాదు. కామ శత్రువుకు జయమే గాని అపజయం తెలియదు. క్రోధ శత్రువుకు గెలుపే గాని ఓటమి లేదు. కామాన్ని ఎందరో ఎదిరించి పోరాడారు. ఎవరు గెలిచారో చెప్పడానికి మన వద్ద దాఖలాలు లేవు.

కామ వేగానికి పండితులు సైతం పరాజితు లయ్యారు. కామం చేతిలో రాజులు కూడా రాలిపోయారు. సన్యాసులు సదలి పోయారు. బలవంతులు బలహీను లయ్యారు. యువకులు బలి అయ్యారు. కామం చేతిలో అందరూ అపజయాన్ని చవి చూచిన వారే.

జ్ఞానా జ్ఞానములు

జ్ఞానికి కామము నిత్యవిరోధి. అజ్ఞానికి కూడా నిత్యశత్రువు. కామం యొక్క ప్రభావం ఉభయులపై ఉన్నా, కామం విషయంలో వారిరువురి మధ్య అవగాహనలో వ్యత్యాసము గోచరిస్తూ ఉంది అంటారు శ్రీశంకరులు.

కామం కదిలి నపుడే, శత్రువు కదులు తున్నాడు అని జ్ఞానం కల వాడు గుర్తిస్తాడు. అందుకే కామ కదలికతో కలత చెందుతూ ఉంటాడు. నన్ను కదిలిస్తున్న కామం నాకు అనర్థాన్ని తెచ్చి పెడుతుంది అని జ్ఞానికి ముందే తెలుసు (*జ్ఞానీ హి జానాతి అనేన అహమ్ అనర్థే ప్రయుక్తః ఇతి పూర్వమేవ*). అందుచేత కామం కదిలినా, క్రోధం కదిలినా జ్ఞాని దుఃఖిస్తూ ఉంటాడు (*దుఃఖీ చ భవతి నిత్యమేవ*).

మూర్ఖుడు, లేదా అజ్ఞానికి కూడా కామము నిత్య శత్రువే అయినా, అది కదిలి నపుడు జ్ఞాని గుర్తించి నట్లు, అజ్ఞాని దానిని శత్రువుగా గుర్తించడు. పైగా మిత్రుడని భ్రమిస్తాడు. కోరిక కలిగి నపుడు కామాన్ని మూర్ఖుడు విరోధిగా భావించడు. అట్టి కామ ఫలితంగా దుఃఖం ప్రాప్తించి నపుడే దానిని శత్రువుగా పరిగణిస్తాడు. కనుక ఉభయులకు కామం శత్రువే అయినా, నిత్యవిరోధి జ్ఞానికే గాని, అజ్ఞానికి కాదు (*అతః అసౌ జ్ఞానినః నిత్య వైరీ న తు మూర్ఖస్య*). మరి, జ్ఞానికి నిత్యవిరోధి అయిన కామము ఏ రూపంలో ఉంటుంది? (*కిం రూపేణ ?*) చెబుతున్నాడు.

స్వభావ స్వరూపాలు

కామము యొక్క రూపాన్ని మూడు విషయాల ద్వారా చూపెడు తున్నాడు. (1) కోరిక అనే రూపం కలది (2) నింప శక్యము కానిది (3) చాలు అనేది లేనిది. ఇవే కామము యొక్క స్వరూప స్వభావాలు.

కామం కోరుతూ ఉంటుంది. విసుగు లేకుండా కోరుతుంది. విరామం లేకుండా కోరుతుంది. సాధ్యా సాధ్యాలను పట్టించుకో కుండా కోరుతుంది. యుక్తాయుక్తాలను విశ్లేషించ కుండా కోరుతుంది. ఇదే కామం యొక్క మొదటి రూపం (**కామ రూపేణ**).

కామము యొక్క రెండవ రూపం అపూర్ణం. అంటే నిండనిది. ఎంత నింపినా నిండనిది. అనాదిగా ఈ ప్రపంచంలో ఎంత వర్షం కురిసిందో! నిర్విరామంగా ప్రవాహ రూపంలో ఎన్ని నదులు సాగరంలో కలిశాయో! ఇంకా కలుస్తూనే ఉన్నాయి. ఇక నింపుకో లేను, నేను నిండి పోయాను అని ఒక్క మాట సముద్రం ఇంత వరకు అనలేదు. కామం కూడా సాగర రూపం ధరించి ఉంటుంది. ఎన్ని భోగాలు అందించినా, నేను నిండిపోయాను అని అనదు. జల్లెడలో నీళ్ళు పోసినట్లే ఉంటుంది. ప్రయత్నమే గాని ఫలితం ఉండదు. అదే కామరూపం. నింప శక్యము కానిది (**దుష్పూరః - దుఃఖేన పూరణమ్ అస్య ఇతి**).

కామము యొక్క మూడవ రూపము అనలం. 'అలం' అంటే చాలు అని అర్థం. చాలు అనేది లేనిది 'అనలం'. అనలం అంటే నిప్పు. ఎన్ని కట్టెలు వేసినా అగ్ని కాల్చి భస్మం చేస్తుందే గాని చాలు అని అనదు అందుకే అది అనలం. కామం కూడా అంతే. ఎన్ని అనుభవించినా అనలం గానే చెలరేగుతూ ఉంటుంది (**అనలేన**).

ఇంతకీ ఈ కామవిరోధి ఉండే దెక్కడ? అదీ చెబుతున్నాడు.

ఇన్ద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే ।
ఏతై ర్విమోహయ త్యేష జ్ఞాన మావృత్య దేహినమ్ ॥ 40

ఇంద్రియాణి-మనః-బుద్ధిః-అస్య-అధిష్ఠానం-ఉచ్యతే
ఏతైః-విమోహయతి-ఏషః-జ్ఞానం-ఆవృత్య-దేహినం

అస్య	=	దీనికి	ఏషః	=	ఇది
ఇంద్రియాణి	=	ఇంద్రియములు	ఏతైః	=	వీని చేత
మనః	=	మనస్సు	జ్ఞానం	=	జ్ఞానమును
బుద్ధిః	=	బుద్ధి	ఆవృత్య	=	కప్పి
అధిష్ఠానం	=	ఆధారముగా	దేహినం	=	జీవుణ్ణి
ఉచ్యతే	=	చెప్ప బడింది	విమోహయతి	=	మోహ పెట్టు చున్నది

ఈ కామానికి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి నివాస స్థానాలు. వీటి ద్వారా కామం జ్ఞానాన్ని కప్పి జీవునికి మోహాన్ని కలిగిస్తుంది.

వ్యాఖ్య

జ్ఞానాన్ని కప్పివేసి, వివేకాన్ని మరుగున పడేసే కామం యొక్క స్వరూప స్వభావాలను తెలుసుకున్నాం. కామము నిత్య శత్రువు అని తెలిసి పోయింది. నిత్యవిరోధిని వెంట పెట్టుకొని ఎవరు సుఖపడ గలరు? కనుక శత్రుబాధ నుండి విముక్తి కలగాలి. అలా జరగాలి అంటే శత్రువు యొక్క స్థావరం ఎక్కడో తెలిసి రావాలి. ముందు శత్రువు ఉండే దెక్కడో తెలిస్తే, ఆ తరువాత అతణ్ణి సులభంగా మట్టు పెట్టడం సాధ్య పడుతుంది (*జ్ఞాతే హి శత్రోః అధిష్ఠానే సుఖేన శత్రు నిబర్హణం కర్తుం శక్యతే*). కావరం గల శత్రువు నైనా స్థావరం తెలిస్తే నాశనం చెయ్యవచ్చు. కామానికి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనేవి స్థావరాలు అంటున్నాడు గీతాచార్యుడు (*ఇంద్రియాణి, మనః బుద్ధిః చ అస్య కామస్య, అధిష్ఠానం, ఆశ్రయః*). ఈ స్థావరాలలో ఉంటూ, కామం మానవుని వివేకాన్ని కప్పివేసి, మోహంలో పడదోస్తూ ఉంది.

శత్రు స్థావరాలు

సంఘ విద్రోహశక్తులు, బందిపోట్లు, తీవ్రవాదులు ఎలాగైతే తమ కంటూ కొన్ని దుర్భేద్యమైన స్థావరా లను ఏర్పాటు చేసుకొని విచ్ఛిన్నకర మైన కార్యకలాపాలను దేశంలో సాగిస్తూ ఉంటారో, అలాగే కామక్రోధాది శత్రువులు కూడా దేహం లోనే ప్రత్యేక స్థావరాలను ఏర్పరచుకొని, తమ కార్యకలాపాలను సాగిస్తూ ఉంటాయి. ఆ స్థావరాలే ఇంద్రియ మనోబుద్ధులు. దేశంలో తీవ్రవాద స్థావరాలు ఉన్నట్లే, దేహంలో 'తీవ్రబాధా' స్థావరాలు ఉన్నాయి. స్థావరాలు ధ్వంస మైతే శత్రువులు భంగ పడ్డేట్లే.

మనం చేసే కార్యా లన్నిటి వెనుక కారణంగా కామం ఉందని అర్థం చేసుకున్నాం. కామం ఎప్పుడైతే నిరాశ్రయ మవుతుందో, కామప్రేరిత కార్యాలు మిగలవు. కామప్రేరిత కార్యాలు అదృశ్యమైతే అశాంతి అంతమైనట్లే. కనుక, ప్రమాద మంతా కామం వల్లనే ఉంది.

ఆత్మ సచ్చిదానంద స్వరూపము. నిర్దోష మైనది. వాంఛలు లేనిది. అట్టి ఆత్మ వల్ల ఏ ప్రమాదమూ లేదు. ఇక దేహ మంటారా? అది జడము. దాని వల్ల కూడా ప్రమాదం లేదు. మరి ఇంద్రియాలు? అవి కేవలం విషయాలను తెలియచేసే వార్తావహులే. కనుక అంతకు మించి అవి ఏమీ చేయలేవు. ఇక మనస్సు విషయాని

కొస్తే, అది మనిషి చేతిలో ఒక పరికరం మాత్రమే. బుద్ధి కూడా ఒక కరణమే. బుద్ధి చెడునే కాదు, మంచిని కూడా నిర్ణయించి చెబుతుంది. బుద్ధి అలా నిశ్చయించడం వెనుక ఎవరున్నారో తెలుసా? ఎవరో కాదు, కామ మనే శత్రువే. ఈ కామప్రేరణ వల్లనే మనిషికి ఇష్టం లేని దానిని కూడా బుద్ధి కర్తవ్యంగా నిశ్చయిస్తుంది (అనిచ్ఛన్నపి). మనిషి ఆచరిస్తాడు. అలా చేయడం యుక్తం కాదని ఒక వైపు అర్థం అవుతున్నా, కామ ప్రేరణ చేత మనిషి వివశుడై చేసి తీరుతాడు.

ప్రథమ స్థావరము

కామ మనే శత్రువుకు మూడు ఆశ్రయ స్థానాలు ఉన్నాయి. అందులో మొదటి స్థావరము ఇంద్రియాలు. ఇంద్రియాలకు ముందు చూపే గాని, వెనుక చూపు, లోచూపు ఉండవు. ప్రపంచాన్ని చూస్తాయి. మనస్సును చూడలేవు. ఇంద్రియాల ముందు ప్రపంచం ఉంది. ఇంద్రియాల వెనుక మనస్సు ఉంది. ప్రపంచంలో గోచర మయ్యే దృశ్యాదులను నేత్రాదులు మనస్సుకు ప్రదర్శిస్తాయి. మనస్సు తిలకిస్తుంది. ఇష్టమైతే పులకిస్తుంది. అనిష్ట మైతే వికటిస్తుంది.

ఇంద్రియాలు తమకు ఆశ్రయ స్థానమైన మనస్సు వైపు తిరిగి చూడలేవు. సూర్యుని నుండి కిరణాలు లోకం లోకి విరజిమ్మ బడినట్లు, మనస్సు నుండి చేతనత్వాన్ని పొందిన ఇంద్రియాలు ప్రపంచం వైపు సదా పరుగులు తీస్తూ ఉంటాయి. మరల ఈ ఇంద్రియాల ద్వారానే మనస్సు ప్రపంచం లోకి చొర బడుతుంది. ఇంద్రియ ద్వారాలను మూసేస్తే, మనస్సు బయటకు పోవాలని ఉబలాట పడినా పోలేదు. ఈ విధంగా కామ శత్రువు యొక్క ప్రథమ స్థావరమైన ఇంద్రియాలను మూసేయాలి. యోగమార్గంలో ఈ ప్రక్రియనే 'దమం' అంటారు (*ఆపరేషన్ 'దమ'*).

ఇంద్రియ ద్వారాల నుండే విషయాలు పయనించి మనస్సును చేరుతాయి. తిరిగి ఇంద్రియాల ద్వారానే మనస్సు లోని కోరికలు ప్రపంచంలో తీరుతాయి. ఇంద్రియాలు ఎప్పుడైతే నిగ్రహింప బడ్డాయో, మనస్సు ప్రపంచం లోకి ప్రవేశించ లేదు. నిగ్రహింపబడి ఉంటుంది. మనస్సు తోడైతేనే ఇంద్రియాలు బలాన్ని పుంజుకొని చెల రేగుతాయి. మనస్సు నియమింప బడితే ఇంద్రియాలు నిర్వీర్య మవుతాయి. స్థావరము బలహీన మైనపుడు శత్రువు బలవంతు డవుతాడా?

ద్వితీయ స్థావరము

కామశత్రువు యొక్క రెండవ స్థావరము మనస్సు. ఇంద్రియాలు ఎప్పుడైతే నిగ్రహింప బడ్డాయో, కామ మనే విరోధి ఇంద్రియ స్థావరాన్ని వీడి మనస్సును స్థావరంగా మార్చుకుంటుంది. ఇంద్రియ మనో స్థావరాలలో ప్రధానంగా ఒక వ్యత్యాసం కనిపిస్తుంది. మనస్సు లేకుండా ఇంద్రియ వ్యాపారాలు సాగవు. కానీ, ఇంద్రియాలు లేకపోయినా, మనస్సు తనకు తానుగా విషయాలను చింతించ గలదు. విషయ చింతనలో రమించ గలదు. దేశ కాల పరిస్థితులను అధిగమించి మనస్సు వ్యవహరించ గలదు. కాని, ఇంద్రియాలు మాత్రం దేశకాల పరిస్థితుల పరిధి లోనే సంచరించ గలవు.

వస్తు ప్రపంచంలో చరించ డానికి మనస్సే ఇంద్రియాల రూపంలో వ్యక్త మౌతుంది. ఇంద్రియాలు విషయాల్ని మనస్సు ముందు పెట్టగానే మనస్సును ఆవరించి యున్న కామం మనస్సును రెచ్చగొట్టి, ఇంద్రియాల ద్వారా విషయ ప్రపంచం లోకి నెట్టుతుంది. కాని, ఆ సమయంలో గనుక దృశ్యాదుల నుండి మనస్సును విరమింప చేసి, ఒక సద్విషయాన్ని చింతించే లాగా నియమించ గలిగితే, కామశత్రువు యొక్క రెండవ స్థావరంపై దాడి మొదలైంది అని అర్థం.

సాధకులైన వారు ఏకాంత ప్రదేశాన్ని ఎన్నుకోవడం లోని ఆంతర్యం ఇదే. ముందుండి కలతపెట్టే వాటిని ప్రక్కకు నెట్టి, ముందుకు పోయే సాధన ప్రక్రియ ఇక్కడ స్పష్టంగా గోచరిస్తూ ఉంది.

ఆ తరువాత మనస్సును దీప్తిమంతం చెయ్యాలి. లాభం లేకుండా ఎవ్వరూ ఏ పనీ చెయ్యరు. విషయ ప్రపంచంలో రమించడం వల్ల కలిగే లాభం ఏమీ లేదు అనే సత్యం మనస్సుకు పట్టించాలి. ప్రారంభంలో విషయాలలో సుఖ మున్నట్లు అనిపించినా, అంతమయ్యే ఆ సుఖాలు అంత్యంలో బ్రతుకును విషతుల్యం చేసి, ఎలా దుఃఖంలో ముంచుతాయో మనస్సుకు అర్థ మయ్యేలా విచారము ద్వారా తెలియ చేయాలి. రాగద్వేషాలు తటస్థ మయ్యే లాగా అవగాహనను పెంపొందించాలి. ఈ విధంగా మనస్సును ఇంద్రియాలకు, ఇంద్రియ విషయాలకు దూరంగా ఉంచితే, కామశత్రువు యొక్క రెండవ స్థావరం కూడా ధ్వంస మౌతుంది. యోగ మార్గంలో దీనినే 'శమం' అని అంటారు (*ఆపరేషన్ 'శమ'*). కామం మకాం మార్చేస్తుంది. ఇంద్రియాల నుండి వెను దిరిగి మనస్సును ఆశ్రయించిన కామం, ఇప్పుడు మనస్సు నుండి కూడా పారిపోయి బుద్ధిలో తల దాచుకుంటుంది.

తృతీయ స్థావరము

గత జన్మ సంస్కార ప్రభావ జనిత ప్రకృతి ప్రేరేపిస్తూ ఉంటుంది కనుక కామేచ్ఛ బుద్ధిలో రూపు దిద్దుకుంటూ ఉంటుంది. విషయాలు కోర దగినవే అని నిశ్చయిస్తుంది. అవి మంచివే నని కితాబు నిస్తూ ఉంటుంది.

కావచ్చు. ప్రపంచంలో మంచివి ఎన్నో ఉండవచ్చు. ఉంటాయి. కాని, మంచి వన్నీ మనకు కావాలా? లేక అవసరమైనవి కావాలా? మంచివి కదా అనుకుంటూ అన్నిటినీ ప్రోగు చేసుకుంటూ పోతే, ఆ తరువాత కూర్చోవడానికి మన ఇంట్లో మనకే స్థలం ఉండక పోవచ్చు. మంచివన్నీ మనకు అవసరం లేదు. మనకు ఏవి మంచివో, ఏవి అవసరమో వాటినే మనం సాధించు కోవాలి.

ఈ కోణంలో బుద్ధిని ఆలోచింప చేస్తే, రాగద్వేషాలు రాలిపోయి, వాటి స్థానంలో ధర్మాధర్మాలు తొంగి చూస్తాయి. ధర్మాచరణంలో కామం ఆటలు సాగవు. అక్కడ అంతా ఈశ్వరార్పణం గానే సాగుతూ ఉంటుంది. ప్రసాదం గానే అందుతూ ఉంటుంది. కామం ఇక తన ఉనికిని పోగొట్టు కుంటుంది. ధర్మం ఊరేగుతూ దర్శన మిస్తుంది. ఈ విధంగా శత్రువు యొక్క మూడవ స్థావరం కూడా ధ్వంసం అవుతుంది. ఇక్కడ వివేకమే వెలుగై దారి చూపుతుంది (*ఆపరేషన్ 'ప్రజ్ఞ'*).

యదా పంచావ తిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ
బుద్ధిశ్చ న విచేష్టేత తమాహుః పరమాం గతిమ్ ॥

ఇంద్రియాలతో సహా మనస్సు ఎక్కడ నిశ్చలంగా ఉందో, నిశ్చయాత్మకమైన బుద్ధి వ్యాపారాలు ఎక్కడ చలించకుండా స్థిరపడ్డాయో, అదియే ఉత్కృష్టమైన సద్గతి అని కఠోపనిషత్తు ప్రవచించింది.

ఈ విధంగా శత్రు స్థావరాలపై వివేక పూరితంగా దాడి చేసి, మోహానికి గురి చేసే కామ శత్రువును మట్టుపెట్టిన వారు అశాంతికి దూరులై శాంతిని అనుభూతం చేసుకుంటారు.

అందుచేత, ఇంద్రియాలను నియమించి, కామమును జయించి, పాపము నుండి విడిపొమ్మని ఆదేశిస్తున్నాడు.

తస్మా త్త్వ మిన్ద్రియా ణ్యాదౌ నియమ్య భరతర్షభ ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనమ్ ॥ 41

తస్మాత్-త్వం-ఇంద్రియాణి-ఆదౌ-నియమ్య-భరతర్షభ
పాప్మానం-ప్రజహి-హి-ఏనం-జ్ఞాన విజ్ఞాన నాశనం

భరతర్షభ	=	అర్జునా!	నియమ్య	=	నియమించి
తస్మాత్	=	అందువలన	జ్ఞానవిజ్ఞాన నాశనం	=	జ్ఞానవిజ్ఞానములను నాశనము చేయు
త్వం	=	నీవు	పాప్మానం	=	పాప స్వభావం గల
ఆదౌ	=	మొదట	ఏనం	=	దీనిని
ఇంద్రియాణి	=	ఇంద్రియములను	ప్రజహి హి	=	అవశ్యం విడిచి పెట్టు

అర్జునా! అందువలన, మొదట నువ్వు ఇంద్రియాలను వశ పరచుకో. ఆ తరువాత, కామాన్ని పూర్తిగా తుడిచి పెట్టేయ్! కామము జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని హరిస్తుంది. అది మహాపాపి.

వ్యాఖ్య

సర్వానర్థ హేతువైన కామము యొక్క మూడు ఆశ్రయ స్థానాల్ని తెలుసుకున్నాం. శత్రువు యొక్క స్థావరాలు తెలిసి పోయాయి కనుక ఇక శత్రువును వధించే కార్యానికి పూనుకోవాలి. జ్ఞాన విజ్ఞానములను పాడు చేసే ఈ కామ పాపిని ముందుగా మొదటి స్థావరమైన ఇంద్రియాల స్థాయి నుండి సంహరించడం ప్రారంభించ మంటున్నాడు. అందుచేత ***(తస్మాత్)*** నువ్వు ***(త్వం)*** ఇంద్రియాలను ***(ఇంద్రియాణి)*** ముందుగా ***(ఆదౌ పూర్వ)*** వశపరచుకో ***(నియమ్య వశీకృత్య)*** అంటున్నాడు.

ముందుగా ఇంద్రియాలను వశం చేసుకోమని చెబుతున్నాడు అంటే, ఇంద్రియ నిగ్రహం మాత్రమే సరిపోదు అని అర్థం. ముందుగా మొదటి స్థావరాన్ని ధ్వంసం చేసి, ఆ తరువాత మిగిలిన రెండు స్థావరాలను కూడా వశ పరచు కోమని దాని అర్థం. అదే *ఆదౌ* పద ప్రయోగం.

ఇంద్రియాలను నియమించడం శత్రువుపై మనం సాధించే మొదటి విజయము. ఇంద్రియాలను జయించడము అంటే, ఇంద్రియ విషయాలకు దూరంగా వెళ్ళడం అని కాదు. తద్వారా విషయాలకు తాత్కాలికంగా దూరమైన వాళ్ళం అవుతామే గాని ఇంద్రియాలను జయించిన వాళ్ళం కాలేము.

ఇంద్రియాలను జయించడం అంటే, రాగద్వేషాలపై పట్టు సాధించడము అని అర్థము. విషయాసక్తి మనస్సు నుండి దూరమైతేనే, రాగద్వేషాలు అదృశ్య మవుతాయి. రాగద్వేషాలు లేనపుడు కామం మనల్ని కదిలించ లేదు. కోరలు తీసిన పాము లాగా పడి ఉంటుంది.

విషయాలలో ఉండే విషతుల్యాన్ని అర్థం చేసుకుంటే విషయాల్ని విషం లాగా విడిచి పెట్టగలం. **విషయాన్ విషవత్ త్యజ** - ఇంద్రియ విషయాలను విషాలుగా భావించి విడిచిపెట్టు అన్నాడు 'అష్టావక్ర గీత'లో అష్టావక్రుడు. అదే ఇంద్రియ నిగ్రహము. విషయాల యందలి దోషమును దర్శించ గానే విషయాలలో రమించాలని ఉత్సాహ పడే మనస్సు వాటి నుండి విరమించి శాంతిస్తుంది.

ఆఖ్యాయిక

యౌవనంలో ఉన్న సాధువును ఒక స్త్రీ తనను పెళ్ళి చేసుకోమని కోరుతుంది. సాధువు అందుకు అంగీకరించడు. అప్పుడు ఆమె సాధువుతో, 'అయ్యా! నేను కామంతో నిన్ను వాంఛించడం లేదు. నీవు మహా మేధావివి. నీ లాంటి మేధావిని బిడ్డగా పొంది, ప్రపంచానికి అందించాలనే మహోన్నత ఆశయంతో అడుగుతున్నాను' అంటుంది.

ఆమె మాటల్ని ఆలకించిన సాధువు, 'అమ్మా! నీ ఆశయానికి నేను ఆనందిస్తున్నాను. నా లాంటి బిడ్డ కావాలి అని నువ్వు అభిప్రాయ పడే టప్పుడు, ఇక ఆలస్య మెందుకు? మాసాలు, సంవత్సరాలు నిరీక్షించడ మెందుకు? నన్నే బిడ్డగా అంగీకరిస్తే నీ కోరిక ఈ క్షణం లోనే తీరిపోతుంది కదా!' అన్నాడు. ఇదే ఇంద్రియ నిగ్రహము. అవగాహన వల్ల ఏర్పడిన నియమము.

ఇంద్రియాలను నియమించడము అంటే, మనం ఇంతకు ముందు చూచినట్లు, మనోబుద్ధులను కూడా నియమించడ మని అర్థం. ముందుగా ఇంద్రియాలను నిగ్రహించాలి. ఆ తరువాత మనోబుద్ధుల్ని నిగ్రహించాలి అని అర్థం.

'ఇంద్రియాలు' అన్నప్పుడు అందులో మనోబుద్ధులు కూడా కలిసి ఉంటాయి. ఇంద్రియాలు బాహ్యంలో చరిస్తూ ఉంటాయి. కనుక అవి బాహ్య కరణాలు. మనోబుద్ధులు ఆంతర్యంలో ఉంటాయి కనుక అవి అంతః కరణాలు. ఇంద్రియాలు బాహ్యేంద్రియాలు కాగా, మనోబుద్ధులు అంతరేంద్రియాలు. దృశ్యాది విషయాల్ని నేత్రాది ఇంద్రియాలు గ్రహిస్తే, విషయ సంయోగము వల్ల కలిగే సుఖదుఃఖాలను, జయాపజయాలను, మానావమానాలను మనోబుద్ధులు గ్రహిస్తాయి.

మహాపాపి

కామము అనేది మహాపాపి ***(మహా పాప్మా)*** అని ముప్పై ఏడవ శ్లోకంలో భగవంతుడు తెలిపాడు. ఇక్కడ పాప స్వరూపం కలది అంటున్నాడు ***(పాప్మానం)***. కామాన్ని పాపిగా ఎందుకు అభివర్ణించాడు? జ్ఞాన విజ్ఞానాలను నాశనం చేస్తూ ఉంది కనుక పాపి అంటున్నాడు.

శాస్త్రం ద్వారా, గురువు ద్వారా ఆత్మ మొదలైన వాటికి సంబంధించిన పరోక్ష జ్ఞానము ఏదయితే కలుగుతూ ఉందో, అది జ్ఞానము ***(జ్ఞానం శాస్త్రతః ఆచార్యతః చ ఆత్మాదీనామ్ అవబోధః)***. విజ్ఞానము అంటే, గురుముఖతః లభించిన జ్ఞానాన్ని ప్రత్యేకించి అనుభవం లోకి తెచ్చుకోవడం ***(విజ్ఞానం విశేషతః తదనుభవః)***. ఈ రెండిటిని నశింప చేయడం పాపము. ఈ పాపకర్మను చేసేది కావడం వల్ల కామము మహాపాపి.

ఆస్తుల్ని నాశనం చేస్తే తిరిగి పొందవచ్చు. ప్రయత్నించి సాధించుకో వచ్చు. జ్ఞాన విజ్ఞానాలు పాడైతే, వాటిని తిరిగి సాధించు కోవడం, సంపాదించు కోవడం అంత సులభ సాధ్యం కాదు. సంవత్సరాల తరబడి శ్రమించి సాధించుకున్న జ్ఞాన విజ్ఞానాలను కామం క్షణంలో పాడు చేస్తుంది. అందుకే కామాన్ని మహాపాపిగా గీతాచార్యుడు అభివర్ణించాడు.

ఇంద్రియాలను మొదట నిగ్రహించి, ఆ తరువాత మనోబుద్ధులను నియమించి, శత్రువు యొక్క స్థావర త్రయాన్ని ధ్వంసం చేసి, విరోధిపై తిరుగు లేని విజయాన్ని సాధించ మంటున్నాడు విజయసారథి ***(ఏనమ్ ప్రజహి)***.

మనస్సును జయించిన వాడు మహిని జయించ గలడు. కనుక ముందుగా ఇంద్రియాలను జయించి, ఆ తరువాత అజ్ఞానాన్ని జయించాలి. దేహేంద్రియ మనోబుద్ధు లన్నీ ఇంద్రియాలే కనుక, అవన్నీ కరణాలే. కనుక, ముందుగా మనోజయం జరిగి పోవాలి. ఆ తరువాత అన్నీ విజయ పరంపరలే. ఎందుకంటే, శాస్త్రం ఒక అందమైన ఉపమానాన్ని అందించింది. ఎందుకు ముందుగా ఇంద్రియ జయం జరగాలి? ఎందుకు ముందుగా మనస్సును జయించాలి అంటే, దానికి కుళ్ళిన మీనాన్ని దృష్టాంతంగా చెప్పింది.

మనస్తు పూర్వ మా దద్యాత్ కుమీన మివ మత్స్యహా

జాలరి చేపల్ని పట్టి గట్టుపై పడేస్తాడు. చావకుండా చలించే చేపలు నీళ్ళల్లోకి జారి పోకుండా వాటిని చంపి బుట్టలో వేసుకుంటాడు. కాని, మొదట కుత్సిన మీనాన్ని, అంటే మళ్ళీ నీళ్ళల్లో ప్రవేశించ డానికి తీవ్రంగా ఏ చేప అయితే యత్నిస్తూ ఉందో, దానిని ముందుగా చంపుతాడు. దాని అర్థం తీవ్ర ప్రయత్నం చేయకుండా నీళ్ళ వైపు మెల్లగా చరించే వాటిని విడిచి పెడతాడు అని కాదు. వాటిని కూడా చంపుతాడు. కాకపోతే, తీవ్ర ప్రయత్నంతో చలించేది, నీటికి దగ్గరగా ఉండేది ఏదో, దానిని ముందుగా చంపుతాడు.

అలాగే సాధకుడు ఇంద్రియ మనోబుద్ధుల్ని నియమించే ప్రయత్నంలో ముందుగా ఇంద్రియాలను నిగ్రహించాలి. ఎందుకంటే, విషయాలకు ఇంద్రియాలు దగ్గరగా ఉన్నాయి. పైగా, ఏ క్షణాన్నైనా అవి విషయ జలాల లోకి జారి పోవచ్చు. కనుక కామ మనే మహాపాపిని వధించాలని అభిలషించే వారు ఇంద్రియ మనోబుద్ధుల్ని అవశ్యం నిగ్రహించాలి అని ప్రబోధిస్తున్నాడు.

కామం యొక్క స్థావరాలను, ఆశ్రయ స్థానాలను తెలిపి, మహాపాపి యైన కామాన్ని త్యజించ మన్నాడు. బాగుంది. అయితే దేనిని ఆధారం చేసుకొని కామవిరోధిని త్యజించాలి? చెబుతున్నాడు.

ఇన్ద్రియాణి పరాణ్యాహు రిన్ద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః ॥ 42

ఇంద్రియాణి-పరాణి-ఆహుః-ఇంద్రియేభ్యః-పరం-మనః
మనసః-తు-పరా-బుద్ధిః-యః-బుద్ధేః-పరతః-తు-సః

ఇంద్రియాణి	=	ఇంద్రియాలను	బుద్ధిః	=	బుద్ధి
పరాణి	=	గొప్పవిగా	పరా	=	గొప్పది అని
ఆహుః	=	చెబుతారు	యః	=	ఎవడయితే
ఇంద్రియేభ్యః	=	ఇంద్రియముల కంటెను	బుద్ధేః	=	బుద్ధి కంటె
మనః	=	మనస్సు	పరతః	=	గొప్పవాడో
పరం	=	గొప్పది అని	సః	=	అతడే ఆత్మ అని
మనసఃతు	=	మనస్సు కంటె కూడా	ఆహుః	=	చెబుతారు

దేహము కంటె ఇంద్రియాలు గొప్పవి అంటారు. ఇంద్రియాల కంటె మనస్సు గొప్పదని చెబుతారు. మనస్సు కంటె బుద్ధి గొప్పది అంటారు. బుద్ధి కంటె పై నున్న దెవరో అదే ఆత్మ అని చెబుతారు.

వ్యాఖ్య

జ్ఞాన విజ్ఞానములను నశింప చేసే కామాన్ని త్యజించ మని భగవానుడు ఆదేశించాడు. కామము అనేది జయింప శక్యము కానిది అని ఇప్పటికే తెలుసు కున్నాము. కామము యొక్క స్థావరాలను, అనగా ఆశ్రయ స్థానాలను కూడా కనిపెట్టేశాము. ఇక దానిని జయించడమే మనకు మిగిలి ఉన్న కర్తవ్యము. శక్తివంతమైన కామాన్ని ధ్వంసం చెయ్యాలి అంటే, అంతకన్నా శక్తివంతమైన, బలవంతమైన ఆశ్రయాన్ని పొందాలి. ఏ ఆశ్రయాన్ని సాధిస్తే కామాన్ని సంపూర్ణంగా జయింప గలమో, దానిని ఆధారంగా పొందాలి. అది మహోత్కృష్ట మైనదై ఉండాలి. అది ఏదో ఈ శ్లోకంలో అర్థం చేసుకుంటాము.

'ఇంద్రియాలను ఉత్కృష్టములు అంటారు' అంటూ శ్లోకాన్ని ఆరంభించాడు అచ్యుతుడు (***ఇంద్రియాణి పరాణి ప్రకృష్టాని ఆహుః***). ఈ వాక్యం వినగానే దేని కంటె ఉత్కృష్టములు? అనే ప్రశ్న పుడుతుంది. అందుకు దేహము కంటె ఇంద్రియాలు ఉత్కృష్టములు అనే సమాధానం వస్తుంది.

దేహం కంటె ఇంద్రియాలు ఉత్కృష్టములు. ఇంద్రియాల కంటె మనస్సు ఉత్కృష్టము. మనస్సు కంటె బుద్ధి ఉత్కృష్టము అంటూ తరతమ భేదాలతో వివరిస్తూ చివరగా అన్నిటి కన్నా ఉత్కృష్ట మైనది ఆత్మ అని, అట్టి ప్రకృష్టమైన, మహోత్కృష్టమైన ఆత్మను పొందిన వారే కామాన్ని సంపూర్ణంగా జయించ గలరు అని అసలు విషయాన్ని బయట పెట్టేశాడు.

ఈ సత్యాన్ని సాంఖ్య యోగంలో స్థితప్రజ్ఞ ప్రకరణములో కూడా భగవానుడు చర్చించాడు (***రసవర్జం రసోఽ ప్యస్య పరం దృష్ట్వా నివర్తతే** - 59 వ శ్లోకం*). పరమేశ్వర దర్శనం తోనే విషయాసక్తి సంపూర్ణంగా నశిస్తుందని అక్కడ చెప్పే ఉన్నాడు. అట్టి దివ్య దర్శనం వైపు నడిపించే ప్రయత్నమే ఈ శ్లోకంలో చేస్తూ ఉన్నాడు.

దేహం నుండి ప్రారంభమై దేహి వరకు తరతమ భేదాలతో, ప్రకృష్ట స్థితిని వివరిస్తూ ప్రవచించాడు. కాకపోతే, ఈ ఉత్కృష్టత అనే దానికి కొలమానము లేమిటో కూడా ముందుగా తెలుసుకుంటే మంచిది.

ఒకదాని కంటె మరొకటి ఎలా ఉత్కృష్టము? తరతమ భేదాలు ఏయే విషయాలలో ఉన్నాయి? వినండి. (1) ప్రకాశత్వంలో ఉత్కృష్టము (***ప్రకాశకత్వాత్***). (2) ఒక దాని కంటె మరొకటి అంతస్థమై ఉండటము (***అంతస్థానాత్***). (3) వ్యాపకత్వంలో ఉత్కృష్టము (***వ్యాపకత్వాత్***). (4) కారణమై ఉండుట చేత ఉత్కృష్టము (***కారణత్వాత్***). (5) ఒకదాని కంటే మరొకటి సూక్ష్మమై ఉండటము (***సూక్ష్మత్వాత్***). (6) ప్రవర్తకత్వంలో ఉత్కృష్టము (***ప్రవర్తకత్వాత్***). ఈ ఆరు ధర్మాలలో తరతమ భేదాలను అనుసరించి ఉత్కృష్టతను నిర్ణయించాలి.

దేహం కంటె ఇంద్రియాలు

దేహం అప్రకాశ మైనది. తాను ఉన్నట్లు తనకే తెలియదు. ఒక బండి లాగా, లేదా బండ లాగా కనిపిస్తూ ఉంటుంది. దేహంతో పోల్చినపుడు ఇంద్రియాలు ప్రకాశవంతంగా ఉన్నాయి. వెనుక నుండి పిలిస్తే ముందు నడుస్తున్న వ్యక్తి తిరిగి చూస్తాడు. వాసనలు తెలుసు కుంటాడు. అలాగే విషయాలు అన్నీను.

దేహం తనకు తాను దృశ్యం కాలేదు. అంటే, తనను తాను దర్శించ లేదు. ఇంద్రియాలు దేహాన్ని దర్శిస్తాయి. స్పృశిస్తాయి. ఆఘ్రాణిస్తాయి. దేహం కన్నా సూక్ష్మంగా ఉంటాయి. ఆకాశంలో ఎక్కడో ఉన్న చంద్రుణ్ణి కళ్ళు ఇక్కడ నుండే చూస్తాయి. పంచీకృత స్థూలభూతాల నుండి దేహం పుడితే, అపంచీకృత సూక్ష్మభూతాల నుండి ఇంద్రియాలు జనించాయి. కనుక ఇంద్రియాలు దేహం కన్నా ఉత్కృష్టములు (***ఇంద్రియాణి పరాణి***).

ఇంద్రియాల కంటె మనస్సు

ఇంద్రియాల కంటే మనస్సు ఉత్కృష్టము. దేహం చేరలేని చంద్రుణ్ణి కళ్ళు చేరాయి. కనిపిస్తున్నాడు కనుక కళ్ళు చంద్రుణ్ణి చేరాయి. ఎదురుగా లేని, కంటికి కనిపించని, కలకత్తా లోని కాళికాదేవి కోవెలను కళ్ళు ఇక్కడ నుండి చూడ లేవు. కాని, మనస్సు చూస్తుంది. ఇంద్రియాల కన్నా మనస్సు సూక్ష్మం కనుకనే అది సాధ్య పడింది.

ఇంద్రియాలను ప్రేరేపించేది, ప్రవర్తింప చేసేది మనస్సు. ఆజ్ఞ లిచ్చి నడిపేది మనస్సు. మనస్సు వాటితో చేరక పోతే ఇంద్రియాలు అచేతనా లవుతాయి. కాని, ఇంద్రియాలు లేకపోయినా మనస్సు తనలో తాను వ్యవహరిస్తుంది. ఊహిస్తుంది. సంకల్పిస్తుంది. వికల్పిస్తుంది. కల్పించు కుంటుంది. ఇంద్రియాలన్నీ ఆదమరచి, చలించని వృక్ష శాఖల్లాగా నిశ్చలంగా ఉన్న నిద్రావస్థలో కూడా, మనస్సు స్వప్నాన్ని సృష్టించుకొని క్రీడిస్తుంది. తానే నేత్రమై చూస్తుంది. శ్రోత్రమై వింటుంది. ఇంద్రియ వ్యాపారాలన్నీ తనకు తానే లోపల సాగిస్తుంది. కనుక ఇంద్రియాల కంటె మనస్సు శ్రేష్ఠము (***ఇంద్రియేభ్యః పరం మనః***).

మనస్సు కంటె బుద్ధి శ్రేష్ఠము

సంకల్ప వికల్పాల మధ్య చలించే మనస్సును నిశ్చయించి నిలిపేది బుద్ధి. మనస్సు తనలో తాను వ్యవహరిస్తుంది. లేదా, ఇంద్రియాలతో చేరి బాహ్యంలో సంచరిస్తుంది. అంతేగాని, లోపల ఉన్న చైతన్యం వైపు పయనించ లేదు. కాని, బుద్ధి అలా కాదు. అటు మనస్సుతో చేరి ప్రపంచం లోకి పోగలదు, ఇటు వెను దిరిగి ఆత్మ వైపు పయనించ గలదు.

మనస్సు 'ఇదం' లేక 'ఇది'గా తెలుస్తుందే గాని 'అహం' లేక 'నేను'గా తెలియదు. 'అహం' వృత్తి బుద్ధి లోనే జనిస్తుంది. బుద్ధికి మనస్సు 'ఇదం'గా తెలుస్తుంది. ప్రేరేపించేది 'అహం' వృత్తి. ప్రవర్తించేది 'ఇదం' అయిన మనస్సు. ప్రవర్తించే దాని కన్నా ప్రేరేపించేది ఉత్కృష్ట మైనది. కనుక మనస్సు కంటె బుద్ధి ఉత్కృష్టము *(మనసః పరా బుద్ధిః)*.

బుద్ధి కంటె ఆత్మ ప్రకృష్టము

బుద్ధిలో కదిలే 'అహం' వృత్తిని, అహంవృత్తికి దృశ్యములైన 'ఇదం' వృత్తులను ప్రకాశింప చేసేది ఆత్మ. దేహేంద్రియ మనోబుద్ధులకు చేతనత్వాన్ని కలిగించేది, సర్వవ్యాపక మైనది, సర్వకారణ మైనది, సదా ప్రకాశవంత మైనది, సూక్ష్మాతి సూక్ష్మ మైనది కావటం చేత ఆత్మ బుద్ధి కంటే ఉత్కృష్ట మైనది. కామం కదలనిది, సర్వ కామాలు తీరినది ఆత్మ. అందుచేత ఆత్మ పరమైనది **(బుద్ధేః పరః సః)**. ఇక్కడ **సః** - 'అది' అంటే, ఆత్మ అని అర్థము.

రాజమార్గము

వానరుడు మతిని అనుసరించ వచ్చు కాని, నరుడు మాత్రం శ్రుతినే అనుసరించాలి అని సాధువులు చమత్కరిస్తూ ఉంటారు. శ్రుతి మార్గము రాజమార్గము. గీత ఉపనిషత్తుల సారము. సారభూతమైన విషయము. ఉపనిషత్తు లనే గోవుల నుండి పితికిన జ్ఞానక్షీరమే భగవద్గీత అని ధ్యానశ్లోకాల లోనే మనం అర్థం చేసుకున్నాం. ప్రస్తుతం దేహం నుండి ఆత్మ వరకు చెప్పబడిన తారతమ్యమును కఠోపనిషత్తు నుండి గ్రహించి ప్రవచించాడు గీతాచార్యుడు.

ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః
మనసశ్చ పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్పరః ॥

ఈ విషయాన్ని నారాయణుడే నరునికి బోధించాడు. ఇక రెండవ ఆలోచనకు, వ్యాఖ్యానానికి అవకాశ మెక్కడుంది?

అందుచేత, బుద్ధి కంటే పరమ ప్రకృష్ట మైనది ఆత్మ. అదే పురుషుడు. పరమాత్మ స్వరూపము. అంతకు మించినది ఏదీ లేదు. **పురుషాత్ న పరం కించిత్ స కాష్ఠా స పరాగతిః** అని శ్రుతిశాసనం.

ఇంద్రియాలు ఐదు, మనస్సుతో ఆరు, బుద్ధితో ఏడు - ఆ తరువాత అష్టమ స్థానంలో ఆత్మ దివ్యంగా ప్రకాశిస్తోంది. అక్కడే అష్టదళ పద్మంలో పద్మనాభుని వైభవం. అదే అష్టాంగ యోగమార్గంలో అష్టమ భూమిక యైన సమాధి. అదే అష్టమగర్భ సంజాతుడైన వాసుదేవుని నివాసము. నారాయణుని అష్టాక్షరీ మహామంత్ర వైభవము.

క॥ *విను మై దింద్రియములకును మనంబు షష్ఠంబు సప్తమత్వము బుద్ధిం*
బనిగొను భవ్య క్షేత్రజ్ఞుని యందష్టమత గల్గు సుగుణాభరణా ॥

అని ఆంధ్ర మహాభారతంలో కవిబ్రహ్మ తిక్కనార్యుని తీపి పద్యము.

బుద్ధి కంటె పరమైన ఆత్మానుభూతి కలిగితే కామమును సంపూర్ణంగా జయించినట్లే. రాజును జయిస్తే రాజ్యాన్ని జయించినట్లే కదా! సర్వాత్మ ప్రాప్తిస్తే సర్వమూ ప్రాప్తించినట్లే. ఆ తరువాత కామము కదలదు. కాలుడు కనిపించడు.

పట్టు వలువలు కప్పినా పన్నీరు చల్లినా
ఘన స్తుతుల ముంచినా గజము లెక్కించినా
చలింప నైతిని నీ మహిమ తెలిసి నేను
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని ఆ మహోత్కృష్ట సన్నిధిలో ఒక విబూదిపండు.

చివరగా, కామాగ్ని జయించి, ఆప్తకాముడవై జీవించు అని ఆనతిస్తూ ఆశీర్వదిస్తున్నాడు.

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్త భ్యాత్మాన మాత్మనా ।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 43

ఏవం-బుద్ధేః-పరం-బుద్ధ్వా-సంస్తభ్య-ఆత్మానం-ఆత్మనా
జహి-శత్రుం-మహాబాహో-కామరూపం-దురాసదం

మహాబాహో	=	అర్జునా!	ఆత్మనా	=	మనస్సు చేతనే
ఏవం	=	ఈ విధముగా	సంస్తభ్య	=	స్తంభింప చేసి
బుద్ధేః	=	బుద్ధి కంటె	కామరూపం	=	కామ స్వరూపమైన
పరం	=	శ్రేష్ఠమైన దానినిగా	దురాసదం	=	జయింప శక్యము గాని
బుద్ధ్వా	=	తెలుసుకొని	శత్రుం	=	శత్రువును
ఆత్మానం	=	మనస్సును	జహి	=	సంహరించు

అర్జునా! ఈ విధంగా ఆత్మను బుద్ధి కంటే శ్రేష్ఠ మైనదిగా తెలుసుకో. బుద్ధి చేత మనస్సును నిగ్రహించు. ఈ కామ శత్రువును జయించుట సుసాధ్యం కాదు. దానిని ఎలాగైనా జయించు.

వ్యాఖ్య

ప్రతి మానవుడు జయించ వలసిన కామాన్ని శత్రువుగా అభివర్ణిస్తూ, అజేయమైన శత్రువుపై విజయాన్ని సాధించి, ఆత్మ సామ్రాజ్యాన్ని అధిరోహించ మని ఆదేశిస్తూ మూడవ అధ్యాయం - కర్మయోగాన్ని సమాప్తి చేస్తున్నాడు.

బుద్ధికి ఉన్నతంగా, అతీతంగా పరమాత్మ స్వరూపం ఉంది. అదే బుద్ధికి చేతనత్వాన్ని ప్రసాదిస్తూ ఉంది. బుద్ధికి అధోముఖంగా మనస్సు చరిస్తూ ఉంది. మనస్సు బుద్ధిని అధోముఖంగా ఇంద్రియాల వైపు ఈడ్చి, విషయ ప్రపంచంలో వ్యవహరింప చేస్తూ ఉంది. కనుక బుద్ధి కంటె పరమైన ఆత్మను తెలుసుకోవాలి అంటే బుద్ధి చేత మనస్సును నిగ్రహించి, కామ రూప శత్రువును అంతం చెయ్యాలి.

శత్రువు ఎంత గొప్పవాడైనా, కంటికి కనిపిస్తూ ఉంటే, అర్థమవుతూ ఉంటే, పోరాడి జయించ వచ్చు. కాని ఈ కామ శత్రువు కనిపించడు. అర్థం కాడు. ఏ రూపంలో ఉంటాడో చెప్పలేము. ఒకసారి కనిపించినట్లు మరొకసారి కనిపించడు. అందుకే **దురాసదమ్** - 'జయింప శక్యము కాని' అన్నాడు భగవానుడు.

(దురాసదమ్ - దుఃఖేన, ఆసదః ఆసాదనం ప్రాప్తిః యస్య తం దురాసదమ్). ఎవరిని గూర్చి తెలుసుకోవడం

కష్టంతో కూడిన కార్యమో, అదే కామ శత్రువు. కామ విశేషాలు అంత సులభంగా అర్థం కావు. కామం **దురాసదమ్** కనుక ఏ రూపంలో నైనా గోచరించ వచ్చు. క్రోధ రూపంలో కనిపించేది కామమే. అంతే కాదు, లోభరూపంలో గోచరించేది, మోహరూపంలో అగుపించేది, మాత్సర్యంగా వికటించేది - అంతా కామమే.

సాధారణంగా శత్రువు బయట ఉంటాడు కనుక, ప్రయత్నించి జయించ వచ్చు. ఈ కామ శత్రువు బయట ఉండేవాడు కాదు. లోపల ఉండేవాడు. కనుక మన ప్రయత్నాలు విఫలమౌతూ ఉంటాయి. ఒక దశలో జయించడం సాధ్యం కాదేమో అనే నిరాశ కూడా కలుగుతూ ఉంటుంది.

వివేకం లోపించడమే ఈ విధమైన నైరాశ్యానికి కారణం. వివేకవంతమైన బుద్ధిని ప్రయోగించలేక పోవడమే కామాన్ని జయించలేక పోవడానికి ప్రధాన ప్రతిబంధకం. కనుకనే మనస్సును ***(ఆత్మానం)*** వివేక బుద్ధి చేత ***(ఆత్మనా)*** చక్కగా స్తంభింప చేసి ***(సమ్యక్ స్తంభనం కృత్వా)*** కామ శత్రువును జయించ మంటున్నాడు. ఈ సందర్భంలో అర్జునుణ్ణి **మహాబాహో!** అని సంబోధించాడు.

'మహాబాహో!' అంటే గొప్ప బాహువులు కలవాడా! అని అర్థము. గొప్పదైన బాహుబలంతో శత్రువును సంహరించేవాడా! అని భావము. బాహ్య శత్రువుల్ని బాహుబలంతో జయించినట్లే, అంతశ్శత్రువును బుద్ధి బలంతో జయించాలి. భావబలంతో జయించాలి. వివేక వైరాగ్యాదులనే శస్త్రాలతో ఖండించాలి. అవగాహనా కవచాన్ని సదా ధరించి పోరాడాలి. అప్పుడు శత్రువు ఏ రూపంలో వచ్చినా జయించడం సాధ్య మవుతుంది. కామరూపాలు ఆ తరువాత మనిషిని కదిలించ లేవు.

బుద్ధిలో వివేక బలం పుష్కలంగా ఉండాలి. అప్పుడే ఊర్ధ్వంగా పయనించి ఆత్మను తెలుసుకో గలుగుతుంది. అలాగే అధోముఖంగా విజృంభిస్తున్న ఇంద్రియ మనస్సుల్ని నియమించ గలుగుతుంది. వివేక బలం లేని నీరస మందమతులు కామ శత్రువును జయించి ఆత్మ సామ్రాజ్యాన్ని చేజిక్కించుకో లేరు ***(న అయం ఆత్మా బలహీనేన లభ్యః - కఠోపనిషత్తు)***.

విజయం వరిస్తుంది

ప్రయత్నశీలుడు పతన మెరుగడు అని ఆర్యోక్తి. పురుషార్థ నిశ్చయం స్థిరంగా ఉండి, బుద్ధిలో వివేకం విరబూస్తే, కామాన్ని జయించడం దుస్సాధ్యం కాదు. మరీ అంత అసాధ్యమైతే, మన పూర్వీకులు ఎలా జయించ గలిగారు? జయించడం దుస్సాధ్యమే అయితే, జయించు అని శ్రీకృష్ణుడు ఎందుకు ఆదేశిస్తాడు? అవగహన కల వారికి ఏదీ అసాధ్యం కాదు.

కామం వాస్తవానికి మిత్రుడూ కాదు. శత్రువూ కాదు. కామం మిత్రుడైతే మనల్ని దుఃఖానికి ఎందుకు గురి చేస్తుంది? కామం శత్రువైతే, ఆత్మజ్ఞానేచ్ఛను ఎలా కలిగిస్తుంది?

నిజం చెప్పాలంటే, ప్రపంచంలో కూడా ఎవ్వరూ ఎవ్వరికీ శత్రువుగా లేరు. అలాగే మిత్రుడు గాను లేరు. మనం ఏర్పరచుకొనే సంబంధాలను బట్టే శత్రువులు, మిత్రులు తయారవుతూ ఉంటారు.

ఇంతెందుకు? ఎందరు భర్తలు భార్యలకు శత్రువులుగా లేరు? అలాగే ఎందరు భార్యలు భర్తలకు శత్రువులు కారు? తండ్రికొడుకుల మధ్య శత్రుత్వము, మామాఅల్లుళ్ళ మధ్య శత్రుత్వము, అన్నదమ్ముల మధ్య శత్రుత్వము - ఇలా ఎన్నని? ఎన్నైనా అవగాహనా లోపం వల్ల కలిగినవే.

మిత్రుల్ని తయారు చేసుకోవచ్చు. శత్రువుల్ని లేకుండా చేసుకోవచ్చు. అంతా మన ప్రవర్తనపై ఆధార పడి ఉంటుంది. మన అవగాహన వృద్ధి చెందే కొద్ది, శత్రువులు తగ్గుతూ ఉంటారు. మిత్రులు పెరుగుతూ ఉంటారు. అంతే.

భయంకర మైన పులుల్ని లొంగ దీసుకొని స్వారి చేసే వారు ఉన్నారు. విషసర్పాల్ని చేతుల్లో పట్టుకొని ఆడించే వారు ఉన్నారు. వివేకం ఉన్నతంగా పయనిస్తే కామాన్ని జయించడం కూడా దుస్సాధ్యం కాదు. అందువల్లనే వివేక బుద్ధి చేత మనస్సును స్తంభింప చేసి కామ శత్రువును జయించాలని అభిలషించే సాధకుడు బుద్ధి కంటె ప్రకృష్టమైన ఆత్మను తెలుసు కోవాలి అంటున్నాడు.

ఆత్మదర్శనం

ఆత్మ నిత్యం. శుద్ధం. బుద్ధం. ముక్తం. బుద్ధికి పరమైన ఈ ఆత్మను తెలుసుకున్న బుద్ధి జ్ఞానంతో శోభిస్తుంది. ఆత్మజ్ఞానంతో శోభిస్తుంది. బుద్ధిలో కలిగే జ్ఞానవృత్తి అజ్ఞానవృత్తిని నశింప చేసి, కామ శత్రువును మట్టు పెడుతుంది.

తాను ఆత్మే అనే జ్ఞానం కలిగిన తరువాత, పరిమితమైన కామం ఉంటే మాత్రం నష్ట మేముంది? పరిమితమైన కామం అనంతాత్మను ఏం చేయ గలుగుతుంది? ఆప్తకాముడైన జ్ఞాని ప్రత్యేకించి పొంద వలసింది ఏముంది కనుక అతనిలో కోర్కెలు కదుల్తాయి? పొంద వలసింది లేనపుడు కోరికలు కదిలితే మాత్రం నష్ట మేముంది? ఆత్మానంద సాగరంలో కోరికలు కూడా అందంగా అలల లాగా లేచి పడుతూ ఉంటాయి.

ప్రపంచం అస్థిరం. చంచలం. కామం దుఃఖ హేతువు. పరమాత్మ అక్షరం. ఆనంద స్వరూపం. కామరూప సంసారం చంచల మైంది కనుక అక్షర రూపుడైన పరమాత్మను తెలుసు కోవాలి అన్నది ఉపనిషత్తు ***(విజ్ఞేయోఽక్షర తన్మాత్రో జీవితం చాపి చంచలమ్ - పైంగలోపనిషత్తు)***.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే కర్మయోగో నామ తృతీయోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు కర్మయోగము అనే మూడవ అధ్యాయము.







చైతన్య భగవద్గీత

అకారాది శ్లోకానుక్రమణిక


ప్రథమాధ్యాయము





అకారాది శ్లోకానుక్రమణిక

ద్వితీయాధ్యాయము



అకారాది శ్లోకానుక్రమణిక

ద్వితీయాధ్యాయము


చైతన్య భగవద్గీత



అకారాది శ్లోకానుక్రమణిక

తృతీయాధ్యాయము





చైతన్య భగవద్గీత

(ప్రథమ సంపుటము)



స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత

(ప్రథమ సంపుటము)

స్వామి సుందర చైతన్యానంద



చైతన్య భగవద్గీత

స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత
స్వామి సుందర చైతన్యానంద
ప్రథమ ముద్రణము : డిసెంబరు 2009....... 15000 కాపీలు.

ప్రతులకు :
1. సుందర చైతన్యాశ్రమం
దుండిగల్ రోడ్,
హైదరాబాద్ - 500 043.
☎ : 08418 - 255777
ఫాక్స్ : 08418 - 255355

2. చైతన్య వానప్రస్థాశ్రమం,
సుందర చైతన్యాశ్రమం
ధవళేశ్వరం - 533 125.
☎ : 0883 - 2417378

3. సుందర చైతన్యాశ్రమం
శాంతిపురం,
విశాఖపట్టణం - 530 016.
☎ : 0891 - 2791079

టైప్ సెట్టింగ్ : ప్రసాద్
ఫోటో డిజైనింగ్ : ప్రవీణ్
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్

ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్, కొవ్వూరు.
☎ : 08813 - 232354, 231575



విషయ సూచిక

చైతన్య భగవద్గీత




స్వామి సుందర చైతన్యానంద













అంకితం

అనుగ్రహించిన ఆదిదేవునకు
అర్థం చెప్పిన ఆచార్యదేవునకు
అంజలి ఘటిస్తూ

ఓం స్వామి సుందర చైతన్యానంద

అంబ! భగవద్గీతే!
త్వాం అనుసందధామి



ప్రాణాలు వెంట బెట్టుకొని
ప్రపంచం లోకి ప్రవేశించిన వారు
తిరిగి ప్రాణాలను ప్రపంచం లోనే
విడిచిపెట్టి వెళ్తున్నారు.

తల్లి గర్భం నుండి వచ్చే నాడు
అందరూ ప్రాణాల తోనే వస్తున్నారు.
పుట్టిన తరువాత ప్రాణాల్ని
చేదుకోవడం లేదు. తోడుకోవడం లేదు.

వెలిగే దీపం ఆరి పోకుండా
నూనె పోస్తూ ఉంటాము.
తెచ్చుకున్న ప్రాణం కారి పోకుండా
ప్రాణవాయువును పీల్చుకుంటూ ఉంటాము.

ప్రాణవాయువును ప్రసాదించి
ప్రాణాలు కాపాడిన ప్రపంచానికి
ఋణగ్రస్తులం కాలేక ప్రాణాలను
ప్రపంచం లోనే విడిచి వెళ్తున్నాం.



మరణ యోగ్యత ప్రతి ప్రాణికీ ఉంది
యోగ్యమైన మరణం ఎందరి కుంది?

జీవిత మిదం త్రుటి ద్వయస్య క్రీడా
ఈ జీవితం రెండు నిమిషాల ఆట.

ఒక నిమిషంలో జననం. మరో నిమిషంలో మరణం
ఒక క్షణంలో కళ్ళు తెరవడం. మరో క్షణంలో కళ్ళు మూయడం.

ఇదే ద్వయం. ద్వైతం. భయం.
కాదెన్నడూ ఇది అభయం.

రెండిటిని రమణీయంగా చూపిస్తూ
రెండిటి మధ్య అదే పనిగ పరుగు లెట్టిస్తూ
రెండు నిమిషాల్లో బ్రతుకును బుగ్గి చేసే
ద్వైత క్రీడ. త్రుటి ద్వయస్య క్రీడ.

జాతస్య మరణం ధృవమ్

పుట్టేది ఎవరైనా గిట్టేందుకే - ఈ మధ్యలో,
తిరిగేది తిరగడమే. తరిగేది తరగడమే.
తిరగడం కర్మ. తిరిగి తిరిగి అరిగి పోవడం ఫలం.

తిరిగేవే అరుగుతాయి. కదిలేవే కరుగుతాయి.
మరిగే జలాలు ఆవిరౌతూ తరిగి పోతాయి.


దేహాలు తిరిగి తిరిగి
అవయవాలు అరిగి అరిగి
క్షణక్షణానికి ప్రాణాలు కరిగి కరిగి
మాయలో పడిన మనస్సు మరిగి మరిగి - ఒకనాడు
మనిషి మరణించి మట్టిలో మట్టిగా కలిసి పోతాడు
కట్టెలలో కట్టెగా కాలి మసై పోతాడు.

ఇక్కడ ఎవ్వరికీ మినహాయింపులు లేవు
మీనమేషాలు మనం లెక్కించ వచ్చు
మృత్యువు వాటిని లెక్క పెట్టదు.

పచ్చని చెట్టు ఎండేందుకే ఉంది
వెచ్చని దేహం మండేందుకే ఉంది.

కాయ ఏ చెట్టు దైనా రాలి పోయేదే
కాయం ఎవరి దైనా కాలి పోయేదే.

పడేందుకే లేస్తుంది కడలి కెరటం
కాటిలో కాలేందుకే పుడుతుంది కాయం.





కాలః జగద్భక్షకః

జల్లెడ బట్టి అందరినీ జగత్తు వడబోస్తూ ఉంటే
కాలం కదం త్రొక్కుతూ జగత్తునే కబళిస్తోంది
విశ్వాన్నంతా వ్యంజనంలా చప్పరిం చేస్తోంది.

జన్మ నిచ్చిన తల్లుల్ని మాటేసి కాటేసింది
పోషించిన తండ్రుల్ని వాటేసుకొని కూల్చేసింది.

భార్యల్ని మ్రింగింది. భర్తల్ని మ్రింగింది
మిత్రుల్ని మ్రింగింది. బంధువుల్ని మ్రింగింది
తాతలను మ్రింగింది. తనయులను మ్రింగింది
దారి కాచి మరీ దొంగలా దోచుకుంది - ఆ క్షణాల్లో

ఇక బ్రతకడ మెందుకు?
చావే మంచిది అనిపిస్తుంది.

ఈ వైరాగ్యం ఎంత కాలం ఉంటుంది?
కాలం దానిని కూడా మ్రింగేస్తుంది.

మరిగించిన మనసే మరపిస్తుంది
సమస్తాన్ని మరచి పోయేలా చేస్తుంది.

మళ్ళీ ప్రపంచం వైపే పరుగులు
అవే దరువులు. అవే కరువులు.

తన భుజబల పరాక్రమాలతో అవనికి వణకు పుట్టించిన హిరణ్యాక్షుడు, వరాహమూర్తి చేతిలో హతుడయ్యాడు. ఉదక ప్రదాన అంత్యక్రియాదు లాచరించిన తరువాత, పుత్రశోకంతో కుమిలి పోతున్న తల్లి దితిని ఊరడించ డానికి హిరణ్యకశిపుడు మాతృదేవి మందిరంలో ప్రవేశించాడు.

శా॥ నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు వీడి పోదురు సదా సంగంబు లేదొక్కచో
శూరుల్ వోయెడి త్రోవఁ బోయెను భవత్పూనుండు దల్లీ! మహా
శూరుఁ డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్!

అమ్మా! ఈ ప్రపంచం ఒక చలివేంద్రం లాంటిది. జీవు లందరూ దాహం తీర్చుకోవడానికి వచ్చిన బాటసారులే. దాహం తీరిన తరువాత, చలిపందిరిని విడిచి, ఎవరి దారిన వారు పోతూ ఉంటారు.

జననీ! ప్రారబ్ధ ఫలాలను అనుభవించ డానికి ఈ ప్రపంచ మనే చలివేంద్రం వద్దకు మన మందరమూ చేరాం. మనమూ బాటసారులమే. సంసార సంచారులమే.

చలిపందిరి వద్ద కలవడమే సంసారము. చలివేంద్రం వద్ద ఎవరితో చెలిమి? ఎవరిది కలిమి? ఏమి సంగము? ఎక్కడి సంసారము?

మాతా! ఎగిరి పోయేందుకే పక్షులు చెట్టుపై వాలుతాయి. తిరిగి నడచేందుకే బాటసారులు చలివేంద్రాన్ని చేరుతారు. వచ్చిన వాళ్ళందరూ తిరిగి పోయేవారే. స్థిరంగా ఉండేవా రెవ్వరూ లేరు. ఒక కాలంలో కనిపించిన వాళ్ళు మరొక కాలంలో కనిపించరు. అందరూ వెళ్ళే వారే. మనమూ అంతే. కాకపోతే, కొందరు ముందు. కొందరు వెనుక. అంతే.

నా సోదరుడు, మహిని వణకించిన నీ ముద్దుల తనయుడు హిరణ్యాక్షుడు ముందు వెళ్ళాడు. విదియ తనది, తదియ మనది. అంతే. తల్లీ! ఎవ్వరైనా పోయే వారే! కానీ నా సోదరుడు మహాశూరుడు. కనుకనే, విష్ణువుతో పోరాడి శూరులు పయనించే మార్గంలో వెళ్ళి పోయాడు. విజయం విష్ణువు దైతే, వీరస్వర్గం నా తమ్ముడిది.

సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్ముఁ డవ్యయుం
డమలుండు సత్యుఁ డనంతుఁ డాఢ్యుండు - తల్లీ! భగవంతుడైన శ్రీమహావిష్ణువు సర్వజ్ఞుడు, సర్వాత్ముడు, నశించని వాడు, నిర్మలుడు, సత్యరూపుడు, అనంతుడు, అధ్యుడు. ఆ దివ్యాత్ముని చేతిలో మరణించిన మహావీరుడైన నా సోదరుని మరణం దుఃఖించ దగింది కాదు అని హిరణ్యకశిపుడు తల్లి దితిని ఎంతగానో ఓదార్చాడు. కుమిలి పోతున్న మాతృశ్రీ హృదయాన్ని కుదుట పరచాడు.

ఆ తరువాత జరిగిం దేమిటి?

దానవ శ్రేణికిన్ వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్ - 'దానవు లందరికీ విష్ణువు ప్రబల శత్రువు. అతడిని వధించాలే గాని వర్ణించ కూడదు' అంటూ విజృంభించాడు.

జాతస్య మరణం ధృవమ్

పుట్టేది ఎవరైనా గిట్టేందుకే - ఈ మధ్యలో,
తిరిగేది తిరగడమే. తరిగేది తరగడమే.
తిరగడం కర్మ. తిరిగి తిరిగి అరిగి పోవడం ఫలం.

తిరిగేవే అరుగుతాయి. కదిలేవే కరుగుతాయి.
మరిగే జలాలు ఆవిరౌతూ తరిగి పోతాయి.


దేహాలు తిరిగి తిరిగి
అవయవాలు అరిగి అరిగి
క్షణక్షణానికి ప్రాణాలు కరిగి కరిగి
మాయలో పడిన మనస్సు మరిగి మరిగి - ఒకనాడు
మనిషి మరణించి మట్టిలో మట్టిగా కలిసి పోతాడు
కట్టెలలో కట్టెగా కాలి మసై పోతాడు.

ఇక్కడ ఎవ్వరికీ మినహాయింపులు లేవు
మీనమేషాలు మనం లెక్కించ వచ్చు
మృత్యువు వాటిని లెక్క పెట్టదు.

పచ్చని చెట్టు ఎండేందుకే ఉంది
వెచ్చని దేహం మండేందుకే ఉంది.

కాయ ఏ చెట్టు దైనా రాలి పోయేదే
కాయం ఎవరి దైనా కాలి పోయేదే.

పడేందుకే లేస్తుంది కదలి కెరటం
కాటిలో కాలేందుకే పుడుతుంది కాయం.





కాలః జగద్భక్షకః

జల్లెడ బట్టి అందరినీ జగత్తు వడబోస్తూ ఉంటే
కాలం కదం త్రొక్కుతూ జగత్తునే కబళిస్తోంది
విశ్వాన్నంతా వ్యంజనంలా చప్పరిం చేస్తోంది.

జన్మ నిచ్చిన తల్లుల్ని మాటేసి కాటేసింది
పోషించిన తండ్రుల్ని వాటేసుకొని కూల్చేసింది.

భార్యల్ని మ్రింగింది. భర్తల్ని మ్రింగింది
మిత్రుల్ని మ్రింగింది. బంధువుల్ని మ్రింగింది
తాతలను మ్రింగింది. తనయులను మ్రింగింది
దారి కాచి మరీ దొంగలా దోచుకుంది - ఆ క్షణాల్లో

ఇక బ్రతకడ మెందుకు?
చావే మంచిది అనిపిస్తుంది.

ఈ వైరాగ్యం ఎంత కాలం ఉంటుంది?
కాలం దానిని కూడా మ్రింగేస్తుంది.

మరిగించిన మనసే మరపిస్తుంది
సమస్తాన్ని మరచి పోయేలా చేస్తుంది.

మళ్ళీ ప్రపంచం వైపే పరుగులు
అవే దరువులు. అవే కరువులు.

తన భుజబల పరాక్రమాలతో అవనికి వణకు పుట్టించిన హిరణ్యాక్షుడు, వరాహమూర్తి చేతిలో హతుడయ్యాడు. ఉదక ప్రదాన అంత్యక్రియాదు లాచరించిన తరువాత, పుత్రశోకంతో కుమిలి పోతున్న తల్లి దితిని ఊరడించ డానికి హిరణ్యకశిపుడు మాతృదేవి మందిరంలో ప్రవేశించాడు.

శా॥ నీరాగార నివిష్ట పాంధుల క్రియన్ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు వీడి పోదురు సదా సంగంబు లేదొక్కచో
శూరుల్ వోయెడి త్రోవఁ బోయెను భవత్పూనుండు దల్లీ! మహా
శూరుఁ డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్!

అమ్మా! ఈ ప్రపంచం ఒక చలివేంద్రం లాంటిది. జీవు లందరూ దాహం తీర్చుకోవడానికి వచ్చిన బాటసారులే. దాహం తీరిన తరువాత, చలిపందిరిని విడిచి, ఎవరి దారిన వారు పోతూ ఉంటారు.

జననీ! ప్రారబ్ధ ఫలాలను అనుభవించ డానికి ఈ ప్రపంచ మనే చలివేంద్రం వద్దకు మన మందరమూ చేరాం. మనమూ బాటసారులమే. సంసార సంచారులమే.

చలిపందిరి వద్ద కలవడమే సంసారము. చలివేంద్రం వద్ద ఎవరితో చెలిమి? ఎవరిది కలిమి? ఏమి సంగము? ఎక్కడి సంసారము?


మాతా! ఎగిరి పోయేందుకే పక్షులు చెట్టుపై వాలుతాయి. తిరిగి నడచేందుకే బాటసారులు చలివేంద్రాన్ని చేరుతారు. వచ్చిన వాళ్ళందరూ తిరిగి పోయేవారే. స్థిరంగా ఉండేవా రెవ్వరూ లేరు. ఒక కాలంలో కనిపించిన వాళ్ళు మరొక కాలంలో కనిపించరు. అందరూ వెళ్ళే వారే. మనమూ అంతే. కాకపోతే, కొందరు ముందు. కొందరు వెనుక. అంతే.

నా సోదరుడు, మహిని వణకించిన నీ ముద్దుల తనయుడు హిరణ్యాక్షుడు ముందు వెళ్ళాడు. విదియ తనది, తదియ మనది. అంతే. తల్లీ! ఎవ్వరైనా పోయే వారే! కానీ నా సోదరుడు మహాశూరుడు. కనుకనే, విష్ణువుతో పోరాడి శూరులు పయనించే మార్గంలో వెళ్ళి పోయాడు. విజయం విష్ణువు దైతే, వీరస్వర్గం నా తమ్ముడిది.

సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్ముఁ డవ్యయుం
దమలుండు సత్యుఁ డనంతుఁ డాఢ్యుండు - తల్లీ! భగవంతుడైన శ్రీమహావిష్ణువు సర్వజ్ఞుడు, సర్వాత్ముడు, నశించని వాడు, నిర్మలుడు, సత్యరూపుడు, అనంతుడు, ఆఢ్యుడు. ఆ దివ్యాత్ముని చేతిలో మరణించిన మహావీరుడైన నా సోదరుని మరణం దుఃఖించ దగింది కాదు అని హిరణ్యకశిపుడు తల్లి దితిని ఎంతగానో ఓదార్చాడు. కుమిలి పోతున్న మాతృశ్రీ హృదయాన్ని కుదుట పరచాడు.

ఆ తరువాత జరిగిం దేమిటి?

దానవ శ్రేణికిన్ వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్ - 'దానవు లందరికీ విష్ణువు ప్రబల శత్రువు. అతడిని వధించాలే గాని వర్ణించ కూడదు' అంటూ విజృంభించాడు.



తల్లికి బోధించిం దేమిటి?
తానిపుడు వాదించే దేమిటి?

అనర్థాల వైపు పరుగు దీసే వారికి
పరమార్థం ఒక పట్టున వంట పట్టదు.

దేవుడు ఉన్నాడని తెలియని దెవరికి?
దేవుడు అంటే ఏమిటో తెలిసిం దెవరికి?

తెలియడం వేరు
అర్థం కావడం వేరు.

ఆవు తినిన ఆహారాన్ని నెమరు వేస్తుందని మనకు తెలును
కానీ, ఆవు నెమరు వేసేది జీర్ణం కాని దానినే అనేది తెలియాలి.

ఏది యుక్తము? ఏది అయుక్తము? అని ఆలోచించలేక
కసువు మేసే టపుడు ఆవు ఏదేదో తినేస్తుంది.

తినింది జీర్ణం కావవుడు, తిరిగి నోటి లోకి తెచ్చుకొని
మళ్ళీ నమిలి మ్రింగుతుంది. అదే నెమరు వేయడం.

తృణ స్వీకరణ కాలే
రోమన్థం కుర్వన్ పశురివ
పశ్చాత్ అనర్థం మా భజ !

అయోగ్యమైన దానిని ఆరగించి, అది అరగని దశలో
నెమరు వేయడానికి పశువు పరితపించినట్లు,
అనర్థదాయక మైన విషయాలను ఆశ్రయించి,
ఆ తరువాత ఆవేదనతో కుమిలి పోవద్దని ఆప్తవాక్యం,
స్వయంప్రకాశ యతీంద్రులు పలికిన హితవాక్యం.



జీవిత మొక విచిత్రమైన ప్రయాణము
ప్రయాణం లోనే ప్రమాదాలు జరుగుతాయి.

పయనించే నావే మునిగేది
జీవించే మనిషే మరణించేది.

మరణం అనివార్యం
ఎప్పు డనేది అనిశ్చితం.

అలహాబాద్ ప్రయాణంలో రాత్రి రైలెక్కిన వాడు
ఆసుపత్రిలో మరునాడు ఉదయం కళ్ళు తెరచి
నే నెక్కడున్నాను? అని పలవరించడం లేదా!

అలహాబాద్ వెళ్ళాలని రైలెక్కాడే గాని
ఆసుపత్రిలో పడక పైకి చేరాలని
పలవరించే వ్యక్తి కలలు గన్నాడా?

వాస్తవాలు ఊహాలలో ఊరేగవు
ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రమాణాలే ప్రకాశిస్తాయి.

ఈ ప్రపంచ ఎడారిలో ఇంతవరకు
ఎవరి దప్పిక తీరలేదు.



కోరికలు అందరి బుద్ధులను కుదిపేశాయే గాని
ఎవరి హృదయాన్ని కూడా కుదుట పరచలేక పోయాయి.

అందరూ ప్రపంచంలో కొంత కాలం ఉండి తిరిగి పోయిన వారే గాని
ఈ ప్రపంచాన్ని తమదిగా, తమ ఆస్తిగా మార్చుకున్న వారు ఎవ్వరూ లేరు.

అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వత:

దేహాలు స్థిరం కావు. సంపదలు శాశ్వతం కావు.

సరుకులు మోసుకొచ్చే నౌక సముద్రంలో మునిగి పోగానే
ఆ పయనించే నౌక లోని సరుకులు కూడా మునిగి పోయినట్లు
మనిషి జీవితం ఈ ప్రపంచంలో ముగిసి పోగానే
అతని కున్న సమస్తము క్షణంలో అతనిది కాకుండా పోతుంది.

దీనికి ఎంత సమయం పడుతుంది?
అంతా క్షణంలో జరిగి పోతుంది.

ఆపద: క్షణ మాయన్తి
క్షణ మాయన్తి సంపద:
క్షణం జన్మ క్షణం మృత్యు:
మునే కి మిహా న క్షణం?



క్షణంలో ఆపద ఆవరిస్తుంది
క్షణంలో సంపద సమీపిస్తుంది
పుట్టేది క్షణం, చచ్చేది క్షణం
మునీ! క్షణం కానిది ఇక్కడ ఏముందని?
అని యోగవాసిష్ఠంలో వసిష్ఠ మహర్షిని
సూటిగా ప్రశ్నించాడు బాలరాముడు.

గతంలో ఎవరెవరు ఏమేమి చేశారో
వాటిలో ఎవరెవరు ఏమేమి చూశారో
వాటి ఫలాలు ఎలా ఉంటాయో, ఎప్పుడొస్తాయో
ఆలోచనలకు అందవు. ఊహాలు పట్టుకో లేవు
ఇక్కడే బండ్లు ఓడ లవుతాయి
ఓడలు తిరగబడి కడలిలో కలిసి పోతాయి.

సంపదలు దూరమై ఆపదలు చేరు వవుతాయి
బాంధవ్యాలు శూన్యమై భారాలను గుండెలలో దించుతాయి.



క్షణాలలో ఆరోగ్యాలు విషమిస్తాయి
ప్రమాదాలు బ్రతుకులనే బుగ్గిపాలు చేస్తాయి.

ఎంతటి వారైనా ఏకాకులు కావచ్చు
ఏకంగా పరలోకానికే పయనించ వచ్చు.

తెలిసి చేసినా, తెలియక చేసినా
చేసినవే కనుక తప్పించుకోవడం సాధ్యం కాదు.

నా భుక్తం క్షీయతే కర్మ
కల్పకోటి శతై రపి

కోట్లాది జన్మ లెత్తినా
అనుభవించనిదే కర్మ నశించదు.

కోరుకునే మనస్సు మనిషి కుంది.
అలాగని కష్టాలను మనిషి కోరుకోడు
నష్టాలు రావాలని ఎప్పుడూ ఆశించడు
అయినా, వచ్చే సమయానికి అవి వచ్చి తీరుతాయి.



దుఃఖం ప్రాప్తించాలని ఎవ్వరూ అభిలషించరు
అనారోగ్యానికి ఎవ్వరూ ఆహ్వానం పలకరు.

భగవాన్!
నాకు జ్వర మొస్తే నీకు కొబ్బరికాయ కొడతాను
అని మ్రొక్కిన వాళ్ళను మీ రెక్కడైనా చూశారా?

షుగర్ వస్తే తలనీలా లిస్తాను
రక్తపోటు రావాలే గాని అంగ ప్రదక్షిణం చేస్తాను
మలేరియా వస్తే కాలి నడకన కొండ కొస్తాను
టైఫాయిడ్ వస్తే నిలువు దోపిడి సమర్పించు కుంటాను.

ఇలా ఎవ్వరూ కోరి ఉండరు. ఎవ్వరూ మ్రొక్కి ఉండరు.
కోరినా, కోరక పోయినా వచ్చే కాలానికి అవి వచ్చి తీరుతాయి.

అవన్నీ ప్రారబ్ద ఫలాలు. పిలవక పోయినా వచ్చే చుట్టాలు
అయినా వాటిని ఆహ్వానించే పని లోనే మనం తలమునకలై ఉంటాము
పిలవక పోయినా వచ్చే వాటిని పని గట్టుకొని మరీ పిలుస్తూ ఉంటాము.

ఆస్తులు అంతస్తులు
అధికారాలు ఆరోగ్యాలు
సంపదలు సంతానాలు
ప్రయాణాలు ప్రమోదాలు - ఇవన్నీ ప్రారబ్ద ఫలాలే.



ఏవి ఎప్పుడు రావాలో అప్పుడు వస్తాయి
ప్రార్థించక పోయినా తప్పక ప్రాప్తిస్తాయి.

ముక్తి అనేది ప్రారబ్దఫలం కాదు
ముక్తి అనేది మన ప్రారబ్దంలో ఉంటే,
మనం పుట్టి ఉండే వాళ్ళమే కాదు
తరించి పోయి ఉండే వాళ్ళము.

మోక్షం ప్రారబ్ద ఫలం కాదు, పురుషార్థ ఫలం
పురుషుడు ప్రయత్నంతో సాధించ వలసిన ఫలం.

పురుషార్థములు

పురుషేణ అర్థ్యతే ఇతి పురుషార్థమ్ - ప్రతి పురుషుడు ప్రయత్నించి పొందా లనుకునే ప్రయోజనాలే పురుషార్థాలు. అవియే ధర్మార్థ కామమోక్షాలు. వీటిలో అర్థకామాలు ప్రాణు లన్నిటిలో గోచరిస్తాయి. ధర్మమోక్షాలు మాత్రం కేవలం మానవులకే సంబంధించి ఉంటాయి.

అర్థం

'అర్థం' అనే పురుషార్థం భద్రతకు సంబంధించింది. ఈ అర్థం అనే పురుషార్థం సర్వ ప్రాణులలో గోచరిస్తుంది. అభద్రత నుండి బయట పడేందుకు, భద్రతను పొందేందుకు జీవులు ఆశించే ప్రయోజనమే అర్థము.

దేహాన్ని రక్షించుకోవాలని అందరూ భావిస్తారు. శరీరానికి భద్రత కావాలి. అంటే, ప్రాణాన్ని నిలుపుకొనేందుకు, దేహాన్ని నిలబెట్టు కొనేందుకు మనిషికి ఆహార పానీయాలు కావాలి. శీతోష్ణాల నుండి రక్షించు కొనేందుకు బట్టలు కావాలి. వర్షాతపాల నుండి దేహాన్ని కాపాడు కొనేందుకు వసతి కావాలి. ఆహార, పానీయ, వసతి, వస్త్రాదులు అందరికీ అవసరమై ఉన్నాయి. అభద్రతా భావాన్ని తొలగించు కొనేందుకు అవసరమైన వీటన్నిటిని మనిషి ప్రయత్నంతో సాధిస్తాడు. అదే అర్థ మనే పురుషార్థము.

'అర్థ' ప్రయోజనాన్ని ఆశించి చేసే ప్రయత్నాలు మానవుల లోనే గాక సర్వ ప్రాణులలో కనిపిస్తాయి. మనిషి గృహం నిర్మించుకుంటే, గువ్వ గూడు కట్టు కుంటుంది. ఎలుకలు బొరియలు చేసుకుంటే, చీమలు పుట్టలు పెట్టుకుంటాయి. వండిన ఆహారాన్ని మనిషి తింటే, వంటబట్టే ఆహారాన్ని జంతువులు తింటాయి.

నిలువ చేసుకొనే స్పృహ మానవుని లాగే జంతువులకూ ఉంది. కాకపోతే, ఎంత నిలువ చేసుకున్నా మనిషికి తృప్తి ఉండదు. ఈ విధమైన అసంతృప్తి జంతువులలో వెదకినా కనిపించదు. అదే తేడా.

అర్థ మనే పురుషార్థ సాధన ద్వారా ఏ భద్రతను మనిషి వాంఛిస్తున్నాడో అది మాత్రము లభ్యం కాదని తెలిసి మనిషి నిరాశలో కూరుకు పోతున్నాడు. అర్థాన్ని సాధించుకో గలడే గాని, అభద్రత నుండి విడివడ లేదు. ఈ దేహానికి ఎంత భద్రతను కల్పించినా, ఒకనాడు శ్మశానంలో గుంట తీసి దానిని భద్ర పరచక తప్పదు. ఈ విధంగా 'అర్థం' అనే పురుషార్థం పరమార్థం కాలేక పోతోంది.

కామం

'భద్రత' అనేది ఎలా 'అర్థం' అనే పురుషార్థానికి సంబంధించినదో, 'సుఖం' అనేది అలా 'కామం' అనే పురుషార్థం పరిధిలో చేరుతుంది. ఈ సుఖం దేహేంద్రియ మనోబుద్ధులలో దేని కైనా సంబంధించింది కావచ్చు.

దేహ భద్రతకు ఆహారం కావాలి అనేది 'అర్థం'. ఆహారం ఇలాంటిదే కావాలి, అలాంటిదే ఉండాలి అనేది 'కామం'. ఇది భద్రతకు సంబంధించింది కాదు; సుఖానికి సంబంధించింది.

పడుకోవడానికి పడక అవసరం. అది అర్థం. మెత్తని దూది పరుపే కావాలి అనేది కామం. ఉండటానికి ఇల్లు అవసరం. అది అర్థం. అది రమ్యమైన హార్మ్యమే కావాలి అనేది కామం. సుఖ భోగాలకు సంబంధించిన విషయం.

ఆహారం, నిద్ర, వసతి, వస్త్రాదులే కాకుండా, మనిషికి రుచులు కావాలి. అవి కూడా అభిరుచులకు అనుగుణంగా ఉండాలి. అంతేకాదు, ఉల్లాసాలు, విలాసాలు, వినోదాలు, వికాసాలు - ఇలా ఎన్నో కావాలి.

అందాలు కావాలి, ఆభరణాలు కావాలి, విహారం కావాలి, సంగీతం కావాలి, ప్రేమలు కావాలి, శృంగారాలు కావాలి, నృత్యాలు కావాలి, సఖ్యాలు కావాలి, ఆటలు కావాలి, పాటలు కావాలి, పువ్వులు కావాలి, నవ్వులు కావాలి. ఇవన్నీ భద్రత కొరకు కాదు. సుఖం కొరకు. కనుక ఇవి 'అర్థం' అనే పురుషార్థం క్రిందికి రావు. సుఖానికి సంబంధించిన 'కామం' అనే పురుషార్థం క్రిందికి వస్తాయి.

కామ పురుషార్థంలో కూడా పశుపక్ష్యాదులు మానవుల లాగే వర్తిస్తున్నాయి. వాటికీ సుఖాలు, వినోదాలు ఉన్నాయి. కోతి ఆడుతుంది. కోయిల పాడుతుంది. నెమలి నాట్యం చేస్తుంది. నక్క ఈల వేస్తుంది. పడుకోవడానికి పక్షి మెత్తని గూడు నిర్మించు కుంటుంది. వాటికీ మన లాగే ఆట లున్నాయి. పాట లున్నాయి. అనుకున్నవి జరగ నపుడు, అనుకోనివి జరిగి నపుడు కలత లున్నాయి. కళ్ళల్లో నీళ్ళున్నాయి.

సుఖా న్నిస్తుందని ప్రాణులు, మానవులు 'కామ' పురుషార్థాన్ని ఆశ్రయిస్తారు. కానీ, అక్కడ కూడా మనిషికి నిరాశే ఎదు రవుతోంది. సుఖాన్నిచ్చే వస్తువు ఎప్పుడూ సుఖాన్నిచ్చే స్థితిలో ఉండదు. అలాగే ఒక వస్తువులో, ఒక విషయంతో ఒక సమయంలో సుఖపడిన వ్యక్తి, అదే వస్తువుతో, అదే విషయంతో అన్ని కాలాలలో సుఖపడలేక పోతున్నాడు. ఈ దృశ్యమాన జగత్తులో సుఖ స్థానాలన్నీ క్షర మయ్యేవే. క్షయ మయ్యేవే. ఏది సుఖ హేతువో ఎంతకూ మనిషికి అంతు పట్టడం లేదు. ఈ విధంగా 'కామం' అనే పురుషార్థం పరమార్థం కాలేక పోతోంది.

ధర్మం

ధర్మ మనే పురుషార్థంలో నైతిక మైన అవగాహన ఉంది. ధార్మిక చింతనము చోటు చేసుకొని ఉంది. ఇది వివేకానికి సంబంధించిన విషయం. విచారించే బుద్ధి కరువై, కేవలం సహజాతాలపై ఆధారపడి జీవించే జంతుజాలము ఈ ధర్మ పురుషార్థం వద్దకు చేర లేవు. ఇది కేవలం వివేకవంతు లైన మానవులకే సంబంధించిన పురుషార్థము. మొదటి రెండు పురుషార్థాలైన అర్థకామాలను సాధించు కోవడంలో మనిషి సన్మార్గం లోనే చరించాలి. ఋజుమార్గం లోనే పయనించాలి. ఇదే ధర్మజీవనము. చతుర్విధ పురుషార్థాలలో మూడవ పురుషార్థము.

నా విషయంలో ఇతరులు ఎలా ఉండాలని భావిస్తానో, నేను ఇతరుల విషయంలో అలాగే ఉండాలి. నా విషయంలో ఇతరులు ఎలా ప్రవర్తించ కూడదని నేను ఆశిస్తానో, నేను ఇతరుల విషయంలో అలా ప్రవర్తించకుండా జీవించాలి. ఇదే ధర్మస్పృహ. ధర్మమార్గము. ధర్మాన్ని ఎట్టి పరిస్థితుల లోను మానవులు అతిక్రమించ కూడదు.

దారి తప్పిన వారిని శిక్షించేందుకు, లేదా సంస్కరించేందుకు చట్టా లున్నాయి. దారి తప్పిన మనిషి చట్టాన్ని కూడా తప్పించుకొనే ప్రయత్నం చేస్తాడు. మనిషి చట్టం కళ్ళు కప్పి తప్పించు కోవచ్చు. కానీ, ధర్మం, దైవం కళ్ళు కప్పలేడు అంటూ మతం రంగ ప్రవేశం చేస్తుంది.

మానవులు ప్రపంచంలో స్థూలంగా కర్మలను ఆచరిస్తారు. కర్మాచరణానికి ముందు కర్మ చేయాలి అనే భావం మనస్సులో ఉంటుంది. భావం అంకురించనిదే కర్మ ఆచరింప బడదు. భావము కూడా కర్మే. మానస కర్మ. స్థూల కర్మకు స్థూల ఫలితం ఎలా ఉంటుందో, భావన అనే సూక్ష్మ కర్మకు సూక్ష్మ ఫలితం ఉంటుంది. ఈ సూక్ష్మ ఫలితాలే పాపపుణ్యాలు.

కర్మలు మానవాధీనాలు. ఫలితాలు దైవాధీనాలు. చట్టాన్ని మనిషి తప్పించు కోవచ్చు. కాని, పాపాన్ని తప్పించుకో లేడు. మానవ నిర్మితమైన చట్టం మనిషికి న్యాయం చేయక పోవచ్చు. కానీ పుణ్యఫలం అతని కొరకు నిరీక్షిస్తూనే ఉంటుంది.

ధర్మం పవిత్రమైంది. ధర్మం దైవానికి ప్రతిరూపము. అర్థకామాలను వాంఛించే వారు ధర్మబద్ధంగా జీవించడం అలవరచు కోవాలి. ధర్మంతో కూడిన కామం, ధర్మబద్ధమైన అర్థం సుఖశాంతుల్ని పెంపొందిస్తాయి.

ధర్మాఽ విరుద్ధో భూతేషు
కామోఽ స్మి భరతర్షభ! - అర్జునా! ధర్మానికి విరుద్ధము కాని కామము నేనే అని గీతాచార్యుడు గీత - విజ్ఞాన యోగంలో చెబుతాడు.

ధర్మము అమృతము వంటిది. అది బ్రతుకుకు జీవం పోసి బ్రతికిస్తుంది. అధర్మం విషం లాంటిది. అది బ్రతుకును విషతుల్యం చేసి అంతం చేస్తుంది.

దుర్యోధనునికి రాజ్యం కావాలి. ఆ మాట కొస్తే, ధర్మరాజుకి రాజ్యం అవసరం లేదా? అదే వాస్తవ మైతే, కురుక్షేత్రం రణరంగ మయ్యే దేనా? రాజ్యం ఇద్దరికీ కావాలి. రాజ్య సుఖాలు కూడా ఇద్దరికీ కావాలి.

'కావాలి' అనే కాంక్ష ఇద్దరిలో ఉంది. కానీ, అదేదో, ధర్మబద్ధం గానే ప్రాప్తించాలి అంటాడు ధర్మరాజు. అధర్మంతో నైనా సరే ప్రాప్తించడమే ముఖ్యం అనుకుంటాడు దుర్యోధనుడు.

అధర్మంతో చరించిన దుర్యోధనుడు తాత్కాలికంగా సుఖించినా, చివరికి దుర్గతిని పొంది శాశ్వతంగా అపకీర్తి పాలయ్యాడు.

ధర్మమార్గాన చరించిన ధర్మరాజు, తాత్కాలికంగా వ్యథ చెందినా, చివరికి సద్గతిని పొంది శాశ్వతంగా కీర్తి మంతుడై శోభించాడు.

అధర్మ పరుడైన దుర్యోధనుణ్ణి అపజయం వాటేసుకుంది
ధర్మమూర్తి యైన ధర్మరాజును విజయం వరించింది.

యతో ధర్మః తతో కృష్ణః
యతో కృష్ణః తతో జయః - ధర్మ మెక్కడ ఉంటుందో దైవం అక్కడే ఉంటుంది. దైవం ఎక్కడ ఉంటుందో, జయం అక్కడే ఉంటుంది అని మహాభారత సూక్తి. వేదవ్యాస మహార్షోక్తి. మహాత్ము లందరికీ దివ్యస్ఫూర్తి.

ఇంత వరకు మనం చెప్పుకున్న మూడు పురుషార్థాలలో అగ్రస్థానము ధర్మానిదే. ద్వితీయ స్థానం అర్థం కాగా, చివరిది కామం. అందుచేత ధర్మార్థకామాలు అంటాము. అవి త్రివర్గములు.

సాధారణంగా ఈ మూడు పురుషార్థాలే ఎక్కువగా మానవుల్ని ఆకర్షిస్తూ ఉంటాయి. మానవులు కూడా ఎక్కువ శాతం ఈ మూడిటినే అనుసరిస్తూ ఉంటారు.

ఇక నాల్గవ పురుషార్థము మోక్షము. దీనిని వాంఛించే వాడు ముముక్షువు.

ఇది చివరి పురుషార్థము. మోక్ష రూపమైంది. దీనిని అందరూ ఆశ్రయించ లేరు. ధర్మార్థ కామాలలో దాగి ఉన్న పరిమితాలను అర్థం చేసుకున్న వారే పరమ పురుషార్థమైన మోక్షాన్ని ఆశిస్తారు.

కేవలం ధర్మార్థ కామాల పరిధిలో మనిషి సంతృప్తి చెంద లేడు. అతని సమస్య లౌకిక మైంది కాదు. పారమార్థికమై ఉంది. అసంతృప్తిని భరించే స్థితిలో ఏ వ్యక్తీ లేడు. పరిమితాలను సహించే స్థితిలో ఏ మనిషీ లేడు. అభావాన్ని అంగీకరించ లేడు. అజ్ఞానాన్ని భరించ లేడు. దుఃఖాన్ని సహించ లేడు. సర్వానర్థాల నుండి విడిపడా లనేదే అతని కోరిక. ఈ కోర్కెను తీర్చే శక్తి ధర్మార్థ కామాలకు లేదు. ఈ సత్యం అర్థమైన వెంటనే వ్యక్తి నాల్గవ పురుషార్థం వైపు తిరుగుతాడు. అదే మోక్షం. సర్వబంధ వినిర్ముక్త స్వరూపం.

మోక్షం

మోక్ష మనేది సహజమైన స్వేచ్ఛ. అందరూ కోరుకునే విముక్తి. అందరూ వాంఛించేది ఇదే అయినా, కొందరికి మాత్రమే ఈ విషయం తెలుసు. అయిష్టమైన దానిని ఎవ్వరూ భరించ లేరు. పంజరంలో ఉంచితే పక్షి కూడా యాతన ననుభవిస్తుంది. బయట పడాలని తపన చెందుతుంది. విడుదల కావాలని గిల గిల తన్ను కుంటుంది. పంజరంలో ఉండటం బంధం. విడుదల కావటం మోక్షం.

కారాగృహంలో బంధింప బడిన ఖైది ఏం కోరుకుంటాడు? అతనికి చాలా అవసరాలు ఉండొచ్చు. కానీ అతడి ముఖ్యావసరం, అతడు వాంఛించే ప్రధాన ప్రయోజనం విడుదల మాత్రమే. అదే విముక్తి. అదే మోక్షము.

ఆత్మానం పాశేభ్యః మోచయతీతి మోక్షః

జీవుని బంధము నుండి విడిపించేది ఏదో, అదే మోక్షము.

బంధము నుండి విడిపడాలి అనే వాంఛ అందరిలో ఉంది. అదే అందరిలో ప్రధాన వాంఛ. జీవు లందరూ ఆశించే ముఖ్య ప్రయోజనం అదే. అందుకే అది పరమ పురుషార్థ మైంది.

ఇంతకీ, మోక్ష మంటే పొందడమా? విడి పడటమా? అనే ప్రశ్న ఈ దశలో ఉదయిస్తుంది. నిజమే. పొందినట్లే అనిపిస్తున్నా, వాస్తవానికి పోగొట్టుకున్నట్లే ఉంది. ఖైది స్వేచ్ఛను పొందినాడు అంటాము. కానీ, యథార్థానికి అతడు బంధము నుండి విడి పడ్డాడు. అదే విముక్తి. మోక్షం కూడా అలాగే కనిపిస్తూ ఉంది.

బంధము ఏదో కాదు. దుఃఖాన్ని కలిగించేది ఏదైనా బంధమే. అందుకనే, బంధాన్ని ఎవ్వరూ భరించ లేరు. దుఃఖాన్ని కలిగించే బంధము నుండి విడి పడాలని కోరుకుంటారు. అదే మోక్షేచ్ఛ. విముక్తిని అభిలషించే ప్రగాఢ వాంఛ. దుఃఖం నుండి, అసంతృప్తి నుండి శాశ్వతంగా విడి పడాలనే ఆశ. ఏకైక ఆకాంక్ష.

దుఃఖాదీనాం మోక్షణం అవసానం మోక్షః

దుఃఖాదుల యొక్క వినాశమే మోక్షము.

దుఃఖాన్ని కలిగించేది బంధమైతే, సుఖాన్ని కలిగించేది మోక్షము. అదే బంధ విముక్తి. అసంతృప్తి బంధమైతే, అసంతృప్తి నుండి శాశ్వతంగా విడిపించి నిత్యతృప్తిని ప్రసాదించేది మోక్షము. అదే అందరూ ఆశించేది.

తృప్తః భవిష్యామి

నేను తృప్తిని పొందాలి. తృప్తుడనై ఉండాలి. ఇదే అందరి అభిలాష. కానీ, నేను తృప్తి చెందాలి అని ఎవరైతే అంటున్నారో, వారు ఎవరైనా సరే, ప్రస్తుతం అసంతృప్తిలో ఉన్నారని అర్థము. అంతేకాదు. అసంతృప్తిని భరించ లేక దాని నుండి విముక్తిని పొందాలని కోరుకుంటున్నారని భావం.

అసంతృప్తి వలన కలిగే దుఃఖాన్ని మనిషి భరించలేక పోతున్నాడు. ఇదే బంధము. దాని నుండి విడుదల పొందాలని యత్నిస్తున్నాడు. అదే మోక్షము.

అసంతృప్తి

మనిషికి ఎన్ని ఉన్నా, ఎంత ఉన్నా, ఎందరున్నా, వాటితో పాటు ఏదో లేదు అనేది కూడా ఉంటుంది. అదే అసంతృప్తి. ఆంతర్యంలో ఏదో అసౌకర్యం. అసంపూర్ణత. దానిని హాయిగా, ఆనందంగా భరించ గలిగితే ఏ సమస్య ఉండదు. అసంతృప్తిని మనిషి క్షణ కాలం కూడా భరించలేక పోతున్నాడు. కారాగృహం నుండి విడుదల పొందాలని ఖైదీ ఎలా తపిస్తున్నాడో, అసంతృప్తి నుండి, దుఃఖం నుండి విడిపడాలని ప్రతి మనిషి అలా పరితపిస్తున్నాడు.

కిం అస్మాభిః దీనైః కరణీయం?

ఈ దీన స్థితి నుండి బయట పడటానికి మేము ఏమి చేయాలి? అని అందరూ ఆవేదన చెందు తున్నారు. ఈ వెలితి తొలగే మార్గ మేదో తెలియక అలమటిస్తున్నారు.

ఇదొక విచిత్రమైన సమస్య. వింత సమస్య. తృప్తి ఎక్కడుందో అర్థం గాని సమస్య. ఎవరూ ఎవరినీ తృప్తి పరచలేని ఈ జగత్తులో తృప్తిని పొందాలని జల్లెడ చేత పట్టుకొని గాలిస్తున్నాం. ప్రయత్నాలు విస్తరిస్తున్నాయే గాని ఫలితాలు వెలుగు చూడటం లేదు. వెలితి . . వెలితి . . వెలితి. ఎప్పుడూ ఇదే పరిస్థితి. ఎవరి కైనా ఇదే గతి.

ఏది ఉన్నా వెలితే. ఏది లేకపోయినా వెలితే.
ఎవరు ఉన్నా వెలితే. ఎవరు లేకపోయినా వెలితే.
ఇక్కడున్నా వెలితే. అక్కడున్నా వెలితే.
ఇప్పుడైనా వెలితే. అప్పుడైనా వెలితే.
అనుకూలంలో వెలితే. ప్రతికూలంలో వెలితే.

ప్రయత్నించి లేని దానిని పొందుతాము. లేని దానిని పొందుతామే గాని 'లేదు' అనే దానిని పోగొట్టుకోలేము. 'లేదు' అనేదే మనస్సులో ఉన్నపుడు, ఏది ఉండి మాత్రం ఏమి ప్రయోజనం? అందుకే అందరూ అసంతృప్తితో అలమటిస్తూ ఉన్నారు. భాగ్యా లొస్తే తృప్తిగా జీవించ వచ్చు అనుకుంటారు పేదలు. బాధలు తీరితే సుఖంగా బ్రతకవచ్చు అనుకుంటారు ధనికులు. ఎవరికి ఏదుందో, ఏది లేదో తెలియదు గాని, అసంతృప్తి మాత్రం అందరికీ ఉంది. ఆవేదన అందరికీ ఉంది. అశాంతి అందరికీ ఉంది.

సుఖప్రాప్తి

ఇష్టప్రాప్తి అనిష్ట నివారణ చికీర్షా
స్వాభావికా సర్వ ప్రాణిషు దృష్టత్వాత్

ఇష్టమైన దానిని పొందడము, అయిష్టమైన దానిని విడిచి పెట్టడము అనే కోరిక సర్వ ప్రాణులలో సహజంగా కనిపిస్తూ ఉంటుంది. ఇష్టమైన దేదో అది సుఖ మని, అయిష్ట మైనది అసుఖం అని అందరూ భావిస్తుంటారు.

మనం ఈ ప్రపంచంలో దేనిని ఆశించినా, అది సుఖ మని భావించి దానిని కోరుకోవడం లేదు. అది సుఖ హేతువు అని భావించి దానిని పొందు తున్నాము. ఏది సుఖహేతువు అని భావించి మనం ఆశించి పొందుతామో, అది సుఖ కారణం కాదు అని తెలియగానే ఆ క్షణం లోనే దానిని త్యజిస్తాము.

సుఖం అనేది ఒక వస్తువు కాదు. సుఖ మనేది వస్తువే అయితే, ఆ వస్తువు అందరికీ సుఖా న్నిచ్చేదై ఉండాలి. అలాంటి వస్తు వేదీ ప్రపంచంలో గోచరించడం లేదు.

సుఖ మనేది కాలం కాదు. ప్రపంచంలో సమయాలు తెలుస్తున్నాయే గాని, ఏవి సుఖ సమయాలో తెలియడం లేదు. ఆనంద కాలాలు ఎంత అన్వేషించినా అంతు పట్టడం లేదు. రాహువు ఎక్కడున్నాడో తెలుస్తున్నాడు కనుక రాహుకాలం ఉంది. సుఖ మెక్కడుందో తెలియడం లేదు కనుక సుఖ కాలం తెలిసి రావడం లేదు.

సుఖ మనేది ప్రదేశమూ కాదు. సుఖం ఇక్కడ లేక పోవచ్చు. అలాగని, అక్కడుంది అని చెప్పడానికి ఆధారాలు లేవు. ఎక్కడి కెళ్ళినా, ఏ ప్రదేశాన్ని చేరినా అన్నీ ఎండమావులే. అందుకనే ఆరాధనాస్థలాలు ఆదాయ కేంద్రాలుగా మారిపోతూ ఉంటే, ఆశ్రమ ప్రదేశాలు ఆవేదనా నిలయాలుగా గోచరిస్తున్నాయి.

సుఖ మనేది సన్నివేశమూ కాదు. ప్రపంచంలో సంఘటనలు, సన్నివేశాలు ఉన్నాయి. సుఖ సన్నివేశాలు లేవు. ఒకే సన్నివేశం కొందరికి సుఖాన్ని, కొందరికి దుఃఖాన్ని పంచడానికి కూడా కారణం సుఖం సన్నివేశానికి సంబంధించింది కాక పోవటమే.

ఇంతకీ ఏది సుఖం? ఎక్కడుంది?
ఏది సుఖ కారణం? అదెక్కడుంది?



ప్రయత్నాలు - ఫలితాలు

అన్తవత్తు ఫలం తేషాం
తద్భవ త్యల్ప మేధసామ్

వివేకం అల్పంగా ఉండేవారు
పొందే ఫలం కూడా స్వల్పం గానే ఉంటుంది.

ప్రియమైన వస్తువులో సుఖం ఉంటుంది. కానీ, ఏది మనకు ప్రియవస్తువో మనకే అర్థం కావడం లేదు. ఇక సుఖపడే దేముంటుంది? ఒక కాలంలో ప్రియ మైనది మరొక కాలంలో ప్రియంగా లేదు. ఒక ప్రదేశంలో ప్రియంగా అగుపించింది, మరొక ప్రదేశంలో ప్రియంగా అగుపించదు.

యత్నించి, శ్రమించి మనం ఏవో ఏవో పొందు తున్నాము. ప్రయత్నించి, పరిశ్రమించి ఏవో ఏవో పోగొట్టు కుంటున్నాము. మన యత్నంలో ఏదైనా రావచ్చు; సుఖం మాత్రం రాదు. మన ప్రయత్నం వల్ల ఏదైనా పోవచ్చు; దుఃఖం మాత్రం పోదు.

ఒకవేళ ఎక్కడైనా, ఎప్పుడైనా సుఖం కొద్దో గొప్పో ప్రాప్తించినా, అది దుఃఖమిశ్రితం గానే ఉంటుంది. దుఃఖాలు తెలియని సుఖాలు ప్రపంచంలో లేవు. నష్టాలు తెలియని లాభాలు కాగడా పెట్టి వెతికినా కనిపించవు.

నిజం చెప్పాలంటే, లాభాల ముసుగులో
వచ్చే వన్నీ నష్టాలే.
రాబట్టుకొనే వన్నీ పోగొట్టు కొనేందుకే
వాటేసుకునే వన్నీ కాటేసి పోయేందుకే.
వచ్చేవి ఏవయినా పోయేందుకే వస్తాయి
ఉన్నవి ఏవయినా పోయేందుకే ఉంటాయి.

అన్నీ పోతున్నాయి. అందరూ పోతున్నారు. తల్లిదండ్రులు పోతున్నారు. బిడ్డలు పోతున్నారు. భార్యలు భర్తల్ని పోగొట్టు కుంటున్నారు. భర్తలు భార్యల్ని పోగొట్టు కుంటున్నారు. ఉద్యోగాలు ఊడి పోతున్నాయి.

పదవులు పారి పోతున్నాయి. ధనం ఖర్చై పోతూ ఉంది. ఆరోగ్యం క్షీణించి పోతూ ఉంది. పళ్ళు ఊడి పోతున్నాయి. వెంట్రుకలు రాలి పోతున్నాయి. చూపు మారి పోతోంది. వినికిడి జారి పోతోంది. ఆయుష్షు కారి పోతోంది.

పరిశ్రమించి పొందిన వాటిని
ఎంత శ్రమించినా నిలుపుకోలేక పోతున్నాము.

ప్రయత్నించి పోగొట్టుకున్న వాటిని
తిరిగి రాకుండా ఆపు చేయలే కున్నాము.

పొందినవి సుఖాలే అయితే, అవి ఉన్నప్పుడు మనం సుఖంగా ఉండాలి. పోయినవి దుఃఖాలే అయితే, అవి పోగానే దుఃఖం కూడా దూరం కావాలి. కానీ, రెండూ జరగడం లేదు.

మన ప్రయత్నాలతో ఎలాగూ సుఖపడలేక పోతున్నాం. పోనీ, ఇతరుల కారణంగా నైనా సుఖపడే అవకాశం ఉందా? ఇది మరీ దారుణం! మన సుఖం పరులపై ఆధారపడి ఉండే దయితే, మన సుఖాన్ని నిర్ణయించే వారు పరు లవుతారు. అదే నిజమైతే, మనం సుఖపడట మనేది కుందేటి కొమ్మే.



ప్రియ వస్తువు - సుఖ స్థానం

అస్మాకం అప్రత్యక్ష మపి
చిరంతనానాం ప్రత్యక్షమ్

మనకు స్పష్టం కాని సత్యము
మన పూర్వీకులకు సుస్పష్టము.
ఇది శంకలకు తావు లేని బాట
కారణం, ఇది శ్రీ ఆదిశంకరుల మాట.

ఏది ప్రియమో, ఏది సుఖమో, ఏది ప్రియ వస్తువో, ఏది సుఖ స్థానమో తెలియక తికమక పడుతున్నాం. 'మన' అనే దానిలో సుఖ ముందా? మనలో సుఖముందా? మనమే సుఖమా? లేక సుఖమే మనమా?

'నేను ఇప్పుడు సుఖంగా లేను' అంటే, ఈ పరిస్థితికి ముందు సుఖంగా ఉన్నాను అని భావము.

'నేను ఇప్పుడు సుఖంగా ఉన్నాను' అంటే, ఈ పరిస్థితికి ముందు సుఖంగా లేను, సుఖాన్ని ఆశించే వాడుగా ఉన్నాను అని అర్థం.

దీనిని బట్టి చూస్తే, 'నేను సుఖ పడుతున్నాను', 'నేను సుఖ పడ్డాను' అనే వాక్యాలు సుఖం చుట్టు తిరుగుతూ ఉన్నాయే గాని నిత్యసుఖానికి సంబంధించి మాత్రం లేవు. సుఖస్థానం తెలిసినవి కానే కావు.

ఒక కారణంగా, ఒక సమయంలో కలిగే సుఖం నిత్యసుఖం కాదు. దానిని నైమిత్తిక సుఖం అంటారు. సుఖానికి నిమిత్తం ఉంది కనుక, నిమిత్తం దూరమైతే సుఖం జారి పోతుంది. అలాంటి సుఖం కూడా సుఖమే. కానీ, అది అల్పసుఖం. అనిత్య సుఖం. నిత్యసుఖం మాత్రం కానే కాదు.

నిమిత్తాపాయే నైమిత్తి కాపాయః
ఛత్రాపాయే ఛాయాపాయః

సుఖ కారణం పోతే సుఖం పోతుంది.
గొడుగు దూరమైతే నీడ దూర మవుతుంది.

లేకుండా వచ్చి కలిసేది, ఉండి లేకుండా పోయేది నిత్యసుఖం కాదు. అనిత్య సుఖ మేదైనా, అప్రియంగా మారేదే. అప్రియ మైనది నిత్య సుఖస్థానం కాలేదు. కనుక నిత్య సుఖము, నిత్య ప్రియత్వము అనే మోక్షము ప్రయత్నాల పరిధి లోనిది కాదు. కర్మఫలం కాబోదు.

కర్తవ్యేన సాధ్యశ్చేత్
మోక్షః అభ్యుపగమ్యతే
అనిత్య ఏవస్యాత్ !

కర్మ ద్వారా సాధించే ఫలితమే మోక్ష మయ్యేటట్లైతే, అట్టి మోక్షము కూడా అనిత్యమే అవుతుంది అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరులు.

ఇంతకీ, ఏది ప్రియవస్తువు?
ఎక్కడ సుఖ స్థానము?

కర్మఫలంగా ప్రాప్తించేది ఏదీ ప్రియవస్తువు కాదు. పరిమితంగా ఉండేది ఏదీ సుఖస్థానము కాదు.

ప్రియవస్తువు ఏదో అది ఏ పరిస్థితుల లోను అప్రియం కాకూడదు. అప్పుడే అది ప్రియవస్తువు అవుతుంది.

అప్రియంగా మారకుండా సదా ప్రియంగా ఉండేది ఏదైనా ఉందేమో ఆలోచించండి. దానిని కనిపెట్ట గలిగితే అదే నిత్యసుఖం కనుక, సుఖస్థానాన్ని కూడా కనిపెట్టిన వాళ్ళ మవుతాము.

ఎవరికి ఏది ప్రియమో, ఏది అప్రియమో నాకు తెలియదు. నీకు ఏది ఇష్టమో, ఏది అయిష్టమో నేను చెప్పలేను. నీకు నీవు సదా ఇష్టమే అని మాత్రం చెప్పగలను. నీకు నీవు ఎప్పుడూ అయిష్టుడివి కావు అని భేరీ మ్రోగించి మరీ చెప్పగలను. నీకు నీవు ఎలా ఇష్టమో, నాకు నేను అలా ఇష్టము. నీకు నీవు ఎలా ప్రియమో, నాకు నేను అలా ప్రియము.

కదాచిన్నాహం అప్రియః

నాకు నేను ఎప్పుడూ అప్రియం కాను.

ఇంకే ముంది? దొరికి పోయింది చిరునామా. ప్రియవస్తువు ఏదో తెలిసి పోయింది. సుఖ స్థాన మెక్కడో అర్థమై పోయింది.

ప్రియవస్తువు ఏదో కాదు, నీవే. సుఖస్థానం ఎక్కడో లేదు, నీవే. అది నీవే (తత్త్వమసి) ప్రియవస్తువు నీవే అని తెలియక పోవడం చేత, అది ఎక్కడో ఉందని స్తనశల్య పరీక్ష చేస్తూ ప్రపంచ మంతా గాలించి మరీ అన్వేషించావు.

ప్రియత్వము అనేది వస్తువుకు సంబంధించింది కాదు. సుఖస్థాన మనేది దృశ్య ప్రపంచం కానే కాదు అని తేలి పోయింది. దృశ్య విషయ మంతా నిషేధింప బడిన తరువాత, ఇక ప్రియవస్తువుగా ఒక్కటే మిగిలింది. అదే నీవు. విషయి. నీవే ప్రియ వస్తువు. నీవు నీకు ప్రియం కనుకనే ఏవైనా నీకు ప్రియంగా గోచరిస్తున్నాయి.

ఆత్మ నస్తు కామాయ
సర్వం ప్రియం భవతి

ఏది నీకు ప్రియంగా గోచరించినా ప్రియత్వానికి హేతువు నీవే. ఇది అర్థమైతే, ఇంకెక్కడి అసంతృప్తి? అర్థం కాకపోతే ఎలా వస్తుంది తృప్తి?

తెలియనంత వరకు లేనట్లే ఉంది. తెలియగానే లేని దెప్పుడు? అని ఆశ్చర్యం కలుగుతోంది.

చరణము : కట్టినాను నీ కొరకే
పూలగూడు నా మదిలో
వచ్చెద వని ఎదురు చూచితిని
వచ్చి ఉంటివని ఎరుగ నైతిని

పల్లవి : నీ చరిత పాడుకోనా!
మనసార వేడుకోనా!

అనుపల్లవి : నా శ్రమలు తీరిపోగా
తొలి భ్రమలు పారిపోగా ॥ నీ చరిత ॥

అని చైతన్య రవళి నినదించింది ఇక్కడే. అక్కడే బ్రహ్మమును లేదా మోక్షమును పొందాలి అన్నది ఉపనిషత్తు (అత్ర బ్రహ్మ సమశ్నుతే).

ఉన్నది - తెలియనిది

ఆనందాబ్ధిః యత్పరః
సోఽహమస్మి

'ఏది ఆనంద సాగరమో
అది నేనే' అన్నది ఉపనిషత్తు.

ఆనంద స్వరూపమైన ఆత్మయే సుఖహేతువు అనేది తెలియని కారణంగా, అనాత్మ విషయాలైన వస్తువులను సుఖహేతువులుగా భావించి వాటిని ప్రియ వస్తువులుగా స్వీకరిస్తున్నాం. ప్రియం గాని వాటిని ప్రియంగా భావించడానికి కారణము ప్రియ వస్తువైన ఆత్మ తెలియక పోవడమే. ఆత్మ తెలియడం లేదు అంటే, ఆత్మ లేదని అర్థమా? లేనిది అయితే, తెలియడం లేదు అని ఎలా చెప్పగలం? కనుక, ఆత్మ ఉన్నదే; తెలియకుండా ఉన్నది.

ఉండి తెలియక పోవడం అజ్ఞానము. అదే బంధము.
ఉన్నది ఉన్నట్లు తెలియడం జ్ఞానము. అదే మోక్షము.
తెలిసీ తెలియని తనము ముముక్షుత్వము. మోక్షేచ్ఛకు కారణము.

నీవే ఆత్మ. నీవే సుఖం. నీవు సుఖించ డానికి ఏదీ అవసరం లేదు. కోరికలు తీర నవసరం లేదు. కోరికలు తీరడం వల్ల కాదు సుఖం కలిగేది; కోరికలు లేని వాడుగా ఉండటం వల్ల.

కోరిక మనస్సులో కదలక ముందు నువ్వు సుఖం గానే ఉన్నావు. కోరిక తీరిన తరువాత మళ్ళీ సుఖంగా కనిపిస్తున్నావు. ఎక్కడ కోరిక లేకుండా నీవు నీవుగా ఉన్నావో, అక్కడే నువ్వు సుఖంగా ఉన్నావు. నీవు సుఖరూప మైన ఆత్మవు అనడానికి ఇదొక ఆధారము.

అలాగే, గాఢనిద్రలో నువ్వు సుఖానుభూతిలో ఉన్నావు. కారణ మేమిటి? అక్కడ కోరిక తీరడం కాదు; కోరిక లేకపోవడం. అమనస్కం కావడం. నీ స్వరూపాన్ని, స్వరూపానందాన్ని భగ్నం చేసే కోరికలు, సంకల్పాలు లేనపుడు నీవు సుఖానుభూతిని పొందుతున్నావు. అదే స్వరూపానుభూతి. అది ఉన్నదే కాని లేనిది కాదు. ఉన్నదే కాని, ఉన్నట్లు తెలియకుండా ఉంది. కనుక ఏదో లేకపోవడం బంధ కారణము కాదు. ఉన్నది తెలియక పోవడమే బంధ హేతువు. తెలియక పోవడం అజ్ఞానము. అజ్ఞానమే బంధము. అజ్ఞానము బంధ మైనందున జ్ఞానమే మోక్షము.

కనుక, సమస్య ప్రపంచానికి సంబంధించింది కాదు. సమస్య వ్యక్తికి సంబంధించింది. వ్యక్తి మీదనే కేంద్రీకృతమై ఉంది. తానేమిటో తనకు తెలియక పోవడము సమస్య. అదే బంధము. తానేమిటో తనకు తెలియడమే పరిష్కారము. అదే మోక్షము.

మనిషికి సమస్య లేదు.
మనిషే నిజానికి సమస్య.

సమస్య ఎక్కడుందో
పరిష్కారం అక్కడే ఉంది

పరిష్కార మేమిటో అర్థం కానంత వరకు సమస్య సమస్య గానే ఉంటుంది. వాస్తవానికి పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదు. సమస్య అనేది ఉంది అంటే, దానికి సంబంధించిన పరిష్కారము కూడా ఉంటుంది. అదేమిటో మనకు తెలియ నపుడు సమస్య ఒక్కటే ఉంటుంది. తెలిసిన మరుక్షణాన సమస్య, పరిష్కారము రెండూ లేకుండా పోతాయి.

సమస్యను బట్టే పరిష్కారం ఉంటుంది. సమస్య యొక్క స్వభావాన్ని బట్టే పరిష్కారము యొక్క స్వరూపము తెలుస్తూ ఉంటుంది.

కొన్ని సమస్యలకు పరిష్కారాలు సమస్యలకు బాహ్యంలో ఉంటాయి. కొన్ని సమస్యలకు పరిష్కారాలు సమస్యల లోనే దాగి ఉంటాయి.

దప్పిక సమస్యగా ఉందనుకోండి. దాహం తీర్చుకోవడమే పరిష్కారము. దప్పిక మనలో ఉంది. కానీ, పరిష్కారం బాహ్యంలో ఉంది. దాహాన్ని తీర్చే నీళ్ళు మనలో లేవు. మనకు బాహ్యంలో ఉన్నాయి. ఇదొక రకమైన సమస్యా పరిష్కారము.

మరొక సమస్య ఉంది. ఆ సమస్యకు పరిష్కారం బాహ్యంలో కాకుండా సమస్య లోనే ముడిపడి ఉంది. ముడి ఉన్నంత వరకు సమస్య ఉంటుంది. ముడి విప్పితే పరిష్కారం ఉంటుంది. సమస్య అదృశ్యం అవుతుంది. సందేహం అంతటితో అంత మౌతుంది.

భిద్యతే హృదయ గ్రంథిః
ఛిద్యన్తే సర్వ సంశయాః

హృదయ ముడి విడి పోతే
సంశయాలు పారి పోతాయి.
ముడి ఉందని చెప్పిన ముండకమే
ముడిని విప్పి లేదని చూపింది.

పొడుపు కథలలో చిక్కుముడులు వేసి, సరదాగా సమస్యలను పరిష్కరించుకొనే ప్రక్రియ మనకు తెలుసు. వాటిలో సమస్య లోనే పరిష్కారం నిగూఢంగా ఉంటుంది. విప్పితేనే గుట్టు బయట పడుతుంది.

కా శీతల వాహినీ గంగా?

గంగ ఎక్కడ ప్రవహిస్తూ ఉంది?
అనేది ప్రశ్న రూపంలో సమస్య.

కాశీ తల వాహినీ గంగా!

గంగ కాశిలో ప్రవహిస్తూ ఉంది
అనేది సమాధాన రూపంలో పరిష్కారము.

ఇంతకీ, మన సమస్యకు పరిష్కారం బాహ్యంలో ఉందా? లేక, అది కేవలం అంతరాలాప మేనా?

మన సమస్య బాహ్యానికి సంబంధించింది కాదు. కనుక, దానికి పరిష్కారము బాహ్యంలో లేదు. బంధము అనేది వ్యక్తిపై కేంద్రీకృతమై ఉంది. కనుక ఎక్కడ సమస్య ఉందో, అక్కడే పరిష్కార ముంది.

మనిషికి సమస్య లేదు. మనిషే సమస్య.
మనిషి సమస్యకు మనిషే పరిష్కారము.

తానే సమస్య - తానే పరిష్కారము

చిదంబరంలో నటరాజ స్వామి క్షేత్రపాలకుడు. ఆర్ద్రా దర్శనం చాలా విశిష్టమైన దని అక్కడ భావిస్తారు. ఆర్ద్ర అనేది నక్షత్రము పేరు అని మనకు తెలుసు. ఆర్ద్ర అంటే తడిసింది అని కూడా అర్థము.

ఆర్ద్రాదర్శనము మార్గశీర్షంలో పూర్ణిమ నాడు వస్తుంది. అది మంచు ఎక్కువగా కురిసే సమయం. కనుక చలి అధికంగా ఉంటుంది. చలి అధికంగా ఉండే ఆ రోజు, శివభక్తులు బ్రహ్మముహూర్త కాలంలో స్నానం చేసి, 'శివశివ' అంటూ వెళ్ళి నటరాజస్వామిని దర్శిస్తారు. విశేషమైన ఆర్ద్రా దర్శనంలో పులకరించి పరవశిస్తారు. ఒకవేళ భక్తులు పులకరించకుండానే పరవశించినా, చలి పని గట్టుకొని మరీ వారిని పులకరింప చేస్తుంది.

ఆర్ద్రా దర్శన సందర్భమును పురస్కరించుకొని ఒక కవి చమత్కరించిన అందమైన అద్భుతమైన శ్లోకం ఒకటుంది. ప్రస్తుతం మనం చర్చిస్తున్న 'సమస్య, పరిష్కారము ఒక్కచోటే' అనే అంశాన్ని ఈ శ్లోకం సోదాహరణంగా వర్ణించి వివరిస్తుంది.

శ్లో॥ మౌళౌ గంగా శశాంకౌ కరచరణ తలే శీతలాంగా భుజంగాః
వామే భాగే దయార్ద్ర హిమగిరి దుహితా చందనం సర్వగాత్రే
ఇత్థం శీతం ప్రభూతం కనక సభా నాథ! సోఢుం క్వ శక్తిః?
చిత్తే నిర్వేద తప్తే యది భవతి న తే నిత్య వాసో మదీయే॥

అది పరమేశ్వరుని విభూతి యైన మార్గశీర్షం (మాసానాం మార్గశీర్షోహం - గీత ; 10 వ అ - 35 వ శ్లో). బ్రహ్మ ముహూర్త కాలం. చీకటి తెరలు తొలగ లేదు. మంచు దట్టంగా కురుస్తోంది. చలి పులిలా వణికిస్తోంది. చిదంబరేశ్వరుని దర్శించాలని ఒక భక్తుడు ఆలయం లోకి భక్తితో ప్రవేశించాడు. దుర్భరమైన చలిని భరించలేక పోతున్నాడు. ప్రార్థనా మంత్రాలు ఉచ్చరిస్తూ ఉంటే, పదాలు పైకి వినిపించడం లేదు. పదాల శబ్దాలు కటకట మనే దంత ఘోషల మధ్య మరుగున పడి పోతున్నాయి. ఎలాగో శక్తిని కూడ గట్టుకొని పై శ్లోకాన్ని ఆ భక్తుడు అతి కష్టం మీద పలికాడు. శ్లోకం లోని మొదటి మూడు పాదాలు సమస్యను చక్కగా చూపెడుతూ ఉంటే, నాల్గవ పాదము పరిష్కారాన్ని దర్శింప చేస్తూ ఉంది. అపూర్వము, ఆశ్చర్యకరమైన ఈ శ్లోక భావాన్ని చూద్దాం.

చిదంబర క్షేత్రపాలకుడైన చంద్రమౌళీశ్వర స్వామిని తన హృదయ సింహాసనముపై ఆసీనుణ్ణి చేసి, స్వామిని దర్శిస్తూ కనక సభాపతిని వర్ణించడం ప్రారంభించాడు ఒక భక్తుడు.

పరమేశ్వరా! నీ సిగ జల, పుష్ప శోభతో ప్రకాశిస్తోంది. గంగమ్మ చల్లగా నిన్ను అభిషేకిస్తూ ఉంటే, చంద్రుడు సిగ పువ్వై శోభిస్తున్నాడు **(మౌళౌ గంగా శశాంకౌ).**

నటరాజా! నీ హస్తపాదాలను చల్లని, మెత్తని పాములు ఆభరణాల వలె చుట్టుకొని ఉన్నాయి **(కరచరణ తలే శీతలాంగాః భుజంగాః).**

పార్వతీశా! నీ ఎడమ పార్శ్వ మంతా హిమవంతుని తనయ, దయ గల చల్లని మా తల్లి హైమావతి పెనవేసుకొని ఉంది **(వామే భాగే దయార్ద్ర హిమగిరి దుహితా).**

హే చంద్రచూడా! నీ దేహ మంతా చల్లని చందనపు పూతలే **(చందనం సర్వ గాత్రే).**

హే త్రినేత్రధారీ! సాంబశివా! ప్రభూతమైన ఈ శీతాన్ని ఎలా సహిస్తున్నావు? దుర్భరమైన ఈ చలువను ఓర్చుకొనే శక్తి నీ కెలా వచ్చింది **(ఇత్థం శీతం ప్రభూతం కనక సభానాథ! సోఢుం క్వ శక్తిః)?**

ప్రభో! మహేశ్వరా! తాపాలతో, పరితాపాలతో నిరంతరము సలసల కాగే నా హృదయమే కదా నీకు నిత్య నివాస స్థానము! **(నిత్య తప్తే నిర్వేద తప్తే మదీయ చిత్తే తే నిత్యవాసః).**

భక్తవత్సలా! భవహరా! కాకపోతే, నా హృదయంలో నువ్వు లేకపోతే **(యది న భవతి)** దుర్భరమైన ఆ శీతాన్ని సహించే శక్తి **(సోఢుం శక్తిః)** నీ కెక్కడిది **(క్వ)?**
ఇదీ శ్లోక భావం.

మాసం మార్గశీర్షం. హిమంతో మహి కప్పబడి ఉంది. బాహ్యంలో ప్రభూతమైన చలి. దానికి తోడు సిగపై చల్లని గంగమ్మ. మరో వైపు చలువల చంద్రుడు. ఎంత దుర్భరమైన చలి! అదలా ఉంచితే, కరచరణాలకు చుట్టుకొని ఉన్న చల్లని పాములు కాటు వేయక పోయినా, దానికి ఏ మాత్రం తీసిపోకుండా బుస్సు మనిపిస్తూ ఉన్నాయి. ఇక వామ ఎక్కడుందో చూడండి! వామ భాగంలో చేరి పోయింది. తండ్రి హిమవంతుని తడి నంతా ఒడి గట్టుకొని, కైలాసంలో కుడిపాదము ముందు పెట్టి ప్రవేశించిందే గాని, ఎడమ పార్శ్వ మంతా నేనే నని పెనిమిటిని పెనవేసుకొని అర్ధాంగి శబ్దానికి అర్థం చెప్పింది. ఈ చల్లని మహాశక్తిని ఎలా భరిస్తున్నాడో!

ఇది చాల దన్నట్లు, మధ్యే మధ్యే, పై నున్న ధారాపాత్ర నుండి అప్రయత్నంగా పైన పడుతున్న చల్లని ఉదకము. ఇక అర్చకులు ఊరకుంటారా! ఒడలంతా చందనం పట్టిస్తూ శీతలోపచారాలతో చలించి పోతుంటారు.

ఇంత చలిని ఎవరు భరిస్తారు?
ఇంత శీతాన్ని ఎలా భరిస్తారు? ఇదీ సమస్య. ఇక్కడికి శ్లోకం మూడు పాదాలు పూర్తి అయ్యాయి.

ఏం చెబుతాడు బాహ్యం నుండి చల్లని శివుడు?
లో నుండే అసలు గుట్టును మెల్లగా విప్పుతున్నాడు.



పలికేది గోపన్నే అయినా,
పలికించిన వాడు రామన్నట.
ఇక్కడా అంతే.

గుట్టపై నున్న వాడు గుండె గుహలో గుసగుస మన్నాడు.
గుట్టు వినిన వాడు గుర్తులు పట్టిస్తున్నాడు.

సర్వేశ్వరా! సర్వాత్మా!
నా హృదయం తాపాలకు నిలయము. పరితాపాలకు ఆలయము. నా గుండె అంతా గుబులే. అంతా దుఃఖాగ్నే. మోహ వ్యామోహాల శోకాగ్నే. వాటి మధ్యలో నన్ను ఉద్ధరించేందుకు చేరిపోయావా? **(ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి** - గీత; 18 వ అ - 61 వ శ్లో). మహాదుఃఖంలో సలసల కాగుతున్న నా హృదయంలో చలి కాచుకుంటున్నావా, చల్లని తండ్రీ! కాచుకో! ఇదే నీ చలికి చక్కని పరిష్కారము. నన్ను కాచేందుకు, బ్రోచేందుకు, చల్లగా చూచేందుకు ఏకైక తరుణోపాయము.

అర్థమైందా! దుఃఖ మనే సమస్య ఎక్కడుందో, దానికి పరిష్కారమైన ముక్తేశ్వరుడు కూడా అక్కడే, మూల స్థానేశ్వరుడుగా ఒదిగి ఉన్నాడు. సమస్య ఉన్న చోటే పరిష్కార ముంది. హృదయం లోనే సమస్య. హృదయం లోనే పరిష్కారము.

ఆత్మ - పరమాత్మ

ఆవయో రంతరం న విద్యతే
త్వమే వాహం అహమేవ త్వం

మనిద్దరికీ భేదం లేనే లేదు
నీవే నేను. నేనే నీవు.

పరమాత్మ హృదయం లోనే కాచుకొంటూ ఉన్నాడు. చలి కాచుకొంటూ ఉన్నాడు. నువ్వెక్కడున్నావు? హృదయం లోనే. పరమేశ్వరుడు ఎక్కడున్నాడు? హృదయం లోనే. ఇద్దరూ హృదయం లోనే ఎలా ఉన్నారు? ఒక్కరు గానే ఉన్నారా, లేక ఇద్దరుగా ఉన్నారా? నువ్వు పరమాత్మ కన్నా వేరుగా ఉన్నావా?

పరమాత్మ నీ కన్నా వేరని నువ్వు భావించ వచ్చు. కానీ, నువ్వు తన కన్నా వేరని పరమాత్మ అంగీకరించడు. మనిద్దరికీ **(ఆవయోః)** భేదం లేనే లేదు **(అంతరం న విద్యతే).** నీవే నేను **(త్వమే వాహం).** నేనే నీవు **(అహమేవ త్వం)** అని ఉపనిషద్వాణిని నీకు వినిపిస్తున్నాడు. అదే మహానారాయణోపనిషత్తు.

నారాయణుడు, నరుడు ఒక్క చోటే ఉన్నారు. కృష్ణార్జునులు ఒకే రథంలో ఉన్నారు. జీవేశ్వరు లిరువురూ శరీర మనే రథం లోనే ఉన్నారు **(శరీరం రథ మేవ** - కఠోపనిషత్తు).

నారాయణమూర్తిని వైకుంఠానికి పరిమితం చేసి నువ్వు అవనిపై అలమటించ దానికి సిద్ధ పడవచ్చు. నారాయణమూర్తి నీకు దూరంగా ఉండ లేడు. నువ్వు వైకుంఠం పోలేవు కనుక, ఆయనే వచ్చి నీ హృదయంలో ఒదిగి పోయాడు. కాచుకుంటూ ఉండి పోయాడు. ఎక్కడ నారాయణు డుంటే అదే వైకుంఠము. నిన్ను విడిచి ఉండ లేని నారాయణుడు మనిద్దరికీ అంతరం లేదంటూ నీ ఆంతర్యం లోనే అలరారు తున్నాడు. నారాయణుడు అనంతశయనుడు. నీ హృదయమే పాలకడలి అయింది. అనంతశక్తి స్వరూపుడు నీలో పవ్వళించి ఉన్నాడు. ఇప్పుడు చెప్పు. నువ్వు శక్తిహీనుడవా? బలహీనుడవా? నారాయణుడు నీలో ఉన్నాడు. సర్వశక్తి నీ లోనే ఉంది. అనంతమైన నీలో అనంతశక్తి ఉంది.

అనంత చైతన్యము

నిన్ను నేను ఎత్తుకోలేను. నన్ను ఎత్తుకొని నువ్వు నడవ లేవు. కానీ, ఎంత ఎత్తైన మనిషైనా, ఎన్ని కిలోల బరువున్నా, తనను తాను తేలికగా మోసుకొని పోతూ ఉంటాడు. ఈ శక్తి ఎక్కడిది? అంత పెద్ద దేహాన్ని జీవితాంతం మోసే దెవరు? ఎంత పెద్ద దేహమైనా అనంతశక్తి ముందు అవగింజే.

ఈ అనంతశక్తి చైతన్యము బరువు లెత్తే ఏనుగులో ఉంది. బాధించే దోమ లోనూ ఉంది. ఈదే తిమింగలంలో ఉంది. ఎగిరే ఈగ లోనూ ఉంది. అది చాలా తేలికైంది. అందుకే ఎగర గలుగుతోంది. చాలా బరువైంది కూడా. అందుకే పర్వతంలా కదలకుండా ఉంటుంది. అణువు అదే. మహత్తూ అదే. దీని వైభవాన్నే వేదం వర్ణించింది. దీని ప్రాభవాన్నే ఋషులు కీర్తించారు.

అణోరణీయాన్ మహతో మహీయాన్
ఆత్మస్య జన్తోః నిహితో గుహాయామ్ ।

అణువు కంటే సూక్ష్మమైంది. మహత్తు కంటే మహత్తర మైంది
సమస్త ప్రాణుల హృదయాలలో అదే దాగి ఉంది.

అణువులు జడరూపాలని, దుర్భేద్యములని పూర్వం విశ్వసించే వాళ్ళం. అణువులు ఛేదింప బడతాయని మనకు ఈ రోజు తెలుసు. అంతేకాదు, జడంగా కనిపించే అణువులో అనంతశక్తి నిండి ఉందని కూడా తెలుసుకున్నాం.

అణువు లోని మాయను తొలగించి మహిమను వ్యక్తం చేశారు ఆధునిక శాస్త్రవేత్తలు. మనిషి లోని మాయను తొలగించి మహిమను దర్శింప చేశారు సనాతన మహర్షులు. ప్రతి ఒక్కరిలో అనంతశక్తి చైతన్యము ఉందని సశాస్త్రీయంగా, సహేతుకంగా ప్రబోధించారు. నీలో అది ఉండటం కాదు; నీవే అది అని తేల్చి చెప్పారు.

అనంతాలు రెండు ఉంటాయా? రెండు అనంతాలు ఉంటే, రెండూ అంతమై పోతాయి కదా! అంత మయ్యేది ఎలా అనంత మవుతుంది?

అనంతము ఏకమే గాని, రెండు కాలేదు. అది అద్వయము. అదే పరమాత్మ. మరి ప్రపంచము? ప్రపంచమే కాదు; ప్రపంచము, నువ్వు, నేను, సమస్తమూ అనంత నారాయణుడే. ఇదే శాస్త్ర తాత్పర్యము. అఖండార్థ బోధ.

స య ఏషోఽణి మైత దాత్మ్య మిదం సర్వమ్
తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ! ఇతి

నాయనా! శ్వేతకేతూ! ఈ విధంగా ఏది చైతన్య స్వరూపమో **(ఏషః యః)**, ఆ సత్య స్వరూపము **(సః)** సమస్త ప్రపంచ బీజరూపమై సూక్ష్మంగా భాసిస్తోంది **(అణిమా)**.

ఈ దృశ్యమాన జగత్తంతా **(ఇదం సర్వం)** ఆత్మ స్వరూపం వల్లనే అలరారుతోంది **(ఏతదాత్మ్యం)**. అదియే ఆత్మ **(సః ఆత్మా)**.

ఆ పరమాత్మ స్వరూపము**(తత్)** నీవు**(త్వం)** అయి ఉన్నావు**(అసి)** అని బోధించాడు ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలక మహర్షి.

ప్రపంచ మంతా పరమాత్మ చేత పూర్ణమై ఉంది. పరమాత్మే సత్యము. ఆ సత్యమే ఆత్మ. అదే నీవు. ఇదే అఖండార్థ బోధ. అద్వైత జ్ఞానబోధ. ప్రపంచము, జీవుడు, ఈశ్వరుడు అభిన్నులే అనే అమృతబోధ.

యత్పరం బ్రహ్మ సర్వాత్మా
విశ్వ స్యాయతనం మహత్

సర్వులకు ఆత్మ యైన పరమాత్మ
విశ్వానికి సర్వాధారమై ఉన్నాడు.

ఈ సత్యం మనకు తెలుసా? తెలియదు. అయితే తెలియాలి. తెలుసుకోవాలి. అదే తెలియ దగింది **(వేదితవ్యం)**. దానిని తెలుసుకున్న తరువాత పొంద వలసింది మరొకటి ఉంటుందా?

మరి, అలాంటి అనంత చైతన్యాన్ని క్రొత్తగా పొందే అవకాశం ఉందా? అది క్రొత్తగా పుడుతుందా? అలా పుట్టేది అనంత మవుతుందా? అనంత మైనది ఉంటే, అది లేని కాల మంటూ ఉంటుందా? లేని ప్రదేశం ఉంటుందా? అలాంటి సద్వస్తువు సాధ్యవస్తు వెలా అవుతుంది? నిత్యవస్తువు సిద్ధవస్తువే గాని సాధ్యవస్తువు కాలేదు. నేడు లేకుండా రేపు కలిగేది సాధ్యవస్తువు. నేడు లేకుండా రేపు కలిగేది మరునాడు మళ్ళీ లేకుండా పోయేదే కదా! అలాంటిది అనంత మెలా అవుతుంది? కనుక, మోక్షము క్రొత్తగా వచ్చేది కాదు. ఉన్నదే. సిద్ధ వస్తువుగా ఉన్నదే.

అయితే, ముక్తి మన కున్నదే. మనం ముక్తుల మయ్యే ఉన్నాము. ఇది అర్థం గాక ముక్తి కొరకు యత్నిస్తున్నాము. మనం ముక్తులమే అయినప్పుడు బంధ మెలా వచ్చింది? ముక్త వస్తువుకు బంధం ఉండే అవకాశమే లేదు. బంధం లేని దానికి బంధం ఉన్నట్లు తెలుస్తూ ఉంది. అదే మన సమస్య.

నువ్వు ఉన్నావా, లేదా? ఉన్నావు. ఆత్మ ఎవరు? నువ్వే. ఇక తెలియని దేముంది? ఇక ఆత్మను పొందడ మేమిటి? ఎలా పొందుతావు? లేని దానిని పొందవచ్చు. ఉన్న దానిని పొందే దేమిటి? ఒకవేళ ఉన్నది తెలియక పోతే తెలుసుకోవాలి. ఏమని? ఆత్మను పొందేది లేదని. ఆత్మను పోగొట్టుకొన్నదీ లేదని. అది సదా ఉన్నదే నని, సిద్ధమే నని, ప్రసిద్ధమే నని. ఆత్మ ఎప్పుడూ అప్రసిద్ధం కాదు అన్నారు శ్రీశంకరులు **(న హ్యాత్మా నామ కస్యచిత్ అప్రసిద్ధః** - గీతాభాష్యము).

ఆత్మ విచారము

మనకు ఏం కావాలి? మోక్షము కావాలి. మోక్షము అంటే ఏమిటి? బంధము నుండి విడి పడటమే మోక్షము. బాగుంది. ఇంతకీ బంధ మెవరికి? మనకు బంధ మున్నట్లేనా? బంధము ఉంది అనుకుందాం. మరి ఆ బంధం సత్యంగా ఉన్నదా, లేకనే ఉన్నట్లున్నదా? ముందు ఈ విషయం నిర్ణయం కావాలి.

బంధము సత్యమే అయితే, సత్యము అంటేనే అన్ని కాలాలలో ఉండేది కనుక, బంధము మన కెన్నడూ దూరం కాదు. అది నిత్యబంధమై ఉంటుంది. దానిని తొలగించడం సాధ్యం కాదు. కనుక, మనం ఆశించే మోక్షం ప్రాప్తించే అవకాశమే లేదు.

ఒకవేళ బంధము అసత్యమే అయితే, అసత్యము అంటే లేనిదే కనుక, లేనిది పోనవసరం లేదు. మోక్షము ఉన్నట్లే. ఇక ప్రయత్న మెందుకు?

అలా గాక, బంధము లేనిదే అయినా, ఉన్నట్లు గోచరించే టప్పుడు **(రజ్జు సర్పవత్** - త్రాడులో పాము లాగా). అట్టి బంధము అర్థం చేసుకో దగిందే గాని, ప్రయత్నంతో దూరం చేసుకో వలసింది కాదు. అలా అర్థం చేసుకోవడమే విచారము. ఆత్మ విషయంలో, లేదా మోక్షం విషయంలో విచారమే ప్రధాన కర్తవ్యము **(అతః విచారః కర్తవ్యః)**.

అతో విచారః కర్తవ్యో
జిజ్ఞాసో రాత్మ వస్తునః

ఆత్మవిచార మొక్కటే
ముముక్షువు కర్తవ్యము.

బంధంలో ఉన్నట్లు భావించ డానికి బంధము ఉండ నవసరం లేదు. బంధ మున్నదనే భావన చాలు. ఒక విధంగా చెప్పాలంటే ఈ భావనే బంధము. భావ బంధము. అదే భవబంధము.

నేను బంధంలో ఉన్నానా?
నాకు బంధ మనేది ఉందా? - అని ప్రశ్నించుకొని విచారిస్తే, ఆత్మ వైన నీకు బంధము లేనే లేదని తెలిసి పోతుంది. బంధము భావన అయినపుడు, అట్టి బంధాన్ని నిర్మూలించే మోక్షము కూడా భావనే అవుతుంది. భావ బంధానికి భావ మోక్షమే పరిష్కార మవుతుంది.

బంధ మోక్ష విహీనోస్మి
శుద్ధం బ్రహ్మాస్మి సోస్మ్యహం!

బంధమోక్షాలు లేని వాణ్ణి
శుద్ధ బ్రహ్మ స్వరూపుణ్ణి అన్నది ఉపనిషత్తు.

అర్థమైందా? బంధము కల్పించు కున్నదే. కరిపించు కున్నదే. తగిలించు కున్నదే. తొలగించుకుంటే పోతుంది. అజ్ఞానమే బంధము కనుక, జ్ఞానమే మోక్షము. తానేమిటో, తన స్వరూప మేమిటో తెలియక పోవడము అజ్ఞాన మైతే, తానేమిటో, తన స్వరూప మేమిటో తెలియడమే జ్ఞానము. ఆత్మజ్ఞానము. విచారము ద్వారా లభ్యమయ్యే స్వరూప జ్ఞానము.

మోక్షం జ్ఞానరూపంలో ఉంది
జ్ఞానం కలిగితే మోక్షం సిద్ధిస్తుంది.

ఆత్మజ్ఞానము

జ్ఞానా దేవ తు కైవల్యమ్

జ్ఞానము ద్వారానే మోక్షము సిద్ధిస్తుంది. మోక్షము అనేది ఉన్నదే గాని లేనిది కాదు. ఏదైనా ఒకటి ఉంది అంటే, దానికి సంబంధించిన జ్ఞానము కూడా ఉంటుంది. అదే ఇక్కడ జ్ఞానము అనబడుతూ ఉంది. ఆ జ్ఞానమే ఆత్మజ్ఞానము.

జ్ఞానం ఎలా కలుగుతుంది? ప్రమాణం ద్వారానే కలుగుతుంది. 'ప్రమ' అంటే జ్ఞానము. జ్ఞానమును కలిగించేది ప్రమాణం **(ప్రమాకరణం ప్రమాణం).** ప్రమాణం ఉంటేనే జ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానము విషయంలో శాస్త్రము ప్రమాణము. శాస్త్రము అంటే వేదము.

ఆత్మ ఏదో కాదు; మన స్వరూపమే. కనుక ఆత్మను పొందడ మనేది లేదు. ఆత్మ ఉన్నదే. కానీ, ఉన్నట్లు తెలియనిది. చీకట్లో ఉన్న వస్తువు లేనిది కాదు. ఉన్నట్లు తెలియనిది. వెలుగు రాగానే ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే జ్ఞానం కలిగితే ఆత్మ ఉన్నట్లు తెలుస్తుంది.

మరి, ఆత్మను తెలుసుకొనే వాడెవరు? తెలియని వాడే కదూ? తాను ఆత్మ అని తెలియని వాడే. మరి తాను ఆత్మ కాదని నిర్ణయించుకున్న వాడు తనకు తానుగా తానే ఆత్మ అని ఎలా తెలుసుకుంటాడు? తనకు తానుగా తెలుసు కోలేని దానిని శాస్త్రం ద్వారానే గ్రహించాలి. ఇక్కడే శాస్త్రం ప్రమాణ మైంది.

యత్తు స్వత: అప్రాప్తం
తత్ శాస్త్రేణ బోధితవ్యం.

తనకు తానుగా పొందలేని జ్ఞానమును
శాస్త్ర ప్రమాణం ద్వారానే పొందాలి.

మనము అన్వేషించే సదాత్మ మనమే అయి నందున, అది ఇంద్రియ మనోబుద్ధులకు గాని, ప్రత్యక్ష అనుమానాది ప్రమాణాలకు గాని అందదు. అట్టి దానిని శబ్ద ప్రమాణము ద్వారానే గ్రహించాలి. ఇక్కడే వేదశాస్త్రము ప్రమాణ మైంది.

శ్రుతి శ్శ నః ప్రమాణం అతీంద్రియ విషయ విజ్ఞానోత్పత్తౌ

మన ఇంద్రియ మనోబుద్ధులకు అందని సత్య విషయాన్ని గ్రహించడానికి వేదాలే ప్రమాణము అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి.

ఆత్మ ఉంది. కాని, తెలియకుండా ఉంది. ఇదియే ఆత్మ అజ్ఞానము. ఆత్మజ్ఞానము కలిగితే ఆత్మ అజ్ఞానము నశిస్తుంది **(ఆత్మజ్ఞానేన ఆత్మ అజ్ఞానం నశ్యతి).** ఆత్మజ్ఞానమును పొందిన వాడు తానే ఆత్మ అని తెలుసుకుంటాడు **(ఆత్మవిత్ పరం ఆప్నోతి).** ఈ విధంగా ప్రమాణం జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

ఆచార్యవాన్ పురుషో వేద

శాస్త్రము ఎప్పుడైతే ప్రమాణ మైందో, అధ్యయనం తక్షణ కర్తవ్య మైంది. మరి శాస్త్రాన్ని మనమే అధ్యయనం చేస్తే సరిపోతుందా? సరిపోదు.

జ్ఞానము ఏదైనా, దానిని పొందే పద్ధతి ఒకటి ఉంటుంది. అలా పొంది నపుడే జ్ఞానం ప్రాప్తిస్తుంది. దీనినే శాస్త్ర పరిభాషలో 'బోధనా విధి' అంటారు.

మనకు మనంగా కారు నడపడం నేర్చుకో లేము. మనకు మనంగా కంప్యూటర్‌ను తెలుసుకో లేము. మరొకరి సహాయం లేకుండా సైకిల్ కూడా త్రొక్క లేము. ఈత కొట్టడం అభ్యసించ లేము. సామాన్య విషయాలే ఇలా ఉన్నాయి. ఇక ఆత్మజ్ఞానం ఎవరి సహాయం లేకుండా సిద్ధిస్తుందా?

అయితే, ఇక్కడ మనకు సహకరించే వ్యక్తి మన లాంటి వాడే అయితే ఉపయోగం లేదు. జ్ఞానం కలిగిన వాడై ఉండాలి. కేవలం జ్ఞానం ఉంటే చాలదు. తన కున్న జ్ఞానాన్ని ఇతరులకు అందించ గలిగే విధానం కూడా తెలిసిన వాడై ఉండాలి. తెలిసి బోధించి నపుడే వినే వాడి బుద్ధి నిండుతుంది. తెలిసే లాగా బోధిస్తేనే వినే వాడి బుద్ధి పండుతుంది. అలా బోధించడమే సంప్రదాయము. సాంప్రదాయక బోధ అంది నపుడే జ్ఞానం ప్రాప్తిస్తుంది. సంప్రదాయం తెలిసి బోధించే వ్యక్తిని గురువు అంటారు.

మనది వేద సంస్కృతి. మనది వేద సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని ఋషులు, గురువులు కాపాడుకుంటూ వచ్చారు.

వేదాన్ని ఋషులు సృష్టించ లేదు.
వేదాన్ని బోధించే సంప్రదాయాన్ని సృష్టించారు.

ఋషిభిః న ప్రమాణ కర్తారః
ఋషిభిః సంప్రదాయ కర్తారః

ఋషులు ప్రమాణకర్తలు కారు
ఋషులు సంప్రదాయ కర్తలు.

జ్ఞానం సృష్టింప బడేది కాదు. అందించ బడేది. వెలిగే దీపము మరొక దీపాన్ని వెలిగించినట్లు, జ్ఞానం కలిగిన గురువు మరొకరికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. గురువు లభించిన వారికే జ్ఞానము ప్రాప్తిస్తుంది.

ఆచార్యవాన్ పురుషో వేద

ఆచార్యుడు ఎవరికి లభిస్తాడో
వారికే జ్ఞానం కలుగుతుంది.

ప్రమాణ ప్రమేయ సంబంధము

మనకు మోక్షం కావాలి. మోక్షం జ్ఞానరూపంలో ఉంది అని గ్రహించాము. జ్ఞానము కలిగితే మోక్షం ప్రాప్తిస్తుంది. జ్ఞానమును శాస్త్రం అందిస్తుంది. ఇదే ప్రమాణ ప్రమేయ సంబంధము. ఆత్మ ప్రమేయము; శాస్త్రము ప్రమాణము. ప్రమాణమైన శాస్త్రం ద్వారా ప్రమేయమైన ఆత్మకు సంబంధించిన జ్ఞానం కలుగుతుంది.

దీనినే ప్రతిపాదక ప్రతిపాద్య సంబంధం అని కూడా అంటారు. ఆత్మ ప్రతిపాదింప బడుతోంది కనుక ఆత్మ ప్రతిపాద్యము. శాస్త్రం ప్రతిపాదించి తెలియ చేస్తోంది కనుక శాస్త్రం ప్రతిపాదకం. నీవే ఆత్మవు. నీవు ఆత్మవని నీకు అర్థమయ్యేలా చేస్తుంది శాస్త్రము. ఇదే ప్రమాణ వైభవము.

రజ్జు జ్ఞానము కలిగిన తరువాత సర్పభ్రాంతి ఎలా లేదో, అలాగే ఆత్మజ్ఞానము కలిగిన తరువాత, అజ్ఞానము, అజ్ఞాన జనిత సంసారము అదృశ్య మవుతున్నాయి. అవిద్యా నివృత్తియే విద్య యొక్క ప్రయోజనం. అజ్ఞాన నివృత్తియే జ్ఞానం యొక్క ఫలం.

బ్రహ్మ విద్యాయాః అవిద్యా నివృత్తిః
తతశ్చ ఆత్యంతిక సంసార అభావః

ఆత్మజ్ఞానము, లేదా బ్రహ్మజ్ఞానము
అవిద్యను అంతం చేస్తుంది.
సమూలంగా సంసారాన్ని నశింప చేస్తుంది.

జ్ఞాన మనేది బుద్ధి నుండి బుద్ధికి అందుతుంది. కనుక శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువు జ్ఞానజ్యోతియై మన హృదయంలో జ్ఞానదీపాన్ని వెలిగిస్తాడు. అదియే ఆత్మజ్ఞాన జ్యోతి. అజ్ఞాన అంధకారాన్ని అదృశ్యం చేసే అఖండాత్మ జ్యోతి. **గు** అంటే చీకటి. **రు** అంటే దానిని పోగొట్టే వెలుగు. అదే గురువు శబ్దార్థము. బంధము, మోక్షము, జ్ఞానము, శాస్త్రము, ఆచార్యుడు - అన్నీ సమగ్రంగా విశ్లేషించుకొని చెప్పుకున్నాం. ఈ దశలో అవగాహన క్రమబద్ధంగా ఉండేలా చూసుకోవాలి. ఇది చాలా ప్రధానమైన విషయం.

మోక్షాయ జ్ఞాన ప్రవృత్తిః
జ్ఞానాయ శాస్త్ర పఠనం
గురూప సదనం శాస్త్ర పఠనం !

మనకు మోక్షం కావాలి. మోక్ష మనేది వస్తువు కాదు; సన్నివేశం కాదు; దేశంలో ఉండదు; కాలంలో తెలియదు. మోక్షం జ్ఞానరూపంలో ఉంది.

జ్ఞానం స్వప్రయత్నంతో సిద్ధించదు. అది ప్రమాణ విషయం. ప్రమాతే ప్రమేయం అనే సత్యం ప్రమాణం లోనే దర్శనీయ మవుతుంది. అదే శాస్త్ర ప్రమాణం. అద్దంలో ముఖదర్శన మైనట్లు శాస్త్రంలో ఆత్మదర్శన మవుతుంది **(ముకురే ముఖ దర్శనవత్ శాస్త్రే ఆత్మదర్శనం).** అద్దానికి అభిముఖంగా వెళ్ళడం అద్దాన్ని దర్శించడానికి కాదు. మన ముఖాన్ని దర్శించడానికి. శాస్త్ర దర్పణాన్ని దర్శించడం కూడా కేవలం శాస్త్ర పఠనానికే కాదు, స్వాత్మ దర్శనానికి.

సంప్రదాయ విదుడైన ఆచార్యుని సన్నిధిలో శ్రవణం చేసి నపుడే ప్రమాణం ఫలిస్తుంది. కనుక, ఆత్మజ్ఞాన ప్రాప్తి కొరకు ఆచార్యుని తప్పక ఆశ్రయించాలి.

ఇదీ క్రమము.
బంధము తొలగాలంటే, మోక్షమును పొందాలి. మోక్షం రావాలంటే జ్ఞానం కలగాలి. జ్ఞానం కలగాలంటే శాస్త్రమును ప్రమాణంగా గ్రహించాలి. శాస్త్రాధ్యయనం గురుసన్నిధి లోనే జరగాలి. ఇదీ సారభూతమైన విషయము.

వేద ప్రమాణము

వేదములు ప్రామాణికాలైన ప్రాచీన జ్ఞాన భాండాగారము. **విద జానే** - దీని చేత తెలుసుకుంటారు కనుక ఇది వేదము **(వేదః).**

వేదాలను శ్రుతులు అని కూడా అంటారు. శ్రుతులు అంటే వినిపించేవి. **శ్రూయతే అనేన ఇతి శ్రుతిః** - దేని చేత జ్ఞానము వినపడు తుందో అది శ్రుతి.

శ్రుతులైన వేదాలను ఆమ్నాయాలు అని కూడా అంటారు. **ఆమ్నాయతే పారంపర్యేణ ఇతి ఆమ్నాయః** - పారంపర్యంగా అభ్యసింప బడేది కనుక వేదము ఆమ్నాయము **(మ్నా అభ్యాసే).**

వేదాలు అపౌరుషేయాలు. పురుషుల చేత రచింప బడేవి పౌరుషేయాలు. అలా కాకుండా స్వతస్సిద్ధ మైనవి, భగవత్స్వరూపంగా విరాజిల్లేవి అపౌరుషేయాలు.

వేదాలన్నీ ప్రాచీన సంస్కృత భాషలో ఉన్నాయి. అందుచేత, ఆధునిక సంస్కృతాధ్యాపకులు, భాషావేత్తలు వేదార్థాన్ని గ్రహించడానికి వేదన చెందుతూ ఉంటారు.

వేద వాఙ్మయాన్ని యథావత్ అర్థం చేసుకోవడానికి అనుకూలంగా యాస్కాచార్యుల వారు **'నిరుక్తము'** అనే సంస్కృత నిఘంటువును రచించారు. నిరుక్తము వేదాంగాలైన ఆరింటిలో ఒకటి. వర్ణాగమ విపర్యయాదుల్ని నిశ్చయించి చెబుతుంది కనుక అది నిరుక్తము **(నిశ్చయేన ఉక్తం నిరుక్తమ్).**

నిరుక్తమును ఆధారం చేసుకొనే భాష్యకారులు వేదాలను వ్యాఖ్యానించారు. వేదాలను వ్యాఖ్యానించిన వారు స్వల్ప సంఖ్యలో ఉన్నారు. వారిలో కూడా పాక్షికంగా వ్యాఖ్యానించిన వారే గాని పూర్ణంగా విశదీకరించిన వారు అరుదు. వేదాన్ని వ్యాఖ్యానించిన సంప్రదాయ విదులలో మాధవాచార్యులు, సాయనాచార్యులు ముఖ్యులు. మాధవాచార్యులే సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన తరువాత విద్యారణ్యస్వామిగా వాసి కెక్కారు. **'వేదాంత పంచదశి'** లాంటి ప్రముఖమైన అద్వైత గ్రంథాలను రచించారు.

ఏ తల్లి కన్నదో - అని తరచుగా మహాత్ములను జనులు శ్లాఘిస్తూ ఉండటం మనం వింటూ ఉంటాము. వేదానికి భాష్యాన్ని అందించిన మాధవ సాయనులు ఒక్క తల్లి బిడ్డలు కావడం, ఇద్దరు సోదరులు అనితర సాధ్యమైన వేదభాష్యాన్ని అందించడం గొప్ప విశేషము. ఆ బిడ్డలను కన్న మహాతల్లి ఎవరో, ఆమె జన్మ ధన్యమైంది. మాధవ సాయనులే కాకుండా ఉద్భటాచార్యులు కూడా రచించారని చెబుతారు. మాధవ సాయనుల భాష్యం లాగా వారిది అంత ప్రాచుర్యాన్ని పొందలేక పోయింది.

సంప్రదాయవిదుల భాష్యం లాగే, మ్యాక్స్‌ముల్లర్ అనే పాశ్చాత్యుడు కూడా సంస్కృత భాషను అభ్యసించి, వేదానికి, ముఖ్యంగా ఋగ్వేదానికి భాష్యాన్ని అందించాడు. ఆయన సంప్రదాయ గాడిలో పడని పాశ్చాత్యుడు. కనుక ఆయన భాష్యం కూడా అలాగే ఉంటుంది. కాకపోతే, ఒక పాశ్చాత్యుడు సంస్కృత భాషను అభ్యసించి,

జ్ఞానాసక్తితో వేదాన్ని పఠించడమే కాకుండా, దానిని వ్యాఖ్యానించడం అనేది అద్భుతమైన విషయము; ప్రశంసనీయము.

ప్రమాణ వైభవము

ప్రపంచము దృశ్యము. కార్యరూపము. ప్రత్యక్ష అనుమానాది ప్రమాణాల చేత అనుభవానికి అందుతుంది. ఈ కార్యరూప ప్రపంచానికి కారణమైన పరమాత్మ ప్రత్యక్షాది ప్రమాణాలకు అందే వాడు కాడు.

కనుక, పరమాత్మ జ్ఞానప్రాప్తికి మరొక ప్రమాణము అవసరమై ఉంది. అదే శబ్ద ప్రమాణం. వేద ప్రమాణం.
ప్రమాకరణం ప్రమాణం - ప్రమ అంటే జ్ఞానము. ప్రమను కలిగించేది కనుక వేదము ప్రమాణము.

వస్తు ప్రతిపాదనం తత్పరత్వం
సిద్ధం శాస్త్రాణామ్ !

సత్య వస్తువును ప్రతిపాదించడమే గాక, ఆ సత్యవస్తు స్వరూపాన్నే పరమ గమ్యముగా వేదాలు కలిగి ఉన్నాయి అన్నది బృహదారణ్యకోపనిషత్తు *(1 - 3 -1)*. అందుచేతనే వేదం ప్రమాణ వైభవంతో ప్రకాశిస్తూ ఉంది. ప్రమాణ విషయాన్ని సులభంగా తీసుకోవడానికి అవకాశము లేదు. ప్రమాణ విషయము బుద్ధికి చిక్కని దైనపుడు, జ్ఞానం ప్రాప్తించడము దుస్సాధ్య మవుతుంది.

ప్రపంచం లోని శబ్దాది విషయ జ్ఞానాన్ని శ్రోత్రాది ఇంద్రియాల ద్వారా మనం తెలుసుకుంటున్నాం. చెవులు శబ్దాలను వింటాయి; రూపాలను చూడలేవు. కళ్ళు రూపాలను చూస్తాయి; శబ్దాలను వినలేవు. ముక్కు వాసన చూస్తుంది, రూపాన్ని చూడలేదు. ఇంద్రియాలు తమ తమ విషయాలను గ్రహించడములో శక్తివంతంగా ఉండటమే గాక, అలా గ్రహించ డానికి మరొక దానిని ఆశ్రయించ కుండా స్వశక్తి మీదనే ఆధారపడి ఉన్నాయి. ప్రమాణం అనే విషయాన్ని కూడా ఇలాగే అర్థం చేసుకోవాలి.

స్వ విషయ శూరాణాం హి
ప్రమాణాని శ్రోత్రాదివత్

శబ్దాలను ఆలకించడంలో చెవులు ఎలా శక్తివంత మైన ప్రమాణమై ఉన్నవో, అలాగే ఏ ప్రమాణ మైనా తత్సంబంధ విషయము నందు శక్తివంతమైన జ్ఞానసాధన గానే ఉంటుంది అన్నది ఉపనిషత్తు.

శబ్దం విషయంలో చెవి, రూపం విషయంలో కన్ను, రుచి విషయంలో నాలుక ఎలా స్వత: ప్రమాణాలై ఉన్నవో (వాటి వెనుక మనస్సు ఉంది కనుక), అలాగే జ్ఞానం విషయంలో, పరమాత్మజ్ఞానం విషయంలో, ముందు వెనుక, కుడి ఎడమ, పైన క్రింద, లోపల బయట, ఎవరి అవసరం లేకుండా, దేని అవసరము రాకుండా, వేదము స్వప్రమాణమై శోభిస్తోంది.

వేదస్య హి నిరపేక్షం
స్వార్థే ప్రామాణ్యం
రవేరివ రూప విషయే

రూపాలను ప్రకాశింప చేయడానికి సూర్యునికి మరొకరి సహాయము అవసరమా? స్వయంగా తన ప్రకాశము తోనే ప్రపంచాన్ని సూర్యుడు ప్రకాశింప చేయ గలడు. రూపాలను సూర్యుడు ప్రకాశింప చేసి వాటి విషయంలో ప్రమాణ మైనట్లు, పరమాత్మకు సంబంధించిన జ్ఞానం విషయంలో వేదాలు మరో సహాయం వైపు చూడకుండా స్వప్రమాణమై శోభిస్తున్నాయి అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి *(2 - 1 - 1)*.

వేదాలు ఇలా ప్రమాణమై శోభిస్తున్నాయి కనుకనే వాటిని పరమాత్మ శ్వాసలని అభివర్ణించింది శాస్త్రం (**అస్య మహతో భూతస్య నిశ్శ్వసిత మేతత్**). అంతే కాదు. ప్రమాణమై శోభిస్తున్న వేదాన్ని నిరసించిన వారిని, నిరాకరించిన వారిని, వారు ఎంతటి వారైనా నాస్తికులే నని తెగేసి మరీ చెప్పింది (**నాస్తికో వేద నిందకః**).

ఆశ్రయ స్థానము

భారతీయ తాత్త్విక దర్శనా లన్నిటికీ వేదాలే మూలం అని చెప్పవచ్చు. న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, మీమాంసాది షడ్దర్శనా లన్నిటికీ వేదాలే ఆధారము. తత్త్వమును బోధించే వాటిని దర్శనాలు అంటారు (**దృశ్యతే అనేన ఇతి దర్శనమ్ - దర్శ్యతే తత్త్వ మనేన ఇతి దర్శనమ్**). దేని వలన చూడ బడుతుందో అది దర్శనము.

ఇంతకీ చూడ బడేది ఏదై ఉండాలి? ఏది దర్శనీయమై ఉండాలి?

నే నెవరు? నా స్వరూప మేమిటి?
నేను క్షేత్రమా? క్షేత్రజ్ఞ స్వరూపమా?
ఈ జగత్తేమిటి? దీనికి కారణ ముందా?
ఇది సృష్టి యేనా? సృష్టికర్త ఎక్కడున్నాడు?
సృష్టికి సృష్టికర్తకు ఉన్న సంబంధ మేమిటి?

ఈ విధమైన ప్రశ్న లన్నిటికీ సూటిగా, సుస్పష్టంగా సమాధానం చెప్పగలిగే దేదో అది దర్శనము. ఇక్కడే కొన్ని దర్శనాలు, అవి ఎంత గొప్పవి అయినా, వాటి కర్తలు మహాత్ములే అయినా, వారి వాక్యాలు జ్ఞానపూరితాలు గానే కనిపించినా, అవి ప్రమాణం కాలేక పోయాయి.

వేదము ఇక్కడే ప్రమాణ శోభతో కనిపిస్తుంది. ఏ వాక్యాన్నైనా ప్రమాణంగా గ్రహించాలి అంటే, అది పూర్ణమైన, ఫలప్రదమైన జ్ఞానరూపమై ఉండాలి. ఇదే ప్రమాణ విషయంలో ఉపనిషత్తుల ఏకవాక్యత (**నిశ్చిత ఫలవత్ విజ్ఞానో త్పాదకమ్ వాక్యం ప్రమాణమ్** - బృహదారణ్యక భాష్యం ; *1 - 4 - 7*).

చతుర్విధ పురుషార్థములలో ప్రశస్త మైనది, పరమ పురుషార్థ మని చెప్పబడింది మోక్షమే అని ముందు గానే మనం చెప్పుకున్నాం. మోక్షమే పరమ పురుషార్థ మని దర్శనాచార్యు లందరూ అంగీకరిస్తారు (**దర్శనాంత రేషు మోక్ష స్వరూపమ్**). కాకపోతే ఏది మోక్షము? మోక్ష మంటే ఏమిటి? అనే విషయం లోనే వైరుధ్యాలు గోచరిస్తాయి.

పరమ పురుషార్థ మైన మోక్షం విషయాన్ని నిర్ణయించడంలో వేదాంతర్గత మైన ఉపనిషత్తులు వస్తు నిర్ధారణ చేసి, ప్రమాణమై శోభిస్తున్నాయి. అంతేకాదు. ధర్మార్థ కామ పురుషార్థాలనే త్రివర్గములను సాధించుకొనే ఉపాయాలను తెలియ చేయడంలో కూడా వేదాలు ప్రమాణాలై శోభిస్తున్నాయి.

పురుషా ర్థోపదేశత్వాత్ శ్రుతీనామ్ !

సమస్త పురుషార్థాలను సాధించుకొనే విషయంలో శ్రుతులు ప్రామాణికంగా మార్గాలను తెలియ చేస్తున్నాయి అన్నారు తైత్తిరీ యోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి. సాధ్యరూప మోక్షమే గాక, సాధన రూప విషయాలను కూడా వేదము ప్రామాణికంగా అందించింది. కర్మోపాసనలను వివరించింది. **'ఓం నమశ్శివాయ'** అనే పంచాక్షరీ మహామంత్రము, **'ఓం నమో నారాయణాయ'** అనే అష్టాక్షరీ మహామంత్రం కూడా వేదంలో ప్రమాణ రూపంలో భాసిస్తున్నాయి.

కనుక ప్రమను, అనగా జ్ఞానమును పొందుటకు వేదమే ప్రమాణము అనేది అర్థ మైందని భావిస్తాను. మరి, వేదము ప్రమాణ మైనపుడు వేదాన్నే కదా ఆశ్రయించాలి? భగవద్గీత ఎందుకు? భగవద్గీత ప్రమాణమా? అప్రమాణమా?

గీతా శాస్త్రము - సర్వశాస్త్ర సారము

సర్వధర్మ స్వరూపమై, పంచమ వేదమని ప్రస్తుతింప బడిన మహాభారత మనే విశాలమైన ఆకాశంలో, దివ్యంగా విలసిల్లుతూ, అద్వైత పీయూషాన్ని అవిరళంగా వర్షించిన అమృత మేఘమాలిక శ్రీమద్భగవద్గీత.

'గీత' అంటే గానం చేయబడేది లేదా పాడ బడేది అని అర్థము (గీయత ఇతి గీతమ్. గై శబ్దే). ఇక్కడ బోధింప బడింది; ఉపదేశింప బడింది అని భావించాలి. 'భగవద్గీత' అంటే భగవంతుని చేత ఉపదేశింప బడిన గీత, లేదా జ్ఞానము.

జ్ఞానము అంటే ఆత్మజ్ఞానము, లేదా బ్రహ్మజ్ఞానము అని అర్థము. ఉపనిషత్తు అంటే కూడా జ్ఞాన మనే అర్థం. ఉపనిషత్తు అనేది గ్రంథ నామము కాదు, గ్రంథ విషయము. ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య అని అర్థము (ఉపనిష ద్విషయం ఉపనిష దేవ).

గీతకు ఉపనిషత్తు అనే పేరు కూడా ఉంది. అలా చూచి నపుడు 'గీత' అంటే భగవంతుని చేత చెప్పబడిన ఉపనిషత్తు అని భావించ వచ్చు. కనుక, గీత అంటే ఉపనిషత్తు అనే పేరు కలిగిన బ్రహ్మవిద్య (గీతోపనిష న్నామ్నీం బ్రహ్మవిద్యాం) అని అర్థము.

గీత, ఉపనిషత్తులు రెండూ ఏకవాక్యతను ప్రసాదిస్తున్నాయి. అంటే, ఒకే అర్థాన్ని అందిస్తూ పరమార్థాన్ని ముందుంచు తున్నాయి.



జ్ఞానాత్ మోక్ష ఇతి ఏషోఽర్థః
నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ ।

జ్ఞానము వల్లనే మోక్షము ప్రాప్తిస్తుంది
ఇదే గీత, ఉపనిషత్తుల తుది నిర్ణయము
అని శ్రీ శంకరుల గీతాభాష్యము.

యత్ర స్థితం బ్రహ్మజ్ఞానే
వేదశాస్త్ర సునిశ్చితమ్ ।

వేదము నిశ్చయించిన బ్రహ్మజ్ఞానము
గీత యందు సుప్రతిష్ఠము
అని స్కాందపురాణము.

గీత, ఉపనిషత్తులు ఒకే విషయాన్ని ప్రతిపాదిస్తూ ఉన్నందున గీత ఏదో కాదు; ఉపనిషత్తే. గీతలో చెప్పబడిన జ్ఞాన మంతా ఉపనిషత్ జ్ఞానమే. ప్రతి అధ్యాయాన్ని ఒక ఉపనిషత్తు అని చెప్పుకోవచ్చు. ప్రతి శ్లోకము ఒక ఉపనిషత్తే. ఉపనిష న్మంత్రాలు కొన్ని గీతలో యథాతథంగా కూడా ఉన్నాయి. అందుకే నేమో, గీత లోని ప్రతి అధ్యాయం చివర ఉన్న సంకల్ప వాక్యంలో, శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు అని బహువచనాన్ని ప్రయోగించడం జరిగింది. గీతను గీతలు అని, ఉపనిషత్తును ఉపనిషత్తులు అని బహువచన ప్రయోగంతో పలకడం చేత, గీతా శ్లోకాలన్నీ ఉపనిష ద్రూపాలే; ఉపనిషత్సారాలే అని అర్థమవుతూ ఉంది.

అలా కాకుండా, 'ఉపనిషత్సు' అనే పదాన్ని 'ఉపనిషత్తులలో' అని అర్థం చెప్పుకున్నా, గీత ఉపనిషత్తుల లోని జ్ఞానాన్నే ప్రసాదిస్తూ ఉంది అని భావించ వచ్చు. ఉపనిషత్తు, గీత అనే రెండు పదాలు స్త్రీ లింగ పదాలే అనేది కూడా గమనార్హం. ఇంకా చెప్పాలి అంటే, గీత సర్వశాస్త్ర స్వరూపిణి (సర్వ శాస్త్ర మయీ గీతా).

గీత వేద స్వరూపము

వేదము అంటే జ్ఞానము అని తెలుసుకున్నాము. ఏ జ్ఞానము? అనే ప్రశ్నకు ఈశ్వర జ్ఞానము అనేది సమాధానము. ఈశ్వరుడు, ఈశ్వర జ్ఞానము రెండు కావు. ఒక్కటే. వేదము, వేదనారాయణుడు వేరు కాదు. ఒక్కటే. వేదమే తన స్వరూపంగా కల వాడు వేదనారాయణుడు (వేదరూపత్వాత్ వేదః). వేదరూపంలో ఉన్నాడు కనుక ఆయనే వేదము.

వేదము తెలిస్తే, వేద్యుడైన నారాయణమూర్తి కూడా తెలిసినట్లే. వేదనారాయణుని తెలుసుకోవడానికి వేదము తప్ప మరొక మార్గం లేదు.

విష్ణుసహస్రనామం నారాయణమూర్తిని వేదాంగః (వి.స.నా - 130 వ నామం) అని కీర్తించింది. వేదములు అంగాలుగా కలిగిన వాడు కనుక వేదనారాయణుడు వేదాంగు డయ్యాడు (వేదా అంగ భూతాః యస్య సః వేదాంగః).

వేదములు అంగాలు అయితే భగవంతుడు అంగి అవుతాడు. అంగిని ఎలా తెలుసుకుంటాము? అంగాల ద్వారానే తెలుసుకుంటాము. కనుక, వేదము తెలిస్తే వేద నారాయణుడు తెలిసినట్లే. భగవంతుని విషయంలో వేదము అలా ప్రమాణమై శోభిస్తోంది.

భగవంతుని విషయంలో వేదము ఎలా ప్రమాణ మైందో, వేదసారమైన భగవద్గీత కూడా అలాగే ప్రమాణమైంది.

వేదాలలో ప్రథమ వేదమైన ఋగ్వేదము లోని మంత్రాలను ఋక్కులు అంటారు. ఋగ్వేదము పవిత్రమైన అగ్నిదేవుని స్తుతితో ప్రారంభ మవుతుంది.

అగ్ని మీళే పురోహితం ।
యజ్ఞస్య దేవ మృతిజమ్
హోతారం రత్నధావతమ్ ।

ఇది ప్రథమ వేదమైన ఋగ్వేదంలో ప్రథమ ఋక్కు కావడం చేత బహుశ సృష్టి లోని స్తోత్రా లన్నిటిలో ఇదే ప్రథమం కావచ్చు. ప్రథమ స్తుతి అక్షరాలలో ప్రథమాక్షర మైన 'అ' కారంతో ప్రారంభం కావడం గమనార్హం. అక్షరాణాం అకారోఽస్మి -అక్షరాలలో నేను అకారాన్ని అన్నాడు భగవానుడు గీతలో (10 వ అ - 33 వ శ్లో). వేదానికి ఆది అక్షరమైన ఆదినారాయణుడు గీతాచార్యుడే. కనుక, గీత వేదస్వరూపమే. వేదసారమే.

ఇక రెండవది వేదాలలో ఉన్నత మైనది అని భావించే స్వర ప్రధానమైన సామవేదం. సామగాన లోలుడైన శ్రీకృష్ణ పరమాత్మ వేదానాం సామవేదోఽస్మి - వేదాలలో నేను సామవేదాన్ని అంటూ సామవేదాన్ని తన విభూతిగా అభివర్ణించాడు (గీత ; 10 వ అ - 22 వ శ్లో).

త్రయీ వేద్యం -మూడు వేదాలు తానే అనే అద్భుత సత్యాన్ని ఆవిష్కరిస్తూ, ఋక్సామ యజురేవ చ (గీత ; 9 వ అ - 17 వ శ్లో) ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అన్నీ తానే నంటూ తన వేద స్వరూపాన్ని భగవంతుడు గీతలో దర్శింప చేశాడు. ఏ దివ్యాత్మని జ్ఞానము అపౌరుషేయ మైన శ్రుతులలో ప్రకాశిస్తూ ఉందో, ఆ ఉత్కృష్ట మైన జ్ఞానమే 'భగవద్గీత' అనే స్మృతి రూపంలో శోభిస్తూ ఉంది. గీతా వైభవాన్ని స్తుతిస్తూ భగవానుడైన శ్రీకృష్ణుడు అర్జునునికి ఏమి బోధించాడో వైష్ణవీయ తంత్రసారము నుండి విందాం.



గీతా మే హృదయం పార్ధ
గీతా మే సార ముత్తమమ్
గీతా మే జ్ఞాన మత్యుగ్రం
గీతా మే జ్ఞాన మవ్యయమ్ !

అర్జునా! గీతే నా హృదయము
గీతే నా మహోన్నత స్వరూపము
గీతా జ్ఞానమే నా తేజము
అదే నా అక్షయ వైభవము.

గీతా సరోజము

జన్మజన్మలుగా మనిషి పేర్చుకుంటూ వస్తున్న నొసటి రాతలను తుడిపేందుకు భారతీయ తత్త్వ సాహిత్యంలో అనేక గీతలు ఆవిర్భవించాయి. వాటి వాటి ప్రత్యేకతలను అవి ప్రదర్శించుకుంటూ జ్ఞానాన్ని వితరణ చేశాయి.

గణేశగీత, గురుగీత, హంసగీత
అవధూతగీత, శివగీత, వసిష్ఠగీత
దేవీగీత, ఋభుగీత, అష్టావక్రగీత
బ్రహ్మగీత, భిక్షుగీత, హనుమద్గీత
పరాశరగీత, రామగీత, జీవన్ముక్తగీత

ఓహ్! ఎన్నని? ఇలా చెప్పుకుంటూ పోతే శతాధికం గానే ఉంటాయి. గతంలో రామగీత, అవధూత గీత, జీవన్ముక్త గీత, గురుగీతలకు నేను రచించిన వ్యాఖ్యానాలను ఆశ్రమం విడుదల చేసింది. గీతలను పరిచయం చేస్తూ, ప్రాచుర్యం కల్పించాలని సుమారు పద్దెనిమిది గీతలను ఎన్నుకొని, వాటిలో ముఖ్య శ్లోకాలను ఎంపిక చేసి, వాటిపై సంక్షేపంగా వ్యాఖ్యానించి, **'సర్వగీతార్థ చంద్రిక'** అనే ఒక చిన్ని పుస్తకాన్ని పాతికేళ్ళ క్రితం మేమే విడుదల చేశాము. దానిని పునః ముద్రించ లేదు. కనుక ప్రతులు ప్రస్తుతం లభ్యం కావు.

గీతలు ఎన్ని ఉన్నా, 'గీత' అనగానే స్మృతిలో మెదిలేది భగవద్గీత ఒక్కటే. అదే గీతా మహాత్మ్యము.

సరోవరం నుండి ఏవేవో పుడుతాయి. ఎన్నెన్నో పుడుతాయి. అన్నీ సరస్సు నుండి పుట్టినవే. కానీ, 'సరోజం' అనగానే సరస్సు నుండి ఉద్భవించినవి ఏవీ గోచరించకుండా కమలమే కళ్ళ ముందు కనిపిస్తుంది. మనస్సును మురిపిస్తుంది.

గీత లెన్నున్నా, 'గీత' అనే నామం భగవద్గీతనే బుద్ధిలో నిలుపుతుంది. భగవద్గీత పేరు వినని వారిని, భగవద్గీత తత్త్వాన్ని పూర్ణంగా తెలిసిన వారిని వ్రేళ్ళపై లెక్కొట్ట వచ్చు. అదే భగవద్గీతా వైభవము.

నిష్ఠాద్వయం

వేద ప్రతిపాదితమైన నిష్ఠాద్వయాన్ని ధర్మద్వయము అని కూడా అంటారు. ఇదే వేదోక్త ధర్మం. మొదటిది ప్రవృత్తి రూపమైన కర్మనిష్ఠ ; రెండవది నివృత్తి రూపమైన జ్ఞాననిష్ఠ. ప్రపంచ మనుగడకు ఈ ధర్మద్వయమే కారణము. ఈ నిష్ఠాద్వయం ప్రాణులకు అభ్యుదయాన్ని, నిశ్శ్రేయసాన్ని ప్రసాదిస్తాయి. ప్రవృత్తి లక్షణమైన కర్మనిష్ఠ అభ్యుదయాన్ని అందిస్తే, నివృత్తి లక్షణమైన జ్ఞాననిష్ఠ సాక్షాత్తు నిశ్శ్రేయసమును అనుగ్రహించి ఆశీర్వదిస్తుంది.

మరి, భగవద్గీత వేద స్వరూపమని, ఉపనిషత్సార మని చెప్పుకున్నాం కదా! అలాంటప్పుడు, ఉపనిష త్ప్రతిపాదిత మైన విషయాన్నే భగవద్గీత కూడా బోధించాలి. ప్రసక్తానుప్రసక్తంగా అనేక విషయాలను అనివార్యంగా చర్చించినా, కేంద్ర విషయం నుండి ప్రక్కకు_తప్పుకో కూడదు. అప్పుడే వేదం లాగా గీత కూడా ప్రమాణమై శోభిస్తుంది. ఆ విషయంలో గీత సఫలీకృత మైంది. వైదిక మైన నిష్ఠాద్వయ రూపమైన ధర్మద్వయాన్నే భగవంతుడు కేంద్ర విషయంగా తీసుకొని భగవద్గీతలో బోధించాడు.

వైదికం హి ధర్మ ద్వయమ్ అర్జునాయ
శోకమోహ మహోదధౌ నిమగ్నాయ ఉపదిదేశ !

శోక మోహ రూప మహాసముద్రంలో మునిగి పోయిన అర్జునునికి వేదోక్త ధర్మమైన రెండు ధర్మాలను భగవంతుడు గీతలో ఉపదేశించాడు.

ఈ బోధ వల్ల భగవంతునికి ఏమి ప్రయోజనము?
గీతను బోధించి పరమేశ్వరుడు ఏమి సాధించాడు?

ప్రయోజన మనుద్దిశ్య
న మందో పి ప్రవర్తతే !

ప్రయోజనం లేని కార్యాన్ని అప్రయోజకుడు కూడా చేయడు. మరి, భగవంతుని బోధ వెనుక ప్రయోజన మేమిటి?

ప్రయోజనం లేని కార్యాలు విజ్ఞులు ఆచరించరు.
అలాగని తనకూ ప్రయోజనం అవసర మైతే ఆయన భగవంతుడు కాలేడు.

నిజమే. తాను చేసిన ప్రబోధ కార్యము ప్రయోజనంతో కూడుకొని ఉంది కనుక, తన విజ్ఞతకు లోపం రాదు.
కానీ, ఆ ప్రయోజనము తన కొరకు కానందున ఆయన పూర్ణత్వానికి కూడా భంగం లేదు.
తన కంటూ ఏ ప్రయోజనం అవసరం లేకపోయినా **(స్వప్రయోజన అభావేపి)** సర్వ ప్రాణులను అనుగ్రహించాలనే కాంక్షతో **(భూతాను జిఘృక్షయా)** వేదోక్త మైన ధర్మద్వయాన్ని భగవంతుడు గీతలో బోధించాడు.

ప్రవృత్తి - నివృత్తి

వేదాంత శాస్త్రాని కైనా, గీతాశాస్త్రాని కైనా మోక్షమే పరమ ప్రయోజనము. అదే నిశ్శ్రేయసము. సంసారము, దానికి కారణమైన అజ్ఞానము సమూలంగా నశించడమే మోక్షము **(నిశ్రేయసమ్, సహేతుకస్య సంసారస్య అత్యన్త ఉపరమ లక్షణమ్).**

ఏమి చెయ్యాలో చెప్పేది ప్రవృత్తి. ఎలా ఉండాలో చెప్పేది వేదోక్తమైన ధర్మద్వయమే ప్రవృత్తి నివృత్తులు. విధి విధానాలు, కర్మోపాసనల ద్వారా జ్ఞానానికి సిద్ధం నివృత్తి. ప్రవృత్తి కర్మమార్గము. నివృత్తి జ్ఞానమార్గము. జ్ఞానమును ప్రసాదించి స్వరూప స్థితిలో నిలిపే నివృత్తి లక్షణ ధర్మం చేసే ప్రవృత్తి లక్షణ ధర్మం కర్మమార్గము. జ్ఞానమార్గము. ఈ రెండే వేదము ప్రతిపాదించే ధర్మద్వయం.

కర్మకు ప్రాప్తించే కర్మఫలం కూడా అనిత్యమే. కనుక మోక్షము కర్మఫలం కాదు. కర్మ అనిత్యం. అనిత్యమైన అనిత్యమైన కర్మ ద్వారా నిత్యమైన ఆత్మను పొందడం అసంభవం **(న హ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్).** గురువు ప్రసాదించే జ్ఞానాన్ని గ్రహించడానికి జ్ఞానం వల్లనే మోక్షం సిద్ధిస్తుంది. జ్ఞానం గురువు ద్వారానే ప్రాప్తిస్తుంది. కర్మయోగము ద్వారా శుద్ధిపడిన తరువాత బుద్ధి శుద్ధి పడి ఉండాలి. ఈ చిత్తశుద్ధి కర్మయోగం వల్ల సిద్ధిస్తుంది.

ముముక్షువు జ్ఞాననిష్ఠకు అర్హు డవుతాడు **(కర్మజా సిద్ధిః జ్ఞాననిష్ఠా యోగ్యతా లక్షణా)**. మోక్షం జ్ఞానరూపంలో ఉంది కనుక ఆత్మజ్ఞానాన్ని పొంది ముక్తు డవుతాడు. శోకాన్ని దాటి పోతాడు **(తరతి శోక మాత్మవిత్ - ఛాందోగ్యోపనిషత్)**.

వేద ప్రతిపాదితమై నిష్ఠాద్వయంగా చెప్పబడుతున్న ప్రవృత్తి నివృత్తి మార్గాలనే గీత కూడా బోధిస్తూ ఉంది. ఉపాయమైన కర్మయోగమును సాధనగా, ఉపేయమైన జ్ఞానయోగమును సాధ్యముగా నిర్ణయిస్తూ నిష్ఠా ద్వయాన్ని గీత బోధిస్తూ ఉంది.

గీతా వ్యాఖ్యానాలు - శ్రీ శంకర భాష్యము

భగవద్గీతపై అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇంకా వెలువడు తున్నాయి. ఈ భాష్యాలలో ప్రముఖ మైనది, ప్రాచీన మైనది శ్రీ ఆదిశంకరాచార్యస్వామి రచించిన భాష్యము.

శ్రీ శంకరులకు పూర్వము కూడా భగవద్గీతకు వ్యాఖ్యానము వ్రాసిన వారు ఉన్నారు. అవి గీతా హృదయాన్ని ఆవిష్కరించ గలిగి ఉంటే, శ్రీ శంకరులు గీతకు భాష్యం వ్రాసి ఉండే వారు కారు.

వాస్తవం చెప్పాలంటే, అవి యథావత్ గీతా హృదయాన్ని ఆవిష్కరించక పోగా, వక్ర భాష్యాన్ని కూడా వినిపించాయి. అందుచేత ఆచార్యుల వారు గీతాభాష్యానికి శ్రీకారం చుట్ట వలసి వచ్చింది.

ఆచార్యుల వారికి పూర్వము బోధాయనుడు అనే వ్యక్తి గీతకు వ్యాఖ్యానము రచించాడు. అతనిని వృత్తికారుడు అని కూడా అంటారు. అతడు జ్ఞానకర్మ సముచ్చయ వాదాన్ని ప్రతిపాదించాడు.

ప్రవృత్తి నివృత్తులను గూర్చి ఇప్పుడే మనం సంక్షేపంగా చెప్పుకున్నాం. గ్రంథంలో మున్ముందు సహేతుక మైన తర్కంతో విస్తారంగా చర్చించడం మీరు చూస్తారు.

ప్రస్తుతం మనం చూచి నంత వరకు కర్మయోగ, జ్ఞానయోగాల మధ్య సాధన సాధ్య సంబంధాన్ని చూశాం. ఉపాయ ఉపేయ సంబంధంగా అర్థం చేసుకున్నాం. జ్ఞానం ద్వారానే మోక్షం ప్రాప్తిస్తుంది. మోక్షానికి జ్ఞానమే సాధనం **(జ్ఞాన మేవ సాధనం)**. జ్ఞానప్రాప్తికి అంతఃకరణ శుద్ధి అవసరం కనుక, దానికి కర్మయోగము సహకరిస్తుంది. ఉపకరిస్తుంది. ఇదీ ఉన్న విషయం.

వృత్తికారుడు ప్రతిపాదించే జ్ఞానకర్మ సముచ్చయము విచిత్రమైన వాదము. కర్మ, జ్ఞానము కలిసే మోక్షాన్ని ఇస్తాయి అనేది బోధాయనుని అభిప్రాయము. జ్ఞానకర్మలు రెండిటిని ఒకే మనిషి ఒకే కాలంలో ఆచరించడం సాధ్య పడదు. కారణం, అవి గతి - స్థితుల వలె పరస్పర విరుద్ధ మైనవి.

ఒకే కాలంలో ఒకే వ్యక్తి నడవాలి - నడవకుండా నిలబడాలి (గతి - స్థితి) అంటే సాధ్యమేనా? ఇంత అశాస్త్రీయ మైన విషయం వృత్తికారుడికి వంట బట్టింది. పోనీ, అది అతని అభిప్రాయం అని సరిపెట్టు కుందాము అంటే, అదే గీతాహృదయ మని వ్యాఖ్యానిస్తూ, గీతకు జ్ఞానకర్మ సముచ్చయ వాదాన్ని అంట గట్టాడు. వృత్తికారుని మతాన్ని గీతాభాష్యంలో అనేక చోట్ల నామ ప్రసక్తి లేకుండా ఆచార్యుల వారు నిశితంగా ఖండించారు.

తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థ
సార సంగ్రహ భూతమ్ దుర్విజ్ఞేయార్థం

ఈ గీతాశాస్త్రము సమస్త వేదార్థ సార సంగ్రహ భూతమై ఉన్నందున, దాని అర్థాన్ని యథావత్ గ్రహించడం సులభసాధ్యం కాదు. చాలా కష్టమైన కార్యము అంటూ భాష్య పీఠిక లోనే ఆచార్యులు వ్యాఖ్యానించారు.

నేను ముందుగానే తెలియ చేసినట్లు, పూర్వ వ్యాఖ్యానాలు ఉండగా, మళ్ళీ ఆచార్యుల వారు భాష్యాన్ని ఎందుకు రచించారు? అనేది పూర్వపక్షము.

వ్యాఖ్యానాలు ఉండినా, అవి విరుద్ధ భావాలను వ్యక్తం చేయడం వల్ల, వాటిని పఠించే వారు విరుద్ధ భావాలను గ్రహించడమే గాక, ఆ విరుద్ధ భావాలు గీత లోనే ఉన్నాయని కొందరు అంటూ ఉండటం వినిన ఆచార్యులు, ఈ విరుద్ధార్థ గ్రహణాన్ని నివారించి, స్పష్టమైన అర్థాన్ని ఋజుమార్గంలో అందించ డానికి భాష్యాన్ని వ్రాయవలసి వచ్చింది అని స్వయంగా చెప్పడం జరిగింది **(అహం వివేకతః అర్థ నిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి)**.

ఆప్త ప్రణీతము

గ్రంథ విషయము విస్పష్టంగా, సులభగ్రాహ్యంగా ఉంటే, దానిని వ్యాఖ్యానించ నవసరం లేదు. మూల గ్రంథము లోని విషయాన్ని గ్రహించడం దుస్సాధ్య మైనపుడే దానికి వ్యాఖ్యానము అవసరమై ఉంటుంది.

మూలానికి వ్యాఖ్యానము తోడై నపుడు విషయం స్పష్టమై సులభగ్రాహ్యం కావాలి. అలా విషయాన్ని సులభ తరం చేసే విధంగా వ్యాఖ్యానించా లంటే వ్యాఖ్యాత ఆప్తుడై ఉండాలి. అతని వ్యాఖ్యానము ఆప్తప్రణీతంగా ఉండాలి.

ఆప్తుడు అంటే యథార్థమును వచించు వాడు అని అర్థము. ప్రామాణికుడు అని భావము. ప్రమాణ విషయాన్ని విడిచి పెట్టకుండా, అప్రమాణ విషయాలను జోడించకుండా విషయాన్ని ఉన్నదున్నట్లు సుస్పష్టంగా అందించ గలిగే వాడు ఆప్తుడు. అట్టివాడు రచించే వ్యాఖ్యానమును ఆప్త ప్రణీతము అంటారు.

వ్యాఖ్యానము ప్రామాణికంగా ఉన్నప్పుడే అది ఆప్త ప్రణీత మవుతుంది. అలా ప్రామాణికంగా ఉండాలి అంటే, అది పంచ లక్షణాయుతంగా ఉండాలి.

పదచ్ఛేదః పదార్థోక్తిః
విగ్రహో వాక్య యోజనా,
ఆక్షేపస్య సమాధానం
వ్యాఖ్యానం పంచలక్షణమ్,

ప్రామాణిక మైన వ్యాఖ్యానమునకు అయిదు లక్షణాలు ఉండాలి. (1) పదచ్ఛేదము, అంటే పదములను విడగొట్టడము (2) పదార్థోక్తి, అంటే పదముల యొక్క అర్థమును చెప్పడము. (3) విగ్రహము, అంటే సమాసగత పదాలను విడదీసి అర్థము చెప్పడము (4) వాక్యయోజనము, అంటే వాక్యానికి సుస్పష్టంగా అర్థం చెప్పడము (5) ఆక్షేపస్య సమాధానం, అంటే ఆక్షేపానికి సమాధానం చెప్పడము. ఈ అయిదు లక్షణాలు ఉన్నప్పుడే వ్యాఖ్యానము ప్రామాణిక మవుతుంది. అట్టి వ్యాఖ్యానమునే ఆప్త ప్రణీతముగా విజ్ఞులు గ్రహిస్తారు.

ఇక భగవద్గీత విషయానికి వస్తే, మూలగ్రంథము సమస్త వేదార్థ సార సంగ్రహభూత మైనందున, అది దుర్విజ్ఞేయమై కష్టసాధ్యంగా ఉన్నందున వ్యాఖ్యాన యోగ్యమై ఉంది.

శ్రీ శంకరులకు పూర్వులైన వ్యాఖ్యానకర్తలు భగవద్గీతను వ్యాఖ్యానించి ఉన్నప్పటికీ, ఆచార్యులు భాష్యాన్ని అందించారు అంటే, పూర్వ వ్యాఖ్యానాలు పంచ లక్షణాయుతంగా లేవా? వ్యాఖ్యాన లక్షణాలను విస్మరించాయా? కాదు. వారు కూడా వ్యాఖ్యాన లక్షణాలను అనుసరించే వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని భాష్యంలో శ్రీ శంకరులే అంగీకరించారు. అయినా, ఆచార్యుల వారు భాష్యం వ్రాయవలసి వచ్చింది. కారణ మేమిటో భాష్య పలుకు ల్లోనే విందాం.

తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థ సార సంగ్రహ భూతం దుర్విజ్ఞేయార్థం। తదర్థా విష్కరణాయ అనేకైః వివృత పద పదార్థ వాక్యార్థ న్యాయ మపి అత్యన్త విరుద్ధ అనేకార్థత్వేన లౌకికైః గృహ్యమానం ఉపలభ్య అహం వివేకతః అర్థ నిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి !

'సమస్త వేదార్థ సార సంగ్రహ భూతమైన గీతాశాస్త్రం యొక్క అర్థాన్ని యథావత్ గ్రహించడం సులభమైన విషయం కాదు; పైగా చాలా కష్టతరం కూడా. అందుచేత, పంచ లక్షణ వ్యాఖ్యాన న్యాయాన్ని అనుసరిస్తూ, పదచ్ఛేదము, పదార్థోక్తి, విగ్రహము, వాక్యార్థము (వాక్య సమన్వయము), ఆక్షేపమునకు సమాధానమును ఇస్తూ కొంత మంది వ్యాఖ్యానించి ఉన్నారు. అయినప్పటికీ, ఆ వ్యాఖ్యానాలు విరుద్ధమైన అనేక అర్థాలతో కూడి ఉన్నందున, అజ్ఞానులు ఆ విరుద్ధమైన అర్థాలను గ్రహించి, గీత లోని భావాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి అని చెప్పుకుంటూ ఉండటం విని, ఏ విధమైన వైరుధ్యానికి అవకాశం ఇవ్వకుండా విషయాన్ని సుస్పష్టం చేయడానికి సంక్షేపంగా వివరిస్తూ వ్యాఖ్యానిస్తాను' అని ఉపోద్ఘాతం లోనే స్పృశించారు.

స్వాభిప్రాయం

మూల విషయానికి సంబంధించిన అర్థాన్ని సుస్పష్టం చేయడం లోనే వ్యాఖ్యాన ప్రాధాన్యత ఉంటుంది. ఎవరైనా **మార్జారీ** అన్న పదానికి ఆడపిల్లి అనే అర్థాన్ని గ్రహించకుండా, **శునీ** అంటూ ఆడకుక్క అని అర్థం చెప్పారనుకోండి, ఇక ఆ తరువాత, 'మార్జారీ, అంటే ఆడపిల్లి విశ్వాసం కలది, ఇంటిని కాపలా కాస్తుంది, గొప్ప ఆఘ్రాణ శక్తి కలది' అంటూ అప్రస్తుత అనర్థ వ్యాఖ్యానాన్ని అందించడం జరుగుతుంది.

ఇక్కడే శ్రీ శంకర భాష్యము అప్రణీతమై అలరారుతోంది. గీత లోని మూలాన్ని ఎక్కడి కక్కడ పద బంధాలను విడగొట్టి, సంప్రదాయ గాడిలో నిలిచి, అర్థాన్ని సుస్పష్టం చేయడంలో శ్రీ శంకరులు అనితర సాధ్యమైన అసమాన ప్రతిభను ప్రదర్శించారు.

బుధులు విభేదించి మరో విధంగా భావించరనే విశ్వాసంతో నా మనస్సు లోని మాట చెబుతున్నా!

భాష్యకారులుగా ఆచార్యుల వారి వైభవాన్ని
తిలకించి పులకించి పరవశించాలంటే,

కదలి కెరటాల వలె ఎగసి పడే
వాదనల వీణానాద విలసనములతో,
ప్రచండ డిండిమ ధ్వనుల వలె చిందు లేసే
సశాస్త్రీయ సిద్ధాంత భేరీ నినాదాలతో,
అలౌకిక వాగ్విభూతి వినిపించే
నేపథ్య సంగీత ఝరులకు అనుగుణంగా
తర్క వేదికపై గీర్వాణ సుందరాంగి ప్రదర్శించే
ప్రతిభా వైశిష్ట్య నాట్యకళా వైభవాన్ని
అవలోకించా లనుకుంటే,
పున్నమి జాబిల్లి పాలవెల్లిపై వెన్నెల పారబోసినట్లు
ప్రసన్న గంభీరమై శోభించే గీతాభాష్యం కన్నా,



ఆచార్యుల వారి ఉపనిషద్భాష్యాలను,
ముఖ్యంగా సూత్ర భాష్యాన్ని దర్శించాలి. పఠించాలి.
జ్ఞాన మార్తాండులైన ఆచార్యుల వాగ్వైభవ వేడికి
సంశయ జలనిధులు ఇంకిపోతూ ఉండటాన్ని మనం
కళ్ళారా చూడవచ్చు.



సర్వశాస్త్ర జ్ఞాన వైదుష్యం
అసమాన ప్రతిభా పాండిత్యం - అనే రెండు రెక్కలతో
ఆ పరమహంస వేదాంత గగన వీధులలో
చిత్ర విచిత్రంగా విహరిస్తూ ఉంటే,
దర్శించి తరించే బుద్ధిని చూచి
కళ్ళు కలత చెంది ఈర్ష్య పడతాయి.
హృదయం అమృత జ్ఞాన రస తరంగిత మవుతుంది.

అనుబంధము - అనుగ్రహము

సంప్రదాయ ప్రవర్తక ఆచార్య శ్రేష్ఠులైన శ్రీ శంకర భగవత్పాదులు ధర్మద్వయ రూపంతో శోభించే గీతాశాస్త్రం మోక్షమునే ముఖ్య ప్రయోజనంగా కలిగి, వాసుదేవ పరబ్రహ్మమును ప్రధానంగా ప్రతిపాదిస్తూ ఉన్నందున, గీతా శాస్త్రం యొక్క యథార్థ జ్ఞానం కలిగితే సర్వ పురుషార్థములు మానవాళికి సిద్ధిస్తా యనే సత్య సంకల్పంతో గీతకు వ్యాఖ్యానాన్ని అందిస్తున్నట్లు భాష్య ఉపక్రమణిక అంతిమ వాక్యంలో తమ మనస్సు లోని మాటను స్పష్టం చేశారు.

యతః తదర్థే విజ్ఞాతే సమస్త పురుషార్థ సిద్ధిః
ఇత్యతః తద్వివరణే యత్నః క్రియతే మయా!

గీతాశాస్త్ర జ్ఞానము సమస్త పురుషార్థ సిద్ధిప్రదం
ఆ కారణంగా సాగిన ప్రయత్నమే నా ఈ వివరణం - అన్నారు ఆచార్యులు.

మోక్ష ప్రయోజనము ప్రధానమైంది కనుక, సంప్రదాయమును అనుసరించి గీతాశాస్త్రము అనుబంధ చతుష్టయముతో శోభించాలి. విషయ ప్రయోజన సంబంధాధికారులను కలిగి ఉండాలి. అప్పుడే శాస్త్రము వ్యాఖ్యాన యోగ్య మవుతుంది.

విషయము :- ప్రతిపాద్య విషయము వాసుదేవు డనే పేరు గల పరబ్రహ్మము. పరబ్రహ్మమే అభిధేయము లేదా విషయము **(వాసుదేవాఖ్యం పరంబ్రహ్మ అభిధేయ భూతం).**

సంబంధము :- మోక్ష రూపమైన ఫలానికి, గీతాశాస్త్రానికి ధర్మద్వయం ద్వారా (ప్రవృత్తి నివృత్తి రూప కర్మజ్ఞానాలకు) సాధ్యసాధన సంబంధం ఉక్తం. అదే విషయ విషయి భావ సంబంధము.

అధికారి :- పరమ పురుషార్థమైన మోక్షమును అర్థించు జిజ్ఞాసువు అధికారి. అతడే ముముక్షువు.

ప్రయోజనము :- గీతా శాస్త్రమునకు మోక్షమే సాక్షాత్తు ప్రయోజనము.

ఈ విధంగా విషయ, ప్రయోజన, సంబంధాధికారులను అనుబంధ చతుష్టయముగా కలిగి ఉన్నందున గీతా శాస్త్రము సంప్రదాయ సిద్ధమై వ్యాఖ్యాన యోగ్యతను సంతరించు కున్నది.

గీతా వ్యాఖ్యానాలు

భగవద్గీతా వ్యాఖ్యానాలలో శ్రీ ఆదిశంకరాచార్యస్వామి వారి భాష్యమే ప్రాచీన మైనది, ప్రముఖ మైనది అని ఇప్పటికే చెప్పుకున్నాం. ఆచార్యుల వారి మార్గమును అనుసరిస్తూ, వారి తరువాత అనేక భాష్య వ్యాఖ్యానాలు వెలుగు చూశాయి. అలాగే, ఆచార్యుల వారి మార్గముతో విభేదిస్తూ మరి కొన్ని వ్యాఖ్యానాలు వచ్చాయి.

రెండవ కోవకు చెందినవి నా బుద్ధికి రుచించ నందున నేను వాటిని ప్రస్తావించడం లేదు. ఆచార్యుల వారి బాటలో నడచినవి, ఆచార్యుల వారి భాష్యంతో విభేదించనివి, ముఖ్యంగా నన్ను ప్రభావితం చేసిన కొన్ని వ్యాఖ్యానాలను సంక్షేపంగా వివరిస్తాను. ఇవన్నీ సంస్కృత వ్యాఖ్యానాలే.

(1) గీతా తాత్పర్య బోధిని

ఇది భగవద్గీతకు సుందరమైన, సరళమైన సంస్కృత వ్యాఖ్యానము. వ్యాఖ్యాత శ్రీ శంకరానంద యతీంద్రులు. వీరు వేదాంత పంచదశి, అనుభూతి ప్రకాశిక మొదలైన అద్వైత గ్రంథములను రచించిన శ్రీ విద్యారణ్యస్వామి వారి గురుదేవులు.

శ్రీ శంకరానంద మునీంద్రులు 'గీతా తాత్పర్యబోధిని' వ్యాఖ్యానమును ఆరంభిస్తూ చేసిన గురు దేవతా స్తోత్రములలో స్వగురు స్తుతిని బట్టి చూస్తే వీరు ఆనందాత్మ సరస్వతీ స్వాముల వారి శిష్యులని తెలుస్తూ ఉంది.

భక్త్యా ప్రణమ్య స్వగురుం
ఆనందాత్మ సరస్వతీమ్ !
క్రియతే శ్రీమద్భగవ
ద్గీతా తాత్పర్య బోధినీ ॥

మద్గురువరేణ్యు లైన శ్రీ ఆనందాత్మ సరస్వతికి భక్తితో ప్రణామము లర్పించి, శ్రీమద్భగవద్గీతకు 'గీతా తాత్పర్య బోధిని' అనే వ్యాఖ్యానాన్ని రచిస్తున్నాను అని ప్రార్థనా శ్లోకంలో స్తుతించారు.

'గీతా తాత్పర్యబోధిని' రచయిత లైన శ్రీ శంకరానంద యతివరేణ్యులు అద్వైత సంప్రదాయక ప్రవర్తక గురువు లైన ప్రముఖులలో ఒకరు. 'గీతా తాత్పర్యబోధిని' వ్యాఖ్యానమునే గాక, వేదాంత ప్రపంచానికి సుపరిచిత మైన 'ఆత్మపురాణము'ను రచించిన గ్రంథకర్త కూడా వీరే.

వీరి గీతా వ్యాఖ్యాన మంతా అద్వైతపరం గానే సాగుతుంది. సుప్రసిద్ధమైన ఈ వ్యాఖ్యానము అనితర సాధ్యంగా భాసిస్తుంది. కానీ, వీరికి జ్ఞానము నందే అభిలాష మెండు. భక్తి విషయంలో వైరుధ్యము లేకపోయినా, ఆసక్తిని మాత్రం పెద్దగా ప్రదర్శించరు.

(2) గూఢార్థ దీపిక

సుప్రసిద్ధ మైన గీతా వ్యాఖ్యానములలో 'గూఢార్థ దీపిక' కూడా విశిష్ట మైనదిగా కీర్తింప బడింది. దీని వ్యాఖ్యాత శ్రీమధుసూదన సరస్వతీ స్వాముల వారు.

శ్రీ శంకరాచార్యస్వామి భాష్యమును అనుసరిస్తూ వీరి వ్యాఖ్యానము సాగుతుంది. వేదము ఎలా కాండ త్రయాత్మకంగా ఉందో, భగవద్గీత కూడా కర్మ, భక్తి, జ్ఞాన క్రమంలో కాండత్రయాత్మకంగా శోభిస్తూ

వేదమునకు ప్రతిరూపమై భాసిస్తూ ఉందని వ్యాఖ్యానించారు. శ్రీ శంకరానందుల వారు భక్తిని స్పృశించకుండా జ్ఞానపరం గానే వ్యాఖ్యను నడుపుతారు. మధుసూదన సరస్వతి భక్తిని స్పృశించకుండా వ్యాఖ్యానాన్ని సాగించ లేరు. ఇదే వీరిరువురి వ్యాఖ్యానములలో మనకు స్పష్టంగా కనిపించే అంతరము.

'అద్వైత సిద్ధి' అనే అద్భుతమైన అద్వైత గ్రంథము శ్రీ మధుసూదన సరస్వతుల వారి కృతియే. వీరు గొప్ప కృష్ణ భక్తులు. వీరిలో భక్తి జ్ఞానాలు అపూర్వ సమ్మేళనంగా కనిపిస్తాయి.

(3) సుబోధినీ వ్యాఖ్య

ఇది శ్రీధరస్వామి రచించిన వ్యాఖ్యానము. భక్తి భావ బంధురమైన శ్రీధరుని 'సుబోధినీ' వ్యాఖ్య ప్రసన్నంగా సాగింది. భాష్యకారుల అభిప్రాయాలతో పాటు, భాష్య వ్యాఖ్యాతల భావాలను కూడా పొదల దాల్చి గీతా వ్యాఖ్యానమును కొనసాగిస్తున్నట్లు శ్రీధరస్వామి ఉపక్రమణిక లోనే తెలియ చేశారు. లక్ష్మీ సమేతుడైన శ్రీమహావిష్ణువును, పార్వతీనాథు డైన విశ్వేశ్వరుని భక్తితో నమస్కరించి, ఆ విధమైన భక్తి చేత ప్రేరితుడై సుబోధినీ గీతా వ్యాఖ్యానమును రచిస్తున్నట్లు ప్రార్థనా శ్లోకాల లోనే తెలిపి, శివకేశవుల మధ్య అభేదమే దర్శనీయ మని స్పష్టం చేశారు.

భక్తి వలన భగవ దనుగ్రహం ప్రాప్తిస్తుందని, భగవ దనుగ్రహము చేత కలిగిన ఆత్మజ్ఞానము వలన సుఖంగా బంధ విముక్తి, మోక్షప్రాప్తి కలుగుతుం దని, ఇదే గీతార్థ సంగ్రహ మని తన అభిప్రాయాన్ని సుబోధినీ వ్యాఖ్యానంలో ఒక్క శ్లోకం లోనే తేట పరిచారు.

భగవ ద్భక్తి యుక్తస్య
త త్ప్రసాదా దాత్మబోధతః
సుఖం బంధ విముక్తిః స్యాత్
ఇతి గీతార్థ సంగ్రహః

భగవద్భక్తి కల వానికి భగవ దనుగ్రహముచే ప్రాప్తించిన ఆత్మజ్ఞానం వల్ల సుఖంగా బంధ విముక్తి కలుగుతుంది అనేది గీతార్థ సంగ్రహము. ఇది శ్రీధరస్వామి అభిప్రాయము.

(4) భారత భావ దీపము

శివాద్వైతు లైన శ్రీ నీలకంఠాచార్యుల వారు రచించిన గీతా వ్యాఖ్యానమును 'భారత భావదీపము' అంటారు. ప్రామాణికంగా సాగిన వీరి వ్యాఖ్యానము భావగర్భితంగా సాగడమే గాక, అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్హేతుక సిద్ధాంతాలను సున్నితంగా తిరస్కరిస్తూ కూడా సాగుతుంది.

రెండవ అధ్యాయం - పదమూడవ శ్లోకం దేహినోఽ స్మిన్ యథా దేహే అనే శ్లోకం పై వ్యాఖ్యానిస్తూ,

వ్యావృత్తేభ్యోఽ ను వృత్తం
భిన్నం కుసుమేభ్యస్సూత్ర మివ,

పరస్పరం భిన్నమైన పుష్పముల యందు అనువృత్త మైన దారము పువ్వుల కన్నా వేరు అయినట్లు, దేహాంతర ప్రాప్తిః - స్థూల శరీరం కన్నా వేరైనట్టి స్థూలానుకారు లగునట్టి సూక్ష్మ దేహములు జీవునికి సంభవిస్తాయి అనే విషయాన్ని విస్తరించి చెబుతూ, అనిత్యములు, అవిభువులు అయిన శరీరాదులకు ఆత్మత్వము సంభవించడం అసంభవం కనుక చార్వాకాది మతాలు నిరస్తములు అని నిర్ధారణ చేస్తారు.

(5) పరమార్థ ప్రపాఖ్య

దైవజ్ఞ పండిత సూరి రచించిన గీతా వ్యాఖ్యానమే 'పరమార్థ ప్రపాఖ్య'. వీరు కృష్ణ భక్తులు. తమ గురువైన చతుర్వేద స్వామి నుండి గ్రహించిన జ్ఞాన ప్రసాదమును ప్రామాణికంగా అందించాలనే కుతూహలంతో గీతా వ్యాఖ్యానమును రచిస్తున్నట్లు, ఈ వ్యాఖ్యానము అల్పజ్ఞులైన వారికి కూడా ఆనందాన్ని ప్రసాదిస్తుంది అని వాగ్దానం చేశారు.

భగవ దనుగ్రహము నందు వీరికి అచంచల మైన విశ్వాసము. సముద్రాన్ని పుడిసిట పట్టే శక్తి అగస్త్య మహర్షికి, భూమాతను పడగలపై నిలిపే శక్తి ఆదిశేషునికి, దహించే శక్తి అగ్నికి, వర్షించే శక్తి మేఘునికి, ప్రకాశించే శక్తి సూర్యునికి, వీచే శక్తి వాయుదేవునికి ఏ లోకాతీత శక్తి స్వరూపుడైన శ్రీకృష్ణుడు అనుగ్రహించాడో, ఆ దివ్యాత్ముడైన యశోదా కిశోరుడే తనలో అంతర్యామిగా అతి సమీపమున సర్వోత్కర్షముగా ప్రకాశిస్తూ, తన చేత గీతా వ్యాఖ్యానాన్ని వ్రాయిస్తున్నాడు అని నివేదించు కున్నారు దైవజ్ఞ పండిత సూరి. గీతా వ్యాఖ్యానాలలో 'పరమార్థ ప్రపాఖ్య' కూడా తన కంటూ ఒక స్థానాన్ని పదిలం చేసుకుంది.

ఇవన్నీ అద్వైత పరంగా సాగిన వ్యాఖ్యానాలే. ఇవే గాక, మరెన్నో, ఎన్నెన్నో చెప్పుకో దగిన గీతా వ్యాఖ్యానాలు అసంఖ్యాకంగా ఉన్నాయి.

ఆచార్యుల వారి భాష్యానికి, ఆచార్యుల వారి శిష్యులలో ఒకరైన ఆనందగిరి ఒక టీకను రచించారు. ఇది శ్రీశంకర భాష్యానికి వివరణములా సాగింది. అదే 'గీతాభాష్య వివేచనము' అనే ఆనందగిరి టీక.

అలాగే శ్రీ మధుసూదన సరస్వతి రచించిన గద్యాత్మక మైన (వచన రూపమైన) 'గూఢార్థ దీపిక' కు శ్రీసదానంద యతీంద్రుల వారు పద్యాత్మకంగా ఒక వ్యాఖ్యను రచించారు. దానిని 'గీతా భావ ప్రకాశము' అంటారు. దీనిని కేవలం శ్రీకృష్ణ పరమాత్మ చరణకమల సేవనముగా రచించి, భగవదర్పణం చేసినట్లు ఆయన చెప్పు కున్నారు.

గీతా భావ ప్రకాశః
శ్రీ సదానందేన నిర్మితః
శ్రీమత్కృష్ణ పదాంభోజ
సేవా ముద్దిశ్య కేవలమ్ - అని శ్రీకృష్ణుని యందు తనకు గల భక్తిని చాటుకున్నారు.

భగవద్గీతపై వెలువడిన సంస్కృత వ్యాఖ్యానాలలో భాష్యోత్కర్ష దీపిక కూడా ప్రసిద్ధ మైనదే. దీనిని ధనపతి సూరి రచించారు. సర్వ శాస్త్ర జ్ఞానఫల మైన మోక్షము గీతా భక్తులకు అనాయాసంగా ప్రాప్తిస్తుంది అని ఫలస్తుతిలో శ్లాఘించారు. నిష్కామ కర్మయోగులకు చిత్తశుద్ధి ఫలం కాగా, తత్త్వ జ్ఞానాధికారికి అన్యాపేక్ష లేని కేవల తత్త్వ దర్శనము వలన మోక్షము ప్రాప్తిస్తుందని గీతాశాస్త్రార్థ సారాన్ని ఆవిష్కరించారు.

శ్రీ బెల్లంకొండ రామరాయ కవి రచించినది భాష్యార్క ప్రకాశము. ఇదొక అద్భుత మైన అద్వైత వ్యాఖ్యానము. వీరు సుమారు వంద పాతికేళ్ళ క్రితం గుంటూరు జిల్లా లోని పమిడిపాడులో ఉండే వారట. వీరు ఆచార్యుల వారి వలె తక్కువ కాలం జీవించారు. ముప్పై ఎనిమిది సంవత్సరాలే బ్రతికారు. సుమారు వందకు పైగా సంస్కృతంలో గ్రంథాలు రచించారు. అవన్నీ అద్భుత మైనవే. వీరి పాండిత్య ప్రతిభను గుర్తించిన పండిత ప్రపంచం వీరిని 'అభినవ శంకరులు' అని కీర్తించింది. ముఖ్యంగా వీరి గీతా వ్యాఖ్యానము జటిల మైనప్పటికీ బహు రసవత్తరంగా, ఆసక్తికరంగా ఉంటుంది. వీరు 'భాష్యార్క ప్రకాశము'లో గీతా వ్యాఖ్యానానికి ఎంత ప్రాధాన్యత నిచ్చారో, విశిష్టాద్వైత ఆచార్యులైన శ్రీమద్రామానుజ భాష్యాన్ని నిశితంగా విమర్శించడానికి కూడా

అంతే ప్రాధాన్యత నిచ్చారు. అలాగే శ్రీ వేదాంత దేశికులు అద్వైతం పై లేవనెత్తిన ఆక్షేపణలను కూడా తీవ్ర స్వరంతో ఖండించారు. వీరు గొప్ప రామభక్తులు. హయగ్రీవోపాసకులు.



భగవద్గీతకు భాష్యా లెన్నున్నా
వెల్లువలై వ్యాఖ్యలు దొర్లి వచ్చినా
అధ్యయనాని కైనా, అనుభూతి కైనా
శాంకర భాష్యమే అసమాన ప్రదీపము.

అవి మాటలు కావు, మంత్రాలు
పలుకులు కావు, ప్రమాణాలు
వాక్యాలు కావు, వాగ్దేవి రూపాలు
అనుసరించే వారికి శాంతితీరాలు.

గీతా దర్శనము

యఉపనిషత్సు ధర్మాః
తే మయి సన్తు ! తే మయి సన్తు !

ఉపనిషత్తుల అనంత జ్ఞానము తమ హృదయాలలో సుస్థిరంగా ఆవిష్కరింప బడాలని ఎంతో కాలంగా ఎందరు తపించారో,

వారందరి కలల పంటగా, ప్రార్థనల ఫలంగా మహాభారతము పంచమవేదంగా అవతరించింది (భారతం పంచమో వేదః). వేద ధర్మాలను, ఉపనిష ద్రహస్యాలను ఒడి గట్టుకొని మరీ అవతరించింది. ఈ మహత్కార్యాన్ని సామాన్యులు సాధించ గలరా? అందుకే సాక్షాత్తు వేదనారాయణమూర్తి వేదవ్యాసుని రూపంలో అవతరించి ఆ మహత్కార్యాన్ని పూర్తి చేశాడు.

కో హ్యన్యః పుండరీకాక్షాత్
మహాభారత కృద్భవేత్ !

పద్మనయనుడైన పరమేశ్వరుడు తప్ప
కాగలడా మరొకడు మహాభారత కర్త?

విశ్వంలోని రూపా లన్నిటినీ మనం రెండు కళ్ళతో చూస్తున్నాము. అలాగే విశ్వనాథుని స్వరూపాన్ని దర్శించడానికి మహాభారతము రెండు దివ్య చక్షువులతో శోభిస్తూ ఉంది. అందుచేతనే మహాభారత జ్ఞాన కమలము కలిమల హరణమే గాక ముక్తి ప్రదాయకమై అలరారుతోంది (భూయాద్భారత పంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే !). మహాభారత జననికి సర్వదర్శన యోగ్యంగా శోభిస్తున్న ఆ నేత్రద్వయం వల్ల భారతము సర్వ శ్రేష్ఠత్వాన్ని సంతరించుకుంటే, సర్వేంద్రియాలలో నేత్రాలే ప్రధానం కనుక, మహోన్నతమైన మహాభారత గ్రంథంలో ఆ నేత్రద్వయం సర్వోన్నతమై శోభిస్తోంది. ఒకటి, భగవద్గీత; రెండు, విష్ణుసహస్రనామం.

భారతం సర్వ శాస్త్రేషు
భారతే గీతికా వరా!
విష్ణో స్సహస్ర నామాపి
జ్ఞేయం పాఠ్యం చ తద్ద్వయమ్ !

సర్వ శాస్త్రములలో మహాభారతము శ్రేష్ఠ మైనది. భారతములో భగవద్గీత శ్రేష్ఠ మైనది. అలాగే విష్ణుసహస్రనామం కూడా. ఈ రెండిటిని సర్వులు తెలుసుకోవాలి. పఠించాలి. గీతను అర్థం చేసుకోవాలి. విష్ణుసహస్రనామాన్ని అవగాహనతో పఠించాలి.

గేయం గీతా నామ సహస్రం
ధ్యేయం శ్రీపతి రూప మజస్రమ్ !

భగవద్గీతను నిత్యము అధ్యయనం చేయాలి. విష్ణుసహస్రనామాన్ని సదా పఠించాలి. ఈ రెండిటి వల్ల ప్రాప్తించే జ్ఞానంతో పరమేశ్వరుని ధ్యానించాలి, దర్శించాలి అని ఆచార్యుల వారి 'భజగోవిందం'.

విశ్వశాంతి ప్రదాయకం

విశ్వశాంతి నినాదంతో నేటి ప్రపంచం ప్రతిధ్వనిస్తూ ఉంది. అరచి అరచి నోళ్ళు అలసి పోతున్నాయి. పలికి పలికి మాటలు మూగ బోతున్నాయి. అంతా అలజడే. అన్నిచోట్ల అశాంతే. అందరిలో ఆవేదనే. మానవ సమాజ మంతా సమస్యలే. సంఘర్షణలే. విశ్వశాంతి అనేది అరుపులకు చిక్కేది కాదు, అవగాహనకు మాత్రమే దక్కేది.

విశ్వశాంతి వ్యక్తిశాంతిపై ఆధారపడి ఉంది. మనిషికి ఆనందం కావాలి. తృప్తి కావాలి. దేశకాలాలకు పరిమితం కాని ఆనందం కావాలి. అనంతానందం కావాలి. అది లభించే వరకు వ్యక్తికి సమస్యలు తీరవు; సంఘర్షణలు తప్పవు.

కురుక్షేత్రంలో అర్జునుడు శ్రీకృష్ణుని ముందు ఒకనాడు ఈ సమస్యనే ఉంచాడు. రాజ్యసుఖాలు, స్వర్గభోగాలు సైతం అందించలేని నిరవధిక సుఖాన్ని, అనంతానందాన్ని ఆశిస్తూ ప్రశ్నించాడు. మానవు లందరి సమస్య ఇదే కనుక, సర్వమానవాళి తరపున ప్రతినిధిగా అర్జునుడు ప్రశ్నించాడు.

సర్వలోకాను గ్రహార్థం అర్జునం
నిమిత్తీ కృత్య ఆహ భగవాన్ వాసుదేవః

సర్వ మానవాళిని అనుగ్రహించుటకు అర్జునుని నిమిత్తమాత్రంగా ఉంచుకొని, వాసుదేవ భగవానుడు భగవద్గీతను బోధించాడు.

గీత అర్జునుని సమస్యను పరిష్కరించింది
నీ, నా సమస్యలను కూడా పరిష్కరిస్తుంది
అన్ని కాలాలకు, అందరు వ్యక్తులకు, అన్ని దేశాలకు
ఉపకరించే అమృత సందేశమే శ్రీమద్భగవద్గీత.

భగవద్గీత ఎవరో కొందరికి మాత్రమే ఉపయోగపడే మత గ్రంథము కాదు. సర్వులను అక్కున చేర్చుకొని ఉద్ధరించే అమృత భాండము. అందుకే గీత విశ్వసందేశమై అలరారుతుంటే, గీతాచార్యుడు విశ్వపూజితుడై శోభిస్తున్నాడు.

సారథ్య మర్జున స్యాదౌ
కుర్వన్ గీతామృతం దదౌ,
లోక త్రయోపకారాయ
తస్మై కృష్ణాత్మనే నమః॥

అర్జునుని రథాన్ని నడిపే బాధ్యతను ఒక వైపు నిర్వహిస్తూ, మరో వైపు ముల్లోకాలకు ఉపకారం చేయాలనే సంకల్పంతో గీతామృతాన్ని పంచిన శ్రీ కృష్ణ పరమాత్మకు నమస్కారము.

సమస్యల వలలో చిక్కుకొని సతమత మవుతున్న అర్జునుడు గీతాచార్యుని ఆశ్రయించాడు. గీతను ఆలకించాడు. సర్వ సమస్యల నుండి, సమస్త సందేహాల నుండి విడి వడ్డాడు. సంతుష్టాంతరంగ చిత్తుడై శోభించాడు.

ఎక్కడా ప్రాప్తించని శాంతిని గీత ప్రసాదిస్తుంది
ఎవరూ అందించలేని ఆనందాన్ని గీత అనుగ్రహిస్తుంది
క్షోభను తొలగిస్తుంది. శోభను కలిగిస్తుంది.

నేటి పరిస్థితి : కాదు, దుస్థితి

గీత అరుదెంచి అయిదు వేల సంవత్సరా లైంది. మన మధ్యకు వచ్చిన గీత మనతో ఉన్నదే గాని మనల్ని విడిచి పెట్టి తిరిగి వెళ్ళ లేదు. గీత మన మధ్యే ఉంది, అయినా ఎందుకనో మన రాతలు మార లేదు.

కల్పతరువు క్రింద ఉన్నవాడు కరువులో కుమిలి పోవడమా?
అమృత భాండాన్ని ముందు పెట్టుకొని దిక్కులేని చావు చావడమా?
నిజమే మరి! ఏం చేద్దాం!
కళ్ళుండినా గ్రుడ్డితనమే!
చెవు లుండినా చెవిటితనమే!

శబ్దాలంకార సొబగులతో శ్రవణ మనోహరంగా మహిత కవితా విభూతిని వినిపిస్తున్నా, ప్రయత్నంతో గట్టిగా చెవులు మూసుకొనే వాణ్ణి ఎవరు మాత్రం ఎలా తృప్తి పరచ గలరు?

శ్యామసుందరు డైన ఇందిరేశుని సుందర మృదు పదములు కనుల ముందు కదులుతున్నా, కర్కశంగా కళ్ళు మూసుకొనే వాణ్ణి ఎవరు మాత్రం ఎలా కాపాడగలరు?



అన్నీ బాగానే ఉన్నాయి
అల్లుడే మరో విధంగా ఉన్నాడు.

ఆరగించిన వానికి ఆకలి తెలియదు
గీతను అర్థం చేసుకుంటే అశాంతి మిగలదు.

గీత ఎందుకు ఉన్నదో, ఏం చెబుతున్నదో
అర్థం గాక కొందరు పాడై పోయారు.

గీతార్థాన్ని శ్రీ శంకరాది మహాత్ములు
పని గట్టుకొని హృదయాలకు పట్టించినా
అపార్థాలతో, అనుమానాలతో
దారి తప్పి మరి కొందరు పాడై పోయారు.

పాడైన వ్యక్తుల్ని నింపుకున్న సమాజం ఎలా బాగుంటుంది? అదీ పాడై పోతుంది. అలా పాడై పోయిన ప్రపంచమే నేడు అశాంతిని ఆరగిస్తూ, కన్నీళ్ళను పానం చేస్తూ ఉంది. శాంతి కావాలని పరితపిస్తూ ఉంది. స్వస్థత చేకూరాలని ఆరాట పడుతూ ఉంది.



ఎవరు ఎందుకున్నారో ఎవరికీ అర్థం గాని పరిస్థితి
ఎవరు ఎటు పోతున్నారో ఎవరికీ తెలియని దుస్థితి
నిర్హేతుక హింసలే నేటి సమాజంలో నియతి
రాక్షస ప్రవృత్తికే ఎటు చూచినా ప్రపంచంలో పరపతి.

మతి లేని ఆలోచనలు
గతి తెలియని గమనాలు
సుగతి ఎంతకూ కలిసి రాదు
దుర్గతి ఎందుకో దూరం కాదు.

అంతా అపసవ్యమే
అంతటా అస్తవ్యస్తమే.

వ్యాకరణం తెలియని వారు భాషను బోధిస్తారు. వైద్యం తెలియని వారు చికిత్సలు చేస్తారు. రాజ్యాంగము తెలియని వారు పరిపాలిస్తారు. జ్ఞానం లేని వారు బోధలు వినిపిస్తారు.

ఎవరు ఎవరినీ నమ్మరు
ఎవరు ఎవరి నైనా వమ్ము చేస్తారు
సొమ్ము చేసుకోవడమే తెలిసిన పని
ఇదే సర్వులను పాలిస్తున్న శని.

ఈ కారు చీకట్ల మధ్య
ఏదో కాంతిరేఖ మెరుస్తోంది.
మరేదో పనికి శ్రీకారం చుట్ట మంటోంది. అది కేవలం పని కాదు. శనిని తొలగించే పని. మునిని తలపించే పని. ఆ పనితనంలో మునితనం ఉంది. అది మామూలు పని కాదు.

ఆర్తుల, దుఃఖార్తుల
న్యాసుల, జిజ్ఞాసువుల కరకమలాలకు జ్ఞాన కమలాన్ని పట్టించే పని.
వినీతుల, విమల మతుల
ముక్తికాముల, మోక్షప్రియుల నేత్ర ప్రమిదలలో చల్లని జ్ఞానవత్తిని వెలిగించే పని.



అభ్యుదయాన్ని జార విడుచుకున్న సమాజానికి
ప్రశాంతతను పోగొట్టుకున్న మానవాళికి
కనువిప్పును కలిగించే కార్యంలో భాగంగా
కురుక్షేత్రాన్ని ధర్మక్షేత్రంగా దర్శింప చేసేందుకు
మానవ మస్తిష్కాన్ని మహిమాన్వితంగా తీర్చి దిద్దేందుకు
పేదవాడికి పైస లిచ్చినట్లు
అన్నార్తుల ఆకలి తీర్చినట్లు
గ్రహాల గమనాన్ని దారి మళ్ళించి
ఆగ్రహాలను సమర్థతతో నిగ్రహించి



నింగిని నేలకు దించి
వంగిన దయను, క్రుంగిన ధర్మాన్ని
నింగిపై నిండుగా నిలిపి
క్షామాన్ని మరపించి, క్షేమంతో మురిపించి
వైరుధ్యాలను అంతం చేసి, వైభవాలను ఆవిష్కరించేందుకు
అందరి చేతులకు గీతను పట్టించాలి.
గీతా జ్ఞానాన్ని బుద్ధి నిండా నింపాలి.

ఇదే తక్షణ కర్తవ్యం
విశ్వశాంతికి ఏకైక మార్గం.

ఇదే జరిగితే,
సూర్యోదయంతో విశ్వంలో తిమిరాలు తొలగినట్లు, గీతా జ్ఞానోదయంతో సమస్త ఉపద్రవాలు అంతరిస్తాయి. లోకంలో కళ్యాణ శోభ నిండు కుంటుంది.

చైతన్య భగవద్గీత

ఏనాటి పుణ్యఫలమో
ఏ దివ్యాత్ముని కృపా వీక్షణమో
బాల్యం లోనే నా మనస్సు బాలగోపాలుని బడి కెళ్ళి కూర్చుంది. అక్షరాలు నేర్పింది, పాఠాలు విన్నది అక్కడే. మాట లొచ్చింది, పాట లొచ్చింది ఆ బడి లోనే.

'తండ్రీ! నీవు మహోన్నతమైన తండ్రివి. నేను అర్హత లేని బిడ్డను. ఆశ ఒక్కటే నా ఆస్తి. అదే నా అర్హత. పారిజాత సుమాలను పట్టుకున్న చేతులతో నమస్కరిస్తూ ఉంటాను. తులసీ దళములను పట్టుకున్న హస్తాలను జోడించి వందన మంటూ ఉంటాను. నీ మాట వింటూ బ్రతుకుతాను. నీ భాషను పట్టుకొనే శక్తి లేనివాణ్ణి. నీ భావాన్ని ముట్టుకొనే సామర్థ్యం లేనివాణ్ణి.' ఇదంతా నా చిన్ననాటి వేడుకోలు.

ఆ వేడుకోలు వెన్నుని చరణాల చెంతకు చేరుతుందని, తన వేడుకను ఆవిష్కరించే మహాకార్యంలో నన్ను వాడుకోవడం జరుగుతుందని నేను కలలో కూడా ఊహించ లేదు.



గీత తోనే చెలిమి చేశాను
గీతే నా కలిమి అని భావించాను
మనస్సు పట్టుకోలేక పోయినా
చేతులు గీతను విడిచి పెట్టేవి కావు.

అదొక సుదినం. శుభదినం
భగవద్వాణిపై గురి కుదిరింది
భగవద్గీతపై మది నిలిచింది.

య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః ॥
న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువి ॥

ఈ గీతాశాస్త్రము అతి రహస్యము. దీనిని నా భక్తులకు ఉపదేశించే వాడు నాకు పరమ భక్తుడు అవుతాడు. నిస్సందేహంగా వాడు నన్నే పొందుతాడు.
అర్జునా! అతని కంటే ప్రియమైన వాడు మానవ ప్రపంచంలో మరొకడు
నేడు లేడు. మున్ముందు ఉండబోడు కూడా.



ఈ రెండు శ్లోకాలు గీతను సమాప్తం చేస్తూ
భగవంతుడు వినిపించిన అమూల్యమైన రత్నాలు
అవే నా పాలిటి రత్నాల గనులు
నన్ను సంపన్నుణ్ణి చేసిన రత్నరాశులు.

గీతా మే పరమా విద్యా
బ్రహ్మరూపా న సంశయః

భగవద్గీత ఒక్కటే నాకు శ్రేష్ఠమైన జ్ఞానము
గీత పరమేశ్వరుని స్వరూపము. సంశయం లేదు.

అంతే. ముక్కుపచ్చ లారని పూవ వయస్సులో బుద్ధిలో భగవంతుని నింపుకొని, ఎవరి కొరకూ ఎదురు చూడకుండా గీతా ప్రచార భారాన్ని భుజాని కెత్తుకున్నాను.

శక్తి ఉండి ఆ కార్యానికి పూనుకోలేదు
భక్తి ఉందనే ధైర్యం వల్ల మానుకోలేదు.

కొండ మోసిన వాడే అండగా నిలిచాడు
సేవా పంటను దండిగా పండించాడు.

త్రికరణ శుద్ధిగా నమ్మి నడిచి నందుకు మాటిచ్చిన వాడు మాటను నిలబెట్టు కున్నాడు. నాలుగు దశాబ్దాలు దేశం నలు చెరగులా గీతను వినిపించే భాగ్యాన్ని అనుగ్రహించాడు. ధన్యోఽ స్మి భగవాన్! ధన్యోఽ స్మి

ఎన్నో గ్రంథాలు వ్రాశారు. గీతను వ్రాయ రెందుకని?
ఎంతో కాలంగా ఇదే భక్తులు నాపై సంధిస్తున్న ప్రశ్న.

వినతిని వినిపిస్తూనే ఉన్నా!
ఆనతి వస్తే తప్పక వ్రాస్తా! - ఇదే భక్తులకు నే నిచ్చిన సమాధానం.

ఆజ్ఞ అయింది. క్షణం ఆగకుండా శుభారంభం చేశా!
రచన ఊపందు కుంది. చిత్ర విచిత్రంగా, నిత్య నూతనంగా రూపు దిద్దుకుంటూ సాగింది.

అర్జునునికి బాహ్యంలో నిలబడి బోధించిన వాడు
నాకు మాత్రం లోపలే స్థిరపడి గుట్టు విప్పాడు.

తెలిసిందంతా వ్రాయలేక పోయాను. వ్రాయ గలిగిందంతా వ్రాశాను. తెలుసుకోవాలి - తరించాలి అని భావించే పుణ్యాత్ములకు మరొకటి తెలియ నవసరం లేకుండా వ్రాశాను.

శ్రమనే ఆహారంగా
పరిశ్రమనే పానీయంగా
నిరీక్షణే నిద్రగా భావించి

అనంత సహనంతో
నిరంతర మననంతో

విచిత్రంగా కదులుతూ
వినూత్నంగా కలలు కంటూ

నడకను మరచి
పరుగును వలచి

సూర్యుణ్ణీ విడిచి
చంద్రుణ్ణీ మరచి
దీప జ్వాలకే అంకితమై

కాలం తెలియకుండా
కాళ్ళు మడచి కూర్చుని

మాటలకు ప్రాణం పోస్తూ
వాక్యాలకు వన్నె లద్దుతూ

మది నంతా మాధవుని నింపుకొని
హృది నంతా గీతామాతను నిలుపుకొని

శంకరునికి కింకరుణ్ణై
వంకరలు లేకుండా
శంకలు కదలకుండా

రెండు వేల పుటలను కుప్పపోసి
నాలుగు సంపుటాల లోకి ఎత్తి నింపి
భక్తుల భుజాలకు తగిలిస్తున్నా!
అలా ఋషి ఋణాన్ని తీర్చుకుంటున్నా!



నివేదన

తత్త్వద్వస్తు స్వభావజ్ఞః
తత్ఫలం వేత్తి నాపరః।

ఎవరికి ఏ వస్తు పరిజ్ఞాన ముందో
వారికే దాని ఫలం పూర్ణంగా తెలుస్తుంది.

భగవద్గీత ఏమిటో, ఏం చెబుతూ ఉందో, ఏ ఫలితాన్ని ప్రసాదిస్తూ ఉందో బ్రతుకునే సమర్పించుకొని అర్థం చేసుకున్నాను.

గీతాసుగీతా కర్తవ్యా
కిమన్యైః శాస్త్ర సంగ్రహైః

ఇతర శాస్త్రాల ప్రసక్తి ఎందుకు?
గీతను చక్కగా పఠిస్తే చాలు.

అనే హితవాక్యం యొక్క ప్రభావ మేమిటో జీవితంలో చూశాను
అందుకే, ఆరు పదులు నిండిన దశలో అనుభవాన్ని రంగరించి వ్రాశాను.

గీతకు ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. వస్తున్నాయి. వస్తూనే ఉంటాయి.
ఎవరు ఎందుకు వ్రాశారో, వ్రాస్తున్నారో నాకు తెలియదు.

గీతను ప్రవచించడం వేరు. గీతను రచించడం వేరు
గీతను బోధించే వాళ్ళందరూ గీతను వ్రాయలేరు.

వినే వారికి అర్థమయ్యే లాగా బోధించడం బోధకు లందరికీ సాధ్యం కాదు
చదివే వారికి అర్థమయ్యే లాగా రచించడం కూడా రచయిత లందరికీ సాధ్యం కాదు.

మరొక అడుగు ముందు కేస్తే
గీత అర్థం కాని వాళ్ళు ఎలాగూ గీతను వ్రాయలేరు
గీతను అర్థం చేసుకున్న వాళ్ళందరూ కూడా గీతను వ్రాయ గలరని చెప్పలేము.

అందుచేతనే,
భగవద్గీతకు ఎన్ని వ్యాఖ్యానాలు వచ్చినా
వ్యాఖ్యానం అనగానే, శ్రీ శంకర భాష్యమే మనస్సులో మెదుల్తుంది
అదే ప్రసన్నము. అదే గంభీరము. ప్రసన్న గంభీరము.



కొందరికి కొన్ని వ్యాఖ్యానాలు బాగుంటాయి
కొందరికి కొన్ని వ్యాఖ్యానాలు బాగుండవు
కొందరికి ఏవైనా బాగుంటాయి
కొందరికి బాగున్నవే బాగుంటాయి.

ఏది బాగు? ఏది ఓగు?
తెలిపి చెప్ప గలిగే దెవరు?

బాగు పడాలనే దృఢదీక్ష కలవారు
బాగేమిటో తెలుసు కుంటారు.

బాగును గ్రహించిన వారే
ఇతరులకు బాగును అనుగ్రహించ గలరు.

తాదృశానాం దశాం తాం తాం
తాదృశా ఏవ జానతే!

అలాంటి వారి స్థితిని
అలాంటి వారే తెలుసుకుంటారు.

ఇది చైతన్య భగవద్గీత

నాకు తపః ఫలం
మీకు పుణ్య ఫలం

ఏదో సాదాగా చదివి ప్రక్కన పెట్టే గ్రంథం కాదు
అప్పుడప్పుడు, అక్కడక్కడ కొన్ని కొన్ని పుటలు ఎన్నుకొని చదివేది అసలే కాదు.

సాంతము సాదరంగా అధ్యయనం చేయవలసిన గ్రంథము
బుద్ధితో పాటు భక్తిని తోడు చేసుకొని చదువ వలసిన గ్రంథము.



భక్తి రేవ ఏనం గమయతి
భక్తి రేవ ఏనం దర్శయతి
భక్తి వశః పురుషః

భక్తి చేయి పట్టుకొని భగవంతుని వద్దకు నడిపిస్తుంది
భక్తి కళ్ళు తెరిపించి భగవంతుని చూపిస్తుంది
ఎందుకనో తెలుసా? భగవంతుడు భక్తికి వశుడు.

ఎవరి ఇంట్లో ఏదుందో, ఏది లేదో
నాకు మాత్రం ఏం తెలుసు?

అన్ని ఇళ్ళల్లో గీత ఉండాలి

భగవంతుని దర్శించ డానికి ఆలయానికి వెళ్ళాలి. దేవాలయానికి వెళ్ళాలి
గీత మీ గృహంలో ఉంటే, మీ గృహమే గీతా మందిర మవుతుంది
గోవిందుడు గీత లోనే ఉన్నందున గోవింద మందిర మవుతుంది.

గీతాశ్రయోఽహం తిష్ఠామి
గీతా మే చోత్తమం గృహమ్!

నేను గీతను ఆశ్రయించుకొని ఉంటాను. గీతే నా నివాస స్థానము
ఇది ఎవరో ఎవరికో చెప్పింది కాదు. భర్త భార్యకు చెప్పింది
అడిగింది ధరణి. తన చిరునామా ఎక్కడో చెప్పింది ధరణీపతి.
ఇది వరాహపురాణం లోని వార్త.

భూదేవి ప్రశ్నించింది అంటే భూలోక వాసు లందరి పక్షాన ప్రశ్నించిందని అర్థము
భూదేవికి చిరునామా నందించాడు అంటే భూలోక వాసు లందరికీ అందించాడని అర్థము.



గీత మన ఇంట్లో ఉంటే చాలు
మన ఇంటికి రమ్మని అచ్యుతుని ఆహ్వానించ నవసరం లేదు
మనందరము అచ్యుతుని ఇంటి లోనే ఆనందంగా ఉంటాము.

గృహమే గుడి

గోవిందుని దర్శించాలని భావించే భక్తులకు
ఎన్ని గుళ్ళని నిర్మించ గలను?
గూళ్ళనే గుడులుగా మారిస్తే
ఎలా ఉంటుందని ఆలోచించాను.

ఇలా ఉంటుంది అనిపించింది
అదే **చైతన్య భగవద్గీత.**



సర్వం సఫలం - సర్వం సంపూర్ణం

నా ఆశయం నెరవేరింది. నా ఏకైక వాంఛ తీరి పోయింది
నా బ్రతుకు సఫల మైంది. పురుషార్థం సిద్ధించింది.

చాలు. చాలు. చాలు.
భగవ దారాధన సమాప్త మైంది
భక్తులకు ప్రసాదం ప్రాప్తించింది.

మహాకృతి మహోజ్జ్వలంగా సమాప్త మైంది
కృతి కర్త ఎవరు? కృతి భర్త ఎవరు?
కృతి భర్త నేను కాదని మీకే తెలుసు
కృతి కర్తను నేను అనేది మీ భావన
కాదని చెప్పేందుకే చివరగా ఈ పాడి మాటలు.

కర్తను కాను అంటే పనిముట్టును అనుకుంటా రేమో!
పనిముట్టును కానే కాను; పనిని ముట్టుకున్నాను. అంతే.

కర్తా బహిః అకర్తా౽ న్తః

బాహ్యానికి కర్తగా కనిపిస్తున్నా
ఆంతర్యంలో అకర్త గానే ఉన్నా!

కృతి భర్తే కృతి కర్త
కృతజ్ఞత చెప్పే ధైర్యం లేదు
ఐదు పది చేసి తల వంచుతున్నా!
అలాగే ఉంటావని విన్నవించు కుంటున్నా!
కృతార్థుణ్ణయ్యా నని వినమ్రుణ్ణై పలుకుతున్నా!

మనసైన మాట

శతాధిక గ్రంథాలను ప్రచురించే అదృష్టానికి నోచుకుంది సుందర చైతన్యాశ్రమం. ఎంతో కాలంగా సర్వులూ ఎదురు చూచిన గ్రంథం **చైతన్య భగవద్గీత** కూడా ఎదలను అలరించేందుకు ఆవిర్భవించింది. ఎందరో ఎన్నో విధాలుగా ఈ కార్యక్రమాలలో వారి వారి సేవలను అందించి తృప్తి చెందారు. అందరికీ ఆశ్రమం ఋణపడి ఉంటుంది.

ఇక ప్రస్తుత విషయం
చైతన్య భగవద్గీత.

రెండు వేల పుటల గ్రంథాన్ని అచ్చు తప్పులు దిద్దుతూ, సవరించి సరి చేయడం సాధారణమైన కార్యం కాదు. బహు భారమైన ఈ కార్యాన్ని భుజాని కెత్తుకొని, రాత్రనక పగలనక ఓర్పుతో, నేర్పుతో నిర్వహించిన ఆశ్రమ

కమిటి సభ్యురాలు శ్రీమతి సి.పద్మా మోహనరావు సేవలను మరచి చైతన్య భగవద్గీతా గ్రంథాన్ని నేను ఊహించ లేను. ఆమె కుటుంబ సభ్యు లందరినీ వాసుదేవ భగవానుడు సర్వదా బ్రోచు గాక! వారందరికీ నా హృత్పూర్వక ఆశీస్సులు.

ఈ గ్రంథమును దివారాత్రములు కంప్యూటర్‌కు అతుక్కుపోయి డి.టి.పి. చేసిన చి॥ కృష్ణప్రసాద్‌కు, గ్రంథాన్ని సర్వాంగ సుందరంగా ముద్రించిన చి॥ నాగబాబుకు నా ప్రేమ పూర్వక ఆశీస్సులు.

బాల్యం లోనే కదిలిన ప్రస్థానము. నాపై ఎందరి ప్రభావ ముందో నాకే తెలియదు. బాల్యం లోనే విశేషంగా గ్రంథ పఠనం చేశాను. అవి ఎంత గానో నన్ను ఉత్తేజ పరచాయి. ఎందరో మహాత్ముల జీవితాలు, బోధలు నన్ను ప్రభావితం చేశాయి. తనదైన శైలిలో సమాజం కూడా తన వంతు పాత్రను తాను నిర్వహించింది. విశేష గ్రంథ పరిచయం, అశేష జన సంసర్గం కలవాణ్ణి. పేరు పేరున ఎందరికి కృతజ్ఞతలు చెప్పేది? ఎన్ని గ్రంథాలను ఉటంకించేది? ఎలాగూ ఉండనే ఉంది మూలమంత్రం, 'అందరికీ వందనాలు'. దాని తోనే ప్రస్తుతానికి సరిపెట్టు కుంటున్నా.

చివరగా మీ అందరికీ
నా మనసైన మాట.

ఇలాంటి గ్రంథాలు అరుదుగా ఉంటాయి. దొరికి నపుడే దోచుకోవాలి. హృదయంలో దాచుకోవాలి. జీవించి నంత కాలం తోడుగా ఉండ వలసిన గ్రంథము. పుస్తకాన్ని పుస్తకంగా ఉంచకుండా, శ్రమించి మస్తకానికి పట్టించండి.

మన వద్ద ఉన్నది మనది కాదు
మన మనస్సు కెక్కిందే మనది.

సద్భావన సత్కార్యాన్ని రూపొందిస్తుంది
సత్కార్యం సత్ఫలితాన్ని ప్రసాదిస్తుంది.

పుణ్య ఫల విశేషంగా తీర్థపు గిన్నె పూజారి చేతికి వచ్చినట్లు, **చైతన్య భగవద్గీత** గ్రంథాన్ని అందించే అదృష్టం మమ్మల్ని వరించింది.

ఈ గ్రంథం మీది. మీతో ఉండ వలసింది
మీరు కొనండి. మరి కొందరి చేత కొనిపించండి.

మీరు శ్రద్ధతో చదవండి. ఇతరుల చేత చదివించండి
కానుకగా ఎవరి కైనా సమర్పిస్తారా? ఇంతకు మించిన అమూల్యమైన రత్నం ఎక్కడ దొరుకుతుంది?

సర్వేజనాః సుఖినో భవన్తు!

ప్రణవ ప్రేమలతో
గీతామాత సేవలో

ఆశ్రమం
16-12-2009

ఓం స్వామి సుందర చైతన్యానంద

గీతా మాహాత్మ్యము

శ్లో॥ యత్ర గీతా విచారశ్చ
పఠనం పాఠనం శ్రుతమ్ ।
తత్రాహం నిశ్చితం పృథ్వి
నివసామి సదైవ హి ॥ 1

భూలక్ష్మీ! గీతా విచారము, గీతాధ్యయనము, గీతా ప్రవచనము, గీతా శ్రవణము - ఇవి ఎక్కడ జరుగుతూ ఉంటాయో అక్కడ నేను సదా నిశ్చయంగా ఉంటాను.

శ్లో॥ గీతాశ్రయోऽహం తిష్ఠామి
గీతా మే చోత్తమం గృహమ్ ।
గీతా జ్ఞాన ముపాశ్రిత్య
త్రీన్లోకా న్పాలయా మ్యహమ్ ॥ 2

గీత నాకు ఆశ్రయము. గీత నా దివ్యమైన మందిరము. భూదేవీ! గీతా జ్ఞానమును అనుసరించే నేను ముల్లోకాలను పాలిస్తూ ఉంటాను.

శ్లో॥ గీతా మే పరమా విద్యా
బ్రహ్మరూపా న సంశయః ।
అర్ధమాత్రాక్షరా నిత్యా
స్వనిర్వాచ్య పదాత్మికా ॥ 3

గీత నా ఉత్కృష్టమైన జ్ఞానము. అది బ్రహ్మస్వరూప జ్ఞానము. ఈ విషయంలో సందేహం వద్దు. అది అమాత్రా ప్రణవ స్వరూపము. అక్షరము; నిత్యము; అనిర్వాచ్యము.

శ్లో॥ చిదానన్దేన కృష్ణేన
ప్రోక్తా స్వముఖ తోऽర్జునమ్ ।
వేదత్రయీ పరానన్దా
తత్త్వార్థ జ్ఞాన సంయుతా ॥ 4

చిదానందమూర్తి శ్రీకృష్ణ పరమాత్మ గీతను స్వయంగా అర్జునునికి బోధించాడు. గీత వేద స్వరూపము. పరమానంద రూపము. ఆశ్రయించిన వారికి తత్త్వసారాన్ని అనుగ్రహిస్తుంది.

శ్లో॥ గీతా శాస్త్ర మిదం పుణ్యం
యః పఠేత్ ప్రయతః పుమాన్ ।
విష్ణోః పద మవాప్నోతి
భయశోకాది వర్జితః ॥ 5

గీతాశాస్త్రము పుణ్యప్రదము. గీతాశాస్త్రమును శ్రద్ధతో అధ్యయనం చేయు వాడు భయశోకాలు తెలియని విష్ణుపదమును పొందుతాడు.

శ్లో॥ మల నిర్మోచనం పుంసాం
జల స్నానం దినే దినే ।
సకృ ద్గీతామ్భసి స్నానం
సంసార మల నాశనమ్ ॥ 6

నిత్యము జల స్నానం చేసే వారికి దేహ మాలిన్యము తొలగుతుంది. గీతా జ్ఞానజలంలో ఒక్కసారి మునిగితే చాలు. సంసార మాలిన్య మంతా తొలగి పోతుంది.

శ్లో॥ యః శృణోతి చ గీతార్థం
కీర్తయ త్యేవ యః పరమ్ ।
శ్రావయేచ్చ పరార్థం వై
స ప్రయాతి పరంపదమ్ ॥ 7

గీతార్ధమును శ్రవణము చేయువాడు, దానిని ఇతరులకు వర్ణించి చెప్పేవాడు, గీత లోని మహోన్నతమైన భావాలను పరులకు వినిపించు వాడు పరమాత్మను పొందుతాడు.

శ్లో॥ సోపా నాష్టాదశై రేవ
భక్తి ముక్తి సముచ్ఛ్రితైః ।
క్రమశః చిత్తశుద్ధిః స్యాత్
ప్రేమ భక్త్యాది కర్మసు ॥ 8

గీతాశాస్త్రము భక్తి దాయకము, ముక్తి ప్రదాయకము. పద్దెనిమిది అధ్యాయములనే సోపానముల ద్వారా ప్రేమ, భక్తి మార్గాలలో పయనించే వారికి చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది.

శ్లో॥ యే శృణ్వన్తి పఠన్త్యేవ
గీతాశాస్త్ర మహర్నిశమ్ ।
న తే వై మానుషా జ్ఞేయా
దేవ రూపా న సంశయః ॥ 9

గీతాశాస్త్రాన్ని అహర్నిశము శ్రవణం చేసే వారిని, అధ్యయనం చేసే వారిని మానవులని భావించ కూడదు. వారు మానవ రూపంలో ఉన్న దేవతలే. ఈ విషయంలో సందేహము లేదు.

శ్లో॥ భారతామృత సర్వస్వం
విష్ణో ర్వక్త్రా ద్వినిస్సృతమ్ ।
గీతా గంగోదకం పీత్వా
పునర్జన్మ న విద్యతే ॥ 10

విష్ణుదేవుని ముఖము నుండి వెలువడిన గీతాశాస్త్రము భారతామృత సర్వస్వము. గీతా గంగోదకాన్ని పానం చేసే వారికి పునర్జన్మ ప్రాప్తించదు *(మోక్షం సిద్ధిస్తుంది)*.

శ్లో॥ శత పుస్తక దానం చ
గీతాయాః ప్రకరోతి యః ।
స యాతి బ్రహ్మసదనం
పునరావృత్తి దుర్లభమ్ ॥ 11

వంద గీతా పుస్తకాలను వితరణ చేయువాడు పునర్జన్మ లేని బ్రహ్మపదమును పొందుతాడు *(జ్ఞానదాన ప్రాశస్త్యమును తెలియ చెప్పడమే ప్రధాన విషయం)*.

శ్లో॥ ఏత న్మాహాత్మ్య సంయుక్తం
గీతాపాఠం కరోతి యః ।
శ్రద్ధయా యః శృణో త్యేవ
పరమాం గతి మాప్నుయాత్ ॥ 12

ఈ మహాత్మ్యమును తెలుసుకొని గీతను అధ్యయనము చేయువాడు ఉత్కృష్టమైన గతిని పొందుతాడు.



చైతన్య భగవద్గీత

ధ్యాన శ్లోకములు



గీతా ధ్యానము

శ్లో॥ ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।
అద్వై తామృత వర్షిణీం భగవతీ మష్టాద శాధ్యాయినీ
మంబ త్వా మనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥ 1

ఓం	= ఓం	అద్వైతామృత వర్షిణీం	= అద్వైత సుధను వర్షించునది
భగవతా	= భగవంతుడైన	అష్టాదశాధ్యాయినీం	= పదునెనిమిది అధ్యాయాలు కలది
నారాయణేన	= నారాయణునిచే	భవద్వేషిణీం	= సంసార జీవనమును రూపు మాపునది
స్వయం	= స్వయముగా		
పార్థాయ	= అర్జునుని కొరకు	భగవతీం	= భగవ త్స్వరూపిణి
ప్రతిబోధితాం	= బోధింప బడినది	అంబ	= అమ్మా
పురాణమునినా	= సనాతన మహర్షి యైన	భగవద్గీతే	= ఓ భగవద్గీతా!
వ్యాసేన	= వ్యాసునిచే	త్వాం	= నిన్ను
మధ్యే మహాభారతం	= మహాభారతము యొక్క నడుమ	అను సందధామి	= పదేపదే ధ్యానిస్తున్నాను.
గ్రథితాం	= కూర్చబడింది		

ఓం! తల్లీ! భగవతీ! సంసార నాశినీ! అష్టాదశాధ్యాయినీ! అద్వైతామృత వర్షిణీ! సాక్షాత్తు భగవంతుడైన నారాయణమూర్తిచే అర్జునుని కొరకు బోధింప బడిన జననీ! సనాతన మహర్షి శ్రీ వేదవ్యాసమునిచే రచింప బడి, మహాభారతము మధ్య శోభించే భారతీ! భగవద్గీతా మాతా! అమ్మా! నిన్ను పదే పదే ధ్యానిస్తున్నాను.

వ్యాఖ్య

భవము - భవ్యము

అమ్మా! నేను - నీ బిడ్డను. ముద్దుబిడ్డను కాలేక పోయిన మొద్దును. దద్దమ్మను. గతంలో నీ మాట వినని నేరానికి పాపపు మూటల్ని మోస్తున్నాను. సంసార కారాగృహంలో మగ్గుతున్నాను. స్థిరత్వం లేని ప్రపంచంలో ప్రియత్వానికి అర్థం లేదని గ్రహించలేక పోయాను. బంతి లాగా దొర్లి పోయేది బాల్యం. పక్షిలా ఎగిరి పోతుంది యవ్వనం. వాగులా ముందుకు సాగి జనన మరణ సంసార సాగరంలో పడిపోతుంది వృద్ధాప్యం. తారాడుతూ, జీరాడుతూ జీవు లందరు మృత్యుకూపం లోకి జారి పోయేవారే. వర్షాకాల మేఘం లాగా కలిమి కారి పోయేదే **(అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః)**.

ఆపదల మధ్య అల్లాడు తున్నాను. నిరాశతో క్షణక్షణం నీరసించి పోతున్నాను. ఏది చేసినా గండమే ఎదు రవుతోంది. ఏది ఆలోచించినా సుడిగుండమై ముంచేస్తోంది. ఒక వైపు ప్రారబ్ధం గుండెలపై పిడుగులు

పడేస్తోంది. మరో వైపు ప్రాయము పశ్చిమంగా వాలి పోతోంది. అమ్మా! భవద్వేషిణీ! నన్ను భవము నుండి బయట పడేయి తల్లీ! (*భగవద్గీతే భవద్వేషిణీమ్*).

అమ్మ పిలుపు - అయ్య పలుకు

అమ్మా! నువ్వు తల్లివి. తల్లియే గదా తొల్లి. అందుకే తొలి దండము మళ్ళీ మళ్ళీ నీకే పెడుతున్నాను. తొలుత మళ్ళీ మళ్ళీ నిన్నే స్మరిస్తున్నాను (*త్వాం అనుసందధామి*). నీ కన్నబిడ్డను. నిన్ను కనే భాగ్యాన్ని ప్రసాదించ మని వేడుకొంటున్నాను. నిన్ను దర్శించుకొనే అదృష్టాన్ని అనుగ్రహించ మని పదే పదే అర్థిస్తున్నాను. ప్రార్థిస్తున్నాను.

చెప్పేవాడు భగవంతుడు. చెప్పబడేది భగవతి. వినిపించే వాడు సమగ్రమైన జ్ఞానస్వరూపుడు. వినపడేది సమగ్ర మైన జ్ఞానము. భగవానుడు భగవతిని భవ్యంగా వినిపిస్తే, భగవతి భగవానుని వైభవాన్ని దివ్యంగా దర్శింప చేస్తూ ఉంది.

తల్లి వైభవాన్ని సంపూర్ణంగా తండ్రి నుండే విన గలం (*భగవతా నారాయణేన*). తండ్రి ప్రాభవాన్ని సమగ్రంగా తల్లి చెబితేనే అర్థం చేసుకోగలం (*భగవతీం అష్టాదశాధ్యాయినీం అంబ*).

సర్వమూ వేద నారాయణుడే. వేదము తల్లి. నారాయణుడు తండ్రి. వేదము, నారాయణుడు వేరు కారు. ఈశ్వరుడు, ఈశ్వర జ్ఞానము వేరు కాదు. ఈశ్వరుడు జ్ఞానస్వరూపుడు. జ్ఞానము ఈశ్వరమయము. కనుక వేదము, వేదనారాయణుడు వేరు కారు. ఒక్కరే. రెండు కాని ఒక్క సత్యమై భాసిస్తున్నారు. అది ద్వైతం కాదు. అద్వైతం. ద్వైతం మృతం. అద్వైతం అమృతం. అమృతం మరణాన్ని దూరం చేస్తుంది. వేదమాత కురిపించే అద్వైతామృతం జనన మరణాలను మాయం చేస్తుంది (*అద్వైతామృత వర్షిణీం*).

అమ్మా! అందుకే నిన్ను మళ్ళీ మళ్ళీ స్మరిస్తున్నాను. అమ్మ పిలుపుకై నిరీక్షిస్తున్నాను. అయ్య పలుకుకై ఎదురు చూస్తున్నాను. ఎద నిండా తల్లిదండ్రుల్ని నిలుపుకొని ప్రార్థిస్తున్నాను. ఒక్క ఒరలో ఇద్దరు ఇమడరు అంటావా! 'తల్లిదండ్రులు' అని రెండుగా వినిపిస్తున్నా, సమాసం ఒక్కటే కదా తల్లీ! తల్లి లేకుండా తండ్రి ఎలా ఉంటాడు? తండ్రి లేకుండా తల్లి ఎలా ఉంటుంది? జ్ఞానం లేకుండా ఈశ్వరుడెలా ఉంటాడు? ఈశ్వరునికి దూరంగా ఈశ్వరజ్ఞానం ఎలా ఉంటుంది? వేదమే నారాయణుడు. నారాయణుడే వేదము. అదే వేదనారాయణ శబ్దము.

అమ్మా! భగవతీ! నా అదృష్టం చూశావా! అమ్మ పిలుపును అందుకుంటున్నా! అదీ అయ్య పలుకులో వినబోతున్నా! ఇరువురు ఒకటే అనే అద్వైత జ్ఞానసుధను పానం చేయబోతున్నా! ఒకరిలో మరొకరిని దర్శించుకొని తృప్తి చెందబోతున్నా! ఒకరి అడుగులో మరొకరు అడుగు వేసుకుంటూ నడిచే మీ అద్భుత చరణాలకు వంగి వంగి వందనాలు అర్పించుకోబోతున్నా! మీ పాదాలలో అద్వైత ముద్రలను చూడబోతున్నా!

అదెలా సాధ్యం అంటావా? మీరు నా తల్లిదండ్రులు కనుక. 'తల్లిదండ్రులు' అనే మాట ద్వంద్వ సమాసము అని కూడా తెలియని మందమతిని కాను లేమ్మా!

ఒక వైపు ద్వంద్వం అంటావు. మరో వైపు ఏక మంటావు. ఏమిటి దంతా? అని ప్రశ్నిస్తున్నావా? మీ ఇద్దరి స్వరూపం అదే నని నాకు తెలిసి పోయింది గామ్మా! ఎలా తెలిసిం దంటావా తల్లీ? తండ్రి చెబితేనే తెలిసింది.

ద్వంద్వ సమాసము నేనే అన్నాడు గోవిందుడు (**ద్వంద్వః సామాసికస్య అహమేవ**). అమ్మా! ద్వంద్వ సమాసము ఉభయ పద ప్రధానం కదా! రెండు పదాలకు సమానార్థమే కదా! ఈ ద్వంద్వ సమాస రహస్యంతో

మీ ఇద్దరి రహస్యం నాకు తెలిసి పోయింది. అయినా, ద్వంద్వం అనే పదానికి 'రహస్యం' అనే అర్థం కూడా ఉంది కదమ్మా! అంతేకాదు, ఈ రహస్యాన్ని వినిపించిన మువ్వల వాని చరణం కదిలిన శ్లోకం కూడా పదవ అధ్యాయం 33 వ శ్లోకమే. మూడు మూడు కనిపిస్తున్నాయి చూడు. అక్కడ కూడా రెండు గానే కనిపిస్తున్నాయి. రెండైనా, మూడైనా ఒక్కటే అనే సత్యాన్ని వినిపించడమే కదా ఇందులోని రహస్యం!

వేద నారాయణునిలో వేదము, నారాయణుడు కలిసే ఉన్నారు. భగవద్గీతలో భగవంతుడు, భగవతి కలిసే ఉన్నారు. ఒకరు ఉంటే రెండవ వారు ఉన్నట్లే. తెలియని వారికి ఇద్దరూ ఉన్నా లేనట్లే. లేదా ఇద్దరూ వేరుగా ఉన్నట్లే. వేదమాత వేద పురుషునికి దూరంగా ఉంటుందని ఎలా ఊహిస్తారో నా కైతే అర్థం కాదు. గీతను గోవిందునికి ఎలా దూరం చేస్తారో నా బుద్ధి కైతే చిక్కదు. రెండిటిని పట్టుకొని వ్రేలాడే ప్రబుద్ధులకు కనువిప్పు కలిగించాలని అభిప్రాయపడ్డా డేమో కాళిదాస మహాకవి, తన 'రఘువంశం' కావ్యంలో దిలీపుని ధర్మపత్ని సుదక్షిణాదేవి నందినీ ధేనువును అనుసరించి నడుస్తున్న సందర్భంలో *శ్రుతే రివార్థం స్మృతి రన్వగచ్ఛేత్* - 'శ్రుతిని అనుసరించే స్మృతి వలె ధేనువును అనుగమిస్తూ ఉంది' అన్నాడు. ఈ సత్యం అర్థమైతే గీతామాత ఎవరో కాదు శ్రుతిమాతే. వాసుదేవుడు ఎవరో కాదు, నారాయణుడే. వేదనారాయణుడే.

శ్రేష్ఠుడైన శ్రోత

వినడం ఎవరి కైనా సాధ్యమే. శ్రవణం కొందరికే సొంతం. వినడానికి చెవులుంటే చాలు. శ్రవణానికి మనస్సు తోడు కావాలి. అది కూడా మామూలు మనసు కాదు. సంస్కరింప బడిన మనసై ఉండాలి. శుద్ధి పడిన బుద్ధి మాత్రమే శ్రవణం చేసి సిద్ధిని పొందుతుంది. అలాంటి పవిత్రమైన బుద్ధి గల మహాత్ముడు అర్జునుడు. సాక్షాత్తు నారాయణుడైన వాసుదేవునికి, మహాత్ముడైన అర్జునునికి మధ్య సంవాద రూపంలో సాగిన గీతాబోధను తాను ఆలకించినట్లు సంజయుడు గీతను సమాప్తం చేస్తూ చెబుతాడు. అర్జునుణ్ణి మహాత్ముడని సంజయుడు కీర్తించడమే శ్రోతగా అర్జునుని శ్రేష్ఠత్వానికి అద్దం పడుతూ ఉంది.

అర్జునుడు పుణ్య పురుషుడు. ధర్మాత్ముడు. భగవద్భక్తుడు. అసూయ లేని వాడు. అధర్మాన్ని అంగీకరించని ధీమంతుడు. అట్టి అర్జునుని నిమిత్తంగా చేసుకొని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతను లోకానికి అందించాడు. బోధించింది పార్థుని కొరకే అయినా యావత్ ప్రపంచం లబ్ధిని పొందింది. పొందుతూ ఉంది.

వ్యాసుని వ్యాసంగము గ్రంథస్థం చెయ్యడం

నరుడైన అర్జునునికి నారాయణమూర్తి స్వయంగా బోధించిన జ్ఞానబోధను గ్రంథస్థం చెయ్యడం
సామాన్యులకు సాధ్యమా? అందుకే నారాయణ స్వరూపుడు, వేద సంస్కర్త అయిన వ్యాస భగవానుడే రచయిత
సామాన్యులకు సాధ్యమా? అందుకే నారాయణ స్వరూపుడు, వేద సంస్కర్త అయిన వ్యాస భగవానుడే రచయిత పవిత్ర కార్యాన్ని భుజాని కెత్తుకున్నాడు.
అయ్యాడు. అచ్యుతుని అమర సందేశాన్ని భావి తరాలకు అందించే పవిత్ర కార్యాన్ని భుజాని కెత్తుకున్నాడు.
దేహానికి గుండె లాగా మహాభారతం మధ్య భీష్మపర్వంలో గీతా ప్రదీపాన్ని ఉంచాడు (**వ్యాసేన గ్రథితాం పురాణ మునినా మధ్యే మహాభారతమ్**).

వేదాలు అనంతములు (**అనంతా వై వేదాః**). వేదాలను సులభతరం చెయ్యాలని సంకల్పించి, అనంత మైన వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, తమ శిష్యులైన పైల, జైమిని, సుమంత, వైశంపాయనుల సహాయంతో విస్తృత పరచాడు శ్రీ వేదవ్యాస మహర్షి. గహన మైన వేద విషయాలను సామాన్య జనులకు అర్థమయ్యే రీతిలో పద్దెనిమిది పురాణాలను రచించి పురాణముని అయ్యాడు. వాటిని ప్రచారం చెయ్యమని సూత మహర్షిని ఆశీర్వదించాడు.

వేద విజ్ఞాన వ్యాప్తికి పాటు పడిన మహానుభావుడు శ్రీ వేదవ్యాస మహర్షి గీతకు వ్యవహర్త కావడం మన

అదృష్టం. కురుక్షేత్ర పుణ్యభూమిలో వాసుదేవుడు కురిపించిన అద్వైత అమృత ధారలను భగవద్గీత అనే సువర్ణ భాండంలో నింపి, ప్రపంచానికి కడుపారా త్రాగించి, తరింప చేసిన వ్యాసమూర్తికి జగతి జోహారు లర్పిస్తోంది.

జయతి పరాశర సూనుః సత్యవతీ
హృదయ నందనో వ్యాసః
యస్యాఽఽస్య కమల గళితం
వాఙ్మయ మమృతం జగత్ పిబతి ॥

ఏ మహాత్ముని ముఖపద్మము నుండి జాలువారిన వాఙ్మయ పీయూషాన్ని (గీతామృతాన్ని) సమస్త ప్రపంచము పానం చేస్తూ ఉందో, పరాశర పుత్రుడు, సత్యవతీ నందనుడు అయిన అట్టి వ్యాసమహర్షికి జయము! జయము!

పిలిస్తే పలికేది తల్లి. బిడ్డ అవసరాల్ని తీర్చేది తల్లి. గీతామాత కూడా అమ్మ లాగా *(అంబ)* మన ఆర్తనాదాల్ని వింటుంది. అపాయాలను తొలగిస్తుంది. అవసరాలను తీర్చి అక్కున చేర్చుకుంటుంది. భవ సాగరంలో మునిగి పోకుండా రక్షిస్తుంది *(భవద్వేషిణీమ్).* అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది *(అద్వైతామృత వర్షిణీం).* అందుకే, జన్మ నిచ్చే తల్లులు ఎందరున్నా, జన్మను కడతేర్చే తల్లి గీతామాత ఒక్కతే అనే ప్రగాఢ విశ్వాసంతో, అకుంఠిత భక్తి శ్రద్ధలతో గీతామాతకు పదే పదే నమస్కరిస్తున్నా. ఆమె చరణ కమలాలను అచంచల భక్తితో హృదయంలో ధ్యానిస్తున్నా.

త్వమేవ సంధ్యా గాయత్రీ
సావిత్రీ చ సరస్వతీ
గీర్వాణ జ్ఞాన సార రూపిణీ
చైతన్య భగవతీ వాగ్దేవి భారతి
శారదాం! విశారదాం!
నమామి శుభదాం
బుద్ధి ప్రదాం శారదాం ॥ శారదాం ॥

అని గీతామాతను చైతన్యగీతంతో స్తుతిస్తూ, తల్లి పద సరోజాలను హృదయంలో స్థిరంగా నిలుపుకొని ధన్యుల మయ్యెదము గాక!

వ్యాస స్తుతి

నమోస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిన్దాయత పత్రనేత్ర ।
యేన త్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥ 2

వ్యాస	= ఓ వ్యాసమహర్షీ!	జ్ఞానమయః	= జ్ఞానరూపమైన
విశాలబుద్ధే	= విశాలమైన బుద్ధి కలవాడా!	ప్రదీపః	= దివ్యదీపము
ఫుల్లారవిందాయత పత్ర నేత్ర	= వికసించిన పద్మపురేకుల వంటి కన్నులు కలవాడా!	ప్రజ్వాలితః	= చక్కగా వెలిగించ బడింది
యేన	= యే	తే	= నీకు
త్వయా	= నీ చేత	నమః అస్తు	= నమస్కారములు
భారత తైలపూర్ణః	= మహాభారత మనే తైలముచే నిండిన		

ఓ వ్యాసమహర్షీ! విశాల హృదయా! వికసిత సరసిజ దళ నయనా! మహాభారత మనే తైలమును నింపి దివ్యమైన జ్ఞాన దీపమును వెలిగించావు. నీకు ప్రణామములు.

వ్యాఖ్య

ఆర్షధర్మ సంస్కృతిలో వ్యాసునిది సమున్నత స్థానం. మహర్షులలో అగ్రతాంబూలం ఆయనిదే. అద్భుత ప్రజ్ఞానిధి. అనంత జ్ఞానజ్యోతి. ఆయన విశాలబుద్ధి ప్రపంచా న్నంతా స్పృశించింది. విశ్వమంతా ఆయన బుద్ధిలో ఇమిడి పోయింది. విశ్వ మెంత విశాలమో, ఆ మహాత్ముని హృదయం కూడా అంత విశాలము ***(వ్యాస విశాల బుద్ధే).***

ఆయన కలానికి హద్దులు లేవు. కవు లందరికీ ఆయన స్ఫూర్తి. కళ లన్నిటికీ ఆయనే దీప్తి. పర్వతాలను పలకరించే టప్పుడు పర్వత మంత ఎత్తు నిలబడతాడు. జంతువుల్ని నిలదీసి భాషిస్తాడు. గువ్వలతో విహరిస్తూ వాటితో గుసగుస లాడుతాడు. నదులతో కలిసి నడుస్తాడు. కాలంతో కరచాలనం చేస్తాడు.

బుద్ధి గల వారు, వారి బుద్ధిని స్వార్థానికి వినియోగించు కుంటారు. బుద్ధి నైపుణ్యంతో వ్యాపారాలు చేసి సంపదలు ఆర్జిస్తారు. ఆస్తుల్ని ప్రోగు చేసుకుంటారు. భాగ్యాలను సంపాదించుకొని భోగాలలో తుల తూగుతారు.

విశాలబుద్ధి గల వ్యాసమహర్షి తన జ్ఞానాన్ని స్వార్థానికి ఉపయోగించుకో లేదు. పరానుగ్రహార్థం వినియోగించాడు. లోక సంగ్రహానికి ఉపయోగించాడు. ఆర్తుల కన్నీళ్ళు తుడిచాడు. పగిలిన హృదయాలను అతికించాడు. అజ్ఞానులను ఉద్ధరించాడు. సమాజాన్ని విజ్ఞాన తోరణాలతో అలంకరించాడు.

వేద కమలాన్ని వికసింప చేసి వేదాబ్జ భాస్కరు డయ్యాడు. సూర్యుని కిరణాలు సోకగానే కమలము వికసించి, మధుర పరిమళాలను వెద జల్లునట్లు, వ్యాస భగవానుని దృష్టి పడగానే వేద కమలము విరబూసి, విజ్ఞాన సుగంధాలను వెదజల్లింది. అందుకే ఆయన విప్పారిన సరసిజ నయనుడు ***(ఫుల్లార విందాయత పత్ర నేత్ర!).***

విస్తృత శాస్త్ర విషయ పరిజ్ఞానము కలవాడు కనుక విశాలబుద్ధి కలవాడు **(వ్యాస విశాలబుద్ధే).** పద్మనేత్రుడు అంటే జ్ఞాన నేత్రము కలవాడు అని అర్థము. అదే బ్రహ్మ నిష్ఠత్వము **(ఫుల్లార విందాయత పత్ర నేత్ర).** కనుక వ్యాస భగవానుడు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు. ఆచార్యులకు ఆచార్యుడు. ఆర్ష విజ్ఞాన దీపమును వెలిగించి, ఎందరో ముముక్షువులకు ముక్తి మార్గాన్ని సుస్పష్టం చేశాడు. ఆయన ముట్టని తాత్త్విక విషయం లేదు. అందుచేతనే **వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం** - వ్యాసుడు చవి చూడని విషయమే లేదని జ్ఞానులు కీర్తించారు.

గీతా జ్ఞాన ధనం - భారతమే ఇంధనం

భారతీయ సంస్కృతిలో మహాభారతానికి ఒక విశిష్ట స్థానం ఉంది. అందుకే, భారతం పంచమ వేదంగా సమున్నత స్థాయిలో నిలిచింది. వేదము ఎలా సంపూర్ణమో, వేదవ్యాస విరచితమైన మహాభారతం కూడా అలా సమగ్ర స్థాయిలో సాక్షాత్కరించింది.

యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్

మహాభారతంలో ఏదయితే ఉందో, అది వేరొక చోట ఉండ వచ్చు. కాని, మహాభారతంలో ఏదయితే లేదో అది మరొక చోట ఉండదు అని వ్యాసుడే రచించాడు. అదే మహాభారత వైభవం.

భారతంలో నీతి ఉంది. ధర్మం ఉంది. అభ్యుదయం ఉంది. నిశ్శ్రేయస ఉంది. అందుకే అది మహాభారతం. వ్యాసుని అద్భుత అపూర్వ సృష్టి అది ఆయనకే సరి పోయింది. వ్యాసుడు నిర్వహించిన

కార్యాలు అన్యులు సాధించ లేనివి. మహత్తర మైన ఆ కార్యాలకు సంపూర్ణ జ్ఞానం ఉండాలి. అద్భుత మైన త్యాగనిరతి కావాలి. అమోఘ సేవాసక్తి ఉండాలి. అవన్నీ పుష్కలంగా ఉండటం చేత వ్యాసమహర్షి అద్భుత కార్యాలను ఆవిష్కరించి చూపాడు. మహాభారత తైలాన్ని నింపి, సర్వ లోకాలకు, సమస్త దేశాలకు, సర్వ కాలాలకు, సమస్త మానవాళికి హితం చేసే గీతా జ్ఞాన ప్రదీపాన్ని వెలిగించి ఇచ్చాడు (***యేన త్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః***)

భవరోగమును పోగొట్టే దివ్యౌషధము భగవద్గీత. సంసారము రోగ మైతే, సంసారానికి కారణ మైన అజ్ఞానమే రోగ కారణము. కారణము ఉన్నంత వరకు కార్యము ఉంటుంది. కార్యరూప సంసారము తొలగాలి అంటే సంసార కారణమైన అజ్ఞానము అంతం కావాలి.

అజ్ఞానము అంటే చీకటి. చీకటిలో ఏది ఏమిటో అర్థం కానట్లు, అజ్ఞాన తిమిరాలు అలుముకున్నపుడు వివేకము కూడా ప్రకాశించదు. చీకటి తొలగాలి అంటే వెలుగు రావాలి. అజ్ఞాన తిమిరాలు అదృశ్యం కావాలి అంటే జ్ఞాన వెలుగులు ప్రసరించాలి. అదే గీతాజ్ఞాన ప్రకాశము. అట్టి గీతా ప్రదీపాన్ని వెలిగించి శోకార్తుల తలరాతలు మార్చిన వ్యాస భగవానునికి నమస్కారము *(నమోఽస్తు).*

ప్రపన్న పారిజాతాయ తోత్రవేత్రైకపాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృత దుహే నమః ॥ 3

ప్రపన్న పారిజాతాయ	= శరణాగతులకు కల్పవృక్షమైన వానికి
తోత్రవేత్ర ఏకపాణయే	= కొరడాను ఒక చేతి యందు కలిగిన వానికి
జ్ఞానముద్రాయ	= చిన్ముద్రను ధరించిన వానికి
గీతామృత దుహే	= గీతామృతమును పితికిన వానికి
కృష్ణాయ	= శ్రీకృష్ణునికి
నమః	= నమస్సులు

శరణాగతులకు కల్పతరువు వంటి వాడు, ఒక చేతి యందు మునికోలను పట్టుకొని, మరియొక చేతితో జ్ఞానముద్రను ప్రదర్శించు వాడు, గీతామృతమును పితికిన వాడు, శ్రీకృష్ణ దేవునకు ప్రణామములు.

వ్యాఖ్య

తరువులు కరువులు తీర్చ వచ్చు. బ్రతుకు తెరువును మార్చలేవు. ఛాయను ప్రసాదించ వచ్చు. మాయను తొలగించ లేవు. ఏ తరువు ఆ ఫలాలనే ఇస్తుంది. కాని కల్పతరువు కోరిన వన్నీ ఇస్తుంది. కల్పతరువు నీడలో కరువులు తీరుతాయి. బరువులు దిగుతాయి. కాని, అజ్ఞానాన్ని తొలగించి మోక్షాన్ని ప్రసాదించడం కల్పతరువుకు కూడా సాధ్యం కాదు. అది ఒక్క పరమేశ్వరునికే సాధ్యం.

స్వర్గం లోని కల్పతరువు కోరికల్ని తీర్చుతుంది. గోవింద కల్పతరువు కోరికలే లేకుండా చేస్తుంది. ఆశ్రితులను ఆప్తకాముల్ని చేస్తుంది. అంటే, సమస్త కోరికలు తీరి పోతాయి కనుక ఇక ఏ కోరికలు ఉండవు అని అర్థము. అదే మోక్షము. ***మోక్ష మిచ్ఛేత్ జనార్దనాత్*** - మోక్షాన్ని ప్రసాదించే వాడు జనార్దనుడు. భక్తుల పాలిటి కల్పవృక్షము. భక్త పారిజాతము.

ఆ మహాత్ముని సమీపించిన వారందరూ సద్గతిని పొంది తరించారు. పరమాత్మ స్మరణం మరణాన్ని నివారిస్తుంది. అశుభాన్ని అంతం చేస్తుంది. అజ్ఞానాన్ని నిర్మూలిస్తుంది. అజ్ఞానం లేని చోట శోకమోహాదు లుండవు. దుఃఖం దరి చేరదు. ఆనందం దూరం కాదు.

భేదం చూడకుండా నది అందరినీ చల్లబరుస్తుంది. తేడాలు లేకుండా గాలి అందరికీ హాయి నిస్తుంది.

ఈ ప్రేమల్ని, త్యాగాల్ని ప్రకృతిలో ఆవిష్కరించిన పరమాత్మ, ఆశ్రయించిన వారిని తారతమ్యాలు చూడకుండా తరింప చేస్తాడు.

నిరుపేద అయిన కుచేలుని ఆదుకున్నాడు. త్రివక్ర అయిన కుబ్జను కనికరించాడు. దారుణ మైన పరిస్థితి నుండి ద్రౌపదిని రక్షించాడు. అమాయకులైన గోపికలను ఉద్ధరించాడు. సుదాముణ్ణి అనుగ్రహించాడు. అక్రూరునికి యమునా జలాలలో దర్శన మిచ్చాడు. ఆవులకు ఆనందాన్ని పంచాడు. కోతుల్ని కరుణతో చూశాడు. గుజ్జాలకు కరస్పర్శతో హాయిని ప్రసాదించాడు. అన్నం పెట్టిన విప్ర స్త్రీలకు అమృతాన్ని అనుగ్రహించాడు. పాలిచ్చిన తల్లికీ మోక్షమే. విష మిచ్చిన రాక్షసికీ మోక్షమే. పిడికెడు అటుకు లిచ్చినా మోక్షమే. అరటితొక్కలు అర్పించినా మోక్షమే. పారము తెలియని ఆ ప్రేమ సాగరంలో మునక వేసిన వారందరూ తరించి పోయారు. చేరని వారు చెడిపోయా రేమో గాని, ఆశ్రయించిన వారందరూ ఆనంద స్వరూపు లయ్యారు. అమృత స్వరూపు లయ్యారు.

ధర్మాచరణమును నేర్పి వానరులను కూడా నరులను చేసేందుకు రామావతారం వస్తే, జ్ఞానప్రేమలను పంచి నరుల్ని నారాయణులుగా మార్చేందుకు కృష్ణావతారం వచ్చింది. అందుకే మునికోలతో, చిన్ముద్రతో శ్రీకృష్ణుడు చిద్విలాసంగా దర్శన మిస్తాడు.

జగన్మోహనం

శ్రీకృష్ణ పరమాత్మ ఒక చేతిలో వేత్రమును ధరించి ఉన్నాడు. 'వేత్రము' అంటే పశువులను తోలే ముల్లుకర్ర అని అర్థము. వెదురు కర్ర అని కూడా అర్థము. గుజ్జాలను తోలే కొరడా, లేదా మునికోల అని కూడా చెబుతారు.

గోవులను మేపు నపుడు బాలకృష్ణుని చేతిలో ఒక కర్ర ఉండేది. దారి తప్పే గోవుల్ని దారి మళ్ళించడానికి అది ఉపయోగ పడేది. ఆనాడు పశువుల్ని దారి మళ్ళించినట్లే, మానవుల హృదయాలలో నిక్షిప్తమై ఉన్న పశు ప్రవృత్తుల్ని కూడా సదా దారి మళ్ళించి సంస్కరిస్తాడు కనుక చేతిలో వేత్రమును ధరిస్తాడు.

రథంలో ఆసీనమై నపుడు పార్థసారథి చేతిలో మునికోల ఉంటుంది. మునికోలను ఊపుతూ అశ్వాలను అదుపులో పెడుతూ ఉంటాడు. అలాగే ఆశ్రితులైన వారి మనస్సులలో చెలరేగే అరిషడ్వర్గాలను అదుపులో ఉంచి ఆశీర్వదిస్తూ ఉంటాడు.

ఇక రెండవ చేతి ద్వారా జ్ఞానముద్రను ప్రదర్శిస్తాడు. చేతి వ్రేళ్ళ ద్వారా ప్రకటించే తాత్త్విక సంజ్ఞా ప్రదర్శనమే జ్ఞానముద్ర, లేక చిన్ముద్ర. అరచేతిని ముందుకు చాపి, చిటికెన వ్రేలు, ఉంగరపు వ్రేలు, మధ్య వ్రేలు - ఈ మూడింటిని కలిపి ముందుకు చాచి, చూపుడు వ్రేలును మడచి బొటనవ్రేలుతో కలిపి వలయాకారంలో ఉంచడాన్ని చిన్ముద్ర అంటారు.

బొటనవ్రేలు లేనిదే ఏ కార్యమును చెయ్యలేము. అన్నిటికీ అదే ఆధారము. ఆ ఒక్కటి లేకపోతే, నాలుగు వ్రేళ్ళు ఉన్నా ఉపయోగము ఉండదు. కనుక, ఆధార మైన బొటనవ్రేలు బ్రహ్మస్వరూపము.

చూపుడు వ్రేలు ఎప్పుడూ దోష దర్శనం చేస్తూ ఉంటుంది. దోషాలను, పాపాలను చూడటమే గాక, చూపెట్టడం ప్రత్యేకంగా దాని పని. కనుక అది జీవునికి సంకేతము. 'జీవ' సంకేత మైన చూపుడు వ్రేలును 'బ్రహ్మ' సంకేత మైన బొటనవ్రేలుకు తగిలించ గానే వలయాకారం ఏర్పడుతుంది. గుండ్రముగా కనిపిస్తుంది. అదే పూర్ణ స్వరూపము. ఆది ఎక్కడో, అంత మెక్కడో అర్థం గాని పరిపూర్ణ సత్తా స్వరూపానికి సంకేతము.

ఇలా రెండు వ్రేళ్ళను కలిపే టప్పుడు మిగిలిన మూడు వ్రేళ్ళను ముందుకు చాచి దూరంగా ఉంచాలి.

పూర్ణానంద స్వరూపము అనుభూతిగా నిలవాలి అంటే, ఆ మూడు వ్రేళ్ళు దూరంగా ఉండాలి. అవే త్రిగుణములు. గుణత్రయమును దూరంగా ఉంచాలి. శరీరత్రయమును దూరంగా ఉంచాలి. అవస్థాత్రయమును దూరంగా ఉంచాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, అనాత్మను దూరంగా ఉంచాలి. అలా ఉంచి నపుడే జీవ బ్రహ్మైక్యము అఖండంగా శోభిస్తుంది. ఇదే చిన్ముద్ర లోని చిద్విలాసం.

శ్రీకృష్ణుడు బోధించిన యోగాలు రెండే. ఒకటి జ్ఞానయోగము. రెండవది కర్మయోగము. చిన్ముద్ర ద్వారా జ్ఞానయోగ వైభవమును, మునికోల ద్వారా కర్మయోగ వైశిష్ట్యమును ప్రదర్శించి చూపాడు. రెండిటిని ఆచరించి చూపాడు. కర్మలలో ఉన్నా జ్ఞానాన్ని జారవిడుచుకో కూడదు అనే సందేశాన్ని అందించాడు. జ్ఞానం లేకపోయినా ధనుర్బాణాలను పడేసి అర్జునుడు నిశ్చేష్టుడై కూర్చున్నాడు. పరిపూర్ణ జ్ఞానంతో శోభిస్తున్నా పురుషోత్తముడు మునికోలను చేత పట్టుకొనే ఉన్నాడు. జ్ఞానంతో శోభించే వారికి కర్మ ఎన్నడూ బంధం కాదని ప్రదర్శన ద్వారా చెప్పకనే భగవానుడు చెబుతున్నాడు.

జ్ఞానం కలవాడే జ్ఞానాన్ని ప్రసాదించ గలడు. చిన్ముద్రాకారుడే గీతామృతాన్ని పితికి ఆశ్రితులకు వితరణ చేశాడు. చిన్ముద్ర ఎలా ఉంటుందో పాలు పితికే వారి వ్రేళ్ళు కూడా పితికే టప్పుడు అలాగే ఉంటాయి. శ్రీకృష్ణుడు జ్ఞానక్షీరాన్ని ఎలా పితికాడో తరువాత శ్లోకంలో చూద్దాం.

అమృతోద్భవం

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః ।
పార్థో వత్సః సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥ 4

సర్వోపనిషదః	= సకల ఉపనిషత్తులు	వత్సః	= లేగదూడ
గావః	= ఆవులు	భోక్తా	= అనుభవించు వాడు
గోపాలనందనః	= గోప కుమారుడు	సుధీః	= బుద్ధిమంతుడు
దోగ్ధా	= పాలు పితుకువాడు	దుగ్ధం	= క్షీరము
పార్థః	= అర్జునుడు	మహత్ గీతామృతం	= గొప్పదైన గీతామృతము

ఉపనిషత్తులు గోవులు. పాలు పితుకు వాడు గోపాల నందనుడు. లేగదూడ అర్జునుడు. పానము చేయు వాడు సద్బుద్ధి కలవాడు. గొప్పదైన గీతామృతమే క్షీరము.

వ్యాఖ్య

జ్ఞాన క్షీరం

ఉపనిషత్తులు గోవులు. జ్ఞానము పవిత్రము కనుక జ్ఞాన పూర్ణమైన ఉపనిషత్తులు పవిత్రములు. అలాగే గోమాత కూడా పవిత్రము. గోక్షీరము ఆరోగ్యప్రదము. ఉపనిషత్సార మైన గీతా పీయూషము అమృతానంద ప్రదము. గోక్షీరము ప్రాణులకు శక్తి నిచ్చి జీవనాన్ని వృద్ధి చేస్తుంది. ఉపనిషత్తులు బోధించే జ్ఞానము మనిషికి ఆధ్యాత్మిక శక్తి నిచ్చి అద్వైత జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. జగత్తు యొక్క ధారణ పోషణలు ఏడు విషయాల మీద ఆధారపడి ఉన్నా యన్నారు మన పూర్వీకులు. ఆ ఏడింటిలో గోమాత ఒకటి.

గోభి ర్విప్రైశ్చ వేదైశ్చ సతీభిః సత్యవాదిభిః
అలుబ్ధైః దానశూరైశ్చ సప్తభి ర్ధాయతే మహీః ॥

గోమాత, వేదవిదుడు, వేదము, పతివ్రత, సత్యవాది, లోభి కాని వాడు, దానవీరుడు - ఈ ఏడుగురి తోనే ధరణి యొక్క ధారణ పోషణలు జరుగు తున్నాయి.

గోవు మనకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది. గోమాత సంతాన మైన ఎద్దులు పొలాన్ని దున్న డానికి, బరువులు మోయడానికి, బండ్లు లాగడానికి ఉపయోగ పడతాయి. ఆవుపేడ శక్తివంతమైన ఎరువుగా ఉపయోగ పడుతుంది. పంచితము, అనగా గోమూత్రము కూడా పవిత్రమే. ఔషధాల తయారీలో గోమూత్రాన్ని ఉపయోగిస్తారు. పంచితాన్ని శుద్ధి క్రియకు కూడా వినియోగిస్తారు. గోమాతల నుండి ఇన్ని విధాలైన ప్రయోజనాలు చేకూరుతున్నా, ప్రధాన ప్రయోజనము మాత్రము క్షీరమే.

ఉపనిషత్తులు అనేకమైన విషయాలను చర్చిస్తాయి. కర్మకాండ, యోగవిధి, ఉపాసనాది విషయాలను కూడా ఉపనిషత్తులు చర్చిస్తాయి. కాని, ఉపనిషత్తుల యొక్క ప్రధాన ప్రయోజనం మాత్రం ఆత్మజ్ఞానమే. జ్ఞానక్షీరమే.

భోజనం లేనిదే మనిషికి శక్తి రాదు. కాని, గోక్షీరము లేకుండా భోజనం రుచిస్తుందా? పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, - ఇవన్నీ క్షీరము ప్రసాదించినవే కదా? అందుచేతనే ***వినా గోరసం కో రసం భోజనేషు?*** గోక్షీరం లేని ఆహారంలో రుచి ఏముంటుంది? అన్నారు పెద్దలు.

జ్ఞానం లేకపోతే జీవితంలో వెలుగు ఉండదు. కాని, ఉపనిషత్తులకు దూరమైన జ్ఞానం వాస్తవానికి అజ్ఞానమే. విశ్వ విజ్ఞాన మంతా ఉపనిషత్తుల నుండే లభిస్తుంది. అందుకనే, వేదాంత జ్ఞానం లేని వారి జీవితాలలో వెలుగు ఉండదు అన్నారు పెద్దలు.

బాల్యంలో తల్లిపాలు త్రాగి పెరుగుతాము. శైశవం దాటిన తరువాత, బ్రతికినంత కాలం గోక్షీరం తోనే జీవిస్తాము. అందుకనే గోమాతను పాలిచ్చి పెంచిన తల్లి స్థానంలో నిలిపి పూజించారు మన పూర్వీకులు.

గోక్షీరం ఎలా అందుతుందో, ఉపనిషత్ జ్ఞానం కూడా అలాగే అందుతుంది. అందుచేత గోవుల్ని ఉపనిషత్తుల తోను, క్షీరాన్ని గీతామృతం తోను పోల్చారు. ఆరోగ్యాన్నిచ్చే గోక్షీరం మధురం. ప్రకాశాన్ని ప్రసాదించే ఉపనిషత్ జ్ఞానం మధురాతి మధురం.

ఆవులు గడ్డి తింటాయి. తినిన ఆహారాన్ని తిరిగి నోటి లోకి తెచ్చుకొని నెమరు వేస్తాయి. అలా నెమరు వేయడంలో పాలు ఉత్పన్న మవుతాయి. జటిల మైన, గహన మైన ఉపనిషత్ విషయాలు ఒక రాగాన మ్రింగుడు పడవు. ఆవు నెమరు వేసినట్లు, ఆ తాత్త్విక విషయాలను మనం మననం చేయాలి. నెమరు వేసే టప్పుడు గోమాత తదేకంగా అవధానంతో ఉంటుంది. అప్పుడే పాలు తయా రవుతాయి. అలాగే, ఉపనిష ద్విషయాలను శ్రవణ మననాదుల ద్వారా బుద్ధికి పట్టించుకొని, ఆ తరువాత తదేక నిష్ఠతో నిదిధ్యాసను సాగిస్తే, జ్ఞానక్షీరం లభిస్తుంది. ఆ జ్ఞానక్షీరమే గీతామృతము. ఉపనిషత్తులు అనే గోవుల నుండి గీతాజ్ఞాన క్షీరమును పితికే వాడు గోపాల నందనుడు.

పాల గోపాలుడు

గోవుల నుండి పాలు పితికే వాడు గోపాలుడు. పాలు పితకడం ఒక కళ. తెలిసిన వాడు పితికితేనే పాలొస్తాయి. తెలియని వాడు పితికితే తన్నులు మిగుల్తాయి. శ్రీకృష్ణుడు గొల్ల పిల్లవాడే కనుక చక్కగా పాలు పితక గలడు. అందుకే అతడు గోపాలుడు. గోవులను పాలించే వాడు అయినందున గోపాలుడు ***(గవాం పాలనాత్).*** అలాగే గోవుల్ని మేపే టప్పుడు గోప వేషధారిగా గోచరించడం వల్ల కూడా శ్రీకృష్ణుడు గోపాలుడు *(గోప వేషధరః గోపాలః).*

పాలు పితకడం అందరూ చేయలేరు. ఉపనిషత్తుల లోని జ్ఞానాన్ని అందరూ అందుకోలేరు. పాలు పితకడం తెలిసిన వానికే గోక్షీరం లభ్య మైనట్లు, సంప్రదాయం తెలిసిన వారికే ఉపనిషత్ జ్ఞానము వంట పడుతుంది. శ్రీకృష్ణుడు గోపాల నందనుడు. గోక్షీరమును ఎలా పితకాలో తెలిసిన వాడు. అలాగే **గో** అంటే 'మహి' లేదా 'భూమి' అని కూడా అర్థము. భూమికి పతి కనుక గోపాలుడు భూపతి. అతడే గోపతి. అతడే గోహితుడు కూడా. ***గోభ్యో హితో గోహితః*** - భూమండలానికి మేలు చేసే వాడు. **గో** అంటే వాక్కు అని మరొక అర్థం. ఉపనిషత్తుల యొక్క జ్ఞాన వైభవాన్ని వర్ణించి చెప్పి, అటు ఉపనిషత్తుల ప్రాభవాన్ని నిలుపు తున్నాడు. ఇటు ఉపనిషత్ జ్ఞానము ద్వారా మహిలో మహిమను ఆవిష్కరిస్తున్నాడు. ఉపనిషత్తు లనే గోవుల నుండి గోపాలు డనే శ్రీకృష్ణుడు భగవద్గీత అనే క్షీరాన్ని ఎలా పితుకు తున్నాడో అర్థం చేసుకున్నాం. ఇంతవరకు జ్ఞానం యొక్క వైశిష్ట్యంతో పాటు ***(గీతా)***, జ్ఞాని యొక్క వైభవాన్ని కూడా అర్థం చేసుకున్నాం ***(గోవిందః)***. ముక్తికి గకార చతుష్టయం రాజమార్గ మని శాస్త్రం చెబుతూ ఉంటే, ఇప్పటికే మనకు గకార ద్వయం లభ్యమైంది. (1)గీత (2) గోవిందుడు.

గీతా గంగా చ గాయత్రీ గోవిందేతి హృది స్థితే
చతు ర్గకార సంయుక్తే పునర్జన్మ న విద్యతే ॥

గీత, గంగ, గాయత్రి, గోవిందుడు అని గకారముతో ప్రారంభమయ్యే నాల్గింటిని హృదయములో నిలుపుకున్న వారికి పునర్జన్మ ఉండదు.

వాత్సల్యం తోనే వర్ధన

ఆవు పాలు ఇస్తుంది. కాకపోతే, ముందుగా లేగదూడ తల్లి పొదుగును స్పృశించాలి. అప్పుడే ప్రేమతో పొదుగు నుండి పాలు కారుతాయి. గీతా క్షీరాన్ని శ్రీకృష్ణుడు ప్రసాదించ డానికి అర్జునుడు లేగదూడగా నిలిచాడు. గీతాబోధ ప్రపంచానికి అంద డానికి పార్థుడు నిమిత్త మయ్యాడు. అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని పరానుగ్రహార్థం ఉపదేశించాలని భగవానుడైన వాసుదేవుడు సంకల్పించాడు ***(సర్వ లోకానుగ్రహార్థం అర్జునం నిమిత్తీకృత్య ఆహ భగవాన్ వాసుదేవః)***.

పేరు ఒకరిది - ఊరు అందరిది

ఆవు పాలిచ్చేది దూడ కొరకే అయినా, పాలన్నీ దూడ ఒక్కటే త్రాగదు; త్రాగలేదు. దూడ ముందుగా కొన్ని పాలు త్రాగుతుంది. ఆ తరువాత మిగిలిన పాలు మన పాలు.

గీతామృతం కూడా అంతే. గీతాజ్ఞానాన్ని శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి ఉద్దేశించి బోధించినా, అది కేవలం అర్జునుని కొరకే కాదు. అందరి కొరకు. అందరి ఆనందం కొరకు. గీతామృతాన్ని పానం చేసే వారు బుద్ధిమంతులు ***(సుధీః భోక్తా)***. అంటే వివేకబుద్ధి కలవారు అని అర్థం. అట్టి వారే గీతామృతాన్ని పానం చేసి అమృత స్వరూపు లవుతారు. ఈ విధంగా వేదార్థ సార సంగ్రహమైన గీతాశాస్త్రాన్ని ప్రసాదించిన శ్రీకృష్ణ దేవునకు కృతజ్ఞతతో మళ్ళీ మళ్ళీ తలవంచి నమస్కరిస్తున్నాము.

జగద్గురు వందనం

వసుదేవసుతం దేవం కంస చాణూర మర్దనమ్ ।
దేవకీ పరమానన్దం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 5

వసుదేవ సుతం	=	వసుదేవుని కుమారుడు
కంస చాణూర మర్దనం	=	కంస చాణూరులను చంపిన వాడు
దేవకీ పరమానందం	=	దేవకీమాతను పరమానంద పరచిన వాడు
జగద్గురుం	=	జగద్గురువు
దేవం	=	భగవంతుడు
కృష్ణం	=	శ్రీకృష్ణుని
వందే	=	నమస్కరింతును

వసుదేవుని కుమారుడు, కంసచాణూరులను చంపిన వాడు, దేవకీదేవికి దివ్యానందాన్ని ప్రసాదించిన వాడు, జగద్గురువు, శ్రీకృష్ణదేవునికి నమస్కారము.

వ్యాఖ్య

వసుదేవ సుతం దేవం

వసుదేవుని కుమారుడుగా అవతరించుట చేత శ్రీకృష్ణుడు వాసుదేవు డని కీర్తింప బడ్డాడు ***(వసుదేవ సుతం - వసుదేవస్య అపత్యం వాసుదేవః)***. అంతేకాదు, సర్వ భూతముల యందు వసించు వాడు కూడా తానే. అందుచేత కూడా ఆయన వాసుదేవుడు ***(వసన్తి భూతాని తత్ర)***. సర్వత్ర ఉండు వాడు, సర్వమును ఆచ్ఛాదించు వాడు కనుక ఆయన 'వాసుః' అయ్యాడు. వాసువైన తాను సాక్షాత్తు దేవుడే కనుక వాసుదేవు డయ్యాడు ***(వాసుశ్చాసౌ దేవశ్చేతి వాసుదేవః)***. అలా చూచి నపుడు అవతారమూర్తిగా ఆయన వసుదేవుని కుమారుడు. దేవుడుగా వసుదేవునికి కూడా తండ్రి. జగత్పిత.

సర్వాణి తత్ర భూతాని వసన్తి పరమాత్మని
భూతేషు చ స సర్వాత్మా వాసుదేవ స్తతః స్మృతః ॥

పరమాత్మ యందు సర్వ భూతములు, సర్వ భూతముల యందు పరమాత్మ ఉండుట చేత ఆయన వాసుదేవుడు అని విష్ణుపురాణము. కనుక వసుదేవుని కుమారుడుగా స్తుతింప బడిన వాసుదేవుడు, వాస్తవానికి దేవదేవు డైన వాసుదేవుడే ***(వసుదేవ సుతం దేవం)***.

కంస చాణూర మర్దనం

శ్రీకృష్ణుడు మేనమామ అయిన కంసుని వధించి కంసారి అయ్యాడు. కంసుడు ఎవరో కాదు, అజ్ఞానమే కంసుడు. ఆదిత్య దర్శనంతో అంధకారం అదృశ్య మైనట్లు, అచ్యుతుని దర్శనంతో అజ్ఞానం అంత మవుతుంది.

అజ్ఞాన కొలువులో అహంకారమే గొప్ప యోధుడు. వాడే చాణూరుడనే మల్లయోధుడు. అహంకారానికి ప్రతిరూపం. శ్రీకృష్ణుడు చాణూరుణ్ణి కూడా వధించాడు. పరమాత్మ ప్రవేశంతో హృదయ మనే మధురా నగరాన్ని కలుషితం చేస్తున్న కంసచాణూరులు మరణిస్తారు. జీవునికి అనంతానందం ప్రాప్తిస్తుంది.

దేవకీ పరమానందం

తల్లి యైన దేవకీదేవికి శ్రీకృష్ణుడు దివ్యానందాన్ని ప్రసాదించాడు. దేవకీ నందనుడై దేవకీదేవిని ఆనందంలో ఓల లాడించాడు. ఆయన దేవకీసుతుడు ***(దేవక్యాః పుత్రః)***. అంతేకాదు. సర్వములో, సర్వ దేవతలలో శోభించే దివ్య చైతన్యం కూడా దేవకీ పుత్రుడే అన్నది పంచమ వేదమైన మహాభారతము ***(సర్వ దేవాః దేవకీ పుత్ర ఏవ - ఇతి మహాభారతే)***.

దేవకీదేవికి శ్రీకృష్ణుడు రెండుసార్లు పరమానందాన్ని కలిగించాడు. కారాగృహంలో బిడ్డగా ఆవిర్భవించి నపుడు, శంఖచక్ర గదా పద్మములతో శోభిస్తూ చతుర్భుజుడుగా దివ్య దర్శన మిచ్చి, 'అమ్మా! బాధపడకు, నేను వచ్చాను. సదా మీ తోనే ఉంటాను. మీ లోనే ఉంటాను. మీ బంధాలను తొలగిస్తాను' అని అభయ ప్రదానం చేసి మహదానందాన్ని కలిగించాడు. అది మొదటిసారి.

ఆ అలౌకిక రూపాన్నే ధ్యానిస్తూ, ఆయన దివ్యనామాన్నే స్మరిస్తూ, చెరసాలలో భక్తి సాధనను కొనసాగించింది దేవకీమాత. తనను స్మరించే భక్తుల్ని శ్రీకృష్ణుడు విస్మరించడు. కంసుణ్ణి వధించి, దేవకీ వసుదేవుల్ని చెరసాల నుండి విడిపించి వారికి దివ్యానందాన్ని అనుగ్రహించాడు. ఇది రెండవ సారి.

దేవకీమాతకే కాదు. భక్తు లెవరి కైనా భగవ దనుగ్రహం ఇలా రెండు సార్లు ప్రాప్తిస్తుంది. మొదట హృదయంలో భక్తిరూపంలో ఆవిష్కరింప బడుతుంది. ఆ తరువాత జ్ఞానరూపంలో ఆశీర్వదించి పరమానందాన్ని ప్రసాదిస్తుంది (*దేవకీ పరమానందం*).

కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీకృష్ణ భగవానుడు ప్రసాదించిన గీతా జ్ఞానం ఒక కాలానికో, ఒక దేశానికో, లేదా కొందరు వ్యక్తులకో సంబంధించింది కాదు. యావద్విశ్వానికి విశ్వ మున్నంత వరకు ఉపకరించే జ్ఞానం కావడం చేత ఆయన జగద్గురువు. కృష్ణుడు బోధించిన గీతాజ్ఞానం పట్ల కొందరికి ఆసక్తి లేకపోవచ్చు. అనురక్తి లేకపోవచ్చు. అయినా, అది వారికి సంబంధించే ఉంది. అవసరం తెలియనంత మాత్రాన అవసరం లేదని కాదు. తెలిసొచ్చిన నాడు అది ఒక్కటే తెరువు అని అర్థ మవుతుంది. ఆనాడు వారికి కూడా ఆయనే గురువు. ఆ విధంగా శ్రీకృష్ణుడు జగద్గురువు. అట్టి జగద్గురువైన శ్రీకృష్ణునికి నమస్కారము.

కృష్ణ యను పలుకులో ఎంత కమ్మదనము
బాధలలో ఓదార్పు అమ్మతనము
నిన్ను మించిన దైవమును కనలేము మేము
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకము భక్తితో నివేదించు కుంటున్న ఒక వెన్నముద్ద.

తరించే మార్గము

భీష్మద్రోణ తటా జయద్రథజలా గాన్ధార నీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా ।
అశ్వత్థామ వికర్ణ ఘోర మకరా దుర్యోధ నావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాణ్డవై రణనదీ కైవర్తకః కేశవః ॥ 6

భీష్మద్రోణతటా	= భీష్మద్రోణులు తీరములు	దుర్యోధన ఆవర్తినీ	= దుర్యోధనుడు సుడిగుండము
జయద్రథజలా	= సైంధవుడు నీరు	సః	= ఆ
గాంధార నీలోత్పలా	= శకుని నల్లకలువ	రణనదీ	= యుద్ధమనే నది
శల్యగ్రాహవతీ	= శల్యుడు సొరచేప	ఖలు	= వాస్తవముగా
కృపేణ వహనీ	= కృపుడు జలప్రవాహ వేగము	పాండవైః	= పాండవులచే
కర్ణేన	= కర్ణుడనే	ఉత్తీర్ణా	= దాట బడినది
వేలాకులా	= అలలతో నిండి	కైవర్తకః	= నావికుడు
అశ్వత్థామ వికర్ణ ఘోరమకరా	= అశ్వత్థామ, వికర్ణులు భయంకర మొసళ్ళు	కేశవః	= కేశవుడు

భీష్మద్రోణులను తీరములుగా కలది, జయద్రథుని జలముగా కలది, శకునిని నల్లకలువగా కలది, శల్యుని సొరచేపగా కలది, కృపాచార్యుడనే జలప్రవాహ వేగము కలది, కర్ణు డనే అలలతో కూడినది, అశ్వత్థామ వికర్ణులనే భయంకరమైన మొసళ్ళతో నిండినది, దుర్యోధనుడనే సుడిగుండము గల సమరనదిని నిజానికి పాండవులు చక్కగా దాట గలిగారు. శ్రీకృష్ణుడు నావికు డయ్యాడు.

వ్యాఖ్య

దుర్యోధనుని అధర్మ జీవనానికి, అక్రమ ప్రవర్తనకు ప్రతిఫలమే కురుక్షేత్ర సంగ్రామము. మాతృమూర్తి కుంతీదేవి అభీష్టానికి అనుగుణంగా, అచ్యుతుని సారథ్యంలో పాండవులు యుద్ధానికి సిద్ధ పడ్డారు. ఏడు అక్షౌహిణుల సైన్యం పాండవుల వైపు నిలిచింది. కౌరవుల పక్షంలో పదకొండు అక్షౌహిణుల సైన్యం నిలిచి భయంకరంగా గోచరిస్తూ ఉంది. మహా ప్రళయ ప్రభంజనంలా కనిపిస్తున్న కౌరవసేనను భయంకరమైన నదీ ప్రవాహంతో పోల్చి అద్భుతంగా వర్ణిస్తూ, చివరగా జీవితానికి అతి ముఖ్యమైన సందేశాన్ని కూడా జోడించి జోహారు లర్పిస్తూ ఉంది ఈ శ్లోకం.

సమరనది

పాండవులు ఎవరిని ఎదిరించి పోరాడాలో, ఆ కౌరవసైన్యం భయంకరమైన నదీ ప్రవాహంలా ఉంది. అది మామూలు నది కాదు. సమరనది. సంసార రణనది.

ఏటి గట్ల మధ్యే నది ప్రవహిస్తుంది. గట్లు లేకపోతే ఏరు ఉండదు. నీరు అన్ని వైపుల పారి కళ్ళేపి చల్లినట్లు రూపం లేకుండా పోతుంది. కురుక్షేత్రంలో కౌరవసేనా నదికి భీష్మద్రోణులు గట్ల లాగా నిలిచి ఉన్నారు. నదిని పటిష్ఠ మైన గట్లు కాపాడినట్లు, కౌరవసేనా నదిని పరాక్రమవంతులు, అజేయు లైన భీష్మ ద్రోణులు కాపాడు తున్నారు. ఏటి గట్టు బలంగా లేనపుడు ఏటికి గండ్లు పడతాయి. అసమాన పరాక్రమవంతు లైన భీష్మద్రోణుల పరాక్రమం ముందు ప్రమాదానికి అవకాశం లేని రీతిలో సమరనది ప్రవహిస్తోంది (*భీష్మద్రోణ తటా*).

గట్లు పటిష్ఠంగా ఉండినా, నదిలో నీళ్ళు లేకపోతే ఏమి ప్రయోజనం? గొప్ప సైన్యం అనే జలంతో జయద్రథుడు జలరూపంలో ఉన్నాడు (*జయద్రథజలా*). ఆ జలం కూడా ప్రవాహ రూపంలో పరవళ్ళు త్రొక్కుతూ ఉంది. ఆ ప్రవాహ వేగమే కృపాచార్యుడు (*కృపేణ వహనీ*).

నది ప్రవహించే టప్పుడు మార్గంలో అక్కడక్కడ ఏటి గట్లు కొద్దిగా రాపిడికి గురై, గుంటలు ఏర్పడుతూ ఉంటాయి. అలాంటి చోట ప్రవాహ జలము కొంత నిలువ ఉండి పోతుంది. అక్కడ బీజవ్యాప్తి వల్ల మొక్కలు పెరుగుతాయి. తీగలు మొలుస్తాయి. కలువలు మొదలైన పువ్వులు పూస్తాయి. కొంత కాలానికి తీగ లన్నీ విస్తరించి నదీ ప్రవాహాన్ని అడ్డగిస్తూ ఉంటాయి. ప్రస్తుతం కౌరవుల సమరనదిలో శకుని కలువ పొద లాగా ఉన్నాడు (*గాంధార నీలోత్పలా*).

నదిలో భయంకరమైన సొరచేపలు, తిమింగలాల లాగా, కర్ణుడి సారథి శల్యుడు కనిపిస్తున్నాడు (*శల్య గ్రాహవతీ*). ఈదడానికి వీలు లేని విధంగా ఆ సమరనది కర్ణుడనే భయంకర కెరటాలతో ఎగిసి పడుతోంది (*కర్ణేన వేలాకులా*). శ్రమించి ఈదడానికి ప్రయత్నిస్తే, గొప్ప ప్రమాదం యువకిశోరాలైన అశ్వత్థామ, వికర్ణు లనే భయంకర మొసళ్ళ రూపంలో పొంచి ఉంది (*అశ్వత్థామ వికర్ణ ఘోర మకరా*).

ఇన్నిటినీ తట్టుకొని గట్టు పైకి చేరే లోగా మధ్యలో పెద్ద సుడిగుండం ఉంది. అదే దుర్యోధనుడు

(దుర్యోధన ఆవర్తినీ). ఆ వైపు లాగబడిన వాళ్ళు తిరిగి బయట పడలేరు. భీష్మ, ద్రోణ, కృప, వికర్ణాదులు ఆ సుడిగుండంలో చిక్కుకొని బయట పడ లేక గింజుకుంటున్న వాళ్ళే. యుద్ధం వారిలో ఎవ్వరికీ ఇష్టం లేదు. సుడిగుండంలో చిక్కుకొని బయట పడలేక పోతున్నారు. ఇలాంటి భయంకర సమరనదిని ఎవరైనా అయినా సుడిగుండంలో చిక్కుకొని బయట పడలేక పోతున్నారు. ఇలాంటి భయంకర సమరనదిని ఎవరైనా దాటగలరా? కాని, పాండవులు దాటేశారు. దానికి కారణం వారు నావలో ఎక్కడమే. అది కూడా విజ్ఞాన నౌక కావడమే. అంతకన్నా ముఖ్యమైన విషయం ఆ నౌకను నడిపే వాడు శ్రీకృష్ణుడు కావడమే *(కైవర్తకః కేశవః).*

తరుణోపాయం

జీవితము ఎవరి దైనా చదరంగమే. రణరంగమే. ఇక్కడ ఏదైనా జరగవచ్చు. ఎలాగైనా జరగవచ్చు. ఎప్పుడైనా జరగవచ్చు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. వివేకంతో చరించాలి. జీవన సమరనదీ ప్రవాహంలో పరిస్థితి విషమించకుండా చూసుకోవాలి.

నదీ ప్రవాహంలో ప్రతి క్షణమూ మార్పులే. జీవితంలో కూడా అంతే. నదిలో కాలు పెట్టబోయే ముందు ఏ నీటి నైతే మనం చూస్తామో, కాలు పెట్టే సరికి మన పాదాలకు తాకే నీరు మనం చూసింది కాదు. కాలు పెట్టే లోగా మనం చూసిన నీరు ముందుకు పోతుంది. కొత్త నీరు కాళ్ళను తాకుతుంది. ఇదే మార్పు. జీవితమూ ఇంతే. క్షణక్షణానికి మార్పే జీవిత మిచ్చే గొప్ప తీర్పు. నేడున్న వారు రేపుండరు. నేడున్న పరిస్థితులు మరునాడు ఉండవు. ఈ నిముషంలో లేని ప్రమాదం మరో పది నిముషాల్లో ముంచుకు రావచ్చు. ఉన్నవి ఊడిపోతూ ఉంటాయి. కొన్ని కళ్ళ ముందే కాలిపోతూ ఉంటాయి. కదిలే కాళ్ళకు కదలలేని స్థితి ఒకటుంది. చూచే కళ్ళకు చూడలేని పరిస్థితీ ఉంటుంది. జాగ్రత్తగా ఉన్నా కొన్ని జారి పోతూనే ఉంటాయి. గోరంత లాభాలను చూసుకొని పది అడుగులు పైకి పోతాం. కొండంత నష్టాలను మోయలేక వంద అడుగులు క్రిందికి జారిపోతాం.

ప్రారబ్దం దర్శకత్వం వహించే ఈ జీవిత నాటకంలో ప్రతిక్షణం ఉత్కంఠే. ప్రతి నిముషం ఉద్వేగమే. అంతా అనిశ్చితమే. అయోమయమే. ఈ మాయా మనుగడలో మనిషి ఎవరిని ఆశ్రయించాలి? ఎవరిని ఆశ్రయించినా, మునిగిపోయే వాణ్ణి వాటేసుకొని తేలేందుకు ప్రయత్నం చేయటమే అవుతుంది. ఎవరిని ఆశ్రయిస్తే అశ్రువులు, అగచాట్లు శాశ్వతంగా అదృశ్య మవుతాయో, ఎవరి అండ దొరికితే దండగ అనుకున్న బ్రతుకు దండిగా పండుతుందో - అట్టి ఏకైక శరణ్యమూర్తి కేశవుణ్ణి భక్తితో ఆశ్రయించాలి.

సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః. భయంకరమైన యుద్ధ మనే నదీ ప్రవాహాన్ని పాండవులు అవలీలగా దాటేశారు. ఎలా దాట గలిగారో తెలుసా? ***కైవర్తకః కేశవః.*** నావ నడిపే వాడు శ్రీకృష్ణుడు కావడం చేత.

పాండవులు శ్రీకృష్ణుని ఆశ్రయించి తరించారు. అందరమూ అదే చెయ్యాలి. బ్రతుకులో చెలరేగే బాధల్ని మన శక్తియుక్తులతో పోగొట్టుకో లేము. ఉప్పెనలా వచ్చిపడే కష్టాల్ని మనకు మనంగా తొలగించుకో లేము. ఎక్కడ అవరోధాలు అడ్డు నిలుస్తాయో, ఎప్పుడు ప్రతిబంధకాలు ఎదురౌతాయో మన మనస్సుకు తెలియదు. ఒకవేళ తెలిసినా చేయ గలిగింది కూడా చాలా విషయాల్లో ఏమీ ఉండదు. రోదిస్తే చీకటి పోదు. ఏడిస్తే పోయింది రాదు. అనివార్యాలు జీవితంలో తప్పవు. అసంభవా లెన్నడూ జరగవు.

చంద్రుడు ఉదయిస్తేనే వెన్నెల. వసంతం విరబూస్తేనే వనం కళకళ. పరమాత్మ కృప ప్రాప్తిస్తేనే జీవితంలో పరిపూర్ణకళ. ఆనందకళ. అనంతానందకళ. భగవంతుడు ఇలా అందరికీ శరణమై ఉన్నాడు. ఆనంద ప్రదాతయై ఉన్నాడు.

మహాభారత కమలం

పారాశర్య వచః సరోజ మమలం గీతార్థ గన్ధోత్కటం
నానాఽఖ్యానక కేసరం హరికథా సంబోధనా బోధితమ్ ।
లోకే సజ్జన షట్పదై రహరహః పేపీయమానం ముదా
భూయా ద్భారత పఙ్కజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే ॥ 7

అమలం = నిర్మలమైన
పారాశర్య వచః సరోజం = వ్యాసుని వచనములనే సరస్సున పుట్టినది
గీతార్థ గంధ ఉత్కటం = గీతార్థ మనే మధురమైన సుగంధము కలది
నానా ఆఖ్యానక కేసరం = వివిధములైన కథలే కేసరములుగా గలది
హరికథా సంబోధనా బోధితం= హరికథల సందేశాలతో వికసించినది
లోకే = లోకంలో
సజ్జన షట్పదైః = మహాత్ము లనెడి తుమ్మెదలచే
అహరహః = దినదినము
ముదా = ఆనందముతో
పేపీయమానం = ఆస్వాదించ బడేది
భారత పంకజం = మహాభారత కమలము
కలిమల ప్రధ్వంసి = కలికల్మషమును నాశనం చేసి
నః = మాకు
శ్రేయసే = శ్రేయస్సు కొరకు
భూయాత్ = అగు గాక!

వ్యాసప్రబోధ మనే సరోవరమున పుట్టినది, గీతార్థ మనే మధురమైన సుగంధము కలది, వివిధము లైన కథలను కేసరములుగా కలది, హరికథా సందేశములతో ప్రఫుల్ల మైనది, ఈ ప్రపంచమున బుధజను లనెడి తుమ్మెదలచే ప్రతిదినము ఆనందముగా ఆస్వాదించ బడునది, కలిదోషములను పోగొట్టునది, నిర్దోష మైనది అయిన మహాభారత కమలము మాకు శ్రేయస్సును ప్రసాదించు గాక!

వ్యాఖ్య

మహాభారత కమలం వ్యాస భగవానుని వాక్సరోవరం నుండి ఆవిర్భవించింది. మహాభారతము అద్భుత మైన గ్రంథము. పంచమ వేదంగా శ్లాఘింప బడింది. ధర్మసూక్ష్మములు, తత్త్వసారములతో నిండిన పవిత్రమైన గ్రంథము. జన కళ్యాణాన్ని ఆవిష్కరించిన గ్రంథము.

భారతము ఇతిహాసమే అయినా, ఒక కాలానికి సంబంధించిన గ్రంథం కాదు. ఏ కాలములో నైనా కమలము తన పరిమళాన్ని ఒకే విధంగా వెద జల్లినట్లు, మహాభారత కమలం దేశకాలాదులకు పరిమితం కాకుండా జ్ఞాన సుగంధాన్ని వెద జల్లుతుంది.

మానవ సమాజం లోని వ్యక్తుల జీవన స్థితిగతులకు, ఆలోచనా విధానానికి, ప్రవర్తనకు అద్దం పడుతుంది. అర్థం చెబుతుంది. కవితా శిల్పంతో, నాటకీకరణంతో, ధర్మ సూక్ష్మ వివరణంతో, తాత్త్విక విశ్లేషణలతో అద్భుతంగా, అసమానంగా అలరారుతూ వినడానికి ఇంపుగా, సొంపుగా ఉంటుంది. అందుచేతనే, 'వింటే భారతమే వినాలి' అనే నానుడి విపుల వ్యాప్తి చెందింది.

అద్దంలో ఎవరి ముఖమైనా కనిపిస్తుంది. మహాభారతంలో ఎవరి జీవిత మైనా ప్రతిబింబిస్తుంది. మన పాత్రలు, ప్రవర్తనలు, మనస్తత్త్వాలు భారతంలో ప్రతిఫలిస్తూ ఉంటాయి. అందుకే భారతం రమణీయంగా

గోచరిస్తుంది. భారతాన్ని అధ్యయనం చేయడం అంటే, మన ఆంతరంగిక లోతు ల్లోకి తొంగి చూడటమే. భారతం త్రికాల జ్ఞాని యైన వ్యాసభగవానుని అపూర్వ సృష్టి కావడమే ఇందుకు ప్రబలమైన కారణము (*పారాశర్య వచః సరోజం*). వ్యాసుని పారాశర్యుడని ఈ శ్లోకంలో పేర్కొనడంలో కూడా అంతరార్థం అదే. భవిష్యత్తును వర్తమానము నందు దర్శించే స్మృతికర్త పరాశరుని కుమారుడు వ్యాసుడు. అట్టి వ్యాసమహర్షి రచించింది కావడం చేత మహాభారత కమలం కాలంలో వాడి పోకుండా కళకళ లాడుతూ ఉంది. నిర్మలంగా ఉంది (*అమలం*).

వాసన లేని పూలు పూజకు పనికిరావు. అవి దర్శనీయమే గాని అర్చనీయము కావు. తత్త్వ సౌరభాన్ని గుండెలో దాచుకోలేని గ్రంథాలు అవి ఇతిహాసా లైనా, కావ్యాలైనా పది కాలాల పాటు ఊరేగ లేవు. మహాభారత గ్రంథము అమోఘమైన గీతా సుగంధంతో అజేయంగా అలరారుతూ ఉంది. తత్త్వార్థ సౌరభంతో గుబాళిస్తూ ఉంది (*గీతార్థ గంధోత్కటం*).

పువ్వు యొక్క సౌందర్యము పూలరేకుల మీదే ఆధారపడి ఉంటుంది. నైతిక జీవనాన్ని వృద్ధి చేసే ధార్మిక కథలనే పూలరేకులతో మహాభారత కమలం మనోజ్ఞంగా శోభిస్తూ ఉంది (*నానాఽఽఖ్యానక కేసరం*).

కోమలమైన రేకులతో సుగంధాన్ని విరజిమ్ముతూ పువ్వులు విరబూయాలి అంటే చల్లని చిరుగాలి తోడు కావాలి. శ్రీహరి భగవానుని దివ్య గాథల లోని భక్తి మారుతము తోడై మహాభారత కమలము విరబూసింది (*హరికథా సంబోధనా బోధితం*). పవిత్రాత్ములు, పావనచరితులు అయిన సాధుజనులు, సత్పురుషులు అనే తుమ్మెదలు అనుదినము ఆ మహాభారత కమలమును ఆఘ్రాణిస్తూ ఉంటారు. జ్ఞాన మకరందాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు.

షట్పది అంటే తుమ్మెద. తుమ్మెదకు ఆరు కాళ్ళు. అందుకే అది షట్పది. తుమ్మెద ఎటు ఎగిరినా, ఎక్కడ తిరిగినా పువ్వుపై వాలి నపుడే నవ్వుతుంది. తనకు ఆకలి తీరేది, ఆనందం కలిగేది పువ్వు ఒడి లోనే. ఆ గుడి లోనే.

అరవిందము ఎవరి కైనా అందం గానే అగుపిస్తుంది. కాని తుమ్మెదకు అందులో అందమే కాదు, ఆనందం కూడా లభిస్తుంది. అరవిందంలో దాగిన మకరందాన్ని జుర్రుకొనే భాగ్యం తనకు ఉండటమే తన ఆనందానికి కారణము.

తుమ్మెద పద్మము లోని మకరందాన్ని ఆస్వాదించినట్లు, సత్పురుషులు, సుకృతాత్ములు అయిన షట్పదులు మహాభారత కమలం లోని అమృతానంద రసాన్ని పానం చేస్తారు.

మహాభారతాన్ని ఎవరు విన్నా ఆనందాన్ని పొందుతారు. కాని సత్పురుషు లనే షట్పదులు అందులోని తత్త్వసారాన్ని ఆస్వాదించి తృప్తి చెందుతారు. తుమ్మెద ఆరు కాళ్ళతో సంచరిస్తుంది కనుక దానిని షట్పది అంటారు. సత్పురుషులు ఐదు జ్ఞానేంద్రియాలు, ఒక మనస్సు వెరసి ఆరు ఇంద్రియ పాదాలతో చరిస్తూ, జ్ఞానమధువును గ్రోలుతారు కనుక వారు కూడా షట్పదులే (*సజ్జన షట్పదైః*).

సుకృతాత్ములైన ఈ సజ్జన భ్రమరాలు మహాభారత కమలం లోని మధువును ప్రతి రోజు ఆనందంతో ఆస్వాదిస్తూ ఉంటారు (*అహరహః పేపీయమానం ముదా*). మహాభారతం యొక్క అవసరం మానవులకు ప్రతిరోజు ఉంది. ప్రతిరోజు అద్దం చూసుకొని ముఖాన్ని ఎలా సరి చేసుకుంటామో, అలాగే ప్రతిరోజు మహాభారతాన్ని పఠిస్తూ మన జీవన సరళిని సవరించుకుంటూ ఉండాలి. అప్పుడే బ్రతుకులో అందం నిండుతుంది. ఆనందం పండుతుంది.

వ్యాస భగవానుని వాక్సరోవరం నుండి ఆవిర్భవించిన మహాభారత కమలం మన హృదయ సరోవరంలో విరబూయాలి. కమలాలతో కళకళ లాడే సరోవరం స్వచ్ఛంగా, నిర్మలంగా, రమణీయంగా, పవిత్రంగా ఉంటుంది. మహాభారత మనే ధార్మిక, తాత్త్విక సరోజం హృదయ మడుగులో వికసిస్తే, నిర్మలత్వాన్ని, పావనత్వాన్ని సంతరించుకొని బ్రతుకు దివ్యంగా శోభిస్తుంది. కలికల్మషాలు అంతరించి పోతాయి (**కలిమల ప్రధ్వంసి**). శ్రేయస్సు ప్రాప్తిస్తుంది. యావత్ప్రపంచం ఈ మహాభారత కమలాన్ని ఆఘ్రాణించు గాక! సర్వజనులు షట్పదులై మహాభారత కమలం లోని ఆనంద మకరందాన్ని ఆస్వాదించెదరు గాక! **జయోఽస్తు విజయోఽస్తు** - 'జయ'మునకు జయమగు గాక! జయ గ్రంథానికి విజయ మగు గాక!

కృపా విశేషము

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।
యత్కృపా తమహం వన్దే పరమానన్ద మాధవమ్ ॥ 8

యత్ కృపా	= ఎవరి కృప	లంఘయతే	= ఎక్కించునో
మూకం	= మూగవానిని	తం	= అట్టి
వాచాలం	= భాషణశీలునిగా	పరమానంద మాధవం	= పరమానంద స్వరూపుడైన మాధవుని
కరోతి	= చేయునో	అహం	= నేను
పంగుం	= కుంటి వానిని	వందే	= నమస్కరిస్తున్నాను
గిరిం	= కొండను		

ఎవరి కృప మూగవానిని భాషణశీలునిగా చేయునో, కుంటివానిని కొండ లెక్కించునో అట్టి పరమానంద స్వరూపుడైన మాధవునికి నమస్కరిస్తున్నాను.

వ్యాఖ్య

భగవత్కృప అనిర్వచనీయం. అనుభవైక వేద్యం. భగవంతుని అనుగ్రహం అమృతానందాన్ని ప్రసాదిస్తుంది. భక్తి మానవునికి బ్రహ్మ సంబంధమును కలిగిస్తుంది. మనస్సు మాధవుని యందు లగ్నమైతే మాయ అంతరిస్తుంది. మహిమ అందల మెక్కుతుంది.

బుద్ధిలో సదా భక్తి భావాలు ఉండేటట్లు జీవించ గలిగితే భక్తులం అవుతాము. భక్తులము కాగలిగితే భగవత్కృపను పొందడానికి అర్హులం అవుతాము. భగవంతుడు సదా భక్తులను దయతో రక్షిస్తూ ఉంటాడు.

భక్తిలో అపారమైన శక్తి ఉంది. అద్భుతమైన లీల ఉంది. భక్తి మూగవానిని కూడా మాట్లాడిస్తుంది (**మూకం కరోతి వాచాలం**). అదంతా భగవంతుని కృపా విశేషం. కృపా సాగరుడైన పరమేశ్వరుని పాదాల చెంత కృపారసం సముద్రం లాగా పొంగి పొరలుతూ ఉంటుంది. నమస్కరించే సంస్కారం తోడైతే భగవత్కృప విశేషంగా వర్షిస్తుంది. కరచరణ విహీను డైన కూర్మదాసు పండరీపురానికి నడిచి వెళ్ళి పాండురంగణ్ణి దర్శించాడు. సంత్ జ్ఞానదేవ్ మహిషము చేత వేదాన్ని పలికించాడు. భగవత్కృపకు అడ్డు లేదు అనడానికి ఇవన్నీ తార్కాణాలు.

తల్లికి వినపడే లాగా బిడ్డ విలపిస్తే చాలు. మరుక్షణం లోనే తల్లి ప్రత్యక్ష మవుతుంది. ఆకలి తీర్చుతుంది. లాలిస్తుంది. పాలిస్తుంది. బాధను తొలగిస్తుంది. కష్టాల్ని కరిగిస్తుంది. మహా భక్తుడైన అంబరీషునిపై

దుర్వాస మహర్షి దురాగ్రహాన్ని ప్రకటించాడు. క్రోధావేశాన్ని ప్రదర్శించాడు. ఏ విధమైన క్షోభకు గురి కాకుండా, అలజడి లేకుండా అంబరీషుడు ప్రసన్నంగా అగుపించాడు. అంబరీషుని అనుగ్రహించేందుకు, దుర్వాసుని సంహరించేందుకు భగవత్కృప సుదర్శనం రూపంలో బయలు దేరింది. మహా తపస్వి అయిన దుర్వాస మహర్షి చివరగా భక్తుడైన అంబరీషుణ్ణే ఆశ్రయించ వలసి వచ్చింది. ఆ సందర్భంలో దుర్వాసుడు పలికిన వాక్యాలు భక్తుల వైభవానికి ప్రతిరూపాలుగా భాసిస్తాయి.

ఒకమా రెవ్వరి పేరు కర్ణములలో నొయ్యారమై సోకినన్
సకలా ఘంబులు పల్లటిల్లి తొలగున్ సంభ్రాంతితో నట్టి స
త్సుకరున్ మంగళతీర్థ పాదు హరి విష్ణున్ దేవ దేవేశునిన్
అకలంక స్థితి గొల్చు భక్తులకు లేదద్దంబు రాజాగ్రణీ ॥

పరమేశ్వరుని కృపలో సర్వ పాపాలు హరించుకు పోతాయి. సదా భగవంతుని మౌనంగా స్మరించే వారికి, నిర్మలంగా ధ్యానించే వారికి, కర్మయోగులై అర్చన కీర్తనాదుల ద్వారా సేవించే వారికి భగవత్కృప తప్పక సిద్ధిస్తుంది. అలాంటి సిద్ధిని ప్రసాదించే వాడు కనుకనే పరమానంద రూపుడైన పరమేశ్వరుని ఈ శ్లోకంలో **మాధవమ్** అని కీర్తించడం జరిగింది.

'మా' అంటే లక్ష్మీదేవి. 'ధవుడు' అంటే భర్త. అందుచేత లక్ష్మీపతి మాధవుడని కీర్తింప బడ్డాడు. మౌన, ధ్యాన, యోగాల ద్వారా తెలియబడే వాడు మాధవుడు ***(మౌనాత్ ధ్యానాత్ యోగాత్ విద్ధి భారత మాధవమ్)*** అని మహాభారతంలో వ్యాసోక్తి.

భగవంతుని కొరకు నిర్వహించే ఉపాసనలు, ఆరాధనలు, భక్తి కార్యాలన్నీ అలౌకిక కర్మలు. అలౌకిక కర్మలకు ఫలం అలౌకికం గానే ఉంటుంది. అదే దయ. భక్తి సాధనల ఫలంగా పరమేశ్వరుడు అనుగ్రహించే కృపా విశేషం భక్తుణ్ణి కృతార్థుణ్ణి చేస్తుంది. కృతకృత్యుణ్ణి చేస్తుంది.

చరణము : *నను కరుణించిన భక్తివి నీవే*
నేను వరించిన ముక్తివి నీవే
నీ వెంట పడితే మిగలదు మోహము
నీవు వెంట రాగా వెలుగును మోక్షము

పల్లవి : *రాధా రమణ రాదేల కరుణ*
దేవకీనందన మాకేల వేదన?

అనుపల్లవి : *జీవుల గమ్యము నీవే కావా!*
బ్రతుకు సంద్రమున నీవే నావ! ॥ రాధా ॥

అని భక్తి వైభవాన్ని, భగవత్కృపా విశేషాన్ని వర్ణించింది చైతన్య గీతిక.

యం బ్రహ్మా వరుణేన్ద్ర రుద్ర మరుత: స్తున్వన్తి దివ్యై: స్తవై
ర్వేదై: సాంగ పదక్ర మోపనిషదై ర్గాయన్తి యం సామగా: ।
ధ్యానావస్థిత త ద్గతేన మనసా పశ్యన్తి యం యోగినో
యస్యాన్తం న విదు: సురాసురగణా: దేవాయ తస్మై నమ: ॥ 9

బ్రహ్మా వరుణేంద్ర రుద్ర మరుతః	= బ్రహ్మదేవుడు, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు, వాయుదేవుడు	తద్గతేన	= పరమాత్మ యందు లగ్నమైన
దివ్యైః స్తవైః	= అద్భుతమైన స్తోత్రములచే	మనసా	= మనస్సుతో
యం	= ఎవనిని	పశ్యన్తి	= అవలోకిస్తున్నారో
స్తున్వంతి	= స్తుతిస్తున్నారో	యం	= ఎవరిని
సామగాః	= సామవేద గాయకులు	యోగినః	= పరమ యోగులు
వేదైః	= శ్రుతుల ద్వారా	యస్య అంతం	= ఎవరి పూర్ణత్వమును
స అంగ పదక్రమ ఉపనిషదైః	= అంగము, పదము, క్రమము, ఉపనిషత్తులతో కూడి	సురాసురగణాః	= దేవతలు, అసురులు కూడా
యం	= ఎవరిని గూర్చి	న విదుః	= తెలియలేరో
గాయంతి	= గానం చేస్తున్నారో	తస్మై	= అట్టి
ధ్యానావస్థిత	= ధ్యాన స్థితిలో	దేవాయ	= భగవంతునకు
		నమః	= ప్రణామము

బ్రహ్మదేవుడు, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు, వాయుదేవుడు ఎవరిని దివ్యమైన స్తోత్రములచే స్తుతిస్తున్నారో, సామవేద గాయకులు అంగ, పద, క్రమ, ఉపనిషత్తులతో కూడి ఎవరిని కీర్తిస్తున్నారో, పరమయోగులు ధ్యానములో పరమాత్మ యందు లగ్నమైన మనస్సుతో ఎవరి వైపు చూస్తున్నారో, దేవాసురులు సైతము ఎవరి స్వరూపమును తెలుసుకోలేక పోతున్నారో అట్టి దేవదేవునకు ప్రణామములు.

వ్యాఖ్య

పరమేశ్వర సాక్షాత్కారానికి అనేక మంది అనేక మార్గాలలో ప్రయాణం సాగిస్తూ ఉంటారు. పవిత్రమైన లక్ష్యంతో ఆరంభ మైనవి కనుక మార్గాలన్నీ మంగళకరం గానే ఉంటాయి. అద్భుతం గానే గోచరిస్తాయి. అలా గోచరించాలి కూడా. కానీ ఇవన్నీ మహా తేజోవంతమైన ఆ ఏకైక గమ్యానికి సోపానాలే గాని స్వయంగా తేజోమయాలు కావు.

మీరు చరించే మార్గం మీరు చేరాలి అనుకునే గమ్యానికి ఎలా సంబంధించి ఉంది? మార్గం, గమ్యం కన్నా వేరుగా లేదు అని తెలియడమే సరియైన మార్గం. అదే జ్ఞానం.

మనం ఎన్నిటినో ఆశిస్తాము. అభిలషిస్తాము. చాలా వాటిని ప్రేమిస్తాము. ఆశించినవి కొన్ని లభిస్తాయి. ప్రేమించినవి కొన్ని ప్రాప్తిస్తాయి. ప్రేమించిన వన్నీ లభించాలని లేదు. చిరుగాలిని నువ్వు ప్రేమించ వచ్చు. అలాగని దానిని పెట్టెలో పెట్టి దాచుకో లేవు. జాబిలిని నేను ప్రేమించ వచ్చు. అలాగని దానిని ఆకాశం నుండి త్రెంపుకొని జేబులో పెట్టుకో లేను. అవసరం లేదు కూడా.

సామాన్యమైన విషయాలే ఇలా ఉండే టప్పుడు, బ్రహ్మవిదుడు ప్రత్యేకంగా మార్గంలో నిలిచి, గమ్యమైన అనంత బ్రహ్మ స్వరూపాన్ని గ్రహించ గలడా? గ్రహించ లేడు. ఎందుకో తెలుసా? తానే బ్రహ్మము. మార్గం గమ్యానికి వేరుగా లేదు. గమ్యం లోనే మార్గం ఒదిగి ఉంది. అన్నీ ఇలాగే ఉన్నాయి. అందుకే బ్రహ్మము అనంతము.

బ్రహ్మము సద్వస్తువు. ఉన్నదే గాని కానున్నది కాదు. లేని దానిని ప్రయత్నించి పొందాలి. ఉన్న దానిని అర్థం చేసుకోవాలి. బ్రహ్మము ఉన్నదే గనుక, అలా ఉన్నట్లు ఏ జ్ఞానం చేత తెలియ బడుతూ ఉందో, అదే బ్రహ్మజ్ఞానము.

బ్రహ్మజ్ఞానం విషయంలో పొంద బడేది ఏదో అది పొందాలి అనుకొనే వాడు బ్రహ్మమే. మార్గంలో ఉన్న వ్యక్తిని గమ్యం నుండి వేరు చేసేది దేశమూ కాదు. కాలమూ కాదు. కేవలం అజ్ఞానమే. అజ్ఞానము తొలగితే సాధకుడే సాధ్యం. ఆ సాధ్యం కూడా సిద్ధం. ఎప్పుడో ఎక్కడో సాధ్య మయ్యేది కాదు. ఇప్పుడే, ఇక్కడే సిద్ధమై ఉండేది. కనుక అది జ్ఞాతవ్యమే గాని కర్తవ్యం కాదు. అందుకనే, ***తత్ విజిజ్ఞాసస్వ*** - దానిని తెలుసుకొనే ప్రయత్నం చెయ్య మన్నది ఉపనిషత్తు.

దేవతలు మరణం లేనివారే గాని బ్రహ్మజ్ఞానులు కారు. కనుక దేవతలకు కూడా బ్రహ్మమే ప్రభువు ***(అమరాణాం మరణ రహితానాం ప్రభుః).*** ఆయనే గమ్యము. దేవతలు అత్యున్నత మైన ప్రకాశ స్వరూపులు. ఉన్నత స్థాయిలో ఉన్నంత మాత్రాన ఉన్న సత్య స్వరూపానికి సంబంధించిన జ్ఞానం కలగాలని లేదు. ప్రమాణం ఉంటేనే ప్రమ, లేదా జ్ఞానం కలుగుతుంది.

కనుకనే, దేవత లందరూ దివ్య స్తోత్రాలతో స్తుతించినా, బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకోలేక పోయారు. వేదనాదంతో కీర్తించే వేద పండితులు కూడా బ్రహ్మ స్వరూపాన్ని గ్రహించలేక పోతున్నారు. అంతర్ముఖులై ధ్యానమగ్ను లైన యోగులు కూడా బ్రహ్మ స్వరూపము అర్థం గాక నిశ్చేష్టులై ఉన్నారు. అట్టి పరబ్రహ్మమును ఎలా కీర్తించాలి? కీర్తించను ఎలాగూ వీలు పడదు కనుక, ఎలా కీర్తించినా దోషం లేదు. అనంత మైన పరమాత్మ స్వరూపాన్ని పరిమితమైన మన ప్రార్థనలలో మడత పెట్టలేము అనేదే అన్ని ప్రార్థనల యొక్క అంతరంగము. కనుక, ఎవరి స్వరూపాన్ని సురాసురులు సైతం తెలుసుకోలేరో, అట్టి భగవంతునికి నమస్కారము ***(యస్యాంతం న విదుః సురా సురగణాః దేవాయ తస్మై నమః).***

భగవాన్! నీవు ఉన్నట్లు తెలుసు. ఎలా ఉన్నావో తెలియదు. నీ స్వరూప స్వభావాలు నా బుద్ధికి దొరకడం లేదు. నీవు ఎలా ఉన్నా, నేను పిలిచే పలుకు మాత్రం నీకే వినిపించాలి. నా ప్రార్థనలు నిన్నే చేరాలి.

తవ తత్త్వం న జానామి కీదృశోఽసి మహేశ్వర
యాదృశోఽసి మహాదేవ తాదృశాయ నమోనమః ॥

నీ స్వరూప మేమిటో నాకు తెలియదు. అది ఏదైనా కానీ, నేను చేసే వందనము ఆ స్వరూపానికే. నీ స్వరూపానికే.

ఈ విధమైన మెత్తని భావాలతో నిండిన ధ్యాన శ్లోకాలను పఠించి, తృప్తి చెందిన గీతా భక్తుని హృదయం ఆనందంతో ఊగుతూ గీత వైపు సాగుతూ ఉంది.

చైతన్య భగవద్గీత

అథ ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయము

అర్జున విషాదయోగః - అర్జున విషాద యోగము

ధృతరాష్ట్ర ఉవాచ :

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాండవా శ్చైవ కి మకుర్వత సంజయ ॥ 1

ధర్మక్షేత్రే-కురుక్షేత్రే-సమవేతాః-యుయుత్సవః
మామకాః-పాండవాః-చ-ఏవ-కిం-అకుర్వత-సంజయ

సంజయ	=	ఓ సంజయా!	సమవేతాః	=	చేరిన
ధర్మక్షేత్రే	=	ధర్మభూమి యైన	మామకాః	=	నా వాళ్ళు
కురుక్షేత్రే	=	కురుక్షేత్రమున	పాండవాః చ ఏవ	=	పాండవులు
యుయుత్సవః	=	సమరేచ్ఛతో	కిం అకుర్వత	=	ఏమి చేశారు?

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు :

సంజయా! యుద్ధం చెయ్యాలని మా వాళ్ళు, పాండవులు ధర్మక్షేత్ర మైన కురుక్షేత్రానికి చేరారు కదా! అక్కడ వాళ్ళు ఏం చేశారు?

వ్యాఖ్య

మంగళము

గీతాశాస్త్రము ధృతరాష్ట్రుని శ్లోకంతో ఆరంభమైంది. మంగళాచరణము చేసి శాస్త్రాన్ని ప్రారంభించాలి అనేది సంప్రదాయము. శిష్టాచార నియమము. భగవద్గీత మంగళముతో ఆరంభం కాకుండా, ఒకేసారి ధృతరాష్ట్రుని శ్లోకంతో ప్రారంభం కావడం చేత, గీతాశాస్త్రము సంప్రదాయ విరుద్ధ మని కొందరి అభిప్రాయము.

ఈ విషయాన్ని కాస్త వివరంగా, విస్పష్టంగా విచారించు కోవాలి. భగవద్గీతకు మంగళాచరణం అవసరమా? అనేది ముందుగా నిర్ణయం కావాలి.

భగవద్గీతకు మంగళాచరణం ప్రత్యేకంగా ఉండ నవసరం లేదు. గీత మహాభారతము మధ్యలో ఉంది **(మధ్యే మహాభారతమ్).** మంగళాచరణముతో మహాభారతము మొదలైంది కనుక భార తాంతర్గత మైన భగవద్గీతకు ప్రత్యేకించి మంగళము చెప్ప నవసరం లేదు.

అలా కాకుండా, భగవద్గీత తత్త్వ ప్రధానమైన శాస్త్రం కనుక, భార తాంతర్గతమే అయినా ప్రత్యేకించి మంగళార్థము ఒక శ్లోకము ఉండి తీరాలి అని భావించడంలో తప్పు లేదు. అలాగని మంగళాన్ని ఆచరించకుండా, సంప్రదాయానికి భిన్నంగా గీత ఆరంభమైంది అనే విమర్శ అర్థరహితం. ఎందుకని? గీతారంభము మంగళాచరణము తోనే జరిగింది.

ధర్మము - దైవము

భగవద్గీతలో ధృతరాష్ట్రుడు పలికిన ఈ ప్రథమ శ్లోకం **ధర్మక్షేత్రే** అంటూ మొదలైంది. **ధర్మక్షేత్రే** అనే సమాసంలో మొదటి పదమే ధర్మం. ధర్మము అనగా దైవమే. ధర్మరూపంలో ఉన్నది దైవమే. ధర్మమును ఆచరించడం సాధన మైతే, ధర్మరూపంలో ఉన్న దైవాన్ని పొందడము సాధ్యము. కనుక, ధర్మము అనేది సాధన వాచకమే కాదు, సాధ్య వాచకం కూడా. ధర్మ శబ్దము సాధన సాధ్య వాచకము, లేదా ఉపాయ ఉపేయ వాచకము.

సాధ్య రూపుడైన పరమేశ్వరుడు మంగళకరుడు. మంగళ రూపుడైన భగవంతుని పొందుటకు ఆచరించే సాధన కూడా మంగళకరమే. అందుచేత, ధర్మశబ్దంతో ప్రారంభించ బడిన గీతాశాస్త్రము మంగళార్థంతో దివ్యంగా శోభిస్తూ ఉంది అనే విషయంలో సందేహానికి తావు లేదు.

ధరతీతి ధర్మః ధరించునది ధర్మము. ***ధృఞ్ ధారణే*** అనే ధాతువు నుండి ధర్మ శబ్దము పుట్టింది. ధారణం అంటే భరించడం, లేదా మోయడం అని అర్థము. ***డుధాఞ్ ధారణ పోషణయోః*** ధారణము, పాలనము అనే రెండు లక్షణాలు కలిగింది ధర్మము. సర్వ ప్రపంచాన్ని భరించేది, ధరించేది, పాలించేది ఏదో అదే ధర్మము. ఈ కారణం చేత సమస్త విశ్వానికి మూలాధారము ధర్మము.

ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా

యావ ద్విశ్వానికి ధర్మమే ఆధారంగా ఉంది అన్నది తైత్తిరీయ శ్రుతి. ధర్మ రూపంలో దైవం ఉన్నప్పుడే అది సాధ్య మవుతుంది. కనుక, ధర్మ మనేది ఏదో కాదు భగవ ద్విభూతియే. భగవ ద్రూపమే. ధర్మరూపంలో ఉన్నది దైవమే. ధర్మం ఉన్నచోట దైవం ఉన్నట్లే. ధర్మస్పృహ దైవస్మరణమే.

యతో ధర్మః తతో కృష్ణః
యతో కృష్ణః తతో జయః

ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ శ్రీకృష్ణ భగవానుడు ఉంటాడు. ఎక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడో అక్కడ జయం వర్ధిల్లుతుంది అని వ్యాసప్రోక్తం.

ధృతరాష్ట్రుని శ్లోకం 'ధర్మ' అనే రెండు అక్షరాలతో దివ్యంగా ప్రారంభమై, 'జయ' అనే రెండు అక్షరాలతో సమాప్త మైంది. ***ధర్మమేవ జయతే*** - ధర్మమే జయించి తీరుతుంది అనే ఆర్షవాణిని ప్రథమ శ్లోకమే అద్భుతంగా ఆవిష్కరించింది.

నరేశుడు - నారాయణుడు

ధర్మ మనే పదంతో ఆరంభం కావడం చేత ప్రథమ శ్లోకం మంగళమనే అనుకుందాం. కాని, పలికిన వాడు ధృతరాష్ట్రుడు కదా! 'ధృతరాష్ట్ర ఉవాచ' అంటూ గీత మొదలైంది. ధృతరాష్ట్రుడు పలికింది మంగళం ఎలా అవుతుంది? అనేది మరి కొందరి వాదము.

వాదించడంలో తప్పు లేదు. కాని, అలా వాదించే వారికి ధృతరాష్ట్ర శబ్దము కూడా మంగళమే అనే సత్యం తెలిస్తే బాగుంటుంది. ***ధృతం రాష్ట్రం యేన సః ధృతరాష్ట్రః*** - ధృతరాష్ట్రుడు అంటే రాష్ట్రమును ధరించిన వాడు అని అర్థము. రాష్ట్రమును ధరించే వాడు రాజు. రాష్ట్రమును పాలించే వాడు రాజు. దేశము యొక్క ధారణ పాలనలు ప్రభువు మీద ఆధారపడి ఉంటాయి. ప్రభువు లోని ఆ శక్తి పరమేశ్వరునిదే. అందుచేతనే ***నరాణాం చ నరాధిపమ్*** - నరులలో నరాధిపుడు అనగా రాజు నేనే అన్నాడు గీతలో భగవానుడు.

దేశాన్ని పాలించే శక్తి సామర్థ్యాలు ప్రభువులో ఉంటాయి. అదే ఐశ్వర్యం. **ఈశ్వరస్య భావః ఐశ్వర్యం.** ప్రభువు యొక్క ఐశ్వర్యము వాస్తవానికి జగత్ప్రభువుదే. పరమేశ్వరునిదే. ఈశ్వరునిలో ఐశ్వర్యం సమగ్రంగా ఉంటుంది. రాజులో అవసరమై నంతే ఉంటుంది. అందుచేతనే ధర్మంగా పాలించే రాజును ధర్మప్రభువు అంటుంటారు. ప్రభువు లోని ధర్మవైభవము పరమేశ్వరునిదే. ధర్మరూపంలో దైవం శోభిస్తూ ఉండటమే దానికి కారణము.

ధర్మస్పృహ లేనివాడు ప్రభువు కాలేడు. దైవస్పర్శ లేనిదే ధర్మస్పృహ రాదు. **నా విష్ణుః పృథివీ పతిః** - విష్ణు అంశ లేనివాడు రాజు కాలేడు అన్నది శాస్త్రము. అందుకనే ప్రభువును భగవ ద్విభూతిగా గీత అభివర్ణించింది.

ధర్మ క్షేత్రము

క్షేత్రము అంటే భూమి, లేక స్థలము అని ఒక అర్థం. ధర్మమును పండించు కొనుటకు అనువైన ప్రదేశము కావడం చేత, ధర్మ నిలయమైన భారతదేశం ధర్మక్షేత్ర మైంది. ధర్మక్షేత్రము అంటే ధర్మమే ప్రధానంగా శోభించు క్షేత్రము అని అర్థము. పుణ్య ప్రధానమైన క్షేత్రము అని భావము.

భారతదేశము ధర్మ ప్రధానమైన క్షేత్రము. పుణ్యప్రద మైన భారతావనిలో కురు మహారాజు ధర్మ పరిపాలన సాగించిన ప్రదేశము కురుక్షేత్రము. అది ఎందరో మహాత్ములు, మహర్షులు కఠోర తపస్సు నాచరించిన తపోభూమి. మరెందరో సుకృతాత్ములు యజ్ఞ యాగాది కర్మములు నిర్వహించిన కర్మభూమి. 'కురు' అంటే కర్మ. పుణ్య కర్మలను ఆచరించ డానికి అనువైన, నెలవైన క్షేత్రము కురుక్షేత్రము.

కురు మహారాజుకు ఇంద్రుడు ప్రత్యక్ష మైంది ఇక్కడే. కురుమహారాజా! కురుక్షేత్ర పుణ్యభూమిలో తప మాచరిస్తూ అంతిమ శ్వాసను విడిచిన వారికి సద్గతి లభిస్తుంది. పుణ్య ప్రధానమైన ఈ కురుక్షేత్రంలో ఆయుధ హస్తులై యుద్ధమున మరణించిన వీరులు ఉత్తమ లోకాలు చేరుతారు అని ఇంద్రుడు వర ప్రదానం చేశాడు. అంతే కాదు. మదాంధులైన క్షత్రియులతో అవతారమూర్తి యైన పరశురాముడు ఘోర పోరాటం చేసి, తన పవిత్ర పాద స్పర్శతో పావనం చేసిన పుణ్యస్థలి కూడా ఈ కురుక్షేత్రమే. దీనిని బ్రహ్మావర్త మని కూడా పిలిచేవారట.

కురుక్షేత్రం చ మత్స్యాశ్చ పాంచాలా శ్శూరసేనకాః
ఏష బ్రహ్మర్షి దేశో వై బ్రహ్మావర్తా దనంతరః

కురుక్షేత్రం, మత్స్యదేశం, పాంచాలము, శూరసేనకము అనే ప్రదేశాలు కలసిన దేశాన్ని బ్రహ్మర్షి దేశము అని పిలిచేవారు.

క్షేత్రము అంటే పవిత్రమైన స్థలము అని కూడా అర్థము. పావన నదీమ తల్లులు ప్రవహించే ప్రదేశాలు కూడా క్షేత్రాలే. అలాగే పరమేశ్వరుడు వెలసిన దివ్య స్థానములను కూడా క్షేత్రములు అంటారు.

గంగ, యమున, నర్మద, కృష్ణ, కావేరి మొదలైన పుణ్యనదులు ప్రవహించే ప్రదేశాలను నదీ క్షేత్రాలు, లేదా తీర్థక్షేత్రాలు అంటారు. ఆయా పుణ్య నదీతీరాలలో దానాది పుణ్యకర్మలను ఆచరిస్తాము. కనుక అవి కూడా కర్మ క్షేత్రాలే. ధర్మ ప్రధానమైన పుణ్యక్షేత్రాలే. కురుక్షేత్రాలే.

కాశీక్షేత్రము, శ్రీకాళహస్తి క్షేత్రము, శ్రీశైలక్షేత్రము, బదరీక్షేత్రము, తిరుపతిక్షేత్రము, పండరీ క్షేత్రము మొదలైన పవిత్ర ప్రదేశాలన్నీ భగవ న్మూర్తులతో మంగళకరంగా శోభిస్తూ దివ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి గాంచాయి.

అలాగే, జీవులు వసించే శరీరాలు కూడా క్షేత్రాలే. మానవ దేహాలన్నీ క్షేత్రాలే.

ఇదం శరీరం కౌన్తేయ క్షేత్ర మిత్యభిధీయతే

అర్జునా! ఈ మానవ దేహాన్ని క్షేత్రము అంటారు అని గీతాచార్యుడే స్వయంగా క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో తెలిపాడు. జీవునికి దేహము ఉపాధి. దేహములో వసించే జీవుణ్ణి దేహం కవచం లాగా కాపాడుతుంది **(క్షతత్రాణాత్)**. అందుచేత కూడా దేహము క్షేత్రము అని పిలువ బడింది.

శరీరము క్షేత్రము. క్షేత్రము అనే పొలానికి రైతు స్వామి. దేహమనే క్షేత్రానికి జీవుడు స్వామి. పొలంలో ఏ బీజాలు నాటుతామో ఆ విధమైన పంటే మనకు ఫలంగా వస్తుంది. అలాగే దేహ మనే క్షేత్రాన్ని కూడా వినియోగించు కోవాలి.

ధర్మబీజాలు నాటుకుంటే, బాహ్యంలో ధర్మకార్యాలు సాగి మనకు పుణ్య మనే పంట వస్తుంది. అధర్మ బీజాలను నాటుకుంటే, తద్వారా అధర్మ కార్యాలు సాగి మనకు పాపం అనే పంట ప్రాప్తిస్తుంది. జ్ఞానాభిలాషులు జ్ఞాన బీజాలను నాటుకుంటే, జ్ఞానమును సముపార్జించుకొని మోక్షఫలాన్ని పొంది తరిస్తారు.

అందరికీ బ్రతుకు పంట పండాలి. అంటే, అందరూ ధర్మాన్ని అనుసరించాలి. ఆచరించాలి. చేసుకున్న వారికి చేసుకున్నంత; ఆ పైన మరి కొంత. ఈ సత్యం పంట విషయానికి వర్తిస్తుందే గాని వంట విషయానికి వర్తించదు.

కిలో బియ్యం వంట చేస్తే మూడు కిలోలు అన్నం తయా రవుతుంది. అలాగని పంచదార, పాలు కలిపి వంట చేస్తే మూడు రెట్లు కోవా తయారు కావాలంటే కాదు. ముద్దగా ఘనీభవించి నాలుగో వంతు కోవా తయా రవుతుంది. ఈ వ్యత్యాసాలు వంటలో ఉంటాయి. పంటలో తరుగుదల ఉండదు.

ధర్మము వంట లాంటిది కాదు. పంట లాంటిది. పెట్టుబడి తక్కువ. రాబడి ఎక్కువ. ఒక బస్తా ధాన్యపు గింజల్ని రైతు భూమిలో చల్లుతాడు. తిరిగి కొన్ని బస్తాల ధాన్యాన్ని ఫలంగా పొందుతాడు. ధర్మం కూడా అలాంటిదే. స్వల్పంగా ఆచరించినా అధికంగా ఫలాన్ని అందిస్తుంది.

స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్

ధర్మాన్ని ఏ కొంచెము ఆచరించినా అది గొప్ప భయాన్ని పోగొట్టి కాపాడుతుంది అని అభయ ప్రదానం చేసింది గీతామాత. దీపం చిన్నదే అయినా దట్టమైన చీకటిని దూరం చేస్తూ ఉంది కదా! ధర్మాచరణం కూడా అంతే.

కురుక్షేత్రము

కురుక్షేత్రము పుణ్యభూమి. యజ్ఞభూమి. తపోభూమి. ఇంతవరకు ఇలాగే అర్థం చేసుకున్నాం. ఇక ఇప్పుడు, కురుక్షేత్రాన్ని యుద్ధభూమిగా చూడబోతున్నాం. కురుక్షేత్రంలో పోరాడటానికి ఇరువర్గాలు సిద్ధపడ్డాయి. **(కురుక్షేత్రే యుయుత్సవః ఏవ సమవేతాః)**. పుణ్యభూమి పోరాట భూమిగా మారింది. సాధన క్షేత్రం సమరక్షేత్ర మైంది. వేదనాదాలతో మారు మ్రోగిన యజ్ఞభూమి రణభేరీ నినాదాలతో హోరెత్తే యుద్ధభూమిగా తయారైంది.

యుద్ధము ఏదో కాదు. వైరుధ్యమే యుద్ధము. వైరుధ్యంలో జనించే సంఘర్షణే సమరము. ప్రపంచంలో ఎక్కడ చూచినా కనిపించేది సమరమే. సమరాన్ని విశ్వం సహించ లేదు. అందుకే విశ్వశాంతి నినాదం.

విశ్వం లోనే కాదు. ఏ వ్యక్తిలో చూచినా సమరమే దాగి ఉంది. వ్యక్తి మనస్సు భరించలేని సంఘర్షణే

సమరము. సంఘర్షణల మధ్య మనిషి స్వాస్థ్యమును పొందలేడు. సమన్వయంతో జీవించ లేడు. సంఘర్షణల ఒత్తిడిలో మనిషి ప్రశాంతంగా బ్రతక లేడు. అందుకే వ్యక్తి శాంతి - వ్యక్తి ఔన్నత్యం అనే నినాదాలు విశ్వంలో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి.

వైరుధ్యాలు విచిత్రంగా విలయ తాండవం చేస్తున్న విశ్వంలో మనం జీవిస్తున్నాం. ఈ కల్లోల వాతావరణంలో యజ్ఞభూమి యైన కురుక్షేత్రము యుద్ధభూమిగా మారినట్లు, శాంతి మందిరంగా విలసిల్ల వలసిన ప్రపంచం అశాంతి నిలయంగా నిలిచి ఉంది.

రంగస్థలమా? రణస్థలమా?

ఆడేందుకు ఉన్నది నాటకరంగం. పోరాడేందుకు ఉన్నది రణరంగం. ఆట ఏదైనా ఆట కొరకే. ఆట వరకే. కాని, పోరాటము అలాంటిది కాదు. పోరాటము పోరాటము కొరకే కాదు. పోరాటము పోరాటము వరకే కాదు. పోరాటము వికృతం కొరకు. పోరాటము వినాశం కొరకు.

ఆటలో ఆనందం ఉంటుంది. పోరాటంలో ఆందోళన ఉంటుంది. ఆటలో పోరాట పటిమ ఉండటం తప్పు కాదు. ఉండాలి కూడా. కాని, ఆట పోరాటంగా మారితే మాత్రం, ఆ తరువాత అంతా ఆరాటమే. బ్రతుకంతా కాటకమే.

ఇంతకీ ప్రపంచం రంగస్థలమా? రణస్థలమా? జీవితం నాటకరంగమా? రణరంగమా? విలువలతో విలసితంగా జీవించే విశ్రాంతి మందిరమా? లేక, విరోధాలతో విషాదాలను విరజిమ్మే వికృత సదనమా? ఆలోచనలకు పదును పెట్ట వలసింది ఇక్కడే.

నాటకంలో ఎందరో నటులు ఉంటారు. ఎన్నో సన్నివేశాలు ఉంటాయి. మరెన్నో అలంకరణలు ఉంటాయి. అలా ఉన్న వన్నీ ఒకే నాటకానికి సంబంధించి ఉన్నాయి. ప్రత్యేకతలతో గోచరిస్తున్నా, ప్రత్యేకంగా మాత్రం లేవు.

ఈ ప్రపంచంలో ఉన్న వన్నీ అలాగే ఉన్నాయి. ప్రత్యేకతలు ఉన్నాయేమో గాని, అవి ప్రత్యేకంగా లేవు. వివిధ రకాల పాత్రలు ఒకే నాటకంలో ఒదిగినట్లు, వివిధ రంగుల పువ్వులు ఒకే మాలలో చేరినట్లు, ఒక్క మాటలో చెప్పాలంటే - వివిధములైన అలలు ఒకే సముద్రంలో అలరారినట్లు, విశ్వంలో ఉన్న వన్నీ ఏకంలో ఏకమై ఉన్నవే గాని, అనేకంలో భిన్నమైనవి మాత్రం కావు.

ఈ సత్యం అర్థమైతే ప్రపంచం ఒక రంగస్థలం. జీవు లందరూ ఉత్సాహంతో నటనలో నర్తిస్తూ జీవించే కళాకారులు. అర్థం కాకపోతే, విశ్వమే ఒక వికృతమైన రణస్థలం. జీవు లందరూ విద్వేషాలతో యుద్ధంలో పోరాడుతూ గతించే పోరుగాళ్ళు.

నటించుట - వికటించుట

నాటకంలో నటులు ఎవరి పాత్రను వారు పోషించాలి. పోషిస్తారు. ఎవరైనా, ఎంతటి నటుడైనా తన పాత్రనే తాను పోషిస్తాడు. అంతమాత్రాన ఇతరుల పాత్రలతో సంబంధం లేకుండా నటించ లేడు. ఇతర పాత్రలతో సంబంధాన్ని సంరక్షించుకొంటూ తన పాత్రను తాను పోషించాలి. అప్పుడే నటనలో వైభవము. అక్కడే నటునిలో వైదుష్యము.

ఇది అర్థమైతే, నటనలో ఘర్షణ ఉన్నా, నటునిలో ఘర్షణ ఉండదు. ఒకవేళ వ్యత్యాసాలు గోచరించినా, వ్యావహారికంగా నటనలో ఉంటాయే గాని, స్వాభావికంగా వ్యక్తిలో ఇమడవు.

అలా కాకుండా, ఇతర పాత్రలతో విభేదిస్తూ, వ్యక్తిత్వంతో విభిన్నంగా వ్యవహరిస్తే, నటుడు ఘర్షణలో పడతాడు. నాటకాన్ని సంఘర్షణకు గురి చేస్తాడు. పుణ్య క్షేత్రమైన కురుక్షేత్రాన్ని రణక్షేత్రంగా మార్చేస్తాడు.

నాటకంలో నటించే నటుడికి నాటకం మొత్తం తెలుసు. అంతేకాదు. వ్యక్తిగా తానేమిటో కూడా తనకు తెలుసు. కనుక సంఘర్షణతో కూడిన సన్నివేశాలలో కూడా నటుడు తనలో తాను ప్రసన్నంగా ఉంటాడు. ప్రతిచర్యలు లేకుండా ప్రశాంతంగా ఉంటాడు. ప్రమోదంగా నటిస్తాడు.

దర్శకుని మార్గదర్శకత్వంలో నాటకం ప్రదర్శింప బడుతుంది. పరమేశ్వరుని అధ్యక్షతన ఈ ప్రపంచ రంగస్థలిపై జీవులు ప్రవేశిస్తూ నిష్క్రమిస్తూ ఉంటారు (***మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే స చరాచరమ్:*** *గీత - 9 వ అ - 9 వ శ్లో*). నాటకంలో ఏమి జరగబోతుందో నటుడికి తెలుసు కనుక, నటుడు సంఘర్షణతో నటిస్తున్నా, వాస్తవానికి నటునిలో ఏ సంఘర్షణా ఉండదు.

కానీ, జీవితంలో ఎప్పుడు ఏమి జరుగుతుందో జీవికి తెలియదు. ఎవరు ఏమౌతారో అర్థం కాదు. అందుకే ప్రతి వ్యక్తికి అనుక్షణం సంఘర్షణ, సంతాపము. ప్రతిక్షణం ఆవేదన, పరితాపము.

యజ్ఞాలు - యుద్ధాలు

మానవ దేహంలో ఎన్నో జీవ కణాలు ఉన్నాయి. ఏ జీవకణం దేనికి అదే. అయినా ఒక జీవకణం మరొక జీవకణంతో సమన్వయ సంబంధాన్ని కలిగి ఉంది. అన్యోన్య అనుబంధాన్ని కలిగి ఉంది.

అలాగే మనస్సులో బోలెడన్ని ఆలోచనలు ఉన్నాయి. ఏ ఆలోచన దేనికి అదే. నిన్నటి ఆలోచన వేరు. నేటి ఆలోచన వేరు అని మనం అనుకోవచ్చు. కానీ, నేటి ఆలోచనకు పునాదులుగా నిన్నటి ఆలోచనలే ఉన్నాయి. మొన్నటి ఆలోచనలే ఉన్నాయి. గతంలో ఏనాడో చేసిన ఆలోచనలు కూడా ఉన్నాయి.

దేహంలో జీవకణాలు ఎన్నున్నా దేహం ఒక్కటే. మనస్సులో ఆలోచనలు ఎన్నున్నా మనస్సు ఒక్కటే. ఇదీ అవగాహన. ఈ అవగాహన కుదిరితే కురుక్షేత్రంలో యజ్ఞాలు చెయ్యొచ్చు. ఈ అవగాహనే కనుక లోపిస్తే యజ్ఞానికి బదులు యుద్ధం చెయ్యొచ్చు. ప్రస్తుతం మనం అక్కడే ఉన్నాం. యుద్ధభూమి లోనే ఉన్నాం.

బాహాబాహి

బాహ్యం ఉంది. బాహ్య ప్రపంచం ఉంది. నిద్రించి నపుడు బాహ్యాన్ని మరచినా, మేలుకుంటే మాత్రం బాహ్యాన్ని బహిష్కరించడం సాధ్యం కాదు. బాహ్యం బాగుంటే బ్రతుకు బాగుంటుంది. బాహ్యం బాధక మైతే బ్రతుకు బావురు మంటుంది.

నిద్రించిన పుణ్యానికి మేలుకోక తప్పదు. మేలుకోగానే ఎదురుపడే వారిని స్మృతిలో పోల్చుకోక తప్పదు. వారు మనకు నచ్చని వారైతే శాంతిని రాల్చుకోక తప్పదు.

ఎదురయ్యే వాటిని, లేదా ఎదురుపడే వారిని చూచి యెద చెడితే ఘర్షణ మొద లవుతుంది. కురుక్షేత్రంలో యుద్ధం ఆరంభ మైనట్లే.

ఇష్టమున్నా లేకపోయినా నిత్యము కొన్ని ముఖాల్ని చూడక తప్పదు. మనకు కనిపించే ముఖం భార్యది కావచ్చు. భర్తది కావచ్చు. అధికారిది కావచ్చు. ప్రక్కింటి వారిది కావచ్చు. లేదా, రోజూ మనం ప్రయాణం చేసే బస్సులో కండక్టర్‌ది కావచ్చు.

ఇష్టం లేని ముఖాలను చూస్తే మనస్సులో ఆరాటం మొద లవుతుంది. ఘర్షణ చెలరేగు తుంది. అదలా ఉంచితే, కొన్ని పరిస్థితులలో ఇష్టమైన ముఖాల్ని చూడటంలో కూడా ఘర్షణే తలెత్తుతూ ఉంటుంది.

మనకు ఇష్టులైన వారిని ఆరోగ్యంగా మనం చూడగలం. ఆనందంగా ఉంటే చూడగలం. అలా చూడటంలో ఘర్షణ లేకపోవచ్చు. వారినే ప్రమాదానికి గురై నపుడో, లేదా మృత్యుశయ్యపై చివరి క్షణాలు లెక్క పెడుతు న్నప్పుడో చూడాలంటే మన పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇదంతా ఘర్షణే. సంఘర్షణే. బాహ్యంలో సాగే బాహాబాహి.

కురుక్షేత్రంలో అర్జునుని విషాదం వెనుక నిగూఢంగా ఉండి ప్రేరేపించిన ఘర్షణ ఇదే. అదంతా మున్ముందు చెప్పుకుందాం. ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని మీకు గుర్తు చేస్తూ ప్రస్తావిస్తున్నా.

నాటకంలో నటుడికి ఏ పాత్ర ఎదురైనా అతని మనస్సులో మాత్రం ఏ విధమైన చలనమూ ఉండదు. ఎదురైన వ్యక్తి స్నేహితు డైనా, శత్రువైనా, నటనలో మార్పు ఉంటుందే గాని, మనస్సులో ఏ వికారమూ ఉండదు.

అంతర్యుద్ధం

బాహ్యంలో నచ్చనివి బాహాబాహికి కారణ మైతే, ఆంతర్యంలో నచ్చనివి అంతర్యుద్ధానికి కారణము. రేపు మన మనస్సులో ఏ ఆలోచనలు కదుల్తాయో వాటిని నేడు ఊహించలేక పోతున్నాము. నిన్న ఏ ఆలోచనల్ని సంతోషంతో హుషారుగా కదలించామో, అవి నేడు బేజారెత్తి స్తున్నాయి. గత మాసంలో చేసినవి ఈ మాసంలో రుచించడం లేదు. ఇది మరొక ఘర్షణ. ఆంతరంగిక ఘర్షణ.

నీకు ఒక వ్యక్తి పూర్తిగా నచ్చితే, ఆ తరువాత మనస్సులో ఏ ఘర్షణ ఉండదు. అసలే నచ్చకపోతే కూడా ఘర్షణ ఉండే ప్రసక్తి లేదు. అలా కాకుండా, ఒక వ్యక్తిలో కొంత నచ్చి, కొంత నచ్చనపుడు, మనస్సులో ఘర్షణ తప్ప మరొకటి ఉండదు.

వ్యక్తి మనకు నచ్చితే అక్కున చేర్చుకోవచ్చు. నచ్చకపోతే ప్రక్కన పెట్టవచ్చు. ఒకే వ్యక్తి కొంత నచ్చి, కొంత నచ్చనపుడు ఉంచుకోవాలో తెలియదు, త్రెంచుకోవాలో అర్థం కాదు. ఇదే సంఘర్షణ. ఇదే సమరము. అయితే, ఈ యుద్ధము బాహాబాహి కాదు. అంతర్యుద్ధం. ఇదే ప్రతి జీవిని పట్టి పీడిస్తున్న సమస్య. కురుక్షేత్రం అద్దం పడుతున్న అందరి సమస్య. జనులందరి సమస్య. ఇదొక చీకటి. దట్టమైన చీకటి. దారి ఎటో అర్థం గాని చీకటి. అంధకారం. గాఢాంధకారం. అజ్ఞానాంధకారం. ఈ చీకటి నుండి బయట పడాలి. వెలుగు వైపుకు ఎగబ్రాకాలి.

తమసోమా జ్యోతిర్గమయ

గీతాభవనం లోకి ప్రవేశించాలి అంటే ముందుగా ద్వారం వద్ద ధృతరాష్ట్రుల వారిని అవశ్యం దర్శించాలి. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. పుట్టుక తోనే గ్రుడ్డివాడు. జాత్యంధుడు. అంధత్వ మనేది ఆ మహారాజుతో కలిసే పుట్టింది (***జన్మనా సహ జాయతే***). అంటే, అలా జన్మించడానికి బీజాలు పూర్వజన్మ లోనే నాటుకున్నా డని అర్థము.

ప్రారబ్ద వశాత్తు ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడైతే, ప్రయత్నించి లేని గ్రుడ్డితనాన్ని అర్ధాంగి గాంధారి అరువు తెచ్చుకుంది. ఇక సంతానం విషయం చెప్ప నవసరం లేదు. అంతా దుస్సంతానమే. దుర్యోధన, దుశ్శాసన, దుస్సల అంటూ అంతా దుకార ప్రయోగమే. దుష్ట సంజాతమే.

దేహ మనే రాష్ట్రాన్ని ధరించిన వాడు ధృతరాష్ట్రుడు. దేహాన్నైతే ధరించాడు కాని, ఆ దేహము ఎందు కొచ్చిందో, దేని కొరకు ఉందో గ్రహించలేని వాడు. కళ్ళకు ఎలాగూ చూపు లేదు. మనస్సును కూడా మూసేసుకున్న వాడు. సత్యాన్ని దర్శించ లేని అంధుడు. జ్ఞానాంధుడు.

ఈ గ్రుడ్డి మహారాజు గారి వాక్యం మమకారంతో ఆరంభ మైంది. **మామకాః** - నా వాళ్ళు అంటూ కౌరవుల్ని, **పాండవాః** - పాండవులు అంటూ పాండుపుత్రుల్ని సాహసించి మరీ పలికాడు.

అయిన వారు - కాని వారు

అయ్యా! అంబికేయా! నా వాళ్ళు (**మామకాః**) అని ముద్దుగా పిలుచుకున్నావు. బావుంది. నీ వాళ్ళు నీ వాళ్ళే. ఎవరూ కాదనడం లేదు. కాని, నీ తమ్ముడు పాండురాజు కుమారులు నీ వాళ్ళు కాకుండా ఎలా పోయారు?

ఇరువురిలో ప్రవహించే రక్తం ఒకటే కదా! ఇరువురిదీ ఒకే వంశం. ఒకే కుటుంబం. ఒకే గోత్రం. అలాంటప్పుడు అయిన వాళ్ళు, కాని వాళ్ళు అనే విచక్షణ ఎక్కడిది? గ్రుడ్డి విచక్షణ. అదే అంధకారం. మనస్సులో చీకటి. మమకారం పొరలు కప్పిన మానవునికి వాస్తవాలు అగుపించవు. విడ్డూరాలే కనిపిస్తాయి. వికారాలే వినిపిస్తాయి.

పాండవులు ఎక్కడి నుండో క్రొత్తగా పుట్టుకొచ్చిన వాళ్ళు కారు. తెలియని వారూ కారు. స్వయాన తన తమ్ముని బిడ్డలే. వాళ్ళనే తన వాళ్ళుగా చూడలేని ధృతరాష్ట్రయ్య ఇక ఎవరిని తన వారిగా చూస్తాడు?

ఇంతకీ, అయిన వాళ్ళెవరు? కాని వాళ్ళెవరు? మానవ జీవన ప్రస్థానంలో ఎవరికి ఎవరు సొంతము? ఎవరికి ఎవరు తోడు? ఎవరితో ఎవరు కలసి వచ్చారు? ఎవరితో ఎవరు కలసి పోతారు? ఉన్నా ఎంత కాలం కలసి ఉంటారు? ఎవరిదైనా ఒంటరి జీవితమే. అందరమూ ఒంటరిగా వచ్చిన వాళ్ళమే. ఒంటరిగా పోయే వాళ్ళమే. అలాంటప్పుడు నా వాళ్ళు (**మామకాః**) అనే మమకార ప్రదర్శనం అర్థ రహితం కాదా? విచారణ చేయ గలిగే వారికి ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఎవ్వరికీ ఏమీ కారని తేలుతుంది (*విచార్యమాణే న కస్యాపి కశ్చిత్ బంధుః*).

అదేదో తాత్త్విక అవగాహన లెండి. వ్యావహారికంగా మనకు సంబంధించిన వాళ్ళు మన వాళ్ళు కాకుండా పోతారా? అని మీరు అనవచ్చు. తప్పు లేదు. అలాంటప్పుడు, మళ్ళీ మన వాళ్ళ లోనే వీరు మన వాళ్ళు - వారు కాని వాళ్ళు అనే వ్యత్యాసాలు, విభేదాలు ఎక్కడి నుండి పుట్టుకొచ్చాయి? ఏమో! తెలియదు అంటారా! అదే పుట్టుగ్రుడ్డి అంటే.

అయినవాళ్ళు అంటే, ఉభయులూ అయిన వాళ్ళే. కాని వారు అంటే, ఎవరైనా కాని వాళ్ళే. ఇలా చూచి నపుడు ఇరువురూ తన వాళ్ళే కావాలి. లేదా, ఇరువురూ తన వాళ్ళు కాకుండా పోవాలి.

వీరు నా వాళ్ళు (**మామకాః**), వారు నా వాళ్ళు కారు అనుకుంటే, అక్కడే ఘర్షణ ఆరంభ మవుతుంది. ఈ ఘర్షణే ప్రస్తుతం కురుక్షేత్రం. ఇది హస్తినాపురానికి సమీపాన ఉండే బాహ్య కురుక్షేత్రం కాదు. అంతః కరణము అంటి పెట్టుకొని ఉన్న అంతరంగిక కురుక్షేత్రం.

పెద్ద మనస్సు - చిన్న బుద్ధి

ముందు పుట్టిన వాడు తండ్రితో సమాన మనుకొంటూ అన్నగారైన ధృతరాష్ట్రుని తండ్రి కంటే ఎక్కువగా పాండురాజు భావించాడు. పూజించాడు. పాండురాజు మరణానంతరం ధృతరాష్ట్రుడే తండ్రి అని త్రికరణ శుద్ధిగా నమ్మిన వ్యక్తి ధర్మరాజు.

భారత యుద్ధం ముగిసింది. ధర్మరాజు సింహాసనాన్ని అధిష్ఠించే శుభ ఘడియ సమీపించింది. మంగళ శంఖాన్ని చేత పట్టుకొని పవిత్ర నదీజలాలతో శ్రీకృష్ణుడు ధర్మరాజును అభిషేకించాడు. సింహాసనాన్ని అధిష్ఠింప చేశాడు. ఆ సందర్భంలో ధర్మరాజు తన మనస్సు లోని మాటను, మనసైన మాటను మంజులంగా వినిపిస్తాడు.

కృష్ణా! ధృతరాష్ట్ర మహారాజు నా తండ్రి. నా దైవం. ఆయన ప్రతినిధిగా ఈ సింహాసనాన్ని నేను అధిష్ఠించాను. ఆయన క్షేమాన్నే కాంక్షిస్తూ జీవిస్తాను (*ఏత దర్థం హి జీవామి*). ఆయన సేవ లోనే నా బ్రతుకును చరితార్థం చేసుకుంటాను. నాకు ఆయనే ప్రభువు అంటాడు.

ధృతరాష్ట్రుడు వృద్ధుడు. పెద్దవాడు. ధృతరాష్ట్రుని ముందు ధర్మరాజు వయస్సులో చాలా చిన్న వాడు. పసికూన. ధర్మరాజు చిన్నవాడే అయినా ఎంతో పెద్ద మనస్సుతో పలికాడు. ధృతరాష్ట్రుడు పెద్దవాడే అయినా, **మామకాః - పాండవాః** అంటూ చిన్న బుద్ధిని బయట పెట్టుకున్నాడు. ఎవరు పెద్దలు? ఎవరు పిన్నలు? పెద్ద మనస్సు కలిగిన పిన్నలు పెద్దలు కాకపోతారా? చిన్న బుద్ధులున్న పెద్దలు పిన్నలు కాకుండా ఉంటారా?

ఆఖ్యాయిక

యంత్రాలు తయారు చేసే ఒక కంపెనీ వారు ఆ నగరం లోనే ఉన్న ఒక సంస్థకు ఒక యంత్రాన్ని అమ్మడం జరిగింది. పక్షం రోజులు గడచిన తరువాత, యంత్రము సరిగ పని చేయడం లేదు. దానిని సరి చేసే వారిని ఎవరి నైనా పంపించండి అని కంపెనీకి ఫోన్ చేశారు ఆ సంస్థవారు.

వెంటనే ఒక వ్యక్తిని పంపించారు కంపెనీ వారు. ఆ వచ్చిన వ్యక్తి యంత్రాన్ని పరిశీలించే లోగా, సంస్థ వారు కంపెనీకి మళ్ళీ ఫోన్ చేశారు. అయ్యా! మీరు పంపిన వ్యక్తి వచ్చాడు. కాని, అతడు చాలా కుర్రవాడు. ఎవరి నైనా పెద్ద వ్యక్తిని పంపించండి అని సంస్థ యజమాని అడిగాడు.

ఫరవాలేదు. మీరేమీ ఆదుర్దా చెందకండి. అతడు సరిపోతాడు. ఆ యంత్రాన్ని కనిపెట్టింది ఆ కుర్రవాడే అని కంపెనీ వారు సమాధానం ఇచ్చారు.

ధర్మం విషయంలో గాని, జ్ఞానం విషయంలో గాని పరిగణించ వలసింది వయస్సును కాదు. జీవన విధానాన్ని, బుద్ధి వికసనాన్ని. అవి లోపించడం వల్లే తన వాళ్ళు, పాండవులు కురుక్షేత్రంలో ఏమి చేశారు? (*కిం అకుర్వత?*) అని ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించాడు.

ఎవరు చేయాలి? ఏమి చేయాలి?

సంజయా! సమరాభిలాషతో కురుక్షేత్రానికి చేరిన నా వాళ్ళు - పాండవులు ఏమి చేశారు? అని వింతగా ప్రశ్నించాడు ధృతరాష్ట్రుడు. యుద్ధభూమిలో ఎవరైనా ఏం చేస్తారు? ఉభయులు కరచాలనం చేసుకొని కలసి భోంచేస్తారా? పరస్పరం మందహాసాన్ని చిందిస్తూ, కుశల ప్రశ్నలు వేసుకొంటూ, పాచికలు ఆడుకుంటారా? ఏమీ చేయరు, యుద్ధం తప్ప! అలాంటప్పుడు ఏం చేశారు అని ప్రశ్నించడ మేమిటి? ఏదో చేయాలి అనేది ఆయన దుగ్ధ. బుద్ధిలో దురద.

ఆలయంలో ప్రవేశిస్తే చాలు. హంతకుడి కైనా ఆ సమయంలో మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. భక్తి కలుగుతుంది. కురుక్షేత్రము పుణ్యక్షేత్రం. ధర్మస్థలం. తపో వనం. శాంతి నిలయం. ధర్మక్షేత్ర మైన కురు క్షేత్రంలో కాలు మోపిన వీరులకు ధర్మ స్పృహ కలగ లేదా? వారి మనస్సులు మార లేదా? వారిలో పరివర్తన రాలేదా? అనేదే ధృతరాష్ట్రుని ఆశ.

అనుకూలమా? ప్రతికూలమా?

పుణ్యక్షేత్రంలో ప్రవేశించ గానే మనస్సులు మారుతాయా? మనుష్యులు పరివర్తన చెందుతారా? పుణ్య సంకల్పాలు గల పుణ్యాత్ములకు పుణ్యక్షేత్రాలు ఓడలకు తెరచాప ల్లాగా సహకరిస్తాయి. ఉపకరిస్తాయి. అంతేగాని, పుణ్యస్పృహ లేని పాపాత్ములను మార్చే శక్తి పుణ్యక్షేత్రాలకు లేదు.

విద్యుద్దీపంలో విద్యుద్వాహక తీగ (ఫిలమెంటు) ఉంటేనే అందులో విద్యుచ్ఛక్తి ప్రసరిస్తుంది. తీగ వీడిపోతే లేదా ఊడిపోతే, విద్యుచ్ఛక్తి ప్రసరించి మాత్రం ఏం చేస్తుంది? దీపాన్ని వెలిగిస్తుందా? కాంతిని ప్రసరింప చేస్తుందా? పాపాత్ములు ఫిలమెంట్లు రాలిపోయిన బల్బుల వంటివారు. అట్టి వారిలో పుణ్యకాంతిని ప్రసరింప చేయడం పుణ్యక్షేత్రాలకు కూడా సాధ్యం కాదు.

అంతమాత్రాన విద్యుచ్ఛక్తి నిరుపయోగమా? నిరుపయోగ మైతే, మరొక బల్బును ఎలా వెలిగిస్తూ ఉంది? పుణ్యాత్ములే పుణ్య ఫలాలను అందుకుంటారు. చిల్లికుండ నీటిని నిలబెట్టుకో లేని విధంగా పాపాత్ములు పుణ్యాన్ని కార్చేసు కుంటారు. పుణ్య ఫలాలను రాల్చేసు కుంటారు. అంతమాత్రాన పుణ్యక్షేత్రాల వైభవం తరగదు. కరగదు.

ఎవరు మారాలి? ఎందుకు మారాలి?

మనస్సులు మారితే మారణహోమం ఆగుతుందని అంబికేయుని అభిప్రాయమా? అదే నిజమైతే, ఎవరి మనస్సులు మారాలి? ఎవరిలో మార్పు వస్తే సమరం ఆగుతుంది? ఈ విషయంలో ప్రధానంగా ముగ్గురే కనిపిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఎవరు సంకల్పించినా రణం ఆగుతుంది. వారెవరంటే, ఒకడు ధృతరాష్ట్రుడు. రెండవ వాడు దుర్యోధనుడు. మూడవ వాడు ధర్మరాజు.

యుద్ధం నివారింప బడాలి అనేదే కనుక ధృతరాష్ట్రుని అభిప్రాయ మైతే, ఈ యుద్ధం జరగటానికి వీల్లేదు అని తాను ఒక్క ఆజ్ఞ జారీ చేస్తే సరిపోయేది. ఆ ఆదేశాన్ని ఆధారం చేసికొని భీష్మద్రోణాదు లతో పాటు మరెందరో వీరులు ధృతరాష్ట్రునికి మద్దత్తుగా నిలిచి యుద్ధాన్ని తీవ్రంగా ప్రతిఘటించి ఉండేవారు. భీష్మద్రోణులు లేకుండా దుర్యోధనుడు రణరంగంలో కాలు పెట్ట గలడా? ఇదంతా ధృతరాష్ట్రునికి తెలియదా? తెలుసు. మమకార ఊబిలో చిక్కుకు పోయిన మహానుభావుడికి ఏమి తెలిసి మాత్రం ఏం లాభం? తన మనస్సు మారదు. మారలేదు. తానే మార నప్పుడు, తన రక్తాన్నే పంచుకొని పుట్టి, దానికి తోడు దుష్ట ప్రారబ్ధ సహజత్వంతో చెలరేగి పోతున్న దుర్యోధనుడు మారుతాడా? దుర్యోధనుడు మారనే మారడు అని క్షుణ్ణంగా తెలిసిన వాడు కూడా ధృతరాష్ట్రుడే.

తాను మారలేదు. తన కుమారుడు మారడు. ఇక ఎవరు మారాలి అని ఆయన అభిమతం? ఇంకెవరు? మిగిలింది ధర్మరాజే కదా! ధర్మరాజే మారాలి. ధర్మరాజు ధర్మాత్ముడు కనుక ధర్మక్షేత్ర మైన కురుక్షేత్రంలో ప్రవేశించ గానే ధర్మస్పృహ ఆవేశించి, సమరంపై ఉత్సాహం తరిగి, రాజ్యంపై విరక్తి పెరిగి, యుద్ధాన్ని నిరసించి మళ్ళీ కట్టుబట్టలతో కానల కేగే ప్రయత్నం చేయలేదా? అనేదే ఆయన గారి ప్రశ్నాంతరం.

ఇన్ని ఆలోచనలతో సతమత మౌతూ, అంతర్యాన్నే రణక్షేత్రంగా మార్చుకున్న ధృతరాష్ట్రుడు ***కిం అకుర్వత?*** యుద్ధభూమిలో ఏమి చేశారు? అంటూ పగలే కలవరిస్తున్నాడు.

అధర్మం అచ్చి రాదు - ధర్మమే రక్షించాలి

ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. యుద్ధం ఎలా జరిగింది? అని ధృతరాష్ట్రుడు సంజయుని సూటిగా ప్రశ్నించి ఉంటే విషయం స్పష్టంగా ఉండేది. అలా కాకుండా, యుద్ధంలో ఏమి చేశారు? ***(కిం అకుర్వత?)*** అని ప్రశ్నించడం వల్లే విషయం మీమాంసకు దారి తీసింది.

ఏమి చేశారు? అని ప్రశ్నించడం లోనే, మనం ముందు గానే విశ్లేషించు కున్నట్లు, ఎవరో ఏదో చేయాలని, దాని వల్ల మరేదో జరగాలని ధృతరాష్ట్రుడు ఆశిస్తున్నాడు అనేది నిర్వివాదాంశం. సరే. ఇంతకీ ఏమి చేయాలి? ఎవరు చేయాలి? ఏమి జరగాలి?

తన కుమారులు గెలవాలి. పాండవులు ఓడిపోవాలి. ధృతరాష్ట్రుడు అంతకు మించి ఆలోచించడం లేదు. ఆయనకి కావలసింది అదే. అంతే.

దుర్యోధనుడు గెలవాలి. కాని, అధర్మపరుడు కనుక గెలవ డేమో అనే భయం. ధర్మరాజు ధర్మప్రభువు కనుక రాజ్యాన్ని త్యజిస్తాడు అనే ధైర్యం. ధర్మరాజు తనంతట తాను యుద్ధము నుండి విరమిస్తే, తన బిడ్డకు రాజ్యం దక్కుతుంది అనే ఆశ. ఇలా ఎందుకు జరగలేదు? అనేదే ధృతరాష్ట్రునిలో సంఘర్షణ.

అసందర్భ ప్రలాపం

భగవద్గీత మహాభారతం భీష్మపర్వంలో ఇరవై ఐదవ అధ్యాయంలో ప్రారంభ మైంది. యుద్ధం ప్రారంభ మైన పదవ రోజు భీష్మాచార్యుడు రథం నుండి పతన మయ్యాడు. ఆ విషయాన్ని చెప్పటానికి పరుగెత్తుకొంటూ సంజయుడు ధృతరాష్ట్రుని మందిరానికి వచ్చాడు.

సంజయోఽ హం మహారాజ నమస్తే భరతర్షభ ।
హతో భీష్మ శ్శాంతనవో భారతానాం పితామహః ॥
యస్య వీర్యం సమాశ్రిత్య ద్యూతం పుత్ర స్తవా కరోత్ ।
స శేతే నిహతో రాజన్ సంఖ్యే భీష్మః శిఖండినా ॥

మహారాజా! నేను సంజయుణ్ణి. నమస్కారము. భరతవంశ పితామహుడు, శంతన మహారాజ నందనుడు భీష్ముడు శరతల్పంపై ఉన్నాడు. ఎవరి శౌర్య పరాక్రమాలపై ఆశలు పెట్టుకొని, నీ కుమారుడు కపట జూదమును నిర్వహించి యుద్ధానికి సిద్ధపడ్డాడో, ఆ భీష్ముడు శిఖండి విడిచిన బాణాలకు గురై పతన మయ్యాడు. నీ కొడుకు ఆశలన్నీ అడియాస లయ్యాయి అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

ఈ వాస్తవాన్ని ధృతరాష్ట్రుడు జీర్ణించుకోలేక పోయాడు. సంజయుని మళ్ళీ మళ్ళీ ప్రశ్నించాడు. మహేంద్ర తేజోసముడు, నరశార్దూల మైన భీష్ముడు హతుడయ్యాడా! అని నివ్వెర పోయాడు.

కథం భీష్మేణ సంగ్రామ మకుర్వన్ పాండునందనాః ।
కథం చ నా జయ ద్భీష్మే ద్రోణే జీవతి సంజయ ॥

సంజయా! యుద్ధంలో భీష్ముని ఎదుర్కొని పాండుసేనలు ఎలా నిలిచాయి? యుద్ధం ఎలా జరిగింది? *(కథం?)* ద్రోణుడు జీవించి యుండగా భీష్ముడు ఎలా పతన మయ్యాడు? కృపాచార్యుడు సమీపంలో లేడా? ***(కృపే సన్నిహితే తత్ర భరద్వాజాత్మకే తథా)*** అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఇదంతా పదమూడు, పద్నాలుగు అధ్యాయాలలో జరిగిన ధృతరాష్ట్ర సంజయ సంభాషణము. ఆ తరువాత యుద్ధభూమిలో జరిగిన విషయాలన్నీ పూస గ్రుచ్చినట్లు సంజయుడు ధృతరాష్ట్రునికి వివరించి చెప్పాడు. వారి సంవాదమును పది అధ్యాయాలలో వాయు వేగంతో ముగించుకొని మహాభారతం ఇరవై ఐదవ అధ్యాయం దగ్గరకు వచ్చి ఆగింది. ఇక్కడ భగవద్గీత ప్రారంభ మైంది.

ఇదీ సందర్భము. ఈ సన్నివేశంలో యుద్ధంలో నా వారు, పాండవులు ఏమి చేశారు? ***(కిం అకుర్వత)*** అని ప్రశ్నించడం అసందర్భ ప్రలాపం కాదా!

ముందు గానే నేను వివరించినట్లు యుద్ధం ఎలా జరిగింది? అని ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించి ఉండాలి. కాని, అది కూడా అప్రస్తుతమే నని ఇప్పటికే విజ్ఞులకు అర్థమై ఉంటుందని భావిస్తున్నాము.

భీష్ముడు హతు డయ్యాడు అని సంజయుడు చెప్పగానే, యుద్ధం ఎలా జరిగింది? అని ధృతరాష్ట్రుడు

వెంటనే ప్రశ్నించాడు. మళ్ళీ ఇక్కడ అడగ నవసరం లేదు. *కథం* అనే మాటకే అవకాశం లేనపుడు *కిం అకుర్వత* అనే మాట ఎలా అంకురిస్తుంది?

భాషాపరంగా వ్యాకరణశాస్త్రంలో తలదూర్చి అర్థం చేసుకుంటే, *కిం అకుర్వత* అనే మాట విచిత్రాల మూటను విప్పుతుంది.

కిం అకుర్వత అనే మాటను సమస్త పదంగా తీసుకుంటే, *కిం అకుర్వత* - ఎంత తప్పు చేశారు! అనే అర్థం వస్తుంది. అంటే, అలా చేయకుండా ఉంటే బాగుండేది అనే భావం ధ్వనిస్తుంది. సంజయా! యుద్ధాభిలాషతో ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో సమావేశమై నా వాళ్ళు, పాండవులు ఎంత తప్పు చేశారు! అనే అర్థం స్ఫురిస్తుంది.

అలా సమస్త పదం కాకుండా, వ్యస్తమైతే, *కిం అకుర్వత* అంటే ఏదో చేశారు అనే అర్థం వస్తుంది. అంటే, వాళ్ళకు తోచిందేదో వాళ్ళు చేసుకు పోయారు. ఏదో చేశారు. ఏదేదో చేసేశారు. ఏమేమో చేసేశారు. అలా చేసి సాధించిం దేముంది? ఏమి ఉపయోగం? అనే అర్థం వస్తుంది. సమర వాంఛతో ధర్మక్షేత్ర మైన కురుక్షేత్రంలో సమావేశ మైన నా వాళ్ళు, పాండవులు , సంజయా! ఏదో చేసేశారయ్యా! అనే అర్థం ధ్వనిస్తుంది. ఏమిటో, అంధ మహారాజు! ఒక్క మాట పలికి అందరినీ గందరగోళంలో ముంచేస్తూ, ఎవరికీ అందకుండా పోతున్నాడు.

అంబికేయుని అంతర్మథనం

యుద్ధం భయంకరంగా సాగుతోంది. ఇప్పటికే ఎందరో మరణించారు. భీష్ముడు హతుడయ్యాడు. గుండె గుబేలు మంటోంది. ఏ క్షణాన ఏమి వినవలసి వస్తుందో అనే భయం మనసును పీడిస్తోంది. ఇలా ఎందుకు జరిగింది? అని ఆంతర్యం ప్రశ్నిస్తోంది. మరో విధంగా ఎందుకు జరగలేదు? అని చిత్తం చింతిస్తోంది. దారుణమైన ఈ అంతర్మథనంలో ఏమి అడగాలని ఆ మహారాజు భావిస్తున్నాడో, ఏమి అడుగుతున్నాడో ముమ్మొందు మందహాసంతో మాటలు కదిలించే మువ్వల వానికే తెలియాలి. చిరునవ్వుల వానికే తెలియాలి.

ఏది ఏమైనా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలి కదా అనుకొంటూ, సంజయుడు స్మృతి పుటలలో తల దూర్చి, పది రోజులు వెనక్కి వెళ్ళి, యుద్ధంలో మొదటి రోజు ఏం జరిగిందో చెప్పడం ఆరంభించాడు. యుద్ధం ఎలా జరిగింది? అని అడిగినా, యుద్ధభూమిలో ఏమి చేశారు? అని ప్రశ్నించినా సమాధానం సరిపోయే లాగా త్రికాలవేది, సర్వాన్ని ప్రత్యక్షంగా దర్శించే శక్తి గల సంజయుడు ***(ప్రత్యక్షదర్శీ సర్వస్య భూత భవ్య భవిష్య విత్)*** చెప్పడం ఆరంభించాడు.

సంజయ ఉవాచ :

దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా ।
ఆచార్య ముపసంగమ్య రాజా వచన మబ్రవీత్ ॥ 2

దృష్ట్వా-తు-పాండవానీకం-వ్యూఢం-దుర్యోధనః-తదా
ఆచార్యం-ఉపసంగమ్య-రాజా-వచనం-అబ్రవీత్

తదా	=	అప్పుడు	దృష్ట్వా	=	వీక్షించి
రాజా	=	రాజైన	తు	=	ఆ తరువాత
దుర్యోధనః	=	దుర్యోధనుడు	ఆచార్యమ్	=	ద్రోణాచార్యుని
వ్యూఢం	=	వ్యూహంగా ఏర్పాటైన	ఉపసంగమ్య	=	సమీపించి
పాండవానీకం	=	పాండవ సైన్యమును	వచనం	=	మాటను
			అబ్రవీత్	=	పలికాడు

సంజయుడు చెబుతున్నాడు :

మహారాజా! వ్యూహంగా ఏర్పడిన పాండవ సైన్యాన్ని దుర్యోధన మహారాజు చూశాడు. వెంటనే ద్రోణాచార్యుల వద్దకు వెళ్ళాడు. తన పలుకును వినిపించాడు.

వ్యాఖ్య

అజ్ఞానము - అహంకారము

అజ్ఞానాంధకారంలో అలమటిస్తున్న అంబికేయుని అప్రస్తుత ప్రసంగాన్ని అర్థం చేసుకున్నాం. అజ్ఞానానికి బిడ్డ అహంకారము. ధృతరాష్ట్రుని బిడ్డ దుర్యోధనుడు. మొదటి శ్లోకంలో ధృతరాష్ట్రుని దర్శనం. రెండవ శ్లోకంలో దుర్యోధనుని భాషణం.

పాండవ సేనను చూచిన దుర్యోధనుడు ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి భాషించాడు అంటున్నాడు సంజయుడు. ఈ శ్లోకము వద్ద దుర్యోధనుడు ప్రవేశించి భాషించడం జరిగింది. కాని, 'దుర్యోధన ఉవాచ' అని వ్యాసుడు ప్రస్తావించ లేదు. దుర్యోధనుని మాటల్ని సంజయుని చేతనే చెప్పించాడు. 'ధృతరాష్ట్ర ఉవాచ' ఉంది కదా మళ్ళీ ఈయన గారు ఎందుకు లెమ్మని భావించాడేమో! మొదటి శ్లోకం మంగళార్థ మైనా ఉపయోగ పడింది. చిన్నదొర గారిది అంతా అహంకార ప్రదర్శనమే కదా అని భావించి, పవిత్రాత్ముడైన సంజయుణ్ణే ఉపయోగించు కున్నాడేమో వ్యాసుడు!

సంధిలో సంజయుడు

మొదటి శ్లోకంలో 'సంజయా' అనే సంబోధన విన పడింది. రెండవ శ్లోకం నుండి 'సంజయ ఉవాచ' అంటే, సంజయుడే వినిపించడం జరుగుతూ ఉంది. సంజయా! అంటూ ధృతరాష్ట్రుడు పలికాడు. దుర్యోధనుడు పలికింది సంజయుడు వినిపించాడు. ఇరువురి మధ్య సంజయుణ్ణే ప్రధానం చేశాడు వ్యాసమహర్షి. ధృతరాష్ట్ర దుర్యోధనుల వంటి వ్యక్తుల మధ్య సంజయుడి లాగా జీవించమని చెప్పకనే చెబుతున్నాడు.

ధృతరాష్ట్రునిలో కోరుకో వలసింది కనిపించదు. దుర్యోధనునిలో ఏరుకో వలసింది వినిపించదు. మొదటిది అంతా అజ్ఞానమే. రెండవది అంతా అహంకారమే. ఈ మధ్యలో నిలిచిన మధ్యవర్తి సంజయుడే ఆదర్శమూర్తి. అందుకే నేమో గీత మొదటి శ్లోకమును విన్నవాడు సంజయుడు. గీత చివరి శ్లోకమును వినిపించిన వాడు కూడా సంజయుడే. జయమును ఆశించే వారు, విజయమును కాంక్షించే వారు సంజయుణ్ణే ఆదర్శంగా తీసుకోవాలి.

సర్వోత్కర్షేణ జయ సంజయ - అన్ని విధాల విజయమును సాధించ మని ఆశీర్వదిస్తుంది సంజయ నామం.

సమ్యక్ జయః యస్య సః సంజయః

ఇంద్రియ మనస్సులను చక్కగా జయించిన వాడు సంజయుడు. కురుక్షేత్రంలో వీరులు ఏమి చేశారు? అని ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు, రాజైన దుర్యోధనుడు వ్యూహముగా ఉన్న పాండవ సేనను చూచి, ఆచార్యుడైన ద్రోణాచార్యుని సమీపించి ఇలా చెబుతున్నాడు అనే సమాధానాన్ని వినిపించాడు సంజయుడు.

బాహ్య దృశ్యము

అనూహ్యమైన రీతిలో వ్యూహాకారంగా కనిపిస్తున్న పాండవ సైన్యాన్ని దుర్యోధనుడు చూశాడు. ఇది

రణరంగంలో సైన్యాన్ని ఒక ప్రత్యేకమైన రూపంలో నిర్మించడాన్ని వ్యూహం
బాహ్యం లోని యుద్ధ దృశ్యము.
అంటారు.
పద్మం యొక్క ఆకారంలో సైన్యాన్ని నిలబెడితే అది పద్మవ్యూహము. ముందు ఎక్కువ సైన్యము
ఉండి వెనుక తక్కువ సైన్యాన్ని ఉంచితే అది మకర వ్యూహము. ముందు తక్కువ సైన్యము ఉండి వెనుక
ఎక్కువ సైన్యము ఉంటే అది శకట వ్యూహము. చీమల బారు లాగా సైన్యమంతా ఒకే వరుసలో ఉంటే, అది
సూచికా వ్యూహము. ఈ విధంగా గారుడ వ్యూహము, దండ వ్యూహము, వరాహ వ్యూహము అని అనేక
వ్యూహా లున్నాయి. అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆయా సేనాధిపతులు వ్యూహాలను నిర్మిస్తూ ఉంటారు.
పాండవులు నిర్మించిన వ్యూహాన్ని చూచి భయపడిన దుర్యోధనుడు ఆచార్యుడైన ద్రోణుని సమీపించాడు.
సైన్యాన్ని చూడగానే ***(దృష్ట్వా తు)*** భయ పడ్డాడు. భయ పడగానే ***(తదా తు)*** ద్రోణాచార్యుని సమీపించాడు.
యుద్ధభూమి దుర్యోధనునికి తెలియనిదా? ఎందుకని భయ పడ్డాడు? దుర్యోధనుని భయానికి మూడు
కారణాలు కనిపిస్తున్నాయి.

అంతర్యుద్ధము

కురుక్షేత్రంలో కౌరవ సైన్యంతో పోల్చితే పాండవుల సైన్యము తక్కువే. పదకొండు అక్షౌహిణుల
సైన్యం కౌరవుల వైపు ఉంటే, ఏడు అక్షౌహిణుల సైన్యం మాత్రమే పాండవుల వైపు ఉంది.
ఎందరో రాజులు తనకు బాసటగా నిలిచారు. అసమాన పరాక్రమవంతులతో తన సేన అపర్యాప్తంగా
ఉంది. ఇలాంటి సేనను ఎదుర్కొనే రీతిలో పాండవులు సేనను సమకూర్చుకో లేరు అని దుర్యోధనుడు
ఇంతకాలం ఊహించాడు. కాని నేడు రణరంగంలో అనూహ్యంగా ఏడు అక్షౌహిణుల సైన్యాన్ని చూడగానే
(దృష్ట్వా తు) దిగ్భ్రాంతి చెందాడు. 'తు' శబ్దం ఈ వాస్తవానికి అద్దం పడుతోంది. దుర్యోధనుని భయానికి ఇది
మొదటి కారణము.

అంతర్యుద్ధంలో అల్లకల్లోలం

పాండవుల సేన పెద్దదే కావచ్చు. తన సేన అంత కంటే పెద్దది కదా! పాండవ సైన్యంలో గొప్ప వీరులు ఉంటే ఉండొచ్చు. అలాగని, తన సేనలో ఉన్న వీరులు మాత్రం తక్కువ వారా? మరి దుర్యోధనునికి భయ మెందుకు?

నిజమే. తన సైన్యంలో వీరు లున్నారు. శూరు లున్నారు. కాని, పాండవ సైన్యంలో ఉండే వీరులకు, తన సైన్యంలో ఉండే వీరులకు మధ్య ఏదో అంతరం ఉంది అని ఆంతర్యం ఘోషిస్తోంది.

తన వైపు భీష్ముడు ఉన్నాడు. కాని, యుద్ధం చేయడం అతనికి ఇష్టం లేదు. ఆచార్యుడైన ద్రోణుడు ఉన్నాడు. కాని, భీష్ముడు లాగా స్థిరమైన వాడు కాడు. ఇక కర్ణుడు ఉన్నాడు అంటే, అతడు విశ్వాసపాత్రుడే. తన కొరకు ప్రాణం ఇస్తాడు. కాని, అత్యవసర సమయంలో ఆమడ దూరాన ఉంటాడు. ఇక వికర్ణుడు, విదురుడు, సంజయుడు - వీళ్ళందరూ పాండవ పక్షపాతంతో వ్యవహరించే వారే. ఎందరో తనతో కలసి ఉన్నారు. కాని, పాలలో పంచదార లాగా తన మనస్సులో మనస్సుగా కలసిన వారెందరు?

ఇక పాండవుల వైపు చూస్తే, అందరూ హితులే. సన్నిహితులే. అవసరమైతే ప్రాణాలు అర్పించడానికి సంసిద్ధంగా ఉన్నవారే. పైగా, కొండంత అండగా శ్రీకృష్ణుడు వాళ్ళ మధ్యే ఉన్నాడు. ఎందరో దేవతల ఆశీర్వాదాలు పాండవులకు ఉన్నాయి. తన విజయాన్ని కాంక్షించే వారి కన్నా, పాండవుల విజయాన్ని కాంక్షించే వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. దుర్యోధనుని భయానికి ఇది రెండవ కారణము.

అపరాధాలే అవరోధాలు

తప్పు చేసిన వారు ఎంతటి వారైనా తప్పించుకో లేరు. చట్టము నుండి తప్పించు కుంటే తప్పించుకో
వచ్చు. చిత్తము నుండి తప్పించుకో లేరు. నిలదీసే చిత్తాన్ని పడుకోబెట్ట లేరు.
పాపిని పాపమే శిక్షిస్తుంది. పాపం చేశావు - పాపం చేశావు అంటూ, తన మనస్సే తనను శపిస్తూ ఉంటుంది.
అందుకే దోషి ధైర్యంగా ఉండ లేడు. పైకి ధైర్యంగా ఉన్నా, లోపల దీనుడై ఉంటాడు. హీనుడై ఉంటాడు. దోష
రహితులైన వారి ముందు మరీ కుంచుకు పోతాడు. తాను ముందుకు సాగా లనుకున్నా, మనస్సు వెనక్కి
లాగుతూనే ఉంటుంది.

పాండవుల సైన్యములో అందరూ సత్పురుషులే. సజ్జనులే. మహాత్ములే. పుణ్యాత్ములే. వారిని చూడగానే
దుర్యోధనుని మనస్సు సహజం గానే సంకోచించి ఉంటుంది. ఇది దుర్యోధన మహారాజు భయానికి మూడవ
కారణము.

ఆచార్యుని ఆశ్రయము

భయంతో చలించి పోయిన దుర్యోధనుడు, భయపడిన పిల్లవాడు పెద్దల వద్దకు పరుగు లెత్తినట్లు,
ద్రోణాచార్యుల వారి వద్దకు వెళ్ళాడు. బాహ్య ఓటమి కన్నా ముందే, దుర్యోధనుని మనస్సులో ఓటమి చేరి
పోయింది. అపజయ శంక బుద్ధిలో ప్రవేశించింది. ఆంతర్యం అల్లకల్లోల మైంది. అందుకే ఆచార్యుని
ఆశ్రయించాడు.

ఆచారా లేమయ్యాయి?

ఆచార్యుని సరే ఆశ్రయించాడు. సంప్రదాయాన్ని పాటించ నవసరం లేదా? సంప్రదాయాన్ని విస్మరిస్తే సదాచారాలు మిగుల్తాయా? సదాచారం లేకుండా సత్ప్రవర్తన ఎలా సాధ్యం?

ఆచార్యుని సమీపించి నపుడు అభివాదం చెయ్యాలా లేదా? మరి దుర్యోధనుడు చేశాడా? లేదు. ఇది దుర్యోధనుని దురాచార ప్రవృత్తి కాదా?

కాదులెండి. యుద్ధభూమిలో ద్రోణ దుర్యోధనులు గురుశిష్యులుగా లేరు. దుర్యోధనుడు రాజు స్థానంలో ఉన్నాడు. శాసించే స్థితిలో ఉన్నాడు. ద్రోణుడు సేనాధిపతి స్థానంలో ఉన్నాడు. కాబట్టి అభివాదం చేయక పోవడం అనాచార మేమీ కాదు అని మీరు అనవచ్చు.

అదే నిజమైతే, సేనాధిపతి రాజు వద్దకు రావాలి గాని, రాజు సేనాధిపతి దగ్గరకు వెళ్ళడ మేమిటి? అనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది. అదే గాక, తరువాత శ్లోకంలో ద్రోణుణ్ణి 'ఆచార్యా!' అంటూ దుర్యోధనుడే సంబోధిస్తాడు. దానిని బట్టి వారి మధ్య గురుశిష్య సంబంధమే ఉంది అని ధ్రువ పడుతూ ఉంది. అభివాదము చేయక పోవడం వెనుక రాజు గారి అహంకారమే ప్రధానం గాని మరొక కారణం కాగడా పెట్టి వెతికినా కనిపించదు.

సంజయుని సంకేతము

దుర్యోధనుడు సరే. సంజయుడు చేసింది బాగుందా? ధృతరాష్ట్ర మహారాజు వద్ద, రాజైన దుర్యోధనుడు అని సంజయుడు పలకడం సమంజసమా? కానే కాదు. అది సంజయునికి తెలియనిదీ కాదు. ధృతరాష్ట్ర మహారాజా! తానే రాజైనట్లు తొలి నుండి దుర్యోధనుడు ప్రవర్తించడం వల్లనే ఈ దౌర్భాగ్యము దాపురించింది.

అనర్థము ప్రాప్తించింది అని వ్యంగ్యంగా పలకడమే సంజయుని మనోభావము. ఈ విధమైన సంభాషణము వాళ్ళిద్దరి మధ్య మహాభారతంలో అనేక చోట్ల కనిపిస్తుంది కూడా.

పశ్యైతాం పాండుపుత్రాణాం ఆచార్య మహతీం చమూమ్ । 3
వ్యూఢాం ద్రుపద పుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥

పశ్య-ఏతాం-పాండుపుత్రాణాం-ఆచార్య-మహతీం-చమూం
వ్యూఢాం-ద్రుపద పుత్రేణ-తవ-శిష్యేణ-ధీమతా

ఆచార్య	=	ఓ ఆచార్యా!	పాండుపుత్రాణాం	=	పాండుతనయుల
తవ	=	నీ యొక్క	ఏతాం	=	ఈ
ధీమతా	=	బుద్ధిమంతుడు	మహతీం	=	గొప్పదైన
శిష్యేణ	=	శిష్యుడు	చమూం	=	సైన్యమును
ద్రుపద పుత్రేణ	=	ద్రుపదుని కుమారునిచే	పశ్య	=	చూడు!
వ్యూఢాం	=	వ్యూహంగా ఏర్పడిన			

ఆచార్యా! పాండవుల సైన్యము ఎంత గొప్ప వ్యూహంతో నిలబడి ఉందో చూడండి. దానిని నిర్మించింది ద్రుపదుని కొడుకైన ధృష్టద్యుమ్నుడు. మీ శిష్యుడు. బుద్ధిమంతుడు.

వ్యాఖ్య

భయ భ్రాంతులతో విహ్వలుడైన గాంధారీ నందనుడు తన పక్షాన్ని తాను చక్క బరచుకొనే ప్రయత్నంలో పడ్డాడు. కర్ణుడేమో యుద్ధానికి దూరంగా ఉన్నాడు. ద్రోణుడు ఉన్నా, అతనిపై దుర్యోధనునికి భీష్మునిపై ఉన్నంత విశ్వాసం లేదు. అందుచేత, తన సైన్యానికి అధిపతిగా ఉన్న భీష్మాచార్యుల వారిని సంప్రదించడానికి బదులుగా ద్రోణాచార్యుని సమీపించాడు.

ఆచార్యా! అటు చూడు! పాండవుల సైన్యము చాలా గొప్పగా ఉంది. ఆ వ్యూహాన్ని రూపొందించిన వాడు ద్రుపదుని కుమారుడు. నీ శిష్యుడైన ధృష్టద్యుమ్నుడు బుద్ధిమంతుడు అని వ్యంగ్యంగా, మర్మంగా పలికాడు. శత్రుపక్షంపై విరుచుకు పడేలా ప్రేరేపించే ప్రయత్నంలో, త్రాచుపాము తోక త్రొక్కినట్లు ద్రోణాచార్యుని ఉసి గొల్పుతూ భాషించాడు.

మిత్ర భేదం - స్వలాభం

గొప్పదైన పాండవ సైన్యాన్ని చూడండి అంటున్నాడు దుర్యోధనుడు. పదకొండు అక్షౌహిణులతో తన సైన్యము ఉండగా, ఏడు అక్షౌహిణుల పాండవ సైన్యాన్ని గొప్పదిగా వర్ణించడంలో ***(మహతీం చమూం)*** దుర్యోధనుని హృదయం ఎంత భయ కంపితంగా ఉందో అర్థ మవుతూనే ఉంది. దుష్ట పన్నాగాలతో, రహస్య కుతంత్రాలతో కలుషిత మైన దుష్టులు విశ్వాస పాత్రులైన వారిని కూడా దారుణంగా శంకించడం, దోషాన్ని అంటగట్టి దుర్భాష లాడటం మనం చూస్తూనే ఉంటాం. ప్రస్తుతం దుర్యోధన చక్రవర్తి ఆ పని లోనే నిమగ్నమై ఉన్నాడు.

పాండవ వ్యూహకర్త ధృష్టద్యుమ్నుడు అనకుండా ద్రుపదుని కొడుకు అంటున్నాడు. మిత్రులైన ద్రుపద ద్రోణులు విభేదంతో విడి పడటం ఎప్పుడో జరిగింది. తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా ద్రోణుడు అర్జునుని ద్వారా ద్రుపదుని అవమానించాడు. ద్రోణునిపై పగ తీర్చుకోవ డానికి ద్రుపదుడు యజ్ఞం చేసి

ధృష్టద్యుమ్నుని బిడ్డగా పొందాడు. ఇదంతా గతం. ఈ గతం ద్రోణాచార్యుని స్వగతమే కదా! అది ఆయనకు తెలియదా? మరి, దుర్యోధనుడు ఎందుకు చెప్తున్నాడు?

నీపై ప్రతీకారం తీర్చుకోవ డానికి ద్రుపదుడు తన కుమారునితో సిద్ధ మయ్యాడు. ఏం చెయ్యాలో ఆలోచించుకో అనే భావాన్ని స్ఫురింప జేస్తూ ద్రోణాచార్యుని రెచ్చగొడు తున్నాడు. అంతే.

పాముకే పాలు పోసింది

ద్రోణుడు ధృష్టద్యుమ్నునికి విలువిద్య నేర్పాడు. తన ప్రాణం తీయాలనే ఏకైక లక్ష్యంతో ఆవిర్భవించిన వాడికి ఎవరైనా విలువిద్య నేర్పుతారా? కాటేయడానికి సిద్ధంగా ఉన్న సర్పానికి ఎవరైనా పాలు పోస్తారా?

ఇప్పుడు చూడు. నీ శిష్యుడే కదా? ***(తవ శిష్యః)*** ఇక చూపిస్తాడు తడాఖా! ***నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష*** - నీ పైనే శర ప్రయోగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఏం చేస్తాం? నీ శిష్యుడు కదా! బుద్ధిమంతుడు ***(ధీమతా)***. గురువునే గుర్తులు మిగలకుండా చేయాలనే శిష్యుడు. భళా! గొప్ప బుద్ధిమంతుడేలే! అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నాడు దుర్యోధనుడు.

ధీమతా అనే పదాన్ని చాలా లోతైన అర్థంతో ప్రయోగించాడు దుర్యోధనుడు. రణరంగంలో బుద్ధిమంతుడు అంటే విలువిద్యా నిపుణుడు అని అర్థం. ధృష్టద్యుమ్నుడు నీ శిష్యుడు కనుక నీ విద్యా సంపత్తి నంతా గ్రహించే ఉంటాడు. తనకు సహజంగా ఉన్న ప్రావీణ్యంతో పాటు అన్యుల నుండి గ్రహించిన కౌశలం కూడా ఉంటుంది కాబట్టి, నా వైపు నిలబడి యుద్ధం చేసే నీ కన్నా, పాండవుల వైపు నిలబడి పోరాడుతున్న నీ శిష్యుడు ధృష్టద్యుమ్నుడే గొప్పవాడుగా తెలుస్తున్నాడు అనే ధ్వని కూడా అతని మాటల్లో ఉంది. ఇది వాస్తవం కాకపోతే, రణరంగంలో శిష్యుని కన్నా గురువే గొప్పవాడు అని నిరూపించుకో! అనే ఎత్తి పొడుపు కూడా ఉంది.

పిలుపులో విరుపు

ద్రోణాచార్యుని సమీపించిన దుర్యోధనుడు ఆచార్యా! అని సంబోధించాడు. కానీ శ్లోకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అక్కడ కూడా రెండో అర్థం స్ఫురిస్తోంది. **పాండు పుత్రాణా మాచార్య** (పాండు పుత్రాణాం ఆచార్య) అనడం చేత, పాండవుల ఆచార్యుడా! అనే వ్యంగ్య సంబోధన కూడా వినపడుతూ ఉంది.

పాండవులు నీ శిష్యులే. వాళ్ళ నాయకుడు కూడా తమరి శిష్యుడే. ప్రత్యర్థు లందరికీ తమరే గురువు. తమరికి కూడా వాళ్ళంటే వల్లమాలిన ప్రేమ. బాగానే ఉంది. కాని అదేమిటో! మా వైపు చేరి యుద్ధం చేస్తావు. అదే విచిత్రం. సరే. తమరికి ఇష్టమైన పాండవుల సేన లోని నాయకుల్ని గురించే చెబుతాను. వినండి. మీ మనస్సుకు కాస్త హాయిగా ఉంటుంది అంటూ దిక్కు తోచక శత్రుస్మరణం చేస్తున్నాడు.

దుర్యోధనుడు అటు చూడ మన్నాడు. ద్రోణుడు చూశాడు. ఇప్పుడు ఏమి చేయాలి? పాండవ సైన్యము చాలా పెద్దదిగా ఉంది. దానిని తక్కువగా అంచనా వేయ కూడదు అనేది దుర్యోధనుని భావన.

సైన్యము గొప్పదిగా ఉన్నంత మాత్రాన విజయము సాధిస్తారని ఎలా చెప్పగలం? విజయం అనేది సైన్యాన్ని నడిపే నాయకుల మీద ఆధారపడి ఉంటుంది. భీష్మాది మహావీరులు, శూరులు తన వైపు కూడా ఉన్నారు కదా! అయినా భయ మెందుకు?

పాండవ సైన్యములో కూడా మహా శూరు లున్నారు. కనుక, ఉపేక్షిస్తే లాభం లేదు అనుకొంటూ శత్రుపక్షంలో ఉండే శూరు లెవరో చెబుతున్నాడు.

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥ 4

అత్ర-శూరాః-మహేష్వాసాః-భీమార్జునసమాః-యుధి
యుయుధానః-విరాటః-చ-ద్రుపదః-చ-మహారథః

అత్ర	=	ఈ సైన్యములో	విరాటః	=	విరాటుడు
యుధి	=	సమరము నందు	చ	=	మరియు
భీమార్జునసమాః	=	భీమార్జునుల వంటి వాళ్ళు	మహారథః	=	మహారథుడైన
మహేష్వాసాః	=	గొప్ప ధనుర్ధారులు	ద్రుపదః	=	ద్రుపదుడును
శూరాః	=	శూరులు	చ	=	మరియు
యుయుధానః	=	సాత్యకి			

పాండవ సైన్యంలో భీమార్జునులతో సమానులైన శూరు లున్నారు. గొప్ప ధనుస్సులు ధరించి ఉన్నారు. సాత్యకి, విరాటరాజు, మహారథుడైన ద్రుపదుడు, ఇంకా -

వ్యాఖ్య

పాండవ సైన్యంలో గొప్ప గొప్ప వీరు లున్నారు. శూరు లున్నారు. అతిరథ మహారథు లున్నారు (సర్వ ఏవ మహారథాః) అంటున్నాడు దుర్యోధనుడు. పైగా వీరందరూ భీమార్జునులతో సమానులు అంటున్నాడు.

గొప్ప ధనుర్విద్యా నిపుణుడై, తనను, సారథిని, గుఱ్ఱాలను ఏక కాలంలో రక్షించుకొంటూ పదివేల మందితో పోరాడే శక్తి గల వీరుణ్ణి మహారథుడు అంటారు. భీమార్జునులతో పాటు పాండవ సైన్యంలో ఉండే గొప్ప శూరుల్ని గూర్చి చెబుతున్నాడు దుర్యోధనుడు.

(1) **యుయుధానుడు.** కృష్ణార్జునులకు చాలా సన్నిహితుడు. గొప్ప పరాక్రమవంతుడు. శ్రీకృష్ణునికి తమ్ముడు. అర్జునుడికి శిష్యుడు కూడా. యుద్ధంలో అసమాన పరాక్రమాన్ని ప్రదర్శించే వాడు కావడం చేత సాత్యకికి యుయుధానుడు అనే పేరు వచ్చింది. కురుక్షేత్రంలో కృతవర్మను, సుదర్శనుని వధించడమే గాక, భూరిశ్రవునితో భయంకర పోరాటాన్ని సాగిస్తాడు సాత్యకి.

(2) **విరాటరాజు.** అజ్ఞాతవాసంలో పాండవులకు ఆశ్రయం కల్పించాడు. పాండవుల ఏడు అక్షౌహిణుల సేనలలో ఒక దానికి సారథ్యం వహిస్తాడు. తన కుమారులు శంభుడు, ఉత్తరునితో కలసి కురుక్షేత్రంలో పోరాడి, ద్రోణుని చేతిలో మరణిస్తాడు. అభిమన్యునికి మామ. శత్రువులను విశేషంగా పీడించే వాడు కనుక విరటుడు అని ప్రసిద్ధి.

(3) **ద్రుపదుడు.** ధృష్టద్యుమ్నుని తండ్రి. పాంచాల దేశానికి రాజు. ద్రౌపది ఆయన కూతురే. ద్రుపదుడు ద్రోణునికి శత్రువు కనుక ద్రోణాచార్యుని రెచ్చగొట్టే ప్రయత్నంలో 'మహారథు' డంటూ ద్రుపదునికి ప్రత్యేకంగా విశేషణాన్ని జోడించాడు దుర్యోధనుడు.

ధృష్టకేతు శ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్ ।
పురుజి త్కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥ 5

ధృష్టకేతుః-చేకితానః-కాశిరాజః-చ-వీర్యవాన్
పురుజిత్-కుంతిభోజః-చ-శైబ్యః-చ-నరపుంగవః

ధృష్టకేతుః	=	ధృష్టకేతుడు	కుంతిభోజః	=	కుంతిభోజుడు
చేకితానః	=	చేకితానుడు	చ	=	ఇంకను
వీర్యవాన్	=	బలవంతుడైన	నరపుంగవః	=	పురుషశ్రేష్ఠుడు
కాశిరాజః	=	కాశిరాజు	శైబ్యః	=	శైబ్యుడు
చ	=	మరియు	చ	=	మరియు
పురుజిత్	=	పురుజిత్తు			

ధృష్టకేతువు, చేకితానుడు, బలవంతుడైన కాశిరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, పురుష శ్రేష్ఠుడైన శైబ్యుడు - వాళ్ళతో పాటు -

వ్యాఖ్య

(4) **ధృష్టకేతువు :-** చేది దేశపు రాజు. శిశుపాలుని కుమారుడు. నకులుని భార్య శ్రుణుమతి ఇతని చెల్లెలే. గొప్ప పోరాట పటిమ కలవాడు.

(5) **చేకితానుడు :-** యాదవ కులానికి సంబంధించిన వీరుడు. చికితానుని కుమారుడు. యుద్ధంలో ఇతనిని దుర్యోధనుడు సంహరిస్తాడు.

(6) **కాశిరాజు :-** కాశీ నగరాన్ని పాలించిన చక్రవర్తి. యుద్ధంలో అసమాన పరాక్రమంతో పోరాడుతాడు. అందుచేత 'వీర్యవాన్' అని ప్రత్యేకంగా శ్లాఘించడం జరిగింది.

(7) **పురుజిత్తు :-** కుంతీదేవికి సోదరుడు. కుంతిభోజుని కుమారుడు. ధర్మజ భీమార్జునులకు మేనమామ. పురు వంశీయులను జయించి పురుజిత్తు అయ్యాడు.

(8) **కుంతిభోజుడు :-** ఇతడు పురుజిత్తు సోదరుడు. తండ్రి యైన కుంతిభోజుని పేరే ఇతనికి కూడా పెట్టబడింది. కుంతీదేవి సోదరుడు.

(9) **శైబ్యుడు :-** శిబి వంశములో పుట్టి నందున ఇతడు శైబ్యుడు. ధర్మరాజుకు పిల్ల నిచ్చిన మామ. శైబ్యుని కుమార్తె దేవిక. శౌర్యవంతుడైన శైబ్యుని 'నరపుంగవః' - పురుష శ్రేష్ఠుడు అంటున్నాడు దుర్యోధనుడు.

యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥ 6

యుధామన్యుః-చ-విక్రాంతః-ఉత్తమౌజాః-చ-వీర్యవాన్
సౌభద్రః-ద్రౌపదేయాః-చ-సర్వే-ఏవ-మహారథాః

విక్రాంతః	=	పరాక్రమవంతు డైన	సౌభద్రః	=	సుభద్ర కుమారుడు
యుధామన్యుః	=	యుధామన్యుడు	చ	=	మరియు
చ	=	మరియు	ద్రౌపదేయాః	=	ద్రౌపది కుమారులు
వీర్యవాన్	=	బలవంతుడైన	సర్వే	=	అందరు
ఉత్తమౌజాః	=	ఉత్తమౌజుడు	మహారథాః ఏవ	=	మహారథులే
చ	=	మరియు			

పరాక్రమవంతుడైన యుధామన్యుడు, బలవంతుడైన ఉత్తమౌజుడు, సుభద్ర కుమారుడు, ద్రౌపది కొడుకులు - వీళ్ళందరూ మహారథులే.

వ్యాఖ్య

(10) **యుధామన్యుడు** :- ఇతడు అర్జునుని రథానికి వామపార్శ్వంలో చక్ర రక్షకుడుగా ఉంటాడు. గొప్ప శక్తిమంతుడు. అందుకే విక్రాంతుడు.

(11) **ఉత్తమౌజుడు** :- ఇతడు పాంచాల దేశపు రాజకుమారుడు. అర్జునుని రథానికి కుడిభాగాన చక్ర రక్షకుడుగా ఉంటాడు. గొప్ప వీర్యవంతుడు.

(12) **సౌభద్రుడు** :- సుభద్రార్జునుల పుత్రుడు. ఉత్తర భర్త. అభిమన్యుడు.

(13) **ద్రౌపదీ కుమారులు** :- ధర్మజుని వలన కలిగిన **ప్రతివింధ్యుడు**, భీముని వలన కలిగిన **శ్రుతసోముడు**, అర్జునుని వలన కలిగిన **శ్రుతకర్ముడు**, సహదేవుని వలన కలిగిన **శ్రుతసేనుడు**, నకులుని వలన కలిగిన **శతానీకుడు**. వీరు అయిదు మంది ద్రౌపదీ పుత్రులు. వీరినే ఉపపాండవులు అంటారు. వీరందరూ మహారథులే.*

మరి, అలాంటి మహారథులైన శత్రువులతో పోరాడి అనర్థం సృష్టించు కోవడం కంటే, వారితో సంధి చేసుకుంటే సరిపోతుంది కదా! అని ద్రోణాచార్యుడు ఎక్కడ చెబుతాడో అని ముందే ఊహించుకొని, తన సైన్యంలో కూడా వీరశూరులు, అతిరథ మహారథులు ఉన్నారంటూ వారిని గూర్చి కూడా చెబుతున్నాడు.

అస్మాకం తు విశిష్టా యే తా న్నిబోధ ద్విజోత్తమ ।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తా న్బ్రవీమి తే ॥ 7

అస్మాకం-తు-విశిష్టాః-యే-తాన్-నిబోధ-ద్విజోత్తమ
నాయకాః-మమ-సైన్యస్య-సంజ్ఞార్థం-తాన్-బ్రవీమి-తే

ద్విజోత్తమ	=	ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా!	తాన్	=	వారిని
అస్మాకం	=	మన పక్షంలో	తే	=	నీకు
యే తు	=	ఎవరైతే	సంజ్ఞార్థం	=	తెలియాలని
విశిష్టాః	=	గొప్పవారో	బ్రవీమి	=	చెబుతున్నాను
మమ	=	నా యొక్క	తాన్	=	వారిని
సైన్యస్య	=	సైన్యమునకు	నిబోధ	=	గమనించు
నాయకాః	=	నాయకులో			

బ్రాహ్మణోత్తమా! ఇక మన పక్షంలో గొప్పవాళ్ళు, సేనా నాయకు లెవ్వరో నీకు తెలియాలని చెబుతున్నా, వారిని కూడా గమనించు.

వ్యాఖ్య

పాండవ సైన్యము లోని అతిరథులను పేర్కొన్నంత మాత్రాన తాను వాళ్ళను చూచి భీతి చెందుతున్నట్లు ద్రోణుడు అర్థం చేసుకుంటా డేమో నని, తన వైపు కూడా అతిరథులైన మహావీరులు ఎందరో ఉన్నారంటూ తన సైన్యము లోని నాయకులను కూడా దుర్యోధనుడు వరుసగా చెప్పబో తున్నాడు.

అంతే కాదు. ఒకవేళ, పాండవసేన లోని తన శిష్యులపై వ్యామోహంతో ద్రోణుడు పూర్ణ హృదయంతో కౌరవుల వైపు శ్రమించక పోయినా, తనకు వచ్చే నష్ట మేమీ లేదనేది ధ్వనించేలా ఈ శ్లోకంలో ద్రోణాచార్యుని

* స్వామీజీ రచించిన చైతన్య మహాభారతంలో ఈ మహారథులను గూర్చి విశేషంగా చర్చించడం జరిగింది.

ద్విజోత్తమా! అని సంబోధించాడు. అంటే, బ్రాహ్మణశ్రేష్ఠుడా! అని అర్థము. ఈ సందర్భములో ఇదొక విచిత్ర మైన, వికటమైన సంబోధనము.

హోమ ధూమం - రణ రుధిరం

ద్విజుడు అంటే రెండవ సారి పుట్టినవాడు అని అర్థము. తల్లి గర్భము నుండి పుట్టడం మొదటి జన్మ అయితే, ఉపనయన సంస్కారం జరిగిన తరువాత ఆ వ్యక్తే రెండవ జన్మ ఎత్తిన వాడు అవుతాడు. అప్పుడు ద్విజుడు అని పిలువ బడతాడు.

జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః

పుట్టుకతో అందరూ శూద్రులే. ఉపనయన సంస్కారం తరువాత ద్విజులుగా మారుతారు. ఈ విధంగా రెండు జన్మలు ఎత్తిన వాడు ద్విజుడు లేక ద్విజన్ముడు అన్నది శాస్త్రం (***ద్వేజాతీ జన్మనీ యస్య సః ద్విజన్మా***).

జన్మ నిచ్చిన జననీ జనకులు మొదటి జన్మకు కారణ మవుతున్నారు. ద్విజుడుగా తన రెండవ జన్మకు గాయత్రీ మంత్రము జనని కాగా, జనకుడు దానిని ఉపదేశించే ఆచార్యుడు అవుతున్నాడు (***తద్వితీయం జన్మ మాతా సావిత్రీ పితా తు ఆచార్యాః***). గాయత్రిని వేదంలో సావిత్రి అని కూడా పిలుస్తారు. మంత్రద్రష్ట విశ్వామిత్ర మహర్షి.

అయితే, ఈ సందర్భంలో ద్రోణాచార్యుని ద్విజోత్తమా! అని సంబోధించడంలో దుర్యోధనుని అంతర్య మేమిటి? ఏముంది, కాస్త మనస్సు పెట్టి చూస్తే శుభ్రంగా తెలుస్తూనే ఉంది కదా!

ద్విజోత్తమా! బ్రాహ్మణశ్రేష్ఠుడా! నీ శరీరం మా వైపు నిలబడి ఉంది. మనస్సేమో ఆ వైపు పచార్లు చేస్తోంది. నీ శిష్యు లందరూ ఆ వైపే ఉన్నారు. నీ మనస్సు కూడా అక్కడే ఉంది. ఇక నీ వల్ల నాకు ఒరిగే దేముంది? అలాగని, నీవు లేకపోతే తరిగే దేముంది? నీవు ద్విజశ్రేష్ఠుడవు. గాయత్రీమాత పుత్రుడవు. సంధ్యా వందనాది పవిత్ర కర్మలు, యజ్ఞ యాగాది పుణ్య కర్మలకు అలవాటు పడ్డ వాడివి. పైగా సత్త్వగుణం గల బ్రాహ్మణుడివి.

హోమధూమం మధ్యలో కూర్చుని వేదమంత్రాలు వల్లించడం వేరు. రణరంగంలో నిలబడి రుధిర ప్రవాహాన్ని వీక్షిస్తూ పోరాడటం వేరు. పారాయణ జపధ్యానాలకు అలవాటు పడిన నీ ద్విజ స్వభావం రణరంగంలో ఏవో అద్భుతాలు సృష్టిస్తుందని నేను ఆశించడం లేదు. నీవు మా అందరికీ శిక్షణ ఇచ్చి ఉండొచ్చు. ఆట నేర్పడం వేరు. క్లిష్టమైన పరిస్థితుల్లో ఆడటం వేరు. పైగా చిత్తము లేకుండా చిందులు వేయడం చిత్రం గానే ఉంటుంది అంటూ, ఆచార్యునిపై తన కున్న అవిశ్వాసాన్ని చెప్పకనే బైట పెట్టేశాడు. అందుకే తన సైన్యంలో ఉండే మహారథులను వివరించి చెబుతున్నాడు. కౌరవ సైన్యములో ఉండే నాయకు లెవరో ద్రోణుడి స్థాయి యోధునికి తెలియదా? మరి దుర్యోధనుడు ఎందుకు చెబుతున్నట్లు?

సంజ్ఞార్థం - గుర్తు చేయాలి అని చెబుతున్నాను అంటున్నాడు. భీష్ముని పతనానంతరం సర్వ సేనాధిపతిగా పగ్గాలు చేపట్టబోయే ద్రోణుడికి తన సైన్యమును, అది కూడా నాయకులను గూర్చి గుర్తు చేయుడ మేమిటి? నీవు మనస్సు పెట్టి యుద్ధం చేయక పోయినా, నాకు వచ్చే నష్ట మేమీ లేదు అని గుర్తు చేయుడమే. నా వైపు నిన్ను మించిన అతిరథ మహారథు లెందరో ఉన్నారు అని తేల్చి చెప్పడమే. చాలా విడ్డూరంగా ఉంది కదూ! నిజమే. అలా ప్రవర్తించే వాడే దుర్యోధనుడు.

ఇక కౌరవ వీరుల్ని గూర్చి ప్రారంభిస్తూ ముందుగా ద్రోణాచార్యుని ప్రస్తావించాడు దుర్యోధనుడు. తన మనస్సులో ద్రోణునిపై ఉండే అవిశ్వాసాన్ని అణచుకో లేక సూటిపోటి మాటలతో వ్యంగ్యాస్త్రాలను విపరీతంగా

సంధించేశాడు. ఆ మాటలకు ద్రోణుడు ఎక్కడ మనస్తాపం చెందాడో, క్రోధంతో కదులు తున్నాడో అని శంకించి, ఆచార్యుని శాంతింప చేసే ప్రయత్నంలో ప్రథమంగా ద్రోణాచార్యునే ప్రస్తావించాడు. దారి తప్పిన వారికి ఎన్నో దారులు!

భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః । 8
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ ॥ *

భవాన్-భీష్మః-చ-కర్ణః-చ-కృపః-చ-సమితింజయః
అశ్వత్థామా-వికర్ణః-చ-సౌమదత్తిః-తథా-ఏవ-చ

భవాన్	= మీరు	అశ్వత్థామా	= అశ్వత్థామ
భీష్మశ్చ	= భీష్ముడు	వికర్ణశ్చ	= వికర్ణుడు
కర్ణశ్చ	= కర్ణుడు	తథా ఏవ చ	= అలాగే
సమితింజయః	= సమర విజయుడు	సౌమదత్తిశ్చ	= సోమదత్తుని పుత్రుడు
కృపశ్చ	= కృపాచార్యుడు		

మీరు, భీష్ముడు,కర్ణుడు, సమర విజయుడు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కొడుకు - వీళ్ళే కాదు,

వ్యాఖ్య

తన పక్షంలో ఉండే ముఖ్యమైన వీరుల్ని గూర్చి చెబుతూ ప్రథమంగా **భవాన్** - తమరు అంటూ ప్రారంభించాడు. వాస్తవంగా మాట్లాడితే ముందు భీష్ముణ్ణి చెప్పి తరువాత ద్రోణుణ్ణి చెప్పాలి. ఇంతవరకు తాను చేసిన అప్రస్తుత అధిక ప్రసంగం వల్ల కలిగిన గాయాలను నయం చేసేందుకు సున్నితంగా మందు రాసే ప్రయత్నంలో పడ్డాడు దుర్యోధనుడు. అందుకనే భీష్ముని కన్నా ముందు ద్రోణుణ్ణి, వికర్ణుడి కన్నా ముందు అశ్వత్థామను ప్రస్తావించి, భోజనం లేకుండానే బ్రాహ్మణుణ్ణి ఉబ్బిస్తున్నాడు.

గొప్ప తేజోసంపన్ను లైన తమరు, భీష్ముడు, కర్ణుడు, సమర విజయుడు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కుమారుడు భూరిశ్రవుడు అంటూ ఏడు మందిని ప్రస్తావించాడు. పాండవ సైన్యములో పదిహేడు మంది వీరుల్ని ప్రస్తావించి, తన వైపు ఏడు మంది వీరుల్నే ప్రస్తావించాడు (**సౌమదత్తి ర్జయద్రథః** అనే పాఠాంతరాన్ని గ్రహిస్తే ఎనిమిది మంది అవుతారు. ఆ ఎనిమిదవ వాడు జయద్రథుడు. అంటే, సింధు నరేశుడు సైంధవుడు).

వాపు - బలుపు

పదకొండు అక్షౌహిణుల సైన్యము గల కౌరవ సైన్యము లోని నాయకులను ఏడు మందిని పేర్కొని, ఏడు అక్షౌహిణుల సైన్యము గల పాండవ సైన్యము లోని నాయకులను పదిహేడు మందిని చెప్పడంలో ఆంతర్య మేమిటో! పైగా పాండవ వీరుల్ని మూడు శ్లోకాలలో ప్రస్తావించి, తన సైన్యము లోని వీరులను ఒక్క శ్లోకం లోనే చెప్పేశాడు. **

మన వాళ్ళను గూర్చి మనకు ఎలాగూ తెలుసు కదా, ఎదుటి వారి శక్తిని అంచనా వేయడమే కర్తవ్యం కావాలి అనే సంగ్రామ చాతుర్యమా? లేక సైన్యము ఎక్కువగా ఉందే గాని, వీరులు కౌరవ సైన్యంలో తక్కువగా

* సౌమదత్తిః జయద్రథః అని పాఠాంతరము.

** గీత 16 వ అధ్యాయమును ప్రారంభిస్తూ, దైవీ సంపదలో జన్మించిన వారిని మూడు శ్లోకాలలో వర్ణించి, ఆసురీ సంపదలో జన్మించిన వారిని ఒక్క శ్లోకంలో చెప్పాదు గీతాచార్యుడు. వ్రాసిన వాడు వ్యాసుడు కావడం చేత, ఇది కూడా ఆలోచించ దగిన విషయమే.

ఉన్నారు. సైన్యము అక్షౌహిణుల సంఖ్యలో తక్కువగా ఉన్నా, పాండవసేన లోనే వీరులు ఎక్కువగా ఉన్నారు అనే నైరాశ్యమా? ఏమో, రెండవదే అయినా దుర్యోధనుని విషయంలో ఆశ్చర్యపో నవసరం లేదు.

ఎందుకంటే, తరువాత శ్లోకంలో మరెందరో తన వైపు ప్రావీణ్యత గల మహావీరులు ఉన్నారు అని పేరు లేని వాళ్ళను ప్రస్తావిస్తాడు. పైగా, వాళ్ళు తమ కొరకు ప్రాణాలు తెగించి వచ్చారు అంటాడు. ఇవన్నీ విస్మరించ దగిన విషయాలు మాత్రం కావు. అదేమిటో కూడా చెప్పుకుందాం.

అన్యే చ బహవ శ్శూరాః మదర్థే త్యక్తజీవితాః ।
నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥ 9

అన్యే-చ-బహవః-శూరాః-మదర్థే-త్యక్తజీవితాః
నానాశస్త్ర ప్రహరణాః-సర్వే-యుద్ధ విశారదాః

అన్యే	= ఇంకా వేరే	త్యక్త జీవితాః	= బ్రతుకును ధారబోసి
బహవః	= చాలా మంది	సర్వే	= అందరు
శూరాః	= శూరులు	నానాశస్త్ర ప్రహరణాః	= అనేక శస్త్రాస్త్రములు గలవారు
మదర్థే	= నా కొరకు	యుద్ధవిశారదాః	= సమర చాతుర్యము గలవారు

ఇంకా, వేరే వాళ్ళు చాలా మంది, నా కోసం బ్రతుకును ఫణంగా పెట్టి వచ్చి ఉన్నారు. శస్త్రాస్త్రములను ధరించిన వాళ్ళందరూ యుద్ధంలో ఎంతో ప్రావీణ్య మున్న వాళ్ళు

వ్యాఖ్య

తన సైన్యంలో ముఖ్యులైన ఏడు మంది వీరుల్ని ప్రస్తావించిన దుర్యోధనుడు, ఆ తరువాత మరెందరో ఉన్నారు అంటున్నాడు. పైగా వాళ్ళందరూ గొప్ప ప్రావీణ్యమున్న వాళ్ళు, శస్త్రాస్త్రములను ధరించి ఉన్నవాళ్ళు అంటున్నాడు. అంతటితో ఆగలేదు. తన కోసం ప్రాణాలు సైతం తెగించి వచ్చారు అంటున్నాడు.

మళ్ళీ ఇదేమిటి? పేరు లేని వాళ్ళను ప్రస్తావిస్తూ, వాళ్ళందరూ గొప్ప ప్రావీణ్యము ఉన్నవాళ్ళట. అంటే, గడచిన శ్లోకంలో పేరు పేరున చెప్పినాడే, వాళ్ళందరూ ప్రావీణ్యము లేని వారా?

అలా ప్రావీణ్యత గల అనామధేయులు శస్త్రాస్త్రములను ధరించి ఉన్నారు అంటున్నాడు. మరి, ఎనిమిదవ శ్లోకంలో పేరు పేరున పలికిన ఏడు మంది విషయ మేమిటి? వాళ్ళు శస్త్రాస్త్రములు ధరించి లేరా? మరి ఎలా ఉన్నారు? గంగాళముల ప్రక్కన గరిటెలు పట్టుకొని నిలుచున్నారా? విస్తళ్ళ ముందు పద్మాసనాలలో విసన కఱ్ఱలు ధరించి విస్తరించి కూర్చున్నారా? ఎంత అర్థరహిత ప్రసంగం! అంతా స్వార్థపూరిత ప్రవచనం.

ఇంకా చూడండి, రాజు గారి వాక్చాతుర్యం! ఆ అనామధేయు లందరూ తన కోసం ప్రాణాలు ధారబోసి వచ్చారు అంటున్నాడు. ఇదొక భావ దారిద్ర్యం.

నిజమే. వాళ్ళందరూ ఈ మహారాజు గారి కోసం ప్రాణాలు త్యజించే వచ్చారు అనుకుందాం. కలం లేకుండా వచ్చిన వాడు కలం లేని వాడే కదా! కళ్ళజోడు లేకుండా వచ్చిన వాడు కళ్ళజోడు లేనివాడే కదా! ప్రాణాలు త్యజించి వచ్చిన వాళ్ళెవరు? ప్రాణాలు లేని వాళ్ళే కదా! ప్రాణాలు త్యజించి వచ్చిన అనామధేయ వీరులు శత్రుపక్షంలో ఎవరి ప్రాణాలు తీస్తారు? భయపడిన వాళ్ళవి తప్ప!

త్యక్త జీవితాః అనే మాటే అశుభ సూచకం. ప్రాణాలు త్యజించి వచ్చారు అనేది మాటలో వినపడుతున్నా,

ప్రాణాలు త్యజించ బోతారు అనేది మనస్సులో కనపడుతూనే ఉంది. అదే కాకుండా, ఆ ప్రాణాలు కూడా తన కోసం (మదర్థం) త్యజించి వచ్చారు అని అన్యాయంగా, అధర్మంగా పలుకు తున్నాడు. ప్రజల కొరకు రాజు బ్రతకాలి గాని, తన కొరకు వారు ప్రాణాలు త్యజించి వచ్చారని రాజు పలకడం శోచనీయం.

మహావీరులైన ఏడు మంది కౌరవ మహారథులను ప్రస్తావించిన తరువాత, అసందర్భంగా అనామధేయుల్ని ఆకాశాని కెత్తుతూ స్తుతించడం వెనుక హేతు వేమిటి? ఏముంది! ఆ ఏడు మంది తన బ్రతుకులో వేడుకను ఆవిష్కరించ లేరు అనే అనుమానమే. కారణ మేమిటి? దుర్యోధనుని ఆంతర్యమే.

(1) ద్రోణుడు :- బ్రాహ్మణుడు. వేదాధ్యయన తత్పరుడు. కౌరవులకు, పాండవులకు ఇరువురికీ గురువే. ఉభయులకు అస్త్రవిద్యను నేర్పిన వాడు. అర్జునునితో సమానమైన వాడు ఉండడు అని ఆశీర్వ దించడమే గాక, నాకు సహకరించే ఏకలవ్యుని బొటనవ్రేలును దూరం చేసిన వాడు. ఇక ఇప్పుడు, యుద్ధంలో నాకు సహాయం చేయబోతాడు!

(2) భీష్ముడు :- రాజయ్యే లక్షణాలన్నీ ఉండి కూడా తండ్రి కోసం సమస్తాన్నీ త్యజించిన వాడు. వివాహము కూడా చేసుకోనని భీష్మించు కున్నాడు. అలాగే బ్రతుకును నీరసింప చేసుకున్నాడు. పైగా తలచుకో గానే తల వాలిపోయే వరాన్ని తండ్రి నుండి పొంది ఉన్నాడు. పొసగితే ఉంటాడు. విసిగిపోతే చెప్పకుండానే తన దారిన తాను పోతాడు. యుద్ధంలో పాండవులను చంప కూడదు అని నిర్ణయించుకున్న వాడు. నాకు యుద్ధంలో ఏదో చేసి పెడతాడు!

(3) కర్ణుడు :- ప్రాణానికి ప్రాణ మిచ్చే స్నేహితుడు. మతి గలవాడే. అతి ఎక్కువ. కవచ కుండలాలు ఉంటే, అతణ్ణి ఎవ్వరైనా మట్టు పెట్ట గలరా? ఇంద్రుడు వచ్చి అడుగుతాడు, ఇవ్వద్దు మొర్రో అని పుత్ర వాత్సల్యంతో ఏడు గుఱ్ఱాలను తోలుకుంటూ సూర్యుడు వచ్చి చెబితే, తండ్రి మాటను కూడా లెక్క చేయకుండా, 'నన్ను యాచించిన వాడు లేదనుకొంటూ తిరిగి పోవుటయా! అదే జరిగినచో, వెంబడించదా అతనిని నా ప్రాణం కూడా' అని నాటక వాచకం పలుకుతాడా? ఇంద్రుడు రానే వచ్చాడు. కవచ కుండలాలు పోనే పోయాయి. అసమాన శక్తివంతుడే. తన శక్తి అవసర సమయంలో ఉపయోగ పడదు అనే శాపం కూడా ఉన్నవాడు. నా మిత్రుడే. ప్రాణమిత్రుడే. యుద్ధంలో నా కేదో చేయబోతాడు!

(4) కృపాచార్యుడు :- అయోని సంభవుడు. ద్రోణుడికి బావమరిది. ద్రోణుడి లాగే మా అందరికీ గురువు. వాళ్ళకూ నేర్పాడు. మాకూ నేర్పాడు. మా సైన్యములో బండెక్కి ఉన్నాడు.

(5) అశ్వత్థామ :- ద్రోణుని కొడుకు. కృపునికి అల్లుడు. మహాకోపి. ఏదైనా చేయ గలడు. బ్రహ్మాస్త్ర ప్రయోగం కూడా చేసే శక్తి కలవాడు. కాని, దానిని ఉపసంహారము చేసే దెలాగో తెలియని వాడు. అర్జునుణ్ణి మించిపోతాడేమో నని తన తండ్రే ఆ రహస్యాన్ని చెప్పలేదు. అతడే అశ్వత్థామ. ప్రస్తుతం నా సైన్యం లోనే ఉన్నాడు.

(6) వికర్ణుడు :- మా తమ్ముడే. వందలో ఒకడు. మందలో చేరడు. ఉన్నట్లుండి నీతుల మూట విప్పుతాడు. ధర్మము - దయ అంటూ తెగ మాట్లాడుతాడు. ప్రస్తుతానికి మా వైపే ఉన్నాడు.

(7) సౌమదత్తి :- సోమదత్తుని కొడుకు. భూరిశ్రవుడు. కౌరవ పాండవు లిరువురికి పితృ సమానుడు. పాండవుల్ని జయించాలని శివుని ప్రార్థిస్తూ తపస్సు చేశాడు. శివుడు తృప్తి చెంది వరం ఇవ్వడానికి వచ్చాడు. శివుణ్ణి చూచి కూడా గర్వంతో ఊగిపోతూ లేచి నిలబడ లేదు. శివుడు క్రుద్ధుడై, యుద్ధంలో క్రూర మరణాన్ని పొందుతావు అని శాపం పెట్టి వెళ్ళాడు. ఆయనే ఇప్పుడు మా నాయకులలో ఒకడు.

(8) జయద్రథుడు :- పాఠాంతరంలో ఎనిమిదవ వాడు చేరితే, ఆయనే జయద్రథుడు. సైంధవుడు. మా చెల్లెలు దుస్సల మొగుడు. అతనికి అన్నీ బాగానే చూశాము. ఏ లోటు రానివ్వ లేదు.

సామాన్యుడు కాడు. అటు, ఇటుగా నా లక్షణాలు కలవాడే. పాండవుల ధర్మపత్ని ద్రౌపదిని అపహరించుకొని పోయాడు. భీముడు, అర్జునుడు వెంబడించి పట్టుకున్నారు. బావమరిది అని చంప లేదు గాని చంపినంత పని చేశారు.

ఆ తరువాత, పాండవులు ఏమి చేస్తారో అని భయం పట్టుకొంది. శివుణ్ణి గూర్చి చాలా కాలం తపస్సు కూడా చేశాడు. పాండవుల్ని కూడా జయించే వరాన్ని తపస్సు ద్వారా పొందాడు. కాని, అర్జునుణ్ణి చంపడం సాధ్యం కాదు అనే మెలిక కూడా ఆ వరంలో చోటు చేసుకొని ఉంది. ఆయన కూడా ప్రస్తుతం ధనుస్సు పట్టుకొని మా మధ్య లోనే ఉన్నాడు. నన్ను రక్షిస్తా నంటున్నాడు.

అందరి విషయంలో ఇలాంటి అందమైన భావాలే దుర్యోధన మహారాజు మనస్సులో ఉన్నాయి. అందరి పైనా అవిశ్వాసమే కనుక అనామధేయులపై అకుంఠిత విశ్వాసము. అంతా అయోమయం. ఆంబికేయం.

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।
పర్యాప్తం త్విద మేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥ 10

అపర్యాప్తం-తత్-అస్మాకం-బలం-భీష్మాభిరక్షితం
పర్యాప్తం-తు-ఇదం-ఏతేషాం-బలం-భీమాభిరక్షితం

భీష్మాభిరక్షితం	=	భీష్మునిచే రక్షితమైన	భీమాభిరక్షితం	=	భీమునిచే రక్షితమైన
తత్	=	అలాంటి	ఏతేషాం	=	వారి యొక్క
అస్మాకం	=	మన	ఇదం	=	ఈ
బలం	=	బలము	బలం తు	=	శక్తి అయితే
అపర్యాప్తం	=	అపారము	పర్యాప్తం	=	పరిమితము
తు	=	అయితే			

మన సైన్యము అపారము. దానిని భీష్ముడు రక్షిస్తున్నాడు. ఇక పాండవుల సైన్య మంటారా? అది చాలా పరిమితం. దానిని భీముడు కాపలా కాస్తున్నాడు.

వ్యాఖ్య

తన సైన్యము పదకొండు అక్షౌహిణులతో ఉంది. పాండవ సైన్యము ఏడు అక్షౌహిణులతో ఉంది. కనుక తన బలం అపర్యాప్తం. పాండవులది పర్యాప్తం. ఇకపోతే అపరిమిత మైన తన సైన్యానికి భీష్ముడు రక్షకుడు. పరిమితమైన పాండవుల సైన్యానికి భీముడు రక్షకుడు అనేది శ్లోకార్థం. సుస్పష్టం.

భీష్ముడు - భీముడు

తన సైన్యాన్ని రక్షించే వాడు సర్వసేనాధిపతి భీష్ముడు అనేది అర్థ మవుతూ ఉంది. పాండవ సైన్యాన్ని భీముడు రక్షిస్తున్నాడు అంటూ భీష్మునికి ప్రత్యర్థిగా భీముణ్ణి ఎందుకు ఎన్నుకున్నాడో అర్థం కావాలి.

భీముడు రాజు కనుక అతణ్ణి పేర్కొన్నాడు అనుకొందామా? లేదా, జ్యేష్ఠుడు కనుక భీముణ్ణి ఉదహరించినాడు అనుకుందామా? ప్రభువు, జ్యేష్ఠుడు - ఈ రెండూ ధర్మరాజే కాని భీముడు కాడు. అలా చూచి నపుడు ధర్మరాజు పేరు చెప్పాలి గాని భీముడి పేరు కాదు.

జ్యేష్ఠుడు కాకపోయినా, శ్రేష్ఠత్వము లేకపోయినా, భీష్ముని లాగా సర్వసేనాధిపతి కనుక భీముడి పేరును ఉదహరించాడు అని అనుకుందా మంటే, పాండవసేనకు సర్వసేనాధిపతి ధృష్టద్యుమ్నుడే గాని భీముడు కాదు.

పోనీ జ్యేష్ఠత్వము, శ్రేష్ఠత్వము, సర్వసేనాధిపత్యము లేకపోయినా, నానాస్త్ర కోవిదుడు, అద్భుత శస్త్రాస్త్ర నిపుణుడు భీముడు అని భావించాడా అంటే, అది కూడా సరి కాదు అనిపిస్తోంది. అలాంటి లక్షణాలు కలవాడు అర్జునుడే గాని భీముడు కాదు.

చివరగా, ప్రత్యేకతలు ప్రదర్శించక పోయినా, పరిపూర్ణతలో దేదీప్యమానంగా ప్రకాశించే పరమాత్మ స్వరూప మని భీముణ్ణి తలచినాడా? అలా చూచి నపుడు, అర్జునుని రథంలో మందహాసంతో శోభిస్తున్న శ్యామసుందరమూర్తిని చెప్పాలి.

అందరినీ ప్రక్కన బెట్టి, తనకు అసలే గిట్టని నిత్య శత్రువు హిడింబి మొగుణ్ణి మొగసాలలో నిలపడ మేమిటి? గాంధారీ నందనుడు ఏది పలికినా గందరగోళాన్నే సృష్టిస్తూ ఉంది.

ప్రతిజ్ఞలే ప్రతిభలు

కౌరవ సైన్యాన్ని రక్షించ వలసిన సర్వసేనాధిపతి భీష్మాచార్యుడు. కాని, యుద్ధంలో ఎందరి నైనా వధిస్తాను గాని పాండవులను మాత్రం సంహరించను అని భీష్ముడు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు.

ఇక భీముడు అంటారా! ధృతరాష్ట్రుని కొడుకు లందరినీ నేనే వధించి తీరుతాను అని ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు.

ఈ రెండూ దుర్యోధనుని మనస్సులో సాగర కెరటా ల్లాగా ఎగసి ఎగసి పడు తున్నాయి. అందుచేత భీష్మభీముల్ని ఉదహరించాడు. అలా భీతి చెందుతున్న సమయం లోనే తమ బలం అపరిమిత మని, పాండవుల బలం పరిమిత మని తాత్కాలిక ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. సైన్యం లాగే భీష్ముని కన్నా భీముడు పరిమితుడు అని కూడా తృప్తి చెందు తున్నాడు. ఎందుకంటే, భీష్మ శబ్దంలో భీముడు చిక్కిపోయే ఉన్నాడు. 'భీష్మ' - భీష్-మ. . . 'భీమ' అనే రెండు అక్షరాలను తొలగించినా, భీష్మునిలో 'ష' కారము మిగిలే ఉంది కదా! ఆ 'ష' కారాన్ని పట్టుకొని సంతోషంతో ఆంతర్యంలో షికారు చేస్తున్నాడు దుర్యోధనుడు.

మరో దారి మంచిది కాదు

ఈ శ్లోకం యొక్క భావార్థము స్పష్టం గానే తెలుస్తున్నా, దీనికి భిన్నంగా అర్థాన్ని సృష్టించారు చాలా కాలంగా చాలా మంది వ్యాఖ్యాతలు.

భీష్మాభి రక్షితం అస్మాకం తద్బలం అపర్యాప్తం

భీమాభి రక్షితం ఏతేషాం ఇదం బలం పర్యాప్తం - అని సూటిగా తెలుస్తూ ఉన్నా,

భీష్మాభి రక్షితం పర్యాప్తం

భీమాభి రక్షితం అపర్యాప్తం - అంటే, భీష్ముని చేత రక్షింప బడుతున్న కౌరవ బలము పరిమితము. భీముని చేత రక్షింప బడుతున్న పాండవ బలము అపరిమితము అనే అర్థాన్ని నేశారు. ఇదంతా సంస్కృత భాషా వైభవము.

అపర్యాప్తం అంటే, అపరిమితము అని ఒక అర్థము. దానినే *న + పర్యాప్తం* గా గ్రహిస్తే, సమర్థవంతము కాదని అర్థము. అంటే కౌరవ సైన్యం పాండవ సైన్యంతో సరితూగ లేదని భావము. అలాగే భీముని సైన్యము

పర్యాప్తం అన్నప్పుడు పరిమిత మైనది అనే గాక, గెలవడానికి *పర్యాప్తం*, అంటే సరిపోతుంది అని భావం. సమర్థవంతంగా ఉంది అని అర్థం. ఇలాంటివి నాలుకలపై నర్తించేందుకు బాగుంటాయి. మనస్సులలో నిలిచేందుకు సరిపోవు.

భారతాన్ని సమగ్రంగా అధ్యయనం చేసిన వారికి ఇవన్నీ చాలా చిన్న విషయాలుగా మూల పడి ఉంటాయి. యుద్ధానికి ముందే ఈ విషయాన్ని సుస్పష్టం చేస్తూ సంజయుణ్ణి దుర్యోధనుడు హెచ్చరిస్తాడు కూడా.

మాకు నక్షౌహిణులు పదనొకండు, వారికి నేడు. మా సైన్యంబు సారవంతంబు వారి బలంబు నిస్సారంబు - అని వ్యాసభారతాన్ని తెనిగిస్తూ తేటతెల్లం చేశాడు తిక్కన సోమయాజి. సారవంతము అంటే అపర్యాప్తం, నిస్సారము అంటే పర్యాప్తం. ఇక సందేహము ఏముంది? ఎక్కడుంది?

ఎంతో చెప్పావు. ఏదేదో చెప్పావు. ఇంతకీ నేను ఏమి చెయ్యాలి? అన్న ప్రశ్న ద్రోణుని కళ్ళల్లో చదివి ఉంటాడు దుర్యోధనుడు. అందుకని చెప్పబో తున్నాడు. మీరు ఏమీ చేయ నవసరం లేదు (ఎలాగూ చేయరని నాకు తెలుసు కనుక). అందరూ చేరి అసమాన పరాక్రమశాలి అయిన భీష్ముణ్ణి రక్షిస్తూ ఉండండి అంటాడు దుర్యోధనుడు.

భీష్ముడు సర్వసేనాధిపతి. గొప్ప యోధుడు. ఆయనను మేము రక్షించడ మేమిటి? తనను తాను రక్షించుకోలేని అసమర్థుడా? అని అనుకుంటారేమో కదా!

కాదు. కాదు. భీష్ముడు అసమర్థుడు కాదు. అతణ్ణి ఎవ్వరూ రక్షింప పనిలేదు. కాకపోతే, పాండవుల్ని వధించను అని శపథం చేశాడు కనుక, పాండవులే చెలరేగి భీష్ముణ్ణి చంపుతా రేమో అనే భయం. అందుకే అతణ్ణి రక్షించు కోవాలి. అతడు జీవించి ఉంటే విజయం తనదే అనేదే దుర్యోధనుని అభిమతం.

అయనేషు చ సర్వేషు యథాభాగ మవస్థితాః ।
భీష్మ మేవాభిరక్షన్తు భవన్తః సర్వ ఏవహి ॥ 11

అయనేషు-చ-సర్వేషు-యథాభాగం-అవస్థితాః
భీష్మం-ఏవ-అభిరక్షంతు-భవంతః-సర్వే-ఏవ-హి

భవంతః	=	మీరు	యథాభాగం	=	మీ మీ నియమిత స్థానముల యందు
సర్వే ఏవ	=	అందరు			
చ	=	అందువల్ల	అవస్థితాః	=	ఉండినవారై
సర్వేషు	=	అన్ని	భీష్మమేవ	=	భీష్మాచార్యుల వారిని
అయనేషు చ	=	స్థానాలలో	అభిరక్షంతు హి	=	చక్కగా రక్షింతురు గాక!

అన్ని చోట్ల మీరు ఉండ వలసిన స్థానాలను విడిచి పెట్టకుండా ఉండండి. అందరూ ఏకంగా భీష్ముణ్ణి రక్షించుకుంటూ ఉండాలి.

వ్యాఖ్య

దుర్యోధనుని గుండెల్లో ఒక వైపు నిరాశా గాలులు వీస్తున్నాయి. మరొక వైపు తన పక్షంలో నిలబడి పోరాడుతున్న నాయకుల మీద అనుమానపు నీడలు ప్రాకుతున్నాయి. ఈ దశలో ఒక్క భీష్ముని మీదే తన ఆశలన్నీ మూగి ఉన్నాయి. కనుకనే అందరూ కలసి భీష్ముణ్ణి రక్షించండి అని రాజుగా ఆజ్ఞాపిస్తున్నాడు దుర్యోధనుడు. భీష్ముని సమీపించే అవకాశం లేకుండా వ్యూహాన్ని నిర్మించి, ఆయా స్థానాలలో వీరుల్ని

కాపాడు కోవాలి అంటున్నాడు.
నియమించారు. అలా నియమిత స్థానాలను వీడకుండా ఉండి, భీష్మణ్ణి కాపాడు కోవాలి అంటున్నాడు.

ద్రోణాచార్యునికి సమీపం లోనే భీష్ముడు ఉన్నాడు. దుర్యోధనుని వ్యర్థ ప్రలాప మంతా పితామహునికి వినపడే ఉంటుంది. సమరారంభంలో ఇదొక అనారోగ్యకర మైన వాతావరణ మని భీష్ముడికి తెలుసు. వీరోత్సాహాన్ని ఇలాంటి సన్నివేశాలు నిస్సారంగా మారుస్తాయని కూడా తెలుసు.

దుర్యోధనుడు ఇంతగా ప్రేలుతున్నా, తిరిగి ఒక్క మాటైనా పలకని ద్రోణుని మౌనాన్ని భీష్ముడు అర్థం చేసుకోలేని వాడు కాడు. ఈ దారుణ సన్నివేశాన్ని ఇక కొనసాగించడం శ్రేయస్కరం కాదని భావించాడో ఏమో, పెద్దగా సింహనాదం చేసి శంఖారావం వినిపించాడు.

తస్య సంజనయ న్హర్షం కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చైః శఙ్ఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥ 12

తస్య-సంజనయన్-హర్షం-కురువృద్ధః-పితామహః
సింహనాదం-వినద్య-ఉచ్చైః-శంఖం-దధ్మౌ-ప్రతాపవాన్

తస్య	=	అతనికి	ఉచ్చైః	=	గట్టిగా
హర్షం	=	సంతోషము	సింహనాదం	=	సింహగర్జనము
సంజనయన్	=	కలిగిస్తూ	వినద్య	=	చేసి
ప్రతాపవాన్	=	ప్రతాపవంతుడు	శంఖం	=	శంఖమును
కురువృద్ధః	=	కురువృద్ధుడు	దధ్మౌ	=	పూరించాడు
పితామహః	=	పితామహుడు			

భీష్మ పితామహుడు కురువృద్ధుడు. పరాక్రమవంతుడు. దుర్యోధనునికి సంతోషాన్ని కలిగించాలని భావించాడు. అంతే. పెద్దగా సింహనాదం చేసి, శంఖాన్ని పూరించాడు.

వ్యాఖ్య

మాట పడింది - భావం లేచింది

అందరూ కలసి భీష్మణ్ణే రక్షించండి అని దుర్యోధనుడు పలికిన మాట భీష్ముల వారి చెవిన పడింది. పరశురాముని నిరసించి పోరాడిన తనను ఇతరులు రక్షించాలా? ఇక ఈ ఉన్మత్త ప్రలాపాన్ని ఆపాలని భావించాడో ఏమో, మాట పలక కుండా సింహగర్జన వంటి కేక వేసి శంఖాన్ని పూరించాడు భీష్ముడు.

తరగతి గదిలో విద్యార్థులు గోల చేస్తూ ఉంటే, ఉపాధ్యాయుడు బల్లను చరుస్తాడు. ఆ శబ్దానికి పిల్లలు నోళ్ళు కట్టేసు కుంటారు. దుర్యోధనా! ఇక పిల్లచేష్టలు, వ్యర్థ ప్రసంగాలు ఆపు! అని చెప్పకుండానే శంఖాన్ని పూరించి దుర్యోధనుని నోరు మూయించాడు భీష్ముడు.

దుర్యోధనుడు అసలు ఇలా ఎందుకు వాగుతున్నాడు? పాండవ సేనను చూచి భీతి చెందుతున్నాడు. భయ విహ్వలుడై, దిక్కు తోచక పూజార్హులను కూడా పరోక్షంగా తూలనాడు తున్నాడు. ఇతనికి ధైర్యం కావాలి. ఉత్సాహం కావాలి. నీరసించిన నాడీమండలం చైతన్యవంతం కావాలి అని భావించి శంఖాన్ని పూరించాడు భీష్ముడు.

ధృతరాష్ట్రకుమారా! దిగులు పడకు. అతులిత శౌర్య పరాక్రమాలు కలిగిన మేము నీ వైపు ఉన్నాం.

పాండవుల్ని మేము ఎదుర్కొంటాం. నువ్వు భీతి చెందకు, అని సంకేతాన్నిస్తూ, తమ శంఖనాదం ద్వారా దుర్యోధనునిలో ధైర్యోత్సాహాలను నింపే ప్రయత్నం చేశాడు భీష్ముడు.

సర్వ సేనాధిపతి భీష్మాచార్యుడు కౌరవ పక్షంలో నిలబడి, సింహనాదం చేసి శంఖాన్ని పూరించాడు. అంటే యుద్ధానికి శ్రీకారం చుట్టాడు అని అర్థం. పితామహుని పిలుపును అందుకొని, సేనలన్నీ వారి వారి నాదాలను వినిపిస్తూ సమ్మతిని తెలిపాయి. సిద్ధం అంటూ శబ్దంతో మారు పలికాయి.

తతః శఙ్ఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః ।
సహసై వాభ్యహన్యన్త స శబ్ద స్తుములోఽ భవత్ ॥ 13

తతః-శంఖాః-చ-భేర్యః-చ-పణవానక గోముఖాః
సహసా-ఏవ-అభ్యహన్యంత-సః-శబ్దః-తుములః-అభవత్

తతః	= తరువాత	అభ్యహన్యంత	=	మ్రోగింప బడ్డాయి
శంఖాశ్చ	= శంఖములు	స శబ్దః	=	ఆ శబ్దము
భేర్యశ్చ	= దుందుభులు	తుములః	=	భయంకరంగా
పణవానక గోముఖాః	=తప్పెటలు, రణభేరులు, బూరలు	అభవత్	=	వ్యాపించింది
సహసా+ఏవ	= ఒకేసారి			

ఆ తరువాత శంఖాలు, దుందుభులు, తప్పెట్లు, రణభేరులు, బూరలు ఒకేసారి మ్రోగాయి. ఆ శబ్దము చాలా భయంకరంగా ఉండింది.

వ్యాఖ్య

జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అయిన భీష్ముడు శంఖాన్ని పూరించ గానే కౌరవసేన లోని వారందరూ ఇక యుద్ధం ఆరంభ మైనట్లే నని భావించి, ఎవరికి వారుగా శబ్ద సంకేతాలను అందించారు.

భం భం అంటూ శంఖాలు ధ్వనించాయి. వారి పక్షం లోనే మరో వైపు నుండి ప్రతిధ్వనించాయి. దుందుభులు పెద్దగా మ్రోగాయి. తప్పెట్ల శబ్దాలు ఉరుముల మ్రోతల్లా ఉన్నాయి. మేఘ గర్జనంలా రణభేరులు దిక్కులు పిక్కటిల్లేలా వినిపించాయి. కర్ణభేరులను బ్రద్దలు చేస్తున్నట్లు బూరల శబ్దాలు చొచ్చుకు పోతున్నాయి.

భూమ్యాకాశాలు శబ్దమయంగా మారి పోయాయి. ఎటు చూచినా శబ్దాలే. ఏ వాయిద్యాలు లేని పదాతి దళాలు నోళ్ళ తోనే విచిత్రంగా అరుస్తూ వికృత ధ్వనులు వినిపించాయి.

కౌరవసేనలు ఇంతగా సంకుల సమరనాదాలు చేస్తూ ఉంటే, పాండవ సేనలు ఏమి చేశాయో! ఏమి చేస్తాయి? చర్యలు ఉన్నప్పుడు ప్రతిచర్యలు తప్పుతాయా? ధ్వనులు ఉన్నప్పుడు ప్రతిధ్వనులు లేకుండా ఉంటాయా? ఈ వైపు ఒకటి అంటే ఆ వైపు ఆరు అంటున్నారు. అదే కదా యుద్ధ మంటే. పాండవులు కూడా శంఖాలను పూరిస్తున్నారు. తరువాత శ్లోకం నుండి ఆరు శ్లోకాల వరకు ఆ నాదాలే. సునాదాలే.

తతః శ్వేతై ర్హయై ర్యుక్తే మహతి స్యన్దనే స్థితౌ ।
మాధవః పాణ్డవ శ్చైవ దివ్యౌ శఙ్ఖౌ ప్రదధ్మతుః ॥ 14

తతః-శ్వేతైః-హయైః-యుక్తే-మహతి-స్యందనే-స్థితౌ
మాధవః-పాండవః-చ-ఏవ-దివ్యౌ-శంఖౌ-ప్రదధ్మతుః

తతః	=	తరువాత	స్థితౌ	=	ఉన్న
శ్వేతైః	=	తెల్లని	మాధవః	=	శ్రీకృష్ణుడు
హయైః	=	గుఱ్ఱములతో	పాండవశ్చైవ	=	అర్జునుడూ
యుక్తే	=	కూడిన	దివ్యౌ	=	శ్రేష్ఠములైన
మహతి	=	ఉత్తమమైన	శంఖౌ	=	శంఖాలను
స్యందనే	=	రథము నందు	ప్రదధ్మతుః	=	పెద్దగా పూరించారు

ఇక, ఆ తరువాత, తెల్లని గుఱ్ఱాలు కట్టిన రథంలో శ్రీకృష్ణుడు, అర్జునుడు ఉన్నారు. వారిద్దరు ఎంతో శ్రేష్ఠమైన శంఖాలను పూరించారు.

వ్యాఖ్య

కౌరవసేన నుండి భయంకరంగా సమర నాదాలు మ్రోగాయి. మేమూ సిద్ధమే నంటూ, తెల్లని గుఱ్ఱాలు కట్టిన గొప్ప రథము మీద ఆసీనులైన శ్రీకృష్ణార్జునులు దివ్యము లైన శంఖాలను పూరించారు.

శుభమస్తు

శ్రీకృష్ణార్జునుల దర్శనమే శుభదర్శనం. వారి శకటమే శుభ శకటం. గొప్పదైన రథంలో ఉన్నారు అంటున్నాడు సంజయుడు ***(మహతి స్యందనే).*** యుద్ధభూమిలో ఎన్నో రథా లున్నాయి. ఇది అలాంటి సాధారణమైన రథం కాదు. ఖాండవ వనాన్ని దహించి నపుడు తృప్తి చెందిన అగ్నిదేవుడు ఆనందంతో ప్రసాదించిన సురలోక శకట మది.

ఆ రథానికి పూన్చిన గుఱ్ఱాలు కూడా సామాన్య మైనవి కావు. దేవ లోకమునకు సంబంధించినవి. అట్టి రథంలో ఉన్న శ్రీకృష్ణార్జునులు మ్రోగించిన శంఖములు కూడా మామూలు శంఖాలు కావు. ఓంకారంతో ధ్వనించే దేవతా శంఖములు. కనుకనే వాటి ధ్వని ప్రత్యేకంగా వినిపించింది. ఈ కారణం చేతనే **'దధ్మతుః'** అనకుండా 'ప్ర' అనే ఉపసర్గను చేర్చి **'ప్రదధ్మతుః'** అంటూ ధ్వని విశేషాన్ని శ్లాఘించాడు సంజయుడు.

అంతా ప్రత్యేకతే. అన్నీ ప్రత్యేకతలే. ఈ ప్రత్యేకతలలో ఉన్న దంతా దివ్యమైన ప్రభావమే. తెల్లని గుఱ్ఱాలు కట్టిన దేవతా రథము కనుక అన్నిటి కన్నా ప్రత్యేకంగా, దివ్యంగా శోభిస్తూ ఉంది. తెల్లదనము శాంతికి చిహ్నాము. అపజయాలు, అవరోధాలు ఉన్న చోట శాంతి ఉండదు. కనుక తెల్లదనము విజయ చిహ్నాము.

విజయోస్తు

శ్రీకృష్ణార్జునులు ఉన్న రథము, ఆ రథానికి కట్టిన గుఱ్ఱాలు, వారు మ్రోగించిన శంఖాలు అన్నిటిని విశేషణాలతో సంజయుడు వైభవోపేతంగా వర్ణించాడు. ఈ వర్ణన లోనే వివరణ లన్నీ ఉన్నాయి. అన్నీ విజయ చిహ్నాలే. ఇవన్నీ వినిన తరువాత ధృతరాష్ట్రుడు మనస్సు మార్చుకుంటా డని, సంధి చేసుకోమని దుర్యోధనునికి ఆజ్ఞ లిస్తాడని సంజయుడు ఊహిస్తున్నాడు. ఆశిస్తున్నాడు. అలా జరిగితే, ఇరుపక్షాలకు విజయమే. లేదా, విజయము ఏకపక్షం గానే ఉంటుంది. ఆ పక్షము ఎవరిది? అనే సంశయానికి ఇక తావు లేదు. ఆ వివరణమే ఈ వర్ణనము. తనకు విజయమో! వినాశమో! ధృతరాష్ట్రుడే నిర్ణయించుకోవాలి.

ఇలా పలికి పాండవ సైన్యంలో ఎవరెవరు ఏయే నాదాలు వినిపించారో, ఏయే శంఖాలు పూరించారో విపులంగా వివరిస్తున్నాడు సంజయుడు.

పాఞ్చజన్యం హృషీకేశో దేవదత్తం ధనఞ్జయః ।
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 15

పాంచజన్యం-హృషీకేశః-దేవదత్తం-ధనంజయః
పౌండ్రం-దధ్మౌ-మహాశంఖం-భీమకర్మా-వృకోదరః

హృషీకేశః	=	శ్రీకృష్ణుడు	వృకోదరః	=	భీముడు
పాంచజన్యం	=	పాంచజన్యమును	పౌండ్రం	=	పౌండ్రమనే
ధనంజయః	=	అర్జునుడు	మహాశంఖం	=	గొప్ప శంఖమును
దేవదత్తం	=	దేవదత్తమును	దధ్మౌ	=	పూరించారు
భీమకర్మా	=	భయంకరమైన పనులు చేసే			

శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. అర్జునుడు దేవదత్తాన్ని ఊదాడు. ఇక భీకర కృత్యాలు చేసే భీముడు మాత్రం, పౌండ్రం అనే గొప్ప శంఖాన్ని మ్రోగించాడు.

వ్యాఖ్య

దైవ సన్నిధి

కౌరవ పక్షంలో ప్రథమంగా భీష్ముడు శంఖాన్ని పూరించాడు. కాని, పాండవుల పక్షంలో ప్రథమంగా శ్రీకృష్ణ భగవానుడు పూరించాడు. సర్వ సేనాధిపతిగా ఆ వైపు భీష్ముడు మ్రోగించి నపుడు ఈ వైపు ధృష్టద్యుమ్నుడు మ్రోగించాలి. కాని, యుద్ధము చేయను అని ద్వారక లోనే దుర్యోధ నార్జునులకు ప్రతిజ్ఞ చేసిన శ్రీకృష్ణుడు యుద్ధంలో శంఖాన్ని పూరించాడు.

కౌరవుల సైన్యము వీరుల పరిరక్షణలో ఉంది. పాండవ సైన్యము దైవానుగ్రహంతో నడుస్తుంది అని దీని అర్థము. పాండవ పక్షానికి అధ్యక్ష స్థానంలో అచ్యుతుడు ఉన్నాడు. ఇక వారికి నశింపు లేదు అని భావము.

పరమేశ్వరుడు పూరించిన శంఖము పేరు పాంచజన్యము. శ్రీకృష్ణుడు తన గురుపుత్రుని అపహరించిన పంచజనుడు అనే రాక్షసుని సంహరించి, అతని ఎముకతో శంఖమును తయారు చేసుకోవడం చేత ఆ శంఖానికి పాంచజన్యము అనే పేరు వచ్చింది.

శంఖము శల్యమే

శంఖము అనేది ఒక ప్రాణి. అది జలచరము. చేప లాగా నీటిలో ఉంటుంది. మనకు మాంసము, ఎముకలు దేహం లోపల ఉంటాయి. పైన చర్మము ఉంటుంది. శంఖమునకు అలా కాదు. బయట ఎముక ఉండి లోపల మాంసము ఉంటుంది. కనుకనే శంఖంలో ప్రాణి ఉన్నప్పుడు నీళ్ళల్లో శంఖము కదులుతూ ఉండటాన్ని కూడా మనం చూడగలం.

సముద్రంలో పంచజనుడు అనే రాక్షసుని ఎముక నుండి గ్రహించుట చేత శ్రీకృష్ణుని శంఖమునకు పాంచజన్యము అనే పేరు వచ్చింది.

శంఖాస్థి పావనం అపావన మస్థిమాణాం

శంఖము యొక్క ఎముక చాలా పవిత్రము. ఇతర ప్రాణుల ఎముకలను మనం అపవిత్రంగా భావిస్తాము. శంఖము యొక్క ఎముక పవిత్రము కాబట్టే మనం లింగాభిషేకాన్ని శంఖము తోనే నిర్వహిస్తాము. ఒక పురుగు లేదా ప్రాణి యొక్క శల్యము పూజోపకరణంగా మారిపోయింది. ఎంత అద్భుతం!

శ్రీకృష్ణ పరమాత్మ పాంచజన్యాన్ని పూరించాడు. అది మామూలు శబ్దము కాదు. గీతాఘోషము. హృషీకములు అంటే ఇంద్రియాలు. వాటికి ప్రభువు కనుక శ్రీకృష్ణుడు హృషీకేశుడు. అట్టి శ్రీకృష్ణుడు పాండవుల వైపు ఉన్నాడు. కనుక కౌరవుల శక్తి సామర్థ్యాలు పాండవుల ముందు పని చేయవు అనేది సంజయుని అభిప్రాయం. యుద్ధం మానుకోమని ధృతరాష్ట్రునికి సంకేతం.

శ్రీకృష్ణదేవుని ఈ శ్లోకంలో హృషీకేశుడని పలికిన సంజయుడు ముందు శ్లోకంలో మాధవుడని అన్నాడు. మాధవుడు అంటే లక్ష్మీపతి అని అర్థము. 'మా' అంటే లక్ష్మీదేవి. ఆమెకు 'ధవుడు' అనగా భర్త కనుక మాధవుడు ***(మాయాః శ్రియః ధనః పతిః మాధవః).*** ఇక్కడ లక్ష్మీదేవి అంటే ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి అని అర్థం కాదు. జయలక్ష్మి, విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి అని అర్థము. విజయలక్ష్మి భర్త పాండవుల వైపు ఉన్నాడు కనుక విజయము వారిదే, ఇక నీ ఇష్టం, అని ధృతరాష్ట్రుని సూక్ష్మంగా హెచ్చరిస్తున్నాడు సంజయుడు.

దైవ ప్రసాదం

శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరిస్తే, అర్జునుడు దేవదత్తాన్ని మ్రోగించాడు. దేవాసుర సంగ్రామంలో రాక్షసులలో పోరాడి విశేషంగా వారిని అర్జునుడు సంహరించి నపుడు అచ్చెరు వొందిన దేవతలు ఆనందంతో అనుగ్రహించిన శంఖమే దేవదత్తము. కనుక అర్జునుని శంఖారావము సాధారణ శంఖధ్వని కాకుండా అలౌకిక నాదాన్ని వినిపిస్తూ ఉంటుంది.

అర్జునాచ్యుతులు నరనారాయణులే అని మనకు తెలుసు. అర్జునుడు నరుడు. నరుడికి దేవతలు ప్రసాదించింది కనుక పార్థుని శంఖము దేవదత్తము. వాస్తవానికి ఒక్క నరుడికే కాదు, అర్జునుడికే కాదు, నరులందరికీ, సమస్త మానవాళికి దేవదత్త మనే శంఖము ప్రసాదించ బడింది. దానిని వినియోగించుకొనే సామర్థ్యం ఉంటే ప్రతి ఒక్కరు అలౌకిక నాదాలను ఆలకించ వచ్చు. ఆనంద స్వరాలను ఆస్వాదించ వచ్చు. సృష్టిలో ఏ ప్రాణికి దక్కని ఈ భాగ్యాన్ని భగవంతుడు నరులకే ప్రసాదించాడు. అందుకే అది దేవదత్తం.

మానవుని కంఠమే దేవదత్తం. పశుపక్ష్యాదులకు కంఠాలు ఉన్నాయి. అవి అరుపులకు పనికొస్తాయి. అక్షరాన్ని పలికేందుకు ఉపకరించవు. అనంతుని నామమే అక్షరం. దివ్యాక్షరం. వేద నాదమే అక్షరం. వేదవాణి అక్షరం. ఇవన్నీ పలికేందుకు, పాడేందుకు సహకరించే కంఠ మనే శంఖము దైవ ప్రసాదం. దేవదత్తం. పలికే వారికి భగవంతుడు పలుకుతాడు. పిలిచే వారికి భగవంతుడు పలుకుతాడు. నారదుడికి పలికాడు. ప్రహ్లాదునికి పలికాడు. మీరాబాయికి పలికాడు. త్యాగరాజుకు పలికాడు. దేవదత్తాన్ని మ్రోగించే వాళ్ళు ఎవరైనా కృష్ణ ప్రియులే. కృష్ణ సఖులే. అర్జునులే.

జగతి కొలనులో వెలుగు చున్నది
కమల లోచనుని చరణ కమలము *
ఆడవే పాడవే అందాల తుమ్మెద
సుధలు గ్రోలి నిండును నీ యెద
పాడవే తుమ్మెద కృష్ణుని మీద
ఆడవే పాడవే హాయిగా తీయగా   *॥ పాడవే ॥*

అని దేవదత్తాన్ని పూరించే ప్రయత్నం చేసింది చైతన్య గీతిక.

దేవదత్తాన్ని పూరించిన అర్జునుని ధనంజయుడు అంటున్నాడు సంజయుడు. రాజసూయ యాగ సమయంలో రాజ్యాలను, రాజ్యాధిపతులను జయించి ధనరాశుల్ని తెచ్చి నందున అర్జునుడు ధనంజయు డని మహాభారతంలో వ్యాసుని మాట. అంటే ధనం అర్జునుని ముందు ఓడి పోయిందని భావము. దైవానికే

* పాదోఽస్య విశ్వాభూతాని - పురుషసూక్తము.

గాని ధనానికి పీట వేయని పార్థుడు ధనంజయుడు. అందుకే దైవాన్ని తన బండి లోనే కూర్చోబెట్టు కున్నాడు విజయుడు.

ఇక్కడ ధనంజయుడు అనే సంబోధనముతో మరొక సంకేతాన్ని కూడా ధృతరాష్ట్రునికి ఇచ్చాడు సంజయుడు. అర్జునుడు ధనం కోసం యుద్ధం చెయ్యడం లేదు. ధర్మం కోసం యుద్ధం చేస్తున్నాడు. ధర్మ రూపంలో ఉన్న దైవం ప్రక్కనే ఉన్నాడు. విజయము వాళ్ళనే వరించి తీరుతుంది. కనుక, సంధికి ఇంకా సమయం దాటి పోలేదు. ఇక నైనా మేలుకో అని పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

అంతేకాదు. ఈ శ్లోకంలో అర్జునుని ధనంజయు డని పేర్కొనిన సంజయుడు ముందు శ్లోకంలో పాండవః అన్నాడు. అంటే, పాండురాజు కుమారుడు అని అర్థము. రాజ్యము పాండురాజుదే కనుక, ఏ విధంగా చూచినా రాజ్యము పాండవులదే అని మర్మంగా భాషించాడు కూడా.

భీమం - భీకరం

భయంకరమైన కార్యాలు చేసే భీముడు పౌండ్రము అనే గొప్ప శంఖాన్ని పూరించాడు. వృకము అనే అగ్నిని కుక్షిలో కలిగి ఉన్నాడు కనుక భీమునికి వృకోదరుడు అనే పేరు వచ్చింది. ఎంత ఆహారా న్నైనా జీర్ణించుకొనే శక్తి భీమునికి ఉంది. అలాగే యుద్ధంలో ఎందరి నైనా మట్టుపెట్టే సామర్థ్యం కూడా ఉంది. భయంకరమైన కర్మలు చేసే భీమసేనుడు పౌండ్ర మనే శంఖాన్ని భీకరంగా ఊదాడు. పాండవులలో మిగిలిన ముగ్గురు సోదరులు ఏయే శంఖాలను పూరించారో తరువాత శ్లోకంలో చెబుతున్నాడు సంజయుడు.

అనంత విజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।
నకులః సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ ॥ 16

అనంతవిజయం-రాజా-కుంతీ పుత్రః-యుధిష్ఠిరః
నకులః-సహదేవః-చ-సుఘోష మణిపుష్పకౌ

కుంతీపుత్రః	=	కుంతీపుత్రుడు	నకులః	=	నకులుడు
రాజా	=	రాజైన	సహదేవశ్చ	=	సహదేవుడు
యుధిష్ఠిరః	=	ధర్మరాజు	సుఘోష మణిపుష్పకౌ	=	సుఘోష మణిపుష్పకము అనే శంఖాలను
అనంత విజయం	=	అనంత విజయమును			

కుంతీపుత్రుడు, మహారాజైన యుధిష్ఠిరుడు, అనంత విజయ మనే శంఖాన్ని పూరిస్తే, నకులుడు సుఘోషాన్ని, సహదేవుడు మణిపుష్పకాన్ని పూరించారు.

వ్యాఖ్య

అనంతం

ధర్మరాజు అనంత విజయము అనే శంఖాన్ని పూరించాడు. అనంత విజయం అంటే సదా విజయమును దర్శించు వాడు అని అర్థము. ధర్మరాజును ప్రత్యేకంగా రాజు అని సంజయుడు సంబోధించడం గమనార్హం.

ప్రస్తుతం రాజ్యానికి రాజు దుర్యోధనుడే గాని ధర్మరాజు కాడు. దుర్యోధనుడు రాజ్యాన్ని మోసంతో చేజిక్కించుకున్నా, వాస్తవానికి ధర్మరాజే రాజు అని సంజయుడు ధర్మవచనాన్ని వినిపిస్తున్నాడు. అంతే కాదు. అనంత విజయము అనే శంఖాన్ని పూరించిన యుధిష్ఠిరుడు కురుక్షేత్రంలో విజయాన్ని సాధించి, రాజుగా సింహాసనాన్ని అధిష్ఠించేది తథ్యం అనేది కూడా సంజయుని మాటల్లో దోబూచు లాడుతోంది.

సుఘోషం

నకులుడు సుఘోషము అనే శంఖాన్ని పూరించాడు. సుఘోషము అంటే ఇంపైన శబ్దము. శ్రావ్యమైన శబ్దము. మంగళకరమైన ధ్వని. ధర్మరాజు అనంత విజయాన్ని ఊది విజయ కేతనాన్ని ఎగుర వేయడం ఖాయం అని సూచిస్తే, ఆ తరువాత మంగళ నాదాలతో ధర్మరాజు సింహాసనాన్ని అధిష్ఠించడం అక్షర సత్యం అని సుఘోషం ద్వారా నకులుడు చెప్పకనే చెబుతున్నాడు.

మణిపుష్పకం

సహదేవుడు మణిపుష్పకం అనే శంఖాన్ని పూరించాడు. ధర్మరాజు అనంత విజయాన్ని పూరించేశాడు. విజయ సూచకంగా నకులుడు సుఘోషాన్ని వినిపించాడు. మణిమయ నవరత్న ఖచిత సింహాసనం పై ధర్మరాజు ఆసీనుడు కావడం ఒక్కటే మిగిలి ఉంది. అది కూడా జరిగి తీరుతుంది అనే సంకేతాన్నిస్తూ సహదేవుడు మణిపుష్పకాన్ని పూరించాడు.

విజయ సూచకం

ఐదుగురు పాండవ సోదరులు దివ్యములైన ఐదు శంఖాలను పూరించారు. అన్నీ విజయ సూచకంగా, మంగళకరంగా వినిపించాయి. శంఖాలు ఐదు వినిపించినా విజయం ఒక్కటే అన్నట్లుగా ఉంది ఆ ఘోష. పైగా ఆ రోజు ఏకాదశి.

దివ్య నామాలతో శోభించే పాండవుల శంఖాలు శ్వేతవర్ణంతో పవిత్రంగా ప్రకాశిస్తున్నాయి. **పాండవాః** అంటే హంస రెక్కల వలె తెల్లగా ఉండే వారు, స్వచ్ఛమైన వారు అని అర్థము. ఇదంతా విజయ సూచకమే.

పాండవులకు ముందుగానే కౌరవులు శంఖములను పూరించారు. కాని, ఒక్క శంఖమున కైనా పేరు ఉన్నట్లు వినలేదు. అవి ప్రఖ్యాతికి నోచుకోని శంఖాలు. పాండవుల శంఖాలకు పేరు ప్రఖ్యాతు లున్నాయి. అంటే, ప్రసిద్ధమైన వని భావం. పంచ పాండవులతో పాటు పాండవ పక్షాన ఇంకా ఎవరెవరు శంఖాలను పూరించారో చెబుతున్నాడు సంజయుడు.

కాశ్యశ్చ పరమేష్వాసః శిఖణ్డీ చ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః ॥ 17

కాశ్యః-చ-పరమేష్వాసః-శిఖండీ-చ-మహారథః
ధృష్టద్యుమ్నః-విరాటః-చ-సాత్యకిః-చ-అపరాజితః

పరమేష్వాసః	=	శ్రేష్ఠమైన విల్లు గల	ధృష్టద్యుమ్నః	=	ధృష్టద్యుమ్నుడును
కాశ్యశ్చ	=	కాశీరాజు	విరాటః చ	=	విరాటుడును
మహారథః	=	మహారథుడైన	అపరాజితః	=	పరాజయ మెరుగని
శిఖండీ చ	=	శిఖండియు	సాత్యకిః చ	=	సాత్యకియును

గొప్ప ధనుస్సును పట్టుకొని కాశీరాజు, మహారథుడు శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, పరాజయం తెలియని సాత్యకి - ఇంకా,

వ్యాఖ్య

మహా ధనుర్ధారి కాశీరాజు, మహారథు డైన శిఖండి, సర్వసేనాధిపతి ధృష్టద్యుమ్నుడు, విరాటరాజు, పరాజయ మెరుగని కృష్ణుని సోదరుడు సాత్యకి వారి వారి శంఖాలను మ్రోగించారు.

ఈ శ్లోకంలో కూడా చివరగా అపజయము లేదు అనే మాటను వినిపిస్తున్నాడు సంజయుడు. యుద్ధమును మొదట నుండి వ్యతిరేకిస్తున్న సంజయుడు అనుక్షణము ఆ ప్రయత్నం లోనే ఉన్నట్లు కనిపిస్తోంది.

కౌరవుల విజయం భీష్మద్రోణుల మీదే ఆధారపడి ఉంది. కాని, కేవలం వారిద్దరిని సంహారించ డానికే జన్మించిన వీరులు ఇద్దరు ఈ శ్లోకం లోనే ఒదిగి పోయారు. భీష్ముని పాలిట మృత్యువుగా శిఖండి, ద్రోణుని పాలిట కాలుడుగా ధృష్టద్యుమ్నుడు కనిపిస్తూనే ఉన్నారు. అందుచేత కూడా పాండవులు అపరాజితులు. పాండవ సేనలో శంఖనాదం చేసిన వీరులను తరువాత శ్లోకంలో కూడా చెప్పి, అక్కడికి ఆపుతున్నాడు.

ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।
సౌభద్రశ్చ మహాబాహుః శఙ్ఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ॥ 18

ద్రుపదః-ద్రౌపదేయాః-చ-సర్వశః-పృథివీపతే
సౌభద్రః-చ-మహాబాహుః-శంఖాన్-దధ్ముః-పృథక్-పృథక్

పృథివీపతే	=	హే భూపతీ!	సర్వశః	=	అంతట
ద్రుపదః	=	ద్రుపదుడు	పృథక్ పృథక్	=	వేరు వేరుగా
ద్రౌపదేయాః చ	=	ద్రౌపది కుమారులు	శంఖాన్	=	శంఖములను
మహాబాహుః	=	గొప్ప భుజములు గల	దధ్ముః	=	పూరించారు
సౌభద్రః చ	=	సుభద్ర కొడుకు అభిమన్యుడు			

హే ధృతరాష్ట్ర మహారాజా! ద్రుపదరాజు, ద్రౌపది కొడుకులు, గొప్ప బాహువులతో శోభిస్తూ సుభద్ర కొడుకు అభిమన్యుడు - అందరూ అంతట ఎవరికి వారుగా శంఖాలను పూరించారు.

వ్యాఖ్య

క్రమం - సక్రమం

ద్రుపదరాజు, ద్రౌపది కుమారులు (ఉప పాండవులు ఐదు మంది), గొప్ప బాహువులు కలిగిన సుభద్ర కుమారుడు అభిమన్యుడు, వీరందరూ శంఖాలను పూరించారు. కాని పాండవ పక్షం లోని వీరులు పూరించిన శంఖాలన్నీ వేరు వేరుగా ధ్వనించాయి (*పృథక్ పృథక్*) అంటున్నాడు సంజయుడు.

కౌరవులు పూరించి నపుడు నేటి చట్టసభల్లో ప్రజా ప్రతినిధు లందరూ మూకుమ్మడిగా లేచి, ఒకేసారి అర్థం కాకుండా అరచినట్లు ఉంటే, పాండవులు పూరించిన శంఖాలు ఒక దాని తరువాత ఒకటిగా సునాద భరితంగా, పూర్వపు రోజుల్లో క్రమశిక్షణ కలిగిన నాయకులు చట్టసభల్లో ఒకరి తరువాత ఒకరు భావగర్భితంగా ప్రసంగించినట్లు ఉన్నాయని అర్థము.

కౌరవుల క్రమశిక్షణా రాహిత్యానికి, పాండవుల క్రమశిక్షణకు ఈ శంఖారావాల లోని వ్యత్యాసాలే అద్దం పడుతున్నాయి.

ఈ శ్లోకంలో ధృతరాష్ట్రుని పృథివీపతీ! అని సంజయుడు సంబోధించడం వాస్తవానికి విశేషమే. ప్రస్తుతం నీవు భూపతివి. పాండవుల భూమిని వారికి పంచి ఇచ్చి నట్లైతే, ఈ భీకర పోరాటము ఉండేది కాదు. కాని, నీవే పృథివీపతిగా శోభించా లనుకున్నావు. ఇక ఆ స్థానము ఉండబోదు. నీకు రాజ్యం మిగలదు. నీవు రాజుగా ఉండలేవు. అందుకే చివరి సారి పృథివీపతీ! అని పిలుస్తున్నా. కళ్ళు ఎలాగూ తెరువలేవు. మనస్సు నైనా తెరచి చూడు. వాళ్ళ రాజ్యాన్ని వాళ్ళకు అప్పగించడం క్రమం. సక్రమం. లేదా, అంతా అక్రమమే. అధర్మమే. ఇది, సంజయుని పిలుపు లోని అంతర్భావం.

ఇంతవరకు పాండవుల శంఖనాదాలను వినిపించిన సంజయుడు, వాటి ప్రభావము ఎలా ఉందో చెబుతున్నాడు.

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥ 19

సః-ఘోషః-ధార్తరాష్ట్రాణాం-హృదయాని-వ్యదారయత్
నభః-చ-పృథివీం-చ-ఏవ-తుములః-వ్యనునాదయన్

తుములః = భయంకరమైన
సః ఘోషః = ఆ శబ్దము
నభః చ = ఆకాశమును
పృథివీం చ ఏవ= భూమిని కూడా
వ్యనునాదయన్ = మారు పలికిస్తూ
ధార్తరాష్ట్రాణాం = ధృతరాష్ట్రుని బిడ్డల
హృదయాని = గుండెలను
వ్యదారయత్ = చీల్చి వేసింది

పాండవులు భయంకరంగా శంఖాల్ని పూరించారు. ఆ శబ్దాలు భూమ్యాకాశాలను ప్రతిధ్వనింప చేశాయి. ధృతరాష్ట్రుని బిడ్డల గుండెల్లో దడ పుట్టించాయి.

వ్యాఖ్య

పాండవ సైన్యము చేసిన శంఖనాదాలు భూమ్యాకాశాలను ప్రతిధ్వనింప చేశాయి. దారుణమైన ఆ సంకుల శంఖ ధ్వనికి దుర్యోధనాదుల గుండెలు జారి పోయాయి.

అంతకన్నా ముందే కౌరవులు శంఖనాదాలు వినిపించడం మనం చూశాం. ఆ శబ్దాలకు పాండవులు చలించ లేదు. కాని, పాండవుల భయంకర మైన శంఖ నాదాలకు కౌరవుల హృదయాలు బ్రద్ద లైనట్లు వింటున్నాం.

హృదయ విదారకమైన ఈ పరిస్థితికి పాండవుల వీర్య శౌర్యాలు, దివ్యములైన శంఖములు వినిపించిన భీకర ధ్వనులు ఒక కారణ మైతే, కౌరవులలో దోష స్పృహతో కూడిన ఆంతరంగిక సంఘర్షణ మరొక కారణము.

పాండవుల శంఖనాదాలకు కౌరవులలో అధైర్యం చోటు చేసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తూ ఉంది. కాని, కౌరవుల శంఖనాదాలకు పాండవులు భీతి చెందక పోగా, రెట్టించిన ధైర్యోత్సాహాలతో ప్రతిస్పందనను వినిపించారు.

కౌరవుల భయానికి వారి అధర్మ వర్తనమే కారణము. పాండవుల ధైర్యానికి వారి ధర్మవర్తనము, గతంలో ఆర్జించిన పుణ్యమే కారణము.

అథ వ్యవస్థితా న్దృష్ట్వా ధార్తరాష్ట్రా న్కపిధ్వజః ।
ప్రవృత్తే శస్త్రసమ్పాతే ధను రుద్యమ్య పాణ్డవః ॥ 20
హృషీకేశం తదా వాక్య మిదమాహ మహీపతే ।

అథ-వ్యవస్థితాన్-దృష్ట్వా-ధార్తరాష్ట్రాన్-కపిధ్వజః
ప్రవృత్తే-శస్త్రసంపాతే-ధనుః-ఉద్యమ్య-పాండవః
హృషీకేశం-తదా-వాక్యం-ఇదం-ఆహ-మహీపతే

అథ = తరువాత
మహీపతే = ఓ భూపతీ!
శస్త్రసంపాతే = ఆయుధ ప్రయోగము
ప్రవృత్తే = జరుగ బోతుండగా
కపిధ్వజః = పతాకము నందు కపిరాజు గల
పాండవః = పాండు కుమారుడు
వ్యవస్థితాన్ = సిద్ధంగా ఉన్న
ధార్తరాష్ట్రాన్ = ధృతరాష్ట్రుని బిడ్డల్ని
దృష్ట్వా = చూచి
ధనుః = వింటిని
ఉద్యమ్య = ఎత్తి పట్టుకొని
తదా = అప్పుడు
హృషీకేశం = శ్రీకృష్ణునితో
ఇదం = ఈ
వాక్యం = మాటను
ఆహ = పలికాడు

ధృతరాష్ట్ర మహారాజా! ఆయుధ ప్రయోగానికి సమయం ఆసన్నమైంది. జండా పై కపిరాజును పెట్టుకున్న అర్జునుడు నీ కొడుకుల్ని చూశాడు. ధనుస్సును పైకెత్తి కృష్ణుడితో చెబుతున్నాడు.

వ్యాఖ్య

శస్త్రాస్త్ర ప్రయోగానికి సమయం ఆసన్న మైంది. జండాపై కపిరాజును కలిగిన అర్జునుడు దుర్యోధనాదుల్ని చూశాడు. గాండీవాన్ని ఎత్తి పట్టుకున్నాడు. ఏదో చెప్పాలని శ్రీకృష్ణుని వైపు చూశాడు.

రణరంగంలో అందరి రథాలకు పతాకాలు ఉంటాయి. కొందరివి ప్రత్యేక చిహ్నాలతో ఉంటాయి. అర్జునుని రథానికి అమర్చిన పతాకంపై కపీశుడు హనుమంతుడు ఉన్నాడు.

మహాభారతము - అరణ్యపర్వములో గంధమాదన పర్వత ప్రదేశము గుండా సౌగంధికా వనం వైపు సాగి పోతున్న భీమసేనుడికి హనుమంతుడు దర్శన మిచ్చి, కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుని రథముపై రెపరెప లాడే ధ్వజముపై తాను ఉంటాడని మాట ఇచ్చాడు. అలాగే ఇప్పుడు అర్జునుని స్యందన ధ్వజంపై ఆంజనేయుడు శోభిస్తున్నాడు.

అర్జున ఉవాచ :

సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥ 21
యావ దేతా న్నిరీక్షేఽహం యోద్ధుకామా నవస్థితాన్ ।
కైర్మయా సహ యోద్ధవ్య మస్మి న్రణ సముద్యమే ॥ 22

సేనయోః-ఉభయోః-మధ్యే-రథం-స్థాపయ-మే-అచ్యుత
యావత్-ఏతాన్-నిరీక్షే-అహం-యోద్ధుకామాన్-అవస్థితాన్
కైః-మయా-సహ-యోద్ధవ్యం-అస్మిన్-రణసముద్యమే

అచ్యుత = శ్రీకృష్ణా!
ఉభయోః = రెండు
సేనయోః = సేనల
మధ్యే = నడుమ
మే = నా యొక్క
రథం = రథమును
స్థాపయ = ఉంచు
అస్మిన్ = ఈ
రణసముద్యమే = యుద్ధ సమయాన
మయా = నా చేత
కైః+సహ = ఎవరితో
యోద్ధవ్యం = యుద్ధము చేయాలో
యోద్ధుకామాన్ = సమరవాంఛ గల
అవస్థితాన్ = ఉన్న

ఏతాన్	= వీళ్ళను	యావత్ నిరీక్షే	= ఎక్కడ నుండి చూడగలనో
అహం	= నేను		

అర్జునుడు అంటున్నాడు :

కృష్ణా! నా రథాన్ని నడిపించు. రెండు సేనల మధ్యన ఉంచు. నే నెవరితో యుద్ధం చేయాలి? యుద్ధానికి ఎవరెవరు సిద్ధంగా ఉన్నారు? వాళ్ళను నేను చూచేటట్లు నా రథాన్ని ఉంచు.

వ్యాఖ్య

మహాభారత యుద్ధము ప్రారంభమయ్యే సమయం సమీపించింది. మహాభారతానికి ముందు ఎన్నో యుద్ధాలు జరిగాయి. కాని మహాభారతము లాంటి యుద్ధము మును పెన్నడూ జరగ లేదు. అందుకే అది మహా సంగ్రామము.

ఉభయ సైన్యాలు సమరానికి సిద్ధంగా ఉన్నాయి. ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. అశ్వములు సకిలిస్తున్నాయి. అంతా కోలాహలం. రథాశ్వముల డెక్కల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. యావద్భారతం లోని రాజు లందరూ యుద్ధభూమిలో ఏదో ఒక పక్షాన నిలబడి ఉన్నారు.

ఏ క్షణం కొరకు అర్జునుడు నిరీక్షించాడో ఆ క్షణం రానే వచ్చింది. ఒక దారుణ బీభత్స సన్నివేశానికి తెర లేవబోతోంది. దుర్యోధనుని దుర్మార్గ కృత్యాలతో విసిగి పోయిన పాండవులు ధర్మానికి పట్టాభిషేకం చేసేందుకు కురుక్షేత్రంలో ఆయుధాలతో నిలబడ్డారు.

కృష్ణా! నా రథాన్ని ఉభయ సేనల మధ్య ఉంచు అన్నాడు అర్జునుడు. తాను ఎవరితో యుద్ధం చేయాలో వారిని చూడాలి అంటున్నాడు. ఎక్కడ రథాన్ని ఉంచితే, శత్రుపక్షం లోని వీరుల్ని చూచే అవకాశం ఉంటుందో అక్కడ ఉంచ మంటున్నాడు. శ్రీకృష్ణుణ్ణి ఆజ్ఞాపిస్తున్నా నేమో? అనే సందేహం కూడా అర్జునునిలో ఉదయించ లేదు. యుద్ధ సమయంలో ఉభయ సేనల మధ్య రథాన్ని ఉంచడము ప్రమాదం కాదా? అనే ఆలోచన కూడా పార్థునికి తట్టలేదు. అవన్నీ కృష్ణుడే చూసుకుంటా డనే విశ్వాస మేమో! అచ్యుతా! అని సంబోధించడం లోని ఆంతర్యం అదే నేమో!

కౌరవుల లోన నిప్పు డెవ్వారి తోడ న
నికి గడగుదు నో చూచి కొనగ వలయు
నరద మల్లన యుభయ సైన్యముల నడిమి
నేల కటు వోవగా నిచ్చి నిలుపు మచట ।

అని తిక్కన సోమయాజి ఆంధ్రానువాదము.

యోత్స్యమానా నవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధే ర్యుద్ధే ప్రియచికీర్షవః ॥ 23

యోత్స్యమానాన్-అవేక్షే-అహం-యే-ఏతే-అత్ర-సమాగతాః
ధార్తరాష్ట్రస్య-దుర్బుద్ధేః-యుద్ధే-ప్రియచికీర్షవః

దుర్బుద్ధేః	= దుష్టబుద్ధి యైన	ప్రియ చికీర్షవః	= మేలు చేయదలచిన వారై
ధార్తరాష్ట్రస్య	= దుర్యోధనునకు	య ఏతే	= ఏ వీరులు
యుద్ధే	= యుద్ధము నందు	అత్ర	= ఇక్కడ

సమాగతాః	= సమావేశ మయ్యారో	అహం	= నేను
యోత్స్యమానాన్	= అలా యుద్ధము చేసే వాళ్ళని	అవేక్షే	= చూస్తాను

దుర్యోధనుడిది పాడు బుద్ధి. అతడికి మేలు చేయాలని యుద్ధానికి వచ్చిన వాళ్ళెవరో వాళ్ళను చూస్తాను.

వ్యాఖ్య

దుర్యోధనుడు దుర్బుద్ధి కలవాడు. అతనికి మేలు చేయాలని, ప్రియమును చేకూర్చాలని ఎవరెవరు వచ్చి యున్నారో వాళ్ళను చూస్తాను అంటున్నాడు అర్జునుడు. ఇక్కడ అర్జునుని ఆంతర్యాన్ని కొద్దిగా ఆలోచించాలి. దుష్టుడైన దుర్యోధనుని వైపు ఉన్న వీరులు ఏదో కారణం చేత అతనికి మేలు చేయాలని వచ్చిన వారు ఉంటారే గాని, మాకు కీడు చేయాలి అనే ఆలోచనతో వచ్చి ఉంటారని నేను అనుకోను. యుద్ధాన్ని నివారించే ప్రయత్నం వాళ్ళు కూడా చేసే ఉంటారు. దుర్యోధనుడిది దుష్టబుద్ధి కనుక వాళ్ళు చెప్పినా విని ఉండడు. అందుచేత, వాళ్ళ కున్న ప్రత్యేక కారణాల వల్ల యుద్ధానికి అనివార్యంగా వచ్చి ఉంటారే గాని, మాకు కీడు చేయాలని ఎవ్వరూ భావించరు. మేము ఎవరికి కీడు చేశామని మాకు కీడు తల పెడతారు? భీష్మద్రోణాదులు కూడా దుర్యోధనుని తృప్తి పరచేందుకే వచ్చారు కదా! మేము గాయ పడటాన్ని వాళ్ళు తట్టుకో గలరా? కృష్ణా! అందుకని ఎక్కడ నువ్వు రథాన్ని ఉంచితే నేను అందరినీ చూడ గలనో అక్కడ ఉంచు అన్నాడు అర్జునుడు.

సంజయ ఉవాచ :

ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।
సేనయో రుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥ 24

ఏవమ్-ఉక్తః-హృషీకేశః-గుడాకేశేన-భారత
సేనయోః-ఉభయోః-మధ్యే-స్థాపయిత్వా-రథోత్తమమ్

భారత	= ఓ ధృతరాష్ట్రుడా!	ఉభయోః	= రెండు
ఏవం	= ఈ విధముగా	సేనయోః	= సైన్యముల
గుడాకేశేన	= అర్జునుని చేత	మధ్యే	= నడుమ
ఉక్తః	= చెప్పబడిన	రథోత్తమం	= గొప్పది యగు రథమును
హృషీకేశః	= శ్రీకృష్ణుడు	స్థాపయిత్వా	= నిలిపి

సంజయుడు చెప్పాడు :

ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు అలా చెప్పాడు. అంతే. శ్రీకృష్ణుడు రథాన్ని తీసికెళ్ళి రెండు సేనల నడుమ ఉంచాడు.

భీష్మద్రోణ ప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।
ఉవాచ పార్థ పశ్యైతా న్సమవేతాన్ కురూ నితి ॥ 25

భీష్మద్రోణ ప్రముఖతః-సర్వేషాం-చ-మహీక్షితాం
ఉవాచ-పార్థ-పశ్య-ఏతాన్-సమవేతాన్-కురూన్-ఇతి

భీష్మద్రోణ ప్రముఖతః	= భీష్మద్రోణుల ఎదుట
చ	= మరియు
సర్వేషాం	= సర్వులైన
మహీక్షితాం	= రాజుల ఎదుట
పార్థ	= ఓ అర్జునా
సమవేతాన్	= సన్నద్ధులైన
ఏతాన్	= ఈ
కురూన్	= కౌరవులను
పశ్య	= చూడు
ఇతి	= అని
ఉవాచ	= పలికెను

రాజు లందరి ముందు, భీష్ముడికి ద్రోణుడికి ఎదురుగా శ్రీకృష్ణుడు రథాన్ని నిలిపాడు. అర్జునా! యుద్ధానికి నడుం కట్టిన కౌరవుల్ని చూడు! అన్నాడు.

వ్యాఖ్య

గుడాకేశు డైన అర్జునుడు చెప్పినట్లే చేశాడు హృషీకేశుడైన శ్రీకృష్ణుడు. నిద్రను జయించిన వాడు గుడాకేశుడు. ఇంద్రియాలను ప్రేరేపించే వాడు హృషీకేశుడు. అర్జునుడు అవధానంతో ఉన్నాడు. శ్రీకృష్ణుడు ఉద్యమించే స్థాయిలో, పురికొల్పే స్థితిలో ఉన్నాడు.

ప్రస్తుతానికి రథాన్ని తీసుకెళ్ళి అర్జునుడు చెప్పినట్లు ఉభయ సేనల మధ్య ఉంచాడు. రథం లోనే ఉన్నాడు కనుక పాండవ మధ్యముడు కూడా మధ్యకే చేరాడు. అందరి దృష్టి ఆ రథం మీదనే ఉంది. అది ఉత్తమ మైన రథం కదా! *(రథోత్తమమ్).*

అగ్నిదేవుడు ప్రసాదించిన రథం. మంగళకరంగా తెల్లని దేవతాశ్వములు కట్టిన రథం. జండాపై హనుమంతుడు. రథం నడుమ నరుడు. నడిపే చోట నారాయణుడు. ఇక, ఆ రథం యొక్క గొప్పతనాన్ని ప్రత్యేకించి చెప్పే దేముంది? కనిపిస్తూనే ఉంది కదా!

ప్రతి మానవ శరీరము రథమే. ఎవరి మనస్సులో మాధవుడు కొలువై ఉంటాడో అది ఉత్తమ మైన రథము *(రథోత్తమమ్).* మాధవుడు అందరి లోను ఉన్నాడు. కాని మాధవ స్పృహ అందరిలో లేదు. మాధవ స్మరణము అందరి మనస్సులు చేయ లేవు. అలా చేసే మనస్సులను కలిగిన శరీరాలే ఉత్తమ రథాలు.

పెట్ట మన్నాడు - చిచ్చు పెట్టమన లేదు

రెండు సేనల నడుమ రథాన్ని పెట్టమన్నాడు అర్జునుడు. అంతే. ఎవరి ముందు పెడితే అర్జునుని బుద్ధి కలత పడుతుందో అక్కడ రథాన్ని పెట్టాడు శ్రీకృష్ణుడు. ఎవరిని చూస్తే కయ్యానికి కాళ్ళు తడబడతాయో, గుండెలు అదురుతాయో వాళ్ళ ఎదురుగా బండిని ఆపాడు. రాజు లందరి ముందు, భీష్మద్రోణులకు ఎదురుగా రథాన్ని నిలిపాడు. అంతటితో ఆగాడా? 'అర్జునా! యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్న కౌరవులను చూడు!' అన్నాడు ***(ఉవాచ పార్థ! పశ్యైతాన్ సమవేతాన్ కురూన్ ఇతి).*** మొదటి అధ్యాయంలో శ్రీకృష్ణుడు పలికిన ఒకే ఒక వాక్యం ఇది. అది కూడా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడని సంజయుడు చెప్పిన వాక్యం.

పార్థ! పశ్య

అర్జునా! సమరాభిలాషు లైన కురుసేనను చూడు అన్నాడు శ్రీకృష్ణుడు. చూడాలనే ఉద్దేశం తోనే అర్జునుడు రెండు సేనల నడుమ రథాన్ని ఉంచ మన్నాడు. అలాగే ఉంచాడు శ్రీకృష్ణుడు. కళ్ళెదుట ***(ప్రముఖతః)*** కనిపిస్తున్న వారిని, చూడు ***(పశ్య)*** అని ప్రత్యేకంగా చెప్ప వలసిన అవసరం లేదు. అయినా, శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆ సన్నివేశంలో, ఆ పరిస్థితిలో 'చూడు' అనే ఆ చిన్న మాట అనూహ్యమైన రీతుల్లో అర్జునుని అంతఃకరణమును కుదిపేసింది. ఆంతర్యంలో కల్లోలాన్ని రేపింది. వివేకాన్ని కలత పెట్టింది.

విషాదానికి పీట వేసింది. కొండంత గుండెను పిండి చేసింది. ద్వేషాగ్నితో రగిలి పోతున్న మనస్సును మమకారంతో నిర్వీర్యం చేసింది.

ఎదురు పడగానే ఎద పగిలింది

భీష్మద్రోణుల ఎదుట రథం ఆగింది. చూడు! అన్నాడు కృష్ణుడు. ఏమి చూడాలి? ఏదో చూశాడు అర్జునుడు. ఏదేదో చూశాడు. ఎదలో దాగిన మమకారా న్నంతా చూశాడు. ఏదో అయ్యాడు. ఎదురాడే శక్తిని కోల్పోయాడు. ఎదురుకొనే పటిమను పడేసు కున్నాడు. ఎదబాధతో ఎదురీద లేక నిశ్చేష్టుడై నిలబడి పోయాడు.

చూడు! అనే ఒక్క మాటే పలికాడు మాధవుడు. ఆ ఒక్క మాటను పట్టుకొని ఏకంగా ఏకేస్తోంది అర్జునుని మనస్సు.

అర్జునా! చూడు! ఎదురుగా ఎవరున్నారో చూడు! భీష్మ తాతయ్య! మీ కురు వంశాభివృద్ధికి ఆయన ఎన్ని త్యాగాలు చేశాడు? ఎన్ని సుఖాలు త్యజించాడు? జీవితంలో ఆయన సుఖపడిం దెప్పుడు? మీ సుఖానికి ఆయన ఆరాట పడని క్షణ మేదో కాస్త ఆలోచించు. పుణ్యాత్ముడు. ధర్మాత్ముడు. వేదవిదుడు. సత్యవ్రతుడు. అసమాన పరాక్రమవంతుడు. ఆయన ఒడి లోనే కదా నువ్వు పెరిగింది! బాల్యంలో నీకు కథలు చెప్పిన తాతయ్య! యౌవ్వనంలో మీ ప్రగతికి బాటలు వేసిన తాతయ్య! ఆ వృద్ధ పితామహుణ్ణి పూజించ వలసిన నీవు, గౌరవించ వలసిన నీవు, ఆయనపై శరవర్షం కురిపించి, ఆ ముసలి ప్రాణం నేల కొరిగితే చూడాలని ఉన్నావా? పార్థ! పశ్య! చూడు! చూడు! బాగా చూడు! ఆయన త్యాగానికి ఇదా ఫలితం? ఆయన ప్రేమకు ఇదేనా నీవు పట్టే నీరాజనం? పార్థ! పశ్య! అర్జునా! చూడు! ఇలాగే చూచి ఉంటుంది అర్జునుని మనస్సు. ఇలాగే చూపి ఉంటుంది పార్థుని హృదయం.

అర్జునా! అటు చూడు! ఆ ప్రక్కనే ఎవ రున్నారో చూడు! ఆచార్యా! అని నీవు ప్రణామం చేసే నీ గురువు ద్రోణాచార్యుడు. తన బిడ్డ అశ్వత్థామ కన్నా నిన్నే ఎక్కువగా ప్రేమించిన వాడు. తన కుమారునికి చెప్పని ధనుర్విద్యా రహస్యాల్ని నీకు చెప్పాడు. నిన్ను సవ్యసాచిగా తీర్చి దిద్దాడు. అర్జునునికి మించిన విలుకాడు మరొకడు ఉండటానికి వీలు లేదని బహిరంగంగా ప్రతిజ్ఞ బూనిన బ్రాహ్మణుడు. నిన్ను మించి పోతాడేమో నని ఏకలవ్యుని బొటనవ్రేలును గురుదక్షిణగా గ్రహించి మాయని మచ్చ తెచ్చు కున్నాడు. అలాంటి ఆచార్యునిపై సుమవర్షాన్ని కురిపించ వలసిన నువ్వు, శరవర్షాన్ని కురిపించి, ఆ మహాత్ముని పవిత్ర దేహం రక్తపు మడుగులో పడి ఉంటే చూడాలని ఉబలాట పడుతున్నావా? పార్థా! పశ్య! అర్జునా! చూడు. చూడు. బాగా చూడు. గురువులకు శిష్యు లిచ్చే గురుదక్షిణ ఇదేనా? గురువు ఋణం తీర్చుకొనే మార్గం ఇదేనా? భావితరాలలో శిష్యు లందరూ నిన్నే ఆదర్శంగా తీసుకుంటే, ఇక ఆ తరువాత గురువుల గతేమిటో ఆలోచించు! పార్థ! పశ్య! అర్జునా! చూడు. ఇలాగే అవలోకించి ఉంటాడు అర్జునుడు. ఇలాగే కలతపడి ఉంటుంది అర్జునుని ఆంతర్యం.

అంతే. తాను దగా పడింది అంతా మరచి పోయాడు మహాత్ముడైన అర్జునుడు. దయతో చలించి పోయాడు. కరుణతో కదలి పోయాడు. తాను చేస్తున్న దేమిటి? అని పునరాలోచన చేశాడు. ఏదో తప్పు చేస్తున్నట్లు తడబడి పోయాడు.

ఊహల ఊయల

మరొక కోణం నుండి చూద్దాం! ఒకవేళ రథాన్ని భీష్మద్రోణుల ముందు ఉంచకుండా దుశ్శాసనుని ముందు గాని, దుర్యోధనుని ముందు గాని, శకుని ముందు గాని, (కర్ణుడు యుద్ధభూమిలో లేడు కనుక) నిలిపి ఉంటే ఎలా ఉండేది? ఏమో! ద్రౌపది వస్త్రాపహరణం స్మృతిలో మెదిలి, వెంటనే గాండీవాన్ని చేబూని గడగడ లాడించేవా డేమో గాండీవి.

అంటే, రణరంగంలో భీష్మద్రోణులు ఉన్నపళంగా ఊడి పడ్డారా? వారుభయులు రణభూమిలో ఎదురుగా దర్శన మిస్తారని ధనంజయునికి ముందు తెలియదా? తెలిసే కదా వచ్చాడు? పైగా సవ్యసాచి సామాన్యుడా! పశుపతితో పోరాడిన దిట్ట! అలాంటి వాడు ఇలా ఎందు కయ్యాడు?

అందుకే అంటున్నాను మాధవుని పథ్య గుళిక బాగా పని చేసిందని! కొన్ని సందర్భాలలో మామూలు మాటలే మారణహోమాల్ని సృష్టిస్తాయి. లేదా, మంగళ తోరణాలు కట్టిస్తాయి. కోటలు కట్టేవీ మాటలే. కోటలు కూల్చేవి కూడా మాటలే.

భీష్మద్రోణుల రూపాలు కౌంతేయుని కలత పెట్టాయా? లేక పరంధాముడు పలికిన పథ్య సూత్రం ఫలించిందా? లేక ఈ రెండు దోహదం చేశాయా? కాకపోతే, అర్జును డంతటి మహావీరుడు అలా నీరసించడ మేమిటి? అని ఆలోచించి నపుడు, ఏది ఏమైనా, కనిపించిన రూపాలో, వినిపించిన శబ్దాలో, ఏవైనా గాని, భీష్మద్రోణుల ప్రభావం ఆ క్షణంలో పార్థుని బుద్ధిపై పడింది అని మాత్రం అనిపిస్తోంది. కారణం కూడా కనిపిస్తోంది. భగవద్గీత, రెండవ అధ్యాయం సాంఖ్యయోగం లోని నాల్గవ శ్లోకంలో అర్జునుడు చెప్పిన దానిని విశ్లేషిస్తే, ఆధారానికి సంబంధించిన ద్వారం తెరచు కుంటుంది.

కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।

ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన ॥

కృష్ణా! భీష్మద్రోణులు పూజింప దగిన వారు. వారిని యుద్ధంలో బాణాలతో ఎదుర్కొని ఎలా పోరాడేది? అన్నాడు అర్జునుడు. ఇది ఊహల ఊయలో, లేక వాస్తవాల పల్లకీయో పట్టింపు లేదు కాని, ఇది మనం పట్టించుకో వలసిన విషయమా, కాదా! అనేదే మీమాంస.

జగన్నాటకం - జగన్నాథ రథం

అయితే, ఇదంతా కృష్ణుడు ఆడిన నాటకమా? అర్జునుణ్ణి బలహీన పరచింది కృష్ణుడేనా? కృష్ణుడు ఇదంతా ఎందుకు చేసినట్లు? ఎవరు అడగాలి? ఎవర్ని అడగాలి? పరమేశ్వర లీలల్ని ప్రశ్నించే శక్తి ఎవరి కుంది? సమాధానం చెప్పే సామర్థ్యం మాత్రం ఎవరి కుంది? ఈశ్వర సంకల్పాలు ఈశ్వరునికే ఎరుక.

కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు ఉన్నాడని మనకు తెలుసు. కృష్ణుని హృదయంలో ఏముందో ఎవరికి తెలుసు? కృష్ణుని ముందు అర్జును డున్నాడు. కాని, అనాదిగా అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న జీవు లెందరో శ్రీకృష్ణుని మనస్సులో కదిలి ఉంటారు. మహారణ్యంగా గోచరిస్తున్న ఉపనిష ద్వనంలో విహరించలేని సామాన్య జనులకు సైతం ఉపనిషత్సారాన్ని అందించాలని అచ్యుతుడు భావించి ఉంటే, అది మానవాళికి మహాభాగ్యం కాదా! ఆశీర్వాదం కాదా! అనుగ్రహం కాదా! భగవద్గీత మానవాళికి ఎనలేని, కొనలేని ఐశ్వర్యం కాదా!

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందనః

ఉపనిషత్తు లనే ఆవుల నుండి గీతామృతాన్ని పితికిన గోపాలుడు కురుక్షేత్రాన్ని అక్షయ గోశాలగా ఎన్నుకొని ఉంటే, లోక కళ్యాణానికి ఇంకేమి కావాలి? అదే జరిగిందేమో! అర్జునుణ్ణి నిమిత్తంగా చేసికొని ఉపనిషత్సారాన్ని గీతా పీయూషంగా మానవాళికి అందించాడేమో (*'అర్జున నిమిత్తీ కృత్య' అని శ్రీ శంకర భాష్యము*).

ఇదే వాస్తవ మైతే, కురుక్షేత్రంలో అర్జునుడికి ఎదురైన సమస్య కల్పిత మేనా? అర్జునుని విషాదము కేవలం మానవాళి కొరకు మాధవుడు సృష్టించిందేనా? అర్జునుని సమస్యకు పరిష్కారంగా గీత ఆవిర్భవించింది అంటున్నారు కదా! సమస్యే కల్పిత మైనపుడు, పరిష్కారం సత్యం ఎలా అవుతుంది? భగవద్గీతను అందించాలనే ఉద్దేశాన్ని సఫలం చేసుకోవడానికి అర్జునుని ప్రయత్న పూర్వకంగా కృష్ణుడు కలత పెట్టడం సమంజసమా?

సర్వజ్ఞుడైన పరమేశ్వరునికి గీతను అందించటానికి మరొక మార్గమే లేకపోయిందా? ఇలా ప్రశ్నల వర్షం కురిస్తే ఆశ్చర్యపో నవసరం లేదు.

అర్జునుడిలో ఉత్పన్నమయ్యే మమకార జనిత శోక మోహాలను ముందే గుర్తించి శ్రీకృష్ణుడు రథాన్ని అక్కడ ఉంచాడేమో! అందరి భావాలను గ్రహించి, ప్రేరేపించే శక్తి పరమేశ్వరునికి ఉంది అనే కదా ఆ దివ్యాత్ముని 'హృషీకేశుడు' అని ఈ శ్లోకం లోనే తెలుసుకున్నాం! అంతా ఈశ్వరలీల.

త త్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄ నథ పితామహాన్ ।

ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీం స్తథా ॥ 26

శ్వశురా న్సుహృద శ్చైవ సేనయో రుభయో రపి ।

తత్ర-అపశ్యత్-స్థితాన్-పార్థః-పితౄన్-అథ-పితామహాన్

ఆచార్యాన్-మాతులాన్-భ్రాతౄన్-పుత్రాన్-పౌత్రాన్-సఖీన్-తథా

శ్వశురాన్-సుహృదః-చ-ఏవ-సేనయోః-ఉభయోః-అపి

అథ	=	తరువాత	భ్రాతౄన్	=	అన్నదమ్ములను
పార్థః	=	అర్జునుడు	పుత్రాన్	=	కొడుకులను
తత్ర	=	అక్కడ	పౌత్రాన్	=	మనుమలను
ఉభయోః సేనయోః	=	రెండు సేనలలో	సఖీన్	=	మిత్రులను
అపి	=	కూడా	తథా	=	అలాగే
స్థితాన్	=	ఉన్నట్టి	శ్వశురాన్	=	మామలను
పితౄన్	=	తండ్రులను	సుహృదః చ	=	స్నేహితులను
పితామహాన్	=	తాతలను	ఏవ	=	కూడా
ఆచార్యాన్	=	గురువులను	అపశ్యత్	=	చూశాడు
మాతులాన్	=	మేనమామలను			

అర్జునుడు సైన్యంలో ఇరువర్గాలను చూశాడు. తండ్రులు, తాతలు, గురువులు, మేనమామలు, అన్నదమ్ములు, కొడుకులు, మనుమళ్ళు, స్నేహితులు, మామలు, మిత్రులు - అందరూ వీళ్ళే కనిపించారు.

వ్యాఖ్య

ఉభయ సేనల మధ్య నిలిచిన రథము నుండి వీక్షించిన అర్జునునికి ఇరుపక్షాల లోని వీరు లందరూ కనిపించారు. కౌరవ సైన్యములో దుర్యోధనాదులకు బంధువు లెవరో వారు తమకు కూడా బంధువులే. తమ సైన్యములో తమకు ఎవరు బంధువులో వారందరూ కౌరవులకు కూడా బంధువులే. ఇక ఎవరికి ఎవరితో యుద్ధము? కుడి చేత్తో ఎడమ చేతిని, ఎడమ చేత్తో కుడి చేతిని మెలిపెడితే ఒరిగే దేముంటుంది?

శత్రువులతో యుద్ధం చేయడం కష్టం కాక పోవచ్చు. ఇక్కడ శత్రువు లెవరు? పరిశీలించి చూస్తే అందరూ తన వాళ్ళే. ఒక్కచోట కలసి భోం చేయవలసిన వాళ్ళు. ఒకరి కష్టాన్ని మరొకరు పంచుకో వలసిన వాళ్ళు. కలసి తినడానికి బదులు కలసి తన్నుకో వలసిన పరిస్థితి వస్తే, వినడానికే రుచించదు. ఇక పాల్గొనే వారికి ఎలా ఉంటుంది?

యుద్ధం చేయాలి అంటే శత్రుభావం ఉండాలి. ద్వేష వృత్తి ప్రకోపించాలి. కాని, ఇక్కడ ఎవరితో శత్రుత్వము? ఎవరిపై ద్వేషము? అందరినీ వీక్షించాడు విజయుడు. రెండు సేనలు రెండు కళ్ళుగా కనిపిస్తున్నాయి. ఏ కన్ను పోయినా తనకే నష్టం. కళ్ళు రెండైనా చూపు ఒకటే అయినట్లు, సేనలు రెండైనా, అర్జునుడికి ఒక్కటి గానే గోచరిస్తున్నాయి.

ఇరుపక్షాల వారిని కలయ చూశాడు. తండ్రులు, తాతలు, గురువులు, మేనమామలు, అన్నదమ్ములు, బిడ్డలు, మనుమళ్ళు, స్నేహితులు, మామలు, మిత్రులు అందరూ వీళ్ళే. వీళ్ళతో పాటు ఏ పాపము ఎరుగని సామాన్య జనులు. అందరినీ చూశాడు.

తా న్సమీక్ష్య స కౌన్తేయః సర్వా న్బన్ధూ నవస్థితాన్ ॥ 27
కృపయా పర యావిష్టో విషీద న్నిద మబ్రవీత్ ।

తాన్-సమీక్ష్య-సః-కౌంతేయః-సర్వాన్-బంధూన్-అవస్థితాన్
కృపయా-పరయా-ఆవిష్టః-విషీదన్-ఇదం-అబ్రవీత్

సః	= ఆ	పరయా	= అత్యంత
కౌంతేయః	= అర్జునుడు	కృపయా	= కరుణతో
అవస్థితాన్	= సన్నద్ధులై యున్న	ఆవిష్టః	= కూడుకొని
తాన్	= ఆ	విషీదన్	= బాధ పడుతూ
సర్వాన్	= సమస్తమైన	ఇదం	= ఈ విధముగా
బంధూన్	= బంధువులను	అబ్రవీత్	= అన్నాడు
సమీక్ష్య	= బాగా చూచి		

యుద్ధానికి సిద్ధంగా ఉన్న బంధువు లందరినీ చూశాడు అర్జునుడు. అపార మైన కరుణతో చలించి పోయాడు. బాధ పడుతూ చెబుతున్నాడు.

వ్యాఖ్య

మనస్సు చాలా విచిత్ర మైంది. విడ్డూర మైంది. కౌరవులను మట్టుపెట్టే సమయం ఎప్పుడు వస్తుందా అని ఇంతకాలం అర్జునుడు నిరీక్షించాడు. అలాంటి అవకాశం దానంతటదే నడచి వచ్చి ముందు నిలబడిన క్షణాన, అర్జునుడు అపార కృపతో నీరసించి పోతున్నాడు. ఒకప్పుడు తాను ఆశించిందే. కాని, దానిని అందుకొనే స్థితిలో ఇప్పుడు లేడు.

బంధువు లందరినీ చూశాడు. మమకార పాశంతో బందీ అయ్యాడు. కృపా పరవశు డయ్యాడు. వీళ్ళను ఎలా వధించాలి? అని తనను తాను ప్రశ్నించు కున్నాడు. ఎంత ప్రశ్నించుకున్నా సమాధానం చిక్కలేదు. దొరక లేదు.

సంధి ప్రయత్నా లన్నీ విఫల మయ్యాయి. దుర్యోధనుని దురాగతాలు శ్రుతి మించాయి. క్రూరాత్ములైన కౌరవులను ఇక విస్మరించ కూడదు. వీళ్ళను చంప వలసిందే అనే దృఢ నిశ్చయంతో యుద్ధానికి వచ్చిన అర్జునుడు, వీళ్ళనా నేను చంప వలసింది? అని ఇప్పుడు, ఇక్కడ తనలో తాను కుమిలి పోతున్నాడు. మమకారం వల్ల ఏర్పడిన కృపా పారవశ్యంతో చలించి పోతున్నాడు. ఇది మామూలు విషయం కాదు. సాధారణ సమస్య కాదు.

అర్జునుడు సాదాసీదా వ్యక్తి కాడు. తొందరపడి ఏ పనీ చేసే వాడు కాడు. వివేకంతో, విచక్షణతో జీవించేవాడు. విశ్లేషించుకుంటూ కార్యాచరణలో నిమగ్న మయ్యేవాడు. అందుకనే, యుద్ధానికి ముందే ఉభయ సేనల మధ్య రథాన్ని ఉంచ మన్నాడు. తాను చంప వలసిన వాళ్ళందరూ తన వారే. తన వాళ్ళతో కలసి శత్రువులను చంపడం వేరు. తన వాళ్ళనే శత్రువులుగా భావించి చంపడం వేరు.

కౌరవుల వల్ల అష్టకష్టాలు అనుభవించి ధర్మబద్ధంగా యుద్ధరంగంలో కాలు పెట్టిన అర్జునుడు, యుద్ధం ప్రారంభమయ్యే సంక్లిష్ట సమయంలో ఇలా నీరసించడ మేమిటి? అనేది సామాన్యమైన ప్రశ్న. దారుణమైన బాధల్ని అనుభవించి, కౌరవుల క్రూర కృత్యాలకు బలై కూడా, యుద్ధానికి విముఖంగా ఉన్నాడంటే, హేతువు ఏమై ఉంటుంది? ఆ హేతువు ఎంత బలీయ మైనది కాకపోతే గీత ఆవిర్భవిస్తుంది? అనేవి సామాన్యమైన ప్రశ్నలు కావు. విశేషమైన విశ్లేషణలు.

అర్జున ఉవాచ :

దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥ 28
సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ 29

దృష్ట్వా-ఇమం-స్వజనం-కృష్ణ-యుయుత్సుం-సముపస్థితం
సీదంతి-మమ-గాత్రాణి-ముఖం-చ-పరిశుష్యతి
వేపథుః-చ-శరీరే-మే-రోమహర్షః-చ-జాయతే

కృష్ణ	= ఓ కృష్ణా!	సీదంతి	= శిథిల మౌతున్నాయి
యుయుత్సుం	= యుద్ధము చేయగోరి	ముఖం చ	= నోరు కూడా
సముపస్థితం	= చేరి యున్న	పరిశుష్యతి	= ఎండిపోతూ ఉంది
ఇమం	= ఈ	మే	= నా యొక్క
స్వజనం	= బంధుజనమును	శరీరే	= దేహము నందు
దృష్ట్వా	= చూచి	వేపథుః చ	= వణుకు కూడా
మమ	= నా యొక్క	రోమహర్షః చ	= గగుర్పాటు కూడా
గాత్రాణి	= అవయవములు	జాయతే	= కలుగుతూ ఉంది.

అర్జునుడు అంటున్నాడు :

కృష్ణా! యుద్ధం చేయాలని వచ్చిన నా బంధువుల్ని చూశాను. నా అవయవాలు పట్టు తప్పుతున్నాయి. నోరు ఎండిపోతోంది. దేహంలో దడ పుడుతోంది. గగుర్పాటు కలుగుతోంది.

వ్యాఖ్య

ఉభయ సేనల మధ్య రథాన్ని నిలిపి, కళ్ళెమును లాగి పట్టుకొని, 'పార్థా! చూడు' అని ఇరవై ఐదవ శ్లోకంలో పలికిన పార్థసారథి, తాను కూడా కౌరవసైన్యాన్ని చూస్తూనే ఉన్నాడు. అర్జునుడు కృష్ణా! అని పిలిచి, తన దీన స్థితిని ఈ శ్లోకంలో వివరించ డానికి ప్రారంభించాడు. ఆ సంబోధనతో శ్రీకృష్ణుడు తన ఎడమ భుజముపై నుండి తలను తిప్పి అర్జునుని తదేకంగా చూశాడు. ఒక చేతితో కళ్ళెమును అందముగా లాగి

పట్టుకొని, రెండవ చేతిలో మునికోలను ధరించి, అర్జునుడు చెప్పే విషయాన్ని వెనుదిరిగి అవధానంతో ఆలకించే పార్థసారథి అద్భుత దృశ్యం ఈ సందర్భము లోనిదే. తేరులో ఈ తీరు లోనే ఉండి ఆలకిస్తున్న శ్రీకృష్ణుడు, తాను గీతను బోధించే సమయంలో దేహ స్థితిని మార్చి, అర్జునుని సూటిగా చూస్తూ పలుకుతాడు. అంతవరకు అలాగే వెను దిరిగి పార్థుని పలుకుల్ని ఓర్పుతో వింటూ ఉంటాడు.

కృష్ణా! అంతా చూశాను. అందరినీ చూశాను. వీళ్ళల్లో సుజను లున్నారు. కుజను లున్నారు. కాని, అందరూ స్వజనులే. నా వాళ్ళే. అటు వైపు నుండి నా వాళ్ళు వేసే బాణాలు ఇటు నా వాళ్ళకే తగుల్తాయి. ఇటు వైపు నుండి మేము ప్రయోగించే అస్త్రశస్త్రాలు అటు నా వాళ్ళకే తగుల్తాయి. నా వాళ్ళను నా వాళ్ళే చంపాలి. చచ్చే నా వాళ్ళు చంపే నా వాళ్ళ చేతి లోనే చావాలి. ఈ పరిస్థితిని నేను తట్టుకోలేక పోతున్నాను. దుర్భర దు:ఖంతో నలిగి పోతున్నాను.

ఈ దారుణ పరిస్థితిని చూచి నా అవయవాలు ముక్క లౌతున్నాయి. నోటిలో తడి ఆరి పోతోంది. శరీరం వణకుతోంది. రోమాంచ మవుతోంది.

మమకారం కొట్టిన దెబ్బకు అర్జునుని మనస్సు విలవిల లాడింది. మనస్సు పట్టు తప్పగానే, దేహం పట్టును కోల్పోయింది.

శత్రువుల దేహాంగాలను విడగొట్ట వలసిన వాడు నా అవయవాలు ముక్క లౌతున్నాయి అంటున్నాడు. ఎందుకు అలా అయ్యాయి? ఎవరు వాటిని అలా శిథిలం చేసింది? మమకారం వల్లే అంగాలు ముక్క లయ్యాయి. అహంకారమే అలా మమకారాన్ని వాటేసుకొని అంగాలను శిథిలం చేసింది.

ముక్కలైన అవయవాలు ఏ పని చేస్తాయి? ఏ పనీ చేయలేని అంగాలు సంగ్రామానికి పనికొస్తాయా? కాళ్ళు కదలడం లేదట. చేతులు చలనాన్ని కోల్పోయాయట.

నోటిలో తడి ఆరి పోయిందట *(ముఖం చ పరిశుష్యతి)*. శుష్యతి అంటే ఆరిపోవడం. కాని, ఇక్కడ పరిశుష్యతి *(పరిత: శుష్యతి)* అంటున్నాడు పార్థుడు. అంటే తడి ఏ మాత్రం లేకుండా నోరు ఎండి పోయింది అంటున్నాడు. దీనిని బట్టి అర్జునుని విషాదము ఏ స్థాయికి చేరుకుందో మనం ఊహించు కోవచ్చు.

ఎక్కువ దూరం నడిస్తే, దాహం వేసి నోరు ఎండి పోవచ్చు. అధికంగా వ్యాయామం చేస్తే నోటిలో తడి ఆరి పోవచ్చు. ఏ శ్రమ లేకపోయినా, కేవలం రథంలో ఆసీనమై ఉన్నా, నోటిలో తడి ఆరి పోయింది అంటే, అర్జునునిలో దు:ఖాగ్ని ఎలా రగులుతోందో ఆలోచిస్తే ఎవరి కైనా అర్థ మవుతుంది.

ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కోలేక శరీరం వణకుతోంది. గగుర్పాటు చెందుతోంది అంటూ, ఇంకా తన శారీరక లక్షణాలు, చిహ్నాలు ఎలా ఉన్నాయో వివరిస్తున్నాడు విజయుడు.

గాణ్డీవం స్రంసతే హస్తా త్త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మన: ॥ 30

గాండీవం-స్రంసతే-హస్తాత్-త్వక్-చ-ఏవ-పరిదహ్యతే
న-చ-శక్నోమి-అవస్థాతుం-భ్రమతి-ఇవ-చ-మే-మన:

హస్తాత్	= చేతి నుండి	త్వక్ చ ఏవ	= చర్మము కూడా
గాండీవం	= గాండీవము	పరిదహ్యతే	= మండిపోతూ ఉంది
స్రంసతే	= జారిపోతూ ఉంది	అవస్థాతుం చ	= నిలుచుటకు కూడా

న శక్నోమి	= శక్తి లేకుండా ఉన్నాను	మన:	= మనస్సు
మే	= నా యొక్క	భ్రమతీవ	= భ్రమించి నట్లుంది

గాండీవము చేతి నుండి జారి పోతోంది. చర్మం కాలి పోతోంది. నిలబడలేక పోతున్నాను. నా తల తిరుగుతోంది.

వ్యాఖ్య

గాండీవము అర్జునుని ధనుస్సు. తనకు ఎంతో ప్రియమైనది. కాని, అది కూడా చేతి నుండి జారిపోతూ ఉంది అంటున్నాడు అర్జునుడు. అంటే, తాను ప్రయత్నంతో పడేయడం లేదు. దానంతట అదే జారిపోతూ ఉంది అంటున్నాడు. అంటే సమరవాంఛ దానంతట అదే ఆవిరై పోతూ ఉంది అని అర్థం.

చర్మం కాలి పోతోందట. అంటే, దేహంలో మంట లెత్తుతున్నాయి. అందుకే చర్మము కాలి పోతోంది. మనసు మరిగి పోతోంది కనుకనే దేహములో మంటలు పుట్టు కొస్తున్నాయి. మమకారం దేహ మనస్సులను ఒకేసారి భయంకరంగా కాల్చేస్తూ ఉంటే ఆరాటపడి పోతున్నాడు అర్జునుడు.

ఈ దశలో అర్జునుడు రథంలో కూర్చొని ఉన్నాడు. యుద్ధం చేయాలి అంటే లేచి నిలబడాలి. లేచే పరిస్థితిలో లేడు. ఆ మాత్రం శక్తి కూడా లేదంటున్నాడు. నిజమేనా? అయితే ఎందుకిలా అయింది? ఉభయ సేనల మధ్య రథాన్ని ఉంచమని చెప్పి కొన్ని నిముషాలు మాత్రమే అయింది. ఈ లోగా లేవలేని విధంగా శక్తిహీను డెలా అయ్యాడు?

ప్రాణతుల్య మైన తమ వారు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతూ ఉన్న సమయంలో, వైద్యుడు రోగి గది నుండి బయటికి రాగానే, డాక్టరు గారు! ఎలా ఉంది? అని పరుగెత్తుకుంటూ వెళ్ళి అడుగుతారు. చెప్పలేము. ఏదైనా, ఏ క్షణమైనా జరగవచ్చు అని వైద్యుడు చెప్పగానే, ఆ అడిగిన వ్యక్తి అక్కడే కుప్పకూలి పోవడం మనం చూస్తేనే ఉంటాం. క్షణం క్రితం పరుగెత్తుతూ వచ్చి, వార్త వినగానే అశక్తుడై పడిపోవడం జరుగుతూ ఉంది. మనస్సు అశక్త మైనపుడు దేహం కూడా శక్తిహీన మవుతుంది. అందుకనే, తల తిరుగుతోంది *(భ్రమతీవ చ మే మన:)* అంటున్నాడు అర్జునుడు.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయోఽను పశ్యామి హత్వా స్వజన మాహవే ॥ 31

నిమిత్తాని-చ-పశ్యామి-విపరీతాని-కేశవ
న-చ-శ్రేయ:-అనుపశ్యామి-హత్వా-స్వజనం-ఆహవే

కేశవ	= ఓ కేశవా!	స్వజనం	= బంధువులను
చ	= ఇంకను	హత్వా	= వధించి
విపరీతాని	= విపరీతము లైన	అను	= ఆ తర్వాత
నిమిత్తాని	= శకునములను	శ్రేయ: చ	= శ్రేయమును
పశ్యామి	= చూస్తున్నాను	న పశ్యామి	= చూడలేక పోతున్నాను
ఆహవే	= యుద్ధము నందు		

కేశవా! అపశకునాలు కనిపిస్తున్నాయి. యుద్ధంలో బంధువు లందరినీ చంపుకొని, నేను బావుకొనే దేమిటో ఊహించలేక పోతున్నాను.

వ్యాఖ్య

శకునాలు - నిమిత్తాలు

అపశకునాలు అగుపిస్తున్నాయి అంటున్నాడు అర్జునుడు. అపశకునాలు అనర్థ సూచకాలు. పక్షుల ద్వారా తెలిసేవి శకునాలు. అవి శుభములే. ఒకవేళ అశుభ మైతే దుశ్శకునాలు అనాలి. పక్షి కూస్తే శకునం. కాకి అరిస్తే శకునం. అసలు శకునం అంటేనే పక్షి అని అర్థము. ఆంధ్రంలో శకునము. సంస్కృతంలో **శకునః**

శకుంతిః శకునిః శకుంతః శకునః ద్విజః (పక్షీ)

అని అమరకోశము. నక్క అరిస్తే, కుక్క ఏడిస్తే అది శకునం కాదు. ఎందుకంటే, కుక్కలు, నక్కలు పక్షులు కావు కనుక. మరి, అప్పుడు దాని నేమనాలి? నిమిత్తం అనాలి. ఏదో ఆపద సూచితమే నిమిత్తం. విపరీతము లైన నిమిత్తాలను నేను చూస్తున్నాను అంటున్నాడు అర్జునుడు. విపరీతా లంటే అనర్థ సూచకాలు.

స్వపక్షమా? ప్రతిపక్షమా?

అర్జునుడి లాంటి వీరుడు చివరికి శకున శాస్త్రము నీడలో రక్షణ పొందాలని యత్నిస్తున్నాడు. విపరీత మైన నిమిత్తాలు, దుశ్శకునాలు కనిపిస్తున్నాయి అంటున్నాడు. అవి బాహ్యంలో కనిపించే రూపాలు, శబ్దాలు కావచ్చు. లేదా, తన శరీరము లోనే కంపించే అవయవాలు కావచ్చు.

బాగానే ఉంది. మరి, ఈ శకునాలు, నిమిత్తాలు ఎవరికి వర్తిస్తాయి? స్వపక్షం వారికా? లేక, ప్రతిపక్షం వారికా? ఎందుకంటే, ఈ శకునాలు, నిమిత్తాలు ఉభయులకూ కనిపిస్తున్నాయి కనుక.

ఎటైనా పోటే

ఎవరి కైతే ఏముంది? ఏ చెంపను వాయించినా కన్నీళ్ళే కదా వస్తాయి! ఎవరికి చెడు జరిగినా ఇరువురికీ అశుభమే. ఇరువురూ స్వజనులే. యుద్ధములో స్వజనులను చంపుట వలన ***(హత్వా స్వజన మాహవే)*** నాకు జరిగే మేలేమిటో గోచరించడం లేదు ***(న చ శ్రేయోఽ ను పశ్యామి).*** ఎటు చూచినా ఈ యుద్ధము అనర్థ దాయకం గానే కనిపిస్తూ ఉంది. అంతా శూన్య ప్రయోజనం. బ్రతుకుకు అర్థ మేమిటో బోధ పడటం లేదు అని ఆవేదన చెందుతున్నాడు అర్జునుడు.

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవిన్ద కిం భోగై ర్జీవితేన వా ॥ 32

న-కాంక్షే-విజయం-కృష్ణ-న-చ-రాజ్యం-సుఖాని-చ
కిం-నః-రాజ్యేన-గోవింద-కిం-భోగైః-జీవితేన-వా

కృష్ణ	= హే కృష్ణా!	గోవింద	= హే గోవిందా!
విజయం	= విజయమును	నః	= మాకు
కాంక్షే	= కోరుట	రాజ్యేన	= రాజ్యముతో
న	= లేదు	కిం	= ఏమి లాభము?
రాజ్యం చ	= రాజ్యమును	భోగైః	= భోగముల చేత గాని
సుఖాని చ	= సుఖములను	జీవితేన వా	= బ్రతుకుట చేత గాని
న	= లేదు	కిం	= ఏమి లాభము?

కృష్ణా! నేను విజయాన్ని కోరుకోవడం లేదు. రాజ్యాన్ని ఆశించడం లేదు. సుఖాలకు ఆరట పడటం లేదు. హే గోవిందా! రాజ్యము వల్ల గాని, భోగాల వల్ల గాని మాకు ఒరిగే దేముంది? బ్రతుకే నిరర్థక మనిపిస్తోంది.

వ్యాఖ్య

యుద్ధం చేయడం వలన తనకు శ్రేయస్సు కలగదు అంటున్నాడు అర్జునుడు. అంటే, తనకు శ్రేయస్సు కావాలి. అది యుద్ధం చేయడం వల్ల లభించే అవకాశము లేదు అనే అభిప్రాయం అర్జునునికి ఉంది.

విజయ మెందుకు?

యుద్ధం చేస్తే మాకు ఒరిగే దేమిటి? అనేది ప్రశ్న. అంటే, విజయాన్ని సాధించడం ప్రయోజనం కాదా? అలాగైతే, ఇప్పటి వరకు యుద్ధాలు చేసి విజయాల్ని సాధించిన వారు ఎందుకు చేసినట్లు? యుద్ధాలలో విజయాలు సాధించక పోతే రాజ్యా లెలా ప్రాప్తించినట్లు?

పైగా, నీ పేరు విజయుడు కదా! విజయాన్ని సాధించే వాడివి కాబట్టే కదా, నీకు విజయుడు అనే పేరు వచ్చింది? మరి ఇలా యుద్ధానికి విముఖుడవై, విజయాన్ని చేజార్చుకుంటే, విజయుడు అనే పేరు పోదా?

కృష్ణా! పోతే పోనీ. పేరు ప్రఖ్యాతులే శ్రేయస్సు అని నాకు అనిపించడం లేదు. నేను విజయాన్ని కోరుకోవడం లేదు ***(న కాంక్షే విజయం).*** విజయం సాధిస్తేనే రాజ్యం వస్తుంది అనేదే ప్రధాన విషయ మైతే, నాకు రాజ్యం కూడా అవసరం లేదు ***(న కాంక్షే రాజ్యం).***

రాజ్య మెందుకు?

కృష్ణా! రాజ్యాన్ని పొంది సాధించే ప్రయోజన మేమిటో కూడా నాకు తెలియడం లేదు. **కారే రాజులు *రాజ్యముల్ గలుగవే... వారేరి?*** రాజ్యము దుర్యోధనుడికి ఉంది కదా! మరి అతడు సుఖంగా ఉన్నాడా? కనుక, నేను రాజ్యాన్ని కోరుకోవడం లేదు అంటున్నాడు అర్జునుడు. మరి, అదే నిజమైతే, యుద్ధభూమికి ఎందుకు వచ్చినట్లు? రథం నడుప మని కృష్ణుని ఎందుకు అడిగినట్లు? నిజమే! యుద్ధం చేయాలనే కిరీటి కదన రంగంలో కాలు మోపాడు. కాని, యుద్ధభూమిలో బంధు జనాన్ని చూసిన తరువాత, సమరవాంఛ సన్నగిల్లింది. యుద్ధ విముఖత బుద్ధిలో జనించింది. మరి, రాజ్యం లేకపోతే, రాజ్యసుఖాలు ఎలా ప్రాప్తిస్తాయి? రాజ్యసుఖాలు కూడా అవసరం లేదు అంటున్నాడు ***(సుఖాని న కాంక్షే).***

సుఖా లెందుకు?

సుఖాల వల్ల ఏమి ప్రయోజనం? సుఖాలు మానవులకు తెలియనివి కావు. సాగర మంత దుఃఖాన్ని అనుభవించింది వాస్తవమే అయినా, కొద్దో గొప్పో కూప తటాకాది స్థాయిలో సుఖాలు కూడా మానవుల అనుభవంలో ఉన్నాయి. ఇంత వరకు అనుభవించిన సుఖాల వల్ల సాధించింది ఏముంది? అలాంటప్పుడు ఇక మున్ముందు కలిగే సుఖాల వల్ల మాత్రం ఒరిగేది ఏముంటుంది? మతాబుల కాంతి లాంటి సుఖాలు మనుగడకు వన్నె తెస్తాయా? మనిషికి తృప్తి నిస్తాయా?

రాజ్యాలు పొందినా, భోగాలలో రమించినా, వాటి వల్ల కలిగే ప్రయోజనము శ్రేయోదాయకమా? కానప్పుడు, ఈ రాజ్యా లెందుకు? విజయా లెందుకు? యుద్ధా లెందుకు? సరే, అదంతా బాగానే ఉంది అర్జునా! కాని, యుద్ధము చేయనంత మాత్రాన శ్రేయస్సు కలుగుతుందా? శ్రేయస్సు మాట దేవు డెరుగు. అసలు జీవనము సాగుతుందా?

జీవించడానికి ఇల్లు కావాలి. ధనం కావాలి. ఇవన్నీ ఎలా వస్తాయి? అర్జునుడు యుద్ధాన్ని విరమించాడు

కనుక, అతని కష్టసుఖాలు మేమే చూసుకుంటా మని దుర్యోధనుడు ముందుకు వస్తాడా? ఇంతెందుకు? అసలు రాజ్యంలో ఉండ నిస్తాడా? ఈ వేధింపుల మధ్య బ్రతికే దెలా? అదంతా ఏమో. అసలు బ్రతకడ మెందుకు? బ్రతికి ఏమి సాధించాలి? *(జీవితేన వా కిం?)* అంటున్నాడు అర్జునుడు.

బ్రతికి ఏమి సాధించాలి?

ఎందుకు జీవించాలి? జన్మించాము కనుక జీవించాలా? లేక, మరణం రాలేదు కనుక బ్రతకాలా? బ్రతికి సాధించే దేమిటి? ఎన్ని సాధించినా, ఒకనాడు మృత్యువు బాధించక తప్పదు *(మరణాంతం జీవితం)*. ఇలాంటి బ్రతుకు కోసం ఎంత మంది బ్రతుకుల్ని బలి తీసుకోవాలి? బ్రతుకు ఏమిటో, దేని కొరకో స్పష్టంగా అర్థం కాకపోవడం చేత బ్రతుకు మీదే విజయునికి విరక్తి పుట్టింది.

భావము నీదే - భారమూ నీదే

ఈ శ్లోకంలో పరమేశ్వరుని కృష్ణా! గోవిందా! అనే రెండు పవిత్ర నామాలతో సంబోధించాడు అర్జునుడు. తనకు ఏమి కావాలో నిర్ణయించుకో లేని స్థితిలో అర్జునుడు ఉన్నాడు. గోల పెట్టే మనసును గోప్యంగా ఉంచుకో లేక గోవిందా! అంటూ మొర పెట్టు కుంటున్నాడు.

గారేషా తు యతో వాణీ తాం చ విన్దయతే గోవిందః

'గో' అంటే వాక్కు. 'విందయతే' అంటే ఇవ్వడ మని అర్థము. వాక్కును అనుగ్రహించే వాడు, లేదా ప్రసాదించే వాడు కనుక శ్రీకృష్ణుడు 'గోవింద' శబ్దవాచ్య డయ్యాడు.

కృష్ణా! మాట లైతే నా నుండి దొర్లుతున్నాయి. వాటి లోని మర్మ మేమిటో నాకు బోధ పడటం లేదు. మాటల్ని కదిలించే వాడివి నీవు. అవి ఎందుకు కదుల్తున్నాయో నీకే తెలుసు. గోవిందా! భావము నీదే. భావము తెలిసిన వాడివి కనుక, నా బాధను తొలగించే భారము కూడా నీదే.

మానవుని ఆలోచనలు సహజంగా బాహ్య ప్రపంచానికి సంబంధించే ఉంటాయి. మానవుడు ఆచరించే కర్మ లన్నీ బాహ్యం లోనే సాగుతుంటాయి. కాని, వాటికి కారణమైన భావాలు ఆంతర్యంలో మెదులుతూ ఉంటాయి. అంతర్యామిని ఆశ్రయించుకొని బాహ్యానికి కదులుతూ ఉంటాయి. ఇలా ఆంతర్యాన్ని ప్రేరేపించే గోవిందుని వైభవము బాహ్యంలో కూడా విరాజిల్లితే బ్రతుకు భగవన్మయ మవుతుంది. అందుకే నేమో, తాళ్ళపాక అన్నమయ్య ఆ దిశలో మనస్సుకు మార్గ నిర్దేశం చేశాడు.

భావము లోనా బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా ॥ ॥ భావము ॥

తన సమస్యను గోవిందుని ముందు పెడుతూ, తన మనసును గోవిందుని చేతికి అందిస్తూ, తాను వాంఛించే శ్రేయస్సును ప్రసాదించ మని గోవిందుని ప్రార్థిస్తున్నాడు పార్థుడు. ఆ భారము నీదే నంటూ గోవిందుని 'కృష్ణా' అని సంబోధించాడు.

సచ్చిదానందాత్మకః కృష్ణ వర్ణాత్మక త్వా ద్వా కృష్ణః

సచ్చిదానంద స్వరూపుడు కనుక భగవంతుడు 'కృష్ణ' శబ్ద వాచ్య డయ్యాడు. కనుక, భావము నెరిగిన గోవిందా! నాకు నిత్యానందాన్ని (శ్రేయస్సు) ప్రసాదించే భారము కూడా నీదే నంటూ 'కృష్ణా' అని సంబోధించాడు అర్జునుడు.

అర్జునా! నీకు రాజ్యము అవసరం లేక పోవచ్చు. కాని, యుద్ధంలో నీవు ఒక్కడి వేనా ఉండేది? నీ వాళ్ళు లేరా? మనకు ఇష్టం లేకపోయినా, మన వాళ్ళ కోసం కొన్ని పనులు చేయాలి కదా! అలాగే, నీకు రాజ్యము

అవసరం లేకపోయినా, యుద్ధము ఇష్టం లేకపోయినా, నీ వాళ్ళ కోసమైనా చేయవచ్చు కదా! ఈ ప్రశ్నకు సమాధానమే తరువాత శ్లోకంలో అర్జునుని ఆవేదన.

యేషా మర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనాని చ ॥ 33

యేషాం-అర్థే-కాంక్షితం-నః-రాజ్యం-భోగాః-సుఖాని-చ
తే-ఇమే-అవస్థితాః-యుద్ధే-ప్రాణాన్-త్యక్త్వా-ధనాని-చ

యేషాం అర్థే	= ఎవరి కొరకు	త ఇమే	= అట్టి వీరందరు
నః	= మనకు	యుద్ధే	= యుద్ధము నందు
రాజ్యం	= రాజ్యము	ప్రాణాన్	= ప్రాణములను
భోగాః	= భోగములు	ధనాని చ	= ధనమును
సుఖాని చ	= సౌఖ్యములు	త్యక్త్వా	= విడిచి
కాంక్షితం	= కోరబడినవో	అవస్థితాః	= నిలబడి యున్నారు

కృష్ణా! రాజ్యాన్ని, రాజ్య భోగాల్ని, రాజ్య సుఖాల్ని మనం ఎవరి కొరకు ఆశించామో, వాళ్ళే యుద్ధంలో నిలబడి ఉన్నారు. సంపదల్ని వదిలేసు కున్నారు. ప్రాణాల్ని కూడా లెక్క చేయకుండా నిలిచి ఉన్నారు.

వ్యాఖ్య

లోకంలో ఎవరు ఏది సంపాదించినా - సుఖాలైనా, భోగాలైనా తన వారితో కలసి అనుభవించడం కొరకే. ప్రస్తుతం యుద్ధం చేసి రాజ్యాన్ని సాధించడం కూడా తన వాళ్ళ కొరకే అనేది అర్జునుని ఆలోచన. అదే వాస్తవ మైతే, తాను, తన వాళ్ళు మాత్రమే కలసి యుద్ధంలో పోరాడాలి. అలా కాకుండా, ఏడు అక్షౌహిణుల సైన్యం తన పక్షాన ఎందుకు వచ్చి నిలిచిందో అర్జునుడు ఆలోచించలేక పోతున్నాడు.

రాజ్యం తన వారి కొరకే అయితే, రాజ్యం కొరకు యుద్ధం చేయడం అనివార్య మైతే, ఈ యుద్ధం అనర్థ మని అర్జునుని అభిప్రాయం. నా వాళ్ళ కొరకు యుద్ధం చేయాలి. ఎవరితో చేయాలి? నా వాళ్ళ తోనే చెయ్యాలి. ఎవరి కొరకు *(ఏషా మర్థే కాంక్షితం)* యుద్ధం చెయ్యాలో, వారే వచ్చి యుద్ధంలో నిలబడి ఉన్నారు.

పైగా ప్రాణాలపై ఆశను వదలుకొని *(ప్రాణాన్ త్యక్త్వా)* యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. యుద్ధం జరిగితే, వారి ప్రాణాలు మిగలవు. రాజ్యం మిగుల్తుంది. ఏమి చేసుకోవాలి ఆ రాజ్యాన్ని? ఎవరితో కలసి రాజ్య సుఖాలు అనుభవించాలి?

యుద్ధభూమిలో ఉన్న నా వాళ్ళు వీరులు. అంతేకాదు. రాజ్యాలున్న వాళ్ళు. భాగ్యాలున్న వాళ్ళు. ధనమున్న వాళ్ళు. అయినా ధనంపై వారి కున్న ఆశను త్యజించారు. ధనాన్ని విడిచిపెట్టి *(ధనాని త్యక్త్వా)* తగాదాకు వచ్చారు. ఇప్పుడు తాను యుద్ధం చేసి ధనాన్ని సంపాదించి బావుకొనే దేముంటుంది? రాజ్యభోగాలు వీరి తోనే కదా కలసి అనుభవించాలి? వాటిని త్యజించే కదా వాళ్ళందరూ రణభూమిలో ఉన్నారు? ఇక రాజ్య మెందుకు? భోగా లెందుకు? రాజ్య భోగాల కొరకు రణ మెందుకు? సరే. ఇంతకీ ఆ తన వాళ్ళు ఎవరో చెబుతున్నాడు, చూద్దాం.

ఆచార్యాః పితరః పుత్రా స్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సమ్బన్ధిన స్తథా ॥ 34

ఆచార్యాః-పితరః-పుత్రాః-తథా-ఏవ-చ-పితామహాః
మాతులాః-శ్వశురాః-పౌత్రాః-శ్యాలాః-సంబంధినః-తథా

ఆచార్యాః	=	గురువులు	శ్వశురాః	=	మామలు
పితరః	=	తండ్రులు	పౌత్రాః	=	మనుమలు
పుత్రాః	=	కుమారులు	శ్యాలాః	=	బావలు
తథా ఏవ చ	=	అలాగు ననే	తథా	=	అట్లే
పితామహాః	=	తాతలు	సంబంధినః	=	చుట్టాలు
మాతులాః	=	మేనమామలు			

వాళ్ళెవరంటే - గురువులు, తండ్రులు, కొడుకులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమళ్ళు, బావలు - ఒక్క మాటలో చెప్పాలంటే చుట్టా లందరూ.

వ్యాఖ్య

తాను యుద్ధం చేసేది ఎవరి కొరకని అర్జునుడు భావిస్తున్నాడో, ఎవరు చనిపోతే, రాజ్యం లభించినా సుఖం ఉండదని చింతిస్తున్నాడో వాళ్ళను గూర్చి చెబుతున్నాడు.

ద్రోణుడు, కృపుడు మొదలైన గురువులు, సొమదత్తి మొదలైన తండ్రులు, లక్ష్మణ అభిమన్యాది కుమారులు, భీష్ముడు, సోమదత్తుడు మొదలైన తాతలు, శైబ్యుడు, ద్రుపదుడు మొదలైన మామలు, కుంతిభోజుడు, శకుని మొదలైన మేనమామలు, జయద్రథుడు మొదలైన బావలు, భీమ దుర్యోధన దుశ్శాసనాది సోదరులు - అందరూ వీళ్ళే. అర్జునుడికి వీళ్ళే కనిపిస్తున్నారు. మనస్సులో ఉన్న వాళ్ళే బయట కనిపిస్తున్నారు. వాస్తవానికి యుద్ధభూమిలో వీళ్ళే కాదు. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం నిలబడి ఉంది. వాళ్ళెవ్వరినీ ప్రస్తావించడం లేదు. వీరుడైన అర్జునుడు కాదు ప్రస్తుతం మాట్లాడేది. మమకారం బరి తెగించి మాట్లాడుతోంది. కట్లు త్రెంచుకొని పరుగిడుతోంది.

ఏతా న్న హన్తు మిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక్య రాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥ 35

ఏతాన్-న-హన్తుం-ఇచ్ఛామి-ఘ్నతః-అపి-మధుసూదన
అపి-త్రైలోక్య రాజ్యస్య-హేతోః-కిం-ను-మహీకృతే

ఏతాన్	=	వీరిని	ఇచ్ఛామి	=	కోరుట
ఘ్నతః అపి	=	చంపుతున్న వారైనా	న	=	లేదు
హంతుం	=	హింసించుటకు	మధుసూదన	=	హే మధుసూదనా!
త్రైలోక్య రాజ్యస్య	=	త్రిలోకాధిపత్యము	మహీకృతే	=	భూమి కొరకు
హేతోః అపి	=	కొరకు గాని	ను కిమ్	=	ఎలా కోరను?

ముల్లోకాల రాజ్యాధిపత్యము వచ్చి పడినా నేను వీళ్ళ నెవ్వరినీ చంపలేను. ఇక భూమి కోసం చంపుతానా? మధుసూదనా! ఒకవేళ వీళ్ళల్లో ఎవరైనా నన్ను చంపాలని ప్రయత్నించినా, నేను మాత్రం వాళ్ళను చంపను.

వ్యాఖ్య

సరే. అర్జునుడు కరుణా హృదయుడు. బంధువులను వధించలే నని బాధ పడుతున్నాడు. అలాగని,

దుర్యోధనాదులు వదిలి పెడతారా? అర్జునుడు చంపడం మానేసినా, వాళ్ళు విజృంభించి అర్జునుని వధించరా? ఆ మాత్రం సాహసం చేయలేని వాళ్ళా?

బాల్యం నుండి వాళ్ళు చేసిందంతా అదే కదా! భీముణ్ణి గంగలో ముంచలేదా? లక్క ఇంటికి నిప్పు పెట్టలేదా? విష ప్రయోగం చేయలేదా? ఈ కార్యాల వెనుక ప్రేమ లున్నాయా? మమకారా లున్నాయా? ఇన్ని చేసిన వాళ్ళు ఈ రోజు వారిని విడిచి పెడతారా? కారుణ్యంతో అర్జునుడు వారిని కనికరించినా, కాఠిన్యంతో అర్జునాదుల్ని మట్టు బెట్టే ప్రయత్నం చేయరా?

అది నిజమే. అయినా ఫరవాలేదు అంటున్నాడు అర్జునుడు. వాళ్ళు నన్ను చంపితే చంపనీ. నేను మాత్రం వాళ్ళను వధించను అంటున్నాడు (*ఏతాన్ న హన్తుం ఇచ్ఛామి ఘ్నతోఽపి*). తన వాళ్ళు, మన వాళ్ళు అనే మమకారం లేకుండా వాళ్ళు ప్రవర్తిస్తే అది వాళ్ళ వ్యవహారం. వాళ్ళు అలా వ్యవహరిస్తున్నా రని నేనెందుకు అలా వర్తించాలి? అనేది అర్జునుని ఆంతర్యం.

స్వర్గలోకము, మానవ లోకము, పాతాళము - ఇవే త్రిలోకములు. ఈ మూడు లోకాల రాజ్యాధిపత్యాన్ని ఇచ్చినా, తన వాళ్ళను వధించడం సాధ్యం కాదు. అలాంటప్పుడు భూలోకంలో ఏదో కొద్దిపాటి రాజ్యం కొరకు వధించడం సాధ్యమా? అనేది అర్జునుని వాదము.

ఇంతవరకు ఇహలోక సంబంధమైన సుఖాల కొరకు తన వారిని వధించడం సాధ్యం కాదని వాదించిన విజయుడు, ఈ శ్లోకం నుండి పరలోక సుఖాల కొరకు కూడా యుద్ధం చేయ లేనని చెబుతున్నాడు.

నిహత్య ధార్తరాష్ట్రా న్నః కా ప్రీతిః స్యా జ్జనార్దన ।
పాప మేవా శ్రయే దస్మా న్హత్వైతా నాతతాయినః ॥ 36

నిహత్య-ధార్తరాష్ట్రాన్-నః-కా-ప్రీతిః-స్యాత్-జనార్దన
పాపం-ఏవ-ఆశ్రయేత్-అస్మాన్-హత్వా-ఏతాన్-ఆతతాయినః

జనార్దన	=	హే జనార్దనా!	ఆతతాయినః	=	దురాత్ములైన
ధార్తరాష్ట్రాన్	=	ధృతరాష్ట్రుని కొడుకుల్ని	ఏతాన్	=	వీరిని
నిహత్య	=	చంపితే	హత్వా	=	చంపి
నః	=	మాకు	అస్మాన్	=	మమ్ములను
కా	=	ఏమి	పాపమేవ	=	పాపమే
ప్రీతిః	=	సంతోషము	ఆశ్రయేత్	=	ఆశ్రయిస్తుంది
స్యాత్	=	కలుగును?			

జనార్దనా! ధృతరాష్ట్రుని బిడ్డల్ని చంపితే మా కేమి సుఖం? వాళ్ళు పాపాత్ములు. పాపుల్ని చంపితే, మమ్మల్ని కూడా పాపమే చుట్టుకుంటుంది.

వ్యాఖ్య

దుర్యోధనాదులను వధించి సుఖించే దేముంటుంది? అనేది అర్జునుని ప్రశ్న. యుద్ధంలో దుష్టుడైన దుర్యోధనుడు ఒక్కడే లేడు. అతనికి సహకరించే వీరులు అనేక మంది వచ్చి ఉన్నారు. వారిలో ధర్మాత్ములు కూడా ఉన్నారు. ఈ సంగ్రామంలో వాళ్ళు నశించే ప్రమాదం కూడా ఉంది.

ఇకపోతే, కౌరవ సైన్యము కూడా పాండవ సైన్యములో కొందరిని సంహరించ వచ్చు. ఈ విధంగా

1-9

ఉభయ పక్షాలలో ఉత్తములైన వారు ఎందరో హతులయ్యే ప్రమాదం ఉంది. అదే జరిగితే, ఇహ లోకంలో మనం పరితపించక తప్పదు. పరలోకంలో పాప ఫలితాన్ని అనుభవించక తప్పదు. దుర్యోధనాదులు ఆతతాయులే. ఆ విషయంలో సందేహము లేదు. కాని, మనం అందరినీ వదలి ఆతతాయుల్ని మాత్రమే చంపలేము కదా! కనుక ఆతతాయుల్ని వధించడంలో దుష్టులే గాక పుణ్యాత్ములు, అమాయకులు కూడా వధింపబడే ప్రమాదం ఉన్నందున, ఆతతాయుల్ని వధించడంలో తమకు పాపమే చుట్టుకుంటుంది అనేది అర్జునుని వాదము. పాపము అనేది నేడు చేసినా, పాప ఫలాన్ని ఏదో ఒకనాడు, ఎక్కడో ఒక చోట అనుభవించక తప్పదు అనే జన్మాంతర పాపపుణ్యాలను కూడా స్పృశిస్తూ, పరలోక అనుభవాలను కూడా తెర పైకి తెచ్చాడు పార్థుడు. ఇంతకీ ఆతతాయులు అంటే ఎవరు?

అగ్నిదో గరద శ్చైవ శస్త్రపాణి ర్ధనాపహృత్
క్షేత్ర దార హరశ్చైవ షడేతే హ్యేతతాయినః ॥

ఇంటికి నిప్పు పెట్టేవాడు (*అగ్నిద*), విషం పెట్టేవాడు (*గరద*), మారణాయుధాలు ధరించే వాడు (*శస్త్రపాణి*), పరుల ధనాన్ని అపహరించే వాడు (*ధనాపహృత్*), ఇతరుల భూములను ఆక్రమించే వాడు (*క్షేత్ర హరః*), అన్యుల భార్యలను అవమానించే వాడు, లేదా అపహరించే వాడు (*దారహరః*). ఈ ఆరు మందిని ఆతతాయులు అంటారు. వీరు వధార్హులే అని శాస్త్రము నిర్ధారణ చేసింది.

పైన తెలిపిన ఆరు దోషాలలో ఏ ఒక్కటి ఉన్నా అట్టి ఆతతాయి వధార్హుడు. కాని, దుర్యోధనాదులు ఈ ఆరు దోషాలనూ పూర్ణంగా కలిగి ఉన్నారు. (1) లక్క ఇంటికి నిప్పు పెట్టారు. (2) భీముడిపై విష ప్రయోగం చేశారు. (3) శస్త్రాలు ధరించి అరణ్యవాసంలో ఉన్న పాండవుల్ని మట్టు పెట్టాలని చూశారు. (4) పాండవుల ఐశ్వర్యాన్ని అపహరించారు. (5) ధర్మబద్ధంగా పాండవులకు రావలసిన భూమిని కాజేశారు. (6) పాండవుల పట్టమహిషి అయిన ద్రౌపదిని అవమాన పరచారు. ఈ ఆరు దోషాలు కలిగిన దుర్యోధనాదులను కేవలం ఆతతాయులని కాదు; నికృష్ట ఆతతాయులు అని పిలవాలి.

ఒక వైపు కౌరవులను ఆతతాయులు అంటూనే, మరో వైపు వధార్హు లైన ఆతతాయులను చంపితే పాపము అంటుతుందని అర్జునుడు విచిత్రంగా వాదిస్తున్నాడు. పాపాత్ముల్ని చంపితే పాపము వచ్చే టట్లైతే, పుణ్యాత్ముల్ని చంపితే పుణ్యం వస్తుందా? అర్జునుని భావం అది కాదు. పాపి ఎలాగూ పాపం చేస్తాడు. పాపి విషయంలో కూడా ధర్మాత్ములు పాపం చేయ కూడదు (*న పాపే ప్రతిపాపః స్యాత్*) అనేదే పుణ్యాత్ముడైన అర్జునుని అభిప్రాయం.

తస్మా న్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రా న్స్వబాంధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ 37

తస్మాత్-న-అర్హాః-వయం-హంతుం-ధార్తరాష్ట్రాన్-స్వబాంధవాన్
స్వజనం-హి-కథం-హత్వా-సుఖినః-స్యామ-మాధవ

మాధవ	=	కృష్ణా!	అర్హాః న	=	అర్హులము కాము
తస్మాత్	=	అందువలన	స్వజనం	=	తన వారిని
వయం	=	మేము	హత్వా	=	చంపుకొని
స్వబాంధవాన్	=	బంధువులైన	కథం	=	ఏ విధముగా
ధార్తరాష్ట్రాన్	=	ధృతరాష్ట్రుని సంతానాన్ని	సుఖినః	=	సుఖవంతులము
హంతుం	=	చంపుటకు	స్యామ హి	=	కాగలము

కృష్ణా! బంధువు లైన ధృతరాష్ట్రుని బిడ్డల్ని చంపడం మా వల్ల కాదు. మాధవా! తన వాళ్ళను చంపుకొని ఎవరైనా ఎలా సుఖపడ గలరు?

వ్యాఖ్య

ధర్మము - మమకారము

ధర్మస్పృహతో అర్జునుడు రణరంగంలో ప్రవేశించాడు. యుద్ధభూమిలో స్వజనుల్ని చూచిన తరువాత అతని మనస్సును మమకారం చుట్టుకొంది. మరీ గట్టిగా పట్టుకుంది. మమకారాన్ని తట్టుకోలేక ధర్మం మరుగున పడి పోయింది. ధర్మానికి, మమకారానికి మధ్య ఘర్షణ ప్రారంభ మైంది. ప్రస్తుతం మమకారానిదే పై చేయిగా నిలిచింది. స్వజనుల్ని చంపడం పాపం కనుక, ఇహలోక సుఖాలే కాదు, పరలోక సుఖాలు కూడా తమకు మిగలవు అనేది అర్జునుని ఉద్దేశ్యం.

ప్రతి కర్మకు ఫలితం ఉంటుంది. స్థూల కర్మకు స్థూల ఫలితం ఉన్నప్పుడు, సూక్ష్మ కర్మకు సూక్ష్మ ఫలితం ఉండాలి కదా! స్వజనుల్ని వధించడం స్థూలకర్మ. దానికి ఫలితం రాజ్యం కావచ్చు. రాజ్యం సరే వస్తుంది. దానిని ఎవరితో కలసి అనుభవించాలి? ఎవరితో కలసి విజయోత్సవాలు జరుపు కోవాలి? స్వజనుల్ని వధించి సాధించిన రాజ్యంలో జరుపుకొనే ఉత్సవాలలో ఉత్సాహాలు కూడా ఉంటాయా?

అయ్యో! ఆతతాయులనే గాక అమాయకుల్ని, సుజనులైన స్వజనుల్ని కూడా చంపుకున్నామే! అనే బాధను మరచి పోగలమా? ఇలా దుఃఖించడం దృష్టఫల మైతే, వారిని చంపాలి అనే భావన ఏదైతే యుద్ధానికి ముందే మనస్సులో ఉందో, అది సూక్ష్మకర్మ. స్థూలకర్మకు స్థూల ఫలిత మున్నట్లే, సూక్ష్మకర్మకు సూక్ష్మ ఫలితం ఉంటుంది. ఆతతాయుల్ని చంపడం పుణ్య మైతే, దానికి ఫలితంగా పుణ్య లోకాలకు ద్వారాలు తెరుచుకో వచ్చు. కాని, కేవలం ఆతతాయుల్నే కాదు కదా యుద్ధంలో వధించేది? సజ్జనులు కూడా చనిపోతారు. ఆతతాయుల్ని చంపడం వల్ల పుణ్యం ప్రాప్తిస్తే, అమాయకుల్ని, సుజనుల్ని వధించడం వల్ల పాపం సంభవించి నరకం ప్రాప్తిస్తుంది. కనుక బంధువుల్ని చంపడానికి మేము సిద్ధంగా లేము అంటున్నాడు. స్వజనుల్ని చంపుకొని, ఆ తరువాత సుఖించే దేముంటుంది అని ప్రశ్నిస్తున్నాడు.

కౌరవులు పాండవులకు స్వజను లైతే, పాండవులు మాత్రం కౌరవులకు స్వజనులు కారా? మరి, వాళ్ళు యుద్ధాన్ని ఎందుకు విరమించు కోవడం లేదు? ఈ ఆలోచన వారికి ఎందుకు రాలేదు? అనే ప్రశ్నకు కూడా సమాధానం చెబుతున్నాడు సవ్యసాచి.

యద్య ప్యేతే న పశ్యన్తి లోభోపహత చేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38

యద్యపి-ఏతే-న-పశ్యంతి-లోభోపహత చేతసః
కులక్షయకృతం-దోషం-మిత్రద్రోహే-చ-పాతకం

లోభోపహత చేతసః	=	లోభము చేత చెదరగొట్ట బడిన మనస్సు గల	మిత్రద్రోహే	=	మిత్ర ద్రోహము వలన కలుగు
ఏతే	=	వీరు	పాతకం చ	=	పాపమును
కులక్షయ కృతం	=	కులనాశము వలన కలుగు	పశ్యంతి	=	చూచుట
దోషం	=	చెడును	యద్యపి న	=	లేక పోయినా

కులం నశిస్తే కలిగే చెడు ఏమిటో, మిత్ర ద్రోహము వల్ల ఏర్పడే పాతక మెలాంటిదో వాళ్ళకు కనిపించక పోవచ్చు. వారికి రాజ్యమే కావాలి. అంతా లోభమే.

వ్యాఖ్య

తెలివి - వెలితి

యుద్ధంలో స్వజనులు మరణిస్తారు. దాని వలన కుల నాశము జరుగుతుంది. స్వజనులే కాదు, సుహృత్తులు కూడా చనిపోతారు. అది మిత్రద్రోహ మవుతుంది. ఈ ఆలోచన అర్జునునికే ఎందుకు వచ్చింది? అర్జునుని పరిస్థితిలో దుర్యోధనాదులు కూడా ఉన్నారు కదా! వాళ్ళెందుకని అలా ఆలోచించడం లేదు. వాళ్ళకు ధర్మాలు తెలియవా? వివేకము లేదా? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. వారికి ధర్మాలు తెలిసినా ప్రయోజనం లేదు. వాళ్ళ తెలివిలో ఒక వెలితి ఉంది. అదే లోభము. వాళ్ళ తెలివిని లోభం తినేసింది. అమాంతం మ్రింగేసింది. అందుకే వాళ్ళను లోభోపహత చేతసులు అంటున్నాడు అర్జునుడు.

లోభం మనిషి చేత ఏ పాపా న్నైనా చేయిస్తుంది. లోభికి లాభమే ప్రధానం, ధర్మం కాదు. లోభం గురువుల్ని గుర్తించదు. బంధువుల్ని ప్రేమించదు ***(అర్థాతురాణాం న గురుః న బంధుః)***. దుర్యోధనాదులు రాజ్య లోభంతో పాడై పోయారు. అందువల్ల కులక్షయం వల్ల కలిగే దోషాన్ని వాళ్ళు పట్టించుకో లేదు. అందుకే కదా పాండవుల్ని లక్క యింటిలో కరిగించేయా లని చూశారు! కులక్షయం వల్ల కలిగే దోషం తెలిస్తే అలా చేస్తారా? తెలియక కాదు. లోభము వారి బుద్ధిని నాశనం చేసింది.

సంధికి వెళ్ళిన అచ్యుతుని బంధించే ప్రయత్నం ఎవరైనా చేస్తారా? అది మిత్రద్రోహం కాదా? ఈ విషయం వాళ్ళకు తెలియదా? తెలుసు. కాని లోభం ముందు ధర్మాలు ఆవిరై పోయాయి. పుణ్యపాపాలు, ధర్మాధర్మాలు, ఇవేవీ పట్టించుకోరు లోభులు.

కావచ్చు. దుర్యోధనాదులు లోభులే కావచ్చు. మరి, ఆ వైపు భీష్మద్రోణులు కూడా ఉన్నారు కదా! వారు కూడా లోభులేనా? ధనాశ, రాజ్యకాంక్ష వారికి కూడా ఉన్నాయా? కులక్షయ దోషము, మిత్రద్రోహ పాతకము వారికి కూడా తెలియదా?

భీష్మద్రోణులు దుర్యోధనాదుల లాగా లోభోపహత చేతసులు కారు. దుర్యోధనాదుల బుద్ధుల్నే లోభం పాడు చేసింది. కాని, లోభంతో పాడై పోయిన దుర్యోధనుని అధీనంలో ఉండటం చేత, ధర్మస్పృహ కలవారే అయినా, ప్రస్తుతము ధర్మం విషయంలో భీష్మద్రోణులు అశక్తులై ఉన్నారు. కాని, అన్నీ తెలిసి లోభం తెలియని మనం పోరుకు దిగడ మేమిటి? అనేదే అర్జునుని వాదము.

యుద్ధం చేయడం తన వల్ల కావడం లేదు అంటూ ఇంత వరకు స్వజన ప్రియ వాదాన్ని వినిపించిన పార్థుడు, ఇక్కడి నుండి యుద్ధాన్నే ఆపి వేయాలి అనే ప్రయత్నంలో పడ్డాడు.

కథం న జ్ఞేయ మస్మాభిః పాపా దస్మా న్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భి ర్జనార్దన ॥ 39

కథం-న-జ్ఞేయం-అస్మాభిః-పాపాత్-అస్మాత్-నివర్తితుం
కులక్షయకృతం-దోషం-ప్రపశ్యద్భిః-జనార్దన

జనార్దన	= హే జనార్దనా!	దోషం	= దోషమును
కులక్షయకృతం	= కులనాశము వలన కలుగు	ప్రపశ్యద్భిః	= చక్కగా గ్రహించిన

అస్మాభిః	= మా చేత	కథం	= ఎలా
అస్మాత్	= ఈ	జ్ఞేయం	= తెలియ దగింది
పాపాత్	= పాపము నుండి	న	= కాదు
నివర్తితుం	= తొలగుటకు		

జనార్దనా! కులక్షయము వల్ల కలిగే దోష మేమిటో మనకు తెలుసు కదా! అలాంటప్పుడు ఈ పాపం నుండి మన మెందుకు తప్పించుకో కూడదు?

వ్యాఖ్య

స్వార్థమా? ధర్మమా?

యుద్ధాన్ని దుర్యోధనాదులు వాంఛించారు. వారిది లోభమే కావచ్చు. మరి అరణ్యవాస, అజ్ఞాతవాస కాలంలో మీరు మాత్రం యుద్ధాన్ని వాంఛించ లేదా? అది లోభం క్రిందికి రాదా? ఇకపోతే, దుర్యోధనుని అధీనంలో ఉన్న భీష్మద్రోణాదులు ధర్మస్పృహను త్యజిస్తే, యుద్ధాభిలాషులై వచ్చిన మీ పక్షం లోని ధర్మాత్ములు కూడా భీష్మద్రోణాదుల లాగే అశక్తులు కారా?

కానే కారు. దుర్యోధనునిది లోభం. అధర్మం. మాది అలోభం. ధర్మం. కనుక, లోభ జనిత పాపం మమ్మల్ని గాని, మా అధీనంలో ఉండే రాజుల్ని గాని అంటదు అనేదే అర్జునుని అభిమత మైతే; మరి అలాంటప్పుడు ధర్మం కోసం చేసే పోరాటములో దోషాలు, పాతకాలు ఎక్కడున్నాయి? ధర్మ నిర్వహణలో మమకారానికి చోటెక్కడుంది? అనేది మరో ప్రశ్న.

ధర్మబద్ధంగా రాజ్యం కావాలని మేము ఆశించాము. అధర్మంగా నైనా రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని దుర్యోధనుడు ఆరాట పడ్డాడు. ఉభయులమూ రణరంగానికి చేరాము. ఇక్కడ స్వజనుల్ని చూచిన తరువాత, మిత్రులను వీక్షించిన తరువాత మా మనస్సు మెత్త పడింది. లోభముతో పాడై పోయిన దుర్యోధనుని మనస్సు మారలేదు. మారలేదు కనుక అతడు మారణహోమం నుండి మరలి పోలేడు. కాని, ధర్మ మెరిగి, దయాగుణం కల మేమైనా రణాన్ని ఎందుకని విరమించు కోకూడదు? కులక్షయం వల్ల సంభవించే ప్రమాదాలు చాలా ఉన్నాయి అంటున్నాడు పాండునందనుడు.

కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽభిభవ త్యుత ॥ 40

కులక్షయే-ప్రణశ్యంతి-కులధర్మాః-సనాతనాః
ధర్మే-నష్టే-కులం-కృత్స్నం-అధర్మః-అభిభవతి-ఉత

కులక్షయే	= కులనాశము జరిగితే	కృత్స్నం	= సమస్తమైన
సనాతనాః	= అనాదిగా వస్తున్న	కులం	= కులమును
కులధర్మాః	= కుల ధర్మములు	అధర్మః	= అధర్మము
ప్రణశ్యంతి	= నశిస్తాయి	అభిభవతి ఉత	= వ్యాపించును కదా!
ధర్మే నష్టే	= ధర్మము నశిస్తే		

కులక్షయం జరిగితే, అనాదిగా, ఆచారంగా వస్తున్న కులధర్మాలు నశిస్తాయి. ధర్మం నశిస్తే, కులమును అధర్మం ఆక్రమిస్తుంది.

వ్యాఖ్య

కులక్షయం వల్ల అనాదిగా వస్తున్న ఆచారాలు నశిస్తాయి. అనాచారాలు, దురాచారాలు ప్రబలుతాయి. శాస్త్రాలు బోధించే ధర్మాలు పాండిత్యము ఉన్న వారికే తెలుస్తాయి. ఇవన్నీ శాస్త్ర ప్రబోధితాలు. అలా కాకుండా, సదాచారవంతులైన పెద్దలు బోధించే ధర్మాలు కులధర్మాలు. అట్టి సాంప్రదాయక ధర్మాల వలన కులంలో ధర్మ జీవనం కొన సాగుతుంది.

అయితే, యుద్ధంలో కులధర్మాలు తెలిసిన పెద్దలు నశించి పోతే, ఆ తరువాత కులధర్మాలు, సంప్రదాయాలు కనుమరు గవుతాయి. ధర్మజీవనం అడుగంటి పోతుంది. అధర్మం ప్రబలుతుంది. కులంలో అధర్మం పెచ్చు పెరిగితే ఆ తరువాత అంతా దోషయుత మవుతుంది. ఎలాగో చెబుతున్నాడు.

అధర్మాభి భవాత్ కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥ 41

అధర్మాభిభవాత్-కృష్ణ-ప్రదుష్యంతి-కులస్త్రియః
స్త్రీషు-దుష్టాసు వార్ష్ణేయ-జాయతే-వర్ణసంకరః

కృష్ణ	=	ఓ కృష్ణా!	వార్ష్ణేయ	=	కృష్ణా!
అధర్మాభిభవాత్	=	అధర్మము వ్యాప్తి చెందితే	స్త్రీషు దుష్టాసు	=	స్త్రీలు చెడిపోవుట వలన
కులస్త్రియః	=	కులాంగనలు	వర్ణసంకరః	=	వర్ణసంకరము
ప్రదుష్యంతి	=	చెడి పోతారు	జాయతే	=	కలుగుతుంది

కృష్ణా! అధర్మం వ్యాప్తి చెందితే స్త్రీలు పాడై పోతారు. స్త్రీలు చెడిపోతే వర్ణ సంకరం జరుగుతుంది.

వ్యాఖ్య

ఇంటి దీపం ఆరిపోతుంది

ధర్మం నశిస్తే కులమును అధర్మం ఆక్రమిస్తుంది (*అధర్మః అభిభవతి*) అని ముందు శ్లోకంలో చెప్పిన అర్జునుడు, అలా అధర్మము కులమును ఆక్రమిస్తూ వ్యాప్తి చెందడం వల్ల (*అధర్మ అభిభవాత్*) కులస్త్రీలు చెడి పోతారు (*ప్రదుష్యన్తి*) అంటున్నాడు.

గృహంలో ధర్మనిష్ఠను కొనసాగించే బాధ్యత, పరిరక్షించే సమర్థత రెండిటిని స్త్రీకే కట్టబెట్టింది సనాతన ధర్మం. కనుక గృహంలో ధర్మదీపాన్ని వెలిగించేది, ఆరిపోకుండా కాపాడేది స్త్రీ మూర్తియే.

ధర్మ ప్రజా సంపత్యర్థం స్త్రియ ముద్వహే

ధర్మ, సంతానముల సంపదను వాంఛించి నేను స్త్రీని వివాహము చేసుకుంటున్నాను అని వివాహానికి ముందే వరుడు ఈ పుణ్య సంస్కృతిలో వాగ్దానం చేస్తాడు. అంతేకాదు.

ఆవాభ్యాం కర్మాణి, ఆశ్రమ ధర్మ కర్మాణి కర్తవ్యాని, ప్రజా శ్చోత్పాదయితవ్యాః

ఇక మీదట మన మిద్దరము గృహస్థాశ్రమ ధర్మాలను చక్కగా ఆచరిస్తూ, అట్టి ధర్మాచరణ ఫలంగా చక్కని సంతానాన్ని పొందుదాము అని వరుడు వధువుతో చెబుతాడు.

వాస్తవానికి భార్య వల్లనే భర్త అన్ని విధాల అద్భుత ప్రయోజనాలను సాధిస్తాడు. అర్ధాంగి వల్లే భర్తకు

సర్వమూ సమకూరుతాయి అని ధర్మశాస్త్ర ప్రబోధము. (1) ఉత్తమ సంతానం (*అపత్యం*). (2) ధర్మ కార్యాచరణము (*ధర్మకార్యాణి*) (3) పతిసేవ (*శుశ్రూషా*). (4) ఉత్తమమైన రతి సుఖము (*రతి రుత్తమా*). (5)తనకు, తన పితృ దేవతలకు స్వర్గప్రాప్తి (*స్వర్గః పితౄణా మాత్మన శ్చహ*). ఇవన్నీ భార్యల వల్లనే భర్తలకు ప్రాప్తిస్తాయి. అందుచేత, సత్సంతానాన్ని ప్రసాదించి ఇటు భర్తకు, అటు భర్త పూర్వీకులకు మహోపకారం చేస్తున్న మహిళలు ఇంటికి మణిదీపాలు అన్నది మనుధర్మ శాస్త్రం.

ప్రజానార్థం మహాభాగా పూజార్హా గృహదీప్తయః
స్త్రియ శ్శ్రియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన ॥

సత్సంతానాన్ని అందించి, భర్తలకు మహోపకారం చేస్తున్న మహిళామూర్తులు భర్తల గృహాలకు మణిదీపాల వంటి వారు (అందుకే అర్ధాంగిని భార్యామణి అంటూ ఉంటారు). స్త్రీలు శ్రీమహాలక్ష్మి వంటి వారు కనుక పూజార్హులు అని ధర్మ శాస్త్రము స్త్రీని శ్లాఘించింది. ఇదంతా పూర్వపు రోజుల్లో హిందూ సమాజం నుండి స్త్రీ మూర్తులు అందుకున్న నీరాజనాలు.

ఇన్ని విధాల గృహాలను రక్షిస్తూ పురుషులను ఆదుకుంటున్న స్త్రీ మూర్తులను పురుషులు రక్షించాలి. ఆదుకోవాలి. పురుషుడు ధనాన్ని సంపాదించ వచ్చు. కాని, దానిని భద్రపరచే బాధ్యత, ఖర్చు చేసే యోగ్యత స్త్రీకే అప్పగించింది హిందూధర్మం.

అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్

పురుషుడు సంపాదించి తీసికొని వచ్చిన ధనమును ఇల్లాలే భద్ర పరచాలి. అవసరాన్ని బట్టి ఇల్లాలే ఖర్చు చేయాలి. భర్తకు అవసరం వచ్చినా భార్యనే అడిగి తీసుకోవాలి. ఈ విధంగా గృహస్థాశ్రమంలో విశిష్ట మైన విలువలు పరిరక్షింప బడ్డాయి.

ఈ విధంగా గృహాలను పరిరక్షిస్తున్న స్త్రీలను రక్షింప వలసిన బాధ్యత పురుషుల పైనే ఉంది. కాని, యవ్వనంలో ఉన్న పురుషులు లక్షలాది మంది కురుక్షేత్రంలో ఉన్నారు. యుద్ధంలో వారు మరణిస్తే, యువతులకు వైధవ్యం ప్రాప్తిస్తుంది. స్త్రీలను రక్షించే వారు లేకుండా పోతారు. అలాంటి అయోమయ పరిస్థితిలో స్త్రీలు అభద్రతలో పడిపోయి బలహీనతలకు తల వంచుతా రేమో! అదే జరిగితే, సాంఘిక సంక్షేమం కుంటు పడుతుంది. సమాజ అభ్యుదయం అడుగంటి పోతుంది. ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు పెద్దలు. ఇల్లాలికే భద్రత లోపిస్తే, ఇంటిదీపమే ఆరిపోతే, ఇక ఇల్లు ఎలా భద్రంగా ఉంటుంది? అంతా అభద్రతే. ఇదంతా యుద్ధ ఫలితమే నని అర్జునుని అభిమతం. కులస్త్రీలు అభద్రతలో పడి, గృహదీపాలు ఆరిపోతే వర్ణసంకరం ఏర్పడు తుందని భీతి చెందుతున్నాడు పార్థుడు. వంశనాశం ఇదే నేమో అని ఆందోళన చెందు తున్నాడు.

ఈ సందర్భంలో, శ్రీకృష్ణుని వార్ష్ణేయా! అని సంబోధించాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు వృష్ణి వంశమునకు చెందిన వాడు కనుక ఆయన వార్ష్ణేయుడు. ఈ సంబోధన ద్వారా అర్జునుడు శ్రీకృష్ణునికి రెండు సంకేతాలు పంపుతున్నాడు.

అయ్యా! శ్రీకృష్ణ మహాశయా! మాది కురువంశము. నీది వృష్ణివంశము. నీ కేమి? ఎన్నైనా చెబుతావు. రాలేది, కూలేది నా వంశమే కదా! అందుకే నేను ఆందోళన పడుతున్నా అనేది ఒక సంకేతము. అదేమిటయ్యా! అర్జునా! యుద్ధంలో మా వంశం వారు కూడా ఉన్నారు కదా! మాకూ నష్టమే కదా? అని శ్రీకృష్ణుడు అంటాడేమో నని, అందుకే చెబుతున్నానయ్యా అచ్యుతా! ఇద్దరికీ తంటాయే కనుక, వెంటనే బండి వెనక్కి తిప్పు. ఇద్దరం ఎవరింటికి వాళ్ళం పోదాము అనేది రెండవ సంకేతము.

అధర్మ వ్యాప్తి వల్ల కులస్త్రీలు చెడి పోతారు. వర్ణ సంకరం ఏర్పడుతుంది అని చెప్పిన అర్జునుడు ఆ వర్ణ సంకరము యొక్క ఫలితం ఎలా ఉంటుందో చెబుతున్నాడు.

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిణ్డోదకక్రియాః ॥ 42

సంకరః-నరకాయ-ఏవ-కులఘ్నానాం-కులస్య-చ
పతంతి-పితరః-హి-ఏషాం-లుప్త పిండోదకక్రియాః

సంకరః	= వర్ణసంకరము	ఏషాం	= వీరి యొక్క
కులఘ్నానాం	= కులమును చెడిపిన వారికి	పితరః	= పితరులు
కులస్య చ	= కులమునకు	లుప్తపిండోదక క్రియాః	= శ్రాద్ధతర్పణ క్రియలు లేనివారై
నరకాయ ఏవ	= నరకము కొరకే	పతంతి హి	= పతన మవుతారు

వర్ణసంకరము వల్ల కులానికి, కుల భ్రష్టులకు మిగిలేది నరకమే. అలాంటి వారి పితృ దేవతలు శ్రాద్ధ తర్పణాలకు కూడా నోచుకోరు. అధోగతి పాలవుతారు.

వ్యాఖ్య

అంతా పాపమయం

అధర్మం వ్యాప్తి చెందడం వల్ల ఏర్పడిన వర్ణ సంకరము నరకాన్ని అందిస్తుంది. కులాన్ని నాశనం చేసిన వారికి, ఆ వినాశంలో నశించకుండా మిగిలిన వారికి ఇరువురికీ నరకమే నంటున్నాడు నర నామధేయుడు.

అధర్మ వ్యాప్తికి, కుల నాశానికి, వర్ణ సంకరానికి కారకులైన వారికి ఎలాగూ నరకం ప్రాప్తిస్తుంది. అలా కాకుండా, వినాశములో నశించకుండా మిగిలిన వారు ఉంటారు కదా! వారికి కూడా నరకమే ప్రాప్తిస్తుంది అనేది అర్జుని అభిప్రాయం.

ధర్మం తెలిసిన వారు, కుల ధర్మాలను క్షుణ్ణంగా ఎరిగిన వారు యుద్ధంలో దివంగతు లౌతారు కనుక, మిగిలియున్న వారికి మార్గ నిర్దేశం చేసేవారు లేకుండా పోతారు. వీరు ఏది విహితమో, ఏది అవిహితమో ఎరుగరు కనుక కులధర్మాలను విస్మరించి పాపాన్ని సంపాదించు కుంటారు. ఇలా యుద్ధ కారణంగా అంతా పాపమయమై పోతుందని పార్థుని ఆవేదన.

పెద్దలు చిన్నబోతారు

కులమును నశింప చేసిన వారికి, కులధర్మాలు పాటించలేని అసమర్థులకు మాత్రమే కాదు నరకం ప్రాప్తించేది. పూర్వీకులు కూడా పిండోదకాలు అందక అధోగతి పాలవుతారు అంటున్నాడు అర్జునుడు.

కులములో పూర్వీకులు చేసిన పాపాలకు నిష్కృతిగా ఆ కులంలో జీవించి యున్న వారి సంతతి పిండోదకాలు సమర్పిస్తారు. ఈ విధంగా పితరుల ఋణాన్ని తీర్చుకుంటారు. గృహస్థాశ్రమ ధర్మంలో వివాహానికి ఇదొక ముఖ్య ప్రయోజనం.

వివాహస్య ఫలం దేవ పితృర్ణాఽ పకరణం

దేవ ఋణాన్ని, పితృ ఋణాన్ని పూర్తిగా తీర్చడమే వివాహానికి ఫలం. గడచిన మూడు తరాల లోని పితృ దేవతలు వారు జీవించి ఉన్నప్పుడు తెలిసో, తెలియకో, ఎన్నో పాపాలు చేసి ఉంటారు. ఆ పాపాలను తటస్థ

పరచి, గతించిన పితరులు యాతన లేకుండా సుఖించడానికి, వారి సంతతి వారు ప్రతి మాసము తర్పణాదులు నిర్వహిస్తారు. పిండోదకాలు సమర్పిస్తారు.

యుద్ధంలో పెద్ద లందరూ నశిస్తే, పిండోదకాలు పితరులకు అర్పించేవా రెవరుంటారు? చనిపోకుండా మిగిలి యున్న వాళ్ళు అర్పిస్తారు అనుకుందాము. వాళ్ళ కైనా విధి విధానాలు తెలిపే వాళ్ళెవ రుంటారు? ఈ విధంగా పితరులు పిండోదకాలు లేనివారై తీవ్ర యాతనను, దుఃఖాన్ని అనుభవిస్తారు. ఇదంతా యుద్ధ ఫలితమే కదా? అనేది పార్థుని ప్రశ్న.

చిరునామాలు చిక్కవు

కులస్త్రీలు రక్షణ లేక పాడైతే, వర్ణ సంకరము ఏర్పడుతుంది. అలాంటప్పుడు పిండోదకాలు సమర్పించే వారు ఎవరు? ఎవరు సమర్పించేవి ఎవరికి చెందుతాయి? అనేది చాలా సంక్లిష్ట మైన విషయం. బీజ ప్రదాతలు ఒకరు, పిండోదకాలు స్వీకరించే వారు వేరొకరు అయ్యేందుకు వీలు లేదు. ఎవరికి ఎవరు బీజప్రదాతలో, వారికే చెందుతాయి తత్సంబంధమైన పిండోదకాలు. ఇదంతా వర్ణ సంకరంలో అర్జునుడు చూస్తున్న గందరగోళం.

ఈ గందరగోళ మంతా గాండీవికే గాని గోవిందునికి లేనే లేదు. ఈ ప్రశ్న లన్నిటికీ సమాధానాలు గోవిందుని వద్ద ఉన్నాయి. ఈ చిక్కుముడు లన్నీ సాంఖ్యంలో వాటంతటవే విడి పోతాయి.

దోషై రేతైః కులఘ్నానాం వర్ణసంకర కారకైః ।
ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥ 43

దోషైః-ఏతైః-కులఘ్నానాం-వర్ణసంకర కారకైః
ఉత్సాద్యంతే-జాతిధర్మాః-కులధర్మాః-చ-శాశ్వతాః

ఏతైః	= ఈ	జాతిధర్మాః	= జాతిధర్మములు
వర్ణసంకర కారకైః	= వర్ణ సంకరమునకు కారణమైన	చ	= మరియు
దోషైః	= దోషముల చేత	కులధర్మాః	= కులధర్మములు
కులఘ్నానాం	=వర్ణసంకర మొనర్చిన వారి యొక్క	ఉత్సాద్యంతే	= నశించి పోతాయి
శాశ్వతాః	= శాశ్వతములైన		

ఈ విధంగా వర్ణ సంకరానికి కారకులైన వ్యక్తుల దోషం వల్ల, శాశ్వత మైన జాతిధర్మాలు, కులధర్మాలు నశించి పోతాయి.

వ్యాఖ్య

వర్ణసాంకర్యము సృష్టించిన పాపము వల్ల కులము కుప్ప కూలుతుంది. కుల నాశము వల్ల కులధర్మాలు దెబ్బ తింటాయి. జాతిధర్మాలు నశిస్తాయి. ధర్మాలు తెలిసిన తలలు యుద్ధంలో రాలి పోవడం చేత, తరతరాల నుండి అందుతూ వస్తున్న ఈ ధర్మాలు తరువాత తరాల వారికి అందకుండా పోతాయి. ఆచరించ వలసిన ధర్మాలను ఆచరించక పోవడం వల్ల పాపము సంక్రమిస్తుంది. అలాగే ఆచరించ కూడని అకృత్యాలను ఆచరించడం వల్ల కూడా నరకము ప్రాప్తిస్తుంది.

ఏది సామాన్య ధర్మము, ఏది విశేష ధర్మము, ఏది స్త్రీ ధర్మము, ఏది పురుష ధర్మము, అనేది ధర్మం తెలిసిన వాళ్ళ నుండే కదా మనం గ్రహించాలి! అలాంటి విశిష్ట వ్యక్తులను సంగ్రామంలో శాశ్వతంగా సాగ నంపితే, ఆ తరువాత ధర్మం విషయంలో కుటుంబాలకు, సమాజానికి మార్గనిర్దేశం చేసే వారు ఎవ రుంటారు?

ధర్మాన్ని రక్షించే దెలా? ధర్మాన్ని రక్షించలేక పోతే, ధర్మం చేత రక్షింపబడే దెలా? ఇన్ని అనర్థాలకు మూలమైన యుద్ధంలో పాల్గొని సాధించే దేముంటుంది? ఏదైనా ఉంటే, అది నరకమే నని తన అభిప్రాయం. తాను వినింది కూడా ఇదే అంటున్నాడు అర్జునుడు.

ఉత్పన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।
నరకే నియతం వాసో భవతీ త్యనుశుశ్రుమ ॥ 44

ఉత్పన్నకులధర్మాణాం-మనుష్యాణాం-జనార్దన
నరకే-నియతం-వాసః-భవతి-ఇతి-అనుశుశ్రుమ

జనార్దన	=జనార్దనా!	వాసః	=	నివాసము
ఉత్పన్న కులధర్మాణాం	=చెడిన కులాచారములు గల	భవతి	=	కలుగుతుంది
మనుష్యాణాం	=మనుష్యులకు	ఇతి	=	అని
నరకే	=నరకము నందు	అనుశుశ్రుమ	=	వింటున్నాము
నియతం	=అనివార్యంగా			

జనార్దనా! కులధర్మాలు పాడు చేసిన మనుష్యులకు నరకము తప్పనిసరి అని వింటున్నాము.

వ్యాఖ్య

బంధుజన నాశము, కులక్షయ దోషము, మిత్రద్రోహ పాతకము, జాతిధర్మ నాశము, అధర్మ వ్యాప్తి పితరుల అధోగతి - ఇలా ఇప్పటికే అర్జునుడు శ్రుతి మించిన రాగాన్ని వినిపించాడు. తన కున్న పాండిత్యాన్నంతా ప్రబలంగా, ప్రముఖంగా ప్రదర్శించాడు.

అర్జునుడు సదాచార గాడిలో పెరిగిన వాడు. శిష్టాచార సంప్రదాయంలో, క్రమశిక్షణతో, పెద్దల మార్గంలో నడచిన వాడు. ఇప్పుడు యుద్ధభూమిలో తనను ముంచిన మమకార మాయలో పడి, అధికుల ముందు అధిక ప్రసంగం చేశానని తనలో తాను శంకించు కున్నాడో ఏమో తెలియదు గాని, కులధర్మాలను పాడు చేసిన వారికి నరకవాసము తప్పదని పెద్దల ద్వారా విని ఉన్నాను (***అనుశుశ్రుమ***) అని అంటున్నాడు.

ఇహము లేదు - పరము మిగలదు

యుద్ధములో విజయాన్ని సాధిస్తే రాజ్యము వస్తుంది. కాని, బంధు జనము నశించడం వల్ల రాజ్యం వచ్చినా సుఖం ఉండదు. తన వాళ్ళు లేరు అనే బాధ, తన వాళ్ళను చంపుకొని రాజ్యభోగాలను అనుభవిస్తున్నా ననే వ్యథ మనిషిని క్రుంగదీస్తూ ఉంటాయి కనుక, ఇక బ్రతికినంత కాలము సుఖశాంతులు ఉండవు.

పోనీ, మరణించిన తరువాత స్వర్గాది ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయా అంటే, అదీ లేదు. కులక్షయానికి కారణం కావడం చేత నరకమే ప్రాప్తిస్తుంది గాని స్వర్గము లభించదు. ఇలా పెద్దల ద్వారా (***ఇతి శుశ్రుమ పూర్వేషాం***) తాను విని ఉన్నాడు. కనుక, యుద్ధం నుండి బయట పడలేక పోతే తనకు నరకమే గతి అని వాపోతున్నాడు విజయుడు.

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్య సుఖలోభేన హన్తుం స్వజన ముద్యతాః ॥ 45

అహో-బత-మహత్పాపం-కర్తుం-వ్యవసితాః-వయం
యత్-రాజ్యసుఖలోభేన-హంతుం-స్వజనం-ఉద్యతాః

యత్	= ఏ కారణము వలన	పాపం	= పాపమును
రాజ్యసుఖలోభేన	= రాజ్యసుఖము పై ఆశ చేత	కర్తుం	= చేయుటకు
స్వజనం	= బంధువులను	వయం	= మేము
హంతుం	= చంపుటకు	వ్యవసితాః	= ప్రయత్నించిన వాళ్ళ మయ్యాము
ఉద్యతాః	= ఉద్యమించామో	అహో బత	= అయ్యో!
మహత్	= గొప్పదైన		

బంధువుల్ని హతమార్చి, పాపాన్ని మూట గట్టుకోవడానికి నడుం బిగించాము. ఇదంతా రాజ్యసుఖాలపై ఆశ తోనే కదా! అయ్యో!

వ్యాఖ్య

రాజ్యభోగాలపై ఆశతో భీష్మద్రోణాది మహాత్ములను వధించ డానికి సాహసించామా? అని తనలో తాను క్రుంగి పోతున్నాడు ధనంజయుడు. ఒక వైపు తన మనసే తనను నిలదీస్తుంటే, మరో వైపు ఇదే విషయం రేపు ప్రజల నుండి అభియోగంగా వినవలసి వస్తుందేమో నని కూడా సంశయిస్తున్నాడు.

రాజ్య సుఖము ఎంత? పాపమే అంతా!

దారుణంగా పోరాడి, స్వజనుల్ని వధించి రాజ్యాన్ని పొంద వచ్చు. రాజ్య సుఖాలను అనుభవించ వచ్చు. ఎంతకాలం ఉంటుంది భోగానుభవము? దేహాలే శాశ్వతం కానపుడు రాజ్యాలు శాశ్వతమా? రాజ్య భోగాలు నిత్యమా? ఏదో కొంత కాలం అల్ప సుఖాలు అనుభవిస్తే అనుభవించ వచ్చు. ఆ తరువాత శాశ్వతంగా నరక కూపంలో పడి, దుర్భర దుఃఖాన్ని అనుభవించాలి కదా! రాజ్య లోభంతో ఇంత పాపాన్ని మూటకట్టు కుంటున్నామా? అని అర్జునుడు బాధతో నలిగి పోతున్నాడు. అంతేకాదు, ఈ విషయా లన్నీ యుద్ధభూమికి రాక ముందే ఎందుకని ఆలోచించలేక పోయాను? అని పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నాడు.

స్వల్ప కాలం రాజ్య సుఖాలు అనుభవించ డానికి స్వజనుల్నే చంపుకోవాలా? స్వజనులకు దూరమై, భారమైన హృదయాలతో అనుభవించే సుఖాలు ఎంతవరకు తృప్తి నిస్తాయి? ఇలాంటి ప్రశ్నలు అర్జునుని అంతర్యాన్ని కుదిపేస్తున్నాయి.

విచిత్ర మేమిటంటే, రాజ్య సుఖాభిలాష అనేది దుర్యోధనునికి సంబంధించిందే గాని అర్జునునికి సంబంధించింది కాదు. ధర్మస్పృహతో అర్జునుడు యుద్ధభూమికి వచ్చాడే గాని, రాజ్యలాభము కోసం కాదు. రాజ్య లోభము ఉండీ కాదు. మమకారం పీడిస్తూ ఉంటే, తాను యుద్ధానికి ఎందుకు వచ్చాడో కూడా మరచి పోతున్నాడు పార్థుడు.

యది మా మప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్ ॥ 46

యది-మాం-అప్రతీకారం-అశస్త్రం-శస్త్రపాణయః
ధార్తరాష్ట్రాః-రణే-హన్యుః-తత్-మే-క్షేమతరం-భవేత్

అప్రతీకారం	= ప్రతీకారము చేయని	శస్త్రపాణయః	= శస్త్రధారులైన
అశస్త్రం	= శస్త్రమును పట్టని	ధార్తరాష్ట్రాః	= దుర్యోధనాదులు
మాం	= నన్ను	రణే	= యుద్ధము నందు

హన్యుః యది	= చంపుదురేని	క్షేమతరం	= శ్రేయస్కరము
తత్	= అది	భవేత్	= అగును
మే	= నాకు		

నేను వాళ్ళను ఎదిరించను. ఆయుధాన్ని పట్టను. అయినా ధృతరాష్ట్రుని కొడుకులు ఆయుధాల్ని పట్టుకొని వస్తారా? యుద్ధంలో నన్ను చంపుతారా? అలాగే చంపనీ! అదే నాకు మంచిది.

వ్యాఖ్య

అర్జునుడు సరే వాళ్ళను వధించడు. అలాగని వాళ్ళు కూడా అర్జునుణ్ణి వధించకుండా ఉంటారా? ఇందుకు సమాధానంగా, ఆయుధాలు ధరించి కౌరవులను చంపడం కన్నా, నిరాయుధుడిగా ఉండి, వాళ్ళ చేతిలో చావడమే మంచిది అంటున్నాడు అర్జునుడు.

చంపడమా? చావడమా?

స్వజనుల్ని, పెద్దల్ని వధించి నరకానికి పోవడమా? లేక నిరాయుధులుగా నిలబడి శత్రువుల చేతిలో మరణించడమా? చంపి నరకానికి పోవడం కన్నా, చచ్చి నరక ప్రవేశాన్ని నివారించు కోవడమే మంచిది అని భావించాడు అర్జునుడు.

కదనరంగంలో కాలు మోపిన తరువాత ఆయుధాల్ని ధరించి పోరాడాలి. అది వద్దని భావించి నపుడు, ఆ తరువాత ప్రత్యామ్నాయంగా రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి, యుద్ధం నుండి పారి పోవడం. రెండు, నిరాయుధులుగా నిలబడి శత్రువుల చేతిలో హతులు కావడం. యుద్ధం నుండి పారిపోవడం పిరికితనం అనిపించు కుంటుంది కనుక, బ్రతికి పాప ఫలాన్ని అనుభవించడం కన్నా, పాప నివారణోపాయంగా మరణించడమే మేలు అనే నిర్ణయానికి వచ్చేశాడు అర్జునుడు. హింసతో విజయాన్ని సాధించడం కన్నా, అహింసా మార్గంలో మరణించడమే ఉత్తమ ధర్మంగా భావిస్తున్నాడు. యుద్ధంలో కొందరిని చంపి, ఆ తరువాత యుద్ధభూమి లోనో, లేదా రాజ్యాధికారము అనుభవించిన తరువాతనో చావడం కన్నా, ఎవరినీ చంపకుండా చావడమే శ్రేయోదాయకము అని అనుకుంటున్నాడు.

ఇక దుర్యోధనాదుల విషయ మంటారా? వారు ఇప్పటికే ఎన్నో పాపకార్యాలు చేసి ఉన్నారు. మా విషయంలో వారు చేసిన దురాగతాలు, దురితాలు దుస్తరాలు.

ఇప్పుడు నిరాయుధులుగా ఉన్న మమ్మల్ని చంపి, ఈ పాపం కూడా మూట కట్టుకో నివ్వండి. ధర్మస్పృహ కలిగిన అహింసావ్రతులం మేము. అధర్మయుతులు, హింసా ప్రవృత్తి కలవారు కౌరవులు.

సంజయ ఉవాచ :

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ । 47
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥

ఏవం-ఉక్త్వా-అర్జునః-సంఖ్యే-రథోపస్థే-ఉపావిశత్
విసృజ్య-సశరం-చాపం-శోకసంవిగ్నమానసః

అర్జునః	= అర్జునుడు	శోకసంవిగ్న మానసః	= దుఃఖము చేత చలించిన మనస్సు కలవాడై
ఏవం	= ఈ విధముగా	సశరం	= బాణంతో కూడా
ఉక్త్వా	= పలికి	చాపం	= ధనుస్సును

విసృజ్య	= విడిచి	రథోపస్థే	= రథము మధ్యలో
సంఖ్యే	= యుద్ధభూమిలో	ఉపావిశత్	= కూర్చున్నాడు

సంజయుడు చెబుతున్నాడు :

అర్జునుడు యుద్ధభూమిలో అలా మాట్లాడాడు. ధనుర్బాణాలను పడేశాడు. దుఃఖంతో కుమిలి పోయాడు. రథం మధ్యలో జారబడ్డాడు.

వ్యాఖ్య

పాపాచరణం కన్నా ప్రాణ త్యాగమే మంచిదని భావించింది అర్జునుని సున్నిత హృదయం. యుద్ధాన్ని త్యజించాలనే నిర్ణయానికి అర్జునుడు వచ్చేశాడు. ధనుర్బాణాలు ధరించి ఉన్నంత వరకు తనను యుద్ధం చేయ వలసిందిగా అందరూ వేధిస్తూనే ఉంటారు అని అభిప్రాయపడి, అంతకు ముందే చేజారి పోతున్న గాండీవాన్ని (*గాండీవం స్రంసతే హస్తాత్ - 30 వ శ్లో*) ఇప్పుడు ప్రయత్న పూర్వకంగా క్రింద పడేశాడు పార్థుడు.

ఉభయ సైన్యాలను వీక్షించాలని ఇంతవరకు రథంలో నిలబడి యున్న అర్జునుడు, దారుణ మైన దుఃఖంతో కదిలిపోతూ (*శోకసంవిగ్న మానసః*), ఇక నిలబడుటకు కూడా అశక్తుడై, రథోపస్థ ప్రదేశంలో జారబడ్డాడు.

అస్పష్ట అవగాహన

యుద్ధం చేసే ఆలోచన లేనపుడు అర్జునుడు యుద్ధరంగం నుండి వెళ్ళి పోకుండా అక్కడే ఎందుకు కూర్చుండి పోయాడు? యుద్ధం చేసే ఆలోచన లేదు కనుక నిలబడ్డవాడు కూర్చున్నాడు, బాగుంది. మరి విరమించి వెళ్ళేవాడు కూర్చో నవసరం లేదు కదా!

తన వాదనలో ఏదో స్పష్టత లోపించిందని అర్జునునికే అనిపిస్తోంది. తన భావాలతో తానే పూర్తిగా ఏకీభవించలేక పోతున్నాడు. అందుకే కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు ఏదైనా చెబుతాడేమో! తన అవగాహనలో లోపం ఉంటే సరి దిద్దుతా డేమో అని నిరీక్షిస్తున్నాడు.

స్థాన భ్రంశము

రథానికి ముందు భాగాన పల్లంగా ఉండే చోట సారథి కూర్చుంటాడు. సారథికి వెనుక భాగాన కొంత ఎత్తైన ప్రదేశంలో యోధుడు ఉంటాడు. యోధునికి వెనుక భాగాన పల్లంగా ఉండే చోట శస్త్రాస్త్రములను అందించే సేవకుడు ఉంటాడు. ఇవి పూర్వము యుద్ధరంగంలో రథములో వ్యక్తులు ఉండే ప్రదేశాలు.

ప్రస్తుతము అర్జునుడు తాను ఉండవలసిన చోట లేడు. యుద్ధము చేసే స్థితిలో లేనందున యోధుడు ఉండే ప్రదేశాన్ని త్యజించాడు. యోధుని వెనుక సేవకుడు కూర్చొనే ప్రదేశము రథోపస్థ ప్రదేశము. ధనుర్బాణాలను పడేసిన పార్థుడు రథోపస్థ ప్రదేశంలో కూర్చున్నాడు.

అర్జునుని ఈ విషాద స్థితిని సంజయుడు ధృతరాష్ట్రునికి విపులంగా వివరించి చెప్పాడు.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే అర్జున విషాదయోగో నామ ప్రథమోఽధ్యాయః

ఇతి	= ఈ విధంగా	శ్రీకృష్ణార్జున సంవాదే	= శ్రీకృష్ణార్జునుల సంవాదము నందు
శ్రీమత్భగవద్గీతాసు	= శ్రీమద్భగవద్గీత యందు	అర్జునవిషాదయోగః నామ	= అర్జున విషాదయోగము అనే పేరు గల
ఉపనిషత్సు	= ఉపనిషత్తుల యందు	ప్రథమః అధ్యాయః	= మొదటి అధ్యాయము
బ్రహ్మవిద్యాయాం	= బ్రహ్మవిద్య యందు		
యోగశాస్త్రే	= యోగశాస్త్రము నందు		

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు అర్జున విషాదయోగము అనే మొదటి అధ్యాయము.

వ్యాఖ్య

గీతా శాస్త్రము - వేదాంతము

వేదాంతము అంటే ఉపనిషత్తుల లోని విషయము. బ్రహ్మమును పొందునట్లు చేయునది ఉపనిషత్తు. కనుక, ఉపనిషత్తు అనునది గ్రంథ విషయమే గాక గ్రంథనామము కూడా.

ఉపనిషదితి బ్రహ్మవిద్యా

ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య. ఆత్మయే బ్రహ్మము అనే జ్ఞానాన్ని బోధించి, శోకాన్ని దాటించి, బ్రాహ్మీస్థితిని ప్రసాదించు చున్నది (***బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి***) కనుక అది ఉపనిషత్తు. అదే వేదాంతము.

ఉపనిషత్తుల సారమే భగవద్గీత. భగవద్గీతలో ఏడు వందల శ్లోకాలు ఉన్నాయి. (గీతలో ఇంకా అధికంగా శ్లోకాలు - ***ఖిల శ్లోకాః*** ఉన్నాయని కొందరు, ఉన్నవాటిలో కూడా కొన్ని ప్రక్షిప్తాలని మరి కొందరు చెప్పే మాటలు మాకు అసంగతాలు. అనామోదములు).

తం ధర్మం భగవతా యథోపదిష్టం వేదవ్యాసః సర్వజ్ఞః
భగవాన్ గీతాఖ్యైః సప్తభిః శ్లోకశతైః ఉపనిబబన్ధ ।

భగవంతుడు ఉపదేశించిన ధర్మాన్ని యథాతథంగా ఏడు వందల శ్లోకాలలో సర్వజ్ఞుడైన భగవాన్ వేదవ్యాస మహర్షి 'గీత' అనే నామంతో శ్లోకబద్ధం చేశాడు అన్నారు భగవాన్ శ్రీమచ్ఛంకర భగవత్పాదులు. శంకరుల మాటే మాకు శిరోధార్యం.

భగవద్గీత లోని అధ్యాయాలు, అలాగే శ్లోకాలు కూడా ఉపనిషత్తులే. ఎలాగైతే ఉపనిషత్తులు బ్రహ్మ విద్యను అనుగ్రహించి, శోకాన్ని దాటిస్తాయో, గీత కూడా అదే పని చేస్తుంది. బ్రహ్మవిద్యే కేంద్ర విషయం కావడం చేత గీత ఉపనిషత్తులతో సమానము.

అంతేకాదు. గీత లోని శ్లోకాలన్నీ ఉపనిషత్తులే అని చెప్పడం జరిగింది. ***భగవద్గీతాసు ఉపనిషత్సు*** అన్నారు. భగవంతుడు ప్రబోధించిన 'ఉపనిషత్తుల'లో అనే బహువచనం ఉన్నందున, ప్రతి శ్లోకము ఒక ఉపనిషత్తు, లేదా ఉపనిష త్ప్రతిపాదిత విషయం అని ప్రవచింప బడింది.

బ్రహ్మవిద్య - యోగశాస్త్రము

బ్రహ్మజ్ఞానమును ఉపదేశించునది బ్రహ్మవిద్య. యోగశాస్త్రము అంటే కర్మయోగ శాస్త్రము. ఒకటి నివృత్తి. మరొకటి ప్రవృత్తి. విడిపడ టానికి చేసే ప్రయత్నం నివృత్తి. లేని దానిని పొందటానికి చేసే ప్రయత్నం ప్రవృత్తి.

అంతఃకరణ శుద్ధికి ఉపకరించే కర్మయోగము ప్రవృత్తి. బంధ నివారణకు ఉపకరించే జ్ఞానయోగము నివృత్తి. సాంఖ్యులకు జ్ఞానయోగము, యోగులకు కర్మయోగము ఉపయుక్తములు. గీతాశాస్త్రము ఇటు బ్రహ్మవిద్య, అటు యోగశాస్త్రము, రెండిటిని ఉపదేశిస్తూ, పూర్ణశాస్త్రమై శోభిస్తోంది.

సంప్రదాయ రక్షణ

బ్రహ్మవిద్య ఊహాలకు, తర్కాలకు అందేది కాదు (***నైషా తర్కేణ మతిరాపనేయా***). ఆచార్యుని ఆశ్రయించి ఆయన అనుగ్రహము చేతనే జ్ఞానమును పొందాలి. అప్పుడే పొందిన జ్ఞానము ఫలవంత మవుతుంది (***ఆచార్యవాన్ పురుషో వేద ఆచార్యాద్ధైవ విద్యా విదితా సాధిష్ఠం ప్రాపత్ ఇతి***). కనుక విధి క్రమము ననుసరించి గురుదేవుని ఆశ్రయించాలి. ప్రశ్నించి తెలుసుకోవాలి. (***కశ్చిత్ గురుం బ్రహ్మనిష్ఠం విధివ దుపేత్య... ఇచ్ఛన్ పప్రచ్ఛ***). ఇది సంప్రదాయము. ఉపనిషత్తుల ద్వారా అందిన శిష్టాచార సంప్రదాయము.

సంప్రదాయమును విస్మరిస్తే జ్ఞానం అందదు. ఉపనిషత్తుల విషయాన్నే గీత ప్రతిపాదిస్తూ ఉంది కనుక గీత సంప్రదాయానికి భిన్నం కాకుండా ఉంది. ఉపనిషత్తులు గురుశిష్యుల సంవాద రూపంలో వినిపిస్తాయి. గీతా శాస్త్రము కూడా శ్రీకృష్ణార్జునుల (***గురుశిష్యుల***) సంభాషణ రూపంలో సాగింది.

యోగ శబ్దార్థము

భగవద్గీతలో పద్దెనిమిది అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కొక్క అధ్యాయానికి ఒక్కొక్క పేరు ఇవ్వబడింది.

ఈ నామధేయాలు మూలానికి సంబంధించినవా? లేక అధ్యాయాల లోని విషయాన్ని బట్టి ఆ తరువాత వచ్చిన వ్యాఖ్యాతలు ప్రత్యేకించి పెట్టినవా? అనే మీమాంస కూడా ఉంది. ఇదంతా యోగ శబ్దార్థం వల్లే వచ్చింది.

యోగః సన్నహనోపాయ ధ్యాన సఙ్గతి యుక్తిషు

యోగము - కవచాదులు (***సన్నహన***), ఉపాయములు (***ఉపాయ***), ధ్యానము (***ధ్యాన***), కలయిక (***సఙ్గతి***), కూర్పుట (***యుక్తిషు***). - ఇవన్నీ యోగమునకు అర్థములే. మరెన్నో అర్థాలు ఉన్నాయి. యోగము అంటే సంబంధము, యోగ్యత, ప్రయత్నము, ప్రాప్తి, చికిత్స అనే అర్థాలు కూడా ఉన్నాయి. యోగము చిత్తవృత్తి నిరోధ మని పతంజలి మహర్షి పారిభాషిక పద ప్రయోగంతో నిర్వచించాడు.

గీతా శాస్త్రము మహాభారతము - భీష్మ పర్వములో ఇరవై ఐదవ అధ్యాయము నుండి నలభై రెండవ అధ్యాయము వరకు వరుసగా పద్దెనిమిది అధ్యాయాలలో ఉంది. కనుక అధ్యాయాల చివర, వరుసగా ప్రథమోఽధ్యాయః, ద్వితీయోఽధ్యాయః, తృతీయోఽధ్యాయః . . . . అష్టాదశోఽధ్యాయః అని ఉండి ఉంటుంది. ఆ తరువాత, గీతా విద్వాంసులు యోగాల పేర్లను చేర్చి ఉంటారు.

నామ భేదం

యోగాలకు నామకరణం చేసిన వారు అనేకులు ఉన్నందు వల్లనే భారత ప్రతులలో ఉండే నామాలు, గీత అధ్యాయాల చివర ఉండే నామాలు వేరు వేరుగా ఉంటాయి.

ఆరవ అధ్యాయాన్ని ధ్యానయోగము అని కొందరు వ్రాస్తే, ఆత్మసంయమ యోగము అని కొందరు, ఆత్మయోగ మని కొందరు, స్వరూపయోగ మని కొందరు, అధ్యాత్మయోగ మని కొందరు వ్రాస్తారు. శంకర భాష్యానుసారం వచ్చే గ్రంథాలలో అభ్యాసయోగః అని ఉంటుంది.

అలాగే నాల్గవ అధ్యాయానికి జ్ఞానయోగ మని, అవతార యోగమని, కర్మబ్రహ్మార్పణ యోగమని - ఇలా ఎన్నో యోగ నామాలు ఇవ్వబడ్డాయి. వీటిని చూచి నపుడు వీటికి నామకరణం అనేక మంది చేసి ఉంటారు అనిపిస్తుంది. కాదు, చేశారనే వాస్తవం తెలుస్తుంది.

అసలు సంగతి

'సజ్గతి' అనే అర్థమే ఇక్కడ యోగ శబ్దార్థము. ఏ అధ్యాయాన్ని ఏ పేరుతో పిలిచినా నష్టం లేదు కాని యోగ శబ్దార్థమును సంగతిగా నిర్ణయించాలి. ఇదే అసలు సంగతి. సంగతి అంటే ఇక్కడ సంబంధము. సంబంధము అంటే విషయ సంబంధము; లేక విషయంతో సంబంధము.

ఆరవ అధ్యాయాన్ని ధ్యానయోగము అన్నా రనుకోండి. దాని అర్థ మేమిటి? ఆరవ అధ్యాయంలో ధ్యానమే విషయము అని అర్థము. అదే సంగతి. అంతే గాని ధ్యానాభ్యాసమునకు సంబంధించినది అని కాదు. అలా చూచి నపుడు, కర్మయోగము అంటే కర్మకు సంబంధించిన విషయం, భక్తి యోగము అంటే భక్తికి సంబంధించిన విషయం. అంతేగాని, భక్తి ఒక యోగమని, ధ్యానం ఒక యోగమని, విభూతి ఒక యోగమని, అనేక యోగాలను సృష్టించి, అవన్నీ అభ్యాస యుక్తము లని అర్థం చెప్పకూడదు. అలా చెబితే, ఏమవుతుంది? ఏమవుతుందా! గీత పద్దెనిమిది యోగాలను బోధించినట్లు అవుతుంది ***(వాస్తవానికి గీత బోధించింది రెండు యోగాలే).*** ఆ పద్దెనిమిది యోగాలను మనం అభ్యసించాలి అనే భాష్యాలు కూడా వినిపిస్తాయి. వినడానికి బాగానే ఉంటాయి. ఆచరణ వద్దకు వచ్చినపుడే గొంతులో వెలగపండు పడేది.

ఉదాహరణకి అర్జున విషాద యోగం అనే ఈ మొదటి అధ్యాయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? యోగ శబ్దాన్ని యోగ విశేషంగా గ్రహిస్తే, ధ్యానయోగ మంటే ధ్యానాభ్యాస మని, విషాదయోగ మంటే, విషాదాభ్యాసము అని అర్థం వస్తుంది. విషాదాన్ని అభ్యసించేది ఎలా? అంటే, విషాదానికి మనం ప్రయత్నించాలా? లేని విషాదాన్ని కొని తెచ్చుకోవాలా? అలాగే చెబుతున్నారు చాలా మంది. ఏడుపు లేనిదే వేడుక లేదని ప్రాసలు వేసి మరీ యతు లవుతున్నారు.

అర్జున విషాద యోగము అంటే అర్జున విషాదము అనే విషయమును వర్ణించుట అని భావము. అంతే. అంతకు మించి తీగ లాగ నవసరం లేదు. అన్ని అధ్యాయాలను కూడా ఇలాగే అర్థం చేసుకోవాలి.

అధ్యాయము

అధ్యాయః అంటే, అధ్యయనము, పాఠము, వేదాధ్యయనము, గ్రంథ భాగము అనే అర్థాలు ఉన్నాయి. ప్రథమోఽధ్యాయః అంటే ప్రథమ పాఠము అని గ్రహించ వచ్చు. గ్రంథములో ప్రథమ భాగము అని అర్థం చేసుకోవచ్చు.

అధ్యాయము అంటే, చదవడం అని, చదవ బడేది అని కూడా స్థూలంగా చెబుతారు. అంటే, ఒక అధ్యాయం తరువాత మరొక అధ్యాయాన్ని వరుసక్రమం లోనే చదవాలి అని కూడా తెలుస్తోంది. భగవద్గీతను అక్కడక్కడ, అలా అలా చదివే వారికి అంతంతే తెలుస్తూ ఉంటుంది. కొంత కొంతే అర్థ మవుతూ ఉంటుంది. గీతా శాస్త్రము పూర్ణ శాస్త్రము. కనుక గీతను పూర్ణం గానే అధ్యయనం చేయాలి. పద్దెనిమిది అధ్యాయాలను పూర్ణంగా అధ్యయనం చేసి నపుడే గీతాహృదయం సుస్పష్ట మౌతుంది. అధ్యయన ఫలం సిద్ధిస్తుంది.

ఓం

చైతన్య భగవద్గీత

అథ ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయము

సాంఖ్య యోగః - సాంఖ్య యోగము

ఇదేమిటి?

మనకు ఎన్నో అర్థమవుతూ ఉంటాయి. ఎన్నిటినో మనం అర్థం చేసుకొంటూ ఉంటాము. అయితే, వాటన్నిటి వెనుక ఉండేది జ్ఞానమే అని చెప్పలేము. అంత తెలిసిన వాడు ఇలా అయ్యా డేమిటి? అని కొన్ని సందర్భాలలో కొందరి విషయంలో మనమే వ్యాఖ్యానిస్తూ ఉంటాము. అదేదో అనూహ్యమైన పరిణామం అని భావించి అలా వ్యాఖ్యానిస్తామే గాని, అది వాస్తవాన్ని అర్థం చేసుకోలేని మన బుద్ధి లోపమే అని గ్రహించము.

ఇది నాకు ఇష్టము, అది అయిష్టము. ఇత నంటే నాకు ఇష్టము, అత నంటే అయిష్టము. ఇష్టాలైతే మనకు ఉన్నాయి. అవి ఎందుకు ఇష్టమో మనకు స్పష్టంగా తెలియదు. అలాగే, మనకు అయిష్టాలు కూడా చాలా ఉన్నాయి. అవి ఎందుకు అలా అయిష్టంగా మారాయో సహేతుకంగా మనం వివరించ లేము. అంతే కాదు. నేడు అయిష్టంగా ఉన్నవి నిన్న ఎందుకు ఇష్ట మయ్యాయో తెలియదు. నేడు ఇష్ట మైనవి రేపు ఎందుకు అయిష్టంగా మారుతాయో కూడా అర్థం కాదు.

ఇవన్నీ మన మనస్సులలో ఏర్పడిన తాత్కాలికమైన నిర్ణయాలు. ఈ నిర్ణయాల వెనుక ఎవరో లేరు. మన భావాలే ఉన్నాయి. మన అభిప్రాయాలే ఉన్నాయి. రాగాలే ఉన్నాయి. ద్వేషాలే ఉన్నాయి. కాని, విశాలమైన ఈ ప్రపంచం మన అభిప్రాయాలకు, మన భావాలకు అనుగుణంగా నడవదు. ధర్మచోదిత మైన ఈ విశ్వము మన రాగద్వేష సంగీతానికి అనువుగా గజ్జె కట్టి నాట్యం చెయ్యదు.

ఆంతర్యాలు - అలజడులు

మనకు తెలియకుండా మనలో ఏవేవో సమస్యలు ఉంటాయి. మనకు అర్థం కాకుండా మనలో ఎన్నో సంఘర్షణలు అవ్యక్తంగా ఉంటాయి. అదొక పూడిక తెలియని అగాధం. ఆ పూడికను మనం తీయలేము. అక్కడికి మనం ప్రయత్నించినా వెళ్ళలేము. అంత లోతుగా మనలో మనమే ఎలా త్రవ్వుకున్నామో, ఎంత బయట పడేసినా అర్థం కాదు. అవన్నీ అగాధాలు. అగోచరాలు. ఉన్నట్లు తెలియకుండా ఉంటాయి. లేనట్లే ఉంటాయి.

ఆంతర్యం ఎవరి దైనా ఇలాగే ఉంటుంది. విశ్లేషించినా అంతు చిక్కదు. విస్మరించినా దూరం కాదు. ఆంతర్యంలో సమస్య లన్నీ అవ్యక్తం గానే ఉంటాయి. అలా ఉండి మనలో భయాలను కదలిస్తూ ఉంటాయి. బాధల్ని సృష్టిస్తూ ఉంటాయి. మన ఆంతర్యం మనదే. మన తోనే ఉంటుంది. మన తోనే కలసి పుట్టింది. మనల్ని నేడున్న పరిస్థితికి తెచ్చింది అదే.

ఎంత తెలిసినా మనిషి సంతోషంగా ఉండలేక పోతున్నాడు అంటే, ఆ తెలిసింది ఏదో, అది అతడు సుఖపడటానికి సరిపోవడం లేదు అని అర్థము. అదంతా కూడా జ్ఞానమే. కాని, సమ్యక్ జ్ఞానం కాదు. పూర్ణజ్ఞానం కాదు. పూర్ణ జ్ఞానమే అయితే, మనిషికి ఆనందం దూరం కాకూడదు.

జీవితం లోని వాస్తవాలకు, మనం వాటిని అర్థం చేసుకొనే విధానానికి మధ్య ఏదో అంతరం ఉంది.

అలాగే నాల్గవ అధ్యాయానికి జ్ఞానయోగ మని, అవతార యోగమని, కర్మబ్రహ్మార్పణ యోగమని - ఇలా ఎన్నో యోగ నామాలు ఇవ్వబడ్డాయి. వీటిని చూచి నపుడు వీటికి నామకరణం అనేక మంది చేసి ఉంటారు అనిపిస్తుంది. కాదు, చేశారనే వాస్తవం తెలుస్తుంది.

అసలు సంగతి

'సఙ్గతి' అనే అర్థమే ఇక్కడ యోగ శబ్దార్థము. ఏ అధ్యాయాన్ని ఏ పేరుతో పిలిచినా నష్టం లేదు కాని యోగ శబ్దార్థమును సంగతిగా నిర్ణయించాలి. ఇదే అసలు సంగతి. సంగతి అంటే ఇక్కడ సంబంధము. సంబంధము అంటే విషయ సంబంధము; లేక విషయంతో సంబంధము.

ఆరవ అధ్యాయాన్ని ధ్యానయోగము అన్నా రనుకోండి. దాని అర్థ మేమిటి? ఆరవ అధ్యాయంలో ధ్యానమే విషయము అని అర్థము. అదే సంగతి. అంతే గాని ధ్యానాభ్యాసమునకు సంబంధించినది అని కాదు. అలా చూచి నపుడు, కర్మయోగము అంటే కర్మకు సంబంధించిన విషయం, భక్తి యోగము అంటే భక్తికి సంబంధించిన విషయం. అంతేగాని, భక్తి ఒక యోగమని, ధ్యానం ఒక యోగమని, విభూతి ఒక యోగమని, అనేక యోగాలను సృష్టించి, అవన్నీ అభ్యాస యుక్తము లని అర్థం చెప్పకూడదు. అలా చెబితే, ఏమవుతుంది? ఏమవుతుందా! గీత పద్దెనిమిది యోగాలను బోధించినట్లు అవుతుంది ***(వాస్తవానికి గీత బోధించింది రెండు యోగాలే).*** ఆ పద్దెనిమిది యోగాలను మనం అభ్యసించాలి అనే భాష్యాలు కూడా వినిపిస్తాయి. వినడానికి బాగానే ఉంటాయి. ఆచరణ వద్దకు వచ్చినపుడే గొంతులో వెలగపండు పడేది.

ఉదాహరణకి అర్జున విషాద యోగం అనే ఈ మొదటి అధ్యాయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? యోగ శబ్దాన్ని యోగ విశేషంగా గ్రహిస్తే, ధ్యానయోగ మంటే ధ్యానాభ్యాస మని, విషాదయోగ మంటే, విషాదాభ్యాసము అని అర్థం వస్తుంది. విషాదాన్ని అభ్యసించేది ఎలా? అంటే, విషాదానికి మనం ప్రయత్నించాలా? లేని విషాదాన్ని కొని తెచ్చుకోవాలా? అలాగే చెబుతున్నారు చాలా మంది. ఏడుపు లేనిదే వేడుక లేదని ప్రాసలు వేసి మరీ యతు లవుతున్నారు.

అర్జున విషాద యోగము అంటే అర్జున విషాదము అనే విషయమును వర్ణించుట అని భావము. అంతే. అంతకు మించి తీగ లాగ నవసరం లేదు. అన్ని అధ్యాయాలను కూడా ఇలాగే అర్థం చేసుకోవాలి.

అధ్యాయము

అధ్యాయః అంటే, అధ్యయనము, పాఠము, వేదాధ్యయనము, గ్రంథ భాగము అనే అర్థాలు ఉన్నాయి. ప్రథమోఽధ్యాయః అంటే ప్రథమ పాఠము అని గ్రహించ వచ్చు. గ్రంథములో ప్రథమ భాగము అని అర్థం చేసుకోవచ్చు.

అధ్యాయము అంటే, చదవడం అని, చదవ బడేది అని కూడా స్థూలంగా చెబుతారు. అంటే, ఒక అధ్యాయం తరువాత మరొక అధ్యాయాన్ని వరుసక్రమం లోనే చదవాలి అని కూడా తెలుస్తోంది. భగవద్గీతను అక్కడక్కడ, అలా అలా చదివే వారికి అంతంతే తెలుస్తూ ఉంటుంది. కొంత కొంతే అర్థ మవుతూ ఉంటుంది. గీతా శాస్త్రము పూర్ణ శాస్త్రము. కనుక గీతను పూర్ణం గానే అధ్యయనం చేయాలి. పద్దెనిమిది అధ్యాయాలను పూర్ణంగా అధ్యయనం చేసి నపుడే గీతాహృదయం సుస్పష్ట మౌతుంది. అధ్యయన ఫలం సిద్ధిస్తుంది.

ఓం

చైతన్య భగవద్గీత

అథ ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయము

సాంఖ్య యోగః - సాంఖ్య యోగము

ఇదేమిటి?

మనకు ఎన్నో అర్థమవుతూ ఉంటాయి. ఎన్నిటినో మనం అర్థం చేసుకొంటూ ఉంటాము. అయితే, వాటన్నిటి వెనుక ఉండేది జ్ఞానమే అని చెప్పలేము. అంత తెలిసిన వాడు ఇలా అయ్యా డేమిటి? అని కొన్ని సందర్భాలలో కొందరి విషయంలో మనమే వ్యాఖ్యానిస్తూ ఉంటాము. అదేదో అనూహ్యమైన పరిణామం అని భావించి అలా వ్యాఖ్యానిస్తామే గాని, అది వాస్తవాన్ని అర్థం చేసుకోలేని మన బుద్ధి లోపమే అని గ్రహించము.

ఇది నాకు ఇష్టము, అది అయిష్టము. ఇత నంటే నాకు ఇష్టము, అత నంటే అయిష్టము. ఇష్టాలైతే మనకు ఉన్నాయి. అవి ఎందుకు ఇష్టమో మనకు స్పష్టంగా తెలియదు. అలాగే, మనకు అయిష్టాలు కూడా చాలా ఉన్నాయి. అవి ఎందుకు అలా అయిష్టంగా మారాయో సహేతుకంగా మనం వివరించ లేము. అంతే కాదు. నేడు అయిష్టంగా ఉన్నవి నిన్న ఎందుకు ఇష్ట మయ్యాయో తెలియదు. నేడు ఇష్ట మైనవి రేపు ఎందుకు అయిష్టంగా మారుతాయో కూడా అర్థం కాదు.

ఇవన్నీ మన మనస్సులలో ఏర్పడిన తాత్కాలికమైన నిర్ణయాలు. ఈ నిర్ణయాల వెనుక ఎవరో లేరు. మన భావాలే ఉన్నాయి. మన అభిప్రాయాలే ఉన్నాయి. రాగాలే ఉన్నాయి. ద్వేషాలే ఉన్నాయి. కాని, విశాలమైన ఈ ప్రపంచం మన అభిప్రాయాలకు, మన భావాలకు అనుగుణంగా నడవదు. ధర్మచోదిత మైన ఈ విశ్వము మన రాగద్వేష సంగీతానికి అనువుగా గజ్జె కట్టి నాట్యం చెయ్యదు.

ఆంతర్యాలు - అలజడులు

మనకు తెలియకుండా మనలో ఏవేవో సమస్యలు ఉంటాయి. మనకు అర్థం కాకుండా మనలో ఎన్నో సంఘర్షణలు అవ్యక్తంగా ఉంటాయి. అదొక పూడిక తెలియని అగాధం. ఆ పూడికను మనం తీయలేము. అక్కడికి మనం ప్రయత్నించినా వెళ్ళలేము. అంత లోతుగా మనలో మనమే ఎలా త్రవ్వుకున్నామో, ఎంత బయట పడేసినా అర్థం కాదు. అవన్నీ అగాధాలు. అగోచరాలు. ఉన్నట్లు తెలియకుండా ఉంటాయి. లేనట్లే ఉంటాయి.

ఆంతర్యం ఎవరి దైనా ఇలాగే ఉంటుంది. విశ్లేషించినా అంతు చిక్కదు. విస్మరించినా దూరం కాదు. ఆంతర్యంలో సమస్య లన్నీ అవ్యక్తం గానే ఉంటాయి. అలా ఉండి మనలో భయాలను కదలిస్తూ ఉంటాయి. బాధల్ని సృష్టిస్తూ ఉంటాయి. మన ఆంతర్యం మనదే. మన తోనే ఉంటుంది. మన తోనే కలసి పుట్టింది. మనల్ని నేడున్న పరిస్థితికి తెచ్చింది అదే.

ఎంత తెలిసినా మనిషి సంతోషంగా ఉండలేక పోతున్నాడు అంటే, ఆ తెలిసింది ఏదో, అది అతడు సుఖపడటానికి సరిపోవడం లేదు అని అర్థము. అదంతా కూడా జ్ఞానమే. కాని, సమ్యక్ జ్ఞానం కాదు. పూర్ణజ్ఞానం కాదు. పూర్ణ జ్ఞానమే అయితే, మనిషికి ఆనందం దూరం కాకూడదు.

జీవితం లోని వాస్తవాలకు, మనం వాటిని అర్థం చేసుకొనే విధానానికి మధ్య ఏదో అంతరం ఉంది.

అంతు చిక్కని అగాధం ఉంది. ఇలాంటి చోటే మనస్సులో ఘర్షణ ఏర్పడుతుంది. అవగాహన స్పష్టంగా లేనపుడే మనిషిలో సంఘర్షణ ప్రారంభ మవుతుంది.

మనిషి - మనసు

మంచో, చెడో, ఏ పనైనా మనిషే చేయాలి. ఏ పని చేయాలి, ఏది చేయకూడదు అనేది కూడా మనిషే నిర్ణయించు కోవాలి. ఈ నిర్ణయాలు మనసు లోనే జరగాలి. అలా నిర్ణయాలు జరగడానికి ఆలవాలమైన మనస్సు, ఆలోచనలకు నిలయమైన మనస్సు ప్రశాంతంగా ఉండాలి. అలజడి లేకుండా ఉండాలి. ఘర్షణలు తలెత్తకుండా ఉండాలి.

ఘర్షణ పడే చిత్తము వివేకంతో చిగురించదు. వివేకం లోపించడం వల్లే ఘర్షణ మొదలవుతుంది. ఆంతర్యంలో ఘర్షణలు విజృంభించి నపుడు అవ్యక్తంగా ఉన్న వన్నీ బుసలు కొడుతూ పైకి లేస్తాయి. అగాధంలో కూరుకు పోయిన సమస్య లన్నీ ఉపరితలం చేరుతాయి. అవ్యక్తంగా నిద్రపోతున్న భయాలు, సమస్యలు మేలుకుంటాయి. బ్రతుకులో బాధలకు, దుఃఖాలకు తెర తీస్తాయి. క్షణాల్లో పరిస్థితుల్ని తారుమారు చేస్తాయి. నిముషాల్లో తుఫానును సృష్టిస్తాయి.

సమరంలో సవ్యసాచి

అర్జునుడు యుద్ధభూమిలో ఉన్నాడు. కురుక్షేత్రంలో ఉన్నాడు. నేడు అతడు కదన రంగంలో ఉండటానికి వెనుక ఎంతో కథ నడచింది. అన్నీ వింతలే. విచిత్రాలే. వికృతాలే. విడ్డూరాలే. వినాశానికి దారి తీసే విషయాలే.

యుద్ధం ఉన్నపళంగా వచ్చింది కాదు. క్షణంలో ఊడి పడింది కాదు. పిడుగుపాటే అయినా పిడుగులా పడింది మాత్రం కాదు. నేడు ఆశనిపాతము అనిపించినా, ఏనాడూ శకుని పాత్ర లేకుండా సాగింది కాదు.

బాల్యం నుండి మాత్సర్యాలే. ఈర్ష్యలే. అసూయా పాచికలే. విషాన్ని జీర్ణించుకోవలసి వచ్చింది. మంటల నుండి బయటపడవలసి వచ్చింది. నీళ్ళల్లో తల దాచుకో వలసి వచ్చింది. నిండు సభలో మహిళ మానమే ప్రశ్నార్థకంగా మారి నపుడు తలలు దించుకో వలసి వచ్చింది.

కందమూలాలు తిని కాలాన్ని నెట్టుకొంటూ వచ్చారు. వనంలో వాసము - రణం తోనే నివాసము, మృగాలతో పోరాటము - మృగాల వంటి మనుష్యుల మధ్య ఆరాటము, విరాటుని కొలువులో అజ్ఞాతము - అజ్ఞాతంలో అతివకు అవమానము, ఎన్ని బాధలు? అన్నీ బాధలే. అన్నీ వ్రణాలే. అన్నీ రణాలే. చివరికి ఏదీ కుదరక, ఎద బాధతో మహారణం. కురుక్షేత్ర కదన రంగంలో ధర్మసంగ్రామం.

సన్నాహాలు - సాయుధాలు

అర్జునుడు దశాబ్దాలు నిరీక్షించింది ఈ సంగ్రామం కొరకే. కఠోర తపస్సులతో సురుల హృదయాలను దోచుకొని, అద్భుత శస్త్రాస్త్రాలను సమకూర్చు కున్నది ఈ సమరం కొరకే. పశుపతితో పోరాడి పాశుపతాస్త్రాన్ని పార్థుడు సాధించింది ఈ పోరాటం కొరకే.

మనిషి ధనాన్ని సంపాదించు కొనేది అవసరాలు తీర్చుకోవ డానికి, అనుభవించడానికి. వీరుడు ఆయుధాలను సమకూర్చు కొనేది సమర రంగంలో ప్రయోగించడానికి. అవసరాలకు ఉపయోగపడని ధనం ఉండి ఏమి ప్రయోజనం? అవసర సమయంలో సమరంలో సంధించుటకు ఉపకరించని ఆయుధాలు ఉండి ఏమి ఉపయోగం?

క్షత్రియుడు ధర్మం కోసం యుద్ధం చెయ్యాలి. తనది ధర్మం. అధర్మపరుడైన దుర్యోధనుని సంహరించి,

ప్రజా క్షేమాన్ని రక్షించ వలసిన ధర్మం ధనంజయునికి ఉంది. అది పాండవుల కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని నెరవేర్చే సమయం కొరకే ఇంత వరకు పాండవులు నిరీక్షించారు. సమయం ఆసన్న మైంది. సమరం ఆరంభం కాబోతోంది. రథాన్ని ఉభయసేనల మధ్య ఉంచమన్నాడు పార్థుడు. అలాగే ఉంచాడు పార్థసారథి.

అవ్యక్తాలు వ్యక్త మయ్యాయి

యుద్ధరంగంలో ఇరుపక్షాల లోని యోధుల్ని పరిశీలించి చూశాడు పార్థుడు. పరీక్షించి మరీ చూశాడు. పరితాపంతో చలించి పోయాడు. విషణ్ణు డయ్యాడు. దేహం విశీర్ణ మైంది. మనసు విచలిత మైంది.

అంతా అయిపోయింది. ఏం మిగిలింది? దుఃఖమే మిగిలింది. తనపై తనకు పట్టు లేకుండా పోయింది. మనస్సును నియంత్రించే స్థితిలో లేడు. దేహం కూడా నీరసించి పోయింది. ధనుర్బాణాలు పడేశాడు. ఉత్సాహాన్ని పడేశాడు. ఆసక్తిని దూరం చేసుకున్నాడు. అర్థం గాక ధర్మాన్నే పడేశాడు.

ఇదంతా విజయాన్ని సాధించలే మేమో అనే భయంతో కాదు. శత్రు సైన్యాన్ని చూచి భీతి చెంది అసలే కాదు. అంటే, ఏ భయమూ లేదని కాదు. యుద్ధ భయము లేదు అంటున్నాను. అంతే.

అంటే, మరేదో భయం ఉందనే కదా? అవును. ఉంది. అది మరేదో భయం కాదు. మహాభయం. అర్జునుని ఆంతర్యంలో అర్థం కాకుండా, అవ్యక్తంగా ఉండి, సమర రంగంలో ఒక్కసారిగా బహిర్గతమై, అర్జును డంతటి వీరుణ్ణి భీరుడుగా మార్చేసిన మహాభయం. మమకారం సృష్టించిన మారణహోమం.

చరణము : **సమర నదిలో మమకార జలము**
ఎవరి నైనా ముంచుట తథ్యము
ఎంత ఈదినా తెలియదు తీరము
ముందు వెనుక గాఢాంధకారము

పల్లవి : **సంసారమె సంగ్రామము**
తెగిన ప్రేగు అనుబంధము
జీవుల ఆరాటము
జీవన పోరాటము ॥ సంసారమె ॥

ఇది చైతన్య గీతం. గీతలో ప్రతిబింబిస్తున్న అర్జునుని మమకారానికి ఊతం.

మమకారం సృష్టించిన మహాభయంతో అర్జునుడు చలించి పోయాడు. ఎవరు లేకపోతే తాను సుఖంగా జీవించలేడో, ఎవరిని విడిచి తాను బ్రతకలేడో, వాళ్ళనే లేకుండా, శాశ్వతంగా లేకుండా చేయవలసి వస్తోంది అనే భయం. విజయ పతాకాన్ని రెపరెప లాడించాలంటే, తన వాళ్ళను పిట్టల్ని రాల్చినట్లు రాల్చేయాలి. ధనుర్బాణాలను చేత బట్టి దారుణంగా కూల్చేయాలి. అదంతా తలచుకొంటూ ఉంటే అర్జునుడి గుండె ముక్కలై పోతోంది. అందుకే ధనుర్బాణాలు పడేశాడు. రథంలో క్రింది వైపున కూర్చుండి పోయాడు (**రథోపస్థే ఉపావిశత్**).

అర్జునుడు - అందరికీ ప్రతినిధి

సవ్యసాచికి సమరం సమస్యగా మారింది. మహా పరాక్రమవంతు డైన పాండవ మధ్యముని మూర్తిమత్వాన్నే మార్చేసింది. ఇతడు అర్జునుడేనా? అనే సంశయం అందరికీ కలుగుతోంది. పూర్వం ఉన్న పార్థుడేనా? అనే సందేహం కలుగుతూ ఉంది. మార్పు అలాగే ఉంటుంది. క్షణాల్లో అన్నీ తారుమా రవుతాయి.

సమస్య అర్జునునిది అని మనకు అనిపిస్తోంది. వాస్తవానికి ఇది అందరి సమస్య. అన్ని దేశాలకు సంబంధించిన సమస్య. అన్ని కాలాలకు సంబంధించిన సమస్య. అందరు వ్యక్తులకు సంబంధించిన సమస్య.

అర్జునునిలో అవ్యక్తంగా, అగాధంగా ఉన్న భయాలే మమకార రూపంలో బహిర్గతమై, సమర రంగంలో సమస్యని సృష్టించాయి. అవి మన లోనూ ఉన్నాయి. కాకపోతే, అర్జునుని ఆంతర్యం లోని అవ్యక్తాలు బాహ్యం లోకి తొంగి చూశాయి. మనలో అవ్యక్తాలు ఇంకా నిద్ర పోతున్నాయి. అంతే తేడా.

ఎవరు ఎప్పుడు నిద్ర లేస్తారో ఎవరికి తెలుసు? అవ్యక్తాలు కూడా అంతే. అర్జునునికి మమకార రూపంలో నిద్ర లేచాయి. మరొకరికి మరో విధంగా బహిర్గతం కావచ్చు. ఇంటిలో చేరిన పాము ఎప్పుడైనా ప్రమాదమే. ఏ ఇంటిలో అయినా ప్రమాదమే. ఒంటిలో చేరిన మహాభయం, ఉల్లమును గుల్ల చేసే మహాభయం ఎప్పుడైనా ప్రమాదమే. ఎవరి కైనా ప్రమాదమే.

కనుక అర్జునుడు అందరికీ ప్రతినిధి. సర్వ మానవాళికి ప్రతినిధి. అర్జునుని బాధలో అందరి బాధలూ ఉన్నాయి. అర్జునుని శోకంలో అందరి శోకాలూ ఉన్నాయి. అర్జునుని సమస్య అందరి సమస్యగా ఉంది. అందుకనే, అర్జునుని ఆధారం చేసుకొని, నరుని నిమిత్తం చేసుకొని (*అర్జున నిమిత్తీ కృత్య*), నరజాతి కంతా జీవిత పరిష్కారాన్ని అందిస్తున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

సంజయ ఉవాచ :

తం తథా కృప యాఽఽవిష్ట మశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదన్త మిదం వాక్య మువాచ మధుసూదనః ॥ 1

తం-తథా-కృపయా-ఆవిష్టం-అశ్రుపూర్ణాకులేక్షణం
విషీదంతం-ఇదం-వాక్యం-ఉవాచ-మధుసూదనః

తథా	= ఆ విధముగా	తం	= ఆ అర్జునుని
కృపయా	= కరుణచే	మధుసూదనః	= శ్రీకృష్ణుడు
ఆవిష్టం	= నిండియున్న వాడు	ఇదం	= ఈ
అశ్రుపూర్ణాకులేక్షణం	= కన్నీరు నిండిన వ్యాకులమైన నేత్రములు గలవాడు	వాక్యం	= వచనమును
విషీదంతం	= శోకిస్తున్న వాడు	ఉవాచ	= పలికాడు

సంజయుడు చెబుతున్నాడు :

మహారాజా! ఆ విధంగా అర్జునుడు కరుణార్ద్ర హృదయు డయ్యాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చూపులు కలత చెందాయి. దుఃఖిస్తున్న అర్జునుని చూచి మధుసూదనుడు నోరు విప్పాడు.

వ్యాఖ్య

అధ్యాయ విభాగము

అర్జునుని విషాదం తోనే మొదటి అధ్యాయము పూర్తి అయింది. వాస్తవానికి రెండవ అధ్యాయం మొదటి పది శ్లోకాల వరకు అర్జునుని విషాదమే కొనసాగు తుంది. ఉభయసేనల మధ్య దుఃఖిస్తున్న (*ఉభయోః సేనయోః మధ్యే విషీదంతం*) అర్జునునితో శ్రీకృష్ణుడు మాట్లాడు తున్నాడు అని సంజయుడు చెబుతాడు. పదకొండవ శ్లోకం నుండి పరమేశ్వరుడు పరమ పవిత్రమైన గీతాశాస్త్రాన్ని వినిపిస్తాడు.

మొదటి అధ్యాయము సంజయుని శ్లోకంతో సమాప్త మవుతుంది. రెండవ అధ్యాయము మళ్ళీ సంజయుని శ్లోకం తోనే ప్రారంభ మవుతుంది. ఈ రెండు శ్లోకాల లోనూ అర్జునుని విషాదాన్నే వర్ణించాడు సంజయుడు.

వక్తలో మార్పు లేదు. విషయంలో మార్పు లేదు. అలాంటప్పుడు సంజయుడు పలికిన రెండు శ్లోకాలను వేరు చేసి అధ్యాయాలను విభజించడానికి కారణ మేమిటి? సాంఖ్య యోగాన్ని 'సంజయ ఉవాచ' అని కాకుండా 'శ్రీ భగవానువాచ' తో ప్రారంభించి ఉంటే సరిపోయేది కదా! అర్జున విషాద యోగాన్ని నలభై ఏడు కాకుండా నలభై ఎనిమిది శ్లోకాలతో నింపి, 'సంజయ ఉవాచ' తో ముగించి ఉంటే బాగుండేది కదా అని కొందరికి అనిపిస్తూ ఉంటుంది.

అలా కాకుండా, అర్జునుని విషాద మంతా ప్రథమ అధ్యాయం లోనే ఉండాలి అని అభిప్రాయపడి, సాంఖ్య యోగము లోని మొదటి పది శ్లోకాలను కూడా అర్జున విషాద యోగం లోనే చేర్చి, ***అశోచ్యా నన్వశోచస్త్వం*** అనే భగవానుని శ్లోకంతో రెండవ అధ్యాయాన్ని ప్రారంభించి ఉంటే బాగుండేది అని మరి కొందరు భావిస్తూ ఉంటారు.

ఏది ఎక్కడ మొదలెట్టాలి, ఎక్కడ ముగించాలి అనే విషయంలో వేదము యొక్క ఆద్యంతాలు తెలిసిన వేదవ్యాసునికి మనం సలహాలివ్వ నవసరం లేదు. అద్భుతమైన వ్యాస భగవానుని అమోఘ సంకల్పాలను అర్థం చేసుకో గలిగితే చాలు.

గుణత్రయ ప్రభావము

సత్త్వరజ స్తమోగుణాలు అనే త్రిగుణాలు ప్రకృతి సంభవాలు. ప్రకృతిలో ఈ మూడు గుణాలు సమంగా ఉంటాయి. కాని, వ్యక్తిలో అవే విషమంగా ఉంటాయి. గుణ ప్రభావంతో వ్యక్తులు విభిన్నంగా ప్రవర్తిస్తూ ఉంటారు.

తమోగుణములో అజ్ఞానమే ప్రధానంగా ఉంటుంది. ఉద్యమ స్థితి పూర్ణంగా ఆగి పోతుంది. ఉద్యోగ సద్యోగాలను విరమించి మనస్సు నిరుద్యోగంలో పడుతుంది. నిర్వేదంలో ఉంటుంది. నిరాశతో ఉంటుంది.

రజోగుణము రాగాత్మకంగా ఉంటుంది. రంజన స్వభావంతో ఉంటుంది. తమోగుణం లాగా పడి ఉండటానికి అంగీకరించదు. మూల పడినా బయటికి ఈడ్చి, దృశ్య విషయాలతో మనస్సును సంగమింప చేస్తుంది. క్రియాశీలంగా ఉంటుంది. రాగద్వేషాలే రజోగుణంలో ప్రధాన పాత్రను పోషిస్తూ ఉంటాయి.

సత్త్వగుణము ప్రసన్నంగా ఉంటుంది. విశుద్ధంగా ఉంటుంది. వినిర్మలంగా ఉంటుంది కనుక దర్పణము వస్తువును ప్రతిబింబించి నట్లు సత్త్వగుణము చైతన్యాన్ని ప్రతిఫలింప చేస్తుంది. సత్త్వగుణ ప్రధానులైన వారే ఆత్మజ్ఞానాన్ని శ్రవణం చేయడానికి అర్హులు.

ధనుర్బాణాలను పడేసి, క్రియాశూన్యుడై, ఎప్పుడైతే రథోపస్థ ప్రదేశంలో అర్జునుడు కూర్చుండి పోయాడో, అప్పటికి అతని తమోగుణం చరమ స్థాయికి చేరింది. ఈ విషయాన్ని నిర్ధారణ చేయడానికే సంజయుని రెండు శ్లోకాలను వేరు చేసి, అధ్యాయ విభజనకు సంకల్పించాడు వేదవ్యాసుడు.

రెండవ అధ్యాయం రెండు, మూడు శ్లోకాలలో అర్జునుని మందలిస్తాడు మధుసూదనుడు. నిర్దాక్షిణ్యంగా ఛీకొట్టి తమోగుణ చీకటి నుండి లాగి బయట పడేస్తాడు. అక్కడి నుండి అర్జునుని రాగాత్మక ప్రవృత్తిని చూస్తాము. మమకార వృత్తిని చూస్తాం. రజోగుణ విన్యాసాన్ని చూస్తాం.

రజోగుణ రాగాలాపన చేస్తూ, చేస్తూ అర్జునుని అంతఃకరణము సత్త్వగుణాన్ని అభివ్యంజనం చేస్తుంది.

ఈ స్థితి లోనే అర్జునుడు ధర్మ సమ్మూఢ చేతస్కుడ నయ్యాను అని అంగీకరిస్తాడు. ఏది శ్రేయస్సో నిర్ణయించి చెప్పమంటాడు. అంతటితో ఆగ లేదు. శిష్యరికం ప్రదర్శించాడు. శాసించ మని ప్రార్థించాడు. సత్త్వగుణ ప్రధాను డయ్యాడు. ఆత్మబోధను ఆలకించ డానికి అర్హుడయ్యాడు. అధికారి అయ్యాడు. అది జరిగిన తరువాతే గీతా శాస్త్రాన్ని ప్రారంభించాడు అచ్యుతుడు.

తమోగుణం చరమ స్థాయికి చేరగానే, చేష్ట లుడిగిన అర్జునుని చూపుతూ మొదటి అధ్యాయం సమాప్త మవుతుంది. రెండవ అధ్యాయం ప్రారంభం లోనే తమోగుణం నుండి రజోగుణానికి చేరుతుంది పార్థుని చిత్తము. రజస్తమస్సులు ప్రధానంగా ఉన్నప్పుడు మనస్సుకు జ్ఞానం పట్టదు. అందుచేత సత్త్వగుణము వచ్చే వరకు నిరీక్షించి, ఆ తరువాత సాంఖ్యాన్ని ప్రారంభించాడు భగవానుడు.

అర్జునుని ఆకృతి

అర్జునుని దైన్యాన్ని వర్ణిస్తున్నాడు సంజయుడు. జాలి కలవా డయ్యాడట ***(కృపయావిష్టం)***. కన్నీళ్ళ పర్యంత మయ్యాడట ***(అశ్రుపూర్ణా కులేక్షణమ్)***. పైగా ఏడుస్తున్నాడట ***(విషీదన్తం)***. అది చూచి, మాట పడేశాడట మధుసూదనుడు. ఇది సంజయుని సంక్షిప్త సంకలిత సంభాషణము.

కృపావిష్టుడు

అర్జునుడు దయార్ద్ర హృదయు డయ్యాడు. జాలిగుండె కలవా డయ్యాడు. ఆయన బుద్ధిని కృప ఆవరించింది. యుద్ధ విముఖతకు కారణమైంది. మరి, ఆ రథం లోనే శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఉన్నాడు కదా! ఆయన ఎందుకని కృపావిష్టుడు కాలేదు? శ్రీకృష్ణుడు కరుణ లేని వాడా? కృప చూపలేని వాడా? కృపానిధి అని ముల్లోకాలు కీర్తించింది ఆయననే కదా! ఇది కూడా ఆలోచించాలి.

కౌంతేయుడు కరుణామయుడే. యుద్ధానికి రాక ముందు కూడా కృప గలవాడే. అయినా యుద్ధం చేయాలనే వచ్చాడు. యుద్ధానికి వెళ్ళకు అని అడ్డు చెప్పని కృప, యుద్ధం చేయకు అని సమరభూమిలో అడ్డు పడుతూ ఉంది. అంటే ఇక్కడ కృప ఒక్కటే కాదు. ఇంకా ఏదో ఉంది.

ఈ ఘర్షణ అంతా ఇతరుల వల్ల ఏర్పడింది కాదు. తన మనస్సు లోనే తయారైంది. ఆలోచనా విధానంలో ఏవో ఏవో తయారయ్యాయి. యుద్ధం చేయక పోతే ధర్మం తప్పిన వాడ నౌతానేమో అనే భయం కూడా అర్జునునిలో ఉంది. పోనీ చేద్దామా అంటే, స్వజనుల్ని, గురువుల్ని చంపాలి. అందుకు మనస్సు సిద్ధంగా లేదు.

ధర్మాన్ని విస్మరించి సుఖపడ లేడు. స్వజనుల్ని చంపి బ్రతక లేడు. ధర్మానికి, వ్యక్తిగత మమకారాలకు మధ్య ఘర్షణ ఏర్పడింది. ఎటైనా దెబ్బ తగిలేది తనకే. ఇక కృప ఎవరి మీద? నిజం చెప్పాలంటే తన మీదే. తన వాళ్ళను పోగొట్టుకొని సుఖంగా బ్రతకలేని తనపై తనకు కృప ఉంది కనుకనే తన వాళ్ళపై కృప కలిగింది. ఇదంతా మమకారము. అహంకారము సృష్టించిన మాయాజాలము. అందుకే అచ్యుతుడు దీనిని అంగీకరించ లేదు. బలహీనతగా కొట్టి పారేశాడు. కృప అనే ముసుగులో అహంకారం దూరి అర్జునుని బుద్ధిని కబళించి వేసిందని శ్రీకృష్ణుడు గుర్తించాడు.

అశ్రుపూర్ణాకులేక్షణుడు

కళ్ళల్లో నీళ్ళు తిరుగు తున్నాయి కనుక చూపులు కూడా కలత చెందాయి. దేహ స్థాయిలో కూడా అర్జునుడు బలహీన పడ్డాడని స్పష్టంగా తెలిసి పోతోంది. కృప ముసుగులో బుద్ధిని కబళించిన మమకారం శరీరాన్ని కృంగ తీయడమే గాక మనస్సును కూడా తీవ్రంగా కలత పెట్టేసింది.

విషణ్ణుడు

మనస్సు విషాదంతో నిండి పోయింది. బాధతో బరు వెక్కింది. ఇదంతా అహంకారము సృష్టించిన మమకారము ఆడే నాటకమే నని గుర్తించిన శ్రీకృష్ణుడు ఈ మమకార పిశాచాన్ని, మోహ జాడ్యాన్ని తుద ముట్టించుటకు సిద్ధ పడ్డాడు. కనుకనే శ్రీకృష్ణుని ఈ సందర్భములో మధుసూదనునిగా వర్ణించాడు సంజయుడు.

సర్వేషాం దేహే మధువత్ ఇష్టత్వాత్ మధుః అహంకారః

తం ఆత్మ ప్రకాశనేన సూదయతి నాశయతీతి మధుసూదనః

సర్వ మానవుల దేహాలలో తేనె లాగా ఇష్ట మైనది, తియ్య నైనది అహంకారము. అట్టి అహంకారమును ఆత్మజ్ఞాన ప్రకాశము చేత నశింప చేయువాడు కనుక శ్రీకృష్ణుడు మధుసూదను డయ్యాడు.

అర్జున విషాద యోగంలో ముప్పై అయిదవ శ్లోకంలో శ్రీకృష్ణుని మధుసూదనా! అని అర్జునుడు సంబోధించాడు. మధువనే రాక్షసుని సంహరించడం వల్ల శ్రీకృష్ణుడు మధుసూదను డయ్యాడు. ప్రస్తుత శ్లోకంలో మధువు అంటే అహంకారము అని అర్థం చెప్పుకున్నాం. అహంకారాన్ని నశింప చేసేవాడు కనుక శ్రీకృష్ణుడు మధుసూదన శబ్దవాచ్య డయ్యాడు.

దీనిని బట్టి చూచి నపుడు అహంకారము కూడా రాక్షసి లాంటి దని అర్థమవుతూ ఉంది. అదొక భూత మని, పిశాచ మని తెలుస్తూ ఉంది. భూతం మనిషిని ఆవేశించినట్లు, అహంకార భూతం కృపా ముసుగులో అర్జునుని మనస్సును ఆవేశించింది. ఏ భూతం పడితే మాత్రం ఏమవుతుంది? సర్వభూతనాథుడు రథం లోనే ఉన్నాడు కదా! మోహ పిశాచాన్ని, అహంకార భూతాన్ని అర్జునుని మనస్సు నుండి తరిమే ప్రయత్నంలో కొరడా ఝుళిపించినట్లు మధుసూదనుడు తీక్షణ మైన పదజాలంతో పార్థుని యుద్ధానికి ప్రేరేపిస్తున్నాడు.

శ్రీ భగవానువాచ :

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥ 2

కుతః-త్వా-కశ్మలం-ఇదం-విషమే-సముపస్థితం
అనార్యజుష్టం-అస్వర్గ్యం-అకీర్తికరం-అర్జున

అర్జున	= హే అర్జునా!	కశ్మలం	= మాలిన్యము
అనార్యజుష్టం	= అనార్యులు పొందేది	విషమే	= విషమ సమయములో
అస్వర్గ్యం	= స్వర్గానికి పనికి రానిది	త్వా	= నిన్ను
అకీర్తికరం	= అపకీర్తిని కలిగించేది	కుతః	= ఎక్కడి నుండి
ఇదం	= ఈ	సముపస్థితం	= ఆవరించింది?

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! సంక్లిష్టమైన సమయంలో ఈ మనోవ్యథ నీకు ఎలా దాపురించింది? ఇది ఆర్యులకు తగనిది. స్వర్గానికి పనికి రానిది. పైగా, అపకీర్తిని కలిగించేది.

వ్యాఖ్య

విషమ సమయంలో వింత ప్రవర్తన

శత్రువులతో పోరాడాలని పోరుభూమిలో పాదం పెట్టిన పార్థుడు, విరోధులను వధించడం కన్నా వారి

చేతిలో మరణించడమే మంచిది అనే వింత వాదాన్ని వినిపించాడు. యుద్ధం వల్ల కలిగే ఉపద్రవాలు తెలుస్తూ ఉండే టప్పుడు యుద్ధాన్ని ఎందుకు విరమించ కూడదు? అని ప్రశ్నిస్తూ, ధనుర్బాణాలను క్రింద పడేశాడు ధనంజయుడు.

అర్జునునిలో గోచరించిన ఈ అనూహ్య పరిణామానికి అచ్యుతుడు ఆశ్చర్య పోయాడు. యుద్ధభూమికి వచ్చి యుద్ధాన్ని విరమించాలని గోల పెట్టడం కన్నా అసలు యుద్ధానికి రాకుండా ఉంటే సరిపోయేది కదా! రణరంగానికి ఎందు కొచ్చినట్లు? ఇదొక ఆకస్మిక పరిణామం. వింత ప్రవర్తన.

ఏది వస్తుందో తెలియదు

జీవితం చాలా విచిత్ర మైంది. జీవుల ప్రవర్తన అంతకన్నా విచిత్ర మైంది. ఎవరు ఎప్పుడు ఎలా ఉంటారో తెలియదు. ఎవరు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో అర్థం కాదు. అన్నీ వింతలే. అన్నీ విడ్డూరాలే.

అర్జునుడు అచ్యుతునికి క్రొత్తవాడు కాడు. బాగా తెలిసిన వాడే. బంధువు. సఖుడు. అన్నీను. అలాంటి వ్యక్తిలో మనో వ్యాకులత, మనోవ్యథ, మనో మాలిన్యం ***(కశ్మలమ్)*** ఈ స్థాయిలో గతంలో ఎప్పుడూ చూడలేదు శ్రీకృష్ణుడు. అందుకే ఆశ్చర్య పోతున్నాడు. ఈ అవివేకం నీకు ఎక్కడి నుండి వచ్చింది? ***(కుతః)*** అని సూటిగా ప్రశ్నిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

ఉన్నదే వస్తుంది

ఈ కశ్మలము ఎక్కడి నుండి వచ్చింది? అని ప్రశ్నించాడు గోవిందుడు. ఎక్కడి నుండి వచ్చింది? అంటే, మునుపు తన వద్ద ఉన్నది కాదు అని అర్థము. అర్ధ శతాబ్దము పైగా పరిచయం ఉన్నా, ఈ విధమైన వింత ప్రవర్తన తానెప్పుడూ అర్జునునిలో చూడ లేదు. ఇది సహజ స్వభావమే అయితే, ఎప్పుడో ఒకప్పుడు కంట బడేదే. అలా ఎప్పుడూ కనలేదు. వినలేదు. ఇప్పుడే, ఇక్కడే, కురుక్షేత్రం లోనే ప్రత్యక్షమైంది.

ఇంతవరకు అర్జునుని విషయంలో తన కంట పడిన వన్నీ సాహసాలే. విజయాలే. వీరత్వాలే. అర్జునుడు అంటేనే ధైర్యవంతుడు, వివేకవంతుడని పేరు. పిరికితనము, అవివేకము, మనోమాలిన్యము లాంటివి అర్జునునిలో అనూహ్య మైనవి. అయితే, ఇప్పుడు ఎలా వచ్చాయి? ఎక్కడి నుండి వచ్చాయి? ఉన్నవే అయితే, ఇంతకాలం కంట బడకుండా ఎలా ఉన్నాయి? ఎక్కడ దాచాడు? ఎలా దాచాడు?

ఉన్న వన్నీ తెలియవు

ఏవి తెలిసినా ఉన్నవే తెలుస్తాయి. అలాగని ఉన్న వన్నీ తెలుస్తాయని చెప్పలేము. ఇంట్లో ఉన్నవి ఇంటి లోని వారి కందరికీ తెలుస్తాయి. బ్యాంకులో దాచినవి ఆ దాచిన వ్యక్తికి మాత్రమే తెలుస్తాయి. కాని, మనస్సులో ఉన్న వన్నీ మనిషికి తెలియాలి అనే నియమం లేదు. మనిషి కొన్ని విషయాలను ప్రయత్నంతో, మరి కొన్ని విషయాలను అప్రయత్నంగా మనస్సులో దాచు కుంటాడు. కొన్ని విషయాలైతే మనిషికి సంబంధం లేకుండానే మనస్సులో చేరి పోతాయి. అశేష అనుభవ పరంపరలలో కొన్ని జారి మనస్సు లోతుల్లో పడి ఉంటాయి. అవన్నీ అలా ఉంటాయే కాని, ఉన్నట్లు తెలియవు.

జలాశయాల్లో పూడికలో ఏర్పడిన చలనం వల్ల ఉపరితలాన జలాలు కదులుతూ ఉండటం, బుడగలు వస్తూ ఉండటం మనం చూస్తూ ఉంటాము. అలాగే మనస్సు లోతులలో జరిగే కంపనం వల్ల అవ్యక్తంగా అంతర్యంలో దాగి ఉన్నవి బాహ్యంలో వ్యక్త మవుతూ ఉంటాయి.

అంతర్యంలో ఏ కంపనం ఎలాంటిదో, తత్సంబంధ మైన పోకడలే బాహ్యంలో గోచరిస్తూ ఉంటాయి.

కానీ, అంతర్యంలో ఎప్పుడు ఎలాంటి చలనం జరుగుతుందో తెలియదు. ఏది జరిగినా, దాని ప్రతిరూపమే, ప్రతిబింబమే బాహ్యంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది కనుక, బాహ్యం లోని ప్రవర్తన కూడా అర్థం కాదు. వింత గానే ఉంటుంది. విచిత్రం గానే ఉంటుంది.

ఎప్పుడు ఏది వస్తుందో తెలియదు. ఏది వచ్చినా ఉన్నది వస్తుందే గాని లేనిది రాదు. అయితే ఆ వచ్చిన దేదో అది అలా ఉన్నట్లు ముందు తెలియదు కనుక ఇప్పుడు వింతగానే కనిపిస్తుంది. నిగూఢ మైనవి, నిమగ్న మైనవి వెలుగు చూచే టప్పుడు అనుభవం విచిత్రం గానే ఉంటుంది.

ఒక అద్భుతమైన రచన చేసి నపుడు, లేదా విస్మయాన్ని కలిగించే విషయాన్ని ప్రసంగించి నపుడు వ్యక్తి తనలో తానే ఒక వింతను, విచిత్రాన్ని దర్శిస్తూ ఉంటాడు. ఈ భావం నాలో ఎలా కదిలింది? ఈ ఆలోచన నాకు ఎక్కడి నుండి వచ్చింది? అని విస్తుపోతూ ఉంటాడు. ఎక్కడి నుండి వస్తాయి? తన నుండే వస్తాయి. తనకు తెలియకుండా తనలో ఉన్నవే తన ద్వారా వెలుగు చూసి నపుడు తనకే వింతగా ఉంటుంది. ఇక ఇతరులకు వింతగా ఉంటుందని ప్రత్యేకంగా చెప్పే దేముంది? అందుకే ఆశ్చర్యపోతూ, ఈ మనోవ్యథ నీకు ఎలా దాపురించింది? ***(కుతస్త్వా కశ్మలమిదం)*** అని ప్రశ్నించాడు శ్రీకృష్ణుడు.

సమయాలు - సందర్భాలు

ఒక వ్యక్తి ఎప్పుడు తింటాడో చెప్పగలం. ఎప్పుడు త్రేపుతాడో ఎలా చెప్పగలం? తినడానికి సమయా లున్నాయి. సందర్భాలూ ఉంటాయి. త్రేపడానికి ఏది సమయమో, ఏది సందర్భమో ఎలా చెప్పగలం? తినిన ప్రతి వ్యక్తి త్రేపుతాడని చెప్పలేము. అలాంటప్పుడు ఎవరు త్రేపుతారో, ఎప్పుడు త్రేపుతారో, ఎక్కడ త్రేపుతారో చెప్పగలమా?

ఒక వ్యక్తి త్రేపి నపుడు, ఈ త్రేపు ఎలా వచ్చింది? ఎందు కొచ్చింది? ఈ సమయం లోనే ఎందు కొచ్చింది? అంటే సమాధానం ఏమి చెప్పాలి? త్రేపు వచ్చేది త్రేపే వాడికే తెలియదు. అందుకే కదా కొందరు ధ్యానంలో, మరి కొందరు శ్రవణంలో, ఇంక కొందరు నిద్రలో కూడా త్రేపుతూ ఉంటారు!

తినిన వాడే త్రేపుతాడు. త్రేపడానికి కూడా సమయం ఉంది. త్రేపే సమయం లోనే మనిషి త్రేపుతాడు. ఆ త్రేపే సమయం ఏదో తెలియదు కనుక, ఇలాంటి సమయంలో త్రేపుతా వేమిటి అని ప్రక్క వ్యక్తి ప్రశ్నిస్తే, నిజమే కదా! ఇప్పుడు ఎందుకు త్రేపాను అని త్రేపిన వ్యక్తి తికమక పడుతూ ఉంటాడు. త్రేపిన సమయము సరి యైనదే. ఆ సమయం తెలియక పోవడం చేత, ఆ కాలం అకాలంగా, ఆ కార్యం అకార్యంగా తెలుస్తూ ఉంటాయి. అచ్యుతుడికి అన్నీ తెలిసినా, అర్జునునికి తెలియ జేయాలని ఈ విషమ సమయంలో ***(విషమే సముపస్థితం)*** నీకు ఈ అవివేకం ఎక్కడి నుండి వచ్చింది? అని ప్రశ్నించాడు.

అర్జునునిలో అంతర్యుద్ధము

సంక్లిష్ట మైన సమయంలో ధర్మాధర్మాల మధ్య సదవగాహన లోపించి నపుడు సత్పురుషుడు సంఘర్షణకు లోనవుతాడు. దేహాన్ని వ్యాధులు పట్టి పీడించినట్లు, మనస్సును వ్యథలు ఆక్రమించి భయాలతో బీభత్సం చేస్తాయి. పాపభీతితో కుదిపేస్తాయి. పార్థుని విషయంలో అదే జరిగింది. అర్జునుని బుద్ధి భయనిలయ మైంది. ధర్మాత్ము డైన ధనంజయుని మూడు భయాలు విపరీతంగా బాధిస్తున్నాయి.

(1) ఇప్పుడు నేను చేయబోయే సంగ్రామము సరియైన దేనా? నేను చేయ దగిన దేనా? ఆర్యసంతతిలో ఆవిర్భవించిన వాణ్ణి. ఆర్షసంస్కృతిలో పెరిగిన వాణ్ణి.

ఆరాత్ పాపకర్మభ్యో యాతి ఇతి ఆర్యః

పాప కార్యాలకు దూరంగా పోవు వాడు ఆర్యుడు. మరి, తాను చేసే యుద్ధము పాపకర్మ అయితే తనకు తీరని కళంకాన్ని తెచ్చి పెడుతుందేమో అని భీతి చెందుతున్నాడు అర్జునుడు.

(2) ఈ రణరంగంలో పోరాడటం నైతికమా? అనైతికమా? ధర్మమా? అధర్మమా? అనే మీమాంస మరొక వైపు అర్జునుని మనస్సును కుదిపేస్తోంది. ధర్మాచరణమునకు ఫలంగా స్వర్గం ప్రాప్తిస్తే, అధర్మాచరణమునకు ప్రతిఫలం నరకమే కదా! ఈ కురుక్షేత్ర పోరాటము తనకు నరక ద్వారాలను తెరుస్తుందేమో అనే నరక భయం కూడా నరుని హృదయాన్ని పిండుతూ ఉంది.

పైగా, ధార్తరాష్ట్రులు దురాత్ములు. పాపుల్ని చంపితే, మమ్మల్ని కూడా పాపమే చుట్టు కుంటుంది *(పాపమే వాశ్రయే దస్మాన్ హత్వైతా నాత తాయినః)* అని మొదటి అధ్యాయం ముప్పై ఆరవ శ్లోకంలో అర్జునుడు అనేశాడు కూడా. కనుక, ఈ యుద్ధం నరక హేతువు అవుతుందేమో అనే పాపభీతి, పరలోక భయం కూడా పార్థుని పట్టుకుని ఉన్నట్లు తెలుస్తోంది.

(3) పరలోకం మాట పరమేశ్వరు డెరుగు. ఇహలోకంలో తల దించుకోవలసి వస్తుందేమో! పవిత్రంగా, ప్రసిద్ధంగా జీవించి పది పేర్లు సాధించు కున్నాడు. ఆశించకుండానే దశవిధ నామాలు అందుకున్నాడు. ఈ పోరాటంలో బీభత్సాన్ని సృష్టించి, పది కాదు కదా, ఒక్కటి కూడా నిలబెట్టుకోలేక పోతాడేమో! పేరు పోగొట్టుకొని ఎలా బ్రతకాలి? ఇన్నాళ్ళు సన్మానాల మధ్య బ్రతికాడు. ఇప్పుడు అవమానాలను భరిస్తూ బ్రతకడం సాధ్య పడుతుందా? ఇలా అర్జునునిలో అంతర్యుద్ధం నడుస్తూ ఉంది. అంతర్యం కల్లోలంగా మారింది. మనసు నీరసించి పోయింది. శరీరం నిర్వీర్య మైంది. గాండీవం చేజారి పోయింది. విజయుడు విషణ్ణు డయ్యాడు.

వజ్రం వజ్రేన భిద్యతే

వజ్రాన్ని వజ్రం తోనే కోయాలి. భయాన్ని భయం తోనే పోగొట్టాలి. ఇదొక అద్భుతమైన శిక్షణ ప్రక్రియ. అసమానమైన రక్షణ ప్రక్రియ. శ్రీకృష్ణుని అమోఘ బోధనా పటిమ ఆరంభ శ్లోకం లోనే అందల మెక్కింది.

భయాలలో, బాధలలో పడి అర్జునుని మనస్సు మునిగి పోతూఉంది. కర్మాచరణం నుండి విడిపడి మగత లోకి జారి పోతూఉంది. దానిని ఎలాగైనా పైకి లేపాలి. నూతనోత్తేజాన్ని కలిగించాలి. ఉత్సాహాన్ని నింపాలి.

పట్టు తప్పి ఒక వ్యక్తి శరీరం కూలబడుతూ ఉంటే, మరొక వ్యక్తి తన దేహశక్తితో సాయం చేసి నిలబెడతాడు. అలాగే, భయంతో, అధైర్యంతో ఒక వ్యక్తి మనసు బలహీనమై, నీరసించి నపుడు, బుద్ధి బలం గల మరొక వ్యక్తి తన ధీశక్తితో అభయ ప్రదానం చేసి, అవగాహనను కల్పించి, పతన మౌతున్న మనస్సును ప్రగతి బాటలో నడిపిస్తాడు. శ్రీకృష్ణుడు తన ప్రారంభ శ్లోకంలో అదే చేస్తున్నాడు. అదే చెబుతున్నాడు.

భయాలు రెండు విధాలుగా ఉంటాయి. (1) విధాయక భయాలు (2) విధ్వంసక భయాలు. విధాయక భయాలు ఆలోచనల్ని పెంచి, అవగాహనను దించి, అంతరాయాలను అదృశ్యం చేసి, అంతరంగాన్ని ఉద్యుక్తం చేస్తాయి. ఉద్యమ స్ఫూర్తిని కలిగిస్తాయి. విధ్వంసక భయాలు ఆలోచనల్ని కుదించి, అవగాహనను దారి మళ్ళించి, అంతరాలను ఆవిష్కరించి, ఆంతర్యాన్ని కల్లోల పరుస్తాయి. కలవర పెడతాయి.

అర్జునునిలో విధ్వంసక భయం చోటు చేసుకుంది. దాని వలన వ్యక్తిత్వమే అస్తవ్యస్త మైంది. విధ్వంసక భయం ఎప్పుడైనా, ఎవరి కైనా ఆత్మహత్యా సదృశమే. శ్రీకృష్ణుడు కూడా పరోక్షంగా అర్జునుని భయ పెడుతూనే మందలించాడు. కాకపోతే అది విధాయక భయం. భయాన్ని పోగొట్టే భయం. నూతన తేజాన్ని నింపే దైవబలం.

వజ్రాన్ని వజ్రం తోనే ముక్కలు చేయాలి. అలాగే భయాన్ని భయం తోనే పోగొట్టాలి అనే బౌద్ధిక పరివర్తనకు, సాంస్కృతిక పునర్జీవనానికి శ్రీకారం చుట్టాడు శ్రీకృష్ణుడు. అర్జునునిలో మూడు భయాలు ఎలా చోటు చేసుకున్నాయో ఇప్పటికే మనం చూశాం. శ్రీకృష్ణుడు మరో మూడు భయాల్ని ప్రవేశ పెట్టి ముచ్చటిస్తున్నాడు. కాకపోతే, మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లు కాకుండా, ఆకలితో గతించే వానికి అమృతాన్ని అందించినట్లు భాషించాడు. తమోగుణ ప్రభావంతో కూలబడిన అర్జునునిలో రాజసిక ప్రవృత్తిని కలిగించి తన కాళ్ళ మీద తాను నిలబడేటట్లు చేశాడు.

భయాలే అభయాలు

యుద్ధం ప్రస్తుత పరిస్థితుల్లో తాను చేయదగిన దేనా? అనేది అర్జునుని మొదటి భయం. కురుక్షేత్ర సంగ్రామంలో పోరాడటం పుణ్యమా? పాపమా? అనేది అర్జునుని రెండవ భయం. ఈ విధమైన యుద్ధము చేయడం వల్ల తనకు అపకీర్తి సంభవిస్తుందేమో! అనేది అర్జునుని మూడవ భయం. తాను ఏది ఆచరించడం వల్ల ఉపద్రవాలు సంభవిస్తాయని ఊహించుకొని అర్జునుడు భీతి చెందు తున్నాడో, దానిని ఆచరించక పోవడం వల్లనే తన ఊహల లోని ఉపద్రవాలు సంక్రమిస్తాయని శ్రీకృష్ణుడు అర్జునుని ఆంతర్యంలో నిగూఢంగా ఉన్న మూడు భయాలనే ప్రస్తావిస్తూ ప్రవచిస్తున్నాడు.

(1) అనార్య జుష్టం

ఆర్యులు ఆచరించ దగినదా, కాదా? అనేది అర్జునుని సంశయం. ఆచరిస్తేనే ఆర్యుడు. ఆచరించకుండా ఉండటం ఆర్యునికి తగినది కాదు; అనార్యులకు తగినది ***(అనార్య జుష్టం)*** అని మొదటి భయాన్ని నివారించే ప్రయత్నంలో అద్భుతంగా ప్రవచించాడు అచ్యుతుడు. **జుష్టం** అంటే ఆచరించ దగినది అని అర్థం. **అనార్య జుష్టం** అంటే ఆర్యులు కాని వారు ఆచరించేది అంటూ మరీ దారుణ మైన భయాన్ని అర్జునుని బుద్ధికి పట్టించాడు భగవానుడు.

ఆర్తుం యోగ్యః ఆర్యః. ఆర్యుడు అంటే సేవింప దగిన వాడు, లేదా పూజింప దగిన వాడు అని అర్థము. ఆర్యుడు ఎందుకని పూజింప దగిన వాడు? ధర్మాన్ని ఆచరించాలని కోరుకొనే వాడు, అధర్మాన్ని ఆచరించ కూడదని అభిప్రాయపడే వాడు కనుక ఆర్యుడు పూజార్హుడు ***(కర్తవ్యం ఆచరన్ కామం అకర్తవ్యం అనాచరన్)***. ఆర్యుడు ఆచరణీయుడు. అనుష్ఠానపరుడు.

సకాలంలో సత్కర్మలు చేసే సత్పురుషులు ఆర్యులు. ఆతతాయు లైన దుర్యోధనాదుల వల్ల ధర్మ హాని ఏర్పడింది. క్షత్రియునికి ధర్మం ప్రాణవాయువు వంటిది. కురుక్షేత్రంలో జరిగేది ధర్మయుద్ధము. వ్యక్తిగత బాంధవ్యాలకు సంబంధించింది కాదు. క్షత్రియ జాతిలో జన్మించిన ఆర్య పురుషుడు ధర్మరక్షణ కొరకు యుద్ధం చేయాలి. అలా చేయక పోతే, అధర్మం వ్యాప్తి చెందుతుంది. క్షత్రియుడు ధర్మాన్ని విస్మరించి యుద్ధం చేయక పోవడం చేతనే ధర్మానికి హాని ఏర్పడుతుంది కనుక, అట్టి ధర్మ గ్లానికి కారణమైన క్షత్రియుడు అనార్యుడని పిలువ బడతాడు. అధర్మ వ్యాప్తికి కారణ మైనందున నరకంలో ప్రవేశిస్తాడు.

(౨) అస్వర్గ్యం

యుద్ధం చేస్తే పాపం వస్తుందేమో, పాప ఫలంగా నరకం సంభవిస్తుం దేమో అనేది మూడవ వాని రెండవ భయం. ఇది గుఱ్ఱం ముందు బండిని ఉంచడమే అవుతుందని శ్రీకృష్ణుడు కనువిప్పు కలిగించాడు.

యుద్ధం చేయక పోతేనే నరకం ప్రాప్తిస్తుంది, స్వర్గం చేజారి పోతుంది అని భగవానుడు సహేతుకంగా

వివరించాడు. ధర్మహాని కలిగే టప్పుడు ధర్మాన్ని రక్షించడానికి క్షత్రియుడు యుద్ధం చేయాలి. అది క్షత్రియ ధర్మం. ధర్మ రక్షణ చేయకుండా, కర్తవ్యం నుండి జారిపోయిన క్షత్రియుడు నరకాన్ని పొందుతాడు.

ధర్మ రక్షణకై యుద్ధం చేసి యుద్ధభూమిలో మరణించిన వీరుడు స్వర్గాన్ని పొందుతాడు అని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. వాటిని అనుసరిస్తూ ఆచరించే వారు ఆర్యులు. స్వర్గప్రాప్తికి అర్హులు. ధర్మయుద్ధం నుండి పారి పోయేవారు అనార్యు లవుతారు. స్వర్గ ద్వారాలు వారికి మూత పడతాయి.

(3) అకీర్తికరం

యుద్ధం చేస్తే అపఖ్యాతి పాలవుతా నేమో అనేది అర్జునుని మూడవ భయం. ఆ అపఖ్యాతి ఏదో యుద్ధం చేయక పోవడం వల్ల వస్తుందే గాని చేయడం వల్ల కాదు అనేది అచ్యుతుని ఆక్షేపము.

యుద్ధాన్ని విరమించి, అర్జునుడు వెను దిరిగితే, కిరీటి కీర్తి కిరీటంలో మరో మణిపూస చేరుతుందా? ధనంజయుడు దయామయుడు అని ప్రజలు కీర్తిస్తారా? పోరాడి గెలిస్తే కీర్తి వస్తుంది గాని పారిపోయి ఓడిపోతే యశస్సు పెరుగుతుందా?

యుద్ధం చేస్తే అపకీర్తి వస్తుంది అనేది అర్జునుని భయం. యుద్ధాన్ని విరమిస్తేనే అపఖ్యాతి అనేది శ్రీకృష్ణుని వాదన.

అర్జునా! కీర్తి, అపకీర్తి అనేవి ఎక్కడ నుండి వస్తాయి? ఎవరి నుండి వస్తాయి? ప్రజల నుండి రావాలి. ప్రజలు ఎవరిని కీర్తిస్తారు? ఎవరిని నిందిస్తారు? ప్రజలు ధర్మాభిలాషులు. ధర్మ రక్షణ చేసే వారిని కీర్తిస్తారు. ధర్మహాని కలిగించే వారిని నిందిస్తారు. దూషిస్తారు.

దుర్యోధనుడు అధర్మపరుడు. నీవు రణరంగం నుండి పారిపోతే, ఆ తరువాత దుర్యోధనునిదే ప్రభుత్వము. అతని దుష్ట పరిపాలనలో ప్రజలు దుర్గతి పాలవుతారు. ఇదంతా నీ నిర్వాకమే నని నిన్ను ఎత్తి పొడుస్తూ ఉంటారు. అర్జునుని పిరికితనం వల్లే మనకు ఈ దుర్గతి ప్రాప్తించింది అని నిన్ను నిందిస్తారు. ఇదంతా కీర్తి క్రిందికే వస్తుందా అర్జునా?

ప్రజలు ఎప్పుడైనా గెలిచిన వారికే పూలదండలు వేస్తారు. పార్థా! పారిపోయిన వారికి పసుపు కుంకాలను పంపడం చూశాము గాని నీరాజనాలు పట్టడం చూడ లేదు. అది కూడా కీర్తే నని నీవు భావిస్తే, నా కేమీ అభ్యంతరం లేదు.

రాజుగా దుర్యోధనుడు ఏ చెడు కార్యం చేసినా, ప్రజలు ముందుగా నిందించేది నిన్నే. ధర్మయుద్ధంలో పాల్గొని, అధర్మపరులను హతమార్చి, వీర క్షత్రియుడిగా ప్రజల మన్నన లందుకొని, ధర్మయుత మైన పాలనను అందిస్తే కీర్తి వస్తుంది గాని, పారిపోతే పేరు వస్తుందా? ఏమో వస్తే రావచ్చు. పేడివాడు అనే పేరు రావచ్చు. పనికి రానివాడు అనే ఖ్యాతి మిగలొచ్చు. అర్జునా! ఆలోచించుకో. పేరు తెచ్చుకోమని, ఖ్యాతి పెంచుకోమని తల్లిదండ్రులు పేరు పెడతారు గాని, పేరును పోగొట్టుకోమని పేరు పెట్టరు. అయినా, నీ పేరు అర్జునుడు కదా! ఈ కశ్మలం ఈ విషమ సమయంలో నీ కెక్కడి నుండి దాపురించింది? అని లేని భయాలను, రాని భయాలను గుండెలో నింపుతూ భాషించాడు భగవంతుడు.

అర్థం కాలేదా అర్జునయ్యా!

చూడు మిత్రమా! నీవు కీర్తిని సంపాదిస్తా వనే మా అత్తమామలు నీకు అర్జునుడు అని పేరు పెట్టి ఉంటారు. పేరుకు ప్రాకులాడ వలసింది పోయి నీలో కశ్మలం పేరుకుపోయిం దేమిటి?

అర్జ్యత ఇతి అర్జునః. అర్జ ఆర్జనే - నీ వల్ల పేరు ప్రఖ్యాతులు ఆర్జింప బడుతాయి అనే కదా నీకు అర్జును డని పేరు పెట్టింది?

శుక్ల శుభ్ర శుచి శ్వేత విశద శ్వేత పాణ్డరాః
అవదాత స్సితో గౌరో వలక్షో ధవళోఽర్జునః ॥

ఈ అర్థాలన్నీ నీవే కదా! శ్వేతవర్ణంతో శోభిస్తూ ఉంటావు. పవిత్రమైన వాడివి. శుద్ధమైన వాడివి. అందుకే కీర్తిమంతుడివి.

ధవళః ధావతి శుధ్యతి ఇతి ధవళః అర్జునః. అర్జున అంటేనే ధవళ వర్ణము. శుద్ధిరూపము. మరి, ఈ అశుద్ధము నిన్ను ఎలా ఆవరించింది? ఈ కశ్మలము ఎక్కడి నుండి వచ్చి నిన్ను పట్టుకొంది? ***(కుతస్త్వా కశ్మల మిదం).***

అర్జునా! తెలుపు వస్త్రానికి మురికి అంటుకోవచ్చు. కాని, ఆ మాలిన్యము తెలుపు వస్త్రానిది కాదు. ఎక్కడి నుండో వచ్చి వస్త్రానికి అంటుకొని ఉంటుంది. శుద్ధి చేస్తే మురికి పోతుంది. వస్త్రం తెల్లగా శోభిస్తుంది ***(శ్వేతతే శ్వేతమ్).***

పార్థా! నీవు కూడా శుద్ధమైన వాడివి. అర్జునుడివి. ప్రస్తుతము నిన్ను ఆవరించిన మనోమాలిన్యము నీ స్వభావము కాదు. ఆగంతుకము. రాసుకుంటే ఉంటుంది. రాల్చేస్తే పోతుంది. తగిలించుకుంటే ఉంటుంది. తొలగించుకుంటే పోతుంది.

మధ్యలో వచ్చినవి మధ్య లోనే పోతాయి. అర్జునా! ఇంతెందుకు? మీరు అజ్ఞాతవాసం చేసి నపుడు విరాట నగరంలో నువ్వు అదోలా ఉన్నావు కదా! ఇప్పుడలా ఉన్నావా? లేవు కదా! అంతే. ఒకవేళ, అలాగే ఉన్నట్లు అనిపిస్తోందా? అలాంటి దేమీ లేదు. భ్రమపడకు. అలాంటి ఆలోచనల్ని రానివ్వకు. వచ్చినా ఉండ నివ్వకు. విడిచేయ్! అది నీకు తగదు.

క్లైబ్యం మాస్మగమః పార్థ నైత త్త్వ య్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్య క్త్వోత్తిష్ఠ పరంతప ॥ 3

క్లైబ్యం-మా స్మ గమః-పార్థ-న-ఏతత్-త్వయి-ఉపపద్యతే
క్షుద్రం-హృదయ దౌర్బల్యం-త్యక్త్వా-ఉత్తిష్ఠ-పరంతప

పార్థ	=	హే అర్జునా!	పరంతప	=	హే పరంతపా!
క్లైబ్యం	=	అధైర్యమును	క్షుద్రం	=	నీచమైన
మాస్మగమః	=	పొందకు	హృదయదౌర్బల్యం	=	హృదయ దుర్బలత్వమును
ఏతత్	=	ఇది	త్యక్త్వా	=	విడిచి
త్వయి	=	నీ విషయమున	ఉత్తిష్ఠ	=	లెమ్ము!
న ఉపపద్యతే	=	తగదు			

పార్థా! అధైర్య పడకు. అది నీకు తగింది కాదు. నువ్వు శత్రువులను పీడించే వాడివి కదా! లే! నీచమైన హృదయ దౌర్బల్యాన్ని విడిచేయి.

వ్యాఖ్య

అధైర్యమే అవరోధము

అధైర్యము అవాంఛనీయము. అసంగతము. సద్యోగ స్ఫూర్తికి ప్రతిబంధక మైన అధైర్యము

అసమంజసము అని శ్రీకృష్ణుని అభిప్రాయం. అందుకే అధైర్యాన్ని పొందకు. అశక్తతను దగ్గరకు రానివ్వకు అని సవ్యసాచికి సలహా ఇస్తున్నాడు (**క్లైబ్యం మాస్మగమః**).

'క్లైబ్యం' అంటే అధైర్యము అని ఒక అర్థము. నపుంసకత్వము అని మరొక అర్థము. ఈ రెండింటిలో ఏదీ యుద్ధభూమికి అర్హ మైనది కాదు. అధైర్యపరుడు యుద్ధం చేసే దేముంటుంది? ఇక నపుంసకుని విషయం ప్రత్యేకంగా చెప్పే దేముంది?

పురుషుడైన వాడు రణరంగంలో ఎదజూపి, ఎదురొడ్డి పోరాడుతాడు. స్త్రీ ఇంటి లోనే ఉంటుంది. సమర రంగానికి రాదు కమక ఆమె పోరాడే ప్రసక్తే లేదు. నపుంసకుని విషయమే విచిత్రంగా ఉంటుంది. నపుంసక జీవి స్త్రీ కాదు కమక ఇంటిలో ఉండటం జరగదు. పురుషుడు కానందున యుద్ధంలో ప్రవేశించడం జరగదు.

స్త్రీ కానందున యుద్ధం చేయకుండా ఇంట్లో ఉండేది లేదు. పురుషుడు కానందున రణరంగంలో ఉండటమే గాని పోరాడేది ఉండదు. మరి, యుద్ధభూమిలో చేసే దేమిటి? ఏముంది? పోరాడే వాళ్ళ మధ్య తారాసిల్లి, తారాడుతూ, తచ్చాడుతూ తటస్థంగా ఉండటమే.

అర్జునుడు స్వభావత: అధైర్యవంతుడు కాడు. నపుంసకుడు అసలే కాడు. గతంలో ఎందరితో యుద్ధం చెయ్యలేదు? ఇంతెందుకు? ఉత్తర గోగ్రహణంలో కౌరవసేన నంతా గడగడ లాడించిన గడుసరి గాండీవి కాడా? సాక్షాత్తు పరమేశ్వరునితో పోరాడి పాశుపతాస్త్రమును పొందిన వాడు ధైర్యము లేనివాడా? అర్జునుడు కురువీరుడు. రణధీరుడు. అందుకే, ఈ సందర్భంలో అర్జునుని పార్థా! అని సంబోధించాడు భగవంతుడు.

పృథాదేవి ఉత్తమ క్షత్రియ స్త్రీ. ఆమె కుమారుడివి. ఉత్తమ క్షత్రియ ధర్మాలతో శోభించ వలసిన వాడివే గాని అధైర్యంతో వెన్ను చూపే వాడివి కావు. కాకూడదు. అది పురుష లక్షణం కాదు. నపుంసక లక్షణం (**క్లీబత్వం -క్లైబ్యం**). నీ విషయంలో అది తగదు. అర్జునా! ఏదో శాపవశాత్తు గతంలో బృహన్నలగా కులికింది వాస్తవమే అయినా, అదేదో పోయింది కదా! ఇప్పుడు లేదు కదా! కనుక ఎటు చూచినా, ఏ అర్థాన్ని ఆశ్రయించినా, క్లైబ్యం నీకు తగింది కాదు.

నీవు తగవు - నీకు తగవే

అర్జునా! ఇది నీకు తగదు (**త్వయి ఏతత్ న ఉపపద్యతే**). అధైర్యము నీకు సంబంధించింది కాదు. తగవు లాడే స్వభావం గల క్షత్రియుడవే గాని పిరికితనాన్ని, పేడితనాన్ని ప్రదర్శించుటకు నీవు తగవు. ఈ విధమైన ప్రవర్తన నీకు తగదు.

బుద్ధి బలహీనపడి నపుడు, హృదయం విషాదభరిత మైనపుడు, మనస్సును నియంత్రించే శక్తిని మనిషి కోల్పోయి నపుడు, ఈ విపత్కర పరిస్థితి నుండి బయట పడటానికి తన శక్తి సరిపో నపుడు మరొక చోట నుండి సహాయం అవసరమై ఉంటుంది. ఆ సహాయంతో తన అశక్తత నుండి బయటపడి మనిషి శక్తివంతు డవుతాడు.

మరొక చోట నుండి సహాయం అందటం అంటే, అది వ్యక్తి నుండి కావచ్చు. గ్రంథం నుండి రావచ్చు. లేదా దృఢమైన లక్ష్యం నుండి కావచ్చు. ఒక సన్నివేశం కూడా సరిపోవచ్చు. ఏదైనా సరే, అలాంటి పరిస్థితిలో ఆ సహాయం ఏదో అది శక్తి ఉత్పాదక యంత్రంగా పని చేయాలి.

ప్రతి మనిషిలో నిగూఢ మైన శక్తి ఉంది. అలాగే కొంత అశక్తత కూడా ఉంటుంది. బలాబలాలు ఉన్నవాడే మనిషి. వ్యక్తిలో రెండూ ఉండొచ్చు. కాని, ఒకే సమయంలో రెండిటిని ప్రదర్శించడం సాధ్యం కాదు.

ఏదో ఒకటే బయట పడుతూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో ధైర్యం ఉండొచ్చు. కొన్ని పరిస్థితులలో అధైర్యమే అందలం ఎక్కవచ్చు. ఎప్పుడు ఏది వస్తుందో, ఏ స్థాయిలో ఉంటుందో చెప్పలేము.

బలం బలమే కనుక బాధ లేదు. బలహీనత ఆక్రమిస్తేనే దానిని నివారించుకొనే ప్రయత్నం చేయాలి. అది కూడా, మనకు సాధ్యం కాకపోతే, మరొకరి సహాయం సలహా రూపంలో సహకరించ వచ్చు. ఉపకరించ వచ్చు. కాని, ఆ సలహాలు సౌజన్యాలుగా ఉండాలే గాని దౌర్జన్యాలుగా ఉండ కూడదు. సముచితాలుగా ఉండాలే గాని, అనుచితాలు కాకూడదు. విధాయకాలై ఉండాలే కాని, విధ్వంసకాలు కాకూడదు.

సలహాలు ఎవ్వరైనా ఇవ్వగలరు. అదొక పెట్టుబడి లేని వ్యాపారం. కొందరికి అనవసర మైన వ్యాపకం కూడా. కాని ఆ సలహాలు సముచితాలు కాకపోతే మాత్రం ఆ తరువాత అంతా అనుచితమే. అనాదరమే. అహితమే. అందుచేతనే, సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడు ఈ సందర్భంలో అనితర సాధ్యంగా, అసమాన వైభవంతో అభిభాషించాడు. పార్థా! అధైర్యము నీకు తగదు. క్షత్రియ వీరా! అధైర్యానికి నీవు తగవు (**నైతత్త్వయ్యుప పద్యతే**). తగవు లాడటమే నీకు తగును అంటున్నాడు అర్జున సఖుడు.

ఆకాశం లోనే ఎండ-వాన

ప్రభాకరుడు పలికినా, జాబిల్లి నవ్వినా ఆకాశంలో ప్రకాశం తాండవిస్తుంది. ఆ ఇరువురూ తెరమరు గైతే గగనాన్ని చీకటి కప్పేస్తుంది. ఆకాశం లోనే చీకటి వెలుగులు. ఆకాశం నుండే తిమిర తేజాలు. ఎండైనా, వానైనా ఆకాశం నుండే. ఏది ఎలా వస్తే ఆకాశం అలా అగుపిస్తుంది.

వ్యోమంలో వెలుగునీడలు తారాడినట్లు, శీతోష్ణాలు పచార్లు చేసినట్లు, బలాబలాలు బుద్ధిలో ఉంటాయి. బుద్ధి నుండే బహిర్గత మవుతాయి. బుద్ధి లోనే బలం ఉంటుంది. బుద్ధి లోనే బలహీనత ఉంటుంది. ఏది బుద్ధిలో ఉంటే అదే బ్రతుకులో తచ్చాడుతుంది. అందుకే, మనసే మనిషి అంటుంటారు మనస్తత్త్వ శాస్త్రవేత్తలు.

ఇటుకలు, సున్నము బలంగా ఉంటే గోడ బలంగా ఉంటుంది. ఆలోచనలు, భావాలు తేజోవంతంగా ఉంటే, బ్రతుకు తేజరిల్లుతుంది. ఆ పని ఎవరికి వారు చేసుకోవాలి. అలా చేసుకోవడం సాధ్యపడ నపుడు మరొకరి చేయూత అవసరం అవుతుంది. అలా చేయూత నిచ్చే వ్యక్తి ఆచార్యుడే అయితే చిత్తము చిగురిస్తుంది. బ్రతుకు పరిమళిస్తుంది. అర్జునునికి కురుక్షేత్రంలో అలాంటి సహాయమే అవసర మైంది. అదృష్టం తోడై అచ్యుతుని అండ లభించింది.

నీరసించిన అర్జునుని మనస్సును శక్తివంతం చేసే ప్రయత్నంలో శ్రీకృష్ణుడు బలమైన రసాయనాన్ని ఈ శ్లోకంలో నూరి పోశాడు. వండి వడ్డించాడు. పనిగట్టుకొని త్రాగించాడు. పనితన మేమిటో ప్రదర్శించి చూపాడు. నిద్రించిన ఆకాశాన్ని సూర్యుడు వెలుగులతో తట్టి లేపినట్లు, నిర్వీర్యమై కూల బడిన అర్జునుని అంత:కరణములో వివేక దీపాన్ని వెలిగించాడు అనంతుడు.

బలవంతుడివి - బలహీన పడకు

అర్జునా! దారుణమైన ఈ విషమ సమయంలో ఈ అవివేకము నిన్నెలా ఆవేశించింది? ఈ మనో వ్యాకులత నీకు ఎలా దాపరించింది? ఇది నీకు తగింది కాదు. నీవు వీరుడివి. శూరుడివి. బలవంతుడివి. నీ చరిత్రలో ఇప్పటి వరకు పుటలన్నీ ఇలాగే ఉన్నాయి. ఇప్పుడే ప్రథమంగా నీలో ఈ కశ్మలాన్ని చూస్తున్నాను. ఇది నీకు తగింది కాదు (**నైతత్త్వ య్యుపపద్యతే**) అంటూ అమోఘంగా భాషించాడు అనంతుడు.

ఈ సందర్భములో పైపైన చూచే వారికి శ్రీకృష్ణుడు అర్జునుని అశక్తతపై స్వారి చేసినట్లు కనిపిస్తుంది. కాని, వివేకంతో విశ్లేషించుకొని, ఆంతరంగిక ఔన్నత్యాన్ని అర్థం చేసుకోగలిగే వారికి, శ్రీకృష్ణుడు అర్జునుని ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, పతన మౌతున్న మనస్సును పదిలంగా నిలిపి, పవిత్రంగా నడిపించినట్లు అర్థ మవుతుంది.

'ఇది నీలో ఉంది' అని దోషాన్ని ఎత్తి చూపడం వేరు. అదే విషయాన్ని 'ఇది నీలో ఉండ తగింది కాదు' అని చెప్పడం వేరు. మొదటి వాక్యం పతనానికి శ్రీకారం చుడుతుంది. రెండవ వాక్యం ప్రగతికి ద్వారం తెరుస్తుంది. మొదటిది నిరాశా నిస్పృహలను, లేదా కోపతాపాలను కలిగించ వచ్చు. కాని, రెండవది మాత్రం ఆశాకిరణాల్ని విరజిమ్ముతూ క్రియాశీలత్వాన్ని ప్రసాదిస్తుంది. దౌర్జన్యాలు ఫలించవు. సౌజన్యాలు నిష్ఫలం కావు.

ఆత్మగౌరవం దెబ్బ తింటే మాత్రం, ఆ వ్యక్తిలో అభివృద్ధి అగుపించదు. మనిషికి పశువుకు తేడా ఇక్కడే. గొడ్డును దుడ్డుకర్రతో బాదినా, మరుక్షణమే గడ్డి పడేస్తే చాలు. గుట్టుగా తిని త్రేపుతుంది. కాని, మనిషిని కొట్ట నవసరం లేదు. తిట్టినా చాలు. మనసు గాయ పడుతుంది, మనిషి తిండి మానేస్తాడు. పశువుకు ఆకలి తీరితే చాలు. కాని, ఆకలి కన్నా, ఆత్మగౌరవానికే మనిషి ప్రాధాన్యత నిస్తాడు.

మనిషి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తూ సలహా లివ్వ కూడదు. అలా ఇవ్వడం ఆత్మ వినాశానికి దారి తీస్తుంది. పడిపోయిన వ్యక్తిని లేపి కూర్చోబెట్టాలి. ఆ తరువాత, కూర్చున్న వ్యక్తిని ప్రయత్నంతో నిలబెట్టాలి. నిలబడ్డాడా, ఆ తరువాత మెల్లగా నడిపించాలి. ఇది విధాయక పద్ధతి. ఇక్కడే సౌజన్యంలో సౌరభం.

అర్జునా! ఇది నీకు తగింది కాదు అని అర్జునుని వ్యక్తిత్వాన్ని ఆకాశానికి ఎత్తేశాడు శ్రీకృష్ణుడు. తనలో తాను ఆలోచించుకొనే శక్తిని అర్జునునికి ప్రసాదించాడు. వలచిన పేడితనాన్ని చెదర గొడుతూ, మరచిన పురుష వైభవాన్ని తిరిగి ఆవిష్కరిస్తూ అభిభాషించాడు.

ఇది మామూలు విషయం కాదు. మనిషిని మనీషిగా, మనీషిని మహర్షిగా, మహర్షిని మాధవునిగా మలచే మహోత్కృష్టమైన బోధనా విధానం. మనస్సుల్ని మలచి, మనుషులను తీర్చిదిద్దే కార్యంలో మహాశిల్పి మధుసూదనుడు ప్రదర్శించిన అసమాన బోధనా కౌశలాన్ని బిడ్డల విషయంలో తల్లిదండ్రులు, విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు, భార్యల విషయంలో భర్తలు, ఉద్యోగుల విషయంలో అధికారులు అనుసరించి ఆచరించ గలిగితే, ఆ తరువాత సమాజంలో కనిపించేది ఏదో కాదు, అభ్యుదయమే. ఆదర్శమే. ఆనందమే.

క్లైబ్యం మాస్మగమః అన్నప్పుడు, శ్రీకృష్ణుడు అర్జునుని మనస్సును పేల్చేశాడు అనిపిస్తుంది. **నైతత్త్వ య్యుపపద్యతే** అన్నప్పుడు అవగాహనను పెంపి, ఆశాజ్యోతిని వెలిగించాడని తెలుస్తుంది.

జ్యోతి ప్రజ్వలనం

సూర్యుడు ఉదయిస్తాడు. విశ్వం వెలుగులతో నిండుతుంది. ఆ వెలుగులో జనులు పయనిస్తారు. పనులు చేసుకుంటారు. ఎవరు ఏ దారిలో పోవాలో, ఎవరు ఏయే పనులు చేయాలో సూర్యుడు నిర్ణయించడు. ఎవరికి వారే నిర్ణయించు కుంటారు. అదంతా వారి వారి స్వభావం మీద, అవసరం మీద ఆధారపడి ఉంటుంది.

అంతే కాదు. సూర్యుడు వెలుగులను విరజిమ్ముతూ ప్రకాశిస్తున్నా, మనం క్రియాశూన్యంగా పడి ఉంటే, మవ్వు ఎందుకని అలా ఉన్నావు? కర్మలు చేయ వెందుకని? అని సూర్యుడు ప్రశ్నించడు. తాను ప్రకాశించే వాడే గాని, నీకు పని కల్పించే వాడు కాడు. నిన్ను పనికి పురికొలిపే వాడు కాడు. ఆ పని అంతా మనదే. మనమే చూసుకోవాలి. మనమే చేసుకోవాలి. మన కొరకే చేసుకోవాలి.

భగవద్గీత జ్ఞానస్వరూపం. గీతాచార్యుడు జ్ఞానరూపుడు. మన హృదయాలలో జ్ఞానప్రదీపాన్ని గీత వెలిగిస్తుంది. ఆ వెలుగులో ఎవరి కార్యాలు వారు పూర్తి చేసుకోవాలి. ఎవరి సమస్యల్ని వారు పరిష్కరించు కోవాలి. సత్యాన్ని అన్వేషించి పట్టుకోవాలి. అసత్యాన్ని విస్మరించి ఆనందంగా జీవించాలి.

శ్రీకృష్ణుడు ఈ రెండు ప్రారంభ శ్లోకాలలో అందించిన సందేశము దీప ప్రజ్వలనమే. సూర్యుడు ఏ ఒక్క వ్యక్తి కోసమో ఉదయించడం లేదు. ఆయన ప్రకాశం అందరి కొరకై ఉంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అందించిన సందేశము ఒక్క అర్జునుని కొరకే కాదు. వినింది అర్జునుడే అయినా, వినిపించింది మాత్రం యావ ద్విశ్వానికే గాని ఏ ఒక్క వ్యక్తి కోసమో కాదు. విశ్వం లోని వ్యక్తులలో ఒక కాలంలో, ఒక దేశంలో ఉన్న వ్యక్తి అర్జునుడు.

గీత అర్జునుని కొరకే అయితే, అతనికే ఉపయోగ పడాలి. లేదా, ఆ కాలము వారికే ఉపయోగ పడాలి. అర్జునునికి శ్రీకృష్ణుడు బోధించిన విషయములో విశ్వసందేశ ముంది. అందుకే విశ్వ మంతటికీ గీత శిరోధార్య మైంది. అన్ని కాలాలకు, అన్ని దేశాలకు, అందరు వ్యక్తులకు సూర్యప్రకాశం లాగా ప్రమాణ ప్రకాశ మైంది. ప్రమను ఆరబోస్తూ భ్రమను అదృశ్యం చేస్తోంది. ఐదు వేల సంవత్సరాలు గడచినా నేటికీ నిత్య నూతనంగా మానవాళిపై తన ప్రభావాన్ని చూపుతోంది. జ్ఞాన ప్రభంజనమై అంతటా వీస్తూ ఉంది.

పిరికితనం పనికిరాదు

చీకటిలో ఏది ఎక్కడుందో, ఎవరు ఎక్కడున్నారో తెలియదు. అందుచేత, ధీరుడు కూడా చీకటిలో భీరు డవుతాడు. కాని, ఒక వైపు వెలుగులు విరజిమ్ముతున్నా విలవిల లాడే వ్యక్తి పిరికివాడు. అతని మనసులో పిరికితనం ఉంది. గుండెలో గుబులు ఉంది. అదే దుర్బలత్వము. మనోదౌర్బల్యము. హృదయ దౌర్బల్యము. అదే మనిషికి అభద్రం. క్షుద్రం. నీచం. దీపమున్నా దిగులు తప్పని దౌర్బల్యం.

కృష్ణుడు కొరడా ఝళిపించాడు. అర్జునునిలో చలనం మొదలైంది. మగతను విడిచాడు (**క్షుద్రం హృదయ దౌర్బల్యం**). తమోగుణం నుండి తమాయించు కున్నాడు. రజోగుణం రాజిత మైంది. తమోగుణ ప్రేరితుడై యుద్ధం చేయలేను అనే సంకేతా న్నిస్తూ ధనుర్బాణాలు పడేసిన సవ్యసాచి, భగవంతుని సందేశముతో కనువిప్పు కలిగి, రజోగుణము చేత ప్రభావితుడై, యుద్ధం ఎలా చేసేది? అంటూ భాషిస్తున్నాడు.

వేలాది సంవత్సరాలుగా అంతటా గీతాప్రదీపం వెలుగుతూనే ఉంది. కానీ, దేదీప్యమానంగా గీతాజ్యోతి వెలుగుతున్నా భయం చీకటిలో బిక్కుబిక్కు మంటూ బ్రతికే వారే ఎక్కువగా కనిపిస్తూ ఉంటారు. ఈ భయాలే మహాజాడ్యాలు. మరణాలు. మారణహోమాలు.

కళ్ళు మూసుకుంటే వెలుగు లుండి ఏమి లాభం? వినియోగము తెలియాలి. వినియోగము అంటే వినింది ఆచరణలో పెట్టడ మని అర్థము. అది చేయలేని దోషం వల్ల గీత మన వద్దే ఉన్నా, రాత మారడం లేదు.

శ్రీకృష్ణుని పలుకులు పార్థునికి ప్రాణవాయువును అందించాయి. ఆశల్ని చిగురింప చేశాయి. కదలిక ప్రారంభ మైంది. ఏ దౌర్బల్యమో ఏమో, అదేదో తన మనసు లోనే ఉండి కలత పెడుతూ ఉంది అనేది అర్జునునికి అర్థమై పోయింది. అది గమనించిన గోవిందుడు, 'లే, వదిలేయ్!' (**త్యక్త్వా + ఉత్తిష్ఠ**) అని ఆజ్ఞాపించాడు.

మనల్ని ఎవ్వరూ కట్టి పడేయ లేదు. మనమే అనవసరంగా భయాన్ని పట్టుకున్నాం. ధైర్యాన్ని పోగొట్టు కున్నాం. పట్టుకున్న దానిని విడిచి పెడితే చాలు. ఆ తరువాత, పట్టు లేని భయాలు వాటంతటవే పారిపోతాయి.

అందుకే, బలహీనతల్ని విడిచేయ్! బలంగా లేచి నిలబడు అని హుంకరించాడు హృషీకేశుడు.

దౌర్బల్యముతో స్నేహం మంచిది కాదు. పిరికితనము శత్రువే గాని నేస్తం కాదు. శత్రువును ఉపేక్షించ కూడదు. శత్రు శేషాన్ని ఉంచకూడదు అంటారు పెద్దలు. అర్జునా! శత్రుతాపనా! లే! నిలబడు అన్నాడు పరమేశ్వరుడు.

పరంతపా! పని సాగనీ

పార్థునికి పరంతపుడు అని పేరు. అంటే శత్రువును పీడించే వాడు అని అర్థము. ఆ పని జరగాలి. అప్పుడే పార్థుడు పరంతపుడు. శత్రువు బయట ఉన్నాడు. పోరాడటానికి ఎదురుగా నిలబడి ఉన్నాడు. అతణ్ణి పీడించాలి. ఎందుకో, అది జరగడం లేదు. బాహ్యం లోని శత్రువును పీడించ వద్దంటూ, లోపల ఎవరో మరొక శత్రువు పార్థుణ్ణి పీడిస్తున్నాడు. ఆ శత్రువే అవివేకము. అదే హృదయ దౌర్బల్యం. ముందుగా అంత శ్శత్రువును మట్టు పెట్టాలి. ఆ తరువాత బాహ్య శత్రువును వధించ డానికి అవరోధా లుండవు. అందుకనే, 'అర్జునా! లే. నిలబడు' అన్నాడు శ్రీకృష్ణుడు.

అర్జున ఉవాచ :

కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన ॥ 4

కథం-భీష్మం-అహం-సంఖ్యే-ద్రోణం-చ-మధుసూదన
ఇషుభిః-ప్రతియోత్స్యామి-పూజార్హౌ-అరిసూదన

మధుసూదన	=	హే కృష్ణా!	సంఖ్యే	=	యుద్ధము నందు
అహం	=	నేను	అరిసూదన	=	శ్రీకృష్ణా!
పూజార్హౌ	=	పూజింప దగిన	ఇషుభిః	=	బాణాలతో
భీష్మం	=	భీష్ముని	కథం	=	ఏ విధముగా
ద్రోణంచ	=	ద్రోణుని	ప్రతియోత్స్యామి	=	ఎదిరించి పోరాడ గలను?

అర్జునుడు అడుగుతున్నాడు :

మధుసూదనా! భీష్మద్రోణులు పూజార్హులు. వాళ్ళను నేను ఎలా ఎదిరించేది? అరిసూదనా! యుద్ధంలో వాళ్ళపై బాణాలు ఎలా వేసేది?

వ్యాఖ్య

శ్రీకృష్ణుని మాటలు అర్జునునిలో ఏదో కొంత మార్పును కలిగించినట్లు కనిపిస్తోంది. కలత చెందిన మనస్సు కొద్దిగా కుదుట పడినట్లు అగుపిస్తోంది. ఆవేశము అదుపులో ఉంది. కన్నీళ్ళు లేకుండా చూస్తున్నాడు. ఆవేశం లేని ఆలోచనతో పలుకు తున్నాడు. సరళమైన భాషలో, మృదువైన పలుకులతో, సున్నితంగా భాషిస్తూ తన సంశయాలను శ్రీకృష్ణునికి వినిపిస్తున్నాడు.

అవగుణము కాదు - అప్రియము

ఈ అవివేకము నీకు ఎక్కడి నుండి వచ్చింది? భయాన్ని విడిచి పెట్టు. ఇది నీకు తగింది కాదు. మనో దౌర్బల్యము నీచ మైనది. శ్రీకృష్ణుడు పలికిన ఈ మాటల్ని అర్జునుడు జీర్ణించుకోలేక పోతున్నాడు.

కృష్ణా! నేను యుద్ధం చేసే స్థితిలో లేను అనేది వాస్తవమే. దానికి కారణం ఏమిటి? నేను భయపడి యుద్ధం చేయడం లేదని నీవు అభిప్రాయ పడినట్లు నీ మాటల్లో తెలుస్తూ ఉంది. నేను భయపడి యుద్ధం విరమించడం లేదు. పిరికితనంతో పారిపోవడం లేదు. నా యుద్ధ విముఖతకు, నాకు సరిపడని ఈ విధమైన కారణాలను ఆపాదించడం నన్ను బాధిస్తోంది. పుండుపై కారం చల్లినట్లు ఉంది. కాకిని కూర్చో బెట్టినట్లు ఉంది.

అయిష్టులను వధించడం సాధ్యమే. ఇష్టమైన వారిని ఎలా చంపాలి? శత్రువులను చంపగలం. మిత్రుల్ని చంపే దెలా? బంధువుల్ని చంపే దెలా? అని మథన పడుతున్నాను. కృష్ణా! నువ్వు నన్ను అడుగుతా వేమో, దుష్టులైన దుర్యోధనాదులు కూడా బంధువు లేనా? అని. అచ్యుతా! దుర్యోధన, దుశ్శాసనాదుల్ని చంపడానికి నేను వెనుకాడటం లేదు. ఎటొచ్చి, భీష్మ ద్రోణాదుల విషయం లోనే కలత పడుతున్నాను. వారిపై బాణాలను ఎక్కుపెట్టడాన్ని ఊహించు కోలేక పోతున్నాను.

భీష్ము డెవరు? ద్రోణు డెవరు? భీష్ముడు కులవృద్ధుడు. పైగా గుణవృద్ధుడు. పెంచి పోషించిన వాడు. వందనీయుడు. ద్రోణుడు ఆచార్యుడు. విద్య నేర్పిన వాడు. విజయానికి బాట వేసిన వాడు. కన్నబిడ్డ కన్నా నన్నే మిన్నగా భావించాడు. ప్రాణ సమానంగా ప్రేమించాడు. ఇలాంటి వారిని ఎలా చంపేది? నాకు చేతు లున్నది వాళ్ళను పూజించుటకే గాని వధించుటకు కాదు. వాళ్ళకు నమస్కరించ వలసిన చేతులు వాళ్ళను ఎలా నాశనం చేస్తాయి?

అచ్యుతా! ఇలా ఆలోచించడం దుర్బలత్వమా? ఇది నాకు తగనిదా? వీరుడు ఇలా ఆలోచించ కూడదా? ధనుర్బాణాలు పట్టగానే దయ దూరం కావాలా? కవచం ధరించ గానే కరుణను వదిలేయాలా? వీరుడు అంటే కఠినుడా? వీరుడికి ప్రేమలు పనికి రావా? మమతలు మంచివి కావా? అస్త్రశస్త్రాలే కాని అనుబంధాలు, అనురాగాలు ఉండ కూడదా?

పూజార్హు లైన పెద్దలను, గురువులను వధించుటకు వెనుకాడటం అవగుణమా? కృష్ణా! అధైర్య మనే అవగుణంతో నేను యుద్ధాన్ని విరమించడం లేదు. అప్రియమైన కార్యాన్ని ఆచరించలేక పోతున్నాను. అధర్మ కార్యాన్ని చూచి భీతి చెందుతున్నా. అంతే.

చెప్పేవాళ్ళు - చేసేవాళ్ళు

మాధవా! కడుపులో చల్ల కదలకుండా కబుర్లు చెప్పేవాళ్ళు చాలా మంది ఉంటారు. చెప్పేవాళ్ళు ఎన్నైనా చెబుతారు. చేసే వాళ్ళదే గదా కష్ట మంతా? చెప్పడం తేలికే. కాని, చంపడం అంత తేలిక కాదు. ఎవ్వరైనా, ఎన్నైనా చెప్పగలరు. అలాగని, అందరూ అందరినీ చంపలేరు. అంతమాత్రాన కశ్మల మంటూ కషాయాన్ని త్రాగించే ప్రయత్నం చేయడం సముచిత మేనా?

ఏమిటి, నువ్వేనా చంపేది? మేము చంపలేదా? అంటావేమో! అందుకే నిన్ను మధుసూదనా! అని పిలుస్తున్నా! నువ్వు చంప లేదని నేను అనడం లేదు. నువ్వు చంపింది ఎవరిని? రాక్షసుల్ని చంపావు. మధువనే రాక్షసుని వధించావు. అందుకని మధుసూదనుడ వయ్యావు.

అయ్యా! నేను చంప వలసింది ఎవరిని? రాక్షసుల్ని కాదు. మహాత్ముల్ని. రాక్షసుని వధించావు కనుక అది నీకు బిరుదుగా మారింది. మధుసూదన నామం మారుమ్రోగింది. నేను భీష్ముణ్ణి వధిస్తే నన్ను జనం కీర్తిస్తారా? భీష్మారీ! అని శ్లాఘిస్తారా? ఈ కార్యము నాకు తగినదా? ఇది స్వర్గహేతువా? ఇది కీర్తికరమా? కృష్ణా! అందుకే అంటున్నాను. ఇది నాకు తగినది కాదు ***(ఏతత్ మయి న ఉపపద్యతే)***. ఆచార్యులను చంపడం ఆర్యుల లక్షణం

కాదు (*అనార్యజుష్టం*). ఈ అమంగళం నన్ను స్వర్గానికి అనుమతించదు (*అస్వర్గ్యం*). ప్రపంచంలో శిష్ట గర్హిత మైన కార్యాన్ని ఆచరించిన వ్యక్తిగా నన్ను చూస్తారు. ఇది అవమానం (*అకీర్తికరం*).

ఏ మూడు భయాలు తన అంతర్యంలో బీభత్సాన్ని సృష్టించి యుద్ధ వైముఖ్యానికి కారణ మయ్యాయో, వాటిని ఈ దశలో కూడా పార్థుడు పట్టుకునే పలుకు తున్నాడు.

మధుసూదనా! నా చేతల్ని చూచి చీదరించుకోకు. నా మనసును కూడా చూడు. నా మాటలు నా మనస్సును ఆవిష్కరించలేక పోతున్నా యేమో! సున్నితమైన నా మనసును చూడు. సుహృద్భావంతో కొట్టుకుంటున్న నా హృదయాన్ని చూడు.

ప్రాణం తీయడం ఎవరైనా చేయ గలరు. అలా తీసిన వాళ్ళెవరైనా తిరిగి ప్రాణం పోయ గలరా? నువ్వు ఎందరినో చంపావు. నేను కూడా చంపాను. ప్రస్తుతం చంపలేక పోతున్నా నంటే చంపడం తెలియకనా? చంపడానికి ధైర్యం లేకనా? ఇలాంటి మాటలు మరొకరు అంటే బాధ ఉండదు. అన్నీ తెలిసిన నువ్వు అంటున్నావే, అక్కడే నేను ఏదో అవుతున్నాను.

అర్జునా! మన శరీరం లోని అవయవమే అయినా, పాడై పోయిన దుష్టాంగాన్ని శస్త్ర చికిత్స చేసి దూరం చేసుకోవడం లేదా? బంధువులే కావచ్చు. అలాగని, దురాత్ములు, అధర్మపరులు, దుష్టులైన బంధువులను వధించక పోతే ఎలా? నన్ను చూసి నేర్చుకో. కంసు డెవరు? స్వయాన నాకు మేనమామ. అలాగని మమకారంతో చెట్టెక్కి కూర్చున్నానా? మెడ వంచి, తలను త్రుంచేశాను. నువ్వు అలా ఎందుకు చేయవు? అని నన్ను ప్రశ్నిస్తా వేమో కృష్ణా!

చూడు. బంధువైన కంస భూపతిని నీవు వధించింది నిజమే. ఆ పని చేయడానికి నేనూ సిద్ధమే. బంధువు, సోదరుడైన దుర్యోధన భూపతిని చంపడానికి నా కేమీ అభ్యంతరం లేదు. బంధువులుగా పుట్టినా వీళ్ళందరూ శత్రువులుగా పెరిగిన వాళ్ళే. వాళ్ళు మనకు శత్రువులే. వాళ్ళను చంపడం దోషం కాదు. అందుకే కదా, నిన్ను అరిసూదనా! అని పిలిచాను.

కృష్ణా! నువ్వు చంపిన వాళ్ళందరూ రాక్షసులు. శత్రువులు. అందుకే నువ్వు మధుసూదనుడివి. అరిసూదనుడివి. ఇక నా విషయం అంటావా? నేను కూడా అలా ఎందరినో చంపాను. కాని, గురువును చంపడం అనేది ఇప్పటి వరకు నువ్వు చెయ్యలేదు. నేనూ చెయ్యలేదు. కాకపోతే, అలాంటి సంక్లిష్టమైన సమస్య ఎదురైన సమయంలో నువ్వు చెప్పేవాడి వయ్యావు. నేను చేసేవాడి నయ్యాను. అసలు తంతు ఇక్కడే ఉంది.

శత్రువుల్ని వధించి 'అరిసూదనా!' అని పిలిపించు కున్నావు. ఇప్పుడు గురువును వధించి, 'ఆచార్య సూదనా' అని నన్ను తిట్టించుకో మంటావా? కృష్ణా! ఇదీ నా బాధ. నా మనసు లోని వ్యథ. అందుకే చంపలేక పోతున్నాను. చంప వలసి వస్తుందని యుద్ధం చేయలేక పోతున్నాను. బలహీనుణ్ణి కాను. బలమైన కారణాలతో సతమత మవుతున్న వాణ్ణి అని తన విషాదం వెనుక దాగి యున్న కారణాలను బైట పెట్టాడు అర్జునుడు.

బావుంది. మరి, యుద్ధాన్ని విరమించి ఏమి చేయాలి? యుద్ధాన్ని విరమిస్తాడు కనుక రాజ్యం రాదు. రాజ్య సుఖాలూ ఉండవు. అవి లేకపోయినా ఫరవాలేదు అనుకుందాం. కనీసం బ్రతకడానికి మార్గమంటూ ఉండాలి కదా! అయిదు గ్రామాలు ఇవ్వడానికి కూడా అంగీకరించని దుర్యోధనుడు రేపు తన రాజ్యంలో కనీసం అద్దె ఇంట్లో బ్రతకడాని కైనా పాండవులకు అవకాశం ఇస్తాడా? దుర్యోధనుని రాజ్యంలో పాండవులకు అద్దెకు ఇల్లు ఇచ్చేవారు ఉంటారా? మరి ఎలా బ్రతకాలి? అది కూడా చెప్పేస్తున్నాడు అర్జునుడు.

గురూ నహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహలోకే ।
హ త్వార్థకామాంస్తు గురూ నిహైవ భుఞ్జీయ భోగా న్రుధిరప్రదిగ్ధాన్ ॥ 5

గురూన్-అహత్వా-హి-మహానుభావాన్-శ్రేయః-భోక్తుం-భైక్ష్యం-అపి-ఇహలోకే
హత్వా-అర్థకామాన్-తు-గురూన్-ఇహ-ఏవ-భుంజీయ-భోగాన్-రుధిర ప్రదిగ్ధాన్

మహానుభావాన్	=	మహానుభావులైన	గురూన్	=	గురువులను
గురూన్	=	గురువులను	హత్వా తు	=	చంపి
అహత్వా	=	చంపక	ఇహ ఏవ	=	ఈ లోకము నందే
ఇహలోకే	=	ఈ లోకమున	రుధిర ప్రదిగ్ధాన్	=	రక్తసిక్త మైన
భైక్ష్యమపి	=	భిక్షాన్న మైనను	అర్థకామాన్	=	అర్థకామాలైన
భోక్తుం	=	భుజించుట	భోగాన్	=	భోగాలను
శ్రేయః హి	=	శ్రేయస్కరము కదా!	భుంజీయ	=	అనుభవిస్తాను

కృష్ణా! గురువులు మహానుభావులు. వాళ్ళను బలి చేసి, నెత్తురు కూడు తిని బ్రతకడం కన్నా, వాళ్ళను చంపడం మానేసి ఈ లోకంలో భిక్ష మెత్తుకొని జీవించడం శ్రేయస్కరము కదా!

వ్యాఖ్య

శాంతి జీవనం

రణరంగంలో శత్రు పక్షాన ముందు వరుసలో ఉన్న సేనాధిపతులు భీష్మద్రోణులు. ఇంతవరకు ఆచార్య స్థానాన్ని అలంకరించిన వాళ్ళు. సమున్నతులు. పూజార్హులు. వాళ్ళనే ముందుగా వధించాలి. లేదా వాళ్ళ చేత వధింప బడాలి. ఇది అర్జునుని సమస్య. ఎటు ఆలోచించినా మిగిలేది అశాంతే.

అలా ఎందుకు అనుకోవాలి? విజయాన్ని సాధించి, రాజ్యభోగాలను అనుభవిస్తూ, ఆనందంగా శాంతి జీవనాన్ని సాగించ వచ్చు కదా! అలా జీవించే అవకాశం ఉంటే అర్జునుడు యుద్ధానికి వెనుకాడే వాడు కాదు. అలా జీవించడం సాధ్యం కాదు అని అర్జునుని ఆంతర్యం ఘోషిస్తూ ఉంది.

విజయాన్ని సాధిస్తే, రాజ్యం లభిస్తుంది. రాజ్యభోగాలు ప్రాప్తిస్తాయి. అవన్నీ అర్థకామాలే. వాటి వల్ల సుఖాలు ప్రాప్తించవు. ఒకవేళ ప్రాప్తించినా అవి నైమిత్తిక సుఖాలే గాని నిత్యసుఖం కాలేవు.

అర్థ మనే పురుషార్థం భద్రతకు సంబంధించింది కాగా, కామ మనే పురుషార్థం సుఖానికి సంబంధించింది. రాజ్యం లభిస్తే తద్వారా వాంఛింప దగినవి ప్రధానంగా ఈ రెండే.

భద్రత అనేది కేవలం ధనం వల్ల రాదు. నిజం చెప్పాలంటే అర్థం వల్లే అభద్రత పెరుగుతుంది. రాజ్యాలు, భోగాలు లభించిన వారు తృప్తి చెందిన దాఖలాలు ఈ ప్రపంచంలో ఎంత అన్వేషించినా అగుపించవు (*న హి లోకే విత్తలాభః కస్యచిత్ తృప్తి కరోద్రష్టః*).

ఇక సుఖాలు అంటావా? వాటిలో కూడా తృప్తి లేదు. ఏది ఎవరికి ఎప్పుడు ఇష్టమో, ఎప్పుడు అయిష్టమో చెప్పలేము. ఇష్టాయిష్టాలు మారుతూ ఉంటాయి. వాటితో పాటు సుఖాలు పారిపోతూ ఉంటాయి. ఇక కామం అనే పురుషార్థం వల్ల ప్రాప్తించే దేముంటుంది?

నిస్సారమైన ఈ అర్థకామాల కొరకు మహానుభావులైన గురువుల్ని వధించాలా? అలా వధించి సాధించే దేముంటుంది? అంతా అశాంతే. అభద్రతే. ఇక శాంతి ఎక్కడ? ఎప్పుడు?

గెలిచినా శాంతి రాదు
ఓడితే శాంతి లేదు

అనిత్యము లైన అర్థకామాలను కొంత కాలం అనుభవించ డానికి మహానుభావు లైన గురువులను వధించడమా? దారుణమైన ఈ పాప కార్యానికి ఫలం రాజ్యసుఖమా? ఎక్కడుంది సుఖం? అంతా దుఃఖమే. నరకమే. పశ్చాత్తాప జీవనమే.

ప్రతి సుఖానుభవంలో దుఃఖమే తొంగి చూస్తూ ఉంటుంది. రమణీయ భోగాలన్నీ గురువుల్ని, పెద్దల్ని రాల్చేసుకొని సాధించినవే గదా? అని అంతర్యం నిలదీస్తూనే ఉంటుంది. కమనీయమైన సుఖాలు, కమ్మని రుచికరమైన పదార్థాలు ఒక వైపు నోరూరిస్తున్నా, మరో వైపు అవి రక్తసిక్తంగా కళ్ళకు కనిపిస్తూనే ఉంటాయి. ఇక భోగా లేవి? సుఖా లెక్కడ? అంతా దుఃఖమే. అంతా నరకమే.

బ్రతికినంత కాలము భోగానుభవంలో కూడా నరకమే దర్శనీయంగా ఉంటుంది. మరణించిన తరువాత ఈ ఘోర పాప ఫలితంగా నరకము లోనే జీవించ వలసి వస్తుంది. గెలిచినా ఇహపర లోకాలలో నరకానుభవమే కనుక శాంతి అనేది కుందేటి కొమ్మే అవుతుంది. ఒకవేళ ఓటమిని చవి చూస్తే ప్రత్యేకించి చెప్పే దేముంటుంది? ఆ ఆలోచన వస్తే చాలు, నరకంలో ఉన్నట్లే ఉంటుంది. కనుక, ఎలా చూచినా యుద్ధము అవాంఛనీయమే. ఇలాగే చూస్తూ ఉంది అర్జునుని మనస్సు.

బ్రతుకు తెరువు

యుద్ధాన్ని విరమించి, రాజ్యాన్ని పోగొట్టుకొని ఆ తరువాత ఎలా బ్రతకాలి? ఎలాగైనా బ్రతకవచ్చు. బ్రతికే వాళ్ళందరూ యుద్ధాలు చేసే బ్రతుకు తున్నారా? జీవించే వాళ్ళందరూ రాజ్యాలు ఏలుతూనే జీవిస్తున్నారా? ఇంతకాలం పాండవులు ఏ రాజ్యాలు ఉండి జీవించారు? బ్రతక డానికి రాజ్యాలు అవసరమా? రాజ్యాలు ఉన్నంత మాత్రాన సుఖంగా బ్రతక గలరా? రాజ్యం దుర్యోధనుడికి కూడా ఉంది. సుఖ మెక్కడుంది? శాంతి ఎక్కడుంది? అనుక్షణం ఘర్షణే. బ్రతుకంతా సంఘర్షణే. రాజ్యమూ ఘర్షణే. రాజ్యము కొరకు సాగించే సమరమూ సంఘర్షణే.

అది సరే. మరి, ప్రాణాన్ని నిలుపు కోవాలి అంటే, దేహాన్ని రక్షించు కోవాలి కదా! రిక్త హస్తాలతో పూట గడిచే దెలా? ఆకలి కడుపుతో కంటిపై రెప్ప వాలే దెలా? ఏముంది? కోరుకొనే స్వభావం గల వారికి ఎన్నున్నా తృప్తి ఉండదు. కోరికలను ప్రక్కన పెట్ట గలిగితే, ఉన్నది ఏదైనా తృప్తినే ఇస్తుంది.

కృష్ణా! మహాత్ముల్ని, గురువుల్ని చంపి, రక్తంతో తడిసిన భోగాలను అనుభవించడం కన్నా, ఈ లోకంలో బిచ్చ మెత్తుకొని తృప్తిగా జీవించడమే యుక్త మని భావిస్తున్నా. మాకు రాజ్యం లేక పోవచ్చు. మేము రాజ్యం లోనే ఉంటాము. రాజులు మమ్మల్ని పట్టించుకోక పోవచ్చు. ప్రజలు పట్టెడన్నము పెట్టక పోరు. నాలుగిళ్ళ ముందు నిలబడి, ఒక చెట్టు క్రింద కూర్చుంటే చాలు. కాలం గడుస్తుంది. బ్రతుకు నడుస్తుంది. జీవన యాత్రలో బ్రతుకు బండి నడవ టానికి ఇంధనాన్ని పుణ్యాత్ములు సమకూర్చుతూనే ఉంటారు. చాలు. కావలసింది ఇంధనమే గాని ధనం కాదు కదా?

యుద్ధం చేసి రాజ్యాన్ని చేజిక్కించు కోవచ్చు. దాని వల్ల ఒరిగే దేమిటి? రక్తసిక్త మైన ఆహారాన్ని భుజిస్తూ, బాధాతప్త మైన స్మృతులతో బ్రతికినంత కాలం నరకాన్ని అనుభవిస్తూ బ్రతకాలి. దారుణ మైన రణం వల్ల సంక్రమించిన మహా పాపఋణాన్ని తీర్చడానికి మరణించిన తరువాత నరకం లోనే మకాం పెట్టాలి.

అలా కాకుండా, యుద్ధాన్ని విరమించి, బిచ్చ మెత్తుకొని జీవిస్తే బ్రతికినంత కాలం తృప్తిగా జీవించ వచ్చు. మరణించిన తరువాత, పాప ఋణం లేదు కనుక పాప ఫలితాన్ని అనుభవించ డానికి నరకానికి వెళ్ళ నవసరం లేదు. దోష రహితమైన బ్రతుకు తెరువు ఫలితంగా స్వర్గాన్ని పొందవచ్చు. కనుక, మరణ సదృశ మైన రణం కన్నా, అమృత తుల్యమైన రణ విరమణమే శ్రేష్ఠంగా కనిపిస్తోంది.

అర్హత ఉందా?

భిక్షాన్నము భుజించి బ్రతుకు తెరువు చూసుకోవాలి అనుకోవడం బాగానే ఉంది. అర్జునా! నువ్వు భిక్షార్హుడి వేనా? భిక్ష మెత్తే అర్హత నీకు ఉందా? అదేమిటి? రాజ్యాధికారం చెలాయించడానికి అర్హత ఉండాలి. అడుక్కు తినడానికి కూడా అర్హత కావాలా? నాలుగిళ్ళ ముందుకు నడిచి పోవడానికి రెండు కాళ్ళు ఉంటే చాలు. రెండు మాటలతో అర్థించడానికి ఒక్క నోరుంటే చాలు. పెట్టింది పట్టడానికి రెండు చేతులు చాలు. ఇంకేమి అర్హత కావాలి?

అర్జునా! నీ లాగే అందరూ జోలె పట్టుకుంటే, ఆ తరువాత పెట్టే వాళ్ళు ఎవరుంటారు? అర్జును డంతటి వాడే జోలె ఆనంద మని భావించాడు కదా అని అందరూ జోలె కుట్టించుకొని భుజానికి తగిలించుకుంటే ఏమవుతుంది? దేశం బిచ్చగాళ్ళ రాజ్యంగా మారి పోదా? రాజ్యంలో అందరూ బిచ్చగాళ్ళైతే, రాజు పెద్ద బిచ్చగాడు కాకుండా పోతాడా? దుర్యోధన మహారాజుని యుద్ధం చేయకుండానే బిచ్చగాణ్ణి చేయడానికి ఈ ప్రణాళికను రూపొందించావా అర్జునా?

అర్హు లెవరు? అర్జునుడు అర్హుడేనా?

భిక్ష మెత్తుకొని జీవించడానికి అర్హత అవసరమా? అవును. అవసరమే. లేకపోతే, సోమరితనమే అర్హతగా మారి, దేశం దిక్కుమాలిన దవుతుంది. మరో విధంగా జీవించ డానికి అవకాశం లేనివాళ్ళే భిక్ష మెత్తుకొని బ్రతకాలి. అదే అర్హత.

ఎవరూ లేని, ఏ దిక్కూ లేని వారు భిక్షార్హులు. అర్జునుడికి అన్నదమ్ము లున్నారు. ఆత్మీయు లున్నారు. అత్తమామ లున్నారు. కొడుకులు, కోడళ్ళు ఉన్నారు. దేహాంగాలన్నీ సౌష్ఠవంతో శోభిస్తున్నాయి. అలాంటి వాడు భిక్షార్హు డెలా అవుతాడు?

ఇకపోతే రెండవ తెగకు సంబంధించిన వాళ్ళు బ్రహ్మచారులు. గురువు వద్ద శుశ్రూష చేస్తూ విద్య నార్జించే బ్రహ్మచారులు భిక్ష మడగ టానికి అర్హులు. సంపాదన లేకుండా జ్ఞాన సముపార్జనే సంపాదనగా జీవిస్తూ ఉంటారు కనుక, అలాంటి వటువులు భిక్షాటన చేసి, గురువును పోషిస్తూ, తమను పోషించుకుంటూ విద్యార్థి దశను పూర్తి చేసుకుంటారు. కనుక బ్రహ్మచారులు భిక్షార్హులు. అలా చూసినా అర్జునుడు అర్హుడేనా? అర్జునుడు బ్రహ్మచారి ఎలా అవుతాడు? అభిమన్యుడు అంగీకరిస్తాడా? సుభద్ర సుముఖ మేనా?

భిక్షాటన చేయడానికి అర్హులు అనాథులు, బ్రహ్మచారులే గాక, మరో తెగ వారు కూడా ఉన్నారు. వారే సన్యాసులు. సర్వసంగ పరిత్యాగులు. సమస్తాన్ని త్యజించి, జ్ఞానాభ్యాసమే ప్రధానంగా కలిగి ఉన్నారు కనుక, శాస్త్రజ్ఞుల్ని ప్రభుత్వం పోషించినట్లు, సన్యాసుల్ని సమాజం ఆదుకుంటుంది. శాస్త్రజ్ఞుల ప్రయోగ జనిత ఫలితాలు ప్రజలకు అందుతాయి కనుక ప్రభుత్వం వారిని పోషిస్తుంది. సాధు పురుషుల జ్ఞానం సమాజ కళ్యాణానికి దోహద పడుతుంది కనుక సమాజం సాధువుల్ని పోషిస్తుంది.

అలా చూచినా కూడా అర్జునుడు భిక్షాటనకు అర్హుడు కాడు. అర్జునుడు గృహస్థుడు. సన్యాసులను

పోషించ వలసిన వాడే గాని, సన్యాసి లాగా పోషింప దగిన వాడు కాదు. కనుక భిక్షార్హత అర్జునునికి లేదు. అ మాట కొస్తే, నేను సన్యాసినే కదా! అంటాడేమో అర్జునుడు.

సుభద్రా పరిణయం ఎలా జరిగింది? సన్యాసి వేషం లోనే కదా సాంగోపాంగంగా సర్వమూ సాగి పోయింది. కనుక, ఎప్పుడో విద్యాభ్యాసం చేసి పట్టభద్రుడైన వాడు నేడు ఉద్యోగాన్ని సంపాదించు కున్నట్లు, పూర్వం వేసిన సన్యాసి వేషం నేడు భిక్షాటనకు అర్హతను కల్పించదా?

అయ్యో! సుభద్రాపతీ! వేషాలు మోసాలు చేయడానికి పనికొస్తాయి. బ్రతుకును మోయడానికి పనికి రావు. సన్యాసులు భిక్షార్హులని శాస్త్రం చెప్పిందే గాని, 'ఆహా నా పెళ్ళంట' అని లోలోన మురిసిపోతూ, పై పైన మంత్రాలు పలికి మాయలు చేసే కుహనా సన్యాసులు భిక్షార్హులని శాస్త్రం ఎక్కడా చెప్పలేదు.

అర్జునుని అంతర్యం

భిక్ష మెత్తుకొని జీవించడానికే సవ్యసాచి అంతర్యం సిద్ధపడి పోయింది. వికలాంగుడిగా తనకు అర్హత లేదు. బ్రహ్మచారి కాలేడు. ఇక మిగిలింది సన్యాస మొక్కటే. ప్రస్తుతం అర్జునుడు సన్యాసి కాదు. గృహస్థుడు. గృహస్థుడు బ్రహ్మచారి కాలేడు. కాని, సన్యాసి కాగలడు. అదే జరిగితే, భిక్షాటనకు అర్హత లభించినట్లే. అదే అర్జునుని అంతర్యం.

గురువులు (***గురూన్***), మహానుభావులు (***మహానుభావాన్***), పూజార్హులు (***పూజార్హౌ***), శ్రేయస్సు (***శ్రేయః***) అంటూ అర్జునుని శ్లోకాలలో, మొక్కల్లో పువ్వు ల్లాగా పరిమళిస్తూ ప్రకాశిస్తున్న పదాలన్నీ అర్జునుని అంతర్యానికి అద్దం పడుతున్నాయి. సన్యాసానికి ఉద్యుక్త మయ్యే హృదయాన్ని ప్రదర్శిస్తున్నాయి. కర్మల కన్నా, కర్మసన్యాసము వైపే మొగ్గు చూపుతున్న పార్థుని బుద్ధికి సాక్షిగా నిలుస్తున్నాయి.

మమకారం ఒక వైపు మనస్సును మెలి పెడుతోంది. మమకారాన్ని త్యజించడం సాధ్యం కాక, మమకారానికి కారణమైన అహంకారాన్నే త్యజించాలని అస్పష్టంగా ఆలోచిస్తున్నాడు అర్జునుడు. అది దుస్సాధ్య మని, అసాధ్య మని కర్మయోగ విశ్లేషణలో అర్జునునితో పాటు ముస్ముందు మనమూ అర్థం చేసుకుంటాము. కాని, అవగాహన కొరవడిన ఈ దశలో అసాధ్యాలు సుసాధ్యాలుగా అగుపించడం దుస్సాహసమే అయినా దుస్సాధ్యం మాత్రం కాదు. ఆ కోణం లోనే మమకారాన్ని భుజాని కెత్తుకుంటూ ప్రసంగాన్ని తరువాత శ్లోకంలో కూడా కొనసాగిస్తున్నాడు కౌంతేయుడు.

న చైత ద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।
యానేవ హత్వా న జిజీవిషామ స్తేఽ వస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥ 6

న-చ-ఏతత్-విద్మః-కతరత్-నః-గరీయః-యత్-వా-జయేమ-యది-వా-నః-జయేయుః
యాన్-ఏవ-హత్వా-న-జిజీవిషామః-తే-అవస్థితాః-ప్రముఖే-ధార్తరాష్ట్రాః

యాన్	= ఎవరిని	నః	= మమ్మల్ని
హత్వా	= చంపి	జయేయుఃయది వా	= వాళ్ళే జయిస్తారో
న జిజీవిషామః	= జీవించుటకు ఇష్టపడమో	నః	= మాకు
తే	= అట్టి	కతరత్	= ఏది
ధార్తరాష్ట్రాః	= ధృతరాష్ట్ర సంబంధులు	గరీయః	= శ్రేష్ఠమో
ప్రముఖే	= ఎదురుగా	ఏతత్ చ	= ఈ విషయమును కూడా
అవస్థితాః ఏవ	= నిలబడ్డారు కదా!	న విద్మః	= ఎరుగము
జయేమ యద్వా	= మనము జయిస్తామో		

కృష్ణా! యుద్ధ రంగంలో మనం ఉన్నాం. మనం జయిస్తామో, వాళ్ళు గెలుస్తారో తెలియదు. మనతో పోరాడటానికి ధృతరాష్ట్రునికి సంబంధించిన వాళ్ళు ఎదురుగా నిలబడ్డారు. వాళ్ళను చంపి మనం బ్రతక గలమా?

వ్యాఖ్య

జయాపజయాలు

యుద్ధం చేయడానికి రెండు పక్షాలు ఉండాలి. కాని, గెలిచేది మాత్రం ఒక పక్షమే. విజయము ఒక్కరిదే. అ ఒక్కరు ఎవరు? ఏ పక్షము వారు? ఎవరు గెలిస్తే మంచిది? కౌరవులా? పాండవులా? అది కూడా సవ్యసాచికి సందిగ్ధం గానే ఉంది.

యుద్ధ మంటూ జరిగిన తరువాత ఎవరో ఒకరు జయించక తప్పదు. ఎవరి విజయము తనకు శ్రేయస్కరము అనేది అర్జునునికి అర్థం కావడం లేదు. ఇంతకీ గెలిచే దెవరు? ఏమో! జయాపజయాలు దైవాధీనాలు. ఎవరైనా జయించ వచ్చు. గెలిచేది తామే నని ఎవరికి వారు భావిస్తూ ఉంటారు. ఎవరి అంచనాలు వారికి ఉంటాయి. కాని, తారుమా రయ్యేవి అంచనాలే కదా! పోరాటంలో అంచనాలు ముందు ఉంటాయి. విజయానికి వచ్చే సరికి అంచనాలే ముంచుతూ ఉంటాయి.

ఏది తెలుసు? ఏదీ తెలియదు

యుద్ధములో గెలుపు ఎవరిదో తెలియదు. ఎవరు గెలిస్తే మంచిదో అది కూడా అర్థం కాదు. అందుకే భిక్షాటన శ్రేయస్కరముగా కనిపించింది. అది కూడా స్థిరంగా లేదు. యుద్ధమా? భిక్షాటనమా? ఈ రెండిటిలో ఏది మంచిది? అనేది కూడా తేలడం లేదు. రెండూ మంచి గానే కనిపిస్తున్నాయి. రెండూ చెడు గానే అగుపిస్తున్నాయి. రెండిటిలో మంచిచెడు లున్నాయి.

యుద్ధం స్వధర్మము. స్వధర్మాన్ని ఆచరించడము శ్రేయస్కరము. స్వధర్మాన్ని త్యజిస్తే పాపం వస్తుంది. కనుక యుద్ధము యుక్తమే గాని అయుక్తము కాదు. అనుచితమూ కాదు. అలా చూచి నపుడు యుద్ధము మంచిదే.

మరో విధంగా చూస్తే, యుద్ధంలో హింస ఉంది. కులక్షయం జరుగుతుంది. స్వజన నాశము తప్పదు. గురువధ అనివార్యం. ఇలా ఆలోచించి నపుడు యుద్ధం శ్రేయస్కరము కాదు అనిపిస్తూ ఉంది.

ఇకపోతే, మిగిలింది భిక్షాటనము. అందులో హింస లేదు. కులక్షయము, స్వజన నాశము లాంటి దోషాలు లేవు. కాని, అది స్వధర్మము కాదు. పరధర్మము. పరధర్మము ఎప్పుడూ మేలు చేయదు. ఈ విధంగా భిక్షాటనములో కూడా మంచిచెడులు ఉన్నాయి. ఏది శ్రేయస్కరమో (***కతరత్ గరీయః***) అది గ్రహించలేక పోతున్నాను (***న విద్మః***) అంటున్నాడు అర్జునుడు. ఎటూ తేల్చుకోలేక తికమక పడుతున్నాడు. ఎందుకని?

ఏదైనా ఎదబాధే

ఎవరు జయిస్తారు? ఎవరు జయించలేరు? అనేది ప్రధాన విషయంగా లేదు. ఎవరు జయిస్తారు అనేది విజయునికి సమస్య కాదు. ఎవరు జయించినా సమస్యే అనేది అర్జునుని సమస్య.

ఓటమిలో మరణమే సంభవించ వచ్చు. అది చాలా బాధాకరం. ఇక గెలుపు విషయాని కొస్తే అది మరీ బాధాకరంగా ఉంది. దారుణంగా ఉంది. ఓటమిలో మరణమే ఉపద్రవం. కాని, గెలుపు మరణం కన్నా భయంకరంగా ఉంది.

కృష్ణా! ఎవరిని వధించిన తరువాత *(యాన్ హత్వా)* మేము జీవించలేమో *(న జిజీవిషామః)*, అట్టి ధృతరాష్ట్రునికి సంబంధించిన భీష్మాదులు *(తే ధార్తరాష్ట్రాః)* ఎదురుగా యుద్ధం చేయడానికి సిద్ధంగా నిలబడ్డారు *(ప్రముఖే అవస్థితాః)*.

ఓడితే ఎలాగూ ప్రాణాలు మిగలవు. గెలిచినా, అయిన వాళ్ళను పోగొట్టుకొని బ్రతకలేము కనుక ప్రాణాలు నిలవవు. ఏది జరిగినా ఎదబాధ తప్పేటట్టు లేదు.

కృష్ణా! గెలుపు వారిదే అనుకుందాం. ఒకవేళ ఓటమి మనదే అయితే, ప్రాణాలు పోకుండా మనం జీవించి ఉంటే, అప్పుడు ఏమి చేయాలి? అప్పుడైనా భిక్షాటన చేసి జీవించక తప్పదు కదా! అదేదో ఇప్పుడే ప్రారంభిస్తే ఏమైంది? అంటూ ఎదబాధతో ఎదురీద లేక ఏదేదో మాట్లాడు తున్నాడు అర్జునుడు. అంతా ధర్మమీమాంసే. కాని, ఏది ధర్మమో, ఏది అధర్మమో అర్థం చేసుకోలేక ఆందోళనలో నలిగి పోతున్నాడు. ఆ విషయాన్ని తానే అంగీకరిస్తున్నాడు.

కార్పణ్య దోషోపహత స్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః ।
యచ్ఛ్రేయః స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ 7

కార్పణ్య దోషోపహత స్వభావః-పృచ్ఛామి-త్వాం-ధర్మసమ్మూఢ చేతాః
యత్-శ్రేయః-స్యాత్-నిశ్చితం-బ్రూహి-తత్-మే-శిష్యః-తే-అహం-శాధి-మాం-త్వాం-ప్రపన్నం

కార్పణ్య	= కృపణత్వ మనే	స్యాత్	= అగునో
దోష	= దోషము చేత	తత్	= దానిని
ఉపహత	= కొట్టబడిన	మే	= నాకు
స్వభావః	= ప్రకృతి గలవాడనై	బ్రూహి	= చెప్పు
ధర్మ సమ్మూఢచేతాః	= ధర్మం విషయంలో మోహానికి గురైన మనస్సు కలవాడనై	అహం	= నేను
		తే	= నీకు
త్వాం	= నిన్ను	శిష్యః	= శిష్యుడను
పృచ్ఛామి	= అడుగు తున్నాను	త్వాం	= నిన్ను
యత్	= ఏది	ప్రపన్నం	= శరణు జొచ్చిన
శ్రేయః	= శ్రేయస్సుగా	మాం	= నన్ను
నిశ్చితం	= నిర్ణయింప బడినది	శాధి	= శాసింపుము

నా మనస్సును దైన్యం ఆవరించింది. నా స్వభావమే చెడి పోయింది. ధర్మ నిర్ణయం చేసే శక్తిని నా మనస్సు కోల్పోయింది. అందుకే నిన్ను అడుగుతున్నాను. నాకు కావలసింది శ్రేయస్సు. అది ఎలా సాధ్యమో నీవే ఖచ్చితంగా చెప్పాలి. కృష్ణా! నేను నీ శిష్యుణ్ణి. నీవే నాకు శరణ్యము. నన్ను శాసించు.

వ్యాఖ్య

ప్రయాణాలు - ప్రమాదాలు

జీవితము ఒక సుదీర్ఘ ప్రయాణము. అడుగులు వేస్తూనే పోవాలి. ఎక్కడ మడుగులు ఎదురవుతాయో ఊహించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ప్రయాణం చేస్తేనే ముందుకు సాగుతాము. ప్రమాదాలు వాటిల్లేది ప్రయాణం లోనే.

ప్రయాణం దారి లోనే. ప్రమాదమూ దారి లోనే. ఎప్పుడు ఏ సమస్య తలెత్తుతుందో తెలియదు. సాధారణ సమస్యల్ని సానుకూల దృక్పథంతో పరిష్కరించు కోవచ్చు. విషమ పరిస్థితులు ఎదురై నపుడు, లేదా సామాన్య మనుకున్న సమస్యలు విషమంగా పరిణమించి నపుడు, కర్తవ్యం అర్థం కానపుడు, అర్థమైనవి సందేహాలను సృష్టించి నపుడు ఎవరైనా వివేకాన్ని కోల్పోతారు. కలత పడతారు. కలతపడే మనస్సు విచక్షణతో విశ్లేషించ లేదు. అక్కడ మరొకరి సహాయం అవసర మవుతుంది. అర్జునుని పరిస్థితి ప్రస్తుతం అదే.

తప్పు తెలిసింది

మనస్సుకు సర్వజ్ఞత్వం లేదు. మనస్సుకు అన్నీ తెలియవు. మనస్సు చేసే ఆలోచనలే మనకు తెలుస్తాయి. మనస్సు చేసే నిర్ణయాలే మనకు మంచివిగా తోస్తాయి. మనస్సు సదా ఋజుమార్గం లోనే ఆలోచిస్తుందని చెప్పలేము. అందుచేత, మనస్సు చేసే నిర్ణయాలు సరియైనవి కాకపోయే అవకాశం కూడా ఉంది. నిజం చెప్పాలంటే, మనస్సును ఎక్కువ శాతం అవాస్తవాలే ఆక్రమించుకొని అధికారం చెలాయిస్తూ ఉంటాయి.

అందరికీ మనస్సు లున్నాయి. అందరూ దారి తప్పే అవకాశ ముంది. దారి తప్పేవాళ్ళే అందరూ. కాని, అలా తాము దారి తప్పినట్లు తెలుసుకో గలిగే వారెందరు? తెలిసినా, అంగీకరించే పెద్ద మనస్సు గలవారు ఎందరుంటారు? ఎందరైనా ఉండనీ. వారే నిజమైన మనుషులు. మనీషులయ్యే అవకాశానికి నోచుకున్నవారు.

తన దోషాన్ని తాను తెలుసు కోవడం మానవత్వం. తెలుసుకున్నట్లు అంగీకరించడం దైవగుణం. తప్పును ఒప్పుగా కప్పిపుచ్చుకొనేందుకు చేసే ప్రయత్నం అమానుషం. అసుర స్వభావం.

ఇంతవరకు అర్జునుడు ఎంతగానో మాట్లాడాడు. తనకు తెలిసిన ధర్మాలన్నీ ప్రవాహ రూపంలో ప్రసంగించాడు. ఇప్పుడే, ఇక్కడే తన మాటల్లో ఏదో తప్పు ఉందని ప్రథమంగా గుర్తిస్తున్నాడు. తన ఆలోచనల్లో ఏదో దోషం ఉందని బహిరంగంగా భగవంతునికి విన్నవిస్తున్నాడు. ఇంతకీ ఏమిటి ఆ దోషం?

కార్పణ్యం

కార్పణ్య దోషము చేత తన స్వభావం దెబ్బ తినింది అంటున్నాడు అర్జునుడు. కృపణత్వ దోషము చేత స్వభావమే పాడై పోయిందట. దైన్యం ఆవరించిందట. మనస్సు విచలిత మైందట. వివేకం లోపించిందట. అందుచేత ఏది ధర్మమో, ఏది అధర్మమో నిర్ణయించలేక పోతున్నాను అని చెబుతున్నాడు కౌంతేయుడు.

కార్పణ్య దోషము అనే సమాసంలో 'కార్పణ్యము' అనేది ఏదయితే ఉందో, అదే స్వభావంగా మారిపోయిందని అర్థము. స్వభావం స్థాయికి చేరి పోయింది. స్వభావమై కూర్చుంది అని భావం. ఇంతకీ అర్జునుని అంతగా చెదర గొట్టిన ఆ కార్పణ్యం ఏమిటి?

పిసినారి పీఠమా?

కృపణుని స్వభావము కార్పణ్యము *(కృపణస్య స్వభావః కార్పణ్యం)*. కృపణుడు అంటే లోభి మహాశయుడు. లేనివాడు కాడు. ఉన్నా లేనివాడు. చేతులు నిండినా చిత్తము నిండని వాడు. తనకు, పరులకు ఉపకరించని కలిమికి కాపలాదారుడు. ధనక్షయము ఏ కొద్దిగా జరిగినా, జరుగు తుందని ఊహించినా, హోరుగాలికి ఊగిపోయే చెట్టు లాంటి 'తనదైన' చిత్తము గల అరుదైన వ్యక్తి.

అర్జునుని పీడిస్తున్న కృపణత్వం ఇదేనా? ఎందుకంటే, తన దైనది ఏదో అది దూరమైతే తట్టుకోలేని వాడు లోభి. కృపణుడు. 'నాది' లేనపుడు 'నేను' ఎందుకు అనుకునేవాడు. ఇదంతా మమకారమే. లోభత్వము యొక్క ఫలరూపమే మమకారము కనుక, 'నా వాళ్ళు - నా బంధువులు' అంటూ విలపిస్తున్న అర్జునుడు ఇలాంటి కృపణుడి క్రిందికి వస్తాడేమో! అనేది కొందరి సంశయము.

మహాభారతంలో అర్జునుని పాత్రను అధ్యయనం చేసిన వారు ఎవ్వరూ ఈ సంశయాన్ని సమర్థించరు. ఆయన ధనంజయుడు. త్యాగమయుడు. రాజ్య మెందుకు? రాజ్య సుఖా లెందుకు? ***(కిం నో రాజ్యేన గోవింద, కిం భోగైః)*** అని ప్రశ్నిస్తున్న వివేకవంతుడు. ఇహపర సుఖాలను తుచ్ఛంగా భావించిన వైరాగ్యమూర్తి. మరి, ఈ కార్పణ్య మేమిటి?

ఇంద్రియ దాస్యమా?

కృపణుడు అంటే అజితేంద్రియుడు అని కూడా అర్థము. అంటే ఇంద్రియములను జయించలేని వాడు ***(కృపణః అజితేంద్రియః).*** ఇది అర్జునునికి వర్తిస్తుందా? కఠోర నియమ నిష్ఠలతో తపస్సు చేసి, పశుపతిని మెప్పించి, పాశుపతాస్త్రమును పొందిన పార్థుడు ఇంద్రియాలను జయించలేని వాడా?

సుందర సుషమాన్విత మందస్మిత వదనంతో, అలౌకిక సౌందర్యంతో, శృంగారానికి నాంది పలుకుతూ, దేవేంద్రుని అనుమతితో రంగ ప్రవేశం చేసిన అసమాన సౌందర్యవతి ఊర్వశి, మంద గమనంతో శయ్యా మందిరానికి అరుదెంచి నపుడు, అమ్మా! క్షమించు. నీకు బిడ్డగా నమస్కరిస్తున్నాను. నీవు నాకు తల్లివి. కుంతి, మాద్రి, శచీదేవి లాగా నీవూ నాకు పూజనీయురాలివి. నన్ను నీ బిడ్డగా స్వీకరించు అని పలికి, తత్ఫలితంగా శాపగ్రస్తుడై, నపుంసకుడై, నాట్యాచారుడిగా ఒక్క సంవత్సరం కులికిన మహానుభావుడు అర్జునుడు అజితేంద్రియుడా? కానే కాడు. మరి ఈ కార్పణ్యానికి అర్థ మేమిటి?

అజ్ఞానమే అసలైన అర్థం

కృపణత్వము అంటే అజ్ఞానము అని, కృపణుడు అంటే అజ్ఞాని అని ఒక అద్భుతమైన విషయాన్ని వినిపించింది ఉపనిషత్తు.

యో వా ఏతదక్షరం గా ర్గ్యవిదిత్వా స్మాల్లోకా త్ప్రైతి స కృపణః

'గార్గీ! అక్షర స్వరూపమైన పరబ్రహ్మమును తెలుసుకోకుండా, ఈ ప్రపంచం నుండి ఎవ్వడైతే నిష్క్రమిస్తున్నాడో వాడే కృపణుడు' అని యాజ్ఞవల్క్య మహర్షి సాధ్వీమాత గార్గికి బోధించాడు.

ఇదే, ఈ అజ్ఞానమే అర్జునుని లోని కృపణత్వ దోషం. అజ్ఞానం ఆవరించి నపుడు ఏది ధర్మమో, ఏది అధర్మమో అర్థం కాదు. ఏది సత్యమో, ఏది అసత్యమో తెలిసి రాదు. అందుచేతనే తాను ధర్మం విషయంలో సంశయాల మధ్య నలిగి పోతున్నట్లు అర్జునుడు అంగీకరిస్తున్నాడు ***(ధర్మ సమ్మూఢ చేతాః).***

అన్నీ సందేహాలే

యుద్ధం చెయ్యాలా, వద్దా? యుద్ధం విరమిస్తే ఏం చెయ్యాలి? భిక్షాటనమే కదా? అది యుక్తమా? అయుక్తమా? స్వధర్మం కనుక యుద్ధాన్ని ఆచరించక తప్పదు. బాగానే ఉంది. స్వధర్మము హింసతో కూడుకొని ఉంది కదా! అయినా ఆచరించక తప్పదా? ఇంతకీ, సమరమా? భిక్షాటనమా? ఏది ఉచితం? ఏది అనుచితం?

అర్జునా! ఈ ధర్మాలన్నీ గతంలో నువ్వు విన లేదా? విద్యాభ్యాసం చేసి నపుడు ధర్మబోధలో ఈ సత్యాలను గురువు నీకు బోధించ లేదా?

గురుబోధలో ఇవన్నీ నేను ఆలకించాను. నేను శ్రద్ధతో ధర్మశాస్త్రాల్ని పఠించాను. కాని, ప్రస్తుతం ధర్మ నిర్ణయం చేయలేని స్థితిలో ఉన్నాను. ధర్మం విషయంలో నా మనస్సు నిండా సందేహాలే చేరిపోయాయి ***(ధర్మ సమ్మూఢ చేతాః).*** ఇదంతా కార్పణ్యదోషము యొక్క ప్రభావమే. కృపణత్వ దోషం చేత నా స్వభావమే చెడిపోయింది ***(కార్పణ్య దోషోప హత స్వభావః).***

కౌరవుల మనస్సులను లోభం దెబ్బ కొట్టిందని మొదటి అధ్యాయం ముప్పై ఎనిమిదవ శ్లోకంలో చెప్పాడు అర్జునుడు ***(లోభోపహత చేతసః).*** తానేమో కార్పణ్య దోషము చేత దెబ్బ తిన్నానని చెబుతున్నాడు. కౌరవులది లోభము, తనది కార్పణ్య మని అర్జునుడు అంగీకరిస్తున్నాడు. తనలో ఏ కృప ప్రస్తుతం వ్యక్త మౌతూ ఉందో అది కార్పణ్య దోష ప్రభావమే నని అభిప్రాయ పడుతున్నాడు.

అర్జునుని కృపను ఇప్పటికే రెండు చోట్ల సంజయుడు ఉదహరించాడు కూడా. అర్జునుడు కృపతో కూడుకొని ఉన్నాడు ***(కృపయా ఽ ఽవిష్టమ్)*** అని మొదటి అధ్యాయం ఇరవై ఏడవ శ్లోకం లోను, రెండవ అధ్యాయం ప్రథమ శ్లోకం లోను సంజయుడు ప్రత్యేకించి ప్రస్తావించాడు.

విషమ సమయాల్లో ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ తలెత్తి నపుడు, వివేకవంతుడు శ్రేయస్సు వైపే మొగ్గు చూపాలి. తాత్కాలిక సుఖాలకు తల వంచి వినాశాన్ని వరించ కుండా, శాశ్వత మైన శ్రేయస్సు వైపే మరలాలి. అర్జునుడు అదే చేశాడు.

చెడిన మనస్సుకు చెడు అర్థం కాదు. కలత చెందిన చిత్తము మంచిని వరించ లేదు. ఇలాంటి చోట మరొకరి సహాయం మనకు అవసరం. అర్జునునికి కూడా అదే ప్రస్తుతం అవసరమై ఉంది. కాకపోతే, అర్జునుడు పుణ్యాత్ముడు కనుక, ధర్మ జీవనం గడిపిన వాడు కనుక ఆయన అదృష్టం కొద్ది సహకరించ దానికి సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడే లభించాడు.

జ్ఞాన పిపాస

తృప్తి లేకుండా మనిషి జీవించ లేడు. ఈ ప్రపంచంలో తృప్తి తెలియని వారు లేరు. తృప్తి చెందని వారు లేరు. తిరిగి అసంతృప్తిని పొందని వారూ లేరు. ఏ తృప్తి అయినా తాత్కాలికమే. నిత్య తృప్తి అనేది ఈ ప్రపంచంలో కుందేటి కొమ్ము లాగే ఉంది.

దాహం వేస్తే మనిషి నీటిని పానం చేస్తాడు. తృప్తి కలుగుతుంది. అంత మాత్రాన దప్పిక శాశ్వతంగా దూరం కాలేదు. ఆకలికి మనిషి ఆహారాన్ని భుజిస్తాడు. తృప్తిగా భోంచేస్తాడు. అంతమాత్రాన ఆకలికి పూర్తిగా దూరం కాలేడు. తృప్తి విషయంలో అనుభవాలన్నీ ఇలాగే ఉంటాయి. నొప్పి తెలియకుండా ఉండేందుకు స్వీకరించే ఔషధాలు రోగ నివారకాలు కావు. ఆరోగ్య ప్రదాయకాలూ కావు. ఏ తృప్తి అయినా ఈ ప్రపంచంలో తాత్కాలికంగా అసంతృప్తిని దూరం చేసేదే కాని నిత్యతృప్తిగా మాత్రం ఉండ లేదు.

ఏది పొందినా ***(ప్రవృత్తి),*** ఏది పోగొట్టుకున్నా ***(నివృత్తి),*** లాభనష్టాల ఊబిలో దిగడం జరుగుతుందే గాని నిత్యతృప్తిని పొందడం జరగదు. అసంతృప్తి నుండి శాశ్వతంగా విడి పడటమూ జరగదు. అర్జునుడికి తన దుఃఖము దూరమయ్యే లాగా కనిపించడం లేదు. పొంది సాధించేది లేనపుడు, అర్థం చేసుకోవడం ఒక్కటే మార్గం. జ్ఞానమే శరణ్యం. జ్ఞానమే సాధనం ***(జ్ఞాన మేవ సాధనం).***

నిత్యతృప్తి అనేది నిత్యవస్తువు లోనే ఉంటుంది. నిత్యవస్తువు అంటే అబాధితం అని అర్థము. లేనిదిగా ఎప్పుడూ కాలేనిది నిత్యవస్తువు. సదా ఉన్నదే. అట్టి అనంతమైన వస్తువును కర్మల ద్వారా ఎలా పొందగలం? కనుక ఉన్న దానిని ఉన్నట్లుగా తెలుసు కోవాలి. అదే జ్ఞానం. నిత్యజ్ఞానం. నిత్యవస్తువుకు సంబంధించిన జ్ఞానమే నిత్యజ్ఞానం. అది కూడా ఉన్నదే. కాకపోతే అజ్ఞానం వల్ల ఉన్నది ఉన్నట్లు తెలియకుండా ఉంది. అంతేకాదు. లేదేమో! అనే సందేహాన్ని కూడా కలిగిస్తూ ఉంది. ఇదే మోహము ***(అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః).***

అర్జునుడు ఆశించేది నిత్యతృప్తి. అందుకే జ్ఞానదాహంతో తపించి పోతున్నాడు. అట్టి జ్ఞానాన్ని నిశ్చయించి చెప్పమని శ్రీకృష్ణుని అర్థిస్తున్నాడు. దానినే శ్రేయస్సు అంటున్నాడు ***(యచ్ఛ్రేయస్స్యాత్ నిశ్చితం బ్రూహి).*** తనకు శ్రేయస్సే కావాలి. ప్రేయస్సు అవసరం లేదు.

శ్రేయస్సు - ప్రేయస్సు

ప్రియమును తాత్కాలికంగా కలిగించేది ప్రేయస్సు. శుభమును శాశ్వతంగా అందించేది శ్రేయస్సు. తాత్కాలిక సుఖాల వైపే మానవులు పరుగులు పెడుతూ అలసిపోతూ ఉంటారు. ఇదే ప్రేయస్సు. దీని నుండి విడిపడి అసంతృప్తి తెలియని ఆనంద స్వరూపాన్ని పొందటమే శ్రేయస్సు.

శ్రేయస్సు ప్రేయస్సు లనే ఈ రెండూ మనిషిని చుట్టుముట్టి ఉంటాయి ***(శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యం ఏతః).*** వివేకము కలిగిన ధీర పురుషుడు ***(ధీరః).*** ఆ రెండిటిని పరిశీలించి ***(తౌ సంపరీత్య).*** వేరు వేరుగా తెలుసుకొంటున్నాడు ***(వివినక్తి).*** అలా విడమరచి తెలుసు కొనిన ధీర పురుషుడు ***(సః ధీరః).*** ప్రేయస్సు కన్నా వేరైన శ్రేయస్సునే ***(ప్రేయసః శ్రేయః హి)*** వరించి వాంఛిస్తున్నాడు ***(అభివృణీతే).*** అట్టివాడు నిత్యతృప్తిని పొందుతున్నాడు. అదే మోక్షము. అర్జునుడు ప్రస్తుతం వాంఛించేది శ్రేయస్సునే గాని ప్రేయస్సును కాదు.

అర్జునుడు ఇంతవరకు ధర్మప్రసంగమే చేశాడు. కాని, ధర్మము విషయంలో తాను స్పష్టతను కోల్పోయినట్లు ఈ శ్లోకం లోనే ప్రథమంగా చెబుతున్నాడు ***(ధర్మ సమ్మూఢ చేతాః).*** అలాంటప్పుడు ధర్మ వివేచనం చేసి నిర్ణయిస్తే సరిపోతుంది. ధర్మ మీమాంసను లేవనెత్తి, అర్జునునికి ధర్మం విషయంలో ఉన్న సంశయాన్ని శ్రీకృష్ణుడు నివారిస్తే సరిపోతుంది. కాని, అంతటితో అర్జునుడు సరిపెట్టుకొనే లాగా లేడు. వాస్తవం చెప్పాలంటే, ప్రస్తుత తరుణంలో అర్జునుడు ధర్మాధర్మాల నుండి విడిపడి ఆలోచిస్తున్నాడు.

ధర్మము యొక్క ఫలం పుణ్యం. పుణ్య మనేది సుఖానికి సంబంధించింది. పరిమిత మైన ఆనందాన్నిచ్చేది. దానిని అర్జునుడు అర్థించడం లేదు. తనకు శ్రేయస్సు కావాలి అంటున్నాడు. అదేదో నిశ్చయించి చెప్పమని శ్రీకృష్ణుని అభ్యర్థిస్తున్నాడు ***(యచ్ఛ్రేయస్స్యా న్నిశ్చితం బ్రూహి).*** సుఖదుఃఖాలను అధిగమించిన ఆనందాన్ని అభిలషిస్తున్నాడు. ధర్మాధర్మాలను దాటిన పరంధామాన్ని కోరుకుంటున్నాడు. ప్రియాప్రియముల నుండి విడిపడిన నిత్య సుఖాంబోధిలో ఓలలాడాలని పరితపిస్తున్నాడు. బ్రహ్మవిదుడు కావాలని, బ్రహ్మమునే పొందాలనే ఏకైక వాంఛతో ఉన్నాడు. బ్రహ్మవిదుని ప్రయాణాన్ని ఉపనిషత్తు కూడా ఇలాగే వర్ణించింది.

స ఏష విసుకృతో విదుష్కృతో బ్రహ్మ విద్వాన్ బ్రహ్మైవాభిప్రైతి

ఆ బ్రహ్మవిదుడు ***(స ఏష బ్రహ్మ విద్వాన్)*** పుణ్యము నుండి విడిపడి ***(విసుకృతః).*** పాపమును అంటక ***(విదుష్కృతః).*** బ్రహ్మమునే ***(బ్రహ్మైవ)*** పొందుచున్నాడు ***(అభిప్రైతి)*** అని కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్తు ప్రవచించింది.

ఎందుకు చెప్పాలి?

కృష్ణా! నాకు ఏది శ్రేయస్సో దానిని నువ్వే నిర్ణయించి చెప్పు. నా మనస్సు ధర్మనిర్ణయం చేసే స్థితిలో లేదు అన్నాడు అర్జునుడు.

అర్జునుడు అడిగినంత మాత్రాన శ్రీకృష్ణుడు చెప్పాలని ఎక్కడుంది? ఎందుకు చెప్పాలి? అర్జునుడి రథాన్ని తోలడానికి అచ్యుతుడు అంగీకరించాడు. బోధిస్తా నని చెప్పలేదు.

అర్జునుడు అడుగు తున్నాడు కనుక చెప్పవచ్చు కదా అంటారా! అడిగినంత మాత్రాన చెప్పాలని కూడా లేదు. అడిగిన వాళ్ళందరికీ ఎందుకు చెప్పాలి? అర్జునుడు ఒక్కడే కాదు, శ్రీకృష్ణుడు చెబితే వినడానికి ప్రపంచ మంతా నిరీక్షిస్తూ ఉంది. వెలుగు కోసం విశ్వమంతా సూర్యుని వైపు చూచినట్లు, జ్ఞానం కోసం ప్రపంచ మంతా పరమేశ్వరు డైన శ్రీకృష్ణుని వైపు చూస్తూ ఉంది. దేవగణము, మహర్షి సమూహము సైతం ఆ దివ్యాత్ముని బోధామృతాన్ని గ్రోలాలనే ఆత్రులు చాస్తోంది. ఈ సత్యాన్ని మహాభారతం - అరణ్యపర్వంలో మహాత్ముడైన మార్కండేయ మహర్షి స్వయంగా ధర్మరాజుకు చెప్పాడు కూడా.

ధర్మరాజా! ఈ ప్రపంచము ప్రళయజలాలలో మునిగి నపుడు, నైరాశ్యంతో నేను కలత చెందిన సమయంలో, ఏ దివ్యాత్ముని ఉదరంలో ఈ సమస్త బ్రహ్మాండాన్ని దర్శించానో, ఆ పరంధాముడు ఎవరో కాదు. ఈ పురాణ పురుషుడే. వార్ష్ణేయుడే. శ్రీకృష్ణుడే.

యస్స దేహో మయా దృష్టః పురా పద్మాయ తేక్షణః
స ఏవ పురుష వ్యాఘ్రః సంబంధీ తే జనార్దనః ॥

ధర్మరాజా! పూర్వము ప్రళయ సమయంలో పద్మనేత్రుడైన ఏ భగవంతుని నేను దర్శించానో, అతడే ప్రస్తుతం నీకు బంధువైన శ్రీకృష్ణుడు అన్నాడు మార్కండేయుడు.

అలాంటి జగన్నాథుడైన శ్రీకృష్ణుని అర్జునుడు ఆశ్రయించడంలో, అడగటంలో ఆశ్చర్య మేముంది? అలాగని, అడిగిన వాళ్ళందరికీ చెబుతారా? అడిగిన వాడు అర్హత లేనివాడైతే, బోధించిన దంతా బూడిదలో పోసిన పన్నీరు కాదా? అడిగిన వాడు అర్హత లేనివా డైతే బోధించ కూడదు అనేది శాస్త్రవిధి.

నియమాలు ఉన్నాయి

జ్ఞానము పవిత్ర మైనది. ప్రసాదం వంటిది. అర్హులకే అనుగ్రహించాలి. పాడు చేసుకొనే స్వభావం గల వారికి ఆస్తులనే పంచరు కదా! అమృత స్వరూపమైన ఆత్మజ్ఞానాన్ని ఎవరు పంచుతారు?

న అపుత్రాయ అశిష్యాయ ప్రబ్రూయాత్

పుత్రుడు కాని వానికి, శిష్యుడు కాని వానికి చెప్పకూడదు అన్నది శాస్త్రం. బిడ్డకు తండ్రిపై ప్రేమ ఉంటుంది. అలాగే శిష్యునికి గురువుపై ప్రేమ ఉండాలి. ప్రేమ లేని వానికి బోధిస్తే బోధ ఫలించదు.

బిడ్డకు తండ్రి విషయంలో ప్రేమే కాదు, చనువు కూడా ఉంటుంది. అలాంటి చనువును గురువు విషయంలో శిష్యుడు ప్రదర్శించ కూడదు. హద్దు లెరిగి ప్రవర్తించాలి. బుద్ధి కలిగి ప్రసంగించాలి. అందుచేత శిష్యుడు అని చెప్పడం జరిగింది. పుత్రుని ప్రేమ, శిష్యుని భక్తి రెండూ కలిగిన వాడే శిక్షణ యోగ్యుడు. అట్టి వానికే బోధించాలని శాస్త్రం శాసించింది.

వినయ విధేయతలు కలిగిన శిక్షణ యోగ్యుడే ఉంటాడు. కాని, బోధించ మని అర్థించడు. అలాంటి వానికి బోధించ వచ్చా? బోధించ కూడదు. అర్హు డైనప్పటికీ అర్థిస్తేనే బోధించాలి.

న అపృష్టః కస్యచిత్ బ్రూయాత్

జిజ్ఞాసతో వచ్చి అడగని ముముక్షువునకు బోధించ కూడదు అని కూడా చెప్పింది శాస్త్రం. శిష్యునికి జ్ఞానాభిలాష ఉండొచ్చు. కాని, గురువును అడగాలి. అభ్యర్థించాలి. ప్రార్థించాలి.

శిష్యుడే కదా! అడగక పోయినా బోధిస్తే ఏమవుతుంది? ఏదైనా కావచ్చు. ఏమీ కాకపోవచ్చు కూడా. రెండూ ప్రమాదాలే. శాస్త్రం ప్రమాణము. జ్ఞానమును ప్రసాదించేది కనుక ప్రమాణము ***(ప్రమాకరణం***

ప్రమాణాం). ప్రమాణము ఫలిస్తే జ్ఞానము శోభించాలి. అంతేగాని ఏదో కావడము, ఏదీ కాకపోవడము - ఈ రెండూ జరగ కూడదు.

అడగని వానికి ప్రేమతో గురువు బోధించాడనే అనుకుందాం. శిష్యుడు వివేక శూన్యుడైతే, 'నీకై నీవే బోధించావు. నేను అడిగానా?' అని గురువుకు ఎదురు ప్రశ్న వస్తే ఏమవుతుంది? జ్ఞాన స్వరూపుడైన గురువుకు ఏమీ కాదు. పరమ పవిత్రమైన సంప్రదాయానికే ఎద పగుల్తుంది. బోధ ఎంత ముఖ్యమో, సంప్రదాయ రక్షణ అంత ముఖ్యం. సంప్రదాయ రక్షణ లోనే జ్ఞానము పండుతుంది. పరిఢవిల్లు తుంది.

అర్హత పొందిన అర్జునుడు

కృష్ణా! శ్రేయస్సు ఏదో నాకు బోధించు అని అడిగాడు అర్జునుడు. ఈ వాక్యాన్ని ఈ సందర్భం లోనే వింటున్నాం. శ్రీకృష్ణార్జునుల మైత్రి ఈనాటిది కాదు. వాళ్ళ మైత్రిలో దశాబ్దాలే దొర్లిపోయాయి.

కలిసి తిరిగారు. కలబడి భుజించారు. కష్టాలు పంచుకున్నారు. కలతలలో పరస్పరము కాచుకున్నారు. కాని, ఎప్పుడు కూడా నాకు శ్రేయస్సును బోధించు అని అర్జునుడు శ్రీకృష్ణుని అడగ లేదు. ఇప్పుడే, ఇక్కడే, కురుక్షేత్రం లోనే ప్రథమంగా అడుగు తున్నాడు పార్థుడు.

ఏ సన్నివేశంలో విషాదానికి, దైన్యానికి అవకాశం లేదో, అలాంటి యుద్ధ సన్నివేశంలో పార్థుడు విషణ్ణుడయ్యాడు. కలత చెందాడు. దీను డయ్యాడు. ఉపదేశాన్ని గ్రహించ డానికి సిద్ధ మయ్యాడు. అర్హతను ప్రదర్శించాడు. శ్రద్ధను ప్రకటించు కున్నాడు. బోధించ మని అర్థించాడు. నేను నీ శిష్యుణ్ణి (*శిష్యస్తేఽహం*). నన్ను శాసించు (***శాధిమాం***) అని అభ్యర్థించాడు. ప్రార్థించాడు. శిష్యుడుగా శరణాగతు డయ్యాడు (**ప్రపన్నమ్**).

జ్ఞానాన్ని శిష్యు లందరికీ సమానంగా పంచుతాడు గురువు. కాని, వ్యక్తిగతంగా వారిని తీర్చిదిద్దే ప్రక్రియలో విభిన్నంగా గోచరిస్తూ ఉంటాడు. ఈ తరతమ భావము గురువు స్వభావానికి సంబంధించింది కాదు. శిష్యుల ప్రవర్తనకు సంబంధించింది.

కొందరు శిష్యులు గురువు హృదయాన్ని గ్రహిస్తూ ప్రవర్తిస్తూ ఉంటారు. కొందరు శిష్యులు తమ బుద్ధిని పట్టించుకొంటూ గురుబోధను ప్రతిచర్యలతో గ్రహిస్తూ ఉంటారు. మొదటి వారికి గురువు చెప్పింది ఏదైనా ప్రసాదమే. రెండవ తెగ వారికి తమకు అనుకూలంగా ఉంటే ప్రసాదము. అనుకూలం కాకపోతే ప్రమాదము.

జ్ఞానం వంటబట్టే వరకు అన్నీ ప్రమాదాలే. అదంతా గురువుకు తెలుసు. కనుకనే, ప్రతిచర్యలు లేకుండా ప్రసన్నంగా జీవించే శిష్యులకు అవసర మైతే ఆజ్ఞాపించి కూడా చెబుతాడు గురువు. ముట్టుకుంటే మునిగిపోయే మనస్సులు గల శిష్యులకు ఉపదేశిస్తాడే గాని వారిని ఆజ్ఞాపించడు.

అర్జునుడు ఈ శ్లోకంలో గురుదేవుడైన గోవిందుని ఆశ్రయించడమే గాక నన్ను శాసించు, ఆజ్ఞాపించు (***శాధిమాం***) అని విన్నవించు కొంటున్నాడు. తన విషయంలో సంశయించ వద్దని తనను తాను గురువుకు సమర్పించు కొంటున్నాడు. అంతేకాదు, ప్రియతమ మైన వారినే ప్రేమతో ఆజ్ఞాపిస్తారు కనుక, తాను ప్రియతమ శిష్యుడ నని చెప్పకనే చెప్పాడు పార్థుడు.

శిష్యుడుగా అర్జునుడు అర్హతను పొందాడు. బోధను గ్రహించ డానికి అధికారి అయ్యాడు. శిష్యుడయ్యాడు. శిక్షణయోగ్యు డని ప్రకటించు కున్నాడు. కాని, ఇక్కడ అర్జునుని వాక్యాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. నేను శిష్యుణ్ణి (***అహం శిష్యః***) అనలేదు. నేను నీ శిష్యుణ్ణి (***అహం తే శిష్యః***) అన్నాడు. శిష్యుడైన వాడు శిక్షణ యోగ్యుడు కనుక ఏ గురువైనా బోధిస్తాడు. కాని, అర్జునునికి మాత్రం శ్రీకృష్ణుడే బోధించాలి.

ఎందుకని? నేను నీకు శిష్యుణ్ణి అన్నాడు అర్జునుడు. అంటే, తన గురువుగా శ్రీకృష్ణుణ్ణే ఎంచుకున్నాడు పార్థుడు.

గురువు లఘువు కాదు

గురుత్వము గౌరవప్రద మైనది. గణనీయ మైనది. ఘనమైనది. ఘనకీర్తి గలది. లఘుత్వము కానిది. లక్షణ మైనది.

ఎందరైనా బోధించ వచ్చు. బోధించేవా రందరూ గురువులు కాలేరు. జ్ఞానగంధము లేకపోయినా జ్ఞానుల మని విర్రవీగే వారు, అహంకారముతో ఊగిపోయే వారు గురువులు కాలేరు. అలాంటి వారిని అనుసరించే మూఢ శిష్యులు గ్రుడ్డి వానిని అనుసరించే గ్రుడ్డివారి లాగా పతన మౌతారు అన్నది ఉపనిషత్తు.

' అవిద్యాయా మన్తరే వర్తమానాః
స్వయం ధీరాః పండితం మన్యమానాః
దంద్రమ్యమాణాః పరియన్తి మూఢాః
అంధేనైవ నీయమానా యథాంధాః ॥

అజ్ఞానంలో అలమటించే మూఢులు తామే గొప్ప పండితుల మని, వివేకుల మని గర్వంతో ఊగిపోతూ, 'గ్రుడ్డి వానిని అనుసరించే మరొక గ్రుడ్డివాని' లాగా పరిభ్రమిస్తూ ఉంటారు అన్నది కఠోపనిషత్తు.*

అర్జునుడు జ్ఞానసాగరు డైన అచ్యుతుని గురువుగా ఎన్నుకున్నాడు. దాని ఫలితంగా మోహనాశము - స్మృతిలాభము జరిగిందని చివరగా అర్జునుడే చెబుతాడు.

గురు-శిష్య వైభవము

ఆత్మజ్ఞానమును బోధించు ఆచార్యుడు అరుదుగా ఉంటాడు. అందుకే గురువు వైభవోపేతుడు. అట్టి ఆత్మజ్ఞానమును అందుకొనే నిపుణుడైన శిష్యుడు కూడా అరుదు గానే ఉంటాడు. కనుక శిష్యుడు కూడా వైభవంతో ఉన్నవాడే. ఇలాంటి గురుశిష్యులు ఏకమైన చోట ఉన్నదంతా జ్ఞానమే. జ్ఞానామృతమే. జ్ఞాన వైభవమే.

ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా
ఆశ్చర్యో జ్ఞాతా కుశలాఽను శిష్టః

ఈ జ్ఞానమును గూర్చి చర్చించ గల వక్త చాలా అరుదు. నిపుణుడైన ఆచార్యుడు చర్చించే ఈ తత్త్వమును అందుకొనే శ్రోత కూడా నిపుణుడే. అరుదైన వాడే. ఇలాంటి గురుశిష్యులు ఒక్కటైన చోట రెండు గాని, కాలేని, అద్వితీయ జ్ఞాన మొక్కటే శోభిస్తుంది.

అలాంటి గురుశిష్యులే శ్రీకృష్ణార్జునులు. కనుకనే, వీరి మధ్య పదిహేడు అధ్యాయాలతో జ్ఞానం వరద లాగా పారింది. అద్భుతమైన గురువు, అద్భుతమైన శిష్యుడు కురుక్షేత్రంలో ఒక్కచోట చేరారు. సంవాద రూపంలో తత్త్వాన్ని చర్చించ బోతున్నారు. అమృతమయ మైన ధర్మబోధ అంద బోతోంది. దివ్యమైన జ్ఞానామృతము వితరణకు సిద్ధం కాబోతోంది.

అర్జునుడు ఆత్రుతతో నిరీక్షిస్తున్నాడు. సంజయుడు ఆసక్తితో ఎదురు చూస్తున్నాడు. మీరూ, నేను కూడా శ్రద్ధతో చేతులు జోడిస్తున్నాం. మారలేక పోయినా, విని ఆనందించ దానికి ధృతరాష్ట్రుడు కూడా సిద్ధపడు తున్నాడు.

* కఠోపనిషత్తు పై పూజ్య స్వామీజీ ప్రవచనముల వి.సి.డి.లు ఆశ్రమంలో లభ్యం.

శరణాగతి

యుద్ధభూమిలో ప్రవేశించి నపుడు అర్జునునిలో కేవలం శత్రుభావనే ఉండింది. సమర సంకల్పమే ఉండింది. ద్వేషవృత్తి ఒక్కటే మనస్సును అంటి పెట్టుకొని ఉండింది.

రణరంగంలో భీష్మాదుల్ని చూచిన తరువాత శత్రు భావన మెల్లమెల్లగా పలుచ బడింది. దాని స్థానంలో మమకార భావన మొలకెత్తింది. ఒక దశలో మనసంతా మమకార వృత్తి పెనవేసుకు పోయింది.

మమకారం అర్జునుని కుదిపేసింది. అంతటితో ఆగలేదు. ఒక సాధారణ సమస్యను పారమార్థిక సమస్యగా మార్చేసింది. ప్రేయస్సును పేలవంగా తేల్చేసింది. శ్రేయస్సునే ప్రధానంగా ముందుకు తెచ్చింది.

మమకార వృత్తి స్థానంలో శరణాగత వృత్తి శోభించింది. జ్ఞానాభిలాష బుద్ధిలో పల్లవించింది. వీరుడిగా కురుక్షేత్రంలో అడుగు పెట్టిన అర్జునుని శిష్యునిగా రూపు దీర్చింది.

అర్జునుడు శరణాగతు డయ్యాడు. ఇక్కడ అర్జునుడు శరణాగతు డయింది వ్యక్తికి అని అనిపిస్తున్నా, కనిపిస్తున్నా, వాస్తవానికి అతడు శరణాగతుడైంది జ్ఞానానికి. వాసుదేవుని లోని అమృతమయమైన జ్ఞానానికి. జ్ఞాని వైభవము అంటే జ్ఞాన వైభవమే. జ్ఞానము యొక్క వైభవమే.

జ్ఞాన ద్వారము

భగవద్గీత రెండవ అధ్యాయం - సాంఖ్య యోగము ఏడవ శ్లోకంలో అర్జునుడు ఏడుపు మానేసి ప్రసన్నంగా శరణాగతు డయ్యాడు. గీతాజ్ఞాన సాధానికి ఈ శ్లోకం ముఖద్వారము అనిపిస్తోంది. ఈ శ్లోకం లేనట్లయితే గీతాభవనం లోకి ప్రవేశమే దక్కేది కాదు. ఈ శ్లోకం శ్రీకృష్ణుని చెవిలో పడకుండా ఉంటే, అర్జునునికి గీతామృతాన్ని శ్రీకృష్ణుడు పంచేవాడు కాడు. అందుకనే, శాస్త్రారంభానికి అవసరమైన అనుబంధ చతుష్టయం ఈ శ్లోకం లోనే పులకిస్తూ పుష్పితమై, పుష్కలంగా పురస్కారము నందుకొంది.

విషయము, ప్రయోజనము, అధికారి, సంబంధము - ఈ నాలుగు అనుబంధ చతుష్టయము. శాస్త్రారంభానికి మూలము.

(1) విషయము : జ్ఞానము. ఆత్మజ్ఞానము. శ్రేయస్సును బోధించమని అర్జునుడు ప్రశ్నించాడు. శ్రేయస్సు అంటే మోక్షము. మోక్షము జ్ఞానరూపంలో ఉంది కనుక జ్ఞానమే ఇక్కడ కేంద్ర విషయము.

(2) ప్రయోజనము : పరమ పురుషార్థమైన మోక్షమే ప్రయోజనము.

(3) అధికారి : అర్జునుడు అధికారి. వివేక, వైరాగ్య, శమాది షట్క సంపత్తి, ముముక్షుత్వము అనే సాధన చతుష్టయ సంపద గల అర్జునుడు అధికారి.

(4) సంబంధము : గీతలో జ్ఞానమే ప్రధానమై నందున, భగవంతుడు, భగవంతుని జ్ఞానము (గీత) వేరు కానందున గ్రంథ విషయము, గ్రంథ నామమునకు సంబంధము ఉంది. అంతేకాదు. శిష్టాచార సంప్రదాయంలో బోధ విషయంలో ప్రముఖంగా ఉండ వలసిన గురుశిష్య సంబంధము కూడా ఇక్కడే శోభించింది.

ఇక జ్ఞానబోధ ప్రారంభం కావాలి. అర్జునుడు తన చివరి మాటను పలికి విరమిస్తున్నాడు.

న హి ప్రపశ్యామి మ మాపనుద్యా ద్యచ్ఛోక ముచ్ఛోషణ మిన్ద్రియాణామ్ ।
అవాప్య భూమా వసపత్న మృద్ధం రాజ్యం సురాణా మపి చాధిపత్యమ్ ॥ 8

న-హి-ప్రపశ్యామి-మమ-అపనుద్యాత్-యత్-శోకం-ఉచ్ఛోషణం-ఇన్ద్రియాణాం
అవాప్య-భూమౌ-అసపత్నం-ఋద్ధం-రాజ్యం-సురాణాం-అపి-చ-ఆధిపత్యం

భూమౌ	= భూమండలమున	ఇంద్రియాణాం	= ఇంద్రియాలకు
అసపత్నం	= శత్రువులు లేని	ఉచ్ఛోషణం	= మిక్కిలి తాపమును కలిగించే
ఋద్ధం	= సమృద్ధ మైన	మమ	= నా యొక్క
రాజ్యం	= రాజ్యమును గాని	శోకం	= దుఃఖమును
సురాణాం	= దేవతల	యత్	= ఏది
ఆధిపత్యం చ అపి	= ఆధిపత్యమును కూడా	అపనుద్యాత్	= పోగొట్టునో
అవాప్య	= పొందినా	న ప్రపశ్యామి హి	= చూడలేక పోతున్నాను

కృష్ణా! సర్వేంద్రియ తాపంతో, శోకంతో కుమిలి పోతున్నాను. ఎలా తొలగించుకోవాలో తెలియడం లేదు. ఈ లోకంలో శత్రు శేషం లేని, సకలైశ్వర్య సంపన్నమైన రాజ్యం లభించినా, నా శోక తాపాలు తీరేలా లేవు. స్వర్గాధిపత్యం కూడా అలాంటిదే ననిపిస్తోంది. నాకు మరొక మార్గం కనిపించడం లేదు.

వ్యాఖ్య

యుద్ధం చెయ్యాలని అర్జునుడు కురుక్షేత్రంలో ప్రవేశించాడు. పోట్లాడటం మాని మాట్లాడటం ఆరంభించాడు. మాటలన్నీ ఖర్చయి పోయాయి. బుద్ధిలో బాధలు అలాగే ఉన్నాయి. ఏమి చెయ్యడానికి మనస్సు ఇష్టపడటం లేదు. ఏది చేసినా చేతులు కాలుతాయి - చిత్తము పేలుతుంది అనే భావం బుద్ధిలో స్థిరపడి పోయింది.

ఏమి చేయాలి? - ఏది పొందాలి?

యుద్ధం చెయ్యాలి. గెలిస్తే రాజ్యం. ఓడితే స్వర్గం. యుద్ధం స్వధర్మం కనుక ఆచరించక తప్పదు. చేసి సాధించే దేముంది? శ్రేయస్సు లభిస్తుందా? అని అర్జునుని ఆంతర్యం ప్రశ్నిస్తోంది.

యుద్ధంలో విజయాన్ని సాధిస్తే రాజ్యం లభిస్తుంది. రాజ్యం రావచ్చు. దుఃఖం పోతుందా? పైరుకు తెగులు - ప్రభువుకు వైరులు అనివార్యాలు. దోమలు, నల్లులు నిండిన ప్రదేశంలో పట్టుపాన్పులు ఏమి సుఖాన్నిస్తాయి? ప్రభువుకు శత్రువులు ఉంటారు. ప్రతికూల పరిస్థితులూ ఉంటాయి. కనుక దుఃఖం తప్పదు. కాని, ఇక్కడ అర్జునుడు ప్రస్తావిస్తున్నది సామాన్యమైన రాజ్యం కాదు. అఖండ భూమండలాధిపత్యము. శత్రువులు లేని రాజ్యము (*అసపత్నం - ఋద్ధం - రాజ్యం*).

కృష్ణా! మనం వాళ్ళను జయిస్తామో, లేక వాళ్ళే మనల్ని జయిస్తారో కూడా తెలియదు. ఏది మనకు శ్రేయస్కరమో కూడా తెలియడం లేదు అని ఆరవ శ్లోకంలో అన్నాడు అర్జునుడు. ఎవరు గెలిచినా సాధించేది ఏమీ లేదని ఇప్పుడు అంటున్నాడు.

తామే గెలిస్తే రాజ్యం వస్తుంది. రాజ్యం క్రొత్తది. దేహం మాత్రం పాతదే. రాజ్యం ఉండినా దేహం ఉండదు. దేహం కూడా కర్మఫలమే. గతంలో ఆచరించిన కర్మల ఫలితంగా దేహం ప్రాప్తించింది. కర్మఫలం ఏదైనా నశించేదే. అర్జునుడు సాధారణమైన వ్యక్తి కాడు. శాస్త్ర విషయాలు వినిన వాడే. అనివార్యాలను జీవితంలో చూసిన వాడే. అదంతా వృథా కాలేదు. తన సమస్యను తీవ్రతరం చేస్తూనే ఉంది. అనిత్యాలను ఆరబోస్తూనే ఉంది.

కుండను చేయడం కర్మ. వస్త్రాన్ని నేయడం కర్మ. కర్మ యొక్క ఫలంగా ఒక కాలంలో ప్రాప్తించిన కుండ మరొక కాలంలో పగిలి పోతుంది. కర్మఫలంగా ఒక కాలంలో లభించిన వస్త్రము మరొక కాలంలో చిరిగి పోతుంది. దేహం కూడా కర్మఫలమే. ఏది పొందినా మరొక నాడు దానిని పోగొట్టుకో వలసిందే. దేహమే నిత్యం కాదు. ఇక రాజ్యం నిత్యమా? ప్రభువై సాధించే దేముంది? పరితపిస్తూనే బ్రతకాలి. అసంతృప్తి తోనే జీవించాలి.

ఒకవేళ యుద్ధంలో అపజయమే ఎదురైతే, మరణమే ప్రాప్తిస్తే, అప్పుడేం జరుగుతుంది? స్వర్గం ప్రాప్తిస్తుంది. ఇక్కడ కేవలం స్వర్గమే కాదు, స్వర్గలోకాధిపత్యం లభించినా తన దుఃఖం ఉపశమించే లాగా లేదు అని స్పష్టంగా చెబుతున్నాడు అర్జునుడు.

రోగి ఒక గ్రామాన్ని విడిచి మరొక గ్రామానికి పోయినంత మాత్రాన రోగం పోతుందా? ఇంటి లోని కష్టాలను మనస్సులో పెట్టుకొని కార్యాలయానికి వెళ్ళిన ఉద్యోగి, కాగితాలలో తల దూర్చినంత మాత్రాన అతని తల నుండి కష్టాలు తప్పు కుంటాయా? అసంతృప్తితో బ్రతికే వ్యక్తి స్వర్గాన్ని చేరి మాత్రం ఏం పొందుతాడు? భోగాలు అనుభవిస్తున్నా, అవి అనిత్య మనే సత్యాన్ని అవలోకిస్తూనే ఉంటాడు. భూమండలాధిపత్యాన్ని అనుభవించినా దానిని త్యజించక తప్పదు. స్వర్గలోకాధిపత్యము కూడా అంతే కదా! అదీ కర్మఫలమే. ఈ లోకంలో కర్మఫలంగా లభించింది ఎలా అంతమవుతూ ఉందో, అలాగే పుణ్యకర్మ ఫలంగా స్వర్గలోకంలో లభించేది కూడా అంతమయ్యేదే నని విస్పష్టం చేసింది ఛాందోగ్య శ్రుతి ***(తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే, ఏవ మేవ అముత్ర పుణ్యచితో లోకః క్షీయతే).*** తృప్తి అనేది ప్రదేశంపై, కాలంపై ఆధారపడి ఉన్నది కాదు. వ్యక్తిపై కేంద్రీకరింపబడి ఉన్నది. ఈ లోకంలో తృప్తి లేనివాడు మరో లోకంలో కూడా తృప్తిగా ఉండ లేడు.

పరిధి దాటిన పరితాపము

రాజ్యం రావచ్చు. స్వర్గం రావచ్చు. దుఃఖం పోయే లాగా లేదు. దేహం లోపల ఏర్పడిన వ్రణాన్ని నిర్మూలించకుండా, దేహంపై మందు రాస్తే బాధ తగ్గుతుందా? తొలగుతుందా? ఆంతర్యం లోని అసంతృప్తిని అదృశ్యం చేసుకోకుండా బాహ్యంలో పొందే భోగాలన్నీ రోగాలే నని పార్థునికి తెలిసి పోయింది. భూమండలాది స్వర్గ పర్యంతం భోగ్య వస్తువుల యందు జిహాసా బుద్ధి ఏర్పడింది.

అర్జునుడు నిలకడగా నిలబడలేక పోయాడు. గాండీవాన్ని పట్టుకొనే శక్తి కూడా చేతులకు లేకుండా పోయింది. అర్జునుని లోని శక్తి నంతా దుఃఖం పీల్చేసింది. శోకాగ్నిలో కుమిలి పార్థుని పటుత్వము ఆవిరై పోయింది. ఇంతటి దుఃఖాన్ని పోగొట్టే శక్తి రాజ్యం వల్ల గాని, స్వర్గం వల్ల గాని వచ్చే ప్రసక్తే లేదని అర్జునునికి అర్థమై పోయింది.

వైరాగ్యం పరమం ధనం

జ్ఞానసాధానికి వైరాగ్యం పటిష్ఠ మైన పునాది వంటిది. వైరాగ్యం లేని జ్ఞానం స్థిరంగా నిలబడదు. అర్జునునిలో వైరాగ్యం తీవ్రస్థాయికి చేరింది. ఇదంతా వివేకం వల్ల ఏర్పడిందే గాని మతాబుల కాంతి వంటిది కాదు. వివేకంతో సాగించిన విశ్లేషణ విజయునిలో వైరాగ్యాన్ని పుష్కలంగా దించింది.

పరిస్థితులు విషమించి నపుడు, అన్ని వైపుల నుండి నిరాశా గాలులు వీచి వ్యక్తి మూర్తిమత్వము నీరసించి నపుడు ఎవరైనా వైరాగ్యాన్ని పొందే అవకాశం ఉంటుంది. కాని, అది తాత్కాలికంగా ఉంటుందే గాని శాశ్వతంగా నిలవదు. అర్జునుడు దారుణమైన పరిస్థితిని వివేకంతో విశ్లేషించుకొని, తన సమస్య ఏమిటో కనుగొన్నాడు.

తనలో అలుముకున్న నిరాశా చీకట్లను తొలగించుకొనే ప్రయత్నంలో అచ్యుతుడనే ఆశాదీపాన్ని, అక్షయ దీపాన్ని ఆశ్రయించాడు. వైరాగ్యంతో వాసుదేవుణ్ణి శరణు పొందాడు. వైరాగ్యము లేని శ్రవణము ఫలప్రదం కాదు.

కొందరికి తత్త్వజ్ఞానము కూడా కాలక్షేపంగా ఉంటుంది. దానినొక వినోదంగా భావిస్తూ, విచిత్రంగా భాషిస్తూ ఉంటారు. అలాంటి వారిలో తత్త్వం పట్ల నిబద్ధత ఉండదు. తీవ్రత ఉండదు. అలాంటి వారు గీతా జ్ఞానగంగలో మునక వేయలేరు.

వివేక వైరాగ్యాలు ఎంత ఉన్నతంగా ఉంటే, అంత మహోన్నతంగా తత్త్వం పంట పడుతుంది. అర్జునుని విషయంలో వైరాగ్యం తీవ్రస్థాయికి చేరింది. ఇహపర లోక భోగాలన్నీ తుచ్ఛంగా కనిపించాయి ఆ పుణ్యాత్మునికి. తత్ఫలితంగా శ్రీకృష్ణ భగవానుడు గీతను బోధించుటకు సిద్ధ పడ్డాడు. ఈ విషయాన్నే సంజయుడు ధృతరాష్ట్రునికి చెబుతున్నాడు.

సంజయ ఉవాచ :

ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।
న యోత్స్య ఇతి గోవిన్ద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9

ఏవం-ఉక్త్వా-హృషీకేశం-గుడాకేశః-పరంతపః
న-యోత్స్యే-ఇతి-గోవిందం-ఉక్త్వా-తూష్ణీం-బభూవ-హ

పరంతపః	= శతృవులను తపింపజేసే	ఉక్త్వా	= పలికి
గుడాకేశః	= అర్జునుడు	న యోత్స్యే	= యుద్ధము చేయను
హృషీకేశం	= హృషీకేశుడైన	ఇతి	= అని
గోవిందం	= గోవిందునితో	ఉక్త్వా	= పలికి
ఏవం	= ఈ విధముగా	తూష్ణీం బభూవ హ	= మౌనంగా ఉండి పోయాడు

సంజయుడు చెబుతున్నాడు :

ధృతరాష్ట్ర మహారాజా! శత్రువులను తపింప చేసే అర్జునుడు హృషీకేశుడైన గోవిందునితో ఈ విధంగా పలికి, నేను యుద్ధం చెయ్యలేను అని చెప్పేశాడు.

వ్యాఖ్య

సంజయుడు ఈ శ్లోకంలో అర్జునుని 'గుడాకేశుడు', 'పరంతపుడు' అంటూ, శ్రీకృష్ణుని 'హృషీకేశుడు' అని పేర్కొంటున్నాడు.

అర్జునుడు పరంతపుడు. అంటే, శత్రువులను తపింప చేయువాడు అని అర్థము. శత్రు సంతాపకరు డైన అర్జునుడు ఎదురుగా శత్రువులను పెట్టుకొని కూడా యుద్ధం చెయ్యనని చెప్పి మౌనం వహించాడు.

పరంతపుడైన అర్జునుని గుడాకేశుడని కూడా చెబుతున్నాడు. ఈ పద ప్రయోగం మొదటి అధ్యాయం ఇరవై నాల్గవ శ్లోకంలో కూడా జరిగింది. 'గుడాక' మంటే నిద్ర. నిద్రను జయించిన వాడు కనుక అర్జునుడు గుడాకేశుడు.

నిద్ర తమోగుణాన్ని సూచిస్తుంది. తమోగుణాన్ని జయించిన వాడు కనుక అర్జునుడు గుడాకేశుడు.

తమోగుణం నుండి బయట పడ్డట్లే అజ్ఞాన నిద్ర నుండి కూడా మేల్కొనే సమర్థుడు అనేది అంతర్భావము.

పరంతప: అంటే అర్జునుడు అని తెలుసుకున్నాం. 'పరంతపః' అనే పదానికి 'పరంతప' అనే పాఠాంతరము కూడా ఉంది. 'పరంతపః' అని విసర్గ యుక్తంగా ఉంటే, 'పరంతప' శబ్దం అర్జునునికి సంబంధించి ఉంటుంది. అలా కాకుండా, విసర్గం లోపించి కేవలం 'పరంతప' అని ఉంటే, సంజయుడు ధృతరాష్ట్రుని పరంతపా! అని సంబోధించినట్లు అవుతుంది. ధృతరాష్ట్రుడు అంధుడు. కనుక శత్రువులను తపింప చేయువాడు అనే అర్థాన్నిచ్చే పదం ధృతరాష్ట్రుని కన్నా అర్జునునికే చక్కగా సరిపోతుంది.

శ్రీకృష్ణుని హృషీకేశుడు అంటున్నాడు. ఈ పదం ఇప్పటికే రెండుసార్లు వచ్చింది. మొదటి అధ్యాయం పదైదవ శ్లోకం లోను, అలాగే ఇరవై నాల్గవ శ్లోకంలో కూడా శ్రీకృష్ణుని హృషీకేశుడు అనడం జరిగింది.

'హృషీకములు' అంటే ఇంద్రియాలు. వాటిని ప్రేరేపించే చైతన్యరూపుడు కనుక శ్రీకృష్ణుడు హృషీకేశుడు. నేను యుద్ధము చెయ్యను అని పలికి అర్జునుడు మౌనం వహించినా, హృషీకేశుడు ప్రక్కనే ఉన్నాడు కనుక, ఎలాగైనా ప్రేరేపించి యుద్ధాన్ని జరిపిస్తాడనే భావము తోనే హృషీకేశుడు అనడం జరిగింది.

హృషీకేశుడైన శ్రీకృష్ణుని 'గోవిందం' అని పేర్కొనడంలో కూడా విశేషమైన భావం ఉంది. అర్జునునికి శ్రేయస్సును అనుగ్రహించే వేదాంత జ్ఞానాన్ని శ్రీకృష్ణుడు బోధించ దానికి ఉపక్రమిస్తున్నాడు. కనుక గోవింద నామము చక్కగా సరిపోయింది.

గోభిర్వేదాంత వాక్యైరేవ విన్దతే లభ్యత ఇతి గోవిందః

వేదాంత వాక్యాల ద్వారా వ్యక్తమయ్యే వాడు కనుక శ్రీకృష్ణుడు 'గోవింద' శబ్దవాచ్యుడు. అర్జునుని సమస్యను జ్ఞానము ద్వారా పరిష్కరించు వాడు గోవిందుడు.

'గోవింద' శబ్దార్థము గురుదేవుని యొక్క సర్వజ్ఞత్వమును సూచిస్తూ ఉంది అని అభిప్రాయ పడ్డారు గీతాభాష్యంలో శ్రీ మధుసూదన సరస్వతి ***(గో వేద లక్షణాం వాణీం విన్దతీతి వ్యుత్పత్త్యా సర్వ వేద ఉపాదానత్వేన సర్వజ్ఞమ్)***. వేదరూపమైన వాక్కును ***(గో)*** పొందువాడు ***(విన్దమ్)*** అను వ్యుత్పత్తి చేత సమస్త వేదములకు ***(సర్వవేద)*** కారణమైన వాడు అగుట చేత ***(ఉపాదానత్వేన)*** శ్రీకృష్ణుడు 'గోవింద' శబ్దవాచ్యుడుగా సర్వజ్ఞుడు ***(సర్వజ్ఞమ్)***.

అర్జునుడు శ్రీకృష్ణునితో చెప్పవలసిం దంతా చెప్పి, నేను యుద్ధము చెయ్యను ***(న యోత్స్య)*** అని పలికి, మరో మాట లేకుండా, ఊరక ***(తూష్ణీం)*** ఉండి పోయాడు ***(బభూవ)***. మౌనంగా ఉండి పోయాడు.

సర్వజ్ఞుడైన జగద్గురువు శ్రీకృష్ణ భగవానుడు మాట్లాడబో తున్నాడు. గురుబోధను ఆలకించాలంటే శిష్యుడు నిశ్శబ్దం గానే ఉండాలి. గురు వచనముల యందే మనస్సును నిలిపి, మరో ఆలోచన లేకుండా, ఆలాపన లేకుండా ఊరుకోవాలి. శ్రవణం చేసే వాడు సమస్తాన్ని త్యజించి, సర్వాన్ని మరచి వినాలి అనేది కూడా శాస్త్రోక్తం ***(సంన్యస్య శ్రవణం కుర్యాత్)***.

తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।
సేనయో రుభయోర్మధ్యే విషీదన్త మిదం వచః ॥ 10

తం-ఉవాచ-హృషీకేశః-ప్రహసన్-ఇవ-భారత
సేనయోః-ఉభయోః-మధ్యే-విషీదంతం-ఇదం-వచః

భారత	=	ఓ ధృతరాష్ట్రా!	తం	=	ఆ అర్జునుని
ఉభయోః	=	రెండైన	హృషీకేశః	=	శ్రీకృష్ణుడు
సేనయోః	=	సేనల యొక్క	ప్రహసన్ ఇవ	=	నవ్వుచున్న వాని వలె
మధ్యే	=	నడుమ	ఇదం వచః	=	ఈ వాక్యమును
విషీదంతం	=	దుఃఖిస్తున్న	ఉవాచ	=	పలికెను

మహారాజా! ఉభయ సేనల నడుమ దిగులుతో దుఃఖమగ్నుడై ఉన్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు మందహాసాన్ని చిందిస్తూ మాట కదిపాడు.

వ్యాఖ్య

ఉభయసేనల మధ్య

పాండవ మధ్యముడు

మిశ్రమ భావాల మధ్య ఎటూ తేల్చుకోలేక నలిగి పోతున్నాడు పాండవ మధ్యముడైన పార్థుడు. ఏదేదో చేసేయాలని యుద్ధభూమిలో అడుగు పెట్టిన అర్జునుడు ఏదీ చేయలేని స్థితికి చేరి, చివరగా యుద్ధ విరమణకు సిద్ధపడ్డాడు. సంక్లిష్టమైన సమయంలో, వీరోచిత పోరాటానికి నడుము బిగించిన తరుణంలో, ఎక్కడో గుండె లోతుల్లో అవ్యక్తంగా దాగియున్న సంశయాలు, భయాలు, ఆందోళనలు ఒక్కసారి పెల్లుబికి చుట్టు ముట్టాయి. విజయుడు విషాదంతో విలపిస్తున్నాడు.

ఉద్యోగ నిమిత్తము ఎంపిక చేసే సమావేశానికి హాజరై నపుడు, దరఖాస్తు పెట్టిన వ్యక్తే దయనీయంగా దిగాలు పడి ఉండటం చూస్తుంటాము. పెళ్ళిచూపులకు ప్రథమంగా వెళ్ళిన వరుడు వధువు గృహంలో అదోలా మెలికలు తిరగడం ఎవరికి తెలియదు? క్రొత్తగా పాఠశాలలో ప్రవేశించి నపుడు, బాల్యం వల్ల భయమో, బిడియమో ఉండింది అంటే అర్థం చేసుకోవచ్చు. నూతనంగా ఉద్యోగ నిర్వహణకు కార్యాలయంలో కాలు పెట్టేటప్పుడు కూడా అలాంటిదే ఏదో ఉంది అంటే దానిని ఎలా అర్థం చేసుకోవాలి?

మనకు ప్రాణతుల్యమైన వారి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని తెలియగానే మనస్సు ఎందుకు పట్టు తప్పుతుంది? కాళ్ళు ఎందుకు వణకుతాయి? చెమటలు ఎందుకు పోస్తాయి? మాట లెందుకు తడబడతాయి? వరదలు పొంగి వచ్చినపుడు, సునామీ ముంచుకొచ్చి నపుడు, ప్రాణాలు కోల్పోయిన విగత జీవుల దీన గాథల్ని పత్రికలలో చదివి నపుడు, మన గుండెలు ఎందుకు గోల చేస్తున్నాయి? కళ్ళు ఎందుకు చెమ్మగిల్లు తున్నాయి? అలా జరగడం అసమంజసమా? ఆ మాత్రం చలనాలు మనుషుల్లో లేకపోతే, రాళ్ళల్లో ఉంటాయా? రప్పల్లో కనిపిస్తాయా?

అర్జునుడు దుఃఖిస్తున్నాడు అనేది అందరికీ తెలుసు. ఆ సన్నివేశంలో దుఃఖం రావడం ఆశ్చర్యమా? కళ్ళ ముందే, క్షణాల్లో, అయిన వాళ్ళు ఎవరుంటారో, ఎవరు ఉండరో అనే ఆలోచన ఆవేదనా పూరిత మైనది కాదా? చిన్న చిన్న కారణాలకే మనుషులు పెద్దపెద్దగా రోదిస్తూ ఉంటారు. అర్జునుడు కూడా నరుడే కదా! మానవుడే కదా! మనస్సున్న వాడే కదా! మమతలు తెలిసిన వాడే కదా! అలాంటి వాడు కలత చెందడం అసహజమా?

అందరి లాగే అర్జునుడు కూడా ఆవేదనకు గురి అయ్యాడు. విషాదానికి లోనయ్యాడు. అలాగని, అర్జునుణ్ణి అందరితో పోల్చడం సబబు కాదు. భయంకర పరిస్థితులు తలెత్తి నపుడు అందరి లాగే అర్జునుని

కళ్ళు కూడా వర్షించి ఉండొచ్చు. అంతమాత్రాన అందరి లాగా అర్జునుడు కాళ్ళకు బుద్ధి చెప్పలేదు. పలాయనం చిత్తగించ లేదు. సమస్యను విస్మరించ లేదు. దానికి మూల మేమిటో తెలుసుకొనే ప్రయత్నం చేశాడు. కార్యంతో కలత పడినా, కారణాన్ని సమూలంగా నిర్మూలించే కార్యక్రమానికి నడుం బిగించాడు. ఆ ప్రయత్నము యొక్క ఫలితమే గీతాశాస్త్రము. ఉపనిషత్సార సందేశము.

జనన మరణాల మధ్య

జీవుల బ్రతుకులు

వచ్చేవారు లేనివారే. ఉన్నవారు లేకుండా పోయేవారే. ఆయువును పోసుకొని జన్మకు వస్తారు. ఆయువును క్రుమ్మరించి మృత్యువులో వాలి పోతారు. ఈ జనన మరణా లనే రెండు గట్ల మధ్య సాగేదే జీవన ప్రవాహము. జీవి ప్రయాణము. మునిగినా తేలినా ప్రవాహం లోనే. గట్ల మధ్యనే. తరించినా అంతరించినా ఉభయ తీరాల మధ్యనే.

ఏది జరుగుతుందో, ఎలా జరుగుతుందో ఎవరికి తెలుసు? అందుకే మధ్యలో ఉన్న వాళ్ళందరూ ఏడ్చేవాళ్ళే. దుఃఖించే వాళ్ళే. విషాదంతో విలవిల లాడే వాళ్ళే.

నరు లందరి పరిస్థితి ఇదే. అందుకనే నరు లందరి పక్షాన ప్రతినిధిగా ఒక్క నరుడు దుఃఖించాడు. ఆ నరుడే అర్జునుడు. సర్వ జీవుల ప్రతిరూపంగా కురుక్షేత్రంలో నిలిచాడు. మధ్యలోనే ఉన్నాడు. ఉభయసేనల మధ్యలోనే ఉన్నాడు.

నరుడు మధ్యముడే. ఇద్దరు అన్నలకు, ఇద్దరు తమ్ముళ్ళకు మధ్యలో అర్జునుడు. పాండవ మధ్యముడు. నరు దెవడైనా మధ్యముడే. ఉత్తములైన దేవతలకు, అధమమైన జంతుజాలానికి మధ్యలో నరజన్మ. మానవ జన్మ. మాధవు డయ్యేందుకు అనువైన జన్మ. అందుకే నరుడు మధ్యముడు.

జీవన పోరాటంలో కూడా నరుడు మధ్యముడే. ఉభయసేనల మధ్య అర్జునుడు. జనన మరణాల మధ్య మానవుడు. ఎదబాధతో ప్రవాహంలో ఎదురీదిన వాడు. మాధవుని ఆశ్రయించిన వాడు. దయ చూపి ఎదబాధను తొలగించమని యదునందనుని యాచించిన వాడు. ప్రార్థించిన వాడు. శాసించి రక్షించమని వేడుకొన్న వాడు. నీ కృప లేనిదే కడతేరలే నని కన్నీటితో శరణుజొచ్చిన వాడు.

పల్లవి : **వసంతం విరబూసిన గాని**
చిగురించవు మోడు తరువులు
అనుపల్లవి : **నీ దయ మా యెద తాకిన గాని**
విరబూయవు మా బ్రతుకులు *॥ వసంతం ॥*
చరణము : **ఉన్నది చెప్పకనే పోతూ ఉంది**
రానున్నది తానే రాబోతుంది
పోయింది ఆయువు వచ్చేది మృత్యువు
నిలవని కాయము చావుకు తాయము *॥ వసంతం ॥*

ఇదే జీవ చైతన్యం. చైతన్య జీవన ఆలాపం. జీవుల విలాపం.

అర్జునుని విషాదాన్ని శ్రీకృష్ణుడు చూశాడు. అతని విలాపాన్ని, విషాదానికి కారణాన్ని అతని మాటల లోనే విన్నాడు. మందహాసంతో తన మాటను వినిపించ డానికి ఉద్యుక్తు డయ్యాడు.

విషాదంతో అర్జునుడు క్రుంగిపోతున్న సమయంలో శ్రీకృష్ణుడు నవ్వడ మేమిటి? ఎలా నవ్వ గలిగాడు?

ఎందుకు నవ్వాడు? మసక చీకటిలో స్థాణువును (కొమ్మలు లేని చెట్టును) చూచి అది చోరుడని భావించి కేక వేసిన వ్యక్తిని చూచి, అది మోడు అని తెలిసిన వాడు నవ్వడా? ఇదీ అంతే.

అర్జునుని దుఃఖానికి కారణమే లేదు అని అచ్యుతునికి తెలుసు. విషాద సన్నివేశంలో ఎవ్వరూ నవ్వలేరు. నిజమే. కాని, అక్కడ విషాదానికి హేతువే లేదని భగవంతునికి తెలుసు. కేవలం అజ్ఞానం వల్ల ఏర్పడిన శోక మోహాలతో అర్జునుడు కలత చెంది కన్నీళ్ళు పెడుతున్నాడని మధుసూదనునికి తెలుసు. అందుకే నవ్వుతూ కనిపిస్తున్నాడు. అది పరిహసించడం కాదు. సానుభూతితో, ప్రేమతో పరామర్శించడం. అది వికృతపు నవ్వు కాదు. సమ్యక్ జ్ఞానం వల్ల ఏర్పడిన చిద్విలాసంలో చిందిన చిరునవ్వు. సర్వ భయాలు, సమస్త శోకాలు జ్ఞానోదయంతో అదృశ్యమయ్యే సమయం ఆసన్న మైందని సూచించే పువ్వు వంటి నవ్వు. పుష్పహాసుని పూర్ణజ్ఞానం విరజిమ్మిన వెలుగుల కిరణం. పూర్ణజ్ఞానం వల్ల కలిగిన మంజుల మనోజ్ఞ ప్రశాంత మందహాసం.

సంసార బీజ భూతౌ శోకమోహౌ , తయోశ్చ సర్వకర్మ సంన్యాస పూర్వకాత్ ఆత్మజ్ఞానాత్ న అన్యతః నివృత్తిః ఇతి తత్ ఉపదిదిక్షుః సర్వలోకానుగ్రహార్థమ్ అర్జునం నిమిత్తీకృత్య ఆహ భగవాన్ వాసుదేవః అశోచ్యా నిత్యాది ,

శోకమోహాలు సంసారానికి బీజాలు. సర్వ కర్మ సన్యాస పూర్వకమైన ఆత్మజ్ఞానం వల్లనే అవి తొలగాలి గాని, అన్య సాధనల వల్ల నివర్తింప బడవు. ఈ విషయాన్ని ఉపదేశించాలని భావించిన శ్రీకృష్ణ భగవానుడు అర్జునుని నిమిత్తంగా చేసికొని, సర్వ లోకాన్ని అనుగ్రహించడం కోసం గీతోపదేశాన్ని ప్రారంభించాడు (***అశోచ్యాన్ అన్వశోచః*** - దుఃఖింప దగని వాళ్ళను గూర్చి దుఃఖిస్తున్నావు).

మువ్వల వాని నవ్వు

అర్జునాచ్యుతులు కురుక్షేత్రంలో ఒకే చోట ఉన్నారు. ఒకే సన్నివేశాన్ని వీక్షిస్తున్నారు. ఒకే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అర్జునుని ముఖంలో విషాదం అలుముకొని ఉంది. అచ్యుతుని ముఖంలో ఆనందం తాండవిస్తూ ఉంది. ఏడుపుతో నరుడు. వేడుకతో నారాయణుడు.

ఏడ్చేవాడు జీవుడు, నవ్వేవాడు దేవుడు. ఏడ్చేవాడు అజ్ఞాని, నవ్వేవాడు జ్ఞాని. ఏడ్చేవాడు మానవుడు, నవ్వేవాడు మాధవుడు. ఏడ్చేవాడు రోగి, నవ్వేవాడు వైద్యుడు. వైద్యుడు నారాయణుడే అనేది లోకోక్తి. అర్జునుని పుణ్యఫలంగా, నారాయణుడే వైద్యుడిగా వచ్చి పార్థుని భవరోగాన్ని రూపుమాపిన అపూర్వ అద్భుత సన్నివేశ మది. భేషజము, భిషక్ రెండూ తానే అయిన జగద్గురువు భవరోగ చికిత్సను నవ్వుతూ ఆరంభించాడు.

నాణ్యమైన నవ్వు నాల్గు విధాలు

(1) అర్జునుడు శ్రీకృష్ణునికి శరణాగతు డయ్యాడు. శ్రేయస్సును నిశ్చయించి చెప్పమన్నాడు. చెయ్యడానికి శిష్యుడుగా తాను సిద్ధమన్నాడు. శాసించి మరీ చెప్పమన్నాడు (***శాధి మాం***). కానీ, శ్రీకృష్ణుడు గురువుగా ఏమి చెబుతాడో వినకుండానే నేను యుద్ధం చెయ్యను (***న యోత్స్యే***) అనేశాడు. ఒక వైపు చెప్పమంటాడు, మరో వైపు చెయ్యనంటాడు. ఈ విరుద్ధ భాషణం వాసుదేవునికి నవ్వు తెప్పించిందేమో!

(2) ఉభయసేనల మధ్య చేరి విలపిస్తున్నాడు విజయుడు (***సేనయో రుభయో ర్మధ్యే విషీదన్తం***). ఏడవడం తప్పు కాదు. ఎవరి స్వేచ్ఛ వారిది. ఎవరు ఎలాగైనా ఏడ్చుకోవచ్చు ఈ ప్రపంచంలో. కాకపోతే, ఆ ఏడ్చే దేదో యుద్ధానికి రాక ముందే ఇంట్లో ఏడిస్తే బాగుండేది కదా! ఉభయసేనల మధ్య ఏడవడ మెందుకు? అదేమన్నా పది మంది చూచి ఆనందించ దగిన అద్భుతమైన వినోద ప్రదర్శనమా? అని నవ్వుకుంటున్నా డేమో!

(3) ఈ మాత్రం ఏడ్చే కార్యక్రమానికి నీవు ఒక్కడివే వచ్చి ఉంటే సరిపోయేది కదా! బండి తోలమని నన్నెందుకు పిలిచావు? నువ్వేదో విరగ దీస్తావని, అరగ దీస్తావని నేనొస్తే, నువ్వేమో రథం వెనుక అరుగు మీద కూర్చొని తీరిగ్గా ఏడుస్తావా? ఇక నేనెందుకు వచ్చినట్లు? ఏడిస్తే అర్జునుడు ఎలా ఉంటాడో చూడటానికి వచ్చానా? లేక నేను పని లేనివాళ్లే అని భావించి పని కల్పించావా? అని నవ్వాడేమో!

(4) అర్జునా! నీ ఏడుపు ఏదైనా గానీ. అందరి ఏడుపులను రూపుమాపే వేడుకను ఆవిష్కరించే మంగళ గడియలు అరుదెంచాయి అనే ఆనందంలో మాధవుడు మందహాసం చిందించాడేమో!

మువ్వలవాడు నవ్వాడు. ముజ్జగాలను నవ్వించే ప్రయత్నంలో చిదానంద స్వరూపుడు చిద్విలాసంతో చిరునవ్వులు చిందించాడు. ఏడుపుకు వీడుకోలు పలక మన్నాడు. ఆ మార్గం లోనే వేడుకోలు వినిపిస్తూ గీతా భవనం లోకి ప్రవేశిద్దాం!

పల్లవి : **మువ్వల గోపాల**
చిరునవ్వుల గోపాల
అనుపల్లవి : **ఏటికి మాటను - గాలికి పాటను**
ఓర్పుతో నేర్పిన భక్త మందార! ॥ మువ్వల గోపాల ॥
చరణము : **విజయుని రథమును కదిపి నడిపి**
రాతను తుడిపే గీతను తెలిపిన
నంద గోపాలా!
ఆనంద గోపాలా! ॥ మువ్వల గోపాల ॥

అని ఊహాలలో ఊరేగింది చైతన్య గీతిక.

ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీ భగవానువాచ :

అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః ॥ 11

అశోచ్యాన్-అన్వశోచః-త్వం-ప్రజ్ఞావాదాన్-చ-భాషసే
గతాసూన్-అగతాసూన్-చ-న-అనుశోచంతి-పండితాః

త్వం	= నీవు	పండితాః	= పండితులు
అశోచ్యాన్	= శోకింప దగని వారిని గూర్చి	గతాసూన్	= మరణించిన వారిని గూర్చి గాని
అన్వశోచః	= దుఃఖిస్తున్నావు	అగతాసూన్ చ	= బ్రతికియున్న వారిని గూర్చి గాని
ప్రజ్ఞా వాదాన్ చ	= పండిత వచనములను కూడా	న అనుశోచంతి	= దుఃఖించరు.
భాషసే	= పలుకు తున్నావు		

శ్రీ భగవానుడు బోధిస్తున్నాడు :

అర్జునా! ఏడవ కూడని వాళ్ళ కోసం ఏడుస్తున్నావు. పండితుల వాక్యాలు పలుకు తున్నావు. పండితులు పోయిన వాళ్ళ కోసం విలపించరు. ఉన్నవాళ్ళ కోసం దుఃఖించరు.

వ్యాఖ్య

శోక మోహాలు

ధర్మం విషయంలో తన మనస్సు మోహంలో చిక్కుకున్న దని అర్జునుడే చెప్పాడు (**ధర్మ సమ్మూఢ చేతాః**). మోహం అంటే ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా చూడటం. ఇది అజ్ఞానం వల్ల సంభవిస్తుంది. అజ్ఞానం ఏదో కాదు. జ్ఞానం లేకపోవడమే అజ్ఞానం.

ఉన్నది ఉన్నట్లు తెలియడం జ్ఞానం. ఉన్నది ఉన్నట్లు తెలియక పోవడం అజ్ఞానం. అజ్ఞాన దశలో లేనిది ఉన్నట్లు తెలిసే ప్రమాదం ఉంది. ఆ ప్రమాదమే మోహము. జను లందరూ మోహవలయం లోనే పరిభ్రమిస్తూ ఉంటారు. వారిలో అర్జునుడు ఒకడు.

అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః

అజ్ఞానము జ్ఞానమును కప్పేసింది. అందుచేత జనులు మోహానికి గురి అవుతున్నారు. తాను ఏమిటో తనకు తెలియదు. ఇది అజ్ఞానము. అజ్ఞాని తాను కాని దానిని తాననుకొని మోహానికి లోనవుతూ ఉంటాడు. ఇది అందరికీ సంబంధించింది కనుక దీనిని సాధారణమోహం అంటారు. ఈ మోహంలో పడ్డవాడు తాను దేహమని భావిస్తూ ఉంటాడు. తన దేహము ఎవరితో సంబంధం కలిగి ఉందో, తాను వారికి సంబంధించిన వాడుగా ఉంటాడు. అలాగే వాళ్ళు తనకు సంబంధించిన వారుగా భావిస్తూ ఉంటాడు. దీనినే భ్రాంతి, లేదా మోహము అంటారు.

నేను వీళ్ళకు సంబంధించిన వాణ్ణి (***అహమ్ ఏషామ్***). అలాగే వీళ్ళు నాకు సంబంధించిన వాళ్ళు (**మమ ఏతే**). ఈ విధమైన మోహం వల్ల, తన వాళ్ళు చనిపోతారేమో, ఈ సంబంధాలు తెగిపోతాయేమో అనే భయం చేత మనిషికి దుఃఖం పొరలి వస్తుంది. అర్జునుడికి అదే జరిగింది. ఆ విషయం దాచుకోకుండా తానే చెప్పేశాడు కూడా. స్వజనులైన బంధువులను మేము చంపలేము. స్వజనుల్ని చంపుకొని సుఖ పడగలమా? *(1 వ అ - 37 వ శ్లో)* అని ప్రశ్నించాడు కూడా. అందుకే, భీష్మద్రోణాదుల్ని ఎలా చంపాలి? (***కథం భీష్మ మహం సంఖ్యే***) అని కృష్ణుణ్ణి నిలదీసి అడిగాడు.

దేహమే తాను అనే మోహం వల్ల కలిగినదే ఈ శోకము. ఇది అందరికీ ఉంది. కనుకనే దీనిని సాధారణ మోహం అన్నారు. ఇది కాకుండా, అర్జునునికి ప్రత్యేకంగా మరొక మోహం తాత్కాలికంగా వచ్చి తగులుకొంది. స్వధర్మమైన యుద్ధము అధర్మంగా కనిపించింది. ఇది అసాధారణ మోహం. ఈ రెండు మోహాలు కుదిపి వేయడం చేతనే కౌంతేయుడు కలత చెంది కన్నీళ్ళు పెట్టుకున్నాడు. అదే శోకం. మోహం వల్ల సంభవించింది. ఇవే శోకమోహాలు. సంసారానికి బీజాలు (***సంసార బీజ భూతౌ శోకమోహౌ***). తానెవరో, ఏమిటో తెలిస్తే గాని ఈ శోకమోహాల నుండి విడి పడటం జరగదు. సంసార సాగరము నుండి బయట పడటం సాధ్యం కాదు. దీనికి ఆత్మజ్ఞానమే ఏకైక మార్గము. మరొక ఉపాయమే లేదు కనుక ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించ డానికి భగవానుడు పూనుకున్నాడు. ***అశోచ్యాన్*** అంటూ అర్జునుణ్ణి ఆత్మజ్ఞాన మార్గం లోకి దించు తున్నాడు. (***తత్ర ఏవం ధర్మ సమ్మూఢ చేతసః మహతి శోక సాగరే నిమగ్నస్య అర్జునస్య అన్యత్ర ఆత్మజ్ఞానాత్ ఉద్ధరణమ్ అపశ్యన్ భగవాన్ వాసుదేవః తతః అర్జునమ్ ఉద్ధి ధారయిషుః ఆత్మజ్ఞానాయ అవతారయన్ ఆహ!***).

యుద్ధం విషయంలో కలిగిన అసాధారణ మోహాన్ని తొలగించడం శ్రీకృష్ణునికి పెద్ద సమస్యేమీ కాదు. ఒకవేళ దానిని తొలగించినా, అలాంటిదే మరొక అసాధారణ మోహం పునః ఏర్పడదు అని చెప్పలేము.

సాధారణ మోహం నిర్మూలించ బడితేనే అసాధారణ మోహాలు అదృశ్య మవుతాయి. కనుక, ఆత్మజ్ఞానోప దేశము అనివార్యమైంది.

శోకం ఎవరి కోసం?

ఉభయసేనల మధ్య దుఃఖిస్తున్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు చూశాడు. ఏడవకు అర్జునా! అని చెప్పలేదు. ఎందుకు ఏడుస్తున్నావు? అని అడగలేదు. ఏడుపు నీకు తగిన దేనా? అని అడుగుతున్నాడు. దుఃఖింప దగిన వాళ్ళ కోసమే దుఃఖిస్తున్నావా? అని ప్రశ్నిస్తున్నాడు. దుఃఖానికి కారణం ఉందా? అని సూటిగా నిలదీస్తున్నాడు.

శోచ్యాః అంటే శోచ్యులు. శోచ్యులు అంటే దుఃఖింప దగిన వారు. అలాగే దుఃఖింప దగని వారు కూడా ఉంటారు. వాళ్ళు ***అశోచ్యాః*** అంటే, అశోచ్యులు ***(న శోచ్యాః అశోచ్యాః).*** ఈ ప్రపంచంలో ఏవేవో నష్టాలు వాటిల్లుతూ ఉంటాయి. వాటన్నిటికీ మనం దుఃఖించము. అవి మనకు సంబంధించినవి అయితే మాత్రం తప్పక బాధ పడతాము. ఈ విధంగా బాధపడ దగినవి, బాధపడ దగనివి అని రెండు విధాల బాధలు ఈ ప్రపంచంలో తెలుస్తున్నాయి.

'చనిపోయాడండీ' అని ఎవరైనా కేక వేస్తే, అది విన్న వెంటనే మనం ఏడుస్తామా? 'ఎవరండి చని పోయింది?' అని ప్రశ్నిస్తాము. ఆ చనిపోయిన వ్యక్తి ఎవరో అయితే, 'కారణ మేమిటట?' అని అడుగుతాము. అదే ఆ చనిపోయిన వ్యక్తి మనకు సంబంధించిన వాడు అయితే కారణం తెలియకుండానే ఏడుస్తాము. ఇది తగిన దేనా? అని భగవానుడు ప్రశ్నిస్తున్నాడు.

దుఃఖించకు అని శ్రీకృష్ణుడు చెప్పడం లేదు. దుఃఖించడానికి కారణం ఉందా? అని అడుగు తున్నాడు. ఏడవకు అని చెప్పినంత మాత్రాన మనుషులు ఏడవకుండా ఉంటారా? ఎప్పటి నుండో ఏడుస్తున్నారు. ఇప్పుడు వద్దంటే ఆపుతారా? ఎవరి ఏడుపు వాళ్ళు ఏడ్చుకోవచ్చు. కాకపోతే, ఏడవ టానికి కారణం కనిపించడం లేదు అంటున్నాడు గీతాచార్యుడు.

తగని వారి కొరకు తాపమా?

అర్జునా! దుఃఖింప దగని వాళ్ళ కొరకు ***(అశోచ్యాన్)*** దుఃఖిస్తున్నావు అంటూ శ్రీకృష్ణుడు గీతాబోధను ఆరంభించాడు. భీష్మాదుల కొరకు అర్జునుడు విలపిస్తున్నాడు. భీష్మద్రోణులు కూడా దుఃఖింప దగినవారు కారు. శోచ్యులు కారు. అశోచ్యులు అనేది అచ్యుతుని అభిమతం.

ఒక వ్యక్తిని గూర్చి దుఃఖించాలి అంటే ప్రముఖంగా రెండే కారణాలు ఉండాలి. ఒకటి, అతడు దురాచార వంతుడై ఉండాలి. లేదా, నశిస్తూ అయినా ఉండాలి. భీష్మద్రోణాదులలో ఈ రెండు కారణాలూ కనిపించవు.

భీష్మద్రోణులు సదాచారవంతులు. సత్ప్రవర్తన కలవారు. సజ్జనులు ***(భీష్మద్రోణాదయః సద్వృత్తత్వాత్).*** వారు మహానుభావులని అర్జునుడే అన్నాడు కదా! అలాంటి వారి ప్రవర్తనలో దుఃఖానికి అవకాశం లేదు.

ఇకపోతే, రెండవది. వాళ్ళు నశిస్తారు అని దుఃఖించాలి. ఇది వాస్తవమా? నశించే దెవరు? దేహాలు నశిస్తాయి. మానవదేహం సామాన్య మైనది కాదు. అది ధర్మసాధనము. అందుకే అది దుర్లభము. దుర్లభమే అయినా దూరం కాకుండా ఉండ లేదు.

దుర్లభో మానుషో దేహో దేహినాం క్షణభంగురః

మానవదేహము దుర్లభమే అయినా అది క్షణభంగురము. క్షణంలో పతనమై పారి పోతుంది. ఎవరి

దేహమైనా నిలవదు. అలాగే భీష్మద్రోణుల దేహాలు కూడా నిలవవు. అలాంటప్పుడు వారి దేహాల విషయంలో దుఃఖము తగిన దేనా?

అదలా ఉంచితే, దేహాలు ఉండటానికి ఆధార మైనది ఆత్మ. ఆత్మకు చావు లేదు. అది నిత్య మైనది. ఇంతకీ భీష్ముడు దేహమా? ఆత్మా? మనము దుఃఖించేది దేహం కోసమా? ఆత్మ కోసమా? దేహము ఎలాగూ నశించేదే కనుక దానిని గూర్చి దుఃఖించ నవసరం లేదు. ఆత్మ నశించేది కాదు కనుక ఆత్మను గూర్చి శోకించ పనిలేదు. ఇక ఎవరి కోసం ఈ దుఃఖం?

భీష్మద్రోణాదులు సత్ప్రవర్తన కలవారు కనుక దుఃఖింప దగినవారు కారు ***(అశోచ్యాః).*** వాస్తవానికి వారు ఆత్మ స్వరూపులే కనుక శోకింప దగిన వారు కారు ***(అశోచ్యాః నిత్యత్వాత్).*** ఇక వాళ్ళు ఎలాగూ దేహాలు కారు కనుక అవి నశిస్తా యని దుఃఖింప నవసరం లేదు. ఇక దుఃఖ మేమిటి? ఎవరి కోసం? దుఃఖింప దగని వాళ్ళ కోసం దుఃఖిస్తున్నాడు అర్జునుడు. అర్జునుడే కాదు. అందరూ అలాగే దుఃఖిస్తున్నారు. దేహాలే ఆత్మ యని భావించి ఆవేదన చెందుతున్నారు. ఈ వాస్తవం అర్థమైతే ఎవరూ, ఎవరి కొరకు దుఃఖింప నవసరం లేదు.

బాధపడి బావుకొనే దేమిటి?

ఈ ప్రపంచంలో మనం బ్రతక డానికి ఉన్నామా? బాధ పడటానికి ఉన్నామా? ఉన్న మనం ఎంత కాలం ఉంటాము? ఎవ్వరైనా అంతేకదా? చూచేందుకు కళ్ళున్నాయి. వాలేందుకు రెప్ప లున్నాయి. రెప్పలు వాలితే కళ్ళు మూస్తాము. రెప్పలు లేస్తే కళ్ళు తెరిచి చూస్తాము. ఇంతవరకు ఎన్నిసార్లు కళ్ళు తెరిచాము? ఎన్నిసార్లు కళ్ళు మూశాము? రెప్పపాటు ఆగకుండా జరుగుతూనే ఉంది. ఒకనాడు ఏదో ఒక్క రెప్పపాటుతో ఆ ఆట కాస్తా ఆగి పోతుంది. అదే చివరి రెప్పపాటు. అదే చావు.

ఇంతకీ, చివరి రెప్పపాటు ఏదో ఎవరికి తెలుసు? తెలియనంత మాత్రాన చావు నుండి ఎవరు తప్పించు కుంటారు? ఏ రెప్పపాటు చివరిదో తెలియదు. అందుకే జీవితం రెప్పపాటు అంటారు. వాలేది రెప్ప. మునిగేది తెప్ప. అర్థమైతే, ముప్పుతిప్ప లెక్కడుంటాయి? ఎవరు ఏడవాలి? ఎవరి కొరకు ఏడవాలి? పోయిన వాళ్ళ కొరకు ఏడవాలి. ఎవరు ఏడవాలి? ఉన్నవాళ్ళే ఏడవాలి. మరి, ఉన్నవాళ్ళు పోకుండా ఉంటారా? అందరూ పోయేవాళ్ళే అయి నపుడు ఏడ్చి సాధించే దేముంటుంది? మనం కూడా పోయే వాళ్ళమే కనుక ఇతరుల కోసం ఏడవడం కన్నా, మన కోసమే మనం ఏడ్చుకుంటే మంచిది కదా! అలాంటప్పుడు ఎంతకాలం ఏడవాలి? పోయే వరకు ఏడుస్తూనే ఉండాలి. ఇక బ్రతుకంతా ఇలా ఏడుపు తోనే సరిపెట్టుకొంటే, బ్రతుకులో వేడుక ఎప్పుడు? పోయిన తరువాతేనా? పోయిన తరువాత వేడుక ఉంటే ఉండొచ్చు. ఊరేగింపు సాగవచ్చు. దానిని చూడటానికి మన మెక్కడ ఉంటాం? మనం లేకుండా జరిగే మన చివరి ఉత్సవమే కదా చావు. మనం వినకుండా మన ప్రక్కన నడిచేదే కదా చావు మేళం. ఎందుకొచ్చిన బాధ? చావు బాధ.

చావు తెలిసే దెవరికి? తెలియని దెప్పుడు?

ఎవరు ఎప్పుడు చస్తారో ఎవరికి తెలుసు? తెలిస్తే, ఆ ఏడ్చేది ఏదో ముందే ఏడవ వచ్చు. చచ్చిన వాడు ఏడవ లేడు. ఏడ్చేవాడు చావకుండా ఉండలేడు. అయినా, ఎప్పుడొస్తుంది చావు? ఏమో, ఎవరికి తెలుసు! ఎందుకు తెలియదు? చావు రాని దెప్పుడు? లేని దెప్పుడు? దానిని తెలుసు కోవాలి. అంతే. తెలియనంత మాత్రాన ఉన్నది లేకుండా పోతుందా?

చావు అంటే ఏమిటి? చచ్చే దెవరు? ఉన్నది పోవడమే మృత్యువా? నశించడమే మృత్యువా? నశింపు

ఏమిటి? మార్పే కదా! అలా చూచి నపుడు మనం ఎప్పుడు మరణిస్తున్నాము? ఎప్పుడూ మరణిస్తూనే ఉన్నాము.

దేహం రాలి పోవడమే మరణమా? అదే నిజమైతే, దేహము ఒకేసారి రాలిపోతుందా? వెంట్రుకలు రాలుతూ ఉంటాయి. పళ్ళు రాలుతూ ఉంటాయి. చూపు తగ్గి కళ్ళు వాలుతూ ఉంటాయి. మన్నును మూజూడాలని వెన్నుపాము వంగుతూ ఉంటుంది. ఇవన్నీ జరిగి నపుడు దుఃఖించని మనం చావుకే ఎందుకు భయపడుతున్నాం? మరణం విషయం లోనే ఎందుకు దుఃఖిస్తున్నాం? గడియారంలో క్షణాల ముల్లు తిరిగి నపుడు పట్టించుకోని మనం గంటల ముల్లు తిరిగి నపుడే ఎందుకు పట్టించు కుంటున్నాం? ఇది జరగ కుండానే అది జరుగుతుందా?

దేహంలో ఉన్నవి, దేహంగా ఉన్నవి ఒకొక్కటి పోతున్నా పెద్దగా రోదించని మనం, మరణానికే ఎందుకు దారుణంగా విలపిస్తున్నాము? ఎందుకో తెలుసా? మరణం తరువాత మనిషి రూపం ఉండదు కనుక. కళ్ళు దేహానివే అయినా, కళ్ళు పోయినా దేహం ఉంటుంది. పళ్ళు దేహానివే అయినా, పళ్ళు రాలినా దేహం ఉంటుంది. కాని దేహం రాలితే, ఆ తరువాత ఏదీ ఉండదు. అందుకే మరణబాధ దారుణంగా ఉంటుంది.

విలాపానికి ఫలం నిష్ఫలం

కర్మ అంటూ జరిగితే ఫలితం ఉండాలి. ఫలితం లేని కార్యం ఉండదు. అలాగే కారణం లేని కార్యమూ ఉండదు. కాని, మరణ బాధకు ఏ ఫలమూ ఉండదు. కారణమూ ఉండదు.

ఏడుపు కార్యమే కదా! మరి దానికి కారణ మేమిటి? చావే. అయితే చావ కూడనిది చచ్చిందా? చావ దగిందే చచ్చిందా? చావకూడనిది ఎలా చస్తుంది? చావ దగిందే చచ్చింది. మరి, చావ దగిందే సహజంగా చచ్చే టప్పుడు అసహజంగా ఏడవటానికి కారణం ఎక్కడుంది? హేతు వేమిటి?

ఇంత తొందరగా పోతాడని అనుకోలేదు. ఇంకా కొంత కాలం ఉంటాడని అనుకున్నాను. అందుకే ఏడుస్తున్నాను. అదే నా ఏడుపుకు కారణం అంటావా?

నిన్ను అలా అనుకోమన్నది ఎవరు? నీవే అనుకున్నావు. నీవు అనుకున్నట్లు జరగ లేదు. అలాంటప్పుడు అలా ఊహించి నందుకు ఏడవాలి గాని చచ్చి నందుకు ఏడవడం దేనికి?

సరే ఏడవ టానికి సరియైన కారణం దొరకటం లేదు. అదలా ఉంచుదాము. పోనీ ఏడ్చినందుకు ఫలం ఉంటుందా? ఉండదు. అందుకే కదా, కొందరే ఏడుస్తున్నారు. అయిన వాళ్ళే ఏడుస్తున్నారు. ఏడుపుకు ఫలితం ఉండేటట్లయితే, అయిన వాళ్ళే కాదు, కాని వారు కూడా అయిన వారి కన్నా ఎక్కువగా ఏడ్చి ఉండేవారు. వాళ్ళు వీళ్ళు ఏమిటి? అందరూ అదే పనిగా ఏడుస్తూనే ఉండేవారు.

ఇంటి ముందు నిలబడి మనం పిలిస్తే, ఇంటిలో ఉన్న మనిషి 'వస్తున్నానండీ' అని మారు పలుకుతాడు. అతడు అలా మారు పలకక పోయినా, వస్తాడనే ఆశతో మనం ఎదురు చూస్తాం.

మరణించిన వాని కోసం మనం పెద్దగా రోదిస్తే, అతడు మారు పలుకుతాడా? తిరిగి వస్తాడా? దుఃఖం మరణించిన వానిని బ్రతికిస్తుందా? అదేమన్నా అమృతమా? అలాంటపుడు ఏడ్చి ప్రయోజన మేమిటి?

మన ఏడుపు ఏగిన వానికి వినిపిస్తుందా? అంత పెద్దగా ఏడ్వగలమా? చనిపోయిన తరువాత రోజు రోజుకు ధ్వని ఎంతగా తగ్గిపోతూ ఉంటుందో మనకు తెలియదా? మనం రోదించినా ఫలితం లేనపుడు దుఃఖించడ మెందుకు?

మరణించిన వానికి మన ఏడుపు వినిపించదు. బ్రతికి ఉన్న వాళ్ళేమో ఏడుపును వేడుకగా వినలేరు. చావు వస్తే ఎవ్వరూ నిలవరు. చావు రానపుడు పొమ్మన్నా ఎవ్వరూ పోలేరు. పోయిన వాళ్ళు పోయారని, ఉన్నవాళ్ళు పోతారని ఏడవ టానికి ఏడ్చేవాడు మాత్రం పోకుండా ఉంటాడా?

ఆఖ్యాయిక

పూర్వము ఒక దోషికి మరణదండన విధించారు రాజుగారు. మరణశిక్షను అమలు చేయ వలసిన రోజు రానే వచ్చింది. దోషిని ఉరికంబం వద్దకు తీసికొని వచ్చారు. కొంతసేపట్లో ఉరి తీయబోతారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రాజుగారు, 'నీ చివరి కోరిక ఏమిటో చెప్పు' అని అడిగారు.

ఏదైనా తినాలని ఉంటే తినిపిస్తారు. మరెవరి నైనా చూడాలని ఉంటే చూపిస్తారు. మరణశిక్ష అమలులో అదొక సంప్రదాయము. మరణశిక్షను అనుభవించ బోయే దోషి రాజు వైపు చూచి, నవ్వుతూ ఒక శ్లోకం చెప్పాడు.

భట్టి ర్నష్టో భారవిశ్చాపి నష్టః
భిక్షుర్నష్టో భీమసేనోఽపి నష్టః
భుక్కుండోఽహం భూపతి స్త్వంబతాసి
భ భీ భు భూ ష్వంతక స్సన్నివిష్టః ॥

మహాప్రభో! విక్రమార్కుని కాలంలో భట్టి ఉన్నాడు. మీకు తెలుసనే అనుకుంటాను. అతడు ఇప్పుడు లేడు. చచ్చిపోయాడు (*భ - నష్టః*). భారవి అనే కవి ఉండేవాడు కదా! అతడూ మరణించాడు (*భా*). భిక్షువు ఉండేవాడు. అతడూ పోయాడు (*భి*). అర్జునుని అన్నగారు భీమసేనుడు వెయ్యి ఏనుగుల బలం కలవాడని ప్రతీతి. ఆయన కూడా పోయాడు (*భీ*). నన్ను భుక్కుడు అంటారు (*భు*). ఇక కొన్ని నిముషాల్లో బయలుదేరు తున్నాను. మంత్రులు, కవులు, బిచ్చగాళ్ళు, మల్లయోధులు అందరూ పోయారు. దోషిని నేనూ పోతున్నాను.

ఇంత వరకు చూసిన దానిని బట్టి యమధర్మరాజు (*అంతకః*) అక్షర పంక్తిలో భ, భా, భి, భీ అంటూ 'భ' గుణింతములో ప్రవేశించినట్లు తెలుస్తూ ఉంది. ఇప్పుడు 'భు' (భుక్కుడు) అంటూ నా వద్దకు వచ్చారు. 'భు' తరువాత అక్షరము 'భూ' అని చమకు తెలియనిది కాదు. నా పని పూర్తి కాగానే నేరుగా సమవర్తి తమ వద్దకే (**భూపతిః**) వచ్చేట ట్లున్నాడు. కాస్త అవధానంతో ఉంటారని చెబుతున్నా. అంతే. ఇక, నన్ను ఉరి తీసేయండి అన్నాడు దోషి.

రాజు గారు లేచి, 'ఆపండి! అతణ్ణి ఉరి తీయకండి. తరువాత చెబుతాను' అంటూ అంతఃపురానికి వెళ్ళాడు. ఏం చెబుతాడు? చెప్పేందు కేముంది? ఆంతర్యంలో అలజడి మొదలై ఉంటుంది. ఎవరు ఉంటారు? పోకుండా ఎవరు ఉంటారు? కలకాలం ఉంటామని భావిస్తారు. ఎంతకాలం ఉంటారు? అల్ప కాలమే. స్వల్ప కాలమే. అదే కల-కాలం. కలగన్నంత సేపు ఉండే కాలం. నేనే ఉండ నప్పుడు వాళ్ళే పంపించడ మెందుకు? అని ప్రభువు ఆలోచనలో పడి ఉంటాడు.

శోచ్యులు - అశోచ్యులు - పండితులు

ఎవరి కోసం దుఃఖించాలి? దుఃఖింప దగిన వాళ్ళు ఎవరు? శోచ్యు లెవరు? ఎవ్వరూ లేరు. అందరూ అశోచ్యులే. దుఃఖింప దగని వారే. ఈ విషయం చక్కగా తెలిసిన వాళ్ళు పండితులు. వారి దృష్టిలో అందరూ అశోచ్యులే. చావు సహజం.

అర్జునుని పరిస్థితే కాస్త తికమకగా ఉంది. యుద్ధం వల్ల సంభవించే ఉపద్రవా లన్నిటినీ ఏకరువు పెడుతూ అర్జునుడు అనర్గళంగా ధర్మోపన్యాసం చేసేశాడు. ఒక అధ్యాయ మంతా మాట్లాడినా సరిపోలేదు. రెండవ అధ్యాయంలో కూడా ఐదు శ్లోకాలను ఆక్రమించాడు.

అర్జునుని మాటలేమో పండిత వచనా ల్లాగా ఉన్నాయి. ప్రవర్తన చూస్తే దుఃఖింప దగని వారి కోసం పామరుని వలె ఏడుస్తున్నాడు. పలుకుల్ని బట్టి పండితుడని భావించాలో, రోదన విని పామరుడని నిర్ణయించాలో అర్థం కావడం లేదు. ఇంతకీ, పండితు డంటే ఎవరో చెబితే సరిపో తుందని భావించాడేమో 'పండిత' పదానికి నిర్వచనం వినిపించాడు వాసుదేవుడు.

గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః

అర్జునా! చచ్చిన వాళ్ళను గూర్చి ***(గతాసూన్)***, బ్రతికిన వాళ్ళను గూర్చి ***(అగతాసూన్)***, పండితులు ***(పండితాః)*** దుఃఖించరు ***(న అనుశోచన్తి)*** అన్నాడు శ్రీకృష్ణుడు.

'పండా' అంటే ఆత్మకు సంబంధించిన జ్ఞానం. 'పండా' ఎవరికి ఉంటుందో వారే పండితులు ***(పండా ఆత్మవిషయా బుద్ధిః యేషాం తే హి పండితాః ఆత్మజ్ఞాః)***. ఆత్మజ్ఞులు. ఆత్మను తెలిసిన వారు.

దుఃఖం తెలియనిది పాండిత్యం

పార్థుని పలుకుల్లో పాండిత్య ప్రకర్ష ముంది. ప్రవర్తనలో పామరత్వం గోచరిస్తూ ఉంది. ఆత్మజ్ఞానము కలవారు పండితులు. ***పాండిత్యం నిర్విద్య*** అనే బృహదారణ్యక శ్రుతి ఆత్మజ్ఞానము కలవారే పండితులని నిర్ణయించింది. పారమార్థిక దృష్టితో చూచి నపుడు అందరూ ఆత్మస్వరూపులే. ఆత్మ నిత్యము కనుక అశోచ్యులే. దుఃఖింప దగని వారే. అలాంటి వారి విషయములో దుఃఖిస్తూ ఉన్నాడు కనుక అర్జునుడు పండితుడు కాడు. ఆత్మవిదుడు కాడు. అజ్ఞానము లోనే ఉన్నాడు అని నిర్ణయించాలి ***(పరమార్థతః నిత్యాన్ అశోచ్యాన్ అనుశోచసి, అతః మూఢః అసి ఇత్యభిప్రాయః)***.

అర్జునా! దుఃఖించకు అని శ్రీకృష్ణుడు ఎందుకు చెప్పలేదో ఇక్కడ అర్థమైంది అనుకుంటాను. దుఃఖించ వద్దని కృష్ణుడు చెప్పినంత మాత్రాన అర్జునుడు దుఃఖించకుండా ఉండ లేడు. అర్జునుడు దుఃఖాన్ని మానాలి అంటే అతడు పండితుడు కావాలి. ఆత్మజ్ఞుడు కావాలి. ఆత్మ ఏమిటో, అనాత్మ ఏమిటో తెలియాలి. చావు ఏమిటో, చచ్చే దెవరో అర్థం కావాలి. అందుకే, ***అశోచ్యాన్*** అంటూ ఆత్మజ్ఞానాన్ని బోధిస్తూ గీతోపదేశాన్ని ప్రారంభించాడు గోవిందుడు.

ఆత్మ పుట్టింది కాదు. కనుక చావదు. చావు లేని దాని విషయంలో దుఃఖం ఉండదు. ఆత్మ కానిది అనాత్మ. దానికి నిత్యత్వము లేదు. ఆత్మ నిత్యము కనుక ఆత్మ కొరకు దుఃఖింప నవసరం లేదు. అనాత్మ నిత్యము కాదు కనుక దాని కొరకు కూడా దుఃఖింప నవసరం లేదు. ఈ విధమైన ఆత్మానాత్మ వివేకం గల పండితులు దేని కొరకూ దుఃఖించరు. వివేకం లోపించిన కారణంగా పార్థుడు విషణ్ణు డయ్యాడు.

ఉన్నా పోయినా ఒక్కటే

మరణించిన వారిని గూర్చి పండితులు దుఃఖించరు. గతించిన వారు అంటే ప్రాణాలు పోయిన వారు ***(గతాసూన్, గత ప్రాణాన్, మృతాన్)***. జీవించి యున్న వారిని గూర్చి కూడా పండితులు విలపించరు. జీవించి యున్నవారు అంటే, ప్రాణాలు పోని వారు అని అర్థము ***(అగతాసూన్, అగత ప్రాణాన్ జీవతః)***. ప్రాణాలు వస్తాయి కనుక అవి పోతాయి. ఇది అనివార్యమైన విషయం. దుఃఖానికి ఆస్కారం లేని విషయం. ఆత్మ రాలేదు

కనుక పోదు. పోని, పోలేని ఆత్మ విషయంలో దుఃఖానికి అవకాశమే లేదు కనుక, ఈ జ్ఞానము గల పండితులు దుఃఖించరు. అంటే, చావు విషయంలో దుఃఖించే వారు పండితులు కారు అనేది సుస్పష్టం.

ఉన్నది పోయేందుకే కనుక చస్తే ఏడవ వద్దు. ఏడ్చినంత మాత్రాన పోయింది తిరిగి రాదు కనుక ఏడ్చి చచ్చేదీ వద్దు. బ్రతికున్న వాళ్ళు చావాలి అనుకోరు. బ్రతకాలనే అనుకుంటారు. వారి ఆశాదీపం కూడా కొడి గట్టే లాగా వారి ముందు పని గట్టుకొని ఏడ్చి చంపొద్దు. అందర్ని వదలి మనం పోతామేమో అని చచ్చే వరకు ఏడుస్తూ కూర్చోవద్దు. చావు ఎవరి కైనా సహజం. చచ్చేది ఆగదు. చావనిది సాగదు.

దేహాలు అనిత్యాలు. నేడు ఉండినా రేపు లేకుండా పోయేవే. ఉన్నప్పుడు కూడా, 'ఒక్కనాటికి - వల్లకాటికి' అనే జపం చేస్తూనే ఉంటాయి. ఆత్మ నిత్యము. అనంతము. అది ఉన్నదే. పోనిదే. ఈ విధమైన జ్ఞానంతో పండితులు శోకాన్ని దాటుతారు ***(తరతి శోకం ఆత్మవిత్*** - ఛాందోగ్యశ్రుతి ***)***.

పల్లవి: **జ్ఞానమె నీ నావ - ధన్యము నీ త్రోవ**
సంసార జలధిలో మేలైన నావ ॥ జ్ఞానమె ॥

చరణములు

1. **ఎక్కడి కేగినా - ఎంతగా తిరిగినా**
నావ తీరానికి - కాయము కాటికి ఖాయము ॥ జ్ఞానమె ॥
2. **లేనిది కాదులే - క్రొత్తగా రాదులే**
ఉన్నదే తెలియాలి - జ్ఞానమే దీపమై వెలగాలి ॥ జ్ఞానమె ॥

ఊడే వాటికి, వాడే వాటికి వగచ కుండా, వీడని, విడిపోని విశుద్ధాత్మగా విహరిస్తూ సాగిపొమ్మంది చైతన్యగీతిక.

ఓం ప్రథమం - అద్భుత బీజం

అశోచ్యా నన్వ శోచస్త్వం అనే ఈ శ్లోకంతో గీతోపదేశాన్ని ప్రారంభించాడు గోవిందుడు. జగద్గురువులు శ్రీ శంకర భగవత్పాదులు తమ భాష్యాన్ని ఈ శ్లోకం నుండే ప్రారంభించారు.

గీతోపదేశ మనే మహావృక్షానికి ***అశోచ్యా నన్వ శోచస్త్వం*** అనే ఈ శ్లోకాన్ని బీజశ్లోకంగా చెప్పుకుంటాము. వృక్షము యొక్క వైభవ మంతా బీజం లోనే నిక్షిప్తమై ఉన్నట్లు, గీతోపదేశ మంతా ఈ శ్లోకంలో బీజ రూపంలో ఉంది. ***అశోచ్యాన్*** అంటూ రెండవ అధ్యాయంలో బోధను ప్రారంభించిన గోవిందుడు **మా శుచః** అంటూ పద్దెనిమిదవ అధ్యాయంలో గీతను సమాప్తం చేస్తాడు. దుఃఖానికి కారణం లేదు అంటూ ప్రారంభించాడు. అది ఋజువు కావాలి. గీతోపదేశంలో ఆత్మజ్ఞానాన్ని అందించి ఈ పరమ సత్యాన్ని ఋజువు చేశాడు శ్రీకృష్ణుడు. దుఃఖానికి హేతువే లేదనే వాస్తవం తెలిసి పోయింది కనుక, ఇక దుఃఖించకు ***(మా శుచః)*** అంటూ గీతోపదేశాన్ని ముగించాడు.

దుఃఖమగ్ను డైన అర్జునుని దుఃఖ నివృత్తికి, ఆనందప్రాప్తికి గీత బోధించ బడింది. దుఃఖం అసంగత మంటూ ఆరంభించి, దుఃఖించకు అంటూ శక్తివంతంగా సమాప్తి చేసి, బోధ యొక్క ఫలితాన్ని గీతాచార్యుడు సుస్పష్టం చేశాడు. కనుకనే గీతాపారాయణ విధానంలో అంగన్యాస కరన్యాసాలు చెబుతూ ఈ శ్లోకము యొక్క ప్రథమ పాదాన్ని బీజంగా చెప్పుకుంటాం.

'అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే' ఇతి బీజం
'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' ఇతి శక్తిః

'అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః' ఇతి కీలకమ్

దుఃఖింప దగింది లేదు అనేది గీతోపదేశానికి బీజం. సర్వమును పరిత్యజించి ఉన్న ఒకే పరమాత్మను ఆశ్రయించడం శక్తి. సర్వ పాపాల నుండి విడిపడి మోక్షాన్ని పొంది దుఃఖానికి దూరం కావడం కీలకం. అందు చేతనే ***అశోచ్యాన్*** అంటూ ప్రారంభించి, **మా శుచః** అంటూ సమాప్తి చేశాడు. ఆద్యంతాల లోనే దుఃఖ ప్రసక్తి వచ్చింది. మధ్యలో దుఃఖ నివారణోపాయానికి బోధ జరగ లేదు అనే అభియోగానికి అవకాశ మివ్వకుండా ***నత్వం శోచితు మర్హసి*** - దుఃఖింప పని లేదు అని మధ్యలో కూడా తెలుపుతూనే బోధించాడు శ్రీకృష్ణుడు.

అకర్మ అమంగళమా?

గీత మోక్ష ప్రదాయక మైన గ్రంథము. ఆత్మజ్ఞానమే కేంద్ర విషయంగా శోభిస్తున్న గ్రంథము. జ్ఞానార్హతకు ప్రవృత్తి ప్రధానం కనుక ప్రవృత్తిని గూర్చి గీత ప్రముఖంగా ప్రవచించిందే గాని, వాస్తవానికి నివృత్తి లోనే గీత నిలిచి ఉంటుంది. గీత నివృత్త్యాత్మక గ్రంథము. ఈ ప్రత్యేకత ప్రారంభ శ్లోకం లోనే ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

ఏ శాస్త్రమైనా చెయ్య వలసింది ఉంది అని చెబుతూ ప్రారంభ మవుతుంది. గీత అలా కాకుండా చెయ్య కూడనిది చేస్తున్నావు ***(అశోచ్యా నన్వ శోచస్త్వం)*** అంటూ ప్రారంభ మైంది. నివృత్తికి ఇక్కడే అద్దం పడుతోంది భగవద్గీత.

చెయ్య కూడనిది చేస్తున్నావు అంటూ నిషేధ రూపంలో గీతోపదేశం ప్రారంభం కావడం మంగళకరంగా లేదని కొందరి అభిప్రాయం. మంగళం విషయానికి వస్తే, ఇప్పటికే మహాభారతంలో మంగళ ప్రస్తావన ఎంతగానో జరిగింది. మంగళాచరణం చేసి వ్యాసభగవానుడు భారతాన్ని ప్రారంభించాడు. గీతకు ***ధర్మక్షేత్రే కురుక్షేత్రే*** అనే ప్రథమ శ్లోకంలో మంగళాచరణం ఎలా జరిగిందో ఈ గ్రంథంలో మనమే చూశాం. ప్రస్తుతం గీత - రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకంలో మనం ఉన్నాం. ఇక్కడ మళ్ళీ మంగళం అవసరమా?

గీతోపదేశాన్ని గోవిందుడు ఈ శ్లోకం నుండి ప్రారంభించాడు అని అంటున్నారు కనుక మంగళం ఉంటే బాగుంటుంది కదా! మంగళం లేకపోయినా సరిపెట్టు కోవచ్చు. కాని, కర్మ రాహిత్యంతో గీతాచార్యుడు ఉపదేశాన్ని ప్రారంభించడం మంగళకరంగా ఉందా? అనే సంశయాన్ని కొందరు దాచుకో వచ్చు. దానిని కూడా దూరం చేసుకుందాం.

మనిషికి తృప్తి కావాలా? అసంతృప్తి కావాలా? అసంతృప్తిని ప్రస్తావించడం శుభమా? సంతృప్తిని వ్యక్త పరచడం శుభమా? ఆకలితో ఉన్న వ్యక్తిని భోం చేయండి అని చెబుతాం. తృప్తిగా భోంచేసిన వ్యక్తిని ఇంక కాస్త గ్రహించండి అంటే, అయ్యో! వద్దండి, చెయ్యలేను అంటాడు. ఎందుకు అలా అంటాడు? తృప్తి చెందాడు కనుక. చెయ్యను, చెయ్యలేను అనడం అమంగళమా? అసంతృప్తితో కర్మారంభం జరుగుతుంది. తృప్తిలో, జ్ఞానంలో కర్మలు విలీన మౌతాయి.

సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే

కర్మలన్నీ జ్ఞానం లోనే పరిసమాప్త మవుతాయి అని గీతాచార్యుడే ముందుందు నాల్గవ అధ్యాయంలో చెప్పబోతాడు. ఆ సందర్భంలో విపులంగా చర్చించు కుందాం. కనుక, మంగళకరంగా మనం కర్మలు చెయ్యొచ్చు. అంతేగాని, కర్మ మంగళం కాదు. కర్మలలో అకర్మను దర్శించడమే శుభం. మంగళం.

ఇదంతా అద్వైతాన్ని అభిలషించే వారికి, అనుసరించే వారికి సరిపోవచ్చు. మేము మాత్రం దానిని మంగళాచరణంగా అంగీకరించము అని మరొక పక్షము వాదించ వచ్చు. అయితే, వారికి కూడా సమాధానం చెబుతున్నాము.

అద్వైతము అందరూ అంగీకరించ గలిగే సామాన్య విషయం కాదు. అందరూ అంగీకరించాలని మేము కూడా కోరుకోము. అలాంటి వారికి మేము చెప్పేది ఒక్కటే. మీరు కోరుతున్నారు కనుక, అవసరం లేకపోయినా మంగళ ప్రస్తావన ఈ సందర్భంలో ముందుకు తెచ్చాం. అలా చూచినా, పదకొండవ శ్లోకం మంగళకరంగా ఉంది. ***అశోచ్యాన్*** అంటూ శ్లోకము మొదలైంది. 'అ' అనే అక్షరంతో ప్రారంభం కావడమే మంగళాచరణం.

అక్షరాణాం అకారోఽస్మి

అక్షరాలలో తాను 'అ' కారము అని గీత - విభూతి యోగంలో అచ్యుతుడే చెప్పాడు కనుక, భగవంతు డైన శ్రీకృష్ణుడు తన స్వరూపమైన అక్షరంతో ప్రారంభించడం చేత, ఈ శ్లోకం మంగళకరము.

వాక్య తాత్పర్యం

అజ్ఞాన జనితమైన శోకమోహాల నుండి విడిపడాలి అంటే, ఆత్మజ్ఞానమే ఏకైక మార్గమని తలచి శ్రీకృష్ణుడు ***అశోచ్యాన్*** అంటూ ఆత్మ యొక్క నిత్యత్వాన్ని ప్రబోధించ డానికి ఉపక్రమించాడని అర్థం చేసుకున్నాం. ఆత్మజ్ఞానము అంటే బ్రహ్మాత్మైక్య జ్ఞానము. ఆత్మయే బ్రహ్మము అనే మహావాక్య జ్ఞానము. **తత్త్వమసి** వాక్య తాత్పర్యం.

తత్ - త్వం - అసి అనే మూడు పదాలకు విపుల వ్యాఖ్యానమే భగవద్గీత అని మనం అర్థం చేసుకొని ఉన్నాం. ఈ మూడు పదాలకు వివరణంగా పరమేశ్వరుడు మూడు షట్కాలను బోధించాడు. మొదటి ఆరు అధ్యాయాలు 'త్వం' పదమును నిర్దేశించే ప్రథమ షట్కము. ఆ తరువాత ఆరు అధ్యాయాలు 'తత్' పదమును నిర్దేశించే ద్వితీయ షట్కము. చివరి ఆరు అధ్యాయాలు 'అసి' పద నిర్దేశమును గావించే తృతీయ షట్కము. ***అశోచ్యాన్*** అనే ఈ శ్లోకంతో ప్రారంభ మైన ప్రథమ షట్కము 'త్వం' పద నిర్దేశము గాన, ***అశోచ్యాన్ అన్వశోచః త్వం*** అంటూ తనలో 'త్వం' పదమును నింపుకొని, మొదటి ఆరు అధ్యాయాలలో నా పని అంతా ఇదే అని చెప్పకనే చెబుతూ ఉంది.

ద్వితీయం అద్వితీయం

అనాత్మ లక్షణాలను ఆత్మ యందు ఆరోపించుకొని దుఃఖించడం అందరి లాగే అర్జునునికి కూడా సాధారణ మోహం కాగా, స్వధర్మాన్ని అధర్మంగా భావించడం అర్జునునికి మాత్రమే ఉన్న అసాధారణ మోహం. సాధారణ మోహం లాగే అసాధారణ మోహం కూడా అందరికీ ఉంటుంది. కాకపోతే, అర్జునుడికి అది యుద్ధం విషయంలో తలెత్తింది. మరొకరికి మరొక విషయంలో తొంగి చూడవచ్చు.

సాధారణ మోహాన్ని నివృత్తి చేసే ప్రయత్నంలో రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకం నుండి ముప్పై యవ శ్లోకం వరకు ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించి ***న త్వం శోచితు మర్హసి*** - దుఃఖింప నవసరం లేదు అంటూ అక్కడ ముగించాడు!

స్వధర్మమైన యుద్ధాన్ని అధర్మంగా భావించి, యుద్ధం నుండి విరమించి పరధర్మాన్ని ఆశ్రయించాలని భావించిన పార్థుని అసాధారణ మోహాన్ని తొలగిస్తూ, అక్కడి నుండి ఎనిమిది శ్లోకాలలో ధర్మాన్ని గూర్చి అద్భుతంగా ప్రవచించాడు భగవానుడు. ఈ ధర్మ ప్రసంగాన్ని ధర్మాష్టకం అని అంటారు.

ధర్మ జీవనంలో కర్మే ప్రధానం కనుక, బంధహేతువైన కర్మను కర్మయోగంగా మార్చుకొని, కర్మసంగము, ఫలసంగము లేకుండా సమబుద్ధితో ఆనందయాత్రను సాగించేది ఎలాగో ఆ తరువాత పదిహేను శ్లోకాలలో చర్చించి యాభై మూడవ శ్లోకం వద్ద సమాప్తి చేశాడు. చివరగా సాంఖ్య, యోగాల ప్రతిరూపంగా, సాకార

రూపంలో నడయాడే జ్ఞానస్వరూపు డైన స్థితప్రజ్ఞుని వైభవాన్ని వర్ణించాడు. ఈ విధంగా ద్వితీయ మనే సాంఖ్యము అద్వితీయంగా శోభిస్తూ ఉంది. ఇక వినండి.

దుఃఖింప దగిన వారు భీష్మద్రోణులతో సహా ఎవ్వరూ లేరు. వారు అశోచ్యులు. ఎందుకని వాళ్ళు అశోచ్యులు? (కుతః తే అశోచ్యాః?) వారు నిత్యులు కనుక (యతః నిత్యాః). అదెలా? (కథమ్?) అదెలాగో చెబుతూ ఆత్మ యొక్క నిత్యత్వాన్ని బోధిస్తున్నాడు.

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్ ॥ 12

న-తు-ఏవ-అహం-జాతు-న-ఆసం-న-త్వం-న-ఇమే-జనాధిపాః
న-చ-ఏవ-న-భవిష్యామః-సర్వే-వయం-అతః-పరం

అహం	=	నేను	జనాధిపాః	=	రాజులు కూడా
జాతు	=	ఒకప్పుడు	న	=	లేరు అనేది
న ఆసం	=	లేను అనేది	న తు ఏవ	=	లేనే లేదు
నతు ఏవ	=	లేనే లేదు	అతఃపరం	=	ఇక మీదట
త్వం	=	నీవు కూడా	వయం సర్వే	=	మన మందరము
న	=	లేవనేది లేదు	న భవిష్యామః	=	లేకపోవుదు మనునది
ఇమే	=	ఈ	న ఏవ	=	లేనే లేదు

పార్థా! నేను ఒకప్పుడు లేనివాణ్ణి కాను. నువ్వు కూడా లేని వాడివి కావు. ఈ రాజు లందరూ కూడా ఒకప్పుడు ఉన్నవారే. మన మందరం భవిష్యత్తులో లేకుండా పోయే వాళ్ళము అసలే కాము.

వ్యాఖ్య

వచ్చేది ఏదైనా మనకు ఇష్టమైన దైతే అది వస్తే మనకు సంతోషం కలుగుతుంది. ఉన్నది ఏదైనా అది మనకు ఇష్టమైన దైతే, అది పోతే దుఃఖం కలుగుతుంది. మా కోడలు ఎప్పుడు ప్రసవిస్తుందో చెబుతారా? అని జ్యోతిష్కుల్ని అడుగుతారు. అంతే గాని, ఆ పుట్టే బిడ్డ చనిపోయే దెప్పుడో చెప్పండి అని ఎవ్వరూ అడగరు.

ప్రసవిస్తే అంత వరకు లేని వాడే కదా పుడతాడు! పుట్టిన వాడు గిట్టకుండా ఎలా ఉంటాడు? అందరూ ఈ ప్రపంచంలో పుట్టేవాళ్ళే, గిట్టేవాళ్ళే. పుట్టడం అనేది ఒక కాలంలో జరుగుతుంది. గిట్టడం కూడా కాలం లోనే జరుగుతుంది. ఈ జనన మరణాలకు మధ్య ఉన్న కాలంలో మనిషి దేహంతో జీవిస్తాడు.

ఒక వ్యక్తి ఉన్నాడు అంటే దేహంతో ఉన్నాడనే అర్థం. దేహం ఎల్లకాలం ఉండదు కనుక, దేహం పోతే ఆ వ్యక్తి లేకుండా పోతాడు. అందుచేత అతడు శోచ్యుడు, దుఃఖింప దగిన వాడు అనేది మన భావం. అనుభవం కూడా. ఇది వాస్తవం కాదని, నేడున్నవాడు ఎప్పుడూ ఉండే వాడే నని, లేకుండా వచ్చిన వాడు కాదని, లేకుండా పోయేవాడూ కాదని, అందుచేత దుఃఖింప దగిన వాడు కాదని ఈ శ్లోకంలో ఆత్మ యొక్క నిత్యత్వాన్ని ఆవిష్కరిస్తున్నాడు భగవానుడు.

ఉన్న నే నెవరు? నేనుగా ఉన్న దెవరు?

తాను ఉన్నట్లు ఎవరికి తెలియదు? అలాగని, తాను ఎలా ఉన్నాడో తెలిసింది ఎవరికి? నేను ఉన్నాను (**అహమస్మి**) అని మనిషి అంటాడు. ఇక్కడ 'నేను' అని దేనిని గూర్చి మాట్లాడు తున్నాడో అది దేహ మని అతని

అభిప్రాయం. దేహం నేడుంది. పుట్టక ముందు లేదు. లేకుండా ఉన్నదే పుట్టింది. ఇప్పుడు ఉంటూ ఉంది. కొంత కాలం ఉండి ఆ తరువాత లేకుండా పోతుంది. లేకుండా పోవడం ఎవ్వరికీ ఇష్టం లేదు. అలా పోయే పరిస్థితి వచ్చినపుడు, ఇష్ట మైనది పోతూ ఉంది కనుక దుఃఖం అనివార్యంగా ఉంటుంది. తన విషయంలో ఇష్ట మున్నట్లే, తనకు సంబంధించిన వారి విషయంలో కూడా ఇష్ట ముంటుంది కనుక, వారి దేహాలు పోతాయని తెలిసినా దుఃఖం ముంచు కొస్తుంది.

వాస్తవానికి నే నెవరు? నాలో నేనుగా ఉన్న దెవరు? అని విచారిస్తే 'నేను దేహము కాను - నాకు దేహం ఉంది' అనే అద్భుతమైన సత్యం తెలిసి వస్తుంది. గతంలో లేని దేహం భవిష్యత్తులో లేకుండా పోయేందుకే వచ్చి ఉండొచ్చు. కాని, నేను అలా లేకుండా పోయేందుకు లేకుండా వచ్చినవాణ్ణి కాను. గతంలో కూడా ఉన్నవాణ్ణే. అలాగే భవిష్యత్తులో కూడా ఉండబోయే వాణ్ణే. ఎప్పుడూ ఉన్నవాణ్ణే ఇప్పుడూ ఉన్నాను. ముస్ముందు కూడా ఉంటాను. నేను లేని కాలమే లేదు. ఒకప్పుడు లేకుండా పోయేవి ఉన్నప్పుడు ఉండటానికి కూడా నేనే కారణము.

ఉండి పోయేది పోతే నష్టం లేదు

పోకుండా ఉండేది తెలియక పోతే లాభం లేదు

నేడు ఉన్నాను అనడంలో తప్పు లేదు. ఒకనాడు లేను అంటేనే దోషం. నేను పుట్టాను అనడం తప్పు కాదు. పుట్టిన రోజు పండుగ జరుపు కోవడం అనుచితమూ కాదు. పుట్టక ముందు లేను అంటేనే సమస్య ఉత్పన్నం అవుతుంది.

శ్రీరామచంద్రుడు ధర్మ రక్షణార్థం జన్మించాడని ఆయన పుట్టిన రోజును శ్రీరామనవమిగా మనం జరుపుకుంటున్నాం. అవతార మెత్తిన వాడు శ్రీమహావిష్ణువు. శ్రీరాముడుగా ఉద్భవించింది వైకుంఠవాసుడే. అంటే, శ్రీరాముడుగా పుట్టినవాడు శ్రీరాముడుగా పుట్టక ముందు ఉన్నవాడా, లేనివాడా? ఉన్నవాడే. మరి, అలా ఒకప్పుడు ఉండిన శ్రీరాముని దేహం నేడు ఉందా? లేదు. అంటే, రాముడు లేనట్లేనా? అదే వాస్తవమైతే, మనం రామధ్యానం ఎందుకు చేస్తున్నాము? మన ధ్యానాన్ని అనుగ్రహించే దెవరు? శ్రీరాముడు కాదా? శ్రీరాముని దేహం ఒక కాలంలో ఉండి, ఆ తరువాత లేకుండా పోవచ్చు. అలాగని, రాముడు లేకుండా పోలేదు. దేహం లేకపోయినా తాను ఉన్నాడు. ఉన్నాడు కనుకనే మన మొర వింటున్నాడు. ఉన్నాడు కనుకనే పిలిస్తే వస్తున్నాడు. తులసీదాసు మొర విన్నాడు. రామదాసు పిలిస్తే వచ్చాడు.

అర్జునా! నేడు నీ ముందు నేనున్నాను. నేను పుట్టినట్లు మా అమ్మ దేవకీదేవి చెబుతుంది. కాని, పుట్టక ముందే నేను ఉన్నానని మా మామయ్య కంసుడికి తెలుసు. అందుకే, నేను పుట్టగానే కబురు అందించమని కాపలా వాళ్ళను పెట్టాడు. అర్థమైందా అర్జునా! పుట్టక ముందు నేను లేను అనేది లేనే లేదు (**న త్వేవాహం జాతు నాసం**). **తత్** గా తెలిసే పరమేశ్వరుడు నిత్యమే. ఆ విషయంలో సంశయం లేదు. 'నేను'గా, 'నీవు'గా తెలిసే **త్వం** కూడా నిత్యమేనా? ఇక్కడే సంశయం.

అయ్యా! కృష్ణయ్యా! అది నీ విషయం. నీవు అవతారమూర్తివి. పుట్టుక లేని వాడివి. మరణం తెలియని వాడివి. నీ జనన మరణాలు చాలా విచిత్ర మైనవి. కాని, పుట్టి చచ్చే మా విషయ మేమిటి? అనేది అర్జునుని ప్రశ్న. ఇది నిజమేనా?

శ్రీకృష్ణుడు అవతారమూర్తి అని అర్జునుడికి ఈ సందర్భంలో తెలుసా? శ్రీకృష్ణుడు భగవంతుడు అని గీతోపదేశానికి ముందు అర్జునుడు గ్రహించాడా? లేదు. అది తెలిసి ఉంటే, రథంలో క్రింది భాగాన శ్రీకృష్ణుణ్ణి

కూర్చోబెట్టి, ఎత్తైన స్థానంలో తాను కూర్చుంటాడా? ఇంతెందుకు? శ్రీకృష్ణుణ్ణి రథం నడపడానికి, గుఱ్ఱాలను కడగటానికి అంగీకరిస్తాడా? తన సర్వస్వమూ అయిన అచ్యుతుడు భగవంతుడే అని పార్థునికి తెలియదు. మనకు తెలియకుండా మనతో ఉంటూ, మనల్ని ఆదుకొనే వాడే భగవంతుడు. కనుక భగవంతుని స్థాయిని ఉదహరిస్తూ శ్రీకృష్ణుడు బోధించడం లేదు. ఆత్మస్థాయి నుండే బోధను అనుగ్రహిస్తున్నాడు. ఆత్మ ఒక్కటే కనుక అందరమూ అన్ని కాలాలలో ఉన్నవాళ్ళమే అనే అద్భుత సత్యాన్ని వంట బట్టిస్తున్నాడు.

అర్జునా! నాది, నీది అని ఇక్కడ రెండు లేవు. విషయమంతా ఒక్కటే. జనన మరణాలు ఎవరివి అయినా విచిత్రాలే. విగత చిత్రాలే. చూడు పార్థా! నా దేహం రాక ముందు నేను ఎలా ఉన్నానో, నీ దేహం రాక ముందు నీవూ అలా ఉన్న వాడివే. నీవే కాదు. మన ముందు కనిపిస్తున్న ఈ రాజులు, భీష్మద్రోణాదులు సైతం వాళ్ళ దేహాలు పుట్టక ముందు కూడా ఉన్నవారే. నా దేహం లేకపోయినా, భవిష్యత్తులో నేను ఎలా ఉండబోతానో, అలాగే నీ దేహం పోయిన తరువాత నీవు, వాళ్ళ దేహాలు పతనమైన తరువాత వాళ్ళు అలాగే ఉండబోతారు. పార్థా! ఉండి పోయేది ఏదో అదే నీకు తెలుస్తూ ఉంది. పోకుండా ఉండేది ఏదో నీకు అర్థం కావడం లేదు. అదే నీ దుఃఖానికి కారణం.

అర్జునా! నీవు, ఈ రాజులందరు కూడా పుట్టక ముందు లేరు అనేది లేదు. ఉన్నవారే. ***(న త్వం... ఇమే జనాధిపాః న ఆసన్ ఇతి).*** నేను, నీవు, ఈ రాజులు దేహాలు లేక ముందు ఉన్న వాళ్ళమే. భవిష్యత్తులో దేహాలు లేకపోయినా ఉండే వాళ్ళమే. అంతేగాని, భవిష్యత్తులో లేకుండా పోయే వాళ్ళము కాము ***(అతః పరమ్ వయం సర్వే న భవిష్యామః న ఏవ).*** ఇది అర్థం కాకపోవడం వల్లనే శోకమోహాలు కలుగు తున్నాయి.

నేడయితే ఉన్నాము కానీ పుట్టక ముందు లేము కదా! ఈ భావమే మోహము. లేకుండా వచ్చాము కనుక భవిష్యత్తులో లేకుండా పోతాము. ఈ ఆలోచనే భయానికి, దుఃఖానికి కారణము. వాస్తవానికి దుఃఖ కారణం లేనే లేదు. ఆలోచనా విధానమే దుఃఖానికి కారణంగా తెలుస్తూ ఉంది.

అర్జునా! గతంలో మన మందరమూ ఉన్నాము. నేడూ ఉన్నాము. మనతో పాటు ఇప్పుడు దేహాలు ఉన్నాయి. భవిష్యత్తులో దేహాలు పతన మవుతాయి. మన ప్రయాణం మాత్రం సాగుతూనే ఉంటుంది.

ఇప్పుడు చెప్పు. భవిష్యత్తులో నీవు, వాళ్ళూ ఉంటూనే ఉంటారు. కనుక నీవు నీ కోసం దుఃఖింప నవసరం లేదు. అలాగే వాళ్ళ కోసం కూడా దుఃఖింప పని లేదు. ఇదే విషయం వాళ్ళకు కూడా వర్తిస్తుంది. వాళ్ళూ, నీవు భవిష్యత్తులో లేకుండా పోయేవారు కారు కనుక వాళ్ళు వాళ్ళ కోసం ఏడవ వలసిన పనిలేదు. అలాగే నీ కోసం ఏడవ వలసిన అగత్యం వాళ్ళకు లేదు. గతంలో అందరమూ ఉన్నాము. నేడు కూడా ఉన్నాము. భవిష్యత్తులో అందరము ఉండబోతాము. ఇక ఎవరు ఎవరి కోసం ఏడవాలి? ***(అశోచ్యా నన్వ శోచస్త్వం).***

నువ్వు ఉంటేనే అది ఉంటుంది

అది లేకపోయినా నువ్వు ఉంటావు

అర్జునా! నువ్వు దేహం లేక ముందు కూడా ఉన్నవాడివే. అప్పుడు దేహం లేదు. లేనిది వచ్చింది. దేహానికి ఆది ఉంది. కనుక అది అనాది కాదు. ఆది ఉన్న దేహానికి అంతం ఉంది. అందుకని అది అనంతం కాలేదు.

కుండ పుట్టింది కనుక దానికి ఆది ఉంది. ఆది ఉంది కనుక అంతమూ ఉంటుంది. తయారు కాక ముందు కుండ లేదు. పగిలిన తరువాత కుండ ఉండబోదు. దేహం యొక్క పరిస్థితి కూడా అదే ***(జనేః పూర్వం అపి మృతేః అథాపి దేహః నాస్తి).***

కుండ అన్ని కాలాలలో ఉండదు. కాని, మట్టి లేని కాలమే లేదు. దేహాలు ఎప్పుడూ ఉండవు. కాని, ఆత్మ లేని కాలమే లేదు. కాలము లేకపోయినా ఆత్మ ఉంటుంది. అదే ఆత్మ యొక్క కాలాతీత స్థితి. నిత్య మంటే అదే. కనుక, ఆత్మ నిత్యము. నిత్యమైన ఆత్మ నశిస్తుందా? నశించదు. మరి, దుఃఖం దేని కోసం ***(అశోచ్యా నన్వ శోచస్త్వం)?***

అర్జునా! కుండ పుట్టక ముందే మట్టి ఉంది. కుండ భగ్నమైనా మట్టి ఉంటుంది. దేహం పుట్టక ముందే నువ్వు ఉన్నావు. నేనూ ఉన్నాను. ఈ రాజులూ ఉన్నారు. దేహం పోయినా నువ్వు ఉంటావు. నేను ఉంటాను. ఈ రాజులూ ఉంటారు. దేహాలుగా ఉండ లేరు. ఆత్మగా ఉంటారు. కనుక, ఉండరేమో అనే సంశయం లేనే లేదు ***(న భవిష్యామః న ఏవ).***

కుండలు ఎన్నో ఉంటాయి. కాని, అన్ని కుండలలో ఆకాశం ఒక్కటే. దేహాలు అనేకంగా ఉంటాయి. కాని, అన్ని దేహాల లోని ఆత్మ ఒక్కటే. బల్బులు ఎన్నో రూపాల్లో ఉంటాయి. అనేక రంగుల్లో ఉంటాయి. కాని, వాటన్నిటిలో ఉండే శక్తి ఒక్కటే. అన్ని బల్బులలో ఒకే విద్యుత్ ఉన్నట్లుగా అన్ని దేహాలలో ఒకే చైతన్యం ఉంది.

ఏకో దేవః సర్వ భూతేషు గూఢః..... ...... సర్వ భూతాంతరాత్మా

ఒకే పరమేశ్వరుడు సర్వ భూతాలలో దాగి ఉన్నాడు. సర్వ జీవులలో ఆత్మస్వరూపంగా శోభిస్తున్నాడు అన్నది ఉపనిషత్తు.

మట్టి ఉంటేనే కుండ ఉంటుంది. కుండ లేకపోయినా, మట్టి ఉంటుంది. బల్బు వెలుగుతూ ఉంది అంటే విద్యుత్ ఉంది అని అర్థం. బల్బు పగిలి పోతుంది. అలాగని, విద్యుత్ నలిగిపోదు. నశించిపోదు.

ఆత్మ ఉంటేనే దేహాలు ఉంటాయి. దేహాలు లేకపోయినా ఆత్మ ఉంటుంది. ఇప్పుడు దేహం ఉంది. దేహంలో చైతన్యాత్మ ఉంది. దేహం పుట్టక ముందు ఈ దేహం లేదు. దేహం లేకపోయినా ఆత్మ చైతన్య స్వరూపంగా భాసిస్తూనే ఉంది. అర్జునా! నువ్వు ఆత్మవి. కనుక ఎప్పుడూ ఉంటావు. ఈ రాజులు కూడా అంతే.

నడిచే రథాలు మారుతాయి

నడిపే రథికుడు మారడు

అర్జునా! అర్థమైంది కదూ! ఎప్పుడూ ఉండేది ఏదో అది నిత్యము. ఎప్పుడూ ఉండ లేనిది ఏదో అది అనిత్యము. నిత్యము ఎప్పుడూ పోనిది కనుక దాని కోసం దుఃఖింప నవసరం లేదు. అనిత్యము ఎప్పుడైనా పోయేదే కనుక దాని కోసం కూడా దుఃఖింప పని లేదు. ఆత్మ నిత్యము. కనుక మన మందరమూ నిత్యులమే. ఎప్పుడూ ఉండే వాళ్ళమే. దేహాలు పోయినా పోయే వాళ్ళము కాము. దేహాలు రాక ముందు కూడా ఉన్న వాళ్ళమే.

దేహం రథం లాంటిది ***(శరీరం రథ మేవ).*** తనకు తానుగా నడవ లేదు. నువ్వుంటేనే నడుస్తుంది. ఎవరి రథము వారిదే. కాని, ఒక రథం ఉన్నట్లు మరొక రథం లేదు. ఏ రెండు శరీరాలూ ఒకే విధంగా లేవు. ఒకే రంగులో లేవు. ఒకే రూపంలో లేవు. మాటలో భేద ముంది. చూపులో తేడా ఉంది. నడకలో వ్యత్యాస ముంది. అర్జునా! ఈ తారతమ్యం ఎక్కడిది? అందరి శరీరాలు ఒకే విధంగా ఎందుకు లేవు?

కృష్ణా! శరీరాలు కూడా కర్మఫలాలే. అందరూ గతంలో ఒకే విధమైన కర్మాచరణం చేయలేదు. అందుచేత, అందరి శరీరాలు ఒకే విధంగా లేవు. మరి, ఈ దేహం ఎప్పుడు చేసిన కర్మకు ఫలం? ఈ జన్మలో చేసిన కర్మల యొక్క ఫలితమే అని చెప్ప గలరా? దేహం రావడమే కదా జన్మ? జన్మ వచ్చిన తరువాతే కదా

కర్మ? మరి, ఈ దేహంతో, ఈ జన్మలో ఆచరించే కర్మ వల్ల ఈ జన్మలోనే ఈ దేహాన్ని ఎలా పొందగలం? నేడున్న దేహం గత జన్మల కర్మఫలం.

అదీ విషయం. గత జన్మలో కర్మలు చేశాము కదా! ఆ కర్మలు ఏ దేహంతో చేశాము? ఏ దేహమో తెలియదు గాని ఈ దేహమైతే కాదు. ఈ దేహంతో గత జన్మలో కర్మలు ఎలా చేస్తాం? సరే. మరి వేరే దేహం ద్వారా ఇప్పుడు కర్మఫలాలను అనుభవించేది ఎవరు? నేనే. ఎవరి కర్మఫలం అది? నాదే. ఎప్పుడు చేసింది? గత జన్మలో. అంటే ఇప్పుడున్న నువ్వు అప్పుడు కూడా ఉన్నావా? ఉండబట్టే కదా చేశాను? అప్పుడు చేసిన నువ్వు ఇప్పుడు కూడా ఉన్నావా? ఉండబట్టే కదా అనుభవిస్తున్నాను? బావుంది. మరి ఇప్పుడున్న దేహం అప్పుడు లేదు కదా! లేదు. అప్పుడున్న దేహము ఇప్పుడు లేదు కదా! లేదు. అప్పుడున్న నీవు, ఇప్పుడున్న నీవు ఒక్కరేనా? అవును. అందుకే అంటున్నాను. నువ్వు ఎప్పుడూ ఉండే వాడివే నని. నేడున్న నువ్వు గతంలో ఉన్నా వని, భవిష్యత్తులో కూడా ఉండబోతా వని. నీ లాగే ఈ రాజు లందరూను. అర్జునా! ఇప్పుడు చెప్పు. దుఃఖానికి కారణ ముందా?

ప్రయాణంలో ఎన్నో బండ్లు ఎక్కుతాము. ఎన్ని ఎక్కుతామో అన్ని దిగుతాము. బండ్లు మారుతాయి. మారుతూనే ఉంటాయి. ప్రయాణం చేసే వాడు మాత్రం మారడు. మారే వాటిలో మారనిది, నశించే దేహాలలో నశించనిది ఏదో అదే నీ స్వరూపం. అందరి స్వరూపం అదే. రూపాలలో భేదాలే గాని స్వరూపంలో భేదం లేదు.

చరణం : ***రూపాలకు రూపము నీవే - రూపము లేని స్వరూపము నీవే***
ఊరు పేరు ఉనికి ఏల? ఊపిరి నీవై నిలిచిన వేళ

పల్లవి : ***ఎన్నో ఎన్నో రూపాలు - అన్నీ ఆరే దీపాలు***
మారని రూపం ఆరని దీపం భువిలో దివిలో నీవే సకలం ॥ ఎన్నో ॥

ఇది ఆత్మ చైతన్యం. చైతన్య గానం లోని అమృతానంద రాగం.

అర్జునా! మారే దానిని మారకుండా ఆప లేము. మారని దానిని ప్రయత్నించినా మార్చ లేము. అనిత్యాలు మారుతూనే ఉంటాయి. మారే అనిత్యాలకు ఆధారమైన నిత్యాత్మ మారదు. సదాత్మగా సదా శోభిస్తూ ఉంటుంది.

అర్జునా! ఆకాశం ఉంది. వాతావరణ మార్పుల్ని ఆకాశంలో మనం చూస్తూ ఉన్నాం. వాతావరణం మారుతూ ఉంది. ఆకాశం మారుతుందా? నిత్యమైన ఆకాశం మారదు. అది సర్వగతం. అలాగే నిత్యమైన నీవు కూడా మార్పు లేని వాడవు. సర్వగతుడవు (***ఆకాశవత్ సర్వగతశ్చ నిత్యః***). నీవూ నిత్యుడవే. ఈ రాజు లందరూ నిత్యరూపులే. ఆత్మస్వరూపులే. కనుక ఎవరూ ఎవరి కోసము దుఃఖింప నవసరం లేదు.

భేదం అజ్ఞానం - అభేదమే జ్ఞానం

అర్జునా! మన మందరము భవిష్యత్తులో కూడా లేకుండా పోయేవాళ్ళం కాము అని శ్రీకృష్ణుడు బోధించడములో అర్థం స్పష్టంగా తెలుస్తూ ఉంది. ఈ దేహాలు నశించిన తరువాత కూడా ఆత్మ స్వరూపంగా మనం సదా ఉంటాం అనేది నిర్వివాదంగా గోచరిస్తోంది.

నేను, నీవు, ఈ రాజులు అంటూ వేరు వేరుగా చెప్పింది ఉపాధి స్థాయి నుండే గాని ఆత్మస్థాయి నుండి కాదు. శ్లోకంలో **వయం** అనే బహువచనం ఉండటం వల్ల, దానిని పట్టేసుకొని భేదాన్ని అల్లుకొంటూ పోయారు అద్వైతము నచ్చనివారు. ఇలాంటి అస్పష్ట వ్యాఖ్యానాలు తలెత్త కూడదనే శ్రీ శంకర భగవత్పాదులు భాష్యంలో వివరణమును విస్పష్టం చేశారు.

దేహ భేదాను వృత్త్యా బహువచనం న ఆత్మాభిప్రాయేణ

అక్కడ ఉన్న రాజుల్ని ఎలా చంపాలి? అనే మీమాంసలో అర్జునుడు ఉన్నాడు. ఆ రాజు లందరికీ దేహాలు ఉన్నాయి. అవి కూడా అనేక రూపాలలో గోచరిస్తూ ఉన్నాయి. కనుక, దేహముల భేదమును బట్టి దేహస్థాయి నుండి బహువచన ప్రయోగం చేయడం జరిగిందే గాని, ఆత్మస్థాయి నుండి కాదు.

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాన్తరప్రాప్తి ర్ధీర స్తత్ర న ముహ్యతి ॥ 13

దేహినః-అస్మిన్-యథా-దేహే-కౌమారం-యౌవనం-జరా
తథా-దేహాంతరప్రాప్తిః-ధీరః-తత్ర-న-ముహ్యతి

దేహినః	=	జీవునకు	యథా	=	ఎలాగో
అస్మిన్	=	ఈ	తథా	=	అట్లే
దేహే	=	దేహము నందు	దేహాంతరప్రాప్తిః	=	మరొక దేహము ప్రాప్తించుటను
కౌమారం	=	బాల్యము	తత్ర	=	ఆ విషయమున
యౌవనం	=	యౌవనము	ధీరః	=	జ్ఞాని
జరా	=	ముసలితనము	న ముహ్యతి	=	మోహమును పొందదు.

జీవుడికి ఈ దేహంలో బాల్యము, తరువాత యౌవనము, ఆ తరువాత ముసలితనము కలుగుతున్నాయి కదా! అలాగే చనిపోయిన తరువాత మరొక దేహం ప్రాప్తిస్తుంది. ఈ విషయంలో జ్ఞానులు మోహానికి గురి కారు. అందుకనే, వారిని ధీరులు అని పిలుస్తారు.

వ్యాఖ్య

మరణించేది ఆత్మ కాదు. మార్పు చెందేది ఆత్మ కాదు. నీవు ఆత్మవే. నీవు మరణించవు. నీవు మార్పు లేని వాడివి. మార్పు లేని, మరణం తెలియని ఆత్మకు దేహం ఉపాధి. ఉపాధికి అవస్థలు ఉన్నాయి. మార్పు లున్నాయి. మరణం ఉంది. పరిణామము చెందుతూ పతనమయ్యే దేహాన్ని ఉపాధిగా కలిగిన ఆత్మ దేహి ***(దేహః అస్య అస్తీతి దేహీ).*** ఎవడికి దేహం ఉంటుందో అతడే దేహి, లేక జీవాత్మ. అంటే, దేహముతో కలసిన ఆత్మయే జీవుడు అని అర్థం.

దేహం రాక ముందు జీవుడు ఉన్నాడు. కనుక, దేహం నశించినా జీవుడు ఉంటాడు అని జీవి యొక్క నిత్యత్వాన్ని గడచిన శ్లోకంలో చూశాము. ఈ సత్యాన్ని గ్రహించిన జ్ఞానులు మృత్యువు విషయంలో శోకమోహాలకు గురి కారు. జీవాత్మ నశించేది కాదు. వికారము చెందేది కాదు. కనుక, ఎటువంటి వికారానికి, వినాశానికి కూడా దుఃఖింప వలసిన అవసరం లేదు. ఈ విషయం ప్రస్తుత శ్లోకంలో సోదాహరణంగా వివరింప బడుతూ ఉంది.

దేహము - దేహి

దేహములో ఉన్నవాడు దేహి. దేహమును ఉపాధిగా కలవాడు దేహి. దేహం మారుతూ ఉంటుంది. అది గ్రహిస్తున్న దేహిలో ఏ విధమైన మార్పు ఉండదు. మార్పులన్నీ దేహధర్మాలే గాని ఆత్మధర్మాలు కావు. అందుచేతనే, మరణించిన వ్యక్తిని గూర్చి మాట్లాడే టప్పుడు జీవుడు దేహాన్ని వదిలేశాడు అంటాము. అంతేగాని, దేహము జీవుణ్ణి వదిలేసింది అని చెప్పము. చావడము అనేది దేహధర్మము కనుక, చనిపోయిన వ్యక్తిని దేహధర్మ మొందినాడు అని పెద్దలు వ్రాస్తూ ఉంటారు. పలుకుతూ ఉంటారు. ఇవన్నీ ఆత్మ యొక్క నిత్యత్వాన్ని

నిరూపించిన పవిత్ర ఆర్ష సంస్కృతిలో, జ్ఞానం కలిగిన వ్యక్తుల నాలుకలపై తొణికిస లాడే జ్ఞానామృత జల బిందువులు.

దేహం ఎప్పుడూ ఒక విధంగా ఉండదు. మారుతూ ఉంటుంది. మన దేహాన్నే తీసుకోండి. గతంలో ఉన్నట్లు ఇప్పుడు లేదు. గతానికి, ఇప్పటికి శరీరంలో చాలా మార్పు లున్నాయి. అయినా, దేహాన్ని తెలుసు కుంటున్న మనలో ఏ మార్పూ లేదు. అదే జీవాత్మ. దేహం లోని మార్పులను గ్రహిస్తూ తనలో ఏ విధమైన మార్పు లేనిది.

మారేది దేహం. మరణించేది దేహము. దేహము ఎప్పుడో ఒకనాడు మరణిస్తుంది అనేది అందరికీ తెలుసు. కాని, దేహము ఎప్పుడూ మరణిస్తూనే ఉంది అనేదే అర్థం కావాలి. ఎప్పుడూ మరణిస్తూనే ఉంది అనే సత్యం అర్థమైతే, ఇప్పుడూ మరణిస్తూనే ఉంది అనే జ్ఞానం కలుగుతుంది. మరణం దుఃఖ కారణమైతే, మరణము ఎప్పుడూ సాగుతూనే ఉంది కనుక దుఃఖము కూడా సదా కొనసాగుతూనే ఉండాలి. కాని, అలా జరగడం లేదు. ప్రాణం పోయి నప్పుడే మనుషులు దుఃఖిస్తున్నారు. అదే మరణం అని భావిస్తున్నారు. ఇదేదో కాస్త గజిబిజి గానే ఉంటుంది. కాస్త వివరంగా చెప్పుకొని అర్థం చేసుకుందాం.

వికారం - నిర్వికారం

ఆత్మ నశించదు. నశించని ఆత్మను అంటి పెట్టుకున్న అవస్థలు నశిస్తున్నాయి. దేహంలో వచ్చే మార్పులే అవస్థలు. అందరి అనుభవంలో అగుపించేవే. చిన్న బిడ్డను వృద్ధుడు అని అనలేము. బాలుడు అంటాము. కనుక, దేహమును ధరించిన జీవుడు, లేదా దేహి యొక్క మొదటి దశ బాల్యదశ. అదే బాల్యావస్థ.

బాలుడు బాలుడు గానే ఉండడు. పెరిగి పెద్దవాడు అవుతాడు. అంటే యౌవనములో అడుగు పెడతాడు. అతడు యువకుడు. బాల్యావస్థ నుండి యౌవనావస్థలో ప్రవేశించిన వాడు.

ఈ రెండు అవస్థల లోను దేహంలో చాలా మార్పు గోచరిస్తూ ఉంటుంది. బాల్యంలో దేహం శక్తిహీనంగా ఉంటుంది. చిన్నదిగా ఉంటుంది. యౌవనం వచ్చే సరికి దేహం శక్తివంత మౌతుంది. పెరిగి పెద్దది అవుతుంది. దృఢ పడుతుంది. ఈ రెండు అవస్థలను తెలుసు కుంటున్న దేహిలో మాత్రం ఏ మార్పూ ఉండదు.

యౌవనము నుండి అదే వ్యక్తి వార్ధక్యానికి ప్రయాణాన్ని సాగిస్తాడు. అదే వృద్ధాప్యం. ముసలితనం. ఇది వృద్ధావస్థ. ఈ అవస్థ మిగిలిన రెండు అవస్థల కన్నా భిన్నంగా ఉంటుంది. దేహంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయి.

శరీరంలో పటుత్వం తగ్గుతుంది. నడకలో వేగం ఉండదు. పరుగు ఊహకు అందదు. వెంట్రుకలు తెల్ల బడతాయి. దంతాలు ఊడి పోతాయి. ఊతకర్ర చేతికి వస్తుంది. చూపు మందగిస్తుంది. చెవులు సరిగా వినపడవు. విన్నది అర్థం కాదు. తిన్నది జీర్ణం కాదు. దేహం లేవ నంటుంది. లేపితే కూర్చోలే నంటుంది. నడుము వంగి పోతుంది. మెడ తిరగ నంటుంది. దడ మొద లవుతుంది. బాల్య యౌవనాలలో ఉన్నది ఒక శరీరమే అయినా, అప్పటికి ఇప్పటికి, ఆ అవస్థకు ఈ అవస్థకు ఎంతో తేడా ఉంది. ఇవన్నీ వికారాలే. మార్పులే. తిరుగు లేని తీర్పులే. దేహంలో ఇన్ని వికారాలు గోచరిస్తున్నా, దేహి యైన జీవాత్మ నిర్వికారం గానే ఉంది. ఆత్మకు ముసలితనం లేదు. వృద్ధ మానవుడు అంటున్నారే గాని, వృద్ధాత్మ అని ఎవరూ అనడం లేదు.

ఎందుకో తెలుసా! మార్పులన్నీ శరీరానివే. ముసలితనం శరీరానికే. దేహి శరీరం కాడు. ముసలివాడు కాలేడు. శరీరాలలో ఉన్న వాడే గాని తాను శరీరం కాడు. శరీర రహితుడు. అందుకే, *అశరీరం శరీరేషు* అన్నది ఉపనిషత్తు. అంటే, శరీరాలలో శరీరం లేకుండా ఉండే వాడు అని అర్థం. ఇది అర్థమైతే దేహం లోని మార్పులు

దుఃఖ కారణాలు కావు. మరణం కూడా దేహానికే కనుక మరణంలో కూడా మోహము ఉండదు. శోకము ఉండదు. ఈ జ్ఞానము ఎవరికి ఉంటుందో అతణ్ణి ధీరపురుషుడు అంటున్నాడు భగవానుడు.

మార్పు - మరణం

మార్పు లన్నీ దేహానివే అని తెలిసిన వారు అవస్థలు మారుతూ ఉన్నా ఆవేదన చెందరు. ఆందోళనకు గురి కారు. కాని, మార్పు లెన్ని జరుగుతున్నా దిగులు చెందని జనులు మరణం వచ్చే సరికి దిగాలు పడతారు. కలత చెందుతారు. కన్నీళ్ళు పెట్టుకుంటారు. ఎందుకో తెలుసా! మరణం కూడా మార్పే నని తెలియదు కనుక.

మరణం అనేది ఒకచోట జరిగేది కాదు. ఒకప్పుడు కలిగేది కాదు. ఎప్పుడూ జరిగేదే. జరుగుతూ ఉండేదే. మనిషి ఒక్క క్షణంలో మరణించడం లేదు. ప్రతిక్షణం మరణిస్తూనే ఉన్నాడు. మన దేహం నిత్యము మారుతూ ఉంది. మన శరీరంలో ప్రతి జీవకణము క్షణం క్షణం మార్పుకు లోనవుతూనే ఉంది.

బాల్యావస్థను చూశాం. అది పోయింది. అదొక చావు. ఆ తరువాత యౌవనం పుట్టింది. కొంత కాలానికి అది కూడా పోయింది. అది మరొక చావు. ఆ తరువాత వృద్ధాప్యం పుట్టింది. అది మృత్యువుతో చస్తుంది. అదే చివరి చావు. ఇవన్నీ మరణాలే. చావులే. మరణం అంటే ఏదో కాదు, మార్పే.

మరి, బాల్యా ద్యవస్థలతో పాటు మరణం కూడా మార్పే అయి నప్పుడు, అవస్థల మార్పులలో దుః ఖించని వాడు మరణం విషయంలో ఎందుకు దుఃఖిస్తున్నాడు? కారణ మేమిటి?

బాల్యా ద్యవస్థలు దేహానికి వస్తున్నా, తాను మాత్రం దేహం లోనే ఉండి చూస్తున్నాడు. తనకు ఏ విధమైన హాని లేదు కనుక దుఃఖించడం లేదు. బాల్య యౌవన వార్ధక్యాల వలె మరణం కూడా ఒక అవస్థే నని తెలియక పోవడం చేత మరణంలో దుఃఖం కలుగుతోంది. మూడు అవస్థలలో తాను ఎలా నిర్వికారంగా ఉన్నాడో, నాల్గవ అవస్థ అయిన మరణంలో కూడా తాను నశించ కుండా ఉంటాడు అనే జ్ఞానం లేకపోవడం చేత మానవుడు శోకిస్తున్నాడు.

ఒక అవస్థ ముగిసి నపుడు మరొక క్రొత్త అవస్థ పుడుతుందే గాని క్రొత్త వ్యక్తి పుట్టడు. అవస్థ మారుతుందే గాని జీవితం మారడం లేదు. అవస్థ పోయినంత మాత్రాన వ్యక్తి పోవడం లేదు. అవస్థలు దేహానికి సంబంధించినవి. అవస్థలు పోయినా తాను ఉంటాడు. మరణం కూడా దేహానికి సంబంధించినదే. కనుక, దేహము పోయినా జీవుడు ఉంటాడు. అలాంటప్పుడు దుఃఖ మెందుకు? అవస్థలు నశించి నపుడు ఎలా దుః ఖం లేదో, మరణావస్థలో కూడా దుఃఖం ఉండటానికి వీల్లేదు. అయినా దుఃఖం కలుగుతూనే ఉంది.

ఇక్కడ మరొక సూక్ష్మమైన విషయాన్ని కూడా అర్థం చేసుకోవాలి. బాల్యా ద్యవస్థలు దేహానికి కలుగుతున్నా, దేశకాలాదులు మారడం లేదు అని కూడా మనిషి భావిస్తున్నాడు.

దేహంలో బాల్యా ద్యవస్థలు నడుస్తూ ఉంటే, ఈ దేహం లోని మార్పులన్నీ ఇప్పుడే, ఇక్కడే, ఈ ప్రదేశం లోనే ఉండి దర్శించడం జరుగుతోంది. ఈ దేహంతో పాటు ఈ కాలమే కూడా కొన సాగుతూనే ఉంది. మరణం దగ్గరకు వచ్చే సరికి, మరణం అవస్థే అయినా, దేహాంతర ప్రాప్తి అనేది మరొక దేశంలో, మరొక కాలంలో జరుగుతూ ఉంది. అది కూడా భయానికి ముఖ్య కారణ మౌతూ ఉంది. కాని, దేశకాలాదులు కూడా మార్పులే అని తెలుసుకుంటే ఆ దిగులు కూడా దూర మవుతుంది.

మనకు ప్రాణతుల్యమైన వ్యక్తే కావచ్చు. అలాగని, అతడు విదేశాలకు వెళ్తే మనం దుఃఖిస్తామా? మరి దేహాంతర ప్రాప్తి ఏమిటి? అలాంటిదే కదా! ప్రయోజనం ఉంది కనుకనే మన ఆత్మీయుడు విదేశాలకు

వెళ్ళాడు. ప్రయోజనం ఉంది కనుకనే జీవుడు ఈ దేహాన్ని విడిచి మరొక దేహం లోకి వెళ్తున్నాడు. కనుక, చావు హర్షించ దగిందే గాని గర్హించ దగింది కాదు.

అవస్థలు మారినంత మాత్రాన జీవికి ఎలా నశింపు లేదో, దేహాంతర ప్రాప్తి కూడా అలాంటిదే. దేహము నశించి నంత మాత్రాన దేహి నశించడం లేదు. బ్రతుకులో ఎన్నో మార్పులను చూచి చలించని జీవుడే చావును కూడా ఒక మార్పుగా చూస్తున్నాడు.

వనంలో పువ్వులు వికసిస్తూ ఉంటాయి. అలాగే వాడిపోతూ ఉంటాయి. మళ్ళీ తాజా సుమాలు విరబూస్తూ ఉంటాయి. జీవన వనవాటికలో పాత అవస్థలు మరుగున పడుతూ ఉంటాయి. నూతన అవస్థలు తెర మీదికి వస్తూ ఉంటాయి. ఇలాంటి వాటికి ధీరుడు దుఃఖించడు. మోహాన్ని పొందడు *(**ధీరః ధీమాన్ తత్ర ఏవం సతి న ముహ్యతి న మోహమ్ ఆపద్యతే**)*. మారేవి మారుతున్నా, ఆరేవి ఆరుతున్నా, మారని, మారలేని, ఆరని, ఆరిపోని అఖండ జ్యోతిర్మయానందము తన స్వరూపమే నని ధీరునికి తెలుసు.

నాడు ఉండినది నేడు ఉన్నది
రేపు ఉండునది ఉండ దగినది
అది ఇది కానిది అద్భుతమైనది
అన్నిటికీ ఆధార మైనది
ఆరని దీపము అఖండము
జీవుల గమ్యము చైతన్యము
రామ రామ జయ రాజారాం
రామ రామ జయ సీతారాం

అని దేహిని చేరే గుర్తును తెలుపుతూ, చైతన్య గుళికను గుటక వేయించింది రామజోగి చిట్కాలులో ఆనంద నిధానం.

పాత భవనాన్ని కూల్చేసి, అక్కడే మరొక అందమైన నూతన భవనాన్ని నిర్మించుకుంటాం. దివ్యమైన ఆ భవనం లోకి ప్రవేశించడానికి ఉత్సాహ పడతామే గాని నిరుత్సాహంతో నీరసిస్తామా? పాతది పోయిందని దుఃఖిస్తామా? దేహాంతర ప్రాప్తి కూడా ఇంతే.

ఆత్మ యొక్క నిత్యత్వం అర్థమైతే, దశలు మారుతున్నా, మరణం సమీపిస్తున్నా, దేహి ధీరుడై ఉంటాడు. ఆనంద స్వరూపుడై ఉంటాడు. మరణం అనేది అతనికి శోక సన్నివేశం కాదు. మంగళస్నానం లాంటిది.

ఒక యజ్ఞాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తాం. పూర్ణాహుతిని ఆనందంగా జరుపుకుంటాం. ఆ తరువాత అందరమూ శుభకరంగా నదిలో దిగి మంగళస్నానం చేస్తాం. దానినే **అవభృథ స్నానం** అంటారు.

జీవితం ఒక మహాయజ్ఞము లాంటిది. ఈ దేహం సమాప్తమై, దేహాంతర ప్రాప్తి కలిగే ముందు జీవన యజ్ఞానికి పూర్ణాహుతి పవిత్ర సమయంలో లభించే మంగళస్నానమే, అవభృథ స్నానమే మరణం. శోకానికి కారణమే లేని పావన తరుణం.

మరణం - మరపు

చివరగా ఈ సందర్భంలో ఒక్క సందేహం మనస్సును పట్టుకొని వ్రేలాడుతూ ఉంటుంది. బాల్యాద్యవస్థల లాంటిదే దేహాంతర ప్రాప్తి కూడా అనేది అర్థమైంది. అలాంటప్పుడు, బాల్యంలో, యౌవనంలో జరిగిన విషయాలు మనకు జ్ఞాపక మున్నాయి కదా! మరి గత జన్మ స్మృతులు ఎందుకని లేవు?

అది అర్థం చేసుకొనే ముందు మరొక్క విషయాన్ని కూడా మనస్సులో పెట్టుకుందాం. ఈ జన్మలో జరిగిన విషయాలు అన్నీ మనకు జ్ఞాపక మున్నాయా? ముఖ్యంగా శైశవదశ లోని అనుభవాలు స్మృతికి వస్తున్నాయా? రావు. రాలేవు. ఎందుకో తెలుసా?

శైశవదశలో బుద్ధి వికసనం జరగదు. అందువల్ల మనస్సు పేలవంగా ఉండి ఏ అనుభవాన్ని నిలుపుకో లేక పోతుంది. అంతమాత్రాన శైశవంలో అనుభవాలు, అనుభూతులు లేవని కాదు కదా!

మరణంలో మనసు విచ్ఛేద మవుతుంది. బుద్ధి వికల మౌతుంది. అలలు తీవ్రంగా కదలి నపుడు బావిలో పూడిక కనిపించనట్లు, మనసు కల్లోల మైనందున జ్ఞాపకాలు తెలియవు. అందుకే జన్మాంతర విషయాలు మరుగున పడిపోతూ ఉంటాయి. ఇది కూడా సృష్టిలో నియతికి సంబంధించిన విషయమే. ముస్ముందు గీతా వ్యాఖ్యానంలో ఇవన్నీ చూస్తాము. కాకపోతే, జన్మాంతర జ్ఞాపకాల విషయంలో మరపు ఒక వరం లాంటిది. భగవత్ప్రసాదం వంటిది.

గత జన్మల జ్ఞాపకాలు వర్తమాన జీవితాన్ని విస్ఫారంగా మారుస్తాయి. రాగద్వేషాలకు పాదులుగా మారుతాయి. అనిశ్చితమైన జీవన విధానానికి శ్రీకారం చుడతాయి. అవసరం లేని వాటిని అవసరాలుగా చూపుతాయి. ప్రశాంత జీవనంలో అశాంతి మంటలు రేపినా ఆశ్చర్యపడ నవసరం లేదు. అందుకే నేమో, సర్వజ్ఞుడు, సర్వ నియంత అయిన పరమేశ్వరుడు పూర్వజన్మ స్మృతి లేకుండా మనిషి మనస్సులో మరపును మడతపెట్టి ఉంచాడు.

*అనిత్యమైన దేహం గతిస్తుంది. దేహం కన్నా అన్యమైన ఆత్మ నశించదు అనే జ్ఞానం కలగడం వల్ల మరణం విషయంలో మోహం కలగదు. కాని, జీవితకాలంలో సుఖదుఃఖాల కారణంగా శోకమోహాలు ఏర్పడుతాయి కదా! అని అర్జునుడు సంశయిస్తాడని ఊహించి (**అర్జునస్య వచనం ఆశఙ్క్య**) స్థూల దేహం కన్నా ఆత్మ విలక్షణంగా ఉన్నట్లే, సూక్ష్మ దేహం కన్నా కూడా ఆత్మ విలక్షణ మైనది అని చెప్పడం ప్రారంభిస్తున్నాడు గీతాచార్యుడు*

మాత్రాస్పర్శా స్తు కౌన్తేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ 14

మాత్రాస్పర్శాః-తు-కౌంతేయ-శీతోష్ణ సుఖదుఃఖదాః
ఆగమాపాయినః-అనిత్యాః-తాన్-తితిక్షస్వ-భారత

కౌంతేయ	= కుంతీకుమారా!	ఆగమాపాయినః	= రాకపోకలు గలవి
మాత్రా స్పర్శాః తు	= ఇంద్రియాలకు ఇంద్రియ విషయాలతో కలిగే సంబంధాలైతే	అనిత్యాః	= అస్థిర మైనవి
శీతోష్ణసుఖదుఃఖదాః	= శీతోష్ణ సుఖదుఃఖములను కలిగిస్తాయి	భారత	= హే అర్జునా!
		తాన్	= వాటిని
		తితిక్షస్వ	= ఓర్చుకో

అర్జునా! ఇంద్రియాలకు ఇంద్రియ విషయాలతో సంబంధం కలిగి నపుడు శీతోష్ణాలు కలుగుతాయి. అలాగే సుఖదుఃఖాలు ఏర్పడుతాయి. పార్థా! అవి వస్తూ ఉంటాయి: పోతూ ఉంటాయి. స్థిరంగా ఉండవు. వాటిని నీవు ఓర్చుకోవాలి.

వ్యాఖ్య

నిత్యమైన ఆత్మ నశించేది కాదు కనుక శోకానికి అవకాశం లేదు. ఆత్మ కన్నా అన్యమైన దేహం నశించేదే

కనుక దాని విషయంలో కూడా దుఃఖానికి కారణము లేదు. ఈ సత్యము మరణ భయాన్ని తొలగిస్తుంది. కాని నిత్య జీవితంలో దుఃఖాన్ని కలిగించేవి చాలా ఉన్నాయి. మరణానికి సంబంధించిన దుఃఖము తొలగినంత మాత్రాన అన్ని దుఃఖాలు ఆవిరై పోతాయి అని అనుకో గలమా? మరణం దేహానికి సంబంధించింది. స్థూల శరీరానికి సంబంధించింది. జీవుడు స్థూలం తోనే కాదు, సూక్ష్మ శరీరంతో కూడా తాదాత్మ్యం చెంది ఉన్నాడు. అనేక కారణాల వల్ల జీవితంలో దుఃఖం ఏర్పడుతూ ఉంటుంది. ఆ విషయాన్ని కూడా ప్రస్తుత శ్లోకంలో వర్ణించి, దుఃఖ కారణాలను తొలగిస్తున్నాడు భగవంతుడు.

దేహం చస్తేనే కాదు దుఃఖం కలిగేది. చస్తుంది అనే వార్త కూడా దుఃఖాన్ని కలిగిస్తుంది. చావును ప్రక్కన పెడితే, బ్రతికి ఉన్నప్పుడు కూడా దేహం వల్ల బాధలు కలుగుతూనే ఉంటాయి.

బ్రతుకు నడవాలి అంటే మనిషి కూడా నడవక తప్పదు. కూర్చుంటే బ్రతుకు నడవదు. మరి నడిచే టప్పుడు పడే అవకాశం లేక పోలేదు. జారితే ఆశ్చర్యం లేదు. పడి దెబ్బ తగిలితే దేహానికి గాయ మవుతుంది. గాయము బాధిస్తుంది. దుఃఖాన్ని కలిగిస్తుంది.

తల ఉన్నందుకు తలనొప్పి వస్తుంది. కడుపు ఉన్నందుకు కడుపు నొప్పి వస్తుంది. అవయవాలు దేహంలో పని చేస్తున్నాయి. పని చేస్తున్నాయి కనుక కొన్ని అరిగి పోతాయి. మరి కొన్ని పాడై పోతాయి. ప్రయత్నిస్తే పాడైనవి కొన్ని బాగవుతాయి. కొన్ని శాశ్వతంగా పాడై పోతాయి. ఇవన్నీ బాధలే.

వేడిని, చలిని తట్టుకొ నేందుకు దేహంపై చర్మం ఉంది. అధిక వేడికి చర్మము కాలి పోతుంది. అధిక చలికి చర్మము ముడుచుకు పోయి పగిలి పోతుంది. చర్మము ఉన్నందుకు ఈ చలనాలు తప్పవు. చర్మములో చలనాలు కలుగుతూ ఉంటే చిత్తంలో సంచలనాలు పుడుతూ ఉంటాయి. సంఘర్షణలు కుదుపుతూ ఉంటాయి. ఇవన్నీ దుఃఖాలు. వీటి స్వభావ స్వరూపాలను, నివారణోపాయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

మాత్రలు - స్పర్శలు

మాత్రలు అంటే ఇంద్రియాలు. స్పర్శలు అంటే విషయాలు. చెవి, కన్ను, నాలుక, ముక్కు, చర్మము అనేవి ఇంద్రియాలు. శబ్దము, రూపము, రుచి, వాసన, స్పర్శ అనేవి విషయాలు. ఐదు ఇంద్రియాలు ఐదు ఇంద్రియ విషయాలను గ్రహిస్తూ ఉంటాయి. ఇంద్రియాలు దేహంలో ఉంటాయి. విషయాలు దేశంలో ఉంటాయి.

అభిః మీయన్తే శబ్దాదయః ఇతి శ్రోత్రాదీని ఇంద్రియాణి మాత్రాః

శబ్దము మొదలైన విషయాలను గ్రహించే ఇంద్రియాలను మాత్రలు అంటారు. ఇవి శబ్దాది విషయాలను కొలుస్తాయి. మదింపు వేస్తాయి. సకిలింపు వినిపిస్తే గుఱ్ఱ మని, గాండ్రింపు వినిపిస్తే వ్యాఘ్ర మని గ్రహించ దానికి చెవి అనే ఇంద్రియము కారణము. ఇది మేక, అది మేఘము అని గ్రహించడానికి కన్ను అనే ఇంద్రియము కారణము. ఈ విధంగా విషయ ప్రపంచంలో ఏది ఏమిటో గ్రహించడానికి, మదింపు వేయడానికి ఇంద్రియాలు ఉపకరిస్తాయి. వీటిని మాత్రలు అంటారు. ఇక స్పర్శలు చూద్దాం.

స్పృశ్యన్తే ఇతి స్పర్శాః విషయాః శబ్దాదయః

స్పర్శలు అంటే స్పృశింప బడేవి అని అర్థం. అంటే ఇంద్రియాలు అనే మాత్రల ద్వారా స్పృశింపబడే విషయాలు. ఇవే స్పర్శలు. ఇంద్రియ విషయాలు.

దేహం ఉన్నంత వరకు దేహంలో ఇంద్రియాలు ఉంటాయి. ఇవి ఐదు ఇంద్రియాలు. వీటి వల్లనే విషయ జ్ఞానము కలుగుతూ ఉంది కనుక వీటిని పంచ జ్ఞానేంద్రియాలు అంటారు. ఇవి దేహంలో ఉంటాయి.

అలాగే దేశం ఉన్నంత వరకు ప్రదేశంలో విషయాలు ఉంటాయి. ఇవి ఐదు విషయాలు. వీటి విషయమే ఇంద్రియాలకు అందే జ్ఞానము. వీటిని విషయ పంచకం అంటారు. ఇంద్రియాలు ఐదు. విషయాలు ఐదు. పంచ జ్ఞానేంద్రియాల ద్వారా పంచ విషయాలు ప్రముఖంగా అందుతూ ఉన్నాయి కనుక ఇది ప్రపంచము.

ఇంద్రియాలు ఉన్నా, విషయాలు లేకపోతే ప్రపంచం ఉన్నట్లు తెలియదు. విషయాలు ఉన్నా, ఇంద్రియాలు లేకపోతే ప్రపంచం ఏమిటో అర్థం కాదు. మాత్రలు ఉండాలి. స్పర్శలు ఉండాలి. అంతే కాదు. అవి పరస్పరము సంబంధం కలిగి ఉండాలి. అప్పుడే విషయ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానము ఉత్పన్న మవుతుంది.

మాత్రాణాం స్పర్శాః శబ్దాదిభిః సంయోగాః తే శీతోష్ణ సుఖదుఃఖదాః శీతమ్ ఉష్ణమ్ సుఖం దుఃఖం చ ప్రయచ్ఛన్తీతి

మాత్రలు అనబడే ఇంద్రియాలకు స్పర్శలు అనబడే విషయాలతో ఏర్పడే సంయోగాలు శీతాన్ని, ఉష్ణాన్ని, సుఖాన్ని, దుఃఖాన్ని పంచుతూ ఉంటాయి. శీతోష్ణాల వల్ల సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి. అంటే, శీతము వల్ల సుఖము, ఉష్ణము వల్ల దుఃఖము అని కాదు. శీతము వల్ల ఒకప్పుడు సుఖము, ఒకప్పుడు దుఃఖము కలుగుతూ ఉంటుంది. అలాగే ఉష్ణము వల్ల ఒకప్పుడు సుఖము, మరొకప్పుడు దుఃఖము కలుగుతూ ఉంటుంది. దీనిని బట్టి చూస్తే శీతంలో సుఖమూ లేదు, దుఃఖమూ లేదు. అలాగే ఉష్ణంలో కూడాను. కాకపోతే దేశ కాల పరిస్థితులను బట్టి శీతోష్ణాల వల్ల సుఖదుఃఖాలు ఏర్పడుతూ ఉంటాయి. ఇది కాస్త విశ్లేషించాల్సిన విషయం. కనుక, కాస్త వివరంగా చెప్పుకుందాం.

శీతోష్ణాలు - సుఖదుఃఖాలు

శీతోష్ణాలు విషయాల నుండి కలుగుతాయి. సుఖదుఃఖాలు మనస్సు నుండి పుడతాయి. కాలాలు మారుతూ ఉంటాయి. వేసవిలో మండుటెండలు కాస్తాయి. వర్షాకాలంలో వానలు కురుస్తాయి. శీతాకాలంలో చలి చుట్టేస్తుంది.

వేసవిలో మండుటెండల్ని మనిషి భరించ లేడు. బాబోయ్! ఎండలు మండిం చేస్తున్నాయి. వర్షాకాలం వచ్చే దెప్పుడో! అని తొందర పడతాడు. వేసవి పోయింది. వర్ష ఋతువు ప్రారంభ మవుతుంది. అయ్యో! వర్షాల వల్ల ఏ పనీ జరగడం లేదు. ఈ వర్షాకాలం పోయే దెప్పుడో! అని వాపోతూ ఉంటాడు. వర్షాకాలము పోయి శీతాకాలం వస్తుంది. అబ్బ! ఈ చలిని భరించలేక పోతున్నాను బాబు! చర్మము పగిలి పోతోంది. ఎముకలు విరిగి పోతున్నాయి. ఈ చలికాలం ఇంకెప్పుడు పోయేది? అంటూ శివరాత్రి కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఏదో రాలేదు అంటాడు. అది రాగానే పోయే దెప్పుడు? అంటాడు. ఇక ఏ కాలంలో మనిషి సుఖంగా ఉంటాడు? పోయే కాలంలో తప్ప.

కాఫీ వేడిగా ఉంటుంది. చలిలో, వర్షంలో త్రాగితే చాలా సుఖంగా ఉంటుంది. అదే కాఫీని వేసవి మండుటెండల్లో త్రాగాలంటే సుఖం ఉండదు సరికదా, చాలా అసౌకర్యంగా కూడా ఉంటుంది.

శీతల పానీయాలు కూడా అంతే. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు శీతల పానీయాలు సుఖాన్నిస్తాయి. అదే చలితో కూడిన వాతావరణంలో త్రాగాలంటే చాలా కష్టంగా ఉంటుంది. దీనిని బట్టి మనకు ఏమి అర్థ మవుతుంది? శీతమైనా, ఉష్ణమైనా వాటిలో కేవలం సుఖమే ఉందని చెప్పలేము. అలాగని దుఃఖమే ఉందని కూడా చెప్పలేము. శీతోష్ణాలు సుఖదుఃఖాల్ని పంచడము అనేది అనేక విషయాల మీద ఆధారపడి ఉంటుంది. శీతోష్ణాలు ఉన్నాయి. ఉంటాయి. వాటిని లేకుండా చెయ్యలేము. రాకుండా ఆపలేము. ఆ అవసరం మనకు లేదు కూడా. ఎందుకంటే, విశ్వ మనుగడకు అవి అవసరమై ఉన్నాయి. శీతోష్ణాలు ఉండేది వాటిని మనం తొలగించ డానికి కాదు. అర్థం చేసుకోవ డానికి. అవగాహన వల్ల వారిని బాధించే శక్తి ప్రపంచంలో దేనికీ లేదు.

దుఃఖ మనేది ఉష్ణము కాదు, శీతమూ కాదు. ఒక వస్తువు కాదు. ఒక ప్రదేశం కాదు. ఒక కాలం కాదు. ఒక పరిస్థితీ కాదు. అది ఆలోచనా విధానం. సుఖం కూడా అంతే. దుఃఖం కావాలని ఎవ్వరూ ఆలోచించరు. కానీ, ఆలోచిస్తూ, ఆలోచిస్తూ దుఃఖంలో పడిపోతారు. అలాగే సుఖం కూడా. సుఖం కావాలనే అందరూ ఆశిస్తారు. కాని సుఖ మేమిటో, ఎక్కడుందో అర్థం గాక ప్రయత్నించి దుఃఖాన్ని కొనితెచ్చుకుంటారు.

అన్ని వేళల పరిస్థితులు అనుకూలంగా ఉండవు. నేడుండినా రేపు ఉంటాయని చెప్పలేము. ఆశించినవి జరగవు. అవసరం లేని వన్నీ పిలిచినట్లు వస్తూ ఉంటాయి. ఎవరైనా ప్రయాణం చేయాలి అనుకుంటారే గాని ప్రమాదం జరగాలని ఆశించరు. మన ఆలోచనలకి జరిగే వాటికి సంబంధం ఉండదు. జీవితంలో ఏ కష్టమూ రాకూడదని మనిషి ఆలోచిస్తాడు. తప్పు లేదు. అలాగే ఆలోచించాలి కూడా. అందరము అలాగే ఆలోచిస్తున్నాం. అలాగని వచ్చే కష్టాలు రాకుండా ఆగుతాయా? వస్తున్నా మని ముందుగా మనకు కబు రంపుతాయా? మన ఆలోచనలు ఒక వైపు నడుస్తూ ఉంటాయి. జరిగేవి మరొక వైపు జరిగిపోతూ ఉంటాయి. వీచే గాలిని ఎలా ఆపలేమో, కురిసే మబ్బును ఎలా నిలప లేమో, జీవితంలో ఎదురయ్యే వాటిని కూడా ప్రక్కకు నెట్టలేము. కాకపోతే, వాటిని అర్థం చేసుకోవడం అలవరచు కోవాలి. ఏమని? వాటికి రాకపోకలు ఉన్నాయి అని.

వస్తాయి - పోతాయి

శీతోష్ణాలు వస్తూ ఉంటాయి. అలాగే పోతూ ఉంటాయి. స్థిరంగా ఉండవు. అందుకే అవి అనియతాలు. అనిత్యాలు. 'ఆగమం' అంటే రాక. 'అపాయం' అంటే పోక. 'ఆగమాపాయినాలు' అంటే రాకపోకలు గలవి అని అర్థం. స్థిరంగా ఉండవు అని భావం.

ఇద్దరు వ్యక్తులు ఒకచోట మాట్లాడుకుంటూ ఉంటారు. అదేదో సంతోషంగా విన దగిందే నని మనసు ఉబలాట పడుతుంది. వెళ్ళి అదేమిటో చెప్పమని వాళ్ళను అడుగుతాం. అబ్బే, ఏమీ లేదు లెండి! అని వాళ్ళు మొగమాట పడతారు. మనలో కుతూహలం పెరుగుతుంది. ఫరవాలేదు, చెప్పండి అని పట్టు పడతాం. ఏమీ లేదండి! ఫలానా వ్యక్తి మిమ్మల్ని ఇలా విమర్శించాడు అని చెబుతారు. అంతే. ఆ క్షణం నుండి గాలివానకు అరటిచెట్టు లాగా మన మనస్సు ఊగి పోతుంది. దాని ప్రభావం మనస్సు మీద కొంత కాలం అలాగే ఉంటుంది. జీవితం ఇలాగే ఉంటుంది.

ఏవి ఎప్పుడు ఎలా వస్తాయో తెలియదు. వచ్చే వాటిని ఆపలేము. అర్థం చేసుకుంటూ పోవాలి. ఎవరు మనసుతో వాళ్ళు ఆలోచిస్తారు. ఇతరుల ఆలోచనల్ని మన మనసు మోస్తూ పోతే, ఆ తరువాత ఒక దశలో మన మనస్సును మనమే భరించ లేక పోతాం. సదవగాహనను ఏర్పరచు కోవాలి. సహనాన్ని పెంచుకోవాలి. ఎందుకంటే, ఏవేవో వస్తూ ఉంటాయి. అలాగే పోతూ ఉంటాయి.

మోపే వారు నిందలు ఎందరో
మోసే వాడివి కాబోకు
కాకి కూతలు ఎవరికి మధురము?
కోకిల రవమే కమనీయము
సహనమె సంపద పగయే ఆపద
సద్గతి కిదియే సోపానము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అంటూ రామజోగి చిట్కాలలో చైతన్య సందేశం.

వచ్చేవి వస్తాయి. పోయేవి పోతాయి. అవి ఎలాగైనా ఉంటాయి. వచ్చేవి చెప్పి రావు. పోయేవి భుజం తట్టి పోవు. ఏవి ఎలా ఉన్నా మనకు నష్టం లేదు. మనం ఎలా ఉండాలో మనం నిర్ణయించు కోవాలి.

పరిస్థితులు మన అధీనంలో ఉండవు. కాని, ప్రవర్తన మన అధీనమే. అన్నీ వెన్నెల రాత్రులే ఉండవు. చీకటి రాత్రులు కూడా ఉంటాయి. వెన్నెలలో విహరించాలి. చీకటిలో దీపం వెలిగించు కోవాలి. అలా జీవించ గలిగితే ద్వంద్వాలు మనస్సుపై దాడి చేయలేవు. బ్రతుకులో అందాలు దూరము కావు. ఇదంతా అవగాహన లోనే స్థిరపడాలి. ఓర్చుకొనే దెలాగో మెల్లగా నేర్చుకోవాలి. అదే తితిక్ష.

ఏవి వచ్చినా పోయేందుకే వస్తాయి. అందుకనే వాటిని భగవానుడు 'ఆగమాపాయినాలు' అంటున్నాడు. అంతేకాదు, ఎంతో కాలం ఉండవు కనుక 'అనిత్యాలు' అని కూడా అంటున్నాడు. వాటి మీద మనకు నియంత్రణ లేదు. అలాగే వాటికి నిలకడ కూడా లేదు. పట్టించు కుంటేనే పట్టి పీడిస్తాయి. అర్థం చేసుకుంటే ఆనవాళ్ళు కూడా మిగలవు.

మబ్బు లొచ్చాయి పోయాయి వచ్చినట్లే
రాకపోకలు లేక గగనము వెలుగుచుండె
జగతి మబ్బు పోయె గగనమై ఉంటివయ్య
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని విబూది పండ్లు మనస్సును అలరిస్తాయి.

వగచకుండా కాచుకో

రాకపోకలతో విసిగించే అనిత్యాలను అవగాహనతో వీక్షిస్తూ సహించడమే తితిక్ష. ద్వంద్వాలు ఏవైనా అనిత్యాలే కనుక వాటి విషయంలో పొంగిపో నవసరం లేదు. అలాగే క్రుంగిపో నవసరం లేదు.

తితిక్ష అంటే దుఃఖపడుతూ భరించడం కాదు. ఆవేదనతో సహించడమూ కాదు. అవగాహనతో పరిస్థితిని అవలోకించి, మనస్సులో ఏ విధమైన ప్రతిచర్యలు లేకుండా, వచ్చే వాటికి స్వాగతం పలుకుతూ, పోయే వాటికి వీడ్కోలు చెబుతూ చలించ కుండా ఉండటమే తితిక్ష (**శీతోష్ణ సుఖదుఃఖాది సహిష్ణుత్వం తితిక్షా!**).

ఈ శ్లోకంలో అర్జునుని రెండు పేర్లతో సంబోధించాడు శ్రీకృష్ణుడు. ద్వంద్వాలను సహించాలి అనే సంకేతా న్నివ్వడానికి రెండు పేర్లతో పిలిచాడేమో! లేక, పేరున్న వాడివి, వదేసుకోకు అని చెప్పడానికో!

తల్లి వైపు నుండి పిలుస్తూ, **కౌన్తేయా!** అన్నాడు. కుంతీకుమారా! అంటూ తల్లిని జ్ఞాపకం చేశాడు. తండ్రి వైపు నుండి పిలుస్తూ ***భారతా!*** అన్నాడు. జ్ఞానంలో రమించేవాడా! అంటూ తండ్రిని స్మృతికి తెచ్చాడు.

తల్లి యైన కుంతీదేవి ఎన్నో బాధల్ని అవగాహనతో సహించింది. తితిక్షకు ప్రతిరూపంగా శోభించింది. ధర్మాత్ముడు, పుణ్యాత్ముడు అయిన పాండురాజు తపోనిష్ఠా గరిష్ఠుడై అనేక సందర్భాలలో తితిక్షకు మారు పేరుగా భాసించాడు. అర్జునా! అలాంటి పుణ్య దంపతులకు సంతానంగా జన్మించావు. తితిక్షను అలవరచుకొని వారి బిడ్డ వనిపించుకో! మాతాపితల పేరును నిలబెట్టు అని భావించి, అలా పిలిచాడేమో! ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. మాధవుని మనస్సు మానవులకు చిక్కుతుందా! చిక్కితే అది ప్రసాదమే. అనుగ్రహమే. వాస్తవానికి వాసుదేవుని మాట లోని మర్మం వాసుదేవుడికే తెలియాలి. లేదా ఆయన స్వరూపమే అయిన వ్యాసదేవునికే తెలియాలి. అంతే.

*తితిక్షాపరునికి లభించే ఫల మేమిటో చెబుతున్నాడు. శీతోష్ణ సుఖదుఃఖాలను సహించే వానికి ఏమవుతుందో వినిపిస్తున్నాడు (**శీతోష్ణాదీన్ సహతః కిం స్యాత్ ఇతి శృణు**).*

యం హి న వ్యథయ న్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖసుఖం ధీరం సోఽ మృతత్వాయ కల్పతే ॥ 15

యం-హి-న-వ్యథయంతి-ఏతే-పురుషం-పురుషర్షభ
సమదుఃఖసుఖం-ధీరం-సః-అమృతత్వాయ-కల్పతే

పురుషర్షభ =ఓ పురుషశ్రేష్ఠా!
ఏతే =ఇవి
సమదుఃఖసుఖం =సుఖ దుఃఖములను సమంగా చూచు
ధీరమ్ =ధీరుడైన
యం పురుషమ్= ఏ పురుషుణ్ణి

న వ్యథయంతి = కష్ట పెట్టవో
సః హి = అతడే
అమృతత్వాయ = మోక్షానికి
కల్పతే = అర్హుడగును

పురుషశ్రేష్ఠుడవగు ఓ అర్జునా! సుఖదుఃఖముల యందు సమబుద్ధి కలిగిన ఏ ధీరపురుషుణ్ణి ఈ మాత్రాస్పర్శలు బాధించలేవో అట్టివాడు మోక్షమును పొందుటకు అర్హుడు.

వ్యాఖ్య

ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో సంగమించి నపుడు శీతోష్ణాలు, సుఖదుఃఖాలు కలుగు తున్నాయి. అవే మానవులను సుఖదుఃఖాల ఊబిలోకి దించి కష్టపెడుతూ ఉంటాయి (*వ్యథయన్తి*). కాని, తితిక్ష కలిగి శీతోష్ణ సుఖదుఃఖాలను సమంగా భావిస్తూ, అవగాహనతో సహించే వివేకవంతుణ్ణి అవి బాధించలేవు (*న వ్యథయన్తి*).

రెండూ ఒక్కటే

సాధారణంగా అందరూ సుఖానికి అనుకూలంగా ఉంటారు. అలాగే దుఃఖానికి ప్రతికూలం గానూ ఉంటారు. అనుకూలమైన సుఖంలో ప్రీతిని కనబరుస్తూ ఉంటారు. ప్రతికూలమైన దుఃఖంలో అప్రీతిని ప్రదర్శిస్తూ ఉంటారు. సుఖంలో, సుఖ కారణాలలో రాగం కలిగి ఉంటారు. దుఃఖంలో, దుఃఖ కారణాలలో ద్వేషాన్ని కుమ్మరిస్తూ ఉంటారు.

సుఖదుఃఖాలను సమంగా చూస్తూ సహించే ధీరపురుషులు రాగద్వేషాల నుండి విడిపడి ఉంటారు. మాత్రాస్పర్శల వల్ల ఏర్పడే ద్వంద్వాలు వారిని కదిలించ లేవు (*న చాలయన్తి*). వారికి వ్యథను కలిగించ లేవు (*న వ్యథయన్తి*).

సుఖదుఃఖాలు రెండూ మనో వికారాలే. వాస్తవానికి వీటిలో సుఖం సుఖంగా లేదు. దుఃఖం దుఃఖంగా లేదు. ఒక వ్యక్తికి సుఖంగా ఉండేది మరొక వ్యక్తికి దుఃఖంగా ఉంటుంది. అంతేకాదు. ఒక వ్యక్తికి ఒక దశలో, ఒక కాలంలో ఏవైతే సుఖాలుగా అనిపిస్తాయో అదే వ్యక్తికి మరొక దశలో, మరొక కాలంలో అవి సుఖాలు కాకుండా పోతాయి. దుఃఖాలు కూడా అలాగే ఉంటాయి. అందుకే సుఖదుఃఖాలు మనోవికారాలు. ఎప్పుడూ ఉండవు. ఉన్నా ఒకే లాగా ఉండవు. వచ్చిపోతూ ఉంటాయి. ఒకసారి సుఖం రూపంలో వచ్చింది మరొకసారి దుఃఖం ముసుగు వేసుకొని వస్తుంది. కనుక అవి అనిత్యాలు. అనిత్యాలు కనుక అంతఃకరణ వికారాలే గాని ఆత్మ ధర్మాలు కావు.

ధీమంతుడే శ్రీమంతుడు

శీతోష్ణ సుఖదుఃఖాలు అనే ద్వంద్వాలు ఏ మహాపురుషుని కలత పెట్టలేక పోతాయో, అతడే ధీమంతుడు

(*ధీరం*). ధీరుడు. *ధియం* అంటే బుద్ధి. **రాతి** అంటే నిగ్రహించు వాడు. కనుకనే ధీరుడు. ఆత్మయే నిత్యమని గ్రహించిన వాడు. ఈ అధ్యాయం పదకొండవ శ్లోకంలో (గీతోపదేశ ప్రారంభ శ్లోకం) పండితుడు అని కీర్తింప బడినవాడు ఈ ధీరుడే. ధీమంతుడే. ఆత్మస్థుడే.

శీతోష్ణాలు దేహాన్ని కుదుపుతాయి. ధీమంతుని చలింప చేయలేవు. కారణం, అతడు దేహస్థుడు కాడు ఆత్మస్థుడు. అనిత్యమైన స్థూల శరీరము యొక్క ప్రభావానికి లోను గాని వాడు.

సుఖదుఃఖాలు మనస్సును విచలితం చేస్తాయి. ధీరపురుషుని కదిలించ లేవు. కారణం అతడు చిత్తస్థుడు కాడు. ఆత్మస్థుడు. అనిత్యమైన సూక్ష్మ శరీరం యొక్క ప్రతాపానికి లొంగని వాడు.

ద్వంద్వాలలో అతడు సముడు. రెండూ అతనికి ఒక్కటే. తుల్య భావంతో తన్మయమైన వాడు. ఏది ఉన్నా కదలడు. ఏది లేకపోయినా కలవర పడడు. అవి ఉన్నా లేనివే యని అతని భావం. అదే తుల్య భావం.

స్థూలమైనా, సూక్ష్మమైనా రెండూ అనిత్యాలని అతడికి తెలుసు. అందుచేత వాటి ప్రభావం అతని మీద పడదు. మండుతున్న పొయ్యి మీద నీళ్ళకుండను ఉంచుతాము. కొంత సేపటికి కుండ బాగా కాగుతుంది. పట్టుకుంటే కాలుతుంది. అలాగే కుండ లోని నీళ్ళు సలసల కాగుతాయి. పైన పడితే కాల్చుతాయి.

పొయ్యి లోని మంట కుండను కాల్చింది. నీళ్ళను కాచింది. కాని, కుండ లోని ఆకాశాన్ని కాల్చ గలిగిందా? పేల్చ గలిగిందా? అందుకే ఆకాశాన్ని అసంగం అంటాము.

సుఖదుఃఖాలు కూడా కుండ లాంటి స్థూలదేహాన్ని, నీళ్ళ లాంటి సూక్ష్మదేహాన్ని కలత పెట్టగలవే గాని, ఆకాశం వంటి ఆత్మను అంట లేవు. వెంట రాలేవు. ధీరుడు ఆత్మస్థుడు. అందుకే ఆ మహితాత్ముని నిత్యాత్మదర్శన నిష్ఠుడు అని భాష్యంలో అభివర్ణించారు శ్రీ ఆది శంకరులు (**సః నిత్యాత్మదర్శననిష్ఠః**).

ఉంటే ఏమి? అంటక పోతే
మంటలు మాయలు మనిషికి లేవు
ఎక్కడ లేదు ఆకాశము
అంటుట కివ్వదు అవకాశము
ఆత్మ ఎప్పుడూ అసంగము
ఎందుకు నీకు గుణసంగము?
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కాలులో అద్వయాత్మ అద్భుత వర్ణనము.

ద్వార దర్శనం

సుఖదుఃఖాలలో కలత చెందని వాడు, ద్వంద్వాలలో అందంగా అద్వయాన్ని దర్శించే ధీరపురుషుడు అమృతత్వానికి, అంటే మోక్షానికి అర్హుడు అవుతున్నాడు అని ద్వంద్వాలను సహించడం వల్ల కలిగే ఫలాన్ని చెబుతున్నాడు.

ఏదైతే అమృతమో, అది అభయ స్థానము. ఏదైతే అభయమో అది బ్రహ్మస్థానము అని శ్రుతి ప్రబోధం (*ఏత దమృతం ఏతదభయం ఏతద్బ్రహ్మ ఇతి శ్రుతి వచనం*). అట్టి బ్రహ్మము నిర్దోషం కనుక సమం అని పిలువ బడింది అన్నది భగవద్గీత (*నిర్దోషం హి సమం బ్రహ్మ*).

అలాంటి సమస్థితిని దర్శించువాడు ధీరపురుషుడు. అలాంటి ధీరపురుషుడు మోక్షానికి అర్హుడు అవుతున్నాడు ***(సోఽమృతత్వాయ కల్పతే - సః అమృతత్వాయ మోక్షాయ, కల్పతే సమర్థః భవతి)*** అన్నాడు గీతాచార్యుడు.

మోక్ష ద్వారం

విషయేంద్రియ సంయోగము ఎవరిని కలత పెట్టలేదో, సుఖదుఃఖాలలో ఎవడు సమదృష్టితో ఉన్నాడో అట్టి ధీరపురుషుడు మోక్షానికి అర్హుడు అంటున్నారు కదా! మరి, అలాంటప్పుడు, మోక్షానికి సాధన చతుష్టయ సంపద కాకుండా ఒక్క తితిక్షుత్వమే అధికారి లక్షణంగా చెప్పినట్లు అయింది కదా! ఇది సరియైన దేనా?

తితిక్ష అనేది శమదమాదులలో ఒకటి. తితిక్ష ఒక్కటే మోక్ష సాధనమైన జ్ఞానమును పొందుటకు సరిపోదు. సుఖదుఃఖాలలో సమంగా ఉండట మనే తితిక్ష శమదమాదులకు ఉపలక్షణము. అలాగే ధీరమ్ ***(ధీమంతుడు)*** అనే పదము వివేక వైరాగ్యాదులకు ఉపలక్షణంగా చెప్పబడింది. కనుక వివేక, వైరాగ్యాదులతో కూడిన శమ దమాదులు మోక్షార్హతకు సాధనాలుగా చెప్పబడ్డాయి. అర్జునుడు ముముక్షుత్వముతో శ్రేయస్సును వాంఛించాడు కనుకనే గీతాచార్యుడు బోధను అనుగ్రహిస్తున్నాడు. పైగా **పురుషర్షభ** అని అర్జునుని శ్రేష్ఠత్వమును స్పష్టం చేశాడు.

'పురుషర్షభ' అనే సమాసము నందు 'ఋషభః' శబ్దము ఉత్తర పదమై, పూర్వ పదమైన 'పురుష' శబ్దము యొక్క శ్రేష్ఠత్వమును స్పష్టం చేస్తూ ఉంది ***(శ్రేష్ఠార్థ గోచరః).*** ఈ విధంగా సాధన చతుష్టయ సంపన్నుడైన అధికారి మోక్ష సాధనమైన 'త్వం' పదార్థ జ్ఞానమును పొందుటకు అర్హత కలవాడై అమృతత్వానికి సమర్థుడు అవుతున్నాడు ***(మోక్షాయ కల్పతే, సమర్థః భవతి).***

అర్జునా! దుఃఖింప దగని వారి కోసం దుఃఖిస్తున్నావు అని పదకొండవ శ్లోకంలో ఉపదేశాన్ని ప్రారంభించిన గీతాచార్యుడు ఆత్మానాత్మ వివేకాన్ని ఇంతవరకు ఐదు శ్లోకాలలో చర్చించాడు. అనాత్మ రూపాలన్నీ ఎలా అనిత్యాలో ఇంతవరకు చెప్పడం జరిగింది. అది సరిపోదు. ఈ సత్యాన్నే తాత్త్విక దృష్టితో విశద పరచేందుకు సాంప్రదాయక సదసద్వివేకాన్ని శాస్త్రీయంగా బోధించ వలసిన అవసరం ఉంది. అక్కడే బోధకు పూర్ణత్వము. ఆ కార్యాన్ని ప్రారంభిస్తున్నాడు శ్రీకృష్ణ భగవానుడు.

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయో రపి దృష్టోఽన్త స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥ 16

న-అసతః-విద్యతే-భావః-న-అభావః-విద్యతే-సతః
ఉభయోః-అపి-దృష్టః-అంతః-తు-అనయోః-తత్త్వదర్శిభిః

అసతః	= లేని దానికి		అనయోః	=	ఈ
భావః	= ఉనికి		ఉభయోః అపి	=	రెండిటి యొక్క
న విద్యతే	= లేదు		అంతః తు	=	నిర్ణయము
సతః	= ఉన్న దానికి		తత్త్వదర్శిభిః	=	తత్త్వజ్ఞుల చేత
అభావః	= లేకపోవుట		దృష్టః	=	చూడ బడింది
న విద్యతే	= ఉండదు				

లేనిది ఉండేది లేదు. ఉన్నది లేకుండా ఉండదు. ఈ రెండిటి యొక్క యదార్థ స్వరూపాన్ని చూచే వారే జ్ఞానులు.

వ్యాఖ్య

ఉండని దానికి ఉనికి లేదు

ఆత్మ నిత్యము అని గ్రహించాము. నిత్యము అంటే ఎప్పుడూ లేకుండా ఉండేది కాదు అని అర్థం. ఇప్పుడు, అప్పుడు, ఎప్పుడూ అనే పదాలన్నీ కాలాన్నే సూచిస్తున్నాయి. కనుక ఆత్మ సదా ఉంటుంది అని చెప్పినా, సదా అనే పదము కాల వాచకము కనుక కాలమంతా ఉండేది అని అర్థం. అంటే, కాలము లేనపుడు లేనిది అని భావం. అలాంటిది నిత్యము కాలేదు. కనుక, కాలంలో ఉంటూ కాలాతీతంగా కూడా ఉండేది ఏదో అది నిత్యము. దానినే ఈ శ్లోకంలో 'సత్' అనడం జరిగింది. సత్ అంటే ఆత్మ. అదే నిత్యము. నిత్యమైన సదాత్మ లేక పోవడం అనేది లేదు ***(సతశ్చ ఆత్మనః అభావః అవిద్యమానతా న విద్యతే).***

'సత్'కు వ్యతిరిక్త మైనది ఏదో అది 'అసత్'. కాలాతీతంగా ఉండేది సత్ అయితే, కాలాతీతంగా ఉండ లేనిది, కాలంలో మాత్రమే ఉండేది అసత్ అవుతుంది. సత్ అనేది నిత్యం కనుక అసత్ అనేది అనిత్య మవుతుంది. కాలపరిధి లోకి ఏది వచ్చినా అది అసత్తే, అనిత్యమే.

అందుచేతనే విషయేంద్రియ సంయోగము వలన కలిగే శీతోష్ణ సుఖదుఃఖాలు ఆగమాపాయినాలు, అనిత్యాలు అన్నాడు గీతాచార్యుడు ***(ఆగమా పాయినోఽనిత్యాః తాన్ తితిక్షస్వ భారత).***

శీతోష్ణాలు కారణాన్ని కలిగి ఉన్నాయి. కనుక అవి అసత్తు. శీతోష్ణాలను ప్రామాణికంగా పరీక్షించి నపుడు వాటికి ఉనికి ఉన్నట్లు గోచరించదు. ఒక పాత్ర వేడిగా ఉంది. అది ఉష్ణము. అది అలా ఉండటానికి అగ్ని కారణము. అంతేకాదు. తాను వేడిగా ఉన్నట్లు పాత్ర వ్యక్తీకరించ లేదు. పాత్రకు స్ఫూర్తి లేదు. పాత్ర వేడిగా ఉంది అని దానిని స్పృశించిన మనం చెబుతాము. మన చర్మానికి వేడి తగిలింది కనుక పాత్ర వేడిగా ఉంది అంటాము. ఒకవేళ చర్మము స్పర్శను కోల్పోతే పాత్ర యొక్క వేడి మనకు స్ఫురించదు. వేడి ఉన్నా లేనిదే అవుతుంది. కనుక, ఉష్ణము అనేది అగ్ని మీద, మన చర్మము మీద, చర్మాన్ని తెలుసుకొనే చిత్తము మీద ఆధారపడి ఉంది. మరొక కారణాన్ని ఎప్పుడైతే కలిగి ఉందో, ఆ కారణం లేనపుడు కార్యము లేనిదే అవుతుంది. కనుక అది అసత్. అంటే, స్వతంత్ర మనుగడను కలిగి ఉన్నది కాదు, స్వప్రతిష్ఠంగా లేదు అని అర్థం.

ఇప్పుడు పాత్ర వేడిగా ఉన్నా, కొంత సేపటికి మళ్ళీ చల్ల బడుతుంది. కనుక కార్యము ఏదైనా వికారమే. వికారము కలిగింది ఏదైనా మార్పు చెందేదే. మార్పు చెందే దానికి స్వతంత్ర సత్తా లేదు. కార్యము వికారము. వికారము కలిగింది మారి పోతుంది ***(వికారో హి సః వికారశ్చ వ్యభిచరతి).*** నియతంగా అంటే, ఒకే రూపంలో ఉండేది అవ్యభిచారి. అదే సత్. అలా ఉండ లేనిది అనియత మైనది కనుక వ్యభిచారి. అదే అసత్.

కార్యాలన్నీ అసత్తులే. కారణం కన్నా భిన్నంగా ఉండ లేనివి. స్వతంత్ర మనుగడకు నోచు కోనివి. పుట్టక ముందు లేనివి. గతించిన తరువాత ఉండ లేనివి. అంటే, ఆ రెండు కాలాలలో గోచరించనివి. కనుక అసత్యాలు. అనిత్యాలు.

మట్టికుండనే తీసుకుందాం. పరీక్షించి చూచి నపుడు కారణమైన మట్టి కన్నా అన్యమైనది అక్కడ ఏదీ కనిపించడం లేదు. కార్యం లోని సత్త్వం కారణం లోనిదే. సత్త్వం అంటే ఉండుట అనే లక్షణము. కార్యమైన కుండలో ఉన్న దేమిటి? మట్టి. కుండకు కారణమైన దానిలో ఉన్న దేమిటి? మట్టే. మట్టిలో ఉన్నదే (సత్త్వం) కుండలో ఉంది. కారణంలో ఉన్నదే కార్యంలో ఉంది.

కుండ తయారైంది అన్నప్పుడు దానిలో 'ఉండుట' అనే ధర్మం ఉంది. 'మట్టికుండ ఉంది'. ఈ వాక్యంలో 'ఉంది' అనేది సత్త్వం. ఆ తరువాత కుండ పగిలి పోయింది. అప్పుడు కుండ లేదు. 'మట్టికుండ ఉంది' అనే

వాక్యంలో కుండ పోయింది కనుక, ఇప్పుడేముంది? కుండను తప్పించి వాక్యాన్ని చూడండి తెలుస్తుంది. 'మట్టి ఉంది'. కనుక కుండ అనే కార్యంలో 'ఉంది' అనేది ఏదయితే ఉండిందో, కుండ పగిలిన తరువాత ఆ 'ఉంది' అనేది ఎక్కడుంది? కారణం లోనే , అంటే మట్టి లోనే ఉంది. అందుకే 'కుండ' పగిలినా 'మట్టి' ఉంది. ఇక కుండ ఏమిటి? కుండకు సత్యం ఏమిటి? అస్తిత్వం ఏమిటి? కుండ అనే పదం కన్నా వేరుగా కుండకు అస్తిత్వం లేదు. రూపం ఉండింది. రూపానికి నామం ఉండింది. రూపం పోయింది. రూపంతో పాటు నామం కూడా పోయింది. నామరూపాలు పోయాయి. నామరూపాలు ఉండి నపుడు ఏదయితే ఉండిందో, అది మాత్రం పోలేదు. ఉంది. ఎలా ఉంది? కారణంగా ఉంది. కారణంలో ఉంది. కనుక నామరూపాలకు ఉనికి లేదు. ఈ విషయాన్నే ఛాందోగ్య శ్రుతి ధ్రువ పరచింది.

వాచారంభణో వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం

కుండ అనేది ఒక రూపానికి నామం. ముంత అనేది మరొక రూపానికి నామం. నామరూపాలు నిత్యం కావు. సత్ కావు. మృత్తిక అంటే మట్టి. మట్టే సత్యం. అదే సత్. సత్ త్రికాల అబాధితం. అంటే మూడు కాలాల్లో నిషేధించను వీలు పడనిది సత్. అసత్ అనేది బాధితం. అంటే కాలంలో నిషేధింప బడేది అని అర్థం. సత్ లేకపోతే నామరూపాలకు అస్తిత్వం లేదు.

చరణము : ***ముంత మూకుడు బానలు కుండలు - నామ రూపాల పోకడలే***
మట్టి పాత్రలకు మన్నే అండ - జగమంతటికి నీవే నిండా

పల్లవి : ***ఎన్నో ఎన్నో రూపాలు - అన్నీ ఆరే దీపాలు***
మారని రూపం - ఆరని దీపం
భువిలో దివిలో నీవే సకలం *॥ ఎన్నో ॥*

కుండలు అమ్మే వ్యక్తి వద్దకు వెళ్ళి, ఆ కుండను ఎంత కిస్తావు? అని అడిగాడు ఒక వ్యక్తి. పది రూపాయలండి అన్నాడు అమ్మేవాడు. ఐదు రూపాయల కిస్తావా? అన్నాడు కొనేవాడు.

కుండే కదా మీకు కావలసింది? అని ప్రశ్నించాడు అమ్మేవాడు. అవును అన్నాడు కొనేవాడు. మట్టి కాదు కదా? అని మళ్ళీ అడిగాడు అమ్మేవాడు. కాదు అన్నాడు కొనేవాడు. సరే, మట్టికుండ పది రూపాయలు. మీకు కుండే కావాలి, మట్టి వద్దు అన్నారు కనుక, మట్టిని ఉంచేసి కుండను తీసుకుపోండి. అయిదు రూపాయలే ఇవ్వండి చాలు అన్నాడు అమ్మేవాడు. ఇవ్వడానికి ఇబ్బంది లేదు కాని, కొని పట్టుకుపోయే దేమిటో కొనే వానికి అర్థం కాలేదు.

అసత్ అనేది కార్యం. వికారయుతం. పుట్టక ముందు ఉండదు. గిట్టిన తరువాత ఉండబోదు. స్వతంత్ర సత్తా లేనిది. స్వప్రతిష్ఠం కానిది. తనకు మరొక కారణాన్ని కలిగి ఉంది. మరొక దానిపై ఆధారపడి ఉంది. అది అసత్.

ఆదౌ అంతేచ యన్నాస్తి వర్తమానేఽ పి తత్తథా

'ఆద్యంతముల యందు ఏదయితే లేదో అది వర్తమానంలో ఉన్నా లేనిదే' అని మాండూక్యకారికలలో శ్రీ శంకరుల వారి పరమ గురువు గౌడపాదాచార్యుల వారు తెలిపారు.

ఉన్న దానికి లేమి లేదు

స్వతంత్ర సత్తా లేనిది, కారణాన్ని కలిగి ఉన్నది, మరొక దానిపై ఆధారపడి ఉన్నది అసత్తు అని

గ్రహించాము. దీనికి వ్యతిరిక్త మైనది సత్తు. అంటే స్వతంత్ర మనుగడ కలది, తన కంటూ ఒక కారణము లేనిది, మరొక దానిపై ఆధార పడనిది అని అర్థం.

కార్య కారణాలను విశ్లేషించి అర్థం చేసుకుంటే కార్యం ఉంది అంటే, దానికి కారణం ఉండాలి. కార్యం ***ఉంది.*** కారణం ***ఉంది.*** ***ఉంది*** అనేది కార్యకారణాలు రెండిటిలో ఉంది.

కార్యమైన కుండ ***ఉంది.*** కారణమైన మట్టి ***ఉంది.*** ***ఉంది*** అనేది రెండిటిలో ఉంది. కార్యమైన కుండ పగిలి పోతుంది. కుండ పోయినా, 'కుండ ఉంది' అనే వాక్యంలో ఉండిన ***ఉంది*** పోలేదు. ఆ ***ఉంది*** అనేది 'మట్టి ఉంది' అనే వాక్యంలో చేరిపోయి ఉంది.

కార్యమైన కుండ ఉన్నప్పుడు, కుండలో ఉండుట అనే ధర్మం (సత్యం) ఏదయితే ఉండిందో, అది కుండ పగిలి పోయిన తరువాత కుండకు కారణమైన మట్టిలో కనిపిస్తూ ఉంది.

'మట్టి కుండ ఉంది' అనేది వాక్యము. ఈ వాక్యంలో మట్టి - కుండ - ఉంది అనే మూడు పదాలు ఉన్నాయి. కుండ నశించగానే 'కుండ' అనే పదం పోయింది. మట్టి - ఉంది, అనే రెండు పదాలతో 'మట్టి ఉంది' అనే వాక్యమే ఉంది.

కుండ నశించగానే, దాని సత్యం మట్టిలో గోచరిస్తూ ఉంది. కార్యమైన కుండ నశించినట్లే, కారణమైన మట్టి కూడా నశించి నపుడు, మట్టి కార్య మవుతుంది. ఆ మట్టికి కారణమైన జలంలో సత్యం గోచరిస్తుంది. జలం నశించి నపుడు, దానికి కారణమైన వాయువులో సత్యం కనిపిస్తుంది. వాయువు నశిస్తే, దానికి కారణమైన ఆకాశంలో సత్యం చేరి పోతుంది. ఆకాశం లేని ప్రళయ కాలంలో ఆకాశానికి కారణ మైనది ఏదో దానిలో సత్యం ఉంటుంది. కనుక ఉండుట అనేది (సత్యం) లేకుండా పోవడం లేదు. ఉన్నది లేకుండా పోయేది లేదు ***(నాఽ భావో విద్యతే సతః, సతః అభావః న విద్యతే).***

ఆకాశం దాని నుండే పుట్టింది ***(తతః ఆకాశః సంభూతః).*** ఆకాశం పుట్టక ముందు ఆకాశానికి కారణంగా ఏదయితే ఉండిందో దాని లోనే ఉండుట అనేది ***(సత్యం)*** ఉండింది. ఆకాశానికి ముందు ఉన్న సద్వస్తువు ఏదో అదే అద్వితీయ పరబ్రహ్మము. అదే **సత్తు.**

సదేవ సౌమ్య ఇద మగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయం బ్రహ్మ నేహ నానాఽ స్తి కించన

నాయనా (సౌమ్య!) ఈ సృష్టికి పూర్వము ***(ఇదం అగ్రే, సృష్టేః ప్రాక్)*** 'సత్తు' ఒక్కటే ఉండింది. అది రెండు కాని ఏకమై ఉండింది. అదియే బ్రహ్మము. అందులో రెండవది అనేది లేనే లేదు అన్నది ఛాందోగ్య శ్రుతి.

అదే సృష్టికి కారణము. ఆ బ్రహ్మము యొక్క సంకల్పము తోనే సృష్టి అవిర్భవించింది. సృష్టి కార్య మైంది. కార్యమైన సృష్టి కారణమైన బ్రహ్మము కన్నా వేరుగా లేదు. సృష్టి ఉంది అన్నప్పుడు, సృష్టిలో ***ఉంది*** అనేది ఏదో సృష్టి విలీన మైనపుడు, ఆ ***ఉంది*** అనేది కారణమైన బ్రహ్మము లోనే ఉంది. అదే **సత్.**

ఆత్మవా ఇద మేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కించన మిషత్, స ఈక్షత లోకాన్ను సృజా ఇతి!

ఈ సృష్టికి పూర్వము ఆత్మ ఒక్కటే ఉండింది. అది తప్ప వేరొకటి లేనే లేదు. ఆ ఆత్మే లోకాలను (సృష్టిని) సృష్టించాలని సంకల్పించింది అన్నది ఐతరేయోపనిషత్తు.

సృష్టికి పూర్వం ఉన్నది ఏదో (సత్) అదే సృష్టి లోనూ ఉంది. కుండకు పూర్వము ఉన్నది ఏదో (మట్టి) అదే కుండ లోనూ ఉంది ***(మృత్తికేత్యేవ సత్యమ్).*** కుండ ఉంది అని మనం చెప్పినప్పుడు కూడా ఆ ఉన్నది (సత్) ఏదో అది మట్టికి సంబంధించినదే. ఈ విధంగా ప్రపంచంలో ఏది ఉంది (సత్యం) అనిపించినా,

విచారించి అర్థం చేసుకుంటే అది, ఆది కారణమైన అద్వితీయ బ్రహ్మమునకు సంబంధించినదిగా ఉంటుంది.

మట్టికుండ కుండగా అసత్. మట్టికుండ మట్టిగా సత్. ప్రపంచము ప్రపంచముగా అసత్. ప్రపంచము పరమాత్మగా సత్. ఇక్కడ అసత్ అంటే అసలే లేనిది అని కాదు. మరొక దానిపై ఆధార పడినది, స్వతంత్ర మనుగడ లేనిది అని ఇప్పటికే మనం అర్థం చేసుకొని ఉన్నాం. అదే అసత్. అదే మిథ్య. అదే మాయ.

మాయామయము జగమంతా
మమకారాలే మనసంతా
ఉన్నది చూడరు ఎవరైనా
లేనిదే చూస్తారు ఎపుడైనా
ఉన్నది బ్రహ్మము లేనిది జగము
తెలిసే దెపుడు ఈ నిజము?
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అంటూ రామజోగి చిట్కాలలో సదసద్వివేకం రాగాలాపన చేసింది.

ఉన్నదే ఉంది (సత్). లేనిది ఉన్నట్లు ఉంది (అసత్). ఈ రెండూ బుద్ధిలో చేరిపోయి ఉన్నాయి. ఇవే రెండు బుద్ధులు. అందువలన సదసద్వివేకం చేసి తీరాలి.

సర్వత్ర బుద్ధి ద్వయోపలబ్ధేః సద్బుద్ధిః అసద్బుద్ధిః ఇతి

అంతట 'సత్ బుద్ధి', 'అసత్ బుద్ధి' అని బుద్ధి ద్వయం తెలుస్తూ ఉంది. సద్విషయానికి సంబంధించిన బుద్ధి సద్బుద్ధి. సద్బుద్ధి సర్వత్ర అనుగతమై ఉంటుంది. మార్పు చెందదు. వికారానికి లోను కాదు (***యద్విషయా బుద్ధిః న వ్యభిచరతి తత్ సత్***). అలాగే అసద్విషయానికి సంబంధించిన బుద్ధి అసద్బుద్ధి. ఇది వికారయుతము. మార్పు చెందుతూ ఉంటుంది (***య ద్విషయా బుద్ధిః వ్యభిచరతి తత్ అసత్***).

సన్ ఘటః. అనే చోట రెండు శబ్దాలు వినిపిస్తున్నాయి. 'సన్' ఒకటి. 'ఘటః' మరొకటి. 'సన్' అంటే ఉన్నది అని అర్థం. అదే సత్. 'ఘటః' అంటే కుండ అని అర్థము. పదాలు రెండైనా అవి ఒకే వస్తువును సూచిస్తున్నాయి.

కుండ పగిలిపోతే (***ఘటే వినష్టే***). కుండ బుద్ధి నశిస్తుంది (***ఘట బుద్ధిః వ్యభిచరతి***). అంతేగాని సద్బుద్ధి నశించదు. కుండ ఉంది అన్నప్పుడు 'ఉంది' అనే దానికి వేరుగా కుండ లేదు. కుండ పోయినా, 'ఉంది' అనేది ఉంది. 'ఉంది' అనేది అన్నిచోట్ల ఉంది. ఇదే అనుగతం. పువ్వు ఉంది. దీపం ఉంది. ఏనుగు ఉంది. కుక్క ఉంది. భార్య ఉంది. 'ఉంది' అనేది అంతటా ఉంది. కనుక 'కుండ ఉంది' అనే వాక్యంలో 'ఉంది' అనేది సద్బుద్ధి. 'కుండ' అనేది అసద్బుద్ధి. సద్బుద్ధి నిత్యము. అసద్బుద్ధి అనిత్యము. వికారయుతము. మిథ్యాభూతము.

నీలోత్పలం అన్నప్పుడు నీలమ్, ఉత్పలమ్ అనే రెండు పదాలలో 'నీలమ్' అనేది విశేషణము. 'ఉత్పలమ్' అనేది విశేష్యం. విశేష్యాలైన ఉత్పలాదులు ఉండటం వల్లనే నీలం అనే విశేషణాన్ని చెప్పడం జరిగింది.

నీలోత్పలం వాడి రేకులు ఊడి నపుడు, ఉత్పలం ఉండదు. కానీ నీలం ఉంటుంది. నింగిలో నీలం ఉంది. సాగరంలో నీలం ఉంది. నీ కళ్ళల్లో నీలం ఉంది. వస్త్రంలో ఉంది. జలంలో ఉంది. ఉత్పలం (అసత్) పోయింది. నీలం (సత్) మరొక చోట కనిపిస్తోంది. ఇది సదసద్వివేకం.

నీలోత్పలం మనే వస్తువు నందు నీలబుద్ధి ఉంది. అలాగే ఉత్పలబుద్ధి కూడా ఉంది. నీలమ్, ఉత్పలం అనే రెండు పదాలు ఒకే వస్తువును తెలుపు తున్నాయి. పైగా, ఈ రెండు ఒక దాని కన్నా మరొకటి వేరుగా లేవు. నీలం కన్నా వేరుగా ఉత్పలం లేదు. నల్లకలువ అన్నప్పుడు కలువ నుండి రంగును ఎలా వేరు చేయగలం? ఉత్పలం నీలం కన్నా వేరు కాకుండా ఉంది అని అర్థం చేసుకోవాలి (***నీలాభిన్నం ఉత్పలం***). కాబట్టి నీల బుద్ధి సద్బుద్ధి. ఉత్పల బుద్ధి అసద్బుద్ధి.

సన్ ఘటః అన్నచోట కూడా ఇదే. ***ఘటః అస్తి***. కుండ ఉంది అంటే, ఆ 'ఉంది' అనేది ఏదో అది కుండ కన్నా వేరుగా లేదు (***సదభిన్నో ఘటః. సత్ అభిన్నః ఘటః***). 'ఉంది' అనే సత్తు కన్నా వేరుగా కుండ అనే అసత్ లేదు.

ఘట, ఉత్పలాది విశేష్యము లన్నీ వికారయుతములు. కనుక మిథ్యా భూతములు. ఉన్నట్లుగా వస్తాయి. లేనట్లుగా పోతాయి. అందుకే ఆగమాపాయినాలు. అసత్తులు కనుక అనిత్యాలు. వీటికి స్వతంత్రంగా సత్యం లేదు. వస్తుత్వము, సత్యత్వము లేదు. వీటి అర్థాలు పరమార్థంలో ఉన్నాయి.

తత్త్వ దర్శనం

దేహం 'ఉంది'. దేహం పోతుంది. 'ఉంది' అనేది ఆత్మగా ఉంది. దేహం అసత్. 'ఉంది' అనేది సత్. ఇక అన్నీ అంతే. ఆత్మ ఒక్కటే సత్. ఆత్మ కన్నా అన్యమైన వన్నీ అసత్. ఇదే తత్త్వం. ఈ రెండిటి నిర్ణయమే తత్త్వం (***ఆత్మా సత్యం తదన్యత్ సర్వం మిథ్య ఇతి తత్త్వ వివేకః***). ఈ నిర్ణయాన్ని దర్శించిన వారు తత్త్వద్రష్టలు, తత్త్వవేత్తలు (***ఉభయోః అపి అంతః తు తత్త్వ దర్శిభిః దృష్టః***).

దేహం ఉంది. కన్ను ఉంది. చెవి ఉంది. మనస్సు ఉంది. బుద్ధి ఉంది. బుద్ధి వృత్తి ఉంది. దేశం ఉంది. కాలం ఉంది. వస్తువు ఉంది. ప్రపంచం ఉంది. అజ్ఞానం ఉంది. 'ఉంది' అనేది అంతటా ఉంది. అదే సత్. అది ఎప్పుడూ మారనిది. అసత్తు లన్నీ మారుతూ ఉంటాయి. కనుక లేనిది ఉండేది లేదు (***న అసతః విద్యతే భావః***). ఉన్నది లేకుండా పోయేది లేదు (***న అభావః విద్యతే సతః***).

కుండ పగిలి పోయింది - అసత్

పగిలిన కుండ ఉంది - సత్ - ఇదే సదసద్వివేకం. లోక వ్యవహార దృష్టిలో నిత్యానిత్య వివేకంగా అర్థం చేసుకున్న దానిని ఈ శ్లోకంలో సదసద్వివేకంగా శాస్త్ర ప్రమాణంతో చెప్పుకున్నాం.

అర్జునా! ఉన్నది లేకుండా పోయేది కాదు కనుక దుఃఖించకు (***అశోచ్యానన్వ శోచస్త్వం***). లేనిది ఉండేది కాదు కనుక దుఃఖించకు (***అశోచ్యానన్వ శోచస్త్వం***). ఈ రెండిటికి సంబంధించిన వివేకము గల వారు పండితులు. వారు దేనికీ దుఃఖించరు (***గతాసూ నగతా సూంశ్చ నానుశోచన్తి పండితాః***).

ఈ విధంగా సదసద్వివేకాన్ని వివరించిన శ్రీ వాసుదేవ భగవానుడు, ఏది సత్తో అది ఎలా నశించదో ముందుగా విశదం చేస్తున్నాడు.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశ మవ్యయ స్యాస్య న కశ్చి త్కర్తు మర్హతి ॥ 17

అవినాశి-తు-తత్-విద్ధి-యేన-సర్వం-ఇదం-తతం
వినాశం-అవ్యయస్య-అస్య-న-కశ్చిత్-కర్తుం-అర్హతి

యేన	= దేని చేత	అవ్యయస్య	= నశించని
ఇదం సర్వం	= ఈ సర్వము	అస్య	= దీనికి
తతం	= వ్యాపించ బడిందో	వినాశం	= వినాశమును
తత్ తు	= దాని నైతే	కర్తుం	= చేయుటకు
అవినాశి	= నాశము లేనిదిగా	కశ్చిత్	= ఎవడును
విద్ధి	= తెలుసుకో	న అర్హతి	= అర్హుడు కాదు

ఈ జగత్తంతా ఏదయితే వ్యాపించి ఉందో, అది నశించేది కాదని తెలుసుకో. నశించని దానిని నాశనం చేసే వారు ఎవ్వరూ లేరు.

వ్యాఖ్య

అర్జునా! దుఃఖింప దగని వాళ్ళ కొరకు దుఃఖిస్తున్నావు అంటూ పదకొండవ శ్లోకంలో భగవంతుడు పలికిన ఆక్షేపణ వాక్యాన్ని సమర్థిస్తూ నిత్యానిత్య వస్తు వివేకాన్ని ఇంతవరకు బోధించాడు. లౌకిక దృష్టిలో అదొక అర్థవంతమైన విశ్లేషణము. ఆత్మ నిత్యము కనుక దుఃఖింప నవసరం లేదు. అనాత్మ అనిత్యము కనుక దుఃఖానికి అవకాశము లేదు అనే అందమైన వాదనను వినిపించాడు.

ఆత్మానాత్మ వివేకానికి శాస్త్రం అవసరం లేదు. యుక్తి, అనుభవం కూడా సరిపోతాయి. జగత్తులో అన్నీ మార్పు చెందుతూ ఉన్నాయి. అలా మార్పు చెందేవి అనిత్యాలు. అనిత్యాలు ఉన్నాయి అంటే, నిత్యమైన దేదో ఉండబట్టే అనిత్యాలు తెలుస్తూ ఉన్నాయి అనేది యుక్తితో నిర్ణయించ వచ్చు.

గురువు చెంత కూర్చొని శాస్త్రాన్ని అధ్యయనం చేయడానికి శిష్యునికి కావలసిన అర్హతలలో నిత్యానిత్య వస్తు వివేకం ఒకటి. అంటే, శాస్త్రాధ్యయనానికి ముందే అట్టి వివేకము విద్యార్థికి ఉండాలి. అలాంటప్పుడు నిత్యానిత్య వస్తు వివేకం శాస్త్ర సిద్ధాంత మెలా అవుతుంది?

నిత్యము అన్నప్పుడే ఎప్పుడూ ఉండేది అని కాల వాచకంగా గ్రహిస్తాము. వాస్తవానికి నిత్యమైన ఆత్మ కాలాతీత మైనది. కాబట్టి ఎప్పుడూ ఉన్నది అని కాకుండా ఉన్నది (అస్తి) అని చెప్పాలి. అలాగే అనిత్యాన్ని ఎప్పుడూ లేనిది అంటూ కాల పరిధి నుండి చెప్పడం కాకుండా, లేనిది (నాస్తి) అనాలి. ఉన్నది సత్తు. లేనిది అసత్తు. లేని అసత్తుకు ఉనికి లేదు. ఉన్న సత్తుకు లేమి ఉండదు. అయితే ఇంత వరకు వ్యావహారికంగా చర్చించిన నిత్యానిత్య వివేకం స్థానంలో, ప్రామాణికంగా శాస్త్ర దృష్టితో సదసద్వివేకాన్ని పదహారవ శ్లోకంలో చర్చించాడు గీతాచార్యుడు. ఇది శాస్త్రీయమైన తాత్త్విక దృష్టి.

సదసద్వివేకము అనేది గహనమైన విషయము. ముఖ్యంగా రెండవ అధ్యాయమైన సాంఖ్య యోగానికి గుండెకాయ లాంటిది. ఒక విధంగా కేంద్ర విషయ మనే చెప్పాలి. కనుక విషయ సౌలభ్యం కొరకు ఈ అంశాన్ని మరి కొంత విశదీకరించి విస్పష్టం చేయడం అవసరమని భావించాడో ఏమో, ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న పదిహేడవ శ్లోకంలో సద్విషయ చర్చను, పద్దెనిమిదవ శ్లోకంలో అసద్విషయ చర్చను చేపట్టి దివ్యంగా భాషించాడు భగవానుడు.

సర్వం విష్ణుమయం జగత్

ఈ శ్లోకంలో తత్ అనే పదం ఏదయితే ఉందో, అది పూర్వ శ్లోకంలో ప్రతిపాదించిన సత్‌కు ప్రత్యామ్నాయంగా వాడ బడింది. 'ఉన్న దానికి లేమి అనేది ఉండదు' అని ఏ సద్రూపాన్ని వివరించడం జరిగిందో, అదే ఇక్కడ సర్వ వ్యాపకము, అవ్యయము అయిన తత్ పదంగా తెలుస్తూ ఉంది. దాని చేతనే

(యేన) ఈ సమస్త జగత్తు ***(సర్వమిదం)*** వ్యాపింపబడి ఉంది ***(తతమ్)***. అంటే, ఈ ప్రపంచ మంతా సదాత్మ చేత పరివ్యాప్తమై ఉంది అని అర్థం.

విశ్వంలో ఎన్నో ఉన్నాయి. అన్నిటిలో 'సత్' వ్యాపించి ఉంది. అందుచేత అది సర్వవ్యాపి. సర్వ వ్యాపకమై ఉంది కనుక అది అవినాశి.

'ఇదం' అనేది జగత్తును సూచిస్తుంది. ఇదం సర్వం అనడం చేత యావద్విశ్వము అని తెలుస్తూ ఉంది. జగమంతా సద్వస్తువు వ్యాపించి ఉంది అని సిద్ధాంతము.

బావుంది. ఇంతకీ విశ్వము, అనగా జగత్తు సత్తా? అసత్తా? ఇందులో సందేహ మేముంది? ముందు శ్లోకంలో ఈ విషయాన్ని సమగ్రంగా చర్చించాము కదా! ప్రపంచము సత్తు కాదు. అసత్. ఎందుకని? (1)స్వతంత్ర సత్తా లేదు. (2) మరొక దానిపై ఆధారపడి ఉంది. (3) కారణ సహితంగా తెలుస్తూ ఉంది. పైగా దృశ్యంగా ఉంది. అనిత్య మైనది.

కారణం లేకుండా కార్యం ఉండదు కనుక సత్ లేకుండా అసత్ ఉండదు. అంతేకాదు. కారణం కన్నా వేరుగా కార్యం ఉండ లేదు కనుక కార్యంలో ఉన్నది ఏదో అది కారణమే. కార్యమంతా కారణమే వ్యాపించి ఉంటుంది.

వ్యాప్య వ్యాపక సంబంధములో కూడా వ్యాపకంగా ఉండేది ఏదో అదే సత్తు. సర్వంలో వ్యాపకమై ఉండేది సత్తు మాత్రమే. సర్వము వ్యాప్యము. సద్వస్తువు ఒక్కటే వ్యాపకము. అసద్వస్తువు వ్యాప్యము.

మట్టిపాత్రలు ఉన్నాయి. మట్టి ఉంది. మట్టికుండ వ్యాప్యము. మట్టి వ్యాపకము. మట్టికుండలో అంతట వ్యాపించి ఉన్నది మట్టే కదా! అలాగే ఈ నామరూపాత్మక మైన జగత్తంతా సద్రూపమే వ్యాపించి ఉంది.

యేన సర్వ మిదం తతమ్

దేని చేత ***(యేన, సదాఖ్యేన బ్రహ్మణా)*** అంటే, ఏ సద్రూపమైన బ్రహ్మము చేత ఈ సమస్త మైన ప్రపంచము ***(సర్వం ఇదం)*** వ్యాపించబడి ఉందో ***(తతమ్)*** అనేది ఈ పాదము యొక్క అర్థము.

యేన సర్వ మిదం తతమ్ అనే ఈ శ్లోక పాదము ఇక్కడే గాక, ఎనిమిదవ అధ్యాయము ఇరవై రెండవ శ్లోకం లోను, పద్దెనిమిదవ అధ్యాయం నలభై ఆరవ శ్లోకం లోను కనిపిస్తుంది. ఇదే భావం ఈశావాస్యోపనిషత్తు లోని ప్రముఖమైన ప్రథమ మంత్రంలో వినిపించింది. ***ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్*** అన్నది ఈశోపనిషత్తు.

అండాండంబులు పిండాండంబులు
బ్రహ్మాండంబులు బ్రహ్మలు మొదలుగ
అంతా రామమయం
ఈ జగమంతా రామమయం

అని సద్రూప చైతన్యాన్ని దివ్యంగా గానం చేశాడు భద్రాచల రామదాసు.

కుండ వ్యాప్యం. మట్టి వ్యాపకం. కుండ పగిలి పోతుంది. అలాగని మట్టి నశిస్తుందా? కుండ అనేది కేవలం నామరూపాలే అని ఇప్పటికే గ్రహించాము. నామరూపాలు నశిస్తాయే గాని మట్టి నశించదు. వ్యాప్యం నశిస్తుందే గాని వ్యాపకం నశించదు.

సమస్త ప్రపంచము వ్యాప్యము. సద్వస్తువు వ్యాపకము. వ్యాప్యమైన అసద్రూప ప్రపంచము నశిస్తుంది. వ్యాపకమైన సద్రూప చైతన్యము నశించదు. సత్ అనేది ఆత్మే కనుక ఆత్మ నశించదు (***అవినాశి. న వినష్టుం శీలమ్ అస్య ఇతి***. నశించే స్వభావం లేనిది ఏదో అది అవినాశి).

సర్వ వ్యాపకమైన అవ్యయ సద్రూపాన్ని ఎలా చూడగలం? అందుకే ***విద్ధి***. తెలుసుకో అంటోంది గీత. ***తద్విద్ధి***. దానిని తెలుసుకో అంటోంది. ఇది కేవలం జ్ఞానం కనుక, ఏ బోధనావిధి చేత అర్థ మవుతుందో, పొంద బడుతుందో అలా తెలుసుకోమని అర్థము (***విద్ధి విజానీహి యేన విధినా ప్రాప్యతే ఇతి***).

అవినాశికి నాశము లేదు

ప్రపంచము నశించినా సద్వస్తువు నశించదు. ప్రపంచం సద్వస్తువుపై ఆధారపడి ఉంది. సద్వస్తువు ప్రపంచంపై ఆధారపడి లేదు. ప్రపంచం లేకపోయినా సద్వస్తువు ఉంటుంది. దానికి నాశము లేదు. ఆత్మకు ఎందుకని నాశము లేదు?

ఆత్మకు నాశము ఎలా కలుగుతుంది? ఉన్నది ఏదైనా నశించాలి అంటే, ఆ నాశము తన వల్లనైనా తనకు కలగాలి. లేదా, తన కన్నా అన్యమైన దాని వల్లనైనా కలగాలి. ఆత్మకు ఈ రెండు కారణాల వల్ల నాశము ఉండదు.

ఆత్మ రూపము లేనిది. కనుక అవయవములు లేనిది. అవయవాలు ఉంటే, అవి నశించడం చేత స్వనాశము జరిగే అవకాశము ఉంటుంది. నిరవయవ మైన ఆత్మ తనకు తానుగా నశించ లేదు (***నిరవయవత్వాత్ దేహాదివత్***).

అలాగే తనకు అన్యమైన దాని వల్ల కూడా ఆత్మకు నాశము కలగదు. ఆత్మ కన్నా అన్యముగా ఏది ఉన్నా అది అసత్ అవుతుంది. అసద్వస్తువుకు తానే ఆశ్రయము కనుక తానే కర్త, కర్మ కావలసి ఉంటుంది. కనుక అదీ పొసగదు.

ఒకవేళ సద్వస్తువైన ఆత్మకు మరి యొక ఆశ్రయము ఉంటే, ఆశ్రయ నాశము జరగడం చేత తాను నశించే అవకాశం ఉంటుంది. ఆత్మకు ఆశ్రయ మనేది వేరుగా లేదు. దేనికైనా ఆత్మే ఆశ్రయమై ఉంది. కనుక, ఆ విధంగానూ నాశము సాధ్యం కాదు.

ఆత్మకు కారణము కనుక ఉంటే నశించే అవకాశము ఉంటుంది. కారణం నశిస్తే ఆత్మ నశిస్తుంది. కాని, ఆత్మ సర్వకారణమై శోభిస్తూ, తన కంటూ ఒక కారణము లేనిదై ఉన్నందున అలా కూడా ఆత్మకు నశింపు లేదు. ***నా చాస్య కశ్చిత్ జనితా***. మరొక దాని నుండి ఆత్మ ఆవిర్భవించ లేదు అని వేదము చెబుతూ ఉంది. కనుక, ఆత్మ కారణం లేనిదై ఉంది. ఇలా ఏ విధం గాను ఆత్మకు నాశము లేనందున ఆత్మను ***అవ్యయః*** వ్యయము కానిది, నాశము లేనిది అంటున్నాడు గీతాచార్యుడు.

చంపే శక్తి ఎవరి కుంది?

సద్రూపమైన ఆత్మ నాశ మెరుగదు. ఆత్మను చంప గలిగే సామర్థ్యం ఎవరి కుంది? ఎవరికైనా ఉంటే, దేనికైనా ఉంటే వాళ్ళు, లేక అది ఉన్నట్లే కదా! ఎక్కడున్నట్లు? కాలం లోనే కదా! కాలంలో ఉండేవి కాలాతీత మైన ఆత్మను ఎలా చంపుతాయి? కనుక సద్వస్తువును నశింప చేసే శక్తి ఎవ్వరికీ లేదు (***న కశ్చిత్ కర్తుమర్హసి***). ఈ విషయంపై వ్యాఖ్యానాన్ని అనుగ్రహిస్తూ సాక్షాత్తు ఈశ్వరుడు కూడా ఆత్మను చంప లేడు అని గీతాభాష్యంలో వ్రాశారు (***న కశ్చిత్ ఆత్మానం వినాశయితుం శక్నోతి ఈశ్వరోఽపి***).

ఆత్మను వధించే శక్తి ఈశ్వరునికి కూడా లేదు అని ఆచార్యులు భాష్యం చెప్పడానికి కారణాలు రెండున్నాయి. ఒకటి, ఆత్మ ఎవరో కాదు. ఆత్మయే ఈశ్వరుడు. ఆత్మయే బ్రహ్మము (**ఆత్మా హి బ్రహ్మ**). రెండు, స్వవిషయంలో క్రియ సాధ్యం కాదు (**స్వాత్మని చ క్రియా విరోధాత్**). మనిషి తన భుజాలపై తాను ఎక్కగలడా? తన కంటిలో ఉండే రేఖలు మొదలైన వాటిని తానే చూడ గలడా? (**యథా చక్షుర్గత రేఖాదీన్ చక్షుః న పశ్యతి** - శ్రీ బెల్లంకొండ రామరాయకవి విరచితం **భాష్యార్కదీపః**). ఆత్మయే బ్రహ్మ మైనందున తనను తాను వధించుకొనే క్రియ సాధ్యం కాదు. ఈశ్వరుని చేత కూడా ఆత్మ చావదు అనడంలో ఇదే ఉద్దేశ్యం. అర్జునా! ఈశ్వరుడే చంప లేని ఆత్మను నువ్వు చంప గలవా? ఆత్మకు చావు లేదు. ఇప్పుడు చెప్పు. నీ దుఃఖానికి అర్థముందా? కనుక, విజయా! విలపించకు.

సద్విషయ చర్చను ముగిస్తూ, అసద్విషయ చర్చను తరువాత శ్లోకంలో చేపడుతున్నాడు.

అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత ॥ 18

అంతవంతః-ఇమే-దేహాః-నిత్యస్య-ఉక్తాః-శరీరిణః
అనాశినః-అప్రమేయస్య-తస్మాత్-యుధ్యస్వ-భారత

నిత్యస్య	=	నిత్యుడును
అనాశినః	=	నాశము లేనివాడు
అప్రమేయస్య	=	ఊహింపను వీలు కాని వాడు
శరీరిణః	=	దేహికి
ఇమే దేహాః	=	ఈ దేహములు
అంతవంతః	=	అంతం కలవి
ఉక్తాః	=	చెప్పబడినవి
తస్మాత్	=	అందుచేత
భారత	=	అర్జునా!
యుధ్యస్వ	=	పోరాడు

శరీరాలను ధరించు జీవుడు నిత్యుడు. నాశము లేనివాడు. ప్రమాణాలకు చిక్కని వాడు. కాని, ఈ శరీరాలు అంతరించి పోతాయి. అందుచేత, అర్జునా! యుద్ధం చెయ్యి.

వ్యాఖ్య

'సత్' అవినాశి. దానికి ఎవ్వరూ నాశాన్ని కలిగించ లేరు. 'అసత్' అనేది లేనిది. లేనిది నశించేది ఉండదు. అలాంటప్పుడు దుఃఖము దేని కొరకు? ఏది నశిస్తూ ఉందని దుఃఖించాలి? నాశము దేనికి? నశింప చేసే వారెవరు? తాత్త్విక దృష్టితో చూచి నపుడు ఇది గొప్ప మోహంగా తెలుస్తూ ఉంది. అందుకనే వేదాంతం దుఃఖాన్ని తొలగించే ప్రయత్నం చేయదు. దుఃఖ మనేది ఎలా అసమంజసమో బుద్ధికి పట్టిస్తుంది. తొలగించే ప్రయత్నం కర్మ. అర్థం చేసుకోవడం జ్ఞానం.

అర్థం చేసుకొనేది బుద్ధి. బుద్ధికే జ్ఞానం పట్టించాలి. కాని, ఇప్పటికే బుద్ధిలో ఉండ కూడని జ్ఞానం చాలా ఉండి పోయింది. నిండి పోయింది. దానిని బుద్ధి నుండి దూరం చేయాలి. ఉండ వలసింది, ఉండ దగింది ఏదో దానిని ఉంచడము, ఉండకూడని దానిని దూరం చేయడం అనే కార్యం అవశ్యం చేయాలి. అప్పుడే దుఃఖం దూరం అవుతుంది. అంటే, దుఃఖం ఎక్కడికో పారి పోతుందని కాదు. త్రాడు అని తెలియగానే అంతవరకు పాము అనే భావన వల్ల ఏర్పడిన భయ శోకాదులు అదృశ్య మైనట్లు, సదసద్వివేకంలో దుఃఖం అవిదై పోతుంది. కనుక, దుఃఖం మనిషికి సమస్య కాదు. జ్ఞానం లేకపోవడమే సమస్య. భయంకరమైన సమస్య. ఇదే ఉపనిషత్తుల సారాంశము. ఈ సత్యమే సదసద్వివేకంలో సారభూతమైన విషయంగా పరమేశ్వరుడు గీతలో బోధిస్తున్నాడు.

జీవః అనాత్మానాం దేహాదీనాం ఆత్మత్వేన అభిమన్యతే
స అభిమానః ఆత్మనః బంధః, తన్నివృత్తిః మోక్షః
యా తదభిమానం కారయతి సా అవిద్యా
స అభిమానః యయా నివర్తతే సా విద్యా ॥

అసద్రూపము లైన దేహాదులను సద్రూపమైన ఆత్మగా భావించి జీవుడు అభిమానిస్తున్నాడు.
ఆ దేహాభిమానమే ఆత్మకు బంధము. అది తొలగి పోవడమే మోక్షము.
అట్టి దేహాభిమానాన్ని కలిగించేది అజ్ఞానము.
అట్టి అజ్ఞానాన్ని తొలగించేది ఏదో అదే జ్ఞానము.

సార రూపమైన ఈ సద్బోధను అందించింది సర్వసారోపనిషత్తు. గీత ఉపనిషత్తుల సారం కనుక ఆ సదుపదేశమునే సదసద్వివేకం ద్వారా బుద్ధికి పట్టిస్తూ ఉంది. గడచిన శ్లోకంలో 'సత్'కు సంబంధించిన విషయాన్ని చర్చించి, అవినాశి యైన ఆత్మకు నాశము అనూహ్యము కనుక దుఃఖము అసంగతం అని గ్రహించాము.

ప్రస్తుత శ్లోకంలో 'అసత్'ను గూర్చి మరికొంత విపులంగా చర్చించి, లేని దాని కోసం దుఃఖం ఉండ నవసరం లేదని సుస్పష్టంగా బోధిస్తున్నాడు భగవానుడు. కాకపోతే, ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అజ్ఞానం అనేది ప్రత్యేకంగా బుద్ధిలో ఎక్కడుంది? జ్ఞానం లేకపోవడమే అజ్ఞానం. అజ్ఞానం పోతే దుఃఖం పోతుంది. చీకటి పోవాలి అంటే వెలుగు రావాలి. అజ్ఞానం పోవాలంటే జ్ఞానం రావాలి. అందుచేత గడచిన శ్లోకంలో 'సత్' చర్చ సాగించిన జగద్గురువు, ఈ శ్లోకంలో 'అసత్' విషయాన్ని విశద పరచే దిశలో అసద్విషయాన్నే సూటిగా ప్రవేశ పెట్టకుండా, కూర్చొని పడుకోవాలి అన్నట్లు, సద్విషయ చర్చను కొనసాగిస్తూనే బుద్ధిని మెల్లగా అసద్విషయ చర్చ వైపుకు మళ్ళించి, ఆ కోణంలో ఆలోచించినా దుఃఖము అసంగత మనే శాస్త్రీయ బోధను అందిస్తున్నాడు. నిత్యుడు, అవినాశి, అప్రమేయుడు అయిన దేహి యొక్క దేహములు నశించి పోతాయి కనుక, సంతాపాన్ని మాని సంగ్రామం లోకి ప్రవేశించ మంటున్నాడు భగవానుడు.

నిత్యం - అవ్యయం - అప్రమేయం

'సత్' అని ఇంత వరకు దేని నైతే గ్రహించామో, ఆ సద్రూప చైతన్యమును మూడు పదాలలో ఇంకా వివరిస్తున్నాడు. దేహము అసత్. దేహమును ఉపాధిగా కలిగిన దేహి సత్. అసద్రూపమైన దేహము సద్రూపమైన దేహికి ఉపాధి. దేహి ఎవరో కాదు. జీవాత్మయే దేహి.

దేహి నిత్యుడు. అంటే ఏ వికారములు లేని వాడు. మరి, దేహంలో ఉండే వాడు కదా దేహి! అవును. అంతటా ఉండే ఆకాశము ఘటంలో కూడా ఉన్నట్లు, చైతన్య రూపుడైన జీవుడు దేహంలో కూడా ఉన్నాడు. ఘటంలో ఉన్న ఆకాశాన్ని ఘటాకాశం అన్నట్లు, దేహంలో ఉన్న జీవాత్మను దేహి అంటున్నాము. ఆకాశం ఘటంలో ఉన్నా, ఘటానికి పరిమితం కానట్లు, దేహి దేహంలో ఉన్నా, దేహ వికారాలకు లోను గాకుండా ఉన్నాడు. దేహాలు అనిత్యాలు. కాని, దేహ వికారాలకు విలక్షణంగా ఉండే దేహి నిత్యుడు ***(నిత్యః)***.

నిత్యుడు కనుక నశించే వాడు కాడు. వికారములే లేని వాడికి వినాశము ఎలా వస్తుంది? నశించేవి దేహాలు. వికారం చెందుతూ శరీరాలు నశిస్తాయి. వికారాలను చూస్తూ, వికారం చెందని దేహి నాశము లేనివాడు. అవినాశి. అవ్యయుడు ***(అనాశినః)***. నిత్యుడు, అవ్యయుడు అయిన దేహి అప్రమేయుడు. అంటే ప్రత్యక్షాది ప్రమాణాలకు అందని వాడు. తెలుసుకొనే వాడు ప్రమాత. తెలియబడేది ప్రమేయము. తెలుసు కొనుటకు సహకరించేది ప్రమాణము. ప్రమాణము ద్వారా కలిగే జ్ఞానము ప్రమ.

విచిత్ర మేమిటంటే, మనకు లభించే ప్రత్యక్ష, అనుమానాది ప్రమాణాలన్నీ మన కన్నా అన్యమైన వాటిని గ్రహించడానికి సహకరిస్తాయి. ఉపకరిస్తాయి. ప్రమాణ వ్యాపారం సాగడానికి ఆధార మైనదే ఆత్మ. అట్టి ఆత్మను ప్రమాణాలు తెలియ చేయలేవు. ఇక్కడ ప్రమేయము ఏదో కాదు, ప్రమాతే. కనుక దేహి ప్రమాణాలకు అందే వాడు కాడు ***(అప్రమేయః)***.

పునరుక్తి దోషం

దేహి నిత్యుడు, అనాశినుడు అని చెప్పి నపుడు ఈ రెండూ ఒకటే కదా! అనే సందేహం రావచ్చు. నశించని వాడు నిత్యుడు. నిత్యుడైన వాడు నశించడు. ఇలా ఒకే అర్థం వచ్చే టప్పుడు రెండు పదాలతో చెప్పడం పునరుక్తి క్రిందికి రాదా? దోషం కాదా? అని కొందరు సంశయించ వచ్చు.

పునరుక్తి దోషం అనేది, వాస్తవం చెప్పాలంటే, కావ్యాలకు, సాహిత్యానికే గాని వేదాంతానికి వర్తించదు. అదలా ఉంచండి. ప్రస్తుతం ఈ సందర్భంలో మాత్రం నిత్యుడు, అవినాశి అనడం పునరుక్తి కాదు ***(నిత్యస్య అవినాశినః ఇతి న పునరుక్తం)***.

రెండిటి అర్థాలు ఒక్కటే అయినా, ఇక్కడ పునరుక్తి లేదు. లోకంలో నిత్యత్వము, వినాశము అనేవి రెండు విధాలుగా తెలుస్తున్నాయి ***(నిత్యత్వస్య ద్వివిధత్వాత్ లోకే, నాశస్య చ)***. నిత్యత్వము రెండు విధాలుగా తెలుస్తూ ఉంటుంది. అలాగే వినాశము కూడా రెండు విధాలుగా ఉంటుంది.

వినాశము అంటే నశించడం. నాశము రెండు విధాలు. ఒకటి, పూర్తిగా నశించి పోవడం. రెండు, క్రమేపి నశిస్తూ ఉండటం. దేహము చనిపోయిన తరువాత శ్మశానంలో భస్మీభూతమై, కనిపించకుండా పోతుంది ***(అదర్శనం గతః నష్టః ఉచ్యతే)***. ఇదొక విధమైన నాశము. అలా కాకుండా, దేహము కనిపిస్తూనే ఉంటుంది. కాని, వ్యాధుల వల్ల చిక్కి శల్యమౌతూ, నశిస్తూ ఉంటుంది. ఇది మరొక విధమైన నాశము. ఈ రెండు విధాలైన వినాశాలు దేహికి లేవు అని చెప్పడానికే, నిత్యుడు, అవినాశి అనే రెండు విశేషణాలను ప్రయోగించాడు గీతాచార్యుడు.

ఒకవేళ ఈ రెండు విశేషణాలను కనుక ప్రయోగించకుండా ఉన్నట్లైతే, ప్రపంచము మార్పు చెందుతూ ఉన్నా ప్రళయం వరకు నిత్యం గానే ఉన్నట్లు, దేహి కూడా పరివర్తన చెందుతూ వ్యావహారికంగా తెలిసే ప్రవాహ నిత్యత్వం కలవాడుగా తెలుస్తాడు. ఈ కారణం చేత, నిత్యుడు, అవినాశి అనే రెండు విశేషణాలు చెప్పవలసి వచ్చింది.

అలా, నిత్యుడు, అవినాశి, అప్రమేయుడు అయిన దేహి యొక్క దేహములు అంతమై పోతాయి అంటున్నాడు అచ్యుతుడు.

దేహము - సందేహము

సద్రూపమైన దేహి నిత్యుడు. అసద్రూపమైన దేహాలు అనిత్యాలు. అంతవంతాలు. అంతమయ్యే స్వభావం కలవి అంతవంతాలు. అవే శరీరాలు. శరీరాలలో చరించే వాడు శరీరి. అనేక గృహాలలో మానవుడు నివసించి నట్లు, అనేక దేహాలలో దేహి వసిస్తూ ఉంటాడు. అందుచేత శరీరాలకు దేహములు ***(దేహాః)*** అని బహువచనము ప్రయోగించి, దేహికి శరీరి ***(శరీరిణః)*** అని ఏకవచన ప్రయోగం చేశాడు. దేహములు అనేకములైనా దేహి ఒక్కడే అని గ్రహించాలి.

దేహం ఉంది. దేహంలో దేహి ఉన్నాడు. దేహి వల్లనే దేహం ఉంది. దేహం లేకపోయినా దేహి ఉంటాడు.

అందుచేత, దేహము అనిత్యము. అసత్తు. దేహి నిత్యము. సత్తు. దేహి అవినాశి. దేహము నాశము కలది. కనుక దేహం నశిస్తుంది. ఆత్మ నశించదు.

దేహం ఒకటి ఉంది అంటాము. ఒకటిగా దేహం ఎక్కడుంది? అని ప్రశ్నిస్తే సమాధానం దొరకదు. దేహంలో ఎన్నో కలసి ఉన్నాయి. దేహంలో రక్తం ఉంది. మాంసం ఉంది. చర్మము ఉంది. మజ్జ ఉంది. ఎముకలు ఉన్నాయి. కేశములు ఉన్నాయి. ఎన్నో ఉన్నాయి. ఎన్నెన్నో ఉన్నాయి. ఇవన్నీ కలిస్తేనే దేహం. దేహం అనేది ప్రత్యేకంగా లేదు **(నైకః న ఏకః)**.

కలసినవి ఏవైనా విడి పోతాయి. యంత్రానికి మఱలు ఊడినట్లు, దేహంలో కీళ్ళు సడలి పోతాయి. ఊడి పోతాయి. మాంసం మెత్త బడుతుంది. క్రొవ్వు కరిగి పోతుంది. చర్మం ముడతలతో మడత పడుతుంది. రక్తం ఇంకి పోతుంది. కలసిన వన్నీ విడి పోతాయి. దేహం నశిస్తుంది. అంత మవుతుంది. ఏ దేహమైనా అంత మయ్యేదే. అందుకనే, దేహాలు అంతవంతాలు.

దేహాలు అంత మవుతా యని ఎవరికి తెలియదు? అర్జునుడికి తెలియదా? అందరికీ తెలుసు. అర్జునుడికి తెలియకుండా ఎలా ఉంటుంది? మరి, అంత సామాన్యమైన విషయాన్ని చెప్పడానికి గీతాచార్యుడు అవసరమా? దేహాలు అంతమౌతా యని అర్జునుడికి తెలుసు. అలా అర్జునుడికి తెలుసు అన్న విషయం బాగా తెలిసిన వాడు కూడా శ్రీకృష్ణు డొక్కడే. దేహాలు పోతున్నా యనే కదా అర్జునుడు పని గట్టుకొని ఏడుస్తున్నాడు! పార్థుని విలాపానికి ప్రత్యక్ష సాక్షి పార్థసారథి కాదా? అర్జునుడు ఎంత బాగా ఏడవ గలడో, కుంతీదేవి కన్నా, సుభద్ర కన్నా బాగా తెలిసిన వాడు శ్రీకృష్ణు డొక్కడే. అలాంటప్పుడు దేహాలు నశిస్తాయని అర్జునుడికి ఎందుకు చెబుతున్నాడు?

దేహాలు అంతవంతాలని, నేడున్నా ఒకనాడు లేకుండా పోతాయని శ్రీకృష్ణుడికి తెలుసు. అర్జునుడికీ తెలుసు. మనకూ తెలుసు. కాకపోతే, దేహాలు ఉన్నప్పుడు కూడా లేనివే అనే సత్యం శ్రీకృష్ణుడి కొక్కడికే తెలుసు. అర్జునుడికి తెలియదు. మనకూ తెలియదు.

దేహాలు అసత్తులు. రజ్జువులో సర్పం లాగా ఉన్నప్పుడు కూడా లేనివే. దేహాలు ఉన్నట్లు తెలుస్తూ ఉంటాయి. విశ్లేషించి వివేకంతో అర్థం చేసుకుంటే, అవి ఉన్నా లేనట్లే ఉంటాయి. ఎండమావులలో నీళ్ళు ఉన్నట్లే, ప్రపంచంలో దేహాలు ఉన్నాయి. ప్రమాణాలతో పరిశీలించి తెలుసుకోగానే, ఎండమావి కనిపిస్తున్నా నీళ్ళు లేనివే అని గ్రహించినట్లు, సదసద్వివేకంతో చూచి నపుడు దేహాలు ఉన్నా లేనివే అవుతున్నాయి అని శ్రీశంకరభాష్యము.

అంతవంతాలు అంటే కేవలం శ్మశానంలో నశిస్తున్నాయి అని కాదు. మిథ్యాభూతాలైన దేహాలు సత్యావగాహనలో అంతమౌతున్నాయి అని అర్థము.

స్వప్నంలో గోచరించిన రూపాలు స్వప్నం తరువాతే కాదు లేకుండా పోయేది, స్వప్న కాలంలో కూడా అవి లేనివే. స్వప్న దేహాలు ఎలా మేలుకోగానే అంతవంతాలో, జాగ్రత్ప్రపంచంలో చలించే దేహాలు కూడా జ్ఞానం కలిగితే స్వప్నం లోని మాయా దేహాల లాగా అంతవంతాలే **(ఇమే దేహాః స్వప్న మాయా దేహాదివత్ అన్తవన్తః)**.

పార్థా! పోరాడు!

ఎలా చంపేది? అంటూ అర్జునుడు దుఃఖించాడు. చచ్చేందుకు ఎవరున్నారు? అన్నంత వరకు బండిని నడిపాడు భగవంతుడు. చావని దానిని ఎవ్వరూ చంపలేరు. చచ్చే దానినే ఎవరైనా చంప గలరు. చచ్చే దెవరు? దేహాలు. దేహాలు సత్తా, అసత్తా? అసత్తే నని తేలి పోయింది. ఇక దుఃఖ మెందుకు? యుద్ధం చెయ్యొచ్చు. అర్జునా! లే! పోరాడు! అన్నాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధానికి ప్రోత్సహించాడు, **హింస చేయమన్నాడు, చేయించాడు అంటూ కొందరు అసందర్భ, అప్రయోజక ప్రసంగాలు చేస్తూ ఉంటారు.** *భారత! యుధ్యస్వ* - పార్థా! పోరాడు అంటూ కురుక్షేత్రంలో అర్జునుణ్ణి యుద్ధానికి పురికొల్పాడు అనేది వారి అభియోగము.

ఇక్కడ ఒక్క విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. లేకపోతే, ఇలాంటి పుచ్చిపోయిన అభియోగాల వాక్య బీజాల తోనే జ్ఞానపంటను పాడు చేసుకో వలసి వస్తుంది. పార్థా! యుద్ధం చెయ్యి! అని శ్రీకృష్ణుడు పలికిన వాక్యం విధివాక్యం కాదు. అనువాద వాక్యం. నువ్వు యుద్ధం చెయ్యాలి అని శ్రీకృష్ణుడు యుద్ధకర్మకు శ్రీకారం చుట్టలేదు. అర్జునుడు యుద్ధం చేయాలని నిర్ణయించుకొనే కురుక్షేత్రానికి వచ్చాడు. లేకపోతే, ఆయనకు అక్కడ ఏమి పని? వచ్చిన పనిని మరచి అచ్చి రాని మాటలన్నీ మాట్లాడు తున్నాడు. మరచిన విషయాన్ని శ్రీకృష్ణుడు జ్ఞాపకం చేశాడు. అంతే.

అర్జునుడికి యుద్ధ ఆలోచనే లేనపుడు, శ్రీకృష్ణుడే ప్రేరేపించి యుద్ధం చెయ్యమంటే, అది విధివాక్యం అవుతుంది. మొదట తానే యుద్ధానికి సిద్ధపడి వచ్చాడు. తనకు యుద్ధంలో సహాయం చేయ వలసిందిగా శ్రీకృష్ణుని ప్రార్థించి మరీ వెంట తెచ్చు కున్నాడు. అలాంటప్పుడు శ్రీకృష్ణుడు యుద్ధానికి కారకుడెలా అవుతాడు? శ్రీకృష్ణునికి యుద్ధాసక్తి లేదు. ఆయనకు ఉండేది ధర్మాసక్తి మాత్రమే. యుద్ధానికి వచ్చిన అర్జునుడు మోహానికి లోనై, ధర్మం విషయంలో నా మనస్సు సంశయాలతో ఉంది **(ధర్మ సమ్మూఢ చేతాః)**, నాకు ఏది మేలో నిశ్చయముగా చెప్పు, నన్ను శాసించు అని ప్రార్థిస్తే, శ్రీకృష్ణుడు అర్జునుడు క్షత్రియుడు కనుక ధర్మయుద్ధము క్షత్రియధర్మము అని చెప్పాడు. అంతేగాని, యుద్ధానికి అర్జునుణ్ణి ప్రేరేపించ లేదు. హింసకు కారకుడూ కాలేదు.

'యుద్ధం చెయ్యొచ్చు అనేది శ్రీకృష్ణుని ఉపదేశము. అదే జరిగి, భీష్మాదులు మరణిస్తే వాళ్లను తాను చంపిన వాడు అవుతాడు. ఒకవేళ భీష్మాదులు గెలిస్తే తాను గతించిన వాడు అవుతాడు. ఇది ఎలా?' అనే సందేహం అర్జునుని మనస్సులో ఉందని ఊహించిన భగవానుడు, ఈ సమస్య అనాదిగా జీవుల్ని పీడిస్తూ ఉన్నదే గాని, అర్జునునితో పుట్టింది కాదని, అలాగే దీనికి పరిష్కారం కూడా వేదాలు అందించే ఉన్నాయని తెలుపుతూ, కృష్ణ యజుర్వేదము లోని కఠోపనిషత్ నుండి రెండు మంత్రాలను ఎన్నుకొని ఈ సందర్భంలో ఉదహరించాడు. అవే పందొమ్మిది, ఇరవైయవ శ్లోకాలు.

యు ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే ॥ 19

యః ఏనం-వేత్తి-హంతారం-యః-చ-ఏనం-మన్యతే-హతం
ఉభౌ-తౌ-న-విజానీతః-న-అయం-హంతి-న-హన్యతే

యః	=	ఎవ్వడు	మన్యతే	=	భావిస్తాడో
ఏనం	=	ఈ ఆత్మను	తౌ ఉభౌ	=	ఆ ఇద్దరు కూడా
హంతారం	=	చంపేదిగా	న విజానీతః	=	తెలిసిన వారు కారు
వేత్తి	=	తెలుసుకుంటాడో	అయం	=	ఈ ఆత్మ
యః చ	=	ఎవడు	న హన్తి	=	చంపదు
ఏనం	=	ఈ ఆత్మను	న హన్యతే	=	చంప బడదు
హతం	=	చచ్చేదిగా			

దేహధారి యైన జీవుడు చంపే వాడని భావించే వాడికి సత్యం తెలియదు. అలాగే జీవుడు చంపబడే వాడు అని భావించే వాడికి కూడా యథార్థం తెలియదు. దేహి చంపేవాడూ కాదు; చంపబడే వాడూ కాదు.

వ్యాఖ్య

మనిషికి ఆలోచించే మనసు ఉంది. మనసు ఉంది కనుక ఏవేవో ఆలోచిస్తూ ఉంటాడు. మనిషి మనస్సులో జరిగే ఆలోచన లన్నీ వాస్తవాలు కానవసరం లేదు. పొరపాటున ఒక మనిషి అభిప్రాయం సత్యమని మనం నమ్మితే, రేపు అదే వ్యక్తి మన వద్దకు వచ్చి నా అభిప్రాయం అది కాదు అంటే ఆశ్చర్యపడ నవసరం లేదు. మనస్సులు అలాగే ఉంటాయి. ఆలోచనలు అలాగే సాగుతాయి.

అతడు వధించాడు. ఇతడు వధింపబడ్డాడు అని మాట్లాడుతూ ఉంటాము. ఈ వాక్యాలు సత్య మేనా? అనే ప్రశ్న ఎవ్వరము, ఎప్పుడు వేసుకోము. పైగా ఇలాంటి మాటలు పలకడానికి మనం శాస్త్రాలను అధ్యయనం చెయ్యలేదు. ఈ లోకం లోనే నేర్చుకున్నాం. ఈ మాటలకు ప్రపంచమే ప్రమాణము. అందువల్ల ప్రపంచంలో మనం ఏరుకున్న విషయాలు, వాటిని పట్టుకొని అల్లుకున్న భావాలు సత్యాలు కావచ్చు, కాకపోవచ్చు. అవి సత్యాలా, కాదా! అవి నిర్ణయించడానికి మనం ప్రపంచం వద్దకు వెళ్తే లాభం లేదు. శాస్త్రం వద్దకు రావాలి. జ్ఞానమును శాస్త్రము నుండే పొందాలి. అందుకే శాస్త్రము ప్రమాణమైంది. 'ప్రమ' అంటే జ్ఞానము. జ్ఞానమును అందించేది కనుక శాస్త్రము ప్రమాణము ***(ప్రమాకరణం ప్రమాణం)***. అట్టి శాస్త్రము అపౌరుషేయమైన వేదమే కాని మరొకటి కాదు. మానవుల ఊహలు, ఊహాజనిత మతాలు ఎన్నడూ ప్రమాణం కాలేవు. అందుచేతనే ఈ సందర్భంలో సాక్షాత్తు భగవంతుడైన శ్రీకృష్ణుడు కూడా వేదాన్నే ఉటంకించాడు.

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోకము, ఆ తరువాత శ్లోకము కఠోపనిషత్తులో ఉన్నాయి. వాటిని యథాతథంగా ఈ సందర్భంలో హారములో మణులు పొదిగినట్లు అమర్చాడు అచ్యుతుడు.

ఉపదేశానికి మాటలు అరువు తెచ్చుకో వలసిన అవసరం గీతాచార్యునికి లేదు. జ్ఞాన కరువు తెలియని విజ్ఞాన కల్పతరువు శ్రీకృష్ణుడు. ఉపనిష న్మంత్రాలను ఉటంకించి గీతా భవనానికి నూతన సొగసుల్ని దిద్ద వలసిన అగత్యం సర్వజ్ఞుడైన శ్యామసుందరునికి లేదు. ఒక విధంగా చెప్పాలంటే, ఉపనిషత్తులే ఆ దివ్యాత్ముని వైభవాన్ని వర్ణించలేక మూగబోయాయి ***(యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ - తైత్తిరీయ శ్రుతి)***. మనస్సులు మూగబోయేది, వాక్కులు విహ్వలత చెందేది వాసుదేవ చైతన్యాన్ని వర్ణించే సందర్భం లోనే అనేది మనం విస్మరించ కూడని విషయమే కాదు, స్మరించ దగిన వైభవము కూడా. వేదాలు వర్ణించ లేక మూగబోయాయి కనుకనే తానే ప్రేమతో స్వాత్మానంద సాగరము నుండి ఒక అలను పైకి లేపి, ఆ అద్భుతాన్ని అసమానంగా వర్ణించి, దాని అప్రమేయ వైభవాన్ని అమోఘంగా ఆవిష్కరించాడు.

వేదైశ్చ సర్వైః అహమేవ వేద్యః
వేదాన్త కృత్ వేదవిదేహ చాహమ్ ॥

అర్జునా! సమస్త వేదముల చేత తెలియ దగిన దివ్యత్వము నేనే. నేను పండించిన పంటే వేదాంతము. వేదమును తెలిసిన వాణ్ణి కూడా నేనే, అని గీత - పదిహేనవ అధ్యాయం - పదిహేనవ శ్లోకంలో వివరించాడు.

అలాంటి భగవానుడు ఈ రెండు శ్లోకాలను కఠోపనిషత్తు నుండి ఎందుకు సంగ్రహించాడు? (1)సంప్రదాయాన్ని రక్షించడానికి. (2) ఆదర్శాన్ని చూపడానికి. (3) వైభవాన్ని గుర్తించి, గౌరవించడం ఎలాగో ప్రపంచానికి చాటి చెప్పడానికి.

వేదము ప్రమాణము. వేదాలను శ్రుతులు అంటారు. శ్రుతి ప్రతిపాదిత విషయాన్ని మహాత్ములు తమదైన శైలిలో వివరించి, వ్యాఖ్యానాలు అందించ వచ్చు. వాటిని శ్రుతులు అనరు. స్మృతులు అంటారు.

స్మృతులు ఏవైనా, ఎవరు చెప్పినా, అవి శ్రుతులను అనుసరించే ఉండాలి. శ్రుతులకు భిన్న మైన స్మృతులను ఆర్షసంస్కృతి అంగీకరించదు. ఇది సంప్రదాయం. సంప్రదాయ రక్షణే జాతికి శ్రీరామరక్ష.

పవిత్రమైన ఋషి సంప్రదాయాన్ని రక్షించే ప్రయత్నంలో గీతాచార్యుడు ఉపనిషత్తుల నుండి మంత్రాలను గ్రహించి, గీతలో పొందు పరచాడు. తాను బోధించేది శ్రుతులకు భిన్నం కాదని లోకానికి సందేశా న్నిచ్చాడు. అందరూ అలాగే ప్రవర్తించాలని శ్రేష్ఠుడుగా ఆదర్శాన్ని అందించాడు. జ్ఞాన భాండాగారాలు, ఈశ్వర ప్రసాదాలైన వేదాలను విడిచి, బుద్ధితో బోధలు చేసే అస్తవ్యస్త ధోరణి నేల విడిచి సాము చేయడం లాంటి దని స్పష్టం చేశాడు. తాను ఆదర్శాన్ని ఆచరించి చూపాడు. అదే శ్రీకృష్ణుని వైభవం.

ఋషిభి ర్బహుధా గీతం ఛన్దోభి ర్వివిధైః పృథక్
బ్రహ్మసూత్ర పదైశ్చైవ హేతు మద్భి ర్వినిశ్చితైః ॥

అర్జునా! ఈ విషయం ఋషుల చేత అనేక విధాలుగా చెప్ప బడింది. వేదాలలో సహేతుకంగా వివిధ శాస్త్ర నిర్ణయాలచే గానం చేయబడింది. బ్రహ్మమును తెలిపే సూత్రాల చేత కూడా దివ్యంగా ప్రబోధించ బడింది అని భగవద్గీత - పదమూడవ అధ్యాయంలో దివ్యంగా ప్రవచించాడు. 'ఇది నా అంతరాత్మ చెప్పింది' అంటూ, అర్థరహిత ప్రసంగాలు చేసే అప్రయోజకుల నోళ్ళు మళ్ళీ తెరవకుండా భగవానుడు కట్టేశాడు.

ప్రస్తుతం మనం రెండవ అధ్యాయం - పందొమ్మిదవ శ్లోకాన్ని చర్చించ బోతున్నాం. ఈ శ్లోకం కఠోపనిషత్తులో కూడా ద్వితీయ వల్లిలో - పందొమ్మిదవ మంత్రమే. అది కాకతాళీయ న్యాయమని మీరు అనుకుంటే తప్పు లేదు. నేను మాత్రం అలా అనుకోవడం లేదు. వ్యాసుని వైచిత్ర్యాలు అలాగే ఉంటాయి అని నా అభిప్రాయం.

అర్జునా! ఆత్మ చంపు తుందని కొందరు, చస్తుందని కొందరు భావిస్తూ ఉంటారు. వీరిద్దరూ వాస్తవం తెలియని వారే. ఆత్మ చంపదు, చంప బడదు అంటున్నాడు భగవానుడు.

కర్త కాదు - కర్మ కాదు

నేను చంప బడతాను, నేను చంపుతాను అనే మాటలు మనం వింటూ ఉంటాము. నేను చంపేవాణ్ణి ***(హన్తాఽహం)***. నేను చంపబడే వాణ్ణి ***(హతోఽస్మ్యహం)*** అని అంటూ ఉంటారు. ఇంతకీ చచ్చే దెవరు? చంపే దెవరు?

దేహి సద్రూప చైతన్యము, నిత్యుడు, అవినాశి, అప్రమేయుడు అని ఇప్పటికే గ్రహించాము. అలాంటి దేహి ఎలా చంపుతాడు? చచ్చేది దేహము కనుక చావడము దేహ ధర్మము. చంపినాను అనేది బుద్ధి. కనుక అది అంతఃకరణ ధర్మము. ఈ రెండూ అసత్తులే. అనాత్మలైన దేహ మనోధర్మాలను ఆత్మ యందు ఆరోపించడం చేత ఆత్మ చంపుతుందని, చస్తుందని భ్రమ చెందుతూ అవివేకులు పలవరిస్తూ ఉంటారు.

చంపుట అనే క్రియ ***(హనన క్రియ)*** ఎవరికి సంబంధించింది? ఆత్మ ఎలా చంపుతుంది? ఆత్మకు చేతు లున్నాయా చంపడానికి? కంఠ ముందా పిసికితే చావడానికి? ఆత్మ అవయవాలు లేనిది కనుక, ***(నిరవయవత్వాత్)*** ఎలా చంపుతుంది? ఎలా చస్తుంది?

చంపేది బుద్ధి ధర్మము. చచ్చేది దేహ ధర్మము. చచ్చినా, చంపినా, ఈ రెండూ ఉండాలి. ఈ రెండు లేని చోట చావడమూ ఉండదు. చంపడమూ జరగదు.

చంపడము, చావడము అనే ఈ కర్తృకర్మలు జాగ్ర త్స్వప్నా ల్లోనే జరుగుతాయి. ఎందుకో తెలుసా? దేహము, బుద్ధి ఈ రెండు అవస్థల లోనే ఉన్నాయి. గాఢనిద్రలో ఇప్పటి వరకు కర్తృకర్మలు జరిగినట్లు దాఖలాలు లేవు. ఎందుకో తెలుసా? అక్కడ దేహమూ లేదు. బుద్ధీ లేదు.

అర్జునా! అర్థమైందా! ఇదంతా ఆరోపమే గాని స్వరూపం కాదు. దేహ ధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించి ఒకడు చచ్చాను అంటాడు. బుద్ధి ధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించి మరొకడు చంపినాను అంటాడు. తాను ఆత్మ అని తెలుసుకుంటే, తాను చచ్చేవాడు కాడని, చంపే వాడూ కాడని గ్రహిస్తాడు. ఆత్మ ఏ కర్మకు కర్త కాలేదు. ప్రపంచంలో ఏ కర్త ఏది ఆచరించినా, ఆత్మ కర్మ కాలేదు.

పార్థా! నువ్వు ఎవరో ఇపుడు చెప్పు? నువ్వు ఆత్మవే. కనుక చంపేవాడివి కావు. అదలా ఉంచు. భీష్ముడు ఎవరో చెప్పు? అతడూ ఆత్మే. కనుక అతనూ చచ్చేవాడు కాడు. భీష్మద్రోణాదుల్ని ఎలా చంపేది? అవి ఇంతకు ముందు నువ్వు పలికిన మాటకు అర్థముందా? ఆలోచించు అన్నాడు అచ్యుతుడు.

ఇదొక అద్భుతమైన శ్లోకం. ఎందరినో ప్రభావితం చేసింది. ఎందరో జీవితాలలో దీపం వెలిగించింది. వికారాల నుండి విడి పడి, వివేకంతో విలక్షణంగా జీవించ డానికి ఎందరికో స్ఫూర్తి నిచ్చింది. ముఖ్యంగా పాశ్చాత్యుల్ని కూడా ఎంతగానో ప్రభావితం చేసింది.

అమెరికా తత్త్వవేత్త ఎమర్సన్‌ను ఈ శ్లోకం ఎంతగానో చలింప చేసింది. ఇంగ్లండు దేశానికి చెందిన గొప్ప విశ్లేషకుడు, విమర్శకుడు, రచయిత అయిన కార్లైల్ ఆంగ్లం లోకి అనువదించ బడిన భగవద్గీతను ఎమర్సన్‌కు కానుకగా ఇచ్చాడు. అది చదివిన తరువాత ఎమర్సన్‌లో గొప్ప పరివర్తన చోటు చేసుకుంది. గీతను అధ్యయనం చేసిన తరువాత తన ఆలోచనా విధానం లోనే గొప్ప మార్పు వచ్చినట్లు తానే స్వయంగా వ్రాసు కున్నాడు.

నాయం హన్తి న హన్యతే అనే వాక్యం అతనిపై అష్టాక్షరీ మంత్రం లాగా పని చేసింది. ఎమర్సన్ సాహిత్యం చదివిన వారు ఆయన రచించిన **బ్రహ్మ** (Brahma) అనే గ్రంథాన్ని మరచిపోలేరు.

వికారాలు తెలియనిది కనుక ఆత్మ చంపదు. చంప బడదు. ఆత్మకు వికారాలు ఎలా లేవో, తరువాత శ్లోకం వివరిస్తూ ఉంది.

న జాయతే మ్రియతే వా కదాచి న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

న-జాయతే-మ్రియతే-వా-కదాచిత్-అయం-భూత్వా-భవితా-వా-న-భూయః
అజః-నిత్యః-శాశ్వతః-అయం-పురాణః న-హన్యతే-హన్యమానే-శరీరే

అయం	=	ఈ ఆత్మ	అజః	=	పుట్టుక లేనిది
కదాచిత్	=	ఎప్పుడును	నిత్యః	=	స్థిరమైనది
న జాయతే	=	పుట్టనిది	శాశ్వతః	=	నిత్యమైనది
న మ్రియతే వా	=	చచ్చేది కాదు	పురాణః	=	అనాది యైనది
న భూత్వా	=	లేకనే	శరీరే	=	శరీరము
భూయః	=	మరల	హన్యమానే	=	చస్తూ ఉన్నా
భవితా వా న	=	ఏర్పడుట లేదు	న హన్యతే	=	చంపబడదు
అయం	=	ఈ ఆత్మ			

ఆత్మ ఎన్నడూ పుట్టదు. కనుక మరణించదు. కొంతకాలం ఉండి ఆ తరువాత లేకుండా పోయేది కాదు. కొంత కాలం లేకుండా ఉండి ఆ తరువాత ఉండేది కూడా కాదు. ఆత్మ పుట్టుక లేనిది. నిత్య మైనది. తరిగేది కాదు. పురాతన మైనది. దేహము క్షీణిస్తున్నా ఆత్మ నశించదు.

వ్యాఖ్య

ఆత్మ చంపేది కాదు. చచ్చేది కాదు. తాను చంపదు, తాను చావదు అని గడచిన శ్లోకంలో గ్రహించాము. మరి, పుడుతుందా? పుట్టి చావకుండా ఉంటుందా? అంటే మార్పు చెందదా? మరి, మనం చూచే మార్పు లన్నీ ఏమిటి? దేనికి సంబంధించినవి? ఇలా అనేక ప్రశ్నలు ఈ సందర్భంలో పుట్టు కొస్తాయి. వాటన్నిటికి సమాధానాలు ఈ శ్లోకంలో లభిస్తాయి.

పుట్టదు - చావదు

పుట్టడం అంటే, అంతవరకు లేనిది రావడం, క్రొత్తగా కనిపించడం అని అర్థము. చావడం అంటే, అంతవరకు ఉన్నది లేకుండా పోవడము అని అర్థము. లేకుండా వచ్చేది జన్మము. ఉండి పోయేది మరణము. ఈ రెండు ఆత్మకు లేవు అని తెలుపుతూ ఈ శ్లోకంలో ***న జాయతే, న మ్రియతే*** అనే రెండు వాక్యాలను ప్రవేశ పెట్టాడు గీతాచార్యుడు.

ఆత్మ పుట్టదు. పుట్టేది కాదు. ఉత్పత్తి లేదు. పుట్టడం అనే లక్షణము ఆత్మకు లేదు. జనన రూప వికారము లేదు ***(జని లక్షణా వస్తు విక్రియా న ఆత్మనః విద్యతే)***. లేనిది కలిగితే జన్మము. ఆత్మ అలా పుట్టాలి అంటే ఆత్మ లేని కాలమంటూ ఒకటి ఉండాలి.

కాలము అనేది సాపేక్షిక సత్యము. కాలము తన మనుగడకు ఆత్మపై ఆధారపడి ఉంది. ఆధారపడి ఉంది కనుక కాలము అసత్. అసద్రూపమైన కాలం ఆత్మపై ఆధారపడి దొర్లుతూ ఉంది. కాలం ఉంది అంటే, ఆత్మ ఉంది అని అర్థం. కాలం లేకపోయినా ఆత్మ ఉంటుంది.

గాఢనిద్రలో కాలం ఎవరికి తెలిసింది? తెలిసి ఉంటే, తెలిసే అవకాశమే ఉంటే, నిద్ర లేవగానే కాల మెంత? అని ఎందుకు అడుగుతాము? ఇంతసేపు నిద్ర పోయానా! అని ఎందుకు ఆశ్చర్య పోతారు? గాఢనిద్రలో కాలం లేదు. ఆత్మ ఉంది. ఉంది కనుకనే, నిద్ర లేస్తున్నాం. ఆత్మ లేని కాలమే లేనందున ఆత్మ కాలంలో ఆవిర్భవించదు.

పుట్టడం ఉంటేనే గిట్టడం. జననం ఉంటేనే మరణం. ఆత్మ జన్మించ లేదు. కనుక ఆత్మ మరణించదు. అంటే వినాశమును పొందదు. లోకంలో మరణించేవి ఎలా లేకుండా పోతున్నాయో, అటువంటి వినాశ రూప మైన మార్పు ఆత్మకు లేదు ***(న మ్రియతే చ ఇతి అన్యా వినాశ లక్షణా విక్రియా ప్రతిషిధ్యతే)***. ఆత్మ లేకుండా వచ్చింది కాదు కనుక లేకుండా పోయేది కాదు.

మరణము అంటే మార్పే కదా! వికారమే కదా! ఆత్మకు ఎలాంటి వికారమూ లేదు. అది అవికార్యం. మార్పు, లేదా వికారం జరగాలి అంటే కర్తృ కర్మ అపేక్ష అనివార్యం. కర్త ఉండాలి. కర్మ జరగాలి. అప్పుడే మార్పు జరుగుతుంది. ఆత్మ విషయంలో అలాంటి వాటికి అవకాశం లేదు.

నేను గీతా వ్యాఖ్యానము వ్రాస్తున్నాను. ఇది కర్మ. ఈ కర్మలో మార్పు అనివార్యం కదా! నేను వ్రాస్తున్నాను. దానికి ముందు వ్రాయాలి అనే ఆలోచన ఉంది. ఆ తరువాత ఒక ఆలోచన తరువాత మరొక ఆలోచన తోసుకుంటూ వచ్చాయి. అలాగే పోయాయి. ఇదే మార్పు.

ఏమి వ్రాయాలి? ఎలా వ్రాయాలి? ఎప్పుడు వ్రాయాలి? వ్రాతకు కావలసిన వన్నీ ఉన్నాయా? లేక తెచ్చుకోవాలా? ఎక్కడ నుండి తెచ్చుకోవాలి? ఇదంతా ఆలోచించేది ఎవరు? నేనే. ఇప్పుడు నే నెవరు? కర్త. కర్తలో మార్పులు ఉన్నాయా, లేవా? వ్రాయాలి అనుకు న్నప్పుడు నేను ఆలోచించే వాణ్ణి *(మన్తా)*. వ్రాతకు కావలసినవి ఆశించి నపుడు నేను కోరుకొనే వాణ్ణి *(కామీ)*. వ్రాయాలని కూర్చున్నా, వ్రాసే అవకాశం లేనపుడు, ప్రతిబంధకాలు తలెత్తి వ్రాతలో వేగం సన్నగిల్లి నపుడు నేను బాధపడే వాణ్ణి *(భోక్తా)*. ఇవన్నీ కర్తలో వికారాలే కదూ! ఇలాంటి వికారాలు ఆత్మకు ఉన్నాయా? లేవు. అందుచేత ఆత్మ కర్త కాదు. కర్త కాదు కనుక కర్మ లేదు. కర్తృకర్మ అపేక్ష లేదు కనుక వికారం లేదు. వినాశం ఉండదు.

వికార ద్వయం నాస్తి

లేనిది కలగడం ఒక వికారం. ఉన్నది లేకుండా పోవడం మరొక వికారం. మొదటిది జన్మ. రెండవది మృత్యువు.

లేనిది ఏది వచ్చినా అది ఒకనాడు లేకుండానే పోతుంది. కుండ లేకుండానే వచ్చింది. లేని కుండ వచ్చింది కనుక అది ఒకనాడు పగిలి లేకుండానే పోతుంది. ఇదొక వికారము.

లేనిది వచ్చి లేకుండా పోవడము ఒక వికారమైతే, ఒక రూపంలో ఉన్నది మరొక రూపంగా మారి, ఆ తరువాత లేకుండా పోవడము మరొక వికారము. మొదటి వికారానికి కుండను దృష్టాంతంగా చెప్పుకున్నాం. రెండవ వికారానికి పక్షి గ్రుడ్డును తీసుకుంటే సరిపోతుంది.

పక్షి గ్రుడ్డు పెడుతుంది. ఇది పుట్టడం. కొంత కాలానికి గ్రుడ్డు నుండి పక్షిపిల్ల పుడుతుంది. ఈ విధంగా గ్రుడ్డుగా పుట్టి, గ్రుడ్డుగా ఉండి పిల్లగా మారిన పక్షి భవిష్యత్తులో మరణించి లేకుండా పోతుంది. ఈ విధంగా లేకుండా ఉండినది, మళ్ళీ కలగటం కూడా ఉండదు *(నాయం భూత్వా భవితా వా న భూయః)*.

న జాయతే మ్రియతే వా కదాచిత్
నాయం భూత్వా భవితా వా న భూయః ॥

శ్లోకంలో ఇంత వరకు చెప్పుకున్న దానిలో **'కదాచిత్'** అనే ఒక్క పదాన్ని వివరించాల్సి ఉంది. 'కదాచిత్' అంటే, ఎప్పుడును లేదా ఒకప్పుడును అని అర్థం. కనుక ఈ 'కదాచిత్' అనే పదం వికారము లన్నిటికీ సంబంధించి ఉంటుంది *(కదాచిచ్ఛబ్దః సర్వ విక్రియా ప్రతిషేధైః సంబధ్యతే)*. ఎలాగంటే, ఒకప్పుడు పుట్టింది కాదు. ఒకప్పుడు చచ్చింది కాదు. ఎప్పుడునూ మారేది కాదు. ఇలా ప్రతి మార్పు లోను ఒకప్పుడును, ఎప్పుడును అంటూ 'కదాచిత్' శబ్దము కలసి పోతుంది. కలసి ఉంటుంది *(న కదాచిత్ జాయతే, న కదాచిత్ మ్రియతే ఇత్యేవం)*. ఈ పదంలో మరొక అందమైన అవగాహనకు తెర లేస్తుంది.

అది లేనిది - ఇది కానిది
ఏదీ కాలేదు

పుట్టడం అనే వికారము లేనిది, మరణం అనే వికారానికి లోను కానిది, మధ్యలో వచ్చే వికారాలు ఏవీ అంటనిది ఆత్మ. అవికార్య సత్తా స్వరూపము. పుట్టింది ఏదైనా గిట్టి తీరుతుంది. ఈ జనన మరణాలతో పాటు మరి కొన్ని వికారాలను పొందుతూ ఉంటుంది.

దేహమే తీసుకుందాం. దేహం పుట్టింది. పుట్టిన దేహం మరణిస్తుంది. ఈ లోగా అనేక వికారాలకు లోనవుతుంది. ఆ వికారాలు ఆరు విధాలుగా ఉంటాయి. వాటినే షడ్భావ వికారాలు అంటారు.

అవి (1) **జాయతే**- పుట్టుట (2) **అస్తి**- ఉండుట (3) **వర్ధతే**- పెరుగుట (4) **విపరిణమతే**- మార్పు చెందుట (5) **అపక్షీయతే**- క్షీణించుట (6) **వినశ్యతి** - నశించుట. ఈ ఆరు వికారాలను షడ్వికారములు అంటారు. ఇలా షడ్వికారాలు పొందేది ఏదయినా నశించి పోతుంది. ఆత్మకు ఈ ఆరు వికారాలు లేవు. కనుక ఆత్మ నశించదు. పుట్టిన దానికే వికారాలు ఉంటాయి. ఆత్మ పుట్ట లేదు.

ఆత్మ ఆరు వికారాలు లేకుండా ఎలా నిత్యమై, సత్యమై ఉందో గీతాచార్యుడు దివ్యంగా బోధిస్తున్నాడు. వికార లక్షణాలు లేవని చెప్పే ప్రక్రియలో భాగంగా ఆత్మ యొక్క లక్షణాలను విశేషంగా వివరిస్తున్నాడు.

అజః :- ఆత్మ పుట్టింది కాదు. ఆత్మకు పుట్టుక లేదు *(న జాయతే, నోత్పద్యతే)*. కుండ పుట్టింది కాని ఆకాశం పుట్టలేదు. కుండ భగ్న మవుతుంది. కుండ లోని ఆకాశం భగ్నం కాదు. షడ్వికారాలలో మొదటిదైన పుట్టుక ***(జాయతే)*** ఆత్మకు లేదు. దేహం పుట్టింది కనుక దేహానికి ఉంది.

నిత్యః :- ఆత్మ నిత్యము. అంటే, కాల పరిధి లోకి రాదు అని అర్థము. ఏదైనా ఉన్నది *(అస్తి)* అంటే, కాలంలో ఉన్నది అని అర్థము. కాలంలో ఉన్నది కాలంలో నశిస్తుంది అని భావం. ఆత్మ ఉంది. కాని కాలానికి పరిమితమై ఉన్నది కాదు. కాలంలో ఉంది. కాలాతీతంగా కూడా ఉంది. ఈ ప్రపంచంలో ఏది ఉండినా పోయేందుకే ఉంటుంది. దేహం ఉంది. ఒకనాడు పోయేందుకే ఉంది *(అస్తి)*. అందుచేత దేహానికి 'అస్తి' అనే వికారము ఉంది. కాని, ఆత్మ లేని కాలము లేనందున, ఆత్మ యొక్క అస్తిత్వము నిత్యమై ఉంది *(అస్తి - నిత్యః)*. ఇలా ఆత్మ రెండవ వికారము లేకుండా ఉంది.

శాశ్వతః :- ఆత్మ శాశ్వత మైంది. మార్పు లేకుండా ఉంది. అదేమిటి, అంత పొడుగయ్యావు? సంవత్సరం లోనే ఇంత పెరిగావా? అని పిల్లలతో మనం అంటూ ఉంటాము. అది వర్ధమాన దశ కనుక పిల్లలు పెరుగుతూ ఉంటారు. అలా పెరిగేది దేహము *(వర్ధతే)*. పెరగడమనే మూడవ వికారము దేహానిదే గాని ఆత్మది కాదు. అందుకే ఆత్మ శాశ్వతము. శాశ్వతము అంటే ఎప్పుడూ ఉండేది. వికారం లేకుండా అలాగే ఉండేది *(శశ్వత్ భవః శాశ్వతః)*. పెరుగు లేనిది కనుక తరుగు తెలియనిది. అదేమిటి! అంత తగ్గిపోయారు? అని వృద్ధులతో అంటూ ఉంటాము. తరిగే ఐదవ లక్షణం *(అపక్షీయతే)* కూడా దేహానిదే కాని, ఆత్మది కాదు.

పురాణః :- ఎప్పటి నుండో ఉన్నా, అలాగే ఉండేది కనుక ఆత్మ పురాణ మైనది *(పురా అపి నవః పురాణః)*. ఎప్పుడూ దివ్యం గానే ఉంటుంది. వికారం చెందదు. దేహం అలా కాదు. పాత పడే కొద్ది రోతగా మారుతూ ఉంటుంది *(విపరిణమతే)*. ఈ పరిణామ దోషము కూడా వికారమే. పరిణామము అనే నాల్గవ వికారము కూడా దేహానిదే గాని, ఆత్మది కాదు.

న హన్యతే :- ఆత్మ చంప బడేది కాదు. ఆత్మ చావదు. దాని నెవరూ చంప లేరు. ఆత్మ పుట్ట లేదు. పెరగ లేదు. క్షీణించ లేదు. పరిణామం చెంద లేదు. ఇక ఎలా నశిస్తుంది? నశించే వికారము దేహానిది. దేహం వికారంతో పుట్టింది కనుక వికారిగా చస్తుంది. ఆత్మకు పుట్టుక లేదు. కనుక మృత్యువు ఉండదు. దేహాలు చస్తూ ఉన్నా ఆత్మ చావదు *(న హన్యతే హన్యమానే శరీరే)*. కనుక నశించుట *(వినశ్యతి)* అనే ఆరవ వికారము కూడా దేహానిదే కాని ఆత్మది కాదు.

షడ్వికారాలు కలిగిన దేహం చస్తుంది. షడ్వికార రహితమైన ఆత్మ చావ కుండా ఉంటుంది. ఈ విధంగా ఆత్మలో షడ్వికారాలు లేవని ఈ శ్లోకంలో నిరూపించడం జరిగింది *(అస్మిన్ శ్లోకే షడ్భావ వికారాః లౌకిక వస్తు విక్రియాః ఆత్మని ప్రతిషిధ్యన్తే)*.

ఈ విధమైన ఆత్మ తానే నని తెలిసిన జ్ఞాని జీవించి ఉన్నప్పుడే ముక్తుడు. జీవన్ముక్తుడు. దేహం లోనే ఉంటాడు. దేహ వికారాలు తనవి కావని గ్రహించి ఉంటాడు. నేను దేహము అనే భావం ఆ మహాత్మునిలో కదలదు. 'నేను' అనేది లేకుండా దేహంలో ఉంటాడు. 'నాది' అనేది అర్థం కాకుండా గృహంలో ఉంటాడు. అహంకారం ఆవిరై పోయింది కనుక 'నేను'గా లేని వాడు. మమకారం మరిగి పోయింది కనుక 'నాది' అనేది తెలియని వాడు. నేను మట్టిని అనే జ్ఞానం కలిగిన కుండ, వ్యవహారంలో ఉపకరిస్తున్నా, తన స్వరూపంలో తాను ఉన్నట్లు, నేను ఆత్మను అని తెలిసిన లోక వ్యవహారాలలో చరిస్తూ ఉండినా, తామరాకు నీటి లోనే నీటిని అంటకుండా ఉన్నట్లు, ఈ ప్రపంచంలో వ్యవహరిస్తూ ఉంటాడు. దేహ విలక్షణుడైన ఆ మహాత్ముడు దేహాన్ని అంటి పెట్టుకొని లేడు. దేహమే ఆ దివ్యాత్ముని నీడ లాగా అనుసరిస్తూ ఉంటుంది **(ఛాయావత్ అనువర్తినీ).**

ఓం... ఓం... ఓం...

అర్జునా! దేహ మేమిటో, దేహి ఎవరో తెలిసిందా? చచ్చే దెవరో, చావని దెవరో అర్థమైందా? ఎవరి కోసం దుఃఖించాలి? శోచ్యు లెవరు? అందరూ అశోచ్యులే. అర్థమైతే దుఃఖ మెక్కడుంది? ఈ సత్యం అర్థమైన వాడే జ్ఞాని. జ్ఞాని ఎవరిని చంపుతాడు? ఎవరిని చంపిస్తాడు? ఇదంతా ఎలా చేస్తాడు? అది కూడా చెప్పుకుందాం.

వే దావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హన్తి కమ్ ॥ 21

వేద-అవినాశినం-నిత్యం-యః-ఏనం-అజం-అవ్యయం
కథం-సః-పురుషః-పార్థ-కం-ఘాతయతి-హంతి-కమ్

పార్థ	= హే అర్జునా!		వేద	=	తెలుసుకున్న
యః	= ఎవడు		సః పురుషః	=	ఆ పురుషుడు
ఏనం	= ఈ ఆత్మను		కం	=	ఎవనిని
నిత్యం	= ఎల్లప్పుడు ఉండుదానినిగా		కథం	=	ఎట్లు
అవినాశినం	= నాశము లేని దానినిగా		ఘాతయతి	=	చంపించును?
అజం	= పుట్టుక లేని దానినిగా		కం	=	ఎవనిని
అవ్యయం	= అక్షయమైన దానినిగా		హంతి	=	చంపును?

పార్థా! ఆత్మ పుట్టేది కాదని, చచ్చేది కాదని, ఎప్పుడూ ఉండేదని తెలుసుకున్న వాడు ఎవరిని ఎలా చంపిస్తాడు? ఎవరిని చంపుతాడు?

వ్యాఖ్య

ఆత్మ స్వరూపం

ఆత్మ నిత్యము. నిరవయవము. సావయవ వస్తువే పుడుతుంది. పుట్టినదే నశిస్తుంది. ఆత్మకు అవయవాలు లేవు. కనుక ఆత్మ పుట్టదు. నశించదు. ఆత్మ అవినాశి. అవినాశి అంటే చివరి దైన భావవికారం లేనిది ***(అంత్య భావ వికార రహితం)*** అని అర్థం. మరణమే అంత్యభావ వికారము. అది ఆత్మకు ఎందుకని లేదు? అని ప్రశ్నిస్తే, పుట్టుక అనే ఆది భావ వికారం లేదు కనుక మరణము అనే అంత్యభావ వికారం లేదు అనే సమాధానం వస్తుంది. ఆద్యంతముల యందు ఏదయితే లేదో, దేని కైతే ఆద్యంతములు ఉన్నవో అది మధ్యలో ఉండినా లేనిదే అని గ్రహించాము కనుక, ఏ విధమైన భావవికారం లేనిది ఆత్మ. అందుకే ఆత్మ అవినాశి.

ఆత్మను అవినాశిగా తెలుసుకున్న వాడు ఆత్మజ్ఞుడు. ఆత్మజ్ఞానము కలవాడు. జ్ఞానము నందు అధికారం కలవాడు ***(సః విద్వాన్ పురుషః అధికృతః).*** పండితుడైన ఆ ఆత్మవిదుడు ఆత్మను పుట్టుక లేని దానినిగా తెలుసుకుంటాడు ***(అజః).*** ఏ విధమైన మార్పులు లేని దానినిగా అర్థం చేసుకుంటాడు ***(అవ్యయం).*** ఆత్మను అజంగా, అవ్యయంగా, అవినాశిగా తెలుసుకున్న వాడు దేనిని ఎలా చంపుతాడు? ఎలా చంపిస్తాడు?

ఇక్కడ చంపుట ***(హన్తి)*** అని చెప్పడంలో కేవలం హననక్రియ అని అర్థం కాదు. చంపుట అనేది కర్మ. చచ్చుట అనేది కూడా కర్మే. కాని, ఇక్కడ చంపుట, చచ్చుట అనే ప్రత్యేకమైన అర్థాలు ఏవీ లేవు. 'హన్తి' అనే పదము అన్ని క్రియలకు ఉపలక్షణంగా చెప్ప బడింది. కనుక ఒక హనన క్రియే కాదు, ఆత్మలో ఏ కర్మకు అవకాశము లేదు. కర్తృకర్మ ప్రేరకాలు ఆత్మలో ఊహించుట సాధ్య పడదు అనేదే ఇక్కడ కేంద్ర విషయం.

ఒక కర్మ జరగాలి అంటే, ఆ కర్మకు సంబంధించిన ఆలోచనలు ముందుగా మనస్సులో ఉండి తీరాలి. కర్మకు ముందు కర్మకు సంబంధించిన జ్ఞానము ఉంటుంది. అట్టి జ్ఞానమును ఆధారం చేసుకొనే కర్మ చేయడం జరుగుతుంది. మరి, ఆ జ్ఞానం ఆలోచిస్తేనే కదా కలుగుతుంది? ఆలోచించాలి అంటే, మనస్సులో సంకల్పాలు నడవాలి కదా!

సంకల్పం చేసే దెవరు? కర్మ చేసే దెవరు? కర్మ చేసే వాడే సంకల్పిస్తాడా? లేక సంకల్పం లేకుండా కర్మ చేస్తాడా? ఇప్పుడు కర్త ఎవరు? చేసే వాడు కర్త. మరి, అలా చేసేవాడు ఆలోచన లేకుండా చేస్తాడా? చెయ్యలేడు. మరి ఆలోచించిం దెవరు? కర్తే. ఆ కర్త ఎవరు? ఆత్మ అవుతుందా? కాలేదు. ఎందుకో తెలుసా! ఆత్మ సంకల్పించదు. సంకల్పాలు నడవ డానికి ఆధారమైంది ఆత్మ. కనుక ఆత్మ కర్త కాదు. ఇలా ఆత్మ స్వరూపాన్ని అకర్తగా, అభోక్తగా తెలుసుకున్న వాడు ఆత్మజ్ఞుడు.

ఆత్మవిదుడు

ఆత్మలో కర్తృకర్మ ప్రేరకాలు లేవని తెలిసిన వాడు, ఆత్మ నిష్క్రియత్వ చైతన్య మనే జ్ఞానాన్ని పొందిన వాడు ఆత్మవిదుడు. అతడు కర్తృ భోక్తృ లక్షణాలు లేని ఆత్మలో సర్వకర్మ సన్యాసమును దర్శించిన వాడు. పరమార్థ జ్ఞానదృష్టితో జీవిస్తూ, కర్మల యందు అకర్మను దర్శించేవాడు. అందుచేతనే మన పెద్దలు, **జ్ఞాత్వా కర్మాణి కుర్వీత** అన్నారు. జ్ఞానాన్ని పొంది కర్మలు ఆచరించు అన్నారు. జ్ఞానం కలిగిన వారికి కర్మలలో అకర్మ దర్శనీయ మవుతూ ఉంటుంది. ప్రస్తుత సాంఖ్య ప్రకరణంలో ఆత్మ వికార రహిత మని, జ్ఞానికి ఏ కర్మలు ఉండవు అని ప్రబోధించడమే ప్రధాన ఉద్దేశ్య మని శ్రీ శంకరులు కూడా అభిప్రాయ పడ్డారు.

హేత్వర్థస్య తుల్యత్వాత్ విదుషః సర్వకర్మ ప్రతిషేధ ఏవ ప్రకరణార్థః అభిప్రేతః భగవతః

ఆత్మ వికార రహితము అనే హేతువు యొక్క అర్థం, సర్వకర్మల విషయం లోను ఆత్మ నిర్వికారము అని తెలుస్తూ ఉంది కనుక, అట్టి ఆత్మను తెలుసుకొనిన ఆత్మజ్ఞాని చేత సర్వకర్మలు నిషేధింప బడుతున్నాయి అనేది భగవంతుని అభిప్రాయము. చంపుట అనే హనన క్రియను నిషేధించుట అనేది కేవలం ఉదాహరణకు సూచించినది మాత్రమే ***(హన్తేః తు ఆక్షేపః ఉదాహర ణార్థత్వేన కథితః).***

ఆత్మ జ్ఞానోదయంలో అజ్ఞానం నివృత్తి అవుతుంది. దేహ ధర్మాలను ఆత్మ యందు ఆరోపించుకొని నేను చంపినాను - నేను చంపించినాను అనే అజ్ఞాన వచనాలు ఇక ఆ స్థితిలో విన పడవు.

ఆత్మ యందు వికారము దర్శనీయ మైనపుడు తాను కర్త అవుతాడు. లేదా, తాను కర్తగా ఉండి కర్మ యైన మరొకరిని పురి కొల్పుతాడు. కర్తృత్వమే లేనపుడు ప్రేరకత్వము ఎలా ఉంటుంది? ఆత్మను తెలుసుకున్న వాడు ఎలా చంపుతాడు? ఎలా చంపిస్తాడు? అంటే ఆత్మజ్ఞుడు కర్మలు ఎలా చేస్తాడు? ఎలా చేయిస్తాడు?

అని అర్థం. ఆత్మను తెలుసు కోవడము అంటే, అలా తెలుసుకున్న వాడు సర్వకర్మ సన్యాసి అయ్యాడని భావము.

మరి, ఆత్మ అవినాశి అనేది నిర్ధారణ చేయ బడింది కదా! అది ఎలా? ***(తత్ర ఆత్మనః అవినాశిత్వం ప్రతిజ్ఞాతమ్, తత్ కిం ఇవ ఇతి? ఉచ్యతే)*** అదే చెప్పబోతున్నాడు.

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22

వాసాంసి-జీర్ణాని-యథా-విహాయ-నవాని-గృహ్ణాతి-నరః-అపరాణి
తథా-శరీరాణి-విహాయ-జీర్ణాని-అన్యాని-సంయాతి-నవాని-దేహీ

యథా	=	ఏ ప్రకారము	తథా	=	అలాగే
నరః	=	మనుష్యుడు	దేహీ	=	జీవుడు
జీర్ణాని	=	చినిగిన	జీర్ణాని	=	శిథిలములైన
వాసాంసి	=	వస్త్రాలను	శరీరాణి	=	శరీరములను
విహాయ	=	విడిచి	విహాయ	=	విడిచి
అపరాణి	=	ఇతరములైన	నవాని	=	నూతనమైన
నవాని	=	వస్త్రాలను	అన్యాని	=	అన్యములైన దేహములను
గృహ్ణాతి	=	ధరించునో	సంయాతి	=	ధరించు చున్నాడు

మానవుడు చినిగి పోయిన వస్త్రాలను వదిలేసి, వేరే నూతన వస్త్రాలను ధరిస్తాడు కదా! అర్జునా! జీవుడు కూడా శిథిలమైన శరీరాలను విడిచేసి, వేరే క్రొత్త శరీరాలను పొందుతూ ఉంటాడు.

వ్యాఖ్య

జీవుడు నిత్యుడు. నశించే వాడు కాడు. మార్పు చెందే వాడు కాడు. మరణం పొందేవాడు కాడు అని ఇంత వరకు చూశాం. కాని, ఈ లోకంలో మనిషి పొందే అనుభవ జ్ఞానము మరో విధంగా ఉంది. ఎందరెందరో కళ్ళ ముందే గతిస్తున్నారు. ఉన్న వాళ్ళు పోయేందుకే ఉన్నారు అని తెలిసి పోయింది. ఉండి పోయే వారిలో తామూ ఒకడు అని మనిషికి అర్థమై పోయింది. ఇదొక తీరని ఆవేదన. ఆరని అశాంతి. ఇదంతా అవివేకంతో మనిషి తనకు తానుగా కల్పించుకున్న బంధము. మరణంలో సమస్తము మునిగి పోతుందని లేని ప్రళయాన్ని ఊహించుకొని మానవులు అల్లాడి పోతున్నారు. మరణం మంగళకర మైనదని, ఆహ్వానించ దగినదే గాని ఆవేదన చెంద దగిన విషయం కాదని చెబుతూ, జనన మరణాల గుట్టు విప్పుతూ, జీవుని నిత్యత్వాన్ని విస్పష్టం చేస్తున్నాడు గీతాచార్యుడు.

గువ్వ - గూడు

సుదీర్ఘ జీవిత ప్రయాణంలో ఈనాటి బ్రతుకు ఒక మజిలీ. ఈ విరామంలో ఎన్నో సంఘటనలు. ఎన్నెన్నో బాంధవ్యాలు. సుఖాలు, నవ్వులు, కష్టాలు, కన్నీళ్ళు, సంయోగాలు, వియోగాలు. ఇదంతా జీవితం. జీవి ఆడే చదరంగం.

నానా దిక్కుల నుండి వచ్చిన పక్షులు ఒక్క చెట్టు మీద విశ్రమిస్తాయి. విశ్రమించినట్లే ఉంటాయి. ఇంతలోనే విశ్రామం విరమించి విహారం సాగిస్తాయి. కొమ్మలు పక్షివి కావు. పక్షికి రెక్కలూ మిగలవు. చెట్టు విడిస్తే ఏ పక్షి పయనం ఏ వైపో!

చెట్టుపై గూడు; గూటిలో పక్షి. హోరుగాలి వీచినా, పై కొమ్మ నుండి పండు రాలి గూటిపై పడినా, గూడు ముక్కలౌతుంది. గువ్వ గంతు లేస్తుంది.

గూటి మీద పండు రాలె - గూడు రెండు ముక్క లాయె
గూటి లోని రామచిలుక - గుట్టల పాలాయె రన్నా
గూటి చిలకేదిరా - చిన్నన్నా
గూడు చినబోయెరా!

గూడు కాదెన్నడూ లోడు - గువ్వకు తప్పదెన్న డైనా దౌడు. గూటిలో గువ్వ ఉంటుంది. గువ్వలో గుట్టు ఉంటుంది. గుట్టు తెలియని గువ్వ గూడే సర్వమని భ్రమిస్తుంది. లేదా, గగనంలో పయార్లు సాగిస్తుంది. గుట్టు తెలిస్తే గువ్వ మనసే గగన మంత విశాల మవుతుంది (*గగన సదృశం*).

బట్ట కడితే బ్రతుకు - బట్ట విడిస్తే చావు

మనిషి వస్త్రాన్ని ధరిస్తాడు. ఆ వస్త్రమే చిరిగి పోతే దానిని వదేసి మరొక క్రొత్త వస్త్రాన్ని ధరిస్తాడు. అలాగే మనిషి దేహ మనే వస్త్రాన్ని ధరిస్తాడు. అది దుర్బలమైతే, ఆ దేహాన్ని త్యజించి నూతన దేహాన్ని పొందుతూ ఉంటాడు.

వాడుకలో ఏవయినా పాత బడతాయి. పాడై పోతాయి. దండైనా, కుండైనా, వస్త్రమైనా, దేహమైనా - ఏదైనా శిథిలం కావలసిందే.

వస్త్రధారి వస్త్రాన్ని మోయాలి. దేహధారి దేహాన్ని మోయాలి. దేహం యొక్క ప్రయోజనం దేహికి ఉంది. ప్రయోజనం లేకపోతే ఎవ్వరూ భారాన్ని మోయరు. వస్త్రం దేహాన్ని కప్పి దేహాన్ని రక్షిస్తూ ఉంటుంది. అలాగే, దేహం దేహిని కప్పి, దేహిని రక్షిస్తూ ఉంటుంది.

అందరికీ దేహాలు ఉన్నాయి. అందరి దేహాలు ఒకే లాగా లేవు. అందరూ వస్త్రాలు ధరిస్తారు. అందరి వస్త్రాలు ఒకే రంగులో ఉండవు. ఒకే నాణ్యతలో కనిపించవు. అభిరుచుల్ని బట్టి బట్టలు. కర్మలను బట్టే దేహాలు.

ఇంటి లోని వారందరికీ ఎవరెవరికి ఎలాంటి బట్టలు కొని పెట్టాలో ఇంటిపెద్దకు తెలుసు. ఉద్యోగం చేసే వారికి ఒక రకమైన బట్టల్ని, చదువుకొనే వారికి వేరొక రకమైన బట్టల్ని, పనిపాట లేని వానికి మరొక రకమైన బట్టల్ని ఇంటి యజమాని కొని పెడతాడు. ఎవరికి ఏది అవసరమో ఇంటిపెద్దకు తెలుసు.

ఈ ప్రపంచానికి యజమాని పరమేశ్వరుడు. ఎవరెవరికి ఎలాంటి దేహాలు ఇవ్వాలో సర్వజ్ఞుడైన సర్వేశ్వరునికి తెలుసు. అందరి దేహాలు ఒక విధంగా లేవు. రూపాలలో భేదా లున్నాయి. రంగులలో భేదా లున్నాయి. ఆరోగ్యాలలో భేదా లున్నాయి. అందాలు, వికారాలు, కళలు, కాంతులు, చూపులు, చేతలు ఎన్నో ఉన్నాయి. అన్నీ భిన్నంగా ఉన్నాయి. అవి అలా ఉండటం వెనుక ఎంతో జ్ఞాన ముంది.

దేహాలు రావడం వెనుక నియతి ఉంది. దేహాలు ఉండటంలో ధర్మా లున్నాయి. దేహాలు రాలి పోవడంలో కూడా నియతి ఉంది. దేహం వస్తుంది. అలాగే పోతుంది. అందుకే దేహాలు అసత్తులు అని తెలుసుకున్నాం. దేహాలు నశించినా దేహి నశించడు. మరొక దేహాన్ని ధరిస్తాడు.

చిరిగిన వస్త్రాలను విడిచి పెట్టి నూతన వస్త్రాలను మనిషి ధరించినట్లు, శిథిలమైన దేహాన్ని విడిచి పెట్టి దేహి నూతన దేహాన్ని ధరిస్తూ ఉంటాడు. వ్యక్తి ఒక్కడే. కాని ధరించే వస్త్రాలు అనేకములు. అలాగే, దేహి ఒక్కడే. కాని, ధరించే దేహాలు అనేకములు. అందుచేతనే, దేహములను **శరీరాణి** అని బహువచనం తోను, జీవుని **దేహీ** అని ఏకవచనం తోను విడ మరచి బోధించాడు.

వస్త్రాలను ధరించే వ్యక్తి వస్త్రాల కన్నా వేరుగా ఉన్నాడు. కనుకనే వస్త్రాలను మార్చుకోవడానికి బాధ పడడు. మరి దేహి విషయ మేమిటి? దేహాలను ధరించే దేహి కూడా దేహాల కన్నా వేరు గానే ఉన్నాడు. కాకపోతే, దేహమే తాను అనే అజ్ఞానంలో ఉన్నాడు. అందుచేత దేహ పతనాన్ని తట్టుకో లేక గగ్గోలు పెడు తున్నాడు.

అర్థం గాకనే ఆవేదన

తల్లి బిడ్డకు పాలిస్తూ ఉంటుంది. కొంతసేపు ఇవ్వగానే ఆ వైపు చనుబాలు అయి పోయాయి అని తల్లి గ్రహిస్తుంది. బిడ్డను ఆ వైపే ఉంచితే లాభం లేదని భావిస్తుంది. వెంటనే బిడ్డను అటు నుండి ఇటు వైపుకు త్రిప్పుకుంటుంది. అలా చెయ్యడం బిడ్డకు పాలు పట్టించాలనే గాని, స్తన్యపానము చేయకుండా నిరోధించాలని కాదు.

అజ్ఞానంలో ఉండటం చేత ఈ సత్యం శిశువుకు తెలిసి రాదు. పాలు త్రాగే శిశువును తన దేహం నుండి దూరం చేయగానే బిడ్డ కెవ్వు మని కేక వేస్తుంది. వెంటనే తల్లి మరో వైపు తన తనువుకు హత్తు కుంటుంది. అంతే, బిడ్డ ఏడుపు ఆపేస్తుంది.

ఈ ప్రపంచంలో మనం ప్రారబ్దాన్ని అనుభవిస్తూ బ్రతుకుతున్నాం. ఒక వైపు చనుబాలు లేవని తెలియ గానే, అక్కడ నుండి వేరే వైపుకు తల్లి బిడ్డను మార్చినట్లు, ఈ ప్రపంచంలో మనకు నూకలు చెల్లిపోయా యని తెలియగానే, పరమేశ్వరుడు ఈ లోకం నుండి మనల్ని తరలిస్తాడు. అదే మృత్యువు. స్తన్యపానం చేసే బిడ్డ అవివేకంతో గోల చేసినట్లు, మనం కూడా అజ్ఞానం చేత మరణంలో దుఃఖిస్తున్నాం.

తరలి పోయేవే తనువులు

నూతన వస్త్రాలు శోభాయమానంగా ఉంటాయి. క్రొత్త వాటి కన్నా వాడుకలో మరింత శోభిస్తాయి. మళ్ళీ వాడుక లోనే మాసి పోతాయి. మలిన పడతాయి. మగ్గి పోతాయి. మూల పడతాయి.

వస్త్రాలు కళకళ లాడే కాలం ఉంది. చిరిగి పీలిక లయ్యే కాలమూ ఉంది. ఇదే కాల మహిమ. ఆకు రాలే కాలముంది. కాయ రాలే కాలముంది. అలాగే కాయం రాలే కాలమూ ఉంది. ఏ వస్త్రమైనా చిరిగి పోయేదే. ఎవరి తనువైనా కాటికి తరలి పోయేదే. దేహాలు దగ్ధమై పోయినా, దేహి ధగధగ మనే కాంతులతో నూతన దేహంలో ప్రవేశిస్తాడు.

చిరిగి పోయిన వస్త్రాన్ని విసర్జించి, నూతన వస్త్రాన్ని ధరించడానికి ఎవరైనా శోకిస్తారా? దుర్బలమైన దేహాన్ని త్యజించి, అందమైన, ఆరోగ్యవంతమైన దేహాన్ని పొంద డానికి మనం ఎందుకు దుఃఖిస్తున్నాం?

కలత లేనివి కూడా కదలి పోతున్నాయి

ఇక్కడ మరొక సందేహము పుట్టుకొస్తోంది. జీర్ణమైన శరీరాలు, వృద్ధాప్యంలో బలహీనమైన శరీరాలు ***(దుర్బలతాం గతాని)*** గతిస్తే అర్థం చేసుకోవచ్చు. నవ యవ్వనంలో ఉండే దేహాలు, రెండు పదులు కూడా నిండని ముచ్చటైన తనువులు కూడా తరలి పోతున్నాయి కదా! వాటి నెలా అర్థం చేసుకోవాలి?

క్రొత్తపాతలు, అందచందాలు, ఆరోగ్యాలు, ప్రారబ్దాలు - వీటిని మదింపు వేసే కొలత పాత్రలు ప్రపంచంలో లేవు. ఎవరి పాత్రలు వారివే. ఎవరి కొలతలు వారివే.

ఒక వ్యక్తి యవ్వనంతో చాలా అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తాడు. మాటల మధ్య తన మూగబాధను వినిపిస్తాడు. వివాహ ప్రయత్నాలు ఒక వైపు సాగుతూ ఉంటే, మరో వైపు తన దేహంలో దారుణమైన క్యాన్సర్ మహామారి మకాం పెట్టి ఉధృత రూపాన్ని దాల్చి ఉందని, రాలి పోవడానికి మాసాలే మిగిలి ఉన్నాయి అని

చెబుతాడు. మనకు మాటలు మూగబోతాయి. చూడటానికి అలా ఉన్నాడు. లోపల ఇలా ఉందా? అని నివ్వెర పోతాము. బాహ్యానికి ఆ దేహం పది కాలాల పాటు ఉండ దగినదే అన్నట్లు ఉంది. దుర్బలత్వ మంతా లోపలే దాగి ఉంది.

ఒక వ్యక్తి ఇల్లు అమ్ముతాడు. మరొక వ్యక్తి ఆ ఇంటిని కొంటాడు. అమ్మిన వాడికి అది పాత ఇల్లు. అందుకే అమ్మేశాడు. కొన్నవాడికి అదే క్రొత్త ఇల్లు. మంచి ముహూర్తం చూసుకొని, బంధుమిత్రాదులతో కలసి ఏదో నూతన గృహప్రవేశం చేసినట్లు ప్రవేశిస్తాడు. నిజమే! ఆ గృహం అతని దృష్టిలో నూతనమే. కాని, గతంలో ఎన్నో శవాలను తరలించిన పాత గృహం అదే అనేది వాస్తవము.

మనం ఈ ప్రపంచానికి ఒంటరిగా రాలేదు. ప్రారబ్దాన్ని వెంట బెట్టుకొనే వచ్చాం. దేహాలు ఎలా ఉన్నా యనేది ప్రధానం కాదు. ఆ దేహంతో ఈ జన్మలో అనుభవించ వలసిన కర్మఫలం మిగిలి ఉందా, అయిపోయిందా! అనేదే ముఖ్య విషయం. ప్రారబ్ద కర్మానుభవము శేషించి ఉంటే, జీవి ఆ దేహంతో కొనసాగుతాడు. ప్రారబ్దం అడుగంటితే వల్లకాటి వైపుకు దేహాన్ని నడిపించి, అనువైన మరో దేహంలో దూరి పోతాడు.

చనిపోయిన వ్యక్తిని శ్మశానానికి అప్ప చెప్పే టప్పుడు దేహం మీద ఒక్క వస్త్రాన్ని కూడా ఉంచరు. చివరికి మొలత్రాడును కూడా తెంచేస్తారు. నాయనా! నీవు ధరించిన వస్త్రాన్ని విడిచేశావు. తరువాత, నీవు ధరించ బోయే వస్త్రం నీ కోసం నిరీక్షిస్తోంది. ఇది ఇక పనికిరాదు అనే సత్యాన్ని ఎరుక పరచాలనే అలా చేస్తారు. ఇదంతా పోయిన వాడికి తెలుస్తుందా? లేదు. ఉన్నవాళ్ళు తెలుసుకుంటా రని అలా చేస్తారు.

ఇంధనం లేని వాహనం నడవదు

దేహం ఈ ప్రపంచంలో ఉండటానికి, ఉండకుండా పోవడానికి వయస్సే ప్రధానం కాదు. కర్మఫలమే కీలకాంశం. కర్మఫలం తన దైన మార్గంలో పావులను కదుపుతూ ఉంటుంది.

కొందరు నూరేండ్లు నిండి చిక్కి శల్యమైన దేహంతో మరణిస్తారు. కొందరు వయస్సులో ఉండి కూడా భయంకరమైన వ్యాధుల వాత పడి, లేదా దారుణ ప్రమాదాలకు లోనై మరణిస్తారు.

తుపాకి గుండ్లు దేహంలో దూసుకు పోయినా బ్రతికిన వారు కొంద రున్నారు. తుపాకి గుండ్ల వంటి భయంకరమైన మాటల్ని విని తట్టుకోలేక ప్రాణాలు విడిచేసిన వారూ ఉన్నారు.

ఎవరి గుండె వారిదే. అలాగని ఆగే ముందు చెప్పి ఆగుతుందా? ఎవరి ప్రాణం వారిదే. అలాగని సాగే ముందు చెప్పి సాగుతుందా? ప్రారబ్దం చేతిలో అన్నీ కీలుబొమ్మలే. అందరూ ఆటబొమ్మలే.

ఇది బ్రతుకు ఆట. ఆడించే వాడి చేతి లోనే ఉంది అంతా. అర్జునా! ఆటలో ఆందోళన ఎందుకు? ఆట ఆగితే ఆవేదన ఎందుకు? ఇది తెలిస్తే ఆటలో ఆనందం ఉంటుంది. గెలుపులో ఆనందమే. ఓటమిలో కూడా ఆనందమే. గెలుపు ఓటములు కూడా ఆటలో భాగమే.

I have loved life so much, why should I not love death even more?

నేను జీవితాన్ని ఎంతగానో ప్రేమించాను. మృత్యువును అంతకన్నా ఎక్కువగా ఎందుకు ప్రేమించలేను? అని తనను తాను ప్రశ్నించు కున్నాడు విశ్వకవి టాగూర్.

అర్జునా! దేహాలు కర్మానుసారంగా రాలిపోయినా, దేహి ఏ విధమైన వికారాలకు లోను గాకుండా క్రొత్త శరీరాలను పొందుతాడు (**దేహా, ఆత్మా అవిక్రియః ఏవ ఇత్యర్థః**).

దేహం ఎప్పుడో ఒకప్పుడు చస్తుంది. అది చచ్చేందుకే ఉంది. అనుక్షణం చస్తూ ఉంది. ఇది అనివార్యం. శోకించ దగనిది. దేహి అవినాశి, నిత్యుడు, శాశ్వతుడు. ఈ విషయాన్ని కూడా సహేతుకంగా చర్చించుకున్నాం. సశాస్త్రీయంగా చెప్పుకున్నాం. ఇక దుఃఖించడం మానేయ్! ***(అశోచ్యా నన్వ శోచస్త్వం).***

అర్జునా! నువ్వు దేహివే కాని దేహానివి కావు. దేహి వైన నిన్ను నశింప చేసే శక్తి ఎవ్వరికీ లేదు. భీష్మద్రోణాదులు కూడా అంతే. వారికి కూడా ఎవ్వరూ వినాశమును కలిగించలేరు. నీవూ ఆత్మే. భీష్ముడూ ఆత్మే. ఆత్మకు ఎందుకు నశింపు లేదో చెబుతాను, విను!

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయ న్త్యాపో న శోషయతి మారుతః ॥ 23

న-ఏనం-ఛిందంతి-శస్త్రాణి-న-ఏనం-దహతి-పావకః
న-చ-ఏనం-క్లేదయంతి-ఆపః-న-శోషయతి-మారుతః

ఏనం = ఈ ఆత్మను
శస్త్రాణి = శస్త్రములు
న ఛిందంతి = ఛేదించవు
ఏనం = ఈ ఆత్మను
పావకః = అగ్ని
న దహతి = కాల్చదు

ఏనం = ఈ ఆత్మను
ఆపః చ = నీళ్ళు
న క్లేదయంతి = తడుపవు
మారుతః = గాలి
న శోషయతి = ఎండగట్ట లేదు

ఆత్మను శస్త్రాలు ఖండించ లేవు. అగ్ని కాల్చలేదు. నీళ్ళు తడపలేవు. గాలి ఎండబెట్ట లేదు.

వ్యాఖ్య

శక్తి గలవారు భువిలో ఎందరో ఉన్నారు. శక్తి గలవి ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. శక్తిని ఉపయోగించి కొందరు కొందరిని ఏదైనా చేయ గలరు. వాళ్ళే మరి కొందరిని ఏమీ చేయ లేరు. కొన్ని శక్తులు ఎవరికీ మినహాయింపు లేకుండా ఎవరి పైనా, ఏదైనా చేయ గలవు, ఎప్పుడైనా చేయ గలవు. అవసర మనుకుంటే యావద్విశ్వాన్నే కబళించే శక్తి అణువుల్లో దాగి ఉంది. కాని, ఏదీ ముట్టలేని, ఎవరూ పట్టలేని, ఏ శక్తీ నశింప చేయలేని అద్భుత చైతన్య శక్తి ప్రతి మనిషి హృదయంలో ఒదిగి ఉంది. అదే సత్. అదే ఆత్మ. పుట్టుక లేనిది. మరణం తెలియనిది. ఏ వికారాలకు లోను కానిది. దానిని నశింప చేసే శక్తి దేనికీ లేదు.

మానవదేహం పాంచభౌతికం. అది పంచభూతాల సృష్టి. మానవ దేహాన్ని పంచభూతాలు ఏదైనా చేయ గలవు. అస్త్రాలు, శస్త్రాలు, విషాలు, మారణాయుధాలు దేహాన్ని ముక్కలు చేయ గలవు. మాయం చేయ గలవు. దేహాన్ని బూడిద చేసే శక్తి నిప్పు కుంది. ముంచే శక్తి నీటి కుంది. ఎండగట్టి ఆరేసే శక్తి, ఊడ్చి పారేసే శక్తి గాలి కుంది. కాని ఇవన్నీ కలసి ఒక్కటైనా, ఆత్మను కదిలించ లేవు. కాల్చలేవు. పీల్చలేవు. ఊడ్చలేవు. మాడ్చలేవు. అదే అద్భుతాత్మ. ఆశ్చర్యాత్మ. చైతన్యాత్మ. సత్యాత్మ.

పంజరం తగలబడి నపుడు పంజరం లోని పక్షి తగల బడకుండా ఉంటుందా? ఇల్లు దగ్ధ మైనపుడు ఇంటి లోని మనిషి చావకుండా ఉంటాడా? మరి, దేహము దగ్ధమయ్యే టప్పుడు దేహి నశించకుండా ఎలా ఉంటాడు? ఉంటాడు. అందుకనే, ***కథం హన్తి?*** ఎలా చంపుతారు? అని ఇరవై ఒకటవ శ్లోకంలో గీతాచార్యుడు ప్రశ్నించాడు.

వధించాలి అంటే సాధనం ఉండాలి. దేని చేత వధించాలి? ఆత్మను వధించ దానికి వధ సాధనాభావ ముంది. అంటే, వధకు సాధనము అలభ్యంగా ఉంది ***(అభావః)*** అని అర్థము. అదేమిటి? బ్రతికించే సాధనము మన వద్ద లేదు అంటే అర్థం చేసుకో గలము. వధించడానికి సాధనా లెందుకు లేవు? పంచభూతాలలో ఒక్క ఆకాశాన్ని ప్రక్కన పెడితే మిగిలిన నాలుగు భూతాలు వధ సాధనాలే కదా! నిజమే. దేహం విషయంలో వధ సాధనాలే గాని ఆత్మ విషయంలో కాదు.

ఆయుధాలు అలభ్యం

ఆయుధాలు పృథివి యొక్క వికారాలు. స్థూల రూపాలు. స్థూల మైనవి స్థూలాన్ని ఖండించ గలవే గాని సూక్ష్మాన్ని ఖండించ లేవు. గొడ్డలి స్థూలాయుధము. చెట్టు కూడా స్థూలం. అందుచేత గొడ్డలితో చెట్టును ఖండించడం సాధ్య పడుతుంది. ఇదే గొడ్డలితో నీళ్ళను ఖండించడం సాధ్య పడుతుందా? జ్వాలను ముక్కలు చేయడం వీలు పడుతుందా? గాలిని నరకడం సాధ్యమేనా? సరే, ఇక ఆకాశం విషయం చెప్పే దేముంటుంది? చెట్టును ఖండించిన గొడ్డలి నిప్పును, నీళ్ళను, గాలిని ఖండించ లేక పోవటానికి కారణ మేమిటి? అవన్నీ సూక్ష్మాలు కావడమే. స్థూలము సూక్ష్మాన్ని ఖండించ లేదు.

ఆయుధాలు ఖండించా లంటే అంగా లుండాలి. అవయవాలు ఉండాలి. దేహానికి అవయవాలు ఉన్నాయి కనుక ఆయుధము ఖండించ గలుగుతుంది. ఆత్మకు అవయవాలు ఎక్కడున్నాయి? అందుకనే శస్త్రాలు ఆత్మను ఖండించ లేవు ***(దేహినం న ఛిన్దన్తి శస్త్రాణి నిరవయవత్వాత్).*** ఆత్మ అమూర్తం. కనుక ఆయుధాలకు అందదు.

అగ్ని అయోగ్యం

కాల్చే శక్తి అగ్నికి ఉన్నా, కాలే అశక్తత ఆత్మకు లేదు. కనుక, అగ్ని ఆత్మను ముట్ట లేదు. లంకలో అశోక వనా న్నంతా అగ్నిదేవుడు కాల్చేశాడు. కాని, సీతమ్మను సమీపించలేక పోయాడు. ఆత్మను తాకే యోగ్యత తనకు లేదని దూరంగా ఉండి పోయాడు.

కట్టెల్ని అగ్ని భస్మం చేస్తుంది. జలాన్ని ఆవిరి చేస్తుంది. గాలిని కాల్చుతుందా? ఆకాశాన్ని తగల బెడుతుందా? ఇలాంటివి చేసేందుకే యోగ్యత లేనపుడు ఆత్మను ఎలా దగ్ధం చేస్తుంది? ***(అగ్నిః అపి న భస్మీ కరోతి).***

నీళ్ళు నిరుపయోగం

పటికబెల్లం నీళ్ళల్లో పడి కరిగి పోతుంది. వస్త్రం కొంతకాలం నీళ్ళల్లో ఉంటే చీకి పోతుంది. కొన్ని నీళ్ళల్లో కరిగి పోతూ ఉంటే, మరి కొన్ని నీళ్ళల్లో తరిగి పోతూ ఉంటాయి. జలం రూపాల్ని అరూపం చేయడమే కాకుండా రూపం లేని వాటికి రూపా న్నిస్తుంది. మట్టిని జలం కరిగిస్తుంది. అంతేకాదు, మట్టికి రూపాన్నిస్తుంది కూడా. నీళ్ళు కలిపే మట్టితో బొమ్మలు తయారు చేస్తారు. ఇళ్ళను నిర్మించు కుంటారు. శరీరానికి జలం వల్లే రూపం వచ్చింది. మరణించిన తరువాత మృత కళేబరాలను నదీ జలాలే కరిగించేస్తూ ఉంటాయి.

ఆత్మ విషయంలో మాత్రం నీళ్ళు ఏమీ చేయలేక నిరుపయోగంగా మిగిలి పోతాయి. దేహాల్ని ముంచి నట్లు ఆత్మను జలాలు ముంచ లేవు. ఆత్మను అరూపం చెయ్యలేవు. కారణం, ఆత్మకు రూపం లేదు. ఆత్మకు కొంగ్రొత్త రూపాన్ని ఇవ్వడం కూడా ఉదకానికి సాధ్యం కాదు. ఆత్మ నిరవయవం.

గాలినే నీళ్ళు ఏమీ చేయలేవు. ఆత్మను ఏం చేయగలవు? నీళ్ళు నీళ్ళుగా ఉండ టానికి కారణ మైనది ఆత్మ. ఆత్మ ఆధారమైనదే గాని ఆధేయము కాదు.

గాలి ఆడదు

ఈల వేస్తూ, గోల చేస్తూ, నిలకడ లేకుండా పరుగులు తీసే గాలి ఆటలు ఆత్మ వద్ద సాగవు. గాలి చాలా విచిత్రమైంది. ఉండి కొందరిని బ్రతికిస్తుంది. పోయి కొందరిని చంపేస్తుంది. గాలి ఆడక కొందరు పోతారు. గాలి ఎక్కువై కొందరు చస్తారు (***శోషణేన నాశయతి వాయుః***). కాని, ఇదే గాలి ఆత్మను శుష్కింప చేయలేదు. కదిలించ లేదు.

వస్తువు లోని చమురును పీల్చేసి దానిని గాలి నశింప చేస్తుంది. అందుకే పూలు వాడి పోతాయి. ముఖాలు వాలి పోతాయి. దీపాలు ఆరి పోతాయి. దేహాలు రాలి పోతాయి. అన్నిటికి అన్నీ జరుగుతాయి కాని, ఆత్మకు మాత్రం ఏమీ జరగదు.

ఒకటి వధింప బడింది అంటే దానికి కారణం ఉండాలి. ఏదయితే వధకు కారణమో, దాని చేత వధింప బడింది కార్యమై ఉండాలి. అప్పుడే వధ సాధ్య మవుతుంది. ప్రపంచంలో ఏదైనా కార్యం గానే తెలుస్తూ ఉంది. ఆత్మ ఒక్కటే కార్యంగా తెలియదు. అందుకే అది సర్వకారణం. సర్వకారణమైన ఆత్మను, పరిమితంగా ఉంటూ, కొంత కాలం కారణాలుగా కులికే కార్యాలు ఏమీ చేయ గలవు? అందుకే ఆత్మ మరణ ధర్మం లేనిదై అమృత స్వరూపంగా భాసిస్తోంది.

మరణ ధర్మము కలది దేహము. దానిని నశింప చేయడానికి వధ సాధనా లున్నాయి. ఆత్మ అమృత స్వరూపము. నశించే దేహాలలో ఉన్నా నశించేది కాదు. ఆత్మకు మరణం లేదు కనుక ఆత్మను తెలుసుకున్న వాడు మరణానికి భీతి చెందడు. దుఃఖించడు.

అశరీరం శరీరేషు అనవస్థేషు అవస్థితమ్
మహాన్తం విభు మాత్మానం మత్వా ధీరో న శోచతి ॥

అనిత్యములైన దేహాలలో ఉండినా ఆత్మ దేహము లేనిది. శ్రేష్ఠ మైనది. సర్వగత మైనది. అట్టి ఆత్మను తెలుసుకున్న వాడు ధీరుడు. దుఃఖం తెలియని వాడు.

ఆత్మను ఖండించలేరు, మండించలేరు అంటూ ఉంటే, ఎందుకని ఆత్మను నాశనం చెయ్యలేరు? అనే ప్రశ్న పుడుతుంది. దానికి సమాధాన మేమిటి? ఏముంది? సాధ్యం కాదు కనుక, అనేదే సమాధానం.

అచ్ఛేద్యో౽య మదాహ్యో౽య మక్లేద్యో౽శోష్య ఏవ చ ।
నిత్యః సర్వగతః స్థాణు రచలో౽యం సనాతనః ॥ 24

అచ్ఛేద్యః-అయం-అదాహ్యః-అయం-అక్లేద్యః-అశోష్యః-ఏవ-చ
నిత్యః-సర్వగతః-స్థాణుః-అచలః-అయం-సనాతనః

అయం	=	ఈ ఆత్మ	అయం	=	ఇది
అచ్ఛేద్యః	=	ఛేదింప రానిది	నిత్యః	=	నిత్య మైనది
అయం	=	ఈ ఆత్మ	సర్వగతః	=	అంతటను వ్యాపించినది
అదాహ్యః	=	దహింప రానిది	స్థాణుః	=	స్థిర మైనది
అక్లేద్యః	=	తడుప రానిది	అచలః	=	చలనము లేనిది
అశోష్యః ఏవ చ	=	ఎండింప లేనిది	సనాతనః	=	శాశ్వత మైనది

ఆత్మ ఖండింప బడదు. కాల్చబడదు. తడుప బడదు. ఎండింప బడదు. ఆత్మ నిత్య మైనది. అంతటా వ్యాపించి ఉండునది. సుస్థిర మైనది. చలనము లేనిది. ప్రాచీన మైనది.

వ్యాఖ్య

అయం అంటే ఇది అని అర్థము. మనకు ఆత్మ ఒక్కటే 'ఇది'గా తెలుస్తూ ఉంటుంది. ఆత్మకు అన్యంగా తెలిసేవి అన్నీ 'అది'గా, 'అవి' గానే ఉంటాయి.

మనకు దూరంగా ఉన్న గోడను, ఆ గోడ అంటాము. మన చేతి లోని పువ్వును ఈ పువ్వు అంటాము. అదే పువ్వును చూచిన కంటిని గూర్చి మాట్లాడ వలసి వచ్చి నపుడు ఆ పువ్వు - ఈ కన్ను అంటాము. అలాగే ఆంతర్యం లోకి మరలితే, ఆ కన్ను - ఈ మనస్సు, ఆ మనస్సు - ఈ బుద్ధి, ఆ బుద్ధి - ఈ అజ్ఞానము, ఆ అజ్ఞానము - ఈ జ్ఞానము, ఆ జ్ఞానము - దానిని తెలుసుకొనే ఈ ఆత్మ. . . అదే **అయం ఆత్మా** - ఈ ఆత్మ. అదే మన స్వరూపము.

సర్వం హ్యేతద్బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ
సోయమాత్మా చతుష్పాత్

ఈ సర్వమూ బ్రహ్మ స్వరూపమే. ఈ ఆత్మయే బ్రహ్మము (***అయం - ఆత్మా - బ్రహ్మ***). ఆ (***సః***) ఈ (***అయం***) ఆత్మ (***ఆత్మా***) నాలుగు పాదాలలో ఉంది (***చతుష్పాత్***) అని మాండూక్యోపనిషత్ ప్రబోధము.

అయమాత్మా బ్రహ్మ. ఈ ఆత్మయే బ్రహ్మము అనే మహావాక్యంలో 'అయం' అనే ఏ పదము చేత ఆత్మ సూచింప బడిందో, అదే ప్రస్తుత శ్లోకంలో **అయం** అంటూ ఆత్మరూపంగా ఉపయోగింప బడింది.

ఈ ఆత్మ (***అయమాత్మా***) నరక డానికి వీలు లేనిది. కాల్చడానికి వీలు కానిది. ముంచ డానికి సాధ్యం కానిది. ఎండింప డానికి వీలు పడనిది. ఎందుకని? రెండవ పాదంలో సమాధానం చెబుతున్నారు. ఆత్మ నిత్య మైనది. సర్వగత మైనది. స్థిరమైనది. చలనము లేనిది. సనాతన మైనది. కనుక పంచభూతాల చేత నశింప బడుటకు అసాధ్య మైనది.

వధించడం కర్మ. వధింప బడటం కర్మ. శస్త్రాదుల చేత చంప బడుటకు ఆత్మ అయోగ్యము, అనర్హము అనేది ఈ శ్లోకంలో నిరూపించ బడుతూ ఉంది. అంటే ఎట్టి క్రియకు కూడా ఆత్మ కర్మ కాలేదు. క్రియాఫలము ఉన్నప్పుడే కర్మత్వము సంభవిస్తుంది. ఆత్మ ఏ క్రియకు ఫలము కాదు.

కర్మల వలన నాలుగు విధాలైన క్రియాఫలాలు కలుగుతాయి. ఈ నాల్గింటిలో ఏదో ఒకటి సంభవించే అవకాశం ఉన్నప్పుడే కర్మత్వము ఉంటుంది (ఏ క్రియాఫలమైనా, హననక్రియా ఫలమైనా కూడా). ఆ నాలుగు ఏమిటి అంటే (1) ఉత్పాద్యం (2) ప్రాప్యం (3) వికార్యం (4) సంస్కార్యం. ఈ నాలుగింటిలో ఏదో ఒక క్రియాఫలం ఉన్నప్పుడే కర్మత్వం ఉంటుంది.

(1) ఉత్పాద్యం :- ఆత్మ ఉత్పాద్యం కాదు. నూతనంగా మనం కుండను తయారు చేసినట్లు, ఆత్మను ఉత్పత్తి చెయ్యడం సాధ్యం కాదు. ఆత్మ స్వతస్సిద్ధం. ఉత్పత్తి చేయాలి అనే ఆలోచనకు ముందే ఆత్మ ఉంది. అలాంటప్పుడు ఆత్మను పుట్టించడం సాధ్యమా? కాదు. కనుక ఆత్మ నిత్యము.

(2) ప్రాప్యం :- వస్తువు ఉంది. దేశకాలాదులలో ప్రయత్నిస్తే పొందుతాము. ఆవు పొదుగులో పాలున్నాయి. ఆవు గోశాలలో ఉంది. మనం ఇక్కడ కూర్చుంటే పాలు లభ్యం కావు. అక్కడి కెళ్ళాలి. పాలు పిండి తెచ్చుకోవాలి. ఇది ప్రాప్యం. ఆత్మ అలా లభ్య మవుతుందా? కాదు. ఎందుకని? ఆత్మ అంతటా ఉంది.

(3) వికార్యం :- ఇక మూడవది వికార్యం. అంటే, పరిణామం చెందడం. ఈ పరిణామ కార్యము యొక్క ఫలంగా కర్మత్వము ఉండట మని అర్థము. పాలు ఉన్నాయి. మనకు నెయ్యి కావాలి. పాలను లోడు పెట్టాలి.

మజ్జిగ చేయాలి. వెన్న తీయాలి. నెయ్యి పొందాలి. అంటే, ఒక పరిణామ క్రమంలో పాల నుండి మనకు నెయ్యి లభిస్తూ ఉంది. ఆత్మ అలా లభిస్తుందా? లభించదు. ఆత్మ స్థిరమైనది కనుక పరిణామం చెందదు. సత్తు అయిన ఆత్మ అవికార్యము.

(4) సంస్కార్యం :- సంస్కరించడం వల్ల కలిగే ఫలము అని అర్థము. దర్పణముపై దుమ్ము ఉంది. మనం ఎంత ప్రయత్నించినా అందులో మన ప్రతిబింబము కనిపించదు. దుమ్ము దులుపుతాము. అద్దం మళ్ళీ స్వచ్ఛంగా మన రూపాన్ని ప్రతిఫలింప చేస్తుంది. ఇది శుద్ధికార్యము. ఆత్మ అచలం కనుక సంస్కార్యం కాలేదు.

అందుచేత పృథివ్యాదులకు ఆత్మ విషయం కాదు. శస్త్రాదులకు విషయం కాలేదు. కాని ఇక్కడ మరొక ముఖ్య విషయ ముంది. ప్రస్తుతం ఈ శ్లోకంలో ఆత్మ **అచ్ఛేద్య** మని, **అదాహ్య** మని, **అక్లేద్య** మని, **అశోష్య** మని ఏదయితే చెప్పబడిందో, ముందు శ్లోకంలో, అంటే ఇరవై మూడవ శ్లోకంలో చెప్ప బడింది కూడా అదే కదా! అదే విషయాన్ని పునః ప్రస్తావించడం పునరుక్తి దోషం కాదా!

పునరుక్తి లేదు - అతివ్యాప్తి రాదు

ఈ సందర్భములో ఆత్మను గూర్చి విచారం చేస్తున్న ఈ శ్లోకాలలో పౌనరుక్త్యం ఉంది అని కొందరు శంకిస్తూ ఉంటారు. పౌనరుక్త్యం అంటే పునరుక్తి దోషం. అంటే, చెప్పిందే చెప్పడం, మళ్ళీ మళ్ళీ చెప్పడం పునరుక్తి దోషం అనబడు తుంది.

న జాయతే మ్రియతేవా అనే శ్లోకం లోనే ఆత్మ నిత్యమైనది, ఏ విధమైన వికారములు లేనిది అని స్పష్టంగా చెప్ప బడింది. ఆ తరువాత శ్లోకాలలో ఆత్మను గూర్చి చెప్పిన దంతా ఈ శ్లోకంలో చెప్పిన దాని కన్నా భిన్నం కాదు, అధికంగానూ లేదు. కొంత విషయము శబ్దము చేత, కొంత విషయము అర్థము చేత పునరుక్తం అయింది. (***కించిత్ శబ్దతః పునరుక్తం, కించిత్ అర్థతః ఇతి***). కనుక ఇక్కడ పునరుక్తి దోషం ఉంది అని సంశయిస్తారు. కాని, దీనిని పౌనరుక్త్యం అని భావించ కూడదు.

ఆత్మ విషయము దుర్జ్ఞేయము. సులభంగా గ్రహించడం సాధ్యం కాదు. అందుచేత, స్వయంగా తానే ఆత్మ ప్రసంగం కల్పించుకొని వేరు వేరు శబ్దాలతో, అర్థాలతో బోధిస్తూ ఆత్మ విషయాన్ని సులభతరం చేస్తున్నాడు భగవంతుడు. ఇలా ఎందుకు చేస్తున్నాడు? అంటే, క్లిష్టమైన, గహనమైన ఆత్మతత్త్వమును తెలుసు కొనిన సంసారులు సంసారాల నుండి బయటపడ గలుగుతారు అనే ఉద్దేశం తోనే పరమేశ్వరుడైన వాసుదేవుడు అలా పదే పదే చెబుతున్నాడు అని శ్రీ శంకరుల వారు కూడా భాష్యంలో అభిప్రాయ పడ్డారు ***(కథం ను నామ సంసారిణామ్ అవ్యక్తం తత్త్వం బుద్ధి గోచరతామ్ ఆపన్నం సత్ సంసార నివృత్తయే స్యాత్ ఇతి).***

పునరుక్తి దోషం వేదాంత శాస్త్రానికి లేదు. కాని, ఈ శ్లోకంలో ప్రస్తావించిన **అచ్ఛేద్య, అదాహ్య, అక్లేద్య, అశోష్య** మనే లక్షణాలు ఆత్మ యందే కాకుండా వేరే చోట కూడా అగుపిస్తాయి. ఇలా, ఒక దాని లక్షణాలు మరొక దాని యందు ప్రవర్తిస్తూ ఉండటం, లేదా వ్యాపించి ఉండటం అతివ్యాప్తి దోషం.

ఆత్మ ఖండింప బడదు. మండింప బడదు. తడుప బడదు. ఎండింప బడదు. ఈ నాలుగు లక్షణాలు ఆకాశానికి కూడా ఉన్నాయి. ఆకాశాన్ని ఖండించ లేము. కాల్చలేము. తడప లేము. ఎండబెట్ట లేము. ఆత్మకు చెప్పిన ఈ నాలుగు లక్షణాలు పంచభూతాలలో ఆకాశతత్త్వంలో కనిపిస్తున్నాయి.

అంతేకాదు. చతుర్విధ భూతాలు ఆకాశాన్నే కాదు, సూక్ష్మ శరీరాన్ని కూడా ఏమీ చేయలేవు. మనోబుద్ధుల్ని కూడా శస్త్రాలు ఖండించ లేవు. అగ్ని దహింప చేయ లేదు. నీళ్ళు ముంచ లేవు. వాయువు ఆరబెట్ట లేదు.

కనుక, ఈ సందర్భములో ఆత్మను గూర్చి చెప్పిన నాలుగు లక్షణాలు ఆకాశానికి, సూక్ష్మ శరీరానికి కూడా సంబంధించి ఉండటం చేత ఇక్కడ అతివ్యాప్తి దోషం వస్తుంది. శ్రీకృష్ణుడు చెప్పింది ఆత్మను గూర్చి కాదేమో, ఆకాశాదులను గూర్చి ముచ్చటించా డేమో అనే శంక కలుగుతుంది. ఈ సందేహాన్ని నివృత్తి చేస్తూ, అతివ్యాప్తి కాదు అని చెప్పడానికి గీతాచార్యుడు **నిత్యము, సర్వగతము, స్థాణువు, అచలము, సనాతనము** అంటూ శ్లోకము యొక్క రెండవ పాదములో ఉటంకించి, ఈ లక్షణాలు ఆత్మకే గాని ఆకాశాదులకు వర్తించవు అని తేటతెల్లం చేశాడు.

ఆత్మ కాలపరిధి లోకి రాదు. ఇప్పుడు ఉండి అప్పుడు లేనిది కాదు. కాలంలో ఉత్పత్తి అయినది కాదు కనుక ఆత్మ ఉత్పాద్యం కాదు. కాలంలో ఆవిర్భవించినవి కాలంలో నశించి తీరుతాయి. ఆత్మ కాలంలో పుట్టింది కాదు కనుక నశించదు. ఈ కారణం చేత ఆత్మ నిత్యము (***నిత్యః***).

ఆత్మ దేశ పరిధి లోకి కూడా రాదు. ఇక్కడ ఉండి అక్కడ లేనిది కాదు. కనుక అది దేశంలో ప్రాప్యం కాదు. అలా ఒక ప్రదేశానికి పరిమిత మైనవి గతించి పోతాయి. ఆత్మ దేశంలో ఉండేది కాదు. దేశకాలాదులు ఆత్మస్ఫూర్తి తోనే తెలుస్తాయి. అందుచేత ఆత్మ అంతటా ఉంది (***సర్వగతః***).

ఆత్మ నిత్యం కనుక మార్పు చెందదు. మార్పు లేనిది కనుక అవికార్యంగా తెలుస్తూ ఉంది. ఆత్మ లేని చోటంటూ లేదు కనుక వికార్యానికి అవకాశం లేనిదై స్థిర మైనదిగా ఉంది (***స్థాణుః***).

ఆత్మను శుద్ధి చేయడం కూడా సాధ్యం కాదు. ఆత్మను శుద్ధి చేయడానికి ఆత్మ కన్నా వేరుగా రెండవ వస్తువు ఉంటే కదా! కనుక ఏ విధమైన సంస్కార్యానికి అవకాశం లేకుండా ఉంది. ఆత్మ చలన రహిత మైనది (***అచలం***).

కర్మజనిత ఫలాలైన ఉత్పాద్యం, ప్రాప్యం, వికార్యం, సంస్కార్యం అనే చతుర్విధ ఫలాలు ఆత్మ విషయంలో నిషేధింప బడు తున్నాయి కనుక ఆత్మ శాశ్వత మైనది. స్థిరమైనది. నిత్య మైనది. సర్వగత మైనది. సనాతన మైనది (***సనాతనమ్***). దీనినే క్రమంగా గుర్తించి అర్థం చేసుకుందాం.

చతుర్విధ భూతాలు ఆత్మను నశింప చేయలేవు కనుక ఆత్మ నిత్యము (***భూతాని ఏనం ఆత్మానం నాశయితుం న ఉత్సహన్తే, తస్మాత్ నిత్యః***). ఆత్మ నిత్యము కనుక సర్వగతము (***నిత్యత్వాత్ సర్వగతః***). సర్వగతము కనుక ఆత్మ స్థాణువు (***సర్వగతత్వాత్ స్థాణుః***). స్థాణువు కనుక స్థిరము, ధ్రువము (***స్థాణుః ఇవ స్థిరః***). స్థిరము కనుక ఆత్మ అచలము (***స్థిరత్వాత్ అచలః***). ఈ విధంగా ఈ ఆత్మ సనాతనము. చిరంతనము (***అయం ఆత్మా అతః సనాతనః చిరంతనః***).

ఇవన్నీ అతివ్యాప్తి దోషాన్ని నివారిస్తాయి. అంతేకాదు. **అచ్ఛేద్యం, అదాహ్యం, అక్లేద్యం, అశోష్యం** అంటూ ముగిస్తే, ఆత్మ లేని దేమో, శూన్యమేమో అని భావించే ప్రమాదం కూడా లేక పోలేదు. ఎందుకంటే, లేని దానిని ఎవరు ఖండిస్తారు? ఎవరు మండిస్తారు? ఎవరు తడుపుతారు? ఎవరు ఎండ బెడతారు? కనుక ఆత్మ లేనిదే నేమో! శూన్య మేమో! అనే సందేహాన్ని నివారిస్తూ, ఆత్మ **నిత్యము, సర్వగతము, స్థిరము, అచలము, సనాతనము** అని చెప్పడం జరిగింది.

అద్భుతమైన ఈ ఆత్మ విషయ ప్రసంగము తరువాత శ్లోకంలో కూడా కొనసాగుతూ ఉంది.

అవ్యక్తోఽయ మచిన్త్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే । 25
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥

అవ్యక్తః-అయం-అచింత్యః-అయం-అవికార్యః-అయం-ఉచ్యతే
తస్మాత్-ఏవం-విదిత్వా-ఏనం-న-అనుశోచితుం-అర్హసి

అయం	=	ఈ ఆత్మ	తస్మాత్	=	అందువలన
అవ్యక్తః	=	వ్యక్తము కానిది	ఏనం	=	ఈ ఆత్మను
అయం	=	ఈ ఆత్మ	ఏవం	=	ఈ రీతిగా
అచింత్యః	=	చింతింప వీలు కానిది	విదిత్వా	=	తెలిసికొని
అయం	=	ఈ ఆత్మ	అనుశోచితుం	=	దుఃఖించుటకు
అవికార్యః	=	వికారము లేనిది	న అర్హసి	=	తగవు
ఉచ్యతే	=	చెప్పబడింది			

ఆత్మ ఇంద్రియాలకు గోచరము కాదు. మనస్సు ఆత్మను ఊహించ లేదు. ఆత్మ మారేది కాదు. ఈ విధంగా ఆత్మను అర్థం చేసుకుంటే, నువ్వు దుఃఖించే అవసరం ఉండదు.

వ్యాఖ్య

దుఃఖింప దగినది శోచ్యం. దుఃఖింప దగనిది అశోచ్యము. విచారించి అర్థం చేసుకుంటే ఇక్కడ దుఃఖింప దగినది ఏదీ లేదు. ఏ సన్నివేశమూ శోచ్యం కాదు. ఏ వ్యక్తీ శోచ్యుడు కాడు. అంతా అశోచ్యమే. అందరూ అశోచ్యులే. ఈ సత్యం అర్థమైన వాళ్ళు పండితులు. దుఃఖం తెలియని వాళ్ళు. ఇది అర్థం కాని వాళ్ళు పండితులు కారు. కనుకనే దుఃఖిస్తూ ఉంటారు.

అర్జునుడు దుఃఖిస్తున్నాడు. ఆగకుండా తెగ ఏడుస్తున్నాడు. అర్జునుణ్ణి పండితుణ్ణి చేయాలని శ్రీకృష్ణుడు భావించాడు. ఆత్మానాత్మ వివేకాన్ని నూరి పోశాడు. పిండి మరీ త్రాగించాడు. దుఃఖహేతువును సమూలంగా విశ్లేషించి నిర్మూలించాడు.

అర్జునా! నీ దుఃఖానికి కారణం నీవా? నీవు కానిదా? అనే ప్రశ్నను లేవదీశాడు. దుఃఖానికి నీవే కారణమైతే ఏదీ శోచ్యం కాదు. ఎవరూ శోచ్యులు కారు. ఒకవేళ, నీవు కానిది నీ దుఃఖానికి కారణమైతే, అప్పుడు కూడా ఏదీ శోచ్యం కాదు. ఎవరూ శోచ్యులు కారు అనే విషయాన్ని ఇంతవరకు అమోఘంగా ప్రవచించాడు. ఈ ప్రసంగాన్ని ఇంతటితో విరమించే ప్రయత్నంలో, నీవు నిత్యాత్మవే కనుక, దుఃఖింప వలసిన అవసరం లేదంటూ, ***అశోచ్యా నన్వ శోచస్త్వం*** అనే విషయానికి పూర్ణత్వాన్ని కల్పిస్తూ, బోధకు తుది మెరుగులు దిద్దుతున్నాడు.

అర్జునా! ఈ ఆత్మ అవ్యక్తము. అచింత్యము. అవికార్యము. కనుక దుఃఖింప నవసరం లేదు అంటున్నాడు.

అవ్యక్తం - అశోచ్యం

ఇంద్రియాలకు ఏది గోచరమో అది వ్యక్తము. కాని, ఆత్మకు రూపాదులు లేనందున ఏ ఇంద్రియానికి కూడా ఆత్మ గోచరం కాదు. కనుక, ఇంద్రియ అప్రత్యక్ష మగుట చేత ఆత్మ అవ్యక్తము ***(సర్వ కారణ అవిషయత్వాత్).***

స్థూలదేహం వ్యక్త మౌతూ ఉంది. వ్యక్తమయ్యే స్థూల దేహం ఉంది అని అర్థం చేసుకొనే సూక్ష్మదేహం కూడా వ్యక్త మౌతూ ఉంది. మనలో దుఃఖం ఉంది. బాధ ఉంది. సంశయం ఉంది. సంతోషం ఉంది. ఇవన్నీ సూక్ష్మ దేహమైన మనస్సులో వ్యక్త మవుతూ ఉన్నాయి. ఎవరికి వ్యక్త మవుతున్నాయి? దేహేంద్రియాలకు మాత్రం కాదు. అవ్యక్తానికే వ్యక్త మవుతున్నాయి. కనుక ఆత్మ అవ్యక్తం. అనగా ఇంద్రియాలకు వ్యక్తం కానిది.

ఈ అవ్యక్త మనే పదాన్ని రెండు శ్లోకాలు దాటితే ఇరవై ఎనిమిదవ శ్లోకంలో విశేషణంగా ఉపయోగించాడు భగవానుడు. ఏదో అర్థం గాని అవ్యక్తం నుండి జీవులు వచ్చారని, అలాగే మరణించి అవ్యక్తం లోకి పోతున్నారని, ఈ మధ్య లోనే వ్యక్త మవుతున్నా రని అవ్యక్తాన్ని అయోమయంగా, మాయావరణంగా విశేషణ రూపంలో వర్ణించడం జరిగింది.

కఠోపనిషత్తులో అవ్యక్తమును కార్యకారణ శక్తి సముదాయంగా పేర్కొంటూ, ***అవ్యక్తాత్ పురుషః*** అవ్యక్తము కంటే పురుషుడు శ్రేష్ఠుడని తెలిపి, ***పురుషాన్న పరం కించిత్ (పురుషాత్ పరం కించిత్ న),*** పురుషుని కంటే శ్రేష్ఠ మైనది మరొకటి లేదు అని యమధర్మరాజు నచికేతునికి బోధించాడు.

కాని, ఈ శ్లోకంలో గీతాచార్యుడు అవ్యక్త మని చెబుతున్నది ఆత్మ విషయమే. దీనిని తెలుసుకుంటే *(ఏవం విదిత్వా)* దుఃఖించే కార్యము ఉండదు అని ఫల మేమిటో కూడా చెబుతున్నాడు.

అచింత్యం - అశోచ్యం

ఇంద్రియ ప్రత్యక్షం కానందున ఆత్మను అవ్యక్తం అన్నాడు. అంటే, ప్రత్యక్షాది ప్రమాణాలకు అందనిది అని అర్థం. ప్రత్యక్ష ప్రమాణాలకు అందని అవ్యక్తాత్మ అనుమాన ప్రమాణానికి అందే అవకాశ ముందేమో! అనే సంశయాన్ని నివారిస్తూ, ఆత్మను అచింత్య మని చెబుతున్నాడు.

పొగతో ఉన్న నిప్పును ఒక చోట సమీపంగా కళ్ళతో చూస్తాము. ఇది ప్రత్యక్షం. ఆ తరువాత మరొక చోట దూరంగా ఉన్న పొగను మాత్రమే చూసి, అక్కడ నిప్పు ఉంది అని నిర్ణయిస్తాము. నిప్పు కళ్ళకు కనిపించక పోయినా, ధూమం కనిపించడం వలన అగ్ని అనుమేయ మవుతూ ఉంది. ఇది అనుమాన ప్రమాణము.

ప్రత్యక్షం కాని దాని విషయంలో అనుమాన ప్రమాణము సిద్ధించదు. నిప్పును ప్రత్యక్షంగా చూసినట్లు మనము ఆత్మను చూడ లేదు. అందుచేత అనుమేయానికి అవకాశము లేక ఆత్మ అచింత్యమని చెప్పబడింది.

అనుమాన ప్రమాణం ఫలించాలంటే మనస్సులో వృత్తులు కదలాలి. వృత్తికి ఆత్మ విషయం కావాలి. మనస్సు ఆత్మను గూర్చి ఆలోచించ లేదు. ఆత్మ ఉండటం చేతనే మనస్సుకు ఆలోచించే సామర్థ్యం కలుగుతోంది (***చైతన్య జ్యోతిషా అవభాసితస్య మనసః మనన సామర్థ్యం*** - కేన భాష్యం). కనుక ఆత్మ చింతించుటకు వీలు కానిది. ఆత్మ అద్వయము. ఆత్మను తెలుసుకోన దానికి ఆత్మ తప్ప మరొకటి లేదు ***(నాఽ న్యోతోఽ స్తి విజ్ఞాతా)*** అని వేదం చెబుతూ ఉంది.

అవికార్యం - అశోచ్యం

వికారం చెందేది కానందున ఆత్మ అవికార్యము. పాలు తోడు పెట్టి నపుడు పెరుగు మొదలైన పదార్థముల రూపంలో వికారం చెందుతాయి. ఆత్మ నిరవయవం కనుక అది వికారం చెందే అవకాశం లేదు. అవయవాలు లేనిది ఏదైనా వికారం చెంద లేదు. ఆత్మకు అవయవాలు లేవు కనుక అది అవికార్యం ***(అవిక్రియత్వాత్ అవికార్యః).***

ఇరవై నాల్గవ శ్లోకంలో కర్మజన్య ఫలాలను గూర్చి తెలుసుకు న్నప్పుడు క్రొత్తగా పుట్టడం అనే 'ఉత్పాద్యం' ఆత్మ విషయంలో పొసగదు అని అర్థం చేసుకున్నాం. అంటే ఆత్మ 'అనుత్పాద్యం' అని అర్థం. అనుత్పాద్యత్వము అనే ఆత్మ ధర్మానికి అవికార్య మనే ఈ విశేషణము ఉపలక్షణంగా కనబడుతోంది. ఈ విషయం వేదంలో కూడా విస్పష్టంగా ఉంది ***పురస్తాత్సిద్ధం బ్రహ్మ (పురస్తాత్ - సిద్ధం - బ్రహ్మ).*** దృశ్యంగా వ్యక్త మయ్యేవి ప్రభవించక ముందే బ్రహ్మము ఉంది అని దాని అర్థం. అంటే అవికార్యంగా ఉంది అని భావము.

ప్రపంచంలో ప్రతిదీ మార్పు చెందుతూ ఉంటుంది. అణుశాస్త్ర పరిశోధనలో క్షణంలో పదార్థం మార్పు

చెందు తుందని, ముఖ్యంగా 'పార్టికల్ ఫిజిక్స్'లో అరక్షణం కాలంలో అణువు విభాగ మవుతుందని, అలా విభాగమైన అణువు ఛేదింప బడి నపుడు అసంఖ్యాకము లైన భాగాలుగా విడి పోతుందని శాస్త్రజ్ఞులు ఆశ్చర్యకర మైన విషయాల్ని చెబుతున్నారు.

సర్వ సాక్షిత్వం

స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు ఆత్మ విలక్షణంగా ఉంది *(స్థూల సూక్ష్మ కారణ శరీరాత్ వ్యతిరిక్తః)*. స్థూల శరీరం ప్రత్యక్షంగా వ్యక్త మవుతుంది. ఆత్మ స్థూల శరీరం లాగా వ్యక్త మయ్యేది కాదు కనుక అవ్యక్తము *(అవ్యక్తోఽ యం)*. ఆత్మ చింతించ డానికి వీలు లేనిది. సంకల్పాలకు, ఊహాలకు అందేది కాదు. ఆత్మ సూక్ష్మ శరీరం లాగా చింతించుటకు సాధ్యము కానిది కనుక అది అచింత్యము *(అచింత్యోఽ యం)*. కారణ శరీరం వికారం చెందుతుంది. ప్రియాది వృత్తి సహితంగా ఉంటుంది. ఆ విధంగా ఆత్మ వికారం చెందేది కాదు. కారణ శరీరము లాగా వికారము చెందేది కాదు కనుక ఆత్మ అవికార్యము *(అవికార్యోఽ యం)*.

అర్జునా! ఈ విధంగా ఆత్మను తెలుసుకుంటే *(విదిత్వా)* చావు దుఃఖాన్ని కలిగించ లేదు. నేను వీళ్ళను చంపుతున్నాను *(హన్తా అహమ్ ఏషామ్)*, నా చేత వీళ్ళు చంపబడు తున్నారు *(మయా ఇమే హన్యన్తే)* అని దుఃఖించడం జరగదు. అర్జునా! భయంకర మైన శస్త్రాస్త్రాలు, మారణాయుధాలు స్పృశించ లేని ఆత్మ విషయంలో ఇక నువ్వు దుఃఖింప పని లేదు అన్నాడు భగవానుడు *(న అనుశోచితుం అర్హసి)*.

ప్రమాణం లేకుండా ప్రమ కలగదు. ముఖ్యంగా ఆత్మ విషయంలో శ్రుతి ప్రమాణానికి దూరమై జ్ఞానమును పొందడం సాధ్యం కాదు. ఆత్మబోధను గ్రహించ డానికి కావలసిన బోధనావిధి భారతదేశం లోనే ఉంది. అందుచేతనే, పాశ్చాత్యులలో ధర్మబోధను అందించే వారు ఉంటారే గాని, ఆత్మజ్ఞానం కలవారు అరుదుగా ఉంటారు. అలా అరుదైన అసమాన వ్యక్తి, అద్భుత శక్తి సోక్రటీస్ మహాశయుడు.

సోక్రటీస్ ప్రబోధాల వల్ల ఏథెన్స్ ప్రజలు పాడై పోతున్నారని, ముఖ్యంగా యువత చెడిపోతూ ఉందని ఆయనపై అభియోగాన్ని మోపుతూ న్యాయస్థానంలో వ్యాజ్యము నమో దైంది. చివరికి తీర్పు రానే వచ్చింది. సోక్రటీస్‌ను విషం త్రాగి మరణించమని న్యాయస్థానం తీర్పు చెప్పింది.

సోక్రటీస్ ప్రశాంతంగా కనిపించాడు. శిక్షను అమలు పరచారు. సోక్రటీస్ విషాన్ని పానం చేశాడు. ఆ తరువాత కూడా చాలా ప్రశాంతంగా కనిపించాడు. ఆయన ముఖంలో భయాందోళనలు గోచరించ లేదు.

సోక్రటీస్‌ను దర్శించి చాలా మంది దుఃఖించారు. వారందరిని సోక్రటీస్ అనునయించాడు. తన ప్రశాంతతకు భంగం కలిగించ వద్దని ఆజ్ఞాపించాడు.

క్రైటో అనే వృద్ధుడు సోక్రటీస్‌ను సమీపించి, "In what way shall we bury you, Socrates?" 'సోక్రటీస్! నిన్ను ఎలా పూడ్చ మంటావు?' అని అడిగాడు.

"In any way you like, but first, you must catch me, the real me. Be of good cheer, my dear Crito, and say that you are burying my body only, and do with that whatever is usual and what you think best" అని సమాధానం చెప్పాడు సోక్రటీస్.

'నీకు ఎలా తోస్తే అలా చెయ్యి. కాకపోతే, ముందు నువ్వు నన్ను పట్టుకో. నా నిజ స్వరూపాన్ని పట్టుకో. నా ప్రియమైన క్రైటో! సంతోషంగా ఉండు. నువ్వు పూడ్చిపెట్టాలి అనుకొనేది నా శరీరాన్ని మాత్రమే. సాధారణంగా అందరూ ఎలా చేస్తారో అలాగే చెయ్యి! లేదా, నీకు ఏది మేలనిపిస్తే అది చెయ్యి!' అని ప్రశాంతంగా పలికాడు సోక్రటీస్.

అదొక దివ్యానుభూతి. అద్భుత మైన ఆంతరంగి కానుభూతి. ఆత్మవిదుని జ్ఞానానంద స్వరూప విలాసము. చిరంత నానంద చిద్విలాసము.

మేలుకున్న వాడు స్వప్నగత దేహానికి అలంకరణలు చేయాలని భావిస్తాడా? త్రాడును దర్శించిన వాడు పాము కోసం అన్వేషిస్తాడా? కలలో ఏమి జరిగితే ఏమైంది? పల్లకీలో ఊరేగినా, పాడెపై పవ్వళించినా, యుద్ధంలో నిలిచినా, అర్జునా! ఎవరి మనస్సు వ్యాకులత చెందదో, చంద్రబింబము లాగా పూర్ణమై, ప్రశాంతంగా ఎవడు కనిపిస్తాడో వాడే ఆత్మజ్ఞుడు. ఇదే జ్ఞానం. ఆత్మజ్ఞానం. గీతాజ్ఞానం. ఉపనిష ద్వైభవం.

తుషార కర బింబాచ్ఛం మనో యస్య నిరాకులమ్
మరణోత్సవ యుద్ధేషు స శాన్త ఇతి కథ్యతే॥

రణం లోను, మరణం లోను, ఉత్సవం లోను ఎవరి మనస్సు కలత పడదో, పూర్ణేందు బింబము వలె స్వచ్ఛమైన ప్రశాంతతతో ఎవడు శోభిస్తూ ఉంటాడో అతడే ఆత్మజ్ఞుడు అన్నది ఉపనిషత్తు.

ఆత్మ నిత్యము. సర్వగతము. అట్టి ఆత్మకు నాశము లేదని, నాశము లేని దాని కొరకు దుఃఖించ నవసరం లేదని ఇంతవరకు గీతాచార్యుడు బోధించాడు. ఒకవేళ ఆత్మ నశించేదే అని సామాన్యుల వలె భావించినా కూడా దుఃఖించ వలసిన అవసరం లేదు అని చెబుతున్నాడు.

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితు మర్హసి ॥ 26

అథ-చ-ఏనం-నిత్యజాతం-నిత్యం-వా-మన్యసే-మృతం
తథాపి-త్వం-మహాబాహో-న-ఏవం-శోచితుం-అర్హసి

మహాబాహో	= అర్జునా!		అథ మన్యసే చ	=	భావిస్తున్నావేమో
త్వం	= నీవు		తథాపి	=	అట్లైనా కూడా
ఏనం	= ఈ ఆత్మను		ఏవం	=	ఈ విధముగ
నిత్యజాతం	= నిత్యము పుట్టుచున్న దానినిగా		శోచితుం	=	దుఃఖించుటకు
నిత్యం	= నిత్యమును		న అర్హసి	=	తగవు
మృతం వా	= నశించుచున్న దానినిగా				

అర్జునా! ఆత్మ ఎప్పుడూ పుడుతూ ఉంటుందని, ఎప్పుడూ చస్తూ ఉంటుందని భావిస్తున్నావా? అలా చూచినా నువ్వు దుఃఖింప నవసరం లేదే!

వ్యాఖ్య

ప్రామాణికంగా, తాత్త్వికంగా పదకొండవ శ్లోకం నుండి గీతాచార్యుడు అందించిన నిత్యాత్మ బోధ ఇక్కడ తాత్కాలికంగా ఆపాడు. మరో విధమైన వాదమును లౌకికుల స్థాయి నుండి ప్రారంభించి, ఆ కోణం నుండి కూడా పరిష్కారాన్ని అందిస్తున్నాడు.

అథ చ - అని ప్రారంభించి నపుడే విషయం మరొక మలుపు తిరిగింది అని అర్థము. 'ఒకవేళ' అనే భావంతో చెప్పి నప్పుడు, అది సాధారణ జనుల స్థాయి నుండి చెప్పినదే గాని, సిద్ధాంత పరంగా నిర్ణయించినది కాదు అని అర్థము. ***అథ చ*** అనేది అంగీకార సూచకంగా కూడా వాడతారు. ఒకవేళ, ఆ పక్షాన్ని అంగీకరించినా కూడా అనే ధ్వని ఉంటుంది.

అర్జునా! నిత్యమైన ఆత్మను గూర్చి నీకు సశాస్త్రీయంగా వివరించాను. అనంగీకార మైన విషయం అందులో ఏదీ లేదు. విషయం వాస్తవమే అయినా, అందరూ అంగీకరించాలి అని ఎక్కడుంది? సంస్కారం కూడా ఊరేగుతూ ఉంటుంది కదా! నేను చెప్పింది అంగీకరించ లేని వాళ్ళు, తాము గ్రుడ్డిగా నమ్మే దానినే పట్టుకొని వ్రేలాడుతూ ఉంటారు. అలా చూచినా కూడా దుఃఖించ నవసరం లేదు అంటూ భౌతికవాదుల దృక్పథం నుండి కూడా ఒక రాగం తీస్తున్నాడు మురళీ మోహనుడు.

ఆత్మ నిత్యుడే. కాని, చస్తూ పుడుతూ ఉంటాడు అని కొందరు (తార్కికులు) వాదిస్తూ ఉంటారు. అలా చూచినా దుఃఖించడ మెందుకు? అనేది శ్రీకృష్ణుని అభిప్రాయము.

మరి కొందరు దేహమే ఆత్మ. దేహం పుడితే ఆత్మ పుడుతుంది. దేహం చస్తే ఆత్మ చస్తుంది. ఈ మధ్యలో క్షణం క్షణం మారుతూ ఉంటుంది అని చెబుతూ ఉంటారు (చార్వాకులు).

ఇలాంటి వాదాలను అనుసరించి చూచినా దుఃఖానికి హేతువు కనిపించదు. దేహంతో కలసి పుట్టడం జన్మ. దేహంతో కలసి మరణించడం మృత్యువు. చచ్చేదే మళ్ళీ మళ్ళీ చస్తూ ఉంది. పుట్టేదే మళ్ళీ మళ్ళీ పుడుతూ ఉంది. ఈ వాదమే సత్యము అని అనుకున్నా అది అర్థం చేసుకో దగిందే గాని, దుఃఖించ దగింది కాదు. ఆత్మ అవికార్యము కనుక నిత్యము అని ఇంత వరకు బోధించడం జరిగింది. దానికి భిన్నంగా లౌకిక దృష్టితో ఆత్మ వికార్యమే అని భావించినా దుఃఖించ నవసరం లేదని బోధించడానికే ఈ శ్లోకం చెప్పబడిందని జరిగిందని శ్రీమధుసూదన సరస్వతి అభిప్రాయము.

ఆత్మ సత్. ఆత్మ లేకుండా పోవడం అంటూ ఉండదు *(న అభావః విద్యతే సతః)*. కనుక, ఆత్మను సద్రూపం గాను, చావు లేనిది గాను సాంఖ్య ప్రకరణంలో వర్ణించడం జరిగింది. కాని, ఆత్మ చస్తుంది అనేది మాట వరుసకు అంగీకరించి ఈ శ్లోకం చెప్పడం జరిగింది అని శ్రీ హనుమంతుల వారి పైశాచ భాష్యము.

ఆత్మ నిత్యజాతం - నిత్యమృతం. ఎప్పుడూ పుడుతూ ఉంటుంది. ఎప్పుడూ చస్తూ ఉంటుంది అని భావించినా, దుఃఖించ నవసరం లేదు అంటున్నాడు. ఎందుకని? దుఃఖించి సాధించే దేముంది? పుట్టేది పుడుతూనే ఉంటుంది. చచ్చేది చస్తూనే ఉంటుంది *(జన్మవతః జన్మ నాశవతః నాశః)*. ఇందులో దుఃఖానికి అవకాశ మెక్కడుంది?

కాని, ఇక్కడ ఒక విచిత్రం ఉంది. ఇలా సిద్ధాంతాల రగడ చేసే వాళ్ళు కూడా చావు దగ్గరయ్యే సరికి ఏడుస్తూనే ఉంటారు. తమ వాళ్ళు పోతున్నారంటే చార్వాకులు కూడా ఏడుస్తారు. మాటలతో ఏడుపులు దూరం కావు. మర్మం తెలిస్తేనే మాయ మవుతాయి. ఆట లాడటం మంచిదే. బ్రతుకుతో ఆడుకోవడం ఎవరికీ శ్రేయస్కరము కాదు.

చీకటి ముసిరిన చింతల నడుమ
ఆడిన ఆటలు చాలవా!
మృత్యుపాశము వెంట నున్నది
సత్యమార్గమును కనలేవా?
తెర పడిందా తనువే లేదు
మర్మము నెరిగి సాగిపో
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

ఈ సందర్భంలో అర్జునుని **మహాబాహో!** అని సంబోధించాడు భగవంతుడు. గొప్ప బాహువులు కలవాడా! అని పిలిచాడు. బాహుబలం కల వాడివి. మంచిదే. దానితో పాటు బుద్ధి బలం కూడా కల వాడివి కా! బలప్రయోగాలు అన్ని వేళల కాపాడవు. బుద్ధి లోని బాధల్ని తొలగించ డానికి జ్ఞానం, అంటే బుద్ధి బలం ఉండాలే గాని, బాహుబలం కాదు.

అర్జునా! ఈ శ్లోకంలో నేను వినిపించిన వాదము నా సిద్ధాంతము కాదు. నీ అభిప్రాయ మని కూడా నేను భావించడం లేదు. బుద్ధి పెరగక, ఎగబ్రాక లేని వాళ్ళ కోసం నేనే కొన్ని మెట్లు క్రిందికి దిగి మాట్లాడుతున్నాను. అంతే.

నీవు మాత్రం నిత్యాత్మనే అర్థం చేసుకుంటూ సవి భావిస్తున్నా. ఒకవేళ, నువ్వూ ఈ చాదస్తుల కోవ లోనే చేరి పోతాను అంటావా! చేరిపో! కానీ, నీ చాదస్తపు మూక చావు విషయంలో ఏడవ కుండా ఉండాలి. అదే నేను చెప్పేది. త్వరపడి ఏడ్చేశారంటే, మీరు చెప్పే సిద్ధాంతాన్ని మీరే నమ్మలేక పోతున్నారని అర్థం. పార్థా! చాతుర్యంతో జీవించడం బుద్ధిమంతుల లక్షణం గాని, చాదస్తంతో బ్రతకడం కాదు.

పుట్టిన దానికి చావు తప్పదు. అలాగే చచ్చిన దానికి పుట్టుక తప్పదు అనే అనివార్య విషయాన్ని కొందరు ప్రస్తావించి ప్రసంగిస్తూ ఉంటారు. అలా చూచినా దుఃఖానికి అవకాశం లేదు. ఎలాగో విను!

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥ 27

జాతస్య-హి-ధ్రువః-మృత్యుః-ధ్రువం-జన్మ-మృతస్య-చ
తస్మాత్-అపరిహార్యే-అర్థే-న-త్వం-శోచితుం-అర్హసి

జాతస్య	= పుట్టిన వానికి	తస్మాత్	= కాబట్టి
మృత్యుః	= చావు	అపరిహార్యే	= అనివార్య మైన
ధ్రువః హి	= తప్పదు కదా!	అర్థే	= విషయము నందు
మృతస్య	= చచ్చిన వానికి	త్వం	= నీవు
జన్మ చ	= పుట్టుకయు	శోచితుం	= దుఃఖించుటకు
ధ్రువం	= తప్పదు కదా!	న అర్హసి	= తగవు

పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చిన వానికి జన్మ తప్పదు. అనివార్యమైన ఈ విషయానికి నువ్వు దుఃఖించడ మెందుకు?

వ్యాఖ్య

ఈ ప్రపంచంలో ఉన్న వాళ్ళందరూ పుట్టిన వాళ్ళే. పై నుండి ఊడిపడ్డ వాళ్ళు కారు. అలాగే చెట్టు నుండి కాచిన వాళ్ళూ కారు. పుట్టిన వాళ్ళను చావ కుండా ఆపే శక్తిమంతులు ఇంత వరకు పుట్ట లేదు. పుట్టడం అనే లక్షణం ఉన్నప్పుడు చావు అనేది అవలక్షణం కాదు. పుట్టిన ప్రతి వ్యక్తి మరణిస్తాడు. మరణించిన వాడు తిరిగి పుడతాడు. అలా పుడుతూ, చస్తూ ఉండేది ఆత్మే అని భావించినా దుఃఖించ డానికి హేతువు కనిపించడం లేదని, గడచిన శ్లోకంలో లాగే ఈ శ్లోకంలో కూడా సామాన్యుల దృష్టి కోణం నుండి సాధారణ బోధను వినిపిస్తున్నాడు.

బండి బయలు దేరేది గమ్యాన్ని చేరడానికే. బ్రతుకు బయలు దేరేది మరణాన్ని చేరుకోవ డానికే. పుట్టి చావడం, చచ్చి పుట్టడం - ఇవే జనన మరణాలు. అపరిహార్యాలు. తప్పించుకో లేని అనివార్యాలు. చక్రభ్రమణం లాంటి ఈ జనన మరణ వలయంలో చిక్కి చచ్చిన వాడు పుట్టకుండా ఉండ గలడా? పునర్జన్మ విషయంలో పూర్వం సిద్ధాంతము మాత్రమే ఉండింది. ఇప్పుడు ఋజువులు కూడా ఉన్నాయి. అంగీకరించని వాళ్ళు కూడా అంగీకరించేలా సాక్ష్యాలు అన్ని దేశాలలో ఉన్నాయి. పుట్టి చావని వాళ్ళు ఎవరు? చచ్చి పుట్టని వాళ్ళు ఎవరు?

పరివర్తిని సంసారే (చక్రవత్) మృతః కో వా న జాయతే

పరిభ్రమించే ఈ చావుపుట్టుకల సంసారములో చచ్చి పుట్టని వాడు ఎవడున్నాడు? అని ప్రశ్నించింది శాస్త్రం.

ప్రపంచంలో మార్పు గలిగేవి కొన్ని ఉంటాయి. అలాగే మార్పు లేనివి కొన్ని ఉంటాయి. మార్పు గలిగే వాటిని అవసరమైతే ప్రయత్నంతో మార్చు కోవాలి. మార్పులేని వాటిని మనస్సుతో అంగీకరించాలి. అప్పుడే మనుగడకు అర్థం ఉంటుంది.

జనన మరణాలు మార్పు లేనివి. అవి మన చేతిలో లేవు. ఎందుకు పుట్టామో తెలియదు. ఎంతవరకు ఉంటామో తెలియదు. ఎప్పుడు పోతామో అర్థం కాదు. ఎవరు పుట్టించారో తెలియదు. అందుకనే, ***పుట్టించ మని అడిగినానా? పుట్టించితే అలిగినానా?*** అని ఒక కవి హృదయం మెలికలు తిరిగింది.

అర్జునా! శాస్త్రాన్ని ప్రామాణికంగా అంగీకరించ లేని వాళ్ళు అస్తవ్యస్త పోకడలతో ఏవేవో ఊహించు కుంటారు. ఎన్ని ఊహించినా, ఎంతగా ఊహించినా, వల్లకాటికి ఊరేగే ప్రయాణాన్ని ఆపలేరు. అది అపరిహార్యం. అలాంటి దాని విషయంలో దుఃఖం అర్థ రహితం.

అల పుడుతుంది. అల పడిపోతుంది. నేడు అస్తమిస్తుంది. రేపు ఉదయిస్తుంది. మనిషి పుడతాడు. మనిషి మరణిస్తాడు. ఇది అనివార్యం. అపరిహార్యం. అర్జునా! అలా చూచినా దుఃఖం అసంగతం. అర్థ రహితం.

మరణాన్ని విడిచి పెట్టి జననం ఉండదు. మనిషి జననం లోనే మరణం కూడా పుడుతుంది. క్షణంలో మనిషి పుడతాడు. ఆ క్షణం నుండే మరణం ప్రారంభ మవుతుంది. ప్రతిక్షణం మరణమే. ప్రతి నిముషం మరణమే. గంటగంటకూ మరణమే. రోజు రోజుకూ మరణమే. అందుకే నేమో! పుట్టిన క్షణం నుండే లబ్ - డబ్ అంటూ గుండె మరణ మృదంగాన్ని వినిపిస్తూ ఉంటుంది.

వ్యాపారం చేయడానికే వ్యాపారి కొట్టు తెరుస్తాడు. వ్యాపారం పూర్తి కాగానే కొట్టు కట్టేస్తాడు. జీవితంలో కూడా అంతే. జీవన వ్యాపారము పూర్తి కాగానే ప్రతి మనిషి జీవిత మనే దుకాణాన్ని కట్టేస్తాడు. అందరూ కొట్టు కట్టేసి పోయే వాళ్ళే. వ్యాపారం ఎప్పుడు పూర్తయితే కొట్టు అప్పుడే కట్టేస్తారు. ఎవరి వ్యాపారం వారిదే. ఎవరి సమయాలు వారివే.

అర్జునా! భీష్మాదులు మరణిస్తారని దుఃఖిస్తున్నావు. నీ దుఃఖానికి అర్థముందా? కారణ ముందా? సరే, నువ్వు వాళ్ళను చంపవు. అలాగని వాళ్ళు చావకుండా ఉంటారా? నువ్వు చంపనంత మాత్రాన, వాళ్ళు చావకుండా ఎప్పటికి అలాగే ఉండేట ట్లైతే యుద్ధం మానేయ్!

నువ్వు చంపక పోయినా వాళ్ళు మరణించి తీరుతారు. అయినా, నువ్వు యుద్ధం చేయడానికి వచ్చావు. హత్యలు చేస్తున్నట్లు బాధపడతా వెందుకు? యుద్ధం అన్న తరువాత ఇరువైపుల పోయేవాళ్ళు పోతారు. ఉండేవాళ్ళు ఉంటారు. పోయినవాళ్ళు చేదు కారు. ఉన్నవాళ్ళు తీపి కాలేరు. అర్థం గాని ఆలాపనలు. వ్యర్థమైన ఆవేదనలు.

జననం తరువాత మరణం, మరణం తరువాత జననం - ఈ జనన మరణాలే జగతిలో నిరంతరం. రాత్రింబవళ్ళు తిరుగుతూ ఉంటాయి. ఉదయ సాయంత్రాలు మారుతూ ఉంటాయి. వెలుగునీడలు వీడకుండా ఉంటాయి. కాలచక్రం గిర్రున తిరుగుతూ ఉంటుంది. ప్రతి భ్రమణానికి ఆయువు కుంచుకు పోతూ ఉంటుంది. కాలం జీవితంతో ఆడుకొంటూ ఉంటుంది. కాలం కరుణపై ఆధారపడి బ్రతుకు నడుస్తూ ఉంటుంది. పువ్వు కాయగా మారేది, కాయ పండుగా తయారయ్యేది చెట్టును అంటి పెట్టుకొని ఉండటానికి కాదు. చెట్టును వీడి రాలి పోవడానికి. అర్జునా! అర్థం చేసుకో! చావుపుట్టుకలు అనివార్యాలే, అపరిహార్యాలే అని భావించినా దుః ఖించడానికి ఏముంది?

మార్పు చేసే అవకాశం ఉన్నప్పుడు మార్పు చేసే ప్రయత్నం చేయక పోయినా, ఫలితానికి దూరమైనా దుఃఖిస్తే అర్థం ఉంది. మార్పు చేయలేనిది ఉన్నప్పుడు దానిని అర్థం చేసుకొని అంగీకరించాలే గాని, ఆందోళన చెందుతూ దుఃఖించ కూడదు. దుఃఖించినా సాధించే దేమీ ఉండదు. ఇరవై ఆరు, ఇరవై ఏడవ శ్లోకాలలో శాస్త్రానికి భిన్నంగా సాధారణ మానవుల ప్రకృతిని దృష్టిలో ఉంచుకొని దుఃఖ నివారణ ప్రసంగాన్ని సాగించిన పరమేశ్వరుడు తరువాత శ్లోకంలో ముక్తాయింపు వినిపిస్తున్నాడు.

అవ్యక్తాదీని భూతాని వ్యక్త మధ్యాని భారత ।
అవ్యక్త నిధనా న్యేవ తత్ర కా పరిదేవనా ॥ 28

అవ్యక్తాదీని-భూతాని-వ్యక్తమధ్యాని-భారత
అవ్యక్త నిధనాని-ఏవ-తత్ర-కా-పరిదేవనా

			అవ్యక్త నిధనాని ఏవ	=	మరణించిన తరువాత కూడా కనిపించవు
భారతా	=	అర్జునా!			
భూతాని	=	ప్రాణులు	తత్ర	=	అట్టి విషయమున
అవ్యక్తాదీని	=	పుట్టుటకు ముందు కనిపించవు	పరిదేవనా	=	దుఃఖపడ వలసింది
వ్యక్తమధ్యాని	=	మధ్యలో కనిపిస్తాయి	కా	=	ఏముంది?

సర్వప్రాణుల శరీరాలు మొదట్లో లేవు. మధ్యలో అగుపిస్తున్నాయి. గతించిన తరువాత మళ్ళీ లేకుండా పోతాయి. అలాంటి విషయంలో దుఃఖపడ వలసింది ఏముంది?

వ్యాఖ్య

ఎచటి నుండి ఎచటికో?

ఈ ప్రపంచం అణువణువులో ప్రసూతి శాల ఉంది. అణువణువులో శ్మశానవాటిక ఉంది. అన్ని ప్రదేశాలలో ప్రాణులు పుడుతూనే ఉన్నాయి. అన్ని ప్రదేశాలలో మరణిస్తూనే ఉన్నాయి. పుట్టక ముందు ఎక్కడున్నాయో తెలియదు. చచ్చి ఎక్కడికి పోతాయో అర్థం కాదు.

పుట్టిన తరువాతే ఎవరైనా ఉన్నట్లు తెలుస్తారు. పుట్టక ముందు తెలియరు. దీనినే భగవానుడు అవ్యక్తావస్థ అంటున్నాడు. అవ్యక్తావస్థ అంటే, సుషుప్త్యవస్థ లాగా అదొక అవస్థ ఏమో అనుకోవద్దు. 'అవ్యక్తమ్' అంటే, ఇక్కడ అదర్శన మని అర్థము. అంటే, కనిపించని స్థితి. పుట్టక ముందు ఎవ్వరూ కనిపించరు. అలాగే మరణించిన తరువాత కనిపించకుండా పోతారు. అది కూడా అవ్యక్తావస్థే. అదర్శనమే. లేకుండా వస్తారు. లేకుండా పోతారు. ఉండినా కనిపించరు. కనిపించ నపుడు ఉన్నారని ఎలా నమ్మేది? అందుకే అవ్యక్తం అంటున్నాడు.

పుట్టక ముందు కనిపించరు. చచ్చిన తరువాత కనిపించరు. మధ్యలో కొంతకాలమే కనిపిస్తారు. ఇక ఆవేదన ఎందుకు? అని ప్రశ్నిస్తున్నాడు శ్రీకృష్ణుడు. తెల్లవారక ముందు చీకటి ఉంటుంది. ఆ తరువాత తెల్లవారుతుంది. సాయంత్రం పొద్దు వాలుతుంది. మళ్ళీ ప్రపంచం చీకటిలో కూరుకు పోతుంది. చీకటి నుండి వచ్చి చీకట్లోకి సాగి పోతుంది.

బండిలో ప్రయాణం చేస్తూ ఉంటాము. మధ్యలో ఎవరో వచ్చి కలుస్తారు. వాళ్ళు ఎక్కడి నుండి వచ్చారో తెలియదు. ప్రయాణం తరువాత ఎటు పోతారో అర్థం కాదు. ఈ మాత్రానికి మధ్యలో ఏముంది విలాపము? ఏముంటుంది విలాసము?

అర్జునా! భీష్మాదులు ఎక్కడ నుండి వచ్చారో నీకు తెలుసా? ఎక్కడికి పోతారో నీకు తెలుసా? పోయే వాళ్ళు చెప్పి పోతారా? చెప్పి పోవడానికి వెళ్ళే దెప్పుడో వాళ్ళకు తెలుసా? ఎక్కడికి పోతారో తెలుసా? తెలిస్తే, మనతో చెప్పి పోయేవాళ్ళు కదా! చెన్నైకి పోతున్నానని మిత్రుడు చెప్పి పోతున్నాడు కదా! పోయిన తరువాత అక్కడ నుండి ఫోన్ చేసి క్షేమంగా చేరానని చెబుతున్నాడు కదా! ఈ ప్రపంచంలో మరణించిన వాళ్ళు అలా చెప్పి పోతున్నారా? వాళ్ళు ఎక్కడ ఉండేది మనకు తెలుసా? తెలిస్తే, ఎందుకు ఏడుస్తాము? వెళ్ళి తెచ్చుకొనే వాళ్ళం కదా! అర్జునా! ఎందుకొచ్చిన ఆవేదన ఇదంతా! *(కా పరిదేవనా?)*.

వ్యర్థ ప్రలాపాలు - వృథా విలాపాలు

అర్జునా! కనిపించకుండా వచ్చి కనిపించకుండా పోయేవాళ్ళ కోసం కంట తడి పెట్టడం సముచితంగా ఉందా? ఇకనైనా ఏడవడం మానేయ్! ఏడుపు ఒక వేడుక కాదు. అనవసరంగా ఏడవకు. అలసి పోతావు.

ఇంతకీ చావు అనేది ఒక ముగింపు అని ఎవరు చెప్పారు? చనిపోయిన వాళ్ళు లేకుండా పోయేవాళ్ళు కారు. కనిపించకుండా పోయేవాళ్ళు. అంతే. అందుకే అవ్యక్తం, అదర్శనం అని అర్థం చేసుకున్నాం.

అదర్శనాత్ ఆపతితః పునశ్చా దర్శనం గతః
నాసౌ తవ న తస్య త్వం వృథా కా పరిదేవనా ॥

కనిపించని స్థితి నుండి వచ్చాడు. కనిపించని స్థితి లోకి పోతున్నాడు. అతడు నీకు ఏమీ కాడు. నువ్వు అతనికి ఏమీ కాలేవు. ఎందుకొచ్చిన వ్యర్థ విలాపం? *(కా పరిదేవనా?)* అని మహాభారతము.

ఇక్కడ విలాప మెందుకు? అంటే, విలాసము కూడా ఎందుకు? అని అర్థం చేసుకోవాలి. విడిచి పోయేవి అని తెలిసి నపుడు పొంగిపోయి సాధించేదీ ఉండదు. క్రుంగిపోయి బావుకొనేదీ ఉండదు. అతి లేకుండా మిత జీవనాన్ని సాగించడమే ఎవరికైనా హితము.

జరిగేవే జరుగు తున్నాయి. జరగ కూడనివి జరిగితే విలపించాలి. అందరికి జరిగేవే మనకూ జరుగు తున్నాయి. గాలి వీచడం నేరమా? భూమి తిరగడం దోషమా? ఎండ కాయడం తప్పా? వానలు కురవడం పాపమా? నిప్పు కాలడం లేదా? నీళ్ళు పారడం లేదా? చెట్టుకొమ్మలు ఊగడం లేదా? కోతి చంచలంగా ఉందని కోప మెందుకు? గేదె అడ్డు తొలగ లేదని శాప మెందుకు? పోనీ, ఏడిస్తే, ఇవేమన్నా మారుతాయా? అలాంటప్పుడు మరణం విషయంలో ఏడు పెందుకు? మరణం మన ఇంట్లోనే జరిగిందా? అయిన వాళ్ళను పోగొట్టుకున్న వాళ్ళం మన మేనా? అందరికి జరిగిందే మనకూ జరుగుతూ ఉంది. కాకపోతే ఎవరికీ జరగనట్లు, మనకే జరిగినట్లు, ఏదో ఏదో ఊహించుకొని ఎదను ముక్కలు చేసుకుంటున్నాం.

ఆఖ్యాయిక

అవి గౌతమ బుద్ధుడు ఉన్న రోజులు. ఒక తల్లి, తన ఒక్కగా నొక్క సంతానం, బాలుడు అయిన బిడ్డను

పోగొట్టుకొని గుండె చెరువయ్యేలా దుఃఖిస్తూ ఉంది. గౌతమ బుద్ధుడు చూశాడు. ఆమెను ఓదార్చాడు. అయినా, ఉపయోగం లేకుండా పోయింది. నీకు నీ బిడ్డ కావాలి. అంతే కదూ? సరే, నేను చెప్పినట్లు చెయ్యి! నువ్వు వెళ్ళి ఎవరి ఇంటిలో ఇంత వరకు ఎవరూ చావ లేదో, వారి ఇంటి నుండి పిడికెడు ఆవాల గింజలు తీసుకొనిరా! అన్నాడు బుద్ధుడు. ఆమె ఉత్సాహంతో లేచి పరుగులు తీసింది. ఆశతో గ్రామంలో ప్రతి ఇల్లూ తిరిగింది. ఎవరూ చనిపోని ఇల్లు ఒక్కటి కూడా కనిపించ లేదు. అందరూ అయిన వాళ్ళను పోగొట్టుకున్న వాళ్ళే.

ఈ మధ్యలో ఆమె ఒక సత్యాన్ని గ్రహించింది. అందరికి జరిగిందే నాకూ జరిగింది. ధర్మానికి తన, మన భేదం తెలియదు. అందుకే అందరి విషయంలో సమదృష్టితో వర్తించే యమధర్మరాజును 'సమవర్తి' అన్నది శాస్త్రం.

ఆది ఎక్కడో తెలిసిరాదు
అంత మెప్పుడో తెలియదు
నడుమ అన్నీ మరపులే
క్షణక్షణానికి మార్పులే
ఏది ఉండునో ఏది ఊడునో
తెలియని జగతి శోకమయం
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ఆశ్చర్య వత్పశ్యతి కశ్చి దేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్యః శృణోతి శ్రు త్వా ప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥ 29

ఆశ్చర్యవత్-పశ్యతి-కశ్చిత్-ఏనం-ఆశ్చర్యవత్-వదతి-తథా-ఏవ-చ-అన్యః
ఆశ్చర్యవత్-చ-ఏనం-అన్యః-శృణోతి-శ్రుత్వా-అపి-ఏనం-వేద-న-చ-ఏవ-కశ్చిత్

కశ్చిత్	=	ఒకడు	అన్యః చ	=	మరొకడు
ఏనం	=	ఈ ఆత్మను	ఏనం	=	ఈ ఆత్మను
ఆశ్చర్యవత్	=	ఆశ్చర్యముగా	ఆశ్చర్యవత్	=	ఆశ్చర్యము వలె
పశ్యతి	=	చూస్తాడు	శృణోతి	=	వింటాడు
తథా ఏవ	=	అట్లే	శృత్వా అపి	=	విని కూడా
అన్యః చ	=	మరి ఒకడు	కశ్చిత్	=	ఎవ్వడును
ఆశ్చర్యవత్	=	ఆశ్చర్యముగా	ఏనం	=	ఈ ఆత్మను
వదతి	=	చెబుతాడు	న వేద ఏవ	=	ఎరుగనే ఎరుగడు

ఆత్మను ఒకడు ఆశ్చర్యంగా చూస్తాడు. మరొకడు చిత్రంగా చెబుతాడు. ఇంకొకడు విచిత్రంగా వింటాడు. ఇంకొకడు ఎంత విన్నా అసలే తెలుసుకోలేడు.

వ్యాఖ్య

సత్యమైనది ఆత్మ. అది నశించేది కాదని ఇప్పటికే తెలుసుకున్నాం. దాని కోసం దుఃఖించ వలసిన

పనిలేదు. ఇక వస్తూ పోతూ ఉండే అపరిహార్యాలు శోకింప దగినవా? మరి దుఃఖం దేని కొరకు? అదే ఎవ్వరికీ అర్థం కాని విషయం. అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించే విషయం.

ఆశ్చర్య మనేది ఒక పదం. ఆశ్చర్యమనే పదానికి మించిన ఆశ్చర్యం ఈ ప్రపంచంలో మరొకటి ఉండదు. ఉంటూ అర్థం కాకుండా ఉండేది ఏదైనా ఆశ్చర్యమే. ఎవరైనా చని పోయారు అని చెప్పగానే వినిన వ్యక్తిలో మనకు మొదట కనిపించేది ఆశ్చర్యం. ఊహించని ప్రగతిని ఎవరైనా సాధిస్తే ఆశ్చర్యం. ఎవరూ చేయలేని కార్యాన్ని ఎవరైనా పూర్తి చేస్తే ఆశ్చర్యం. ఆశ్చర్యాన్నైతే అందరూ వ్యక్తం చేస్తారు. ఆశ్చర్య మేమిటి? అని ప్రశ్నిస్తే, ఎవ్వరూ చెప్పలేక ఆశ్చర్యంగా చూస్తారు, ఆశ్చర్యంగా మిగిలి పోతారు. అదే ఆశ్చర్యం!

ఆశ్చర్యవత్ ఆశ్చర్యమ్, అదృష్టపూర్వం అద్భుతం అకస్మాత్ దృశ్యమానం తేన తుల్యమ్ ఆశ్చర్యవత్ ఆశ్చర్యం!

ఇంతవరకు చూడనిది అకస్మాత్తుగా చూడటం జరిగితే, అదేదో ఆశ్చర్యంతో సమానము. అలాంటి దేదైనా ఆశ్చర్యమే. అయిదు తలలతో ఆవు పుట్టింది అని చెప్పగానే, అందరూ ఆశ్చర్యంతో చూడటానికి వెళ్తారు. ఎందుకంటే, అలాంటిది గతంలో ఎన్నడూ చూడలేదు, వినలేదు కనుక. అదే ఆశ్చర్యము.

ఆంగ్లేయులు ప్రథమంగా ద్విచక్ర వాహనాన్ని మన దేశంలో ప్రవేశ పెట్టి నపుడు, ఆ సైకిల్ మీద వెళ్ళే వ్యక్తిని చూడటానికి గోదావరి గట్టు పొడవునా జనం గుమిగూడి, అదేదో చక్రం మీద మనిషి పోతున్నాడు. ఆశ్చర్యంగా ఉంది. చూద్దాం, రండి! అంటూ పరుగులు తీశారట. వస్తువు ఏమిటి? విషయ మేమిటి? అనేది కాదు ప్రధానము. అంత వరకు చూడనిది, ఒక ప్రత్యేక మైనది ఏదైనా ఉంటే అదే ఆశ్చర్యం.

ఈ ప్రపంచాన్ని ఒక ఆశ్చర్యంగా మనుషులు చెప్పుకుంటూ ఉంటారు. ఇక్కడ ఏవి ఎందుకు, ఎలా జరుగు తున్నాయో తెలియదు కనుక చిత్రమైన జగత్తు అని ఆశ్చర్య పడుతూ ఉంటారు. విచిత్రమైన ప్రపంచం అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ ఉంటారు.

ఆత్మ విషయంలో కూడా అలాగే ఆశ్చర్యాన్ని కనబరుస్తూ ఉంటారు అంటున్నాడు గీతాచార్యుడు.

ఆశ్చర్యాత్మ

ఆత్మను కొందరు ఆశ్చర్యం లాగా చూస్తూ ఉంటారు. కొందరు ఆశ్చర్యం లాగా పలుకుతూ ఉంటారు. కొందరు ఆశ్చర్యం లాగా వింటూ ఉంటారు. కొందరేమో, చూచినా, మాట్లాడినా, వినినా అర్థం చేసుకోలేరు అన్నాడు శ్రీకృష్ణుడు.

ఆత్మ విషయంలో అన్నీ ఆశ్చర్యాలే. ఆత్మ అంత సులభంగా వంట బట్టేది కాదు. అందుకే ఆశ్చర్యంగా మిగిలి పోతూ ఉంటుంది. ఆత్మను అర్థం చేసుకోవడం కష్టం (***దుర్విజ్ఞేయః***). అర్జును డంతటి వాడే అటు ఇటు చూస్తున్నాడు ఆశ్చర్యంగా. అర్థమైందా, కాలేదా అనేది వేరే విషయం. అర్థమైనా ఆశ్చర్యమే. అర్థం కాకపోయినా ఆశ్చర్యమే. అందుకే నేమో, ఈ శ్లోకాన్ని పరిచయం చేస్తూ, శ్రీ శంకరాచార్యస్వామి భాష్యంలో శ్రీకృష్ణుడు అర్జునునిపై సానుభూతితో అనునయ వచనాలు పలికినట్లు ఆశ్చర్యంగా వినిపించారు.

అయం ప్రకృతః ఆత్మా కిం త్వా మేవ ఏకం ఉపాలభే సాధారణే భ్రాన్తి
నిమిత్తే? కథం దుర్విజ్ఞేయః అయం ఆత్మా ఇతి? అతః ఆహ -

ప్రకృతమైన ఈ ఆత్మను గ్రహించడం చాలా కష్టము. ఆత్మ విషయంలో అందరూ సహజం గానే భ్రాంతి చెందుతూ ఉండే టప్పుడు, అర్జునా! నిన్ను ఒక్కడినే ఎందుకు నిందించాలి? అనుకుంటూ ఆత్మను తెలుసుకోవడం ఎంత కష్టమో భగవంతుడు చెబుతున్నాడు అన్నారు శ్రీ శంకరులు.

చూడటమే ఒక ఆశ్చర్యం

ఒకడు ఆత్మను ఆశ్చర్యం లాగా చూస్తాడు (***ఆశ్చర్య మివ పశ్యతి కశ్చిత్ ఏనం ఆత్మానం పశ్యతి కశ్చిత్***). ఇక్కడ చూడటం అంటే తెలుసుకోవడ మని అర్థం. ఆత్మ దృశ్యం కాదు కనుక చూడటము అంటే, తెలుసుకోవడం, లేదా బుద్ధితో చూడట మని అర్థము. అలా తెలుసు కోవడంలో కలిగేది ఆశ్చర్యమే నంటున్నాడు. ఎందుకని? ఒక గ్రంథాన్ని చదివి అర్థం చేసుకుంటాం. శ్రీమద్రామాయణం ఉంది. దానిని చదివి అర్థం చేసుకుంటాం. అలాగే ఆత్మ విషయం ఉపనిషత్తులలో ఉంది. కాని, చదివితే అర్థం కాదు. అదే ఆశ్చర్యం.

అనన్య ప్రోక్తే గతి రత్ర నాస్తి - ఆత్మ విషయం ఎవరి నుండైనా శ్రవణం చేయ వలసిందే గాని, మనకు మనంగా చదివితే అర్థం కాదు. అదే ఆశ్చర్యం. ***ఆచార్యవాన్ పురుషో వేద.*** ఆచార్యుణ్ణి అనగా గురువును పొందిన వాడే అర్థం చేసుకో గలడు అని కూడా వేదమే తెలిపింది.

గురువు వద్ద శ్రవణం చేయాలి. అది కూడా ఆశ్చర్యమే. ఇంతవరకు ఎందరి నుండి మనం ఎన్ని విషయాలు శ్రవణం చేయలేదు? కాని, ఆచార్యుని వద్ద ఆత్మ విషయం శ్రవణం చేయడం ఒక ప్రత్యేకతగా ఉంది. అదే ఆశ్చర్యము.

ఆత్మ అంటే ఏదో అని చెబుతాడని శ్రోత ఊహిస్తే, ఆత్మవు నీవే అని బోధిస్తాడు. పోనీలే, అదేమిటో తెలుసుకుందా మనుకుంటే, నువ్వు కాళ్ళు లేకనే నడుస్తావు, చెవులు లేకనే వింటావు, కళ్ళు లేకనే చూస్తావు అంటూ, మన భాష లోనే మాట్లాడుతున్నా, మనస్సుకు పట్టని విషయాల్ని అదే పనిగా చెబుతాడు.

చెవులు ఉంటేనే అంతంత మాత్రం వినపడుతూ ఉంది. చెవులు లేకనే వింటావు అనేసరికి, ఆ తరువాత ఆ కొద్దిపాటి వినికిడి కూడా పోతూ ఉంది. నువ్వు లేని చోటే లేదు అని గురువు బోధిస్తూ ఉంటే, అసలు ఉన్న దెక్కడో కూడా అర్థం కావడం లేదు. అంతా ఆశ్చర్యమే. నేను పుట్టలే దంటాడు. మరి, పుట్టిన తేది ఏం కావాలి? నీకు చావు లేదు అంటాడు. అది అర్థం చేసుకోవడానికి చచ్చినంత పని అవుతోంది. ఆశ్చర్యం!

చెప్పడం కూడా ఆశ్చర్యమే

ఆత్మను గూర్చి చెప్పడం కూడా చాలా కష్టమే. అసలు చెప్పడం ఎందుకు? వినే వాడికి అర్థం కావడానికి. మరి అర్థమవుతూ ఉందా? ఆశ్చర్యం! వినేవారే గాని అర్థమైంది అనే వారు ఉండరు. అలాంటి విషయాన్ని చెప్పడం సులభ సాధ్యమా?

గుండెల్ని పిండి, గొంతును అరగదీసి, మనసును మరగించి, అనేక దృక్కోణాలలో గురువు బోధిస్తాడు. తీరా ఉపనిషత్తును పూర్తి చేసిన తరువాత, రామాయణం అంతా విని రాముడికి లక్ష్మణుడు ఏమౌతాడు? అని అడిగినట్లు, ఆత్మను పొంద డానికి నేను ఏమి చేయాలి? అని అడుగుతాడు శ్రోత. పాపం, వక్త! ఆశ్చర్యం! నువ్వేమీ చేయ నవసరం లేదు నాయనా! అదేదో నేనే చేస్తాను. మళ్ళీ బోధిస్తాను అని గురువు మళ్ళీ సిద్ధ పడతాడు. ఆశ్చర్యం!

ఆత్మ మాటలకు అందనిది. మనస్సుకు చిక్కనిది. అయినా మాటల లోనే చెప్పాలి. మనస్సుకే పట్టించాలి. ***యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ*** - ఎక్కడికి నా మాటలు చేరలేవో, నీ మనస్సు చేరుకో లేదో అదే ఆత్మ అని చెప్పాలి. అది కూడా మాటల లోనే చెప్పాలి. ఆశ్చర్యము!

చెప్పింది శ్రోతకు అర్థమైతే, వక్తకు ఆశ్చర్యం! ఎంత చక్కగా గ్రహించ గలిగాడు అని ఆశ్చర్యం. ఒకవేళ చెప్పింది శ్రోత గ్రహించలేక పోతే, ఇంత చెబుతున్నా గ్రహించలేక పోతున్నా డేమిటి? అని ఆశ్చర్యం.

వినడం కూడా ఆశ్చర్యమే

ఇంతవరకు ఏది విన్నా మన కన్నా అన్యమైన దానిని గూర్చే విన్నాం. కాని, ఇప్పుడు మనం వినేది మనల్ని గురించే కనుక ఆశ్చర్యంగా ఉంటుంది. ఏవో ఏవో ఈ ప్రపంచంలో లభ్యమైతే మనం సుఖ పడతాము అనేది మన అవగాహన. మరి, బోధలో మనమే సుఖం, మనమే సుఖహేతువు అని ఆశ్చర్యంగా వింటాము.

ఏమిటి! నాలో ఇంత వైభవ ముందా? ఇదంతా నిజమేనా? అని శ్రోత ఆశ్చర్యంగా వింటూ ఉంటాడు. ఈలోగా, ***సర్వమిద మహాం చ బ్రహ్మైవ*** - ఈ జగత్తు, బ్రహ్మము, నేను, నీవు అంతా ఒక్కటే. నీవే బ్రహ్మము అని గురువు బోధిస్తాడు. ఆశ్చర్యం! ఆశ్చర్యం! పరమాశ్చర్యం!

విన్నంత సేపు బాగానే ఉంటుంది. ఎంత విన్నా మళ్ళీ మొదటి కొస్తుంది. ఇంత వింటున్నా, అంత బాగా చెబుతున్నా అర్థం కాదేమిటో! ఆశ్చర్యం!

వినినా వంటబట్టక పోవడం

పరమాశ్చర్యం!

వినడం వరకు బాగానే ఉంటుంది. విన్న తరువాత ఏమీ విననట్టే ఉంటుంది. ఆశ్చర్యం! ఎంత విన్నా అర్థం కావడం లేదు. గురువు గారికి ఎలా అర్థమైందబ్బా! అని ఆచార్యుని ఆశ్చర్యంగా చూస్తాడు శిష్యుడు. అంతవరకు ఫరవాలేదు. మరొక ఆశ్చర్యం ఉంది.

వక్తు రేవ హి తజ్జాడ్యం శ్రోతా యత్ర న బుధ్యతే

వినే వాడికి అర్థం కాకపోతే ఆ దోషము చెప్పే వాడిదే అనే న్యాయ మొకటుంది. నాకు అర్థం కాక పోవడానికి కారణం నేను కాదు అని ఈ న్యాయాన్ని గనుక శిష్యుడు వినిపిస్తే గురువుకు పరమాశ్చర్యం! ఇంతకీ సారాంశ మేమిటంటే, ఎంతో పరిశ్రమిస్తేనే గాని ఆత్మజ్ఞానం కలగదు ***(అతః దుర్బోధః ఆత్మా ఇత్యభిప్రాయః).*** మన కన్నా అన్యమైన దానిని తెలుసు కోవడం ఆశ్చర్యం కాక పోవచ్చు. ఆత్మబోధలో మనం తెలుసు కుంటున్నది మనల్నే. అందుచేత అర్థమైనా ఆశ్చర్యం గానే ఉంటుంది. అర్థం కాకపోయినా ఆశ్చర్యం గానే ఉంటుంది. అంతా ఆశ్చర్యమయం.

*ఇంతవరకు బోధించిన సాంఖ్య ప్రకరణాన్ని ఇప్పుడు సమాప్తి చేస్తున్నాడు (**అథ ఇదానీం ప్రకరణార్థమ్ ఉపసంహరన్ ఆహ**).*

దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥ 30

దేహీ-నిత్యం-అవధ్యః-అయం-దేహే-సర్వస్య-భారత

తస్మాత్-సర్వాణి-భూతాని-న-త్వం-శోచితుం-అర్హసి

భారత	=	అర్జునా!	తస్మాత్	=	అందుచేత
సర్వస్య	=	అందరి	సర్వాణి	=	సమస్తమైన
దేహే	=	దేహాలలో	భూతాని	=	ప్రాణుల గూర్చి
అయం	=	ఈ	త్వం	=	నీవు
దేహీ	=	ఆత్మ	శోచితుం	=	దుఃఖించుటకు
నిత్యం	=	ఎల్లప్పుడు	న అర్హసి	=	తగవు
అవధ్యః	=	వధింప బడేది కాదు			

అందరి శరీరాలలో ఉన్న ఈ ఆత్మ ఎప్పుడూ చంప బడదు. కనుక, ఏ ప్రాణిని గూర్చి కూడా నువ్వు దుఃఖించ పని లేదు.

వ్యాఖ్య

ఎక్కడికి పోదు

ఏదో జరిగి పోతుందని, మరేదో అవుతుందని అర్జునుడు ఏదో ఏదో ఆలోచించుకొని, ఎదలో భారం నింపుకొని కురుక్షేత్రంలో ఏడుస్తూ కూర్చున్నాడు. ***అశోచ్యా నన్వ శోచస్త్వం.*** దుఃఖింప దగని విషయంలో దుఃఖిస్తున్నావు అంటూ రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకంలో శ్రీకృష్ణుడు సాంఖ్యాన్ని బోధించడం ప్రారంభించాడు. ఈ శ్లోకంతో సాంఖ్య ప్రకరణం ముగుస్తుంది. ***నత్వం శోచితు మర్హసి*** అంటూ సమాప్తి చేస్తున్నాడు. 'దుఃఖం తగదు' అంటూ ప్రారంభమై 'దుఃఖింప పని లేదు' అంటూ సమాప్తి చేస్తున్నాడు.

శుద్ధ ఆత్మతత్త్వ విజ్ఞానం సాంఖ్యం ఇతి అభిధీయతే

నిర్మలమైన ఆత్మ తత్త్వమునకు సంబంధించిన జ్ఞానమే సాంఖ్యము అని వ్యాసుని ప్రబోధము. రెండవ అధ్యాయం లోని సాంఖ్య ప్రకరణ మంతా ఈ విషయం చుట్టే తిరిగింది. తాను ఆత్మ అని తెలుసుకున్న వాడు నిత్యతృప్తుడు. నిరాశ్రయుడు. తన తృప్తికి మరొకరిపై ఆధారపడి ఉండే వాడు కాడు. తన ఆనందానికి మరొక సన్నివేశాన్ని అన్వేషించే వాడు కాడు.

తానేమిటో తనకు తెలియడం చేత, తన దేహంతో పాటు ఈ ప్రపంచ మేమిటో కూడా అతనికి తెలుసు. తాను ఉన్నట్లు తనకు తెలుసు. ఉన్న వన్నీ ఈ ప్రపంచంలో ఎలా ఉన్నాయో కూడా తెలుసు. తెలియబడే వన్నీ ఎప్పుడూ మారుతూ ఉండినా, అలా మారే వాటి నన్నిటినీ తెలుసుకొనే తాను మారేవాడు కాడని కూడా అతనికి తెలుసు. అతడే దేహి. మారే దేహాలలో ఉంటూ మారని వాడు.

కుండ ఉంది. కుండలో ఆకాశం ఉంది. కుండను కొని తీసుకొని పోతూ ఉంటాం. మనం కుండను పట్టుకొని పోతామే గాని కుండ లోని ఆకాశాన్ని తీసుకొని పోము. కుండ ఉంటుంది. కుండలో ఆకాశం ఉంటుంది. కుండ పగుల్తుంది. కుండ లోని ఆకాశం ముక్కలు కాదు. నశించదు.

కుండలు అనేకంగా ఉంటాయి. అన్ని కుండలలో ఆకాశం ఉంటుంది. కుండలు ఎన్ని ఉంటే అన్ని ఆకాశాలు ఉండవు. కుండలు ఎన్నయినా ఉండొచ్చు. ఆకాశం మాత్రం ఒక్కటే. కుండలు ప్రయాణం చేస్తాయి. ఆకాశం పయన మెరుగదు. కుండలు పగిలి పోతాయి. ఆకాశం నశించదు. అది సర్వగతం. కుండ లన్నీ ఆకాశానికి ఉపాధులు. ఒకే ఆకాశానికి అనేకమైన ఉపాధులు.

ఆత్మకు దేహాలన్నీ ఉపాధులే. ఒకే ఆత్మకు అనేకమైన ఉపాధులు. దేహాలు ఎన్నో ఉంటాయి. దేహి ఒక్కడే. దేహాలు మార్పు చెందుతాయి. దేహి మారడు. దేహాలు నశిస్తాయి. దేహి నశించడు. అలా నశించని జీవుడు **(దేహీ)** దేహం లోనే ఉన్నాడు. నశించని వాడుగా ఉన్నాడు **(అవధ్యః).** ఏ వికారాలూ లేకుండా ఉన్నాడు **(నిత్యః).**

అర్జునా! నీవూ అదే. ఆత్మవే. అందరూ ఆత్మస్వరూపులే. అందరి దేహాలలో ఉన్న అఖండాత్మ స్వరూపము ఒక్కటే **(సర్వస్య దేహే అయందేహీ నిత్యః, అవధ్యః).** అర్జునా! పోయేది ఏదన్నా ఉంటే పోనీ. 'నేను పోతాను' అనేది మరచిపో! బాగలేనిది ఏదన్నా ఉంటే ఉండనీ. అంతమాత్రాన 'నేను బాగలేను' అనకు. నువ్వు పోయే వాడివి కావు. నీకు నశింపు లేదు, అంటూ పరమేశ్వరుడు ఈ శ్లోకంలో కూడా ఆత్మ యొక్క నిత్యత్వాన్ని వివరించి, అర్జునుని ఆవేదనకు చరమగీతం పాడుతున్నాడు.

ఏడుపు మానేయ్!

ఉండేది ఏమిటో, పోయేది ఏమిటో అర్థం కాక విషణ్ణుడ వయ్యావు. పోయేది అంటూ ఏదైనా ఉంటే, దానిని పోనీ. కాని, నువ్వు పోయేవాడివి కావు. వచ్చిన వాడివీ కావు. ఎన్నడూ ఉన్నవాడివే. నువ్వు ఎలా నిత్యంగా ఉన్నావో, అలాగే నీకు సంబంధించిన జ్ఞానం కూడా నిత్యమే. నువ్వు నిత్యుడుగా ఉండబట్టే నిత్యమైన ఏ జ్ఞానము కల్పిత బంధాలను కరిగిస్తోంది.

దుఃఖ మనేది ఆత్మ లేక కాదు. నువ్వే ఆత్మ అని తెలియక. ఆత్మస్వరూపం కాని దెవరు? అలాగని ఆత్మ తానే అన్న జ్ఞానం ఎంత మంది కుంది? ఆత్మ యొక్క అజ్ఞానం అందరికీ అనాదిగా ఉంది. అది అలాగే కొనసాగుతూ ఉంది. ఎందుకో తెలుసా! ఆత్మ ఏమిటో అర్థం కాకపోవడం చేత.

పార్థా! ఆత్మ ఏమిటో నీకు తెలిపాను. అనాత్మ ఏమిటో కూడా తెలిపాను. ఆత్మను అనాత్మగా భావించే ప్రమాదం ఉండకూడ దనే అలా చేశాను. నువ్వేమిటో నీకు తెలిసింది. నువ్వు కాని దేమిటో కూడా నీకు అర్థమైంది. నువ్వు ఎక్కడికీ పోవు. ఏ వికారానికి, వినాశానికి లోను కావు (*నిత్యః అవధ్యః*). ఇక నువ్వు కాని దంటావా? అది అసత్. లేనిదే. ఉన్నది పోదు కనుక అశోచ్యం. లేనిది ఉండేది లేదు కనుక అశోచ్యం. ఇక దుఃఖ మెక్కడుంది? కౌన్తేయా! కళ్ళు తుడుచుకో! విజయా! విలపించకు. అర్జునా! ఆవేదన చెందకు. పార్థా! లే! పోరాడు.

అర్జునునికి పట్టిన మోహం రెండు విధాలుగా ఉందని ప్రారంభం లోనే చెప్పుకున్నాం. అనాత్మ ధర్మాలను ఆత్మ యందు ఆరోపించుకొని, నేను చంపేవాణ్ణి - నేను చచ్చేవాణ్ణి అని దుఃఖించే సాధారణ మోహం మొదటిది. దానికి చికిత్స జరిగిపోయింది. అదే సాంఖ్య ప్రకరణం.

ఇక రెండవది అసాధారణ మోహం. స్వధర్మమైన యుద్ధాన్ని అధర్మంగా భావించి, పాపభీతితో శోకానికి గురి కావడం రెండవది అయిన అసాధారణ మోహం. ప్రస్తుతం రెండవ దానికి చికిత్స ప్రారంభ మవుతూ ఉంది. ధర్మం అనే కోణం నుండి చూచినా, యుద్ధం చేయ దగిందే నంటూ తరువాత శ్లోకం నుండి ప్రారంభిస్తున్నాడు భగవానుడు.

పరమార్థ తత్త్వ దృష్టితో చూచి నపుడు శోకమోహాలకు అవకాశమే లేదని ఇంతవరకు చెప్ప బడింది. కేవలం ఆత్మజ్ఞాన దృష్టి తోనే కాదు, స్వధర్మం అనే దృష్టితో కూడా చెప్పడం జరుగుతూ ఉందని శ్రీ శంకరాచార్య స్వామి ధర్మచర్చకు భాష్యంలో శ్రీకారం చుట్టి అవతారికను అందించారు (ఇహ పరమార్థ తత్త్వా పేక్షాయాం శోకో మోహో వా న సంభవతి ఇత్యుక్తమ్. న కేవలం పరమార్థ తత్త్వాపేక్షా యా మేవ, కిం తు -).

స్వధర్మ మపి చావేక్ష్య న వికమ్పితు మర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽ న్యత్ క్షత్రియస్య న విద్యతే ॥ 31

స్వధర్మం-అపి-చ-అవేక్ష్య-న-వికంపితుం-అర్హసి
ధర్మ్యాత్-హి-యుద్ధాత్-శ్రేయః-అన్యత్-క్షత్రియస్య-న-విద్యతే

స్వధర్మం అపి	=	స్వధర్మమును కూడా	ధర్మ్యాత్	=	ధర్మయుతమైన
అవేక్ష్య చ	=	గాంచి	యుద్ధాత్	=	యుద్ధము కంటె
వికంపితుం	=	చలించుటకు	అన్యత్	=	అన్యమైన
న అర్హసి	=	తగవు	శ్రేయః	=	శ్రేయస్సు
క్షత్రియస్య	=	క్షత్రియునకు	న విద్యతే హి	=	లేదు గదా!

అర్జునా! నువ్వు క్షత్రియుడివి. ధర్మ యుద్ధం చేయడం నీ స్వధర్మము. అలా చూచినా కూడా యుద్ధము కన్నా నీకు శ్రేయస్కర మైనది మరొకటి లేదు. నువ్వు శోకింప పని లేదు.

వ్యాఖ్య

చేయ వలసింది చేయ నపుడు చేయకూడని దానిని చేయవలసి వస్తుంది. ఏదీ చేయకుండా మనిషి జీవించలేడు. ప్రతి మనిషి ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. ఏదో ఏదో చేస్తూ పోతే, మరేదో ఏదో అనుభవించ వలసి వస్తుంది. కనుక, చేసేది ఏదైనా ధర్మబద్ధంగా ఉండాలి. అప్పుడే వ్యక్తి సుఖశాంతులతో జీవిస్తాడు. సమాజము అభ్యుదయ మార్గంలో పయనిస్తుంది. మానవ సమాజం అభ్యుదయ మార్గంలో ఆదర్శంగా జీవించాలంటే, సమాజంలో ఉండే వ్యక్తు లందరు, వారి వారి ధర్మాలను త్రికరణ శుద్ధిగా ఆచరించ గలగాలి. ఎక్కడ ఏ చిన్న మర ఊడినా పెద్ద యంత్రము కుంటు పడునట్లు, ఏ వ్యక్తి ధర్మచ్యుతుడైనా సమాజాభ్యుదయానికి విఘాతం ఏర్పడుతుంది. ప్రభువు ధర్మం తప్పితే మరీను.

ధర్మ జీవనం

భార్యాబిడ్డల్ని పోషించడం యజమాని ధర్మము. ప్రజలను పాలించడం రాజు ధర్మము. పశుపక్ష్యాదులు తమ సంతానాన్ని తాము రక్షించు కుంటాయి. మీరు అలా రక్షించుకోవాలి అని వాటికి ఎవ్వరూ చెప్పలేదు. అవి కేవలం సహజాతాల ప్రేరణతో తమ ధర్మాన్ని నెరవేర్చు కుంటాయి.

మనిషికి మనస్సుంది. బుద్ధి ఉంది. ఉన్నంత మాత్రాన లాభం లేదు. అవి పని చేస్తేనే ఉపయోగం. ఎవరి బుద్ధైతే పని చేస్తుందో, అతణ్ణి బుద్ధిమంతుడు అంటారు. పని చేయక పోతే బుద్ధిహీనుడు అంటారు. బుద్ధిమంతుడు తనను తాను రక్షించుకుంటూ సమాజ అభ్యుదయానికి సహకరిస్తూ ఉంటాడు. బుద్ధిహీనుడు తనను తాను పాడు చేసుకుంటూ, సమాజ అస్థిరతకు తన వంతుగా కారకు డవుతాడు.

మనిషి జ్ఞానవంతుడు కావాలి. సాంఖ్య ప్రకరణంలో మనం చూచినట్లు ఆత్మజ్ఞానియై శోభించాలి. ధర్మపరుడు కాని వాడు జ్ఞానవంతుడు కాలేడు. ఉట్టికి ఎక్కలేని వాడు స్వర్గానికి ఎక్కుతాడా? అనేది సామెతే కాదు, సత్యం. చేయ దగిందే (*ధర్మం*) చెయ్య లేనివాడు చేయ వలసింది (*జ్ఞానాభ్యాసం*) ఏమి చేస్తాడు?

ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః

ధర్మమును నశింప చేసేవాడు ధర్మం చేత నశింప బడుతాడు. ధర్మమును రక్షించేవాడు ధర్మం చేత రక్షింప బడుతాడు అన్నది మహాభారతము. అందుచేత ధర్మాన్ని ఎవ్వరూ విడిచి పెట్ట కూడదు అని విధిగా శాసించింది (*తస్మాత్ ధర్మం న త్యాజ్యం*).

ధర్మం అమృతం వంటిది. అది మనిషికి ప్రాణం పోస్తుంది. అధర్మం విషం లాంటిది. అది మనిషి ప్రాణం తీస్తుంది. అధర్మంగా జీవిస్తూ, ఆనందంగా బ్రతక గలము అనుకోవడం ఎండమావులలో దప్పిక తీర్చుకొనే ప్రయత్నమే అవుతుంది.

క్షత్రియ ధర్మం

క్షతాద్ యో వై త్రాయతి ఇతి స తస్మాత్ క్షత్రియః స్మృతః

వినాశము జరగకుండా సమాజాన్ని కాపాడే వాడు క్షత్రియుడు. అవసరమైతే యుద్ధమైనా చేసి ప్రజల్ని రక్షించ వలసిన వాడు క్షత్రియుడు. అంతేగాని, తన వ్యక్తిగత ఆరాటంలో సన్యసించే వాడు మాత్రం కాదు.

యుద్ధం స్వధర్మో నృపతేః ప్రజానాం పరిపాలనమ్

ప్రజల్ని ధర్మబద్ధంగా పాలిస్తూ వారికి సుఖశాంతులు దూరం కాకుండా చూడటం, ఒకవేళ అలాంటి దురదృష్టకరమైన పరిస్థితి ఆసన్న మైతే, యుద్ధం చేసి అయినా సరే శాంతి భద్రతలను కాపాడటం క్షత్రియ ధర్మం. రాజధర్మం.

కనుక యుద్ధం అనేది క్షత్రియుని కర్తవ్యము. యుద్ధఫలం ఇలాగే ఉండాల్సి అనే నియమ మేమీ లేదు. అది ఎలాగైనా ఉండొచ్చు. కర్మఫలాలు దైవాధీనాలు. కర్తవ్యాన్ని నిర్వహించడం మానవుల వంతు. ఫలాలను అనుగ్రహించడం భగవంతుని వంతు. కర్తవ్యాన్ని విస్మరించే వానికి ఫలాలను గూర్చి ప్రసంగించే అర్హత ఉండదు.

క్షత్రియుడు ధర్మ పరిపాలన చేయాలి. అది ధర్మము. ఏ కారణం చేత నైనా ధర్మచ్యుతి జరిగితే, తత్ఫలితంగా శాంతిభద్రతలు కుంటు పడితే, దానిని సుస్థిర పరచ డానికి యుద్ధమే శరణ్య మైతే, యుద్ధంలో పోరాడైనా సరే, దేశాన్ని, ప్రజల్ని రక్షించాలి. అందుచేత యుద్ధం క్షత్రియుని ధర్మం అని చెప్ప బడింది. ఈ విధంగా యుద్ధం క్షత్రియునికి స్వధర్మము ***(స్వధర్మః క్షత్రియస్య యుద్ధమ్).***

ధర్మయుద్ధంలో ధనంజయుడు

కురు సామ్రాజ్యాన్ని పాలించ డానికి అంధుడైన ధృతరాష్ట్రుడు అనర్హుడు. అందుచేత ధృతరాష్ట్రుని సోదరుడైన పాండురాజు ధర్మజ్ఞుల, శ్రేష్ఠ పురుషుల ఆదేశాన్ని బొదల దాల్చి సింహాసనాన్ని అధిష్ఠించాడు.

అదృష్టాలు అందల మెక్కిస్తాయి. దురదృష్టాలు పని గట్టుకొని క్రిందికి దించుతాయి. పాండురాజు విధి వక్రించింది. తపస్సు నాచరించ డానికి పాండురాజు అరణ్యాలకు వెళ్ళాడు. ఆ తరువాత, పాండురాజు కుమారుడు, జ్యేష్ఠుడు అయిన ధర్మరాజు సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఆయన పరిపాలనలో ధర్మం చతుష్పాదాలతో నడిచింది. ప్రజలు సుఖశాంతులతో జీవించారు.

ఇంతలోనే దాయాదుల పోరు ఆరంభమైంది. ధర్మప్రభువు ధర్మరాజును దుర్యోధనుడు దగా చేశాడు. మాయ చేసి మోసం చేసి రాజ్యాన్ని అపహరించాడు. ధర్మం అడవుల పాలైంది. అధర్మం అందల మెక్కింది. అధర్మ పాలనలో ప్రజలు అశాంతికి లోనయ్యారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది, ప్రజల జీవనంలో సుఖశాంతులు నింపడము పాండవుల ధర్మమైంది. అందుకే శ్రీకృష్ణుడు పాండవుల పక్షం చేరాడు. కనుక స్వధర్మము అనే కోణము నుండి చూచినా, అర్జునుడు చలింప వలసిన అవసరము లేదు అనేది శ్రీకృష్ణుని అభిప్రాయము.

యుద్ధభూమిలో అర్జునుడు విషణ్ణుడైన సందర్భంలో ఎలా చలించి పోయాడో మనం చూశాం. శరీరం వణుకుతోంది అని అర్జునుడే అన్నాడు. ***(వేపథుశ్చ శరీరేమే రోమహర్షశ్చ జాయతే).*** దానిని దృష్టిలో ఉంచుకొని, అర్జునా! క్షత్రియ ధర్మాన్ని ఆచరించడానికి అనువైన ఈ యుద్ధంలో నువ్వు అంతగా చలించిపో నవసరం లేదు అంటున్నాడు శ్రీకృష్ణుడు.

దిగులు - దిగ్భ్రాంతి

మహాభారత యుద్ధ ఫలితాలను అతిగా ఊహించుకొని కలత చెందిన అర్జునుడు దారి తప్పి ఆలోచించాడు. అతనికి ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా గోచరించ సాగింది. అందుచేత స్వజనుల్ని చంపుకోవడం శ్రేయస్కరంగా కనిపించడం లేదని ప్రథమ అధ్యాయంలో వాదించాడు ***(న చ శ్రేయోఽ ను పశ్యామి హత్వా స్వజన మాహవే).***

తరువాత, రెండవ అధ్యాయంలో తాను ధర్మం విషయంలో సందేహంతో ఉన్నట్లు అంగీకరించాడు. ఏది శ్రేయస్సో కూడా అర్థం కావడం లేదని ఒప్పుకున్నాడు. తనకు శ్రేయస్సును నిశ్చయించి చెప్పమని

ప్రార్థించాడు. అదంతా దృష్టిలో ఉంచుకొని శ్రీకృష్ణుడు, క్షత్రియుడైన వానికి ధర్మయుతమైన యుద్ధము కంటే శ్రేయస్కర మైనది వేరొకటి లేదు అని ధర్మ ప్రసంగం చేస్తున్న ఈ సందర్భంలో నొక్కి వక్కాణిస్తున్నాడు ***(ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽ న్యత్ క్షత్రియస్య న విద్యతే).***

క్షత్రియుడు అనివార్యమైన మరణం నుండి వెను తిరగ కూడదు. ఒకవేళ యుద్ధంలో ప్రాణం పోయినా ప్రశస్తమే. పవిత్రమే. అదే చెబుతున్నాడు.

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ లభన్తే యుద్ధ మీదృశమ్ ॥ 32

యదృచ్ఛయా-చ-ఉపపన్నం-స్వర్గద్వారం-అపావృతం
సుఖినః-క్షత్రియాః-పార్థ-లభంతే-యుద్ధం-ఈదృశం

పార్థ	=	అర్జునా!	ఈదృశం చ	=	ఇట్టి
యదృచ్ఛయా	=	కోరకుండా	యుద్ధం	=	యుద్ధమును
ఉపపన్నం	=	లభించిన	సుఖినః	=	సుఖవంతులు
అపావృతం	=	తెరవ బడిన	క్షత్రియాః	=	క్షత్రియులు
స్వర్గద్వారం	=	స్వర్గద్వారము అయిన	లభంతే	=	పొందుతున్నారు

పార్థా! యుద్ధము నువ్వు కోరుకున్నది కాదు. దీని వల్ల స్వర్గ ద్వారాలు తెరుచు కుంటాయి. ఇట్టి యుద్ధమును క్షత్రియులు మాత్రమే పొందుతారు. అలా పొందిన వాళ్ళు ధన్యులు కదా!

వ్యాఖ్య

ఊహించని కార్యం

యుద్ధమును ఎవ్వరూ అభిలషించరు. యుద్ధాలైనా, వర్షాలైనా కోరితే వచ్చేవి కావు. పుణ్యాన్ని పంచ డానికి యుద్ధం వస్తే, పంటను పండించ డానికి వర్షాలు పడతాయి. యుద్ధం వచ్చినా, వర్షం పడినా కారణాలు ఉన్నాయి. కారణాలు లేకపోతే కోరినా అవి రావు. ఆశించకుండా వచ్చే అవకాశాలను విజ్ఞులు వినియోగించు కుంటారే గాని, పాడు చేసుకోరు.

అర్జునా! క్షత్రియుడివి కావడం చేత ఈ అవకాశం నిన్ను వరించింది. నువ్వు యుద్ధం చెయ్యాలని భావించలేదు. నన్ను కౌరవుల వద్దకు సంధికి పంపే టప్పుడు కూడా యుద్ధాన్ని నివారించమనే నువ్వు కూడా చెప్పావు. నేను కూడా అలాగే ప్రయత్నించాను. కాని, మన ప్రయత్నాలు ఫలించ లేదు. దుర్యోధనుడు యుద్ధాన్నే కోరుకున్నాడు. సంగ్రామం అనివార్యమైంది. ఇది నువ్వు ఆశించకుండానే నీకు ప్రాప్తించింది ***(యదృచ్ఛయా ఉపపన్నమ్).***

యుద్ధం చెయ్యడం భీష్మాదులకు మాత్రం ఇష్టమా? మన లాగే యుద్ధ నివారణకు వాళ్ళు కూడా ప్రయత్నించారని నీకు తెలియదా? వారి ప్రయత్నాలు కూడా ఫలించ లేదు. యుద్ధం తప్పనిసరి అయింది. మరి, వాళ్ళు యుద్ధానికి రాలేదా? ఇష్టం లేదని పారిపోయారా? పారిపోతే క్షత్రియు లెలా అవుతారు? క్షత్రియ ధర్మాలలో యుద్ధం నుండి పారిపోకుండా ఉండటము కూడా ఒకటి అని వారికి తెలుసు ***(యుద్ధే చాప్య పలాయనమ్.... క్షాత్రం కర్మ స్వభావజమ్).***

పుణ్యప్రదం

అర్జునా! అనేక యజ్ఞ యాగాదులు చేసిన వాళ్ళు వాటి ఫలంగా స్వర్గాన్ని పొందుతారు. కాని వీరులైన క్షత్రియులు అదే స్వర్గ ఫలాన్ని యుద్ధం వల్ల పొందుతారు. అందుచేత ఆశించని యుద్ధాన్ని పుణ్యం గల క్షత్రియులే పొంద గలరు.

కృష్ణా! హింసాయుతమైన యుద్ధము పుణ్యకార్యమా? అని అడుగుతా వేమో. యుద్ధం పుణ్యకార్య మని నేను చెప్పడం లేదు. యుద్ధం ధర్మ కార్యము అంటున్నాను. ధర్మ కార్యము యొక్క ఫలం పుణ్యం. ఆ పుణ్యఫలం స్వర్గం.

కనుక క్షత్రియ ధర్మాన్ని అనుసరించి యుద్ధంలో పాల్గొనే వీరులు మరణిస్తే, వారి కొరకు స్వర్గ ద్వారాలు తెరుచు కుంటాయి. ధర్మయుద్ధంలో పాల్గొనడ మనే కార్యము వల్ల లభించే పుణ్యమే, మూతబడిన స్వర్గ ద్వారాలను తెరిపిస్తుంది. ఈ శ్లోకంలో అర్జునుణ్ణి *పార్థా!* అని పిలిచాడు శ్రీకృష్ణుడు. పార్థా! అంటే, పృథ కుమారా! అని అర్థము. పృథ అంటే కుంతీదేవి. ఈ సంబోధనలో ఎంతో భావం నిగూఢంగా ఉంది. అట్టి భావస్ఫూర్తి తోనే అర్జునునికి స్ఫూర్తి నివ్వాలని భావించి శ్రీకృష్ణుడు పార్థా! అని పిలిచాడు.

శ్రీకృష్ణుడు రాయబారానికి హస్తినకు వెళ్ళి నపుడు, సంధి విఫలమై యుద్ధము అనివార్యము కాగా, తిరిగి పాండవుల వద్దకు వస్తూ, అత్తమ్మ కుంతీదేవిని దర్శించు కున్నాడు. ఆ సమయంలో కుంతీదేవి శ్రీకృష్ణునితో ఇలా అంది.

ఏతద్ధనంజయో వాచ్యో నిత్యోద్యుక్తో వృకోదరః
యదర్థం క్షత్రియా సుతే తస్య కాలోఽ యమాగతః ॥

కృష్ణా! క్షత్రియ జనని దేని కొరకు కుమారుని కంటుందో, అట్టి సమయము ఆసన్న మైనదని, అర్జునునికి, నిరంతరము పోరాట పటిమను ప్రదర్శించే భీమునికి నా మాటగా చెప్పు అన్నది.

తల్లి మాటను గుర్తుకు తెస్తూ, పార్థా! అని సంబోధించి, కోరకుండా లభించింది, స్వర్గద్వారాలను తెరిచేది అయిన యుద్ధ కార్యాన్ని ఆచరించు అని స్ఫూర్తిని కలిగిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

యుద్ధం చేయకపోతే ఏమౌతుంది? దాని ఫలిత మేమిటో కూడా చెబుతున్నాడు.

అథ చే త్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33

అథః-చేత్-త్వం-ఇమం-ధర్మ్యం-సంగ్రామం-న-కరిష్యసి
తతః-స్వధర్మం-కీర్తిం-చ-హిత్వా-పాపం-అవాప్స్యసి

అథ	= ఇక		తతః	=	అపుడు
త్వం	= నీవు		స్వధర్మం	=	స్వధర్మమును
ధర్మ్యం	= ధర్మయుక్తమైన		కీర్తిం చ	=	కీర్తిని
ఇమం	= ఈ		హిత్వా	=	విడిచి
సంగ్రామం	= యుద్ధమును		పాపం	=	పాపమును
న కరిష్యసి చేత్	= చేయక పోతే		అవాప్స్యసి	=	పొందుతావు

అర్జునా! ధర్మ సమ్మతమైన ఈ యుద్ధాన్ని నువ్వు చెయ్యక పోతే, దాని ఫలిత మేమిటో తెలుసా? నువ్వు పోగొట్టు కొనేది స్వధర్మాన్ని, కీర్తిని. పొందేది పాపాన్ని.

వ్యాఖ్య

ధర్మ వర్తనం లేక పోవడమే అధర్మం

ఇష్టాయిష్టాలను నిర్ణయించుకునే అధికారం మనిషికి ఉంది. వాటిని మార్పు చేసుకునే అధికారం కూడా మనిషికి ఉంది. పాపపుణ్యాల విషయంలో మాత్రం నిర్ణయాధికారం శాస్త్రానిదే కాని మనిషిది కాదు.

వ్యక్తి సమాజానికి దూరంగా లేడు. సమాజ సహకారం లేకుండా జీవించ లేడు. సమాజం పట్ల తన ధర్మాన్ని నిర్వర్తించని వాడు అధర్మపరుడు అవుతాడు. అధర్మఫలం పాపం కనుక అతడు పాపము చేసిన వాడు అవుతాడు. పాపఫలమును అనుభవించ వలసిన వాడు కూడా అవుతాడు.

యుద్ధం చెయ్యక పోతే ఏమవుతుంది? ఏ యుద్ధం? ధర్మయుద్ధం. అందుచేతనే, ధర్మయుతమైన ఈ యుద్ధము ***(ఇమం ధర్మ్యం సంగ్రామం)*** అని నొక్కి మరీ స్పష్టం చేశాడు భగవంతుడు. ఇలాంటి ధర్మ యుద్ధాన్ని విరమిస్తే దుష్ఫలితం అనివార్యం అంటున్నాడు. ఈ శ్లోకంలో *అథ* అనే పద ప్రయోగము వల్ల, యుద్ధం విరమిస్తే కలిగే దోషానికి సంబంధించిన విషయాన్ని హెచ్చరికతో పరిసమాప్తం చేయడం జరిగింది.

యుద్ధ మనేది క్షత్రియునికి స్వధర్మం అని ఇప్పటికే తెలుసుకున్నాం. అధర్మపరులైన శత్రువులు ఎదురు నిలిచి పోరాడే టప్పుడు, వారిని జయించి, ధర్మాన్ని రక్షించ వలసిన బాధ్యత, భూ భారాన్ని తగ్గించ వలసిన కర్తవ్యం కూడా భూపతికే ఉంది. అందుకే ఇది సాధారణ ప్రసంగం కాదు; ధర్మశాస్త్ర ప్రబోధము.

నిర్జిత్య పరసైన్యాని క్షితిం ధర్మేణ పాలయేత్

ధర్మదూరులైన శత్రు మూకలను జయించి భూమిని, ధర్మాన్ని క్షత్రియుడు రక్షించాలి అని ధర్మశాస్త్రం చెబుతూ ఉంది. దీనికి భిన్నంగా వర్తించడం అధర్మం అవుతుంది. చేయ వలసింది చేయక పోవడం కూడా పాపమే అని ముఖ్యంగా గుర్తించాలి.

ఇక్కడ మరొక సంశయం కలుగుతుంది. కర్మ చేస్తే ఫలితం తప్పదు అనేది అందరికీ తెలుసు. ఫలం ఏదయినా కర్మ చేస్తేనే అందుతుంది. మరి, ఇక్కడ అర్జునుడు కర్మను మానేస్తున్నాడు. అంటే, కర్మ చేయడం లేదు. చేయని దానికి ఫలం ఉందని చెప్పడం విడ్డూరంగా లేదా? అనే సంశయం కొందరికి కలుగుతూ ఉంటుంది.

నిజమే. యుద్ధం అయితే చేయడం లేదు. యుద్ధభూమికి వచ్చి తిరిగి పోతున్నాడా, లేదా? అది కర్మ కాదా? అలా తిరిగి పోవడం అనే కర్మ చేయకూడనిది కాదా? చేయకూడని దానిని చేస్తున్నాడు కనుక అది పాపం. దాని ఫలితమే పాప ఫలం. ధర్మయుద్ధం నుండి పారి పోవడం పాపం. కాని, ధర్మశాస్త్రం ఈ విషయాన్ని ఎంత క్షుణ్ణంగా చెబుతూ ఉందంటే, అలా పలాయనం చిత్తగిస్తున్న సమయంలో యోధుడు కనుక మరణిస్తే, అతని పుణ్యం జయించిన రాజుకు చెందుతుంది అని కూడా చెప్పింది.

రాజా సుకృత మాదత్తే హతానాం విపలాయినామ్

యుద్ధభూమి నుండి పారిపోతూ మరణించిన వాడి సుకృతాన్ని రాజే పొందుతా డని యాజ్ఞవల్క్య స్మృతి చెబుతూ ఉంది. కనుకనే సంగ్రామం నుండి పరుగులు తీసి పాపం మూట కట్టుకో వద్దు అని శాస్త్రం ఆదేశించింది ***(న నివర్తేత సంగ్రామాత్)***.

అందుచేత, ధర్మయుతమైన ఈ యుద్ధాన్ని చేయకుండా విడిచి పెడితే, స్వధర్మాన్ని పోగొట్టు కోవడమే గాక, కీర్తిని కూడా పోగొట్టుకొని పాపాన్ని మూట కట్టుకో వలసి వస్తుందని పరమేశ్వరుడు హెచ్చరిస్తున్నాడు.

పేరు నిలవదు - ఖ్యాతి మిగలదు

స్వధర్మం అనేది చాలా గొప్ప విషయం. విశాలంగా అర్థం చేసుకో వలసిన విషయం. స్వధర్మం కళ్ళ లాంటిది. కళ్ళజోడు వంటిది కాదు. స్వధర్మం తల్లి లాంటిది. సవతి తల్లి వంటిది కాదు. స్వధర్మం మనతో కలిసి పుడుతుంది. స్వధర్మాన్ని మార్చుకో లేము. సవతి తల్లులు ఎందరైనా ఉండొచ్చు. కన్నతల్లి మాత్రం ఒక్కతే. ఆమె విషయంలో మార్పు జరగదు. జరగలేదు. తల్లి విషయంలో నిర్ణయాధికారం మనకు లేదు. తల వంచి అంగీకరించడమే. స్వధర్మం కూడా తల్లి లాంటిదే. అందుకని స్వధర్మాన్ని విడిచి పెట్ట కూడదు. క్షత్రియునికి యుద్ధం స్వధర్మం కనుక యుద్ధాన్ని విడిస్తే ధర్మాన్ని విడిచి పెట్టినట్లే అవుతుంది అని భగవంతుడు హెచ్చరిస్తున్నాడు. స్వధర్మాన్ని పోగొట్టు కుంటే పాపం వస్తుంది అంటున్నాడు ***(స్వధర్మం హిత్వా పాప మవాప్స్యసి).***

యుద్ధాన్ని విరమిస్తే స్వధర్మ నాశమే గాక, కీర్తి నాశమని కూడా ఎరుక పరుస్తున్నాడు. అదేమిటి? అర్జును డంతటి వీరుడు యుద్ధాన్ని విరమిస్తే జనులు శ్లాఘించరా? ఆహా! చంపే శక్తి ఉన్నా, చంపకుండా విడిచి పెట్టాడు. దయామయుడు, ప్రేమమూర్తి అని స్తుతించరా?

అలా జరగనే జరగదు. యుద్ధ రంగానికి రాకుండా విరమించి ఉంటే, అది వేరే విషయం. యుద్ధం చేయడానికి వచ్చి, రణభూమి నుండి తిరిగి పోతే, యుద్ధం చేయ లేకనే తిరిగి పోయాడు అని చెప్పుకుంటారు.

అర్జునునికి ఎంత పేరుంది! ఎంత ఖ్యాతి ఉంది! చేసిన వందలాది దానకర్మలు ఒక్క దొంగతనంతో పోయినట్లు, ఉన్న ఖ్యాతి సమస్తమూ, యుద్ధం మానేయడ మనే ఒక్క అపఖ్యాతితో తుడిచి పెట్టుకు పోతుంది. పైగా, పాపం మూట కట్టుకో వలసి వస్తుంది.

అయ్యో! ఎంత పాపాన్ని చేయడానికి పూనుకున్నాము? ***(అహోబత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్)*** అని మొదటి అధ్యాయం నలభై ఐదవ శ్లోకం లోను, ఆతతాయులైన దుర్యోధనాదుల్ని వధించుట వలన మాకు పాపమే వస్తుంది ***(పాప మేవ ఆశ్రయేత్ అస్మాన్)*** అని అదే అధ్యాయం ముప్పై ఆరవ శ్లోకం లోను అర్జునుడు వాపోయాడు. పాప మనేది యుద్ధం చేయక పోవడం వల్ల వస్తుందే గాని ***(పాపం అవాప్స్యసి)*** యుద్ధం చేయడం వల్ల కాదు అని ఈ సందర్భంలో భగవానుడు సహేతుకంగా, సశాస్త్రీయంగా వివరించాడు.

యుద్ధం చేయక పోవడం వల్ల కలిగే దుష్ఫలితాలను తరువాత శ్లోకంలో కూడా వినిపిస్తున్నాడు.

అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తేఽ వ్యయామ్ ।
సమ్భావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ 34

అకీర్తిం-చ-అపి-భూతాని-కథయిష్యంతి-తే-అవ్యయాం
సంభావితస్య-చ-అకీర్తిః-మరణాత్-అతిరిచ్యతే

అపి చ	=	మరియు	కథయిష్యంతి	=	ముచ్చటించుకుంటారు
భూతాని	=	లోకులు	సంభావితస్య	=	మాననీయునకు
తే	=	నీ యొక్క	అకీర్తిః	=	అపకీర్తి
అవ్యయాం	=	అంతము లేని	మరణాత్ చ	=	మరణము కంటె కూడా
అకీర్తిం	=	అపకీర్తిని	అతిరిచ్యతే	=	అధిక మైనది.

ప్రజలు నీ అపకీర్తిని చాలా కాలం పాటు అదే పనిగా చెప్పుకుంటారు. సన్మానాలు అందుకొన్న వానికి అవమానము మరణం కంటే ఎక్కువే కదా?

వ్యాఖ్య

జరిగిన వన్నీ సన్మానాలే

అర్జునా! ఒక పెద్ద బండను కొండ మీదకి మోసుకొని పోవడానికి చాలా శ్రమించాలి. సమయం కూడా చాలా పడుతుంది. అదే బండను పై నుండి క్రిందికి త్రోయడానికి పెద్దగా శ్రమించ నవసరం లేదు. పైగా ఎక్కువ కాలం పట్టదు కూడా.

అర్జునా! నీవు ఎంత కీర్తిమంతుడివి! అదంతా క్షణాల్లో వచ్చిందా? సులభంగా ప్రాప్తించిందా? ఎంత కాలం ఎంతగా శ్రమిస్తే లభించింది! ఎన్ని అద్భుతమైన ఆయుధాలు నీ వద్ద ఉన్నాయి! అవి దారిన పోయే వాళ్ళు దానం చేసినవి కావే! దేవతల్ని మెప్పించి, ఒప్పించి తెచ్చినవి కావా? పరమశివునితో నువ్వు చేసిన పోరాటం సామాన్యమా? దాని వల్ల నీకు లభించిన కీర్తి మరొకరికి సాధ్యమా? ***(మహా దేవాది సమాగమాది నిమిత్తాం, కీర్తిః).*** జనులు నిన్ను ఎంతగా కీర్తించారు! ధర్మాత్ముడు అనలేదా? శూరుడని పిలవలేదా? ***(ధర్మాత్మా, శూరః ఇత్యేవం ఆదిభిః).*** నువ్వు యుద్ధం నుండి వెను దిరిగితే ఈ కీర్తి మిగుల్తుందా? నీ ఖ్యాతి నిలుస్తుందా?

జరగబోయే వన్నీ అవమానాలే

ఎంతో కాలం శ్రమించి సాధించిన కీర్తి క్షణాల్లో మటుమాయ మవుతుంది. అర్జునా! సంవత్సరాలు శ్రమించి సాధించిన పేరేమో క్షణాల్లో పోతుంది. క్షణాల్లో సంక్రమించిన అపకీర్తి మాత్రం జీవితాంతం ఉంటుంది. పేరు లేకపోతే నష్టం లేదు. పేరున్న వాడు చెడ్డపేరుతో బ్రతకడం దుర్భరంగా ఉంటుంది. మరణ సదృశంగా ఉంటుంది. కాదు, కాదు. మరణం కన్నా దారుణంగా ఉంటుంది.

నువ్వు కనిపించగానే అదిగో! అతడే! అంటూ చెప్పుకుంటారు. పూర్వం కూడా అలాగే చెప్పుకొనే వారు. కాకపోతే, దేవతల్ని సైతం ఎదిరించి పోరాడిన విజయ శిఖామణి ఇతడే! అని చెప్పుకొనే వారు. ఇప్పుడు? అదిగో, అతడే! కురుక్షేత్రం నుండి దౌడు తీసిన వీరయోధుడు అతడే! అని అపహాస్యం చేస్తారు. అది భరించడం నీ లాంటి వీరుడికి సాధ్యమేనా అర్జునా? ఆలోచించు!

కృష్ణా! వీరుడు అంటే, పరాక్రమాన్ని ప్రకటిస్తే నేనా? బాహుబలాన్ని ప్రదర్శించి శత్రువును వధిస్తేనే శూరుడా? వీరుడైన వానికి మనస్సు ఉండదా? క్షత్రియుడు అయినంత మాత్రాన ప్రేమ ఉండదా? ధీరుడికి సున్నిత మైన హృదయం ఉండ కూడదా? ఇప్పటి వరకు నా వైభవా లెన్నో చూశారు. ఈ యుద్ధాన్ని ఎందుకు చేయలేక పోతున్నానో ప్రజలు గ్రహించ లేరా? పండితులు వివరించ లేరా? జాలిగుండె అని నిర్ణయించ లేరా?

అర్జునా! అదంతా నీ భ్రమ! ఈ సమాజం ఒక మాయలమారి. అన్నీ బాగుంటే పగలు అరబోస్తుంది. ఏ మాత్రం తేడా వచ్చినా, నిజానిజాలను పరిశీలించ కుండానే పగలు కుమ్మరిస్తుంది. అసమానంగా ఊరేగిన వాణ్ణి అదుపు లేకుండా కుదిపేసే సమయం ఆసన్న మైందని పొంగి పోతుంది. నామరూపాలు లేకుండా ఊడ్చి పారేసే కాలం చేరువైందని ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతుంది. సముద్ర మంత నోరు తెరుచుకొని విమర్శిస్తుంది. గాలిలా తిరుగుతూ ప్రచారం చేస్తుంది. సామాన్యులే కాదు, మహారథులు కూడా నిన్ను నిశితంగా, నిర్దయగా విమర్శిస్తారు. యుద్ధం చెయ్యలేక కేవలం పిరికితనం తోనే నువ్వు పరుగులు తీశావని చెప్పుకుంటారు. నా మాట విను!

భయా ద్రణా దుపరతం మంస్యన్తే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 35

భయాత్-రణాత్-ఉపరతం-మంస్యంతే-త్వాం-మహారథాః
యేషాం-చ-త్వం-బహుమతః-భూత్వా-యాస్యసి-లాఘవం

మహారథాః	= మహారథులు		యేషాం	=	ఎవరికి
త్వాం	= నిన్ను		త్వం	=	నీవు
భయాత్	= భయము వలన		బహుమతః	=	మాననీయుడవు
రణాత్	= రణరంగము నుండి		భూత్వా	=	అయి
ఉపరతం	= మరలిన వానినిగ		లాఘవం	=	చులకన
మంస్యంతే	= అనుకుంటారు		యాస్యసి చ	=	పొంద గలవు

మహారథు లందరూ పూర్వం ఎంతగానో నిన్ను గౌరవించారు. ఇప్పుడు వాళ్ళ దృష్టిలో నువ్వు చులకనై పోతావు. కేవలం భయం వల్లనే నువ్వు యుద్ధం మానేశావని వాళ్ళందరూ భావిస్తారు.

వ్యాఖ్య

ఉన్న కృపను చూడరు
లేని భయాన్ని అంటకడతారు

అర్జునా! సామాన్యులు చేసే విమర్శల్ని తట్టుకో వచ్చు. కాని, మహారథులు కూడా అలాగే భావిస్తారు. నువ్వు ఏదో కృపతో యుద్ధం నుండి వెను దిరిగావని ఋజు మార్గంలో అర్థం చేసుకోరు. కర్ణుడు మొదలైన వారికి భయపడే నీవు యుద్ధాన్ని విరమించావని చెప్పుకుంటారు (**భయాదిభిః కర్ణాదిభ్యః యుద్ధాత్ నివృత్తం చిన్తయిష్యన్తి - న కృపయా ఇతి**) అంటున్నాడు గీతాచార్యుడు.

అర్జునుడిలో ఉన్నది వాస్తవానికి కృపే. ఈ విషయం శ్రీకృష్ణునికి పూర్ణంగా తెలుసు. కాని, ఎవరు అర్థం చేసుకుంటారు? ఒక వైపు నిజం తెలుస్తూ ఉన్నా, అర్జునుణ్ణి చులకన చేయాలని పలు విధాలుగా విమర్శిస్తారు. జడిసి పోయాడు. ఇక జగడ మెక్కడిది? అని అవహేళన చేస్తారు.

పూర్వము అర్జునుడు అంటే గౌరవం ఉన్నవాళ్ళే ఇప్పుడు చులకనగా చూస్తారు. అందుకే **లాఘవమ్** అంటున్నాడు శ్రీకృష్ణుడు. 'లాఘవమ్' అంటే లఘుభావము, తేలిక భావము, చులకన భావము అని అర్థము.

లఘుభావం ఏర్పడి నపుడు కేవలం వెనుక మాత్రమే నిందిస్తారని చెప్పలేము. ముందే విమర్శిస్తారు. ముఖం మీదే అపహాస్యం చేస్తారు. ఇలాంటి సమయాల లోనే మహామహులు కూడా నీరు గారి పోతారు. ఇలా చులకన భావంతో చూచే దెవరు? పూర్వం తనను గౌరవించిన వాళ్ళే, భయపడిన వాళ్ళే, దుర్యోధనుడు మొదలైన వాళ్ళే. వాళ్ళే ఇప్పుడు నిందించే మహారథులు (**మహారథాః దుర్యోధన ప్రభృతయః**). దుర్యోధనాది సైనికులు పూర్వం భయపడి గౌరవించారు. నేడు చులకన భావంతో లేని దౌర్బల్యాన్ని అంట గడతారు. కొందరు మనుషులు మారరు. వారి మనసులూ మారవు. మంచికి నోచుకోరు. వంచనకు వెనుకాడరు. అర్జునా! అలాంటి వారికి అవకాశం ఇచ్చిన వాడివి అవుతావు. బాగా ఆలోచించుకో!

చరణము : **పాలకడలిలో కాలకూట విషము**
ఎదురౌ తుందని ఎరిగిన దెవరు?

ఏ పాప మెరుగని కైలాసపతికి
గళమున గరళము నింపిందెవరు?
పల్లవి : **మారిన దెవరు - మార్చే దెవరు?**
మార్పు మనిషికి సాధ్యమా మనసా? ॥ మారిన ॥
అనుపల్లవి : **కురిసే మబ్బును నిలిపే దెవరు?**
మారే మనసును ఆపే దెవరు? ॥ మారిన ॥

మంచివారు చెడు నెరుగరు. చెడ్డవారు మంచి నెరుగరు. వివేకం లోపిస్తే మహిలో అన్నీ విడ్డూరాలే.

యుద్ధం మానేస్తే, అందరి దృష్టిలో అర్జునుడు ఎలా చులకన అవుతాడో వివరించిన వాసుదేవుడు, అలా తేలిక భావంతో రెచ్చిపోయిన శత్రువులు ఏ విధంగా మాట్లాడతారో వినిపిస్తున్నాడు.

అవాచ్యవాదాం శ్చ బహూ న్వదిష్యన్తి త వాహితాః ।
నిన్దన్త స్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36

అవాచ్యవాదాన్-చ-బహూన్-వదిష్యంతి-తవ-అహితాః
నిందంతః-తవ-సామర్థ్యం-తతః-దుఃఖతరం-ను-కిం

తవ	= నీకు		అవాచ్యవాదాన్ చ	= అనరాని మాటల్ని కూడా
అహితాః	= శత్రువులు		వదిష్యంతి	= అన గలరు
తవ	= నీ యొక్క		తతః	= అంత కంటె
సామర్థ్యం	= సామర్థ్యమును		దుఃఖతరం	= దుఃఖము
నిందంతః	= నిందిస్తూ		కిం ను	= ఏముంటుంది?
బహూన్	= అనేకంగా			

అర్జునా! ఇక నువ్వంటే గిట్టని వాళ్ళున్నారు చూడు. నీ సామర్థ్యాన్ని నిందిస్తూ అనరాని మాటలు అంటారు. అంతకు మించిన బాధ మరొకటీ ఉంటుందా?

వ్యాఖ్య

అర్జునా! ఎవరైనా తేలికైన బంతి తోనే ఆడుకుంటారు. బరువైన బండతో ఎవ్వరూ ఆడుకోరు. చులకన కానంత వరకే గౌరవము. ఒక్కసారి నీవు చులకన అయ్యావా, ఆ తరువాత అందరూ శూలాలు దించడానికే చూస్తారు. మాటల ఈటెలు విసిరేందుకే సిద్ధ పడతారు. పదునైన పదాలను ప్రయోగిస్తారు. వాడియైన వాక్యాలను వినిపిస్తారు. అంతకు మించిన దుఃఖం మరొకటి ఉంటుందా?

కృష్ణా! అదేమిటి? నా శక్తేమిటో ఎవరికి తెలియదు? నా వీర వైభవ మంతా ప్రచార రూపంలో జనావళిలో ఊరేగింది కదా? సమాజానికి నేనేమైనా క్రొత్త వ్యక్తినా? ఇంత తెలిసి నప్పుడు ఎందుకు నిందిస్తారు? నా సామర్థ్యము వారికి తెలియదా?

అర్జునా! తెలుసు. నీ శక్తేమిటో విమర్శించే వారికి బాగా తెలుసు. తెలుసు కనుకనే నిందిస్తారు. తెలియని వాళ్ళు ఎలా నిందిస్తారు? అసలు వాళ్ళు నిందించేది నీ సామర్థ్యాన్నే (**నిందంతః తవ సామర్థ్యమ్**). సామర్థ్యాన్ని శ్లాఘించాలి గాని నిందించడ మేమిటి, అంటావా? సామర్థ్యానికి క్రొత్త అర్థాలు పుట్టిస్తారు. నూతన వ్యాఖ్యానాలు వెలుగు లోకి తెస్తారు. పైగా, ప్రభుత్వం నడిపే వాళ్ళు అందరూ ఆ వైపే మొగ్గు చూపుతారు. వాళ్ళు చేసే

నిందలు దుర్భరంగా ఉంటాయి. అనరాని మాటలు అంటారు (*అవాచ్య వాదాన్ వదిష్యన్తి*). అవి కూడా అనేక విధాలుగా ఉంటాయి (*బహూన్*). అలా ఎందుకు చేస్తారు అంటావా? వాళ్ళందరూ నీకు అహితులే కనుక. (*అహితాః శత్రవః*). శత్రువులు ఏమి చేయరు? ఏది మాట్లాడరు?

నీ సామర్థ్యము (*తవ సామర్థ్యమ్*) నీకు తెలుసు. నాకు తెలుసు. వాళ్ళకు కూడా తెలుసు. తెలిసే నిందిస్తారు. ఏముంది ఇతడి సామర్థ్యం? అంటూ విమర్శలు మొదలు పెడతారు. అబ్బ! శివుడితో యుద్ధం చేశాడట! మన ముందే నిలువ లేక పోయాడు. చూడగానే పారిపోయాడు. ఇతనేమిటి? శివుడితో యుద్ధం చేయడ మేమిటి? ఏదో వేడుక కోసం శివుడు కొంతసేపు వినోదంగా ఆడుకుంటే, ఇతడే శివుణ్ణి జయించి నట్లు చెప్పుకున్నాడు. అంతా ప్రచార ఆర్భాటము! ఈ రోజు తేలిపోయింది కదా, కురుక్షేత్రంలో ఆయన సామర్థ్య మేమిటో!

ఇక ఉత్తర గోగ్రహణం విషయం మనకే తెలుసు కదా! ఉత్తర కుమారునికి సారథిగా వచ్చినవాడి సామర్థ్యం ఏమిటో మనమే చూశాం కదా! ఏదో దయ తలచి ఒక్కడితో పోరాడట మెందుకని వదిలేస్తే, తానే మమ్మ ల్నందరినీ జయించినట్లు చాటింపు వేయించు కున్నాడు. మరి, ఆ సామర్థ్య మేదో ఇప్పుడు ప్రదర్శించ వచ్చు కదా!

ఆయన గొప్ప నాట్యాచార్యుడే కావచ్చు. ఆడుకుంటే ఎవరు కాదన్నారు? పోరాడటం అనే మాటలో ఆట ఉందని, పోరు ఒక ఆటని అర్జునుడు భావించి నట్లుంది. కర్ణ దుర్యోధనాది వీరుల ముందు నిలబడి పోరాడట మంటే, ఉత్తర కుమారునికి సారథ్యము వహించడమూ కాదు, ఉత్తరకు నాట్యం నేర్పించడమూ కాదని అర్జునుడికి ఇప్పటికి తెలిసి ఉంటుంది అని చెప్పుకుంటారు. ఒకనాటి నీ సామర్థ్యం ఈ రోజు అసమర్థతగా అందరి నోళ్ళల్లో నాని పోతుంది.

ఏదో మహాయుద్ధం చేసేటట్లు రెండు సేనల మధ్య రథాన్ని నిలపమని చెప్పాడు. ఇది ఎక్కడన్నా ఉందా? ఈ పుడమికి పోరాటాలు క్రొత్తవా? ఇది వరకు ఎందరు యుద్ధాలు చేయలేదు? ఏదో ఒక వైపు నిలబడి యుద్ధం చేయడం చూశాము. మధ్యలో నిలబడి యుద్ధం చేస్తారా? ఈ మధ్యావతారము ఏమిటో! పాండవ మధ్యముడు కనుక మధ్యలోకి వచ్చాడేమో అనుకున్నాము. తరువాత అర్థమైంది, ఈ మధ్యావతారము విరాట నగరంలో ఎత్తిందే నని. అందుకే కదా, వీర పురుషుల్ని చూడగానే కాలికి బుద్ధి చెప్పాడు.

అర్జునా! అహితులు అదుపులో ఉంటారా? అవకాశం వచ్చి నపుడు జారవిడుచు కుంటారా? మహారథులే అలా అంటారని అనుకోకు. మశకాలు కూడా తెగించి తమ మహిమను తామే చాటు కుంటాయి. మామూలు సైనికులు కూడా నన్ను చూచే భయపడి అర్జునుడు పారిపోయాడు అని భార్యలతో చెప్పుకుంటారు. నన్ను చూచిన తరువాత, ఆ నరుడు నడవనే లేదు. పార్థా! పార్థా! అంటూ సారథి వెంటబడి పిలుస్తున్నా, ఇంకెక్కడి పార్థుడు? పరుగే పరుగు. ఒకటే పరుగు. అయినా, అందరూ అలా పరుగులు తీయలేరు. పోరాటంలో లేక పోయినా, పరుగులో మాత్రం గొప్ప పటిమే ఉంది అని చెప్పుకుంటారు. అర్జునా! నీతో పాటు నాకూ తప్పదు పోటు. ఆలోచించుకో! ఇక పత్రికలలో వార్తలన్నీ మన చుట్టే తిరుగుతాయి. పతాక శీర్షికన నీ పేరు ఊరేగుతుంది. ఏదో ఓ మూల వలయం చుట్టి నాకూ కొన్ని వడ్డిస్తారు. అర్జునా! ఇంతకు మించిన దుఃఖం మరొకటి ఉంటుందా? ఇలా దుఃఖంతో జీవించడం కన్నా యుద్ధంలో మరణించడమే మేలు కదా! (**మృతం శ్రేయో న జీవితమ్**).

యుద్ధం చేయడమా? చేయక పోవడమా? ఇక ఈ మీమాంసకు తెర దించుతూ, యుద్ధమే సమంజస మని నిర్ణయం చేస్తున్నాడు భగవంతుడు.

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మా దుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37

హతః-వా-ప్రాప్స్యసి-స్వర్గం-జిత్వా-వా-భోక్ష్యసే-మహీం
తస్మాత్-ఉత్తిష్ఠ-కౌంతేయ-యుద్ధాయ-కృతనిశ్చయః

కౌంతేయ	=	అర్జునా!	భోక్ష్యసే	=	అనుభవించ గలవు
హతో వా	=	చంప బడితివా	తస్మాత్	=	అందువలన
స్వర్గం	=	స్వర్గమును	కృతనిశ్చయః	=	దృఢనిశ్చయము కలవాడవై
ప్రాప్స్యసి	=	పొంద గలవు	యుద్ధాయ	=	యుద్ధమునకు
జిత్వా వా	=	జయించితివా	ఉత్తిష్ఠ	=	లెమ్ము!
మహీం	=	రాజ్యమును			

కౌన్తేయా! యుద్ధంలో మరణిస్తే స్వర్గాన్ని పొందుతావు. జయించావా, భూ మండలాన్ని పాలిస్తావు. ఏదైనా రానీ! నిశ్చయమైన భావంతో లేచి నిలబడు. యుద్ధానికి సిద్ధం కా!

వ్యాఖ్య

కర్తవ్యాన్ని నిర్వహించే వారికి ఏదైనా మంచే జరుగుతుంది. ధర్మాన్ని ఆచరించే వారు ఎన్నడూ దగా పడరు. స్వధర్మాన్ని ఆచరించే వారు సత్ఫలితాన్నే అందుకుంటారు. కనుక ధర్మాచరణంలో సంశయాలు మంచివి కావు. యుద్ధకర్మకు సంబంధించిన సర్వ సంశయాలను అర్జునుని హృదయం నుండి దూరం చేసిన భగవానుడు, ఇక స్వధర్మమైన యుద్ధమును ఆచరించి సత్ఫలమును అందుకో మని ఆజ్ఞాపిస్తున్నాడు.

విజయమో! వీర స్వర్గమో!

యుద్ధం అనివార్యమని తేలిపోయింది. మరి ఫలితం మాట ఏమిటి? అది మన చేతిలో లేని విషయం. ఆట ఆడటమే మన పని. జయాపజయాలు దైవాధీనాలు. కర్మలు ఏవైనా అంతే. కర్మలు మనం చేస్తాం. రావలసిన ఫలం దైవానుగ్రహంగా వచ్చి తీరుతుంది. కాకపోతే, స్వధర్మానుష్ఠానంలో ఫలితం ఎలా ఉన్నా, అది శుభదాయకం గానే ఉంటుంది.

యుద్ధం విషయంలో కృత నిశ్చయంతో ఉండమని ఆజ్ఞాపించాడు అచ్యుతుడు. ఫలితం విషయ మంటారా? ఏముంది? ఇక్కడ రెండే ఫలితాలు ఉన్నాయి. కాకపోతే, ఏది వచ్చినా శుభమే. లాభమే. పోరాటము అనివార్యం. మరణిస్తే స్వర్గం ప్రాప్తిస్తుంది (**హతః సన్ స్వర్గం ప్రాప్స్యసి**). గెలిస్తే రాజ్యం లభిస్తుంది (**జిత్వా వా భోక్ష్యసే మహీమ్**). రెండిటిలో ఏదైనా లాభమే. వాంఛనీయమే (**ఉభయథాపి లాభః ఏవ**).

ధర్మయుద్ధంలో మరణించిన వారికి స్వర్గం ప్రాప్తిస్తుంది. ఇది శాస్త్రం నిర్ణయించిన ఫలం. ఒకవేళ గెలిస్తే రాజ్యం లభిస్తుంది. ప్రజలకు ధర్మ పరిపాలనం అందించే అవకాశం వస్తుంది. ఎన్నో పుణ్య కార్యాలు చేయ వచ్చు. రాజ్యభోగాలు అనుభవించ వచ్చు. బ్రతికితే పుణ్యకార్యాలు చేయవచ్చు. మరణిస్తే పుణ్య ఫలాన్ని అనుభవించ వచ్చు. ఎటు చూచినా లాభమే. ఏది జరిగినా నష్టం లేదు. అందుచేతనే, ఇలాంటి యుద్ధాన్ని సుఖవంతులైన క్షత్రియులే పొందుతారు అని భగవంతుడు ముప్పై రెండవ శ్లోకం లోనే చెప్పేశాడు (**సుఖినః క్షత్రియాః పార్థ లభన్తే యుద్ధ మీదృశమ్**).

కీడెంచి మేలెంచాలి అంటారు పెద్దలు. యుద్ధంలో జయాపజయాలు రెండూ లాభాలే నని తెలిసినా,

పరమేశ్వరుడు ముందుగా మరణాన్ని ప్రస్తావించి (*హతోవా*) ఆ తరువాత విజయాన్ని పేర్కొన్నాడు. ముందు మరణానికే సిద్ధం చేస్తున్నాడు. కష్టతరమైన కార్యానికి మనస్సును సిద్ధం చేసుకుంటే, ఆ తరువాత జీవితంలో కష్టాలే ఉండవు. వైఫల్యాలకు జంక కుండా సిద్ధపడి పోరాడితే, ఆ తరువాత ఏది వచ్చినా వైభవం గానే ఉంటుంది. అందుచేత, ఇక లేచి, యుద్ధానికి సిద్ధపడ మని చెబుతున్నాడు శ్రీకృష్ణుడు.

కౌన్తేయా! లే, నిలబడు అన్నాడు శ్రీకృష్ణుడు. నేను యుద్ధం చేయలేను అని చెప్పి, ధనుర్బాణాలను క్రింద పడేసి, రథము వెనుక భాగాన అర్జునుడు కూర్చుండి పోయాడు అనేది మనం చూశాం (*రథోపస్థ ఉపావిశత్*). యుద్ధం నిశ్చయం అని చెప్పేశాడు కనుక, ఇక లేవ మంటున్నాడు శ్రీకృష్ణుడు. లేవ మన్నాడు కదా అని లేచి ఇంటి వైపు అర్జునుడు అడుగులు వేస్తాడేమో నని, లేచేది యుద్ధము కొరకే (*యుద్ధాయ*) అని స్పష్టం చేస్తున్నాడు.

ఈ సందర్భంలో అర్జునుణ్ణి *కౌంతేయా!* అని పిలిచాడు శ్రీకృష్ణుడు. ఈ సన్నివేశంలో ఇలా పిలవడంలో ఏదో అనుబంధం పెన వేసుకొని ఉంది. ఇది కేవలం మనస్సును చలింప చేసే మాట కాదు. హృదయాన్ని ద్రవింప చేసే ప్రేమ పిలుపు.

సోదరుడు మాటల మధ్య, తమ్ముడూ! అన్నాడు అంటే, ఆ క్షణంలో ఏదో జరుగుతూ ఉందని అర్థం. పేరు పెట్టి పిలిచే తండ్రి, నాయనా! అని కుమారుణ్ణి పిలిచాడు అంటే, నా తండ్రీ! అని బిడ్డను పలకరించాడు అంటే, వాళ్ళిద్దరి మధ్య ఆ క్షణంలో మాటలకు అందనిది ఏదో జరిగిపోతూ ఉందని గ్రహించ వచ్చు. అలాగే, శ్రీకృష్ణుడు ఈ సందర్భంలో అర్జునుణ్ణి కౌంతేయా! అనడంలో కూడా అలాంటిదే ఏదో దోబూచు లాడుతోంది.

అర్జునా! చెప్ప వలసింది అంతా చెప్పాను. వివిధ కోణాలలో వివరించాను. మా మేనత్త కుమారుడివి. అందుకే, సంకోచం లేకుండా మాట్లాడేశాను. ఇక కార్యరంగం లోకి కాలు పెట్టాలి. నువ్వు సూక్ష్మగ్రాహివి. కుంతీపుత్రుడివి. కుంతము అంటే బల్లెము. బల్లె మంత కుశాగ్ర బుద్ధి గల వాడివి అని అర్థము. నడుము బిగించు. మీ అమ్మ నీకు ఎందుకు జన్మ నిచ్చిందో ఆ కార్యాన్ని నెరవేర్చ మని నా ద్వారా ఆమె నీకు ఆదేశాన్నిచ్చింది. తల్లి ఆజ్ఞను పాలించు. తల్లి పక్షము వాణ్ణి. నా మాట కూడా హృదయంలో పెట్టుకో. ఉత్తిష్ఠ! లేచి నిలబడు అనేదే కౌంతేయా! అనే సంబోధనలో శ్రీకృష్ణుని ఆంతర్యము.

భవ్యమైన మలుపు

భగవద్గీత ఇక్కడ ఒక అందమైన మలుపు తిరుగుతోంది. కర్మయోగానికి బాట సుగమం చేయబడుతోంది. ఉపనిషత్తులు బ్రహ్మవిద్యనే ప్రధానంగా చేసుకొని శోభిస్తూ ఉంటాయి. భగవద్గీత బ్రహ్మవిద్యతో పాటు యోగశాస్త్రంగా కూడా దేదీప్యమాన మవుతూ ఉంది. అదే గీత యొక్క ప్రత్యేకత (*శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే*).

కర్మ లేకుండా జీవితం క్షణం కూడా ముందుకు సాగదు. ప్రతి కర్మను అవగాహనతో ఆచరించ గలిగితే కర్మ అనేది యోగంగా మారి అమృతమయ జీవనాన్ని ప్రసాదిస్తుంది. కానిచో, బంధాన్ని సృష్టించి బ్రతుకులో అందాలను, ఆనందాలను దూరం చేస్తుంది.

నిరాశల నుండి మనిషి బయట పడాలి. నిరుత్సాహాన్ని బుద్ధి నుండి తరిమి వేయాలి. ఎన్ని పరిస్థితులు చుట్టు ముట్టినా, ఎన్ని సమస్యలు అడ్డు నిలిచినా, ఏ మాత్రం కళను కోల్పోకుండా, చుక్కల మధ్య పూర్ణ చంద్రుని లాగా శోభించే జీవన మార్గాన్ని ఇక తరువాత శ్లోకం నుండి పదిహేడు శ్లోకాలలో ఒక ప్రవాహంలా బోధించ బోతున్నాడు భగవంతుడు. ***ఉత్తిష్ఠ!*** లేచి, నిలబడు అని భగవంతుడు చెప్పింది ఒక్క అర్జునునికే

కాదు, మనందరికీ. యావ త్ప్రపంచానికి, అన్ని కాలాల లోని అందరు వ్యక్తులకి. శారీరక దుర్బలత్వాన్ని విడిచి, మానసిక దౌర్బల్యానికి చరమగీతం పాడి, ఉత్సాహంతో, ఉద్యమ స్ఫూర్తితో, జీవిత రంగస్థలిపై తమ పాత్రను మహోన్నతంగా పోషించుటకు సిద్ధం కమ్మని సర్వ మానవాళికి పాంచజన్యాన్ని పూరిస్తూ పవిత్ర సందేశాన్ని అందివ్వ బోతాడు.

యుద్ధంలో మరణిస్తే స్వర్గము ప్రాప్తిస్తుంది. యుద్ధంలో గెలిస్తే రాజ్యము లభిస్తుంది. నిజమే. అయితే ఈ యుద్ధం వల్ల ఇహపరాలలో ఏదో ఒకటి సిద్ధిస్తుంది. కాని, అర్జునుడు కాంక్షించిన శ్రేయస్సు ఎలా వస్తుంది? మోక్షహేతువు కానపుడు ఈ యుద్ధాన్ని చేయడ మెందుకు? సమబుద్ధితో సంగ్రామాన్ని నిర్వహిస్తే, దాని వల్ల చిత్తశుద్ధి ఏర్పడి, మోక్షమునకు దారి సుగమ మవుతుంది. ఆ విధమైన కర్మయోగమును ఆచరించడానికి తగిన ఉపదేశాన్ని అనుగ్రహిస్తున్నాడు.

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి ॥ 38

సుఖదుఃఖే-సమే-కృత్వా-లాభాలాభౌ-జయాజయౌ
తతః-యుద్ధాయ-యుజ్యస్వ-న-ఏవం-పాపం-అవాప్స్యసి

సుఖదుఃఖే	= సుఖదుఃఖాలను		యుద్ధాయ	=	యుద్ధానికి
లాభాలాభౌ	= లాభనష్టాలను		యుజ్యస్వ	=	సిద్ధపడు
జయాజయౌ	= జయాపజయాలను		ఏవం	=	ఇలా చేస్తే
సమే	= సమానముగ		పాపం	=	పాపమును
కృత్వా	= భావించి		న అవాప్స్యసి	=	పొందవు
తతః	= ఆ తరువాత				

సుఖ మొచ్చినా, దుఃఖ మొచ్చినా ఒకేలా ఉండు. లాభ మొచ్చినా, నష్ట మొచ్చినా ఒకే భావంతో చూడు. జయ మొచ్చినా, అపజయ మొచ్చినా సమబుద్ధితో స్వీకరించు. ఇలా చేస్తే నీకు ఏ పాపమూ అంటదు.

వ్యాఖ్య

అర్జునుడు అంత దుఃఖం లోనూ, తన దుఃఖ మేమిటో స్పష్టంగా దర్శించ గలిగాడు. శత్రువులు లేని సమృద్ధమైన రాజ్యము భూలోకంలో లభించినా, సురలోక ఆధిపత్యము ప్రాప్తించినా, ప్రస్తుతం తనను కాల్చేస్తున్న దుఃఖాన్ని అవి పోగొడుతాయి అని తాను భావించటం లేదని తేల్చి చెప్పేశాడు. తనకు కావలసిన శ్రేయస్సును నిశ్చయించి చెప్పమని కూడా శ్రీకృష్ణుని అడిగాడు.

అర్జునా! యుద్ధంలో మరణిస్తే స్వర్గము, జయిస్తే రాజ్యము లభిస్తాయి కనుక యుద్ధం చెయ్యమని శ్రీకృష్ణుడు ఆదేశించాడు. ఈ రెండిటిని (ఇహపర సుఖాలు) నిరుపయోగంగా అర్జునుడు చూస్తున్నాడు. పైగా అతను వాంఛించేది శ్రేయస్సు. అంటే, మోక్షము. యుద్ధం వల్ల స్వర్గమో, రాజ్యమో వస్తాయే గాని మోక్షము వచ్చే ప్రసక్తే లేదు. ముఖ్యంగా క్షత్రియునికి యుద్ధం కంటే శ్రేయస్సును ఇచ్చేది మరొకటి ఉండబో దని శ్రీకృష్ణుడు ఈ ధర్మప్రసంగాన్ని ప్రారంభిస్తూ ముప్పై ఒకటవ శ్లోకం లోనే చెప్పడం జరిగింది (***ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోఽ న్యత్ క్షత్రియస్య న విద్యతే***).

కర్మ ఏదైతే జరుగుతూ ఉందో, దానికి సంబంధించిన జ్ఞానం ముందే ఉంటుంది. మనం ఏ కర్మ

చేయాలి? ఎలా చేయాలి? చేసే పద్ధతి ఏమిటి? మన అవగాహన ఎలా ఉండాలి? ఇవన్నీ కర్మాచరణం జరగక ముందే మన బుద్ధిలో ఉండాలి. ఈ విధంగా, కర్మజ్ఞానములు అనుష్ఠానంలో అభిన్నంగా ఉన్నాయి. కనుక, జ్ఞానశుద్ధి లేకుండా కర్మశుద్ధి రాదు. జ్ఞానశుద్ధితో కర్మాచరణం జరిగితే, అది యుద్ధమైనా, యజ్ఞమైనా, తద్వారా అంతఃకరణము శుద్ధిపడి, ఆత్మజ్ఞానమును పొందుటకు అర్హమై, మోక్షాన్ని పొందుతుంది. ఈ విధమైన కర్మయోగ ప్రక్రియను ఆవిష్కరిస్తూ, కర్మయోగ పునాదిని ఈ శ్లోకంలో అందంగా భగవానుడు నిర్మిస్తున్నాడు. సమబుద్ధి కలిగి కర్మలను ఆచరిస్తే, పాపము పొందక పోవటమే గాక, చిత్తశుద్ధిని పొంది మోక్షమును పొందే అర్హతను సంపాదించ గలుగుతారు అని బోధిస్తున్నాడు.

ఇంతవరకు యుద్ధం చేయడానికి అనుగుణంగా హేతువు లన్నీ వినిపించాడు. ఇప్పుడు తాత్త్విక దృష్టితో, అనుష్ఠాన ప్రధానమైన కర్మయోగాన్ని ప్రవేశ పెడుతున్నాడు. ఆ తరువాత కర్మయోగాన్ని చర్చిస్తాడు. అంతటితో ఆగకుండా మున్ముందు రాబోయే అధ్యాయాలలో కూడా ఈ విషయాన్ని గీతాచార్యుడు ప్రస్తావిస్తూనే ఉంటాడు. ఇది విషయాన్ని అందంగా మలుపు తిప్పే శ్లోకము.

యుద్ధము స్వధర్మ మని భావించి పోరాటానికి దిగుతున్న అర్జునునికి సముచితమైన ఉపదేశాన్ని ఈ శ్లోకంలో శ్రీకృష్ణుడు అందిస్తున్నాడు అని భాష్యంలో శ్రీ శంకరులు కూడా అభిప్రాయ పడ్డారు ***(యుద్ధ మానస్య ఉపదేశమ్).*** అయితే, ఈ ఉపదేశము ప్రసంగ వశాత్తు చేయబడినా ***(ఏష ఉపదేశః ప్రాసంగికః)*** వాస్తవానికి పరమార్థ దర్శనమును బోధించడమే ఇందులోని ప్రధాన విషయము.

సమతా సౌధానికి ముఖద్వారము

సమతా సౌధంలో ప్రవేశించాలి అంటే రాగద్వేషాలు సమరసమై ఉండాలి. తటస్థపడి ఉండాలి. రాగద్వేషాలు తటస్థపడిన బుద్ధిలో సుఖదుఃఖాలు నిలవ లేవు. ఇది కాస్త విచారించి, విశ్లేషణతో అర్థం చేసుకో వలసిన విషయము.

కర్మాచరణం వెనుక రాగద్వేషాలే ప్రధానంగా ఉంటాయి. ఏది చేరువైతే మనకు సుఖమో, దానిపై మనకు రాగం ఉందని అర్థము. ఏది దూరమైతే మనకు సుఖమో, దానిపై మనకు ద్వేషము ఉంది అని అర్థము. వ్యక్తుల విషయంలో కూడా అంతే. ఇవే రాగద్వేషాలు.

యుద్ధం విషయమే తీసుకుందాం. యుద్ధం సుఖమా? కానపుడు, దుర్యోధనుడికి యుద్ధంపై రాగం ఎలా ఉదయించింది? యుద్ధం ఇష్టం కాదు, దేని కారణంగా యుద్ధమనే కార్యం జరుగుతూ ఉందో, దాని మీద ఇష్టం. అదేమిటి? లాభం. రాజ్యలాభం. అదెలా వస్తుంది? యుద్ధంలో జయిస్తే వస్తుంది. కనుక లాభం అనే కార్యం జయము అనే కారణం మీద ఆధారపడి ఉంది. అందుచేత దుర్యోధనునికి యుద్ధం ప్రియంగా ఉంది. ఒకవేళ యుద్ధం అపజయాన్ని కలిగిస్తుంది అని ముందే తెలిస్తే, దాని మీద రాగం ఉదయించదు. ద్వేషం పుడుతుంది. యుద్ధాన్ని ద్వేషిస్తాడు. ఎందుకని? యుద్ధం వెనుక నష్టం కార్యంగా ఉంది కనుక. అదే రాజ్యనష్టం. దానికి కారణ మేమిటి? అపజయము. అపజయం కారణంగా రాజ్యనష్టం వాటిల్లుతోంది. కనుక యుద్ధం అప్రియంగా ఉంటుంది.

ఈ విధంగా ఏ కర్మ చేసినా, రాగద్వేషాల ప్రేరణతో కనుక చేస్తే, అవి సుఖదుఃఖాలకు కారణ మవుతాయి. రాగద్వేషాలను తృప్తి పరచేందుకు కర్మ చేయ కూడదు. ధర్మాధర్మాలను దృష్టిలో ఉంచుకొని కర్మలను ఆచరించాలి. ఇలా ధర్మాధర్మాల పరిధిలో నుండి యుద్ధం చేస్తే పాపము అంటదు ***(న ఏవ పాపం అవాప్స్యసి).***

సుఖం కార్య రూపంలో తెలుస్తూ ఉంది అంటే, అందుకు లాభమో, జయమో, సన్మానమో కారణమై ఉంటుంది. అలాగే దుఃఖం కార్యరూపంలో తెలుస్తూ ఉంది అంటే అందుకు నష్టమో, అపజయమో, అవమానమో కారణమై ఉంటుంది. రాగద్వేషాలు లేని కర్మలలో సుఖదుఃఖాలు ఉండవు. రాగద్వేషాలు లేని కర్మలు బంధహేతువులు కాలేవు. అందుకనే సుఖదుఃఖాలను, లాభాలాభాలను, జయాపజయాలను సమంగా భావిస్తూ యుద్ధానికి సిద్ధపడ మని భగవానుడు ఆదేశిస్తున్నాడు. సుఖదుఃఖాలను సమం చేయుట మంటే, రాగద్వేషాలను కదలించ వద్దు అని అర్థము ***(సుఖ దుఃఖే సమే కృత్వా - రాగద్వేషౌ అకృత్వా ఇతి ఏతత్).***

రాగద్వేషాలు

సమత్వంలో శాంతి ఉంటుంది. విషమత్వంలో అశాంతి ఉంటుంది. సమత్వము యోగము. విషమత్వము రోగము. రాగద్వేషాలను సమం చేసి, ధర్మాధర్మాలను అవలోకిస్తూ, ఏది చేయాలి? ఏది చేయకూడదు? అనే వివేకంతో కర్మలను ఆచరించేవాడు యోగి అవుతాడు.

కర్మ రంగంలో ప్రవేశించే ముందు కర్మ ఎలా చెయ్యాలో క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. రాగద్వేషాలు లేకుండా ఉండాలి. ధర్మాధర్మాల అవలోకనం జరుగుతూ ఉండాలి. ఈ విధంగా, రాగద్వేషాలను సమం చేసి, వాటి కార్యాలైన సుఖదుఃఖాలను, లాభాలాభాలను, జయాపజయాలను సమంగా చూసే సమబుద్ధిని ఏర్పరచుకొని, ఆ తరువాత యుద్ధానికి సిద్ధపడు అర్జునా! అంటున్నాడు శ్రీకృష్ణుడు ***(తతః యుద్ధాయ యుజ్యస్వ).*** ఈ విధంగా యుద్ధం చేస్తే పాపాన్ని పొందవు అంటున్నాడు ***(ఏవం యుద్ధం కుర్వన్ పాపమ్ న అవాప్స్యసి).***

దుర్యోధనుడు యుద్ధంలో ఉన్నాడు. అతనిని యుద్ధానికి పురికొల్పిం దెవరు? ధర్మాధర్మాలా? కానే కాదు. అవి అతనికి పట్టనే పట్టవు. గిట్టనే గిట్టవు. అతని వెనుక ఉండి నడిపించేవి రాగద్వేషాలే. అవి ఎలా ఆడిస్తే అలా ఆడాడు. పాపాన్ని మూటగట్టు కున్నాడు.

దుర్యోధనుడికి రాజ్యంపై రాగ ముంది. అంతే కాదు, పాండవులపై ద్వేష ముంది. ఈ రాగద్వేషాలే అతణ్ణి యుద్ధరంగంలో నిల బెట్టాయి. అశాంతిలో పడుకో బెట్టాయి.

యుద్ధానికి రాగద్వేషాలే కారణం కనుక, యుద్ధానికి ముందు కూడా దుర్యోధనుడు అశాంతి జీవనాన్నే గడిపాడు. కాని, శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధం చేయ వలసిందిగా ఆజ్ఞాపించడం వెనుక ఈ రాగద్వేషాలు లేవు. వాస్తవానికి అర్జునుడు కూడా రాగద్వేషాలతో కురుక్షేత్రంలో అడుగు పెట్టలేదు. ధర్మ ప్రధానం గానే యుద్ధంలో పాల్గొన డానికి వచ్చాడు. అంటే, పాండవులు దుర్యోధనుని లాగా రాగద్వేషాలతో యుద్ధానికి రాలేదా? లేదు.

మరి, యుద్ధంలో విజయాన్ని సాధిస్తే, రాజ్యాన్ని చేజిక్కించుకోరా? అది రాగం కాదా? కాదు. ఎందుకని? రాజ్యం పాండవులదే కదా! వాళ్ళ రాజ్యాన్నే వాళ్ళు పొందా లనుకుంటున్నారు. పైగా, రాజ్యం ఒక అధర్మపరుడి చేతిలో ఉంది. అలాంటి వ్యక్తి నుండి రాజ్యాన్ని, ప్రజలను రక్షించ వలసిన బాధ్యత క్షత్రియులుగా పాండవులపై ఉంది. కనుక వారు యుద్ధం చేయడంలో ధర్మమే ప్రధానంగా గోచరిస్తూ ఉంది. ఇక ద్వేష మనేది పాండవులలో కాగడా పెట్టి వెతికినా కనిపించదు. దుర్యోధనుని దుష్ట కార్యాలను వాళ్ళు నిరసించారే గాని, ఏనాడూ దుర్యోధనుని నిందించి ఎరుగరు.

కర్మలు చేయక తప్పదు. కనుక, కర్మల వెనుక రాగద్వేషాలు లేకుండా చూసుకోవాలి. కర్మల వెనుక రాగ ద్వేషాలు లేకపోతే, కర్మఫలాల విషయంలో ప్రతిచర్యలు చోటు చేసుకోవు. ప్రతిచర్యలు లేని మనస్సే ప్రశాంతంగా ఉంటుంది.

చేయక తప్పవు కర్మములు
చేసి చూడాలి ఫలములు
అనుకూలములు సుఖములు
ప్రతికూలములు శోకములు
రాగద్వేషాలే సందడులు
రాలిననాడే పండుగలు
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ ఇది రామజోగి చిట్కా.

కర్మలలో చంచలత్వం ఉంటుంది. కర్మలలో అన్నీ చలనాలే (**చలనాత్మకం కర్మ**). అలలు అలలుగా కర్మ ప్రేరిత సంకల్పాలు మనసులో కదులుతూ ఉంటాయి. వాటిని అదుపులో ఉంచుకోవాలి. అప్పుడే బుద్ధిలో ప్రశాంతత నిలుస్తుంది.

ఊయలలో బిడ్డ పడుకుని ఉంటుంది. ఆ బిడ్డ చూపులో ఏదో ప్రశాంతత తొంగి చూస్తూ ఉంటుంది. రాగద్వేషాలు లేక పోవడమే బిడ్డ ప్రశాంతతకు కారణము.

మనస్సు ప్రశాంతంగా ఉంటేనే ఏదైనా సాధించ గలం. ఆవేశాలు అంతఃకరణను కుదుపుతూ ఉంటే, బుద్ధిలో ఉద్రేకాలు ఊరేగుతూ ఉంటే, బ్రతుకు పూర్ణత్వం వైపు సాగదు.

రాగద్వేషాల్ని సమం చేస్తే, మనం నివసిస్తున్న ప్రపంచం మనకు రెండింతలుగా కనిపిస్తుంది. మనం నేలపై నడుస్తున్నా, ఆకాశంలో విహరించినట్లే ఉంటుంది. సుఖదుఃఖాలు రెండూ ఒక్కటే అనేది కర్మయోగానికి పునాది. సమభావంతో స్వధర్మాన్ని ఆచరిస్తే, ఏ పాపము అంటదు అని చెబుతూ, ఈ శ్లోకంలో కర్మయోగానికి చక్కని పునాదిని నిర్మించడం జరిగింది. కర్మను కర్మయోగంగా మార్చుకొనే దెలాగో, కర్మఫలాలను ప్రశాంతంగా, ప్రసన్నంగా ప్రసాద రూపంలో ఎలా గ్రహించాలో బోధించే అసమాన గీతా ప్రబోధానికి ఈ శ్లోకంతో శ్రీకారం చుట్టాడు శ్రీకృష్ణుడు.

ఆత్మ విషయానికి సంబంధించిన జ్ఞానమును ఇంతవరకు చెప్పడం జరిగింది. అట్టి జ్ఞానానికి అనుకూలంగా ఏ కర్మయోగం ఆచరించడం చేత కర్మబంధం నుండి విడిపడటం జరుగుతుందో, అట్టి యోగ జ్ఞానమును చెప్పడానికి ప్రారంభిస్తూ సాంఖ్య, యోగాలకు సంబంధించిన స్పష్టమైన అవగాహనను ఇప్పుడు అందించడమే సముచిత మని భావించి, ఆ విషయాన్ని ఈ సంధి శ్లోకంలో వివరిస్తున్నాడు.

ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధి ర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి ॥ 39

ఏషా-తే-అభిహితా-సాంఖ్యే-బుద్ధిః-యోగే-తు-ఇమాం-శృణు
బుద్ధ్యా-యుక్తః-యయా-పార్థ-కర్మబంధం-ప్రహాస్యసి

పార్థ	= అర్జునా!	అభిహితా	= చెప్ప బడినది	ప్రహాస్యసి	= విడువ గలవు
సాంఖ్యే	= జ్ఞానయోగ విషయమున	యయా	= ఏ	ఇమాం	= దీనినే
ఏషా	= ఇంతవరకు చెప్పిన	బుద్ధ్యా	= బుద్ధిచే	యోగే తు	= యోగ విషయమున
బుద్ధిః	= వివేకము	యుక్తః	= కూడిన వాడవై	శృణు	= వినుము
తే	= నీ కొరకు	కర్మబంధం	= కర్మబంధమును		

అర్జునా! పరమార్థ తత్త్వ జ్ఞానాన్ని సాంఖ్యం అంటారు. ఆ విషయాన్నే ఇంతవరకు నీకు చెప్పాను. ఇక కర్మయోగ విషయాన్ని చెబుతాను. విను. ఈ యోగశాస్త్ర జ్ఞానము చేత నువ్వు కర్మ బంధం నుండి విడి పడతావు.

వ్యాఖ్య

శోకమోహాది రూప సంసార నివృత్తికి సాక్షాత్తు కారణమైన జ్ఞానము సాంఖ్యము. ఇది పరిశుద్ధమైన ఆత్మతత్త్వ విజ్ఞానము (***శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభి ధీయతే***). దేని చేత ఆత్మతత్త్వము చక్కగా ప్రకాశింప బడుతూ ఉందో అదే సాంఖ్యము అని శ్రీధర వ్యాఖ్య (***సమ్యక్ ఖ్యాయతే ఇతి సాంఖ్యం***). అంటే, సమస్త ఉపనిషత్తుల చేత (***సర్వైః వేదాంతైః***) ప్రకాశింపబడు ఆత్మజ్ఞానము సాంఖ్యము.

ఈ సాంఖ్య విషయమును **అశోచ్యా నన్వశోచస్త్వం** అనే పదకొండవ శ్లోకము నుండి ప్రారంభించి, ముప్పైయవ శ్లోకము వరకు వివరంగా చెప్పడం జరిగింది. ఆ తరువాత ముప్పై ఒకటవ శ్లోకము నుండి ముప్పై ఎనిమిదవ శ్లోకము వరకు చెప్పిన విషయం సాంఖ్యం కాదు. అది ప్రాసంగిక ఉపదేశము. అంటే, ప్రసంగ వశాత్తు సందర్భానుసారంగా బోధించిన అన్య విషయమే గాని సాంఖ్యము కాదు.

ఇక ఇప్పుడు, అనగా నలభైయవ శ్లోకం నుండి కర్మయోగము బోధింప బడుతూ ఉంది. ఇంతవరకు చెప్పిన (1) ఆత్మ విషయ జ్ఞానమునకు సంబంధించిన సాంఖ్యము, (2) అట్టి జ్ఞానానికి అనుకూలంగా సమబుద్ధితో ఆచరింపబడే కర్మలకు సంబంధించిన కర్మయోగము, మరియు (3) బంధమును కలిగించు కర్మలు - ఈ మూడింటికి సంబంధించిన అవగాహన ఈ సందర్భములో ఏర్పడక పోతే, ఆ తరువాత గీతా జ్ఞానమును హృదయంలో భద్రపరచు కోవడం చాలా కష్ట సాధ్య మవుతుంది. అందుకే ఈ ముప్పై తొమ్మిదవ శ్లోకాన్ని సంధి శ్లోకంగా అందించాడు పరమేశ్వరుడు.

సాంఖ్యము లేదా సన్న్యాసము

లేనిది ఉండట మంటూ ఉండదు. ఉన్నది లేకుండా పోయేదంటూ ఉండదు. ఈ రెండిటిని గూర్చిన నిర్ణయము ఏదో అదే తత్త్వవివేకము అంటూ, సదసద్వివేకం ద్వారా ఉన్నది ఆత్మే నని, దానికి అన్యమైనది ఏదైనా అనాత్మే నని సాంఖ్య ప్రకరణంలో గ్రహించాము. ఆత్మజ్ఞానము ద్వారా మోక్షమును పొందవచ్చు నని కూడా తెలుసుకున్నాం. సర్వ బంధముల నుండి విడిపడి పోవడమే మోక్షము.

ఇంతకీ బంధము అనేది సత్యమా, అసత్యమా? బంధమే కనుక సత్యమైతే, సత్యమైనది పోయేది కాదు కనుక బంధము కూడా పోదు. ఒకవేళ బంధమే కనుక అసత్యమైతే, అది లేనిదే కనుక పోవలసిన అవసరం లేదు. ఈ రెండూ కాకుండా బంధం అనేది అటు సత్యము గాక, ఇటు అసత్యము గాక మిథ్యగా గోచరించు చున్నదైతే అది కేవలం అజ్ఞానమే అవుతుంది. అజ్ఞాన జనితమైన అధ్యాసే అవుతుంది. అజ్ఞానమే సమస్యగా తెలిసే టప్పుడు, దానిని పరిష్కరించడానికి జ్ఞానము కన్నా అన్యమైన సాధనము ఉండదు. జ్ఞానము అజ్ఞానమును పోగొడుతుంది. ఉన్నది ఉన్నట్లుగా తెలుస్తుంది. అదే మోక్షము.

మోక్షము అనేది లేనిది కాదు. ఉన్నదే. కాని, అజ్ఞానం వల్ల ఉన్నట్లు తెలియనిది. ఆత్మ లేనిది కాదు. ఉన్నదే. కాని, ఉన్నట్లు తెలియనిది. చీకటిలో ఉన్న వస్తువు లేనిది కాదు. ఉన్నట్లు తెలియనిది. వెలుగు వస్తే ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే, జ్ఞాన వెలుగులో అజ్ఞాన చీకట్లు విచ్ఛిన్న మవుతాయి. ఆత్మ తనంతట తానే దివ్యంగా ప్రకాశిస్తుంది. అదే మోక్షము.

ఈ ఆత్మజ్ఞానమే సాంఖ్యము. అర్జునా! ఈ సాంఖ్యానికి సంబంధించిన జ్ఞానమును నీకు బోధించాను *(ఏషా, సాంఖ్యే, బుద్ధిః జ్ఞానం, తే తుభ్యం, అభిహితా ఉక్తా)*. పరమార్థ వస్తు వివేక విషయానికి సంబంధించిన జ్ఞానాన్ని గీతాచార్యుడు బోధించాడు. ఈ జ్ఞానాన్ని పొంది అందరూ తరించాలి.

సాంఖ్యము బోధించే ఆత్మజ్ఞానమును పొందడానికి ప్రతిబంధకాలను తొలగించుకొని కేవలం జ్ఞాన సముపార్జనమే ప్రధానంగా చేసుకొని జీవించే త్యాగి సన్యాసి. ఇతనికి కర్మాపేక్ష ఉండదు. జ్ఞానాసక్తే ప్రధానంగా ఉంటుంది. ఈ విధమైన జీవనానికి అలవాటు పడిన వారు సాంఖ్యులు, లేదా సన్యాసులు. జ్ఞాననిష్ఠ యందే కాలమును వెళ్ళబుచ్చు వారు. **నిష్ఠా** అంటే స్థితి. ***అనుష్ఠేయ తాత్పర్యం*** - అంటే అనుష్ఠించ వలసిన దాని యందు తత్పరత్వం. ఇది సన్యాసము. సాంఖ్యజీవన విధానం. సన్యాసి శ్రవణ మనన నిదిధ్యాసల ద్వారా జ్ఞానమును పొంది, తానే బ్రహ్మము అని తెలిసికొని మోక్షరూపు డవుతాడు. సర్వబంధముల నుండి విడి పడతాడు. శోకమోహాలను దాటుతాడు. ఆనంద స్వరూపుడై శోభిస్తాడు. అతడే ఆత్మవిదుడు. ఆప్తకాముడు. బ్రహ్మజ్ఞాని. ఈ స్థితికి ఉపకరించేదే సాంఖ్యము. జ్ఞాననిష్ఠ , లేదా జ్ఞానయోగము.

కర్మబంధము

ప్రతి మనిషి అసంతృప్తిలో బ్రతుకుతూ ఉంటాడు. తృప్తి చెందాలని అభిలషిస్తూ ఉంటాడు. అది నిత్య తృప్తిగా ఉండాలని భావిస్తూ ఉంటాడు. అలాంటి దాని కొరకు అన్వేషిస్తూ కర్మలు చేస్తూ ఉంటాడు. తద్వారా లభించే ఫలాలు శాశ్వతంగా ఉండాలని ఆశిస్తాడు. కాని కర్మఫలాలు ఎప్పుడూ శాశ్వతం కావు. కర్మలు పరిమితంగా ఉంటాయి. కాలం చేత, దేశం చేత, వ్యక్తి సామర్థ్యం చేత పరిమితంగా ఉండే కర్మలు అనిత్య మైన కర్మలు. వాటి ఫలాలు నిత్యానందాన్ని అందించ లేవు.

కర్మలు చేయకుండా మనిషి క్షణకాలం ఉండ లేడు. కర్మ చేసి నిత్యసుఖాన్ని పొంద లేడు. కర్మలు చేస్తూ ఉంటాడు. తత్సంబంధమైన ఫలాలు అందుతూ ఉంటాయి. ఫలానుభవం తరువాత ఫలం అంతరించి పోతుంది. ఫలం నశించగానే ఫలానుభవం వల్ల ఏర్పడిన ఆనందం కూడా నశిస్తుంది. కాని, ఆ ఆనందానికి సంబంధించిన ఆసక్తి మనస్సులో నిలిచి పోతుంది. అదే వాసనగా పరిణమిస్తుంది. ఇలా మనిషి ఎన్నో కర్మలు చేస్తాడు. ఎన్నో ఫలాలను అనుభవిస్తాడు. ఎన్నో వాసనలను మనస్సులో ముద్రించు కుంటాడు. ఆ వాసనల ప్రేరణతో పునః ఆయా కర్మలలో చరిస్తూ ఉంటాడు.

కర్మ - కర్మఫలం - అనుభవం - వాసన ఇది క్రమము. వాసన - కర్మ - కర్మఫలం - అనుభవం - మళ్ళీ వాసన ఇది ఒక ఆవృతం. ఇదొక భ్రమణం. చక్రభ్రమణం. సంసార చక్రభ్రమణం. కర్మబంధం. ఈ విధంగా కర్మ సముద్రంలో పడి, అనిత్యమైన ఫలాలను అనుభవిస్తూ శోకమోహాది రూప సంసారంలో జీవుడు పరిభ్రమిస్తూ ఉంటాడే గాని మోక్షాన్ని పొంద లేడు.

కృతి మహోదధౌ పతన కారణం
ఫల మశాశ్వతం గతి నిరోధకం

అశాశ్వతమైన కర్మఫలాలే కర్మ సముద్రంలో పడటానికి కారణ మవుతున్నాయి. గమ్యానికి అడ్డుగోడలై ఉన్నాయి అన్నారు ఉపదేశసారంలో శ్రీ రమణమహర్షి.

పతనానికి కారణమైన కర్మలు ప్రగతికి రాజమార్గం కాలేవు. బంధాన్ని కలిగించే కర్మలు మోక్షానికి కారణం కాలేవు. ***న మోక్షార్థాని కర్మాణి ఇతి సిద్ధమ్*** - కర్మ మోక్షానికి పనికి రాదు అని ఋజువైంది అన్నారు బృహదారణ్యకోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి. కనుక మోక్షమును అభిలషించే వ్యక్తి కర్మల వైపు

వెళ్ళ కూడదు. జ్ఞానం వైపే తిరగాలి. జ్ఞాననిష్ఠాపరుడు కావాలి. అంటే సన్యాసి కావాలి. ఉపనిషత్తుల నిర్ణయం ఇదే. వాస్తవం చెప్పాలంటే భగవద్గీతకు కూడా ఈ విషయము నందే ఆసక్తి, అనురక్తి.

గీతాశాస్త్రే ఆత్మ జ్ఞానవతః సన్యాసే ఏవ అధికారః న కర్మణి

శాస్త్రము నుండి, లేదా గురువు నుండి ఆత్మకు సంబంధించిన విషయ జ్ఞానమును పొందిన వ్యక్తి సన్యాసము వైపు మరలాలే గాని, కర్మల వైపు కాదు అనేది గీతాశాస్త్రము యొక్క ఉపదేశము అని గీతాభాష్యంలో శ్రీ శంకరులు అభిప్రాయ పడ్డారు.

కర్మలు చేయకుండా ఉండలేము. అలాగని కర్మలు చేసి సాధించే దేమీ లేదు, కర్మ సముద్రంలో పడి మునిగి పోవడం తప్ప. ఇప్పుడేమి చేయాలి? *కిం కర్తవ్యం?*

కర్మయోగము

కర్మయోగమే తక్షణ కర్తవ్యం. అదే నిష్కామ కర్మయోగము. ఈ కర్మయోగము కర్మబంధాలను తొలగిస్తుంది. మోక్షహేతువు అవుతుంది.

కర్మ బంధము కాదు. కర్మఫలము బంధమును సృష్టించదు. కర్మఫలాలను స్వీకరించే టప్పుడు మన మనస్సులో ఏర్పడే ప్రతిచర్యలే బంధాన్ని సృష్టిస్తాయి. ఈ ప్రతిచర్యలకు రాగద్వేషాలే కారణమై ఉంటాయి. కొంప ముంచేవి రాగద్వేషాలే.

కర్మలను త్యజించ వలసిన అవసరం లేదు. రాగద్వేషాలను తటస్థం చేస్తే చాలు. కర్మాచరణంలో 'అహం' భావన లేకుండా నిమిత్తమాత్రంగా వ్యవహరిస్తూ, ఫలాలు అందినపుడు 'మమ' భావన లేకుండా ప్రసాదంగా స్వీకరించ గలిగితే కర్మలు బంధహేతువులు కావు. పైగా అంతఃకరణ శుద్ధికి ఉపకరిస్తాయి. అంతః కరణ శుద్ధి లేని బుద్ధిలో జ్ఞానం నిలవదు. కనుక కర్మయోగి కాని వాడు సన్యాసి కాలేడు. ఈ విషయాలన్నీ ముందు కర్మయోగంలో విపులంగా చర్చించుకుందాం.

సమన్వయం

జ్ఞానమును అనుగ్రహించేది సాంఖ్యము. జ్ఞానమును గ్రహించడానికి చిత్తశుద్ధిని, చిత్త నైర్మల్యాన్ని ప్రసాదించేది కర్మయోగము. కర్మయోగి కానివాడు జ్ఞాని కాలేడు. జ్ఞానము ఎంత ప్రధానమో, జ్ఞాన సముపార్జనకు సహకరించే కర్మయోగము కూడా అంతే ప్రధానము.

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥

జ్ఞాననిష్ఠుల చేత ఏ స్థానము పొందబడుతూ ఉందో, కర్మయోగుల చేత కూడా అదే పొందబడుతూ ఉంది. సాంఖ్యమును, యోగమును ఎవ్వడు ఒక్కటిగా చూస్తాడో, వాడే సత్యదర్శనము చేసిన వాడు అని ఐదవ అధ్యాయంలో గీతాచార్యుడే చెప్పబోతాడు. ఇక్కడ సాంఖ్యము అంటే కపిలుని సాంఖ్యము కాదని, యోగము అంటే పతంజలి యోగము కాదని, నేను ప్రత్యేకించి చెప్ప నవసరం లేదనుకుంటాను.

ఎవడు కర్మయోగి అవుతాడో, వాడు తప్పక కర్మసన్యాసి అవుతాడు. కర్మయోగము సన్యాసానికి దూరంగా లేదు. సన్యాస మంటే ఏమిటి? వదలడమే సన్యాసము ***(సమ్యక్ న్యాసః ఇతి సన్యాసః)***. కర్మయోగంలో అది జరుగుతూనే ఉంది కదా!

కర్మయోగి రాగద్వేషాలను వదులు కుంటున్నాడా, లేదా? అది సన్యాస లక్షణం కాదా? కర్మఫలాలను త్యాగం చేయడం లేదా? కర్తృత్వ భావనను విడిచి పెట్టడం లేదా? భోక్తృత్వ భావనను త్యజించడం లేదా? ఇవన్నీ న్యాసాలు కావా? భవిష్యత్తులో ప్రాప్తించే సన్యాసానికి సోపానాలు కావా? ఈ విధంగా సాంఖ్య, యోగాలు రెండూ ముక్తి మార్గాలై ఉన్నాయి. వీటి సమన్వయం లోనే సిద్ధత్వం ప్రాప్తిస్తుంది. ఈ విషయాన్ని ఉపనిషత్తు కూడా ధ్రువపరచింది.

తత్కారణం సాంఖ్య యోగాది గమ్యం
జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః ॥

సర్వ కారణమైన పరబ్రహ్మమును సాంఖ్యము ద్వారా, కర్మయోగము ద్వారా పొందాలి. అట్టి భగవంతుని తెలుసుకున్న వాడు సర్వ బంధముల నుండి విడిపడు తున్నాడు అన్నది శ్వేతాశ్వతరోపనిషత్తు.

బంధించే కర్మల కన్నా, బంధవిముక్తికి తోడ్పడే కర్మయోగము ఎంత ఉత్కృష్ట మైనదో తరువాత శ్లోకంలో చెబుతున్నాడు. ఈశ్వరారాధనతో కూడిన కర్మయోగమును అభ్యసించి, భగవదనుగ్రహానికి పాత్రులమై, పరమేశ్వర ప్రసాదం అనే నిమిత్తం వల్ల (ఈశ్వర ప్రసాద నిమిత్త జ్ఞానప్రాప్తేః) ప్రాప్తించే జ్ఞానముతో కర్మబంధం నుండి విడిపడి తరించుటకు నిష్కామ కర్మయోగమును స్తుతిస్తున్నాడు. కర్మయోగము నందు ఆసక్తిని పెంపొందించడమే ఈ స్తుతి యొక్క ఉద్దేశ్యము (స్తౌతి ప్రరోచనార్థమ్).

నేహాభిక్రమనా శోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40

న-ఇహ-అభిక్రమనాశః-అస్తి-ప్రత్యవాయః-న-విద్యతే
స్వల్పం-అపి-అస్య-ధర్మస్య-త్రాయతే-మహతః-భయాత్

ఇహ	= ఇందు	ధర్మస్య	= ధర్మము యొక్క
అభిక్రమనాశః	= ప్రారంభ నాశము	స్వల్పమపి	= కొంచెమైనను
న అస్తి	= లేదు	మహతః	= గొప్పదైన
ప్రత్యవాయః	= ప్రత్యవాయ దోషము	భయాత్	= భయము నుండి
న విద్యతే	= ఉండదు	త్రాయతే	= రక్షించును
అస్య	= ఈ		

అర్జునా! కర్మలలో రెండు దోషా లున్నాయి. ప్రారంభించిన పని పాడై పోవచ్చు. దీనిని అభిక్రమ నాశ దోషం అంటారు. అలాగే ఫలితాలు విరుద్ధంగా కూడా రావచ్చు. దీనిని ప్రత్యవాయ దోషం అంటారు. కర్మయోగంలో ఈ రెండూ ఉండవు. ధర్మరూపమైన ఈ యోగాన్ని స్వల్పంగా ఆచరించినా, గొప్ప భయం నుండి మనల్ని రక్షిస్తుంది.

వ్యాఖ్య

కర్మ బంధహేతువు. కర్మయోగము మోక్షహేతువు. కర్మ బంధిస్తుంది. కర్మయోగము బంధము నుండి విడిపిస్తుంది. కర్మ దోషయుత మైనది. కర్మయోగము నిర్దోష మైనది. కర్మలలో నష్టం ఉంటుంది. కర్మయోగములో అంతా లాభమే. నష్టము తెలియని లాభమే. వేసే ప్రతి అడుగు అభివృద్ధి వైపే. ప్రగతికి సోపానమే. ఈ విధంగా సకామ కర్మలకు, నిష్కామ కర్మలకు ఉండే భేదాన్ని వివరిస్తున్నాడు.

అభిక్రమ నాశం

కర్మ దోషయుతంగా ఉంటుంది. కర్మల లోని దోషాలలో అభిక్రమనాశ దోషం ఒకటి. 'అభిక్రమము' అంటే ప్రారంభము. 'నాశం' అంటే లేదు అని అర్థం. అంటే, ఒక కర్మను ప్రారంభించి నపుడు దానికి ఫలం నిశ్చయంగా ఉంటుంది అనేది లేదు. మనం ఆరంభించిన కర్మ ఫలితాన్ని ఇవ్వకుండానే మధ్యలో నశించే అవకాశం ఉంది. ఎలాగంటే, వ్యవసాయము, వాణిజ్యము మొదలైన విషయాల లాగా **(యథా కృష్యాదేః)**.

రైతు పంట పెడతాడు. అది అభిక్రమం. అంటే ప్రారంభం. పొలంలో పంట పెట్టడము అనే ఈ కర్మకు ధాన్యము ఇంటికి చేరడం ఫలం. అలా ఫలము చేతికి అందకుండా, ప్రారంభించిన కార్యము మధ్యలో పాడైతే అది అభిక్రమనాశం. కర్మలలో ఇలాంటి దోషం ఉంటుంది.

ఆదాయం రావాలని వర్తకుడు వాణిజ్యాన్ని ఆరంభిస్తాడు. కాని, మధ్యలోనే నష్టం వచ్చి వాణిజ్యము అనే కర్మ ఆగిపోవచ్చు. ఇదే అభిక్రమనాశం. వంట చేయడం కర్మ. వంట మధ్యలో పాడైతే అది అభిక్రమ నాశ దోషం.

ఆరంభించ బడిన కర్మ నశించ డానికి అనేక కారణాలు ఉండొచ్చు. ఉదాహరణకు పొలంలో పెట్టిన పంటనే తీసుకుందాం. వర్షాలు పడక పంట పాడు కావచ్చు. తెగుళ్ళు కారణం కావచ్చు. ఏది కారణం అనేది అలా ఉంచితే, పాడయ్యే అవకాశం ఉంది అనే విషయాన్ని నిరాకరించే అవకాశం లేదు.

కాని, కర్మయోగంలో ఈ విధమైన దోషం లేదు. వేసే ప్రతి అడుగు ముందడుగే. ఆరంభించిన కర్మ మధ్యలో ఆగినా వినాశము మాత్రం ఉండదు. అభిక్రమనాశం ఉండదు. కర్మయోగము మోక్ష మార్గము. ఈశ్వరారాధనతో కూడింది **(న ఇహ మోక్షమార్గే కర్మయోగే అభిక్రమనాశః)**. ఎంత చేస్తే అంతే ఫలము. చేసుకున్న వారికి చేసుకున్నంత.

ఒక వ్యక్తి భయంకరమైన ఆకలితో ఉంటాడు. అతనికి కొంచెము ఆహారమే లభించ వచ్చు. దాని వల్ల అతనికి పూర్తిగా ఆకలి తీరక పోవచ్చు. కాని, కొంతైనా తీరిందా, లేదా? పూర్తిగా తిన నివ్వకుండా మధ్యలో ఎవరైనా ఆపినా, తినినంత వరకు ఆకలి తీరుతుందే గాని, అభిక్రమ నాశము ఉండదు. పూర్తిగా భోంచేయ లేదు కనుక తినింది ఆకలి తీర్చదు అనే దోషం లేదు. కర్మయోగము ఇలాంటిది. అభిక్రమ నాశ దోషము లేనిది. కర్మకు, కర్మఫలానికి మధ్య అవరోధం ఏర్పడి ఫలం అందక పోవడం అనే దోషం కర్మలలో ఉంటుందే గాని, కర్మయోగంలో ఉండదు.

ఈ రోజు పది మాలలు జపం చేయాలి అని కూర్చుంటాము. నాలుగు మాలలు చేస్తాం. ఈలోగా అవరోధం ఏదో వస్తుంది. జపం అక్కడికి ఆపి, వేరే అవసర కార్యంలో మనం నిమగ్న మవుతాం. అలా చేయడం వల్ల ఆరంభించిన జపము నాలుగు మాలలకే పరిమిత మైంది. అయినా, ఆ నాలుగు మాలలు చేయడం వలన కలిగే ఫలము తప్పక వచ్చి తీరుతుంది.

గంట సేపు చేసే పూజలో అర్ధగంట కార్యక్రమం పూర్తి అయింది. ఈ లోగా ముఖ్యమైన ఫోను వస్తుంది. లేచి వెళ్ళి, ఫోనులో మాట్లాడి, ఆ తరువాత తిరిగి వచ్చి మళ్ళీ పూజను ప్రారంభిస్తాం. ఈ విధమైన అవరోధము మధ్యలో ఏర్పడటం వల్ల పూజాఫలము అందకుండా పోవడ మనేది లేదు. భోజనం చేస్తూ చేస్తూ వెళ్ళి, ఫోను మాట్లాడిన తరువాత తిరిగి వచ్చి మళ్ళీ భోజనం చేయడం లాంటిదే.

మరి, అలా ఫోను మ్రోగి పూజకు అంతరాయం కలిగి నపుడు, భక్తుడు కలత చెందడం జరుగుతూ ఉంది కదా! అంటే, అది సాధకుని మనోస్థాయికి సంబంధించిన విషయం. కర్మఫలానికి సంబంధించింది

కాదు. కాని, ఇక్కడ మరొక సత్యాన్ని కూడా సాధకులు గ్రహించాలి. సాధనలో వచ్చే అవాంతరాలను ప్రతిబంధకాలుగా ప్రారంభ సాధకులు భావిస్తారే గాని, పరిపక్వత చెందిన వారు కలత చెందరు. పూజా సమయంలో ఫోను మ్రోగితే, ఆ ఫోను చేసిన వాడు నా కృష్ణుడే అని భక్తుడు ప్రశాంతంగా లేచి వెళ్తాడు. అంతేగాని, అదేదో అవరోధ మని భావించి ఆవేదన చెందడు. ఇలాంటి పరిపక్వత కర్మయోగంలో మెల్ల మెల్లగా అల్లుకుపోతూ ఉంటుంది.

ప్రత్యవాయం

అభిక్రమ నాశ దోషం లాగే కర్మలలో మరొక దోషం ఉంది. అదే ప్రత్యవాయ దోషం. రోగంతో బాధపడే వ్యక్తి మందు తీసుకుంటాడు. మందు తీసుకొనే మోతాదులో భేదం వచ్చినా, పథ్యంలో లోపం జరిగినా, సత్ఫలితం రాకపోవడ మనేది ప్రక్కన పెడితే, దుష్ఫలితం వచ్చే అవకాశం కూడా ఉంది.

అలాగే ఒక రోగానికి మందు తీసుకుంటే ఆ రోగం పోవచ్చు. తీసుకున్న ఔషధం యొక్క గుణాన్ని బట్టి మరొక క్రొత్త వ్యాధి ఉత్పన్నం కావచ్చు. ఇదే ప్రత్యవాయ దోషం అంటే. ఇలాంటి దోషం కర్మయోగంలో లేదు. ఏ కొద్దిగా కూడా లేదు ***(కిం చ న అపి చికిత్సావత్ ప్రత్యవాయః విద్యతే)***.

వేదోక్త కర్మకాండలో కొన్ని సందర్భాలలో ఉచ్చారణ దోషం వల్ల విరుద్ధ ఫలాలు వచ్చే అవకాశం ఉంది. త్వష్ట ప్రజాపతి నిర్వహించిన యజ్ఞంలో ఇంద్రుని వధించే కుమారుడు కావాలి అని సంకల్పం చేస్తే, స్వరదోషం వల్ల ఇంద్రుని చేత వధింపబడే బిడ్డడు పుట్టాలి అనే భావం ఏర్పడింది. అలాగే జరిగింది*. నహుషుడు కొండచిలువగా మారడం కూడా మనకు తెలుసు. ఇవన్నీ ప్రత్యవాయ దోషాలు. **

కర్మయోగంలో ప్రత్యవాయ దోషం లేదు. నువ్వు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని సంకీర్తన చేస్తూ ఉన్నావనుకో, ఓం నమో భగవతే వాసుదేవా. . అనే సరికి హఠాత్తుగా తుమ్మొచ్చి ఆపేశా వనుకో. దాని వల్ల నష్టం వాటిల్లదు. నువ్వు విడిచి పెట్టినా 'య' కారాన్ని కృష్ణుడు అందుకొని, తరువాత మంత్రానికి ఫలం సిద్ధం చేస్తుంటాడు. ఇదంతా కర్మయోగ వైభవం.

లాభనష్టాలలో, సుఖదుఃఖాలలో సమబుద్ధి కలిగి, ఫలితాన్ని ఈశ్వర ప్రసాదంగా స్వీకరించే కర్మయోగంలో అభిక్రమ నాశ దోషం ఉండదు. విధి ఉల్లంఘన వల్ల ఏర్పడే ప్రత్యవాయ దోషం కూడా ఉండదు. దోష రహితమైన కర్మయోగంలో ఎంత చేసుకుంటే అంత ఫలం. కర్మయోగి ఆచరించే కర్మలలో ఈశ్వరుడు ఉన్నందున, కర్మయోగి చేసే కర్మలన్నీ అలౌకిక కర్మలే. అలౌకిక కర్మలకు ఫలం కూడా అలౌకికం గానే ఉంటుంది. అదే ఈశ్వరానుగ్రహం. భగవంతుని దయ. ఈశ్వర భావనతో ఎంతగా కర్మ చేస్తూ ఉంటే అంతగా చిత్త ప్రసాదం ఏర్పడుతూ ఉంటుంది.

నేడు స్వల్పము - రేపు సర్వము

అర్జునా! ఈ కర్మయోగ రూప ధర్మాన్ని స్వల్పంగా ఆచరించినా, అది దారుణమైన జనన మరణ రూప సంసార భయం నుండి మనలను రక్షిస్తుంది. ఇది భగవ ద్వచనం. బాధాతప్త జగత్తులో క్రుంగుతున్న జనావళికి భగవంతుడు వినిపిస్తున్న అభయవాక్యం.

ఈ కర్మయోగములో సాధన స్వల్పమే అయినా, ఫలం అధికంగా ఉంటుంది. ఇక్కడ భగవంతుడు స్వల్పం అన్నాడే గాని అల్పం అనలేదు. ఈ రెండిటి మధ్య తారతమ్యాన్ని కూడా మనం గుర్తించాలి.

అల్ప వస్తువు మోతాదులో తక్కువగా ఉంటుంది. విలువ కూడా తక్కువ గానే ఉంటుంది. స్వల్ప వస్తువు

*పూజ్య స్వామీజీ రచించిన చైతన్య భాగవతము. ** చైతన్య మహాభారతంలో చూడవచ్చు.

అలా కాదు. మోతాదులో తక్కువగా ఉన్నా విలువను బట్టి చూస్తే అమూల్యంగా ఉంటుంది. దీనిని యోగ్యతా లక్షణము అంటారు.

రాయి, రత్నము రెండూ రాళ్ళే. మొదటి దానికి పరిమాణమే గాని, యోగ్యత లేదు. రెండవది పరిమాణంలో చిన్నదే అయినా ధర విషయానికి వస్తే ప్రముఖంగా పలుకుతుంది. అందుకే దానిని విలువైన రాయి అంటాము.

దేవాలయం బయట ఒక రాతి ముక్క పడి ఉంటుంది. అందులో మరొక ముక్క మూర్తిగా మలచబడి ఆలయంలో పూజ అందుకొంటూ ఉంటుంది. రెండూ రాళ్ళే. రెండూ ఒకే మోతాదు లోనే ఉన్నాయి. యోగ్యత విషయానికి వచ్చే సరికి పోలికే లేకుండా పోయింది. కర్మలు ఎంత గొప్పవి అయినా బంధ హేతువులే. ఆ కర్మలే యోగభావనతో ఆచరించి నపుడు మోక్ష హేతువులు అవుతున్నాయి. ఇదంతా కర్మయోగ వైభవము.

పవిత్రమైన ఈ కర్మయోగాన్ని ఆచరించే భక్తుడు జనన మరణరూప సంసారం నుండి బయట పడతాడు. స్వల్పము అనే సంశయం అవసరం లేదు. నేడు స్వల్పం, రేపు స్వల్పం, మరునాడు స్వల్పం, ఆ మరునాడు స్వల్పం - ఆ తరువాత సర్వం.

చిన్న నిప్పురవ్వ అరణ్యాన్ని దహించి వేస్తుంది. సాగర మధ్యంలో చిక్కుకున్న వ్యక్తి చిన్న నావను ఆశ్రయించుకొని తీరం చేరుతాడు. చిన్న మాత్రను మ్రింగి రోగి దారుణమైన రోగాన్ని పోగొట్టు కుంటాడు. స్వల్పమైనా, కర్మయోగము భవబంధాలను తొలగిస్తుంది.

కర్మయోగము అనేది భావన. అది కేవలం కర్మ అనుకో కూడదు. కర్మయోగి భావనలో భగవంతుడు ఉంటాడు. భావన బుద్ధిలో ఉంటుంది. భావనలో ఈశ్వరుడు ఉన్నాడు అంటే, బుద్ధిలో ఈశ్వరుడు ఉన్నాడని అర్థము. భావన కూడా కర్మే. మానసకర్మ. భావన రూపంలో భగవంతుడు ఉన్నాడు కనుక అట్టి భావన భగవద్భావన. భగవద్భావనకు ఫలం భగవదనుగ్రహం. అదే భావశుద్ధి. అదే చిత్తశుద్ధి. అదే అంతఃకరణ శుద్ధి. ఆ చిత్త ప్రసాదమే జ్ఞానానికి కర్మయోగిని అర్హుణ్ణి చేస్తుంది. అధికారిని చేస్తుంది.

అల్ప ప్రయోజనం - అనల్ప ఫలం

సాంఖ్యము బోధించే సన్యాసము ఉత్కృష్టమైనది. అందులో రెండవ ఆలోచన లేదు. కాకపోతే, పట్టుకున్న ప్రతి దానిని విడిచిపెట్ట మంటూ ఉంటుంది సన్యాసము. ఆశను విడిచిపెట్టు! వ్యాపారాన్ని విడిచిపెట్టు! భార్యా బిడ్డల్ని వదిలేయ్! దేహాన్ని మరచిపో! మనస్సును నిగ్రహించు! ఆలోచనల్ని అరికట్టు! నిజమే, ఇవన్నీ మోయడం ఎందుకు? వీటిని మోయడం కన్నా క్రిందికి త్రోయడమే నయం. బుద్ధి మాత్రం ఎన్నిటి నని మోస్తుంది? మోసి మోసి అదే ఒక మోయలేని బరువై కూర్చుంటుంది.

అలాగని, అన్నిటినీ విడిచి పెట్టడం సాధ్యమా? బుద్ధి శుద్ధి పడినపుడే అవన్నీ సాధ్య పడతాయి. వివాదాలతో వివాదాలు పరిష్కారం కావు. అవగాహన తోనే అంతర్యం లోని అలజడులు అణుగుతాయి.

కర్మయోగం తీరుతెన్నులు సన్యాసం లాగా ఉండవు. అది వదులు - ఇది వదులు అని సన్యాసము చెప్పినట్లు కర్మయోగం చెప్పదు. అది చేయదగింది - చెయ్యి, ఇది చేయదగింది - చెయ్యి, అని బుజ్జగించి చెబుతుంది. ఏదో ఒకటి చెయ్యాలనే దురద మనకు ఉండనే ఉంది. కనుక చేయ వలసిన కర్మలను, చేయదగిన కార్యాలను రాగద్వేష రహితంగా చేస్తూ, పనిని పూజగా ఎలా మార్చుకోవాలో కర్మయోగము నేర్పుతుంది. కర్మయోగి చేసే ప్రతి కర్మ ఒక పూజగా మారుతుంది. ఈ విధమైన కర్మయోగంలో రాగద్వేషాలు పలుచబడి పోతూ ఉంటాయి. మనస్సులో ప్రశాంతత చేరిపోతూ ఉంటుంది. చిత్తశుద్ధి ఏర్పడుతూ ఉంటుంది. ఆ తరువాత చిత్త నైశ్చల్యం రానే వస్తుంది. బుద్ధి ధ్యానానికి సిద్ధ పడుతుంది. ఇదంతా కర్మయోగమే చేసి పెడుతుంది.

మరణంలో మహాభయం

కర్మయోగి సాధన ఒక జన్మలోనే పూర్తి కాకుండా చనిపోయినా, కర్మయోగంలో అభిక్రమనాశ దోషము, ప్రత్యవాయ దోషము లేవు కనుక, అతడు మరణ సమయంలో కూడా ఈశ్వర భావనే కలిగి ఉంటాడు కావున, మరణానంతరము ఈశ్వరభక్తికి అవకాశం ఉండే ప్రదేశంలో జన్మించి, గడచిన జన్మలో విడిచిన యోగాన్ని తిరిగి చేపట్టి, సాధనను కొనసాగించి తరించి పోతాడు. అందుకే కర్మయోగము శ్రేష్ఠమైనది.

న హి కల్యాణ కృత్కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి!

అర్జునా! కళ్యాణ ప్రదమైన కార్యమును ఆచరించు వాడు ఎప్పుడూ దుర్గతిని పొందడు అని గీతాచార్యుడు ధ్యానయోగంలో చెప్పబోతాడు.

గీతాచార్యుడు బోధిస్తున్న సాంఖ్య, యోగాలలో నిశ్చయ రూపమైన జ్ఞానము ఒక్కటే ముఖ్యమైనది. నిశ్చయము లేనివారి జ్ఞానములు అనంతములుగా ఉంటాయి.

వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41

వ్యవసాయాత్మికా-బుద్ధిః-ఏకా-ఇహ-కురునందన
బహుశాఖాః-హి-అనంతాః-చ-బుద్ధయః-అవ్యవసాయినాం

కురునందన	= అర్జునా!	అవ్యవసాయినాం	= నిశ్చయబుద్ధి లేని వారి
ఇహ	= ఈ యోగమున	బుద్ధయః	= బుద్ధులు
వ్యవసాయాత్మికా	= నిశ్చయ రూపమైన	బహుశాఖాః	= అనేక భేదములు గలవి
బుద్ధిః	= బుద్ధి	అనంతాః చ హి	= అనంతములు గదా!
ఏకా	= ఒక్కటే		

అర్జునా! ఈ కర్మయోగంలో భిన్నాభిప్రాయాలు ఉండవు. బుద్ధి ఏకమై ఉంటుంది. నిశ్చయమై ఉంటుంది. నిశ్చయ బుద్ధి లేని వారి ఆలోచనలు భేదాలతో ఉంటాయి. అంతం లేకుండా సాగుతూ ఉంటాయి.

వ్యాఖ్య

మనస్సులో స్పష్టత లేనప్పుడు మాటలలో స్పష్టత ఉండదు. మనిషికి ఏమి కావాలో, తాను ఏది పొందాలో స్పష్టంగా తెలిసి ఉండాలి. తాను ఏది పొందాలో తనకే తెలియనప్పుడు, ప్రయత్నంతో ఏది పొందినా, అది తాను ఆశించింది కాకపోవచ్చు. తన ప్రయాణం ఎక్కడికో తెలియని వ్యక్తి ఎటు అయినా పోవచ్చు. తాను చేరే చోటు ఏదైనా కావచ్చు. ఈ విధమైన అస్పష్టత సైతం ఆధ్యాత్మిక మార్గంలో చాలా ప్రమాదకరమైనది.

సాంఖ్యము – యోగము

గీత బోధిస్తున్న సాంఖ్యము, యోగము రెండింటి లోను జ్ఞానము నిశ్చయముగా ఉంటుంది. భగవద్గీత మోక్ష ప్రధానమైన శాస్త్రము. సర్వకర్మలను సన్యసించి, ఆత్మజ్ఞానమును మాత్రమే విచారణ చేయడము సన్యాసము. అదే సాంఖ్యము. జ్ఞానమును పొందడము అంటే నేనే బ్రహ్మము అని తెలుసు కోవడమే. దీనికి సన్యాసము తప్ప మరొక మార్గము లేదు.

రెండవది కర్మయోగము. జ్ఞానము ఎంత ప్రధానమో, కర్మయోగము అంతే ప్రధానము. కర్మయోగము లేకుండా జ్ఞానము కలగదు. జ్ఞానమును పొందడానికి కావలసిన బుద్ధిని కర్మయోగము తయారు చేస్తుంది.

కనుక సాంఖ్య, యోగములు రెండూ మోక్షసాధనాలే. సాంఖ్యములో మోక్షం ఉంది. యోగంలో మోక్షానికి సాధనం ఉంది. రెండూ ఒకే గమ్యం వైపు సాగుతాయి. క్రమమార్గంలో ఉంది. మోక్షమార్గంలో సాంఖ్య, యోగాల నిశ్చయ స్వభావం ఒక్కటే. దీనినే ఈ శ్లోకంలో *వ్యవసాయాత్మికా బుద్ధిః* అంటున్నారు పరమాత్ముడు.

నిశ్చయ స్వభావము

వ్యవసాయాత్మికా బుద్ధి అంటే నిశ్చయ స్వభావం గల బుద్ధి లేదా జ్ఞానము అని అర్థము. ఇక్కడ నిశ్చయ స్వభావము అనేది స్పష్టతకు సంబంధించిన విషయం. మనము పొంద దలచింది ఏమిటి? దాని స్వరూప స్వభావాలేమిటి? దానిని పొంద దానికి సాధన ఏమిటి? ఇవన్నీ బుద్ధిలో స్పష్టంగా ఉండాలి. ఇదే నిశ్చయ జ్ఞానము. వ్యవసాయాత్మికా బుద్ధి (*వ్యవసాయాత్మికా బుద్ధిః*).

సన్యాసి కైనా, కర్మయోగి కైనా గమ్య మేమిటి? మోక్షము. మోక్షము ఎక్కడుంది? ఎలా ఉంది? మోక్షము జ్ఞానరూపంలో ఉంది. కనుక మోక్షానికి జ్ఞానమును పొందడ మొక్కటే మార్గము. ఇది సాంఖ్యము. జ్ఞానమును పొందడానికి సర్వ కర్మలను సన్యసించి సన్యాసి జ్ఞానమార్గంలో పయనిస్తాడు. సన్యాసము స్వీకరించడం కూడా కేవలం జ్ఞాన సముపార్జనం చేయాలి అనే ఉద్దేశ్యం తోనే. కనుక సాంఖ్యంలో సాగుతున్న సన్యాసికి వ్యవసాయాత్మికా బుద్ధి, అంటే నిశ్చయ స్వభావము ఒకే విధంగా ఉంది (*ఏకా*).

సాంఖ్యములో సన్యాసికి వ్యవసాయాత్మికా బుద్ధి ఎలాగైతే ఒక్కటే ఉందో, కర్మయోగము చేయు వ్యక్తికి కూడా నిశ్చయ స్వభావము ఒక్కటే ఉంది (*ఇహ కర్మయోగే వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకా*). తనకు మోక్షం కావాలి. మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానమును పొందుటకు కావలసిన చిత్తశుద్ధిని కర్మయోగము ద్వారా పొందుతూ, జ్ఞానంపై దృష్టి నిలిపి జీవనయాత్రను కర్మయోగి సాగిస్తాడు. ఈ విషయంలో ఏ విధమైన సంశయాలు అతని మనస్సులో లేవు. నిశ్చయ జ్ఞాన మొక్కటే ఉంది.

మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చా శుద్ధ మేవచ
అశుద్ధం కామ సంకల్పం శుద్ధం కామ వివర్జితమ్ ॥

శుద్ధ మని, అశుద్ధ మని మనస్సు రెండు విధాలు. కోరికలతో, తత్సంబంధమైన సంకల్పాలతో కూడింది అశుద్ధము. కామ సంకల్పాది దోషాలు లేనిది శుద్ధము అన్నది ఉపనిషత్తు.

సన్యాసులు, కర్మయోగులు మోక్షమే తమ గమ్యంగా భావించి, దాని విషయంలో నిశ్చయ స్వభావంతో ఉన్నారు కనుక, వారిలో కామ సంకల్పాది దోషాలు ఉండవు. వారి బుద్ధి ఒకే విధంగా ఉంటుంది. అలాంటి ఏక లక్ష్యము లేనివారు అనేక గమ్యాలను ఆశ్రయిస్తూ అనేక మార్గాలలో పయనిస్తూ ఉంటారు. అందుచేత వారి జ్ఞానము నిశ్చయముగా ఉండదు. వారు అవ్యవసాయులు. అంటే వ్యవసాయాత్మికా బుద్ధి లేనివారు. ఏక విధమైన జ్ఞానము లేనివారు. వారి చిత్తము సదా చలిస్తూ ఉంటుంది. వారికి అనేక గమ్యాలు. అనేక మార్గాలు (*బహుశాఖాః*). వాటికి అంత మంటూ ఉండదు. ఒకటి తీరుతూ ఉంటే, మరొకటి కోరుతూ ఉంటారు.

ధనం వెంట పరుగులు తీస్తూ ఉంటారు. పదవుల వెంట పరుగు పెడుతూ ఉంటారు. ఇవన్నీ గమ్యాలనుకుంటారు. అవి ఆగకుండా సాగుతూ ఉంటాయి. అనేకమైన శాఖలుగా విస్తరించి ఉంటాయి అంటున్నారు గీతాచార్యుడు. అంటే, అనేక భేదాలతో ఉంటాయని అర్థం. వివిధ ఫలాలను ఆశిస్తూ ఉంటారు కనుక వారికి నిశ్చయాత్మికా జ్ఞానం ఉండదు. అలాంటి వారు కర్మయోగమునకు అర్హులు కారు.

కర్మయోగి హృదయం ఆరాధనా భావంతో ఉంటుంది. భక్తి భావంతో ఈశ్వరుడే నిండి ఉంటాడు. అందుచేత కర్మయోగము పవిత్ర మైనది. కర్మయోగము ఉపాయము. సాంఖ్యము ఉపేయము.

కురు నందన

ఈ శ్లోకంలో అర్జునుణ్ణి కురునందనా! అని సంబోధించాడు శ్రీకృష్ణుడు. కురునందనా! అంటే కురు వంశాన్ని సంతోష పెట్టువాడా! అని అర్థము. అంతేకాదు, 'కురు' అంటే చెయ్యి అని అర్థము. 'నందన' అంటే ఆనందించే వాడు. కురునందనా! అని ప్రత్యేకంగా సంబోధిస్తూ, కర్మయోగంలో చరించి తృప్తి చెందు అని బోధించాడు శ్రీకృష్ణుడు.

నిశ్చయమైన జ్ఞానం లేనివారు ఎలా ఉంటారో వినిపిస్తున్నాడు.

కర్మ బంధమా? ఈ వాక్యం పలకడం కర్మ కాదా! ఈ వాక్యాన్ని పలకాలి అని అనుకోవడం కర్మ కాదా? పలకడం వాచక కర్మ అయితే, పలకాలి అనుకోవడం మానసకర్మ. కర్మ బంధము అని చెప్పే వ్యక్తి బంధములో ఉండే చెబుతున్నాడా? లేక బంధము లేకుండా చెబుతున్నాడా? బంధములో ఉండే వ్యక్తికి బంధము ఎలా తెలుస్తుంది? బంధము అర్థమైతే ఇక బంధ మెక్కడుంది? కల కనే వ్యక్తికి ఇది కల అని తెలుస్తుందా? తెలిస్తే ఇక కల ఎక్కడుంది?

బంధము లేని వ్యక్తి కర్మ బంధము అని ఎలా చెబుతాడు? అలా చెప్పడం కర్మ అని అతనికి తెలియదా? కనుక కర్మ బంధము కాదు. కానే కాదు. గాలి వీచడం కర్మ. మొక్క పెరగడం కర్మ. పువ్వు పూయడం కర్మ. కాయ కాయడం కర్మ. అలలు కదలడం కర్మ. చిలుక పలకడం కర్మ. కళ్ళు తెరవడం కర్మ. రెప్ప పడటం కర్మ. సృష్టి కర్మ. స్థితి కర్మ. లయ కర్మ. కర్మ కాని దేముంది? కర్మలలో బంధ మెక్కడుంది?

మరి, బంధ మేమిటి? కర్మ బంధము కాదు. కోరిక బంధము. కోరికతో కూడిన ఏ కర్మ అయినా బంధమే. కోరిక లేని కర్మ బంధం కాదు. శ్వాస కర్మ కాదా! అది బంధమా? అలాగని శ్వాసను బంధిస్తే, ప్రాణం నిలుస్తుందా? చూపు బంధమా? అదీ కర్మే కదా! చూపు బంధమైతే సర్వ శక్తిమంతుడైన పరమేశ్వరుని సృష్టి లోని అందాలన్నీ దేని కొరకు? ఎవరి కొరకు? వినికిడి బంధమా? అదే వాస్తవ మైతే, సృష్టి లోని రమణీయ పలుకులు, అపాత మధురమైన గానామృతాలను ఎవరు ఆస్వాదించాలి? కనుక కర్మ బంధం కాదు. కోరికే బంధము.

అలా అయితే, కోరిక లేకుండా కర్మ సాధ్యమా? ఏ కర్మను ఎవరు చేసినా, వెనుక కోరిక ఉండి తీరాలి కదా! కోరిక ఉంటేనే కదా ఎవరైనా కర్మ చేస్తారు? భగవంతుడు కూడా సృష్టి చేయాలని కాంక్షించే చేశాడని ఉపనిషత్తు కూడా చెబుతూ ఉంది.

అయినా, కోరిక లేకుండా ఎవరైనా ఉండగలరా? మనిషికి అది సాధ్యమేనా? ప్రతిచోట చలన ముంది. ప్రతి చలనంలో కోరిక దాగి ఉంది. ఈ విశ్వంలో పరిమితాలన్నీ ప్రత్యక్షం గానో, పరోక్షం గానో చలిస్తూనే ఉన్నాయి. అనంతాన్ని అందుకోవాలనే ఆశే ఆ చలనాలలో దోబూచు లాడుతోంది.

భూమండలం కూడా అందుకే చలిస్తోంది. సౌరమండల మంతా మెల్లగా చలిస్తూ, ఒక మహోజ్జ్వలమైన తార వైపుకు తరలిపోతూ ఉందని విజ్ఞాన శాస్త్రవేత్తలు వింత వింత విషయాల్ని వినిపిస్తున్నారు.

మనుషు లందరూ ఆ బాట లోనే ఉన్నారు. ఆ మార్గం లోనే తెలిసో తెలియకో ప్రయాణం సాగిస్తున్నారు. అనిత్యాల నుండి విడిపడి నిత్యవస్తువును వాటేసు కోవాలని, అంతం కలిగిన వాటి నుండి విడిపడి అనంతం వైపు పరుగులు తీయాలని ఆశ పడుతున్నారు. మన అందరి కోరిక అదే.

ఎండలో తిరిగి అలసి పోయి ఇల్లు చేరిన వ్యక్తి, చల్లని పానీయం కావాలని కోరుకుంటాడు. ఎందుకని? ఎండలో వచ్చాడు. బాగా డస్సి పోయాడు. అలసటగా ఉంది. ఆవేదనగా ఉంది. ఇదంతా అనుభవిస్తూ, భరిస్తూ

కూర్చోలేడు. ఈ అస్వస్థత నుండి బయట పడాలి. శీతల పానీయం కావాలి అంటాడు. శీతల పానీయం కావాలి అని అడిగింది శీతల పానీయం కొరకు కాదు. తాను అసౌకర్యం నుండి విడిపడ టానికి.

ఇదొక్కటే కాదు. మనం ఈ ప్రపంచంలో ఏది కోరినా, దాని వెనుక దాగి ఉన్న సత్యం ఇదే. సినిమా చూసినా, టి.వి. చూసినా, కాశ్మీరు వెళ్ళినా, ఊటీలో ఊరేగినా, పకోడి నమిలినా, పాయసం జుర్రినా, ఎత్తులో ఎగిరినా, మత్తులో తూలినా, అన్నిటి వెనుక, అందరి వెనుక, ప్రతి కోరిక వెనుక అసంతృప్తి నుండి విడిపడాలనే ఆత్రుతే ఉంది. కాకపోతే, ఈ విధమైన అనుభవాలలో ఏదో కొంత తృప్తిని మనిషి అనుభవిస్తున్నాడు. వాస్తవానికి అది తృప్తి కాదు. తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

మన అసంతృప్తి ఎక్కడుందో మనం చూడలేక పోతున్నాం. మనం ఆశించే తృప్తి ఎక్కడ దాగి ఉందో మనం అర్థం చేసుకోలేక పోతున్నాం. దేహము, ఇంద్రియాలు, మనస్సు కల్గించే పైపై ప్రేరణలకు స్పందిస్తున్నామే గాని, మన అంతర్యపు లోతుల్లో వీటికి ఏది హేతువుగా ఉందో విశ్లేషించుకోలేక పోతున్నాం.

అవి కావాలి - ఇవి కావాలి అనేది మన ఉద్దేశ్యం కాదు. అనంతంగా భాసించాలి అనేదే మన ఆశ. ఇది అనంతానికి సంబంధించిన కోరిక. అనంతమైన కోరిక. కాని, ఇంద్రియ మనస్సులు మనల్ని పరిమితాల వైపుకు ఈడుస్తున్నాయి. అసలు బంధానికి హేతువు ఇక్కడే ఉంది. అంతేగాని బంధహేతువు కర్మ కాదు.

మరి, కర్మ బంధం కానపుడు, కోరికే బంధమై నపుడు కోరికల్ని వదిలేస్తే సరిపోతుంది కదా? మరి కోరికలు ఎందుకు కదులుతున్నాయి? నువ్వు తృప్తిగా లేవు కనుక. తృప్తి చెందాలి అని ఆశిస్తున్నావు కనుక కోరికలు కదులుతున్నాయి. కోరికల్ని వదిలేయాలి అంటే, అవి లేకపోయినా నువ్వు తృప్తిగా ఉండ గలగాలి. ఉండ గలవా?

తృప్తిగా ఉండటానికి కోరికల్ని వదిలేస్తావా?

తృప్తిగా ఉన్నావు కనుక కోరికల్ని వదిలేస్తావా?

నువ్వు తృప్తిగా ఉండాలి అంటే కోరికల్ని వదిలేయాలి. నువ్వు తృప్తిగా లేనపుడు కోరికల్ని ఎలా వదుల్తావు? కర్త ఉన్నంత వరకు కోరికలు బంధహేతువులే. నిన్ను నువ్వు కర్తగా భావించినంత వరకు కోరికలు నిన్ను బంధిస్తూనే ఉంటాయి. బాధిస్తూనే ఉంటాయి. నీవు అకర్తవు, అభోక్తవు అని నీ స్వరూపాన్ని నీవు తెలుసుకుంటే, కోరికలు ఉన్నా నష్టం లేదు, పోయినా నష్టం లేదు. కర్మలు సాగినా నష్టం లేదు, కర్మలు ఆగినా కష్టం రాదు.

నమాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా

ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న సబధ్యతే ॥

అర్జునా! కర్మలు నన్ను అంటవు. కర్మఫలము నందు నాకు కోరిక లేదు. ఇలా నన్ను ఎవడు తెలుసుకుంటాడో, అతడు కర్మల చేత బద్ధుడు కాడు అన్నాడు జ్ఞానయోగంలో గీతాచార్యుడు.

కృష్ణుడు భోక్తగా లేడు. కనుక కర్త కూడా కాదు. ఆయన అకర్త. అభోక్త. ఇది జ్ఞానం. ఆత్మజ్ఞానం. ఆత్మయే పరమాత్మ. జీవుడే దేవుడు. నరుడే నారాయణుడు. మానవుడే మాధవుడు. మాధవుడు ఏమిటో అర్థ మైతే, మానవుడు మాధవుడి కన్నా అన్యం కాదని తేలిపోతుంది.

ఇది జ్ఞానం. ఇదే సాంఖ్యం (*శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభిధీయతే*). సన్యాసము దీని కొరకే. సన్యాసానికి అర్హత లేని వాళ్ళు చిత్తశుద్ధికి కర్మల నాచరించాలి. ఇది యోగము. కర్మయోగము. మోక్షానికి ఈ రెండూ మార్గాలే.

మరి, బంధము? ఈ రెండూ కాకుండా, కోరికల చేత, ఆశల చేత ప్రేరేపింప బడి, కర్మ సుడిగుండంలో పరిభ్రమించే మార్గము ఏదైనా బంధమే. ఇలా బంధాలు తగిలించుకొని, బ్రతుకులో అందాలు చెడగొట్టు కుంటున్న వారున్నల్లి గురించి, ఛాందసుల్ని గురించి మూడు శ్లోకాలలో చెబుతున్నాడు, విందాం!

యామిమాం పుష్పితాం వాచం ప్రవద న్త్యవిపశ్చిత: ।
వేదవాదరతా: పార్థ నాన్య దస్తీతి వాదిన: ॥ 42

యాం-ఇమాం-పుష్పితాం-వాచం-ప్రవదంతి-అవిపశ్చిత:
వేదవాదరతా:-పార్థ-న-అన్యత్-అస్తి-ఇతి-వాదిన:

పార్థ	= అర్జునా!	వాదిన:	= వాదించువారు
వేదవాదరతా:	= వేదవాదముల యందు రమించు వారు	అవిపశ్చిత:	= అవివేకులు
అన్యత్	= మరి యొకటి	పుష్పితాం	= వికసిత పుష్పం లాగా పైకి అందంగా కనపడే
అస్తి	= ఉండుట	ఇమాం	= ఇట్టి
న	= లేదు	యాం వాచం	= ఏ మాటలను
ఇతి	= అని	ప్రవదంతి	= చెబుతున్నారో

అర్జునా! అవిపశ్చితులు అంటే అవివేకులు. వీరికి వేదం ప్రతిపాదించిన సకామ కర్మల యందే ప్రీతి. ఫల భోగము నందే ఆసక్తి. స్వర్గాన్ని మించింది మరొకటి లేదని పువ్వులు పరచినట్లు రమణీయంగా వాదిస్తూ ఉంటారు.

వ్యాఖ్య

సాంఖ్యమును అనుసరించే సన్యాసులు, యోగమును ఆశ్రయించిన కర్మయోగులు ఒకే విధమైన నిశ్చయాత్మక బుద్ధిని ఎలా కలిగి ఉన్నారో గడచిన శ్లోకంలో చూశాం. నిశ్చయాత్మక బుద్ధి లేని అవిపశ్చితుల స్వభావమును గూర్చి వరుసగా మూడు శ్లోకాలలో వినబోతున్నాం.

అవిపశ్చితులు అంటే అల్పబుద్ధులు, అవివేకులు అని అర్థం (*అవిపశ్చిత: అల్పమేధస: అవివేకిన: ఇత్యర్థ:*). అలాగని వాళ్ళు నిరక్షరకుక్షులు కారు. వేదాధ్యయనము చేసిన వారే. వేదంలో అద్భుతమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. అల్పమైన ఫలాలను అందించే సాధనలు ఉన్నాయి. అనల్పము, అనంతమైన ఫలాన్ని ఇచ్చే సాధనలూ ఉన్నాయి. వివేకులు అనంతఫలము వైపు మొగ్గు చూపుతారు. అవివేకులు అల్ప ఫలాలను ఆశ్రయించుకొని ఉంటారు. అల్ప ఫలాలను ఆశించేవారు కనుక వారు అల్పమేధ కలవారు. అవిపశ్చితులు. అల్పబుద్ధి కలవారు కనుక అల్పాన్నే అనంతంగా ఊహించుకొని, వినే చెవులు దొరకగానే ఆలస్యం చేయకుండా ఊదరగొడుతూ ఉంటారు.

పువ్వుల పలుకులు

వీరిది పూల సంభాషణం (*పుష్పితాం వాచమ్*). వినడానికి ఇంపుగా, సొంపుగా సంభాషిస్తారు. పువ్వులు ఎంత సుప్పితంగా ఉంటాయో, వాళ్ళ పలుకులు కూడా అంత సుకుమారంగా ఉంటాయి. పట్టుకుంటే పూల రేకులు ఊడినట్లు, ప్రశ్నిస్తే వీళ్ళ మాటలు కూడా ప్రాబల్యాన్ని కోల్పోతాయి. మనోహరంగా కనిపించే పువ్వులు గంటల్లో వాడిపోయినట్లు, మంబాలమైన వీరి వాదాలు క్షణాల్లో వాడోడు లేకుండా పోతాయి. కాకపోతే, వింటున్నంత సేపు రమణీయం గానే ఉన్నట్లు అనిపిస్తాయి అన్నారు శ్రీ శంకరులు కూడా (**శ్రూయమాణ రమణీయాం**). వారి పుష్పిత వాణిని *వదన్తి*, పలుకుతున్నారు అంటే సరిపోతుంది. కాని, గీతాచార్యుడు *ప్రవదన్తి* అని ఉపసర్గను చేర్చి చెప్పాడు. వారు మాట్లాడే అర్థరహితమైన, వ్యర్థమైన విషయాలను చాలా ఘనంగా భావించి, గంభీర స్వరంతో వినిపిస్తూ ఉంటారు. అందుకని ప్రవదన్తి అన్నాడు. మాటల్లో పస లేకపోయినా, పలికే ప్రతి మాట వేద వాక్కే. అదే విచిత్రము.

వేద వాదాలు

వీరికి భోగమే యోగము. ఏ సాధన చేస్తే ఏ ఫలం వస్తుంది? ఏ భోగం అనుభవించాలంటే ఏ యాగం చేయాలి? ఈ విధంగా ఫలాపేక్షతో కూడిన యజ్ఞయాగాదుల యందు ఆసక్తే గాని, మోక్షము, భగవంతుడు, మొదలైన విషయాలలో అనురక్తి ఉండదు. వారు తెలిసినది అంటే కర్మలు - ఫలభోగాలే గాని మరొక ప్రస్తావన ఉండదు.

ఈ యాగం చేస్తే పుత్రులు కలుగుతారు (**పశ్యతి పుత్రం**). ఆ క్రతువు చేస్తే మనవడు పుడతాడు (**పశ్యతి పౌత్రం**). ఎవరికి ఘనంగా దక్షిణలు ముట్టజెప్తారో వారు అమృతత్వాన్ని పొందుతారు (**దక్షిణావంతో అమృతత్వం భజన్తే**). మేము యజ్ఞ యాగాదులు నిర్వహించి సోమపానం చేశాం (**అపామ సోమమ్**). ఇలాంటి నిష్ఫలమైన పుష్పిత వాక్కులను పునశ్చరణ లేకుండా గుంభాను గుంభాలుగా కుట్టిస్తూ ఉంటారు. అన్నీ పూల పలుకులే. మోదుగ పూలు లాంటివి. పువ్వుల్లో సువాసన ఉండదు. కాయల్లో చేదు భయంకరంగా ఉంటుంది.

తన మాటే వేదం - తన పాటే నాదం

భోగ సాధనాలైన కర్మలు తప్ప మరొక విషయాన్ని ముచ్చటించ డానికి అంగీకరించరు. వేదమంతా తమకే తెలుసు అంటారు. కర్మకాండనే పట్టుకొని వ్రేలాడుతూ ఉంటారు. జ్ఞానకాండ వైపు కన్ను ఎత్తైనా చూడరు. ఎందుకని? కర్మలు - భోగాలు, వీటి కన్నా అన్యమైనది, అద్భుత మైనది మరొకటి లేనే లేదని వాదిస్తూ ఉంటారు (**న అన్యత్ అస్తి ఇతి వాదిన:**). వేదాన్నే విశ్వసిస్తారు. వేదాన్నే భాషిస్తారు. వేదసారాన్ని అందుకొనే ప్రయత్నం మాత్రం చెయ్యరు. కర్మకాండకే ప్రాధాన్యత నిచ్చి, పైపై మాటలనే పరిమిత మవుతారు గాని లోతులకు వెళ్ళి ముఖ్య విషయాన్ని గ్రహించరు.

ఛాందోగ్యోపనిషత్తులో ఒక చిన్న ఆఖ్యాయిక ఉంది. ఒక జీవాత్మను మృత్యువు వెంటడించి తరుము తుంది. పరుగు లెత్తి అలసి పోయిన ఆ జీవాత్మ ఎక్కడ రక్షణ పొందాలో తెలియక వేదాలలో ప్రవేశిస్తుంది. అలాగని మృత్యువు విడిచి పెట్టకుండా, తాను కూడా వేదాల లోకి ప్రవేశిస్తుంది. ఆ జీవాత్మ మృత్యువు నుండి తప్పించుకోవడానికి వేద లోతుల్లోకి, లోతుల్లోకి, లోతుల్లోకి వెళ్తుంది. ఆ అగాధ లోతుల్లోకి వెళ్ళడం మృత్యువుకు సాధ్యం కాదు. మృత్యువు వెను దిరిగి వచ్చేస్తుంది. ఆ జీవాత్మ మరణం నుండి తప్పించుకొని తరించి పోతుంది. ఇదీ కథ.

వేదము యొక్క లోతులను చూచిన వారే మృత్యువు నుండి తప్పించు కుంటారు. వేదము యొక్క లోతు అంటే, వేదము యొక్క అంతము, లేదా చివరి భాగము. అదే వేదాంతము. ఉపనిషత్తుల జ్ఞానము. వేదాంత లోతుల లోకి దూసుకొని పోయింది కనుకనే ఆ జీవాత్మ మృత్యువు నుండి తప్పించుకో గలిగింది. **అపామ సోమమ్** అంటూ పైపైన కర్మకాండ లోనే పచార్లు చేసి ఉంటే, ఇంతే సంగతులు అని సంతాపం పెట్టవలసి వచ్చేది.

ఈ వేద లంపటుల విచిత్ర స్వభావాన్ని తరువాత శ్లోకంలో కూడా వివరిస్తున్నాడు భగవంతుడు.

కామాత్మాన: స్వర్గపరా జన్మకర్మ ఫలప్రదామ్ ।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43

కామాత్మానః-స్వర్గపరాః-జన్మకర్మఫలప్రదాం
క్రియావిశేషబహులాం-భోగైశ్వర్యగతిం-ప్రతి

కామాత్మానః	=	కోరికలతో నిండిన మనస్సు గల
స్వర్గపరాః	=	స్వర్గమే పరమ మైనది అని తలచేవారు
జన్మకర్మఫలప్రదాం	=	జన్మమును, కర్మఫలమును ఇచ్చే
క్రియా విశేష బహులాం	=	బహుళమైన కార్యకలాపములతో నిండినది
భోగైశ్వర్య గతిం ప్రతి	=	భోగముల యొక్క ఐశ్వర్యముల యొక్క ప్రాప్తిని గురించి

ఈ అవిపశ్చితుల మనస్సుల నిండా కోరికలే ఉంటాయి. స్వర్గము నందే వారికి మక్కువ. భోగాలను, సంపదలను పొందే మార్గాన్ని చెబుతూ ఉంటారు. అవి అనేక క్రియా కలాపాలతో కూడి ఉంటాయి. పైగా, జన్మ అనే కర్మ ఫలాన్ని అందిస్తాయి.

వ్యాఖ్య

కోరికల కోలాటం

కోరికలే స్వభావంగా గల వారికి ***(కామాత్మానః)***, అవి కావాలి - ఇవి కావాలి, అది చేస్తే ఇవి వస్తాయి, ఇది చేస్తే అవి వస్తాయి, అంటూ పోయే వరకు వచ్చే వాటికి స్వాగతం పలకడం తోనే సరిపోతుంది. ఏది చేయాలన్నా, దానికి ముందుగా ఏమొస్తుంది? అనే ప్రశ్న పుడుతుంది. మనస్సు నిండా కోరికలే. బ్రతుకంతా కోరికల కోలాటం తోనే సాగుతుంది. ఇదంతా అజ్ఞాన క్రీడ. అవిద్యా విలాసము. అవిద్యా జనితమైన కర్మ సుడిగుండంలో చిక్కుకొనే భోగవాదులు అంధకారంలో కూరుకు పోతున్నారు అని ఉపనిషత్తు హెచ్చరించింది కూడా.

అన్ధం తమః ప్రవిశన్తి యే అవిద్యా ముపాసతే

అవిద్యను ఆశ్రయించే వారు అజ్ఞాన చీకట్లలో ప్రవేశిస్తారు అన్నది ఈశావాస్యోపనిషత్తు.

దివిలో కాపురం

స్వర్గమే వారికి పరమ పురుషార్థం. స్వర్గమే గమ్యము ***(స్వర్గపరాః)***. స్వర్గ ప్రస్తావన వేదంలో ఉంది. స్వర్గం భోగభూమి. వీరు భోగాసక్తులు కనుక స్వర్గమే వీరికి సర్వస్వము. అంతే కాని స్వర్గము కూడా ఒక లోకమే నని, స్వర్గానికి కూడా ఆద్యంతా లున్నాయని, పుణ్యఫలంగా ప్రాప్తించిన స్వర్గము పుణ్యం క్షీణించ గానే నశిస్తుందని, తిరిగి జన్మ ప్రాప్తిస్తుందని వాళ్ళు ఆలోచించరు. భోగవాదులు కనుక, నందన వన విహారాలు, అమృత పానాలు, అప్సరసల విలాసాలు - ఈ వాంఛలే మళ్ళీ మళ్ళీ వాళ్ళ మనస్సులలో తిరుగుతూ ఉంటాయి. జ్ఞానకాండ వైపు దృష్టి మరల్చరు కనుక వైరాగ్య శూన్యులై ఉంటారు. ఈ స్వర్గ చర్చ ప్రతి మతం లోను ఉంది. మోక్షం తెలియని వారికి స్వర్గమే మోక్షము. బ్రతికినంత కాలం కడుపే కైలాసం. ఇల్లే వైకుంఠం. చచ్చిన తరువాత స్వర్గమే సర్వము.

ఈ స్వర్గపరుల సల్లాపాలు ఆలకించిన కొందరు అమాయకులు కొన్ని విచిత్రమైన పదాలను, వింత వింత వాక్యాలను వినిపిస్తూ ఉంటారు. మీరు ఊటీకి వెళ్ళొచ్చారు కదా! అక్కడ ఎలా ఉంది? అని అడిగితే, అబ్బ! ఏం చెప్పను? స్వర్గం లాగా ఉంది అంటాడు. స్వర్గం ఎలా ఉంటుందో చూసిన వాడు చెప్పాడా? చెప్పేవాడు చూశాడా? పోని, అతడు చెప్పిన దానిని మన మెలా అర్థం చేసుకోవాలి? మనం ఎప్పుడైనా స్వర్గం చూశామా? చూడని దానిని అర్థం చేసుకొనే దెలా? ఎవరి మనస్సులో స్వర్గానికి సంబంధించి ఎలాంటి

ఊహాచిత్రం ఉంటుందో, దానిని అలా అలా ఊహించు కోవడమే. అందుకే, ఎవడి లోకం వాడిది అనే నానుడి నోళ్ళల్లో బాగా నానింది.

ఒక కప్పు కాఫీ ఇచ్చి, ఎలా ఉంది? అని అడిగితే, ఒకడు అమృతంలా ఉందంటాడు. ఏదో పూర్వం త్రాగి త్రేపినట్లే! మా అబ్బాయికి ఒక మంచి అమ్మాయిని చూసి పెట్టండి పేరయ్య గారూ! అంటే, మీ కెందుకండీ! రంభ లాంటి అమ్మాయిని చూసి పెడతాను అంటాడే గాని, పిల్లవాడి వయస్సెంతో, రంభ వయస్సెంతో కూడా ఆలోచించడు.

భోగ భాగ్యాలు

ఇక వారి పుష్పితవాణి భోగం లోనే బోణి. భోగాలను, ఐశ్వర్యాలను, సిరిసంపదలను, స్వర్గాన్ని - ఇలాంటి వాటిని అనుగ్రహించే కర్మలను గూర్చే వారి చర్చ నడుస్తూ ఉంటుంది. కర్మకు ఫలం జన్మ. ఉత్తమ జన్మ రావాలి అంటే ఏ కర్మను ఆచరించాలి? అనేదే వారి సంభాషణ సారాంశమై ఉంటుంది ***(కర్మణః ఫలం జన్మైవ కర్మఫలం తత్ ప్రదాతాతీతి జన్మ కర్మ ఫలప్రదా)***.

అంతే కాకుండా క్రియా విశేషాలను అధికంగా చర్చిస్తూ ఉంటారు. క్రియా విశేషాలు అంటే క్రియల యొక్క గొప్పతనాలు ***(స్వర్గ పశు పుత్రాది అర్థాః)***. స్వర్గము, సిరిసంపదలు, ఇవే ప్రధానంగా గల విషయాలకు సంబంధించిన కర్మలు అని అర్థము. ఈ విధమైన అనుచిత ఆలోచనలు చేస్తూ జనన మరణ సంసార చక్రంలో పడి తిరుగుతూ ఉంటారు.

చివరికి ఏమౌతుంది? వినండి.

భోగైశ్వర్య ప్రసక్తానాం త యాపహృత చేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥ 44

భోగైశ్వర్య ప్రసక్తానాం-తయా-అపహృత చేతసాం
వ్యవసాయాత్మికా-బుద్ధిః-సమాధౌ-న-విధీయతే

భోగైశ్వర్య ప్రసక్తానాం	= భోగైశ్వర్యముల యందు ఆసక్తి కల వారికి	వ్యవసాయాత్మికా	= నిశ్చయాత్మక మైన
		బుద్ధిః	= బుద్ధి
తయా	= అట్టి పుష్పిత వాక్కులచే	సమాధౌ	= అంతఃకరణము నందు
అపహృత చేతసాం	= అపహరించబడిన మనస్సు గల	న విధీయతే	= ఉండదు.

భోగము నందు, ఐశ్వర్యము నందు ఆసక్తు లైన ఈ అవిపశ్చితుల తియ్యని పుష్పిత వాక్కులకు ఆకర్షితులై కొందరు బుద్ధిని జార విడుచు కుంటారు. అలాంటి వారి అంతఃకరణములో నిశ్చయ బుద్ధి నిలవదు.

వ్యాఖ్య

నిశ్చయం నిలవదు

భోగమే నా కర్తవ్యం. ఐశ్వర్యమును సాధించడమే నా పని ***(భోగః కర్తవ్యం ఐశ్వర్యం చ ఇతి భోగైశ్వర్యయోః ఏవ ప్రణయవతాం)***. ఈ విషయాల యందే ఆసక్తి. ఆ విధమైన సంకల్ప సల్లాపాల చేత వివేకమును పోగొట్టుకున్న అవిపశ్చితుల బుద్ధి యందు అలాంటి విషయాలే ఉంటాయి గాని, సాంఖ్యులకు, యోగులకు ప్రాప్తించే వ్యవసాయాత్మికా బుద్ధి, నిశ్చయ రూపమైన జ్ఞానము నిలిచేందుకు అవకాశము లేదు. ఇక్కడ సమాధి అంటే అంతఃకరణము, లేదా బుద్ధి అని అర్థము.

మోక్షం నాస్తి

ఇలాంటి భోగవాదులకు మోక్షము లభించదు. ఎందుకని? కారణం లేకుండా కార్యము సంభవించదు కనుక. **కారణా భావే కార్యాభావః** అనే న్యాయము ననుసరించి, కారణము లేకుండా కార్యము ప్రాప్తించదు కనుక, యోగబుద్ధి అనే కారణమే లేని ఈ భోగాసక్తులు తత్కార్యమైన మోక్షమును పొందలేరు.

భోగవాసన అంతఃకరణములో చేరి పోయింది. మనస్సంతా తేనెటీగలు ముసురుకున్నట్లు, కోరికలు నిండిపోయాయి. యోగబుద్ధి ప్రవేశించే అవకాశమే లేదు. కాపాడే వేదము ఉండి కూడా బ్రతుకు అన్యాయమై పోయింది. ప్రమాణ ఫలం అందకుండా పోయింది. అందుకనే బృహదారణ్యకోపనిషత్తు ఇలాంటి వాళ్ళను దృష్టిలో ఉంచుకొని, వేదము వేదము కాకుండా పోయింది అన్నది ***(వేదో అవేదో భవతి).***

కాకపోతే, ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు వేదనింద చేశాడని కొందరు విమర్శిస్తూ ఉంటారు. శ్రీకృష్ణుడు వేదనింద చేయలేదు. వేదసారాన్ని గ్రహించలేని వేదజడుల్ని నిరసించాడు. అంతే.

అందుకనే, హే అర్జునా! వేదం లోని ఈ కర్మకాండలో చిక్కుకొని సంసారములో పడకుండా, సాంఖ్య యోగాది గమ్యమైన మోక్షాన్ని పొందుటకు గుణాతీతుడివి కా! అని తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ 45

త్రైగుణ్యవిషయాః-వేదాః-నిస్త్రైగుణ్యః-భవ-అర్జున
నిర్ద్వంద్వః-నిత్యసత్త్వస్థః-నిర్యోగక్షేమః-ఆత్మవాన్

అర్జున	= అర్జునా!	నిర్ద్వంద్వః	= ద్వంద్వములు లేని
వేదాః	= వేదములు	నిత్యసత్త్వస్థః	=సదా సత్త్వము నందే ఉన్న వాడవు
త్రైగుణ్యవిషయాః	=త్రిగుణములకు సంబంధించిన ఫలాలను విషయాలుగా బోధిస్తాయి	నిర్యోగక్షేమః	=యోగక్షేమములు లేని వాడవు
		ఆత్మవాన్	=అప్రమత్తుడవు
నిస్త్రైగుణ్యః	=త్రిగుణాలను విడిచిన వాడవుగా	భవ	=కా!

కర్మ కాండను ప్రతిపాదించే వేదాలు త్రైగుణ్య విషయాలు. అంటే, సంసార రూపాలు. అర్జునా! నువ్వు మూడు గుణాల నుండి ముక్తుడివి కా! ద్వంద్వాలను దాటిపో. నిత్య సత్త్వంలో నిమగ్నుడవు కా! యోగక్షేమాల నుండి విడిపడిపో! ఆత్మజ్ఞానివి కా!

వ్యాఖ్య

వేదము - వేద్యము

వేదంలో ప్రధానంగా రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి కర్మకు సంబంధించింది. అదే ప్రవృత్తి. రెండవది జ్ఞానానికి సంబంధించింది. అదే నివృత్తి. ఈ రెండిటిలో ఏదో ఒక దానిని మనుషులు అనుసరిస్తూ ఉంటారు. అందుచేత అందరికీ వేదం యొక్క అవసరం ఉంది. కాకపోతే, వేదంలో ఎవరికి ఏది అవసరమో, ఎవరికి దేనిపై ఆసక్తి ఉందో, దానినే వాళ్ళు అందుకుంటారు. ఆచరిస్తారు.

గ్రంథాలయంలో ఎన్నో గ్రంథాలు ఉంటాయి. గ్రంథాలయానికి అందరూ వెళ్తారు. ఎవరికి ఏ గ్రంథం కావాలో అదే వాళ్ళు తీసికొని చదువుతారు. ఒకరు పింగళి సూరన 'కళాపూర్ణోదయము' చదువుతారు. మరొకరు షేక్స్పియర్ 'కామెడి ఆఫ్ ఎర్రర్స్' చదువుతారు*. ఎవరు ఏది చదువుతారు, ఏది చదవరు? అనేది వాళ్ళ ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంటుంది.

* 'కళా పూర్ణోదయము' రచించిన పింగళి సూరన పదిహేనవ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాయల వారి ఆస్థానము లోని అష్టదిగ్గజ కవులలో ఒకడు. 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' రచించిన షేక్స్పియర్ ఇంగ్లాండు దేశీయుడు. పదిహేనవ శతాబ్దము లోని వాడే. ఇంగ్లండు, ఇండియాల మధ్య రాకపోకలు లేని కాలమది. కాని, వీరిరువురు వ్రాసిన ఈ గ్రంథాలకు సామ్యం ఉందనేది స్వామీజీ అభిప్రాయం.

నిఘంటువులో వేలాది, లక్షలాది పదాలు ఉంటాయి. వాటిలో ఎవరికి ఏ పదం అవసరమో, దాని మీదే చూపుడు వ్రేలు పడుతుంది. వేదంలో అనేక విషయాలు చర్చింప బడ్డాయి. వాటిలో ఎవరికి ఏది కావాలో దానినే వాళ్ళు ఎంచుకుంటారు.

మనిషి ఒక్కడే. కాని, ఆ మనిషిలో కోరికలు అనేకము. ఆశలు అనేకము. ఒకరు ఆశించింది మరొకరు ఆశించాలి అనే నియమం లేదు. ఒకరి కోరిక మరొకరి కోరిక కానవసరం లేదు. ఎవరి కోరికలు వారివే. ఎవరి కష్టాలు వారివే.

ఆశించడం ఇచ్ఛాశక్తి. అలా ఆశించ డానికి కావలసిన విషయ జ్ఞానము కూడా మనిషికి ఉంది. ఉండబట్టే ఆశించాడు. అదే జ్ఞానశక్తి. జ్ఞానశక్తి ద్వారా ప్రేరేపించబడి, ఇచ్ఛాశక్తి ద్వారా దేనిని కోరుకుంటాడో, దానిని పొందడానికి కావలసిన శక్తి కూడా మనిషికి ఉంది. అదే క్రియాశక్తి. క్రియాశక్తి ఉండటం వల్లనే ఈ ప్రపంచంలో తాను సాధించాలి అనుకున్నవి కొన్నైనా మనిషి సాధించ గలుగుతున్నాడు.

అంటే, అన్నీ సాధించలేక పోతున్నాడు అని అర్థం. ఇది మన అనుభవంలో, అందరి అనుభవంలో తొంగి చూస్తున్న విషయమే. అలా సాధించలేక పోవడానికి ఏవో ప్రతిబంధకాలు ఉంటాయి. ఆ ప్రతిబంధకాలను అధిగమించే శక్తి మనకు ఉండదు. అందువల్లనే ఫలాలు అందకుండా పోతాయి.

ప్రగాఢంగా మనం ఆశించింది, ప్రతిబంధకాల కారణంగా విఫల మైనపుడు, ప్రతిబంధకాలను తొలగించుకొని ఫలితాలను పొంది తృప్తి చెందడానికి మన శక్తి సరిపో నపుడు, ఎక్కడ నుండి సహాయం అందుతుందో ఆ వైపుకు తిరుగుతాము. లోకంలో అందే సహాయాలు కూడా విఫల మైనపుడు, అలౌకికమైన సహాయం కొరకు ప్రయత్నం చేస్తాము. అది దైవ సహాయం కావచ్చు. లేదా, దేవతా సహాయం కావచ్చు. అలాంటి సహాయాన్ని పొందడానికి మనం చేసే కర్మలే ప్రార్థనలు. పూజలు. యాగాలు. యజ్ఞాలు.

ఏ కర్మకు ఏది ఫలం? ఏ యాగానికి ఏది ఫలం? ఇవన్నీ వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయి. ఇదంతా కర్మకాండ. ఉపాసనా కాండ. ఇది వేదంలో ఒక భాగం. కర్మకాండకు సంబంధించిన విషయం.

రెండవది జ్ఞానకాండ. ఇది వేదాలలో చివరి భాగము. కనుకనే, దీనిని వేదాంతము అంటారు. ఇక్కడ బోధింప బడేది జ్ఞానము. లౌకిక జ్ఞానము కాదు. బ్రహ్మజ్ఞానము. ఈ జ్ఞానమును బోధించే కాండ జ్ఞానకాండ. అవే ఉపనిషత్తులు. **ఉపనిషదితి బ్రహ్మ విద్యా**. ఉపనిషత్తు అంటేనే బ్రహ్మవిద్య అని అర్థము.

వేదములో ఉత్తరార్థంగా గోచరించే వేదాంతము అనే ఈ జ్ఞానకాండ కోరికల్ని తీర్చే ప్రయత్నంలో ఉండదు. కోరేవాణ్ణి గూర్చి చర్చించే విషయంలో ప్రమాణమై ఉంటుంది. కర్మలు, క్రియలు, ఫలాలను ప్రక్కనబెట్టి సూటిగా కర్తను గూర్చి చర్చిస్తుంది.

జ్ఞానకాండ కోరికలను ఎందుకు తీర్చదు? ఆ ప్రయత్నం ఎందుకు చేయదు? తనకు ఆ శక్తి లేదా? వేదం లోని కర్మకాండ కన్నా శక్తివంత మైనది వేదాంతము. కోరికలను తీర్చే శక్తి ఉందా, లేదా? అనేది అప్రధాన మైన విషయం. కోరికలు తీరినా, తీరక పోయినా, ఒరిగేది ఏమీ ఉండదు అనేదే వేదాంతానికి ప్రధానమైన విషయం. అందుకనే,

స్వప్నస్థ రాజ్యభిక్షాభ్యాం ప్రబుద్ధః స్పృశతే ఖలు!

కలలో రాజు అయిన వానికి మేలుకుంటే సింహాసనం ఉంటుందా? స్వప్నంలో భిక్షాటనం చేసిన యాచకునికి

మేలుకుంటే అక్షయపాత్ర ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించి కోరికల వల్ల కలిగే సుఖదుఃఖాలు స్వప్నతుల్యాలు అవి స్పష్టం చేసింది ఉపనిషత్తు. అందుచేత కోరికల జోలికి ఉపనిషత్తు పోదు.

ఈ సందర్భంలో కర్మకు, జ్ఞానానికి ఉన్న తేడా అస్పష్టంగా ఉండ కూడదు. అస్పష్ట అవగాహనలు గీతను అర్థం చేసుకోవడానికి సరిపోవు. కోరికలు తీర్చే పనిలో కర్మకాండ ఉంటుంది. కోరేవాణ్ణి పట్టించుకొని వేదాంతం చర్చిస్తుంది.

ఇప్పటి వరకు ఎన్నో కోరుకున్నాం. కోరినవి కొన్ని సాధించుకున్నాం. అయినా, సాధించుకో లేనివి చాలా మిగిలి ఉన్నాయి. ఎన్ని తీరినా, తృప్తి తీరని వ్యక్తి గానే మనిషి మిగిలి పోతున్నాడు. వ్యక్తి ఎంత తెలివి గల వాడైనా ఈ వెలితి నుండి తప్పించుకోలేక పోతున్నాడు. వెలితిని తొలగించి, వెలుగును ప్రసాదించే జ్ఞానం ఒక్క ఉపనిషత్తు ల్లోనే ఉంది.

వేదాలు కర్మకాండకు పరిమితమై ఉంటాయి. వాటిలోని జ్ఞానము సంసారానికి సంబంధించిన జ్ఞానము ***(త్రైగుణ్య విషయాః)***. ఈ సంసార హేతువులైన త్రైగుణ్య విషయాల నుండి విడిపడి కోరికలను దాటిన వాడవు కా! ***(నిస్త్రైగుణ్యో భవ!)*** అని బోధిస్తున్నాడు గీతాచార్యుడు.

ముల్లోకాలు ఈ మూడే

కర్మకాండను బోధించే వేదాలు త్రైగుణ్య విషయాలు. వివేక జ్ఞానము లోపించి, భోగైశ్వర్యాలే ప్రధాన మనుకొని జీవించే వారికి వేదము అంటే త్రైగుణ్య విషయమే అని అభిప్రాయం. త్రిగుణాలకు సంబంధించిన విషయాలు త్రైగుణ్యాలు.

సత్త్వగుణము, రజోగుణము, తమోగుణము - ఈ మూడు గుణాలను త్రిగుణములు అంటారు. సత్త్వగుణము సుగుణము. రజోగుణము అవగుణము. తమోగుణము దుర్గుణము. సత్త్వగుణము సహకరిస్తుంది. రజోగుణము వికటిస్తుంది. తమోగుణము పాడు చేస్తుంది. సత్త్వగుణములో జ్ఞానము, ప్రశాంతత ఉంటాయి. రజోగుణములో రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, ఆవేశాలు, ఆందోళనలు ఉంటాయి. తమోగుణములో సోమరితనము, నిద్ర, దుఃఖాదులు ఉంటాయి.

ఈ ప్రపంచ మంతా మాయామయము. మాయలో ఈ త్రిగుణాలే ఉంటాయి. మాయకు స్వతంత్ర మనుగడ లేదు. మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంటుంది ***(బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమో గుణాత్మికా మాయా అస్తి)***. ప్రపంచమే మాయా నిర్మితము కనుక మాయలో ఉన్న త్రిగుణాలే ప్రపంచంలో కనిపిస్తాయి.

సర్వలోకాలు సృష్టి లోనివే. మాయా స్వరూపాలే. ప్రపంచమే త్రిగుణ మిళితం. భోగైశ్వర్యాలు, వాటిని పొందడానికి ఆచరించే సాధనలు ఈ త్రిగుణాల యొక్క కార్యాలే. కారణమైన మాయలో ఉన్న త్రిగుణాలే కార్యమైన జగత్తులో ఉన్నాయి. పరలోకం కూడా సృష్టి లోనిదే. కనుక, స్వర్గలోక భోగాలు, వాటిని పొందడానికి ఆచరించే సాధనలు కూడా త్రిగుణముల లోనివే.

త్రైగుణ్యమే సంసారము. సంసారానికి సంబంధించిన విషయాలను బోధించేవి త్రైగుణ్య విషయాలు ***(త్రైగుణ్యం సంసారః విషయః ప్రకాశయితవ్యః యేషాం తే వేదాః త్రైగుణ్య విషయాః)***.

సాధ్య సాధనములు

త్రిగుణముల కారణంగా రాగద్వేషాలు అనే కార్యాలు ఏర్పడ్డాయి. ఈ రాగద్వేషాలకు సంబంధించిన విషయాలనే వేదాలు బోధిస్తాయి. ఎవరు ఏ ఫలమును ఆశిస్తారో, వారికి తత్సంబంధ మైన సాధనల్ని తెలుపుతాయి. కొన్ని విషయాలలో ఫలితాలు కనిపిస్తాయి. కొన్ని విషయాలలో అగోచరంగా ఉంటాయి. కొన్నిటిని

పరిశీలించుకొనే అవకాశం ఉంటుంది. కొన్నిటిని విశ్వసించాలే గాని పరీక్షించి చూసుకొనే అవకాశం ఉండదు.

సంతానం లేని వారు సంతానం కలగ డానికి యాగం చేస్తారు. వర్ష పాతానికి యజ్ఞాలు నిర్వహిస్తారు. వీటికి ఫలితాలు ఉన్నాయా, లేదా అనేది పరీక్షించి చూసుకోవచ్చు. కాని, స్వర్గప్రాప్తి కోసం యజ్ఞం చేస్తే, దానిని ఎలా నిర్ధారణ చేసుకోవాలి? విశ్వసించాలి. అంతే.

ఏది ఏమైనప్పటికి వేద ప్రతిపాదితమైన కర్మల వలన కలిగే ఫలితాలు ఏవైనా అనిత్యాలే. నశించేవే. సంతానం కలిగినా నశించి పోవలసిందే. స్వర్గం ప్రాప్తించినా పుణ్యం క్షీణించ గానే పోగొట్టుకో వలసిందే.

త్రైగుణ్య విషయాలు సంసారము అని ఎప్పుడైతే చెప్పబడిందో, ఇక వేదము లోని కర్మకాండను ఆశ్రయించి మనం సాధించ బోయేది సంసారాన్నే కాని మరొక దానిని కాదు. సంసారానికే యజ్ఞ యాగాదులైతే, ఇక శ్రమించి వాటిని ఆచరించడ మెందుకు? సంసారాన్ని పొంది మనం ఏమి సాధించాలి? ఇప్పుడు మనం ఎక్కడున్నాం? సంసారంలో కాదా? మనం ముడిపడి ఉన్నది మూడు గుణాల్లో కాదా! చిక్కుముళ్ళు అన్నీ మూడు ముళ్ళే కదా! పీటముళ్ళు ఆ మూడే కదా!

పల్లవి : **వృథా చేయబోకు - ఈ జన్మము సదా రాదు నీకు** ॥ వృథా ॥
చరణములు : **ఉత్తమ జన్మమురా దీనిని వ్యర్థము చేయకురా**
ఉత్త సంసారమురా రేపది మృత్యురూప మౌరా ॥ వృథా ॥
మూడు గుణంబులలో నీవు ముక్తుడ గారాదా!
పాడు ఘటము కాదా, రేపది భస్మమై పోదా! ॥ వృథా ॥

అంటూ మూడుగుణాల సంసారం నుండి విడిపడి పొమ్మని సందేశాన్నిస్తూ చైతన్య గానం తత్త్వ గానాలాపన చేసింది. అందుకనే పరమేశ్వరుడు అర్జునా! గుణాల నుండి తప్పుకో! ***(నిస్త్రైగుణ్యో భవ!)*** అని ఆదేశిస్తున్నాడు.

ముడులు విడిపోనీ

గుణాలే సంసారం కనుక, సంసార దుఃఖం నుండి విడిపడాలి అంటే, సంసారాన్ని ప్రభావితం చేసే గుణాల నుండి బయట పడాలి. అందుకే, నిస్త్రైగుణ్యుడవు కా! అంటున్నాడు ***(నిస్త్రైగుణ్యో భవ!)***.

గుణాల నుండి విడిపడ గలమా? విడిపడి ఉండ గలమా? అసలు మానవ శరీరమే గుణ సముదాయం కదా! త్రిగుణాలు పోతే, త్రిగుణాల కార్యమైన శరీరం మిగుల్తుందా? కనుక, నిస్త్రైగుణ్యుడు అంటే, కోరికలు లేనివాడు అని అర్థం ***(నిష్కామః భవ ఇత్యర్థః)***. నిష్కాముడు అంటే అనిత్యమైన భోగైశ్వర్యముల మీద ఆసక్తి లేనివాడు. మమకారాన్ని పూర్తిగా త్యజించిన వాడు.

రెండు తరువాతే మూడు

కోరికల్ని జయించి కామనా రహితుడైన వాడే నిస్త్రైగుణ్యు డవుతాడు అని తెలుసుకున్నాం. కోరికల్ని జయించాలంటే ముందు ద్వంద్వాల నుండి విడిపడాలి. రెండిటి నుండి విడి పడితేనే మూడిటి నుండి విడి పడతాడు. రెండు తరువాతే కదా మూడు. కనుక ముందు ద్వంద్వముల నుండి విడిపడాలి ***(నిర్ద్వంద్వో భవ!)***.

సుఖదుఃఖాలకు కారణమైన పరస్పర వైరుధ్యము గల శీతోష్ణాదులు ద్వంద్వములు అని చెప్పబడ్డాయి. ద్వంద్వాలు ఉన్నంత వరకు కోరికలు తప్పవు. ద్వంద్వాలు అనే కారణాలకు కామనలు కార్యాలు. కామనలు ఉంటే త్రిగుణాలు ఉన్నట్లే. త్రిగుణాలు ఉన్నంత వరకు సంసారం తప్పదు. సంసారం ఉన్నంత వరకు దుఃఖం అనివార్యంగా ఉంటుంది. కనుక ద్వంద్వాలను దాటి పోవాలి.

ద్వంద్వాలను దాటి పోయేది ఎలా? వాటి ప్రభావం బుద్ధిపై పడకుండా ఉంటే వాటిని దాటి పోయినట్లే. శీతోష్ణాలు, మానావమానాలు, జయాపజయాలు - ఇవన్నీ ద్వంద్వాలే. ఈ ద్వంద్వాల మధ్యే అందాలు పాడై పోతున్నాయి. ఆనందాలు అదృశ్య మవుతున్నాయి.

కర్మకాండను అంటిపెట్టుకొని, భోగైశ్వర్యాలకై అర్రులు చాస్తూ, సంసార వలయంలో చిక్కుకు పోయిన భోగవాదుల్ని గూర్చి గడచిన మూడు శ్లోకాలలో చెప్పుకున్నాం. వారిని కామాత్ములని తెలుసుకున్నాం *(కామాత్మానః)*.

ప్రస్తుతం భగవానుడు చెబుతున్నది వారికి విరుద్ధమైన జీవన విధానము. కర్మకాండను ఆశ్రయించుకొని కామాత్ములైన వారిది భోగజీవితం. జ్ఞానకాండను ఆశ్రయించుకొని నిష్కాములైన వారిది త్యాగ జీవితం.

కామాత్ముల మనస్సులలో కామం ఉంటుంది. నిష్కాముల హృదయాలలో కామం ఉండదు. ఆత్మస్పృహ ఉంటుంది.

ఆశ నిరాశల ఊయలలో
ఊగింది మనసు ఉసూరు మంటూ
ఆశే లేని జీవికి
ఉండదు నిరాశ ఎన్నటికి
ఆశ ఉంటే ఉండనీ
శివుడే ఆశలో నిండనీ
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ద్వంద్వాల నుండి విడిపడిన వారికే ఆశ అడుగంటుతుంది. నిష్కామ్యం వరిస్తుంది. ద్వంద్వాలను ఎలా దూరం చేసుకోవాలి? చెబుతున్నాడు. అర్జునా! నిత్యసత్త్వస్థుడవు కా! అప్పుడే ద్వంద్వాలను దాటి పోగలవు *(నిత్య సత్త్వస్థో భవ!)*.

పార్థా! ప్రశాంతంగా ఉండు!

నిత్య సత్త్వస్థుడు అంటే, నిత్యము సత్త్వ గుణాన్ని ఆశ్రయించిన వాడు అని అర్థము. అంటే, రజోగుణ, తమోగుణాలకు లొంగని అంతఃకరణము కలవాడు. సత్త్వగుణ ప్రధానంగా ఉండేవాడు ప్రశాంతంగా ఉంటాడు. ప్రసన్నంగా ఉంటాడు. ప్రియంగా ఉంటాడు. వివేకంతో ఉంటాడు. అతనిలో రజోగుణ ప్రేరితాలైన రాగము, రోషము, ఆవేశములు అణగారి ఉంటాయి. అలాగే, తమోగుణ ప్రేరితాలైన నిద్ర, అలసత, నైరాశ్యము, శోకములు అదృశ్యమై ఉంటాయి.

స్మృతియు సంప్రీతియును బ్రసన్నతయు నీ దృశ్యములగు సత్త్వగుణోదితములు
రాగలోభ రోషాదులు రాజసములు దర్పశోక ప్రముఖములు తామసములు

అని గుణ విశేషాలను వివరించింది ఆంధ్ర మహాభారతము (తిక్కన సోమయాజి).

శ్రీమద్రామాయణంలో విభీషణుడు సత్త్వగుణానికి ప్రతీక మైతే, రావణుడు రజోగుణానికి, కుంభకర్ణుడు తమోగుణానికి ప్రతీకంగా ఉంటారు. ముగ్గురూ సోదరులే. అలాగే త్రిగుణములు కూడా మాయాదేవి బిడ్డలే.

సత్త్వము అంటే బ్రహ్మ స్వరూపము అని కూడా అర్థము. నిత్య సత్త్వస్థుడు అంటే, సదా బ్రహ్మము నందే నిలకడగా ఉండువాడు అని అర్థము. ప్రశాంత జీవనమును గడిపేవాడు, బ్రహ్మభావన యందే స్థిరంగా నిలిచిన ధన్యాత్ముడు తన జీవనయాత్రను కూడా బ్రహ్మదృష్టి తోనే కొనసాగిస్తాడు. లేనిది కావాలి అనుకోడు. ఉన్నది పోయినా కలత చెందడు.

యోగక్షేమాలు

యోగక్షేమాలను మరచి మనుగడను సాగించ మంటున్నాడు. నిర్యోగక్షేముడుగా జీవించ మంటున్నాడు *(నిర్యోగ క్షేమః)*. లేని దానిని పొందడం యోగము *(అనుపాత్తస్య ఉపాదానం యోగః)*. పొందిన దానిని రక్షించుకోవడం క్షేమం *(ఉపాత్తస్య రక్షణం క్షేమః)*.

ఈ రెండే ప్రతి మనిషిని కుదిపేస్తూ ఉంటాయి. మనం ఆశించినవి కొన్ని లభించకుండా ఉంటాయి. ఒకవేళ లభించినా, నిలవకుండా పోతాయి. అలా పోతూనే ఉంటాయి. ఆశించింది రాకపోయినా దుఃఖమే. శ్రమించి సాధించుకున్న దానిని పోగొట్టుకున్నా శోకమే.

మొక్కను నాటడం యోగం, రక్షించుకోవడం క్షేమం. ఇల్లు కట్టుకోవడం యోగం. అది పాడు కాకుండా కాపాడుకోవడం క్షేమం. స్కూటర్ కొనడం యోగం. అది మూల పడకుండా చూసుకోవడం క్షేమం.

ఇక్కడ మరొక ముఖ్య విషయాన్ని గ్రహించాలి. యోగం విషయంలో ప్రాప్తం రెండు విధాలుగా ఉంటుంది. (1) మనము ఆశించకుండా ప్రాప్తించేవి. (2) మనం ప్రయత్నించి సాధించేవి. ఈ రెండూ యోగం క్రిందికే వస్తాయి.

మనం ఆశించకుండా ప్రాప్తించే యోగము అంటే, నా ఉద్దేశ్యం మనం అడగకుండానే పరమేశ్వరుడు ప్రసాదించినవి అని. మనకు దేహం ఉంది. మనం కోరితే వచ్చింది కాదు. ఆయన అనుగ్రహిస్తేనే వచ్చింది. అది మనకు నచ్చిందా నచ్చలేదా అనేది వేరే విషయం.

తల్లిదండ్రుల్ని మనం ఎన్నుకోలేదు. పుట్టిన తేదీని నిర్ణయించింది మనం కాదు. జన్మకాలం మనం సూచించింది కాదు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, పుట్టిన ప్రదేశము - ఇవన్నీ ఈశ్వరుడు నిర్ణయించిన విధంగానే మనకు ప్రాప్తించాయి. ఇదంతా యోగమే. అందుకనే, ఆశించని, ఊహించని ఆశ్చర్యాలు జరిగి నపుడు, 'ఆయన యోగం అలా ఉందండి' అంటూ ఉంటారు.

ఇక రెండవ యోగము మన ప్రయత్నంతో, కృషితో సాధించేది. అది మనం కట్టిన ఇల్లే కావచ్చు, తాళి కట్టిన ఇల్లాలే కావచ్చు, కన్నబిడ్డలే కావచ్చు, కొన్న కాంచనమే కావచ్చు. తినే కంచమే కావచ్చు. ఇవన్నీ కూడా పూర్వం లేకుండా ఉండి, ఆ తరువాత మన ప్రయత్నంతో పొందినవి కనుక యోగము క్రిందికే వస్తాయి.

యోగమైతే ఇలా రెండు విధాలుగా ప్రాప్తిస్తూ ఉంది కాని, క్షేమం మాత్రం రెండిటికి ఒక్కటే. పరమేశ్వరుడు ప్రసాదించిన యోగాలైనా, మనం కృషితో సాధించిన యోగాలైనా - రెండిటిని రక్షించుకోవడం మాత్రం చేస్తూనే ఉంటాం. కాని, విచిత్ర మేమిటంటే, రెండు యోగాలూ నిలవవు. రెండిటినీ కాపాడుకో లేము. రెండిటినీ పోగొట్టుకోవలసిందే. కాకపోతే, ఏది ముందో, ఏది వెనకో తెలియదు. పోతాయని మాత్రం ఖచ్చితంగా తెలుసు. పరమేశ్వరుడు ఇచ్చిన ఒళ్ళు నిలవదు. మనం కట్టుకున్న ఇల్లూ నిలవదు. ఒళ్ళు కాలి బూడిదై పోతుంది. ఇల్లు కూలి నేల పాలవుతుంది. ఇంకెక్కడి సంబంధాలు? ఎవరి కున్నాయి అనుబంధాలు?

న మే దేహో న సంబంధో మేఘేనేవ విహాయసః

మేఘంలో ఆకాశానికి సంబంధం ఉందా? నాకు మాత్రం దేహంతో ఎక్కడుంది సంబంధం? అని సూటిగా ప్రశ్నించాడు ఋషి కుండికోపనిషత్తులో.

ఉన్నవి నిలవవు కనుక వాటి క్షేమాలు చూడ నవసరం లేదంటారా? అలా ఎందుకంటాము? కాపాడుకొనే ప్రయత్నం చక్కగా చేయాలి. చెయ్యి జారిపోతే మాత్రం, విలక్షణంగా ఉండటం మన స్వభావం కావాలి అంటున్నాడు భగవానుడు. అంతే.

అన్నీ పోయేవే. ప్రతి దానికి వచ్చే కాలం ఉంది. అలాగే పోయే కాలం ఉంది. పోయే క్షణాన ఎవ్వరూ దేనినీ ఆపలేరు. ఇలా ఆలోచించి నపుడు యోగక్షేమాలు లాభాలా, నష్టాలా? రెండూ కావు. ఎందుకని? వచ్చేవి పోతాయి అని తెలిసి నపుడు వచ్చేవి లాభాలూ కావు, పోయేవి నష్టాలూ కావు.

ఈ లోకంలో దైవానుగ్రహంగా మనకు ప్రాప్తించినవి, మన ప్రయత్నంతో మనం సాధించినవి రెండూ మిగలవు. అంతేకాదు, ఒకవేళ స్వర్గం ప్రాప్తించినా, అది కూడా పోయేదే. అందుచేతనే, పుణ్యాన్ని, ధర్మాన్ని, స్వర్గాన్ని గూర్చి చర్చించిన ధర్మశాస్త్రాలు కూడా వాటిని లాభాలుగా పరిగణించ లేదు. ఆత్మజ్ఞానాన్నే అక్షయ లాభంగా కీర్తించాయి.

ఆత్మలాభా న్న పరం విద్యతే

ఆత్మలాభానికి మించి పొంద దగిన లాభ మంటూ లేదు అని ఆపస్తంభ ధర్మ సూత్రము సుస్పష్టం చేసింది.

అర్జునా! అప్రమత్తంగా ఉండు!

ఇక్కడ **ఆత్మవాన్** అంటే సదా ఆత్మ చింతనమే కలవాడు అని అర్థం. బ్రహ్మాకార వృత్తిని అఖండంగా పొగించేవాడు అని అర్థం. ఏ విధంగా నైనా బుద్ధిలో ఆత్మజ్ఞానమే ఉండాలి గాని, అనాత్మకు సంబంధించిన జ్ఞానము ఉండ కూడదు.

శ్రీ శంకరాచార్యస్వామి **ఆత్మవాన్** అంటే అప్రమత్తుడు అనే అర్థం చెప్పారు (*అప్రమత్తశ్చ భవ*). ఏమరుపాటు లేకుండా ఉండమని ఆదేశించారు. అంటే, దేహేంద్రియ మనోబుద్ధులను స్వాధీనంలో ఉంచుకో మని సూచించారు.

ఎంత విన్నా, ఎంత చదివినా, ఆచరణలో లేని విద్య సత్ఫలితా న్నివ్వదు. ***సాధనా భావే సాధ్యాభావః.*** సాధనము లేకుండా సాధ్యము లభించదు. అంటే, దేహేంద్రియ మనోప్రాణాలు అనాత్మ. వాటి యందు ఆత్మబుద్ధిని ఉంచకుండా అప్రమత్తుడవై ఉండు అని భావము. ఏవి ఉన్నా నష్టం లేదు. అవి 'మనము' అనుకుంటే మాత్రం లాభం లేదు.

ఆత్మవాన్ భవ! అర్జునా! ఆత్మవంతుడవు కా! అని ఈ శ్లోకంలో భగవంతుని చివరి మాట. అర్జునా! ధనవంతుడవు కా! బలవంతుడవు కా! గుణవంతుడవు కా! అని చెప్పకుండా ఆత్మవంతుడవు కా! అని ఉపదేశించాడు వాసుదేవ పరబ్రహ్మ.

ధనం దగా చేసేదే. బలం బలహీన మయ్యేదే. గుణాలు చంచలములే. ఆత్మజ్ఞానమే స్థిరం. ధృవం. ఆనందప్రదం. అనంతానంద స్వరూపం.

మరి, గీతాచార్యుడు చెప్పినట్లు ఇహపర సాధన సాధ్యాలను విస్మరిస్తే, తద్వారా లభించే సుఖాలు బ్రహ్మవిదునికి దూరమైనట్లే కదా! అని కొందరు సందేహిస్తూ ఉంటారు. అలాంటి దేమీ లేదు. బ్రహ్మవిదునికి

దూరంగా ఏ సుఖమూ లేదు. **సర్వం పదం హస్తి పదే నిమగ్నమ్.** *కుంజర పాదంలో సర్వ జంతువుల పాదములు ఇమిడి ఉన్నట్లు, బ్రహ్మానందములో సమస్త సుఖాలు ఇమిడి ఉన్నాయి అని తరువాత శ్లోకంలో బోధిస్తున్నాడు.*

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।
తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46

యావాన్-అర్థః-ఉదపానే-సర్వతః-సంప్లుతోదకే
తావాన్-సర్వేషు-వేదేషు-బ్రాహ్మణస్య-విజానతః

సర్వతః	= అంతటను	విజానతః	= పరమార్థ జ్ఞానము గల
సంప్లుతోదకే	= నిండిన జలప్రవాహము ఉండగా	బ్రాహ్మణస్య	= బ్రాహ్మణునకు
ఉదపానే	= నీరు లభించే బావి మొదలైన వానిలో	సర్వేషు	= సమస్తమైన
యావాన్	= ఎంతగా	వేదేషు	= వేదములలో
అర్థః	= ప్రయోజనం ఉండునో	తావాన్	= అంత ప్రయోజనము

బావులు, చెరువుల యందు మనకు ఎంత ప్రయోజనం సిద్ధిస్తుందో, అంతటా పొంగి పొరలుతున్న జలాశయంలో అంతే ప్రయోజనం సిద్ధిస్తుంది. అలాగే, వేదోక్త కర్మల వల్ల ఏ ఫలం సిద్ధిస్తుందో, పరమార్థం తెలిసిన సన్యాసికి అదే ఫలం సంపన్న మవుతుంది.

వ్యాఖ్య

అంతే ప్రయోజనం

వేదాల లోని కర్మకాండ ప్రతిపాదించే సకామ కర్మలను విడిచి పెట్టిన బ్రహ్మవిదునికి, ఆయా కర్మల వల్ల ఏర్పడే ఫలితాలు దూరం కావడం లేదా? ఆ ఫలితాలను బ్రహ్మజ్ఞాని పోగొట్టుకోవడం లేదా? అనే సంశయాన్ని నివారిస్తూ, సర్వత్ర వరద నీరు పొంగి ప్రవహించే టప్పుడు, బావులు, చెరువులు, నదులు మొదలగు వాటి వల్ల ఎంత ప్రయోజనం ఉంటుందో, సర్వము తానైన బ్రహ్మజ్ఞానికి త్రైగుణ్య విషయాలైన యజ్ఞ యాగ వ్రత తపో దానాదుల వల్ల అంతే ప్రయోజనం ఉంటుంది అని చెబుతున్నాడు.

ఉదపానే - 'ఉద' అంటే ఉదకము. ఉదకమును అనగా జలమును పానం చేస్తారు (*పిబన్తి*) కనుక, జలము ఉండే స్థానానికి ఉదపానము అని పేరు. నీరు ఉండే ప్రదేశాలు ఈ భూమిపై చాలా ఉన్నాయి. వాపీ, కూప, తటాక, నదీనదాలలో నీరు ఉంటుంది. ఆ నీరు మానవాళికి ఉపయోగ పడుతూ ఉంటుంది.

దిగుడు బావుల లోని నీరు (***వాపి***) పొలాలలో సేద్యానికి ఉపయోగ పడుతుంది. చేద బావుల లోని నీరు (**కూప**) పానం చేయడానికి పనికొస్తుంది. చెరువు నీరు (***తటాక***) స్నానం చేసేందుకు ఉపకరిస్తుంది. పారే జలము (నదీనదాలు) బట్టలు ఉతక డానికి ఉపయోగ పడుతుంది. వీటిలో ఒక్కొక్క దాని వల్ల ఒక్కొక్క ప్రయోజనం ఉంటుంది. కాని, సర్వత్ర వరద జలము ప్రవహించే టప్పుడు వీటి అవసరం ఉంటుందా? వాపీ కూప తటాక నదీ నదాల వల్ల కలిగే ప్రత్యేక ప్రయోజనా లన్నీ ఆ మహాజలాశయంలో కలుగుతూ ఉన్నాయి కదా! అలా, ఆ మహా జలాశయము సర్వత్ర వ్యాపించి నపుడు ఈ బావులు, చెరువులు, నదులు, మొదలైన వన్నీ ఆ జలాశయంలో అంతర్భూతాలై పోయాయి కదా! (***తత్ర అంతర్భవతి***).

అలాగే, త్రైగుణ్య విషయాలను బోధించే వేదాల వల్ల బ్రహ్మజ్ఞానికి అలాంటి ఫలమే ఉంటుంది. యాగాలు,

యోగాలు, యజ్ఞాలు, వ్రతాలు, తపస్సులు, దానాలు మొదలైన వన్నీ వేదాల లోని కర్మకాండలో ఉన్నాయి. ఆయా సాధనలు ఆచరిస్తే లభ్యమయ్యే ఫలితాలు కూడా అక్కడే చెప్పబడ్డాయి. బ్రహ్మవిదుడు ఈ వేదోక్త కర్మముల నన్నిటినీ త్యజిస్తున్నాడు. అలాగని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను పోగొట్టుకున్న వాడు కావడం లేదు.

ఎలాగైతే, వాపీ కూప తటాకాదుల వల్ల కలిగే ప్రయోజనా లన్నీ మహా జలాశయం వల్ల కలుగుతూ ఉన్నాయో, అలాగే బ్రహ్మవిదుని యందు వేదోక్త కర్మల వల్ల ఏర్పడే ప్రయోజనా లన్నీ సిద్ధించే ఉన్నాయి. ***శతే పంచాశత్.*** 'నూటిలో యాభై ఉండనే ఉంది' అనే న్యాయము చందమున బ్రహ్మజ్ఞానములో సర్వ వేదోక్త కర్మల ఫలము ఇమిడి ఉంది అని అర్థము.

వేదోక్త కర్మఫలాలు అందించే సుఖాలు నైమిత్తిక సుఖాలు. అంటే, ఒక కారణం వల్ల లభించేవి. నిమిత్తము ఉండటం వల్లనే ప్రాప్తించేవి. నిమిత్తం ఉండటం వల్ల ప్రాప్తించిన నైమిత్తిక సుఖాలు, నిమిత్తం పోగానే లేకుండా పోతాయి. స్వర్గమే తీసుకుందాం. పుణ్యం నిమిత్తంగా స్వర్గం అనే సుఖం లభిస్తుంది. పుణ్యం క్షీణించ గానే స్వర్గం దూర మవుతుంది. వేద ప్రతిపాదిత కర్మల వల్ల కలిగే సుఖాలన్నీ ఈ విధమైన నైమిత్తిక సుఖాలై ఉంటాయి.

బ్రహ్మజ్ఞాని లోని ఆనందము సహజ మైనది. మరొక కారణం వల్ల ప్రాప్తించింది కాదు. అది నిత్యసుఖమే కాని నైమిత్తిక సుఖం కాదు. ఈ నైమిత్తిక సుఖాల వల్ల ప్రాప్తించే ఆనందము కూడా వాస్తవానికి బ్రహ్మానందములో ఒక లేశమే నని ఉపనిషత్తు ఉద్ఘోషించింది ***(ఏతస్య ఏవ ఆనందస్య అన్యాని భూతాని మాత్రా ముపజీవన్తి).***

అంతా ప్రయోజనమే

బావి నీటి వల్ల కొంత ప్రయోజనము. చెరువు నీటి వల్ల కొంత ప్రయోజనము. నదీ జలము వల్ల కొంత ప్రయోజనము. మహా జలాశయము వల్ల అంతా ప్రయోజనమే.

వేదాల లోని సకామ కర్మల వల్ల కలిగే ప్రయోజనాలు సాధన సాధ్యాలను బట్టి భిన్నంగా ఉంటాయి. ఏ కర్మకు ఆ ఫలమే ప్రాప్తం. ఏది చేసుకుంటే అదే ఫలం. ఎంత చేసుకుంటే అంతే ఫలం. కాని, బ్రహ్మజ్ఞానము వల్ల కలిగే ఫలం అనంతఫలం. అంతా ఫలమే.

అంతం కలిగిన కర్మల ఫలితాలను ఆశించే మానవుల ప్రవృత్తిని బట్టి చూచినా, పెద్ద ప్రయోజనం లభించే టప్పుడు, చిన్న ప్రయోజనాన్ని త్యజించడం మనం చూస్తూ ఉంటాం.

పెద్ద ఉద్యోగం లభిస్తే వ్యక్తి చిన్న ఉద్యోగాన్ని త్యజిస్తాడు. మధ్యమ ఫలాల కోసం అధమ ఫలాలను, ఉత్తమ ఫలాల కోసం మధ్యమ ఫలాలను మానవులు విడిచి పెడుతూ ఉండటం సర్వ సామాన్యమైన విషయం.

న తే (జ్ఞానినః) కర్మ ప్రశంసన్తి కూపం నద్యాం పిబన్నివ

నదిలో పుష్కలంగా నీరు లభించే టప్పుడు మనిషి బావికి ప్రాధాన్యత నివ్వనట్లు, బ్రహ్మజ్ఞాని సకామ కర్మలకు ప్రాధాన్యత నివ్వడు అని మహాభారతంలో వ్యాసోక్తి.

బావులలో, నదులలో, చెరువులలో నీరు పెరుగుతూ ఉంటుంది. తరుగుతూ ఉంటుంది. సముద్రజలం పెరగదు. అలాగే తరగదు. సకామ కర్మల వల్ల ఏర్పడే సుఖాలలో వృద్ధిక్షయాలు ఉంటాయి. బ్రహ్మజ్ఞానం పూర్ణరూపమైంది. బ్రహ్మజ్ఞాని పూర్ణపురుషుడు. అతడి ఆనందాన్ని పెంచేవారు లేరు, తగ్గించేవారూ లేరు.

మరి, అలాంటప్పుడు, బ్రహ్మజ్ఞానం కొరకే ప్రయత్నం చేస్తే సరిపోతుంది కదా! కర్మలు చేయడ మెందుకు? అని అర్జునుడు ప్రశ్నించకుండా, కర్మయోగ ప్రాశస్త్యాన్ని ప్రముఖంగా తరువాత శ్లోకంలో వివరిస్తున్నాడు.

అర్జునుడికి వేదం తెలుసు. వేదం లోని కర్మకాండ అంతా తెలుసు. కాని, కర్మను కర్మయోగంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకో వలసిన సమయం ఆసన్నమైంది. అర్జునుడి అదృష్టం కొద్దీ అందించేవాడు అచ్యుతు డయ్యాడు.

కర్మ ణ్యే వాధికార స్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతు ర్భూ ర్మా తే సఙ్గో౽స్త్వకర్మణి ॥ 47

కర్మణి-ఏవ-అధికారః-తే-మా-ఫలేషు-కదాచన

మా-కర్మఫలహేతుః-భూః-మా-తే-సంగః-అస్తు-అకర్మణి

తే	= నీకు	తే	= నీకు
కర్మణి ఏవ	= కర్మము నందే	కర్మఫలహేతుః	= కర్మఫలమునకు కారణమైన వాడవు
అధికారః	= అధికారము	మా భూః	= కావద్దు
ఫలేషు	= ఫలము నందు	అకర్మణి	= కర్మ చేయక పోవుట యందు
కదాచన	= ఒకప్పుడును	సంగః	= ఆసక్తి
మా	= లేదు	మా అస్తు	= ఉండ కూడదు

అర్జునా! కర్మల యందే నీకు అధికారం. ఫలాల విషయంలో ఎప్పుడూ అధికారం లేకుండా ఉండు. కర్మ ఫలాలకు నువ్వు కారణం కావద్దు. అలాగని కర్మలను మానేయాలని చూడకు.

వ్యాఖ్య

సుందరంగా, సుశోభితంగా, సముజ్జ్వలంగా భాసించే పరమేశ్వరుని సృష్టిలో ఒక కాలంలో, ఒక ప్రదేశంలో మనం జన్మించాము. జన్మించడం మన అధీనంలో లేదు. కాని, జీవించడం మన చేతి లోనే ఉంది.

పరిస్థితుల్ని మనం శాసించ లేము. ప్రవర్తనను మనం సరిదిద్దుకో గలం. బాహ్యాన్ని మార్చడం మనకు సాధ్యం కాదు. బాహ్యంలో ఏది ఎందుకు జరుగుతూ ఉందో, వాటికి సంబంధించిన పూర్ణజ్ఞానం మనకు లేదు. జ్ఞానం లేనపుడు ఏం మార్చగలం? కాకపోతే, మనకు దృఢ నిశ్చయ మంటూ ఉంటే, ఆంతర్యాన్ని మార్చుకొని ఆనందంగా జీవించగలం. బుద్ధిని సరి చేసుకొని బ్రతుకును భవ్యంగా తీర్చుకోగలం.

జీవితంలో అన్నీ అనుకూలంగా ఉండవు. నేడు ఉండినా రేపు ఉంటాయని చెప్పలేము. అన్నీ మారుతూ ఉంటాయి. వాటితో పాటు మనస్సు కూడా మారుతూ ఉంటే, మథన పడుతూ ఉంటే, ఇక జీవితంలో సుఖపడట మనేది కుందేటి కొమ్మే అవుతుంది.

కొన్ని కావాలి అనుకుంటాం. కావాలి అనుకున్నవి రావాలి అని కోరుకుంటాం. వాటిని పొందాలని కర్మలు చేస్తాము. కొన్ని వస్తాయి. అన్నీ రావు. అలాగే, ఉన్నవి ఇష్టం లేకపోతే, అవి పోవాలి అని కర్మలు చేస్తాం. కొన్ని పోతాయి. అన్నీ పోవు.

ఇష్టమైనవి దగ్గరగా ఉండాలి అనుకుంటాం. కానీ, ఉండవు. ఇష్టం లేనివి దూరంగా పోవాలి అనుకుంటాం. కాని, పోవు. ఉండటానికి వచ్చినవి పొమ్మన్నా పోవు. పోవడానికి వచ్చినవి ఉండమన్నా ఉండవు. ఈ రెండిటి మధ్య ఆనందంగా బ్రతకడం ఎలాగో మనిషికి అర్థం కావాలి.

బ్రతకడం మనిషికి తెలుసు. ప్రాణం ఉన్నందుకు ఏదో ఒక విధంగా బ్రతికేస్తాడు. బ్రతుకు బండిని లాగేస్తాడు. కాని, ఆనందంగా బ్రతకడం మనిషికి తెలియదు. సుఖంగా జీవనయాత్రను సాగించడం ఎలాగో

అర్థం కాదు. ఆ రహస్యాన్ని భగవద్గీత బయట పెడుతుంది. అలా జీవించే పద్ధతిని కర్మయోగం బోధిస్తుంది. ప్రస్తుతం మనం గీతాసౌధంలో ఈ అద్భుతాన్ని వీక్షిస్తున్నాం. నాలుగు చక్రాల మీద ఆధారపడి కారు పరుగులు తీస్తూ ప్రయాణం చేసినట్లు, ప్రధానంగా నాలుగు విషయాల మీద ఆధారపడి కర్మయోగ శకటము పవిత్రమైన మార్గంలో జ్ఞానం వైపు పరుగులు పెడుతూ ఉంది.

అర్జునా! (1) కర్మ చేయడంలో నీకు అధికారం ఉంది. (2) ఫలితం విషయంలో ఎప్పుడూ లేదు. (3)కర్మ ఫలాలకు నువ్వు కారణం కావద్దు. (4) కర్మను చెయ్యకుండా ఉండటానికి ఆసక్తి చూపవద్దు. అంద మైన, అద్భుతమైన ఈ శ్లోకంలో ఈ నాలుగు ప్రధానమైన విషయాలు. మొదటిది విధివాక్యం. అంటే చేయ దగింది. మిగిలిన మూడు నిషేధ వాక్యాలు. అంటే, చేయ కూడనివి.

నిర్ణయాధికారం నీదే

ప్రాణులన్నీ కర్మ చేస్తాయి. చలించడం ఏదైనా కర్మే *(చలనాత్మకం కర్మ)*. మనిషి ఒక్కడే కాదు, ప్రతి ప్రాణి కర్మలో నిమగ్నమయ్యే ఉంది. కాకపోతే, కర్మ స్వేచ్ఛ మనిషికి మాత్రమే ఉంది. పశుపక్ష్యాదులకు లేదు. అవి సహజాతాలతో పని చేస్తాయి. అందుచేత, సృష్ట్యాది నుండి అవి ఒకే విధంగా ఉన్నాయి. ఇంత కాలం గడచినా, పాపం మోసం చేసేది ఎలాగో ఇప్పటికీ నేర్చుకోలేక పోయాయి. మానవుని లాగా ప్రగతిని సాధించలేక పోయాయి.

మనిషికి బుద్ధి ఉంది. ఆలోచించే పరిజ్ఞానం ఉంది. విచారించే వివేక ముంది. కనుకనే, కర్మ స్వేచ్ఛ ఉంది. ఈ స్వేచ్ఛనే అధికారం అంటున్నాడు గీతాచార్యుడు. ఒక పనిని చెయ్యాలి అనుకుంటే మనిషి చెయ్యగలడు *(కర్తుం శక్యం)*. ఒక పనిని చెయ్యకూడదు అనుకుంటే, చెయ్యకుండా ఉండగలడు *(అకర్తుం శక్యం)*. ఒక విధంగా చెయ్యాలి అనుకున్న దానిని మరొక విధంగా కూడా చెయ్యగలడు *(అన్యథావా కర్తుం శక్యం)*. ఈ స్వేచ్ఛ మనిషికి ఉంది. ఇదే కర్మలలో అధికారము.

గోడ కట్టినా, గుంట త్రవ్వినా, పద్యం వ్రాసినా, పాట పాడినా, అవలోకించినా, ఆలోచించినా, వ్యవసాయం చేసినా, వ్యాపారం సాగించినా, కట్టె కొట్టినా, కట్టు కట్టినా, ఉద్యోగం సాగించినా, ఉద్యమం కొనసాగించినా - ఇవన్నీ కర్మలే. నీ ఇష్టంతో జరిగేవే. నిర్ణయాధికారం నీదే. అర్జునా! కర్మ చేయడంలో నీకు అధికార ముంది *(కర్మణి ఏవ అధికారః తే)*.

యుద్ధానికి రావాలి అనుకున్నావు, వచ్చావు *(కర్తుం శక్యం)*. యుద్ధం చెయ్యను అని కూర్చున్నావు *(అకర్తుం శక్యం)*. యుద్ధం మానేసి సన్యాసి నవుతాను అంటున్నావు *(అన్యథావా కర్తుం శక్యం)*. అర్జునా! నీకు కర్మస్వేచ్ఛ, కర్మ విషయంలో అధికారం ఉండ బట్టే ఇన్ని రంగులు మారుస్తున్నావు. క్రొత్త క్రొత్త హంగులు చూపిస్తున్నావు.

మొదటి చక్రం బాగానే తిరుగుతోంది. రెండవ చక్రం దగ్గరే సమస్య తలెత్తుతూ ఉంది. చక్రంతో పాటు తల కూడా తిరుగుతోంది. కర్మ చేయడంలో అధికారం ఉంది అనే మొదటి విషయం అర్థమైంది. ఫలితం విషయంలో అధికారం లేదు అనే రెండవ విషయమే కాస్త మ్రింగుడు పడకుండా ఉంది.

ఎవరు ఏ కర్మ చేసినా ఫలితాన్ని ఊహించే చేస్తారు. గోళ్ళు కొరుకుతూ కూర్చున్నా, మనస్సులో ఏదో మ్రింగుడు పడని విషయం ఉందనే అర్థం. కొరికితే ఏమన్నా మ్రింగుడు పడుతుందేమో అనే ఆశ. అంతే. ఏ కర్మ చేసినా, దాని వెనుక ఏదో సాధించాలి అనే కోరిక ఉండి తీరుతుంది. అదే ఫలాశ. ఫలాసక్తి. కర్మ చేసే అధికారం నీకు ఉంది. కాని, ఫలం విషయంలో అధికారం లేదు అనేదే కష్టపడి మ్రింగినా జీర్ణం కాని విషయం.

కర్మ చేసే అధికారం ఉన్నప్పుడు, ఫలాన్ని పొందే అధికారం లేకుండా ఎలా ఉంటుంది? నా కర్మకు నేను బాధ్యుణ్ణే అయి నపుడు, నా కర్మఫలానికి మరొకరు బాధ్యులు ఎలా అవుతారు? నా కర్మ యొక్క ఫలాన్ని ముందుగా ఊహించే కదా నేను కర్మ చేశాను? ఎవరైనా అలాగే చేస్తారు. ఫలితాన్ని ఊహించకుండా ఎవరైనా ఎందుకు చేస్తారు?

ప్రయోజనం అనుద్దిశ్య మందోఽ పి న ప్రవర్తతే

ఫలితాన్ని ఊహించకుండా బుద్ధిహీనుడు కూడా కర్మ చేయడు. మరి, ఫలితాన్ని ఊహించి కర్మను ఆచరించే టప్పుడు, కర్మ విషయంలో ఉన్న అధికారం, ఫలం విషయంలో ఎందుకు లేదు? ఇవన్నీ చక్కని ప్రశ్నలు. వీటన్నిటికీ ఈ శ్లోకంలో జవాబులు చిక్కుతాయి.

ఈ చిక్కుముడులు విప్పే ముందు నేను ఒక్క ప్రశ్న మీ ముందు ఉంచుతాను; నాకూ కర్మాధికారం ఉంది కనుక! ఎన్నికల్లో నిలబడిన నలుగురు అభ్యర్థులు విజయం అనే ఫలాన్ని ఊహించే కదా పోటీ చేయడం అనే కర్మను సాగిస్తారు! ఎన్నికల్లో నిలబడే అధికారం నలుగురికీ ఉంది. లేకపోతే ఎలా నిలబడతారు? విజయాన్ని నలుగురూ ఊహించే కదా పోటీ చేశారు! మరి గెలిచే అధికారం నలుగురికీ ఉందా? ఉంటే, ముగ్గురెందుకు ఓడుతారు? అలాగని, గెలిచిన వ్యక్తికి అధికారం ఉందంటారా? అదే వాస్తవమైతే, ఓడిన ముగ్గురికి కూడా గెలిచే అధికారం ఉండాలి కదా? నలుగురికి అర్హతలు ఉండబట్టే కదా నిలబడ్డారు? ధరావత్తు సొమ్ము నలుగురు చెల్లించారూ కదా! కాస్త ఆలోచించండి.

ఈ ప్రపంచంలో శ్రమించే సేవకులుగా మనం ఉన్నామే గాని, జీతాలిచ్చే యజమానులుగా లేము. ఇక్కడే ఫలితాలను సాధించడంలో అధికారులం కాలేక పోతున్నాం. ఎందుకని? కాస్త విశ్లేషించి అర్థం చేసుకుందాం.

ఫలం దైవాధీనం

కర్మయోగం అంటే ఫలితాలను ఊహించకుండా కర్మలు చేస్తూ పోవడం అని చాలా మంది వ్యాఖ్యానిస్తూ ఉంటారు. ఇలాంటి అశాస్త్రీయ, అహేతుక విషయాలను గీత బోధించదు. ఫలితం మీద దృష్టి లేకుండా, ఫలితాన్ని ఊహించకుండా, ఎవరైనా కర్మ చేయగలరా? ఫలితం మీద దృష్టి లేనపుడు కర్మ చేయడం ఎందుకు?

అర్జునా! కర్మ చేయడంలో నీకు అధికారం ఉంది. ఫలితంలో లేదు **(మా ఫలేషు)** అన్నాడు భగవానుడు. అంతేగాని, ఫలితం ఊహించ వద్దు అని చెప్పలేదు. ఫలితాన్ని ఊహించే అందరూ కర్మల్ని ఆచరిస్తారు.

జీతాన్ని ఊహించే ఉద్యోగం చేస్తాం. అదే ఫలమంటే. ఆటలో గెలవాలనే ఆడతాం. పరీక్షల్లో ఉత్తీర్ణులం కావాలనే వ్రాస్తాం. ఉద్యోగాన్ని సంపాదించాలనే ఇంటర్వ్యూకి వెళ్తాం. ఈ కర్మ లన్నీ ఊహించే ఆచరిస్తాం. అలాగే చేయాలి. కాకపోతే, మనం ఊహించిన ఫలితాలు రావచ్చు. రాకపోవచ్చు. ఫలం విషయంలో మనకు అధికారం ఉండేట ట్లయితే, అలా రాకపోవడం అనేది ఉండనే ఉండదు. ఇక్కడే మనం కాస్త లోతుగా విశ్లేషించు కోవాలి.

క్రీడాకారుడు శ్రమించి ఆడాలి. గెలవాలనే ఆడాలి. కాని, ఆడేవా ళ్ళందరూ గెలవ లేరు. గెలుపుపై మనకు అధికారం ఉంటే ఎప్పుడూ విజయం మనదే కావాలి. ఆడే అధికారం మనకు ఉంది. విజయం విషయంలో మనకు అధికారం లేదు. పని చేయకుండానే జీతాల్ని ఆశించే నేటి సమాజం, కర్మ చేసిన వారికి కూడా

ఫలితంపై అధికారం లేదు అనే సత్యాన్ని అంగీకరించ లేదు. అంగీకరించలేని సత్యాన్ని అర్థమయ్యేలా బోధించడానికే శాస్త్రం ఉంది.

ఫలితాన్ని ఊహించి మనం కర్మ చేస్తాం. మనం కర్మ చేసినంత మాత్రాన ఫలితం రావాలనే నియమం లేదు. కర్మ చేయడమే కాకుండా, ఫలితం రావడానికి అనుకూలమైన పరిస్థితుల నన్నిటినీ మనం సఫలం చేయ గలగాలి. అప్పుడే కర్మ సత్ఫలితా న్నిస్తుంది. కాని, అలా సఫలం చేయడం మన చేతిలో లేదు. మన చేత కాదు.

పంటను పండించడానికి రైతు తన వంతు కృషి తాను చేస్తాడు. కేవలం రైతు చేసే కృషి లోనే పంట రాదు. పంట పండాలి అంటే వర్షం సకాలంలో పడాలి. రైతు పంట పెట్టగలడే కాని, మేఘాల్ని పిండలేడు. అతివృష్టిని ఆపలేడు. అనావృష్టిని నివారించ లేడు. ఎన్నో కారణాల వల్ల పంట చేతికి అందకుండా పోతుంది. ఫలం వస్తే మనం అనుభవించగలం కాని, ఫలితాన్ని సృష్టించ లేము. కర్మఫలాన్ని సృష్టించుకొనే అధికారం మనకే ఉంటే, అసలు కర్మ చేయకుండానే ఫలితాన్ని సృష్టించుకో వచ్చు. అది సాధ్యపడే పని కాదు. ఫలితం విషయంలో మనకు అధికారం లేదు కనుకనే భగవంతుడు, అర్జునా! కర్మ చేయడంలో నీకు అధికార ముంది, ఫలితంలో లేదు అంటున్నాడు (***కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన***). అంటే, ఎప్పుడూ లేదా? ఎప్పుడూ లేదు అనే దాని అర్థం. ఒకప్పుడు ఉంటే, మరొకప్పుడు కూడా ఉండే అవకాశం ఉంటుంది. ***కదాచన*** (ఎప్పుడూను) అనే పదం వాడటం లోని అర్థం అదే.

ఇంటి నుండి బయలుదేరి బండి నడుపుకుంటూ పోతుంటారు. ప్రమాదం జరగాలని ఎవరైనా అనుకుంటారా? కాని జరుగుతున్నాయా, లేదా? ఒకవేళ జరగ కూడదు అని సంకల్పించినా జరిగేవి జరగ కుండా ఉంటాయా? జరిగేవి జరిగే తీరుతాయి.

ఈ ప్రపంచం పరమేశ్వరుని సృష్టి. అందమైనది. అర్థవంత మైనది. ప్రయోజనాత్మక మైనది. దీనికి సంబంధించిన సర్వజ్ఞానము ఎవ్వరికీ లేదు, పరమాత్మకు తప్ప. ఈ ప్రపంచంలో ఎవ్వరము సర్వజ్ఞులం కాము. కనుకనే ఏది ఎందుకు ఎప్పుడు ఎలా జరుగుతుందో అర్థం చేసుకోలేక సతమత మవుతుంటాము.

మనకు అర్థం కాక పోవచ్చు. కానీ, ఉన్న వన్నీ అర్థవంతం గానే ఉన్నాయి. ఉదజని, ప్రాణవాయువు కలసి నీరు తయారైంది. రాయిని పైకి విసిరితే, భూమి ఆకర్షించడం వల్ల క్రింద పడుతోంది. ఈ సృష్టిలో అన్నీ ధర్మబద్ధంగా నడుస్తున్నాయి. ప్రతిదాని వెనుక ఒక నియతి ఉంది. ఉంది కనుకనే ఆ ప్రత్యేకమైన విషయాన్ని అధ్యయనం చేయడానికి, పరిశోధించడానికి అవకాశం కలుగుతూ ఉంది.

ఈ సృష్టి లోని ధర్మాలను ఎవరు సృష్టించారు? ఎవరికి తెలుసు? విశ్వాన్ని గూర్చి వ్యక్తి ఏమి చెప్పగలడు? విశ్వానికి కర్త ఎవరో అతనికే విశ్వాన్ని గూర్చి తెలుసు. ఈ సృష్టి లోని చట్టా లన్నీ ఆయన అధీనం లోనే ఉన్నాయి. వాస్తవం చెప్పాలంటే ఈ చట్టాల రూపంలో ఉన్నది తానే. ధర్మరూపంలో ఉండేది దైవమే. ధర్మ రూపంలో ఉన్నాడు కనుక ఆయన సర్వజ్ఞుడు. సర్వజ్ఞుడు కనుకనే సర్వాన్ని సృష్టించ గలిగాడు (***సర్వజ్ఞః సర్వం సృజతి***). సర్వజ్ఞుడైన వాడే సర్వులు ఆచరించే సమస్త కర్మలకు ఫలితాన్ని ఇవ్వగలడు. కనుక కర్మ మన చేతి లోనే ఉంది. కాని, ఫలితం దైవాధీనం.

కోరుకునే శక్తి భగవంతుడు మనిషికి ప్రసాదించాడు. దానినే ఇచ్ఛాశక్తి అంటారు. కోరే శక్తి ఉన్నవాడు కోరుకుంటే తప్పేముంది? ఏది కోరుకున్నా తప్పు లేదు. మనం కోరింది రాకపోవడమూ తప్పు కాదు. అలా రాలేదని దుఃఖ పడటమే తప్పు. లాభం కొరకు వ్యాపారం చేయడం దోషం కాదు. కాని, నష్టం వస్తే, అది రావలసింది కాదు అని దుఃఖించడం మాత్రం సమంజసం కాదు.

ఏదైనా వచ్చింది అంటే, అది రావలసింది కనుకనే వచ్చింది. రాకూడని దైతే ఎందుకొస్తుంది? ఈ ప్రపంచంలో అనివార్యాలు ఉన్నవేమో గాని అసంభవాలు లేవు. మనం ఆశించింది రాకపోవచ్చు. అలాగని, మనకు రావలసిన దానిని ఆపే శక్తి ఎవ్వరికీ లేదు. మన ఊహాలకు, ఆశలకు ఫలితాలు రాకపోవచ్చు. మన కర్మలకు ఫలితాలు వచ్చి తీరుతాయి.

ఏ కర్మకు ఏది ఫలమో, ఏ కర్మ ఫలము ఎప్పుడు రావాలో, ఎక్కడ రావాలో, సర్వజ్ఞుడికే తెలుసు. మనం సర్వజ్ఞులం కాము. కనుక సత్యాన్ని గ్రహించలేము. నేడు ఆచరించిన కర్మల యొక్క ఫలితాలను గూర్చే మనం ఆలోచిస్తాం. కాని, గత జన్మల లోని కర్మల యొక్క ఫలితాలు ఈ జన్మ లోని కర్మఫలితాలతో ఏకమై అందే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితులలో ఏదీ అర్థం గాని అయోమయ స్థితిలో మనం పడిపోతాము. అందుకనే ఫలాలలో నీకు అధికారం వద్దు అంటున్నాడు గీతాచార్యుడు.

పల్లవి : **ఏ కర్మమునకు ఏది ఫలమో ఎరిగినవా రెవరు?**
చేసిన కర్మము ఫలమును పొందక దాటే వారెవరు? ॥ ఏ కర్మమునకు ॥

చరణము : **నీది కానిది, నీకు లేనిది రమ్మన్నా రాదు**
నీది అయినది, నీకొర కున్నది పొమ్మన్నా పోదు
ఉండే వాటిని పొమ్మనకు, మరి లేనిది రమ్మనకు
రాకపోకల వాడుక తెలియక, వేడుక లేదనకు ॥ ఏ కర్మమునకు ॥

అని కర్మఫలాలను ఆరబోసింది చైతన్య గీతిక.

ఫల హేతువు పరమేశ్వరుడే

కర్మ చేయాలి. కర్మఫలము వస్తుంది. కర్మఫలము నందు మనకు అధికారము లేదు (***కర్మ కుర్వతః మా ఫలేషు అధికారః అస్తు, కర్మఫల తృష్ణా మా భూత్ కదాచన***).

కర్మ చేస్తాం. ఫలితం వస్తుంది. కాని అది మనం ఆశించిన విధంగా ఉండక పోవచ్చు. మనం ఒకటి ఊహిస్తాం. ఫలం మరొకటి వస్తుంది. మనం ఆశించింది రాలేదని ఆవేదన చెందుతాం. మనం ఊహించింది రాని మాట నిజమే. కాని, మనకు రావలసిందే వచ్చింది అనేది అంతకు మించిన నిజం. లోపం ఏదన్నా ఉంటే మన ఊహలో ఉంటుందే గాని సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు అందించే కర్మఫలంలో ఉండదు.

పరమేశ్వరుని అమృత హస్తాల నుండి అందుతూ ఉంది కనుక కర్మఫలము ప్రసాదము. ప్రసాదము అనేది వస్తువు కాదు, భావన. **ప్రసాదేతి ప్రసన్నతా.** ప్రశాంతతను కలిగించేది ఏదో అదే ప్రసాదము. ఫలహేతువు పరమేశ్వరుడు అనేది నిర్ధారణ కాగానే, ఫలం ప్రసాదంగా దర్శన మిస్తుంది.

ఏది అందినా, ఇచ్చేవాడు ఈశ్వరుడు కావడం వల్ల, అందినది ప్రసాదం అవుతుంది. ఏది అందు కుంటున్నా అందులో అందించే వాని రూపమే గోచరిస్తుంది. కనుక ప్రతి కర్మఫలమూ ప్రసాదమే.

ప్రసాదంలో ఇష్టాయిష్టాలు ఎవరి కుంటాయి? ప్రసాదాన్ని ఎవ్వరైనా కళ్ళ కద్దుకుని తీసుకుంటారు. తిరుపతి నుండి లడ్డు తెస్తే అది ప్రసాదము. శ్రీకాళహస్తి నుండి బిల్వపత్రం తెస్తే అది ప్రసాదము. శ్రీశైలం నుండి విబూది తెస్తే అది ప్రసాదము. కాశి నుండి గంగోదకం తెస్తే అదీ ప్రసాదమే. బృందావన ధూళి కూడా మహాప్రసాదమే. పదార్థాలు అనేకములు. కానీ, అన్నీ ప్రసాదాలే. కనుక ప్రసాదము అనేది వస్తువు కాదు, భావన అని తేలిపోయింది. ఒక వస్తువు పరమేశ్వరుని వద్ద నుండి వచ్చింది అని గుర్తించ గలిగే భక్తి మనకు ఉంటే, మరుక్షణమే ఆ వస్తువు ప్రసాద మవుతుంది.

ఈ విధమైన ప్రసాద భావనలో అంతా ప్రసన్నతే. ఆశించింది అందినా ప్రసాదమే. అందక పోయినా ప్రసాదమే. అధికంగా అందినా ప్రసాదమే. అల్పంగా అందినా ప్రసాదమే.

ప్రసాద భావనలో అనుకూలాలు అదృశ్య మవుతాయి. ప్రతికూలాలు పారి పోతాయి. ఏది అధికమో తెలియదు. ఏది అల్పమో అర్థం కాదు. కర్మయోగికి కర్మఫలాల యందు ఆసక్తి ఉండదు. అంతఃకరణ శుద్ధి కోసమే కర్మలు ఆచరిస్తాడు కనుక ఈ ప్రసాద భావన వల్ల బుద్ధి శుద్ధి పడుతుంది.

చరణము : **అనుకూలములు ప్రతికూలములు ఫలములలో లేవు**
అధికమైనా అల్పమైనా ఫలము నిష్ఫలము
రాగము కాని ద్వేషము లేని ఫలములు బాధించవు
ఏది వచ్చినా ఎలా వచ్చినా నీ కది ప్రసాదము

పల్లవి : **ఏ కర్మమునకు ఏది ఫలమో ఎరిగినవా రెవరు?**
చేసిన కర్మము ఫలమును పొందక దాటే వారెవరు?

మనకు ఏవి ఉన్నా, మనతో ఎందరు ఉన్నా, పరమేశ్వరుడు ప్రసాదిస్తేనే అవి మనకు కలిగాయి. అందుకే ఉన్న వన్నీ ప్రసాదాలు. ఉన్నవా రందరూ అనుగ్రహ రూపాలు.

సామాన్యునికి కర్మ సాధనం - ఫలం సాధ్యం. కర్మయోగికి కర్మ సాధనం - ఫలం చిత్తశుద్ధి. అందరూ ఫలం కోసం పని చేస్తారు. భక్తునికి ఫలాసక్తి ఉండదు. ఈ ప్రపంచంలో కర్మల వల్ల పొందే ఫలాలన్నీ ఏదో ఒకనాడు పోగొట్టు కొనేవే అని కర్మయోగికి తెలుసు ***(అస్మిన్ లోకే కర్మభిః సంపాదిత అనుభవః నష్టో భవతి!)***.

కర్మశూన్యత దోషయుతం

ఫలాసక్తి లేనపుడు కర్మ చేయడం ఎందుకు? అని భావించకూడదు. ఒకవేళ కర్మలో దోషముంటే దానిని త్యజించ వచ్చు. దోషం కర్మలో లేదు. కర్మఫలం లోనూ లేదు. కర్మఫలాల విషయంలో మనం ప్రతిచర్యలలో స్పందించడంలో ఉంది. సమస్య అక్కడ ఉత్పన్న మవుతుంది.

కర్మను త్యజించడం ఎందుకు? ఆశించిన ఫలం రాదు అనే భయం ఉంటేనే కర్మను త్యజించాలి. కర్మకు ఫలం రాదని కర్మను ఆరంభించక ముందే నీకు తెలుసా? కర్మ చేస్తేనే కదా ఫలం వచ్చేది? కనుక కర్మ చేయాలి. వచ్చిన ఫలితాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. అప్పుడు ఏ దోషమూ అంటదు. కర్మయోగికి కర్మశూన్యత సమస్యల్ని సృష్టిస్తుందేమో గాని కర్మాచరణము సమస్య కాదు. ఫలాసక్తితో కర్మలు చేయడం రజోగుణ మైతే, కర్మశూన్యత తమోగుణ మవుతుంది. ఫలాపేక్ష లేకుండా కర్మలు ఆచరించడం సత్త్వగుణము. కర్మయోగి నిత్య సత్త్వస్థుడు.

కర్మయోగి కర్మఫలం కొరకు కర్మ చేయడు అని తెలిసింది. మరి కర్మలు ఎలా చేయాలి? ***(కథం తర్హి కర్తవ్యమ్ ఇతి ఉచ్యతే)***. *తరువాత శ్లోకం ఆ విషయాన్నే స్పష్టం చేస్తూ ఉంది.*

యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనఞ్జయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48

యోగస్థః-కురు-కర్మాణి-సంగం-త్యక్త్వా-ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోః-సమః-భూత్వా-సమత్వం-యోగః-ఉచ్యతే

ధనంజయ	= అర్జునా!	కర్మాణి	= కర్మలను
సంగం	= ఫలసంగమును	కురు	= చేయుము
త్యక్త్వా	= విడిచి	సమత్వం	= సమబుద్ధి
సిద్ధ్యసిద్ధ్యోః	= సిద్ధి యందు అసిద్ధి యందు కూడా	యోగః	= యోగమని
సమః భూత్వా	= సమభావంతో ఉన్నవాడవై	ఉచ్యతే	= చెప్పబడింది
యోగస్థః	= యోగములో ఉండి		

అర్జునా! యోగనిష్ఠలో ఉండి కర్మలను ఆచరించు. ఫలాసక్తిని విడిచి పెట్టు. ఫలము సిద్ధించినా, సిద్ధించక పోయినా సమబుద్ధితో ఉండు. సమత్వమే యోగము.

వ్యాఖ్య

నదిని దాటాలి అనేదే నీ అభిమత మైతే, నదిలో దిగకుండా నీవు ఆ పని చేయలేవు. కేవలం నదిలో దిగినా లాభం లేదు. ఈత తెలిసి ఉండాలి. లేకపోతే మునిగిపోయే ప్రమాద ముంది. మోక్ష తీరాన్ని చేరాలి అని అభిలషించే సాధకుడు కర్మ జలాలలో దిగక తప్పదు. అయితే, ఈ కర్మలను కర్మయోగంగా మార్చుకొనేది ఎలాగో తెలియక పోతే, మళ్ళీ సంసారంలో మునిగిపోయే ప్రమాదమే ఉంటుంది. కనుక యోగస్థుడవై కర్మలను ఆచరించు అని ఈ శ్లోకంలో గీత బోధిస్తూ ఉంది ***(యోగస్థః కురు కర్మాణి)***.

యోగస్థుడు అంటే యోగము నందు ఉన్నవాడు. మరి, యోగం అంటే ఏమిటి? సమత్వమే యోగము ***(సమత్వం యోగ ఉచ్యతే)*** అని యోగానికి ఒక క్రొత్త నిర్వచనాన్ని ఈ సందర్భంలో గీత వినిపిస్తూ ఉంది. సిద్ధించినది, సిద్ధించనిది, ఈ రెండిటి విషయంలో సముడుగా ఉంటూ కర్మలు చేయుమని చెబుతూ ఉంది ***(సిద్ధ్య సిద్ధ్యోః సమో భూత్వా. . . . సిద్ధ్య సిద్ధ్యోః అపి సమః తుల్యః భూత్వా కురు కర్మాణి ఇతి)***. అదెలా సాధ్యం? సంగమును, అనగా ఆసక్తిని త్యజించి కర్మలు చేయడము వల్లనే. *(సంగం త్యక్త్వా)*.

సంగత్వమే సంగతి

కర్మ చేస్తూపో. ఫలితాన్ని విడిచి పెట్టు. కర్మఫలానికి నీవు కారణం కావద్దు అని నలభై ఏడవ శ్లోకంలో కర్మయోగాన్ని బుద్ధికి పట్టించాడు భగవంతుడు.

కర్మ బంధము కాదు. ఫలాసక్తియే బంధము అని అర్థం చేసుకున్నాం. ఫలసంగం లేకుండా కర్మలను ఆచరించడం కర్మయోగంలో కీలకమైన విషయము. కర్మలు చేస్తూ ఫలాసక్తిని విడిచి, ప్రసాద భావనతో కర్మఫలాలను అనుభవించడం వల్ల గతంలో చేసిన కర్మల వల్ల ఏర్పడిన వాసనలు తరిగిపోతూ ఉంటాయి. ఫలాసక్తిని విడిచి, రాగద్వేషాలు లేకుండా, ఈశ్వరభావనతో ప్రస్తుతం కర్మలు చేస్తూ ఉన్నాము కనుక, క్రొత్త వాసనలు అంతఃకరణములో తయారు కావు. ఈ విధంగా కర్మయోగంలో ఒక వైపు వాసనలు ప్రక్షాళన మవుతున్నాయి. మరో వైపు జ్ఞానప్రాప్తికి అంతఃకరణము శుద్ధిపడి సిద్ధపడుతూ ఉంది. హృదయం పవిత్ర మవుతూ ఉంది. ఇలాంటి హృదయమే ధ్యానానికి ఉపకరిస్తుంది. ఈ విషయాన్ని ఆరవ అధ్యాయంలో విపులంగా చెప్పుకుందాం.

జ్ఞానయోగంలో చరించే తత్త్వవిదునికి, కర్మయోగంలో సంచరించే కర్మయోగికి మోక్షమే పరమావధి కనుక సమబుద్ధి ఉండి తీరాలి. సంగత్వం ఉన్నంత వరకు సమత్వం ఉండదు. కనుక, కర్మయోగి సంగత్వాన్ని త్యజించి కర్మలు చేయాలి ***(సంగం త్యక్త్వా. . కురు కర్మాణి)***.

ఏ కర్మ తాను చేయవలసి ఉందో, ఆ కర్మను సంగత్వం లేకుండా, విధిగా కర్మయోగి నిర్వహించాలి. అంటే, కర్మ చేయాలి; కర్మసంగం ఉండ కూడదు. ఈ కర్మ నాది అనే భావన ఉండకూడదు. ఈ కర్మ నేను చేయవలసింది. నేను చేసేందుకు ఉంది అని భావించాలి. అంతేకాని, 'ఈ కర్మ నాది' అనే కర్మసంగం కర్మయోగికి పనికి రాదు. ఈ కర్మ నాది అని భావిస్తే, ఫలం ఎవరి దవుతుంది? కర్మ నాది అయినపుడు ఫలం కూడా నాదే అవుతుంది. ఇది ఫలసంగం. ఫలాసక్తి లేకుండా కర్మలను ఆచరించే వ్యక్తికి ఫలసంగం ఉండదు. కనుక, కర్మసంగం ఉండ కూడదు. ఫలసంగం ఉండ కూడదు.

కర్మ నాది కాదు అని స్పష్ట మైనపుడు, నేను కర్తను ఎలా అవుతాను? కర్తను కానపుడు కర్తృత్వ మెక్కడిది? కనుక, యోగికి కర్తృత్వ సంగం కూడా లేదు. కర్త అయినవాడే భోక్త అవుతాడు. కర్తృత్వం ఉంటేనే భోక్తృత్వం ఉంటుంది. కర్మ నాది కాదు అనే భావనతో కర్మయోగి కర్తృత్వం నుండి ఎప్పుడైతే విడిపడి పోతాడో, తత్కర్మఫలం కూడా నాది కాదు అనే భావనతో భోక్తృత్వ సంగం నుండి కూడా విడిపడి పోతాడు.

కర్మసంగం లేదు కనుక కర్తృత్వ సంగం లేదు. కర్తృత్వ సంగం లేదు కనుక ఫలసంగం లేదు. ఫలసంగం లేదు కనుక ఫల భోక్తృత్వ సంగం లేదు. ఇలా సర్వ సంగముల నుండి విడిపడి సమభావంతో ఉన్నవాడు కర్మయోగి. ఈ సమత్వమే యోగము అంటోంది భగవద్గీత. ఈ యోగంలో ఉన్నవాడు యోగస్థుడు. కర్మయోగి. కనుకనే, సంగత్వాన్ని త్యజించి, యోగస్థుడవై కర్మల నాచరించు అర్జునా! అంటున్నాడు యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు ***(యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ!).***

యోగస్థుడైన వాడు ఏ కర్మలైనా చేయనీ. ఎన్ని కర్మలైనా చేయనీ. సంగం లేదు కనుక అతడిని కర్మ బంధించదు. పైగా అతడు చేసే కర్మ లన్నీ ఒకే మార్గంలో పోతూ ఉంటాయి. సద్గతి వైపే సాగుతూ ఉంటాయి. మోక్షం వైపే నడుస్తూ ఉంటాయి.

సమత్వమే సద్గతి

కర్మ బంధించదు. సంగత్వం బంధిస్తుంది. ఫలాశే బంధకారణ మవుతూ ఉంది. కర్మయోగి యోగస్థుడు. కామ్యకర్మలు చేయడు. ఫలాసక్తి లేకపోవడమే తన సమ వైఖరికి కారణము.

ఫలాసక్తి లేని వానికి ఏ ఫలమైనా సమమే. ఇదే సమత్వము. ఇది ప్రియము, అది అప్రియము అని భావిస్తేనే కర్మలు బంధిస్తాయి. ఇది సుఖము - అది దుఃఖము అని తలచి నపుడే రాగద్వేషాలు పుట్టుకొస్తాయి. ఫలాల వెనుక ధర్మాలు ఉన్నాయి అనేది అర్థమైతే, రాగద్వేషాలు అంకురించవు. ఈ విషయంలో కర్మయోగి చిత్తము చలించదు. కనుక కర్మ చేసేటప్పుడే తాను యోగస్థుడు ***(యోగస్థః కురు కర్మాణి).***

కర్మ సుఖాన్ని ఇవ్వదు. దుఃఖాన్నీ ఇవ్వదు. కర్మ కేవలం కర్మఫలాన్ని ఇస్తుంది. అంతే. కర్మఫలాల విషయంలో మనకు ఉండే రాగద్వేషాలను బట్టి, ఆసక్తిని బట్టి సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి.

యోగస్థుడైన వాడు చేసే కర్మలు గంగాజలం వలె పావనమై ఉంటాయి. తులసిదళాల వలె పవిత్రమై ఉంటాయి. యోగస్థుడు కర్మలు ఆచరిస్తున్నాడు అంటే, అవి కేవలం ఈశ్వరార్థమై ఉంటాయి ***(యోగస్థః సన్ కురు కర్మాణి, కేవలం ఈశ్వరార్థమ్).*** అతడు కేవలం ఈశ్వరుని కొరకే కర్మలు ఆచరిస్తాడు.

మన కర్మలు ఈశ్వరుని కెందుకు? సంసారం కోసం ఉద్యోగం చేసినట్లు, ఈశ్వరుని కొరకు కర్మలు చేయాలా? మన కర్మలు సర్వజ్ఞుడైన ఈశ్వరునికి అవసరమా? కానే కాదు. మరి ఈశ్వరార్థం కర్మలు ఎందుకు చేయాలి?

మనం చేయదగిన కర్మ ఏదో దానిని చేయడం మన ధర్మము. యోగస్థుడు ధర్మార్థం కర్మను చేస్తున్నాడే

గాని ఫలం కొరకు కాదు. ధర్మరూపంలో ఉన్నది ఎవరో కాదు, దైవమే. కనుక దైవానికి తల వంచి యోగస్థుడు కర్మను ఆచరిస్తున్నాడు. అంతేగాని, తన కర్మ ఈశ్వరునికి అవసరమై కాదు. తన కర్మల వల్ల ఈశ్వరుడు సంతృప్తి చెందేదీ లేదు. తన కర్తవ్యాన్ని నిర్వహించే టప్పుడు, ఆ కర్తవ్య రూపంలో గోచరిస్తున్న శ్రీకృష్ణుణ్ణి దర్శిస్తూ, ఫలసంగం లేకుండా, కర్మాచరణంలో తృప్తి చెందేవాడే యోగస్థుడు. మనం చేసే కర్మల వల్ల పరమేశ్వరుడు తృప్తి చెందడానికి అంతకు పూర్వం భగవంతుడు అసంతృప్తిలో ఉన్నాడా? అందువల్ల, నేను చేసే కర్మల వల్ల ఈశ్వరుడు సంతోషించాలి అనే సంగత్వాన్ని కూడా విడిచి పెట్టేయాలి అని వ్యాఖ్యానించారు భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి.

విధిగా నీవు చేయ వలసిన కర్మ స్వకర్మ. స్వకర్మ రూపంలో ఉన్నది సర్వేశ్వరుడే అని తెలిసి పోయింది. ఇక ఇప్పుడు మనం చేసే ప్రతి కర్మ ఈశ్వరార్చనయే. ఆచరించే ప్రతి కర్మలో ఈశ్వర దర్శనమే. ఇక్కడ పని లేదు. పూజే ఉంది. యోగస్థుడు ఆచరించే ఆరాధనే ఉంది. ఈ విధంగా కర్మ లాచరించే వానికి బంధ మెక్కడుంటుంది? ఆనందం దూరంగా ఎక్కడికి పోతుంది? స్వధర్మాచరణములో ఎంతెంత అవగాహన పెరుగుతూ ఉంటే, అంతంత సమత్వం నిండుతూ ఉంటుంది. ఆరాధనా పూరిత కర్మ ద్వారా మనస్సును ఆత్మజ్ఞానానికి సిద్ధం చేయడమే ఇక్కడ యోగము. ఇదే **సిద్ధి**. దీనికి భిన్న మైనది **అసిద్ధి**. ఈ రెండిటిలో కూడా సమంగా ఉండటమే యోగము ***(సమత్వం యోగ ఉచ్యతే).***

ఫలాపేక్ష లేకుండా కర్మలు చేస్తూ ఉంటే చిత్తశుద్ధి కలుగుతుంది. తద్వారా కలిగే జ్ఞానప్రాప్తి లక్షణము **సిద్ధి** ***(ఫల తృష్ణా శూన్యేన క్రియమాణే కర్మణి సత్త్వ శుద్ధిజా, జ్ఞానప్రాప్తి లక్షణా సిద్ధిః).*** దీనికి విరుద్ధ మైనది **అసిద్ధి** ***(తద్విపర్యయజా అసిద్ధిః).*** ఈ రెండిటి విషయంలో కూడా సమంగా ఉంటూ కర్మలు చేయడమే యోగం ***(తయోః అపి సమః తుల్యః భూత్వా కురు కర్మాణి).*** అంటే, ఈ కర్మను ఆచరిస్తే, ఇది చిత్తశుద్ధికి దోహదపడి జ్ఞానప్రాప్తిని కలిగిస్తుందని, ఈ కర్మపై ఆశ గాని, లేదా రాగం గాని; ఆ కర్మ వల్ల అంతఃకరణము మలినమై జ్ఞానప్రాప్తికి ప్రతిబంధక మౌతుందని ఆ కర్మపై నిరాశ గాని, లేదా ద్వేషం గాని లేకుండా, రెండిటి విషయం లోను సమబుద్ధి కలిగి యుండటమే యోగము. అంతఃకరణ అశుద్ధికి సంగత్వమే కారణం కాని కర్మ కాదు అని యోగస్థునికి తెలుసు. అందుకని అతడు చలించడు. ఇది యోగస్థుని అద్భుతమైన యోగస్థితి.

సమత్వ బుద్ధితో కూడిన ఈ నిష్కామకర్మ సకామ కర్మల కంటే ఎంత శ్రేష్ఠమైనదో వివరిస్తున్నారు.

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనఞ్జయ ।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49

దూరేణ-హి-అవరం-కర్మ-బుద్ధియోగాత్-ధనంజయ
బుద్ధౌ-శరణం-అన్విచ్ఛ-కృపణాః-ఫలహేతవః

ధనంజయ	= అర్జునా!	బుద్ధౌ	= బుద్ధి యందు
బుద్ధియోగాత్	= బుద్ధియోగము కంటె	శరణం	= ఆశ్రయమును
కర్మ	= కామ్యకర్మ	అన్విచ్ఛ	= కోరుకో
దూరేణ	= చాలా దూరం చేత	ఫలహేతవః	= ఫలము నాశించు వారు
అవరం హి	= తక్కువైనది కదా!	కృపణాః	= కృపణులు

ధనంజయా! ఫలాపేక్షతో చేసే కర్మ బుద్ధి యోగము కంటే చాలా తక్కువది. కనుక బుద్ధి యోగాన్నే ఆశ్రయించు. ఫలాసక్తి కలవారు దీనులు.

వ్యాఖ్య

ఉండని దానికి ఉనికి లేదు

సమత్వబుద్ధితో కూడిన కర్మయోగం పవిత్ర మైనది. రాగద్వేషాలకు చాలా దూరంలో ఉంటుంది. ఫలితాల విషయంలో ఆందోళన లేకుండా సమబుద్ధితో ఉంటుంది. అంతఃకరణ శుద్ధిని కలిగిస్తుంది. సాంఖ్యము బోధించే జ్ఞానాన్ని అందుకోవ దానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. సూటిగా చెప్పాలంటే మోక్షహేతువు అవుతూ ఉంది. ఫలసంగం లేకుండా ఉండటమే కర్మయోగ వైశిష్ట్యము.

ఫలితాన్ని కోరుతూ, ఫలాసక్తితో కర్మలు చేసేవారు దీనులు అంటున్నాడు గీతాచార్యుడు (*కృపణాః*). వారు ఎందుకని కృపణులు అంటే, ఫలాసక్తి చేత ప్రేరేపింపబడి విశేషంగా కర్మ లాచరిస్తూ ఉన్నారు కనుక (*ఫల హేతవః ఫలతృష్ణా ప్రయుక్తాః*).

సమత్వబుద్ధితో కూడిన కర్మయోగముతో పోల్చి చూచి నపుడు ఫలాసక్తితో చేసే సకామ కర్మ చాలా నికృష్టమైంది (*అవరం నికృష్టం*). సకామ కర్మలు ఫలసంగంతో కూడుకొని ఉంటాయి. రాగద్వేషాల మధ్య ఊగిస లాడుతూ ఉంటాయి. భోగైశ్వర్య ప్రసక్తి తోనే నిండి ఉంటాయి. జననమరణాలకు కారణమై, బంధహేతువులుగా ఉంటాయి. సకామ కర్మలలో మోక్షాపేక్ష అనూహ్యం. చిత్తశుద్ధి శూన్యం. నికృష్టమైన ఈ సకామ కర్మలు శ్రేయోదాయకం కావు కనుక, దీనుల వలె వాటిని ఆశ్రయించ వద్దని పరమేశ్వరుడు ఈ శ్లోకంలో హెచ్చరిక చేస్తూ ఉన్నాడు. చిత్తశుద్ధిని, చిత్త నైర్మల్యాన్ని కలిగించే నిష్కామ కర్మయోగమునే ఆశ్రయించమని బోధిస్తున్నాడు (*బుద్ధౌ శరణ మన్విచ్ఛ*).

సమత్వబుద్ధి యోగమును (*బుద్ధౌ*) ఆశ్రయించ మంటున్నాడు (*శరణమ్ ఆశ్రయమ్ అభయప్రాప్తి కారణమ్, అన్విచ్ఛ ప్రార్థయస్వ*). సమత్వబుద్ధి భయాన్ని నిర్మూలిస్తుంది. అభయాన్ని అనుగ్రహిస్తుంది. అందుకే దానిని అభయప్రాప్తి కారణము అన్నారు భాష్యంలో శ్రీ శంకరులు.

కర్మ ఆరంభించక ముందే, ఈ కర్మ వల్ల ప్రయోజనం ఏమిటి? అనే ఊహలను, ఆశలను ముందుంచుకొని, విచారించుకొని ఆ తరువాత కర్మాచరణములో ప్రవేశించడం సకామ కర్మలలో సాధారణ మైన విషయము. తమ అంచనాలు నెరవేరుతాయో లేదో అనే భయం కర్మారంభము నుండే ప్రారంభ మవుతుంది. ఒకవేళ నెరవేరక పోతే ఎలా? అనే సందిగ్ధం మనస్సులో ఆందోళనకు నాంది పలుకుతుంది. ఈ భయాలు నిరాశల్ని పెంచుతాయి. నిరుత్సాహాన్ని మనసులో దించుతాయి. అందుకే ఫలాసక్తి కలవారు కృపణులు. దీనత్వంతో బ్రతికేవారు (*కృపణాః*). దీనత్వంతో బ్రతికే వ్యక్తి జీవితం నికృష్టంగా ఉంటుంది (*అవరం*).

ఫలాసక్తే ఈ నికృష్టమైన దీనత్వానికి కారణము. ఫలసంగం వల్లే భయాలు పుట్టుకొస్తున్నాయి. సమత్వ బుద్ధితో వ్యవహరించే వారిలో ఫలసంగం ఉండదు. భయాలూ ఉండవు. అందుకనే బుద్ధి యోగాన్ని ఆశ్రయించ మంటున్నాడు భగవానుడు (*బుద్ధౌ శరణం*). పైగా, అది అభయప్రదం అంటున్నాడు (*అభయప్రాప్తి కారణమ్*). దానినే ఆశ్రయించ మంటోంది గీత. ప్రార్థించ మంటోంది (*అన్విచ్ఛ ప్రార్థయస్వ*).

ఫలాసక్తితో సకామ కర్మలను ఆచరించే దీనులు ఆశానిరాశల మధ్య ఊగిస లాడుతూ ఉంటారు. అశాంతితో అలమటిస్తూ ఉంటారు. మనిషికి ఏది ఉంది, ఏది లేదు అనేది ప్రధానం కాదు. ఆశ ఒక్కటి ఉంటే చాలు. ఎన్ని ఉన్నా లేనట్లే. అది తీరని దాహం. వయస్సు గతిస్తున్నా ఆశ నశించదు. పైగా నిరాశా నిస్పృహలను పెంచుతూ పోతుంది.

చరణము : **లేనినాడు ధన మొకటే లేదు**
ఉన్ననాడు మరి లేనివి ఎన్నో!
ఎన్నున్నా - ఆశ కదిలితే
పండని కాయే ఆ బ్రతుకెపుడు
పల్లవి : **ఉన్నది గాంచవె ఓ మనసా!**
వేరొండులే దనే సత్యము తెలుసా!

అంటూ ఆశాపాశాన్ని త్రుంచే ప్రయత్నంలో, ఉన్న సత్యాన్ని కళ్ళ ముందు ఆరబోసింది చైతన్యగీతిక.

నలభై ఎనిమిది, నలభై తొమ్మిదవ శ్లోకాలలో వరుసగా అర్జునుణ్ణి **ధనంజయ - ధనంజయ** అంటూ సంబోధించాడు దామోదరుడు. అర్జునా! లౌకిక ధనాన్ని జయించావు. ఇక అక్షయ ధనాన్ని కూడా జయించు. మోక్షసిరిని చేజిక్కించుకో అని చెప్పడమే 'ధనంజయ!' అని రెండు శ్లోకాల్లోనూ వరుసగా సంబోధించడం లోని ఆంతర్యం. అందుకని **బుద్ధౌ శరణ మన్విచ్ఛ** - బుద్ధియోగాన్ని ఆశ్రయించు. అభయస్థితిని పొంది తరించు అని బోధించాడు.

సమత్వబుద్ధి వల్ల పాపపుణ్యాలు అంటవు. కర్మలు చేస్తున్నా కర్మలకు అంటకుండా ఉండే స్థితిని కర్మయోగము అనుగ్రహిస్తుంది. ఎలాగో చూడండి!

బుద్ధియుక్తో జహా తీహ ఉభే సుకృతదుష్కృతే ।
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50

బుద్ధియుక్తః-జహాతి-ఇహ-ఉభే-సుకృతదుష్కృతే
తస్మాత్-యోగాయ-యుజ్యస్వ-యోగః-కర్మసు-కౌశలం

బుద్ధియుక్తః	= సమత్వబుద్ధితో కూడిన వాడు	యోగాయ	= యోగము కొరకు
ఉభే సుకృతదుష్కృతే	= పుణ్యపాపముల రెండింటిని	యుజ్యస్వ	= ప్రయత్నించు
ఇహ	= ఇక్కడే	కర్మసు	= కర్మల యందు
జహాతి	= విడుస్తున్నాడు	కౌశలం	= నేర్పు
తస్మాత్	= ఆ కారణము చేత	యోగః	= యోగము

సమత్వ బుద్ధి కలవాడు పుణ్యపాపాలను రెండిటినీ ఈ లోకం లోనే విడిచి పెట్టేస్తున్నాడు. అందుచేత బుద్ధి యోగానికి సిద్ధం కా! కర్మలలో కుశలత్వమే యోగము.

వ్యాఖ్య

కర్మయోగాన్ని సంక్షిప్తంగా, సారభూతంగా నలభై ఏడవ శ్లోకంలో వివరిస్తూ భగవానుడు ఉపదేశించిన నాల్గవ అంశం 'కర్మలను విడిచిపెట్ట కూడదు' (*మాతే సఙ్గోస్త్వ కర్మణి*). ఆ విషయాన్ని ప్రస్తుత శ్లోకం విస్పష్టం చేస్తూ ఉంది.

యోగాన్ని నిర్వచిస్తూ, సమత్వమే యోగము అని నలభై ఎనిమిదవ శ్లోకంలో ఉపదేశించాడు. సమత్వ మనేది కర్మలకు సంబంధించింది కాదు. కర్మఫలాలకు సంబంధించింది. కర్మలను ఆచరించడములో, లేదా ఆరంభించడంలో సమత్వం కుదరదు. కారణం? కర్మలు స్థూలమైనవి. పైగా, దేని కదే. ఒక కర్మ మరొక కర్మ కాదు. పంట పెట్టడం ఒక కర్మ అయితే, వంట చేయడం మరొక కర్మ. ఈ రెండిటిని సమంగా చూడటం

సాధ్య పడదు. ఫలితాలు మనస్సుపై ప్రభావాన్ని చూపుతాయి కనుక, వాటి విషయంలో ప్రసాద భావన కలిగి ఉంటే, రాగద్వేషాలు తటస్థ మవుతాయి. ప్రసాదంలో భేదాలు చూడనట్లే, కర్మ ఫలితాల విషయంలో కూడా సమత్వం కుదురుతుంది. కాని, కర్మలను ఆరంభించే విషయంలో అది వర్తించదు. ఆ విషయాన్ని ఈ శ్లోకం విశద పరుస్తూ **యోగః కర్మసు కౌశలమ్** అంటూ యోగానికి మరొక అద్భుతమైన నిర్వచనాన్ని అందిస్తోంది.

ముందు కర్మ జరిగితే తరువాత ఫలితం వస్తుంది. ఫలాలలో ప్రసాద బుద్ధి కలిగి సమభావంతో ఉండటం వల్ల ఫలభోగ సంగము ఉండదు. నూతన వాసనలు తయారు కావు. ఉన్నవి కూడా ప్రక్షాళనం అవుతూ ఉంటాయి. చిత్తశుద్ధి ఏర్పడుతూ ఉంటుంది.

కాని, ఫలితానికి ముందే కర్మాచరణములో దోషాలు సంక్రమించే ప్రమాదం ఉంది కదా? ఇది కర్మ సంగాన్ని కలిగించదా? పాపపుణ్యాలను అంటగట్టదా? అనేది సంశయం. ఆ విషయాన్నే ఈ శ్లోకంలో చర్చిస్తున్నాడు భగవానుడు. మనం సోదాహరణంగా అర్థం చేసుకుందాం.

ఒక వ్యక్తి అధర్మంగా ఒక కర్మను ఆచరించి, ఫలితాల విషయంలో సమత్వంతో మెలిగితే, అతడు కర్మయోగి అవుతాడా? పాప కర్మాచరణం చేసినవాడు కాకుండా పోతాడా? అక్రమ వ్యాపారం చేస్తాడు. ఫలితం అధికమైనా, అల్పమైనా, అనుకూలమైనా, ప్రతికూలమైనా ప్రసాదంగా సమబుద్ధితో స్వీకరిస్తాడు. అంతమాత్రాన, అతడు కర్మయోగి అవుతాడా? పాపపుణ్యాల నుండి విడిపడినవా డవుతాడా? కాడు. ఫలితాల విషయంలో ఒకవేళ సమత్వాన్ని అలవరచుకుంటే, ఫలసంగం లేనివాడు అవుతాడు కాని కర్మసంగం నుండి, కర్తృత్వ సంగము నుండి విడిపడిన వాడు కాలేడు. అందుచేత, ***సమత్వం యోగ ఉచ్యతే*** అనే యోగ నిర్వచనము ఒక్కటే చిత్తశుద్ధికి సరిపోదు కనుక, ***యోగః కర్మసు కౌశలమ్*** అనే రెండవ నిర్వచనాన్ని ఈ శ్లోకంలో అందిస్తున్నాడు.

కర్మలలో కుశలత్వము

విహిత కర్మలను, అంటే చేయదగిన కర్మలను ధర్మబద్ధంగా చేసిన వ్యక్తి సమత్వబుద్ధితో ఫలాలను ప్రసాదంగా స్వీకరించడం వల్ల ఫలసంగం లేనివాడు అవుతున్నాడు. ఇక్కడ మరొక ముఖ్యమైన విషయాన్ని మనం విశ్లేషించుకోవాలి.

నేను కర్తను అనే భావంతో కర్మ చేసినపుడు కర్తృత్వం ఏర్పడుతూ ఉంది. కర్త అయినవాడు భోక్త కాకుండా ఎలా ఉంటాడు? ఫలితాలను ఎలా తప్పించుకుంటాడు? సమత్వంతో జీవిస్తే, ఫలితం యొక్క ప్రభావం మనసు మీద పడకుండా జాగ్రత్త పడగలడు. నూతన వాసనలు తయారు కాకుండా చూసుకో గలడు. కాని, కర్మాచరణములో జరిగిన పాపపుణ్యాల నుండి ఎలా విడి పడతాడు? కేవలం ఈ జన్మలో చేసినవే గాక, గత జన్మలలో చేసిన పాపపుణ్యాల మూటను కూడా మోస్తూ ఉన్నాడు కదా! వాటి నుండి ఎలా విడి పడతాడు?

నేను కర్తను అనే కర్తృత్వ భావనతో చేసినపుడు, పాపపుణ్యాలు కర్తను అంటిపెట్టుకొనే ఉంటాయి. కేవలం ఫలసంగం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను తొలగించుకున్నంత మాత్రాన కర్మసంగం వల్ల ఏర్పడే పాపపుణ్యాల నుండి ఎలా విడిపడతాడు?

మరొక విషయాన్ని కూడా ఇక్కడ అర్థం చేసుకోవాలి. కర్మఫలాల విషయంలో ప్రసాద భావన వల్ల సమత్వం ప్రాప్తించింది. బావుంది. మరి ప్రసాదం ఏమిటి? ఈశ్వర ప్రసాదం. పరమేశ్వరుడు ప్రవేశించకుండా ప్రసాదం లభిస్తుందా? భక్తుడు ఉండి, భగవంతుని అర్చించి నపుడే కదా ప్రసాదం లభిస్తుంది? ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం.

భగవంతుని విశ్వసించని నాస్తికుడు ప్రసాదాన్ని స్వీకరించ గలడా? ఫలితాన్ని స్వీకరించగలడే గాని, ఫలితాన్ని ప్రసాదంగా స్వీకరించ లేడు. సామాన్య జ్ఞానంతో అతడు ఆచరించిన కర్మ శాస్త్ర దృష్ట్యా ధర్మమే అయినప్పటికి, ఫలితాన్ని మాత్రం అతడు ప్రసాదంగా స్వీకరించలేడు. పరమేశ్వర భావన లేకుండా ప్రసాద భావన ఉండే అవకాశమే లేదు.

భక్తుడైన కర్మయోగి పరమేశ్వర భావనతో ఉన్నాడు కనుక, ఫలితాన్ని ప్రసాదంగా గ్రహించ గలడు. బావుంది! మరి నైవేద్యం పెట్టకుండానే ప్రసాదం లభిస్తుందా? లభించదు. కనుక కర్మను ఆచరించే టప్పుడు, ఆ కర్మలో పరమేశ్వరుడు ఉన్నప్పుడే అట్టి కర్మ పూజగా మారి, ఫలితం ప్రసాదంగా అందుతుంది.

కర్మ ఫలితాన్ని ప్రసాదంగా స్వీకరించాలి అంటే, ముందు కర్మను అర్చనగా ఆచరించాలి. చేసే పని పూజ కావాలి అంటే, కర్మ చేసే ముందే భావనలో ఈశ్వరుడు ఉండాలి. ఈశ్వర భావనతో కర్మ జరగాలి. మరి అదెలా సాధ్యం?

పరమేశ్వరుడు సర్వవ్యాపి. విశ్వవ్యాపి. విశ్వంలో విశ్వనాథుడు ధర్మరూపంలో ఉన్నాడు. నేను చేసే కర్మ గనుక ధర్మబద్ధంగా ఉంటే, ధర్మరూపంలో దైవమే ఉన్నాడు కనుక, పనిలో పరమేశ్వరుని పూజించడమే అవుతుంది.

పని అనే పూజలో కర్త అయిన నేను పూజారిగా ఉన్నాను. విశ్వమంతా ధర్మరూపంలో వ్యాపించి ఉన్న పరమేశ్వరుడు విశ్వం లోనే ఉన్న వ్యక్తిలో కూడా వ్యాపించి ఉన్నాడు. నా దేహం కూర్చుంటే, అందులో ఆయన ప్రమేయం ఉంది. నా దేహం తిరిగితే, అందులో ఆయన ప్రమేయం ఉంది. నా చేతులు పని చేయడం వెనుక ఆయన శక్తే ఉంది. ఆయన దృష్టి పడటం వల్లనే నా చూపుకు వెలుగు ఉంది. కనుక నా ద్వారా ఎన్నో జరగవచ్చు. అలాగని నేను కర్తను కాను. హరియే కర్త. ఈ భావనతో పని చేస్తే, ఆ పని పూజ అవుతుంది ***(నాహం కర్తా హరిః కర్తా తత్పూజా కర్మచాఖిలమ్).***

ఈ విధమైన వైఖరితో సాగే పని పూజ అవుతుంది కనుక ఫలితం ప్రసాదం అవుతుంది. ఒక నాస్తికుడు మంచి పనే చెయ్యవచ్చు. కాని, ఈ విధమైన ఈశ్వర భావనతో చెయ్యగలడా? అందుచేత నాస్తికుడు ఆచరించిన సత్కర్మకు సత్ఫలితం రావచ్చు నేమో గాని, ఆ ఫలితం ప్రసాదంగా మాత్రం మారదు. రాగద్వేషాలు సమరస మైతేనే ఫలితం ప్రసాదం. ప్రసాద భావన ఉంటేనే చిత్తశుద్ధి కలుగుతుంది.

కర్మ పూజ కావాలి. ఈశ్వరారాధన కావాలి. ఫలితం ప్రసాదం కావాలి. కర్మ పూజ కావాలి అంటే కర్మలో పరమేశ్వరుడు ఉండాలి. కర్మలో పరమేశ్వరుడు ఎలా ఉంటాడు? ధర్మరూపంలో ఉంటాడు. అంటే, కర్మ ధర్మబద్ధంగా ఉంటేనే కర్మలో ఈశ్వరుడు ఉన్నట్లు. ధర్మబద్ధ మైన కర్మను ఈశ్వర భావనతో, అహంకారం లేకుండా ఆచరించి నపుడే అది పూజ అవుతుంది. ఫలితాన్ని ఈశ్వర భావనతో, మమకారం లేకుండా స్వీకరించి నపుడే అది ప్రసాదం అవుతుంది.

కర్మ పూజ కానపుడు ఫలితం ప్రసాదం కాలేదు. ఫలితాలు అందినపుడు ప్రతిచర్యలు లేకుండా, ప్రసాదంగా సమత్వంతో స్వీకరించాలి అంటే, కర్మను ఆచరించే టప్పుడు ఈశ్వర భావనతో ధర్మబద్ధంగా ఆచరించ గలగాలి. **సమత్వం యోగ ఉచ్యతే** అనే యోగ నిర్వచనము ఫలితాల విషయంలో మనకు ఉండవలసిన వైఖరిని స్పష్టం చేసింది. కాని, కర్మాచరణములో మన వైఖరి ఎలా ఉండాలో **యోగః కర్మసు కౌశలమ్** అనే నిర్వచనము విశదపరుస్తూ ఉంది.

తాను ధర్మబద్ధంగా చేయవలసింది ఏదో అది స్వధర్మము. దానిని ఆచరించడమే స్వకర్మ. ఈ స్వకర్మ

ద్వారా పరమేశ్వరుని అర్చించిన వారికి చిత్తశుద్ధి సిద్ధిస్తుంది (*స్వకర్మణా తం అభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః*). స్వధర్మాన్ని ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తాడు కనుక ఫలితం సిద్ధించినా, సిద్ధించక పోయినా సమత్వబుద్ధితో ఉంటాడు. ఇదే కర్మలలో కుశలత్వము (*స్వధర్మాఖ్యేషు కర్మసు వర్తమానస్య యా సిద్ధ్య సిద్ధ్యోః సమత్వ బుద్ధిః ఈశ్వరార్పిత చేతస్తయా తత్ కౌశలం కుశలభావః తద్ధి కౌశలం*). ఇదే కౌశలం. కర్మలలో నేర్పు. ఈ విధమైన అవగాహనతో కర్మయోగి కర్మల యందు కుశలత్వంతో ఉంటాడు. కర్మలలో కర్మయోగి నేర్పరి. అంతేగాని, కర్మలలో నేర్పరితనం కల ప్రతి వ్యక్తీ కర్మయోగి కాలేడు. అలా అయ్యేట ట్లయితే, నేర్పుతో చోరత్వానికి పాల్పడే జేబుదొంగలు కూడా కర్మయోగులు కావాలి.

యోగః కర్మసు కౌశలం అనే యోగ నిర్వచనము కర్మ విషయంలో బంధం లేకుండా చేస్తూ ఉంది. *సమత్వం యోగ ఉచ్యతే* అనే యోగ నిర్వచనము ఫలం విషయంలో బంధ విముక్తిని కలిగిస్తూ ఉంది. ఈ విధంగా కర్మయోగానికి పూర్ణత్వం సిద్ధిస్తూ ఉంది. కర్మయోగి కర్మల లోను, ఫలితాల లోను సమబుద్ధితో చరిస్తున్నాడు. కనుక పుణ్యపాపాల నుండి విడిపడు తున్నాడు.

పాపపుణ్యాలు పారిపోతాయి

కర్మసంగం నుండి, ఫలసంగం నుండి విడిపడిన కర్మయోగి పాపపుణ్యాల నుండి కూడా విడిపడు తున్నాడు.

కర్మలో ధర్మాధర్మా లుంటాయని తెలుసుకున్నాం. ధర్మబద్ధంగా చేస్తే అది సత్కర్మ. అధర్మంగా ఆచరిస్తే అది దుష్కర్మ. సత్కర్మ సుకృతం. దుష్కర్మ దుష్కృతం. సుకృత ఫలం పుణ్యం. దుష్కృత ఫలం పాపం. ఈ పాపపుణ్యాలు రెండూ మనిషిని బంధిస్తాయి. ఈ రెండూ కర్మల లోనే ఉన్నాయి కనుక బంధము కర్మల లోనే ఉంది. అదే కర్మబంధం.

కర్మయోగి పాపపుణ్యాలను ఇక్కడే విడిచేస్తున్నాడు (*జహాతీహ*) అంటున్నాడు ఈ శ్లోకంలో గీతాచార్యుడు. ఇక్కడే వదిలేస్తున్నాడు అంటే, ఈ లోకం లోనే విడిచిపెడు తున్నాడు అని అర్థం (*జహాతి త్యజతి, ఇహ అస్మిన్ లోకే*).

పుణ్యపాపాలను అనుభవించ డానికి ప్రత్యేకంగా లోకాలు ఉన్నాయి. పుణ్యం చేసుకున్న వాడు స్వర్గానికి పోతాడు. పాపం చేసిన వాడు నరకానికి పోతాడు. కర్మయోగి ఎక్కడికీ పోవడం లేదు. అందుచేత, పుణ్య పాపాలను ఇక్కడే విడిచేస్తున్నాడు.

పాపము యొక్క అనుభవము దుర్భరము కనుక దానిని విడిచి పెట్టడం బాగానే ఉంది. పుణ్యఫలాన్ని కూడా ఎందుకు విడిచి పెట్టాలి? అని కొందరు సంశయిస్తూ ఉంటారు.

పుణ్యం చేసిన వాళ్ళు స్వర్గానికి పోతారు. పాపం చేసిన వాళ్ళు నరకానికి పోతారు. పాప ఫలాన్ని అనుభవించిన తరువాత మళ్ళీ ఆ జీవుడు మానవ లోకంలో పుడుతాడు. అలాగే పుణ్యఫలంగా ప్రాప్తించిన స్వర్గ సుఖాన్ని అనుభవించిన తరువాత, ఆ జీవుడు కూడా మానవలోకం లోనే మళ్ళీ జన్మిస్తాడు. ఇరువురికీ జన్మ అనివార్యం.

కర్మయోగి తరించి పోతాడు కనుక పరలోకానికి వెళ్ళే ప్రసక్తి లేదు. పుణ్యపాపాలను అనుభవించడానికి పరలోకం వెళ్ళడు కనుక ఆ పుణ్యపాపాలను ఈ లోకం లోనే విడిచిపెట్టి వెళ్తున్నాడు.

కర్మయోగి పుణ్యపాపాలను ఎలా త్యజిస్తాడు? వచ్చే వాటిని (*ఆగామి*) రాకుండా ఆపుకో గలడేమో గాని, గత జన్మలలో ఆచరించిన కర్మల ఫలితంగా సంక్రమించిన పుణ్యపాపాలను ఎలా పోగొట్టుకుంటాడు? జ్ఞానం

వల్లనే పాపపుణ్యాలు నశిస్తాయి. కర్మయోగం వల్ల అంతఃకరణ శుద్ధి జరుగుతుందే గాని, పాపపుణ్యాలు ఎలా నశిస్తాయి? పరమార్థ దర్శనం కలిగి నపుడే కదా పుణ్యపాపాలు నశిస్తాయి!

నిజమే. జ్ఞానం వల్లనే కర్మ లన్నీ దగ్ధ మవుతాయి. పుణ్యపాపాలు జ్ఞానం చేతనే అదృశ్య మవుతాయి. కాకపోతే, కర్మయోగి జ్ఞానానికి ఎంతో దూరం లేడు. ఇదే అర్థం కావలసిన విషయం. కర్మయోగంలో నిష్ణాతుడైన వాడు ఆలస్యం లేకుండా జ్ఞానాన్ని పొందుతాడు. జ్ఞాని అవుతాడు కనుక పుణ్యపాపాలను ఇక్కడే విడి చేస్తాడు అని అర్థం (*సత్త్వశుద్ధి జ్ఞానప్రాప్తి ద్వారేణ ఉభే సుకృత దుష్కృతే ఇహ జహాతి*). ఈ విషయాన్ని ఉపనిషత్తు కూడా ధ్రువపరుస్తూ ఉంది. చిత్తశుద్ధిని పొందిన సాధకుడు పుణ్యపాపాలను విడిచి నిరంజన స్వరూపు డవుతున్నాడు అని ప్రమాణాన్ని అందించింది.

విద్వాన్ పుణ్య పాపే విధూయ నిరంజనః సామ్య ముపైతి

సాధకుడు (*విద్వాన్ సాధకః ఇత్యర్థః*) బంధహేతువులైన పుణ్యపాప కర్మలను సమూలంగా విడిచిపెట్టి (*విధూయ నిరస్య దగ్ధ్వా*) నిరంజనుడై, పరమేశ్వరునితో సామ్యమును పొందుతున్నాడు అని అథర్వణ వేదం.

ధర్మాత్ముడైన వాడు శాశ్వత శాంతిని పొందుతున్నాడు. అర్జునా! నా భక్తుడు (కర్మయోగి) నశించడు అని తెలుసుకో అని తొమ్మిదవ అధ్యాయంలో భగవంతుడే చెబుతాడు. ఇదంతా కర్మయోగ వైభవము. చూస్తూ ఉండగానే కర్మయోగంలో కర్మ పడిపోయి యోగం నిలుస్తుంది. కళ్ళ ముందే కర్మయోగి కర్మను జార్చుకొని యోగియై శోభిస్తున్నాడు. ఆ తరువాత జ్ఞానియై తరించిపోతాడు.

కనుక కర్మలను విడిచిపెట్టే ప్రయత్నం అవసరం లేదు. కర్మయోగి కాగలిగితే, కర్మలు వాటంతట అవే లేకుండా పోతాయి. కనుక కర్మను విడిచిపెట్ట నవసరం లేదు (*మాతే సంగోఽస్త్వ కర్మణి*). అర్జునా! యోగమును ఆచరించు. కర్మయోగివి కా! సమత్వబుద్ధిని సాధించు (*తస్మాత్ సమత్వ బుద్ధి యుక్తో భవ!*).

కర్మయోగి కర్మబంధము నుండి ఎలా విడిపడుతున్నాడో తరువాత శ్లోకంలో వివరిస్తున్నాడు

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబన్ధ వినిర్ముక్తాః పదం గచ్ఛ న్త్యనామయమ్ ॥ 51

కర్మజం-బుద్ధియుక్తాః-హి-ఫలం-త్యక్త్వా-మనీషిణః
జన్మబంధ-వినిర్ముక్తాః-పదం-గచ్ఛంతి-అనామయం

బుద్ధియుక్తాః	= సమత్వబుద్ధి గల	జన్మబంధ వినిర్ముక్తాః	= జన్మబంధము నుండి విడిపడిన వారై
మనీషిణః	= వివేకులు		
కర్మజం	= కర్మ వలన పుట్టిన	అనామయం	= దుఃఖరహితమైన
ఫలం	= ఫలితమును	పదం	= స్థానమును
త్యక్త్వా	= విడిచి	గచ్ఛంతి హి	= పొందుచున్నారు కదా!

సమబుద్ధి కలిగిన వివేకవంతులు కర్మలు పంచే ఫలాలను త్యజిస్తారు. జన్మ బంధాల నుండి విడిపడతారు. ఏ ఉపద్రవాలు లేని చోటికి చేరి పోతారు.

వ్యాఖ్య

బంధానికి కారణమైన కర్మల లోనే చరిస్తూ ఉండినా బంధానికి లొంగని శక్తిని, యుక్తిని ప్రసాదిస్తుంది

కర్మయోగము. ఇదే సమత్వము. ఇదే కర్మలలో కుశలత్వము. కర్మయోగంలో కొనసాగే సుకృతాత్ములు
బంధానికి కారణమైన 'కర్మ'ను దూరం చేసుకొని ముక్తి హేతువైన 'యోగం'లో శోభిస్తారు.

మానవు లందరూ పాపపుణ్యా లనే పడవ లోనే ప్రయాణం చేస్తూ ఉంటారు. కర్మయోగంలో ప్రవేశించ
గానే పాపం కారిపోతుంది. పుణ్యం మాత్రమే మిగిలి ఉంటుంది. చిత్తశుద్ధి ఏర్పడగానే పుణ్యాపాపాలు రెండూ
కారిపోతాయి. కాయ పెరుగుతూ ఉంటే పూలరేకులు రాలి పోతాయి. ఆ తరువాత కాయ పండుగా మారుతుంది.
రాగద్వేషాల కారణంగా ఏర్పడే పుణ్యాపాపాలను దాటిన కర్మయోగి జ్ఞానమును పొంది తరిస్తాడు.

సమత్వబుద్ధి గల వాడు పుణ్యాపాపములు రెండిటిని ఈ లోకము నందే విడిచి పెడుతున్నాడు అని
యాభైయవ శ్లోకం మొదటి పాదంలో తెలిపాడు ***(బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే)***. సమత్వబుద్ధి
గలవాడు కర్మ ఫలములను విడిచి పెడుతున్నాడు అని యాభై ఒకటవ శ్లోకం మొదటి పాదములో తెలిపాడు.
రెండూ ఒకే విషయం. కాని యాభైయవ శ్లోకం రెండవ పాదమును పరిశీలిస్తే యోగాన్ని అనుష్ఠించు, కర్మల
యందలి కుశలత్వమే యోగము అని సాధనను ఎరుక పరచి, యాభై ఒకటవ శ్లోకం రెండవ పాదంలో బంధ
విముక్తి జరిగి, మోక్షప్రాప్తి కలుగుతూ ఉంది అని ఫలం వినిపిస్తున్నాడు.

ఫలత్యాగం

సమత్వబుద్ధి గల కర్మయోగి ఫల సంగాన్ని త్యజిస్తున్నాడు ***(సమత్వం యోగ ఉచ్యతే)***. కర్మ సంగాన్ని కూడా త్యజిస్తున్నాడు ***(యోగః కర్మసు కౌశలమ్)***. పుణ్యాపాపాలే కర్మఫలం కనుక పుణ్యాపాపాల నుండి విడిపడిన కర్మయోగి పుణ్యాపాపాల ఫలమైన జన్మబంధము నుండి కూడా విడిపడు తున్నాడు ***(జన్మ బంధ వినిర్ముక్తాః)***.

బంధాన్ని ఎవరూ భరించ లేరు. బంధములో అందము ఉండదు. ఆనందమూ ఉండదు. బంధము నుండి విడిపడాలని అందరూ భావిస్తూ ఉంటారు. ఇంతకీ ఏది బంధం? జన్మ బంధమే బంధము అంటున్నాడు గీతాచార్యుడు ***(జన్మ ఏవ బంధః జన్మబంధః)***.

జన్మించడం లోనే బంధము తెలుస్తూ ఉంది. వాస్తవానికి జన్మించడములో ఒక బంధము నుండి బయట పడటమే జరిగింది. కాకపోతే, జన్మించగానే మరెన్నో బంధాలు తగుల్కోవడం చేత జన్మ బంధమైంది.

పుట్టక ముందే తొమ్మిది నెలలు తల్లి గర్భంలో జీవి బందీయై ఉన్నాడు. జన్మించడంతో చెరసాల నుండి బయట పడ్డట్లే అయింది. కాని, అక్కడ నుండి క్రొత్త క్రొత్త బంధాలు మొదలవు తున్నాయి. ఊయలలో కొంత కాలము, ఇంట్లో కొంత కాలము, పాఠశాలలో కొంత కాలము, కార్యాలయాల్లో కొంత కాలము, సంసారంలో కొంత కాలము, వైద్యశాలలో కొంత కాలము - ఇలా జీవులు ఎప్పుడూ బంధాల లోనే కొనసాగుతూ ఉంటారు. ఎలా విడిపడతామా అని ఆందోళన చెందుతూ ఉంటారు. అట్టి వారికి తరుణోపాయాన్ని గీత అందిస్తోంది.

కర్మసంగాన్ని, ఫలభోగ సంగాన్ని త్యజించిన కర్మయోగులు, జననమరణాలు శరీరానికే గాని అకర్తయైన ఆత్మకు కాదని, తామే ఆత్మ యని తత్త్వజ్ఞానాన్ని పొందుతారు. దుఃఖ రహితమైన ముక్తి పథాన్ని సాధించి తరిస్తారు. అది కూడా, ఎప్పుడో మరణించిన తరువాత కాకుండా, జీవించి ఉండగానే సాక్షాత్కరించుకుంటారు ***(జీవన్తః ఏవ జన్మబంధ వినిర్ముక్తాః సన్తః పదం పరమం విష్ణోః మోక్షాఖ్యం గచ్ఛన్తి. అనామయం సర్వోపద్రవ రహితం ఇత్యర్థః)***. కర్మఫలాన్ని త్యజించి, జ్ఞానవంతులైన వారు జీవించి ఉండగానే జన్మబంధాల నుండి విడిపడి, ఏ ఉపద్రవాలు లేని విష్ణుదేవుని యొక్క పరమపదము అనే మోక్షాన్ని పొందుతారు.

పదం ప్రాప్తం

పరమపదము ఏదో అదే పరంధామము. అదే విష్ణుపదము. అదే మోక్షము. మనిషి మరణిస్తే మన సంప్రదాయంలో పరమపదించాడు అని అంటారు. పరమపదము అంటే ఏమిటి?

తద్విష్ణోః పరమం పదం అన్నది వేదము. 'పదం', 'ధామం' అనేవి వేద పదాలు. పరమం పదం, పరంధామం అనేవి జీవుల గమ్యాన్ని నిర్దేశించే ప్రమాణ పదాలు.

పదం అన్నా, ధామం అన్నా స్థలము, లేదా ప్రదేశము అని అర్థం. చనిపోయిన తరువాత జీవులు చేరే ప్రదేశమే పరమపదం. ఆ చోటు ఎక్కడ? ఆ ప్రదేశము ఏది? ఈ విషయంలో మతాలు చిత్ర విచిత్రంగా చెబుతాయి. కాని, వేదము ఈ మతాలకు భిన్నంగా, విలక్షణంగా శోభిస్తూ ప్రవచిస్తుంది.

చనిపోయిన తరువాత ఇక్కడ లేము కనుక మరొక చోటికి చేరి ఉంటాము అనేది మతాల విశ్వాసం. భువిని విడిచిన జీవులు దివిని చేరుతారు అనేది వారి నమ్మకం. దివి అంటే మరొక లోకం లేదా స్వర్గం అని వారి భావము.

స్వర్గానికి వెళ్ళడం అంటే మళ్ళీ తిరిగి వస్తారా, లేదా? ఒక చోటికి వెళ్ళడ మంటూ జరిగితే తిరిగి రావడము కూడా జరుగుతుంది. ఈ విషయాన్ని గీత - తొమ్మిదవ అధ్యాయం కూడా ధ్రువపరుస్తుంది.

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి

పుణ్యఫలంగా స్వర్గానికి వెళ్ళిన వారు పుణ్యఫల భోగాన్ని అనుభవించి, పుణ్యము క్షీణించ గానే మళ్ళీ భూలోకం చేరుతారని గీతాబోధ.

చావడం తిరిగి పుట్టడానికే అయితే, పుట్టుక మాట అలా ఉంచితే, చావుకు కూడా అర్థం లేకుండా పోతుంది. ఇలాంటి వ్యర్థ ప్రయాణాలు, అనర్థ ప్రమాణాలు చేరలేని దివ్యధామమే వేదం చెప్పిన పరంధామం. అదే పరమపదం. అదే ఈ శ్లోకంలో అనామయ పదం. అంటే, సర్వోపద్రవ రహిత స్థితి. ఏ బాధలు, ఉపద్రవాలు లేని స్థితి.

యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ

అర్జునా! ఎక్కడికి చేరితే తిరిగి రావడ మంటూ ఉండదో అదియే నా పరంధామం అని గీత - పదిహేనవ అధ్యాయంలో భగవంతుడు చెబుతాడు.

ఏది పరంధామం? పరమేశ్వరుని ధామమే పరంధామం. అది ఎక్కడ? పరమేశ్వరుడు ఏమిటో తెలిస్తే, ఆయన పరంధామం ఎక్కడో అర్థ మవుతుంది.

సృష్టికి పరమేశ్వరుడు అభిన్న నిమిత్త ఉపాదాన కారణం కావడం చేత పరమేశ్వరుని కన్నా వేరుగా సృష్టి లేదు. ఉండలేదు. సృష్టి రూపంలో ఉన్నది పరమేశ్వరుడే. విశ్వమున్న చోటే విశ్వేశ్వరు డున్నాడు. విశ్వం లేక పోయినా, విశ్వేశ్వరుడు దివ్యంగా ప్రకాశిస్తూ ఉంటాడు. అదే అతని అనంత వైభవం. అనంతం అనేది ఒక ప్రదేశంలో ఉంటుందా? అనంతం జ్ఞానరూపంలో ఉంటుంది. జ్ఞానం కలిగిన వ్యక్తి అనంతు డవుతాడు. అనంతుడు ఎక్కడికి పయనిస్తాడు? ఎక్కడ నుండి ప్రయాణం ఆరంభిస్తాడు? ఎక్కడికి చేరుతాడు? అనంతుడు చేరడానికి తన కన్నా అన్యంగా ఏముందని? ఏ ప్రదేశ ముందని? కనుకనే,

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి - బ్రహ్మమును తెలుసుకొనే వాడు బ్రహ్మమే అగుచున్నాడు.

బ్రహ్మవిదాప్నోతి పరమ్ - బ్రహ్మవిదుడు పరంధామమును పొందుతున్నాడు.

తానే పరంధామంగా విలసిల్లు తున్నాడు. పరమపదంగా శోభిస్తున్నాడు. అనామయ పదంగా భాసిస్తున్నాడు. అదే విష్ణుపదం. విష్ణువు అంటే, అంతటా ఉండేవాడు *(వ్యాపన శీలం)*. అంతేగాని, ఏదో ఒక లోకంలో ఊరేగే వాడు కాడు. ఊరించేవాడూ కాడు. కనుక పరంధామం, లేదా పరమపదం, లేదా అనామయపదం అనేది లౌకిక స్థానం కాదు. అలౌకిక ధామం. స్వరూప ధామం. అదే మోక్షం. అది ఉన్నదే గాని కానున్నది కాదు. అందుకనే, జన్మబంధ వినిర్ముక్తుడు అనామయ పదమును చేరుతాడని గీతాచార్యుడు బోధిస్తే, అది మరణించిన తరువాత కలిగేది కాదు, జీవించి ఉండగానే, ఇక్కడే ఇప్పుడే స్వరూపంగా పొందబడేది అని శ్రీ శంకరాచార్య స్వామి భాష్యంలో ఉద్బోధించారు *(జీవన్తః ఏవ జన్మబంధ వినిర్ముక్తాః సన్తః పదం పరమం విష్ణోః మోక్షాఖ్యం గచ్ఛన్తి)*.

ఇది కేవలం జ్ఞానం వల్ల ప్రాప్తించేది. నువ్వు ముక్తుడవు అయ్యే ఉన్నావు. కనుకనే, జ్ఞానం మోక్షాన్ని ప్రసాదిస్తూ ఉంది. ఒకవేళ ఇప్పుడు ముక్తుడవు కాకపోతే, మోక్షం క్రొత్తగా వచ్చేది అయితే, ఒక కాలంలో వస్తుంది కనుక మరొక కాలంలో తప్పకుండా పోతుంది.

కనుక నీవు నిత్యముక్తుడవే. ఇదే శాస్త్ర తాత్పర్యం. నిత్య ముక్తుడవు కనుక బంధ మనేది లేనే లేదు. ఇప్పుడు లేదు. ఇంతకు పూర్వం లేదు. ఇక ముందు ఉండబోదు. బంధం లేనిదే. బంధం లేదు అని గుర్తించ నంత కాలం బంధం ఉంటుంది. లేకనే ఉన్నట్లు ఉంటుంది. కనుక లేని దానిని లేనట్లు, ఉన్న దానిని ఉన్నట్లు గుర్తించడమే జ్ఞానం.

జ్ఞానం వల్లనే మోక్షం ప్రాప్తిస్తుంది *(జ్ఞానాదేవతుకైవల్యం)*. నిష్కామ కర్మయోగము యొక్క గమ్యస్థానము జ్ఞానమే. సమత్వబుద్ధి గల యోగి చిత్తశుద్ధిని పొంది, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతాడు. కనుక కర్మయోగము కూడా మోక్షహేతువే.

పల్లవి : **గోవిందా! గోవిందా! జన్మలన్నీ గోవింద!**
జన్మలన్నీ గోవిందా! కర్మములన్నీ గోవింద!

అనుపల్లవి : **శరణన్న వారికి గోవిందా! గోవిందా!**
మరణము గోవింద! జననము గోవిందా! *॥ గోవిందా ॥*

చరణములు : **(1) జన్మల బంధాలు గోవిందా గోవిందా**
జీవుల సంబంధాలు గోవిందా గోవిందా
బాధలు గోవింద! బరువులు గోవింద!
కష్టాలు నష్టాలు గోవిందా! గోవిందా! *॥ గోవిందా ॥*

(2) లోకము గోవింద శోకము గోవింద
పాపము గోవింద పుణ్యము గోవింద
చేతి గీత గోవింద నొసటి రాత గోవింద
ఆశలు గోవింద పేరాశలు గోవిందా! *॥ గోవిందా ॥*

అని గోవిందా - గోవిందా అంటూ సరిపెట్టుకుంది చైతన్యగీతం.

ఆత్మ తత్త్వాన్ని అచ్యుతుని నుండి ఆలకించాడు అదృష్టవంతుడైన అర్జునుడు. ఆత్మతత్త్వాన్ని పొందడానికి అనువైన అంతఃకరణ శుద్ధిని ప్రసాదించే కర్మయోగాన్ని కూడా దివ్యంగా ఆలకించాడు. ఈ కర్మయోగం ద్వారా కలిగే చిత్తశుద్ధి వలన ఏర్పడే సమత్వబుద్ధి తనకు ఎప్పుడు ప్రాప్తిస్తుందో, అనామయపదం ఎప్పుడు

సిద్ధిస్తుందో అనే జిజ్ఞాస అర్జునుని మనస్సులో కదులుతూ ఉందని పరమేశ్వరుడు గ్రహించాడేమో! ఆ విషయాన్ని కూడా తరువాత రెండు శ్లోకాలలో చెబుతున్నాడు.

యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి ।
తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52

యదా-తే-మోహకలిలం-బుద్ధిః-వ్యతితరిష్యతి
తదా-గంతాసి-నిర్వేదం-శ్రోతవ్యస్య-శ్రుతస్య-చ

యదా	= ఎప్పుడు	తదా	= అప్పుడు
తే	= నీ యొక్క	శ్రోతవ్యస్య	= వినవలసిన దాని విషయంలో
బుద్ధిః	= బుద్ధి	శ్రుతస్య చ	= వినిన దాని విషయంలో
మోహకలిలం	= మోహ కాలుష్యమును	నిర్వేదం	= వైరాగ్యమును
వ్యతి తరిష్యతి	= దాటేస్తుందో	గంతాసి	= పొంద గలవు

అర్జునా! నీ బుద్ధి మోహ కాలుష్యాన్ని దాటాలి. అప్పుడు వినదగిన విషయాల లోను, విన్న విషయాల లోను నీకు విరక్తి కలుగుతుంది.

వ్యాఖ్య

వివేకము లేకపోవడమే 'మోహం' *(అవివేక రూపం)*. 'కలిలం' అంటే కాలుష్యము. మాలిన్యము. 'మోహ కలిలం' అంటే, అవివేక రూపమైన మాలిన్యము అని అర్థం *(అవివేక రూపం కాలుష్యం)*. వివేకం లేని బుద్ధికి ఎటు పోవాలో, ఎందుకు పోవాలో అర్థం కాదు. అవివేకం వల్ల ఉన్న దానిని లేనట్లు, లేని దానిని ఉన్నట్లు అర్థం చేసుకొనే ప్రమాదం కూడా ఉంటుంది. ఏది అర్థమైతే, దాని పైనే మనస్సులో ఆసక్తి కలుగుతుంది. దేనిపై ఆసక్తి ఉంటే, దాని వైపే బుద్ధి పరుగులు తీస్తుంది. మోహాత్మక మైన మనస్సుకు అనిత్య మైనదే నిత్యంగా కనిపిస్తుంది కనుక, అట్టి మనస్సు అనిత్యాల వైపే ప్రయాణం చేస్తూ ఉంటుంది. అంతేకాదు, నిత్యమైన దాని వైపు పోకుండా నిరోధిస్తూ ఉంటుంది కూడా. ఈ మోహం ఆత్మానాత్మ వివేక జ్ఞానాన్ని కలుషితం చేస్తుంది *(యేన ఆత్మానాత్మ వివేకబోధం కలుషీకృత్య)*. మనస్సును విషయాల వైపు ప్రవర్తింప చేస్తుంది *(విషయం ప్రతి అంతఃకరణం ప్రవర్త్యతే)*. ఈ మోహ కాలుష్యాన్ని బుద్ధి దాటి పోవాలి. అలా దాటి పోవడం అంటే, మోహ మాలిన్యాన్ని అతిక్రమించాలి. నిర్మలం కావాలి. శుద్ధి పడాలి *(తత్ తవ బుద్ధిః వ్యతితరిష్యతి. శుద్ధి భావమ్ ఆపత్స్యతే ఇత్యర్థః)*. అప్పుడే యోగబుద్ధి సిద్ధిస్తుంది.

అవసరం లేనివి అవసరాలుగా తెలుస్తూ ఉంటే, జీవితంలో ఏది అవసరమో కూడా అర్థం కాకుండా పోతుంది. అనవసరమైన విషయాల పట్ల ఆసక్తి లేకపోవడం కూడా ప్రగతి సూచకమే. మనకు అవసరం లేనివి ఇతరులకు అవసరం కావచ్చు. వాళ్ళకు ఆసక్తి ఉన్న విషయాలపై మనకు ఆసక్తి ఉండ నవసరం లేదు. మనకు ఏది కావాలో అది క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. దాని పైనే మనకు అనురక్తి ఉండాలి. ఇది వివేకం. అనవసరాలను ఆలింగనం చేసుకోవడం అవివేకం. అదే మోహం. దాని వల్ల ఏర్పడే అశుద్ధమే కాలుష్యం. ఇదే మోహ కాలుష్యం. ఇది తొలగితే, ఇంత వరకు వినిన విషయాల పట్ల **(శ్రుతం)**. వినబోయే విషయాల పట్ల **(శ్రోతవ్యం)** నిర్వేదమును పొందుతావు అంటున్నాడు గీతాచార్యుడు.

వినింది వికలం

ఈ శ్లోకం సాధకులకు చాలా ఉపయుక్త మైంది. దారి తెలియక దగా పడే వారికి ఇదొక దారిదీపం

వంటిది. అక్షరాభ్యాసం నాడే అక్షర స్వరూపం తెలిసి రానట్లు ప్రారంభం లోనే అందరూ వివేకంతో ఎలా చరిస్తారు? ఆ మార్గంలో చరిస్తూ ఉంటే, క్రమేపి వివేకం ఉదయిస్తుంది. వివేకం ఉదయించే లోగా వ్యక్తిలో ఏదో జరిగి పోతుంది.

వ్యక్తిలో వివేకం ఉదయించ లేదని, అవివేకం చూస్తూ కూర్చుంటుందా? తన వ్యాపక మేదో తనకు ఉండనే ఉంటుంది. తన వ్యాపారము తాను సాగిస్తూనే ఉంటుంది. ఇది ఎంత వరకు ప్రాకి పోతుంది అంటే, వివేకం వచ్చినా ప్రవేశించడానికి వీలు లేనంతగా మనస్సులో నిండి పోతుంది. ప్రతి సాధకునికి ఇదొక కాళరాత్రి వంటిది.

వివేకం లేనివాడు కనుక ఎక్కడెక్కడో ఏదేదో వింటాడు. జ్ఞానం లేదు కనుక వినింది అంతా వాస్తవమే నని భ్రమిస్తాడు. అదే సత్యమని అతుక్కు పోతాడు. గమ్యం నిర్దిష్టంగా ఉండదు కనుక మార్గం కూడా నిర్ణీతంగా ఉండదు. ఎటు పోవాలో, ఏమి చేయాలో అర్థం కాదు. ఈ లోగా మరొకటి వింటాడు.

అన్ని మార్గాలు ఒకే గమ్యం వైపు నడుస్తాయి. ఏ మార్గమైనా గమ్యం చేర్చేదే అని ఎవరో బాకా ఊదుతూ ఉంటే అది వింటాడు. ఈ అస్తవ్యస్త వాక్యానికి రోమ్ నగరం ఒక ఉదాహరణ. అంతే, ఇక ఆ తరువాత ఎటు పడితే అటు పోవడమే. ఏది కనిపిస్తే అదే దారి. అదేమి టంటే, రోమ్ నగరం అంటాడు. ఇక ఆ నాలుకపై 'రోమ్' ఉంటుందే గాని, 'రామ్' ఉండదు.

విినిన వన్నీ విడ్డూరాలే. వివేకం లేనపుడు వినే వన్నీ విచిత్రాలే. ఈ విచిత్రాలు బుద్ధిని ఎంతగా వికలం చేస్తాయో ఇపుడు తెలియదు. బుద్ధిని శుద్ధి చేసుకోవడానికి శ్రీకారం చుట్టిన నాడు ఎంత చెత్త చేరి పోయిందో అర్థ మౌతుంది.

- *ఇలా చేస్తే మూడు నెలల్లో ముక్తి ముంగిట నిలుస్తుంది.*
- *ఈ మార్గంలో నడిస్తే బొందితో కైలాసం పోవచ్చు.*
- *ధ్యానం చేయకపోతే మోక్షం రాదు.*
- *టిక్కెట్టు లేకుండా సినిమా హాల్లోకి పోలేవు. శరీరంపై ఈ చిహ్నాలు లేకపోతే దైవసన్నిధి లోకి ప్రవేశించ లేవు.*
- *మానవసేవ లోనే మోక్షం లభిస్తుంది.*
- *భగవంతుడు ఆ లోకంలో ఉంటాడు. అలా ఉంటాడు. ఇలా ఉంటాడు.*

ఇలాంటి మహావాక్యాలు వందల్లో కాదు, వేలల్లో ఉన్నాయి. వెతికితే లక్షల్లో కూడా దొరుకుతాయి. ఎన్నని? ఎందరని? ఇంకెక్కడి వివేకం? బుద్ధే వికలమై పోయింది.

వినబోయేది వైకల్యం

ఇది విన్నాను - అది వినాలి.
ఇది చదివాను - అది చదవాలి.
వీళ్ళు చెప్పింది ఆచరించాను - వాళ్ళు చెప్పింది ఆచరించాలి.
ఇక్కడికి పోయాను - అక్కడికి పోవాలి.
ఈ ధ్యానం చేశాను. ఆ ధ్యానం చేయాలి.
ఇందులో ఏదో దొరికింది - అందులో ఏం దొరుకుతుందో చూడాలి.

ఇలా పలవరిస్తూ ఉంటారు. అంతా తిరుగుతూ ఉంటారు. అన్నీ కావాలి. ఎన్నెన్నో కావాలి. ఏదీ వదలరు. దేనినీ పట్టుకోరు. వారానికి ఒక ఆశ్రమం. రోజుకో గురువు. క్షణం చిత్తం. క్షణం మాయ. అంతా మాయే. మాయే మహిమ. ఇదంతా మోహ కాలుష్యం. వివేకం లోపించడం వల్ల ఏర్పడిన బుద్ధి దోషం.

మనిషే కాదు చీకటిలో
ఛాయ కూడా కనబడదు
మహిమే కాదు మోహములో
మాయ కూడా కనిపించదు
వెలుగుల లోనే విచారము
తానే వెలుగును వివేకము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ - ఇదొక రామకోగి చిట్కా.

అంతా మంచే - అన్నీ మంచివే

జ్ఞానం ఎవరి నుండైనా రావచ్చు. దిక్కు లేని వారికి ఏ దిక్కు నుండైనా వినిపించ వచ్చు. ఎవరు చెప్పినా వినాలి. వినపడింది వినాలి (*శ్రోతం శ్రోతవ్యం*). కనపడింది చూడాలి (*దృష్టం దృష్టవ్యమ్*). ఏ పుట్టలో ఏ పాముందో! ఏ పెట్టెలో ఏ తేలుందో! దూరపు కొండలు నునుపు - దగ్గర తొండలు మెరుపు . . . అదేమి టంటే, తొండ పరుగు కంచె వరకు అని మరొక విరుపు.

ఇలా విని విని ఎందరో పాడయ్యారు. వినాలి అనుకొని ముస్ముందు ఇంకెందరో పాడు కావటానికి సిద్ధంగా ఉన్నారు. ఇలా వినిన విషయాల పట్ల, వినబోయే విషయాల పట్ల ఎవరికి ఆసక్తి ఉండదో, పైగా వైరాగ్యం ఉంటుందో, అట్టి వారికి యోగబుద్ధి సిద్ధించింది అని అర్థం.

నిరాశ కాదు - నిర్వేదం

అవసరం లేని దాని విషయంలో ఆశ కదలకుండా ఉండటం నిరాశ కాదు. నిర్వేదం. వైరాగ్యం. రాగం లేని స్థితి. నిస్సారమైన విషయాల పట్ల అరుచి. వాస్తవానికి ఇదొక గొప్ప సంపద. వైరాగ్య సంపద. సాంఖ్య, యోగాలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న వారికి అనిత్యమైన విషయాల పట్ల కలిగే అనాసక్తి. నిర్వేదం. ఇంతవరకు వినినవి (*శ్రుతం*), ఇక మీదట వినబోయేవి (*శ్రోతవ్యం*) ఏవైనా నిష్ఫలమే అనే వివేకం. జ్ఞానం (*శ్రోతవ్యం శ్రుతం చ నిష్ఫలం ప్రతిపద్యతే ఇత్యభిప్రాయః*). అలం బుద్ధి లక్షణం. ఇది చాలు. చాలు. చాలు అనే తృప్తిలో యోగబుద్ధి సారించిన విలక్షణ దృక్పథం. వైరాగ్య దర్శనం.

ఇది వారికి ఎలా సాధ్యమైంది? అంతకు మించి పొంద దగింది లేదు కనుక. వేదాంత జ్ఞానమునకు మించిన సత్యం ఏముంది? యోగనిష్ఠలో ఉన్న వ్యక్తికి ఇహపర విషయాల యందు ఉన్న వైరాగ్యాన్ని కదిలించే శక్తి ఏ సిద్ధాంతానికి ఉంది?

ఈ ప్రపంచము దేని చేత ప్రకాశిస్తూ ఉందో (*యేన ప్రకాశతే విశ్వం*), దేని యందు లయించిపోతూ ఉందో (*యత్రైవ ప్రవిలీయతే*), అట్టి పరమశాంత స్వరూపమైన, శ్రేష్ఠపదమైన బ్రహ్మమును నేనే (*తద్బ్రహ్మ పరమం శాన్తం తద్బ్రహ్మాస్మి పరం పదమ్*). ఇది ఉపనిషత్తు ప్రసాదిస్తున్న ఆత్మజ్ఞానము. దీనికి మించి పొంద దగింది ఏముంది? ఇంతకు మించిన ఆకర్షణ ఎక్కడుంది? అందుచేత వేదాంత వన విహారం చేసే యోగయుక్తునికి, జ్ఞాననిష్ఠునికి ఈ ప్రపంచంలో వినిన విషయాల పట్ల, వినబోయే విషయాల పట్ల ఆసక్తి ఉండదు. అనురక్తి ఉండదు. అంతా నిర్వేదమే. వైరాగ్య విభూతి ప్రదర్శనమే. అంతా చిన్మయమే (*సర్వం సచ్చిన్మయం తతమ్*). ఇక నేను కోరుకో దగింది ఏముంది? (*కిం అన్యత్ అభివాంఛామి ?*) అని నిత్యతృప్తితో పరవశించి ప్రశ్నించాడు ఉపనిషత్తులో మహర్షి.

ప్రపంచంలో వినిన సాధన సాధ్య విషయాలే గాక, వేదం లోని సాధ్య సాధనల విషయంలో కూడా యోగ బుద్ధి విలక్షణం గానే ఉంటుంది. వైరాగ్యం తోనే ఉంటుంది అంటున్నాడు.

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధావచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53

శ్రుతివిప్రతిపన్నా-తే-యదా-స్థాస్యతి-నిశ్చలా
సమాధౌ-అచలా-బుద్ధిః-తదా-యోగం-అవాప్స్యసి

శ్రుతివిప్రతిపన్నా	= వేదవాదాలతో కలత చెందిన	యదా	= ఎప్పుడు
తే	= నీ యొక్క	స్థాస్యతి	= నిలబడుతుందో
బుద్ధిః	= బుద్ధి	తదా	= అప్పుడు
నిశ్చలా	= చలింపనిదై	యోగం	= యోగమును
అచలా	= స్థిరముగా	అవాప్స్యసి	= పొంద గలవు
సమాధౌ	= సమాధి యందు		

అనేక విషయాలను, వేద వాదాలను ఆలకించి విచలితమైన నీ బుద్ధి ఆత్మ యందు నిశ్చలంగా నిలవాలి. అప్పుడే యోగాన్ని పొంద గలవు.

వ్యాఖ్య

ప్రతిచర్యలు లేని యోగము, ప్రతిబంధకాలు లేని జ్ఞానము - ఈ రెండూ చాలా ప్రధాన మైనవి. ఆత్మ ఉన్నదే. ఆత్మజ్ఞానమే ఇప్పుడు తన వద్ద లేనిది. కనుక ఆత్మజ్ఞానానికి సాధకుడు యత్నించాలి. ఉన్న దానికి సంబంధించిన జ్ఞానమే కనుక విచారము కొనసాగించాలి. ఇక్కడ భగవత్కృప ఆచార్యుని రూపంలో, ప్రమాణ రూపంలో ఉంటుంది. ప్రమాణ విచారం చక్కగా జరిగితే ప్రమ కలుగుతుంది. ప్రమ అంటే జ్ఞానము.

ఇలాంటి జ్ఞానము కలగాలి అంటే, మనస్సు శుద్ధిపడి ఉండాలి. అంటే, రాగద్వేషాల చేత అశుద్ధమైన మనస్సు, వాటి నుండి విడిపడి విశుద్ధం, ప్రసన్నం కావాలి. అందుకు సహకరించేదే కర్మయోగము. కనుక యోగము జ్ఞాన సాధనము.

సాధారణంగా మనస్సు చలన స్వభావం కలిగి ఉంటుంది. అనేక విషయ సంపర్కం చేత బుద్ధి వికలమై ఉంటుంది. విషయ ప్రపంచం యొక్క అస్థిరత్వం అర్థమైతే వికలమైన బుద్ధి వైరాగ్యంతో శోభిస్తుంది. కలత చెందకుండా ఉంటుంది.

విషయ ప్రపంచంలో అనేక విషయాలను, సాధన సాధ్యాలను గూర్చి విని, చూచి, ఆలోచించి, విక్షిప్త మైన మనస్సు, ఈ మోహ కాలుష్యాన్ని దాటి నపుడు దేనికీ కలత చెందకుండా నిర్వేదంతో విలక్షణంగా ఉంటుంది అని యాభై రెండవ శ్లోకంలో చూశాం. ప్రపంచంలో మనస్సు ఎలాగైతే విక్షిప్త మైందో, అలాగే వేదం లోని కర్మకాండ వల్ల కూడా విక్షిప్త మయ్యే అవకాశం ఉంది.

శ్రుతులలో వేరు వేరు సాధనలు, వేరు వేరు ఉపాసనలు చెప్పబడ్డాయి. వేరు వేరు సాధనలకు వేరు వేరుగా సాధ్యాలు నిర్ణయింపబడి ఉన్నాయి. వీటిలో ఏది ఆచరణీయమో ఏది కాదో, ఏది అవసరమో, ఏది అనవసరమో అర్థం కానపుడు, మనస్సు విచలిత మవుతుంది. విక్షిప్త మవుతుంది.

మనకు ఏది కావాలో అది నిశ్చయంగా తెలిస్తే, ఆ తరువాత సాధ్యసాధనాలు ఎన్నున్నా అవి మనలను కలత పెట్టలేవు. వాటి ప్రభావం మన మీద ఉండదు. అవన్నీ ఉంటాయి. అయినా బుద్ధి వైరాగ్యంతో విలక్షణంగా

ఉంటుంది. సాధనసాధ్యాల విషయంలో నిశ్చయం లేక సందేహాలతో నిండి ఉన్న మనస్సునే శ్రవణాదులు కలత పెడతాయి. సంశయాలు లేని బుద్ధికి అవి విక్షేపాన్ని కలిగించ లేవు.

కళ్ళు లేని వ్యక్తిని ఏ రూపం కలత పెడుతుంది? వినికిడిని కోల్పోయిన వ్యక్తిని ఏ శబ్దం బాధిస్తుంది? అలాగే, నిశ్చయ జ్ఞానంతో సంశయ నివృత్తి జరిగి, పురుషార్థ నిశ్చయం స్థిరంగా ఉండి, సాంఖ్య, యోగాలకు సంబంధించిన అవగాహన స్థిరంగా ఉన్న వ్యక్తి మనస్సును వేదం లోని కర్మకాండ కూడా అస్థిర పరచ లేదు.

సర్వే వేదాః యత్పద మామనన్తి - సర్వ వేదాలు ఏ బ్రహ్మమును గూర్చి చెబుతున్నాయో, ఆ బ్రహ్మమే ఏకైక గమ్యముగా గల సాధకుని బుద్ధిని కర్మలు కలత పెట్టలేవు.

అర్జునా! శ్రుతుల లోని సాధ్యసాధన సంబంధము లైన విషయాలను శ్రవణం చేయడం చేత విప్రతిపన్న మైన, అంటే విక్షిప్త మైన (నిలకడను కోల్పోయిన) బుద్ధి, ఏ సమయంలో నిశ్చల మవుతుందో, స్థిర పడుతుందో, ***(యదా స్థాస్యతి నిశ్చలా, యదా యస్మిన్ కాలే, స్థాస్యతి స్థిరీభూతా భవిష్యతి, నిశ్చలా చలన వర్జితా సతి)*** సంశయాలు లేకుండా అచలమై ఉంటుందో ***(అచలా)*** అప్పుడు యోగాన్ని పొందులావు ***(తదా యోగమ్ అవాప్స్యసి)*** అంటూ ఈ కర్మయోగ ప్రకరణాన్ని సమాప్తం చేస్తున్నాడు గీతాచార్యుడు.

ఈ శ్లోకంలో ఒక్క పదాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే సరిపోతుంది. 'చిత్తం ఎక్కడ నిలకడగా ఉంటుందో' అంటున్నాడే, అది ఎక్కడ? అదే సమాధి అనే పదం. అంటే దేని మీద బుద్ధి నిశ్చలంగా ఉంటుందో అది సమాధి ***(సమాధా వచలా బుద్ధిః సమాధౌ - సమాధీయతే చిత్తం అస్మిన్ ఇతి సమాధిః ఆత్మా)***. ఇక్కడ సమాధి అంటే ఆత్మ అని అర్థము. ఏ విక్షేపాలు లేకుండా, వికల్పాలు లేకుండా ఆత్మ యందు బుద్ధి స్థిరంగా ఉండటమే సమాధి. ఆ సమయం లోనే యోగబుద్ధి స్థిరంగా ఉంది అని అర్థం ***(తస్మిన్ కాలే యోగం అవాప్స్యసి)***. చిత్తైకాగ్రత సిద్ధించింది అని భావం. బుద్ధి ఆత్మలో స్థిరపడి నపుడు యోగబుద్ధిని పొందినట్లు నిశ్చయం. దీనినే బుద్ధి అనకుండా ప్రజ్ఞ అని ప్రవచించారు భాష్యంలో ఆచార్యులు. వివేక ప్రజ్ఞను సమాధిగా అభివర్ణించారు ***(యోగమ్ అవాప్స్యసి, వివేక ప్రజ్ఞాం సమాధిం ప్రాప్స్యసి)***. సమాధిలో వివేక ప్రజ్ఞ యొక్క స్థిరత్వము గోచరిస్తుంది.

ఇది వినగానే, స్ఫూర్తితో స్పందించిన అర్జునుడు, పార్థసారథిని ప్రశ్నించే అవకాశం లభించి నందుకు పొంగిపోతూ ***(ప్రశ్న బీజం ప్రతిలభ్య)***, *వివేక ప్రజ్ఞను పొందిన, సమాధి స్థితుడైన, ఆత్మ యందు ప్రజ్ఞ స్థిరపడిన స్థితప్రజ్ఞుని లక్షణాలను వాసుదేవుని నుండి వినాలనే కుతూహలంతో ఇలా ప్రశ్నిస్తున్నాడు.*

అర్జున ఉవాచ :

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥ 54

స్థితప్రజ్ఞస్య-కా-భాషా-సమాధిస్థస్య-కేశవ
స్థితధీః-కిం-ప్రభాషేత-కిం-ఆసీత-వ్రజేత-కిం

కేశవ	= కృష్ణా!	కిం	= ఏమి
సమాధిస్థస్య	= సమాధి యందున్న	ప్రభాషేత	= భాషించును?
స్థితప్రజ్ఞస్య	= స్థిరబుద్ధి గల వాని యొక్క	కిం	= ఎట్లు
భాషా	= భాషణము	ఆసీత	= కూర్చొనును
కా	= ఏది?	కిం	= ఏ విధంగా
స్థితధీః	= స్థితప్రజ్ఞుడు	వ్రజేత	= చరించును?

అర్జునుడు అడుగుతున్నాడు :

కేశవా! ఆత్మ స్థితుడైన స్థిత ప్రజ్ఞుని లక్షణ మేమి? స్థితప్రజ్ఞుడు ఏమి మాట్లాడుతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా సంచరిస్తాడు?

వ్యాఖ్య

అసమాన అద్భుత దీప్తి
అరుదైన అపూర్వ కీర్తి

ధర్మం అనేది లక్షణం. దానికి రూపం లేదు. బుద్ధిలో భాసిస్తుంది. రూపం లేని ధర్మం రూపాన్ని ధరిస్తే ఎలా ఉంటుంది అంటే ఏమి చెప్పగలం? 'శ్రీరాముడిలా ఉంటుంది' అని అనగలం. అంతే.

ప్రేమ అనేది కూడా లక్షణమే. ప్రేమకు కూడా రూపం లేదు. రూపం లేని ప్రేమ భావంలో చలిస్తుంది. హృదయంలో ఊరేగుతుంది. రూపం లేని ప్రేమ ఎలా ఉంటుంది అంటే సమాధానం ఏం చెప్పగలం? 'శ్రీకృష్ణ పరమాత్మలా ఉంటుంది' అని చెప్పగలం. అంతే.

మరి, జ్ఞానం? ఆత్మ లక్షణమైన అద్భుత జ్ఞానం ఎలా ఉంటుంది? అంటే, తిరిగి ఏం జవాబు చెప్పాలి? చెప్పడానికి మాటలు ఎక్కడ నుండి తెచ్చుకోవాలి? మరుగున పడిపోతున్న మనస్సుతో ఏమని ఊహించాలి? మేలుకొని మాట్లాడాలా? నిద్రించి కల కనాలా? మైమరచి నిద్ర పోవాలా? ఎక్కడ నుండి పలకాలి? ఏమని చెప్పాలి? ఏమీ చెప్పలేక రెండు చేతులు జోడించి, ఆచార్యదేవులు శ్రీ ఆదిశంకరుల వారి వైపు చూడాలి. చూడమని చెప్పాలి. అంతే.

గీతలో మనం అధ్యయనం చేస్తున్నది రెండవ అధ్యాయం. ఇది ద్వితీయం. అద్వితీయం. అధ్యాయం ఆరంభం లోనే శరణాగతిని చెప్పుకున్నాం. ఆ తరువాత ఆత్మజ్ఞానమైన సాంఖ్యాన్ని అధ్యయనం చేశాం. ఆ తరువాత ప్రాసంగిక విషయంగా ధర్మాన్ని గూర్చి విన్నాం. మళ్ళీ సాంఖ్యము నుండి లంకెను అంది పుచ్చుకొని పవిత్రమైన ప్రసాదం లాంటి కర్మయోగాన్ని విన్నాం. ఇక ఇప్పుడు స్థితప్రజ్ఞుని లక్షణాలను వినబోతున్నాం.

స్థితా ప్రతిష్ఠితా అహమస్మి పరంబ్రహ్మ ఇతి ప్రజ్ఞా యస్య సః స్థితప్రజ్ఞః

నేనే పరబ్రహ్మమును అని ఎవని ప్రజ్ఞ, లేదా జ్ఞానము స్థితమై, అంటే స్థిరమై నిలిచి ఉందో, అతడే స్థితప్రజ్ఞుడు. బ్రహ్మజ్ఞాని. జీవన్ముక్తుడు.

దేవుడు ఎలా ఉంటాడో అని ఆలోచించే వారు ఎవరిని దర్శించి ఇలా ఉంటాడా! అని తృప్తి చెందుతారో, అతడే స్థితప్రజ్ఞుడు.

తనపై ఎటువంటి ప్రభావం చూపలేని ప్రపంచాన్ని, సంకల్పం కూడా లేకుండా, కేవలం సన్నిధి అనుగ్రహం చేతనే విశేషంగా ప్రభావితం చేస్తాడు. యావద్విశ్వానికి నీడ నిచ్చే ఆ జ్ఞాన తరువు యొక్క వ్రేళ్ళు వేదంలో పాతుకొని ఉంటాయి. అతనిని మలిన పరచే వస్తువు లేదు. పాడు చేసే శక్తి లేదు.

ఏది వచ్చినా అతనికి ఆనందమే. అతడు ఆహ్వానం పలకడం తెలియని వాడు. ఏది దూరమైనా అతనికి ఆనందమే. అతడు వీడుకోలు చెప్పడం అర్థం కానివాడు. సర్వమూ ఆ వ్యక్తికి సంతతానంద సంధాయకమే. కారణం, అతడు వ్యక్తి కాడు, అద్భుత శక్తి.

సుఖాలు అతణ్ణి వరించి సమీపిస్తాయి. అయ్యో! సంతోష పరచలేక పోయామే అని దిగులుతో వెను దిరిగి పోతాయి.

మేము ఆవరిస్తే ఉక్కిరిబిక్కిరై ఊపిరి ఆడకుండా విలపించే వాళ్ళనే చూశాము. చింత చెందని వాణ్ణి, కన్నీళ్ళు ఒలికించని వాణ్ణి, దరహాసము చెదరని పూర్ణచంద్ర శోభతో ప్రకాశించే పవిత్రాత్ముణ్ణి ఇంత కాలానికి చూడగలిగామని కష్టాలు పరవశిస్తాయి.

నదులొచ్చి పడుతున్నా పెరుగుదల లేని సముద్రం లాగా, ఏది వచ్చినా, ఎంత వచ్చినా పొంగని వాడు. జలాలు ఆవిరై పోతున్నా తరుగుదల అర్థం కాని సాగరం లాగా ఏది పోతున్నా, ఎవరు పోతున్నా క్రుంగని వాడు. నిర్వికార స్వరూపుడు.

ప్రాపంచిక పెనుగాలులు దారుణంగా వీస్తున్నా, ఏ మాత్రం కదలిక లేకుండా ప్రకాశించే జ్ఞాన ప్రదీపుడు. సర్వశక్తి స్వరూపుడు.

దేవాలయం కదలదు. దేవాలయంలో దేవుడు పలకడు. కదిలే దేవాలయంలో పలికే దేవుడే స్థితప్రజ్ఞుడు. ముముక్షువులు ప్రయత్నించి సంపాదించుకో వలసిన పవిత్ర సాధనలను సహజ లక్షణాలుగా పొందిన పావనాత్ముడు. కృతకృత్యుడు. ఆప్తకాముడు. అతడే స్థితప్రజ్ఞుడు. అరుదైన ఆరాధ్యమూర్తి. మానవాళికి అసమాన అద్భుత స్ఫూర్తి. లోక కళ్యాణ కీర్తి.

పార్థుని ప్రశ్న

కేశవా! ఆత్మస్థితుడైన స్థితప్రజ్ఞుని లక్షణ మేమిటి? అతడు ఏమి మాట్లాడుతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా చరిస్తాడు? ఇది అర్జునుని ప్రశ్న.

యోగబుద్ధినే ప్రజ్ఞ అనే పదంతో భాషించడం జరిగిందని మనం ముందే చెప్పుకున్నాం. ఆత్మవివేకం కలిగిన బుద్ధినే ప్రజ్ఞగా అర్థం చేసుకోవాలి. 'స్థిత' అంటే ప్రతిష్ఠితం కావడం. ఈ శ్లోకంలో **స్థితప్రజ్ఞః - స్థితధీః** అనే రెండు పదాలలో 'స్థిత' అనేది సామాన్యంగా ఉంది. ప్రజ్ఞః - ధీః అనే రెండు పదాలు ఒకే అర్థంతో వాడబడ్డాయి. ఎవరి ప్రజ్ఞ, లేదా బుద్ధి ఆత్మ యందు సుప్రతిష్ఠమై ఉందో అతడే స్థితప్రజ్ఞుడు.

స్థితప్రజ్ఞుడు ఆత్మజ్ఞాని. ఆత్మజ్ఞానికి ఉపనిషత్తులలో అనేక పేర్లు ఉన్నాయి. బ్రహ్మనిష్ఠుడు, బ్రహ్మజ్ఞాని, ఆప్తకాముడు, జీవన్ముక్తుడు - ఇలా అనేక పేర్లతో ఉపనిషత్తులు పిలిచాయి. కాని, ఈ సందర్భం లోనే, గీత లోని ఆత్మజ్ఞానికి స్థితప్రజ్ఞుడు అనే పేరును వింటున్నాము. ఇది పార్థుడు సృష్టించిన పదం.

యాభై మూడవ శ్లోకంలో ***యదా స్థాస్యతి నిశ్చలా, సమాధా వచలా బుద్ధిః*** అనే పదాలను పరమేశ్వరుడు పలికి నపుడు, అర్జునుడికి అందమైన ఆలోచన కదలి, సుందరమైన ఈ మాటను ***(స్థితప్రజ్ఞ)*** రూపొందించాడు. ఆ తరువాత, ఈ విశిష్ట నామం విశేష ప్రాచుర్యాన్ని పొందింది. ఆత్మ యందు ***(సమాధిః)*** నిశ్చలమైన ***(స్థిత)*** బుద్ధి ***(ప్రజ్ఞ)*** ఎవరికి ఉందో అతడే స్థితప్రజ్ఞుడు. పార్థుని ప్రశ్నకు సమాధానంగా స్థితప్రజ్ఞుని లక్షణాలను పద్దెనిమిది శ్లోకాలలో వర్ణించిన పార్థసారథి చివరగా, **ఏషా బ్రాహ్మీస్థితిః** అని సమాప్తం చేశాడు. ఆత్మ యందు బుద్ధి స్థిరపడటమే స్థితప్రజ్ఞత్వం కావడం వల్ల, ఇదే బ్రాహ్మీస్థితి అని సమాప్తి చేయడం జరిగింది.

పతంజలి మహర్షి బోధించిన యోగ ప్రక్రియలో ఎనిమిదవ అంగము సమాధి. ఆ సమాధికి రాకపోక లుంటాయి. అక్కడ యోగి అంతర్ముఖుడై నప్పుడే సమాధినిష్ఠుడు. బహిర్ముఖ మైనపుడు సమాధిలో లేడు అని అర్థం. కాని ఇక్కడ, **సమాధి** అనే పదాన్ని ఆత్మ గానే గ్రహించాలి. అష్టాంగ యోగ మార్గంలో వినిపించే సమాధిగా అర్థం చేసుకో కూడదు. ఇక్కడ నడిచేది జ్ఞాన ప్రకరణం.

స్థితప్రజ్ఞస్య కా భాషా - సమాధిస్థస్య అని అర్జునుడు అన్నప్పుడు అది సమాధి స్థితుడైన వానికి సంబంధించిన విషయ మని, అలా సమాధి స్థితుడైన యోగి బహిర్ముఖమై ప్రపంచంలో చరించే టప్పుడు అతడు ఎలా ఉంటాడు? అనేది ***స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్*** అనే రెండవ పాదము యొక్క అర్థమని చాలా మంది వ్యాఖ్యానిస్తూ ఉంటారు. చాలా మంది ఇలా ప్రవచించడం బాల్యంలో నేను కూడా విన్నాను. ఈ విధమైన వ్యాఖ్యానము గీతకు అన్వయించదు. గీత జ్ఞాన ప్రధానమైన మోక్షశాస్త్రము.

అర్జునుని అంతరంగం

అర్జునుని ప్రశ్న లోని ఆంతర్యం ఏమై ఉంటుంది? స్థితప్రజ్ఞుని లక్షణ మేమిటి? అతడు ఎలా మాట్లాడుతాడు? ***(కిం ప్రభాషేత?)*** ఎలా కూర్చుంటాడు? ***(కిమాసీత?)*** ఎలా చరిస్తాడు? ***(వ్రజేత కిమ్?)*** అని ప్రశ్నిస్తున్నాడు. ఇది విడ్డూరంగా లేదూ? ఒక వైపు ప్రశ్నిస్తూనే, మరొక వైపు వింటూనే, స్థితప్రజ్ఞుడు ఎలా మాట్లాడుతాడు? అని అడగట మేమిటి? అర్జునుడితో మాట్లాడుతున్న దెవరో అర్జునుడికి తెలియదా? ఠీవిగా కళ్ళెం చేత పట్టుకుని రథంలో ముందు కూర్చుని దివ్యంగా శోభిస్తున్న ముకుందుని తన ఏడుపుతో లేపి నిలబెట్టి, ఎలా కూర్చుంటాడు? అని ఇప్పుడు అడుగుతా డేమిటి? ఎలా సంచరిస్తాడో ఇన్ని సంవత్సరాలుగా చూడలేదా? అతడి సంచారాన్ని గురించి ప్రత్యేకించి ఇప్పుడు ప్రశ్నిస్తా డేమిటి? శ్రీకృష్ణుని కన్నా వేరుగా ఆత్మజ్ఞానిని, బ్రహ్మజ్ఞానిని చూడాలని కౌంతేయుడు ఉబలాట పడుతున్నాడా? కానే కాదు.

అర్జునుడు సర్వ మానవాళి ప్రతినిధి. ఆయన వేసే ప్రశ్న లన్నీ మన ప్రశ్నలే. ఆయన పొందే సమాధానా లన్నీ మన కోసమే. శ్రీకృష్ణు డెవరో, ఏమిటో తెలియకపోతే, ఈ శ్లోకంలో ***కేశవా!*** అని సంబోధిస్తాడా?

కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాః
తే యద్వశేన వర్తన్తే స కేశవః

క+అ+ఈశ - ఈ మూడు కలసి 'కేశ' శబ్దం వస్తుంది. 'క' అంటే బ్రహ్మ, 'అ' అంటే విష్ణువు, 'ఈశ' అంటే ఈశ్వరుడు. 'కేశ' శబ్దంలో త్రిమూర్తులు ఒదిగి పోయారు. ఈ ముగ్గురు మూర్తులు ఎవరికి వశపడి ఉంటారో (వ), అతడే కేశవుడు. త్రిమూర్తులను శాసించేవాడు.

స్థితప్రజ్ఞః అనడంలో కేశవుని కన్నా అన్యమైన విచిత్ర రూపాన్ని చూడాలని అర్జునుడు భావించడం లేదు. అలాగే ***ప్రభాషేత, ఆసీత, వ్రజేత*** అనే పదాలను ప్రయోగించి ప్రశ్నించడంలో స్థితప్రజ్ఞుని ఆసన సిద్ధిని దర్శించాలని అభిలషించడమూ లేదు. ఆత్మజ్ఞుడైన జ్ఞాని హర్ష శోకాలలో ఎలా ఉంటాడు? ఇంద్రియ మనస్సులను నియమిస్తాడా? ఎలా నియంత్రిస్తాడు? శబ్దాది విషయాలు అందరిని పురి కొల్పినట్లే స్థితప్రజ్ఞుని కూడా ప్రేరేపిస్తాయి కదా! వాటి విషయంలో ఎలా వ్యవహరిస్తాడు? ఇదంతా అర్జునుని అంతరంగం. అచ్యుతునికి హస్తామలకం. లేకపోతే, అంత అద్భుతంగా, గుటక మ్రింగకుండా పద్దెనిమిది శ్లోకాలను అనర్గళంగా పలికి ఆత్మజ్ఞాన వైభవాన్ని ఆవిష్కరిస్తాడా?

అస్పష్ట అవగాహన

మనం ముందుగానే చర్చించు కున్నట్లు, స్థితప్రజ్ఞత్వం అనే అద్భుత విషయాన్ని యోగ దృక్పథం నుండో, లేక మరొక కోణం నుండో దర్శించి, కేవలం పదాల యొక్క అర్థాన్నే యథాతథంగా గ్రహించి, కొందరు తదనుగుణంగా అభినయించడం మీరు కూడా చూసే ఉంటారు. వారి మాటల్లో, చేతల్లో, నడకలో ఒక విధమైన వింత ధోరణి అసహజంగా కనిపిస్తూ ఉంటుంది. వారి దృష్టిలో అదంతా స్థితప్రజ్ఞ వైభవం. అలాంటి విచిత్ర పోకడలు శ్రీకృష్ణునిలో, శ్రీ ఆదిశంకరాచార్యులలో కాగడా పెట్టి వెతికినా కనిపించవు. జ్ఞానం అనేది

బుద్ధికి సంబంధించిందే గాని, భౌతిక దృష్టిలో ప్రదర్శించే వేషభాషలు కాదు. వింత నడకలు కాదు. ఒయ్యారపు చూపులూ కాదు.

మాట్లాడుతూ, మాట్లాడుతూ మెల్లగా కళ్ళు మూస్తారు. అర్ధ నిమీలిత నేత్రాలతో అలా ఉండి పోతారు. మెల్లమెల్లగా కొద్ది కొద్దిగా మాట్లాడుతారు. మాటకి మాటకి మధ్య నిశ్శబ్దాన్ని పెంచుతుంటారు. అలా మాట్లాడాలి. అలాగే మాట్లాడాలి. లేకపోతే, స్థితప్రజ్ఞులం కాకుండా పోతామేమో అని వాళ్ళ భయం. వారి వెంట ఉండి మనం చూడాలే గాని, ఆకలి వేసినపుడు కాలు కాలిన పిల్లుల్లాగా తిరుగుతూ గగ్గోలు పెట్టేస్తారు. ఎందుకొచ్చిన బాధ ఇదంతా? బోధ అర్థం గాక స్వయంకృతంగా తగిలించుకొనే వ్యథ కాకపోతే!

ఇలా మాట్లాడితేనే స్థితప్రజ్ఞులం అవుతామేమో అనుకుంటే, మూగవాడు జ్ఞాని అయ్యే అవకాశం లేదా? ఇలా నడిస్తేనే స్థితప్రజ్ఞులం అవుతాము అనుకుంటే, కుంటివాడు ఆత్మజ్ఞానానికి అనర్హుడా? దండధారుడైన ప్రతి సన్యాసి స్థితప్రజ్ఞుడైతే, కర్ర చేతి కొచ్చిన వృద్ధు లందరూ **(వృద్ధోయాతి గృహీత్వా దండం)** స్థితప్రజ్ఞ లేగా? బరువుల్ని పెంచుకుంటూ పోతే బంధాలు తొలగవు. జ్ఞానం కలిగి నపుడే బ్రతుకులో అందాలు అరబోసు కుంటాయి. ఆనందాలు వెల్లివిరుస్తాయి.

భావ సుమాలు

ఒక పొదలో మల్లెలు విరబూస్తే అవి మనకు కనిపించక పోయినా, వాటి సౌరభాన్ని మనం ఆఘ్రాణిస్తాము. బిడ్డల వచ్చీరాని పలుకులు స్పష్టంగా లేకపోయినా, వారి ఆలోచన లేమిటో మనం పసి కట్టేస్తాము. జ్ఞానం కలిగిన వారు స్థాలీపులాక న్యాయంగా సర్వాన్ని గ్రహించేస్తారు. మనోగతాన్ని చదివేస్తారు.

ఉదీరితోఽర్థః పశునాఽపి గృహ్యతే
హయాశ్చ నాగాశ్చ వహన్తి నోదితాః
అనుక్తమ ప్యూహతి పండితో జనః
పరేంగిత జ్ఞాన ఫలాహి బుద్ధయః

మనం ఏదన్నా పలికితే, లేదా చెబితే పశువుకు అర్థ మవుతుంది. గుర్రాలు, ఏనుగులు అర్థం చేసుకొని బరువుల్ని మోస్తాయి. కాని, చెప్పని విషయాన్ని కూడా ఎవడైతే ఊహిస్తాడో వాడే పండితుడు. ఎందుకంటే, పరుల అంతరంగాన్ని అర్థం చేసుకోవడానికి మనుషులకు బుద్ధుల్ని ప్రసాదించాడు భగవంతుడు.

ఎంత అందమైన శ్లోకం! శ్లోకాలన్నీ అందం గానే ఉంటాయి. భావాలు బుద్ధికి పడితేనే బ్రతుకులు అందంగా మారుతాయి. సామాన్య విషయాలు కూడా కొందరికి అర్థం కావు. చెప్పినా తలకు ఎక్కవు. మనసుకు పట్టవు. మీరు చెప్పింది నాకు ఇలా అర్థమైంది అంటూ ఉంటారు. పశువులకు చెప్పింది చెప్పినట్లు అర్థ మవుతుంది. చాలా మంది మనుషులకు వినింది మరొక విధంగా అర్థమవుతూ ఉంటుంది.

బుద్ధిలో గంభీరత ఉండాలి. అనుపేక్ష్యత ఉండాలి (విస్మరించని సంస్కారము). సౌమనస్యము ఉండాలి. ఏవైనా, ఎవరికైనా పుట్టుకతో రావు (ప్రత్యేకతలు చర్మాంశములు కావు). ప్రయత్నిస్తే, ప్రయత్నంలో దోషం లేకపోతే, ఈ ప్రపంచంలో, ముఖ్యంగా ఆధ్యాత్మిక జీవితంలో అసాధ్యాలు అంటూ ఉండవు.

అర్జునుడు ఎంత భావస్ఫూర్తితో అర్థించాడో! లేకపోతే, పరమేశ్వరుడు సారథి స్థానాన్ని అలంకరిస్తాడా? అర్జునుని అంతరంగాన్ని అర్థం చేసుకున్న అచ్యుతుడు ఎంత అద్భుతంగా ప్రవచిస్తాడో ఈ స్థితప్రజ్ఞ వైభవంలో మనం చూస్తాం.

సాధకుడు ప్రయత్న పూర్వకంగా ఏ సాధనలను ఆచరించాలో, అవే స్థితప్రజ్ఞునిలో సహజ లక్షణాలుగా

శోభిస్తూ ఉంటాయి. ఆధ్యాత్మిక గ్రంథాలలో ఇది చాలా సహజమైన విషయం అంటారు భాష్యంలో శ్రీశంకరులు
(సర్వత్రైవ హి అధ్యాత్మ శాస్త్రే కృతార్థ లక్షణాని యాని తాన్యేవ సాధనాని ఉపదిశ్యన్తే యత్న సాధ్యత్వాత్).

శ్రీ భగవానువాచ :

ప్రజహాతి యదా కామా న్సర్వా న్పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ 55

ప్రజహాతి-యదా-కామాన్-సర్వాన్-పార్థ-మనోగతాన్
ఆత్మని-ఏవ-ఆత్మనా-తుష్టః-స్థితప్రజ్ఞః-తదా-ఉచ్యతే

పార్థ	= అర్జునా!	ఆత్మనా	= ఆత్మ చేత
యదా	= ఎప్పుడు	ఆత్మని ఏవ	= ఆత్మ యందే
మనోగతాన్	= మనస్సులో ఉన్న	తుష్టః	= సంతోషించిన వాడై ఉండునో
సర్వాన్	= సమస్తమైన	తదా	= అప్పుడు
కామాన్	= కోరికలను	స్థితప్రజ్ఞః	= నిశ్చలబుద్ధి కలవాడని
ప్రజహాతి	= విడిచి పెడతాడో	ఉచ్యతే	= చెప్పబడుచున్నాడు

భగవంతుడు చెబుతున్నాడు :

పార్థా! మనస్సు లోని సమస్తములైన కోరికలను విడిచిపెట్టి ఉంటాడు. తన లోనే తనతో సంతోషిస్తూ ఉంటాడు. అతడే స్థితప్రజ్ఞుడు.

వ్యాఖ్య

ముముక్షువుకు ఏవి మోక్ష సాధనలో అవి జీవన్ముక్తునికి లక్షణాలు. స్థితప్రజ్ఞుని లక్షణ మేమి? అని అర్జునుడు అడిగిన మొదటి ప్రశ్నకు గీతాచార్యుడు ఇలా సమాధానం చెబుతున్నాడు. మనస్సు లోని సమస్త కోరికలను సంపూర్ణముగా విడిచిపెట్టిన వాడు, తన ఆనందానికి తన మీదే ఆధారపడి ఉండేవాడు స్థితప్రజ్ఞుడు.

దేనిని ఈ ప్రపంచంలో మనం ఆశించినా, అది సుఖము అని కాదు మనం దానిని వెంబడించేది, సుఖ కారణమని. మనం సుఖకారణ మని భావించింది సుఖం కాదు అని తెలిసి నపుడు, ఆ క్షణం నుండే దానిని ఆశించడం మానేస్తాము.

సుఖం ఎక్కడ ఉంటుందో, అక్కడ సంతోషం ఉంటుంది. తృప్తి ఉంటుంది. సుఖాలు మనకు తెలియనివి కావు. మనం సంతోషంగా ఉన్న సమయాలు జీవితంలో లేక పోలేదు. తృప్తి చెందిన సందర్భాలూ లేక పోలేదు. కాని, అవే గనుక సుఖ సంతోషాలు అయితే, మనల్ని అవి సదా సుఖపెట్టి ఉండాలి. కాని, అలా జరగలేదు. అందుకనే, నిరంతరం మనం సుఖాన్వేషణలో ఉన్నాం. సంతోషానికై వెంపర్లాడుతున్నాం. తృప్తి చెందాలని శ్రమిస్తున్నాం.

ఆనందం అనేది ఒక వస్తువు కాదు. ఒక ప్రదేశం కాదు. కాలము కాదు. సన్నివేశమూ కాదు. వీటిలో ఏది మనకు నిత్యతృప్తిని ప్రసాదించినా, మనం నేడు అసంతృప్తితో ఉండేవాళ్ళం కాదు.

కాఫీ చేదుగా ఉంటుంది. పంచదారను కలిపితేనే అది తియ్యగా మారుతుంది. తీపి అనేది చక్కెర ధర్మము. తీపి లేని చక్కెర ఉండదు. కాని సుఖము అనేది వస్తువు యొక్క ధర్మము కాదు. సుఖం అనేది వస్తువే

అయితే, పంచదార కాఫీని మధురంగా మార్చినట్లు, వస్తువులు మనల్ని సుఖపెట్ట గలిగి ఉండాలి. ప్రపంచంలో వస్తువు లున్నాయి. కాని, సుఖవస్తువు లేదు. వ్యక్తులు ఉండొచ్చు. వారు మనల్ని సమీపించ వచ్చు. అంతమాత్రాన సుఖం సమీపిస్తుందని, తృప్తి లభిస్తుందని అనుకోలేము. వ్యక్తులు మనకు దూరం కావచ్చు. ఆ కారణంగా సుఖం దూర మవుతుందని, తృప్తి మాయ మవుతుందని కూడా చెప్పలేము.

ఉన్నవి సుఖానికి, తృప్తికి కారణమని కొందరు అభిప్రాయ పడుతున్నారు. అలా ఉన్నవి ఒక దశలో తృప్తిని పంచలే నపుడు, పైగా అసంతృప్తికి కారణ మైనపుడు, ఇవి తృప్తికి హేతువులు కావు అని తెలిసి వాటిని త్యజిస్తున్నారు. లేనివి ఆనంద హేతువు లని అభిప్రాయపడి వాటిని పొందటానికి మరికొందరు శ్రమిస్తున్నారు. శ్రమించి వాటిని సాధించుకున్నా, అవి ఉండి తృప్తిపరచలేక పోగా జీవితంలో అసౌకర్యంగా మారినపుడు అవి అభిలషణీయాలు కావని గ్రహించి, వాటిని ఇష్టం గానో, అయిష్టం గానో విడిచి పెట్టేస్తున్నారు.

తన ఆనందానికి తానే కారణమైన మహాత్ముడు స్థితప్రజ్ఞుడు. కనుక తాను ఉన్నాడు అంటే ఆనందంగా ఉన్నాడు అని అర్థము. తాను నిత్యానందుడు కనుక, ఏదైనా తనను సమీపించ వచ్చు. అంతమాత్రాన తన ఆనందం పెరిగే దంటూ ఉండదు. తన నుండి ఏదైనా దూరం కావచ్చు. అలాగని, తన తృప్తి దూరమయ్యేదీ ఉండదు. అతడే స్థితప్రజ్ఞుడు.

కామము - కామి

కోరికలు ఉండాలి. అలా ఉన్న కోరికలు తీరాలి. అప్పుడే మనకు సుఖం. ఇది సాధారణంగా అందరి అభిప్రాయం. ప్రస్తుతం మనం సుఖంగా లేము కనుక కోరికలను తీర్చుకొని తృప్తి చెందాలి అనుకుంటాం. అలాగే కోరికలను తీర్చుకుంటున్నాం. కోరిక లైతే తీరుతున్నాయి కాని, తృప్తి కలగడం లేదు.

స్థితప్రజ్ఞుడు సమస్తమైన కోరికలను విడిచి పెట్టేశాడు. కాని, తృప్తిగా ఉన్నాడు. ఆనందంగా ఉన్నాడు. దేనినీ ఆశించకుండా, దేనిపై ఆధార పడకుండా తనలో తాను తృప్తి చెంది ఉన్నాడు. ఇది స్థితప్రజ్ఞుని వైభవము.

కోరికలు మనస్సు నుండే కదుల్తాయి. మనస్సు ఉంటేనే కోరికలు ఉంటాయి. గాఢనిద్రలో మనస్సు లేదు. అందుకనే, కోరికలు కూడా లేవు. మరి, స్థితప్రజ్ఞుడు మనస్సు లోని సమస్తమైన కోరికలను చక్కగా విడిచి పెట్టేశాడు కదా! **(సర్వాన్ కామాన్ మనోగతాన్ ప్రజహాతి)**. మరి అతనికి మనస్సు ఉందా, లేదా?

స్థితప్రజ్ఞుడు కూడా జీవించి ఉన్నంత వరకు కర్మలను ఆచరిస్తూనే ఉంటాడు. స్నానం చేస్తాడు. భోజనం చేస్తాడు. నిద్ర పోతాడు. వెనుక శబ్దమైతే తిరిగి చూస్తాడు. ఇవన్నీ కర్మలే. మనస్సు లేకపోతే ఇవన్నీ ఎలా చేస్తాడు? మనస్సు ఉంది. కాకపోతే, కోరికలు లేని మనస్సు ఉంది.

అంటే, ఇక స్థితప్రజ్ఞుని మనస్సులో కోరికలు కదిలే అవకాశమే లేదా? ఎందుకు లేదు? స్థితప్రజ్ఞులైన వారిని బాగా పరిశీలించి అర్థం చేసుకుంటే, స్థితప్రజ్ఞత్వం సిద్ధించిన తరువాత కూడా వారిలో కోరికలు ఉన్నట్లు తెలుస్తూ ఉంది.

స్థితప్రజ్ఞత్వం సిద్ధించిన తరువాతే రమణమహర్షి 'ఉపదేశసారం' రచించారు. వ్రాయాలి అనే కోరిక లేకపోతే ఎలా వ్రాయగలిగారు? మొదట ఆ గ్రంథాన్ని తమిళంలో రచించారు. ఆ తరువాత, ఆయనే ఆ పుస్తకాన్ని తెలుగు లోకి, సంస్కృతం లోకి అనువాదం చేశారు. అభిలాషే లేకపోతే ఇవన్నీ ఎలా జరుగుతాయి?

చెప్పాలి అనే కోరిక లేకపోతే, శ్రీకృష్ణుడు గీతను బోధించే వాడా? వ్రాయాలి అనే వాంఛ లేకపోతే, శ్రీశంకరులు గీతాభాష్యం రచించే వారా? ఇవన్నీ చూస్తూ ఉంటే, స్థితప్రజ్ఞులైన వారు కోరికలను సమూలంగా విడిచి పెట్టినట్లు గోచరించడం లేదు.

సిద్ధిని పొందగానే కోరికలు పోవు. పోవలసిన అవసరం కూడా లేదు. ప్రజ్ఞ స్థిరంగా ఉన్నవాడు జ్ఞాని (స్థితప్రజ్ఞు). జ్ఞాని దేహంతో జీవించే ఉన్నాడు. ప్రారబ్ధాన్ని మోస్తూ దేహం కొనసాగుతూనే ఉంది. దేహ అవసరాలు తీరుతున్నాయి. మనస్సు లేకుండా అవసరాలు ఎలా తీరుతాయి? ఆలోచనలను కదిలించకుండా అవసరాలను తీర్చుకొనేది ఎలా? ఆలోచనలు కదిలే టప్పుడు కోరికలు తలెత్తవా? తప్పక తలెత్తుతాయి.

సాధకులకు కోరికలు మనస్సులో కదిలినట్లే, సిద్ధ పురుషులకు కూడా కోరికలు కదుల్తాయి. కదుల్తాయి కనుకనే, మనస్సులో పుట్టిన సమస్త కోరికలను విడిచి పెడుతున్నాడు అని చెప్పడం జరిగింది. కోరికలే లేకపోతే, విడిచిపెట్టే దేముంటుంది?

బంధమా? అందమా?

జ్ఞాని మనస్సులో కోరికలు పుడుతాయి. అది మనోధర్మము. మనస్సులో కలిగిన కోరికలను జ్ఞాని విడిచి పెడుతున్నాడు. ఈ కోరికలు మనోగతాలు. అంటే మనస్సులో ప్రవేశించినవి అని అర్థం. ఈ విషయాన్ని అవధానంతో అర్థం చేసుకోవాలి.

ఒక అందమైన వస్తువును జ్ఞానం లేనివాడు చూస్తాడు. అలాగే కళ్ళున్నాయి కనుక స్థితప్రజ్ఞుడు కూడా చూస్తాడు. అందమైనది కనుక, పొందాలనే అభిలాష కలగడం మనస్సుకు సహజం. ఇద్దరికీ మనస్సు ఉంది. అందమైనది కనుక ఇద్దరి మనస్సులలో అభిలాష పుడుతుంది. కోరిక కలుగుతుంది. అవివేకి దానిని పొందాలని, పొంది సుఖించాలని దాని వెంట పడతాడు. స్థితప్రజ్ఞుడు దానిని చూస్తాడు. మనస్సులో కోరిక కదుల్తుంది. ఆ అందము ఎలా అవాంఛనీయమో, ఎలా సుఖ హేతువు కాదో తనకు తెలుసు కనుక, చేయి జారిపోయి వస్తువు క్రింద పడిపోయినట్లు, స్థితప్రజ్ఞుని మనస్సు నుండి కోరిక జారి పోతుంది. ఇదే తేడా. చాలా పెద్ద తేడా.

స్థితప్రజ్ఞునికి కోరికలు కలగక పోవడం అనేది లేదు. మనస్సు లోకి విషయాలు ప్రవేశించినట్లే, కోరికలు కూడా ప్రవేశిస్తాయి. కనుకనే ఆచార్యుల వారు ***మనోగతాన్*** అనే మాటకు ***మనసి ప్రవిష్టాన్, హృది ప్రవిష్టాన్*** అని అర్థం చెప్పారు. అంటే, మనస్సులో ప్రవేశించిన కోరికలు, హృదయంలో ప్రవేశించిన కోరికలు అని అర్థం. కోరికలైతే ప్రవేశించడం జరుగుతూ ఉంది. ప్రవేశించిన కోరికలను గుర్తించి, వాటిని వెంటనే త్యజించడం కూడా జరుగుతూ ఉంది. అయితే ఆ విడిచిపెట్టడం కూడా మామూలుగా విడిచి పెట్టడం కాదు. పూర్తిగా విడిచి పెట్టడం అని అర్థము. అందుకనే గీతాచార్యుడు ***జహాతి*** అని సరిపెట్టకుండా, ఉపసర్గను చేర్చి, ***ప్రజహాతి*** అన్నాడు. ***ప్రకర్షేణ జహాతి, పరిత్యజతి***, అంటే పూర్తిగా విడిచి పెట్టడం అని అర్థం.

జహాతి అంటే త్యజించడం. మనం అవసరం లేదని ఈ క్షణంలో త్యజించిన వాటిని రేపు మళ్ళీ అవసరాలుగా భావించి అభిలషిస్తూ ఉంటాం. అంటే విడిచి పెట్టినవి మళ్ళీ తిరిగి వస్తుంటాయి అని అర్థము. ***ప్రజహాతి*** అంటే, ఇక మళ్ళీ అగుపించవు అని అర్థం.

బంధ హేతువులైన కోరికలు మనస్సులో స్ఫురించ గానే స్థితప్రజ్ఞుడు వెంటనే వాటిని రాల్చేస్తాడు. బంధమును కలిగించనివి, లోక కళ్యాణానికి ఉపకరించేవి అయినపుడు వాటిని ఆదర్శంగా ఆచరిస్తాడు. కృతార్థుడైన వ్యక్తిని కర్మలు ఏం చేయగలవు? సంగత్వం లేని కర్మలలో బంధ మెక్కడుంది? అంతా అందమే. ఇది అర్థం కాకపోవడం చేత, జ్ఞానులను కూడా సమాజం గుర్తించలేక పోతోంది.

దేనిని బట్టి జ్ఞానిని గుర్తించాలి? జ్ఞానాన్ని బట్టే గుర్తించాలి. అంతేగాని, మరొక దానిని బట్టి కాదు. జ్ఞాని కర్మలు చెయ్యొచ్చు. చేయకుండా ఉండొచ్చు. సమాజానికి ఏదీ చేయడం లేదు కనుక అతడు జ్ఞాని కాడు అనడం అజ్ఞానానికి నిదర్శనం. జ్ఞాని సమాజాన్ని ఎలా ఆశీర్వదిస్తాడో అజ్ఞానికి అర్థం కాదు.

అలాగే, జ్ఞాని విశేషంగా కర్మలు చెయ్యొచ్చు. అంతమాత్రాన, అతని జ్ఞానాన్ని సంశయించ కూడదు. జ్ఞాని కర్మలు చేస్తే సమాజానికి అదృష్టం. జ్ఞాని ఏ కర్మలు చేయకుండా ఒకచోట కూర్చున్నా, అది సమాజానికి ఆశీర్వాదం.

ఆలయంలో భగవంతుడు మూలవిరాట్టుగా ప్రతిష్ఠింపబడి ఉంటాడు. ఆలయం లోని మూర్తి అచలం. ధ్రువం. ఆ భగవంతుడే ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తిగా ఊరేగుతూ వస్తాడు. ఆ రెండు మూర్తులలో భగవంతుడు కాని దెవరు? రెండు రూపాలు ఒక స్వరూపానివే. రెండు మూర్తులూ ఆరాధ్యములే. ఆలయం లోని మూర్తిని మనం వెళ్ళి దర్శించి అర్చిస్తాం. తానే మన వద్దకు ప్రేమతో కదిలి వచ్చిన ఉత్సవమూర్తిని ఆరాధించి ఆనందిస్తాం.

కదలకుండా ఉన్నా, కదిలి ఊరేగినా, రెండు మూర్తులలో దర్శన మిచ్చేది భగవంతుడే. కర్మలు ఆచరించినా, ఆచరించక పోయినా, స్థితప్రజ్ఞుడు జ్ఞానియే. చేసినా, చేయక పోయినా అతడు అకర్తే. కర్త ఉంటేనే కోరికలు బంధిస్తాయి. కర్త లేకుండా కదిలే కమనీయ కోరికలే స్థితప్రజ్ఞునిలో ఉంటాయి. బంధహేతువులైన కోరికలు ఆ పవిత్రాత్ముని అంతఃకరణలో కదలవు. ఎందుకని? అతడు ఆనంద స్వరూపుడు. నిత్య తృప్తిలో ఓలలాడే వాడు. తన స్వరూపమైన ఆనందంలో తానుగా ఆనందించే వాడు. కోరిక లన్నీ తీరిపోయిన ఆప్తకాముడు. ఆత్మవిదుడు.

యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్ । సోఽ శ్నుతే సర్వాన్కామా న్సహ । బ్రహ్మణా విపశ్చితేతి ।

ఎవడు బుద్ధిగుహ లోని శ్రేష్ఠమైన హృదయాకాశంలో నిగూఢంగా ఉన్న ఆత్మను తెలుసుకొను చున్నాడో, అట్టివాడు బ్రహ్మాత్మ స్వరూపముతో పాటు సమస్త మైన కోర్కెలను ఒకేసారి అనుభవించిన వాడు అగుచున్నాడు అని బ్రహ్మవిదుని పూర్ణత్వ శోభను దివ్యంగా వర్ణించింది తైత్తిరీయ శ్రుతి.

ఆఖ్యాయిక

యమునాతీరంలో ఆచార్యుడైన గురుగోవిందుడు ఆసీనుడై ఉన్నాడు. ప్రవహించే యమునా నది పరవళ్ళను తిలకిస్తూ, ఎగసిపడే అలల సౌందర్యాన్ని వీక్షిస్తూ కూర్చొని ఉన్నాడు. కోటీశ్వరుడైన రఘునాథు డనే శిష్యుడొకడు అక్కడికి వచ్చి గురువుకు నమస్కరించాడు.

గురుదేవా! నేడు నా పుట్టిన రోజు. మీ ఆశీస్సులను అర్థిస్తున్నాను. నా సమర్పణను స్వీకరించి అనుగ్రహించండి అని రెండు బంగారు కడియాలను గురుగోవిందునికి సమర్పించాడు.

గురుగోవిందుడు వాటిని స్వీకరించి, అందులో ఒక దానిని కుడిచేతి బొటన వ్రేలుకు తగిలించుకొని, సుదర్శన చక్రం లాగా త్రిప్పుతూ ఉన్నాడు. అది కాస్త పట్టు తప్పి, ప్రవహించే యమునా జలాలలో పడి పోయింది.

అయ్యో! పడిపోయిందా! ఫరవా లేదు, గురుదేవా! నాకు ఈతలో కూడా గొప్ప ప్రావీణ్య ముంది. కాకపోతే, మీ చేతి నుండి జారిపోయిన ఆ స్వర్ణ కంకణము నదిలో ఏ వైపు పడిందో నేను చూడలేదు. మీరు చూసి ఉంటారు. తమరు చెబితే, నేను నది లోకి దూకి, తిరిగి ఆ కంకణాన్ని తెచ్చిపెట్టగలను అన్నాడు.

ఆ మాటలు విని, శిష్యుడు రఘునాథుని ప్రియంగా వీక్షించి, తన చేతిలో ఉన్న రెండవ కడియాన్ని పట్టుకొని, 'అదిగో - అక్కడ' అని దానిని కూడా నీళ్ళ ల్లోకి విసిరేశాడు గురుగోవిందుడు. అంతే!

సమీచీనత్వ బుద్ధి

మనస్సులో కదిలే సమస్త మైన కోరికలను త్యజించిన వాడు, తన ఆనందానికి తానే కారణమైన మహాత్ముడు స్థితప్రజ్ఞుడు. నిత్యతృప్తుడు. నిరాశ్రయుడు. పరమార్థ దర్శనం అనే అమృత రసం ప్రాప్తించడం చేత, ఇది చాలు - అన్యములైనవి ఏవీ అవసరం లేదు అనే స్థిరమైన సంకల్పం కలవాడు స్థితప్రజ్ఞుడు. ***(పరమార్థ దర్శనామృత రసలాభేన అన్యస్మాత్ అలం ప్రత్యయవాన్ స్థితప్రజ్ఞః).***

స్థితప్రజ్ఞుడు కోరికలను విడిచి పెట్టేశాడు. అలాగని కోరికలను విడిచి పెట్టేసిన ప్రతి వ్యక్తీ స్థితప్రజ్ఞుడు అవుతాడా? పూర్ణత్వం లేనివాడు కోరికలను కూడా వదేసుకుంటే, దుఃఖభాగుల కోవలో చేరుతాడేమో గాని స్థితప్రజ్ఞుడు కాలేడు. నిరాశ వేరు, నిర్వేదం వేరు అని ఇప్పటికే మనం తెలుసుకొని ఉన్నాం.

స్థితప్రజ్ఞుడు తృప్తి చెంది ఉన్నాడు కనుక దేనినీ వాంఛించడు ***(న కించిత్ వాంఛతి)***. అసంతృప్తితో అల్లాడే వ్యక్తి కోరికలను కూడా విడిచి పెడితే, ఇక తృప్తి చెందే ప్రయత్నం కూడా చేయకుండా, నిరాశావాదిగా, నిర్భాగ్యుడిగా నిలిచి పోతాడు.

తృప్తిగా భోంచేసిన వాడు, 'నేను తినలేనండి - నాకు వద్దండి' అని చెప్పడం వేరు. ఎవరి మీదనో అలిగి, లేదా మరెవరి మీదనో ద్వేషంతో 'నేను తినలేనండి - నాకు వద్దండి' అని అంటే, అలా అనిన వ్యక్తి తృప్తిగా ఉన్నాడని అర్థమా?

ముముక్షువులు కోరికలకు దూరం కాలేరు. అలాగని, కోరికల్ని ఆవిష్కరిస్తూ ఊరేగితే, చివరికి ఆవేదనే మిగుల్తుంది. కోరికలు సాధకులకు సహజం. బంధ హేతువులైన కోరికలు స్థితప్రజ్ఞుని మనస్సు నుండి పాదరసం లాగా జారిపోతే, సాధకులైన వారు ప్రయత్న పూర్వకంగా వాటిని దూరం చేసుకోవాలి. ప్రగతి హేతువులైన కోరికల్ని కదిలించుకుంటూ పోవాలి. పతన హేతువులైన వాటిని పరిత్యజించాలి. వాటి లోని దోషాలను దర్శించ గలిగితే అవి క్రమేపి దూరమై పోతాయి. కనుక, నిత్యానిత్య వస్తు వివేక జ్ఞానంతో సమీచీనత్వ బుద్ధిని సాధకులు తయారు చేసుకోవాలి.

'సమీచీనము' అంటే అర్హ మైనది, తగినది అని అర్థం. అట్టి దానిని గుర్తించే బుద్ధిని 'సమీచీనత్వ బుద్ధి' అంటారు. కోరిక కదలి నపుడు ఇది తగినదా, కాదా అనేది వివేకంతో విశదీకరించుకొని, ఆ తరువాత ***యోగః కర్మసు కౌశలమ్*** అని మనం చర్చించిన విషయాన్ని హృదయంలో ఉంచుకొని, అహంకారం లేకుండా ఈశ్వరార్పణ బుద్ధితో కర్మను ఆచరించాలి. అలా నైవేద్యంగా సమర్పించిన కర్మకు ఫలం వచ్చినపుడు, ***సమత్వం యోగ ఉచ్యతే*** అని మనం అర్థం చేసుకున్న విషయాన్ని స్మృతికి తెచ్చుకొని, ప్రసాద బుద్ధితో ఫలమును అందుకోవాలి.

ఈ విధమైన నిష్కామ కర్మయోగం వల్ల, బంధహేతువు లైన కర్మలు దూర మవుతాయి. బంధమును సృష్టించని సత్కర్మలు చిత్తశుద్ధికి తోడ్పడుతాయి. ఒక దశలో కోరికలు వాటంతటవే సమూలంగా దూరమై పోతాయి. ఆత్మానందము అనుభూతిగా భాసిస్తుంది. అంతవరకు ముముక్షువు కోరికలను సొంతం విడువ లేడు. విడువ కూడదు కూడా.

ఏ కోరికలు స్థితప్రజ్ఞునికి ఆభరణాలుగా, అలంకరణలుగా శోభిస్తున్నాయో, అట్టి సద్భావ జనిత కోరికలను ముముక్షువులు ప్రయత్న పూర్వకంగా కదిలించి సాధనలు ఆచరించాలి. సాధకుని స్థాయిలో కోరిక ఆశీర్వాదమే గాని, అవరోధం కాదు. కాకపోతే, అవి సకామమా, నిష్కామమా అనేది సాధకుడే బేరీజు వేసుకోవాలి. అంతేగాని, తొందరపడి కోరికలే ఉండ కూడదు అనే నిర్ణయానికి రాకూడదు.

ఆఖ్యాయిక

మహాభారతంలో ఒక చిన్న కథ. భీష్ముని వద్ద ధర్మరాజు ధర్మ ప్రసంగాన్ని ఆలకించాడు. ఆ తరువాత, ఒకనాడు తన చుట్టూ ఉన్న బంధువులను చూచి ఒక ప్రశ్నను సంధించాడు.

ప్రతి మనిషి ప్రయత్నంతో సాధించ వలసిన పురుషార్థములు నాలుగు ఉన్నాయి అని మనకు తెలుసు. అవే ధర్మార్థ కామ మోక్షాలు. అయితే, ఈ నాల్గింటిలో ఏది శ్రేష్ఠతమము? అని ప్రశ్నించాడు ధర్మరాజు.

దేనికైనా ధర్మమే ప్రధాన మైంది. విశ్వమంతా ధర్మము నందే ప్రతిష్ఠితమై ఉంది. ధర్మానికి దూరమై ఏ పురుషార్థము ఫలించదు. కనుక, ధర్మమే శ్రేష్ఠతమము అని సమాధానం చెప్పాడు విమల నీతిజ్ఞుడైన విదురుడు.

ధర్మమును ఆచరించాలన్నా, ధర్మ కార్యాలను నిర్వహించాలన్నా, ధనము ప్రధానమై ఉంది. ఈ జగత్తు ధనం మూలం గానే ప్రకాశిస్తూ ఉంది. జగద్వైభవానికి ధనమే ప్రధానము. కనుక, భద్రతను కలిగించే అర్థమే శ్రేష్ఠతమము అని ధనంజయుడు చెప్పాడు.

తన అభిప్రాయాన్ని కూడా సర్వులూ ఆశిస్తున్నారు కనుక ధర్మరాజు తన నిర్ణయం కూడా చెప్పాడు. సర్వ మానవాళికి అంతిమ గమ్యము మోక్షమే కనుక, జనన మరణ చక్రం నుండి విడిపించి, శాశ్వతానందాన్ని ప్రసాదించే మోక్షమే శ్రేష్ఠతమ మని తన అభిప్రాయాన్ని తెలియ జేశాడు.

కాని, అందరికీ విస్మయాన్ని కలిగిస్తూ, చతుర్విధ పురుషార్థాలలో కామమే పరమ శ్రేష్ఠమని భీముడు బల్ల గుద్ది మరీ చెప్పాడు. ఏ కర్మను ఆచరించాలన్నా, ముందుగా దానిని ఆచరించాలి అనే కోరిక ఉండాలి. ధర్మ మైనా, అర్థమైనా, మోక్షమైనా, కామించకుండా సాధించే అవకాశ ముందా? **కామి కాలేని వాడు మోక్షకామి *అవుతాడా?*** కనుక, ఏది సాధించాలన్నా, కామం ఉన్నప్పుడే సాధ్యం కాబట్టి, చతుర్విధ పురుషార్థాలలో కామమే సర్వ శ్రేష్ఠ మని పలికి, భీమసేనుడు గదను పైకెత్తి భుజంపై పెట్టుకున్నాడు. అందరూ భీముణ్ణే సమర్థించారు.

కనుక ముముక్షువులు కోరికలను విడిచి పెట్టడం కాకుండా, వడగట్టి వ్యవహరించడం అలవరచు కోవాలి. అలా సోపానక్రమంగా వృద్ధి చెంది, ఆ తరువాత సమస్త కోరికలను సంపూర్ణంగా త్యజించి, ఆత్మానంద స్వరూపులై స్థితప్రజ్ఞులై శోభించాలి.

*అర్జునుడు అడిగిన **కిం ప్రభాషేత?** అనే రెండవ ప్రశ్నకు సమాధానం చెబుతున్నాడు.*

దుఃఖే ష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే ॥ 56

దుఃఖేషు-అనుద్విగ్నమనాః-సుఖేషు-విగతస్పృహః
వీతరాగభయక్రోధః-స్థితధీః-మునిః-ఉచ్యతే

దుఃఖేషు	=	దుఃఖాలలో	వీతరాగ భయక్రోధః	=	అనురాగము, భయము, క్రోధము లేనివాడు
అనుద్విగ్నమనాః	=	కలత చెందని మనస్సు కలవాడు	మునిః	=	మనన శీలుడు
సుఖేషు	=	సుఖాలలో	స్థితధీః	=	స్థితప్రజ్ఞు డని
విగత స్పృహః	=	ఆసక్తి లేనివాడు	ఉచ్యతే	=	చెప్పబడతాడు

అతని మనస్సు కష్టాలలో కలత పడదు. సుఖాలలో తృప్తి చెందదు. అనురాగము, భయము, క్రోధము లేనివాడు. అట్టి మననశీలుడే స్థితప్రజ్ఞుడు.

వ్యాఖ్య

యాభై అరు, యాభై ఏడవ
స్థితప్రజ్ఞుడు ఎలా భాషిస్తాడు (*కిం ప్రభాషేత ?*) అనే రెండవ ప్రశ్నకు యాభై అరు, యాభై ఏడవ శ్లోకాలలో సమాధానం చెబుతున్నాడు. స్థితప్రజ్ఞుడు ప్రపంచంలో ప్రాప్తించే సుఖదుఃఖాల విషయంలో ఎలా వ్యవహరిస్తాడు అనేది ఈ ప్రశ్న లోని అంతరార్థం.

దుఃఖాలలో దిగులు చెందని వాడు, సుఖాల యందు ఆసక్తి లేనివాడు, రాగము, భయము, క్రోధము లేనివాడు, స్థిరమైన బుద్ధి గల మననశీలుడు స్థితప్రజ్ఞుడు అని అభిభాషించాడు అచ్యుతుడు.

సుఖము - దుఃఖము

ప్రపంచం ఒక్కటే. కాని, ఆ ప్రపంచం అందరినీ ఒకే విధంగా ప్రభావితం చేయడం లేదు. నిన్న ఇష్టమైన వస్తువు నేడు అయిష్టంగా ఉంది. అంటే, నిన్న సుఖాన్ని పంచిన వస్తువు నేడు సుఖాన్ని పంచే స్థితిలో లేదు అని అర్థం. అలాగే, మొన్న అయిష్టంగా ఉన్నది నేడు ఇష్టంగా కనిపిస్తోంది. మళ్ళీ రేపు ఎలా ఉంటుందో తెలియదు. ఇష్టమైన వస్తువులో సుఖం కనిపిస్తుంది. అయిష్టమైన వస్తువు దుఃఖ కారణంగా తెలుస్తూ ఉంది.

ఇంతకీ వస్తువులో సుఖ ముందా? దుఃఖ ముందా? సుఖమే ఉంది అనుకుందాం. అదే వాస్తవ మైతే, మరొక కాలంలో ఆ వస్తువు నుండే దుఃఖం ఎందుకు కలుగుతుంది? పోనీ, దుఃఖమే ఉన్నట్లు అంగీకరిద్దా మంటే, అదే వస్తువు మరొక కాలంలో సుఖాన్ని ఎలా ఇవ్వ గలుగుతుంది? ఇంతకీ వస్తువులో ఏముంది? సుఖమైతే లేదు. ఎందుకని? దుఃఖాన్ని కూడా పంచుతూ ఉంది కనుక. అంటే, దుఃఖం ఉందా? దుఃఖం కూడా లేదు. ఎందుకని? సుఖాన్ని పంచుతూ ఉంది కనుక.

ఇలా విచారిస్తూ పోతే, సుఖం ఎక్కడుంది? అనే ప్రశ్న తలెత్తుతుంది. ప్రపంచంలో లేదు అనే సమాధానం వస్తుంది. అలాగే దుఃఖం ఎక్కడుంది అని ప్రశ్నిస్తే, ప్రపంచంలో లేదు అనే సమాధానమే వస్తుంది. సుఖదుఃఖాలు ప్రపంచంలో లేనపుడు, అవి ఎక్కడున్నాయి? సుఖదుఃఖాలు ఎప్పుడైతే ప్రపంచంలో లేవో, ఈ ప్రపంచం ఉంది అని ఎవరైతే తెలుసుకుంటున్నారో, వారి లోనే ఉన్నాయి అని నిర్ధారణ అవుతూ ఉంది. ప్రపంచం ఉంది అని తెలుసుకుంటున్నది నీవే.

ప్రపంచం ఉన్నట్లు నీకు తెలుస్తూ ఉంది. నువ్వు చూస్తేనే ప్రపంచం ఉంది. నువ్వు తెలుసుకొంటూ ఉన్నావు కనుకనే ప్రపంచం ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ప్రపంచానికి స్వతంత్ర మనుగడ లేదు. ప్రపంచం నీ మీద ఆధారపడి ఉంది. నువ్వు మాత్రం ఎవరి మీద ఆధార పడకుండా ఉన్నావు. స్వతఃసిద్ధంగా ఉన్నావు. నీ మీద ఆధారపడి మనుగడను సాగించే ప్రపంచం సర్వ స్వతంత్రుడ వైన నీకు సుఖాన్ని గాని దుఃఖాన్ని గాని ఎలా కలిగిస్తుంది?

సుఖదుఃఖాలు అనేవి ప్రపంచానికి సంబంధించి లేవు. కనుక, సుఖదుఃఖాలకు సంబంధించిన మన సమస్య ప్రపంచంతో ముడిపడి లేదు. మనం సుఖపడట మనేది, లేదా దుఃఖపడట మనేది ప్రపంచం మీద ఆధారపడి ఉంటే మాత్రం, మన సుఖదుఃఖాలను నిర్ణయించేది ప్రపంచమే అవుతుంది.

ప్రపంచం పరిణామశీలం. నిరంతరం మార్పు చెందుతూ ఉంటుంది. కనుక, ప్రపంచం మనిషికి సమస్య కాదు. సమస్య అనేది ఏదైనా ఉంటే, అది మనిషి మీదనే కేంద్రీకృతమై ఉంది. అలా చూచి నపుడు, సుఖదుఃఖాల సమస్య మనిషికి లేనే లేదు. **మనిషికి మనిషే సమస్య.**

ఇంతకీ, మనిషిలో ఏముంది? సుఖముందా? దుఃఖముందా? సుఖముంది. అయితే దుఃఖం ఎలా వచ్చింది? లేదు, లేదు. దుఃఖమే ఉంది. మరైతే సుఖ మెక్కడుంది? ప్రపంచాన్ని గూర్చి విచారించి నపుడు,

సుఖదుఃఖాలు ప్రపంచంలో లేవు అనేది ఎలాగైతే అర్థమైందో, అలాగే మనల్ని గూర్చి ఆలోచించి నపుడు, సుఖదుఃఖాలు మన స్వరూపం కూడా కావు అనేది అర్థ మవుతుంది. ఏది ఏమిటో అర్థం కాకపోవడం వల్లనే సుఖదుఃఖాల బరువుతో బ్రతుకు భారంగా మారుతూ ఉంది. స్థితప్రజ్ఞుడికి తానే ఆత్మ అనే ప్రజ్ఞ స్థిరంగా ఉంది. ఆత్మ ఆనంద స్వరూపము. సుఖదుఃఖాలు మనోగతాలు. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న వాడు కనుకనే దుఃఖం వస్తే ఉద్విగ్న మనస్కుడు కాడు. సుఖం వస్తే, దాని యొక్క స్పృహ లేకుండా ఉంటాడు (***దుఃఖేషు అనుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః***). జీవన్ముక్తులు సుఖదుఃఖాలలో మునిగిపోరు అన్నది ఉపనిషత్తు (***జీవన్ముక్తా నమజ్జన్తి సుఖదుఃఖ రసస్థితే***).

రాగ భయ క్రోధాదులు

సుఖాలు ఎవరిని ఉత్సాహ పరచలేవో దుఃఖాలు వారిని కలత పెట్ట లేవు. సుఖదుఃఖాలు రెండూ మనో వికారాలే. జ్ఞాని ఆత్మస్థితమైన ప్రజ్ఞ కలవాడు కనుక సుఖదుఃఖాలలో చలనం లేకుండా ఉంటాడు.

మనకు ఎన్నైనా ఉండొచ్చు. అవన్నీ మన మనస్సులో ఉండ నవసరం లేదు. మన చుట్టూ ఎందరైనా ఉండొచ్చు. వాళ్ళందరూ మన బుద్ధిలో ఉండ నవసరం లేదు. ఏ వస్తువులు, లేదా వ్యక్తులు మనకు దగ్గరగా ఉంటే మనకు సుఖంగా ఉంటుందో, వారిపై మనకు రాగం ఉందని అర్థం. ఏ వస్తువులు లేదా వ్యక్తులు దూరంగా పోతే మనం కలత పడతామో అవన్నీ రాగ సంబంధాలు. అనురాగ బంధాలు. ఇలాంటి రాగం స్థితప్రజ్ఞునికి ఉండదు.

రాగం ఉంటే ఏమి? దాని వల్ల ఏమిటి నష్టం? ఉంచుకోవచ్చు. రాగం మనస్సులో ఉంచుకోవడం తప్పు కాదు. రాగం ఉన్న వాటిని మనస్సులో నింపుకుంటే, రేపు అవి దూరమై నపుడు కష్టం. దూరమైన వాటిని మనస్సు నుండి దూరం చేసుకో గలమా? భౌతికంగా దూరమై, భావంలో దూరం కానివి బుద్ధికి భార మవుతాయి. బ్రతుకులో బరువును పెంచుతాయి.

ఉన్నవి బాధించవు. మనస్సులో ఉన్నవే బాధిస్తాయి. బాధించే వాటిని మనస్సులో పెట్టుకొని సుఖంగా బ్రతకలేము. బాధించకుండా ఉండేదే మనస్సులో ఉండాలి. అప్పుడే సుఖశాంతులతో జీవించ గలం.

ఉండి బాధించేవి అనిత్యాలు. పోయి బాధించేవి కూడా అనిత్యాలే. ఈ విషయంలో స్థితప్రజ్ఞునికి స్థిర మైన బుద్ధి ఉంది. కనుక తాను సదా రాగము నుండి విడిపడి ఉంటాడు.

రాగవృత్తి మనస్సులో ఉంటే, ఆ తరువాత ఏదో ఒక సమయంలో మనస్సులో క్రోధవృత్తి తప్పక వచ్చి చేరుతుంది. రాగవృత్తి విఫలమైతే, ఆ తరువాత ఉద్భవించేది క్రోధవృత్తే. రాగవృత్తి లేని మనస్సులో క్రోధవృత్తి చేరదు. కనుక మననశీలుడైన స్థితప్రజ్ఞుడు రాగక్రోధాల నుండి విడిపడి ఉన్నాడు.

దేహాత్మ భావమును త్యజించిన వాడు జ్ఞాని. దేహము తాను కానందున, దేహము యొక్క క్షయ నాశాదులు అతనికి భయ కారణాలు కాలేవు. దేహం తాను కానపుడు, ఇతర దేహాలతో సంబంధాలు మిథ్యే కనుక వాటి క్షయ నాశాదులు కూడా అతనికి భయాన్ని కలిగించ లేవు.

ఆత్మజ్ఞానంలో ద్వైతం లేదు. ద్వైతము లేనపుడు భయం ఎలా కలుగుతుంది? ఉన్నది ఒక్కటే అయినపుడు, నాశ మెవరికి? ఎవరి వలన నాశము? కనుక స్థితప్రజ్ఞుడు భయము నుండి విడిపడి అభయ రూపుడై శోభిస్తున్నాడు. అద్వయుడు కనుకనే అభయరూపుడు. జ్ఞాని యొక్క అద్వయానుభూతిని ఉపనిషత్తు అందంగా వర్ణించింది. **సర్వ మాత్మైద మాత్రాహం కిం వాంఛామి త్యజామి కిమ్?** ఈ సమస్తమూ ఆత్మయే. ఇక నేను దేనిని ఆశిస్తాను? దేనిని త్యజిస్తాను? - ఇది జ్ఞాని యొక్క అద్వైతానుభూతి.

దుఃఖము వచ్చి నపుడు కలత చెందని, సుఖము వచ్చినపుడు ఆసక్తి కలగని సమస్థితికి గతంలో సాధకుడుగా ప్రయత్నించిన వాడు నేడు స్థితప్రజ్ఞుడై ఆ సమస్థితిని లక్షణంగా పొంది శోభిస్తున్నాడు. రాగము, క్రోధము, భయము నుండి విడి పడాలని పూర్వం ప్రయత్నం చేసేవాడు. ఇప్పుడు వాటన్నిటి నుండి విడిపడి ఆనందరూపుడై అలరారు తున్నాడు. ముముక్షువులు అయిన వారు స్థితప్రజ్ఞుని లక్షణాలను సాధనలుగా స్వీకరించి, వాటిని సాధించడానికి తీవ్రంగా యత్నించాలి.

దుఃఖాలలో కలత చెందని వాడు స్థితప్రజ్ఞుడు. సాధకుడు ఈ లక్షణానికి ప్రయత్నించాలి. దుఃఖము ఒక్కటే. కాని, ఇక్కడ **దుఃఖేషు** అని బహువచనం వాడటం జరిగింది. దుఃఖము ఒక్కటే అయినా, దుఃఖ కారణాలు మూడు విధాలుగా ఉన్నందున, దుఃఖములు అనే బహువచనాన్ని ప్రయోగించాడు. అలాగే, **సుఖేషు** అనడం కూడా.

సుఖదుఃఖాలు మూడు విధాలుగా ఉంటాయి. (1) ఆధ్యాత్మికము (2) ఆధిభౌతికము (3) ఆధి దైవికము. జ్వరము, తలనొప్పి మొదలైన దేహ సంబంధంగా కలిగే దుఃఖాలు ఆధ్యాత్మిక దుఃఖాలు. వ్యాఘ్ర వృశ్చిక సర్పాదుల వల్ల ఏర్పడే దుఃఖాలు ఆధిభౌతికాలు. పెనుగాలి, వర్షము, ఎండ, అగ్ని, పిడుగుపాటు మొదలైన వాటి వలన కలిగే దుఃఖాలు అధిదైవికాలు.

పాపపుణ్యాల కారణం గానే ఈ విధమైన సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి. దుఃఖానుభవంలో పాపం క్షీణిస్తూ ఉంటుంది. దుఃఖాన్ని ప్రసాదంగా స్వీకరిస్తూ, దుఃఖ హేతువైన పాపాన్ని ఆచరించకుండా సాధకుడు జాగ్రత్త వహించాలి.

అలాగే ఆనంద మనేది ఆత్మ యందే లభిస్తుంది కాని, విషయాల నుండి, వ్యక్తుల నుండి రాదు అని గ్రహించి, సాధకుడు వాటి యందు రాగము లేకుండా ఉండాలి. తాను దేహము కాదని, ఆత్మయే నని సదా సంభావిస్తూ భయము నుండి విడిపడాలి. క్రోధం అనేది మనోగతం. రాగం ఫలించ నపుడు క్రోధం పడగ విప్పుతుంది. క్రోధం వల్ల ఎంతో శక్తి వ్యర్థమై పోతుందని తెలిసి, ఆ శక్తిని సాధకుడు జప ధ్యానాదులకు వినియోగించు కోవాలి.

*అర్జునుడు అడిగిన రెండవ ప్రశ్నకు (**కిం ప్రభాషేత ?**) సమాధానమును యాభై ఏడవ శ్లోకంలో కూడా కొనసాగిస్తున్నాడు.*

యః సర్వ త్రానభిస్నేహ స్తత్త త్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

యః-సర్వత్ర-అనభిస్నేహః-తత్-తత్-ప్రాప్య-శుభాశుభం
న-అభినందతి-న-ద్వేష్టి-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

యః	=	ఎవడు	న అభినందతి	=	సంతోషింపడో
సర్వత్ర	=	అన్నిటి యందు	న ద్వేష్టి	=	ద్వేషింపడో
అనభిస్నేహః	=	అభిస్నేహము లేనివాడై	తస్య	=	అట్టివాని యొక్క
తత్ తత్	=	ఆయా	ప్రజ్ఞా	=	జ్ఞానము
శుభాశుభం	=	శుభాశుభాలను	ప్రతిష్ఠితా	=	స్థిరమైనది.
ప్రాప్య	=	పొంది			

అతడికి దేని తోనూ అనుబంధం లేదు. శుభాన్ని పొంది సంతోషించడు. అశుభాన్ని పొంది ద్వేషించడు. అతని జ్ఞానము స్థిరమైనది.

వ్యాఖ్య

కిం ప్రభాషేత? హర్ష విషాదాలలో స్థితప్రజ్ఞుడు ఎలా వ్యవహరిస్తాడు? అనే రెండవ ప్రశ్నకు యాభై ఆరవ శ్లోకంలో సమాధానం చెప్పడం ప్రారంభించిన పార్థసారథి, ఆ విషయాన్ని ఈ శ్లోకంలో కూడా కొనసాగిస్తున్నాడు. 'రాగ భయక్రోధాదుల నుండి విడిపడిన వాడు' అని పూర్వ శ్లోకంలో చెప్పిన విషయాన్ని కొనసాగిస్తూ అభిస్నేహం అవరోధ మంటూ ఈ శ్లోకాన్ని ప్రారంభిస్తున్నాడు.

రాగ భయ క్రోధాదులు ఎలా ప్రతిబంధకాలో చూశాం. రాగం అంటూ ఉండాలే గాని, ఎవరు ఎంత రాగం తీస్తారో చెప్పలేము. దేనిపై మనకు రాగం ఉంటుందో, అది ఎప్పుడూ దూరం కాకూడదని ఆలోచిస్తూ ఉంటాం. అలా ఆలోచించడం తప్పు కాదు. కాని, అది దూర మయ్యేది మాత్రం వాస్తవం. కనుక, దేని వైపు మన రాగం సాగుతూ ఉంటుందో, అది ఎప్పుడు దూర మవుతుందో అనే భయం మనస్సును పట్టి పీడిస్తూనే ఉంటుంది. ఎవరు ఎప్పుడు దూరమౌతారో అనే దిగులు అంటిపెట్టుకొనే ఉంటుంది. అలాంటి పరిస్థితులకు కారణమయ్యే వ్యక్తులపై క్రోధం పుడుతుంది. ఇవన్నీ జరగకుండా ఉండాలి అంటే అభిస్నేహం లేకుండా ఉండాలి. అలా సహజం గానే ఉండగలిగే వాడు ముని. ఆ స్థితిని ప్రయత్నంతో సాధించే వాడు ముముక్షువు.

అభిస్నేహాలు అవరోధాలు

స్నేహము అంటే చెలిమి. అభిస్నేహము అంటే గట్టి స్నేహము. స్నేహము ఎప్పుడూ లేతగా ఉండాలి. ముదర కూడదు. స్నేహము అంటే చమురు అని కూడా అర్థము. చమురు అంటుకుంటే చాలు, దానిని వదిలించుకోవడం కష్టం. అభిస్నేహం కూడా అలాంటిదే. ఇది జ్ఞానానికి ప్రతిబంధకము. అందుకనే ముని (మననశీలుడు) అభిస్నేహం లేకుండా ఉంటాడు (***అభిస్నేహ వర్జితః***). స్థితప్రజ్ఞుడు (***యః***) అన్ని విషయాల లోను (***సర్వత్ర***) అభిస్నేహము లేకుండా ఉంటాడు అంటున్నాడు అచ్యుతుడు. దేహము, జీవితము మొదలైన విషయాలలో కూడా అభిస్నేహం లేకుండా ఉండే వాడు ముని అని శ్రీ శంకరులు భాష్యంలో అభిప్రాయ పడ్డారు (***దేహ జీవితాదిషు అపి అనభిస్నేహః***).

పూలు విరబూస్తాయి. విరబూసిన పూలు వాడి పోతాయి. దేహాలు జన్మిస్తాయి. జన్మించిన దేహాలు నశిస్తాయి. ఈ ప్రపంచంలో ఎవరు మన వారు? మన దేహమే మనది కాదు. ఈ దేహం ఎంత కాలం ఉంటుందో మనకే తెలియదు. క్షణక్షణానికి చిల్లికుండలో నీరు కారి పోయినట్లు (***భిన్న కుంభోదకవత్***) ప్రతి క్షణం దేహం నశించిపోతూ ఉంది (***ప్రతి క్షణం వినాశీ***).

మన దేహమే మనది కాకుండా పోతుంది. అలాంటప్పుడు ఈ దేహంతో సంబంధాలు కలిగిన వారిపై అభిస్నేహాన్ని పెంచుకోవడం ఎంతవరకు సమంజసం? పోయే దేహాన్ని అతిగా ప్రేమించి సాధించేది ఏమీ ఉండదు. కనుకనే, జీవిత, దేహాదుల యందు అభిస్నేహము లేకుండా ఉంటాడు స్థితప్రజ్ఞుడు.

జీవితమే ఒక స్వప్నం లాంటిది అని మునికి తెలుసు. తాత్త్వికంగా విచారించి నపుడు, నిద్ర నుండి మేల్కొన్న వానికి కల లోని వ్యక్తులు లేనివారే అయినట్లు, మననశీలునికి దారాపుత్రాదులు, బంధుమిత్రాదులు ఉన్నప్పుడు కూడా వారు లేనివారే అని తెలుసు (***విచార్యమాణే తత్త్వ దృష్ట్యా దారా పుత్రాదయో న సన్తి***). అందుకే వారిపై అభిస్నేహం లేకుండా ఉంటాడు.

ఆకాశంలో మేఘాలు ఉంటాయి. అలాగని మేఘాలతో ఆకాశానికి సంబంధం లేదు. కొండపై మేఘాలు ఊరేగు తుంటాయి. అయినా, కొండకు, మేఘాలకు సంబంధం లేదు. కలిసినట్లే కనిపిస్తాయి. అలా కనిపించి నపుడు కూడా విడిపడే ఉంటాయి. స్థితప్రజ్ఞుడు అన్నిటితో ఉంటాడు. అన్నిటి నుండి విడిపడి ఉంటాడు. స్నేహంతో ఉంటాడు. అభిస్నేహం లేకుండా ఉంటాడు. స్నేహం బంధించదు. అభిస్నేహం బంధానికి కారణ మవుతుంది.

దేహం ఉంటే నష్టం లేదు. దేహాసక్తి ఉంటే లాభం లేదు. మితిమీరిన సంబంధాలు, అతి స్నేహాలు సంతాపాన్నే కలిగిస్తాయి. ఎండమావుల్ని చూస్తే తప్పు లేదు. వాటి వెంట పరుగు లెత్తితే సుఖం మిగలదు. ఇదంతా అభిస్నేహమే అనేది గీతాచార్యుని సందేశం.

స్నేహాలు సమీపించి నపుడే స్మృతికి వస్తాయి. అభిస్నేహాలు దూరంగా ఉన్నా కలత పెడతాయి. ఎవరిపై మనకు అభిస్నేహం ఉంటుందో, వారు దూర దేశాలలో ఉన్నా, వాస్తవానికి మన మనస్సు లోనే తిష్ఠ వేసి ఉంటారు. వారి సమస్య లన్నీ మన సమస్యలుగా మిగిలి ఉంటాయి. అభిస్నేహాలు లేకపోతే, వాటి వల్ల ప్రాప్తించే శుభాశుభాలు మనపై ప్రభావాన్ని చూపలేవు. స్థితప్రజ్ఞుడు అభిస్నేహము లేనివాడు కనుక, వాటి వల్ల కలిగే ఫలితాలకు కలత చెందడు. శుభం కలిగిందని సంతసించడు. అశుభం వాటిల్లిందని దుఃఖించడు. రాగద్వేషా లకు అతీతంగా ఉంటాడు.

శుభాశుభాలు

విశ్వానికి చీకటి వెలుగులు తప్పవు. వ్యక్తికి శుభాశుభాలు తప్పవు. శుభం కలిగి నపుడు వ్యక్తులు పొంగిపోతూ ఉంటారు. అశుభాన్ని ద్వేషిస్తూ ఉంటారు. శుభాశుభాలు తమ ప్రభావాన్ని మనస్సుపై ఇలా చూపుతూ ఉంటాయి.

శుభాశుభాలు కలిగి నపుడు స్థితప్రజ్ఞుడు సమబుద్ధితో వ్యవహరిస్తూ ఉంటాడు. వివేకం వలన ఏర్పడిన జ్ఞానం అతనిని హర్ష విషాదాలలో స్థిరంగా, సమంగా ఉండేటట్లు చేస్తుంది.

శుభములను సుఖ కారణాలుగా, అశుభములను దుఃఖ కారణాలుగా మానవులు భావిస్తూ ఉంటారు. వాస్తవానికి ప్రపంచంలో, లేదా జీవితంలో సన్నివేశాలు జరుగుతూ ఉంటాయి. అవి అలా జరగడం వెనుక నియతి ఉంది. ధర్మా లున్నాయి. జరగ కూడనివి ఎన్నడూ జరగవు. జరిగే వాటిని ఆపాలి అనుకున్నా అవి జరిగి తీరుతాయి. ఏవి ఎలా ఉంటాయో ముందే వివేకంతో గ్రహించ గలిగితే, శుభాశుభాలు, హర్ష విషాదాల మధ్య ఊగిసలాడే పరిస్థితి తల ఎత్తదు.

శుభమైనా, అశుభమైనా, ఏది ఎందుకు జరుగుతూ ఉందో మనకు తెలియక పోవచ్చు. మన ప్రమేయం లేకుండా మన జీవితంలోకి ఏవీ ప్రవేశించవు. తెలిసో, తెలియకో తెచ్చుకున్న వాటిని తరిమితే పోవు. పోయే క్షణం వచ్చినపుడు తురిమినా నిలవవు. అవి అలా జరగడం వెనుక ధర్మముంది. దైవ హస్త ముంది.

గృహ ప్రవేశము అనేది శుభ కార్యము. బంధుమిత్రాదుల మధ్య ఒక వ్యక్తి ఆ కార్యాన్ని ఎంతో ఆనందంగా జరుపుకుంటూ ఉంటాడు. పొంగిపోతూ ఉంటాడు. ఈ లోగా ఆ ఇంట్లో అగ్ని ప్రమాదము సంభవించి తీరని నష్టం వాటిల్లుతుంది.

గృహ ప్రవేశము, అగ్ని ప్రమాదము రెండూ సంఘటనలే. నిష్కారణంగా, నిర్హేతుకంగా ఏదీ జరగ లేదు. గృహప్రవేశ కార్యంలో సంతసించిన వ్యక్తి అగ్ని ప్రమాదం జరిగి నపుడు దుఃఖిస్తాడు. కారణాలను అన్వేషిస్తూ

ద్వేషాన్ని ప్రకటిస్తాడు. దుఃఖాన్ని కలిగించే సన్నివేశం వెనుక దాగి యున్న వాస్తవాన్ని చూడలేక పోవడమే, అర్థం చేసుకోలేక పోవడమే అతని ద్వేషానికి కారణ మవుతూ ఉంది.

సూర్యోదయంలో వెలుగులు విరజిమ్ముతాయి. దానిని శుభోదయంగా మనిషి స్వీకరిస్తాడు. సూర్యా స్తమయంలో చీకట్లు ముసురు కుంటాయి. అది అశుభమా? సూర్యాస్తమయం లేకపోతే, సూర్యోదయం ఎలా జరుగుతుంది? అవగాహన లోపించిన వారికి చీకటి అశుభము. చీకటి అనేది గాయపడే గాని, రాకూడనిది కాదు. ఈ వాస్తవాన్ని అంగీకరిస్తూ, దీపాన్ని వెలిగించి, సంధ్యలో వందనం సమర్పించ మన్నారు మన పెద్దలు.

కొన్ని సంఘటనలు ప్రియంగా ఉంటాయి. కొన్ని అప్రియంగా ఉంటాయి. శుభమైనా, అశుభమైనా వాటిని సమంగా స్వీకరించాలి. ఆందోళన లేకుండా కర్మఫలాలను అందుకో గలగాలి (**సమత్వం యోగ ఉచ్యతే**). బాధ ఉండ కూడదు. ప్రతిచర్యలు లేకుండా ప్రవర్తించాలి. అప్పుడే సమత్వం ఉన్నట్లు. వివేక ప్రజ్ఞ గల వానిలో ఈ సమస్థితి సహజంగా శోభిస్తూ ఉంటుంది. ముముక్షువులు అవగాహనను పెంచుకొని, ఆందోళన లేకుండా జీవించడానికి ప్రయత్నించాలి. ప్రారంభంలో ఏదైనా కష్టం గానే ఉంటుంది. కాలంలో అన్నీ సౌలభ్యాలే ఉంటాయి.

పసిబిడ్డ తడబడే అడుగులతో నడిచేందుకు చేసే ప్రయత్నం చూస్తే, మనకే ఆందోళనగా ఉంటుంది. అడుగడుగుకి బిడ్డ ఎంతగానో కష్ట పడుతూ ఉంటుంది. వయస్సు పెరిగే కొద్దీ, నిలబడటం, నడవటం, పరుగులు తీయటం అన్నీ సహజంగా జరిగి పోతూ ఉంటాయి. ఈ సహజత్వము ఎక్కడ నుండో ఊడి పడలేదు. బిడ్డ అభ్యాసం లోనే సమకూరింది. ముముక్షువు లైనవారు జ్ఞాన లక్షణాలను ప్రయత్నించి సాధించుకోవాలి. సిద్ధావస్థలో అవే సహజంగా కనిపిస్తాయి.

అర్జునుడు అడిగిన మూడవ ప్రశ్న ***కిం ఆసీత?*** *అంటే, ఎలా కూర్చుంటాడు? శ్రోత్రాది జ్ఞానేంద్రియాలను ఎలా నియమిస్తాడు? అని అర్థం. దానికి సమాధానమే యాభై ఎనిమిదవ శ్లోకం*

యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58

యదా-సంహరతే-చ-అయం-కూర్మః-అంగాని-ఇవ-సర్వశః
ఇంద్రియాణి-ఇంద్రియార్థేభ్యః-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

యదా	= ఎప్పుడు	సర్వశః	= అన్ని వైపుల నుండి
అయం	= ఇతడు	సంహరతే	= వెనుకకు మరల్చునో
కూర్మః	= తాబేలు	తస్య	= అతని
అంగానీవ	= అంగముల వలెనే	ప్రజ్ఞా	= జ్ఞానము
ఇంద్రియార్థేభ్యః	= శబ్దాది విషయముల నుండి	ప్రతిష్ఠితా	= స్థిరమైనది
ఇంద్రియాణి	= ఇంద్రియములను		

తాబేలు తన అంగాలను లోనికి ముడుచుకుంటుంది కదా! అలాగే స్థితప్రజ్ఞుడు తన ఇంద్రియాలను విషయాల నుండి వెనక్కి లాగేసుకుంటాడు. అతని జ్ఞానము చలించనిది.

వ్యాఖ్య

మనం నివసిస్తున్న ప్రపంచం ఎవరి సొత్తూ కాదు. ఏ ఒక్కరికీ సొంతం కాదు. ఇక్కడ ఎవరైనా, దేని

కోసమైనా ప్రయత్నించని వస్తు, ప్రయత్నించిన ప్రతి ఒక్కరికీ ప్రతిదీ దొరుకుతుందని చెప్పలేము. దొరికినా స్థిరంగా నిలుస్తుందని చెప్పలేము. ఇప్పటి వరకు మన జీవితంలో ఎన్నెన్నో దొరక బుచ్చుకున్నాం. అలాగే వాటిని జారవిడుచుకున్నాం. ఎందుకని అలా జరుగుతుంది? ముందే చెప్పాను కదా, ఏదీ మన సొత్తు కాదు.

ఇంద్రియాలు మన దేహంలో ఉన్నాయి. ఇంద్రియ విషయాలు దేశంలో, అంటే బయట ఉన్నాయి. బాహ్యం లోని విషయాలను ఇంద్రియాలు గ్రహించి మనస్సు ముందు ఉంచుతాయి. తత్ఫలితంగా ఇంద్రియాల ద్వారా మనస్సు వెళ్ళి విషయ ప్రపంచంతో సంబంధాన్ని ఏర్పరచు కుంటుంది. ద్వంద్వాలను అనుభవిస్తూ ఉంటుంది.

మనస్సు అలా ఎందుకు విషయాల వైపు పరుగులు తీస్తుంది? ఏదో లాభం ఉంది కనుకనే పోతుంది. లాభం వచ్చేటట్లైతేనే ఎవరైనా, ఏ వ్యాపారం లోకి అయినా ప్రవేశిస్తారు. ఏదీ రాదని తెలిస్తే ఎవ్వరూ ఎక్కడికీ పోరు.

ఇంతకీ ఇంద్రియ విషయాల వల్ల మనస్సు పొందే లాభ మేమిటి? ఇక్కడ ఇంకా కాస్త లోతుగా ఆలోచించ వలసి ఉంటుంది. లాభము అనేది మళ్ళీ రెండు విధాలు. వాస్తవంగా లాభం ఉండి, లాభాన్ని పొందడము ఒకటి. లాభము లేకపోయినా, లాభము ఉన్నట్లు, లాభాన్ని పొందుతున్నట్లు ఊహించుకొని తృప్తి చెందడము మరొకటి. అంటే, ఈ రెండవ విషయంలో వాస్తవంగా జరిగేది ఒకటి. మనం భావించేది మరొకటి.

ఇంద్రియ విషయాలు సుఖ హేతువులు అని అందరి అభిప్రాయం. అందుకే అందరూ ఆ వైపు పరుగులు తీస్తూ ఉంటారు. వస్తువులలో సుఖాలు ఉన్నట్లయితే, సుఖ మనేది విషయాల స్వభావమైతే, ఒకర్ని ఆకర్షించిన విషయం, లేదా వస్తువు అందరినీ ఆకర్షించగలిగి ఉండాలి.

సీతమ్మ చూసింది బంగారు జింకే అయితే అది రామలక్ష్మణుల్ని కూడా ఆకర్షించి ఉండాలి. కాని, అలా జరగలేదు. సీతమ్మ కష్టాలకు బంగారు జింక కారణమా? అది బంగారు జింక కాదు అని గ్రహించలేని సీతమ్మ బుద్ధి కారణమా? అమ్మగారి బుద్ధే కారణం. అదలా ఉంచండి. అసలు బంగారు జింక అక్కడికి రాకుండా ఉన్నట్లైతే, సీతమ్మ అమాయక మనస్సు దానిని కోరేది కాదు కదా? బంగారు జింక ఉంటే ఉండ నివ్వండి. కళ్ళతో చూడబట్టే కదా ప్రమాదం వాటిల్లింది! కళ్ళు చూస్తే ఏమైంది? మనస్సు కోరుకోకుండా రామలక్ష్మణుల మనస్సుల లాగా కదలకుండా ఉండి ఉంటే ఈ ఇక్కట్లు వచ్చేవి కావు కదా? ఇలా ఎన్నో ప్రశ్నలు.

ఇంద్రియాలు ప్రదర్శించక పోతే, మనస్సు ప్రకోపించదు కదా? అని కొందరు. మనస్సు స్థిరంగా ఉండ గలిగితే కిటికీల వంటి ఇంద్రియాలు కలత పెట్టవు కదా? అని మరి కొందరు. నిజం చెప్పాలంటే, ఈ రెండూ కారణం కావు. మరో విధంగా చెబితే రెండూ కారణాలే. వివేకం లోపిస్తే, ఏదైనా దుఃఖానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. వివేకం ఉంటే, ఏదీ బాధించదు. ఇంద్రియాల విషయంలో ఉండ వలసిన అవగాహనను యాభై ఎనిమిదవ శ్లోకం లోను, మనస్సు విషయంలో ఉండ దగిన అవగాహనను యాభై తొమ్మిదవ శ్లోకం లోను అందిస్తున్నాడు భగవంతుడు.

పార్థా! తాబేలు తన అంగాలను లోనికి ముడుచు కొనునట్లు, స్థితప్రజ్ఞుడు ఇంద్రియాలను ఇంద్రియ విషయాల నుండి మరలించి అంతర్ముఖం చేస్తున్నాడు అంటున్నాడు పార్థసారథి.

ఇంగితము లేని ఇంద్రియాలు

ఇంద్రియాలను జయించిన వాడే ఆత్మ సామ్రాజ్యానికి అధినేత అవుతాడని, ఇంద్రియాలను జయించ

లేని అసమర్థులే ఇక్కట్ల పాలు అవుతారని సాధారణంగా మనుషులు అభిప్రాయ పడుతూ ఉంటారు. కనుక ఇంద్రియ విషయాల నుండి ఇంద్రియాలను ఉపసంహరించే ప్రయత్నం చేస్తూ ఉంటారు.

కొందరు హఠ యోగాది ప్రక్రియలను అనుసరిస్తూ ఇంద్రియాలను బలవంతంగా లొంగదీస్తూ ఉంటారు. ఇలాంటి సాధు స్వభావాలు ఉన్నవాళ్ళు ఎన్నెన్నో, తాత్కాలికంగా నిగ్రహించబడి మళ్ళీ బహిర్ముఖం చెందేందుకు అవకాశం కొరకు ఇంద్రియాలు ఎదురుచూస్తూ ఉంటాయి. అలా కాకుండా, ఇంద్రియ విషయాల లోని దోషాన్ని మనస్సుకు పట్టిస్తే, తెలిసి ఎవరూ గోతిలో పడరు కనుక, ఇంద్రియాలు సహజంగానే నిగ్రహించ బడతాయి. దీనినే యోగశాస్త్రంలో 'ప్రత్యాహారము' అంటారు.

ప్రపంచంలో ఎన్నో విషయాలు ఉన్నాయి. మరెన్నో వస్తువులు ఉన్నాయి. వాటన్నిటిని గూర్చి మనం ఆలోచిస్తున్నామా? ఉన్న వన్నీ మనకు తెలియవు. తెలిసిన విషయాలలో కూడా అన్నీ మనం పట్టించుకోము. ఏవి మనకు అవసరమో, వేటిపై మనకు ఆసక్తి ఉందో, వాటినే పట్టించు కుంటాము.

ఇంద్రియాలు ఉన్న వాటిని తెలియ జేస్తాయి. అంతే. నేత్రేంద్రియము ఉంది కనుక రూపాలు, రంగులు కనిపిస్తున్నాయి. శ్రోత్రేంద్రియము ఉంది కనుక శబ్దాలు వినిపిస్తున్నాయి. కళ్ళు లేని వ్యక్తికి రూపాలు లేవు, రంగులూ లేవు. అలాగే పంచ జ్ఞానేంద్రియాలు లేకపోతే ప్రపంచమే లేదు.

ప్రపంచం ఒకటి ఉంది అని మనకు తెలియడానికి ఇంద్రియాలు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. నడచిపోతూ దారిలో ఒకచోట గుడిగంటలు వింటాం. అంతే. దగ్గరలో గుడి ఉంది అని గ్రహించి అక్కడికి వెళ్ళి భగవంతునికి నమస్కరిస్తాం. గాఢనిద్రలో ఉన్నా, అలారం మోగగానే నిద్ర లేచి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటాం. ఇదంతా వినికిడి వల్ల కలిగే ప్రయోజనం.

టెలివిజన్ కార్యక్రమాల్ని చూస్తూ ఒకే ఒక రిమోట్‌తో ఛానళ్ళను మారుస్తూ ఉంటాం. ఇలా మనం ఛానళ్ళు మార్చడానికి కళ్ళు కారణమా? టెలివిజన్ లోని కార్యక్రమాల్ని కళ్ళు చూపిస్తాయి. అంతే. ఏ కార్యక్రమాన్ని చూడాలి అనే విషయాన్ని నిర్ణయించేది మనస్సే గాని కళ్ళు కావు. అవసరమైన కార్యక్రమాల్ని చూడటం మానేసి, అనవసరమైన, ఆసక్తికరమైన కార్యక్రమాల్నే మనం బుద్ధిలేనివారై చూస్తూ ఉంటాము.

ఈ ప్రపంచంలో కోరుకోకుండా ఎప్పటినైనా చూడవచ్చు. ఆసక్తి కలిగి ఆశించి నప్పుడే బంధాలు మొదలవుతాయి. ఆశించేది మనస్సే కాని ఇంద్రియాలు కావు. మనస్సు నిగ్రహంతో ఉంటే, ఇంద్రియాలు చేయగలిగేది కూడా ఏమీ ఉండదు. కారణం నిర్ణయించే వ్యక్తికి అర్థము కావలసి ఉంటుంది.

మనస్సును నిగ్రహించడాన్ని శాస్త్రంలో 'శమము' అంటారు (*మనో నిగ్రహః*). శమము మనకు పట్టున, ఇంద్రియాలను వస్తువుల నుండి దూరం చేయడము ఒక్కటే మార్గము. అదే బాహ్యేంద్రియ నిగ్రహము. దీనిని శాస్త్రంలో 'దమము' అంటారు. గీతలో మనం ముందుకు పోయే కొద్దీ ఈ ప్రస్తావన అనేక చోట్ల వస్తుంది. అప్పుడు విపులంగా చర్చించుకుందాం. ఇంద్రియాలను చక్కగా ఉపసంహరించ గలిగితే (*సంహరతే, సమ్యక్ ఉపసంహరతే*) తాత్కాలికంగా మనస్సు నియమించ బడుతుంది. ఇలా ఉపసంహరించడం స్థితప్రజ్ఞునికి సహజంగా ఉంటుంది. తాబేలు తన అవయవాలను లోనికి ముడుచు కున్నంత సులువుగా ఉంటుంది. అదే పనిని సాధకుడు ప్రయత్నంతో పరిశ్రమించి సాధించాలి.

తాబేలు తార్కాణము

ఇంద్రియాలను బయటకు విడిచి పెట్టడం, మరలి లోపల పెట్టుకోవడం అనేది జ్ఞానికి తాబేలు లాగా సహజంగా ఉంటుందని సోదాహరణంగా వివరిస్తున్నాడు.

భారతీయ సాహిత్యం, ముఖ్యంగా తత్వశాస్త్రం పశుపక్ష్యాదుల్ని, మృగకీటకాదుల్ని నిశితంగా పరిశీలించి, మానవ జీవన విధానానికి సరిపడే అంశాలను వాటి నుండి గ్రహించి, వాటి ద్వారా నైతిక, ఆధ్యాత్మిక సత్యాలను విరివిగా మానవాళికి వితరణ చేసింది.

విశ్వాసము, క్రూరత్వము, మోసం, స్నేహం, ఇంద్రియ నిగ్రహం, త్యాగం - మొదలైన గుణాలను, స్వభావాలను విపులంగా వివరించ డానికి, ఆసక్తికరంగా బోధను శ్రోత గ్రహించ డానికి, నోరు లేని ప్రాణుల్ని ఎన్నుకొని నోరార ప్రవచించింది.

ప్రస్తుతం జ్ఞాని తన ఇంద్రియాలను నియమించే పద్ధతిని వివరించ డానికి తార్కాణంగా కూర్మానికి కుర్చీ వేశాడు శ్రీకూర్ముడు.

తాబేలు వేగంగా చరించ లేదు. మెల్లగా చరిస్తూ ఉంటుంది. ఏదైనా శబ్దం విన్నా, లేదా ఏదైనా అపాయాన్ని శంకించినా, వెంటనే తన అంగాలను వాలముతో సహా లోనికి లాగేసు కుంటుంది. దృఢమైన, దుర్భేద్యమైన కవచం లాంటి చిప్పలో ఇమిడి పోతుంది. అపాయం నుండి తప్పించు కుంటుంది.

అంగాలను సులువుగా బయటకు వదలి పెడుతుంది. అలాగే, సులువుగా లోనికి ముడుచు కుంటుంది. అంటే, ఎప్పుడు బహిర్ముఖం కావాలో, ఎప్పుడు అంతర్ముఖం కావాలో తాబేలుకు తెలుసు. కూర్మానికి భగవత్ప్రసాదంగా ఆ జ్ఞానం లభించింది. అదే స్థితప్రజ్ఞునిలో వివేక ప్రజ్ఞ వల్ల ప్రాప్తించిన మనః ప్రసాదంగా శోభిస్తోంది.

కూర్మ మఖిలావయవముల గుదియ ముడుచు
మాడ్కి నే యోగి యింద్రియ మానసములఁ
దనర మరలించు నింద్రియార్థముల వలన
నాతఁ డాత్మ స్థిత ప్రజ్ఞుఁడగు మహాత్మ ।

ఇది 'సీతారామాంజనేయ సంవాదము' అనే బృహద్గ్రంథము లోని పద్యము.

తాబేలు అవయవాలను సులువుగా బయటకు వదలి పెట్టి, తిరిగి సులభంగా వెనక్కి తీసేసుకుంటుంది. మానవులు కూడా శ్రోత్రాది ఇంద్రియాలను సులువుగా బహిర్ముఖం చేస్తారు. కాని ఎందుకనో, అంత సులువుగా వెనక్కి తీసుకోలేరు.

అభిమన్యుడు వీరావేశంతో పద్మవ్యూహంలో ప్రవేశించాడు. ప్రవేశించ గలిగాడే గాని తిరిగి నిష్క్రమించలేక పోయాడు. మృత్యువాత పడ్డాడు. విచ్చలవిడిగా ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో పెనుగు లాడితే, ఆ తరువాత జీవితంలో పెనుతుఫానే ముంచు కొస్తుంది. అందుచేత ఇంద్రియ నిగ్రహము చాలా అవశ్యంగా తెలుస్తోంది.

స్వామీ! మీకు ఏ ఆహారమంటే ఇష్టం అని ఒక సాధువును ప్రశ్నిస్తే, నాయనా! నాకు ప్రత్యాహారం అంటే చాలా ఇష్టం అని చెప్పాడట. ఇంద్రియాలను ఇంద్రియ విషయాల నుండి వెనుకకు త్రిప్పడమే ప్రత్యాహారం. ఆహారం లేకపోతే మనిషి జీవించ లేడు. ప్రత్యాహారం లేకుండా సాధకునికి ఆధ్యాత్మిక జీవితం ఉండదు.

ఇంద్రియాలను నియమించి తీరాలి. అన్ని వైపుల నుండి నియమించాలి. ఏ ఒక్క ఇంద్రియాన్నో నియమిస్తే సరిపోదు. ఒక ఇంద్రియం యొక్క ప్రభావం మరొక ఇంద్రియంపై పడే ప్రమాద ముంది. అందుచేత అన్ని వైపుల నుండి *(సర్వశః)* అని చెప్పడం జరిగింది.

ఇవి చూడ కూడనివి, అవి విన కూడనివి, ఇవి తిన కూడనివి అని మునికి తెలుసు. అవి ఎలా నిరుపయోగమో వివేక బుద్ధి ఫలితంగా స్థితప్రజ్ఞునికి తెలుసు కనుక అతని ఇంద్రియాలు సహజం గానే విషయాల నుండి వెనుదిరుగుతాయి. ముముక్షువులు ఈ విషయంలో తీవ్రంగా ప్రయత్నించాలి. అప్పుడే ఇంద్రియ నిగ్రహాన్ని సాధించ గలుగుతారు. అవగాహన చాలినంతగా లేనప్పుడు విషయాల నుండి విరమించడం అలవరచు కోవాలి. ఇంద్రియాలను విషయాలకు దూరంగా ఉంచాలి.

ఇంద్రియాలను ఇంద్రియ విషయాలకు దూరం చేస్తే సరిపోతుందా? అంతటితో ఇంద్రియ నిగ్రహం సాధించి నట్లేనా? కానే కాదు. అది కేవలం తాత్కాలిక ఉపశమనమే. ఉపసంహారమే. పట్టు సడలిస్తే మళ్లీ పరుగులే. మరి శాశ్వతంగా ఇంద్రియాలు ఎప్పుడు నిగ్రహింప బడుతాయి? అది కూడా విందాం.

విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59

విషయాః-వినివర్తంతే-నిరాహారస్య-దేహినః
రసవర్జం-రసః-అపి-అస్య-పరం-దృష్ట్వా-నివర్తతే

నిరాహారస్య	= ఆహారం లేని,	పరం	= పరమాత్మను
దేహినః	= జీవుడికి	దృష్ట్వా	= చూచి
రసవర్జం	= రాగాన్ని విడిచి	అస్య	= అతని యొక్క
విషయాః	= విషయములు	రసః అపి	= రాగము కూడా
వినివర్తంతే	= నివర్తిస్తాయి	నివర్తతే	= తొలగి పోతుంది

విషయాలను గ్రహించని జీవునికి విషయాలు దూర మవుతున్నాయే గాని, వాటి యందు రాగము నశించడం లేదు. పరమాత్మను దర్శించ గలిగితే విషయాలతో పాటు రాగము కూడా తొలగి పోతుంది.

వ్యాఖ్య

దేహానికి ఆకలిదప్పులు ఉన్నట్లే, మనస్సుకు కూడా ఆకలిదప్పులు ఉన్నాయి. అదే రాగాసక్తి. ఇంద్రియాలను నిగ్రహిస్తే, విషయాలు దూర మవుతాయి. అంతేగాని మనస్సులో ఉండే విషయాసక్తి దూరం కాదు. కేవలం ఇంద్రియాలను నియమించినంత మాత్రాన, ఆ వ్యక్తి యొక్క బుద్ధి స్థిరంగా ఉంది *(స్థితధీః)* అని చెప్పలేము.

ఉపవాసం

ఇంద్రియాలను జయించాలని, ఉద్రేకాలను నియంత్రించాలని అభిప్రాయపడి కొందరు సాధకులు ఉపవాస వ్రతం పాటిస్తూ ఉంటారు. నిరాహారంగా ఉంటే ఇంద్రియాలను అరికట్ట వచ్చు అనుకుంటారు. ఇది ఉపయుక్తం కాదని ఆ తరువాత అనుభవంలో గ్రహిస్తారు. ఆహారాన్ని దూరం చేసుకో గలమే గాని ఆహారం పట్ల ఆసక్తిని దూరం చేసుకోలేము అని తెలుసు కుంటారు.

ఆహారం తీసుకోకుండా ఉంటే ఆహారానికి భౌతికంగా దూర మవుతాము. మానసికంగా చాలా దగ్గరై ఉంటాము. ఏకాదశి నాడు కొందరు ఉపవాసం ఉంటారు. వారి దృష్టి, ధ్యానము అంతా ద్వాదశి మీదే ఉంటుంది. అంటే, ద్వాదశి పారాయణం మీద కాదు. పారాయణానంతరం స్వీకరించ బోయే ప్రసాదం మీద, భోజనం మీద ఉంటుంది. ఆ భోజనం ఎలా ఉండాలి? అనే విషయచర్చ లోనే కొందరు ఏకాదశిని గడిపేస్తారు.

ఉపవాసంలో దేహం బలహీన పడుతుంది. ఇంద్రియాలన్నీ శక్తిహీనంగా ఉంటాయి. అంటే, అన్ని

ఇంద్రియాలలో ఉన్న బలం ఏమైనట్లు? అన్ని
ఇంద్రియాలలో బలం లేకుండా ఉంటుంది. అయితే ఇంతవరకు ఇంద్రియాలలో ఉన్న బలం ఏమైనట్లు? అన్ని
ఇంద్రియాలలో ఉన్న బలం వెళ్ళి నాలుకకు అంటుకుపోయింది అని అర్థం.

ఇంద్రియాణి జయన్త్యాశు నిరాహారా మనీషిణః
వర్జయిత్వాతు రసన మసౌ రస్యేహి వర్ధతే॥

ఆహారాన్ని విడిచి పెట్టిన విద్వాంసులు అన్ని ఇంద్రియాలను జయించ గలుగుతారు, ఒక్క రసనేంద్రియమును తప్ప. ఎందుచేత నంటే, నాలుక స్వవిషయంలో ఆసక్తిని పెంచుకుంటూనే ఉంటుంది అన్నది భాగవతము.

జ్వరం వస్తే ఆహారం రుచించదు. రోగి ఆహారం తీసుకోవడం మానేస్తాడు. నీరసంతో ఉంటాడు. ఇంద్రియాలన్నీ బలహీనపడి ఉంటాయి. అంతమాత్రాన అతనిలో ఆసక్తి, అభిరుచి నశించవు. జ్వరం తగ్గగానే ఏవేవి తినాలి? అని ఊహించుకుంటూనే ఉంటాడు. జ్వరం వల్ల రసనేంద్రియము పదార్థాల జోలికి పోదు. కనుక ఆ వ్యక్తికి ఆహార పదార్థాలు దూర మవుతాయి. అంతే కాని ఆహారం మీద అభిరుచి దూరం కాదు. ఇదే విషయాసక్తి. ఇదే రాగాసక్తి. రసానుభవం.

నీరసం రసహీనం కాదు

నిరాహారంగా ఉంటే మనిషి నీరసిస్తాడు. దేహేంద్రియాలు నీరసానికి లోనవుతాయి. కాని, మనస్సు మాత్రం రసపూర్ణం గానే ఉంటుంది. మనస్సు నీరసించదు. విషయాలు దూరమైనంత మాత్రాన విషయరసం దూరం కాదు. మనస్సు నుండి కారిపోదు. పారిపోదు.

ఆహారము అంటే కేవలం నాలుక ద్వారా లోనికి వెళ్ళే పదార్థాలు మాత్రమే అని భావించ కూడదు. *ఆహ్రియతే ఇతి ఆహారః*. ఇంద్రియాల ద్వారా మనం గ్రహించే విషయాలన్నీ ఆహారమే. నోటికి పదార్థాలు ఆహారమైతే, కంటికి రూపాలు, రంగులు ఆహారము. చెవికి శబ్దము ఆహారము. ముక్కుకు వాసన ఆహారము. చర్మానికి స్పర్శ ఆహారము. ఇంద్రియాల ద్వారా లోనికి గ్రహింపబడే బాహ్య విషయాలన్నీ ఆహారమే.

విషయాల మీద మనకు ఉండే ఆసక్తే రాగం. ఆ రాగాన్నే రసం అంటారు. 'రస' శబ్దానికి ఆసక్తి, అభిరుచి, రాగం అనే అర్థాలు ప్రముఖంగా ఉన్నాయి (*రస శబ్దో రాగే ప్రసిద్ధః*). విషయ సంబంధమైన రాగమే రసము. విషయాలను నిరాకరిస్తే (*ఆహారం*) విషయాలు దూర మౌతాయే గాని, విషయ సంబంధమైన ఆసక్తి, రసం మనస్సులో ఊరుతూనే ఉంటుంది. నిరాహారం వల్ల దేహేంద్రియాలు నీరసించ వచ్చు నేమో గాని మనస్సు మాత్రం రసహీనం కాదు.

విషయాలను నివారించినా విషయాసక్తి మనస్సులో గాఢంగా ఉంటుంది కనుక, మళ్ళీ విషయానుభవం లోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ఆహారాన్ని పునః విశేషంగా స్వీకరించే పరిస్థితిని ఎవ్వరూ కాదన లేరు.

దేహ బరువు తగ్గాలని నేడు చాలా మంది అనేక చికిత్సలను చేయించు కుంటున్నారు. పురాతన చికిత్సలతో పాటు అధునాతన సాంకేతిక చికిత్సలు కూడా వ్యవహారం లోకి వచ్చి ఉన్నాయి. చికిత్స సమయంలో ఆరు కిలోల బరువు తగ్గితే, చికిత్సానంతరం కొంత కాలానికి మళ్ళీ తొమ్మిది కిలోలు పెరిగి ఉంటారు. అభిరుచులు బరువును అధికం చేస్తాయి.

వృక్ష శాఖల్ని ఖండించి నంత మాత్రాన వృక్షం నశించదు. మూలం గాఢంగా లోతుకు చొచ్చుకు పోయి ఉంటుంది కనుక మళ్ళీ చెట్టు చిగురిస్తూనే ఉంటుంది. నూతనమైన శాఖలు పుట్టుకొస్తూనే ఉంటాయి. మూలాన్ని వ్రేళ్ళతో సహా పెకలించి వేస్తే, చెట్టు మళ్ళీ చిగురించదు. ఇంద్రియ నిగ్రహం కూడా అంతే.

విషయాలను దూరం చేస్తే ఉపయోగం ఉండదు. విషయాసక్తి మనస్సులో దూరం కావాలి. దేహేంద్రియ మనస్సులు అన్నీ నిగ్రహింప బడాలి.

నిరాహారంగా ఉండి, ఇంద్రియాలను విషయాలకు దూరంగా ఉంచడాన్ని 'నిగ్రహం' అంటారు. మనస్సులో రాగ రసం ఇంకిపోయి, మనస్సు స్వాధీన మైతే, దానిని 'సంయమనం' అంటారు. నిగ్రహము ఒక్కటే సరిపోదు. సంయమనం కూడా కావాలి. అప్పుడే బుద్ధి స్థిరంగా ఉంటుంది. అదెప్పుడు సాధ్యం? పరమాత్మ దర్శనం జరిగి నపుడే.

పరధ్యానము - పరమాత్మ దర్శనం

పరమాత్మ ఆనంద స్వరూపుడు (*రసోవైసః*). రస స్వరూపుడైన పరమాత్మ దర్శనం లభించే వరకు మనసులో రసం నివర్తించదు. రాగాసక్తి దూరం కాదు. విషయాభిలాష అదృశ్యం కాదు. పరతత్త్వాన్ని ఎప్పుడైతే దర్శించడం జరుగుతుందో, అప్పుడే విషయాలతో పాటు విషయ రసం కూడా లేకుండా పోతుంది.

ఒకడు పరధ్యానంలో ఉంటే, అతని ముందు ఏది ఉన్నా ఉన్నట్లు అతనికి తెలియదు. పిలిచినా అతనికి వినిపించదు. శబ్దం అతని చెవిలో పడుతుందే గాని మనస్సులో దూరదు. ఇంద్రియాలకు విషయాలు అందుతున్నా, పరధ్యానంలో ఉన్నవాడు ఆ విషయాల పట్ల స్పృహ లేకుండా ఉంటాడు. కారణం ఏమిటి? ఎదురుగానే ఉన్న వస్తువు కనిపించక పోవడానికి కారణము, అతని మనస్సులో మరేదో వస్తువు ఉండటమే. మనస్సులో గోచరించే వస్తువును చూడటంలో నిమగ్నమై ఉన్నాడు కనుక కళ్ళ ఎదుట ఉన్న వస్తువును గుర్తించ లేక పోతాడు.

ఆంతర్యంలో పరమాత్మను దర్శించే వాడు బాహ్య విషయాల యందు స్పృహ లేనివాడై ఉంటాడు. ఆసక్తి లేనివాడై ఉంటాడు. రస పిపాస లేనివాడై ఉంటాడు. బయట ఎన్నయినా ఉండనీ. ఉన్న వన్నీ లోనున్న దాని కన్నా వేరు కానపుడు, ప్రత్యేకించి దేని మీద ఆసక్తి ఉంటుంది? పరమాత్మ దర్శనం కలగనంత వరకే ప్రపంచంపై ఆసక్తి ఉంటుంది. పరమాత్మ దర్శనంతో విషయ పిపాసలు పండుటాకుల్లా రాలిపోతాయి. ఇదంతా పరమాత్మ దర్శన వైభవము.

అత్యవసరమైన పని మీద వెళ్తున్న తల్లి, బిడ్డను ఇంటిలో విడిచి పెట్టి జాగ్రత్తగా చూస్తూ ఉండమని కుటుంబీకులకు చెప్పి వెళ్తుంది. ఉదయం వెళ్ళిన తల్లి మధ్యాహ్నమైనా ఇంకా ఇంటికి రాలేదు. తల్లి కోసం బిడ్డ ఏడవడం మొదలు పెడుతుంది. పండ్లు, మిఠాయిలు బిడ్డ చేతిలో పెట్టి, అమ్మ వచ్చేస్తుందని ఓదార్చుతూనే ఉన్నారు కుటుంబము లోని వారు.

సాయంత్రం అయింది. అమ్మ ఇంకా రాలేదు. బిడ్డ ఏడుపు తారాస్థాయికి చేరుకుంది. బొమ్మలు కూడా కొనిపెడతారు. అవన్నీ బిడ్డ చేతిలో పట్టుకొని ఉంటుందే గాని, ఏడుపు మాత్రం మానదు. బొమ్మలు చేతి లోనే ఉంటాయి. కళ్ళల్లో నీళ్ళు కారుతూనే ఉంటాయి.

ఈ లోగా అమ్మ వచ్చేస్తుంది. తల్లిని చూడగానే బిడ్డ చేతి లోని బొమ్మల్ని పడేస్తుంది. చుట్టూ ఉన్న మిఠాయిలను, పండ్లను ప్రక్కకు నెట్టేస్తుంది. ఏడుపు ఆపేస్తుంది. ఒక్క ఉదుటన లేచి, అమ్మా! అంటూ ముందుకు ఉరికి అమ్మను పట్టేసుకుంటుంది. చుట్టేసుకుంటుంది. అంతే. ఆ క్షణంలో, బిడ్డకు తల్లి తప్ప మరేదీ కనిపించదు. వినిపించదు. తినాలని అనిపించదు. సమస్త విషయాలు మనస్సు నుండి అప్రయత్నంగా జారిపోతాయి (*పరం దృష్ట్వా. అస్య రసః అపి నివర్తతే*). పరమాత్మ జ్ఞానం కలిగి, పరమేశ్వరుని దర్శించిన మనస్సులో విషయాసక్తి ఇలాగే అదృశ్య మవుతుంది. రాగం ఆగుతుంది. రసం నీరసిస్తుంది.

పల్లవి : సత్యమైన నీ కథ విని
వినిపించింది మనసు మనవిని ॥ సత్యమైన ॥
అనుపల్లవి : పోయిన పున్నమి వచ్చిందని
చేసిన పున్నెము తెచ్చిందని ॥ సత్యమైన ॥
చరణము : చెప్పుటకేమి లేదని
చెప్పక మన సుండలేదని
మనసారా నీ కిచ్చిన మనసు
ఏనాటికి తిరిగి రాదని
నిన్నాదలి ఎన్నడు రాలేదని ॥ సత్యమైన ॥

అని రాగాన్ని త్రుంచి పడేసింది చైతన్య గీతిక.

ఈ విధమైన పరమాత్మ దర్శనం, సమ్యగ్దర్శనం స్థితప్రజ్ఞునికి జరిగిపోయింది కనుక, ఆ మహాత్ముని స్థిరమైన వివేక బుద్ధిని *(స్థితధీః)* విషయాలు చేరలేవు. విషయాసక్తి చలింప చేయలేదు. ముముక్షువులైన సాధకులు మాత్రం అట్టి పరమార్థ దర్శన ప్రజ్ఞను సిద్ధం చేసుకోవాలి అని అభిభాషించారు భాష్యంలో ఆచార్యులు ***(తస్మాత్ సమ్యగ్దర్శనాత్మికాయాః ప్రజ్ఞాయాః స్థైర్యం కర్తవ్యమ్ ఇతి అభిప్రాయః)***.

పరమాత్మ దర్శన రూపమైన ప్రజ్ఞను స్థిరంగా నిలబెట్టుకోవాలి. అలా భావించే వారు ముందుగా తమ ఇంద్రియాలను వశపరచుకోవాలి. శుద్ధి చేసుకోవాలి. ఇంద్రియాలు వశపడక పోతే మాత్రం, ఆ తరువాత పెనుతుఫాను చెలరేగే ప్రమాదం ఉంటుంది. ఎలాగంటే . . . . .

యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః ।
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః ॥ 60

యతతః-హి-అపి-కౌంతేయ-పురుషస్య-విపశ్చితః
ఇంద్రియాణి-ప్రమాథీని-హరంతి-ప్రసభం-మనః

కౌంతేయ	= అర్జునా!	ప్రమాథీని	= ప్రమాదమును కలిగించు
యతతః అపి	= ప్రయత్నము చేయుచున్న	ఇంద్రియాణి	= ఇంద్రియములు
విపశ్చితః	= విద్వాంసుడైన	ప్రసభం	= బలాత్కారముగా
పురుషస్య	= పురుషుని యొక్క	హరంతి హి	= హరించు చున్నవి గదా!
మనః	= మనస్సును		

కౌన్తేయా! విద్వాంసుడైన పురుషుడు తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉంటాడు. అయినా, క్షోభను కలిగించే ఇంద్రియాలు మనస్సును బలవంతంగా లాక్కొని పోతుంటాయి.

వ్యాఖ్య

స్థితప్రజ్ఞునికి ఇంద్రియ మనస్సులు లోబడి ఉంటాయి. ఆత్మయే తాను అనే జ్ఞానం ఉండటం చేత, తన ఆనందానికి మరొక దానిపై ఆధారపడి ఉండే ప్రసక్తి లేనందున, మననశీలుని బుద్ధి స్థిరంగా ఉంటుంది. గాలి లేని చోట దీపం లాగా నిశ్చలంగా, పవిత్రంగా ఉంటుంది. అతనికి ప్రపంచము విస్మృతప్రాయం.

వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉండే దివ్యాత్ముడు స్థితప్రజ్ఞుడు. వివేకము లేని వాడు అవిపశ్చితుడు. అవివేకి. అట్టి

వానిని ఇంద్రియాలు కుదిపేస్తాయి. మనస్సు ముంచేస్తుంది. పెనుగాలికి ఊగే అరటిచెట్టు లాగా అతడు సుఖదుఃఖాల మధ్య ఊగిపోతూ ఉంటాడు.

అటు స్థితప్రజ్ఞుడు కాలేక, ఇటు అవివేకిగా ఉండలేక, స్థిరమైన వివేక బుద్ధి కొరకు ప్రయత్నించే సాధకుడు విపశ్చితుడు **(మేధావినః)**. వివేకము కలిగిన విద్వాంసుడు ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును నియమించి, స్థిరమైన వివేక ప్రజ్ఞ కొరకు ప్రయత్నిస్తూ ఉంటాడు. అట్టి విపశ్చితుడైన సాధకుని విషయం ఈ శ్లోకంలో చర్చింప బడుతూ ఉంది.

పండితుడైన సాధకుడు ఇంద్రియాలను నియమించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ ఉంటాడు ***(యతతః ప్రయత్నం కుర్వతః)***. అయినా బాధించే స్వభావం కలిగిన ఇంద్రియాలు ***(ప్రమాథీని, ప్రమథన శీలాని)*** వివేకం కలిగి ప్రయత్నం చేయుచున్న సాధకుని మనస్సును క్షోభకు గురి చేస్తాయి ***(విక్షోభయన్తి, ఆకులీ కుర్వన్తి)***. తీవ్రంగా బాధించి క్షోభింప చేస్తాయి. వ్యాకులచిత్తున్ని చేస్తాయి. అలా కలత చెందిన విద్వాంసుని మనస్సును క్షణాల్లో బలాత్కారంగా ***(ప్రసభం)*** హరించి వేస్తాయి ***(హరన్తి)***.

ఇంద్రియాలు చాలా బలం కలిగి ఉంటాయి. దేహాన్ని చలింప చేస్తాయి. మనస్సును చంచలంగా మారుస్తాయి. కొన్ని విషయాలలో మనస్సు మగతలో పడి ఉన్నా, ఇంద్రియాలు మనస్సును తట్టి లేపుతాయి. పట్టి ఊపుతాయి. అందుకనే, విద్వాంసుడు అయినప్పటికి ***(విపశ్చితః అపి)***, తీవ్రంగా ప్రయత్నం చేయుచున్నప్పటికి ***(యతతః అపి)***, ఇంద్రియాలు మనస్సును బలవంతంగా ఇంద్రియ విషయాల వైపు ఈడుస్తున్నాయి అంటున్నాడు.

చిత్తం దుర్బలం - యత్నం విఫలం

దీపం లేని ఇంటి లోనే దొంగలు పడతారు. దీపం ఒక్కటే సరిపోదు. ధీరత్వం కూడా ఉండాలి. బాహ్యంలో ఏమి జరుగుతూ ఉందో తెలుసుకోవడానికి దీపం ఉండాలి. దేని నైనా ఎదుర్కొని సాధించే ధీశక్తి వ్యక్తి ఆంతర్యంలో ఉండాలి. అప్పుడే దొంగల్ని నివారించినట్లు ఇంద్రియాలను నిగ్రహించే అవకాశం ఉంటుంది.

ఇంద్రియ విషయాల లోని దోషాన్ని చూడటము వివేకము. అట్టి వివేకము కలవాడే విపశ్చితుడు. విద్వాంసుడు. కేవలం వివేకములో ఆదమరచి ఉండటం లేదు. నిగ్రహించే ప్రయత్నము తీవ్రం గానే చేస్తున్నాడు. అయినప్పటికి ఇంద్రియాలు అతని బుద్ధిని హరించి వేస్తున్నాయి.

ప్రయత్నమే చేయకుండా కూర్చునే అవివేకి బుద్ధిని ఇంద్రియాలు సులభంగా ఈడ్చి పడేస్తాయి. ఇక్కడ విపశ్చితుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు కనుక ఇంద్రియాలు బలప్రయోగంతో అతడిని లొంగదీసు కుంటున్నాయి ***(హరన్తి ప్రసభం)***.

బలవాన్ ఇంద్రియ గ్రామో విద్వాంసం అపికర్షతి

బలవంతుడైన విద్వాంసుని కూడా ఇంద్రియాల గుంపు లొంగదీసు కుంటుంది అన్నాడు వ్యాసమహర్షి.

ప్రయత్నశీలుడైన వివేకి యొక్క మనస్సును కూడా ఇంద్రియాలు బలవంతంగా హరించ డానికి కారణ మేమిటి? అనే ప్రశ్న ఎవరిలో నైనా ఉదయిస్తుంది. దానికి కారణం ఒక్కటే. అతడు విద్వాంసుడే కావచ్చు. ప్రయత్నశీలుడే కావచ్చు. అతడి మనస్సులో ఇంకా రాగాసక్తి మిగిలి ఉంది *(రసం)*. ఈ రసమే బుద్ధిని నీరసం చేస్తుంది. లేని శక్తిని ఇంద్రియాలకు చేకూర్చుతుంది.

చిన్న నిప్పురవ్వ అరణ్యాల్ని దహించే శక్తిని కలిగి ఉన్నట్లు, మనస్సు లోని విషయాసక్తి ఇంద్రియాలకు

మిలిమీరిన బలాన్ని సమకూర్చుతుంది. ఇక్కడే చాలా మంది పండితులు పరాభవానికి లోనయ్యారు. మహాశక్తిమంతులు, మాననీయులైన వారు కూడా దారి తప్పి దగా పడ్డారు.

మహర్షి విశ్వామిత్రుడు ఎప్పుడు ఎక్కడ విఫలమైనా, ఆ దురదృష్టం వెనుక విషమించిన రసమే ఉండింది. మహాభారతంలో అయితే, మహాత్ములు, మహావీరులు అయిన భీష్మద్రోణాదులలో కూడా ఈ రాగం శ్రుతి తప్పినప్పుడే వారు ఆపదల పాలైనట్లు, ఆవేదనలకు లోనైనట్లు తెలుస్తుంది.

మనస్సులో విషయాసక్తి మిగిలి ఉంటే చాలు. ఇంద్రియాలు విజృంభించి మనస్సును లొంగదీసుకుంటాయి. బుద్ధి దుర్బల మైనపుడే సాధకుడి యత్నాలు విఫల మౌతాయి.

మనస్సు ఇంద్రియాల వశం కాకుండా సాధకులు జాగ్రత్త పడాలి. మనస్సును నిగ్రహించి, వివేక ప్రజ్ఞను స్థిరపరచుకోవాలి అని భావించే ముముక్షువులు, ముందుగా ఇంద్రియాల విషయంలో జాగ్రత్త పడాలి. దానికి ఏమి చేయాలి?

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

తాని-సర్వాణి-సంయమ్య-యుక్తః-ఆసీత-మత్పరః
వశే-హి-యస్య-ఇంద్రియాణి-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

తాని సర్వాణి	= ఆ ఇంద్రియాల నన్నిటిని
సంయమ్య	= చక్కగా వశ పరచుకొని
యుక్తః	= యోగయుక్తుడు
మత్పరః	= నా యందు ప్రియము గలవాడై
ఆసీత	= కూర్చోవాలి
యస్య	= ఎవని యొక్క
ఇంద్రియాణి	= ఇంద్రియములు
వశే	= స్వాధీనము నందున్నవో
తస్య	= అతని యొక్క
ప్రజ్ఞా	= బుద్ధి
ప్రతిష్ఠితా హి	= స్థిరమైనది కదా

ఇంద్రియాల నన్నిటినీ నిగ్రహించాలి. ఏకాగ్ర బుద్ధి కలిగి ఉండాలి. నా యందే ఆసక్తి గలవాడై ఉండాలి. ఇంద్రియాలు ఎవరికి వశ పడతాయో వారి జ్ఞానమే సుస్థిర మైనది.

వ్యాఖ్య

ఇంద్రియాలను వశపరచుకో వలసిన అవసరం జీవితంలో ప్రధాన మైనది అని తెలియని వాడు పామరుడు. అవసరాన్ని గుర్తించడమే గాక, ఆ మార్గంలో నిరంతరం శ్రమించే వాడు పండితుడు. ఇంద్రియాలను సంపూర్ణంగా నియమించడమే గాక, ఇంద్రియ విషయ స్పృహ కూడా లేని పవిత్రాత్ముడు జ్ఞాని. అతడే స్థితప్రజ్ఞుడు. అతని వివేక బుద్ధి సదా స్థిరంగా ఉంటుంది.

సాధ్యం తెలియాలి. సాధన నడవాలి. అప్పుడే సిద్ధి. ఇంద్రియ విషయాలు దోషపూరితాలు. ఇంద్రియాలు మోసపూరితాలు. ఇవి బ్రతుకును పాడు చేసేందుకే ఉన్నాయి. చెడిపే వాటిని నమ్ముకోవడం, చెడిపోగానే దుఃఖించడం మనిషికి పరిపాటి అయింది.

ఇంద్రియ విషయాలు సుఖ హేతువులు కావు. ఇంద్రియ విషయాలలో ప్రతి సుఖం వెనుక దుఃఖమే దాగి ఉంటుంది. ఇది పూర్ణంగా అర్థమైతే, ఇక ఆ తరువాత, ఆ వైపుకు పొమ్మన్నా మనస్సు పోదు. రాగద్వేషాలు స్థిరమైనవి కావు. కనుక, వాటి కార్యాలైన సుఖదుఃఖాలు కూడా స్థిరమైనవి కావు. స్థిరం కానివి ఎప్పుడో ఒకప్పుడు

మనల్ని వదలి పోయేవే. వాటంతటవి మనల్ని విడిచిపెట్టి పోతే మనకు దుఃఖం కలుగుతుంది. వాటి లోని దోషాలను గుర్తించి మనమే వాటిని వదిలేస్తే, సుఖం దూరం కాకుండా ఉంటుంది.

మనస్సును నియమించాలి అంటే ఇంద్రియాలను నిగ్రహించి తీరాలి అని పూర్వ శ్లోకాల లోనే గ్రహించాము. కనుక, వివేక ప్రజ్ఞలో కూడుకున్న స్థితప్రజ్ఞుడు ఇంద్రియాల నన్నిటినీ వశపరచుకొని (**సంయమ్య, వశీకరణం కృత్వా**) ఉంటాడు. 'మత్పరుడై కూర్చుని ఉంటాడు' (**ఆసీత మత్పరః**) అంటున్నాడు భగవంతుడు.

'మత్పరుడు' అంటే వాసుదేవుడే సర్వభూతాంతరాత్ము డని తెలిసి, తాను వాసుదేవుని కన్నా అన్యుడు కాదని భావించుట (**మత్పరః అహం వాసుదేవః సర్వ ప్రత్యగాత్మా పరః యస్య సః మత్పరః**) అని అర్థం. కూర్చుని ఉంటాడు అంటే నిర్వ్యాపారుడై ఉంటాడు అని అర్థం. అదే **ఆసీత** - 'కూర్చునుట' అనే పదానికి అర్థం (**న అన్యః తస్మాత్ ఇతి ఆసీత ఇత్యర్థః**). వాసుదేవుని కంటె తాను అన్యుడు కానట్లు భావించడం చేత, మననశీలుని ఇంద్రియాలు వశ పడతాయి. అప్పుడు అతని ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది (**అభ్యాస బలాత్ తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా**).

కృషి ఉండాలి - కృప కావాలి

ఇంద్రియాలను నిగ్రహించడంలో మన కృషి పూర్ణంగా ఉండాలి. విషయాల యందు ఆసక్తి, పరమాత్మ యందు ఉదాసీనత ఉన్నంత కాలం మనం ఈ ప్రపంచంలో అశక్తులము గానే ఉంటాము. అశక్తులతో ఏమి సాధిస్తాము? కనుక, అలాంటి సమయాలలో దృష్టిని పరమాత్మ వైపు మళ్ళించాలి.

ఈ శ్లోకంలో ప్రధానంగా రెండే విషయాలు ప్రస్తావించ బడ్డాయి. ఒకటి సాధన దశ. రెండవది సాధ్య స్థితి. ఇంద్రియాల నన్నిటినీ సంయమనం చేయాలి అనేది సాధన. మత్పరుడై ఉండాలి అనేది సాధ్య సంబంధం. సాధన విషయంలో నిషేధాన్ని నిర్దేశించాడు. సాధ్య విషయంలో విధిని నిర్ణయించాడు.

దృశ్య నివారితము సాధన కాగా, మనస్సు ఆత్మ పరమై ఉండటం సాధ్య సంబంధ మవుతూ ఉంది. విషయాలన్నీ దృశ్యాలే. దృశ్యాల నుండి ఇంద్రియ మనస్సులను నిగ్రహించి, ప్రత్యగాత్మ రూపుడైన వాసుదేవుని యందు చిత్తమును స్థిరంగా ఉంచితే, అట్టి వాని వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది (**తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా**).

దృశ్య వారితం చిత్త మాత్మనః
చిత్త్వ దర్శనం తత్త్వ దర్శనం ॥

దృశ్య పదార్థముల నుండి వారింప బడిన చిత్తము ఆత్మ దర్శనము చేయడమే సత్య దర్శన మని శ్రీరమణ మహర్షి 'ఉపదేశసారం'లో రచించారు. దృశ్యము నుండి ప్రయత్న పూర్వకంగా విడిపడాలి. ఆ తరువాత పరమాత్మ యందు మనస్సును లగ్నం చేయాలి (**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః**).

పతంజలి మహర్షి తన యోగ దర్శనములో మొదట **యోగః చిత్తవృత్తి నిరోధః** అని యోగాన్ని నిర్వచించారు. మనస్సు లోని ఆలోచనలను అరికట్ట మని ఆదేశించారు. మనస్సులో ఏ ఆలోచనలు ఉంటాయి? విషయాలకు సంబంధించిన ఆలోచనలే ఉంటాయి. కనుక దృశ్యము నుండి విడిపడ మని ప్రబోధించారు.

విషయాల నుండి విరమించిన ఇంద్రియ మనస్సులు, అలాగే ఖాళీగా ఉంటే, తిరిగి విషయాలలో దూరిపోయే ప్రమాదం ఉంటుంది కనుక, అలా నియమించిన ఇంద్రియ మనస్సులను స్వరూపంలో సంధానం చేయమన్నారు (**తదా ద్రష్టుః స్వరూపేఽవస్థానమ్**).

ఈ రెండూ సులభం కావు. విషయాల నుండి ఇంద్రియాలను నియమిస్తే గాని, మనస్సును ఆత్మ యందు లగ్నం చెయ్యలేము. మనస్సు ఆత్మ యందు లగ్నమైతే గాని రాగాసక్తి (రసం) ఉపశమించదు. ఏం చెయ్యాలి?

ఒక రాజు గారికి ఒక్కడే కుమారుడు. అతడికి వివాహం కావాలి. ఆ పిల్లవాడు ఉన్మాది. పిల్ల నివ్వమని ఎవరిని అడిగినా, 'పిచ్చి కుదిరితే పిల్లను ఇస్తాము' అంటారు. వైద్యుల్ని సంప్రదిస్తే, 'పెళ్ళి చేస్తేనే పిచ్చి కుదురుతుంది. ఇది ఒక విచిత్రమైన పిచ్చి' అంటారు. ఏం చేయాలి?

ప్రస్తుతం ఈ శ్లోకంలో మన పరిస్థితి కూడా అదే. ఇంద్రియాలను నిగ్రహించే ప్రయత్నా లన్నీ మనం చేయాలి. మన ప్రయత్నం విఫలమై నపుడు పరమేశ్వరుని వైపు మరలాలి. అనుగ్రహాన్ని అర్థించాలి. ప్రార్థించాలి.

ఇదేమిటి? సాంఖ్య ప్రకరణంలో స్థితప్రజ్ఞుడైన జ్ఞాని లక్షణాలను వర్ణిస్తూ, తటాలున భక్తికి తెర లేపడ మేమిటి? వ్యాఖ్యానాన్ని భక్తి పరంగా త్రిప్పడ మేమిటి? అని మీకు ఆశ్చర్యం కలగవచ్చు. ఇక్కడ, నేను పని కట్టుకొని వ్యాఖ్యను త్రిప్పడం లేదు. పరమేశ్వరుని వాక్యాల లోని మర్మాన్ని విప్పి చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. అంతే.

ఇంద్రియాలను నియమించడంలో మన కృషి ఫలించ నపుడు పరమేశ్వరుని కృపను అర్థించడం తప్ప మరో గత్యంతరము లేదు. అందుకే గీతాచార్యుడు **మత్పరః** అన్నాడు. లేకపోతే **తత్పరః** అని ఉండేవా డేమో! జ్ఞానమార్గంలో స్థితుడైన స్థితప్రజ్ఞుడు ఎలాగూ ఆత్మపరుడై ఉంటాడు. అదే మార్గంలో చరించే సన్యాసులు కూడా ఆత్మపరం గానే ఆలోచిస్తారు. కాని, సాధకుడైన కర్మయోగికి సగుణబ్రహ్మను ఆశ్రయించడం కన్నా మరొక మార్గమే లేదు. పైగా, అదే సరియైన మార్గము కూడా. ఆచార్యుల భాష్యంలో కూడా ఈ సత్యం తొంగి చూస్తుంది.

అర్జునా! మత్పరుడవు కావాలి. అంటే, ఆత్మ పరాయణుడవు కావాలి. లేదా, భగవత్పరాయణుడ వైనా కావాలి. ఈశ్వరుడు పరబ్రహ్మము కన్నా వేరుగా లేడు కదా! **మత్పరః** అనే అంశాన్ని వ్యాఖ్యానించే టప్పుడు 'అందరిలో ప్రత్యగాత్మ రూపంగా ఉన్న వాసుదేవుడు' అని ఆచార్యులు ప్రసాదించిన వ్యాఖ్యానాన్ని మీకు అందించాను. ప్రత్యేకించి 'వాసుదేవ' శబ్దాన్ని ప్రయోగించడంలో ఆచార్యుల వారి అభిప్రాయం సుస్పష్టంగా ఉంది. భక్తి లేకుండా కర్మయోగం లేదు. ఈ భక్తియే పరిపక్వత చెంది నపుడు స్వస్వరూపాను సంధానం అవుతుంది.

సాధకుడు విద్వాంసుడు, ప్రయత్నశీలుడు అయినప్పటికి, ప్రలోభ పెట్టే ఇంద్రియాలు అతని మనస్సును బలాత్కారంగా హరించుకొని పోతాయి అని పూర్వ శ్లోకం లోనే చూశాము కదా! హరించుకొని పోయేవారు, అపహరించుకొని పోయేవారు ఎవరు? చోరులు కాదా? మరి, అలాంటి దొంగల నుండి ఎలా తప్పించు కోవాలి? ప్రభువును ఆశ్రయించాలి. మరో మార్గం లేనే లేదు.

ప్రభువు మన వాడైతే చాలు. చోరుల్ని ఎదిరించడంలో మనం అశక్తులం అయినా, శక్తిమంతుడైన ప్రభువు మనకు అండగా ఉంటాడు కనుక తన అధికారాన్ని వినియోగించి చోరుల్ని శిక్షించగలడు. మనల్ని రక్షించగలడు.

మనం ప్రభువుకు సంబంధించిన వాళ్ళం అని తెలిస్తే, అసలు చోరులే మన చెంతకు రాక పోవచ్చు. ఏది ఎలా ఉన్నా, చోరుల బారి నుండి మనం బయట పడేది మాత్రం తథ్యం. అలాగే, పరమేశ్వరునికి మనం భక్తులం కాగలిగితే, ఏ మాలిన్యము మనల్ని అంటదు. ఏ అశుభమూ మనకు జరగదు.

న వాసుదేవ భక్తానాం అశుభం విద్యతే క్వచిత్

భగవంతుడైన వాసుదేవునికి భక్తులైన వారికి ఏ అశుభమూ జరగదు.

[illegible]

ధ్యాయతో విషయా న్పుంసః సఙ్గస్తే షూపజాయతే ।
సఙ్గా త్సఞ్జాయతే కామః కామాత్క్రోధో౽ భిజాయతే ॥ 62

ధ్యాయతః-విషయాన్-పుంసః-సంగః-తేషు-ఉపజాయతే
సంగాత్-సంజాయతే-కామః-కామాత్-క్రోధః-అభిజాయతే

విషయాన్	= విషయములను	సంగాత్	= ఆసక్తి వలన
ధ్యాయతః	= ధ్యానిస్తున్న	కామః	= కోరిక
పుంసః	= పురుషునకు	సంజాయతే	= పుడుతుంది
తేషు	= వాని యందు	కామాత్	= కోరిక వలన
సంగః	= ఆసక్తి	క్రోధః	= క్రోధము
ఉపజాయతే	= పుడుతుంది	అభిజాయతే	= పుడుతుంది

విషయాలను అదే పనిగ చింతిస్తూ ఉంటే వాటి యందు మనిషికి ఆసక్తి ఏర్పడుతుంది. ఆసక్తి వల్ల కామం పుడుతుంది. కామం వల్ల క్రోధం జనిస్తుంది.

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥ 63

క్రోధాత్-భవతి-సమ్మోహః-సమ్మోహాత్-స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశాత్-బుద్ధినాశః-బుద్ధినాశాత్-ప్రణశ్యతి

క్రోధాత్	= క్రోధము వలన	స్మృతిభ్రంశాత్	= విస్మృతి వలన
సమ్మోహః	= మోహము	బుద్ధి నాశః	= బుద్ధినాశనము
భవతి	= కలుగుతుంది	బుద్ధినాశాత్	= బుద్ధినాశము వలన
సమ్మోహాత్	= మోహము వలన	ప్రణశ్యతి	= సర్వనాశన మగును
స్మృతివిభ్రమః	= విస్మృతియు		

క్రోధం వల్ల మోహము కలుగుతుంది. మోహము వల్ల స్మృతి నశిస్తుంది. స్మృతి నశించడం వల్ల బుద్ధి నశిస్తుంది. బుద్ధి నాశం వల్ల మనిషే నశించి పోతాడు.

వ్యాఖ్య

ఎవరు ఎలా జీవించినా, జీవించాలి అనుకున్నా, ఈ ప్రపంచంలో అడ్డుచెప్పే వారు ఎవ్వరూ లేరు. ఎవరి స్వేచ్ఛ వారిది. ఎవరి జీవితం వారిది. కాని, ఎవరి బ్రతుకును వారే పాడు చేసుకొనుటకు సిద్ధపడితే మాత్రం బాగు చేసే శక్తి కూడా ఎవ్వరికీ లేదు.

జీవితంలో కొన్నిటిని మనం ఆశిస్తాం. అవి కావాలి అని గాఢంగా అభిలషిస్తాం. అలాగే కొందరిని ప్రేమిస్తాం. వాళ్ళు సదా మనతో కలిసి ఉండాలి అనుకుంటాం. ఇవన్నీ మన ఆశలు. కోరికలు.

మనం ఆశించే విషయాలన్నీ మనకు అర్థ మయ్యాయని కాదు. మనం ప్రేమించే వ్యక్తుల యొక్క స్వరూప స్వభావాలు మనకు అవగత మయ్యాయని కాదు. వాళ్ళ అంతర్యాలు మనకు అంతు పట్టాయనీ కాదు.

వాస్తవం చెప్పాలంటే, మనకు ఇతరులతో ఉండే సంబంధాలన్నీ వాళ్ళ స్వభావాలను మనం ఆపోశనం పట్టడం వల్ల ఏర్పడ్డవి కావు. వాళ్ళ విషయంలో మనకు ఉండే అభిప్రాయాలను బట్టి వారితో మన సంబంధాలు ముడిపడి ఉన్నాయి. విషయాలు కూడా అంతే.

అందుకనే, మనతో సంబంధం కలిగిన విషయాలు ఊహించని విధంగా వికృత రూపాన్ని దాల్చి నపుడు, 'ఇవి ఇలా అవుతాయని నేను అనుకోలేదు' అని వాపోతాం. అలాగే, మనం ప్రేమించే వ్యక్తులు, మనతో సంబంధాలు కలిగి ఉన్న మనుషులు మన అభిప్రాయాలకు భిన్నంగా ప్రవర్తించి నపుడు మనం బాధపడతాం. వ్యథ చెందుతాం. 'వీళ్ళు ఇలాంటి వాళ్ళని నేను ఊహించ లేదు' అంటూ క్రోధాన్ని వెళ్ళ గక్కుతాం. వాళ్ళు ఎలాంటి వాళ్ళో మనం అర్థం చేసుకోవాలి గాని, మనం ఊహించినట్లు వాళ్ళు ప్రవర్తించడం సాధ్యపడే విషయం కాదు. సత్యం ఏదో మనస్సుకు పట్టాలి గాని, మనస్సు లోని చెత్తంతా సత్యం అయ్యే అవకాశం లేదు.

ప్రపంచం లోని విషయాలలో సుఖాలను అన్వేషించడం ఎండమావులలో దప్పిక తీర్చుకొనే ప్రయత్నం వంటిదని ఇప్పటికే మనకు అర్థమైపోయింది. వ్యక్తుల సంబంధాల వల్ల బ్రతుకులో అందాలు, ఆనందాలు విలసిల్లుతా యని గాలిమేడలు కట్టుకోవడం, ఇసుక నుండి చమురును పిండే ప్రయత్నమే నని కూడా తేలిపోయింది. అయినా, కొందరు రాగాసక్తిని పెంచుకొంటూ, విషయ సంగత్వాన్ని సృష్టించుకుంటూ ఎలా పతన మౌతున్నారో అవరోహణ క్రమంలో ఈ రెండు శ్లోకాలలో వివరిస్తున్నారు.

అష్టాంగ అయోగము

సాధకుడు ప్రగతిని సాధించి, పరిపూర్ణతను పొందడానికి యోగమార్గంలో యమ నియమాది అష్టాంగ యోగాన్ని ఆరోహణ క్రమంలో పతంజలి మహర్షి బోధించాడు. విషయ ప్రపంచంలో రాగాసక్తితో జీవించి పతన మయ్యే వ్యక్తి యొక్క దుర్గతిని అవరోహణ క్రమంలో గీతాచార్యుడు వివరిస్తూ, అలా వినాశాన్ని పొంద వద్దని హెచ్చరిస్తున్నాడు. ఇది యోగమార్గం కాదు. అయోగ మార్గం. అందుకే దీనిని 'అష్టాంగ అయోగం'గా పిలుస్తోంది చైతన్య భగవద్గీత. అవి (1) విషయ ధ్యానము (2) సంగత్వము (3) కామం (4) క్రోధం (5) సమ్మోహము (6) స్మృతిభ్రంశము (7) బుద్ధినాశము (8) సర్వనాశము. ఇది అష్టాంగ అయోగంలో అవరోహణ క్రమం.

వీటిని గూర్చి తెలుసుకునే ముందు ఒక ప్రశ్నకు సమాధానం చెప్పుకొని ముందుకు పోదాం. హఠయోగాది సాధనల్ని ఆచరించే కొందరు ప్రశ్నిస్తూ ఉంటారు. 'ఏమండీ! ఇంద్రియాలను నిగ్రహిస్తే సరిపోతుంది కదా! మనస్సులో ఏముంటే ఏమైంది? ఇంద్రియాలను ఇంద్రియ విషయాల వైపు వెళ్ళకుండా హఠంతో నిరోధిస్తే సరిపోతుంది కదా!' అని.

ఆ ప్రయత్నమే గనుక ఫలరూప మైతే, కారాగారంలో మగ్గుతున్న ఖైదీ లందరూ యోగులే అవుతారు. ఇంద్రియాలు గ్రుడ్డివి. కళ్ళజోడు లాంటివి. చూడటానికి కళ్ళజోడు ఉపయోగ పడుతుందే గాని చూసేవి మాత్రం కళ్ళే. అలాగే, ఇంద్రియాలు విషయాలను మనస్సు ముందు ప్రదర్శిస్తాయి. అంత వరకే. ఇంద్రియాలు విజృంభించి విషయాల వైపు పరుగులు పెడుతున్నాయి అంటే, దానికి మనస్సు లోని విషయాసక్తే కారణం. విషయ చింతనమే ప్రబల కారణము. విషయ చింతనముతో ప్రారంభమై, వ్యక్తి వినాశానికి దారి తీసేది కేవలం రాగాసక్తే. అదెలాగో చూద్దాం.

విషయ ధ్యానము

బాహ్యం లోని విషయాలు ఇంద్రియాల ద్వారా అంతర్యం లోకి, అనగా మనస్సు లోకి ప్రవేశిస్తూ ఉంటాయి. సంతలో ఎన్నో వస్తువుల్ని మనం చూస్తాం. అవన్నీ మన ఇంటి లోకి రావాలి అనుకోము. అలాగే ఈ ప్రపంచం లోని విషయాలు ఎన్నో మన మనస్సు లోకి ప్రవేశిస్తూ ఉంటాయి. అవన్నీ కావాలని మన బుద్ధి కోరుకోదు.

ఎందుకనో కొన్ని మనకు నచ్చుతాయి. నచ్చిన వాటిని ఇష్టపడతాం. అయితే, ఒకరు ఇష్టపడింది మరొకరు ఇష్టపడాలి అనే నియమం ఏమీ లేదు. రుచులు లోకంలో భిన్నంగా ఉంటాయి. అభిరుచులూ భిన్నం గానే ఉంటాయి.

ఏదైనా ఒకటి మనకు నచ్చింది అంటే, అందులో ఉన్నదంతా నచ్చిందని చెప్పలేము. మనం నచ్చింది అక్కడ ఉంది. అంతే. అరటిపండును మనం కోరుకున్నాము అంటే, అందులో మనకు కావలసింది పండే గాని తొక్క కాదు. అలాగే గులాబీ పువ్వు మనకు కావాలి. ముల్లు అవసరం లేదు. కాకపోతే, తొక్క లేకుండా అరటిపండు దొరకదు. ముల్లు లేకుండా గులాబి ఉండదు.

పెళ్ళిచూపులు లేకుండా ఎవరూ పెళ్ళి చేసుకోరు. చూపులు ఎన్నో జరుగుతాయి. నచ్చేది మాత్రం ఒక్కరినే. అలా నచ్చి పెళ్ళి చేసుకున్న వారికి నచ్చిం దేమిటి? అని ప్రశ్నిస్తే ఎవరి నుండీ సరైన సమాధానం రాదు. ఎందుకని? నచ్చింది ఏమిటో నచ్చిన వారికే తెలియదు. ఇక ఇతరులకు తెలిసే దేముంటుంది? కష్టం తప్ప!

ఇంతకీ నచ్చిం దేమిటి? దేహము యొక్క వర్ణమా? దేహము యొక్క పొడవా? దేహము లోని కోమలత్వమా? కట్టుకున్న దుస్తులా? పెట్టుకున్న నగలా? పెట్టబోయే కానుకలా? చదివిన చదువా? కంఠస్వరమా? మందహాసమా? మనస్సా? మాటతీరా? ఈ రోజుల్లో అయితే, నాకు నచ్చింది సింప్లిసిటీ అని విచిత్రంగా పలుకుతూ ఉంటారు. మంచిదే. నచ్చి ఉండొచ్చు. ఆ మాత్రం దానికి పెళ్ళి అవసరమా? అందుకే విదియ నాడు నచ్చుకోవడం, చవితి నాడు అదే పనిగ నొచ్చుకోవడం. విశ్లేషిస్తే మన ఇష్టాలన్నీ ఇలాగే ఉంటాయి.

ఏది మనకు నచ్చుతుందో, దానిని మనస్సు ధ్యానిస్తూ ఉంటుంది. అదే విషయధ్యానం అంటే. సద్గతికి ఈశ్వర ధ్యానం. దుర్గతికి విషయ ధ్యానం. ఏ ధ్యానమైనా మానస వ్యాపారమే. బాహ్యంలో ఉండే విషయాలతో, లేదా వ్యక్తులతో మానసికంగా ఏర్పడే సంబంధమే ఇక్కడ ధ్యానం. విషయ ధ్యానం. 'అది ప్రాప్తిస్తే బాగుండును' అనే ఆలోచన. మనల్ని ఆకర్షించిన 'శోభన విషయం' గురించి తదేక చింతన.

సంగబుద్ధి

విషయ చింతనము ప్రారంభమై నపుడే కాస్త జాగ్రత్తపడి ఆత్మానాత్మ వివేకంతో సంగబుద్ధి ఏర్పడకుండా చూసుకోవాలి. లేదా, చింతనము సంగత్వాన్ని సృష్టిస్తుంది (*సంగః ఆసక్తిః ప్రీతి*). ఇక్కడే విషయాసక్తి మొదలవుతుంది. సంగత్వము ఏర్పడిన తరువాత సంకల్పా లన్నీ ఆ వైపే నడుస్తూ ఉంటాయి. ఇదే విషయ సంగత్వము. అలా కొంత కాలము సాగితే, సంగత్వ ప్రభావం చేత కోరిక పుడుతుంది. ఇదే కామము (*సంగాత్ ప్రీతేః సంజాయతే సముత్పద్యతే కామః తృష్ణా*). విషయాసక్తి కోరికను కదిలిస్తుంది. ఇక అది తీరని దాహాన్ని సృష్టిస్తుంది.

కోరిక దగ్గర విషయం గట్టి పడుతుంది. విషయ ధ్యానము, సంగత్వము అనే రెండు స్థాయిలలో విషయం కాస్త పలుచగానే ఉంటుంది. కామం దగ్గరకు వచ్చేసరికి విషయం గట్టి పడుతుంది.

కామ వికారము

'నేను ఆశిస్తున్నది ఆశించ దగిందే' అనే భావంతో ప్రారంభమై, 'ఎలాగైనా అది నాకు దక్కాలి' అనే

దృఢమైన కోరికగా మారుతుంది. ఆ కోరిక ఏదైనా కావచ్చు. ధనం కావచ్చు. గృహం కావచ్చు. పదవి కావచ్చు. కీర్తి కావచ్చు. కుక్క కావచ్చు. కోతి కావచ్చు. లేదా కోతి లాంటి మనిషి కావచ్చు.

విషయ ధ్యానము, సంగత్వము - ఈ రెండు స్థాయిలలో వివేకం బలహీనంగా ఉంటుంది. కామం స్థాయిలో మాత్రం వివేకానికి గ్రహణమే పడుతుంది. ఎవరు చెప్పినా, ఏమి చెప్పినా కామికి రుచించదు. ఈ స్థాయిలో మాత్రం వివేకానికి గ్రహణమే పడుతుంది. ఈ స్థాయికి, అనగా కామం యొక్క స్థాయికి చేరిన తరువాత స్థాయికి రాకుండా సాధకులు జాగ్రత్త పడాలి. ఈ స్థాయికి, అనగా కామం యొక్క స్థాయికి చేరిన తరువాత నిరోధించ గలిగే వాళ్ళు చాలా అరుదుగా ఉంటారు.

కొందరు కుక్క మీద ప్రేమను పెంచుకొని కుక్కను ప్రాణతుల్యంగా పెంచుకుంటూ ఉంటారు. దాని చూపుల్లో వాళ్ళకు చంద్ర దర్శనం అవుతుంది. అది తోక ఆడిస్తే వాళ్ళ మనస్సులు ఆనందంతో ఊగి పోతాయి. అది లేనిదే బ్రతకలేము అన్నవాళ్ళు ఉన్నారు. అది మరణిస్తే సమాధులు నిర్మించిన వాళ్ళు ఉన్నారు. మరీ ప్రేమ ముదిరి దానితో పాటు మరణించిన వాళ్ళూ ఉన్నారు.

ఈ శ్లోకంపై వ్యాఖ్యానాన్ని ప్రారంభించే టప్పుడే నేనొక విషయాన్ని ప్రస్తావించాను. ఎవరు ఎలా ఉండా లనుకుంటే అలా ఉండొచ్చు. అడ్డుచెప్పే వాళ్ళు ఎవ్వరూ ఉండరు. కాకపోతే, ఎవరి జీవితాలను వాళ్ళు మదింపు వేసుకోవాలి. జీవితాన్ని చేజేతులా ఎవరైనా పాడు చేసుకోవచ్చు. కాని, తిరిగి బాగు చేసుకోవాలి అనుకుంటే మాత్రం, అది పాడు చేసుకున్నంత సులభం కాదు.

కుక్కను పెంచుకోవచ్చు. తప్పు లేదు. అది మరణిస్తే దానితో పాటు మరణించాలి అనుకోవడం మాత్రం వివేకవంతుల లక్షణం కాదు. చనిపోయిన కుక్క మళ్ళీ పుడుతుంది. దానితో పాటుగా చనిపోయిన వాళ్ళు తిరిగి ఎలా పుట్టాలని? ఎక్కడ పుట్టాలని? మన విధికి మనమే కర్తలము అనే సత్యాన్ని ఎవ్వరూ మరచి పోకూడదు.

ఆఖ్యాయిక

ఋషభుని కుమారుడు భరతుడు. అజనాభము అనే దేశాన్ని పాలించిన రాజు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. ప్రజలను పరమ వాత్సల్యంతో ప్రేమించాడు. పాలించాడు. మహాభక్తుడు. ఆయన వల్లనే మన దేశము భారత దేశము అనే పేరును పొందింది.

జింక చర్మాన్నే వస్త్రంగా ధరించేవాడు. ముక్తి మార్గంలో రాజ్యం కూడా ప్రతిబంధకమే నని, సమస్తాన్ని త్యజించి, కఠోర సాధనను కొనసాగించాలని పులహాశ్రమం చేరాడు. భోగాలు అనుభవించ వలసిన వయస్సులో సర్వమును త్యజించి, రాజ్యాన్ని బిడ్డలకు అప్పగించి సన్యసించాడు.

ఒకనాడు నదీ తీరమున ధ్యానమగ్నుడై ఉన్నాడు భరతుడు. అక్కడకు ఒక గర్భిణి అయిన లేడి వచ్చింది. ఈ లోగా ఆ వనం లోని సింహ మొకటి గర్జించింది. భీతి చెందిన హరిణి నదిని దాటేందుకు ఎగిరి దుమికింది. జింకపిల్లను ప్రసవించి తల్లి జింక మరణించింది.

భరతుడు చలించి పోయాడు. తల్లిని పోగొట్టుకున్న బిడ్డను ఆశ్రమానికి తెచ్చుకున్నాడు. ఆ హరిణ పోతమును పెంచుతూ దాని మీద ఎనలేని ప్రేమను పెంచు కున్నాడు. జపధ్యానాదులు దూర మయ్యాయి. హృదయంలో జింకపిల్లే నిండి పోయింది. దాని ధ్యాస లోనే బ్రతుకు గడిచి పోయింది. మరణ సమయంలో కూడా భరతుని మనస్సులో జింకపిల్లే ఉండి పోయింది. దాని ఫలితంగా మరణించిన భరతుడు మరుజన్మలో జింకగా పుట్టవలసి వచ్చింది. ఆ తరువాత తరించడానికి రెండు జన్మలు ఎత్తవలసి వచ్చింది.* ఇదే కామ వైపరీత్యము.

*స్వామీజీ రచించిన చైతన్య భాగవతము - పంచమ స్కంధములో వివరంగా పఠించవచ్చు.

కోరికల్ని వదలించే శక్తి మనిషి మనసుకు ఉంది. కోరిన ప్రతి దానిని సాధించుకొనే శక్తి మాత్రం మనిషికి లేదు. మనిషి సర్వాన్ని కోరుకోవచ్చు. కాని, దానిని పొందడానికి తనకు సర్వ శక్తిమత్వం లేదు అనేది మరచి పోకూడదు. సాధారణంగా కోరిన వస్తు లభించవు. ప్రతి మనిషి జీవితంలో ఆశించేవి ఎక్కువ. అందుకొనేవి తక్కువ. ఆశించడానికి స్తోమత అవసరం లేదు. అందుకోవడానికే సామర్థ్యం కావాలి. కోరిన దానిని పొందే సామర్థ్యం లేక, పొందిన దానిని నిలబెట్టుకొనే శక్తి లేక బాల్యం నుండి వృద్ధాప్యం వరకు ప్రతి మనిషి అంతులేని నిరాశలో కూరుకుపోతూ ఉంటాడు.

చరణము : కోరిన దేదీ దొరకని బాల్యము
ఆశల ఊబిలో మునిగిన పరువము
సాగింది కాలము సడలింది దేహము
ఎపుడూ నిరాశే తోడు - మనసా

పల్లవి : చూడు ఇదే నీ లోకం - మనసా
మనసా - ఓ మనసా - నా మనసా

అనుపల్లవి : తిరిగి రాదు పోయిన సమయం
ఎటు పోతుందో పయనం - మనసా ॥ చూడు ఇదే నీ లోకం ॥

అని చైతన్య గీతిక మనస్సును జాగృతం చేసింది.

కోరింది లభ్యం కానపుడు మనిషి క్షోభకు గురి అవుతాడు. చింత చెందుతాడు. తన కోరిక ఫలించక పోవటానికి కారణ మేదో దానిపై క్రోధం పెంచు కుంటాడు. ప్రతిబంధకంపై ప్రకోపంతో రెచ్చి పోతాడు. ఇదే క్రోధం. కామం విఫలం కావడం వల్ల ఏర్పడిన పరిణామం. ప్రతిఫలం (*కామాత్ కుతశ్చిత్ ప్రతిహతాత్ క్రోధః అభిజాయతే*).

క్రోధ ప్రకటనము

కామం విఫలం కాగానే క్రోధం బుసలు కొడుతుంది. క్రోధానికి కామమే కారణము. కామం నుండే క్రోధం ఉద్భవిస్తుంది. కామానికి, కామ ఫలితానికి మధ్య అవాంతరాన్ని సృష్టించిన ప్రతిబంధకముపై క్రోధం జనిస్తుంది. ఈ దశలో నిగ్రహము అనేది మందేటి కొమ్మే అవుతుంది.

క్రోధము మనస్సును క్రుంగ దీస్తుంది. బుద్ధిని వికలం చేస్తుంది. వివేకాన్ని హరించి వేస్తుంది. క్రోధంలో మనస్సు ఆలోచనా శక్తిని కోల్పోతుంది. బుద్ధి నిర్ణయించే శక్తిని జారవిడుచు కుంటుంది. వివేకం ఉండదు కనుక క్రోధి ఏదైనా చేస్తాడు. కోపిష్టి ఎలాగైనా మాట్లాడుతాడు.

పశువుకు వివేకం ఉండదు. మృగానికి వివేకం ఉండదు. వివేకం లోపించిన మనిషి అంతకన్నా విశిష్టంగా వ్యవహరించ లేడు. ఆ విషయాన్ని కోపిష్టి స్వయం గానే అంగీకరిస్తాడు. 'నాకు కోపం వస్తే నేను మనిషిని కాను - ఏం చేస్తానో నాకే తెలియదు' అంటూ ఉంటాడు. తాను మనిషి కాదని తానే అంగీకరిస్తున్నాడు. ఇక కోపిష్టిని గురించి వేరే ఏమి చెప్పాలి?

కోపం వచ్చిన వాడు ఎవ్వరినీ లెక్క చేయడు. జన్మ నిచ్చిన తల్లిదండ్రుల్ని కూడా దారుణంగా అవమానిస్తాడు. మన సంస్కృతిలో ఆచార్యుని ఆదిదేవునితో సమానంగా భావించి పూజిస్తాము. కాని, అట్టి గురుదేవుని కూడా కోపిష్టి నిందిస్తాడు అన్నారు భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి (*క్రుద్ధః హి సంమూఢః సన్ గురుమ్ అపి ఆక్రోశతి*).

క్రోధం వచ్చి నపుడు వివేకం నశిస్తుంది కనుక కోపము వచ్చిన వాడు కోపాన్ని ఎలాగైనా ప్రకటించ వచ్చు. విధి నిషేధాలు ఆ వదరుబోతుకు వర్తించవు. నీళ్ళు చల్లగా లేవని గ్లాసును ముక్కలు చేయాలా? కోపం సరే వచ్చింది. అలాగని గరిటెలు ఏం చేశాయి? ఫైళ్ళు ఏం చేశాయి? కుర్చీలు ఏం చేశాయి? మరీ ఇంత బీభత్సమా? ఏళ్ళ తరబడి క్రికెట్ ఆడుతున్నా, నైపుణ్యాన్ని పెంచుకోలేని అసమర్థతకు చింతించ వలసింది పోయి, అవుటు కాగానే బ్యాట్‌ని నేలకేసి కొట్టే ప్రబుద్ధుల్ని క్రీడాకారులని స్తుతించాలా? లేక అప్రయోజకు లని గర్హించాలా? ఎందరో వీక్షిస్తున్నారు అనే ఇంగితము కూడా లేదు. అదే కోపమంటే! ప్రతిబంధకము ఏదో కూడా కోపంలో అర్థం కాదు. ప్రతిబంధకం అర్థం కానపుడు ఎదురుగా ఏది కనిపిస్తే దాని మీదే ప్రతాపం. ఎవరు కనిపిస్తే వారి మీదే ప్రకోపం. క్రోధం వల్ల మనస్సు స్థిమితాన్ని కోల్పోతుంది.

ఇక్కడ మరొక్క విషయాన్ని కూడా మనం సమన్వయించు కోవాలి. క్రోధంతో పాటు లోభాన్ని కూడా కలిపి అర్థం చేసుకోవాలి. కామం సఫలం కానపుడు క్రోధం కలుగుతుంది. ఒకవేళ కామం ఫలిస్తే ఏమవుతుంది? లోభం తయారవుతుంది. లోభం కూడా మనస్సుపై తీవ్ర ప్రభావాన్నే చూపుతుంది. అది రాలేదు - ఇది రాలేదు అని కామం గోల పెడుతూ ఉంటే, ఇది పోతుందేమో - అది పోతుందేమో అని లోభం గగ్గోలు పెడుతూ ఉంటుంది. రెండూ మనస్సును కలత పెట్టేవే. క్షోభను కలిగించేవే. ఈ రెండిటి మధ్య క్రోధం ఉంటుంది. కామక్రోధ లోభాలలో క్రోధం మధ్యలో ఉంటుంది. అటు కామం ఫలించక పోయినా, ఇటు లోభం విఫలమైనా, రెండిటి మధ్య ఉన్న క్రోధం మధ్యాహ్న మార్తాండుని వలె ప్రచండంగా చెలరేగి పోతుంది.

మోహ జాలము

క్రోధం వల్ల మనస్సులో సమ్మోహము ఏర్పడుతుంది. ఏది చేయాలి? ఏది చేయకూడదు? అనే వివేకం పూర్తిగా నశించడమే మోహము. సమ్మోహము. అవివేకానికి ఆకారము. ఆహార్యము (***సంమోహః అవివేకః కార్యాకార్య విషయః***). ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు అర్థం చేసుకొనే అయోమయ స్థితి మోహంలో ఉంటుంది. అందులో చిక్కినవాడు బయట పడలేడు. అందుకే దానిని మోహజాలము అన్నారు. ఈ మోహ ప్రభావం చేత వ్యక్తి జ్ఞాపకశక్తిని కోల్పోతాడు.

స్మృతి విభ్రమము

మోహం వల్ల కార్యాకార్య వివేకము పూర్తిగా క్షీణిస్తుంది కనుక స్మృతి జ్ఞానము నశిస్తుంది. స్మరణ శక్తి ఉండదు. సాధారణంగా జ్ఞాపకం పెట్టుకోవలసిన వాటిని జ్ఞాపకం పెట్టుకోవడము, మరచి పోవలసిన వాటిని మరచి పోవడము చిత్తము యొక్క సహజ లక్షణము.

స్మృతి విభ్రమము జరిగిన వాళ్ళు జ్ఞాపకం పెట్టుకో వలసిన వాటిని మరచి పోతూ ఉంటారు. మరేం చేస్తుంటారు? చేసేందుకు ఏమీ లేదు కనుక, మరచి పోవలసిన విషయాల్ని నెమరు వేసుకుంటూ ఉంటారు. అంటే, స్మృతి చెడిన వారికి అనవసరమైన వన్నీ అవసరాలుగా తెలుస్తూ ఉంటాయి అని అర్థం.

ఈ స్మృతి విభ్రమము విషయంలో శ్రీ శంకరాచార్య స్వామి అందమైన వ్యాఖ్యను అందించారు. 'స్మృతి కలగడానికి తగిన విధంగా కారణాలు ఉన్నా, స్మృతి కలగక పోవడం స్మృతి విభ్రమము' అని వ్యాఖ్యానించారు (***స్మృత్యుత్పత్తి నిమిత్త ప్రాప్తౌ అనుత్పత్తిః***). స్మృతి కలగటానికి అనుకూలంగా నిమిత్తాలు ఉన్నా, స్మృతి కలగకుండా ఉంటుందా? ఆశ్చర్యంగా ఉంది కదూ! అదే స్మృతి విభ్రమము అంటే. ఉదాహరణకు ఒక వ్యక్తిని గూర్చి చెప్పుకుందాం.

ఆఖ్యాయిక

ఇద్దరు స్నేహితులు ఉండేవారు. ప్రతి రోజు వారు ఉభయులూ కలిసి మాట్లాడుకోకుండా నిద్రపోరు. ఒకనాడు ఒకడు మరొకనితో, మిత్రమా! నువ్వు నా నుండి యోగవాసిష్ఠము అనే గ్రంథమును తీసికొనిపోయి ఆరు నెలలైంది. ఇంకా చదవలేదా? నువ్వు పూర్తి చేసి ఉంటే, అది నేను మళ్ళీ చదవాలి అనుకుంటున్నాను అన్నాడు.

అరెరె! ఈ రోజు కూడా అనుకున్నా, తెచ్చి ఇచ్చేద్దా మని. చదవడం పూర్తి అయి నెలరోజు లైంది. రోజూ తెద్దామని అనుకుంటూనే మరచిపోతున్నా. రేపు తప్పక తెచ్చి ఇస్తాను అన్నాడు. రోజూ అలాగే, అలాగే అంటూ వెళ్ళడం. మరునాడు అలాగే మరచిపోయి రావడం.

ఒకనాడు, మిత్రమా! నీకు మరపు కాస్త ఎక్కువలా ఉంది. రోజూ ఇలాగే మరచి పోతున్నావు. రేపు నువ్వు మరచి పోకుండా నే నొక పని చేస్తాను అని చెప్పి, మిత్రుడి ఉత్తరీయం కొంగు చివర ఒక చిన్న రాయిని ఉంచి ముడి వేశాడు పుస్తకం ఇచ్చిన మనిషి. 'చాలా బాగుంది. ఇక నేను మరచిపోయే ప్రసక్తే లేదు' అని చెప్పి వెళ్ళాడు ఆ మతిమరపు మనిషి.

మరునాడు ఇంటి నుండి బయలుదేరుతూ ఉత్తరీయాన్ని భుజాన వేసున్నాడు. కొంగు చివర నున్న రాయి భుజానికి తగిలింది. వెంటనే భార్యను పిలిచి, నా ఉత్తరీయంలో రాయి కట్టింది నువ్వేనా? దేని కోసం? అని అడిగాడు. నేను కాదండీ! నిన్న మీరు మీ స్నేహితుడి ఇంటికి వెళ్ళారు కదా! బహుశ అతడే మైనా కట్టాడేమో! అన్నది అర్ధాంగి.

అయితే, కావచ్చు అనుకుంటూ తొందర తొందరగా మిత్రుడి ఇంటికి వచ్చి, మిత్రమా! నా ఉత్తరీయంలో రాయి కట్టింది నువ్వేనా? అని అడిగాడు. ఆ మిత్రుడికి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

ఇదే ఆచార్యుల వారు చెప్పింది. జ్ఞాపకానికి కారణాలు సుస్పష్టంగా ఉన్నా, ఏ మాత్రం జ్ఞాపకానికి నోచుకోక పోవడము స్మృతివిభ్రమ విలాసము. స్మృతి లేనపుడు ఇక బుద్ధి ఎక్కడ ఉంటుంది? అదే బుద్ధి నాశము అంటే.

బుద్ధి లేదు

స్మృతి ఎప్పుడైతే పోయిందో, ఏదీ జ్ఞాపకం ఉండదు. అంతా విస్మృతే. దాని వల్ల బుద్ధి నశించి పోతుంది. ఏది కార్యము? ఏది అకార్యము? అనే వివేకానికి బుద్ధి అయోగ్యమై పోతుంది. అదే బుద్ధినాశము (***కార్యాకార్య విషయ వివేకా యోగ్యతా అంతఃకరణస్య బుద్ధేః నాశః ఉచ్యతే***) అంటే.

బుద్ధినాశము అంటే బుద్ధి లేకుండా పోయిందని కాదు. 'బుద్ధి లేని మనిషి' అన్నప్పుడు ఆ మనిషికి బుద్ధి అసలే లేదు అని అర్థం కాదు. బుద్ధిని ప్రదర్శించడం వల్లే కదా బుద్ధి లేనివాడు అని అర్థమైంది? బుద్ధి లేదు అంటే, యోగ్యమైన బుద్ధి లేదు అని అర్థం. సద్బుద్ధి లేదు అని భావం. బుద్ధి మాత్రం ఉంటుంది. ఏం ప్రయోజనం? సద్బుద్ధిగా లేనిది ఏదో అది ఓనాడు దుర్బుద్ధిగా, దుష్టబుద్ధిగా మారుతుంది. ఇలా బుద్ధి నశించడం వల్ల, మనిషికి, పశువుకు మధ్య తేడా లేకుండా పోతుంది. కనుక మనిషే నశించి పోతాడు అంటే, పురుషార్థ ప్రాప్తికి యోగ్యతను కోల్పోతాడు అని అర్థం. దాని కన్నా మరణమే నయం (***పురుషార్థ అయోగ్యః భవతి ఇత్యర్థః***).

సర్వ నాశం

ఇంకే ముంది? అంతా అయిపోయింది. సమస్త అనర్థాలకు విషయ ధ్యానమే మూలం అని తేలిపోయింది (***సర్వ అనర్థస్య మూల ముక్తం విషయాభి ధ్యానమ్***).

విషయ ధ్యానము ఎలా అనర్థ దాయకమో ఇంతవరకు వివరించాడు. ఇక ఇప్పుడు మోక్షమును పొందే ఉపాయమును బోధిస్తున్నాడు. అర్జునుడు అడిగిన **వ్రజేత కిమ్?** అనే నాల్గవ ప్రశ్నకు సమాధానమే ఈ అరవై నాల్గవ శ్లోకము.

రాగద్వేష వియుక్తై స్తు విషయా నిన్ద్రియై శ్చరన్ ।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥ 64

రాగద్వేషవియుక్తైః-తు-విషయాన్-ఇంద్రియైః-చరన్
ఆత్మవశ్యైః-విధేయాత్మా-ప్రసాదం-అధిగచ్ఛతి

రాగ	= రాగము చేత	విషయాన్	= విషయములను
ద్వేష	= ద్వేషము చేత	చరన్ తు	= అనుభవించుచున్నవా డైతే
వియుక్తైః	= విడువబడి	విధేయాత్మా	= స్వాధీనమైన మనస్సు కలవాడై
ఆత్మవశ్యైః	= తనకు వశమైన	ప్రసాదం	= చిత్త నైర్మల్యాన్ని
ఇంద్రియైః	= ఇంద్రియముల చేత	అధిగచ్ఛతి	= పొందుతాడు

రాగద్వేషాలు లేకుండా చూసుకోవాలి. ఇంద్రియాలను వశ పరచుకోవాలి. మనస్సును స్వాధీన పరచుకోవాలి. అలాంటి వాడు విషయాల మధ్య చరిస్తున్నా ప్రశాంతం గానే ఉంటాడు.

వ్యాఖ్య

మనస్సులో దుఃఖ కారణం లేకుండా జీవించ గలిగితే, అంతకు మించిన భాగ్యం మనిషికి మరొకటి ఉండదు. మనలో మనం హాయిగా తృప్తి చెంది జీవించడం కంటే ఉత్తమమైన సుఖాలు, సంపదలు ఈ ప్రపంచంలో లేవు.

వ్రజేత కిమ్? 'శబ్దాది విషయాలలో స్థితప్రజ్ఞుడు ఎలా చరిస్తాడు?' అని అర్జునుడు అడిగిన నాల్గవ ప్రశ్నకు సమాధానమే ఈ శ్లోకము. పూర్వ శ్లోకంలో విషయాసక్తిలో, విషయ ధ్యానంలో బ్రతుకును పాడు చేసుకుంటున్న అముముక్షువు విషయం వివరించిన వాసుదేవుడు, ఈ శ్లోకంలో మనస్సును నియమించిన ముముక్షువు యొక్క ప్రశాంత జీవనాన్ని వివరిస్తున్నాడు.

సాధకుడు వివేకి అయినప్పటికి, చక్కని ప్రయత్నము చేస్తున్న వాడై నప్పటికి, క్షోభను కలిగించే ఇంద్రియాలు అతని మనస్సును ఎలా పాడు చేస్తున్నాయో అరవైయవ శ్లోకంలో స్పష్టం చేశాడు. ఇంద్రియాలను నియమిస్తేనే వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉంటుందని అరవై ఒకటవ శ్లోకంలో చెప్పాడు. ఇంద్రియాలను నిగ్రహించినా, మనస్సును నియమించకుండా విషయ ధ్యానం చేస్తూ పోతే వచ్చే ప్రమాదము ఏమిటో అరవై రెండు, అరవై మూడవ శ్లోకాలలో వివరించాడు. కాని, ఈ శ్లోకంలో విషయాన్ని మరొక మలుపు త్రిప్పుతూ, మనస్సును కనుక నిగ్రహించ గలిగితే, ఇంద్రియాలను విడిచి పెట్టినా వచ్చే ప్రమాదము ఏమీ ఉండదని నూతన చర్చకు తెర తీస్తూ ఉన్నాడు. ఇక్కడ ప్రసంగ విషయమే పూర్తిగా మారి పోయింది. విషయం అలా వేరు పడిందని చెప్పేందుకు శాస్త్రంలో **తు** అనే అవ్యయ పదమును వాడుతూ ఉంటారు.

విషయ చింతనము అనర్థదాయక మని గడచిన రెండు శ్లోకాలలో విన్నాం. అంటే విషయాలను స్మరించకుండా ఉండాలి అని అర్థం. మరి విషయాలను గూర్చి ఆలోచించకుండా, విషయ సంబంధమైన క్రియలు ఎలా నడుస్తాయి? ఒకవేళ నడిస్తే, అవి అనర్థ మనే కారణము యొక్క కార్యాలే కదా! కారణము

అనర్థ మైనపుడు కార్యాలు కూడా అనర్థాలే! మరి, అన్నపానాది కార్యాలు కూడా విషయ చింతనము అనే అనర్థ కారణము వల్ల ఏర్పడినవే కదా! అన్నపానాదులు లేకుండా జీవించే దెలా? అన్నపానాదులకు సంబంధించిన ఆలోచనలు కదలకుండా అన్నపానాదుల్ని స్వీకరించడం ఎలా జరుగుతుంది? శరీరయాత్ర ఎలా సాగుతుంది? ఈ విధమైన సందేహాలను నివారిస్తూ, ముముక్షువు రాగద్వేషాల నుండి విడిపడిన వాడై, వశ పడిన ఇంద్రియాలతో విహిత కర్మలను ఆచరిస్తూ, ప్రశాంతతను పొందుతున్నాడు అని బోధిస్తున్నాడు.

రాగద్వేషాలు

విషయాల యందు మనిషికి గల ఆసక్తియే రాగద్వేషాలకు కారణ మవుతూ ఉంది. ఇంద్రియ విషయాల లోని దోషాలను దర్శించడం చేత విషయాసక్తి అడుగంటి పోతుంది. విషయాసక్తి క్షీణించ గానే రాగద్వేషాలు అదృశ్య మవుతాయి. రాగద్వేషాలు నిర్వీర్యం కాగానే విషయాలు నిస్సార మవుతాయి, కర్మలు బంధ రహితంగా ఉంటాయి.

పాము వల్ల ఎవ్వరికీ హాని జరగదు. హాని జరిగింది అంటే, అది పాము కోరల లోని విషం వల్లనే. కోరల్ని తీసి వేస్తే పాము వల్ల ఏ అపాయము ఉండదు. రాగద్వేషాలు అనే కోరల్ని దూరం చేస్తే కర్మలు నిరపాయంగా ఉంటాయి.

రాగద్వేషాల నుండి విడిపడిన ముముక్షువు మనస్సును, ఇంద్రియాలను నియమించి ఉంటాడు కనుక, విషయాలలో చరించినా నిర్దోషం గానే ఉంటాడు. రాగద్వేషాల కోరల నుండి విడిపడిన మనస్సు నియమింప బడి ఉంటుంది కనుక (**విధేయాత్మా**) ఇంద్రియాలు మరొక మార్గం లేక మనస్సుకు వశపడి ఉంటాయి (**ఆత్మ వశ్యైః**). ఇక్కడ ఆత్మ అంటే అంతఃకరణము అని అర్థము. కనుక ఇంద్రియాలు మనస్సుకు వశపడి ఉంటాయి అని అర్థం.

విషయ ధ్యానంలో ఉన్న లౌకికుడు ఏ ప్రపంచములో సంబంధము పెట్టుకొని చరిస్తున్నాడో, ముముక్షువు కూడా అదే ప్రపంచంతో వ్యవహరిస్తున్నాడు. విషయ చింతనములో పడ్డవాడు రాగద్వేషముల చేత కలుషిత మైన మనస్సుతో విషయ ప్రపంచంలో చరించి పాడై పోతున్నాడు. రాగద్వేషముల నుండి విడిపడి, మనస్సును నియమించి, తనకు స్వాధీనములైన ఇంద్రియాల చేత అదే ప్రపంచంలో చరిస్తూ ముముక్షువు ప్రశాంతతను అనుభవిస్తున్నాడు. అతని శాంతి భగ్నం కావటం లేదు. దేహేంద్రియ మనస్సులు ప్రపంచంలో చరిస్తున్నా యోగయుక్తుడు స్థిరంగా ఉన్నాడు. అతని బుద్ధి పరినిష్ఠితమై ఉంది.

ధర్మాధర్మాలు

రాగద్వేషాలు ఎప్పుడైతే దూరమై పోయాయో (**రాగద్వేష వియుక్తైః**), ఇక వివేక ప్రజ్ఞ కలవాడు ప్రపంచంలో చరించ డానికి ఆధార మేమిటి? అతనిలో కర్మకు కారణ మేమిటి? రాగద్వేషాలు తటస్థ పడ్డాయి కనుక, ఇక అతడిలో మిగిలి ఉన్నవి ధర్మాధర్మాలే. చేయదగింది ఏది, చేయ కూడనిది ఏది అనే విచక్షణతో, చేయవలసిన కార్యాలను ఫలాసక్తి లేకుండా, రాగద్వేషాల వలలో చిక్కకుండా తటస్థంగా ఆచరిస్తూ ఉంటాడు. అలాంటి వ్యక్తిని ఏ కర్మలూ బాధించ లేవు.

ధర్మాచరణములో సంగబుద్ధి లేకుండా ఎప్పుడైతే విషయాల మధ్య చరిస్తున్నాడో, అతడు ఎక్కడ చరించినా, ఎలా చరించినా ధర్మానికి దూరంగా పోడు. ధర్మము దైవానికి దూరంగా లేదు. ధర్మ రూపంలో ఉన్నది దైవమే. కనుక ప్రజ్ఞావంతుడు ఎక్కడ చరించినా, వాస్తవానికి పరమాత్మ స్పృహ తోనే ఉంటాడు.

సర్వథా వర్తమానోఽ పి స యోగీ మయి వర్తతే

అర్జునా! నా యందే మనస్సు నుంచిన యోగి ఏ విధంగా వ్యవహరిస్తూ ఉండినా, అతడు నా లోనే ఉంటాడు అని మున్ముందు గీతలో భగవానుడే చెబుతాడు.

అంతటా, అన్ని విధాల పరమేశ్వర స్పృహతో జీవించే వాడు ప్రత్యేకంగా దేనిపై రాగాన్ని ఉంచుతాడు? దేనిని పని కట్టుకొని ద్వేషిస్తాడు?

విషయాలలో చరిస్తూ ఉండినా తామరాకు మీద నీటిబొట్టు లాగా అంటకుండా ఉంటాడు. అదే పనిగా తిరుగుతూ ఉండినా, ఏ మాలిన్యము అంటని గాలి లాగా పవిత్రుడై ఉంటాడు. ప్రసన్నంగా ఉంటాడు. ప్రశాంతంగా ఉంటాడు. ప్రసాద బుద్ధితో నిర్మలంగా ఉంటాడు ***(ప్రసాదం అధి గచ్ఛతి)***. ప్రసాదము అనేది పదార్థం కాదు. భక్తితో స్వీకరించే పదార్థమే ప్రసాదం. కాని, ఇక్కడ ప్రసాదం అంటే ప్రసన్నత. స్వస్థతతో జీవించడం ***(ప్రసాదః ప్రసన్నతా స్వాస్థ్యమ్)***.

మరి, ఈ ప్రసాదం యొక్క ఫల మేమిటి? ప్రసాదం ప్రాప్తిస్తే ఏం జరుగుతుంది? చెబుతున్నాడు.

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే ।
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ 65

ప్రసాదే-సర్వదుఃఖానాం-హానిః-అస్య-ఉపజాయతే
ప్రసన్నచేతసః-హి-ఆశు-బుద్ధిః-పర్యవతిష్ఠతి

అస్య	= అట్టి వానికి
ప్రసాదే	= చిత్త నైర్మల్యము వలన
సర్వదుఃఖానాం	= సమస్త దుఃఖముల యొక్క
హానిః	= వినాశము
ఉపజాయతే	= కలుగు చున్నది

ప్రసన్న చేతసః	= నిర్మలమైన మనస్సు గల వానికి
ఆశు	= శీఘ్రముగ
బుద్ధిః	= బుద్ధి
పర్యవతిష్ఠతి హి	= స్థిరపడు చున్నది

చిత్త ప్రసాదము లభించిన వానికి సమస్త దుఃఖాలు అంతరిస్తున్నాయి. నిర్మలమైన మనస్సు గల వాని బుద్ధి వెంటనే ప్రశాంతతను పొందుతుంది కదా!

వ్యాఖ్య

ఆలోచించ గలిగే మనస్సును అడగకుండానే భగవంతుడు మనకు ప్రసాదించాడు. భగవంతుడు అనుగ్రహించిన మనస్సుతో మనం ఆనందంగా జీవించడ మనేది మన ఆలోచనా విధానం మీద ఆధారపడి ఉంటుంది.

విశిష్టమైన అతిథిని మన ఇంటికి ఆహ్వానిస్తాం. అతడు అంగీకరిస్తే ఎంతగానో పొంగిపోతాం. ఇంటిని శుభ్రం చేసుకొని అలంకరించే కార్యంలో పూర్తిగా నిమగ్న మవుతాం. మరి ఆత్మారాముడు ప్రవేశించే ముందు మన బుద్ధిని ఎలా శుద్ధి చేసుకోవాలి? ఎంత పవిత్రంగా ఉంచుకోవాలి? అదే తపస్సు. అదే జ్ఞాన సాధన.

ధూళి ధూసరితమైన ఆసనంలో అతిథిని కూర్చోబెడతామా? కనుక ఆత్మారాముడు స్థితుడై ఉండా లంటే, మన అంతఃకరణ పరిశుద్ధమైన ఆలయంగా మారాలి. అందుకనే, **దేవో భూత్వా దేవం యజేత.** దేవుణ్ణి పూజించే ముందు నీవు దేవుడివి కావాలి అన్నది శాస్త్రం. అందుకే పూజకు ముందు స్నానం, తిలక ధారణం, శుద్ధ వస్త్ర ధారణం చేస్తాము. ముందు శుద్ధి, తరువాత సిద్ధి. సాధన సాధ్యాలు రెండూ బుద్ధి లోనే.

రాగద్వేషాల నుండి విడిపడి, ఇంద్రియ మనస్సులను వశ పరచుకొని, విషయాలలో చరిస్తూ ఉండినా, బుద్ధి ప్రసన్నం గానే ఉంటుంది అని గ్రహించాము. అలాంటి ప్రసాద బుద్ధియే వైకుంఠ ద్వారము. ఆ తరువాత వైకుంఠ ప్రవేశమే. విష్ణుదేవుని దర్శనమే.

దుఃఖము - శాంతి

ఆరోగ్యం ఉంది అంటే, అనారోగ్యం లేదు అని అర్థము. స్వస్థత ఉన్న చోట అస్వస్థత ఉండదు. అస్వస్థతకు కారణాలు అనేకం ఉండొచ్చు. స్వస్థతకు కారణం అవసరం లేదు. అది స్వభావం. అస్వస్థతకు గల కారణాలు తొలగిపోతే, అస్వస్థత ఉండదు. స్వస్థతే మిగుల్తుంది.

దుఃఖం ఉంది అంటే దుఃఖ కారణాలు ఉన్నాయి అని అర్థం. దుఃఖం మనందరి అనుభవంలో ఉంది. కాని, అందరి దుఃఖాలకు కారణాలు ఒకే విధంగా లేవు. కారణాలు భిన్నంగా ఉన్నా, దుఃఖం మాత్రం ఏకమే. దుఃఖము అందరిదీ ఒక్కటే. రాజు గారి దుఃఖము, సేవకుని దుఃఖము అని దుఃఖంలో విభజన లేదు. దుఃఖము ఎవరికి వచ్చినా, బుద్ధి బరు వెక్కుతుంది. గుండె భార మవుతుంది. మనసు మెలికలు తిరుగుతుంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. ఇదంతా దుఃఖానుభవం.

దుఃఖం అందరికీ ఒక్కటే. దుఃఖ కారణాలు మాత్రం వ్యక్తికి వ్యక్తికి భిన్నంగా ఉంటాయి. ప్రియ మైనది దూరమైతే ఎవరికైనా దుఃఖం కలుగుతుంది. ప్రియమైనది ఏది? అనే ప్రశ్న పడితే మళ్ళీ సమాధానం ఒకే విధంగా ఉండదు. ఎవరికి దేని మీద, లేదా ఎవరి మీద ఆసక్తి ఉంటే, అది వారికి ప్రియం అవుతుంది.

నాయకుడు దుఃఖిస్తాడు. యాచకుడు దుఃఖిస్తాడు. పసి బాలుడూ దుఃఖిస్తాడు. అందరి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. కారణాల లోకి వెళ్ళి, దుఃఖ హేతువు ఏమిటి? అని ఆ ముగ్గురిని ప్రశ్నిస్తే, పదవి చేజారి పోయింది అంటాడు నాయకుడు. అక్షయపాత్ర పోయింది అంటాడు యాచకుడు. ఆటబొమ్మ విరిగి పోయింది అంటాడు పిల్లవాడు.

ఎవరికి ఏది పోగొట్టు కోవడం వల్ల దుఃఖం కలిగిందో, వారికి అది తిరిగి లభిస్తేనే దుఃఖం పోతుంది. అంతేగాని, ఒకరి దుఃఖ కారణం తొలగడం వల్ల మరొకరి దుఃఖం దూరం కాదు. పదవి పోవడం వల్ల నాయకుడు దుఃఖిస్తున్నాడని, దుఃఖిస్తున్న బాలుడికి అదే పదవిని ఇస్తామని చెబితే, దుఃఖం పోదు సరిగదా, కాస్త పెరిగే అవకాశం కూడా ఉంది. అలాగే అక్షయపాత్రను కొనిపెడితే, యాచకుడికి దుఃఖం పోతుంది కాని, అదే అక్షయపాత్రను నాయకుడికి ఇస్తే దుఃఖం వెయ్యింత లవుతుంది.

ఎవరి దుఃఖ కారణాలు దూరమైతే, వారి దుఃఖం దూర మవుతుంది. దుఃఖం దూరం కాగానే ప్రశాంతత బుద్ధిలో చోటు చేసుకుంటుంది. ప్రశాంతత అందరికీ ఒక్కటే. దుఃఖం ఒక్కటే అయినా, దుఃఖ కారణాలు వేరుగా ఉన్నట్లు, ప్రశాంతత ఒక్కటే అయినా ప్రశాంతతకు కారణాలు వేరుగా ఉంటాయా? ఉండవు. ఎందుకని? ప్రశాంతత అనేది వ్యక్తి స్వభావం. అది అతని స్వరూపం. అశాంతికి కారణా లుంటాయి గాని, శాంతికి కారణాలు అవసరం లేదు. అశాంతికి గల కారణాలు అదృశ్య మైతే శాంతి పూర్ణమై భాసిస్తుంది. ఇది పూర్ణశాంతి. పరమాత్మ జ్ఞానం వల్ల ప్రాప్తించే పరమశాంతి.

దూరమైన దుఃఖం

స్థిరమైన ప్రజ్ఞ గలవాడు రాగద్వేషాలను తటస్థ పరచి ఉంటాడు కనుక అతనికి ఇష్టాయిష్టాలు ఉండవు. ఏదో పోవడం వల్ల దుఃఖం రాదు. ఏదో ఉండటం వల్ల సుఖం పోదు. విషయాసక్తి నశించడం వల్ల ఈ విధమైన రాగద్వేషాలు స్థితప్రజ్ఞుని బుద్ధిలో అదృశ్య మయ్యాయి. అతడు గతానికి వగచేది ఉండదు. అగతాన్ని వలచేది

ఉండదు. రాగద్వేషాలు ఈ విధంగా ఎవరిని చలింప చేయలేవో వారి బుద్ధి ప్రసన్నంగా ఉంటుంది. ఈ బుద్ధి ప్రసాదం కారణంగా సమస్త దుఃఖాలు నశించి పోతున్నాయి.

ఇది సాధ్యమేనా? ధన నష్టం జరిగితే దుఃఖం ఉండదా? ఉంటుంది. ఎవరికి? ధనం సుఖ కారణమని భ్రమించే వారికి, ధన నష్టం కారణంగా దుఃఖం కలుగుతుంది. ధనంపై ఆసక్తి లేని వారికి ధననష్టం దుఃఖాన్ని ఎలా కలిగిస్తుంది? ధనం మనకే కాదు, ఎందరికో ఉంది. మన కన్నా అధికంగా సంపదలున్న వారి ఐశ్వర్యాలే నిలవకుండా పోతున్నాయి. మనవి మాత్రం పోకుండా ఉంటాయా? ఎవరైనా, ఈ ప్రపంచం లోకి ధనంతో ప్రవేశించ లేదు. ఒంటరి గానే వచ్చారు. వచ్చిన తరువాతే ఈ ప్రపంచంలో వారి వద్దకు ధనం వచ్చి చేరింది. వచ్చింది ఏదైనా పోయేదే. పోవడం, ఉండటం అనేది అలా ప్రక్కన పెడితే, ఉన్న దాని మీద ఆసక్తి ఉన్నప్పుడే, ఆ ఉన్నది పోయి నపుడు బాధ కలుగుతూ ఉంటుంది. ఉన్నదాని మీద రాగం లేనపుడు, అది ఉండినా, పోయినా ఒరిగేది ఉండదు, తరిగేదీ ఉండదు. ధనాసక్తి లేని స్థితప్రజ్ఞుని బుద్ధిని, ధనం ఉండి సుఖపెట్టనూ లేదు. ధనం పోయి దుఃఖపెట్టనూ లేదు.

ధన నష్టమే కాదు, జన నష్టము కూడా అంతే. జనం సుఖ కారణం కాలేరు. అలాంటప్పుడు దుఃఖ కారణ మెలా అవుతారు? జీవులకు రాకపోకలు ఉంటాయి. వాటి ప్రభావం మాత్రం మననశీలునిపై ఉండదు.

పోయేవాళ్ళ కోసం ఏడ్చే ఉద్యోగం మన కెవరిచ్చారు? ఒకనాడు పోయేవాళ్ళే నేడు ప్రపంచంలో ఉన్నారు అనేది జ్ఞానం. చావు అనేది దుఃఖానికి కారణమా? అదే వాస్తవ మైతే, చచ్చిపోతున్న వాళ్ళందరి కోసం మనం ఏడవాలి. అలా ఎవ్వరూ ఏడవడం లేదు. కొందరు పోతేనే ఏడుస్తున్నారు. ఎందుకని? వాళ్ళు తమ వాళ్ళు కనుక. తమ కుటుంబీకులు కనుక. మరి, కుటుంబంలో చనిపోతున్న అందరి కొరకు ఒకే విధంగా ఏడుస్తున్నారా? పసివాళ్ళకు, ముసలివాళ్ళకు ఒకే స్వరమా? లేదు. మరి, ఈ భేదం ఎందుకు? మళ్ళీ సమాధానం మొదటికే వస్తుంది. రాగాసక్తియే ఇక్కడ ప్రధానం. పరమాత్మ దర్శనం చేత, ఈ రాగాసక్తి పూర్తిగా నశించింది కనుక *(శ్లోకం -59)* జన నష్టం కూడా ప్రజ్ఞావంతుని బుద్ధిని చలింప చేయలేదు. అంతే.

దుఃఖాలు ప్రపంచంలో ఉంటాయి. అలాగే దుఃఖ కారణాలు కూడా ఉంటాయి. కాని, అవేవీ స్థితప్రజ్ఞుని బుద్ధిని కదిలించ లేవు. అతనిలో దుఃఖాన్ని కలిగించ లేవు.

ప్రసాద బుద్ధి ప్రాప్తించడం చేత వివేక ప్రజ్ఞ గల మననశీలుని దుఃఖాలన్నీ నశించి పోతాయి ***(ప్రసాదే సర్వ దుఃఖానాం హానిః వినాశః అస్య యతేః ఉపజాయతే)***. ప్రసన్నత వల్ల దుఃఖాలు పోతాయా? ఈ విషయం ప్రామాణిక మేనా? దుఃఖ నివృత్తి ఇలా జరుగు తుందని శాస్త్రం అంగీకరిస్తుందా? దీనిని కాస్త సంక్షిప్తంగా విశ్లేషించుకుందాం.

సమస్త దుఃఖాలకు అధ్యాసే కారణం. కనుక అధ్యాస ***(అతస్మిన్ తద్బుద్ధిః - అది కాని దాని యందు అది అనే బుద్ధి)*** తొలగితేనే సమస్త దుఃఖాలు నశిస్తాయి. అధ్యాస తొలగాలి అంటే, దానికి కారణమైన అజ్ఞానం నివృత్తి కావాలి. మరి అజ్ఞానం ఎలా నివృత్తి అవుతుంది? జ్ఞానం వల్లనే అజ్ఞానం నశించాలి. ఇదీ క్రమం. జ్ఞాన మార్గంలో ఉండే కార్యక్రమం. మరి, జ్ఞానం వల్లనే సర్వ దుఃఖాలు నశిస్తాయి అని శాస్త్రం సాంప్రదాయకంగా, సహేతుకంగా బోధిస్తూ ఉంటే, దానికి భిన్నంగా, కేవలం బుద్ధి లోని ప్రశాంతత వల్లనే సర్వ దుఃఖాలు నశిస్తాయి అని గీతాచార్యుడు బోధించడం సశాస్త్రీయ మేనా? అదే వాస్తవ మైతే, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువును ఆశ్రయించి ఆత్మజ్ఞానాన్ని పొంద వలసిన అవసర మేమిటి? ఇలాంటి మీమాంస అనివార్యం.

నిజమే. కేవలం ప్రసన్నత ప్రాప్తించడం వల్లనే దుఃఖాలన్నీ దూరమై పోవు. దుఃఖాలు లేకుండా పోవడం

వేరు, దుఃఖాలు నశించడం వేరు. ప్రసాదబుద్ధి గల పవిత్రాత్మునిలో దుఃఖాలు లేవు అనేది వాస్తవమే. కాని, దుఃఖాలు సమూలంగా నశించడం అనేది ఆత్మజ్ఞానం వల్లనే జరుగుతుంది. కాకపోతే, ప్రసాద బుద్ధి కలిగిన ప్రజ్ఞావంతునికి జ్ఞానం ఎంతో దూరంలో లేదు అనేది వాస్తవం. ముందే నేను వివరించి నట్లుగా, ప్రసాద బుద్ధి వైకుంఠ ద్వార దర్శనం లాంటిది. ద్వార దర్శనమే దైవదర్శనం కాదు. కాని, ద్వార దర్శనం చేసుకున్న వ్యక్తికి దైవ దర్శనం ఎంతో దూరం లేదు. అందుకు ఎంతో సమయమూ పట్టదు. అందుచేతనే ప్రసన్న చిత్తము కలవారికి స్థిర జ్ఞానం ప్రాప్తించడం శీఘ్రం గానే **(ఆశు)** జరిగి పోతుంది అన్నాడు ఈ శ్లోకంలో గీతాచార్యుడు.

ప్రసన్న చేతస్కుడైన వాని బుద్ధి స్థిరంగా ఉంటుంది. ఆకాశం లాగా నిశ్చలంగా ఉంటుంది. ఆత్మ స్వరూపం లాగా అచలంగా ఉంటుంది అని అర్థం ***(ఆకాశ మివ పరి సమన్తాత్, అవతిష్ఠతే ఆత్మస్వరూపేణైవ నిశ్చలీ భవతి ఇత్యర్థః)***.

వివేక ప్రజ్ఞ గల వాని ప్రసాద బుద్ధి ఆకాశం లాగా నిశ్చలంగా ఉంటుంది అని ఆచార్యుల వారి భాష్యం. ఈ సందర్భంలో ఇదొక అందమైన, అద్భుతమైన ఉపమానం.

పంచభూతాలలో చలనము లేనిది ఆకాశ మొక్కటే. వాయువు చలిస్తుంది. అగ్ని చలిస్తుంది. జలము చలిస్తుంది. భూమి అదే పనిగా తిరుగుతూ ఉంది. ఆకాశం మాత్రం అచలంగా ఉంది. అందుచేతనే ఆత్మను మరొక దానితో పోల్చవలసి వచ్చినప్పుడు, మరొక మార్గం లేక ఆకాశం తోనే పోలుస్తూ ఉంటాము. **ఆకాశవత్, వ్యోమవత్** అని చెబుతూ ఉంటాము. విష్ణుమూర్తిని *గగన సదృశం* అని కీర్తిస్తాము. పైగా, ఆకాశము ఆత్మస్వరూపానికి అతి సన్నిహితంగా ఉంది. పంచభూతాలలో ముందుగా ఆకాశమే వచ్చింది ***(తతః ఆకాశః సంభూతః)***. ఈ విధంగా స్థిరమైన ప్రజ్ఞ కలవాడు కృతకృత్యుడు అవుతాడు అన్నారు భాష్యంలో ఆచార్యులు కూడా **(ఏవం ప్రసన్న చేతసః అవస్థిత బుద్ధేః కృతకృత్యతా)**. అంటే, అంతటా బ్రహ్మమునే దర్శించే ప్రజ్ఞ ***(బుద్ధిః)*** ప్రతిష్ఠిత మవుతూ ఉంది **(పర్యవతిష్ఠతి)** అని అర్థం.

అంటే, ప్రసాదబుద్ధి వలన ఏర్పడిన నిర్మలత్వము, ఆత్మజ్ఞానము వలన ఏర్పడే నిర్మలత్వము వంటిదని అర్థము ('గగన సదృశం' లాగా). ఇంతవరకు దుఃఖాలు ఆశ్రయించిన అంతఃకరణమును ఇప్పుడు నిర్మల మైన ప్రసాదము ఆక్రమిస్తుంది. ఇక, శీఘ్రంగా ఆ బుద్ధిలో పవిత్రమైన జ్ఞానం ప్రవేశిస్తుంది. పతంజలి మహర్షి కూడా తమ యోగదర్శనంలో ఈ విషయాన్ని విస్పష్టం చేశాడు.

సూత్రము : సత్త్వ పురుషయోః శుద్ధి సామ్యే కైవల్య మితి ॥

'సత్త్వము' అంటే బుద్ధి. శుద్ధమైన బుద్ధి. ప్రశాంత మైన బుద్ధి. 'పురుషుడు' అంటే ఆత్మ. చైతన్య రూపుడు. వీరిద్దరికి శుద్ధిలో, అనగా నిర్మలత్వములో పోలిక ఉంది. సామ్యము ఉంది. ఈ సామ్యము స్థిరపడితే కైవల్యము సిద్ధించినట్లే అని 'యోగ దర్శనము' - విభూతి పాదము, యాభై ఐదవ సూత్రంలో యోగసూత్రకారుడు మహర్షి పతంజలి ప్రస్ఫుటం చేశాడు (సత్త్వ పురుషయోః =బుద్ధి పురుషుల యొక్క, శుద్ధి సామ్యే =శుద్ధి యందు సామ్యము కలుగ గానే, కైవల్యమ్ ఇతి = కైవల్యము సిద్ధిస్తుంది).

కనుక ఇట్టి స్థిరమైన ప్రశాంత ప్రజ్ఞను అభిలషించు వాడు రాగద్వేషాలను తటస్థ పరచాలి. మనస్సును సంయమనం చేసి, శాస్త్ర విహిత కర్మలను, ధర్మబద్ధంగా ఇంద్రియాలతో ఆచరిస్తూ, పారవశ్యం చెందకుండా ప్రవర్తిస్తూ ఉండాలి. అప్పుడే పవిత్రమైన ప్రసాద బుద్ధి ఏర్పడుతుంది. ఈ స్థితి స్థితప్రజ్ఞునిలో సహజంగా భూషణం లాగా ప్రకాశిస్తూ ఉంటుంది.

వివేక ప్రజ్ఞ గల యోగయుక్తుని వైభవాన్ని ఇంతవరకు వర్ణించిన గీతాచార్యుడు, ఇప్పుడు, అయుక్తుడు

వివేక ప్రజ్ఞ లేకుండా ఉంటాడు కనుక, అతనికి ప్రసాదబుద్ధి ఉండదు, శాంతి ఉండదు అని అంటున్నాడు ఈ విషయాన్నే రాబోయే అరవై ఆరు, అరవై ఏడు శ్లోకాలలో చెబుతున్నాడు. కాకపోతే, ఈ సందర్భంలో పూర్వోత్తర శ్లోకాలను కలిపే అవతారికలో శ్రీ శంకరాచార్య స్వామి, **సేయం ప్రసన్నతా స్తూయతే** - అంటే, ఈ ప్రసాద బుద్ధి స్తుతింపబడుతూ ఉంది అన్నారు. అప్రసన్నతను గర్హించడములో ప్రసన్నతను స్తుతించడం అంతర్వాహినిగా ఉండనే ఉంటుంది. ఎలాగో చూద్దాం!

నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చాభావయత: శాన్తి రశాన్తస్య కుత: సుఖమ్ ॥ 66

న-అస్తి-బుద్ధిః-అయుక్తస్య-న-చ-అయుక్తస్య-భావనా
న-చ-అభావయతః-శాంతిః-అశాంతస్య-కుతః-సుఖం

అయుక్తస్య	=	యోగయుక్తుడు కాని వానికి	అభావయతః	=	భావ శూన్యునకు
బుద్ధిః	=	బుద్ధి	శాంతిః	=	శాంతి
న అస్తి	=	ఉండదు	న చ	=	ఉండదు
అయుక్తస్య	=	యోగయుక్తుడు కాని వానికి	అశాంతస్య	=	శాంతి లేని వానికి
భావనా చ	=	భావనయు	సుఖం	=	సుఖము
న	=	కలుగదు	కుతః	=	ఎలా కలుగును?

నిగ్రహ యుక్తి లేని వానికి బుద్ధి ఉండదు. సంయమ శక్తి లేని వానికి ఆత్మనిష్ఠ ఉండదు. ఆత్మ భావన లేని వానికి శాంతి మిగలదు. శాంతి లేని వానికి సుఖము ఎలా కలుగుతుంది?

వ్యాఖ్య

వేడి నుండి విడిపడాలి అని నిప్పు ఎప్పుడూ భావించదు. కారణం, వేడి వల్ల నిప్పుకు ఎప్పుడూ బాధ లేదు. వేడిగా ఉండటం నిప్పు యొక్క స్వభావం. స్వభావము ఎప్పుడూ బాధించదు. శాంతికి దూరంగా పోవాలని ఏ వ్యక్తీ భావించడు. శాంతి వల్ల జీవికి ఎన్నడూ అస్వస్థత ఉండదు. శాంతి అనేది ప్రతి జీవి లక్షణం. స్వభావం. స్వరూపం. స్వభావ స్వరూపాలు ఎప్పుడూ బాధించవు.

నిప్పు వల్ల నీటికి బాధ ఉంది. అందుకే వేడి చేస్తే నీరు సలసల కాగుతుంది. వేడి నుండి విడిపడాలి అని నీరు భావిస్తుంది. అందుకే నీటిని కాచి ప్రక్కన పెట్టినా, కొంత సేపటికి వేడిని తొలగించుకొని నీరు చల్ల బడుతుంది. అశాంతి నుండి విడి పడాలని ప్రతి వ్యక్తీ కోరుకుంటాడు. అశాంతి వల్ల జీవి అస్వస్థతను అనుభవిస్తాడు. అందుకే అశాంతి కలిగి నపుడు దానికి కారణాలను అన్వేషించి, వాటిని తొలగించుకొని తిరిగి శాంతిని పొందాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. శాంతి లేనివాడు సుఖం లేనివాడే.

సుఖపడాలి అంటే శాంతి ఉండాలి. శాంతి ఉండాలి అంటే, ఆత్మభావన ఉండాలి. ఆత్మభావన ఉండాలి అంటే, ప్రసన్న చిత్తము ఉండాలి. ప్రసన్న చిత్తము ఉండాలి అంటే ఇంద్రియ నిగ్రహము ఉండాలి.

ఈ శ్లోకంలో ప్రధానంగా నాలుగు కార్యాలు ఉన్నాయి. ఈ నాలుగు కార్యాలకు నాలుగు కారణాలు ఉన్నాయి. **కారణా భావే కార్యాభావః** 'కారణాన్ని తొలగిస్తే కార్యం మిగలదు' అనే న్యాయాన్ని అనుసరించి, ఒక్కొక్క అయుక్త కార్యానికి గల అయుక్త కారణాన్ని తొలగిస్తూ, చివరగా నిత్య సుఖానికి, నిత్య శాంతికి మార్గాన్ని సుగమం చేస్తున్నాడు.

ప్రసాద బుద్ధి

'అయుక్తుడు' అంటే ప్రసాద బుద్ధి లేనివాడు. సమాహిత చిత్తము లేనివాడు. అట్టి వానికి ఆత్మ విషయానికి సంబంధించిన బుద్ధి ఉండదు (*నాస్తి బుద్ధిః అయుక్తస్య*). ఆత్మను తెలుసుకొనుటకు అనువైన అంతఃకరణమే 'ఆత్మబుద్ధి'.

ఆత్మబుద్ధి లేదు అంటే ఇంద్రియ నిగ్రహము, చిత్త సంయమనము లేవు అని అర్థము. అలాంటి అంతః కరణము ఆత్మ చింతనకు పనికి రాదు. స్వచ్ఛమైన, నిస్తరంగంగా ఉండే జలము లోనే ప్రతిబింబము గోచరిస్తుంది. జలచరాల వల్ల గాని, క్రొత్తగా వచ్చి పడే జలాల వల్ల గాని, నీరు కదులు చలిస్తూ ఉంటే, ప్రతిబింబము గోచరించదు. ఒకవేళ కనిపించినా, గుర్తు పట్టలేని విధంగా ఛిన్నాభిన్నమై ఉంటుంది. ఇక బురద నీరు, బుడగల నీరు అయితే చెప్ప నవసరం లేదు. ప్రతిబింబము కనిపించే అవకాశమే ఉండదు.

విషయాసక్తి గల మనస్సు బురద నీరు వంటిది. సంయమనం లేని చిత్తము అలలతో చలించే జలము వంటిది. సమాహిత చిత్తము నిర్మల జలము వంటిది. నిస్తరంగ జలము వంటిది. అలాంటి సమాహిత చిత్తమే ఆత్మ చైతన్యమును ప్రస్ఫుటంగా ప్రతిఫలింప చేస్తుంది. ఆ సమాహిత చిత్తమే ప్రసాద బుద్ధి. అయుక్తునకు ఇది లభించదు (*నాస్తి న విద్యతే. బుద్ధిః ఆత్మ స్వరూప విషయా. అయుక్తస్య అసమాహిత అంతఃకరణస్య*).

ఆత్మ భావన

ఆత్మభావన అంటే, ఆత్మజ్ఞానము యొక్క విషయంలో అభినివేశం. అంటే, పట్టుదల. ప్రసాద బుద్ధి లేని అయోగ్యునికి, లేదా అయుక్తునికి ఆత్మజ్ఞానం విషయంలో పట్టుదల ఉండదు. అంటే, విషయ ధ్యానం ఉంది అని అర్థం. విషయ ధ్యానం సాగుతూ ఉంది అంటే రాగద్వేషాలు పుష్కలంగా ఉన్నాయి అని అర్థం. అలాంటి వాని బుద్ధి దృశ్యముల వైపు పరుగులు తీస్తుందే గాని, ద్రష్ట వైపు తిరగదు.

ఆత్మభావన లేని వ్యక్తిలో విషయ వాంఛానివృత్తి జరగదు. రాగద్వేషాలతో నిండి పోయిన మనస్సుతో ఏకమై పోయిన వ్యక్తికి ఆత్మభావన ఎలా ఉంటుంది? వాంఛా నివృత్తి చేసుకోవాలి అని ఎందుకు అనిపిస్తుంది? తనకు ఆత్మ భావన ఏర్పడక పోవడమే గాక, మరెవ్వరైనా హితోపదేశం చేసినా క్రోధం కలుగుతుందే గాని, వాంఛా నివృత్తికై ప్రయత్నం సాగదు.

ఒకే కుర్చీలో ఇద్దరు వ్యక్తులు కూర్చోలేరు. ఒకరు లేచిన తరువాతే మరొకరు కూర్చోగలరు. విషయాసక్తిని ఆశ్రయించిన బుద్ధిలో ఆత్మభావన ఉండదు. ఆత్మభావన ఉండాలి అంటే ప్రసాద బుద్ధి ఏర్పడి ఉండాలి. ప్రసాద బుద్ధి ఉండాలి అంటే విషయాసక్తి లేకుండా ఉండాలి. కనుక, అయుక్తు డైన వానికి ఆత్మభావన ఉండదు (*న చ అస్తి అయుక్తస్య భావనా ఆత్మజ్ఞానాభినివేశః*).

శాంతి జీవనం

ఆత్మానందమును పొందాలి అని భావిస్తున్న వ్యక్తి చిత్తము నిర్మలంగా ఉండాలి. ప్రశాంతంగా ఉండాలి. అలాంటి మనస్సే ఆత్మభావన చేయ గలుగుతుంది. ఆత్మభావన లేని వానికి శాంతి ఉండదు (*న చ అస్తి అభావయతః శాన్తిః*).

అయుక్తుడైన వాడు ఆత్మభావన చేయ లేడు. అశుద్ధమైన బుద్ధికి ఆత్మచింతన అలవడదు. ఇక అభినివేశం, అంటే పట్టుదల ఎలా వస్తుంది? శ్రవణ మననాదులు అట్టి వాని బుద్ధిలో జరగవు. అది బుద్ధి కాదు. సంశయాల పుట్ట. అందుచేత ఆత్మభావన సాగదు. ఉపశమము ఉండదు (*న చ అస్తి అభావయతః ఆత్మజ్ఞాన అభినివేశమ్ అకుర్వతః శాన్తిః ఉపశమః*).

సుఖప్రాప్తి

ఇక్కడ సుఖము అంటే నిత్యసుఖము అని అర్థం. నిరతిశయ సుఖము అని భావం. ఆదే ఆత్మసుఖం. ఉపశమం లేని వానికి, అంటే శాంతి లేని వానికి నిరతిశయ సుఖం ఎలా కలుగుతుంది? *(అశాంతస్య కుతః సుఖమ్)*.

చిత్త సంయమనం ద్వారా విషయాల నుండి ఇంద్రియాలను మరల్చడం వల్ల ఏర్పడే ఆంతరంగిక సుఖమే ఇక్కడ కేంద్ర విషయము. అంతేగాని విషయ తృష్ణ వల్ల ఏర్పడే సుఖం కానే కాదు *(న విషయ విషయా తృష్ణా)*. అలాంటి సుఖం వాస్తవానికి దుఃఖమే *(దుఃఖ మేవ హి సా)* అని శ్రీ శంకర భాష్యము.

అలాంటి విషయ తృష్ణ ఎంత వరకు ఉంటుందో, అంతవరకు జీవికి సుఖం లభించదు. చిత్తము ఉపశమిస్తేనే సుఖం ప్రాప్తిస్తుంది. అందుకనే, శాంతి లేని వానికి సుఖ మెలా కలుగుతుంది? అని ప్రశ్నించాడు గీతాచార్యుడు.

అయుక్తుడైన వారికి ఎందుకని ఆత్మబుద్ధి ఉండదు? అంటే, దానికి సమాధానమే తరువాత శ్లోకం.

ఇన్ద్రియాణాం హి చరతాం యన్మనో౽నువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివామ్భసి ॥ 67

ఇంద్రియాణాం-హి-చరతాం-యత్-మనః-అను-విధీయతే
తత్-అస్య-హరతి-ప్రజ్ఞాం-వాయుః-నావం-ఇవ-అంభసి

చరతాం	= చరించుచున్న	ప్రజ్ఞాం	= బుద్ధిని
ఇంద్రియాణాం	= ఇంద్రియములకు	అంభసి	= నీటి యందు
యత్ మనః	= ఏ మనస్సు	నావం	= ఓడను
అనువిధీయతే	= అనుసరించి ప్రవర్తిస్తున్నదో	వాయుః ఇవ	= గాలి వలె
తత్	= అట్టి మనస్సు	హరతి హి	= హరిస్తున్నది గదా!
అస్య	= ఈ మనుజుని యొక్క		

ఇంద్రియాలు ఇంద్రియ విషయాల వైపు పరుగు లెత్తుతూ ఉంటే, వాటి వెంటబడి తిరిగే మనస్సు మానవుని వివేకాన్ని హరించి వేస్తుంది. ఎలాగో తెలుసా? నీటిలో పయనించే నావను గాలి పెడదారి పట్టించినట్లు.

వ్యాఖ్య

ఈ జీవితం లోని అనుభవాలు, ఈ జన్మ లోనివే కాకుండా గత జన్మల లోనివి కూడా, ఎన్నో, ఎన్నెన్నో కలిసి మనల్ని ఈనాటి జీవన స్థితికి నెట్టాయి. ఏ బాధకు ఏది ప్రధాన కారణమో తెలియక పోయినా, కారణం లేకుండా మాత్రం ఏ కార్యము జరగదని మనకు తెలుసు.

బాధలతో బ్రతుకును ఈడ్చుకుంటూ పోవడము ఎవ్వరికీ ఇష్టం ఉండదు. కాని, బాధల నుండి విడి పడటం కూడా ఎవ్వరికీ సాధ్యం కావడం లేదు. అందుకే ప్రతి ఒక్కరికి బ్రతుకు బాధలమయం అనిపిస్తూ ఉంటుంది.

అవసరం లేని వాటిని మనస్సు నుండి తొలగిస్తేనే ఈశ్వర జ్ఞానం మనస్సులో నిలుస్తుంది. మనస్సు నిండా ప్రపంచాన్ని నింపుకొని, ఆత్మజ్ఞానం కావాలి, ఈశ్వర ధ్యానం సాగాలి అంటే అది సాధ్యపడే విషయం కాదు.

ఏ విషయంలో ఎవరికి ఆసక్తి ఉందో, ఎవరి విషయంలో ఎవరికి అనురక్తి ఉందో తెలియదు గాని, ఎవరి విషయంలో వారికి ఆసక్తి ఉండి తీరాలి. మనల్ని మనమే పట్టించుకోక పోతే, మనల్ని పట్టించుకో వలసిన అవసరం ఎవరికి ఉంటుంది? మన విషయంలో మనమే జాగ్రత్త పడాలి. మనకు హాని చేయడంలో మనకు మించిన వారు ఎవరో ఉంటా రనేది అవాస్తవం. ఇంతవరకు జన్మాదిగా మనల్ని మనమే పాడు చేసుకుంటూ వచ్చాము. కాబట్టి మనల్ని మనమే బాగు చేసుకోవాలి. మనల్ని మనం పాడు చేసుకో రాదు. మనల్ని పాడు చేసే అవకాశాన్ని మరొకరికి ఇవ్వ రాదు. ఆ విషయంలో ఇంద్రియ మనస్సులు కూడా మినహాయింపు కావు.

బాహ్య దృష్టితో విరించి విశ్వరచన చేశాడు. అందుచేత సృష్టిలో అన్నీ బాహ్య వ్యాపారాలే జరుగుతాయి. చెట్లు ప్రాణవాయువును విడుస్తూ ఉంటాయి. సాగరజలాలు ఆవిరిగా ఏర్పడి మేఘాల్ని తయారు చేస్తూ ఉంటాయి. భూమి లోపల విత్తనాన్ని నాటినా, అది భూమిని చీల్చుకొని బాహ్యానికి దూసుకొస్తుంది. అన్నీ బాహ్యం లోకి పరుగులు పెట్టేవే. ఈ విషయంలో ఇంద్రియాలు ప్రత్యేకం కావు. మనస్సు విశేషం కాదు.

చలించే లక్షణం గల ఇంద్రియాలు విశ్వంలో ఏదైనా బాహ్య ప్రపంచంలో చరిస్తూ ఉంటాయి. అది వాటి స్వభావం. ఇంద్రియాలు తమ తమ విషయాలలో చరిస్తూ ఉంటాయి. ప్రవర్తిస్తూ ఉంటాయి (**ఇంద్రియాణాం చరతాం స్వస్వ విషయేషు ప్రవర్తమానానాం**). అవి అలా చరిస్తూ ఉంటే, మనస్సు వాటిని అనుసరించి ప్రవర్తిస్తూ ఉంటుంది (*మనః అను విధీయతే, అను ప్రవర్తతే*).

ఇంద్రియాలు ఇంద్రియ విషయాల వైపు పరుగులు తీస్తే వచ్చే నష్టమేమీ లేదు. ఇంద్రియాలు విషయాలతో సంయోగం చెందకుండా ఉండ లేవు. కన్ను ఇంద్రియము. రూపము, లేదా రంగు ఇంద్రియ విషయము. కన్ను పని చేస్తూ ఉంది అంటే, రూపాలు కనిపించకుండా ఎలా ఉంటాయి? చెవి ఉంది కనుక శబ్దం వినిపిస్తుంది. దానిని ఎవరు ఆపగలరు? విషయాలు ఉంటే నష్టం లేదు. ఇంద్రియాలు వాటితో ఏకమైనా వచ్చే కష్ట మేమీ ఉండదు. మనస్సు వెళ్ళి ఇంద్రియాలతో ఏకమై నప్పుడే సమస్యలు తలెత్తు తున్నాయి.

కనిపించే ప్రతి వస్తువును కళ్ళు చూస్తాయి. కళ్ళు చూచే వస్తువు లన్నీ మనస్సుకు అవసరం లేదు. మనస్సుకు ఏది అవసరమో దానినే మనస్సు కోరుకుంటుంది. శబ్దాలైనా, వాసనలైనా, రుచులైనా, స్పర్శ లైనా ఏవైనా అంతే. ఇలా ఇంద్రియాలు విషయాలలో వ్యవహరిస్తూ ఉంటే, ఏ మనస్సైతే వాటిని అనుసరించి తిరుగుతూ ఉంటుందో, ఆ మనస్సు యోగయుక్తుని బుద్ధిని హరిస్తుంది (**తత్ అస్య ప్రజ్ఞాం హరతి**).

ఇక్కడ ప్రజ్ఞ అంటే 'ఆత్మానాత్మ వివేకము వలన కలిగిన జ్ఞానము' అని అర్థం (**ఆత్మానాత్మ వివేక జాం**). అట్టి జ్ఞానాన్ని మనస్సు హరిస్తుంది. నశింప చేస్తుంది (**నాశయతి**). ఆత్మానాత్మ వివేకము నశించడం వల్ల ఇంద్రియ మనస్సులు విషయ సుఖాల వెంట బడి పరుగులు తీస్తాయి. జీవిని చెరలలో పడవేస్తాయి.

తే॥ జ్ఞాన విజ్ఞాన యుతుఁడయ్యు సంతతంబు
నాత్మ భావన లేకున్న యతని యింద్రి
యంబులు మనంబు తమకు వశంబుఁ జేసి
విషయ సుఖముల చవిఁజూపి వెతలఁ బెట్టు

అని సీతారామాంజనేయ సంవాదము.

ఇంద్రియాల వెంట బడి విషయాల వైపు పరుగులు పెట్టే మనస్సు యోగయుక్తుని ఆత్మానాత్మ వివేక జ్ఞానాన్ని హరిస్తుంది అన్నాడు గీతాచార్యుడు. అది ఎలా? (*కథం?*). నీటి లోని పడవను గాలి ఎలాగో అలాగ అంటున్నాడు (**వాయుః నావమ్ ఇవ, అంభసి ఉదకే**).

నీటిలో ప్రయాణం చేసే వాళ్ళు ఓడలలో పయనిస్తూ ఉంటారు. ఓడలు వారు చేరాలకున్న గమ్యము వైపు ఒక నిర్దిష్టమైన మార్గంలో నడుస్తూ ఉంటాయి. ఈ లోగా పెనుగాలి వీస్తుంది. అలా వీచిన గాలి ఓడను పెడత్రోవ పట్టిస్తుంది. మరొక దిశకు లాక్కొని పోతుంది. సుడిలో పడదోసినా ఆశ్చర్యం లేదు.

అలాగే, యోగయుక్తుని ప్రజ్ఞ ఆత్మ వైపు సాగిపోతూ ఉంటే, మనస్సు పెనుగాలి లాగా అతని ప్రజ్ఞను దారి మళ్ళించి, విషయాల వైపు త్రిప్పుతుంది. విషయ సుడిగుండంలో పడ దోస్తుంది.

కనుక మనస్సు బుద్ధితో చేరి ఆత్మప్రాప్తి కొరకు యత్నించాలే గాని, ఇంద్రియాలతో చేరి విషయ సుఖాల వైపు పరుగు పెట్ట కూడదు.

రాగద్వేషాలను తటస్థ పరచి, ఇంద్రియాలను నిగ్రహించడమే స్థిరమైన ప్రజ్ఞకు హేతువు అని బోధిస్తూ, ఇంద్రియ నిగ్రహ ప్రకరణాన్ని తరువాత శ్లోకంలో సమాప్తి చేస్తున్నాడు.

తస్మా ద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇన్ద్రియా ణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

తస్మాత్-యస్య-మహాబాహో-నిగృహీతాని-సర్వశః
ఇంద్రియాణి-ఇంద్రియార్థేభ్యః-తస్య-ప్రజ్ఞా-ప్రతిష్ఠితా

మహాబాహో	=	అర్జునా!	ఇంద్రియాణి	=	ఇంద్రియములు
తస్మాత్	=	అందువలన	నిగృహీతాని	=	నిగ్రహింప బడినవో
ఇంద్రియార్థేభ్యః	=	ఇంద్రియ విషయముల నుండి	తస్య	=	వాని యొక్క
సర్వశః	=	అన్ని విధముల	ప్రజ్ఞా	=	బుద్ధి
యస్య	=	ఎవని యొక్క	ప్రతిష్ఠితా	=	స్థిరమై ఉంది

అర్జునా! కాబట్టి, ఇంద్రియాలు ఇంద్రియ విషయాల నుండి అన్ని విధాలా నిగ్రహింప బడాలి. అలాంటి వాని జ్ఞానమే సుస్థిరంగా ఉంటుంది.

వ్యాఖ్య

నిగ్రహమే నిర్ణయం

మనస్సు నిరంతరం చలిస్తూ ఉంటుంది. మనస్సు చలించ దానికి, చరించ డానికి దారులు రెండే ఉన్నాయి. మనస్సు ఇంద్రియాల ద్వారా అధోముఖంగా పయనించి, ఇంద్రియ విషయాలలో రమిస్తూ, అనిత్యమైన సంసారాన్ని తయారు చేసుకోవచ్చు. లేదా, బుద్ధి ద్వారా ఊర్ధ్వంగా పయనించి ఆత్మానందాన్ని పొందవచ్చు. మనస్సు అధోముఖంగా నడక సాగిస్తే కలిగే దుర్గతిని, ఊర్ధ్వంగా పయనిస్తే ప్రాప్తించే సద్గతిని తెలియ చేసిన తరువాత, ***తస్మాత్*** - అందుచేత, బుద్ధి ద్వారా ఆత్మప్రాప్తి కొరకే యత్నించ మని, దానికి ఇంద్రియాలను నిగ్రహించడమే ప్రధానమైన సాధన మని తెలియ చేస్తూ, ఈ శ్లోకంతో ఇంద్రియనిగ్రహ ప్రకరణాన్ని సమాప్తి చేస్తున్నాడు భగవంతుడు.

వివేకవంతుడు శుద్ధ మనస్సును తయారు చేసుకోవాలి. ఇంద్రియాలు మనస్సుకు లోబడి చరించాలి. శుద్ధ బుద్ధి సూచించినట్లు విహిత కర్మల యందే ఇంద్రియాలు చరిస్తూ ఉండాలి. విషయాల లోకి వెళ్ళమని మనస్సు ఆజ్ఞాపించి నపుడే ఇంద్రియాలు ముందుకు సాగాలి. తిరిగి రమ్మని చెప్పగానే తల వంచి తిరిగి వచ్చే లాగా ఉండాలి.

బండిని గుఱ్ఱాలు లాగుతూ ఉంటాయి. కళ్ళెము మాత్రం సారథి చేతి లోనే ఉంటుంది. కళ్ళెముల యొక్క పట్టు విడుపులను బట్టి గుఱ్ఱాలు పరుగెత్తుతూ ఉండాలి. కళ్ళెమును గట్టిగా పట్టి లాగ గానే గుఱ్ఱాలు ఆగి పోవాలి. ఆగిపోతాయి కూడా.

బ్రతుకు బండిని ఐదు గుఱ్ఱాలు లాగుతూ ఉంటాయి. మనస్సు కళ్ళెము, బుద్ధి సారథి. బుద్ధి అనే సారథి ఆజ్ఞలను పాటిస్తూ మనస్సు అనే కళ్ళెము, ఇంద్రియములు అనే గుఱ్ఱములు ప్రవర్తిస్తూ ఉండాలి. అప్పుడే గమ్యము సుగమ మవుతుంది.

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహ ఏవ చ
ఇంద్రియాణి హయా నాహుః విషయాం స్తేషు గోచరాన్

ఆత్మ రథము యొక్క యజమాని. శరీరమే రథము. బుద్ధియే సారథి. మనస్సు కళ్ళెము. ఇంద్రియాలే గుఱ్ఱములు. ఇంద్రియ విషయాలే మార్గములు అని అద్భుతంగా ప్రవచించింది కఠోపనిషత్తు.

ఇంద్రియాలు ఇంద్రియ విషయాల నుండి అన్ని విధాల నిగ్రహింప బడాలి (**ఇంద్రియాణి సర్వశః ఇంద్రియార్థేభ్యః నిగృహీతాని**). ఏదో ఒక్క ఇంద్రియాన్ని మాత్రం నిగ్రహిస్తే సరిపోదు. సర్వేంద్రియములు నిగ్రహింప బడాలి. అది కూడా సంపూర్ణంగా నిగ్రహింప బడాలి. త్రికరణ శుద్ధిగా నియమింప బడాలి (**సర్వశః సర్వప్రకారైః మానసాది భేదైః**). ఒక వైపు విషయాలు ప్రేరేపిస్తున్నా, ఇంద్రియాలు నిగ్రహంలో ఉండాలి. మనస్సు సంయమనంతో ఉండాలి.

మనస్సును నిగ్రహించే ప్రయత్నం చేయడమే కాదు, అది చక్కగా నిగ్రహింప బడిందో లేదో వీక్షిస్తూ ఉండాలి. సాధారణంగా అందరూ గమ్యాన్ని చేరాలి అనే కోరుకుంటారు గాని, మార్గాన్ని విస్మరిస్తూ ఉంటారు. మార్గాన్ని బట్టే గమ్యం ఉంటుంది. మార్గం విషయంలో శ్రద్ధ వహించే వారు గమ్యాన్ని తప్పక చేరుతారు.

స్థిత ప్రజ్ఞత్వం కావాలి అని అందరూ ఆశిస్తారు. మనస్సు ఏ వైపు పోతుందో పట్టించుకోరు. ప్రేయో మార్గంలో చరించే బుద్ధికి వివేక ప్రజ్ఞ కుదరదు. శ్రేయో మార్గంలో చరించే బుద్ధికే స్థిరత్వం ఉంటుంది. మన మనస్సు ఎటు నడుస్తూ ఉందో అనుక్షణం గమనిస్తూ ఉండాలి. అట్టివారే స్థితప్రజ్ఞులై శోభిస్తారు.

కోరుకొమ్మంటివి రెండు వరాలు నన్ను
కోరుకొంటిని చేతులు రెండు కలిపి
ఒకటి జగతి మరపు వేరొకటి శివుని వలపు
నీ అడుగుల కడ పడి ఉండు నీలకంఠా!

నీలకంఠ శతకంలో ఇదొక విబూది పండు.

ఈ శ్లోకంలో అర్జునుణ్ణి **మహాబాహో!** అని సంబోధించాడు పరమేశ్వరుడు. అంటే గొప్ప బాహువులు కలవాడా! అని అర్థం. గొప్ప శక్తిసామర్థ్యాలు కలవాడు అని భావం. తన బాహుబలం చేత సమర రంగంలో శత్రువులను తుద ముట్టించగల సామర్థ్యం కలవాడు సవ్యసాచి. శత్రువులను నిలువరించి గొప్ప బాహువులు కలవాడు అనే ఖ్యాతిని సాధించినట్లే, ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును నియమించి, మహా బుద్ధిమంతుడు, స్థితప్రజ్ఞుడు అనే యశస్సును కూడా సాధించ మని ప్రోత్సహించడమే **మహాబాహో!** అనే సంబోధన లోని అంతర్భావం.

స్థితప్రజ్ఞ వైభవాన్ని యాభై ఐదవ శ్లోకం నుండి ప్రవచించడం ప్రారంభించిన పార్థసారథి, యాభై ఎనిమిదవ

శ్లోకంలో ఈ ఇంద్రియ నిగ్రహ ప్రకరణాన్ని ప్రారంభించి, అరవై ఎనిమిదవ శ్లోకంలో సమాప్తి చేశాడు. యాభై ఎనిమిదవ శ్లోకం లోని రెండవ పాదము, అలాగే అరవై ఎనిమిదవ శ్లోకం లోని రెండవ పాదము అక్షరం కూడా మార్పు లేకుండా ఒకే విధంగా ఉన్నాయి. **ఇంద్రియాణీన్ద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా** అంటూ నిగ్రహ ప్రకరణాన్ని ఆద్యంతాలలో ఒకే విధంగా పలికి, ఇంద్రియ నిగ్రహము యొక్క ఆవశ్యకతను నొక్కి వక్కాణించాడు భగవంతుడు.

తరువాత శ్లోకం నుండి విషయం మరొక మలుపు తిరుగుతూ ఉంది. స్థితప్రజ్ఞుని వైభవాన్ని తరువాత మూడు శ్లోకాలలో వివరిస్తున్నాడు గీతాచార్యుడు.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69

యా-నిశా-సర్వభూతానాం-తస్యాం-జాగర్తి-సంయమీ
యస్యాం-జాగ్రతి-భూతాని-సా-నిశా-పశ్యతః-మునేః

సర్వభూతానాం	= సమస్త ప్రాణులకు	భూతాని	= భూతములు
యా	= ఏది	జాగ్రతి	= మేల్కొని ఉంటాయో
నిశా	= రాత్రియో	సా	= అది
తస్యాం	= దాని యందు	పశ్యతః	= పరమార్థ తత్త్వాన్ని చూస్తున్న
సంయమీ	= యోగి	మునేః	= మునికి
జాగర్తి	= మేల్కొని ఉంటాడు	నిశా	= రాత్రి
యస్యాం	= దేని యందు		

ఏది సర్వ ప్రాణులకు రాత్రియో, దాని యందు జితేంద్రియుడైన యోగి మేల్కొని ఉంటాడు. దేని యందు సర్వ ప్రాణులు మేల్కొని ఉంటాయో అది పరమార్థమును వీక్షిస్తున్న మునికి రాత్రి.

వ్యాఖ్య

జ్ఞానం వల్ల మోక్షం వస్తుందా? అదే వాస్తవ మైతే, మోక్షానికి నిమిత్తం ఉంది అని చెప్పవలసి వస్తుంది. అపుడు మోక్షంలో ప్రాప్తించేది నిరతి శయానందము కాకుండా పోతుంది. మోక్షం కూడా నైమిత్తిక సుఖంగా మిగిలి పోతుంది. జ్ఞానం వల్ల మోక్షము వచ్చేట ట్లయితే, జ్ఞానం లేక ముందు మోక్షం లేనిదే అవుతుంది. అలాంటిది ఎలాంటి మోక్షమో తెలియదు గాని, నిత్యమోక్షం మాత్రం కాలేదు. ఒకప్పుడు లేకుండా మరొకప్పుడు కలిగేది ఏదయినా కాల పరిధి లోకే వస్తుంది. కాలపరిధిలో ఉన్నది ఏదీ నిత్యం కాదు.

మోక్షం సదా ఉన్నదే. జ్ఞానం వల్ల మోక్షం కలుగుతుంది అనేది వాస్తవం కాదు. మోక్షమే జ్ఞానరూపంలో ఉంది అనేది సత్యం. జ్ఞానం వల్ల అజ్ఞానం తొలగుతుంది. అంతే. మోక్షము అనేది దేని యొక్క ఫలమూ కాదు. అది కేవలం స్వరూప వైభవము. సత్య జ్ఞానానంద స్థితి. ఈ స్థితిలో దివ్యంగా ప్రకాశించే వాడే స్థితప్రజ్ఞుడు. ఆత్మవిదుడైన స్థితప్రజ్ఞుని వైభవాన్ని అద్భుతంగా వర్ణిస్తూ ఉంది ప్రస్తుత శ్లోకం.

ఇది ఆలంకారిక భాషలో చెప్పబడిన గ్రంథి శ్లోకం. 'గ్రంథి' అంటే సంస్కృతములో ముడి అని ఒక అర్థం. దారం ముడి పడుతుంది. ఒకొక్కసారి చిక్కుముడి పడుతుంది. దానిని జాగ్రత్తగా విప్పాలి. లేదా, మొదటికే మోసం వచ్చి, మరీ బిగుసుకు పోతుంది. శాస్త్రంలో అక్కడక్కడ ఇలాంటి గ్రంథి శ్లోకాలు అగుపిస్తూ

ఉంటాయి. వాటిని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే దివ్యమైన మణులు లభ్య మవుతాయి. లౌకికంగా అస్తవ్యస్తంగా అర్థం చేసుకుంటే, విషయం మరీ జటిల మవుతుంది.

సమస్త ప్రాణులకు ఏది రాత్రి సమయమో అది స్థితప్రజ్ఞానికి పగలు. సర్వ ప్రాణులకు ఏది పగలో అది జ్ఞానికి రాత్రి. ఇది శ్లోకం యొక్క భావం.

ఇలాంటి శ్లోకాల విషయంలో కేవలం అక్షరార్థం, వాక్యార్థం గ్రహిస్తే సరిపోదు. లక్ష్యార్థాన్ని గ్రహించాలి. ఏ అంతర్భావం ఇందులో ఇమిడి ఉందో, దాగి ఉందో దానిని సశాస్త్రీయంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి.

కేవలం వాక్యార్థాన్ని గ్రహిస్తే మాత్రం అంతా అయోమయంగా ఉంటుంది. అందరూ నిద్రపోయే రాత్రి సమయాన జ్ఞాని మేల్కొని ఉంటాడు అని చెబితే, ఆ తరువాత రాత్రి పూట కాపలా కాచే వాళ్ళు, రాత్రి ఉద్యోగాలు చేసే వాళ్ళు, దొంగలు అందరూ అదృష్టవశాత్తు జ్ఞానులై కూర్చుంటారు.

దివారాత్రములు

రాత్రి పూట చీకటి దట్టంగా అలుముకొని ఉంటుంది. తదేకంగా చూచినా చీకటిలో ఏదీ కనిపించదు. ఏది ఏమిటో అర్థం కాదు. పగటి పూట వెలుగు ఉంటుంది కనుక చూస్తే కనిపిస్తుంది. ఈ సందర్భంలో, అందరికీ ఏది రాత్రి సమయమో, అది సంయమ శీలుడైన స్థితప్రజ్ఞునికి పగలు అంటున్నాడు. అంటే, అందరూ ఎక్కడైతే చూడలేని స్థితిలో ఉన్నారో, అక్కడ స్థితప్రజ్ఞుడు చూస్తున్నాడు అని అర్థము. అలాగే ఏది సర్వులకు పగలో, అది జ్ఞానికి రాత్రి అంటున్నాడు. అంటే, అందరూ చూచే దానిని జ్ఞాని చూడలేక పోతున్నాడు అని అర్థం.

లౌకికులకు ప్రపంచం సత్యము. జ్ఞానికి పరమాత్మ సత్యము. ప్రపంచము ప్రపంచముగా సామాన్యులకు గోచరిస్తుంది. ప్రపంచము పరమాత్మగా యతివరేణ్యునికి అగుపిస్తుంది. అందరూ చూచేది ఆత్మవిదునికి అగుపించదు. ఆత్మజ్ఞాని చూచే దానిని సర్వులూ వీక్షించ లేరు. ఏది అతనికి వెలుగో, అది అన్యులకు చీకటి. ఏది సర్వులకు ప్రకాశమో, అది జ్ఞానికి తిమిరము.

ఇంద్రియ విషయానుభవములో సామాన్యులు సదా మేల్కొని ఉంటారు. అక్కడ జ్ఞాని నిద్రించిన వాడే. ఆత్మానందములో జ్ఞాని రమిస్తూ ఉంటాడు. అక్కడ లౌకికులు నిద్రించిన వారే.

వ్యావహారిక ప్రపంచములో లౌకికులు మేల్కొని ఉంటారు. అక్కడ ముని నిద్రిస్తూ ఉంటాడు. అంటే, ఎరుక లేకుండా ఉంటాడు. పారమార్థిక స్ఫురణలో స్థితప్రజ్ఞుడు శోభిస్తూ ఉంటాడు (**పరమార్థ తత్త్వం స్థితప్రజ్ఞస్య విషయః**). అక్కడ సామాన్యులు నిద్రిస్తూ ఉంటారు.

ఆనందానుభూతి

స్థితప్రజ్ఞుని వైభవాన్ని వర్ణించడం ప్రారంభిస్తూ, స్థితప్రజ్ఞుని లక్షణాన్ని (**కా భాషా ?**) వివరించే యాభై ఐదవ శ్లోకంలో, మనస్సు లోని కోరికలను సంపూర్ణంగా విడిచిపెట్టి, తన ఆత్మ యందే ఆత్మానందమును పొందువాడు స్థితప్రజ్ఞుడు అని నిర్వచించడం జరిగింది.

కోరికల్ని పట్టుకొని వ్రేలాడే వారు సాధారణ మానవులు. అది వారికి పగలు. సమస్త కోరికల్ని త్యజించిన యతికి కోరికల స్పృహ లేనందున అది అతనికి రాత్రి.

ఆత్మ యందు ఆత్మానందమును అనుభవించే వాడు జ్ఞాని. కనుక, అది అతనికి పగలు. ఆత్మానందము అనేది ఒకటి ఉందని కూడా తెలియని సామాన్యులకు ఆ స్థితి చీకటి కాలమే. రాత్రి సమయమే.

సామాన్యుల సుఖం అనిత్యం. స్థితప్రజ్ఞుని ఆనందం నిత్యం. సామాన్యుల సుఖానికి కారణాలు ఉన్నాయి. అందుచేత వారు అనుభవించేది నైమిత్తిక సుఖం. స్థితప్రజ్ఞుని ఆనందం మరొక నిమిత్తం ద్వారా ప్రాప్తించింది కాదు. అందుచేత అతడు అనుభవించేది నిర్నిమిత్త సుఖం.

ఈ విధంగా విద్యావిద్యల తారతమ్యం తెలుస్తూ ఉంది. జ్ఞానాజ్ఞానాల వ్యత్యాసం అర్థమవుతూ ఉంది. జ్ఞానికీ అజ్ఞానికీ భేదం అనేది వ్యవహారంలో కనిపించేది కాదు. భావంలో ప్రస్ఫుట మయ్యేది. ఇదొక ఆశ్చర్యకరమైన విషయం. కాకీ గూబల అనుభవం లాగా విచిత్ర మైనది.

కాకోలూక నిశేవాఽయం సంసారోఽజ్ఞాత్మ వేదినోః

వివేకము గల జ్ఞానుల, అవివేకము గల అజ్ఞానుల యొక్క ఈ సంసారము కాకీ గూబల రాత్రి వంటిది అన్నది శాస్త్రము.

రాత్రి చీకటి గల కాకికి పిది పగలో, పగలు చీకటి గల గూబకు అది రాత్రి. రాత్రి యందు చూపు గల గూబకు పిది పగలో, పగలు చూపు గల కాకికి అది రాత్రి. వ్యాఖ్యను కూడా గ్రంథి వాక్యాలలో చెప్పుకొని ఆనందించాలని ఇలా వ్రాశాను. అంతే.

భానుని వెలుగు గువ్వకు పిలుపు
తెలియని గూబకు చీచీ పిలుపు
బ్రహ్మమయము విశ్వము సర్వము
తెలియని వానికి భ్రమమయము
గలగల పారును నదిలో జలము
గుటుకుటు మారదు శునకము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని ఒక రామభోగి పిట్టా.

అజ్ఞానులైన వారికి పరమార్థ తత్త్వం రాత్రి లాంటి రాత్రి (*అజ్ఞానినాం సర్వ భూతానాం నిశా ఇవ నిశా పరమార్థ తత్త్వమ్*). అవిద్యా నిద్ర నుండి మేల్కొన్న సంయమి, జితేంద్రియుడు అయిన యోగి, పరమార్థ తత్త్వ రూపమైన దాని యందు మేల్కొని యున్నాడు (*తస్యాం పరమార్థ తత్త్వ లక్షణాయాం అజ్ఞాన నిద్రాయాః ప్రబుద్ధః సంయమీ జితేంద్రియః యోగీ ఇత్యర్థః*) అని ఆచార్యుల వారి భాష్యము.

జ్ఞానోదయం

జ్ఞాని అద్వైతానుభూతిలో శోభిస్తున్నాడు. ద్వైతము అనేది అతనికి రాత్రి. అవిద్యావస్థలో ఉన్న వారికి ద్వైత ప్రపంచము సత్యమే అనిపించ వచ్చు. కారణం, గ్రాహ్య గ్రాహక సంబంధం ఉండటమే. 'గ్రాహ్యము' అంటే గ్రహింప బడునది. 'గ్రాహకము' అంటే గ్రహించునది.

ఈ విధమైన గ్రాహ్య గ్రాహకములు స్వప్నంలో కూడా ఉన్నాయి కదా! స్వప్నము అవిద్యా రూపమే కదా! అలాగే, గ్రాహ్య గ్రాహక సంబంధం ఉన్న జాగ్రదవస్థ కూడా అవిద్యా రూపమే కనుక జ్ఞానికి జాగ్రత్ప్రపంచం కూడా రాత్రి వంటిదే.

జ్ఞాతృ - జ్ఞాన - జ్ఞేయములు అనే త్రిపుటి స్వప్నంలో తెలుస్తూ ఉండినా, నిద్ర నుండి మేలుకోగానే అ మూమూ లేనివే అవుతున్నాయి. కనుక జ్ఞానికి ద్వైతమే రాత్రి. అద్వైతమే పగలు.

మరి, ప్రమాణమైన శాస్త్రం విషయం ఏమిటి? వేదము ప్రమాణము. స్వప్నము నందు, ప్రపంచము నందు గ్రాహ్య గ్రాహకములు ఎలా తెలుస్తున్నాయో, అలాగే వేదము యొక్క పూర్వార్థ మంతా కూడా ఈ గ్రాహ్య గ్రాహకముల తోనే నిండి ఉంది. కర్మ ప్రవృత్తి గోచరిస్తూ ఉంది. సాధ్య సాధనాలను గూర్చి ప్రసంగిస్తూ వేదము కూడా కర్మను ప్రబోధ చేయుచునే ఉంది. ఇదంతా రాత్రి లాంటి అవిద్యే అని తెలుసుకున్న జ్ఞాని కర్మల నుండి విడివడి యున్నాడు. ఆత్మజ్ఞానం కలిగే వరకే ప్రమాణము యొక్క ప్రమాణత్వం ఉంటుంది. ఆత్మజ్ఞానం కలిగిన తరువాత, తానే అద్వితీయాత్మగా ప్రకాశిస్తూ ఉన్నందున, ప్రమాణ ప్రమేయాలకు అవకాశం ఎక్కడుంది? తెలిపేది, తెలియబడేది అనే ద్వైతానికి అవకాశ మెక్కడుంది?

తెలియబడగింది ప్రమేయము. తెలుసుకొనే వాడు ప్రమాత. ప్రమేయం ఉంటేనే ప్రమాత ఉంటాడు. ప్రమేయం ఉండటం వల్ల ప్రమాతకు ప్రమాతృత్వం ఉంటుంది. ప్రమాతే ప్రమేయము అనే అద్వయ జ్ఞానం కలిగి నపుడు, అంతవరకు ఉన్న ప్రమాతృత్వం కూడా తొలగిపోతూ ఉంది. అంత్య ప్రమాణమైన శాస్త్రం ఆత్మ యొక్క ప్రమాతృత్వాన్ని కూడా నివర్తింప చేస్తుంది. ఎప్పుడైతే, ప్రమాతృత్వాన్ని నివర్తింప చేస్తుందో, అప్పుడు స్వప్నం లోని ప్రమాణాలు మేలుకున్న తరువాత అప్రమాణ మైనట్లు, ప్రమాణమైన శాస్త్రం కూడా ఈ అఖండానంద స్థితిలో అప్రమాణ మవుతుంది (*నివర్తయదేవ చ అప్రమాణీ భవతి స్వప్న కాల ప్రమాణ మివ ప్రబోధే*). ఇదే జ్ఞాని వైభవము. ఆత్మజ్ఞాన వైభవము. ఈ వైభవమే రాత్రైన వాడు స్థితప్రజ్ఞుడు. దీనికి భిన్నంగా ఇంద్రియ విషయాలను వెంబడించి చరించువాడు హతప్రజ్ఞుడు, లేదా గతప్రజ్ఞుడు.

ఉత్పన్న శక్తిబోధస్య త్యక్త నిశ్శేష కర్మణః
యోగినః సహజావస్థా స్వయ మేవ ప్రకాశతే ॥

జ్ఞానశక్తిని పొందిన వాడు, కర్మలను సంపూర్ణంగా త్యజించిన వాడు అయిన యోగికి సమాధి స్థితి స్వయంగా, సహజంగా కలుగుతూ ఉంది అన్నది ఉపనిషత్తు.

విషయాసక్తిని విడిచి, రాగద్వేషాలను తటస్థ పరచి, స్థితప్రజ్ఞుడైన మహాత్మునికి మాత్రమే మోక్షం ప్రాప్తిస్తుంది గాని, విషయాలను కోరే వాడికి కాదు అనే సత్యాన్ని సోదాహరణంగా ప్రతిపాదిస్తున్నాడు.

ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠం సముద్ర మాపః ప్రవిశన్తి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే స శాన్తి మాప్నోతి న కామకామీ ॥ 70

ఆపూర్యమాణం-అచల-ప్రతిష్ఠం-సముద్రం-ఆపః-ప్రవిశంతి-యద్వత్
తద్వత్-కామాః-యం-ప్రవిశంతి-సర్వే-సః-శాంతిం-ఆప్నోతి-న-కామకామీ

ఆపూర్యమాణం	=	నింపబడుతూ ఉన్నా	సర్వే	=	అన్నియును
అచలప్రతిష్ఠం	=	మార్పు లేని స్థితి గల	యం	=	ఎవనిని
సముద్రం	=	సముద్రమును	ప్రవిశంతి	=	చేరుతున్నాయో
యద్వత్	=	ఏ విధముగ	సః	=	అతడు
ఆపః	=	జలములు	శాంతిం	=	శాంతిని
ప్రవిశంతి	=	ప్రవేశిస్తాయో	ఆప్నోతి	=	పొందుతాడు
తద్వత్	=	ఆ విధంగా	కామకామీ	=	కామములు కోరేవాడు
కామాః	=	కామములు	న	=	పొందడు

ఎంతగా నిండుతున్నా, హద్దు మీరకుండా స్థిరంగా ఉండే సముద్రములో నదీ జలాలు ప్రవేశిస్తూనే ఉంటాయి.

అలాగే సమస్తమైన భోగ్య విషయాలు ఏ వికారాన్ని కలిగించకుండా ఎవనిలో ప్రవేశిస్తున్నాయో, అతడే శాంతిని పొందుతాడు. కోరికలు కోరేవాడు పొంద లేడు.

వ్యాఖ్య

అందరూ పూర్ణత్వాన్ని వాంఛిస్తారు. పూర్ణత్వము అనేది లేనిదే అయితే దానిని పొందాలి అనే ఆశ ఎలా ఉదయిస్తుంది? పూర్ణత్వము అనేది ఉన్నదే అయితే, ఉన్న పూర్ణంలో నువ్వు వేరుగా ఎలా ఉండ గలవు? పూర్ణము ఉంది. ఏదైనా ఉన్నది అంటే, దానికి సంబంధించిన జ్ఞానము కూడా ఉంటుంది. పూర్ణము ఉంది కనుక పూర్ణానికి సంబంధించిన జ్ఞానము కూడా ఉండాలి. ఆ జ్ఞానము కలిగితే పూర్ణము ఏమిటో తెలుస్తుంది. ఏమని తెలుస్తుంది? నీ కన్నా వేరుగా పూర్ణము అనేది ఒకటి ఉంది అని కాదు, నీవే పూర్ణమని. శూన్యము తెలియని పూర్ణమని. కోరిక కదలని పూర్ణమని. కొరత తెలియని పూర్ణమని.

వ్యవహారంలో కూడా పూర్ణం అనే పదాన్ని మనం వాడుతూ ఉంటాము. చెరువు పూర్ణంగా నిండింది అంటాము. కడుపు పూర్ణంగా నిండింది అంటాము. కాని, కాల వ్యవధిలో చెరువు పూర్ణంగా లేదని తెలుస్తుంది. కొన్ని గంటల తరువాత మళ్ళీ కడుపు ఖాళీగా ఉంది అని అర్థ మవుతుంది. కనుక ఇవన్నీ పూర్ణాలే అయినా, కాసే అవకాశాన్ని, మారే అవసరాన్ని త్రోసి పుచ్చలేవు. ఆ మామిడిపండు రసపూర్ణంగా ఉంది అంటాము. అంటే, అందులో పూర్ణంగా రసమే ఉందా? టెంక, పిక్క లేవా? ఇలాగే ఉంటాయి వ్యవహారంలో పూర్ణాలు. తొలగించేవి, తగిలించేవి లేకుండా స్వతః పూర్ణంగా ఉండే జ్ఞానమే పూర్ణజ్ఞానము. అదే ఆత్మజ్ఞానము. బ్రహ్మజ్ఞానము. స్థితప్రజ్ఞుని నిశ్చలమైన జ్ఞానము.

స్వతః పూర్ణః పరాత్మా బ్రహ్మ శబ్దేన వర్ణితః

స్వయంగా పూర్ణ రూపమైన పరమాత్మ స్వరూపమే బ్రహ్మ శబ్దము చేత వర్ణింప బడింది అన్నది వేదాంతము. ఈ పూర్ణాత్మలో వెలుగే గాని వెలితి తెలియదు. ఇది పెరిగేది కాదు. తరిగేది కాదు. సాగర సదృశ మైనది.

అచల ప్రతిష్ఠం

నదులు సముద్రం లోకి ప్రవేశిస్తూ ఉంటాయి. ఇలా కొన్ని వేల సంవత్సరాలుగా నదీ జలాలు వాటంతట అవే తోసుకొంటూ వచ్చి సముద్రంలో పడుతున్నాయి. నదులను తనలో ప్రవేశించ మని సముద్రం కోరినట్లు ఎక్కడా దాఖలాలు లేవు.

నదీజలాలు అదే పనిగా వచ్చి పడుతున్నా, మేఘ జలాలు నిలిచి కురుస్తున్నా, అన్ని వైపుల నుండి జలాలు సముద్రాన్ని నింపుతున్నా (***ఆపూర్యమాణమ్ అచలప్రతిష్ఠమ్***), జలాలన్నీ సాగరంలో లయిస్తున్నాయే గాని సాగరం యొక్క నీటి మట్టము పెరగడం లేదు. అలాగే తరగడమూ లేదు. సముద్రము సదా పూర్ణం గానే ఉంటుంది. తన పూర్ణత్వానికి మరొక దానిపై ఆధార పడటం లేదు. నదుల వలె ఒక చోట నుండి మరొక చోటికి చలించడం లేదు (***అచలమ్***). అంతే కాదు, జలాలు ఎన్ని వచ్చి పడినా తన హద్దును దాటడం లేదు. స్థిరంగా ఉంది (***ప్రతిష్ఠమ్***).

స్థితప్రజ్ఞుడు కూడా సాగర సదృశంగా శోభిస్తున్నాడు. తాను పూర్ణుడై ఉన్నాడు. తన పూర్ణత్వము మరొక దానిపై ఆధారపడి లేదు. జలాలు వచ్చి సాగరంలో పడుతున్నట్లు, సమస్త విషయాలు (***సర్వే కామాః***) అన్ని వైపుల నుండి వచ్చి ఆ పూర్ణ పురుషునిలో ప్రవేశిస్తూ ఉన్నాయి (***ప్రవిశన్తి***). సాగరంలో ప్రవేశించిన జలాలు సాగర రూపాన్ని పొందినట్లు, బ్రహ్మజ్ఞానిలో ప్రవేశిస్తున్న విషయాలు ఆ దివ్య స్వరూపునిలో విలీనమై పోతున్నాయి.

పొంగుట తెలియని, క్రుంగుట అర్థం గాని పూర్ణ సాగర సదృశుడు స్థితప్రజ్ఞుడు.

నీళ్ళు సముద్రం లోనే కాదు, బావుల్లో, నదుల్లో, చెరువుల్లో కూడా ఉన్నాయి. బావినీరు వర్షపు జలం మీద, భూగర్భ జలాల మీద ఆధారపడి ఉంది. వర్షం పడకపోయినా, భూగర్భ జలాల మట్టం తగ్గినా, బావి ఎండిపోతుంది.

వర్షాల వల్ల, వాగులు, కాలువలు వచ్చి కలవడం వల్ల నదులు పొంగి ప్రవహిస్తాయి. వాగులు ప్రవహించడం ఆగిపోయినా, వర్షాలు పడకపోయినా నదులు ఇంకి పోవడం చూస్తూ ఉంటాము.

నదీజలాలు, వాగులు, వంకలు వచ్చి కలవడం చేత, వర్షపు నీరు వచ్చి పడటం చేత చెరువులు నిండుతాయి. గ్రీష్మంలో జలం ఆవిరై నీటి మట్టం తగ్గిపోతూ ఉంటుంది.

ఈ విధమైన పొంగుక్రుంగులు సముద్రంలో చూడలేము. సామాన్య జను లందరూ బావులు, చెరువులు, నదుల లాంటి బుద్ధులు కలిగి ఉంటారు. వారి బుద్ధులు స్థిరంగా ఉండవు. పొంగుతూ క్రుంగుతూ ఉంటాయి. వారి సుఖశాంతులు విషయాలపై ఆధారపడి ఉంటాయి. అలా ఆధారపడి జీవించే వాళ్ళే **కామ కాము**లంటున్నాడు గీతాచార్యుడు.

కామములు అంటే ఇక్కడ కోరబడేవి అని అర్థము. అంటే ఇంద్రియ విషయాలు అని అర్థం. వాటిని కోరేవాడు కామకామి. సాగర సదృశంగా ఎవరి వివేక ప్రజ్ఞ స్థిరంగా ఉంటుందో, అట్టి స్థితప్రజ్ఞుడు శాంతిని పొందుతాడు (***సః శాంతిం ఆప్నోతి***). విషయాలను వాంఛించే వాడు శాంతిని పొందలేడు (***న కామ కామీ***).

తనలో వచ్చిపడే జలరాశు లన్నీ తన కన్నా అన్యమైనవి కావని తెలుసు కనుక సాగరము పూర్ణంగా ఉంటుంది. తనను చేరే విషయాలన్నీ తన కన్నా అన్యమైనవి కావని స్థితప్రజ్ఞునికి తెలుసు కనుక అతడూ పూర్ణ రూపుడై శోభిస్తాడు. తాను కోరేవి తన కన్నా అన్యమైనవి అని భావించడం చేత కామి పూర్ణత్వం అర్థం కానివాడై ఉంటాడు.

అవికార్య స్వరూపం

సాగరాన్ని చేరే నదీ జలాలు నానా వర్ణ రసగంధ భేద విశేషాలతో నిండి ఉంటాయి. గంగాజలము తెల్లగా ఉంటుంది. కృష్ణాజలము నల్లగా ఉంటుంది. ఈ విధంగా సాగరంలో వచ్చి పడే జలరాశులు, శుక్ల నీల రక్త పీతాది వర్ణ విశేషాలతో కనిపిస్తూ ఉంటాయి. ఇవన్నీ వచ్చి సాగరాన్ని కలిసి తమ విశేషాలను పోగొట్టుకొని విలీనమై పోతాయి. సముద్రం మాత్రం ఈ విశేషాలు ఏవీ లేకుండా సహజం గానే శోభిస్తూ ఉంటుంది.

నదీ జలాలలో వర్ణ భేదమే కాకుండా రసభేదం కూడా ఉంటుంది. కొన్ని నదీ జలాలు తియ్యగా ఉంటాయి. మరి కొన్ని ఉప్ప గాను, వగరు గాను ఉంటాయి. మధురామ్ల తిక్త కషాయాది రస విశేషాలతో ఉంటాయి. అంతేకాదు, పరిమళ దుర్గంధాది వాసనా విశేషాలు కూడా ఉంటాయి. కొన్ని జలాలు పలుచగా ఉంటే, మరి కొన్ని చిక్కగా ఉంటాయి. ఈ విధమైన లఘుత్వాది గుణ విశేషాలతో కూడా ఉంటాయి. సాగరంలో ప్రవేశించిన తరువాత ఇవన్నీ అదృశ్యమై పోతాయి. సాగరంలో మచ్చుకైనా కనిపించవు. తనలో వచ్చి పడుతున్న జలాల విశేషాలను తనలో ప్రదర్శించ కుండా సాగరం సహజంగా, గంభీరంగా శోభిస్తూ ఉంటుంది.

స్థితప్రజ్ఞుని బుద్ధి కూడా సాగరం లాగా నిశ్చలంగా, అవికార్యంగా భాసిస్తూ ఉంటుంది. అనేక భోగ్య విషయాలు పూర్ణ పురుషునిలో ప్రవేశిస్తూ ఉంటాయి. సూపా పూప రస అన్నాదులు స్వీకరింప బడుతూ ఉంటాయి. సూపా పూప రసాన్నాదులు అంటే, పప్పు, పిండివంటలు, రసము, అన్నము మొదలైనవి అని అర్థము. ఇవన్నీ ప్రారబ్ధ ఫలంగా, అప్రార్థితంగా జ్ఞానికి అందుతూ ఉంటాయి. నామ, రూప, రస, పరిమళ, పాక సంస్కారాది

విశేషాలతో అందుతూ ఉంటాయి. అయినా సాగర సదృశమైన ఆ దివ్యాత్మని బుద్ధిలో ఏ విధమైన వికారము గోచరించదు. అది చలించ కుండా స్థిరంగా ఉంటుంది (*స్థితధీః అచల ప్రతిష్ఠమ్*).

కామి (కోరేవాడు) భోగ్య విషయాలలో వికారం చెందుతూ ఉంటాడు. విషయాలలో రాగ రమ్యాది విశేషాలను చూస్తూ, అహంకార మమకారాలను రంగరించుకొని, నేను భోక్తను అనే అభినివేశంతో భేద దృష్టిని కలిగి, బద్ధుడై ఉంటాడు. అందుచేత అశాంతితో అలమటిస్తూ మనుగడను సాగిస్తూ ఉంటాడు.

జలరాశులు వచ్చి పడుతున్నా, తనలో ఏ విధమైన మార్పు లేకుండా, గంభీరంగా, ప్రశాంతంగా, పూర్ణంగా శోభిస్తూ ఉంటుంది సాగరము. అలాగే, భోగ్య విషయాలు ఎన్ని వచ్చి తన బుద్ధిలో ప్రవేశిస్తూ ఉండినా, ఏ మాత్రం చలనం లేకుండా, ఏ విధమైన వికారం చెందకుండా, పూర్ణ శోభతో, శాంతరూపుడై ప్రకాశిస్తూ ఉంటాడు స్థితప్రజ్ఞుడు. ఈ విధమైన పూర్ణశోభ భోగ్య విషయాలను కోరే కామికి లభించదు.

సముద్రం తన పూర్ణత్వానికి వచ్చిపడే జలాలపై ఆధారపడి లేదు. జ్ఞాని తన పూర్ణానందానికి విషయాలపై ఆధారపడి లేదు. తనలో ప్రవేశించే జలరాశిని సముద్రం నిరోధించడం లేదు. తనను చేరే విషయాలను స్థితప్రజ్ఞుడు నిరాకరించడం లేదు. ***అహం అకర్తా - అహం అభోక్తా*** అనే భావన తోనే ప్రపంచంలో చరిస్తూ ఉంటాడు. పుణ్య పాపాలకు అతీతుడు. శుభాశుభాలకు విలక్షణుడు. అసంగ రూపుడు. ఆనంద స్వరూపుడు.

స్థితప్రజ్ఞుని వైభవ మంతా అతని బుద్ధి లోనే ఉంది. అది ఆంతరంగిక సౌందర్యము. జ్ఞాని దేహం ఇలా ఉండాలి అనే నియమ మేమీ లేదు. అష్ట వక్రాలు ఉన్నా మహర్షి ప్రజ్ఞ స్థితమే గాని గతం కాదు. జ్ఞాని వైభవము దేహ సంబంధ మైంది కాదు. జ్ఞానం కలిగింది కదా అని అరవై వయస్సు గల దేహం ఇరవై లోకి జారి పోయేదీ ఉండదు. జ్ఞానము అనేది ఇంద్రియ సంబంధ మైనది కాదు. ఒక అంధుడికి జ్ఞానం కలిగితే, దాని ప్రభావం వల్ల దేహానికి ఉన్న అంధత్వం పోదు. బుద్ధి లోని అజ్ఞానం పోతుంది. అంతే. ప్రజ్ఞ మార్పు చెందదు. మార్పును వాంఛించదు. అందుకే ఆ ప్రజ్ఞ స్థితం. స్థితప్రజ్ఞ. స్థితప్రజ్ఞ కలవాడు స్థితప్రజ్ఞుడు. అతడే జీవన్ముక్తుడు.

యస్య స్థితా భవేత్ప్రజ్ఞా యస్యానందో నిరంతరః
ప్రపంచో విస్మృత ప్రాయః స జీవన్ముక్త ఇష్యతే ॥

ఎవరి ప్రజ్ఞ స్థిరంగా నిలిచి ఉంటుందో (*స్థితప్రజ్ఞః*), ఎవరి ఆనందము నిరంతరం ప్రవాహ రూపంలో ఉంటుందో, ఎవరికి ప్రపంచం స్మృతిలో ఉండదో అతడే జీవన్ముక్తుడు అన్నారు 'వివేక చూడామణి' గ్రంథంలో శ్రీ శంకరాచార్యస్వామి.

ఈ అద్భుత అద్వైత జ్ఞాన ప్రసాదాన్ని సర్వులకూ వితరణ చేయా లనే గీతామాత ఐదు వేల సంవత్సరాలుగా ఈ ప్రపంచంలో నిలిచి ఉంది. సర్వులూ స్థితప్రజ్ఞులు కావాలి అనేదే భగవద్గీత ఏకైక ఆశయము. అందుకొనే వారు ధన్యులు (*తే ధన్యాః*).

పల్లవి : **కడలి అలల వోలె మనసాయె**
అంబర మంతాయె నా హృదయం ॥ కడలి ॥

చరణములు : **1. కవుల ఊహలు పాపల నవ్వులు**
హరివిల్లు రంగులు నను చేరే
కోకిల రవములు కుసుమ బాలలు
కదిలించే మదిని స్పృశియించే ॥ కడలి ॥

2. తలుపులు లేని నీ గుడిలో
నీ రాకను ఆపే వారెవరు?
తలపులు ఆగిన నా హృదిలో
తడబడతా వేమి రావేమి? ॥ కడలి ॥

అంటూ ఆత్మానంద సాగరంలో లేచిన ఒక చైతన్య తరంగం.

స్థితప్రజ్ఞ ప్రకరణాన్ని సమాప్తి చేస్తూ, సింహావలోకనంగా పునః సారభూతమైన విషయాన్ని తరువాత శ్లోకంలో అందిస్తున్నాడు.

విహాయ కామాన్య స్సర్వా న్పుమాం శ్చరతి నిఃస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాన్తి మధిగచ్ఛతి ॥ 71

విహాయ-కామాన్-యః-సర్వాన్-పుమాన్-చరతి-నిఃస్పృహః
నిర్మమః-నిరహంకారః-సః-శాంతిం-అధిగచ్ఛతి

యః	=	ఏ	నిర్మమః	=	మమకారము లేనివాడై
పుమాన్	=	పురుషుడు	నిరహంకారః	=	అహంకారము లేనివాడై
సర్వాన్	=	సమస్తములైన	చరతి	=	చరిస్తాడో
కామాన్	=	కోరికలను	సః	=	అట్టివాడు
విహాయ	=	విడిచి	శాంతిం	=	శాంతిని
నిఃస్పృహః	=	స్పృహ లేనివాడై	అధిగచ్ఛతి	=	పొందుతాడు

సమస్తమైన కోరికలను విడిచి పెట్టిన వాడు. వాటి యందు స్పృహ లేకుండా ఉన్నవాడు. మమకారము లేనివాడు. అహంకారము తెలియని వాడు. అలా చరించే వాడే శాంతిని పొందుతాడు.

వ్యాఖ్య

బుద్ధిలో వివేక ప్రజ్ఞ ఉండాలే గాని, మనల్ని ఆకర్షించే శక్తి ఈ ప్రపంచంలో దేనికీ ఉండదు. ఎవ్వరికీ ఉండదు. ఏముంది ఈ ప్రపంచంలో ఆకర్షణ? ఎక్కడుంది ఈ జగతిలో ఆనందము? ఆడంబరాల మధ్య ఊరేగినా, అష్టైశ్వర్యాలతో తులతూగినా, అందల మెక్కి సర్వాధికారం సాగించినా, సుందర మందిరాలలో ఆదమరచి నిద్రించినా, ఏదో ఒకనాడు, ఎక్కడో ఒక్కచోట మానవ దేహం కూలి పోయేదే. ఎవరి దేహమైనా నేల రాలి పోయేదే. కాలి బూదిగా మారి పోయేదే.

దేహము ఒక మట్టికుండ. ఏనాడైనా పగిలేదే. ఇక మనసా? అదొక దారపు ఉండ. ఎంత జాగ్రత్త పడినా చిక్కు పడుతూనే ఉంటుంది. చిక్కుల్లో పడుతూనే ఉంటుంది. చచ్చే దేహము - చంపే మనసు, ఈ రెండిటి తోనే బ్రతుకులు కాలి పోతున్నాయి. మనుగడ మసై పోతూ ఉంది. ఎన్ని జన్మలు ఇలా వృథా కావాలి? ఎంత కాలం ఈ బాధలు అనుభవించాలి? ఎలాగూ దగా పడ్డాం. ఇకనైనా నిఘా పెంచుకుందాం. అంతరించే అడ్డదారుల్ని వదలి, తరించే దొడ్డదారిని వెతుక్కుందాం.

దీన శుభము లేదు దివ్య కీర్తియు లేదు
జగతిఁ బుట్టి బుట్టి చచ్చి చచ్చి
పొరల నేల మనకు పుట్టని చావని
త్రోవ వెదకి కొనుట దొడ్డబుద్ధి ॥

అని చిన్న వయస్సు లోనే దొడ్డ విషయాన్ని బోధించాడు ప్రహ్లాదుడు. ఇదే నిజమైన త్రోవ. ఇదే జ్ఞాన మార్గము. ధన్యమైన మార్గము. ఈ త్రోవలో నడచే వారందరూ ధన్యులే.

తే ధన్యాః భువి పరమార్థ నిశ్చితే హాః
శేషాఽ స్తు భ్రమనిలయే పరిభ్రమన్తః

అట్టి జ్ఞానాన్ని పొందేందుకు యత్నించువారు ధన్యులు. మిగిలిన వారు మాయలో పరిభ్రమిస్తున్నారు. భ్రమలో చరిస్తున్నారు అన్నారు 'ధన్యాష్టకం'లో శ్రీ శంకరాచార్యస్వామి.

స్థితప్రజ్ఞుని లక్షణాన్ని యాభై ఐదవ శ్లోకంలో ***ప్రజహాతి యదా కామాన్ సర్వాన్*** - 'సమస్తమైన కోరికలను విడిచి పెట్టిన వాడు' అంటూ కామనా త్యాగంతో ప్రారంభించాడు శ్రీకృష్ణుడు. ఈ శ్లోకంలో ***విహాయ కామాన్ యః సర్వాన్*** - 'సమస్తములైన కోర్కెలను విడిచి పెట్టిన వాడు' అంటూ అదే వాక్యంతో స్థితప్రజ్ఞుని వైభవాన్ని సమాప్తి చేస్తున్నాడు. కామజయమే రామజయం. శ్రీరామ జయం. కామాన్ని జయించిన వాడే ఆత్మారాముడు అవుతున్నాడు. ఎవడు సమస్త కోరికలను త్యజించి చరిస్తూ ఉంటాడో, అట్టి పురుషుడే స్థితప్రజ్ఞుడు. అతడే శాంతిని పొందుతాడు. బంధాన్ని కలిగించే కోరికలను త్యజించిన వివేకవంతుడు కేవలం ప్రారబ్ధానుభవము కొరకే ప్రపంచంలో చరిస్తూ ఉంటాడు (***చరతి***). ఇక్కడ చరించడము అంటే, జీవితంపై ఆసక్తి ఉండి అని అర్థం కాదు. ప్రారబ్ధ వశాత్తు దేహం ఉంది కనుక, జీవనము కొరకే వ్యవహరిస్తూ చరించేవాడు అని అర్థము (***చరతి, జీవనమాత్ర చేష్టా శేషః పర్యటతి ఇత్యర్థః***).

కోరిక లన్నీ విడిచి పెట్టేశాడు, సరే. కనీసం, బ్రతకాలి అనే ఆశైనా లేకుండా ఉంటాడా? అది కూడా లేదు అనే సత్యాన్ని వివరిస్తూ ఉంది ***నిస్పృహః*** అనే పదం. శరీరం జీవించి ఉండాలి అనే స్పృహ కూడా లేనివాడు (***శరీర జీవన మాత్రేఽ పి నిర్గతా స్పృహా యస్య సః నిస్పృహః సన్***).

ప్రారబ్ధాధీనమై చరిస్తున్న దేహానికి ఏది ప్రాప్తించినా, దాని యందు కూడా **మమ** 'నాది' అనేది లేనివాడు. ఎందుకని? ***అహం*** 'నేను' అనేదే లేకుండా పోయింది కనుక. 'నేను' అనేది ఉంటేనే, 'నాది' అనేది ఉంటుంది. 'నేను' అనేది బ్రహ్మమే, పూర్ణబ్రహ్మమే అనే ప్రజ్ఞ గల ఆత్మవిదుడు, తన కన్నా అన్యంగా ఎవ రున్నారని వారి నుండి వేరు పడటానికి 'నేను' అనాలి? అంతా తానే అయి నపుడు అతనిది కానిది ఏముందని 'నాది' అని ప్రత్యేకంగా పలకాలి? ఇలా అహంకార మమకారముల నుండి విడిపడిన వాడు స్థితప్రజ్ఞుడు. అతడే శాంతిని పొందుతున్నాడు. అతడి స్థితియే మోక్షము. అదే నిర్వాణము.

ఈ ప్రపంచంలో ఏది పొందినా, ఎన్ని పొందినా శాంతి మాత్రము రాదు. ఒక్క జ్ఞానమే శాంతిని ప్రసాదిస్తుంది. ఆత్మజ్ఞానమే పూర్ణశాంతిని హృదయంలో నింపుతుంది.

సాగరాన్ని చేరే వరకు నది ప్రవహిస్తూనే ఉండాలి. పండయ్యే వరకు కాయ చెట్టును అంటి పెట్టుకొనే ఉండాలి. శాంతి లభించే వరకు మనం ఈ ప్రపంచంలో కర్మలు ఆచరిస్తూనే ఉండాలి.

కర్మల ఫలితంగా ఏది లభించినా, సుఖం వస్తుందేమో గాని శాంతి రాదు. సుఖాలకు రాకపోక లున్నాయి. సుఖం రావచ్చు. వచ్చిన సుఖం పోవచ్చు. కాని శాంతి మన స్వరూపం. అది లభ్యమైతే మళ్ళీ పోయేదంటూ ఉండదు.

సుఖ మున్న చోట దుఃఖం లేక పోవచ్చు. అలాగని, శాంతి ఉంటుంది అని చెప్పలేము. ఈ కారణం చేతనే, సుఖాలు ఉన్నవారు కూడా ఈ ప్రపంచంలో కర్మలు ఆచరిస్తూనే ఉన్నారు.

దుఃఖము ఉన్నచోట సుఖము ఉండదు, శాంతి ఉండదు. సుఖమున్న చోట దుఃఖం ఉండదు, శాంతి

కూడా ఉండదు. మరి శాంతి లేని వానికి సుఖ మెక్కడుంటుంది? ***అశాంతస్య కుతః సుఖమ్?*** శాంతి లేని వానికి సుఖ మెలా వస్తుంది? అని ప్రశ్నించాడు గీతాచార్యుడు ఈ అధ్యాయం లోనే.

శాంతి ఉంటేనే సుఖం ఉంటుంది. ఏది పొందినా శాంతి రాదు. జ్ఞానం వల్లనే శాంతి వస్తుంది. పరమాత్మ జ్ఞానం వల్లనే శాంతి ప్రాప్తిస్తుంది. అదే మోక్షం. స్థితప్రజ్ఞుడు పొందే అక్షయధనం ఇదే (***సః ఏవం స్థితప్రజ్ఞః బ్రహ్మవిత్, శాంతిం నిర్వాణాఖ్యామ్ అధిగచ్ఛతి ప్రాప్నోతి బ్రహ్మభూతో భవతి ఇత్యర్థః***).

అధ్యాయమును పరిసమాప్తి గావిస్తూ ఫలశ్రుతిని అందిస్తున్నాడు గోవిందుడు.

ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాస్యా మన్తకాలేఽ పి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥ 72

ఏషా-బ్రాహ్మీ-స్థితిః-పార్థ-న-ఏనాం-ప్రాప్య-విముహ్యతి
స్థిత్వా-అస్యాం-అంతకాలే-అపి-బ్రహ్మనిర్వాణం-ఋచ్ఛతి

పార్థ	= అర్జునా!	అంతకాలే అపి	= మరణ కాలంలో అయినా
ఏషా	= ఇది	అస్యాం	= బ్రహ్మస్థితి యందు
బ్రాహ్మీస్థితిః	= బ్రహ్మజ్ఞాని స్థితి	స్థిత్వా	= నిలిచి
ఏనాం	= దీనిని	బ్రహ్మనిర్వాణం	= బ్రహ్మప్రాప్తిని
ప్రాప్య	= పొంది	ఋచ్ఛతి	= పొందుతున్నాడు.
న విముహ్యతి	= మోహము చెందదు		

అర్జునా! ఇదే బ్రహ్మరూప స్థితి. దీనిని పొందినవాడు తిరిగి మోహమును పొందడు. మరణ సమయంలో కూడా ఈ బ్రాహ్మీస్థితిలో నిలిచి బ్రహ్మానందమును పొందుతాడు.

వ్యాఖ్య

అద్వితీయమైన ద్వితీయ అధ్యాయాన్ని సమాప్తం చేస్తూ, ఆత్మజ్ఞాన వైభవమును స్తుతిస్తున్నాడు (***ఏషా జ్ఞాన నిష్ఠా స్తూయతే***). అర్జునా! ఇదే బ్రాహ్మీస్థితి. స్థితి అంటే నిష్ఠ. ఇదే బ్రహ్మనిష్ఠ (***ఏషా బ్రాహ్మీ స్థితిః***).

ఆత్మతత్త్వ విజ్ఞానమే సాంఖ్యం. ఈ అధ్యాయంలో ఆత్మజ్ఞానమే ప్రధానంగా చర్చింప బడింది. ఆత్మజ్ఞానాన్ని పొందడానికి అర్హతను సాధించడం కోసం కర్మయోగం చెప్ప బడింది. స్థితప్రజ్ఞుని గూర్చి అర్జునుడు ప్రశ్నించడం వల్ల జ్ఞాన మార్గంలో సాధ్య సాధనాలను కూడా బోధించడం జరిగింది. వేదాంత విజ్ఞాన మంతా ఈ సాంఖ్యం లోనే ఆవిష్కరింప బడింది. ఇదే బ్రాహ్మీస్థితి అంటూ ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు అనంతానంద స్వరూపుడైన గీతాచార్యుడు.

ఇదే బ్రాహ్మీస్థితి. దేశకాలాదులు తెలిసి రాని అనంతానుభూతి. అద్వయానుభూతి. వ్యక్తిత్వము అర్థం గాని అవ్యక్తానుభూతి. ఈ స్థితిలో మనం ఒక చోట ఉండే వాళ్ళము కాము. బ్రహ్మము ఎక్కడో లేనిది కాదు. ఎక్కడో ఉండేదీ కాదు. ఎక్కడైనా ఉండేదే. ఎక్కడ, ఎప్పుడు అనే భావాలకు చిక్కేది కాదు. అలాంటి ఆలోచనలకు తాను ఆధారమే అయినా, వాటికి తనలో అవకాశ మివ్వని అఖండస్థితి.

నీవు - నేను, అది - ఇది అనేవి తెలియని, అర్థం గాని అద్వైత స్థితి. ఏది ఎక్కడ ఉంది? అని ఊహించలేని స్థితి. అన్నీ అంతటా ఉన్నాయనే జ్ఞాన మొక్కటే అఖండంగా వెలిగే ఆనంద ప్రదీప స్థితి. ఇదే బ్రాహ్మీస్థితి. ఇది ప్రత్యేక అనుభవం కాదు. సమస్త అనుభవాలు సమరసమైన అఖండైక రసానుభూతి. నది సాగర రూపమై తానే

సాగర మనే అనుభూతిలో స్థిరపడి నట్లు, ఈ ఆత్మయే బ్రహ్మ అనే బ్రహ్మాత్మైక్య జ్ఞానము స్థితమైన, స్థిరమైన అవ్యయానంద స్థితి. *అహమేవ - అహమేవ.* 'నేనే - నేను నేనే' అనే ఆత్మజ్ఞాన తరంగ వలయాలు ఆత్మానంద సాగరంలో చలిస్తున్న అనిర్వచనీయ స్థితి.

తదేవ నిష్కలం బ్రహ్మ నిర్వికల్పం నిరంజనం
చైతన్య మేకం బ్రహ్మేతః ప్రజ్ఞానం బ్రహ్మ మయ్యపి ॥

ఆ బ్రహ్మము విభాగములు లేనిది. వికల్పములు లేనిది. మలినము అంటనిది. చిద్రూప మైనది. అద్వయ మైనది. ఈ కారణం చేత *(అతః)*. నా యందున్న ప్రజ్ఞానము కూడా *(మయ్యపి ప్రజ్ఞానం)* బ్రహ్మమే *(బ్రహ్మైవ)* అని అమృతబిందూపనిషత్తు గొంతు విప్పింది. త్రిపుర తాపిన్యుపనిషత్తు వంత పాడింది.

తిరుగు లేని తిరిగి రాని స్థితి

దివ్యమైన ఈ బ్రాహ్మీస్థితిని పొందిన వాడు *(ఏనాం ప్రాప్య)* ఏ విధమైన మోహానికి గురి కాడు *(న విముహ్యతి)*. మేలుకున్న వ్యక్తిని స్వప్నం లోని విషయాలు చలింప చేయలేవు. బ్రహ్మనిష్ఠుడైన వానిని భ్రమలు ముట్టలేవు. పట్టలేవు. సూర్యోదయమైన తరువాత చీకట్లు ఎలా ఉంటాయి? కాయ పండుగా మారిన తరువాత పూలరేకులు ఎక్కడ మిగిలి ఉంటాయి? అన్నిటికీ తెరపడి పోయింది. అజ్ఞానం తెర మరుగైంది. నిత్య మోక్షంలో మోహ మనేది అనూహ్యం. మోహం కదిలితే ఇక మోక్ష మెక్కడిది? మోహం నశిస్తేనే మోక్షం. మోహం తిరిగి వస్తే మోక్షం నశించినట్లే కదా! నశించేది మోక్షం ఎలా అవుతుంది? కనుక మోహము తిరిగి రాదు. మోక్షము ఎక్కడికీ పోదు. ఉన్నది ఉన్నట్లు తెలియడమే జ్ఞానం. ప్రజ్ఞానం.

మోక్షము కూడా క్షరమైతే
దానిని పొంది ఫలమేమి?
అక్షరమై అది స్థిరమైతే
పొందే యత్నం ఎందుకని?
పోయేది లేదు - వచ్చేది కాదు
ఉన్నది ఉన్నట్లు తెలియాలి
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

ఇది రామజోగి చిట్కా.

కాలం కాదు కొలమానం

దివ్యమైన ఈ బ్రాహ్మీస్థితి కాలంలో కలిగేది కాదు, కాలంలో కరిగేదీ కాదు అని తెలుసుకున్నాం. కనుక ఎప్పుడూ ఉన్న బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానము ఎప్పుడైనా కలగవచ్చు. ఎప్పుడు ఎవరికి కలిగినా, ఆ కలిగిన వ్యక్తి వ్యక్తిగా మిగిలి ఉండడు. బ్రహ్మముగా వెలిగి పోతాడు. ఈ స్థితి మరణ సమయంలో నైనా కలగవచ్చు. కలగడము అంటే కడతేరి పోవడమే కనుక అది ఎప్పుడైనా సంభవించ వచ్చు. జ్ఞానము ఆ వయస్సులో అసంభవము, ఈ వయస్సులో అసంగతము అనేది లేనే లేదు.

జ్ఞానానికి కావలసింది మనస్సే గాని వయస్సు కాదు. సానుకూలమైన సమబుద్ధే గాని సమయం కాదు. చచ్చే వ్యక్తి కూడా పొందవచ్చు. కాకపోతే, జిజ్ఞాస చావ కుండా ఉండాలి. వివేక వైరాగ్యాదులు అంతరించ కుండా ఉండాలి. శ్రద్ధ మొద్దు బారి పోకూడదు. అంతే. కనుకనే, మరణ సమయంలో నైనా *(అన్తకాలేఽపి)* ఈ బ్రాహ్మీస్థితిలో *(అస్యాం)* స్థిరంగా నిలిచి *(స్థిత్వా)* బ్రహ్మరూపమైన మోక్షాన్ని పొందవచ్చు *(బ్రహ్మ నిర్వాణమ్*

ఋచ్ఛతి). చివరి సమయంలో కూడా శ్రద్ధ గలవాడు గురువు నుండి జ్ఞానాన్ని పొందుతాడు. మోక్షాన్ని పొందుతాడు.

అత్యాశ కాదు - అనంతాశ

నా వయస్సు మళ్ళింది. మనస్సు మరిగి పోయింది. దేహం సడలి పోయింది. ఏదీ చెయ్యలేని పరిస్థితి దాపురించింది. ఇక నేను ఏమి సాధిస్తాను? అని వృద్ధులు చింతిస్తూ ఉంటారు. మరణ సమయంలో ఉండే వారికి కూడా మోక్షం ప్రాప్తించే అవకాశం ఉందని సాక్షాత్తు భగవంతుడే చెబుతూ ఉంటే, నేను ముసలివాణ్ణి, మునిగి పోతానేమో అని దుఃఖించడం జ్ఞానం అనిపించుకోదు.

వయస్సు మళ్ళిన వారి మనస్సులు పలికే ఈ అప్రస్తుత ప్రసంగాలు యువతకు చెడు సంకేతాన్ని చేర వేస్తాయి. ఇంతకాలం జీవించిన వ్యక్తే తరించడం సాధ్యం కాదని ఇలా తపించి పోతున్నాడు; ఇక మనకిది సాధ్యమేనా? అని నిరాశలో యువత కూరుకు పోయే ప్రమాదం ఉంది.

ఎక్కువ కాలం జీవించిన వారికి అనుభవాలు కూడా ఎక్కువ గానే ఉంటాయి. తమ అనుభవాల ద్వారా అనుభవం లేని వారిలో ఆసక్తిని, ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపే కర్తవ్యం పెద్దలదై ఉండాలి. నిరాశల్ని, నిస్పృహల్ని పెనవేసుకొని, తాము కలత పడటమే గాక, యువతను కలవర పెట్టడం పెరిగిన వయస్సుకే కళంకము.

మనిషి ఆశావహ దృక్పథంతో జీవించాలి. మనిషిలో ఉత్సాహం ఉండాలి. ఉద్యమ స్ఫూర్తి ఉండాలి. అదే యోగ లక్షణం. నిరాశలు, నిస్పృహలు రోగ లక్షణాలు.

వయస్సు మళ్ళినంత మాత్రాన జ్ఞానం మరలి పోయిందని, వెనుదిరిగి పోయిందని ఎవరు చెప్పారు? వయస్సు పోయినా వినికిడి ఉంటే చాలు. ఆరోగ్యం పోయినా, ఆసక్తి ఉంటే జ్ఞానాన్ని రాకుండా ఎవ్వరూ ఆపలేరు.

ఆఖ్యాయిక

ఖట్వాంగుడు చక్రవర్తి. రాజ్యాన్ని పాలిస్తూ ఉన్నాడు. దేవ దానవ సంగ్రామంలో మహా శక్తివంతుడైన ఖట్వాంగుడు దేవతల వైపు నిలబడి రాక్షసులతో పోరాడాడు. విజయాన్ని సాధించిన దేవతలు ఖట్వాంగుని ప్రశంసించారు. ఏదైనా వరాన్ని కోరుకొమ్మని ఆజ్ఞాపించారు.

ఖట్వాంగుడు ఆలోచించి, తన మరణ కాలము ఎప్పుడో తెలియచేయ వలసిందిగా దేవతల్ని ప్రార్థించాడు. దేవతలు దివ్యదృష్టితో చూచి, ఇక కేవలం ముహూర్త కాలమే ఉంది అని నిప్పు లాంటి నిజాన్ని వినిపించారు. అంటే, కేవలం నలభై ఐదు నిముషాలు మాత్రమే ఖట్వాంగునికి జీవించే అవకాశం ఉంది. ఖట్వాంగుడు సమస్తాన్ని త్యజించాడు. మనస్సు బ్రహ్మము నందు నిలిపి, ఆ ముహూర్త కాలంలో తరించి పోయాడు.

ఖట్వాంగో నామ రాజర్షిః ముహూర్తే ముక్తి మేయివాన్
విజ్ఞాయ చరమావస్థాం దేవతాభ్యో నృపోత్తమః ॥

తాను కేవలం ముహూర్త కాలము మాత్రమే జీవించే అవకాశం ఉందని దేవతల ద్వారా, జ్ఞానుల ద్వారా తెలుసు కొనిన రాజర్షి ఖట్వాంగుడు ప్రయత్నించి ముక్తిని సాధించాడు. నలభై ఐదు నిముషాల కాలంలో మృత్యు ముఖంలో ప్రవేశించ బోయే ఖట్వాంగుడు తరించి నపుడు, మేము ముసలివాళ్ళ మయ్యాం, తరిస్తామో లేదో! అని వృద్ధులు చింతించడం హాస్యాస్పదం కాదా?

ఏది కనిపిస్తే దాని వెంట పరుగు లెత్తకుండా, ఏది వినిపిస్తే దాని కొరకు వెంపర్లాడ కుండా, ఆశా పిశాచాన్ని మనస్సు నుండి దూరం చేసుకొని, ధన జన మమకార వ్యామోహాల నుండి బయటపడి, దృఢమైన

మనస్సుతో, ఆచార్యదేవుని అడుగుజాడలలో అకుంఠిత విశ్వాసంతో చరించే వారు జ్ఞానాన్ని పొంది తరించడానికి వయస్సు అవరోధం కాదు. అనారోగ్యం ప్రతిబంధకమూ కాదు. వివేక విచారాలకు నోచుకోని మనస్సు, సందేహాలకు నిలయమైన బుద్ధి, విశ్వాసం లేని చిత్తము, శ్రేష్ఠులను అర్థం చేసుకోలేని అహంకారము - ఇవే జ్ఞానానికి అడ్డుగోడలు. అవరోధాలు.

వేదము ఒక మహారణ్యము. అందులో ఏది ఎక్కడుందో నిరంతరము అందులో నిమగ్నమై ఉన్న వారికే అర్థం కాదు. అలాంటి వేద విజ్ఞానాన్ని కాచి, వడబోసి, సారాన్ని తీసి గీతామృతంగా భగవంతుడు మానవాళికి ప్రసాదించాడు. మరణకాలంలో అయినా జ్ఞానాన్ని పొందే అవకాశం ఉందని, ప్రతి మానవ హృదయంలో కొండంత విశ్వాసాన్ని నింపి సాంఖ్యాన్ని ముగిస్తున్నాడు గీతాచార్యుడు.

మరణానికి ఎవ్వరూ భీతి చెందాల్సిన అవసరం లేదు. గీతామృతం మన వద్ద ఉంది. ఇక మరణ మెక్కడుంది? భగవంతుడు అందరినీ కనికరిస్తాడు. జ్ఞానము అందరినీ ఆశీర్వదిస్తుంది.

వికారి నైనా బికారి నైనా
ఈసడించదు దర్పణము
పేదనైనా పామరునైనా
పారద్రోలదు దైవము
జ్ఞానమె మనిషికి శరణము
తెలియని నాడే మరణము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

ముముక్షువులకు మోక్ష మార్గంలో దారి బత్తెంగా ఇదొక రామజోగి చిట్కా.

జ్ఞానమే ప్రధానం కనుక మరణశయ్యపై ఉన్న వారు కూడా తరిస్తారు. వృద్ధులైనా తరిస్తారు. రోగులైనా తరిస్తారు. జ్ఞానము బుద్ధికి అందేదే కనుక, ఏ జాతి వారైనా తరిస్తారు. ఏ మతం వారైనా తరిస్తారు. లింగభేదం లేదు. వర్ణభేదం లేదు. శ్రద్ధ ఒక్కటి ఉంటే చాలు. అంతా అభేదమే. అద్వైత జ్ఞానమే.

ఈ సందర్భంలో రెండవ అధ్యాయానికి భాష్యాన్ని సమాప్తం చేస్తూ, చివరి వాక్యాన్ని అద్భుతంగా పలికి ఆశీర్వదిస్తారు పూజ్యపాదులు శ్రీ శంకరాచార్యస్వామి.

కిము వక్తవ్యం బ్రహ్మచర్యాదేవ సంన్యస్య యావజ్జీవం యో బ్రహ్మణి ఏవ అవతిష్ఠతే స బ్రహ్మనిర్వాణం ఋచ్ఛతీతి?

మరణ సమయంలో ఉన్నవాడే తరించే టప్పుడు బ్రహ్మచర్యాశ్రమము నుండే సన్యాసమును స్వీకరించి, జీవిత మంతా బ్రహ్మ విచారము నందే ఉన్నవాడు మోక్షాన్ని తప్పక పొందుతాడు అని ప్రత్యేకంగా చెప్పాలా? అని చివరి మాట పలికారు. మహాత్ముల మాటే శ్రీరామరక్ష.

జై జై శ్రీ శంకర గురుదేవ!

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
సాంఖ్యయోగో నామ ద్వితీయోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు సాంఖ్యయోగము అనే రెండవ అధ్యాయము.

చైతన్య భగవద్గీత

అథ తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయము

కర్మయోగః - కర్మయోగము

కొండ అద్దమందు కొంచెమై ఉండదా? అన్నట్లు, వేదాంత సారమంతా, ముఖ్యంగా భగవద్గీత కేంద్ర విషయ మంతా రెండవ అధ్యాయం - సాంఖ్యయోగంలో అద్భుతంగా ప్రవచింప బడింది. గీతాచార్యుడు ప్రబోధించిన ఆత్మ తత్త్వం అర్జునుడికి ఎంతో తృప్తి నిచ్చింది. ఊరట నిచ్చింది. ఆనందాన్ని పంచింది. కాని కర్మ విషయమే కాస్త ఇబ్బంది పెడుతోంది.

ఏది శ్రేయస్సో దానిని నిశ్చయించి చెప్పమని అర్థించాడు అర్జునుడు. తనకు కావలసింది మోక్షమే అనే విషయం కూడా సుస్పష్టం అయింది. మోక్షము అనేది ఉన్నదే కనుక, దానికి సంబంధించిన జ్ఞానం కలగాలి. అంతే. అదే ఆత్మజ్ఞానం. అదే సాంఖ్యం (**శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభిధీయతే**).

ఆత్మ సత్యము. ఆత్మ జ్ఞానము. ఆత్మ అనంతము. అట్టి ఆత్మకు సంబంధించిన జ్ఞానమే ఆత్మ జ్ఞానము. ఆత్మ జ్ఞానము కలిగిన వాడు తానే ఆత్మ అని తెలుసు కుంటాడు. ఆత్మయే బ్రహ్మము అని గ్రహిస్తాడు. ఇదే మోక్షము. కనుక జ్ఞానము వల్లనే మోక్షము సిద్ధిస్తుంది అనేది వేదాంత తాత్పర్యము. భగవద్గీత కూడా ఈ విషయాన్నే ధ్రువ పరచింది (**తస్మాత్ కేవలాదేవ జ్ఞానాత్ మోక్షః ఇతి ఏషః అర్థః నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ**).

ఆత్మతత్త్వాన్ని రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకం నుండి ముప్పైయవ శ్లోకం వరకు అద్భుతంగా ప్రవచించాడు గీతాచార్యుడు. అర్జునుని ప్రశ్నను ఆధారం చేసుకొని ఆత్మవిదుని వైభవాన్ని కూడా స్థితప్రజ్ఞ లక్షణాలలో వివరించాడు. ఇదంతా అర్జునుడికి చాలా ఓదార్పును, సంతృప్తిని కలిగించింది.

తనకు కావలసింది మోక్షం. మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలగాలి అంటే శ్రవణం చేయాలి. **సన్న్యస్య శ్రవణం కుర్యాత్.** సన్యసించి శ్రవణం చేయాలి అనే విషయం కూడా ప్రసిద్ధమే. మరి, సన్యాసాన్ని ప్రోత్సహించకుండా, అర్జునా! నువ్వు యుద్ధం చెయ్యి అని, జ్ఞాన బోధానంతరం కూడా శ్రీకృష్ణుడు చెప్పడం అర్జునుడికి మ్రింగుడు పడని విషయంగా తయారైంది.

మాతే సంగోఽస్త్వ కర్మణి - అర్జునా! కర్మను మానేయాలి అనుకోకు (2 - 47).

యోగస్థః కురు కర్మాణి - యోగస్థుడవై కర్మలను ఆచరించు (2 - 48).

ఉత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః - అర్జునా! లే! యుద్ధానికి సిద్ధపడు (2 - 37).

యోగాయ యుజ్యస్వ - కర్మయోగానికి ప్రయత్నం చెయ్యి (2 - 50).

సవ్యసాచి సందేహం

ఇంతకీ గీతాచార్యుడు ప్రబోధించేది జ్ఞానమా? లేక కర్మాచరణమా? జ్ఞాన మార్గంలో చరిస్తే మోక్షం సిద్ధిస్తుంది. కర్మ చేస్తే కర్మఫలం వస్తుంది. అంతేగాని మోక్షం రాదు. మోక్ష మనేది కర్మఫలం కాదు. ఇకపోతే, శ్రీకృష్ణుడు బోధించిన కర్మయోగము కూడా అంతఃకరణ శుద్ధిని కలిగిస్తుందే గాని మోక్షాన్ని ప్రసాదించ లేదు. అలాంటప్పుడు, రాజమార్గం లాగా జ్ఞానమార్గం ఉండగా, మోక్షాన్ని ప్రసాదించ లేని కర్మాచరణ వైపు తనను

మనస్సుతో, ఆచార్యదేవుని అడుగుజాడలలో అకుంఠిత విశ్వాసంతో చరించే వారు జ్ఞానాన్ని పొంది తరించడానికి వయస్సు అవరోధం కాదు. అనారోగ్యం ప్రతిబంధకమూ కాదు. వివేక విచారాలకు నోచుకోని మనస్సు, సందేహాలకు నిలయమైన బుద్ధి, విశ్వాసం లేని చిత్తము, శ్రేష్ఠులను అర్థం చేసుకోలేని అహంకారము - ఇవే జ్ఞానానికి అడ్డుగోడలు. అవరోధాలు.

వేదము ఒక మహారణ్యము. అందులో ఏది ఎక్కడుందో నిరంతరము అందులో నిమగ్నమై ఉన్న వారికే అర్థం కాదు. అలాంటి వేద విజ్ఞానాన్ని కాచి, వడబోసి, సారాన్ని తీసి గీతామృతంగా భగవంతుడు మానవాళికి ప్రసాదించాడు. మరణకాలంలో అయినా జ్ఞానాన్ని పొందే అవకాశం ఉందని, ప్రతి మానవ హృదయంలో కొండంత విశ్వాసాన్ని నింపి సాంఖ్యాన్ని ముగిస్తున్నాడు గీతాచార్యుడు.

మరణానికి ఎవ్వరూ భీతి చెందాల్సిన అవసరం లేదు. గీతామృతం మన వద్ద ఉంది. ఇక మరణ మెక్కడుంది? భగవంతుడు అందరినీ కనికరిస్తాడు. జ్ఞానము అందరినీ ఆశీర్వదిస్తుంది.

వికారి నైనా బికారి నైనా
ఈసడించదు దర్పణము
పేదనైనా పామరునైనా
పారద్రోలదు దైవము
జ్ఞానమె మనిషికి శరణము
తెలియని నాడే మరణము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

ముముక్షువులకు మోక్ష మార్గంలో దారి బత్తెంగా ఇదొక రామజోగి చిట్కా.

జ్ఞానమే ప్రధానం కనుక మరణశయ్యపై ఉన్న వారు కూడా తరిస్తారు. వృద్ధులైనా తరిస్తారు. రోగులైనా తరిస్తారు. జ్ఞానము బుద్ధికి అందేదే కనుక, ఏ జాతి వారైనా తరిస్తారు. ఏ మతం వారైనా తరిస్తారు. లింగభేదం లేదు. వర్ణభేదం లేదు. శ్రద్ధ ఒక్కటి ఉంటే చాలు. అంతా అభేదమే. అద్వైత జ్ఞానమే.

ఈ సందర్భంలో రెండవ అధ్యాయానికి భాష్యాన్ని సమాప్తం చేస్తూ, చివరి వాక్యాన్ని అద్భుతంగా పలికి ఆశీర్వదిస్తారు పూజ్యపాదులు శ్రీ శంకరాచార్యస్వామి.

కిము వక్తవ్యం బ్రహ్మచర్యాదేవ సంన్యస్య యావజ్జీవం యో బ్రహ్మణి ఏవ అవతిష్ఠతే స బ్రహ్మనిర్వాణం ఋచ్ఛతీతి?

మరణ సమయంలో ఉన్నవాడే తరించే టప్పుడు బ్రహ్మచర్యాశ్రమము నుండే సన్యాసమును స్వీకరించి, జీవిత మంతా బ్రహ్మ విచారము నందే ఉన్నవాడు మోక్షాన్ని తప్పక పొందుతాడు అని ప్రత్యేకంగా చెప్పాలా? అని చివరి మాట పలికారు. మహాత్ముల మాటే శ్రీరామరక్ష.

జై జై శ్రీ శంకర గురుదేవ!

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
సాంఖ్యయోగో నామ ద్వితీయోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు సాంఖ్యయోగము అనే రెండవ అధ్యాయము.

చైతన్య భగవద్గీత

అథ తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయము

కర్మయోగః - కర్మయోగము

కొండ అద్దమందు కొంచెమై ఉండదా? అప్పట్లు, వేదాంత సారమంతా, ముఖ్యంగా భగవద్గీత కేంద్ర విషయ మంతా రెండవ అధ్యాయం - సాంఖ్యయోగంలో అద్భుతంగా ప్రవచింప బడింది. గీతాచార్యుడు ప్రబోధించిన ఆత్మ తత్త్వం అర్జునుడికి ఎంతో తృప్తి నిచ్చింది. ఊరట నిచ్చింది. ఆనందాన్ని పంచింది. కాని కర్మ విషయమే కాస్త ఇబ్బంది పెడుతోంది.

ఏది శ్రేయస్సో దానిని నిశ్చయించి చెప్పమని అర్థించాడు అర్జునుడు. తనకు కావలసింది మోక్షమే అనే విషయం కూడా సుస్పష్టం అయింది. మోక్షము అనేది ఉన్నదే కనుక, దానికి సంబంధించిన జ్ఞానం కలగాలి. అంతే. అదే ఆత్మజ్ఞానం. అదే సాంఖ్యం (***శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యభిధీయతే***).

ఆత్మ సత్యము. ఆత్మ జ్ఞానము. ఆత్మ అనంతము. అట్టి ఆత్మకు సంబంధించిన జ్ఞానమే ఆత్మ జ్ఞానము. ఆత్మ జ్ఞానము కలిగిన వాడు తానే ఆత్మ అని తెలుసు కుంటాడు. ఆత్మయే బ్రహ్మము అని గ్రహిస్తాడు. ఇదే మోక్షము. కనుక జ్ఞానము వల్లనే మోక్షము సిద్ధిస్తుంది అనేది వేదాంత తాత్పర్యము. భగవద్గీత కూడా ఈ విషయాన్నే ధ్రువ పరచింది (***తస్మాత్ కేవలాదేవ జ్ఞానాత్ మోక్షః ఇతి ఏషః అర్థః నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ***).

ఆత్మతత్త్వాన్ని రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకం నుండి ముప్పైయవ శ్లోకం వరకు అద్భుతంగా ప్రవచించాడు గీతాచార్యుడు. అర్జునుని ప్రశ్నను ఆధారం చేసుకొని ఆత్మవిదుని వైభవాన్ని కూడా స్థితప్రజ్ఞ లక్షణాలలో వివరించాడు. ఇదంతా అర్జునుడికి చాలా ఓదార్పును, సంతృప్తిని కలిగించింది.

తనకు కావలసింది మోక్షం. మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలగాలి అంటే శ్రవణం చేయాలి. ***సన్న్యస్య శ్రవణం కుర్యాత్.*** సన్యసించి శ్రవణం చేయాలి అనే విషయం కూడా ప్రసిద్ధమే. మరి, సన్యాసాన్ని ప్రోత్సహించకుండా, అర్జునా! నువ్వు యుద్ధం చెయ్యి అని, జ్ఞాన బోధానంతరం కూడా శ్రీకృష్ణుడు చెప్పడం అర్జునుడికి మింగుడు పడని విషయంగా తయారైంది.

మాతే సంగోఽస్త్వ కర్మణి - అర్జునా! కర్మను మానేయాలి అనుకోకు (2 - 47).

యోగస్థః కురు కర్మాణి - యోగస్థుడవై కర్మలను ఆచరించు (2 - 48).

ఉత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః - అర్జునా! లే! యుద్ధానికి సిద్ధపడు (2 - 37).

యోగాయ యుజ్యస్వ - కర్మయోగానికి ప్రయత్నం చెయ్యి (2 - 50).

సవ్యసాచి సందేహం

ఇంతకీ గీతాచార్యుడు ప్రబోధించేది జ్ఞానమా? లేక కర్మాచరణమా? జ్ఞాన మార్గంలో చరిస్తే మోక్షం సిద్ధిస్తుంది. కర్మ చేస్తే కర్మఫలం వస్తుంది. అంతేగాని మోక్షం రాదు. మోక్ష మనేది కర్మఫలం కాదు. ఇకపోతే, శ్రీకృష్ణుడు బోధించిన కర్మయోగము కూడా అంతఃకరణ శుద్ధిని కలిగిస్తుందే గాని మోక్షాన్ని ప్రసాదించ లేదు. అలాంటప్పుడు, రాజమార్గం లాగా జ్ఞానమార్గం ఉండగా, మోక్షాన్ని ప్రసాదించ లేని కర్మాచరణ వైపు తనను

శ్రీకృష్ణుడు ఎందుకు మళ్ళిస్తున్నాడు? అనేది అర్జునుని సందేహం. ఈ సందేహమే అర్జునుని కలవర పెడుతోంది.

స్థితప్రజ్ఞ వైభవ వర్ణనములో ప్రథమ శ్లోకం లోనే **ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్** - అర్జునా! మనస్సులో కలిగే సమస్తమైన కోరికలను ఎవడైతే త్యజిస్తాడో వాడే స్థితప్రజ్ఞుడు అని చెప్పాడు కదా! మరి కోరికల్ని విడవడ మంటే, కర్మల్ని విడిచి పెట్టడం కాదా?

అసలు కోరికే లేకపోతే కర్మకు అవకాశం ఎక్కడుంది? కోరికలు ఉన్నవాడే వాటిని తీర్చుకోవడానికి కర్మలు చేస్తాడు (**కామాయ మానవ్య కరోతి కర్మాణి** - ఉపనిషత్ భాష్యం). ఏదో సాధించాలి అనే కదా మనిషి కర్మ చేస్తాడు? మరి కర్మ ద్వారా ఏది సాధించినా అది మోక్షం మాత్రం కాదు. అలాంటప్పుడు జ్ఞాననిష్ఠకు సంబంధించిన సన్యాసమే శ్రేయోదాయకం. మరి ఈ కర్మల వైపు నన్నెందుకు శ్రీకృష్ణుడు పురికొల్పుతున్నాడు? అని సందేహిస్తున్నాడు అర్జునుడు.

యద్భావేత్ తమావ సేత్ అనే న్యాయాన్ని బట్టి, ఎవరు దేనిని వాంఛిస్తారో, వారు దాని యందే నిమగ్నమై ఉంటారు. ఎవరికి ఏది ఇష్టమో, దాని చుట్టే వారి మనస్సు తిరుగుతూ ఉంటుంది. అర్జునుడికి మమకారం వల్ల యుద్ధం రుచించ లేదు. సన్యాసానికి మనస్సు సిద్ధ పడుతోంది. అందుకు అనుకూలంగా జ్ఞానమార్గం ఉంది. దాని వైపే ఆయన మనస్సు మొగ్గు చూపుతోంది. కర్మలను విడిచి పెట్టడానికి సిద్ధంగా ఉంది.

నిజమే. కాని, కర్మలను విడిచి నంత మాత్రాన జ్ఞానము ప్రాప్తిస్తుందా? ఆత్మజ్ఞానం కలగాలి అంటే, అంతఃకరణశుద్ధి ఉండాలి. కర్మలను పరే త్యజిస్తాడు. మరి జ్ఞానాన్ని పొందడానికి అవసరమైన చిత్తశుద్ధి ఏది? కర్మలను విడిస్తే చిత్తశుద్ధి వస్తుందా? అసలు కర్మల్ని త్యజించడం అంత సులభమైన విషయ మేనా?

కర్మ అనివార్యం

కర్మను వదిలించు కోవడం అంత తేలికైన పని కాదు. శక్తి ఉన్నా లేకపోయినా, వయస్సు ఉండినా, మళ్ళినా, ఆరోగ్యమున్నా క్షీణించినా మనిషి కర్మ చేయక తప్పదు. నాకు శక్తి లేదు. నేను కర్మ చేయలేను అని నువ్వు చెప్పొచ్చు. శక్తి లేదని భోం చేయకుండా ఉండ గలవా? శక్తి రావాలంటే భోంచేసి తీరాలి. అదీ కర్మే.

వయస్సు పైబడింది. నేను పని చేయలేను అంటారు వృద్ధులు. నిజమే. ఏమీ చేయక పోయినా, కర్ర పట్టుకొని లేస్తున్నావా, లేదా? లేవడమే కాదు, కర్ర పట్టుకోవడం కూడా కర్మే. కర్ర పట్టుకోవడమే కాదు, కర్ర పట్టుకోవాలి అని అనుకోవడం కూడా కర్మే.

చిన్నపిల్లలు ఏమీ చేయకుండా ఊయలలో పడుకొని ఉన్నా, వారు కూడా కర్మ చేస్తున్న వారే. కాళ్ళు ఆడించడం కర్మ. చూడటం కర్మ. నవ్వడం కర్మ. ఏడవడం కర్మ. ఏది కర్మ కాదు?

ఆరోగ్య ముంటే విందు లారగిస్తావు. ఆరోగ్యం లేకపోతే, విందుకు దూర మవుతావు. విందు మానినా మందు తినడం మానలేవు కదా! అది కూడా కర్మే.

కర్మ ఎవరినీ వదలదు. అందరూ కర్మలు చేయాలి. చేశారు. చేస్తున్నారు. శ్రీరాముడు చేశాడు. శ్రీశంకరాచార్య స్వామి చేశారు. శ్రీకృష్ణుడూ చేశాడు. గీతను బోధించడం కర్మ కాదా? మురళిని వాయించడం కర్మ కాదా?

అన్నీ కర్మలే. ఆడటం కర్మ. ఆడించడం కర్మ. పాడటం కర్మ. పాడించడం కర్మ. ఆదుకోవడం కర్మ. గుండె బాదుకోవడం కర్మ. కర్మ కాని దేముంది? కర్మ చేయని వారు ఎవరున్నారు?

ఇక్కడ మనం గమనించ వలసిన అతి ప్రధానమైన విషయం ఒకటి ఉంది. పరిమిత మైనది ఏదైనా,

ఎవరైనా, పని చేయక తప్పదు. తప్పక పని చేయ వలసిందే. ఎందుకని? పరిమితంగా ఉండటమే దుర్భరం కనుక. విశ్వమంతా ఆ కోణం లోనే నడుస్తూ ఉంది.

ప్రపంచాన్ని పరిశీలించి చూస్తే, సూర్యోదయం నుండి ప్రాణులే కాకుండా ప్రకృతి కూడా కర్మ వలయంలో పడి పరిభ్రమిస్తూనే ఉంది. సృష్టిలో ఎక్కడా బద్ధక మనేది కన్పించడం లేదు, మనోబుద్ధులున్న మనిషిలో తప్ప.

విశ్వమే కర్మ వలయంలో చిక్కి ప్రవర్తించే టప్పుడు, విశ్వధర్మాలకు వేరుగా, విలక్షణంగా వ్యక్తి ప్రవర్తించ గలడా? కర్మ నుండి విడిపడి అకర్మలో ఉండ గలడా? వ్యక్తి విశ్వానికి వేరుగా లేడు. విశ్వం వ్యక్తికి వేరుగా లేదు.

విశ్వము చాలా విశాల మైనదే కావచ్చు. విశాలమైన విశ్వాన్ని గూర్చి ఆలోచించే బుద్ధి గల మానవుడు విశ్వమంతటి వాడు కాక పోవచ్చు. కాని, విశ్వాన్నంతా తనలో ఇముడ్చుకొనే శక్తి కలిగిన వాడు. ఈ విషయాలన్నీ మున్ముందు గీతలో మనం ఆశ్చర్యంగా చూడబోతాము.

చలించే గుణం గాలికి ఉంది. గాలికి దూరమై వ్యక్తి జీవించ లేడు. చలించే గాలి నీలో ఉన్నా, అది చలిస్తూ ఉంటుందే గాని, దుప్పటి కప్పుకొని పడుకోదు. ఒకవేళ మనిషి దుప్పటి కప్పుకొని పడుకున్నా, లేదా నిద్రించినా, అతనిలో గాలి మేలుకొని కదులుతూ ఉంది కనుకనే అతడు దుప్పటి తొలగించుకొని మళ్ళీ లేవగలుగు తున్నాడు. వాయుదేవుడు సదా కర్మ లోనే ఉన్నాడు.

చలించే గుణం జలానికి ఉంది. చలించడం ద్రవ లక్షణం. ప్రపంచంలో చలించే జలమే మన దేహంలో కూడా చలిస్తూ ఉంది. దేహానికి రూపాన్నిచ్చే జల భూతము, దేహంలో ఉండి రక్తాన్ని ప్రసరింప చేస్తూ ఉంది. లేకపోతే, జీవనమే సాధ్యం కాదు. అదంతా కర్మే. వరుణుడు నిరంతరము కర్మ లోనే ఉన్నాడు. ఇలా ఎంతైనా చెప్పుకుంటూ పోవచ్చు. ఈ ప్రపంచంలో కర్మ లేని దెక్కడ?

భూమి తిరుగుతూ ఉంది. అదీ కర్మే. తిరిగే భూమి మీద ఉన్న వాళ్ళు తిరగకుండా ఎలా ఉంటారు? నేను తిరగడం లేదు అని అనుకున్నా, వాస్తవానికి తిరుగుతున్న వాళ్ళే. ఇక కర్మశూన్యత ఎక్కడుంది? కర్మ ఏమిటో అర్థం కాకపోవడం చేత, మనిషిని కర్మశూన్యత ఆకర్షిస్తూ ఉంది.

ఏదీ చేయనంత మాత్రాన అది కర్మశూన్యత కాదు. మాట్లాడకుండా మనిషి ఉండొచ్చు. ఆలోచించ కుండా ఉండగలడా? శ్వాసించకుండా ఉండగలడా? ఆ రెండు కూడా ఆగిపోతే, ఆ తరువాత కర్మ చేయకుండా ఉండటానికి ఇక ఉన్న దెవరు? అసలు దేహాన్ని ధరించడమే కర్మ. దేహాన్ని ధరించ డానికి కారణం కర్మ. దేహము కొంత కాలం ఈ ప్రపంచంలో మనుగడను సాగించడానికి కారణం కర్మ. దేహం రాలి పోవడానికి కూడా కారణం కర్మే. కర్మ తోనే పుట్టిన దేహం కర్మ తోనే పెరుగుతుంది. కర్మ తోనే పెరిగిన దేహం కర్మ తోనే తరుగుతుంది. కర్మ తోనే తరిగిన దేహం కర్మ కారణం గానే నశించి పోతుంది. నశించిన తరువాత కూడా కర్మ ప్రభావం చేతనే పంచభూతాలలో విలీనమై పోతుంది. అంతా కర్మే.

అనివార్యం - అనర్థం

కర్మ మనిషిని బంధిస్తుంది అని ముందే చెప్పుకున్నాం. విషయాసక్తి ఉండబట్టే కర్మలు చేస్తున్నాం. కర్మ చేయడానికి ఏ ధర్మాలైతే ఈ ప్రపంచంలో మనకు అనుకూలిస్తున్నాయో, అవే ధర్మాలు ఆయా కర్మలకు సంబంధించిన ఫలాలు మనకు అంద డానికి కారణమై ఉన్నాయి.

ఆసక్తితో కర్మను చేస్తాము. ఫలితాన్ని అనుభవిస్తాం. ఫలానుభూతి మనస్సుపై ప్రగాఢమైన ముద్రను వేస్తుంది. అదే వాసన, లేదా సంస్కారము.

కర్మలలో ఎవ్వరికీ ఆసక్తి లేదు. కర్మఫలాల యందే ఆసక్తి ఉంది. అవి తృప్తి నిస్తాయనే ఆశ ఉంది. వాటి వల్ల నిత్యతృప్తి కలుగుతుందనే భ్రాంతి ఉంది (**తృప్తః భవిష్యామి**). ఏ కర్మ అయినా దేశకాలాదుల చేత, వ్యక్తి సామర్థ్యం చేత పరిమితంగా ఉంటుంది. పరిమితమైన కర్మలు పరిమితమైన కర్మఫలాలను సృష్టిస్తాయి. నిత్యతృప్తిని అందించ లేవు.

కృతస్య క్షయిత్వాత్. సృష్టింప బడేది ఏదైనా నశించేదే అంటారు బృహదారణ్య కోపనిష ద్భాష్యంలో శ్రీశంకరాచార్య స్వామి.

కర్మలు చేస్తాం. కర్మఫలాలను అందుకుంటాం. వాటి వల్ల మనకు తాత్కాలికమైన సుఖం కలుగుతుంది. ఆ తరువాత ఫలితం నశించి పోతుంది. ఆ ఫలితం వల్ల కలిగే సుఖం కూడా గతించి పోతుంది. సుఖం గతించినా, ఆ సుఖానుభవం వల్ల మనస్సులో ఏర్పడిన సంస్కారము, లేదా వాసన నశించదు. మనస్సును అంటి పెట్టుకొనే ఉంటుంది. అలాంటి అనుభూతిని తిరిగి పొందాలి అనే వాంఛను రెచ్చ గొడుతూనే ఉంటుంది. ఇదే మనస్సులో ఆవేదన. ఆందోళన.

ఆవేదనతో అంతఃకరణ ఆనందంగా ఉండ లేదు. మనస్సు ఆ వాంఛను తీర్చు కొనేందుకు ప్రయత్నిస్తుంది. కర్మ చేస్తుంది. ఫలాన్ని అనుభవిస్తుంది. మళ్ళీ భోగానుభవ సంస్కారాన్ని తయారు చేసుకుంటుంది. అది మళ్ళీ ప్రేరేపించి కర్మను చేయిస్తుంది. ఈ విధంగా కర్మ సుడిగుండం తయా రవుతుంది.

కర్మ - కర్మఫలం - భోగానుభవం - వాసన, మళ్ళీ వాసనా ప్రేరిత కర్మ - కర్మఫలం - భోగానుభవం - వాసన, లేదా సంస్కారము. ఇలా కర్మచక్రం తిరుగుతూ ఉంటుంది. ఒక దశలో మనం కర్మ సముద్రంలో పడి ఉన్నాము అని అర్థ మవుతుంది. ఈ విధంగా కర్మలు జన్మలకు కారణ మవుతాయే గాని, మోక్ష హేతువులు కాలేవు.

మరి కర్మల వల్ల మోక్షము లభ్యం కానపుడు కర్మలు చేయడం దేనికి? కర్మల నుండి సంపూర్ణంగా విడిపడి పోవచ్చు కదా? అర్జునుని ఆంతర్యం కూడా ఇదే. మంచిదే. కాని, కర్మల నుండి విడిపడటం సాధ్య మేనా?

న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మా ణ్యశేషతః

అర్జునా! శరీరం ఉన్నంత వరకు కర్మలను పూర్ణంగా త్యజించడం ఎవ్వరికీ సాధ్య పడదు అని సాక్షాత్తు గీతాచార్యుడే పద్దెనిమిదవ అధ్యాయంలో చెబుతాడు. ముఖ్యంగా ఈ మూడవ అధ్యాయం లోనే ఆ విషయాన్ని విపులంగా చర్చిస్తాడు కూడా.

దేహము ఉన్నంత వరకు కర్మ చేయకుండా ఉండ లేము. ఏ కర్మ చేసినా అది బంధహేతువే గాని మోక్ష హేతువు కాదు. **కర్మ అనివార్యం - ఆచరిస్తే అనర్థం.** ఇది సర్వ మానవాళి సమస్య.

తరుణోపాయం

కర్మ చేయకుండా ఉండటం సాధ్యం కాదు (**అనివార్యం**). చేసి సాధించేది మాత్రం కర్మఫలమే. బంధమే (**అనర్థం**). దీనికి ఉపాయం ఏమిటో ఆలోచించాలి. మొదటి అధ్యాయాంతంలో 'యోగ' శబ్దార్థాన్ని మనము విపులంగా చెప్పుకున్నాం. అక్కడ 'యోగము' అనే పదానికి మనం చూచిన అర్థాలలో, 'సంగతి' అనే అర్థానికి పీట వేశాం. యోగానికి 'ఉపాయం' అనే మరొక అర్థాన్ని కూడా చెప్పుకున్నాం. ఇక్కడ, ఈ సందర్భంలో అదే సమన్వయం. ఏ ఉపాయాన్ని అనుసరించి ఆచరిస్తే కర్మ బంధహేతువు కాదో, పైగా

మోక్షసాధన మవుతుందో, ఆ ఉపాయమే కర్మయోగము. మూడవ అధ్యాయం లోని సారభూతమైన విషయము. అర్జునుని సందేహంతో ఈ అధ్యాయం ప్రారంభ మవుతూ ఉంది.

అర్జున ఉవాచ :

జ్యాయసీ చే త్కర్మణ స్తే మతా బుద్ధి ర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ 1

జ్యాయసీ-చేత్-కర్మణః-తే-మతా-బుద్ధిః-జనార్దన
తత్-కిం-కర్మణి-ఘోరే-మాం-నియోజయసి-కేశవ

జనార్దన	= కృష్ణా!	కేశవ	= కృష్ణా!
బుద్ధిః	= జ్ఞానము	తత్	= అప్పుడు
కర్మణః	= కర్మ కంటె	ఘోరే	= భయంకరమైన
జ్యాయసీ	= శ్రేష్ఠ మైనది	కర్మణి	= కర్మ యందు
తే	= నీ యొక్క	మాం	= నన్ను
మతా చేత్	= అభిప్రాయమైతే	కిం నియోజయసి	= ఎందుకు నియోగిస్తున్నావు?

అర్జునుడు అడుగుతున్నాడు :

జనార్దనా! కర్మ కంటే జ్ఞానం శ్రేష్ఠ మని నీ అభిప్రాయమా? అదే అయితే, కృష్ణా! భయంకరమైన కర్మల లోకి నన్ను ఎందుకు దించుతున్నావు?

వ్యాఖ్య

ప్రశ్న ఎందుకు?

రెండవ అధ్యాయంలో హేతు, ఫల భూతమైన బుద్ధిద్వయం పరమేశ్వరుని చేత ప్రతిపాదించ బడింది. మొదటిది యోగబుద్ధి, అంటే కర్మయోగ బుద్ధి. రెండవది సాంఖ్యబుద్ధి, అంటే జ్ఞానయోగ బుద్ధి.

కర్మయోగబుద్ధి సాధనము. కనుక హేతుభూతము. జ్ఞానయోగబుద్ధి సాధ్యము. కనుక ఫల రూపము. ఈ రెండిటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించాలి. లేకపోతే, అనేక సంశయాలు తలెత్తుతాయి. ప్రస్తుతం పార్థుని ప్రశ్నకు కూడా ఇదే కారణము.

రెండవ అధ్యాయంలో సాంఖ్యబుద్ధిని అనుసరించి జ్ఞాననిష్ఠను బోధించాడు భగవంతుడు. ***ఏషా తే౽భిహితా సాంఖ్యే బుద్ధిః*** - ఆత్మజ్ఞాన విషయంలో ప్రతిపాదింప బడిన సాంఖ్యము నీకు చెప్పబడింది. అలాగే ***యోగే త్విమాం శృణు*** - ఏ ఉపాయంతో కర్మబంధము నుండి విడిపడ గలవో అట్టి కర్మయోగ బుద్ధిని విను అంటూ కర్మయోగాన్ని గూర్చి కూడా ప్రసంగించాడు. ఇంతవరకు ఏ సంశయానికి అవకాశం లేదు.

కాకపోతే, నలభై తొమ్మిదవ శ్లోకంలో ***దూరేణ హి అవరం కర్మ బుద్ధి యోగాత్*** - బుద్ధియోగం కంటే కర్మ నికృష్ట మైనది అని భగవంతుడు తెలిపాడు. ఇక్కడ బుద్ధియోగము అంటే కర్మయోగము. కర్మ అంటే ఫలాపేక్షతో కూడిన సకామకర్మ అని అర్థం. ఈ సందర్భంలో బుద్ధి అనే పదాన్ని సాంఖ్యబుద్ధిగా అర్జునుడు అర్థం చేసుకున్నాడు. పైగా, ***బుద్ధౌ శరణ మన్విచ్ఛ*** -'నువ్వు బుద్ధినే ఆశ్రయించు' అని అదే శ్లోకంలో చెప్పడం వల్ల, సాంఖ్యము కంటే కర్మ నికృష్టము కనుక సాంఖ్యమునే ఆశ్రయించ మని శ్రీకృష్ణుడు చెప్పినట్లు అర్జునుడు పొరపాటు పడ్డాడు.

అలా పొరపడ్డా నేమో అనే సంశయం కూడా అర్జునునికి లేక పోలేదు. ఈ విషయాన్ని రెండవ శ్లోకానికి వ్యాఖ్యానములో చెబుతాను.

అర్జునుని అవగాహన అలా ఉంది. అదలా ఉంచండి. **మాతే సంగోస్త్వ కర్మణి** - అర్జునా! కర్మలను విడిచి పెట్టకు. **యోగస్థః కురు కర్మాణి** - యోగస్థుడవై కర్మలను ఆచరించు అనే వాక్యాలు భగవంతుడు కర్మను ప్రతిపాదిస్తున్నా డని తెలుస్తూ ఉంది. అలాగే, డెబ్బైయ్యవ శ్లోకంలో జ్ఞానియే పూర్ణశాంతిని పొందుతాడు కాని కోరికలను కోరే కామి పొంద లేడు (***న కామ కామీ***) అని జ్ఞానాన్ని ప్రశంసించడం జరిగింది. సకామ కర్మను నిరసించడం కూడా జరిగింది. అంతకంటే ప్రధానంగా,

బుద్ధి యుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే

సమత్వ బుద్ధి గలవాడు పాపపుణ్యాలు రెండిటిని ఈ లోకము లోనే విడిచి పెట్టేస్తున్నాడు అని యాభై య్యవ శ్లోకంలో భగవంతుడు బోధించాడు. ఇక్కడ సుకృత, దుష్కృతాలను త్యజించే వాడు స్వరూపంతో సహా (అహంకారమే ఇక్కడ స్వరూపం) త్యజిస్తున్నాడు అని అర్జునుడు భావించాడు.

అర్జునుడు క్రొత్తగా విద్యాభ్యాసం చేసిన వాడు కాడు. వేదంలో ప్రవేశ మున్నవాడే. ఒకవేళ అదే క్రొత్త సమస్యల్ని సృష్టిస్తూ ఉందేమో! ఎందుకంటే, వేదంలో సాధ్య సాధనాలను వివరించే కర్మ విషయం విశేషంగా చర్చింప బడి ఉండవచ్చు. కాని కర్మయోగం విషయంలో గీత వలె స్పష్టంగా లేదు. కర్మయోగము వేదంలో ఉన్నదే అయినా, అది కేవలం భగవంతుడైన శ్రీకృష్ణుని అద్భుత అమోఘ సృష్టి అని నిస్సంకోచంగా చెప్ప వచ్చు. ఈ విధమైన స్పష్టత లోపించడం వల్లనే భగవంతుడు పని గట్టుకొని గీతను బోధించాడు. అర్జునుడు కూడా వేదాన్ని ఆలకించిన వాడే కనుక 'సుకృత దుష్కృతాలను త్యజించాడు' అంటే, కర్తతో సహా అని భావించాడు. ఈ విషయాన్ని బృహస్పతి ప్రవచించి ఉన్నాడు కూడా! అర్జునుడికి తెలిసే ఉండొచ్చు.

త్యజ ధర్మ మధర్మంచ ఉభే సత్యానృతే త్యజ
ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తం త్యజ ॥

ధర్మాధర్మములను రెండిటిని విడిచి పెట్టు. సత్యమును, ఋతమును రెండిటిని త్యజించు. దేని చేత విడిచి పెడుతున్నావో దానిని కూడా విడిచి పెట్టు అని బృహస్పతి వచనం. ***అహం కర్తా అహంకారః*** కనుక, విడిచి పెట్టే అహంకారాన్ని కూడా తుడిచి పెట్టాలని అర్థం చేసుకున్నాడేమో అర్జునుడు!

ఇదీ అర్జునుని సంశయం. ఒక వైపు శ్రీకృష్ణుడు జ్ఞాననిష్ఠను ప్రశంసిస్తున్నాడు. మరొక వైపు కర్మలను ఆచరించ మంటున్నాడు. కర్మ కంటే (***కర్మణః***) జ్ఞానము (***బుద్ధి***) శ్రేష్ఠ మని నీ అభిమత మైతే, కృష్ణా! ఘోర మైన కర్మల లోకి నన్నెందుకు దించు తున్నావు? అని ప్రశ్నిస్తున్నాడు అర్జునుడు. ఈ ప్రశ్నతో మూడవ అధ్యాయం కర్మయోగము ప్రారంభ మవుతూ ఉంది.

ప్రశ్నార్థక మైంది

కర్మ అంటే సకామ కర్మ. బుద్ధియోగము అనేది నిష్కామ కర్మయోగము. బుద్ధియోగము, అంటే నిష్కామ కర్మయోగము కంటే సకామ కర్మ నికృష్ట మని భగవంతుడు బోధించాడు. కాని, జ్ఞానము కంటే నిష్కామ కర్మయోగము నికృష్ట మని అర్జునుడు అర్థం చేసుకున్నాడు. బుద్ధి అంటే కర్మయోగ బుద్ధి అని కనుక అర్జునుడు అర్థం చేసుకొని ఉంటే, ఘోరమైన ఈ కర్మ లోకి నన్నెందుకు పడదోస్తున్నావు? (***తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి***) అని ప్రశ్నించే వాడు కాడు. ఎందుకంటే, నిష్కామ కర్మయోగము ఘోర మెట్లా అవుతుంది?

ఘోరకర్మ అంటే యుద్ధం అని అర్జునుని అభిప్రాయము. యుద్ధ మనేది సాధారణమైన కర్మ కాదు. రక్తపాతంతో కూడిన దారుణమైన కర్మ. పైగా, తాను కోరిందేమో మోక్షము. ఇదేమో ఘోరమైన యుద్ధ కర్మ. పైగా ఏ కర్మకు కూడా మోక్షం ఫలం కాలేదని ఒక వైపు తెలుస్తూ ఉంది. ఇవన్నీ గందరగోళాలే. అన్నీ కలిపి ప్రశ్నార్థక మయ్యాయి. అదే పార్థుని ప్రశ్న.

పైగా తానే మరొక మాట కూడా అంటున్నాడు. పరస్పర విరుద్ధమైన వాక్యాలతో నా బుద్ధిని కలత పెట్టేలా ఉన్నావు అని కూడా అనేశాడు. ఈ రెండిటిలో ఏది శ్రేయోమార్గమో దానిని బోధించ మని అడుగుతున్నాడు.

అదే రెండవ శ్లోకం.

వ్యామిశ్రే ణేవ వాక్యేన బుద్ధిం మోహయ సీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయో௨హ మాప్నుయామ్ ॥ 2

వ్యామిశ్రేణ-ఇవ-వాక్యేన-బుద్ధిం-మోహయసి-ఇవ-మే
తత్-ఏకం-వద-నిశ్చిత్య-యేన-శ్రేయః-అహం-ఆప్నుయాం

వ్యామిశ్రేణ ఇవ	= కలిసిపోయి నట్లున్న	శ్రేయః	= శ్రేయస్సును
వాక్యేన	= వాక్యము చేత	ఆప్నుయాం	= పొందగలనో
మే	= నా యొక్క	తత్	= అట్టి
బుద్ధిం	= బుద్ధిని	ఏకం	= ఒక్క దానిని
మోహయసి ఇవ	= మోహింపజేయునట్లు ఉన్నావు	నిశ్చిత్య	= నిశ్చయించి
అహం	= నేను	వద	= చెప్పుము
యేన	= దేని చేత		

కలగా పులగం చేసి నీ మాటలతో నా బుద్ధిని కలవర పెడుతున్నావు. నాకు ఏది శ్రేయస్సు నిస్తుందో ఆ ఒక్క దానినే నిశ్చయంగా చెప్పు.

వ్యాఖ్య

గీతాచార్యుడు పలికిన మాట అర్జునునికి వ్యామిశ్రంగా కనిపిస్తూ ఉంది. వ్యామిశ్రం అంటే సంకీర్ణము, లేదా కలిసి ఉండటము అని అర్థము. పాలు, నీళ్ళు కలిసి ఉండటం వ్యామిశ్రం. ఆ విధంగా శ్రీకృష్ణుని వచనం కలగాపులగం లాగా అగుపిస్తూ ఉంది అంటున్నాడు. వ్యామిశ్రంతో పాటు మోహాన్ని కూడా కలిగించే టట్లు ఉంది అని అంటున్నాడు. ఈ విధమైన రెండు సందేహాలను అర్జునుడు వ్యక్తం చేశాడు. శ్రీకృష్ణుడు పరస్పర విరుద్ధంగా కనిపించే రెండు మార్గాలను సంకీర్ణం చేసి సంభాషించడం వల్లనే ఈ రెండు సంశయాలు ఉత్పన్న మైనట్లు చెబుతున్నాడు. జ్ఞానకర్మ సముచ్చయం వల్లనే ఈ గందరగోళ మంతా తల ఎత్తిందని అర్జునుని అభిప్రాయము (వృత్తికారుని మతమైన సముచ్చయ వాదము గీతకు అంగీకారం కాదు. సమ్మతము కాదు). శ్రీకృష్ణుడు జ్ఞానకర్మలు ఏకమైతేనే శ్రేయస్సు అని చెప్పలేదు. ఈ విషయాన్ని అర్జునుడు కూడా గ్రహించాడని తెలుస్తూ ఉంది. లేకపోతే, రెండిటిలో ఏది నాకు శ్రేయస్సో, ఆ ఒక్క దానినే బోధించు కేశవా అని అడిగి ఉండేవాడు కాదు కదా!

సముచ్చయం కాదు - సందేహం లేదు

ఒక వైపు జ్ఞానాన్ని ప్రబోధిస్తూ, మరొక వైపు కర్మను ఆచరించ వలసిందిగా కర్మయోగాన్ని విశేషంగా

ప్రతిపాదించాడు వాసుదేవుడు. అంటే, జ్ఞానకర్మలను ఒకే కాలంలో ఒకే వ్యక్తి ఆచరించాలా? అదెలా సాధ్యం? లేక రెండూ ఆచరణీయము లని చెప్పడంలో భిన్న కర్తృక మని భావమా? భిన్న కర్తృకము అంటే భిన్నమైన కర్తలు ఆచరించడము అని అర్థం. దీనిని కాస్త స్పష్టంగా అర్థం చేసుకుందాం.

జ్ఞానకర్మలు రెండిటిని ఒకే వ్యక్తి ఆచరించాలా? రెండిటిని ఆచరించడానికి అధికారి ఒక్కడేనా? ఏకాధికారమా? లేక, జ్ఞానకర్మలను వేరు వేరు వ్యక్తులు ఆచరించాలా? భిన్నాధికారమా? అంటే కొందరు కర్మను, కొందరు జ్ఞానమును ఆచరించాలి అని భావమా?

అది ఏకాధికారము, రెండిటిని ఒక్కడే ఆచరించాలి అని అంటే, పరస్పర వైరుధ్యము గల జ్ఞానకర్మలను ఒకే వ్యక్తి ఏక కాలంలో ఆచరించడం సాధ్యం కాదు కదా! అలాంటప్పుడు జ్ఞానకర్మల సముచ్చయం అనుపపన్నం కాదా?

లేదు, భిన్నాధికారమే అని అంటావా? కొందరు కర్మాధికారులు, కొందరు జ్ఞానాధికారులు అని అంటావా? అలాంటప్పుడు నేను దేనికి అధికారినో, అది నాకు చెప్పాలి గాని, రెండూ చెబుతున్నావు ఎందుకని కృష్ణా?

నాకు ఏదైనా ఫరవాలేదు. నాకు కావలసింది మాత్రం మోక్షం. శ్రేయస్సు. దేని వల్ల నేను శ్రేయస్సును పొందుతానో ***(యేన శ్రేయో௨ హ మాప్నుయామ్)***. ఆ ఒక్క దానిని నాకు నిశ్చయించి చెప్పు ***(తత్ ఏకం నిశ్చితం వద)*** అంటున్నాడు అర్జునుడు.

జ్ఞానకర్మలలో ఏది శ్రేష్ఠం? అని అడిగితే, జ్ఞానమే శ్రేష్ఠము అంటున్నాడు శ్రీకృష్ణుడు. మరి నేను ఏమి చెయ్యాలి కృష్ణా? అని అడిగితే, అర్జునా! యోగస్థుడవై కర్మల్ని ఆచరించు అని శ్రీకృష్ణుడే ఆదేశిస్తున్నాడు. ఇదీ గందరగోళము. మోక్షానికి జ్ఞానమే సాధనము. నువ్వు మాత్రం కర్మల్ని విడిచి పెట్టకు అని గీతాచార్యుని ప్రబోధం. ఇక్కడే వ్యామిశ్రాన్ని చూస్తున్నాడు అర్జునుడు.

జ్ఞానమే శ్రేష్ఠమైతే, కర్మల లోకి నన్ను దించడ మెందుకు? జ్ఞానమును, కర్మలను రెండిటిని అనుష్ఠించాలి అంటావా? జ్ఞానకర్మలకు కర్తలు భిన్నం కదా? జ్ఞానానికి కర్త వేరు. కర్మకు కర్త వేరు ***(భిన్న కర్తృకయోః జ్ఞాన కర్మణోః)***. కనుక ఒకే వ్యక్తి రెండిటిని ఏక కాలంలో ఆచరించడం అసంభవం ***(ఏక పురుష అనుష్ఠాన అసంభవం)***. కాబట్టి ఈ రెండిటిలో ఏదో ఒక్కటే ఆచరణీయం. ఆ ఒక్కటి ఏదో దానిని నిశ్చయించి చెప్పు అని అర్థిస్తున్నాడు అర్జునుడు.

ఆరోపణము కాదు - అభ్యర్థనము

కృష్ణా! కలగాపులగం చేసినట్లు ***(వ్యామిశ్రేణ ఇవ)*** ఉన్న నీ మాటలతో నా బుద్ధిని మోహానికి గురి చేసినట్లు ***(మోహయసి ఇవ)*** ఉన్నావు అన్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుని వచనం కలగాపులగం అనేది అర్జునుని వాస్తవమైన అభిప్రాయమా? కానే కాదు. ఎందుకని? కలగాపులగం అయినదాని 'వలె' ***(ఇవ)*** ఉంది అన్నాడు. అలాగే శ్రీకృష్ణుని భాషణము తనను మోహానికి గురి చేసింది అనేది అర్జునుని అభిమతమా? ముమ్మాటికీ కాదు. అందుకే మోహానికి గురి చేసినదాని 'వలె' ***(ఇవ)*** ఉంది అన్నాడు.

'కృష్ణా! నీ మాటలు వ్యామిశ్రము, మోహయుతము' అని కనుక అర్జునుడు పలికి ఉంటే, భగవద్గీతను శ్రవణం చేయడానికి అర్జునుడు అర్హుడే కాదు. 'కృష్ణా! నేను నీకు శిష్యుణ్ణి. నన్ను శాసించు. బోధించు' అని శరణాగతు డైనవాడు అలా అభియోగాన్ని మోపుతాడా?

కృష్ణుడు అర్జునుడికి అపరిచితు డేమీ కాదు. కాని, ఇప్పుడు శ్రీకృష్ణుడు కేవలం పరిచితుడుగా లేడు. స్నేహితుడిగా లేడు. బంధువుగా లేడు. గురువుగా ఉన్నాడు. జగద్గురువుగా శోభిస్తున్నాడు.

'నేను గురువును' అని శ్రీకృష్ణుడు ప్రకటించుకోలేదు. 'నేను శిష్యుణ్ణి' అని అర్జునుడే తన శ్రద్ధను ప్రకటించు కున్నాడు. బిడ్డ ఉంటేనే తల్లి. శిష్యుడు ఉంటేనే గురువు. బిడ్డకు ఒకే తల్లి. శిష్యుడికి ఒకే గురువు. అర్జునుని అదృష్టం కొద్ది జగద్గురువే అతనికి ఆచార్య డయ్యాడు.

గురువుతో 'నన్ను నువ్వు కలవర పెడుతున్నావు' అని శిష్యుడు భాషించడమా! అది ఘోరపాపం కాదా? మోహాన్ని మాయం చేసే మహితాత్ముడైన ఆచార్యుని నువ్వు నాకు మోహాన్ని కలిగించేలా బోధిస్తున్నావు అని అనవచ్చా? ఇది మహాదారుణం. శిష్టాచార సంప్రదాయంలో ఊహించ డానికి కూడా వీలు లేని మహాపరాధం. అలాంటి అపచారాన్ని కౌంతేయుడు చేస్తాడా? చెయ్యడు. చెయ్యలేడు.

అందుకే **ఇవ - ఇవ** అంటూ వినమ్రుడై పలికాడు. అలా కనిపిస్తున్నాయి అని అర్థము. గురుదేవా! నీ వాక్యాలు అద్భుతాలు. అమోఘాలు. కాని, మంద బుద్ధి నైన నాకు అర్థంగాక, అవి సంకీర్ణంగా గోచరిన్నాయి. సముచ్చయంగా అర్థమౌతున్నాయి. ఇదే మోహం. నువ్వు కలిగించింది కాదు. నేను కల్పించుకున్నది అంటూ, అర్జునుడు అభిప్రాయ పడుతున్నాడే గాని ఆరోపణ చేయడం లేదు. అదే 'ఇవ' శబ్దార్థము. ఆచార్యుల వారు కూడా తమ భాష్యంలో ఇలాగే అభిప్రాయ పడ్డారు.

భగవాన్! వివిక్తాభిధాయీ! నువ్వు సుస్పష్టం గానే చెబుతావు. నేను మందబుద్ధిని కనుక, నాకు వ్యామిశ్రంలా కనిపిస్తోంది ***(మమ మంద బుద్ధేః వ్యామిశ్రం ఇవ భగవద్వాక్యం ప్రతిభాతి)***. మోహమంతా నా స్వయంకృతమే. నన్ను మోహజాలం నుండి బయట పడేయాలని బోధిస్తున్న నువ్వు నన్ను ఎందుకు మోహానికి గురి చేస్తావు? ***(మమ బుద్ధి వ్యామోహ అపనయాయ హి ప్రవృత్తః త్వం తు కథం మోహయసి?)***. అని గుండెలు కరిగే గురుభక్తి వచనాలతో అర్జునుని హృదయాన్ని ఆవిష్కరించారు పూజ్యపాదులు శ్రీ ఆది శంకరాచార్య స్వామి. శ్రీకృష్ణుణ్ణి అర్జునుడు 'వివిక్తాభిధాయీ' అని పిలిచాడు భాష్యంలో. 'వివిక్తాభిధాయి' అంటే, ఏ విషయానికి ఆ విషయాన్ని విడమరచి చెప్పేవాడు అని అర్థము.

మధుసూదన సరస్వతి వ్యాఖ్యానము కూడా ఆచార్యుల వారి మార్గం లోనే ఉంది. **ఇవ** శబ్దార్థాన్ని చెబుతూ, భగవాన్! నీవు పరమ కరుణామూర్తివి. నీలో మోహకత్వం లేదు. అయినా, నా భ్రాంతి చేత మోహము నాలో భాసిస్తుంది అని అర్జునుని అంతర్యాన్ని విప్పి చూపాడు ***(పరమ కారుణికస్య తవ మోహకత్వం నాస్తి ఏవ. తథాపి భ్రాన్త్యా మమైవం భాతీతి ఇవ శబ్దే నోక్తమ్)***.

అర్జునుడు ఆదర్శం

వేదాంత శాస్త్రంలో బోధ చాలా ప్రధానమైంది. బోధ ఎంత ప్రధానమో బోధనా విధి అంత ప్రధానము. అదే సంప్రదాయము. సంప్రదాయాన్ని తెలిసి బోధించే సద్గురువు లభించడం ముముక్షువుల అదృష్టం. జిజ్ఞాసువుల భాగ్యం. అలాంటి గురువరేణ్యులతో ఎలా భాషించాలి, వారి వద్ద ఎలా ప్రవర్తించాలి అనే విషయంలో అర్జునుణ్ణి ముముక్షు జనులు ఆదర్శంగా తీసుకోవాలి. 'ఇవ' శబ్దాన్ని ప్రయోగించి, వ్యామిశ్రం అనకుండా, వ్యామిశ్రం వలె ఉన్నది అనడం శిక్షణ యోగ్యుడైన శిష్యుని యొక్క విశిష్ట గుణాన్ని తెలుపుతూ ఉంది. మనం దోషయుతంగా ప్రవర్తించినా, దోషాలకు అతీతులైన గురువులు పట్టించుకోరు. అలాగని, సామాన్య వ్యక్తులతో మెలగినట్లే గురువులతో కూడా ప్రవర్తించే సంస్కారం గల శిష్యుడు శిక్షణార్హుడేనా?

కర్మయోగం అర్జునుని ప్రశ్నతో ప్రారంభ మైంది. ఒక విధంగా చూస్తే సంశయంతో కూడిన అర్జునుని ప్రశ్న భగవద్గీతలో ఇదే మొదటిది అని చెప్పవచ్చు. మున్ముందు మరెన్నో సంశయాలను ప్రశ్నల రూపంలో భగవంతుని ముందు ఉంచి, వాటికి సమాధానాలను అందుకుంటాడు అర్జునుడు.

రెండవ అధ్యాయంలో యాభై నాల్గవ శ్లోకంలో **స్థితప్రజ్ఞస్య కా భాషా?** అని అర్జునుడు ప్రశ్నించాడు కదా! అనే సంశయం మీకు రావచ్చు. అదీ ప్రశ్నే. కాని, అది సందేహంతో కూడిన ప్రశ్న కాదు. స్థితప్రజ్ఞుని వైభవాన్ని వివరించ మని ఉత్సుకతతో కోరిన వాక్యం. ఇక్కడే, కర్మయోగం ప్రారంభం లోనే, అర్జునునిలో సందేహాయుత మైన మొదటి ప్రశ్న తలెత్తింది.

వాస్తవానికి ఈ సంశయం అర్జునునికి రెండవ అధ్యాయంలో కర్మయోగం గురించి ఆలకించి నపుడే కలిగింది. కాకపోతే, స్థితప్రజ్ఞత్వం అనే విషయమును శ్రీకృష్ణుడు చెప్పగానే, వెంటనే స్పందించిన పార్థుడు, స్థితప్రజ్ఞ వైభవాన్ని వివరించ మని అర్థించాడు. అది పూర్తి కాగానే, తన మనసును కలత పెడుతున్న సంశయాన్ని నివృత్తి చేసుకోవాలని భావించి మూడవ అధ్యాయం ఆరంభం లోనే జగద్గురువును పరిప్రశ్నించాడు.

సంబోధనమే సర్వసిద్ధి మంత్రం

కర్మయోగంలో ఆరంభ శ్లోకాలు రెండూ అర్జునుని ప్రశ్నలే. అయితే, ఈ సందర్భములో గీతాచార్యుని ***జనార్దనా! కేశవా!*** అని యుక్తియుక్తంగా, భావయుతంగా సంబోధించాడు పాండునందనుడు. తనకు కావలసింది ఏమిటో మళ్ళీ మళ్ళీ అడిగి పునరుక్తితో పురుషోత్తముని విసిగించ కుండా, సంబోధన తోనే సంచి నింపుకొనే ప్రయత్నం చేశాడు. అందుకే ***జనార్దనా!*** అని ఆర్తిలో పలుకు తున్నాడు. తనకు మోక్షమే కావాలి అని పునరుద్ఘాటిస్తున్నాడు.

జనైః పురుషార్థం అభ్యుదయ నిశ్శ్రేయస లక్షణం యాచ్యతే ఇతి జనార్దనః

అభ్యుదయ నిశ్శ్రేయస లక్షణమైన పరమ పురుషార్థమును గూర్చి జనుల చేత కోరబడే వాడు జనార్దనుడు. మోక్షమును ప్రసాదించ మని జనులందరూ ఎవరిని యాచిస్తారో అతడే జనార్దనుడు.

అర్జునుడు శ్రేయస్సును వాంఛిస్తున్నాడు. మోక్షాన్ని కోరుకుంటున్నాడు. ఈ విషయాన్ని ఇప్పటికి మూడుసార్లు శ్రేయస్సు - శ్రేయస్సు - శ్రేయస్సు అని ప్రస్తావించాడు. మళ్ళీ ఐదవ అధ్యాయం ప్రారంభంలో కూడా అడుగుతాడు. కనుకనే ఈ సందర్భంలో శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రశ్నించి, పునరుక్తిని పలకలేక సంబోధన తోనే అర్థిస్తున్నాడు. ఇదంతా భావసౌందర్యం. ఆధ్యాత్మిక మార్గంలో శిష్యుడైన వానికి ఉండవలసిన సమయోచిత, సందర్భోచిత భావపుష్టి.

జనార్దనా! అని సరిపెట్టుకోలేదు. మళ్ళీ, ***కేశవా!*** అని కూడా ప్రార్థించాడు. జనార్దనుడు కేశవుడు ఎలా అవుతాడో విష్ణుపురాణం వైభవంగా ప్రవచించింది.

కేశి వధాద్వా 'యస్మాత్త్వయైష దుష్టాత్మా హతః కేశీ జనార్దన' తస్మాత్ కేశవ నామ్నా త్వం లోకే ఖ్యాతో భవిష్యసి

జనార్దనా! దురాత్ముడైన 'కేశి' అనే రాక్షసుణ్ణి వధించావు. ఈ కారణంగా నువ్వు లోకంలో 'కేశవ' నామంతో విఖ్యాతుడవు అవుతావు అని శ్రీకృష్ణునితో విన్నవించు కున్నాడు నారదమహర్షి.

'కేశి' ఎవరో కాదు. అజ్ఞానమే కేశి. అజ్ఞానం నశిస్తేనే మోక్షం ప్రాప్తిస్తుంది. ***కేశవా! నా అజ్ఞానాన్ని పోగొట్టు. జనార్దనా! నాకు మోక్షాన్ని ప్రసాదించు*** అంటూ దివ్య భావస్ఫూర్తితో పరమాత్మను సంబోధిస్తూ సంభాషించాడు పార్థుడు.

కనుక, కర్మజ్ఞానాలలో ఏదో ఒకటి నిశ్చయించి చెప్పు కృష్ణా! అని అర్జునుడు ప్రార్థిస్తూ ప్రశ్నించాడు. పార్థుని ప్రశ్నకు పార్థసారథి ప్రతివచనం పలుకుతున్నాడు.

శ్రీభగవానువాచ :

లోకేఽస్మి న్ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3

లోకే-అస్మిన్-ద్వివిధా-నిష్ఠా-పురా-ప్రోక్తా-మయా-అనఘ
జ్ఞానయోగేన-సాంఖ్యానాం-కర్మయోగేన-యోగినాం

అనఘ	= పాపరహితుడా!		జ్ఞానయోగేన	=	జ్ఞానయోగము చేత
పురా	= పూర్వము		యోగినాం	=	యోగులకు
అస్మిన్	= ఈ		కర్మయోగేన	=	కర్మయోగము చేత
లోకే	= లోకమున		ద్వివిధా	=	రెండు విధాలుగా
మయా	= నా చేత		నిష్ఠా	=	నిష్ఠ
సాంఖ్యానాం	= సాంఖ్యులకు		ప్రోక్తా	=	చెప్ప బడింది

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

పాప రహితా! పార్థా! ఈ లోకంలో అనుష్ఠాన పద్ధతులు రెండు విధాలు అని పూర్వం నేనే చెప్పాను. సాంఖ్యులకు జ్ఞానయోగము. యోగులకు కర్మయోగము.

వ్యాఖ్య

ప్రతి వచనం ఫలదాయకం

జనార్దనా! కేశవా! అంటూ తన సంశయాన్ని ప్రశ్న రూపంలో భగవంతుని ముందు ఉంచాడు అర్జునుడు. అర్జునుని ప్రశ్నకు సమాధానం చెబుతూ, సంబోధన తోనే సంతృప్తి పరుస్తూ శుభం పలికాడు సర్వేశ్వరుడు.

అజ్ఞాన నివృత్తికి ***కేశవా!*** అంటూ, మోక్షప్రాప్తికి ***జనార్దనా!*** అంటూ అర్జునుడు సంబోధిస్తే, ***అనఘా!*** అంటూ ప్రతివచనం పలికి, జ్ఞానబోధను గ్రహించి తరిస్తావు అని భగవానుడు అభయ ప్రదానం చేశాడు.

అనఘా! అంటే, పాపరహితుడా! అని అర్థం. భగవద్గీత సమాప్తి సమయంలో అర్జునుణ్ణి 'మహాత్ముడు' అని శ్లాఘించాడు సంజయుడు. మహాత్ముడంటే ఎవరు? పాపాన్ని చూచి భీతి చెందే వాడే మహాత్ముడు. పాపాచరణము సహించ లేని సత్పురుషుడే మహాత్ముడు.

అర్జునుని జీవితంలో కళంక మనేది కాగడా పెట్టి వెతికినా కనిపించదు. ధర్మమే ఊపిరిగా భావించి జీవించిన పవిత్రాత్ముడు. అందుచేతనే, గీతా శ్రవణానికి అర్హు డయ్యాడు. సాక్షాత్తు భగవంతుని కరుణకు పాత్రుడై, ఆదిదేవుణ్ణే ఆచార్యునిగా పొందాడు. అలాంటి వానికి పాప మెక్క డుంటుంది? అందుకే అర్జునుడు అనఘుడు.

అర్జునా! అనఘా! మిశ్రమ వాక్యాలతో నిన్ను నేను కలత పెట్ట లేదు. నిన్ను నీవే కలత పెట్టుకున్నావు. అర్జునా! నిన్ను నేను మోహ కాలుష్యానికి గురి చేస్తానా? బిడ్డ మట్టిలో ఆడి మలిన పడితే, తల్లి స్నానం చేయిస్తుంది కదా! నీ విషయంలో నేనూ అంతే. మోహజాడ్యాన్ని నీవు తయారు చేసుకున్నావు. పవిత్రమైన జ్ఞానజలంతో నీకు ఆగంతుకంగా ప్రాప్తించిన అవివేకాన్ని పోగొట్టి బుద్ధిని శుద్ధి చేస్తాను అనే సంకేతాన్ని 'అనఘా' అనే సంబోధన ద్వారా ఇస్తూ బోధను ప్రారంభిస్తున్నాడు భగవంతుడు.

ఉభయ నిష్ఠలు

ఈ లోకంలో రెండు నిష్ఠ లున్నాయి. సాంఖ్యులకు జ్ఞాననిష్ఠ. యోగులకు కర్మయోగ నిష్ఠ. ఈ రెండిటిని పూర్వం ఈ లోకంలో తానే చెప్పినాడట. ఇది భగవానుని ప్రతివచనంలో ప్రథమ విషయం. ముందుగా నిష్ఠ అంటే ఏమిటో తెలుసుకుందాం.

నిష్ఠా స్థితిః అనుష్ఠేయ తాత్పర్యమ్. 'నిష్ఠ' అంటే స్థితి. ఆచరించ వలసిన విషయంలో తత్పరత్వం. విహిత కర్మల యందు నియమంతో కూడిన అనుష్ఠానము. ధ్యానయోగి ధ్యానం చేస్తూ ఉంటాడు. అంటే, అతడు ధ్యానము నందే తత్పరుడై ఉంటాడు. అది ధ్యానయోగి యొక్క స్థితి. అదే ధ్యాననిష్ఠ. తపస్సు నందు తత్పరుడై ఉండటం తపోనిష్ఠ. వ్రతమును ఆచరించుటలో తదేక దృష్టితో వ్యవహరించడం వ్రతనిష్ఠ. బ్రహ్మము నందే బ్రహ్మభావనతో ఉండటం బ్రహ్మనిష్ఠ. జ్ఞానం విషయంలో తదేక చింతనము కలిగి ఉండే స్థితి జ్ఞాననిష్ఠ. కర్మల యందు లగ్నమై ఉండే స్థితి కర్మనిష్ఠ. ఇది 'నిష్ఠ' శబ్దార్థము. అనుష్ఠానంలో నిశ్చయాత్మక మైన స్థితి. నియమబద్ధ మైన అనుష్ఠాన పద్ధతి.

ఈ లోకంలో ***(అస్మిన్ లోకే)*** రెండు విధాలైన నిష్ఠ ***(ద్వివిధా నిష్ఠా)*** పూర్వము ***(పురా)*** నా చేతనే చెప్ప బడింది ***(మయా ప్రోక్తా)*** అంటున్నాడు అచ్యుతుడు. సాంఖ్యులకు జ్ఞానయోగ నిష్ఠ ***(జ్ఞాన యోగేన సాంఖ్యానాం)***. యోగులకు కర్మయోగ నిష్ఠ ***(కర్మయోగేన యోగినామ్)***. ఇదీ అసలు విషయం.

రెండు విధాలైన అనుష్ఠాన పద్ధతివి పూర్వం తానే చెప్పినట్లు చెబుతున్నాడు. ఇక్కడ 'పూర్వం' అంటే సృష్ట్యారంభంలో అని అర్థం ***(సర్గాదౌ)***. అంటే, సృష్టికి పూర్వమే సృష్టికి సంబంధించిన జ్ఞానం ఉంది. అదే వేదజ్ఞానం. ఆ జ్ఞానం తోనే భగవంతుడు సృష్టి కార్యాన్ని చేశాడు.

సృష్టి, సృష్టి జ్ఞానము ఒక్కటే. సృష్టి జ్ఞానము సృష్టి కర్తదే. కనుక ఆయన నుండే సృష్టికి జ్ఞానం అందాలి. అలాగే అందింది. కాకపోతే, ఎన్నో లోకాలు ఉండగా, పవిత్రమైన వేదజ్ఞానము, వేదజ్ఞానము ప్రతిపాదించే ద్వివిధా నిష్ఠ ఈ లోకంలో మాత్రమే చెప్ప బడింది. మరొక లోకంలో చెప్పబడ లేదు ఎందుకని? అడవిలో వెన్నెల కాచినా ప్రయోజనము ఉండదు కనుక.

జ్ఞానబోధ యొక్క ఆవశ్యకత ఏమిటి? మోక్షప్రాప్తి. అంతే కదూ? మోక్షార్హత మానవ లోకంలో ఉందే గాని, మరొక లోకంలో లేదు. మానవ లోకము ఒక్కటే కర్మభూమి. మిగతా లోకాలన్నీ భోగ భూములు. కర్మభూములు కావు. అందుచేత ఈ లోకానికే వేదజ్ఞానం, వేదాంత జ్ఞానం ప్రసాదించ బడింది.

అర్జునా! అందుచేత ఈ లోకానికే నేను పూర్వం ద్వివిధా నిష్ఠను అందించాను. కృష్ణా! కుబేర లోకంలో ఎందుకని వితరణ చేయలేదు? చేయ కూడదని కాదు గాని, చేసినా ప్రయోజనం ఉండదని! చిక్కుల నుండి బయట పడాలి అనే ఆరాటం వాళ్ళకు లేదు. చెక్కులను పోగు చేసుకోవాలి అనే ఉత్సాహం నాకు లేదు. అందుకే ఇక్కడే బోధించాను. మోక్షాన్ని జన్మహక్కుగా పొంది, పరమేశ్వరా! నీవే దిక్కు అనే ముముక్షువులు ఇక్కడే ఉన్నారు కనుక, ఇక్కడే బోధను అందించాను. అభ్యుదయ నిశ్శ్రేయసలకు సాధనమైన వేద సంప్రదాయాన్ని ఆవిష్కరించి, బోధించిన పరమేశ్వరుడను నేనే ***(అభ్యుదయ నిశ్శ్రేయస ప్రాప్తి సాధనం వేదార్థ సంప్రదాయమ్ ఆవిష్కుర్వతా. ప్రోక్తా. మయా సర్వజ్ఞేన ఈశ్వరేణ)***.

ఒక్కటే గమ్యము - ఒక్కటే మార్గము

అర్జునుడు శ్రేయస్సును అర్థించాడు. శ్రేయస్సు అంటే మోక్షము. అందరికీ మోక్షం కావాలి. కనుక అందరికీ మోక్షమే ఏకైక గమ్యము.

మరి, మోక్షము ఎక్కడుంది? మోక్షము జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలిగితేనే మోక్షం కలుగుంది. దీనికి మరొక మార్గం లేదు. జ్ఞానము ద్వారానే మోక్షం లభిస్తుంది అనేది సర్వ ఉపనిషత్తుల యొక్క ఏకైక తాత్పర్యం ***(జ్ఞానాత్ మోక్షా ఇతి చ సర్వోపనిషదాం సిద్ధాన్తః)*** అని శ్రీ శంకరుల ఉపనిష ద్భాష్యము.

మోక్షము గమ్యము. అందుకు జ్ఞానమే మార్గము. మరి, ఈ ద్వివిధా నిష్ఠ ఏమిటి? ద్వివిధా నిష్ఠ అంటే రెండు రకాలైన మార్గాలు సమాంతరంగా ఉన్నాయని అర్థం కాదు. ద్వివిధా నిష్ఠ అంటే రెండు రకాలైన వ్యక్తులు ఉన్నారు, వాళ్ళను బట్టి రెండు విధాలైన నిష్ఠను బోధించ వలసి వచ్చింది అని భావం. నిష్ఠ రెండు విధాలుగా గోచరిస్తున్నా, మోక్షమనే ఏక గమ్యాన్ని చేరే సరికి, ఒక్క నిష్ఠే మిగిలి ఉంటుంది. అదే జ్ఞాననిష్ఠ. అదెలాగో అర్థం చేసుకుందాం.

జ్ఞాన నిష్ఠ

సాంఖ్యులకు, అంటే సన్యాసులకు జ్ఞానయోగ నిష్ఠ ప్రతిపాదించ బడింది. బ్రహ్మచర్యాశ్రమము నుండే సన్యసించిన వివేకవంతులకు, వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థులైన యతిపురుషులకు జ్ఞాననిష్ఠ చెప్ప బడింది. బ్రహ్మ విషయము నందే స్థిరంగా ఉన్న పరివ్రాజకులకు ***(బ్రహ్మణ్యేవ అవస్థితానాం)*** జ్ఞాననిష్ఠయే అనుష్ఠాన పద్ధతి.

జ్ఞానయోగము అంటే జ్ఞానమే యోగము అని అర్థం ***(జ్ఞానమ్ ఏవ యోగః జ్ఞానయోగః)***. బ్రహ్మమే సత్యమని, ఆత్మయే బ్రహ్మమని ఎరిగిన వారు సాంఖ్యులు, లేదా సన్యాసులు. శ్రవణ మనన నిదిధ్యాసల ద్వారా పొందబడు 'నేనే బ్రహ్మము' అనే అఖండ బ్రహ్మాకార వృత్తి చేత నిశ్చలమైన స్థితిని లేదా నిష్ఠను కలిగి ఉండటమే జ్ఞానయోగ నిష్ఠ ***(జ్ఞాన యోగేన సాంఖ్యానామ్)***.

జ్ఞాననిష్ఠలో ఉన్న వారికి మరొక వ్యాపకము ఉండదు. ఆత్మవిచార ధ్యానమే ప్రధానమైన సాధన. అదే జ్ఞాననిష్ఠ, లేదా బ్రహ్మనిష్ఠ. వీరిది నివృత్తి మార్గము. నిరాకార పరబ్రహ్మమునే చింతన చేయువారు జ్ఞాననిష్ఠులు. సాంఖ్యులు. సన్యాసులు. సన్యాసులు కాని వారు, గృహస్థాశ్రమంలో కర్మలలో చరించు వారు అనుసరించ వలసింది జ్ఞాననిష్ఠ కాదు. కర్మయోగ నిష్ఠ.

కర్మయోగ నిష్ఠ

కర్మయోగము అంటే కర్మమే యోగముగా గలది అని అర్థం ***(కర్మ ఏవ యోగః కర్మయోగః)***. ఈ విధమైన కర్మయోగము యోగులకు, అనగా కర్మలను ఆచరించే గృహస్థులకు అనుష్ఠాన పద్ధతిగా చెప్ప బడింది. అదియే కర్మయోగ నిష్ఠ.

కర్మ పరిమితమై, పరిమితమైన ఫలాలను ఇస్తుంది కనుక కర్మ బంధహేతువు. సాధకుడైన వాడు ఈశ్వర భావనతో కర్మలను ఆచరిస్తాడు కనుక అవి బంధహేతువులు కావు. కర్మయోగి కర్మలను ఆచరిస్తాడే గాని, కర్మల చేత గాని, కర్మఫలాల చేత గాని బద్ధుడు కాడు.

నేను కర్తను కాను. హరియే కర్త ***(నాహం కర్తా - హరిః కర్తా)***. పరమేశ్వరుని సేవకుడుగా నేను కర్మలను ఆచరిస్తున్నాను అనే భావనలో చరిస్తాడు ***(ఈశ్వర భృత్యవత్ అహం కరోమి)***. కర్మాచరణములో కర్తృత్వమును విడిచి, ఫలానుభవము నందు సంగత్వము లేకుండా ఉంటాడు. కర్మలను పరమేశ్వరునికి నైవేద్యంగా సమర్పించి, లభించిన ఫలాలను ప్రసాదంగా స్వీకరిస్తూ, రాగద్వేషముల నుండి విడిపడి ఉంటాడు. ఈ విధంగా విశుద్ధ మైన, ప్రసన్నమైన చిత్తమును కర్మయోగ నిష్ఠలో పొందుతాడు. ఇతడే కర్మయోగి. ఇతని అనుష్ఠాన పద్ధతి కర్మయోగ నిష్ఠ. ఇతనిది ప్రవృత్తి మార్గము. ఈశ్వర దర్శన ప్రాప్తియే కర్మయోగ ఫలము.

పార్థుని పరిస్థితి

సన్యాసిది జ్ఞాననిష్ఠ. యోగిది కర్మయోగ నిష్ఠ. జ్ఞానమార్గంలో చరించే యతి పురుషులకు జ్ఞానమే మార్గము. కర్మమార్గంలో చరించే గృహస్థులకు జ్ఞానయుతమైన కర్మయే మార్గము. ఇలా, రెండు విధాలుగా నిష్ఠ తెలుస్తూ ఉండినా, గమ్యము మాత్రము ఒక్కటే. అదే మోక్షము.

ఈ రెండిటిలో అనగా, జ్ఞాన కర్మలలో ఏది శ్రేష్ఠము? రెండూ శ్రేష్ఠమే. శ్రేష్ఠము కానిది సకామకర్మ ఒక్కటే. కర్మయోగమూ శ్రేష్ఠమే. జ్ఞానయోగమూ శ్రేష్ఠమే. ఈ రెండు మార్గాలలో దేనినైనా గ్రహించ వచ్చు.

జ్ఞానమార్గానికి అర్హులైన వారికి జ్ఞాననిష్ఠ శ్రేష్ఠము. జ్ఞాననిష్ఠకు అర్హులు కాని వారికి కర్మయోగ నిష్ఠ శ్రేష్ఠము. ఇక్కడ ఒక్క విషయం సుస్పష్టంగా తెలియాలి. మనం ఆశ్రయించ వలసింది జ్ఞానయోగమునో, లేక కర్మయోగమునో గాని, జ్ఞానమునో, లేక కర్మనో కాదు.

మోక్షమును పరమావధిగా భావించి, సన్యాసి జ్ఞానయోగంలో ఉంటాడు. మోక్షమునే పరమ పురుషార్థంగా భావించి గృహస్థుడు కర్మయోగంలో ఉంటాడు. ఇక్కడే సాధారణ కర్మ కర్మయోగంగా మారుతూ ఉంది.

జ్ఞానమే శ్రేష్ఠమని నీ అభిప్రాయ మైతే, ఘోరమైన యుద్ధకర్మలో నన్ను ఎందుకు దించుతున్నావు? అని అర్జునుడు ప్రశ్నించాడు.

అర్జునుడు సన్యాసి కాడు. గృహస్థుడు. కనుక కర్మయోగి కావలసిన వాడే గాని, సర్వకర్మల్ని సన్యసించి జ్ఞాననిష్ఠలో ఉండ వలసిన వాడు కాడు. కర్మలు చేయ వలసిన వాడే గాని, కర్మలను విడిచి పెట్ట వలసిన వాడు కాడు.

కర్మయోగం ద్వారానే జ్ఞానయోగం

కేవలం కర్మలను విడిచినంత మాత్రాన, అలా విడిచిన వాడు సన్యాసి కాలేడు. కర్మయోగంలో శుద్ధి పడిన వాడే జ్ఞానయోగంలో స్థిరంగా ఉంటాడు. చాలా మంది సన్యాసం పుచ్చుకొని, ఆ తరువాత ఎందుకు పుచ్చుకున్నామా? అని చింతిస్తూ ఉంటారు. సన్యాసం పుచ్చుకోవడం వేరు. సన్యాసిగా జీవించడం వేరు. మనస్సులో రాగద్వేషాల గాలులు వీచే వారికి సన్యాసము సుఖా న్నివ్వదు.

కర్మలను విడిచి నంత మాత్రాన సన్యాసము అనిపించుకోదు. అలాగైతే, సోమరిపోతు లందరూ సన్యాసు లవుతారు. అలా కావడం చేతనే ప్రధానంగా నేటి సమాజంలో సన్యాసము ప్రశ్నార్థకంగా మారింది.

సన్యాసులు కాని వారు కర్మయోగము ద్వారా చిత్తశుద్ధిని పొందాలి. అప్పుడే జ్ఞానయోగానికి అర్హు లవుతారు. అందుచేతనే ఫలాపేక్షను కోరే దీను ల్లాగా కాకుండా, బుద్ధి యోగాన్ని ఆశ్రయించు అంటున్నాడు అర్జునునితో శ్రీకృష్ణుడు ***(బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః)***. ఇక్కడ భగవంతుడు ప్రబోధించిన యోగబుద్ధిని సాంఖ్య బుద్ధిగా అర్థం చేసుకున్న అర్జునుడు, కర్మయోగము కంటే జ్ఞానయోగము శ్రేష్ఠమని శ్రీకృష్ణుడు చెప్పినట్లు పొరపాటు పడ్డాడు.

ఇక్కడే శ్రద్ధగా అర్థం చేసుకోవాలి. కర్మలను విడిచి జ్ఞానాన్ని ఆశ్రయించమని గీతాచార్యుడు చెప్పలేదు. అలాగని, జ్ఞానకర్మలను రెండిటిని కలిపి ఆచరించ మని అసలే చెప్పలేదు ***(జ్ఞానకర్మ సముచ్చయము)***.

నువ్వు జ్ఞానయోగము నైనా అనుసరించ వచ్చు. లేదా, కర్మయోగము నైనా అనుసరించ వచ్చు. రెండిటికి మోక్షమే గమ్యము.

కాకపోతే, సన్యాసానికి అర్హత లేకుండా సన్యాసం పుచ్చుకుంటే, సన్యాసంలో చేయదగిన కార్యము తప్ప

మిగిలిన వన్నీ చేస్తూ పోవలసి వస్తుంది. కర్మయోగం బుద్ధిని శుద్ధి చేస్తుంది. తద్వారా జ్ఞాననిష్ఠకు మార్గాన్ని సుగమం చేస్తుంది. కనుక, ***యోగస్థః కురు కర్మాణి***, యోగస్థుడవై కర్మలను ఆచరించు అని అర్జునుని కర్మయోగం వైపుకు త్రిప్పాడు గీతాచార్యుడు. ఈ ద్వివిధానిష్ఠను మున్ముందు అనేకచోట్ల ప్రస్తావిస్తూ అద్భుతంగా ప్రవచిస్తాడు పరమేశ్వరుడు.

జ్ఞాననిష్ఠ ప్రాప్తికి హేతువు కర్మనిష్ఠయే అని భగవంతుడు చెబుతున్నా, అర్జునుని మనస్సు సన్యాసము నందే అపేక్ష కలిగి ఉందని గుర్తించిన గీతాచార్యుడు, కర్మలను త్యజించినంత మాత్రాన సిద్ధి లభించదు అని తరువాత శ్లోకంలో బోధిస్తున్నాడు.

న కర్మణా మనారమ్భా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సంన్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 4

న-కర్మణాం-అనారంభాత్-నైష్కర్మ్యం-పురుషః-అశ్నుతే
న-చ-సంన్యసనాత్-ఏవ-సిద్ధిం-సమధిగచ్ఛతి

పురుషః	= మనుజుడు	న అశ్నుతే	= పొందదు
కర్మణాం	= కర్మల యొక్క	సంన్యసనాత్ ఏవ	= కేవలం సన్యసించుట చేతనే
అనారంభాత్	= ఆరంభము చేయక పోవటం వల్ల	సిద్ధిం	= సిద్ధిని
నైష్కర్మ్యం	= నిష్క్రియమైన స్థితిని	న సమధిగచ్ఛతి చ	= పొంద లేదు

కర్మ చేయడం మానేసి నంత మాత్రాన మానవుడు నైష్కర్మ్యమును పొందలేడు. కర్మను విడిచినంత మాత్రం చేత సిద్ధిని పొందలేడు గదా!

వ్యాఖ్య

గమనం లేకుండానే గమ్యమా?

జ్ఞాననిష్ఠ ప్రాప్తికి కర్మనిష్ఠ హేతువు. కర్మనిష్ఠ తనకు తానుగా, స్వతంత్రంగా మోక్ష హేతువు కాదు. కాని, కర్మనిష్ఠను హేతువుగా పొందిన జ్ఞాననిష్ఠ స్వతంత్రంగా మోక్ష హేతువు అవుతూ ఉంది.

కర్మనే చేయ నపుడు 'కర్మ లేకుండా పోవడము' అనే ఫలం కలగదు. ఆకలితో ఉన్నవాడు భోం చేస్తాడు. భోం చేసిన తరువాత తృప్తి చెందుతాడు. అలా తృప్తి చెందిన వాడు వెంటనే తిరిగి భోంచేయ నవసరం లేదు. 'భోజనం చేయ నవసరం లేదు' అనే ఫలం భోజనం చేయడం వల్లనే కలిగింది. అసలు భోజనం చేయడమే ఆరంభించని వ్యక్తి, 'భోజనం చేయ నవసరం లేదు' అనే ఫలితాన్ని ఎలా పొందుతాడు? చలనమే లేదు. చేరే దేముంది? కదలనే లేదు. కడ చేరే దెక్కడ? కడతేరే దెప్పుడు? కర్మలనే ఆరంభించని వాడు నైష్కర్మ్యాన్ని ఎలా పొందుతాడు?

నడచిన వాడే చేరుతాడు. చెట్టెక్కిన వాడే దిగుతాడు. బట్ట కట్టుకున్న వాడే విప్పుతాడు. ఒళ్ళు తడిచిన వాడే తుడుచుకుంటాడు. చేసిన వాడే చేయడం ఆపేస్తాడు. చేయడమే ఆరంభించని వాడు చేత యుడిగిన స్థితికి చేరలేడు ***(న కర్మణాం అనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే)***.

కర్మను చేయకుండా ఉన్నంత మాత్రాన 'కర్మ లేకపోవడం' *(నైష్కర్మ్యం)* అనే ఫలాన్ని పొంద లేము. ఉపాయం లేకుండా ఉపేయప్రాప్తి కలగదు అనే న్యాయం ఉండనే ఉంది కదా ***(న హి ఉపాయం అంతరేణ ఉపేయ ప్రాప్తిః అస్తి)!***

కర్మ లేని స్థితియే నైష్కర్మ్యం. అది కర్మ చేత అబాధితం. ఏదైతే కర్మ చేత నిషేధింప బడదో, అదే నైష్కర్మ్యం. అది ఆత్మయే. ఆత్మసిద్ధియే నైష్కర్మ్యసిద్ధి. జ్ఞానయోగము నైష్కర్మ్యరూపము. ఆత్మ స్వరూపమునకు సంబంధించినది. నైష్కర్మ్య రూపమైన జ్ఞానయోగము ఉపేయ మైతే, కర్మయోగము ఉపాయము. ఉపాయమైన కర్మయోగము లేకుండా ఉపేయమైన జ్ఞానయోగ నిష్ఠ ఎలా ఏర్పడుతుంది? నైష్కర్మ్యం ఎలా సిద్ధిస్తుంది?

కర్మలను వదలి పెట్టడం నైష్కర్మ్యం కాదు. కర్మత్యాగమూ కాదు. అది కేవలం కర్మలలో త్యాగం. గమ్యం చేరాలని బండిలో ప్రయాణం చేస్తూ, గమ్యం రాక ముందే బండి దిగి పోతే గమ్యం చేరినట్లు అవుతుందా? జ్ఞాననిష్ఠకు అర్హతను పొందక ముందే కర్మయోగాన్ని త్యజించడం చాలా ప్రమాదము.

కర్మలను విడిచి పెడితే నైష్కర్మ్యం రాదు. నైష్కర్మ్య స్థితిలో కర్మలు వాటంతట అవే విడిపోతాయి. నైష్కర్మ్యం రావాలి అంటే జ్ఞానం రావాలి. నేను ఆత్మ. ఆత్మ అకర్త. అభోక్త. కనుక, నేనూ అకర్తే - అభోక్తే అనే జ్ఞానం మనిషికి కలగాలి. దానికి ప్రత్యేకమైన మనస్సు కావాలి. శుద్ధ బుద్ధి ఉండాలి. దానిని కర్మయోగం ప్రసాదిస్తుంది. అట్టి కర్మయోగాన్ని ఆరంభించని వారికి నైష్కర్మ్యం సిద్ధించదు (***నైష్కర్మ్యం అశ్నుతేన***).

వదేసుకోవడమే వరమార్థమా?

సన్యాసము స్వీకరించి నంత మాత్రాన సిద్ధి కలుగుతుందా? కలగదు. సన్యాసము తీసుకుంటే, కర్మలు దూర మవుతాయి. అజ్ఞానం దూరం కాదు. శ్రవణాదుల ద్వారా జ్ఞానాన్ని పొంది అజ్ఞానాన్ని పోగొట్టు కొనేందుకే సన్యాసము ఉంది. అదే జ్ఞాననిష్ఠ. అదే నివృత్తి మార్గము.

జ్ఞానసాధన నిమిత్తమే సన్యాసము స్వీకరింప బడుతుంది. మరి సన్యాసు లందరూ జ్ఞానసాధనలో ఉన్నారా? ఉండక పోవచ్చు. అసలు జ్ఞానాసక్తే లేని సన్యాసులు నేడు ఎక్కువగా కనిపిస్తున్నారు. మరి వారందరూ సన్యాసము ఎందుకు గ్రహించినట్లు? జ్ఞానం కోసమే. మరి జ్ఞానాభ్యాసమును ఎందుకని చెయ్యరు? జ్ఞాననిష్ఠలో ఎందుకని ఉండరు? చెయ్యలేరు కనుక చెయ్యరు. ఉండలేరు కనుక ఉండరు. మరి వాళ్ళకు సిద్ధి ఎలా? ఇంకెక్కడి సిద్ధి? బుద్ధి ఉంటే కదా సిద్ధి? సన్యాసము పుచ్చుకొని సంసారాలను చేజార్చుకుంటారే గాని, జ్ఞాననిష్ఠలో ఉండి సిద్ధిని చేజిక్కించుకో లేరు (***సన్న్యసనా దేవ, కేవలాత్ కర్మ పరిత్యాగ మాత్రాదేవ జ్ఞాన రహితాత్ సిద్ధిం న ప్రాప్నోతి***). జ్ఞానం లేకుండా కేవలం కర్మలను త్యజించి నంత మాత్రాన సిద్ధిని పొందలేరు.

కర్మసన్యాసం అంటే కేవలం కర్మల్ని విడిచి పెట్టడం కాదు. కర్మలలో సన్యాస భావం కలిగి ఉండటం. కర్మలలో సన్యాస భావన అంటే ఏమిటి? కర్మ చేసే ముందు నేను చేస్తున్నాను అనే భావన ఉంటుంది. అదే కర్తృత్వ భావము. ఫలం ప్రాప్తించి నపుడు నేను అనుభవిస్తున్నాను అనే భావన ఉంటుంది. అదే భోక్తృత్వ భావం. ఈ రెండు లేనపుడే కర్మలలో సన్యాస మనస్తత్వం ఉంటుంది. కర్తృత్వం లేనపుడు కర్త ఎక్కడ ఉంటాడు? కనుక నేను అకర్తను (***అహం అకర్తా***). భోక్తృత్వం లేనపుడు భోక్త ఎక్కడుంటాడు? ఇదే నైష్కర్మ్య స్థితి. కనుక నేను అభోక్తను (***అహం అభోక్తా***).

ఈ స్థితి కేవలం కర్మల్ని విడిస్తే కలుగుతుందా? లేక జ్ఞానం వల్ల కలుగుతుందా? జ్ఞానం వల్లనే ప్రాప్తిస్తుంది. కనుక జ్ఞానంతో సన్యాసాన్ని స్వీకరిస్తేనే సిద్ధి కలుగుతుంది. జ్ఞానం లేకుండా మరే ఇతర కారణాల వల్ల కర్మల్ని విడిచి పెట్టినా అది సన్యాసము అనిపించు కోదు. ఒకవేళ అనిపించు కోవచ్చు, కాషాయం కనిపిస్తూ ఉంది కనుక. సిద్ధి మాత్రం కుందేటి కొమ్మే అని భగవంతుడు నిశ్చయంగా చెబుతున్నాడు.

వివేకం లేకుండా, రాగద్వేషాలను తటస్థ పరచ కుండా సన్యాసం పుచ్చుకొని ఏమి సాధిస్తారు? రాగద్వేషాల

ప్రపంచాన్నే సాధించు కుంటారు. శ్రవణాదులే ప్రధాన మనుకొని సన్యాసమును స్వీకరించిన వారు వివిదిషా సన్యాసులుగా జీవితాన్ని కొనసాగించాలి. నేటి సమాజంలో సన్యాసులు అలా ఉన్నారా?

కొందరు పాట కచేరీలు చేస్తున్నారు. కొందరు నాట్యం చేస్తున్నారు. కొందరు నాటకాలు వేస్తున్నారు. కొందరు చలనచిత్ర కార్యక్రమాల్లో తల మునకలై ఉన్నారు. కొందరు రాజకీయాలు నడుపుతున్నారు. కొందరు సమాజ అభ్యుదయాన్ని కాంక్షించి ఉద్యమాలు నడుపు తున్నారు. నిరసన వ్రతాలేనా! నిరాహార దీక్షలేనా! అదేమిటంటే, ఆ సంరక్షణ - ఈ సంరక్షణ అంటారు. అంతేగాని సన్యాసానికే రక్షణ కరువైందని గుర్తించరు. వీరికి విషయాల యందు ఉత్సాహమే గాని, ఉపనిషత్తుల మీద మనస్సుంటే కదా! ఇక మరీ వైపరీత్యం ముంచుకొస్తే, విద్వత్తు కలిగి, శ్రమించి గ్రంథరచన చేసిన సాధువుల గ్రంథాల నుండి విషయాలను దొంగిలించి, అదంతా తమ జ్ఞానమే అన్నట్లు ఊగిపోతూ, తల-తోక లేని ప్రసంగాలు చేస్తుంటారు. ఎంగిలి కూడా మంగళమే అనే స్థాయికి సన్యాసం నేడు దిగజారి పోయింది.

దీని కంతటికి కారణ మేమిటి? ఏముంది! రాగద్వేషాలను తటస్థ పరచకుండా, కర్మయోగంలో పరిపక్వత చెందకుండా, సన్యాసం స్వీకరించడమే. రాగద్వేషాలను తటస్థ పరచే అవకాశం కర్మయోగంలో ఉందే గాని, సన్యాసంలో లేదు. రాగద్వేషాలు తటస్థ పడకుండా సన్యాసం స్వీకరించిన వారు ఇటు కర్మయోగులూ కారు. అటు సన్యాసులూ కారు. సిద్ధి ఎలాగూ లేదు. కనీసం శుద్ధి కూడా లేకుండా పోతుంది.

కనుక, కర్మసన్యాస మనేది వట్టి మాటల పంచాంగం కాదు. కర్మయోగి అయిన వాడే కర్మసన్యాసి కాగలడు. జ్ఞానం లేకుండా కేవలం కర్మలను విడిచిన వాడు సన్యాసి కాలేడు. అయినా కర్మ చేయకుండా ఉండటం సులభమైన కార్యం కాదు. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

న హి కశ్చిత్ క్షణ మపి జాతు తిష్ఠ త్యకర్మకృత్।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః ॥ 5

న-హి-కశ్చిత్-క్షణం-అపి-జాతు-తిష్ఠతి-అకర్మకృత్
కార్యతే-హి-అవశః-కర్మ-సర్వః-ప్రకృతిజైః-గుణైః

కశ్చిత్	=	ఎవడును	గుణైః	=	గుణముల చేత
జాతు	=	ఒకప్పుడును	సర్వః	=	ప్రతివాడు
క్షణమపి	=	క్షణ మైనను	అవశః	=	అస్వతంత్రుడై
అకర్మకృత్	=	కర్మ చేయని వాడై	కర్మ	=	కర్మను
న తిష్ఠతి హి	=	ఉండడు గదా	కార్యతే హి	=	చేస్తున్నాడు
ప్రకృతిజైః	=	ప్రకృతి సిద్ధమైన			

కర్మ చేయకుండా ఎవ్వడూ క్షణం కూడా ఉండలేడు. స్వభావము వల్ల పుట్టిన గుణాలు మానవుని ప్రేరేపిస్తున్నాయి. వాటికి అనుగుణంగా అస్వతంత్రుడై మానవుడు కర్మల నాచరిస్తున్నాడు.

వ్యాఖ్య

కర్మ ప్రపంచంలో నిర్విరామంగా కూరుకు పోయిన కర్మజీవులు మానవులు. కర్మ చేయకపోతే జీవనం సాగదు. ప్రతి మనిషి దేహంలో కర్మ సాగుతూనే ఉంటుంది. తెలిసి ప్రత్యక్షంగా కొన్ని కర్మలు నడుస్తూ ఉంటే, మన ప్రమేయం లేకుండానే పరోక్షంగా ఎన్నో కర్మలు సాగుతూ ఉంటాయి. కొనసాగుతూనే ఉంటాయి. కొన ఊపిరి వరకు కర్మలు కదుల్తూనే ఉంటాయి. ఊపిరి పోసుకోవడం కర్మ. ఊపిరి పీల్చుకోవడం కర్మ.

చలనాత్మకం కర్మ. కర్మ అంటే ఏదో కాదు. ఎక్కడ ఏ చలనం కలిగినా అది కర్మే. మొక్క పెరగడం కర్మ. మొగ్గ తొడగడం కర్మ. పువ్వు పూయడం కర్మ. కాయ కాయడం కర్మ. పండు పండటం కర్మ. పండి రాలడం కర్మ.

బండి ఎక్కడం కర్మ. బండి దిగడం కర్మ. మధ్యలో కూర్చుని ఉండటం కర్మ. తిండి తినడం కర్మ. తిండి మానడం కర్మ. అన్నీ కర్మలే. కర్మ లేకుండా క్షణం గడవదు. క్షణకాలం ముందుకు పోవాలి అంటే కర్మ జరగాలి. గడియారాన్ని చూచి కాలాన్ని నిర్ణయిస్తాం. క్షణాలు, నిముషాలు, గంటలు ఎలా కదలి పోతున్నాయో గడియారం చూపిస్తుంది. కాలం ఎంతైనా కావచ్చు. ఎన్ని గంటలైనా కావచ్చు. అలా గంటలు సాగడ మనేది క్షణాలు సాగడంపై ఆధారపడి ఉంటుంది. క్షణం కదిలి వెనక్కి వెళితేనే నిముషం వస్తుంది. కదులుతున్న క్షణంలో సాగే కాలంలో క్షణక్షణము కర్మే. కర్మ లేని క్షణం లేదు. ఏ ఒక్కడూ కర్మ చెయ్యకుండా క్షణం కూడా ఉండలేడు (***న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మ కృత్***).

కాయము ఉన్న వాడెవ్వడూ కర్మ నుండి తప్పుకో లేడు. కర్మ కారణంగా వచ్చిన దేహము కర్మ తోనే సాగి సాగి, చివరగా అంతరించడం అనే కర్మతో అదృశ్యమై, ఆ తరువాత కూడా కర్మ చేయించు కుంటుంది. కర్మ లేకుండా జీవనం సాగదు. జననం కర్మ. జీవనం కర్మ. మరణం కర్మ.

నేను రెండు గంటలు కర్మ చేయకుండా ఉంటాను అని ఒక వ్యక్తి వ్రతాన్ని చేపట్టవచ్చు. ఒక వైపు మౌన వ్రతము సాగుతూ ఉంటుంది. మరొక వైపు నేను ఏమీ మాట్లాడటం లేదు అనే మననం మనస్సులో కొనసాగు తూనే ఉంటుంది. మననం కూడా కర్మే. మానసకర్మ.

దేహంలో అణువణువున చలన ముంది. అది కర్మ. కణకణములో చలన ముంది. అదీ కర్మే. గుండె కొట్టుకొంటూ సాగడం కర్మ. గుండె కొట్టుకోలేక ఆగడం కర్మ. అంత్యక్రియ జరగ డానికి గుండె ఆగిపోవడము అనే కర్మే కారణము.

దేహంలో నిరంతరము కర్మలు సాగుతూనే ఉన్నాయి. ఊపిరితిత్తులు పని చేస్తున్నాయి. రక్త ప్రసారం జరుగుతూ ఉంది. శ్వాసలు కదులుతూ ఉన్నాయి. మనస్సులో ఆలోచనలు నడుస్తూ ఉన్నాయి. ఇవన్నీ కర్మలే. కళ్ళు మూయడం కర్మ. కళ్ళు తెరవడం కర్మ. నిద్ర పోవడం కర్మ. నిద్ర మేల్కొనడం కర్మ. కర్మ కానిది ఏముంది? కర్మ చేయని వారు ఎవరున్నారు?

కాలు నిలవని పిల్లవాడిని, ఎందుకలా తిరుగుతావు? కొంతసేపు కదలకుండా కూర్చో! అని మనం ఒక్కొక్కసారి శాసిస్తూ ఉంటాము. అలా కూర్చున్న పిల్లవాడు కొంతసేపైన తరువాత, ఇలా ఎంతసేపు కూర్చోవాలి? పనీ పాట లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవడం నా వల్ల కాదు అంటాడు. అలా అంటాడే గాని, గోళ్ళు గిల్లుకోవడం కూడా కర్మే అని అర్థం చేసుకోలేడు. కర్మల నుండి విడి పడటం ఎవ్వరికీ సాధ్యం కాదు.

అబ్బ! చాలా శ్రమపడి పోయాను. కొంతసేపు అలా ఫ్యాను క్రింద కూర్చుని విశ్రాంతి తీసుకుంటాను అనుకుంటూ ఫ్యాను క్రింద కుర్చీలో కూర్చుంటాడు ఓ వ్యక్తి. అతడు ఏమీ చేయకున్నా, ఫ్యాను గాలికి తలపై వెంట్రుకలు కదులుతూ ఉంటాయి. అదీ కర్మే.

కర్మ చేయడం కష్టం అనుకుంటారు చాలా మంది. కాని, కర్మ చేయకుండా ఉండటం ఎంత కష్టమో కర్మను ఆపితే గాని తెలియదు. అందుకే, సన్యాసము అందరికీ సాధ్య పడదు. సమ్మెలు విఫల మయ్యేది కూడా ఇక్కడే.

సృష్టికి కర్త ఉన్నాడు. ఆయనే సృష్టికర్త. సృష్టికర్త కార్యమే సృష్టి. సృష్టి అనేది కర్మ. సృష్టే కర్మ అయి నపుడు, సృష్టిలో ఉన్న మానవుడు కర్మకు ఎలా దూరం అవుతాడు? విమానం గాలిలో ఎగురుతూ ఉంది. విమానంలో ప్రయాణం చేసే వాడు ఎగరక పోయినా ఎగిరిన వాడే. ఈ సత్యం ఎరిగిన వాడే.

ఆఖ్యాయిక

నలుగురు స్నేహితులు కలిసి ఒక పోటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎవరు పది గంటల సేపు మాట్లాడకుండా కూర్చుంటారో వారు విజేతలు. గెలిచిన వారికి ఒక చేతి గడియారము బహుమానము.

పోటీ కార్యక్రమం ప్రారంభమైంది. గంట గడిచింది. స్నేహితులు ఒకరిని ఒకరు చూసుకొని ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. మరొక గంట గడిచింది. ఒకడు మరొకణ్ణి సైగతో, ఎలా ఉంది నీకు? అని అడిగాడు.

రెండవ వాడు బాగానే ఉంది అని తల ఊపాడు. అది చూచి మూడవ వాడు, అలా సైగలు కూడా చేసుకోకూడదు! అన్నాడు. వెంటనే, మొదటివాడు మూడవ వాడితో, ఏయ్! నువ్వు మాట్లాడేశావ్! పోటీ నుండి నువ్వు విరమించినట్లే! అన్నాడు. అది వినగానే, తల ఊపిన రెండవ వాడు పకపక నవ్వుతూ నువ్వు మాత్రం మాట్లాడ లేదేంటి? నువ్వూ ఓడి పోయినట్లే అన్నాడు.

ఇక, అంతవరకు మౌనంగా ఉన్న నాల్గవ వ్యక్తి, మీ విషయం నాకు తెలియదు గానీ, నేను మాత్రం మాట్లాడలేదు అన్నాడు. పోటీ సమయం ఇంకా ఎనిమిది గంటలు మిగిలి ఉంది. కర్మల్ని ఆపడం సాధ్యపడే పని కాదు. ఎందుకని కర్మలు అలా అనివార్య మవుతున్నాయి? వాటి వెనుక కారణా లున్నాయి.

కార్యకారణాలు

ప్రపంచం మాయా కార్యము. ఈ మాయా ప్రకృతిలో త్రిగుణాలు కదులుతూ ఉంటాయి. మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంటుంది. బ్రహ్మాశ్రయమైన మాయలో సత్త్వ రజస్తమో గుణాలు అనే త్రిగుణాలు ఉంటాయి. కారణమైన మాయా ప్రకృతిలో త్రిగుణాలు ఉన్నాయి కనుక, మాయా ప్రకృతికి కార్యమైన ఈ దృశ్యమాన ప్రపంచంలో కూడా త్రిగుణాలు ఉండి తీరాలి. కనుక, ఉన్నాయి. ప్రకృతి గుణాల ప్రభావాలను గూర్చి పదునాల్గవ అధ్యాయంలో భగవానుడు విశదంగా చర్చిస్తాడు.

మాయకు బద్ధుడైన మానవుడు మాయా కార్యమైన గుణాల ఒత్తిడి వల్ల కర్మలను ఆచరిస్తూ ఉంటాడు. అస్వతంత్రుడై చరిస్తూ ఉంటాడు. కనుక, కర్మలను నిరోధించడం సాధ్యం కాదు. కర్మలను ఎలాగూ నిగ్రహించడం, నిరోధించడం సాధ్య పడదు కనుక, ఈశ్వర భావనతో కర్మల నాచరించి, బంధహేతువైన కర్మలను జ్ఞాననిష్ఠకు హేతువైన కర్మయోగంగా మార్చుకోమని పవిత్రమైన కర్మయోగ నిష్ఠను భగవంతుడు ఉపదేశిస్తున్నాడు.

ఇక్కడ అతి ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. త్రిగుణాలు అజ్ఞానిని చలింప చేస్తాయే గాని, జ్ఞానిపై తమ ప్రభావాన్ని చూపలేవు. జ్ఞాని గుణాతీతుడు. నిస్త్రైగుణ్యుడు. *ఉదాసీనవత్ ఆసీనః, గుణైః యః న విచాల్యతే* - ఉదాసీనుడుగా ఆసీనుడైన జ్ఞాని గుణాల వల్ల చలించడు అని పద్నాల్గవ అధ్యాయం - గుణత్రయ విభాగ యోగంలో గీతాచార్యుడే చెబుతాడు. అంటే, గుణాలు అజ్ఞానినే చలింప చేస్తాయి అని అర్థం. అందుచేతనే శ్రీశంకర భాష్యంలో, ***అజ్ఞః ఇతి వాక్య శేషః*** అనడం జరిగింది. అంటే, ఈ శ్లోకానికి ***అజ్ఞః*** - 'అజ్ఞాని' అనే పదాన్ని చేర్చి అర్థం చేసుకోవాలి అన్నారు ఆచార్యులు. గుణాలు అజ్ఞానిని చలింప చేస్తాయే గాని, జ్ఞానిని చలింప చేయలేవు అనే సత్యాన్ని గుర్తించ మని దాని భావం.

జ్ఞాని కానివాడు గుణాల చేత చలిస్తూ, ఇంద్రియ వ్యాపారాలను మాత్రమే నిగ్రహించి, యథేచ్ఛగా మనో వ్యాపారాన్ని సాగిస్తూ ఉంటాడు. అట్టి కపటిని కనిపెట్టి చూపుతున్నాడు.

కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇన్ద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే ॥ 6

కర్మేంద్రియాణి-సంయమ్య-యః-ఆస్తే-మనసా-స్మరన్
ఇంద్రియార్థాన్-విమూఢాత్మా-మిథ్యాచారః-సః-ఉచ్యతే

యః	= ఎవడు	ఆస్తే	= ఉంటాడో
కర్మేంద్రియాణి	= కర్మేంద్రియములను	సః	= వాడు
సంయమ్య	= నియమించి	విమూఢాత్మా	= వివేక శూన్యుడు
మనసా	= మనస్సు చేత	మిథ్యాచారః	= కపటి అని
ఇంద్రియార్థాన్	= శబ్దాది ఇంద్రియ విషయాలను	ఉచ్యతే	= చెప్పబడుతున్నాడు
స్మరన్	= స్మరిస్తూ		

కపటమైన ఆచరణ కలవాడు వివేక శూన్యుడు. కేవలం కర్మేంద్రియాలను అణచి పెడతాడు. అతని మనస్సు మాత్రం ఇంద్రియ విషయాలనే చింతిస్తూ ఉంటుంది.

వ్యాఖ్య

మనం ఏమి సాధించాలో మనకు క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. దానితో పాటు మన అర్హత ఏమిటో కూడా మనకు అర్థం కావాలి. అర్హతలే ఎప్పుడైనా, ఎక్కడైనా అందల మెక్కుతాయి. దంభముతో కూడిన ఆచారాలు, దర్పముతో కూడిన వ్యవహారాలు బ్రతుకును చీకటిమయం చేస్తాయి.

దురహంకారము బ్రతుకులో సుఖాన్ని దూరం చేస్తుంది. తెలిసి చేసినా, తెలియక చేసినా పాపాచారము మనిషిలో పవిత్రతను లేకుండా చేస్తుంది. జ్ఞానం లేకుండా కర్మలలో ప్రదర్శించే అనవసరమైన ఆర్భాటాలు, అర్థరహితమైన ఆరాటాలు ఆరోగ్యప్రదము కావు.

హితమైన ఆహారమును తీసుకుంటే ఆరోగ్యం కలుగుతుంది. అహితమైన ఆహారము అనారోగ్యాన్ని తెచ్చి పెడుతుంది. నిరాహారము దేహాన్నే నశింప చేస్తుంది. కర్మలు కూడా అంతే. నిష్కామ కర్మలు ప్రశాంతతను ప్రసాదిస్తాయి. సకామ కర్మలు అశాంతిని కలిగిస్తాయి. నైష్కర్మ్యం పేరుతో ప్రదర్శింప బడే అకర్మ అధోగతికి దారి తీస్తుంది. జ్ఞానం లేకుండా కర్మత్యాగం చేసే వాడు అజ్ఞుడు. అవివేకి. కపటి.

మూఢాచారము

మనోనిగ్రహం లేకుండా కేవలం ఇంద్రియాలను నియమించడం నిగ్రహం క్రిందికి రాదు. ఇంద్రియాలు తమంతట తాము విషయాలలో రమించ లేవు అని ఇప్పటికే మనం తెలుసు కున్నాము. మనస్సు ఇంద్రియాలతో చేరినపుడే విషయానుభవము కలుగుతుంది. అలాంటప్పుడు కేవలం దంభముతో, మూర్ఖంగా, మౌఢ్యంగా ఇంద్రియాలను మాత్రం నిగ్రహించి, మనస్సును నిగ్రహించలేని వ్యక్తులు ఎప్పుడైనా, ఎక్కడైనా విగ్రహరూపులే గాని, నిగ్రహవంతులు కాలేరు. పైగా, అలాంటి విమూఢులు మిథ్యాచారులు అవుతారు అంటున్నాడు భగవంతుడు ***(సః విమూఢాత్మా మిథ్యాచారః ఉచ్యతే)***.

'మిథ్య' అంటే సత్యము కానిది. 'ఆచారము' అంటే ప్రవర్తనము. 'మిథ్యాచారము' అంటే అసత్య

ప్రవర్తనము. కపట వర్తనము. అట్టి కపట వర్తనము కలవాడు విమూఢుడు. అట్టి విమూఢుడు మిథ్యాచారుడు. శ్రీఆది శంకరాచార్యుల వారు అతని ప్రవర్తనను పాపంగా నిర్ణయించారు. విమూఢుడైన మిథ్యాచారుడు పాపాచారము కలవాడు అన్నారు ***(విమూఢాత్మా విమూఢ అన్తఃకరణః మిథ్యాచారః మృషాచారః పాపాచారః సః ఉచ్యతే)***.

ఇంద్రియాలు బాహ్యకరణాలు. మనస్సు అంతఃకరణము. అంతఃకరణములో మూఢత్వము కలవాడు కనుక మిథ్యాచారుడు విమూఢుడు అని పిలువ బడ్డాడు. ఇక్కడ మిథ్యాచారుని కపట వర్తనము ఏమిటి?

తాను నైష్కర్మ్య సిద్ధిని పొందిన జ్ఞానిగా అభినయించడమే మిథ్యాచారము. ఇంద్రియాలను విషయాలలోకి వెళ్ళకుండా నిరోధిస్తాడు. బాహ్య విషయాల పట్ల ఆసక్తి లేనట్లు వ్యవహరిస్తాడు. ఏ విషయాలను బాహ్యంలో విస్మరించి విసర్జించాడో, వాటినే మనస్సులో తదేకంగా స్మరిస్తూ ఉంటాడు. ఇంతకు మించి కపట వర్తనము ఏముంటుంది?

ఇంద్రియాలను అరికట్టి, లేదా బిగబట్టి, మనస్సులో కోరికల్ని అదుపు చేయలే నపుడు నిగ్రహము అనే మాటకు అర్థం ఎక్కడుంది? తాను ఏమీ చేయడం లేదు కనుక, ఇంద్రియ విషయాల నుండి ఇంద్రియాలను నిగ్రహించి ఉన్నాడు కనుక, తాను నిజం గానే నిష్క్రియత్వంలో ఉన్నట్లు నటిస్తూ ఉంటాడు. ఇదే కపట వర్తనము.

ఇంద్రియ విషయాలను అనుభవించక పోయినా, మనస్సులో అవే ఆలోచనల్ని సాగించే వ్యక్తికి నిష్క్రియత్వ మెక్కడుంది? నిష్క్రియత్వ మంటే ఏమిటి? ఆత్మతత్త్వమే నిష్క్రియత్వము. ఆత్మ నిష్క్రియము. నిరంజనము. శాంతము. ఇది తనకు తాను అర్థం చేసుకో వలసిన విషయమా? లేక, పరుల కొరకు అభినయించ దగిన విషయమా? జ్ఞానం లేని మూర్ఖుడు కనుక, అజ్ఞాన ప్రదర్శన లిస్తూ కాలం వెళ్ళబుచ్చుతూ ఉంటాడు. వింత ప్రవర్తనతో అమాయకులను మాయ చేస్తూ ఉంటాడు. అతడే మిథ్యాచారుడు.

కదలకుండా కూర్చుంటాడు. అది నిష్క్రియత్వం అని ఆయన అభిప్రాయము. అదే నిజమైతే, గోడలన్నీ జ్ఞానులే. కళ్ళు ఆర్పకుండా చూస్తూ ఉంటాడు. ఆయన ఏదో కర్మలో అకర్మను దర్శిస్తున్నట్లు జనం భావించాలని మనస్సులో తహతహ లాడుతూ ఉంటాడు. అలా చూడటమే సమదర్శన మైతే, కిటికీ లన్నీ జ్ఞానులే.

బూడిద పూసుకొని చెట్ల క్రింద ఆసీనులయ్యే వాళ్ళు, ముందు మంట వేసుకొని చలి కాచుకొనే భంగిమలో కూర్చునే వాళ్ళు, కౌపీనంతో ఎండలో, వానలో తిరిగే వాళ్ళు, ఏదో ఆత్మానందాన్ని అనుభవిస్తున్నట్లు అప్పుడప్పుడు మందహాసం చిందిస్తూ కొంగ ల్లాగా ఆకాశం వైపు చూచేవాళ్ళు, ఓహ్! ఎన్ని వేషాలని? ఎన్ని భంగిమలని? మిథ్యాచారానికి మ్రింగుడు పడని అసత్యమే లేదు.

ముఖ్యంగా, అవధూతలు అని చెప్పుకొంటూ తిరిగే వాళ్ళలో నూటికి తొంభై మంది మిథ్యాచారులే అనేది నా జీవితానుభవము. బ్రతుకుకు అర్థం తెలియక, జడలు పెంచుకొని, బట్టలూడ దీసుకొని, బజారున పడి, ఉలుకు పలుకు లేకుండా, మందమతుల్ని ఊరించే ఈ మిథ్యా జ్ఞానుల్ని చిన్నతనంలో నేను చాలా మందిని చూశాను. వివేకం కన్నా విశ్వాసమే మెండుగా ఉన్న ఆ దశలో ఎంత మందిని విశ్వసించానో, ఆ తరువాత ఎంతగా కుమిలి పోయానో! అందుకే ఇలాంటి దౌర్భాగ్యుల్ని 'మూఢులు' అని సరిపెట్టుకో లేక 'విమూఢులు' అని ఛీ కొట్టాడు గీతాచార్యుడు.

ఏం చేద్దాం! అజ్ఞాన దశలో అన్నీ ఆనందాలే. విడ్డూరాలన్నీ వింతలు గానే కనిపిస్తాయి. పిచ్చివాళ్ళను కూడా పరమహంసలుగా ప్రజలు రూపొందించిన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. పరమహంసల్ని చూడాలని ఉబలాట పడే పిచ్చి భక్తులు, పిచ్చివాళ్ళనే పరమహంసలుగా భావించి అర్చిస్తే, వాళ్ళ అమాయకత్వాన్ని తప్పు

పట్టలేము గాని, ఆ అమాయకత్వాన్నే ఆత్మానుభూతిగా భావిస్తే మాత్రం, ఆ తరువాత వచ్చే ప్రమాదాన్ని వారు భరించ గలరా అనేది సందేహం.

మిథ్యాచారు లేమో జ్ఞానం లేక పోయినా, అర్థరహిత మైన విచిత్ర వేషాలతో, వింత ప్రవర్తనలతో ప్రదర్శన లిచ్చి, కాలంలో కనుమరుగై పోతారు. ఆ తరువాత, అమాయకులు ఒక వైపు, గోముఖ వ్యాఘ్రాలు మరో వైపు సందడులకు శ్రీకారం చుట్టి అంగడులు తెరుస్తారు.

ఆ మహాత్ముడు చావలేదు. ఆయనకు చావు లేదు. చావు రాదు. ఆయన బ్రతికే ఉన్నాడు. రాత్రి మా ఇంటి కొచ్చాడు. ఒరే! నీ ఇంట్లో భోంచేయాలని వచ్చానురా! అన్నాడు. అంతే. నేను పీట వేశాను. మా అమ్మ విస్తర వేసి అన్నం వడ్డించింది. నా భార్య పులుసు పోసింది. మా పెద్దబ్బాయి వంకాయ కూర వడ్డించాడు. మా చిన్నమ్మాయి రసం పోసింది. మా మేనత్త మజ్జిగ పోసింది. ఖాళీ విస్తర నేనే ఎత్తేశాను. చెయ్యి కడుగు కొనేందుకు పెరట్లో వేపచెట్టు వెనక్కి భగవాన్ వెళ్ళాడు. తువాలు తెద్దామని నేను లోనికి వెళ్ళాను. అంతే! తిరిగి వచ్చే సరికి ఆయన లేడు. ఇదీ కథ.

అంతే. ఆ తరువాత అతణ్ణి చుట్టేస్తారు జనం. అతని రెండు చేతుల్ని తమ చేతుల్లోకి తీసికొని కళ్ళ కద్దుకుంటారు. భగవాన్ భోంచేసిన విస్తరను ఎత్తి వేసిన ఈ చేతులు ఎంత పుణ్యం చేసుకున్నాయో! అని సామాన్యులు కూడా ఆ సందర్భంలో కవుల అవతార మెత్తుతారు. ఏవో నాలుగు అక్షరాలు పొట్టలో పడేసుకొని, అవి వినేవాళ్ళు ఎప్పుడు దొరుకుతారా! అని ఎదురు చూసే ఒక కవి, ఈ చేతుల పుణ్యాలు, పుణ్య వాక్యాలు వినగానే, అమాంతం రెచ్చిపోయి **కమలాక్షు నర్చించు కరములు కరములు** అంటూ ఆయన రాగాన్ని ఆయన వినిపించి పని పూర్తయిందని వెళ్ళి పోతాడు.

ఇలా ఒకరిని మించి ఒకరు వింత వింత అనుభవాలను ఊహించుకొని చాటుతూ ఉంటారు. కవులు కలాలు పట్టి కల్లబొల్లి కథలు, చరిత్రలు వ్రాసేస్తారు. ఇక ఆ తరువాత, పారాయణాలేనా! భజన లేనా! గుళ్ళేనా! గోపురా లేనా! సందడే సందడి. అంగడే అంగడి.

హృషీకేశుని హెచ్చరిక

ఇలాంటి వ్యక్తుల విషయంలో జాగ్రత్త వహించక పోతే, ఆ తరువాత ఆధ్యాత్మిక జీవనమే దారి తప్పి మనిషి దగా పడే అవకాశము లేక పోలేదు. అటు మిథ్యాచారుడు కూడా డాంబికత్వంతో జ్ఞానాన్ని పొందే అవకాశాన్ని జారవిడుచు కోవడమే గాక, చిత్తశుద్ధికి కూడా మార్గాన్ని మూసేసు కుంటాడు. ఛిద్రమైన భావాలతో, క్షుద్రమైన సంకల్పాలతో బ్రతుకునే బుగ్గి చేసుకుంటాడు. కాలం వ్యర్థ మవుతూ ఉంటుంది. బ్రతుకు వృథా అయిపోతుంది. ఇలాంటి అప్రయోజకుల మాయలో పడి అమాయకులైన సాధకులు అన్యాయ మవుతూ ఉంటారు.

మోసము తెలియదు మోసముగా
వంచన అగుపించు మంచిదిగా
సాధువుగా లంకేశుడు
పసిడి లేడిగా మారీచుడు
మాటల వెనుక మర్మములు
మహిలో ఎన్నో మోసాలు
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

మూర్ఖత్వంతో ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించి, మనస్సులో పూర్వం అనుభవించిన వాటిని, ఇక ముందు అనుభవించాలని భావించే వాటిని నెమరు వేసుకోవడం కన్నా, డాంబికత్వాన్ని త్యజించి, పవిత్ర మైన కర్మయోగంలో చరించి, రాగద్వేషాలను తటస్థ పరచుకొని, జ్ఞాననిష్ఠకు సిద్ధం కావడమే దివ్యమైన మార్గ మని గీతాచార్యుడు బోధిస్తున్నాడు. అనర్థదాయక మైన మార్గంలో పయనించి, బ్రతుకును అన్యాయం చేసుకో వద్దని హెచ్చరిస్తున్నాడు.

తిరిగే రాతికి పాచి పట్టదు

సాధన అనేది చెప్పుకున్నంత సులువైన విషయం కాదు. శిక్షణ లేని మనస్సులకు అనుకున్నంత అనువైన విషయమూ కాదు. తిరిగే మనస్సును కూర్చోబెట్టడం మహామహులకే దుస్సాధ్యంగా ఉంటుంది. ఇక, సామాన్యుల విషయం ప్రత్యేకంగా చెప్పాలా?

మిథ్యాచారులకే కాదు, సదాచారవంతు లకు కూడా మనస్సు నిలబడదు. కాకపోతే, సదాచారవంతు డైన సాధకునికి ప్రయత్నమైనా ఉంది. మిథ్యాచారునికి ఆ అవకాశం కూడా ఉండదు. అర్హత లేకపోయినా డాంబికంగా ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సుతో ఇంద్రియ వ్యాపారాల్ని సాగిస్తూ, శుద్ధిపడే అవకాశాన్ని కూడా జారవిడుచు కోకుండా, అటువంటి మిథ్యా జీవనానికి స్వస్తి పలికి, కర్మయోగంలో కొనసాగితే, మనస్సు శుద్ధి పడుతుంది. కర్మయోగాన్ని అనుష్ఠించ లేకపోయినా, కనీసం కర్మ ప్రవాహంలో కొనసాగుతూ ఉండినా, కర్మాచరణంలో తల మునకలై ఉండటం చేత కొంతైనా మనస్సు నియమింపబడే అవకాశం ఉంటుంది. మిథ్యాచార జీవనం కన్నా, అజ్ఞానంతో కూడినదే అయినా, కర్మాచరణమే మేలు.

జలాలలో కదల కుండా ఉండే రాతికే పాచి పడుతుంది. మంచి ముత్యాలకు ఎలాగూ పాచి పట్టదు. తిరిగే రాతికి కూడా పాచి పట్టదు. కర్మయోగి మంచి ముత్యం లాంటివాడు. కర్మి తిరిగే రాయి లాంటి వాడు. మిథ్యాచారుడు కదలలేని బండ లాంటి వాడు. జీవన ప్రవాహం లోనే అందరూ ఉన్నారు. జీవించే విధానాన్ని బట్టి వెలుగులు ఉంటాయి. లేదా, వెతలే మిగుల్తాయి.

తనిఖీ కేంద్రాలు

రహదారులలో, అక్కడక్కడ ప్రభుత్వము తనిఖీ కేంద్రాలను (చెక్‌పోస్టులు) ఏర్పాటు చేస్తుంది. ఆ కేంద్రాల వద్ద, ప్రయాణం చేసే వాహనాలను ఆపి, తనిఖీలు నిర్వహిస్తారు. తరలించ కూడని వస్తువుల్ని తరలిస్తున్నా రేమో అని పరీక్షించి చూస్తారు. అలాంటివి ఏవీ లేకపోతే, సజావుగా ముందుకు సాగనిస్తారు. ఒకవేళ అలాంటి నిషిద్ధమైన వస్తువులు ఉంటే వాటిని అక్కడే దించి, ఆ తరువాత వాహనాలను ముందుకు పోనిస్తూ ఉంటారు.

ఆధ్యాత్మిక జీవన రహదారిలో కూడా ఇలాంటి తనిఖీ కేంద్రాలు చాలా అవసరం. గీతలో అనేక చోట్ల తనిఖీ కేంద్రాల వంటి శ్లోకాలు దర్శన మిస్తాయి. సాధన మార్గంలో అవసరం లేనివి, అనర్థాన్ని కలిగించేవి మనతో కలసి ప్రయాణం చేస్తున్నాయా! అని మనల్ని మనం పరీక్షించు కోవడానికి ఈ తనిఖీ కేంద్రాల వంటి శ్లోకాలు ఉపకరిస్తాయి.

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోకం అలాంటిదే. మిథ్యాచారుల్ని గూర్చి తెలుసుకుంటే మనకు ఒరిగే దేముంటుంది? అలాంటి మిథ్యా జీవనము తెలిసో, తెలియకో మనలో కూడా కొద్దో, గొప్పో ప్రవేశించి ఉంటే, దానిని తొలగించుకొని ప్రయాణాన్ని సుగమం చేసుకోవడానికి ఇలాంటి శ్లోకాలు ఉపకరిస్తాయి. ఆత్మ పరిశీలనకు ఎంతగానో దోహద పడతాయి.

మనో నిగ్రహమే సాధకునికి ప్రశస్త మైన సాధన. మనసు ఒక్కటి నిగ్రహింప బడితే, మనుగడలో వెలుగుల

తోరణాలు కనిపిస్తాయి. మనస్సు నిగ్రహాన్ని కోల్పోతే, బ్రతుకులో అన్నీ చీకటి కోణాలే ఎదు రవుతాయి. మనస్సు మనది అయినపుడు ఎక్కడి కెళ్ళినా, ఏది చేసినా బాధ ఉండదు. బరువు తెలియదు. మన మనస్సే మనది కానపుడు ఏది చేసినా, ఏది చూసినా వెతలే ఎదు రవుతాయి, కలతలే కనిపిస్తాయి. ఈ సత్యాన్ని మహాభారతం అద్భుతంగా, భావగర్భితంగా ప్రవచించింది.

నాన్తస్య కిం అరణ్యేన తథా నాన్తస్య భారత
యస్త్యైవ నివసేద్దాంతః తత్ అరణ్యం స చాశ్రమః ॥

అంతఃకరణమును నిగ్రహించ గలిగే వారు అరణ్యాలకు పోవలసిన అవసర మేముంది? అంతఃకరణ మును నిగ్రహించ లేని వారు అరణ్యాలకు పోయి మాత్రం సాధించే దేముంటుంది? ఎవరు మనస్సును నియమిస్తారో, వారు ఎక్కడ ఉంటే అదే అరణ్యం. అదే ఆశ్రమం (*తదరణ్యం స చాశ్రమః*).

అలాంటి ఉత్తమ జీవన విధానానికి తెరదీస్తూ, తరువాత శ్లోకాన్ని బోధిస్తున్నాడు భగవంతుడు.

యస్త్వింద్రియాణి మనసా నియ మ్యారభ తేఽర్జున ।
కర్మేన్ద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే ॥ 7

యః-తు-ఇంద్రియాణి-మనసా-నియమ్య-ఆరభతే-అర్జున
కర్మేంద్రియైః-కర్మయోగం-అసక్తః-సః-విశిష్యతే

అర్జున	= అర్జునా!	కర్మయోగం	= కర్మయోగమును
యఃతు	= ఎవడయితే	అసక్తః	= ఆసక్తి లేనివాడై
ఇంద్రియాణి	= ఇంద్రియములను	ఆరభతే	= ఆరంభించునో
మనసా	= మనస్సు చేత	సః	= అతడు
నియమ్య	= నియమించి	విశిష్యతే	= శ్రేష్ఠుడు
కర్మేంద్రియైః	= కర్మేంద్రియముల చేత		

అర్జునా! శ్రేష్ఠుడు ఇంద్రియాలను మనస్సు చేత నియమిస్తాడు. ఆసక్తి లేకుండా, కర్మేంద్రియాల చేత కర్మ యోగమును ఆరంభిస్తాడు.

వ్యాఖ్య

కేవలం కర్మేంద్రియాలను నిగ్రహించి, మనస్సు చేత ఇంద్రియ వ్యాపారాలను సాగించే అవివేకి, ఎలా వ్యర్థ జీవిగా మారుతున్నాడో ఆరవ శ్లోకంలో చూశాం. అతడికి భిన్నంగా, మనస్సును నిగ్రహించి, కర్మేంద్రియాల ద్వారా విషయాలలో చరించే కర్మయోగి ఎలా ప్రగతిని సాధిస్తున్నాడో ప్రస్తుత శ్లోకంలో అర్థం చేసుకుంటున్నాం.

తనపై తనకు పట్టు లేనపుడు, కర్మేంద్రియాలను బిగబట్టి విషయానుభవానికి దూరమై సాధించేది ఏమీ ఉండదు. మనసులో విషయాసక్తిని విడిచి పెట్టిన యోగి, తనకు వశమైన మనస్సు చేత ఇంద్రియాలను విషయాలలో విడిచిపెట్టినా, కర్మయోగ ప్రభావము చేత బద్ధుడు కావడం లేదు. పైగా, పరమ పురుషార్థ ప్రాప్తికి అర్హు డగుచున్నాడు. ఈ శ్లోకంలో 'తు' అనే శబ్దము విషయము మారుతూ ఉంది అని తెలుపుటకు ప్రయోగింప బడింది.

వివేక బుద్ధి

ఇంద్రియాలను కర్మయోగి మనస్సు చేత నియమిస్తున్నాడు. మనస్సు ఇంద్రియాలను ఎలా

నియమిస్తుంది? మనస్సు లోని వివేకం చేత నియమిస్తుంది. అదే వివేక బుద్ధి. ఈ విధమైన అంతరేంద్రియ నిగ్రహముతో కర్మయోగి కర్మలను ఆరంభించి ఆచరిస్తాడు (*ఆరభతే*).

కర్మలను ఆరంభించడము అంటేనే, వాటి వెనుక కోరిక ఉంది అని భావము. అదే కర్మఫలాసక్తి. కర్మఫలానుభవము నందు ఆసక్తి, భోగానుభవ కాంక్ష. కాని, అది కర్మయోగికి లేదు.

కర్మయోగి విహిత కర్మలను ఆచరిస్తాడు. ఫలాసక్తి లేకుండా ఉంటాడు. ఫలం ఏదైనా అది అశాశ్వత మని అతడికి తెలుసు. అంతేకాదు, ఫలానుభవం మనస్సులో సంస్కారాన్ని ముద్రించి జన్మలకు తరలిస్తుంది అని కూడా తెలుసు. కనుక కర్మఫలాసక్తి లేకుండా ఈశ్వరారాధనా భావంతో కర్మల్ని ఆచరించి, చిత్తశుద్ధిని పొందుతాడు. అదే పరమధర్మంగా భావిస్తాడు (*స్వవిహిత వృత్త్యా భక్త్యా భగవదారాధనం పరమోధర్మః* - మధ్వాచార్యులు). మనస్సును నియమించి ఉన్నాడు కనుక రాగద్వేషాల నుండి విడిపడి ఉంటాడు. అతడి కర్మలు రాగద్వేషాల చేత కలుషితం కానందున, అతడు బద్ధుడు కాడు.

విహిత కర్మ ఏదో అదే స్వధర్మము. ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక, విహిత కర్మాచరణమును దైవారాధనగా భావిస్తాడు. తత్ఫలితంగా అంతఃకరణ శుద్ధిని పొందుతాడు.

సాధన భూయస్త్వే ఫల భూయస్త్వమ్ అనే న్యాయాన్ని అనుసరించి, సాధన అధికమయ్యే కొలది, ఫలము కూడా అధిక మవుతూ ఉంటుంది. మనస్సును నియమించి, రాగద్వేషాల నుండి విడిపడి, కర్మ ఫలాపేక్ష లేకుండా, ఈశ్వర భావన చేత కర్మయోగి ఎప్పుడైతే కర్మలు ఆచరిస్తున్నాడో, అతడు కర్మలను ఆచరిస్తూ ఉండినా, ఆ కర్మాచరణము పూర్వ వాసనలను ఒక వైపు క్షాళనం చేస్తూనే మరొక వైపు చిత్తశుద్ధిని అధికం చేస్తూ ఉంటుంది.

ఆరవ శ్లోకం లోని మిథ్యాచారుని జీవనము ఇందుకు భిన్నంగా ఉంటుంది. అతడు కర్మలను విరమించి ఉన్నాడు కనుక, విహిత కర్మల నుండి విముఖుడు. ధర్మాచరణానికి విదూరుడు. విషయవాంఛలకు దూరం కానందున వినష్టుడు. భగవ చ్చింతనానికి దూరుడు. అనుభవించక పోయినా విషయాలకు దగ్గర వాడు. సదా విషయస్మరణమే కర్తవ్యంగా కలవాడు. ఎలాగూ కర్మలను త్యజించి ఉన్నాడు కనుక పరభాగ్యోపజీవి.

అనాసక్తి

వివేకబుద్ధి కలిగిన యోగి కర్మేంద్రియాల ద్వారా కర్మలను ఆచరిస్తూ ఉండినా, విశిష్టుడే. ఎందుకో తెలుసా? అతడికి కర్మల యందు గాని, కర్మఫలాల యందు గాని ఆసక్తి లేదు (*అసక్తః*). అతడు ఫలాభిసంధి లేనివాడు.

విషయాల పట్ల ఆసక్తి లేదు. ఫలాకాంక్షతో కర్మలను ఆరంభించడం లేదు. ఎప్పుడైతే ఈ రెండిటిని త్యజించడం జరిగిందో, అలాంటి పావనాత్ముడు జ్ఞాననిష్ఠా మార్గానికి అర్హుడవుతున్నాడు (*తదుభయ పరిత్యాగే జ్ఞానకారీ భవేత్* - స్వయంప్రకాశ యతి).

భోగానుభవము నందు ఆశ లేనివాడు కనుక కర్మయోగి అసక్తుడు. కర్మయోగికి విషయాసక్తి ఎలా దూర మవుతుంది? వివేకం ఉంది కనుక. నిత్యానిత్య వస్తు వివేకం కలిగి ఉన్నాడు కనుక.

విషయాలు పరిచ్ఛేద రూపాలు. ఇంద్రియాలు పరిమిత పరికరాలు. మనస్సు చంచలము. ఇక ఎక్కడి భోగానుభవం? రూపాలను, రంగులను చూచి చూచి నేత్రాలు మొద్దుబారి పోతున్నాయి. మసక లవుతున్నాయి. వడపోసి వడపోసి మూత్రపిండాలు వాడి పోతున్నాయి. కొట్టుకొని కొట్టుకొని గుండె నీరస పడుతోంది.

అనుభవించిన భోగాలు రోగాలకు ద్వారాలు తెరుస్తున్నాయి. అనుభవంలో అవయవాలు అరిగి పోతున్నాయి. సుఖానుభవం ఎంతో అర్థం కాదు. దుఃఖానుభవమే అంతా. సుఖం అల్పం. క్లేశం అనల్పం. ఇదే విషయానుభవం **(సుఖమల్పం బహుక్లేశః విషయ గ్రాహిణాం నృణామ్)**. అందుకే కర్మయోగి అసక్తుడు.

ఆహారం లేకపోతే మనిషి జీవించ లేడు. అలాగని హానికరమైన ఆహారాన్ని తీసుకుంటే అనారోగ్యానికి గురి అవుతాడు. సాత్త్వికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటాడు.

ఆహారం లాంటిదే కర్మ కూడా. ఆహారానికి కర్మకు చాలా దగ్గర సంబంధ ముంది. ఆహారం లేకపోతే మనిషి కర్మ చేయలేడు. అలాగే కర్మ చేయకుండా ఆహారాన్ని పొంద లేడు. ఆ రెండిటికి అవినాభావ సంబంధం ఉంది. కనుక ఆహారం విషయంలో ఎలాగో కర్మ విషయంలో కూడా అలాగే ఉండాలి.

కర్మ చేయక పోతే మనిషి జీవించ లేడు. అలాగని సకామ కర్మలు చేస్తూ పోతే బంధంలో తగుల్కొంటాడు. నిష్కామ కర్మయోగంలో చరిస్తేనే బంధంలో చిక్కుకోడు. అంతేకాదు, చిత్తశుద్ధిని పొంది జ్ఞాననిష్ఠకు అర్హుడవుతాడు. కనుక, ఎవడైతే విషయాల యందు విరక్తిని, పరమేశ్వరుని యందు అనురక్తిని కలిగి ఉంటాడో అతడే యోగయుక్తుడు **(పరమాత్మని యో రక్తః విరక్తః అపరమాత్మని - ఉపనిషత్తు)**.

కృష్ణా! నాకు ఏదో ఒకటి నిశ్చయించి చెప్పు **(తదేకమ్ నిశ్చిత్య వద)** *అని రెండవ శ్లోకంలో అర్జునుడు అడిగాడు కదా! గీతాచార్యుడు చెబుతున్నాడు.*

నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః ॥ 8

నియతం-కురు-కర్మ-త్వం-కర్మ-జ్యాయః-హి-అకర్మణః
శరీరయాత్రా-అపి-చ-తే-న-ప్రసిద్ధ్యేత్-అకర్మణః

త్వం	=	నీవు	జ్యాయః హి	=	శ్రేష్ఠము కదా
నియతం	=	నియతమైన	అకర్మణః	=	కర్మ చేయని
కర్మ	=	కర్మను	తే	=	నీకు
కురు	=	చేయుము	శరీరయాత్రా అపి చ	=	శరీరయాత్ర కూడా
అకర్మణః	=	కర్మ చేయకుండుట కంటె	న ప్రసిద్ధ్యేత్	=	జరగదు
కర్మ	=	కర్మ			

నువ్వు మాత్రము నియత కర్మను చెయ్యి. కర్మను మానుట కంటే కర్మ చేయడమే శ్రేయస్కరము. కర్మ చేయకపోతే దేహయాత్ర కూడా సాగదు.

వ్యాఖ్య

నదిని దాటాలి అనుకుంటే, నదిలో దిగడం ఒక్కటే మార్గం. కర్మ సుడిగుండం నుండి బయటపడి తరించాలి అనుకుంటే, కర్మ చేయడం కన్నా మరొక మార్గం లేదు. ఈత వచ్చిన వాడు నదిలో దిగినా మునిగి పోడు. కర్మయోగి కర్మ ప్రవాహంలో ఈదుతున్నా, అతడు కర్మ వలయంలో చిక్కుకోడు. కర్మల చేత బద్ధుడు కాడు.

పని చేసి చేసి విసిగి పోయానండీ! ఇక నేను పని నుండి విరమించాలి అనుకుంటున్నాను అని చాలా మంది అంటూ ఉంటారు. కర్మలలో అలసట వారి చేత అలాంటి మాటలు పలికిస్తుంది. ఏదీ చెయ్యకుండా

ఉండటం ఎవ్వరికీ సాధ్యం కాదు. అలాగని, ఏదేదో చేసి ఎదలు పగలగొట్టు కోవడం కూడా మంచిది కాదు. ఏది చెయ్యాలో దానిని అవగాహనతో చేస్తే, కర్మ యోగంగా మారుతుంది.

మన ప్రమేయం లేకుండానే కొన్ని కర్మలు మన ద్వారా జరుగుతూ ఉంటాయి. శ్వాసక్రియ నడుస్తూ ఉంది. ప్రతి క్షణం నడుస్తూ ఉంది. కాని శ్వాసలను గూర్చి మనం ఆలోచించడం లేదు. శ్వాసించే ప్రయత్నము ప్రత్యేకంగా చేయడమూ లేదు. అవన్నీ సహజం గానే జరిగి పోతున్నాయి. అందుచేత వాటిని సహజ కర్మలు అంటారు. కళ్ళపై అదే పనిగ రెప్పలు పడుతూ లేస్తూ ఉంటాయి. దేహ చలనాలు జరుగుతూ ఉంటాయి. మూత్రపిండాలు పని చేస్తూ ఉంటాయి. కాలేయము ఖాళీగా ఉండదు. గుండె కొట్టుకుంటూనే ఉంటుంది. ఇవన్నీ సహజంగా జరిగిపోతూ ఉంటాయి. అందుకే అవి సహజ కర్మలు.

సహజ కర్మలు నడుస్తూ ఉంటేనే, జీవనయాత్ర సాగుతూ ఉంటుంది. వాటి వల్ల మనిషికి బంధము లేదు. అలాగే మోక్షము కూడా ఉండదు. అవి ఒక నియతికి కట్టుబడి నడిచేవే గాని, మనం పని కట్టుకొని ఆచరించే నియత కర్మలు కావు.

కర్మస్వేచ్ఛ

సహజ కర్మలు మానవులలో నడిచినట్లే, జంతువులలో కూడా నడుస్తాయి. మానవుని లాగా జంతువులకు కర్మస్వేచ్ఛ లేనందున, అవి బ్రతికినంత కాలం సహజ కర్మల మధ్యే జీవనాన్ని సాగిస్తాయి. ప్రత్యేకమైన కోర్కెలు వాటిలో కదలవు. సహజాతాలే ప్రధానంగా ఉంటాయి. రాగద్వేషాలకు అవకాశం లేదు కనుక జంతువులకు బంధమూ లేదు. మోక్షమూ ఉండదు.

మనిషికి కర్మ స్వేచ్ఛ ఉంది. ఏది చెయ్యాలి, ఏది చెయ్య కూడదు అనే వివేకం ఉంది. మానవులు ఆచరించే కర్మలు వివిధంగా ఉండటానికి వివేకంలో భేదమే ప్రధాన కారణము.

మన కర్మల వెనుక ఇష్టాయిష్టాలు ఉన్నాయి. అవే రాగద్వేషాలు. అనుకున్నది జరగాలి అని కర్మ చేస్తాము. అలా జరిగి నపుడు అది మన విజయంగా భావిస్తాము. అది హిమాలయాన్ని ఎక్కడం కావచ్చు. వ్యాపారంలోకి దిగడం కావచ్చు. అలాగే, మనం జరగాలి అనుకున్నది జరగ నపుడు అది మన అపజయంగా భావిస్తాము. జయం వచ్చిందని పొంగిపోయిన మనమే అపజయం ఎదురైందని క్రుంగిపోతాము. కర్మలు - కర్మఫలాల విషయంలో సరియైన అవగాహన మనకు లేకపోవడమే ఈ విధమైన ఘర్షణకు కారణము.

కర్మలో జయమూ లేదు. అపజయమూ లేదు. కర్మలు జయాపజయాలను సృష్టించ లేవు. కర్మలు ఇవ్వగలిగేది కర్మ ఫలాలను మాత్రమే. కర్మఫలాల విషయంలో మన కున్న రాగద్వేషాలను బట్టి ఒక కర్మఫలం జయం గాను, మరొక కర్మఫలం అపజయం గాను తెలుస్తూ ఉంటుంది. అంతేకాదు, ఒక కాలంలో జయం అనుకున్నది మరొక కాలంలో అపజయం గాను, ఒక కాలంలో అపజయ మనుకున్నది ఇంకొక కాలంలో జయం గాను తెలుస్తూ ఉంటుంది. తరచుగా పార్టీలు మార్చే వారు ఎన్నికలలో వచ్చే ఫలితాలకు ఒక్కొక్క ఎన్నికలో ఒక్కొక్క విధంగా స్పందించ డానికి కారణం ఫలితాలు కావు. వారి వారి మనస్సులలో మారిపోయే రాగద్వేషాలు.

మరి, రాగద్వేషాల చేత ప్రేరేపించబడి కర్మ చేసిన వ్యక్తి ఫలితం విషయంలో ప్రశాంతంగా ఉండే మార్గముందా? ఉంది. అదే కర్మయోగ వైభవము. కర్మ రాగద్వేషాల చేత ఆరంభించ బడినా, ఫలితం అనేది సృష్టి లోని ధర్మాలకు తల వంచి ప్రాప్తిస్తుందని, ఆ ధర్మాల రూపంలో ఉన్నది దైవమే నన్న వివేకం ఉన్నవాడు ఫలితం ఎలా ఉన్నా దానిని ప్రసాదం గానే స్వీకరిస్తాడు.

ప్రస్తుతం మనస్సులో ఉన్న రాగద్వేషాల వత్తిడికి లోనై కర్మను ఆచరించడం వల్ల, మనస్సులో ఉన్న రాగమో లేదా ద్వేషమో క్షాళనం అవుతుంది. కర్మఫలం విషయంలో ప్రసాద భావన ఉన్నందున, నూతనంగా రాగద్వేషాలు తయారు కావు. కనుక ఫలం వచ్చి నపుడు అది జయమని పొంగడము గాని, అపజయ మని క్రుంగడము గాని జరగదు. ఫలము ఏదైనా ఒక్కటే. ఎందుకని? ఏది వచ్చినా ప్రసాదమే కనుక. ప్రసాదము అనేది భావనే కాబట్టి బుద్ధిని ప్రశాంతంగా ఉంచుతుంది. ఇలా శాంతించిన మనస్సు జ్ఞాననిష్ఠకు అర్హతను సాధిస్తుంది.

కర్మయోగంలో ప్రధానంగా కర్మకు కాదు విలువ; భావానికి విలువ. కర్మఫలం ప్రధానం కాదు; కర్మ ఫలము నందు భావనే ప్రధానం. కర్మయోగికి ఏ కర్మఫల మైనా ఒక్కటే. కారణం, ఏదైనా అశాశ్వతమే. కర్మయోగం ద్వారా ప్రస్తుతం ఉన్న రాగద్వేషాలను తటస్థం చేయడం వల్ల, ఉన్న వాసనలు క్షాళన మవుతాయి. నూతనంగా సంస్కారాలు పుట్టవు. చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది. అది మోక్షహేతువు అవుతుంది.

యోగ్య ప్రయుక్తం సాధనం కార్య సాధకమ్ - అనేది న్యాయం. యోగ్యుడైన వాడు చేసే ఏ పని అయినా ఫలప్రద మవుతుంది. యోగ్యుడు ప్రయోగించిన సాధనము కార్యసాధక మవుతుంది. అయోగ్యుని సాధనే అరణ్య రోదన మవుతుంది. యోగ్యుడైన వాడు ఆచరించ వలసిన యోగవిధి ఏమిటో చెబుతూ, అర్జునా! నియతమైన కర్మను చెయ్యి. అకర్మ కంటే కర్మే విశిష్ట మైనది. కర్మను మానేస్తే దేహయాత్ర కూడా సాగదు అంటున్నాడు ఈ శ్లోకంలో భగవానుడు.

'నియతకర్మ' అంటే, అవశ్యం చేయదగిన కర్మ అని అర్థము. అలాంటి కర్మను చెయ్యాలే గాని మానకూడదు. ***నియతం కురు కర్మత్వం*** - ఈ వాక్యాన్ని రెండు విధాలుగా అన్వయించుకో వచ్చు. ***నియతం కర్మ కురు (త్వం)***. అర్జునా! నియతమైన కర్మను నువ్వు ఆచరించు అని ఒక అర్థము. ***కర్మ నియతం కురు (త్వం)***. అర్జునా! కర్మను నువ్వు నియతంగా చెయ్యి అని మరొక అర్థము. ఏది ఎలా ఉన్నా, ***నియతం*** అనేదే ఈ శ్లోకంలో కేంద్ర విషయం.

నియత కర్మ

'నియతకర్మ' అంటే నువ్వు తప్పక చేయ దగిన కర్మ అని అర్థము. మరి, ఏది నియతకర్మ? ఇది నియతకర్మ అని నిర్ణయించేది ఎవరు? అనే ప్రశ్న కూడా ఉత్పన్న మవుతుంది. నియతం అనే పదము లోనే దాని అర్థము, నిర్ణయాధికారము, రెండూ ఇమిడి ఉన్నాయి.

నియతం నిత్యం, యో యస్మిన్ కర్మణి అధికృతః ఫలాయ చ అశ్రుతం తత్ నియతం కర్మ. 'నియతం' అంటే నిత్యము అని అర్థము. అంటే శాస్త్రము నిశ్చయించిన కర్మ (***శాస్త్ర ఉపదిష్టం***). శాస్త్ర ప్రతిపాదిత కర్మను ఆచరించడానికి అధికారి అయినవాడు, ఫలాభిసంధి లేకుండా ఆచరించే కర్మ 'నియతకర్మ' అవుతుంది. అంటే, కర్మను నిర్ణయించేది శాస్త్రమైనా కావాలి, లేదా స్వభావమైనా కావాలి. శాస్త్ర విహితంగా, లేక స్వభావ జనితంగా ఆచరింప బడేది 'నియతకర్మ'. ఈ రెండిటిని కలిపి ఒక్క మాటలో 'స్వధర్మం' అని చెప్పుకోవచ్చు.

శాస్త్రం నిర్దేశించిన కర్మలు నియత కర్మలు. ఇందులో విధి నిషేధాలు ఉంటాయి. చేయ దగినది చేయ మని చెప్పడం విధి అయితే, చేయకూడని దానిని చెయ్యవద్దు అని చెప్పడం నిషేధం. శ్వాసించడం చేయ దగిన కర్మ. అలాగని 'నువ్వు శ్వాసించు' అనే విధి వాక్యాన్ని వేదము అందించ నవసరం లేదు. అలాగే 'భవనం మీద నుండి క్రిందికి దూకవద్దు' అనే నిషేధ వాక్యాన్ని కూడా వేదం పలక నవసరం లేదు. ఇవన్నీ మానవుని సామాన్య వివేకానికి అందుతాయి. అలా కాకుండా తనకు తానుగా గ్రహించలేని విషయాలను, గ్రహించినా దారి తప్పే

అవకాశం ఉన్న విషయాలను, హితకారిణి అయిన శాస్త్రము కర్మల విషయంలో సుస్పష్టమైన మార్గనిర్దేశం చేస్తుంది.

శాస్త్ర విహిత కర్మలు ఉన్నట్లే, స్వభావ జనిత కర్మలు కూడా ఉంటాయి. మనస్సు లోని సంస్కారమే ఇక్కడ స్వభావము. శాస్త్ర ప్రతిపాదిత కర్మలను గాని, లేదా స్వభావ ప్రేరిత కర్మలను గాని సకామంతో చేస్తే, లేదా ఫలాపేక్షతో చేస్తే అవి బంధహేతువు లవుతాయి. అందుకే నియతకర్మను ఫలాపేక్ష లేకుండా ఆచరించ మని గీతాచార్యుడు ఆదేశిస్తున్నాడు (***నియతం కర్మ, తత్ కురు హే అర్జున! ఫలాయ చ అశ్రుతం తత్ నియతం కర్మ***).

నియతకర్మ అనగానే ప్రస్తుతం చేస్తున్న కర్మను మార్చే ప్రయత్నము చేయ నవసరం లేదు. ఇప్పుడు ఎలాగైతే కర్మలు చేస్తున్నావో అలాగే చెయ్యి. ఏ కర్మ ప్రస్తుతం అశాస్త్రీయంగా జరుగుతూ ఉందో, దానినే సశాస్త్రీయంగా చేస్తావు. అంతే. ఫలాసక్తితో ఇంతవరకు కర్మలను ఆచరించావు. ఫలాపేక్ష లేకుండా ఇక మీదట నియతకర్మను చేస్తావు. అంతే. ప్రయాణము అదే. మార్గము అదే. ఏదీ మారలేదు. మనస్సులో భావన ఒక్కటే మారింది. మనస్సు మారింది. దానితో మనుగడ మహిమాన్విత మయింది. అదే కర్మయోగ వైశిష్ట్యము. అర్జునా! ఇప్పుడు చెప్పు. కర్మను విడిచి పెట్టి జడత్వంతో రాయిలా పడి ఉండటం శ్రేయస్కరమా? నియత కర్మను ఫలాసక్తి లేకుండా ఆచరిస్తూ, చిత్తశుద్ధితో ప్రకాశిస్తూ, ప్రసన్న చిత్తముతో జ్ఞాననిష్ఠకు సిద్ధం కావడం శ్రేయస్కరమా? అందుకే, అకర్మ కంటే కర్మే మంచిది అంటున్నాను (***యతః కర్మ జ్యాయః అకర్మణః***).

అకర్మ అయుక్తం - కర్మ యుక్తం

నేను కర్మ చెయ్యను అని కూర్చున్నంత మాత్రాన అలా అనుకుంటున్న వ్యక్తి కర్మ చేయనివాడు కాలేడు. 'నేను కర్మ చెయ్యను' అని చెబుతున్న వాడు ఎవడో, అతడే ఒకప్పుడు 'నేను కర్మ చేస్తున్నాను' అన్నవాడు. 'కర్మ చేయ్యను' అన్నప్పుడు కర్త ఉన్నాడు. 'కర్మ చేస్తున్నాను' అన్నప్పుడు కూడా కర్త ఉన్నాడు. కర్త ఉన్నంత వరకు కర్మ నుండి విడిపడటం సాధ్యం కాదు.

తాను అకర్త అని తెలుసుకున్న వాడే కర్మ నుండి విడిపడతాడు. 'నేను అకర్త' అనేది జ్ఞానం. జ్ఞానంలో కర్మకు అవకాశం లేదు. తాను అకర్త అనే జ్ఞానం లేకుండా, 'నేను కర్మను చెయ్యను' అన్నంత మాత్రాన అలా అనే వ్యక్తి అకర్త కాలేడు. అందుచేత అకర్మ కంటే కర్మయే ఉత్తమ మైనది. కాకపోతే, యోగ భావనతో కర్మలు బంధం కాకుండా చూసుకోవాలి. అది కర్మయోగం లోనే సాధ్యం. కనుక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలోచించి నపుడు కర్మ చేయకుండా ఉండటం కంటే, కర్మ చేయడమే అధికతర మైనది (***కర్మ జ్యాయః అధికతరం ఫలతః***).

కర్మశూన్యత అనేది సన్యాసము క్రిందికి రాదు. జ్ఞానంతో సన్యాసము తీసుకుంటే, అది విద్వత్సన్యాసము అవుతుంది. జ్ఞానేచ్ఛతో సన్యాసం పుచ్చుకుంటే, అది వివిదిషా సన్యాస మవుతుంది. ఏదీ చేయకుండా కూర్చున్నవాడు, ఈ రెండిటి క్రిందికి రాడు. పైగా, ఆత్మజ్ఞానము లేకుండా కర్మలకు దూరమైనాడు కనుక మోక్షప్రాప్తి యొక్క ప్రసక్తే లేదు.

కర్మయోగి ఫలాసక్తి లేకుండా కర్మలను ఆచరించడం చేత చిత్తశుద్ధిని పొంది మోక్షార్హు డవుతున్నాడు. జ్ఞాననిష్ఠకు యోగ్యతను సాధిస్తున్నాడు. ప్రసాద భావన వల్ల ప్రశాంతత అనే దృష్ట ఫలాన్ని కూడా అనుభవిస్తున్నాడు.

ఏ కర్మను చేయని వాడు ఏ ప్రగతిని సాధించ లేడు. ఈ జన్మలో ప్రగతికి సోపానాలే లేనివాడు, రాబోయే జన్మలో ఏ వైభవాన్ని చూస్తాడు? అందుచేత, అధమ జన్మను పొందుతాడు.

కర్మయోగి అలా కాదు. ఒకవేళ తాను సిద్ధిని పొందలేక పోయినా, ఆచరించిన కర్మయోగము యొక్క ఫలితంగా శుచి గల ప్రదేశాలలో జ్ఞాననిష్ఠకు అనుకూలమైన శ్రీమంతుడుగా జన్మిస్తాడు. కనుక, ఆత్మజ్ఞానము లేని వానికి అకర్మ అయుక్తం. కర్మయే యుక్తం.

అకర్మ విషయంలో మనం ఆలోచించ వలసిన అతి ముఖ్యమైన విషయం కూడా ఒకటుంది. కర్మ చేయకుండా కూర్చోవడం వల్ల, కర్మల లోని దోషాలు అంటవని, నూతన వాసనలు తయారు కావని భావించి కూడా కొందరు కర్మలను త్యజిస్తారు. ఇది మరీ ప్రమాదకరమైన పరిస్థితి. ఎందుకంటే, నూతన సంస్కారాల విషయం అలా ఉంచండి. పేరుకు పోయిన పాత వాసనలు ప్రక్షాళన మయ్యేది ఎలా? సహేతుకమైన ఆలోచన లోపిస్తే, ఆ తరువాత అంతా ప్రమాదమే. కర్మను చూచి భయపడి, అకర్మ శ్రేయస్కర మని భావించడం అనుచితం. కనుక, కర్మ చేస్తూ, కర్మను యోగంగా మార్చుకోవడం లోనే వాసనలు ప్రక్షాళనమై, బుద్ధి శుద్ధిపడే అవకాశం ఉంది. ఒకవేళ మనిషి భయపడ వలసిన పరిస్థితి వస్తే, కర్మను మానడం అనే ఆలోచనకు భయపడాలి గాని, కర్మను చేయడానికి కాదు.

అకర్మ అన్ని విధాల దోషయుతంగా తెలుస్తూ ఉంది. అంతేకాదు, కర్మ చేయని వానికి దేహయాత్ర కూడా జరగదు. మనుగడే సమస్యగా పరిణమిస్తుంది. అలా చూచి నపుడు కర్మాకర్మల విశేషం ఈ లోకం లోనే స్పష్టంగా తెలుస్తూ ఉంది ***(అతః దృష్టః కర్మాకర్మణోః విశేషః లోకే).***

దేహయాత్ర

దేహంలో ఉన్నవాడు దేహి. దేహయాత్ర లేకుండా దేహి ఉండలేడు. దేహం ఉంటేనే దేహి. దేహం ఉండాలి అంటే కర్మ జరిగి తీరాలి. చలించే దేహం చలనాత్మకమైన కర్మకు దూరమై మనుగడను సాగించ లేదు.

కారులో ప్రయాణం చేసేవాడు కారు విషయంలో తగు చర్యలు చేపట్టినట్లు, దేహ మనే బండిలో పయనించే వాడు దేహం విషయంలో అవసరమైన కార్యాలు చేపట్టక తప్పదు. కారును శుభ్రం చేసుకోవాలి. ఇంధనాన్ని నింపుకోవాలి. ఇవన్నీ కర్మలే. దేహి కూడా దేహం విషయంలో స్నానాది శుద్ధి కార్యాలను నిత్యం ఆచరించాలి. దేహం నిలవడానికి అన్నపానీయాదుల్ని స్వీకరించాలి. అప్పుడే దేహం మన గలుగుతుంది. ఇంధనం లేకపోతే కారు కదలదు. అన్నాదులు లేకుండా శరీరయాత్ర జరగదు.

కారును నడపకుండా పడేస్తే త్రుప్పు పట్టి పోతుంది. కర్మను చేయడం మానేస్తే, దేహం క్షీణిస్తుంది. మనస్సు ఆలోచనా శక్తిని కూడా కోల్పోతుంది. బండి మనకు ఉపకరిస్తూ ఉంది కనుక, బండి నడవ డానికి కొంత కర్మ చేయక తప్పదు. దేహం జీవనయాత్రకు ఉపకరిస్తూ ఉంది కనుక, దేహం విషయంలో కూడా దేహి కర్మ చేయక తప్పదు.

కర్మ చేయక పోవడం వల్ల దేహం యొక్క మనుగడకే ప్రమాదము అని చెప్పకుండా, దేహయాత్ర కూడా జరగదు అనడంలో భగవంతుడు ఎంతో భావగర్భితమైన సందేశాన్ని ముముక్షు లోకానికి అందించాడు. **యాత్రా** అంటే, ప్రయాణము, మార్గము, ఉత్సవము, తీర్థయాత్ర అని అర్థము.

శ్రేయస్సును పొందడానికి దేహి సాగించే ప్రయాణమే దేహయాత్ర. శ్రేయస్సు గమ్యము. అట్టి గమ్యాన్ని చేరడానికి దేహికి పరమేశ్వరుడు ప్రసాదించిన వాహనమే దేహము. గమ్యము చేరడము అనేది గమనంపై ఆధారపడి ఉంటుంది. గమనమునే **యాత్రా** అంటారు. ప్రతి గమనము యాత్ర కాకపోవచ్చు. యాత్ర చేయాలి అంటే మాత్రం గమనం తప్పదు. మోక్షమనే గమ్యాన్ని చేరడానికి అకర్మ అనేది మార్గం కాదు. గమనం కాదు. చలనాత్మకమైన కర్మయే గమనము.

ప్రయాణాలు మనిషికి క్రొత్తవి కావు. ప్రతి ప్రయాణము యాత్ర కాదు. కాని, యాత్ర చేయాలి, తీర్థయాత్ర చేయాలి అంటే మాత్రం ప్రయాణం చేసే తీరాలి. బండిలో మనం ప్రయాణిస్తాము. కాని, ఎటు పయనించాలి? అనేది బండికి తెలియదు. బండిని నడిపే వ్యక్తి బుద్ధికి తెలుస్తుంది. అలా తెలిసిన వాడు బండిని నడిపితేనే గమ్యం వస్తుంది. కదలకుండా బండిలో కూర్చుంటే గమ్యం చేరడం సాధ్య పడదు.

దేహం అనే బండిలో ఉన్న దేహి దేహేంద్రియ మనోబుద్ధులను కదిలించి శ్రేయస్సు వైపు నడిపితేనే, గమ్యాన్ని చేరి తరిస్తాడు. కేవలం దేహంలో కూర్చుని కర్మ చేయకుండా ఉంటే, గమనమే జరగదు కనుక గమ్యాన్ని చేరే అవకాశమే ఉండదు ***(శరీర యాత్రా అపి న ప్రసిద్ధ్యేత్ ప్రసిద్ధిం న గచ్ఛేత్ అకర్మణః అకరణాత్).***

మానవులు తీర్థయాత్రలు చేస్తూ ఉంటారు. పుణ్యాన్ని ఆర్జించాలని తీర్థాటన చేస్తారు. కాని, మానవుడు సాగించే దేహయాత్ర కేవలం పుణ్యానికే కాదు, మోక్షానికి కూడా. పరమ పురుషార్థాన్ని సాధించడం కోసమే దేహయాత్ర కొనసాగాలి. ఈ కార్యం కోసమే పరమేశ్వరుడు జీవునికి శరీరాన్ని ప్రసాదించాడు. జీవితంలో మహోత్తమమైన ధర్మసాధన కొరకే దేహం ఉంది.

శరీరం ఆద్యం ఖలు ధర్మ సాధనమ్ - ధర్మజీవన యాత్రలో, మోక్షజీవన మార్గంలో శరీరమే ప్రథమ సాధనంగా ఉందని మహాకవి కాళిదాసు 'కుమార సంభవం'లో అద్భుతంగా ప్రవచించాడు.

ఈ దేహయాత్ర ఎప్పుడు బయలు దేరిందో, ఎక్కడ శ్రీకారం చుట్టిందో చెప్పలేము. తల్లి గర్భం నుండి కదలి శ్మశాన గర్భంలో ఆగినట్లు తెలుస్తున్నా, వాస్తవానికి అది సత్యం కాదు. నేటి దేహానికి అది వర్తించవచ్చు. ఏమి సాధించాలని నేటి దేహం వచ్చిందో, అదే సంకల్పంతో గత జన్మలలో దేహాలు కూడా వచ్చాయి. దేహయాత్రలు జరిగాయి. అయినా, గమ్యం చేరడం జరగ లేదు. అందుకే నేడు మళ్ళీ దేహం కనిపిస్తూ ఉంది. ఈ జన్మ కూడా వృథా అయితే, మళ్ళీ జన్మలో వేరొక దేహం కనిపిస్తుంది. శ్మశానము అనేది జీవికి విరామ స్థానమే గాని, గమ్యస్థానము కాదు. మోక్షమే గమ్య స్థానము.

కర్మ చేయడం మానేస్తే, దేహము యొక్క మనుగడే ప్రమాదంలో పడి పోతుంది. బండి పాడై నపుడు ఇక గమనం ఏముంది? గమ్య మెక్కడుంది? కనుకనే, అకర్మ కన్నా కర్మే యుక్త మని, కర్మ చేయక పోతే, దేహయాత్ర కూడా ప్రశ్నార్థక మవుతుందని హెచ్చరిస్తున్నాడు పార్థసారథి.

అర్జునా! కర్మను చూచి భయపడి, అకర్మను వరించి, నీవు చెప్పినట్లు సన్యాసి లాగా భిక్ష మెత్తుకొని జీవించాలని భావించినా, చూడు నాయనా! భిక్ష మెత్తడం కర్మ కాదా? సన్యాసి మాత్రం కర్మకు దూరమైంది ఎప్పుడు? అందుకని, నియతమైన కర్మ అకర్మ కంటే మేలైనది కనుక, ఫలాసక్తి లేకుండా ఆచరిస్తూ పో! స్వధర్మాచరణమే నీకు యుక్తం. పాపాలన్నీ ప్రక్షాళన మవుతాయి. చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది. మోక్షం కళ్ళ ముందే దోబూచు లాడుతుంది.

నిప్పు పెట్టిన వ్యక్తిని అయినా
ముట్టినచో నిప్పు కాల్చును
ధర్మము విడిచి చరించు వారికి
లభించదు దేవుని కనికరము
ధర్మము నందే వైభవము
తప్పిన ధర్మము వైకల్యము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

అర్జునా! కర్మ బంధహేతువు కనుక అది త్యాజ్యమని నీవు భావించడం కూడా సరియైనది కాదు. ఎలాగో, చెబుతాను విను.

యజ్ఞార్థా త్కర్మ ణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబన్ధనః ।
తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసఙ్గ స్సమాచర ॥ 9

యజ్ఞార్థాత్-కర్మణః-అన్యత్ర-లోకః-అయం-కర్మబంధనః
తదర్థం-కర్మ-కౌంతేయ-ముక్తసంగః-సమాచర

కౌంతేయ	= అర్జునా!	కర్మబంధనః	= కర్మమే బంధముగా గలది
యజ్ఞార్థాత్	= యజ్ఞార్థమైన	తదర్థం	= యజ్ఞము కొరకు
కర్మణః	= కర్మ కంటె	ముక్తసంగః	= సంగమును విడిచిన వాడవై
అన్యత్ర	= ఇతర కర్మ యందు	కర్మ	= కర్మమును
అయం	= ఈ	సమాచర	= చక్కగా ఆచరించు
లోకః	= లోకము		

అర్జునా! యజ్ఞము కొరకు కాకుండా ఈ లోకంలో చేసే కర్మ లన్నీ బంధాలకు కారణ మవుతాయి. కాబట్టి సంగత్వము లేకుండా కర్మను ఆచరించు.

వ్యాఖ్య

స్వార్థంతో కూడిన సకామ కర్మలు బంధహేతువులు. ఫలాసక్తి లేకుండా, ఈశ్వర ప్రీత్యర్థం ఆచరించే కర్మలు బంధహేతువులు కావు. కనుక ఈశ్వరార్థం కర్మల్ని ఆచరించాలి అని గీతాచార్యుని ప్రబోధము.

యజ్ఞకర్మ

యజ్ఞో వై విష్ణుః విష్ణువు సర్వ యజ్ఞ స్వరూపుడు అన్నది వేదం. యజ్ఞములను ఆచరించు వారికి సంతుష్టిని కలిగించు వాడు అని కూడా చెప్పింది శ్రుతిమాత ***(సర్వేషాం తుష్టికారకః యజ్ఞా కారేణ ప్రవర్తత ఇతి వా యజ్ఞోవై విష్ణుః ఇతి శ్రుతేః)***. కనుక యజ్ఞ మనగా విష్ణువు. ఈశ్వరుడు. యజ్ఞరూపుడైన పరమేశ్వరుని కొరకు ఆచరించే కర్మ ఏదైనను అది యజ్ఞకర్మే అవుతుంది ***(ఈశ్వరార్థం యత్ క్రియతే తత్ యజ్ఞార్థం కర్మ)***. యజ్ఞార్థం, అంటే ఈశ్వరార్థం కర్మను ఆచరించే వాడు బద్ధుడు కాడు. ఈశ్వర ప్రీత్యర్థం కర్మను ఆచరించే వారికి బంధము లేదు. యజ్ఞకర్మ కాకుండా స్వార్థపూరితమైన కర్మలు చేయువారు కర్మబంధంలో చిక్కు కుంటారు.

రాగద్వేషాల చేత ప్రేరేపించ బడి ఫలాసక్తితో ఆచరించి నపుడే కర్మలు బంధిస్తాయి. యజ్ఞకర్మ వైశిష్ట్యము దానికి భిన్నంగా ఉంటుంది. యజ్ఞకర్మలో స్వార్థ చింతనము ఉండదు. రాగద్వేషాల స్థానంలో ధర్మాధర్మాలు నిలుస్తాయి. ధర్మస్పృహ ప్రధానంగా ఉంటుంది. యజ్ఞరూపుడైన పరమేశ్వరుడే ఇక్కడ ధర్మరూపంలో ఉన్నాడు. సకామ కర్మలలో ఏ ఫలాసక్తి బాధిస్తూ ఉండిందో, ఆ ఫలాసక్తి స్థానంలో ప్రసాద బుద్ధి చోటు చేసుకుంటుంది. ఫలసంగం ఎక్కడైతే లేదో, అక్కడ కర్మ బంధహేతువు కాలేదు.

కర్మణా బధ్యతే జన్తుః - కర్మల చేత జీవులు బద్ధు లవుతారు అన్నది శాస్త్రం. అంటే, యజ్ఞకర్మ కానిది ఏదైనా బంధహేతువు అవుతుందనే అర్థం. ఏది బంధము కొరకు కాదో ***(తత్ కర్మ యత్ న బంధాయ - ఉపనిషత్తు)*** ఆ కర్మ యజ్ఞకర్మ.

కర్మ ఒక్కటే. చేసే వ్యక్తి కూడా ఒక్కడే. చేసే విధానమూ ఒక్కటే. కాకపోతే, చేసే వ్యక్తి యొక్క భావాన్ని

బట్టి అది బంధమా? బంధ రహితమా? అని నిర్ణయించ వలసి ఉంటుంది. సకామ కర్మలలో ఫలాభిసంధి ఉంటుంది కనుక అది బంధము. యజ్ఞకర్మ నిష్కామము కనుక అది బంధము కాదు. కర్మలలో దోషము లేదు. కర్మలలో భావనే ప్రధానం. నికృష్టమైన భావంతో ఆచరించే కర్మను ఉత్కృష్టమైన భావంతో చేస్తాం. అంతే.

రాగద్వేషాల కొరకు అచరించే దైతే, అట్టి కర్మ బంధాన్ని సృష్టిస్తుంది. ధర్మాధర్మాల స్పృహ కలిగి, ధర్మ రూపంలో ఉన్న దైవం ప్రీత్యర్థం ఆచరించే కర్మ బంధాన్ని సృష్టించదు. పైగా చిత్తశుద్ధిని కలిగించి మోక్షహేతు వవుతుంది. కనుక, కర్మలు ఈశ్వరార్థం జరగాలి. కర్మలలో ఫలాభిసంధి లేకుండా చూసుకోవాలి. అలా చేయగలిగి నపుడు కర్మకు బంధించే శక్తి ఉండదు.

సమర్పణ భావం

ఇంత వరకు సంగత్వం లేకుండా కర్మ చేయమన్నాడు. ఫలాసక్తి రహితంగా కర్మల్ని ఆచరించ మని చెప్పాడు. ఇప్పుడు విషయాన్ని ఒక అందమైన మలుపు త్రిప్పుతూ, యజ్ఞార్థం చేయ మంటున్నాడు. ఈశ్వరార్థం ఆచరించ మంటున్నాడు. యజ్ఞకర్మలో 'నేను', 'నాది' అనే అహంకార, మమకారాలు నిస్సారమై నిర్వీర్య మవుతూ ఉంటాయి. మనం చేసేది ఏదైనా ఈశ్వర కర్మ అవుతుంది. మనకు అందేది ఏదైనా ప్రసాదము అవుతుంది. కర్మ నైవేద్య మవుతూ ఉంటే, ఫలం ప్రసాదంగా అందుతూ ఉంటుంది. బుద్ధి ప్రసన్నతలో ప్రశాంతంగా ఉంటుంది. జ్ఞాననిష్ఠకు సిద్ధపడుతూ ఉంటుంది.

కర్మ చేయడానికి మనిషికి శక్తి కావాలి. ఆలోచించే యుక్తి కావాలి. పరిస్థితులు, కాలం అనుకూలంగా ఉండాలి. ఇవన్నీ భగవ త్ప్రసాదాలు. కాళ్ళు లేనివాడు నడవ లేడు. కళ్ళు లేనివాడు చూడ లేడు. చేతులు ఉండబట్టే పనులు చేస్తున్నాము. ఇవన్నీ భగవంతుడే ప్రసాదించాడు. అవి అలా పని చేయడానికి నియతిని నిర్మించింది తానే. సమస్తాన్ని నియంత్రించే నియంత తానే. కనుక కర్మాచరణము మనం చేసినా, వైభవ మంతా తనదే. ఆయన యంత్రి. నేను యంత్రము. పని నాదే కావచ్చు. పనితన మంతా అతనిదే. నేను కేవలం పాత్రధారిని. పరమేశ్వరుడు సూత్రధారి. ఈ భావనతో చేసే కర్మ ఏదైనా యజ్ఞకర్మే అవుతుంది. పని పూజగా మారుతుంది. ఫలం ప్రసాద మవుతుంది.

మనం చేసే కర్మలలో స్వార్థం లేదు. ధర్మస్పృహ, ధర్మచింతన ప్రధానంగా ఉంది. ఏ కర్మ చేయాలో, ఏది చేయ కూడదో అనే విషయంలో కూడా అవగాహన ఉంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి జారి పడుతూ ఉంటే, మనం ముందు కురికి అతణ్ణి రక్షించే ప్రయత్నం చేస్తాం. ఎందుకని? భగవంతుడు మనకు చేతు లిచ్చాడు. అందుచేత, మరొక వ్యక్తి పతనమయ్యే పరిస్థితిని రానివ్వము. ఈ విధమైన కర్మలో స్వార్థం లేదు. కాని, ఇదే కర్మలో ఈశ్వర భావన గనుక చోటు చేసుకుంటే, అది యజ్ఞకర్మ అవుతుంది. అదే కర్మయోగము.

అర్జునా! కనుక, యజ్ఞార్థం కర్మలు చెయ్యి. ఈశ్వర ప్రీత్యర్థం కర్మలను ఆచరించు. ముక్తసంగుడవై ఉండు ***(ముక్త సంగః కర్మఫల సంగ వర్జితః సన్)***. ఈ విధంగా కర్మలను ఆచరించు ***(సమాచర నిర్వర్తయ)***. నిస్వార్థంగా, ఈశ్వర ప్రీత్యర్థం, ఫలాసక్తి లేకుండా చేసే ఏ కార్యమైనా యజ్ఞకార్యమే. దైవ కార్యమే. ఈశ్వర ప్రీత్యర్థం చేసే కర్మ బంధించదు. స్వార్థ పూరిత కర్మలే బంధిస్తాయి. అలాంటి కర్మలలో కలవకు. దూరంగా ఉండు. ముడిపడితే బంధము. విడిపడితే మోక్షము.

ఆఖ్యాయిక

ఒక ఇంట్లో భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. పరస్పరం పరుష పదజాలంతో దూషించు

కుంటున్నారు. ఒక దశలో విసిగి పోయిన భర్త భార్యకు హితబోధ చేస్తూ, మన ఇంట్లో ఉన్న రెండు కుక్కలు చూడు, ఎంత అన్యోన్యంగా జీవిస్తున్నాయో? ఏ రోజైనా మన లాగా పోట్లాడు కున్నాయా? వాటి లాగా ప్రశాంతంగా మనం ఎందుకని ఉండలేక పోతున్నాం? అని అనునయంగా పలికాడు. భార్య మండి పడుతూ, మీరు చెప్పేది నేను అంగీకరించను. అవి కూడా ఉండ లేవు. మచ్చికతో ఉండటం వాటికి కూడా సాధ్యం కాదు. నా మాట మీద మీకు నమ్మకం లేకపోతే, ఆ రెండిటిని కలిపి ఒక త్రాటితో కట్టేయండి. ఆ తరువాత ఏమి జరుగుతుందో మీకే అర్థమవుతుంది అంది. అంతే.

అర్జునా! యజ్ఞకర్మ నేడు నేను ప్రారంభిస్తున్నది కాదు. సృష్ట్యాది నుండే ఉంది. అందుకే నువ్వు ఆచరించాలి. అది కూడా చెబుతాను. విను.

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽ స్త్విష్టకామధుక్ ॥ 10

సహయజ్ఞాః-ప్రజాః-సృష్ట్వా-పురా-ఉవాచ-ప్రజాపతిః
అనేన-ప్రసవిష్యధ్వం-ఏషః-వః-అస్తు-ఇష్టకామధుక్

ప్రజాపతిః	= బ్రహ్మ	అనేన	= దీని చేత
పురా	= పూర్వము	ప్రసవిష్యధ్వం	= వృద్ధి చేయండి
సహయజ్ఞాః	= యజ్ఞములతో గూడిన	ఏషః	= ఇది
ప్రజాః	= ప్రజలను	వః	= మీకు
సృష్ట్వా	= సృజించి	ఇష్టకామధుక్	= ఇష్టమైన కోరికలను ఇచ్చునది
ఉవాచ	= పలికెను	అస్తు	= అగు గాక

పూర్వము బ్రహ్మదేవుడు యజ్ఞములతో సహ ప్రజలను సృష్టించాడు. ఈ యజ్ఞముల చేత మీరు వృద్ధిని సాధించండి. యజ్ఞములు మీ కోర్కెలను తీర్చుతాయి అన్నాడు.

వ్యాఖ్య

ప్రజలను సృష్టించిన వాడు ప్రజాపతి (*ప్రజానాం స్రష్టా*). అతడే బ్రహ్మదేవుడు. సృష్టి ప్రారంభంలో ప్రజాపతి యజ్ఞ సహితంగా ప్రజల్ని సృష్టించాడు. ప్రజా సహితంగా యజ్ఞాల్ని సృష్టించాడు. అంటే, మనిషి సృష్టింపబడి నపుడే హిత కారకములు, అహిత నివారకములు అయిన సాధనోపాయాలు కూడా పుట్టాయి అని అర్థము.

అలా ప్రజలను సృష్టించిన ప్రజాపతి, ఈ యజ్ఞముల చేత వృద్ధిని సాధించండి అని చెప్పాడు. ఈ యజ్ఞాలు మీ అభీష్టములను నెరవేర్చి ఫల విశేషాలను ప్రసాదిస్తాయి అని కూడా చెప్పాడు. సర్వులకు యజ్ఞములు ఫలదాయకములు. సకాములైన వారికి స్వర్గాది భోగాలను ప్రసాదిస్తాయి. నిష్కాములై శ్రేయస్సును అభిలషించే ముముక్షువులకు ముక్తిని అనుగ్రహిస్తాయి. **ధర్మజ్ఞ సమయః ప్రమాణమ్** అనే సూత్ర నిర్దేశానుసారం ధర్మజ్ఞుడు, శ్రేష్ఠుడు అయిన బ్రహ్మదేవుని ఉపదేశమును ప్రామాణికంగా గ్రహించి సర్వులు ఆచరించాలి. పెద్దల మాటను ఆలకించి ఆచరించాలి అనేది సృష్ట్యాది లోనే నిర్దేశింప బడింది.

సంస్కార యజ్ఞాలు

యజ ధాతువు నుండి 'యజ్ఞ' శబ్దం పుట్టింది. 'యజ' అంటే దేవతారాధన అని అర్థం. యజ్ఞాలు భగవత్ప్రీతికరము లైన ఆరాధనలు. ఇవన్నీ వైదిక కర్మలు. జీవితాన్ని అన్ని దశలలో సంస్కరించే సంపదలు.

జీవాత్మను సంస్కరించ డానికి నలభై సంస్కారాలను శాస్త్రం నిర్దేశించింది (*చత్వారింశత్*). అవి గర్భాధానము నుండి ప్రారంభమై అంత్యేష్టి వరకు సాగుతాయి. ఆ తరువాత కూడా నిర్వహించ బడుతాయి. ఇవన్నీ జీవి ఔన్నత్యాన్ని కాంక్షించి నిర్దేశింప బడినవే. వీటిలో పంచ మహాయజ్ఞాలు ఉన్నాయి. సప్త పాక యజ్ఞాలు ఉన్నాయి. సప్త హవిర్యజ్ఞాలు ఉన్నాయి. సప్త సోమ యజ్ఞాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా గర్భాధాన పుంసవన సీమంత జాతకర్మాది నలభై సంస్కారాల లోనివే.

ఈ విధమైన యజ్ఞాలలో కొన్ని ప్రతిరోజు చేయవలసినవి కాగా, మరి కొన్ని ప్రత్యేక సమయాలలో నిర్వహించ వలసినవిగా ఉంటాయి. పంచ మహాయజ్ఞాలు రోజూ చేయాలి. దేవయజ్ఞము, పితృయజ్ఞము, బ్రహ్మయజ్ఞము, మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము లాంటివి నిత్యమూ చేయ వలసినవి. అగ్నిహోత్రము నిత్యకర్మ. ఔపాసన కూడా అంతే. అది పాకయజ్ఞంలో భాగమే. కాని సోమయజ్ఞాలు జీవితంలో ఒక్కసారి మాత్రమే చేయ వలసినవి.

సంస్కార యజ్ఞాలన్నీ జీవుడు తల్లి గర్భంలో ఉన్నప్పుడే ప్రారంభ మవుతాయి. ఇవి దోషాలను దూరం చేస్తాయి. ఉత్తమ శక్తులకు ఊత నిస్తాయి. భావశుద్ధిని పెంపొందిస్తాయి. అందుచేతనే అవి సంస్కారాలు అని పిలువ బడ్డాయి. ***సంస్క్రియన్తే ఏభిరితి సంస్కారాః*** జీవులను సంస్కరిస్తాయి కనుక అవి సంస్కారాలు. శాస్త్రీయమైన క్రియా విశేషాలు.

వస్తు వినియోగంలో కూడా మనం ఈ విధమైన సంస్కారాలను చూస్తూ ఉంటాం. ఉదాహరణకు మనం తినే అన్నమునే తీసుకోండి. మొదట అది వరి ధాన్యంగా ఉంటుంది. అది మన ఆహారమే. కాని, ధాన్యాన్ని అలాగే ఆరగించ గలమా? సంస్కరించిన తరువాతే వినియోగించుకో గలం. ముందు ధాన్యాన్ని కోసి ఆర బెట్టాలి. ఆ తరువాత దానిపై ఉన్న పొట్టును తొలగించాలి. అది బియ్యంగా తయారైన తరువాత కడిగి, వండటం అనే క్రియను సాగించాలి. ఆ తరువాతే అది అన్నమై మనకు ఆహారంగా ఉపయోగ పడుతుంది. ఇదంతా ధాన్య సంస్కారము.

అలాగే భూమి నుండి రత్నాలు, బంగారు మొదలైన ప్రశస్తమైన, విలువైన వస్తువులు లభిస్తాయి. కాని, వాటిని ఎంతో శుద్ధి చేస్తే గాని వాటి లోని వైభవము బహిర్గతం కాదు. అలా సంస్కరింప బడిన తరువాతే అవి ఆభరణాలై, అలంకార యోగ్యమై శోభిస్తాయి.

అలాగే జన్మాదిగా ఎన్నో దోషాలతో జీవులు జన్మిస్తారు. వారిని సంస్కరించే ప్రక్రియలు చేపట్టక పోతే, వ్యర్థ జీవు లవుతారు. సంస్కరిస్తే పునీతు లవుతారు. ప్రకాశవంతంగా జీవిస్తారు. పవిత్రులై తరిస్తారు.

ఈ విధమైన జీవ సంస్కారాలు గర్భాధానం నుండే ఆరంభ మవుతాయి. తల్లి గర్భంలో ఉన్న దేహ పిండము మంత్రపూతం కావడమే గర్భాధాన సంస్కార వైశిష్ట్యం. గర్భాధాన, పుంసవన, సీమంతాది సంస్కారాలు గర్భవతి యైన మహిళను ఉద్దేశించి చేసేవిగా మనం భావిస్తాము. వాస్తవానికి అవి తల్లి గర్భంలో వృద్ధి చెందే బిడ్డ కొరకు నిర్దేశించినవి. అందుచేత, వీటి విషయంలో ఉపేక్ష పనికి రాదు. గర్భము దాల్చిన మూడవ మాసంలో పుంసవనము, గర్భము దాల్చిన ఆరవ మాసంలో గాని, లేదా ఎనిమిదవ మాసంలో గాని సీమంతం చేస్తారు. ఇవన్నీ పరమేశ్వరుని అనుగ్రహాన్ని అర్థిస్తూ, ఈశ్వర ప్రీత్యర్థం యజ్ఞ భావనతో చేసే కార్యక్రమాలు.

స్త్రీ పురుషుల నియమ రహిత ప్రవర్తనము వల్ల, దోషయుత సంకల్ప ప్రభావ జనిత అరిష్టాలను హరించేందుకే గర్భాధాన, జాతకర్మ, చౌల, ఉపనయనాది సంస్కారాలను నిర్వహిస్తారు. ప్రతి సంస్కారము జీవిని శుద్ధి చేస్తూ పోతుంది. అందుకే ఇవన్నీ పవిత్రమైన యజ్ఞా లయ్యాయి. ప్రతి సంస్కారము, సంస్కారాచారము నందు గోచరించే క్రియలు ఎంతో ఆధ్యాత్మిక భావగర్భితాలు.

వైదిక సంప్రదాయానుసారం పిల్లవాడు పుట్టగానే తండ్రి ఆ బాలుని ముఖాన్ని ముందుగా చూడాలి. అలా చూచిన క్షణం లోనే, తండ్రి పితృ ఋణం నుండి విముక్త డవుతున్నాడు అన్నది శాస్త్రం (***ఋణాత్ పితా విముచ్యేత పుత్రస్య ముఖ దర్శనాత్***). పుత్రుని ముఖాన్ని చూడగానే తాను పితృఋణం నుండి విముక్తిని పొందినట్లు తండ్రి భావించ వచ్చు నని వాగ్దానం చేసింది శాస్త్రం. అందుచేతనే, ముఖాన్ని చూచిన తరువాత, తండ్రి సచేల స్నానం చెయ్యాలి అన్నది. సచేల స్నానం అంటే, బిడ్డ ముఖాన్ని చూచే సమయంలో తండ్రి ఏ బట్టను ధరించి ఉన్నాడో, ఆ బట్టతో సహ స్నానం చేయడమే సచేల స్నానం (***పుత్రే జాతే పితుః స్నానం సచేలం తు విధీయతే***).

అంతేకాదు, ఈ స్నానం చేసే పద్ధతిని కూడా మహాద్భుతంగా వివరించింది. పాత్రలో నింపిన జలముతో సచేల స్నానం చేయ కూడదట. సచేల స్నానం నదిలో గాని, చెరువులో గాని, దిగుడు బావిలో గాని చేయాలట. అది కూడా మెల్లగా దిగి కాదు. ఎగిరి నీళ్ళల్లో దుమికి స్నానం చెయ్యాలట. ఇవన్నీ ఎందుకు?

పుత్రుని ముఖం చూడగానే, పితృఋణం నుండి విముక్తిని పొందినట్లు తండ్రి భావిస్తాడు. కారణ మేమిటంటే, తనకు కలిగిన కుమారుడు తన తరువాత పితృ దేవతలకు సమర్పించ వలసిన తర్పణాది క్రియలు సమర్పించి, పితృఋణం తీరుస్తాడు అని అర్థం. తండ్రి చేసిన అప్పును తనయుడు తీర్చినట్లు, తండ్రి పితృఋణాన్ని కూడా శ్రాద్ధాది కర్మల ద్వారా తీరుస్తాడని అర్థం.

మరి జలాశయాల్లో ఎగిరి దుమికి ఎందుకు స్నానం చెయ్యాలి? ఎగిరి దుమికితే, జల బిందువులు పైకి చిమ్ముతాయి. అలా పైకి ఎగసే జలబిందువుల ద్వారా పైనున్న పితృ దేవతలకు, మీ ఋణాన్ని తీర్చుకుంటాము అనే సంకేతాన్ని పంపుతాడు. మెల్లగా జలాశయాల్లో దిగితే నీళ్ళు పైకి చిమ్మవు కదా! అందుకే అలా దుమికి స్నానం చేయాలి.

శిశువు జన్మించిన వేళా విశేషాన్ని బట్టి దోషాలు ప్రాప్తించే అవకాశం ఉంటుంది. వీటిని జాతారిష్టాలు అంటారు. అలా జాతారిష్టంతో పుట్టిన శిశువు పెరిగే వేళ సంప్రాప్తించే దోషాలను బాలారిష్టాలు అంటారు. ఇలాంటి అరిష్ట నివారణార్థం 'జాతకర్మ' సంస్కారాన్ని నిర్వహిస్తారు. తద్వారా అరిష్ట జనిత దోషాలు హరింప బడతాయి. ఆయుర్దాయం అభివృద్ధి చెందుతుంది. ఈ విషయాలన్నీ 'బృహస్పతి సంహిత' విపులంగా విశదీకరించింది (***జన్మని అశుభ యోగానాం వినాశాయ విశేషతః***).

తండ్రి బిడ్డకు జాతకర్మ సంస్కారాన్ని నిర్వహించిన తరువాత, తల్లి బంగారు పాత్ర లోని జలముతో గాని, లేదా బంగారు ఉంచిన జలముతో గాని తన దక్షిణ కుచమును, అంటే కుడి స్తనమును శుద్ధి చేస్తుంది. స్తనశుద్ధి చేస్తున్న సమయం లోనే మంత్రోచ్చారణ చేస్తుంది.

యస్మై త్వగ్ స్తన ప్రప్యాయ ఆయుః వచః యశో బలం - ఓ పయోధరమా! పాలు నిండిన స్తనమా! నువ్వు నా బిడ్డకు దీర్ఘాయువును ప్రసాదించు. దేహకాంతిని అనుగ్రహించు. కీర్తిని, బలాన్ని పుష్కలంగా ఇవ్వు అని అభిమంత్రించి, ఆ తరువాత తన కుడి స్తనమును బిడ్డ నోటికి అందిస్తుంది. ఇదంతా జాతకర్మ సంస్కారంలో గోచరించే 'ఫలీకరణ హోమ' సంప్రదాయ వైభవం. ఇవన్నీ తెలిసి ఆచరిస్తే, అద్భుతమైన ఫలితాలను ప్రసాదిస్తాయి.

యదేవ విద్యయా కరోతి శ్రద్ధ యోపనిషదా, తదేవ వీర్యవత్తరం భవతి

దేని నైనా అర్థం చేసుకొని, శ్రద్ధతో ఆచరించి నపుడే అది ఫలవత్తరం అవుతుంది అన్నది ఛాందోగ్యోపనిషత్తు. 'వీర్యవత్తరం' అంటూ, 'తరప్' ప్రత్యయాన్ని ప్రయోగించడం చేత, తెలియక చేసినా,

మంత్రోచ్చారణ మహిమ చేత ఫలం లభిస్తుంది. కాని, తెలిసి చేస్తే ఫలితం అధికతరం అని చెప్పడానికే, అలా ప్రవచించాడు ఋషి.

గర్భాధానం మొదలుకొని, సీమంత, జాతకర్మ, నామకరణాది సంస్కారాలన్నీ తల్లిదండ్రులు బిడ్డల క్షేమాన్ని కాంక్షించి చేసేవే. కాకపోతే, అన్నీ ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి. ఎందుకని? పరమేశ్వర ప్రీతి తోనే పాపాలు ప్రక్షాళన మవుతాయి కనుక.

మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా పరమేశ్వర ప్రీత్యర్థం

అంటున్నాము సంకల్పము చేప్పేటప్పుడు. దురితములు అంటే పాపాలు. అనేక జన్మలలో చేసిన పాపాలు పర్వత రూపాలై ఉంటాయి. అవన్నీ నశించాలి. నా విషయంలో పరమేశ్వరుడు తృప్తి చెందాలి అనేదే ఈ సంస్కారాల లోని ప్రధాన మైన ఉద్దేశము.

ఈ విధమైన సంస్కారాల ప్రభావం చేత వ్యక్తిలో విశిష్టత చోటు చేసుకుంటుంది. పాపం పరిహరింప బడుతుంది. బుద్ధిలో వికసనం కలుగుతుంది. సదాచారం లేకుండా సర్వాత్మభావం కలగదు కనుక మన సాంప్రదాయక ఆచారాలు, సంస్కారాలు ఉత్కృష్ట ధర్మాలై, ఇటు వ్యక్తికి, అటు సమాజానికి కళ్యాణాన్ని కలిగిస్తాయి (***ఆచారః పరమోధర్మః నృణాం కళ్యాణ కారకః***).

ఈ సదాచారాలన్నీ సృష్ట్యాది లోనే ఆవిర్భవించాయి. సత్సంప్రదాయాలు, ఉత్తమ సంస్కారాలు యజ్ఞ రూపాలుగా సర్గాది యందే మానవులతో పాటు ఉద్భవించాయి. అందుకే ప్రజలతో పాటు యజ్ఞాలను కూడా ప్రజాపతి సృష్టించాడని గీతాచార్యుడు చెబుతున్నాడు.

యజ్ఞవ్యాప్తి

ప్రజలతో సహ యజ్ఞాలు పుట్టాయి. ప్రజలు, యజ్ఞాలు ప్రజాపతి నుండి ఉద్భవించిన కవలలు. కనుక యజ్ఞము మనిషికి సహోదరి. కలిసి పుట్టినా మార్గనిర్దేశం చేసే శక్తిని కలిగి ఉంది కనుక, ప్రజల కన్నా యజ్ఞానికే జ్యేష్ఠత్వము, శ్రేష్ఠత్వము ఉన్నాయి. అక్క చెప్పినట్లు తమ్ముడు వినాలి. యజ్ఞం ఆదేశించినట్లు ప్రజలు ఆచరించాలి. అప్పుడే వ్యక్తి ఔన్నత్యం, సమాజ అభ్యుదయం. ఇలా జీవించి యజ్ఞాలను వృద్ధి పరచండి అని విరించి పలికాడు (***అనేన యజ్ఞేన, ప్రసవ ష్యధ్వం ప్రసవః వృద్ధిః తాం కురుధ్వమ్***).

యజ్ఞాలు, ప్రజలు సృష్ట్యారంభంలో పుట్టారు. యజ్ఞాలను ప్రక్కన పెడితే, మిగిలినవి ఏవయితే పుట్టాయో అవన్నీ ప్రజల క్రిందికే వస్తాయి. కనుక పుట్టిన వన్నీ యజ్ఞ భావం తోనే జీవించాలి. యజ్ఞ జీవనాన్ని పెంపొందిస్తూ ఉండాలి. అదే వృద్ధి. అభివృద్ధి. 'ప్రసవ' శబ్దార్థము.

సృష్టిలో అన్నీ యజ్ఞభావం తోనే ఉన్నాయి. యజ్ఞజీవనాన్నే కొనసాగిస్తూ ఉన్నాయి. లేకపోతే, ఈ సృష్టి ఎప్పుడో అంతరించి పోయేది. యజ్ఞము అనేది పవిత్రకర్మ. కాకపోతే, యజ్ఞకర్మను కామ్యకర్మగా కాకుండా, ఫలాసక్తి లేకుండా ఆచరించి, శ్రేయస్సుకు సాధనంగా మలచుకునే అద్భుత కర్మయోగ ప్రక్రియను ప్రవేశ పెడుతూ ప్రవచిస్తున్నాడు గీతలో భగవానుడు.

సృష్టి సందర్భం లోనే యజ్ఞాలు పుట్టాయి. నేటికీ యజ్ఞజీవనం ప్రకృతిలో పరవశిస్తూ దర్శన మిస్తుంది. నిస్వార్థంగా, ఫలాసక్తి లేకుండా యజ్ఞకర్మలు సృష్టిలో సాగిపోతూ ఉన్నాయి.

యావ ద్విశ్వాన్ని సూర్యుడు తన వెలుగులతో నింపు తున్నాడు. ఏదీ ఆశించడు. ఫలాభిసంధి తెలియని పారవశ్య కార్యంలో సదా నిమగ్నమై ఉన్నాడు. అదే అర్కుని ప్రకాశం లోని రహస్యము.

జలాలను మరిగిస్తాడు. ఆవిరిని పీల్చుకుంటాడు. మేఘాలకు రూపు దిద్దుతాడు. మేఘజలాలను ధరణిపై ధారగా కుమ్మరిస్తాడు. ప్రచార ఆర్భాటం లేదు. ప్రశంసలపై ఆసక్తి లేదు. జీవితమే గాని జీతం తెలియదు. అదే ఆయన జీవన శోభ. ఆయన యజ్ఞ జీవనంతో శోభిస్తున్నాడు. ఆయన వల్లే విశ్వము పోషింప బడుతూ ఉంది. ఇలా యజ్ఞాన్ని వృద్ధి చేస్తూ, పూషా! అని కీర్తింప బడ్డాడు. జగత్తును పోషించే వాడు పూషా!

ఆయన ఉదయిస్తేనే, మనం కార్యాలలో ఉద్యమిస్తాము. అన్ని కార్యాలకు ఆది తానై ఆదిత్యు డయ్యాడు. ఆదివారానికి అధిపతి అయ్యాడు. అంతేనా? ఆయన యజ్ఞజీవన వైభవానికి సంతసించిన గీతాచార్యుడు, ***జ్యోతిషాం రవి రంశుమాన్.*** ప్రకాశము గల వారిలో నేను సూర్యుణ్ణి అని దివ్యంగా గీతలో ప్రవచించాడు. ఇదంతా యజ్ఞజీవన ఫలం.

యజ్ఞభావంతో జీవించి సూర్యుడు నారాయణు డయ్యాడు. సూర్యనారాయణు డయ్యాడు. యజ్ఞ జీవనానికి అలవాటు పడిన వాయువు వాయుదేవు డయ్యాడు. పరోపకారార్థం, ఫలాపేక్ష లేకుండా జీవించే జీవన విధానము ఏదైనా యజ్ఞమే.

నదులు పరుల కొరకే ప్రవహిస్తున్నాయి. చెట్లు ఇతరులకు నీడనిస్తూ, గాలి నిస్తూ, ఫల పుష్పాదులను పంచుతూ బ్రతుకు తున్నాయి. అంతా యజ్ఞజీవనమే. ప్రకృతిలో ఎక్కడ చూచినా యజ్ఞరూపాలే. యజ్ఞ స్వరూపాలే.

ప్రపంచంలో వన మహోత్సవ వైభవాన్ని చూచి నపుడు పక్షుల ప్రాభవం తెలిసి వస్తుంది. ఎవరి ఇంట్లో వాళ్ళు మొక్కలు నాటుకుంటారు. ఎవరి పొలంలో వారు బీజాలను చల్లుకుంటారు. మరి ప్రపంచంలో అడుగడుగునా పచ్చదనం ప్రాకి పోవడానికి కారణ మెవరు? పక్షులు కావా? వాయువు కాదా? ఏమి ఆశించి అవన్నీ ఈ కార్యాలను నిర్వహిస్తున్నాయి? అదే యజ్ఞజీవనం.

వానపాములు భూమిని గుల్ల చేసి సారవంతం చేస్తాయి. పంట చేతికి వచ్చే సమయంలో ఎలుకలు పాడు చేయకుండా పాములు రక్షిస్తాయి. అంతా యజ్ఞజీవనమే. యజ్ఞజీవన వైభవమే.

యజ్ఞము కామధేనువు

గోవు నుండి పాలు పితుక్కుంటాము. ఆవు పాలిస్తుందే గాని పంచదార నివ్వలేదు. కాని, కామధేనువు అలా కాదు, ఏది కోరితే దానిని అనుగ్రహిస్తుంది ***(ఇష్ట కామధుక్).*** మనకు ఏమి కావాలో వాటిని దాని నుండి పిండుకోవచ్చు. యజ్ఞము కామధేనువు వంటిది.

యజ్ఞ జీవనము వలన పరమ పురుషార్థమైన మోక్షము కూడా కలుగుతుంది. యజ్ఞ జీవనము చిత్తశుద్ధిని అనుగ్రహిస్తుంది. చిత్తశుద్ధి మోక్షహేతువు అవుతుంది. కనుక యజ్ఞము ప్రతి ఒక్కరి జీవితంలో కామధేనువు కావాలి.

కామధేనువు ఉండేది కోర్కెలను తీర్చడానికా? కోరికలు లేకుండా చేయడానికా? అసలు కోరికలే లేవు అనుకుందాం. అప్పుడు తీర్చ వలసిన అవసర మేముంటుంది? ఆప్తకాముడైన వాడు దేనిని కోరుకుంటాడు? ఏ కోర్కెను తీర్చుకుంటాడు?

సోఽ శ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి

ఎవరైతే తన హృదయము నందు బ్రహ్మమును దర్శిస్తాడో, అతడు బ్రహ్మస్వరూపుడై సమస్త కోర్కెలు తీరినవాడు అగుచున్నాడు అని తైత్తిరీయశ్రుతి. ఈ విధమైన ఫలసిద్ధికి యజ్ఞము కామధేనువు వంటిది.

ఈ విధమైన యజ్ఞ కర్మాచరణము ద్వారా దేవతలతో ఎలా సంబంధాలు ఉంటాయో, ఉండాలో తెలుపుతున్నాడు.

దేవా న్భావయ తానేన తే దేవా భావయంతు వః ।
పరస్పరం భావయన్తః శ్రేయః పర మవాప్స్యథ ॥ 11

దేవాన్-భావయత-అనేన-తే-దేవాః-భావయంతు-వః
పరస్పరం-భావయంతః-శ్రేయః-పరం-అవాప్స్యథ

అనేన	=	వీని ద్వారా	పరస్పరం	=	ఒకరి నొకరు
దేవాన్	=	దేవతలను	భావయంతః	=	సంతోష పరచు కొంటూ
భావయత	=	గౌరవించండి	పరం	=	శ్రేష్ఠమైన
తే దేవాః	=	ఆ దేవతలు	శ్రేయః	=	శ్రేయస్సును
వః	=	మమ్మల్ని	అవాప్స్యథ	=	పొంద గలరు.
భావయంతు	=	గౌరవిస్తారు			

యజ్ఞము చేత మీరు దేవతల్ని తృప్తి పరచండి. ఆ దేవతలు తిరిగి మిమ్మల్ని తృప్తి పరుస్తారు. ఇలా పరస్పరము తృప్తి పరచుకొంటూ, ఉత్కృష్టమైన శ్రేయస్సును పొందుతారు.

వ్యాఖ్య

మనిషి ఒంటరిగా పుడతాడు. ఒంటరిగా మరణిస్తాడు. కాని, ఒంటరిగా జీవించలేడు. పది మందితో కలిసే జీవించాలి. తన జీవనానికి ఎందరో సహకరించాలి. మనిషి బ్రతికినంత కాలం శ్వాసిస్తూనే బ్రతకాలి. అంటే, తాను జీవించి ఉన్నంత కాలం గాలిని పీల్చుకుంటూనే ఉండాలి. శ్వాసించే శక్తి తనలో ఉండవచ్చు. కాని, శ్వాసించ డానికి బయట గాలి ఉండాలి. గాలి లేకుంటే మనిషి జీవితం అంతమై పోతుంది.

సృష్టిలో అన్నీ ఇలాగే ఉన్నాయి. అందరికీ అవసరాలు ఉన్నాయి. ఎందరో సహకరిస్తేనే మన జీవితం నడుస్తుంది. ఒకరి వల్ల మనకు ఎలా సహకారం అందుతూ ఉందో, మన వల్ల కూడా ఇతరులకు అలాగే సహకారం అందుతూ పోవాలి. ఇది పరస్పర సహకార జీవనము. దీనినే యజ్ఞ జీవనము అని అభిభాషించాడు గీతాచార్యుడు. జీవన చక్రాన్ని త్రిప్పేది యజ్ఞ భావనే. యజ్ఞ జీవనమే.

జీవులను సృష్టించి నపుడే బ్రహ్మదేవుడు యజ్ఞాలను కూడా సృష్టించాడు. యజ్ఞముల చేత అభివృద్ధిని సాధించమని, పరమ పురుషార్థాన్ని పొంది ఆనందించ మని పదవ శ్లోకంలో తెలిపిన భగవంతుడు, యజ్ఞము యొక్క స్వభావ స్వరూపాలను, యజ్ఞ జీవన ఫలాలను ఈ శ్లోకంలో తెలుపు తున్నాడు. యజ్ఞ జీవనం లేకుండా మనిషి సంతృప్తి చెంద లేడు.

ఎన్నో వస్తున్నాయి - ఎందరో ఇస్తున్నారు

పాడిపంటలు లేకపోతే మనం జీవించ లేము. భూమాత మనకు పంట నిస్తుంది. పంట పండ టానికి మేఘము నీళ్ళు పోస్తుంది. సూర్యుడు శక్తి నిస్తున్నాడు. పాడు కాకుండా వాయుదేవుడు కాపాడు తున్నాడు. ఇది యజ్ఞ భావన. ఒకరికి మరొకరు సహకరించడం యజ్ఞమైతే, అట్టి సహకార జీవనం వల్ల కలిగే ఫలమే యజ్ఞఫలం.

మొక్కలు పువ్వులను ఇస్తాయి. మన కొరకే అవి పూస్తున్నాయి. పువ్వులను మనం కోసుకుంటాము.

మొక్కలు అడ్డు చెప్పవు. కాకపోతే, మొక్కలు పూలు పూయాలి అంటే, అవి బ్రతికి ఉండాలి. మొక్కలు బ్రతకాలి అంటే వాటికి నీళ్ళు కావాలి. పువ్వులను అందించే చేతులు మొక్కలకు ఉన్నాయి. నడిచి వెళ్ళి నీళ్ళు తెచ్చుకొని త్రాగడానికి మొక్కలకు కాళ్ళు లేవు. కాళ్ళు ఉన్న మనం మొక్కలకు నీళ్ళు తెచ్చి పోస్తే, మనసున్న మొక్కలు మనకు పువ్వులను ప్రసాదిస్తాయి. ఇదే యజ్ఞ జీవనము. మరొకరిని తృప్తి పరచకుండా మనం తృప్తి చెందడం సాధ్యం కాదు. యజ్ఞ భావనే మనిషికి ఎనలేని సుఖసంతోషాలను ప్రసాదిస్తుంది.

యజ్ఞ జీవనం సృష్టిలో దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది. యజ్ఞము వల్లే వానలు కురుస్తున్నాయి. సౌరశక్తి అందుతూ ఉంది. సంతానం కలుగుతూ ఉంది. పంటలు అందుతున్నాయి. పాడి కలుగుతూ ఉంది. పసిడి ప్రాప్తిస్తూ ఉంది. ఆరోగ్యం కలుగుతూ ఉంది. ఆయుష్షు వృద్ధి చెందుతూ ఉంది.

పశువులు పాలు ఇస్తున్నాయి. క్షీరాన్నిచ్చే గోమాతలు తమ క్షీరాన్ని తాము త్రాగవు. మన కొరకే వాటి పాదుగులు బరువెక్కు తున్నాయి. మనం పిండుకుంటున్నా అవి వారించడం లేదు. బాధను భరిస్తూ మనకు క్షీరాన్ని ప్రసాదిస్తున్నాయి. ఈ విధమైన యజ్ఞభావన వాటికి ప్రయత్నం లేకుండానే అలవడింది. ప్రకృతి సహజంగానే ప్రాప్తించింది. కాని, మనిషికి కర్మస్వేచ్ఛ ప్రసాదించ బడింది. అందుచేత, ప్రయత్నిస్తేనే యజ్ఞ భావన అలవడుతుంది.

గోవులిచ్చే పాలు మనకే. మానవులకే. పాలు పిండుకోవడం తప్పు కాదు. పాలిచ్చే పశువులకు గడ్డి పెట్టక పోవడం నేరం. కుడితిని త్రాగించక పోవడం దోషం. పశువులకు గ్రాసాన్ని అందిస్తే, అవి మనకు క్షీరాన్ని ప్రసాదిస్తాయి. నువ్వు పెట్టే ఆహారం వల్ల ఆవులు బ్రతుకుతాయి. అవి ప్రసాదించే క్షీరం వల్ల నీ ఆయుష్షు వృద్ధి చెందుతూ ఉంది. ఇదే పరస్పర సహకార రూపమైన యజ్ఞ జీవనము.

ప్రకృతి దేవతా స్వరూపం

యజ్ఞజీవనంతో సాగుతున్న ప్రకృతిలో పరమేశ్వరుని అడుగులు మనకు దర్శన మిస్తాయి. వాటినే మనం దేవతలు అంటూ ఉంటాము. భౌతికంగా ఏవయితే జడరూపాలుగా కనిపిస్తున్నాయో, భావనను తోడు చేసుకొని వీక్షించి నపుడు అవే దేవతామూర్తులుగా దర్శన మిస్తాయి.

వాయువు జడం. కాని వాయువు లేకుంటే ఆయువు మిగలదు. అందుచేత ఆయుష్షు నిచ్చే వాయువు భగవ త్ప్రసాదంగా వీక్షింప బడుతోంది. దేవతా స్వరూపంగా దర్శింప బడుతోంది. అందుకే వాయువును వాయుదేవుడు అంటున్నాం. ***నమస్తే వాయో!*** ఓ వాయుదేవుడా! నీకు నమస్కారము అంటూ వాయువుకు నమస్కరిస్తున్నాం.

భౌతికంగా చూస్తే సూర్యుడు ఒక అగ్నిగోళం. కేవలం జడరూపము. కాని మన జీవనానికి ఉపకరిస్తున్న సౌరశక్తిని అర్థం చేసుకు న్నప్పుడు, సూర్యుణ్ణి దేవతగా ఆరాధిస్తున్నాం. ప్రార్థనతో పలకరిస్తున్నాం. ***శం నో మిత్రః*** ఓ సూర్యదేవా! మమ్మల్ని సుఖపెట్టు అని మొరపెట్టు కుంటున్నాం.

జలము కూడా జడమే. కాని, నీరము ప్రాణాధార మనే సత్యాన్ని గ్రహించి నపుడు, ప్రాణాన్ని కదిలించే చలనశక్తిని జలాలకు ప్రసాదించిన ప్రాణేశ్వరుడైన పరమేశ్వరుని వైభవాన్ని నీళ్ళల్లో దర్శిస్తూ, ***శం వరుణః*** సుఖ శాంతులను అనుగ్రహించ మని వరుణుణ్ణి వేడుకుంటున్నాము.

నిత్య దర్శనం

పరమేశ్వరుని దర్శనం కావాలని మనం ఎంతగానో పరితపిస్తాం. కాని, ప్రతిరోజు, ప్రతిక్షణం ప్రకృతి రూపంలో పరమేశ్వర దర్శనం ప్రాప్తిస్తూనే ఉంది అనే సత్యాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాం.

అరుణోదయానికి ముందే స్నానాదులు ముగించుకొని, రెండు చేతులు జోడించి, తూర్పుదిక్కును చూస్తూ కూర్చో. సూర్యుడు తూర్పున మెల్లగా పైకి వస్తూ ఉంటే, నీవు కూడా భక్తి భావంతో లేచి దండం పెట్టు. అది భగవద్దర్శనం అవునో, కాదో ఆలోచించుకో.

దృశ్యాలను చూచే శక్తి నేత్రాలకు ఉంది. కాని, దృశ్యాలలో దోబూచు లాడే 'దృక్' స్వరూపాన్ని దర్శించేందుకే నేత్రాల వెనుక మనస్సు నిలిచి ఉంది. నేత్రంతో పాటు మనస్సును ప్రసాదించడంలో పరమేశ్వరుని ఉద్దేశ్యం అదే. కళ్ళతో చూస్తే కేవలం రంగులు, రూపాలు కనిపిస్తాయి. దృశ్యాలు మాత్రమే అగుపిస్తాయి. కాని, ఆ కళ్ళకు బుద్ధిని తోడు చేసుకొని కనిపించే రూపాలలో అవ్యక్తంగా ఉన్న పరమేశ్వరుని దర్శించాలి అనేదే ఈశ్వర ప్రబోధం. అందుచేతనే, అట్టి దర్శన భాగ్యాన్ని ప్రసాదించ మని దేవతా రూపంలో ఉన్న దేవదేవుని, ప్రకృతి రూపంలో ఉన్న పరమేశ్వరుని ఋషులు ప్రార్థించారు.

ఓ దేవతలారా! మా కన్నులతో పరమేశ్వరుని దివ్య రూపాన్ని దర్శించే భాగ్యాన్ని ప్రసాదించండి అని ప్రార్థించారు (***భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః***). మన ప్రార్థనలను ఆలకించిన పరమేశ్వరుడు మనకు దర్శన మివ్వడానికి దేవతా రూపంలో సిద్ధ మయ్యాడు. గాలి వీచినంత మాత్రాన పరిపోదు. తెరచాపను ఎత్తి పట్టినపుడే ప్రయాణం సుఖంగా సాగుతుంది. పరమేశ్వరుని అనుగ్రహం గాలి లాగా వీస్తూనే ఉంది. మనమే అది గుర్తించి యజ్ఞభావనతో తెరచాపను ఎత్తి పట్టాలి.

యజ్ఞ జీవనం

యజ్ఞభావనతో జీవిస్తూ, మనం దేవతల్ని తృప్తి పరిస్తే, యజ్ఞరూపు లైన దేవతలు మనల్ని అధికంగా తృప్తి పరుస్తారు. ఈ విధంగా పరస్పరం సహకరించు కుంటూ యజ్ఞజీవనంతో సుఖాన్ని, శ్రేయస్సును కూడా పొంద వలసిందిగా పరమేశ్వరుడు ప్రబోధిస్తున్నాడు.

మన పూర్వీకులు యజ్ఞములను భావస్ఫూర్తితో ఆచరించేవారు. వారు సమర్పించే హవిర్దానాలతో ఇంద్రాది దేవతలు తృప్తి చెందేవారు (***దేవాన్ ఇంద్రాదీన్ భావయత వర్ధయత***). అలా తృప్తి చెందిన ఇంద్రాది దేవతలు వర్షాన్ని కురిపించి, తద్వారా అన్నాదులను కలిగించి వాళ్ళను తృప్తి పరచేవారు (***తే దేవాః భావయన్తు ఆప్యాయన్తు వృష్ట్యాదినా***). ఈ విధంగా పరస్పరం సహకరించుకుంటూ సుఖాన్ని, శ్రేయస్సును పొందేవారు (***ఏకం పరస్పరం అన్యోన్యం భావయన్తః శ్రేయః పరమం అవాప్స్యథ***).

శ్రేయస్సు అంటే మోక్ష మని ఇప్పటికే మనం తెలుసుకొని ఉన్నాం. ఇక్కడ 'శ్రేయః' అనే పదాన్ని మోక్షపరం గాను, స్వర్గపరం గాను కూడా అర్థం చేసుకోవాలి.

యజ్ఞాలు పుణ్యకర్మలు. పుణ్యం వల్ల వచ్చేది స్వర్గమే కాని మోక్షం కాదు. యజ్ఞము ఏదైనా సరే, దాని వెనుక ఒక కోరిక ఉంది. అభీష్ట ఫలసిద్ధికే యజ్ఞం చేస్తాం. కనుక ఈ యజ్ఞ ఫలితాలు బుభుక్షువుకు (***భోక్త***) ఉపకరించేవే గాని ముముక్షువుకు సహకరించేవి కావు అని కొందరు భావిస్తూ ఉంటారు.

దేవతలు, మానవులు పరస్పరం సంతృప్తి పరచుకుంటూ యజ్ఞ కర్మలను ఆచరించడం చేత, అట్టి యజ్ఞ జీవన ఫలంగా ఉత్తమమైన స్వర్గాన్ని పొందుతారు (***స్వర్గం వా పరం శ్రేయః అవాప్స్యథ***). ఈ విషయంలో సందేహం లేదు.

కాని, ముముక్షువు అయిన కర్మయోగి యొక్క యజ్ఞ భావనలో పరమేశ్వరుడే ఉన్నాడు కనుక, అతడు ఫలాసక్తి లేకుండా యజ్ఞకర్మలను ఆచరించడం చేత అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞానప్రాప్తి ద్వారా ఉత్తమ శ్రేయస్సును అనగా మోక్షాన్ని పొందుతాడు అని భావము (***పరమపి జ్ఞానప్రాప్తి క్రమేణ అవాప్స్యథ***).

చేసే చేతులు రెండు - తినే చేయి ఒక్కటే

ఇక్కడ మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను అర్థం చేసుకో వలసి ఉంది. మానవులు, దేవతలు పరస్పరం యజ్ఞభావనతో సహకరించుకుంటూ సంతృప్తిని పొందు తున్నారు అని గ్రహించాం. యజ్ఞాచరణలో కూడా పరస్పరం ఒకే విధంగా చరిస్తున్నారు. ఇదీ అర్థమవుతూ ఉంది. కాని, యజ్ఞఫలం విషయంలో ఇరువురూ సమానంగా ఫలితాన్ని పొందుతున్నారా? అనేది ప్రత్యేకంగా నా సందేహం. ఈ సందేహాన్ని పట్టుకొని విషయాన్ని తరచి చూస్తే, 'లేదు' అనే వ్యతిరేక సమాధానమే వస్తుంది.

మనం అర్థం చేసుకున్న దానిని బట్టి చూస్తే యజ్ఞఫలము స్వర్గం కావాలి, లేదా మోక్షం కావాలి. బుభుక్షువు స్వర్గాన్ని కాంక్షిస్తాడు. అభీష్టాన్ని నెరవేర్చుకొని స్వర్గాన్ని పొందుతాడు. ముముక్షువు అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతాడు. బాగుంది. ఇంతకీ దేవతలు కూడా యజ్ఞజీవనంలో తృప్తి చెందు తున్నారు కదా! మరి వారు పొందే యజ్ఞఫల మేమిటి? స్వర్గమా? మోక్షమా? రెండూనా? లేక రెండూ కాదా?

యజ్ఞఫలంగా దేవతలు స్వర్గాన్ని పొంద లేరు. ఎందుకని? చెట్టు ఎక్కి ఉన్నవాడు మళ్ళీ చెట్టు ఎక్కడ మేమిటి? దేవతలు స్వర్గం లోనే ఉన్నారు కదా! మళ్ళీ స్వర్గానికి ఎలా పోతారు? అంతగా కోరుకుంటే, నరకానికి పోతే పోవచ్చు. కాని యజ్ఞఫల మనేది స్వర్గాన్ని ప్రసాదించేదే కాని, నరకాన్ని ప్రసాదించేది కాదు. కనుక దేవతలకు యజ్ఞఫలంగా స్వర్గప్రాప్తి ప్రత్యేకంగా లేదు. ఇక మిగిలింది ఏమిటి? మోక్షమే కదూ? కనుక దేవతలకు యజ్ఞఫలంగా మోక్షప్రాప్తి కలగాలి. కాని దానికి కూడా అవకాశం లేదు. ఎందుకని?

మోక్షానికి ప్రయత్నం భూలోకంలో జరగాలే కాని, స్వర్గలోకంలో కాదు. స్వర్గలోకం భోగభూమి. అది కర్మభూమి కాదు కనుక స్వర్గం నుండి మోక్ష ప్రయత్నము సాధ్య పడదు. కనుక దేవతలకు ఇటు స్వర్గఫలం ప్రత్యేకంగా లేదు. అటు మోక్షఫలం అందే అవకాశం లేదు. పోనీ అంతఃకరణ శుద్ధి కలుగుతుందా అంటే, ఆ ఆలోచనకు కూడా సమన్వయం కుదరదు. అంతఃకరణ శుద్ధిని పొందడం కూడా కర్మే. మోక్ష హేతువైన సమకార్యం. ఇలాంటివి భూలోక వాసులకే గాని స్వర్గలోక వాసులకు సాధ్య పడవు. కనుక, యజ్ఞజీవనంలో ఫలాన్ని అందుకొని తృప్తి చెందేవారు మానవులు. యజ్ఞాల వల్ల తృప్తి చెంది ఆనందంతో ఆశీర్వదించే వారు దేవతలు.

మానవులు పరిమితమైన శక్తి గలవారు. స్వార్థానికి సంకెళ్ళు వేయడంలో అశక్తులు. కనుక, వారి నుండి మనకు సర్వత్ర, సదా సహాయం అందుతుందని చెప్పలేము. కాని, దేవతలు అలాంటి నిస్సహాయులు కారు. పైగా, వారిలో యజ్ఞజీవనమే గాని స్వార్థం ఉండదు. కనుక, యజ్ఞభావనతో, దేవతారాధనా భావంతో సాగించే యజ్ఞకర్మలే సత్ఫలితాల నిస్తాయి. యజ్ఞ భావానికి దూరమై జీవించే సమాజం లోనే కరువులు, కాటకాలు, కాఠిన్యాలు, హింసలు తాండవిస్తూ ఉంటాయి.

ఒక కార్యానికి అనేక కారణాలు ఉంటాయి. అలాంటి కారణాలలో ఏదో ఒక కారణం ప్రధానంగా ఉంటుంది. అలాగే సమాజ అభ్యుదయానికి అనేక కారణాలు ఉంటాయి. కాని, మానవుల సత్ప్రవర్తన, ధర్మ జీవనము ప్రధాన కారణమై ఉంటుంది.

అలాగే సమాజ వినాశానికి కూడా మానవుల దుష్ప్రవర్తన, అధర్మ జీవనము ప్రధాన కారణాలుగా ఉంటాయి. ధర్మ పరాయణులున్న సమాజం దివ్యంగా శోభిస్తుంది. అభ్యుదయంతో అలరారే సమాజంలో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లుతారు. యజ్ఞభావంతో జీవించడం వల్ల ప్రకృతి పల్లవించి పులకిస్తుంది. సమాజం శాంతితో పరవశించి సుఖిస్తుంది.

దాతృత్వం ఉండదా?

పరస్పర సహకార యజ్ఞజీవనంలో దేవతలు మానవులను తృప్తి పరచి ఆనందిస్తున్నారే గాని, ఏ విధమైన ఫలాసక్తిని వాంఛించి కాదు అని అర్థం చేసుకున్నాం. అలాంటప్పుడు, మానవులు యజ్ఞభావంతో జీవించక పోయినా, దేవతలు తమ అసమాన దాతృత్వ వైభవంతో మానవులకు సహాయం చేయవచ్చు కదా! అని కొందరు పిడివాదాలు, పొడివాదాలు వినిపిస్తూ ఉంటారు.

కృతం భవతి సర్వత్ర - ఎక్కడైనా చేస్తేనే ఫలం లభిస్తుంది. ఏదీ చేయక పోవడ మనే కర్మకు ఫలితం కూడా ఏమీ లేక పోవడమే అవుతుంది. కాళ్ళే లేని వ్యక్తికి చెప్పులు తొడగడం సాధ్యమేనా? చేస్తేనే ఫలం. చూస్తేనే రూపం.

చేసినవాడు ఫలితాన్ని ఆశిస్తాడు. ఏది చేస్తాడో తత్సంబంధ మైన ఫలాన్నే ఆశిస్తాడు. ఏదీ చేయని వాడు ఏ ఫలితాన్ని ఆశిస్తాడు? సమస్తాన్నీ ఆశిస్తాడు. సర్వులూ ఏమి చేయకనే సమస్తాన్ని ఆశిస్తూ కూర్చుంటే, ప్రయోజనం ఎలా ఉంటుందో ఊహిస్తే అర్థం కాకపోదు.

పైగా, ఏమీ చేయకుండా ఉండేందుకే భగవంతుడు మానవాళిని సృష్టించి ఉంటే, మనిషికి కాళ్ళు చేతులు ఎందుకు ఇచ్చినట్లు? కళ్ళు - నాలుక దేని కొరకు ఉన్నట్లు? చేయమనే ఇచ్చాడు. చేస్తూ చూడమనే ఇచ్చాడు. చూస్తూ చేయమనే ఇచ్చాడు. చూసి ఆశించాలి. ఆశించిన దానిని చేసి సాధించాలి. అందుచేతనే, మనుషులతో పాటే యజ్ఞాలను కూడా సృష్టించాడు. మానవులు చేయ వలసింది చేస్తే, దేవతలు ఇవ్వవలసింది ఇస్తారు. చెయ్యడానికి నోచుకోని చేతులు పుచ్చుకోవ డానికి పనికి రావు.

ఆఖ్యాయిక

ఒక శిష్యుడు గురువు గారిని దర్శించడానికి ఆశ్రమానికి వచ్చాడు. లోపలికి వెళ్ళి గురువు గారికి నమస్కరించి, 'గురుదేవా! భగవంతుని మీద నాకు అచంచల విశ్వాసం ఏర్పడింది. నా యోగక్షేమా లన్నీ భగవంతుడే చూసుకుంటాడు అనే ప్రగాఢ విశ్వాసంతో ఉన్నాను. ఇదంతా మీ దివ్య బోధ లోనే నాకు ప్రాప్తించింది.

గురుదేవా! పూర్వము నేను ఎక్కడికి వెళ్ళినా, నా సైకిలుకు తాళం వేసి లోనికి వెళ్ళేవాణ్ణి. ఇప్పుడు అలా చెయ్యడం లేదు. రక్షించే దేవుడు ప్రక్కనే ఉండగా, నా సైకిలును ఎవరు అపహరిస్తారు? భారాన్నంతా భగవంతునిపై పడేసి నిశ్చింతగా ఉంటున్నాను. ఇప్పుడు కూడా నా సైకిలు మన ఆశ్రమం ముందే తాళం లేకుండా పడి ఉంది' అని ఊగిపోతూ పలికాడు.

అతడి మాటలను ఆలకించిన గురువు, 'చూడు నాయనా! రక్షించే పరమేశ్వరుడు ప్రక్కనే ఉన్నాడని నువ్వే చెబుతున్నావు కదా! మరి, నువ్వు లోపలికి వచ్చి నపుడు ప్రక్కనే ఉండే పరమేశ్వరుడు కూడా లోనికి వచ్చినట్లే కదా! మరి, బయట సైకిలును ఎవరు రక్షిస్తారు?' అని ప్రశ్నించాడు. శిష్యుడు తెల్లబోయాడు.

'మూర్ఖుడా! నీకు భగవంతుడు బుద్ధి నిచ్చింది నీ సైకిలుకు ఆయన కాపలా కాయడానికా? సైకిలుకు తాళం ఉండేది తీసిపెట్టి తమాషా చూడ టానికా? ఛీ! ముందు వెళ్ళి సైకిలుకు తాళం వేసిరా! నీకు నీవుగా చక్కగా చేసుకో వలసిన కార్యాలను భగవంతుడు ఎప్పుడూ పట్టించుకోడు' అని గురువు చీవాట్లు పెట్టాడు.

యజ్ఞభావంతో జీవించే వారికే దైవ సహాయం అందుతుంది. దేవతల ఆశీర్వాదాలు లభిస్తాయి. చేసే వారే ఫలాలను అందుకుంటారు. ఇచ్చే వారికే పుచ్చుకొనే అర్హత ఉంటుంది. పుచ్చుకొని తిరిగి ఇవ్వని వాడు ఎవడైనా చోరుడే. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

ఇష్టాన్భోగా న్హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః ।
తైర్దత్తా నప్రదా యైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః ॥ 12

ఇష్టాన్-భోగాన్-హి-వః-దేవాః-దాస్యంతే-యజ్ఞభావితాః
తైః-దత్తాన్-అప్రదాయ-ఏభ్యః-యః-భుంక్తే-స్తేనః-ఏవ-సః

యజ్ఞభావితాః = యజ్ఞము చేత సంతోషింప బడిన		దత్తాన్	= ఇవ్వబడిన వానిని
దేవాః = దేవతలు		ఏభ్యః	= వీరి కొరకు
వః = మీ కొరకు		అప్రదాయ	= సమర్పించ కుండా
ఇష్టాన్ = ఇష్టములైన		యః	= ఎవడు
భోగాన్ = భోగములను		భుంక్తే	= భుజిస్తాడో
దాస్యంతే హి = తప్పక ఇస్తారు		సః	= వాడు
తైః = వారి చేత		స్తేన ఏవ	= చోరుడే

యజ్ఞము చేత తృప్తి చెందిన దేవతలు మీకు ఇష్ట భోగాలను ప్రసాదిస్తారు. అలా ప్రసాదింప బడిన వాటిని తిరిగి దేవతలకు సమర్పించ కుండా అనుభవించు వాడు చోరు డవుతాడు.

వ్యాఖ్య

మానవుని మనుగడ మహిమాన్విత మైనది. ధర్మంతో ముడిపడి ఉంది. నియతిలో నియంత్రించబడి ఉంది. తన కొరకే తాను జీవించే విధానానికి భిన్నమైన ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. నా జీవనం నీతో ముడిపడి ఉంది. నీ జీవనం నాతో ముడిపడి ఉంది. మనిద్దరి జీవితాలు మరొకరితో కలిసి నడుస్తూ ఉన్నాయి. తమకు తాముగా ఎవ్వరూ బ్రతకలేని ప్రపంచ మిది. అందరూ అందరి కొరకు ఆదర్శంగా జీవించ వలసిన అందమైన ప్రపంచమిది. మనం అందరి కొరకు ఉన్నాం. అందరూ మన కొరకు ఉన్నారు. ఈ విధమైన సమిష్టి సహకార జీవనాన్ని సమన్వయంతో సాగే దైవ నిర్మితమైన ప్రపంచంలో, ధర్మయుతంగా జీవించుటకు ప్రయాణము సాగిస్తున్న బాటసారులం మనం. ఈశ్వరీయ సామ్యవాద వ్యవస్థలో భాగస్వాములం మనం.

ప్రభుత్వము యొక్క ప్రమేయం లేకుండా ప్రజా జీవనము సాగదు. పరమేశ్వరుని పాత్ర లేకుండా ప్రపంచంలో ఏ కార్యమూ జరగదు. అన్ని కార్యాలలో ఆపద్బాంధవు డైన ఆదిదేవుని అదృశ్యహస్త ముంది. పరమేశ్వరుని ప్రమేయం లేకపోతే మనిషి మాట్లాడ లేడు. చూడలేడు. వినలేడు. తినలేడు. తినినా జీర్ణించుకో లేడు. అన్ని కార్యాల వెనుక అచ్యుతుని అద్భుతమైన అనుగ్రహం దాగి ఉంది. అగ్ని, వాయువు, వరుణుడు, సూర్యుడు మొదలైన దేవతామూర్తుల రూపంలో జీవులను, జగత్తును ఆశీర్వదిస్తున్న మహిమాన్విత శక్తి ఆ పరంధాముడే.

పెట్టుబడులు - ఫలితాలు

నీవు చేసే వ్యాపారములో మరి కొందరు పెట్టుబడి పెట్టడం వల్ల వ్యాపారము సవ్యంగా సాగడమే గాక, గొప్ప ఫలితాన్ని కూడా సాధిస్తుంది. వ్యాపారములో పెట్టుబడిదారులకు కూడా ఫలితం అందుతుంది. అందాలి కూడా. అలా కాకుండా, పెట్టుబడులను మాత్రం గ్రహించి, ఫలితాన్ని పెట్టుబడిదారు లకు పంచని వాడు ఏమవుతాడు? ముందు దొంగ అవుతాడు. ఆ తరువాత ఋణగ్రస్తు డవుతాడు.

అలాగే, దేవతల రూపంలో ఉన్న పరమేశ్వరుని సంపదను అందుకొని ప్రత్యర్పణం లేకుండా జీవించే

వాడు కూడా చోరుడే అవుతాడు. ఋణగ్రస్తుడుగా మిగిలి పోతాడు. పదుగురికి సంబంధించిన భాగ్యాన్ని ఒక్కడే అనుభవిస్తే దొంగ గాక ఏమవుతాడు?

ఆకలిగా ఉందని భోజనానికి కూర్చుంటాం. విస్తరలో ఆహారం వడ్డించ బడింది. ఆరగించ డానికి ఉపక్రమిస్తున్నాం. ఆరగిస్తే ఆకలి తీరి పోతుంది. తృప్తి కలుగుతుంది. మనకు తృప్తి నిచ్చేందుకు విస్తరలో ఆహారం సిద్దంగా ఉంది.

అది ఆహారమా? లేక ఈశ్వరుని అనుగ్రహ ప్రసాదమా? ఆకలి తీర్చే అన్నాన్ని సృష్టించింది ఎవరు? మనం మాత్రం కానే కాదు. వంటవార్పులే మనవి. అన్నదాత భగవంతుడే.

ధరణి లేకుండా ధాన్యం లేదు. ధరణి లోని సత్తువ ఎవరిది? ధాన్యాన్ని సృష్టించిం దెవరు? ఆదిబీజాన్ని అనుగ్రహించిం దెవరు? వర్ష రూపంలో ఉన్న దెవరు? సారశక్తి ఎవరిది? అగ్ని రూపంలో పక్వం చేసిం దెవరు? ఓషధు లెలా వచ్చాయి? పంచభూతాల నుండి సూర్యచంద్రుల వరకు అందరూ చేతులు కలిపితేనే నా చేతి నిండా ఈ క్షణం అన్నపు ముద్ద ఉంది. అందుకే ఆ ముద్ద నోటి లోకి చేరే లోగా ఈ భాగస్వాము లందరూ కళ్ళ ముందు మెదుల్తున్నారు. దానిని వారికి సమర్పించి ఆ తరువాత భోం చేయాలి. మనం చేసే ప్రత్యర్పణంలో ధర్మం ఉంది. మనకు బాధ్యత ఉంది. వారికి హక్కూ ఉంది. కృతజ్ఞతా భావంతో వారి వంతు వారికి అర్పించి ఆ తరువాతే మనం ఆరగించాలి. అది, ధర్మ జీవనం. అలా కాకుండా స్వార్థంతో మనమే ఆరగించడం దొంగ జీవనం. అలాంటి స్వార్థపరుడు దొంగే (**స్తేనః**) అవుతాడు అంటున్నాడు గీతాచార్యుడు.

ఒక నిర్దోషి శిక్షకు గురి అయి నపుడు, 'నేను ఏ దోష మెరుగను. నాపై దురుద్దేశంతో నిందను మోపారు. నేను నిర్దోషిని. సత్య మేమిటో ఆ భగవంతుడికే తెలుసు' అంటూ ఉండటం మనము తరచుగా వింటూ ఉంటాము. లోకం దోషిగా పరిగణించినా, దైవదృష్టిలో తాను నిర్దోషియే నని ఆ వ్యక్తి అభిప్రాయము.

మరొక కోణంలో చూచి నపుడు, ప్రజల దృష్టిలో నిర్దోషిగా, ధర్మజ్ఞుడుగా పేరు పొందిన వ్యక్తి, దైవం దృష్టిలో దోషి అయి నపుడు, అధర్మపరుడు అయి నపుడు, ఆ వ్యక్తి మనస్సు ఎలా ఉంటుంది? నేను పాపిని. ఈ విషయాన్ని లోకం గుర్తించలేక పోవచ్చు. చట్టం పసికట్టలేక పోవచ్చు. అయినా నా పాపం భగవంతుడికి తెలియకుండా పోతుందా? దైవం దృష్టిలో నేను శిక్షార్హుణ్ణే కదా! అని తనలో తాను కుమలి పోతూ ఉంటాడు.

దొంగల పరిస్థితి ఎప్పుడైనా, ఎక్కడైనా ఇలాగే ఉంటుంది. దేవతలు ప్రసాదించిన భోగాలను ప్రత్యర్పణం చేయకుండా, స్వార్థంతో తానే అనుభవించువాడు రాజైనా దొంగే. దైవ సంపదను అపహరించి మనుషులు దొంగలు కాకూడదు. ధర్మ జీవనాన్ని సాగించి, ఈశ్వరార్పణ బుద్ధితో ప్రత్యర్పణం చేసి, ఋణ విముక్తులు కావాలి. భోగాలను అనుభవించి, ఋణము లేనివాడుగా కానివాడు (**ఆనృణ్యమ్ అకృత్వా**) దొంగే. చోరుడే (**స్తేనః ఏవ తస్కరః ఏవ**). ఎందుకో తెలుసా? దేవతల సంపదను అపహరించిన వాడు అయ్యాడు కనుక (**సః దేవాది స్వాపహారీ**). 'ఆనృణ్యమ్' అనేది భాష్యం లోని పదం. ఆనృణ్యము అంటే 'ఋణము లేని వారు అగుట' అని అర్థము.

దేవతల రూపంలో ఉన్న పరమేశ్వరుని అనుగ్రహంతో లభించిన భోగాలను ముందుగా పరమేశ్వరునికి సమర్పించి, ఆ తరువాత ప్రసాదంగా స్వీకరించు వారు ఏ పాపాన్ని అంటరు. ప్రసాదాన్ని భుజించేవారు ప్రసన్నచిత్తు లవుతారు. అలా కాకుండా, కేవలం స్వార్థ జీవనాన్నే కొనసాగించు వారు భుజించేది ప్రసాదం కాదు. పాపమే అంటోంది గీత. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చూడబోతున్నాం.

యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః ।
భుఞ్జతే తే త్వఘం పాపా యే పచ న్త్యాత్మకారణాత్ ॥ 13

యజ్ఞశిష్టాశినః-సంతః-ముచ్యంతే-సర్వకిల్బిషైః
భుంజతే-తే-తు-అఘం-పాపాః-యే-పచంతి-ఆత్మకారణాత్

యే తు	= ఎవరైతే	భుంజతే	= తింటున్నారు
ఆత్మకారణాత్	= తమ శరీర పోషణార్థము	యజ్ఞశిష్టాశినః	= యజ్ఞశేషమును ఆరగించు
పచంతి	= వండుకొంటున్నారో	సంతః	= సత్పురుషులు
పాపాః	= పాపులైన	సర్వకిల్బిషైః	= సమస్త పాపముల నుండి
తే	= వారు	ముచ్యంతే	= విడిపోతున్నారు
అఘం	= పాపమును		

యజ్ఞ శేషమును ఆరగించే సత్పురుషులు సర్వ పాపాల నుండి విడిపడు తున్నారు. అలా కాక, ఎవరైతే, కేవలం తమ కొరకే వండు కొంటున్నారో, అట్టి పాపాత్ములు పాపాన్నే ఆరగిస్తున్నారు.

వ్యాఖ్య

జీవించడానికి మనిషి భుజించి తీరాలి. భుజించకుండా జీవించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. అందరూ భుజిస్తూనే జీవిస్తారు. అందరూ ఆహారాన్నే భుజిస్తారు. ఈ విషయం అందరికీ తెలుసు. కాని, ఆహారాన్ని ఎవ్వరూ భుజించరు అనేది శాస్త్రము యొక్క అభిప్రాయం.

ఎవరు ఏది భోం చేస్తారు? ఏ పదార్థాన్ని భుజిస్తారు? అనేది అప్రధానమైన విషయం. అమృతాన్ని భుజిస్తున్నారా? పాపాన్ని తింటున్నారా? అనేది ముఖ్యమైన చర్చనీయాంశం. మనిషి తీసుకొనేది ఆహారమే అయినా, ఆ ఆహార రూపంలో అమృతమైనా ఉంటుంది, లేదా పాపమైనా ఉంటుంది. అమృతాహారమైనా ఉంటుంది, లేదా పాపాహారమైనా ఉంటుంది.

యజ్ఞములను ఆచరించి, దేవతాదులకు సమర్పించిన తరువాత మిగిలిన యజ్ఞ శేషమును భుజించే వారు అమృతమును భుజించిన వారై, సమస్త పాపముల నుండి విడిపడి పోతున్నారు. అలా కాకుండా, యజ్ఞ జీవనానికి దూరులై, కేవలం తమ కొరకే ఎవరైతే వండుకొని తింటున్నారో, వారు పాపాన్నే భుజిస్తున్నారు. ఇదే గీతామాత నిర్దేశము. గీతాచార్యుని ఆదేశము.

యజ్ఞము అంటే పంచ మహాయజ్ఞములు అని శాస్త్ర నిర్ణయము. దేవయజ్ఞము, పితృయజ్ఞము, ఋషి యజ్ఞము, మనుష్య యజ్ఞము, భూత యజ్ఞము - ఈ ఐదు యజ్ఞాలను 'పంచమహా యజ్ఞములు' అంటారు. ఈ పంచమహా యజ్ఞాలను నిర్వహించి, యజ్ఞశేషంగా ప్రాప్తించిన ఆహారాన్ని భుజించే వారు అమృతాహారాన్ని ఆరగించిన వారవుతున్నారు. అంతేకాదు. అమృతాహార సేవనము యొక్క ఫలితంగా సమస్తమైన పాపాల నుండి విముక్త లవుతున్నారు.

పాపాలు - పరిహారాలు

కర్మాచరణంలో తెలిసో తెలియకో హింస జరిగిపోతూ ఉంటుంది. హింస వలన కలిగే పాపాలు ఐదు విధాలుగా ఉంటాయి. వీటినే 'పంచ మహాపాతకాలు' అంటారు. ప్రతి మనిషి ఈ ఐదు పాపాలను ప్రతి రోజు తెలిసో, తెలియకో ఆచరిస్తూ ఉంటాడు.

కణ్డనీ పేషణీ చుల్లీ చోదకుంభీ చ మార్జనీ
పంచ సూనా గృహస్థస్య పంచయజ్ఞా త్ప్రణశ్యతి ॥

రోలు, లేక కత్తిపీట (*కణ్డని*), నూరెడి రాయి, లేదా రుబ్బు రాయి (*పేషణి*), పొయ్యి (*చుల్లి*), నీళ్ళకుండ (*ఉదకుంభః*), చీపురు (*మార్జనీ*) - ఈ ఐదింటిని సూనాస్థానములు అంటారు. అంటే, హింస జరిగే స్థానములు, లేదా హింసకు కారణమైన స్థానములు అని అర్థము. ఈ ఐదింటికి సంబంధించిన కార్యాలలో అనివార్యంగా జరిగే హింస ఐదు విధాలుగా ఉంటుంది. అవే పంచపాపాలు. శాస్త్రంలో వీటిని 'పంచసూనాలు' అంటారు.

రోటిలో దంచే టప్పుడు (గ్రైండర్ త్రిప్పే టప్పుడు), కత్తిపీటతో లేదా కత్తితో ముక్కలు కోసే టప్పుడు, పప్పు లేదా పిండి రుబ్బే టప్పుడు, పొయ్యి లేక స్టవ్ వెలిగించే టప్పుడు, పొయ్యి మండే టప్పుడు, చల్లని జలపాత్రను ఉంచు నపుడు, ముఖ్యంగా ఇంటిని శుద్ధి చేసే టప్పుడు మన కర్మల ఫలితంగా అనేక సూక్ష్మ జీవులు నశిస్తాయి. అది తెలియక చేసినదే అయినా చేయ దగింది మాత్రం కాదు. తెలిసి జరిగినా, తెలియక జరిగినా హింస హింసే.

దోమల మధ్య నిద్ర పోలేము. అందుకని, దోమ నివారక ద్రవ్యాల్ని ఇళ్ళల్లో ఉపయోగిస్తాము. దాని వల్ల దోమలు నశిస్తాయి. ఈగలు, బొద్దింకలు చని పోతాయి. ఇదంతా పాపమే. ప్రతి గృహస్థుడు ఈ విధమైన పంచసూనా దోషాలను అనివార్యంగా చేస్తూ ఉంటాడు. ఆ దోష నివారణార్థం పంచ యజ్ఞాలను నిర్వహించి పాపము నుండి విముక్తిని పొందుతూ ఉంటాడు (*పంచసూనా గృహస్థస్య పంచయజ్ఞా త్ప్రణశ్యతి*).

ప్రసాదమే పరిహారము

పంచసూనాది పాపాలను ప్రక్షాళనం చేసుకొనేందుకు పంచ మహాయజ్ఞాలు నిర్వహిస్తారు. దేవయజ్ఞము, పితృయజ్ఞము, ఋషి యజ్ఞము, మనుష్య యజ్ఞము, భూతయజ్ఞము - ఈ అయిదింటిని పంచ మహాయజ్ఞాలు అంటారు. ఈ పంచ మహాయజ్ఞాలను నిర్వహించి, యజ్ఞ శిష్టమైన అశనమును లేదా ఆహారమును భుజించి వారు యజ్ఞశిష్టాశులై సమస్తమైన పంచసూనాది పాపాల నుండి విముక్త లవుతారు. అందుకనే యజ్ఞ శిష్టమైన ఆహారమును అమృతము అన్నారు.

ప్రతి నిత్యం అనివార్యంగా జరిగి పోయే పంచసూనాది దోషాలను పరిహరించు కోవాలి. లేకపోతే, మనిషి పాపాల చేత బద్ధు డవుతాడు. పాప విముక్తికై చేసే ప్రతిక్రియలే పంచ మహాయజ్ఞాలు.

(1) దేవ యజ్ఞము :- వేదాధ్యయనము, దేవతార్చన, జపహోమాదులు మొదలైనవి దేవయజ్ఞము క్రిందికి వస్తాయి.

(2) పితృయజ్ఞము :- పితృదేవతలను సంతోషపెట్టే కార్యాలను పితృయజ్ఞము అంటారు. శ్రాద్ధ తర్పణాలు పితృయజ్ఞాలే.

(3) ఋషి యజ్ఞము :- ఋషులు ప్రసాదించిన జ్ఞానము వలన మనం అభ్యుదయ నిశ్శ్రేయసలను సాధిస్తున్నాము. అట్టి ఋషుల యొక్క ఋణాన్ని తీర్చుకొనే ప్రయత్నంలో ఋషి యజ్ఞాన్ని నిర్వహించాలి. స్వాధ్యాయ ప్రవచనాదులను నిరంతరము కొనసాగించుటయే ఋషి యజ్ఞము.

(4) మనుష్య యజ్ఞము :- ఎందరో వ్యక్తుల సహకారం వల్లనే మన జీవితం సాగుతూ ఉంది. అట్టి మానవులను తృప్తి పరచే కార్యక్రమంలో మనుష్య యజ్ఞమును నిర్వహించాలి. అతిథి అభ్యాగతులను సత్కరించడం, మాననీయులను సన్మానించడం మనుష్య యజ్ఞ మవుతుంది.

(5) భూత యజ్ఞము :- పశుపక్ష్యాదులు ఎన్నో విధాలుగా మన జీవనానికి సహకరిస్తాయి. వాటిని తృప్తి పరచేందుకు నిర్వహించే కార్యక్రమాలు భూత యజ్ఞంగా పిలువ బడతాయి.

ఈ విధంగా పంచయజ్ఞ విధులను నిర్వర్తిస్తూ, యజ్ఞ శేషాన్ని ప్రసాదంగా స్వీకరిస్తూ, ప్రమాదకృత హింసాది జన్యములైన పంచసూనాది దోషాల నుండి మానవులు విముక్తులు కావాలి.

సర్వమూ సమర్పణమే

ఇంతవరకు రెండు, మూడు అధ్యాయాలలో ఏ 'కర్మయోగ' తత్త్వాన్ని మనం అర్థం చేసుకున్నామో, దానినే ఇక్కడ 'యజ్ఞము' అనే విషయంగా అభిభాషిస్తున్నాడు. కర్మయోగంలో దేనిని 'ప్రసాదం'గా అర్థం చేసుకున్నామో, దానినే ఇక్కడ 'యజ్ఞశేషం'గా చెప్పుకుంటున్నాము.

ప్రసాదం విషయంలో ఎలాగైతే భావనే ప్రధాన మైందో, యజ్ఞశేషం విషయంలో కూడా భావనే ప్రధానం. ప్రసాదం ఎలా వస్తువు కాదో, యజ్ఞశేషం కూడా అన్నం కాదు. యజ్ఞశిష్టము ప్రసాదమే కనుక, అది పదార్థం కాదు, భావన.

ఆహారాన్ని ముందుగా పరమేశ్వరునికి బ్రహ్మార్పణం అని సమర్పించి, ఆ తరువాత యజ్ఞ శేషాన్ని అమృతంగా స్వీకరిస్తాము. కొందరు భోజనంలో మొదటి ముద్దను బ్రహ్మార్పణం చేసి, పవిత్రంగా నేత్రాలకు అద్దుకొని, దానిని ప్రక్కన ఉంచి, ఆ తరువాత యజ్ఞశేషాన్ని భుజిస్తారు. భోజనానంతరం ఆ అన్నపు ముద్దను పక్షులకు గాని, జంతువులకు గాని సమర్పించి, వాటిలో పరమేశ్వరుని దర్శిస్తూ తృప్తి చెందుతారు.

వంట పూర్తి కాగానే, కొంత పదార్థాన్ని పరమేశ్వరార్పణం గావించి, దానిని ప్రక్కన ఉంచి, ఆ తరువాత యజ్ఞశేషాన్ని అమృతంగా స్వీకరిస్తారు. తదనంతరం వేరుగా ఉంచిన అర్పణ పదార్థాన్ని యాచకులకో, పక్షులకో సమర్పించి తృప్తి చెందుతూ ఉంటారు. ఈ సదాచారం ఇప్పటికీ సంప్రదాయవాదుల గృహాలలో కనిపిస్తూ ఉంటుంది.

ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్య స్విద్ధనమ్ ॥

ఈ సమస్త చరాచర ప్రపంచము ఈశ్వరునిచే పరివ్యాప్తమై ఉంది. త్యాగం చేసి అనుభవించు. ఏ ఒక్కరి ధనాన్ని ఆశించకు అని అద్భుతంగా ప్రవచించింది ఈశావాస్యోపనిషత్తు.

త్యాగము చేసి అనుభవించు ***(తేన త్యక్తేన భుంజీథా, తేనత్యక్తేన త్యాగేన ఇత్యర్థః, భుంజీథాః పాలయేథాః).*** ఇదే యజ్ఞజీవనము. యజ్ఞశేషమైన అమృతమును భుజించే సత్పురుషుల జీవన వైభవము. అలాంటి సంతులు సర్వ పాపముల నుండి విడిపడు తున్నారు.

చేయవలసిన కర్మలను ప్రమాద వశాత్తు చేయక పోవడం వల్ల సంక్రమించిన పాపము, చేయకూడని కర్మలను బుద్ధి పూర్వకంగా చేయడం వల్ల ప్రాప్తించిన పాపము, స్పృహ లేకపోయినా, నడవడంలో గాని, పరుండటంలో గాని, కాళ్ళు చేతులు అప్రయత్నం గానో, ప్రయత్న పూర్వకం గానో కదిలించడంలో గాని అవశంగా ప్రాప్తించిన పాపములు - ఈ విధమైన సమస్త పాపముల నుండి, పాప ఫలితాల నుండి, యజ్ఞ శేషమును ఆరగించు పావనాత్ములు విముక్తు లవుతున్నారు.

ఏకా క్రియా ద్వ్యర్థకరీ బభూవ - ఒక కార్యము రెండు ప్రయోజనాలను కలిగిస్తుంది అనే న్యాయము ననుసరించి యజ్ఞ శిష్టాశులైన సత్పురుషులు యజ్ఞ జీవనమును సాగిస్తూ అటు లోక కళ్యాణానికి దోహదం

చేయడమే గాక, ఇటు సత్త్వశుద్ధి ద్వారా మోక్షానికి సిద్ధపడుతూ ఉన్నారు. అమృతమును ఆరగిస్తున్నారు. అమృతత్వానికి మార్గాన్ని సుగమం చేసుకుంటున్నారు.

అలా కాకుండా, ఎవరైతే యజ్ఞభావ విముఖులై, అనర్థమైన స్వార్థమే పరమార్థ మని భావించి, తమ దేహ పోషణార్థమే వండుకొని తింటున్నారో, వారు పాప భోజనులే అవుతున్నారు.

పాపమే పరమాన్నము

యజ్ఞ శేషమును భుజించే పావనాత్ముడు తయారు చేసుకున్న పాపాల నుండి విడిపడి పోతూ ఉంటే, యజ్ఞదూరులై, కేవలం ఆత్మంభరులై చరించు పాపులు పని కట్టుకొని లేని పాపాలను తయారు చేసుకుంటున్నారు. పాపాన్నే భుజిస్తూ ఉన్నారు ***(భుంజతే, తే అఘం పాపం).***

పంచ మహాయజ్ఞాలకు దూరులైన వారు తమ కుక్షిని నింపుకొనుటకే వండుకుంటారు. అటు దేవతలకు సమర్పించరు. ఇటు భూతాలకు అర్పించరు. కనుక వారు అన్న రూపంలో ఉన్న పాపాన్ని భుజిస్తున్నారే గాని అన్నాన్ని భుజించడం లేదు. కేవలం తన స్వార్థం కొరకే భుజించువాడు పాపాన్నే భుజిస్తున్నాడు అన్నది ఋగ్వేదము.

యజ్ఞ విముఖుడైన స్వార్థపరుడు ఫలశూన్యమైన ఆహారాన్ని పొందు తున్నాడు ***(మోఘమన్నం విన్దతే అప్రచేతాః - ఋగ్వేదము).*** 'అప్రచేతాః' అంటే సద్బుద్ధి లేనివాడు అని అర్థము.

కేవలాఘో భవతి కేవలాదీ - 'కేవలాదీ' అంటే కేవలం తన పొట్ట కోసమే తినేవాడు అని అర్థం. 'కేవలాఘోభవతి' అంటే కేవలం పాపాన్నే భక్షించే వాడు అవుతున్నాడు అని వేదవచనము.

కుక్షింభరులు యజ్ఞ విముఖులు. భగవ న్నివేదనమును చేయరు. అతిథులను ఆదరించరు. శకున శునకాది భూతాలకు కూడా సంతర్పణము చేయరు. కనుకనే వారు పాప విముక్తులు కాలేక పోతారు. ఇలా స్వార్థ జీవనమును సాగించువాడు పాపము నుండి విడిపడడు అని 'శతపథ బ్రాహ్మణము' తెలుపుతూ ఉంది ***(న సః పాప్మనో వ్యావర్తతే).***

తే.గీ ॥ అతిథి పితృదేవతా పూజ లాచరించి
కాని గృహమేధులకు భోజ్యమైన గుడువ
దగదు యజ్ఞశిష్టం బమృతంబుగాగ
నార్య జనములు సెప్పుదు రధిపవర్య?

అని 'ఆంధ్ర మహాభారతము' - శాంతి పర్వములో తిక్కనార్యుని తీపి పద్యము.

సృష్టి చక్రంలో యజ్ఞచక్ర మనేది అతి ప్రధానమైన, ప్రశస్తమైన అంగము. కనుక ఈ యజ్ఞ చక్రాన్ని సర్వులూ అనుసరించాలి. **ముచ్యంతే సర్వకిల్బిషైః** అంటూ అది సర్వ పాపాల నుండి మనలను విరమింప చేస్తూ ఉంది. అలాగే, **నైష్కర్మ్యం పురుషోఽ_శ్నుతే** అంటూ మోక్షానికి కూడా దారి చూపిస్తూ ఉంది. అందుకే ఈ కర్మయజ్ఞ చక్ర గమనాన్ని తరువాత వరుసగా మూడు శ్లోకాలలో చెబుతున్నాడు.

అన్నా ద్భవన్తి భూతాని పర్జన్యా దన్నసమ్భవః ।
యజ్ఞా ద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥ 14

అన్నాత్-భవంతి-భూతాని-పర్జన్యాత్-అన్నసంభవః
యజ్ఞాత్-భవతి-పర్జన్యః-యజ్ఞః-కర్మసముద్భవః

చైతన్య భగవద్గీత

అన్నాత్	= అన్నము వల్ల	యజ్ఞాత్	= యజ్ఞము వల్ల
భూతాని	= ప్రాణులు	పర్జన్యః	= మేఘం
భవంతి	= పుడుతున్నాయి	భవతి	= పుడుతూ ఉంది
పర్జన్యాత్	= మేఘము వల్ల	యజ్ఞః	= యజ్ఞము
అన్నసంభవః	= అన్నము కలుగుతూ ఉంది	కర్మసముద్భవః	= కర్మము వలన పుడుతుంది

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్ ।
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ 15

కర్మ-బ్రహ్మోద్భవం-విద్ధి-బ్రహ్మ-అక్షరసముద్భవం
తస్మాత్-సర్వగతం-బ్రహ్మ-నిత్యం-యజ్ఞే-ప్రతిష్ఠితం

కర్మ	= కర్మను	తస్మాత్	= అందువలన
బ్రహ్మోద్భవం	= వేదము వలన ఉత్పన్న మైనదిగ	సర్వగతం	= సర్వవ్యాపకమైన
విద్ధి	= తెలుసుకో	బ్రహ్మ	= బ్రహ్మము
బ్రహ్మ	= వేదము	నిత్యం	= సదా
అక్షర సముద్భవం	= పరబ్రహ్మము నుండి ఉత్పన్న మైనదిగ	యజ్ఞే	= యజ్ఞము నందు
		ప్రతిష్ఠితం	= ప్రతిష్ఠితమై ఉంది

అన్నము వలన ప్రాణులు పుడుతున్నాయి. మేఘము వలన అన్నము కలుగుతూ ఉంది. యజ్ఞము వలన మేఘము ఏర్పడుతూ ఉంది. యజ్ఞము కర్మ వల్లనే సాధ్య మవుతూ ఉంది.

కర్మ వేదము వలన కలుగుతూ ఉంది. వేదము అక్షర రూపుడైన బ్రహ్మము నుండి ఉత్పన్నమైంది. అందుచేత, సర్వగతమైన బ్రహ్మము సదా యజ్ఞము నందే స్థిరపడి ఉంది.

వ్యాఖ్య

ప్రజలతో పాటు యజ్ఞములను కూడా సృష్టించాడు ప్రజాపతి యైన బ్రహ్మదేవుడు. తండ్రి తన బిడ్డలకు వ్యాపార నిమిత్తం కొంత డబ్బు ఇచ్చినట్లు, సుఖ జీవనానికి, పురుషార్థ సాధనకు బ్రహ్మదేవుడు యజ్ఞములను పెట్టుబడిగా మనకు ప్రసాదించాడు. తండ్రి ఇచ్చిన ధనములో బిడ్డలు వ్యాపారమును వృద్ధి చేసుకున్నట్లు, పరమేశ్వరుడు ప్రసాదించిన యజ్ఞములతో యజ్ఞ వ్యాపారమును విరివిగా సాగించి, విశిష్టమైన ఫలాలను ఈ లోకంలో మనం కూడా పొందాలి. అదే యజ్ఞ వైభవము.

యజ్ఞము మనతో కలిసి పుట్టింది. మధ్యలో వచ్చి కలిసింది కాదు. కనుక యజ్ఞము సోదరి వంటిది. భార్య వంటిది కాదు. భార్యను భర్త చూసి, నిర్ణయించుకొని వరిస్తాడు. వరించి వివాహ మాడుతాడు. ఈ సంబంధము మధ్యలో కలిగింది. అందుచేత మధ్య లోనే తెగిపోతుంది. యజ్ఞము సోదరి లాగా మనతో కలిసి పుట్టింది. సోదరి రక్తమే మనలో ఉంటుంది. మన రక్తమే సోదరిలో ఉంటుంది. మనుషుల విషయంలో యజ్ఞం కూడా అంతే. కాని, ఇక్కడ సోదరి ఉపమానం కూడా ఏకదేశీయమే. వాస్తవానికి, మనతో కలిసి పుట్టిన యజ్ఞం, సముద్రంలో కలిసే వరకు నదికి వేగం తోడుగా ఉన్నట్లు, మనతో కలిసే ఉంటుంది. కనుక, యజ్ఞమును త్యజించ కూడదు. యజ్ఞం కూడా కర్మే కనుక కర్మను త్యజించ కూడదు అనేదే ఇక్కడ ప్రధానమైన విషయం. అటు సృష్టి చక్రాన్ని, ఇటు జీవన చక్రాన్ని అందంగా, అద్భుతంగా త్రిప్పేది, నడిపేది యజ్ఞచక్రమే.

దేవతలను, మానవులను అనుసంధానం చేసేది యజ్ఞమే. యజ్ఞకర్మ మనల్ని అటు దేవతల తోను, ఇటు మానవుల తోనూ కలుపుతుంది. యజ్ఞకర్మ ద్వారా మనం దేవతల్ని తృప్తి పరుస్తాము. తృప్తి చెందిన దేవతలు అనుగ్రహించే భోగాలను అందుకొని, వాటిని మానవులలో పరమేశ్వరుని దర్శిస్తూ, యజ్ఞ భావనతో వారికి సమర్పణం గావిస్తూ, మిగిలిన యజ్ఞశేషమును ప్రసాదంగా స్వీకరిస్తాం. ప్రశాంతతను అనుభవిస్తూ సమస్త కల్మషాల నుండి విడి పడతాం. మోక్షమార్గంలో మహోన్నత స్థాయికి చేరుకుంటాం.

ఇచ్చి పుచ్చుకోవడాలే యజ్ఞంలో ప్రధానంగా కనిపిస్తాయి. పుచ్చుకొని తిరిగి ఇవ్వక పోవడం ధర్మం కాదు. ఇవ్వకుండా పుచ్చుకొనే వైఖరి సమంజసం కాదు. ఇస్తూ పుచ్చుకోవాలి. పుచ్చుకుంటూ ఇవ్వాలి. ఈ రెండిటిలో ఈశ్వరభావన తోడుగా ఉండాలి. అప్పుడే ఆ ఇచ్చి పుచ్చుకోవడాలు యజ్ఞకార్యా లవుతాయి.

సాగరం నుండి ఉద్భవించిన నదులు తిరిగి సముద్రాన్ని చేరి శాంతిస్తాయి. అది నిత్య ప్రవాహం. అదే ప్రవాహ నిత్యత్వం. ప్రభాతంలో సూర్యుడి నుండి వెడలిన కిరణాలు ప్రదోషంలో తిరిగి సూర్యుని లోనే లయించి విశ్రమిస్తాయి. ఉదయ కాలంలో చెట్టును వీడి ఎగిరి పోయిన పక్షులు అస్తమయ కాలానికి చెట్టును చేరి విశ్రమిస్తాయి. బ్రహ్మమును వీడి జగత్తులో ప్రవేశించిన మనం తిరిగి బ్రహ్మమును చేరి శాంతించాలి. జనన మరణ చక్రంలో పడి శోకమయ జీవనాన్ని కొనసాగించడం కాకుండా యజ్ఞ చక్రాన్ని ఆలంబనగా పట్టుకొని సుఖమయంగా, శాంతిమయంగా బ్రతుకును కడతేర్చు కోవాలి. బ్రహ్మము యజ్ఞము నందే ప్రతిష్ఠితమై ఉన్నాడు.

అన్నం నుండే ఆవిర్భావం

అన్నం నుండే ప్రాణులు పుడుతున్నాయి. ప్రాణుల ఆవిర్భావము అన్నము వల్లనే జరుగుతూ ఉంది. అంటే, ప్రాణులు కేవలం అన్నం వల్ల పుట్టవు. పాత్రల్లో ఉండే అన్నం వల్ల మనుషులు పుట్టరు. ఆ అన్నాన్ని తల్లిదండ్రులు ఆరగించడం వల్ల పుడతారు. కనుకనే, భాష్యంలో 'అన్నాత్' అనే పదానికి 'భుక్తాత్' అనే అర్థం చెప్పారు. 'భుక్తాత్' అంటే తిన బడినది అని అర్థం. అంటే, తల్లిదండ్రులు తినిన ఆహారము శుక్ల శోణిత రూపంగా (రేతో రూపంగా పురుషుడిలో, శోణిత రూపంగా స్త్రీలో) పరిణమించి ప్రాణుల ఆవిర్భావానికి కారణ మవుతూ ఉంది. కనుక సర్వప్రాణులు అన్నము నుండే పుడుతున్నాయి అని చెప్పడం జరిగింది ***(అన్నాత్ భుక్తాత్ లోహిత రక్త పరిణతాత్ ప్రత్యక్షం భవన్తి జాయన్తే భూతాని).***

అన్నాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే జాతాని అన్నేన వర్ధన్తే

భూతము లన్నీ అన్నము వల్లనే పుడుతున్నాయి. పుట్టిన భూతములు అన్నము వల్లనే వృద్ధి చెందు తున్నాయి అని తైత్తిరీయశ్రుతి. మరి, ప్రాణుల ఆవిర్భావానికి కారణమైన అన్నము ఎక్కడ నుండి వస్తూ ఉంది? పర్జన్యం నుండి అన్నం పుడుతూ ఉంది.

పర్జన్యం నుండే ప్రసాదం

ప్రాణుల ఆవిర్భావానికి హేతువైన అన్నము పర్జన్యము నుండి పుడుతూ ఉంది. 'అన్నాత్' అన్నప్పుడు 'భుక్తాత్' అని ఎలా లక్షణం చెప్పుకున్నామో, అలాగే ఇక్కడ 'పర్జన్యము' అంటే 'వర్షము' అని లక్షణం చెప్పుకోవాలి. వర్షము వల్లనే కదా మనకు అన్నాదులు కలుగుతున్నాయి! ***(పర్జన్యాత్ వృష్టేః అన్నస్య సంభవః అన్నసంభవః).***

పర్జన్యము అంటే వర్షము అని, వర్షమేఘము అని, వర్షరూపుడైన వరుణదేవుడు అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. అంతేకాదు. పర్జన్యుడు అంటే సూర్యుడు అనే అర్థం కూడా ఉంది.

ఆగ్నౌ ప్రాస్తాహుతిః సమ్యగాదిత్యం ఉపతిష్ఠతే
ఆదిత్యా జ్జాయతే వృష్టిః వృష్టేః అన్నం తతః ప్రజా ॥

అగ్ని యందు అర్పించిన ఆహుతి సూర్యుని చేరుతుంది. సూర్యుని వల్ల వర్షం కలుగుతుంది. వర్షం వల్ల అన్నము, అన్నము వలన ప్రాణులు పుడుతున్నాయి అని బృహదారణ్య కోపనిషత్తులో జనక యాజ్ఞవల్క్య సంవాదంలో ప్రతిపాదింప బడింది. మనుధర్మ స్మృతిలో కూడా ఈ శ్లోకం ఉంది. కనుక పర్జన్య శబ్దానికి సూర్యుడు అని గ్రహించినా అంగీకారమే. అలాగే సముద్రము అని చెప్పుకున్నా విరోధం లేదు. ఎందుకంటే, సముద్రం వల్లనే మేఘాలు తయా రవుతున్నాయి. కాకపోతే, పర్జన్యానికి ఎన్ని అర్థాలు చెప్పుకున్నా, ఇవన్నీ పరమేశ్వరుని కన్నా వేరుగా లేవు అనే సత్యాన్ని మాత్రం విస్మరించ కూడదు. పర్జన్యుడు అంటే పరమేశ్వరుడు అని అర్థం. విష్ణుసహస్రనామంలో 'పర్జన్యః' అనేది కూడా ఒక పవిత్రనామం (810 వ నామం - **కుముదః కున్దరః కున్దః పర్జన్యః పావనోఽనిలః**).

కనుక పర్జన్య మెవరో కాదు, పరమేశ్వరుడే. మేఘరూపంలో ఉన్న పరమేశ్వరుడు వర్షించి ధరణిని చల్ల బరచినట్లు, పర్జన్య నామధేయుడైన పరమేశ్వరుడు అనుగ్రహ వర్షాన్ని కురిపించి తాపత్రయమును తొలగిస్తాడు (***పర్జన్యవత్ ఆధ్యాత్మికాది తాపత్రయం శమయతి***). అంతేకాదు. వర్షించే మేఘము అన్నాది ఫలాలను అనుగ్రహించునట్లు, పర్జన్యుడైన పరంధాముడు సమస్త కామములను అభివర్షిస్తాడు. సమస్త కోర్కెలను తీర్చుతాడు అని అర్థము (***సర్వాన్ కామాన్ అభివర్షతీతి వా, పర్జన్యః***). అంతా భగవత్ప్రసాదమే. ప్రాణులు ప్రసాదం. ప్రాణుల పుట్టుకకు కారణమైన అన్నాదులు ప్రసాదం. అన్నాదులను సృష్టించే వర్షాలు కూడా ప్రసాదమే. మరి, ఈ వర్షానికి కారణం? యజ్ఞము నుండి పర్జన్యం పుడుతుంది.

యజ్ఞ మేఘం

యజ్ఞము వల్ల వర్షం కలుగుతుంది (***యజ్ఞాత్ భవతి పర్జన్యః***). యజ్ఞము పవిత్రము కనుక యజ్ఞభావన కూడా పవిత్రమే. స్థూలంగా ఆచరింపబడే యజ్ఞకర్మకు ఫలం ఉన్నట్లే, సూక్ష్మమైన యజ్ఞభావనకు కూడా సూక్ష్మ ఫలితం ఉంటుంది. అదే యజ్ఞము యొక్క సుకృతం. దాని వల్లనే వర్షం పుడుతుంది. పడుతుంది.

యజ్ఞం వల్ల వర్షం కలుగుతుంది అంటే, యజ్ఞము చేయక పోతే వర్షాలు ప్రాప్తించవు అని అర్థము. వర్షాలు పడితే క్షేమం. వర్షాలు పడక పోతే క్షామం. తన స్వకర్మ చేత పరోపకారం జరిగితే అది యజ్ఞకర్మ అవుతుంది. యజ్ఞాలలో పరోపకారవాంఛ ఉంది. యజ్ఞఫలమైన పర్జన్యము కూడా పరోపకారార్థమే వర్షిస్తూ ఉంది.

మేఘాలు గగనంలో కదుల్తూ ఉంటాయి. అవసరానికి పరోపకార దృష్టితో వర్షిస్తాయి. ఆకాశంలో మేఘాలు నిరాధారంగా తిరుగుతూ ఉంటాయి. తమ పైనే తాము ఆధారపడి ఉంటాయి. పరులకు సహకరిస్తూ ఉంటాయి. ఇదే యజ్ఞజీవనము.

వృక్షాలు కదుల్తూ ఉంటాయి. గాలిని చలింప చేస్తూ ఉంటాయి. తమ కాళ్ళ మీదనే తాము నిలబడి ఉంటాయి. ఇతరుల భుజాల పైన ఎక్కి స్వారి చేయవు. కాని తమ శాఖ లనే చేతుల్ని మెల్లగా ఊపుతూ సర్వులకు చల్లని గాలిని, హాయిని ఇస్తాయి. పువ్వులను రాలుస్తాయి. పండ్లను అందిస్తాయి. ప్రాణులకు నీడ నిస్తాయి. మేఘాలు ద్రవించుటకు సహకరిస్తాయి. ఇదంతా తమ హద్దులో తాము ఉంటూనే నిర్వహిస్తాయి. సర్వులను పోషిస్తాయి. తమ పోషణకు ఎవరిపైనా ఆధార పడకుండా ఉంటాయి. ఇదే యజ్ఞజీవనం. విశ్వకళ్యాణానికి ఆచరించ వలసిన విశిష్టకార్యం. ఆడంబరాలకు అవకాశ మివ్వకుండా, అహంకారము అవరోధం కాకుండా, పవిత్రమైన అంతఃకరణతో, ఉదార స్వభావంతో ఆచరించే కార్యమే యజ్ఞకర్మ.

ఉదార చరితులైన మహర్షులలో విశ్వామిత్ర మహర్షి అగ్రగణ్యుల కోవకు చెందుతారు. విశ్వానికి మేలు చేసే మిత్రుడు కనుక ఆయన విశ్వామిత్రుడు. ఆయన ఆచరించిన ప్రతి కార్యము విశ్వ కళ్యాణార్థమే జరిగింది. సీతారాముల కళ్యాణంతో శ్రీకారం చుట్టి, విశ్వకళ్యాణంతో తృప్తి చెందిన మహర్షి శ్రీ విశ్వామిత్రుడు.

సమాజంలో కళ్యాణశోభను ఆవిష్కరించ డానికి ముందే విశ్వామిత్రుడు అరణ్యంలో యజ్ఞాన్ని నిర్వహించాడు. యజ్ఞం చేయనిదే విశ్వకళ్యాణం జరగదని ఆ మహాత్మునికి తెలుసు. అందుకనే, ముందుగా యజ్ఞాన్ని నిర్వహించాడు. యజ్ఞమేఘమే అభ్యుదయ ఫలాన్ని అందిస్తుందని గుర్తించాడు. గ్రహించాడు.

అభ్యుదయమే ప్రధాన మైనపుడు అహంకారం అగుపించదు. అందుకనే అరణ్యంలో యజ్ఞాన్ని నిర్వహించాడు. అక్కడ జన సందోహం లేదు. ఆర్భాటాలు అసలే లేవు. అసంస్కారులైన అడవిజాతి వారి మధ్యే యజ్ఞాన్ని నిర్వహించాడు.

విశ్వామిత్రుడు అరణ్యంలో కాకుండా అయోధ్యలో యజ్ఞమును నిర్వహించి ఉంటే, ఏ ఆపద ఉండేది కాదు. ఏ ఉత్పాతము ఉత్పన్న మయ్యేది కాదు. ఆపదలు వచ్చినా, వస్తాయని తెలిసినా తాను మాత్రం అరణ్యం లోనే యజ్ఞాన్ని నిర్వహించాలని దృఢంగా సంకల్పించాడు.

జనారణ్యం మధ్య ఆడంబరాలను, అహంకారాలను ఆరబోసుకుంటూ, పది మంది మెప్పు కోసం సాగించే వినోద ప్రదర్శనం యజ్ఞం కాబోదని విశ్వామిత్రుడు అభిప్రాయ పడ్డాడు. విశ్వకళ్యాణం జరగాలే గాని అది విశ్వానికి తెలియ వలసిన అవసరం లేదని అభిప్రాయ పడ్డాడు. కాకపోతే, రామలక్ష్మణుల్ని తనకు తోడుగా ఉంచు కున్నాడు.

రాముడు దైవం. లక్ష్మణుడు వివేకం. యజ్ఞ జీవనమును సాగించే వారు వివేకాన్ని పోగొట్టుకో కూడదు. అలాగే దైవారాధనకు దూరం కాకూడదు. చిత్త ప్రసాదము, దైవానుగ్రహము - ఈ రెండిటిని పొందినవారు విశ్వకళ్యాణ కారకు లవుతారు. రామలక్ష్మణు లున్నచోట యజ్ఞాలు ఫలప్రద మౌతాయి. సంపదలు నిండుతాయి. విజయాలు ప్రాప్తిస్తాయి. ధర్మం శోభిస్తుంది. ఈ విషయాన్నే గీతను సమాప్తం చేస్తూ సంజయుడు కూడా వినిపిస్తాడు (***యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః, తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతి ర్మతిర్మమ***).

కనుక, సమాజంలో కళ్యాణ శోభ గోచరించాలన్నా, విశ్వము వెలుగులతో వికసించాలన్నా యజ్ఞ జనిత వర్షమే కారణ మవుతుంది. ఈ సందర్భములో, కొందరిలో అనివార్యంగా కొన్ని సంశయాలు ఉత్పన్నం కావచ్చు.

యజ్ఞాలు లేకపోయినా వర్షాలు పడుతూ ఉన్నాయి కదా! పంటలు కూడా పండుతూనే ఉన్నాయి కదా! శాంతిరూపమైన యజ్ఞాలు లేకపోవడమే గాక, అశాంతి మయమైన హింసలు కూడా విలయతాండవం చేస్తూ ఉన్నాయి. అయినా పాడిపంటలు అందుతూనే ఉన్నాయి కదా! లేకపోతే, ప్రజలు ఎలా జీవిస్తున్నారు? యజ్ఞాలు లేకపోయినా ప్రజా జీవనానికి ఆటంకం లేనపుడు, యజ్ఞాలను నిర్వహించ వలసిన అవసర మేమిటి? అని కొందరు సంశయగ్రస్తులు ప్రశ్నిస్తూ ఉంటారు కూడా.

అరిష్టాలు చెప్పిరావు

పనులే మనకు కనిపిస్తాయి. ఫలితాలు అగుపించవు. వర్తమానం లోనే మనస్సు వర్తిస్తుంది. భవిష్యత్తును స్పష్టంగా వీక్షించ లేదు. సదాచారవంతుడు అనారోగ్యం పాలైతే, దురాచారవంతుడు, త్రాగుడుకు బానిస అయిన అప్రయోజకుడు ఆరోగ్యంగా తిరుగుతూ ఉంటాడు. అంతమాత్రాన వాడు అమృతాన్ని సేవిస్తున్నాడు అని అర్థమా?

సమాజంలో ఎక్కువ మంది ఇలాగే అర్థం చేసుకుంటున్నారు. మోతాదు మించక పోతే, అంతకు మించి

కలియుగంలో వైకల్యాలే కైవల్యాలు
మేలు చేసే మిత్రులు ఉండబో రని వైద్యులు కూడా నొక్కి వక్కాణిస్తున్నారు. కలియుగంలో వైకల్యాలే కైవల్యాలు
కాబోలు. కొద్దికొద్దిగా పుచ్చుకుంటే విషం హాని చేయదు అని భావించడంలో ఎంత సత్య ముందో, ఈ
మోతాదు మించని మంత్రంలో తంత్రం కూడా అంతే ఉంది.

'నువ్వు త్రాగకు. నేను పాడై పోతున్నాను' అని కాలేయము కబురు చేయదు. 'నేను కొట్టుకోలేక పోతున్నాను'
అని గుండె గంట కొట్టి చెప్పదు. 'నేనిప్పుడిప్పుడే కొద్దికొద్దిగా, దేహంలో ప్రాకుతున్నాను' అని క్యాన్సరు కార్డుముక్క
వ్రాయదు. వచ్చిన తరువాత నయం చేసుకొనే యత్నం కన్నా, రాక ముందే నివారించుకొనే ప్రయత్నమే
ఎప్పుడైనా, ఎవరికైనా శ్రేయోదాయకము.

యజ్ఞాలు లేకపోయినా, హింసలు విరివిగా విస్తరించినా వర్షాలు పడుతున్నాయి. అది ఎవరూ కాదనడం
లేదు. వర్షాలు పడుతున్నాయి. కాని, సకాలానికి పడుతున్నాయా? పంటను పండించే వర్షాలు పడుతున్నాయా?
పంటను పాడు చేసే వర్షాలే పడుతున్నాయి. పాడిపంటల్ని వృద్ధి చేసే వర్షాలు పడటం లేదు. పైగా అంటురోగాలను
వ్యాపింప చేసే వానలు కురుస్తున్నాయి.

వానలు కురుస్తున్నాయి. కాని వాటి వల్ల క్షేమం కలగక పోగా క్షామం ఏర్పడుతూ ఉంది. వానలు పడి
మల్లెలు పూస్తున్నాయి. కాని మల్లెలలో సువాసన ఏది? మామిడికాయలు కాస్తున్నాయి. కాని ఫలాలలో మాధుర్య
మేది? యజ్ఞఫలాలు కానివి రుచిగా ఉండవు. శుచిగా ఉండవు. కనుక యజ్ఞజనిత పర్జన్యాలే పవిత్రమైన ఫలితాల
నిస్తాయి. వర్షం కోసం ఆకాశాన్ని చూచే సమాజం సుఖశాంతులలో వర్ధిల్లుతుందే గాని, సముద్రం వైపు చూచే
సమాజం సుఖశాంతులకు నోచుకోదు. మరి, వర్షానికి కారణమైన యజ్ఞానికి కారణ మేమిటి? కర్మయే యజ్ఞానికి
కారణము.

చేస్తేనే యజ్ఞము

యజ్ఞము కర్మ వల్ల పుడుతుంది (***యజ్ఞః కర్మ సముద్భవః***). యజ్ఞానికి కారణం కర్మే గాని కర్మ చేయక
పోవడం కాదు. యజ్ఞం కార్యం కనుక, అకార్యం నుండి కార్యం ఉత్పన్నం అయ్యే అవకాశం లేనందున
యజ్ఞమునకు కర్మ కారణ మవుతూ ఉంది.

ఇక్కడ అర్థవంతమైన సంశయం ఒకటి తలెత్తుతుంది. యజ్ఞము కర్మ వల్ల పుడుతుంది అంటున్నాడ
గీతాచార్యుడు. మరి, యజ్ఞ మేమిటి? యజ్ఞం కర్మ కాదా? యజ్ఞము కర్మ అయినపుడు, యజ్ఞము కర్మ వల్ల
జనిస్తుంది అంటే, కర్మ కర్మ వల్ల పుడుతుంది అని చెప్పినట్లు అవుతుంది కదా! ఇది సమంజసమా? కా
కాదు. కర్మ కర్మ వల్ల జనిస్తుంది అని చెప్పడం అయుక్తం. అసంగతం. కనుక 'అన్నము', 'పర్జన్యము' అ
పదాలను లక్షణాన్ని ఆశ్రయించి ఎలా అర్థం చేసుకున్నామో, 'యజ్ఞం' విషయంలో కూడా లక్షణాశ్రయ
అనివార్యం అవుతూ ఉంది.

'యజ్ఞము' అంటే 'అపూర్వము' అని అర్థము (***యజ్ఞః అపూర్వమ్***). అపూర్వం అనే కర్మ వల్ల యజ్ఞ
పుడుతుంది అని అర్థము. అంటే, ఋత్విక్కులు, యజమాని మొదలైన వారు నిర్వహించే మంత్ర, తంత్ర
హోమాది వైదిక కర్మ వల్ల యజ్ఞము జరుగుతుంది అని అర్థము.

వేద ప్రమాణము

కర్మ బ్రహ్మము నుండి పుడుతుంది. అంటే, ఏ కర్మకు వేదం కారణమో, అట్టి వేదమే ఇక్కడ బ్రహ
శబ్దంతో చెప్ప బడింది (***బ్రహ్మ వేదః***). కనుక యజ్ఞకర్మ బ్రహ్మోద్భవము, అంటే వేదోద్భవము అని అర్థమ
ఋత్విక్కులు మరియు యజమానుల యొక్క వ్యాపార రూపంగా గోచరించే యజ్ఞకర్మ వేదమునే ప్రమాణం

కలిగి ఉంది కనుక, ఇక్కడ వేదమే బ్రహ్మ శబ్దంతో చెప్పబడింది (***యజమానాది వ్యాపార రూపం కర్మ బ్రహ్మ
వేదః, కర్మ తస్మాత్ ప్రవృత్తమ్*** - శ్రీధరవ్యాఖ్య). కర్మ స్వభావాన్ని తెలుపుతుంది కనుక 'బ్రహ్మము' అంటే 'వేదము'
అని అర్థం చేసుకోవాలి. మరి బ్రహ్మము అనే వేదం ఎక్కడ నుండి ఆవిర్భవించింది?

వేదపురుషుని నుండే వేదజ్ఞానము

వేదము బ్రహ్మము నుండి పుడుతుంది. వేదము బ్రహ్మమే. వేద నారాయణుడూ బ్రహ్మమే. అంటే
'బ్రహ్మము' అని చెప్పబడిన వేదము 'అక్షరము' అని చెప్పబడే బ్రహ్మము నుండి పుట్టింది అని భావము (***బ్రహ్మ
వేదాఖ్యం అక్షర సముద్భవమ్***). అక్షరమైన బ్రహ్మమే వేదానికి కారణము. సమస్త విషయాలను ప్రకాశింప చేస్తూ
సర్వజ్ఞమై శోభిస్తున్న వేదానికి బ్రహ్మమే కారణం (***మహతః ఋగ్వేదాదేః శాస్త్రస్య, సర్వజ్ఞ కల్పస్య యోనిః కారణం
బ్రహ్మ***).

అక్షర రూపుడు, జగత్కారణమైన బ్రహ్మము నుండే నిశ్వాస రూపమున వేదము ఆవిర్భవించింది కనుక
వేదమునకు బ్రహ్మమే కారణమని వేదమే చెబుతూ ఉంది (***అస్య మహతో భూతస్య నిశ్వసిత మేత దృదృగ్వేదో
యజుర్వేదః సామవేదోఽథర్వాంగిరసః*** - బృహదారణ్యకోపనిషత్తు).

బ్రహ్మము అని చెప్పబడిన వేదము అక్షర రూపుడైన పరబ్రహ్మము నుండి నిశ్వాస లాగా బహిర్గత
మైంది. అంటే అవలీలగా, అనాయాసంగా, అప్రయత్నంగా వెలువడిందని భావము.

శ్వాసక్రియలో గాలిని వదలడం అంటే, లోపల ఉన్న గాలిని విడిచి పెట్టడ మనే గాని, గాలిని సృష్టించి
విడిచి పెట్టడం అని అర్థం కాదు. సర్వజ్ఞమైన వేదమును నిశ్వసించడం అంటే, బ్రహ్మము కన్నా వేరు గాని
జ్ఞానమును ప్రకాశింప చేయడమనే గాని, జ్ఞానమును సృష్టించి బహిర్గతం చేయడమని భావం కాదు.

వేదము అంటే జ్ఞానము. జ్ఞానాన్ని సృష్టించడం సాధ్యం కాదు కనుక, వేదం కూడా సృష్టింప బడింది
కాదు. అది అపౌరుషేయము. అంటే, ఏ పురుషుని యొక్క కార్యము కాదని అర్థము.

వేదము జ్ఞాన స్వరూపమే అయినా, అది సృష్టింప బడిందే గాని అపౌరుషేయము కాదు అని కొందరి
అభిప్రాయము. అలాంటి వారే వేదానికి కాలాన్ని నిర్ణయిస్తారు. అంటే, వేదము ఒక కాలంలో ఆవిర్భవించినట్లు
చెబుతారు. ఇదంతా సంప్రదాయం అర్థం గాని వ్యక్తులు సాగించే వింత సంభాషణము.

జ్ఞానము ఒక కాలంలో పుట్టింది అంటే, అది పుట్టక ముందు జ్ఞానం లేదనే కదా అర్థం? పుట్టడం
అంటేనే లేనిది కలగడం అని అర్థం. అంతవరకు లేని జ్ఞానం క్రొత్తగా పుట్టింది అంటే, జ్ఞానం పుట్టక ముందు
ఏముంది? జ్ఞానము యొక్క అభావం ఉంది. అదేమిటి? అజ్ఞానము. అంటే, అజ్ఞానం నుండి జ్ఞానం కలిగింది
అని అర్థమా? అలాగే అంగీకరిద్దాం. మరి అజ్ఞానం నుండి జ్ఞానం కలిగింది అంటే, కార్యమైన జ్ఞానానికి
అజ్ఞానం కారణం అని చెప్పినట్లు అయింది కదా! అదే వాస్తవ మైతే, జ్ఞానం కలిగిన తరువాత అజ్ఞానం ఉందా,
లేదా?

జ్ఞానం కలిగిన తరువాత అజ్ఞానం ఉండదు. ఎలా ఉంటుంది? వెలుగు వచ్చిన తరువాత చీకటి ఎలా
ఉంటుంది? అదే వాస్తవ మైతే, మరి కార్యమైన జ్ఞానానికి అజ్ఞానం కారణమై నపుడు, కార్యంలో ఉన్నది కారణమే
కనుక, కారణమైన అజ్ఞానం పోతే కార్యమైన జ్ఞానం ఎలా ఉంటుంది? అజ్ఞానమే పోకుండా ఉన్నప్పుడు, ఇక
జ్ఞాన మెక్కడుంది? చీకటి ఉంది అంటే, వెలుగు లేదు అనే కదా అర్థం? వెలుగు, చీకటి రెండూ ఉన్నాయి
అంటారా? అలాంటప్పుడు చీకటిని అర్థం చేసుకోవడం కష్టం కాదు గాని, వెలుగు విషయమే ప్రశ్నార్థక
మవుతుంది. చీకటితో కలిసి కాపురం చేసే వెలుగు కూడా ఒక వెలుగేనా? చీకటిని పోగొట్ట లేనిది వెలుగు ఎలా
అవుతుంది?

కనుక జ్ఞానము ఉన్నదే. జ్ఞానం విషయంలో ఉన్న దానిని కనుగొనడమే గాని లేని దానిని కల్పించడం కుదరదు. బ్రహ్మము, బ్రహ్మము యొక్క జ్ఞానము వేరు కావు. కనుక అక్షర పరబ్రహ్మము బ్రహ్మ మని చెప్పబడే వేదానికి కారణమైంది.

బ్రహ్మము, బ్రహ్మజ్ఞానము వేరు కావు కనుక, అక్షర పరబ్రహ్మము, సర్వజ్ఞమైన వేదము వేరు కావు. బ్రహ్మజ్ఞానము కలిగితే బ్రహ్మము తెలిసినట్లే. బ్రహ్మజ్ఞానము వేదము నందే ఉండటం చేత బ్రహ్మము వేదంలో ప్రతిష్ఠితమై ఉన్నాడు. వేదము బ్రహ్మరూపము కనుక, వేదరూపమైన కర్మలో కూడా బ్రహ్మమే ఉన్నాడు. వేద ప్రతిపాదిత కర్మ నుండి యజ్ఞము ఆవిర్భవించింది కనుక యజ్ఞములో కూడా బ్రహ్మమే ఉన్నాడు. యజ్ఞ రూపుడుగా ఉన్నాడు (*యజ్ఞోవై విష్ణుః*). యజ్ఞము వల్లనే వర్షం ఉత్పన్న మైంది కనుక వర్షరూపంలో కూడా తానే ఉన్నాడు.

తపామ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ

'అర్జునా! నేను తపింప చేస్తున్నాను. వర్షాన్ని ఆకాశంలో నిలిపేది నేనే. వర్షాన్ని కురిపించేది నేనే' అని రాజవిద్యా రాజగుహ్య యోగంలో భగవానుడే స్వయంగా చెబుతాడు.

వర్షం వల్ల అన్నం ఏర్పడుతూ ఉంది కనుక, అన్నరూపంలో కూడా తానే ఉన్నాడు (***అన్నం బ్రహ్మేతి వ్యజానాత్*** - తైత్తిరీయ శ్రుతి). అన్నం వల్లనే ప్రాణులు ఉత్పన్న మౌతున్నాయి కనుక, ప్రాణులలో ఉన్నది కూడా తానే. ఈ విధంగా బ్రహ్మము సర్వవ్యాపకమై, సర్వత్ర ప్రతిష్ఠితమై ఉన్నాడు (***తస్మాత్ సర్వగతం బ్రహ్మ***). కనుక యజ్ఞము నందు ఉన్నది ఎవరో కాదు. యజ్ఞము నందు బ్రహ్మమే ప్రతిష్ఠితమై ఉన్నాడు (***నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్***).

బ్రహ్మము సర్వగత మని నిర్ధారణ చేస్తూ, మళ్ళీ యజ్ఞము నందే ప్రతిష్ఠిత మని చెప్పడం వైరుధ్యం కాదా? కానే కాదు. యజ్ఞము బ్రహ్మము కన్నా వేరై నపుడే అది విరుద్ధ మవుతుంది. సర్వగత మైన బ్రహ్మమునకు అన్యంగా ఏదీ లేదు. కాకపోతే, ప్రస్తుతం యజ్ఞచక్ర వైభవము చర్చింప బడుతూ ఉన్నందున బ్రహ్మము యజ్ఞము నందు సుప్రతిష్ఠితం అని చెప్పడం జరిగింది (***సర్వగత మపి సత్ నిత్యం, సదా యజ్ఞవిధి ప్రధానత్వాత్ యజ్ఞే ప్రతిష్ఠితమ్***).

కనుక, ఈ కర్మచక్రమును, యజ్ఞ చక్రమును విస్మరించి జీవనం సాగించడం సాధ్యం కాదు. అలా విస్మరిస్తే, ఫలితాలు కూడా విషమిస్తాయి. ఎలాగో వినండి.

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయ తీహ యః ।
అఘాయు రిన్ద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16

ఏవం-ప్రవర్తితం-చక్రం-న-అనువర్తయతి-ఇహ-యః
అఘాయుః-ఇంద్రియారామః-మోఘం-పార్థ-సః-జీవతి

పార్థ	= అర్జునా!	న అనువర్తయతి	= అనుసరించి జీవించడో
ఏవం	= ఈ విధముగా	సః	= వాడు
ప్రవర్తితం	= త్రిప్ప బడుచున్న	అఘాయుః	= పాపమే ఆయువుగా గలవాడై
చక్రం	= సృష్టి చక్రమును	ఇంద్రియారామః	= ఇంద్రియ లోలుడై
ఇహ	= ఈ లోకము నందు	మోఘం	= వ్యర్థముగా
యః	= ఎవడు	జీవతి	= జీవించు చున్నాడు

అర్జునా! ఆ విధంగా తిరుగుతున్న కర్మ చక్రాన్ని అనుసరించి ప్రవర్తించని వాడు పాప జీవనం గడుపు తున్నాడు. ఇంద్రియ లోలుడై వ్యర్థ జీవిగా బ్రతుకు తున్నాడు.

వ్యాఖ్య

ధర్మచక్రము

విశ్వచక్రం విశిష్టంగా తిరుగుతూ ఉంది. ధర్మమునే ప్రధానంగా చేసుకొని తిరుగుతూ ఉంది కనుక ఇది ధర్మచక్రము. ఈ చక్రము త్యాగ నిరతితో చరిస్తూ ఉంది కనుక ఇది యజ్ఞచక్రము. సమయాలను, నియమాలను పాటిస్తూ పరిభ్రమిస్తూ ఉంది కనుక ఇది కాలచక్రము. ఈశ్వరాజ్ఞ చేత ఈ జగచ్చక్రము తిరుగుతూ ఉంది (*ఏవం ఈశ్వరేణ జగచ్చక్రం ప్రవర్తితం*).

ఈ సృష్టి చక్రమును కదిపిన వాడు పరమేశ్వరుడు. నడిపేవాడు కూడా తానే. చక్రం ఆగకుండా తిరుగుతూ ఉంది. చక్రము అంటే కేవలం బండిచక్ర మని కాదు. చక్రము వలె తిరిగేది అని అర్థము (***చక్రవత్ భ్రామ్యతి ఇతి***).

ప్రతిక్షణం ఈ చక్రభ్రమణంలో క్రొత్తవి ఎన్నో, ఎన్నెన్నో గోచరిస్తూ ఉంటాయి. ఋతువులు తిరిగి పోతూ ఉంటాయి. కాలాలు కదలిపోతూ ఉంటాయి. మొక్కలు పుష్పిస్తూ ఉంటాయి. చెట్లు చిగురిస్తూ ఉంటాయి. కాయలు కాస్తూ ఉంటాయి. ఆకులు రాలుతూ ఉంటాయి. ఒక వైపు ప్రసూతి గృహాలు విరివిగా పంపుతూ ఉంటే, మరో వైపు శ్మశాన వాటికలు విచ్చలవిడిగా పట్టుకు పోతూ ఉంటాయి.

చక్రంలో ఏ ఆకు ఎక్కడ ఉండాలో అక్కడే ఉంది. ఏ అంగము ఏ కార్యం చెయ్యాలో అదే చేస్తూ ఉంది. ఇది చిన్నది - అది పెద్దది అనే తారతమ్యం లేదు. ఏ చిన్నది దారి తప్పినా చాలా పెద్దది ఆగిపోతుంది. అన్నీ ఒకే చక్రంలో ఇమిడి ఉన్నాయి. కనుక, దేని ప్రాధాన్యత దానికే ఉంది.

పనసతొనలు తియ్యగా ఉంటాయి. కాకరకాయలు చేదుగా ఉంటాయి. అవి అలా ఉండటంలో ఆశ్చర్యం లేదు. అలా ఉండకుండా మరో విధంగా ఉన్నప్పుడు ఆలోచించ వలసి వస్తుంది. ఏది ఎలా ఉండాలో అలా ఉండటం నియతి. నియతికి భిన్నంగా చరించడం దోషం. నియతి రూపంలో ఎవరో లేరు. నియంతయే ఉన్నాడు. ధర్మమే నియతి. ధర్మరూపంలో ఉన్నది దైవమే. ధర్మచక్రాన్ని త్రిప్పేది దైవమే. అందుకే ఆయన చక్రధారి. చక్రపాణి. చక్రమును చేతి యందు కలవాడు చక్రపాణి (***చక్రం పాణౌ యస్య సః***). ధర్మచక్ర రూపంలో ఉన్న చక్రపాణి త్రిప్పే విశ్వచక్రంలో, విడ్డూరంగా ప్రవర్తించడం అంటే దైవానికి ప్రతికూలంగా చరించడమే అని అర్థము. అధర్మంగా చరించడమే అని భావం.

నీవు, నేను, మనం అందరమూ ఈ కాలచక్రంలో అంగాలై ఉన్నాము. నియతితో సాగే ఈ యజ్ఞచక్రంలో మన కర్తవ్యాన్ని మనం నిర్వహిస్తూ పోవాలి. విశ్వం ఎంత గొప్పదైనా కావచ్చు. విశ్వమంత గొప్పగా వ్యక్తి కనిపించక పోవచ్చు. కాని, వ్యక్తి విశ్వంలో ఉండ దగిన వాడే. ఉండదగిన వాడు కాకపోతే ఎందుకు ఉంటాడు? ఉన్నాడు అంటే, చేయ వలసింది ఉంది కనుకనే ఉన్నాడు. చేయ వలసింది ఉండి నపుడు చేయకుండా ఉండటం అధర్మం అవుతుంది.

దారి తప్పితే దగా పడినట్లే

చేయవలసింది చేయనివాడు ఏం చేస్తాడు? చేయకూడనిది చేస్తాడు. అదే అధర్మం. అదే పాపం. అది ఎంతవరకు చేస్తాడు? అదే చేయడానికి అలవాటు పడ్డాడు కనుక బ్రతికి ఉన్నంత వరకు పాపమే చేస్తాడు.

అంటే జీవనమే పాపభూయిష్ట మైందని అర్థము. ఆయుర్దాయ మంతా పాపాచరణకే సరిపోతుంది. అందుకనే, అట్టి వానిని **అఘాయుః** అంటున్నాడు గీతాచార్యుడు.

'అఘము' అంటే పాపము. 'ఆయుః' అంటే జీవనము. అఘాయువు అంటే, పాపమే ఆయువుగా గల వాడు, లేదా పాపజీవనుడు అని అర్థము. ధర్మచక్రాన్ని అనుసరించని వాడే పాపజీవనుడు.

'అఘాయువు' పాపజీవనుడు కనుక ధర్మచక్రంలో ఇమడడు. మరి ఎక్కడ చరిస్తాడు? ఇంద్రియ సుడిగుండంలో పడి పరిభ్రమిస్తూ ఉంటాడు. అందుకనే అఘాయువును ఇంద్రియారాముడు అని అంటున్నాడు భగవానుడు.

ఇంద్రియాలతో ఇంద్రియ విషయాల యందు రమించేవాడు, క్రీడించే వాడు ఇంద్రియారాముడు **(ఇంద్రియైః ఆరామః ఆక్రీడా విషయేషు యస్య సః ఇంద్రియారామః)**.

అట్టి వాని జీవితము వృథా అంటున్నాడు వాసుదేవుడు **(మోఘం వృథా. హే పార్థ సః జీవతి)**. కనుక ఆత్మజ్ఞానం లేనివాడు కర్మాధికారి కనుక కర్మలు యజ్ఞభావనతో చేస్తూనే ఉండాలి అనేది ప్రస్తుత ప్రసంగ సారాంశం **(తస్మాత్ అధికృతేన కర్తవ్య మేవ కర్మ ఇతి ప్రకరణార్థః)**.

మూడవ అధ్యాయమైన ఈ కర్మయోగమును ప్రారంభిస్తూ, సాంఖ్యులకు, అనగా సన్యాసులకు జ్ఞాన యోగమును, యోగులకు, అనగా సన్యాసులు కాని వారికి, లేదా గృహస్థులకు కర్మయోగమును విస్పష్టంగా తెలియ చేయడం జరిగింది.

తదేకం వద నిశ్చిత్య అంటూ ఈ రెండిటిలో ఏదో ఒక దానిని నిశ్చయించి చెప్ప వలసిందిగా అర్జునుడు రెండవ శ్లోకంలో అభ్యర్థించాడు. దానికి సమాధానంగా **న కర్మణా మనారంభాత్** అంటూ నాల్గవ శ్లోకంలో కర్మయోగాన్ని ప్రారంభించి, **నియతం కురు కర్మత్వం** అంటూ ఎనిమిదవ శ్లోకంలో శాస్త్ర విహిత కర్మలను ఆచరించ మని ఉపదేశించడం జరిగింది. ఆ తరువాత, **యజ్ఞార్థాత్ కర్మణోన్యత్ర** అనే తొమ్మిదవ శ్లోకం నుండి, ఇప్పుడు మనం అధ్యయనం చేస్తున్న **ఏవం ప్రవర్తితం చక్రం** అనే పదహారవ శ్లోకం వరకు ఆత్మవేత్తలు కానివారు అవశ్యం కర్మలను ఎందుకు ఆచరించాలో తెలుపుతూ, కర్మలు చేయక పోవడం ఎలా అయుక్తమో, దోషమో కూడా విపులంగా చర్చించడం జరిగింది.

ఆత్మజ్ఞానం లేని కర్మాధికారులు కర్మలను తప్పక అనుష్ఠించాలి అంటున్నాడు కదా! మరి, ఆత్మానందమును అనుభవించు ఆత్మజ్ఞానులు కర్మలను ఆచరించాలా లేదా? అనే సంశయానికి సమాధానం చెబుతున్నాడు.

యస్త్వాత్మరతి రేవ స్యా దాత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సంతుష్ట స్తస్య కార్యం న విద్యతే ॥ 17

యః-తు-ఆత్మరతిః-ఏవ-స్యాత్-ఆత్మతృప్తః-చ-మానవః
ఆత్మని-ఏవ-చ-సంతుష్టః-తస్య-కార్యం-న-విద్యతే

యః మానవః తు	= ఏ మానవుడైతే	స్యాత్	= ఉంటాడో
ఆత్మరతిః ఏవ	= ఆత్మ యందే ప్రీతి గలవాడై	తస్య	= అట్టి వానికి
ఆత్మతృప్తః చ	= ఆత్మ చేతనే తృప్తిని పొందువాడై	కార్యం	= చేయ దగింది
ఆత్మని ఏవ	= ఆత్మ యందే	న విద్యతే	= ఉండదు
సంతుష్టః చ	= సంతోష పడువాడై		

ఆత్మ యందే రమించువాడు, ఆత్మ యందే తృప్తి పొందువాడు, ఆత్మ యందే సంతసించు వాడు చేయవలసిన కార్య మేదీ లేదు.

వ్యాఖ్య

ఇంద్రియ విషయాల యందు రమిస్తూ బ్రతుకును వృథా చేసుకొనే ఇంద్రియారాముణ్ణి గూర్చి గడచిన శ్లోకంలో చర్చించిన భగవంతుడు, సదా ఆత్మ యందే రమిస్తూ, ఆత్మ యందే తృప్తి చెందుతూ, ఆత్మ యందే ఆనందిస్తున్న ఆత్మారాముణ్ణి గూర్చి ఇప్పుడు చెబుతున్నాడు. విషయం వేరు పడిందని చెప్పడానికి 'తు' శబ్దాన్ని ప్రయోగించాడు.

సూర్యుడు ఉదయించాడు అంటే వెలుగులను విరజిమ్ముతాడు. సూర్యుని ప్రకాశాన్ని ఎవ్వరూ ఆపలేరు. తాను కూడా ఆపుకోలేడు. ప్రకాశమే తన స్వరూపము. స్వరూపాన్ని దాచుకోవడం సాధ్యం కాదు.

మల్లెలు విరబూసాయి అంటే, పరిమళాలను వెదజల్లుతాయి. వానలు ఎక్కడైనా, ఎప్పుడైనా చల్లగానే కురుస్తాయి. ఆత్మజ్ఞాని సర్వత్ర, సదా ఆత్మానందం లోనే ఉంటాడు. ద్వంద్వాలను అధిగమించిన ఆ మహాత్ముని చిత్తము ఆత్మ యందే రమిస్తూ ఉంటుంది. అతని అనంతానందము యొక్క రహస్యం అదే **(యస్య బ్రహ్మణి రమతే చిత్తం నందతి నందతి నందత్యేవ** - భజగోవిందం).

ఆత్మరతుడు

ఆత్మజ్ఞాని సదా ఆత్మ యందే రమిస్తూ ఉంటాడు. అంటే, ఆత్మ కన్నా అన్యమైన విషయాల యందు రమించడు అని నిశ్చితార్థం **(ఆత్మరతిః ఆత్మని ఏవ రతిః న విషయేషు)**.

సుఖపడాలి అనుకొనే వారే అందరూ. సుఖ మెక్కడుందో తెలిసిన వారు ఎందరు? అందుకనే, సుఖ పడటానికి కొందరు వస్తువుల్ని కోరుకుంటారు. కొందరు వ్యక్తుల్ని వాంఛిస్తారు. కొందరు కొన్ని ప్రత్యేక సన్నివేశాలను తయారు చేసుకుంటూ ఉంటారు. వాటి వల్ల కూడా సుఖం కలగవచ్చు. కాని, అట్టి సుఖం తాత్కాలికం. అనిత్యం. నిత్యసుఖ మనేది పరిమిత విషయాలలో లభించదు. అది మానవుని స్వభావం. స్వరూపం. తానే సుఖం. అది తెలిసిన వాడు తన సుఖానికి మరొక దానిని కోరుకోడు. ఏదో అనుకూలంగా ఉంటేనే తనకు సుఖం అనే అవివేకం నుండి ఆత్మజ్ఞాని ఎప్పుడో విడి పోయాడు. తన సుఖానికి తానే కారణం అని తెలిసిన వాడు ఆత్మజ్ఞాన నిష్ఠుడు. తాను తనతో ఉంటే చాలు అనే సత్యాన్ని దృఢంగా ఎరిగిన వాడు. ఆత్మ సదా సుఖ స్వరూపము అనే జ్ఞానం స్థిరంగా కలవాడు **(యస్య స్థితా భవేత్ ప్రజ్ఞా)**. ఆత్మ నిత్యము కనుక ఆత్మసుఖము కూడా అఖండము. ఆత్మ తానే అనే జ్ఞానము గల ఆత్మవేత్త యొక్క సుఖము కూడా అఖండమే **(యస్య ఆనందః నిరంతరః)**. ప్రపంచంలో ఏదీ తన సుఖానికి అనుకూలంగా ఉండ నవసరం లేదు. కనుక, ఆత్మసుఖంలో రమించే జ్ఞాననిష్ఠునికి ప్రపంచము విస్మృతప్రాయము **(ప్రపంచో విస్మృతప్రాయః)**. ఇక, తాను తనకు అనుకూలంగా ఉండటాన్ని కాదనే వాళ్ళు ఎవరున్నారు? అందుకే అతడు సదా ఆత్మరతుడు.

ఆత్మతృప్తుడు

ఆత్మజ్ఞాన నిష్ఠుడు ఆత్మ యందే తృప్తి చెంది ఉంటాడు. అంటే, ఆత్మ కన్నా అన్యములైన విషయాల యందు తృప్తి చెందడు అనేది పరమార్థం **(ఆత్మతృప్తః ఆత్మని ఏవ తృప్తః న అన్నరసాదినా)**.

తృప్తః భవిష్యామి - నేను తృప్తి పడాలి అనుకొనే వారే అందరూ. తృప్తి చెందిన వారు ఈ ప్రపంచంలో ఎందరు? అందరూ తృప్తి చెందే వారే. మళ్ళీ అసంతృప్తితో అలమటించే వారే. ఆకలి తీరని వారెవ రున్నారు?

అలా చూచి నపుడు, ఆకలి తీరినవారు మాత్రం ఎవరున్నారు? అనుభవించి నపుడు తృప్తితో 'చాలు' అనుకుంటారు. ఆ తరువాత ఎంతో సేపు పట్టదు 'చాలదు' అనే అసంతృప్తిని వ్యక్తం చేయడానికి. తృప్తి అనేది మానవునికి కుందేటి కొమ్ము లాంటిది. కాని ఆత్మజ్ఞాని అంతటా 'అలం' బుద్ధిని సాధించినవాడు. 'అలం' అంటే చాలు అని అర్థం. అందుకే అతడు నిత్యతృప్తుడు. తన తృప్తికి మరొక దానిపై ఆధార పడేవాడు కాడు కనుక నిరాశ్రయుడు. ఆత్మకు మించినది మరొకటి లేదని ఎరిగిన వాడు (*న దేవః స్వాత్మనః పరః* - తన ఆత్మకు మించిన దేవుడు లేడు - ఉపనిషత్తు). అందుచేత ఆత్మ తృప్తికి మించిన తృప్తి, లేదా సుఖము మరొకటి ఉండదని క్షుణ్ణంగా తెలిసిన వాడు (*న హి ఆత్మ తృప్తేః పరం సుఖం* - యోగశిఖోపనిషత్తు).

ఆత్మ సంతుష్టుడు

ఆత్మజ్ఞాని ఆత్మ యందే సంతుష్టుడు. అంటే, ఆత్మ కన్నా వేరైన విషయాల యందు సంతోషించాలనే వాంఛ లేనివాడు (***ఆత్మని ఏవ సంతుష్టః సంతోషః హి బాహ్యార్థ లాభే సర్వస్య భవతి, తమ్ అనపేక్ష్య ఆత్మని ఏవ చ సంతుష్టః***).

విషయాలలో ఆనందించాలి అనే అభిలాష లేనివాడు. సంతోష మనేది కేవలం తనకు సంబంధించిన విషయ మని, ఆత్మజ్ఞాన జనిత ఫలమని పూర్ణంగా తెలిసిన వాడు. అందరూ ప్రపంచంలో ఆనందిస్తూ ఉంటే, వారందరికీ విలక్షణంగా ఆత్మవిదుడు తనలో తాను ఆనందిస్తూ ఉంటాడు. ఇతరుల సంతోషానికి నిమిత్తాలు ఉన్నాయి. తనది నిర్నిమిత్తానందము. ఏదో లభిస్తే సంతోషము అనే దురవగాహన నుండి విడిపడి తనకు తాను దూరం కాకుండా ఉంటేనే సంతోషము అనే పరమార్థ జ్ఞానం కలిగినవాడు. నదులన్నీ సాగర రూపాన్ని దాల్చినట్లు, ప్రపంచం లోని సమస్తమైన సంతోషాలు ఏ ఆనందసాగర రూపమై ఉన్నాయో, ఆ సుఖ సాగరము తానే అనే జ్ఞానము కలవాడు (***ఆనందాబ్ధిః యత్పరః సోఽహమస్మి*** - మైత్రేయోపనిషత్తు). అలాంటి మహాత్ముడు ఏమి చెయ్యాలి? దేని కోసం చెయ్యాలి?

కిం కర్తవ్యం?

అసంతృప్తితో ఉండేవారు దానిని పోగొట్టు కొనేందుకు ఏదేదో చేస్తూ ఉంటారు. ఏవేవో పొందాలని, తద్వారా తృప్తి చెందాలని ఉబలాట పడుతూ ఉంటారు. ఏమేమి చేసి ఏవేవి పొందాలో అవన్నీ ఆత్మవిదుడు పొందే ఉన్నాడు కనుక ఆయన చేయ వలసింది ఏమీ లేదు. సర్వఫలమును పొందిన వాడై ఉన్నాడు కనుక చేయవలసిన వన్నీ చేసినవాడే అయ్యాడు (***కృత్స్న కర్మకృత్***).

ఆత్మే తానని తెలిసిన వాడు ఆత్మజ్ఞాన నిష్ఠుడు. ఆత్మ పూర్ణ స్వరూపము కనుక అది అసంగము. ఏకమైన ఆత్మకు దేనితో సంగత్వం ఉంటుంది? సంగత్వం లేనపుడు కర్మ ఎక్కడుంది? ఆత్మలో కర్మ లేనపుడు ఆత్మ ఎలా ఉంది? కర్మ చేయనిదిగా ఉంది. అంటే నిష్క్రియత్వంతో ఉంది. అకర్తగా ఉంది. ఆత్మ అకర్త అని గ్రహించి నపుడు, తానే ఆత్మ అని తెలుసు కొనిన ఆత్మవిదుడు ఎలా ఉంటాడు? అకర్తగా ఉంటాడు. పొంద వలసింది ఉంటేనే చేయ దగింది ఉంటుంది. పొంద వలసింది లేనపుడు చేయ వలసింది మాత్రం ఏముంటుంది? ఇలాంటి జ్ఞానము కల ఆత్మవిదునికి చేయవలసింది ఏదీ లేదు అని అర్థం (***యః ఈదృశః ఆత్మవిత్ తస్య కార్యం కరణీయం న విద్యతే, నాస్తి ఇత్యర్థః***).

ఆత్మజ్ఞాన నిష్ఠుడు కర్మలు చెయ్యవచ్చు. చెయ్యకుండా కూర్చోవచ్చు. ఎలా ఉన్నా తాను అకర్తే. ఆత్మజ్ఞానము కర్తను అదృశ్యం చేసింది. కనుక, ఆత్మవిదుడు కర్మను చేసినా తాను కర్త అనే భావం లేకుండా ఉంటాడు. కర్మల నుండి నేను ఎప్పుడు విడిపడతాను? అని ఆత్మజ్ఞాని పలకడు. సర్వ కర్మల నుండి విడిపడి

ఉన్న ఆత్మనే నేను అనే జ్ఞానంతో ఉంటాడు. ఇక దేహం అంటారా? ఉంటుంది. తాను దేహమనే భావన ఆత్మనిష్ఠునికి ఉండదు కనుక ప్రారబ్ధ ఫలంగా కదులుతున్న దేహం ఆత్మజ్ఞానిని నీడ లాగా వెంబడిస్తూ ఉంటుంది (***ఛాయావత్ అనువర్తినీ*** - వివేక చూడామణి).

కర్మలు చేసి ఆత్మజ్ఞాని పొందేది ఉండదు. కర్మలు చేయకుండా పోగొట్టుకొనేదీ ఉండదు. గుణ దోషాలకు అతీతుడైన జ్ఞాని నిరాశ్రయుడు. ఈ సత్యాన్నే ప్రవచిస్తున్నాడు.

నైవ తస్య కృతే నార్థో నాకృతే నేహ కశ్చన । 18
న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థవ్యపాశ్రయః ॥

న-ఏవ-తస్య-కృతేన-అర్థః-న-అకృతేన-ఇహ-కశ్చన
న-చ-అస్య-సర్వభూతేషు-కశ్చిత్-అర్థవ్యపాశ్రయః

తస్య	= అతనికి	న	=లేదు
ఇహ	= ఈ లోకము నందు	చ	=మరియు
కృతేన	= కర్మ చేయడం చేత	అస్య	=ఇతనికి
అర్థః	= ప్రయోజనము	సర్వభూతేషు	=సర్వభూతముల యందును
న ఏవ	= లేనే లేదు	అర్థవ్యపాశ్రయః	=లాభాన్ని ఆశించి ఆశ్రయించడం
అకృతే న	= కర్మము చేయక పోవుట చేత	కశ్చిత్	=ఏది కూడా
కశ్చన	= ఏమియును	న	=లేదు

అట్టి ఆత్మజ్ఞానికి ఈ లోకము నందు కర్మలు చేయుట వలన ప్రయోజనము ఏమీ ఉండదు. కర్మ చేయక పోయినా ఏమీ ఉండదు. అతనికి సమస్త ప్రాణుల యందు ఫలం కొరకు సంబంధము ఏ మాత్రము ఉండదు.

వ్యాఖ్య

ప్రయోజనాన్ని ఆశించ కుండా కర్మ చేయడం జరగదు. కర్మ జరిగింది అంటే ఫలం ఉండి తీరాలి. ఇంతవరకు మనం అర్థం చేసుకున్న దానిని బట్టి కర్మఫలము నందు ఆసక్తి కలిగి కర్మ చేసేవాడు కర్మి. కర్మ ఫలాసక్తి లేకుండా చిత్తశుద్ధి కొరకు కర్మలు ఆచరించే వాడు కర్మయోగి. అసలు కర్మలకే అంటక, నైష్కర్మ్య స్థితిలో ఉండే మహితాత్ముడు జ్ఞాని. అతని వైభవాన్నే ప్రస్తుతం మనం చూస్తున్నాము.

ఉండి లాభం లేదు

కర్మ యొక్క ఫలం రెండు విధాలుగా మనకు అర్థమైంది. మొదటిది బాహ్య ప్రపంచంలో లభించే కర్మఫలం. రెండవది బాహ్యంలో కాకుండా తన లోనే, అంటే తన మనస్సు లోనే ప్రాప్తించే అంతఃకరణ శుద్ధి. ఈ రెండు ఫలాలను దృష్టిలో ఉంచుకొనే కర్మాచరణం చేయాలి. జ్ఞాని ఈ రెండు ఫలాలకు అతీతుడు. అతడు ఆత్మ యందే ఆనందాన్ని పొందుతూ ఉన్నాడు కనుక అతనికి (***తస్య పరమాత్మ రతేః***) కర్మ చేసి పొంద వలసిన ప్రయోజనము ఏదీ కనిపించడం లేదు (***కృతేన కర్మణా ప్రయోజనం నాస్తి***).

కర్మ జన్యమైన సుఖము అనిత్యమని అతనికి తెలుసు. నిరంతరం బ్రహ్మానంద రసానుభూతిలో అఖండంగా అలరారుతున్న ఆత్మవిదుడు, తాను పొందే ఉన్న ఆత్మజ్ఞానానికి అవసరమైన అంతఃకరణ శుద్ధి కొరకు కర్మలు ఆచరించే పని లేదు.

ఆత్మ అకర్త కనుక కర్మలో కూడా జ్ఞాని అకర్మనే చూస్తాడు. అలాంటి వాడు కర్మ చేసి పొందేది

ఏముంటుంది? కర్మ చేయనంత మాత్రాన పోగొట్టు కొనేది ఏముంటుంది? ఆత్మ అకర్త అనే జ్ఞానం జారి పోయేది కాదు. పారిపోయేది కాదు. జ్ఞాని పొంద వలసింది ఏదీ లేనందున అతడు అకర్తే. కర్మ చేయని వాడే. అలాంటి జ్ఞాని నుండి అనాయాసంగా కర్మలు దొర్లితే అవి సూర్యుని ప్రకాశం లాగా, చంద్రుని వెన్నెల లాగా ప్రపంచానికి ఆశీస్సులు అవుతాయి. అంతేగాని, కర్మలలో ఉన్నందున ఆత్మజ్ఞానికి ఏదో ఒరుగుతుంది అని మాత్రం కాదు.

సరే. జ్ఞాని ప్రత్యేకంగా పొంద వలసింది ఏమీ లేదు కనుక కర్మల యొక్క అవసరం అతనికి లేదు అనే అనుకుందాం. మరి, మనం రెండవ అధ్యాయంలో చూసినట్లు, చేయ వలసిన కార్యాన్ని చేయక పోవడం చేత ప్రాప్తించే ప్రత్యవాయ దోషం జ్ఞానికి అంటదా? జ్ఞానికి ఏదీ అంటదు. అందుకే అతడు నిస్సంగుడు.

పోతే నష్టం లేదు

చెయ్య వలసింది చెయ్యక పోతే మనకు నష్టం వాటిల్లుతుంది. దీనినే కర్మ ప్రస్థానంలో ప్రత్యవాయ దోషంగా తెలుసుకున్నాం. జ్ఞాని కర్మలు చేయక పోయినా అతడికి ప్రత్యవాయ దోషం అంటదు.

ఉన్నది ఆత్మ ఒక్కటే. అది ఏకం, అద్వయము అనే జ్ఞానం ఆత్మవిదునికి స్థిరంగా ఉంది. తత్ఫలితంగా ఈ ప్రపంచమంతా అతనికి మిథ్యా స్వరూపమే. **మాయా మాత్ర మిదం ద్వైతమ్** - ఈ ద్వైత ప్రపంచము అంతా మాయే నని అతనికి తెలుసు కనుక, మాయలో కర్మలను ఆచరింపక పోవడం వల్ల కలిగే నష్టం కూడా ఏదీ ఉండదు అని అతనికి తెలుసు.

అప్పు తీసుకున్న వాడు తిరిగి ఇవ్వక పోతే శిక్షార్హుడు. స్వప్నంలో అప్పు తీసుకున్న వాడు మేలుకున్న తరువాత చెల్లించక పోతే శిక్షార్హు డవుతాడా? స్వప్నము లోని కర్మజనిత దోషం జాగ్రదవస్థలో వర్తిస్తుందా? ఇదీ అంతే.

ఆత్మ జ్ఞానామృతమును పానం చేసి తృప్తి చెందిన ఆత్మవిదునికి, కృతకృత్యుడైన జ్ఞానికి ఏ కొద్దిపాటి కర్తవ్యం కూడా లేదు. ఒకవేళ కర్తవ్యము ఉండి తీరాలి అంటే మాత్రం, అలా ఉన్నవాడు ఆత్మజ్ఞాని కానే కాడు అని శాస్త్రం నిర్ధారించింది (**జ్ఞానామృతేన తృప్తస్య కృతకృత్యస్య యోగినః నైవాస్తి కించి త్కర్తవ్య మస్తి చేత్ న స తత్త్వవిత్**).

మరి, అర్జునుడు ఇప్పుడు ఏమి చేయాలి? కర్మను త్యజించాలా? లేక ఆచరించాలా? అదే తరువాత శ్లోకం.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచర న్కర్మ పర మాప్నోతి పూరుషః ॥ 19

తస్మాత్-అసక్తః-సతతం-కార్యం-కర్మ-సమాచర
అసక్తః-హి-ఆచరన్-కర్మ-పరం-ఆప్నోతి-పూరుషః

తస్మాత్	= అందువలన	అసక్తః	= ఆసక్తి లేనివాడై
అసక్తః	= ఫలాసక్తి లేనివాడవై	కర్మ	= కర్మను
సతతం	= ఎల్లప్పుడు	ఆచరన్	= చేయుచున్న
కార్యం	= చేయ దగిన	పూరుషః	= పురుషుడు
కర్మ	= కర్మమును	పరం	= మోక్షమును
సమాచర	= చక్కగా ఆచరించు	ఆప్నోతి హి	= పొందుతాడు గదా!

అందుచేత, నువ్వు ఫలాపేక్ష లేకుండా, చేయదగిన కర్మను చేస్తూ ఉండు. ఫలాపేక్ష లేకుండా కర్మ నాచరించే వాడు మోక్షమును పొందుతున్నాడు.

వ్యాఖ్య

జ్ఞాని నిత్యతృప్తుడు. నిత్యానంద స్వరూపుడు. తన ఆనందానికి తానే కారణమైన వాడు. అలాంటి వాడు తృప్తి చెంద డానికి చేయ వలసింది ఏముంటుంది? అలాగని ఏదీ చేయకుండా కూర్చుంటే మాత్రం అతనికి వచ్చే నష్ట మేముంటుంది? అందుకే జ్ఞాని నిత్యతృప్తుడు. నిరాశ్రయుడు. తాను పొంద వలసిన ప్రయోజనం ప్రత్యేకంగా ఏదీ లేనందున, అతడు ఆశించి చేయ దగిన పని కూడా ఏమీ ఉండదు. ఈ విషయాన్ని పద్దెనిమి దవ శ్లోకంలో చూశాం.

కృష్ణా! అలాంటప్పుడు నేను కూడా జ్ఞానమార్గాన్ని ఆశ్రయించి కర్మలను విడిచి పెడతాను. కర్మలు చేసి సాధించే దేమీ లేదు కనుక, జ్ఞాన నిష్ఠాపరుడు కర్మలను త్యజించినట్లు నేను కూడా త్యజిస్తాను అని అర్జునుడు అభిప్రాయ పడతా డేమో అని ఆశంకించి, అర్జునా! నువ్వు కర్మలను ఆచరించి తీరాలి అని బోధించేందుకు ఈ శ్లోకాన్ని చెబుతున్నాడు గీతాచార్యుడు. జ్ఞాని అయిన వాడు కర్మలను ఆచరించ వచ్చు. లేదా, విరమించ వచ్చు. అలాగని, జ్ఞానము లేనివా రందరూ కర్మ చేసి సాధించే దేమీ లేదు కనుక కర్మల్ని త్యజిస్తాము అని అభిప్రాయ పడితే, అలాంటివాళ్ళు కర్మలను విడిచిన వాళ్ళు అవుతారే గాని, బంధాలను తొలగించుకొన్న వాళ్ళు కాలేరు.

ఆఖ్యాయిక

సంగీత శిక్షణను ఇచ్చే ఒక గురువు గారి వద్ద సంగీతం నేర్చుకోవాలని ఒక విద్యార్థి చేరాడు. గురువు గారి వద్ద కొన్ని సంవత్సరాలు అభ్యాసం చేశాడు. అయినా అతడికి సంగీతం ఏమాత్రం అబ్బ లేదు.

'గురువుగారూ! మీరు గొప్ప సంగీత విద్వాంసులు. మీ వద్ద శిక్షణ పొందితే నేను కూడా గొప్ప విద్వాంసుణ్ణి కావచ్చు నని ఆశపడి మిమ్మల్ని ఆశ్రయించాను. కాలం గడిచి పోయిందే గాని కళ రాలేదు' అన్నాడు దీనంగా.

బద్ధకస్తుడైన ఆ పిల్లవాణ్ణి చూచి గురువు, 'మూడు పూటలా పుష్టిగా తిని కూర్చుంటే సంగీతం వస్తుందా? మాకు అలా రాలేదులే' అన్నాడు విసుగ్గా. ఆ తరువాత, నాలుగు రోజులు గడిచాయి. శిష్యుడు గురువు గారిని మళ్ళీ వచ్చి కలిశాడు.

'గురువుగారూ! నాలుగు రోజులు గడచి పోయాయి. ఈ నాలుగు రోజులూ మీరు చెప్పినట్లే చేశాను. అయినా, ఫలితం శూన్యం. ఇక, నేను చెయ్య దగింది ఏమిటి?' అని అడిగాడు.

గురువు ఆలోచనలో పడ్డాడు. నాలుగు రోజుల క్రితం ప్రత్యేకించి వీడికి నేను ఏమి చెప్పాను? సంవత్సరాలు తరబడి శిష్యరికం చేసినా సంగీతం అబ్బని వీడికి, నాలుగు రోజుల్లో అది ప్రాప్తించేటట్లు, నేను ఏ మంత్రం చెప్పాను? అని ఆలోచనలో పడ్డాడు. చివరికి శిష్యుణ్ణే అడిగేశాడు, 'నేను నీకు ఏం చెప్పాను?' అని.

'గురువుగారూ! మూడు పూటలా తిని కూర్చుంటే సంగీతం రాదన్నారు కదా! అందుకని ఈ నాలుగు రోజులు మూడు పూటలా తినకుండానే పడుకున్నాను. అయినా సంగీతం రాలేదు' అన్నాడు.

సాధన తోనే సాధ్యం

సంగీత జ్ఞానం పూర్ణంగా కలిగిన విద్వాంసుడు సాధన చేయక పోయినా పాడ గలడు. సంగీత జ్ఞానము లేనివాడు తిని కూర్చున్నా, తినకుండా పడుకున్నా, అతడు తినినవాడు, తినని వాడు అవుతాడే గాని సంగీతం

వచ్చినవాడు మాత్రం కాలేదు. ***అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు*** - సంగీత సాధన చేస్తూ ఉంటే సంగీత విద్య వస్తుంది. విద్వాంసుడైన వాడు అభ్యసించడం లేదని సాధకుడు కూడా అభ్యసించడం మానేస్తే, అతడు ప్రయత్నాన్ని విరమించిన వాడు అవుతాడే గాని, అనుకున్నది సాధించిన వాడు కాలేదు. **సాధనమున పనులు సమకూరు ధరలోన** - 'చేసుకున్న వారికి చేసుకున్నంత' అనేది ఒక అద్భుతమైన సత్యవచనం.

జ్ఞాని కర్మలు చేయడం లేదని, జ్ఞాని కానివాడు కూడా కర్మల్ని మానేస్తే, అట్టివాడు కర్మను విడిచిన వాడు అవుతాడే గాని జ్ఞాని కాలేడు. ప్రస్తుతం జ్ఞానిగా శోభిస్తున్న వ్యక్తి కూడా గతంలో కర్మలను ఆచరించి తత్ఫలితంగా అకర్త అయిన వాడే గాని, కర్మ చేయకుండా నైష్కర్మ్యాన్ని పొందిన వాడు కాడు ***(న కర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽ శ్నుతే** - 3 వ అ - 4 వ శ్లో).*

అర్జునా! ఆత్మజ్ఞాని పొంద వలసింది లేదు కనుక చేయ వలసింది కూడా ఏమీ లేదు. ఆత్మజ్ఞానము లేని వారందరు కర్మలను అవశ్యం చేయాలి. జ్ఞానోదయం జరగ నపుడు, జ్ఞానదీపాన్ని వెలిగించుకొనే ప్రయత్నాన్ని విరమించు కోవడం అవివేకం. ***తస్మాత్*** - అందువలన. అంటే, నీవు జ్ఞానివి కానందు వలన కర్మను ఆచరించి తీరాలి.

ప్రస్తుత శ్లోకాన్ని 'తస్మాత్' అని ఆరంభించడములో అంతర్భావం ఇదే. జ్ఞానులు కర్మలను విడిచిపెట్టి ఆత్మరతిలో ఆత్మతృప్తులై ఆత్మానందాన్ని అనుభవిస్తుంటారు కనుక, నేను కూడా అలాగే సంతుష్టుడనై ఉంటాను అని జ్ఞానం లేనివాడు భావిస్తే, ప్రగతి లేకపోగా, పతనం తప్పదని తెలుపుతూ, ***తస్మాత్ జాగ్రత జాగ్రత*** అని హెచ్చరిస్తున్నాడు.

చెయ్యదగింది చెయ్యి

ఏవి ఎలా జరగవలసి ఉందో అవి అలా జరుగుతాయి. నేను చేయగలిగింది చేస్తాను అనేది సాధకుని భావన కావాలి. మనం చేయవలసినవి ఎన్నో ఉన్నాయి. అవి చేయడం కోసమే మనం ఈ ప్రపంచంలో ఉన్నాము. చేయ వలసినవే చేయ లేనపుడు, చేయ లేనివి ఎలా చేస్తాము?

కర్మ బంధాన్ని సృష్టిస్తుందా? జడమైన కర్మ బంధాన్ని ఎలా సృష్టిస్తుంది? కనుక కర్మ బంధము కాదు. కర్మల యందు ఆసక్తే బంధము. బంధము కాకుండా కర్మలు చెయ్యవచ్చు. ఆసక్తి లేకుండా కర్మ చేస్తే కర్మ బంధించదు. కనుకనే, అర్జునా! చేయవలసిన కర్మను ***(కార్యం కర్తవ్యం కర్మ)*** ఎల్లప్పుడు ***(సతతం సర్వదా)*** చక్కగా ఆచరించు ***(సమాచర నిర్వర్తయ)***. కాకపోతే, కర్మ ఫలాసక్తి లేకుండా ఆచరించు ***(అసక్తః)***. ఫలాపేక్ష లేకుండా కర్మలు చేయడం అంటే, రాగద్వేషాల నుండి విడిపడి, ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించడం అని అర్థం ***(ఈశ్వరార్థమ్ కర్మ కుర్వన్)***. అలా కర్మలను ఆచరిస్తే, తద్వారా చిత్తశుద్ధిని సాధించి మోక్షాన్ని పొందుతావు ***(మోక్షం ఆప్నోతి ప్రాప్నోతి సత్త్వశుద్ధి ద్వారేణ ఇత్యర్థః)*** అనేది భగవానుని ఆదేశము.

ముక్తిమార్గం

కర్మ చేయకుండా ఉండటం సాధ్యం కాదు. కర్మలను ఆచరిస్తూ పోతే రాగద్వేషాలు నూతనంగా తయారు కాకుండా ఉండవు. మనస్సు రాగద్వేషాలకు చిక్కితే కర్మ బంధహేతువు అవుతుంది. కనుక కర్మలను చేస్తూనే అవి బంధాలు కాకుండా చూసుకోవాలి. అందుకు కర్మయోగమే అనువైన చక్కని మార్గము.

కర్తవ్యతా బుద్ధిలో ఫలాకాంక్ష లేకుండా కర్మల్ని ఆచరించాలి. ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే, రాగద్వేషాలు తటస్థ పడతాయి. దీనినే మహాత్ములు 'అనాసక్తి యోగము' అని పేర్కొన్నారు. ఈ విధమైన కర్మయోగమును ఆచరించు సుకృతాత్ములు చిత్తశుద్ధి ద్వారా మోక్షాన్ని పొందుతారు.

ధర్మరూపంలో ఉన్నది దైవమే అని ఇప్పటికే గ్రహించాం. ఈ ప్రపంచంలో ధర్మచక్రమే తిరుగుతూ ఉంది. ధర్మాన్ని ఆశ్రయించి, ధర్మమార్గాన చరించే వారికి రాగద్వేషాలు అంటవు కనుక, వారి మనస్సు స్వలక్ష్యము నందే ఉంటుంది. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల్ని ఆచరించడం అంటే, ధర్మరూపంలో ఉన్న దైవాన్ని హృదయం లోకి ఆహ్వానించడం అని అర్థం. అదే భక్తి. భక్తి కలిగిన వాడు భక్తుడు. భక్తుడు ఎవరో కాదు. కర్మయోగే భక్తుడు. భక్తుడైన కర్మయోగి, భక్తి ద్వారా, అంటే కర్మయోగము ద్వారా అంతఃకరణ శుద్ధిని పొందు తున్నాడు. ఈ విధంగా ముక్తిమార్గంలో చరించి మోక్షరూపు డవుతున్నాడు.

కర్మయోగి ధర్మ జీవనాన్ని సాగించడం చేత పాపమంతా ప్రక్షాళన మవుతుంది ***(ధర్మేణ పాప మపను దతి)***. పాపం నశించడం చేత బుద్ధిలో జ్ఞానం ఉదయిస్తుంది ***(జ్ఞాన ముత్పద్యతే పుంసాం క్షయాత్ పాపస్య కర్మణః)***. జ్ఞానం వలన మోక్షం సిద్ధిస్తుంది ***(జ్ఞానా దేవతు కైవల్యం)***. ఇది క్రమం. కర్మయోగి కార్యక్రమం.

ముముక్షువులైన వారు ఎందరో ఈ కర్మయోగ మార్గంలో చరించి తరించి పోయారు. ఇది పవిత్రమైన, సూటియైన మార్గం కనుక, తరించిన మహాత్ములు కూడా ఆదర్శాన్ని నిలిపేందుకు వారికి అవసరం లేకపోయినా, కర్మల్ని ఈ ప్రపంచంలో ఆచరించి చూపారు. వారెవరంటూరా? వినండి.

కర్మ ణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహ మే వాపి సమ్పశ్య న్కర్తు మర్హసి ॥ 20

కర్మణా-ఏవ-హి-సంసిద్ధిం-ఆస్థితాః-జనకాదయః
లోకసంగ్రహం-ఏవ-అపి-సంపశ్యం-కర్తుం అర్హసి

జనకాదయః	= జనకుడు మొదలగు వారు	లోకసంగ్రహం ఏవ	=లోక కళ్యాణమునే
కర్మణా ఏవ	= కర్మ చేతనే	సంపశ్యన్ అపి	=చూస్తున్న వాడవైనా కూడా
సంసిద్ధిం	= సిద్ధిని	కర్తుం	=కర్మ చేయుటకు
ఆస్థితాహి	= పొందిరి గదా	అర్హసి	=తగి యున్నావు

జనకుడు మొదలైన వారు కర్మ చేతనే సిద్ధిని పొందారు కదా! నీవు కూడా లోక హితమును దృష్టిలో ఉంచుకొని కర్మను ఆచరించడమే సముచితం.

వ్యాఖ్య

కర్మ చేసే ప్రతి వ్యక్తి అజ్ఞాని కాడు. అలాగే, కర్మ చేయకుండా ఉన్న ప్రతివాడూ జ్ఞాని కాడు. కర్మ చేసినంత మాత్రాన జ్ఞాని జ్ఞాని కాకుండా పోడు. కర్మ చేయనంత మాత్రాన అజ్ఞాని అజ్ఞానం నుండి విడి పడడు.

కర్మ చేయడం మోక్షానికి విరుద్ధ మని శాస్త్రం చెప్పలేదు. కర్మ మోక్షాన్ని ప్రసాదించ లేదు అని మాత్రమే చెప్పింది. ఫలాసక్తితో, రాగద్వేషాలతో కర్మలను ఆచరిస్తే అవి బంధహేతువు లవుతాయి. ఫలాసక్తి లేకుండా, ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తే కర్మ కర్మయోగంగా మారుతుంది. అంతఃకరణ శుద్ధిని ప్రసాదిస్తుంది. చిత్తశుద్ధి మోక్షానికి హేతువు అవుతుంది. గతంలో తరించిన మహాత్మ లందరూ ఇలాగే తరించారు.

కర్మల విషయంలో అవగాహన చక్కగా ఉండాలి. జ్ఞాననిష్ఠకు అర్హులు కాని వారు కర్మల్ని సన్యసించి సాధించేది ఏమీ ఉండదు. అలాగని, కర్మలలో కూరుకు పోయినా ప్రయోజనం ఉండదు. కనుక కర్మల ద్వారా శుద్ధిపడే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. అదే శ్రేయోమార్గం.

యుద్ధకర్మను అర్జునుడు సన్యసించడాన్ని శ్రీకృష్ణుడు సమర్థించడం లేదు. పైగా వ్యతిరేకిస్తున్నాడు కూడా. అలాగని, రాజు లందరు స్వార్థంతో, ఫలాభిసంధితో యుద్ధాలు చేసినట్లు, అర్జునుడు కూడా చేయాలి అని శ్రీకృష్ణుడు అభిప్రాయ పడటం లేదు. అర్జునుడు క్షత్రియుడు. క్షత్రియుడైన అర్జునుడు చేయవలసిన కర్మ (**కార్యం కర్మ**) ఏదయితే నిరీక్షిస్తూ ఉందో, దానిని చేయక తప్పదు అనేదే శ్రీకృష్ణుని అభిమతం. అలా చేయ దగిన కర్మను ఆసక్తి లేకుండా ఆచరిస్తే బంధము లేక పోవడమే గాక, మోక్షానికి మార్గం సుగమం అవుతుంది అనేదే గీతాచార్యుని నిశ్చితాభిప్రాయము.

ఇది కేవలం ఊహ మాత్రమే కాదు. ఆ విధమైన కర్మయోగ మార్గంలో ఎందరో విద్వత్తు కలిగిన క్షత్రియులు గతంలో తరించారు. మోక్షాన్ని పొందారు అని కూడా చెబుతున్నాడు (***కర్మణి ఏవ, పూర్వే క్షత్రియాః విద్వాంసః సంసిద్ధిం మోక్షం గస్తుమ్***). అలాంటి క్షత్రియులు ఎవరు? అని అడిగితే, జనకుడు మొదలైన వారు అని సమాధానం చెబుతున్నాడు (***జనకాదయః జనక అశ్వపతి ప్రభృతయః***).

కర్మయోగంలో చరించి గతంలో ఎందరో క్షత్రియులు సంసిద్ధిని పొందారు అంటున్నాడు. వారే జనకాదులు అని సోదాహరణంగా చెబుతున్నాడు. 'జనకాదులు' అనడం లోనే జనకుడు ఒక్కడే కాదు, ఇంకా చాలా మంది ఉన్నారు అని అర్థం. ఎవరు వారు? జనకుడు, అశ్వపతి, భగీరథుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, ఇక్ష్వాకుడు మొదలైన వారు పురాణేతిహాసాలలో ఎందరో కనిపిస్తారు. వారందరూ జ్ఞానులయ్యారు. మోక్షాన్ని పొందారు.

అయితే వీరందరూ మోక్షాన్ని పొందడానికి కర్మను ఆచరించారా? లేక త్యజించారా? అనేది ఇక్కడ చర్చనీయాంశము. రెండూ చెయ్య లేదు. బంధ కారకములైన కర్మల్ని చేసినా ప్రయోజనం ఉండదు అని గ్రహించిన వారు కనుక, వారందరూ రాజులే అయినా, గృహస్థులే అయినా కర్మలలో కూరుకొని పోలేదు.

అలాగని, తమ క్షత్రియ ధర్మాన్ని, గృహస్థ ధర్మాన్ని విస్మరించి సన్యాసుల వలె చరించడం యుక్తం కాదని గ్రహించారు కనుక కర్మలను త్యజించనూ లేదు. కర్మలు ఆచరిస్తూనే కర్మలలో శుద్ధిపడే ప్రయత్నం చేశారు. చిత్తశుద్ధి ద్వారా జ్ఞానప్రాప్తిని, తద్వారా మోక్షాన్ని పొంది తరించారు.

చేసి తరించారా? తరించి చేశారా?

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న ఈ శ్లోకం యొక్క మొదటి పాదాన్ని రెండు కోణాల నుండి దర్శించి అర్థం చేసుకోవాలి. జనకుడు మొదలైన రాజులు కర్మాచరణ ద్వారా సిద్ధిని పొందారా? లేక సిద్ధిని పొంది కర్మాచరణం చేశారా? ఈ రెండిటికి అవకాశా న్నిస్తున్న ఈ శ్లోక పాదాన్ని అలా రెండు విధాలుగా విశ్లేషించి అర్థం చేసుకుంటేనే విషయం స్ఫటికంలా స్పష్టంగా బుద్ధిలో నిలుస్తుంది.

ఏమీ చేయకుండా ఎవరూ ఏదీ పొందలేరు. అలాంటప్పుడు జనకాదులు మాత్రం అకర్మ ద్వారా సిద్ధిని ఎలా పొందుతారు? కనుక కర్మయోగంలో చరిస్తూనే పొందారు.

మరి ఈ శ్లోకంలో, ఆత్మజ్ఞానాన్ని పొందడానికి జనకాదులు కర్మను ఆచరించారా? లేక జ్ఞానాన్ని పొంది కర్మాచరణం సాగించారా? అనే మీమాంస తలెత్తుతూ ఉంది కనుక వారికి సమ్యగ్దర్శన ప్రాప్తి లభించిన తరువాతే కర్మల్ని ఆచరించారు అని గనుక చెప్పుకుంటే, వారు లోక కళ్యాణార్థం కర్మాచరణం చేశారు అని అర్థం చేసుకోవాలి (***యది తే ప్రాప్త సమ్య గ్దర్శనాః తతః లోక సంగ్రహార్థం***).

అలా కాకుండా, వారికి సమ్యగ్దర్శన ప్రాప్తి కలగలేదు కనుకనే కర్మను ఆచరించారు అని చెప్పుకుంటే అంతఃకరణ శుద్ధికి కర్మలను ఆచరించి, కర్మయోగం ద్వారా సంసిద్ధిని పొందారు అని ఈ శ్లోకంలో మొదటి

పాదాన్ని అర్థం చేసుకోవాలి (***అప్రాప్త సమ్యగ్దర్శనాః జనకాదయః కర్మణా, సత్త్వశుద్ధి సాధన భూతేన, క్రమేణ సంసిద్ధిం ఆస్థితాః***).

ఆత్మజ్ఞానం లేని వారే అయినా, చిత్తశుద్ధి కోసం క్షత్రియులైన జనకాదులు కర్మాచరణం చేసి, తద్వారా జ్ఞానాన్ని పొందారు కనుక, క్షత్రియుడైన అర్జునుడు కూడా వారి మార్గం లోనే చరించి, యుద్ధకర్మను ఆచరించి కూడా సిద్ధిని పొందవచ్చు అని అభిప్రాయము.

జనకాదులు ఆత్మజ్ఞానార్థమై, చిత్తశుద్ధి నిమిత్తం కర్మలను ఆచరించి ఉండవచ్చు. కాని, శ్రీకృష్ణుని గీతాబోధ వల్ల తనకు ఆత్మజ్ఞానం కలిగింది కనుక తాను కర్మను ఎందుకు చెయ్యాలి? అని అర్జునుడు భావిస్తాడేమో అని ఆశంకించిన అచ్యుతుడు, అలా అయినప్పటికి, అర్జునా! నువ్వు లోక సంగ్రహార్థం కర్మలు చెయ్యవచ్చు అంటున్నాడు.

జనకుడు మొదలైన వారు జ్ఞానాన్ని పొందిన తరువాత కూడా లోక సంగ్రహార్థం కర్మల్ని ఆచరించారు. తాము ఆత్మే నని వారికి తెలుసు. ఆత్మ అకర్త అనేది వారి అనుభవంలో ఉన్న విషయమే. అయినా, ప్రారబ్ధవశాత్తు దేహము కొనసాగుతూ ఉంది కనుక, దేహ ప్రారబ్ధానుసారము కర్మల్ని అవశ్యం చెయ్యాలి కనుక చేశారు.

శ్వాసల్ని పీల్చుకోకుండా జ్ఞాని దేహంలో ఉండ గలడా? మరి, శ్వాసక్రియ కర్మ కాదా! అలాగని, శ్రమించి ఎవరైనా శ్వాసలు పీల్చుకుంటున్నారా? శ్రమించి కంటిరెప్పలు వాల్చుతున్నారా? సామాన్యులు శ్వాసక్రియాది కర్మల్ని అనాయాసంగా, అప్రయత్నంగా ఆచరించినట్లు, జ్ఞానులు సర్వ కర్మల్ని స్పృహ లేకుండా చేయగలరు. కారణం, ఆత్మ అకర్త అనే జ్ఞానం వారిలో స్థిరపడి ఉంది కనుక.

జీవన్ముక్తులైన జనకాదులు దేహధారులై ఉన్నారు కనుక, క్షత్రియ ఉపాధితో క్షాత్ర ధర్మాన్ని నిస్సంగులై, ఆత్మరూపులై ఆచరించారు. వారికి రాజ్యం ఉండింది. కనుక చేయ వలసిన కార్యం ఉండింది (**కార్యం కర్మ**). ప్రజల కష్టాలను తీర్చేవారు. ధర్మయుతంగా రాజ్యాన్ని పాలించేవారు. ప్రజల బాధల్ని తీర్చి, లోక సంగ్రహార్థం కర్మాచరణం చేసేవారు. అదంతా లోకం కొరకే కాని, తమ కొరకు కాదు. ఇంతెందుకు? శ్రీకృష్ణ భగవానుని విషయం చూడండి. ఆయన రథాన్ని నడుపుతున్నది తన కొరకా? అర్జునుని కొరకా? తన స్వార్థం కొరకా? లోక కళ్యాణం కొరకా? జ్ఞాని చర్యలు ఎప్పుడైనా, ఎక్కడైనా ఇలాగే ఉంటాయి.

ఆత్మజ్ఞానం కలిగిన తరువాత, కర్మలు చెయ్యకూడదు అనే నియమం లేదు. జ్ఞానం కలిగి ఉండవచ్చు. అయినా ప్రారబ్ధాధీనంగా దేహం కొనసాగుతూ ఉంది కనుక (***ప్రారబ్ధ కర్మాయత్తః***) దేహ ప్రారబ్ధాన్ని అనుసరించి కర్మల్ని చెయ్యవచ్చు. కర్మల్ని విడిచి పెట్టి కూర్చోవచ్చు. రాజ్యాన్ని పాలించ వచ్చు. చెట్టు క్రింద నిష్క్రియుడై పడి ఉండవచ్చు. జ్ఞానికి విధి నిషేధాలు విధించే సాహసం ఇంతవరకు ఎవ్వరూ చెయ్యలేదు. జ్ఞాను లందరిలో జ్ఞానం ఒక్కటే. కాని, జ్ఞానం కలిగిన వారు అందరూ ఒకే విధంగా చరించరు. అది ప్రారబ్ధ భేదమే గాని జ్ఞానంలో భేదం కాదు.

పూర్ణ జ్ఞానరూపులైన శ్రీ ఆది శంకరాచార్య స్వామి ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించి జ్ఞాన ప్రబోధం చేశారు. అరుణాచలంలో శ్రీరమణులు నిశ్చల రూపులై లోకాన్ని ఆశీర్వదించారు. అదంతా ప్రారబ్ధ భేదం వల్ల వచ్చిందే గాని జ్ఞానంలో భేదం వల్ల కాదు.

అర్జునా! జ్ఞానులైన జనకాదులే లోక సంగ్రహార్థం కర్మల్ని ఆచరించారు. నీవు జ్ఞానివి కాకపోయినా, కర్మల్ని త్యజించాలని ఉబలాట పడుతున్నావు. నువ్వు చేయవలసిన కర్మ ఉంది (**కార్యం కర్మ**). అదే నిన్ను ప్రస్తుతం కురుక్షేత్రానికి ఈడ్చుకొని వచ్చింది. చెయ్యవలసింది ఉండగా, చెయ్యను అని భీష్మించుకొని

కూర్చోవడం జ్ఞాని లక్షణం కాదు. యుద్ధం కావాలని నువ్వు అభిలషించావా? నేను ప్రయత్నించానా? అయినా అనివార్యంగా ప్రాప్తించిన యుద్ధంలో నీ పాత్రను పోషించేందుకే నువ్వు ఇక్కడ నిలబడి ఉన్నావు. అలా కాకుండా నువ్వు కూడా జ్ఞానివే అని గనుక నీ అభిమత మైతే, అప్పుడు కూడా యుద్ధ ప్రారబ్ధం కలిగిన దేహంతో లోక సంగ్రహార్థం నువ్వు యుద్ధానికి సిద్ధం కాక తప్పదు. లోకం సక్రమ మార్గంలో చరించ డానికి నువ్వు కర్మను ఆచరించే తీరాలి ***(లోక సంగ్రహమ్ ఏవ అపి ప్రయోజనం సంపశ్యన్ కర్తుమ్ అర్హసి).***

క్షత్రియ ప్రారబ్ధంతో ఉన్న దేహంతో క్షత్రియ ధర్మం ఆచరింప బడాలి. తప్పదు. సర్వ ధర్మాలు రాజును ఆశ్రయించుకొని ఉన్నాయి ***(సర్వేరాజాశ్రితా ధర్మాః).*** కనుక రాజ దేహమును ధరించిన నీవు రాజ ధర్మానికి దూరం కాలేవు. రాజధర్మానికి కారకుడు రాజే కదా! ***(రాజా ధర్మస్య కారకః).*** కనుక క్షత్రియ ప్రారబ్ధ దేహధారి వైన నువ్వు ఆత్మజ్ఞానివి అయినా కర్మల్ని ఆచరించాలి ***(లోకసంగ్రహార్థం).*** ఆత్మజ్ఞానివి కాకపోయినా, కర్మల్ని ఆచరించాలి ***(సత్త్వ సంశుద్ధి సాధనార్థం).*** అర్జునా! కర్మను విరమించి నంత మాత్రాన బంధవిముక్తి జరగదు. కర్మ ద్వారానే జ్ఞానం కలగాలి. ఈ విషయంలో శాస్త్రం భిన్నంగా లేదు.

సర్పి రస్తి పయసీక్షు గో రస స్తైల మస్తి తిలమధ్యే ఏవతత్
లభ్యతే మథన యంత్ర కర్మణా కర్మణా హృదిగతా తథైవ చిత్ ॥

పాలల్లో నెయ్యి ఉంది. చెరకులో రసం ఉంది. నువ్వులలో నూనె ఉంది. కానీ మథించి నపుడే వాటిలో ఉన్నది లభ్య మవుతూ ఉంది. అలాగే, హృదయాంతర్యామి అయిన ఆత్మ కూడా కర్మ చేతనే ప్రాప్తిస్తుంది.

అర్జునా! జ్ఞానులు శ్రేష్ఠులు కదా! మరి జ్ఞానాన్ని పొందాలని యత్నించే సాధకులు కూడా శ్రేష్ఠులే కదా! కనుక శ్రేష్ఠులు ఎవరైనా ఇతరులకు ఆదర్శాన్నే అందిస్తారు. ఎందుకో తెలుసా! శ్రేష్ఠులు ఏది ఆచరిస్తే, అన్యులు దానినే అనుసరిస్తారు కనుక. విను.

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దే వేతరో జనః ।
స య త్ప్రమాణం కురుతే లోక స్త దనువర్తతే ॥ 21

యత్-యత్-ఆచరతి-శ్రేష్ఠః-తత్-తత్-ఏవ-ఇతరః-జనః
సః-యత్-ప్రమాణం-కురుతే-లోకః-తత్-అనువర్తతే

యత్ యత్	= ఏయే కర్మను				
శ్రేష్ఠ	= శ్రేష్ఠుడు		యత్	=	దేనిని
ఆచరతి	= ఆచరిస్తాడో		ప్రమాణం	=	ప్రమాణముగ
తత్ తత్ ఏవ	= ఆయా కర్మనే		కురుతే	=	చేస్తాడో
ఇతరః	= ఇతరమైన		లోకః	=	లోకము
జనః	= జనము		తత్	=	దానినే
సః	= అతడు		అనువర్తతే	=	అనుసరిస్తుంది

శ్రేష్ఠుడు దేనిని ఆచరిస్తే ఇతరులు దానినే ఆచరిస్తారు. శ్రేష్ఠుడు ప్రమాణంగా గ్రహించిన దానినే అన్యులు కూడా ప్రమాణంగా స్వీకరిస్తారు.

వ్యాఖ్య

చెట్టుకు కొమ్మలు ఎన్నయినా ఉండ వచ్చు. కాని, ప్రధాన మైనది కాండము. దానిని ఆధారం చేసుకొనే శాఖలు విస్తరిస్తూ ఉంటాయి. అలాగే గృహంలో యజమాని ప్రధానమైన వాడు. అతని మార్గం లోనే గృహం లోని

సభ్యులు ప్రవర్తిస్తూ ఉంటారు. కార్యాలయంలో అధికారి ప్రధానుడు. దేశంలో రాజు ప్రధానుడు. ప్రధానుడైన వాణ్ణి శ్రేష్ఠుడుగా దర్శిస్తూ అన్యులు అనుసరిస్తూ ఉంటారు.

శ్రేష్ఠః ప్రధానః - శ్రేష్ఠుడు అంటే ప్రధానమైన వాడు అని అర్థము. శ్రేష్ఠుడు మార్గదర్శి. అతని బాటలో నడవాలని అందరూ అభిలషిస్తారు. అతని మాటను శిరోధార్యంగా సర్వులూ భావిస్తారు. అతని మాటే వేదం. అతని పాటే నాదం. అతడు ఆడిందే ఆట. అతడు పాడిందే పాట.

శ్రేష్ఠత్వము అనేది జ్యేష్ఠత్వము వల్ల కూడా వస్తుంది. కాకపోతే పరిమితంగా ఉంటుంది. గృహంలో జ్యేష్ఠుడే శ్రేష్ఠుడు. కాని అది ఆ కుటుంబానికి మాత్రమే వర్తిస్తుంది. సర్వులకు వర్తించదు. జ్యేష్ఠు డైనంత మాత్రాన శ్రేష్ఠుడని చెప్పలేము. కాని, శ్రేష్ఠత్వము ఉన్నవాడు జ్యేష్ఠుడు కాకపోయినా శ్రేష్ఠుడే. జ్యేష్ఠత్వము, శ్రేష్ఠత్వము, రెండూ ఒకే చోట అరుదుగా అగుపిస్తాయి.

అదే అందరికీ దారి

శ్రేష్ఠుడు ఎలా ప్రవర్తిస్తే ఇతరులు అలాగే ప్రవర్తించ డానికి ప్రయత్నిస్తారు. ఎలా ఆలోచిస్తే అందరూ అలాగే ఆలోచిస్తారు. శ్రేష్ఠుడైన వాడు ఏయే కర్మలను ఆచరిస్తాడో ***(యద్యత్ కర్మ ఆచరతి శ్రేష్ఠః)*** ఆయా కర్మలనే సామాన్య జనులు అనుసరిస్తూ ఆచరిస్తారు ***(తత్తత్ ఏవ కర్మ ఆచరతి ఇతరః అన్యః జనాః తదనుగతః - కించ సః శ్రేష్ఠః).*** అందుచేతనే అతడు శ్రేష్ఠుడు.

శ్రేష్ఠుడైన వాడు సమాజానికి మార్గదర్శకుడు కావాలి. అతడి ప్రవర్తన సమాజం మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. శ్రేష్ఠుడైన వాడు దారి తప్పితే, సమాజం దగా పడి పోతుంది. శ్రేష్ఠుడు విబుధు డైతే, అతనిని అనుసరించే వారు బుధజను లవుతారు. శ్రేష్ఠుడు విప్లవకారు డైతే, అతడి అనుయాయులు ప్రతి చిన్న విషయానికి ఆవేశంతో ఊగిపోతూ ఉంటారు.

రాజు అనేవాడు రాజ్యానికి శ్రేష్ఠత్వము వహిస్తాడు. అతని మాటను అందరూ అంగీకరిస్తారు. అతడి నడవడికను అనుసరిస్తారు. అనుకరిస్తారు. రాజు సత్పురుషు డైతే జనులు సత్ప్రవర్తనలో ఉంటారు. జ్యేష్ఠుడు అనైతికంగా జీవిస్తే, అనుయాయులలో ఎక్కువ శాతం అధర్మ మార్గం లోనే ఉంటారు. ఈ సత్యం ప్రజాస్వామ్యంలో మరీ స్పష్టంగా, ముంజేతి కంకణం లాగా దర్శన మిస్తుంది. లంచగొండితనం, హింస మొదలైన పైశాచిక కృత్యాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో విలయ తాండవం చేయడానికి శ్రేష్ఠత్వాన్ని, ప్రాధాన్యాన్ని కలిగి యున్న నాయకులే కారణము. ***యథా రాజా తథా ప్రజా*** అని కదా ఆర్యోక్తి!

కాకపోతే, ఇక్కడ కాస్త లోతుగా ఆలోచించ వలసిన విషయం ఒకటుంది. శ్రేష్ఠుడు దారి తప్పితే, అనుసరించే వారందరూ దారి తప్పుతారు అనేది అందరికీ సువిదితమే. కాని, దాని వల్ల అనుయాయులకే నష్ట మని భావిస్తూ ఉంటారు. అది వాస్తవమే అయినా, గాలివాన కొమ్మలనే కాదు, చెట్లను కూడా కూల్చేస్తుంది అన్నట్లు, అనాదర్శం వల్ల ఏర్పడే దుష్పరిణామం అనుయాయుల్నే కాదు, జ్యేష్ఠుని కూడా విడిచి పెట్టదు. వ్యవస్థే పాడై నపుడు, ఆ వ్యవస్థలో జీవించే వ్యక్తి విలక్షణంగా సుఖపడ గలడా? కనుక శ్రేష్ఠుడైన వాడు మెలకువతో ఉండాలి. మేలైన మార్గం లోనే చరించాలి. భిన్నంగా వ్యవహరిస్తే అది ఎవరికీ మంచిది కాదు.

ఆఖ్యాయిక

కార్తీక మాసంలో శ్రేష్ఠుడైన ఒక విప్రుడు నదీస్నానం చేయడానికి వెళ్ళాడు. తన చేతిలో ఒక రాగి చెంబు ఉంది. నది లోకి దిగబోయే ముందు దానిని తీరం లోనే ఉంచి, నదిలో ప్రవేశించడానికి ఉద్యుక్తు డయ్యాడు. అంతలోనే అతనికి ఒక సందేహం కలిగింది. ఆ రాగి చెంబును ఎవరైనా అపహరిస్తారేమో అనే సంశయం

1-29

కలిగింది. ఎవరూ అపహరించకుండా ఉండాలని ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. తన రాగి చెంబును ఎవ్వరూ చూడకుండా ఇసుకలో పూడ్చి పెట్టేశాడు. స్నానానంతరం తీసుకోవచ్చు అని అభిప్రాయ పడ్డాడు.

అతనికి వెంటనే మరొక సందేహం కలిగింది. తీరమంతా ఇసుకే కదా, స్నానానంతరము వచ్చి తీసుకోవడానికి సంకేత మెలా? అని ఆలోచించి, ఎక్కడైతే తన రాగి చెంబును పూడ్చి పెట్టాడో, అక్కడ ఇసుకతో ఒక లింగాకారాన్ని చేశాడు. ఇక ఏ సందేహమూ అవసరం లేదు. రాగి చెంబు క్షేమంగా ఉంటుంది. స్నానం చేసి వచ్చి ఆ లింగాకారాన్ని గుర్తించి, చెంబును చేత పట్టుకొని వెళ్ళొచ్చని నిర్ణయించుకొని స్నానానికి నదిలో దిగాడు.

విప్రుడు వేదాధ్యయనం చేసిన శ్రేష్ఠుడు. నదీ స్నానానికి వచ్చిన చాలా మంది భక్తులు ఆయన చెంబును దాచడం చూడలేదు గాని, సైకత లింగాన్ని చేస్తూ ఉండటం చూశారు. కార్తీక మాసంలో అలా సైకత లింగాన్ని చేసి ఆ తరువాత స్నానం చేయడం శాస్త్ర విధి అయి ఉంటుందని విప్రుని ప్రవర్తనను వింతగా అర్థం చేసుకున్న ఆ భక్తులు తాము కూడా శ్రేష్ఠుని మార్గాన్నే అనుసరించాలని భావించి, ఒకొక్కరు ఒకొక్క సైకత లింగాన్ని తీరంలో చేసుకుంటూ పోయారు.

విప్రుడు స్నానం చేసి వచ్చి, తీరంలో నిలబడి ఆశ్చర్య పోయాడు. ఎక్కడ చూచినా సైకత లింగాలే. తన రాగి చెంబు ఏ లింగం క్రింద ఉందో అతడికి అర్థం కాలేదు. చెంబును దాచే ఉపాయమైతే ఆలోచించాడు గాని, అది తనకే అపాయం తెచ్చి పెడుతుందని, అందరికీ అనాదర్శం అవుతుందని ఊహించలేక పోయాడు.

గతానుగతికో లోకో న లోకః పారమార్థికః
తీరే సైకత లింగేన నష్టం మే తామ్రభాజనమ్ ॥

ఈ లోకం చాలా విచిత్ర మైంది. పోయేవాడి వెంట బడి గొర్రెదాటుగా పోవడమే గాని, వాస్తవాన్ని ఆలోచించి ఆచరించే వారు అరుదు. నదీ తీరంలో సైకత లింగాన్ని చేసిన కారణంగా, నా రాగి చెంబు నాకు దూరమైంది అని విప్రుడు చింతించాడు. శ్రేష్ఠత్వ మనేది ఉత్కృష్టంగా ఉండాలే గాని నికృష్టం కాకూడదు.

అర్జునా! శ్రేష్ఠుడు ఏది చేస్తే ఇతరులు అదే చేస్తారు. శ్రేష్ఠుడు దేనిని ప్రమాణంగా గ్రహిస్తే, (***శ్రేష్ఠః యత్ ప్రమాణం కురుతే***), అది లౌకికమైనా, వైదికమైనా (***లౌకికం వైదికం వా***) లోకం దానినే అనుసరిస్తుంది (***లోకః తదనువర్తతే***). దానినే ప్రమాణంగా స్వీకరిస్తుంది (***తదేవ ప్రమాణీ కరోతి***). ఇది చాలా నిగూఢమైన విషయం. సర్వ కాలాలకు ఉపకరించే విషయం. సమాజంలో ధార్మిక, ఆధ్యాత్మిక స్పృహకు సంబంధించిన విషయం. సాంఘిక స్థిరత్వం ధార్మిక చింతనముపై ఆధారపడి ఉంటుంది. సమాజంలో ధార్మిక చింతనము శ్రేష్ఠుని పైనే ఆధారపడి ఉంటుంది.

అదే ప్రమాణం

ప్రమాకరణం ప్రమాణం. 'ప్రమ' అంటే జ్ఞానము. ప్రమను, అంటే జ్ఞానాన్ని కలిగించేది ఏదో అదే ప్రమాణము. ఇది లౌకికం గానూ ఉండ వచ్చు. లేదా వైదికం గానూ ఉండ వచ్చు. లౌకిక వైదిక వ్యవహారాలన్నిటికీ వైదికులకు వేదమే ప్రమాణము. అందరికీ వేదం ప్రమాణం కాక పోవచ్చు. వేదమే ప్రమాణం అని భావించే వారికి కూడా శాస్త్ర లోతులు అర్థం కాకపోవచ్చు. శాస్త్ర మనేది మహాసాగరం. అగాధం. దానిని అందరూ ఈదలేరు. కనుక శ్రేష్ఠులైన వారిని అనుసరిస్తూ పోతారు. పోవాలి కూడా. అందుకు చాలా కారణాలు ఉన్నాయి.

తర్కోఽ ప్రతిష్ఠః శ్రుతయో విభిన్నాః నైకో ఋషిర్యస్య మతం ప్రమాణం
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గత స్స పన్థాః ॥

తర్కానికి స్థిరత్వము లేదు. వేదాలు విభిన్నంగా ఉన్నాయి. ఈ ఋషి పలికిందే వేదము అని చెప్పేందుకు వీలు లేదు. ధర్మతత్త్వము నిగూఢ మైనది. శ్రేష్ఠుడైన మహాత్ముడు ఏ మార్గాన చరిస్తే అదియే ఇతరులకు ఆదర్శ మార్గము అన్నది మహాభారతము.

కనుక శ్రేష్ఠుడైన రాజు దేనిని ప్రమాణంగా గ్రహిస్తే, ప్రజలు దానినే ప్రమాణంగా గ్రహిస్తారు. ఈ సత్యాన్ని ప్రవచించింది ఆర్షధర్మమే అయినా, దానిని ఎలా వినియోగించు కోవాలో బౌద్ధ ధర్మానికి తెలిసి నంతగా హిందూ ధర్మానికి తెలియదు అనేది నిర్వివాదాంశం. అంటే, అదేదో అర్థం గాని అమోఘమైన విషయం కావడం వల్ల హిందూ ధర్మాచార్యులు అర్థం చేసుకోలేక పోయారు అనేది నా అభిమతం కాదు.

హిందూ ధర్మము చాలా విశాలమైంది. కాని ధర్మాచరణంలో తన కంటూ కొన్ని పరిధు లున్నాయి. అవి కూడా ఇనుపగోడ ల్లాగా దుర్భేద్యంగా ఉన్నాయి. సత్యదృష్టే గాని మతవ్యాప్తి యందు హిందూ ధర్మానికి ఆసక్తి లేదు. ప్రచార ఆర్భాటాలు గాలికి, నిప్పుకు, నీళ్ళకు ఎలా లేవో, హిందూ ధర్మానికి కూడా అలాగే లేవు. హిందూధర్మము మతం కాక పోవడమే ఇక్కడ ప్రధానమైన విషయం.

విశిష్టమైన వేద ప్రమాణాన్ని రాజులు ఏయే కాలాలలో అనుసరించారో, ఆయా కాలాలలో ధర్మం చతుష్పాదాలతో నడిచింది. ప్రజలు సుఖశాంతులతో జీవించారు. హింసలు కుందేటి కొమ్ము లయ్యాయి. ప్రతి ఇంటి గుమ్మానికి శాంతి తోరణాలు అలంకరించ బడ్డాయి. ప్రతి మానవ హృదయం ప్రశాంతి సదనమై, దైవ మందిరమై విలసిల్లింది.

అవగాహన లేని ప్రభువులు శ్రేష్ఠులుగా చరించిన కాలా ల్లోనే ధర్మం చావుదెబ్బ తిన్నది. జనజీవనం అస్తవ్యస్త మైంది. క్రూరత్వానికి కాళ్ళొచ్చాయి. అశాంతికి రెక్క లొచ్చాయి. మరీ, ఇటీవల ప్రజాస్వామ్య భారతంలో జ్ఞానం లేని మతాలు, సంస్థలు బుద్ధిహీనులైన నాయకుల్ని బుట్టలో వేసుకొని తమ వ్యాపారాన్ని, వ్యవహారాన్ని ప్రబలంగా విస్తరింప జేస్తున్నాయి. ఇది సమాజానికి ఆరోగ్యకరం కాదు. అనాలోచిత మార్గాలు ఏదో ఒకనాడు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తాయి. అందుకనే, రాజధర్మంలో ఉన్న అర్జునుణ్ణి ఆదర్శంగా జీవించమని, తన శ్రేష్ఠత్వాన్ని ఋజువు చేసుకోమని శ్రీకృష్ణుడు ఆదేశిస్తున్నాడు. జనకాదుల్ని దృష్టిలో ఉంచుకొని, జీవనయాత్రను సాగించ మని సాధువాక్యాన్ని వినిపిస్తున్నాడు. జ్ఞానం గల వారిని సర్వులూ అనుకరిస్తారు కనుక, అర్జునా! జ్ఞానంతో చరించడం అలవరచుకో అంటున్నాడు భగవానుడు.

ఎఱుక గలుగు నాతఁడేది యొనర్చిన
నదియు చేతు రితరులైన వార
లతఁడు సత్యమిట్టి దనెనేని లోకంబు
తత్ప్రవర్తనమునఁ దగిలి యుండు ॥

అని భాగవతంలో పోతనామాత్యుని తీపి పద్యము.

చెప్పేందుకు ఎన్నైనా ఉంటాయి. చేసే వారికి కదా తెలుస్తుంది అని అర్జునుడు గుండెలో గుసగుసలాడతా డేమో నని ఊహించిన గోవిందుడు, అర్జునా! నేను చెప్పి చూచేవాణ్ణి కాను. చేసి చూపేవాణ్ణి ఒకరెండుకు? నేనే నీకు ఆదర్శం. నన్ను చూచి నేర్చుకో! అంటూ పరమేశ్వరుడు తన సమగ్ర యశస్సును ఆవిష్కరిస్తున్నాడు.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22

న-మే-పార్థ-అస్తి-కర్తవ్యం-త్రిషు-లోకేషు-కించన
న-అనవాప్తం-అవాప్తవ్యం-వర్తే-ఏవ-చ-కర్మణి

పార్థ	=	అర్జునా!	అనవాప్తం	=	పొంద బడనిది
మే	=	నాకు	అవాప్తవ్యం	=	పొంద వలసినది
త్రిషు లోకేషు	=	ముల్లోకాలలో	న	=	లేదు
కర్తవ్యం	=	చేయ దగినది	కర్మణి	=	కర్మము నందే
కించన	=	ఏదియు	వర్తే ఏవ చ	=	ప్రవర్తిస్తూనే ఉన్నాను
న అస్తి	=	లేదు			

పార్థా! ముల్లోకాలలో నేను చేయవలసిన కార్య మంటూ నాకు ఏదీ లేదు. నేను పొందనిది లేదు. పొంద దగిందీ లేదు. అయినా, నేను కర్మలను చేస్తూనే ఉన్నాను.

వ్యాఖ్య

అర్జునా! ఆత్మజ్ఞానమును పొందిన ఆప్తకాముడు కూడా లోకసంగ్రహార్థం కర్మల్ని ఆచరిస్తూనే ఉంటాడు. ఈ విషయంలో నీకు సందేహం ఉంటే, ఒకరి విషయం ఎందుకు? నా వైపు ఎందుకు చూడవు? (***మాం కిం న పశ్యసి?***) అంటూ తననే ఉదాహరణంగా చూపిస్తున్నాడు షడ్గుణైశ్వర్య సంపన్నుడైన భగవానుడు. నన్ను చూడు. నా నడవడిని చూడు. నా చర్యల్ని చూడు. ప్రతిచర్యలు చూడు. క్షణం తీరిక లేదు - పైసా ఆదాయం లేదు. ఇదే ఆత్మవిదుని జీవన వైభవం.

కర్తవ్యం నాస్తి

ఎవరు ఏది చేసినా లేని దానిని పొందడానికి చేస్తారు. లేదా, ఉన్న దానిని వదిలించుకోవడం కోసమైనా చేస్తారు. లేనిది సుఖ కారణమైతే, ఆ లేని దానిని పొందాలని ప్రయత్నిస్తారు. ఉన్నది దుఃఖ కారణమైతే, ఆ ఉన్న దానిని వదిలించు కోవాలని ప్రయత్నిస్తారు. పొంద వలసింది ఉన్నప్పుడే చెయ్య వలసింది ఉంటుంది. పొంద వలసింది లేనపుడు చెయ్య వలసింది కూడా ఉండదు.

పడక కుర్చీలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న వ్యక్తిని, 'ఏమిటి? పని లేకుండా ఖాళీగా కూర్చొని ఉన్నారు?' అని ప్రశ్నిస్తే, 'అన్ని పనులూ అయిపోయా యండి. అందుకే విశ్రాంతి తీసుకుంటున్నా' అంటాడు.

అంటే, ఇక ఆయన చేయ వలసిన పనులు ఏవీ లేవని అర్థమా? కానే కాదు. ఆ సమయానికి లేవు అని అర్థం. ఆ ప్రదేశంలో లేవు అని అర్థం. ఇంట్లో పనులన్నీ పూర్తి అయ్యాయి అంటే, ఇక ఆఫీసులో పూర్తి చేయ వలసినవి ఉన్నాయి అని అర్థం. ఇదే కర్తవ్యం. అంటే చేయ దగిన కర్మ.

ప్రతి ఒక్కరికి ఏదో ఒక కర్తవ్యం ఉంటుంది. నేడు లేకపోయినా, రేపు ఉంటుంది. లేదా మరునాడైనా ఉంటుంది. ఇక్కడ లేకపోయినా వేరొకచోట ఉంటుంది. నేడు ఇక్కడ లేకపోయినా, రేపు ఇక్కడే ఉంటుంది. అందుకనే, చాలా మంది ప్రయాణాలు అర్థాంతరంగా ఆగిపోతూ ఉంటాయి. విధి నిషేధాలు ఉంటూ ఉంటాయి కనుక కర్మలు మారుతూ ఉంటాయి. కర్తవ్యాలు మారుతూ ఉంటాయి.

కాని, భగవంతుని విషయం వేరు. ఆయనకు ఏ కర్తవ్యమూ లేదు. ఎక్కడ లేదు? ఎక్కడా లేదు. ఎప్పుడు లేదు? ఎప్పుడూ లేదు. ముల్లోకాలలో ఆయనకు కర్తవ్యం అంటూ లేదు (***త్రిషు లోకేషు కర్తవ్యం నాస్తి***). అప్పుడు లేదు. ఇప్పుడు లేదు. ఎప్పుడూ లేదు (***త్రిషు లోకేషు***). అక్కడ లేదు. ఇక్కడ లేదు. ఎక్కడా లేదు (***త్రిషు లోకేషు***). ఎందుకని లేదు?

భగవంతుడు ఏమి పొందాలి? ఆయనకు లేని దేమిటి? పొంద వలసినది, ఆయన పొందకుండా ఉన్నది ఏమిటి? ఏది లేదని ఆయన దేనిని కోరుకోవాలి? ఆయనకు లభ్యము కానిది (***అనవాప్తమ్***) లేనే లేదు (***న-నానవాప్తం***). అప్రాప్త మైనది ఉంటే కదా, దానిని పొందాలి అనే కర్తవ్యం ఉంటుంది? చతుర్దశ భువనాలు తన లోనే ఉన్న పరమేశ్వరునికి లేనిదంటూ ఏముంది? కనుక ఆయన చేయదగింది కూడా లేదు (***కర్తవ్యం నాస్తి***). ఆయనకు లేనిది లేదు (***న అప్రాప్తం***). అలాగే ఉండ వలసింది లేకుండా పోయేదీ లేదు (***న అవాప్తవ్యం***). అయినా పరమేశ్వరుడు సదా కర్మల యందే ఉన్నాడు.

కార్యం అస్తి

చేయ వలసింది అంటూ ఏదీ లేకపోయినా, పొంద వలసిన దంటూ ప్రత్యేకంగా ఉండక పోయినా పరమేశ్వరుడు సదా కర్మల యందే ఉన్నాడు. కర్తవ్యమే లేకపోయినా, కర్మల యందే ఉన్నాడు (***వర్త ఏవ చ కర్మణి***).

తనకు ఏ అవసరం లేకపోయినా లోకసంగ్రహార్థం వాసుదేవుడు కర్మల్ని ఆచరించాడు. ఎంత చేస్తున్నా ఆనందానికి దూరం కాలేదు. నిర్విరామంగా శ్రీకృష్ణుడు కర్మలను ఆచరించినా, ఎప్పుడూ ఎవ్వరూ ఆయనను నీరసించినట్లు చూడలేదు. అలసి పోతే కదా నీరసం వచ్చేది? సంవత్సరాలు ఆడుతున్నా శ్వాసలు అలసి పోవడం లేదు. ఇక శ్వాసల్ని నడిపే పరమేశ్వరుడు అలసి పోతాడా?

కర్మల లోనే ఉన్నా, ఎన్నడూ కేశవుడు నిరాశ చెందలేదు. ఆశ ఉంటే కదా నిరాశ? లోక కళ్యాణార్థం సాగే మంగళ కార్యాలలో శోభే గాని క్షోభ ఉండదు. సమస్త కోరికలు తీరిన జ్ఞానులు లోకసంగ్రహార్థం కర్మలు చేస్తారు. అందుకు నిదర్శనం వాసుదేవుడే. జన్మించింది మొదలు శ్రీకృష్ణుడు కర్మకు దూరమైంది ఎప్పుడు? అలాగని కర్మల చేత బద్ధుడైనది ఎప్పుడు?

ఎప్పుడు చూచినా, ఎక్కడ చూచినా ఏదో ఒకటి చేస్తూనే కనిపించాడు. ఒకొక్కప్పుడు గోవుల్ని పూజిస్తూ కనిపిస్తాడు. మరొకప్పుడు కోతులకు వెన్న పెడుతూ అగుపిస్తాడు. రాక్షసుల్ని మట్టు బెడుతూ ఉంటాడు. గోపులను రక్షిస్తూ ఉంటాడు. ఆలమందల మధ్య పాడుతూ ఉంటాడు. అబలల మధ్య ఆడుతూ ఉంటాడు. బండి ఎక్కి హస్తినలో కనిపిస్తాడు. బండి దిగి ద్వారకలో దర్శన మిస్తాడు. ఆపదలో ఉన్నవాళ్ళను ఆదుకొంటూ ఉంటాడు. కవ్విస్తాడు. నవ్విస్తాడు. కనికరించి కడ తేరుస్తాడు.

రాయబారిగా పోయి రమ్మంటే రాజు లాగా పోయాడు. బండి తోలమంటే, బదులు చెప్పకుండా భారాన్ని భుజాన వేసుకున్నాడు. ధనంజయుడు దిగాలు పడి కూర్చుంటే, దివ్యంగా నిలబడి భగవద్గీతను బోధించాడు. అందరి మధ్యే ఉన్నా, అన్నీ చేస్తూ ఉన్నా అందం చెడకుండా శోభించాడు. వేడుకే గాని ఏడుపు తెలియని వాడు. ప్రమతో సదా వెలిగి పోయాడే గాని, భ్రమలో ఎప్పుడూ కుమిలి పోలేదు. అందించిన వాడే గాని అందుకున్న వాడు కాడు. అటుకులతో తృప్తి చెందాడు. అక్షయ సంపదల్ని అనుగ్రహించాడు.

మడుగులో దూకాడు. మేడల్లో కులికాడు. యమునలో ఈదాడు. వేణువును ఊదాడు. మన్ను అయినా వెన్న అయినా ఒకటే నన్నాడు. నిరంతరం చిరంతనమే. చిద్విలాసమే. అంతా లోకసంగ్రహార్థమే. పాలిచ్చిన తల్లికి మోక్షమే. విష మిచ్చిన రాక్షసికీ మోక్షమే. దగ్గర చేరిన వారందరూ దరి చేరి పోయారు. ఆయనకు సాటివాడే లేడు. ఇక మేటివాడు ఎలా వస్తాడు? అందుకే, **కృష్ణస్తు భగవాన్ స్వయమ్** - అంటూ భాగవతం నోరార కీర్తించింది.

అర్జునా! నేను శ్రేష్ఠుణ్ణి. జ్యేష్ఠుణ్ణి కూడా. అందుకే కర్తవ్యం లేక పోయినా ఆదర్శం కొరకు దివ్యంగా

కర్మల్ని ఆచరించాను. నాకు కర్తవ్యం లేదని నేను కర్మల్ని మానేస్తే, నన్ను చూచి కర్తవ్యం ఉన్నవాళ్లు కూడా కర్మల్ని మానేస్తారు. శ్రేష్ఠుడు ఆ విధంగా అనాదర్శం కాకూడదు. ఎందు కంటావా? చెబుతాను, విను.

యది హ్యహం న వర్తేయం జాతు కర్మ ణ్యతన్ద్రితః ।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23

యది-హి-అహం-న-వర్తేయం-జాతు-కర్మణి-అతంద్రితః
మమ-వర్త్మ-అనువర్తన్తే-మనుష్యాః-పార్థ-సర్వశః

పార్థ	=	అర్జునా!	మనుష్యాః	=	మనుషులు
అహం	=	నేను	సర్వశః	=	అన్ని విధాల కూడా
జాతు	=	ఎప్పుడైనా	మమ	=	నా యొక్క
అతంద్రితః	=	అప్రమత్తుడనై	వర్త్మ	=	మార్గమును
కర్మణి	=	కర్మ యందు	అనువర్తంతే	=	అనుసరిస్తారు
న వర్తేయం యది	=	ప్రవర్తించ నట్లైతే			

పార్థా! నేను అప్రమత్తుణ్ణై కర్మల్ని ఆచరిస్తూ ఉంటాను. అలా కాకపోతే, జను లందరు నా మార్గమునే అనుసరిస్తారు. నా లాగే ప్రవర్తిస్తారు.

వ్యాఖ్య

అశ్రేష్ఠః శ్రేష్ఠానుసారీ - సామాన్యుడు శ్రేష్ఠుడైన వానిని అనుసరిస్తాడు అనే న్యాయాన్ని బట్టి శ్రేష్ఠులైన వారు సామాన్యులకు మార్గదర్శకులుగా ఉండాలి. ఇది చాలా ప్రశస్తమైన విషయం కనుక సర్వులలో జ్యేష్ఠుడు, సర్వులకు శ్రేష్ఠుడు అయిన సర్వేశ్వరుడే ఆచరించి ఆదర్శాన్ని నెలకొల్పాడు.

శ్రేష్ఠుడు అంటే ప్రధానమైన వాడు అని ముందు శ్లోకంలో చెప్పుకున్నాం. ఈ శ్రేష్ఠత్వము తరతమ భేదాలతో ఉంటుంది. ఒకరిని మించిన శ్రేష్ఠత్వము మరొకరిలో గోచరిస్తూ ఉంటుంది. అందరి కన్నా శ్రేష్ఠుడు పరమేశ్వరుడు. ఆయనే శ్రేష్ఠతముడు. శ్రేష్ఠు లందరూ పురుషులు. శ్రేష్ఠతముడైన భగవంతుడు పురుషోత్తముడు. సర్వులను అతిశయించిన ఐశ్వర్యము కలవాడు కనుక శ్రేష్ఠుడు (**సర్వాతిశయత్వాత్ శ్రేష్ఠః**). అలాగే, సర్వాతిశయుడైన పరమేశ్వరుడు సర్వులకు కారణమైన వాడు కనుక జ్యేష్ఠుడు (**సర్వ కారణత్వాత్ జ్యేష్ఠః**). సర్వమును సృష్టించిన భగవానుడు స్వయంగా మధురలో అవతరించి నపుడు సర్వ మానవాళికి ఆదర్శాన్ని అందించి, జ్యేష్ఠత్వానికి, శ్రేష్ఠత్వానికి పరిపూర్ణతను కలిగించాలని సదా కర్మల నాచరిస్తూ కనిపించాడు.

అనుకరణ అనేది ప్రతి వ్యక్తి లోను కొద్దో గొప్పో ఉంటుంది. అనుకరణ అనేది అసలే లేనివారు ఉండరు. అది ప్రతి మనిషికి జన్మ లోనే వస్తుంది. అందుకే అది సహజాతము (**జన్మనా సహ జాయతే**). ఈ సహజాత లక్షణం చేత మనుషులు శ్రేష్ఠుడైన వానిని అనుసరిస్తారు. అందుచేత శ్రేష్ఠుడు కర్మల విషయంలో అప్రమత్తుడై ఉండాలి. సోమరి కాకుండా ఉండాలి. అలసత్వము లేకుండా ఉండాలి. శ్రేష్ఠునిలో అజాగ్రత చోటు చేసుకుంటే, అనుకరించే వారు పరమ అజాగ్రత స్వరూపులై ఉంటారు. కనుకనే, అర్జునా! సోమరితనము లేకుండా, నేను ఈ విధంగా కర్మలలో ఉండక పోయినట్లైతే, జనులందరు నన్నే అనుసరిస్తారు. అందుకే అన్యులకు ఆదర్శంగా ఉండాలని కర్మల్ని ఆచరిస్తున్నాను. అది కూడా అలసత్వము లేకుండా ఆచరిస్తూ ఉన్నాను.

ప్రయాణము - ప్రమాదము

'తంద్రత' అంటే అలసత్వము, కునికిపాటు అని అర్థము. కార్యంలో అవశత్వమే 'తంద్రత'. శ్రీకృష్ణుడు

కార్యాచరణములో ఈ అవగుణానికి అవకాశం ఇవ్వలేదు (**అతన్ద్రితః అనలసః**). అప్రమత్తుడై కర్మల్ని ఆచరించాను అంటున్నాడు. తాను పొంద వలసింది ఏమీ లేకపోయినా, కర్మ చేయ వలసిన అవసరం తనకు లేకపోయినా, లోక సంగ్రహార్థం కర్మలు చేయడమే కాకుండా, ఆ కర్మల్ని అప్రమత్తుడై ఆచరించడం అద్భుతమైన విషయము. శ్రీకృష్ణు డంతటి శ్రేష్ఠతముడే అలా అప్రమత్తుడై ఉంటే, ఇక సామాన్యులైన మానవులు ఎంత జాగ్రతతో వ్యవహరించాలి? ఈ ఆలోచన సామాన్యులలో కలిగించడమే ఆదర్శము. ఆధ్యాత్మిక ప్రయాణంలో అలసత్వానికి మించిన శత్రువు మరొకటి ఉండదు. సర్వ నాశనాన్ని సృష్టించేది సోమరితనమే. సోమరి చిత్తము దయ్యాల కొంప అని ఆంగ్ల సామెత. అలసత్వాన్ని, ఏమరుపాటును పొరపాటుగా కాకుండా పిడుగుపాటుగా భావించారు మన పెద్దలు. అందుకే దానికి 'ప్రమాదము' అని పేరు పెట్టారు. ప్రమాదము, నిద్ర, అలసత్వము అనేవి తమోగుణ లక్షణా లని పద్దెనిమిదవ అధ్యాయంలో భగవంతుడే చెబుతాడు. అక్కడ ఈ మోహ జాడ్యాన్ని వివరంగా చర్చించు కుందాము.

మన సంస్కృతిలో అలసత్వాన్ని, అతినిద్రను చావు కన్నా హీనంగా చూశారు మన పెద్దలు. ఇదొక ప్రమాదావస్థ. అందుకే నేమో, నిద్ర మరణంతో సమాన మన్నారు. సామాన్యులు ఇలా అంటూ ఉండటం మనం విన్నాం. వింటున్నాం. కానీ మహాజ్ఞాని, బ్రహ్మపుత్రుడైన సనత్సుజాతుడు కూడా ధృతరాష్ట్రునితో అదే మాట అన్నాడు. **ప్రమాదో వై మృత్యుః** - ఈ ప్రమాదావస్థ చావుతో సమానము అన్నాడు. ఆధ్యాత్మిక మార్గంలో చరించే సాధకునికి నిద్ర, అలసత్వము, ప్రమాదము - వీటి స్వరూపమైన తంద్రత అశనిపాతము వంటిది అని శ్రీ ఆది శంకరాచార్య స్వామి కూడా నిర్ధారణ చేశారు.

ప్రమాదో బ్రహ్మనిష్ఠాయాం న కర్తవ్యః కదాచన

ఆధ్యాత్మిక మార్గంలో చరించే సాధకునికి అజాగ్రత్త, నిద్ర, మరపు అనే ప్రమాదావస్థ ఉండనే కూడదు అని ప్రకరణ గ్రంథంలో వ్యాఖ్యానించారు శ్రీ శంకరులు. ప్రమాదమే మృత్యువు (**ప్రమాదో మృత్యు రితి**) అని కూడా హెచ్చరించారు.

ప్రమాదావస్థలో మనిషి ఏం చేస్తాడు? అలసత్వ మున్నవాడు ఆచరించే దేముంటుంది? నిద్రించే వాడు చూసే దేముంటుంది? చేసే దేముంటుంది? ఏదీ చేయకుండా ఉండేవాడు ఏమి పొందుతాడు? ఏదీ చేయలేని కారణానికి ఏదీ పొందలేని కార్యమే గదా ఫలితం! అదే చావు అని ఆచార్యుల అభిప్రాయం.

అర్జునా! అందుచేతనే చేయ వలసిం దంటూ నాకు ప్రత్యేకంగా ఏదీ లేకపోయినా, ప్రమాదానికి గురి కాకుండా కర్మల్ని ఆచరిస్తున్నాను. నేను కనుక కర్మల్ని విడిచి పెడితే, శ్రీకృష్ణుడి కన్నా శ్రేష్ఠు లెవరు? మనం కూడా ఆయన మార్గం లోనే పోదామని వాళ్ళ బలహీనతకు వాళ్ళే బలాన్ని చేకూర్చు కుంటారు. అందుకే అలాంటి అలసత్వానికి అవకాశం ఇవ్వకుండా నేను కర్మల నాచరించి నా శ్రేష్ఠత్వాన్ని నిరూపించు కుంటున్నాను.

కృష్ణా! నీవు షడ్గు ణైశ్వర్య సంపన్నుడవు కదా! నీలో కళ్యాణ గుణాలు అనేకం ఉన్నాయి. జ్ఞాన సంపద సమగ్రంగా ఉంది. ఆ విషయాలలో కూడా జనులు నిన్ను అనుకరించ వచ్చు కదా! మరి, అలా అనుకరించడం లేదు ఎందుకని?

అర్జునా! మనస్తత్వ శాస్త్రం తత్త్వశాస్త్రంలో ఒక అంశం. ఇది మనస్తత్వ శాస్త్రానికి సంబంధించిన ప్రశ్న. అనుకరించ వలసిన విషయాలు ఎదుటి వ్యక్తిలో అనేకం కనిపిస్తూ ఉన్నా, వాటిలో తన మనస్తత్వానికి, తన అభిరుచికి అనుగుణమైన దానినే అనుకరించే వాడు ఎన్నుకుంటాడు. ఇదొక మానసిక దౌర్బల్యం. అనుకరణలో ఒక విధమైన ఉన్మాదం విచిత్రంగా చోటు చేసుకొని ఉంటుంది.

శ్రేష్ఠుడు భోంచేస్తాడు. పని చేస్తాడు. అనుకరించే వాడు భోజనాన్ని మాత్రమే అనుసరిస్తాడు. పని చేయడాన్ని అనుకరించడు. ఎందుకని? పని చేయడం కన్నా చెయ్యకుండా ఉండటమే అతడికి ఇష్టం. ఈ ప్రపంచంలో ఏది చెయ్యాలన్నా ఒళ్ళు వంచక తప్పదు. అది ఎవ్వరికీ ఇష్టం ఉండదు. ఏమి చెయ్యకుండానే అన్నీ వచ్చి ఒడిలో పడాలి అనేదే అందరికీ ఇష్టం. ఎవరైనా ఇష్ట మైనదే కదా చేస్తారు?

శ్రేష్ఠుడు ఆలయానికి వెళ్తాడు. అలాగే సినిమాకు కూడా వెళ్తా డనుకోండి. అనుసరించే వాడు ఆలయానికి వెళ్ళాలని సంకల్పించడు. సినిమాకు పోవడానికే సిద్ధ పడతాడు. అదేమంటే శ్రేష్ఠుణ్ణి కారణంగా చూపిస్తాడు. కనుక, అనుసరించే వాడి బలహీనతను కూడా దృష్టిలో ఉంచుకొని శ్రేష్ఠుడు అప్రమత్తుడై వ్యవహరించాలి. తాను అదే చేస్తున్నట్లు పరమేశ్వరుడు చెబుతున్నాడు.

ఒకవేళ, శ్రేష్ఠుడైన తాను అలా జీవించక పోతే ఏమి జరుగుతుందో కూడా చెబుతున్నాడు.

ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః ॥ 24

ఉత్సీదేయుః-ఇమే-లోకాః-న-కుర్యాం-కర్మ-చేత్-అహం
సంకరస్య-చ-కర్తా-స్యాం-ఉపహన్యాం-ఇమాః-ప్రజాః

అహం	= నేను	సంకరస్య చ	= సంకరానికి కూడా
కర్మ	= కర్మను	కర్తా	= కారకుణ్ణి
న కుర్యాం చేత్	= చేయనిచో	స్యాం	= అవుతాను
ఇమే	= ఈ	ఇమాః	= ఈ
లోకాః	= లోకములు	ప్రజాః	= ప్రజలను
ఉత్సీదేయుః	= నశిస్తాయి	ఉపహన్యాం	= చెడగొట్టిన వాడ నవుతాను

నేను కర్మ చేయడం మానేస్తే, ప్రజలు కూడా కర్మలు చేయకుండా చెడి పోతారు. కర్మ సంకరానికి నేను కర్త నవుతాను. ప్రజల్ని పాడు చేసిన వాణ్ణి కూడా అవుతాను.

వ్యాఖ్య

ప్రారబ్ధ కర్మను అనుభవించ డానికి పుట్టిన వాళ్ళం మనం. విశ్వ ప్రభుత్వమును నడిపే నియంత పరమేశ్వరుడు. ఏవేవో కావాలని తాపత్రయపడే వాళ్ళం మనం. ముల్లోకాలలో పొంద వలసింది అంటూ ఏదీ లేని పురుషోత్తముడు భగవంతుడు. అయినా, ధర్మ సంస్థాపనార్థం అవతారాన్ని ధరించి నపుడు, సర్వ మానవాళికి ఆదర్శాన్ని నిర్దేశించేందుకు తాను మానవులు ఆచరించే సామాన్య కర్మల్ని ఆచరించాడు. వాటినే మహిమాన్వితంగా ఆచరించి మహికి మహోజ్వలంగా కర్మయోగ దిశా నిర్దేశం చేశాడు.

అకర్మ అనాదర్శం

అర్జునా! అకర్మ కారణంగా లోకాలు నశిస్తాయి. లోకులు కూడా నశించి పోతారు. కనుక, జగత్తు యొక్క స్థితికి కర్మ అవశ్యమై ఉంది. అలాంటి కర్మ విషయాన్ని నేను ఉపేక్షిస్తే లోక నాశనానికి కారణ మవుతాను.

కర్మ లేకపోతే యజ్ఞాలు ఎలా జరుగుతాయి? యజ్ఞాలు జరగక పోతే దేవతలకు హవిర్దానము ఎలా అందుతుంది? హవిస్సులతో దేవతలు సంతృప్తి చెందక పోతే, వర్షా లెలా వస్తాయి? ఒకవేళ వచ్చినా, అతివృష్టి సునామీలు వస్తాయి. అలాంటప్పుడు పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయా? ఉండవు. ఇక లోకం నశించకుండా

ఎలా ఉంటుంది? అందుకే నాకు అవసరం లేకపోయినా నేను కర్మను ఆచరిస్తున్నాను. నేను కనుక కర్మను ఆచరించడం మానేస్తే ***(న కుర్యాం కర్మ చేత్ అహం)*** ఈ లోకాలన్నీ ***(ఇమే సర్వే లోకాః)*** నశించి పోతాయి ***(ఉత్సీదేయుః వినశ్యేయుః)***. ఈ విధంగా కర్మ సంకరానికి, లోక వినాశానికి నేను కారణ మవుతాను. నేను చేయడం లేదని అందరూ చేయడం మానేస్తారు.

అర్జునా! చేతులు కనిపిస్తాయి కనుక అందరూ చూడ గలుగుతారు. బుద్ధిని చూడ గలిగే సూక్ష్మదర్శిని ఎవరి వద్ద ఉంది? నేను చేసే కర్మల్ని అందరూ చూడ గలరు. నాలోని జ్ఞానాన్ని చూచే శక్తి ఎవరి కుంది? జ్ఞానం బుద్ధిలో అర్థం చేసుకునేది కనుక అది అందరికీ సాధ్య పడదు. కర్మలు కళ్ళకు కనిపిస్తూ ఉంటాయి కనుక, అర్థం కాక పోయినా అందరూ అనుసరించ గలరు. అలాంటప్పుడు నేను కర్మలు చేయకుండా ఎలా ఉంటాను? జ్ఞానైశ్వర్యంతో శోభించే నేనే కర్మలు ఆచరించే టప్పుడు, జ్ఞానము లేని వాళ్ళు ఆచరించకుండా ఎలా ఉండ గలరు? అయినా, జ్ఞానం లేని వాళ్ళు కర్మల్ని మానేస్తే జ్ఞానం వస్తుందా? కర్మల్ని మానేసి మరే విధంగా జ్ఞానాన్ని పొందుతారు? చూడు అర్జునా! త్రాగేది పాలే అయినా, పట్టడానికి పాత్ర ఉండాలి. పాలు ఇవ్వండి అంటే గ్లాసుతో తెచ్చిస్తారు. నేను అడిగింది పాలు కదా, గ్లాసు ఎందుకు తెచ్చావు, అంటే ఎలా? గ్లాసును ఎవ్వరూ మ్రింగరు. కాని, గ్లాసు లేకుండా ఎవ్వరూ పాలు త్రాగలేరు. జ్ఞానామృతాన్ని పానం చేయడానికే అందరూ ఉన్నారు. కాని, కర్మపాత్ర లేకుండా జ్ఞానక్షీరాన్ని పానం చేయడం సాధ్యం కాదు. జ్ఞానాత్పూర్వం కర్మను త్యజించడం వినాశానికి దారి తీస్తుంది.

దూరమైతే దుర్గతే

జ్ఞానం లేని వారు కర్మకు దూరమైతే దుర్గతి ప్రాప్తిస్తుందే గాని సద్గతి లభించదు. భౌతికం గాను, బౌద్ధికం గాను వినాశమే దాపురిస్తుంది. ప్రగతి అనేది పని చేయడం మీదే ఆధారపడి ఉంటుంది. తరతమ భేదాలు పని చేసి నపుడే గోచరిస్తాయి. ఏ పనీ చేయని వారిలో తరతమ వ్యత్యాసాలు ఎలా ఉంటాయి?

జ్ఞానం లేని మనిషి మనస్సులో ఏముంది? అజ్ఞానము ఉంది. అజ్ఞానము ఎప్పుడైతే ఉందో, దాని నంటి పెట్టుకొని రాగద్వేషా లుంటాయి. స్వార్థం ఉంటుంది. అభిమానం ఉంటుంది. అహంకారం ఉంటుంది. మమకారం ఉంటుంది. వీటి మధ్య జ్ఞానం నిలుస్తుందా? మరి ఇవన్నీ దూరం అయ్యే దెలా? కర్మ చేయక పోతే ఇవన్నీ ఎలా అదృశ్య మవుతాయి?

కర్మ చేయక పోతే పోవలసినవి పోవు. రావలసినవి రావు. మనిషిలో జ్ఞానాభిలాష ఉండవచ్చు. కాని, జ్ఞానాశ చిగురించదు. కాంతి కనిపించదు. అంతా చీకటే ఉంటుంది. నిరాశే అలుము కుంటుంది. నిరాశా జీవి తానేమి సుఖ పడతాడు? సమాజాన్ని ఏమి సుఖ పెడతాడు?

మొక్కలో పువ్వు లాగా సమాజంలో మనిషి శోభించాలి. మొక్కలో ఎండిపోయిన కట్టెపుల్ల లాగా సమాజంలో వ్యక్తి ఉండ కూడదు. అలా ఉండటం వల్ల తనకు వెలుగు ఉండదు. సమాజానికి శోభ ఉండదు.

కర్మకు దూరమైన సమాజం ఈ విధంగా దుఃఖభూయిష్ట మవుతుంది. నిరాశా జీవులకు నిలయమైన సమాజం నిర్వీర్యమై నీరసించి పోతుంది. నవ్వుతూ, నవ్వించే వాడు ప్రక్కనే ఉంటే, నవ్వలేని వాడు కూడా నవ్వుతూ ఉంటాడు. ఏడ్చేవాడు ప్రక్కన చేరితే, నవ్వేవాడు కూడా కొంత కాలానికి నవ్వును మరచి పోతాడు. ఒక దశలో, నవ్వంటే ఏమిటి? అని ప్రశ్నించినా మనం ఆశ్చర్యపో నవసరం లేదు.

ముసిముసి నవ్వుల పసితనాన్ని మొగ్గ లోనే త్రుంచేసి, నవ్వు ముసలిదైన తరువాత, మైదానాలలో నిలబెట్టి, కొనితెచ్చుకొని కేరింతలు కొట్ట మనడం నవ్వు అవుతుందా? లేక నవ్వులాట అవుతుందా? హో - హో అంటూ కేరింతలు కొడితే నవ్వు వస్తుందా? రాని నవ్వుకు ఆహ్వానం ఇలాగేనా?

నవ్వును కర్మగా భావించడం ఈ దురవస్థకు కారణం. నవ్వు పువ్వు లాంటి దని తెలియక పోవడం వల్లే కేరింతలకు కాళ్ళొచ్చాయి. మొగ్గను నలిపితే సువాసన రాదు. పువ్వు వికసిస్తే పరిమళాన్ని ఎవ్వరూ ఆపలేరు. నవ్వు వస్తే ఆపుకో గలరా? నవ్వు రానపుడు తెచ్చుకో గలరా? నవ్వు కనుక కర్మే అయితే, ఆపడం కష్టం కాదు. ప్రయత్నించి పొందడమూ కష్టం కాదు. కానీ, అది సాధ్యమయ్యే పనేనా?

బ్రతుకు పువ్వు కావాలి
పువ్వే నవ్వుగా రావాలి
పలుకులు కావాలి పూలరేకులు
కమ్మని భావాలు పరిమళాలు
సుమ సౌందర్యమె జీవనము
నిత్యానందమే మకరందము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

తృప్తిగా భోం చేసిన వాడే త్రేపుతాడు. భోం చేయడం కర్మ. కాని త్రేపు మాత్రం ప్రయత్నంతో చేసే కర్మ కాదు. తృప్తిగా భోం చేయడం వల్ల కలిగిన ఫలితం. భోజనం అనే కర్మే జరగ నపుడు, త్రేపు ఎలా వస్తుంది? ఆకలితో ఉన్నవాడు తృప్తిగా భోజనం చేసినట్లు అభినయిస్తూ, మైదానాలలో నిలబడి త్రేపినట్లు శబ్దాలు చేస్తే అది నిజంగా త్రేపడం అవుతుందా?

యుద్ధకర్మను ఆచరించడం అనే దోషం వల్ల జాతి సంకరం ఏర్పడు తుందని (**వర్ణసంకర కారకైః**), తద్వారా ఏర్పడే ధర్మచ్యుతి వల్ల నరకం ప్రాప్తిస్తుందని (**నరకే నియతం వాసః భవతి**) తాను పూర్వం విని ఉన్నట్లు (**అనుశుశ్రుమ**) అర్జునుడు తన విషాదంలో ఆలపించాడు.

దానికి వ్యతిరిక్తమైన భావనను భగవంతుడు ఈ సందర్భంలో వినిపిస్తున్నాడు. అర్జునా! ఒకవేళ నువ్వు అలా గతంలో విని ఉంటే విని ఉండ వచ్చు. కాని, అది మాత్రం విన దగింది కాదు. విన దగింది ఏమిటో నేను వినిపిస్తాను. విను. కర్మ చేస్తే కాదు సంకరం ఏర్పడేది, కర్మ చేయక పోవడం వల్ల ఏర్పడుతుంది. సంకరం ప్రాప్తిస్తుందని నువ్వు కర్మ మానేస్తాను అంటున్నావు. కర్మ చేయక పోతే నేను సంకరానికి కారణ మవుతానని నేను కర్మ చేస్తున్నాను.

అర్జునా! కర్మ నాశనానికి దారి తీస్తుందని నువ్వు కర్మను త్యజించాలి అంటున్నావు. కర్మను మానేస్తే వినాశం వస్తుందని నేను కర్మ చేస్తున్నాను అంటూ, అర్జునుడు వినిపించిన మాటల్నే తిరిగి పలుకుతూ, కర్మకు నూతన భాష్యాన్ని వినిపిస్తున్నాడు భగవంతుడు.

అర్జునా! నేను ప్రజల్ని అనుగ్రహించ వలసిన వాణ్ణి. కాని, కర్మ చేయడం మానేస్తే, వాళ్ళ వినాశానికి కారణ మవుతాను (**ప్రజానామ్ అనుగ్రహాయ ప్రవృత్తః ఉపహతిమ్ ఉపహననం, కుర్యామ్ ఇత్యర్థః**). అలా చేయడం భగవంతుణ్ణి అయిన నాకు తగిన దేనా? చెప్పు (**మమ ఈశ్వరస్య అననురూపమ్ ఆపద్యేత**). అందుకే అవసరం లేకపోయినా కర్మాచరణలో ఉన్నాను. నేనే ఆచరించే టప్పుడు, నువ్వు ఆచరించకుండా ఎలా ఉంటావు? పార్థా! అందరూ కర్మలు చేయాల్సిందే.

కాకపోతే, అజ్ఞానులు ఫలాపేక్షతో సకామ కర్మల యందు నిమగ్నమై ఉంటారు. జ్ఞానులు ఫలాపేక్ష లేకుండా లోక సంగ్రహార్థం కర్మలు చేస్తూ ఉంటారు. అదే తేడా. విను.

సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథా௨సక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥ 25

సక్తాః-కర్మణి-అవిద్వాంసః-యథా-కుర్వంతి-భారత
కుర్యాత్-విద్వాన్-తథా-అసక్తః-చికీర్షుః-లోకసంగ్రహం

భారత	= అర్జునా!	తథా	= అట్లే
అవిద్వాంసః	= అవివేకులు	విద్వాన్	= జ్ఞాని
కర్మణి	= కర్మ యందు	లోకసంగ్రహం	= లోక సంగ్రహమును
సక్తాః	= ఫలాపేక్ష కలిగి	చికీర్షుః	= చేయ దలచిన వాడై
యథా	= ఏ విధంగా	అసక్తః	= ఫలాపేక్ష లేకుండా
కుర్వంతి	= చేస్తారో	కుర్యాత్	= చెయ్యాలి

అర్జునా! జ్ఞానము లేని వారు ఫలాపేక్షతో కర్మలను ఆచరిస్తూ ఉంటారు. జ్ఞాని కూడా అలాగే కర్మలు చేస్తూ ఉంటాడు. కాకపోతే, ఫలాపేక్ష లేకుండా ఉంటాడు. లోక హితార్థము చేస్తూ ఉంటాడు.

వ్యాఖ్య

జ్ఞాననిష్ఠలో ఉన్న కొందరు కర్మల విషయంలో విముఖతను చూపుతూ ఉంటారు. జీవితాన్ని ఎంతో చూశాము. చేయ వలసిన కర్మ లన్నీ చేశాము. కర్మల వల్ల సాధించేది ఏముంటుంది? కర్మల నుండి విరమించే సమయం ఆసన్నమైంది. ఇక విరామమే ఆరామం. నైష్కర్మ్యమే కర్తవ్యం అని చాలా మంది భావిస్తూ ఉంటారు. చేసింది చాలు. చూసింది చాలు. ఇక ఏమి చెయ్యాలి? ఏమి చూడాలి? నాలో నన్ను చూసుకోవడమే చేయ వలసింది అనుకొంటూ ఉంటారు. ఈ అభిప్రాయంతో గీతాచార్యుడు ఏకీభవించడం లేదు.

వైఖరి లోనే వ్యత్యాసం
వ్యవహారంలో కాదు

ఆత్మజ్ఞానము కలవారు విద్వాంసులు. ఆత్మజ్ఞానం లేనివారు అవిద్వాంసులు. ఉభయులూ కర్మల లోనే ఉంటారు. వారు చేసే కర్మలు ఒకే విధంగా ఉంటాయి. కాని, ఆ కర్మల విషయంలో వారి వైఖరి యందు అజగజాంతర వ్యత్యాసం ఉంటుంది. అంటే, మేకకు ఏనుగుకు ఉన్నంత తేడా ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే సామ్యమే ఉండదు.

అజ్ఞాని కర్మలు చేస్తాడు. జ్ఞాని కూడా కర్మలు చేస్తాడు. ఇద్దరూ కర్మల లోనే ఉంటారు. కాని, కర్మాచరణంలో వారి దృక్పథాలు భిన్నంగా ఉంటాయి. కర్మ ఫలాపేక్షతో అజ్ఞాని కర్మ చేస్తాడు. ఫలాసక్తి లేకుండా జ్ఞాని కర్మలను ఆచరిస్తాడు. 'నేను చేస్తున్నాను' అనే కర్తృత్వ బుద్ధి అజ్ఞానిలో ఉంటుంది. 'చేయదగింది కనుక చెయ్యాలి' అని, కర్తృత్వ బుద్ధి లేకుండా జ్ఞాని కర్మను ఆచరిస్తాడు.

కర్మ ఫలాపేక్ష ఉంది కనుక అజ్ఞానులు కర్మలకు అంటుకొని పోతారు (*సక్తాః*). ఆప్తకాముడైన జ్ఞానికి ఫలాపేక్ష లేనందున ఆసక్తి లేకుండా కర్మ నాచరిస్తాడు (*అసక్తః*). అజ్ఞాని ఆచరించే కర్మమార్గము బంధాన్ని కలిగించి, జన్మల్ని అందిస్తుంది. జ్ఞాని ఆచరించే కర్మలు బంధాలను తొలగించి, మోక్షాన్ని అనుగ్రహిస్తాయి.

తాము భోగించ డానికే ఈ ప్రపంచం ఉంది అని భావించి అజ్ఞానులు కర్మల్ని ఆచరిస్తారు. కర్తృత్వంతో కర్మలకు అంటుకు పోతారు. అలాగే భోక్తృత్వం వల్ల ఫలాలతో సంగత్వం కలిగి ఉంటారు.

సృష్టి లోని నియతిని అర్థం చేసుకుంటూ, చేయవలసిన కర్మను జ్ఞాని లోక సంగ్రహార్థం ఆచరిస్తాడు. కర్తృత్వాభిమానం లేకుండా నిష్కామంగా చేస్తాడు కనుక జ్ఞాని కర్మలకు అంటడు. పరానుగ్రహార్థం ఆచరిస్తాడు కనుక ఫలాభిసంధి లేకుండా ఉంటాడు.

అజ్ఞానిలో అంతా స్వార్థమే. తన కొరకే తాను కర్మల్ని ఆచరిస్తాడు. జ్ఞానిలో అంతా పరార్థమే. లోక సంగ్రహార్థమే జ్ఞాని కర్మల్ని ఆచరిస్తాడు. అజ్ఞానికి తన దేహమే సర్వం. సర్వాన్ని తన కొరకు వినియోగించుకోవడానికి ఏ మాత్రం వెను కాడని స్వభావమే సొంతం. జ్ఞానికి సర్వం తన దేహమే. సర్వానికి తన సేవల్ని విస్తరించ డానికి నిరంతరం ధర్మ జీవనాన్ని కొనసాగించడమే సొంతం.

కర్మలు చేయడంలో ఉభయులు ఒకే విధంగా కనిపిస్తారు. అజ్ఞాని కర్మల్ని ఎంత ఉత్సాహంతో చేస్తాడో, జ్ఞాని కూడా అంతే ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ కర్మల్ని ఆచరిస్తాడు. వ్యవహారంలో ఇద్దరూ ఒకే విధంగా కనిపించినా, వైఖరిలో చాలా వ్యత్యాసం ఉంటుంది. జ్ఞాని చాలా విలక్షణంగా అగుపిస్తాడు. కర్తృత్వ బుద్ధి లేకుండా ఉండటం, ఫలాసక్తి లేకుండా కర్మల్ని ఆచరించడం, సాకల్య వైకల్యాల యందు, అంటే కర్మ సఫలమైనా, నిష్ఫలమైనా, పూర్ణంగా ఫలించినా పాక్షికంగా ఫలించినా, హర్షవిషాదాలకు లోను గాకుండా ఉండటం జ్ఞాని లోని వైలక్షణ్యము.

కళ్యాణప్రదం

రాగద్వేషాలు మనస్సు నుండి రాలిపోతాయి. ఫలాసక్తి బుద్ధి నుండి జారి పోతుంది. స్వార్థం కళ్ళ ముందే కరిగి పోతుంది. సంయమవంతు డైన జ్ఞాననిష్ఠుడు సదా కర్మలలో కదులుతూనే ఉన్నా బంధం లేకుండా ఉంటాడు. సదా ఆనంద మగ్నుడై ఉంటాడు.

ఫలాసక్తి ఎప్పుడైతే లేదో, కర్మలలో తారతమ్యం అర్థం కాదు. చెయ్య వలసింది చెయ్యడమే గాని, ఇష్టాయిష్టాలు కర్మాచరణంలో కనిపించవు. లేకపోతే, విశ్వసారథి విజయసారథి అవుతాడా? గుఱ్ఱాలను శుభ్రం చేసినా, రథాన్ని సిద్ధం చేసినా, మునికోలను చేత పట్టినా, మునీశ్వరుడై వేదాంత రహస్యాలను విశిష్టంగా బోధించినా - ఆ రూపంలో మార్పు లేదు. ఆ స్వరూపంలో మార్పు లేదు. ఆ నవ్వులో మార్పు లేదు. ఆయన నడకలో మార్పు లేదు. వ్యవహారం మారుతూ ఉండే గాని వైభవం మారడం లేదు.

అందుకే నేమో! ఆ రూపాన్ని ఎంత చూచినా తనివి తీరడం లేదు ***(రూపం అత్యద్భుతం హరేః).*** గొప్ప ఆశ్చర్యం కలుగుతోంది ***(విస్మయః మే మహాన్).*** క్షణక్షణం ఆనంద వీక్షణమే ***(హృష్యామి చ పునః పునః)*** అని పరమాత్మ రూప వైభవాన్ని వర్ణిస్తూ సంజయుడు పరవశించి పోయాడు కురుక్షేత్రంలో.

రూపాన్ని చూచి సంజయుడు పులకరిస్తే, అమృత వాక్యాలను విని అర్జునుడు తన్మయు డవుతున్నాడు. మళ్ళీ మళ్ళీ మాట్లాడమని అర్థిస్తున్నాడు. చెవులను దోసిళ్ళుగా చేసికొని గీతా పీయూషాన్ని ఎంత పానం చేసినా తృప్తి కలగడం లేదని కురుక్షేత్రంలో కుంతీ నందనుడు కదిలి పోతున్నాడు ***(భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽ మృతమ్).***

ఇదంతా జ్ఞానంతో కర్మలలో చరిస్తున్న జ్ఞాని వైభవం. మాటలకు అందని మాధవ వైభవం. మనస్సుకు చిక్కని మధుసూదనుని ప్రాభవం. లోక కళ్యాణార్థం నిష్కామంగా ఆచరింప బడే అలౌకిక కర్మ వైభవం.

చిట్టి నా పొట్టకు శ్రీరామరక్ష - చిన్ని నా ఇంటికి మరొక లక్ష అనే మంత్రాన్ని సదా జపిస్తూ, స్వార్థపరుడు ఉత్సుకతతో సంసారంలో ఊగుతూ ఉంటే, **ధర్మస్య జయోఽస్తు - విశ్వస్య కళ్యాణమస్తు** అనే విశిష్ట భావనతో, నిష్కాముడైన జ్ఞాననిష్ఠుడు పరమోత్సాహంతో ప్రపంచంలో ఊరేగు తున్నాడు.

అజ్ఞానులు ఏ విధమైన అభినివేశంతో ఆసక్తులై కర్మలు ఆచరిస్తున్నారో, జ్ఞాని కూడా అదే అభినివేశంతో అసక్తుడై కర్మల్ని ఆచరిస్తూ ఉంటాడు. వ్యత్యాస మంతా వైఖరి లోనే గాని వ్యవహారంలో కాదు. భేద మంతా మనస్సు లోనే గాని మనుగడలో కాదు.

రెండు సరోవరాలు ఉన్నాయి. జలపూర్ణంగా గోచరిస్తున్నాయి. గట్టున నిలబడి చూస్తే రెండిటిలో భేదం లేదు. వాటి లోకి దిగితే భేదం అర్థ మవుతుంది. ఒక సరోవరం లోని జలం బురదతో నిండి ఉంటుంది. మరొక సరోవరం లోని జలం స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటుంది.

బురద నిండిన సరోవరం లాగా ఫలాసక్తి గల అజ్ఞాని మనస్సు ఉంటే, నిర్మలోదకంతో పవిత్రంగా ఉన్న సరోవరం లాగా నిష్కాముడైన జ్ఞాని మనస్సు ఉంటుంది. అందుచేతనే జ్ఞాననిష్ఠుని కర్మలు నిర్మలంగా ఉంటాయి. పవిత్రంగా ఉంటాయి. పరానుగ్రహార్థం శోభిస్తూ ఉంటాయి.

ఇదంతా జ్ఞాని ఎందుకు చేస్తున్నట్లు? ***(తద్వత్ కిమర్థం కరోతి)*** లోక సంగ్రహార్థమే జ్ఞాని ఇదంతా చేస్తున్నాడు ***(చికీర్షుః లోక సంగ్రహమ్).*** పరానుగ్రహార్థమే పరమేశ్వరుడు కూడా ప్రస్తుతం రథాన్ని నడుపుతున్నాడు.

చేసే చేతలలో, పలికే పలుకులలో, చూచే చూపులలో - జ్ఞాని ఎక్కడున్నా, ఏమి చేసినా అతని హృదయంలో జ్ఞానజ్యోతి సదా ఆరకుండా వెలుగుతూ ఉంటుంది. అందుకే ఫలాసక్తిని వీడి పరానుగ్రహార్థం ***(లోక సంగ్రహమ్)*** సదా చికీర్షుడై ఉంటాడు. **చికీర్షుః** అంటే **కర్తుం ఇచ్ఛుః** - అంటే, చెయ్యడానికి ఇచ్ఛ కలిగి ఉంటాడు అని అర్థం.

క్రతువు లోన వసంత ఋతువు లోన
వేదనాదము వినిపించు యెదల లోన
యతుల హృదయాన వెలిగేటి వెలుగు నీవు
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని విశ్వనాథుని విమల చరణ సన్నిధిలో ఒక విబూదిపండు.

అజ్ఞానులు ఆసక్తితో ఉంటారు. అది వారికి సహజం. అలాగని, వాళ్లను నిరసించ కూడదు. తాను ఆచరించే కర్మల ద్వారానే జ్ఞాని అజ్ఞానులను సన్మార్గంలో ఉంచాలి. అదే చెబుతున్నాడు.

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసఙ్గినామ్ । 26
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్తః సమాచరన్ ॥

న-బుద్ధిభేదం-జనయేత్-అజ్ఞానాం-కర్మసంగినాం
జోషయేత్-సర్వకర్మాణి-విద్వాన్-యుక్తః-సమాచరన్

కర్మసంగినాం	=	కర్మఫలాసక్తు లైన	యుక్తః	=	అభియుక్తుడై
అజ్ఞానాం	=	అజ్ఞానులకు	సర్వ కర్మాణి	=	సమస్త కర్మలను
బుద్ధిభేదం	=	బుద్ధి చలనమును	సమాచరన్	=	చక్కగా ఆచరిస్తూ
న జనయేత్	=	కలిగించ కూడదు	జోషయేత్	=	చేయించాలి
విద్వాన్	=	జ్ఞాని			

జ్ఞాని యైనవాడు అజ్ఞానుల బుద్ధిని కలతపెట్ట కూడదు. తాను యోగయుక్తుడై సమస్త కర్మలను నేర్పుతో ఆచరిస్తూ ఉండాలి. ఇతరులు కూడా అలాగే ఆచరించేటట్లు చూడాలి.

వ్యాఖ్య

తాను పొంద వలసింది ఏదీ లేకపోయినా, లోక సంగ్రహార్థం జ్ఞాని కర్మలను ఆచరిస్తూనే ఉన్నాడు. కానీ, జ్ఞానం ప్రతి ఒక్కరు పొంద దగినదే అయినా, అజ్ఞానులను జ్ఞానం వైపు త్రిప్పి వారి బుద్ధిని జ్ఞాని కలత పెట్ట కూడదు. కర్మాసక్తులైన వారి బుద్ధికి పట్టని తాత్త్విక విషయాలను వారికి బోధించి మనస్సును కలవర పరచ కూడదు.

అవసరమే కాదు - అర్హత కూడా ఉండాలి

కర్మల యందు ఆసక్తి గల అజ్ఞానుల బుద్ధిలో భేదాన్ని కలిగించ కూడదు అంటున్నాడు భగవానుడు. బుద్ధిభేదం అంటే బుద్ధిలో అస్థిరత్వం అని భావము. 'భేదనం' అంటే చాలనం. చలింప చేయడం అని అర్థం. మరి, చలింప చేసేది దేనిని? అంతవరకు ఏదైతే చలనం లేకుండా స్థిరంగా ఉండిందో దానిని. మరి అంత వరకు కర్మాసక్తులైన అజ్ఞానులలో చలించ కుండా స్థిరంగా ఉన్న దేమిటి?

'నేను ఈ కర్మ చెయ్యాలి; ఆ ఫలితాన్ని అనుభవించాలి' (***మయా ఇదం కర్తవ్యమ్, భోక్తవ్యం చ అస్య కర్మణః ఫలమ్***) అనే నిశ్చితమైన బుద్ధి అజ్ఞానులలో స్థిరంగా ఉంటుంది. అట్టి బుద్ధిని చలింప చేయడమే 'బుద్ధిభేదం'. దానిని కలిగించ కూడదు (***తం న జనయేత్, న ఉత్పాదయేత్***) అంటున్నాడు. జ్ఞానులైన వారికి, జ్ఞానం కలిగి ఇతరులకు బోధ చేసే వారికి శ్రీకృష్ణుడు అనుగ్రహిస్తున్న సందేశం ఇది.

'దేవుణ్ణి ఏ కోరికలు కోర కూడదు. మోక్షాన్నే కోరుకోవాలి. మోక్షం జ్ఞాన రూపంలో ఉంది. కనుక జ్ఞానాభ్యాసం చెయ్యాలి. కర్మలు అజ్ఞాన జనితం. కర్మల్ని త్యజించాలి. నేను అకర్తను - అభోక్తను అని సదా భావిస్తూ ఉండాలి...' ఇలాంటి మాటలతో సకామ కర్మలను ఆచరించే వారి బుద్ధిని జ్ఞాని కలత పెట్ట కూడదు.

పైన పలికిన వాక్యాలు సత్యాలే కావచ్చు. ప్రతి ఒక్కరికి వాటి అవసరం ఒకనాడు కలగవచ్చు. అలాగని కర్మ ఫలాపేక్షతో కర్మల్ని ఆచరించే అజ్ఞానులకు, జ్ఞానార్హత లేని వారికి అవన్నీ బోధించి ఏమి ప్రయోజనం?

దేవుణ్ణి ఏదీ కోరకూడదు అంటే ఎలా? భగవంతుని ముందు కాకపోతే మరెవరి ముందు చెయ్యి చాపాలి? ఆయనను మించిన దాత ఎవరు? అడిగింది ప్రాప్తిస్తుందా, లేదా? అనేది వేరే విషయం. అడగ వలసిన అవసరం వచ్చి నపుడు దృష్ట నష్ట స్వభావం కలిగిన ఈ ప్రపంచం ముందు మోకరిల్లడం కన్నా, భక్తవత్సలు డైన పరమేశ్వరుని ముందు నిలబడి ప్రార్థించడం యుక్తం కాదా? ఆ విధంగా నైనా రెండు చేతులెత్తి భగవంతునికి నమస్కరించే అదృష్టం అర్థుడికి లభిస్తుంది.

పిల్లవాడు చందమామను కోరుకోవడం తప్పా? కోరిక కదలి నప్పుడు తల్లిదండ్రుల్ని గాక మరెవరిని అడుగుతాడు? అడిగి నంత మాత్రాన వస్తుందా, అనే పిడివాద మెందుకు? పిల్లవాడు కనుక అర్థం గాక అడిగాడు. అర్థం గాక పిల్లవాడు అడిగితే, అతనికి అర్థం గాని తార్కిక విషయాలను వినిపించి సాధించే దేముంటుంది? అది అడగ దగింది కాదు అనేది అర్థమైతే, ఎందుకు అడుగుతాడు? అజ్ఞాన దశ లోనే చిత్రమైన అభ్యర్థనలు ఉంటాయి. అలాంటి విషయాలను అర్థం చేసుకోవాలే గాని అభ్యంతరం చెప్పకూడదు.

జ్ఞాన రుచి కలిగిన నాడు అర్థించే వాడే తన ఆశలలో అరుచిని చూస్తాడు. జ్ఞానము నందే అనన్య భావాన్ని, దానికి విరుద్ధమైన విషయాలలో చెప్పకుండానే ఉదాసీనతను పెంచు కుంటాడు. అనురాగం స్థానంలో విరాగాన్ని దర్శిస్తాడు. అంత వరకు అతణ్ణి మెల్లగా అనునయిస్తూ దిశా నిర్దేశం చేస్తూ పోవాలి. 'నీవు అకర్తవు - అభోక్తవు' అంటూ మ్రింగుడు పడని విషయాలను అదే పనిగ ఏకరువు పెడితే, అతడు ఏకంగా కర్మలు చేయడమే మానేస్తాడు.

ఈ రోజుల్లో ఈ విధమైన విపరీత ధోరణి బాగా ప్రబలి పోయింది. ఒకటి రెండు సంవత్సరాలు, అక్కడ ఇక్కడ తిరగడం, నాలుగు వేదాంత వాక్యాలు మ్రింగడం, ఆ తరువాత అజీర్ణంతో బాధపడుతూ, 'నామం వల్ల ఏమొస్తుంది? నామిని తెలుసుకో! జపం చేస్తే ఏమొస్తుంది? జపం చేసే వాడెవడో వెతికి పట్టుకో! నువ్వెవరో తెలుసుకో!' అంటూ అజీర్ణ త్రేపుల్ని త్రేపుతూ, విచిత్ర వేషధారణతో ఊరూరా విద్వారంగా తిరుగుతూ ఉంటారు. ఇలాంటి శుష్క వాదనలను వినిపించే శూన్య హృదయుల్ని ఈ శ్లోకంలో మందలిస్తున్నాడు మధుసూదనుడు.

అజ్ఞానులు ఫలాసక్తులే గాని ధర్మాసక్తులు కారు. జ్ఞానాసక్తులు అసలే కారు. ఆసక్తి లేనిచోట అవధానం ఉండదు. అవగాహన కలుగదు. అవగాహన కలిగే వరకు వారిని కర్మలలో కొనసాగే టట్లు చూడాలి. అంతేగాని, కలవర పెట్టి కర్మల్ని విరమింప చేయ కూడదు.

క్రొత్త బట్టలు దొరికే వరకు చిరిగిన బట్టలే మేలు చేస్తాయి. చిరిగి పోయాయని వాటిని త్యజించమని చెప్పకూడదు. కుట్టుకొని వేసుకోమని చెప్పాలి. ఉతుక్కొని ధరించ మని తెలియ చేయాలి. అంతేకాదు. మనం కూడా ఖరీదైన బట్టల్ని ధరించ కుండా, సాధారణ దుస్తుల్ని ధరిస్తే, మనం అతనికి ఆదర్శంగా ఉంటాము. మాటల కన్నా చేతలే దివ్యంగా బోధిస్తాయి. శోభిస్తాయి.

అనుసరించేటట్లు జీవించాలి

అజ్ఞానుల విషయంలో చేతులకు పని కల్పించాలే గాని చెవులకు చిలుము పట్టించ కూడదు. కర్మాసక్తులైన వారు చేసే కర్మలను ఆపడం కాకుండా, ఆ కర్మలనే జ్ఞాని కూడా యోగయుక్తుడై శ్రద్ధతో ఆచరించాలి. అప్పుడే ఆదర్శం అందల మెక్కుతుంది.

జ్ఞాని కూడా ఆదర్శం కోసం అజ్ఞానుల లాగే కర్మల్ని ఆచరిస్తే, తాను కూడా కర్మ సుడిగుండంలో చిక్కుకొని బద్ధుడు కాడా? కానే కాడు. అందుకే అతడు యుక్తుడు. అతడు చేసే కర్మల వెనుక జ్ఞానం ఉంది. వ్యవహారం ఒకే విధంగా ఉన్నా, వైఖరిలో భేదం ఉన్నందున బద్ధుడు కాడు. కనుక, ఫలాసక్తి గలవారు చేసినట్లే సర్వ కర్మల్ని, ఫలాసక్తి లేకుండా, శ్రద్ధతో ఆచరించి అజ్ఞానులకు జ్ఞాని ఆదర్శం కావాలి (***సర్వ కర్మాణి విద్వాన్ స్వయం తదేవ అవిదుషాం కర్మ యుక్తః అభియుక్తః సమాచరన్***). అంతేకాదు, తాను చేయడమే గాక, వారి చేత కూడా చేయించాలి (***జోషయేత్ కారయేత్***).

కర్మలు - కైంకర్యాలు

జ్ఞాని తాను ఆచరించి చూపాలి. ఇక్కడ **యుక్తః** అంటే, జ్ఞానంతో కూడిన జ్ఞాననిష్ఠుడు అని అర్థం (***జ్ఞానేన యుక్తః***). కర్మాసక్తి కలిగి ఫలాపేక్షతో చరించే కర్మికి కర్మల నుండి విడిపడి పొమ్మని బోధించడం కంటే, ఆ కర్మల్నే ఫలాసక్తి లేకుండా ఎలా ఆచరించాలో చేసి చూపడం మంచిది అంటున్నాడు భగవానుడు.

కర్మ ప్రవాహంలో కొట్టుకు పోయే వ్యక్తిని దారి మళ్ళించడం చాలా కష్టము. అయుక్త మైన మాటలతో అతణ్ణి మళ్ళించే ప్రయత్నం చేయడానికి బదులు, జ్ఞాననిష్ఠుడు ఆత్మస్థితుడై, ఫలాసక్తి లేకుండా పరానుగ్రహార్థం నిర్మలంగా కర్మల్ని ఆచరిస్తూ ఉంటే, అట్టి ప్రశాంత జీవనాన్ని చూచి సకామ కర్మలను ఆచరించే వారు కూడా నిష్కామ కర్మయోగం వైపు ఆకర్షితు లవుతారు. ఈ విధంగా జ్ఞాననిష్ఠుడు తాను ఆచరిస్తూ కర్మాసక్తులను ఆకర్షించి వారి చేత కూడా చేయించాలి (***జోషయేత్ కారయేత్***).

ఈ శ్లోకంలో **జోషయేత్** అనే పదానికి **యోజయేత్** అనే పాఠాంతరం కూడా ఉంది. అజ్ఞానులైన వారికి ఆత్మజ్ఞానాన్ని బోధించ కుండా వారి చేత కర్మలు చేయించాలి అని అర్థం.

జోషయేత్ - జుషీ ప్రీతి సేవనయోః అని ధాత్వర్థము. అంటే, వారికి ప్రీతి కలిగించాలి (**జోషయేత్**). ఆచరించే టట్లు చూడాలి (**యోజయేత్**).

ప్రీతి ఎలా కలుగుతుంది? ఆచరించి చూపడం లోనే ప్రీతి కలుగుతుంది. జ్ఞాననిష్ఠుడు తిలకధారణ చేసి చరిస్తూ ఉంటే, ఆ తరువాత ఆ శ్రేష్ఠుని మార్గాన్ని అందరూ అనుసరిస్తారు. అన్ని విషయాలలో అతడు అలాగే ఆదర్శం కావాలి.

సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారు అద్వైతానుభూతిని పొందిన మహాజ్ఞాని. అయినా, సామాన్య జనులకు అనుకూలంగా ఎన్నో కీర్తనలు రచించారు. అద్వైతాచార్యులైన శ్రీ శంకర భగవత్పాదులు అనేక ఆలయాలను పునరుద్ధరించారు. వివిధ దేవతామూర్తులపై స్తోత్రాలు రచించారు. పూజాదికాలు నిర్వహించారు. ఇవన్నీ సామాన్యులను సన్మార్గంలో నడిపించ డానికే.

ఇక్కడ మరొక్క ముఖ్య విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. జ్ఞాననిష్ఠుడు తాను ఆచరిస్తూ కర్మాసక్తులను ఆకర్షించి సన్మార్గంలో ఉంచాలి అంటే, ఈ అనుసరణము కర్మయోగ పరిధి లోనిదే గాని జ్ఞానయోగానికి సంబంధించింది కాదు.

అనుసరించడం అనేది కర్మయోగంలో సాధ్య పడుతుందే గాని, జ్ఞానయోగంలో సాధ్య పడదు. జ్ఞాని కర్మయోగాన్ని ఆచరిస్తూ ఆదర్శాన్ని ఆవిష్కరించాలి. అంతేగాని జ్ఞానాన్ని ప్రదర్శించ కూడదు. దానిని ప్రవచించ వలసిందే గాని దర్శించడం వీలు పడదు. కాకపోతే, కర్మాసక్తుడైన వాడు జ్ఞాననిష్ఠుని ఆదర్శంతో ముందు కర్మయోగిగా మారితే, ఆ తరువాత అతడే జ్ఞానార్థియై మోక్షాన్ని పొందుతాడు.

కర్మయోగాన్ని అనుసరిస్తూ అభ్యసించ వచ్చు. జ్ఞానాన్ని ఆలకించ వలసిందే గాని అనుసరించడం, అనుకరించడం కుదరదు. కనుకనే, మనవాళ్ళు, **రాముడు చేసినట్లు చెయ్యి - కృష్ణుడు చెప్పినట్లు చెయ్యి. కృష్ణుడు చేసినట్లు చెయ్యకు**) అని చెబుతూ ఉంటారు.

రాముడు ధర్మ మార్గాన్ని ఆదర్శంగా నిలిపాడు కనుక, ఆ మార్గంలో మనమూ చరించ వచ్చు. కానీ, కృష్ణుడు బోధించిన గీతను మనం అర్థం చేసుకొని ఆచరించాలి. అంతేగాని ఆయన జీవితంలో చేసిన వన్నీ చేయాలి అనుకుంటే, అది సాధ్య పడదు. రాసలీలలో నాట్యం చేయడం వీలు పడుతుందేమో గాని, ఆయన లాగా కార్చిచ్చును అమాంతం మ్రింగడం, కొండనెత్తి వేలిపై నిలబెట్టడం సాధ్యమయ్యే పనులేనా!

కనుక, జ్ఞాననిష్ఠలో ఉన్నవారు అజ్ఞానులను తాత్త్విక సందేశాలతో కలత పెట్టకూడదు. వారు కర్మలు చేస్తున్నట్లే తాము కూడా కర్మల్ని ఆచరిస్తూ ఫలాకాంక్ష లేకుండా జీవించి, సామాన్యులకు ఆదర్శాన్ని నెలకొల్పాలి. తాము చేస్తూ, తాము చేసే కర్మలలో వారికీ ప్రీతి కలిగేటట్లు చూడాలి. ఆ తరువాత, వారి చేత కూడా నిష్కామంగా చేయించాలి.

వివేకం పెరుగుతూ ఉంటే, ఫలాసక్తి నశిస్తూ ఉంటుంది. కర్మలలో అవగాహన ఏర్పడితే, సకామ కర్మలు నిష్కామ కర్మ లవుతాయి. సదాచార జీవనము అలవడుతుంది. అది సర్వాత్మ భావానికి దారి తీస్తుంది. అంతేగాని, ప్రారంభం లోనే మ్రింగుడు పడని విషయాల జోలికి పోకూడదు. **సర్వంబ్రహ్మమయం** అనేది అందరి స్థాయికి దిగి రాలేని సత్యము. ముందు ఆలయంలో భగవంతుణ్ణి దర్శించి, అర్చించి, శుద్ధి పడితే, ఆ తరువాత జ్ఞానప్రాప్తి ద్వారా అంతటా సమదర్శనం ప్రాప్తిస్తుంది.

ఆద్యుడు ఎవరో తెలియని నాడు
ఆలయమే మనకు ఆశ్రయము
అనంతుడు తానని తెలిసిన నాడు
ఏది కాదు ఆలయము?
విశ్వమంతా సుందరము
ఏది చూసినా శివమయము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

మనిషి కర్మ చేత ఎలా బద్ధు డవుతున్నాడో తరువాత శ్లోకంలో స్పష్టం చేస్తున్నాడు.

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకార విమూఢాత్మా కర్తాఽహ మితి మన్యతే ॥ 27

ప్రకృతేః-క్రియమాణాని-గుణైః-కర్మాణి-సర్వశః
అహంకార విమూఢాత్మా-కర్తా-అహం-ఇతి-మన్యతే

ప్రకృతేః	= ప్రకృతి యొక్క	అహం	= నేను
గుణైః	= గుణముల చేత	కర్తా ఇతి	= చేసేవాణ్ణి అని
సర్వశః	= అన్ని విధాలుగా	అహంకార విమూఢాత్మా	= అహంకారము చేత వివేకమును కోల్పోయిన వాడు
క్రియమాణాని	= చేయబడుతున్న	మన్యతే	= భావిస్తున్నాడు
కర్మాణి	= కర్మలను		

చేయబడే కర్మ లన్నీ ఏ విధంగా చూచినా ప్రకృతి యొక్క గుణముల చేతనే చేయబడుతూ ఉంటాయి. ఆత్మ జ్ఞానము లేని అహంకారి నేనే కర్తను అని భావిస్తూ ఉంటాడు.

వ్యాఖ్య

జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ కర్మలు ఆచరిస్తున్నారు. కర్మలు చేస్తున్నా జ్ఞాని బద్ధుడు కాడు. కాని అజ్ఞాని కర్మల చేత బద్ధుడు అవుతాడు. ఈ బంధము కర్మభేదాన్ని బట్టి వచ్చింది కాదు. భావ వ్యత్యాసాన్ని బట్టి వచ్చింది. భావభేదం వల్ల అజ్ఞాని బద్ధు డవుతున్నాడు, జ్ఞాని బద్ధుడు కావడం లేదు. అజ్ఞాని ఎలా బద్ధు డవుతున్నాడో ఇరవై ఏడవ శ్లోకం లోను, జ్ఞాని ఎలా బద్ధుడు కావడం లేదో ఇరవై ఎనిమిదవ శ్లోకం లోను స్పష్టంగా వివరిస్తున్నాడు.

ప్రకృతి పురుషులు

'ప్రకృతి' అంటే మాయ, లేక అవిద్య. మాయ త్రిగుణ మిళితం. త్రిగుణమయం. మాయ లోని త్రిగుణాలే ఇరవై నాలుగు తత్త్వాలుగా మార్పు చెందాయి. పంచభూతాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, శబ్దాది విషయాలు ఐదు, అంతఃకరణ చతుష్టయం - ఇవే ఇరవై నాలుగు తత్త్వాలు.

బాహ్య ప్రపంచము, దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతము, అన్నీ 'ప్రకృతి' అనబడే మాయ యొక్క కార్యాలే. ప్రకృతి వికారాలే. ఒక్క మాటలో చెప్పాలంటే, దేహేంద్రియ ప్రాణ మనస్సులు, ఈ దృశ్యమాన ప్రపంచము దేని నుండి వచ్చాయో, ఆ కారణమే మాయ, లేదా 'ప్రకృతి'.

మాయ కారణము. మాయ నుండి వచ్చిన వన్నీ కార్యాలు. మాయా కార్యాలు. ప్రకృతి కార్యాలు. ప్రకృతి నుండి వచ్చిన ఏ కార్యంలో అయినా ప్రకృతి గుణాలే ఉంటాయి. అందుచేత అవి ప్రకృతి కార్యాలు **(ప్రకృతేః** *గుణైః క్రియమాణాని కర్మాణి)*.

ప్రకృతి గుణమయం అని చెప్పుకున్నాం. ఈ ప్రపంచ మంతా ప్రకృతి కార్యమే కనుక సత్త్వరజ స్తమో గుణాలు అనే ఇటుకల పైనే ఈ విశ్వసౌధం నిర్మిత మైంది. బాహ్యంలో ఉన్నవీ గుణాలే. మనలో ఉన్నవీ గుణాలే. బాహ్య ప్రపంచం లోను, వ్యక్తి దేహేంద్రియ మనోబుద్ధుల లోను ఉన్న వన్నీ గుణాలే కనుక, బాహ్యం లోని గుణ సముదాయం వ్యక్తి లోని గుణ సముదాయం పరస్పరం ఆకర్షించుకొంటూ ఉంటాయి. ఆ విధంగా సమరస మవుతూ ఉంటాయి.

విషయాల కొరకు ప్రాకు లాడేది ఇంద్రియాలు కాదు. దేహమూ కాదు. మనలో ఉన్న గుణాలే బాహ్యం లోని గుణాల వైపు పరుగులు పెడుతున్నాయి. *గుణాః గుణేషు వర్తన్తే*- గుణాలు గుణాలలో తిరుగు తున్నాయి అనే సత్యం జ్ఞానికే అర్థ మవుతుంది. ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో చూస్తాం కూడా.

ప్రకృతి యొక్క గుణాలే నానా విధాలైన కార్యాలను ఈ విశ్వంలో సాగిస్తున్నాయి. ఈ సత్యాన్ని తెలుసుకున్న వాడు జ్ఞాని. 'గుణాలు గుణాలలో ప్రవర్తిస్తున్నాయి. నేను ఏమి చేయడం లేదు. నేను కర్తను కాను' అని జ్ఞాని భావిస్తాడు. అందుచేత అతడు ప్రకృతి కార్యాల చేత బద్ధుడు కాదు. ఈ సత్యం అర్థం గాని అజ్ఞాని 'నేనే కర్తను' అని భావిస్తూ ఉంటాడు (*అహం కర్తా ఇతి మన్యతే*). అందుకే అతనిని ***అహంకార విమూఢాత్మా*** అని పిలుస్తున్నాడు గీతాచార్యుడు.

ఈ ప్రపంచ మంతా ప్రకృతి కార్యమే కనుక, ప్రకృతి నుండి జనించినదే కనుక, ఏదయినా ప్రకృతి వికారమే. ఈ మూల ప్రకృతి పురుషునిపై ఆధారపడి ఉంది. 'పురుషుడు' అంటే చైతన్యము, ఆత్మ, బ్రహ్మము అని అర్థం చేసుకోవాలి. కనుక, త్రిగుణ మిళితమైన ప్రకృతి, లేదా మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది (*బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమో గుణాత్మికా మాయా అస్తి*).

కార్యకరణాభిమాని

మూల కారణంగా తెలుస్తూ ఉన్న మాయ నుండి కార్యరూప జగత్తు ఆవిర్భవించింది. ప్రకృతి వికారమే కనుక ప్రపంచములో కూడా గుణ వికారాలే గోచరిస్తున్నాయి. అలాగే మానవ దేహము కార్యమైతే, ఇంద్రియ ప్రాణ మనోబుద్ధులు కరణాలై ఉన్నాయి. ఈ కార్యకరణ సంఘాతమునకు ప్రకృతి, లేదా మాయ మూల కారణంగా ఉంది.

ప్రకృతి, లేదా మాయ పురుషుని, లేదా బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది. అలాగే మన దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులు అనే కార్యకరణ సంఘాతము ఆత్మను ఆధారం చేసుకొని ఉంది. ఇంతకీ, నీ వెవరు? నీవు ఆత్మవే గాని గుణ వికారమైన కార్యకరణ సంఘాతము కాదని రెండవ అధ్యాయం లోనే అర్థం చేసుకున్నాము. అలాంటప్పుడు ప్రపంచంలో నడిచే గుణ సమన్వయ కార్యాలకు నీవు కర్తవు ఎలా అవుతావు?

కార్యకరణ సంఘాతమైన దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధుల యందు 'అహం' భావన, లేక 'నేను' అనే భావన కలిగి ఉన్నందున, తానే కర్త అని అజ్ఞాని భావిస్తుంటాడు. అలాంటప్పుడు 'నీవు అకర్తవు - అభోక్తవు' అని జ్ఞాని వినిపించే బోధ ఫలితా న్నిస్తుందా? కర్మ చేసి నపుడే కదా కర్త ఉంటాడు? 'నేను కర్తను' అనే భావనతో అజ్ఞాని కర్మలను ఆచరిస్తు న్నప్పుడు, 'నీవు కర్తవు కావు' అని జ్ఞాని చేసే బోధ ఫలిస్తుందా? అందుకనే, జ్ఞాని అజ్ఞానిని కలత పెట్టకూడదు అని ఇరవై ఆరవ శ్లోకంలో భగవంతుడు విస్పష్టంగా వినిపించాడు.

అహం కర్తా అహంకారః - దేహేంద్రియాదిక మైన అనాత్మ యందు 'నేను' అనే బుద్ధి ఏదయితే ఉందో, అదే అహంకారము. అట్టి అహంకారము చేత మూఢమైన బుద్ధి గలవాడు అహంకార విమూఢుడు. గుణ ధర్మాలను తన యందు ఆరోపించుకొని ఆవేదన చెందే అజ్ఞాని. ఈ విధంగా అజ్ఞాని కర్మల చేత బద్ధు డవుతున్నాడు.

ఇదే సంసారము. 'తాను కానిది తాను' అనే భావనే బంధము. సర్వ దుఃఖాలకు, సమస్త దోషాలకు అదే కారణము.

దేహోఽ హ మితి సంకల్పం తద్దుఃఖ మితి చోచ్యతే
దేహోఽ హ మితి యజ్ఞానం తదేవ నరకం స్మృతమ్ ॥

'నేను దేహము' అనే భావనే దుఃఖమయమైన సంసారము. 'నేను కార్యకరణ సంఘాతము' అనే భావనే నరక బాధలకు కారణ మవుతూ ఉంది అన్నది తేజోబిందూపనిషత్తు.

అవివేకము చేత తాను కర్త అని భావించిన అజ్ఞాని బద్ధుడవుతూ ఉంటే, గుణకర్మల వాస్తవ స్థితిని తెలిసిన జ్ఞాని, తాను కర్త కాదు అని భావిస్తూ, ఆసక్తి లేకుండా కర్మలను ఆచరిస్తున్నాడు. అది కూడా చెప్పుకుందాం.

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః । 28
గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే ॥

తత్త్వవిత్-తు-మహాబాహో-గుణకర్మవిభాగయోః
గుణాః-గుణేషు-వర్తంతే-ఇతి-మత్వా-న-సజ్జతే

మహాబాహో	=అర్జునా!	గుణేషు	= విషయముల యందు
గుణకర్మ విభాగయోః	=గుణ, కర్మల విభాగముల యొక్క	వర్తంతే ఇతి	= ప్రవర్తిస్తున్నాయి అని
తత్త్వవిత్ తు	=తత్త్వమును తెలిసిన వాడైతే	మత్వా	= తలచి
గుణాః	=గుణములు	న సజ్జతే	= ఆసక్తి లేకుండా ఉంటాడు

అర్జునా! గుణకర్మల విభజనము యొక్క వాస్తవమును తెలిసిన వాడు జ్ఞాని. ఇంద్రియాలు అనే గుణాలు విషయాలు అనే గుణాల యందు ప్రవర్తిస్తూ ఉన్నాయని భావిస్తాడు. వాటి యందు ఆసక్తి లేకుండా ఉంటాడు.

వ్యాఖ్య

కారణమైన ప్రకృతి, లేదా మాయలో త్రిగుణాలు ఉన్నాయి. అవి పరిణామం చెంది సూక్ష్మ, స్థూల భూతాలు గాను, శ్రోత్రాది సూక్ష్మ స్థూల ఇంద్రియాలు గాను జనించాయి. ప్రపంచ మంతా పంచభూతాల సమ్మేళనమే కనుక ప్రపంచంలో త్రిగుణాలే ఉన్నాయి. అలాగే మానవ దేహం, ఇంద్రియ మనోబుద్ధులు కూడా గుణ వికారాలే. అందువల్ల, బాహ్యప్రపంచం లోని గుణాలు, వ్యక్తి లోని గుణాలను ఆకర్షిస్తున్నాయి. ఈ విధంగా కర్మలు జరుగుతూ ఉంటే, వీటి యథార్థ స్వరూపమును తెలియక, తానే కర్త అని భావించి 'అహంకార విమూఢాత్ముడు' బద్ధు డవుతున్నాడు. అతనికి భిన్నంగా తత్త్వవిదుడు ప్రవర్తిస్తున్నాడు. కర్మల యందు ఆసక్తి లేకుండా ఉంటూ ముక్తు డవుతున్నాడు.

గుణాల యొక్క, కర్మల యొక్క యథార్థ స్వరూపం తెలిసి, వాటి నుండి తనను వేరు చేసుకొని శోభించే వాడు తత్త్వవిదుడు (*గుణ విభాగస్య కర్మ విభాగస్య చ తత్త్వవిత్ ఇత్యర్థః*). అది తెలిసిన వాడు కనుక

గుణాలు గుణ విషయాల యందు ప్రవర్తిస్తున్నాయి అని గ్రహిస్తాడు. అంటే, ఇంద్రియ మనోబుద్ధులు అనే గుణాలు, లేదా కరణాలు (**గుణాః కరణాత్మకాః**) గుణాల యందు, అంటే విషయాల యందు (**గుణేషు విషయాత్మకేషు**) ప్రవర్తిస్తున్నాయి (**వర్తన్తే**) అని యథార్థంగా తెలుసు కుంటాడు. అలా ఎప్పుడైతే తెలుసు కుంటాడో, ఆత్మ ప్రవర్తించడం లేదు అనే సత్యాన్ని గ్రహించి (**న ఆత్మా ఇతి మత్వా**). కర్తృత్వం లేకుండా ఉంటాడు. కర్మల యందు ఆసక్తి లేకుండా ఉంటాడు (**న సజ్జతే సక్తిం న కరోతి**).

ఇంద్రియాలకు ఇంద్రియ విషయాల తోనే సంబంధం. గుణాలకు గుణవిషయాల తోనే సంబంధం. ఆత్మకు ఇటు ఇంద్రియాలతో గాని, అటు ఇంద్రియ విషయాలతో గాని; ఇటు గుణాలతో గాని, అటు గుణ విషయాలతో గాని సంబంధం లేదు. సంగత్వం లేదు. కనుక ఆత్మ అసంగము. ఈ సత్యం తెలిసిన వాడు కనుక తత్త్వవిదుడు అసంగుడు (**అసంగః సంగ వర్జితః**).

శుద్ధ చైతన్య స్వరూపుడైన పురుషుడు లేదా ఆత్మ, దృక్‌శక్తి, లేదా దృక్చైతన్యము. వాస్తవానికి చూచే వాడు తానే. చైతన్యాత్మ చూచేందుకు సాధనమైన బుద్ధి, దర్శనశక్తి. దృక్‌శక్తికి, దర్శనశక్తితో ఏర్పడిన సంయోగము వల్లనే **అహం కర్తా**, 'నేను కర్తను' అనే భ్రాంతి కలుగుతూ ఉంది. దృక్‌శక్తిని దర్శనశక్తిగా భావించ డానికి అజ్ఞానమే కారణం (**తస్య హేతుః అవిద్యా** - యోగసూత్రం). కనుక అజ్ఞానం వల్ల సంసారం ఉత్పన్న మవుతూ ఉంది. 'నేను కర్తను' అని భావించేవాడు (**కర్తాఽ హ మితి మన్యతే**) బద్ధుడై సంసారి అవుతున్నాడు. ఈ విషయాన్ని పతంజలి మహర్షి యోగదర్శనంలో స్పష్టం చేశాడు.

ద్రష్టృ దృశ్యయోః సంయోగో హేయహేతుః

దృగ్దృశ్యముల సంయోగమే హేయమైన దుఃఖరూప సంసారానికి హేతువు అని పతంజలి యోగసూత్రం.

చంద్రునికి జలముతో సంబంధము లేదు. కాని, చంద్రుడు జలములో ప్రతిబింబించడం చేత చంద్రునికి జలముతో సంబంధం ఉన్నట్లు అగుపిస్తూ ఉంటుంది. అలాగే నిర్వికారుడైన పురుషునికి, గుణ వికారమైన బుద్ధికి ఏ విధమైన సంబంధం లేదు. కాని దృక్చైతన్యం బుద్ధిలో ప్రతిఫలించడం చేత పురుషునికి బుద్ధితో సంబంధం ఉన్నట్లు కనిపిస్తూ ఉంది. అనిపిస్తూ ఉంది.

తత్త్వవిదుడు గుణకర్మల యొక్క విభాగమును వాస్తవముగ తెలిసిన వాడు కనుక, అజ్ఞానము నుండి విడిపడి ఉన్నాడు. అజ్ఞానం లేని కారణం చేత, పురుష, బుద్ధుల యొక్క సంయోగము లేని వాడై ఉన్నాడు. కనుక దుఃఖము తెలియని వాడై ఉన్నాడు. ఇదే తత్త్వవిదుని మోక్షము. ఈ క్రమం పతంజలి యోగసూత్రంలో సుస్పష్టంగా తెలుస్తుంది. అవిద్య యొక్క అభావం వల్ల సంయోగము యొక్క అభావము సంభవము. ఈ సంయోగ అభావమే 'హానమ్'. హానము' అంటే దుఃఖ రాహిత్యము. అదే దృక్చైతన్య మైన పురుషుని కైవల్యము, లేదా మోక్షము (**తదభావాత్ సంయోగ అభావః హానం తద్దృశేః కైవల్యమ్** - యోగసూత్రమ్).

మోక్షరూపుడైన తత్త్వవిదుడు ప్రపంచంలో చరిస్తూ ఉన్నా, తామరాకు మీద నీటిబొట్టు లాగా ఉంటాడు కనుక, అతనికి కర్మసంగం లేదు. ఫలసంగం లేదు. భువిలో చరిస్తున్నా, దివి నుండి దిగి వచ్చిన దివ్యాత్ముడా! అనిపిస్తూ ఉంటాడు.

ఈ విధమైన గుణకర్మల యదార్థ జ్ఞానము లేకపోవడం చేత, గుణకర్మల యందు ఆసక్తి కలిగి, కర్తృత్వాభిమానంతో కర్మలను ఆచరించే మందమతులను విద్వాంసులు కలతపెట్ట కూడదు కనుక, **న బుద్ధిభేదం జనయేత్** అంటూ ఇరవై ఆరవ శ్లోకంలో ఉపక్రమించిన విషయాన్ని ఇక్కడ ఉపసంహరిస్తున్నాడు.

ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జన్తే గుణకర్మసు ।
తా నకృత్స్నవిదో మన్దా న్కృత్స్నవి న్న విచాలయేత్ ॥ 29

ప్రకృతేః-గుణసమ్మూఢాః-సజ్జంతే-గుణకర్మసు
తాన్-అకృత్స్నవిదః-మందాన్-కృత్స్నవిత్-న-విచాలయేత్

ప్రకృతేః	= ప్రకృతి యొక్క	మందాన్	= మందమతులైన
గుణసమ్మూఢాః	= గుణములచే మోహితులై	తాన్	= వారిని
గుణకర్మసు	= గుణకర్మముల యందు	కృత్స్నవిత్	= విద్వాంసుడు
సజ్జన్తే	= ఆసక్తు లౌతున్నారో	న విచాలయేత్	= కలత పెట్ట కూడదు
అకృత్స్నవిదః	= అల్పజ్ఞులైన		

అల్పజ్ఞులైన మందమతులు ప్రకృతి యొక్క గుణముల చేత మోహితులై ఉంటారు. గుణముల యొక్క కార్యాలలో ఆసక్తులై ఉంటారు. అట్టి కర్మజీవులను సర్వజ్ఞుడైన జ్ఞాని కలత పెట్ట కూడదు.

వ్యాఖ్య

గుణముల యొక్క, కర్మల యొక్క యథార్థ స్వరూపమును గ్రహించలేని అవివేకులు ఫలాసక్తితో కర్మల యందు నిమగ్నమై ఉంటారు. వీరు బద్ధులు. అల్పజ్ఞానం కలిగిన వారు. అవిద్వాంసులు. వీరిని **అకృత్స్నవిదః** అంటున్నాడు భగవానుడు. 'అకృత్స్నవిదులు' అంటే పూర్ణజ్ఞానం లేనివారు అని అర్థము. పాక్షికమైన జ్ఞానం కలవారు అని భావం. అంటే కేవలం ఫలితాన్ని మాత్రమే దర్శించేవారు అని అర్థము (**అకృత్స్నవిదః కర్మఫల మాత్ర దర్శినః**). వీరిని మందబుద్ధులు, లేదా మందమతులు అంటున్నాడు. అంటే, అల్పప్రజ్ఞ కలిగిన వారు అని భావము (**మందాన్ మంద ప్రజ్ఞాన్**). సంస్కృతంలో 'మన్దః' అనే పదానికి చాలా అర్థాలున్నాయి. 'మన్దః' అంటే సోమరి, ఉత్సాహం లేనివాడు, బలహీనుడు. 'విలంబము' అంటే ఆలస్యము చేసేవాడు. ఇతడు చేసినా ఆలస్యమే. చూసినా ఆలస్యమే. ఇతడికి ఏదైనా అర్థం చేసుకోవడానికి చాలా సమయం కావాలి అని అర్థం. 'మన్దః' అంటే 'శని' అని అర్థం కూడా ఉంది. శనిని దర్శించాలంటే తూర్పు గోదావరి జిల్లాకు పోవాలి. అక్కడ 'మందపల్లి' అనే గ్రామంలో శనీశ్వరుని ఆలయ ముంది. శని ఉండటం చేత ఆ గ్రామానికి 'మందపల్లి' అనే పేరు వచ్చింది.

మందమతులు, 'అకృత్స్నవిదు' లైతే, విద్వాంసులు, లేదా ఆత్మవిదులు 'కృత్స్నవిదులు' (**కృత్స్నవిత్ ఆత్మవిత్ స్వయం**). అలాంటి తత్త్వవిదులు మందభాగ్యులైన వారిని చలింప చేయకూడదు (**న విచాలయేత్**). ఇక్కడ చలింప చేయడము అంటే మనం ముందే చూచినట్లు బుద్ధి భేదం కలిగించడం అని అర్థము (**బుద్ధి భేద కరణ మేవ చాలనం**). అలా విద్వాంసులు మందమతులను చలింప చేయ కూడదు, లేదా కలతపెట్ట కూడదు అని అర్థం (**తత్ న కుర్యాత్ ఇత్యర్థః**).

ఈ శ్లోకం లోని విషయం ఇరవై ఆరవ శ్లోకంలో చెప్పిందే. అక్కడ అజ్ఞానిగా పేర్కొన్న మూర్ఖుడికి ఇక్కడ మందభాగ్యుడనే బిరుదు ప్రదానం చేయడం కన్నా అన్యమైన విషయం ఈ శ్లోకంలో నాకు కనిపించడం లేదు. అలాగని చాలా అవసరమైన, అతిముఖ్యమైన, ఉపేక్షింప దగని గంభీరమైన విషయం కనుకనే, భగవానుడు పునః ప్రవచించాడు గాని, పునరుక్తికి తెర తీయలేదు.

ప్రబోధాలు చేసే వారికి, ప్రవచనాలు సాగించే వారికి, శిష్యులను ప్రోగు చేసుకొనే గురువులకి ఈ

సత్యం వెంట బట్టక పోతే, ఇది చాలా హానికరమైన పరిణామాలకు దారి తీస్తుందని భగవానుడు పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

అజీర్ణపు రోగికి ఆహారం పెట్టే కొద్ది ఆరోగ్యం చెడిపోతూ ఉంటుంది. బాగా కాలిన భూమి మీద చల్లటి నీళ్ళు పోస్తే ఆవిర్లు పైకి లేస్తాయి. పోసిన వాళ్లే వేడెక్కిస్తాయి. అర్హత లేని వ్యక్తికి ఆత్మను గూర్చి బోధిస్తే, దాని వల్ల మేలు జరగక పోగా, అతనిలో నిరాశ అలుము కుంటుంది. మందబుద్ధులపై అతిప్రేమను కుమ్మరిస్తే ప్రాప్తించేది అనర్థమే గాని పరమార్థం కాదు.

చంచల స్వభావుల్ని కర్మల నుండి విరమింప చేయ కూడదు. నాకేం జరుగుతుంది? నా కేమి వస్తుంది? అంటూ పలవరించే మంద ప్రబుద్ధుల్ని కర్మల లోనే కొనసాగ నివ్వాలి. జ్ఞాననిష్ఠను గూర్చి అసలు చెప్ప కూడదు. కర్మయోగాన్ని కూడా క్రమంగా ప్రవేశ పెట్టాలే గాని, ఒక్కసారిగా బోధించ కూడదు. 'మందం' అంటేనే సంస్కృతంలో గాని, తెలుగులో గాని మెల్లగా అని అర్థం.

మందబుద్ధులు మూఢులు కనుక, 'నీవు అకర్తవు - అభోక్తవు' అంటూ కలవర పెట్టకుండా 'ఏదైనా అస్థిరమే, అశాశ్వతమే' అంటూ వైరాగ్య వచనాలతో ఊదర పెట్టకుండా, మెల్లగా, అంటే మందంగా భగవన్నామ సంకీర్తనం చేయించడం చాలా మంచిది. ఉత్తమమైన సాధన. పరివర్తనను గమనిస్తూ, సోపానక్రమంగా ముందుకు నడిపించాలి. ఈ కారణం చేతనే శ్రీ శంకరాచార్యస్వామి *గోవిందం భజ మూఢమతే!* అని చక్కగా ప్రవచించారు.

ఇటు మందమతి కాక, అటు తత్త్వవిదుడు కాలేక, ప్రస్తుతం ముముక్షువుగా కొనసాగుతున్న వ్యక్తి యొక్క కర్తవ్యం ఏమిటి? చెబుతున్నాడు.

మయి సర్వాణి కర్మాణి సంన్య స్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30

మయి-సర్వాణి-కర్మాణి-సంన్యస్య-అధ్యాత్మ చేతసా
నిరాశీః-నిర్మమః-భూత్వా-యుధ్యస్వ-విగతజ్వరః

సర్వాణి	= సమస్తమైన	నిరాశీః	= ఆశ లేని వాడవు
కర్మాణి	= కర్మలను	నిర్మమః	= మమకారము లేని వాడవు
మయి	= నా యందు	విగత జ్వరః	= సంతాప రహితుడవు
అధ్యాత్మచేతసా	= అధ్యాత్మ చిత్తముతో	భూత్వా	= అయి
సంన్యస్య	= ఉంచి	యుధ్యస్వ	= యుద్ధము చెయ్యి

సమస్త కర్మలను వివేక బుద్ధితో నా యందు సమర్పించు. ఆశను విడిచి పెట్టేయ్! మమతను వదలి పెట్టేయ్! దుఃఖానికి దూరమై యుద్ధంలో పోరాడు.

వ్యాఖ్య

కర్మలను ఆచరించ నంత మాత్రాన మానవులు నైష్కర్మ్యమును పొంద లేరు. అలాగే, కర్మలను విడిచి నంత మాత్రాన మోక్షాన్ని పొంద లేరు అని నాల్గవ శ్లోకంలో ప్రారంభించిన కర్మయోగ ప్రకరణాన్ని ఈ శ్లోకంతో సమాప్తం చేస్తున్నాడు భగవంతుడు. కర్మను అవశ్యం ఆచరించాలి అంటూ ఇరవై కారణాలను పేర్కొన్నాడు. అందుచేతనే ఈ ముగింపు శ్లోకంలో 'యుద్ధం చెయ్యి' (*యుధ్యస్వ*) అని ఆదేశిస్తున్నాడు.

కర్మయోగ ప్రకరణాన్ని ఉపసంహారం చేస్తూ, యుద్ధం చెయ్యమని చెప్పడంలో ప్రధానమైన విషయం

కర్మాచరణమే గాని యుద్ధం కాదు. అర్జునుడు యుద్ధభూమిలో ఉన్నాడు కనుక యుద్ధం చెయ్యమంటున్నాడు. అంతే. ఎవరెవరు ఏయే కర్మక్షేత్రాలలో ఉంటే ఆయా కర్మల్ని ఆచరించాలి అని దాని అర్థం. ఎవరెవరికి ఏయే కర్మలు చేయ దగినవో (*కార్యం కర్మ*) వాటిని వారు ఆచరించి తీరాలి అనేది నిర్ణయం.

రైతు వ్యవసాయం చెయ్యాలి. వైద్యుడు వైద్యం చెయ్యాలి. ఉపాధ్యాయుడు బోధించాలి. ప్రభువు పాలించాలి. ఉద్యోగస్థులు ఉద్యోగాలు చెయ్యాలి. వ్యాపారస్థులు వ్యాపారాలు చెయ్యాలి. 'చెయ్యాలి' అనేదే కేంద్ర విషయం. కర్మయోగ ప్రకరణంలో ప్రధానమైన విషయం. మరి, ఎలా చెయ్యాలి? అంటే, అధ్యాత్మ చిత్తంతో సర్వ కర్మలను పరమేశ్వరుని యందు సమర్పించాలి అంటున్నాడు.

సమస్తములైన కర్మల్ని సన్యసించి యుద్ధం చెయ్యడం ఎలా? కర్మ లన్నిటినీ త్యజించడం అంటే, యుద్ధం కూడా కర్మే కనుక యుద్ధాన్ని కూడా త్యజించాలి. పైగా సమస్త కర్మలను త్యజించిన వాడు, ఇంతవరకు మనం అర్థం చేసుకున్న దానిని బట్టి, జ్ఞాననిష్ఠకు అర్హుడు కావాలి. అంతేగాని కర్మనిష్ఠకు కాదు. ఆచార్యుని ఆశ్రయించి శ్రవణం చేయదగిన వాడై ఉండాలే గాని కర్మక్షేత్రంలో పోరాడే వాడు కాలేడు.

కనుక, సమస్తమైన కర్మలను నా యందు సన్యసించి అని భగవంతుడు పలికిన వాక్యంలో 'సన్యసించి' అంటే ఉంచి అని అర్థము (*సంన్యస్య నిక్షిప్య*). ఇక్కడ **మయి** నా యందు ఉంచి అనడంలో ఉద్దేశ్యం సర్వజ్ఞుడు, సర్వాత్మ స్వరూపుడు, పరమేశ్వరుడు అయిన వాసుదేవుని యందు ఉంచి అని అర్థం (***మయి వాసుదేవే పరమేశ్వరే సర్వజ్ఞే సర్వాత్మని, సర్వాణి కర్మాణి సంన్యస్య నిక్షిప్య***). అంటే, సగుణబ్రహ్మము నందు సమర్పించి అని భావం.

మరి, వాసుదేవ పరబ్రహ్మము నందు కర్మల్ని సమర్పించేది ఎలా? కర్మ అనేది వస్తువు కాదు. పదార్థం కాదు. పత్రం కాదు. పుష్పం కాదు. మరి కర్మల్ని ఎలా సమర్పించాలి? అందుకనే, అధ్యాత్మచిత్తముతో సమర్పించాలి అంటున్నాడు. అధ్యాత్మచేతము అంటే 'వివేకబుద్ధి' అని అర్థము (*అధ్యాత్మ చేతసా వివేక బుద్ధ్యా*)

'వివేకబుద్ధి' అంటే కర్తృత్వము లేని బుద్ధి. అలాగని 'అహం అకర్తా' అనే బుద్ధి కాదు. 'కర్తను నేనే. కాని కర్తృత్వ బుద్ధి నాకు లేదు' అని అర్థం. కర్మ చేస్తున్నాను. కాని, సేవకుడు లాగా చేస్తున్నాను. యజమాని ఆదేశించిన కర్మను చేస్తున్నాను. నిర్దేశించిన కర్మను చేస్తున్నాను. చేయదగిన కర్మను చేస్తున్నాను. ఈశ్వరుని భృత్యుణ్ణై చేస్తున్నాను. ఈశ్వరుడు ప్రభువు. నేను భృత్యుడు - ఇదే వివేకబుద్ధి, ఈ విధమైన బుద్ధితో పరమేశ్వరునికి సర్వ కర్మల్ని నైవేద్యంగా సమర్పించాలి. ఇలా సమర్పించే కర్మయోగి వైఖరి ఎలా ఉండాలి అంటే, మూడు విషయాలను అందంగా ప్రతిపాదిస్తున్నాడు. (1) ఆశను విడిచి పెట్టాలి. (2) మమకారం లేకుండా ఉండాలి. (3) సంతాపము, లేక శోకము లేకుండా ఉండాలి. అప్పుడే కర్మలు పవిత్ర నైవేద్యా లవుతాయి.

ఆశను ఆగనీ

అందరి కర్మల వెనుక ఆశలు ఉన్నాయి. ఆశ ఏదో కాదు, కామం. ఒక విధంగా చెప్పాలంటే విషయ దాహం. అది వర్తమానానికి సంబంధించింది అయినా కావచ్చు. లేదా, భవిష్యత్తుకు సంబంధించింది అయినా కావచ్చు. గతానికి సంబంధించింది మాత్రం కాలేదు. గతానికి సంబంధించి అనుభవాలు, నిరాశలు ఉంటాయే గాని, ఆశలు ఉండవు. నెరవేరాలి అనే కోరికే ఆశలో ప్రధానంగా ఉంటుంది. గతం ఎలాగూ తిరిగి రాదు కనుక ఆశలు గతానికి సంబంధించి ఉండవు.

నేడు ఎలా ఆశలు కదుల్తున్నాయో గతంలో కూడా అలాగే కదిలాయి. మనిషి ఆశాజీవి. ఆశలు మనిషికి

క్రొత్తవి కావు. గతం లోని ఆశలే నేడు వీస్తున్న నిరాశా గాలులు. అలాగే నేటి ఆశలే భవిష్యత్తులో నిస్పృహల్ని ప్రసరింప చేస్తాయి. ఇంత వరకు ఆశామార్గంలో చరించి అన్యాయమై పోయాం. ఇక ఆశల్ని విడిచి పెట్టి ప్రయాణం సాగించాలి. కర్మయోగి అదే చేస్తాడు. అందుకే అతడు **నిరాశీ** అయ్యాడు ***(నిరాశీః త్యక్తాశీః).*** 'నిరాశీ' అంటే ఆశను విడిచి పెట్టిన వాడు. లోకాన్ని మరచిన వాడు. లోకేశ్వరుని మరవని వాడు. అతడే కర్మయోగి. అతడే భక్తుడు.

మమతను మాసిపోనీ

'ఇది నాది - అది నాది' అనే మమకారము మరుగున పడాలి ***(నిర్గత మమభావః).*** ఈశ్వరుని కొరకు కర్మల్ని ఆచరించే భృత్యుడికి మమకారం ఎలా ఉంటుంది? 'నాది - నాది' అంటూ ఇంతవరకూ ప్రోగు చేసుకున్న మమకార దోషాన్ని 'నీదే - నీదే' అంటూ ఇకనైనా కడిగేసు కోవాలి. **త్వమేవ శరణం మమ దేవ దేవ** అంటూ మమతను వీడి, సేవా జీవనాన్ని ప్రారంభించాలి. అదే కర్మయోగ వైభవం. కర్మయోగి ప్రాభవం.

సంతాపం సడలిపోనీ

జ్వరః అంటే దుఃఖము, వేడి, జ్వరము అని అర్థాలున్నాయి. వీటి నుండి విడి పడటమే ఇక్కడ విగత జ్వరము ***(విగతజ్వరః విగత సంతాపః విగత శోకః విగత జ్వరః).*** భౌతికంగా దేహానికి వచ్చే జ్వరము శారీరిక జ్వరము. మనస్సును పీడించే సంతాపము, లేదా దుఃఖము మానసిక జ్వరము. ఇదే సంసార తాపము. కర్మయోగి సంసార తాపము నుండి విడిపడిన వాడు. ఆశ లేనివాడు కనుక ఏదో రాలేదని దుఃఖించడు. మమకారం లేనివాడు కనుక ఏదో పోయిందని బాధ పడడు. 'పరమేశ్వరుని భృత్యుడు' అనే పాత్రను పవిత్రంగా పోషిస్తాడు కనుక ప్రశాంత జీవనాన్ని కొనసాగిస్తాడు. అర్జునా! ఇదే కర్మయోగ వైభవం. ఇప్పుడు ఆలోచించు. కర్మల్ని విడిచిపెట్టి ఏమి సాధిస్తావు? వైభవం అంతా కర్మయోగం లోనే ఉంది. కర్మయోగము నందు శుద్ధిపడిన వాడే జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొంది తరిస్తాడు.

పరమేశ్వరుడు అనుగ్రహించిన ఈ బోధను ఎలా ఆచరించాలో, ఆచరిస్తే కలిగే ఫలితం ఏమిటో చెబుతున్నాడు.

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠన్తి మానవాః ।
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యన్తే తేఽపి కర్మభిః ॥ 31

యే-మే-మతం-ఇదం-నిత్యం-అనుతిష్ఠంతి-మానవాః
శ్రద్ధావంతః-అనసూయంతః-ముచ్యంతే-తే-అపి-కర్మభిః

శ్రద్ధావంతః	= శ్రద్ధ కలవారై	నిత్యం	= ఎల్లప్పుడు
అనసూయంతః	= అసూయ లేనివారై	అనుతిష్ఠంతి	= అనుసరిస్తారో
యే మానవాః	= ఏ మనుజులు	తే అపి	= వారు గూడ
మే	= నా యొక్క	కర్మభిః	= కర్మల చేత
ఇదం మతం	= ఈ అభిప్రాయమును	ముచ్యంతే	= విడి పడతారు

నా ఈ అభిప్రాయాన్ని సదా అనుసరించే వారు శ్రద్ధావంతు లవుతారు. అసూయ లేని వారు అవుతారు. కర్మల నుండి విడిపడతారు.

వ్యాఖ్య

అర్జునా! నేను బోధించిన ఈ కర్మయోగాన్ని గతంలో ఆచరించిన వారందరూ తరించి పోయారు.

అనాదిగా ఎందరికో జ్ఞానభిక్ష పెట్టిన పవిత్ర మార్గమిది. అందుచేతనే జ్ఞానాన్ని పొందిన జనకాదులు కూడా పరానుగ్రహార్థం కర్మల్ని ఆచరించారు. ఇంతెందుకు? ఇతరుల విషయం అలా ఉంచు. నన్ను చూడు! నేను పొంద దగింది ఏదీ లేకపోయినా, నీ బండిలో కూర్చుని సారథ్యం వహిస్తున్నానా, లేదా? పరానుగ్రహార్థం చేసే కర్మలలో పోగొట్టుకొనేది ఏమీ ఉండదు. పైపెచ్చు అట్టి కర్మలు లోకసంగ్రహార్థం సాగుతుంటాయి కనుక వాటి ద్వారా ప్రపంచం లబ్ధిని పొందుతుంది.

అర్జునా! ఎవరో తరించారని ఇతిహాసాల నుండి ఉదహరిస్తే, ప్రస్తుతం ఉన్న వాళ్ళు తరించరు అని భావం కాదు. నీళ్ళు ఏ కాలంలో అయినా, ఏ వ్యక్తికైనా దాహాన్ని తీరుస్తాయి. నేను బోధించిన జ్ఞానం కూడా అలాంటిదే. అది ఎవరినైనా, ఎప్పుడైనా తరింప చేస్తుంది. కాకపోతే, ఈ మార్గాన్ని నిరంతరం ఆచరించాలి. అంతేకాదు, ప్రస్తుతం మనకున్న వాటిలో కొన్నిటిని తొలగించు కోవాలి, లేని వాటిని కొన్నిటిని తగిలించు కోవాలి. అవేమిటో చెబుతాను. విను.

కర్మయోగంలో చరించే భక్తులు (1) శ్రద్ధావంతులై ఉండాలి. (2) అసూయ లేనివారై ఉండాలి. అంటే, శ్రద్ధను గట్టిగా పట్టుకోవాలి. అసూయను ప్రయత్నించి పోగొట్టు కోవాలి. శ్రద్ధ లేని వారికి ఈ యోగము ఎలా వంట పట్టదో, అసూయాపరులకు కూడా అలాగే వంట పట్టదు.

శ్రద్ధ అంటే శాస్త్ర విషయం లోను, శాస్త్రమును బోధించే సద్గురువు విషయం లోను అకుంఠితమైన విశ్వాసమును కలిగి ఉండటం. ఇక్కడ శాస్త్రము గీతాశాస్త్రము. గీత మోక్షశాస్త్రము. ప్రమాణ రూపంలో ఉన్న ప్రసాదము. ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకొని స్వీకరించినట్లు, గీతాశాస్త్రాన్ని పవిత్రంగా, ప్రమాణంగా విశ్వసించి ఆచరణలో పెట్టు కోవాలి.

శ్రద్ధ కలవారై ఉండాలి. అసూయ లేనివారై ఉండాలి. అసూయ అనేది ఒక విచిత్రమైన దుర్గుణం. అది నిప్పు లేకుండా లేచే పొగ. నేల విడిచి సాము చేసే ప్రక్రియ. మన కన్నా ఆధిక్యాన్ని, అభివృద్ధిని సాధించిన వాళ్ళను చూచి నపుడు మనస్సును ద్వేషంతో నింపే ఒకానొక దుర్గుణం అసూయ అని సాధారణంగా భావిస్తూ ఉంటారు. అది ఉండ కూడని అవలక్షణమే. కాని, అది అసూయ కాదు, మాత్సర్యము. ఇతరులలో ఉన్న దానిని చూచి ఓర్వలేని గుణము. అసూయ అది కాదు. అసూయ అంటే, లేని దానిని ప్రయత్న పూర్వకంగా ఆరోపించడం. గుణాలలో దోషాన్ని దర్శించడం ***(గుణేషు దోషదర్శనం).*** ఉన్న మంచిని చూడలేక పోగా, లేని దోషాన్ని ఆరోపించి చూడటం అసూయ అనే దుర్గుణం.

ఎవరైనా పవిత్రంగా దానం చేస్తూ ఉంటే, అసూయాపరుడు జీర్ణించుకో లేడు. ఆ దానకర్మ వెనుక ఏదో లబ్ధిని పొందాలనే ఉద్దేశం ఉందని ప్రసంగం సాగిస్తాడు. ఇలా అసూయాపరులు విశృంఖలంగా వ్యవహరిస్తూ ఉంటారు. ఇలాంటి దుర్గుణము లేకుండా ఉంటేనే కర్మయోగము ఫలితా న్నిస్తుంది.

అర్జునా! మోక్ష శాస్త్రమైన గీతాశాస్త్రము నందు శ్రద్ధ ఉండాలి. అసూయ ఉండ కూడదు. అలాగే, గీతా శాస్త్రాన్ని బోధిస్తున్న సద్గురువు నైన నా విషయంలో కూడా శ్రద్ధ ఉండాలి. అలాగే, నా విషయంలో అసూయ ఉండ కూడదు ***(అనసూయన్తః అసూయాం మయి గురౌ వాసుదేవే అకుర్వన్తః).***

శాస్త్రం బోధించే విషయంలో సందేహాలు ఉండ వచ్చు. వాటిని ప్రయత్నించి, పరిప్రశ్నించి తొలగించు కోవాలి. శాస్త్ర విషయంలో సందేహాలు ఉండవచ్చు. అలాగని శాస్త్రాన్ని సందేహించ కూడదు. ప్రమాణగత సంశయం ప్రమాదాన్ని సృష్టిస్తుంది. శాస్త్రం విషయంలో శ్రద్ధ కలవాడు శాస్త్రాన్ని సందేహించడు. శాస్త్రం విషయంలో తన అవగాహనను సందేహిస్తాడు. ఇదే సంప్రదాయం.

అర్జునుడికి శ్రద్ధ ఉంది. అయినా, సందేహాలను జగద్గురువైన గీతాచార్యుని ముందు పరుస్తూ నివృత్తి చేసుకున్నాడు. సందేహం కలిగి నపుడు శాస్త్రాన్ని ప్రశ్నించ లేదు. తన అవగాహనను ప్రశ్నించుకున్నాడు. గురుబోధలో దోషాన్ని చూడ లేదు. తన అవగాహనను తాను పునః పరిశీలించు కున్నాడు. ప్రశ్నించు కున్నాడు. తన బుద్ధికి విన్న విషయం అస్పష్టంగా ఉన్నట్లు నిర్ణయించు కున్నాడు (**వ్యామిశ్రేణ ఇవ**). ఇదే శ్రద్ధ.

అర్జునా! ఇలాంటి శ్రద్ధ కలిగి, అనసూయాపరు లైన వారు, సదా ఈ యోగాన్ని అనుసరిస్తే (**నిత్యం అనుతిష్ఠన్తి**) కర్మ సుడిగుండం నుండి తప్పక బయట పడ గలరు. కాకపోతే, ఇది నిత్యానుష్ఠానం కావాలి. సదా ఆచరించాలి. కర్మలు సదా సాగుతూ ఉంటాయి కనుక, కర్మలలో యోగబుద్ధి సదా ఉండాలి.

కర్మయోగి ఎవరో కాదు, భక్తుడే కర్మయోగి. అందుచేత కర్మయోగి పూజ చెయ్యవచ్చు. అది బహిరంగ సాధన. అలాగే, కర్మయోగి కళ్ళు మూసుకొని సగుణబ్రహ్మ ధ్యానాన్ని కొనసాగించ వచ్చు. అది అంతరంగ సాధన. సాధనలకు సమయాలు ఉంటాయి. కాని, కర్మలు నిరంతరం సాగుతూనే ఉంటాయి. అట్టి కర్మలలో యోగబుద్ధిని కలిగి ఉండటం నిత్యసాధన.

శ్రద్ధ అనేది ఆధ్యాత్మిక మార్గంలో అమృతము వంటిది. శాస్త్ర విషయంలో, సద్గురువు విషయంలో ఎవరికి ఎంత శ్రద్ధ ఉంటే, అంత ఫలం అందుతూ ఉంటుంది. ఇక, అసూయ అంటారా! అది విషం లాంటిది. గురువు ప్రసాదించే జ్ఞానామృతంలో అసూయ అనే విషం కలిస్తే, ఆ తరువాత ప్రమాణఫలం ప్రాప్తించే అవకాశమే ఉండదు. కనుక ఈ శ్లోకంలో పరమేశ్వరుడు సూచించిన రెండు ప్రధాన విషయాలను సాధకులు సదా మనస్సులో నింపుకొని ముక్తి మార్గంలో పయనించాలి.

అలా కాకుండా, పైన చెప్పిన దానికి భిన్నంగా, విపరీతంగా చరించే మూఢులు ఏమవుతారో తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.

యే త్వేత దభ్యసూయన్తో నానుతిష్ఠన్తి మే మతమ్ ।
సర్వజ్ఞాన విమూఢాం స్తా న్విద్ధి నష్టా నచేతసః ॥ 32

యే-తు-ఏతత్-అభ్యసూయంతః-న-అనుతిష్ఠంతిః-మే-మతం
సర్వజ్ఞాన విమూఢాన్-తాన్-విద్ధి-నష్టాన్-అచేతసః

యే తు	= ఎవరైతే		
మే	= నా యొక్క	తాన్	= వారిని
ఏతత్ మతం	= ఈ అభిప్రాయమును	అచేతసః	= అవివేకులుగా
అభ్య సూయంతః	= అసూయాపరులై	సర్వజ్ఞాన విమూఢాన్	= ఏ జ్ఞానము లేని వాళ్ళుగా
న అనుతిష్ఠంతి	= అనుసరించరో	నష్టాన్	= చెడిపోయిన వాళ్ళుగా
		విద్ధి	= తెలుసుకో

అసూయాపరులు నా అభిప్రాయాన్ని అనుసరించరు. వారు మూర్ఖులు. వారిని సర్వ జ్ఞాన శూన్యులుగా, భ్రష్టులుగా తెలుసుకో!

వ్యాఖ్య

శ్రద్ధ కలవారై, అసూయా రహితులై పరమేశ్వరుని అభిమతానికి (**ఈశ్వరస్య మతం**) అనుగుణంగా చరించే వారు జ్ఞానవంతులై తరించి పోతారు. దానికి భిన్నంగా, అసూయాపరులై, ఆచార్యుని యందు, ప్రమాణము నందు శ్రద్ధ లేనివారై, భగవంతుడు ఉపదేశించిన మార్గమును విడిచిన వారై, ఇటు కర్మ సంబంధ మైన జ్ఞానము లేక, అటు బ్రహ్మ సంబంధమైన జ్ఞానము లేక భ్రష్టులై పోతారు.

అలాంటి వారు అవివేకులు (*అచేతసః*). వ్యర్థమైన వాదాలతో, శుష్క వచనాలతో బ్రతుకును బుగ్గి చేసుకుంటారు. తత్ఫలితంగా వారు నశిస్తారు అంటున్నాడు భగవంతుడు (*నష్టాన్ నాశం గతాన్*).

ఇక్కడ నష్ట మేమిటో కూడా అర్థం కావాలి. నష్ట మంటే ఉన్న దానిని పోగొట్టుకోవడం అని కాదు. వచ్చే దానిని రాబట్టుకోలేక పోగొట్టుకోవడం అని అర్థం. ఈ ప్రపంచం లోకి మనం లక్ష్యసాధన కోసం వచ్చాం. ఇక్కడ మోక్ష సాధన కొరకే ఉన్నాం. ఈ అవకాశం దేవతలకు కూడా లేదు. ఒక్క మానవుడికే ఉంది. అందుచేతనే గడచిన శ్లోకంలో **మానవాః** అని ప్రత్యేకించి చెప్పి, తరించే అవకాశం ఒక్క మానవుడికే ఉందని తెలిపాడు. అలాంటి అవకాశాన్ని జారవిడుచు కోవడం కన్నా మించిన నష్టం ఏముంటుంది? అందుకే సర్వజ్ఞాన విమూఢులై (*సర్వజ్ఞాన విమూఢాన్*) నశించి పోతారు అంటున్నాడు భగవంతుడు.

ఇక్కడ అన్ని రకాలైన జ్ఞానాల విషయంలో వివేకం లేనివాడు కనుక సర్వజ్ఞాన విమూఢుడు అని అర్థం కాదు. అన్ని విషయాలలో జ్ఞానం లేకపోవడ మేమిటి? నిరుపయోగ మైన అనేక విషయాలకు సంబంధించిన జ్ఞానం అవివేకికి బాగా ఉంటుంది. శాస్త్రాన్ని, గురువును విమర్శించే జ్ఞానం ఉంది కదా? అది జ్ఞానమా, అజ్ఞానమా - అనేది వేరే విషయం. అసలే జ్ఞానం లేకుండా మాత్రం లేదు. మూఢుడికి మూఢ జ్ఞానము ఉంది. కాని, సర్వజ్ఞానం లేదు. అందుకే అతడు సర్వజ్ఞాన విమూఢుడు.

భగవంతుడికి 'సర్వం' అని పేరు. అంటే 'సర్వుడు' అని అర్థం (**సర్వః సర్వస్య సర్వదా జ్ఞానాత్ సర్వమ్**). సర్వ రూపుడు కనుక పరమేశ్వరుడు సర్వుడు. సర్వుడైన ఈశ్వరునికి సంబంధించిన జ్ఞానము సర్వజ్ఞానము. అట్టి సర్వ జ్ఞానమునకు సంబంధించిన వివేకము లేనివాడు సర్వజ్ఞాన విమూఢుడు. కనుక శ్రద్ధ లేనివారు, అసూయా పరులైన మూర్ఖులే విమూఢులు. సంశయగ్రస్తులు. వీరు ప్రమాణ, ప్రమేయ, ప్రయోజన విషయాలలో మూఢులై ఉంటారని ఆనందగిరి శంకర భాష్యానికి రచించిన టీకలో తెలిపారు.

కృష్ణా! పవిత్రమైన నీ మార్గాన్ని వీళ్ళు ఎందుకు అనుసరించరు? పరధర్మాన్ని ఎందుకు ఆశ్రయిస్తారు? దోషాల నుండి బయటపడే తోషంతో జీవించాలని ఎందుకు అభిలషించరు? అనే సందేహాలకు సమాధానం చెబుతున్నాడు.

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతే ర్జ్ఞానవా నపి ।
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33

సదృశం-చేష్టతే-స్వస్యాః-ప్రకృతేః-జ్ఞానవాన్-అపి
ప్రకృతిం-యాంతి-భూతాని-నిగ్రహః-కిం-కరిష్యతి

జ్ఞానవాన్ అపి	= జ్ఞానవంతుడు కూడా	ప్రకృతిం	= స్వభావాన్నే
స్వస్యాః	= తనదైన	యాంతి	= పొందుతూ ఉంటాయి
ప్రకృతేః	= స్వభావానికి	నిగ్రహః	= నిగ్రహము
సదృశం	= తగినట్లుగా	కిం	= ఏమి
చేష్టతే	= ప్రవర్తిస్తాడు	కరిష్యతి	= చేయగలదు?
భూతాని	= ప్రాణులు		

జ్ఞానవంతు డయినా తన స్వభావానికి అనుగుణం గానే ప్రవర్తిస్తున్నాడు. ప్రాణులన్నీ తమ స్వభావాన్ని అనుసరించే నడుస్తున్నాయి. కాబట్టి, నిగ్రహము ఏమి చేస్తుంది?

వ్యాఖ్య

అతడు ఎందుకలా ప్రవర్తించాడు? ఆమె ఆ విధంగా ఎలా మాట్లాడ గలిగింది? ఎంత చెప్పినా అలాగే చేస్తా డెందుకని? ఆ వ్యక్తి ఇక మారే అవకాశమే లేదా? అనే ప్రశ్నలు ఎదురైన నపుడు, ఏం చేద్దామండీ! అది అతని స్వభావం. అతడు అంతే. అది ఆమె స్వభావం. ఆవిడ మారదు అనే మాటలు జవాబులుగా వినపడుతూ ఉంటాయి. ఈ మాటలు సాధారణంగా సామాన్యుల నోటి నుండి వింటూ ఉంటాం. కాని, అవే మాటలు సాక్షాత్తు భగవంతుని ముఖత: ప్రస్తుతం వింటున్నాము.

ప్రకృతిని బట్టే ప్రవృత్తి

సమస్త ప్రాణులు తమ స్వభావాన్ని అనుసరించే ప్రవర్తిస్తూ ఉంటాయి. జ్ఞాని కూడా తన స్వభావానికి అనుగుణం గానే ప్రవర్తిస్తూ ఉంటాడు. తన ప్రకృతిని, లేదా స్వభావాన్ని నిగ్రహించడం ఎవరికీ సాధ్యమయ్యే పని కాదు అంటున్నాడు గీతాచార్యుడు.

పూర్వజన్మ సంస్కారాలు ప్రస్తుత జన్మలో అభివ్యక్త మవుతూ ఉంటాయి. అదే ప్రకృతి, లేదా స్వభావము (***ప్రకృతి: నామ పూర్వకృత ధర్మాది సంస్కార: వర్తమాన జన్మాదౌ అభివ్యక్త:***). పూర్వ జన్మములో ఆచరించిన ధర్మాధర్మాలు, రాగద్వేషాది కర్మల వలన ఏర్పడిన సంస్కారమే నేటి జన్మలో మానవుని స్వభావంగా ఉంటుంది. అదే మానవ ప్రకృతి అంటే. తన ప్రకృతికి అనుగుణం గానే మనిషి ప్రవర్తిస్తూ ఉంటాడు. స్వభావానికి భిన్నంగా ప్రవర్తించడం ఎవరికీ సాధ్యమయ్యే విషయం కాదు. గత జన్మ సంస్కార జనిత వాసనలకు అనుగుణమైన ప్రదేశాల లోనే ప్రాణులు పుడుతూ ఉంటాయి.

వైద్య విద్యను అభ్యసించిన వ్యక్తి వైద్యశాల లోనే ఉంటాడు. పాఠశాలలో ఉండడు. ఉపాధ్యాయ వృత్తిలో శిక్షణ పొందిన వ్యక్తి పాఠశాలలో బోధిస్తూ ఉంటాడే గాని వైద్యశాలలో వైద్యం చేస్తూ కనిపించడు. జన్మ సంస్కార ప్రవృత్తి కూడా ఇలాగే ఉంటుంది.

గత జన్మ సంస్కారాలే ప్రస్తుత జన్మలో స్వభావంగా ఉన్నపుడు, తన ప్రకృతికి భిన్నంగా చరించడం ఎవ్వరికీ సాధ్యపడదు. స్వభావమే మనిషి చేత కర్మ చేయిస్తుంది. స్వభావ సిద్ధములైన గుణాల చేత నెట్టబడి ప్రతి వ్యక్తి అస్వతంత్రుడై కర్మల్ని ఆచరిస్తాడు అని కర్మయోగము - ఐదవ శ్లోకం లోనే భగవానుడు చెప్పి ఉన్నాడు (**కార్యతే హి అవశ: కర్మ సర్వ: ప్రకృతిజై ర్గుణై:**). ప్రకృతి అధీనంలో ఉన్నవారు ప్రవృత్తికి ఎలా దూర మవుతారు? ఒక కర్మను ఆపడం అంటే, మరొక కర్మను ఆరంభించడం అని అర్థం. స్వభావమే కర్మల్ని చేయిస్తుంది. ఆహారం తినను అని కూర్చున్న వ్యక్తి చేత కూడా ఆకలి ఎలా తినేలా చేస్తుందో, కర్మ చేయను అని కూర్చున్న వ్యక్తి చేత కూడా స్వభావం కర్మ చేయిస్తుంది.

గత జన్మ కృత పుణ్యపాప కర్మల వలన ఏర్పడిన సంస్కారము మనస్సు లోతుల్లో వాసనల రూపంలో ఉంటుంది. అదే స్వభావము, లేదా ప్రకృతి. అనుకూల పరిస్థితులలో, సమయాలలో బహిర్గత మయ్యేందుకు యత్నిస్తూ ఉంటుంది. బావి లోని నీటిని చేదతో తోడి బయటికి తీసినట్లు, ఇంద్రియాలు నిగూఢంగా ఉన్న వాసనల్ని బాహ్యానికి ఈడుస్తాయి. ఆ ప్రవాహాన్ని ఆపడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ప్రకృతి వేగాన్ని ఎవ్వరూ ఆపలేరు. ఒకవేళ ఆపే ప్రయత్నం చేసినా, నదిని నిరోధించినట్లే ఉంటుంది. గాలిని అరచేతిలో బంధించినట్లే ఉంటుంది. అందుచేతనే, ***నిగ్రహం కిం కరిష్యతి*** - స్వభావాన్ని నిగ్రహించడం ఎలా కుదురుతుంది? అని భగవంతుడే ప్రశ్నిస్తున్నాడు. స్వభావాన్ని నియంత్రించడం అసంభవం అంటున్నాడు. శ్రీ శంకరాచార్యస్వామి తమ భాష్యంలో, స్వభావ ప్రవాహంలో కొట్టుకుపోయే వారిని, అన్యుల మాట అటుంచి, స్వయంగా భగవంతుడు కూడా ఆపలేడు అన్నారు (***నిగ్రహ: కిం కరిష్యతి, మమ వా అన్యస్య వా***).

నిజమే కదూ! తమ వాసనలకు (***స్వస్యా: ప్రకృతే:***) అనుగుణం గానే (***సదృశమ్***) మనిషి ప్రవర్తించే టప్పుడు (***చేష్టతే***) అలా ప్రవర్తించడం వెనుక నియతి ఉందా, లేదా? నియతి రూపంలో ఉన్నది నియంతే కదూ! మరి నియతిని నియంత అతిక్రమిస్తాడా? ధర్మాన్ని దైవమే ఉల్లంఘిస్తాడా? స్వభావాన్ని ఆపడం అందుకే అసంభవము. స్వభావాన్ని నిగ్రహించలేక పోవడం చేతనే పరమేశ్వరుని బోధను మానవులు అనుసరించలేక పోతున్నారు. అందుకే మార్పు బాధాకరం. మనిషిని మార్చడం కష్టతరం. స్వభావ ప్రేరణతో ప్రకోపించిన సుయోధనుని వాసుదేవుడే మార్చలేక పోయాడు.

పల్లవి : **మారిన దెవరు? మార్చే దెవరు?**
మార్పు మనిషికి సాధ్యమా మనసా! ॥ **మారిన** ॥

అనుపల్లవి : **కురిసే మబ్బును నిలిపే దెవరు?**
మారే మనసును ఆపే దెవరు? ॥ **మారిన** ॥

చరణము : **నీది కానిది నీకు లేనిది**
ఇవ్వలేరు ఇలలో దేవతలైనా
కర్కశమైన కౌరవపతిలో
మార్పును చూశాడా కేశవుడైనా ॥ **మారిన** ॥

అని నిగ్రహింప బడని ప్రకృతిని పల్లవితో ముడి వేసి, చరణంలో చర్చించింది చైతన్య గీతిక.

జ్ఞాని ప్రత్యేకం కాదు

సామాన్యులే కాదు, జ్ఞాని కూడా తన ప్రకృతికి అనుగుణం గానే ప్రవర్తిస్తాడు అంటూ విస్మయాన్ని గొలిపే విషయాన్ని వినిపిస్తున్నాడు (***జ్ఞానవాన్ అపి స్వస్యా: ప్రకృతే: సదృశం చేష్టతే***). తాను అకర్తగా శోభిస్తున్నా, జ్ఞాని ఆచరించే కర్మలు స్వభావాన్ని అనుసరించే సాగుతున్నాయి అంటున్నాడు.

ప్రారబ్దానుసారం జ్ఞాని దేహం ద్వారా కర్మలు ఎలా జరుగుతూ ఉన్నాయో, గత జన్మ సంస్కార జనిత వాసనల కనుగుణంగా జ్ఞాని కర్మలలో ప్రవర్తిస్తూ ఉంటాడు. కాకపోతే, జ్ఞాని స్వభావం పవిత్రంగా ఉంటుంది కనుక, ఆయన ద్వారా పవిత్రమైన కర్మలే అప్రయత్నంగా సాగిపోతూ ఉంటాయి. దేహంలో గుండె ఆడినట్లు, రక్తం పారినట్లు, రెప్పపాట్లు పడినట్లు, శ్వాసలు అల్లలాడినట్లు, మనస్సు లోని స్వభావము అప్రయత్నంగా ప్రవర్తిస్తూ ఉంటుంది.

మరి, స్వభావ ఆగ్రహాన్ని నిగ్రహించ లేనపుడు, అందరూ ప్రారబ్దం చేతిలో కీలుబొమ్మలే కదా? అంతా ప్రారబ్ద ప్రాభవమే కదా? ఇక పురుషార్థానికి స్థాన మెక్కడుంది? పురుషార్థ సాధనకు అవకాశమే లేనపుడు శాస్త్రము యొక్క ప్రయోజన మేమిటి? ***సత్యం వద - ధర్మం చర*** - సత్యాన్ని పలుకు - ధర్మంగా నడుచుకో అంటోంది శాస్త్రం. మరి, స్వభావం అసత్య భాషణంతో, అధర్మ ఆచరణతో నిండి ఉన్నప్పుడు, శాస్త్రం చెప్పిన దానిని ఆచరించే అవకాశ మెక్కడుంది? స్వభావాన్ని నిగ్రహించడం సాధ్యపడదని భగవంతుడే చెబుతున్నాడు కదా! అలాంటప్పుడు విహిత కర్మాచరణ ఎలా సాధ్యం?

ఈ సంశయాన్ని తరువాత శ్లోకంలో నివారిస్తున్నాడు.

ఇన్ద్రియ స్యేన్ద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయో ర్న వశ మాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపన్థినౌ ॥ 34

ఇంద్రియస్య-ఇంద్రియస్య-అర్థే-రాగద్వేషౌ-వ్యవస్థితౌ
తయోః-న-వశం-ఆగచ్ఛేత్-తౌ-హి-అస్య-పరిపంథినౌ

ఇంద్రియస్య	= ప్రతి ఇంద్రియమునకు		వశం	=	వశమును
ఇంద్రియస్య అర్థే	= ఇంద్రియ విషయము నందు		న ఆగచ్ఛేత్	=	పొంద గూడదు
రాగద్వేషౌ	= రాగద్వేషములు		తౌ	=	ఆ రాగద్వేషములు
వ్యవస్థితౌ	= ఏర్పడి ఉన్నాయి		అస్య	=	సాధకునికి
తయోః	= ఆ రాగద్వేషములకు		పరిపంథినౌ హి	=	శత్రువులు గదా

ప్రతి ఇంద్రియానికి దానికి సంబంధించిన ఇంద్రియ విషయము నందు రాగద్వేషాలు ఏర్పడి ఉన్నాయి. రాగద్వేషాలకు ఎవ్వరూ వశపడ కూడదు. రాగద్వేషాలు సాధకునికి ప్రబల శత్రువులు కదా!

వ్యాఖ్య

ఏ వ్యక్తి కూడా తన ప్రకృతికి, లేదా స్వభావానికి భిన్నంగా ప్రవర్తించ లేడని అర్థం చేసుకున్నాం. స్వభావమే జీవితాన్ని నడుపుకుంటూ పోతూ ఉంది. మన కర్మల్ని స్వభావమే నిర్ణయిస్తూ ఉంది అని గ్రహించాం.

స్వభావాన్ని అనుసరించే అందరూ ప్రవర్తిస్తున్నారు అన్నప్పుడు స్వభావం లేనివారు ఎవరుంటారు? ఎవ్వరూ ఉండరు (*న చ ప్రకృతి శూన్యః కశ్చి దస్తి*). ఒకవేళ, అలాంటి వారు ఎవరైనా ఉంటే, వారికి మాత్రమే శాస్త్రం ఉపయోగ పడుతుందని, స్వభావ ప్రేరణలో ప్రవర్తించే వారికి శాస్త్రం ఉపయోగ పడదని అర్థం. అలాంటప్పుడు ఇక శాస్త్రాధ్యయనం ఎందుకు? ఆ సందేహానికి సమాధానమే ఈ శ్లోకం.

స్వభావం కర్మలను నిర్ణయించ వచ్చు. స్వభావ సిద్ధమైన కర్మలు బంధాన్ని కలిగించవు. రాగద్వేషాలతో కలిసి నపుడే కర్మలు బంధిస్తాయి. రాగద్వేషాల విషయంలో మనం జాగ్రత్తగా ఉంటే, స్వభావజనిత కర్మలు బంధహేతువులు కావు. స్వభావాన్ని మనం నిగ్రహించలేక పోవచ్చు. కాని, వివేకంతో చరిస్తే రాగద్వేషాలను కట్టడి చేయగలం.

రాగద్వేషాలు

ప్రతి ఇంద్రియానికి తత్సంబంధమైన ఇంద్రియ విషయము నందు రాగద్వేషాలు ఉంటాయి. **ఇంద్రియస్య ఇంద్రియస్య** అని రెండుసార్లు చెప్పడాన్ని సంస్కృత భాషా ప్రక్రియలో **వీప్సా** అంటారు. అంటే, ద్విరుక్తి అని అర్థము. 'ఇంద్రియస్య ఇంద్రియస్య' అంటే సమస్తమైన ఇంద్రియముల యొక్క **అర్థే** - విషయముల యందు; అనగా రూపము నందు, శబ్దము నందు, రసము నందు, స్పర్శము నందు, గంధము నందు అని అర్థము. ప్రతి ఇంద్రియానికి తత్సంబంధమైన ఇంద్రియ విషయము ఇష్టమైతే రాగము ఏర్పడుతుంది (***ఇష్టే రాగః***). అనిష్ట మైతే ద్వేషము కలుగుతుంది (***అనిష్టే ద్వేషః***).

విషయాలను గుర్తించ డానికి ఇంద్రియాలు ఉపకరిస్తాయే గాని, రాగద్వేషాలను ఇంద్రియాలు కదిలించ లేవు. రాగద్వేషాలు కదల డానికి స్వభావమే కారణము. అందుచేత కళ్ళు చూపించిన వన్నీ మనం కోరుకోము. వాటికి సంబంధించిన వాసనలు మన వద్ద ఉన్నప్పుడే అవి మనల్ని ఆకర్షిస్తాయి. ఆకర్షించిన వాటినే మనం కోరుకుంటాము.

ఎంత విశిష్టమైన వస్తువునైనా అందరూ అభిలషించలేక పోవడానికి స్వభావమే కారణము. మనము దేనిని కోరుకున్నా, ఆ కోరిక వెనుక స్వభావ ప్రేరణ ఉంటుంది. కాని, అది మనకు కనిపించదు. మెదడు యొక్క లోతుల్లో ఉంటుంది కనుక అర్థం కాదు కూడా. 'ఏం చేద్దాం! నేను అలాగే ప్రవర్తిస్తూ ఉంటాను. అది నా

స్వభావం' అని మనుషులు చెప్పుకోవడం కూడా వింటూ ఉంటాము. స్వభావం ముందు మనిషి ఎంత అశక్తుడో ఆ మాటల్ని విశ్లేషిస్తే అర్థ మవుతుంది.

ఒక పువ్వును నచ్చినా, ఒక మనిషిని మెచ్చినా, ఒక పండును కోరినా, ఒక బట్టను ధరించినా, ఒక పదార్థాన్ని ఆశించినా, ఒక ప్రదేశాన్ని నిరసించినా వాటి వెనుక కారణా లున్నాయి. అవన్నీ స్వభావంలో దాగి ఉన్నాయి. వ్యక్తుల స్వభావాలు భిన్నంగా ఉన్నాయి కనుక, రాగద్వేషాలలో వ్యత్యాసాలు గోచరిస్తూ ఉన్నాయి.

పెళ్ళిచూపులలో అనేక మందిని చూడటానికి ఇదే కారణము. వాస్తవానికి అక్కడ చూస్తున్నవి కళ్ళు కాదు. మనస్సూ కాదు. మనస్సులో అంతర్లీనంగా ఉన్న స్వభావం. స్వభావమే సానుకూలమైన వ్యక్తి కొరకు అన్వేషిస్తూ ఉంది. ఎందరో అందమైన అబ్బాయిలను చూసిన తరువాత, సాధారణ రూపాన్ని చూసి అమాంతం పెళ్ళికుమార్తె నచ్చేస్తుంది. అందమైన వాళ్ళను ఎందరినో చూచి కాదన్నావు. చివరికి ఈ చింతపండు నచ్చాడా? అని ఎవరైనా ఎగతాళి చేస్తే, నా కళ్ళతో చూస్తే మీకు అర్థ మవుతుంది అంటుంది పెళ్ళి కుమార్తె. నిజమే. అది అక్షర సత్యం. దృశ్యం అందరి నేత్రాలకు ఒకే విధంగా కనిపిస్తుంది. కాని, నచ్చడం అనేది చూడటం మీద ఆధారపడి లేదు. స్వభావం మీద ఆధారపడి ఉంది. ఆ స్వభావ జనిత ఆకర్షణే నేత్రాల ద్వారా ప్రసరించి నచ్చడం లేదా మెచ్చడం జరుగుతుంది.

ఏది నచ్చినా, ఏది నచ్చక పోయినా వాటి వెనుక రాగద్వేషా లున్నాయి. ఈ రాగద్వేషాలను స్వభావం కదిలిస్తూ ఉంటుంది. తదనుగుణంగా అస్వతంత్రుడైన మనిషి ప్రవర్తిస్తూ ఉంటాడు. మనస్సులో నిక్షిప్తమై ఉన్న సంస్కారం మీద మానవునికి ఆధిపత్యం లేదు. స్వభావం మనిషి అధీనంలో ఉండదు. కాని, చేసే కర్మలలో మనిషికి స్వేచ్ఛ ఉంది. ఒక కర్మను చెయ్యవచ్చు (***కర్తుం శక్యం***). చేయక పోవచ్చు (***అకర్తుం శక్యం***). మరో విధంగా చెయ్యవచ్చు (***అన్యథావా కర్తుం శక్యం***). కనుక స్వభావం ముందుకు తోస్తున్నా, స్వభావాన్ని నిగ్రహించ లేని వ్యక్తి కర్మల విషయంలో తన కున్న స్వేచ్ఛను వినియోగించుకో వచ్చు. రాగద్వేషాలను మార్చలేక పోవచ్చు నేమో గాని, రాగద్వేషాలకు చిక్కకుండా కర్మల్ని ఆచరించ వచ్చు. ఇదే కర్మయోగంలో దాగి ఉన్న వైభవం.

ఉంటే ఉండనీ - కలిసి ఉండకు

స్వభావం కర్మల్ని నిర్ణయించ వచ్చు. ప్రవర్తనను నియంత్రించ వచ్చు. కాని, మన కర్మస్వేచ్ఛను నిషేధించ లేదు. పూర్వజన్మ సంస్కార జనిత వాసనలు ఒక వైపు ప్రవాహ రూపంలో ప్రేరేపిస్తున్నా, ప్రస్తుత జన్మలో పురుష ప్రయత్నంతో సాగుతున్న పరమార్థ సాధనను అవగాహనతో కొనసాగిస్తే, రాగద్వేషాలకు వశం కాకుండా కర్మల్ని ఆచరించ వచ్చు. స్వభావము స్వధర్మంగా రూపు దాల్చినా, రాగద్వేషాలు లేకుండా స్వధర్మాన్ని ఆచరించి కర్మబంధం నుండి విడిపడ వచ్చు. స్వభావం ఎలా వ్యక్త మవుతుంది? రాగద్వేషాల ద్వారానే వ్యక్తం కావాలి. రాగద్వేషాలను ఎప్పుడైతే తటస్థ పరచామో, ఆ తరువాత కోరలు తీసిన పాము లాగా కర్మలు నిర్వీర్య మవుతాయి. బంధాన్ని కలిగించ కుండా ప్రారబ్ధం కరిగి పోతూ ఉంటుంది. అందుచేతనే, 'రాగద్వేషాలకు వశపడకు' అంటున్నాడు భగవంతుడు (***తయోః రాగద్వేషయోః వశం న ఆగచ్ఛేత్***). అంతేగాని, 'రాగద్వేషాలు లేకుండా ఉండు' అని చెప్పలేదు. ఎందుకంటే, అవి స్వభావంలో ఉంటాయి. వాటిని నియంత్రించ లేము. కనుక, వాటికి వశపడకు అన్నాడు. ఇది కర్మస్వేచ్ఛను ఆవిష్కరిస్తోంది.

రాగద్వేషాలను తటస్థ పరచ గలిగితే కర్మలు బంధించవు. కనుక రాగద్వేషాలను అవశ్యం తటస్థ పరచాలి. అది కర్మయోగం ద్వారానే సాధ్యం. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను నైవేద్యంగా సమర్పించి, ఫలితాల్ని ప్రసాదంగా స్వీకరించి నపుడు ఇక రాగ మెక్కడుంది? ద్వేషం ఎలా ఉంటుంది? రాగద్వేషాలు లేనపుడు

ఇక బంధ మెక్కడుంది? రాగద్వేషాలే మనిషికి ప్రబల శత్రువులు. శ్రేయో మార్గంలో అవే విఘ్నాలు. ప్రతిబంధకాలు. కనుక అవే శత్రువులు అంటున్నాడు (*పరిపన్థినః హి*).

స్వభావజనిత రాగద్వేషాల చేత ప్రేరేపింప బడిన వాడు పరధర్మం కూడా అనుసరణీయమే అని భావిస్తాడు. అది యుక్తం కాదు. ఆ విషయాన్ని చెబుతున్నాడు.

శ్రేయా న్స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35

శ్రేయాన్-స్వధర్మః-విగుణః-పరధర్మాత్-స్వనుష్ఠితాత్
స్వధర్మే-నిధనం-శ్రేయః-పరధర్మః-భయావహః

స్వనుష్ఠితాత్	=	బాగుగా ఆచరింప బడిన	స్వధర్మే	=	తన ధర్మము నందు
పరధర్మాత్	=	పరధర్మము కంటె	నిధనం	=	మరణమైనా
విగుణః	=	గుణము లేనిదైనా	శ్రేయః	=	శ్రేయస్కరము
స్వధర్మః	=	తన ధర్మము	పరధర్మః	=	పరుల ధర్మము
శ్రేయాన్	=	శ్రేష్ఠమైంది	భయావహః	=	భయాన్ని కలిగిస్తుంది

చక్కగా ఆచరింప బడిన అన్యుల ధర్మము కన్నా, గుణము లేని దైనా స్వధర్మమే మేలు. స్వధర్మము నందు మరణ మైనా మంచిదే. పరధర్మము భయంకరము.

వ్యాఖ్య

మన ప్రకృతికి, లేదా స్వభావానికి అనుకూల మైనది ఏదో అదే స్వధర్మము. ప్రకృతిని అనుసరించి ప్రవృత్తి ఉంటుంది. ఇదే స్వధర్మానుష్ఠానము. స్వధర్మాన్ని ఆచరించడంలో మనం శాస్త్ర విహిత కర్మల్ని ఆచరిస్తూ పోవాలి. విపరీతంగా చరిస్తే పరిస్థితులు వికటిస్తాయి. ఫలితాలు విధ్వారంగా ఉంటాయి.

హింస చేయ కూడదు (*హింసాం న కుర్యాత్*). మద్యపానం చేయ కూడదు (*సురాం న పిబేత్*). మాంస భక్షణం చేయ కూడదు (*కలంజం న భక్షయేత్*). ఇవి శాస్త్ర ప్రతిపాదిత నిషేధాలు. కాని, స్వభావంలో వీటి యందు రాగబుద్ధి ఉంటే, అవి నిషేధాలే అయినా వాటిని మనిషి విధిగా గ్రహిస్తాడు.

స్నాన సంధ్యాదులు, నిత్య నైమిత్తిక కర్మలు శాస్త్ర విహితాలే అయినా, వాటి యందు ద్వేషబుద్ధి ఉంటే వాటిని త్యజిస్తాడు. కనుక చేయకూడని నిషిద్ధ కర్మలు చేయడానికి, చేయవలసిన విహిత కర్మలు చేయక పోవడానికి రాగద్వేషాలే కారణాలని తేలి పోయింది. ఈ రాగద్వేషాలు స్వభావ జనితాలు కనుక వీటికి స్వభావమే ప్రబల కారణము.

స్వభావమే స్వధర్మమై ఉంటుంది. స్వభావ ప్రేరణతో స్వధర్మాన్ని ఆచరించే టప్పుడు, మనకు కర్మస్వేచ్ఛ ఉంది కనుక, శ్రద్ధతో శాస్త్రానుసారం కర్మల్ని కర్మయోగంగా మార్చుకుంటే, పూర్వ సంస్కారాలు ఖర్చయి పోతాయి. నూతన వాసనలు తయారు కావు. కనుక శాస్త్రానుసారం స్వధర్మానుష్ఠానం అనివార్యం. అవసరం కూడా.

స్వధర్మం భవ్యం - పరధర్మం భయరూపం

స్వః ధర్మః స్వధర్మః - తనదైన ధర్మమే స్వధర్మము. తన ప్రకృతికి అనుగుణమైన ధర్మమే స్వధర్మము. అలాంటిది గుణహీనంగా ఉండవచ్చు కూడా (*విగుణః అపి*). అయినా అదే శ్రేయస్కరము (*శ్రేయాన్*). అదే ప్రశస్త మైనది. చక్కగా ఆచరింప బడిన పరధర్మము కంటే స్వధర్మమే ప్రశస్తము.

స్వధర్మాన్ని ఆచరించ డానికి అనుకూలమైన స్వభావము మనస్సులో ఉంది. సంస్కార ప్రేరిత కర్మను, లేదా స్వధర్మాన్ని రాగద్వేషాలు లేకుండా, ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తే, ధర్మరూపంలో దైవమే ఉన్నందున, స్వధర్మానుష్ఠానంలో వాసనలు ప్రక్షాళన మవుతాయి. సుగుణాలతో కూడినదే అయినా పరధర్మము అనుష్ఠింప దగింది కాదు. పరధర్మాన్ని అనుసరించ డానికి ప్రేరణ నిచ్చే అనుకూలమైన స్వభావము మన వద్ద లేకపోవడమే అందుకు కారణము.

ఒక వైపు స్వభావ ప్రేరిత స్వధర్మాన్ని విస్మరించడము వల్ల పూర్వ వాసనలు ప్రక్షాళనం కావు. మరొక వైపు పరధర్మం స్వభావంలో లేనందున ప్రేరణ కరువై పరధర్మాన్ని ఆచరించడం సాధ్యం కాదు. అందుచేత, జీవించినంత కాలము చేసే కర్మలలో ఘర్షణను అనుభవిస్తూ బ్రతక వలసి వస్తుంది. ఇలా బ్రతకడం కన్నా చావడమే మేలు అంటున్నాడు భగవంతుడు. పరధర్మంలో బ్రతకడం కన్నా స్వధర్మంలో మరణించడమే శ్రేయస్కరము (***స్వధర్మే స్థితస్య నిధనం మరణ మపి శ్రేయః పరధర్మే స్థితస్య జీవితాత్***).

స్వధర్మం తల్లి లాగా జన్మతః సంక్రమించింది. భౌతికంగా బిడ్డ పుట్టడానికి తల్లి ఎలా కారణమో, అలాగే జీవి ఆవిర్భావానికి స్వభావం కారణము. స్వధర్మాన్ని మార్చడం సాధ్యం కాదు. ఇష్టం లేకపోతే మళ్ళీ పెళ్ళి చేసుకొని భార్యను మార్చుకోవచ్చు. అలా తల్లిని మార్చడం సాధ్యం కాదు. స్వమాతను కాదని, పరమాత గర్భం నుండి మళ్ళీ పుట్టడం సాధ్యం కాదు. అలాగే స్వధర్మాన్ని నిరసించి, పరధర్మాన్ని స్వీకరించడం కూడా సాధ్యం కాదు.

అర్జునుడు క్షత్రియుడు. క్షత్రియ స్వభావం కలవాడు. క్షత్రియ ధర్మం స్వధర్మంగా కలవాడు. అందుకే అరణ్యంలో కూడా అస్త్రశస్త్రాలు సాధించు కోవడానికి తపస్సు చేశాడు. క్షత్రియ ధర్మమైన యుద్ధకర్మను చేయడానికి కురుక్షేత్రంలో ప్రవేశించాడు. తీరా ప్రవేశించాక, ఏ కారణం చేతనో యుద్ధం కన్నా భిక్షాటనమే శ్రేయస్కర మని భావించాడు. దీనిని వాసుదేవుడు వారిస్తున్నాడు.

యుద్ధం అర్జునుడికి స్వధర్మం. తన ప్రకృతికి సంబంధించింది. భిక్షాటన స్వధర్మం కాదు. పరధర్మం. అర్జునుడు కర్మనిష్ఠకు సంబంధించిన వాడే కాని, జ్ఞాననిష్ఠకు సంబంధించిన వాడు కాదు. అలాంటప్పుడు సన్యాసి ధర్మాన్ని ఎలా ఆచరించగలడు? భిక్షాటన సమయంలో ఎవరైనా ఛీ కొడితే, అర్జునుడు సహించ గలడా? కాని సన్యాసి సంతోషంగా ఆ తిరస్కారాన్ని స్వీకరించ గలడు. అర్జునుడు క్షత్రియ ఆవేశం కలవాడు కనుక, అలా నిందించిన వాణ్ణి శిరచ్ఛేదం చేసినా చేస్తాడు. ఆ చేసేదేదో, దారిన పోయేవాణ్ణి చేసే కన్నా, దుష్టుడైన దుర్యోధనుణ్ణి చేయవచ్చు కదా? పరధర్మమైన భిక్షాటన అర్జునుడికి ఎలా శ్రేయస్కరము? పైకి పెట్టుబడి లేని వ్యాపారంగా కనిపించ వచ్చు. కాని, లోపల భిక్షాటనకు అనుకూలమైన స్వభావము ఏది?

ఇంతెందుకు? అర్జునుడి అన్నగారు భీమసేనుల వారు ఏకచక్రపురంలో మారువేషంలో భిక్షాటన చేశారు కదా! అప్పుడేమైంది? రూపము బ్రాహ్మణ రూపమే గాని, స్వరూప ప్రదర్శన మంతా క్షత్రియునిదే.

భిక్షాటనలో అన్యుల ఇళ్ళ ముందు నిలబడి, 'మాతా! భిక్షాందేహి!' అనలేక పోయాడు. అందుకని ఇళ్ళ ముందు నిలబడి హుంకరించే వాడు. ఆ శబ్దానికి భయపడి తల్లులు భిక్షం వేసేవారు. భిక్షం యాచించినట్లు ఉండేది కాదు, పన్ను వసూలు చేసినట్లే ఉండేది అన్నాడు వ్యాసుడు. ***భిక్షాటనం చ హుంకారాత్, కరవత్ వైశ్యతో౽గ్రహీత్*** - వ్యాపారస్థుల నుండి ప్రభువు సుంకం వసూలు చేసినట్లు భిక్షను సంగ్రహించేవాడట భీమసేనుడు. ఇదెక్కడన్నా ఉందా! ఎందుకు ఉండదు? పరధర్మంలో తప్పక ఉంటుంది.

ఒకవేళ స్వధర్మమైన యుద్ధం దోషపూరితంగా ఉందని, ఏ కష్టము, దోషము లేకుండా భిక్షాటన హాయిగా

ఉంటుందని భావించి, నేడు అర్జునుడు యుద్ధాన్ని మాని, కురుక్షేత్రం నుండి పలాయనమై హరిద్వార్‌లో ఆశ్రమం పెట్టుకున్నా, ప్రక్క ఆశ్రమం సన్యాసితో పోట్లాడుతాడే గాని పద్మాసనంలో కూర్చుని ధ్యానం చేయలేడు. ఒకవేళ చేసినా, ఆ ధ్యానంలో దుర్యోధనుడు దర్శన మిస్తుంటాడే గాని దేవుడు ఉండడు.

ఎవరి వేలిముద్రలు వారివే. ఎవరి చూపు వారిదే. ఎవరి జీర్ణశక్తి వారిదే. ఎవరి స్వధర్మము వారిదే. బాగుగా అనుష్ఠింపబడే పరధర్మం కన్నా గుణహీనంగా కనిపించినా స్వధర్మమే మేలు. భయంకరమైన పరధర్మాన్ని ఆచరించడం కన్నా, స్వధర్మంలో మరణించడమే ఉత్తమము. నేడు మరణించినా, రేపు స్వభావానికి అనుకూల మైన జన్మ వస్తుంది. పరధర్మంలో బ్రతికి పాడు కావడం కన్నా, స్వధర్మంలో మరణించి, తిరిగి జన్మించిన తరువాత స్వధర్మానుష్ఠానాన్ని కొనసాగించడం ఉత్తమం.

పాలు గొప్పవే కావచ్చు. నీళ్ళు పాల లాగా విశిష్ట మైనవి కాక పోవచ్చు. అయినా, చేప నీళ్ళ ల్లోనే బ్రతుకుతుంది. విశిష్ట మైనవి కదా అని చేపను పాలల్లో ఉంచితే చచ్చిపోతుంది. స్వధర్మ పరధర్మాలు ఇలా జీవన్మరణాలకు కారణ మవుతాయి.

ఇక్కడ. ఈ సందర్భంలో అర్జునుని బుద్ధి సంశయంలో పడింది. స్పష్టత కోసం తపిస్తూ ఉంది. ఎందుకని మనిషి అనివార్యంగా పాపం చేస్తున్నాడో తెలుసు కోవాలని భావించి ప్రశ్నిస్తున్నాడు.

అర్జున ఉవాచ :

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।
అనిచ్ఛ న్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥ 36

అథ-కేన-ప్రయుక్తః-అయం-పాపం-చరతి-పూరుషః
అనిచ్ఛన్-అపి-వార్ష్ణేయ-బలాత్-ఇవ-నియోజితః

వార్ష్ణేయ	= కృష్ణా!	నియోజితః ఇవ	= ఆజ్ఞాపింప బడ్డాడా అన్నట్లు
అథ	= అయితే	కేన	= దేని చేత
అయం	= ఈ	ప్రయుక్తః	= ప్రేరేపింప బడిన వాడై
పూరుషః	= పురుషుడు	పాపం	= పాపాన్ని
అనిచ్ఛన్ అపి	= ఇష్టము లేకున్నా కూడా	చరతి	= చేస్తున్నాడు?
బలాత్	= బలవంతంగా		

అర్జునుడు అడుగుతున్నాడు :

కృష్ణా! తనకు ఇష్టం లేకున్నా, ఎవరో బలవంతంగా ఆజ్ఞాపించినట్లు మనిషి పాపం చేస్తున్నాడు. మనిషిని అలా ప్రేరేపించేది ఏది?

వ్యాఖ్య

తప్పులే చెయ్యని వారు ఎవరున్నారు ఈ ప్రపంచంలో? తమలో దోషాలే లేవని ఎవరు చెప్పగలరు? అందరూ చెడిపోయిన వాళ్ళు కారు. కాని, కాస్తో గొప్పో చెడు చేయకుండా ఎవ్వరూ లేరు. మరి, చెడు చేసే వారికి అది చెడు అని తెలిసి చేస్తున్నారా? లేక తెలియక చేస్తున్నారా? తెలిసే చేస్తున్నారు. తెలియకుండా ఎలా చేస్తారు? అలా తెలియకుండా జరిగితే అది పిల్లల్లో జరగాలి. పిల్లలు చేసేది చెడు కాదు. పొరపాట్లు, అంతే.

ఎవరు తప్పు చేసినా తెలిసే చేస్తారు. అధర్మపరులు ధర్మాధర్మాలు తెలియని వారు కారు. దొంగతనము

చేసే వారికి అది తప్పు అని తెలియక కాదు. అది తప్పు కాదని వాళ్ళ అభిప్రాయమైతే, రహస్యంగా ఎందుకు చేస్తారు?

తెలిసే తప్పు చేసే టప్పుడు, అలా చేయడం వారికి ఇష్టమేనా? తప్పు చెయ్యడానికి మనిషి ఎంత ఘర్షణకు గురి కావాలి! మనస్సు ఘర్షణకు గురి కావడం ఎవరికి ఇష్టం? అయినా, మనిషి తప్పు చేస్తూనే ఉన్నాడు. ఇష్టం లేకపోయినా చేస్తున్నాడు. పైగా చెయ్యకూడదు అనుకున్నా ఎవరో బలవంతంగా నెట్టినట్లు చేస్తున్నాడు. లేదా రాజు చేత ఆజ్ఞాపించ బడిన సేవకుని లాగా చేస్తున్నాడు. ఇదంతా ఎందుకు జరుగుతోంది? నే నెందుకు పాపం చేస్తున్నాను? అని మౌనంగా ప్రతి మనిషి తన మనస్సులో వేసుకొనే ప్రశ్ననే అర్జునుడు మనందరి ప్రతినిధిగా శ్రీకృష్ణుని బాహాటంగా అడుగు తున్నాడు.

మనిషి ఇష్టపడి తప్పు చేస్తే ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు. ఇష్టం లేకున్నా ***(స్వయమ్ - అనిచ్ఛన్ అపి)*** ఎందుకు పాపాన్ని చేస్తున్నాడు? ఇష్టం లేనిది చేయడం అంటే, వెనుక దేని ప్రోద్బలమో ఉండాలి. లేదా ఎవరైనా ప్రేరేపిస్తూ ఉండాలి. అలా ప్రేరేపించే దెవరు? భగవంతుడా? ప్రారబ్ధమా? అజ్ఞానమా? కామమా? ఎవరి చేత, లేదా దేని చేత ***(కేన)*** ఆజ్ఞాపించ బడి మానవులు పాపాచరణం చేస్తున్నారు? అనేది అర్జునుని ప్రశ్న.

కేన అని అర్జునుడు ఏ పదంతో ప్రశ్నించాడో, ఆ పదం నామధేయం గానే ఒక ఉపనిషత్తు ఉంది. అదే కేనోపనిషత్తు. ***కేనేషితం పతతి ప్రేషితం మనః*** - మనస్సు విషయాల మీదికి పరుగు లెత్తడానికి కారణ మెవరు? అలా అభిలషించే దెవరు? ప్రేరేపించే దెవరు? అనే ప్రశ్నతో కేనోపనిషత్తు ప్రారంభమైంది.

దుర్యోధనుడు కూడా ***కేన*** అనే పలికాడు. తాను చేసేది పాప మని, అధర్మ మని దుర్యోధనునికి తెలుసు. ధర్మ మేమిటో తెలియక అలా చేశాడేమో అని అనుకోవ డానికి వీల్లేదు. అతనికి ధర్మం కూడా తెలుసు. కాని ధర్మ మార్గంలో జీవించడం తెలియదు. అతని వింత ప్రవర్తనను విచిత్రమైన అతని మాటల్లోనే చెప్పు కుందాం.

జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః జానా మ్యధర్మం న చ మే నివృత్తిః
కేనాపి మార్గేన హృది స్థితేన యథా నియుక్తోఽస్మి తథా కరోమి ॥

ధర్మం నాకు తెలుసు. కాని అనుసరించాలి అనుకోలేదు. నాకు అధర్మం కూడా తెలుసు. కాని విడిచి పెట్టడం జరగలేదు. ఎవరో నన్ను నియమిస్తూ నడిపిస్తూ ఉంటే నేను అలా నడిచాను. ఆ నడిపిం దెవరో నా మనస్సు లోనే ఉండాలి అన్నాడు.

పాపం అనర్థ మని, వినాశ హేతువు అని అర్జునునికి తెలుసు. దుర్యోధనునికి కూడా తెలుసు. కాకపోతే, అనర్థానికి మూల మేమిటో తెలుసుకొని దానిని పరిహరించు కోవాలి అనే ఆలోచన దుర్యోధనునికి లేదు. కాని, అర్జునుడు మాత్రం పాపానికి హేతువు ఏమిటో తెలుసుకొని, దానిని పరిహరించు కోవాలని శ్రీకృష్ణుని అడుగు తున్నాడు. కారణం అర్థమైతే కదా నివారించు కొనేది? అందుకనే ***అథ*** అంటూ ప్రశ్నను ప్రారంభించాడు. ***అథ*** శబ్దము అర్థాంతర బోధకము.

భగవంతుని బోధలో ఇంత వరకు వినాశానికి అనేక కారణాలు చెప్పబడ్డాయి. ***ధ్యాయతో విషయాన్ పుంసః*** *(2 - 62)*, ***భుంజతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మ కారణాత్*** *(3 - 13)*, ***ప్రకృతేర్గుణ సమ్మూఢాః*** *(3-29)*, ***తౌ హ్యస్య పరిపన్థినౌ*** *(3 - 34)* - ఇవన్నీ అనర్థానికి హేతువులు గానే గోచరిస్తున్నాయి. అనర్థానికి ఇవన్నీ సమాన ప్రాధాన్యం గల కారణాలా? లేక, వీటిలో ఒకటి ప్రధానము, మిగిలినవి అప్రధానములా? లేక సహకారులా? కృష్ణా! నీవు విషయాన్ని ఎంతో విస్తరించి చెప్పావు. నాకు మాత్రం అంతా అనిశ్చితంగా ఉంది.

కనుక నీవే నిశ్చితమైన విషయాన్ని సంక్షిప్తంగా చెప్పు! తద్వారా ఈ అనర్థం నుండి బయట పడి ఆత్మానందాన్ని అనుభూతం చేసుకుంటాను అని అర్జునుడు ప్రశ్నిస్తున్నాడు. ఇదంతా ఆ శ్లోకంలో ఎక్కడుంది బాబూ? తమరి పైత్యాన్ని పార్థునిపై రుద్దడ మేమిటి? అని సంశయిస్తున్నారా? ఏనుగు పాదంలో అన్ని పాదాలు ఇమిడినట్లు, శ్రీకృష్ణుని 'వార్ష్ణేయా!' అని పిలవడం లోనే పార్థుని హృదయం సుస్పష్టంగా ఆవిష్కరింప బడింది.

వార్ష్ణేయా అంటే వృష్ణి వంశంలో పుట్టిన వాసుదేవా! అని అర్థం (**వృష్ణి కుల ప్రసూత**). కాని, మరొక గంభీరమైన, తాత్త్వికమైన అర్థం కూడా ఉంది. బ్రహ్మజ్ఞానులైన వారిలో బ్రహ్మానంద పీయూషాన్ని వర్షింప చేయునది 'వృష్ణి'. ఈ విధమైన సమ్యక్ బోధ ద్వారా తెలియ దగిన వాడు వార్ష్ణేయుడు (**బ్రహ్మవిదాం బ్రహ్మానందామృతం వర్షతీతి వృష్ణిః ! సమ్యగ్బోధేన తేన అవగమ్యతే ఇతి వార్ష్ణేయః**).

సర్వానర్థ హేతువైన ఏ శత్రువును గూర్చి చెప్పమని అర్జునుడు ప్రశ్నించాడో, ఆ శత్రువు యొక్క చిరునామాను తెలియ చేస్తున్నాడు చిద్విలాస చిదానంద స్వరూపుడు.

శ్రీ భగవానువాచ :

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్ ॥ 37

కామః-ఏషః-క్రోధః-ఏషః-రజోగుణ సముద్భవః
మహాశనః-మహాపాప్మా-విద్ధి-ఏనం-ఇహ-వైరిణం

ఏషః	=ఇది	మహాపాప్మా	= గొప్ప పాపము గలది
రజోగుణసముద్భవః	=రజోగుణము వలన పుట్టిన	ఏనం	= దీనిని
కామః	=కామము	ఇహ	= ఇక్కడ
ఏషః	=ఇది	వైరిణం	= శత్రువుగా
క్రోధః	=క్రోధము	విద్ధి	= తెలుసుకో
మహాశనః	=తృప్తి పొందనిది		

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

రజోగుణము వలన పుట్టిన కామమే పాప కారణము. క్రోధమే పాప కారణము. దీనికి తృప్తి లేదు. మహా పాపాలకు కూడా ఇదే కారణము. ఈ కామాన్ని, క్రోధాన్ని ఇక్కడ శత్రువని తెలుసుకో.

వ్యాఖ్య

పాపం అనేది కార్యం. చెయ్యబడేది కార్యం. చెయ్యాలి అనే కోరిక లేకుండా చెయ్యడం అనే కార్యం జరగదు. **అకామస్తు క్రియా నాస్తి** అనే న్యాయాన్ని అనుసరించి, ఎక్కడ ఏ కార్యం జరిగినా దానికి కారణంగా కోరిక ఉంటుంది. పాపము అనే కార్యం జరగాలి అంటే పాప సంకల్పం మనస్సులో కదలాలి. అదే కోరిక. పాప కార్యానికి హేతువు. ఎవరు ఏ పాపకార్యం చేసినా అది కామము యొక్క కార్యమే అని వేదం కూడా ప్రవచించింది (**యద్యద్ధి కురు తే జన్తుః తత్తద్ధి కామస్య చేష్టితమ్**).

వివేక ప్రధానమైన సత్త్వగుణం ప్రచ్ఛన్న మైనపుడు క్రియాశీలమైన రజోగుణం ప్రభవిస్తుంది. రజస్సు యొక్క గుణము రాగము. రంజనాత్మకమైన విషయము నందు రజోగుణము వల్ల రాగం ఏర్పడుతుంది. ఆ తరువాత భోగేచ్ఛ కదుల్తుంది. అదే కామము. కనుక, కామము అనేది రజోగుణము నుండి పుడుతుంది (**రజోగుణ సముద్భవః**).

కామము సర్వప్రాణి ప్రత్యక్షం. కోరిక లేని దెవరు? కోరిక తెలియని దెవరికి? అందుకనే **ఏషః** - 'ఇది' అంటున్నాడు భగవానుడు. 'ఇది' అంటే, అందరికీ తెలిసింది. ఇది కామం (**ఏషః కామః**). ఇది క్రోధం (**ఏషః క్రోధః**). రెండిటికి 'ఏషః' - 'ఇది' అని ఏకవచన ప్రయోగం చేయడంలో, కామము, క్రోధము అనే రెండు పేర్లు ఇక్కడ వినపడు తున్నా, ఆ రెండూ ఒక్కటే అని అర్థం. క్రోధము కూడా కామమే. తీరని కామమే క్రోధంగా మారుతుంది. ఈ కామం వల్లనే పాప కార్యాలు సాగుతాయి. కామం పోతే క్రోధం ఉండదు.

తృప్తి లేనిది

కామానికి తృప్తి తెలియదు. 'చాలు' అనే పదం కామానికి అర్థం కాదు. సంస్కృతంలో **అలం** అంటే 'చాలు' అని అర్థం. అదే తృప్తి. అలం బుద్ధి. కామానికి అలం బుద్ధి లేదు. అందుకే అది 'అనలం'. 'అనలం' అంటే నిప్పు. ఎంత వేసినా, ఎన్ని వేసినా అగ్ని దహించి వేస్తుంది. ఇక చాలు అనదు. అందుకే అది అనలమైంది.

కామం కూడా అంతే. కామం భోగం కొరకే అయితే, భోగించిన తరువాత కామం లేకుండా పోవాలి. కానీ మన అనుభవం అందుకు భిన్నంగా ఉంది. భోగ్య వస్తువులను అనుభవిస్తున్నా, భోగేచ్ఛ తీరడం లేదు. అనుభవించే కొద్ది పెరుగుతూ ఉందే గాని తరగడం లేదు.

న జాతు కామః కామానా ముప భోగేన శామ్యతి
హవిషా కృష్ణ వర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే ॥

కామములను ఎంతగా అనుభవించినా కామము శమించదు. నెయ్యి పోస్తూ ఉంటే అగ్ని ఎలా వృద్ధి చెందుతుందో, అనుభవించే కొద్ది కామము పెరుగుతూనే ఉంటుంది అని మహాభారతము లోను, మనుధర్మ శాస్త్రం లోను చెప్ప బడింది.

భోగిమంటలో కట్టెలు వేస్తూ ఉంటాము. ఎన్ని వేసినా కట్టెలు కాలిపోతూ ఉంటాయే గాని, మంట ఆరదు. పైగా విజృంభిస్తూ ఉంటుంది. అలాగే భోగి ఎంతగా కామాన్ని తృప్తిపరచా లనుకున్నా, అనుభవించడం జరుగుతుందే గాని కామము శాంతించదు. తృప్తి చెందదు. అందుచేతనే తృప్తి చెందాలని భావిస్తూ నూతనంగా కోరికల్ని తయారు చేసుకుంటూ ఉంటాడు. అనుభవించిన తరువాత మళ్ళీ అసంతృప్తిలో పడుతూ ఉంటాడు. ఒకవైపు అనర్థాన్ని చూస్తూనే, మరో వైపు కామాన్ని తృప్తి పరచే ప్రయత్నంలో ఉంటాడు అన్నది వేదం (**అనర్థ పరిపాకత్వ మపి జానన్ ప్రవర్తతే**). అనర్థ మని తెలిసి కూడా కామాన్ని విడిచి పెట్టడు.

తృప్తిని దూరం చేసి, శాంతిని కాల రాచి, పాప కూపంలో పడేసే ఈ కామాన్ని శత్రువుగా అభివర్ణించాడు గీతాచార్యుడు. బ్రతుకును బుగ్గి చేసేవాడు శత్రువు అవుతాడు తప్ప మిత్రుడు అవుతాడా? పాప స్వభావం గల కామం మనిషి చేత ఘోర పాపాలు చేయిస్తుంది. కామం ప్రేరేపించి నపుడే మనిషి పాపం చేస్తాడు అన్నారు శ్రీశంకరాచార్యస్వామి (**కామేన హి ప్రేరితః జన్తుః పాపం కరోతి**). అందుచేత, అర్జునా! ఈ సంసారంలో (**ఇహ సంసారే**) ఈ కామమే (**ఏనం కామమ్**) శత్రువు అని (**వైరిణమ్**) తెలుసుకో (**విద్ధి**) అన్నాడు భగవంతుడు.

మనం నివసించే గ్రామంలో లేదా పట్టణంలో మనకు గొప్ప శత్రువు ఉన్నాడు అని తెలిస్తే, ప్రమాదాన్ని ఊహించి ఎంతగానో బాధ పడతాము. ఒకవేళ, ఆ శత్రువు మన వీధి లోనే మకాం పెట్టాడని తెలిసిం దనుకోండి, ఎలా ఉంటుంది? వీధిలో కూడా ఎక్కడో కాదు, మనం అద్దెకున్న ఇంట్లోనే మరొక వాటాలో అద్దెకు ఉంటున్నాడు అని తెలిస్తే, అప్పుడెలా ఉంటుంది? అది కూడా కాదు. భయంకరమైన ఆ శత్రువు మన మనస్సు లోకి ప్రవేశించాడని తెలిసిం దనుకోండి, మన పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడానికి మాటలు సరిపోతాయా? ఇప్పుడు మన అందరి పరిస్థితి అదే కదా! మహాపాపి, భయంకరమైన కామ శత్రువు, క్రోధ శత్రువు మన

చిత్తాన్ని ఛిద్రం చేసేస్తున్నాడు. ఇది అర్థం కాకపోవడం చేత మన ప్రమాద మేమిటో కూడా మనకు తెలిసి రావడం లేదు. అందుకే 'విద్ధి' తెలుసుకో అంటున్నాడు భగవంతుడు.

గతంలో చేసిన పాపాలకు నేడు పశ్చాత్తాపంతో కుమిలి పోతూ ఉన్నాం కదా! దురదృష్టాన్ని, దుర్గతిని అనుభవిస్తూ, **తృష్ణయా హి అహంకారితః** - దురాశే నాకీ దుర్దశను కలిగించింది అని దుఃఖిస్తున్నాం కదా! అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రాకుండా ఉండాలి అంటే, పాపాన్ని చేయించే కామాన్ని మనస్సు నుండి గెంటేయాలి.

ఆశ ఉంటే కలదు నిరాశ
కల గంటేనే కలవరము
శ్వాస లాగినా ఆశలు పోవు
అంటి ఉంటాయి మరుజన్మకు
ఆశే మనిషికి పాశము
బ్రతుకును త్రుంచే యమపాశము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

కామము ఎలాంటి శత్రువో, ఏ విధంగా శత్రువో దృష్టాంతముతో వివరిస్తున్నాడు.

ధూమే నావ్రియతే వహ్ని ర్యథాదర్శో మలేన చ ।
యథోల్బే నావృతో గర్భ స్తథా తే నేద మావృతమ్ ॥ 38

ధూమేన-ఆవ్రియతే-వహ్నిః-యథా-ఆదర్శః-మలేన-చ
యథా-ఉల్బేన-ఆవృతః-గర్భః-తథా-తేన-ఇదం-ఆవృతం

యథా	= ఏ విధంగా		ఉల్బేన	=	మావి చేత
ధూమేన	= పొగ చేత		గర్భః	=	గర్భస్థ శిశువు
వహ్నిః	= అగ్ని		ఆవృతః	=	కప్పబడుతుందో
ఆవ్రియతే	= కప్పబడుతుందో		తథా	=	అలాగే
యథా	= ఏ విధముగా		తేన	=	దాని చేత
ఆదర్శః	= అద్దము		ఇదం	=	ఇది
మలేన చ	= మాలిన్యము చేత		ఆవృతం	=	కప్ప బడింది

పొగ చేత అగ్ని కప్పబడినట్లు, ధూళి చేత అద్దము కప్పబడినట్లు, మావి చేత గర్భము నందు శిశువు ఆవరింప బడినట్లు, కామము చేత జ్ఞానము కప్పబడి ఉంది.

వ్యాఖ్య

సర్వ అనర్థాలకు కారణమైన శత్రువు కామము. ఈ కామము యొక్క పరిణామమే క్రోధము. రజోగుణము వలన పుట్టిన కామము, రజోగుణము తోనే ప్రవర్తిస్తూ ఉంటుంది. సర్వ పాపాలకు కారణం కావడం చేత కామము మహాపాపము. తృప్తి తీరనిది కనుక **మహాశనము**. అందుకే సంసారంలో కామమే అప్రతిహతమైన శత్రువు. మోక్షమార్గంలో ప్రధాన శత్రువు అయిన కామమును మూడు దృష్టాంతముల చేత వివరిస్తున్నాడు.

సూర్యాస్తమయం జరిగిన తరువాత ప్రపంచాన్ని చీకటి కప్పివేసినట్లు, ఈ కామమనే శత్రువు జ్ఞానాన్ని కప్పేస్తుంది. ఎలా అంటే, అగ్నిని పొగ కమ్మినట్లు, అద్దాన్ని దుమ్ము కప్పినట్లు, గర్భస్థ శిశువును మావి ఆవరించినట్లు అంటున్నాడు.

నిప్పు - పొగ

నిప్పు నుండే పుట్టిన పొగ నిప్పును కప్పేస్తుంది. నిప్పుకు ప్రకాశం ఉంది. ధూమము అప్రకాశం. నివురు కప్పినపుడు నిప్పు కూడా ప్రకాశం లేనట్లే అప్రకాశంగా అగుపిస్తుంది. వాస్తవానికి ప్రకాశాత్మక మైన అగ్నిలో వెలుగు లేకుండా పోలేదు. పొగ కప్పి ఉండటం చేత అగ్ని అప్రకాశాత్మకంగా అగుపిస్తోంది. నివురును తొలగిస్తే నిప్పు కనిపిస్తుంది. ప్రకాశిస్తూ గోచరిస్తుంది. అంతేకాదు. నివురు కప్పి నపుడు కూడా నిప్పులో ఉన్న వెలుగు కనిపించలేదే గాని, అందులోని దాహకశక్తి పోలేదు. నివురు కప్పినా ముట్టుకుంటే నిప్పు కాలి తీరుతుంది.

నిప్పును పొగ కమ్మినట్లు మానవుని వివేకాన్ని కామము కప్పేస్తుంది. మంచిచెడు లేమిటో, ధర్మాధర్మా లేమిటో గ్రహించే వివేకము కామము వల్ల మరుగున పడి పోతుంది. కామాన్ని తొలగిస్తే జ్ఞానము మళ్ళీ బుద్ధిలో యథావిధంగా ప్రకాశిస్తూ గోచరిస్తుంది.

ముకురము - మురికి

నిప్పును పొగ ఎలా కప్పేసిందో, అద్దాన్ని దుమ్ము అలా కప్పేస్తుంది. కాకపోతే, నిప్పును పొగ కమ్మినపుడు నిప్పు కనిపించ లేదు. ఉన్నట్లు కూడా తెలియ లేదు. కాని, దర్పణాన్ని ధూళి ఆవరించినా, దర్పణము దర్శనీయం గానే ఉంటుంది. అద్దం కనిపిస్తూనే ఉంటుంది. కాకపోతే, అద్దంలో మన ప్రతిబింబం కనిపించదు. దుమ్ము చేరడం వల్ల దర్శనానికి అద్దం ఉపకరించడం లేదు. అంతమాత్రాన అద్దం తన దర్శన శక్తిని కోల్పోలేదు. దుమ్ము దులిపితే, అద్దము మళ్ళీ రూపాన్ని ప్రతిబింబిస్తుంది.

నిప్పును పొగ కప్పినట్లు, అద్దాన్ని దుమ్ము మూసినట్లు, జ్ఞానాన్ని కామం కప్పేస్తుంది. అద్దంలో మన ప్రతిబింబాన్ని మనం చూసుకోవ డానికి దుమ్ము ఎలా ప్రతిబంధక మైందో, మన స్వరూపాన్ని మనం దర్శించుకోవ డానికి కామం ప్రతిబంధక మైంది. అద్దంపై ఉన్న దుమ్మును దులిపి శుభ్రం చేస్తే అద్దం ఉపయోగ పడినట్లు, కామాన్ని బుద్ధిలో అదృశ్యం చేస్తే జ్ఞానం దివ్యంగా సత్య దర్శనానికి ఉపకరిస్తుంది.

శిశువు - మావి

నిప్పును పొగ, ముకురాన్ని మురికి కప్పినట్లు, గర్భస్థ శిశువును మావి కప్పేసింది. నివురు కప్పిన నిప్పు కనిపించదు. అయినా ముట్టుకుంటే కాలుతుంది. దర్పణము కంటికి కనిపిస్తూ ఉంటుంది. అయినా ప్రతిరూపాన్ని ప్రదర్శించ లేదు. మావి చేత కప్పబడిన గర్భస్థ శిశువు తల్లి గర్భంలో ఉంది. మావి కనిపించదు. తొలగించే అవకాశాన్ని ఇవ్వదు. బిడ్డ జననం వరకు నిరీక్షించ వలసిందే గాని, నిప్పుపై నివురును, ముకురంపై మురికిని తొలగించినట్లు, శిశువును ఆవరించిన మావిని తొలగించను సాధ్యపడదు. అది కాలం లోనే తొలగాలి.

గర్భస్థ శిశువును మావి కప్పినట్లు, కామం వివేకాన్ని దట్టంగా ఆవరించింది అంటున్నాడు. తొలగించను సాధ్యపడని విధంగా కప్పేసింది అంటున్నాడు. అది కాలంలో తొలగ వలసిందే గాని, వెంటనే తొలగించడం సాధ్యపడదు అనే సంకేతాన్ని కూడా ఇస్తున్నాడు.

కామ విన్యాసాలు

నిప్పును కప్పిన నివురును విసనకర్రతో విసిరితే పోతుంది. ఊదితే ఉండదు. కాని దర్పణాన్ని కప్పిన

ధూళి ఊదినా, విసిరినా పూర్తిగా పోదు. తుడిస్తేనే పోతుంది. కడిగితేనే పోతుంది. కాని శిశువును కప్పిన మావిని అటు ఊదనూ లేము. ఇటు కడగనూ లేము. కనిపెట్టుకొని కూర్చోవడం కన్నా ఏమీ చెయ్యలేము.

కొందరిలో కామము నివురు లాగా ఉంటుంది. ఊదగానే నివురు అదృశ్య మైనట్లు, గురూపదేశముతో వారి లోని కామము కనుమరు గవుతుంది.

మరి కొందరిలో కామము దర్పణంపై ధూళి లాగా ఉంటుంది. ఊదడం కాకుండా తుడిస్తేనే, కడిగితేనే దర్పణం శుద్ధి పడినట్లు, కేవలం గురూపదేశమే కాక, వీరిలో పురుష ప్రయత్నం కూడా జరగాలి. సాధనావశ్యకత ఉంటుంది. అభ్యాస వైరాగ్యాలతో అనుష్ఠానంలో స్థిరపడి తేనే అది పోతుంది.

ఇంక కొందరిలో కామము గర్భస్థ శిశువును మావి కప్పినట్లు ఉంటుంది. ప్రయత్నించినా సద్యః ఫలితం రాదు. అలాంటి వారు నిరీక్షణ లోనే నిరాశకు దూర మవుతారు. ఫలితాన్ని అందుకుంటారు. వీరికి కాలం లోనే అన్నీ కలిసి వస్తాయి.

నిప్పు లోని ప్రకాశాన్ని నివురు నిరోధించినట్లు, వివేకాన్ని కప్పిన కామం మనిషి లోని అందాన్ని, ప్రకాశాన్ని దూరం చేస్తుంది. దర్పణాన్ని ధూళి మలినం చేసినట్లు, కామం హృదయాన్ని కలుషితం చేస్తుంది. మావిని తొలగించటానికి ప్రయత్నాలు విఫల మైనట్లు, ఎంత ప్రయత్నించినా నిగ్రహింపబడక కామం సాధకుని నిస్పృహాయునిగా మార్చేస్తుంది.

ఎంత చేసినా, ఏమి చేసినా తృప్తి చెందని కామము మనిషిని దీనుణ్ణి చేసి దిగులు పుట్టిస్తుంది. కామము ప్రతిహత మైనపుడు పుట్టుకొచ్చే క్రోధము (**కామాత్క్రోధోభి జాయతే:** *2 - 62*) ప్రపంచంలో శత్రువుల్ని ప్రోగు చేస్తూ మనిషికి శాంతి లేకుండా చేస్తుంది. అందుచేతనే ఈ కామక్రోధాల్ని నిరోధించడానికి, ఈశ్వరుణ్ణి, ఈశ్వర జ్ఞానాన్ని ఆశ్రయించాలి.

దిగులుతో దినములన్నీ కారిపోయె
పగలతో ప్రపంచమె మారిపోయె
దరి చేర్చాలి నన్ను నీవు దారి చూపి
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా! అని ఈశ్వర పూజనంలో ఒక విబూది పండు.

జ్ఞానాన్ని పొందాలని యత్నించే సాధకునికి కామము ఎలా నిత్య శత్రువుగా నిలిచి ఉందో వివరిస్తున్నాడు.

ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।
కామరూపేణ కౌన్తేయ దుష్పూరే ణానలేన చ ॥ 39

ఆవృతం-జ్ఞానం-ఏతేన-జ్ఞానినః-నిత్యవైరిణా
కామరూపేణ-కౌంతేయ-దుష్పూరేణ-అనలేన-చ

కౌంతేయ	=	అర్జునా!	నిత్యవైరిణా	=	నిత్య శత్రువు
దుష్పూరేణ	=	నింప శక్యము కానిది	ఏతేన	=	దీని చేత
అనలేన చ	=	అగ్ని వంటిది	జ్ఞానం	=	జ్ఞానము
కామరూపేణ	=	ఆశారూప మైనది	ఆవృతం	=	కప్పు బడినది
జ్ఞానినః	=	జ్ఞానికి			

అర్జునా! కామము ఎన్నటికీ నిండనిది. అగ్ని లాగా తృప్తి చెందనిది. ఆశా రూప మైనది. జ్ఞానికి నిత్య శత్రువు. కామం తోనే జ్ఞానం కప్పబడి ఉంది.

వ్యాఖ్య

శ్రేయో మార్గంలో అప్రతిహత మైన విరోధిగా ప్రతిబంధకాలను సృష్టించే కామం మానవులను వివిధము లైన పొరలతో ఎలా కప్పి వేసిందో, అలాగే ప్రతి వ్యక్తిని వివిధంగా ఎలా అడ్డగిస్తూ ఉందో, మూడు దృష్టాంతాల ద్వారా తెలుసుకున్నాం. మానవుని జ్ఞానాన్ని మూసేసిన ఈ కామం జ్ఞానాన్ని పొందాలని ఆశించే ముముక్షువుకు నిత్యవిరోధి అంటున్నాడు.

శత్రువు - నిత్య శత్రువు

అజాత శత్రువులు ఈ ప్రపంచంలో ఉండరు. ప్రతి ఒక్కరికి కొందరు శత్రువులు ఉండనే ఉంటారు. కారణం లేకుండా శత్రుత్వము ఉండదు. ఆ కారణం ఎదుటి వ్యక్తే కానవసరం లేదు. ***తన కోపమే తన శత్రువు*** అని సుమతి శతక కర్త తెలిపినట్లు, తన లోని ఈర్ష్యాసూయలే ఎదుటి వ్యక్తిలో శత్రువును చూపించ వచ్చు.

ఏది ఎలా ఉన్నా, శత్రువు అనే వాడు ఉంటాడు. శత్రువు మన ముందే ఉండ నవసరం లేదు. మనస్సులో కదిలినా చాలు, మనిషి ఏదో అసౌకర్యాన్ని అనుభవిస్తూ ఉంటాడు. నేడు శత్రువై బాధిస్తున్న వ్యక్తి, కాలంలో మిత్రుడుగా మారితే, ఆ తరువాత అతడు శత్రువుగా ఉండడు. బాధను కలిగించడు.

ఒకవేళ శత్రువు మిత్రుడుగా మారక పోయినా, ఏ కారణం చేత నైనా అతడు దేశాంతరం వెళ్ళి దూర మైతే, శత్రుత్వము మరుగున పడి పోతుంది. ఒకవేళ మనిషే మరణిస్తే, ఆ తరువాత ఉండమన్నా ఉండదు. అందుకే మరణంలో శత్రుత్వము లేదు అంటూ ఉంటారు. మరణం ఎవరి దైనా కావచ్చు. అందరికీ మరణం ఉంది. శత్రువు మరణించ వచ్చు. శత్రువును చూచేవాడూ మరణించ వచ్చు. ఇలా చూచి నపుడు ప్రతి మనిషికి శత్రువు లున్నారే గాని నిత్యశత్రువు కనిపించడు.

కాని, కామం మనిషికి శత్రువు. జ్ఞానవంతునికి నిత్యశత్రువు (***జ్ఞానినో నిత్య వైరిణా***) అంటున్నాడు గీతాచార్యుడు.

శత్రువు మరొక కాలంలో మిత్రుడు కావచ్చు. కామం ఏ కాలం లోనూ మిత్రుడు కాలేదు. ఏ ప్రదేశం లోనూ మిత్రుడు కాలేదు. ఎప్పుడూ శత్రువే. శత్రువు దూర ప్రాంతాలకు వెళ్ళినట్లు, కామం మనల్ని విడిచి దూరంగా పోదు. ఇక చావంటారా! కామానికి అది లేనే లేదు. మనల్ని చంపుతుందే గాని అది చావదు. ఒకవేళ మనం మరణిస్తే, అంతటితో ఆగుతుందేమో అని ఆశించడానికి వీలు లేదు. ఈ జన్మను చాలించి, మనం మరో జన్మను ఎత్తినా, అక్కడ కూడా కామం మనకు ఎదురేగి ఆహ్వానం పలుకుతుంది. అందుకే కామాన్ని నిత్యవిరోధిగా భగవంతుడు అభివర్ణిస్తున్నాడు.

నిత్యము తోడుగా ఉంటుంది. కనుకనే కామము నిత్యశత్రువు. జన్మాంతరాలలో కూడా విడిచి పెట్టదు కనుక నిత్యవిరోధి. ప్రపంచంలో మనకు విరోధులు ఉండ వచ్చు. అందరి విషయంలో కాకపోయినా, కొందరి విషయంలో నైనా మనది పై చేయిగా ఉంటుంది. వారిపై మనదే విజయంగా ఉంటుంది.

కామం విషయం అలా కాదు. కామ శత్రువుకు జయమే గాని అపజయం తెలియదు. క్రోధ శత్రువుకు గెలుపే గాని ఓటమి లేదు. కామాన్ని ఎందరో ఎదిరించి పోరాడారు. ఎవరు గెలిచారో చెప్పడానికి మన వద్ద దాఖలాలు లేవు.

కామ వేగానికి పండితులు సైతం పరాజితు లయ్యారు. కామం చేతిలో రాజులు కూడా రాలిపోయారు. కామం చేతిలో సన్యాసులు సడలి పోయారు. బలవంతులు బలహీను లయ్యారు. యువకులు బలి అయ్యారు. అందరూ అపజయాన్ని చవి చూచిన వారే.

జ్ఞానా జ్ఞానములు

జ్ఞానికి కామము నిత్యవిరోధి. అజ్ఞానికి కూడా నిత్యశత్రువు. కామం యొక్క ప్రభావం ఉభయులపై ఉన్నా, కామం విషయంలో వారిరువురి మధ్య అవగాహనలో వ్యత్యాసము గోచరిస్తూ ఉంది అంటారు శ్రీశంకరులు.

కామం కదిలి నపుడే, శత్రువు కదులు తున్నాడు అని జ్ఞానం కల వాడు గుర్తిస్తాడు. అందుకే కామ కదలికతో కలత చెందుతూ ఉంటాడు. నన్ను కదిలిస్తున్న కామం నాకు అనర్థాన్ని తెచ్చి పెడుతుంది అని జ్ఞానికి ముందే తెలుసు (***జ్ఞానీ హి జానాతి అనేన అహమ్ అనర్థే ప్రయుక్తః ఇతి పూర్వమేవ***). అందుచేత కామం కదిలినా, క్రోధం కదిలినా జ్ఞాని దుఃఖిస్తూ ఉంటాడు (***దుఃఖీ చ భవతి నిత్యమేవ***).

మూర్ఖుడు, లేదా అజ్ఞానికి కూడా కామము నిత్య శత్రువే అయినా, అది కదిలి నపుడు జ్ఞాని గుర్తించి నట్లు, అజ్ఞాని దానిని శత్రువుగా గుర్తించడు. పైగా మిత్రుడని భ్రమిస్తాడు. కోరిక కలిగి నపుడు కామాన్ని మూర్ఖుడు విరోధిగా భావించడు. అట్టి కామ ఫలితంగా దుఃఖం ప్రాప్తించి నపుడే దానిని శత్రువుగా పరిగణిస్తాడు. కనుక ఉభయులకు కామం శత్రువే అయినా, నిత్యవిరోధి జ్ఞానికే గాని, అజ్ఞానికి కాదు (***అతః అసౌ జ్ఞానినః నిత్య వైరీ న తు మూర్ఖస్య***). మరి, జ్ఞానికి నిత్యవిరోధి అయిన కామము ఏ రూపంలో ఉంటుంది? (***కిం రూపేణ ?***) చెబుతున్నాడు.

స్వభావ స్వరూపాలు

కామము యొక్క రూపాన్ని మూడు విషయాల ద్వారా చూపెడు తున్నాడు. (1) కోరిక అనే రూపం కలది (2) నింప శక్యము కానిది (3) చాలు అనేది లేనిది. ఇవే కామము యొక్క స్వరూప స్వభావాలు.

కామం కోరుతూ ఉంటుంది. విసుగు లేకుండా కోరుతుంది. విరామం లేకుండా కోరుతుంది. సాధ్యా సాధ్యాలను పట్టించుకో కుండా కోరుతుంది. యుక్తాయుక్తాలను విశ్లేషించ కుండా కోరుతుంది. ఇదే కామం యొక్క మొదటి రూపం (***కామ రూపేణ***).

కామము యొక్క రెండవ రూపం అపూర్ణం. అంటే నిండనిది. ఎంత నింపినా నిండనిది. అనాదిగా ఈ ప్రపంచంలో ఎంత వర్షం కురిసిందో! నిర్విరామంగా ప్రవాహ రూపంలో ఎన్ని నదులు సాగరంలో కలిశాయో! ఇంకా కలుస్తూనే ఉన్నాయి. ఇక నింపుకో లేను, నేను నిండి పోయాను అని ఒక్క మాట సముద్రం ఇంత వరకు అనలేదు. కామం కూడా సాగర రూపం ధరించి ఉంటుంది. ఎన్ని భోగాలు అందించినా, నేను నిండిపోయాను అని అనదు. జల్లెడలో నీళ్ళు పోసినట్లే ఉంటుంది. ప్రయత్నమే గాని ఫలితం ఉండదు. అదే కామరూపం. నింప శక్యము కానిది (***దుష్పూరః - దుఃఖేన పూరణమ్ అస్య ఇతి***).

కామము యొక్క మూడవ రూపము అనలం. 'అలం' అంటే చాలు అని అర్థం. చాలు అనేది లేనిది 'అనలం'. అనలం అంటే నిప్పు. ఎన్ని కట్టెలు వేసినా అగ్ని కాల్చి భస్మం చేస్తుందే గాని చాలు అని అనదు అందుకే అది అనలం. కామం కూడా అంతే. ఎన్ని అనుభవించినా అనలం గానే చెలరేగుతూ ఉంటుంది (***అనలేన***).

ఇంతకీ ఈ కామవిరోధి ఉండే దెక్కడ? అదీ చెబుతున్నాడు.

ఇన్ద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే ।
ఏతై ర్విమోహయ త్యేష జ్ఞాన మావృత్య దేహినమ్ ॥ 40

ఇంద్రియాణి-మనః-బుద్ధిః-అస్య-అధిష్ఠానం-ఉచ్యతే
ఏతైః-విమోహయతి-ఏషః-జ్ఞానం-ఆవృత్య-దేహినం

అస్య	= దీనికి	ఏషః	= ఇది
ఇంద్రియాణి	= ఇంద్రియములు	ఏతైః	= వీని చేత
మనః	= మనస్సు	జ్ఞానం	= జ్ఞానమును
బుద్ధిః	= బుద్ధి	ఆవృత్య	= కప్పి
అధిష్ఠానం	= ఆధారముగా	దేహినం	= జీవుణ్ణి
ఉచ్యతే	= చెప్ప బడింది	విమోహయతి	= మోహ పెట్టు చున్నది

ఈ కామానికి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి నివాస స్థానాలు. వీటి ద్వారా కామం జ్ఞానాన్ని కప్పి జీవునికి మోహాన్ని కలిగిస్తుంది.

వ్యాఖ్య

జ్ఞానాన్ని కప్పివేసి, వివేకాన్ని మరుగున పడేసే కామం యొక్క స్వరూప స్వభావాలను తెలుసుకున్నాం. కామము నిత్య శత్రువు అని తెలిసి పోయింది. నిత్యవిరోధిని వెంట పెట్టుకొని ఎవరు సుఖపడ గలరు? కనుక శత్రుబాధ నుండి విముక్తి కలగాలి. అలా జరగాలి అంటే శత్రువు యొక్క స్థావరం ఎక్కడో తెలిసి రావాలి. ముందు శత్రువు ఉండే దెక్కడో తెలిస్తే, ఆ తరువాత అతణ్ణి సులభంగా మట్టు పెట్టడం సాధ్య పడుతుంది (***జ్ఞాతే హి శత్రోః అధిష్ఠానే సుఖేన శత్రు నిబర్హణం కర్తుం శక్యతే***). కావరం గల శత్రువు నైనా స్థావరం తెలిస్తే నాశనం చెయ్యవచ్చు. కామానికి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనేవి స్థావరాలు అంటున్నాడు గీతాచార్యుడు (***ఇంద్రియాణి, మనః బుద్ధిః చ అస్య కామస్య, అధిష్ఠానం, ఆశ్రయః***). ఈ స్థావరాలలో ఉంటూ, కామం మానవుని వివేకాన్ని కప్పివేసి, మోహంలో పడదోస్తూ ఉంది.

శత్రు స్థావరాలు

సంఘ విద్రోహశక్తులు, బందిపోట్లు, తీవ్రవాదులు ఎలాగైతే తమ కంటూ కొన్ని దుర్భేద్యమైన స్థావరాలను ఏర్పాటు చేసుకొని విచ్ఛిన్నకర మైన కార్యకలాపాలను దేశంలో సాగిస్తూ ఉంటారో, అలాగే కామక్రోధాది శత్రువులు కూడా దేహం లోనే ప్రత్యేక స్థావరాలను ఏర్పరచుకొని, తమ కార్యకలాపాలను సాగిస్తూ ఉంటాయి. ఆ స్థావరాలే ఇంద్రియ మనోబుద్ధులు. దేశంలో తీవ్రవాద స్థావరాలు ఉన్నట్లే, దేహంలో 'తీవ్రబాధా' స్థావరాలు ఉన్నాయి. స్థావరాలు ధ్వంస మైతే శత్రువులు భంగ పడ్డేట్లే.

మనం చేసే కార్యా లన్నిటి వెనుక కారణంగా కామం ఉందని అర్థం చేసుకున్నాం. కామం ఎప్పుడైతే నిరాశ్రయ మవుతుందో, కామప్రేరిత కార్యాలు మిగలవు. కామప్రేరిత కార్యాలు అదృశ్యమైతే అశాంతి అంతమైనట్లే. కనుక, ప్రమాద మంతా కామం వల్లనే ఉంది.

ఆత్మ సచ్చిదానంద స్వరూపము. నిర్దోష మైనది. వాంఛలు లేనిది. అట్టి ఆత్మ వల్ల ఏ ప్రమాదమూ లేదు. ఇక దేహ మంటారా? అది జడము. దాని వల్ల కూడా ప్రమాదం లేదు. మరి ఇంద్రియాలు? అవి కేవలం విషయాలను తెలియచేసే వార్తావహులే. కనుక అంతకు మించి అవి ఏమీ చేయలేవు. ఇక మనస్సు విషయాని

బుద్ధి కూడా ఒక కరణమే. బుద్ధి చెడునే కాదు, మంచిని కోస్తే, అది మనిషి చేతిలో ఒక పరికరం మాత్రమే. బుద్ధి కూడా ఒక కరణమే. బుద్ధి అలా నిశ్చయించడం వెనుక ఎవరున్నారో తెలుసా? ఎవరో కాదు, కామ కూడా నిర్ణయించి చెబుతుంది. బుద్ధి అలా నిశ్చయించడం వెనుక ఎవరున్నారో తెలుసా? ఎవరో కాదు, కామ మనే శత్రువే. ఈ కామప్రేరణ వల్లనే మనిషికి ఇష్టం లేని దానిని కూడా బుద్ధి కర్తవ్యంగా నిశ్చయిస్తుంది (అనిచ్ఛన్నపి). మనిషి ఆచరిస్తాడు. అలా చేయడం యుక్తం కాదని ఒక వైపు అర్థం అవుతున్నా, కామ ప్రేరణ చేత మనిషి వివశుడై చేసి తీరుతాడు.

ప్రథమ స్థావరము

కామ మనే శత్రువుకు మూడు ఆశ్రయ స్థానాలు ఉన్నాయి. అందులో మొదటి స్థావరము ఇంద్రియాలు. ఇంద్రియాలకు ముందు చూపే గాని, వెనుక చూపు, లోచూపు ఉండవు. ప్రపంచాన్ని చూస్తాయి. మనస్సును చూడలేవు. ఇంద్రియాల ముందు ప్రపంచం ఉంది. ఇంద్రియాల వెనుక మనస్సు ఉంది. ప్రపంచంలో గోచర మయ్యే దృశ్యాదులను నేత్రాదులు మనస్సుకు ప్రదర్శిస్తాయి. మనస్సు తిలకిస్తుంది. ఇష్టమైతే పులకిస్తుంది. అనిష్ట మైతే వికటిస్తుంది.

ఇంద్రియాలు తమకు ఆశ్రయ స్థానమైన మనస్సు వైపు తిరిగి చూడలేవు. సూర్యుని నుండి కిరణాలు లోకం లోకి విరజిమ్మ బడినట్లు, మనస్సు నుండి చేతనత్వాన్ని పొందిన ఇంద్రియాలు ప్రపంచం వైపు సదా పరుగులు తీస్తూ ఉంటాయి. మరల ఈ ఇంద్రియాల ద్వారానే మనస్సు ప్రపంచం లోకి చొర బడుతుంది. ఇంద్రియ ద్వారాలను మూసేస్తే, మనస్సు బయటకు పోవాలని ఉబలాట పడినా పోలేదు. ఈ విధంగా కామ శత్రువు యొక్క ప్రథమ స్థావరమైన ఇంద్రియాలను మూసేయాలి. యోగమార్గంలో ఈ ప్రక్రియనే 'దమం' అంటారు *(ఆపరేషన్ 'దమ')*.

ఇంద్రియ ద్వారాల నుండే విషయాలు పయనించి మనస్సును చేరుతాయి. తిరిగి ఇంద్రియాల ద్వారానే మనస్సు లోని కోరికలు ప్రపంచంలో తీరుతాయి. ఇంద్రియాలు ఎప్పుడైతే నిగ్రహింప బడ్డాయో, మనస్సు ప్రపంచం లోకి ప్రవేశించ లేదు. నిగ్రహింపబడి ఉంటుంది. మనస్సు తోడైతేనే ఇంద్రియాలు బలాన్ని పుంజుకొని చెల రేగుతాయి. మనస్సు నియమింప బడితే ఇంద్రియాలు నిర్వీర్య మవుతాయి. స్థావరము బలహీన మైనపుడు శత్రువు బలవంతు డవుతాడా?

ద్వితీయ స్థావరము

కామశత్రువు యొక్క రెండవ స్థావరము మనస్సు. ఇంద్రియాలు ఎప్పుడైతే నిగ్రహింప బడ్డాయో, కామ మనే విరోధి ఇంద్రియ స్థావరాన్ని వీడి మనస్సును స్థావరంగా మార్చుకుంటుంది. ఇంద్రియ మనో స్థావరాలలో ప్రధానంగా ఒక వ్యత్యాసం కనిపిస్తుంది. మనస్సు లేకుండా ఇంద్రియ వ్యాపారాలు సాగవు. కానీ, ఇంద్రియాలు లేకపోయినా, మనస్సు తనకు తానుగా విషయాలను చింతించ గలదు. విషయ చింతనలో రమించ గలదు. దేశ కాల పరిస్థితులను అధిగమించి మనస్సు వ్యవహరించ గలదు. కాని, ఇంద్రియాలు మాత్రం దేశకాల పరిస్థితుల పరిధి లోనే సంచరించ గలవు.

వస్తు ప్రపంచంలో చరించ దానికి మనస్సే ఇంద్రియాల రూపంలో వ్యక్త మౌతుంది. ఇంద్రియాలు విషయాల్ని మనస్సు ముందు పెట్టగానే మనస్సును ఆవరించి యున్న కామం మనస్సును రెచ్చగొట్టి, ఇంద్రియాల ద్వారా విషయ ప్రపంచం లోకి నెట్టుతుంది. కాని, ఆ సమయంలో గనుక దృశ్యాదుల నుండి మనస్సును విరమింప చేసి, ఒక సద్విషయాన్ని చింతించే లాగా నియమించ గలిగితే, కామశత్రువు యొక్క రెండవ స్థావరంపై దాడి మొదలైంది అని అర్థం.

సాధకులైన వారు ఏకాంత ప్రదేశాన్ని ఎన్నుకోవడం లోని ఆంతర్యం ఇదే. ముందుండి కలతపెట్టే వాటిని ప్రక్కకు నెట్టి, ముందుకు పోయే సాధన ప్రక్రియ ఇక్కడ స్పష్టంగా గోచరిస్తూ ఉంది.

ఆ తరువాత మనస్సును దీప్తిమంతం చెయ్యాలి. లాభం లేకుండా ఎవ్వరూ ఏ పనీ చెయ్యరు. విషయ ప్రపంచంలో రమించడం వల్ల కలిగే లాభం ఏమీ లేదు అనే సత్యం మనస్సుకు పట్టించాలి. ప్రారంభంలో విషయాలలో సుఖ మున్నట్లు అనిపించినా, అంతమయ్యే ఆ సుఖాలు అంత్యంలో బ్రతుకును విషతుల్యం చేసి, ఎలా దుఃఖంలో ముంచుతాయో మనస్సుకు అర్థ మయ్యేలా విచారము ద్వారా తెలియ చేయాలి. రాగద్వేషాలు తటస్థ మయ్యే లాగా అవగాహనను పెంపొందించాలి. ఈ విధంగా మనస్సును ఇంద్రియాలకు, ఇంద్రియ విషయాలకు దూరంగా ఉంచితే, కామశత్రువు యొక్క రెండవ స్థావరం కూడా ధ్వంస మౌతుంది. యోగ మార్గంలో దీనినే 'శమం' అని అంటారు *(ఆపరేషన్ 'శమ')*. కామం మకాం మార్చేస్తుంది. ఇంద్రియాల నుండి వెను దిరిగి మనస్సును ఆశ్రయించిన కామం, ఇప్పుడు మనస్సు నుండి కూడా పారిపోయి బుద్ధిలో తల దాచుకుంటుంది.

తృతీయ స్థావరము

గత జన్మ సంస్కార ప్రభావ జనిత ప్రకృతి ప్రేరేపిస్తూ ఉంటుంది కనుక కామేచ్ఛ బుద్ధిలో రూపు దిద్దుకుంటూ ఉంటుంది. విషయాలు కోర దగినవే అని నిశ్చయిస్తుంది. అవి మంచివే నని కితాబు నిస్తూ ఉంటుంది.

కావచ్చు. ప్రపంచంలో మంచివి ఎన్నో ఉండవచ్చు. ఉంటాయి. కాని, మంచి వన్నీ మనకు కావాలా? లేక అవసరమైనవి కావాలా? మంచివి కదా అనుకుంటూ అన్నిటినీ ప్రోగు చేసుకుంటూ పోతే, ఆ తరువాత కూర్చోవడానికి మన ఇంట్లో మనకే స్థలం ఉండక పోవచ్చు. మంచివన్నీ మనకు అవసరం లేదు. మనకు ఏవి మంచివో, ఏవి అవసరమో వాటినే మనం సాధించు కోవాలి.

ఈ కోణంలో బుద్ధిని ఆలోచింప చేస్తే, రాగద్వేషాలు రాలిపోయి, వాటి స్థానంలో ధర్మాధర్మాలు తొంగి చూస్తాయి. ధర్మాచరణంలో కామం ఆటలు సాగవు. అక్కడ అంతా ఈశ్వరార్పణం గానే సాగుతూ ఉంటుంది. ప్రసాదం గానే అందుతూ ఉంటుంది. కామం ఇక తన ఉనికిని పోగొట్టు కుంటుంది. ధర్మం ఊరేగుతూ దర్శన మిస్తుంది. ఈ విధంగా శత్రువు యొక్క మూడవ స్థావరం కూడా ధ్వంసం అవుతుంది. ఇక్కడ వివేకమే వెలుగై దారి చూపుతుంది *(ఆపరేషన్ 'ప్రజ్ఞ')*.

యదా పంచావ తిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ
బుద్ధిశ్చ న విచేష్టేత తమాహుః పరమాం గతిమ్ ॥

ఇంద్రియాలతో సహా మనస్సు ఎక్కడ నిశ్చలంగా ఉందో, నిశ్చయాత్మకమైన బుద్ధి వ్యాపారాలు ఎక్కడ చలించకుండా స్థిరపడ్డాయో, అదియే ఉత్కృష్టమైన సద్గతి అని కఠోపనిషత్తు ప్రవచించింది.

ఈ విధంగా శత్రు స్థావరాలపై వివేక పూరితంగా దాడి చేసి, మోహానికి గురి చేసే కామ శత్రువును మట్టుపెట్టిన వారు అశాంతికి దూరులై శాంతిని అనుభూతం చేసుకుంటారు.

అందుచేత, ఇంద్రియాలను నియమించి, కామమును జయించి, పాపము నుండి విడిపొమ్మని ఆదేశిస్తున్నాడు.

తస్మా త్త్వ మిన్ద్రియా ణ్యాదౌ నియమ్య భరతర్షభ ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనమ్ ॥ 41

తస్మాత్-త్వం-ఇంద్రియాణి-ఆదౌ-నియమ్య-భరతర్షభ
పాప్మానం-ప్రజహి-హి-ఏనం-జ్ఞాన విజ్ఞాన నాశనం

భరతర్షభ	=	అర్జునా!	నియమ్య	=	నియమించి
తస్మాత్	=	అందువలన	జ్ఞానవిజ్ఞాన నాశనం	=	జ్ఞానవిజ్ఞానములను నాశనము చేయు
త్వం	=	నీవు	పాప్మానం	=	పాప స్వభావం గల
ఆదౌ	=	మొదట	ఏనం	=	దీనిని
ఇంద్రియాణి	=	ఇంద్రియములను	ప్రజహి హి	=	అవశ్యం విడిచి పెట్టు

అర్జునా! అందువలన, మొదట నువ్వు ఇంద్రియాలను వశ పరచుకో. ఆ తరువాత, కామాన్ని పూర్తిగా తుడిచి పెట్టేయ్! కామము జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని హరిస్తుంది. అది మహాపాపి.

వ్యాఖ్య

సర్వానర్థ హేతువైన కామము యొక్క మూడు ఆశ్రయ స్థానాల్ని తెలుసుకున్నాం. శత్రువు యొక్క స్థావరాలు తెలిసి పోయాయి కనుక ఇక శత్రువును వధించే కార్యానికి పూనుకోవాలి. జ్ఞాన విజ్ఞానములను పాడు చేసే ఈ కామ పాపిని ముందుగా మొదటి స్థావరమైన ఇంద్రియాల స్థాయి నుండి సంహరించడం ప్రారంభించ మంటున్నాడు. అందుచేత ***(తస్మాత్)*** నువ్వు ***(త్వం)*** ఇంద్రియాలను ***(ఇంద్రియాణి)*** ముందుగా ***(ఆదౌ పూర్వ)*** వశపరచుకో ***(నియమ్య వశీకృత్య)*** అంటున్నాడు.

ముందుగా ఇంద్రియాలను వశం చేసుకోమని చెబుతున్నాడు అంటే, ఇంద్రియ నిగ్రహం మాత్రమే సరిపోదు అని అర్థం. ముందుగా మొదటి స్థావరాన్ని ధ్వంసం చేసి, ఆ తరువాత మిగిలిన రెండు స్థావరాలను కూడా వశ పరచు కోమని దాని అర్థం. అదే ***ఆదౌ*** పద ప్రయోగం.

ఇంద్రియాలను నియమించడం శత్రువుపై మనం సాధించే మొదటి విజయము. ఇంద్రియాలను జయించడము అంటే, ఇంద్రియ విషయాలకు దూరంగా వెళ్ళడం అని కాదు. తద్వారా విషయాలకు తాత్కాలికంగా దూరమైన వాళ్ళం అవుతామే గాని ఇంద్రియాలను జయించిన వాళ్ళం కాలేము.

ఇంద్రియాలను జయించడం అంటే, రాగద్వేషాలపై పట్టు సాధించడము అని అర్థము. విషయాసక్తి మనస్సు నుండి దూరమైతేనే, రాగద్వేషాలు అదృశ్య మవుతాయి. రాగద్వేషాలు లేనపుడు కామం మనల్ని కదిలించ లేదు. కోరలు తీసిన పాము లాగా పడి ఉంటుంది.

విషయాలలో ఉండే విషమత్వాన్ని అర్థం చేసుకుంటే విషయాల్ని విషం లాగా విడిచి పెట్టగలం. **విషయాన్ విషవత్ త్యజ** - ఇంద్రియ విషయాలను విషాలుగా భావించి విడిచిపెట్టు అన్నాడు 'అష్టావక్ర గీత'లో అష్టావక్రుడు. అదే ఇంద్రియ నిగ్రహము. విషయాల యందలి దోషమును దర్శించ గానే విషయాలలో రమించాలని ఉత్సాహ పడే మనస్సు వాటి నుండి విరమించి శాంతిస్తుంది.

ఆఖ్యాయిక

యౌవనంలో ఉన్న సాధువును ఒక స్త్రీ తనను పెళ్ళి చేసుకోమని కోరుతుంది. సాధువు అందుకు అంగీకరించడు. అప్పుడు ఆమె సాధువుతో, 'అయ్యా! నేను కామంతో నిన్ను వాంఛించడం లేదు. నీవు మహా మేధావివి. నీ లాంటి మేధావిని బిడ్డగా పొంది, ప్రపంచానికి అందించాలనే మహోన్నత ఆశయంతో అడుగుతున్నాను' అంటుంది.

ఆమె మాటల్ని ఆలకించిన సాధువు, 'అమ్మా! నీ ఆశయానికి నేను ఆనందిస్తున్నాను. నా లాంటి బిడ్డ కావాలి అని నువ్వు అభిప్రాయ పడే టప్పుడు, ఇక ఆలస్య మెందుకు? మాసాలు, సంవత్సరాలు నిరీక్షించడ మెందుకు? నన్నే బిడ్డగా అంగీకరిస్తే నీ కోరిక ఈ క్షణం లోనే తీరిపోతుంది కదా!' అన్నాడు. ఇదే ఇంద్రియ నిగ్రహము. అవగాహన వల్ల ఏర్పడిన నియమము.

ఇంద్రియాలను నియమించడము అంటే, మనం ఇంతకు ముందు చూచినట్లు, మనోబుద్ధులను కూడా నియమించడ మని అర్థం. ముందుగా ఇంద్రియాలను నిగ్రహించాలి. ఆ తరువాత మనోబుద్ధుల్ని నిగ్రహించాలి అని అర్థం.

'ఇంద్రియాలు' అన్నప్పుడు అందులో మనోబుద్ధులు కూడా కలిసి ఉంటాయి. ఇంద్రియాలు బాహ్యంలో చరిస్తూ ఉంటాయి. కనుక అవి బాహ్య కరణాలు. మనోబుద్ధులు ఆంతర్యంలో ఉంటాయి కనుక అవి అంతః కరణాలు. ఇంద్రియాలు బాహ్యేంద్రియాలు కాగా, మనోబుద్ధులు అంతరేంద్రియాలు. దృశ్యాది విషయాల్ని నేత్రాది ఇంద్రియాలు గ్రహిస్తే, విషయ సంయోగము వల్ల కలిగే సుఖదుఃఖాలను, జయాపజయాలను, మానావమానాలను మనోబుద్ధులు గ్రహిస్తాయి.

మహాపాపి

కామము అనేది మహాపాపి ***(మహాపాప్మా)*** అని ముప్పై ఏడవ శ్లోకంలో భగవంతుడు తెలిపాడు. ఇక్కడ పాప స్వరూపం కలది అంటున్నాడు ***(పాప్మానం)***. కామాన్ని పాపిగా ఎందుకు అభివర్ణించాడు? జ్ఞాన విజ్ఞానాలను నాశనం చేస్తూ ఉంది కనుక పాపి అంటున్నాడు.

శాస్త్రం ద్వారా, గురువు ద్వారా ఆత్మ మొదలైన వాటికి సంబంధించిన పరోక్ష జ్ఞానము ఏదయితే కలుగుతూ ఉందో, అది జ్ఞానము ***(జ్ఞానం శాస్త్రతః ఆచార్యతః చ ఆత్మాదీనామ్ అవబోధః)***. విజ్ఞానము అంటే, గురుముఖతః లభించిన జ్ఞానాన్ని ప్రత్యేకించి అనుభవం లోకి తెచ్చుకోవడం ***(విజ్ఞానం విశేషతః తదనుభవః)***. ఈ రెండిటిని నశింప చేయడం పాపము. ఈ పాపకర్మను చేసేది కావడం వల్ల కామము మహాపాపి.

ఆస్తుల్ని నాశనం చేస్తే తిరిగి పొందవచ్చు. ప్రయత్నించి సాధించుకో వచ్చు. జ్ఞాన విజ్ఞానాలు పాడైతే, వాటిని తిరిగి సాధించు కోవడం, సంపాదించు కోవడం అంత సులభ సాధ్యం కాదు. సంవత్సరాల తరబడి శ్రమించి సాధించుకున్న జ్ఞాన విజ్ఞానాలను కామం క్షణంలో పాడు చేస్తుంది. అందుకే కామాన్ని మహాపాపిగా గీతాచార్యుడు అభివర్ణించాడు.

ఇంద్రియాలను మొదట నిగ్రహించి, ఆ తరువాత మనోబుద్ధులను నియమించి, శత్రువు యొక్క స్థావర త్రయాన్ని ధ్వంసం చేసి, విరోధిపై తిరుగు లేని విజయాన్ని సాధించ మంటున్నాడు విజయసారథి ***(ఏనమ్ ప్రజహి)***.

మనస్సును జయించిన వాడు మహిని జయించ గలడు. కనుక ముందుగా ఇంద్రియాలను జయించి, ఆ తరువాత అజ్ఞానాన్ని జయించాలి. దేహేంద్రియ మనోబుద్ధు లన్నీ ఇంద్రియాలే కనుక, అవన్నీ కరణాలే. కనుక, ముందుగా మనోజయం జరిగి పోవాలి. ఆ తరువాత అన్నీ విజయ పరంపరలే. ఎందుకంటే, శాస్త్రం ఒక అందమైన ఉపమానాన్ని అందించింది. ఎందుకు ముందుగా ఇంద్రియ జయం జరగాలి? ఎందుకు ముందుగా మనస్సును జయించాలి అంటే, దానికి కుత్సిన మీనాన్ని దృష్టాంతంగా చెప్పింది.

మనస్తు పూర్వ మా దద్యాత్ కుమీన మివ మత్స్యహా

జాలరి చేపల్ని పట్టి గట్టుపై పడేస్తాడు. చావకుండా చలించే చేపలు నీళ్ళల్లోకి జారి పోకుండా వాటిని చంపి బుట్టలో వేసుకుంటాడు. కాని, మొదట కుత్సిన మీనాన్ని, అంటే మళ్ళీ నీళ్ళల్లో ప్రవేశించ డానికి తీవ్రంగా ఏ చేప అయితే యత్నిస్తూ ఉందో, దానిని ముందుగా చంపుతాడు. దాని అర్థం తీవ్ర ప్రయత్నం చేయకుండా నీళ్ళ వైపు మెల్లగా చరించే వాటిని విడిచి పెడతాడు అని కాదు. వాటిని కూడా చంపుతాడు. కాకపోతే, తీవ్ర ప్రయత్నంతో చలించేది, నీటికి దగ్గరగా ఉండేది ఏదో, దానిని ముందుగా చంపుతాడు.

అలాగే సాధకుడు ఇంద్రియ మనోబుద్ధుల్ని నియమించే ప్రయత్నంలో ముందుగా ఇంద్రియాలను నిగ్రహించాలి. ఎందుకంటే, విషయాలకు ఇంద్రియాలు దగ్గరగా ఉన్నాయి. పైగా, ఏ క్షణాన్నైనా అవి విషయ జలాల లోకి జారి పోవచ్చు. కనుక కామ మనే మహాపాపిని వధించాలని అభిలషించే వారు ఇంద్రియ మనోబుద్ధుల్ని అవశ్యం నిగ్రహించాలి అని ప్రబోధిస్తున్నాడు.

కామం యొక్క స్థావరాలను, ఆశ్రయ స్థానాలను తెలిపి, మహాపాపి యైన కామాన్ని త్యజించ మన్నాడు. బాగుంది. అయితే దేనిని ఆధారం చేసుకొని కామవిరోధిని త్యజించాలి? చెబుతున్నాడు.

ఇన్ద్రియాణి పరాణ్యాహు రిన్ద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః ॥ 42

ఇంద్రియాణి-పరాణి-ఆహుః-ఇంద్రియేభ్యః-పరం-మనః
మనసః-తు-పరా-బుద్ధిః-యః-బుద్ధేః-పరతః-తు-సః

ఇంద్రియాణి	=	ఇంద్రియాలను	బుద్ధిః	=	బుద్ధి
పరాణి	=	గొప్పవిగా	పరా	=	గొప్పది అని
ఆహుః	=	చెబుతారు	యః	=	ఎవడయితే
ఇంద్రియేభ్యః	=	ఇంద్రియముల కంటెను	బుద్ధేః	=	బుద్ధి కంటె
మనః	=	మనస్సు	పరతః	=	గొప్పవాడో
పరం	=	గొప్పది అని	సః	=	అతడే ఆత్మ అని
మనసఃతు	=	మనస్సు కంటె కూడా	ఆహుః	=	చెబుతారు

దేహము కంటె ఇంద్రియాలు గొప్పవి అంటారు. ఇంద్రియాల కంటె మనస్సు గొప్పదని చెబుతారు. మనస్సు కంటె బుద్ధి గొప్పది అంటారు. బుద్ధి కంటె పై నున్న దెవరో అదే ఆత్మ అని చెబుతారు.

వ్యాఖ్య

జ్ఞాన విజ్ఞానములను నశింప చేసే కామాన్ని త్యజించ మని భగవానుడు ఆదేశించాడు. కామము అనేది జయింప శక్యము కానిది అని ఇప్పటికే తెలుసు కున్నాము. కామము యొక్క స్థావరాలను, అనగా ఆశ్రయ స్థానాలను కూడా కనిపెట్టేశాము. ఇక దానిని జయించడమే మనకు మిగిలి ఉన్న కర్తవ్యము. శక్తివంతమైన కామాన్ని ధ్వంసం చెయ్యాలి అంటే, అంతకన్నా శక్తివంతమైన, బలవంతమైన ఆశ్రయాన్ని పొందాలి. ఏ ఆశ్రయాన్ని సాధిస్తే కామాన్ని సంపూర్ణంగా జయింప గలమో, దానిని ఆధారంగా పొందాలి. అది మహోత్కృష్ట మైనదై ఉండాలి. అది ఏదో ఈ శ్లోకంలో అర్థం చేసుకుంటాము.

'ఇంద్రియాలను ఉత్కృష్టములు అంటారు' అంటూ శ్లోకాన్ని ఆరంభించాడు అచ్యుతుడు (***ఇంద్రియాణి పరాణిప్రకృష్టాని ఆహుః***). ఈ వాక్యం వినగానే దేని కంటె ఉత్కృష్టములు? అనే ప్రశ్న పుడుతుంది. అందుకు దేహము కంటె ఇంద్రియాలు ఉత్కృష్టములు అనే సమాధానం వస్తుంది.

దేహం కంటె ఇంద్రియాలు ఉత్కృష్టములు. ఇంద్రియాల కంటె మనస్సు ఉత్కృష్టము. మనస్సు కంటె బుద్ధి ఉత్కృష్టము అంటూ తరతమ భేదాలతో వివరిస్తూ చివరగా అన్నిటి కన్నా ఉత్కృష్ట మైనది ఆత్మ అని, అట్టి ప్రకృష్టమైన, మహోత్కృష్టమైన ఆత్మను పొందిన వారే కామాన్ని సంపూర్ణంగా జయించ గలరు అని అసలు విషయాన్ని బయట పెట్టేశాడు.

ఈ సత్యాన్ని సాంఖ్య యోగంలో స్థితప్రజ్ఞ ప్రకరణములో కూడా భగవానుడు చర్చించాడు (***రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే*** *- 59 వ శ్లోకం*). పరమేశ్వర దర్శనం తోనే విషయాసక్తి సంపూర్ణంగా నశిస్తుందని అక్కడ చెప్పే ఉన్నాడు. అట్టి దివ్య దర్శనం వైపు నడిపించే ప్రయత్నమే ఈ శ్లోకంలో చేస్తూ ఉన్నాడు.

దేహం నుండి ప్రారంభమై దేహి వరకు తరతమ భేదాలతో, ప్రకృష్ట స్థితిని వివరిస్తూ ప్రవచించాడు. కాకపోతే, ఈ ఉత్కృష్టత అనే దానికి కొలమానము లేమిటో కూడా ముందుగా తెలుసుకుంటే మంచిది.

ఒకదాని కంటె మరొకటి ఎలా ఉత్కృష్టము? తరతమ భేదాలు ఏయే విషయాలలో ఉన్నాయి? వినండి. (1) ప్రకాశత్వంలో ఉత్కృష్టము (***ప్రకాశకత్వాత్***). (2) ఒక దాని కంటె మరొకటి అంతస్థమై ఉండటము (***అంతస్థానాత్***). (3) వ్యాపకత్వంలో ఉత్కృష్టము (***వ్యాపకత్వాత్***). (4) కారణమై ఉండుట చేత ఉత్కృష్టము (***కారణత్వాత్***). (5) ఒకదాని కంటే మరొకటి సూక్ష్మమై ఉండటము (***సూక్ష్మత్వాత్***). (6) ప్రవర్తకత్వంలో ఉత్కృష్టము (***ప్రవర్తకత్వాత్***). ఈ ఆరు ధర్మాలలో తరతమ భేదాలను అనుసరించి ఉత్కృష్టతను నిర్ణయించాలి.

దేహం కంటె ఇంద్రియాలు

దేహం అప్రకాశ మైనది. తాను ఉన్నట్లు తనకే తెలియదు. ఒక బండి లాగా, లేదా బండ లాగా కనిపిస్తూ ఉంటుంది. దేహంతో పోల్చినపుడు ఇంద్రియాలు ప్రకాశవంతంగా ఉన్నాయి. వెనుక నుండి పిలిస్తే ముందు నడుస్తున్న వ్యక్తి తిరిగి చూస్తాడు. వాసనలు తెలుసు కుంటాడు. అలాగే విషయాలు అన్నీను.

దేహం తనకు తాను దృశ్యం కాలేదు. అంటే, తనను తాను దర్శించ లేదు. ఇంద్రియాలు దేహాన్ని దర్శిస్తాయి. స్పృశిస్తాయి. ఆఘ్రాణిస్తాయి. దేహం కన్నా సూక్ష్మంగా ఉంటాయి. ఆకాశంలో ఎక్కడో ఉన్న చంద్రుణ్ణి కళ్ళు ఇక్కడ నుండే చూస్తాయి. పంచీకృత స్థూలభూతాల నుండి దేహం పుడితే, అపంచీకృత సూక్ష్మభూతాల నుండి ఇంద్రియాలు జనించాయి. కనుక ఇంద్రియాలు దేహం కన్నా ఉత్కృష్టములు (***ఇంద్రియాణి పరాణి***).

ఇంద్రియాల కంటె మనస్సు

ఇంద్రియాల కంటే మనస్సు ఉత్కృష్టము. దేహం చేరలేని చంద్రుణ్ణి కళ్ళు చేరాయి. కనిపిస్తున్నాడు కనుక కళ్ళు చంద్రుణ్ణి చేరాయి. ఎదురుగా లేని, కంటికి కనిపించని, కలకత్తా లోని కాళికాదేవి కోవెలను కళ్ళు ఇక్కడ నుండి చూడ లేవు. కాని, మనస్సు చూస్తుంది. ఇంద్రియాల కన్నా మనస్సు సూక్ష్మం కనుకనే అది సాధ్య పడింది.

ఇంద్రియాలను ప్రేరేపించేది, ప్రవర్తింప చేసేది మనస్సు. ఆజ్ఞ లిచ్చి నడిపేది మనస్సు. మనస్సు వాటితో చేరక పోతే ఇంద్రియాలు అచేతనా లవుతాయి. కాని, ఇంద్రియాలు లేకపోయినా మనస్సు తనలో తాను వ్యవహరిస్తుంది. ఊహిస్తుంది. సంకల్పిస్తుంది. వికల్పిస్తుంది. కల్పించు కుంటుంది. ఇంద్రియాలన్నీ ఆదమరచి, చలించని వృక్ష శాఖల్లాగా నిశ్చలంగా ఉన్న నిద్రావస్థలో కూడా, మనస్సు స్వప్నాన్ని సృష్టించుకొని క్రీడిస్తుంది. తానే నేత్రమై చూస్తుంది. శ్రోత్రమై వింటుంది. ఇంద్రియ వ్యాపారాలన్నీ తనకు తానే లోపల సాగిస్తుంది. కనుక ఇంద్రియాల కంటె మనస్సు శ్రేష్ఠము (***ఇంద్రియేభ్యః పరం మనః***).

మనస్సు కంటె బుద్ధి శ్రేష్ఠము

సంకల్ప వికల్పాల మధ్య చలించే మనస్సును నిశ్చయించి నిలిపేది బుద్ధి. మనస్సు తనలో తాను వ్యవహరిస్తుంది. లేదా, ఇంద్రియాలతో చేరి బాహ్యంలో సంచరిస్తుంది. అంతేగాని, లోపల ఉన్న చైతన్యం వైపు పయనించ లేదు. కాని, బుద్ధి అలా కాదు. అటు మనస్సుతో చేరి ప్రపంచం లోకి పోగలదు, ఇటు వెను దిరిగి ఆత్మ వైపు పయనించ గలదు.

మనస్సు 'ఇదం' లేక 'ఇది'గా తెలుస్తుందే గాని 'అహం' లేక 'నేను'గా తెలియదు. 'అహం' వృత్తి బుద్ధి లోనే జనిస్తుంది. బుద్ధికి మనస్సు 'ఇదం'గా తెలుస్తుంది. ప్రేరేపించేది 'అహం' వృత్తి. ప్రవర్తించేది 'ఇదం' అయిన మనస్సు. ప్రవర్తించే దాని కన్నా ప్రేరేపించేది ఉత్కృష్ట మైనది. కనుక మనస్సు కంటె బుద్ధి ఉత్కృష్టము *(మనసః పరా బుద్ధిః).*

బుద్ధి కంటె ఆత్మ ప్రకృష్టము

బుద్ధిలో కదిలే 'అహం' వృత్తిని, అహంవృత్తికి దృశ్యములైన 'ఇదం' వృత్తులను ప్రకాశింప చేసేది ఆత్మ. దేహేంద్రియ మనోబుద్ధులకు చేతనత్వాన్ని కలిగించేది, సర్వవ్యాపక మైనది, సర్వకారణ మైనది, సదా ప్రకాశవంత మైనది, సూక్ష్మాతి సూక్ష్మ మైనది కావటం చేత ఆత్మ బుద్ధి కంటే ఉత్కృష్ట మైనది. కామం కదలనిది, సర్వ కామాలు తీరినది ఆత్మ. అందుచేత ఆత్మ పరమైనది *(బుద్ధేః పరః సః).* ఇక్కడ *సః* - 'అది' అంటే, ఆత్మ అని అర్థము.

రాజమార్గము

వానరుడు మతిని అనుసరించ వచ్చు కాని, నరుడు మాత్రం శ్రుతినే అనుసరించాలి అని సాధువులు చమత్కరిస్తూ ఉంటారు. శ్రుతి మార్గము రాజమార్గము. గీత ఉపనిషత్తుల సారము. సారభూతమైన విషయము. ఉపనిషత్తు లనే గోవుల నుండి పితికిన జ్ఞానక్షీరమే భగవద్గీత అని ధ్యానశ్లోకాల లోనే మనం అర్థం చేసుకున్నాం. ప్రస్తుతం దేహం నుండి ఆత్మ వరకు చెప్పబడిన తారతమ్యమును కఠోపనిషత్తు నుండి గ్రహించి ప్రవచించాడు గీతాచార్యుడు.

ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః
మనసశ్చ పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్పరః ॥

ఈ విషయాన్ని నారాయణుడే నరునికి బోధించాడు. ఇక రెండవ ఆలోచనకు, వ్యాఖ్యానానికి అవకాశ మెక్కడుంది?

అందుచేత, బుద్ధి కంటే పరమ ప్రకృష్ట మైనది ఆత్మ. అదే పురుషుడు. పరమాత్మ స్వరూపము. అంతకు మించినది ఏదీ లేదు. **పురుషాత్ న పరం కించిత్ స కాష్ఠా స పరాగతిః** అని శ్రుతిశాసనం.

ఇంద్రియాలు ఐదు, మనస్సుతో ఆరు, బుద్ధితో ఏడు - ఆ తరువాత అష్టమ స్థానంలో ఆత్మ దివ్యంగా ప్రకాశిస్తోంది. అక్కడే అష్టదళ పద్మంలో పద్మనాభుని వైభవం. అదే అష్టాంగ యోగమార్గంలో అష్టమ భూమిక యైన సమాధి. అదే అష్టమగర్భ సంజాతుడైన వాసుదేవుని నివాసము. నారాయణుని అష్టాక్షరీ మహామంత్ర వైభవము.

క॥ *విను మై దింద్రియములకును మనంబు షష్ఠంబు సప్తమత్వము బుద్ధిం*
బనిగొను భవ్య క్షేత్రజ్ఞుని యందష్టమత గల్గు సుగుణాభరణా ॥

అని ఆంధ్ర మహాభారతంలో కవిబ్రహ్మ తిక్కనార్యుని తీపి పద్యము.

బుద్ధి కంటె పరమైన ఆత్మానుభూతి కలిగితే కామమును సంపూర్ణంగా జయించినట్లే. రాజును జయిస్తే రాజ్యాన్ని జయించినట్లే కదా! సర్వాత్మ ప్రాప్తిస్తే సర్వమూ ప్రాప్తించినట్లే. ఆ తరువాత కామము కదలదు. కాలుడు కనిపించడు.

పట్టు వలువలు కప్పినా పన్నీరు చల్లినా
ఘన స్తుతుల ముంచినా గజము లెక్కించినా
చలింప నైతిని నీ మహిమ తెలిసి నేను
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని ఆ మహోత్కృష్ట సన్నిధిలో ఒక విబూదిపండు.

చివరగా, కామాన్ని జయించి, ఆప్తకాముడవై జీవించు అని ఆనతిస్తూ ఆశీర్వదిస్తున్నాడు.

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్త భ్యాత్మాన మాత్మనా ।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 43

ఏవం-బుద్ధేః-పరం-బుద్ధ్వా-సంస్తభ్య-ఆత్మానం-ఆత్మనా
జహి-శత్రుం-మహాబాహో-కామరూపం-దురాసదం

మహాబాహో	=	అర్జునా!	ఆత్మనా	=	మనస్సు చేతనే
ఏవం	=	ఈ విధముగా	సంస్తభ్య	=	స్తంభింప చేసి
బుద్ధేః	=	బుద్ధి కంటె	కామరూపం	=	కామ స్వరూపమైన
పరం	=	శ్రేష్ఠమైన దానినిగా	దురాసదం	=	జయింప శక్యము గాని
బుద్ధ్వా	=	తెలుసుకొని	శత్రుం	=	శత్రువును
ఆత్మానం	=	మనస్సును	జహి	=	సంహరించు

అర్జునా! ఈ విధంగా ఆత్మను బుద్ధి కంటే శ్రేష్ఠ మైనదిగా తెలుసుకో. బుద్ధి చేత మనస్సును నిగ్రహించు. ఈ కామ శత్రువును జయించుట సుసాధ్యం కాదు. దానిని ఎలాగైనా జయించు.

వ్యాఖ్య

ప్రతి మానవుడు జయించ వలసిన కామాన్ని శత్రువుగా అభివర్ణిస్తూ, అజేయమైన శత్రువుపై విజయాన్ని సాధించి, ఆత్మ సామ్రాజ్యాన్ని అధిరోహించ మని ఆదేశిస్తూ మూడవ అధ్యాయం - కర్మయోగాన్ని సమాప్తి చేస్తున్నాడు.

బుద్ధికి ఉన్నతంగా, అతీతంగా పరమాత్మ స్వరూపం ఉంది. అదే బుద్ధికి చేతనత్వాన్ని ప్రసాదిస్తూ ఉంది. బుద్ధికి అధోముఖంగా మనస్సు చరిస్తూ ఉంది. మనస్సు బుద్ధిని అధోముఖంగా ఇంద్రియాల వైపు ఈడ్చి, విషయ ప్రపంచంలో వ్యవహరింప చేస్తూ ఉంది. కనుక బుద్ధి కంటె పరమైన ఆత్మను తెలుసుకోవాలి అంటే బుద్ధి చేత మనస్సును నిగ్రహించి, కామ రూప శత్రువును అంతం చెయ్యాలి.

శత్రువు ఎంత గొప్పవాడైనా, కంటికి కనిపిస్తూ ఉంటే, అర్థమవుతూ ఉంటే, పోరాడి జయించ వచ్చు. కాని ఈ కామ శత్రువు కనిపించడు. అర్థం కాడు. ఏ రూపంలో ఉంటాడో చెప్పలేము. ఒకసారి కనిపించినట్లు మరొకసారి కనిపించడు. అందుకే ***దురాసదమ్*** - 'జయింప శక్యము కాని' అన్నాడు భగవానుడు.

(దురాసదమ్ - దుఃఖేన, ఆసదః ఆసాదనం ప్రాప్తిః యస్య తం దురాసదమ్). ఎవరిని గూర్చి తెలుసుకోవడం

కష్టంతో కూడిన కార్యమో, అదే కామ శత్రువు. కామ విశేషాలు అంత సులభంగా అర్థం కావు. కామం **దురాసదమ్** కనుక ఏ రూపంలో నైనా గోచరించ వచ్చు. క్రోధ రూపంలో కనిపించేది కామమే. అంతే కాదు, లోభరూపంలో గోచరించేది, మోహరూపంలో అగుపించేది, మాత్సర్యంగా వికటించేది - అంతా కామమే.

సాధారణంగా శత్రువు బయట ఉంటాడు కనుక, ప్రయత్నించి జయించ వచ్చు. ఈ కామ శత్రువు బయట ఉండేవాడు కాదు. లోపల ఉండేవాడు. కనుక మన ప్రయత్నాలు విఫలమౌతూ ఉంటాయి. ఒక దశలో జయించడం సాధ్యం కాదేమో అనే నిరాశ కూడా కలుగుతూ ఉంటుంది.

వివేకం లోపించడమే ఈ విధమైన నైరాశ్యానికి కారణం. వివేకవంతమైన బుద్ధిని ప్రయోగించలేక పోవడమే కామాన్ని జయించలేక పోవడానికి ప్రధాన ప్రతిబంధకం. కనుకనే మనస్సును ***(ఆత్మానం)*** వివేక బుద్ధి చేత ***(ఆత్మనా)*** చక్కగా స్తంభింప చేసి ***(సమ్యక్ స్తంభనం కృత్వా)*** కామ శత్రువును జయించ మంటున్నాడు. ఈ సందర్భంలో అర్జునుణ్ణి **మహాబాహో!** అని సంబోధించాడు.

'మహాబాహో!' అంటే గొప్ప బాహువులు కలవాడా! అని అర్థము. గొప్పదైన బాహుబలంతో శత్రువును సంహరించేవాడా! అని భావము. బాహ్య శత్రువుల్ని బాహుబలంతో జయించినట్లే, అంతశ్శత్రువును బుద్ధి బలంతో జయించాలి. భావబలంతో జయించాలి. వివేక వైరాగ్యాదులనే శస్త్రాలతో ఖండించాలి. అవగాహనా కవచాన్ని సదా ధరించి పోరాడాలి. అప్పుడు శత్రువు ఏ రూపంలో వచ్చినా జయించడం సాధ్య మవుతుంది. కామరూపాలు ఆ తరువాత మనిషిని కదిలించ లేవు.

బుద్ధిలో వివేక బలం పుష్కలంగా ఉండాలి. అప్పుడే ఊర్ధ్వంగా పయనించి ఆత్మను తెలుసుకో గలుగుతుంది. అలాగే అధోముఖంగా విజృంభిస్తున్న ఇంద్రియ మనస్సుల్ని నియమించ గలుగుతుంది. వివేక బలం లేని నీరస మందమతులు కామ శత్రువును జయించి ఆత్మ సామ్రాజ్యాన్ని చేజిక్కించుకో లేరు *(న అయం ఆత్మా బలహీనేన లభ్యః - కఠోపనిషత్తు)*.

విజయం వరిస్తుంది

ప్రయత్నశీలుడు పతన మెరుగడు అని ఆర్యోక్తి. పురుషార్థ నిశ్చయం స్థిరంగా ఉండి, బుద్ధిలో వివేకం విరబూస్తే, కామాన్ని జయించడం దుస్సాధ్యం కాదు. మరీ అంత అసాధ్యమైతే, మన పూర్వీకులు ఎలా జయించ గలిగారు? జయించడం దుస్సాధ్యమే అయితే, జయించు అని శ్రీకృష్ణుడు ఎందుకు ఆదేశిస్తాడు? అవగహన కల వారికి ఏదీ అసాధ్యం కాదు.

కామం వాస్తవానికి మిత్రుడూ కాదు. శత్రువూ కాదు. కామం మిత్రుడైతే మనల్ని దుఃఖానికి ఎందుకు గురి చేస్తుంది? కామం శత్రువైతే, ఆత్మజ్ఞానేచ్ఛను ఎలా కలిగిస్తుంది?

నిజం చెప్పాలంటే, ప్రపంచంలో కూడా ఎవ్వరూ ఎవ్వరికీ శత్రువుగా లేరు. అలాగే మిత్రుడు గాను లేరు. మనం ఏర్పరచుకొనే సంబంధాలను బట్టే శత్రువులు, మిత్రులు తయారవుతూ ఉంటారు.

ఇంతెందుకు? ఎందరు భర్తలు భార్యలకు శత్రువులుగా లేరు? అలాగే ఎందరు భార్యలు భర్తలకు శత్రువులు కారు? తండ్రికొడుకుల మధ్య శత్రుత్వము, మామాఅల్లుళ్ళ మధ్య శత్రుత్వము, అన్నదమ్ముల మధ్య శత్రుత్వము - ఇలా ఎన్నని? ఎన్నైనా అవగాహనా లోపం వల్ల కలిగినవే.

మిత్రుల్ని తయారు చేసుకోవచ్చు. శత్రువుల్ని లేకుండా చేసుకోవచ్చు. అంతా మన ప్రవర్తనపై ఆధార పడి ఉంటుంది. మన అవగాహన వృద్ధి చెందే కొద్దీ, శత్రువులు తగ్గుతూ ఉంటారు. మిత్రులు పెరుగుతూ ఉంటారు. అంతే.

భయంకర మైన పులుల్ని లొంగ దీసుకొని స్వారి చేసే వారు ఉన్నారు. విషసర్పాల్ని చేతుల్లో పట్టుకొని ఆడించే వారు ఉన్నారు. వివేకం ఉన్నతంగా పయనిస్తే కామాన్ని జయించడం కూడా దుస్సాధ్యం కాదు. అందువల్లనే వివేక బుద్ధి చేత మనస్సును స్తంభింప చేసి కామ శత్రువును జయించాలని అభిలషించే సాధకుడు బుద్ధి కంటె ప్రకృష్టమైన ఆత్మను తెలుసు కోవాలి అంటున్నాడు.

ఆత్మదర్శనం

ఆత్మ నిత్యం. శుద్ధం. బుద్ధం. ముక్తం. బుద్ధికి పరమైన ఈ ఆత్మను తెలుసుకున్న బుద్ధి జ్ఞానంతో శోభిస్తుంది. ఆత్మజ్ఞానంతో శోభిస్తుంది. బుద్ధిలో కలిగే జ్ఞానవృత్తి అజ్ఞానవృత్తిని నశింప చేసి, కామ శత్రువును మట్టు పెడుతుంది.

తాను ఆత్మే అనే జ్ఞానం కలిగిన తరువాత, పరిమితమైన కామం ఉంటే మాత్రం నష్ట మేముంది? పరిమితమైన కామం అనంతాత్మను ఏం చేయ గలుగుతుంది? ఆప్తకాముడైన జ్ఞాని ప్రత్యేకించి పొంద వలసింది ఏముంది కనుక అతనిలో కోర్కెలు కదుల్తాయి? పొంద వలసింది లేనపుడు కోరికలు కదిలితే మాత్రం నష్ట మేముంది? ఆత్మానంద సాగరంలో కోరికలు కూడా అందంగా అలల లాగా లేచి పడుతూ ఉంటాయి.

ప్రపంచం అస్థిరం. చంచలం. కామం దుఃఖ హేతువు. పరమాత్మ అక్షరం. ఆనంద స్వరూపం. కామరూప సంసారం చంచల మైంది కనుక అక్షర రూపుడైన పరమాత్మను తెలుసు కోవాలి అన్నది ఉపనిషత్తు ***(విజ్ఞేయోఽక్షర తన్మాత్రో జీవితం చాపి చంచలమ్ - పైంగలోపనిషత్తు)***.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే కర్మయోగో నామ తృతీయోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు కర్మయోగము అనే మూడవ అధ్యాయము.







అకారాది శ్లోకానుక్రమణిక



ప్రథమాధ్యాయము



అకారాది శ్లోకానుక్రమణిక



ద్వితీయాధ్యాయము



అకారాది శ్లోకానుక్రమణిక



ద్వితీయాధ్యాయము



చైతన్య భగవద్గీత

అకారాది శ్లోకానుక్రమణిక

తృతీయాధ్యాయము

